భావవీణ

ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 7 - Spl. Edition - July 2020 - ISSN No. : 2456-4702

"ఆధునిక తెలుగు సాహిత్యం - సామాజిక జీవన చిత్రణ"





అంతర్జాల జాతీయ సదస్సు

జులై 3 - 4, 2020.

నిర్వహణ :

తెలుగు విభాగం

పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కాలేజి

పెదనందిపాడు, గుంటూరు - 522 235, ఆంధ్రప్రదేశ్.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Literary, Culture & Language Study

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue No. 7 - Spl. Edition - July 2020 - ISSN No. : 2456-4702

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies
   Universityof Heidelberg, Germany.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

COVER PAGE & PAGE SETTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, Guntur. 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar,
Guntur - 522 002. Ph. 9703301698.

విషయసూచిక

1.	"నేను" యౌగిక కావ్యం : సామాజిక జీవన చిత్రణ	- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు	9
2.	అప్పల్నాయుని కథల్లో రైతు జీవితం	- ఆచార్య కె. శ్రీదేవి & చంద్రబాబు	14
3.	మధ్యతరగతి స్త్రీల జీవితం - సోమంచి శ్రీదేవి	- డా॥. పంతంగి వెంకటేశ్వర్లు	19
4.	సామాజిక జీవన చిత్రణకు ప్రతిబింబం ఆధునిక కవిత్వం	- డా॥. పి. విజయకుమార్	23
5.	డా॥. వి. చంద్రశేఖర్ రావు కథలు - సామాజిక చిత్రణ	- డా॥. కడియాల వెంకటరమణ	26
6.	రచయిత్రుల క్రొత్త కథలు - సామాజిక జీవన చిత్రణ	- మాధవి బొల్లు	31
7.	ఆధునిక తెలుగు సాహిత్యం	- డా॥. ఇ. మురళీధర్	35
8.	ఆచార్య ఇనాక్ గారి కథలలో దళిత సామాజిక జీవన చిత్రణ	- డా॥. కాగిత సుబ్బారావు	37
9.	రాయలసీమ కథకుల్లో సామాజిక జీవన చిత్రణ	- డా॥. రాచపాళెం పురంధీశ్వరి	42
10.	వలస కార్మికులు - సామాజిక జీవన చిత్రణ	- డా॥. ఎస్. విజయభాస్కర్	46
11.	ప్రజాకవి వేమన కవిత్వం - సామాజికతత్వం	- డా॥. వి. శివనాగార్జునరెడ్డి	51
12.	మా గోళ్ళే కథలు - సమాజ చిత్రణ	- శ్రీమతి పసుపులేటి నాగమల్లిక	55
13.	గిరిజనుల జీవన వైవిధ్యం - సంస్కృతి సంప్రదాయాలు	- పులి చెంచయ్య	58
14.	మలుపు తిప్పిన - మలుపు తిరిగిన రథచక్రాలు	- శ్రీపతి మారుతి	62
15.	ప్రబంధ సాహిత్యం - సామాజికత్వం	- ఉన్నవ గణేష్	65
16.	తెలంగాణ బహుజన సాహిత్యంలో అస్తిత్వవాదం	- నరేష్ భూక్య (నారి)	68
17.	రాయలసీమ కరువు - సాహిత్య ప్రస్థానం	- డా॥. జి. రవికుమార్	73
18.	తెలుగు సాహిత్యం - సామాజిక దృక్పథం	- డా॥. నూనె అంకమ్మరావు	78
19.	ఆధునిక తెలుగు కథ - ప్రత్యేకత	- డా॥. వి.శాంతిలక్ష్మి	82
20.	చారిత్రక వచన మహాకావ్యము 'బోయకొట్టములు పండ్రెండు'	- తంగి ఓగేశ్వరరావు	86
21.	ఆచార్య నరసింహారెడ్డి కవితల్లో సమసమాజ చిత్రణ	- డా॥. బ్రహ్మానందరెడ్డి	97
22.	తెలుగు కవిత్వంలో తృతీయ స్వరం	- జోశ్యుల దీక్ష	100
23.	జయప్రభ కవిత్వంలో సామాజిక విశ్లేషణ	- డా॥. కె. ఈశ్వరమ్మ	103
24.	ఆధునిక వ్యక్తిత్వం దిశగా చేసిన ప్రయాణం - నీల	- డా॥. డి. శ్రీనివాసులు	106
25.	'గబ్బిలం' - సామాజిక జీవన చిత్రణ	-డా॥. గుంటుపల్లి గౌరి	110
26.	ప్రశ్నించేదిశగా భారతీయ స్త్రీ...	-డా॥. జాడ సీతాపతి రావు	113
27.	మాడభూషి కవిత్వం - సామాజిక ప్రయోజనం	- కె.లక్ష్మణ	118
28.	ఆధునిక తెలుగు కథ (2001-2010)-సామాజిక జీవన చిత్రణ	-డా॥. శేఖర్ కోలా	126

29. కన్నెగంటి అనసూయ 'కొత్తగా రెక్కలొచ్చెనా!' నవల - డా॥. యం. ప్రసాద్ 130
30. 'చిత్తూరు కథ' సంకలనం-చిత్తూరు ప్రజల ఆచారవ్యవహారాలు - డా॥ పి. జయచంద్రుడు 133
31. మినీ కవిత్వం - హైకూ - నానీలు - సామాజిక దర్శనం - డా॥. వీపూరి వేంకటేశ్వర్లు 138
32. తెలంగాణ నవలల్లో సామజిక జీవన చిత్రణ - గుండు రవి 143
33. జగన్నాథ కథ చక్రాల్ - సమాజ నిర్మాణ కథలు - పోల బాల గణేష్ 146
34. శతకములు - వ్యక్తిత్వ వికాసం - సామల కిరణ్ 150
35. వీరేశలింగం - జీవన ప్రస్థానం - సూరేపల్లి పద్మావతి 156
36. రావిశాస్త్రి గారి రత్తాలు-రాంబాబు నవలలో కనిపించే స్త్రీల జీవనము - ఏ. వెంకటప్రసాదు 160
37. వీరేశలింగం గారి నాటకాలు - సామాజికత - అవుల గిరిబాబు 163
38. అనుమాండ్ల భూమయ్య పద్య రచనలు - బి. మహేష్ 167
39. మల్లవరపు ' జీవనది' - సామాజిక జీవన చిత్రణ - దిట్టకవి తిరుమల శ్రీనివాస్ 170
40. 'జలగల వార్డు' కథ - అంతర్ బహిర్ సమాజం - డా॥. ఎ. రవీంద్రబాబు 173
41. 2012 దినపత్రికల్లోని కథలు - సామాజికత - డా॥. బి. సురేష్‌బాబు 178
42. వల్లంపాటి కథలలో సామాజిక జీవన చిత్రణ - డా॥. బోడిరెడ్డి మహేంద్రరెడ్డి 181
43. తెలుగు సాహిత్యంపై స్త్రీవాద సాహిత్య ప్రభావం - డా॥. ఇ.వాసు 184
44. బోయిభీమన్న - 'గడ్డిపిల్ల' - దళిత సామాజిక స్పృహ - డా॥. జి. శైలమ్మ 188
45. లలితానంద్ కవిత - రైతు ప్రతీకలు - డా॥. జంపాల అనూరాధ 193
46. ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్ వచన కవితలు - సామాజిక దృక్పథం - డా॥. యం. మాదన్న 198
47. కాసుల ప్రతాపరెడ్డి కథలు - సామాజిక జీవన చిత్రణ - మద్దిరాల సత్యనారాయణరెడ్డి 201
48. రాసాని కథలు - గిరిజన, సంచార తెగల జీవిత చిత్రణ - డా॥. పోచంరెడ్డి రాజేశ్వరి 204
49. తెన్నేటి వారి 'మనచేతుల్లోనే' నాటిక -సామాజిక స్పృహ - డా॥. పులపర్తి శ్రీనివాసరావు 208
50. రావిశాస్త్రి - అల్పజీవి : సామాజిక స్థితిగతులు - డా॥. సి. ముత్యాలప్ప 214
51. ఆధునిక తెలుగు కథలు - సామాజిక జీవన చిత్రణ - శ్రీమంతుల దామోదర్ 217
52. డా॥. ముదిగంటి సుజాతారెడ్డి కథలు - సామాజికత - డా॥. తండు కృష్ణయ్య 220
53. జాఘవా రచనల్లో సామాజిక జీవనచిత్రణ - డా॥. వై.వి.సిహెచ్. లీలా పద్మజ 225
54. కన్యాశుల్కం - నాటి సాంఘిక నేపథ్యం - డా॥. గుల్లిపల్లి జయపాలరావు 228
55. ముదిగంటి సుజాతరెడ్డి నవలలు - తెలంగాణ స్త్రీల జీవనం - పల్లెమోని జయమ్మ 232
56. "జాఘవా సాహిత్యంలో మానవీయత" - డా॥. చౌదం అదినారాయణ 235
57. గూడ అంజయ్య పాటలలో - సామాజిక జీవన చిత్రీకరణ - పోల్కం రాములు 238
58. భారత దళితోద్యమ వైతాళికుడు భాగ్యరెడ్డివర్మ జీవిత చరిత్ర - అచ్చ కమలాకర్ 240
59. తెలుగు దినపత్రికలు - ఆధునిక ధోరణులు - పరిశీలన - యం. అనిత 243

60. తెలుగు జానపద కళలు, కళా వైభవం, విశిష్టత, సమగ్ర పరిశీలన	- రవీందర్ అచ్చ	248
61. తెలుగు పత్రికలలో బాల సాహిత్య ఆవిర్భావం - వికాసం	- ముత్తె స్వప్న	252
62. గంగిరెద్దులాట - సామాజిక జీవన చిత్రణ	- పెదపాటి శ్రీవీరవెంకట శ్రీదేవి	254
63. గరికపాటి ఆశుకవిత్వం - సామాజిక జీవన చిత్రణ	- ఉల్లెంగ ముత్యం	256
64. భాగవత పురుషార్థ ధర్మాలు	- డా॥. పోల ఉమామహేశ్వరరావు	258
65. కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ అంతర్నేత్రం-సామాజిక చిత్రణ	- పళ్లెం జ్యోతి	261
66. మధుసూదన్ "బతుకుబండి" - సామాజిక దర్శనం	- డా॥. ఎ. విజయలక్ష్మి	265
67. సమాజ దర్పణం గురజాడ	- డా॥. వాసిరెడ్డి భవాని	269
68. జీవన భాష : కవితా విమర్శ	- అలువాల శ్రీలత	272
69. తెలుగు సాహిత్యంలో అత్యాచారాల పై కవిత్వం (శీర్షిక)	- జ్వలిత	275
70. రాయలసీమ కథ - ప్రాంతీయ అస్థిత్వం (1981 - 90)	- కె. సంగాలు	279
71. డా॥ యమ్.వి.జె.భువనేశ్వరరావు జీవన ప్రస్థావన	- కె. నారాయణ	285
72. ఆచార్య ఇనాక్ గారి 'విఘ్ను వినాయకుడు' కథా - పరిశీలన	- నోముల రాజు	290
73. పుట్టపర్తిగారి కలంలో-ఓరుగల్లు, రుద్రమదేవి కీర్తి, పరాక్రమాలు	- నోముల సుమలత	294
74. తెలుగు కథ - ముసుగుల్లో ముస్లిం మహిళల ఆక్రందన	- డా॥ .పి .వరలక్ష్మి	297
75. స్త్రీవాద కథలు - సామాజిక చైతన్యం	- ఉషారాణి పిల్లి	301
76. "బతుకాట"నవల వస్తువు, సామాజికాంశాలు విశ్లేషణ	- పొంకం నాగరాజు	308
77. కన్నెగంటి అనసూయ 'ఆవిడెవరు...?' కథా సంపుటి - సామాజిక చిత్రణ	- ఆర్. లక్ష్మీ ప్రసన్న కుమార్	313
78. చింతా అప్పలనాయుడు కథలు - సామజిక జీవన చిత్రణ	- సారిపల్లి నాగరాజు	316
79. లోకరీతి శతకము - సామాజిక జీవన చిత్రణ	- షేక్ జరీనా	319
80. కరీంనగర్ జిల్లా జానపద కథల వైశిష్ట్యం - విశ్లేషణ	- టి. భోజన్న	324
81. తెలుగు సాహిత్యం - శ్రామికస్త్రీల జీవన చిత్రణ - చైతన్యం	- టి. వెంకట నారాయణ	328
82. తెలంగాణ కథలు - సామాజిక సమస్యలు - కులవృత్తులు	- తోట రామకృష్ణ	331
83. నవీన్ నవలలు - సామాజిక స్పృహ	- డా॥. అల్లు గణేష్	334
84. శ్రీలత నవలా సాహిత్యం - సామాజిక జీవన చిత్రణ	- డా॥. బి. సుబ్బరత్నం	338
85. అభ్యుదయ కవిత్వం - సామాజిక జీవన చిత్రణ	- డా॥. కె. జ్యోతిలక్ష్మి	341
86. జాషువా తెరచాటు నాటకం - సామాజిక దృక్పథం	- డా॥. మందలపు నటరాజ్	348
87. తెలంగాణ గిరిజన కవిత్వం - బంజారాల జీవన చిత్రణ	- డా॥. నూనావత్ రాంబాబు	353
88. కథల్లో సామాజిక జీవన చిత్రణ	- డా॥. నల్లపనేని విజయలక్ష్మి	358
89. వచన కవిత్వంలో రైతు జీవిత చిత్రణ	- డా॥. సుబ్బర రామాంజనేయులు	362
90. అత్యాధునిక కవితా రూపం 'నానీలు'	- డా॥. వెల్దండి శ్రీధర్	365

91.	మాలపల్లి నవల కథా సంగ్రహం - సామాజిక జీవన చిత్రణ	- జి.బాలకృష్ణ	370
92.	ఓల్గా కథలు - సమాజంలో "స్త్రీ" పాత్ర	- గొల్లపల్లి వనజ	372
93.	జాషువా కవితలో దేవతా మూర్తులు	- కొణతం చైతన్య కుమార్	376
94.	"సంజీవదేవ్ - సామాజిక చైతన్యం - రేఖామాత్ర పరిశీలన	- లంక ఎల్.ఆర్.వెంకటరమణ	380
95.	'సంకెళ్ళు తెగాయి' - సామాజిక మార్పు	- డా॥. మేడికుర్తి ఓబులేసు	383
96.	ఆధునిక తెలుగు సాహిత్యం - తెలంగాణ కవుల రచనలలో జీవన చిత్రణ	- యస్. రజిత	386
97.	ఎన్. పూజిత నవలలు - సామాజిక జీవన చిత్రణ	- పి. జ్యోతి	389
98.	దిద్దుబాటులో సామాజిక జీవన చిత్రణ	- పెదనారప్ప గారి సురేష్	395
99.	నిద్రాజగత్తులో హాస్య రసపోషణ	- వై. బుజ్జి	397
100.	కృష్ణమోహన్‌గారి 'నారీ హంలతకుడు' నవలలో జీవన చిత్రణ	- బి. ఆంజనేయులు	401
101.	ఈతరం అమ్మాయిలు - సామాజిక స్పృహ	- వింధ్యారాణి	405
102.	గంగుల శాయిరెడ్డి "కాపుబిడ్డ" - రైతు జీవిత చిత్రణ-విశ్లేషణ	- రాజస్వామి గోగు	408
103.	కవి జీవిత పరిశోధనల్లో డా॥. సి.ఆర్. రెడ్డి జీవితం, రచనలు - పరిశీలన	- వనపర్తి శ్వేత	411
104.	ఆధునిక తెలుగు సాహిత్యం - చాకలి వారి జీవిత ప్రస్తావన	- రమేష్ గంగుల	414
105.	సినిమాలుగా రూపొందిన తెలుగు నవలలు - పరిశీలన	- వేణు జక్కరాజు	418
106.	ఆంధ్ర మహాభారతం - మానవీయ విలువలు పరిశీలన	- శ్యామల కడారి	423
107.	కొలకలూరి ఇనాక్ కథానికలలో మానవత విలువలు	- శోభరాణి. టి	427
108.	సాహిత్యంలో చారిత్రక నాటకాల విశిష్టత - విశ్లేషణ	- మంతెన జ్యోతి	432
109.	దళితవాద కవిత్వం - శీర్షికాశిల్పం పరిశీలన	- ఆర్. భార్గవి	436
110.	సంప్రదాయ కవిత్వంలో స్త్రీ చిత్రణ - స్త్రీవాద దృక్కోణం పరిశీలన	- బాల్తి సునీత	441
111.	గురజాడ వారి ముత్యాలసరాలు - సామాజిక చిత్రణ	- డా॥. డి. సుశీల	446
112.	నూతన సాహిత్య ప్రక్రియ సిరిమంజరిలో సామాజిక జీవన చిత్రణ	- ధనాశి ఉషారాణి	451
113.	నీలిమేఘాలు - స్త్రీ మానసిక సంఘర్షణ పరిశీలన	- జె. కృష్ణవేణి	453
114.	తెలంగాణ మాండలిక నవలలు : నూతన ఆవిష్కరణలు పరిశీలన	- గణేష్ వేమునూరి	458
115.	వరంగల్ జిల్లా పత్రికలు - సాహిత్య సేవ పరిశీలన	- నాగపురి స్వప్న	464
116.	నాగప్ప గారి సుందర్రాజు కథలు - మాదిగల జీవన చిత్రణ	- డా॥. ఆంజనేయుడు	469
117.	కటుకోజ్వల మనోహరాచారి - "ఆత్మీయులు" తెలుగు కథ	- డా॥. నాగరాజు అసిలేటి	474
118.	నవలల్లో నటీమణుల జీవిత చిత్రణ	- డా॥. ఎవివికె. చైతన్య	478
119.	ఆముక్త మాల్యదలో జనజీవనం	- డా॥. బశెట్టి ఉపేంద్ర	486
120.	పుంజీతం కథలు సామాజిక జీవన చిత్రణ	- డా॥. బాసని సురేష్	489
121.	'ప్ర'పంచపదులు - సామాజిక జీవనాంశాలు	- డా॥. సిహెచ్. పవన్‌కుమార్	492

122. తెలుగు కథానికలు - స్త్రీ జీవిత చిత్రణ - డా॥. డి. మస్తానమ్మ 497
123. డా॥ పి. కేశవరెడ్డి నవలల్లో సామాజిక జీవన చిత్రణ - డా॥. జి. పార్వతి 501
124. అగ్గిపుల్లల నవలిక - విద్యార్థుల జీవనశైలి - డా॥. డి. సత్యలత 505
125. తెలంగాణ కథలు - సామాజిక జీవన చిత్రణ - డా॥. డి. విజయకుమారి 510
126. సమాజ ప్రతిబింబం - నాడు నేడు - డా॥. దీవి కోమలారాణ 520
127. ప్రాంతీయ చైతన్య నవలలు - సామాజిక జీవన చిత్రణ - డా॥. ప్రకాశరావు జి 526
128. ఆధునిక సాహిత్యంలో కరువు ప్రభావ చిత్రణ - డా॥. జి. వెంకట రమణ 532
129. కరోనా కథ - ముస్లిం సామాజిక జీవన చిత్రణ - డా॥. జడా సుబ్బారావు 538
130. ఆధునిక తెలుగు సాహిత్యం సామాజిక జీవన చిత్రణ - కె. నవీనరాణి 542
131. భువనచంద్ర సినీగేయాలు - సామాజిక జీవన చిత్రణ - డా॥. కె. రామలక్ష్మి 548
132. రావూరి భరద్వాజ 'జీవన సమరం' - సామాజిక జీవన చిత్రణ - డా॥. కె.వి.యన్.డి. వరప్రసాద్ 552
133. తెలంగాణ కథా పరిణామం - డా॥. కడివెండి మమత 556
134. గొరుసు జగదీశ్వర రెడ్డి కథల్లో మానవ జీవిత చిత్రణ - డా॥. మంద వెంకటరత్నం 558
135. అంటారాని గొంతు ఆక్రందనం - అక్రమ సంతానం - డా॥. మెండా దేవానంద్ కుమార్ 561
136. జానపదుల జీవన విధానం - సామాజిక జీవన చిత్రణ - డా॥. ఒభిన్ని శ్రీహరి 563
137. అస్పృశ్యమవుతున్న దేశీ శబ్దజాలం నిమ్నతీకరణంలో - డా॥. పి.ఎ. సత్యనారాయణ 566
138. అద్దేపల్లి సాహిత్యం - సామాజిక జీవన చిత్రణ - డా॥. పి. కాళియప్ప 569
139. అమెరికా తెలుగు కథలు - సామాజిక పరిణామం - డా॥. పలివెల చిరంజీవిరావు 576
140. పదహారణాల రైతు - జీవన చిత్రణ - డా॥. రొట్ట గణపతిరావు 581
141. అల్పజీవి - సామాజిక జీవన చిత్రణ - డా॥. రాపోలు శ్రీనివాస్ 584
142. ప్రపంచీకరణ సాహిత్యం - సామాజిక జీవన విధ్వంసం - డా॥. సింగర వాణి 589
143. వచన కవిత్వంలో స్మృతి - సామాజికత - సుంకర గోపాలయ్య 592
144. ఆధునిక కవిత్వంలో దగాపడిన దళిత జీవన చిత్రణ - డా॥. తరపట్ల సత్యనారాయణ 594
145. 'రంధి' నవల - సామాజిక జజీవన చిత్రణ - ఎలగొండ రాములు 599
146. చల్లా రాధాకృష్ణ శర్మ రచనల్లో సామాజిక జీవన చిత్రణ - ఎంబేటి అమృతేష్ 602
147. 'పాకుడురాళ్ళు'- సామాజిక సమస్యలు, అంశాలు - గంధం వేణు 605
148. గురజాడ అప్పారావు కవిత్వము - సామాజిక వాస్తవికత - డా॥. పట్టపు శివకుమార్ 610
149. కాళోజీ కథల్లో సామాజిక జీవన చిత్రణ - జె. శంకర్ 614
150. రూపనగుడి నారాయణరావు నాటకాల్లో సామాజిక జీవన చిత్రణ - కె. ఎం. సునీల్ కుమార్ 618
151. పానుగంటి వారి సాక్షి వ్యాసములలో సామాజికాంశములు - కె. మాధవి 622
152. అగరం వసంత్ హొసూరు కథలు - సామాజికాంశాలు - కె. సతీష్ కుమార్ 626

153. శ్రీశ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు- సామాజిక చిత్రణ - కె. శంకర సాయిబాబు 631
154. అధునిక సమగ్ర సామాజిక కావ్యం - "ఆసుపత్రి గీతం" - ఖలీమ్ పాషా 634
155. చలం సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛ - సత్య శిరీష కాళ్ళకూరి 635
156. "తెలంగాణ దళిత కవిత్వం - సామాజిక జీవన చిత్రణ" - కందాళ వనదుర్గా రోహిణి 640
157. రేగులపాటి కిషన్‌రావు 'అన్వేషణ' కథలు - సామాజిక చిత్రణ - కటుకం శారద 643
158. సావుకూడు - సామాజిక జీవన చిత్రణ - కాటంగారి బాబు 648
159. పాలేరు నాటకంలో నవరసాల సామాజిక జీవనం - కవాడపు లలిత 651
160. సినారె పాటలో సామాజిక జీవన చిత్రణ - ఎమ్. ఎన్. వి. సూర్యకుమారి 654
161. పండుగలు - సామాజిక చిత్రణ - యం. నాగమ్మ 657
162. గంటేడ గౌరునాయుడు కథలు - సామాజిక జీవన చిత్రణ - ఎం. రమాగీతాదేవి 660
163. వందేళ్ల కథకు వందనాలు కథల్లో సామాజిక జీవిత చిత్రణం - మళ్ళా పెంచల ప్రసాద్ 663
164. కాలం వెంట నడిచిన కథ - నందిగామ నిర్మలకుమారి 666
165. కె. వరలక్ష్మి గారి కథలో సామాజిక చిత్రణ - పోతురాజు దుర్గాదేవి 670
166. బైబిల్‌ల్లోని ప్రజల జీవన విధానం - సాంఘిక పరిస్థితులు - సుజిత రెడ్డి 674
167. రాచపూటి రమేష్ కథలు - జీవన చిత్రాలు - యస్. చంద్రయ్య 680
168. చలం సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛ - సత్య శిరీష కాళ్ళకూరి 684
169. అట్టాడ అప్పలనాయుడుగారి కథలు - సామాజిక దృక్పథం - తలారి సుజాతమ్మ 689
170. జయంపు కృష్ణ కథలు - సామాజిక జీవన చిత్రణ - తుళ్ళూరు రవి 693
171. కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ నవలలు-సామాజిక జీవన చిత్రణ- యు. సత్యప్రభ 696
172. తెలుగు సాహిత్యంలో గజళ్లు - డా॥. ఉడాలి విష్ణుప్రియ 700
173. డా॥ కొండెపోగు సాహిత్యం - సామాజిక జీవన చితణ్ర - ఉడుముల అంజిరెడ్డి 705
174. నానీలు - సామాజిక జీవన చిత్రణ - వి. వింధ్యవాసినీ దేవి 709
175. కోమలాదేవి దాంపత్యాలు నవల - సామాజిక చిత్రణ - వడ్డివాటి మల్లయ్య 715
176. విహారి 'కొత్తనీరు' కథా సంపుటి - సామాజిక జీవన చిత్రణ - డా॥. కాళిశెట్టి సంధ్య 719
177. నేటి సమాజానికి అవసరం మానవతావాద సాహిత్యం - డా॥. నందనవనం శివ కుమార్ 723
178. గబ్బిలం సామాజిక చైతన్యం - ఎన్. నరేంద్ర 726
179. విద్యార్థి నవల - సామాజిక జీవన చిత్రణ - నూకల విజయలక్ష్మి 728
180. ఆచార్య కొలకలూరి మధుజ్యోతి కథల్లో స్త్రీ - సిరిగిరెడ్డి గంగాదేవి 731
181. వయన కవిత్వం - స్త్రీ అస్తిత్వం - సామాజిక జీవన చిత్రణ - డా॥. బూసి వెంకటస్వామి & - పెండ్యాల లావణ్య 734
182. Gurajada's Modernistideals and Enigmatic Social Concerns - Dr. B. Venu gopala Rao 738

"నేను" యౌగిక కావ్యం : సామాజిక జీవన చిత్రణ

– ఆచార్య దొర్ల వెంకటేశ్వరరావు, తెలుగుశాఖ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటి, గచ్చిబౌలి, హైదరాబాద్.

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం అంటారు. అయితే తాను జీవించే సమాజ చిత్రణ తన రచనల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది. తాను పుట్టి పెరిగిన వాతావరణం, తనకు ఉన్నటువంటి పరిచయాలు, తాను చదివిన నా రచనలు, తాను విన్న ప్రసంగాలు మొదలైన వన్నీ కూడా తన రచనలో ప్రతిబింబిస్తుంటాయి. వాటిని బట్టే ఆ రచయిత దృక్పథం, అతని సామాజిక జీవన విధానాన్ని తెలుసుకోగలుగుతాం.ఈ నేపథ్యం నుండే డాక్టర్ వాసిలి వసంత కుమార్ 'విశ్వర్షి వాసిలి' కలం పేరుతో 'నేను' యౌగిక కావ్యంలో గల సామాజిక జీవన చిత్రణ గురించి ఈ పత్రంలో పరిశీలించాలనుకుంటున్నాను.

సాధారణంగా సాహిత్యంలో సమాజజీవన చిత్రణ అనేది వివిధ పాత్రలు, సన్నివేశకల్పనలు, వర్ణనల ద్వారా జరుగుతుంది. కానీ, వచన దీర్ఘకావ్యంలో ఒక బలమైన వస్తువుని లేదా ఒక అంత: సూత్రాన్ని లేదా ఒక సిద్ధాంతాన్ని వర్ణిస్తుంటారు. "నేను" యౌగిక కావ్యం ఆధునిక సమాజంలో కొంతమంది ఆలోచనాదృక్పథంగా అభివర్ణించవచ్చు. కొంతమంది ఆలోచనాదృక్పథం అంటే కొంతమంది సమాజంలో భాగమే కదా. కాబట్టి, ఆ సమాజిక జీవన చిత్రణ ఎలా ఉందనేది ఈ కావ్యాన్ని అనుసరించి గుర్తించే అవకాశం ఉందనుకుంటున్నాను.

ఆధునిక తెలుగు సాహిత్యంలో 1977-85 సంవత్సరాల మధ్య కాలంలో దీర్ఘకావ్యాలు వచ్చాయి. నగ్నముని "కొయ్యగుర్రం" (1977) ని ఇంచుమించు దీర్ఘకావ్యానికి ఉండవలసిన అనేక లక్షణాలున్న రచనగా విమర్శకులు భావిస్తున్నారు. ప్రముఖ విమర్శకుడు చేకూరి రామారావు గారు కొయ్యగుర్రం గురించి వ్యాఖ్యానిస్తూ దీర్ఘకావ్యం గురించి ఇలా అన్నారు. "కావ్య ఖండికల్లో ఒకే వస్తువు (అంటే కథకాదు), ఒకే భావం ఉంటాయి. ఒక ఖండికలో భిన్నభావాల్ని పలికించడం కష్టం. దానికి కొంత విస్తీర్ణత కావాలి. మనం రోజూ చేసే ఖండికలకన్నా పెద్దవిగా ఉంటే తప్ప భిన్న భావాల్ని చెప్పడం కుదరదు. అంటే మహాకావ్యం కావాలి. మహాకావ్యానికి విస్తీర్ణతే ప్రధానం కాదు గానీ, అవసరమైన ఒకలక్షణం. పెద్ద ఫాంటులో అచ్చేయడం వల్లనో, పాదాలు విరవడం వల్లనో కవిత్వం కానట్టే, విస్తీర్ణత వల్ల ఏదీ మహాకావ్యం కాదు.కాలేదు. ఒక ప్రధాన వస్తువుతో, ఒక తాత్త్విక చింతనతో, సందేశంతో అనేక భావాలతో, మూడ్స్ తో కథలేకుండా 'అర్బేనిటి' అనే లక్షణం కలిగి ఉండి తగినంత విస్తారంగా ఉన్న దీర్ఘకవితను ఆధునిక మహాకావ్యం అంటున్నాను" (నగ్నముని కొయ్యగుర్రం- అవలోకనం, 2001: 10). చేరా గారు మహాకావ్యం అన్నా, దీర్ఘకావ్యం అనే ఆలోచనతోనే చెప్పారు. ఇలాంటి దీర్ఘ కావ్యాల్లో డా.సి.నారాయణరెడ్డి గారి 'విశ్వంభర', మట్టేమనిషీ ఆకాశం, వరవరరావు గారి 'సముద్రం', ఆరుద్రగారి 'త్వమేవాహం', ఖాదర్ మొయుద్దీన్ 'పుట్టుమచ్చ' మొదలైన వరుసలోనే 'విశ్వర్షి వాసిలి'గా పేరొందిన డాక్టర్ వాసిలి వసంతకుమార్ గారి "నేను"యౌగిక కావ్యం కూడా చెప్పుకోవచ్చు. దీన్ని మార్చి, 2020లో ప్రచురించారు. అంతకుముందే ఒక ఏడాదిగా కొన్ని పత్రికల్లోను, వాట్సప్ గ్రూపుల్లోను దీనిలోని కొన్ని భాగాల్ని ప్రచురించారు.

డాక్టర్ వాసిలి వసంతకుమార్ గారు యోగాశిక్షణ నిస్తుంటారు. యోగదర్శనానికి సంబంధించిన అనేక కావ్యాల్ని కూడా రాశారు. మనకే తెలియని మన రహస్యాలు, ఆధ్యాత్మిక జీవనతత్త్వం: అస్తిత్వ దృక్పథం, అస్తిత్వతాత్త్వికత, యోగ దర్శని మొదలైన గ్రంథాలు రాశారు. కనుక, యోగ వల్ల తనకు కలిగిన అనుభవాన్ని

విశ్వానుభవంగా వర్ణించడం ఈ కావ్యవిశిష్టత. ఈ కావ్యం లోని ''నేను'' వైయక్తికం కాదుబీ మానవునికి ప్రతీక. మానవ అన్వేషణకు ప్రతీక. మానవ పరిణామానికి ప్రతీక. మానవుడికీ, విశ్వానికీ జరిగే ఆలోచనల సంఘర్షణకు ప్రతీక. ఇలాంటి అభిప్రాయమే ఈ కావ్యానికి 'ఇదో యౌగిక అనుభావ్యం' పేరుతో ముందుమాట రాస్తూ ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ ''తాను అన్నది దీన్ని అభివ్యక్తీకరించిన కవికాదు... 'నేను' అనే ఒక సాకృత వ్యక్తిని నడిపించే చైతన్య శక్తి'' (పుట:9) అన్నారు.

మనం సాహిత్యంలో ఆధునికతను కాలానుగుణం గాను, ఒక తత్త్వంగాను అర్థం చేసుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన కొన్ని పరిణామాలు 'ఆధునికత'ను నిర్వచించుకునేలా చేశాయి. సాధారణంగా ఏ భాషలోనైనా, ప్రపంచంలో ఎక్కడనుండి వచ్చిన సాహిత్యమైనా ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది. దీన్ని సాహితీవేత్తలు భావవాద సాహిత్యం, భౌతికవాద సాహిత్యంగా పిలుస్తున్నారు. భావవాద దృక్పథంతో సాహిత్యాన్ని రాసేవారు సాహిత్యం భగవంతుని ప్రేరణవల్ల కలుగుతుందని భావిస్తారు. పూర్వజన్మసంస్కారాలు గురించి మాట్లాడతారు. పాలించేవాళ్లు దైవాంశ సంభూతులుగా భావిస్తూ, వాళ్ళకు అనుగుణంగా సాహిత్య సృజన చేస్తుంటారు. మన కష్టసుఖాలకు మన కర్మమే కారణమని వాదిస్తుంటారు. మానవుని చేతిలో ఏమీ లేదనీ, అంతా క్రమానుసారంగానే జరుగుతుందని భావిస్తుంటారు. సాధారణంగా ఇటువంటి భావాలతో కొన్నాళ్ళు మన తెలుగు సాహిత్యం కూడా కొనసాగింది. దీన్ని సంప్రదాయ సాహిత్యం, ప్రాచీన సాహిత్యం మొదలైన పేర్లతో పిలుస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా వచ్చిన కొన్ని మౌలికమైన మార్పులు మానవుల ఆలోచనా విధానాన్ని మార్చేశాయి. మూఢ విశ్వాసాలను, రాచరికాన్ని, నియంతృత్వాన్ని ధ్వంసం చేసి, ప్రత్యామ్నాయ ప్రజాప్రభుత్వాల్ని కొనసాగించవచ్చని రష్యా విప్లవం (1917), ఫ్రెంచి విప్లవం (1789-1799) ప్రపంచానికి కొత్త ఆలోచనల్ని కలిగించాయి. ఫ్రెంచి విప్లవం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావనలను ప్రపంచానికి అందించింది. రష్యా విప్లవం మానవ ఆలోచనా విధానాన్ని కొత్తమలుపుకి తిప్పాయి. దైవాంశ సంభూతులు, వంశపారంపర్యపాలన, పాపపుణ్యాలు మొదలైనవన్నీ ప్రశ్నింపబడ్డాయి. ఈ హేతువాద దృష్టి మనిషిని దేవుడు-సైన్స్ అనే రెండు మార్గాల్లో ఆలోచించేలా చేసింది. దేవుడి సృష్టి - ఆ ఆలోచనలన్నీ మతంగా మారి, కొంతమందికి మాత్రమే సంతోషంగా జీవించే అవకాశం ఉందని బోధిస్తూ ఆ ఆలోచనలన్నీ ''దైవం'' చుట్టూ తిరిగేలా చేశాయి.

సైన్స్ - అంటే భౌతిక వాస్తవికత గురించి ఆలోచించే వాళ్ళు చారిత్రక వాస్తవాలను, సామాజిక పరిణామ గతుల్నీ హేతుబద్ధంగా విశ్లేషించడం మొదలుపెట్టారు. సమాజ ప్రగతి అంతా మానవ సృష్టి అన్నారు. ఈ ఆలోచనా దృక్పథంతో రచనలు చేసేవాళ్ళంతా మానవుణ్ణి కేంద్రంగా చేసుకొని తమ రచనల్ని కొనసాగించారు.

ఈ మానవుడి కేంద్రంగా జరిగే చర్చలో పాల్గొన్న వారు 'మానవకేంద్రితం' గురించి కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారు '' మానవుడంటే ఎవరు? ఈ ప్రాణికోటిలో మనం భావించే అత్యున్నత ప్రతిభాసంపదలు ప్రదర్శించే నరుడేనా? ఈ ప్రతిభా సంపదులకు మూల విధాన మేమిటి? మానవుణ్ణి ఇంత ఉన్నతంగా తీర్చి దిద్దుతున్న ఆ చైతన్య స్రోతస్విని స్వరూపం ఏమిటి? 'పరస్పర సంబంధం లేనట్లుగా అగుపించే రెండు సమాంతరాల సమన్వయమే సత్యం' అనే మాట పూర్వులనేక విధాలుగా చెప్పారు. 'పూర్ణమదం పూర్ణమిదం' అన్న ఉపనిషద్వాక్కు నుంచి మొదలుపెట్టి, 'ది సమ్మింగ్ అప్' (The Summing Up) నవలా రచయిత సోమర్సెట్ మామ్ వరకు ప్రాక్పశ్చిమ దార్శనికులు, రచయితలు పలువిధాలుగా అభివర్ణించారు. ఎంత అభివర్ణించినా ప్రాథమిక అంశాలు రెండే.

ఒకటి పదార్థమూ, రెండు చైతన్యమూ. ...రెండూ కలిస్తే ప్రాణి. ప్రాణికి రూపం ఇచ్చేది పదార్థం. అర్థం చెప్పేది చైతన్యం. దాని మహార్థాన్ని జీవన సార్థక్యం కోసం వినియోగించుకోవటమే కాకుండా ప్రకృతిని తన అధీనం లోకి తెచ్చుకొని, దానికి పూరణగా నంన్కృతిని నిర్మించుకున్న జీవి మానవుడు" అని వివరించారు. (పుట: 10) ఈ అభిప్రాయాన్ని గమనిస్తే, పదార్థం-చైతన్యం గురించి వాటి అవినాభావ సంబంధాన్ని, దాని ముందు వెనుకల గురించీ చర్చలు మొదలవుతాయి. ఇవన్నీ తాత్వికాంశాలు. కళ్ళకు కనిపించే సత్యాలుగా కొన్నింటినైనా నిరూపించే భౌతిక శాస్త్రజ్ఞులు, ఆ ఆలోచనలున్న షడ్దర్శనాలు, ఉపనిషత్తుల వంటి వాటిలో నిష్ణాతులు రచనలు చేయడం, వాటిని వ్యాఖ్యానించడం వంటివి చేయగలిగినప్పుడే నిజమైన 'సత్యం' స్పష్టమయ్యే అవకాశం ఉంది. సత్యాన్ని అన్వేషించే క్రమం నరంతరం కొన సాగాల్సిందే. దీనిలో భాగమే ''నేను'' యౌగిక కావ్యం కూడా! అందుకనే ఆ రకమైన ఆలోచనల జీవన విధానాన్ని ఈ కావ్యం ప్రతిఫలిస్తుందని అనగలుగుతున్నాను.

నేను యౌగిక కావ్యం- సంప్రదాయ-ఆధునిక భావనల సమన్వయ దృష్టితో వచ్చిన కావ్యమని ప్రతిపాదిస్తున్నాను. ప్రపంచ సృష్టి, దానిలో మానవుడు, మానవుని అస్తిత్వం, మానవుని జీవన గమ్యం మొదలైనవన్నీ తాత్వికదృక్పథంతో వర్ణించారు. కొన్ని విషయాల్లో భౌతికాంశాలకు ప్రాధాన్యం ఉంటే, మరికొన్ని అంశాలకు కేవల భౌతిక సత్యాలతోనే నిరూపితం కాదనే కోణంలో ఈ కావ్యవర్ణన సాగింది. సైన్స్ కూడా చెప్పలేని అనేకాంశాలు మనముందుకొస్తున్న 'సమకాలీన మానవ జీవనం' ఈ కావ్యంలో ప్రతిఫలిస్తుంది. వీటిలో కొన్ని అంశాల్ని వివరించే ప్రయత్నం చేస్తాను.

నేను యౌగిక కావ్యం (2020) ఏడు విభాగాలుగా ఉంది. పరిణామ, ప్రమోద, ప్రమాణ, ప్రస్థాన, ప్రయోగ, ప్రవిమల, పరమపథాలు అనేవి ఆ విభాగాలు.

"శూన్యం కాని స్థితీ కాని
గగనం లేని గాలీ లేని
వెలుతురు చేరని చీకటి చేరని
వాయులీన ఖగోళత
అణువుకు అనంతానికి అభేదకత"

(నేను యౌగిక కావ్యం, పుట: 48)

అని కావ్యాన్ని ప్రారంభించారు.

సృష్టి ఎలా ప్రారంభమైందనే ఆలోచన ఇక్కడ కవిత్వంగా మారింది. విశ్వావిర్భావినికి రకరకాల సిద్ధాంతాలున్నాయి. దేవుడే సృష్టికారకుడని ఒక సిద్ధాంతం. బిగ్ బ్యాంగ్ థియరీ మరొకటి. ఒక పెద్ద విస్ఫోటన ఫలితంగా విశ్వం ఏర్పడ్డదని చెప్పేదే బిగ్ బ్యాంగ్ థియరీ. మహా విస్ఫోటన సమయంలో హీలియం సింథసైజేషన్ జరిగి ఉంటుందని పరిశోధకుల అభిప్రాయం. హీలియం (Helium) అనేదొక రసాయన మూలకం. రంగు, రుచి, వాసన లేని, విషపూరితం కాని (non-toxic), తటస్థమైన ఒకే అణువు కలిగిన రసాయన మూలకంగా చెప్తారు. Hydrogen (ఉదజని) ఒక రసాయన మూలకం. దీన్ని ఎఅనే సంకేతముతో సూచిస్తారు. ఉదజని యొక్క అణు సంఖ్య 1. మూలకాల పట్టికలో ఇది మొదటి మూలకం. హైడ్రోజెన్ ని ఆంగ్లంలోని ఎ అనే అక్షరంతో మూలకాల పట్టికలో మొదటిగా సూచిస్తారు. తర్వాత 2 వదిగా సూచించేది హీలియం (He). సాధారణోష్ణము, పీడన ముల వద్ద ఇది రంగు, వాసన, రుచి లేని, అలోహిత బణు (H_2) వాయువు. ఇవన్నీ పై కవితాత్మక పంక్తుల్లో సులభంగా వివరించాడు కవి. ఇలా శాస్త్రీయంగా వివరించాల్సిన అంశాలెన్నో ఈ కవిత్వంలో ఉన్నాయి. అలాంటి సృష్టి ఆవిర్భావంలో మానవుని ఆవిర్భావం జరిగిన పరిణామాన్ని ఇలా కవిత్వీకరిస్తారు కవి.

"కాలం స్థితీ విడివడని ఏకత
ఆ ఏకత్వంతో ఖగోళ జవజలం
జలధిన ఈదులాడుతూ ఒక జీవం
జీవనానికై కలయ తిరుగుతున్న ప్రాణం
జల జీవనానికి ప్రాణభూతంలా భూగోళం

భూగ్రహానికి శ్రీకరంగా నేను (పుట: 49)

ఇక్కడ మత గ్రంథాల్లో సృష్టి ఆవిర్భావం గురించి కనిపించే వర్ణనల్లా అనిపిస్తాయి. కానీ, తర్వాత '' జలతత్వంతో ముడిపడ్డ మానవతత్త్వం/మత్స్యావతారంగా తొలి ఆవిష్కరణ'' అని ప్రతిపాదిస్తారు కవి. ఇక్కడే కవి భారతీయ దార్శనిక ఆలోచనాదృక్పథంతో శాస్త్రీయంగా వివరించే ప్రయత్నం కనిపిస్తుంది. కేవలం దశావతారాల్ని ఉన్నతీకరిస్తూనో, దాన్నే విశదీకరిస్తే ఒక వర్గానికి వెనుకేసుకొచ్చిన వాదనతో నిండిన కావ్యమయ్యేది. అలా కాకుండా -

"చిరుజీవం పెరుగుతూ పెనుజీవం కావటం
పెరిగిన కణం మూల కణంగా వెనుతిరగడం
రేపటి కోసం ఒకరిని ఒకరు ఆశ్రయించడం
చివరికి నిష్క్రమించడం సృష్టి పరిణామం
తిరోగమనం మృతతత్వానికి తొలిపరిణామం
ఇదే నా జనన మరణ ఆవిష్కృత రహస్యం"

(పుట: 51)

ఇక్కడున్నారు కవిగా, దార్శనికుడిగా 'విశ్వర్షి వాసిలి'. మన కళ్ళముందు కనిపించే వాస్తవాన్ని భ్రమలుగా చెప్పబ్లేదు. జనన-మరణాలు మనకి కనిపించే వాస్తవం. కానీ, మనిషి పుట్టింది అందుకేనా? ''తిరోగమనం మృతత్వానికి తొలిపరిణామం" అనే ప్రతిపాదనతో కావ్యాన్ని పురోగమనం దిశగా పయనించడం ఎలాగో వివరిస్తూ పరిపూర్ణం చేయడం కావ్యపరమార్థం. దీనికి శాస్త్రాన్ని, ఆధ్యాత్మిక రహస్యాలతో సమన్వయీకరిస్తూ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని హిందూ పురాణాల్లో దశావతారాలుగా చెప్పేవాటిలో గల అంతరార్థవ్యక్తీకరణగా జీవపరిణామాన్ని కవిత్వీకరిస్తారు కవి. "నేను కార్య జాతం కాదు.../ కర్మజాతం కానే కాదు..."(పుట: 52) అని తన శాస్త్రీయమైన అనుభవాన్ని, విశ్వరహస్యశోధన సత్యాన్ని నిజాయితీగా వెల్లడిస్తారు కవి. మొదటి భాగం 'పరిణామ పథం' సృష్టినీ, మానవ జీవ పరిణామాన్నీ శాస్త్రీయంగా కవిత్వీకరించడం వల్ల వేదాలు, పురాణాలు, కావ్యాలు మొదలైన వాటిలో గల తాత్త్విక సత్యాల్ని మహానుభావులు ప్రతీకలుగా అందించారని విశదీకరిస్తున్నట్లు తెలుస్తుంది. అందువల్ల మరలా హిందూ పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాల్ని ఈ దృష్టితో అధ్యయనం చేయాలనే ప్రేరణ కలుగుతుంది. బుద్ధుడు, కృష్ణుడు, పాండవులు, జీసస్, మహర్షుల జన్మకొక ఒక పరమార్థం ఉందంటారు. మానవ పురోగమనానికి ఆ పరమార్థాన్ని అవగాహన చేసుకోవడం అవసరమంటారు.

"నేను రాగాన్ని మోసుకుంటూ
చరణారవిందమవుతుంటాను
వైరాగ్యాన్ని సృజిస్తూ
ముకుళిత హస్తమవుతుంటాను
జీవితంలో పాడుకుంటూ పాదుకుంటూ
మృత్యువును చేదుకుంటూ చేరుకుంటూ
నా నరాలు నయగారాలు పోతున్నాయి
నా నేత్రాలు అరమోడ్పులతున్నాయి"

(పుట: 58)

అని మానవ జీవితానుభవంలో గల సుఖదుఃఖ దశల్ని వర్ణిస్తూనే చివరికి ఏమవుతామో చదివేసరికి కళ్ళు చెమరుస్తాయి. ఆకులో ఆకునైపోతానన్న కవి దేవులపల్లి కృష్ణశాస్త్రిని గుర్తుకు తెస్తున్నట్లనిపిస్తుంది. కానీ, ఒక భౌతిక వాస్తవం మనిషి మరణించడం. నిజంగా అది మరణమేనా? దీన్ని '' నేను వాస్తవ నిశ్శబ్ద గమనాన్ని ... స్వప్న శబ్ద గమకాన్ని/ ఇంద్రియ సంచారిని... పరమ పథ విహారిని/ ఇద్ధరిన ద్వైతాన్ని... అద్ధరిన అద్వైతాన్ని" అని చెప్పడంలోనే విశ్వర్షి వాసిలి గారి ఔచిత్యం, ఉదాత్తమైన భావన కనిపిస్తుంది. ఇక్కడ పరమ పథం అంటే ఏమిటో కూడా ఆయనే వర్ణిస్తూ '' విశ్వమే నేను" (పుట: 58) అని స్పష్టంగా చెప్తారు.

"నా అక్షరం / ఆత్మదర్శనాల నిఘంటువు/ సాధనా రహస్యాల సర్వస్వం" (పుట:76) "నేను అష్టాంగ దర్శనను/ నవనాడుల చరిత్రను'' (పుట:93), ''నేను గర్భస్థ మంత్రాన్ని/విశ్వకుండలిని తంత్రాన్ని/ సహస్ర మండల పారవశ్యాన్ని'' (103) మొదలైన భావాలన్నీ యోగ

దర్శనానికి సంబంధించినవి. యోగా చేస్తే మానవుడు పొందే నిజమైన ఆనందం తెలుస్తుంది. దేహధర్మం తెలుస్తుంది. దేహధర్మం తెలిస్తే మరణిస్తామనే దు:ఖం నుండి విముక్తులవుతాం. ఈ కావ్యంలో అనేకచోట్ల బుద్ధుని ప్రస్తావన కనిపిస్తుంది. బౌద్ధంలో గల శాంతికి మూలం ధ్యానం. ధ్యానం యోగా మౌలిక ధర్మం. అలా విశ్వం తెలియాలన్నా, విశ్వరహస్యాల్లో అంతర్భావమైన మానవ దేహతత్త్వం తెలియాలన్నా యోగరహస్యాలు తెలియాలనే భావనలు గల కవితాత్మక వాక్యాలు కావ్యం నిండా మనల్ని యోగావైపు మళ్లిస్తాయి. కావ్యాన్ని చదువుతున్నంత సేపూ ఆ సత్యాలు అనుభవంలో కొచ్చే కొద్దీ మనసంతా ఆనందతాండవం చేస్తుంది. "నేను మూడుకోట్లను దాటాలి/మూఢమతులను కాదనగల గాలి" అని జ్ఞానంగా ప్రాచుర్యంలో ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టుకోవాలనీ, విశాలమైన భావాల్ని అలర్చుకోగలిగినప్పుడే నిజమైన మనమేమిటో మనకి అర్థం అవుతుందని, వీటిని ప్రతిమనిషి ప్రాథమికంగా తెలుసుకోవాలంటారు కవి. "నేను భాషను దాటాలి/ భావవలయ భాషాభేదాలను దాటిపోగలగాలి" (పుట: 124) అనే మహోదాత్తభావనలు ఉన్న ఈ కావ్యం పాఠకుడికి విశ్వమానవుణ్ణి తయారు చేసే పొజిటివ్ ఎనర్జీనిస్తుంది. ప్రకృతితో మానవుడు ఉంటున్న తీరు, ఉండాల్సిన తీరుని తాత్త్వికంగా తెలుసుకోవడానికి ఈ దీర్ఘకావ్యం ఎంతగానో తోడ్పడుతుంది. ఇది తెలుగు భాషలో వెలువడొచ్చు. కానీ, దీనిలోని భావాలు అన్ని భాషలవాళ్ళు చెందినవి. ఇది ఈ దేశంలో వెలువడొచ్చు. కానీ, ఈ కావ్యంలోని భావాలు ప్రపంచంలోని అందరి అనుభవాలు. ఈ కావ్యంలోని భావాల్ని అవగాహన చేసుకోగలిగితే ఈ విశ్వాన్ని అర్థం చేసుకోగలిగినట్లే. అందుకే విశ్వమే తానై, తానై విశ్వమై యోగదార్శనిక సత్యాన్ని ప్రవచించారు 'విశ్వర్షి వాసిలి'

కవి ఈ కావ్య నేపథ్యాన్ని వివరిస్తూ "ఆధ్యాత్మిక దృష్టి కోణానికి ఆధునికతను మేళవించి పలుకుతున్న" కావ్యమని ఒక పాఠకులెవరో అన్నారని, ఆ అభిప్రాయాన్ని అంగీకరిస్తున్నట్లుగానే వాటిని ఉదహరించుకున్నారు. మొత్తం మీద ఈ "నేను యౌగిక కావ్యం" సమకాలీన వైజ్ఞానిక మానవుని అంత: సంఘర్షణ, పరిణామాల్ని మనకళ్ళముందుంచుతుంది. "మనవుకు ఆది రూపమైన మత్స్యం నుండి, నేటి మానవ సంఘ మనుగడ వరకూ మనో యోగ పర్యటనను కావించే" (పుట:32) రచనగా ప్రముఖ విమర్శకురాలు డాక్టర్ రాజేశ్వరి దివాకర్ల గారు పేర్కొన్నారు. పంచభూతాలు, పంచకోశాలు, చతుర్విధ పురుషార్థాలు ఇంద్రియాలు, ఆత్మ, ధ్యానం, మొదలైన వాటిని మాత్రమే కాకుండా, భూలోక ఆవరణకు అతీతమైన ఈ ప్రాకృతిక ప్రపంచంలో మనిషి స్థానాన్ని యోగికంగా శోధించిన మహోన్నత కావ్యంగా డాక్టర్ రాయదుర్గం విజయలక్ష్మి అభిప్రాయపడ్డారు. (పుట:34) డాక్టర్ ఏల్చూరి మురళీధరరావుగారు ఈ కావ్యాన్ని ప్రతీకాత్మకంగా భావిస్తూ, వైదిక విషయాలు, ఐతిహాసికాలు, పౌరాణికాలు, వైజ్ఞానికాలు, కాల్పనికాలు మొదలైన అనేకాంశాల సంగమంగా వ్యాఖ్యానించారు. (పుట: 20) ఈ అభిప్రాయం ప్రకారం కూడా "నేను" యౌగిక కావ్యం కాలానుగుణంగా ఆధునిక కావ్యంగా నిలుస్తూనే, తాత్త్వికంగా కొన్ని సంప్రదాయాల్ని చర్చకు పెడుతున్న కొంతమంది ఆలోచనలకు ప్రతిఫలనంగా ఈ కావ్యాన్ని గుర్తించవచ్చు.

❖ ❖ ❖

అప్పల్నాయుని కథల్లో రైతు జీవితం

– ఆచార్య కె. శ్రీదేవి & చంద్రబాబు, పరిశోధక విద్యార్థి, తెలుగుభాష & అనువాద అధ్యాయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

చంద్రమ్మ భర్త గుంపస్వామి నాయుడు. రైతులతో కబుర్లు తప్ప యింటి వ్యవహారాలు పట్టించుకునేవాడు కాదు. నీలకంఠేశ్వర స్వామి ఆలయ మాన్యం, తాతముత్తాతల ఆస్తి, పుట్టింటి వారిచ్చిన పొలంతో పాటు పశుసంపద, యింటి వ్యవహారాలు చంద్రమ్మే చూసుకునేది. ముగ్గురు ఆడపడుచుల పెళ్లి తమ స్థాయికి తగ్గట్లుగా చేస్తుంది. ముగ్గురు ఆడపిల్లలను, ఒక్కడే అయిన కొడుకు సూర్యనారాయణ బాగోగులు చూసుకుంటుంది. గ్రామంలోని రాజకీయ కారణాల వలన దేవాలయ మాన్యం కౌలు సర్పంచి చేతికెళుతుంది. గుంపస్వామినాయుడు ఎలుగు దాడిలో గాయపడి యింటి పట్టునే ఉంటాడు. ఇద్దరు కూతుళ్ళకి పెళ్లి చేయటం, సంప్రదాయ పంటల స్థానంలో వేసిన వాణిజ్య పంటలు నష్టపోవటంతో చంద్రమ్మ ఆస్తులు ఒక్కొక్కటిగా తరిగిపోతాయి. పట్నంలో చదువుతున్న కొడుకు సూర్యనారాయణ సరోజను ప్రేమించి పెళ్లి చేసుకొని యింటికి తీసుకొస్తాడు. చంద్రమ్మ పరిస్థితి మరింత దిగజారుతుంది.

రెండో చెల్లెలు పెళ్లికని తనఖాలోని పొలం అమ్మించి, మిగిలిన డబ్బు పట్టుకొని సూర్యనారాయణ భార్యతో సహా పట్నం చేరతాడు. అత్తగారి మెప్పకనే బడ్డీకొట్టు పెట్టుకుంటాడు. గవర్నమెంటు నౌకరీకని కొంతడబ్బు ఒక ఆసామికిచ్చి మోసపోతాడు. బడ్డీకొట్టు వ్యాపారం దివాళా తీయటంతో భార్యను, కూతురు రోజాను వెంటబెట్టుకొని తిరిగి చంద్రమ్మ యింటికే చేరతాడు. యింట్లో సమస్యలతో సతమతమయ్యి వేరుకాపురం పెడతాడు. మూడో చెల్లిలి పెళ్లి చేయటానికి ఉన్న రెండెకరాల్లో ఎకరా పొలం అమ్మి పెళ్లిచేస్తాడు. దేవాలయ మాన్యం కౌలుకోసం ప్రయత్నించి విఫలమవుతాడు. తండ్రి చనిపోవటంతో, అప్పటికే యిద్దరు బిడ్డల తండ్రయిన సూర్యనారాయణ ఆర్థిక యిబ్బందులకు గురవుతాడు. ఉన్న ఎకరా పొలం మీద వచ్చే ఆదాయం రెండు కుటుంబాలకు సరిపోక తల్లీ కొడుకులు లోలోన ఘర్షణ పడుతుంటారు.

జ్వరంతో బాధ పడుతున్నా గుక్కెడు గంజినీళ్ళు పోయలేదని, కొడుకు పట్టించుకోవడం లేదని చంద్రమ్మ ఊరిపెద్దల ముందు చెబుతుంది. తన సమస్యకు పరిష్కారం చూపమంటుంది. చంద్రమ్మకు ఆప్తులైన అయ్యవారు, అయ్యవారమ్మ సూర్యనారాయణకు పరిస్థితి వివరిస్తారు. వచ్చిన ఆదాయం కుటుంబపోషణకు చాలక తల్లి బాధ్యత చూడలేకపోతున్నానని సూర్యనారాయణ పెద్దల ముందు చెబుతాడు. పేగులమధ్య కలహాలు తెచ్చిన ఈ లేమి తట్టుకోవటం తనవల్ల కావటం లేదంటాడు. తల్లి ఇష్టప్రకారం మీరు చూపే ప్రత్యామ్నాయం తనకు సమ్మతమే నంటూ కన్నీటితో సమస్యను చెప్పి వెళ్ళిపోతాడు.

గ్రామ పెద్దలు యిద్దరి సమస్యపట్ల సానుభూతి తెలిపి వెళ్ళిపోతారు. అయ్యవారు చంద్రమ్మ సమస్యకు ప్రత్యామ్నాయం ఆలోచిస్తుంటారు. 'కొత్త ప్రభుత్వం ఏర్పడిందని, యికనుంచి బియ్యం చవకగా దొరుకుతాయనే' రేడియో వార్తలు అయ్యవారికి విన్పిస్తాయి. చంద్రమ్మ సమస్యకి ప్రత్యామ్నాయం 'చవకగా బియ్యం దొరకటమా' అని అయ్యవారు తర్కించుకుంటుండగానే చంద్రమ్మ మరణిస్తుంది.

గయిరమ్మ :

గౌరమ్మ ఆడకూలీలందరికీ నాయకురాలు. పొలం పనులు గుత్తకి తీసుకుని పని చేయిస్తుంది. మిగతా కూలీలకు పని చూపిస్తుంది. చైర్మన్ గారి పొలం గుత్తకి తీసుకుని మిగతా కూలీలతో పాటు తనుకూడా నాట్లేస్తుంది. మడిగట్టు మీద వరిదుబ్బు పెట్టి పూజచేసి ఆ

దారిలో పోయే వారందరినీ దక్షిణలు వేయమంటారు ఆడకూలీలు. అలా వచ్చిన డబ్బుతో గౌరమ్మ నాయకత్వంలో గయిరమ్మ సంబరం చేయడానికి నిర్ణయించుకుంటారు. పొలం పనులు చూడటానికి వచ్చిన చైర్మన్ సత్యం నాయుడ్ని, అతనితో వచ్చిన వారిని దక్షిణ వేయమని గౌరమ్మ అడుగుతుంది. సత్యంనాయుడు హాస్యమాడబోతే మాటలతో తిప్పికొట్టి దక్షిణలు రాబడుతుంది.

మమకారం :

ఆ యిల్లు వంశధార నది ఒడ్డున ఉంది. యింటి యజమాని తన చిన్నతనంలో బాల్యాన్ని పొలాల్లో ఆడుకుంటూ, వంశధారలో యీత కొడుతూ ఆనందంగా గడుపుతాడు. గ్రామంలో పంచాయితీ రాజకీయాలొచ్చాక గ్రామస్థుల్లో విభేదాలొస్తాయి. పంటల్లో వచ్చిన నష్టాలతో అతని తండ్రి సన్నకారు రైతుగా మారతాడు. వర్షాధార మెరకపొలం రెండెకరాలు జీవనాధారమవుతుంది. హైస్కూలు చదువు పూర్తయ్యాక, మూడో తోబుట్టువు పెళ్ళి జరగటం వలన అతని చదువు ఆగిపోతుంది.

తండ్రి మెరకపొలంలో నుయ్యి దవ్వించి ఏతాం ఏర్పాటు చేస్తాడు. ఆ సంవత్సరం పంటలు బాగా పండుతాయి. తండ్రి అతడ్ని కాలేజ్‌లో చేర్పిస్తాడు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా తండ్రి మరణిస్తాడు. తల్లయిన రాజులమ్మ చదువు పూర్తి చేయిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకి చేసిన ఖర్చులకి రాజులమ్మ బంగారం అమ్మేస్తుంది. రెండేళ్ళ తరువాత అతడు బ్యాంక్ క్లర్క్‌గా ఉద్యోగం సంపాదిస్తాడు. ఆరేళ్ళ పాటు అనేక చోట్ల ఉద్యోగం చేసి విశాఖపట్నం చేరుతాడు. తల్లికి పక్షవాతం వస్తే విశాఖలో వైద్యం చేయిస్తాడు. తల్లి కోరిక మేరకు సద్గుణను పెళ్లి చేసుకుంటాడు. అప్పుచేసి ఎన్.ఏ.డి. కొత్తరోడ్‌లో యిల్లు కట్టుకుంటాడు. తల్లిని తనదగ్గరే ఉంచాడు.

అతనికి కూతురు పుట్టి ఆర్నెల్లవుతుంది. పాప అజీర్ణంతో ఏడుస్తుంటే సద్గుణ ఉడ్‌వర్డ్ పడుతుంది. పూర్వం అజీర్ణానికి వాము, జీలకర్ర పాలతో వేసి పట్టే వారమని, ఈ తరం వాళ్ళు టి.వి. ప్రకటనలకు మోస పోతున్నారంటుంది రాజులమ్మ. యింటి పెరట్లో వేప, తులసి మొక్కలు బదులు ముళ్ళచెట్లు పెంచుతున్నారని కొడుకు యింటిని ఈసడిస్తుంది. అతడు ఊర్లోని పొలం, ఇల్లు అమ్మేస్తానంటే తల్లి అడ్డుపడుతుంది. తన మరణానంతరం ఏమైనా చేసుకోమంటుంది. ఊర్లో పొలం కౌలు చేసే శిమ్మన్న వచ్చి అతడ్ని కలుసుకుంటాడు. రాజులమ్మ శిమ్మన్న తెచ్చిన నువ్వులు, వేరుశనగ అందుకొని వ్యవసాయ పరిస్థితులను ఆరా తీస్తుంది.

శిమ్మన్నను పిలిపించడానికి కారణమేంటని రాజులమ్మ కొడుకుని అడుగుతుంది. పడమర రెడ్లు చేపల పెంపకం కోసం పొలాలు కొంటుంటారు. ఎక్కువ రేటొస్తుందని అతడు శిమ్మన్నని పిలిచి పొలం అమ్మబోతున్నట్టు చెబుతాడు. 'నా పొలం అయితే అమ్మనని, మీ పొలం కనుక మీ ఇష్టం' అంటూ శిమ్మన్న వెళ్ళిపోతాడు. రాజులమ్మ కొడుకుతో మాట్లాడటం మానేస్తుంది. అతడు పొలం అమ్మకాన్ని వాయిదా వేసుకుంటాడు.

హైద్రాబాదు బదిలీ కావటంతో కూతుర్ని అత్తమామల దగ్గర ఉంచి కాన్వెంట్‌లో చేరుస్తారు. ఇరుకు గదులైన అపార్ట్‌మెంట్లలో రాజులమ్మ యిమడలేక పోతుంది. మనవరాలు లేకపోవటంతో మరింత మౌనం దాలుస్తుంది.

అత్తమామల యింటికి దగ్గర్లో పాతఇల్లు అమ్మకానికి వుంటే అతడు కొనుక్కుంటాడు. విశాఖలో కట్టిన యింటిని, ఊర్లో ఇంటిని, పొలాన్ని అమ్మేస్తాడు. కొత్తఇంట్లో చేరాక కూతుర్ని తనదగ్గరే ఉంచుకుంటాడు. పెరట్లో గల వేపచెట్టుతో, మనవరాలితో సరదాగా గడుపుతూ మునుపటిలా మారిన తల్లిని చూసి ఆనందిస్తాడు. సంక్రాంతి పండుగకు ఊరు పంపించమని రాజులమ్మ కొడుకుని అడుగుతుంది. ఊరెళ్తే నాణ్యమైన సరుకులు యింటికి తెచ్చుకోవచ్చని, శిమ్మన్న కూడా యింతదూరం రాలేడని చెబుతుంది. తల్లి ఊరెళ్తే పొలం అమ్మేసిన విషయం తెలిసిపోతుందని అతడు కంగారు

పడతాడు. ఆరోగ్య దృష్ట్యా అంతదూరం ప్రయాణించ కూడదని ఆపేశాడు. అందుకు రాజులమ్మ తను చనిపోతే అస్థికలను వంశధారలో కలపమని కోరుతుంది.

శివరాత్రి ముందు తల్లి చనిపోతుంది. తల్లికోరిక మేరకు అతడు అస్థికలు పట్టుకుని ఊరెళ్తాడు. గ్రామస్థులు అతడిని గుర్తుపట్టి సానుభూతి తెలుపుతారు. మేనత్త తల్లితో తనకుగల అనుబంధాన్ని గుర్తుచేసుకొని ఏడుస్తుంది. వ్యవసాయ పంటల పరిస్థితిని వివరిస్తుంది.

అతడు మేనమామ కొడుకుతో కలసి వంశధారలో తల్లి అస్థికలను కలుపుతాడు. తల్లి కోరిన భూమిని, యింటిని అమ్మేసానని, సంక్రాంతికి ఊరు పంపించలేక పోయానని ఏడుస్తుంటే మేనమామ కొడుకు అతడ్ని ఓదార్చుతాడు. యిద్దరూ కలిసి యింటికి చేరేదారిలో సంత జరుగుతుంది. అక్కడ ఒక చెట్టుక్రింద ఉన్న పిచ్చివాడ్ని శిమ్మన్నగా గుర్తుపడతాడు. ఇంటిమీద మమకారంలో తల్లి చనిపోతే, భూమిపై మమకారంలో శిమ్మన్న పిచ్చివాడయ్యాడని అతడు గ్రహిస్తాడు. మేనమామ కొడుకు లాంటివాళ్ళు తప్ప, గ్రామస్థులందరూ భూముల్ని చేపల చెరువులుగా మార్చటం, ఆ పొలును వాసనలకి బాధ పడ్తాడు. మేనత్తా, బావ బ్రతిమాలినా వినకుండా పట్నానికి బయలుదేరుతాడు. రైల్వే స్టేషనుకు చేరేదాకా గాలిలో పొలుసు వాసన అతడ్ని వెంటాడుతుంది.

బంధాలూ - అనుబంధాలూ :

బలరామయ్యకు వద్దెనిమిదేళ్ల వయసులో తల్లిదండ్రులు చనిపోతారు. రెండెకరాల పల్లపు భూమి, ఎకరా మెట్ట, చెల్లెలు, తమ్ముడి బాధ్యతలు బల రామయ్యే చూసుకుంటాడు. రాత్రీ పగలు వ్యవ సాయంలో కష్టపడి చెల్లెలి పెళ్లి జరిపిస్తాడు. తమ్ముడైన శివకృష్ణను పట్నంలో చదివిస్తాడు. మేనమామ కూతురు అన్నపూర్ణమ్మను పెళ్లిచేసుకుంటాడు. తమ్ముడి చదువుకి, ఉద్యోగ ప్రయత్నాలకి అయ్యే ఖర్చులతో అప్పులు పెరుగుతుంటాయి. నెలిమర్ల జూట్‌మిల్లులో ఉద్యోగం వేయిస్తారని చెల్లెలి ద్వారా వచ్చిన సంబంధం ఖాయం చేసి శివకృష్ణ పెళ్లి జరిపిస్తాడు.

శివకృష్ణ మామగారు నెల్లిమర్ల జూట్‌మిల్లులో శివ కృష్ణకు టెంపరరీ ఉద్యోగం వేయిస్తాడు. యిటు బలరామయ్య వ్యవసాయంతో వచ్చిన నష్టాలతో, అప్పు లతో యిబ్బంది పడుతుంటాడు. అటు టెంపరరీ ఉ ద్యోగంతో చాలీచాలని జీతంతో శివకృష్ణ యిబ్బంది పడుతుంటాడు. రెండు కుటుంబాల మధ్య రాకపోకలు తగ్గి ఆరేళ్ళవుతుంది. ఆ సమయంలో శివకృష్ణ అన్నని కలవడానికి వస్తాడు.

కొంత సొమ్ము లంచంగా కడితే ఉద్యోగం పర్మినెంటు అవుతుందని చెబుతాడు. అన్నపూర్ణమ్మ వ్యవసాయ పంటల వలన మిగిలిన అప్పులగురించి ఏకరువు పెడుతుంది. పెళ్ళికి ముందు ఉద్యోగం వేయిస్తామని మాట యిచ్చిన అత్తవారిని అడగమంటుంది. శివకృష్ణ తనవాటా పొలం యిస్తే అమ్ముకుంటానంటాడు. బల రామయ్య పొలం అమ్మడానికి ఒప్పుకోడు. పొలాన్ని తనఖాపెట్టి డబ్బు సర్దుబాటు చేస్తాడు. అలావచ్చిన డబ్బుతో శివకృష్ణ పర్మినెంటు ఉద్యోగిగా మారితే, బలరామయ్య పొలంలేని రైతుకూలీ అవుతాడు.

జూట్‌మిల్ లాకవుట్ ప్రకటించి ఆరునెలలవుతుంది. శివకృష్ణ భార్యా పిల్లలతో యిబ్బంది పడుతుంటాడు. బలరామయ్య కరువుబారిన పడతాడు. శివకృష్ణ భార్య 'ఉమ' భర్త యిబ్బంది చూడలేక బియ్యం కోసం బలరామయ్య యింటికి వస్తుంది. ఉమ వచ్చి మూడు రోజులైనా బియ్యం లేవనేసరికి తోడికోడలైన అన్న పూర్ణమ్మని నిష్కారమాడుతుంది. చుట్టుపక్కల వాళ్లతో ఉమ తన పరిస్థితిని చెప్పుకొని వెళ్లిపోవటానికి బయలు దేరుతుంది. కరువువల్ల అందరికీ పూట గడవటమే కష్టంగా ఉందని చుట్టుపక్కల వాళ్లు చెబుతుంటే ఖాళీ చేతులతో బయల్దేరుతున్న సమయానికి బలరామయ్య బియ్యం మూటతో వస్తాడు. ఉమ సంతోషంగా అందరికీ వెళ్ళొస్తా

నని చెప్పి వెళ్ళిపోతుంది. ఉమను బస్సెక్కించి బల రామయ్య యింటికి చేరుతాడు.

బలరామయ్య అన్నపూర్ణమ్మ చేతికి పదిరూపాయల నోట్లకట్ట అందిస్తాడు. తనఖాపెట్టిన భూమి అమ్మేయ డానికి సిద్ధపడ్డానని చెబుతాడు. పొలంలేని ఊర్లో ఉం డలేనని, నెల్లిమర్ల జూట్‌మిల్లులో కళాసీగా చేరుతానని అంటాడు. ఎన్నికష్టాలెదురైనా భూమి అమ్మకానికి ఒప్పు కోని బలరామయ్య భూమిని అమ్మేస్తాననటంతో అన్న పూర్ణమ్మ బాధపడుతుంది. యిద్దరూ బాధ పడుతున్న సమయంలో జూట్‌మిల్లు గొడవల్లో పోలీసు కాల్పుల్లో శివకృష్ణ మరణించిన సంగతి రేడియో వినిపిస్తుంది. బలరామయ్య నోట్లకట్టని వీధిలోకి విసిరేసి 'కోల్పోయిన భూమిని' తమ్ముడ్ని ఎవరస్తారా అంటూ యేడ్పుగొంతుతో పెద్దగా అరుస్తుంటాడు.

కొలతలు :

బెల్లాన చెరువు దగ్గర్లో కొలతలు వేయించిన పొలం పట్టాను దాలప్పడికి కన్నంనాయుడు యిప్పిస్తాడు. దాలప్పడు తుప్పలు, పొదలతో నిండిన పొలాన్ని నాలుగేళ్ళు బాగుచేసి వ్యవసాయసాగుకు అనువుగా మార్చుకుంటాడు. అతను ఆ పొలంలో సాగుచేయ కూడదని కోర్టు నోటీసులిస్తుంది. దాలప్పడు ఎమ్మార్వోను కలిసి దరఖాస్తు అందిస్తాడు. ఎమ్మార్వో ఏవిషయం తేల్చకపోవటం, అరుద్ర కార్తె రావటంతో దాలప్పడు పొలం దున్నటానికి సిద్ధమవుతాడు. దుక్కి దున్నుతున్న సమయంలో ఎస్సై, యిద్దరు కానిస్టేబుళ్లు వస్తారు. నోటీసులిచ్చిన పొలంలో యింకోసారి అడుగుపెడితే అరెస్ట్ చేస్తామని హెచ్చరించి వెళ్లిపోతారు.

పట్టా యిప్పించిన కన్ననాయుడ్ని కలవడానికి దాలప్పడు వెళ్తాడు. రాజకీయ నాయకులతో ఏర్పడిన సత్సంబంధాలతో కన్నంనాయుడు సహకార బ్యాంకు అధ్యక్షుడవుతాడు. చిన్నపూరింట్లోనుండి బంగ్లాకి మారి కన్నబాబుగా పిలవబడతాడు. పట్టా యిప్పించిన కన్నం నాయుడికీ యిప్పటి కన్నబాబుకి గల తేడా చూసి ఆశ్చర్యపోయిన దాలప్పడు పట్టాసంగతి గుర్తుచేస్తాడు. కలక్టర్, ఎమ్మార్వోలతో మాట్లాడతానని చెప్పి కన్నబాబు దాలప్పడ్ని పంపించేస్తాడు.

దాలప్పడు రోజుకోసారి పొలంచూసి వస్తుంటాడు. ఎమ్మార్వో ఆఫీసుకి, కన్నబాబు ఆఫీసుకి తిరుగు తుంటాడు. పనికిరాని పట్టాకాగితం పటుకొని తిరగటం వల్ల యిల్లు గడవటం కష్టమవుతుందన్న భార్యపై చేయి చేసుకుంటాడు. చివరకు సిగ్గుపడి కన్నబాబుతోనే తేల్చు కుంటానని బయలు దేరుతాడు. పట్టాపొందిన పొలం జిరాయితీ చెరువుగర్భం కనుక సాగుచేయకూడదని జోగినాయుడు కోర్టుకెళతాడు. అతడు కన్నబాబుతో కలిసి ఉండటం దాలప్పడు చూస్తాడు. కన్నబాబు బయటకు వచ్చి జోగినాయుడు 'స్టే' తెచ్చుకున్నాడని, పొలం సంగతి మర్చిపోమని చెబుతాడు. లేదంటే కోర్టుకెళ్లమని సలహా యిస్తాడు.

దసరా పండగకి బట్టలుకొనమని అల్లరి చేస్తే బట్ట యివ్వకుండా టైలరు దగ్గర కొలతలు తీయించి మాయ చేసే తండ్రి గుర్తొస్తాడు దాలప్పకి. తన తండ్రిలాగే కన్నబాబు కొలతలు తీయించి పట్టాయిచ్చాడు, పొలం మాత్రం యివ్వలేదన్న సంగతి అర్థమవుతుంది. ఎందుకూ పనికిరాని పట్టాకాగితం మరొకర్ని మోసంచేయడానికి ఉ పయోగపడుతుంది కనుక ఉంచుకోమని కన్నబాబుకే యిచ్చేస్తాడు. దాలప్పడు పొలంమీద ఆశ వదులుకోక పోయినా కన్నబాబు లాంటి వారి మోసాల్ని మాత్రం గ్రహిస్తాడు.

భారత దేశం వ్యవసాయ ప్రధాన దేశం. అందులోనూ ఆంధ్రప్రదేశ్‌లో 70 శాతం ప్రజలు గ్రామీణులే. అతి ప్రాచీనకాలం నుంచి నేటివరకు రైతన్నదే ప్రధాన భూమిక. ఆరుగాలం శ్రమించే రైతన్న దేశానికి వెన్నెముక. పొద్దున నిద్రలేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు గ్రామీణుల జీవనశైలి విలక్షణంగా ఉంటుంది. ఏరువాక మొదలు పంట యింటికి చేరేవరకు వాళ్లు అనుసరించే పద్ధతులు, ఆచారాలు, నమ్మకాలు సంప్రదాయ బద్ధంగా

ఉంటాయి. కుటుంబ వ్యవస్థ సమిష్టిగా ఉండటం వలన ఎంతటి కష్టాన్నైనా అవలీలగా జయించవచ్చనే నమ్మకం వాళ్ళది. 1960-70 దశకంలో వచ్చిన హరిత విప్లవంద్వారా దేశంలో ఆహార కొరతనుండి మిగులువైపు పయనించే టట్లు చేసిన ఘనత రైతులదే.

తొంభైయవ దశకంలో వచ్చిన సరళీకరణ ఆర్థిక విధానాలు మూలంగా రైతు కుటుంబాలు ఛిన్నాభిన్న మయ్యాయి. ఉత్తరాంధ్ర ప్రాంతపు రైతులు ఊరికి, భూమికి దూరంగా వలన పోవలసిన పరిస్థితి ఎదురయ్యింది. సంప్రదాయ పంటలు నష్టాలే మిగి ల్చాయి. వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు కూడా రాలేదు. ఈ అంశాలే తన కథలకు వస్తువులుగా తీసుకొని, గ్రామీణ జీవితంలో వచ్చిన మార్పులను అప్పల్నాయుడు 'ప్రత్యామ్నాయం' కథల సంపుటిలో కూర్చారు. "ఏ రచయిత అయినా తనకు తెలిసిన జీవితమే శక్తివంతంగా చిత్రించగలడు. ఒక నిర్దిష్ట ప్రాంతంలో జీవించిన రచయిత ఆ ప్రాంత చలనాలను ప్రత్యక్ష ప్రభావాల మూలంగానో పరోక్ష ప్రభావాల మూలంగానో తప్పక తన రచనల్లో పొందు పరుస్తాడు"

ఉత్తరాంధ్ర కథలకు చితికిపోతున్న ఉత్తరాంధ్ర పల్లె ల్లోన్ని రైతు జీవితాలే నేపథ్యం. పల్లెప్రజల కపటం లేని మనస్తత్వం, ఆత్మీయత, ఒకరినొకరు సాయం చేసుకునే గుణం, భూమి, పశువులు, వాటిచుట్టూ తిరిగే వారి ఆలో చనలు కథల్లో కన్పిస్తాయి.

❖ ❖ ❖

మధ్యతరగతి స్త్రీల జీవితం – సోమంచి శ్రీదేవి

– డా॥.బంతంగి వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాయం, వరంగల్.

'నా రచనల్లో ఉన్నది మధ్య తరగతి వాళ్లే' అన్న కచ్చితమైన అవగాహన గల రచయిత్రి సోమంచి శ్రీదేవి గారు. వీరు ఇప్పటి వరకు 3 కథా సంపుటాలను ప్రచురించారు. 2002లో 'గూడు' అన్న కథా సంపుటిని, 2005లో 'సింధూరి', 2011లో 'గుండెలోతు' అన్న కథా సంపుటాలను ప్రచురించారు. ఇవిగాక సంగమం, నీకోసం నేను, తిరస్కృతులు, మాయ జలతారు, ప్రియమైన జీవితం, ప్రేమలోంచి ప్రేమలోకి, నిన్నటి స్వప్నం పేర్లతో 7 నవలలు రాశారు. 1977లో ఇంటర్ మీడియట్ చదువు తున్న రోజుల్లో వనితా జ్యోతి అన్న స్త్రీల పత్రికలో మొదటి కథ అచ్చయింది. 1996 నుంచి క్రమం తప్పకుండా రచనలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 1962లో జన్మించిన సోమంచి శ్రీదేవి గారు ఎక్కువకాలం శ్రీకాకుళం జిల్లాలోని మందస అనే ఊర్లో ఉన్నారు. 1977నుంచి వరంగల్, హైద్రాబాద్‌లో ఉంటున్నారు. 2002లో ప్రచురించబడ్డ గూడు కథా సంపుటిలో 24 కథలున్నాయి. ఇవి విపుల, ఇండియాటుడే, ఆంధ్ర ప్రభ, ఆంధ్రభూమి, వనిత తదితర పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. 'సింధూరి' కథా సంపుటిలో 14 కథలున్నాయి. వీటిల్లో 'యుద్ధం ముగిశాక' అన్న కథ విపులలో ప్రచురితం కాగా వారసత్వం అన్న కథ అముద్రితం. మిగిలిన కథలు ఆంధ్రభూమి, ఆంధ్ర ప్రభ పత్రికల్లో వచ్చాయి. సింధూరి సంపుటికి సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ అవార్డు పొందారు. ఇందులోని ఒక కథకు 'అటా' బహుమతి లభించింది. అధిరోహణం, రూపాయిచొక్కా కథలకు భూమిక బహుమతిని అందుకున్నారు. 'ఎంతెంత దూరం' అన్న కథకు 'విపుల' తృతీయ బహుమతితో పాటు రంగవల్లి ట్రస్ట్ అవార్డును కూడా పొందారు.

వివిధ సామాజిక పరిణామాలపట్ల సునిశితమైన అవగాహన ఉన్న రచయిత్రి వీరు. మరీ ముఖ్యంగా ఇటీవలి పరిణామాల గురించి లోతైన అవగాహన, స్పష్టమైన దృక్పథం వీరికి ఉన్నాయి. ప్రయివేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ ఫలితంగా ఎక్కువగా దెబ్బ తిన్నది మధ్యతరగతి జీవితం అని వీరు గుర్తించారు. "పిల్లలు ఎక్కడికెక్కడికో వెళ్ళి ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి. చిన్న చిన్న పిల్లల్ని వదిలిపెట్టి ఆడవాళ్ళు ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేయాల్సిరావడం. . . . . ఇంత కష్టపడి డబ్బు సంపాదించుకొని ఒకప్పుడు ఏ సుఖాలు, సౌఖ్యాలను సునాయాసంగా మానవ సంబంధాల్లో పొందామో వాటిని ఈ రోజు డబ్బుపెట్టి కొనుక్కోవలసి వస్తుంది" అని అంటారీమె.

వీరు ప్రచురించిన 3 కథా సంపుటాలలోని మొత్తం 53 కథలలో ఒకటి, అరా మినహాయిస్తే ఇంచుమించుగా అన్ని కథలు మధ్యతరగతి సాధారణ జీవితానికి సంబంధించినవే. వీరి నవలల్లో కూడా ఎక్కువగా చిత్రితమైంది మధ్య తరగతి జీవితమే. అయితే వీటన్నింటిని ఇక్కడ చర్చించడం సాధ్యంకాదు గనుక వీరి కథల్లో కొన్నింటిని మాత్రమే తీసుకొని వాటిల్లో మధ్యతరగతి జీవన చిత్రణ ఎలా జరిగిందో చర్చించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. 'గూడు' కథా సంపుటిలోని 24 కథల్లో 'నాకొద్దీ అభ్యుదయం', 'నాకిక్కడచోటులేదు' అనే రెండు కథలను పరిశీలిద్దాం. 'నాకొద్దీ అభ్యుదయం'లో ఉదయ అనే పాత్ర ఇలా అంటుంది.

"డబ్బు సంపాదించగలగడమే ఆడవాళ్ళు సాధించిన అభ్యుదయమైతే అలాంటి అభ్యుదయం నాకు వద్దు- ఎవరికో సంపాదనా యంత్రాన్ని కాలేను. నా జీవితమే నాలోని ప్రేమాస్పదమైన అంశం అని అనుకునే మనుషుల్ని నేను ప్రేమించలేను. నా సంపాదనతో నిమిత్తం లేకుండా నన్ను నన్నుగా ప్రేమించే వ్యక్తుల మధ్యకు వెళుతున్నాను" అంటుంది.

ఉద్యోగం చేసే ఉదయ తనకు వివాహం చేయ కుండా వచ్చిన ప్రతి సంబంధాన్ని తల్లితండ్రులు చెడగొడు తున్నారని భావించి తన జీవిత భద్రతకోసం బైటికి వచ్చేస్తుంది. ఆమెకు స్వతంత్రించి పెళ్ళి చేసుకోవాలని కోరిక. ఆమె అనుకున్నట్లుగానే భానుప్రకాష్ అనే అతన్ని ప్రేమిస్తుంది. తనకు అన్న వరస అయిన వ్యక్తికి భాను ప్రకాష్‌ను పరిచయం చేయడానికి భానుప్రకాష్‌ను ఇంటికి ఆహ్వానిస్తుంది ఉదయ. కాని భానుప్రకాష్ రాడు. తన చెల్లెల్ని చేసుకోబోయే వ్యక్తిని చూడటానికి వచ్చిన అన్న సందేహిస్తూనే వెళ్ళిపోతాడు. తల్లిదండ్రులకు తెలియ కుండా వివాహం చేసుకోవాలనుకున్న ఉదయ తమ ఇద్దరి మధ్య వ్యవహారాన్ని రహస్యంగా ఉంచమని భాను ప్రకాష్‌ను కోరుతుంది. దీనిని అవకాశంగా తీసుకున్న భానుప్రకాష్ ఉదయను మోసం చేయాలనుకుంటాడు. భాను ప్రకాష్ మోసాన్ని గ్రహించిన ఉదయ మొగవాడితో ప్రమేయంలేని జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొని బ్రహ్మకుమారి దీక్ష తీసుకుంటుంది. ఈ కథలో ఉదయ తీసుకున్న నిర్ణయం సగటు మధ్యతరగతి మనస్తత్వానికి ప్రతిబింబం. ఒక సమస్యను ఎదుర్కొని నిలబడి పరిష్క రించుకోలేని స్థితి ఎదురైనప్పుడు మధ్యతరగతి ఫలాయన వాదంలోకి పరుగులు తీస్తుంది అన్న విషయాన్ని ఈ కథలో బలంగా చెప్పారు రచయిత్రి. ఇదే కథలో అన్న పాత్ర చేత ఇలా అనిపిస్తారు రచయిత్రి. ''ఆడవాళ్ళు ఏదైనా సాధించారేమో నాకు తెలీదుకాని కొన్ని కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొంతమంది పెళ్ళి అనే చట్రంలో ఇమడలేకపోతున్నారు. ఫ్రీ లైఫ్‌కు అల వాటుపడి పెళ్ళి చేసుకోవడం ద్వారా వచ్చిపడే బాధ్యత లకు కొందరు భయపడుతున్నారు. ఉదయకు లాగా ఏవో కారణాల చేత పెళ్ళిచేసుకోలేని వాళ్ళు కొందరు ఇలాంటి వాళ్లలో చాలా మంది వివాహితున్ని చేసుకోవ డానికి ఇష్టపడుతున్నారట. ద్వితీయ అనేది తమ సమస్య లకి ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు'' ఒక ఉదయ జీవితం ఆధారంగా మధ్యతరగతి కుటుంబాల పోకడ లను రచయిత్రి విప్పిచెప్పారు. బ్రహ్మకుమారి దీక్ష తీసుకున్న ఉదయ సాంసారిక సుఖానికి, పెళ్ళికి దూరంగా జరిగింది. వీటివల్ల తదనంతరం మరికొన్ని సమస్యలకు దారితీయగల అవకాశాలు ఉన్నాయని మనం భావించ వచ్చు.

'నాకిక్కడ చోటులేదు' అనే కథ పల్లెటూరి మధ్య తరగతి తల్లి జీవనశైలికి పట్టణ మధ్యతరగతి కూతురు జీవనశైలికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలిపే కథ. ఇందులోని సరయు తల్లిదండ్రులు తెచ్చిన సంబంధాన్ని తిరస్కరించి తల్లిదండ్రులకు చెప్పకుండా వివాహం చేసుకొని వెళ్ళిపోతుంది బొంబాయికి. ఎనిమిది ఏళ్ళ తరువాత సరయును చూడటానికి బొంబాయి వెళుతుంది తల్లి. తెగిపోయిన బంధాన్ని తాను ఎందుకు పునరుద్ధ రించుకుంటుందో సరయు తల్లికి అర్థంకాదు. సరయుకి జీవితానికి సంబంధించిన అవగాహన లేదు. ''మనిషి నిరంతర ప్రగతికామి కాదు. పెళ్ళితో ఆడపిల్ల ప్రగతి ఆగిపోకూడదు. అలాంటి జీవితం నాకు కావాలి. అందుకే వసంత్‌తో వెళ్ళిపోతున్నాను'' అని సరయు వెళ్ళిపోతుంది. అయితే ఇందులో ప్రధాన విషయం ఏమిటంటే బొంబాయికి కూతురు దగ్గరికి వెళ్ళిన తల్లి అక్కడ పట్టణ మధ్యతరగతి జీవితాల్లోని యాంత్రికతకు ఉక్కిరిబిక్కిరి అవుతుంది. సరయు వ్యక్తిత్వంలో వచ్చిన మార్పును గమనిస్తుంది. తన కళ్లముందు సరయు పిల్లలు పెరుగు తున్న పరిస్థితులను గ్రహించగలుగుతుంది.

''వ్యవసాయ ఆధారమైన దేశంలో.... రైతు కుటుంబంలో పుట్టిన విత్తనాన్ని చీల్చుకొని మొక్క మొలవడాన్ని కాని, పూవు పూయడాన్ని గాని, కాయ కాయడాన్నిగాని వాళ్ళు చూడలేదు'' అని గ్రహిస్తుంది. భర్త చనిపోయాడు గనుక తాను సరయు వసంత్‌ల దగ్గర ఉండవచ్చు. ఆమె ముంబాయి లాంటి మహానగరంలో ఇళ్ళంతా యంత్రాలు ఆధునిక పరికరాల మధ్య ఉండలేక సరయుతో సంబంధాన్ని కొనసాగించలేక పోవడమనే నిస్సహాయతను ఈ కథలో గమనించవచ్చు. మధ్యతరగతి

వ్యక్తుల జీవితాల్లో సంభవించే మార్పులు, పరిణామాలు వ్యవస్థకు అన్వయించి చూపే ఒక నేర్పు ఈవిడ కథల్లో ప్రధానంగా కన్పిస్తుంది. ఉదయ జీవితంలో పెళ్ళికి స్థానం లేకపోవడం ఒక సమస్య అయితే సరయు తల్లి విషయంలో పట్టణంలో జీవించడానికి స్థానం లేదను కోవడం మరొక సమస్య. ఈ కథకు కూడా ఇంకొక కొన సాగింపు ఉంది. కారణం ఏదైనా గ్రామీణ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు పట్టణ జీవితాలను ఎంచుకున్నప్పుడు లేదా అనివార్యంగా పట్టణాలలోనే జీవించాల్సి వచ్చినపుడు వారి కుటుంబ సభ్యులు గ్రామాల లోనే జీవించే పరిస్థితులు ఉంటాయని ఈ కథ ద్వారా మనం గమనించవచ్చు.

'యుద్ధం ముగిశాక' కథ అన్ని కులాలకు సంబంధించిన మధ్యతరగతి మనస్తత్వాన్ని గురించి ప్రస్తావించే కథ. ఇందులో నాయకుడు మాలతి అనే దళిత స్త్రీని పెళ్ళి చేసుకుంటాడు. వారికి ఒక ఆడపిల్ల పుడుతుంది. ఆ పాపకు మీరా అని పేరు పెడతారు. మీరా తండ్రి బ్రాహ్మణ కులానికి చెందినవాడు. శాఖాహారి. కూతురు కూడా శాఖాహారిగానే పెరుగుతుంది. ఆ అమ్మాయికి వివాహం చేయాలనే ప్రతి ప్రయత్నం విఫలమవుతుంది. తనకు పెళ్ళి చేయాలన్న తల్లిదండ్రుల ప్రయత్నం విఫలం కావడాన్ని మీరా గ్రహించి గాయపడుతుంది. ఎవరికో ఒకరికి ఇచ్చి పెళ్ళి చేద్దామనుకున్న తల్లిదండ్రుల ప్రయత్నాలు కూడా ఫలించవు. చివరకు జ్ఞానదేవ్ అనే ప్రొఫెసర్ మీరాను వివాహం చేసుకోవడానికి ముందు కొచ్చిన సమయానికి మీరాకు పెళ్ళిపట్ల నిర్లప్తత, విముఖత ఏర్పడుతుంది.. కూతురును ఈ నిర్లిప్తత నుంచి ఎలాగోలాగా బయటపడేసి జ్ఞానదేవ్‌తో పెళ్ళి జరిపిస్తాడు తండ్రి. ఈ కథలో ప్రధానాంశం మీరా వివాహం కాదు. వివాహ నిర్ణయం విషయంగా మధ్యతరగతి వ్యక్తులలో వారి జీవితాలలో వారిని శాసిస్తున్న విలువలు, వారి జీవితాన్ని వదలి పెట్టకుండా వెన్నాడుతున్న అభ్యంతరాలు. . . . వీటిని గురించి ప్రధానంగా చర్చించిన కథ ఇది. మధ్యతరగతి జీవితాల్లో ఉండే విలువల పట్టింపుని అందువల్ల వ్యక్తులు పడే వేదనను ఈ కథ ప్రధానంగా చర్చించింది.

కులం, మతం, ఆస్తి అంతస్తు, కట్నకానుకలు ఇవన్నీ ఒకరికొకరు ఏమీ కానపుడు వాళ్ళ పెళ్ళిలో ఇవి ముఖ్య పాత్ర వహిస్తాయి. ఒకరినొకరు కావాలనుకున్నప్పుడు తమ అస్తిత్వాన్ని అవి కోల్పోతాయి. మధ్య తరగతి వారికి రచయిత్రి ఇవ్వదలచిన సందేశం ఇదే.

ఈ కథ సామాన్యుల జీవిత కథలు మొదలయ్యేది యుద్ధం ముగిశాకే అన్న ప్రకటనతో మొదలవుతుంది. అయితే వాస్తవ జీవితంలో కథ మొదలయ్యేది పెళ్ళితోనే అని అనడం ద్వారా నిజజీవిత కథకి, జీవితాన్ని గురించి రాసే కథలకి మధ్య ఉండే తేడాలను కూడా ఈ కథ చర్చకుపెట్టింది.

'కోడలొచ్చింది' కథ అహల్యకు సంబంధించిన కథ. కోడలువస్తే తనకు విముక్తి దొరుకుతుందన్న అహల్య ఆనందమో, ఆశనో ఈ కథలో ప్రధానం చేయబడింది. ఈ కథలో అహల్య ఒక అజ్ఞాత బంధాన్ని తన బాధ్యతల రూపంలో కలిగి ఉన్నానని భావిస్తుంది. ఉద్యోగం చేసే సృజనను కోడలుగా చేసుకోవడం వల్ల అత్త అయిన అహల్యకు ఆశాభంగమే ఎదురైంది. తన పనుల్లో బాధ్యతల్లో సగం స్వీకరించాల్సిన కోడలు అంటీముట్ట నట్లుగా ఉండడంతో అహల్య బాధపడుతుంది. కోడలి పట్ల అసంతృప్తితో ఉండటాన్ని కొడుకు వాసు గమనించాడు. అటు తల్లిని ఇటు భార్య ఉద్యోగం, ఇంటిపనిని నిర్వర్తించడంలో గల ఇబ్బందిని అర్థం చేసుకున్నాడు. తల్లి వద్దంటున్నా వినకుండా సృజనకు పరీక్షలు ఉన్నాయని చెప్పి పుట్టింటికి పంపిస్తాడు. దీంతో అహల్య మరింత బాధపడుతుంది. ఇంట్లో జరుగుతున్న ఈ సంఘర్షణ అహల్య భర్త ప్రసాదరావు దృష్టికి వచ్చింది. భార్యది అజ్ఞానమో మూర్ఖత్వమో అర్థం కాదతనికి. ఆమెను గట్టిగానే మందలిస్తాడు. "పిల్లలకు పెళ్ళిళ్ళు చేసేది మన అహాలను నిలబెట్టుకోవడానికి కాదు. వాళ్ళ జీవితాలు

అర్థవంతంగా ఉండటానికి. భార్య భర్తల మధ్య అను బంధాన్ని పెరగనీయి" అంటూ సూచన చేస్తాడు. ఇట్లా కొడుకు పెళ్ళితో మధ్యతరగతి కుటుంబాల్లో వచ్చే మార్పులను వారి వారి మనస్తత్వాలను ఎంతో అర్థ వంతంగా రచయిత్రి చిత్రించింది.

'వంటింటి కిటికి' కథలో అనూష తల్లిదండ్రుల్ని కాదని హేమంత్‌ను పెళ్ళి చేసుకుంటుంది. ఇద్దరు నిరుద్యోగులే. ఆ నిరుద్యోగమే ఇద్దరి పాలిట ఒక సమస్యగా మారి ఒకరినుంచి ఒకరు ఆర్థిక భద్రతలను కోరుకోవడం వల్ల ఆర్థికంగా నిలదొక్కుకోక పోవడం వల్ల అనూషను వదలిపెట్టి వెళతాడు హేమంత్. హేమంత్ వెళ్ళిపోయాక తన కుటుంబానికి కొంత దగ్గర అవుతుంది అనూష. తండ్రి ఇంటికి రానివ్వకుండానే నైతికంగా మద్ధతును ఇస్తాడు.అనూష తల్లిదండ్రుల సహాయంతో హాస్టల్లో చేరి చదువుకుంటుంది. ఉద్యోగం కూడా సంపా దించుకుంటుంది. కంప్యూటర్ కోర్సులు చదివి పదివేల రూపాయల జీతంతో ఉద్యోగం చేస్తుండగా తిరిగి హేమంత్ మళ్ళీ అనూష జీవితంలోకి వస్తాడు. తనను వదలి వెళ్ళిపోయిన హేమంత్ పట్ల కొంత కటువుగానే ఆమె ఉంటుంది. ఈలోపు అనూషతో వివాహానికి సూర్య ప్రకాష్ అనే సహ ఉద్యోగి ప్రపోజ్ చేస్తాడు. హేమంత్‌లోని సున్నితమైన పార్శ్వాలను తల్లితండ్రులు గుర్తించాక అనూష నిర్ణయంలోని అసమంజసత్వాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తారు. వ్యక్తులతో భావస్వామ్యమా? ఆర్థిక సమానత్వమా? అనే విచికిత్సకు లోనవుతుంది అనూష. జరిగిన దానిలో తన తప్పును తెలుసుకుంటుంది. చివరికి హేమంత్‌ను జీవిత భాగస్వామిగా అంగీకరించడం ఒడిదొడుకుల్లోనే జీవితం గడపడంతో కథ ముగుస్తుంది. ఇందులో పాత్రలు ఏ విషయన్నైనా ఒక కోణంలోంచి చూడటానికి అలవాటు పడ్డ స్థితిని చూస్తాం. సోమంచి శ్రీదేవి వ్యక్తి, కుటుంబం, వ్యవస్థ అనే మూడు భావన లను ప్రధానీకరించుకొని కథలురాశారు. ప్రేమ, పెళ్ళి, భార్యాభర్తల సంబంధాలు, ఆధిపత్యం, సమానత్వం, తదితర భావనల్లో ఉండే జఠిలమైన అంశాలను, మధ్యతరగతి మనస్తత్వాలను సోమంచి శ్రీదేవి కథలుగా, నవలలుగా రాస్తూ వస్తున్నారు.

వాదాలతో నిమిత్తం లేకుండా మధ్యతరగతి కుటుంబాల వేదనను విశ్లేషించే ప్రయత్నం చేశారు. సమాజం ఎంతో మారిందని చెపుతారు గాని స్త్రీల సమస్యలు అలాగే ఉన్నాయి. స్త్రీ సంపాదనపరురాలు అయినా కాకపోయినా భర్త మంచివాడు అయితేనే కుటుంబం సజావుగా నడుస్తుంది అంటారామె. అలాగే మంచి కార్పోరేట్ సెక్టర్‌లో ఉండికూడా పీడనను స్త్రీలు ఎదుర్కొంటున్నారు. డబ్బు అనేది అంతముఖ్యమైంది ఏమీకాదు. మధ్యతరగతికి చెందిన భార్య భర్తల మధ్య అవగాహన లేకపోతే డబ్బు సంపాదన వల్ల ప్రయోజనం ఏమి లేదంటారు. వ్యక్తికి వ్యక్తికి మధ్య అవగాహన లేకపోతే ఒకే కుటుంబంలోను అనేక సంఘర్షణలు తలెత్తు తాయి. సంఘర్షణలను నివారించుకొని సమన్వయంతో జీవించడమే మధ్యతరగతి జీవితాదర్శం అని చెపుతాయి శ్రీదేవి కథలు.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. 'గూడు' కథా సంపుటి
2. 'సింధూరి' కథా సంపుటి
3. 'గుండెలోతు' కథా సంపుటి

❖ ❖ ❖

సామాజిక జీవన చిత్రణకు ప్రతిబింబం ఆధునిక కవిత్వం

– డా॥ పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

సమాజంలో భాషాసంబంధమైన ఒక కళగా కవిత్వం ఆవిర్భవించింది. సామాజిక జీవనచిత్రణతో ఆధునిక కవిత్వం ఎడతెగని ఝరీప్రవాహంగా ప్రవహిస్తూనే ఉంది. భావావేశంతో సామాజికస్పృహ కల్గిన కవిత్వసృజన సమాజంలో దర్శనమిస్తూనే ఉంది.

"వానవేళ్ళతో మబ్బులు రచించే / ఆకుపచ్చ కవిత్వమే నేలంటే / కృషక శరీర మేఘం నుండి / తెగిపడ్డ చెమట చుక్కను / కవిత్వంగా మొలకెత్తించడమే / మట్టిగుండెలోని మహోన్నతత్వం / ప్రకృతి ఒక దృశ్యకవిత్వం / రుతువు రుతువునూ అద్భుత కవితాసంకలనంగా ఆవిష్కరించే / కాలం కంటే గొప్పకవి ఇంకెవరుంటారు" అంటారు గంటేడ గౌరునాయుడు గారు. కాలగమనంలో పరిశీలిస్తే కాలం కంటే గొప్పకవి ఎవరుంటారనడంలో చక్కని ఊహాశిల్పం కన్పిస్తుంది. కాలగమనంలో ప్రకృతిలో సాక్షాత్కరించిన ప్రతిదృశ్యాన్ని, ఎదురైన కష్టాన్ని, అక్షరీకరించడం జరుగుతూ వస్తూ ఉంది.

"చచ్చేదాకా బతకడమే జీవితమైతే / కాలంతో పోరాడే అనాధ జీవితాలే గొప్ప కవిత్వం / బాధను గుప్పిట బిగించి / పచ్చిబాలింత కన్నీటి కొడవలితో / వరికోత కోయడమే జీవితానికి పొడిగింపయితే / ఆ తల్లి పాదాల కింద నలిగిన మట్టే మహాద్భుత కవిత్వం" / అన్నారు బెల్లంకొండ రవికాంత్. ఆధునికులు కవిత్వాన్ని సామాజిక సమస్యలకు అన్వయించి సరికొత్త భాష్యం చెప్పారు. కవికి సమాజానికి జరిగే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వం అంటారు శ్రీశ్రీ. సమస్యకి సొల్యూషన్ దొరికినా, దొరకకపోయినా అందులోనే అంతరాంతరాలలోకి వెళ్లి కవిత్వానికి కొత్త నిర్వచనం చెప్పారు.

"కవి బాటసారై / పాఠకుణ్ణి తోటి పథికుణ్ణి చెయ్యడం కవిత్వం / అన్నార్తుల ఆక్రందనలకు కవితో పాటు / పాఠకుడు పరితాపం చెందటం కవిత్వం / కవిత్వం రాయటం అంత సులభం కాదు" అంటారు అడిగోపుల వెంకటరత్నమ్. కవి బాటసారై భావాలబాటలో తనతో పాటు పాఠకుడిని పయనింపచేసి పరితాపం చెందించటమే కవిత్వం అని రాయడం అంత సులువేం కాదు. కవిత్వం కఠోర తపస్సుతో మధనం అందించే అమృతం అనే భావన స్ఫురిస్తుంది.

"సహనం కళ్ళెదుటే / జీవితం దహన కావ్యమౌతుంటే / మానవీయ బంధాలన్నీ / మంటగల్సిపోతుంటే / గుండెలోంచి ఉబికి వచ్చేదే కవిత్వం / పాలింకిపోతే నోరెండిపోయిన / శిశువులాంటి దుఃఖం కవిత్వం / మాతృత్వపు పాదులోంచి మొలకెత్తే వాత్సల్యం కవిత్వం / అప్పుడే పొదుగులోంచి కురిసిన / పాలనురుగు వెచ్చదనం కవిత్వం" అంటారు రాధేయ. మానవత్వం మంటగలిసి పోతున్న తరుణంలో ఆవేదనకు అక్షరరూపంగా ఉబికి వచ్చేదే కవిత్వం. ఊహలకు అందని భావాలతో అక్షరాలకు అన్నం పెట్టి కవిత్వ సృజన చేశారు.

"నా కవిత్వం పోరాడదు / బ్రతిమాలదు / తాను కూర్చుని మనని నడవమనదు / మోయమనదు / నచ్చినట్లు ఎగిరేందుకు కొత్త ఆకాశాలను చూపిస్తుంది./ మనం ఎన్నుకొన్న రెక్కల కోసం కొంచెం శక్తిని పొట్లం కట్టిస్తుంది./ స్వచ్ఛమైన మెలకువ నా కవిత్వం / స్వచ్ఛమైన నిదుర నా కవిత్వం./ జీవించినంత సరదాగా మరణించటం నేర్పే క్రీడ నా కవిత్వం" అన్నారు బి.వి.వి. ప్రసాద్. స్వచ్ఛమైన మెలకువే కవిత్వం అనడంలోనే వెతికి చూసిన కొద్దీ రత్నాలు లభించే కవిత్వ సముద్రంగా స్ఫురిస్తుంది.

"కవిత్వం మరణవేదనలో పునర్జన్మ / అది నరాలు తీగలపై జ్వాలామూర్ఛన / శబ్దసమ్మేళనలో సంఘర్షణలో భావవిస్ఫోటన / కవిత్వం తప్ప మరేది బ్రతుకును

స్పర్శించి, ఘర్షించగలదు / మరేది సృష్టి, లయ నావిష్కరించగలదు / అవాస్తవ వాస్తవమైన ఆనంద విషాదమైన కవిత్వాన్నే నేను మాట్లాడతాను అంటారు పాపినేని శివశంకర్. సామాజిక జీవన చిత్రణంలో ఆనందవిషాదాల సమాహారమే కనిపిస్తుంది. ఆనందవిషాదమైన కవిత్వాన్ని గురించే మాట్లాడతానని, మరణవేదనలో పునర్జన్మ కవిత్వం అని కవిత్వాన్ని జీవిస్తాను, జీవితాన్ని కవిత్వీకరిస్తానని అక్షర సృజన చేశారు పాపినేని శివశంకర్.

కవిత్వం వొక గమ్యం కాదు / అదెప్పుడు వొక మజిలీ మాత్రమే / అనివార్యమైన భావాల పుప్పెన ముంచెత్తడమే కవిత్వం / దేన్ని ఎవరూ ఏ ఆనకట్టా వేసి బంధించలేరు / బంధించిన చోట కవిత్వం నిలవనీరై పోతుంది / ప్రవాహం కవిత్వ లక్షణం / గమ్యం చేరానన్న తృప్తిలో కవిత్వం లేదు" అన్నారు అఫ్సర్. కవిత్వానికి లక్ష్యం ఉంది కాని ఆ గమ్యం చేరానన్న తృప్తి లేదు. ఇంకా ప్రవాహం చేస్తూనే ఉంటుందనడంలో సామజిక జీవన చిత్రణ ప్రతిబింబించి సృష్టి ఉన్నంతవరకు కవిత్వసృజన ప్రవాహం కొనసాగుతుంటుందనే భావన స్పష్టమవుతుంది.

కవిత కొత్త అనుభవాల కాంతిపేటికను తెరవాలి / కదిలించాలి / ప్రతి మాటకీ శక్తి వుంది, పదును వుంది / ప్రతి చిత్రణకీ అర్థం వుంది, ఔచిత్యం వుంది / గులకరాళ్ళ డబ్బా మోగించి గొప్ప సంగీతం అని దబాయించకు / అంత్యప్రాసలు వేసినంత మాత్రాన ప్రాసైక్ భావం పోయిట్రీ అవదు / కవిత్వం ఒక ఆల్కెమీ దాని రహస్యం. కవికే తెలుసు / ఈ కాలంలో బ్రతుకు, యీ ప్రపంచాన్ని ప్రతిఫలించు / నువ్వు చెప్పేదేదైనా నీదై ఉండాలి. నీలోంచి రావాలి. చించుకొని రావాలి అన్నాడు తిలక్. కవిత ఉన్నప్పుడే నవత రాణిస్తుంది. ప్రపంచాన్ని ప్రతిఫలించినప్పుడు వ్యక్తం చేసిన భావం పాఠకుడికి అదే అనుభూతిని కల్గించినప్పుడే ఆ కవిత్వానికి అర్థం, పరమార్థం అనే భావన తిలక్ కవిత్వంలో స్ఫురిస్తుంది.

"నదులు కవులు భూగోళపు రక్తనాళాలు / నదులు ప్రవహిస్తాయి. కవితల్లా పశువుల కోసం పక్షుల కోసం మనుషుల కోసం / నదులు కనే కలలు ఫలిస్తాయి పొలాల్లో / కవులు కనే కలలు ఫలిస్తాయి మనుష్యుల్లో / నేను కవితల్ని నా హృదయ పంజరంలో / ఉంచి పెంచలేను ముద్దుగా / ముత్యాలు ఆహారంగా... వేస్తాను / ఒక్కొక్కప్పుడు కన్నీటి ముత్యాలు" అన్నారు గుంటూరు శేషేంద్రశర్మ. అక్షరాలతో కన్నీటి ముత్యాలు రాల్పించిన ఘనత శేషేంద్రశర్మగారిది.

అక్షరాల్ని మట్టిలో విత్తి పంటలుగా మార్చి అక్షరాల్ని గుండెలో ప్రతిష్ఠించుకొని మనిషినయ్యానన్న కవి రావి రంగారావు.

"ఒక కవిత, నీ కోసం దిగివచ్చేటప్పుడు ఆకాశంలో / కిరణాలు మరింత వన్నె తీరతాయి నదుల్లో / జలాలు మరింత తేటపడతాయి. గోదారి ఒడ్డున / రసజ్ఞులకొక పూర్వపద్యంలో కొత్త అర్థం స్ఫురిస్తుంది / కవిత స్వర్గంలో ఉన్నప్పుడు చుట్టూ హంసలు / బారులు తీరతాయి. ఇప్పుడు నీ కోసం ఈ / దుమ్ములో అడుగుపెడుతున్నది. ముందు నీ / గుండె చీల్చు, ఆపైన నా శ్రోతల గుండె చీల్చు" అన్నారు వాడ్రేవు చినవీరభద్రుడు. నీ గుండెచీల్చి నీ ఆవేదనకు అక్షర రూపాన్నిచ్చి అప్పుడు శ్రోతల గుండె చీల్చమంటున్నాడు. "ముడుచుకుంటే కవిత్వమెలా పలుకుతుంది / అనేక దేహాలుగా / లక్షలాది కళ్ళుగా తెరుచుకో / జీవం ఒళ్ళు విరుచుకుంటుంది / కవిత్వం పరవళ్ళు తొక్కుతుంది" అన్నారు స్కై. సమాజంలో ప్రతి సమస్యకు స్పందించాల్సిన శక్తి కవికి, కవిత్వానికుంది. అప్పుడే కవిత్వం పరవళ్ళు తొక్కి దాని పరమార్థాన్ని నెరవేర్చుకుంటుందన్న భావన స్పష్టమవుతుంది.

"మట్టిలో బుట్టి మట్టిలో కలిసే మనిషికి / మట్టి వాసన తెలియకుంటేనే / ఆశ్చర్యం / వానకురిస్తే ఆవిర్లెత్తే మట్టివాసన / మట్టిలోంచి మొలిచే మొక్క పచ్చని / లేలేత పసికందుల ఆ మట్టిని సేవించే / మనిషేనా మహాదైవం / ఆ మట్టివాసనే / నాకత్తరుమయం" అన్నారు అనిశెట్టి రజిత. మట్టికి మనిషికి ఉన్న అనుబంధాన్ని పదబంధాలలో

పేర్చి సామాజిక జీవనచిత్రణను కళ్లకు కట్టినట్లు పేర్కొన్నారు.

"నేను నా ముఖాన్నిపుడు / రూపాయి బిళ్ళలో చూసు కుంటున్నాను / రూపాయి నన్ను నడిపించే శక్తి మాత్ర / నేను రూపాయి ముందు చేతులు కట్టుకున్న సేవకున్ని / నాకు ప్రపంచమంతా నిలబెట్టిన రూపాయి / నీడలోనే సర్దుకున్నట్లు కనిపిస్తోంది / నేనిప్పుడు తప్పనిసరై / అద్దం ముందు నిలుచున్న / నా ముఖానికి బదులు మొత్తం శరీరం / మండుతున్న కాగడాలా అగుపడుతోంది" అన్నారు ఆర్. రామకృష్ణ. సమాజంలో రూపాయి విలువేంటో రూపాయికి దాసోహం అనే పరిస్థితులు రూపాయి ముందు చేతులు కట్టుకున్న సేవకున్ని అనడం లోనే వ్యక్తమయ్యింది.

"ఇప్పుడు ఇల్లు గడవక / ఆ దంపతులిద్దరికీ ప్రతిదినం తగాదే / పనితనం నేర్చాడుగానీ / బతుకు నేర్వలేదు / వేళ్లతో కొట్టిన ధ్వనితో / కుండపగులు కనిపెట్టిండుగానీ / బతుకు పగుళ్ళు పట్టుకోలేక పోయిండు / శరీరంలో సత్తువ పోయినా / గుండెలో నమ్మకం పోలేదు / పైసల లోకాన్ని తిట్టుకోలేక / మనసు చంపుకో లేక / మళ్ళీ మళ్ళీ మట్టి పిసుకుతూనే వుంటాడు" అన్నారు నందిని సిధారెడ్డి. యంత్రం ముందు మనిషి ఒట్టిపోయిన వైనాన్ని కుండవగులు కనిపెట్టినా బతుకువగుళ్ళు పట్టుకోలేకపోయాడని ఎందరి ఇళ్ళల్లో కుండల్లో అన్నం ఉడికినా ఇప్పుడితని కుండలో అన్నం లేదన్నభావాన్ని పలికించారు.

"గాజుల చేతులయితేనేం / గాల్లోకి నమ్మెటెత్తి కొట్టాల్సిందే / నిప్పులమీద కాలి ఎరుపెక్కిన / కొడవలికొన పదునెక్కాల్సిందే / ఆ దిమ్మె మీద దెబ్బదెబ్బకీ / ఆత్మల్ని శుద్ధి చేసుకుంటున్నాయి. పనిముట్లు / వాళ్ళకి వారసత్వం కొలిమి / వాళ్ళకి సర్వస్వం కొలిమి / సౌకర్యాలు సంక్షేమ పథకాలూ అంటని / అనామక అవశేషాలు వాళ్ళు" అన్నారు వజ్జుల శివకుమార్. కమ్మరి కొలిమి దీనస్వరాన్ని, అంతరించిపోతున్న ఆనవాళ్ళని చక్కగా చిత్రిక పట్టారు శివకుమార్

"నిన్నటిదాకా ఆధీనంలో వున్న / పట్టెడ కాస్తా అదుపు తప్పి / నీ మెడకు యినుప పట్టెడైంది / నువ్వువాడిన సుత్తే / నీ తలపై శ్రావణంతో / సమస్యల పోట్లేస్తోంది / పట్టుకారు నిన్ను పట్టి / మూసలో నొట్టి పట్టి / కొలిమిలో వేడిచేసి / నీ జీవితాన్నొక కడ్డీగా కొలిమిలో వేడిచేసి / నీ జీవితాన్నొక కడ్డీగా మార్చి / దిమ్మెలపై వుంచితే / యినుప గజ్జెల తల్లి / మోతలు మోగిస్తున్నది / దయనీయమైన నీతలరాతను / నువ్వు నమ్మిన వీరబ్రహ్మం / మార్చేస్తాడా / ఈ ప్రపంచీకరణ బారి నుండి / నిన్ను రక్షిస్తాడా?" అన్నారు సునారపు రామచంద్రరావు. ప్రపంచీకరణ నేపథ్యంలో కంసాలి కుంపట్లోంచి ఎగిసిన ఆకలిసెగలను చక్కగా ఆవిష్కరించారు.

"మార్కెట్‌లో ప్రవేశించిన / కొత్త కొత్త యంత్రాలు / పనివాళ్ళ చేతివేళ్ళ కత్తెరలు / కప్పను మింగే సర్పంలా / కాలం పరిణమించిన వేళ / పూలమ్మిన చోటే కట్టెలమ్మలేక / ప్రాణత్యాగమంత్రం జపిస్తారు / బంగారం కరిగించే యాసిడ్ / ప్రాణాల్ని కరిగించే / మృత్యుధాతువై రుణం తీర్చుకుంటుంది" అన్నారు మందరపు హైమవతి. యంత్రాలు చేతికళ పాలిట పెనుభూతమైన స్థితిని వ్యక్తం చేశారు. ఇలా సామాజిక జీవన చిత్రణలో భాగంగా ప్రపంచీకరణ నేపథ్యంలో వస్తున్న మార్పులను కుల వృత్తుల విధ్వంసం, మానవుని ఆలోచనలలోని మార్పులు, ఇవన్నీ ఆధునిక కవిత్వంలో పరిమళించాయి. సామాజిక జీవన చిత్రణకు దర్పణంగా ఆధునిక కవిత్వం ప్రతిబింబించింది. ప్రతిబింబిస్తూనే ఉంటుంది.

❖ ❖ ❖

డా॥. వి. చంద్రశేఖర్ రావు కథలు – సామాజిక చిత్రణ

– డా॥. కడియాల వెంకటరమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

గృహోన్ముఖంగా :

ఈ కథలో రాజసుందరం ల్యాప్‌ట్యాప్ కంప్యూటర్ విడిభాగాలు తయారుచేసే కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. అంతర్జాతీయ ఆర్థిక మాద్యం కారణంగా తన ఉద్యోగాన్ని కోల్పోయే పరిస్థితుల్లో ఉంటాడు. ఇవే కారణాలు కాకపోయినా రాజసుందరం విస్సుగా, అనీజీగా, నిశ్శబ్దపు దుఃఖంతో మానసికంగా కుమిలిపోతుంటాడు. దీంతో అతను ఆత్మహత్య చేసుకోవాలని భావిస్తాడు. ఒక వారం రోజుల తరువాత శుక్రవారం నాడు తుపాకీతో మాత్రమే చనిపోవాలి అనుకుంటాడు. ఈ వారం రోజుల తర్వాత ఒక అపార్ట్‌మెంట్‌కి డబ్బులు కట్టి అది తన భార్యకు అందేలా చేస్తాడు. తన కొడుక్కి సెల్ ఫోన్ అందేలా ముందే ఏర్పాటు చేస్తాడు. ఈ వారం రోజులు తుపాకీని తల దగ్గర కాల్చుకొనేట్లు ప్రేరణ పొందే అలవాటు చేసుకుంటాడు. ఆఫీస్‌లో, భార్య పిల్లలతో పైకి ఆనందంగా కనిపిస్తాడు. ఒక రోజు ఆఫీసులో సైకలాజికల్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేస్తారు. అక్కడ వివిధ రకాల సీసాల్లో ఉన్న వాసన గమనిస్తాడు. కన్నీటి వాసన, మూత్రం వాసన, చీము కారుతున్న వాసన, జబ్బు వాసన, శవం వాసన ఒక్కొక్క వాసన చూస్తుంటే అతనిలో భయం, ఆశ్చర్యం, గగుర్పాటుకులోనయి పెద్ద కేకపెట్టి అక్కడ నుండి వెళ్ళి పోతాడు. రోడ్డు మార్గంలో ఉద్యోగాల నుండి తొలగించ బడ్డవారు ఆందోళన చేస్తుంటారు. అందులో ఒక యువకుడు గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకుంటాడు. మరుసటిరోజు బిల్డింగులు కూలిపోతున్న దృశ్యాలను చూస్తాడు. టీవీలో తీవ్రవాదులు పేల్చేసిన తాజ్ హోటల్ దృశ్యాలు యిలా చాలా దృశ్యాలు చూస్తాడు. శుక్రవారం రానే వస్తుంది. ఆత్మహత్యకు సిద్ధపడతాడు. అంతలోనే తన తల్లి దగ్గర నుండి ఫోన్ వస్తుంది. తన తల్లిని చూడాలని భావిస్తాడు. చాలా కాలం తర్వాత తల్లిని కలుసుకుంటున్నాననే ఆనందంలో రైల్వే స్టేషన్ కు పోతాడు. స్టేషన్ అంతా నిశ్శబ్దంగా యుద్ధానంతర సన్నివేశంలా ఉంటుంది. రైలు కోసం రాజసుందరం ఎదురుచూస్తుంటాడు. గంట గడుస్తుంది. అక్కడి వాతావరణంలో ఎలాంటి మార్పు లేదు.

శవాలలాగా మనుషులు, నిద్రనటిస్తున్న పోలీసులు, శవం కుళ్ళినప్పుడు వస్తున్న వాసనలో, 'ఇంకాస్త ఆశ మిగిలి ఉంది' అని అనుకుంటాడు. కాసేపటికి తన లాంటి వ్యక్తి అతనికి కనిపిస్తాడు.

ఈ కథలో రచయిత అంతర్జాతీయ ఆర్థిక మాంధ్యం తద్వారా ఉద్యోగాలు పోవడం. సెన్సెక్స్ భారీ నష్టాలు సంభవిస్తాయని తెలిపాడు. మరో వైపు ముంబై పేలుళ్లు, తీవ్రవాదులతో యుద్ధం, ఆసుపత్రుల్లో రోగుల బాధను రచయిత చిత్రించాడు. అదేవిధంగా రాజసుందరం తన తల్లిని చూడడానికి వెళ్లిన రైల్వే ప్లాట్ ఫారంలో మనుష్యుల ఇక్కట్లను అక్కడి దుర్గంధాన్ని చిత్రించాడు. పై సంఘటనలు అన్నింటిని వాటితో సంబంధం ఉన్న మనుష్యులు అంతా సాధారణంగా ఉండడాన్ని కూడా రచయిత ఎత్తిచూపారు. "ఎదురు చూడడం దుర్భరమే, నరకమే, హింసే, దుఃఖమే కానీ ఎదురు చూడటం అయిపోయాక వచ్చే ప్రయాణాలు ఎంతో ఆనందంగా ఉంటాయి.వాటి కోసం ఎదురు చూడక తప్పదు." పై వాక్యాలను బట్టి మనిషి తనకు ఎదురయ్యే దుర్ఘటనలను సహనంగా భరించగలిగినపుడే ఆ తర్వాత సుఖసంతోషాలు లభిస్తాయని తాత్వికీకరించాడు. అదేవిధంగా మనస్సులో ఏర్పడే అసంతృప్తి, అనాసక్తి, విసుగు లాంటి భావాలు అన్నీ కూడా ఈ కథలోని రాజసుందరం లాంటి వాళ్లు సానుకూలంగా

స్వీకరించినప్పుడే వారి మనసులోకి సంతోషాలనే వెలుగులు ప్రసరిస్తాయని రచయిత సూత్రీకరించాడు.

కొన్ని పక్షులు ఎగరగలవు :

ప్రపంచాన్ని ద్వేషంతోనూ, కోపంతోనూ గాక ప్రేమించే మనసు తో చూసి ప్రపంచాన్ని జయించాలని కోరుకున్న ఆధునిక భావజాలం గల స్త్రీల జీవితాలకు ప్రతిరూపమే' కొన్ని పక్షులు ఎగరగలవు' కథలోని ఇతివృత్తం.

ఈ కథలో జానకి అనే యువతి తల్లిదండ్రులది కులాంతర వివాహం. చిన్న పల్లెటూరులో జానకి తండ్రిని సాంఘిక హింసకు గురి చేస్తారు. ఎదిరించి నిలబడే ధైర్యం అతనికి లేక అతను ఎక్కడికో వెళ్ళి పోతాడు. దీంతో తల్లీ ఇంటి ముందర ఒక చిన్న హోటల్ పెట్టుకొని మగతోడు లేని జీవితాన్ని జానకి తల్లి ధైర్యంగా గడుపు తుంది. జానకి పాఠశాలలో చదువుకునేది. అక్కడ మనోహర్ అనే ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న విద్యార్థి నుండి అవమానాలను ఎదుర్కొంటుంది. కుల సంకరము వలన మనోహర్ జానకిని అసహ్యించుకునే వాడు. అంతే కాకుండా జానకిని జెన్నీగా పిలిచేవాడు. జెన్నీ అంటే ఒక తిట్టు అని అవమానకరమైన టీజింగ్ అని అర్థం అయ్యాక కసితో జానకి అని కాక స్కూల్ రిజిస్టర్ లో జెన్నీగా పేరు మార్చుకుంటుంది. మనోహర్ ఆర్.ఎస్.ఎస్.లో సభ్యుడు. నిరంతరం గాయత్రి మంత్రాన్ని చదివి డ్రిల్లో పాల్గొనే వాడు. మనోహర్ మీద కోపంతో జెన్నీ అతని బ్రహ్మచర్యం పై దాడి చేస్తుంది. టాగోర్ నవల చదివినప్పుడు దానిలోని గోరా పాత్ర మనోహర్ కు ప్రతిరూపమే. అప్పటి నుండి మనోహర్ ఆర్.ఎస్.ఎస్. నుండి బహిష్కరించబడ్డాడు. జెన్నీ తల్లి అడుగు జాడల్లో నడుస్తూ గుంటూరులో ఒక పెద్ద రెస్టారెంట్ నడుపుతుంది. సమాజంలో బ్రతకలేని మనోహర్ జెన్నీపై అధికారాన్ని చూపించాలని భావిస్తాడు. చుట్టుప్రక్కల వారు జెన్నీని వక్రచూపులతో చూసినా, అవమానించినా భరిస్తుంది. చివరికి అందరినీ ప్రేమించే మనస్తత్వం కలిగి ఉంటుంది. రెస్టారెంట్ భూ వివాదాన్ని చాకచక్యంగా పరిష్కరించుకుంటుంది. పెద్ద పెద్ద వారితో పరిచయాలు పెంచుకుంటుంది. ఈ కారణంతో ఆమెను ఉద్దేశించి చాలామంది చాటుమాటు గుసగుసలు మాట్లాడేవారు. అయినప్పటికీ జెన్నీ మాత్రం ప్రపంచాన్ని జయించాలనే కోరిక తో ముందుకుసాగేది. చివరికి జెన్నీపై కక్షకట్టిన మనోహర్ ఆమె నిర్మించుకున్న అందమైన రెస్టారెంట్ ను ధ్వంసంచేయాలని బాంబులు తెచ్చుకుంటాడు. ఈ ప్రమాదంలో అతని చనిపోతాడు. మనోహర్ చావును జెన్నీ జీర్ణించుకోలేకపోతుంది. రెస్టారెంట్లో స్టాఫ్ నంతా పిలిచి కొన్ని నెలలు రెస్టారెంట్ మూసేసి మరల తెరుద్దాం అంటుంది. హోటల్ స్టాప్ సభ్యుడైన రాజ్ ఆమె దగ్గరికి వెళ్లి ''పోరాటం ఆపవద్దు! లైట్ ద బర్డ్ ఫ్లై'' అంటాడు.

ఈ కథలో జెన్నీ తల్లిదండ్రులది కులాంతర వివాహం. ఈ విషయం తెలిసిన వాళ్ళ సూటిపోటి మాటలు తట్టు కోలేక తండ్రి కుటుంబాన్ని వదిలి వెళ్ళిపోతాడు. జెన్నీ తన చదువుతో పాటు తల్లితో కలిసి జీవితపోరాటం చేస్తుంది. మొదట్లో ఇంట్లోనే చిన్న హోటల్ నడుపుతారు. తరవాత వారికి ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్మి ''ప్లయింగ్ బర్డ్'' త్రీ స్టార్ అనే అందమైన రెస్టారెంట్ ను జెన్నీ నిర్మిస్తుంది. ప్రపంచాన్ని ద్వేషంతోను, కోపంతోను కాక ప్రేమించే మనసుతో చూడడం అలవాటు చేసుకోన్న నాకు, ఎటు చూసిన స్నేహితులే, ప్రతి మలుపులోనూ ఒయాసిస్సులే. ''ఒదిగి ఒదిగి సిగ్గులు చిందించే పాతతరపు స్త్రీను కాను నేను. ప్రపంచాన్ని జయించాలని నేటి స్త్రీని!'' పై వాక్యాల్ని బట్టి జెన్నీ మనుషుల పట్ల ప్రేమభావం కలిగి ఉంటుందని తద్వారా ఆమెకు స్నేహితులు, ఆప్తులు విస్తృతంగా ఉన్నారన్న విషయం మనకు అర్థమవుతుంది. అంతేకాకుండా ఒక సాంప్రదాయ స్త్రీగా కాకుండా ప్రపంచాన్ని జయించాలనే కలలుగనే స్త్రీగా కూడా ఆమెను గురించి తెలుస్తుంది. ఈ లక్షణాలే జీవితంలో ఆమెను పోరాట మార్గంలో ఉంచాయి. రెస్టారెంట్ నిర్మించి పదిమందికి ఆసరాగా సమాజానికి ఆదర్శంగా నిలుస్తుంది. దీన్ని బట్టి స్త్రీలు ఆశక్తులు కారని జీవితంలో జెన్నీలాగా ఆదర్శంగా నిలవాలన్నది ఈ కథలో రచయిత సందేశంగా భావించవచ్చు.

ముఖాముఖం :

ఈ కథలో మాలతి నాటకాలు, ఉద్యమాలు జీవితంగా గడిపింది. ఈమె పచ్చని చెట్ల కోసం, అరణ్యాల కోసం స్వచ్ఛంద సంస్థల్లో భాగం అవుతుంది. డబ్బుకు, రాజకీయాలకు స్వచ్ఛంద సంస్థలు అమ్ముడుపోతాయి. దీంతో భూమిని, భూమిపుత్రుల్ని బలవంతంగా వేరు చేస్తారు. ఈ పోరాటంలో మాలతి చిత్రహింసలకు గురై కొందరి చేతుల్లో మానభంగానికి గురవుతుంది. ఈమె అప్పటినుండి ఉద్యమాలను, నాటకాలను వదిలేసి నిర్లిప్తమైన జీవితం గడుపుతుంది. ఈమె కోసం సుజాత, శివం అనే మిత్రులు పోరాడుతారు. ఒక్కసారి శివం ఒక నాటకాన్ని వేయడానికి మాలతిని ఆహ్వానిస్తాడు. మాలతికి వెళ్లడం ఇష్టం లేకపోయినా శివం కోసం వెళ్ళుతుంది. దారిలో మాలతికి సుజాత ఎదురవుతుంది. మాలతిని ఓదార్చి సుజాత ధైర్యం చెబుతుంది. సుజాత జర్నలిస్ట్‌గా తనకు న్యాయం చేసే పనిలో ఉన్నానని మాలతికి చెప్పి వెళ్లిపోతుంది. శివం పిలిచాడని ఆమె సెంట్రల్ యూనివర్సిటీకి వెళుతుంది. శివం మాలతిని నాటకం వేయాలని బలవంతం చేస్తాడు. మాలతి ఒప్పుకోక తప్పదు. శివం వేస్తున్న నాటకమంతా మాలతికి జరిగిన అన్యాయానికి సంబంధించింది. నాటకం వేస్తున్న కొద్దీ మాలతి నాటకంలో లీనమవుతుంది. నాటకం మూడవ రంగంలో మాలతిది ప్రధాన పాత్ర. పర్యావరణ పరిరక్షణ సమితిలో భాగం ఆమె పోరాటం. దీంతో ఆమెను బలాత్కారం చేయడం జరుగుతుంది. మాలతి తనకు జరిగిన అన్యాయాన్ని తలచుకుని బాధపడుతుంది. శివం ఆమెను ఓదారుస్తాడు. రెట్టించిన ఉత్సాహంతో మాలతి చిట్టచివరి రంగంలో పాలుపంచుకోవడానికి సిద్ధపడుతుంది.

సమాజంలోనూ, కుటుంబంలోనూ, పనిలోనూ స్త్రీలు గురవుతున్న అణచివేత, దోపిడికి నిలువెత్తు నిదర్శనం ఈ కథ. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, దోపిడీలను ఎదిరించిన ఒక స్త్రీని ఏ విధంగా అత్యాచారానికి గురి చేసి ఆమెను నిస్సహాయురాలిగా చేసిన తీరును ఈ కథ ద్వారా రచయిత చెప్పుకొచ్చాడు. తనకు జరిగిన అన్యాయానికి నిస్సహాయురాలిగా మాలతిని రచయిత చూపిస్తూ తిరిగి ఆమెలో ధైర్యాన్ని కసిని నింపిన తీరు ఆకట్టుకుంటుంది. పురుషాహంకార సమాజంలో స్త్రీలు, పురుషులను ఎదిరిస్తూ ధైర్యంగా నిలబడితేనే వారు తమ అస్తిత్వాలను కాపాడుకోగలరని రచయిత ఈ కథ ద్వారా యావత్తు స్త్రీ జాతికి సందేశాన్ని ఇచ్చాడు. చేయ దలచిన పని మీద లేదా వ్యవస్థ మీద కసి, పట్టుదల ఉంటే అనుకున్నది సాధించవచ్చునని స్త్రీ జాతిని మేల్కొలిపే దిశగా రచయిత ఈ కథను చిత్రించాడు.

ఈ కథలో మాలతి 'ఫోకస్' అనే స్వచ్ఛంద పర్యావరణ పరిరక్షణ సంస్థలో పనిచేస్తోంది. ఈ పర్యావరణ పరిరక్షణ కోసం అదే ప్రదేశంలో ఒక సమావేశం జరుగుతుంది. ఆ సమావేశంలో మాలతి మాట్లాడుతూ రాజకీయ నాయకులు, అధికారులే అటవీ సంపదను కొల్లగొట్టి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తుంది. దీంతో మాలతి మానభంగానికి గురికావడమే కాకుండా గిరిజనుల గుడిసెలు తగలబడతాయి. ఆ సంఘటన కారణంగా మాలతిలో నిస్తేజం, నిరాశచోటు చేసుకున్నాయి. మాలతి స్నేహితుడైన శివం మాలతికి జరిగిన సంఘటనను నాటకంగా చిత్రీకరిస్తాడు. అందులో మాలతి నటించేటట్లు ప్రోత్సహిస్తాడు. తద్వారా ఆమెలో మళ్ళీ ధైర్యం, ఉత్సాహం నెలకొంటాయి. దీన్ని బట్టి "పర్యావరణ పరిరక్షణ కోసం, సామాజిక హితం కోసం పనిచేసే మాలతి లాంటి వారిపై దాడులు దౌర్జన్యాలు జరుగుతాయి. కాబట్టి వాటికి బెదిరిపోకుండా మాలతి లాగా మళ్ళీ ధైర్యాన్ని ఉత్సాహాన్ని నింపుకొని సామాజిక అభివృద్ధికి కృషి చేయాలన్నది రచయిత భావనగా చెప్పవచ్చు. అదే విధంగా గిరిజనులు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని వారిపై నెపం పెట్టి పర్యావరణానికి వినాశనం కలిగించి అటవీ సంపదను రాజకీయనాయకులు, అధికారులు దోచుకుంటున్నారని" ఈ కథ ద్వారా రచయిత సమాజానికి చైతన్యాన్ని కలిగించాడు.

సిద్ధార్థ వగపెందుకు :

ఈ కథలో మాలతి గొప్ప రచయిత్రి. సమాజ సేవకు రాలు. సారా వ్యతిరేక ఉద్యమం తాలూకు మీటింగులను తన ఇంట్లో నిర్వహించి ఉద్యమాలకు ఊపిరి ఊదేది. ఈమెకు భర్త, కుమారుడుంటాడు. అయితే కుమారుడు తనపట్ల తన తల్లి పెద్దగా స్పందించదని అనుకునేవాడు. దీంతో మాలతి కొడుకు తన తండ్రి తో ఎక్కువ చనువుగా ఉండేవాడు. తన తండ్రితో హైదరాబాద్ నగరాన్ని చుట్టేస్తూ హాయిగా గడిపేవాడు. ఒక సందర్భంలో మాలతి భర్త తన కొడుకుతో మాలతిని ఉద్దేశించి ఇలా అంటాడు. "మీ అమ్మ కొత్తతరం స్త్రీకి ప్రతినిధి. మమకారం, ప్రేమ, నాది అనే పాశం ఇవన్నీ స్త్రీలకు సమాజం తగిలించిన సంకెళ్ళని తన నమ్మకం.స్త్రీలే కాదు అసలు మనుషులెవరు అంత ఎమోషనల్‌గా ఉండనవసరం లేదని ఆమె వాదన" అంటాడు. అనుకోకుండా మాలతి భర్త మరణిస్తాడు. అప్పటి నుండి తన తండ్రి జ్ఞాపకాలతో మానసిక వ్యధకు గురవుతాడు మాలతి కొడుకు. తన తల్లి తనను పట్టించుకోవట్లేదని ఆమెపై అసహనంగా ఉంటాడు. ఒక సందర్భంలో మాలతిని "నువ్వు నా తల్లివేనా? ఆ పోయింది నీ మొగుడేనా? అంటూ ఏడుస్తాడు. మాలతి మాత్రం ఆ మాటలకు రవ్వంత కూడా చలించదు. మాలతి కొడుకు కాలేజీకి వెళ్లి అక్కడ పాఠాలు వినకుండా బయట తిరిగేవాడు. ఒకసారి నగరంలో బిక్షమెత్తుకొనే పిల్లలతో స్నేహం చేస్తాడు. వాళ్లకు భోజనాలు ఏర్పాటు చేస్తాడు. ఆ బిచ్చగాళ్ళతో ఆడుకుంటాడు. సెంటిమెంట్లు, భయాలు, దిగులు ఏమి లేని స్వేచ్ఛా జీవితం వాళ్ళది అనుకుంటాడు. బిచ్చగాళ్ళ గుంపుతో పాటు పోలీసులకు చిక్కుతాడు. విషయం తెలుసుకున్న మాలతి తన కొడుకును ఇంటికి తీసుకొస్తుంది. "నాతో కలిసి ఉండడం ఇష్టం లేకపోతే చెప్పు హాస్టల్‌లో చేర్పిస్తాను. నేను మీ నాన్నలా ఎప్పటికీ ఉండలేను" అని చెప్తుంది. తన తల్లికి తనకు మధ్య అనుబంధం లేదు అనుకుంటాడు. ఒకరోజు మాలతి రాసిన నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వస్తుంది. ఆ సన్మాన కార్యక్రమానికి తన కొడుకును పిలుస్తుంది. ఆ కుర్రాడు వెళ్ళడు. కార్యక్రమం అయిపోయాక ఆమె ఇంటికెళ్తుంది. ఆ కుర్రాడు నిద్రపోయినట్లు నటిస్తాడు. మాలతి ఆ కుర్రాడు దగ్గరికి వెళ్లి చూసి వేరే గదిలో పడుకుంటుంది. ఉదయాన్నే పేపర్ చదువుతాడు ఆ కుర్రాడు, ఆ పేపర్ లోని వార్త చూసి షాక్ తింటాడు మాలతి కొడుకు. "సుప్రసిద్ధ నవలా రచయిత్రి మాలతికి తీవ్రమైన గాయాలు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఊరేగింపుపై పోలీసులు లాఠీఛార్జి" అనే వార్తలు చదువుతాడు. దాని పక్కనే మరో వార్త హైదరాబాద్ స్ట్రీట్ చిల్డ్రన్ కు రచయిత్రి మాలతి కానుక. చనిపోయిన తన భర్త జ్ఞాపకార్థం "రాజశేఖర్ మెమోరియల్ ఇన్ స్టిట్యూట్ ఫర్ చిల్డ్రన్" అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు సాహితి అకాడమీ బహుమతి మొత్తంతో పాటు తన రచనల పై వచ్చే రాయితీ ఈ సంస్థకే వినియోగిస్తున్నట్లు వార్త చదువుతాడు. పేపరును విసిరేసి ఆత్రంగా మాలతి గదిలోకి వెళ్తాడు ఆమె కొడుకు. "ప్రపంచపు దుఃఖం అంతా తన దుఃఖం అనుకొని, ఇట్లా దెబ్బలు తిని జైల్లో పడి ఆఖరికి ప్రాణాలు కూడా పోగొట్టుకొనే త్యాగమూర్తుల కోవలో చెందిన మాలతి మేడమ్" అనే పశ్చాత్తాపపడతాడు. కళ్ళనిండా నీళ్లు నింపుకొని అమ్మా! అని పిలువబోయి ఈ కళ్ళనీళ్ళు కార్చడాలు ఆమెకు బొత్తిగా ఇష్టముండదు." అనుకొని ఆమెకోసం కాఫీ చేసుకెళ్తాడు. అప్పుడు మాలతి తన కొడుకు వైపు ఆశ్చర్యంగా చూస్తుంది.

ఈ కథ కుటుంబం బంధాలకన్నా, సామాజిక బాధ్యతలు సమాజ అభివృద్ధి ముఖ్యమని భావించిన ఒక రచయిత్రి కథ. మమకారం, ప్రేమ, నాది అనే పాశం స్త్రీలకు సమాజం తగిలించిన సంకెళ్ళని భావించే ఒక కొత్త తరం స్త్రీకి ప్రతినిధి మాలతి. మనుషులు ఎవరు ఎమోషనల్ గా ఉండాల్సిన అవసరం లేదని ఆమె రచనలు ఉదాహరిస్తాయి. కుటుంబంలో ఒకరికి మరణం దుఃఖాన్ని కలిగించిన ఇతర సభ్యుల జీవితాలు అక్కడితో

ముగిసిపోవడం ఉండకూడదు. జీవితం అంటే దుఃఖం మాత్రమే కాదని, ఎవరికి వారే ఓదార్పు ఆసరా కావాలని ఎవరికి వారే చిగురించాలని భవిష్యత్తుకు పునాదులు ఏర్పరచుకోవాలని ఈ కథ ద్వారా రచయిత సూచించాడు. ఈ కథలో మాలతి కొడుకు తన తండ్రిని కోల్పోయాక తీవ్ర మనోవేదనకు గురి అవుతాడు. తన తండ్రి జ్ఞాపకాలలో నుండి బయటికి రాలేక తన మనసుకు జబ్బు చేసుకుంటాడు.

కానీ మాలతి మాత్రం దుఃఖానికి మందు దుఃఖపడ నివ్వడమే అని ఆ కుర్రాడిని డిస్టర్బ్ చేయద్దు. క్రమంగా వాడే కోలుకోవాలని మళ్లీ కొత్త జీవితంలోకి రావాలని మాత్రం ఆకాంక్షిస్తుంది. దీన్నిబట్టి బాధ్యతాయుతమైన రచయితలు జీవితాన్ని వాస్తవికంగా ఆలోచిస్తారని తెలుస్తోంది. ప్రపంచపు దుఃఖం అంతా తన దుఃఖమని భావించే మాలతి పట్ల తన కొడుకు మొదట అపనమ్మకంగా ఉన్నా చివరికి ఆమె సామాజిక కార్యకలాపాలను చూసి పశ్చాత్తాపం పొందడం జరుగుతుంది. దీన్ని బట్టి జీవితం అంటే తను జీవిస్తూ మాలతి లాగా సామాజిక సంక్షేమానికి తోడ్పడడమేనన్నది రచయిత భావనగా చెప్పుకోవచ్చు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రచయిత్రుల క్రొత్త కథలు–సామాజిక జీవన చిత్రణ

– ఊధవి బొల్లు, పరిశోధక విద్యార్థి, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

కథలంటే పైపైనే ఉన్నాయనుకున్నావేమో అంటూ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 'మార్గదర్శి' అనే కథానికలో అవి రాయడానికి నేర్పుండాలి. చదవడానికి పరిజ్ఞానం ఉండాలి అని చెప్పటంలోని ఔచిత్యం గమనించాలి. సమాజంలోని ఏవిషయాన్ని చెప్పాలి, ఏమి చెప్పాలి, ఎలా చెప్పాలి, ఎందుకు చెప్పాలి లాంటి విషయాల్ని దృష్టిలో ఉంచుకొని వ్రాసే రచయితలు అభివృద్ధి పథంవైపు అడుగులు వేస్తారనడంలో సందేహం లేదు.

రచన ఒక సామాజిక బాధ్యత. సామాజిక సమస్యల నెన్నుకోవడంలోనూ వాటిని కథలుగా మలచడంలోనూ రచయిత నైపుణ్యం మెచ్చదగినది. సాహిత్యం ఎప్పుడు సమకాలీన సమాజానికి ప్రతిబింబించే విధంగా ఉంటుంది. ఏ కథ అయినా, ఏ కవిత అయినా, ఏ కథా ప్రక్రియ అయినా సమాజానికి అనుబంధంగానే సాగుతుంది. సామాజిక వర్తమాన పరిస్థితులను బట్టి సాహిత్యం కొనసాగాలనే విషయాన్ని ఆధునిక విమర్శకు ఆద్యుడైన కట్టమంచివారు అనాడే పరిగణించారు. కథ వ్రాయడ మన్నది అంత సులువుకాదు. ఇతివృత్తాన్ని ఎన్నుకోవటం, పాత్ర చిత్రీకరణ గావించటం, మలుపులు, ఆరంభ, ముగింపులు ఇవన్నీ కథకునికి పరీక్షలాంటివి. చదవగానే కొంచెంసేపయినా తను చెప్పదల్చుకున్న విషయం గురించి ఆలోచింపచేయగల శక్తి ఆ కథకుండాలి. జీవితంలో రకరకాల సత్యాల్ని చెప్పే కథలు-మన మధ్య జరుగుతున్న సంస్కారహీనమైన విషయాల్ని చెప్తూ మనలో సంస్కారాన్ని అవగాహనను పెంచడానికి ఈ కథా సాహిత్యం ఎంతో మేలు చేస్తుంది. రచయితలు అందరూ జన జీవితాలని ఒకే దృక్పథంతో అధ్యయనం చేయరు. సామాజిక పరిణామాలను ఒకే వరుసలో అర్థం చేసుకోరు. భిన్న భిన్న దృక్పథాలతో, భిన్న భిన్న కోణాలలో, భిన్న భిన్న అవగాహనలతో రచనలు చేస్తుంటారు. అలా రచనలు సాగించేవారిలో 33 మంది రచయిత్రులు వారి రచనలను ఒక కథా సంకలనంలో పెట్టడం జరిగింది. ఈ కథా సంపుటి పేరు రచయిత్రుల-క్రొత్త కథలు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత పద్మభూషణ్ డా.సి. నారాయణరెడ్డిగారి 87వ జయంతి సందర్భంగా వంశీ సంస్థ ఈ కథా సంకలనాన్ని ఆవిష్కరించటం జరిగింది. ఈ కథా సంకలనంలోని రెండు కథలు తీసుకొని వాటిలోని సామాజిక చిత్రీకరణను చూపించటం నేటి అంశం. ఆర్. దమయంతి వ్రాసిన హుండీ కథను, కస్తూరి అలివేణి వ్రాసిన 'బడుగు-నీడ' కథను మీ ముందుంచుతున్నాను. వీరిద్దరి కథలలో మనకి అనవసర వర్ణనలు, పాత్రలు కన్పించవు.

ఒక సామాన్య విషయాన్ని తీసుకొని చక్కటి సామాజిక స్పృహతో రచన చేసి సమాజంలో అసహాయులుగా ఉన్నవారిలో చైతన్యం, బెదిరిన వాళ్ళకి ధైర్యం, వ్యక్తిత్వం కోల్పోయినవారికి వ్యక్తిత్వం ఇవ్వటం వీరి రచనలలో సాగింది. మన జీవన విధానంలో ఉన్న విలువలకు తమ కథలలో ప్రాధాన్యమిచ్చి సమాజ నడవడికలో మార్పు తీసుకురావలన్నదే వారి దృక్పథం- సంకల్పం.

మొదటగా "హుండీ" కథలోని సామాజిక చిత్రణ

హుండీ :

ప్రజా జీవితంలోని అనేక అంశాల సమాహారమే సమాజం. సమాజాన్ని విడిచి సాహిత్యం జీవించలేదు. తన జీవితంలో చూసిన ప్రతి సంఘటననూ, తన అనుభవాల్నీ, ఆవేదననూ, తపననూ సాహిత్యరూపంలో సమాజంతో పంచుకోవాలన్న కాంక్ష రచయిత్రి దమయంతిది.

కథలో ఒక నీతో, సందేశమో ఉన్నంత మాత్రాన

అందులో సామాజికత స్పృశించదు. సామాజిక సమస్యల మూలాలను, వాటి పరిష్కారాలను, సామాజిక మానవీయ సంబంధాలను కూర్చి చక్కటి కథను అందించారు రచయిత్రి దమయంతి. ఈమె వ్రాసిన కథ "హుండీ"లో గుడిలో బడిని చేర్చి రెండు రకాల ఉపయోగాలు చెప్పారు. సమాజానికి ఈ కథ ద్వారా సందేశంతో పాటు ఒక మంచి ఆలోచన ఎంతమందికి ఎన్నిరకాలుగా ఉపయోగపడిందో చూపించారు. దేవుడి పైన నమ్మకం ఎంత ముఖ్యమో, చదువుపైన నమ్మకం, ప్రాధాన్యత అంత కంటే ముఖ్యమని చెప్పారు.

ప్రతి మంచి ఆలోచనలోనూ దేవుడుంటాడు. ఉన్నతమైన సమాజం కోసం శ్రమించే రామకృష్ణలాంటి వారి దేహము-ఒక దేవాలయమే! నడిచే దేవాలయమే. ఇతరులకు ఉపకారం చేయాలంటే ధనమే ఉండనవసరంలేదు. ఎదుటివారి అవసరం, కష్టాన్ని అర్థంచేసుకునే మనస్సు ఉంటే చాలు. అదే గొప్ప డబ్బుతో నిండిన హుండీ. అదే శాంతిని స్థాపించే హుండీగా మారుతుంది.

నీలకంఠం అనే వ్యక్తి ఎప్పటినుండో పల్లెటూరిలోని గుడిని కనిపెట్టుకుని ఉన్నాడు. గుడిని ప్రాణప్రదంగా కాపాడుకుంటూ వస్తున్నాడు. గుడికి రకరకాల హంగులూ-ఆర్భాటాలు చేసినా గుడికి వచ్చేవాళ్ళు లేనేలేరు. నీలకంఠం ఆవేదన అంతా ఇంతా కాదు. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. అతని ఆలోచనా పరిధి అంతవరకే ఉండింది. అలాంటి పరిస్థితుల్లో నీలకంఠం గారి దగ్గరకి ఒక వ్యక్తి వచ్చి నేను ఉద్యోగ విరమణ తర్వాత ఉచితంగా పిల్లలకు చదువు చెప్పాలనీ, దానికి స్థలం లేకపోవటంతో గుడిలో చదువు చెప్పటానికి అవకాశం ఇస్తే అందరికీ ఉపయోగపడుతుందంటాడు. దానికి అనుమతినిచ్చిన నీలకంఠంగారికి అతితక్కువ రోజుల్లోనే అతని వలన ఎంతమందికి ఉపయోగపడుతున్నాడో ఎవరూ చెప్పకుండానే గ్రహించగలిగారు.

పదవీ విరమణ చేసిన వ్యక్తి ఇలా మురికివాడల పిల్లలకూ, గ్రామాల్లో పిల్లలకూ ఉచితంగా చదువు చెబితే ఆ గ్రామాన్ని అన్నివిధాలా ఉద్ధరించినట్లే. దేవుని కన్నా మాస్టారి పాఠాలే ముఖ్యమనే స్థాయిలో మాస్టారి దగ్గరకు విద్యార్థులు పెరిగారు. అలాగే గుడిలోకి జనం రావడం కూడా ఎక్కువైంది. దేవుని ఆదాయం బాగుంది.

ఆ దేవాలయాన్ని సరస్వతీ విద్యాలయంగా మార్చిన ఘనత ఆ మాస్టారిదే. మనస్ఫూర్తిగా నీలకంఠంగారు ఒప్పుకొని ఇంకా నీవు అధికంగా ఏమైనా క్లాసులు చెప్పాలన్నా నీవు వాడుకోవచ్చు అనే భరోసాతో రామకృష్ణ ఇంకా ఎన్ని మంచి పనులకు ఈ స్థలం ఉపయోగించవచ్చా అని ఆలోచిస్తున్నాడు. అతని ఆలోచనలు, ఆశయాలు వింటుంటేనే నీలకంఠంగారు వదిలేద్దామనుకున్న గుడి నిర్వహణను దేవుడు మాస్టార్ని పంపి దేవుడు తనను వదలలేదు. నిరాటంకంగా సేవ చేసుకోమన్నాడు అని అనుకొని ఆయన కళ్ళు కృతజ్ఞతతో నిండాయి.

మాస్టారు విద్యాదాన హుండీ అనే కొత్త ఆలోచనతో దాతలు ఎవరైనా ఉంటే బీదవిద్యార్థుల చదువుకు అవసరమయ్యే సంవత్సరపు ఖర్చులు భరించే దాతలు ఉంటే ముందుకు రావచ్చు అని తన ఆలోచనలు, సూచనలు నీలకంఠంగారితో పంచుకుంటున్నాడు. అలా మాస్టారి ఆలోచనలు ఎంతమందికి మార్గదర్శకంగా ఉన్నాయి. ఈ మాస్టారిలా ఎవరో ఒకరు మంచి ఆలోచనతో ముందుకు అడుగు వేస్తే గ్రామాల్లో నిరక్ష్యరాస్యత అనేది ఉండదు. విద్య మనిషిలో సంస్కారాన్ని పెంచుతుంది. దానితో పాటు వారు మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారు.

కాలనీ వాసులంతా మంత్రిగారు గుడికి రావటంతో అందరూ గుడిలో ఉన్నారు. 'విద్యాదాన హుండీ' కి ఆ కాలనీ వాసులలో దానం చేసినవారికి సత్కారం, అభినందనలు జరిగే కార్యక్రమంతో కథ ముగుస్తుంది.

కాలనీ వాసులు తాము చేసిన చిన్న సాయానికి పొందబోతున్న సత్కారం కంటే పేద కుటుంబాలలో విద్య అనే విద్యుద్దీపాలు వెలిగించగల్గాము అనే తృప్తి వారి

మనస్సులలో, ముఖాలలో స్పష్టంగా ఉంది. ప్రతి దేవాలయం ఒక విద్యాలయంగానూ, పేదవారిని ఆదుకునే విద్యాదాన హుండీ నిండాలని ప్రతి గ్రామంలో ఇలాంటివారు ముందుకువస్తే విద్యాలక్ష్మితో ఆ గ్రామాలు విలసిల్లుతాయని రచయిత్రికి సమాజం పట్ల గల అవగాహనా నేపథ్యమే.

మనిషి ఆర్థిక సామాజిక స్థితులకు సంస్కారానికీ సంబంధం లేదు. ఇతరులకు మేలు చేయటం కంటే ఈ జీవితానికి కూడబెట్టే ధనం ఇంకేముంటుంది. ఇక్కడ ఎవరి అంతరంగాల్లో వారు, వారు చేసే పనులతో ఆనందంగా తృప్తిగా ఉన్నారు.

నీలకంఠంగారికి - గుడిలోకి వచ్చే జనాలను చూసి ఆయనకు పండుగే పండుగ. భక్తులు గుడికి రావటమే ధనంగా, అదే సిరి సౌభాగ్యాలుగా ఆయనకు ఆనందాన్ని చ్చాయి. మాస్టారు - ఇంకేం పనులు చేస్తే పేదలకు ఆసరాగా ఉండగలనా? ప్రతీ దేవాలయం విద్యా దానాలకు మూలస్తంభాలై నిలిస్తే సమాజం విజ్ఞానంతో విలసిల్లుతుంది కదా అని మాస్టారి సదాలోచన. కాలనీ వాసులు - వారు చేసిన ఉడుత సాయం ఎంతమందికి ఆనందాన్ని తృప్తినిచ్చింది అని వారి భావన. ఇలా ఎవరి అంతరంగాలలో వారందరికి తృప్తి, ఆనందం. ఒకరి మంచి ఆలోచన, మంచి పనితో అడుగు ముందుకు వేయటం వల్ల ఎంతమందికి ఎన్నిరకాల ఉపయోగపడే పనులు చేయగలిగారు, అవి ఎంతమందికి ఉపయోగ పడ్డాయి అన్నది రచయిత్రి చూపించగలిగారు ఈ కథలో ..... ఇక రెండవది.

బడుగు - నీడ :

శతాబ్దాలుగా అణచబడుతున్న మనిషి ఆవేదనకు అక్షరరూపం ఇచ్చారు కస్తూరి అలివేణి. బడుగు జీవితాల ఆశలను, అవి కొందరి స్వార్థాలకు బలైపోతున్న తీరును అద్దంపట్టినట్లు చూపించారు తన కథ 'బడుగు నీడ'లో. ఏరోజుకారోజు బ్రతికే బ్రతుకులు బడుగు వర్గానివి. రాజరికాలు పోయినా, ప్రజాస్వామ్యం విలసిల్లినా ఎందుకో వీరి బ్రతుకులు మారలేదు. అలా అని వారు ఎవరినీ నిలదీయడంలేదు. రెక్కాడితేకాని డొక్కాడని బ్రతుకులు వారివి. కదిపితే కన్నీటి గాధలూ, కథల్లాంటి జీవితాలు. కన్నీటిలోనే మునిగి తేలుతున్నవారి జీవితాలను కళ్ళకు కట్టినట్లు ఈ చిన్న కథలో చక్కగా చూపించగలిగారు రచయిత్రి. యాంత్రికమైన జీవితాలు, రేపు మీద ఆశ లేని వారి బ్రతుకులను, వారి జీవితంలోని విషాదాన్ని నిరాడంబర శైలిలో గుండెను పట్టి ఊపే ఉదంతంతో ఈ కథను చిత్రించారు.

అలాంటి బడుగు వర్గంలోని ఒక కుటుంబంలో తల్లి పడే ఆవేదనను అర్థాంతరంగా ముగిసిన కొడుకుల జీవితాలను సున్నితంగా మనస్సుకు హత్తుకునేలా కథను మలిచారు. ఈ కథలో సత్తెమ్మ పాత్ర ప్రధానమైనది. ఇద్దరు కొడుకులు, భర్త ఈ ముగ్గురి మధ్య నలిగిపోయిన పాత్ర సత్తెమ్మది. సాధారణంగా ఇలాంటి కుటుంబాలలో మగవాళ్ళు తాగుడుకు బానిసలైపోతారు. ఆడవాళ్ళు పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తూ ఉంటారు. అలాంటి జీవితమే సత్తెమ్మది కూడా. తాగుబోతుగా మారి గవర్నమెంటు ఉద్యోగం పోగొట్టుకున్న భర్తతో కాపురం చేస్తుంది. మొగడు బుద్ధిపుడితే పనికి వెళ్తాడు. పనికి వెళ్ళివచ్చిన రోజు బ్రాందీషాపుకు అంకితం.

అలాంటి పరిస్థితుల్లో ఇద్దరినీ చక్కగా చదివిద్దా మనుకుంటుంది. కానీ విధి సత్తెమ్మ జీవితంతో ఆడుకుంటుంది. పెద్ద కొడుకును మొగుడు తన వెంట తిప్పుకుని చెడగొడితే చదువు లేక అల్లరిచిల్లరిగా తిరుగుతూ నక్సలైట్లలో చేరతాడు. తెలిసీ తెలియని వయసులో తెలియక, తొందరపాటు నిర్ణయాలతో చేసే పనులకు జీవితంలో ఎటువంటి పరిస్థితులకు బలైపోతారో పెద్దకొడుకు పాత్రలో చూపించారు రచయిత్రి. రెండవ కొడుకుని చదవించాలనే ఆమె ఆశ మరొకసారి కుప్పకూలిపోయింది. అనారోగ్యంతో పోలియో వచ్చి సరైన వైద్యం లేక కాళ్ళు పోగొట్టుకొని కుంటివాడై ఇంట్లో పడి ఉంటాడు రెండో కొడుకు. అయినా సత్తెమ్మ బాధను దిగమింగుకుని

అతని కోసమే బ్రతుకుతుంది. ఆ బిడ్డ తన కళ్ళ ఎదురు గానే ఉన్నాడు కదా అనుకొని బ్రతుకుతున్న ఆమె మీద విధి మరొకసారి పగ తీర్చుకుంది. కూకొని తింటే ఇల్లు ఎలా గడుస్తుందనే తలంపుతో తనూ ఏమైనా పని చేసి సంపాదించాలని ఒక రాజకీయ ప్రచారసభకు వెళ్ళి ఆ గలాటాలో ప్రాణాలు పోగొట్టుకొంటాడు.

పెద్దాడు ఎవరితోనో పంపించిన రెండు లక్షలు, ఈ గలాటాలో చనిపోయినవారికి మనిషికి లక్ష ఇస్తారని అంటున్న జనాన్ని చూస్తూ పిల్లలిద్దరూ అమ్మ కష్టపడ కూడదని లక్షలు గడించారు అని గుండెలవిసేలా దుఃఖి స్తున్న సత్తెమ్మ మాటలు అక్కడున్న భర్తకు తప్ప ఎవరికీ అర్థం కాలేదు.

ఇది ఒక మారుమూల గ్రామంలో ఒక బడుగు జీవిత గాథ. ఇలా మనదేశంలో ఎన్నో వేల గ్రామాలు వందల బడుగు జీవితాల కథలు-ఎన్నో. వీరి జీవితాలు మారే దెప్పుడు? వీరి కథలకు అంతం లేదు-సుఖం లేదు.

ఎదుటివారి ఆర్థిక ఇబ్బందులను తమ ప్రయోజనా లకు అనుగుణంగా మార్చుకున్న రాజకీయ నాయకులు, పెద్ద పెద్దవాళ్ళు తమ సంపాదనలకు బడుగు జీవితాన్ని తాగుడికి బలిచేస్తున్న వారిని మత్తుమందులో ఉంచు తున్నది ఎవరిని రచయిత్రి ప్రశ్నించటంతో కథ ముగు స్తుంది.

పెద్దవాళ్ళ గొప్పలకి వీరి జీవితాన్ని తాకట్టు పెడు తుంటే వీరి జీవితాలు ఎదగవు, వీరి కథలు మారవు. నీడలో మ్రొక్క ఎదగనట్టే బడుగు నీడలో బడుగు బ్రతుకులు ఎదగవు. సత్తెమ్మ లాంటి తల్లులకు ఆవేదన తప్పదు. జారిపోయిన కన్నీళ్ళు, ఆగిపోయిన కథలు, అలసిపోయిన కథలు ఇలా బడుగు జీవితాల జీవితాలు.

పై కథలో భగవంతునికి సమాజానికి సమర్పించు కోవటం ఉత్తమ గుణానికి ప్రతీకగా ఉన్న రామకృష్ణలాంటి వ్యక్తి సమాజానికి ఎంత అవసరమో, ఈ కథలో రాజకీయ నాయకుని స్వార్థానికి బలైపోయిన జీవితాలు - ఈ విధంగా ఆధునిక కథాప్రక్రియలో సమకాలీన సమాజం ప్రతిబింబిస్తూనే ఉంది. కథా ప్రక్రియ పుట్టి వంద సంవత్సరాలైనా కథాప్రక్రియ తన విశిష్టతను చాటు కుంటూనే మానవ జీవితాన్ని భిన్న కోణాల్లో ఆవిష్క రిస్తుంది.

మానవుడు సంఘజీవే కాదు సహాయ జీవి, సహకార జీవి కూడా. మానవుడు తన నిత్యజీవితంలో ఇతరులతో సహాయ, సహకారాలు ఇచ్చి పుచ్చుకోవడం చాలా అవ సరం. తప్పనసరి కూడా. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఎప్పుడో ఒకప్పుడు నిత్యం ఇతరుల తోడ్పాడుతోనే జీవితం గడపాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరి జీవితంలో ఇతరుల సహకారం ఇతరుల జీవితంలో తన సహకారం లేకపోతే ఆ వ్యక్తి జీవితంగానీ, కుటుంబ జీవితం గానీ, సమాజ జీవితం గానీ రాణించదు. కాబట్టి సమాజంలోని మానవుల మధ్య సత్సంబంధాలు నెలకొన్నప్పుడే వాటిని కాపాడుకోగలిగినప్పుడే ప్రతీ ఒక్కరి జీవితం శ్రేయోదాయకం - ఆనందదాయకం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక తెలుగు సాహిత్యం

(చిలుకూరి కథలు సామాజిక జీవన చిత్రణ)

– డా॥. ఇ. మురళీధర్

చిలుకూరి దేవప్రుత (24-4-1952 నుండి 18-10-2016) ఊడలమర్రి కథకు సంక్షిప్త రూపం ఇది. పాతికేళ్ల క్రితం 1993 ఆహ్వానం పత్రికలో అచ్చయింది. దేవప్రుత అనంతపురంలో జన్మించారు. రచనల్లో దళిత,జీవన చిత్రణ చేశారు. వంకర టింకర, ఆరు గ్లాసులు, ఏకాకినౌక చప్పుడు, బందీలాంటి సంపుటాలుగా ఆయన కథలు వెలువబడ్డాయి. అద్దంలో చందమామ, పంచమం, కక్షశిల, చీకటిపూలు ఆయన నవలలు.

దేవప్రుత రచనా వ్యాసంగం 1977లో మొదలైంది. వీరి మొదటి కథ మానావత్వం. దేవప్రుత దాదాపు 75 కథలు వివిధ పత్రికల్లో వెలువరించి ఉన్నారు. 1986లో వీరు రాసిన "ఆరుగ్లాసులు" కథకి మయూరి పత్రిక వాళ్ళు ప్రథమ బహమతి ఇచ్చారు. మన్ను తిన్నమనిషి, విడుదల, కథలో కోన్ని ఇతర భాషల్లోకి అనువాదం చేయబడ్డాయి. ఇప్పటి వరకు దేవప్రుత రెండు కథా సంపుటాలు వెలువరించారు. వీరు 'ఆరుగ్లాసులు' కథ సంపుటం 1988లో, ఏకాకి నౌకచప్పుడు" కథల సంపుటం 1995లో వచ్చాయి.

మోహన్ కుటుంబానికి ఒకరోజు టెలిగ్రామ్ వస్తుంది. అందులో ఫాదర్ అడ్మి-టెడ్ హాస్పెటల్ అని ఉంటుంది. మోహన్ టెలిగ్రాం చూసి వెంటనే గొహాతి నుండి అనంత పురానికి బయలుదేరినాడు. మోహాన్ ప్రయాణ సమయంలో తన నాన్నగారిని గురించి నిమిషానికి ఐదు సార్లు గుర్తు చేసుకుంటాడు. ఆ కుటుంబంలో మోహన్ చివరివాడు. నాన్నకు తనంటే చాలా ఇష్టం. సుధాకర్ అన్నయ్య ఢిల్లీ నుంచి ముందే అనంతపురం చేరు కున్నాడు. డాక్టర్ రిపోర్టు చూస్తే నార్మల్‌గానే ఉంది. మోహన్ భార్య గీత హాయిగా ఒళ్ళు మరచి నిద్రపోతుంది. వారి పిల్లలు నిద్రపోతున్నారు. "ఈ పిల్లలకు, ఈవిడకు ఏమీ వ్యత్యాసం లేదు. అదే తన వారికి సీరియస్‌గా ఉందని తెలిసై ఇంత నిశ్చంతగా నిద్రపోయేదా" అను కున్నాడు మనసులో మోహన్.

తన ప్రయాణంలో ఆంధ్రాబార్డర్‌లో వచ్చిన తరువాత చూస్తే బంద్ జరుగుతున్నది. రైలు సాయంత్రానికి కదులుతుంది. నాలుగు రోజులు అయింది, ఇంకా మోహన్ రాలేదని అని తమ్ముని గురించి సుధాకర్ అను కున్నాడు. ఎట్టికేలకు మో**హన్** కుటుంబం అనంతపురం చేరుకున్నారు. శారదమ్మ కుమారున్ని, కోడలిని పిల్లలను చూసి ఆప్యాయంగా క్‌గిలించుకున్నది.

నాన్నగారు కోమలో ఉన్నాడని తన చెల్లెలు నిర్మల మోహన్‌తో చెప్పినది. నాన్న విషయం సుధాకర్ చెల్లెలను, అమ్మను అడిగి తెలుసుకున్నారు. జ్వరం వచ్చింది, మరుసటి రోజే గుండెల్లో మంట అన్నారు. అతని జబ్బు అంతుపట్టడం లేదు. వారం రోజులు గడిచిపోయాయి. నలుగురుతోపాటు పంచుకుంటే నరకమైనా స్వర్గమే అన్నట్లుగా ఉంది మోహన్ తల్లికి పది రోజులు గడిచాయి. ఎవరికి వారు ప్రయాణాలుసాగించారు. పిల్లల చదువులు, వారి ఉద్యోగాలకు కష్టంగా ఉంది. వారందరూ వెళ్ళుతుంటే శారదమ్మకు బాధ కలిగినది. "ఆయనకేమి ఉద్యోగిగా, తండ్రిగా, తాతగా అన్ని అనుభవించాడు" అని అన్నాడు అల్లుడు. శారదమ్మ మనస్సు బాధపడినది.

భగవంతుని తలచుకొని త్వరగా నీ దగ్గరకు చేర్చుకో అని మనస్సులో అనుకొన్నది.

అందరూ కలిసి అమ్మకు తోడుగా "సబిత" అనే నర్సును వైద్యపరిచర్యల కోసం ఏర్పాటుచేశారు.అందరు

బయలుదేరినారు. శారదమ్మ మాత్రంఏకాకిగా ఉం పోయింది. భర్త దగ్గర స్టూలు మీద కూర్చొన్నది. ముస లాయన గురక అందరికీ వినిపిస్తోంది, శారదమ్మకు తప్ప.

సమాజ పరిణామ క్రమంలో సమిష్టి కుటుంబాలకు బదులుగా వైయుక్తిక కుటుంబాలు ఆవిర్భవిస్తూ ఉన్నాయి. ఆర్థిక, సాంఘిక జీవన విధానంలో వచ్చిన మార్పులే వైయుక్తిక కుటుంబాల ఆవిర్భావానికి కారణం. పట్టణ జీవితాలలో సమి-ష్టిగా ఉండలేని స్థితి నెలకొన్నది. ఉద్యోగులు బదిలీ కాకుండా ఉండలేరు. కాబట్టి సమిష్టి కుటుంబ జీవనం గడపడానికి వీలు లేదు. దీనికి తోడు తను, కుటుంబం తప్ప ఇతరుల గురించి పట్టించుకోలేని దుస్థితి ఏర్పడింది. ఈ కథలో కుమారులందరూ ఉద్యోగస్తులే. ఆర్థిక ఇబ్బందులు ఎవరికీ లేవు. తమ తల్లిదండ్రులను తమ వద్దే ఉంచుకొని వారి వృద్ధాప్య జీవితానికి తోడుగా ఉండి ఉండవచ్చు. ఈ కథలో ఎవరూ ఈ వృద్ధ దంపతులకు అండగా నిలువ లేక పోయారు. వ్యాధితో బాధపడుతూ కోమాలో ఉండి మంచం పట్టిన తండ్రికి పరిచర్యలు అందించలేక ఒక నర్సును ఏర్పాటు చేసిపోయారు. ఈ స్థితి కుటుంబ జీవనంలోని వైయక్తిక పోకడలను గురించి తెలుపుతుంది. ఆత్మీయతకు తావు ఇవ్వని వ్యాపార జీవితాన్ని గురించి తెలుపుతుంది.

"అణచివేత", "దోపిడీ" అనే ప్రత్యేంగా దళితులుగా పిలవబడుతున్న వారికి మాత్రమే చెందినవికావు. అవి నలుపు, తెలుపులంటూ రంగుల్లో మెరవచ్చు. మతం అనే ఉన్మాదంలో దాగొచ్చు. జండర్ అవతారం దాల్చోచ్చు. మందబలంలో దూకొచ్చు. ప్రాంతాల కుతంత్రంలో మొలవచ్చు. చివరికి అందివచ్చిన అవకాశం.... అందు కోలేని వాడిపై ప్రయోగం కావచ్చు. ఏదిఏమైనా భిన్న అనుభవాలతో కలిగిన మరిన్ని స్పందనల అక్షరూపమే శ్రీచిలుకూరి దేవప్రుతగారి కథలు, దేవప్రుతగారి కథలు అనుభూతి ప్రధానంగా కంటే, అనుభవ ప్రధానంగా సాగుతాయి. అనుభవంలో సంతోషం కంటే ఎక్కువగా గుర్తుండేది, వేంటాడేది కూడా దుఃఖము,బాధలే! సహజ సిద్ధింగా తన చుట్టూఉన్న పరిసరాల్లో రోజువారి కార్య క్రమాల్లో నుండి నోప్పినిమాత్రమే గమనించడం, వేగంగా స్వీకరించగలగడం. లోతుగా స్పందించగాగడం అనే లక్షణమేతన అనుభవాలను కథా రూపందాల్చే విధంగా పొందిన ప్రేరణ ఫలితమే ఈ "ఏకాకినౌక చప్పుడు" కథా సంగ్రహం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథలలో దళిత సామాజిక జీవన చిత్రణ

– డా॥. కొగిత సుబ్బారెడ్డి, తెలుగు ఉపన్యాసకులు, ఆర్ట్ & సైన్స్ కళాశాల, బాపట్ల.

"హితేన సహితం సాహిత్యమ్", "సహితస్య భావ: సాహిత్యమ్" అనుటచే సాహిత్యము అనగా మేలును కూర్చునట్టిదియు, హితాన్ని బోధించేది, ధర్మాన్ని ఉప దేశించేది అని చెప్పవచ్చు. ఇంకా ఆనందదాయకమైనది, నీతిని బోధించునది, ధర్మప్రతిపాదనము చేయునది కూడా సాహిత్యమే. సాహిత్యం వల్ల లోకం లోని పాఠకులు ప్రధానంగా రెండు ప్రయోజనాలు పొందుతున్నారు., అవి 1. ఆనందము 2. ఉపదేశం ఆధునిక సాహిత్యంలో అనేక ప్రక్రియలు ఉన్నాయి. అటువంటి వాటిలో అతి శక్తివంతమైనది కథానిక ప్రక్రియ. "అచిరకాలంలో పాఠకుల మనోభావాలపై చెరగని ముద్ర వేసి చిరస్థాయిగా నిలిచిపోగల శక్తి, సామర్థ్యం ఒక్క కథానికకు మాత్రమే ఉన్నది.

ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను, ఆయన సాహిత్యాన్ని మనం చూసినప్పుడు ఆయన సాహిత్య సృష్టి ఏనాడు సామాజానికి దూరంగా లేదు. ఆచార్య ఇనాక్ గారు ఏనాడు సమాజాన్ని విడిచి సాముచేయలేదు. ప్రజల సమస్యలకు దూరంగా ఉండలేదు. అపారమైన సామాజిక అవగాహన ఉన్న ఆచార్య ఇనాక్ తాను దర్శించిన మానవ ప్రపంచాన్ని వాళ్ళ కష్ట సుఖాలను, సుఖ దు:ఖాలను, మంచి చెడ్డలను అక్షర బద్ధం చేసి ప్రాణ ప్రతిష్ట చేశాడు.

సామాజిక జీవనం, వాస్తవికత లేని రచనలు ఉత్తమ రచనలు కాజాలవు. ఉత్తమ రచనలో సామాజిక జీవనం, వాస్తవికత ఉండాలి. సమాజంలోని సమస్యలు, సంఘ టనలు ప్రధానంగా మనకు కన్పించాలి. నేటి సమాజానికి దగ్గరగా కథలు ఉండాలి. నేటి సామాజిక స్వరూపాన్ని మరి ముఖ్యంగా పీడిత, తాడిత వర్గాల వారి, మధ్య తరగతి వర్గాల కుటుంబాలకు సంబంధించిన ఇతి వృత్తాలను తన కథానికలలో నిక్షిప్తం చేశారు ఇనాక్‌గారు. వీరి రచనలలో సామాజిక జీవనం, వాస్తవికతలు మనకు ప్రతి కథలో కనిపిస్తాయి.

'వ్యక్తికి, సమాజానికి ఉన్న సంబంధం ఓడకి సముద్రా నికి ఉన్న సంబంధంలాగా నాకన్పిస్తుంది. సముద్రపు ఆటుపోట్లన్ని ఓడ గమనాన్ని నిర్దేశిస్తాయి' రచయిత సామాజిక, సమస్యలను తీసుకొని కథలు రాస్తే ప్రయో జనం ఉంటుందన్న విషయం మరువరాదు. అయితే సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలెన్నో కలవునేడు. ఆ సమస్యల్ని తమ కథావస్తువులుగా తీసుకొని సమాజానికి మంచి చేకూర్చే మార్పును నేర్పుతో రచనలు చేసినట్ల యితే సమాజానికి కాస్తయినా మేలు చేసినవారవుతారు.

రచయిత తాము వ్రాసిన కథలలో వాస్తవికతకు దగ్గరగా ఉండాలి. అప్పుడే పాఠకుడు చదవటానికి ఆసక్తిని చూపుతాడు. సామాజిక వాస్తవికతను తమ రచనల్లో చిత్రించినట్టయితే ఆ రచనలు, రచయిత సంఘ సంస్కారభావ తీవ్రతను ప్రతిబింబిస్తాయి. రచయిత వ్రాసే బహుకొద్ది కథలైన అవి ప్రజలకు ఎక్కువ ప్రభావం చూపాలి. సామాజిక స్పృహతో, క్లుప్తతతో వర్ణణలతో నిండైన పాత్రలతో ఉండాలి.

"కథలు పాఠకులను రంజింప చేయడమే కాకుండా వ్యక్తిగత, సామాజిక సమస్యల గురించి ఆలోచింప చేస్తే అవి తమ ముఖ్య ప్రయోజనాన్ని సాధించినట్లే"

"ఏ రచయిత అయినా తన సంసారాన్ని బట్టి తన జీవితానుభవాన్ని బట్టి, తన నాటి సామాజిక పర్యవేక్షణా చోదక శక్తులను బట్టి రచనలు చేస్తాడు. సాధారణంగా

ఆయన వ్యక్తిత్వం ఆయన రచనల్లో ప్రతిఫలిస్తుంది. కొంత వరకైనా ఇది ఏ రచయిత విషయం లోనైనా తప్పదు. దేశ కాలాలకు అతీతంగా ఎంతటి ప్రతిభావంతుడైనా రచన చేయడం కష్టం''

''తెలుగులో రకరకాల కథలున్నాయి. సామాజిక స్పృహ ఉన్న కథలు చైతన్యానికి అభివృద్ధికి కారణమవుతున్నాయి. సామాజిక స్పృహ అంటే మానవ సమాజం ఒకటి ఉందన్న మాట''.

'సమాజం సాహిత్యంలో ప్రతిబింబించాలని, అది సహజంగా, వాస్తవికంగా ఉండాలని అటువంటి సాహిత్యం సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని, సంఘాన్ని ప్రభావితం చేయాలని కోరుకొనే దృష్టితో సమాజ-సాహిత్య సంబంధ బాంధవ్యాలు, ఇచ్చి పుచ్చు కోవటాల నేపధ్యంలో కథానికల్ని చూడాలి'' అని అంటారు ఇనాక్ గారు.

''సాహిత్య వస్తుతత్వం గ్రహించడం నేటి విమర్శ ప్రాథమిక కర్తవ్యం. సాహిత్యానికి సమాజానికి సంబంధం స్పష్టంగా గుర్తుండటం ఈ విమర్శకు అవసరం. సాహిత్యం సమకాలీన జీవితానికి వ్యాఖ్యానంగా చూడటం, అది ఆవేశపరవశంగా అవతరించి, తత్ స్థితి కలిగించేటట్టు ఉన్న దశను వివరించడం, అది ఆత్మాశ్రయ ప్రాముఖ్యం సంతరించుకోవడంలోని ఔచిత్యం దర్శించడం, సాహిత్య గుణగణాలే పరిశీలనాంశాలుగా ప్రవర్తిల్లటం, సాహిత్య వస్తువును సమాజ నేపధ్యం నుండి విశదీకరించడం''6 ఇలాంటి అన్ని విషయాలలో ఇనాక్ గారు అందెవేసిన చేయి.

ఇనాక్ గారి కథలన్నింటిని పరిశీలించినప్పుడు అన్ని కథలు వాస్తవికతను సంతరించుకొన్నవే, కొన్ని రచయిత యధార్థ జీవితంలో నుండి వచ్చినవి. తాను సమాజంలో ఎదుర్కొన్న పరిస్థితులను మనకు కళ్ళకు కట్టినట్లు వర్ణించారు ఇనాక్ గారు. అందుకే ఆయన కొలుపులు కథానికల సంపుటిలో 'హృదయంలో' ఇలా రాశారు. ''సహృదయులు సామాజికంగా ఏ స్థాయి వ్యక్తులయినా ఏ అంతస్థులు అధిరోహించిన వాళ్లయినా, ఏ జీవన రంగాల స్థితిగతులకు చెందిన వారయినా, ఏ ఆలోచన, ఆవేదన, ఆత్మీయత, అనురాగం, ఆదరణలకు వారసులైనా, ఈ కథానికలు నిక్షిప్తం చేసుకున్న జీవిత పరిచయం వల్ల, అందించే సాహిత్య సంస్పర్శ వల్ల, సమాజ శరీరం వదలి పరకాయ ప్రవేశాత్మతో, అక్షరావరణం దాటి, జీవితావరణంలోకి వచ్చి దాన్ని పరిశీలించి అటు సాహిత్య జీవులుగా, ఇటు సమాజ వ్యక్తులుగా సంతృప్తి చెందుతారని ప్రగాఢ విశ్వాసం''. అంటారు ఇలా అనుకునే రచయిత ఏ కథను రాసినా, సమాజాన్ని విడచి రచన చేయలేదు. సమాజానికి, కథానికకు ఆదానప్రదాన సంబంధం ఉంది.

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి రచనలలో వాస్తవికత, సామాజిక జీవనం లేని కథలు ఏమైనా ఉన్నాయా? అంటే లేవని చెప్పక తప్పదు.

ప్రస్తుతం ఆయన కథానికలలో వాస్తవికత సామాజిక జీవన నేపధ్యాల గురించి పరిశీలించుట ప్రస్తుతాంశం.

''ఊరబావి'' కథను మనం పరిశీలించినట్లయితే అందులో గాలి-నీరు ప్రకృతి అందించిన వరాలు. అవి అందరికి సొంతం అయినా గ్రామీణ ప్రాంతాలలో మునుసుబు లాంటి వారు బలహీన వర్గాల వారికి 'నీటిని ఇవ్వకుండా బాధలుపెట్టడం సమాజంలో చాలా చోట్ల మనం గమనిస్తూనే ఉన్నాం. సమాజంలో బలహీన వర్గాలు నీటికోసం పడే పాట్లు మనకు ఈ కథలో చక్కగా అర్థ మౌతుంది. మునుసుబు, చెప్పులు కుట్టే వాళ్ళ మధ్య నీటికాధారమైన ఊరబావి కొరకు జరిగే కొట్లాటలు మనకు సమాజంలో జరుగుతున్న అరాచకాలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. అంతే కాక ఆ ఊరబావిని ఎలాగైనా పల్లెప్రజలకు సొంతం చేయాలనే తపనతో చిదంబరం భార్య వేసిన ఎత్తులు మనకు కథలో చక్కని మలుపులు.

బావిలో ఎద్దు దట్టెం వేసింది చిదంబరం, వాళ్ళ నాన్న అని ఇద్దరిని పిలిపించి బాగా కొట్టించి గుంజకు కట్టివేశారు.

ఈ సన్నివేశాన్ని పరిశీలించినపుడు అమాయకుల్ని బల వంతులు ఏమైనా చేయగలరు అనే అహంకారంతో వారి మీద పెత్తనం చెలాయించడం, సమాజంలో పేదలు తాము బలహీనులమని, ఏ తప్పు చేయకపోయినా వారిని ఏమీ చేయలేక బ్రతకడం మనకు కనిపిస్తుంది. ఇవన్నీ సమాజంలో జరుగుతూ ఉన్న సంఘటనలే. అయితే అమాయకులను రక్షించడానికి కొందరు సహాయ పడు తుంటారు. అలాంటి వారే ఈ కథలో ఊర్లో నాంచారయ్య, స్టేషను మాష్టారు, 'లా' చదివి ప్రాక్టీసు పెట్టిన సత్య నారాయణ గారు.

ఈ కథలో పల్లెలోని జనులను ఊర్లోకి ప్రవేశించ నియ్యక పోవడము, వారికి నీరు ఇవ్వక పోవడము, దేవాలయ ప్రవేశము లేకుండా చేయడము., ఇవన్నీ సమాజంలో జరుగుతు ఉన్నాయని., అయితే ఇవి ఎంతో కాలం సాగవని, సమాజంలో ఉన్న వాస్తవికతను, సామాజిక జీవనాన్ని ఇనాక్ గారు ఈ కథలో చిత్రీకరించారు.

'ఆకలి' కథలో పేదరికం, తిండి కోసం పోరాటం, ఆ తిండి కోసం చావడానికైనా సిద్ధ పడటం లాంటి విషయాలు కనిపిస్తాయి. సమాజంలో పేదరికపు రూపు రేఖలే 'చిన్ని' పాత్ర చిన్ని చిన్న మెదడులో బ్రతుకు దెరువు కోసం మార్గాన్వేషణలు, ఆలోచనలు కలిగాయి. ఈ కథలో పేదవారి ఆకలి తీరుతెన్నులు వివరించారు. అంబలి త్రాగేవాడికి అమృతమబ్బితే కలిగే సంతృప్తి, ఆనందం వర్ణించబడ్డాయి. సమాజంలో అనేక మంది 'ఆకలి' కోసం ఎంత బాధపడుతున్నారో, వారి జీవన విధానం, వారి కుటుంబ పరిస్థితులు, చిన్ని వాళ్ల అమ్మ నిండు చూలాలు. అన్నం లేక మల మల మాడట, అన్నం లేని పరిస్థితులలో ఆకలి బాధకు తట్టుకోలేక మంచి నీటితో కడుపు నింపుకోవడం ఇలాంటి విషయాలన్ని మన హృదయాలను కరిగించే విధంగా సమాజం ఉంది. 'అయినా సమాజం మాత్రం అలాంటి వారి గురించి పట్టించుకోదు' అని ఇనాక్ గారు సమాజ వాస్తవాన్ని తేటతెల్లం చేశారు ఈ కథలో.

'ఆహత జ్వాల' కథలో సమాజంలో మంచితనం ఉన్న పనికిరాదని, పేదవారికి ప్రేమలు, పెళ్ళిల్లు ఉండ కూడదని, అందునా ధనవంతులతో స్నేహము అసలే తగనిది అనే విషయాలు గురించి కథ చెప్పారు. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్నది ఇదే. పేదవారి పట్ల, ధనవంతుడికి ఎంత కోపం ఉన్న వాడు ఆ కోపాన్ని, పగను తీర్చుకోవడానికి సమయం కోసం ఎదురు చూస్తాడు. ''పేదవాని కోపం పెదవికి చేటు'' అన్న సామెతగా పేదవాడు మిగిలిపోతున్నాడు. కారణం ఉ న్నా లేకపోయినా శిక్ష అనుభవించేవాడు మాత్రం పేదవాడని ఇది ఈనాటికి జరుగుతున్న నగ్న సత్యమని ఇనాక్ గారు ఈ కథలో తెలియజేశారు.

'పిండీకృత శాటి' కథలో గ్రామాలలో చాకళ్లు, మంగళ్ళు, కూలీ పని చేసేవారు వారి కోసం బ్రతకరు. ఊరి మునసబులు, కరణాల కోనమే బ్రతుకుతారు. మునుసబుల, కరణాల పనులు చేయడం కోసం అవసర మైతే వారి ప్రాణాల్ని కూడా లెక్కచెయ్యరని ఈ కథలో తెలియజేశారు. పేదవాడు నమ్మితే ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధపడతాడని ఈ కథలో తెలియజేశారు. సమాజంలో ఇప్పటికీ యజమానుల కోసం ప్రాణత్యాగానికి వెనుకాడని వారు ఉన్నారు.

'తలలేనోడు' కథలో గ్రామీణ ప్రాంతాలలో ఈనాటికీ జరుగుతున్న అరాచకాలు వివరించారు. మునుసబు, కరణం లాంటి వారు బడుగు వర్గాలపై ఏ విధంగా అజమాయిషీ చేస్తారో తెలియజేశారు. పేదల దగ్గర కొంచెం ఆస్థి ఉంటే దానిని వారు సొంతం చేసుకోవడానికి ఎంతకైనా తెగిస్తారు. అవసరమైతే తండ్రీ, కొడుకుల మధ్య చిచ్చు పెడతారని,.. డబ్బు గల వాడి అహం కారానికి, పట్టుదలకు కోటి వంటి వాళ్ళు నాగలింగం వంటి వాళ్ళు బలికాక తప్పదు అని నిరూపించిన కథ. సమాజంలో ఉన్న వాస్తవాన్ని పేదల సామాజిక జీవనాన్ని చక్కగా చిత్రించిన కథ ఇది.

ఇనాక్ గారి కొలుపులు, కథానికల సంపుటిలో అన్ని కథలు ప్రజలసామాజిక జీవనానికి, వాస్తవికతను చాటుకునేదిగా, వారి జీవన ప్రస్థానం ప్రతిబింబించే విధంగా ఉన్నాయి. అందులోని కథలలో ఏది ఆయుధం, విముక్తి, కొలుపులు, విఘ్ను వినాయకుడు మొదలైనవి ముఖ్యంగా దళితుల జీవితాలను, ఉన్నవి ఉన్నట్లు గా వర్ణించిన కథలు.

ఏది ఆయుధం కథలో పేదవాడిని ఉన్నవాడు వాడి ఇష్టం వచ్చినట్లు చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉం టాడని, రెడ్డిపేరుతో పిలువబడే నారాయుడు నరభక్షక పులి లాంటివాడని, వాడి కంటిలో పడ్డ కుందేలు లాంటి ఓబిలేసు జీవిత చరిత్రను వర్ణించాడు కవి. ఓబిలేసు పొలాన్ని ఆక్రమించుకోవడానికి ఎన్ని ఎత్తులో వేశాడు రెడ్డి. దాన్ని ఆక్రమించు కోవడం కుదరక ఓబిలేసును జైలులో పెట్టి అడ్డు తొలగించాలని చూశాడు.. కాని జైలులో నరసింహులు సహాయంతో రెడ్డిని ఎదురించాడు. పేదవాడు లేకపోతే ధనికుడి ఉనికికే ప్రమాదం అని. పేదవాడు ఎంతకైనా తెగిస్తాడని చాటి చెప్పిన కథ ఇది. 'గడ్డి పరకలు సైతం వెంటిగా మారితే మద గజాన్నైనా బంధించగలవన్న నిజాన్ని గుర్తించి దళితులు, ఒక్కటై ఐకమత్యంతో తమను పీడించే వారిని ఎదుర్కొనాలి అని, ధనబలానికి, అధికార బలానికి కండబలంతోడైతే సమాజంలో ఎన్ని అరాచకాలు జరుగుతాయో, అది ఎంతగా పేదల బ్రతుకుల్ని కాల్చి వేస్తాయో పేద దళితుల పట్ల ఎంతగా శాపాలవుతాయో కళ్ళకు కట్టే కథానిక 'ఏది ఆయుధం' లో సమాజంలో ఉన్న వాస్తవాన్ని వివరించారు ఇనాక్.

'కొలుపులు' కథలో సంపన్నులు పేదల బ్రతుకులతో ఆటలాడుకుంటారని, వారి కామవాంఛలు తీర్చకపోతే వారిని సమాజంలో ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తారని, వారి సరదాలు, కోర్కెలు తీర్చడానికే పేదలు ఉన్నారని. అది పేదల పాలిట శాపంగా మారిందని, అయితే ఇటు వంటి వారి కోరికలు, సరదాలు ఎంతో కాలం చెల్లవని, సమాజంలో ఇటువంటి వారు ఎక్కడో ఒకచోట పెద్ద ఎదురుదెబ్బ తింటారని, అవసరమైతే వాడి ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని తెలియజేశారు.

'విముక్తి' కథలో ఇద్దరూ సంపన్నులు కాచుకున్న పందెంలో సామాన్య మానవుడు బలికావాలి అని వారు కోరుకోవడం విచిత్రంగా ఉంది. అయితే ఇది అక్షర సత్యం. సామాన్య మానవుడు వాడి పరిస్థితుల కారణంగా, సమాజంలో బ్రతకడం కోసం సంపన్నుల దగ్గర అప్పు చేయడం, ఆ అప్పు తీర్చలేక వారు ఏది చెప్పినా చేయడం జరుగుతుంది. అప్పు తీర్చలేక అవసరమైతే ఆ అప్పుకోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడని పరిస్థితి ఉంది. సంపన్ను లకు ఏమీ తోచక వారు ఆడుకొనే ఆటలో సామాన్య మానవులు పాముగా మారుతున్నాడు. తాము అను కున్నది సాధించడానికి సంపన్నులు ఏం చేయడానికైనా సిద్ధపడతారు. అయితే అలాంటి ఆటలలో ఒక్కొక్కసారి వారి ప్రాణాలే పోతాయనడానికి, ఎంతగా ఇతరుల జీవితాలతో ఆటలాడిన చివరికి పోయేది తన ప్రాణమే అని తెలుసుకోవాలి అని సమాజంలో జరుగుతున్న ఇటువంటి సంఘటనలు వాస్తవాలు మనకు చక్కగా విశదీకరించారు ఇనాక్ గారు.

'విఘ్నవినాయకుడు' కథలో సమస్యల పరిష్కారం కోసం సమర్థులు,పెద్దలే అవసరం లేదని సామాన్య మానవుడు కూడా సమాజంలో సమస్యల్ని చక్కగా పరిష్కరించగలడని తెలియజేసిన కథ.

'అస్పృశ్య గంగ' కథానికల సంపుటిలో కథలను పరిశీలించితే మనకు సమాజంలో జరుగుతున్న వాస్తవాలు కనిపిస్తాయి. సమాజంలో జరిగే ప్రతి సన్నివేశాన్ని దగ్గరగా ఉండి చూశారు ఇనాక్ గారు. ఇందులో రెండు కన్నీటి బొట్లు, పంతం, విపర్యయం, నల్లులు, పొట్టపేగులిబ్బంది గోడు, పరిష్కారం, గొడ్డదొంగ, అస్పృశ్య గంగ, మరోదారి లేదు మొ॥లగు కథలను పరిశీలిస్తే సమాజంలో జరుగు తూనే ఉన్న ప్రతి సంఘటనలనను మన కళ్లముందుం చారు ఇనాక్ గారు.

అస్పృశ్య గంగ కథలో వినాయక్ ఉండటానికి ఇంటి కోసం ఎంతో కష్టపడి తపోవనంలో ఇల్లు కట్టుకుంటే, అక్కడున్న అగ్రవర్ణాల వారు తాను దళితుడని తనని ఎంతో నిరాదరణగా చూస్తారు. చివరికి తనకు తాగడానికి కూడా చుక్క నీరు దొరకనివ్వరు. తన పిల్లలు ఆడుకోవడానికి ప్రక్క ఇళ్ల వారు వారిని లోపలికి రానివ్వరు. ఇలాంటివి సమాజంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. తన ఇంటిలో పని చేయడానికి వచ్చిన పనివాళ్ళను కూడా తన ఇంటిలో పని చేయనివ్వరు. ఈనాటి సమాజంలో ఇటువంటి విషయాలను మనం ప్రతిరోజు గమనిస్తూనే ఉన్నాము. అగ్రవర్ణాల వారు తనను అవమానించినా, నీరు దొరకననివ్వకుండా చేసిన తాను మాత్రం వారికి బావి త్రవ్వించి ఆ బావి నీరు అందరికి ఇవ్వాలని ఆశపడ్డారు. ఎంత మంచి మనస్సో. సమాజం తనను అవమానిస్తూనే తనకు అపకారం చేస్తున్నా వారికి మాత్రం తను మేలు చేస్తాను అంటారు. పేదవాడికి ఆకలి బాధ, నీటి బాధ తెలుసు. అతను మాత్రం అందరి పట్ల మంచిగానే ఉంటారు. ఇలాంటి వారు సమాజంలో చాలా అరదుగా కనిపిస్తారు. అయితే వారు అవమానిస్తున్న పిల్లలకు మాత్రం ప్రోత్సాహాన్ని అందించి, వారిని కష్టాలలో నుండి ఎదగాలి అని ధైర్యం చెప్పాడు. తను బావి త్రవ్వించి ఆ బావి నీరు అందరికి ఇచ్చి ఆత్మ సంతృప్తి చెందాలని భావించాడు. ఇలా సమాజానికి ఒక చురక అంటించి అందరం మనుషులమేనని, ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ కాదు అని, మనకు కీడు చేసిన వారికి కూడ మేలు చేయాలని మొక్కవోని ధైర్యంతో ఎదగాలని చెప్పి ఈ కథను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు ఇనాక్ గారు. ఇది ఆయన సొంత కథ.

పై విధంగా ఇనాక్ గారు కథలలో సామాజిక వాస్తవాలను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరిస్తారు. దళితులు జీవితాలలోని వాస్తవాలను సహజంగా ఉన్నది ఉన్నట్లు అక్షర బద్ధం చేస్తారు ఇనాక్ గారు.

ఆధార గ్రంధాలు :

1. మానవతా దృక్పథం-సామాజిక చైతన్యం-ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, అభ్యుదయ కవిత్వానంతరధోరణులు, వ్యాస సంకలనం, పుట 144, సాహితీ బంధు బృందం, వరంగల్లు - 1987
2. కథలెలా రాయాలి? అబ్బూరి ఛాయాదేవి -పుట, 218, కథలెలా రాస్తారు, సంకలనం, శార్వరి -విశాలాంధ్ర పబ్లికేషన్స్
3. మన నవల- పరిశీలన, అక్కిరాజు రమాపతిరావు, పుట,97,1979.
4. కొమ్మూరి జానకీ దేవి - లఘు సిద్ధాంత వ్యాసం, ప్రకరణం. 4, పుట,74, వాల్తేరు.
5. కొలుపులు (కథానిక సంపుటి), ఆచార్య కొలకలూరి ఇనాక్, జ్యోతి గ్రంథమాల, మీర్‌పేట, హైదరాబాదు, పుట 5.
6. ఆచార్య కొలకలూరి ఇనాక్, షష్టిపూర్తి సన్మాన సంచిక, పుట 44.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రాయలసీమ కథకుల్లో సామాజిక జీవన చిత్రణ

– డా॥. రొచపాళెం పురంధీశ్వరి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల, తి.తి.దే., తిరుపతి.

సమాజ సంబంధం నుండి ఉత్పత్తి అయిన ఒక వాస్తవిక సాంస్కృతిక కళారూపం సాహిత్యం. మనం దీనిని అధ్యయనానికి స్వీకరించినా, స్వీకరించకపోయనా ఇది వుంటుంది. మనకూ సాహిత్యానికీ అవినాభావ సంబంధ ముంది. సమాజం సాహిత్యమూ విడదీయరానివి. సమాజ సాహిత్య సంబంధమే సాహిత్యతత్వం. సాహిత్యతత్వ దర్శనమే సాహిత్య దర్శనం. సమాజ సాహిత్యాలు పరస్పర ప్రభావితాలు. వాటి సంబంధము విడదీయరానిది. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తే సమాజం సాహిత్యా దర్శాలను స్వీకరిస్తుంది.

'హితేన సహితం సాహిత్యమ్' అనీ 'సహితస్య భావః సాహిత్యమ్' అనీ అంటే సాహిత్యం హితంతో కూడినదనీ, ధర్మాది సమస్త శాస్త్ర రహస్యాలతో సహితమైనదనీ అర్థం. ప్రకృతిలో వున్న సత్యాన్ని సౌందర్యవంతంగా, ఆనంద పర్యవసానంగా చిత్రించేది సాహిత్యం. ఉపదేశప్రధానా లైన రసపోషకాలైన ప్రాచీన కావ్యనాటకాది ప్రక్రియలూ, ఆధునికాలైన నవల, నాటకం, నాటిక, వ్యాసం, కథానిక, గేయాలూ సాహిత్యమనబడతాయి. సమాజమనే కేంద్రబిందువు చుట్టూ వివిధ వ్యాసార్ధాలతో గీయబడిన వృత్తం వంటిది సాహిత్యం. ఒక కాలంలో వెలుగు చూసిన ఒక జాతి సాహిత్యాన్ని చదవడం ద్వారా ఆ జాతి సామాజిక పరిస్థితుల్ని తెలుసుకోగలుగుతాం.

సాహిత్యంలో ఏదో ఒక విషయం వుంటుంది. దానిని తెలిపే భాషా నిర్మాణం వుంటుంది. ఈ రెండూ కలిసి ఏదో ఒక ప్రక్రియ రూపంలో వుంటాయి. అంటే కవిత్వమో, నాటకమో, నవలో, కథో వుంటాయి. సాహిత్య వస్తువు, సాహిత్య భాష, సాహిత్య ప్రక్రియ ఈ మూడు అంశాలు మార్పులకు లోనవుతూ వుంటాయి. సాహిత్యంలో సామాజిక దృక్పథం ప్రధానంగా వుంటుంది. సామాజిక స్పృహతో రాసే రచన పాఠకులలో సామాజిక చైతన్యాన్ని పెంచుతుంది. ఈ కోవకు చెందినవే కథలు.

కథ కథకోసం కాక, ఏదో ఒక విశేషాంశాన్ని, అర్థాన్ని సహృదయతను పాఠకుడికి అందించవలసి వుంటుంది. అంటే ప్రతి కథకు అది ప్రధాన కథ కావచ్చు. అది ఆ కథలో ఇమిడి, వ్యాపించి వుంటుంది. కథ విన్న చదివిన పాఠకుడికి ఆ కథలో ఇమిడి ఉన్న అర్థం తేటపడుతుంది. కథ హృద్యతతో ఆహ్లాదకత్వంతో వుండాలి. కొత్తదనం పుట్టిపడేలా వుండాలి. హృద్యత, కొత్తదనం రెండూ కథలో వుంటే పాఠకుడిని చైతన్యవంతుణ్ణి చేస్తుంది. అపుడే ఈ కథలు మనిషిలో మంచితనాన్ని పెంచుతాయి. 1910లో గురజాడ వారి దిద్దుబాటుతో మొదలైన తెలుగు కథా ప్రస్థానానికి కాసింత పుష్టిని సంతుష్టిని కల్గించిన వారు రాయలసీమ కథకులు. వారిలో మధురాంతకం రాజారాం, మహేంద్ర, నరేంద్ర కె.సభా, డా॥వి.ఆర్. రాసాని పులికంటి కృష్ణారెడ్డి, మునిపల్లెరాజు, కేతు విశ్వనాథరెడ్డి, కొలకులూరి ఇనాక్ కలువకొలను సదానంద మునిసందరం, సింగమనేని నారాయణ, శాంతి నారాయణ స్వామి చిలుకూరి దేవపుత్ర మొదలైనవారు.

రాయలసీమలో కథకుల్లో సామాజిక జీవన చిత్రణ:

రచనా వస్తువు సమకాలికమైతే అందులో వాటి సామాజిక పరిస్థితులు మరింత ప్రస్ఫుటంగా ప్రత్యక్షమవు తాయి. సమకాలీన జీవితమే కథలకు వస్తువు కావాలి. కథావస్తువు వాస్తవికతకు దగ్గరగా వుండాలి. వస్తు స్వీకరణలో వైవిధ్యముండాలి. కథ ప్రధానంగా ఒక పాత్ర చుట్టూ ఒక సంఘటన చుట్టూ, ఒక భావం చుట్టూ పరివ్యాప్తంగా వుండేటట్లు రాసినవారు రాయలసీమ కథకులు. మానవ ప్రవర్తనకు అత్యంత సమీపంలో వున్న సాహిత్య ప్రక్రియ కథానిక. ఆంధ్రదేశంలో ఈ తరం

తెలుగు కథానికా రచయితల్లో ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కొందరి రాయలసీమ కథకుల్ని పరిశీలించడమే ఈ నా పత్ర సమర్పణ ముఖ్య ఉద్దేశ్యం.

మధురాంతకం రాజారాం :

వీరి పేరు వింటేనే రాయలసీమ జీవన దృశ్యం. ఆ ప్రాంతపు మాండలికం చప్పున స్ఫురిస్తాయి. మధురాంతకం రాజారాం ప్రాంతీయతను విశ్వజనీనంగా చిత్రించి యావత్ తెలుగు సాహితీ ప్రతినిధిగా చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించారు. (సాధించారు). సమకాలీన తెలుగుకథకు పెద్ద దిక్కుగా నిలిచారు. రాజారాంగారు గ్రామీణ ప్రాంత పరిస్థితులను, మధ్యతరగతి జీవన చిత్రణను బహుముఖాలుగా కథలలో రూపొందించగల ప్రతిభావంతుడు. మాటలు నేర్చిన మధ్యతరగతికి ప్రతినిధి. మధ్యతరగతి ప్రజలలో సహజంగా వుండే లోపాలు, వెకిలి ఆశలు, పిచ్చి ఊహలు, బాధలు, ఆప్యాయతలు అన్నీ ఏవగింపుతో గాక, మెల్లని మందహాసంతో తమ కథలలో చిత్రించారు. ఈ కథలు చదువుతుంటే 'ఎంత వెర్రివాళ్లం మనం' అన్పిస్తుంది. ఈ కథలను చదువుతుంటే మనలను మనం బాగా అర్థం చేసుకోగలుగుతాం. మనలో వున్న పిచ్చి ప్రవృత్తులను చూచి నవ్వుకోగలుగుతాం. మన అవివేకాన్ని చూసుకొని జాలిపడగలుగుతాం. ఇంతకన్నా గొప్ప ప్రయోజనం కథా రచనకు మరొకటి లేదేమో అన్పిస్తుంది.

తెలుగు సమాజపు సాంస్కృతిక సంపన్నతను పుష్కలంగా కథానేపథ్యంగా వాడుకున్న రచయితలలో రాజారాం ఒకరు. 'సర్కసుడేరా' కథ చదువుతుంటే మనం మొత్తం సర్కసు చూసివచ్చినట్టుగా వుంటుంది. ఆడేరా చాలా పెద్దది. డేరా చుట్టూ సాధు, క్రూర జంతువుల పాకలు ఇలా ఇంకా ఇన్నెన్నో. సమాజ విలువలతో జీవితం తలపడినప్పుడల్లా గెలుపు ఓటములను ఉద్రేకాలకు అతీతంగా, వినమ్రతా స్వభావంతో, ఆత్మీయమైన ప్రమాభిమానాలతో స్వీకరించటం వీరి సాహిత్య ఔన్నత్యానికి ఒక బలం సాహిత్యంలో అయనది పాతకొత్తల మేలు కలయికలతో కూడిన సంప్రదాయవాదం. 'అర్హత' కథలో సిద్ధముని గురించి రెండు వాక్యాలు చెప్పకుంటే రాజారాం గారి కథా సాహిత్యంలో జీవన ప్రమాణాల ఔన్నత్యం తెలుస్తుంది. సిద్ధముని చిన్నవైతు. తన పొలంలో బంగారం పండించాలని బావి తవ్వకం పని చేపడుతాడు. అది తలకు మించినపనవుతుంది. అప్పులు పుట్టవు. బావిలో బండ పడింది. ఆ బండను తీస్తే నీళ్ళు పడతాయన్న నమ్మకం ఇలాంటి గడ్డు పరిస్థితిలో సిద్ధముని కుటుంబానికి వారసత్వంగా పచ్చకామర్ల వైద్యం వుంది. ఆ వైద్యంలో సిద్ధముని రోగి నుండి పుచ్చుకునేది కేవలం రెండు రూపాయలు. ఈ రెండు రూపాయలు బదులు ఇరవై రూపాయలు తీసుకో నీకు ఈ అప్పులూ, ఈ అప్పులకోసం తిప్పలూ వుండవు అంటారు. దానికి సిద్ధముని తిరస్కరిస్తాడు. రాజారాం గారి కథా సాహిత్యం ఇది.

బడుగు బడిపంతులు జీవన ఉదాత్తతకు ఆయన కత "తాను వెలుగించినదీపాలు" అద్భుత ప్రతీక. ఆకల్మష శృంగారానికి నివాళి 'కమ్మతెమ్మెర కథ" పొద్దుచాలని మనిషి కథ స్వయం ఉపాధితో మానవుడి డిగ్నిటీని కాపాడే సాధనం. "గణనీయుడు కథ" మానవుని విద్యుక్త ధర్మానికి ప్రతిధ్వని వ్యంగ్యోక్తులతోనే ప్రౌఢత్వానికి పట్టంకట్టే కథలు పదులు కాదు వందలు 'శబ్దసందేశం'లో అరబ్బు దేశాల్లో మగ్గుతున్న భారతీయ గ్రామీణ స్త్రీల ఆక్రందన విని కంటతడి పెట్టని పాఠకుడుంటాడా "రాతిలో తేమ" కథ చదివి గాంధీజీని స్మరించని పాఠకుడుంటాడా ఇలా చెప్పుకొంటూపోతే రాజారాంగారి కథలు తెలుగుజాతికి నిత్య జీవిత వర్ణచిత్రాలు మధురాంతకం రాజారాం తెలుగు కథారంగాన ధృవతారగా వెలుగొందినారు. సామాజిక పరిణామానికి అద్దంపట్టి ఆ మార్పులలోని చైతన్యానికి రూపకల్పన చేసినవాడు మధురాంతకం రాజారాం. కథాశిల్పం అపురూపం. నాలుగు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి అవిరళ సేవచేసి తెలుగువారి జీవిత ప్రతి రూపాలను వాస్తవికతతో రమణీయంగా చిత్రించిన మధుర కథకుడు రాజారాం.

కె. సభా :

కె.సభా కథానికలు రాసి తెలుగు కథా సాహిత్య వికాసానికి తోడ్పడ్డాడు. సమకాలీన జీవితమే కథలకు వస్తువుగా స్వీకరించాడు. సభా కథావస్తువు సామాన్యమైంది. సహజమైంది. సజీవమైంది. సమకాలీనమైంది. వాస్తవమైంది. విస్తృతమైన వైవిధ్యం కలది. సభా గ్రామ ప్రజల జీవనాన్ని తన కథలకు వస్తువుగా స్వీకరించాడు. సామాన్యజన జీవన సమస్యలే. ఆయన కథలకు ఆయువుపట్టు సామాన్యుడే వారి కథలకు నాయకుడు. రైతు బాధలు, కష్టాలు వీరి కథా వస్తువు. జీవిన దృక్పథంలోని మార్పులు కథా వస్తువును తీర్చి దిద్దాయి.

సభా సామాజిక స్పృహ గల రచయిత సభాకథలలో సామాజిక జీవన ప్రతిబింబాలు ఉట్టిపడుతాయి. సమాజంలో తన కంటికి కన్పించిన ప్రతి అంశాన్ని కథగా మలిచాడు. సభా రాయలసీమ గ్రామ ప్రజల కష్టాలను బాధలను బాగా తెలిసినవాడు రైతు కష్టాల్లో పుట్టి పెరిగి మరణిస్తున్నాడు. ఇక్కడి సేద్యం చాలా శ్రమతో కూడుకున్నది. రైతుకు తగిన ఫలితం దొరకలేదని తన కథల ద్వారా చెప్పాడు సభా. పల్లె ప్రజల జీవితాల్లోని అజ్ఞాన అంధకారాన్ని పారద్రోలి విజ్ఞానదీపాలు వెలిగించడానికి మతకలహాల అడ్డుగోడల నిర్మూలనకు, అనాథ స్త్రీలపై అన్యాయంగా అత్యాచారాలను అరికట్టేందుకు వ్యసనాలకు బలైపోయే జీవితాలకు విముక్తికి కథలు రాశాడు. గ్రామ ప్రజల పాలిట నరక కూపాలైన ఆసుపత్రులను విమర్శించాడు. జంతువుల పట్ల సభాకు ప్రేమ, జాలి, అభిమానం అని వారి కథా వస్తువులు తెల్పుతాయి.

సభా కథలలో నిర్భరత వుంటుంది. "అంతరంగం" కథలో 'ఇంకో అరగంట పోనీ ఆకలిగాలేదు'అలా గాలికి వెళ్ళి మళ్ళీ వచ్చితినవచ్చు' అన్నది మనస్సు అంతరంగం. ఈ కథ ప్రారంభం నిర్భరత ప్రధానం. ఇది చాలా ఆసక్తికరంగా వుంది. కథానిక పేరుకు తగినట్లుగా మానవుని అంతరంగం స్థితి మొదటి వాక్యంలోనే తెల్పబడింది రాయలసీమ రైతు బావి తవ్వతాడు. బండపడుతుంది. అతని కష్టాల్ని తెల్పడం "పాతాళగంగ" కథానిక లక్ష్యం. గ్రామాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల భయంకర స్థితిని తెలియచేయడం "పురిటినొప్పులు"లోని ముఖ్య ఉద్దేశ్యం. పాలేర్ల వెట్టిచాకిరి తెలియచేయడం "వెండి కంచం"లోని పరమార్థం ఇలా సభా 400 నుంచి 600 దాకా కథలు రాసారని కొందరి అభిప్రాయం. ఏది రాసినా రాయలసీమ జన జీవన చిత్రణకు అద్దంపట్టేవే ఈ కథల్లోని సారాంశం. రాయలసీమ ప్రజలు నిరంతరం కరువుతో బాధపడే అంశాలను కరువుకు గురైన గ్రామ ప్రజల జీవితాలను వారి దయనీయమైన స్థితిని తన కథల్లో హృదయ విదారకంగా చిత్రించాడు.

మధురాంతకం మహేంద్ర :

రాయలసీమ ప్రాంతంలో చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన కథలు రాసిన సాంఘిక, సామాజిక జీవనానికి అద్దంపట్టే కథలను రాసారు. అట్టడుగు వర్గాల, బడుగువర్గాల ప్రజల స్థితిగతులను ఆకళింపు చేసుకొని కథలు రాసిన రచయిత మహేంద్ర.

రచయిత శిల్పి అయితే వస్తువు ఒక బండరాయి శిల్పి తన పనితనంతో బండరాయిని అందమైన శిల్పంగా తీర్చిదిద్దినట్లే రచయిత మనిషి జీవితంలో జరిగిన సంఘటనను గానీ, సమస్యనుగానీ, వస్తువుగా తీసుకుని తన రచనా నైపుణ్యంతో అందమైన కథగా మలుస్తాడు. వీరి కథలు వాస్తవానికి దగ్గరగా వుండి ప్రజల స్థితిగతుల్ని సమాజస్థితి గతుల్ని గ్రామీణ జీవితాన్ని, రాయలసీమ కడగండ్ల జీవితాన్ని కరువు సమస్యలను తెలియచేస్తాయి. సహజత్వానికి ప్రతీకలుగా ప్రజలముందు నిలుపారు. వీరు అతి చిన్న వయస్సులోనే 14 కథలను పద్నాలుగు రకాల వస్తువులతో మనకళ్ళముందు వుంచాడు.

"కనిపించని కోయిల" కథలో రవికి మొదటి నుంచి కోయిల కూత విన్పిస్తుంది. కానీ కోయిల కన్పించదు. రవి తన ఆర్థిక పరిస్థితుల వల్ల పై చదువులకు ఎక్కడ ఆటంకం వచ్చినా తన మొండి పట్టుదలతో పై చదువులకు వెళ్ళడం, 'జర్తె' కథలో గ్రామీణులు అందులోనూ

అట్టడుగు వర్గానికి చెందిన కూలీలు రోజూ జీవన భృతికోసం మేకలు మేపుకొని అడవిలో కట్టెలు కొట్టి అమ్మి బ్రతికేవారికి సంబంధించినది. ఇలా విభిన్న కోణాలతో విభిన్న కథలను తీసుకొచ్చి సామాజిక జీవనచిత్రణను కన్నులకు కట్టినట్లు చిత్రించాడు. "అతడి పేరు మనిషి", కథలో సమాజంలో ధనవంతుల ప్రవర్తనను, "ఒక పగటి వేళ యిరానీ హొటల్లో" కథలో విద్యార్థి జీవనాన్ని, "గొళి" కథలో మూఢనమ్మకాలను, హొగినేకల్ కథలో విహార యాత్ర విశేషాలను, "పాడి ఆవు" కథలో పేదల లోన్లను, "ప్రతిజ్ఞ" కథలో సీమకరువును "కుక్కచావు" కథలో, బేసిన్ బ్రిడ్జిదగ్గర కథలో గ్రామీణా ప్రాంతాల్లోని వారు పట్టణానికి యోజను, ఈతనేర్చుకోవడం, ముసలమ్మ "మరణం" కథలో వ్యక్తిగత జీవనానికి, "ఇంధనం" కథలో ఇంధనం అవసరాన్ని, "వ్రతం" కథలో ఉన్న ఊర్లో నేలని అమ్మి రైతుపడే కష్టాలను రాయలసీమ కడగండ్ల జీవితాలను చిత్రించాడు.

కొలకలూరి ఇనాక్ :

కొంతమంది కథలు రాస్తారు. కొంతమంది నవలలు రాస్తారు. కొంతమంది విమర్శ అద్భుతంగా చేస్తే మరి కొంతమంది కవిత్వం అదనంగా అల్లుతారు. నాటకాలు, నాటికలు కల్పించే ఇంకొంతమంది వుంటారు. ఒక ప్రక్రియలో పేరు సంపాదించినవారు మరొక ప్రక్రియలో రాణించడం చాలా కష్టం. కానీ కథ, నవల, కవిత్వం, విమర్శ, నాటిక, నాటకం మొదలైన ప్రక్రియలన్నింటిలో సృష్టి చేసి పదిమంది మెప్పుపొందటం సామాన్యమైన విషయం కాదు. ఇలా అరుదుగా కన్పించే సాహితీ వేత్తలలో కొలకలూరి ఇనాక్ ఒకరు. ఆధునిక కాలంలో కథల్లో ఒక ప్రేత్యకతను చూపించిన వ్యక్తి ఇనాక్. వీరు రాసిన ఆకలి కథలో చిన్న పాత్ర వర్ణణాతీతమైనది. రాయలసీమలో కరువే కాదు ఆకలికి బలైపోయి చనిపోయినవారు ఉన్నారనడానికి "ఆకలి" కథ ఒక నిదర్శనం. రాయలసీమ కడగండ్ల జీవితానికి అద్దం పట్టే కథలు ఎన్నో రచించాడు.

కేతు విశ్వనాథరెడ్డి :

రాయలసీమ కథా రచయితల్లో వీరిది ఒక ప్రత్యేక మైన స్థానం. వీరు అనేక కథలు రాసారు. వీరి కథల్లో సామాజిక ప్రయోజనం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. వీరు సామాన్యమైన రైతుకుటుంబంలో జన్మించారు. గ్రామీణ వాతావరణం, రైతుల జీవన విధానం ఆధారంగా రాసిన కథలలో "నమ్ముకున్న నేల" కత ఒకటి. ఈ కథలో గ్రామాల్లో పరిస్థితులు సరిగా లేక పంటలు పండక, పండినా గిట్టుబాటు ధర లభించక రైతులు పడుతున్న బాధలు, అప్పులు పాలవుడం వీటిని గమనించిన వీరు ఆధునిక నాగరికత వల్ల, పారిశ్రామికీకరణవల్ల, గ్రామీణ వాతావరణంలో వచ్చిన మార్పులకు బాధపడి రచయిత మనస్సు ప్రతిబింబమే ఈ కథలోని సారాంశం. వానలు లేక, కరువుతో నేల దగా చేయగా రైతు వీరన్న ఫ్యాక్టరీ కూలీగా మారాడు. వీరన్న పాత్ర రాయలసీమ రైతుల కష్టాలకు అద్దం పడుతోంది.

యువ రచయితలకూ స్ఫూర్తిదాతలుగా నిలిచినారు. రాయలసీమ కథకులు. తెలుగు కథా సాహిత్యానికి నిరుపమాన సేవలందించినవారు. సుప్రసిద్ధ కథకులు రాయలసీమ మధ్యతరగతి జీవితాల్లోని మందహాసాన్ని మంచి చెడులను తమ కథల్లో ఆవిష్కరించి రాయలసీమ సాహిత్యానికి ప్రాణం పోసిన కథకులు ఎందరో ఎంద రెందరో. సమకాలీన మధ్యతరగతి జీవితాన్ని ప్రతి బింబిస్తూ సామాజిక సమస్యలకు దర్పణం పట్టే కథలనేకం రచించారు. తెలుగు సాహితీ లోకంలో కథలు రాసిన రాయలసీమ కవులు లోకాన్ని సుసంపన్నం చేసారు. సామాజిక వ్యక్తిత్వాలను గూర్చి వైయక్తిక దృష్టితో మధ్యతరగతి జీవన వైవిధ్యాలను రాయలసీమలో ప్రత్యేకించి ప్రాంతీయ వాసనలతో కథలు రాసి మానవతా వాదులుగా నిగర్వులుగా, నిరాడంబరులుగా సహృదయు లుగా సహృదయ చక్రవర్తులుగా చరిత్రలో నిలిచి పోయారు.

❖ ❖ ❖

వలస కార్మికులు – సామాజిక జీవన చిత్రణ

– డా॥. ఎస్. విజయభాస్కర్

తెలుగు సాహిత్యంలో నన్నయ్య నుండి నేటివరకు ఎంతోమంది కవులు సమాజంలో జరుగుతున్న ప్రతి అంశంపై స్పందిస్తున్నారు. తమ కవితల ద్వారా, పాటల ద్వారా, నాటకాల ద్వారా, నాటికల ద్వారా, బుర్రకథల ద్వారా వ్యాసాల ద్వారా సామాజిక జీవన చిత్రణ చేస్తున్నారు. సాహిత్యం ద్వారా అప్పటి సమాజ స్థితిగతులను అర్థం చేసుకోవడానికి అంచనా వేయడానికి ఎంతో ఉపయోగపడుతుంది. అనేక మంది కవులు, రచయితలు సమాజరుగ్మతలను వివిధ సాహిత్య ప్రక్రియల ద్వారా ప్రజలకు తెలియజేసి వారిని జాగృతం చేశారు. కన్యాశుల్కం నాటకం గురజాడ సృష్టి. "పుట్టడి బొమ్మపూర్ణమ్మ" ద్వారా, కన్యక ద్వారా ప్రజలను జాగృతం చేయడం జరిగింది. కన్యాశుల్కం నాటకంలో సమాజరుగ్మతలను తెలిపారు. పుట్టడిబొమ్మ పూర్ణమ్మలో పూర్ణమ్మ దుర్గలో లీనమైన ఘట్టమున గురజాడ చేసిన వర్ణన ఎంతో హృదయవిదారకరముగా ఉంటుంది.

"కన్నులకాంతుల కలువలచేరెను మేలిమిజేరెను మేనిపసల్"
హంసలజేరెను నడకల బెడుగులు దుర్గను జేరెను పూర్ణమ్మ"

అని పూర్ణమ్మ చిత్రమును మనముందుంచారు. తోటి పిల్లలు తాతా అని ఎగతాలిచేస్తే మానసిక క్షోభ పూర్ణమ్మ ఏవిధంగా అనుభవించిందో తెలుస్తుంది. అదే విధంగా రైతులపై, సారాపై, తల్లి దండ్రులపై ప్రకృతిపై, వృక్షాలపై, కాలుష్యంపై, ఇంకా అనేక విషయాలను కవులు స్పందిస్తూ కవితలను, పాటలను వ్రాస్తున్నారు.

వలస కార్మికులు :

వలసలు అనేక దశాబ్దాల నుండి ఉన్నాయి. తాగడానికి నీరులేక నీటి కోసం ప్రజలు మొదలు వలస పోవడం ప్రారంభించారు. పక్షులు కూడా వాతావరణాన్ని బట్టి ప్రపంచంలోని అనేక పక్షులు మన దేశానికి వలస వస్తుంటాయి. ఎండాకాలంలో, వానాకాలంలో, చలికాలంలో వలస పక్షులు వివిధ దేశాలనుండి మన దేశానికి వస్తాయి. తర్వాత తన దేశాలకు వలసపక్షులు వెళ్ళిపోతుంటాయి. వలసలు లేని ప్రపంచాన్ని మనం అవగతం చేసుకోలేము. కాలంతో కనుమరుగుయ్యే చరిత్రను బోధిస్తే విశ్వమంతా వలసలమయమే. ఎలాగంటే భూమి పొరల్ని చీల్చుకొని విత్తనం చైతన్యంలో మొక్కగా అవతరించడం వలసే. అనంతమైన సంద్రంలోని అలలు తీరాన్ని చేరుట వలసే, శూన్యంలోని జాబిల్లి వెన్నెలను ప్రసాదించడం వలసే, అపురూపమైన విరులు సువాసనలు వెదజల్లడం వలసే, హాయినిచ్చే గాలి తుమ్మెదలు మృదువుగా వీడయం వలసే, జలపాతంలోని ఝరులు ప్రవహించడం వలసే, కవి అంతరంలోని ఆలోచనలు కవిత్వంగా ప్రస్ఫుటమవ్వడం వలసే. ఇలా ప్రకృతిలోని ప్రతిది వలసగా తన ప్రత్యేకతను ఉనికిని చాటుకుంటున్నాయి. అలాగే పశుపక్ష్యాదులు వాటి అవసరాల రీత్యా వలస బానిసలౌతున్నాయి.

వలసలో సాధక బాధకాలు, కష్టనష్టాలు జయాపజయాలు సర్వసాధారణం. గతించిన చరిత్ర అంతా వలసమయం. క్రీస్తుపూర్వం భారతదేశంలో రత్నాలు రాసులు పోసి అమ్మేవారు ఆ విషయం తెలుసుకున్న విదేశీయులు మన దేశానికి వలసగా వచ్చి దోచుకు పోయారు. క్రీస్తుతర్వాత కూడా విదేశీయులైన పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఆంగ్లేయులు, మహ్మదీయులు వలసల పేరుతో మనదేశ సంపదను దోచుకుపోయారు అని డాక్టర్ ఎ. రంజిత్‌కుమార్ వలస వ్యధల మౌనస్వరంలో వివరించారు. అదేవిధంగా ప్రజలు తినడానికి తిండి,

కట్టుకోవడానికి బట్టలు లేక ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా గ్రామాల నుండి నగరాలకు, గ్రామాల నుండి వేరే రాష్ట్రాలకు, గ్రామాలక నుండి వేరే దేశాలకు వలసలు వచ్చారు. తమ నివసించే గ్రామంలో వారికి జీవనోపాధి లేక పోడవం వలన జీవనోపాధి సంపాదించుకోవడానికి వలసలు వెళ్తుంటారు.

మహాకవి శ్రీ శ్రీ మహాప్రస్థానం అనే గ్రంధంలోని బాటసారి అనే కవితలో

కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని
తల్లిమాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి
మూడురోజులు ఒక్కతీరుగా
నడుస్తున్నా దిక్కు తెలియక
నడిసుముద్రపు నావరీతిగ
నడుస్తున్నా దిక్కు తెలియక
నడిసముద్రపు నావ రీతిగ
సంచరిస్తూ, సంచలిస్తూ,
తలచుకుంటూ,
తల్లడిల్లే,
కెళ్ళగిల్లే,
పల్లటూల్లే బాటసారికి
ఎంత కష్టం!

ఈ కవిత ద్వారా బాటసారి శీర్షిక ద్వారా వలస కార్మికుల జీవితాలను హృదయ విదారకంగా వివరిం చడం జరిగింది. కరోనా మహమ్మారి ప్రపంచమంతా అతలాకుతలం అయ్యింది. చాలామంది వలస కార్మికులు వారి వారి ఊళ్ళకు వెళ్ళడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదేశ రవి రాసిన

పిల్లజల్లా ఇంటికాడ ఎట్ల ఉండ్రో
నా ముసలి తల్లీ ఏమి వెట్టి సాదుతుందో
పూట పూట జేసుకొని బతికెటోళ్ళం
పూట గడవా ఇంతదూరం వచ్చినోళ్ళం
దేశమేమో గొప్పదాయే
మా బతుకులేమో సిన్నబాయె
మాయదారి రోగమొచ్చి
మా బతుకు మీద మన్ను వొసె
ఏమి బతుకో ఏమీ బతుకో
చెడ్డబతుకు చెడ్డబతుకు
చెడ్డబతుకు చెడ్డబతుకు చెడ్డబతుకు
పేద రోగం కంటె పెద్ద రోగముందా
ఐనవాళ్ళ కంటె పెద్ద అండవుందా
కష్టంకాలం ఇంటికాడె ఉంటసారు
కలిసిమెలిసి కలోగంజో తాగెటోళ్ళం.
పిల్లగాన్లు కన్నులళ్ళ
విడవకుండ మెదలనట్టే
ఇంటిదాని దుఃఖ మేమో
ఆగకుండా తరమవట్టే
ఏమి జేతు ఏమి జేతు
ఏమి జేతు ఏమి జేతు - 2 సార్లు
బస్సులోద్దూ బండ్లు వద్దూ అయ్యా సారూ
ఇడిసి పెడితే నడిసి నేనూ పోత సారూ
బస్సులోద్దూ బండ్లు వద్దూ అయ్యా సారూ
ఇడిసి పెడితే నడిసి నేనూ పోత సారూ

అనే పాట అందరిని కదిలించి వేసింది. అదే విధంగా పిల్లలు నగరానికి వెళ్ళి ఇరుకున్న దృశ్యాన్ని తల్లి పడే బాధను.

"పట్నంలో నా కొడుకు ఎట్లున్నాడో
పడారాని పాట్లేన్ని పడుతున్నడో
యాలకింత బువ్వ తింటున్నడో
అమ్మయాది కొచ్చి అట్లే పంతున్నడో"

అనే పాట హృదయాన్ని ద్రవింపజేస్తుంది. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు, డైరెక్టర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాడభూషి సంపత్ కుమార్ వలసపై కవితను రాశారు.

పి. శ్రీనివాసరెడ్డి చిరునామా లేని కార్మికులు అనే కవితను రాశారు. రమేష్ సుంకర

ఇది ఆకలికేకల పోరాటం
తీరని వేదన ఆరాటం
దారి తెన్ను తెలియదులే
దాగుడుమూతల లోలంలో దాహగ్నిల
కడుపులు మండునులే -

అని రాశారు.

ఎ. నాగార్జున రాసిన

యడబాసె రోజులకు గడిచే కాలం ఎందుకు
పువ్వొలె వాడిపోయే సాగే బతుకు ఎందుకు
కడుపున మోసిన కన్న తల్లిని
తొడబుట్టిన అక్కచెల్లెండ్లను

అని అన్నారు.

"కూటికోసం కూలికోసం
పట్నం వచ్చిన కూలి వందనం"

అనే పాట సంచలనం రెకెత్తించింది. అదే విధంగా వలసెల్లిపోయింది.

ఊరు నేడు వల్లకాడు అయ్యింది చూడు'' అని గ్రామాలు గ్రామాలు వలసలుపోయి ఊర్లు అన్ని ఖాళీ అయిన సంఘటనలను చక్కగా వివరించారు. గ్రామాలలో వివిధ వృత్తులవారు గ్రామాలను వదిలి నగరాలకు, వివిధ రాష్ట్రాలకు వలసలు పోయి జీవితాలను గడుపుతున్నారు. ఏది పడితే అది తినడం వలన వలస కార్మికులకు కరోనా వైరస్ వ్యాపించి ప్రాణాలను కోల్పోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికులను పట్టించుకోవడం లేదని కేంద్రంలో దేశ ఉత్యన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు, రాష్ట్రాలలో హైకోర్టులు వలస కార్మికుల సమస్యను సుమోటోగా స్వీకరించి ప్రభుత్వాలకు వలస కార్మికులు ఎంతమంది? వారి వివరాలు అడిగితే వారి వివరాలు ప్రభుత్వాలు చెప్పలేకపోయాయి. చివరికి దాదాపు 20 కోట్ల మందికి పైగా వలస కార్మికులు మన దేశంలో ఊన్నట్లు లెక్కలు తేచ్చారు. వలస కార్మికులకు వారి స్వస్థలమునకు పంపాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని సుప్రీంకోర్టు చెబితే అప్పుడు రైళ్ళలో వారిని పంపడం జరిగింది. పొట్టకూటికోసం నగరాలకు వచ్చి మార్కెట్లలలో, ఫ్లై ఓవర్ల నిర్మాణం లలో, పెద్ద పెద్ద బిల్డింగ్ల నిర్మాణంలో వలస కార్మికులు పనిచేస్తూ మురికి వాడలలో పూరి గుడిసెలలో వారి జీవన చిత్రాన్ని వ్యాసరచయిత డా॥ఎస్. విజయ భాస్కర్ ఈ విధంగా వివరించారు.

కన్నవారిని, పుట్టిన ఊరిని వదిలి..ఆడి
పాడిన సోపతి గాళ్లను మరిచి...
కట్టుకోవడానికి బట్టలు
పని చేయడానికి తట్టలు
పొగ గొట్టాల కంపులు
తప్పవు వారికి తిప్పలు
బిల్డింగుల ఫ్లై ఓవర్ల
రోడ్ల నిర్మాణం, మార్కెట్లలో సంచులు మోత..
ఏ పనైనా సై అంటూ చేసే
సైనికులు వీరు
లాక్ డౌన్-స్వీయ నిర్బంధం విదిస్తే.. తినడానికి
తిండి, చెయ్యడానికి పనులు లేక
ఆదుకునే నాధుడే రాక
రేషన్, ఓటర్ కార్డు ఊరిలోనే వారి రికార్డు
పి.ఎం, సి.ఎం ఇస్తున్న ఆర్థిక సాయం అందక,
బియ్యం దొరకక
పరాయి వాళ్లగా బతుక లేక రవాణా
సదుపాయాల వసతి లేకపోయినా,
చావైనా బతుకైన పుట్టిన ఊరులోనే అంటూ
పిల్లా పాపలతో ముల్లె మూటలతో రోడ్ల వెంట
రైల్వే పట్టాల వెంట
పోలీసు లాఠీలకు వెరవక
బయలుదేరిన బాటసారులు
జాతి నిర్మాతలు
ఈ వలస కార్మికులు...

పల్లెల రాజయ్య వ్రాసిన

జమేదారి కోయిలో జమేదారి కోయిలా
వలసాకూలీల బతుకు వల్ల కాడె జేసిరా
జమేదారి కోయిలా....

అనేవి వలస కార్మికుల గురించి తెలియజేస్తున్నవి.

కోరనా వ్యాపించడంతో దేశ ప్రధాని లాక్‌డౌన్ విధించారు. రవాణా వ్యవస్థ దెబ్బతిన్నది. బతుకుకోసం, భుక్తి కోసం ఎక్కడో కానరాని రాష్ట్రాలకు వెళ్ళిన వలస జీవులకు పనిలేక, పైసాలేక అనేక లక్షలమంది కూలీలు జీవితం గడవడం కష్టమై తమ స్వంత ప్రాంతాలకు వెళ్ళాలని నిర్ణయించారు. బస్సులు, రైళ్ళు, విమానాలు ఏవి ప్రయాణ సదుపాయాలు లేకపోవడంతో పిల్లపాపలతో, ముల్లె, మూటలతో, ఆకలితో కాళ్ళకు బొబ్బలు వచ్చి నప్పటికి నడుచుకుంటూ రోడ్లవెంట, రైల్వేపట్టాలవెంబడి బయలుదేరి తమతమ స్వంత గ్రామాలకు వెళ్ళారు. వారి కష్టాలను పడుతున్న ఇబ్బందులను ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో చూసి కంట కన్నీరు పెట్టించింది. కొంత మంది నడవలేక వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భవతులు ప్రాణాలను కోల్పోయారు. గర్భవతులు రోడ్లమీదనే ప్రసవం అయ్యారు. చిన్నపిల్లలను, ముసలివాళ్ళను మూటలను తీసుకొని పోవడం హృదయ విదారకంగా మారింది. కొంతమంది రోడ్లమీద, రైల్వే ప్లాట్‌ఫామ్‌ల మీద పడుకొని ప్రమాదాల బారినపడి ప్రాణాలను కోల్పోయిన వారి సంఖ్య లెక్కలేదు. తిండిలేక, నిద్రలేక ఎక్కడ పడితే అక్కడె ఎంత వేడిమిని తాళలేక నిళ్ళను తాగడం వలన కూలీలు కరోనా సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను జాతీయ స్థాయిలో "వలసకూలీ" అనే 'ఇ' సంకలనం 2020 జూన్‌లో తెచ్చారు. ముఖచిత్రం కూరెళ్ళ శ్రీనివాస్ సంపాదకవర్గం డాక్టర్ ఎ. రంజితకుమార్ ఇంకా 5 మందితో వచ్చింది. భార్య భర్త ఒక పాప ముల్లెమూట సామాన్లతో ముఖచిత్రం బాగుంది. దీనిలో 84 కవితలు ఉన్నాయి. కర్నూల్ నుండి ఆరవేటి రాజకుమార్ "వలస కూలీల బాధల బడబాగ్నులు" శీర్షికను కవితను రాస్తూ కంటినిండా నీరు నిండినా..... గమ్యం చేరేదెన్నందున అని ముగించారు.

విజయవాడ కవయిత్రి కె. కళ్యాణ్ కృష్ణకుమారి వలస బొబ్బలు శీర్షికన

ఆకలి ముడతల శబ్దం.....
..... బొబ్బల నడక

అని ముగించారు.

చిత్తూరు జిల్లాకు చెందిన డా॥ డి. ఉషారాణి ఎడారి బతుకులు శీర్షికన

బతుకును బాగు చేసుకోవాలని...
..... మా బతుకును దూరంగాను

అని ముగించారు.

రామన్నపేట పి. హరికిషన్ "వలసకూలీలమే శీర్షికన

అవును మేము వలస కూలీలమే...
..... నలు దిక్కుల క్షామం తప్పదంతే

అంటూ ముగించారు.

జగిత్యాలకు చెందిన అనిత రెక్కలు తెగిన పక్షులై....! శీర్షికన

విరామమెరుగక నిరంతరం....
..... కరోనా సంకెళ్ళ నుండి విముక్తి పొందేనా?

అని ముగించారు.

ఈ వ్యాస రచయిత డా॥ఎస్. విజయ వలస జీవుల భవిత శీర్షికన.

కన్నవారిని వదిలి...
ప్రభుత్వాలకు వారు వేశారు ఓటు.

అని ముగించారు.

నల్గొండ నుండి డా॥ మహ్మద్ హుస్సేన్ వలస కార్మికులు శీర్షికన

త్యాగ మూర్తులు వాళ్ళు అని ముగించారు.

గాయపడిన పాదం, అనువుగాని వేళ, పూట గడవక

వలసకూలి, కలిసి ఉందాం వలసకూలి, వలసకూలి కూనిరాగం, ప్రగతి చిన్న బోయే, రెక్కలు ముక్కలు ఈ విధమైన శీర్షికలతో ఈ ఇ-కవిత సంచలనంలో చోటు చేసుకున్నాయి.

'కరోనా' వలన సాహిత్యం విద్యార్థులే కాకుండా ప్రతి ఒక్కరు పరిస్థితుల కనుగుణంగా స్పందించారు. డాక్టర్లపై, పోలీసులపై, పారిశుద్ధ్య కార్మికులపై, ఆరోగ్య కార్యకర్తలపై కనిపించే దేవుళ్ళు శీర్షికన కవితలు రాశారు. ఈ విధంగా వలస కార్మికులు అటూ ప్రభుత్వాన్ని, ప్రజలను కదిలించారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వము రచన- డా॥ సి. నారాయాణరెడ్డి సంప్రదాయములు ఉపయోగములు
2. తెలుగు సాహిత్య చరిత్ర రచన - డాక్టర్ ద్యానా శాస్త్రి
3. మహాప్రస్థానం రచన - శ్రీరంగం శ్రీనివాసరావు
4. వలసకూలీ - సంపాదకులు డాక్టర్ ఎ. రంజిత్‌కుమార్
5. చలం మ్యూజింగ్స్ - రచన - వి. సుబ్బారావు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రజాకవి వేమన కవిత్వం – సామాజికతత్వం

– డా॥. వి. శివనాగార్జునరెడ్డి, తెలుగు అధ్యాపకుడు, ఐఐఐటి, ఒంగోలు.

సమాజ ప్రతిబింబమే సాహిత్యం. సమకాలీన సమాజానికి దర్పణం పడుతుంది సాహిత్యం. అనుభవాల నుంచి, జీవితాల నుంచి, సమాజమూలాల నుంచి వచ్చే సాహిత్యమే గొప్ప సాహిత్యమవుతుంది. జీవిత సంఘర్షణలోంచి వచ్చిన సాహిత్య విలువలను కలిగి ఉన్న సాహిత్యమే ప్రజలను చేరుతుంది. "సాహిత్యం జీవిత వృక్షానికి పూసే పువ్వు" అన్న కొడవటి కుటుంబరావు మాటలు జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసరముంది. ఇందులో ప్రాచీన సాహిత్యం నుండి నేటి వరకు ఎందరో కవులు తమ కవిత్వ పాటవాన్ని ప్రదర్శించారు. ఆధునిక సాహిత్యంలో బాగా ప్రజల గుండెల్లో స్థిరస్థానాన్ని నిలుపుకున్న ప్రజాకవి వేమన.

తెలుగు ప్రజానీకానికి వేమన ఒక మహాయోగి. మట్టిలో పుట్టి మహోన్నత శిఖరాల నందుకున్న మానవతామూర్తి. మనుషుల మధ్య తిరుగుతూనే మానవ జీవిత సత్యాలను నిత్యాన్వేషణ శీలంతో దర్శించి, విమర్శించిన వివేకి. అన్వేషణలో అందివచ్చిన అనుభవాలను "ఆటవెలదులను ఈటెలుగా అలవోకగా సందించి" లోకానికి అందించిన మహానుభావుడు. వేమన పద్యం ఒక్కటైనా నోటికి రాని తెలుగువాడుండడు. ఆయన సూక్తి ఆయన అంతర్వ్యక్తి అద్దం పట్టిన అభివ్యక్తి. "ఆయన సాధకుడు, బోధకుడు, ఆయన ద్రష్ట స్రష్ట, మహాకవి" అని జి.వి. సుబ్రహ్మణ్యం అక్షరాక్షర సత్యంగా అభిభాషించారు.

కాలము :

తెలుగు సాహిత్య చరిత్రలో మధ్యయుగానికి చెందిన కవి వేమన. క్రీ.శ. 17వ శతాబ్దంలో జీవించి, తెలుగు నేలపైన సంచరించి, ప్రజల జీవితాన్ని దగ్గరగా పరిశీలించి, ప్రజల భాషల్లో పద్యాలు చెప్పినకవి. వేమన కాలాన్ని గూర్చి పలురకాలైన అభిప్రాయాలున్నాయి. "ఆంధ్ర సాహిత్య పునర్వికసన వసంతుడు" అను పొగడ్త కెక్కిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వేమన క్రీ.శ. 17 అని, కాంబెల్ పండితుడు క్రీ.శ. 16 అని, వంగూరి సుబ్బారావుగారు క్రీ.శ. 1212-1652 నడిమివాడని, మొత్తం మీద వేమన సుమారు క్రీ.శ. 1650 (1700) కాలం వాడని తన పరిశోధనలో ఎన్. గోపి నిర్ణయించారు.

"ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి
మూగచింతలపల్లె మొదటి యిల్లు
ఎడ్డరెడ్డి కులమదేమని చెప్పుడు"

అనే పద్యం ఆధారంగా వేమన మొదటి యిల్లు మూగచింతలపల్లె అని తరువాత కొండవీడు బదిలీ అయ్యిందని భావిస్తున్నారు. మూగచింతలపల్లె చిత్తూరు జిల్లా చంద్రగిరి దగ్గరిలో ఉంది. కొండవీడు పదాన్ని బట్టి కొండవీటి రెడ్డిరాజుల కితడు బంధువు అని కొందరు భావించినారు. వేమన కదిరి తాలుకా కటారుపల్లెల "శార్వరి సంవత్సర చైత్ర శుక్ల నవమినాడు" సిద్ధి పొందినట్లు పలువురు విమర్శకులు వ్రాసినారు. కటారుపల్లె వేమన అసలు పేరు పుల్లారెడ్డి. ఇంటిపేరు పైడిపాలం. కొడిదరెడ్ల శాఖకు చెందిన ఈ పుల్లారెడ్డి సేద్యము చేయుచుండగా పిడుగుపడి మరణించగా తరువాత తల్లికి కలలో కన్పించి ఏడవనాడు తిరిగి పునర్జీవితుడు నగుదునని చెప్పి ఎనిమిదవ రోజు బ్రతికి రాగా "ఎట్లు బ్రతికినావు పుల్లారెడ్డి" అని ఊరువారు అడుగగా "నా పేరు పుల్లారెడ్డి కాదు వేమన" అని చెప్పి అప్పటి నుంచి వేమన పేరుతో తూర్పుదేశమంతట సంచరించారని చరిత్రకారులు చెప్తున్నారు.

1819లో జె. అబెదుబాయ్ రచించిన "హిందూవుల ఆచారాలు పండుగలు" అనే పుస్తకంలో వేమన గురించి

ప్రస్తావనను 1824లో సి.పి.బ్రౌన్ వేమన పద్యాల్ని మొదటగా 1829లో బ్రౌన్ 1200 పద్యాలతో రెండవసారి ముద్రించాడు. పూర్ణయాచారి బందరులో 1919లో నాలుగువేల పద్యాలతో వేమన శతకం అచ్చువేశాడు.

వేమన కవిత్వం :

"ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన తెలుగు కవులలో మహానుభావులు" అని శ్రీశ్రీ ప్రశంసించారు. వేమనకు ఆటవెలదికీ గల గాఢానుబంధాన్ని పరిశీలిస్తే "యవ్వనంలో ఆయన ఒక ఆటవెలదికి లొంగి తరువాత తన్నుతాను నిలదొక్కుకొని". మరో ఆటవెలదిని లొంగదీసుకున్నాడు అని ఆయన ఆటవెలది పద్యాల ద్వారా తెలుస్తుంది.

"చదువులందు పాడి మొదవులందును స్త్రీల
పెదవులందు రాజ్య పదవులందు
ఆశలు డిగినట్టి అయ్యలు ముక్తులు"
విశ్వదాభిరామ వినురవేమ"

ఎక్కడికి అక్కడ విరుగుతూ, సులభ గ్రాహ్యమయ్యే టట్లుండి, అంత పదవ్యావృత్తితో కూడిన ఈ పద్యం కంఠస్థం కావడం అతి సులభం. అందుకే వేమన పద్యాలు బహుజనాదరణ పొంది తాము చిరంజీవులై ఆయనను చిరంజీవిని చేసాయి. "విశ్వదాభిరామ వినురవేమ" అనేది వేమన పద్యాలలోని మకుటం. కొన్నిటికి "వేమా" అనే చిన్న మకుటం కూడా లేకపోలేదు. "విశ్వదాభిరామ వినురవేమా" అనేది వేమన కవిత్వానికి కోహినూరు కిరీటమే. వేమన తనకు తాను ఉపదేశించుకొన్నట్టుగా "విశ్వాన్ని ఇచ్చినవాడివైన - అంటే సృష్టికర్తకు ఇష్టుడైన ఓ వేమా వినుమా" అనే అర్థమే సరైనదనటం సముచితం.

"కామిగానివాడు కవిగాడు రవిగాడు
కామిగాక మోక్షగామిగాడు
కామియైనవాడు కవియౌను రవియౌను"

జీవితంతో సంబంధములేని నర్వనంగ వరి త్యాగమును వేమన ఖండించినాడు. సంసార పరిధిలోని కామమును అనగా జీవితం మీద మమకారమును అణగద్రొక్కకూడదని కోరికలు లేనివాడు భావములు లేని కవి వంటివాడని, తేజస్సు సూర్యుని వంటివాడని చెప్పాడు.

"ఆడుదాని జూడనర్థంబు జూడగ, బ్రహ్మకైన బుట్టు రెమ్మ తెగులు" అని తన వలపు తెగులును సమర్థించుకొనినాడు.

"పనస తొనలకన్న పంచదారల కన్న
జుంటి తేనెకన్న జున్ను కన్న
చెరకు రసము కన్న చెలిమాట తీపిరా"

అని తన అనుభవవ్యామోహంను చూసి మురిసిపోయాడు. వేమన ఎక్కడ సంచారం చేసినా ఆయా ప్రదేశాల ప్రజాజీవితాన్ని, సాంఘిక పరిస్థితులను నిశితంగా పరిశీలించి తార్కికంగా విమర్శించాడు. అధికారంలో ఉన్న అల్పబుద్ధులపై విమర్శ ఇలా చెప్పాడు.

"అల్పబుద్ధివాని కధికారమిచ్చిన
దొడ్డవారినెల్ల తొలగగొట్టు
చెప్పు తినెడి కుక్క చెఱకు తీపెరుగునా"

మనకు ఎన్ని ఆస్తులున్న, ఎంత సంపదలు, ఎంత చదువులున్న సుఖశాంతులున్నప్పుడే గృహమే కదా స్వర్గసీమ. అలాకాకుండా ఇంటిలో ఒకరికి ఒకరు సఖ్యత లేకుంటే పోరు ఉంటే ఏలా ఉంటుందో ఈ పద్యంలో చూడవచ్చు.

"చెప్పులోని రాయి చెవిలోన జోరీగ
కంటిలోని రాయి కాలిముల్లు
ఇంటిలోని (దాని) పోరు ఇంతింత కాదయా"

అలాగే సామాజిక సంఘర్షణలు, మానసిక కల్మషాలు, విలువల పతనం, కక్ష్యలు, కార్పణ్యాలు సమాజానికి ఎంత హాని చేస్తాయో వాటిలో మార్పుకోరిన వైతాళిక కవి వేమన.

"చంపదగిన యట్టి శత్రువు తనచేత
చిక్కెనేని కీడు సేయరాదు
పొసగు మేలుజేసి పొమ్మనుటే చాలు"

జీవిత సత్యాలు :

వేమన మానవ స్వభావాల్ని, మానసిక ప్రవృత్తుల్నీ, జీవన విధానాల్లోని మంచి చెడుల్ని లోతుగా పరీక్షించి పద్యాల ద్వారా మెదడుకు మేతనందించాడు. జీవితంపై అవగాహన కల్గిస్తాడు. జీవిత రహస్యాల్ని మరింత ఎరుక పరుస్తాడు. మతగ్రంథాలు చెప్పని, మహర్షులు మతాధికారులు సరళంగా చెప్పలేని జీవితపు పోకడల్ని, సత్యాల్ని నిష్కర్షగా, స్పష్టంగా వివరించే మహాఋషి వేమన.

"పుత్తడిగలవాని పుండు బాధైనను
వసుధలోన చాలవార్త కెక్కు
పేదవాని యింట పెండ్లైన యెరుగరు"

నేటి సమాజంలో వ్యవస్థని ధనస్వామ్యంను సైతం పట్టి చూపే పద్యం ఇది.

"అల్పుడెపుడు పల్కునాడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మోగునట్లు కనకంబు మ్రోగునా"

గొప్పలు చెప్పుకున్నంత మాత్రాన గొప్పవాడవుతాడా; వినయం ఉండాలి. మిడిసిపాటు చేటు అంటూ వివరించే పద్యం ఇది.

"పసుల వన్నెవేరు పాలేకవర్ణమౌ
పుష్పజాతివేరు పూజ ఒకటి
దర్శంబులు వేరు దైవంబు ఒక్కటి"

అన్నాడు. సర్వమతాల సారాంశం ఒక్కటే అన్నాడు. ఒకడే దేవుడన్నాడు కాని దైవభక్తికి చిత్తశుద్ధి చాలా అవసరమన్నాడు. చిత్తశుద్ధిలేని శివపూజను నిరసించాడు. ఆత్మశుద్ధి, భాండశుద్ధి, చిత్తశుద్ధి ఇవి ఏ పని చేసినా ఉండాలనే నైతికతను తెలియజేస్తాడు.

నైతిక దృక్పథం :

ఆదర్శవంతమైన ప్రాపంచిక దృక్పథమున్న మంచి నైతిక దృక్పథముండడం సహజం. సమాజంలోని అవినీతిని పద్యాలనే వ్రేళ్ళతో పెకలించి వేసిన వేమనకు గొప్ప నైతికత ఉంది. మానవ సంబంధాలు ఒక పద్ధతిలో కొనసాగడానికి మానవజీవితం అర్థవంతం కావడానికి నీతి అవశ్యకతను వేమన బాగా గుర్తించాడు.

"నీతిలేనివాడు కోతికంటెను బాడు
నీతిదెలిసినవాడు నిర్మలాత్మ
నీతి ప్రఖ్యాతగా నిండియుండగవలయు"

వేమన నైతిక పాఠకుల్లో ఆలోచనల్ని రేకెత్తిస్తుంది. ఆత్మవిమర్శలో పడవేస్తుంది. నిజాయితిపరులను ఆదరిస్తుంది. కపటదారులను అదరగొడుతుంది.

"తప్పులెన్నువారు తండోపతండంబు
లుర్వీజనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు"

పరులను నిందించడం సమాజంలో బాగా అలవాటై పోయిన అంశం. ఇతరులను నిందించడంలో ఉన్న ఆనందం అనుభవైక వేద్యం కానీ మనిషికి ఆత్మవిమర్శ ముఖ్యమైన నీతి అని వేమన చెప్పాడు.

బాధ్యతాదృక్పథం :

సమాజంలో ప్రతిమనిషి ఇంకొకని పట్ల బాధ్యత ఉంటుందని వేమన అభిప్రాయం. మనిషి బాధ్యతను విస్మరించరాదని హెచ్చరించాడు. స్త్రీ పురుషుల మధ్య తల్లిదండ్రుల బిడ్డల మధ్య అనేక సామాజిక సమూహాల మధ్య పరస్పర బంధు బాధ్యతలున్నాయని వారు నైతికతతో బాధ్యతగా మెలగాలని తెల్పాడు.

"ఆలివంకవారు ఆత్మబంధువులైరి
తల్లివంకవారు తగిన పాటి
తండ్రివంకవారు దాయాది పగవారు"

భార్యవైపువారైనా తల్లివంకవారైన ఇచ్చేవారే కానీ తన నుండి ఆశించరు. తండ్రి వంకవారు ఆస్తిపాస్తులు పంపకంలో అసంతృప్తులు, మోసాలు సహజం అని తెలిపాడు.

"తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి వాడు గిట్టనేమి
పుట్టలోన చెదలు పుట్టదా గిట్టదా"

బంధుప్రీతి, బాధ్యతలు లేని వారసుల గురించి పైవిధంగా తెలిపారు.

ముగింపు :

వేమన కవిత్వతత్వమును, తాత్విక విధానం, సాంఘిక సామాజిక దృష్టిని అనేక కోణాల్లో విశ్లేషించి ఆంధ్రదేశము నందే కాక యావత్ భారతీయ సాహిత్యంలో ఆయనకు సముచిత స్థానం కల్పించబడింది. ప్రతి విషయాన్ని తన అనుభవంలోంచి తనను అందులో ఊహించుకొని చెప్పిన నగ్న సత్యాలే. ఏది ఏమైనా తెలుగుజాతి ఉన్నంతకాలము వేమన పలుకులు సజీవంగా ఉండి తెలుగువారి చైతన్యానికి కారణంగానే తోడ్పడతాయి అనడంలో ఎటువంటి సందేహంలేదు.

ఆధార గ్రంథాలు :

1. వేమన కవిత్వం సామాజికత - డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
2. తెలుగు సాహిత్యచరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి
3. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

మా గోఖలే కథలు – సమాజ చిత్రణ

శ్రీమతి వసుధులేటి నాగమల్లిక, తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం, తూ॥గో॥జిల్లా

మానవ నిర్మితమైన సాహిత్యం మనిషిలాగానే సమాజంతో అవినాభావ సంబంధాన్ని కలిగి తన ప్రయాణాన్ని కొనసాగిస్తుంటుంది. ముఖ్యంగా ఆధునిక తెలుగు సాహిత్యలత అంతా దాదాపుగా వృక్ష సమాజాన్ని ఆశ్రయించి పుష్పించి, ఫలించినదే. అందులోనూ ఆబాల గోపాలాన్ని ఆనందింపచేసి ఆలోచింపచేస్తున్న ఆధునిక సాహిత్య చైతన్య ప్రక్రియ కథాప్రక్రియ. ఈ కథా ప్రక్రియ పుట్టుకే నాటి సమాజాన్ని చిత్రిస్తూ, సమాజోద్ధరణకై రాసినదిగా కానవస్తుంది. అదే గురజాడ వారి దిద్దుబాటు.

తరువాత ఎంతో మంది కథకులు తమ కలం ద్వారా సమాజ వాస్తవిక చిత్రణ కల కథలెన్నో రాశారు. వారిలో మాగోఖలే ఒకరు. వీరి కథలన్నీ నాటి సమాజాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించాయి. మా గోఖలే అని పిలుచుకునే వీరి పేరు మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే. వీరు గుంటూరు జిల్లాలో 1917 మార్చి 7న బ్రాహ్మణ కోడూరులో జన్మించి, 1981 అక్టోబరు 4న పరమ పదించారు. వీరు సృష్టించిన కథా సాహిత్యం 1940-60ల మధ్య కాలంలోని నాటి గుంటూరు ప్రాంతపు గ్రామీణ సమాజ వెలుగు నీడల్ని కమనీయంగా చిత్రించింది.

గోఖలే తమ తండ్రి గారైన మాధవపెద్ది లక్ష్మీ నరసయ్య గారి నుండి గాంధేయ భావజాలాన్ని, వారి బాబాయి కొడవటి గంటి కుటుంబరావు గారి నుండి అభ్యుదయ భావజాలాన్ని, నాటి సమాజంలోని వామపక్ష భావజాలాన్ని పుణికి పుచ్చుకుని అచ్చమైన అభ్యుదయ రచయితగా అరసంలో విశేష కృషి చేశారు.

వీరు మద్రాసులోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ప్రసిద్ధ చిత్రకారుడు దేవీ ప్రసాద్ రాయ్ చౌదరి గారి వద్ద చిత్ర కళను లోతుగా అభ్యసించారు. అంతేకాక సినీ రంగంలో అద్భుతమైన కళాదర్శకుడిగా వెలుగొందారు. అందుకే నేమో వారి కథల్లోని పాత్రలు కళ్ళముందు కదలాడే చిత్రకళాఖండాలుగా వాస్తవిక దృష్టిని కలిగిస్తాయి.

1940 నుండి సుమారు రెండు దశాబ్దాలు మాగోఖలే రచనల కాలం. వీరి తొలి సంపుటి మూగజీవులు (1946) రెండో కథా సంపుటి బల్లకట్టు పాపయ్య (1955). ఇవేగాక మరికొన్ని కథలు మొత్తం యాభై 'మాగోఖలే కథలు''గా 1989లో ప్రచురించబడింది. నాడు కష్టజీవుల పట్ల సానుభూతిని ప్రకటించే అభ్యుదయ సాహిత్యం విశేషంగా వస్తున్న కాలంలో తన వంతు బాధ్యతగా తన కలంతో నాటి సమాజంలోని బడుగు గ్రామీణ జన జీవితాల్ని తన కథల్లో ప్రదర్శన యుక్తంగా, సహజంగా చిత్రీకరించారు. మా గోఖలే ప్రత్యేకత ఏమంటే సమాజం అట్టడుగున సాటి రచయితలు తొంగి చూడని అనేక చీకటి కోణాల్లోకి దిగి వాటిని తన కథా సాహిత్యం ద్వారా వెలుగు లోకంలోకి తీసుకొస్తారు. తానున్న గ్రామాన్నే రచనా నేపథ్యంగా నాటి తెలుగు గ్రామీణ సమాజాన్ని సహజ సుందరంగా వర్ణించారు.

గోఖలే కథల్లోని పాత్రలన్నీ నాటి సమాజ వాస్తవికతకు దర్పణం లాంటివే. బల్లకట్టు పాపయ్య, యానాదిముసలాయి, వడ్డె కొండయ్య, మాదిగ ముత్తాయ్, బండి రాముడి పెళ్లాం, కిష్టమ్మగారి పెద్దజీతగాడు, సావుకారు గురవయ్య, సన్నరైతు రాగవయ్య. ఈ మనుషుల్లో గొప్ప జీవిత కాంక్షలుండవు. గొంతెమ్మ కోర్కెలుండవు. చిన్నచిన్న ఆశలు, ఆరాటాలు తప్ప. మూగ జీవాలు కథలో పావలా డబ్బులు కోసం ఇల్లిల్లూ తిరిగి పనిచేసినా యానాది ముసలాయికి పస్తులు తప్పవు. శివరేత్రి కథలో కొండయ్య కోటప్ప కొండకు వెళ్ళాలని పరితపిస్తాడు. కిష్టయ్య పంతులు కథలో పంతులు వీధి వీధి తిరిగేది చల్ల చుక్క కోసం. కొండాయి పక్షి కథలో నాలుగక్షరాలు నేర్చుకోవ

డానికి తపిస్తాడు కొండాయి. పెళ్లి కథలో... రత్తి బూరె ముక్క తినడమే పండుగ. వీళ్ళంతా నాటి సమాజంలో అచ్చమైన మనుషులే.

వీళ్ళలో దాగి వున్న గొప్ప మానవాత్మని చూపడమే గోఖలే చేసిన పని. వీళ్ళంతా ఎవరినీనిందించరు. ఎవరినీ వాళ్ళ కష్టాలకి బాధ్యులన్నీ చేయ్యరు. ఆరోపణలు చేయ్యరు. తమకి దక్కిన దానితో సంతృప్తిపడతారు. నాటి గ్రామీణ సమాజంలోని జీవనతత్వాన్ని చక్కగా దృశ్యీ కరించారు. అయితే వారిలా రచయిత సంతృప్తి చెందక ఆ పరిస్థితుల వెనుక నున్న వారి అణగారిన బ్రతుకుల్ని మనముందుంచి ఆలోచింపచేస్తారు. నాటి గ్రామీణ భూస్వామ్య సంస్కృతిలోని వెలుగు నీడల్ని తన కథా చిత్రణలో చూపిస్తాడు.

"బల్లకట్టు పాపయ్య' కథలో వేకువ జామునే కాలవకు బల్లవేసి రాత్రి వరకు జనాల్ని, వాళ్ళ వ్యాపార వస్తువుల్ని కాలవ దాటించే పాపయ్యకు నెలకు ఆరురూపాయల పావలా జీతం వస్తుంది. దానితో సంసార భారాన్ని మోస్తూ రోదిస్తాడు. అయినా సంతోషంగా తన పని చేస్తూ తోటి వారితో పరిహాసాలు ఆడుతూ జీవనాన్ని సాగిస్తాడు. మిగిలిన పాత్రల సంభాషణల ద్వారా ఈ కథలో నాటి గ్రామీణ సమాజ జీవనాల్ని వివరిస్తారు.

షావుకారు భవనానికి రాళ్లెత్తిన కూలీల కథ 'రాయి మడుసులు' కిష్టఒడ్డున నుండే నల్లరాయి కొండ తొలిచి భవంతి కట్టిన రాయి మడిసికి గృహ ప్రవేశం విందులో చోటు ఉండదు. ఇంటికి పోయి తిండికి కూర్చుంటే బువ్వలోకి చల్లలేక దోపిడీ స్వరూపం చూపిస్తుంది.

కొత్త కౌల్దారి చట్టం వచ్చి పాలంలోంచి కౌలుదారుల్ని అకారణంగా తొలగించరాదంటుంది. పంటలో సగం ఇవ్వాలంది. అయినా పెద బసవయ్య గారి ఆరు ఎక రాలు కౌలు చేస్తున్న రాముల్ని చిన్నసాకుతో తొలగిస్తాడు భూస్వామి. ఇలాంటి చట్టాలు పులుసులో కరిగిపోతాయని అందరికీ తెలిసిందే. అయితే పెద బసవయ్య దగ్గర జీతగాడిగా పనిచేయనని రాములు చేసిన తిరుగుబాటు నాటి భూస్వాములకు ఒక హెచ్చరికగా 'పంట సేలు కథ''లో చిత్రీకరించి నాటి కర్షకుల జీవన స్థితిని, భూస్వాముల దౌర్జన్యాన్ని, తిరుగుబాటు చైతన్యాన్ని చూపించారు.

పొరుగూరు నుండి పొట్ట పోసుకోడానికి వచ్చిన గురవయ్య కొట్టు పెట్టుకుని కొద్ది కాలంలోనే సావుకారు అవుతాడు. తాపీ పని చేసే కొండయ్య బతుకంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా గట్టి ఇల్లు కట్టలేకపోతాడు. ఈ వైరుధ్యానికి కారణం మనల్నే కనుక్కోమంటుంది వీరి "దేవుడిచ్చిన సొమ్ము కథ".

మోతుబరి రైతు కొడుకు గోపాలం మోసం చేస్తే గర్భవతి అయిన పనిపిల్ల మంగ. నలుగురిలో తిరగలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి కృత్రిమమైన ఏ సామాజిక నిర్భందాలు లేని రాముడు పెళ్ళి చేసుకుంటాడు. మంగ దుస్థితికి కారణం ఎవరో కథ చివర్లో తెలుస్తోంది. సున్నిత మైన శిల్ప సంవిధానం, నాటి సమాజంలో మోతుబరుల మోసానికి దగా అయిన వాళ్ళ జీవిత చిత్రణ గల ఈ కథ 'బండి రాముడి పెళ్లాం'.

ఇలాంటిదే ఇద్దరు మనుషులు, మార్పు మొదలైనవి. గోఖలే కథాశైలి నజీవమైనది. తన జీవితానుభవ మూలాల్లోంచి వచ్చిన ఆ శైలి అప్పటి గుంటూరు ప్రాంతపు గ్రామీణ సమాజ జీవన శైలే. ప్రతీ రచన వెనుక రచయిత దృక్పథం ఉంటుంది. మన గోఖలే దృక్పథానికి సంబంధించి రెండు ముఖ్యవాదాలు ఉన్నాయనిపిస్తుంది. అవి 1) స్వభావ వాదం - ఇది దైనందిన జీవన రేఖల్ని ఉన్నది ఉన్నట్లు చిత్రిస్తుంది. 2) వాస్తవికతావాదం ఇది ఉన్న జీవితం అలా ఎందుకుందో ఆలోచించమని, వైరుధ్యాల్ని చిత్రించి పరిష్కారం అన్వేషిస్తుంది. ఈ రెండూ నమాజాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రీకరించుటకే ప్రాధాన్యతనిస్తాయి.

అందుకేనేమో మా గోఖలే కథల్లో అంతటి సామాజిక చరిత్రను సజీవంగా చిత్రీకరణ చేసినట్లు కన్పిస్తుంది. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నతను 'మార్పుకథ' కూలివాళ్ల

తిరుగుబాట్లను 'పంటసేలు కథ' గ్రామాల నుంచి వలసలు గూర్చి వివరించే దారి తప్పిన ఇద్దరు మనుషులు కథ, రెండో ప్రపంచ యుద్ధ ప్రభావం గూర్చి గూడెం పోకడ కథ, తిండి కరువు ప్రభావాన్ని పిప్పిదంట్లు కథ, వృత్తుల మధ్య అంతరాలు దేవుడిచ్చిన సొమ్ములు కథ, అట్టడుగు జనం ఆకలి ఆక్రోశాన్ని మూగజీవులు, నువ్వు కడుపులు, రాయిమడుసులు కథలు, రాత్రుల రహస్య సంబంధాల్ని పాలపిట్ట గూడు పెట్టింది, సీకటి పొత్తు కథలు ఇలా ఒకటేమిటి మా గోఖలే కథలన్నీ నాటి సమాజ సజీవ గ్రామీణ చరిత్రను వాస్తవికంగా చిత్రీకరించి చూపుతాయి.

ఇంతటి గొప్ప సామాజిక చిత్రణను తన కథల్లో నిక్షిప్తం చేసిన గొప్ప కథలు మా గోఖలే ఆధునిక తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు.

ఆధార గ్రంథాలు :

1. మూగజీవులు కథా సంపుటం - యువ ప్రచురణ - 1946
2. బల్లకట్టు పాపయ్య కథా సంపుటం - విశాలాంధ్ర ప్రచురణ - 1955
3. మా గోఖలే కథలు - విశాలాంధ్ర ప్రచురణ - 1989
4. విస్మృతకథ 'సంకలనం -సం. పాపినేని నిశివ శంకర్' - 1995

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గిరిజనుల జీవన వైవిధ్యం – సంస్కృతి సంప్రదాయాలు

– పులి చెంచయ్య, తెలుగు అధ్యాపకులు, కె.ఏ.సి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లూరు.

గిరిజనుల సామాజిక జీవనంలో వ్యవసాయం, అడవి ప్రధాన పాత్ర కలిగివున్నాయి. గిరిజనుల కార్యకలాపాలను వేట, ఆహార, అటవీ ఉత్పత్తుల సేకరణ, పోడు వ్యవ సాయం, స్థిర వ్యవసాయం, వ్యవసాయ కూలీ పనులు, పశుపోషణ, గృహపరిశ్రమలు తదితరాలుగా స్థూలంగా విభజించవచ్చు. గిరిజనుల జీవనం అడవి ఆహారంగాను, వన మూలికలు, వివిధ రకాల ఆకులు ఆరోగ్య వనరుగా ఉపయోగపడుతున్నది. సాగు చేసుకొనేందుకు భూమి తమ చేతుల్లో లేకపోవడం వలన వీరు వ్యవసాయ కూలీలుగాను, పాలేర్లు గాను, కాపలాదారుగాను, చేపల వేటగాళ్ళుగాను జీవనాన్ని సాగిస్తున్నారు.

గిరిజనులు నివసించే కొండ ప్రాంతల్లో వ్యవసాయం లాభసాటిగా ఉండదు. ఉత్పత్తి తక్కువ కావడం వల్ల మిగులు పెద్దగా వుండదు. లంబాడీలు అత్యధిక భాగం మైదానాలలో చిన్న రైతులుగాను, వ్యవసాయ కూలీలు గాను ఉన్నారు. జాతవులు, గదబలు, కొండరెడ్లు, సవరలు పోడు వ్యవసాయాన్ని ప్రధాన ఆదాయ వనరుగా భావిస్తున్నారు. వారు ఎత్తైన అటవీ ప్రదేశాలలో నివసిస్తున్నందున ప్రధానంగా పోడు వ్యవసాయం మీదనే ఆధారపడుతున్నారు. దీని మీద వచ్చే ఆదాయం జీవనానికి సరిపోకపోవడంతో అటవీ ఉత్పత్తుల సేకరణ, వ్యవసాయ కూలీ పనులు వంటివి కూడా చేస్తుంటారు. సాధారణంగా గిరిజనులు ప్రధాన వృత్తితోపాటు అను బంధ వృత్తిని పాటించుట జరుగుతున్నది. చెంచులు ఆహార సేకరణతోపాటు, పశుపోషణ చేస్తున్నారు. యానాదులు చేపలు వేట, పాచిపని, మగవారు చెరువు, కాలవ గట్లు, రొయ్యిల గుంట్లవద్ద, అపార్టుమెంట్లలల్లో కాపలాదారులుగా జీవిస్తున్నారు. బగతులు, కోయలు స్థిర వ్యవసాయంతోపాటు కొండసోడు చేస్తారు. సుగాలీలు పశుపోషణ చేస్తున్నారు. ఏజెన్సీ గిరిజనలందరూ అటవీ ఉత్పత్తులు సేకరించుట సాధారణ విషయం. నల్లమల్ల అడవులు, కొండల్లో చెంచులు ముఖ్యంగా వేట, ఆహార సేకరణపై ఆధారపడి జీవిస్తారు. వారు తవ్వుగర్ర, వెదురు బుట్ట, ఇంటిబద్ది అతిసాధన్యంగా వాడుతారు. వేట చేస్తారు. బుట్టలు అల్లుతారు. వీరు ఇప్పుడిప్పుడే స్థిర వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. రాగులు, జొన్నలు పండిస్తున్నారు. చెంచులు, కొండరెట్లు విల్లంబులు ధరించుట సర్వసాధారణమైనప్పటికి వేట ప్రధానమైనది కాదు. ప్రత్యేక పండగల సందర్భంగానే వేట చేస్తున్నారు. గిరిజనులు చేపలు పట్టడం సర్వసాధారణమే అయినా గోదావరి ఒడ్డు ప్రాంతంలో నివసించే కొండరెడ్లు, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో వున్న యానాదులు చెరువుల్లో, కాలువల్లో, నదులలో చేపలు పట్టడంలో ఎక్కువ సమయం గడుపుతారు. లంబాడీలు, గోండులు పశు పోషకులుగా ఒకప్పుడు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ప్రయాణాలు చేసేవారు. ప్రస్తుతం వారు స్థిర వ్యవసాయం చేస్తూనే పశుపోషణ సాగిస్తున్నారు. గిరిజనే తరులతో కలసి జీవించే ఎరుకల వారు బుట్టలు అల్లడం, పందులు పెంచుట వంటి వృత్తులపై ఆధారపడి జీవిస్తు న్నారు.

ఇళ్ళ నిర్మాణం - గ్రామాలు :

గిరిజనుల గృహాలు సాధారణంగా కొండగడ్డి, తాటాకు లతో కప్పబడి చిన్నవిగా ఉంటాయి. చెంచుల ఇండ్లు బుట్ట గుడిసెల వలె వుంటాయి. చుట్టూ తడికలు పెడుతారు. ఇండ్లకి గడ్డికప్పుతారు. మైదాన ప్రాంతాలలో నవిసించే యానాదులు, ఎరుకల వారు ప్రధానంగా గ్రామాల చివర తాటాకు గుడిసెలలో నివసిస్తారు. వీటిని కాలనీ అని, సంఘాలని పిలువడం జరుగుతుంది.

శ్రీకాకులం ప్రాంతంలో నివసించే జాలావులు, సవరలు, ఒకదానికొకటి ఆనుకొని వుండే దీర్ఘ చతురస్రాకారం గల గుడిసెలలో నివసిస్తారు. గ్రామంలో ఇవి వరసగా వుంటాయి. విశాఖపట్నం జిల్లాలో నివసించే గిరిజనులు చతురస్రాకారం లేదా దీర్ఘ చతురస్రాకారంగా వున్న గుడిసెలలో నివసిస్తారు. ఇండ్లకు వీరు వెదురు తడికలు పెడతారు. వీటికి మట్టిపూసి గోడలు తయారుచేస్తారు. కోయల గ్రామాలలో 30 నుండి 300 వరకు ఇండ్లు కట్టుకొని జీవిస్తున్నారు. కొన్నిచోట్ల చిన్నచిన్న గుంపులుగా ఇండ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. వారు ఇండ్లు సాధారణంగా చతురస్రాకారంలో వుంటాయి. అయితే ఇటీవలకాలంలో ప్రభుత్వ క్వార్టర్స్‌లు, పెంకుటిల్లు, చిన్నచిన్న స్లాబు ఇళ్ళు ప్రభుత్వ నిర్మించిస్తున్నది. అవి వారి అవసరాలకు తగినట్లుగా వుండటంలేదు. సరిగా నాణ్యంగా లేక ఎక్కడ చూసిన శిధిలావస్థలో వున్న క్వార్టర్స్ కనబడుతుంటాయి. ఇదేకాక ఒక్క క్వార్టర్స్‌లో 2, 3 కాపురాలు నివసిస్తూ అపరిశుభ్ర వాతావరణంలో గిరిజన సమూహాలు కనబడతాయి. వారి ఇండ్లలలో ఎటువంటి ఫర్నిచర్ వుండవు. ఇండ్లలోని వరండా గోడలకు సున్నంతో అంటి అంటనట్లు గోడలు కనబడతాయి. ఇంటి ముందర తడికలతో పందిరి వేస్తారు. చుట్టూ తడికలతో అడవి పుల్లలతో, తీగలతో ప్రహరీ నిర్మిస్తారు. ఇంటిలోకి ప్రవేశానికి (మెయిన్ గేటు) కూడా ద్వారం కూడా తడికలతో, అడవి పుల్లలతో నిర్మిస్తారు.

సంస్కృతి-సంప్రదాయాలు-మూఢనమ్మకాలు :

గిరిజనుల గ్రామాలను గుంపులను, గూడెంలు, తండాలు, కాలనీలు, సంఘాలు అని అంటారు. ప్రతి గ్రామానికి ఒక పెద్ద దొర లేదా మేస్త్రీ ఉంటాడు. ఆ గ్రామ పెద్దకు సలహాదారులుగా పటేల్ లేక వ్యాపారి (గ్రామ వ్యవహారాల పెద్ద) ఉంటాడు. వీరే కాకుండా పూజారి పనులు చేసిపెట్టడానికి టెక్‌నింథ్ (తలారీ) ఉంటాడు. వీరు గ్రామ పరిపాలన నిర్వహిస్తారు. తీర్పులు ఒక్కసారి కటువుగాను, తీవ్రంగాను, బాధకరంగా ఉంటాయి. ఇటీవల కాలంలో ఇవి తగ్గుముఖం పట్టాయి. తెగ కట్టుబాటువును ఉల్లంఘించి వేరే కులస్థులను తెగలవారిని నివాహం చేసుకొంటే తెగ నుండి బహిష్కరిస్తారు. తిరిగి తెగలో కలుపుకోవాలంటే కొంతడబ్బు, సారా తెగ పెద్దలకు ఇవ్వాలి. తెగల మధ్య కూడా వివాహాలు ఉండవు. ఏ తెగకు ఆ తెగ గొప్పని అంటారు.

గిరిజనులు పండుగలు, పెండ్లిళ్ళలో సారాను, ఇప్పుడు మద్యంను పుష్కలంగా తాగుతారు. వీరికి మూఢనమ్మకాలు, మూఢవిశ్వాసాలు ఎక్కువ. ఏ జబ్బు వచ్చినా, ఏ జ్వరం వచ్చినా గ్రామంలో వెజ్జి లేక వడ్డి (మంత్రగాళ్ళ) తాయిత్తులు దండలు వేయించుకొంటారు. దేవతలకు మొక్కులు, మొక్కుకుంటారు. లేదా ఆకు పసరు, చెట్ల బెరడు, పసరు త్రాగిస్తారు, మూఢనమ్మకాలతో ఒకొక్కసారి మంత్రాలు, చేతలడి (బున్సు) చేసాడు అని భావించి వ్యక్తిని తీవ్రంగా కొట్టడం చంపడం జరుగుతుంది.

గిరిజనుల పండగలు :

గిరిజనులు వ్యవసాయం ప్రారంభంలో భూమి పండగ, కొత్త పంటలు వచ్చినప్పుడు పచ్చ పండగ, చిక్కుడు పండగ, పప్పు పండగ, సంక్రాంతి, మామిడి పండగ, కామున పండగ, పెత్తరమాస (పెద్దల పండగ), ఆగను పండగ, హోలీ పండగ వంటి పండగలు జరుపుతారు. వీటితోపాటు, ఇతర ప్రజలు జరుపుకునే శివరాత్రి, ఉగాది, దసరా, దీపావళి, శ్రీరామనవమి తదితర పండగలు, ఉత్సవాలు సహితం జరుపుతున్నారు. అయితే, గిరిజనుల్లో వీరి సంప్రదాయ ఉత్సవాల పండగల సందర్భంగా, వివాహ సందర్భాలలో పాటలు పాడుతూ, డోళ్ళతో డాన్సులు చేయటం తప్పనిసరి.

"భూమి పండగ" :

గిరిజన గ్రామాలలో తొలకరి కాలంలో వానలు పడాలనీ, పంటలు పండాలనీ గిరిజనులందరూ ఆకాంక్షిస్తూ భూమి పండగ చేసుకుంటారు. ఇది ప్రతి సం॥ము జరుపుతారు. ఊరిబైట ఒక స్థలంలో పందిరివేసి, గొయ్యి

తవ్వి జంతుబలి, పూజలు జరుపుతారు. సామూహిక భోజనం చేస్తారు. ఆ తరువాత భూములు దున్నటం, పంటలు వేయటం ప్రారంభిస్తారు. ఇది గిరిజనుల సంప్ర దాయం. కట్టుబాట్లు, వీరోచితత్వం, పట్టుదల ఈ పండగలో కనపడుతుంది.

ఈ పండగను కొన్నిచోట్ల ఒకరోజు జరుపుతారు. మరికొన్ని ప్రాంతాలలో 3 రోజులు జరుపుతారు. ఈ పండగ సందర్భంగా చివరి రోజు పురుషులందరు అడవిలో వేటకు బయలుదేరవలసిందే. పురుషులెవరైనా మొండికేస్తే, స్త్రీలు అంగీకరించరు. వారిని గెదుముతారు. బురద-పేడ వారిపై జల్లుతారు. దీనితో వారికి ఇష్టమున్నా లేకున్నా గ్రామం వదిలి పారిపోవలసిందే. వేటకు పోయిన వారు జంతువును వేటాడందే దాదాపుగా గ్రామం తిరిగి రారు. జంతువును చంపితెచ్చిన పురుషులకు భోజనాలతో గ్రామంలోగల స్త్రీలు ఆహ్వానం పలుకుతారు. సాధా రణంగా వేటలో జంతువును అడవిలోనే మాసం కోసి తెచ్చుకుంటారు. కాని, ఈ సందర్భంగా చనిపోయిన జంతువులను కావడివేసి గ్రామం పొలిమేర వరకు తెచ్చి దానికి పూజలు జరిపి మాసం కోసుకుంటారు. కొంత మాసం సామూహికంగా వండితింటారు. మిగిలింది ఇండ్లకు తీసుకెళ్ళతారు. ఇలా జరిగిన సందర్భంగా పురుషులను స్త్రీలు పొగడ్తలతో మెచ్చుకుంటారు. ఒకవేళ వేటజరపకుండా ఇంటిదారి పడితే వారిని స్త్రీలు తిట్టటమే గాక, వారిపై బురద, పేడ జల్లుతారు. ఆ విధంగా గెదిమి వేస్తారు. ఆ తరువాత అప్పుడొకరు, అప్పుడొకరు చీకటి పడ్డాక గుట్టు చప్పుడుకాకుండా వీరు ఇండ్లకు చేరతారు. గతంలో అడవిలో జంతువులు విస్తృంగా వుండేవి. కాని, అవి ప్రస్తుతం సరిగా లభించటం లేదు. అంతేగాక మారిన పరిస్థితుల్లో గిరిజనులు భూమి పండగ జరిపి, ఆటలు - పాటలు జరిపినా వేట ఆనవాయితీగా ఒకరోజు మాత్రమే జరుపుతున్నారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి దగ్గర గ్రామాల్లో స్త్రీలు రేల పాటలు పాడుతూ నిధులు వసూలు చేస్తారు. అవి పండగ అవసరాలకు ఖర్చుచేస్తారు.

కోయల సంప్రదాయ - రేల, పెరంబోడ్యాన్సుల ప్రత్యేకత :

కోయల సంప్రదాయ డ్యాన్సులలో ప్రధానమైనవి స్త్రీలు చేసే రేల డ్యాన్సు మరియు పురుషులు ప్రత్యేక అలంకరణతో చేసే పెరంబోడ్యాన్సు. ఈ రెండు రకాలు ఖమ్మం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో గల కోయలు అనుసరిస్తున్నారు. వారందరిలో కల్లా ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్‌లోని కూనవరం, చింతూరు మండలాల్లోని గిరిజన గ్రామాల కోయలు చేసే డ్యాన్సులు అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ డ్యాన్సులను వారి పండగలు - పెళ్ళిళ్ళ సందర్భంలో చేస్తారు. వీటిలో గ్రామంలోని యువతీ-యువకులేగాక ముసలివారు సైతం పాల్గొంటారు. పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. ఒక గ్రామంలో జరిగే కార్యక్రమానికి ఆయా చుట్టుప్రక్కలగల వారు కూడా వచ్చి పాల్గొంటారు.

రేల డ్యాన్సు ప్రధానంగా గిరిజన స్త్రీలే చేస్తారు. కానీ, ఉత్సాహంగల యువకులు కూడా పాల్గొంటున్నారు. స్త్రీలు ఈ డ్యాన్స్ సందర్భంగా తలకు కొప్పు పెట్టుకుంటారు. చీరను మోకాళ్ళవరకు అడ్డకట్టు కడతారు. కాళ్ళకు కడియాలు పెట్టుకుంటారు. స్త్రీలు వరుసగా నిలబడి దండలు పట్టుకుని రెరెలయ్యో రెరెలో... రెరెలయ్యో రెరెల... రేలరేలా రెరెలా... అంటారు. ముందుకు లయబద్ధంగా అడుగులువేస్తూ నడుస్తారు. ఆ డ్యాన్సు మరీ ఊపు ఎక్కితే స్పీడుగా గంతులేస్తారు. ఈ సందర్భంగా వారు ఎంతో ఆనందపడతారు. చూపరులకు ఎంతో ఆసక్తి కలిగిస్తుంది. ఈలలు వేస్తూ కేరింతలు కొడతారు.

'పెరంబో' డ్యాన్సు కేవలం పురుషులే చేస్తారు. ఇది ప్రధానంగా పెళ్ళిళ్ళకు చేస్తారు. ఎండాకాలంలో ఖాళీ సమయాలలో సంతోషానికి రాత్రిపూట చేస్తారు. ఈ సమయంలో పురుషులు లావుగా వుండి బారుగా వున్న కోయ్యడోలు మెడకు తగిలించుకొని ఒకవైపు చిర్ర (కర్రముక్క)తో, మరోవైపు చేతివేళ్ళతో కొడతారు. తలపై

అడవి దున్నల కొమ్ములు, నెమలి ఈకలుగలు వెదురు బుట్టను తలకు తగిలించుకుంటూ నెమలి ఈకలకు పొడవాటి గుడ్డ చుట్టి వేలాడదీస్తారు. డోలికొయ్య తగిలించుకున్న వ్యక్తి స్త్రీలు కట్టుకునే లంగా వంటి బట్టతో అలంకరించుకుంటాడు. ఈ సందర్భంగా వీరు ఒక కాలికి కడియం తగిలించుకుంటారు. వీరికి హుషారెక్కినప్పుడు కడియం గల కాసును అప్పుడప్పుడు విసిరివేస్తూ, 'కెయ్' అని పెద్దగా అరుస్తారు. సంతోషంగా ఊగిపోతారు. ఈ విధంగా పురుషులు డ్యాన్స్ చేస్తున్నప్పుడు వారి ప్రక్కనే స్త్రీలు రేల పాటలు పాడుతూ వారి డ్యాన్సును సాగిస్తూనే వుంటారు. ఈ డ్యాన్స్ శ్రమ పూరితమైనది కానీ ఆనంద పడతారు. డోలు చాలా బరువుగా వుంటుంది. అయితే గిరిజనుల్లో వారి ఆర్థిక పరిస్థితి, జీవనం మెరుగుపడక పోయినా, బయటి ప్రపంచ పరిస్థితుల ప్రభావం వలన ప్రస్తుత యువతరంలో ముఖ్యంగా విద్యావంతుల్లో వాటి ఎడల ఆసక్తి తగ్గుతున్నది. సినిమా పాటల ప్రభావం, సినిమా డ్యాన్సుల ప్రభావం చోటుచేసుకుంటున్నది. మైకుల ప్రభావం పెరుగుతున్నది.

❖ ❖ ❖

మలుపు తిప్పిన – మలుపు తిరిగిన రథచక్రాలు

– శ్రీమతి కూరుతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

ప్రపంచ చరిత్రలో నియంతల నీడలో ఉన్న ఏ రాజ్యం ఇప్పటివరకు ఎక్కువకాలం మనుగడ సాధించలేదు. ప్రజలకు కావలసిన కనీస స్వేచ్ఛా స్వాతంత్రాలు ఇవ్వని ఏ రాజ్యమైన సిద్ధాంతమైన సరే తిరుగుబాటును ఎదుర్కొంటోంది. ఇలాంటిదే తెలంగాణ సాయుధ పోరాటం. భూమికోసం, భుక్తి కోసం, దారుణమైన బానిస వ్యవస్థ విముక్తి కోసం ఆరోజు తెలంగాణ ప్రజలు జరిపిన సాయుధ పోరు ప్రపంచ చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోయింది. ఇలాంటి తెలంగాణ ప్రజల గతిని మలుపు తిప్పిన ఆనాటి ప్రజల సాయుధ పోరాటాన్ని, ఇతివృత్తంగా తీసుకొని ఎంతో నేర్పుతో "మలుపు తిరిగిన రథచక్రాలు" అనే నవలను చిత్రించారు ముదిగంటి సుజాతారెడ్డిగారు. ఈ నవలను విశ్లేషించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం.

నవల పరిచయం :

మలుపు తిరిగిన రథచక్రాలు అనే ఈ నవల పాఠకుల ఆలోచనను మలుపు తిప్పే విధంగా రచయిత్రి చిత్రించడం జరిగింది. ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. నిజాం లాంటి నియంతృత్వ పాలన వల్ల ఎన్నో కష్టాలను భరించిన ప్రజలు ఆ దాస్య శృంఖలాల విముక్తి కోసం తాము చేసిన తిరుగుబాటు, తెలంగాణ సాయుధ పోరాటం.

ఈ సాయుధ పోరాటం ఏవిధంగా జరిగిందో, అది ఏ విధంగా ప్రజలను సమైక్యత కలిగించి చైతన్యం పెంచిందో దొరలు, దేశముఖ్ లు, రజాకార్ల పెత్తనాన్ని ప్రజలు ఏ విధంగా అణచివేశారు అనే విషయాలు మనకు ఈ నవల ద్వారా కనిపిస్తాయి. సాయుధ పోరాట కాలంలో 'సంఘం' దాని ప్రభావం తెలంగాణ ప్రజలపై ఏ విధంగా ఉందో మనం 'మలుపు తిరిగిన రథ చక్రాలు' అనే ఈ నవలలో గమనించవచ్చు.

ఈ నవలలో ప్రధానంగా రమేష్ అనే యువకుడి చుట్టూ అల్లుకున్న ఇతర పాత్రల ద్వారా ఇది సాగుతుంది. ఈ నవలలో కథానాయకుడు అయిన రమేష్ నాయకత్వాన గ్రామ యువకులు కలిసి రహస్యాలను దళాలను ఏర్పరచుకొని దొర గడీలను వారిని అంత మొందిస్తే ఉంటారు. బతుకమ్మ ఆడటానికి వచ్చిన స్త్రీలను దోచుకోవడానికి దొర వేసిన ఎత్తుగడను సంఘం వమ్ము చేస్తుంది. ఆ సమయంలోనే గాయపడిన రమేశ్, దొర కూతురైన సరళను కలవడం వారి మధ్య స్నేహం ఏర్పడటం జరుగుతుంది.

తర్వాత కొన్ని అభ్యుదయ భావాలు కలిగిన సరళ తాను సంఘంలో చేరతానని చెప్పడం దానికి రమేష్ నిరాకరించడం జరుగుతుంది. కానీ దొర కూతురు అయిన సరళ, రమేష్ తో పాటు సంఘంలో పని చేస్తానని చెప్పడం ఈ నవలలో ఇది ఒక గొప్ప విషయం. ఇది ముఖ్యంగా సరళ, కస్తూరి తెచ్చిన పుస్తకాలను, దినపత్రికలను చదువుతూ అనేక విషయాలను తెలుసుకోవడం, దీనివల్ల తన ఆలోచనల్లో మార్పురావటం జరిగింది. దీన్ని ఈ నవలలో చిత్రించడం ద్వారా మరోసారి విద్య యొక్క ప్రాధాన్యాన్ని తెలియజేశారు.

అలాగే కౌలు గింజలు కలవలేదని నెపంతో కొమురయ్య మరియు అతని తమ్ముని చంపడం ద్వారా దొర ఆధిపత్యాన్ని చూపించడం, సరళ వివాహాన్ని తండ్రి అన్నారం దేశముఖ్ రంగారావుతో నిశ్చయిస్తాడు. సంఘం రంగారావు గడిపై దాడిచేసి అందర్నీ ఆహుతి చేస్తుంది. తర్వాత సంఘం సహాయంతో ప్రజలు చేసిన దాడిలో రాంచంద్రరావు, మహీంద్ర లు మరణించడం, ప్రభాకర్ సహాయంతో రమేశ్, భువనేశ్వరి సరళ, కస్తూరిలను పట్నానికి పంపిస్తాడు. ఆడబాప మాలతి కొడుకు

మురళిదాసు బలవంతంగా సరళను వివాహం చేసుకోవడం. గ్రంథాలయ నిర్వాహకుడు ప్రభాకర్ కస్తూరిల వివాహం, సరళకు కూతురు జన్మించడం, చదువు పెళ్లి, మనమరాలు జననం, అమెరికా ప్రయాణంలో కూతురు అల్లుళ్ళ మరణం, చివరిలో సరళ మనుమరాలు బేబీ బాధ్యతను రమేశ్ తీసుకోవడం, అంటే జనజీవన స్రవంతి లోకి రావడం అనే వివిధ అంశాల ద్వారా ఈ నవల ముగుస్తుంది.

విమర్శనాత్మక అంశాల పరిశీలన :

ఈ నవలలో రచయిత్రి అంతర్గతంగా అనేక విషయాలను చెప్పకనే చెప్పినట్లు అర్థమవుతుంది. ఈ నవలలో ముఖ్యంగా స్వాతంత్ర్యం రాకముందు నుంచి స్వాతంత్ర్యానంతరం 1946-86 మధ్య కాలపు తెలంగాణ రాజకీయ, సామాజిక, చారిత్రక జీవన స్థితిగతులు ప్రతిబింబించాయి. మొత్తంగా 40 సంవత్సరాల కాలం ఈ నవలలో గమనించవచ్చు. మలుపు తిరిగిన రథచక్రాలు నవలలో ఆడబాప వ్యవస్థను, దొరల కుటుంబంలో పుట్టిన అభ్యుదయ భావాలు కలిగిన సరళ పాత్ర మొదలైన వాటిద్వారా దీనిలో స్త్రీల మనోభావాలను కొంత వ్యక్తం చేయడం కనిపిస్తుంది. అలాగే ఆ కాలంనాటి పరిస్థితులు, సాంప్రదాయాలు పద్ధతులు, గడీల నిర్మాణం, కట్టడాలు దొరల దర్పం బానిసలుగా ఉండే ఆడబాపలు, సామాన్య ప్రజల దుర్భర పరిస్థితులను ఇందులో పాత్రోచిత సంభాషణలు మాటలు ద్వారా చిత్రించారు.

విప్లవం ప్రధాన కేంద్రంగా కొన్ని నవలలు వచ్చినా, విప్లవంతో విసిగిపోయిన సంఘ సభ్యులు జనజీవన స్రవంతిలోకి కలిసినట్లు రూపొందించబడినదిగా ఇది గుర్తించబడింది. దీనిని ఈ నవల పేరులోనే గుర్తించవచ్చు. ప్రధానంగా మలుపు తిరిగిన రథచక్రాలు పరిశీలిస్తే రథాన్ని 'యుద్ధ సమయాలలో' వాడుతుండగా ఈ నవలలో 'సాయుధపోరాటం' అని అనే పేరుతో జరుగుతున్న యద్ధంలో ఇతివృత్తంతో దీన్ని చిత్రిస్తూ, చివరికి సంఘ సభ్యులు పోరాటం నుండి జనజీవన స్రవంతి లోకి రావడం ఒక 'మలుపు తిప్పే సన్నివేశం' దీనిని ఆలోచించే రచయిత్రి ఈ నవలకు "మలుపు తిరిగిన రథచక్రాలు" అనే పేరుని ఔచిత్యంతో పెట్టారనిపిస్తుంది.

ఈ నవలలో రచయిత్రి అంతర్గతంగా కొన్ని ప్రశ్నలను లేవనెత్తి వాటికి సమాధానాలు మాత్రం పాఠకులకే వదిలేసినట్లుగా అనిపిస్తుంది. "మీ ఆశయాలను ఆదర్శాలను నేరవేర్చుకోవాలంటే ప్రజలకు న్యాయం కలిగించాలను కుంటే వేరే దారి లేదా? చెప్పు రమేశ్! చెప్పు" అని అడిగిన సరళ మాటల్లో (పుట 145) ఒక ప్రశ్నగా, "వర్గ భేదం సమాజంలో నశించినాడు నా దీక్ష పూర్తి అవుతుంది. సామాన్య ప్రజానీకం చైతన్యవంతమై ఉప్పెనలా లేచేంత వరకు నా పోరాటం సాగుతుంది"(పుట 159) అని చెప్పిన రమేష్ మాటలను మరో ప్రశ్నగా. ఈ రెండింటికి సమాధానాలు పాఠకులను ఆలోచనలో పడవేసినట్లు తెలుస్తుంది.

అలాగే ఈ నవలలో నిశితంగా పరిశీలిస్తే అనేక విషయాలు మనకు గోచరిస్తాయి. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన కమ్యూనిస్టు భావాలు, వారి సిద్ధాంతాలు స్వాతంత్ర్యానంతరం కూడా యవకులు కమ్యూనిజం వైపు ఎందుకు ఆకర్షించబడ్డారు వాటికి దారి తీసిన పరిస్థితులు, స్వాతంత్ర్యనంతర కాలంలో రాజకీయ నాయకులు వారిని అణిచి వేయడం మొదలైన విషయాలు ఈ నవల ద్వారా పాఠకులకు ఆలోచన పెట్టింది రచయిత్రి.

ఈ నవల మొత్తంలో ముఖ్య విషయాలను రచయిత్రి కొన్ని ప్రతీకల ద్వారా తెలియజేసినట్లు తెలుస్తుంది. అభ్యుదయ భావాలు కలిగిన సరళను ప్రజాస్వామ్య విలువలకు ఒక ప్రతీకగా చెప్పు, ఆమెకు దోపిడీ దారుడు అయిన మురళిదాసు తో వివహం కావడం ఆ ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా గుర్తించవచ్చు. కథా నాయకుడు అయిన రమేష్ సరళ చివరి దశలో తన

మనమరాలు బేబీ బాధ్యతను తీసుకోవడానికి సిద్ధ పడటం అనేది, తను విప్లవాన్ని వదిలి సామాన్య జీవితం లోకి వస్తున్నాడు అని అనిపిస్తుంది.

మలుపు తిరిగిన రథచక్రాలు నవలలో ముదిగంటి తన స్వంత అనుభవాలను జోడిస్తూ వాటితోపాటు అనేక సామాజిక అంశాలను చిత్రించారు. ముఖ్యంగా దొరలు, దేశముఖ్‌ల పాలన రజాకార్ల వ్యవస్థ, వెట్టిచాకిరి విధానం, భూస్వామ్య వ్యవస్థ మరియు ఆడబాపల వ్యవస్థ అనాటి గ్రామీణ జీవితం, అలాగే స్వాతంత్రానంతరం పరిస్థితు లను కూడా దీనిలో చిత్రించారు. విప్లవవీరుడు ప్రజా స్వామ్యాన్ని కోరుకుని జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లుగా రాయడంపై కొంత భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

తెలంగాణా సాయుధ పోరాటానికి సంబంధించిన సాహిత్యం, ఆళ్వారుస్వామి రాసిన 'ప్రజల మనిషి' 'గంగు' రంగాచార్యులు రాసిన 'చిల్లర దేవుళ్ళు' మహీధర రామ మోహనరావు గారి 'ఓనమాలు', తర్వాతి కాలంలో అల్లం రాజయ్య, సాహు వంటి వారు కొంత చేసిన, ముది గంటి గారి 'మలుపు తిరిగిన రథ చక్రాలు' మాత్రం తెలంగాణా విప్లవ నేపథ్యంతో వచ్చిన సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం నిలుపుకుంది.

ఉపయుక్తగ్రంథ సూచిక :

1. తిరుమల్ రావు జయధీర్. తెలంగణా రైతాంగ పోరాటం ప్రజా సాహిత్యం:సాహితీ సర్కిల్ హైదరాబాదు 1988.
2. త్రివేణి,వి. ముదిగంటి సుజాత రెడ్డి రచనలు - సమగ్ర పరిశీలన. హైదరాబాదు 2012.
3. రంగాచార్యులు దాశరధి. చిల్లర దేవుళ్ళు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాదు 1987.
4. వేంకటేశ్వర రావు దేవులపల్లి. తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్ర(1946-51): ప్రోలిటేరియన్ లైన్ ప్రచురణలు, హైదరాబాదు 1988.
5. సుజాత రెడ్డి ముదిగంటి. మలుపు తిరిగిన రథ చక్రాలు:రోహణం ప్రచురణలు.హైదరాబాదు 1994.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రబంధ సాహిత్యం – సామాజికత్వం

– ఉన్నవ గణేష్, ప్రముఖ కవి, విజయవాడ.

తెలుగు సాహిత్యం విలక్షణ అనువాద సాహిత్యం. తొలినాళ్లలో సంస్కృతం రచనలని అనువదిస్తూ సాగిన ఈ సాహిత్యం ప్రస్తుతం శాఖోప శాఖలుగా విస్తరించి విరాజిల్లుతుంది. ప్రపంచం మెచ్చదగిన మచ్చిక భాష తెలుగు. కావ్య నాటక పురాణేతిహాస శతకాది ప్రక్రియలలో ఇతర భాషలను సైతం అబ్బుర పరిచేలా విస్తరించటం తెలుగు భాషకు వెన్నతో పెట్టిన విద్య. తెలుగు సాహిత్య ప్రక్రియలలో ప్రసిద్ధ ప్రక్రియ "ప్రబంధం". 15వ శతాబ్దం లో ఈ ప్రక్రియ బహుముఖ తేజస్సుతో వెలుగులీనినది. రాయల వెన్నుదన్నుతో తెలుగు భాషకు ఒక మణిపూస అయినది. రాయల తరువాత తంజావూరు పాలకుల వద్ద చిక్కి శల్యమై తుదకు అరుదుగా కనిపిస్తున్నది. అటువంటి ప్రబంధ ప్రక్రియకు సంబంధించి ఎన్నో విషయాలు ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

ప్రబంధ ఆవిర్భావ వికాసాలు :

తెలుగు సాహిత్యంలో ప్రబంధయుగం లేదా రాయల యుగాన్ని స్వర్ణ యుగంగా చెప్పుకుంటారు. ఎందుకంటే ఈ యుగంలో పుట్టిన సాహిత్యం మరే యుగంలోనూ పుట్ట లేదు అనుట అతిశయోక్తి కాదు. అష్టదిగ్గజాల ప్రతిభా పాటవానికి ఈ యుగం ఆలవాలం. భక్తి శృంగార కరుణ భరిత ప్రబంధాలు ఈ యుగంలో పురుడుపోసుకున్నాయి. అసలు ప్రబంధం అనే పదం ఈ యుగానికే పేరు తెచ్చింది. ప్రకృష్టేన బంధః ప్రబందః అని ప్రబంధానికి నిర్వచనం. పటిష్టమైన ప్రణాళిక, అద్వితీయ రచనా విధానాల కలబోతే ఈ ప్రక్రియ.

ప్రబంధ లక్షణాలు :

తెలుగు సాహిత్యంలో ప్రబంధానికి కొన్ని లక్షణాలను పేర్కొన్నారు. వాటి ప్రకారం ప్రబంధంలో అష్టాదశ వర్ణనలు ఉండాలి. నవరసాలతోపాటు ఏదో ఒక రసం ప్రధానంగా ఉండాలి. పురాణ ఇతిహాసాల నుండి తీసుకున్న చిన్న కథను స్వతంత్రంగా పెద్దది చేసి రాస్తే దానిని ప్రబంధం అని అంటారు

ఈ ప్రబంధాలు ప్రధానంగా శృంగార రస ప్రధానాలు. భక్తి పూర్వక ప్రబంధాలు వెల్లివిరిశాయి. రాయల యుగం లోనే ఈ ప్రక్రియకి పట్టం కట్టారు. తంజావూరు పాలకుల సమయంలో ఒక విధంగా ప్రాభవం కోల్పోయినట్లే అయినది. కానీ ప్రబంధం చాల విలక్షణమైన ప్రక్రియగా తెలుగు సాహిత్య చరిత్రలో నిలిచిపోయింది. ఎన్నో విభిన్న లక్షణాలతో ప్రబంధానికి ప్రత్యేకతను కూర్చారు కవులు.

ప్రబంధ సాహిత్యం సామాజికత్వం వివరణ :

ఏ సాహిత్యం అయిన అంతిమ లక్ష్యం సమాజ హితమే. దేశ కాల పరిస్థితులను బట్టి సాహిత్యం తన ఉనికిని విస్తరింప చేసుకుంటుంది. ప్రజల కి హితము చెప్పటమే సాహిత్యం యొక్క విధి. కవులు తమ భావాలని కావ్య రూపంలో వ్యక్తం చేసే వారు. పండితులు వాటికి సరైన అర్థాలు ఏర్పరచి ప్రజలకు అర్థమయ్యేట్లు వ్యాఖ్యానించే వారు. సాహిత్యం కూడా కాలానుగుణంగా మార్పులు చెందుతూ వస్తుంది. నన్నయ్య కాలం నాటి స్థితికి, ప్రబంధ స్థితికి, ప్రస్తుతానికి భాష విషయంలో, కావ్యం విషయం లో, చాల భేదాలు మార్పులు ఉన్నాయి.

సామజికత్వం అంటే :

మానవుడు సంఘ జీవి. కాబట్టి తను తోటి వారితో ఎలా ఉండాలి అనే విషయాల సమాహారమే సాజికత్వం. ఇందులో కుటుంబం, ఆర్థికం, జీవన విధానం వంటి విషయాలు చోటు చేసుకుంటాయి. వీటిని కవితా వస్తువులుగా స్వీకరించి కవులు తమ కావ్యాలను ప్రజాపయోగం చేశారు. మరి ఇప్పుడుకూడా ప్రజారంజక కవిత్వమే పతాక

స్థాయిలో ఉన్నది. కానీ కొంతమంది పండిత ప్రకాండులు మరియు దళిత, విప్లవ కవిత్వ మేధావులు ప్రబంధాన్ని విమర్శ చేయటం గమనించ దగిన విషయం. కడుపు నిండిన కవిత్వం ప్రబందానిది అందులో వర్ణాలకు వర్ణన లకు తప్ప జనానికి స్థానం లేదు అన్నది వాళ్ళ వాదన. ఆ విషయాలను కాస్త విపులంగా చూద్దాం

విమర్శ - సమాధానం :

దళిత విప్లవ శతాబ్దాల కవులు ప్రబంధ యుగ కవిత్వాన్ని కడుపు నిండిన కవిత్వం అని వర్ణన తప్ప మరేమీ లేదని విమర్శించారు. దానికి నా సమాధానం ఏమిటంటే "ముందు మనం కాలానుగుణంగా కవిత్వం మారుతుంది అని చెప్పుకున్నాము. ఆ విధంగా ఆలోచిస్తే దళిత సాహిత్య కాలానికి విప్లవ సాహిత్య కాలానికి ప్రబంధ కవిత్వ కాలానికి ఎంతో వ్యత్యాసం ఉంది. ఇందుకు చిన్న ఉదాహరణ ఒక బాలుడు దెబ్బ తగిలితే అరిచే అరుపుకు, ఆకలితో అరిచే అరుపుకు తేడా ఉందా లేదా? అలాగే ప్రేమతో అమ్మా అనే పిలుపుకు , కోపంతో అమ్మా అనే పిలుపుకు భేదం ఉందా లేదా? మరి భిన్న కాలాలలో సాహిత్యం మారినప్పుడు ప్రబంధం తక్కువది అని అనడం ఎంత వరకు సమంజసం. అది పండితులకే తెలియాలి."

ఈ వితండ వాదన పక్కన పెడితే ప్రబంధ కాలంలో పరిపాలన చాల సుభిక్షంగా ఉన్నది. ఐన మానవునికి కావాల్సిన విషయాలను కావ్య ముఖతః చెప్పారు. ఎప్పుడో చెప్పిన విషయాలను తప్పు అనడం గమనిస్తే ఇప్పటి వారికి వాటి మీద అవగాహనా లేదు అన్న విషయం స్పష్టంగా అర్ధం అవుతున్నది. ఏ కాలానికి ఆ కాల సాహిత్యం ఉత్తమం అయినది అన్న విషయం మనం గ్రహించాలి.

పబంధ సాహిత్యంలో సామాజిక జీవనం :

పైన చెప్పుకున్నట్లు ప్రబంధ కాలంలో జీవన విధానం చాల హుందాగా సమానత్వంగా ఉండేది. కాబట్టి రాజును దృష్టిలో ఉంచుకొని ప్రజల జీవన విధానాన్ని వివరించటం జరిగింది.దాన్ని బట్టి కవిత్వపు లోటుపాట్లను పండితులు గుర్తించడం కూడా జరిగింది. తొలి తెలుగు ప్రబంధంగా అల్లసాని పెద్దన గారి మనుచరిత్రను ప్రస్తావిస్తారు. ఈయనకి ఆంధ్ర కవితా పితామహుడు అన్న బిరుదు కూడా ఉన్నది. ఈ మనుచరిత్రలో మనువు పుట్టుక వరకు మాత్రమే ఉన్నది. స్వారోచిష మను సంభవం అని మరో పేరు కూడా ఈ ప్రబంధానికి ఉన్నది. ఇందులో వివరింప బడిన వృత్తాంతం నాటి సామాజిక పరిస్థితులకు ఎంతో ఉపయోగం.

ప్రవరాఖ్యుడు ఇందులో కధా నాయకుడు వరూధుని కధానాయక. ఇక్కడ ప్రదానంగా పురుషులు ఎలా బ్రతకాలో వివరించడం మరియు నిత్య కర్మల ప్రాధాన్యత చాల స్పష్టంగా వివరింప బడినది. అలాగే ప్రయాణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరింపబడ్డాయి. ఇందులో కధ మరియు వస్తువు విషయం లో అభి ప్రాయాలు భేదాలుగా ఉన్నా ప్రధానంగా ప్రవరాఖ్యుడి జీవన విధానం మనకు కావాల్సిన అంశం. మూడు పూటలా నిత్యాగ్ని హోత్రంతో, అన్నదానాదులతో, అతిధి మర్యాదలతో జీవించిన సద్గుణ మూర్తి ప్రవరాఖ్యుడు. నేటి వారికి ఈ పాత్ర ద్వారా ఎంతో గొప్ప జీవన విధానాన్ని మనం నేర్పించవచ్చు. మరి ఇలాంటి వాళ్ళు విప్లవ దళిత సాహిత్య మేధావులకు ఎందుకు కనిపించరో? నన్నయ్యని ఆయన బొందలోనే పండనివ్వండి అని అన్న కవీస్వరులకి నన్నయ్య లేనిదే సుసాహిత్య బీజం పడేది కాదు అన్న ఆలోచన ఎందుకు రాదో? పెద్దన కవిత్వం కడుపు నిండినదే అయితే భావి తరాల పురుషులకు ప్రవ రాఖ్యుడు వచ్చేవాడా? కడుపు నిండి నపుడు సుఖ పురుషుల చరిత్రలు పుట్టాలి కానీ సద్గుణ ప్రవరాఖ్యుడు ఎలా పుట్టాడు? అందుకే కాలం అన్నిటికి సమాధానం చెప్తుంది.

ప్రబంధం వర్ణనకే పెద్ద స్థాయి ఇచ్చింది అన్నది జగమెరిగిన సత్యం. కానీ ఆ వర్ణనలో పాత్ర గొప్పతనం

కూడా దాగి ఉన్నది అన్న సత్యాన్ని తెలుసుకోవాలి. ఆదర్శ పురుషులకు గుర్తుగా ప్రవరాఖ్యుడిని చెప్పు కోవాలి. ఆధునిక కాలానికి కూడా ఈయన ఒక ఆదర్శ మూర్తిగానే గుర్తింపు పొందటం విశేషం. అల్లసాని వారి పాదాల అల్లిక లో ఎంత సొగసు ఉందొ ఆనాటి ప్రజల జీవన విధానం అంత సుందరంగా ఉండేది. నేటి వారికి ఆధునిక కవులకి కూడా ఇవి ఉపయోగపడే విధంగా ఉండటం ఆయన రచన గొప్పతనమే.

అలాగే ధూర్జటి రచనలు కూడా సామాజిక జీవనానికి ఎంతో దగ్గరగా ఉంటాయి. తిన్నడి పాత్ర చిత్రణలో అడవి ప్రజల బతుకులు ఎలా ఉంటాయో చెప్పారు. వారి లో దానిగిన న్యాయ వైద్య విద్యలను చక్కగా కవిత్వీ కరించారు ధూర్జటి. పింగళి సూరన కల్పించిన పాత్రలలో ఆనాటికి ఉన్న స్వార్ధం, కోపం యొక్క స్థాయి గురించి విశ్లేషణ చేయటం సూరన లోని సూరి తత్వానికి నిలువెత్తు నిదర్శనం. పారిజాతాపహరణ కావ్యంలో భార్యా భర్తల కలహానికి మందు వివరిచటం నంది తిమ్మన గొప్పతనం. ఇలాంటివి మనకి ఎప్పటికి అర్ధమవుతాయి. మరి ఇవి అన్ని కడుపు నిండిన కవిత్వం లోవేనా? నాటి పరిస్థితులకు అనుగుణంగా వారి జీవన విధానాన్ని కవులు వివరించారు. ఇవే ఆధునిక కవిత్వానికి పునాదిగా చేసుకొని నేటి పరిస్థితులకు అనుగుణంగా కవులు మలచుకోవాలి అంతే కానీ నోటికి పనిచెప్పడం కలానికి కులం అంటగట్టడం ఎంత వరకు సమంజసం.

ముగింపు :

ఒక కవిత్వం గొప్పదని మరొక కవిత్వం తప్పు అని చెప్పే స్థాయికి మనం చేరలేదు. నిజానికి ప్రతి కవిత్వానికి మనం విలువ ఇవాల్సిందే. ఆధునిక కవిత్వంలో వస్తున్న ప్రతి అంశానికి ప్రబంధంతో సంబంధం ఉంది. బానోచిస్టం సర్వం అన్నట్లు పెద్దలు పునాది వేయకుండా ఆధునిక సాహిత్యం ఇలా ఉండేది కాదు. ఇప్పటి వారి ప్రతిభ అప్పటి వారి భిక్ష. వాళ్ళు వదిలేసిన విషయాలను మనం కొత్త పంధాలో చెప్పుకుంటున్నాం అది కూడా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని. ఈ వ్యాసం ప్రధానంగా సామాజి కత్వం నాడు నేడు ఉన్న విమర్శకి సమాధానంగా రాసినది. అప్పటి సమాజంలో స్థితి వేరు ఇప్పటి సమాజ పోకడ వేరు అంతే కానీ ప్రాచీనం లేనిదే ఆధునికానికి గుర్తింపు లేదు. ఆధునికం లేనిదే ప్రాచీనం విలువ తెలీదు. ప్రబంధం తనలో ప్రజా జీవితాన్ని బంధించింది. ఆధునికా నికి అవకాశం ఇచ్చింది.

❖ ❖ ❖

తెలంగాణ బహుజన సాహిత్యంలో అస్తిత్వవాదం

– నరేష్ భూక్య (నాలి), పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలంగాణలో బహుజన తాత్విక పునాదికి రూప శిల్పిగా బి.ఎస్ రాములు గారిని పేర్కొనవచ్చు. ఈ తాత్విక భూమిక ఏర్పడ్డానికి 20 సంవత్సరాల చరిత్రను మనం అవలోకించవలసి ఉంది. ప్రధానంగా 1990 తరువాత అణగారిన వర్గాల్లో మార్పు కోసం ఆలోచనలు చోటు చేసుకున్నాయి. దళితవాదం, స్త్రీవాదం, ముస్లింవాదం మొదలైనవన్నీ సమాజ పురోగతికి ఎంతో తోడ్పడ్డాయి. ఆనాడు అంబేద్కర్ సమాజం మౌలికంగా మార్పులు పొందడానికి చేసిన కృషి దాని తాలూకు ఫలితాలు ప్రధానంగా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో తమ అస్తిత్వాన్ని చాటుకుంటూ కాస్త ఆలస్యంగానైనా ముందుకు రావడం జరుగుతోంది. మౌలికంగా సాహిత్యంలో తాత్విక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక రంగాలలో ఒక కొత్త తత్వానికి బీజాలు ఏర్పడాలంటే పాత దానిని నిర్మూలించే ప్రయత్నం చేయాలి. నిజానికి ఆ పని అంత సులభమైనది కాదు. దీనిలో లో మార్పు కేవలం అణగారిన వర్గాల వారి యొక్క అభివృద్ధికి మాత్రమే పరిమితం కాకుండా వీరిని అణగ దొక్కుతున్న పై వర్గం కులాలు అనగా అగ్రవర్ణ కులాలు ఆధిపత్య వాదులు అంత సులభంగా మార తారని అనుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే అగ్రవర్ణాల ఆధిపత్యం కొడిగట్టిన కరుడుగట్టిన భావజాలంతో తాత్విక పునాది వేగవంతంగా నిర్మితం కావడానికి తన మోకాలును అడ్డు పెడుతుంది.

1990 తర్వాత వచ్చిన స్త్రీవాద దళితవాదులు కొంతమేరకు సమాజంలో అలజడులను సృష్టించడమే కాకుండా తమ అస్తిత్వాన్ని చాటుకునే ప్రయత్నంలో ఆత్మగౌరవ విధానాలను స్వీకరించి కొంతమేరకు కృషిచేసి లక్ష్యాలు సాధించినప్పటికీ ఎక్కువ భాగం భయంతో సమాజానికి దూరంగ జరగడమనేది మాత్రం నిలిచి పోయింది. ఏది ఏమైనా బహుజన తాత్విక పునాది అనేది అంత సులభంగా గట్టున పడలేదు. ఎందుకంటే దీనిపై ఆధిపత్యం సాధిస్తున్న సంస్థలకు ఇతర వర్గాలు సహ కారం చేయడం కూడా మనం గమనించవచ్చు. అయితే కాలం ఎప్పుడూ ఒక తీరుగా ఉండదు అన్నట్లుగా ఒక చారిత్రక పరిణామంలో బహుజన రచయితలు కళా కారులు ఒక ఐక్య వేదికను ఏర్పాటు చేసుకోగలిగారు. అంతర్గతంగా వీరిలో ఉన్న వైరుధ్యాలను తగ్గించుకునే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా బహుజన రచ యితలను ప్రోత్సహించడం కొత్త ఆలోచనలకు పెట్టడం అవి కూడా సాహిత్య తాత్విక సైద్ధాంతిక కవిత్వ కథ పాటలు మొదలైన అంశాలలో వారందరూ కలిసి ప్రతి పాదించిన నిర్ణయాలన్నీ కూడా ఇక్కడ పేర్కొన్న ప్రక్రియ లలో గ్రంథస్థమై విశ్వంలోకి అడుగు పెట్టాయి. అందులో ఈ సైద్ధాంతిక తత్వం తీవ్ర వేగంతో ప్రయాణించడానికి కేవలం గ్రంథాలే కాకుండా సదస్సులు సభలు శిక్షణ తరగతులు వీటిని కూడా ఈ బహుజన ఐక్య వేదిక ముందుకు తీసుకో రాగలిగింది. అయితే ఈ బహుజన ఐక్య వేదిక చేసిన ప్రయత్నాలు అటు రాశిలోను ఇటు వాసిలోనూ కొంతమేరకు ఫలితాలు సాధించడం ముదా వహం.

40 ఏళ్ల తీవ్ర పోరాట జీవితంలో లో బి ఎస్ రాములు ఈ బహుజన తాత్విక సిద్ధాంత ప్రతిపాదనతో ముందుకు రావడానికి కారణాలు పరిశీలిస్తే వారు ఒక్క రోజులో వారి జీవితంలో మార్పును తీసుకురాగలిగారు అని మాత్రం చెప్పలేం. అయితే వారు పుట్టిన కులం ఏదైనా వారు అభ్యసించిన విద్య ప్రాచ్య విద్య అవ్వడం వల్ల దాని లోతుల్లోని విషయాలను మర్మాలను కూలంకషంగా అధ్యయనం చేసిన అవగాహనతో ఎన్నో ఎదురు దెబ్బలు

తిన్న తర్వాత ఈ బహుజన తాత్విక వేదికను ఒక కొత్త సాహిత్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి వెలుగు చేశాడని మాత్రం స్పష్టంగా చెప్పవచ్చు. ఉద్యమాలు వాటిపట్ల ప్రజల తీర్పులు లక్ష్య సాధనలో అనుభవించిన అనేక ఆటు పోట్లు వీరి లక్ష్యాలను అడ్డగించడానికి ప్రయత్నించిన అగ్రకులాల కుతంత్రాలు వీరికి మనో నిబ్బరాన్ని కలిగించి ఇంకా ముందుకు పోవడానికి వీలు కలిగేలా పరిస్థితులను మలుచుకుని తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి రాములు గారు ప్రగతి వైపుకు ప్రయాణించారు.

ఈ లక్ష్య సాధనలో రాములు గారు ఆత్మకథ వ్యథల జీవిత చిత్రణ వంటి కొత్త ప్రక్రియలను ముందుకు తీసుకు వచ్చారు. సాహిత్య తత్వాన్ని అర్థం చేసుకుంటూ దానిని సామాజిక పరంగా విస్తృతం చేయడంవల్ల ఎన్నో ఫలితాలు సాధించారు. ఎందుకంటే సాహిత్య సాంస్కృతిక తత్వాన్ని రూపు సారాలను మార్చకుండా సమాజంలో మార్పు కు అస్కారం లేదు. కాబట్టి మొదట సైద్ధాంతిక ప్రాతిపదిక సైద్ధాంతిక ప్రతిపత్తి ఆవశ్యకతను సాహిత్య చరిత్ర నిర్మాణంలో రావలసిన మార్పులను ఒంట పట్టించుకున్నారు. దానిలో భాగంగా ఇతి వృత్తంలో మార్పును స్వాగతించారు. కొత్త సృజనకు ఆసరా అందించారు. దీనివల్ల కొత్త పాఠక వర్గం తయారైంది. అనేక సామాజిక శక్తుల అండదండలు వీరికి లభించాయి. అంతే కాకుండా అనేక ఆలోచనలకు అవకాశం ఏర్పడింది. అస్తిత్వవాదం పూర్తిగా సంపూర్ణం కాకపోయినప్పటికి కొంతమేరకు తనదైన బాణీని వినిపించింది.

పీడిత కులాల నుంచి ఎదిగే బుద్ధిజీవులు కళాకారులు సాహితీవేత్తలను రాజకీయపరమైన అడ్డంకుల ద్వారా అవరోదించడం అణిచివేయడం అనేవి కనిపిస్తున్నప్పటికీ పైన పేర్కొన్న బహుజన సమాజ సాహిత్యకారులు తమ సొంత ఎదుగుదల క్రమానికి తామే తమకు తోచిన వరకు సిద్ధాంత ప్రతిపాదనలను చేకూర్చే క్రమంలో ఎదిగే ప్రయత్నాలు చేశాయి. అయితే కేవలం వారి భావ వ్యక్తీకరణలోని బలహీనతలను ఆసరా చేసుకుని వారిని వారి సాహిత్యాన్ని అణగదొక్కే ప్రయత్నాలు ప్రారంభించారు. మతతత్వ వాద పురుషాహంకారం యథార్థత వాదాలతో అభివృద్ధి చెందిన ప్రాంతాల వర్గాల వారి ఆధిక్యతను తిరిగి నిలబెట్టే ప్రయత్నం చేయడం అగ్రవర్ణాల వారు ప్రధానంగా చేశారు.

వర్తమానంలో పోరాడుతున్న పీడిత వర్గాల కులాల లింగాల భాషల ప్రాంతాల ప్రజలు తమ జ్ఞానం మొత్తం తమకే పరిమితం ఇతరులకు ఎందుకు చెందాలని ప్రశ్నించుకోవడం ప్రారంభించారు. ఒక కోణంలో పరిశీలిస్తే పీడిత వర్గాల బ్రతుకుల్లో జడత్వం మిగిలిపోయింది. అయితే ఆ జడత్వాన్ని చలనంగా మార్క్సిజంగా తెలియ జేస్తూ వచ్చారు కొందరు. అసలు నిజానికి జడత్వం అంటే ఏమిటని ప్రశ్నించుకున్నప్పుడు తన ప్రవర్తనను స్వభావాన్ని చలనాన్ని దిశను మార్చుకోలేకపోవడమే జడత్వం. దీనిలో మార్పును కోరుకోవటం ఒక కోణం అయితే మరొక కోణంలో మార్పును కోరినప్పటికీ లక్ష్యాలను నెరవేర్చుకోక పోవడం మరొక కోణం. అందుకనే దాదాపుగా బహుజన తాత్విక వాదంలో చాలామంది తమకు జరుగుతున్న అన్యాయాలను ఏకరువు పెట్టారే గాని వాటికి సంబంధించిన సమస్యలకు ఏ మాత్రం ప్రాధాన్యతను ఇవ్వకుండా పరిష్కారాలను ఇవ్వకుండా వారు ఒక నిరాశకు నిర్లిప్తతకు లోనయ్యారు.

చాలాకాలం స్థిరమైన జడత్వం భ్రమ కాలుగా ఉన్న వాటిని వ్యవస్థ అనడం జరిగింది. అది పితృస్వామిక వ్యవస్థ మాతృస్వామిక వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థ ఇవన్నీ కూడా జడత్వ భ్రమకాలే పితృస్వామిక వ్యవస్థ జడత్వంలో పెట్టుబడిదారీ వ్యవస్థ జడత్వం ప్రవేశించి దానిని పెట్టుబడిదారి జడత్వ భ్రమక పితృస్వామిక వ్యవస్థగా మార్చింది. ఇందులో ఫైనాన్షియల్, క్యాపిటల్ ,టెక్నాలజీ దోపిడి రూపాల్లో జీవన అవసరాలుగా అవసరమైన సంస్కృతిగా జీవన అవసరాలుగా రూపుదిద్దుకోవడం జరిగింది. పీడిత కులస్తులు చేసే చలన క్రమాలు అగ్రకుల జడత్వాన్ని వదిలించి కొంతకాలం పాటు అస్తవ్యస్తం

చేశాయి. ఒకే రకమైన విధానాన్ని యుగయుగాలుగా పాటించడమనే ఈ విషయంలో పీడిత ఇతర కులాలు తీవ్రంగా తమ నిరసనలు తెలియజేశాయి. ఉదాహరణకు తాము ఎంతో కాలంగా అగ్రవర్ణాల వారి వస్త్రాలను శుద్ధి చేయడం జరుగుతుంది. అయితే ఇప్పటికీ అదే పనిలో ఉండడమే జరుగుతుంది తప్ప (పల్లకిని బోయలు మోసినట్లుగా) ఏనాడు ఈ పీడిత కులాల బట్టలను అగ్రవర్ణాలవారు ఉతికే స్థాయి ఏ కాలంలో ఎప్పటికీ కనిపించలేదు. దీనిమీద బహుజన తాత్విక వేదిక మరింత కొత్త ఆలోచనలతో 1980లో కుల నిర్మూలన స్త్రీ విముక్తి అనే వాదాలకు అవకాశాన్ని ఇచ్చింది.

అయితే ఈ పోరాటాల చరిత్రలో ఇదే కాలంలో ప్రారంభమయ్యాయని చెప్పడం ఒక కోణంలో మాత్రమే సబబు అనిపించుకుంటుంది. మరో కోణంలో ఆలోచిస్తే దీని తాలూకు బీజాలు 1847 నుండే(కమ్యూనిస్టు మానిఫెస్టో ఏర్పడడానికి కొద్ది నెలల ముందు) ఏర్పడ్డాయి అన్న విషయం చాలామంది అగ్రవర్ణాల మేధావివర్గం కనిపెట్టలేక పోయింది. సమస్త రంగాల్లో తాత్విక ఆచరణలో నేడున్న అగ్రకులాల పురుషుల ఆధిపత్య స్థానంలో పీడిత, కులాల, లింగాల, జాతుల, మతాలు ఆదిక్యతలోకి వస్తే మార్క్సిజం కూడా మారుతుంది. అందుకని వర్తమాన సమస్యల్లోని పరిష్కారాలను వర్త మానం లోపలే వెతకాలి. కుల నిర్మూలనకు ప్రాతిపదిక అగ్ర కులాలపై వ్యతిరేకత అణగారిన కుల ప్రాతిపదిక నుంచే ఉత్పన్నమవుతుంది. పితృస్వామిక నిర్మూలన కూడా స్త్రీవాద ప్రాతిపదిక నుంచే ఉత్పన్నమవుతుందనే కొత్త ఆలోచనలు రూపుదిద్దుకున్నాయి.

ఈ విధంగా అగ్రవర్ణాల వారు తమవిగా చెప్పు కుంటూ ప్రసార మాధ్యమాలలో జానపద కళాకారులు కులాల పరంగా పైకి రానివ్వకుండా వారిది కేవలం రాళ్ళెత్తిన కూలీల పాత్రగానే రికార్డు చేయడం జరిగింది. గొల్ల సుద్దులు భామాకలాపం అయింది వీటిపై ఎంతో అవగాహనతో లోతులకు వెళ్లి తెలంగాణ ప్రాంతంలో ఈ కళాకారుల సంబంధించిన కళా ప్రక్రియలు ఏవిధంగా వాటి బాణీని సంతరించుకున్నాయో ప్రజలకు తెలియ జేయడంలో అకాడమిక్ స్థాయిలో బిరుదురాజురామ రాజు, యశోదరెడ్డి, గంగాధరం, తిరుమల రావు, రుక్నుద్దీన్, నరసయ్య వంటి వారు ఎంతో శ్రద్ధతో రేబవలు శ్రమించి కనుమరుగైన పాత విషయాలను సోదా హరణలతో వెలుగుచేసే ప్రయత్నం చేశారు. వీరబ్రహ్మం, వేమన, కబీర, కాళోజీ లా సమాజంలోని అన్యాయాలను చీల్చి చండాడుతూ కమ్యూనిస్టులు పుట్టకముందే దున్నే వాడిదే భూమి అని పాటలు రాసి దొరల గడిల ముందు గుర్రం పై నిలబడి సవాల్ విసురుతూ తత్వాలు పాడి పల్లె పల్లెల్లో ప్రచారం చేసిన రామ నరసింహ కవి (రాఘవపట్నం వాసి) ఇతర ప్రాంతాల వారికి తెలియనట్లే ఈ ప్రాంతం వారికి కూడా తెలియకుండా పోయాడు.

పేదరికం నిరుద్యోగం చిన్నకులం, చిన్నవృత్తుల్లో, చిన్నకమతాల్లో, చిన్నఊర్లో ఉండటం అనేది వెనుక బాటుతనానికి కారణాల అని పరిశీలించినప్పుడు ప్రాచీన కాలంలో ఇది ఒక పెద్ద కారణమైతే ఇంతకంటే తక్కువ ఆర్థిక సాంఘిక స్థితిలో గ్రామాలను సస్యశ్యామలం చేసే పంటలు జానపద కళారూపాలు కళలు అందులోని సాహిత్యం సంగీతం ఎలా వృద్ధి చెందగలిగిందనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతుంది. అయితే దీనికి ప్రధాన కారణం ఆలోచించినప్పుడు పైన పేర్కొన్న కళలు కళాకారులు బహుజన వర్గంలోని వారు అవ్వడం వల్ల ఈ సోకాల్డ్ ఆధునిక సాహిత్యంలో వారు వెనుకబాటు తనానికి లోనయ్యారు. ఆ మాటకొస్తే జానపద సమాజం నుండే కదా ఆధునిక సమాజం పరిణామం చెందింది. ఇవి కొన్ని రాజకీయ పార్టీలు గుర్తించలేక పోయాయి. కాగా పోగ వారు అంతగా చేయూతను కూడా ఇవ్వలేదు. అగ్రకులాలు పాత కులవృత్తుల కే పరిమితమై ఉంటే ఎంతో బాగుండేది. దానివల్ల జానపద కులాలు ఎదిగి సాఫీగా నిరంతరం సాగి ఆధునిక అభివృద్ధి ఫలాలు బహుజన కులాల్లో ఒకటైన శూద్ర అది శూద్ర కులాల హక్కుభుక్తలై ఉండేవి.

ఈ విషయాలన్నీ పసిగట్టి కందుకూరి, రామరామ స్వామి, కట్టమంచి, శ్రీపాద తమ తమ కులాలను మేల్కొలిపి ఆధునిక అభివృద్ధి వెంట ప్రయాణం చేసేలా చేశారు. ఇప్పటివరకు రాసిందంతా ఇతర దృక్పథాలతో నిండి ఉన్నదే. బహుజనులపై అగ్రవర్ణాల ఆధిపత్యం వారి అణచివేత కొనసాగడానికి దోహదపడిన అంశాలను తెలియజేసే విధానం మాత్రమే జరిగింది. స్వీయానుభవాలను చిత్రించడానికి నిబద్ధత నిమగ్నత అవసరం లేదు. అభ్యాసం ఆత్మవిశ్వాసం ఉంటే చాలు. ఈ లక్ష్యంతోనే అంబేద్కరిజం ప్రాతిపదికగా 1992లో సమస్త వర్ణ, వర్గ, కుల, మత, ప్రాంత, దేశ, భాష, విచక్షణలకు అసమానతలకు వ్యతిరేకంగా దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక ఏర్పడింది. ఇది సామాజిక న్యాయం మార్పు లక్ష్యంగా ప్రజల జీవన ప్రమాణాలు సంస్కృతి ఉన్నతి కోసం కృషి చేస్తూ సాహిత్య కళా రూపాలలోనూ తాత్వికరంగంలోనూ శ్రమిస్తోంది. ఈ సంస్థ కోట్లాది బహుజనులో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. వేలాది రచయితలకు కళాకారులకు మార్గదర్శనం చేసింది. దళిత బహుజన దృక్పథాన్ని సాహిత్యాన్ని విస్తృతం చేసి తెలుగు సాహిత్య చరిత్రకు ఒక కొత్త పరిణామాన్ని అందించింది. అనిశెట్టి ప్రభాకర్, సాహూ, చక్రవేణులు గతించాక బహుజన సాహిత్యంను తిరిగి బతికించిన వారు సీతారాములు, రామలక్ష్మణ్, ఏడ్లూరి సుధాకర్, కొలకలూరి ఇనాక్, బోయ జంగయ్య, పి.సి రాములు డా. దామెర్ల రాములు, కలేకూరి ప్రసాద్, ఆకుల గంగాధర్, బి ఎస్ రాములు, కంచ ఐలయ్య, మాస్టర్జీ, పులి గోవర్ధన్, కడలి సత్యనారాయణ మూర్తి, శివ సాగర్, జూలూరి గౌరీశంకర్, జి. లక్ష్మి నరసయ్య, సూర్య, దార్ల రామచంద్రం వంటి రచయితలకు జవసత్వాలను ఇచ్చింది. సమాజంలో ఉద్యమాలు భావజాల చర్చ జరుగుతున్న నాటినుండి వాటిలో వచ్చిన మార్పుల అన్నింటిని కూడా ఆయా బహుజన రచయితలు గళం విప్పి తెలియజేశారు. కేవలం కవిత్వ రూపంలోనే కాకుండా కథల ప్రక్రియలో కూడా ఇది చోటు చేసుకుని ఎన్నో కొత్త విషయాలను తెలియ జేసాయి. ''ఎద్దుల కాడి మోయాలని దు దున్నల్లా దున్నాలని'', పని పాటలు నేర్చుకోవాలని అగ్రకులాల వారికి హెచ్చరికలు చేశాయి. మా కోసం మీరు రాసే రాతలన్నీ కేవలం గట్టు మీద ఉండి రాసినవి గానే ఉన్నాయి తప్ప అందులో అనుభవాలకు అనుభవించటానికి ఏమీ కనిపించడం లేదు. అదే మేము పుట్టిన నాటి నుండి పొందినటువంటి చేదు అనుభవాలు మా ఆర్తి మా గోస కూటికోసం, నీటి కోసం పుట్టిన నాటి నుంచి పడ్డ అగచాట్లు అన్నీ కూడా మా చేత కలం పట్టిస్తున్నాయి. మా కన్నీళ్లు సిరాగా మారి అక్షరాలై అనంతంలో మేమేమిటో మా సత్తా ఏమిటో తెలియజేస్తున్నాయన్న వాదంతో బహుజనుల సాహిత్యంలో రచయితలు ఎందరో ఆవేశంగా తమ గళాలను విప్పారు. కలంలకు పదును పెట్టారు. గ్రంథాలు రాశులుగా వచ్చాయి వాసిగా ఆలోచనలు పెరిగాయి మాది మనది అనే భావన ఒక కొత్త నినాదంగా చోటు చేసుకోవడం జరిగింది.

పూలే, బుద్ధుడు, నానక్, కబీర్, నారాయణగురు, అంబేద్కర్ తాత్విక వాద భూమికతో చరిత్రను తిరగ రాస్తాం. చారిత్రక చోదక శక్తులుగ ముందుకు నడుస్తాం. మాది నడిచే బండి.దీనితో కలిసి నడవాలంటే ఈ నాటి చారిత్రక దశల కొత్త శక్తులు లేవనెత్తుతున్న ప్రశ్నలకు నాన్చకుండా సమాధానాలు తెలుసుకోవలసిన అవసరం ఉందనే నినాదంతో దలిత బహుజన సాహిత్య వేత్తలు ఎంతో కృషి చేశారు.

ఈ విధంగా పై విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని సమాజ చైతన్యానికి సాహిత్యం ఒక వాహికగా భావ ప్రసారానికి వారధిగా కవిత్వం రాజాశ్రయాల నుంచి ఉద్యమ నేపథ్యం నుంచి తర్క వితర్కాల బేరీజుతో 1980 దాకా ఒక వాదానికి ప్రతినిధిగా భాసిల్లింది.అయితే పరిణామశీలమైన కవిత్వం వివిధ రూపాలను సంతరించుకున్నట్లు అనేక ఉద్యమాలు తెలియజేశాయి. తెలంగాణ కవులు ఈ ఫలితాలను అన్ని సందర్భాల్లో

బలంగా పట్టించుకున్నారు.వీరిపై సామాజిక ముద్ర తప్ప ఇతరుల ప్రభావం ఏ మాత్రం కనిపించదు. ప్రత్యేకంగా చెప్పాలంటే అది ఒక స్వేచ్ఛా విహంగం.దానిదొక డైనమిక్ వ్యక్తిత్వం.'' జీవితంలో ఒత్తిళ్లను పట్టించుకున్న వాడే నిజమైన కవి'' అన్న నందిని సిద్ధారెడ్డి భావజాలాన్ని తమ మార్గంగా బహుజన సమాజ కర్తలు నిర్దేశించుకున్నారు. తెలంగాణ కవులు ప్రజల బలమైన ఆకాంక్షకు పునాది రాళ్లుగా సంఘర్షణలతో ప్రజల పక్షాన వారి కవిత్వాన్ని ప్రతిఫలింప చేశారు. ఇదే ప్రపంచ సాహిత్య చరిత్రలో తెలంగాణ బహుజన కవిత్వం ఒక ప్రత్యేక స్థానం నిలుపు కోవడానికి దోహదపడిందనే విషయం కూడా మనకు అవగతమవుతుంది.

తెలంగాణ కవులు ప్రపంచీకరణ నేపథ్యంలో దళితుల పట్ల వివక్ష, స్త్రీ స్వావలంబన, ముస్లిం మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం వారి కవిత్వాన్ని బలంగా వినిపిస్తున్నారు. వీరిలో బన్న ఐలయ్య, జూపాక సుభద్ర, అనిశెట్టి రజిత, నెల్లుట్ల రమాదేవి, షాజహాన్ తదితరులంతా దళిత, స్త్రీవాద, మైనారిటీ వాద, బహుజన వాద కవిత్వాలను సామాజిక మూలాలోంచి వినిపిస్తున్నారు. దళిత మ్యాని ఫెస్టో రచించ గలిగిన సత్తా సలంద్ర రచనలు బలంగా కనిపిస్తుంది.'' ఎవడి హక్కుల పక్క రా ఈ నేల ''అని తీవ్రంగా ప్రశ్నించే సంయమన ధోరణి అసమాన సమాజంలో హెచ్చుతగ్గులు పోవాలనే ఆకాంక్షతో గళం విప్పిన వాడు బన్న అయిలయ్య దలిత బహుజన తెలంగాణ పక్షపాతి.

''కొంగు నడుముకు చుట్టి కొడవలై లేచిన మల్లు స్వరాజ్యంను అడుగు పుట్టిన పసికందును గోండుల గుడిసె అందించి దళంలో కదిలి వెళ్ళిన వీరమాత కమలమ్మని అడుగు'' అంటూ సలాం దొర సలాం కవితలో ఆచార్య ఎస్ వి సత్యనారాయణ తెలంగాణ పోరాట అస్తిత్వాన్ని వ్యక్తం చేశారు.

తెలంగాణ బహుజన సాహిత్యంలో పీడిత బలహీన వర్గాలు, నిమ్నకులాల జాతులు మైనారిటీలు, స్త్రీ, దళిత వాదములు వినిపించేటట్లు రచయితలు కవులు కళా కారులు తమ కలంతో గళం విప్పుతు బహుజన సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ తమ అస్తిత్వాన్ని నిలుపు కొనుటకు సాహిత్య సూరులుగా ఆధునిక రచయితలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. దేవరాజు మహారాజు అవరణం, సాహితీ స్వర్ణోత్సవ వ్యాసావళి.
2. తెలంగాణ చరిత్ర సంస్కృతి జీవనం -మలయశ్రీ
3. తెలంగాణ ఉద్యమాల పాట -సాహిత్య వ్యాసాలు.సి .కాశీం
4. దళిత కథానిక -పరామర్శ. డా? కే.లక్ష్మీనారాయణ
5. కాలువ మల్లయ్య కథలు తెలంగాణ జన జీవితం. బన్న ఐలయ్య
6. తెలుగు వచన కవిత? తెలంగాణ ప్రాంతీయ స్పృహ. మైనం గీతావాణి
7. గుడిసె గుండె వచన కవితా సంపుటి.దేవరాజు మహారాజు
8. దళిత బహుజన సాహితీవేత్తలు. బి.ఎస్.రాములు
9. సమగ్ర సామాజిక కథ తాత్విక భూమిక. బి.ఎస్.రాములు
10. వ్యాస భారతి డా?రావి భారతి సాహిత్య వ్యాసాలు.
11. తెలంగాణ దీపస్తంభం. డాక్టర్ జలంధర్ రెడ్డి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రాయలసీమ కరువు – సాహిత్య ప్రస్థానం

– డా॥. జి. రఘకుమార్, సహాయ ఆచార్యులు, తెలుగు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఒంగోలు.

'కరువు' అంటే కాటకం, క్షామం, ఎద్దడి అనే నిఘంటు అర్థాలున్నాయి. రాయలసీమ ప్రాంతానికి 'కరువు' అనుకోని అతిథేమీ కాదు. ఇది నిత్యం వాడుకలో ఉండే పదం. విజయనగర సామ్రాజ్యం పతనమైన కొద్ది కాలంలోనే రాయలసీమ ప్రాభవం తరిగి "రాళ్ళసీమ" అంటూ పిలువబడుతూ హేళనకు గురౌతుంది. అనాధిగా రాయలసీమ ప్రజాపీడనానికి గురై విజయ నగరపు రాజుల నుండి మైసూరు రాజుకు, మైసూరు రాజు నుండి నిజాంకు హస్తగతమై కాంతిహీనమై పోయింది. చివరకు నిజాం రాజుల నుండి కుంపిణీ వారికి దత్తత కావడంతో ఈ ప్రాంతం 'దత్తమండలాలు' పేరుతో కొంత కాలం పిలుస్తూ, ప్రస్తుతం అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలను 'రాయలసీమ' ప్రాంతంగా వ్యవహరిస్తున్నారు.

రాయలసీమ వైశాల్యం 67,400 చ.కి.మీ. ఈ ప్రాంతంలో సారవంతమైన భూమితోపాటు నల్లరేగడి, మంచి సత్తువైన ఎర్రనేలలూ ఉన్నాయి. ఆహారపంటలకే కాక, పండ్లతోటలకు కూడా అనువైన ప్రదేశాలు అధికంగా ఉన్నాయి. పశుసంపద అభివృద్ధికి తగిన వసతులు కూడా ఉన్నాయి. పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలు విరివిగా లభిస్తున్నాయి. ఖాదీ ఉత్పత్తి, నూలు మగ్గాలు వేనకు వేలు రాయలసీమ గ్రామాలలో ఉన్నాయి. ఇన్ని వనరులు కలిగి ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతం కరువు కాటకాలకు నిలయంగా మారింది. ప్రజల దౌర్భాగ్యమో, పాలకుల ఉదాశీనతో బ్రిటీషు పాలనా చరిత్ర మాత్రం కేవలం ఒక పెద్ద కాటకపు గాథ. "కంపెనీ పాలన కింద ఉన్న ప్రాంతాలన్నింటిలో దత్తమండలాల ప్రజలే కడుబీదవారని" మన్రో అన్నాడంటే రాయలసీమ రైతుల కష్టాలు, కరువులు ఏ విధంగా ఉన్నాయో మనం అర్థం చేసుకోవచ్చు.

విజయనగరాన్ని అచ్యుతదేవరాయలు నామ మాత్రంగా పరిపాలన కొనసాగిస్తున్న కాలంలో క్రీ.శ. 1540 ప్రాంతంలో భయంకరమైన కరువు వచ్చిందనీ, రాయల సీమ ప్రాంతం చాలా వరకు ఆ కరువుతో నకనకలాడి పోయిందనీ, 2/3 వంతు జనం ఆకలితో చనిపోయారని కొందరు నరమాంస భక్షణకు కూడా సందేహించలేదని జొనేదోకాస్ట్రో అన్న పోర్చుగీసు యాత్రికుడు రాశాడు. రాయలసీమలో వచ్చిన కరువుల్ని, వాటి ఆధారంగా వచ్చిన సాహిత్య ప్రస్థానాన్ని వివరించడమే ఈ పత్ర ఉద్దేశం.

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో రుతు వర్ణనలో రాయలసీమ జీవన నేపథ్యాన్ని చిత్రించాడు. అష్టదిగ్గజ కవుల్లో ఒకడైన ధూర్జటి సీమ కరువును వాస్తవికంగా చిత్రించాడు. వర్షాభావం వల్ల దేశం కరువుతో నిరస్తనన్యమైపోయింది. ప్రజలు తిండి దొరక్క గునుగులూ, ఊదరులూ, వెదురుబియ్యం, గొట్టెచెట్లు, తుంగగడ్డలు, ఈతగుజ్జులు మొదలైన వాటిని తిన్నారని ఆయన వర్ణించాడు.

ఆ క్షామ ప్రభావం -

"తోలును నెమ్ములు నిగిలి త్రోసిన దొంబదిచోట్ల గూలు వా
రాలిని బిడ్డల న్విడిచి యాకటి చిచ్చున వెచ్చపోవు వా
రేలికబంటు వాసి యొకయించుక లేక కృశించు వారునై
తూలె జనంబు మీనశని దోషముదాకి నిరస్తసస్యమై"

(శ్రీకాళ: 3-153)

కరువుపీడిత ప్రజలకు చర్మం, ఎముకలు మాత్రం మిగిలాయి. తోస్తే తొంబై చోట్ల పడుతున్నారు. ఆకలి బాధ భరించలేక పెళ్ళాంబిడ్డల్ని వదిలి వలసవెళ్ళి పోతున్నారని ధూర్జటి హృదయ విదారకంగా దృశ్య సాక్షాత్కార పద్ధతిలో మనకళ్ళ ముందు సన్నివేషాలను నిలిపాడు.

19వ శతాబ్దిలో 1804, 24, 33, 49, 64, 66 సం॥రాలలో గొప్ప కరువులు సంభవించాయి. 1878-79 సం॥లో అతి భయంకరమైన కరువులో ఆకలి మరణాలు చూసి బ్రిటీషు పాలకులు చలించిపోయారు. దీన్ని పెద్దకరువు, ధాతుకరువు, డొక్కల కరువు, ముష్టికరువు, వలసకరువు, దూబకరువుగా రకరకాల పేర్లు ఉన్నాయి. 16% మంది ప్రజలు ఈ కరువు కాలంలో చనిపోయినట్లుగా బ్రిటీషు ప్రభుత్వ రికార్డులు తెలుపుతున్నాయి. ప్రభుత్వం అనేక సర్వేలు చేయించగా అందులో రాయల సీమలో కొన్ని ప్రాంతాలు ఎడారిగా మారిపోయే ప్రమాద మున్నదని తెలిసింది. 1890, 96, 1900, 1920-21, 1924-25, 1934-35, 1937, 38, 1941, 42, 1945, 46, 1950, 53, 1958, 59, 1966, 68, 1983, 84 సం॥రాలలో కూడా రాయలసీమపై కరువు ప్రభావం తీవ్రంగా పడింది.

1901-1903 వరకు పనిచేసిన "ఇండియన్ ఇరిగేషన్ కమిటి" కర్నూలు, బళ్ళారి, అనంతపురం, కడప జిల్లాలకు కరువు బారి నుండి ప్రజలకు రక్షణ లేదని చెబుతూ గత శతాబ్దకాలంలో ఈ జిల్లాలో పెక్కు పర్యాయాలు ప్రజలు ఇలాంటి బాధకు గురైనారని తెలిపారు. క్షామం, దుర్భిక్షం దుష్ఫలితాల నుండి ఈ ప్రాంతం ఇప్పుడిప్పుడే కోలుకోలేదనీ, 19వ శతాబ్ది వరకు కరువు 6 సంవత్సరాల కొకసారి రాగా 20వ శతాబ్దంలో కరువు, దుర్భిక్షం ప్రతి 2 సం॥రాలకు లేదా 3 సం॥రాలకు ఒక పర్యాయం వచ్చిందని వారి సర్వే నివేదికలు స్పష్టం చేశాయి.

1942 సం॥లో వాయువ్య, ఈశాన్య ఋతుపవనాలు సకాలంలో వర్షాలు కురిపించక ఈ జిల్లాలో విపరీతమైన కరువు సంభవించింది. సుమారు 20 లక్షల మంది ప్రజలు ఈ కరువు కోరల్లో చిక్కుకొని తీవ్ర క్షోభకు లోనయ్యారు. 4 లక్షల మంది నామమాత్రపు క్షామసహాయం పొంది నట్లు ప్రభుత్వ రికార్డుల ద్వారా తెలుస్తుంది.

రాయలసీమలో 1952 సం॥లో తీవ్ర కరువు వచ్చింది. కొన్ని వందల మంది ప్రజలు మరణించారు. గ్రుక్కెడు గంజికోసం గంజికేంద్రాలలో ప్రజలు పడిగాపులు కాచేవారు. పశువులు తాగడానికి నీరులేక పశుగ్రాసం లేక మరణించినట్లు తెలుస్తుంది. రైతు పొట్టకూటికి ఇల్లాలి పుస్తెలను సైతం తెగమనమ్మిన చరిత్ర ఈ కరువుకు ఉంది.

ఇంతటి కరువు ప్రాంతమైన రాయలసీమకు ప్రభుత్వాలు ఏమీ చేయలేదా? అని ప్రశ్నిస్తే, కమిటీలు - సర్వేలు రూపంలో కాలయాపన చేసిందే, కానీ శాశ్వత కరువు నివారణ మార్గాన్ని మాత్రం చూపలేకపోయింది. 1800 నాటి క్షామ విచారణ సంఘం 'భారత ప్రజలు దరిద్రానికి, కరవు కాటకాదుల్తో నానాబాధలకు గురి కావటానికి మూలకారణం ప్రజాకోటి కంతటికి ప్రధాన వృత్తి వ్యవసాయం కావటమే"నని తేల్చింది. ఇది నిజం. నేడు వ్యవసాయం జూదం లాగా తయారయ్యింది.

1901 భారతదేశ నీటి పారుదల కమిటీ సర్‌కాలిన్ స్కాట్ అధ్యక్షతన ఒక రిపోర్టు తయారు చేసి "రాయల సీమను కరువుల బారి నుండి రక్షించటం జాతివిధి" అని పేర్కొన్నది.

1938 సం॥లో మద్రాసు ప్రభుత్వం 'క్షామ నివారణ చట్ట పరిశీలన సంఘం' ఏర్పాటు చేసింది. వీరి సలహా లను దత్తమండల జిల్లాలన్నింటిలో ఆచరణలో పెట్టేం దుకు ప్రభుత్వం 1941 సం॥లో "దత్తమండల ఆర్థికాభి వృద్ధి సంఘం" అనే సంఘాన్ని ఐదు సంవత్సరాల కాల పరిమితిలో ఏర్పాటు చేశారు. ఇది కేవలం ఒక సలహా సంఘం మాత్రమే కావడంతో దీని ద్వారా ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఆ తర్వాత 1949 సం॥లో ఈ సంఘాన్ని రద్దు చేసి 'రాయలసీమ అభ్యున్నతి సంఘం' పేరుతో నూతన సంస్థను స్థాపించి డెవలప్‌మెంట్ కమీషన్ పేరిట ఒక ఉద్యోగిని 2 సం॥ల కాలపరిమితితో నియామకం చేశారు. ఈ సంఘం నాలుగు సమావేశాలు జరిపింది. ఫలితం మాత్రం శూన్యం.

కరువు నివారణ చర్యలు ప్రభుత్వాలే కాక సమాజ పౌరులందరి సహాయ సహకారంతో నివారణ మార్గాల్ని

రూపొందించుకొని అమలు చేస్తే కరువు కొంత వరకైనా తగ్గితే ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో జీవనం కొనసాగిస్తారని పలువురి అభిప్రాయం.

రాయలసీమ సాహిత్యం - కరువు ప్రస్థాన :

"క్షామము దాపురించి పలుమారులు చచ్చెను జంతు సంతతుల్
వేమరు చచ్చినారు ప్రజ వేనకువేలు చరిత్ర లోపలన్
క్షామము లెన్ని వచ్చిన రసజ్ఞత మాత్రము చావలేదు జ్ఞా
నామృత వృష్టికిన్ కొరత నందని రాయలసీమ లోపలన్"
అన్న

నండూరి రామకృష్ణమాచార్యుల మాటలు వాస్తవం. సీమ చరిత్రలో ఎన్ని కరువులు వచ్చినా, ఎన్ని కష్టాలు చవిచూసినా కవులు, కళాకారులు తమ కళలను మరింత పదునెక్కించారే కాని కలాన్ని విడనాడలేదు. రాయలసీమ ప్రాంత కరువును చూసి చలించిన బైరపురెడ్డి నారాయణరెడ్డి 'రాయలసీమరైతు' కావ్యంలో కరువును గురించి చెబుతూ "తన 50 సం॥ల అనుభవంలో సమృద్ధిగా పంటలు పండిన కాలాన్ని చూడలేదని, 1952 సం॥లో సంభవించిన కరువు బీభత్సదృశ్యాలింకా ఆయన మదిలో మెదలుతూనే ఉన్నాయని అనాటి విషాద అనుభవాలే ఈ కావ్యానికి ప్రేరణ నిచ్చిందని" చెప్పారు. కరువు మీద రాయలసీమ రైతు అనే సంపూర్ణ పద్యకావ్యాన్ని రాశాడు. 1955లో రచించిన 1976లో ప్రచురించినాడు. వీరు స్వయంగా రైతు. రైతు పడే బాధల్ని కళ్ళకట్టినట్లు ఈ కావ్యంలో పద్యాలు రచించాడు. కడప జిల్లా రాయచోటి తాలూక బహుదానది తీరంలోని ఒక చిన్న పల్లె కథాస్థలం. కరువులో మూగజీవుల ఆవేదనను

కసవు పొసగదు, నీరైన నొసగలేక
మేపనడవికి తోలిన గోపవరుల
కనుగొలంకుల జొచ్చిన కరుణ జలము
గ్రోలగను జూచినట్లుండె గోచయంబు

వ్యవసాయ కూలీలకు పనులు లేవు. పశువులకు పచ్చగడ్డి లేదు. దాహం తీర్చడానికి నీటిచుక్క లేదు. ఆమూగ జీవుల బాధను హృదయ విదారకంగా చిత్రించాడు.

బెళ్ళూరి శ్రీనివాసమూర్తి 'తపోవనం' అనే ఖండకావ్యాన్ని రచించారు. ఇందులో రాయలసీమ గొప్పదనాన్ని వర్ణిస్తూ -

'ఏతాపస్వి జేవించెనోయీ మనోజ్ఞ
సీమ పూజ్యమౌరాయలసీమలోన
నాటి ఋషి వాటికల శోభనందపరచు
ప్రకృతి మాధుర్యమొలకు మాపల్లెలిచట అన్న
నోటితోనే
కనుదోయి గంజి కేంద్రమిటులోకర్ణింపు డాక్రందన
ధ్వని హస్తంబులు మట్టి పాత్రలు వహింపన్ దీన
భావంబు లా
నన సీమన్ రహియింపగా ముసురుచున్నారెంత దారిద్ర్య మీ
జనతన్ మ్రింగగ వేచియున్నది దుష్కాలంబు
ప్రాప్తింగన్"

అంటూ జీవిత వాస్తవాన్ని చెప్పారు, కరువులో ప్రజల ఆక్రందనల్ని కళ్ళకు ప్రత్యక్ష. మయ్యే దృశ్యాల్ని బాధాతప్త హృదయంతో కవి తన భావాల్ని వ్యక్తం చేశాడు.

వై.సి.వి.రెడ్డి 'సందేశం' ఖండ కావ్యంలో రైతు జీవితాన్ని చక్కగా వర్ణించాడు.

రాత్రిదినములుబని చేయు - రైతువేట
కొండకోనలదిరుగాడు - కూలివెంట
గడుపుమంటకు గష్టించు - బడుగువెంట
దేవుడొక్కడే వెన్నంటి - తిరుగునంట

రాయలసీమ కరువు కళ్ళకు కట్టినట్లు చిత్రించిన కవి విద్వాన్ విశ్వం వీరి 'పెన్నేటి పాట'లో రాయలసీమ కన్నీటి గాథ ఉంది. 1948-53 మధ్య పెన్నానదీ తీరం కరువుతో బాధపడ్డ తీరును కథారూపంలో చిత్రించింది ఈ కావ్యం. రాయలసీమ ఎడారిగా మారిన దృశ్యాన్ని..

"నాగ కన్యలిచట కన్పడరు గాని । నాగు బాములు
చకచక సాగునిచట ॥

గరుడ గంధర్వ కామినుల్ కన్పడరు ఁని । బొంత
గద్దలు గుంపు గట్టు నిచట ॥ అంటారు.

కరువు ప్రభావాన్ని హేతుబద్ధంగా చిత్రిస్తూ

"దైవమా ఉంటివా? చచ్చినావ నీవు? ధర్మమా
గెంటిరా? నిన్ను ధరణి నుంచి
హృదయమా మానవుడు నిన్ బహిష్కరించె"

అని ఆక్రోశిస్తాడు.

పుట్టపర్తి నారాయణ చార్యులు 'మేఘదూతం' కావ్యంలో కరువును ప్రస్థావించారు.

"... యిక నేడు । క్షామ పీడితమైన గాత్రములు వణకాడ
నీమొగము వీక్షింతు! తెనుగు ప్రజ"

అని మేఘునితో చెప్పారు.

పాలా వెంకటసుబ్బయ్య 'అనిల సందేశం' రాయల సీమ కరువుకు అద్దం పట్టిన కావ్యం. దీని కావ్య శిల్పం కూడా పుట్టపర్తి వారి 'మేఘదూతము'లోనిదే. ఈ కావ్యంలో కథానాయిక భూదేవి. నాయకుడు మేఘుడు. వార్తాహరుడు వాయుదేవుడు. భూదేవి రాయలసీమ కరువు పరిస్థితులను తెలియజేస్తూ భర్తయిన మేఘునికి వాయువు ద్వారా సందేశం పంపుతుంది.

"కోటానుకోట్లు నీకొమరులు నిలువున । గూలిపోయి
రనుమ, కూడులేక ॥
లక్షోప లక్షలు భిక్షాధికారులై । దుఃఖాన గుమలుచు
దూలిరనుమ ॥
వేలకు వేలు వస్త్రాలకు హీనులై । చింపి పాతలనై
కైసేసి రనుమ ॥
పచ్చని వల్వ నిప్పచ్చరంబున నీదు । దయితయు
మాలిన్యదామయనుమ"

రాయలసీమ జీవితంలోని విషాదాన్ని చిత్రించాడు కవి.

కరువులో రాయలసీమ జీవితాన్ని చిత్రించిన దీర్ఘ కావ్యాలు, కవిత్వాలను కూడా రాశారు. వారిలో పులికంటి కృష్ణారెడ్డి, శాంతి నారాయణ, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, గోపీని కరుణాకరన్, రఘుబాబు, నాగప్పగారి సుందర రాజు, రాప్తాడు గోపాల కృష్ణ మొదలైనవారు ముఖ్యులు.

రాయలసీమలో బతుకు శిథిలం కావటాన్ని గోపిని కరుణాకరన్ అభిప్రాయం ప్రకారం.

"సేద్యం జూదమైపోయింది
మీ అమ్మమెడలోని తాళిబొట్టుపసుపు కొమ్మయింది
నీ చెల్లెలి చెవుల్లోని కమ్మలు
జొన్న బెండులయ్యాయి"

మానవ సంబంధాలు తెగిపోవడానికి కరువే ప్రధాన కారణమని చెబుతారు.

కరువు మనుషుల్ని ఆకలితో మాడ్చడమే కాదు, జీవితం మీద ఎంత నైరాశ్యం కలిగిస్తుందో సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, రాచపాళెం వారి అభిప్రాయాల్ని వెల్లడించారు.

"ఈ సీమ ఎడారిగా మారినా బావుండు
రాని వసంతంకోసం ఎదురుచూస్తూ
క్షణక్షణం చావకుండా వుండేందుకు"

(సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి)

"మాకు కరువు చావు కన్నా
ఆకలి చావు కన్నా
వరద చావు ఎంతో సుఖమనిపిస్తుంది"

(రాచపాళెం)

రాయలసీమ ఎడారిగా మారే ప్రమాద ముందనీ, ఈ ప్రాంతానికి నీటి వసతి కల్పించడమొక్కటే ప్రత్యామ్నాయంగా భావించిన సర్ ఆర్థర్ కాటన్, కర్నల్ ఎల్లిస్, మెకంజీ వంటి బ్రిటీషు నిపుణులు సైతం ఈ ప్రాంత పరిస్థితిని అధ్యయనం చేసి కృష్ణా, తుంగభద్ర, పెన్నా జలాలను రాయలసీమకు మళ్ళించడం ద్వారా ప్రమాద నివారణకు పథకాలు రూపొందించారు. దీనిలో భాగంగానే కడప - కర్నూలు కాలువ 1890లో నిర్మించ బడింది. నేటికీ కరువు పరిస్థితిని కేంద్ర - రాష్ట్ర మంత్రులు,

నిపుణుల బృందం పరిశీలకులుగా రావడమనేది ఆన వాయితీగా మారింది. రాయలసీమకు శాశ్వత కరువు నివారణ చర్యలు సక్రమంగా అమలు జరిపేందుకు ప్రజలను చైతన్యపరచి పాలకుల కళ్ళు తెరిపించేందుకు కవులు కళాకారులు నడుం బిగించాలని ఈ సందర్భంలో వినమ్రంగా అర్థిస్తూ సెలవు.

ఆధార గ్రంథాలు :

1. వల్లంపాటి వెంకటసుబ్బయ్య : రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ
2. భూమన్ : చరిత్రలో రాయలసీమ
3. కొన్ని కావ్యాలు కొందరు కవులు : రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
4. సీమ గుండె చప్పుడు : కదలిక ప్రచురణ
5. రాయలసీమ రైతు : భైరపురెడ్డి నారాయణరెడ్డి
6. పెన్నేటి పాట : విద్వాన్ విశ్వం

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు సాహిత్యం – సామాజిక దృక్పథం

– డా॥. నూనె అంకమ్మరావు

మనిషి తాను సుఖంగా వుంటూ తక్కిన జీవులను సుఖంగా వుంచాలనే బాధ్యత గుర్తించిన వాడు. అందుకే మానవుడు సంఘజీవి. కవులు, రచయితలు సాధారణంగా తాము ఎంచుకునే వస్తువులన్నీ సమకాలీన సామాజిక స్పృహతో కూడినవి. తన చుట్టూ సామాజిక వాస్తవిక సంఘటనలకు కొంత కల్పనలను జోడించి తాను కోరుకునే సామాజిక చైతన్యమార్గాన్ని చూపిస్తూ కల్పనా సాహిత్యాన్ని నిర్మించడం జరుగుతుంది. సామాజిక స్పృహ, చైతన్యం అన్న అంశాలను దృష్టిలో ఉంచుకున్న రచయిత వాస్తవిక సంఘటనల సమాహారంగా రచన సాగిస్తాడు. కల్పనల విషయంలో వాస్తవికత దెబ్బతినకుండా రాయడం రచయిత నైపుణ్యం మీద ఆధారపడి ఉంటుంది. వాస్తవికత అన్న అంశాన్నే రియరిజమ్ అనే పదంతో వ్యవహరిస్తారు. వాస్తవిక జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రించడమే ''రియలిజమ్''.

''రియలిజంలో కల్పనకు ఊహకు తావుండదు. కంటికి కనిపించే జీవితం సాహిత్యంలో కళ్ళకు కట్టినట్లు రాయడమే వాస్తవికత''ని ఇనాక్ గారు వాస్తవికతను వివరించారు. వాస్తవికతే సామాజిక స్పృహ అన్న అంశాన్ని చాలామంది రచయితల ఏకీభవిస్తారు. ఎంతోమంది కవుల్ని, రచయితల్ని, సమాజమే తయారు చేస్తోంది. సమాజంలోని ఆకలిని, కరువును, కష్టాలను, కన్నీళ్ళను, మనుష్యుల మధ్య, మనుసుల మధ్య అంతరాల్ని, కుటుంబ విలువలను అనుభవపూర్వకంగా రచయితలే తెలుసుకుంటారు. ప్రతి కవి, రచయిత తాను అహరహరం సామాజిక జీవనని, సహజం లేనిదే తాను లేనని, ఉనికి భద్రత తన అభ్యుదయం సర్వస్వం సమాజ శ్రేయస్సు మీదే ఆధారపడి ఉంటాయని, అలాంటి శ్రేయస్సు చేకూర్చడానికి తాను కూడా ఒక సమిధిలా కాలుతూ నిరంతరం సమాజ సంబంధిత చైతన్యంతో జీవిస్తూ ఉద్ధత భావనలోనే నిమగ్నుడై రచన చేస్తాడు.

తెలుగు సాహిత్యంలో ''సామాజిక దృక్పథం'' అన్న మాట నేడు విస్తృతంగా ఉపయోగింపబడుతున్నది. రచయితగానీ, కవిగానీ తన అనుభవంలో ఉన్న సామాజిక స్పృహనుండి విశ్లేషించడం శాస్త్రీయ దృష్టి అనిపించి కుంటుంది. సమాజంలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎలా అధిరోహించాలన్న అవగాహనను కల్పించే ప్రయత్నాన్నే 'సామాజిక స్పృహ' అనవచ్చు. రచయిత తాను రాస్తున్న విషయాలలో సమాజంలో భిన్న వర్గాల మధ్య, భిన్న ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అలాంటి అంశాలను జోడించి రాయడమే, చైతన్యానికి ప్రధాన భూమిక. అదే సామాజిక స్పృహ. ఒకే అంశాన్ని పలువురు పలు రకాల కోణాలలో చర్చించవచ్చు, విశ్లేషించవచ్చు. ఏ అంశం అయితే ఎక్కువమంది మనసును ఆకట్టు కుంటుందో అదే మంచి రచన అవుతోంది. మంచి విశ్లేషణ కూడా అవుతోంది.

ప్రాచీన సాహిత్యంలో కానీ, ఆధునిక సాహిత్యంలో కానీ ఎంతోమంది సమాజ సంబంధమైన అంశాలను ఇతి వృత్తాలుగా ఎంచుకుని రచనలు చేశారు. సామాజిక సంఘటనలకు తగిన రసాలనీ, శబ్దాలనీ, గుణాలనీ, రీతులను, అలంకారాలను జోడించి చెప్పడమే సాహిత్య సాంప్రదాయమని నిర్వహించారు. సాహిత్యం, సామాజిక సంబంధమైనదే. సమాజాన్ని అవగాహన చేసుకోకపోతే సాహిత్యాన్ని సృజించడం కష్టసాధ్యం. లోకజ్ఞత, మానవుల విజ్ఞత, పరిపక్వదృష్టి, కరుణ, సత్యసంధత, ధీరత్వం మొదలైన లక్షణాలన్ని ఉపయోగించే రచయితలే సాహిత్యం యొక్క సిసలైన సామాజితకు ప్రతిరూపం. అలా రచించిబడిన సాహిత్యమే వింతల్ని చూపిస్తూ

నవ్విస్తోంది, విశేషాన్ని చూపిస్తూ కవ్విస్తోంది. విషయ సమస్యల్ని చూపిస్తూ ఏడిపిస్తోంది. నవ్వుల కంటతడి పెట్టించే సాహిత్యమే ఉత్తమ లక్షణంగా ఎక్కువమంది పాఠకులకు ఆమోదయోగ్యంగా ఉంటుంది.

మనిషికి సాటి మనిషితో ఎలాంటి సంబంధం బాంధవ్యాలుండాలో మనుస్మృతి మొదలు, మహాభారత, రామాయణాల వరకూ యెన్నో రీతుల చెబుతూనే వచ్చాయి. అలాగే తైత్తరీయ బ్రాహ్మణం, పద్మపురాణం లాంటి ప్రాచీన గ్రంథాలలో సామాజిక జీవనం యేవిధంగా వుండాలో ఎన్నో రీతులలో ప్రవచించడం చూడవచ్చు. మనమీనాడు ఒక మంత్రంగా భావిస్తున్న సామాజిక స్పృహ అన్న అంశం - యేనాడో కవులందరికీ సుపరిచిత మైనదేననీ కేవలం ఆధునిక భావజాలం కనిపెట్టిన అంశమేమాత్రమూ కాదని చెప్పటానికి ఎన్నెన్నో ఉదాహరణలు సంస్కృత సాహిత్యంలోనే కాక, ఇంకా ప్రాచీనమైన ప్రకృతి సాహిత్యంలోనూ కుప్పలు తెప్పలుగా కనిపిస్తాయి.

స్నేహమంటే పాలూ, నీళ్ళవలె ఉండాలి. అలా కలిసి పోయిన పాలను వేడి చేస్తే ముందుగా ఆవిరైపోయేదీ నీళ్ళేకదా! ఆపద సమయంలోను తానే ముందుగా దాన్ని యెదుర్కొని, తన మిత్రుణ్ణి రక్షించేవాడే, నిజమైన స్నేహితుడు. పదిమందికీ సాయపడని ధనవంతుడు వల్ల సమాజానికేమిటి లాభం. కవిదాన్ని తన భావనలో వివరిస్తూ తాటిచెట్టూ నీడనివ్వలేదు. దాని ఫలాలు అందనంత యెత్తులో ఉండటం వలన యెవరికీ ఉపయోగంలేదు. ఇకనీవెంత యెత్తైన దానివైనా లాభంలేదని చెప్తాడు. మనిషిలో దాగివున్న కోపమూ, అభిమానం, మాయ, లోభం - ఇవన్నీ దూరమైతే తప్ప అంతశ్శుద్ధి సాధ్యం కాదని చెప్తాడు హేమచంద్రుడు. హాలుడు సేకరించిన గాథా సప్తశతి కేవలం. శృంగార దర్పణం కాదని యీ సంకలనం సఫల సామాజిక దర్పణమని కూడా గుర్తించవలసిన అవసరాన్ని విశదపరచే గాథలు ఇందులో చాలానే ఉన్నాయి. "ఆచరించరు నీచమానవులు' అంటూ యేపనీ చేయక సోమరితనానికి అలవాటుపడినవారి గురించి చెప్పాలని తెలుగుకవి తన కలాన్ని సిద్ధం చేసుకోకముందే, యెన్నో శతాబ్దాలక్రితమే సోమరిపోతులను హెచ్చరించాడు తనదైన రీతిలో యీ ప్రాకృతకవి.

ఆదికవి వాల్మీకి విరచిత రామాయణం మనిషి సమాజంలో మెలగవలసిన తీరును గురించి పూసగుచ్చి నట్లు వివరిస్తుంది. ప్రాకృత సాహిత్యకాలం నాటి ఒక పల్లెటూళ్ల జరిగిన యీ సంఘటన యెంత సమాజంగా ఉందో గమనిస్తే తన మరిది దుశ్చేష్టలను కనిపెట్టిన వదినె, తన చిత్రశాలలో రామునిసేవలో తన్మయుడవు తున్న సౌమిత్రి పటాన్ని పదేపదే చూపుతున్నది. వదిన మరిదికి తనపై గల దురూహాను కనిపెట్టింది. కానీ పదిమందిముందు బయటపెడితే కుటుంబ గౌరవానికి తలవంపులన్న సంగతిని గుర్తుంచుకుని, అన్యాపదేశంగా మరిదికి రామలక్షణుల చిత్రపటాన్ని చూపుతూ 'నీవు ఇలాగే అన్నపెద్దరికాన్ని నిలుపవలెననీ, వదినెనైన నన్ను చెడుదృష్టితో చూడకూడదని చెబుతున్న దన్నమాట.

దధీచీ మహర్షి జనహితకోసం తనవెన్నెముకను త్యాగం చేశాడంటే అప్పటి త్యాగనిరతియెంత ఉన్నతమైనదో వూహించవచ్చు. మరి ఇప్పటి స్వార్థపూరిత వాతావరణమో? తరతరాల కోసం కూడా ధనాన్ని నల్లగా మార్చి మరీ గోనె సంచుల్లోనూ, నేలమాళిగల్లోనూ, వీలైతే ఇతర దేశాల రహస్య ఖాతాల్లోనూ భద్రపరిచే తెలివితేటలనేమనాలో అర్థంకాదు.

"తత్త్వము విచారించితి మేని చాదస్తముల
యంతస్తును దాటి లోతుకుదిగి
చూడగల్లుటయే ఉత్తమ సంస్కారమునకు గుర్తు
అట్లు చేయలేనిది వట్టిమైపూత"

అని ఉత్తమ సస్కారం ఎలా ఉండాలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారిలో దృష్టిలో తెలుస్తోంది. ఎవరి పని వారికి గొప్పదన్న సంగతి అర్థమవుంతుంది. మేం అంతనీ, ఇంతనీ వట్టి గొప్పలు, చెప్పటం కాదు చేసే పని త్రికరణశుద్ధిగా నిర్వర్తిస్తేచాలని ఉద్బోధించారు. మానవ సంబం

ధాలు రోజురోజుకూ మర్యాదహీనంగా, అస్తవ్యస్తం కావ డాన్ని శర్మగారు తప్పబట్టారు. మనిషి జీవితానికి శ్రద్ధ అనేది అత్యంత అవసరమని నొక్కి వక్కాణించారు.

క్షేత్రయ్య మానవతా దృష్టికోణాన్ని ఆవిష్కరించిన వ్యాసం "పదములు - క్షేత్రయ్య" సమాజంలో స్త్రీల అభి వృద్ధే నిజమైన సామాజిక ప్రగతికి మూలమని చెప్తారు. సంఘసంస్కరణ దృష్టిలో కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన కృషి సమాజానికి ఎంతో చైతన్యం, ఉ త్సాహాన్ని కలిగించాయి. ఏ రచయితలైనా, కవులైన సామాజిక దృక్పథం లేకుండా రచనలు చేయడం సాధ్యం కాదు. మాటలు నేర్చిన మానవుల్ని గూర్చి, వాళ్ళబాధల్ని గూర్చి రాయడమేకాదు, మాటలు రాని మూగజీవుల మనస్తత్వాన్ని కూడా ఎరిగిన వారు కవులు, రచయితలు.

విద్వాన్‌విశ్వం తాను రాసిన 'పెన్నేటిపాట'లో రాయల సీమ ప్రాంత దుస్థితిని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. రాయలసీమలో చెరువులు ఎండిపోవడం, వర్షాలు రాకపోవటం, అధికారులు నిర్లక్ష్యంగా పరిపాలించటం, ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తులై ఉండకపోవటం మరియు ఇక్కడ జనులు చదువు సంధ్యల లేక అనాగరికులుగా ఉండటంలాంటి ఎన్నో విషయాలను ఈ కావ్యంలో ప్రస్తావించారు. వేమన సామాజిక దృక్పథం తోనే ఆటవెలది పద్యాలలో ప్రజల్ని మేల్కొలిపే విధంగా కవిత్వం రాశాడు. మనిషిగా పుట్టి మృగంలా ఆలోచించే మనుషుల తత్వాన్ని వేమన సూటిగా ప్రశ్నిస్తాడు. వేమన మానవాదానికి ప్రధాన కారణం అయన కవిత్వంలో కనిపించే స్వతంత్ర బుద్ధి, సామెతలు, నీతులు, హాస్యం, సమాజసంక్షేమం, హేతువాద లక్షణాలు. అందుకే వేమన ప్రజాకవిగా, గొప్పదార్శికునిగా కనిపిస్తాడు. అందుకే విద్యార్థుల్లో నైతిక విలువలు, సంస్కరణ భావాలు పెరగాలంటే వేమన పద్యాలను తప్పకుండా చదవాల్సిన అవసరముంది. వేమన తాను జీవించిన సమకాలీన సమాజ పరిస్థితులను అర్థం చేసుకొని, భవిష్యత్తు కార్యాచరణకు పూసుకున్నారని తెలుస్తోంది.

సామాజిక వాస్తవాన్ని గ్రహించి వ్యవహారిక భాషోద్య మాన్ని నడిపిన భావవాది, ప్రాపంచిక దృక్పథ సంస్కరణ వాదియైన గిడుగు రామమూర్తి పంతులుగారు, గురజాడ అప్పారావు గారితో కలిసి సామాజిక పరిస్థితులపై పోరా డారు. వ్యావహారిక భాషోద్యమంలో ఆయన చేసిన వాదాలు, ఉద్యమాలు భాషలోని శక్తిని అందరికీ అందేలా చేసిన ప్రయత్నంగా స్పష్టమవుతుంది. ఇవన్నీ ఆయన సామాజిక దృక్పథాన్ని తెలియజేస్తాయి. సాహిత్యంలో రానురాను దేశభక్తి జాతీయోద్యమం, పూర్వవైభవ పునస్మరణ, స్వాతంత్ర్యం సంబోధ సన్నగిల్లి సామాజిక దృక్పథం, వాస్తవిక చిత్రణలు ప్రాధాన్యం వహించాయి.

గురజాడ గేయకథల్లో సామాజిక దృక్పథం కనిపిస్తుంది. ఆయన గురజాడ బృహత్తర సృజన 'కన్యాశుల్కం' నాటకంతో ప్రారంభమయ్యింది. గురజాడ గేయ కథకుడిగా తొలి రచన 'ముత్యాలసరములు', బరం పురంలో సహపంక్తి భోజనాలు జరిగి, సాంఘిక పరిస్థితులు చర్చలు జరిగాక, ఇంటికి తిరిగివస్తున్న గురజాడ ఆలో చనల రూపం. ఈ సహపంక్తి భోజనాలనే "పెట్టినారొక విందు జాతుల జేర్చి, వినవైతో, అంటాడు. ఇల్లుచేరి తన భార్యతో, నింగిలో హేలీ తోకచుక్క గురించి మూఢ భయాలను కాదని, 'దూరబంధువు ఇతడు భూమికి, దారి బోవుచు చూడవచ్చెను' అంటూ 'తలతునేనిది సంఘసంస్కరణ ప్రయాణ పతాకగానే' అని తన అర్ధాంగితో తన ఆధునిక అవగాహన పంచుకుంటాడు. 1910లో వచ్చిన గురజాడ 'ముత్యాల నరములు' తెలుగులో రాసిన తొలిగేయకథ. ఇదొక సమకాలీన సంఘటనల ఆధారిత గేయకథ. అంటే పలుక వీలుగా కవిత్వమూ ఉంటుంది. చెప్పవీలుగా కథా తోడు ఉం టుంది. ఇదే గురజాడ శైలీ విశేషం. వారి డామన్‌పితియస్ కథ మానవులంతా సమానులేనని తెలియజేస్తోంది. గురజాడ 'కన్యక' ద్వారా నిరసనను, 'పూర్ణమ్మ' కథ ద్వారా పసిపిల్ల మనోవేధనను హృదయవిదారకంగా చెప్పారు. గురజాడ సాంఘిక ఇతివృత్తాల మానవ సమాజపు విలువల్ని తెలియజేస్తున్నాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జాషువ వర్ణధర్మాల ఉక్కుచట్రం అమలును ఆకాంక్షించే శక్తుల నెదిరించటం కర్తవ్యంగా భావించాడు. జాతీయోద్యమంలో భాగంగా ముందుకొచ్చిన సంస్కరణ ఉద్యమం ఇలాంటి శక్తులవల్ల వెనకడుగును వేసే ప్రమాదం ముంచుకు రాగలదని పసిగట్టే - జాషువా 1941లో గబ్బిలం వెలువరించినాడు. సామాజిక అసమానతలపై ఏవగింపు, సంస్కరణల ఫలాలు చేతికి అందగలవన్న ఆశ నశించిపోతున్న తరుణంలో హరిజనులుగా పిలవబడుతున్న వారిలో చైతన్యం రగిల్చి ఉద్యమించేలా చేసి దళితుల్లో ఆత్మగౌరవ సాధనకై తపించాలని ఊహించాడు. పీడకవర్గాల ముక్కుగుద్ది హక్కుల సాధన దిశగా సాగిన మహాప్రస్థానంలో జాషువా ఎత్తిన అనల పతాకం గబ్బిలం. ఆగామి యుగంలో దళిత సూర్యుని శిరస్సునుంచిన అగ్నికిరీటం గబ్బిలం. ఇలా తెలుగుసాహిత్యంలో భిన్న ప్రక్రియల్లో సామాన్య మానవుల్ని అంజెండాగా చేసుకొని సమకాలీన సామాజిక దృక్పథంతో ఎంతోమంది కవులు, రచయితలు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక తెలుగు కథ – ప్రత్యేకత

– డా॥. బి.శాంతిలక్ష్మి, అతిథి ఉపన్యాసకురాలు, తెలుగు విభాగం, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు.

తెలుగు కథ :

పసివయసు నుండి పండు ముసలి వరకు అందరినీ ఆకర్షించగల గుణం కలిగిన వచన ప్రక్రియగా కథను అభివర్ణించవచ్చు. కథ పాఠకుణ్ణి నవ్విస్తుంది, ఏడిపిస్తుంది, కవ్విస్తుంది, సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది, పాఠకుని మనసులో దోబూచులాడుతూ ఒక్కో సందర్భంలో పాఠకునికి సవాలు కూడా విసురుతుంది. మొత్తంమీద పాఠకున్ని స్పందింపచేసి ఆలోచింపచేస్తుంది. అందుకే కథను షడ్రుచోపేతమైనదిగా అభివర్ణించవచ్చు. కథ పుట్టుక మానవజాతికి అపురూప కానుక.

ఆధునిక కాలంలో తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కథకు చాలా ఉన్నత స్థానం ఉంది. కథకు చాలా ప్రాచీనత ఉన్నప్పటికీ అన్ని హంగులతో రూపుదిద్దుకున్న కథ గురజాడ రాసిన 'దిద్దుబాటు' తో ప్రారంభమై అంతర్జాతీయ ఖ్యాతిని పొందింది. తరువాత శ్రీపాద, చలం, కరుణ, విశ్వనాథ, కొడవగంటి, రావిశాస్త్రి, కాళీపట్నం, కొలకలూరి ఇనాక్, బలివాడ లాంటి ఎందరో కథకులు కథాప్రక్రియను సుసంపన్నం చేశారు.

భారతీయ సాహిత్యంలోనే కాక విశ్వసాహిత్యంలో సైతం తెలుగు కథకు విశిష్టమైన స్థానం ఉంది. ఏ దేశానికీ ఏ భాషకూ తీసిపోనంత ఇతివృత్త వైవిధ్యం, శిల్పనైపుణ్యం, భాషావైచిత్రి తెలుగు కథలలో కనబడుతుంది.

తెలుగు కథ ప్రాచీనత :

కథ లేదా కథానిక ఇంకా చిన్న కథ అన్న పేర్లతో పిలువబడుతున్న ఈ నవ్య ప్రక్రియకు దేశీయ మాండలిక భాషలో 'తిత్తవ' అనే పేరు ఉండడం విశేషమైతే అగ్నిపురాణంలో కథకు లక్షణ నిర్దేశం చేయబడడం ఇంకా విశేషం. నేటి కథకు ఏర్పరచుకున్న లక్షణాలతో కొంచం భేదం ఉన్నా ప్రాచీన కాలంలోనే అగ్నిపురాణకర్త

"భయానకం సుఖపరం గర్భేచ కరుణోరసః
అద్భుతాంతే సుక్లప్తార్థనో దాత్త సా కథానికా"

"దీర్ఘంగా కాక పొందికగా ఉండటం, ఉదాత్తత కలిగి ఉండటం. సంభ్రమాశ్చర్యాలు కలిగించి కరుణ అద్భుత రసాలను పోషించటం, ఆనందాన్ని కలిగించటం" అంటూ ఈ చిన్న శ్లోకంలో కథానికా లక్షణాలను నిక్షేపించేయటం చాలా గొప్పవిషయం.

నాగరికతలు కూడా అభివృద్ధి చెందని కాలంలోనే ఆదిమ మానవులు తమ జీవితానుభవాలను, చారిత్రక సంఘటనలను కథలుగా చెప్పుకొనేవారు. కథకు దీన్ని మూల రూపంగా చెప్పవచ్చు. చిత్రకళ కన్నా కూడా ప్రాచీనత కలిగిన కళగా కథను అభివర్ణించవచ్చు.

పాశ్చాత్య దేశాల్లో బొకేషియో కథలూ, మధ్య ప్రాచ్యంలో అరేబియన్ రాత్రుల కథలూ, చార్ దర్వేష్ కథలూ, పాళీ భాషలోని జాతక కథలూ, భారతదేశంలో పంచతంత్ర కథలూ, భట్టివిక్రమార్క కథలూ, మదన కామరాజు కథలూ, శుక సప్తతి కథలూ, కాశీ మజలీ కథలు, తెనాలి రామలింగడి కథలు, పసలపూడి కథలు మొదలైన ఎన్నో కథలు కథలకున్న ప్రాచీనతను బల పరుస్తున్నాయి, సాక్షీభూతాలుగా నిలుస్తున్నాయి.

ఆధునిక తెలుగు కథ - ప్రత్యేకత :

ఆధునిక తెలుగు కథ చాలా ప్రత్యేకతను సంతరించుకుంది. కథారచనలో వస్తువు(కథాంశం), శిల్పం, ఇతివృత్తం, ప్రారంభం, మలుపులు, కథాకథనం, ముగింపు మొదలైన అంశాలు ఇమిడి ఉంటాయి. దీనిలో కథన శిల్పం ప్రధాన లక్షణం. పాత్రల మనస్తత్వం ముఖ్యం. ఒక పాత్ర మీదనో, ఒక సంఘటన మీదనో, ఒక భావం మీదనో ఆధారపడి చిన్న టార్చిలైటు వేసి జీవితరేఖలోని ఒక బిందువును, ఒక జీవిత శకలాన్ని

చూపుతూ అనుభూతి తీవ్రతను కలిగిస్తుంది. ప్రాచీన కథలో కథ చెప్పడం ఉంది కానీ ఆధునిక కథలో లాగా శిల్పానికి ప్రాధాన్యత కనిపించదు. అన్ని హంగులతో అంగాంగ సుందరంగా తీర్చిదిద్దబడి తెలుగు పాఠక లోకానికి అపురూప కానుకయ్యింది నేటి ఆధునిక తెలుగు కథ.

"సాధారణముగా నాతి విస్తృత క్షేత్రము కలిగి, ఒకానొక సంవేదనముతో కూడి స్వయం సంపూర్ణమై దానిలోని విభిన్న తత్వములను ఎకోన్ముఖముగ చూపు ఇతి వృత్తాత్మక గద్య కవితా శిల్పఖండమును కథానిక అనవచ్చు"

"ఒకరకమైన ఎత్తుగడ, నడకతీరు, ముగింపు, పరిమిత పాత్రలకు చక్కని పోషణ, వస్తు విన్యాస వైశిష్ట్యము, ఒక జీవిత సత్యమును ప్రతిపాదించుట, అన్నిటినీ మించి వ్యష్ట్యైక్యము0డి వినోదమో, వికాసమో కలిగించగల చిన్నకథ కథానిక"

"జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యంతో కళ్ళకు కట్టించి, హృదయాన్ని ఒకానొక మహత్తరమైన అనుభూతితో నిండించి పదే పదే చదవాలనిపించే కథను గొప్పకథ అని చెప్పవచ్చు"

"ఒక కథ చదివిన తర్వాత మనసు చలించాలి. మళ్ళీ చదివింప జెయ్యాలి. ఈ కథ బాగుంది అని పదిమందికీ చెప్పించ గలగాలి. మరో పదేళ్ళో ఇరవై ఏళ్లో పోయిన తరువాత చదివినా అదే అనుభూతి, స్పందన కలగాలి. అప్పుడే అది గొప్ప కథ అవుతుంది."

పై నిర్వచనాలు కథకున్న ప్రాముఖ్యతను, ప్రత్యే కతను విషదపరుస్తున్నాయి. మరి అటువంటి ఒక గొప్ప కథ ఎప్పుడు, ఎలా, ఎందుకు, ఏమి ఆశించి వెలుగు చూస్తుంది అని పరికించి చూస్తే దాని వెనుక ఒక కథకుడి కఠోరశ్రమ కనిపిస్తుంది.

"కథకు ముడిసరుకు జీవితమే - ఎంతో వైవిధ్యంతో కూడుకున్న మానవుల ప్రవర్తనే. రాయగల్గిన శక్తి, ఓపిక ఉంటే అందరూ కథలు రాస్తారు. రాయగల్గిన శక్తి లేని వాళ్ళు కనీసం కథలు చెబుతారు. తన జీవితంలో గాని లేదా తమ పక్క వాళ్ళ జీవితంలో గాని జరిగిన సంఘ టనల్ని ఒక వరుస క్రమంలో తమ స్నేహితులకో, బంధువు లకో ఎప్పుడో అప్పుడు అందరూ చెబుతారు. కాబట్టి కథలు చెప్పని వారంటూ ఎవరూ ఉండరు. కాకపోతే కలం పట్టి కథలు రాయటం మాత్రం అందరూ చెయ్యలేరు.

కలం పట్టి రాయటానికి ప్రతిభా-వ్యుత్పత్తులు మాత్రమే సరిపోవు, కఠోరమైన శారీరక శ్రమ చెయ్యటానికి కావలసిన శక్తీ, ఓపికా కావాలి. అందుకే ఎంతో నేర్పుగా నోటితో కథలు చెప్పే వాళ్ళను ఒక చోట కూర్చొని తాము చెప్పిన దాన్నే యథాతథంగా రాయమంటే రాయలేరు. ఇందుకు కారణం భాష రాకపోవటం, కల్పనాశక్తి లేకపోవటం అని చెప్పటానికి వీల్లేదు. ఇవన్నీ మాట్లాడుతున్నప్పుడు పుష్కలంగా కనిపిస్తాయి. ఇందుకు కారణం ఒకటే, రాయటం మాట్లాడినంత సులభం కాదు. రాయటం అనేది బుర్రతో మాత్రమే చేసే పని కాదు. చేతితో చేసే పని. ఐదారుగంటలు స్థిమితంగా ఒక చోట కూర్చొని రాయటం ఎంతో శారీరక శ్రమతో కూడుకున్న పని. - మొదటిసారి రాసింది సంతృప్తికరంగా లేకపోతే మళ్ళీ ఐదారుగంటలు కూర్చుని రెండోసారి రాయటం కొన్ని సార్లు మూడవసారి కూడా రాయటం- ఇది అందరికీ చేతనయ్యే పని కాదు. కాబట్టి కొంత కఠినమైన భౌతిక శ్రమ కూడా చెయ్యగల్గిన వాడే కథలు రాయగలడు.

కథలు రాయటానికి కావలసిన ఒక ప్రాథమికమైన అవసరం ఏమిటంటే కథకుడిలో కథలు రాయాలన్న ఒక సహజమైన తపన, పట్టుదల ఉండటం, ఏదన్నా రాయాలని ఎవరికైనా ఎందుకనిపిస్తుంది? అన్న ప్రశ్నకు సమాధానం ఓ భావకవి అన్నట్టుగా కోకిలకు కూయాలని ఎందుకనిపిస్తుంది? మేఘానికి వర్షించాలని ఎందుకని పిస్తుంది? అని చెప్పటమే. ఈ రాయాలన్నది, కొత్తగా ఏదో చెప్పాలన్నది కొంతమందిలో చాలా ప్రగాఢంగా ఉం టుంది. అలా చెప్పటం ద్వారా సాహిత్యాన్ని కొంత

మరమ్మత్తు చేస్తున్నామని, సమాజాన్ని కొంత మరమ్మత్తు చేస్తున్నామని వాళ్ళనుకుంటారు. అయితే కథకుడు కావటానికి ఈ రాయాలన్న తహతహ ఒక్కటే సరిపోదు. ఇంతకు ముందే చెప్పినట్టుగా రాయటాన్నొక కఠోర పరిశ్రమగా స్వీకరించి గంటలు-గంటలు ఈ రాయటం మీద తన శక్తినంత కేంద్రీకరించగల్గే ఓపికా, పట్టుదల కూడా కథకుడికి కావాలి. వీటితోబాటు పరిస్థితులు కూడా అనుకూలించాలి. తాను ఎంతో శ్రమించి రచించిన కథ ప్రచురించబడి, దాన్ని పదిమందీ చదివి దానిలోని గొప్పతన్నాన్ని గుర్తిస్తే ఆ కథకుడు ఇంకా ఎన్నో మంచి కథలు రాయగల్గుతాడు."

కథ రాయటం వెనుక ఇంతటి తపన, కఠోర శ్రమ ఉంది కనుకే కథలు సమాజ సహజీవనం చేస్తూ సమాజంతో విడదీయలేని ఒక బంధాన్ని ఏర్పరుచుకున్నాయని చెప్పవచ్చు. రోజు రోజుకూ పెరిగిపోతున్న సినిమా థియేటర్లు, కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న సినిమా నిర్మాతలు, ఎంత ఖరీదైనా పెట్టి సినిమాలను చూసి విజయవంతం చేస్తున్న ప్రేక్షకులు, మంచి కథలకు ఎప్పుడూ సమాజంలో స్థానం ఉంటుందనడానికి నిలువెత్తు నిదర్శనం.

కథానికా లక్షణాలు :

1. కథానికా నిర్వచనంగా కానీ, కథానికా లక్షణంగా కానీ కథాంశాలను గుర్తించటం జరుగుతుంది. కథాంశాలలో అతి ముఖ్యంగా భావింపబడే అంశాలు కథా విషయం(వస్తువు), కథా పాత్రలు, కథా కాలం, కథా స్థలం. చిన్నదిగా కలిగిన కథా వస్తువు(ఇతివృత్తం)తో సహజంగా పరిమితంగా కలిగిన పాత్రలతో మితం కలిగిన సన్నివేశ సమయం కథా ప్రదేశం వంటి లక్షణాలు మేళవించిన సంధర్భాలలో కథకు కథైక్య0, కాలైక్యం, స్థలైక్యం కుదిరినట్లు చెప్పడం జరుగుతుంది.
2. కథాప్రారంభం - ముగింపు మంచి కథకు ప్రధానమైన లక్షణం. ప్రారంభం ఆకర్షితంగా ముగింపు సహజంగా ఉండి కథ అంతా ఆలోచనాత్మకంగా ఉండాలి.
3. కథనంలో స్పష్టత, సరళతలతో పాటు వ్యావహారిక భాషలో ఉండడం అవసరం.
4. అనంత విశ్వాన్ని తనలో ఇముడ్చుకోగలిగిన కథానిక విశ్వమానవ జీవితాన్ని ప్రతిబింభించేదిగా ఉండాలి.

ఆధునిక తెలుగు కథ - వస్తు ప్రాముఖ్యత :

కథా వైశిష్ట్యానికి ఉత్తమవస్తువు ప్రాముఖ్యత వహిస్తుంది.

"నిగూఢ బీజస్థితి నుంచి వెలికి వచ్చిన విషయాంకురం కథా వస్తువు"

"వస్తువుని ఆంగ్లంలో 'Content' అంటారు. ఒకానొక ద్రుగ్విషయంలో ప్రత్యేకంగా, నియమ బద్ధంగా ఉన్న మూల కాల, క్రమ విధానాల మొత్తమే వస్తువు"

"కథను కథావస్తువు, కథా రూపం అని విభజించవచ్చు. అంటే కథావస్తువు మాత్రమే కథ కాదు, వస్తువుకు అనుగుణమైన రూపం కుదిరినప్పుడు మాత్రమే మంచి కథ రూపొందుతుంది. కథావస్తువును కథగా మార్చేది రూపమే. దీనిద్వారా పాఠకుడు కథావస్తువును అర్థం చేసుకుంటాడు, అనుభవిస్తాడు."

పై నిర్వచనాలను బట్టి కథ ఎంచుకున్న ఇతివృత్తం, ఆ ఇతివృత్తాన్ని చెప్పదల్చుకున్న విధంగా చెప్పగలగడం అనే రెండు ముఖ్య విషయాలపై ఆధారపడి ఉందని తెలుస్తున్నది.

వస్తువు - స్వరూప స్వభావాలు :

కథారచనలో ఇమిడివున్న వివిధ అంశాలలో కథా వస్తువు అన్నిటికన్నా ముఖ్యమైనది. కథ ఒక కట్టడం అనుకుంటే వస్తువు పునాది. భవంతి నిర్మాణానికి పునాది ఎంత అవసరమొ అదే విధంగా కథ నిర్మాణానికి

రచయిత ఎంచుకునే వస్తువు ప్రాధాన్యత వహిస్తుంది. కథా వస్తువు ఆధారంగా జరిగే సంఘటనల క్రమ పరిణామాన్ని 'ఇతివృత్తం' అంటారు. కథా నిర్మాణాన్నే ఇతివృత్తంగా పేర్కొనవచ్చు. బలమైన ఇతివృత్తం పాఠకున్ని ఆకర్షించడమే కాక ఆలోచింపచేస్తుంది కూడా. దీని ద్వారా బాహ్యనిర్మాణంతో పాటు అంతర్గతమైన నిర్మాణం కూడా రూపొందుతుంది. ఈ విషయాలను బట్టి ఎంత చక్కటి కథనంతో కథ రచించబడినా సరైన వస్తువు లేకపోతే ఆ కథకు జీవం ఉండదన్న విషయం అవగతమవుతున్నది.

సాంఘిక మార్పు, సామాన్య వ్యక్తి ప్రాధాన్యత, స్త్రీ అస్తిత్వం మొదలైన సామాజిక అంశాలే కథలలో ఆవిష్కరించ బడతాయి. ఈ నేపధ్యంలో సామాజికత, సాంప్రదాయికత, మనస్తాత్వికత, వైయక్తిక చైతన్యం, సామాన్యత మొదలైనవి కథా వస్తువు ప్రాముఖ్యతను ప్రదర్శించే అంశాలుగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ అంశాల ద్వారా కథానికలలో వస్తు వైవిధ్యాన్ని కూడా గుర్తించవచ్చు.

ఆధునిక తెలుగు కథ - పాత్రచిత్రణ :

కథానికలలో వస్తువు పాత్రల రూపంలోనే ఆకృతి పొందుతుంది. కథకు జీవం నింపేది పాత్రలు. పాత్ర చిత్రణ విషయంలో కథకులకు నిశిత దృష్టి చాలా అవసరం. ఒక కథ చదివినా, విన్నా అందులోని పాత్రలు మనసులో చెదరని ముద్ర వేయగలగాలి. అప్పుడే ఆ కథకు మంచి గుర్తింపు వస్తుంది. పది కాలాల పాటు పాఠకుల హృదయాలలో నిలిచిపోతుంది.

సాధారణంగా మనకు నిత్యజీవితంలో కన్పించే వ్యక్తులనే పాత్రలుగా మన ముందుంచుతాడు రచయిత. వాస్తవికతకు అద్దం పట్టే పాత్రపోషణను నిర్వహించి తద్వారా సహజత్వాన్ని ఆయా పాత్రలలో నింపుతాడు. కనుక రచయిత అనుభవ పరిధి అతని కథల్లోని పాత్రల్లో వ్యక్తమవుతుంది.

"కథను నడిపించేవారు, కథా వస్తువును భరించే వారు, కథాంశాన్ని సూచించేవారు పాత్రలు"

"కథకు ముడి సరుకు జీవితం"

"జీవితం ప్రిజమ్ లాంటిది"

అటువంటి జీవితాన్ని కథల్లో జీవించగలిగేలా చేయాలంటే అందుకు పాత్ర పోషణ ఎంత ముఖ్యమైనదో అర్థం అవుతుంది. మానవ జీవితంలో ఎన్నెన్నో కోణాలుంటాయి. వాటిని అన్వేషించి, పరిశీలించి కథగా మలచడం ఒక ఎత్తయితే ఆ కథలోని పాత్రలకు జీవం పోయడం రచయిత ప్రతిభపైనే ఆధారపడి ఉంటుంది.

"సంఘంలో మనుషులు ఎట్లా బ్రతుకుతున్నారో, ఏ ఆశలు, ఆశయాల కోసం బ్రతుకుతూ పోరాడుతున్నారో ఆ పాత్రలు ఆ కథానికలో అలానే ఉండాలి. పాత్ర వేషం, నమ్మకం, నడత అన్నీ వాస్తవికంగా ఉండాలి. పాత్రల సంభాషణలో పాత్రలకు తగిన భాష ఉండాలి. పల్లెటూరి మనిషి పాత్ర అయినపుడు ఆ సంభాషణలు ఆ పాత్రకు తగిన యాసతో మాండలికంలో ఉండాలి."

ఉపసంహారం :

తెలుగు సాహిత్యంలో అత్యున్నతమైన స్థానం కలిగియున్న కథాసాహిత్యానికి గల ప్రాచీనతను తెలియచేసి వివిధ సాహిత్యవేత్తల నిర్వచనాలను, లక్షణాలను పొందుపరచడమైనది. వీటి ఆధారంగా కథాసాహిత్యానికి ఉన్న విస్తృతి, వైవిధ్యం తెలుసుకునే ప్రయత్నం జరిగింది.

❖ ❖ ❖

చారిత్రక వచన మహాకావ్యము 'బోయకొట్టములు పండ్రెండు'

– తంగి ఓగేశ్వరరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె గారు 1936 పిబ్రవరి 1న చిత్తూరు జిల్లా తలుపుల పల్లెలో జన్మించారు. అయన చిత్తూరు జిల్లాలోని పలు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసి, 1994 లో కలిచెర్ల ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ అనంతరం పిళ్ళె గారు తన పూర్తి సమయాన్ని తెలుగు భాషాభివృద్ధికి వినియోగించారు. అచేతన స్థితిలో ఉన్న మదనపల్లి రచయితల సంఘంలో తిరిగి చైతన్యం నింపారు. తెలుగు సాహిత్యంలో పద్యం, నవల, కథ, వ్యాసం, నాటకం మొదలైన అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశారు. అతని రచనలలో పేరొందిన రచన 'బోయకొట్టములు పండ్రెండు'.

కారణం బాలసుబ్రహ్మణ్యంపిళ్ళె పండరంగని అద్దంకి శానసం ఆధారంగా రచించిన చారిత్రక నవల బోయకొట్టములు పండ్రెండు.

"----------భూపాలకుండు
పట్టంబు గట్టిన ప్రథమంపు నేడు బలగర్వమొప్పంగ బైలేచి సేన
పటంబు గట్టించి ప్రభు పండరంగు బంచిన సామంత పదువతో బోయ
కొట్టము ల్వండ్రెండు గొని వేంగినాటి గొఱల్చియ త్రిభువనాంకుశ బాణనిల్పి
కట్టెపు దుర్గంబు కడు బయల్సేని కందుకుర్బెజవాడ గావించి
మెచ్చిపండురంగు పరమ మహేస్వరుండు ఆదిత్య బటరనికి ఇచ్చిన
భూమి ఎనుబొది పుట్ల ఆడ్లు పట్టు నేల ధర్మపురంబున ధర్మువులు వీని రక్షించిన వారికి అస్వమేదంబున పలంబు అగు"

ఇదే పండ రంగని అర్దంకి శాసనం. ఈ శాసనాన్ని క్రీ.శ.848 లో గుణగ విజయాదిత్యుని సేనాని పండ రంగడు పల్లవులపై తన విజయానికి చిహ్నంగా అద్దంకిలో నెలకొల్పాడు. అద్దంకి శాసనంలో పేర్కొన్న బోయలు ఎవరు? వారు ఎక్కడి వారు? వారిని పండ రంగడు ఎందుకు జయించాడు? కట్టెపుదుర్గాన్ని ఎందుకు నేలమట్టం చేశాడు? అనే ప్రశ్నలకు సమాధానాల్ని ఊహించి కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు ఈ నవలను రచించారు. లభిస్తున్న చారిత్రక సత్యాలకు కొంత కల్పనల్ని జోడించి ఈ చారిత్రక నవల్ని రచించారు.

ఈ శాసనం వేంగి చాళుక్య రాజైన గుణగ విజయాదిత్యుని కీర్తికి, అతని సేనాని పండ రంగని పరాక్రమానికి ప్రతీకగా నెలకొల్పబడింది. కాని పిళ్ళె గారు "ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగునపడి కాన్పింపని కథలన్నీ కావాలిప్పుడు" అన్న శ్రీశ్రీ గారి మాటలకు కట్టుపడి బోయవీరులపక్షం వహించి వారి విషాదగాథను నవలగా తీర్చిదిద్దారు. ఈ నవల్లో కొట్టం అనగా పల్లవ రాజ్యంలో పరిపాలన విభాగం. ఇది నేటి రెవిన్యూ మండలంగా భావించవచ్చు.

ఈ నవలలోని సంఘటనలు క్రీ.శ. 614 వ సంవత్సరంలో ప్రారంభమై క్రీ.శ.848 వ సంవత్సరం వరకు ఇంచుమించు 220 సంవత్సరాలపాటు కొనసాగుతాయి. ఈ నవలలో బోయల ఏడు తరాల చరిత్రను రచయిత వివరించారు. వేంగీ చాళుక్యులు, పల్లవుల మధ్య యుద్ధాలు సాగుతున్న కాలం అది. త్రిపురాంతకంలో నివశిస్తున్న బోయలు ఆ యుద్ధాలలో నలుగుతూ తమదైన రాజ్యాన్ని నిర్మించుకునేందుకు గుండ్లకమ్మ, మూసీ నదుల మధ్య ప్రాంతంలో ప్రయత్నాలు సాగిస్తాడు. రెండు నదుల మధ్య వ్యవసాయ, వ్యాపారాలు అభివృద్ధి

చేసుకొని జీవిస్తూ పలు పరిపాలన విభాగాలను, ఒక పెద్ద కోటను కట్టుకుంటారు. చివరికి పల్లవ, చాళుక్యరాజుల సామ్రాజ్యకాంక్షకు బోయలు బలైయ్యారు. రెండు వందల సంవత్సరాల వ్యవధిలో నిర్మించిన బోయరాజ్యాన్ని చాళుక్యసేనాని పండరంగడు ఒక్కరోజులో కూలదోసి, దానికి చిహ్నంగా ఈ అద్దంకి శాసనం వేశాడు.

బోయలు త్రిపురాంతకం ప్రాంతానికి చెందినవారు. వీరు విష్ణుకుండినులకు సామంతులుగా ఉండేవారు. చాళుక్యులు ఆ ప్రాంతాన్ని ఆక్రమించురున్న తరువాత వారి పాలనలో బోయలు అనేక ఇబ్బందులు పడతారు. చాళుక్యుల చేతిలో చాలామంది బోయ యువకులు మరణిస్తారు. చాళుక్యుల నుండి బోయ జాతిని కాపాడుకోవడానికి వారి నాయకుడైన మొదటి వీరనబోయడు పల్లవ చక్రవర్తుల అనుమతితో కందుకూరు, వంగవోలు మధ్య గుండ్లకమ్మ నది తీరంతో తమ నివాసాలు ఏర్పాటు చేసుకొని, అక్కడికి వెళ్ళిపోతారు.ఈ విధంగా బోయలు పల్లవులకు దగ్గరౌతారు. వేంగిరాజ్యాని ఆక్రమించుకున్న చాళుక్యరాజు సత్యాశ్రయ పులకేసి తన తమ్ముడైన మొదటి విష్ణువర్ధనుడిని వేంగి రాజుగా నియమించి బాదామికి వెళ్ళిపోతాడు.మొదటి విష్ణువర్ధనుడి అనంతరం అతని కొడుకు జయసింహవల్లభుడు వేంగిరాజ్యానికి రాజవుతాడు. కుమారులు చాళుక్యుల చేతిలో మరణించడం, మనుమలు చిన్నవారు కావడంతో మొదటి వీరనబోయని మరణాంతరం అతని భార్య మంగసాని బోయలకు నాయకత్వం వహిస్తుంది. ఈమె కాలంలో జయసింహవల్లభుడు బోయకొట్టాలపై దాడి చేస్తాడు. కాని మంగసాని తన మాటల చాతుర్యంతో అతనిని శాంతింపజేసి చాళుక్యుల నుండి బోయలను కాపాడుతుంది. జయసింహుడు బోయకొట్టాలను చాళుక్య సామంత రాజ్యంగా చేసుకొని మొదటి వీరనబోయని మనుమడు రెండవ వీరనబోయడిని బోయకొట్టాలకు నాయకుడిగా నియమిస్తాడు. ఈ విధంగా బోయలు చాళుక్యులకు సామంతులవుతారు.

రెండవ వీరనబోయడు చాళుక్య రాజ్యోద్యోగి ధనపాలని కూతురు జయశ్రీ ప్రేమలో పడతాడు. నాగరికులు మంచివారు కాదు అనే అభిప్రాయం గల మంగసాని నాగసాని అనే బోయస్త్రీతో వివాహం చేస్తుంది.వీరికి కసవనబోయడు జన్మిస్తాడు. కాని మంగసాని మరణాంతరం రెండవ వీరనబోయడు జయశ్రీని వివాహం చేసుకుంటాడు. వీరికి పులిరాజు జన్మిస్తాడు.ఈ విధంగా చాళుక్యులకు బోయలకు వివాహ సంబంధాలు ఏర్పడతాయి. పులిరాజుకు చాళుక్యుల అండదండలు ఉండటంతో రెండవ వీరనబోయడు జీవించి ఉండగానే బోయకొట్టాలపై తన నియంత్రణ నెలకొల్పుకుంటాడు. తండ్రి మరణాంతరం అన్న అయిన కసవనబోయడిని ప్రక్కనబెట్టి తానే నాయకుడౌతాడు. తమ్ముడితో గొడవకు ఇష్టపడని కసవనబోయడు మౌనంగా ఉండిపోతాడు.

పులిరాజు చాళుక్యుల అనుకూల విధానాలను అనుసరిస్తాడు. పల్లవుతో కావాలనే శత్రుత్వం పెట్టుకుంటాడు. దీనితో పల్లవ చక్రవర్తి నందివర్మ తన సేనాధిపతైన ఉదయచంద్రునికి పెద్దసైన్యాన్ని ఇచ్చి బోయకొట్టాలపైకి పంపిస్తాడు.ఈ యుద్ధంలో పులిరాజు ఓడిపోయి పారిపోతాడు. ఉదయచంద్రుడు కసవనబోయని మనుమడు వీరభద్రుడిని బోయకొట్టాలకు నాయకునిగా నియమిస్తాడు. కాని నాగసాని తన కొడుక్కి కాకుండా వీరభద్రునికి నాయకత్వం అప్పగించడంతో వీరభద్రునిపై ద్వేషం పెంచుకొని అతనిపై విషప్రయోగం చేసి చంపివేస్తుంది. దీనితో వీరభద్రుని తమ్ముడు నన్నిబోయడు బోయకొట్టాలకు నాయకుడౌతాడు. అతని తమ్ముడు పొన్నిబోయడు గుంటూరు, బెజవాడ వెళ్ళి విద్యను అభ్యసిస్తాడు. ఇతడు పల్లవ రాకుమారి వకుళను ప్రేమించి వివాహం చేసుకుంటాడు. ఈ విధంగా బోయలు పల్లవులకు దగ్గర కావడమేగాక వారితో వివాహ సంబంధాలు ఏర్పరుచుకుంటారు.

చాళుక్యరాజ్యం కోసం అన్నదమ్ములైన భీమసలుకి, రెండవ విజయాదిత్యుల మధ్య వారసత్వ యుద్ధం

జరుగుతుంది. విజయాదిత్యునకు బోయవిలుకాండ్ర సహాయం అవసరమౌతుంది. విజయాదిత్యుని మంత్రి కడియరాజు బలవంతంగానైన బోయలను లోంగదీసు కోవాలని ప్రయత్నించి విఫలమౌతాడు. నన్నిబోయనికి బంధీగా చిక్కుతాడు. నన్నిబోయడు అతనిని క్షమించి విడిచిపెడతాడు. బోయల చేతిలో తనకు జరిగిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటాడు కడియ రాజు. కాని రాజ్యంకోసం 108 యుద్ధాలు చేయవలసి రావడం, ఆ యుద్ధాలలో తన సొంత మనుషులు అనేక మంది చనిపోవడం, యుద్ధాలలో జరిగిన మరణ హోమాన్ని కళ్ళార చూసిన రెండవ విజయాదిత్యుడు యుద్ధవిముఖుడు అవుతాడు. దీనితో కడియరాజు ప్రతీకారం నెరవేరదు. కాని తన కొడుకైన పండరంగని హృదయంలో బోయలపై ద్వేషాన్ని పెంచుతాడు.రెండవ విజయాదిత్యుని అనంతరం అతని కొడుకు కలి విష్ణు వర్ధనుడు చాళుక్యరాజ్యానికి రాజౌతాడు. కాని కొద్ది రోజులలోనే ప్రమాద వసత్తు మరణిస్తాడు. అతని అనం తరం అతని కుమారుడు, రెండవ విజయాదిత్యుని మను మడు గుణగ విజయాదిత్యుడు చాళుక్యరాజ్యానికి రాజౌతాడు. అతడు పండరంగనికి మంచి స్నేహితుడు. తాను చాళుక్యరాజ్యానికి రాజు కాగానే పండరంగడిని సర్వసైన్యాధ్యక్షునిగా నియమిస్తాడు. అతడు పెద్ద సైన్యంతో బోయకొట్టాల పైకి యుద్ధానికి వెళ్ళి బోయ కొట్టాలను పూర్తిగా నేలమట్టం చేస్తాడు. బోయనాయకు లైన నన్ని, పొన్ని బోయలు, వారి కుమారులు, బంధువులు ఈ యుద్ధంలో మరణిస్తారు. ఇది 'బోయకొట్టములు పండ్రెండు' నవల సారాంశం.

ఇట్లు రెండు వందల సంవత్సరాల కాలంలో ఆవిర్భ వించి, అభివృద్ధిచెంది, ఒక వెలుగు వెలిగిన బోయ రాజ్యం, అభిమాన ధనులైన బోయ విలుకాండ్రలకు స్థావరమైన బోయరాజ్యం, పండ్రెండు బోయకొట్టాలు అనే సామూహిక నామంతో పిలవబడే బోయరాజ్యం, పల్లవ, చాళుక్య రాజుల సామ్రాజ్యకాంక్షకు బలై, వారి రాజకీయపు చెత్తుల మధ్య నలిగి, కేవలం ఒక్కనాటి యుద్ధంలో శాశ్వతంగా రూపు మాసిపోయింది. బలైపోయింది. చరిత్ర పుటలలో కేవలం ఒక పంక్తిగా నిలిచిపోయింది. ఈ బోయకొట్టాల విషాదగాథనే పిళ్ళెగారు ఈ నవలలో వివరించారు. ఈ నవలలో రచయిత అర్కభట్టారకుని కుటుంబాన్ని ఆధారంగా చేసుకొని ప్రాఙ్నన్నయ్య యుగంలో శాస్త్ర సాంకేతిక అంశాలలో వచ్చిన మార్పు లను వివరించడానికి ప్రయత్నించారు. అర్కభట్టారకుడు గొప్ప ఖగోళశాస్త్ర పరిశోధకుడు. అర్కభట్టారకుని తరువాత అతని కుమారుడు మొదటి ఆదిత్య భట్టారకుడు ఖగోళ శాస్త్ర పరిశోధనల పట్ల ఆసక్తి చూపలేదు. మొదటి ఆదిత్య భట్టారకుడు పంచాంగాలు రాయడం, వైదిక విద్యలు క్షుణంగా అభ్యసించాడు. ఆదిత్యభట్టారకుని కుమారుడు భాస్కరభట్టారకుడు ఆయుర్వేద ఔషదాల గురించి పరి శోధనలు చేశాడు. మొదటి ఆదిత్యభట్టారకుని ముని మనుమడైన రెండవ ఆదిత్యభట్టారకుడు జ్యోతిష్య, ఆయుర్వేద శాస్త్రాల్లో గొప్ప నిపుణుడు.వకుళ చేతిలో ప్రాణాంతకమైన గాయం పొందిన పండరంగనికి ఇతడే ప్రాణభిక్ష పెడతాడు. రెండవ ఆదిత్యభట్టారకుని పూర్వీకుల ఆసక్తుల్ని పరిశీలిస్తే క్రమంగా శాస్త్రం వెనుకబడి, పంచాంగం, జ్యోతిష్యం ముందుకు వచ్చినట్లు తెలుస్తుంది.

ఈ నవల ప్రాఙ్నన్నయ్య యుగపు విజ్ఞాన సర్వస్వంలా ఉంది. అనేక విషయాలపైన నవలలో సమాచారం అందించారు పిళ్ళెగారు. ఏనుగులు పట్టే విధానం, వాటికి శిక్షణ ఇచ్చే విధానం, విలువిద్యా ప్రదర్శనం, యుద్ధ తంత్రాలు, నాటి శిక్షావిధానాలు, సాతులు, సంతలు, పన్నులు, ఇనుక గడియారాల నిర్మాణం, నాటక ప్రదర్శనలు, తోలుబొమ్మలాటలు, ఆలయ నిర్మాణం, వేశ్యా వాటికలు, కోటలు కట్టడం, ఊర్లు ఏర్పడటం, జంతువుల చర్మాలతో బొమ్మలు తయారుచేసే విధానం - ఒకటేమిటి అనేక విషయాలపైన ఈ నవల దృష్టిని సారించింది.

బోయకొట్టాల చరిత్ర చెబుతూనే ఆ కాలంలో ముఖ్యంగా చాళుక్యులు తెలుగు దేశికవితకు ఎలా పునాదులు వేశారో పిళ్ళె గారు వివరించారు.వివరించడమే కాకుండా స్వయంగా కొన్ని పద్యాలనూ, జనపదుల పాటలనూ రాసి వాటి ఆధారంగా ప్రాఙ్నన్నయ్య యుగంలో తెలుగు భాష తీరుతెన్నులను వివరించే ప్రయత్నం చేశారు రచయిత. నన్నిచోడుడు తన కుమార సంభవంలో ఈ క్రింది పద్యాన్ని పేర్కొన్నాడు

"మును మార్గ కవితా లోకం
బున వెలయగ దేశి కవిత పుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జన చాళుక్యరాజు మొదలగు బలువుర్"

ఈ పద్యంలో కీర్తించిన చాళుక్య నృపులు ఎవరు? అనే ప్రశ్నకు సాహిత్య, చారిత్రక పరిశోధకులు భిన్న అభిప్రాయాలూ వ్యక్తం చేస్తున్నారు. "పై పద్యమున ఁజాళుక్యరాజనఁగా నిప్పుడు మనకు ఁబ్రస్తుతుడును, నన్నియ యాంధ్ర భారత కృతికి ఁగారయి తయునగు రాజరాజ నరేంద్రుఁడగు నని నేను దలంచు చున్నాడను" అని వేటూరి ప్రభాకరశాస్త్రి గారు ఊహించారు. కాని పిళ్ళెగారు అతనికి భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. "దేశి కవితను పుట్టించిన చాళుక్యరాజు ఖచ్చితంగా రాజరాజ నరేంద్రుడు కాదు. ఎందుకనగా నన్నయ్యకు పూర్వమే తెలుగువారు గాసట బీసట అయిన తెలుగు దేశికవితను చదువుచుండినారు. కావున దేశికవిత పుట్టించి తెనుంగున నిలిపినవాడు సత్యాశ్రయుడే కావలయును" అని పిళ్ళె గారు ఊహించారు.

నన్నయ్యకి పూర్వం తెలుగు సాహిత్య స్వరూపం అంచన వేయడానకి ఈ నవల ఉపయోగపడుతుంది. దేశీయచ్ఛందాల పుట్టుకను ఎంతో ఛమత్కారంగా ఈ నవలలో వర్ణించారు. అందుకోసం యతులు, ప్రాసలు, సంధులు లేని కొన్ని పద్యాలను కూడా రచించి, తెలుగు పద్యం ప్రాథమిక దశలో ఇలా ఉండవచ్చని పిళ్ళెగారు చూపారు. "తెలుగులో కవిత్వము పుట్టలేదు కాని తెలుగు వారు కవిత్వము చెప్పినారు. తమిళంలో 'తిరుక్కురళ్' కంటే ముందే తెలుగువారు కవిత్వం చెప్పియున్నారు. 'తిరుక్కురళ్' లో సూక్తులు మాత్రమున్నవి. తెలుగువారి కవిత్వము నానారస భరితము" అని గాథాసప్తశతి ద్వారా తెలుగు భాషా ప్రాచీనతను నిరూపించడానికి పిళ్ళెగారు ప్రయత్నించారు.

చాళుక్యుల కాలంలో తరవోజ, కందం, మధ్యాక్కర, ఆటవెలది, తేటగీతి, సీసం వంటి దేశీయ ఛందస్సులు రూపొందినప్పటికి పండితులు సంస్కృత వృత్తాలను తెలుగులోకి దిగుమతి చేశారు. "నన్నయ్యకు పూర్వము మొదట చెదురు మదురుగా తరవోజ, సీసము, మధ్యాక్కర మొదలైన దేశి పద్యము లుండెడివి. సంస్కృతాభిమానులయిన పండితులు వానిని ఆదరింపమిచే తరువాత నకృత్తుగా చంపకోత్పలమాలల వంటి వృత్తములు వ్యాప్తికి వచ్చినట్లు తోచుచున్నది" అని అన్న జి. నాగయ్యగారి మాటలు అక్షర సత్యం. అదే సమయంలో "పండిత కవులు సరళమైన శ్రావ్యమైన సంస్కృత పదములను సమాసములుగా కూర్చి తెలుగు పద్యములలో చేర్చుటకు ప్రయత్నములు చేయుచుండిరి" అని పిళ్ళెగారు పేర్కొన్నారు. ఈ విధంగా సంస్కృత వృత్తాలు, పదాలు, సమాసాలు నెమ్మదిగా తెలుగు భాషలో కలిసి పోయాయి. ఈ విధంగా తెలుగు భాషా నన్నయ్య కాలానికి సంస్కృత భూయిష్టమైంది. అప్పటివరకు వ్యవహారంలో ఉన్న అనేక అచ్చ తెలుగు పదాలు కనుమరుగయ్యాయి. వాటి స్థానాన్ని సంస్కృత ఆక్రమించుకుంది.

శాతవాహనులకాలంలో ఉన్న మతసహనం ఈ కాలంలో అంతరించింది. ప్రభువులు ఏ మతాన్ని అనుసరిస్తే, ప్రజలు, సామంతులు కూడా అదే మతాన్ని అనుసరించవలసి వచ్చింది. "అంతరంతరములో అతడు జైనమతాభిమాని. కానీ పాలకులు శైవమతావలంబకుల గుటచేత అతడు తన జైనమతాభిమానమును బయట పడనీయక గుట్టుగా కాలము గడుపుచున్నాడు" అని పిళ్ళెగారు అద్దంకి పల్లవ దుర్గాధ్యక్షుడైన రుద్రమ నాయకుని గురించి పేర్కొన్నారు.

ఈ కాలంలో బ్రాహ్మణులు, పాలకుల సహాయంతో జైన, బౌద్ధ మతాలను నిర్మూలించడానికి ప్రయత్నించారు. బోయకొట్టాలపైకి యుద్ధానికి వెలుతున్న జయసింహ వల్లభునితో ''ఆ ప్రాంతమున ఇంకను కొందరు బౌద్ధ భిక్షులు సంచారము చేయుచు బౌద్ధ ధర్మమును ప్రచారము చేయుచున్నారట. వారు బౌద్ధ ధర్మము ప్రచారము చేయుట వలన కొంత నష్టమున్నది. బౌద్ధులు నిరీశ్వరవాదులు. స్వర్గనరకములు లేవందురు. అందు వలన ప్రజలలో పాపభయము నశించును. పామరులు వశృంఖలత్వమును అలవాటగుదురు. వైదికమతము కూడా భగవంతుని నిరాకారుడనియు, నిర్గుణుడనియు, నిరంజనుడనియు పేర్కొనుచున్నది. అట్టి నిరాకార నిర్గుణ భాగవత్తత్త్వము నందు జ్ఞానులు మాత్రమే మనస్సును లగ్నము చేయగలరు. పామరులకు సగుణ, సరూప దేవతామూర్తి కనబడిననేగాని మనస్సు లగ్నము కాదు. భగవంతుని యందు మనస్సు లగ్నమైననేకాని పాప పుణ్యముల భావనము, ధార్మిక భావము ఏర్పడదు. స్వర్గనరకముల భావన ఉండిననేకాకి ప్రజలు సన్మార్గ ప్రవర్తకులు కాలేరు. కావున పామరులైన బోయలకు స్వర్గనరక భావన కలిగించవాలె. వారి కొట్టములకు కొందరు బ్రాహ్మణులను పంపవలె. ఆ బ్రాహ్మణులు కొట్టములలో కాపురముండి వారికి ధర్మబోధన చేయవలె'' అని అర్కభట్టారకుడు చెప్పాడు. జయసింహుడు బోయకొట్టాలను జయించిన తరువాత అర్కభాట్టారకుడు చెప్పినట్లు బోయ కొట్టాల నుండి బౌద్ధులను తొలగించాడు. అక్కడ బ్రాహ్మణులను నియమించాడు. దేవాలయ నిర్మాణం కూడా ప్రారంభించాడు. ఈ విధంగా ఏడవ శతాబ్దిలో బ్రాహ్మణులు, పాలకులు సంయుక్తంగా వైదిక మత పురురుద్ధరణకు ప్రయత్నించినట్లు తెలుస్తుంది.

చాళుక్య రాజులు, రాజోద్యోగులు, ప్రముఖులు క్రమంగా శైవ మతం పట్ల ఆకర్షితులైయ్యారు. కాని సామాన్య ప్రజలు, స్త్రీలు ఇంకా జైన మతాన్ని అభిమానించారు. జైన సాంప్రదాయాల్ని పాటించారు. జైన సన్యాసులకి సత్రాలు, మఠాలు, జినాలయాలు కట్టించారు. పృథ్వీవ్యాఘ్రరాజు చేత మంచనశర్మ కుమారుడు హరిశర్మ అక్షరాభ్యాసం చేయిస్తాడు. అక్షరాభ్యాస సమయంలో హరిశర్మ 'ఓం నమశ్శివాయ' అని రాయబోగా జయశ్రీ అడ్డుకుంటుంది. ''ఈ సాంప్రదాయము ఇప్పుడిప్పుడు వచ్చినది. అనేక తరములుగా తెలుగు సీమలో జైన సిద్ధుల పేరు మీద 'ఓం సిద్ధం నమః' అని వ్రాయించుతయే అలవాటులో నున్నది. ఆ పద్ధతి నెందుకు మార్చవలె'' అని వాదిస్తుంది. ఈ విధంగా రాజులతో సంబంధంలేకుండా అంతఃపుర స్త్రీలు జైనాన్ని ఆదరించారు.

క్రీ.శ. 8,9 శతాబ్దాలలో కుమారీలభట్టు, శంకరాచార్యులు హిందూ మత దిగ్విజయ యాత్రలు జరిపి 'హస్తినాతాడ్యమానోపి నగచ్ఛేత్ జైన మందిరం' అని బోధించారు. ఈ విధంగా శైవమత వ్యాప్తితో జైనం అంతరించింది. జైనులు హిందూ మతంలో కలిసిపోయారు. హరిశర్మ 'ఇప్పుడు ఎక్కడ చూసిన ఓం నమశ్శివాయ సిద్ధం నమః అని రాస్తున్నారు' అని జయశ్రీతో చెప్పిన మాటలు హిందు, జైన సంస్కృతుల సంగమాన్ని చూసిస్తున్నాయి.

క్రీ.శ.7 వ శతాబ్దానికి ఆంధ్రదేశంలో బౌద్ధం దాదాపుగా అంతరించింది. బుద్ధుడు దశావతారాల్లో ఒక అవతారంగా మారిపోయాడు. కాని అశోకుని కాలానికే బౌద్ధం సియాం (థాయలాండ్), కంబోడియా, లావోస్, బర్మా, వియత్నాం, చైనా, జపాన్ దేశాలలో గొప్పగా ప్రచారం పొందింది. ఈ ఆగ్నేయాసియా దేశాలలో కూడా హిందూ మతం, బౌద్ధ మతంతో పోటీపడింది. ''మన పొరుగున నున్న సింహళము నందును, సముద్రముల కావల బహు దూరమున నున్న మలయ, చంపా(వియత్నాం), సువర్ణ ద్వీపముల(బర్మా) యందు బౌద్ధమతము విస్తరించి యున్నది. కావున ఆ దేశములలో బౌద్ధమతమును అణచి వేసి వైదిక ధర్మమును స్థాపించుటకై మేము అక్కడికి

బయలుదేరినాము'' అన్న నూరనభట్టు మాటలు భారతదేశానికి వెలుపల హిందూ, బౌద్ధ మత ఘర్షణలను సూచిస్తున్నాయి. కంబోడియాలోని అంగోర్ వాట్ విష్ణు దేవాలయం, జావాలోని బొరోబొదుర్ బౌద్ధ స్తూపం ప్రాచీన కాలంలో ఆ దేశాలలో భారత సంస్కృతి వ్యాప్తికి నిదర్శనాలు. ''స్థానికి ప్రజల సహచర్యం వల్ల హిందూ సంప్రదాయాలు కొంత మారినప్పటికీ, వెయ్యేళ్ళు గడిచినా ఈ దేశాల్లో భారతీయతను స్పష్టంగా చూడవచ్చును'' అని అన్న కృష్ణారెడ్డిగారి మాటలు ఆగ్నేయాసియా దేశాలలో భారత సంస్కృతి వ్యాప్తిని స్పష్టం చేస్తున్నాయి.

''బృహత్ఫలాయనులు, శాలంకాయనులు, విష్ణు కుండినులు, పల్లవులు జన్మరీత్యా బ్రాహ్మణులైనప్పటికి క్షాత్ర ధర్మాన్ని అనుసరిచడం వలన క్షత్రీయులైయ్యారు.'' బ్రాహ్మణులకు సమాజంలో గౌరవ స్థానం ఉండేది. 'ఇదం బ్రాహ్మం ఇదం క్షాత్రం' అన్నట్టు బ్రాహ్మణులు ఒక వైపు వైదిక విద్యావిజ్ఞాన విధులై ఉంటూ, మరో వైపు శస్త్రోపజీవులై సేనాపతులుగా, దండనాధులుగా ప్రభువులను సేవించేవారు. ఈ నవలలో చౌడమరసు, సోమేశ్వర భట్టారకుడు, అతని కుమారుడు కొమరశర్మ, కడియరాజు, అతని కుమారుడు పండ రంగడు, అయ్యపశర్మ, అతని కుమారుడు వినయడిశర్మ బ్రాహ్మణులైనా చాళుక్య ప్రభువులకు కుడిభుజాలుగా నిలచి విజయాలు సాధించి పెట్టారు. ఆంధ్రబ్రాహ్మణుల్లో ఈ యుగంలోనే వైదిక, నియోగి శాఖాభేదం ప్రారంభమై ఉంటుందని డా. బి.యస్. యల్. హనుమంతురావు గారు పేర్కొన్నారు.

శాతవాహ అనంతర కాలంలో రాజులు బ్రాహ్మణులకూ, మత సంస్థలకూ భూదానాలు విరివిగా చేశారు. 'భూమి దానాత్ పరం నాస్తి' అనే భావన ప్రచారంలో ఉంది. ''నా విషుఃపృథివీ పతిః రాజనగా ఎవరు? సాక్షాత్తు దేవుడే. రాజసేవయే దైవ సేవ. ఈ విషయమును మీరు ప్రజలకు నూరిపోయవలె. రాజులు మిమ్ములను భూసురులు అని గౌరవించుట ఎందుకు? మీకు అగ్రహారములు మాన్యములు ఇచ్చుట ఎందుకు? మీ మాటల వలన ప్రజలు రాజుకు విధేయులై ఉండవలె ననియే కదా'' అని మంగియువరాజు బ్రాహ్మణులతో అన్న మాటలు బ్రాహ్మణ క్షత్రియుల మధ్య సంబంధాలను తెలియజేస్తాయి.

''చాళుక్యులు బోయబ్రాహ్మణుల ఋషి గోత్రాలను, సనాతన సామాజిక వ్యవస్థలో వారి స్థానాన్ని గుర్తించి, కర్మరాష్ట్రంలో వారికి అగ్రహారాలిచ్చినట్లు రేయూరు, చందలూరు, కొడనాగూరు శాసనాల నుండి తెలుస్తుంది. ఈ బ్రాహ్మణుల ద్వారా చాళుక్యాధికారానికి బోయల విశ్వాస సహకారాలు సాధించి తద్వారా పల్లవ దాడుల నరికట్టవచ్చని వీరి ఆశయం.'' పై విషయాల ఆదారంగా నాటి రాజులు ప్రజలను తమకు విధేయులుగా చేసుకోవడానికి బ్రాహ్మణుల సహాయం అవసరమైంది. అదే విధంగ జీవనానికి అవసరమైన ధనం, అగ్రహారాల కొరకు బ్రాహ్మణులకు పాలకుల అవసరం ఏర్పడింది. ఈ విధంగా పాలకులు, బ్రాహ్మణులు పరస్పర సహకారంతో క్రింది వర్ణాల వారిని తమ అదుపులో పెట్టుకున్నారని తెలుస్తుంది. అద్దంకి శాసనంలోని 'ధర్మువులు వీని రక్షించిన వారికి అశ్వమేధంబున పలంబు అగు' అనే వాక్యం ఉంది. అనగా అనాడు ఈ బ్రాహ్మదేయాల విషయంలో బ్రాహ్మణులకు, సామాన్య ప్రజలకు మధ్య కొంత సంఘర్షణ జరిగినట్లు తెలుస్తుంది.

దేశ, జాతి, కుటుంబ మర్యాదలను తృణీకరించి స్వార్థపరులై సంహాసనం కోసం చాళుక్య రాజకుమారులు పోరాడారు. మూడవ విష్ణువర్ధనుడు-కొక్కిలి, రెండవ విజయాదిత్యుడు - భీమసలికి మధ్య జరిగిన వారసత్వ యుద్ధాలలో వేంగిరాజ్యం అల్లకల్లోలమైంది. ''చాళుక్యులు స్వహస్తాలతోనే వేంగి నగరాన్ని పరశురామ ప్రీతి చేసినారు'' అని అన్న బి.యస్. యల్. హనుమంతరావు గారి మాటలు నాటికాలంలో నైతిక పతనతను చూసిస్తున్నాయి. పాలకులలోని వారసత్వ తగాదాలు సామంతుల్లోకీ పాకినట్లు నాగసాని వృత్తాంతం వలన తెలుస్తుంది. ఈమె తన కుమారుడు బోయకొట్టాలకి నాయకుడు కానందుకు

ప్రతీకారంగా ఆరు సంవత్సరాల వయస్సు గల వీరభద్రుడ్ని విషప్రయోగం చేసి చంపుతుంది.

బోయలలో నాలుగవ తరం నుండి అక్షరాస్యులు కనిపిస్తారు. జయశ్రీ కుమారుడైన పులిరాజు వినుకొండలో విద్యను అభ్యసిస్తాడు. బోయాలకు ఐదవ తరం ప్రతినిధైన పాన్ని బోయడు బోయల్లో మొదటి విద్వాంసుడు. అతను బోయకొట్టాల్లో హరిశర్మ వద్ద కొంత సంస్కృత విద్యను అభ్యసించీ, ఉన్నత విద్యను అభ్యసించడానికి గుంటూరు, ధాన్యకటకాలకు వెళ్తాడు. అక్కడ సంస్కృత గ్రంథాలతో పాటు అప్పుడప్పుడే వికసిస్తున్న తెలుగు సాహిత్యాన్ని కూడా అభ్యసిస్తాడు. బోయల ఆరవ తరానికి ప్రతినిధి అయిన మలయప్ప గొప్ప సంస్కృత విద్వాంసుడు. కంచిలో గొప్ప విద్వాంసుల వద్ద విద్యను అభ్యసిస్తాడు. శంకరాచార్యుల శివనందలహరి, సౌందర్యలహరి అనే సంస్కృత గ్రంథాలకు వ్యాఖ్యానం రాస్తాడు. "పాండిత్యంలో శంకరశర్మ కుమారుడైన వాసవశర్మ కంటె మలయప్ప నూరు రెట్లు మెరుగు" అని అన్న పిళ్ళెగారి మాటలే మలయప్ప పాండిత్యానికి నిదర్శనం. అవకాసం కల్పిస్తే కులమతాలకి అతీతంగా అన్ని వర్ణాల ప్రజలు విద్యలో ప్రతిభ కనబర్చగలని పిళ్ళెగారు ఈ నవల ద్వారా తెలియజేశారు.

బొయకొట్టాలలో మొదట కార్తికేయ దేవాలయం నిర్మించడంలోనే పిళ్ళెగారు గొప్ప ఔచిత్యాన్ని పాటించారు. కార్తికేయుడు దక్షణ భారత ప్రజల దేవతాగణాల్లో మొదటివానిగా భావిస్తున్నారు. "పూర్వము యక్షులలో వేటకాండ్రకు 'మురుగ' అనే ఒక దేవత కలడు. ఇతని కాఱుమొగములను, పండ్రెండు చేతులును గలవు. ఈ దేవుని దేవాలయము లరణ్యముల నడుమ, పర్వత శిఖరముల మీదను సాధారణముగా నిర్మింబడు చుండెను. బ్రాహ్మణార్యులు యనార్యులను వశపఱచు కొనుటకై యనార్య దేవతలను గ్రహించి యాదరించి పూజింప సాగిరి. వీరు వేటకాండ్ర దేవతయగు 'మురుగ' ను స్కందకుమారుడనియు, షణ్ముఖుడనియు, కుమార స్వామియనియు పేరువెట్టి శివునికుమారునిఁజేసిరి" అని చిలుకూరి వీరభద్రరావు గారు పేర్కొన్నారు. ఆంధ్ర శాతవాహనుల మూలపురుషుడైన శాతవాహనుడు యక్షునకు బ్రాహ్మణ కన్య యందు జన్మించినట్లు ఒక కథ ప్రచారంలో ఉంది. అందువల్ల అటవికులైన బోయలలో వైదిక మతాన్ని చొప్పించడానికి కార్తికేయారాధనే అత్యున్నత మార్గంగా పిళ్ళెగారు భావించారు.

బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు ఈ నవలలో గొప్ప తార్కికతను ప్రదర్శించారు. జయసింహ వల్లభుడు, అర్క భాట్టారకుల మధ్య జరిగిన సంభాషణ పిళ్ళెగారి తార్కిక పరిజ్ఞానానికి నిదర్శనం. జయసింహుడు 'మనమందరం తెలుగు ప్రజలం. తెలుగుదేశం అంతటిని ఒకే రాజ్యంగా చెయ్యాలి. తమిళులైన పల్లవుల్ని తెలుగు ప్రాంతం నుండి తరిమివేయ్యాలి' అని ఆర్కాభట్టారకుడితో చెబుతాడు. దీనికి సమాధానంగా అర్క భట్టారకుడు "మీ పెద తండ్రి గారు ఉదారస్వాభావముతో తెలుగునేలను మీ తండ్రిగారికి ధారవోసి స్వతంత్ర రాజ్యముగా వెలయించినాడు కనుక సరిపోయింది కాని లేనిచో ఈ పాటికి ఈ తెలుగునేల బాదామి సామ్రాజ్యమును కన్నడిగులతో కలిసిపోయి యుండెడిది కాదా? మన భాగ్యవశమును హర్షవర్ధనుడు ఓడినాడు కనుక సరిపోయింది. కానీ, అతడే గెలిచి యుండిన యెడల ఈ తెలుగువారును, ఆ కన్నడిగులను అందరమును కన్యాకుబ్జ సామ్రాజ్యమును చేరిపోయి ఆ ఉత్తరాది భాషల వారికి దండములు పెట్టెడి వారము కదా? మేము తెలుగువారమై యుండియు, నిన్నటివరకు పల్లవరాజ్య ప్రజలుగా నుంటిమి. ఈనాడు వేంగిరాజ్య ప్రజల మైతిమి. పల్లవరాజ్యమును స్వాధీనము చేసికొనవలెనను కోరిక మీకు లేదా. మీ కోరిక నెరవేరినచో తమిళుల గతియేమి? వారు ఏ రాజ్యము వారు? వారు వేంగిరాజ్య ప్రజలగుదురా? కనుక జాత్యభిమానము, భాషాభిమానము ఇక చెల్లవు. బలమున్నవాని జాతియే ప్రజలజాతి. బలమున్న వాని భాషయే ప్రజల భాష" అని జయసింహ వల్లభునితో చెప్పిన మాటలు పిళ్ళెగారు తార్కిక ఆలోచనకు నిదర్శనం.

పులిరాజు చాళుక్య ఆడపడుచైన జయశ్రీని వివాహం చేసుకుంటాడు. పొన్నిదొర పల్లవ రాకుమారి అయిన వకుళను పెండ్లాతాడు. ఈ విధంగా అటవికులైన బోయ దొరలు నాటి పాలకులైన పల్లవ, చాళుక్యులతో వివాహ సంబంధాలు కలిగి ఉండడాన్ని బట్టి అప్పటికి ఇంకా కులవ్యవస్థ ద్రవస్థితిలోనే ఉందని స్పష్టమవుతుంది. ''చాళుక్యయుగంలో సామాజికంగా ఆసక్తికరమైన పరిణామాలు జరిగినాయి. అందొకటి-తరచుగా జరిగిన యుద్ధాల వల్ల, ఆగ్రహారాల ద్వారా, వ్యవసాయి విస్తరణ వల్ల బోయలవంటి ఆటవిక జాతులు నాగరిక సాంప్రదాయక సమాజంలో భిన్న కులాలలో చేరినారు'' అని డా. బి.యస్.యల్. హనుమంతరావు గారు చెప్పిన మాటలు నాటికాలంలో అనేక అటవిక జాతులు నాగరిక సమాజంలో చేరిన విషయాన్ని దృఢపరుస్తున్నాయి.

7వ శతాబ్దిలో దక్షిణ భారతదేశంలో పల్లవులు, చాళుక్యులు, రాష్ట్రకుటులు, పశ్చిమ గంగులు ప్రధాన రాజావంశాలు. వీరి సామ్రాజ్య విస్తరణాకాంక్షకి దక్షణ భారత దేశం మొత్తం ఒక పెద్ద యుద్ధశిబిరంగా తయారైంది. ఈ ప్రధాన రాజ్యాలు తమ రాజ్య రక్షణ కోసం సరిహద్దులలో సామంతరాజ్యాలను ప్రొత్సహించారు. బాణులు, వైదుంబులు, నోలంబులు, ముదిగొండ, వేములవాడ చాళుక్యులు మొదలైన సరిహద్దు సామ్రాజ్యాలు ఈ విధంగానే ఏర్పడ్డాయి. శత్రురాజులు తమపై దాడిచేసినప్పుడు ప్రధానరాజ్యాలు ఈ గడి సామంతుల్ని రక్షణ కవచాలుగా ఉపయోగించుకునేవారని తెలుస్తుంది.

''చాళుక్యులు చీటికి మాటికి పల్లవ రాజ్యముపై దండెత్తుచున్నారు. పల్లవుల ఉత్తర సరిహద్దు దుర్గము అణ్ణెక్కి దానిని దాటిన తరువాత చాళుక్య సైన్యము ఎకాఎకిని కందుకూరుపై పడుచున్నది. మధ్యలో బోయ కొట్టములు వంటి మరియొక అడ్డంకి ఉండుట మంచిది. బోయలు తమ స్థావరమును కాపాడుకొనుటకు ప్రాణము లొడ్డి పోరాడుదురు వారు మేటిధనుష్కులు చాటుదెబ్బ తీయుటలో నిపుణులు. సత్యాశ్రయుడు మొదటి దండయాత్ర చేసినపుడు ఈ బోయదొరలు చాటు దెబ్బ కొట్టి చాళుక్యసైన్యమునకు పెద్దనష్టము కలిగించిన విషయము అందరెరిగినదె. బోయదుర్గములు పటిష్ట మగుట పల్లవులకు లాభ దాయకము. కావున వారికి కావలసిన సహాయముచేసి వారిని కృతజ్ఞతాపాశముతో కట్టివేసుకోవలె'' అని జయ వర్మ ఆలోచించి, బోయలను ఆధరించాడు. జయవర్మ పథకం నాటి పాలకుల స్వార్థాన్ని తెలియజేస్తున్నాయి.

7వ శతాబ్దిలో పాలకులు నిరంతరం యుద్ధాలలో మునిగితేలారు. వీరి దండయాత్రల వల్ల పాడిపంటలు నాశనమయ్యాయి. యుద్ధాలు చెయ్యడానికి అధిక మొత్తంలో ధనం అవసరమైంది. ఈ ధనం కోసం పాలకులు సామాన్య ప్రజలు, చేతివృత్తుల వారు, వర్తకుల నుండి విపరీతంగా పన్నులు వసూలు చేశారు. ''పూర్వ మెప్పుడో ఆరింట ఒక భాగము పన్నుగా ఉండెడిది. అది నాలుగింట ఒక భాగమునకు హెచ్చెను. ఇప్పుడు మూడింట ఒక భాగమునకు హెచ్చిపోయెను. ప్రజలకు సుఖశాంతులు నిప్పచ్చర మాయెను. ఇది ఇప్పటి భరతఖండ స్వరూపము, స్వభావము'' అని చెప్పిన అర్క భట్టారకుడి మాటలు ఆనాటి ప్రజల దుర్భర పరిస్థితులని తెలియజేస్తున్నాయి. అందుచేతనే 'రాజు సామీప్యం' ఈతి బాధలలో ఒకటిగా పేర్కొన్నారు.

సాధారణంగా నవలల్లో వ్యవహారిక, మాండలిక భాషలను ఉపయోగిస్తారు. కాని ఈ నవలను పిళ్ళెగారు సరళ గ్రాంథికంలో రాశారు. ''నేడు వ్యవహారిక భాష ప్రాంతీయ, మాండలిక, వర్ణ, వర్గ, వాద భేదాలతో కొట్టు మిట్టాడు చున్నది. పరస్పర విద్వేషములను కూడా సృష్టించుచున్నది. పత్రికలలో అతి జుగుస్సాకరమైన వ్యాఖ్యానాలు జరుగుచున్నవి. కనుక ఇప్పుడు నేను ఈ నవలను సరళ గ్రాంథికములో వ్రాయుటకు పూనుకొన్నాను'' అని పిళ్ళెగారు ఈ నవల సరళ గ్రాంథికంలో రాయడానికి కల కారణాన్ని పేర్కొన్నారు. రచయిత మాటలు కొంత వరకు

వాస్తవంగా కనిపిస్తున్నాయి. తెలంగాణ మాండలికంలో రాసిన నవలలు కోస్తా, రాయలసీమ ప్రాంతాల వారికి, అదే విధంగా రాయలసీమ మాండలిక నవలలు మిగిలిన రెండు ప్రాంతాల వారికి చదవి, అర్థం చేసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. పిళ్ళెగారి ఈ నవలను తెలుగు వారందరికి అర్థమయ్యేలా సరళ గ్రాంథికంలో రాశారు.

ఈ నవల్లో పిళ్ళెగారు స్త్రీ పాత్రలను అత్యున్నతంగా చిత్రించారు. మొదటి వీరనబోయని మరణాంతరం బోయకొట్టాల బాధ్యతను అతని భార్య మంగసాని నిర్వహిస్తుంది. చాళుక్యరాజు జయసంహ వల్లభుడు బోయ కొట్టాలపై దాడి చేసినప్పుడు మంగసాని తన మాటలూ, చేతల ద్వారా అతనిని ప్రసన్నం చేసుకొని, బోయలను కాపాడుతుంది. రెండవ వీరనబోయనికి అతని పిన్న తల్లి అన్నె మసాని మార్గదర్శిగా ఉంటుంది. రెండవ వీరనబోయని భార్య జయశ్రీ బోయల్లో చాళుక్య నాగరికత చొప్పించడానకి ప్రయత్నింస్తుంది. ఆమె ప్రభావం వలన బోయలు పల్లవులతో యుద్ధం చేయ్యవలసి వస్తుంది. పొన్ని బోయని భార్య, పల్లవరాకుమారి అయిన వకుళ బోయలలో కలసిపోయి, బోయస్త్రీలతో సైన్యం తయారు చేస్తుంది. కడియరాజు బోయకొట్టాలపై దాడి చేసినప్పుడు అతనిని ఓడించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ''ఒక చాళుక్య వనిత ఆనాడు ఒక బోయయువకుని పెండ్లాడి వానిని చాళుక్యునిగా మార్చివైచినది. ఈ నాడు ఒక పల్లవ వనిత బోయదొరను పెండ్లాడి తానే బోయవనితగా మారుచున్నది. ఓ స్త్రీ నీవు ఎంతకైనను తగుదువు ఏమైనను చేయగలవు. ఏ రూపమునైనను ధరింపగలవు. నీకు అసాధ్యమేదియు లేదు. నీకు జోహార్లు'' అని పొన్నిబోయడు అన్న మాటలు ఈ నవలలో స్త్రీల సామార్థ్యానికి నిదర్శనం.

ఈ నవల ద్వారా పిళ్ళెగారిని గొప్ప సంఘసంస్కర్తగా చెప్పవచ్చు. బ్రాహ్మణులు ఒక స్త్రీ చేత సహగమనం చేయిస్తున్నప్పుడు, కసవనబోయడు అడ్డుపడి ఆమెను కాపాడుతాడు. ఆ సందర్భంలో కసవనబోయడు అక్కడ ఉన్న బ్రాహ్మణులను ''మీరు ఏ మహారాజుకైనను మొఱ పెట్టుకొనుడు. నాకు లెక్కలేదు. నా బొందిలో ప్రాణమున్నంత వరకు నా నేలపైన ఇటువంటి క్రూరకర్మ జరగనివ్వను'' అని హెచ్చరిస్తాడు. ఈ సందర్భంలో పిళ్ళెగారు కనవనబోయని పాత్రను రాజారామ్మోహన్ రాయ్ కి ఆదర్శం అన్నట్లుగా చిత్రించారు.

సహగమనాన్ని అడ్డుకున్నప్పుడు బ్రాహ్మణులు 'మా ఆచారవ్యవహారాల్లో ఇతర కులస్తుల ప్రమేయాన్ని ఒప్పుకోము' అని వీరనబోయని అడ్డుకుంటారు. అప్పుడు వీరనబోయడు 'ఈ బ్రాహ్మణ శరీరం శూద్రులు పెట్టిన తిండితో బలిసింది. మీకు దానాలూ, సంభారాలూ, మాన్యాలూ ఇవ్వడానికి శూద్రులు కావాలి. మీ వ్యవ హారాలు విచారించడానికి శూద్రులు పనికి రారా? మా రాజ్యంలో బ్రాహ్మణులకు ఒక ధర్మం. ఇతరులకు మరొక ధర్మం లేదు. అందరికీ ఒకే ధర్మం' అని బ్రాహ్మణులతో అన్న మాటలు పిళ్ళెగారి సర్వసమానత్వ భావనకు నిదర్శనం.

ఈ నవలలో పిళ్ళెగారు ముమ్మొనవాలు(త్రిశూలం), కుడుకలు, కంచుకములు, సాతు, గొల్లెనలు, బచ్చులు, తాపలు, గోతములు దుత్త, బానసము(వంటగది), ఒజ్జలు, బొక్కెనలు మొదలైన అచ్చ తెలుగు పదాలు ఉపయోగించారు. ''నేడు మనం మాట్లాడే భాషలో అన్యదేశ్యపదాలు కోకొల్లలు. అన్యదేశ్యాలు లేకుండా మనం కాస్సేపుకూడా మాట్లాడటం దుస్కరం. నవల ప్రాచీన కాలానికి చెందినదవటంవల్ల అన్యదేశ్యాలు సుతరామూ వాడకుండా దేశ్య తత్సమ తద్భవాలతోనే కథ నడిపించారు. మన భాషలోని దేశ్య శబ్దాలు అనేకం నేడు అటకెక్కాయి. అటకెక్కిన దేశ్యపదాలను ఆత్మీయంగా స్వీకరించి నవలలో పిళ్ళెగారు ఉప యోగించారు'' అని గాడేపల్లి దివాకరదత్తు గారు ఈ నవల ముందు మాటలో పేర్కొన్నారు.

ఏ కావ్యానికైనా సామెతలు, జాతీయాలు మరింత శోభను చేకూర్చుతాయి. ఈ నవల్లో పిళ్ళెగారు 'ఆబోతులు

ఆబోతులు పోట్లాడుకొనగా మధ్య దూడలు నలిగినట్లు' 'ఏనుగు పోటు కంటె ఇరుపోటు మేలందురు' 'చెట్టు లేని చోట ఆముదపుచేట్టే మహావృక్షము' 'పాలు త్రాగిన రొమ్మునే గ్రుద్దెడివారు' 'తిన్న ఇంటి వానములు లెక్కపెట్టెడి వారు' మొదలైన సామెతలను ప్రయోగించారు. అదేవిధంగా 'యథా రాజా తథా ప్రజా' 'కడుపున అగ్గిపోసినట్లు' 'చెప్పుకింద తేళ్ళవలె' మొదలైన జాతీయాలు ఉపయోగించారు. ఈ విధంగా పిళ్ళెగారు ఈ నవలను అచ్చమైన తెలుగు కావ్యంగా రూపొందించారు.

ఈ నవల పిళ్ళెగారి వర్ణన నైపుణ్యాన్ని, భాషా ప్రయోగ సామర్థ్యాన్ని మన కళ్ళ ముందుంచుతుంది. బోయలు చాళుక్యుల పాలనలో ఉన్నప్పటికీ, వారికి మొదట ఆదరించిన పల్లవులంటె ఇష్టం. ఈ విషయాన్ని రచయిత 'మాటలు చాళుక్యుల వైపు ఎదలు పల్లవుల వైపు' అనే చిన్న వాక్యంలో వ్యక్తం చేశాను. వకుళ వ్యక్తిత్వాన్ని 'వకుళ శక్తియందు అపర దుర్గ, భక్తియందు ప్రహ్లాదమూర్తి' అనే ఒక్క వాక్యంలో ధ్వనింపజేశారు. ఈ నవలను పిళ్ళెగారు తన తెలుగు భాషా పరిజ్ఞానానంతా ఉపయోగించి అత్యంతాద్భుతంగా రచించారు.

"తూర్పు చాళుక్య రాజ్యస్థాపనతో మధ్యయుగం ప్రారంభమవుతుంది. రాజకీయ అనైక్యత, అంతర్యుద్ధాలు, వ్యవసాయ ఆర్థిక విధానం, పురోహితుల ప్రాబల్యం, మూఢవిశ్వాసాలతో కూడిన మతం విద్యాలకు ఆధారం కావడం వంటి మధ్యయుగ లక్షణాలీకాలంలో స్పష్టంగా కన్పిస్తాయి" అని డా. బి.యస్.యల్. హనుమంతరావు గారు చెప్పిన మాటను నవలగా రాస్తే అది బోయ కొట్టములు పండ్రెండు.

బోయకొట్టములు పండ్రెండు అసలుసిసలైన తెలుగు వీరుల వీరగాథ

"ఈ నవలలోని -

ఇతివృత్తం కావ్యేతివృత్తం,
భాష కావ్య భాష,
శైలి కావ్య శైలి,
కల్పనలు కావ్య కల్పనలు,

ఇది తెలుగువారు తప్పక చదవవలసిన వచన మహా కావ్యం" అని అన్న గాడేపల్లి దివాకరదత్తు గారి మాటలు ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కరణం బాల సుబ్రహ్మణ్యం పిళ్ళె - బోయకొట్టములు పండ్రెండు, అమర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, మదనపల్లి, డిసెంబర్ 2013.
2. ఆచార్య జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష (మొదటి సంపుటి), నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి, ఆగష్టు 2004.
3. శ్రీ వేటుకూరి ప్రభాకర శాస్త్రి - సింహావలోకనము, మంజరి ప్రచురణలు, ముక్యాల, 1955.
4. నన్నెచోడుడు - కుమార సంభవం, జొన్నలగడ్డ మృత్యుంజయరావు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1994.
5. డాక్టర్ బి.యస్.ఎల్. హనుమంతరావు - ఆంధ్రుల చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, జూలై 2014.
6. పి.వి.కె. ప్రసాదరావు - ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర, ఎమెస్కో బుక్స్, విజయవాడ, జనవరి 2008.

7. డా॥ పింగళి లక్ష్మీకాంతం - ఆంధ్ర సాహిత్య చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1974
8. డా॥ దివాకర్ల వేంకటావధాని - ఆంధ్ర వాఙ్మయ చరిత్రము, ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్, 1961
9. ఆరుద్ర - సమగ్ర ఆంధ్ర చరిత్ర (మొదటి సంకలనము), తెలుగు అకాడమి, హైదరాబాద్, 2012
10. శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) - మహా ప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, జూన్ 2006
11. కె.కృష్ణారెడ్డి - భారతదేశ చరిత్ర (ప్రాచీన యుగం), ఓరియంట్ బ్లాక్ స్వాన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్, 2016.
12. డా.నెలటూరు వేంకటరమణయ్య - పల్లవులు-చాళుక్యులు, వేదము వేంకటరాయ శాస్త్రి అండ్ బ్రదర్స్, మద్రాసు, 1969.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆచార్య నరసింహారెడ్డి కవితల్లో సమసమాజ చిత్రణ

– డా॥. బ్రుక్మాచందరెడ్డి, పోస్ట్ డాక్టొరల్ ఫెలో, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

"నా మదిలో వేదన
హృదిలో యాతన
ఏ కావ్యకన్యకను కనేందుడో!
ఏ భావసౌధ వినిర్మాణానికో!!"

ఆచార్య పాపిరెడ్డి నరసింహారెడ్డి రాయచోటి తాలుకాలోని పెద్దకాల్వపల్లి సమీపంలో కటనకింద పాపిరెడ్డిగారి పల్లెలో జన్మించారు. వ్యవసాయాధారిత మధ్యతరగతి ఉమ్మడి కుటుంబంలో రామిరెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు నాల్గవ సంతానం. పువ్వుపుట్టగానే పరిమళిస్తుందన్న పెద్దలమాటను నిజం చేస్తూ రెడ్డిగారు ఆడుతూ పాడుతూ, మధ్యమధ్యలో ఆర్థిక పోట్లకు గురౌతూ విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుని స్థాయినుండి విశ్వవిద్యాలయ ఆచార్యుల దాకా తన ప్రస్థానాన్ని నిరాటకంగా కొనసాగించారు. తన అనుభవాలను తను చూసిన ప్రత్యక్ష విషయాలను కవిత్వీకరించడం ఆయన హాబీ. ఇందులో భాగంగా 'భావవిహంగాలు', 'అనుభూతుల పొదరిండ్లు' శీర్షికల్లో కవితాసంకలనాలను వెలువరించారు. వ్యాకరణాచార్యులుగా, తెలుగు సాహిత్యాన్ని ఔపోసన పట్టిన వీరి రచనల్లో భాష కాస్త కఠువుగానే ఉంటుంది. కొరికి చప్పరిస్తేనే ఆ రుచి ద్యోతకమౌతుంది.

రాసినవి కొన్ని కవితలే అయినప్పటికీ రాశి కాన్న వాసి ముఖ్యమన్న విషయం తెలుస్తుంది. రెడ్డిగారి కవితల్లో సమసమాజ వాతావరణాన్ని పరిశీలిద్దాం.

ప్రసిద్ధ తెలుగుకవి తిలక్ తన "హేమంత హసంతిక' అనే వ్యాసంలో కవిత్వాన్ని గురించి ఇలా అంటాడు. "ఫీలింగులకు సంబంధించినది కవిత్వం. ఇంద్రియాలు, ఉద్రేకాలు కవి విహరించే క్షేత్రాలు... సమాధిలో, సాధనలో ఒక జ్ఞాని సాధించగలిగిన దాన్ని కవి కులాసాగా తన ఫీలింగ్ ద్వారా పొందగలడు".

తిలక్ తన 'నవత - కవిత' ఖండికలో కవిత్వం ఏం చేయాలో ఈవిధంగా చెబుతాడు. "కవిత కొత్త అనుభవాల కాంతిపేటికను తెరవాలి". "కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి".

విమర్శకులు సమనమాజ స్పృహను కలిగించే కవితల్ని అభ్యుదయ కవిత్వంలో భాగమని వింగడించారు ఆచార్య సినారె అభ్యుదయ కవిత్వ లక్షణాలను తన సిద్ధాంతగ్రంథం ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు - ప్రయోగములలో పేర్కొన్నారు.

సమసమాజం నిర్మాణం కావాలంటే పేద, ధనిక, కుల, మత నిర్మూలనం కావాలి. సమాజంలోని అవినీతి, లంచం లాంటివి నశించాలి. వీటిపై కవి తన కవితల రూపంలో తన మనోగతాన్ని ఆవిష్కరిస్తాడు.

పేదవారిపై ధనికుల ఆధిపత్యాన్ని, వారి శ్రమను ఎలా జుర్రుకుంటారో కవి తన 'ముసుగు తీస్తే' కవితలో ఇలా అంటాడు.

"అసత్యం ఏనుగుపై అధర్మం అంబారీలో
అవినీతి వెలిగిస్తూ అవకాశ వేదాలు వల్లిస్తూ
సమాజానికి కట్టిన సమాధిలా
ఆ లక్షగారు..... "

(అ.పొ. పుట 18)

బిచ్చగాళ్ళ పరిస్థితిపై కవికి జాలేకాక వారుకూడా సాటి మనుషులే అనే భావన కనిపిస్తుంది. వారిని చూస్తుంటే ధర్మదేవత వివిదాంగాలు వాళ్ళలో ఉన్నట్టు ఊహిస్తాడు.

"సత్యం సత్తుబోకితో ధర్మం ఊతకర్రతో
నిజాయితీ కంకాళంతో సమాజానికి సజీవ ప్రతీకలా
ఈ బిచ్చగాడు! ....."

(అ.పొ. పుట 18)

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

పేదవాని జీవితం చాలా ఇరుకైనది. ఎన్ని అడ్డుగోడలు అతనిచుట్టూ, పాపపుణ్యాల ప్రహరీలు, నీతినిజాయితీల అగడ్తలు అతన్ని బందీని చేస్తుంటాయి. సమాజంలో ప్రతి బీదవాడు తన అస్తిత్వాన్ని, తన దారిద్ర్యాన్ని సమాజానికి తెలియపరచడానికి భయపడ్తాడు, బిడియపడతాడు.

"చేతులు... చేతులు...
లేని డబ్బుల్ని పిసుక్కుంటూ
జోబీలో సొమరిగా తారాడే చేతులు
జోబిలో పెట్టి లేమితో కాల్చుకోవడమెందుకని
పై పైనే సవరిస్తూ కొన్ని"

రామరాజ్యంలోనైనా, నేటి ఆధునిక సమాజంలోనైనా ధనికుల, పేదల స్థితుల్లో ఎలాంటి మార్పు లేదంటారు కవి.

పేదవాడికి కడుపులో మాత్రమే ఆకలి ఉంటుంది. అంటే తన జానెడు పొట్టనిండితే సంతృప్తి చెందాలను కుంటాడు. ధనికుడికి శరీరమంతా ఆకలిగా ఉంటుంది. ఎంత ఉన్నా ఇంకా సంపాదించాలన్న ఆశ అధికంగా ఉంటుంది.

"రాముడి కాలంలోనైనా
బలరామానుజుడి కాలంలోనైనా
లేనోడు లేనోడే
ఉన్నోడు ఉన్నోడే
లేనోడికి కడుపులోనే ఆకలి
ఉన్నోడికి ఒళ్ళంతా ఆకలి"

(భావవిహంగాలు, పుట 79)

మధ్యతరగతి ప్రజల దైనందిక జీవితాలు, వారి ఈతి బాధలు రచయితకు బాగా తెలిసినవే. అనుభవంతో ఉన్నవి కొన్నైతే తాను కళ్ళారా చూసినవి మరికొన్ని. మధ్య తరగతి మనిషి తనకు ఏమీ లేకున్నా అన్ని ఉన్నాయన్న భ్రమతో బ్రతకాలంటాడు. తన బాధలు ఇంకొకరికి తెలియకూడదని ఆరాటపడుతుంటాడు. 'మధ్యతరగతి మనిషి' అనే ఖండికలో

"అప్పుల పెంటకుప్పల్లో
ఆనందరత్నాన్ని వెతికే
అభాగ్య ఆశాజీవి
మధ్యతరగతి మనిషి"

ప్రభుత్వాలు మధ్యతరగతి వారిని అందల మెక్కిస్తా మని ఓట్లకోసం ఏవేవో వాగ్దానాలు చేస్తుంటాయి. అవి తీరక మధ్యతరగతి వారి పరిస్థితి త్రిశంకుస్వర్గంలా తయారౌతుందని తన 'త్రిశంకుస్వర్గం' ఖండికలో పేర్కొంటాడు.

"విశ్వామిత్ర ప్రభుత్వం
ధనిక స్వర్గంలోకి చేర్చేందుకు విఫలమై
మధ్యతరగతి త్రిశంకు స్వర్గం
మనకోసం సృజించింది"

తన నర(క)లోకం ఖండికలో డబ్బు తీసుకొని మార్కు లేసే అధ్యాపకులను తప్పపడతాడు. విద్యాధికార్లు లంచాలకు అలవాటుపడి ఉపాధ్యాయులు పాఠశాలలకు పోకున్నా వారిని కాపాడుతున్న దౌర్భాగ్యాన్ని ఈసడించుకొంటాడు.

"డబ్బులిస్తే మార్కులేసే
అధ్యాపక దగాకోర్లూ...
విజిట్‌కు, ఇన్స్పెక్షన్లకు
అయ్యవార్ల ఎంగిళ్ళు తినే
విద్యాధికారి కాకిమూకలూ..."

నేడు ఉద్యోగాలు రావాలంటే లంచం, రెకమెండేషన్ తప్పనిసరి. ఈ రెండూ ఉంటేగాని ఉద్యోగాలు రావడం కష్టమని 40 సం॥రాల క్రిందటే సూచించాడు. బహుశా తన ఉద్యోగ ప్రయత్నంలోనో లేక ఎక్కడనో చూసే ఉంటారు కాబోలు.

"ఉత్తరాయణ, దక్షిణాయణాల్లేందే
ఉద్యోగం నాస్తి, నాస్తి అని
ఉద్యోగామిష ఖండాల్ని పబ్లిగ్గా
వేలం వేస్తున్నాయి
పెద్దమనిషి గద్దలు"

మహిళల మీద జరిగే అఘాయిత్యాలను, అత్యాచారాలను తనకు తానుగానే ఎదుర్కోవాలని, తిరగబడాలని మహిళాలోకాన్ని మేల్కొమంటాడు కవి. తన 'మహిళ'

ఖండికలో

"మానినీ ప్రాణ సమమానాన్ని
హరించిన వాని పంచప్రాణాల్ని
ఉరితాడుకు ఎరచేయని
ఈ సీతా ద్రౌపదుల దేశంలో
తన జాతిని
తన నీతిని
రక్షించుకునే హేతి
నాతి అని నిరూపించాల్సింది
నువ్వే!.... నువ్వే!!
మహిళా!"

సమాజంలో అసమానతలున్నప్పుడు సమసమాజ స్థాపన సాధ్యంకాదని, తిరుగుబాటు తప్పదంటాడు కవి. తన 'అంతస్థులు' ఖండికలో పై అంతస్థువారు కింది అంతస్థువారిని ఎదగనీయకుండా అణగదొక్కుతుంటారన్న నిజాన్ని తన కవితలో అందంగా తూర్పారబట్టారు.

"కింది అంతస్థు
మీది అంతస్థుకు
పునాదే - కాదనను
కానీ కన్నెత్తి చూడకు
పై అంతస్థువాడు
కళ్ళలో దుమ్ము పోస్తాడు
తలెత్తి వీక్షించడం విప్లవం
పాపం
నీ తల పగుల్తుందే? అంటూనే
బండేస్తాడు
నీ నెత్తిన" (భా.వి. పుట 85)

పై విధంగా సభ్యసమాజంలోని డొల్లతనాన్ని వేలెత్తి చూపడమేకాక అసమానతలు పెరిగినపుడు సంఘర్షణ తప్పదంటాడు రెడ్డిగారు.

మకిలిపట్టిన మానవుల హృదయాలను శుద్ధి చేయాలని, అసమానతలు మరిచి సంఘజీవులుగా అందరూ కలిసి మెలిసి ఉండటానికి కలాన్నే హలంగా చేసి మనుషుల హృదయక్షేత్రాలపై సంతోష ధాన్యసిరిని పండిస్తానంటాడు. తన కవితామృతంతో దురాచారాలకు బలైన మనుషులను పునరుజ్జీవులను చేసి నిజమైన మానవులుగా తయారు చేస్తానంటాడు కవి తన 'కవిత్వం' ఖండికలో

"కవిత్వంలోనే అంతర్నిహితంగా
నా కలాన్నే హలంగా జేసి
మీ హృదయోసర క్షేత్రాల్ని దున్ని
సంతోషాల ధాన్యాన్ని
సంచులు సంచులుగా పండిస్తాను
కలాన్నే కత్తిగా జేసి
మీ దురాచారాల గొంతులు కోసి
నా కవితామృత సేచనజేసి
పునరుజ్జీవనం మీకిస్తాను
నిజమైన మానవులుగా
మీరు నిలబడేందుకు"

ఆచార్య నరసింహారెడ్డి రాసింది తక్కువే అయినా ఆశించింది చాలా ఎక్కువ. తనను కలలుగన్న సమసమాజమేర్పడాలని ఆకాంక్షిస్తూ అదే విషయాన్ని తన విద్యార్థులకు ప్రబోధం చేసే ఈయన ధన్యుడు. తాను కలలుకన్న రాజ్యం రావాలని అందులో మనందరం సుఖంగా ఉండటానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆశిద్దాం.

ఆధారగ్రంథాలు :

1. తిలక్ కవితాశిల్పం, ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్, 15-96/5, పద్మావతినగర్, తిరుపతి, 1990.
2. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు (సిద్ధాంతగ్రంథం), ఆచార్య సి.నారాయణరెడ్డి, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాద్, మచిలీపట్నం, 1977.
3. భావవిహంగాలు (కవితల సంపుటి), ఆచార్య పాపిరెడ్డి నరసింహారెడ్డి, తిరుపతి, 1984.
4. అనుభూతుల పొదరిండ్లు, ఆచార్య పి.నరసింహారెడ్డి, తిరుపతి, 1995.

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు కవిత్వంలో తృతీయ స్వరం

(The Third Voice in Telugu Literature)

– జోశ్యుల దీక్ష, హైదరాబాద్.

"ఆడగా పుట్టలేదు తల్లిగా మారటానికి
మగగా మిగల లేము తండ్రులమై తరించటానికి
ఎటు కాని వాళ్ళమైపోయాము"

అంటూ థర్డ్ జండర్ లేదా హిజ్రాల యొక్క వేదనా స్వరాన్ని సహానుభూతితో వ్యక్తీకరించే ఒక మంచి ప్రయత్నం ఇటీవల జరిగింది. 1980, 90 దశకాల్లో స్త్రీల, దళితుల ఆవేదనల్ని అక్షరీకరిస్తూ అనేక కవితాసంపుటులు వచ్చాయి. ఆ తరువాత మైనారిటీ, బి.సి. కవిత్వాలూ బలంగా వినిపించాయి. ఇలా తమ బాధల్నీ, వేదనల్నీ ఎవరికి వారు చెప్పుకొంటూ వచ్చారు. అయితే మరి ట్రాన్స్‌జండర్స్‌గా చెప్పబడే ఆడ-మగ కాని ఈ మూడో రకం వ్యక్తుల హృదయ వేదనల్ని ఎవరు చెపుతారు. ఎవరు ఈ భావాలకు అక్షర రూపాన్నిస్తారు. ఎవరు వీరి హృదయాలను తడిమి కవిత్వం రాస్తారు? అసలు ఎవరు వీరికంటూ ఒక మనసు ఉంటుందని, అలా పుట్టటం, పెరగటం వారి తప్పుకాదని సమాజానికి కవిత్వరూపంలో ఒక మెసేజ్ ఇవ్వగలరు. అసలు కనిపిస్తేనే, లేదా ప్రక్కన నుంచుంటేనే ఒళ్ళు జలదరించే వీరిని గూర్చి ఎవరు రాయాలనుకొంటారు?

అలా అనుకొన్నవారే "తోట సుభాషిణి", "కంచర్ల శ్రీనివాస్". "The Third Voice (తృతీయ స్వరం)" అనే ఈ కవితా సంపుటిలో సుభాషిణి-16, శ్రీనివాస్-16 వెరసి మొత్తం 32 కవితలు రాసారు. డా॥ సీతారాం ఈ సంపుటికి విశ్లేషణాత్మకమైన ఒక చక్కని ముందుమాట రాసారు. "ఇంకా జ్వలిత" (దెంచనాల విజయలక్ష్మి) కె. ఆనందాచారి, సాదనాల వేంకట స్వామి నాయుడు, తోట సుభాషిణి, కంచర్ల శ్రీనివాస్‌లతో పాటు ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు దోమల మేరి కూడ ఈ సంపుటికి ముందు మాటలు రాసారు. విశేషమేంటంటే ఆ ముందుమాటలు కవిత్వంలానే ఎంతో ఆర్ద్రంగా ఉంటాయి. 2016లో దీన్ని ఆవిష్కరించారు.

ఎవరైనా తాము అనుభవించి రాయటం వేరు. ఇతరుల అనుభవాల్ని, ఆవేదనల్ని పరకాయ ప్రవేశంచేసి సహానుభూతితో అర్థంచేసికొని రాయటం వేరు. స్త్రీలు పెద్దగా రాయలేని రోజుల్లో గురజాడ, కందుకూరి వంటి వారు వారి కోసం రాసారు. దళితులు తమ బాధల్నీ వేదనల్నీ వ్యక్తీకరించకముందే దళితేతరులు వారి కోసం కవిత్వం రాసారు. అలాగే ఇక్కడ వేదన ఈ ఇరువురు కవులిదీకాదు. కాని ఈ బాధంతా తమదే అన్నంత ఫీల్‌తో రాసారు.

ఈ సంకలనంలోని కవితలన్నిటికీ "Third Voice" Black Flag, Broken Hearts, I want real life, Refuge, its engough" అంటూ ప్రతి కవితకు శీర్షికను ఇంగ్లీష్‌లోనే పెట్టి, కొన్ని కవితల చివరి రెండు వాక్యాలనూ ఇంగ్లీషులోనే రాస్తారు. తెలుగు కవితలకు ఇంగ్లీషు పేర్లేంటి? అనిపించవచ్చు. చెప్పదలచుకొన్న అంశాన్ని గట్టిగా, పదునుగా, సూటిగా పరహృద్భిదమై దూసుకుపోయేటట్లు చెప్పాలన్న తపనకావచ్చు. ముందుగా సుభాషిణి గారి స్వరాన్ని విందాం!

ఆడవారికి కొన్ని కలలుంటాయి. మగవారిలోనూ ఉంటాయి. కానీ మీకే కాదు "మాలోనూ కలలున్నాయి/ మాలోనూ కళలున్నాయి/ మగగా పుట్టినా / ఆడగా మారినా / మాలోనూ ఆశలున్నాయి / మాలోనూ కోరికలున్నాయి" అంటూ "We also have dreams" n' desires" అనే కవితలో మూడో గొంతును వినిపిస్తారు సుభాషిణి. అంతేకాదు అందమైన చీరకట్టులోను, మనోహరమైన ఆడబొట్టులోను మాకెంతో ఆనందం ఉందంటారు.

హిజ్రాలు, కొజ్జాలుగా పిలవబడే ఈట్రాన్స్‌జండర్స్ రైళ్ళలోను, బస్సుల్లోను, షాపులవద్ద చప్పట్లు కొడుతూ యాచిస్తూ ఉంటారు. కొందరైతే అసభ్యంగా అరాచకంగా ప్రవర్తిస్తారని, కొందరు బాలల్ని బలవంతంగా వారి వృత్తిలోకి దించుతారని వింటుంటాం. ఎక్కడైనా ఏ జండర్‌లోనైనా నేర ప్రవృత్తి కలవారు కొందరుంటారు. అందరూ అలానే ఉంటారనుకోవటం తగదు. ఇటీవల కరోనా లాగ్డౌన్ సమయంలో ఎందరో అభాగ్యులను ఆదుకొని అన్నం పెట్టిన ఒక హిజ్రాను గూర్చి వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో ఎందరినో ఆలోచింప జేసింది.

అసలు వీళ్ళెందుకు అడుక్కొంటారు? ఎందుకు ఈ అర్ధరాత్రి చాటుమాటు వ్యాపారం? అని మన కనిపించ వచ్చు. కాని ఎంత చదువుకొన్నా వారికి ఎవరూ ఏ ఉద్యోగం ఇవ్వరు. ఏ పనుల్లోనూ పెట్టుకోరు. మరి వాళ్ళేంచేస్తారింక? అందుకే ''మేమూ అందరిలా/ పగటిపూట పదికాసులు సంపాదించుకోవాలి/న్యాయంగా ధర్మంగా మా కాళ్ళమీద మేము నిలబడగలగాలి/We want Justice/We want power of Judgement'' అంటూ నినదిస్తారు సుభాషిణి గారి మాటల్లో.

మరొక బాధాకరమైన విషయం ఏంటంటే తల్లి దండ్రులు కూడా వీరి మన: ప్రవృత్తిని అర్ధం చేసుకోలేరు. పైగా వాళ్ళు అలా ఉంటున్నందుకు తిడతారు, కొడతారు, బెదిరిస్తారు. ఇంటి నుంచి గెంటేస్తారు కూడ. కొందరైతే ఈరకమైన మన:ప్రవృత్తితో ఇంట్లో ఇమడలేక పోతారు. అలాగని ఎక్కడికి పోవాలో తెలీదు. ఏంచెయ్యాలో తెలీదు. అందుకే ఇలా అంటారు సుభాషిణి. ''దేవుడిచ్చిన రూపాన్ని / జన్మనిచ్చిన లోకాన్ని వదిలి ఎక్కడికి పారిపోవాలి/ ఎవరిని నిందించాలి/పచారి కొట్టువాడి నుండి వాటర్ బాయ్ దాకా / ఎగాదిగా చస్తూ ఈసడించుకొంటుంటే/ మగనా, ఆడనా అని గుసగుసలాడుకొంటుంటే Where to go? Where ever we go?'' అని ఈ సమాజాన్ని సూటిగా ప్రశ్నిస్తారు ఈ ట్రాన్స్‌జండర్స్.

అంతేకాదు ఈ సమాజంలో కులవ్యవస్థకు బలైతే ప్రభుత్వ పథకాలున్నాయి. వర్గ వివక్షకు గురి అయితే రాజకీయ వ్యవస్థ అడ్డుపడుతుంది. మరి రెండే లింగాలని చెప్పే ఈ ఆస్తిత్వపు సమాజం ''మూడో లింగాన్ని కర్కశంగా నలిపేస్తుంటే/కాపాడేవారేరి?'' అంటూ Discrimination అనే కవితలో చాలాబలంగా, సూటిగా ప్రశ్నిస్తారు వీరు.

కావాలని ఎవరూ ట్రాన్స్‌జండర్స్‌గా పుట్టరు. అది ప్రకృతి శాపం. అయితే అవకాశం రావాలికాని మేము దైన్నైనా సాధిస్తాం. అవసరమైతే తట్టలు ఎత్తగలం, కుప్పలు మోయగలం, కూటికోసం కూలిపనులు చేస్తాం, పోటీచేసి రాజకీయనాయకులం కూడా కాగలం. ''మాలోను సత్తాఉంది/మాలోను కసి ఉంది/ కారుణ్యం దాగుంది'' అంటూ మేము ఎందులోనూ ఎవ్వరికీ తీసి పోము అంటూ సమాజానికి సవాలు విసురుతారు.

అయితే ఆ మధ్య ట్రాన్స్‌జండర్స్ కాకుండానే కొందరు రౌడీలు ట్రాన్స్‌జండర్స్‌గా వేషం మార్చుకొని రౌడీయిజంతో అటు ప్రజల్ని, ఇటు అసలైన ట్రాన్స్‌జండర్స్‌ని ఇబ్బందులు పాలుచేసిన సంఘటనలు విజయవాడ లాంటి పట్టణాల్లో జరిగాయి. ఆమధ్య మీడియాలో దీనిపై వార్తలు కూడా వచ్చాయి. ఆ అంశాన్నే తీసుకొని ''మాలోనూ కల్తీలున్నారు/మగాడిగా పుట్టి ఆడగానటిస్తూ/సమాజంలో మాకు చెడ్డపేరును తెస్తూ/మాలో లేని రౌడీతనాన్ని పెంచేసి/మాలో ఉన్న ఆడతనాన్ని తగ్గిస్తున్న బడా బాబులు'' అంటూ వాళ్ళకి మేము బుద్ధి చెపుతాం అంటారు.

ఇక ఈ సంపుటిలో కంచెర్ల శ్రీనివాస్ స్పృశించిన అంశాలు మరింత విలక్షణంగా ఉంటాయి. గర్వించే క్షణాలు, పంచుకొనే తీపి జ్ఞాపకాలు రాసుకోవడానికి మీకందరికీ నాలుగక్షరాలున్నాయి. ''ఇంకిపోని కన్నీళ్లు, సలిపే గుండెగాయాలు తప్ప నాకేం ఉన్నాయి''? అంటూ ప్రశ్నిస్తారు.

ఈ ట్రాన్స్‌జండర్స్‌ని చాలామంది Point Five అంటూంటారు. కంచెర్ల శ్రీనివాస్ అదే శీర్షికతో "ఏ అంకెకూ సంఖ్యకూ కొరగాని/పాయింట్ ఫైవ్ బతుకు/ అస్థిత్వానికే తప్ప/ఆదరణకు నోచుకోదు" అంటూ పాయింట్‌ఫైవ్ అనే పదాన్ని ఉచ్చరించగానే వాళ్ళ హృదయాలకయ్యే గాయాన్ని తడుముతారు.

అంతేకాదు సాధారణంగా అబ్బాయిపుడితే ప్లస్ అని, అమ్మాయి పుడితే మైనస్ అని అంటూంటారు. చాలా ఇళ్ళలో వినిపించే మాట ఇది. మరి "అటు ప్లస్‌లేదని/ ఇటు మైనస్సూ కాదని/ఏ హోదాకు నోచని సంకేతాలం" మా మాటేంటి? అంటూ ప్రశ్నిస్తారు శ్రీనివాస్ మాటల్లో వీరు. అలాగే "Yes he is" అనే కవితలో పంచములను సృష్టించినోడి వారసుడో, మనుధర్మం ప్రకటించినోడి సోదరుడో మనిషి ధర్మం మరచి మమ్మల్ని బృహన్నలగా, ఎటూ కాని ఆడంగిగా పుట్టించాడంటారు.

ఈ సంకలనంలో ట్రాన్స్‌జండర్ల ప్రాధేయింపు ధోరణి కనిపిస్తుంది. ప్రతిఘటన చైతన్యం విదితమవుతుంది. ధిక్కార స్వరం వినిపిస్తుంది. దళితులకు, స్త్రీలకు, బి.సి. లకు ఉన్నట్లే "ఓ నేతలారా! పోటీకి మాకోసీటేది/మాకొక రాష్ట్రం కావాలి, రాజ్యం కావాలి/పాలకులం మేము అయ్యే అవకాశం దక్కాలి/చప్పట్లు చరిచి అర్థించే మా చేతుల చేవ ఏంటో చూపుతాం" - అంటూ సవాలు చేస్తారు. అవును నిజంగానే వాళ్ళకొక అవకాశం ఇస్తే వాళ్ళేదైనా సాధించి తీరతారనిపిస్తుంది.

హిజ్రాలుగా పిలవడే ఈ ట్రాన్స్‌జండర్స్ చరిత్ర చాలా పురాతనమైనది. వాత్స్యాయన కామసూత్రాలలో తృతీయ ప్రకృతి గురించి వివరించారు. రామాయణంలో రాముడు వనవాసానికి వెళ్ళే సమయంలో, భారతంలో అహిరావణుడు యుద్ధానికి వెళ్ళే సమయంలోను వీరి ప్రాస్తావన ఉంది. 2014 ఏప్రిల్ 15న సుప్రీంకోర్ట్ ప్రత్యేక రూలింగ్ ద్వారా కొన్ని సమాన హక్కుల్ని కలుగజేసింది. అయితే అవికాగితాలకే పరిమితమైతే సమానత్వమెలా సిద్ధిస్తుందని ప్రశ్నిస్తారు వీళ్ళు. "మరుగుదొడ్ల నుంచి సంక్షేమ పథకాల దాకా / ప్రతి చోటా పురుషులు స్త్రీలు అన్న సూచికలేతప్ప/ ఏ లెక్కలకురాని మా మూడోవర్గానికి సదుపాయాలేవి?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారు వీరు.

ఇంతకు మునుపు తెలుగులో వీరిని గూర్చి ఒకటో, రెండో కవితలు మాత్రం వచ్చాయి. ఒక సంపుటిగా రావటం మాత్రం ఇదే ప్రథమం. తనకి చిన్నప్పటి నుంచీ ఆడా-మగ కాని వ్యక్తులను చూసినప్పుడల్లా ఎన్నో ఆలోచనలు కలచి వేసేవని, అనుకోకుండా ఒక హిజ్రా ఆత్మకథని చదవటంతో వేదనాభరితమైన వీరి ఆలోచనల్ని, జీవితశకలాల్ని కవిత్వీకరించాలన్న ఆలోచన కలిగిందని సుభాషిణి ముందు మాటలో అంటారు.

మగ శరీరంలో ఇమడలేక, ఆడతనాన్ని పొందలేక కన్నవారి కోపగింపు, వీధివాళ్ళ ఈసడింపు, అయినవారి ఏవగింపు, సమాజపు చీదరింపులతో ఎక్కడికి పోవాలో తెలియని ఈ అభాగ్యుల వేదనల్ని సమాజం ముందుపెట్టి ప్రశ్నించాలన్న ఉద్దేశ్యంతో సుభాషిణీ, శ్రీనివాస్‌లు తృతీయ స్వరాన్ని మంచి అభివ్యక్తితో చాలా బలంగా వినిపించారు. ఈ సంపుటి చదివాక ట్రాన్స్‌జండర్ల పట్ల ఉన్న తేలిక భావం, అవహేళన దృక్పథం మన మనసుల్లోంచి చెరిగి పోతాయి ఈ కవులు ఆశించేది కూడా అదే.

ఇటీవలే వివిధ కోణాల్లో ట్రాన్స్‌జండర్ల సమస్యల్ని విశ్లేషిస్తూ "అస్మిత" అనే కథా సంపుటిని దేశవ్యాప్తంగా ఆవిష్కరించారు. అస్మిత, కోవూరి చారిటబుల్ ట్రస్టు, ఐద్వా సంయుక్తంగా నిర్వహించిన కథలపోటీలో బహుమతి పొందిన కథలతోపాటు, మొత్తం 19 కథలను ఎంపిక చేసి ఈ సంకలనాన్ని 2020, జూన్ 25న ఆవిష్కరించారు. భవిష్యత్తులో వీరిని గూర్చి వివిధ ప్రక్రియలలో మరింత విస్తృతమైన సాహిత్యం రావాలని ఆశిద్దాం !

ఆధార గ్రంథాలు :

1. The Third Voice 2. అస్మిత (తృతీయస్వరం) (కథానికల సంకలనం) కవితా సంకలనం; మే-2016 జూన్-2020. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జయప్రభ కవిత్వంలో సామాజిక విశ్లేషణ

– డా॥. కె. ఈశ్వరమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, డి.ఆర్.డబ్ల్యు. కళాశాల, గూడూరు, నెల్లూరు జిల్లా.

స్త్రీవాద రచయిత్రులలో ప్రత్యేకంగానూ, ప్రముఖం గానూ చెప్పుకోదగ్గ రచయిత్రి జయప్రభ స్త్రీవాద కవిత్వ రచన ప్రారంభించిన జయప్రభ అనేక గ్రంధాలు రచించారు. స్త్రీవాద రచయిత్రులు అంతకముందు వరకు ఎవరూ స్పృశించని, ఎవరూ గుర్తించని అనేక అంశాలను తెరపైకి తీసుకొని వచ్చి సమకాలీన సాహితీ వేత్తలలో ఆలోచనలను రేకెత్తించారు. అందులో ప్రధానమైనది జండర్ స్పృహ. సెక్స్, జండర్ అనేవి విభిన్న అంశాలు. సెక్స్ అనేది జన్మత: వచ్చేది ఇది శారీరక పరమైన అంశం. జండర్ అనేది మానసికమైనది, భావజాల పరమైనది. స్త్రీ పురుషునితో సమానం కాదు, స్త్రీ బలహీనురాలు అన్నభావం తరతరాలుగా సమాజంలో పాతుకొనిపోయి స్త్రీ పరమైన అంశాలు తక్కువ అన్న భావాన్ని వ్యక్త పరిచేవిగా ఉపయోగించ బడుతున్నాయి. " నేను గాజులు తొడుగుకున్నానా?, ఆడదానిలా నడుస్తున్నా వెందుకు?, ఈ పని స్త్రీలు చెయ్యలేరా?, మొదలైనవి జండర్ భావజాలానికి చెందినవి. స్త్రీ పురుష సమానత్వం కావాలంటే ఇలాంటి భావజాలాన్ని సమూలంగా రూపు మాపాలన్నది స్త్రీవాదుల అభిప్రాయం.

స్త్రీ వాద కవయిత్రులలో జయప్రభది ఒక పదునైనన కలం. తాత్విక స్పృహ పుష్కలంగా కలిగిన ఒక బలమైన గళం. మానవ సమాజంలో సగభాగమైన స్త్రీలు తమ ఉనికిని గుర్తెరిగి పురుషులతో సరిసమానమైన ప్రతిపత్తిని కాంక్షిస్తూ చేసే ప్రయత్నమే స్త్రీవాదం. స్వేచ్ఛ, సమానత్వం లేని సమాజంలో తమ హక్కుల కోసం స్త్రీలు పరాధీనతకు పితృసామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటం ఏదైనా స్త్రీవాదం అని చెప్పవచ్చు. తమని స్త్రీలుగా కాక మానవులుగా పరిగణించే ఒక క్రొత్త దృక్పధం కోసం స్త్రీ వాదం ప్రయత్నిస్తున్న ఈ బాటలో జయప్రభ గారు పయనిస్తూ తన కవితలలో జండర్ స్పృహను కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు. ప్రధానంగా జయప్రభ కవితలలో పితృస్వామ్యం,లింగవివక్ష, నడవడిక, యవ్వనం, అత్యాచారం, వివాహం, మాతృత్వం గర్భవిచ్ఛిత్తి, ఇంటిపని, లైంగిక స్వేచ్ఛ, అనే అంశాలు ప్రముఖంగా కనిపిస్తాయి.

జయప్రభ తన కవితలలో జండర్ స్పృహను ఏవిధంగా వ్యక్తం చేయగలిగారో పరిశీలిద్దాం :

జండర్ స్పృహ స్పష్టంగా కలిగిన జయప్రభ తన కవిత్వాన్ని ప్రత్యేకంగా " ఆడదానిగా రాసేను " అంటూ... తన ప్రతీ కవిత్వంలోనూ ఆడగొంతుకను వినిపిస్తారు. జీవితం ఆడవాళ్ళను వేరుగా, మగవాళ్ళను వేరుగా విడదీయరాదని, ఒకరిపై మరొకరి ఆదిపత్యం ఉండ కూడదని, జండర్ పరంగా హెచ్చుతగ్గులను వివరిస్తూ సంస్కృతి పరంగా, సమాజం పరంగా, వ్యక్తిగత పరంగా తన కవిత్వాన్ని కళ్ళకు కట్టినట్లు కవిత్వీకరిస్తారు.

తను పుట్టడానికోతల్లి
తను పిల్లల్ని పుట్టించడానికో పెళ్లాం తప్ప
మరో ఆడది భూమిమీద ఉండనక్కర లేని
పరమ కిరాతకానికి, మారణ హూమానికి
సాక్షులుగా నిలబడ్డ అవమానం మనది.
తలను వాడిపాదాలముందు
తనువు వాడిగుప్పెట్లోను పెట్టినందుకు
వాడి ఆజ్ఞలను శిరసావహించినందుకు
మనల్ని పుట్టనే వద్దంటాడు . . . . .

పుత్రుడు పున్నామి నరకం నుండి రక్షిస్తాడని, వంశోద్ధారకుడవుతాడని. వ్యామోహపు సిద్ధాంతాలతో స్త్రీ శిశువుల్ని కళ్ళుతెరవక ముందే కళ్ళుమూయించే రాక్షసత్వానికి ప్రతీకగా " రేపటి మన పిల్లల ప్రాణానికి " ఈ కవిత నిదర్శనం.

స్త్రీల శరీరాలు, ఆలోచనలు, ఆకాంక్షలు పురుషులచేత ఎలా నిర్దేశింపబడుతాయో "పదిలం" అనే కవితలో చూస్తే .....

చీరకుచ్చిళ్లు జారిపోగలవమ్మాయీ
పొట్ట చర్మానికి గుచ్చి పిన్ను పెట్టుకోమ్మాయీ
బ్రా హుక్కు తెగిపోతుందేమో పొరపాటున
పరువంతా పోగలదమ్మా ...పదిలం..పదిలం

"పైటని తగలెయ్యాలి " అనే కవితలో... పైట పురుష స్వామ్య భావజాలానికి ఒక బలమైన ప్రతీక. పురుషాధిపత్య సమాజం స్వార్థంతో రూపకల్పన చేసిన భావన పాతి వ్రత్యం. ఈనాటి స్త్రీ శవంలాగ కాక ఒక వ్యక్తిలాగా వుండాలని కోరుకుంటూ ఇలా అంటారు.

పైట కొంగును చూస్తే
నాకెందుకో పాతివ్రత్యం గుర్తొస్తుంది.
నువ్వు అడదానివంటూ హిప్నటైజ్ చేస్తుంది.
నేను నడిచే శవాన్ని కాకుండా వుండాలంటే
ముందుగా పైటని తగలెయ్యాలి

స్త్రీకి ఇష్టమైన వాడిపై తన అభిప్రాయాన్ని వ్యక్తపరచ డానికి కూడా స్వేచ్ఛ లేదంటూ . . . .

ఔనే శూర్పణఖ మోహాన్ని ప్రదర్శింప కూడదని
నీ రాక్షస మత గ్రంధాలేవి నీకు చెప్పలేదటే
ఘన ఆర్యపౌరుషేయ సంస్కృతిలో
మోహానికి ముసుగేయకుంటే. . . . మరి
అడదానికి ముక్కు చెవులు కోయరటే
లక్ష్మణుడే నీపై కోరిక ప్రకటిస్తే . . .అది
శృంగారమవుతుంది
నీ కోరిక మాత్రం తుచ్ఛా కామవికారమవుతుంది
అతడి చేతిలోని ఆ మొనతేలిన ఖడ్గం క్రింద ముక్క
లైనది నీ సౌందర్యమా
నీలోని వాత్సల్యమా
నీ సహస్ర వాంఛా సుమధళమా
తెలుసా వాల్మీకికి . . . ..

అంటారు జయప్రభ.

ఈ కవిత పురుషాధిక్య సమాజ దౌష్టానికి నిదర్శనం.

"చూపులు గుచ్చుకుంటాయి " అనే కవితలో.....

రెండు కళ్ళ నుంచి చూపులు
సూదులుల్లా వచ్చి - మాంసపు ముద్దలపై
విచ్చలవిడిగా తిరుగుచూ
సొంగకార్చె కుక్కల్లాంటి ఆకలుంటుందని
రోడ్డుమీద, బస్సుల్లోను, క్లాసుల్లోను,
వేసే ప్రతీ అడుగువెనక
శరీరంలోని ఏదో ఒక భాగాన్ని గాయం చేస్తూ
విషపు చూపులు గుచ్చుకుంటూ వుంటాయి. . . .

అంటూ ఒళ్ళంతా ముళ్ళుండే రోజు ఆడవారికి ఎప్పుడొస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తారు జయప్రభ.

"మానవి" అనే కవితలో. . . .

మాతృత్వమని, సతీత్వమని - మాయలు చేసి
మగవారికి పట్టం కట్టి - నన్నేమో మధ్య పెట్టి
మెడకో ఉరిత్రాడు చుట్టి - నాస్వేచ్ఛను మట్టు బెట్టి
నా చైతన్యాన్ని దోచాయి - తరతరాలుగా మూర్ఖపు నమ్మకాలతో
నన్ను నిర్వీర్యం చేశాయి.. . . . .

ఈ కవితలో జండర్ పరంగా మన సంస్కృతి స్త్రీ పురుషలను వేరు చేసి చూపడాన్ని గమనించవచ్చు.

"యశోధరా వగపెందుకే" అనే కవితలో . . ..

వారు భౌద్దులు తాపస్సులు - చింతలంటవు వారిని
జరామృత్యుభయాలుండవ్ - భోధివృక్షం క్రిందే
జ్ఞానోదయం అవుతుందని
వారికి ముందే తెలుసు - ఆ అర్ధరాత్రి అనంత యాత్రకి
ఆరంభం తెలియనిది నీకే
అష్టాంగ మార్గాన నువ్వుమాత్రం - అలా దిక్కుల్ని
చూడకే
యశోధరా నీవింక త్యాగాలు చేయకే

అంటూ ...పురుషుడు తానెంచుకున్న మార్గంలో నలిగిపోయేది సహధర్మచారిణి ఒక సిద్ధార్థుడు అత్రు పరిష్కరణకు అరణ్యాలలో అన్వేషించినా నిర్ధాక్షణంగా

విస్మరించినా, అక్షరధారలు ఎందరో యశోధరలు. పురుషుడి కార్యసాధనలో ప్రథమ తాంబూలం స్త్రీ ఆతాహుతేనన్న సంస్కృతిని ఆవిష్కరించింది ఈ కవిత.

"అమ్మమ్మ స్వగతం" అనే కవితలో . . .

అమ్మడూ ఏనభైఏళ్ళ నాబ్రతుకులో
నాదిగులు తీరింది రెండే రెండుసార్లు
ఒకటి మా అత్తగారు పోయినప్పుడు
రెండు మా ఆయన పోయినప్పుడు . ఎందుకంటే
అత్తగారి అదిరింపులతో ఒంచిన తలెత్తకుండా
అణుకువగల కోడలిగా
నటించి నటించి నానడుము వొంగి పోయిందే
నాతండ్రి వయస్సున్న ఆయన నాకుమోగుడెలా అయ్యాడో
తెల్లారగట్టే లేచి తలార స్నానం తప్పినందుకు
గింజుకింటూ రాత్రి వొళ్ళప్పగించినందుకు
తీరా నాకు స్వేచ్ఛ దొరికే నాటికి - మూడోవంతు నాజీవితం గడిచిపోయింది.

పుణ్యంకొద్ది దొరికిన పురుషుడు, ఆపురుషు, అతని కన్న తల్లి చనిపోయిన ఈ రెండు సందర్భాలలో దిగులు చెందాల్సిన కోడలు ఇక్కడ దిగులు తీరిందని సంతోషాన్ని ప్రకటించిన తీరు అమోఘం.

"వరలక్ష్మీ కవితలో"

అంట్లూ గిన్నెలు తోమి తోమి
కన్నాలు పడిన అరచేతులతో
రోజంతా యంత్రల్లా పనిచేశాక
రాత్రంతా నిద్దరోయే వుంటుంది
నిద్రలో ఆవిడ కలలెలాంటివో కన్నుక్కున్నవాళ్ళు లేరు

స్త్రీ ఇంటి చాకిరిని తప్పించుకోడానికి నెలలో ఆ మూడు రోజుల కోసం ఎదురు చూస్తారని వంటింటి పై యుద్ధం ప్రకటించాలని అంటారు. మైనార్టి రచయిత్రి తస్లీమా నస్రీన్ ముస్లిం ఫండ మెంటలిజమ్‌ను ప్రశ్నిస్తూ " లజ్జా " నవల రాసినందుకు మతపెద్దల కోపానికి గురై గృహ నిర్భంధంలో ఉండవలసి వచ్చిన దుస్థితిని ఇలా ఎండగట్టారు.

వీళ్ళున్నారే - తస్లీమా...
తిరుచూర్ణం దిద్దిన మనకే
అల్లాకే నాం అంతా మనమీదకే
వీళ్ళలో ఎర్రవాళ్ళుంటారు
నల్లవాళ్ళుంటారు
తెల్లవాళ్ళుంటారు...

జయప్రభ తనను తాను స్త్రీ గా ఆవిష్కరిస్తూ

నిశ్శబ్ధపు అంచున - కాంతి పుంజపు వెల్లువనై
అవనిని ఆక్రమిస్తున్న - తొలివేకువనవుతాను
మట్టిని చీల్చి వస్తున్న మొలకను

మరో చైతన్య శ్రవంతికి ప్రతీకను అంటూ. . . . కవితా లోకంలో విహరిస్తూ "సూర్యుడుకూడా ఉదయిస్తాడు" అనే కవితలో

ఈ సమరంలో రాలినా ఓడిపోను నేను
మరో జ్యోతిగా మరు నిమిషంలో అవతరిస్తాను

అని అన్నా వీరి కవితాలోకం స్త్రీ వాద ప్రపంచానికి మార్గదర్శం . . . .

ప్రభంజనమై
ఫెమినిజమై
కవిత్వమై నేను
చిరకాలం జీవిస్తాను. . . . . .

అన్న జయప్రభ వాక్యాలు,ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటున్నాను.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక వ్యక్తిత్వం దిశగా చేసిన ప్రయాణం – నీల

-డా॥. డి. శ్రీనివాసులు

ఒక నిరుపేద రైతుకూలీ చెమటోడ్చి పొదుపు చేసి కొంచెం పొలం కొంటాడు. అతని కొడుకు మరికొంత పొలం కొని రైతవుతాడు. అతని కొడుకు నాలుగక్షరాలు నేరుస్తాడు. అతని కొడుకు బాగా చదివి ఒక చిరుద్యోగం సంపాదిస్తాడు. అతని కొడుకు ఉన్నతాధికారి అవుతాడు. అతని కొడుకు ఓ చిన్న పరిశ్రమ పెట్టి నలగరికి ఉపాధి కల్పిస్తాడు. అతని కొడుకు దాన్ని పెద్ద కంపెనీగా దిద్ది వేల మందికి ఉపాధి కల్పించి గొప్ప ధనవంతుల జాబితాలో తన పేరు లిఖించుకుంటాడు. ఇలా అంతా సవ్యంగా జరిగితే అది తరతరాల్లో సంభవించే సహజ పరిణామ క్రమం. అలా కాకుండా ఒక నిరుపేద బుడుతడు పెట్రోల్ బాయ్ గా పనిచేస్తూ తన తెలివి తేటలతో ఒక జీవితకాలంలోనే లక్షలకోట్ల కంపెనీకి అధి పతి అయిన ఒక ధీరూబాయ్ అంబానీ అవుతాడు. ఒక చాయ్ బాయ్ ఒక జీవిత కాలంలోనే దేశాధినేత అవు తాడు. ఇది వ్యక్తిగత ప్రగతి దృష్ట్యా చూస్తే అసహజం అసమానం అయిన పరిణామం. ఈ రెండవ కోవని పోలిన ఒక మానసిక వైజ్ఞానిక నాగరిక మేధో పరమైన పరిణామం కె.ఎన్. మల్లీశ్వరి గారి నవల 'నీల'లో చూడొచ్చు.

కలవారి ఇళ్ళలో పుట్టి చదువునంధ్యల ద్వారా తెలివితేటలు గడించి వెలిగిపోవడం వేరు. కడమల ఇళ్ళలో పుట్టి కడగల్లు అనుభవిస్తూ ఎదగడం వేరు. అది బ్రాయిలర్ కోడి ఫారంలో ఫీడింగ్ మెక్కి కండపట్టి ఒళ్ళు బలుపెక్కడం లాంటిది. ఇది అడవికోడి గుడ్డిడిగి బయటి ప్రపంచలో అడుగు పెట్టింది మొదలు ఎలుకల నుండి ఎంటవల నుండి ముంగిసల నుండి అడవి పిల్లుల నుండి గద్దలనుండి వానల నుండి వరదల నుండి కార్చిచ్చు నుండి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవితమంతా చావుభీకరాన ఉరుకులు పరుగులతో మనుగడ సాగిస్తూ ఎదిగి వచ్చే ఒక క్రమం లాంటిది. దానికీ దీనికీ మోడుకూ మొలక్కూ ఉన్నంత తేడా. చావుకూ సచేతనంగా జీవించడానికి ఉన్నంత తేడా. అలా కష్టనష్టాల అనుభవంలోంచి ఉద్యమ నేపథ్యంలోంచీ చేతనతో, సజీవశక్తితో ఎదిగొచ్చి గడిదేరిన ఒక క్రమం 'నీల'లోని నీల పాత్రలో మనకు కనబడుతుంది.

నాగరికతలు ప్రారంభం అయ్యాక ఈ భూమ్మీద అత్యంత ఆధునికుడు, అత్యాదిమ మానవుడూ సమకాలీనులుగా అన్ని కాలాల్లో కనబడతారు. అయితే అత్యంత వెనుకబడ్డ కుటుంబంలో పుట్టి ఒక జీవిత కాలంలోనే పరిపూర్ణమైన ఆధునిక వ్యక్తిగా ఎదగడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. అది నీలలో జరిగింది. దీనికి ఊతమిచ్చే మాటలు ఈ నవల్లో నీల అంత రాంతికంలో కూడా దొరుకుతాయి. ''బుద్ధి చెప్పిన మంచిని గ్రహించడానికి, ఆచరించడానికి మంచి వాతా వరణం, చదువు, డబ్బు, స్వేచ్ఛ లాంటివి కూడా చాలా సాయపడతాయి... ఇవేమీ లేని మనుషుల్లో కూడా అసాధారణ వ్యక్తిత్వం ఉండొచ్చు. కానీ దానిని సంతరిం చుకోడానికి మామూలు మనుషులు కన్నా వేల రెట్లు నలుగుళ్ళు పడతారు'' అని నీల తనలో తాను అను కుంటుంది. నిజానికి అలా నలుగుళ్ళు పడి అనుభవం గడించినవాళ్ళకే నిజమైన నుస్థిరమైన వ్యక్తిత్వం అబ్బుతుంది. అందుకే నీల తన బిడ్డ మినోని బ్రాయిలర్ కోడిలా పెంచకూడదని ఆమెకు తన కష్టసుఖాలు తెలిసే లానే బతుకుతుంది.

ఒకానొక ఉదయం ఏలూరుకు అనుకొని ఉన్న చోళదిబ్బలో ''ఉప్పుడు మబ్బులుండవు'' అన్న ప్రకృతిని అర్థం చేసుకునే స్వగతంతో నీల అన్వేషణ మొగ్గ తొడిగింది. చోళదిబ్బ బీదరికం, కడుపాకలి, తల్లి

చంద్రకళ పెద్దమ్మ ఆరంజ్యోతిల బతుకాటం, జ్యూట్ మిల్లు కార్మిక పోరాటం, స్టాలిన్ సూర్యం ఉద్యమ స్ఫూర్తి ఆ పసితనానికి ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలన్న తపన పెంచాయి. తన తండ్రి పరిశి అమ్మని ఆటోరాజుని హత మార్చి జైలుకెళ్లడంతో బతుకు తెరువు కోసం నీల కుంగి పోయింది. ఆ కుంగుబాటు నుంచి ఆమె ఎంతో బతుకు పాఠం నేర్చుకుంది. ఆ పాఠాన్ని డైరీలో మూడు బతుకు సూత్రాలుగా రాసుకుని తనను తాను ఒక చట్రంలో బంధించుకుంది.

నీల జీవితం పాడుగునా ఇతరుల్లో లోపాలను చూస్తూ వాటికి తను దూరంగా ఉండాలని నిర్ణయించు కుంటూ అలాంటి లోపాలు తనలోనూ ఉన్నాయని గుర్తిస్తూ తనను తాను విమర్శించుకుంటూ సమీక్షించు కుంటూ సరిదిద్దుకుంటూ ఎదిగింది. భార్యాభర్తల మధ్య మాత్రమే జీవితం కడదాకా లైంగిక సంబంధాలు ఉం డాలని, వారి మధ్య మూడో మనిషి ప్రమేయం ఉండ రాదని ఆమె నమ్మింది. అయితే అనుకున్నదొక్కటి ఐనది ఒక్కటి. తను ప్రసాద్ నుండి ఏ కారణంగా విడాకులు తీసుకుందో, పరదేశిని ఏ కారణంగా తిరస్కరించిందో అటువంటి ఎలిమెంట్ పట్ల రాడికల్ ఆలోచనలు ఉన్న సదాశివతో జీవితం పంచుకోడానికి ఆమె సిద్ధపడింది.

నీల రాసుకున్న బతుకు సూత్రాల చట్రం నుంచి తనకు తెలియకుండానే పరిస్థితుల ప్రభావం వల్ల బయటపడింది. అమ్మ చంద్రకళ, సవతి సరళ, భర్త ప్రసాద్, ఆప్తబంధువు సంపూర్ణ, మిత్రురికం కట్టుకోడం ద్వారా తన మొకర అయిన పరదేశి, ప్రియమైన నేస్తం అజిత, సహచరుడు సదాశివ వీళ్ళలో ఉన్న పరవ్యక్తి వ్యామోహం, బహుళ శారీరక సంబంధాలు, ప్రేమల్లోని అంతరాలను ఆమె అసహ్యించుకుంది. అవి అమ్మ, ఆటోరాజుల చావుబీ దాని వల్ల తాను పడ్డ అవమానాలు అపరాధభావం లాంటి అనర్థాలకు దారి తీస్తాయని అందువల్ల తను అలా ఉండకూడదని చాలా గట్టిగా అనుకున్నది. కానీ జీవితం చివరికి వచ్చి చూసుకుంటే ఆ చిక్కుముళ్ళ బంధాలు తననే ఆవరించేసాయి. ఆమె దాన్ని జీర్ణించుకోడానికి సమయం, అనుభవాలు అవసర మయ్యాయి. మానవ సంబంధాల్లో శారీరక సంబంధాలు చాలా అల్పమైనవనీ వ్యక్తిగత సామాజిక సంబంధాలు కొనసాగించడంలో అవి కాస్తా తాత్కాలిక శారీరక సంబంధాలుగా మారినా కొంపలు మునిగేది ఏమీ లేదనీ దానివల్ల సాహచర్య, కుటుంబ సంబంధాలకు వచ్చే ప్రమాదం ఏమీ లేదనీ మనస్సు ముందు నైతికానైతికాల చర్చ అనవసరం అనీ ఆమె గ్రహించడానికి ఎంతో మానసిక పరివర్తన అవసరమైంది. దానికి పైన చెప్పిన వాళ్ళందరి అనుభావాలు, వ్యక్తిత్వాలు, వాళ్ళ కొన్ని లింగులూ ముడిసరుకులు అయ్యాయి.

అవివాహ లైంగిక జీవితం, వివాహేతర సాహచర్యం, వివాహ సహిత బహుళ శారీరక సంబంధాలు, ఒకరితో ప్రేమ ఒకరితో పెళ్లి ఇలాంటి వాటిని సహజీకృతం చెయ్యడానికి ఈ నవల్లో అజిత, సదాశివ, ప్రసాద్, పరదేశి పాత్రలు ప్రయత్నించాయి. సరళ, సంపూర్ణ కూడా ఈ కోవలోకే వస్తారు. ఈ భావనలకు నీలను సానుకూలం చెయ్యడంలో ఆమెను ఒప్పించడంలో ప్రసాద్, పరదేశి, సంపూర్ణ, అజితలు విఫలం అయ్యిండొచ్చు. దానికి వాళ్ళ వ్యక్తిగత బలహీనతలు కూడా కారణం కావచ్చు. సదాశివ ఒక్కడే ఈ విషయంలో సఫలుడై ఉండొచ్చు. దానికి అతని నిజాయితీ కూడా కొంత కారణం కావచ్చు. కానీ సదాశివ విజయానికి ముడిసరుకులు పై నలుగురే. నీలలో పరిణామం ప్రసాద్ వద్ద ప్రారంభమై, పరదేశి సంపూర్ణ అజితలతో బాటు ప్రయాణించి, సదాశివ వద్ద పరిపూర్ణ మైంది. అలా పరిపూర్ణం కావడానికి తన ఆరాధ్య దేవత లాయరమ్మ వసుంధరకు సదాశివకు మధ్య కూడా కొంత సాహచర్యం ఉందన్న వాస్తవం నీల గ్రహింపుకు రావడం బలమైన కారణం అయింది.

నీల ఇంత నలిగి ఎదిగిన ఎదుగుదల కంటే ఎక్కువ ఎదుగుదల తన కూతురు మినోలో ఏ నలుగుళ్ళూ లేకుండానే వచ్చింది. అది ఆ అమ్మాయి పుట్టి పెరిగిన

పరిసరాల నుండి లభించింది. దాన్ని నీల అర్థం చేసుకుంది. నీలలో ప్రారంభమైన మార్పులు వసుంధర బుద్ధులు చెప్పినప్పటి నుండి ఒక స్పష్టమైన రూపం సంతరించుకుంటూ వచ్చాయి. "నూటికి తొంభై తొమ్మిది శాతం ప్రేమలన్నీ ఏదో రూపంలో బందిఖానాలే. అట్లా కాకుండా మునుషులకుండే అన్ని రకాల స్వేచ్ఛలనూ గౌరవిస్తూ ప్రేమించుకోవడం అనేది మంచి విలువ... దానికి(స్త్రీపురుష బంధానికి) చాలా పరీక్షా సమయాలుంటాయి. మనుషులు ఒకరికొకరు తారసపడే సందర్భాల్లో అనేక ఆకర్షణలు ప్రేమలు కలుగుతాయి. ఏ స్థాయి వరకూ వాటిని రానివ్వాలో ఎక్కడితో ముగించాలో ఎంతవరకూ కొనసాగించాలో మనుషులు ఎవరికి వారే నిర్ణయించుకుంటారు. నిర్బంధాలున్న చోట అవి రహస్యంగా సాగుతాయి... ఆడా మగా స్నేహాలంటే కేవలం లైంగిక సంబంధాలుగా చూడటం నుంచి మనం బైటకి రాలేదనిపిస్తుంది" అని వసుంధర చెప్పిన మాటలు నీలకు ఎంతో ఊరట నిచ్చాయి. నీల సదాశివతో చోళదిబ్బకు పోయి ఊరు తిరిగినప్పుడు బాల్యంలో ఎంతో పెద్దగా గొప్పగా కనిపించిన స్థలాలు కంటికి ఆనకుండా పోయాయి. దాని వల్ల మార్పు అనేది సహజం అని ఆమె అవగాహనకు వచ్చింది.

చివరగా నీల తనలో వచ్చిన మార్పులనే ఆమె విశాఖ నుండి పరదేశిని వదలి సదాశివ కోసం హైదరాబాదు వచ్చేటప్పుడు నెమరు వేసుకుంది. తన జీవితంలో ఎదురైనవాళ్ళు వాళ్ళు కష్టపెట్టిన వాళ్ళైనా, కష్టం పంచుకున్న వాళ్ళైనా అందరివల్లా తన వ్యక్తిత్వానికి మేలే జరిగిందని గ్రహించింది. వాళ్ళ మంచితనాన్ని అర్థం చేసుకుంది. ఒకప్పుడామెను ప్రతి ఒంటరిరాత్రి వంటింట్లో నిర్జీవంగా పడున్న అమ్మరూపు కనబడి భయపెట్టేది. ఇప్పుడు కనిపించడం లేదు. అంటే అప్పుడు అమ్మ చేసింది తప్పు కాదని ఇప్పుడు తాను చేస్తున్నదీ తప్పుకాదని తెలుసుకుని అపరాధభావం భావం నుండి బయటపడింది. ఇప్పుడు నీల వడ్డించిన విస్తరి లాంటి తన జీవితం అన్నీ నిండిన శూన్యమా? తన పోరాట జీవితం అయిపోయిందా? అని భయపడుతున్నదే తప్ప ఆమెకెలాంటి కొరతా లేదు. ఇప్పుడామె పొట్టలో పేగులు గుర్రుమంటుండగా అది చూసి చిలకమ్మగారి నడిపిదాని లాంటి పిల్లలు ఎగతాళిగా నవ్వుతుండగా ఆకలితో చోళదిబ్బ వీధుల్లో తిరిగిన నీల కాదు. కాటన్ కుర్తాలు, జీన్స్ ప్యాంట్సూ ధరించి చిన్న పిల్లలా కనిపించే అత్యాధునిక మహిళ. ఆబగా విస్తృతంగా సాహిత్యాన్ని చదివి హక్కులూ ఉద్యమాలూ దృక్పథాల గురించి అవగాహన సంపాదించిన మేధావి. వివిధ సామాజికాంశాలపై జరిగే సెమినార్లలో పత్రసమర్పణలు చెయ్యగల దిట్ట. మురికివాడల బాగోగులకై నడుం కట్టిన సామాజిక ఉద్యమకర్త. "తనలాంటి నీలవేణులకు జీవితప్రస్థానాన్ని సులువు చెయ్యాలి" అని దృఢంగా సంకల్పించుకున్న ధీరవనిత. పరదేశి వేసిన సముద్రం ఎందుకు వెనక్కి వెళుతుందో తెలుసా? అన్న ప్రశ్నకు సమాధానం తెలుసుకున్న నీలవేణి.

నీల నవల్లో ప్రస్తావించిన అవివాహ లైంగిక జీవితం, వివాహేతర సాహచర్యం, వివాహ సహిత బహుళ శారీరక సంబంధాలు, ఒకరితో ప్రేమ ఒకరితో పెళ్లి ఈ సంబంధాలను సహజీకృతం చెయ్యడం అన్నవి నిజానికి రచయిత్రి దృక్పథాలు. ఈ విలువల స్థాపనం చెయ్యడానికే ఆమె ఈ నవల రాశారు. ఇవి ఇప్పటికే నాగరికంగా ఎదిగిన సంపన్న దేశాల్లో సహజాతిసహజం అయిపోయాయి. అభివృద్ధి చెందుతున్న మన దేశం లాంటి దేశాల్లో ఇప్పుడిప్పుడే ఈ సంప్రదాయాలు కాలూనుతున్నాయి. అయితే వాటికి బహిరంగంగా బయటపడే సామాజిక స్వేచ్ఛ, రాజకీయంగా శాసనబద్ధతలు లేవు. అగ్ని సాక్షికమైన వివాహ బంధాన్ని పరమపవిత్రంగా భావించే భారతావనిలో ఈ సంబంధాలను జనాలు ఎలా స్వీకరిస్తారు? వీటికి ఎంత తొందరగా సానుకూలం అవుతారు? ఈ వ్యవస్థ ఎప్పుడు వేళ్ళూనుకుంటుంది? అన్న ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం అన్నది కాలం నిర్వహించాల్సిన విధి.

తొంభైల నాటి కాలం, ఆ రోజుల్లో వచ్చిన సారా వ్యతిరేకోద్యమం, పొదుపు ఉద్యమాలు స్త్రీలలో గొప్ప చైతన్యాన్ని తీసుకు వచ్చాయి. కుటుంబాల్లో కొన్ని కుదుపులు వచ్చినప్పటికీ పొదుపు సంస్థల నిర్వహణల్లో కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ అవి స్త్రీల గొంతులకు పురుషాధిపత్యం పట్ల ధిక్కార స్వరాన్ని అందించాయి. స్త్రీల చేతుల్లోకి కొంత వరకూ ఆర్థికాధికారాలను తెచ్చాయి. వాళ్లకి రాజకీయ చైతన్యాన్ని అందించాయి. వీటిని ఫాష్టరమ్మ, శుభాంజలి, వసుంధర, నీతాబాయి, అజితల్లో సూచాయగా సంపూర్ణలో పరిపూర్ణంగా చూడొచ్చు. ఈ పరిణామాల్ని అక్షరీకరించం కూడా రచయిత్రి ఉద్దేశాల్లో ఒకటి. ఈ పాత్రల నుండి నీల ఎంతో స్ఫూర్తిని పొందుతూ ఎదిగింది. ఫాష్టరు మావయ్య తనను హాస్టల్లో చేర్పించి చదివించి పెట్టిన అక్షరభిక్ష, రాజమండ్రిలోని నవనీత మహిళామండలి, అక్కడి పుస్తకాలు, మహిళలు దళితుల ఉద్యమాల్లో పాటలు పాడ్డానికి వచ్చిన అవకాశాలు, 'కాలాతీత వ్యక్తులు' మొదలైన నవలల్లోని ఇందిర లాంటి పాత్రలు, ఫాష్టరమ్మ చూపించిన రెక్కలు ఊడిన పక్షిరాజు లాంటివి నీలపై చాలా ప్రభావం చూపాయి.

బుచ్చిబాబు గారి "చివరకు మిగిలేది"లో దయానిధి లాగా మల్లీశ్వరి గారి నీలలో నీల అమ్మ జ్ఞాపకాల అపరాధభావం అనుభవిస్తుంది. అందువల్ల 'సంచికా. కాం'లో "నీల చదువుతుంటే బుచ్చిబాబు 'చివరికి మిగిలేది'కి ఫిమేల్ వర్షన్ అనిపిస్తుంది" అన్న జగద్ధాత్రి గారి మాటల్లో కొంత వాస్తవం ఉంది. అయితే అమ్మ చేసిన అపరాధం ఏమిటో బుచ్చిబాబు గారు స్పష్టం చెయ్యలేదు. కానీ అది నీలలో మల్లీశ్వరి గారు కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. బుచ్చిబాబు గారు అలా దాచడానికి ఆయన, ఆయన సంస్కారం, ఆయన సామాజిక నేపథ్యం, ఆయన కాలం ప్రభావం చూపించి ఉండవచ్చు. దాన్ని బట్టబయలు చేసి అదీ ఒక్క జీవన విధానమే అని సమర్థించి "ఏం చేసుకుంటారో చేసుకోండి" అని సమాజం ముందు ఒక సవాల్ విసరడానికి ఇప్పుడు ఈ రెండువేలా పది-ఇరవై దశకంలో సరిగ్గా సమయం ఆసన్నమైంది. అందుకే ఆ పనిని మల్లీశ్వరి గారు సాహసోపేతంగా చేశారు. మల్లీశ్వరి గారు తన దృక్పథాన్ని వెల్లడించింది బ్రాహ్మణేతర సమాజం ద్వారా అయ్యుండొచ్చు. కానీ ఒక స్రష్టగా ఆమె అనివార్యంగా రాబోయే భవిషత్తు సమాజాన్ని ముందే పసిగట్టారు. దానికి ఏ గొంకూ లేకుండా రాబోయే విమర్శలకు, సవాళ్ళకు సిద్ధపడి ధైర్యంగా నవలా రూపం ఇచ్చారు.

వాడ్రేవు చినవీరభద్రుడు గారు నీలకు అభిప్రాయం రాస్తూ "వ్యక్తిని, అతని చుట్టూ సమాజాన్ని సంపూర్ణంగా చిత్రించడం నవల ప్రధాన లక్షణం" అన్న ప్రతిపాదనకు ఉపపత్తులను తీసుకువచ్చారు. చేసి ఈ అర్థంలో తన కర్తవ్యాన్ని నిర్వహించిన నవలలు తెలుగులో చాలా అరుదని అలాంటి వాటిలో నీల చాలా విలువైన రచన అని కొనియాడారు. అది ముమ్మాటికీ సత్యం.

ఇదివరకే నేను తానా బహుమతి 2017 పొందిన నవలల్లో బండి నారాయణస్వామి గారి 'శష్టభూమి'పై వ్యాసం రాశాను. అది ప్రజాశక్తి "అక్షరం"లో ప్రచురిత మైంది. అన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి 'ఒంటరి'పై రాశాను. అది సాహిత్య ప్రస్థానం ఫిబ్రవరి 2019 సంచికలో అచ్చై వచ్చింది. ఈ మూడు నవలలూ చదువుతూ పోతున్నపుడు అవి చాలా ఆనక్తిగా అనిపించాయి. రచయితలు ముగ్గురూ జీవితపు అనుపానులు తెలిసిన వాళ్ళే అని అనిపించింది. అయితే ఆత్మీయంగా అనిపించి హృదయానికి హత్తుకోవడం దృష్ట్యా గుండెను కరిగించి కంటతడి పెట్టించడం దృష్ట్యా పాత్రల్లో వచ్చిన హృదయ మార్దవం, మానసిక పరివర్తన, చిత్తసంస్కారం, జీవిత విలువల పట్ల అభిప్రాయ పరిణామం దాన్ని చదివిన పాఠకుల్లో కూడా కలిగేలా నవల చూపే ప్రభావం దృష్ట్యా చూస్తే ఒక కొంత ఎత్తులో ఒంటరి కనబడింది. దానిపైన శష్టభూమి కనబడింది. ఈ రెండింటి కన్నా చాలా ఎత్తులో నీల నిలబడి కనబడింది అని చెప్పడానికి నాకెలాంటి అభ్యంతరం గానీ సంకోచం గానీ కలగడం లేదు. ❖

'గబ్బిలం' – సామాజిక జీవన చిత్రణ

–డా॥. గుంటుపల్లి గౌరి, లెక్చరర్, స్వయంప్రతిపత్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గుంటూరు.

కవి దిగ్గజ, విశ్వకవి సామ్రాట్, కళాప్రపూర్ణ, పద్మ భూషణ్, కవితా విశారద, కవికోకిల, నవయుగ కవి, కవి చక్రవర్తి, మధుర శ్రీనాధ, బిరుదులు పొందిన గుఱ్ఱం జాషువా గుంటూరు జిల్లా వినుకొండలో 1895 సెప్టెంబరు 28న గాఢమైన క్రైస్తవ మతాచారం గల కుటుంబంలో వీరయ్య, లింగమాంబలకు జన్మించారు. జాషువా తల్లిదండ్రులది కులాంతర, మతాంతర వివాహము. ఇలాంటి కులాంతర, మతాంతర వివాహాలను గౌరవించే స్థాయికి నాటి సమాజము ఎదగలేదు. అందుకనే వీరిద్దరూ అనాదరణకు, అవమానాలకు గురయి కులరక్కసి కాట్లను, మతరక్కసి గాట్లను ఎదుర్కొని, ఎదురొడ్డి జీవనం సాగించారు. జాషువా బాల్యం కుల మత వివక్షతల మధ్య, అవమానాల మధ్య పేదరికంలో గడిచింది. అక్షరాభ్యాసం మిషనరీ బడిలో జరిగిన తర్వాత 5వ తరగతికి హిందూ పాఠశాలలో చేరడం జరిగింది. అక్కడ సవర్ణ హిందూ ఉపాధ్యాయుల ఛీత్కారాలు జాషువా లేత హృదయాన్ని గాయపరిచాయి. కులం వల్ల కలిగిన అవమానం, దారిద్ర్యం వల్ల కలిగిన దైన్యం రెండూ జాషువాను కలచివేశాయి. జాషువా కవిత్వాన్ని అతని వ్యక్తిత్వం నుండి విడదీయలేము. ఏ కళకైనా రసావేశమే ప్రధానం. అందుకే జర్మను మహాకవి గెథే 'True art can not exist without emotion' అన్న పలుకులు జాషువా కవిత్వానికి అక్షరాల సరిపోతాయి.

జాషువా చిన్నతనం నుండి ఈ సమాజంలోని కులహంకారం వల్ల ఎదుర్కొనిన తిరస్కారాలు, అవమానాలు అతడు ప్రత్యేకంగా స్పందించడానికి దోహదపడి తన స్థితికి గల కారణాల్ని, తన జాతికి జరిగిన అన్యాయాల్ని ప్రశ్నించడానికి ఆధారమయ్యాయి. హృదయంలో వున్న వేదన సమాజం మీద ద్వేషంగా కాకుండా బాధతో కూడిన సృజనాత్మకమైన కవిత్వ రూపంలో పెల్లుబికింది. అంతే కాకుండా 20వ శతాబ్దంలో వచ్చిన సంస్కరణోద్యమాలు, దళిత సంఘర్షణలు వాటి ప్రభావాలు, ఫలితాలు కూడా 'గబ్బిలం' కావ్యరచనకు కారణమయ్యాయి.

తరతరాలుగా భారతదేశంలో కులవ్యవస్థ కొన సాగుతూ ఉంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులని 4 కులాలుగా ఈ సమాజం కొన్ని కట్టుబాట్లని ఏర్పాటు చేసుకుంది. ఐదవ కులాన్ని అస్పృశ్యులుగా సృష్టించి ఊరికి దూరంగా జీవించమని నిర్దేశించింది. వీరు దేవాలయాలలోకి ప్రవేశించడంగాని, మిగతా కులాల వారితో సంబంధబాంధవ్యాలు పెట్టుకోవడానికి గాని వీలులేదు. అసలు ఈ చాతుర్వర్ణ వ్యవస్థనే నిలదీస్తూ జాషువా విప్లవమూర్తిగా సాక్షాత్కరించి పంచమకులం ఎక్కడ ఉందని గర్జిస్తూ-

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలువురు కుమారులనుట విన్నాము గాని
పసరముకన్న హీనుడభాగ్యుడైన
యైదవ కులస్థుడెవరమ్మా, సవిత్రి?" అన్నారు జాషువా

తెలుగు సాహిత్యంలో అస్పృశ్యత నేపథ్యంగా, సమగ్రంగా, సంప్రదాయకావ్యాల కంటే భిన్నంగా అంటే ఒక దళితుడే నాయకుడిగా ఉండడం అనేది 'గబ్బిలం' ద్వారా జాషువా తీసుకొచ్చిన నవ్య కావ్య విప్లవంగా భావించాలి. జాషువా రాసిన మిగతా రచనల కావ్య వస్తులన్నిటికన్నా 'గబ్బిలం' కావ్యవస్తువు పూర్తిగా భిన్నమైనది, విప్లవాత్మకమైనది. గబ్బిలం కావ్యంలో దళిత స్పృహ, దళిత చైతన్యం, దళిత అభివ్యక్తి స్పష్టంగా వ్యక్తం చేయబడింది.

తరతరాలుగా అస్పృశ్యతకూ, అణచివేతకూ గురి అయిన దళితుల జీవిత నేపథ్యమే గబ్బిలం కథావస్తువు.

'కాళిదాసు మేఘసందేశము మనస్సులో ఉంచుకొని నేనీకావ్యము రచించితిని' అని జాషువా చెప్పుకున్నాడు. మేఘసందేశం కావ్యంలోని నాయకుడైన యక్షుడు ఒక తప్పుచేసి ఏడాదిపాటు బహిష్కరణకు గురి అవుతాడు. శరత్కాలంలో మేఘాలను చూచి విరహాగ్నితో తన ప్రేయసికి ప్రణయ సందేశం పంపడానికి మేఘాన్ని ఎన్నుకొని దాని ద్వారా తన ప్రియురాలికి ప్రణయ సందేశమును పంపిస్తాడు. జాషువా గబ్బిలంలోని కథా నాయకుడైన అరుంధతీసుతుడు తుకతుకనుడుకు అశ్రు సందేశమును గబ్బిలముద్వారా ఈశ్వరునితో చెప్పమని పంపిస్తాడు. యక్షుని శిక్షాకాలము 1 సం॥ అయితే దళితుడి శిక్షాకాలము యావజ్జీవము. యక్షుడు 'మన్నధాగ్నితప్తుడు' అరుంధతీసుతుడు క్షుదాగ్ని పీడితుడు ఇది తరతరాలుగా సాగుతున్నది. ఇలా ఎంతకాలం కొనసాగుతుంది? దళితుడు చేసిన నేరమేమిటి? ఈ ప్రశ్నలులేవనెత్తి అంటరానివాడి గుడిసెలోనికి వచ్చిన గబ్బిలంద్వారా శివుడికి సందేశం పంపించడం, తనప్రశ్నలకు సమాధానాలు అడగం ఇందులోని ప్రధానవస్తువు అయితే ఈ కావ్యంలో పూర్తిగా దళిత సమస్యలు చర్చకురాలేదు. తన ఈ స్థితికి కారణమైన హేతువుల్ని మాత్రమే స్పృశించి వదిలిపెట్టాడు.

గబ్బిలం మొదటి భాగం రెండవ ప్రపంచ యుద్ధ కాలంలోను, రెండవభాగం రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత వెలువడినవి. మొదటి భాగంలో గబ్బిలం దళితుడి సందేశాన్నికైలాసంలోని శివుడి దగ్గరకు తీసుకెళుతుంది. గబ్బిలం రెండవ భాగంలో జాతీయోద్యమ ఫలితంగా దేశంలో ఏర్పడిన మార్పులకు సంతోషించి గబ్బిలానికి సాదర స్వాగతం పలికాడు దళితుడు. కాని తన సంతోషం తాత్కాలికం అని తెలుసుకున్న దళితుడు గబ్బిలం ముందు తన బాధను వ్యక్తపరుస్తాడు. దేశంలో అనైక్యత, స్వార్థపరత్వం, కులమతాల గొడవలు దళితుడ్ని బాధపెట్టాయి.

భావకవితా యుగం మహోజ్వలంగా వెలుగుతున్న రోజులలో తల ఎత్తిన కవి జాషువా. భావకవిత్వంలో ప్రణయకవిత బహుగా విస్తరించినను, జాషువా దేశాభిమాన కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం వెలయించినే గాని ప్రణయకవిత్వం వైపు పోలేదు. ఊహాప్రేయసి వర్ణను నిరసించాడు. నలుగురికి ఉపయోగపడని జిలుగు నగిషీలు వ్యర్థమని భావకవితపై నిరసనను వ్యక్తపరచి మానవతావాదంతో కూడిన 'గబ్బిలం' కావ్యాన్ని మనకం దించాడు.

ఇంటిలోనికి ప్రవేశించి దీపమార్పిన గబ్బిలమును చూచి తన కన్నీటికథను ఈశ్వరునితో చెప్పమని ప్రార్థిం చెనుగాని నిజమునకు అతని ఉద్దేశ్యము దేశారాధన. 'గబ్బిలం' కావ్యంలో జాషువాది ఆర్ద్రదృష్టి తప్ప ఆవేశంతో కూడుకున్నది కాదు. కరుణరసంతో నిండుకున్న కావ్యమే కాని, క్రౌర్యంతో కూడుకున్నది కాదు. ఈ విషయాన్ని జాషువా-

"నాదుకన్నీటి కథ సమన్వయముసేయ
నార్ధహృదయంబు కూడా కొంత వసరంబు"
అని ప్రకటించుకున్నాడు.

ఈ కావ్యనాయకుడు తన జీవిత చరిత్రని కైలాసం లోని శివునికి విన్నవించమని 'గబ్బిలం'తో నివేదించు కున్నాడు. తన స్థితికి కారణమైన పరిస్థితుల్ని ఈవిధంగా ప్రశ్నిస్తాడు-

"కర్మ సిద్ధాంతమున నోరుకట్టివేసి
స్వార్థలోలురు నాభుక్తి ననుభవింత్రు
కర్మమననేమోదానికి కక్షయేమొ
యీశ్వరుని చేత బుజువు చేయింపవమ్మ"

జాషువా 'గబ్బిలం' కరుణ, వీరరస ప్రధానం. కాబట్టి ఇందులో జాషువా కవిత్వం చిందించే కరుణరసం ఉత్త కన్నీళ్లది కాదు, ప్రతిఘటనాపూర్వకమైనది.

"నిమ్నజాతుల కన్నీటి నీరదములు
పిడుగులై దేశమును కాల్చివేయు"
నని హెచ్చరించగలిగాడు.

కాల్చే కన్నీళ్లను తిలకించడం అంటే కరుణ, వీరరస సిద్ధాంతానికి బాట వేయడమే కదా!

వాని తలమీద పులిమిన పంకిలమును
గడిగి కరుణింపలేదయ్యో గగన గంగ
వాని నైవేద్యమున అంటుపడిననాడు
మూడుమూర్తులకును గూడ కూడు లేదు

అస్పృశ్యుడు పండించిన ధాన్యమే కదా ఆలయంలో సమర్పించే నైవేద్యం. అంటరానివాని ధాన్యాన్ని అంటు కోమని ఆ దేవతలు అనుకుంటే వాళ్లకు కూడా కూడు ఉండదు. పూజారులకు బ్రతుకుతెరువు ఉండదు.

అంతేగాక జాషువా- "పామునకు బాలు, చీమకు బంచదార

మేపుకొనుచున్న కర్మభూమింజనించు
ప్రాక్తనంబైన ధర్మదేవతకు గూడ
నులికిపడు జబ్బుగలదు వీడున్నచోట
వాని నుద్ధరించు భగవంతుడేలేడు
మనుజుడెట్లు వానిగనికరించు
వాడు జేసికొన్న పాపకారణమేమొ
యింతవఱకు వానికెఱుకలేదు"

అని తన హృదయంలో ఉన్న బాధను వెలిబుచ్చాడు. కుల మత వర్ణ వ్యవస్థను కూకటివేళ్లతో పెళ్లగించాలని కలాన్ని గునపండా ఉపయోగించాడు. ఈ సంఘ సంస్కరణాభిలాష ఇతని కవిత్వంలో చతుర్ముఖాలుగా సాగింది. మతవైషమ్య నిరసనం, అస్పృశ్యతా నిరసనం, అంధ విశ్వాస నిరసనం, దారిద్ర్య నిరసనం అనే నాలుగు అంశాల పునాదుల మీదనే ఇతని సంఘ సంస్కరణ కవితా నిర్మాణం జరిగింది. సాంఘిక చైతన్యం కోసం, సామాజిక అభ్యున్నతి కోసం ఆయన కవిత్వంలో గొప్ప తపనతో కూడిన ఆర్ద్రత కనపడుతుంది.

అభ్యుదయాన్ని కోరి, మతంకంటే మనిషి గొప్పవాడని నిరూపించి, ప్రజలతో కలిసి, ప్రజల కోసమై సరళమైన భాషలో అనేక రచనలు చేసిన ఈ కవికోకిల, ఈ నవ యుగ కవి చక్రవర్తి, ఈ మధుర శ్రీనాథ ఇప్పటికీ, ఎప్పటికీ "సుకవి జీవించె ప్రజల నాలుకలయందు" అన్నట్లు, ప్రజల నాలుకలయందు మాత్రమే కాదు, ప్రజల హృదయాలలో కూడ సజీవంగా ఉన్న అసలుసిసలైన 'కీర్తి'శేషుడు జాషువ.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రశ్నించేదిశగా భారతీయ స్త్రీ...

–డా॥. జొడ సీతారతి రెడ్డి, తెలుగు శాఖాధ్యక్షులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజీవీడు, కృష్ణాజిల్లా

దేశంలో రోజురోజుకు పెరుగుతున్న నేరాలలో అత్యధికం మహిళలపైనే ఉండటం గర్హనీయం. ఆడవారిపై దాడులు ఒక్కోదశలో ఒక్కొక్క విధంగా ఉండటంతో మహిళల ఉనికే ప్రశ్నార్థకం. కడుపులోని బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణహత్యచేయడంగానీ, ఆడపిల్ల పుట్టగానే గాయపరచడం లేదా హత్యచేయడం, కన్ను తెరవని పసికందులను అమ్మేయడం, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, వ్యభిచారకూపంలోకి నెట్టివేయడం, యవ్వనదశలో ఈవ్ టీజింగ్, కిడ్నాపింగ్, అత్యాచారం లేదా మానభంగం, వరకట్నచావులు, గృహహింస, లైంగిక వేధింపులు, భౌతికదాడులు, మానసిక వేధింపులు, బలవంతపు గర్భస్రావాలు, పెద్దవారిలో లైంగిక వేధింపులు, హత్యలు, ఆత్మహత్యలు, మునలి వయస్సులో పిల్లలనుంచి నిరాదరణ, అనారోగ్య సమస్యలు ఇలా ప్రతిస్థాయిలో మహిళ ఎదుర్కొంటున్న సమస్యలు అనంతం. ఇలాంటి అన్ని అంశాలలో కొన్నిటిని పద్య, ఆధునిక సాహిత్యాల పరంగా చూద్దాం -

వ్యాస పరిమితి :

హితాన్ని కలిగించేది సాహిత్యం. అందులో వర్ణనల ద్వారా స్త్రీని చూసే విధానాన్ని పరిశీలిద్దాం. స్త్రీని గురించి వర్ణనలు చేసేటప్పుడు కవు(వయిత్రు)లు, రచయిత్రు(త)లు ఎందుకు ఇంత శ్రద్ధాసక్తులు చూపిస్తారు? ఇందులో ఉన్న ఆంతర్యం ఏమిటి? ఏ రకమైన సందేశాల్ని, సూచనల్ని, తత్వాల్ని, శరీరధర్మాల్ని చెప్పదలచుకున్నారు? నేటి స్త్రీకి అవసరమైన అంశాలను ఎలా చూడాలి? స్త్రీల మనోభావాల్ని వారి మాటల్లో వారు ఎలా చెప్పదలచుకున్నారు లేదా వ్యక్తీకరించదలచుకున్నారు? ప్రాచీన కాలంలోని తత్వం, తర్వాత ఉండే మార్పులు ఎలా చోటు చేసుకున్నాయి? ఇలాంటి అంశాలు, రచనలలోని సమాచారాన్ని విశ్లేషించి తెలపడం ఈ వ్యాస పరిమితి.

పద్య సాహిత్యం :

శ్రీకృష్ణుడు తన చెల్లెలైన ద్రౌపదికి వాచ్యంగా చెప్పాడు. విషాద రోషాలు కావగలేని స్థితిలో ఉన్న ఆమెకు వ్యంగ్యంగా చెప్పితే అర్థం కాదని వాచ్యం చేశాడేమో ఆమె తనాగురించి తాను గొప్పగా చెప్పుకుంది. ఇది ఆమె శ్లాఘ కాదు, ఆత్మాభిమానం.

చం. "వరమునఁబుట్టితిన్ భరత వంశముఁజొచ్చితి, నందు పాండుభూ
వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁబొందితి, నీతి విక్రమ
స్థిరులగుఁ బుత్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపుఁ గాంచితిన్బీ
సరసిజనాభ! యిన్నిటఁ, బ్రసిద్ధికి నెక్కిన దాన నెంతయున్; (3-3-108)

ఉత్తమ ఇల్లాలికి ఆరు గౌరవ ప్రమాణాలు కావాలి. 1. పుట్టింటి గౌరవం, 2. మెట్టింటిది, 3. అత్తమామల గౌరవం, 4. భర్త గౌరవం, 5.సంతన గౌరవం, 6. పుట్టింటి సహకార గౌరవం. ఇది పరిపూర్ణంగా కలిగింది ద్రౌపది.

ధర్మరాజు ద్రౌపది మనస్సును పరిగణనలోకి తీసుకురావడం లేదని ఆమె మనోవేదన. దానికి మరింతగా మండించేలా ఆమె అస్థిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని లెక్కించక పోవడం. అప్పటి రాజనీతిలో తన మనోభావానికి తగినంత గౌరవస్థానం ఇవ్వాలని ఒత్తిడి తేడానికి ఈ పద్యం సహకరిస్తుంది. పైగా ఆమె అయోనిజ, యాజ్ఞసేని (యజ్ఞం నుంచి పుట్టింది, పవిత్రురాలు) అలాంటి ఆమె అభిప్రాయాల్ని తీసుకోవాలని ధర్మరాజులాంటి పొరపాటు చెయ్యవద్దని కృష్ణుడికి సూచన.

ఉ : **"నీవు సుభద్ర కంటెఁ గడు నెయ్యము గారవముం**
దలిర్ప సం
భావన సేతు, వట్టి నను, పంకజనాభ! యొకండు
రాజసూ
యావ బృధంబునందు, శుచియై పెను పొందిన
వేణిఁబట్టి యీ
యేవురు జూడగా, సభకు నీడ్చె, కులాంగన
నిట్లొనర్తురే!" (3-3-110)

కౌరవ సభకు కృష్ణుడు రాయబారిగా వెళ్ళే సందర్భంలో ద్రౌపది మాటలివి. రెండు పద్యాలు (109, 110) తెరపై పాత్ర హావ భావాల్ని ప్రదర్శించేలా ఉంది. ఆ ఘట్టమేగాక, కౌరవ సభలో కృష్ణుని రాయబార ఘట్టాన్ని, తిక్కన నాటకీయతకు నిలువు టద్దాలు. వాక్యనిర్మాణం ప్రత్యేకం. పాత్రల ఆహార్యం నాటకీయతను సూచిస్తున్నాయ్.

నుడికారం :

అంటే భాషలోని సొగసులు. పలుకు బడులు. ఆంగ్లంలో ఇడియమ్స్ అంటారు. ప్రతి భాషకు పద్ధతి ఉంటుంది. వాక్య నిర్మాణంలో, క్రియాప్రయోగంలో, సామెతలు వాడే సందర్భంలో, లోకోక్తుల్ని ప్రయోగించే రీతిలో ప్రత్యేకతలు ఉంటాయి. అదే నుడికారం.

'ఇన్ని గొప్ప గుణాలున్న తనకు ఎందుకీ వ్యథ'లని తన అన్న (కృష్ణుడు)తో వాపోతుంది. ఆత్మీయులు ఎదురైనప్పుడు ఆవేదనను వారికి తెలిపి హృదయభారాన్ని తగ్గించుకోవడం మానవ లక్షణం. మానినిగా ఉన్న ద్రౌపదికి అవకాశం చిక్కిందని, తన భర్తలకు చెప్పినా పెద్దగా ప్రయోజనం లేదని భావించింది. పుట్టింటివాళ్లు కనిపించినప్పుడు హృదయాంతరాళాల్లో ఉన్న బాధను వెళ్లగక్కడమే స్త్రీ నైజం.

ఒక్క భర్త అభిరుచులకు అనుకూలంగా మెలగటమే కష్టమనుకునే స్త్రీలకు ద్రౌపది అయిదుగురు భర్తలతో మెలగిన తీరు అభినందనీయం. అందుకే, ఆమె గొప్ప ఆదర్శ మహిళ అయ్యింది. ఐదుగురు భర్తలు చేతి వేళ్లలా రక రకాల మనస్తత్వాలుఉన్న వారితో ఒక్కొక్క సంవత్సరం ఉండాలి. అదీ పెళ్లయిన కొత్తలో ఆ కొత్త పెండ్లి కూతురుకు ఎదురైన పరీక్ష ఇది. జీవితాంతం భర్తలందరికీ అనుకూలంగా ఉంటూ వారి ప్రేమానురాగాలను పొందిన మహాసాధ్వి ద్రౌపది. ధర్మరాజు దగ్గరకు ధౌమ్యుడు, దుర్వాసుడు లాంటివాళ్లు వచ్చి గంటల తరబడి ధర్మోపన్యాసాలు ఇచ్చేవారు. శుచి, శుభ్రంగా వారికి ఇష్టమైన పదార్థాలను అందించేది. ఇంట్లో ఏమున్నదో లేదో చూడకుండా వచ్చిన అతిథులను 'భోజనానికి లేవండనే' భర్తలనే ఎక్కువగా చూస్తుంటాం లోకంలో. అప్పుడా గృహిణికి అదొక గడ్డు సమస్య. కానీ, ద్రౌపది చిరునవ్వుతో వారికి ఆతిథ్యమిచ్చేది. సహజంగా స్త్రీ మనసు సున్నితం. పద్య సాహిత్యంలో ఎక్కువగా స్త్రీ వర్ణనలున్నాయి. వాటిల్లో కనిపించే వాటిని రెండు రకాలుగా విభాగం చేయవచ్చు. మార్పులు చేసుకోదగినవి, మార్పులకు అవకాశం లేనివి. ఉదాహరణకు కళ్లను వర్ణించేటప్పుడు అవి ఎలా ఉన్నాయో అలానే చెప్పటం. రెండో అంశం నడక, మాట లాంటివి. వీటిని మార్చుచేసుకోవడం ప్రయత్నం ద్వారా సాధ్యం కావచ్చు.

తే.గీ. భ్రమరక మనోహరం బొటఁ బద్మమగును
తారకాహృద్యమగుట సుధానిధి యగు
రెంటి జగడాలు మోమున నంటి యుంట
సబ్జముఖి యంట లెస్స యీ యలరుఁబోఁడి

(విజయవిలాసము ఆ.2. ప. 105)

అర్జునుడు సుభద్రను చూసిన సన్నివేశం. సారాంశం సుభద్ర ముఖం అందమైనది. దాన్ని అబ్జముఖి (నీటి నుంచి పుట్టినది) అని రూఢి చేశాడు. ఇంతటి విజయుడు అయినా ఆలోచనలో పడడానికికారణం ఆమె ముఖంలో ఉన్న లక్ష్మీకళ. 'కామీ స్వతాం పశ్యతి' అన్న మాటనూ గుర్తుంచుకోవాలి. తన దృష్టిలో ఆమె అలా కనిపించింది. ఇలాంటి వితర్కాలు ప్రేమిస్తున్నామన్న దృష్టి ఉన్నవారికి కలిగే చిత్త చాంచల్యం. దీని ద్వారా కవి సాధించగలిగిన ప్రయోజనం 'ఎంతవారలైన కాంత దాసులే' అన్న భావన.

ఉ. **సారము ముద్దుఁబల్కు, ఘనసారము నిద్దపు మేని తావి, కా**
సారము నాభిరంధ్రము, విసారము తేట మిటారి చూపు శ్రీ
కారము కర్ణయుగ్మము, మొకారము నవ్వుమొగంబు, షట్పదా
కారము కొప్పు, నన్మధు వికారము మోవి, వధూలలామకున్

(రుక్మిణీ పరిణయము. ఆ.2.ప.9)

ఈ పద్యాన్ని కూచిమంచి తిమ్మన రాశాడు. ఇక్కడ గమనించిన అంశాలు- పల్కు, మేనునుంచి వచ్చిన వాసన. దగ్గరగా చూసినందున నాభి, ఆమె పక్కకు చూసినప్పుడు ఆమె చూపులు, వెనుకనున్న కొప్పు, ఆమె ముఖంలోని ప్రత్యేకమైన రంగు. ఇవి అన్నీ అందరి స్త్రీలలో ఉంటాయి. అలాగని అంటే సాధారణం అయిపోతుంది. అందుకే కొసర 'వధూలలామ' పదం వేశాడు. దీనితో అర్థంలో ప్రత్యేకతలు వచ్చేశాయ్. మాట తీరు బాగుండాలి. ఇది కచ్చితంగా సాధించవలసిన అవసరాన్ని సూచిస్తున్నారు. ఆ పదం వధూలలామ అనడంలో భావించవచ్చు. మేను సుగంధం. ఎప్పుడు వస్తుంది? పరిమళ ద్రవ్యాలతో స్నానాదులు, లేపనాలు పూసుకున్నప్పుడు, కొంతమందికి సహజంగా కూడా రావచ్చు. సాత్వికాహారం తీసుకున్నప్పుడు కూడా సుగంధం రావచ్చు.

యుక్త వయసు ఉన్న స్త్రీ నాభిని ఎవరు బడితే వారు చూడకూడదు. అంత జాగ్రత్తలు తీసుకోవాలి. పొరపాటున కనబడింది అది చెరువులా ఉందట. అంటే స్వచ్ఛంగా ఉండటం అవసరం. పాశ్చాత్య సాహిత్యంలో రచయితలు 'బ్లూ ఐస్' (blue eyes)గా స్త్రీల అందమైన కళ్లను వర్ణించారు. అదే మన (భారత)దేశంలో చేపకళ్లు, పద్మనేత్రి లాంటి పదాలు వాడేరు. అంత విశాలమైన కళ్ళు అవ్వాలంటే చిన్నప్పటినుంచే తల్లులు పిల్లలకు కాటుకను పెడతారు. దానివల్ల రెండు ప్రయోజనాలు ఒకటి కంట్లో దుమ్ము పడకుండా కాపాడడం, రెండు వాటి విస్తృతి పెరగడం. చేప కళ్ళు అందమైనవి. కళ్లే అంత అందమైనవి అయితే "చేపే కళ్లయితే" ఆ అందం రెట్టింపు. జుత్తు సహజంగా తుమ్మెదల్లాంటి రంగుకలిగి పొడవుగా ఉంటుంది. ఇది ఆమె ఆరోగ్యాన్ని సూచిస్తున్నది. నవ్వు ముఖం, ఆమె ప్రశాంతతను సూచిస్తున్నది. జుర్రుకునేలా ఉండే (తేనె రంగు) మోవి. ఇవి ఉత్తమ స్త్రీ లక్షణాలు. ఇలా వర్ణనల ద్వారా స్త్రీలను వర్ణిస్తే, పాగడ్తలలో ముంచెత్తేస్తే కవులకు రాజులు ధనాన్ని ఇచ్చేవారు.

ఆధునిక సాహిత్యం :

పైన పేర్కొన్న అంశాలు, లక్షణాలు తర్వాత మార్పులకు గురై, పురుషాధిక్యంగా పరిణామం చెందాయి. "పాఠం ఒప్పజెప్పకపోతే "పెళ్లి" చేస్తానని పంతులుగా రన్నప్పుడు ఆఫీసులో "నా మొగుడున్నాడు" అని అన్నయ్య అన్నప్పుడూ..." అంటూ పెళ్ళిని పెద్ద శిక్షగా, మగడు స్వేచ్ఛా భక్షకుడుగా "బందిపోట్లు" కవితలో "సావిత్రి" తేల్చారు. పెళ్లి అనేది సాంఘిక కట్టుబాటు నుంచి స్వేచ్ఛాహరణంవైపు ప్రయాణం చేసింది. మొగుడు అనే పదం మొరటుతనాన్ని, అనహనాన్ని సూచిస్తుంది. అందాన్ని వర్ణించడం పోయి, వాస్తవాల్ని, బాధల్ని వెలికి తీయడం కవిత్వ లక్షణంగా ప్రయాణం సాగించింది.

అబ్బూరి ఛాయాదేవి "విన్నావా?" కవితలో -

"నువ్వు ఆడదానివి, గీత దాటకూడనిదానివి,
మచ్చపడితే మాయనిదానివి.."

ఇలాంటి తత్వం మగవాడికి లేదు అనే విషయాన్ని సూచిస్తున్నారు. పూర్వం ఉన్న మౌలిక అంశాన్ని తర్వాత మగవారు పాటించడం లేదు. ప్రహ్లాదుడు శీలాన్ని పాటించాడు. ఆ శీలాన్ని ఇంద్రుడు సేవకుడిగా వచ్చి వరంగా పొందాడు. అయితే అలాంటి అంశాలను గుర్తుంచుకునే స్థితిలో సమాజంలో ఉన్న మగవారు గుర్తించడం లేదు.

"వంటిల్లు" కవితలో విమల రచయిత్రి- "ఈ వంటిల్లు సామ్రాజ్యానికి మా అమ్మే మహారాజ్ఞి, అయినా వంటింటి

గిన్నెలన్నిటిపైనా మా నాన్న పేరే" అంతేకాదు వడ్డిస్తున్న ప్పుడు మా అమ్మ ఒక గరిటగా కనిపిస్తుందని వర్ణిస్తారు. తల్లిదండ్రులు పార్వతీ పరమేశ్వరులు. అర్ధనారీశ్వరులు. ఈ భావనపోయి విపరీత ధోరణులు చోటుచేసుకున్నాయి.

"మనమంటే 34, 24, 35 కొలతలమైనచోట, మొటిమలు మొలవడం, జుత్తురాలడం..." అంటూ సౌందర్యం పేరుతో స్త్రీని హింసిస్తూ చూడడాన్ని విమల వ్యతిరేకించారు. ఇవన్నీ స్త్రీలపట్ల కవయిత్రులు చూసే కోణాలు.

సమన్వయం :

"పితారక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే, సుతా రక్షతి వార్ధక్యే నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అని వ్యాసుడు జయ సంహితలో చెప్పాడు. స్త్రీకి బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కుమారుడు రక్షకుడిగా ఉండాలి. ఇక్కడ రక్షణ పొందడం, ప్రకృతి పరమైన అవసరమే గాని అసమర్థత కాదని నేటి సమాజం గుర్తించాలి. చాలా విషయాల్లో స్త్రీ విశేష మైన శక్తిగలది. ఆమెకు గల సౌకుమార్యం, సేవాదృక్పథం, త్యాగబుద్ధి, సంయమనం పురుషునికి ఉండనే ఉండవు. సంతతికి జన్మనివ్వడంలో, పెంచడంలో, శిక్షణ ఇవ్వడంలో స్త్రీ దైవాంశ సంభూత అందుకే ఆమెకు 'మాతృదేవోభవ' అంటూ ఆరాధనలో ప్రథమస్థానం ఇచ్చారు.

ప్రకృతికి పర్యాయపదంగా... ఆకాశంలో సగంగా... అభి వర్ణించబడే స్త్రీ వేదకాలం నుంచి పురుషాధిక్య ప్రపంచంలో అణచివేతకు గురవుతూనే ఉంది. తల్లిగా తన స్తన్యంతో శక్తిని నింపింది. గోరుముద్దలు తినిపించి నడక, నడత నేర్పించింది. ఆలిగా, జీవిత భాగస్వామిగా కష్టసుఖాల్లో సహధర్మచారిణిగా సాగే స్త్రీకి సమాజంలో అందుతున్న గౌరవం అంతంత మాత్రమే. స్త్రీ పురుష సమానత్వం మూడు పువ్వులు ఆరుకాయలుగా ఏ కాలంలోనూ, ఏ దేశంలోనూ, ఏ సమాజంలోనూ లేనే లేదు. ఇది చరిత్ర చెప్పిన నిజం. మన దేశంలోని జనాభాలో సగం మంది స్త్రీలే. వీరు అన్ని రంగాల అభివృద్ధిలో పురుషులతో పోలిస్తే వెనుకబడి ఉన్నారు. కారణం స్త్రీలు సామాజిక కట్టుబాట్లు, కులగౌరవం, క్రమ శిక్షణ పేరుతో బయట ప్రపంచంతో సంబంధాలు లేక గృహానికి పరిమితం కావడమేనని చెప్పవచ్చు.

ఒక వంక కన్యాశుల్కం, మరో వంక బాల్యవివాహాలు, వేరొక వంక బహు భార్యత్వం, నిర్భంధ వైధవ్యం, సతీ సహగమనం, వేశ్యాలోలత్వం లాంటి సంకెళ్లలో స్త్రీలు బందీలుగా ఉన్న రోజుల్లోనే ఆశాజీవి అయిన గురజాడ 'ఎప్పటి కైనా ఆమె విముక్తి పొందుతుందని, నవీన యుగపు స్త్రీ చరిత్రను పునర్లిఖిస్తుంద'ని వందసంవత్సరాల క్రితమే ఉద్బోధచేశారు. ఆనాటి సమస్యలు, అవ గాహనలు, ఆదర్శాలు, అనుభవాలు వేరు.

శాస్త్రీయ దృష్టి :

మనిషి సైన్స్ పరిభాషలో జంతువే. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాలి. మిగతా జంతువులకు లేని అనాలోచిత కామం మనిషికి ఎందుకు వచ్చింది? జంతువులు ఆయా కాలాల్లో మాత్రమే అవి సంభోగం చేసుకుంటాయి. మనిషికి కాలంతో పనిలేదు. ఈ భావనలు విపరీతాలై మరిన్ని దుర్ఘటనలై దాపురిస్తున్నాయ్. ఇప్పుడు మనం ఇరవై ఒకటవ శతాబ్దంలో పయనిస్తున్నాం. శాస్త్రీయ దృక్పథం పెరిగింది. నాగరికత పెరిగి చంద్రుడి మీదకు అడుగుపెట్టాం. ఎన్నో అసాధ్యాలనుకున్నవి సుసాధ్యా లయ్యాయి. శాస్త్రీయదృష్టితో మనిషి ఆలోచించినప్పుడే స్త్రీ భావనల్ని ఆమె కోణాలతో పరిశీలించగలుగుతాడు.

పెద్దలమాట :

బంధనాలనుంచి స్త్రీలు బయటపడిన రోజే స్త్రీజాతికి విముక్తి. స్త్రీలు అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించినరోజే దేశాభివృద్ధి. 'ఇంటికి దీపం ఇల్లాలు' ఎలాగో, 'దేశానికి వెలుగు స్త్రీజాతే'. "స్త్రీయశ్చా- పురుషామార్గం సర్వాలంకార భూషితా: నిర్భయా ప్రతిపద్యంతే యదా రక్షతి భూమిపా:" (సంస్కృత భారతం, 12-68-32). 'ఏదేశంలో స్త్రీలు సర్వాలంకారాలతో పురుషుల తోడు లేకుండా రహ

దారుల్లో, వీధుల్లో నిర్భయంగా తిరుగగలరో అక్కడే సుపరిపాలన ఉందని చెప్పొచ్చు' అని దీని అర్థం. మహాత్మా గాంధీ ఈ భావననే చెప్పారు. "స్త్రీల పరిస్థితి మెరుగుపడనిదే ప్రపంచంలో సంక్షేమానికి తావులేదు. ఒక్కరెక్కతో ఏ పక్షీ ఎగరలేదు" అన్న వివేకానందుడి మాటలను గమనించాలి. స్త్రీల విషయాల్లో నాటికీ నేటికీ విద్య, ఉద్యోగాది రంగాలలో కొద్దిపాటి మార్పు వచ్చింది.

నేటి సమాజభావనలు :

ఇంకా స్త్రీ అనేకానేక ఒత్తిడుల మధ్య జీవిస్తున్నది. ఆర్థిక పరాధీనత, బ్రతుకు బానిసత్వం ఆమెను లొంగ దీసేలా చేస్తున్నాయి. దానికి తోడు మారుతున్న సమాజ విలువల దృష్ట్యా సాంఘిక దురాచారాలు, వరకట్నం, మద్యపాన వ్యసనాలు, స్త్రీలపై అత్యాచారాలు, లైంగిక దాడులు, స్త్రీ గౌరవ ప్రతిపత్తులకు గొడ్డలివేటుగా తయారయ్యాయి. వరకట్న మరణమో, మానభంగమో, అత్యాచారమో ఆమెను కబలిస్తూనే ఉన్నాయి. పురుషులతో పోటీగా చదువుతూ, ఉద్యోగాలు చేస్తూ విజయాల్ని దక్కించుకుంటూ ఆధునిక కాలంలో ఆడది 'అబల' కాదు 'సబల' అని నిరూపించుకుంటున్నది. స్త్రీలు అటు గృహనిర్వహణలోను, ఇటు ఉద్యోగం, విధి నిర్వహణలోనూ నలిగిపోతున్నారు. ఉదయం లేచింది మొదలు అత్తమామలను, భర్త, బిడ్డలు సేవలతో నతమతమౌతూ సంసారాన్ని సాగిస్తున్నారు. కనీన వసతులు లేని కార్యాలయాలలో తమ ఇబ్బందులను చెప్పుకొనలేక కంటతడి పెడుతున్నారు. అధికారుల వేధింపులను, సహోద్యోగుల ఎత్తిపొడుపు మాటలను సహిస్తూ విసిగి వేసారి ఇంటికి తిరిగి వచ్చిన తరువాత కూడా, కనీసం కుటుంబ సభ్యుల సానుభూతి గాని, సహకారాన్ని గాని పొందలేకపోతున్నారు.

ముగింపు :

పరిస్థితులెలా ఉన్నా జీవన పోరాటంలో పురోగమనం సాధిస్తూ, అమ్మదనం నుంచి అంతరిక్షం దాకా ఎదిగి అంతర్జాతీయంగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసుకుంటునే ఉంది. పితృస్వామ్య వ్యవస్థ లక్ష్యాలు, ఆదర్శాలు స్త్రీపట్ల ఘోరమైన వికటాట్టహాసం సలుపు తున్నాయి. స్త్రీకి స్వేచ్ఛా సమానత్వం ఇంకా నూరామడల దూరంలోనే ఉందనేది నగ్నసత్యం. ఆడశిశువుల అమ్మ కాలు, బ్రూణహత్యలు, వరకట్న వేధింపులు, గృహ హింస, స్త్రీలపై అత్యాచారాలు, లైంగికదాడుల్లాంటి చాలా సాంఘికదురాచారాలు స్త్రీలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. మహిళల జీవితాలకు భద్రత లేని దేశాలలో భారతదేశానిది నాలుగవ స్థానానికి చేరింది. మొదటి స్థానంలో ఆఫ్ఘనిస్తాన్, రెండవ స్థానంలో కాంగో, మూడవ స్థానంలో పాకిస్తాన్ ఉన్నాయి. మొత్తం మీద ఇప్పుడిప్పుడే భారతీయ స్త్రీ వర్ణనలనుంచి, పొగడ్తలనుంచి, వాస్తవాల్ని గుర్తింపజేస్తూ ప్రశ్నించే స్థాయికి చేరుతున్నదని భావించ వచ్చు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

మాడభూషి కవిత్వం – సామాజిక ప్రయోజనం

- కె.లక్ష్మణ

ప్రస్తావన :

ప్రాచీన పద్య కవిత్వం ఒక ఎత్తైతే, ఆధునిక వచన కవిత్వం మరొక ఎత్తుగా ఎదుగుతున్నది. ఈ ఎత్తులో భాగంగానే సంఘసంస్కరణ కవిత్వం, భక్తి కవిత్వం, దేశభక్తి కవిత్వం, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవకవిత్వం, స్త్రీవాదకవిత్వం, దళితకవిత్వం, వచనకవిత్వం, మినీకవిత్వం, హైకూ కవిత్వం, నానీలు ఇలా వివిధ రకాలైన ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. ప్రాచీన కవిత్వం పదిలంగా ఉన్న రోజుల్లోనే, వాటి మధ్యలో ఆధునిక కవిత్వం విత్తనంగా మారి, మొలకెత్తి, చెట్టుగా ఎదగడమన్నది అసాధ్యమైన విషయం. అలాంటిది ఆధునిక కవిత్వం ప్రాచీన కవిత్వానికి సరితూగే విధంగా వ్యాప్తి చెందింది. ఆధునిక కవిత్వం కందుకూరి వీరేశలింగంతో ప్రారంభమయినప్పటికీ, వచన కవిత్వం ప్రజలందరి నోళ్లలో నానే విధంగా బీజం వేసినవారు గురజాడ వేంకట అప్పారావు. అప్పటి నుంచి విభిన్న కోణాల్లో, వివిధ దృక్పథాల్లో, పలురకాలైన సంఘటనలు, సంఘర్షణలు, సన్నివేశాలను కవితా వస్తువులుగా చేసుకొని కవిత్వాన్ని వెలువరిస్తున్నారు. అలా వెలువరిస్తున్న ఆధునిక కవులు కోకొల్లలు అన్నడంలో ఎటువంటి సందేహం లేదు. ఎందుకో ఆధునిక కాలంలోని కవులకు కవిత్వం రాయడం మీద మోజు ఎక్కువైపోయింది. అలా కవిత్వాన్ని ఒక పాటగా, మాటగా మలుస్తున్నారు. పాటలో కవిత్వం ఉండవచ్చు. మాటలో కవిత్వం ఉండవచ్చు. ఈ రెండింటిలో మాత్రం కవిత్వం పరిపుష్టంగా ఉండడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా ఉన్నదనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రాచీన కవుల కవితా ప్రభావం ఆధునిక కవుల మీద కూడా ఉన్నదనడంలో సందేహంలేదు. ఎందుకంటే ప్రాచీన కవులు పద్య కవిత్వాన్ని రాసినట్లుగానే ఆధునిక కవుల్లో కూడా పద్య కవిత్వాన్ని రాసిన కవులు లేకపోలేదు. అలా రాసిన వాళ్ళు కూడా కోకొల్లలని చెప్పాలి. ఆ విధంగా ప్రాచీన కవిత్వంతో పాటుగా ఆధునిక కవిత్వం నాటి నుంచి నేటి వరకు పరిణామం చెందుతూనే ఉంది. అలా పరిణామం చెందుతూ ఉన్న కవిత్వం ఎంతో మంది కవుల్ని ఎన్నో అంశాల మీద కవిత్వాన్ని రూపకల్పన చేయడానికి అవకాశం కల్పించింది. అలా అవకాశం కల్పించడమే కాకుండా ఎంతో మంది కవుల్ని ప్రసిద్ధ రచయితలుగా, జ్ఞానపీఠ గ్రహీతలుగా, పద్మశ్రీలుగా ఇలా ఎన్నో అవార్డులను పొందే విధంగా కవిత్వం రాణిస్తుందంటే ఇదంతా కవితా మహిమే కావచ్చు. ఈ విధంగా ఆధునిక కవిత్వం పలుదిశలుగా వ్యాప్తిచెందుతూనే ఉంది. ఈ వ్యాప్తిలో భాగంగా ఆధునిక కవి అయిన మాడభూషి సంపత్ కుమార్ గారి కవిత్వంలో సామాజిక ప్రయోజనానికి సంబంధించిన విషయాలు ఉన్నాయి. ఎందుకంటే ఈయన కవిత్వంలో ప్రధానమైన వస్తువు సామాజికమే. ఈయన సామాజిక బాధ్యతను దృష్టిలో పెట్టుకొని కవిత్వాన్ని కవిత్వీకరించారు. ఆ విధంగా ఈయన కలం నుండి జాలువారిన కవితలన్నీ కూడా సామాజిక ప్రయోజనాత్మకంగా ఉంటుంది. అందువల్లే మాడభూషి సంపత్ కుమార్ గారు ఆధునిక కవుల్లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోగలిగారు. మాడభూషి సంపత్ కుమార్ ఆచార్యులే కాదు పాత్రికేయుడు, కవి, విమర్శకుడు, అనువాదకుడు, బహుభాషా కోవిదుడు, అభ్యుదయవాది, మానవతా వాది, నిగర్వి, నిరాడంబరుడు, నిస్వార్థ సేవాతత్పరుడు, తమిళనాట తెలుగు భాషే ఊపిరిగా జీవిస్తున్న మహనీయుడు. వీరి కవితా సంపుటాలు

'జీవితం-కవిత్వం', 'శత్రువుతో ప్రయాణం', 'చివరకు నువ్వే గెలుస్తావు', 'ఆలోచనలు', 'మూడో మనిషి', 'వికారి', 'మొదటి అబద్ధం' మొదలైనవి. మాడభూషి కవిత్వంలో సామాజిక ప్రయోజనం గురించి విశ్లేషించుకొనే ముందుగా నిఘంటువు కారులు ఇచ్చిన కవిత్వం, సామాజికుడు, ప్రయోజనము అనే పదాలకు అర్థాలను ఒక సారి చూద్దాం.

కవిత్వము = కవి చెప్పిన పద్యాదికము, కవిత (శబ్దార్థచంద్రిక అను ఆంధ్రనిఘంటువు మహాకాళి సుబ్బారాయనిచే వ్రాయబడినది, పరిష్కర్త : వేదము లక్ష్మీనారాయణశాస్త్రి, పుట.310)

సామాజికుడు = సభయం దుండు వాడు, ఒక సమాజములో జేరి యున్నవాడు (శబ్దార్థచంద్రిక అను ఆంధ్రనిఘంటువు మహాకాళి సుబ్బారాయనిచే వ్రాయ బడినది, పరిష్కర్త : వేదము లక్ష్మీనారాయణశాస్త్రి, పుట.1236)

ప్రయోజనము = కార్యము, హేతువు (శ్రీ: శబ్దరత్నాకరము సంపూర్ణనిఘంటువు మరియు అను బంధం, కర్త బహుజనపల్లి సీతారామాచార్యులు 1827-1892, పుట.641)

జీవితం - సమాజం :

మాడభూషి కవితా సంపుటాల్లోని కవితలన్నీ కూడా విభిన్న కోణాల్లో ఉంటుంది. అలా విభిన్న కోణాల్లో ఉండే కవితలన్నీ కూడా సమాజంలో ఏదో ఒక మార్పు తీసుకొనిరావడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే మాడభూషి గారి మొదటి కవితా సంపుటం "జీవితం-కవిత్వం"లో-

"జీవితాన్ని విడిచి పెట్టి / కవిత్వం ఎలా రాస్తావ్?
కవిత్వానికి తెలియకుండా / జీవితాన్ని ఎలా దాస్తావ్?"

(జీవితం-కవిత్వం,పుట.1)

పై కవితా పాదాలన్నీ కూడా జీవితానికి కవిత్వానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని గురించి తెలియజేస్తాయి. అక్కడే పొరపాటు. ఎందుకంటే జీవితంలో ఎదిగిన తరువాతే కవిత్వాన్ని రూచి చూడగలం. అలా రుచి చూసిన దాన్ని కవితా పాదాలుగా మలుచుకోవడంలోనే ఉంటుంది కవి యొక్క నైపుణ్యం. ఆ నైపుణ్యతను పక్కన పెట్టితే, ప్రధానంగా కవి ఆవేదన తన కవిత్వం సమాజానికి ఎదో ఒక విధంగా ఉపయోగపడాలన్నదే. కవిత్వం ఎలా రాస్తావ్? జీవితాన్ని ఎలా దాస్తావ్? అనే పాదాల్లో సమాజాన్ని గురించి తెలియకుండా కవిత్వాన్ని ఎలా రాస్తావనే విషయమే కాకుండా జీవితాన్ని ఎలా దాస్తావనే అనే విషయాన్ని కూడా ప్రస్తావించారు. అందువల్లే సాహిత్యం సమాజానికి హితాన్ని తెలియజేయాలని కవి తన కవిత్వంలో కవిత్వీకరించారు.

"జీవితాన్ని / కాచి వడబోసిన వాడు
కవిత్వాన్ని రుచి కూడా చూడలేడు!
కవిత్వంలో / మునిగి తేలినవాడు
జీవితాన్ని అవలీలగా ఈదగలడు!"

(జీవితం-కవిత్వం,పుట.75)

జీవితం, కవిత్వం సామాజిక శ్రేయస్సే. ఎందుకంటే జీవితంలో కష్టసుఖాలను అనుభవించినవాడు కవిత్వాన్ని రుచి కూడా చూడలేడన్నారు రచయిత. అదే వ్యక్తి కవిత్వాన్ని రుచి చూసారంటే జీవితాన్ని అవలీలగా ఈదగలడనే దృక్పథాన్ని కవిత్వీకరించారు. పై రెండు విషయాలు జీవితానికి కవిత్వానికి సంబంధించినవి. జీవితం సమాజం మీద ఆధారపడి ఉంటుంది. అలాగే సమాజం కోసమే కవిత్వం కవిత్వీకరించబడుతున్నది. అందువల్లే కవిత్వంలోనూ జీవితంలోనూ సమాజం కోసం కవిత్వం దాగి ఉన్నదనే విషయాన్ని ప్రతి ఒక్కరు అవలోకనం చేసుకోవాలి.

"జీవితపు / రహదారిలో
సేద తీర్చే చెట్టు / కవిత్వం!"

(జీవితం-కవిత్వం, పుట. 108)

చెట్టు సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నదనే విషయాన్ని మనం ఒక సారి గుర్తు చేసుకోవాలి.

చెట్టు నీడ నిస్తుంది. పండ్లు ఇస్తుంది. ఇలా అన్ని రకాలుగా సమాజానికి మేలు చేస్తున్నది. అలాంటిది మాడభూషి సంపత్ కుమార్ జీవితపు రహదారిలో అంటున్నారు. జీవితపు రహదారిలో అంటే ఒక వ్యక్తి తన జీవితంలో ఎన్న ఒడిదుడుకులకు లోనై, అష్టకష్టాలు పడి జీవితంలో ఎదగడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి ప్రయత్నంలో భాగంగానే జీవితపు రహదారిలో సేద తీర్చే చెట్టు 'కవిత్వం' అంటున్నారు. ఇక్కడ కవిత్వం ఎందు కంటున్నారు రచయిత. ఆధునిక సాహిత్య ప్రక్రియలు అన్ని కూడా సామాజిక ప్రయోజనం కోసమే. అది ఎలాంటి సామాజిక ప్రయోజనమంటే ఏ ప్రక్రియైన సాహిత్యంలో మంచి విషయాలను తెలియజేసే విధంగా ఉండాలన్నదే కవి భావన. 'జీవితం-కవిత్వం' కవితా సంపుటంలోని కవితలన్నీ కూడా జీవితానికి, కవిత్వానికి సంబంధించినవే అయినప్పటికీ జీవిత కోణంలో చూస్తే జీవితానికి సంబంధించినవిగానూ, కవితా దృక్పథంతో చూస్తే కవిత్వానికి సంబంధించిన అంశాలను మనం పరిశీలించు కోవచ్చు. కానీ ఈ రెండూ విషయాలు కూడా సమాజం కోసమే అన్నది రచయిత దృక్పథం.

''శత్రువుతో ప్రయాణం'' కవితా సంపుటంలోని 'అడవిలో పొద్దు గూకింది' అనే కవితలో-

"జీవితం ఎందాకా? / అడుగులు దూర దూరంగా పడుతున్నాయి!
చేతుల్లో సత్తువలేదు / కాళ్ళు లాగుతున్నాయి
పొద్దుగూకేలోగా / జీవితాన్ని దాటెయ్యాలి!"

(శత్రువుతో ప్రయాణం,పుట.10)

సామాజిక ప్రయోజనం కోసం కావచ్చు, కుటుంబ జీవన విధానం కోసం కావచ్చు మనిషి పడుతున్న కష్టాలను గురించి కవి జీవితం ఎంతవరకు అని వాపోతున్నారు. జీవితం ఎంతవరకు అంటే ప్రాణం ఉన్నంతవరకే అనే విషయాన్ని ప్రతి ఒక్కరు పసిగట్టాలి. ఎందుకంటే మనిషికి ప్రాణం పోయిందంటే విలువ లేదు. ఆ విలువ రావడా నికి మనుషులు ఎన్ని రకాలుగా కష్టపడుతున్నారనే విషయాన్ని అడుగులు దూర దూరంగా పడుతున్నా యన్నారు. అంటే తినడానికి తిండి లేకుండా, త్రాగడానికి నీళ్ళు లేకుండా అడుగులు దూర దూరంగా పడుతున్నా యని, చేతుల్లో కూడా సత్తువలేకుండా పోయిందని, కాళ్ళు కూడా లాగేస్తున్నాయని ఈ సాయంత్రం సమయాని కంతా జీవితాన్ని దాటెయ్యాలని మనుషులు తాపత్రయం పడుతున్నారు. అంటే జీవితం ఎంతవరకు అనే విషయం ఎవరికీ తెలియదనే అంశాన్ని రచయిత ప్రస్తావించారు.

మరో కవిత 'సమాజం'లో

మనం ఎప్పుడూ / అసమ సమాజంలోనే పయనిస్తూ ఉంటాం
పట్టాల్లా ప్రవహించడం తప్ప / జంక్షన్ రానే రాదు!

(శత్రువుతో ప్రయాణం,పుట.58)

రచయిత సమాజాన్ని ఎన్నో కోణాల్లో చిత్రీకరించార నడానికి పై కవితా పాదాలే నిదర్శనాలు. ఎందుకంటే సమాజంలో ఉన్న వ్యక్తులందరూ అసమ సమాజంలో ప్రయాణం చేస్తున్నారన్నారు. ఏ విధంగా ప్రయాణం చేస్తున్నారు. ట్రైన్ నడపడానికి పట్టాలు ఉన్నదనే విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. అంటే పట్టాలపైన ట్రైన్ ప్రవహిస్తూనే ఉంటుంది. ఆ ప్రవహిస్తున్న ట్రైన్‌కి మధ్య మధ్యలో జంక్షన్లు వస్తుంది. ఇక్కడ రచయిత మనిషి జీవితానికి జంక్షన్‌రానే రాదని వాపోయారు.

''మూడో మనిషి'' కవితా సంపుటంలోని 'అక్షరాలు' అనే కవితలో-

"ఓంకారంతో / ప్రారంభమై
అంతం లేకుండా సాగే / అక్షరాలు
అనంతంగా / జీవితాంతం సాగుతూ ఉంటాయి
జీవితాన్ని సాగుచేస్తూ ఉంటాయి!"

(మూడో మనిషి, పుట.54)

అక్షరాలు ఎందుకు నేర్చుకోవాలి. సమాజంలో జరిగే మంచి, చెడు అనే అంశాలనే కాకుండా మరెన్నో విషయాలు మనకు అర్థం కావాలంటే, వాటితో మనం

జీవనం సాగించాలంటే అక్షరాలు తెలిసి ఉండాలి. అందుకే ఓంకారంతో ప్రారంభమై అంతంలేకుండా సాగే అక్షరాలు ఏవిధంగా సాగుతున్నదన్నారు? అనంతంగా, జీవితాంతం, జీవితాన్ని సాగుచేస్తూనే ఉన్నాయి. రైతు ఏ విధంగా పొలంలో పంటను సాగుచేస్తూ ఉంటారో అదే విధంగా మనిషి జీవితానికి కూడా అక్షరాలు సాగుచేస్తూనే ఉన్నాయనే విషయాన్ని గురించి లోతైన దృక్పథంతో రచయిత వెలిబుచ్చారు.

స్త్రీ మనోవేదన :

మాడభూషి సంపత్ కుమార్ స్త్రీలపై జరుగుతున్న హత్యాచారాలు, మానభంగాలు, కుటుంబ జీవన విధానంలో ఆమె పడుతున్న కష్టాలు, బాధలకు సంబంధించిన వివిధ రకాలైనటువంటి అంశాలను గురించి ఎన్నో కవితలను కవిత్వీకరించారు. ''శత్రువుతో ప్రయాణం'' కవితా సంపుటంలోని 'ఆమె' అనే కవితలో-

''మొగుణ్ణి వదిలేసిందన్న / నెపాన్ని మోస్తూ
బతుకును ఈడుస్తూ / పిల్లల్ని పెద్ద చేయాలి
తాను మరణించడానికి సిద్ధపడి / బిడ్డకు జీవాన్ని పోస్తుంది
బిడ్డలకోసమే జీవితాన్ని దారపోస్తుంది''

(శత్రువుతో ప్రయాణం, పుట.27)

స్త్రీ సమాజంలో గౌరవంగా బ్రతకడానికోసం ఆమె పడుతున్న కష్టాలను గురించి కళ్ళకు కట్టినట్లు రచయిత చిత్రీకరించారు. అంటే పెళ్ళైన స్త్రీ మొగుణ్ణి వదిలేసిందంటే ఆమెను సమాజం మరొక విధంగా చూస్తుంది. అలాంటి స్త్రీ పిల్లల్ని పెద్ద వాళ్ళు చేయాలని సంకల్పంతోనే తాను మరణించడానికి సిద్ధపడి, బిడ్డకు ప్రాణం పోస్తుందనే విషయాన్ని రచయిత తెలియజేశారు. అలాగే తన జీవితాన్ని బిడ్డల కోసమే దారపోస్తుందన్నారు. స్త్రీ సమాజంలో ప్రయోజకురాలుగా జీవించాలన్న, ఎదగాలన్న ఆమె కంటూ ఒక ప్రత్యేకమైనటువంటి స్థానాన్ని సంపాదించుకోవాలన్నదే కవి భావన.

''చివరకు నువ్వే గెలుస్తావు'' అనే కవితా సంపుటంలో 'అమ్మ' అనే కవితలో అమ్మ తన బిడ్డను పెంచి పెద్దవాడ్ని చేయడానికి ఎన్ని రకాలుగా ఆలోచిస్తుందనే విషయాన్ని-

''అమ్మ మేల్కొని ఉంటే / గుడిలో వినిపించే మంత్రంలా వినిపిస్తుంది
అమ్మ పనిచేస్తుంటే / బరువును మోస్తున్న బండిలా ఉంటుంది
పగలంతా చెట్టునీడలా ఉన్న అమ్మ / రాత్రిళ్ళు ఇంట్లో దీపంలా ఉంటుంది!''

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.68)

చెట్టు నీడస్తుంది. అమ్మ ఒక జీవితాన్నిస్తుంది. బిడ్డను పెంచి పోషిస్తుంది. అలాంటి అమ్మ మేల్కొని ఉంటే గుడిలో మంత్రంలా వినిపిస్తుందన్నారు. అమ్మ ఇంట్లో పనిచేస్తుంటే బరువును మోస్తున్నటువంటి ఒక బండిలా ఉంటుందన్నారు. అమ్మను చెట్టుతో పోల్చారు రచయిత. అమ్మ పగలంతా చెట్టునీడలా ఉంటుందన్నారు. రాత్రి సమయంలో ఇంట్లో వెలిగే విద్యుత్తు దీపంలా ఉంటుందన్నారు. అమ్మ గురించి పలువిషయాలను తెలియజేయడానికి కారణం కూడా అమ్మ పెంచిన బిడ్డ సమాజంలో ఒక ఉన్నత స్థాయికి ఎదగడం కోసమే.

''శత్రువుతో ప్రయాణం'' కవితా సంపుటంలోని 'మగాడు' కవితలో స్త్రీ ఎన్ని రకాలుగా మగాడికి అణగిమణగి జీవించాలనేటువంటి విషయాన్ని-

''చెవులు కుట్టారు / ముక్కు కుట్టారు
బాధగా ఉన్నా / భరించాను నోరుమూసుకొని
అంతా నా అందంకోసమేనని
తీరా నోరు తెరవాలని / ప్రయత్నించినప్పుడుగానీ
తెలియలేదు / ముందుగానే / నోరు కూడా కుట్టేశారనీ!''

(శత్రువుతో ప్రయాణం,పుట.48)

చంటి బిడ్డకు తొమ్మిది నెలలో గానీ, పదకొండో నెలలో గానీ చెవులు కుట్టడం ఆనవాయితీ. అలాంటిది రచయిత చెవులు కుట్టారు, ముక్కు కుట్టారన్నారు. అంటే

చెపులు కుట్టినప్పుడు, ముక్కు కుట్టినప్పుడు బాధగా ఉన్నా భరించాను. ఎందుకంటే ఇవన్నీ కూడా నా అందం కోసమే అనే భ్రమలో జీవించాను. చివరకు పెళ్ళి చేసుకొని అత్తగారింటికి వెళ్ళినప్పుడు అక్కడ నోరు తెరవాలంటే ఏప్పుడో నా నోరు కూడా కుట్టేశారనే విషయాన్ని గ్రహించాను. రచయిత 'మగాడు' అనే శీర్షికను పెట్టినా, కవితలో ఉన్నటువంటి అన్ని విషయాలు కూడా స్త్రీమనోవేదన, ఆమె పడుతున్నటువంటి కష్టాలు, అనుభవిస్తున్న బాధలను గురించే తెలియజేశారు. ఇవన్నీ కూడా ఎందుకు తెలియజేశారంటే చివరకు ఇలాంటి కష్టాలను సమాజంలో ఏ స్త్రీ పడకూడదనే కవి ఆవేదన.

ప్రకృతి - ప్రయోజనం :

''శత్రువుతో ప్రయాణం'' అనే కవితా సంపుటంలో ప్రకృతికి సంబంధించిన విషయాలను 'విరోధి' కవితలో తెలియజేశారు. 'విరోధి' అంటే తెలుగు సంవత్సరాలలో ఒక సంవత్సరం విరోధినామ సంవత్సరం. ఈ 'విరోధి' కవిత ప్రారంభంలో-

"ఈ ఉగాది / నాకు విరోధి!
షడ్రుచులు వడ్డించిన / భూమి తల్లిపై
అత్యాచారం! / ప్రాణమై నిలిచిన
ప్రకృతిపై పడగెత్తిన / మానవ అహంకారం!"

(శత్రువుతో ప్రయాణం,పుట.20)

తెలుగు వాళ్లకి మొదటి పండుగ ఉగాది. అలాంటి మొదటి పండుగైన ఉగాది నాకు విరోధి అంటున్నారు మాడభూషి సంపత్ కుమార్ గారు. తినడానికి షడ్రుచులు వడ్డించినటువంటి భూమి తల్లిపై కూడా అత్యాచారాలు చేస్తున్నారని వాపోయారు. అందరి ప్రాణాలను కాపాడుతున్న ప్రకృతిపై మానవులు తన అహంకారాన్ని చూపిస్తున్నారన్నారు. ఇక్కడ మనం ప్రధానంగా గ్రహించవలసిన విషయమేమిటంటే సమాజంలో ఉన్న మనుషులు చెట్టును పెంచి పోషించరు. కానీ చెట్లను నరకడంలో ముందుగా ఉన్నారనే విషయాన్ని పరోక్షంగా రచయిత వెలిబుచ్చారు.

మరో కవిత 'స్వభానుకు స్వాగతం!' అనే కవిత కూడా తెలుగు సంవత్సరానికి సంబంధించిందే. అంటే తెలుగు సంవత్సరాలలో స్వభానునామ సంవత్సరం కూడా ఒకటి.

"సొగసులు / చిమ్ముకొంటూ / వస్తున్న
స్వభానుకు స్వాగతం! / పచ్చని మామిడి తోరణాలతో
పసిడి పరిమళాలు / వెదజల్లుతూ
సోయగాలు పోతున్న / స్వభానుకు స్వాగతం!"

(శత్రువుతో ప్రయాణం,పుట.40)

ఇంతకు ముందు కవిత 'విరోధి'లో కవి నాకు ఈ ఉగాది విరోధి అన్నారు. కానీ పై కవితా పాదాల్లో సొగసులు చిమ్ముకొంటూ వస్తున్న స్వభానునామ సంవత్సరం ఉగాదికి స్వాగతం పలుకుతున్నారు రచయిత. అది కూడా ఎలాంటి ఉగాది? ఎలా వస్తుంది? పచ్చని మామిడి ఆకులతో కట్టిన తోరణాలతో పసిడి పరిమిళాలతో వెదజల్లుతూ వస్తున్నటువంటి సోయగాలు పోతున్న స్వభానుకు స్వాగతమన్నారు. ఇంతకు ముందు చెప్పిన విధంగానే తెలుగు వాళ్ళకు ఉగాది పండుగ రోజు నుండి ఆ సంవత్సరమంతా అన్ని శుభకార్యాలు జరుగుతుందనే ధృడమైన నమ్మకంతో జీవిస్తుంటారు. ఇలాంటి ఉగాది మాత్రమే సమాజానికి మేలు చేస్తుందని రచయిత ఉద్దేశమేమో! ఒక రచయిత ఉద్దేశమే కాకుండా అలాంటి ఉగాది మాత్రమే సమాజానికి కావల్సిందనే నా అభిప్రాయం. ఈనాటి కాలంలో ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న 'కరోనా' మహమ్మారిలాగ కాకుండా అందరికీ మంచిని చేకూర్చే విధంగా ఉగాది ఉండాలన్నదే కవి ఆలోచన.

''చివరకు నువ్వే గెలుస్తావు'' అనే కవితా సంపుటంలోని 'రహదారి' కవితలో

"రోడ్డుమీద / రాళ్ళను తన్నుకుంటూ వెళ్ళాను
కాళ్ళు నెత్తుటిపూలు-/ వెనకవస్తున్నవారికి
రోడ్డంతా గులాబి పువ్వులు!"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.40)

రహదారిలో ముందు వెళ్ళుతున్న వ్యక్తి మంచివాడైతే అడ్డం వచ్చినవాటిని తొలగించుకొని వెళ్ళతాడు. అలా రచయిత రోడ్డుమీద రాళ్ళను తన్నుకుంటూ వెళ్ళానన్నారు. అంటే మధ్య మధ్యలో అడ్డంగా ఉన్న రాళ్ళను తీసి పడవేస్తూ వెళ్ళినప్పుడు, తన కాళ్ళలో నెత్తురు వచ్చినప్పుడు, వాటిని ప్రకృతిలోని పూలుతో పోల్చారు. కానీ తన వెనకవస్తున్నవారికి రోడ్డంతా కూడా గులాబి పువ్వులు అన్నారు. అంటే తాను ముందుగా వచ్చినప్పుడు కొన్ని రాళ్లు తగిలినా గానీ అది పువ్వులతో పోల్చారు. అదే వెనక వచ్చినవారికి రోడ్డు శుభ్రంగా ఉంది. కాబట్టి గులాబి పువ్వులపైన హాయిగా నడుచుకుంటూ వస్తున్నారని కవి వెలిబుచ్చారు.

మరో 'గాలి' కవితలో

"చెట్టు గాలిని / సృష్టించింది!
గాలి చెట్టును / పీడించింది!"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.43)

మాడభూషి సంపత్ కుమార్ గారు పై నాలుగు పాదాల్లో చాలా లోతైన కవిత్వాన్ని కవిత్వీకరించారు. ఎందుకంటే చెట్టు వల్ల గాలి వస్తుందనే విషయం అందరికీ తెలిసిందే. కానీ అదే గాలి చెట్టును పీడించేస్తుందన్నారు. సునామీ వచ్చినప్పుడు, విపరీతమైన గాలి వీచినప్పుడు చెట్టు కిందపడిపోవడం జరుగుతుంది. ఈ చిన్న విషయాన్ని ఎంత చక్కగా చిత్రీకరించారంటే దీనికి కారణం కవిలో ఉన్నటువంటి సామాజిక ప్రయోజమే.

'ఆకు' కవితలో-

"చెట్టు / ఒక కన్నీటి / బొట్టును కార్చింది
కవిత్వం కోసం కాయితంగా మారడానికి!
ఆకును / రాల్చేందుకు
కవిత్వంతో చెట్టు హృదయాన్ని కదిలించగలిగాను
కానీ ఆకును అతికించలేకపోయాను!"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.46)

నాటి నుంచి నేటి వరకు కాయితం కావాలంటే ప్రకృతిలోని ఎన్నో చెట్లను నరికివేయ్యాలి. అలాంటిది మాడభూషి సంపత్ కుమార్ గారు పైకవితా పాదాల్లో చెట్టు ఒక కన్నీటి బొట్టును కార్చుతుందంటే నమ్ముతారా? నమ్మాలి. ఎందుకంటే సమాజంలోని మూఢనమ్మకాలను బయట పడాలంటే ఒక కవిత్వం గానీ, కథ గానీ, నవల గానీ, నాటకం మరేదైన ప్రక్రియ వెలుగులోకి రావాలి. అప్పుడు గానీ సమాజంలో మార్పురాదు. మార్పును తీసుకోని రావడానికే చెట్టు కవిత్వం కోసం కాయితంగా మారింది. అలా కాయితంగా మారినటువంటి చెట్టులోని ఆకును రాల్చినందుకు, కవిత్వంతో చెట్టు హృదయాన్ని కదిలించ గలిగానన్నారు. కానీ చెట్టును విడిచిపోయినటువంటి ఆకును మాత్రం అతికించలేకపోయానని వెలిబుచ్చారు.

మరో కవిత 'చెట్టు'లో-

"చెట్టుపూసిన / పువ్వులను తురుముకోండి
చెట్టుకాసిన / కాయలను తినండి
చెట్టుకు కాసిన / ఆకులను ఉపయోగించుకోండి
చెట్టును మాత్రం నరికేయకండి!"

(చివరకు నువ్వే గెలుస్తావు, పుట.63)

సమాజంలోని మనుషులకు చెట్టు అన్ని రకాలుగా ఉపయోగపడుతుంది. చెట్టు గాలినిస్తుంది, నీడనిస్తుంది, పువ్వులు, కాయలు, ఆకులు ఇలా అన్నీ ఇచ్చినటువంటి చెట్టును మాత్రం నరికేయకండి అని రచయిత ఆవేదన చెందారు. ఎందుకంటే మనిషి పుట్టినప్పటి నుంచి చని పోయేంతవరకు చెట్టు అన్ని రకాలుగా మనిషికి సహాయంగా ఉంటుంది. అదే మనిషి చనిపోయినప్పుడు ఆ మనిషిని కాల్చడానికి కూడా చెట్టు ఉపయోగ పడుతుంది. కాబట్టి ఈ ప్రకృతిలో ఉన్న ఏ చెట్టును నరకకూడదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టు కోవాలని మరోసారి హితబోధ చేశారు.

"మూడో మనిషి" కవితా సంపుటంలో 'ప్రకృతి' అనే కవితలో-

"ప్రకృతిని / ఎదిరించి / బెదిరించి

గుప్పిట్లో పెట్టుకొన్న మానవుడా
ప్రకృతి జూలు విదిల్చిందంటే
నీ టెక్నాలజీ / నీ టెక్నిక్కులు
టైటాన్‌లా కుప్పకూలిపోవలసిందే!"

(మూడో మనిషి, పుట.16)

నేటి సమాజం ఎలా ఉందంటే నీటిని అమ్ము కున్నట్లుగా, గాలిని కూడా అమ్ముకొనే పరిస్థితి వచ్చేసింది. రచయిత ప్రకృతిని ఎదిరించి, బెదిరించి తన గుప్పిట్లో పెట్టుకొన్నటువంటి మానవుడ్ని హెచ్చరిస్తున్నారు. ఈ ప్రకృతి విపరీతంగా గాలి వీచినట్లయితే నీ సాంకేతిక విజ్ఞానం, సాంకేతికత, టైటాన్ కంపెనీలాగా కుప్పకూలి పోతుందని వ్యక్తం చేశారు.

"అనుభవాలు అనుభవాలుగా
కుప్పలు పోసినా / ప్రకృతిని అర్థంచేసుకోకపోవడానికి
అనుభవం చాలడంలేదు!"

(మూడో మనిషి, పుట.16)

ఎన్ని సాంకేతిక పరికరాలు ఉన్నప్పటికి ప్రకృతిని అర్థం చేసుకోవడానికి సాధ్యంకాలేదు. పై కవితా పాదాల్లో రచయిత అనుభవాలు కుప్పలుగా పోసినటువంటి శాస్త్రవేత్తలు ఉన్నప్పటికి ప్రకృతిని అర్థం చేసుకోలేక పోతున్నారని వాపోయారు. అంటే ఈ ప్రకృతిపై ఎంతటి అనుభవం కలిగిన వ్యక్తులున్నప్పటికీ ఏమీ చేయలేక పోతున్నారని కవి భావన. ఈ విషయాన్ని ఎందుకు చెప్పవలసిందంటే ఎప్పుడు వాన వస్తుంది? ఎప్పుడు గాలి వీస్తుంది? అనే విషయాలను నేటి కాలానికి కూడా పసిగట్టలేకపోతున్నారు.

మరో కవిత 'ఒక గాలి'లో-

"ఏ చెట్టు / గాలిని సృష్టించిందో
ఆ చెట్టును / అదేగాలి
సమూలంగా / నాశనం చేసింది"

(మూడో మనిషి, పుట.33)

ఒక సునామీ అయినా, ఒక గాలి అయినా, ఒక వానైనా చాలు సమాజాన్ని అల్లకల్లోలం చేయడానికి. ఏ చెట్టు అయితే గాలిని సృష్టించిందో అదే చెట్టును అదే గాలి సమూలంగా నాశనం కూడా చేస్తుందన్నారు రచయిత. ఎలాగంటే విపరీతమైన గాలి విచీనట్లుయితే చెట్లు నేలమీద పడిపోతుందనే విషయాన్ని తెలియ జేశారు.

"గాలి తాను కూర్చున్న చెట్టును
తానే పెకలించింది / గాలిని, చెట్టును
సమానంగా పూజించాడు మనిషి
ఒక దేవత దెయ్యమై / వికటాట్టహాసం చేస్తే
చెట్లు తలవిరబోసుకొని హాహాకారాలు చేశాయి
వృక్షవంశాన్ని నాశనం చేసి / గాలి మనిషిని
గాల్లోకి వదిలేసింది!"

(మూడో మనిషి, పుట.33)

గ్రామీణ ప్రాంతంలో జీవించే ప్రజలకు మూఢ నమ్మకాలు ఉంటాయి. ఆ చింతచెట్టులో దెయ్యం ఉంటుందని, వంకల్లో దెయ్యం ఉంటుందని భయ పడుతూ ఉంటారు. అలాంటిది ఇక్కడ రచయిత మనిషి గాలిని, చెట్టును సరి సమానంగా పూజిస్తాడు. కానీ ఒక దేవత దెయ్యమై వికటాట్టహాసం చేస్తుంటే చెట్లు తలవిర బోసుకొని హాహాకారాలు చేస్తున్నాయనే విషయాన్ని పసి గట్టారు. ఆ గాలి వల్ల, ఆ దెయ్యం వల్ల వృక్షాలన్నీ కూడా నాశనం అయిపోయాయి. అదే గాలి మనిషిని గాల్లోకి వదిలేసిందని విషయాన్ని పై విధంగా చిత్రీకరించారు.

ముగింపు :

"మాడభూషి కవిత్వం-సామాజిక ప్రయోజనం" అన్న వ్యాసంలో మాడభూషి గారి కవితా సంపుటాల్లోని కొన్ని కవితలను మాత్రమే పరిశీలించాను. ఎందుకంటే మాడ భూషి గారి కవితా సంపుటాల్లోని కవితలన్నీ కూడా ఒక్కొక్క కవిత ఒక్కొక్క సామాజిక ప్రయోజాన్ని కలిగించే విధంగా ఉన్నదనడంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఎందు కంటే రచయిత సమాజాన్ని ప్రతి ఒక్క కవితల్లో కళ్ళకట్టినట్లు చిత్రీకరించారు. అందువల్లే మాడభూషి

సంపత్ కుమార్‌గారు వెలువరించిన ప్రతి కవితను పరిశీలించాలి, పరిశోధించాలి, విశ్లేషించాలి, విపులీకరించాలి. కానీ నేను ఈ వ్యాసంలో కొన్ని విషయాలను మాత్రమే పరిశీలించాను. అది నా ఆలోచనకు తగిన విధంగా కొన్ని కవితలను విశ్లేషించాను. ఒక్క విషయాన్ని మాత్రం మీతో పంచుకుంటున్నాను. మాడభూషి గారి కవిత్వాన్ని అర్థం చేసుకోవడమంటే కత్తి మీద సామే. ఆయన పెట్టినటువంటి కవితా శీర్షికలు, కవితల్లోని కవితా పాదాలు సామాన్య పాఠకులకు అర్థమయ్యే విధంగానే ఉంటుంది. కానీ అర్థం చేసుకోవడం సాధ్యమయ్యే పనికాదు. కొన్ని పదాలకు అర్థాలు కూడా దొరకక పోవచ్చు. ఎందుకంటే వినూత్నమైన దృక్పథంతో కవిత్వాన్ని కవిత్వీకరించడంలో మాడభూషి సంపత్ కుమార్ గారు గత ముప్పై సంవత్సరాలుగా ముందు వరుసలోనే ఉన్నారనడంలో ఎటువంటి సందేహం లేదు. "మాడభూషి అంటే మానవత్వమే! మానవత్వమంటే మాడభూషే!".

ఆధార గ్రంథాలు :

1. వేదము లక్ష్మీనారాయణశాస్త్రి - శబ్దార్థచంద్రిక అను ఆంధ్రనిఘంటువు మహాకాళి సుబ్బారాయనిచే వ్రాయబడినది, టాగూరు పబ్లిషింగ్ హౌస్, షాప్ నెం.20, వైశ్యా హాస్టల్ బిల్డింగ్, కాచిగూడా చౌరస్తా, హైదరాబాదు-27, ప్రచురణ : 2003.
2. బహుజనపల్లి సీతారామాచార్యులు 1827-1892 - శ్రీ: శబ్దరత్నాకరము సంపూర్ణనిఘంటువు మరియు అనుబంధం, విక్టోరియా పబ్లిషర్స్, సింగరాజువారి వీధి, కొత్తపేట, విజయవాడ-01, మూడవ ముద్రణ: సెప్టెంబర్ 2007.
3. సంపత్‌కుమార్, మాడభూషి - "జీవితం-కవిత్వ" శ్రీ విజయనామ సంవత్సర ఉగాది, ఏప్రిల్ 2013, "శత్రువుతో ప్రయాణం" శ్రీ మన్మథనామ సంవత్సర ఉగాది, మార్చి 2015, "చివరకు నువ్వే గెలుస్తావు" శ్రీదుర్ముఖినామ ఉగాది, ఏప్రిల్ 2016, "మూడోమనిషి" హేవిళంబి ఉగాది, మార్చి 2017, పాలపిట్టబుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక తెలుగు కథ (2001–2010) – సామాజిక జీవన చిత్రణ

–డా॥. శేఖర్ కోలా, తెలుగు అధ్యాపకుడు, ఆంధ్ర లొయోల కళాశాల, విజయవాడ.

'నిశ్శబ్ద విప్లవం-- కథ జి. ఉమామహేశ్వర్ గారు రచించారు. ప్రజాతంత్ర వర్తమాన సాహిత్య ప్రత్యేక సంచిక, మార్చి 2001 లో ముద్రించబడింది. ముగ్గురు మిత్రుల మధ్య జరిగిన కథ. ఐ.టి. రంగం కొత్తగా సమాజాన్ని ఆక్రమిస్తున్న తొలి రోజులలో ఉమామహేశ్వర్ గారు సమాజం మీద ఎక్కుపెట్టిన బాణం ఈ కథ. పెద్ద అద్దాల మేడలో ఉండే ఐ.టి. ఉద్యోగికీ, మధ్యతరగతి ప్రభుత్వ ఉద్యోగికీ, పేద మట్టి రైతుకి మధ్య కథ విస్తరించడంలోనే ఈ కథ సౌందర్యం అంతా అక్కడే ఉంది. అంతే కాకుండా ఈ ముగ్గురూ మిత్రులు కూడా. ఆనాటి సమాజం యొక్క సామాజిక వాస్తవాన్ని పచ్చిగా సమాజానికి చూపి ప్రశ్నించిన కథ.

ఒకరోజు అనుకోకుండా మురళీ, సంజన్నలు కృష్ణ మోహన్‌ని ఆఫీసులో కలుస్తారు. ముగ్గురు బాల్య స్నేహితులు. చాలా రోజులకు కలుస్తారు. పదో తరగతి తరువాత వారు ఇప్పుడే కలవటం. కృష్ణమోహన్ ఆఫీసులో అడుగు పెట్టినప్పటి నుండి వేరే ప్రపంచంలో ఉన్నామా అనిపిస్తోంది వారిద్దరికి. అందమైన బిల్డింగు, నీట్గా అమర్చిన ఫర్నిచరు, క్యాబిన్లు, సెంట్రలైజ్డ్ ఏసి, ఏసి లోంచి సెంటు వాసనలు. అడుగు పెడితే మాసి పోతుందేమో నన్నట్లు తెల్లని టైల్స్ తో ఫ్లోరింగ్, అందరి ముందు కంప్యూటర్లు, ఫోన్లు, అందరికీ బూట్లు, టైలు - ఈ వాతావరణంలో తెల్లటి పాలల్లో మరకలుగా కనిపిస్తున్నామేమో అనిపించింది వారిద్దరికి. వారి మాటల్లో బాల్యం గుర్తుచేసుకుంటారు. కృష్ణమోహన్ జీతం నెలకు 40,000 వేలుగా తెలుసుకుంటారు. ఇంటికి ఏమైన పంపుతున్నావా అని సంజన్న ప్రశ్నిస్తాడు. ఈ మధ్యనే పెళ్ళైందనీ, ఖర్చులు పెరిగాయని పంపటానికి సరిపోవటం లేదని చెపుతాడు. తన విలాశవంతమైన జీవితాన్ని మిత్రులకు పరిచయం చేస్తాడు. ఈ ఉద్యోగంలో పార్టీలు, మందు, విందులు సాధారణం అని వాటికే వచ్చిన సంమాదన సరిపోతుందని ఇంటికి పంపంటానికి ఏమీ మిగలటంలేదని వివరిస్తాడు. అతని ఆనందమయమైన జీవితాన్ని చూచి మిత్రులు ఆశ్చర్యపోతారు. ఒక్క సారిగా వారి పేద బ్రతుకులు కళ్ల ముంది కదులుతాయి.

మురళి ఒక సాధారన ప్రభుత్వ గుమ్మస్తా. జీతం నెలకు 4,000. తను నిత్యం ఖర్చులతో సతమతమవుతుంటాడు. కాని మిత్రుడు తన పది నెలల జీతం ఒక్క నెలలోనే సంపాదించటం తలచుకుంటే నిద్రపట్టలేదు. ఆఫీసులో ఎంత పనిచేసిన రూపాయి సంపాదన పెగటంలేదు. నిజాయితీకి గుర్తింపు లేకపోవటాన్ని తలచుకొని బాధపడుతుంటాడు.

సంజన్న ఒక పేద రైతు. అంతే కాదు తన గ్రామంలోని మిగిలిన రైతులకు నాయకుడు కూడా. ఆ సంవత్సరం కల్తీ విత్తనాల వల్ల గ్రామంలో ఎవరి పొలంలోనూ మొలక రాలేదు. వీటిని కూడా డబ్బులికేకద కొన్నాది. ''మోసం చేసింది నన్నొక్కణ్ణే కాదుగదా. తిండి తినే అందర్నీ మోసం చేసినట్లు! ఒకట్రెండు ఎకరాలుండేటోళ్లు ఏం తట్టుకుంటారు? ఇంత పురుగుమందు తాగి సస్తారు. . . . అయినా సస్తాబోతే ఎవురికి లాభం? సావాల్సిన ఖర్మం పట్టించినోణ్ణి సంపాల.'' రైతులందరూ సంజన్న నాయకత్వంలో ప్రభుత్వ పరిపాలన కార్యాలయం ముందు ధర్నాచేస్తారు. అద్దాల మేడ భళ్లుమంది. అందులోని ఎం.డి. చెంప చెళ్లుమంది. ''రెండు లక్షలు! రెండు లక్షలు!! ఒరేయ్ ఇంత సంపాదింస్తున్నావు. ఏ పొద్దయినా మా గురించి ఆలోచించినావా? నేను గుండె మీద ధైర్యంగా చెయ్యేసుకుని చెప్తాండ - నేను నీ కోసం వడ్లు పండిస్తాండ - బేళ్లు పండిస్తాండ- నీ తిండి మొత్త ఇదిగో ఈ నా పిచ్చినా కొడుకులు పండించిందేరా? చెప్పరా. చెప్పు. నువ్వు గూడ గుండె మింద చేయ్యేసుకుని చెప్పు. నువ్వు మా కోసం

ఏం చేసినావు?" సంజన్న ఈ ప్రశ్న ఎం.డి.ని మాత్రమే అడిగినట్లు లేదు. మనందరినీ అడుగుతున్నట్లువుంది. సమాధానం ఏం చెప్పగలదు ఈ నవ సమాజం.

సంజన్న కృష్ణమోహన్ని పట్టుకున్నాడు. ''ఏంరా! మీకు వారానికొకసారి పుల్లుగ తాగకపోతే నిద్రపట్టదా? ఎవడబ్బ పొమ్మని కులుకుతున్నారా? మీరు తాగేది మందు కాదురా! అది మా రక్తం. మా రక్తం తాగు తున్నారా! నెలకు నలభై, యాభై వేలు సంపాదించేవోడు అమెరికాకి పైస లేకుండా ఉత్తరం వ్రాసుకోవచ్చంట. మేం పిచ్చి నాకొడుకులమయి అద్రూపాయికి కార్మ కొనుక్కోవాల. ఇదేం న్యాయం. ఒరేయ్ కృష్ణమోహన్ వీణ్ణి చూడరా! గుమాస్తాగిరి చేస్తా తమ్ముణ్ణి సదివించినాడు. చెల్లెలు పెండ్లి చేసినాడు. ఒక్క పైసా లంచం ముట్టలేదు. నాలుగు వేలతో ఎట్ల బతుకుతున్నాడో చూడ్రా! ఒరేయ్ వీడి కాలి కింద దూరాల్రా నువ్వు. తెలుసునా!----అంటూ కష్టజీవుల త్యాగాలను, మరోసారి జి.ఉమామహేశ్వర్ గారు స్వార్థంతో నిండిన ఈ సమాజాన్నీ వాస్తవ దృష్టికోణంలో చూపించాడు.

స్త్రీవాద రచయిత్రి 'కుప్పిలి పద్మ గారు' రాసిన కథ 'సాలభంజిక--. ప్రజాతంత్ర వర్తమాన సాహిత్య ప్రత్యేక సంచికలో మార్చి, 2005 న ముద్రితము. పనిచేస్తున్న ఆడవారి జీవితాలకు అద్దం ఈ కథ. పేద స్త్రీలు కుటుంబ పోషనలో ఎలా సమిదలుగా మారుతున్నారో విడదీసి చూపించిన కథ. సాలభంజిక అంటే బొమ్మ అని అర్థం. దేవుడు చేసిన బొమ్మ ఈ సాలభంజిక. ఈ కథకు ఆ పేరు సరిపోయింది. ఇద్దరు అమ్మాయిల దయనీయమైన జీవితాలపై రాయబడిన కథ ఇది. ఎవరూ చూడని, తెలియని జీవితాలను పద్మగారు చక్కగా ఒడిసి పట్టుకున్నారు. దాన్ని నడిపించిన తీరు కూడా బాగుంది. సామాజిక వాస్తవికతకు ఇది నిలువెత్తు నిదర్శం.

మాధురి, అంజలి ఇద్దరు 'అందమైన ప్రపంచాన్ని' చూపించే కంపెనీలో ఉద్యోగులు. వివిధ ప్రదేశాలతో పాటు అతిథులకి కాలసిల ఏర్పాట్లు, శారీరక సుఖాలు చూడడం కూడ వీరి బాధ్యత. ఆ అమ్మాయిలు వాళ్లతో స్టార్ హొటల్ కో గెస్ట్ హౌస్ కో. వ్యాపార లావాదేవీ లలో ఆటవిడుపు యీ చిరునవ్వులు. వీరి మనస్సు ఎవరికీ అవసరంలేదు.

మాధురి పేదింటి పిల్ల. కుటుంబ పెద్ద కాని పెద్ద. తల్లికి ఒక రోజు ఈ ఉద్యోగం చేయనని చెపుతుంది ధైర్యంగా. కాని ''మీ బాస్ డిన్నర్ కి రమ్మని సతాయిస్తున్నాడా? ఆడాళ్లని ఏదో వొకటి అలా అంటుంటారు. అందంగా వుంటావ్ కదా. ఇంకాస్త ఎక్కువ చికాకు ఉంటుంది. లౌక్యంగా మెసులుకోవాలి. అంతేగాని అలా బెంబేలు పడిపోతే ఎలా... నీది ఎలాంటి చికాకైనా కాస్త సర్దుకుపోమ్మా. నువ్విప్పుడు ఉద్యోగం మానేస్తే వీళ్ల చదువులకి చాలా కష్టం అవుతుంది. ఇంటి పరిస్థితి చికాకుగా అయిపోతుంది. కొన్నాళ్లు కష్టపడితే అంతా వొక దారికి వస్తారు. నాలుగు డబ్బులు వెనకేసుకుంటే నీ పెళ్లి చెయ్యొచ్చు. పొరపాటున కూడా వుద్యోగం మానైకు. ఎక్కడైనా మగాళ్లతో ఏదో ఒక చికాకు వుంటుంది కదా తల్లీ. కాస్త వోపిక పట్టు'' అంటూ తల్లి దాదాపు కూతురి కాళ్లు పట్టుకున్నంత బతిమాలుతుంది. సాటి స్త్రీ కష్టాన్ని అర్థం చేసుకొనే పరిస్థితి కూడా లేని పేదరికం. పాపం ఆమె మాత్రం ఎంచేస్తుంది.

మాధురి మనస్సు చాలా బాధపడుతుంది. 'డిన్నర్‌కి పిలిచి చెయ్యి పట్టుకోవటమో కళ్లల్లోకి చూపులు జార్చటమో కాదమ్మా, ఇప్పుడే లౌక్యాలు అక్కర్లేదు. ఏ మునుగులూ లేవ్. అవసరాలే. మేధస్సు శరీరమూ పెట్టుబడి అంతే.'' అని చెప్పాలనుకుంది కాని అర్థం చేసుకోలేని తల్లి. ఆమెను జాలిగాచూడటం తప్ప ఏమి చేయలేని నిస్సహాయత. తరువాత పరిణామాలలో మాధురి ఆ ఉద్యోగం మానేసి, తనకు ఏ ఇబ్బంది లేని మరో ఉద్యోగంలో చేరుతుంది. పాత జీవితానికి స్వస్తి చెప్పి కౌశిక్ అనే అభ్యుదయ భావాలున్న యువకున్ని పెళ్లి చేసుకొని ఆనందంగా జీవిస్తుంది.

విధి వంచితురాలు అంజలి. ఆమెకు కూడా తెలుసు తాను చేస్తున్న ఉద్యోగం మంచిది కాదని. కాని ఆర్థిక

పరిస్థితి తనను ఎక్కడికి కదలనీయదు. ఈమె బల హీనతను చూసి సురేష్ లోబరుచుకుంటాడు. అవశరాలను ఉపయోగించుకొని స్త్రీలను వసపరచు కోవటం ఈ దుష్ట సమాజంలో భారతకాలం నుంచి ఉన్న దుర్మార్గపు నీతి. పెళ్లి చేసుకుంటా ననీ, మంచి జీవితం ఉందని ఆశచూపి తన పని కానించుకుంటాడు. తను ఎదగటంకోసం అంజలిని ఉపయోగించుకుంటాడు. స్త్రీ తను మోస పోతున్నాని కూడా గ్రహించలేక పోవటం ఆధునిక సమాజంలో చాలా బాధకరం. ''తోడేళ్ళున్నాయి జాగ్రత...'' అన్న సినీకవి మాటలు గుర్తుకు వస్తున్నాయి. సురేష్ అలాంటి బిజినెస్సే ప్రారంభిస్తాడు. దానికి పెట్టుబడి అంజలి బంగారు నగల డబ్బులు, తన అందం పెట్టు బడిగా వచ్చిన డబ్బు. బిజినెస్ నిలబడడానికి తొలి రోజులలో ఆమె అందమే ఆకర్షణ. సురేష్ ఆర్థికంగా బలపడినతరువాత షరామామూలే చెప్పకుండ వేరే అమ్మాయితో పెళ్లి. అంజలికి మాత్రం గిఫ్ట్ గా ఎయిడ్స్ వ్యాధి. అంజలీకి కొవ్యోక్తి కరెక్ట్ ఎగ్జాంపుల్. తన యవ్వనమంత కుటుంబ పోషణకు, మోసగాడి ఎదుగుద లకు ఉయోగించింది. చివరికి నిజం గ్రహించే సరికి చేతులు కాలీ. ఉద్యోగం చేసుకునే స్త్రీల పట్ల సమాజం ఎన్నిరకాలుగా దాడిచేస్తుందో ఈ కథ చక్కని మాదిరి. పద్మగారు కథను నడిపిన తీరు పాఠకున్ని కంటతడి పెట్టిస్తుంది. ఇక్కడ కులం మతం కాదు స్త్రీ అయితే చాలు మోసం చేయటాని సహస్ర కాలకూఠనాగులు కాచుకుని ఉంటాయనే సామాజిక వాస్తవాన్ని మరోసారి ఎలుగేత్తి చాటింపేశారు.

''వ్యక్తులపై కాదు, ప్రేమపై విశ్వాసాన్ని నింపుకో. మనపై మనకి ప్రేమ, గౌరవం... చుట్టూ పరిస్థితులకి అందరం బందీలమే. అలా ప్రవర్తించడానికి సురేష్‌కి వుండే లాజిక్ సురేష్ కి వుంటుంది. నేహకి వుండే సమర్థన నేహాకి వుంటుంది. వ్యక్తులు కుమ్మరించే ప్రేమ మెసాల బట్టే మన ఆనంద విషాదాలని నిర్ణయించే శక్తి వాళ్లకి ఇచ్చేస్తే మనం రోజూ ఛస్తూ బతుకుతూ వుంటాం...'' మాధురీ పలుకులు నిస్సహాయ స్త్రీలకు దిక్సూచి. ప్రాణ వాయువు.

'వలస'-- కథను ఇనాయతుల్లా రచించారు. 'కథా సమయం-- కథల సంకలనంలో జూలై 2010 లో ముద్రిం చారు. రాయలసీమ ఫ్యాక్షన్ రాజకీయాలు ఎలా ఉం టాయో కళ్లకు కట్టిన కథ. తక్కువ కులాల ప్రజలను పెద్ద కులాల వాళ్లు ఎంత హీనంగా, దుర్మార్గంగా హింసిస్తారో ఈ కథ మరోసారి చూపించింది. ఫ్యాక్షన్ పడగ నీడలో రాయలసీమ గ్రామాల ప్రజల కన్నీటి వెతల సజీవ చిత్రణ ఈ కథ. ఇనాయతుల్లా కథను నడిపించిన తీరు కొత్త సినిమా చూసినట్లు ఉంది. కథ చదివినంత సేపు అనేక భావచిత్రాలు రూపుదిద్దుకుంటాయి. ఒక మాటలో చెప్పాలంటే రాయలసీమ ప్రజల వలస బతుకులకు అనలైన కారణమైన ఫ్యాక్షన్ రాజకీయాల మీద ఎక్కుపెట్టిన కలం ఈ కథ.

కథ మొత్తం కర్నూలు జిల్లా కరిడికొండలోనే జరుగు తుంది. కథ అంతా విశ్వనాథం, కాశీల చుట్టూనే తిరుతుంది. కరిడికొండకు కనీసం బస్సుకూడ లేదు. కానీ జన్మభూమి కార్యక్రమంలో రాష్ట్రంలోనే ప్రథమ బహుమతి పొందిన గ్రామం. అంతే కాదు ఫ్యాక్షన్ వీడి బడిబాట పట్టిన్న గ్రామంగా పేపర్లో పతాక శీర్షిక ఎక్కిన ఊరు. ఆ వార్తలను చూసి ఆ గ్రామాన్ని ప్రజలను చూసి, ఇంత గొప్పగా గ్రామాన్ని నడిపిస్తున్న వారి నాయకుడు భైసాని వెంకట సుబ్బారెడ్డి గారితో ఒక ఇంటర్వ్యూకోసం కుదిరితే ఒక సెల్ఫీ కోసం కాశి ఆ గ్రామానికి బయలు దేరతాడు.

'కరిడికొండకు బస్సు రాదు సారూ. కొంచేపు కుచ్చో వ్యాను యిట్ల లోనికి పోయింది. మల్ల తిరిగొత్సాది. దానికి పోదువుగాని' అన్నమాటలు వినగానే ఉల్కిపడతాడు. రోడ్డంత బొక్కలిరిగి పోయేటంత గతుకులు. '24 గంటల్లో రోడ్డు నిర్మాణం' అనే పేపరు పతాక శీర్షిక వార్త అతని కళ్లముందు ప్రత్యక్షం. పేపరు వార్తలలోని నిజం నేతిబీరలోని నెయ్యి గుర్తుకు వస్తాయి కాశీకి.

కరిడికొండ ముఖద్వారం దగ్గరే కాశీకి సమస్యల స్వాగతం. ''హొటల్లో కూర్చున్న వాళ్లలో ఒకరిద్దరు తప్ప ఒంటి మీద అంగీలు తొడుక్కున్న వాళ్లు ఎక్కువమంది లేరు. ఒకాయన మాత్రం అక్షరమక్షరం అతి కష్టమ్మీద

కలుపుకొని పేపర్లో వార్తలు చదువుతుంటే చుట్టూ కూచున్నవాళ్లు టీ చప్పరిస్తూ వింటున్నారు. కొంత మంది పిల్లలు పేపర్లలోని సినిమా పేజీల మీద పడి మాట్లాడుకుంటున్నారు.'' వ్యాను కోసం ఆగిన అతనికి కనబడిన దృశ్యాలు. '12 గంటల్లో అంగన్ వాడి పాఠశాల నిర్మాణం' మళ్లీ పేపర్ లోని వార్త గుర్తుకు వస్తుంది. చదవటంరాని వీళ్లను, బట్టలు కూడ లేని పేదవారిగా చేసిన అక్కడి నీచ రాజకీయాల మీద ఛీత్కారం అతని మనస్సులో బుస్సుమంది.

కరిడికొండలో ఎక్కువ కురువ, బలిజ, బోయ, వడ్డె, మాదిగ కులాలున్నాయి. ఊర్లో అంతా 10, 15 ఎకరాల రైతులే. ఇద్దరో ముగ్గురో బావులు, బోర్లువున్న వాళ్లు. ఒకప్పుడు బోయ బీరప్ప నాయుడు కుటుంబం బాగా ఆస్తిగల కుటుంబం. రెడ్లతో ఫ్యాక్షన్ నడిపి ఇల్లు పొలాలు పోగొట్టుకున్నాడు. ఇప్పుడు ఊరిలో రెడ్ల పెత్తనమే. పెద రెడ్డికి ఎదురు తిరిగిన వాళ్లెవరికీ ఊరిలో స్థానం ఉండదు. అలా చాలా బోయ కుటుంబాలు ఊరు వదిలి వెళ్లి పోయినాయి. ఊర్లో ఉండాలంటే పెద రెడ్డి కాళ్ల క్రింద ఉండాలి. ఇంతలో ఊరిలోకి వెళ్లటానికి వ్యాను వస్తుంది. వ్యానులో నుండి దిగుతున్నవాళ్లలో సగం మందికి పైగా పెద్దపెద్ద మూటలతో సామాన్లతో దిగుతున్నారు. పెద్ద పిల్లల చేతుల్లో చేటలు, బిందెలు, బకెట్లు కనిపిస్తాయి. ఆ దృశ్యం కాశీని కదిలిస్తుంది. పుట్టిపెరిగిన ఊరు వదిలి వెళ్లటం ఎంత కష్టం. మన కళ్లు అప్రయత్నంగా తడవుతాయి.

కాశీ తిన్నగా ఊరులోకి వెళతాడు. మిత్రున్ని కలిసి, వాస్తవాలు తెలుసుకుంటాడు. అసలు బడికట్టిన స్థలం రెడ్డిది కాదనే వాస్తవాన్ని తెలుసుకుంటాడు. దాతలనుండి డబ్బు, పలుకుబడి, బెదిరింపుల ద్వారా ఇసుక, సిమెంటు, ఇటుక వచ్చిన తీరుగుర్తిస్థాడు. అమాయక ప్రజల శ్రమదానం కలిసిరాగ తనే స్కూలు, రోడ్డు నిర్మించినట్లు పేపర్లో వార్తలు రాయిస్తాడు. ఈ పనుల ద్వారా చాలా డబ్బు కూడబెట్టిన వాస్తవాన్ని తెలుసుకుంటాడు. శ్రమదానానికి రాకుండా కుటుంబ పోషణకోసం డబ్బుల పనికి పోయిన మాదిగ ఎర్రమద్ది కాళ్లు విరగగొట్టిన సత్యాన్నికనిపెడతాడు. బైసాని వెంకట సుబ్బారెడ్డి ముందు వుండలేక గ్రామం విడిచిపోతున్న మాదిగ కుటుంబాల దయనీయ గాదలను చూచి కన్నీరవుతాడు. ఫ్యాక్షన్ రాజకీయాలు ఎలా ఉంటాయో వినటమే కాని చూడని కాశీ ఆనాడు ప్రత్యక్షంగా చూచి చలించిపోతాడు. ఆ సాయంత్రమే పెద్ద రెడ్డిని కలుస్తాడు. అతను చెప్పె అనత్యాలను విని మౌనంగా గ్రామం నుండి బయలుదేరుతాడు. 'ఇంటర్వ్యూ చేయమని నన్ను పంపిన జనవాణి మేనేజ్ మెంట్ నా రిపోర్ట్ కు ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి' అనుకుంటాడు కాశీ.

రాయలసీమలోని ఎక్కువ గ్రామాలలోని అమాయకపు ప్రజలు ఫ్యాక్షన్ వల్లనే 'వలస' పోతున్నారనే పచ్చినిజాన్ని 'ఇనాయతుల్లా' ఎంతో ధైర్యంగా ప్రపంచానికి చాటారు. ఇంత వరకు ఏ రచయితా రాయాని నిజాన్ని, వారి సంకుచిత భావజాలాన్ని సాహితీలోకానికి తేటపరిచారు. రాయల సీమ ప్రజల కన్నీటికీ, కష్టాలకూ అసలైన కారణాన్ని లోకానికి బట్టబయలు చేసి, వారి సమస్య పరిష్కారానికి కొత్త బాటలు పరచినతీరు కొత్త పుస్తకం చదివి నట్లుంది నాకు.

ఆధార గ్రంథాలు :

1. పాతికేళ్ల కథ 1990-2014, మొదటి భాగం - సం. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్
2. పాతికేళ్ల కథ 1990-2014, రెండవ భాగం - సం. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్
3. వందేళ్లకథకు వందనాలు - సం. గొల్లపూడి మారుతిరావు
4. తెలుగు వికీపీడియా -- తెలుగు కథ

❖ ❖ ❖

కన్నెగంటి అనసూయ 'కొత్తగా రెక్కలొచ్చెనా!' నవల – సామాజికాంశాలు

– డా॥. యం. ప్రసాద్, పాఠశాల సహాయకులు(తెలుగు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాపూరు, నెల్లూరు జిల్లా.

సాహిత్యం మనిషిని మనీషాగల వ్యక్తిగా తయారు చేస్తుంది. ఆధునిక సాహిత్యంలో కథ, కథానిక, నవల, నాటిక, వచన కవితలకు అత్యధిక ప్రాచుర్యం ఉంది. వ్యక్తిని శక్తిగా మార్చగలది. మేధస్సుని మరింత మన్నిక గలదిగా చేసేది సాహిత్యం. అలాంటి సాహిత్యంలో నవలకు ఒక విశిష్ట స్థానం కలదు. కొత్త విషయాలను తెలియజేసేది నవల.''నవాన్ విశేషాన్ లాతి గృహ్ణతీతి నవలా'' నవీన విశేషాలను తెలుపునది నవల అని ప్రముఖ సాహితీ వేత్త కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి అంటారు. నవలను మధ్య తరగతి ఇతిహాసం అని కూడా పిలుస్తారు. ''నావెల్ ఈజ్ ఎ పాకెట్ థియేటర్'' అని ప్రముఖులు అంటారు. ఇంతటి విశిష్టత కలిగిన నవలా సాహిత్యంలో చలం, రావిశాస్త్రి, అంపశయ్య నవీన్ వంటి సుప్రసిద్ధ రచయితలు ప్రసిద్ధ నవలలు రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. వీరే గాకుండా నేడు తెలుగు సాహిత్యంలో ప్రముఖ రచయితలు, రచయిత్రులు నవలా సాహిత్యంలో విరివిగా రచనలు చేస్తున్నారు. అలాంటి వారిలో కన్నెగంటి అనసూయ కూడా ఒకరు. వీరు 500కు పైగా కథలు, రెండు నవలలు రాశారు. సామాజిక వేత్తగా, సాహితీ వేత్తగా సమాజానికి, సాహిత్యానికి ఇతోధికంగా అవిరళ కృషి సల్పుతున్నారు. వీరి కలం నుండి జాలువారిన విలక్షణ ఇతివృత్తం గల సులక్షణమైన నవల 'కొత్తగా రెక్కలొచ్చెనా!'అనేది. ఈ నవలలోని సామాజికాంశాలను చిత్రీకరించడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

నవల ఇతివృత్తం :

సుబ్బారావు పదవీ విరమణ పొందిన ఉద్యోగి. తన కుమారులు విదేశాలలో స్థిరపడగా తన భార్య రుక్మిణమ్మ తో కలిసి ఒక అపార్టుమెంటులో ఇల్లు తీసుకొని అక్కడే నివాసం ఉంటూ అప్పుడప్పుడు తన కుమారులు దగ్గరకు వెళ్ళి వస్తుంటారు. వినాయక చవితి రావడంతో అపార్టు మెంటులోని వారందరూ ఉత్సవాలు చేయడానికి పూను కుంటారు. ఉత్సవ కమిటీలో సుబ్బారావు ఉండడంతో జానపద సాహిత్యంలో భాగమైన బుర్రకథను ప్రదర్శిం చాలని నిర్ణయిస్తారు. బుర్ర కథకుడి కోసం సుబ్బారావు అన్వేషించగా పక్క ఊరికి చెందిన వెంకటస్వామి బృందంతో ఒప్పందం కుదుర్చుకుంటారు. రోజులు సమీ పిస్తుండగా ఒక రోజు వెంకటస్వామి పరుగెత్తుకుంటూ వచ్చి ఎవరో అనామకులు బుర్రకథ ప్రదర్శన చేయరాదని కాదని ప్రదర్శిస్తే చంపుతామని బెదిరిస్తూ మెసేజ్ వచ్చి నట్లు చెబుతాడు. సుబ్బారావు ఎవరో అపార్టుమెంటు వాళ్ళే తాను అంటే గిట్టని వారు ఇలా చేశారని బాధపడతాడు.

వెంకటస్వామి ఒక్కగాని ఒక కూతురు అవనిజ పట్టణంలో బాలికల వసతి గృహంలో ఉంటూ పదవ తరగతి చదువుకుంటూ ఉంటుంది. అవనిజ వాళ్ళ వార్డన్ సునంద అవనిజను దగ్గరకు తీసుకొని అన్నీ తానై చూసు కుంటుంది. అప్పుడప్పుడు అవనిజతో పాటు వాళ్ళ ఇంటికి వెళ్తుంది. వాళ్ళ ఇంటికి సరిపడే సామాన్లు, బియ్యం, బేడలు మొదలైనవి తీసుకొనిపోయి ఇస్తుంది. అవనిజ తల్లిదండ్రులు చాలా సంతోషపడతారు. తిరిగి వెళ్ళే టప్పుడు కొంత డబ్బులు కూడా అవనిజ తల్లికి ఇస్తుం టుంది. మేక వన్నె పులిలాంటి మోసాన్ని వారు గ్రహించలేక పోతారు. అవనిజను తల్లిదండ్రుల దగ్గర ఉంచకుండా వెంటనే తీసుకొని పోతుంటుంది. తనకు ఆరోగ్యం సరిగా లేదని చెబుతున్నా అవనిజ మాటలు పట్టించుకోకుండా ఆమె తల్లిదండ్రులు సునందతో పాటు పంపిస్తారు. ఒక రోజు తీవ్రజ్వరంతో హాస్టల్‌లో ఉన్న అవనిజను చూడడా నికి ఆమె బావ రోషన్ వస్తాడు. బాగలేని అవనిజను హాస్పిటల్‌కి తీసుకుపోగా ఆమెకు ఎయిడ్స్‌వ్యాధి అని

డాక్టర్‌లు నిర్ధారిస్తారు. అవనిజను విచారించగా వాళ్ళ వార్డన్ సునంద ఒక లెస్బియన్ అని తనను ఏవిధంగా ఇబ్బందులకు గురిచేసి రాక్షసానందాన్ని పొందేదో తెలియ జేసి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. రోషన్ పోలీసు కేసు పెట్టగా సునందను అరెస్టు చేస్తారు. అవమాన భారంతో సునంద ఆత్మహత్య చేసుకొని మరణిస్తుంది. ఈ విషయం తెలిసిన అవనిజ తండ్రి వెంకటస్వామి పక్షవాతానికి గురికాబడి కాళ్ళు, చేతులు చచ్చుబడి పోతాయి. కుటుంబ భారం మోయలేక అవనిజ తల్లి తల్లడిల్లుతుంది. బుర్రకథ ఆగిపోయిందని సుబ్బారావు క్రుంగిపోతాడు.

వెంకటస్వామిని బెదిరిస్తూ సెల్‌కి సునంద మెసేజ్ పెట్టిన విషయం, అవనిజ చెప్పినట్లు వినకుండా ఉంటే తన తల్లిదండ్రులను చంపుతానని సునంద భయపెట్టి నట్లు అవనిజ చెబుతుంది. సుబ్బారావు దంపతులు వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించి వస్తారు. సుబ్బారావు భార్య అవనిజకు ధైర్యం చెప్పి తండ్రి వారసత్వాన్ని కొనసాగించమని, బుర్రకథను చెప్పమని ప్రోత్సాహిస్తుంది. అవనిజ బుర్రకథను నేర్చుకొని వాళ్ళ అమ్మ, అత్త, బావ రోషన్‌ల సహాయంతో వినాయక ఉత్సవాలలో స్త్రీల సమస్యలపై బుర్రకథ చెప్పి అందర్నీ మెప్పిస్తుంది. అప్పటినుండి తాను గతాన్ని మరిచిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. అంతటితో నవల ముగు స్తుంది.

ఐక్యమత్యం :

అపార్టుమెంటులో ఉండే వారు అందరూ ఐక్య మత్యంతో కలిసి మెలసి ఉండాలనే భావన సుబ్బారావుది. కానీ కొంత మంది పనిగట్టుకొని ఇతను చేసే పనులకు అడ్డుతగులుతూ అడుగడుగున ఆటంకాలు కలిగిస్తుం టారు. ఐక్యమత్యం లోపించడంతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి వాచ్‌మెన్‌ని మార్చవలసి వచ్చేది. వినాయక చవితి ఉత్సవంలో జానపద కళలల్లో భాగమైన బుర్రకథను నేటి యువతకు పరిచయం చేద్దామని సుబ్బారావు తన అభిప్రాయాన్ని తెలియజేయగా కొంతమంది తిరస్క రిస్తారు. చివరికి అందరూ ఆమోదాన్ని తెలియజేస్తారు. నవలలో మాదిరిగానే నేడు పెద్ద పెద్ద అపార్టుమెంటులల్లో ఇలాంటి వివాదాలు ఉత్పన్నమవుతుంటాయి. అలాంటి వాటిని ఎలా ఎదుర్కోవాలి. అందరినీ ఐక్యమత్యంతో ఎలా ఉంచాలో ఈ నవల ద్వారా రచయిత్రి చక్కగా తెలియజేశారు.

కళల పరిరక్షణ :

కళలు మన సంస్కృతికి ప్రతీకలు మరియు విజ్ఞాన కరదీపికలు. వాటిని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి మనిషికి ఉంది. ప్రపంచీకరణలో భాగంగా నేడు కళలు కనుమరుగుతున్నాయి. అలాంటి కళలను కాపాడాలి. భావి తరానికి వాటి ప్రాధాన్యతను తెలియజేయాలనే ఉ ద్దేశంతో ఈ నవలలో సుబ్బారావు బుర్రకథను వినాయక ఉత్సవాలకు ప్రదర్శింపజేయాలని అనుకుంటాడు. కొంతమంది పాత చింతకాయ తొక్కు మాదిరి అవి వద్దని వారించినా పట్టుపట్టి అందరినీ ఒప్పిస్తాడు. కళల విశి ష్టతను అందరూ తెలుసుకోవాలి. వాటిని పరిరక్షించాలనే ఉద్దేశంతో రచయిత్రి ఈ నవలను బుర్రకథా నేపథ్యంతో నడిపినట్లు తెలుస్తుంది.

సాంఘిక దురాచారం :

ఈ నవలలో ప్రధాన పాత్ర అవనిజ పదవతరగతి చదువుతున్న ముగ్ధబాలిక. హాస్టల్ వార్డన్ సునంద బెదిరింపులకు భయపడి 'లెస్బియన్' (ఇద్దరు స్త్రీలు ఒకరితో ఒకరు పరస్పరం రతిక్రియలో పాల్గొని ఆత్మ సంతృప్తి పొందుట)గా మారుతుంది. ఈ క్రమంలో అవనిజ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తురాలవుతుంది. ఈ వ్యాధి సునంద నుండి అవనిజకు సంక్రమిస్తుంది. 'లెస్బియన్' అనేది ఒక భయంకరమైన మానసిక వ్యాధి. ఈ వ్యాధికి గురికాబడిన ఆడవాళ్ళు వారికి నచ్చిన వారిని ఎంపిక చేసుకొని వారితో సన్నిహితంగా మసులుకుంటూ వారిని వశపరుచుకుంటారు. ఈ క్రమంలో ఎంతమంది జీవితాలతోనైనా చెలగాటమాడుతారు. ఈ సాంఘిక దురా

చారం నేటి సమాజంలో చాపకింద నీరులాగా వ్యాపించి ఉంది. దీని వలన చాలామంది ప్రముఖులు పీడింపబడుతున్నారు. కొంతమంది నచ్చిన సాటి లెస్బియన్ స్త్రీని వివాహం చేసుకుంటున్నారు. మరికొంత మంది అమాయకులైన ఆడపిల్లల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారు. ఈ నవల ద్వారా రచయిత్రి ఏ ఆడపిల్ల ఇలాంటి దురాచారాలకు బలికాకూడదని, సునంద లాంటి లెస్బియన్‌ల కబంధ హస్తాలలో చిక్కుకోరాదని సందేశమిస్తుంది.

మహిళా చైతన్యం :

ఇందులో మహిళా చైతన్యం కన్పిస్తుంది. పదవతరగతి చదివే పదహారణాల పడుచుపిల్లని కంటికి రెప్పలా కాపాడవలసిన వార్డెన్ సునంద కన్నుపడుతుంది. స్వాభావికంగా లెస్బియన్ అయిన సునంద అవనిజను సొంత బిడ్డలాగా చూసుకుంటూ, అవనిజ తల్లిదండ్రులకు అనుమానం ఏ మాత్రం రానీయక వారిని వస్తూ రూపంలోను, ధన రూపంలోను సహాయం చేస్తూ వశ పరుచుకొంటుంది. చుట్టూ మనుష్యులు ఉన్నప్పుడు మంచిగా మాట్లాడుతూ, రాత్రి సమయం అయితే అవనిజను శారీరకంగా, మానసికంగా హింసిస్తూ, తన పశువాంఛను తీర్చుకుంటుంది. సునంద తన తల్లి దండ్రులను ఎక్కడ చంపుతుందోనని అవనిజ ఆమె రాక్షసానందాన్ని భరిస్తుంది. ఎయిడ్స్ వ్యాధికి గురి కావడం. సునంద అరెస్టు కావడం. సునంద అవమాన భారంతో ఆత్మహత్యకు గురికావడం. కూతురు దుస్థితిని తెలుసుకొని అవనిజ తండ్రి వెంకటస్వామి పక్షవాతానికి గురికావడం. దిక్కుతోచని స్థితిలో అవనిజ తల్లి, అవనిజ ఉంచారు. ఆత్మహత్యే శరణ్యమని అవనిజ భావిస్తుంది.

సుబ్బారావు భార్య రుక్మిణమ్మ అవనిజ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తూ వారిలో ధైర్యం నింపుతుంది. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ అవనిజ బుర్రకథను నేర్చుకొంటుంది. అవనిజ అమ్మ, అత్తలు వంతపాడుతుండగా అవనిజ ప్రధాన కథకురాలి పాత్ర పోషిస్తూ వినాయక ఉత్సవాలలో బుర్రకథ చెప్పి సభికుల్ని మెప్పిస్తుంది. ఆదే వృత్తిగా పెట్టుకొని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. అభం శుభం తెలియక ఎయిడ్స్ వ్యాధి లాంటి భయంకర వ్యాధులకు బలికాబడినప్పుడు స్త్రీలు క్రుంగిపోయి, తనువు చాలించకుండా కొత్త జీవితాన్ని ప్రారంభించాలనే సందేశాన్ని, మహిళా చైతన్యాన్ని ఈ నవల ద్వారా రచయిత్రి విపులీకరించారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. సాంఘిక నవల - కథన శిల్పం - మృణాళిని.సి
2. నవలా శిల్పం - వెంకటసుబ్బయ్య వల్లంపాటి
3. కొత్తగా రెక్కలొచ్చెనా! నవల - అనసూయ కన్నెగంటి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

'చిత్తూరు కథ' సంకలనం – చిత్తూరు ప్రజల ఆచార వ్యవహారాలు

– డా॥ పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చిత్తూరు.

ఆధునిక తెలుగుసాహిత్యంలో అత్యంత ప్రజాదరణ పొందిన సాహితీప్రక్రియ కథ. వ్యక్తీకరణకు చక్కని మార్గం కావడంతో నేటి సాహిత్యయుగంలో కథకు ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతూ ఉంది. సమకాలీన సమాజం లోని అతిసూక్ష్మ విషయం నుండి అతి స్థూలమైన విషయాలను అభివ్యక్తీకరించడంలో కథ ముందున్నది. ఈ కథలు ధారావాహికాలుగా, సంపుటాలుగా, సంకలనాలుగా నేడు ఆవిష్కరింపబడుతున్నాయి. అలాంటి సంకలనాలలో 'కడప కథ', 'నెల్లూరు కథ', 'సీమ కథలు', 'మొరసునాడు కథ'లున్నాయి. ఈ కోవకు సంబంధించినదే 'చిత్తూరుకథ' సంకలనం. ఈ 'చిత్తూరు కథ' అనే సంకలనం నలభైనాలుగు కథల సమాహారం. ఈ సంకలనాన్ని తిరుపతికి చెందిన కథాభిలాషి పేరూరు బాలసుబ్రమణ్యం 2014 సంవత్సరం వెలుగులోకి తెచ్చారు. ఈ 'చిత్తూరుకథ' సంకలనం చిత్తూరుజిల్లా ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానికతా ఉనికిని చాటుకునేందుకు ఆవిష్కరించడం జరిగింది. ఈ కథలు చిత్తూరు ప్రజల సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సంబంధ విషయాలను కొంత వరకు సమగ్రంగా అధ్యయనం చేస్తున్నాయి. చిత్తూరు ప్రజల జీవన విధానాలను, వారి మనస్తత్వాలను, ఆచార వ్యవహారాలను, కళల సంబంధ విషయాలను ఈ చిత్తూరు కథలు కళ్ళకు కట్టినట్లు చిత్రించాయి. చిత్తూరు జిల్లా మదనపల్లి నుండి వరదయ్యపాళెం వరకు సుమారు నూటయాభై కిలోమీటర్ల విస్తీర్ణం గల రాష్ట్రంలో పెద్ద జిల్లాలలో చిత్తూరు జిల్లా ఒకటి. చిత్తూరుకు పడమర కర్ణాటక రాష్ట్రం, దక్షిణాన తమిళరాష్ట్రాలు ఉన్నాయి. అలా చిత్తూరుజిల్లా మూడు రాష్ట్రాల సంగమ ప్రదేశమని చెప్పవచ్చు. తెలుగు, తమిళం మరియు కన్నడ సంప్రదాయాలకు చిత్తూరు నెలవు. ఆహారపు అలవాట్లలో, ఆచార వ్యవహారాల్లో తూర్పు చిత్తూరు ప్రజలపై తమిళ సంప్రదాయ ప్రభావం, పశ్చిమ చిత్తూరు ప్రజలపై కన్నడ సంప్రదాయ ప్రభావాలను ఈ చిత్తూరు కథలు చక్కగా చిత్రించాయి. ముఖ్యంగా చిత్తూరు ప్రజల భాషపై తమిళ, కన్నడ భాషల ప్రభావాలు చిత్తూరు కథల్లో మనకు కనిపిస్తాయి. తమిళ రాజధాని చెన్నై చిత్తూరుకు అత్యంత సమీపం కావడం చేత తమిళ భాషాప్రభావం తెలుగుపై అధికంగా ఉందని మనం చిత్తూరు కథల ద్వారా తెలుసుకోవచ్చు. ఇప్పుడు తమిళ, కన్నడ సమాజాల ప్రభావం వల్ల చిత్తూరు ప్రజల ఆచార వ్యవహారాలకు సంబంధించిన సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

ఆచారము అనే పదానికి అలవాటు, వాడుక, సంప్రదాయం, మర్యాద, అభ్యాసం, ధర్మం అనే అర్థాలున్నాయి. ఏదైనా ఒక సంఘంలో గానీ, మతంలోకానీ, కుటుంబంలో కానీ తరతరాలుగా పాటించే దానిని 'ఆచారము' అని అంటారు. పండగలకు, పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకు, చెడు కార్యాలకు కూడా ఆచారాల్ని పాటిస్తారు. ఆచారాలన్నవి ఆయా కుల, మత, సంఘం అభిరుచులను తెలియ జేస్తాయని చెప్పవచ్చు. ఈ ఆచారాలు కాలాన్ని బట్టి మారవచ్చు. పాత ఆచారాల స్థానంలో కొత్త ఆచారాలు రావచ్చు. ఆచారాలు పాటిస్తే మంచి జరుగుతుందని, మరచిపోతే చెడు జరుగుతుందని ప్రజల నమ్మకం. మానవుడు పుట్టింది మొదలు మరణించే వరకు అన్ని కార్యక్రమాల్లో ఈ ఆచారాల్ని పాటిస్తాడు. ఈ ఆచారాల ద్వారా ఆయా కాలాల్లో ప్రజల జీవనవిధానాన్ని, ప్రజల ఆహారపు అలవాట్లు వంటి విషయాలను తెలుసుకోవచ్చు. ఈ ఆచారాలు కుటుంబ సంక్షేమం కోసం, కుల సంక్షేమం

కోసం పాటింపబడతాయి. ప్రస్తుతం చిత్తూరు కథల్లో చిత్తూరు కథకులు తమ కథల్లో సందర్భానుసారంగా చిత్రించిన ఆచారవ్యవహారాలను పరిశీలిద్దాం.

గోపిని కరుణాకర్ రచించిన 'దేవరెద్దు' కథలో 'పైటలు వేయడం' అనే ఆచారం ప్రస్తావించడం జరిగింది. పుష్ప వతి అయిన అమ్మాయి ఆరోజు నుండి 'పైటలు వేయడం' అనే ఆచారం చిత్తూరు ప్రాంతంలోనే కాదు ఆంధ్ర ప్రాంతమంతా ఉందని చెప్పవచ్చు.

వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ రచించిన 'బిడ్డలు' కథలో 'తలకొరివి పెట్టడం' అనే ఆచారం గురించి ప్రస్తావిం చడం జరిగింది. తండ్రి విద్యాసాగర్ మరణిస్తే అస్తులు ఇవ్వలేదనే కారణంగా కొడుకులిద్దరు అంతిమ సంస్కా రానికి రారు. కానీ పెంపుడుకొడుకు ప్రవీణ్, అన్న కూతురు ఇద్దరూ కలసి విద్యాసాగర్‌కు తలకొరివి పెడతారు. రక్తసంబంధం ఉన్న కొడుకులు కాకుండా ఇతరులు తలకొరివి పెట్టడం, పురుషులు కాకుండా స్త్రీలు ఇక్కడ తలకొరివి పెట్టడం జరిగింది. స్త్రీలు తలకొరివి పెట్టడం ఒకప్పుడు సంఘవ్యతిరేకం. కానీ అది నేడు ఆచారంగా చెల్లుబడి అయిపోయింది.

కొన్ని కులాల్లో కులదేవతకు ఇంటికొక ఆడబిడ్డను ఇచ్చే ఆచారం ఉండేది. అలా కులదేవతకిచ్చిన ఆడపిల్ల సమాజానికి చెందుతుంది. ఆనాటి నుంచి ఆ ఆడపిల్ల స్వేచ్ఛాజీవితం హరించబడుతుంది. దీనినే 'మాతమ్మ వ్యవస్థ' అని కూడా అంటారు. అలాంటి 'మాతమ్మ వ్యవస్థ' గురించి ఎం.ఆర్. అరుణకుమారి తన 'పోస్టు చేయని ఉత్తరం' కథలో ప్రస్తావించడం జరిగింది.

లంకిపల్లె కన్నయ్య నాయుడు రచించిన 'జీవనం' కథలో ప్రతి సంవత్సరం ఇంట్లో పుట్టిన ఆడబిడ్డకు 'పసుపుకుంకుమ' పేరుతో కొత్తబట్టలు ఇవ్వడమనే ఆచారం ప్రస్తావించడం జరిగింది. 'జీవనం' కథలో జీవయ్య భార్య 'బంగారా'నికి పసుపుకుంకుమలు ఇవ్వడానికి మేనల్లుడు రావడం జరిగింది.

సుంకోజి దేవేంద్రాచారి రచించిన 'అన్నంగుడ్డ' కథలో ఆచారి కులస్థుల ఆచారాన్ని ప్రస్తావించడం జరిగింది. కొయ్యపని చేసే ఆచారి కులస్థులు పొరుగూరికెళ్ళినప్పుడు అక్కడివారు పెట్టిన భోజనం తినేవారు కారు. తాము తీసుకొని వెళ్ళే ఆహారపు పదార్థాలనే తినేవారు. అది ఆచారి కులస్థుల ఆచారం. ఒకవేళ ఆచారి కులస్థులు ఎక్కువ కాలం పనుల కోసం పొరుగూరిలో ఉండాల్సివచ్చినపుడు స్వయంపాకం చేసుకునేవారు గానీ, ఇతరులు పెట్టే ఆహారాన్ని మాత్రం భుజించేవారు కారు. ఇది ఆచారి (వడ్రంగి) కులస్థుల ఆచారం. అలాగే గూళూరు బాలకృష్ణమూర్తి రచించిన 'పనసపండు' కథలో మంగలి కులస్థుల అలవాట్లను ప్రస్తావించడం జరిగింది. ఒక గ్రామంలో పనిచేసే మంగలివారు మరో గ్రామంలో క్షురక పనులు చేయకూడదు. ఒకవేళ చేసినా కొన్ని గ్రామాలకు మాత్రం గ్రామ మంగలిగా ఉంటాడు. అలాగే గ్రామ ప్రజలకు క్షురకపని చేసే మంగలివారు ఆ గ్రామాలకు చెందిన హరిజనవాడల్లో తప్పక చేయకూడదు. అలా హరిజన ప్రజలకు క్షురకపని చేసిన మంగలిని ఆ గ్రామం నుండి వెలివేస్తారు. అలాగే 'పననపండు' కథలో పనసపండుకు ఆశపడి ఒక హరిజనుడికి క్షవరం చేసి నందుకు చిన్నస్వామి శెట్టి అనే మంగలిని గ్రామ బహిష్కరణ చేస్తారు. అది గ్రామాల్లో ఉండే ఆచారం. దీంతో ఆ మంగలి ఏ గ్రామంలోను క్షురక వృత్తిని చేసుకొనే అవకాశం ఉండదు. జీవనోపాధికై వేరే వృత్తిని ఎంచుకుని జీవించాల్సిందే. అది ఆనాటి గ్రామాల్లో ఉన్న కరుడు గట్టిన సంప్రదాయం. వ్యక్తిగతంగా, కులపరంగా చేసే వివక్షతకు ఈ గ్రామ బహిష్కరణ చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

పలమనేరు బాలాజీ రచించిన 'తపన' కథలో కొత్త పనిని ప్రారంభించే ముందు ఇష్టదేవతనో, విఘ్నేశ్వరున్నో పూజించే ఆచారాన్ని ప్రస్తావించడం జరిగింది. సాధా రణంగా భారతీయ సంప్రదాయాల్లో ఒక ఇల్లు కట్టు కోవడమో, ఒక వ్యాపారాన్ని ప్రారంభించడమో, ఒక శు

భకార్యాన్ని తలపెట్టడమో జరిగినపుడు ఎలాంటి ఆటంకాలు రాకుండా ఉండాలని విఘ్నేశ్వరుని పూజించడం అనవాయితీ.ఈ పూజాకార్యక్రమంలో దేవుని పటమో, దేవుని ప్రతిమగా పసుపుముద్దను పెట్టి పూజా ద్రవ్యాలతో వినాయకున్ని ఆరాదించడం జరుగుతుంది. అలాగే పలమనేరు బాలాజీ రచించిన 'తపన కథ'లో సన్నకారు రైతు అయిన గోవిందయ్య బోరుబావి వేయడానికి పూజాకార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. పసుపుకుంకుమ చల్లి, టెంకాయకొట్టి సాంబ్రాణి కడ్డీలు వెలిగించి బోరు బండికి కర్పూర హారతి ఇవ్వడం జరుగుతుంది. ఇలా బోరు పని ప్రారంభమవడానికి ముందు బోరు బండిని పూజించే ఆచారాన్ని 'తపన' కథలో మనం చూడవచ్చు.

కె.సభా రచించిన 'మిథునలగ్నం' కథలో పెళ్ళైన కొత్త దంపతులు అత్తారింటికి వెళ్ళేటప్పుడు 'గ్రామంలోని ముత్తైదువులకు తాంబూలాలిచ్చి ఆశీర్వచనాలు పొందడం' అనే ఆచారాన్ని మనం చూడవచ్చు. మన భారతీయ సంప్రదాయంలో పెళ్ళి అనే సంప్రదాయం అత్యంత ప్రసిద్ధమైన, పవిత్రమైన ఆచారంగా చెప్పవచ్చు. మానవ సంబంధాలను పెంపొందించే, మానవ కుటుంబాల మధ్య తత్సంబంధాలను నెలకొల్పి మానవజాతి అభివృద్ధికి జరిగే ఒక పవిత్రమైన సంప్రదాయం పెళ్ళి. అలాంటి పెళ్ళి ఆచారం ద్వారా ఏకమైన నూతన జంట తమ గ్రామంలోకి పెద్దల ఆశీస్సులు పొందడం అనే ఆచారం ద్వారా తమ నూతన జీవితం పదికాలాలు సంతోషంగా, ఆనందదాయకంగా, సంతానోత్పత్తితో నూతన కుటుంబంతో విరాజిల్లుతామనే గట్టి నమ్మకం మన సమాజంలో ఉంది. అలాగే చిత్తూరు కథల్లోని 'మిథునలగ్నం' కథలో సుభద్ర, బసవయ్య అనే నూతన దంపతులు గ్రామంలోని ముత్తైదువుల చేత ఆశీస్సులు పొందడం జరుగుతుంది. అలా ఆశీస్సులు అందుకున్న నూతన దంపతులు తమ స్థాయికి తగిన కానుకలు సమర్పించుకుంటారు. అలాగే మేర్లపాక మురళి రచించిన 'వడ్డాణం' కథలో కొత్తగా పెళ్ళైన ఆనంద్, నిరుపమలు ఇంటికి ప్రవేశించి ముందు వినాయకుని గుడికి వెళ్ళి అక్కడ ప్రదక్షిణలు చేసివస్తారు. ఇలా నూతనంగా పెళ్ళైన దంపతులు ఇంటికి వెళ్ళే ముందు వినాయకుని గుడికి వెళ్ళే ఆచారం చిత్తూరు ప్రజల జీవనవిధానంలో చూడవచ్చు.

ఆచారాల్లో భాగంగా చిత్తూరు కథకులు తమ కథల్లో చిత్రించిన పెళ్ళి, వండుగల గురించి కూడా తెలుసుకుందాం.

మన ఆచారవ్యవహారాల్లో పెళ్ళి ఒకటి. పెళ్ళి కుటుంబ వ్యవస్థకు మూలం. ఈ 'పెళ్ళి' అనే శుభకార్యం మూలంగానే స్త్రీ, పురుషులు భార్యాభర్తలవుతారు. ఈ పెళ్ళి భార్యభర్తల దాంపత్య జీవితానికి నాంది అవుతుంది. ఈ పెళ్ళి వల్ల కుటుంబంలో నూతన బంధాలు ఏర్పడుతాయి. ఒక విధంగా చెప్పాలంటే మానవుల మధ్య బంధాలు, అనుబంధాలకు మూలం ఈ పెళ్ళే ప్రధాన మని చెప్పవచ్చు. ఇప్పుడు చిత్తూరు కథల్లోని పెళ్ళి ప్రస్తావనను పరిశీలిద్దాం.

మధురాంతకం నరేంద్ర రచించిన 'పురోహిత పరిషత్' కథలో బంగార్రాజు, జీవరత్నంల వివాహం మరియు భూలోకానాయుడు, ధనలక్ష్మిల పెళ్ళిల గురించి ప్రస్తావించడం జరిగింది. మేర్లపాక మురళి రచించిన 'వడ్డాణం' కథలో ఆనంద్, నిరుపమల పెళ్ళి గురించి, వివేకాశ్రితుడు రచించిన 'పెండ్లిపయానం' కథలో సుశీల పెళ్ళి, రవి అనితల పెళ్ళి, సూర్యకిరణ్ పెళ్ళి... ఇలా మూడు తరాల పెళ్ళిళ్ళ గురించి, మూడు తరాల్లో పెళ్ళి ఆచారాల్లో వచ్చిన మార్పులను కథకులు చక్కగా చిత్రించారు. వీరిలో సుశీల పెళ్లి మొదటితరం పెళ్లి. ఈ తరంలో పెళ్ళిళ్ళు వారం పదిరోజులు జరిగేవి. వారం ముందే బంధువులు ఇళ్ళకు చేరుకుని సందడి చేసేవారు. పెళ్ళైన వారం వరకు బంధువులు పెండ్లి ఇళ్ళల్లోనే ఉండి ఆనందంగా గడిపేవారు. ఇది అచ్చమైన తెలుగు పెళ్ళిళ్ళకు నిదర్శనం. రవి, అనితల పెళ్ళి రెండోతరం

పెళ్ళి. ఈ రెండోతరం పెళ్ళి మూడునాలుగు రోజులకు పరిమితమైంది. సూర్యకిరణ్ పెళ్లి మూడోతరం పెళ్ళి. ఈ పెళ్ళి ఒక్కరోజుకే పరిమితమైంది. బ్యాండుమేళాలతో, పాటకచ్చేరిలతో హంగామా చేయడం. పెళ్ళికి వచ్చినవారు వధూవరులను దీవించి, వారికి కానుకలు సమర్పించి, విందు ఆరగించి అందరూ వెళ్ళిపోవడం జరుగుతుంది. ఇది నేటి ఆధునిక వివాహానికి ప్రతీక. ప్రపంచీకరణ నేపథ్యంలో పెళ్ళి అనే సంప్రదాయం ఒక తరం నుండి మరో తరానికి ఎలా మార్పు చెందిందో చిత్తూరు కథకుడు వివేకాశ్రితుడు 'పెండ్లిపయానం' కథలో చక్కగా చిత్రించారు. ఆర్. వసుంధరాదేవి రచించిన 'పిచ్చిగీతలు' కథలో చైతన్యప్రభు కుమార్తె పెళ్ళి గురించి, కె. సభా రచించిన 'మిధునలగ్నం' కథలో సుభద్ర, బసవయ్యల పెండ్లి గురించి, తెనాలి సుశీల రచించిన 'పోనేల కాశికి...' కథలో రాజేశ్వరి, రామారావు పెళ్ళిల గురించి చిత్తూరు కథకులు సందర్భానుకూలంగా తమ కథల్లో పెళ్ళిని గురించి ప్రస్తావించారు.

పండుగలు అనేవి ప్రజల ఆచారాల్లో అంతర్భాగం. ప్రజలు నిరంతర శ్రమజీవులు. శ్రమతో వచ్చిన అలసటను పోగొట్టుకోవడానికి పాటలు పాడుకోవడం, పండుగలు చేసుకోవడం అనే ఆచారానికి శ్రీకారం చుట్టారు. శ్రామికజీవితానికి అలవాటు పడిన మానవుడు విశ్రాంతి కోసం, కుటుంబ ఆనందం కోసం 'పండుగ' అనే ఆచారాన్ని ఏర్పాటు చేసుకున్నాడని చెప్పవచ్చు. ఆచారవ్యవహారాల్లో పండుగకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ పండుగలు సాధారణంగా మతాలనుబట్టి, జాతులను బట్టి, వర్గాలను బట్టి, తెగలనుబట్టి వేరువేరుగా ఉంటాయి. ప్రతి మతానికి కొన్ని పండుగలు ఉంటాయి. కానీ రొట్టెల పండగ, కర్రలపండగ, పీర్లపండగ వంటి పండుగలను కొన్ని ప్రాంతాల్లో హిందువులు, ముస్లింలు కలిసి చేసుకుంటారు. ఇలాంటి పండుగలు దేశంలో మత సామరస్యానికి ప్రతీకలుగా చెప్పుకోవచ్చు. చిత్తూరుకథల్లో కె. సభా రచించిన 'మిధునలగ్నం' కథలో ఉగాది పండుగ గురించి, వీరపల్లె వీణావాణి రచించిన 'మూలాధార చక్రం' కథలో వినాయకచవితిని గురించి ప్రస్తావించడం జరిగింది. అలాగే పేట శ్రీనివాసులు రెడ్డి రచించిన 'చిత్తూరు పంచమి' కథలో తిరుచానూరులో జరిగే అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల గురించి, తుమ్మల రామకృష్ణ రచించిన 'మహావిద్వాంసుడు' కథలో త్యాగయ్య సంగీత ఆరాధనోత్సవాల గురించి ప్రస్తావించడం జరిగింది. ఉగాది పండుగ, వినాయక ఉత్సవాలు సర్వసాధారణం. కానీ కార్తీకమాసంలో తిరుచానూరులో జరిగే అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు చాలా ప్రసిద్ధమైంది. ఈ బ్రహ్మోత్సవాలకు దక్షిణాది రాష్ట్రాల ప్రజలందరూ వస్తారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, కేరళా లాంటి సుదూరప్రాంత ప్రజలు చలిని సైతం లెక్కచేయకుండా ఈ బ్రహ్మోత్సవాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ ఉత్సవంలో భాగంగా తిరుమల కొండ నుండి పసుపుముద్దను ఏనుగుపై ఊరేగింపుగా తిరుపతి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువస్తారు. తిరుమల నుండి తీసుకువచ్చిన పసుపు ముద్దకోసం భక్తులు ఎగబడుతారు. ఆ పసుపుముద్ద పొందితే అది తమ కుటుంబానికి శుభప్రదమని భావిస్తారు. పన్నెండురోజులు జరిగే ఈ బ్రహ్మోత్సవాలలో చక్రస్నానంతో ఈ ఉత్సవాలు ముగుస్తుంది. బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు కోనేటిలో స్నానం కోసం భక్తులు కోనేరు చుట్టూ జనసందోహంతో వేచిచూస్తారు. ఆ రోజు కోనేటి స్నానం చేస్తే సకలపాపాలు పోతాయని, దెయ్యాలు, భూతాల బెడదలు పోతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం. అలాంటి కార్తీక బ్రహ్మోత్సవాలను పేట శ్రీనివాసులు రెడ్డి తన 'చిత్తూరు పంచమి' కథలో బహుచక్కగా చిత్రించడం జరిగింది. అలాగే త్యాగరాయ ఆరాధనోత్సవాలను సంగీత విద్వాంసులు మాత్రం ప్రత్యేకంగా నిర్వహించడం తెలిసిందే.

ఇలా చిత్తూరు కథకులు తమ కథల్లో చిత్రించిన ఆచార వ్యవహారాలకు సంబంధించిన అంశాలను

వివరించడం జరిగింది. చిత్తూరు కథల్లో మనకు ప్రధానంగా కనిపించే ఆచారవ్యవహారాలకు సంబంధించిన అంశాలు ఇతర ఆంధ్ర ప్రాంతాల్లో కూడా మనకు కనిపించవచ్చు. కానీ కొన్ని అంశాలలో తమిళ సంప్రదాయ ప్రభావం వల్ల చిత్తూరు ప్రజల ఆచార వ్యవహారాల్లో కొంత వరకు భిన్నత్వం కనిపిస్తుందని చెప్పవచ్చు.

పరిశీలనా గ్రంథాలు :

1. చిత్తూరు కథ (సంకలనం) - బాలసుబ్రమణ్యం, పేరూరు.
2. తెలుగు సాహిత్య చరిత్ర - శాస్త్రి, ద్వా.నా.
3. ప్రపంచీకరణ సంస్కృతి - రవి, తెలకపల్లి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

మినీ కవిత్వం – హైకూ – నానీలు – సామాజిక దర్శనం

– డా॥. వీధుల వేంకటేశ్వర్లు, తెలుగు ఉపాధ్యాయుడు, కర్నూలు.

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు చోటు చేసుకున్నాయి. ప్రాచీన కాలంలో పద్యానికి ప్రాచుర్యం ఉండేది. ఆ తర్వాత గేయం వచ్చింది. పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల కొత్త కొత్త ధోరణులు తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి. ముఖ్యంగా 1930లో వచనకవిత రంగ ప్రవేశం చేసింది. అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం ఇవన్నీ వచన కవితలో సాగాయి. ఇలా వచన కవితకు ఆధునిక తెలుగు సాహిత్యంలో విస్మృతమైన వ్యాప్తి కలిగింది.

మినీ కవిత :

వచన కవిత వచ్చిన అయిదు దశాబ్దాల తర్వాత మినీ కవిత తెరపైకి వచ్చింది. 'మినీ కవితను' ఒక ఉద్యమంగా తెచ్చిన ఘనత రంగారావు గారికే దక్కుతుంది. అందు చేతనే విమర్శకులు రంగారావు గారిని 'మినీ కవిత పితామహుడు' అని పేర్కొన్నారు.

మినీ కవిత - కారణాలు :

1) ఆధునిక కాలంలో వచ్చిన శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పుల వల్ల మారిన ప్రజల మానసిక వైఖరి.
2) ఆసక్తిని చంపుతున్న 'రొటీన్' వచన కవితలు
3) భావాన్ని బలంగా, సూటిగా చెప్పడానికి ఒక క్రొత్త వాహికగా అవతరించడం.

మినీ కవిత - లక్షణాలు :

1. సంక్షిప్తత 3.2 నవ్య బంధురశైలి 3. చమత్కారం 4. వ్యక్తీకరణలో సూటిదనం 5. కొత్తదనం 6. భావ గాంభీర్యం 7 వ్యావహారిక భాష 8. శీర్షికా ప్రాధాన్యం

మినీ కవిత - ప్రయోజనాలు :

1. ఆవేశాన్ని, ఆనందాన్ని హృదయానికి హత్తు కునేటట్లు చెప్పగలుగుతుంది.
2. ఆర్థిక, సాంఘిక, రాజకీయ, అసమానతల్ని ప్రతి బింబిస్తుంది.
3. జీవిత విమర్శకు అద్దం పట్టి, సామాజిక చైతన్యా నికి శక్తివంతమైన సాధనంగా ఉపయోగ పడుతుంది.
4. వాస్తవాన్ని తెలియపరుస్తూ, గుణపాఠం చెప్పే కవితాగుణం కల్గివుంటుంది.

మినీ కవిత - వర్గీకరణ :

మినీ కవితలో ఉన్న కోణాల్ని పరిశీలించి డా॥ రావి రంగారావు కొన్ని రకాలుగా విభజించారు. అవి: -

1. సౌందర్యానుభవ మినీ కవితలు
2. నైతిక మినీ కవితలు
3. సాంస్కృతిక మినీ కవితలు
4. ఆధ్యాత్మిక మినీ కవితలు
5. జ్ఞానాత్మక మినీ కవితలు
6. ప్రజాస్వామ్య మినీ కవితలు
7. మానవతా మినీ కవితలు
8. సామాజిక మినీ కవితలు
9. దేశభక్తి మినీ కవితలు

మినీ కవితలు - విమర్శ :

కుక్క అనే మినీ కవితను దాసరాజు రామారావు గారు రాశారు.

"వాడు ఎన్నికలప్పుడు
నా యింటి ముందు నిలబడ్డాడు
వాడు గెలిచాక
నా యింట్లో కొచ్చి కూర్చున్నాడు
వాడు పదవిలోకొచ్చి
నా కుండలో కూడెత్తుకెళ్లాడు"

ఎన్నికలప్పుడు నాయకులు కాళ్ళువేళ్ళు పట్టుకొని మరీ ఓట్లు అడుగుతారు. ఎన్నికైన తర్వాత అయిదు సంవత్సరాల వరకు జీవితాలతో ఆడుకుంటారు. తర్వాత పేదల కూడును లాగుకొని తింటారని కవి ఈ కవితలో సమాజంలోని రాజకీయ నాయకుల గురించి ప్రస్తావించాడు.

1984 సం॥లో అక్టోబర్ 31వ తేదీన అంగరక్షకుల చేత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ అతి దారుణంగా హత్యగావించబడ్డారు. దీనికి స్పందిస్తూ... డా॥ కొండపల్లి సుదర్శన రాజు

"ప్రపంచంలో
మారణ హోమానికి శ్రీకారం
మత జననం
అందులో అంతర్భాగమేనోయ్
ఇందిర హననం! "

అని మతమే ప్రపంచ మారణహోమానికి కారణమయిందంటాడు.

"రెసిడెన్షియల్ పంజరంలో
చిలుకల్ని చూడు
అవిశ్రాంత వేద పఠనం"

అని డా॥ గుమ్మా సాంబశివరావు చదువుల తీరు తెన్నుల్ని ప్రస్తావిస్తారు.

'మానవత' అనే మినీ కవితలో' కన్నా అనంత వెంకటేశన్ గారు

"పీడిత జన
జీవితాల బూడిదని
కన్నీటితో ముద్దచేసి
నాయకుని బొమ్మ చేద్దామనుకున్నా
ఎంత ప్రయత్నించినా
బక్క చిక్కిన వాడి
బొమికల బోనే వస్తుంది"

అని మానవత్వం బీదవాడిలోనే కన్పిస్తుంది. కాని నాయకుడిలో కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నాడు.

ఇక రంగారావు గారు సవ్యసాచిలా అటు మినీ కవితలు రాస్తూ, ఇటు మినీ కవితలపై విమర్శనాత్మకంగా వ్యాసాలు రాయడం చెప్పుకోదగ్గ విషయం. అంతే కాదు, మినీ కవితను ఆధారంగా చేసుకొని వీరు ఎమ్.ఫిల్, పిహెచ్.డిలు సంపాదించారు. దీన్ని బట్టి మినీ కవిత ఎంత గొప్పదో తేటతెల్లమవుతుంది. .

హైకూ :

క్రీ.శ 14వ శతాబ్దంలో జెన్ బౌద్ధులు' తమ బౌద్ధమత సిద్ధాంతాలకనుగుణంగా ఒక నూతన కవితా ప్రక్రియను నిర్మించుకున్నారు. అదే హైకూ! కనుక హైకూ అనేక ప్రక్రియ జపాన్ ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి వచ్చింది. చిట్టిపొట్టి కవితలతో అందంగా ఉండే ఈ ప్రక్రియలో అనేక తాత్విక, చారిత్రక, సామాజికాంశాలు చోటు చేసుకున్నాయి.

హైకూ - లక్షణాలు :

హైకూ ప్రక్రియకు కొన్ని ముఖ్యమైన లక్షణాలున్నాయి అవి.

1. ప్రాకృతిక ప్రేరణ
2. పదచిత్రం - అనుభూతి
3. లక్షణ వ్యంజనాభివ్యక్తి
4. సార్వకాలీనత
5. అల్పంలో అనల్పాభివ్యక్తి
6. అమూర్త భావాల మూర్తీకరణ
7. కొత్త కోణంలో ప్రకృతిదర్శనం
8. ఒకే కాలం - ఒకే స్థలం

హైకూ ప్రయోజనాలు :

1. విశేష అనుభవం నుంచి సార్వత్రిక సత్యాల్ని మనసులకు తీసుకెళ్తుంది.
2. తన మూడు పాదాలతోనే సమస్త లోక వృత్తాన్ని ఆవరిస్తుంది.
3. మానవ ప్రకృతిలోని అతి సున్నితమైన ప్రకంపనలని పద చిత్రాలుగా ప్రదర్శిస్తుంది.

4. ఒక ప్రతీకను ఆశ్రయించి ఒక అనుభవాన్ని తెల్పుతుంది.
5. తన పరిసరాలతో సామరస్యంగా జీవించడం నేర్పుతుంది.

హైకూ - వర్గీకరణ :

హైకూలు మూడు రకాలు అవి.

1. ప్రకృతి హైకూలు
2. తాత్విక హైకూలు
3. సామాజిక హైకూలు

ప్రకృతి హైకూలు :

"కొండెక్కాను
అయినా
మేఘాలందలేదు"

అని కె. రామచంద్రారెడ్డి వర్షాభావ పరిస్థితిని ఇందులో సూచించారు.

తాత్విక హైకూలు :

"పొంచి ఉంటోంది
నీడల్లే మరణము
జీవం వెనుకే "

అని డా॥ తలతోటి పృథ్వీరాజ్ గారు పుట్టుక వెనుకే చావు ఉంటుందని స్పష్టం చేశారు.

సామాజిక హైకూలు :

"నాడు కొడుకు
హాస్టల్లో, నేడు తండ్రి
వృద్ధాశ్రమంలో"

అని డా॥ గుమ్మా సాంబశివరావు నేటి తండ్రి కొడుకుల పరిస్థితిని చమత్కరించారు. తల్లిదండ్రులు ఉద్యోగాల వేటలో పడి, పిల్లల్ని పెంచలేక, వారి బాగోగుల్ని పట్టించుకోలేక హాస్టల్లో వదులుతున్నారు. కనుక ఇప్పుడు పిల్లలు పెరిగి పెద్దవారై, తల్లిదండ్రుల బాధ్యతల్ని తీసుకోలేక వృద్ధాశ్రమంలో చేర్చుతున్నారు.

"కులమతాలు
మన్నుకులేని అంటు
మట్టి బొమ్మకు"

డా॥. తలతోటి పృథ్వీరాజ్‌గారు కులమతాల గురించి అంటారు.

మట్టికి లేని కులమతాలు మట్టితో తయారయిన మనిషికి మాత్రం కులమతాల పట్టింపు కావలసి వచ్చింది? అని కవి ఆవేదన చెందుతున్నారు.

"కుడితే కుట్టింది.
దోమకు అస్పృశ్యత లేదని
రక్త ప్రమాణకంగా చెప్పింది"

అని అస్పృశ్యతను గురించి ప్రస్తావిస్తూ 'శిఖా-ఆకాష్' లు వ్యంగ్యంగా విశదీకరిస్తారు. సృష్టిలో మనిషికి తప్ప ఏ ప్రాణికి అస్పృశ్యత లేదని వాపోతున్నారు.

ఇస్మాయిల్ గారు 'దృశ్యాదృశ్యం, ఆకాశ దీపాలు, వెన్నెల రాత్రి వాన' మొదలైన హైకూ సంపుటాలకు పీఠికలు రాశారు. ఈ పీఠికలు ఎంతోమంది సహృదయ పాఠకులను ఆకట్టుకున్నాయి. అయితే హైకూ ప్రక్రియ పది కాలాలపాటు ఉండాలంటే 'హైకూ' కవులందరూ ప్రాకృతిక, తాత్విక భావాలతో పాటు, సామాజిక హైకూలను కూడా అవకాశం కల్పించి, మెరుపులా దృశ్యానుభూతిని కలిగించి అద్భుతంగా రాయాలి.

నానీలు :

ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో 'నానీలు' రాజ్యమేలుతున్నాయి. నానీలు దేశీయ కవితా ప్రక్రియకు సంబంధించినవి.

నానీలు అంటే గోపి. గోపి అంటే 'నానీలు'గా తెలుగు దేశంలో బహుళ ప్రచారం ఉంది. దీనికి కారణం 'నానీ' ప్రక్రియకు ఆద్యులు ఆచార్య గోపిగారు కావడమే ! వీరు సూక్ష్మంలో మోక్షంలా నాలుగు పాదాల్లో అనంత భావాల్ని వ్యక్తం చేసే ప్రయత్నం చేశారు. వీరి నానీలు 'వార్త' దిన పత్రికలో ప్రచురించబడి, ఎంతో మందిని ఆకర్షించి, ఆనందింపజేశాయి.

నానీలు - లక్షణాలు :

నానీలను సృష్టించిన గోపిగారు ఈ ప్రక్రియకు కొన్ని నియమ నిబంధనల్ని కూడా ఏర్పరచారు.

1. నాలుగు పాదాలుండాలి.
2. మొత్తం 20 నుంచి 25 అక్షరాల నిడివి ఉండాలి.
3. ఒక్కో పాదంలో ఇన్ని అక్షరాలు పాటించాలనే నియమమేమి లేదు.
4. మొదటి భావాంశాన్ని రెండోది సమర్థించాలి లేదా భావవైరుధ్యాన్ని సమన్వయపరచాలి.

నానీలు - వర్గీకరణ :

నానీల్ని వస్తు వైవిధ్యాన్ని బట్టి తొమ్మిది రకాలుగా విభజించవచ్చు.

1. ప్రాకృతిక నానీలు
2. సామాజిక నానీలు
3. తాత్త్విక నానీలు
4. ఉపదేశాత్మక నానీలు
5. కవితాత్మక నానీలు
6. నిర్వచనాత్మక నానీలు
7. వ్యంగ్య నానీలు
8. చమత్కార నానీలు
9. విలక్షణ నానీలు

నానీ కవులు ఒక విషయాన్ని బలంగా చెప్పడం కోసం వ్యంగ్య శైలిని ఆశ్రయించారు. ముఖ్యంగా సామాజికాంశాలు తీసుకొని ఎక్కువ మంది నానీలను వ్రాశారు.

డా॥ తలతోటి పృథ్వీరాజ్ ప్రకృతి రమణీయతతో

"రామచిలకలన్నీ
ఎగిరెళ్ళాయి
పచ్చని చెట్టు
మోడుబారి పోయింది"

అని పక్షులు లేకపోవడంతో చెట్లన్ని మోడుబారి పోతున్నాయని వివరించారు. మేధావులు విదేశాలకు వలసపోవడంతో మనదేశం మోడుబారి పోతుందని చమత్కరించారు.

తమ్మిడి నాగభూషణం గారు కులం గురించి ప్రస్తావిస్తూ

"భూకంపం
నిలువెత్తు భవనాలు కూల్చింది
కులం మాత్రం
అలాగే నిల్చుంది" అని విశ్లేషిస్తారు.

డా॥. గుమ్మాసాంబశివరావు గారు రాజకీయ నాయకులను గురించి వివరిస్తూ

"రాజకీయపు
కొంగను చూడు
వాగ్దానపు ధ్యానం
ఓటరు చేప చిక్కుతుందా ?"

అని చమత్కరిస్తారు.

రాజకీయ నాయకులనే కొంగలు తమ వాగ్దానాలనే ధ్యానాలతో ఓటర్ల చేపలను పడతారని విశ్లేషించారు.

మొత్తం మీద నానీలు సున్నితమైన కొత్త కోణాల్ని ఎన్నుకొని కన్నీరు పెట్టించడంలోను, కణకణమంటూ నిప్పుల్ని కురిపించడంలోనూ ప్రధాన భూమికల్ని పోషించాయి.

మినీ కవిత - హైకూ - నానీలు : బేధాలు :

మినీ కవిత - హైకూ - నానీల మధ్య రూపనిర్మాణ విషయంలో చాలా వ్యత్యాసం కన్పిస్తుంది.

మినీ కవిత :

శీర్షిక	: ఉండదు.
అక్షర నియమం	: 17 అక్షరాల్లో (5+7+5= 17) ఉంటుంది.
పాద నియమం	: 10 నుంచి 12 పాదాల లోపు ఉంటుంది.
వస్తు నియమం	: ప్రాకృతిక, సామాజిక విషయాలు ఉంటాయి.

హైకూ :

శీర్షిక	: ఉండదు.

అక్షర నియమం : 17 అక్షరాల్లో (5+7+5= 17) ఉంటుంది.

పాద నియమం : 3 పాదాల లోపు ఉంటుంది.

వస్తు నియమం : ప్రతి విషయం కవితా వస్తువుగా ఉంటుంది.

నానీలు :

శీర్షిక : ఉండదు

అక్షర నియమం : 20 అక్షరాల్లో ఉంటుంది.

పాద నియమం : నాలుగు పాదాల్లో ఉంటుంది.

వస్తు నియమం : ప్రతి అంశం కవితా వస్తువుగా ఉంటుంది.

''ప్రకృతి రమణీయతతో ముడిపడిన ప్రక్రియ హైకూ అయితే సామాజిక అంశాలతో ఎక్కువగా ప్రస్తావించే ప్రక్రియ నానీ. నిర్మాణ పరంగా నానీ మినీ కవిత కాదు. మినీ కవితకు కొసమెరుపు ఉండాలి. తళుక్కున మెరిసి పోయే కవిత కాదు నానీ. స్థిర కాంతిని వెదజల్లుతూ మెల్లగా మనసు నిండా వ్యాపించే గుణం నానీకి ఉంది'' అని శ్రీ ఎస్. ఆర్. భల్లం గారు 'గోపి నానీల సమాలోచనంలో' అంటారు.

ఈ విధంగా ఏ చిన్న సామాజికాంశాన్నైనా ప్రతిపాదించి, వ్యాఖ్యానించి, కవిత్వపు గుళికగా మార్చగలిగిన సదుపాయం గల ఈ ప్రక్రియలు తెలుగు కవిత్వ పాఠకులను కవులుగా మార్చగలిగాయి.

అంతేకాదు ప్రధాన స్రవంతిలో కనిపించని కవులనేకులు వీటి ద్వారా వెలికివచ్చారు.

ఆధార గ్రంథం :

1. సిమ్మన్న, వెలమల : తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం (2009).

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలంగాణ నవలల్లో సామజిక జీవన చిత్రణ

– గుండు రవి, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

అస్తిత్వ ఉద్యమాల నేపధ్యంలో ఒక ప్రాంతం తన సాహిత్యాన్ని, సంస్కృతినీ తరచి చూసుకుంటూ, పునర్విశ్లేషణకు పూనుకున్న సందర్భమిది.కనుకనే తెలంగాణలోని సాహిత్యం మీద మరింత లోతుగా, విస్తృతంగా పరిశోధనా దృష్టితో విశ్లేషణలు చేస్తున్న కాలంలో ఉన్నాం. ఈ నేపధ్యంలోనే నవలప్రక్రియకు సంబంధించి తెలంగాణలో జరిగిన కృషిని చూసినపుడు తెలంగాణ నవలల్లోని విస్తృతి తెలుస్తుంది.

1940కి పూర్వం తెలంగాణ పల్లెల్లో జీవితం ఎలా ఉండేదో, నిజాం ప్రభువుల, దొరల పీడనకు లోనయిన గ్రామీణ ప్రజల అవస్థలు ఎలా ఉండేవో వట్టికోట ఆళ్వారుస్వామి నవల 'ప్రజల మనిషి'లో చూస్తాం. ఆనాటి గ్రామాల్లో ప్రజల బతుకు పోరాటం,దోపిడీకి వ్యతిరేకంగా సంఘటితమైన జనాల ప్రతిఘటనను దాశరథి రంగాచార్య రచించిన 'జనపదం' నవల తెలుపుతుంది.అలాగే వారి మొదుగుపూలు, చిల్లర దేవుళ్ళునవలలు కూడా తెలంగాణాలోని సామజిక మర్పుల్ని ప్రతిపలిస్తాయి. పోరాటం ముగిసి దశాబ్దాలు గడుస్తున్నప్పటికి తెలంగాణ రచయితలకు 1946-51 మధ్య జరిగిన తెలంగాణ సాయుధపోరాటం ఇతివృత్తంగా నిలిచింది. పోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకోని రచనలు చేసే సంప్రదాయం 1970 ల తరువాత కాలంలో మరింత పెరిగింది. రైతాంగ సాయుధ పోరాటం నేపధ్యంలో వచ్చిన నవలలుఇందుకు ఉదాహరణ. 1970 నుండి 1990 వరకు కొనసాగిన విప్లవోద్యమం కాలంనాటి తెలంగాణ పరిస్థితులను, ఉద్యమ తీరుతెన్నుల్ని చిత్రించిననవలలు1980 ల తరువాత వచ్చాయి.

తెలంగాణ సామజిక జీవితంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతిస్పందిస్తూ ఇక్కడిరచయితలు నవలలు రాస్తున్నారు.కథ రచనతో పోల్చుకుంటే నవలారచన తక్కువే అయినప్పటికీ వచ్చిన నవలలు చరిత్రను, ముఖ్యంగా పోరాట చరిత్రను రికార్డు చేయడం గమనార్హం. జీవితంలోని వైవిధ్యమే నవలల్లోనూ ప్రతిఫలిస్తుంది. తెలంగాణ సామజిక చరిత్ర రచనకు ఇతివృత్త వైవిధ్యం ఎంతగానో ఉపకరిస్తుంది.

ఆనాటి జాతీయోద్యమ ప్రభావంతో తెలంగాణేతర నవలాకారుల చారిత్రక నవలలు వెలువడి,సంస్కృతి పట్ల ఆ రచయితల ఆక్రాంక్షలను బయట పెట్టాయి. నోరి నరసింహాశాస్త్రి 'రుద్రమదేవి', అడవి బాపిరాజు 'గోనగన్నారెడ్డి' లాంటి నవలలు ఏ లక్ష్యంతో రాసిన అందులో ఆనాటి తెలంగాణ జీవితమే కనపడుతుంది. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని చిత్రించిన తెలంగాణేతర నవలాకారుల్లో మహీధర రామమోహనరావు ముందు వరుసలో దర్శనమిస్తారు.ఆయన రచించిన 'ఓనమాలు', 'మృత్యువు నిడల్లో' 'రథచక్రాలు' నవలల్లో తెలంగాణా రైతంగా సాయుధ పోరాటం నేపధ్యం, ఆనాటి రాజకీయ జీవితాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తాయి.బొల్లిముంత శివరామకృష? 'మృత్యంజయులు', అంతటి నర్సింహం 'చీకట్లో కాంతిరేఖలు', లక్ష్మికాంతమొహన్ 'సింహగర్జన', కందిమళ్ళ ప్రతాపరెడ్డి 'బందూకు' నవలలుతెలంగాణ రైతాంగ పోరాటాన్ని వివిధ కోణాల్లో చిత్రించినవి. తెలంగాణాలో ఆనాడు వినోదబావే జరిపిన భుదానోద్యమానికి అడ్డం పట్టే నవల 'నీ బాంచెన్ కాల్మొక్కుతా' ను రచించిన ఇల్లిందల సరస్వతి దేవి సమజికవగాహనలోనూతన వైవిధ్యాన్ని చాటుకుంది.తెలంగాణ సంస్కృతిని లోతుగా అధ్యయనం చేసిన మామిడాలదశరథ్ 'చీకటి చేదిరింది' నవలను రాసి ఇక్కడి జీవితాన్ని కళ్ళముందు ఉంచారు. వరవరరావు గారు అన్నట్లు "తెలంగాణ రచ

యిత లకు తెలంగాణ వస్తువైనందువల్ల అది రక్తమాంసాలున్న, జీవన్మరణ పోరాటానికి సంఘర్షణశీల ఉద్యమ సాహిత్యమైంది.తెలంగాణ బయటివారికి ఆ వస్తుబలమే వారికీ ఉద్యమ రచయితల గుర్తింపును తెచ్చింది. ఇది ఒక చారిత్రక కారణం."

స్త్రీవాద ఉద్యమ ప్రభావం తెలంగాణలో అంతగా లేకపోయినప్పటికీ కుటుంబదాంపత్య, మనవ సంబంధాలను విశ్లేషిస్తూ పోల్కంపల్లి శాంతాదేవి, మాదిరెడ్డి సులోచన, ముదిగంటి సుజాతారెడ్డి నవలలు వచ్చాయి. పోరాట ఉద్యమ స్ఫూర్తితో గీతాంజలి 'ఆమె అడవిని జయించింది', వనజ 'అడవిపుత్రిక' నవలలు రాశారు. తెలంగాణలో పాలకులు సృష్టించిన కరువు ఉంది కానీ సాహిత్య కరువు లేదని ఇక్కడ వెలువడ్డ నవలలు నిరూపించాయి. తెలంగాణ ఆర్థిక, రాజకీయ, సామజిక చరిత్రను తరువాతి తరాలు తెలుసుకోవాలంటే ఈ నవలలు ఎంతగానో ఉపయోగపడుతాయి.

చారిత్రక నవలలో పేర్కొనదగినవి అడవి బాపిరాజు రాసిన గోన గన్నారెడ్డి. ఇది కాకతీయ రుద్రమదేవి కాలపు చారిత్రక నవల. నోరి నరసింహాశాస్త్రి రుద్రమదేవి చాలా విశిష్ట రచన. తెలంగాణీయుల తెలంగాణ చారిత్రక నవలగా వద్దిరాజు సీతారామరావు 'రుద్రమదేవి' (1918) ని పేర్కొనాలి.తెలంగాణ చారిత్రక నవలా రచయితలలో బి.యన్.శాస్త్రి గారు విశిష్టులు. అయన రాసిన ముడు నవలలో తుకాదేవి (కృష్ణదేవరాయల భార్య), 'వాకాటక మహాదేవి' విషు? కుండినుల కాలపు నవల. 'విప్లవజ్వాల' తెలంగాణ సాయుధ పోరాటాన్ని కథాంశంగా చేసుకొని రాసిన నవల. 'జగిత్యాల జైత్రయాత్ర'తో మొదలైన ఉద్యమ నవల గురుంచి చెప్పుకోవాలనుకున్నా, దాని ప్రత్యేకత గురుంచి చెప్పుకోవాలనుకున్నా అది 'కొలిమంటుకుంది' అవుతుంది. సామజిక సమస్యలను ఎత్తి చూపిన చెరబండరాజు ఆ సామజిక సమస్యలకు పరిష్కారాన్ని వెతికే క్రమంలో మార్క్సిస్టు రాజకీయాలు అతన్ని ఆకర్షించాయి. 1965-1982 మధ్య కాలంలో తెలంగాణలో సంబవించిన సామజిక పరిణామాలు,వివిధ సామజిక ఉద్యమాలు, వాటి దశలు చెరబండరాజును ప్రభావితం చేసాయి. ఆ ప్రభావంతోనే మాపల్లె (1978), ప్రస్థానం (1981), నిప్పురాళ్ళు (1983), దారిపొడుగునా (1985) నవలలు రాశాడు. ఈ నవలల్లో తెలంగాణ సమాజంలోని వైరుధ్యాలను, వాటిని రూపుమాపే విప్లవోద్యమాలను చెరబండరాజుచిత్రించాడు.

తెలంగాణ నవలలు ఉద్యమాలతోనే ఆరంభమయ్యాయి. నిజాం వ్యతిరేక పోరాటం,రజాకార్ల దాడులు, సాయుధ పోరాటం, విమోచనోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహా సభల స్ఫూర్తినివ్వగా పోరాట రూపాలుగా నవలలు రూపొందాయి. తెలంగాణ నవలలన్నింటిలో మధ్య తరగతి ప్రజల ఆశలు, ఆకాంక్షలు, ప్రజల జీవితం అడుగడుగునా కన్పిస్తాయి. నవీన్ కాలరేఖలు, బాంధవ్యాలు, చెదిరిన స్వప్నాలు నవలలు తెలంగాణ మధ్యతరగతి జీవితానికి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలిచాయి. కాలువ మల్లయ్య 'సాంబయ్య చదువు' నగర జీవితమే కాదు మధ్యతరగతి జీవితానికి అద్దంపట్టిన నవల. ఆలాగే పరవస్తు లోకేశ్వర్ 'సలాం హైదరాబాదు', మధ్య తరగతి యువకుల ఘోషను చెప్పిన ఎం.వి.తిరుపతయ్య 'జీవనసమరం', నేటి యువతీ యువకుల మనస్తత్వ చిత్రణ మలయశ్రీ 'నిర్ణయం' నవల. నవ్వలేక నవ్వుతూ బతకలేక బతుకుతూ ఓటమిని కూడా గెలుపులా భావిస్తూ ఆడుతుపడుతూ కాలం గడిపే మధ్యతరగతి మందహాసం అన్ని నవలల్లానూ ప్రతిబింబిస్తుంటుంది. మనవ సంబంధాలు మనిషికి, ప్రకృతికి, ఇతర ప్రాణులకూ మధ్య ఉన్న అన్యోన్య సంబంధాలను చిత్రించిన నవల పెద్దింటి అశోక్ కుమార్ 'జిగిరి', నీళ్ళ సమస్యగా రాసిన 'దాడి', ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజల్ని చీల్చిన వైనాన్ని 'ఊరికి ఉప్పలం' నవలలో చిత్రించారు.

పోరాటాల ప్రభావం ఇక్కడి ప్రజాజీవనంపై ఎంతగానో ఉంది.పోరాట స్వభావమున్న తెలంగాణ నేలకు ప్రత్యేక

సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి.ఇక్కడి సంస్కృతి, చరిత్ర, పోరాటాలను, సామజిక జీవితాన్ని ప్రజల భాషను తెలంగాణ సాహితీకారులు అక్షరబద్ధం చేశారు, చేస్తు న్నారు. ప్రాంతీయత ముద్రతో తెలంగాణ జీవితా లకు భాష్యాలు చెప్పే రచనలు చేస్తున్నారు. ఇందులో భాగం గానే కథ, కవిత్వం, నవలాసాహిత్యం విస్తృతంగా వచ్చింది.

మొత్తం జీవితాన్ని వ్యాఖ్యానించడానికి నవల ఉత్తమ మైన సాధనం. నవలకు ఉన్న విస్తృతి,పరిధి ఏ సాహిత్య ప్రక్రియలకు లేదు. తెలంగాణ గ్రామాలలో వచ్చిన పరిణామాలను, సంఘర్షణలను, మారుతున్న విలువ లను, నశిస్తున్న వృత్తులను, ప్రత్యామ్నాయం లేని బతుకులను, విప్లవ పోరాటాలను వాస్తవిక దృష్టితో చిత్రిం చిన నవలలు అనేకం ఉన్నాయి. చారిత్రక నేపధ్యంలో, తెలంగాణ గ్రామాలల్లో సామజిక పరిస్థితుల్ని, క్రమంగా ప్రజల్లో పెరుగుతున్న రాజకీయ చైత్యన్నాన్ని చిత్రించిన నవలలు వచ్చాయి,వస్తున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. ఆనందలక్ష్మి, సి. "తెలుగు నవలలో కుటుంబ జీవన చిత్రణము," శోభనాచల ప్రెస్,విజయవాడ.1979.
2. సంజీవమ్మ, పి. "తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం," అరసం, కడప. 1985
3. వరవరరావు,"తెలంగాణ విమోచనోద్యమం-తెలుగు నవల,"మార్చి, 1983.
4. వెంకటేశ్వర్లు,పంతంగి(సం)."తెలంగాణ తెలుగు నవల,"శ్రీదీప్తి ప్రింటర్స్,హనుమకొండ,డిసెంబరు,2014.
5. చెన్నయ్య,జె(సం)."తెలంగాణాలో తెలుగు సాహిత్య వికాసం," ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు, ఏప్రిల్, 2013.
6. ఆచార్య.శ్రీహరి,రవ్వ(సం). "తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర",తెలుగు అకాడమి,హైదరాబాదు,2016.
7. ఉదయ, ఎం. "తెలుగు నవలల్లో తెలంగాణ జనజీవితం", హైదరాబాద్ విశ్వవిద్యాలయం,1992.
8. వెంకట్ రెడ్డి,సిహెచ్."ఆధునిక తెలుగునవల:తెలంగాణా సామాజిక జీవన చిత్రణ(1947-2000)",ఉస్మానియా విశ్వవిద్యాలయం,2011.
9. నాగభూషణ శర్మ, మొదలి. "తెలుగు నవలా వికాసం," నాట్య కళా ప్రెస్, హైదరాబాద్. 1971
10. వెంకటేశ్వర్లు,పుల్లబోట్ల."తెలుగు నవల సాహిత్యంలో వికాసం,"డిసెంబరు,1974.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జగన్నాథ కథ చక్రాల్ – సమాజ నిర్మాణ కథలు

– పోల బాల గణేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాశీ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి.

మానవ జీవితానికి అవసరమైన మార్గదర్శనం పూర్వుల నుండి, లేదా పెద్దల నుంచి అందుతుంది. ఈనాటి ఆధునిక కాలంలో వైయుక్తిక జీవితానికి అలవాటు పడిన మనిషి ఈ సమాజంలోని వివిధ పరిస్థితుల నుండి తనను తాను సంస్కరించుకోవడానికి ఏ కొద్దిగానైన ప్రయత్నిస్తున్నాడు. ఇటువంటి సందర్భంలో తెలుగు కథ తనదైన పాత్ర నిర్వహిస్తుంది. రచయితను బట్టే రూపు దిద్దుకుంటుంది కథ. సమాజ పరిశీలన ద్వారా కథలు రూపొంది, సమాజంలో వ్యక్తి ఏ విధంగా ఉంటే వ్యక్తికి, కుటుంబానికి, సమాజానికి క్షేమమో తన కథల ద్వారా తెలియజేసిన కథకుడు జగన్నాథ శర్మ, పత్రికా రచయితగా పాత్రికేయరంగానికి, సాహిత్య లోకానికి సుపరిచితులు.

కథా రచయిత పూర్తి పేరు "అయలసోమయాజుల నీలకంఠేశ్వర జగన్నాథ శర్మ. విజయనగరం జిల్లా పార్వతీపురంలో 1956 ఏప్రెల్ 13 న జన్మించారు. కథ రచయితగా, నవలకారుడుగా, వ్యాస కర్తగా, వివిధ గ్రంథ లను రచియించిన గ్రంథకర్తగా బహుముఖ ప్రక్రియలను చేప్పటిన సుప్రసిద్ధ రచయిత. ఆంధ్రజ్యోతి ప్రచురించే నవ్య వీక్లీ సంపాదకులుగా పాత్రికేయరంగంలో వృత్తి నిర్వహిస్తున్నారు. వీరు ఇప్పటి వరకు ఐదువందల కథలు వ్రాసారని తెలుస్తుంది. వారి చిన్నతనం నుండే కథలు వ్రాయడం ప్రారంభించారు. వీరు వ్రాసిన కథలు వివిధ పత్రికలో ప్రచురించబడ్డాయి. ఆ విధంగా ప్రచురించిన 'రాజధాని కథలు' యువ మాన పత్రికలో, (పత్రిక ప్రారంభంలో తెనాలి నుండి వెలువడేది ఆ తర్వాత హైదరాబాదు నుండి వచ్చేది.) 'మా ఊరి కథలు' పల్లకి వార పత్రికలో, 'అగ్రహార కథలు' ఆదివారం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన్నాయి. కథలతో పాటు వీరు 18 నవలలు కూడా రచన చేశారు. వాటిలో 'అగ్రహారం', 'శౌర్యచక్ర', 'చార్మినార్', 'ఇక్కడంతాక్షేమం' వంటివి పాఠ కుల ఆదరణాభిమానాలు పొందాయి. వీరు సినిమా, టీ.వీ రచయితగా కూడా ప్రసిద్ధి చెందారు. 'కథా సరిత్సాగరం', 'పంచతంత్రం', 'పాలపిట్ట', 'నెమలీక', 'పేదరాసి పెద్దమ్మ', 'జగన్నాథ కథచక్రాల్-1-2' వంటివి కథా సంపుటాలు. పాఠక ప్రజల మన్ననలు పొందాయి. అలాగే వీరు అబాలగోపాలానికి అనువైన శైలిలో వెలువరించిన 'భారత', 'భాగవత', 'రామయణాల' గ్రంథాలు సహృదయ లోకంలోనికి వేగంగా విస్తరించాయి. వీరిని 2017 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' పురస్కారంతో సన్మా నించింది. అలాగే బహుముఖ సాహితీవేత్త 'బలివాడ కాంతారావు స్మారక జీవన సాహితీ' పురస్కారాని 2018 లో అందుకోన్నారు."

సమాజంలోని అనేక పార్శ్వాలను గుర్తించిన కథకుడు కథా వస్తువు కోసం వేరే ఏక్కడో వేతకనవసరం లేదు. వాస్తవమైన సమాజ స్థితిగతులను దర్శిస్తూ, వాటిలోని లోపాలను సరిచేసే ఆలోచన ఉంటే చాలు. ఆర్. ఎస్. సుందరం గారు ఇలా అంటారు. "ఏ సాహిత్యరూపానికైనా మూలం, ముడి సరుకు సమాజమే. మానవుల జీవిత సంఘర్షణలు, సంబంధ బాంధవ్యాలు, భావోద్వేగాలు, అనుభూతులు, సుఖదుఃఖాలు, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలు మొదలైన వాటన్నింటి సమన్వయ సమాహారమే సమాజం." అయితే స్వతహాగా కథకుడు పాత్రికేయరంగంలోని వారు కావడం వల్ల వ్యక్తులు-కుటుంబం- వివిధ పరిస్థితులు లేదా వివిధ సందర్భాల్లో మానవ ప్రవర్తన విధానం ఏప్పుడు ఎలా ఉంటుందో గమనించే తత్వం చేత మార్పు రావాలంటే మొదట మారాల్సింది మనిషేనని (వ్యక్తి) తెలియజేస్తారు. "ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజాని

కొక చరిత్ర, ఆ చరిత్రకొక పరిణామక్రమం ఉంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవి యొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రభావశీలి అయితే ఈ గమనాన్ని అతడు వేగవంతం చేస్తాడని శ్రీశ్రీ అన్నారు." జగన్నాథ శర్మ గారు సమాజ పరిణామాన్ని గుర్తించిన వారే కాబట్టి ఎన్నో వందల కథలను రచన చేయగలిగారు. సమాజ నిర్మాణ కథలు అని చెప్పడంలో ఉద్దేశం ఇదే. మనిషి నైతిక జీవన విధానంలోని మార్పును లేదా లోపాలను కథలోనే నిక్షిప్తం చేసి చూపెట్టడం, అటువంటి పరిస్థితులు ఏదుర్కొంటున్న పాఠకులు నిర్వహించాల్సిన కర్తవ్యం దానిలో చేప్పడం కథకుడి ప్రత్యేకత. ప్రగతిశీలి, ప్రభావశీలి అయిన కథకుడు కాబట్టే ఈ పేజీ కథలు ప్రాచుర్యం పొందాయి. వారు వ్రాసిన ఈ నవ్యవీక్లీ మొదటి పేజీ కథలు జగన్నాథ కథచక్రాల్ (మొదటిది) లో సంపుటి కరించిన కథలన్ని సమాజ నిర్మాణ కథలే అంటే అతి సయోక్తి కాదు. ఈ కథ సంపుటిలో మొత్తం వంద చిన్న కథలున్నాయి. అన్ని దాదాపు ఒక పేజీ నిడివిలోనివే. ప్రతీది ప్రత్యేకమైన మానవ కేంద్రమైన అంశాన్ని తీసుకోని రాసినవే. ఈ సమాజంలోనివే. విలువలు కోల్పోతున్న ప్రస్తుత సమాజంలో ఎట్లా ఉండాలో కూడా సూచనలు నిర్దేశిస్తూ భావి ఆరోగ్యకరమైన సమాజం కోసం అందిచ్చి నవిగా ఈ కథలున్నాయి. ఓ రెండు మూడు కథలు ఉదహరించి స్వస్తి పలుకుతాను.

సర్వసాదరణంగా ఎక్కడికి వెళ్లిన హోటల్ ఉండటం మనం చూస్తూనే ఉంటాము. ఆ ప్రాంతంలోని ఒక ప్రత్యేకమైన ఆదరణ ఉన్న టిఫిన్ హోటల్ ఉండటం సహజం. కాని ఆ హోటల్ వారి చిన్న సదుద్దేశం ఎంతటి విలువను నేర్పిస్తుందో... అటువంటి కథే దేవుడిడ్లి. ఈ కథలో ఓ ఊరికి పెడ్లి కొడుకు స్నేహితులు వివాహ కార్యక్రమానికి హజరై అక్కడి ప్రముఖ హోటల్లో టిఫిన్ చెద్దామని అడిగి తెలుసుకొని చలమయ్య హోటల్కు చెరుకున్నారు. కేవలం ఇడ్లీ మాత్రమే అందించబడుతుంది ఆ హోటల్లో. ఫ్రెండ్స్ వెళ్లి కూర్చున్నారు. చాల చిన్నది హోటల్. అక్కడికి కస్టమర్లు టిఫిన్ కోసం వచ్చి మూడు పేట్లు టిఫిన్ ఆర్డర్ ఇచ్చి ఒక ప్లేట్ దేవుడిడ్లీ ఆర్డర్ చేస్తూన్నారు. దేవుడు అనే వ్యక్తి ఎవరు కనిపించకపోవడం స్నేహితులు గమనిస్తూన్నే ఉన్నారు. సర్వర్ వచ్చి ఇచ్చి పోవడం బిల్లు మూడు పేట్లుకు ఇవ్వడం, డబ్బు కట్టి ఒక స్లిప్ దేవుడిడ్లీ అంటూ గోడకు స్లిప్ అంటిస్తూన్నాడు చలమయ్య. వారికి ఏమి అర్థం కాలేదు. వారు టిఫిన్ చేసి పెడ్లి కొడుకు పిలుస్తూన్నాడని వెళ్లిపోయారు.

మర్నాడు ఉదయం కూడా టిఫిన్ చేయాడానికి చలమయ్య హోటల్కు వేళ్లారు. అక్కడ చాల అసహ్యంగా ఉన్న బిచ్చగాడు వచ్చి ఇడ్లీ తింటున్నాడు. చెట్నీ, సాంబార్ కావలసినంత అడిగి వడ్డించుకోని తిని వేళ్ళాడు. సర్వర్ దేవుడిడ్లీ ఒకటి అని అరచి చేపితే అక్కడ అంటించిన స్లిప్ ఒకటి చించిపారేశాడు ఓనరు. అక్కడ అది చూసిన ఆ స్నేహితులు విస్తూపోతారు. ఏ హోటల్లోకైన బిచ్చ గాడిని రానిస్తారా, రానించిన సిటులో కూర్చోపేటి టిఫిన్ ఆర్డర్ ఇచ్చి కావలసినంత సౌకర్యవంతగా టిఫిన్ పేట్టి, పైసా కూడా తీసుకోకుండా వేళ్ళనీస్తారా కాని వెళ్ళాడు. చలమయ్య గారి ఔదార్యం, ఆ ఊరి ప్రజల దాతృత్వమే దీనికి కారణం. ఆకలికి అలమటించే వారికి ఆహారం అందించడం కోసం చలమయ్య గారి ఆలోచన, దానికి తోడు ఆ ప్రజల్లో ధర్మం చేయాలనే ఆచరణాత్మక నడవడి ఎంతో గోప్పది. ఇది చూసిన స్నేహితులు చలమయ్యను అభినందిస్తే మీరు చేయాల్సింది నన్ను అభినందించడం కాదు మీ ఊరిలో ఇలాంటి వెసులుబాటు కల్పించ మన్నారు. ఇంకా పేదలకి ఇంత తిండి పెట్టండి ఆనంది స్తాను అన్నారు చలమయ్య. "ధర్మం చెయ్యడానికి కూడా టైం చిక్కని ఈ వేగవంతమయిన జీవితంలో ధర్మానికి ఓ చక్కటి అవకాశాన్ని కల్పించింది చలమయ్య హోటల్. ధర్మం చేసేందుకు అక్కడికో ఇక్కడికో వెళ్ళక్కర్లేదు. బిచ్చగాళ్ళను వెదుక్కోనక్కర్లేదు. డబ్బిచ్చి తృప్తి పరచలేం. అదే ప్లేట్ ఇడ్లీ పేట్టి తృప్తి పరచవచ్చు. అతని ఆకలిని కాస్తలో కాస్తంత తీర్చోచ్చు."

కుటుంబంలో భర్తకు ఇష్టం లేని గర్భధారణ ఎంతటి దుఃఖానికి కారణమైయిందో, ఆగర్భంలోని 'చిట్టితల్లి ఉత్తరం' ద్వారా కథకుడు తెలియజేశాడు. గర్భనివారణకు భార్య భర్తల మధ్య జరిగే సంఘర్షణ, దాని కారణంగా మహిళ అనుభవించే బాధను ఈ కథలో వర్ణన చేశారు కథకుడు. అయితే గర్భంలోని శిశువు ఆడశిశువు కాబట్టి ఆ చిట్టితల్లే స్వర్గంలో నుంచి అమ్మా అంటూ ఉత్తరం వ్రాసింది. సాధారణంగా గర్భస్థ శిశువు రూపుదాల్చక ముందే గర్భస్రావం చేయడం జరుగుతుంది. కాని ఈ శిశువు అవయవ నిర్మాణం రూపుదిద్దుకొంటున్న సమయంలో చిట్టితల్లిని గర్భస్రావం చేయడం జరిగింది. ఆ బాధ ఇటు చిట్టితల్లికి అటు తల్లికి శారీరక, మానసికంగా కలిగింది. గర్భంలోనున్న తన స్థితిని, తల్లి పట్ల గల ప్రేమను ఈ ఉత్తరం ద్వారా వ్యక్తపరిచింది. అయితే ఆ రాచ్చసి గురించి దేవుడి ద్వారా అబార్షన్ అని తెలుసుకుంది. చివరికి "అయిందేదో అయిపోయింది. చచ్చిపోయాను, అయినా నీకెందుకీ ఉత్తరం అంటే, నువ్వంటే నాకు చాల ఇష్టం అమ్మా. ఎప్పటికయినా నీ కూతురుగా పుట్టాలని ఉంది. అందుకు రాస్తున్నాను. జాగ్రత్తమ్మా! పదే పదే అబార్షన్ రాచ్చసి నీ కడుపులోకొస్తే నువ్వు తట్టుకోలేవు. చచ్చిపోతావు. రాకుండా చూసుకో! నాన్నకి కూడా చెప్పు, నిన్ను జాగ్రత్తగా చూసుకోమని!" అని ఉత్తరంలో చిట్టితల్లి చెప్పింది. పూర్తిగా రూపమే లేని శిశువు తన తల్లి భావాలే తన బాధగా పొందింది. ఏడ్చింది. ఆపరేషన్ దియేటర్లో తనపై జరిగిన దాడిని రాచ్చసి దాడిగా భావించింది.

నేటి వాస్తవ పరిస్థితులు తలపిస్తూ ఆడ శిశువని తెలిసి జరుగుతున్న అబార్షన్ల గురించి స్పష్టపరుస్తుందీ కథ. ఈ సమాజంలోని పాఠకులకు పదే పదే అబార్షన్ల వల్ల చివరికి తల్లి ప్రాణాలకే ముప్పు వస్తుందని, అబార్షన్కు ఎక్కువగా పాల్పడవద్దు అని తెలియజేస్తుందీ కథ. దీనిలో ఆర్థిక, సామజిక కోణాలు అంతర్గతంగా ప్రభావితం చేస్తున్నాయని మరి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

'డైరిలో ఒక పేజీ' అనే కథలో పట్నంలో నివాస ముంటున్న కొడుకు. అతడి తల్లి మరణించినా, తండ్రి మాత్రం ఇంకా పల్లెటురులోనే ఒంటరిగా ఉంటున్నాడు. తన తండ్రికి ఆనారోగ్యం చేస్తే చుట్టు ప్రక్కల వారు జాగ్రత్తగా చూసుకొన్నారు. ఇది తెలిసిన కొడుకు ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తండ్రిని తన వెంట పట్నానికి తీసుకుని వెళ్ళిపోతాడు. అక్కడ తండ్రి పరిస్థితిని క్షుణంగా గమనిస్తూ కొడుకు తండ్రి ఇబ్బందిని గమనిం చాడు. రాత్రి సమయంలో నాన్నను చూడానికి వచ్చిన కొడుకు అతను నిద్ర పోవడంతో తిరిగి వెళ్ళబోయాడు అంతలో అతనికి తండ్రి దిండు క్రింద ఒక డైరి కనిపిం చింది. దానిలో తండ్రి ఏవిధంగా అలసిపోయింది, తన జీవన సరళీ ఏవిధంగా వుంది, తనను ఏవిధంగా చూసు కుంటే తను ఆ పట్నం లోని జీవన సరళిలోని వ్యక్తిగా అవుతాడో చెప్పుతాడు. నాన్నగా తన ఇష్టాయిష్టాలు అందులో చెప్పి తాను చిన్నప్పుడు కొడుకును ఏవిధంగా చూసుకొన్నాడో ఆ విధంగా పోలుస్తూ చెప్పడం జరిగింది. తండ్రిగా ఏవిధంగా కుమారుని పై ప్రేమ చూపాడో అదే విధంగా తనంత ప్రేమగా చూసుకోవాలని తెలిపాడు. "ముసలి కంపు కొడుతున్నానని, అసహ్యంగా ఉన్నానని దూరంగా పారిపోకు, దగ్గరగా తీసుకుని కూర్చో నీ చిన్న పుడు నువ్వు ఎలా ఉన్నా నేను అలాగే దగ్గరగా తీసుకునే వాణ్ణి. నువ్వలా తీసుకుంటే ధైర్యంగా, ఆనందంగా, హాయిగా నవ్వుతూ చనిపోతాను చంపాలని మాత్రం ప్రయత్నించకు. - డైరీ మూసేశాడతను. కళ్ళు చెమర్చు కుని, తండ్రిని చూశాడు. చలికి వణికిపోతూ కనిపిం చాడు. దుప్పటి కప్పాడు. కప్పి, పండిన తండ్రి తలను ఆప్యాయంగా నిమిరాడు. నుదుటన ముద్దుపెట్టి మురిసి పోయాడు."

కొడుకులు నేడు ఆస్తుల కోసం తల్లిదండ్రులను నరకయాతనపాలు చేస్తూన్నా ఈ తరుణంలో తల్లిదండ్రు లను బిడ్డలు ఏవిధంగా చూసుకోవాలో ఈ కథ ద్వారా తెలియజేశారు కథకులు.

'భగవద్గీత' అనే కథలో శెలవులకు ఇంటికి వచ్చిన మనువడు తాతను రోజు గమనిస్తూ ఉంటాడు. తాత రోజు భగవద్గీత గ్రంథాని చదవడం చూసి ఆ బాలుడు తను కూడా తాత మాదిరి శుభ్రంగా స్నానపానాదులు ఆచరించి భగవద్గీతను చదవడం ఆరంభించాడు. కొన్ని రోజులు ఈ విధంగా చేసిన ఆ బాలునికి దానిలోని విషయం అర్థం కాక నేరుగా తన తాత వద్దకు వేళ్లి అడిగాడు తాత రోజు ఈ భగవద్గీత పారాయణం వల్ల ఏమిటి ప్రయోజనం అని. అప్పుడు తాత సమాధానం కార్యకారణ రూపంగా బోధించాడు.

తన కళ్ళేదుట ఉన్న బోగ్గుల గంపను చూసి నీవు వేళ్లి ఈ బుట్టతో ఆ యేటి నుండి నీరు తీసుకునిరా అని చెప్పుతాడు. మనువడు నీరు తీసుకొని రావడానికి పలుమార్లు ప్రయత్నించి తాతతో ఈ బుట్టకు రంధ్రాలున్నాయి దీనితో నీరు ఏలా తెవడం, నీరు దీనిలో ఏలా నిలుస్తూంది అని ప్రశ్నిస్తాడు. అయిన లేదు దీనితో నీరు తీసుకోని రావలసిందే అంటారు. ఆ బాలుడు ఇంకా వేగంగా నీరు ముంచి తీసుకోని రావడానికి ప్రయత్నిస్తాడు చివరకి తాత దగ్గరకు వచ్చి తాత బుట్టతో నీరు తీలుకు రావడం సాధ్యం కాదు అని చెప్పుతాడు. అసలు దీని వల్ల ప్రయోజనం లేదు అంటాడు.

అప్పుడు తాత చూడు ఈ బుట్ట నువ్వు తీలుకోని వేళ్లేటప్పుడు బోగ్గులతో నల్లగా ఉంది. ఇప్పుడు చూడు ఎంత స్వచ్ఛంగా తెల్లగా మారిపోయిందో అని చూపించి మనువడుకి చేప్తూ భగవద్గీత చదవడం వల్ల కూడా ఇదే ప్రయోజనం కలుగుతుంది. మనిషిలోని కల్మషాలన్ని క్రమంగా భగవద్గీత చదవడం ద్వార వేళ్లిపోతాయి. రోజు రోజుకు కొంత మార్పు మనిషిలో తప్పక కలుగుతుంది అని సమాధానం చేబుతాడు.

"భగవద్గీత చదవడం వల్ల లాభం ఏమిటని అడిగావు చూడు ఇదే లాభం. చదివిందంతా గుర్తుండకపోవచ్చు. అర్థం కాకపోవచ్చు. కాకపోతే చదివిన ప్రతిసారీ ఎంతో కొంత నీలో మార్పు కలుగుతుంది. నీ మనసు, శరీరం రెండు స్వచ్ఛత సంతరించుకుని, శుభ్రపడతాయి. చాలు కదా అన్నాడు తాతయ్య. చాలు అనుకున్నాడు మనవడు."

ఇలాంటి కథలు సమాజాభివృద్ధికి దోహదంకరంగా ఉంటాయి. పరస్పర ఆశ్రితాలైన సమాజ సాహిత్యాలను దేని నుండి ఏది ప్రయోజనం పొందుతుందో.. కాని "ఓ సందర్భంలో గోర్కీతో టాల్ స్టాయి ఇలా అన్నాడట నిజ జీవితాని యథాతథంగా రాయకు. జీవితం పై నీ అభిప్రాయాలతో, జీవితం ఎలా ఉండాలని వాంచిస్తున్నావో వాటిని చిత్రీకరించు." ఆ విధంగా సమాజ శ్రేయస్సును, హితాన్ని కోరకు, సమాజంలోని వ్యక్తుల ఆలోచనలు, ఆచరణలు అటు కుటుంబానికి, ఇటు సమజానికి మేలైనవిగా ఉండాలనేదే ఈ కథకుని ఉద్దేశంగా కనిపిస్తుంది. ఇవి సమాజ నిర్మాణ కథలుగా అర్థం చేసుకోవడంమే సాహిత్య ప్రయోజనం. ఈ ఒక పేజీ కథల నుండి నేర్చుకోవడానికి పాఠకునికి అనేక విషయాలున్నాయి. సాహిత్యం సమాజ విలువలనూ, వాటి స్వరూపాన్ని విమర్శనాత్మకంగా వెలువరించడం ద్వారా పాఠకుడు జీవితాన్ని నిర్ధిష్టంగా అర్థం చేసుకోగలుగుతాడని విమర్శకులు పేర్కొంటారు. జగన్నాథ కథచక్రాల్ (1-2) నూరు నవ్యవీక్లీ మొదటి పేజీ కథలు సంపుటిని మరింత లోతుగా సహృదయ పరిశోధకులు పరిశీలించగలరు.

సంఖ్యా సూచికలు :

1. te.wikipedia.org/wiki/ఎ.ఎస్.జగన్నాథ శర్మ
2. https://eemaata.com/em/issues201801/14729.html.
3. దేవుడిడ్లీ-పుట-10, చిట్టితల్లి-పుట-12, డైరిలో ఒక పేజీ-పుట-16, భగవద్గీత-పుట-208-జగన్నాథ కథచక్రాల్ -నూరు నవ్యవీక్లీ మొదటి పేజీ కథలు సంపుటి- జగన్నాథ శర్మ,అమరావతి పబ్లికేషన్స్- గుంటూరు- 2013.
4. https://eemaata.com/em/issues201801/14729.html.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

శతకములు – వ్యక్తిత్వ వికాసం

- సాముల కిరణ్, తెలుగు అధ్యాపకులు

తెలుగు సాహిత్య ప్రక్రియలలో సామాన్య జన జీవనానికి కూడా చదివి అర్థం చేసుకోవటానికి వీలుగా ఉన్నవి శతకములు. ఎంతో లోతయిన భావములను వాడుక భాషలోని పదములతో చెప్పి, సామాన్య మానవుని కూడా జ్ఞానిని చేయగలిగినవి ఈ శతకములు. ఇంతకీ ఈ శతకముల గురించి మన పెద్దలు ఏమన్నారో చూడండి.

చట్టాన్ని చెబుతుంది శాస్త్రం
హితాహితాలు చెబుతుంది ఇతిహాసం
బుద్దులు చెబుతుంది పురాణం
సుద్దులు చెబుతుంది శతకం

అదన్నమాట శతకమునకు ఉన్న ప్రాముఖ్యం.

శతకములు అంటే ఏమిటి?

శతకం అంటే 100 లేదా 108 పద్యముల సంకలనం. మన సంస్కృతిలో 100 కు, 108 కి ఉన్న ప్రాముఖ్యత గురించి చెప్పవలసిన అవసరం లేదు కదా! ఒక శతకంలోని అన్ని పద్యములు ఒకే వృత్తంలో ఉంటాయి. అన్నింటికి ఒక మకుటం ఉంటుంది. మకుటం అంటే కిరీటం కదా! అవును కిరీటమే, కానీ ఇక్కడ సంభోదన అని అర్థం. ఈ మకుటమును బట్టి ఆ పద్యం ఏ శతకమునకు చెందినదో తెలుస్తుంది.

శతకముల వలన ఉపయోగం ఏమిటి?

మాటలు పలుకటం వచ్చిన చిన్న పిల్లలకు వీటిని నేర్పించటం వలన వారి స్పష్టమైన ఉచ్చారణ కలుగుతుంది. మాతృభాషపై పట్టు కలుగుతుంది. భావ వ్యక్తీకరణ తెలుస్తుంది. జ్ఞాపక శక్తీ వృద్ధి చెందుతుంది. ఇక పెద్దలకు నిత్య జీవితంలో వచ్చే చిన్న చిన్న కష్టములను దాటే సలహాలు ఉంటాయి. ఈరోజులలో అందరూ కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగి నేర్చుకునే "వ్యక్తిత్వ వికాసం" ఈ శతకములలో కావలసినంత దొరకుతుంది. ఉదాహరణ : వేమన, సుమతి శతకములు.

మన పిల్లలకు ఇటువంటి విలువలున్న తెలుగు పద్యములు కనీసం నెలకు రెండు నేర్పితే, వారికి భవిష్యత్తులో మరొకరిపై ఆధారపడి సామాజిక విలువలు, నైతిక విలువలు నేర్చుకునే అగత్యం తప్పుతుంది.పూర్వం పాఠశాలల్లో చిన్నపిల్లలకు సరళమైన శతకాలను నేర్పి, ఆ శతకాలలోని చిన్నచిన్న నీతిసూత్రాలనూ, కృష్ణశతకం వంటివాటిద్వారా శ్రీకృష్ణుని లీలలనూ, మహిమలనూ చిన్నారి మనసుల్లో నాటుకునేలా చెప్పడం జఱిగేది. క్రమంగా విద్యాబోధనలోవిద్యార్థులు సాహితీవివరణలతో కూడినపద్యాలూ, శతకాలూ, వాటి అర్థాలను ఆకళింపు చేసుకునే జ్ఞానం లభించేది.

ఈనాడు భాషకు ప్రాధాన్యత తగ్గి, శతకాల విశిష్టత మఱుగున పడిపోయింది. ఐతే, శతకాలలో నేర్చుకోదగిన విశేషాలు, ఆనాటి సమాజనీతులూ, పద్ధతులూ ఎన్నో మనకు కనిపిస్తాయి. వేమనశతకం సులభమైన పదాలతో రచింపబడి పండిత పామర జనులకు సులువుగా అర్థమయ్యేలాఉంటుంది. ఇక సుమతీ శతకం, భాస్కర శతకం, నారాయణ శతకం, నారసింహ శతకం ఇలా అనేక శతకాలు తెలుగుభాషకు వన్నెలను సమకూర్చాయి.

ఆధునిక సమాజంలో వ్యక్తిత్వవికాసం విషయంలో పలు అపోహలు ఏర్పడ్డాయి. పలు రకాల అసత్య ప్రచారాలు అమలులో ఉన్నాయి. ప్రత్యేక శిక్షణ సంస్థలు, గ్రంథాలు మనకు విస్తృతంగా కనిపిస్తున్నాయి. వ్యక్తిత్వ వికాసం అంటే పదిమందినీ మించిపోవడం కాదు. పదిమందినీ కలుపుకు పోవడం. సంభాషణా నైపుణ్యం అంటే దబాయించి వాదించడం కాదు. గుబాళించేలా

మాట్లాడ గలగడం. నాయకత్వ లక్షణం అంటే పెత్తనం చలాయించడం కాదు, ప్రేమతో జయించడం. నిర్వహణా సామర్థ్యం అంటే నెత్తిమీద కత్తి పెట్టి పని చేయించడం కాదు, ఒత్తిడి లేకుండా ఒప్పించి పని చేయించడం. ఇవన్నీ ప్రాచీన సాహిత్యంలోని పద్యాల ద్వారా అత్యాధునిక విద్యార్థినీ విద్యార్థులకు మనస్సుకి పట్టేలా చెప్పవచ్చు.

పద్యం పాత చింతకాయ పచ్చడే కావచ్చు. కాని పిల్లలకు నైతిక జీవనసూత్రాలు తెల్పటానికి, ధారణాశక్తి వృద్ధికి, భాషాసౌందర్యం తెలుసుకోటానికి పద్య సాహిత్యం ఉపయోగపడుతుంది అనటంలో సందేహం లేదు. ఉదాహరణకి తిక్కన భారతంలో ఒక పద్యం చూడండి.

ఒరులేయవి యొనరించిన
నరవర! య ప్రియము మనంబున కగు, దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పథములకెల్లన్

ఇతరులు ఏ పనులు చేస్తే మనం బాధపడతామో, ఆ పనులను ఇతరుల పట్ల మనం చెయ్యకుండా ఉండటమే ఉత్తమమైన ధర్మం. ఇలాంటి ఎన్నెన్నో కమనీయమైన అంశాల్ని ఎంతో రమణీయంగా తీర్చిదిద్దగల నైపుణ్యం మన కవులకు వెన్నతో పెట్టిన విద్య. విస్తృతమైన మన విలక్షణ సాహిత్యంలో ప్రక్రియకు వైవిధ్యం ఉందే తప్ప వైరుధ్యం లేదు. అందునా శతక సాహిత్యం జీవన సాన్నిహిత్యానికి ప్రతీక. ఆత్మవిశ్వాసం కోల్పోతున్న అనేక సందర్భాలలో మనలో ఆత్మవిశ్వాస బీజాల్ని నాటి వాటిని మహావృక్షాలుగా పోషించేవి శతకాలు.

శతకనీతి లోకరీతికి దర్పణం
కమలములు నీట బాసిన
కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్
తమతమ నెలవులు దప్పిన
దమ మిత్రులె శత్రులుట తథ్యము సుమతీ!

పద్మాలు తమస్థానమైన నీటిని విడిచిపెడితే సూర్యుడి ఎండకి కమిలిపోతాయి. అదే నీటిలో ఉన్నప్పుడు ఆ సూర్యుడి ఎండకే వికసించి శోభిస్తాయి. తమతమ స్థానాలు మారితే మిత్రులు సైతం శత్రువులవుతారు. ఈ పద్యం లోకరీతికి నిలువుటద్దం. తమతమ పరిధులలో జీవించడమే ఉత్తమ వ్యక్తిత్వం. సుమతీ శతక కారుడైన బద్దెన రాసిన ఇలాంటి కొన్ని పద్యాలను వ్యక్తిత్వ వికాస కోణంలో చూద్దాం.

సంభాషణా నైపుణ్యం (Communication Skills):

మనుషులకు దేవుడిచ్చిన వరం మాట. మనసులో చెలరేగే భావాలను వ్యక్తపరచేందుకు వీటిని ఉప యోగించాలి గాని భావాలను కప్పిపుచ్చుకుంటూ, ఎదుటి వ్యక్తిని తప్పుదారి పట్టించేందుకు కాదు. మాటతో ఎంత ప్రేమను పొందవచ్చో అంతే ద్వేషాన్ని కొనితెచ్చుకోవచ్చు. వ్యక్తిత్వ వికాసంలో మాట అత్యంత ప్రాధాన్యత వహి స్తుంది. మనం మాట్లాడే మాటలు మనకు సమాజంలో గౌరవాభిమానాల్ని సంపాదించిపెడతాయి. అందుకే సుమతీ శతక కారుడు మాట ప్రాధాన్యాన్ని ఇలా వివరిం చాడు.

ఇమ్ముగ జదువని నోరును
నమ్మాయని పిలిచి యన్న మడుగని నోరున్
దమ్ముల బిలువని నోరును
కుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ!

తనివితీరా చదవాలి. మొక్కుబడిగా కాదు. చిత్తశుద్ధితో మనస్ఫూర్తిగా చదవాలి. పరస్త్రీలను సైతం నోరారా అమ్మా అని పిలిచి గౌరవించాలి. తమ్ముళ్ళను కూడా ప్రేమగా గౌరవంగా సంబోధించాలి. ఒరే అని పిలిచినా ఆ పిలుపులో ఆత్మీయత, అభిమానాలు ఉండాలి. తల్లి ముద్దుగా పిచ్చిమొద్దు అంటే హృదయం ఉప్పొంగుతుంది. అదే బయటివాడు అంటే ఒళ్ళు మండుతుంది. ఏదో మొక్కుబడిగా పలికే పదాలకు వెనుక శక్తి ఉండదు. అవి కేవలం మామూలు పదాల్లా మిగిలిపోతాయి. ఆ పదాల వెనుక ఉండే వ్యక్తి వ్యక్తిత్వం ఆ పదాలకు శక్తినిస్తుంది. ఎదుటివారి మనస్సులపై ప్రభావం చూపి స్తుంది.

మాటకు ప్రాణము సత్యము
కోటకు ప్రాణంబు సుభటకోటి ధరిత్రిన్

బోటికి ప్రాణము మానము
చీటికి ప్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ!

చీటికి సంతకం, కోటకు భటులు, పడతికి మానం, మాటకు సత్యం ప్రాణం వంటివి. ధర్మపాలనకు ఎంత ప్రాముఖ్యముందో సత్యం మాట్లాడటానికీ అంతే ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే సత్యం పలకడమే మన ధర్మం. ఎదుటివాడు మనకన్నా చిన్నవాడా పెద్దవాడా తక్కువస్థాయి వాడా అన్న దాంతో సంబంధం లేకుండా గౌరవించాలి. గోడకు కొట్టిన బంతి అంతే వేగంగా వెనక్కు వచ్చినట్లు మనం గౌరవిస్తే మనకు గౌరవం లభిస్తుంది. అందుకే మన మాటలో మంచితనాన్ని ప్రకటించాలి. అమంగళకరమైన మాటలను కూడా మంగళప్రదంగా చెప్పాలి. వృథాగా ఒకరితో వైరం, వివాదాలు పెట్టుకోకూడదు. అనవసరమైన అహం ప్రదర్శిస్తే క్షణంలో తేలిపోయే విషయం కూడా అనవసరమైన వాగ్వివాదాలకు, మనస్తాపాలకూ దారి తీస్తుంది.

శుభముల నొందని చదువును
నభినయమును రాగరసము నందని పాటల్
అభిలాష లేని కూటమి
సభమెచ్చని మాటలెల్ల జప్పన సుమతీ!

మంచిని చేకూర్చని చదువు, ఇంపును, హాయిని కలిగించని పాటలు, ఉత్సాహాన్నివ్వని కలయిక, సభాసదులు మెచ్చని మాటలు సారం లేనివి. సభ మెచ్చని మాటలు మాట్లాడేవారు ఎంత విజ్ఞాన వంతులైనా, ఎంత తెలివి గలవారైనా ప్రజల అభిమానానికి పాత్రులు కాలేరు. మాటకారి తనం అనేది కత్తి మీద సాములాంటిది. కానీ ఒకసారి సభలో మాట్లాడి శ్రోతలను అలరించడం అన్నది అలవాటైతే ఎటువంటి సభలోనైనా ప్రజలను ఉర్రూత లూగించడం సులభమౌతుంది.

శ్రవణ నైపుణ్యం (listening skill):

నిదానమే ప్రధానం- దేనికీ తొందర పనికిరాదు, పరిగెత్తి పాలు తాగేకంటే నిలబడి నీళ్ళు తాగడం మంచిది. ఇలాంటి పెద్దల మాటలు, వారు వాడే సామెతలు, మందలింపులు, పాఠాలు, పద్యాలు అన్నీ కూడా పిల్లల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయి, ఆలోచింపజేస్తాయి, నడవడిని సక్రమంగా తీర్చిదిద్దుతాయి. మొత్తంమీద వ్యక్తి యొక్క సంపూర్ణ వికాసానికి సహకరిస్తాయి. ఇకపోతే లిజనింగ్ స్కిల్స్ విషయానికొస్తే ఎవరు చెప్పినా వినాలి. వినగానే తొందర పడక నిజమో, అబద్ధమో% తెలుసుకోవాలి. ఇది బద్దెన గారి సూక్తి.

వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపతగున్
కని కల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

మరి ఎంత మంది ఇలా మంచి చెడ్డలు పరిశీలించి న్యాయమైన నిర్ణయాలు తీసుకొంటున్నారు. అందువల్లే.. చాడీలు చెప్పే వారి మాటలే చెల్లుబాటు అవుతున్నాయి. నిజానిజాలు గమనించక తొందర నిర్ణయాలు తీసుకొని..... అపార్థాలతో..... ఆవేశపడి, ఆతర్వాత ఎంత బాధపడితే..... ఏమి ప్రయోజనం.....! చెప్పుడు మాటలు విని శత్రుత్వం తెచ్చుకొంటే.. ఆ తర్వాత సర్దుకు పోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఒకవేళ చెప్పుడు మాటలతో బలమైన వ్యక్తులను ఢీ కొట్టాల్సివస్తే.. మొదటికే మోసం రావచ్చు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్నట్లవుతుంది.

సంకల్పబలం (Will power) :

తనకోపమే తన శత్రువు - ఇది నీతివచనం. జీవితానికి పనికొచ్చేమాట. అందరికీ తెలిసినదే. కానీ ఈ శత్రువును నిగ్రహించడం, జయించడం మాత్రం సాధ్యం కాని అంశంగా చాలామందికి మిగులుతోంది. కోపం వల్ల అవతలి వారికి జరిగే ప్రమాదమేమో కానీ, ముందు కోపధారికే అది దుష్ఫలితాలనిస్తుంది. "ఏం చేస్తాం! ఆ సమయంలో ఎంత ఆపుకుందామని అనుకున్నా మావల్ల కాదు" అంటారు కొందరు. మనవల్ల కానిదేదీ లేదు. దానికి కావలసిందల్లా సంకల్పబలం ఒక్కటే.

పగ వలదెవ్వరి తోడను
వగవంగా వలదు లేమి వచ్చిన పిదపన్
తెగనాడ వలదు సభలను
మగువకు మనసీయ వలదు మహిలో సుమతీ

ఈ చిన్న ప్రపంచంలో ఎవరు ఎప్పుడు సెలవు తీసుకుంటారో ఎవరికీ తెలియదు. ఉన్నన్నాళ్ళు సంతృప్తిగా గడపాల్సిన జీవితం పగలు, కక్షలతో సాగిపోవడం అవసరమా? మనకు చెడు చేసిన వ్యక్తిని క్షమించడానికి కూడా ఎంతో ఔదార్యం కావాలి. ఉన్నతమైన వ్యక్తిత్వం, సమదృష్టి, విచక్షణ క్షమించే వ్యక్తికి ఉన్నప్పుడే ఇది సాధ్యం. క్షమించరాని తప్పయితే క్షమకు జీవిత కాలం సరిపోదు. అలాగే సంపదలేదని విలపించడం కూడా తగదు. మనకు నిజంగా ప్రాప్తం ఉంటే అది మన దగ్గరే ఉండేది. ఇకపోతే సభలు, సమావేశాలు, పది మంది మూగిన చోట, ఒక విషయం పైన గాని, ఒక వ్యక్తిని ఉద్దేశించి గాని పరుషంగా మాట్లాడటం గాని, విమర్శించడం గాని తగదు. అంత మందిలో అతను దానిని అవమానంగా తీసుకోవచ్చు. అకారణంగా కోపం, పగ పెట్టుకోవచ్చు. అది అశాంతికి దారితీయొచ్చు. ఫలితం కక్షలు, కార్పణ్యాలు.ఇంకా మగువకు మనసివ్వక పోవడం అనేది ఆ వ్యక్తి మానసిక ఉద్వేగాల మీద ఆధారపడి ఉంటుంది. ప్రేమించక పోవడమే మంచిది. అతివను ప్రేమించాక లేదా ప్రేమించడం మొదలెట్టాక మనసు తన ఆధీనంలోకి వెళ్ళిపోతుంది. నిన్నటి దాక మన శ్వాసలో మనం శాసించిన మన మనసు మాట వినదు. ఆలోచనలు కుదురుగా ఉండవు. వ్యక్తిత్వం పరాధీనం అవుతుంది.

చెడు స్నేహాలు (Bad Friendship) :

ఎవరితో ఎలా వ్యవహరించాలి, ఎప్పుడు ఏం మాట్లాడాలి, ఏ విషయానికి ఎలా స్పందించాలి వంటి విషయాలు వ్యక్తిత్వవికాసంలో అత్యంత ప్రాధాన్యత వహిస్తాయి. ముఖ్యంగా చెడ్డవారి స్నేహాన్ని గుర్తించేందుకు సుమతీ శతక కారుడు మార్గం చూపిస్తున్నాడు.

ఉపమింప మొదలు తియ్యన
కపటం బెడనెడను, జెఱకు కై వడినే పో
నెపములు వెదకును గడపట
గపటపు దుర్జాతి పొందుగదరా సుమతీ!

చెఱుకుగడ మొదట తియ్యగా ఉండి తరువాత తీపి తగ్గి చివరికి చప్పిడియై పోయినట్లు చెడ్డవారితో స్నేహం కూడా ఆరంభంలో బాగా ఉండి మధ్యలో వికటమై చివరికి చేటు కలిగిస్తుంది.

కొంచెపు నరు సంగతిచే
నంచితముగ కీడు వచ్చునది యెట్లన్నన్
కించిత్తు నల్లి కరచిన
మంచమునకు చేటు వచ్చు మహిలో సుమతీ!

చిన్న నల్లి కరచినా దాన్ని తొలగించే యత్నంలో భాగంగా మంచానికి కూడా దెబ్బలు తగులుతాయి. అలాగే నీచుడితో స్నేహం చేస్తే కీడు కలుగుతుంది.

తలనుండు విషము ఫణికిని
వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్
తలతోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!

దుష్టుడికి నిలువెల్లా విషమే ఉంటుంది కాబట్టి స్నేహాలు చేసేటప్పుడు మంచిచెడులు విచారించి చేయాలి. తన లక్ష్యం ఏమిటి, తానేం సాధించాదలచుకున్నాడు, ఈ స్నేహం వల్ల తన లక్ష్యం ఎలా నెరవేరుతుంది అన్న విషయాలు విశ్లేషించి మరీ స్నేహం చేయాలి. మన చదువుకి, ఏకాగ్రతకు భంగం కలిగించేవాడికి బైబై చెప్పాలి.

చెడు ఆలోచనలు (Bad Thoughts) :

మానవుడి మనస్సు ఒక కెమెరా లాంటిది. అనుక్షణం మన చుట్టూ జరుగుతున్న విషయాలనన్నిటిని అది గ్రహిస్తుంది. దాన్ని ఆపేసే వీలు లేదు. ఎటువంటి ఆలోచనైనా మనసుపై ప్రభావం చూపుతుంది. అందుకనే వీలైనంత వరకు చెడు ఆలోచనలు చేయకూడదని నియమం ఏర్పరిచారు. ప్రపంచంలో అతిశక్తివంతమైనది

కామం. కామం లేనిదే ప్రపంచం లేదు. వ్యక్తిత్వవికాసంలో కామాన్ని అదుపులో ఉంచడం అత్యంత ప్రధాన పాత్ర వహిస్తుంది. వ్యక్తుల స్వభావాన్ని బట్టి కామాన్ని అదుపులో పెట్టుకోవాలి.

పరసతుల గోష్ఠి నుండిన
పురుషుడు గాంగేయుడైన భువి నింద పడున్
బరసతి సుశీలయైనను
బరు సంగతి నున్న నింద పాలగు సుమతీ!

బ్రహ్మచర్యవ్రతంలో ఉన్న భీష్ముడైనా పరకాంతలతో మాట్లాడుతూ కనిపిస్తే అపకీర్తి పాలవుతాడు. అలాగే మంచి శీలవతి అయినప్పటికీ పరపురుషుడితో స్నేహంగా ఉంటే నిందలు మోయాల్సి వస్తుంది. పది మంది ఓ అబద్ధాన్ని పదిసార్లు పలికితే ఆ అబద్ధమే నిజమై కూచుంటుంది. కానీ ఆధునిక సమాజంలో స్త్రీ పురుషులిరువురూ సాన్నిహిత్యంగా ఉండటం తప్పనిసరి అవుతోంది. ఇటీవల అయితే రాత్రులు కూడా కలిసి పనిచేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. పురుషులతో నన్నిహితంగా మెలగటం స్త్రీ విముక్తికి నిదర్శనం అయింది. స్త్రీలతో తిరగడం పురుషత్వానికి ప్రతీక అయింది. ఈ రకమైన విధానాల వల్లనే నేడు సమాజంలో అనేక అకృత్యాలు జరుగుతున్నాయి.

నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లిదండ్రి నాధులతోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ!

సభలో తల్లిదండ్రులతో అధికారులతో పరస్త్రీలతో బ్రాహ్మణ శ్రేష్టులతో పరాచకాలు ఆడకూడదని తెలుసు కోవాలి.

ఆత్మాభిమానం (Self Respect) :

ఆత్మాభిమానం కలవాడు రాజులను మెప్పించి వారి వెకిలి చేష్టలను భరించడం కన్నా నీళ్ళు తాగి బతకడానికి ఇష్టపడతాడు. పోతన చెప్పిన దానినే సుమతీ శతక కారుడు మరో కోణంలో ఇలా చెప్పాడు.

అడిగిన జీతంబియ్యని
మిడిమేలపు దొరను గొల్చి మిడుకుట కంటెన్
వడిగల యెద్దుల గట్టుక
మడి దున్నుకు బ్రతుక వచ్చు మహిలో సుమతీ!

అడిగిన జీతం ఇవ్వని వాడి దగ్గర పని చేయడం కన్నా వ్యవసాయం చేస్తూ బ్రతకడమే మేలు. ఇంకా అడియాస కొలువు కొలువ కూడదట. అంటే ఏ ఉద్యోగంలో అయితే వ్యక్తి ఆశలు నెరవేరవో ఆ ఉద్యోగం చేయకూడదని అర్థం.

అధరము కదిలియు కదలక
మధురములగు మాటలుడిగి మౌనవ్రతుడౌ
నధికార రోగపురిత
బధిరాంధక శవము జూడ బాపము సుమతీ!

పెదవి కదిలిందో లేదో తెలియని విధాన మంచి మాటలు మాని అధికారమనే రోగంతో మాట్లాడకుండా దర్పంగా ఉండే అధికారి జీవచ్ఛవంతో సమానం, అటువంటి అధికారిని చూస్తేనే పాపం.

సాహితీ ప్రక్రియల్లో కథా కథన పద్ధతి, వర్ణనలు, రసం, ఉదాత్తత తదితర లక్షణాలకే పెద్దపీట దక్కుతుంది. అవసరమైన చోట అలతియలతిగా సామాజిక విలువల ప్రస్తావన జరుగుతుంది. కానీ శతకం విషయంలో మాత్రం నైతిక వర్తనంతో కూడిన సామాజిక విలువలే ప్రధానాంశాలు. మానవ మనస్తత్వ చిత్రణతో పాటు మనిషి మనుగడ ప్రశ్నార్థకం కాకుండా వీలైన ధర్మసూత్రాలు, సత్య వచనాలు ఇందులో కనిపిస్తాయి. మొత్తమ్మీద సమగ్ర సమాజ నైతిక విలువల పతాకలు శతకాలు. కాబట్టి పిల్లలకు శతకాలతో చెలిమి చేయిస్తే, వాళ్లు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. ఆ ఎదుగుదలే మెరుగైన సమాజానికి పునాది.

శతకాలు సత్య సన్నిహితాలు. సమాజ ప్రతిబింబాలు. నైతిక విలువల వృద్ధికారకాలు. సామాజిక విలువలకు పట్టంకడుతూ, మనిషిని మనీషిగా నిలబెట్టగలిగిన

శతకాలకు తెలుగు సాహిత్యంలో లోటులేదు. రుజు వర్తనకు దూరమవుతూ, ఆర్థిక విషయలోలత్వంతో ప్రవర్తిస్తున్న నేటి సమాజానికి ఈ శతక పద్యాలే మార్గ దర్శకాలు. సమాజానికీ, వ్యక్తికీ అవినాభావ సంబంధముంటుంది. ఏ వ్యక్తీ ఒంటరిగా జీవించలేడు. కొన్ని భౌగోళిక పరిసరాల మధ్య, కొన్ని సామాజిక సంస్థలను పెంపొందించుకుని, ఆర్థిక సంబంధాలతో, సంస్కృతీ సంప్రదాయాలతో, నైతిక విలువలతో మనుగడ సాగించే మానవ సమూహమే సమాజం. పటిష్టమైన సంస్కృతీ సంప్రదాయాలు, మానవీయ ఆలోచనలూ, ఆచరణాత్మక నైతిక ప్రవర్తన, ధర్మపరాయణత్వం, సత్యవాక్కుద్ధితో కూడిన సమాజమే నిజమైన సంతోషానికి నిలయమవుతుంది. కానీ, నేటి సమాజంలో ఈ విలువలతో కూడిన జీవనం లుప్తమవుతోంది. ఈ దుస్థితి నుంచి సమాజాన్ని ధర్మ మార్గం వైపు నడిపించగలిగేది సాహిత్యమే. అందులోనూ ప్రజాప్రయోజనాలకు, సామాజిక శక్తుల అభివృద్ధికి దోహదపడే ప్రజాసాహిత్యం పాత్ర అపరిమితం. ఇలాంటి ప్రజాసాహిత్యం మాత్రమే విలువైన సమాజాన్ని తయారు చేస్తుంది. అలాంటి సమాజ నిర్మాణం కోసం దేశ, కాల, భాషలతో సంబంధం లేకుండా సాహితీవేత్తల్లో ఎక్కువ మంది తమ రచనల్లో సామాజిక విలువలకు పెద్దపీట వేస్తూనే ఉన్నారు.ఒకప్పుడు ఈ ప్రాచీన శతక పద్యాలను పాఠశాలల్లో పిల్లలకు తప్పనిసరిగా నేర్పేవారు. అంతకు ముందే ఇంట్లో తల్లులు కూడా నీతిశతకాలను చదివించే వారు. ఎందుకంటే తేట తెలుగు మాటలతో, సరళమైన అల్లికలతో మన శతకాలు వ్యక్తిత్వ వికాస అవసరాలను నిర్దేశిస్తూ వచ్చాయి. అంతేకాక అవి భాషానైపుణ్యంతో పాటు జీవిత నిష్ఠను నేర్పేవి. ఇక వేరే 'వ్యక్తిత్వ వికాసాలు' అవసరమయ్యేవి కావు. దాంతో అనేక జీవిత సత్యాలు పిల్లలకు ఈ పోటీప్రపంచంలో అడుగిడక ముందే తెలిసిపోయేవి. మానవ మనన్తత్వం, సామాజిక మనన్తత్వాల పట్ల అవగాహన కలిగేది. ఆధునిక సమాజంలో అనాటి శతక సాహిత్యంలోని వ్యక్తిత్వ వికాస విలువలు, సామాజిక విలువలు తప్పనిసరి అవసరం అనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. మానవుల్ని చూసే కోణం, స్త్రీ జాతిని చూసే కోణం, ధనాన్ని చూసే కోణం మారితే సమాజంలోని అన్ని సమస్యలు దూరం అవుతాయి. చట్టాలు చేయలేని పనిని కుటుంబాలు చేయవచ్చు. కుటుంబాల్లో రాబోయే తరానికి నైతిక, సామాజిక విలువల్ని అందివ్వటంలో నాటి పద్యరత్నాలు కొన్ని చాలవా? పిల్లలు ఇవి నేర్చుకుంటే పెద్దలమయిన మనం భావితరాలకి మానవత్వ భిక్ష పెట్టినవాళ్ళం అవుతాం. వెనుకటి తరాల ఋణం తీర్చుకున్నవాళ్ళం అవుతాం. కాబట్టి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరు శతక పఠన ప్రక్రియని వ్యాపింపచేయాలని సవినయ మనవి. అన్ని శతకాల్లోని మేలిమి ముత్యాలని ఏరి నేటి తరానికి అందివ్వాల్సిన బాధ్యత సాహితిసంస్థల పైన, సాహితికారుల పైన ఉంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వీరేశలింగం – జీవన ప్రస్థానం

– సూరేపల్లి పద్మావతి, సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

తెలుగు సాహిత్య గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఎందరో కవులలో కందుకూరి వీరేశలింగం పంతులు గారు ముందు వరుసలో ఉంటారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడి తీసుకువచ్చిన గొప్పకవి. ఆయన రచనలు సాంఘిక జీవన విధానానికి దగ్గరగా, సామాజిక పరిస్థితులు, ఆచార కట్టుబాట్లను సంస్కరించే విధంగా ఉంటాయి. తెలుగు సాహిత్యములో కందుకూరి వీరేశలింగం పంతులు గారితో ఆధునిక యుగం ప్రారంభమైనదని చెప్పవచ్చును. తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నతమైన వ్యక్తి. గొప్ప సంఘసంస్కర్త. ఆధునిక సాహిత్య కలియుగ వైతాళికుడు. ఆయన రచనలు, నాటికలు ముఖ్యంగా కన్యాశుల్కం ద్వారా ఆనాటి సమాజంలో ఆచరిస్తున్న కట్టుబాట్లను, మూఢ నమ్మకాలను, ఆచార వ్యవహారాలను సూటిగా సమాజానికి తెలియజెప్పిన గొప్ప సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులుగారు 16 ఏప్రిల్ 1848 వ సం॥లో జన్మించారు. వీరి కుటుంబం ఆచార సంప్రదాయాలకు నిలయం. వీరి కుటుంబం ఏలూరు నుంచి రాజమండ్రికి వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వీరేశలింగం పంతులుగారి తల్లిదండ్రులు పున్నమ్మ, సుబ్బారాయుడు వీరేశలింగం, గారికి 1853వ సం॥లో అక్షరాభ్యాసం జరిగినది. అప్పటినుండి వీరి విద్యాభ్యాసం వీధి బడిలోనే జరిగింది. వీరేశలింగం పంతులు గారికి నాలుగేళ్ళ వయసులో తండ్రి చనిపోయారు.పెదతండ్రి, నాయనమ్మల పెంపకం లోనే అల్లారు ముద్దుగా పెరిగాడు. చిన్నతనంలోనే పురాణ పఠనం, శ్రవణ మందు మిక్కిలి ఆసక్తి ఉండేది. ఏడో యేట బడిలో చేరి బాలరామాయణం, ఆంధ్రనామ సంగ్రహం, రుక్మిణీ కళ్యాణం, కృష్ణశతకం, సుమతీశతకం, అమరం మొదలైనవి నేర్చుకున్నాడు. 1870 ప్రాంతంలో విద్యాభ్యాసం చేసే సమయంలోనే రచనలు చేయటం ప్రారంభించాడు. 1870లో సర్వకళాశాల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై అదే సంవత్సరంలో శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం, రసిక జనరంజనం వ్రాశాడు. పన్నెండో యేట రాజమహేంద్రవరం ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు చదువులో చేరాడు. చిన్నతనం నుండి చదువులో ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణుడైనాడు. విద్యాభ్యాస సమయంలోనే బాల్య స్నేహితులైన చల్లపల్లి రంగయ్య పంతులు దగ్గర నుండి, మిగతా బాల్యమిత్రుల నుండి కేశవ చంద్రుల ఉపన్యాస సంపుటిని తీసుకొని చదివి ఏకేశ్వర మతం పట్ల విశ్వాసం ఏర్పర్చుకున్నాడు. హేతువాదం పట్ల అభిమానం, సంఘసంస్కరణ పట్ల ఆసక్తి పెరిగాయి. భూత ప్రేత పిశాచాలపై నమ్మకం లేకపోవటం, బ్రాహ్మ మతంపై అభిమానం ఏర్పడినవి. అతి చిన్న వయసులో (1861 పదమూడో యేట) రాజ్యలక్ష్మమ్మ గారితో వివాహ మైనది. అప్పుడు రాజ్యలక్ష్మమ్మ గారి వయసు ఎనిమి దేళ్ళు, పెరిగి పెద్దయ్యాక వీరేశలింగం ఇటువంటి బాల్య వివాహాల నిర్మూలనకే కృషి చేశాడు. చదువుకునే రోజుల్లోనే కేశవ చంద్రసేన్, అత్మూరి లక్ష్మీనృసింహం గార్ల ఉపన్యాసాలు, బోధనల వల్ల బ్రహ్మమత ప్రభావితు డయ్యాడు.

వీరేశలింగం స్త్రీ విద్యకై ఉద్యమించడమే కాకుండా, బాలికల కొరకు పాఠశాలను కూడా ప్రారంభించాడు. మగ పిల్లలతో, ఆడపిల్లలు కలిసి చదువుకునే విద్యా విధానాన్ని కూడా ప్రవేశపెట్టాడు. అంటరాని కులాలకు చెందిన పిల్లలను చేర్చుకొని, వారిని మిగతా పిల్లలతో కలిసి కూర్చోబెట్టి, ఉచితంగా చదువు చెప్పేవాడు. అంతే కాకుండా పుస్తకాలు, పలకా బలపాలు కూడా కొనిచ్చే వాడు. ఆ సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు

పెళ్ళిళ్ళు చేసేవారు. వారు కాపురాలకు పోకముందే వారి భర్తలు చనిపోయేవారు, ఆ పిల్లలు వితంతువులై, అనేక కష్ట నష్టాలు ఎదుర్కొనేవారు. దీనిని రూపుమాపేందుకే వితంతు పునర్వివాహాలను జరిపించాలని ప్రచారం చేశారు. అలా ప్రచారం చేయటమే కాకుండా ఎన్ని కష్టాలెదురైనా ఆచరణలో పెట్టి, చేసి చూపించాడు. స్త్రీ పునర్వివాహ విషయంపై తనకున్న అభిప్రాయాలను రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రచారం చేసెడి వాడు. వీరేశలింగం 1881 డిసెంబరు11వ తేదీన తన స్వగృహంలో మొట్టమొదటి వితంతు వివాహం జరిపించి, ఆచరణలో పెట్టినాడు. వరుడి పేరు గోగులపాటి శ్రీరాములు, వధువు సీతమ్మ. స్త్రీల గురించి ఆలోచించే వీరేశలింగం వారి కొరకు ఒక పత్రికను ప్రత్యేకంగా ప్రారంభించారు. 'సతీహితోబోధిని' అనే మాస పత్రికను ప్రారంభించి, దీనిలో దేహారోగ్యధర్మ బోధిని, సత్య సంజీవని, పత్నహిత సూచని పేరిట స్త్రీల ఉపయోగం కొరకు సులభమైన, శాస్త్ర, ఆరోగ్య, నీతి కథలు ప్రచురించి స్త్రీలకు జ్ఞాన సంపదను అందించే ప్రయత్నం చేశాడు. ఈ పత్రికలో స్త్రీకి విద్యా అవశ్యకత గురించి తెలియజేస్తూ రచించిన "సత్యవతీ చరిత్ర" అనే నవలను ప్రచురించారు. స్త్రీలు తమ ఆరోగ్యం గురించి, తమ శరీరం గురించి జ్ఞానం పొందితే, తమ జీవితాన్ని సుఖమయం చేసుకోవచ్చునని భావించాడు. స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబాన్ని ఏవిధంగా సమర్థవంతంగా నిర్వహించ గలదో, అదే స్త్రీ విద్యావంతురాలు కాకపోతే మూర్ఖురాలై సంసారాన్ని ఏ విధంగా మారుస్తారని ఈ నవలలో స్త్రీ విద్యా ఆవశ్యకతను తెలిపారు.

శ్లో॥ అరక్షితాగ్ని హేరుద్దా: పురుషైరాప్తకారిభి:
ఆత్మానమాత్మ నాయుస్తుర క్షేయుస్తా సురక్షిత: ॥

పురుషులచే గృహములో నిర్భంధించబడిన స్త్రీలు రక్షితులు కారు. ఏ స్త్రీ తమను తామే కాపాడుకుంటారో వారే సురక్షితులు అన్నశ్లోకం ముద్రించటంలోనే స్త్రీలలో ఏ విధంగా మార్పునీ, ధైర్యాన్ని ఆశిస్తున్నాడో స్పష్టంగా అర్థమవుతుంది.

1884 జూన్ 22వ తేదిన నూతనముగా స్త్రీ పునర్వివాహ సంఘాన్ని స్థాపించాడు. సంఘం మరింత బలపడే విధంగా ప్రయత్నించాడు. 1885-86 లో రాజమండ్రిలోని పారిశుధ్య విచారణ సంఘంలో సభ్యులుగా చేరి నగర పారిశుద్ధ్యం కొరకు కూడా తీవ్రంగా కృషిచేశారు. 1891లో రాజమండ్రి ప్రార్థనా సమాజం పక్షాన వెలువడిన "సత్యసంవర్ధని" పత్రికను నిర్వహించారు. ఇందులో 'కలి పురుష శనైశ్చర విలాసము', యోగభ్యాసము, హిందూమత సభ, 'సరస్వతి నారద విలాపము' అనే వ్యంగ్య రచన కూడా పత్రికలో వెలువడింది. 1893లో సంఘంలోని దురాచారాలను మాన్పించి సమాజం యొక్క దశ, దిశను మార్చి, స్త్రీ విద్యాభివృద్ధికి వితంతు పునర్వివాహానికి తీవ్ర కృషి చేసిన వీరేశలింగం గారిని గుర్తించి ఇండియన్ గవర్నమెంట్ వారు 'రావు బహద్దూర్' బిరుదును ఇచ్చి గౌరవించారు. 1878-98లో మద్రాసులో వితంతు శరణాలయాన్ని తమ సృగృహమందే స్థాపించి సంఘ సంస్కరణ కార్యక్రమాన్ని విస్తరింపజేశాడు. 1898లో వీరేశలింగం గారు నిర్వహించే చింతామణి పత్రిక ఆగిపోయింది. మద్రాసులో సర్వ కళాశాల సభ్యులుగా నియమింపబడి, అక్కడ జరిగిన దేశీయ సాంఘిక మహాసభకు ఆయనే అధ్యక్షతగా వ్యవహరించారు. ఈ సభలోనే వీరికి "దక్షిణ హిందూదేశ విద్యాసాగరుడని" శ్రీమహాదేవి గోవిందరానడే వారు బిరుదునిచ్చారు.

1910 ఆగస్టు 11న వీరేశలింగం గారి ధర్మపత్ని రాజ్యలక్ష్మమ్మగారు మరణించారు. వీరేశలింగం గారిపై అపవాదులు, అభియోగాలు న్యాయస్థానంలో రావటంతో దిగాలు చెంది అనారోగ్యానికి గురయ్యారు. భార్య మరణం, వృద్ధాప్యం, అనారోగ్యం, అపవాదులు, న్యాయ స్థానాల్లో అభియోగాల వల్ల వీరేశలింగం గారిని చివరి దశలో చికాకు పరిచినాయి. ఇన్ని చికాకుల మధ్య కూడా 1917లో కవుల చరిత్ర ప్రథమభాగాన్ని సంస్కరించారు. తన జీవిత కాలమంతా సంఘంలోని దురాచారాలను మాన్పటానికి, స్త్రీల అభ్యున్నతి కొరకు కృషి చేసిన, స్త్రీల

సంస్కరణలకు ఉద్యమ రూపాన్ని తీసుకొచ్చిన ఘనత వీరేశలింగం పంతులుగారిదే.

కందుకూరి వీరేశలింగం పంతులు నవలలు రచించడంలో ప్రథములు 'శ్రీరంగ రాజచరిత్రము' అనే తెలుగు నవలని నరహరి గోపాలకృష్ణమ శెట్టి రచించారు. ఇదే తొలి తెలుగు నవల అని కొంతమంది అభిప్రాయం. కానీ వీరేశలింగం పంతులు రచనలపై పరిశోధన చేసిన అక్కిరాజు రమాపతిరావు తొలి సాంఘిక నవల "రాజశేఖర చరిత్ర" అని సోదాహరణంగా వివరించారు. వీరేశలింగం గారి నవలలు 1) శ్రీ రాజశేఖర చరిత్ర 2) సత్యరాజు పూర్వదేశయాత్రలు 3) సత్యవతీ చరిత్రము 4) చంద్ర మతీ చరిత్రము. ఇందులో రాజశేఖర చరిత్ర, సత్యరాజు పూర్వదేశయాత్రలు, పురుషుల్ని దృష్టిలో ఉంచుకొని రాయగా సత్యవతీ చరిత్రము, చంద్రమతీ చరిత్రము స్త్రీలను దృష్టిలో ఉంచుకొని రాశారు. "రాజశేఖ చరిత్ర'కి తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం ఉంది. తన 30వ ఏట దీన్ని రచించినారు. వీరేశలింగం గారి మహా యశస్సునకు శరత్కౌముది వంటిది, వారి రాజశేఖర చరిత్రము. రాజశేఖరచరిత్ర ఉదయించినప్పటి నుండి నేటి వరకు కూడా తెలుగు నవలా రచనకు మార్గ దర్శకత్వమును వహించును అని అన్న రమాపతిరావు మాటల్లో నిజం లేకపోలేదు. సాహితీపరుల ప్రశంసలతో ఇప్పటికే పదిసార్లు పైగా పునర్ముద్రించబడిన నవల రాజశేఖరచరిత్ర "సత్యరాజు పూర్వదేశ యాత్రలు" అనే నవలలో సమాజంలో గల వికృత సంఘటనలని హేళన చేస్తూ హాస్యరస కల్పనలు చేశారు. తమ కాలంలో మత దురాచారాల్ని, మూర్ఖపు విశ్వాసాల్ని పంతులు గారు ఈ నవలలో తెలిపారు. 1883లో "సత్యవతీ చరిత్రము " అనే నవలను స్త్రీలను ఉద్ధేశించి స్వతంత్రంగా రచించారు. స్త్రీ ప్రాధాన్యాన్ని, విద్యాభివృద్ధిని, తెలియపరుస్తూ ఈ నవల రాశారు. 1884లో "చంద్రమతీ చరిత్రము" అనే మరొక నవలలో మత ధర్మాలను, నీతి విషయాలను వర్ణిస్తూ స్త్రీల అభ్యుదయాన్ని తెలియపరుస్తూ పదిహేను ప్రకరణలతో రాశారు. తెలుగులో ప్రహసనాలకు ఆద్యులు కందుకూరి వీరేశలింగంగారు. ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల, రాజకీయ సాంఘిక దురాచారాలను వినోదకరంగా వివరించి మాన్పించాలనే ప్రహసనాలు రచించారు. చాలా ప్రహసనాలు తమ "వివేక వర్ధిని" పత్రికలో ప్రచురించారు. తెలుగులో స్వీయ చరిత్రలు రచించినవారిలో వీరేశ లింగం గారే ప్రథములు, ఎటువంటి అసత్యాలుగాని వికారాలు గానీ, మమకారాలుగానీ లేకుండా జీవిత చరిత్రను రచించటం, వారు జీవించి ఉండగా రచించడం కత్తి మీద సాము వంటిది. "స్వీయ చరిత్రలు వచన రచనమునకు వీరేశలింగంగారే మార్గదర్శి "పండిన వృక్షమునకే రాతి దెబ్బలన్నట్లు, పుస్తకములు రాయువారికే విమర్శలు అనే రాళ్ళు తాకుతాయి. లోకములో ఎవ్వరును సర్వజ్ఞులు కాలేరు. ఎంతటి విద్యాంసులు రాసిన పుస్తకములనైనను తప్పలుండవచ్చును". అంతటి మహోన్నత వ్యక్తి, సంస్కారి, మనీషి కందుకూరి వీరేశలింగం పంతులుగారు.

అందుకనే చిలకమర్తి వారు.

"తన దేహము తన గేహము
తనకాలము తన ధనమ్ము తన విద్య జగ
జ్జనులకు వినియోగించిన
ఘనుడీ వీరేశలింగ కవి జనులారా" అన్నారు.

సమాజంలోని దురాచారాలపట్ల తన నిరసనను అడుగడుగున, తన రచనల ద్వారా తెలియజేస్తూ, తను ఆశించిన మార్పులను ఆచరణలో పెట్టి దాదాపు యాభైయేండ్ల పాటు అవిశ్రామ కృషి సల్పిన వీరేశలింగం గారు 1919 మే 27న మద్రాసులోని వేదవిలాస భవనంలో పరమపదించాడు. సమాజంలోని దురాచారాలను తీవ్రంగా విమర్శించి, సంఘసంస్కర్తగా, జనంలో నూతన చైతన్యాన్ని తీసుకొని రావటానికి నిర్విరామ కృషి చేసిన పంతులుగారి సాహిత్య ప్రక్రియలన్నింటిని చేపట్టి

సమర్థవంతంగా నిర్వహించారు. వీటిని ఆధునిక మార్గం వైపు మళ్ళించడమే కాకుండా తన సంస్కరణ ఉద్యమానికి వాటిని విస్తృతంగా వాడుకున్నారు. ఆయన రచనలే బలమైన ఆయుధాలుగా సంఘసంస్కరణకు ఉప యోగపడ్డాయి. బాలికలు చిన్నతరగతులలో చదువు కోవటానికి వీలుగా స్త్రీ దీపిక పేరున ఒక శతకం వ్రాశాడు.

చక్కదనమునకు దోడు చదువుకూడ
గలిగియుండిన నంద మౌనలరనగును
దాని కలిగిన వడుపున దనరు చంద్రు
పూవుబోండ్ల విద్యా గందమునకు గరము

సాహిత్య, సామాజిక రంగాలలో మార్పులు తేవడానికి కృషిచేసిన వీరేశలింగం సాహిత్య సామాజిక పునరుజ్జీవ నోద్యమ కారుడుగా చెప్పవచ్చును. ఆయన మార్గదర్శి, కవి, పరిశోధకుడు, పండితుడు, సంస్థా నిర్మాత శతాధిక గ్రంథకర్త. తన జీవితమతా మహిళాభ్యుదయం కొరకు కృషి చేసిన వ్యక్తి.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర-దా.ద్వా.నా శాస్త్రి
2. తెలుగు సాహిత్య చరిత్ర-పాఠ్యపుస్తము- SDLCE-KU ప్ర.సం॥పే - II

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రావిశాస్త్రి గారి రత్తాలు – రాంబాబు నవలలో కనిపించే స్త్రీల జీవనము

– ఓ. వెంకట ప్రసాదు, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, వనపర్తి.

రత్తాలు - రాంబాబు నవలను రావిశాస్త్రి రచించాడు. ఈ నవలలో రత్తాలు, జలజ, జాంబవతి, సచ్చాలు, పైడి తల్లి, సుబ్బులు వంటి స్త్రీలందరు అట్టడుగు వర్గాల నుంచి వచ్చినవారే. కాబట్టి వీరందరూ ఆనాటి సమాజం సృష్టించిన పరిమాణాల కారణం చేతనో, బతుకుదెరువు కోసమో, భద్రత లేకపోవటం వల్లో సింహాచలం వంటి బ్రోకర్లు, పట్టుసాలి రంగమ్మవంటి మోసగత్తెల వల్ల దగాపడో వేశ్య కంపెనీలలో చేరబడినవారే. వీరి దుర్భర జీవితాలవల్ల కనిపించే సామాజికపరిస్థితులు ఇలా వున్నాయి.

ఈ నవలలో ముత్యాలు పాత్ర చాలా విలక్షణంగా వుంటుంది. ముత్యాలు పల్లెటూర్లో జన్మించి, చిన్నపుడే తల్లిదండ్రులను, భర్తను పోగొట్టుకుని, వయసులో ఉన్నపుడు పెళ్ళిచేసుకుంటానని చెప్పిన వ్యక్తిచే మోసగించబడి, అన్న ఆదరణ లేక, వదిన ఈసడింపులు భరించలేక బతుకుదెరువు కోసం పట్నంచేరి, మార్కెట్‌లో కూలీగా వెళ్తే అక్కడ వుండే స్త్రీ చేత మోసగించబడి వేశ్యా కంపెనీలో చేరుతుంది. తాను వేశ్యాకంపెనీలో నిత్యం నరకాన్ని అనుభవిస్తూనే రిక్షా జోగులుపై వున్న ప్రేమతో బ్రతుకుమీద ఆశతో జీవిస్తూ రత్తాలు వంటి అమాయకుల బ్రతుకు బండలు కాకుండా కాపాడుతుంది. నమ్మినవాళ్ళను మోసం చేయకూడదనే నిజాయితీకి కట్టుబడి, సమయానుకూలంగా లౌక్యాన్ని ప్రదర్శిస్తూ, చమత్కారంగా మాట్లాడుతూనే తప్పుచేసిన వాళ్ళను నిలదీస్తుంది. అవనరనమయాల్లో కంపెనీ ఓనర్ నరసమ్మతో కూడ గయ్యాళిగా మాట్లాడి, ఆమె దౌర్జన్యాన్ని అరికట్టే ప్రయత్నం చేసేది.

ఈ వ్యవస్థలో మానవ సంబంధాలు డబ్బుతో ముడి పడి వున్నాయని, డబ్బులేనిదే మనిషికి విలువలేదన్న విషయం రావిశాస్త్రి ముత్యాలు మాటలద్వార తెలియ జేస్తాడు. డబ్బు సంపాదించడానికి స్త్రీని వ్యాపారవస్తువుగా మార్చిన పెట్టుబడిదారి వ్యవస్థలో స్త్రీని అంగడి సరుకుగా, సంతలోని పశువుగా చూయిస్తూ ఏవిధంగా బేరసారాలు కుదుర్చుకుంటారో బ్రోకర్ సింహాచలం, కంపెనీ ఓనర్ నరసమ్మకు మధ్య జరిగిన సంభాషణల ద్వార తెలుస్తుంది. ప్రజల మానప్రాణాలను చట్టపరంగా కాపాడాల్సిన అధికారులు, నాయకులు విషయం తెలిసి కూడ నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారే కాని ఏమి చేయడంలేదని రావిశాస్త్రి వ్యంగంగా ఎత్తిపొడుస్తాడు. కళ్లముందు జరిగే ఈ ఘోరాలను ఆ దేవుడు కూడ చూస్తూ మౌనంగా వుంటాడే తప్ప ఏమి చేయలేడని రావిశాస్త్రి వివరించాడు.

ఈ నవలలో ఇంకోపాత్ర సచ్చాలు. సచ్చాలు వేరే కులం వాడిని పెళ్లిచేసుకున్నందుకు ఆమె తల్లిదండ్రులు దూరమౌతారు. ఈమె భర్త టౌన్లో రిక్షాతొక్కుతూ బస్సుకింద పడిపోగా 3 సంవత్సరాల కొడుకును తీసుకుని అత్త గారింటికి వెళ్తే, వాళ్ళు రానివ్వరు. అపుడు కూలి పనిచేసి బతకుతున్న సచ్చాలును, రంగమ్మ అనే స్త్రీ చేరదీసి వేశ్యా కంపెనీకి అమ్మివేస్తుంది. సచ్చాలు కొడుకు మీద ఆశతో నరకాన్ని అనుభవిస్తుండగా కొన్ని రోజులకు జ్వరంతో ఆమె కొడుకు చనిపోతాడు. ఈ విషయాన్ని ముత్యాలు, రత్తాలుతో చెప్పి దిక్కులేని ఆడవారిని లోకం ఎలా చూస్తుందో వివరిస్తుంది.

వయసులో ఉన్న ఆడదాన్ని రౌడీలు మానభంగం చేస్తే గ్రామ ప్రెసిడెంటుకాని, పోలీసుహెడ్డు కాని డిఎస్పీ

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

దొర ఎవ్వరూ సహాయానికి రాకపోగ, శీలాన్ని అమ్ము కుంటున్నావని నేరం మోపి కోర్టుకు అప్పగిస్తే, మెజిస్ట్రేటు తప్పుచేసావంటూ జుర్మానా విధిస్తాడు. "సివరికేటవుద్దంటే పిండుకున్నన్నాళ్ళు పాలు పిండుకుని కడాకు గంగిగోవుని గోదారొడికి అమ్మేసినట్లు, ఆడదాని మానంతో డబ్బు పిండుకున్నన్నాళ్ళు పిండుకుని, కాడకి దాన్ని అప్పన్న కొండమెట్లకి అప్ప చేసేస్తారు" అని చెప్పిస్తాడు రావిశాస్త్రి. ఇక్కడ స్త్రీల రక్త మాంసాలతో వ్యాపారం చేసే లోక స్వభావాన్ని, దాన్ని పెంచి పోషిస్తున్న పాలకులనూ, ప్రభుత్వయంత్రాంగాన్ని రావిశాస్త్రి తీవ్రంగా దుయ్య బడుతూ వేశ్యల దుర్భరజీవితాన్ని వాస్తవ చిత్రీకరణ చేస్తూ సభ్యసమాజాన్ని ఆలోచింపచేసే ప్రయత్నం చేస్తాడు.

ఒక సందర్భంలో "ఈ సంఘానికి డబ్బే మూల స్తంభమని, అమ్మడం కొనడమే దీని మూల సూత్రమని, దోపిడీలే ఇందులో పెద్దల జీవనాధారమనీ, నోరులేని వాళ్ళ నెత్తురు పీల్చడమే ఇందులో న్యాయం ధర్మం అని రత్తాలికి తెలియదు" అంటూ వ్యవస్థ యొక్క దోపిడి వ్యాపారస్వభావాన్ని వివరిస్తాడు రావిశాస్త్రి. రత్తాలు తనపై పడబోతున్న సింహాచలం, అతని బానును వదిలించుకుని తన మానాన్ని కాపాడుకుంటుంది. అదే సమయంలో సచ్చాలు నూతిలోపడి చనిపోతే అపుడు ముత్యాలు, రత్తాలును తప్పించే ప్రయత్నం చేస్తుంది. అపుడు వేశ్యా కంపెనీ ఓనర్ నరసమ్మ దగ్గరవుండే అడ్డబుర్ర మావయ్య రత్తాలును తీసుకురాగ నరసమ్మ కోపంతో రత్తాలు జుట్టుపట్టి ఈడ్చి నేలకొట్టి "లంజా! నాటు లంజా! నా యింట్లోంచి అడుగు బైటకేసి దాటీడానికి నీకెన్ని గుండెలే! నీకెంత దయిర్యవే! ఇదిల్లను కొంటున్నావేటే నంజా! ఇదిల్లుగాదు చెంట్రల్ జైలు. నాను ఈ చెంట్రల్ జైలుకు సూపర్నెంటుని" అంటూ బెదిరించి ఒరే అడ్డబుర్రా! ఒరే మావయ్యా అని కేకేసి దీన్ని మూడ్రోజుల వరకు చీకటికొట్టులో వేయండి అని ఆర్డరు జారి చేస్తుంది. ఈ మాటలను బట్టి ఈ చీకటి సామ్రాజ్యానికి నరసమ్మే సర్వాధికారిణి అనీ ఆ కోటలో చిక్కుకున్న అమ్మాయిలు బానిసలనీ, మావయ్యలు కాపలాకుక్కలని రావిశాస్త్రి తెలిపాడు. వేశ్యాకూపంలో చిక్కుకున్న స్త్రీలు, నరసమ్మ వంటి ఓనర్ల దౌర్జన్యానికేకాక, డబ్బున్న వివిధ వర్గాల దోపిడీ పీడనకు ఎలా గురవుతారో స్పష్టంగా రావిశాస్త్రి వివరించాడు. ధనవంతుల దోపిడీపీడనకు గురయ్యే అట్టడుగు వర్గాలలోని స్త్రీ పురుషులలోనే మానవత్వపు విలువలు ఎక్కువగా వుంటాయని ఈ నవలలో రాంబాబును రక్షించే సంఘటన వల్ల తెలుస్తుంది.

ముత్యాలు, రత్తాలును వేశ్యాకూపం నుండి పంప టానికి ఏర్పాట్లుచేసి, ఆమెను ఈ నరకకూపం నుండి బయటపడమన్నపుడు రత్తాలు ముత్యాలుతో తననుకూడ ఈ నరకకూపం నుండి బయటికి రమ్మని చెప్పినపుడు ముత్యాలు, నరసమ్మ తనను నమ్మిందని నరసమ్మ కంపెనీలో లేనపుడు ఆమెను వదిలి రావటం ధర్మంకాదని చెప్పినపుడు నమ్మినవారిని మోసం చేయకూడదనే భావన కనిపిస్తుంది.

ఈ నవలలో సామాజిక విలువలను కాపాడే వ్యక్తు లలో మధ్యతరగతి కుటుంబానికి చెందిన రాంబాబు, డాక్టరు, ముసలితాత, కష్టాలలో ఉండీకూడ అవసరాన్ని గుర్తించి, డబ్బు సహాయం చేసిన మాధవరావు కనిపిస్తారు.

ఆస్తులకు, డబ్బుకు అధిక ప్రాధాన్యమిచ్చే పెట్టుబడి దారీ వ్యవస్థలో, వేశ్యలే కాక ధనిక, మధ్యతరగతి కుటుంబాల్లోని స్త్రీలు కూడ పితృస్వామ్య వ్యవస్థాధి పత్యంలో స్వతంత్రులుగా లేకపోవటం, రాజీ ధోరణితో జీవితాలను ఎలా కొనసాగిస్తారో రావిశాస్త్రిగారు ఈ నవల లోని వసంత, రాధ, రాంబాబు తల్లిచుట్టూ ఆవరించు కున్న సామాజిక వాతావరణ చిత్రణద్వార తెలుస్తుంది.

ఈ రాజ్యం ధనవంతులదే తప్ప, బీదలది ఏమాత్రం కాదని నరసమ్మ, గంగరాజు, హెడ్డు, ముత్యాలు, కొంగరిక్షా వారి మాటల ద్వార రావిశాస్త్రి ప్రకటిస్తాడు. చీకటి వ్యాపారం వెనుక వున్న కష్టాలను నరసమ్మ చేత పరోక్షంగా చెప్పిస్తాడు. వేశ్యావ్యాపారాన్ని పోషించే

వ్యక్తులందరూ సమాజంలో పేరున్న వారేననే విషయాన్ని రావిశాస్త్రి తేటతెల్లం చేస్తాడు....

దోపిడీ వ్యవస్థ, వ్యాపారసంబంధాలు ప్రజల స్వేచ్ఛను నియంతలా అణచి వేసే స్థాయికి ఎలా విస్తరిస్తున్నాయో నన్న విషయాన్ని, పోలీసులు తమ అధికారబలంతో అవినీతికి పాల్పడుతూ పేదలపట్ల అమానుషంగా ప్రవర్తిస్తూ ధనవంతులకు పై అధికారులు తల ఒగ్గి పనిచేసే విధానం, ఈ వ్యవస్థలో పాలనాయంత్రాంగం అండతో నరసమ్మ వంటి వ్యక్తుల దుర్మార్గానికి గురైన ముత్యాలు, రత్తాలు వంటి స్త్రీలే కాక బతుకుదెరువు కోసం కంపెనీని అంటిపెట్టుకుని జీవిస్తున్న కొంగరిక్షా, రిక్షాజోగులు, అడ్డబుర్రవంటి వ్యక్తులు వర్గ స్వభావంతో అన్యాయానికి వ్యతిరేకంగా నిలిచి సమాజాన్ని ప్రశ్నించే విధానాన్ని, రావిశాస్త్రి తెలియజేయటం జరిగింది.

ఈ విధంగా ఈ నవలలోని స్త్రీలంతా ఏదో ఒకరకంగా పురుషాధిక్యానికి దోపిడీకి గురవుతున్నారనే విషయాన్ని వివరించాడు రావిశాస్త్రి. కమ్యూనిష్టు సిద్ధాంతాన్ని నమ్మిన రావిశాస్త్రి ఈ నవలలో పాలనాయంత్రాంగ లోపాలను వివరిస్తూ అట్టడుగువర్గాల చైతన్యంతో సమాజంలో నూతనమార్పు వస్తుందని ఆశించాడు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వీరేశలింగం గారి నాటకాలు – సామాజికత

– ఆవుల గిరిబాబు, పరిశోధక విద్యార్థి - యస్.వి. యూనివర్శిటి, తిరుపతి.

వీరేశలింగం జీవితం సంఘ సంస్కరణ, సాహిత్య కృషులతో పెనవేసుకు పోయింది. ఒక దాని నుండి మరో దానికి విడదీసి చూడలేము. సాంఘిక దురాచారాలపై ధ్వజమెత్తిన సంఘ సంస్కరణాభిలాషి. గొప్ప సంఘ సంస్కర్త. తెలుగు జాతి గర్వింపదగ్గ మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగం. సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు నిరుపమానమైన కృషి చేసిన మహానుభావుడు ఆయన. సాహితీ వ్యాసంగంలోను అంతటి కృషి చేసిన కందుకూరి బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు.

గుడ్డి నమ్మకాలు, మూఢాచారాలు రాజ్యమేలుతున్న రోజుల్లో బాల్యవివాహాలు, వృద్ధ వివాహాలు, కన్యా శుల్కం, వితంతువుల దుర్భర జీవితం, అర్థంలేని కట్టుబాట్లు, దేవుడి పేరుతో జరిగే అమానుష కృత్యాలు, అవిద్య వంటి సమస్యల వలయంలో చిక్కుకొని, ప్రజలు దిక్కుతోచని దైన్యావస్థలో ఉండేవారు. ఈలాంటి సమాజ దుస్థితిని చూచి, కలత చెంది సమాజాన్ని సంస్కరించాలనే ధ్యేయంతో, తన కలాన్ని కత్తిగా అసాంఘిక వాదులలో నిత్య యుద్ధం చేస్తూ, నిస్వార్థంగా సేవ చేసిన వారు కందుకూరి. సంఘానికి వెలుగు బాట చూపిన వైతాళికుడు, యుగ పురుషుడు. వీరి రచనలు సంఘ సంస్కరణాభిలాషకు వేగు చుక్కగా ముందు తరాల రచయితలకు మార్గ దర్శకుడు. సంఘ శ్రేయస్సే ఆయనకు పరమావధి. ఈ లక్ష్య సాధనకైఅనేక కష్టాలు పడ్డ శ్రమైకజీవి.

ఒక వ్యక్తిగా, సంఘ సంస్కర్తగా, రచయితగా వీరేశలింగానికి అనేక విశిష్ఠతలు ఉన్నాయి. అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు. ఆరాధ్యుడు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడుగా కీర్తి గడించిన వ్యక్తి కందుకూరి. ఆయనకున్న ఇతర విశిష్ఠతలు మొట్ట మొదట వితంతు వివాహం జరిపించిన వ్యక్తి. మొట్ట మొదటి సహవిద్యా పాఠశాలను ప్రారంభించాడు. తెలుగులో మొదటి స్వీయ చరిత్ర తొలి నవల తొలి ప్రహసనం వ్రాసింది కందుకూరి వారే.

కందుకూరి వారి గద్య పద్య రచనలతో బాటు నాటకాలు గొప్ప ఆదరణ పొందాయి. నాటక రచనలో వీరు మార్గ దర్శకులు అనడంలో సందేహం లేదు. ఆధుని కాంధ్ర వాఙ్మయంలో వివిధ ప్రక్రియలు వెలసి, అభివృద్ధి చెందడానికి కారం వీరేశలింగం పంతులు వారే అని చెప్పవచ్చును. నన్నయ దగ్గర నుండి మన పూర్వకవులు నాటక రచన చేయలేదు. శృంగార శాకుంతలం, కేయూర బాహు చరిత్ర, ప్రబోధ చంద్రోదయం మొదలైన నాటకాలను ప్రబంధాలుగా 15 శతాబ్దంలో రచించారు. పండితులకు సంస్కృత నాటకాలు ఉండేవి. పామరజనాలు తోలు బొమ్మలాటలు, యక్షగానాలు, వీధి భాగవతాలు మొదలైనవి చూస్తూ ఉండే వారు. అందుచేత తెలుగు సాహిత్యంలో నాటకాలు ప్రత్యేకంగా రచించడానికి ఎవ్వరూ పూనుకొని ఉండక పోవచ్చును. అంతేగాక సమాజంలో 'నట విట గాయ'కాదులుగా గౌరవ హీనులుగా చూడటం చేత కూడ నాటకాలపై ప్రభావం చూపించి ఉండవచ్చు. 19వ శతాబ్దంలో గాని తెలుగులో నాటకాలు రచింప లేదు. 1876లో కందుకూరి వారు అభిజ్ఞానశాకుంతలమును తెనిగించి 1883 నాటికి పుస్తక రూపంలో ప్రకటించారు.

వీరేశలింగంగారు 1875వ సంవత్సరంలో 'వివేక వర్ధిని' పత్రికకు అనుబంధంగా వున్న 'హాస్య సంజీవని' పత్రికలో 'బ్రహ్మ వివాహ' ప్రహసనాన్ని వెలువరించాడు. తరువాత 'వ్యవహార బోధిని' అనే నాటకం ప్రకటించారు. 1880లో

'రత్నావళి, చమత్కార రత్నావళి' అనే నాటకాలు రచించి విద్యార్థుల చేత నటింప జేశారు. వీరేశలింగం గారి స్వతంత్ర నాటకాలు 1. బ్రహ్మ వివాహము, 2. వ్యవహార ధర్మబోధిని, 3. మహారణ్య పురాధిపత్యము, 4. ప్రహ్లాద నాటకము, 5. సత్య హరిశ్చంద్ర నాటకము, 6.దక్షిణ గోగ్రహణము, 7. వివేక దీపిక మొదలైనవి. వీరి అనువాద నాటకాలు సంస్కృతము నుండి 1. అభిజ్ఞాన శాకుంతలము, 2. రత్నావళి, 3. మాళవికాగ్ని మిత్రము, 4. ప్రబోధ చంద్రోదయము మొదలైనవి. ఆంగ్లము నుండి 1. చమత్కార రత్నావళి, 2. రాగమంజరి, 3. కల్యాణ కల్పవల్లి, 4. వెన్నీసు వర్తక చరిత్రము అనువదించారు. వీరు ఎక్కువగా 'సంఘ సంస్కరణ' కొరకు నాటకాలను రచించారు. అతి బాల్యవివాహాలు, అతి వృద్ధ వివాహాలు, కన్యాశుల్కము మొదలైన వాటి వలన కలిగే అనర్థాలను తెలియజేయటానికి 'బ్రహ్మ వివాహము' రచించాడు. ఈ నాటకం సంభాషణాత్మకమైన గద్య రచన. కాబట్టి ఇందులో సాంఘిక దురాచారాలను దుయ్యబట్టడమే ప్రధానాంశంగా ఉండుట, గమనార్హం. ఈ విధంగా 'బ్రహ్మ వివాహం' నాటకంలో కందుకూరి వారు సాంఘిక విషయాలను సున్నితంగా విమర్శించాడు.

వ్యవహార ధర్మబోధిని :

తొలి తెలుగు రూపక ప్రదర్శన జరిగిన నాటకం. దీనిని ప్లీడరు నాటకం అని కూడ అంటారు. (తెలుగు నాటక వికాసం, పి.ఎస్.ఆర్. అప్పారావు(డిశంబరు, 1967) వ్యవహార ధర్మబోధిని 1880లో కందుకూరి వీరేశలింగం ఈ నాటకాన్ని వ్రాయగా, అదే సంవత్సరం రాజమహేంద్ర వరంలోని విజయనగరం మహారాజా బాలికోన్నత పాఠశాలలో మొదటి సారి ప్రదర్శించారు. (విశాలాంధ్ర -తెలుగు నాటక రంగం- ఆధునిక ధోరణులు- 18 జూలై 2017). కోర్టులో న్యాయం, గట్టు తగాదాలు, పుట్ట తగాదాలు, స్థలం తగాదాలలో అన్నదమ్ములు బద్ధ శత్రువులుగా, సంపన్నులని కూడా రోడ్డు మీద నిలబెట్టి తమాషా చూడటం, కోర్టు దర్శనాన్ని మన కళ్ళముందు చూపించిన సామాజిక ఉద్యమ నాటకం ఇది. (ప్రజాశక్తి నాటకమే ఒక ఉద్యమం- 18 జూలై 2017). ఇది ఐదు అంకాల నాటకం. ఇందులోని పాత్రలు నిజ జీవితంలో ఎదురయ్యే పాత్రలే. దీనిని గద్య రూపంలో, వ్యవహార భాషలో వ్రాశారు. వ్యవహార భాషలో వ్రాయడమనేది ఆ కాలంలో సాహసమనే చెప్పాలి. మొదటి ప్రదర్శనకు కొన్ని వందల మంది ప్రజలు వచ్చి చూశారని వీరేశలింగం తన స్వీయ చరిత్ర (స్వీయ చరిత్ర 1వ భాగం లోని 175వ పుట) లో వ్రాసుకున్నాడు. దీనిని బట్టి మొదటి ప్రదర్శనతోనే నాటకం ఎంత విజయ వంతమైనదో తెలుస్తుంది.

'వ్యవహారబోధిని' నాటకంలో కూడ సంఘ సంస్కరణ ప్రధానాంశంగా అందులోని పాత్రలను తీర్చి దిద్దుతూ నిజ జీవితంలోని పాత్రల చిత్రణ జరిగిందని, ఇందులోని విషయాలు నిజంగా జరిగాయని కందుకూరి వారు స్వయంగా చెప్పుకొన్నారు. ఆనాటి ప్రజలు విశేషంగా ఆదరించి 'ప్లీడరు నాటక' మని పిలుచుకొన్నారు. దీనితోనే తెలుగులో నాటక ప్రదర్శనారంభమైనదనే విషయం తెలిసినదే.

"ఇటువంటి రూపకములను ప్రదర్శించుట కదియే మొదలయినందున నూఱుల కొలది జనులు వచ్చి చూచి ఆనందించిరి." అని పంతులు గారే చెప్పారు. 'వ్యవహార బోధిని'ని చదివినప్పుడు, చూచి నప్పుడు అందలి విషయాలు యథాతథాలుగా కావడం వలన చాలా మందికి బాధ కలిగినది. అయినా వారు బాధ పడూతూనే ఆనందించారని కందుకూరి గారు స్వయంగా చెప్పుకొన్నారు.

చమత్కార రత్నావళి :

1880 చివరి భాగంలో కందుకూరి వీరేశలింగం రచించిన హాస్య నాటకం ఇది. షేక్స్‌పియర్ ' కామెడీ ఆఫ్ ఎర్రర్ ' కు అనుకరణ. ఈ ప్రదర్శనకు చాలా మంది ప్రేక్షకులు వచ్చి చూచి బ్రహ్మరథం పట్టారు. దీనిని వీరేశలింగం పంతులు తన విద్యార్థులచే ప్రదర్శింప జేశారు. ఈ అనువాదంలో కందుకూరి వారి భిన్నమైన

మార్గాన్ని ఎంచుకొన్నారు. అనువాదం చాలా సరళంగా ఉంటుంది. పాత్రల మరియు ప్రాంతాల పేర్లు మార్చారు. సేవకులకు, స్త్రీలకు వ్యవహారిక భాషను ఉపయోగించారు. మూలంలోని పద్యాలను కూడ గద్యంలోనికి అనువదించి గద్య నాటకంగా వ్రాశారు. సమాజంలోని దురాచారాలను పరోక్షంగా హేళన చేస్తూ హాస్యంగా చెప్పారు.

మాళవికాగ్ని మిత్రము :

మహాకవి కాళిదాసు విరచిత సంస్కృత నాటకం ఇది. కాళిదాసు మొదటి నాటక రచన ఈ నాటకంలోని ప్రధాన పాత్రలు మాళవిక, అగ్ని మిత్రుడు. రత్నావళి అనే సంస్కృత రూపకానికి అనువాధం చేసారు, పౌరాణిక ఇతివృత్తంతో దక్షిణ గోగ్రహం, సత్యహరిశ్చంద్ర అనే నాటకాలు రచించారు. మాళవికాగ్ని, మిత్రం తో మొదలైన పన్నెండు నాటకాలను సంపూర్ణంగా, అసంపూర్ణంగా రాసిన నాటకాలను లెక్కిస్తే మొత్తం ఇరవై నాటకాలను రచించినట్లు రమాపతిరావు పేర్కొన్నారు.

'వివేక దీపిక' స్త్రీ పునర్వివాహ ప్రయోజనాన్ని గూర్చి 'వివేక దీపిక' లో చిత్రించారు. వితంతువులు పునర్వివాహం లేకపోవడం వలన అనేక అనర్థాలకు దారి తీస్తుందని చెప్పారు. వితంతువుల సహజ కామ వాంఛలు తీర్చుకోవడానికై ప్రయత్నించి, తత్ఫలితంగా ఎన్నో అఘాయిత్యాలకు పాల్పడతారని, వాటిని నివారించాలని ఇందులో చెప్పారు. మహారణ్య పురాధిత్యములోని పాత్రలన్నీ పశువులు, పక్షులు. ఆనాడు సంఘంలో నెలకొన్న దుష్ట వర్తనాలన్నింటిని అవహేళనాత్మకంగా జంతువుల పాత్రల సంభాషణల చేత స్పష్టంచేశారు.

స్త్రీల ఉపయోగార్థములైన గ్రంథాలను ప్రకృతి శాస్త్రాన్ని అపూర్వమైన కవుల చరిత్రనుకూడ రచించి ఆంధ్ర సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. ప్రజలకు వినోదం కలిగించడమే గాక సాంఘిక దురాచారాలను రూపు మాపడానికి అనేక ప్రహసనాలను రచించారు. ప్రహసనాలలో హాస్యాన్ని బాగా పరిపోషించారు.

ఇలా సంఘ సంస్కరణ కోసం వచన నాటకాలు, సంస్కృతాంగ్లముల నుండి అనువాదాలు చేసి ముందు తరాల సంఘ సంస్కరణాభిలాషులకు మార్గ దర్శకులై ఆంధ్ర నాటక సాహిత్యానికి ఎంతో సేవ చేసి కందుకూరి వారు ధన్యులయ్యారు. ఆంధ్ర సారస్వతలోక సంస్మరణీయులు సాహితీలోక విశ్వాస పాత్రతకు నిదర్శనం. ఈనాడు స్త్రీలంతా అనుభవించే స్వేచ్ఛా స్వాతంత్ర్య సౌభ్రాతృత్వాలకు నిజంగా పునాది వేసిన స్త్రీ పక్షపాతి కందుకూరి. నేటి స్త్రీలకు ఆదర్శప్రాయుడు అనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

పండిన వృక్షమునకే రాతి దెబ్బలు అన్నట్లు వీరేశలింగం గారికి నొప్పి కలిగించినా, తట్టుకొని మరింత గొప్పగా రచనలు చేసి నొప్పించిన వారినే మెప్పించిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. సాధారణంగా లోకంలో ఎవ్వరును సర్వజ్ఞులు ఉండరు. ఎంతటి విధ్వాంసులు వ్రాసిన పుస్తకములలో తప్పులు ఉండటం సహజం. అంతటి మహోన్నత సంస్కారి, ఆదర్శవాది మన కందుకూరి వీరేశలింగం పంతులు గారి గురించి,చిలక మర్తి వారు,

"తన దేహము తన గేహము
తన కాలము తన ధనమ్ము తన విద్య జగ
జ్ఞానులకు వినియోగించిన
ఘనుడీ వీరేశలింగ కవి జనులారా! " అన్నారు.

ఆరుద్ర గారన్నట్లు "అదేం చిత్రమో గానీ తాము శారీరకంగా దుర్బలులైనా జాతిని బలిష్ఠం చేసి దేశాభివృద్ధిని, భాషాభివృద్ధిని సాధించిన 'మనోబల భీముల'లో వీరేశలింగం గారు ప్రథములు. ఇటువంటి ఉజ్జ్వల చారిత్రుడిని ఏ బిరుదుతో వర్ణించినా తక్కువే అవుతుంది. నిర్మాతలచే నిర్మించిన వారిగా నేను వీరేశలింగం పంతులు గారిని భావిస్తున్నాను" అంటూ "అభినవాంధ్రకు ఆయనే ఆద్యబ్రహ్మ" అంటూ తన సమగ్ర సాహిత్య పదకొండవ సంపుటిలో ఆరుద్ర తెలియ జేశారు.

కందుకూరి వారి ప్రగతి బాట, ఆయన రాతలలో పదును, మాటలు గుండెకు హత్తుకునే విధంగా

ఉంటాయి. వీరేశలింగం వంటి దీక్షా పరుడు, కార్య శూరుడు, స్వతంత్రుడు ఆంధ్ర రచయితలలో లేడు, ఉండడు అని ఇప్పటికీ ఈ మాటలు చెక్కు చెదరని సత్యాలు అంటే అతిశయం కాదు ! అని మధునా పంతులు ప్రశంసించారు.

"వీరేశలింగం పంతులు గారు బహుయోజన శాఖా సంయుతమైన వటవృక్షం వంటి వారు. నేడు దేశీయుల యొక్క సాంఘిక చైతన్యానికి, సారస్వత వైవిద్యమునకు పంతులు గారు ఆయన కాలము నందు గావించిన కృషియే మూలాధారం. వారితో ఆధునిక యుగము ప్రారంభమైనదని చెప్ప వచ్చును" అని అక్కరాజు రమాపతి రావు కీర్తించాడు.

వీరేశలింగం పగలు సంస్కరణ విషయములలో పనిచేసి, రాత్రులు గ్రంథ రచనము సాగించుచుండు అలవాటు కలవాడు. రచన చేయకపోతే రాత్రులు వీరికి నిద్ర పట్టేది కాదు. సంఘసంస్కరణే ధ్యేయంగా గ్రంథ రచన చేసేవారు. ఆయన రచనలపై సాంప్రదాయకులు అభియోగాలు మోపారు. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, యుగ కర్తగా ప్రసిద్ధి పొందిన మన గద్యతిక్కన.

ఆధార గ్రంథాలు :

1. మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి: ఆంధ్ర రచయితలు, పుట 82-88, అద్దేపల్లి అండ్‌కో, రాజ మహేంద్ర వరం.
2. తెలుగు సాహిత్య చరిత్ర : ద్వా.నా. శాస్త్రి- ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. కందుకూరి వీరేశలింగం : డా. అక్కిరాజు ఉమాపతి రావు, తెలుగు వైతాళికులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, హైదరాబాదు.
4. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా. నా. శాస్త్రి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అనుమాండ్ల భూమయ్య పద్య రచనలు – సామాజిక జీవన చిత్రణ

– ఖు. మహేష్, పరిశోధక విద్యార్థి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

తెలుగులో పద్య కవులు పెరిగిపోతున్న ఈ కాలంలో అనుమాండ్ల భూమయ్య తన కలం నుండి అనేక పద్యకావ్యాలను ఆవిష్కరిస్తున్నారు. ఈ పద్యకావ్యాలను అత్యంత రమణీయంగా పటిస్తున్నారు. 20వ శతాబ్దంలో చెప్పుకోదగిన పద్య రచయితలలో అనుమాండ్ల భూమయ్య ఒకరు. ఈయన పద్యకావ్యాలే గాక సాహిత్య విమర్శ రచనలు కూడా చేస్తున్నారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన భూమయ్య విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యాభ్యాసం చేసి పరిశోధకుడుగా మంచి పేరును గడించారు. నాయని సుబ్బారావు కృతుల విశ్లేషణ మొదలుకొని నేటి వరకు తన కలం నుండి అనేక సాహితీ పరమైన రచనలు వెలువడుతున్నాయి. ఈయన తన రచనల్లో ప్రాచీన గుణాలను, తాత్వికతను, భారతీయతను జోడించుకొని మంచి భావకుడిగా కవితా రంగంలోకి ప్రవేశించిన మేటి కవి.

తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ జిల్లాలోని వెదురు గుట్ట గ్రామంలో 1949 జూన్ 3వ తేదీన లక్ష్మయ్య, శాంతమ్మ దంపతులకు జన్మించాడు. విశ్వవిద్యాలయ ఆచార్యుడు నుండి కులపతి వరకు వివిధ హోదాలను నిర్వహించి పదవీ విరమణ పొందారు. నేటికి కూడా అనేక రచనలు జాలువారుతున్నాయి. ఈయన అనేకమైన ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలను అందుకున్నారు.

పద్య రచనలు :

1. వేయి నదుల వెలుగు
2. వెలుగు నగల హంస
3. అగ్ని వృక్షం
4. అమృత సేతువు
5. జ్వలిత కౌసల్య
6. అరుణాచల రమణీయం
7. చలువ పందిరి
8. అష్టావక్ర గీత
9. త్రిజట
10. ప్రవర నిర్వేదం

భూమయ్య కలం నుండి విమర్శ గ్రంథాలు కూడా అనేకం వెలువడ్డాయి.

అనుమాండ్ల భూమయ్య పద్య రచనలు సామాజిక జీవన చిత్రణ :

భూమయ్య రచనల్లో పద్య రచనలకు ఒక విశిష్ట స్థానం ఉంది. పద్య కావ్యాలలో ఎక్కువగా ప్రాచీన భావాలు, మానవతా విలువలు, తాత్విక చింతన, ఆధ్యాత్మిక భావంతో కూడి ఉంటాయి. వాటిని సాహితీ లోకానికి పరిచయం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

జ్వలిత కౌసల్య :

వాల్మీకి సంస్కృతంలో రామాయణం రాశాడు. ఈ గ్రంథం అతిపెద్ద మహాకావ్యం. రామాయణంలో ఎన్నో పాత్రలున్నాయి. కొన్ని పాత్రలకు సరైన న్యాయం జరగలేదు. అసమగ్రమైన పాత్రలకు సజీవమైన ప్రాణం పోశారు. కొందరు కవులు చిన్న పాత్రలను తీసుకుని కూడా మహా గ్రంథాలు రాశారు. అసమగ్ర విషయాలకు కూడా సరైన జవాబు ఇచ్చారు. అలాంటి రచయితలలో నేటి ఆధునిక పద్య కవి అనుమాండ్ల భూమయ్య ఒకరు. ఈయన కూడా రామాయణంలోని ఈ అంశాన్ని ప్రధానంగా తీసుకున్నారు. ఎవరూ ఊహించనటువంటి విషయాన్ని చాలా సమగ్రంగా చర్చించి రాశాడు.

రాముడు ఏకపత్నీవ్రతుడు. ఏకపత్నీవ్రతుడుగా ఉంటానని తల్లికి మాట ఇచ్చిన సందర్భాన్ని ఈ కావ్యంలో

ప్రస్తావించాడు. రామాయణంలో ఉన్న పద్ధతినే నేటికి కూడా భారతీయ సమాజం అనేక విషయాలకు శ్రీరాముని ఆదర్శంగా భావిస్తారు. ముఖ్యంగా ఏ సందర్భంలో రాముడు ఏకపత్నీవ్రతుడుగా ఉండవలసి వచ్చిందో అనుమాండ్ల భూమయ్య కావ్యంలో విపులంగా తెలిపాడు. ఆధునికంగా, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన నేటి సమాజంలో కూడా శ్రీరాముడు తండ్రికి ఇద్దరు ముగ్గురు భార్యలున్నారు. రాజరిక వ్యవస్థలో చాలా సాధారణమైన విషయంగా భార్యలు ఉండటాన్ని భావిస్తారు. కానీ రాజరిక వ్యవస్థలో ఒక శ్రీ మనోవేదనను అంతరంగా బాధలను గ్రహించిన కవి ఎంతో సున్నితంగా కన్న తల్లి కోసం ఎంతో బాధ్యతగా మెలిగిన సంఘటనలు అనేకం కనిపిస్తాయి.

"నాడు నిన్ను నే గనకున్న నష్టమేమి
కలిగెడిది? వంధ్య యను పేరొకటి యే తప్ప
సంతు లేదన్న ఏకైక చింత తప్ప
వందే కు మరొక చింత రవ్వంత లేదు"

అంటూ కౌసల్య హృదయవిదారకమైన మాటలు పలుకుతుంది. వంధ్యకు ఒకటే చింత మాత్రమే చేసే దాన్ని. ఇప్పుడు నిన్ను కనీ ఎన్నో బాధలు పడవలసి వస్తుంది కదా అని పలుకుతుంది. ఇలా తల్లి బాధలను గమనించిన రాముడు ఎట్టి పరిస్థితుల్లోనూ బహు భార్యత్వం స్వీకరించకూడదని నిర్ణయించుకుంటాడు.

నాణ్యమౌ ఏడువారాల నగలు కలవు
నన్ను గొలువ దాసదాసీ జనం కలదు
ఎన్ని వుండి వాన్ని అనుభవించలేని
భాగ్య హీనము పతి ప్రేమ బడయ లేక

ఎన్ని ఆభరణాలు ఉన్నా కానీ ఏమి లాభం భర్త ప్రేమ అనురాగాలు లేవు. ఈ రాజ్యానికి చూస్తే సమాజానికి మహారాణి. సామాజికంగా చూస్తే నేటి సమాజంలో కూడా ఎన్నో కష్టనష్టాలను గురించి వారు ఉన్నారు. ఈ కావ్యం ద్వారా గొప్పనైనా సందేశాన్ని అందించాడు కవి. ఏకపత్నీ వ్రతం వెనుక ఉన్న కారణాలను ఆ మాటకు నిలబడి ఉండటానికి గల సంకల్పం గురించి ఎన్నో విషయాలను భవిష్యత్తు సమాజానికి కూడా ఎంతో విలువైన విషయాలను అందించాడు. అప్పుడు రాముడు

"గడిచిన కాలం ఎట్లో గడిచిపోయే
తండ్రి తప్పుపులివియని తలప లేను
ఏ పరిస్థితులు ఎటు రానివ్వు నాకు
ఒక్క సీతయే ఈ జన్మకు నా భార్య"

అని సంకల్పించాడు. ఇలా రాముడు కొన్ని యుగాల చరిత్ర ఈ సమాజంలో మారిన రాముడు ఏకపత్నీ చరిత్ర మాత్రం నేటికీ ఎంతో ఆదర్శప్రాయంగా ఈ సమాజానికి నిలిచే ఉంది.

ప్రవర నిర్వేదం :

అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర ప్రబంధంలో ప్రవరుడు హిమాలయలకు వెళ్లి వచ్చిన తర్వాత ఏమి జరిగింది అనే ప్రస్తావన మూలంలోని మనుచరిత్ర గ్రంథంలో పెద్దన ప్రస్తావించలేదు. ప్రవరుడి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఏమి చేసి ఉంటాడు. తల్లి దండ్రులకు, భార్యకు ఇన్నిరోజులు ఎక్కడ ఉన్నా ఈ విషయాన్ని చెప్పి ఉన్నాడా? లేదా? నిజమైన విషయాన్ని ప్రస్తావించాడా? లేదా? అంశాల ఆధారంగా ఒక ఊహ చేసి అనుమాండ్ల భూమయ్య ఈ కావ్యాన్ని రాశాడు. హిమాలయాలకు వెళ్ళి నందుకు బాధపడ్డాడా? లేదంటే వరూధిని అడిగిన కోరికను తీర్చవలసి వచ్చిందని చింతించాడా? నేను ఉర్దూ నీకు ఎందుకు న్యాయం చేయలేక పోయాను అని బాధపడి ఉంటాడా? ఇలాంటి విషయాలను నివృత్తి చేస్తూ ఈ ప్రవర నిర్వేదం ఈ కావ్యాన్ని రచించాడు. ఇందులో పునరాగమనం, నిర్వేదం, జ్ఞాన అమృతం ప్రవరుడు వరూధిని కోరికను తిరస్కరించి అగ్నిదేవుడిని ప్రార్థిస్తాడు. అగ్నిదేవుడు ప్రత్యక్షమై ప్రవరుడి కోరిన కోరికను తీరుస్తాడు.

"తీర్థయాత్ర చేసెడి కోర్కె తీవ్రమైన
వేళ, వచ్చిన సిద్ధుని వేడుకొనగ
అతడోసగే పాద లేపన, మది గ్రహించి
ప్రవరుడపుడే చేరె హిమవత్పర్వతము"

ఇంటికి చేరుకున్న ప్రవరుడు ఇప్పటివరకు తాను ఎక్కడికి వెళ్ళింది. ఏమి చేసింది. అంతా కూడా తన తల్లిదండ్రులకు పూసగుచ్చినట్లు చెబుతున్నాడు. తనకు ఎప్పటినుంచో తీర్థయాత్రలు చేయాలని కోరిక బలంగా ఉండేది. ఎలాగైనా ఈ దేశంలో అన్ని క్షేత్రాలను దర్శించాలి అనే బలమైన సంకల్పం ఉండేది. ఆ ఉద్దేశంతోనే ఒక రోజు మన ఇంటికి వచ్చిన సిద్ధుడిని అడిగాను. నాకు తీర్థయాత్రలు చేయాలని ఉద్దేశాన్ని వ్యక్తపరిచాను.

"ప్రవర! పంచ ప్రాణములు నీ పైన నిలుపు
కొన్న వారము, నిన్ను మా కన్నులందు
నిలుపుకొని బ్రతికీడ్చు వృద్ధులము మేము
కనులకు కీవు దూరమైన కనము బ్రతుకు"

అంటూ కన్న తల్లిదండ్రులకు కుమారుడిగా ఉండ వలసిన బాధ్యతలు ఏమిటో ఈ కావ్యంలో వెల్లడించాడు. ప్రవరుడు కుటుంబంపై ఉన్న ప్రేమను వ్యక్త పరిచాడు. సమాజంలో ఏ వ్యక్తికైనా మొదట కుటుంబమే అన్న బాధ్యతను గుర్తుచేశాడు. ప్రతి వ్యక్తి కూడా కుటుంబ విలువలకు కట్టుబడి ఉండాలని అప్పుడే సమాజంలో మంచి గౌరవ మర్యాదలు కలుగుతాయని బాధ్యతను ఈ కావ్యం ద్వారా సమాజానికి గుర్తుచేశాడు. అనుమాండ్ల భూమయ్య కావ్యాలలో లోతైన తాత్విక విషయాలను ప్రస్తుత సమాజానికి ఏమి అవసరమో గుర్తించి ప్రాచీన గ్రంథాలలోని విషయాలను మళ్లీ నేటి ఆధునిక సమాజానికి అందించాలని ఎంతో కృషి చేస్తున్నాడు.

ఉపయుక్త గ్రంథాలు :

1. భూమయ్య, అనుమాండ్ల. జ్వలిత కౌసల్య, మనసుని ప్రచురణలు, హైదరాబాద్: 2014.
2. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. ముంగిలి - తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర, హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2016.
3. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర, హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2016.
4. భూమయ్య, అనుమాండ్ల. ప్రవర నిర్వేదం, హైదరాబాద్: మనస్విని ప్రచురణలు, 2016.
5. రామకృష్ణమాచార్య, నండూరి. పద్యశిల్పం, సికింద్రాబాద్: చారి అండ్ కంపెనీ, 1995.
6. వెంకటావధాని, దివాకర్ల. సాహిత్య సోపానములు, హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 2008.
7. సుజాత రెడ్డి, ముదిగొండ. సంస్కృత సాహిత్య చరిత్ర, హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2014.

❖ ❖ ❖

మల్లవరపు 'జీవనది' – సామాజిక జీవన చిత్రణ

- దిట్టకవి తిరుమల శ్రీనివాస్, పరిశోధక విద్యార్థి, తెలుగు ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ప్రకాశం జిల్లా పద్యకవులలో విశిష్ట స్థానాన్ని పొందిన మల్లవరపు జాన్ గారి కవిత్వ వారసత్వాన్ని అందుకొని, తన సాహిత్యం ద్వారా సామాజిక సందేశాన్ని అందించిన అభ్యుదయ భావాల మధుర కవి మల్లవరపు రాజేశ్వరరావు గారు.

తను సామాజికంగా ఎదుర్కొన్న సంఘటనలు, తనకు ఎదురయిన అనుభవాలు, తాను చేసిన లోక పరిశీలనతో, సామాజిక స్పృహతో, సంస్కరణ వాదిగా మల్లవరపుశతకం, జీవనది, వీరగాథ, భక్తయోబు, ఎస్తేరురాణి వంటి రచనలు చేసి పద్య, గేయ కవిత్వాలకు ప్రాణం పోశారు.

జీవనది సామాజిక జీవన చిత్రణ :

వస్తు వైవిధ్యంతో రాజేశ్వరరావు గారు 'జీవనది' ఖండకావ్యంలో సామాజిక జీవన చిత్రణను ఆలోచింప చేసేదిగా ఆవిష్కరించారు.

"అదనులో వర్షంబు పదునుగా బడనిచో
ఆందోళనలతోడ అలసిపోవు
అతివృష్టితో పంట హతము సేయు ప్రకృతి
గాంచి దుఃఖాన కృశించిపోవు
పురుగు మందుల దెచ్చి పొలమంతయును చల్లి
ఫలితంబు కనరాక పరితపించు
దొరపొగాకును మిర్చి ధరలన్ని పడిపోవ
పెట్టుబడులు రాక బెగ్గలించు"
అప్పునిప్పుల మంటలో నాలుమగలు
తప్పికయె దీరని యెడారిదారులందు
అలసి సొలసిన కనుల భాష్పాలు రాల
ఆత్మహత్యనె రైతన్న ఆశ్రయించు"

(అన్నదాత - జీవనది)

- సకాలంలో వర్షం పడదు. పంట చేతికొచ్చే సమయంలో అకాలవర్షం రైతన్నను ఆందోళనకు గురి చేస్తుంది. అతివృష్టి, అనావృష్టితో రైతు కుదేలవుతున్నాడు. వ్యయ ప్రయాసల కోర్చి బోరుబావులు వేస్తే భూగర్భ జలాలు లేక, నీరు పడక, చేసిన అప్పును తీర్చలేక ఆత్మ హత్యను ఆశ్రయిస్తున్న రైతన్న కష్టాలను వేదనతో చిత్రించారు రాజేశ్వరరావు గారు.

నకిలీ పురుగుమందులు, ఎరువులు, నకిలీ విత్తనాలు, రైతును ఏ దశలోనూ కోలుకోనివ్వడం లేదు. పండిన కాస్త పంటకూ గిట్టుబాటు ధర ఉండదు. వడ్డీ వ్యాపారులు, దళారీల చేతుల్లో బందీ అవుతున్నాడు రైతు.

వ్యవసాయం ప్రధానవృత్తిగా గల భారతీయ సమాజంలో రైతు కుటుంబాలలో, కేవలం పురుషులే కాకుండా స్త్రీల భాగస్వామ్యం ఎంతో ఉంటుంది. ఇంటి పనులతో పాటు పొలం పనులతో కూడా మహిళలు శ్రమిస్తారని రైతమ్మను వర్ణిస్తున్నారు కవి.

"మేలుకొని పతి దేవుని మేలు కొలిపి
బండికట్టంగ పతికి తోడ్పడెదవమ్మ
పూజగావించి నుదుటిపై బొట్టుపెట్టి
కన్నులకు నద్దుకొందువు గాదె తాళి"

(రైతమ్మ-జీవనది)

- తెల్లవారు ఝామున భర్తకంటె ముందుగా నిద్రలేచి ఇంటిముందు ఊడ్చి శుభ్రం చేసి, కళ్ళాపి చల్లి ముగ్గువేసి భర్తను నిద్రలేపుతుంది. స్నానమాచరించి, కులదైవానికి పూజచేసి చీరకొంగును నడుమును తోసి ఇంటిపనులు చక్కబెడుతుంది. ఎడ్లబండి కట్టడంలో భర్తకు తోడ్పడు తుంది. లక్ష్మీదేవి కటాక్షం లాగా ఎదురొస్తుంది. వెన్న చిలికి మజ్జిగ చేస్తుంది. వంటచేసి భర్తకు అన్నం తీసుకు వెళ్తుంది.

సామాజిక పరిశీలన నిశితంగా చేసిన కవి సహజత్వా నికి ప్రతిబింబంగా చిత్రించారు.

"తలపైని గంపతో తరలిపోవును తన
పైట చెఱంగును పదిల పరచి
కొడవలి చేబూని, ముడివైచి జడనంత
పైరు జొన్నను కోసి పనలనిడును"

(జీవనది)

రైతుభార్యను ఇంటిని తీర్చిదిద్దే ఇల్లాలిగా, భర్తకు పొలం పనులతో సాయం అందించే కర్షకురాలిగా కవి అభివర్ణించారు. రైతు కుటుంబాలలో స్త్రీలు తమ పనిని బాధ్యతగా చేస్తారని, శ్రమగా భావించరని రాజేశ్వరరావు గారు రైతమ్మను అభినందించారు.

"చెమటచుక్కల తన పైట చెరగుతోడ
మోము చమ్మిని తుడిచి ప్రమోదభరిత
స్నిగ్ధ హృదయము నందు కృషిని దలంచి
ఫలితమార్జించు రైతమ్మ పంటచేల"

(జీవనది)

- సూర్యోదయం నుండి సూర్యోస్తమయం వరకు పంటచేలల్లో చాకిరి చేసే రైతన్నకు చేదోడు వాదోడుగా వుండే మహిళకు మాత్రం విశ్రాంతి లేదని, రైతమ్మ శ్రమను గుర్తించడం లేదని కవి బాధపడ్డాడు.

మన చుట్టు ఉన్న సమాజంలో జరుగుతున్న, కనబడుతున్న యదార్థస్థితిని తెలియజెప్పారు రాజేశ్వర రావుగారు.

కులం పేరుతో కుత్సితబుద్ధితో అంటరానివారంటూ హేళన చేస్తున్న సమాజం నుండి మార్పుదిశగా అడుగులు వేస్తున్నప్పటికీ చాలామందిలో ఆ జాడ్యం పోలేదు. మాటల ద్వారా, చేతల ద్వారా ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతూనే ఉందని రాజేశ్వరరావుగారు వేదన చెందారు.

"మొన్నమొన్ననె మేల్కొన్న మొండిపురుగు
చచ్చెనని తలంచుట తప్పు, పుచ్చుపురై
లందు చొచ్చుకు పోయెడి యంటు జబ్బు
నంత మొనరింప శాస్త్రజ్ఞులవసరంబు"

(అంటుమంట - జీవనది)

కులముద్రతో అవమానములు పొందినప్పటికీ, కష్ట పడి శ్రద్ధగా చదువుకొని విద్యావంతుడయినప్పుడు, గౌరవించడానికి ఈ సమాజంలోని కొందరికి మనసురాక పోవడం ఆశ్చర్యకరమంటూ, మార్పును కోరుకుంటు న్నారు కవి.

ఈ సృష్టిలో ప్రతి ప్రాణికి తొలి స్పర్శ అమ్మ, అమ్మ ప్రేమలాటి ప్రేమ మనకు ఎక్కడా దొరకదు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరచిపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా పరుగులు తీస్తూ బంధాలను వీడి, మమతాను రాగాలకు దూరమవుతున్న నేటి సమాజాన్ని చూసి ఆవేదన చెందారు కవి.

"వార్ధకము దేహధార్ఢ్యంపు పటిమ నణప
పనులజేసి గడింపక పస్తులున్న
తల్లికన్నంబు బెట్టని తనయుడుర్వి
చాగి యెటులౌను మెడచండ్ల ఛాగిగాని"

(నిట్టూర్పు- ఓదార్పు- (జీవనది))

- నేటి సమాజంలో అనేక కుటుంబ జీవితాలలో కనబడుతున్న సంఘటనలను చూసిన రాజేశ్వరరావు గారు ఆలోచింపచేసేలా రచించారు.

తల్లి నవమాసాలు మోసి కని పెంచి పెద్ద చేసినది. బిడ్డ ఆకలిని తీర్చడమే తనకు ఆనందంగా భావించేది తల్లి. బిడ్డ అవసరాలను తీర్చడానికి ఎన్నో శ్రమలు పడే వాడు తండ్రి.

జవసత్వాలుడిగిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో అన్నం పెట్టడానికి వంతులు వేసుకుంటున్న కొడుకులు, కూతుళ్ళను సమాజంలో చూస్తున్నాం.

ముసలితనంలోని తల్లిదండ్రులను ఆత్మీయంగా చూసుకోవాలని, బిడ్డల పలకరింపు తల్లిదండ్రులకు ఊరట నిస్తుందని, ధైర్యాన్నిస్తుందని రాజేశ్వరరావు గారి కవిత్వంలో ప్రతిధ్వనించింది.

"కన్నతల్లికంటే ఘనము నేదు" అని వేమన ఘనమైన వాక్కును గుర్తుకు తెచ్చారు రాజేశ్వరరావు గారు.

సామాన్యుని ఆకలిబాధ, జీవనోపాధికి పనికిరాని విద్యావ్యవస్థ గూర్చి రాజేశ్వరరావు గారు ఆందోళన చెందారు.

"కడుపునిండుగ నన్నంబు కుడువలేని
లక్షలాది నిర్భాగ్యులు కుక్షిమంట
బార్పలేని విద్యలతో నిరాశలందు
మనెడివారి కుద్యోగముల్ మమతనిడరె!"

(తపన- జీవనది)

నేటికీ సామాజికంగా అస్తవ్యస్త, ఎగుడుదిగుడు పరిస్థితులున్న నేపథ్యంలో పేదవాడి ఆకలి తీరే దారిలేదు. నిర్భాగ్యులు ఆకలిని తీర్చే కార్యక్రమాలు అవసరం. ఉన్నపాడికి ఉన్నత విద్యలు. లేని వాడికి ఏమీ లేవు. కాలానుగుణంగా వచ్చే మార్పులకు తగినట్లుగా, ప్రభుత్వ రంగంలో విద్యకు పెద్దపీటవేసి, పేదలు, దళితులు గిరిజనులు, బలహీనవర్గాల వారు ఉన్నత చదువులు చదివి, ఉపాధి అవకాశాలను పొందేలా చేయాలని కవి ఆకాంక్షిస్తున్నాడు.

ఉపసంహారం :

సమాజ హితమే సాహిత్య ప్రయోజనం. సాహితీకారుడు సామాజిక స్పృహతో రచనలు చేసినపుడు ఆ సాహిత్యానికి మరింత విలువ చేరుతుంది. భిన్న మనస్తత్వాలు కలిగిన సమాజంలో మనిషి ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు ఎలా నెగ్గుకురావాలి? అనే ప్రశ్నలకు సమాధానంగా సాహిత్యం నిలబడాలి. ఆనందోపదేశములతో కావ్య ప్రయోజనం నెరవేరాలంటే కవి తన చుట్టూ ఉండే ప్రపంచంలోకి వెళ్ళాలి. పరిశీలించాలి. ఆలోచించాలి. నీతి ప్రబోధ చేయగలగాలి. అప్పుడు సమాజానికి, జీవన గమనానికి సరైన దిశానిర్దేశం చేసినట్లువుతుంది. ఈ కార్యంలో మల్లవరపు రాజేశ్వరరావు గారి 'జీవనది' సమాజానికీ జ్ఞాన దాహాన్ని తీర్చే 'జీవనది' గా చిరస్థాయిగా నిలుస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1) జీవనది - మల్లవరపు రాజేశ్వరరావు
2) వేమనశతకం - వేమన
3) కొన్నికలలు కొన్ని మెలకువలు -వాడ్రేవు చిన వీరభద్రుడు
4) సూక్తి ముక్తావళి - సేకరణ : జ. పుండరీకాక్షరావు
5) సమాజము - విద్య - కె.పి.ఎ.చౌదరి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

'జలగల వార్డు' కథ – అంతర్ బహిర్ సమాజం

– డా॥. ఎ. రవీంద్రబాబు

సాహిత్యం, సమాజం పరస్పర ప్రేరకాలు. చలనశీల మైన సమాజంలోని ఉపరితల అంశాలలోని సాహిత్యం మిగిలిన వాటితో గతితార్కిక సంబంధం కలిగి ముందుకు సాగుతుంది. ఆర్థిక వ్యవస్థలోని మార్పులు సాహిత్యానికీ మార్గదర్శనం చేస్తూ సమాజగతినీ మార్చుతాయి. మానవ పరిణామాన్ని ఎప్పటికప్పుడు ఆర్థికస్థాయి నిర్దేశిస్తుంది. జీవన విలువల్లోని వాస్తవిక నమూనాలను ప్రతిబింబించే సాహిత్యం సమాజానికి దర్శనిగా నిలుస్తూ సమాజ పురోగతికి వారధిగా నిలుస్తుంది. శిల్పపరమైన రూపగతు లను సమాజ స్థితిగతులకు అనుగుణంగా మార్చుకుంటూ ప్రజాపక్షం వహిస్తుంది. చారిత్రక పరిణామంలో వస్తురూప రహస్యాలను తనలో ఇముడ్చుకుంటున్న సాహిత్యం ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా ప్రవహిస్తూనే ఉంటుంది.

సాహిత్యం - సమాజం :

సాహిత్య స్వరూప స్వభావాలను నిర్హేతుకంగా అర్థం చేసుకోవాలంటే సమాజంలోని మనిషి అంతర్ బహిర్ చేతనలపై అది చూపే ప్రభావాన్ని క్షుణ్ణంగా అంచనా వేయాలి. రచయిత మానసిక ప్రపంచంలో కలిగే సంచలనాత్మక ప్రకటిత భావానికి కారణం బాహ్య సమాజమే. చలం శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాస్తూ "తనకీ, ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వమం టాడు." సాహిత్య సృజనకారుడి స్పందన, ప్రతిస్పందన లకు స్పష్టమైన నిర్వచనం ఇది. సమాజం కేవలం బయట మాత్రమే కాదు, సృజనశీలి అంతరంగంలోనూ, ఆ అంతరంగం నుంచి జనించే సాహిత్య ప్రక్రియలోని ప్రతి అశంలోనూ ఉంటుంది. అదే వాస్తవికతకు మూలాలను సిద్ధం చేసే క్రియ. కథ, కవిత్వం, నవల, నాటకం... ఏ ప్రక్రియలో అయినా శిల్పరహస్యాలను ఛేదన చేస్తూ, వాటికి వస్తువుతో ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తే ఆ రచనలోని సమాజాన్ని కచ్చితంగా అవగతం చేసుకోవచ్చు.

కథ - కథకుడి దృష్టి :

సమకాలీన సమాజంలో కథాప్రక్రియ ముందడుగులో ఉంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. కథల్లోని పాత్రలు, వాటి సంఘర్షణ, బహిర్ ప్రవర్తన, భాషతో పాటు సన్నివేశాలు, వర్ణనల వంటి వాటిలో సమాజం ప్రతిబింబి స్తుంది. గొరుసు జగదీశ్వరరెడ్డి 30కి పైగా కథలు రాశారు. వీటిలో పదింటిని 'గజ ఈతరాలు' పేరుతో ప్రకటించారు. 'హ్యాపీడేస్' పేరుతో కొందరి సినీ ప్రముఖుల చిన్ననాటి ముచ్చట్లను సంకలితం చేశారు. ప్రస్తుతం చర్చించబోయే 'జలగల వార్డు' కథ 'గజ ఈతరాలు' సంపుటిలోనిదే. రచయిత సమాజంతో రాజీపడలేక తన అంతరంగంతో యుద్ధం చేస్తాడు. ఆ యుద్ధ ప్రతిఫలమే ఈ రచన. అందుకే రచనలో రచయిత వేటితో రాజీపడలేకపోయాడో, వేటి వల్ల సంఘర్షణకు గురయ్యాడో అవే కనిపిస్తాయి.

గొరుసు జగదీశ్వరరెడ్డి "జలగల వార్డు" కథను ఉత్తమ పురుష దృష్టికోణంలో చిత్రించాడు. ప్రతి సన్నివేశాన్ని, సంవాదాన్ని, సంఘర్షణను కథకుడి దృష్టితోనే చెప్పాడు. కథ మొత్తాన్ని స్వీయ అనుభవంలా గీశాడు. రచయిత, వాళ్ల అమ్మకు పక్షవాతం వస్తే ప్రభుత్వ ఆసు పత్రికి తీసుకెళ్తాడు. అక్కడ ఎదురైన ప్రత్యక్ష అనుభవాలను కథలో దృశ్యాలుగా చూపించాడు. హాస్పిటల్ నేపథ్యంతో సాగే ఈ కథలో సమాజంలోని అనేక అంశాలు కళ్లకు కడతాయి. డాక్టర్లు, నర్సులు, వార్డ్ బోయ్‌లు, రోగుల ప్రవర్తన, మాట తీరుతోపాటు బెడ్‌లు, బాత్ రూమ్‌ల స్థితినీ తెలియజేస్తాయి. రచయిత మొత్తంగా ప్రభుత్వ ఆసుపత్రి నీలినీడల చిత్రాన్ని అక్షరాలతో గీశాడు.

వార్డ్‌లో ఒంటికెళ్లిన వాళ్లను స్వీపరు అరవడంతో కథ ప్రారంభమవుతుంది. తన ఉద్యోగం పోతుందని బాధపడే

వార్డ్ బోయి స్థితిని రచయిత సామాజిక ఆర్థిక కోణాల్లో అర్థం చేసుకోవడంతో ముగుస్తుంది. ఈ రెండింటి మధ్య ఎన్నో సన్నివేశాలు, సంఘటనలు, పాత్రలు, వాటి సంఘర్షణలు, వాదాలను వాస్తవికంగా చిత్రించాడు జగదీశ్వర రెడ్డి. సమాజంలోని అనేక రుగ్మతలను, ఆర్థిక అసమానతల్లోంచి అవస్థలు పడుతున్న మనుషుల స్థితిగతులను, వారి బాధాతప్త హృదయాలను కథలో సూక్ష్మంగా చెప్పే ప్రయత్నం చేశాడు.

రోగులు – అవస్థలు :

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వాళ్లు. వాళ్ల స్థితిని ఆసరాగా చేసుకొని వాళ్లతో అక్కడి సిబ్బంది ఎలా మాట్లాడతారు? ఎలా ప్రవర్తిస్తారు? బిక్కుబిక్కుమంటూ భయంతో రోగులు ఎలా ఉంటారు?... అన్నీ వివరిస్తాడు కథకుడు. వార్డ్‌లోని రోగుల కోసం బ్రెడ్డు పాలు వచ్చినప్పుడు కథకుడితో అరవై ఏళ్ల ముసలామె "బాబ్బాబూ.. పాలు బ్రెడ్డూ అక్కర్లేకపోతే నాకిచ్చావా" అని దీనంగా అడుగుతుంది. ఆమెకి "తెచ్చాక ఇస్తాలే" అని చెప్తాడు రచయిత. ఆ మాటలు విన్న ఎదురు బెడ్ పేషంట్ వచ్చి "ఏడి బాబూ... పొద్దుటాలిచ్చే బెడ్డూ, పాలూ ఆ ముసిలిఖండికి ఇచ్చేసినారేటి? రోజూ ముసిల్దాయి అందరి దగ్గిరా సిగ్గూ, సెరవూ ఒగ్గీసి అడిగీసి తీసీసుకుంటాది. నాకు ముందూ, యెనకా ఏటీ నేదు బాబూ, ఆ మొగుడు నచ్చినోడు తాగీసి ఎక్కడో తొంగుండి పోతాడు. ఇంటి దగ్గిర సంటి పిల్లలున్నారు బాబూ... ఆకలాకలని గోలగోల సేత్తారు. మీకు మజ్జాన్నవూ, రేతిరీ భోజనం ఇత్తారుకదా, నాకిచ్చీయండి... సందేళకి మాయమ్మ వత్తాది. దానికిత్తే, ఆదొట్టుకెళ్ళి పిల్లలకెడతాది" అని అడుగుతుంది. "పేషంట్లు వాళ్ల జబ్బుల్ని నయం చేసుకోడానికి వచ్చినట్లు కన్పించడం లేదు. హాస్పిటల్ వాళ్ళు పెట్టే తిండికోసం లేని రోగాల్ని నిజంగా తెచ్చుకుంటున్నారని పించింది" అని నిజాన్ని అక్కడే ప్రకటిస్తాడు రచయిత.

వార్డ్ బోయ్ వస్తుంటే భయంగా వణికిపోతూ, పిల్లిలా స్తంభం చాటును నక్కుతుంది ఓ పేషంటు. అటు ఇటు గెంతుతూ డాక్టర్ వచ్చేసరికి చలిజ్వరం వచ్చినట్లు వణికిపోతూ బెడ్‌కు అంటుకుపోయిన మరో ముసలమ్మ "ఒళ్లంతా ఒగటే సలుపు. కడుపులో పేగులన్నీ కరకర మంతాయి. మయదారి జబ్బునాగుంది బాబూ" అని చెప్తే డాక్టర్ చిన్నగా నవ్వుతూ మందులు రాసిస్తాడు. కానీ హౌస్ సర్జన్లు వస్తే తన రోగం గురించి ఎక్కడ చెప్పాలోనని తప్పించుకోడానికి ప్రయత్నించి వాళ్లకు దొరికిపోతుంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల గురించి కథకుడు చిత్రించిన దృశ్యాల వెనుక వాళ్ల వాస్తవిక జీవితం దాగి ఉంది. రోగం లేకపోయినా తమ తిండికోసం, ఇంట్లోవాళ్ల కడుపు నింపడం కోసం రోగిగా నటించేవాళ్ల దీనస్థితి ఉంది. వార్డ్ బోయ్‌లకు, నర్స్‌లకు, హౌస్ సర్జన్లకు, డాక్టర్లకు అబద్దాలు చెప్పూ, భౌతికంగా మానసికంగా ఓడిపోతూ, తమనుతాము నైతికంగా చంపుకుంటూ, పక్కల రోగులకు ఇచ్చే పాలు, బ్రెడ్డు, భోజనాలతో బతుకు ఈడ్చడం వెనక సమాజంలోని అట్టడుగు పొరల్లో జీవిస్తున్న ప్రజల కన్నీటి వ్యధ ఉంది.

వైద్య సిబ్బంది విధులు :

కథలో నర్స్‌ల గురించిన ప్రస్తావన, వర్ణనలు అక్కడక్కడా కనిపిస్తాయి. ఒకచోట నర్సులు వార్డులో ఉన్న బెడ్లు సర్దడం. మరోచోట బ్రెడ్డూ, పాలు వచ్చేయి అని చెప్పడం. ఇంకోచోట "ఏడుగంటలు అయ్యేసరికి నర్సులంతా బురదనీటిలో కదలాడే బాతుల్లా వార్డులో అటూ, ఇటూ పరుగెడుతున్నట్లు నడుస్తూ, ప్రతి పేషంటు దగ్గరా కేస్ షీట్స్ వున్నాయో, లేవో చెకప్ చేసుకుంటున్నారు. హెడ్ నర్స్ రావడంతోనే "ఈ కుర్సీ ఇక్కడెందుకుందీ? ఆ పేషంట్ దగ్గర మరో మనిషి ఎందుకు ఎగస్ట్రా వున్నాడు?" రకరకాల ప్రశ్నలను గుప్పిస్తూ తెల్లని ఐరావతంలా కదిలి వస్తూ అరవడం మొదలుపెట్టింది." అని వాళ్ళ భౌతిక రూపాల్ని, వృత్తిని వర్ణిస్తాడు రచయిత. హౌస్ సర్జన్ల డ్యూటీస్ గురించి ఓ పాత్ర చెప్తూ "బెడ్ చుట్టూ మూగేత్తారు. నీళ్ళు తాగాలనిపించినా. ఒగటికెళ్ళాలన్నా

సిటంకదల్తానికీల్లేదంటారు. ఏటో నా జబ్బు గురించే దిక్కు మాలిన పశిన్లన్నీ ఏత్తారు. అన్నీ యిని ఓపిగ్గా బదులు సెప్పాళాల్లకి. నిన్న మజ్జానం దాకా ఒగ్గల్లేదు" అని అంటుంది. డాక్టర్ల విధుల గురించి ప్రస్తావిస్తూ... "వార్డులోకి ఎనిమిదింటికి డాక్టరు వస్తాడు. అతనితోపాటు ఇద్దరు హౌస్ సర్జన్లూ, మరో ఇద్దరు సిస్టర్లూ, ఒక హెడ్ నర్సూ ఉన్నారు. "ఎలా ఉంది?" అని అడుగుతూ, ప్రతి పేషంట్ దగ్గరున్న కేస్ షీట్ ను చూస్తూ, నర్సులు రాసిన బి.పి.ని, టెంపరేచర్ రీడింగునీ చెకప్ చేస్తూ మందులు, ఇంజక్షన్లూ రాస్తున్నాడు. డాక్టరు ప్రతి చర్యనీ జాగ్రత్తగా గమనిస్తూ, అతని మాటల్ని అక్షరబద్ధం చేస్తున్నారు హౌస్ సర్జన్ కుర్ర డాక్టర్లు".

కథకుడు వాళ్లమ్మ దగ్గరకు డాక్టర్ వచ్చినప్పుడు "పెరాలిసిస్ ఎప్పుడు మొదలయ్యిందీ, వచ్చి ఎన్నాళ్ళ యిందీ... అన్నీ వివరంగా డాక్టరుకు చెప్పాను..... ... అమ్మ కంటి చూపునీ, వినికిడినీ పరిశీలించి తను నోట్సులో రాసుకున్నారు హౌస్ సర్జన్లు. అమ్మకు పెరాలసిస్ రావడానికి గల కారణాల్ని, మెదడులోని రక్తనాళాలు ఎలా ప్రసరణ శక్తిని కోల్పోతాయో అన్నీ వివరంగా చెప్పుకుపోతున్నాడు డాక్టర్. పనిచేయని అవయవాలని నొక్కి నొక్కి చూస్తూ... ఆమె ఫీలింగ్స్‌ని స్టడీ చేస్తున్నారు." అంటూ డాక్టర్ల నిబద్ధతో కూడిన వృత్తి నిర్వహణనీ చెప్తాడు. జనరల్ ఆసుపత్రిలో నర్సులు, హౌస్ సర్జన్లు, డాక్టర్లు తమ వృత్తికి కట్టుబడి నిజాయితీగా పనిచేయడాన్ని కథలోని ఈ వాక్యాలు రుజువు చేస్తాయి. హాస్పిటల్‌లోని చెడు, మంచి... రెండింటినీ బేరీజు వేసే రచయిత సూక్ష్మ దృష్టికి నిదర్శనం ఇది.

హాస్పిటల్ స్థితి :

జనరల్ హాస్పిటల్ ఎలా ఉంటుందో, ప్రధానంగా రెండు అంశాలలో చూపించాడు రచయిత. ఒకటి బెడ్లు, రెండు బాత్‌రూమ్. బెడ్ల గురించి చెప్తూ నర్సులు "వార్డులో ఉన్న తుప్పుపట్టిన మంచాలపైన ఎన్నాళ్ళ నుంచో పేషంట్ల ఉచ్చలకీ, వాంతులకీ అట్టగట్టుకుపోయిన మరకల పరుపులని నర్దుతూ వాటిపైన తెల్లని బెడ్ షీట్లని పరుస్తున్నారు" అని వర్ణిస్తాడు. బాత్ రూమ్ గురించి "నిన్న రాత్రి వార్డు పక్కనే వున్న బాత్రూమ్ లోకి వెళ్ళాల్సివచ్చింది. అక్కడ నేలంతా అంగుళం దళసరి నాచు... కాలుమోపి, జారబోయి ఎలాగో తమాయించుకోబట్టి సరిపోయింది గానీ, లేకపోతే ఈ పాటికి ఏ ఆర్థోపెడిక్ వార్డులోనో పేషంట్‌గా వుండాల్సి వచ్చేది. ఒక గంటపాటు ఆ బాత్రూమ్ లో ఉంటే ఆ దుర్గంధానికి ఊపిరితిత్తులు చెడిపోవటం ఖాయమనిపించింది. వార్డులోని పేషంట్లు, వారి తాలూకు మనుషులూ కారిడార్ లోనే అన్ని పనులు ఎందుకు కానిచ్చేస్తున్నారంటే... తప్పు వాళ్లదా?" అంటాడు. ఈ ప్రశ్న కేవలం అపరిశుభ్రత గురించి మాత్రమే కాదు, జనరల్ ఆసుపత్రులకు నిధుల కొరత, యాజమాన్య నిర్లక్ష్యం, పట్టించుకోని ప్రజాప్రతినిధులను విమర్శించడమూ ఉంది.

లంచం బహిర్ స్వరూపం :

ఈ కథలో రచయిత ఎత్తిచూపిన ముఖ్య సమస్య జనరల్ హాస్పిటల్‌లోని లంచాలు. లంచాన్ని తీసుకునే వ్యక్తుల స్వభావాన్ని, వాళ్ల జీవితాలను, ఆర్థిక స్థితిగతులను కూడా కథలో చర్చకు పెట్టాడు జగదీశ్వరరెడ్డి. లంచం ప్రస్తావన కథలో అనేకచోట్ల కనిపిస్తుంది. రచయిత వాళ్లమ్మను హాస్పిటల్ కు తీసుకొచ్చినప్పుడు వీల్ ఛైర్ అవసరమవుతుంది. "వార్డుబోయ్ ని గంటసేపు బ్రతిమిలాడితే విసుక్కుంటూ, కాస్త అమ్మ పరిస్థితిని అర్థం చేసుకున్నట్లు వీల్ ఛైర్ తీసుకొచ్చేడు. తీరా వార్డుదాకా తీసుకొచ్చేక "మీరు వెళ్ళాల్సింది ఫస్ట్ ఫ్లోర్ లోని వార్డుకి. అక్కడికి రావడం కుదర్దు. స్ట్రెచర్ లో తీసుకెళ్ళండి. అక్కడ వార్డ్ బోయ్ వుంటాడు. నాకు పదిరూపాయాలివ్వండి...". అని అడిగి తీసుకుంటాడు.

మరోచోట వార్డ్ బోయ్ వెంకట్రావు మామూలు ఇవ్వలేదని ముసలమ్మను, రచయితను బెదిరిస్తాడు. "పన్నెండో నంబరు బెడ్ పేషెంటు తాలూకు మీరేనా? నిన్న మజ్జానం జాయినయ్యారట కదా! ఏటి బాబూ, ఇంకా

మాకు మామూలు యీయినేదు? గేటు దగ్గిరా, ఇక్కడా అంతా కలిసి నల్గురువ్. రెండొందలిచ్చియండి. సర్దీసు కుంతాం ఎలాగో'' అతను ఎవర్నడుగుతున్నాడో, ఎందు కడుగుతున్నాడో మొదట అర్థం అవలేదు. ''ఏటి బాబూ, తవర్ని కానట్టు అల్గసూత్తారేటి? మిమ్మల్నే అడుగుతా... వోర్ణ బాయ్‌ల్కి పీజులిచ్చుకోవాల, నేకపోతే మీ తాలూకూ మనుసులెవ్వరూ లోనకి రాటానికీల్లేదు'' నేను సమాధానం ఇచ్చేలోగా.. జాగిలంలా పసిగట్టి, స్థంభం చాటునున్న ముసలమ్మ రెక్కపట్టి లాగేడు.'' అని వార్డ్ బోయ్ లంచంకోసం ఎలా బెదిరిస్తాడో చెప్తాడు. కథకుడు మాత్రం కోపంగా ఒక్కపైసా ఇవ్వనని అతడిపై అరుస్తాడు. అతడు ఆ అరుపుల్ని లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా డాక్టరు వస్తున్నాడని తెలియడంతో ''పేషంట్లదగ్గరున్న వాళ్ళ నందరినీ గేదెల్ని తోలినట్లు అదిలించడం మొదలు పెడతాడు.''

ఇంకో సన్నివేశంలో కథకుడు వెంకట్రావు గేటు దగ్గర గొడవపడడం వింటాడు. డాక్టరు వచ్చేటైంకు వెళ్లలేదని కడుపునొప్పితో బాధపడుతున్న రోగి భర్తను వాతలు పడేటట్లు బాదాడని కూడా తెలుస్తుంది. డ్యూటీ నర్స్ కు కంప్లైంట్ చేసినా ఫలితం ఉండదు. మరో వార్డ్ బోయి అప్పారావు కథకుడి అత్త కేరేజ్ తీసుకొస్తుంటే రెండ్రూ పాయలు తీసుకొని లోపలకు పంపుతాడు. పురుగుల మందు తాగి చనిపోయిన యువతి అన్న, సామాను మర్చిపోయి రెండు రోజుల తర్వాత వచ్చి, తమ బాధను రచయితతో వెల్లబోసుకుంటాడు. ''పోస్టుమార్టంకు చెల్లి శవాన్ని స్ట్రెచర్ పైకి చేర్చింది మొదలు, వాళ్ళు మమ్మల్ని నానా హింసకు గురిచేశారండీ... వీళ్ళకు అడుగడుగున ముడుపుల్ని చెల్లించలేక... చచ్చామనుకోండి. తీరా మా బాధల్లో మేం ఉన్నామా... పంచనామా చేయడానికి మమ్మల్ని మా ఊరెళ్ళి పోలీసుల్ని తీసుకురమ్మన్నారు. లేకపోతే వెయ్యి రూపాయలు ఇస్తే ఆ తంతు తామే కానిచ్చేస్తాం అన్నారు. ఏం చేస్తాం? ఇవ్వక తప్పింది కాదు మరి. ఆ తర్వాత శవం బయటకి వచ్చేదాకా మా ప్రాణాలు తోడేశారు కదండీ!

చెల్లి శవం చుట్టూ రాబందుల్లా రెక్కలు చప్పుళ్ళు చేస్తూ మా వెంటే ఉన్నట్లు అన్పించింది. చివర్లో చెల్లి శవానికి చుట్టిన బట్టకు కూడా ఐదువందలు వసూలు చేశారండీ!'' అని చెప్తాడు. అంతలో వార్డ్ బోయ్ వచ్చి మా కివ్వాల్సిన మామూలు ఇవ్వలేదని అతడిని అడుగుతాడు. అతడికి కోపం వస్తుంది. ఇద్దరి మధ్యా గొడవ జరుగుతుంది. వార్డ్ బోయ్ చెవికి దెబ్బతగిలి రక్తం కారుతుంది. అతడికి తగిన గుణపాఠం జరిగింది కదా...! అని జగదీశ్వరరెడ్డి అంతటితో కథ ముగించడు. వెంకట్రావు లంచం తీసుకోవడం వెనక ఉన్న రహస్యాన్ని, ఆ పని చేయిస్తున్న పరిస్థితులను అతడితోనే చెప్పిస్తాడు. కథలో అప్పటి వరకు వార్డ్ బోయ్ ప్రవర్తనను చెప్పిన కథకుడు అతడి అంతరంగంలోని బాధను వెల్లగక్కిస్తాడు. ఇదే కథకు ఆయువుపట్టు.

లంచం అంతర్ స్వరూపం :

వెంకట్రావు హృదయాన్ని బద్దలు చేసుకుంటూ ''ఇక్కడ కట్టవంతా నాదీని, సుకవంతా నన్నిక్కడుంచి నోడిదీనీ, నాకొచ్చీ జీతంనోంచి మూడొంతులు దొబ్బీసి, నాకు పావొంతు ఇత్తాడు. ఆడు మరో ఉజ్జోగువో, యాపారవో సేసుకుంతూ కాలుమీద కాలేసుకొని, దర్జాగా రాజానాగుంతాడు... నానూ... మీ అందరి సేతా సిగ్గూ సెరవొగ్గీసి సప్పుదెబ్బలు తింతూ మీ నోటుమ్ము నాముకం మీదూయించుకుంతాను... ఊసీయండి... రండి''. ''ఈ ఇసియం తెలిస్తే ఆడు నా ఉజ్జోగం తీసేత్తాడ్రా... రేపుడ్నుండి నా నేట్రా తిని బతకాలా... నా పెళ్ళాం పిల్లలు ఎక్కడ్రా ముష్టెంత్తుకు బతకాల'' వెంకట్రావు జీరగొంతుక మెల్లమెల్లగా దూరమవుతోంది'' అని అతడి ఉద్యోగ అభద్రతను, కుటుంబ కష్టాలను చెప్పిస్తాడు రచయిత. అప్పటి వరకు ఆ పాత్ర మీదున్న కోపం పోయి పాఠకులకు జాలి కలుగుతుంది. హృదయాలు ఆర్ద్రతతో నిండిపోతాయి. సరిగ్గా చలం చెప్పిన అంతర్ బహిర్ యుద్ధారావమే ఈ పాత్రలోని బాహ్య అంతర్ ప్రవర్తనలో, జీవితంలో కనిపిస్తుంది.

పేషంట్లను లంచం ఇవ్వమని వేధించడం అనేది వెంకట్రావు బాహ్య స్వరూపం. కానీ ఆ లంచం తీసుకోవడానికి ప్రేరేపించిన పరిస్థితులు..!? వేరే వాళ్ల ఉద్యోగాన్ని చేస్తూ ఒక్క వంతు మాత్రమే జీతంగా తీసుకుంటూ దోపిడీకి గురవుతున్నాడు. కుటుంబపోషణ భారం, ఉద్యోగ అభద్రత... అన్నీ కలిపి అతడిని లంచంవైపు నడిపించాయి. ఇవి సమాజంలో ఉన్న నిరుద్యోగ సమస్యను, ఉద్యోగస్తుల అక్రమాలను కళ్లకు కడతాయి. సమాజానికి పునాదైన ఆర్థికాంశం ప్రజల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తుందో కథలో వ్యక్తమవుతుంది. లంచాలు తీసుకుంటున్న వెంకట్రావు లాంటి వార్డ్ బోయ్‌లు, కేవలం తిండికోసమే ఆసుపత్రుల్లో చేరిన ముసలమ్మల జీవితాలన్నీ ఆర్థికాంశంతోనే ముడిపడి ఉన్నాయి. జలగలు రక్తాన్ని ఎలా పీల్చుకుంటాయో ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులను లంచాలపేరుతో అలా పీల్చుతున్నారని చెప్పడానికే జగదీశ్వరరెడ్డి ప్రతీకాత్మకంగా కథకు "జలగల వార్డ"నే పేరుపెట్టాడు.

హస్పిటల్ సమాజ నమూనా :

రచయిత వాళ్ల అమ్మ గురించి చెప్తూ... "అహర్నిశలూ మా కోసం కొవ్వొత్తిలా కరిగి కరిగి... ఇలా అయిపోయింది అమ్మ. నాన్న తెచ్చేది తక్కువ జీతమే అయినా పొదుపుగా దాచి, తిండికీ, చదువులకీ ఖర్చుపెడుతూ, చాలకపోతే తన ఒంటిపైని ఒక్కో నగనీ మా ఎదుగుదలకు కరిగిస్తూ... ఎంత శ్రమపడింది?. రెక్కలొచ్చేక ఉద్యోగాల వేటలో వలస జీవులమై వెళ్ళిపోయిన అన్నయ్యగానీ, నేను గానీ... ఈ వయసులో వాళ్ళ ఋణం తీర్చుకోలేక, భద్రత లోపించిన ఉద్యోగాలతో, పెరిగే ఖర్చులని తట్టుకోలేక, చిద్రమైపోతున్న బతుకుల్ని ఎగదోపుకుంటూ... ప్రేమల్నీ, ఆత్మీయతల్నీ కృతకంగా మార్చుకుంటూ, అనుబంధాల్ని వ్యాపార బంధాలను చేసుకుంటూ ఈ వ్యవస్థకీ ప్రతీకలమై జీవిస్తున్నాం." అని అమ్మలోని త్యాగాన్ని, వెల కట్టలేని మమకారాన్ని, మనుషుల మధ్య ముసురుకుంటున్న వ్యాపార బంధాలను వర్ణిస్తాడు.

రచయిత ఆసుపత్రి అనుభవాలన్నీ అతడి బాహ్య రూపానికి సంబంధించినవి. వాటితో రాజీపడలేక అంతర్ సంఘర్షణకు గురియ్యాడు. ఆ సంఘర్షణను పాత్రల సంఘర్షణ ద్వారా పాత్రోచిత భాషలో చూపించాడు. కొండ అద్దమందు అన్నట్లు జనరల్ ఆసుపత్రిలోని ప్రతి సూక్ష్మ అంశాన్నీ సమాజానికి ముడిపెట్టి చూపించాడు. సమాజానికి మూలమైన ఆర్థికాంశంతోపాటు, హాస్పిటల్‌లోని వ్యాధులు, వైద్యం, పేషంట్లు, నర్స్ లు, డాక్టర్లు, వార్డ్ బోయ్‌లు, కుటుంబ సంబంధాలు... అన్నింటిని నమూనా పాత్రల ద్వారా వాస్తవికతతో చిత్రించాడు. మొత్తంగా కథలో ఆసుపత్రే సమాజానికి ఒక నమూనా.

ఉపయుక్త గ్రంథాలు :

1. జగదీశ్వరరెడ్డి, గొరుసు. గజ ఈతరాలు. 2007. విజయనగరం: ఎస్.కె. పబ్లికేషన్స్
2. మధుసూదనరావు, త్రిపురనేని. .... సాహిత్యంలో వస్తు శిల్పాలు. హైదరాబాదు: పర్ స్పెక్టివ్.
3. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1997. కథాశిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. శివశంకర్ , పాపినేని. 1996. సాహిత్యం మౌలిక భావనలు. గుంటూరు: పాపినేని ప్రచురణలు.
5. శ్రీశ్రీ. 2004. మహాప్రస్థానం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

2012 దినపత్రికల్లోని కథలు – సామాజికత

– డా॥. బి. సురేష్‌బాబు, వై.కోడూరు, యర్రగుంట్ల.

సమాజం పట్ల మానవుడి ప్రవర్తన ఏ విధంగా ఉంటుందో, కాలానుగుణంగా మానవుడిలో మార్పును కథలల్లో చెప్పడం కనిపిస్తుంది. సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను రచయిత అవగాహన చేసుకోవాలి. ఎప్పటికప్పుడు సమాజంలో జరుగుతున్న మార్పులను అర్థం చేసుకోవాలి. రచయితకు సామాజిక స్పృహ ఎంతైనా అవసరం. తాను గ్రహించి తెలుసుకున్న వాటిని కథకుడు సమాజంలోని ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, మతం, కులంలలో జరుగుతున్న లోటుపాట్లను తమ రచన ద్వారా పాఠకులకు తెలియచేసి, తద్వారా సమాజానికి కథకుడు తమవంతు కృషి చేయడం జరుగుతుంది.

సమాజంలో మారుతున్న కాలానుగుణంగా మనిషిలో లోపిస్తున్న మార్పులను కొన్ని విభాగాలుగా విభజించి వివరించడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

మానవత్వం :

మానవుడు సంఘజీవి. పుట్టుక నుంచి మరణం వరకు ఇతరులపై ఆధారపడుతూ ఉంటాడు. తనకు కావలసిన వాటిని సమకూర్చుకొనే సందర్భాలలో ఇతరులను ఆశ్రయించడం జరుగుతుంది.

సహజంగా మానవుడు ఇతరులపై ప్రేమ, దయ, జాలి, కరుణ కలిగి, పదిమందికి సహాయం చేసే గుణాన్ని కలిగి ఉండాలి. వ్యక్తిగత కోరికలు, అలవాట్ల వలన ఇతరులకు హాని కలిగించరాదు. మానవ జన్మలో ఏదో ఒక సహాయం ఇతరులకు చేయాలనే విషయాలను 2012 కథలలో కథకుడు ఇలా చెప్పడం జరుగుతుంది.

'అనాథెవరు?' కథా రచయిత యెన్నం ఉపేందర్. కథలో సంజీవరావు జీవితాన్ని గురించి వివరించడం జరిగింది. సంజీవరావు గవర్నమెంట్ ఉద్యోగం చేసేవాడు. అతను బ్రతికివున్న రోజులలో ఎవరికీ సహాయం చేయలేదని, చివరకు భోజనాన్ని కూడా సరిగ్గా చేసేవాడు కాదని సంజీవరావు గురించి చెప్పడం జరుగుతుంది. సంజీవరావు చనిపోయిన తరువాత అతని శవాన్ని గురించి ఎవరూ పట్టించుకోరు. ఆ ప్రాంతంలో అనాథ శవంలా ఉంటుంది. చుట్టుప్రక్కల వాళ్ళందరూ సంజీవరావుని అసహ్యించుకోవడం జరుగుతుంది. చివరకు మిత్రుడు జరగవలసిన కార్యాన్ని పూర్తిచేసి ఇంటికి వెళతాడు. సంజీవరావు సంపాదించిన డబ్బులన్నీ ఏమి చేశాడని మిత్రుడు కూడా సంజీవరావుని అసహ్యించుకుంటాడు. చివరకు మిత్రునికి సంజీవరావు దగ్గర నుండి ఉత్తరం వస్తుంది. అది సంజీవరావు చనిపోవడానికి ముందు రాసినది. అందులో.....

"ప్రియమైన మిత్రుడికి. నా ఆరోగ్యం ఈ మధ్యలో బాగా దెబ్బతిన్నది. డాక్టర్ కూడా ధృవీకరించాడు. సడెన్‌గా పోతానేమోనన్న బాధ రోజురోజుకీ కృంగదీస్తుంటే ఇక లేట్ చేయకూడదని నా ఆస్తి అంతా వృద్ధాశ్రమానికి, పిల్లల అనాథాశ్రమానికి వ్రాశాను. వివరాలు జత చేస్తున్నాను, వీటిని ఆయా నియంత్రణాధికారులకు అందించ ప్రార్థన ఉంటాను.

ప్రేమతో
సంజీవరావు
(ఆంధ్రభూమి : 19 ఫిబ్రవరి 2012 : 19)

ప్రస్తుతం పెద్దలు సంపాదించిన ఆస్తులను వారి పిల్లలకి, పెళ్ళికానివారైతే బంధువులకు ఇవ్వడమే సాధారణంగా కనబడుతుంది. కానీ ఈ కథలో సంజీవరావు మానవత్వంతో అతని ఆస్తిని తను చనిపోయన తరువాత అనాథలకు చెందేలా వీలునామ రాయడం జరుగుతుంది. చనిపోయిన తర్వాత ఎంతో మంది అనాథలకి అతడు ఆధారం అయ్యాడు. సంజీవరావు అనాథాశ్రమానికి అతని వంతు సేవ చేయడం ఈ కథలో కనిపిస్తుంది.

అభ్యుదయం :

ప్రగతి పథంలో మానవ జీవన విధానం చైతన్య మార్గంలో పయనించడం అభ్యుదయానికి ప్రతీక. ప్రతి వ్యక్తి నూతన ఆలోచనా దృక్పథం కలిగి, నవ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం అభ్యుదయానికి నాంది. వర్ణ వివక్షత, స్త్రీ పక్షపాత ధోరణి, మత సామరస్య రాహిత్యం మొదలగు దురాచారాలపై ప్రతిఘటన చేసి నవ భారత నిర్మాణంలో చేయి చేయి కలపడం అభ్యుదయానికి సంకేతం. భిన్నత్వంలో ఏకత్వం, బుద్ధ దేవుని మార్గం అభ్యుదయ వీచికలకు ఆలంబన. ప్రతి వ్యక్తి తనకు జరిగే అన్యాయాలను ఎలాంటి తారతమ్యం లేకుండా హక్కులకోసం పోరాడటం జరుగుతుంది. అలాంటి కథను కింద వివరించడం జరిగింది.

'మార్పు' కథా రచయిత జొన్నలగడ్డ ఫణీంద్రకుమార్. ఇందులో రైతుల జీవితంలో మార్పును వివరించడం జరుగుతుంది.

కథలో శోభనాద్రి ప్రధాన పాత్ర. ఇతడు రైతుల సమస్యలపై ప్రభుత్వంపై పోరాటం చేస్తాడు. పొలాలకు నీరు తెప్పించే విషయంపైన, పంటలకు గిట్టుబాటు ధర ప్రభుత్వమే కల్పించాలని పోరాడుతుంటాడు. రైతులందరినీ ఒక్కటి చేసి ప్రభుత్వంపై ధర్నాలు చేయడం, కలెక్టర్‌కు ఫిర్యాదులు ఇవ్వడం మొదలైన పనులు చేస్తాడు. ఒకసారి మంత్రి రావడంతో అక్కడికి రైతులు వెళ్ళి, వారి సమస్యలను చెప్పుకుంటారు. ప్రాజెక్టు కట్టమని ఒకరు, అప్పులు భరించలేకున్నామని మరొకరు చెప్పగా మంత్రి ఏమీ చేయలేక బయటికి వెళతాడు. మా సమస్యలు వినని వాడికి ఎందుకు ఈ రచ్చబండలు అని కాశయ్యను నిలదీస్తాడు.

"నీవు చేయి ఎత్తితే నేను చేయి ఎత్తగలను. నీకు నాకు తేడా వుంది. నీవు మనిషిగా ప్రవర్తించక పోయినా..... నేను మనిషిగా ప్రవర్తిస్తున్నా....."సౌమ్యంగా అన్నాడు కాశయ్య.

మీడియా వారికి కావాలసిన న్యూస్ దొరికింది. కాశయ్య మీద మారిడయ్య చేయి ఎత్తడం గమనించిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. మంత్రికి వ్యతిరేఖంగా నినాదాలు చేస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయారు. మంత్రి తలపట్టుకుని కూర్చున్నాడు". (ప్రజాశక్తి :1 జూలై 2012:8)

రైతులు మంత్రిపై చేయి ఎత్తడం, మంత్రినే కొట్టే స్థితిలోకి రైతులు వెళ్ళడం అభ్యుదయమే. రైతుల సమస్యల కోసం శోభనాద్రి పోరాటం చేయడం సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది. పోరాటాలు చేయకపోతే సమస్య అలాగే ఉంటుందని చెబుతాడు. ప్రస్తుత సమాజంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు ధైర్యంగా ఎదుర్కోవడం ఈ కథలో కనపడుతుంది.

కులం :

కులం అనేది సమాజంలో ఏ వ్యక్తినైనా తేలికగా గుర్తించడానికి వేదకాలంలో ఆర్యులు రూపొందించిన ఒక వ్యవస్థ. తరువాత కాలంలో తాము వివాహాలు చేసుకుంటూ, ఒక విధమైన జీవన సరళిని కొనసాగిస్తూ వచ్చిన సామాజిక వర్గాలకు కులాలు అనే పేరు ఏర్పడింది. వృత్తిని, ఆచారాలను, సామాజిక స్థాయి వంటి అనేకాంశాలు కులాల్లో చాలాకాలంగా కొనసాగుతున్నవి. వంశపారపర్యంగా పాటించబడే ఒక సామాజిక దురాచారం ఈ కులం.

గ్రామాలలో ఇప్పటికీ పెద్ద కులంవారు చిన్న కులం వారిపై ఆధిపత్యాన్ని చెలాయించడం జరుగుతుంది. తక్కువ కులం వారిని పెద్ద కులంవారు తమ ఇంటిలో బానిసలుగా, తన చెప్పుచేతుల్లో ఉండేటట్లు చేసుకుంటారు. తక్కువ కులం వారికి ఏవైనా భూము లుంటే వాటిని కూడా బెదిరించి తీసుకోవడం జరుగుతుంది. ఇలాంటి సంఘటననే ఈ కథలో తెలియ చేయడం జరిగింది.

'తరం - అంతరం' కథా రచయిత చెన్నా రామమూర్తి. ఇందులో రెడ్ల ఆధిపత్యం, తక్కువ కులాలవారిపై చిన్నచూపు, బానిసత్వ విధానం ఈ కథలో కనబడుతుంది.

చిన్నారెడ్డి ఇంటిలో సోములు పనిచేస్తుంటాడు. ఇతనికి ఇద్దరు కొడుకులు. తండ్రి మాదిరిగానే చిన్నారెడ్డి

ఇంట్లో పెద్దకొడుకు శీను కూడా పనిచేస్తాడు. సరైన ఆహారంలేక, అనేక ఆర్థిక కారణాలతో సోములు ఆరోగ్యం క్షీణిస్తుంది. ఆర్థిక సమస్యల వలన సోములు తన ముక్కా లెకర అమ్మాలనుకుంటాడు.

కానీ వాటిని అప్పు కింద పాసుపుస్తకాలను చిన్నారెడ్డి ఇంట్లో ఉంచుకుంటాడు. వాటిని ఇవ్వమని సోములు అడిగితే.....

''ఛత్.....నోర్ముయ్యి, నీకేమన్నా బుద్ధుందా రొంతన్నా....నాకు బాకీ ఉండే లెక్కలేకి నేను నీ భూమిని తీసేనుకున్నా.....ఇంకా నువ్వే బాకీ పడతావు....అట్లాంటప్పుడు మళ్ళా భూమిని వాని కమ్ముతానంటావా.....మరి నా బాకీ సంగతెట్ట? అని అటు రామిరెడ్డివైపు తిరిగి 'వాడమ్ముతానంటే నువ్వెట్ల వచ్చినా వయ్యా కొనడానికి.....నీకు తెల్దా.....వీడు మా ఇంట్లో పనిచేస్తాడని సరే ఎట్లా ఒచ్చినావు.....వాడిలెక్కంతా నువ్వే కట్టి ఈ కాయితాలు తీసుకో....' అంటూ చిట్టాపద్దులు ముందేశాడు.....'' (ఆంధ్రభూమి : 6 మే 2012 : 19)

పల్లెటూరిలో రెడ్ల కులంవారు చిన్న కులంవారితో వారి ఇంటి పనులను చేయించుకుంటారు. ఒక తరం నుండి మరో తరం వరకు రెడ్ల కులం వారికి బానిసలుగా ఉంటారు. చిన్నకులంవారి అవసరాలకు డబ్బు ఇచ్చి వారి స్థిరాస్థులేవైనావుంటే వాటిని తాకట్టు పెట్టుకుని, చివరకు వాటిని లాక్కోవడం జరుగుతుందనే వాస్తవాన్ని తరం - అంతరం కథలో చిత్రించారు.

'మాయాజాలం' కథా రచయిత డా॥ ఎం.హరికిషన్. ఇందులో ధనలక్ష్మికి తమ పిల్లలు అంతర్జాలంలో వివిధ సైట్లను చూచి చెడిపోతున్నారని తెలుసుకుంటుంది.

ధనలక్ష్మి భర్త అధ్యాపకుడు. ఉదయం వెళ్ళి సాయంత్రం ఇంటికి వస్తాడు. ధనలక్ష్మి ఒక్కటే ఇంటి పనులు చూసుకుంటుంది. వాటితో పాటు తమ పిల్లలకు కావాలసినవన్నీ సమకూర్చుతుంది. తమ ఇంటిలో నెట్ పెట్టినప్పటినుండి పిల్లల ప్రవర్తనలో మార్పు వచ్చిందని గమనిస్తుంది. పిల్లలు భోజనానికి కూడా కిందికి రారని, వారి గదికే తీసుకెళ్ళే పరిస్థితి ఏర్పడిందని ఆమె స్నేహితురాలు లావణ్యకు చెబుతుంది. ఈ పోటి ప్రపంచం పిల్లలకు నెట్ అసరమే కానీ చదువు సంబంధ వెబ్‌సైట్స్ చూస్తే బాగుంటుంది, కానీ అలా కాక అశ్లీల దృశ్యాలను పిల్లలు చూస్తే చెడిపోయో అవకాశం ఉందని లావణ్య చెబుతుంది. మారుతున్న కాలానుగుణంగా పిల్లల గురించి తల్లి పడే బాధను చెప్పడం జరిగింది. లావణ్య ఆమెకు తెలిసిన విషయాన్ని ధనలక్ష్మికి చెబుతుంది.

''ఎలా చిక్కుకున్నాడో గానీ ఎప్పుడు చూడు కొత్త సినిమాలు, గేమ్స్, పాటలు, పోర్న్ వీడియోలు, ఫేస్ బుక్‌లు, టిట్టర్లు, చాట్‌లు, మేయిళ్ళంటూ రాత్రింబవళు ఆగదిలోనే, వాళ్ల నాన్న వాడి కళ్ల కింద నల్లటి చారలు చూసి నెట్ పెట్టించాక పాపం కష్టపడి చదువుతున్నాడు అనుకున్నాడే కానీ, రిజల్ట్స్ వచ్చేదాకా వాస్తవాన్ని గ్రహించలేకపోయాడు. కానీ ఏం లాభం? అప్పటికే బానిసైపోయాడు. కనెక్షన్ తీసేస్తే పిచ్చి పట్టిన వానిలా అరుస్తూ కేక లేస్తున్నాడు. మానసికంగా దెబ్బతిని ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు' చెప్పింది లావణ్య''. (ఆంధ్రజ్యోతి : 21 అక్టోబర్ 2012 : 20)

అంతర్జాలంలో అనవసర విషయాలను పిల్లలు చూడడం వలన చెడిపోవడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. వీటి వలన నేటి పిల్లలు పెడదారి పట్టే అవకాశం ఉందని, కాలానుగుణంగా పిల్లల ప్రవర్తనలలో కూడ ప్రపంచీకరణ ప్రభావం కనబడుతుంది.

ఈ విధంగా పై కథల్లో సామాజికత ప్రస్ఫుటమవుతుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. కథా శిల్పం - వెంకట సుబ్బయ్య వల్లంపాటి
2. కథానిక స్వరూప స్వభావాలు - దక్షిణామూర్తి పోరంకి
3. తెలుగు కథా వికాసం - పద్మరాజు పాలగుమ్మి

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వల్లంపాటి కథలలో సామాజిక జీవన చిత్రణ

– డా॥. బోడిరెడ్డి మహేంద్రరెడ్డి, తెలుగు అధ్యాపకులు, ట్రిబుల్ ఐటి విశ్వవిద్యాలయం, ఒంగోలు.

వల్లంపాటి వెంకట సుబ్బయ్య విద్యార్థి దశలో 'అన్యథా శరణం నాస్తి' అనే కథ (1958) ఆంధ్రప్రభలో ప్రచురించడంతో వల్లంపాటి రచనా వ్యాసంగం ప్రారంభ మైంది. కథాసాహిత్యంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. వల్లంపాటి ఇంతవరకు డెబ్భైకి పైగా కథల్ని, మూడు నవలల్ని, అనేక అనువాద గ్రంథాల్ని రాశాడు. ఇతడు ఎన్నో ప్రఖ్యాత గ్రంథాల్ని విస్తృతాధ్య యనం చేయడం వల్ల ప్రాచ్యపాశ్చాత్య సాహిత్యసంపదను బాగా ఆకళింపు చేసుకొని కథ, నవలా రచయితగా, విమర్శకుడిగా గుర్తింపు పొందాడు. కథ, నవల ప్రక్రియల లక్షణాలను శాస్త్రీయంగా చర్చించి విభిన్న కోణాల్లో వాటి బాగోగుల్ని విశ్లేషించి, నిర్మొహమాటంగా, నిర్ద్వందంగా తనఅభిప్రాయాల్ని వెలువరిస్తూ, విమర్శ ప్రక్రియనే ప్రధానంగా ఎంచుకుని విమర్శక లోకంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సీమకథకుడు, నవలాకారుడు, విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య. ఇతని కథలన్నీ దాదాపు గ్రామీణ నేపథ్యాన్ని కలిగి ఉండడం విశేషం.

ఆంధ్రదేశంలో ఎన్నో ఏళ్ళుగా సమసిపోకుండా వస్తున్న సమస్యల పట్ల కొత్త కోణంలో ఆలోచించి, ఆ సమస్యలకు గల మూలకారణాలను అన్వేషించి, తన రచనల్లో వాటిని చిత్రించాడు. ప్రతి సమస్యకు స్పందించే గుణం రచ యితల్లో, కళాకారుల్లో కనిపిస్తుంది. ఈ లక్షణం ఇతనిలో ఎక్కువగా కనిపిస్తుంది. సమాజంలో కొనసాగుతున్న నీచ రాజకీయాల్ని, నిరంతర కరువుల్ని, పేదల జీవితాల్ని, ఛిద్రమైపోతున్న వ్యవస్థను గ్రామీణుల ప్రాదేశికతను అక్కడి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విషయాల్ని ఎక్కువగా శిల్పీకరించి రచనలు చేసిన రచయిత. ఇతడు రచయితగానే కాకుండా విమర్శకుడిగా ఎంతో గుర్తింపు పొందాడు.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య జీవితం :

ప్రసిద్ధ రచయితగా వల్లంపాటి జీవితం ఎంతో వైవిధ్యభరితంగా కొన్ని ప్రత్యేకతల్ని సంతరించుకొంది.

వల్లంపాటి జననం :

వల్లంపాటి చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూక రొంపిచర్ల గ్రామంలో 1937 మార్చి 15న లక్ష్మీదేవమ్మ, రామచంద్ర అశ్వర్థన్ దంపతులకు పెద్దకుమారుడుగా జన్మించాడు.

బాల్యం :

వల్లంపాటి బాల్యం రొంపిచర్లలో గడిచింది. ఇతని తండ్రి రాజకీయ నేపథ్యం గల కుటుంబానికి చెందిన వాడు. వచ్చిపోయే వాళ్లతో ఇల్లు సందడిగా ఉండేది. బాల్యం నుండే ఎంతో హుందాతనాన్ని ప్రదర్శించేవాడని అతని తల్లి చెప్పగా విన్నాం. వల్లంపాటికి సత్యనారా యణ, రాధాకృష్ణమూర్తి అనే ఇద్దరు తమ్ముళ్ళు. శ్యామ లమ్మ, శాంతమ్మ, లలితమ్మ, దేవకి, శకుంతల అనే ఐదు మంది చెల్లెళ్ళతో బాల్యం ఆటపాటలతో సాగి పోయింది. వల్లంపాటి నంవన్న కుటుంబంలో జన్మించడం వల్ల ఏలోటూ లేకుండా జీవితం హాయిగా సాగింది.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య సాహిత్యం :

వల్లంపాటి ఎన్నో గ్రంథాల్ని చదివి బాగా ఆకళింపు చేసుకొన్నాడు. చదువుకునే రోజుల్లోనే సృజనాత్మక రచనలు చేశాడు. అతడు కథా, నవలా రచయితగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించు కున్నాడు. చిన్నతనంలో కవిత్వాన్ని రాసే ప్రయత్నం చేశాడు. అలా వ్రాసిన కొన్ని పద్యాలను ఒకసారి పుట్టపర్తి నారాయణాచార్యులకు చూపించాడు. అప్పటికే పుట్టపర్తి వల్లంపాటి కథలు, నవలలు చదివాడు. నవలల్లో కొన్ని తార్కిక ఆలోచనల్ని గమనించి ఆ విషయాన్ని వల్లంపాటికి

చెప్పి విమర్శనా రంగంలో కృషి చేస్తే బాగుంటుందని సలహా ఇచ్చాడు. విమర్శనా రంగంలో రానించాలంటే నిష్పాక్షికమైన మనస్తత్వంతోపాటు, విస్తారమైన జ్ఞానం, అనువర్తన, విశ్లేషణ సామర్థ్యం కావాలి. ఇతర భాషలతో పరిచయం ఉండాలి. అందుకే పుస్తకాల్ని బాగా చదవాలి. సాహిత్యాన్ని, వాటిపై వచ్చిన వ్యాఖ్యల్ని, సమీక్షల్ని, విమర్శల్ని చదివాడు. వాటితోపాటు లక్షణ గ్రంథాలను ప్రాచీన, ఆధునిక రచనల్ని చదివి విజ్ఞానాన్ని వివేచించాడు. ఆ దిశగా అధ్యాయనాన్ని కొనసాగించాడు. అప్పటి నుండి రాయడం కంటే చదవడం పైనే ఎక్కువ దృష్టి పెట్టి విశ్వనాథ సత్యనారాయణ గారి 'శ్రీ మద్రామాయణ కల్పవృక్షం - శూర్పణఖా ఖండం' మీద ఒక వ్యాసాన్ని రాసి విశ్వనాథకు చూపించారు. విశ్వనాథ వెన్నుతట్టి ప్రోత్సహించారు. అలాగే వల్లంపాటికి కన్నడ భాష కూడా తెలుసు కాబట్టి కన్నడ నుంచి తెలుగులోకి, తెలుగు నుంచి కన్నడలోకి, తెలుగు నుంచి ఆంగ్లంలోకి కొన్ని వ్యాసాలను అనువదించాడు. చరిత్రకు సంబంధించిన కొన్ని గ్రంథాల్ని ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించాడు. వల్లంపాటి కథలు, నవలలు, విమర్శ గ్రంథాలు, అనువాద గ్రంథాలు రాశాడు.

కథకుడిగా వల్లంపాటి :

వల్లంపాటి 1958 'ఆంధ్రప్రభ'లో ప్రచురితమైన 'అన్యథాశరణంనాస్తి' అనే కథతో రచనా వ్యాసంగం ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 70 కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అందులో వల్లంపాటి తన రచనల్లో సమాజంలో సామాజిక జీవన చిత్రణ, ప్రజల జనజీవన స్థితి గతులను ఎంతో రమ్యంగా వివరించారు.

సామాజిక జీవన చిత్రణ :

మానవుడు సంఘజీవి. మనిషికి సంఘానికి విడదీయరాని సంబంధం ఉంది. సమాజంలోని వ్యక్తులందరు సత్సంబంధాలు కల్గినపుడు మాత్రమే తమ సామాజిక జీవన కార్యక్రమాలు సాగించగలరు. తాను నివసించే సమాజంలో కొన్ని కట్టుబాట్లకు అనుగుణంగా జీవిస్తాడు. ఇలా మానవుడు అందరికీ ఆమోదయోగ్యమైన జీవనవిధానాన్ని కొనసాగిస్తారు. సంఘంలో కుల, వర్ణ, జాతి మొదలైన అంశాలు సామాజికాంశాలుగా చెప్పవచ్చు.

ఒక ప్రాంతాన్ని బట్టి కాని భౌగోళిక పరిస్థితిని బట్టి సామాజికాంశాలు మారుతు ఉంటాయి. మనిషి సమాజంలో జీవించాలంటే అనేక సామాజిక విషయాల్ని తెలుసుకోవాలి. ఇలాంటి విషయాలు కథా సాహిత్యానికి ఎంతో దోహదపడుతుంది.

వల్లంపాటి కథలలో ఇలాంటి ఎన్నో సామాజికాంశాలు చోటు చేసుకొని ఉన్నాయి. వాటిలో కులాలు, వృత్తులు, వ్యాపారాలు, ఆహారపు అలవాట్లు, ఆర్థిక పరిస్థితులు వంటివి చెప్పుకోదగ్గవి.

కులాలు :

వేదకాలం నుంచి చతుర్వర్ణ వ్యవస్థ భారతదేశంలో వేళ్ళూనుకొని ఉంది. సర్ హెర్బర్ట్‌రిస్లే "ఒక మూల పురుషుడు కలిగి ఒకే వంశిక వృత్తిని పాటిస్తూ, అంతర్వివాహం మాత్రం చేసుకొని ఒకే పేరుతో చలామణి అయ్యే కొన్ని కుటుంబాలు లేదా బంధుత్వ సమూహాల సాధర్మ సమూహాన్ని కులాలు" అంటారు అని అన్నపురెడ్డి వేంకటేశ్వరరెడ్డి నిర్వచించాడు.

వృత్తుల ఆధారంగా కులాలు ఏర్పడ్డాయి. 'కులం' అంటే 'వివాహం' లేక వంశానుక్రమంతో అనుసంధానం పొందిన ఒక సమూహం. కులం అనేది తరతరాలుగా వస్తున్న ఒక భావన. ప్రస్తుత కాలంలో సమాజంలో బ్రతకడానికి అన్ని కులాలవారు అన్ని రకాల పనులను చేస్తున్నారు. దీనివల్ల కుల ప్రాధాన్యత రోజురోజుకు తగ్గిపోతోంది. మానవులంతా సమానం అనే భావన పెరిగిపోతుంది.

వల్లంపాటి తన కథలలో సందర్భానుసారంగా కుల ప్రస్తావనను వివరించడం జరిగింది. ఇందులో బ్రాహ్మణ, రెడ్ల, దొరల, జమిందారుల, నాయుడు, చౌదరిల కులాల ప్రస్తావన ఎంతగానో వివరించడం జరిగింది.

వృత్తులు :

మానవుడు బతుకుదెరువు కోసం ఏర్పరచుకున్న ఏ

పనినైనా 'వృత్తి' అంటారు. జన్మతః మనిషి కులపరంగానూ, వర్గపరంగానూ, మతపరంగానూ జీవనభృతి నిమిత్తం ఏర్పడిన పనిని 'వృత్తి' అంటారు. పూర్వం భారత దేశంలో ప్రజలు అధిక భాగం వృత్తులపై ఆధారపడి జీవించేవారు. నేటికి అనేక వృత్తులవారు కులవృత్తిపై జీవనం సాగిస్తున్నారు. ముందుతరం వారు ఒకే వృత్తి సాగించడంవల్ల, వారు మరింత నేర్పు, నైపుణ్యం ప్రదర్శించేవారు.

''జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులంతా వంశ పారంపర్యంగా చేసేవనే వృత్తి'' అని ఆచార్య పి. నరసింహారెడ్డి నిర్వచించాడు. ఆధునిక కాలంలో కుల వృత్తులు అంతరించి పోతున్నాయి. నేడు బ్రతుకు కోసం కాకుండా ఆర్థిక పరిపుష్ఠికోసం బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడి పోతున్నారు. ఇలా కులవృత్తులు నేడు ఎంతగానో అంతరించిపోయాయి. వల్లంపాటి తన కథలలో కులవృత్తుల ప్రస్తావన సంతరించుకొన్నది. 'డిప్యూటీ కలెక్టర్', 'టీచర్', 'పూజారి', 'వైద్యవృత్తి', 'పోలీస్', 'ఐ.ఏ.ఎస్.', 'అటెండర్', 'జట్కా', 'పాలేరు', 'వార్డు కౌన్సిలర్', 'మ్యూజిక్', 'వ్యవసాయ' కూలీల వృత్తుల గురించి వివరించడం జరిగింది.

వ్యాపారాలు :

సమాజంలోని ప్రజల అవసరాలకు తగిన వస్తువులను అమ్మి, శ్రమకు తగిన ఫలితాన్ని పొందడాన్నే 'వ్యాపారం' అంటారు. పూర్వ వ్యాపారం వస్తు మార్పిడి ద్వారా జరిగేది. నాణేలు వచ్చిన తరువాత వారి వారి వస్తువులను సంతలో పెట్టుకొని అమ్ముకునేవారు. ఇది కాకతీయుల కాలంనాటి నుంచి సంతలు ఉన్నట్లు సాహిత్యాధారాలు కనిపిస్తున్నాయి. ఇలా వ్యాపారాలను గురించి వల్లంపాటి కథలలో ప్రస్తావన కన్పిస్తుంది. ఇందులో 'సున్నపురాళ్ళు', 'బట్టల వ్యాపారం', 'కూరగాయలు', 'తమలపాకుల', 'ఎరువుల', 'విత్తనాల' వ్యాపారాలు గురించి వివరించడం జరిగింది.

ఆహారపు అలవాట్లు :

మానవుని జీవన విధానంలో ముఖ్యమైనది ఆహారం. మానవుడు బ్రతకడం కోసం ఏర్పరచుకొన్న పదార్థాల్ని 'ఆహారం' అంటారు. ఆహారం అనేది మానవునికే కాదు సకల ప్రాణకోటికి ప్రధానమైనది. నాడు ఆదిమ మానవుని నుంచి నేటి ఆధునిక మానవుడి వరకు ఆకలి తీర్చుకొనే వారు. వృక్షాలు మాత్రం కేవలం నీటిపై, సూర్య రశ్మిపై ఆధారపడి ఆహారాన్ని తయారు చేసుకొంటాయి. వల్లంపాటి కథలో ఆహారపు అలవాట్లు శాఖాహారం, ద్రవ పదార్థాలు, పండ్లు, కాయల ప్రస్తావన గురించి సవివరంగా వివరించడం జరిగింది.

ఆర్థిక పరిస్థితులు :

మానవుని జీవనస్థాయిని తెల్పునది ఆర్థికస్థితి అంటారు. ఆర్థికంగా పుష్టి కల్గినవారు సుఖసంతోషాలతో జీవనం సాగిస్తారు. మనిషి తన పొట్ట నింపుకోవడానికి, తన కుటుంబాన్ని సంసారాన్ని నడపడానికి ఆర్థిక స్వావలంబన ఎంతైన అవసరం. నేడు ఆర్థిక పునాదులపై మనిషి జీవనం ఆధారపడి ఉంటుంది. వల్లంపాటి కథలలో ఆర్థిక పరిస్థితులను గురించి ఎన్నో అంశాలను ప్రస్తావించాడు. ఇలా వల్లంపాటి కథ లలో సామాజిక జీవన చిత్రణను ఎంతగానో వివరించడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. వల్లంపాటి కథలు - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
2. వల్లంపాటి సాహిత్య వ్యాసాలు - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. వల్లంపాటి కథా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
4. తెలుగు సామెతలు - జనజీవనం - డా॥ పి. నరసింహారెడ్డి
5. సమాజశాస్త్రం - పరిచయం సూత్రాలు - అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు సాహిత్యంపై స్త్రీవాద సాహిత్య ప్రభావం

– డా॥. ఐ.వెకు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వ), చిత్తూరు.

తెలుగు సాహిత్యంపై ఆధునిక కాలంలో అనేక సాహితీ ప్రక్రియలు ప్రభావితం చేసాయి. ముఖ్యంగా జాతీయోద్యమ, కాల్పనిక, అభ్యుదయ, విప్లవకవిత్వోద్యమాలు ఎక్కువగా ప్రభావితం చేసాయి. ఈ ప్రక్రియల అనంతరం అత్యంత ప్రభావం చూపిన ఉద్యమం స్త్రీవాదం. ముఖ్యంగా స్త్రీవాదం 1975 తరువాత రూపుదిద్దుకొని 1985 నుంచి స్థిరపడి క్రమంగా అన్ని ప్రక్రియలపై విస్తరించింది. ఈ ప్రక్రియ ఆంగ్లంలో ఫెమినిజం అన్న పదానికి సమానార్థకంగా తెలుగులో ''స్త్రీవిముక్తి'' అనీ, ''స్త్రీ విమోచనోద్యమం'' అనీ రకాల పేర్లతో ఉన్నది. అయితే వీటన్నిటి తరువాత ''స్త్రీవాదం'' అన్నపేరుతో వాడుకలో ఉన్నది.

తెలుగు స్త్రీవాద సాహిత్య నేపథ్యాన్ని పరిశీలిస్తే అమెరికాలో 1966 తర్వాత స్త్రీలవిముక్తి బృందాలు ఏర్పడ్డాయి. ఇంటి చాకిరికి జీతం ఉండాలనే నినాదం కూడా 1970 తరువాత అమెరికాలో ఉద్యమరూపం దాల్చింది. ఓటు హక్కు, విద్యాహక్కు, ఎన్నికల్లో పోటీచేసే హక్కు వీటన్నింటిని స్త్రీలు పోరాటం ద్వారానే సాధించారు. ఈ సామాజిక ఉద్యమాలతోపాటు కొందరి స్త్రీల రచనలు కూడా భారతదేశంలో స్త్రీవాద ఉద్యమానికి ప్రేరణ నిచ్చాయి. వాటిలో ముఖ్యంగా చెప్పకోదగినవి 1792లో ఇంగ్లండు రచయిత్రి 'మేరీహల్ స్టోన్ క్రాఫ్ట్' రచించిన 'ఇండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్' స్త్రీల హక్కుల గురించి చర్చించిన మొట్టమొదటి పుస్తకం. 1942లో ఫ్రెంచి రచయిత్రి సైమన్-డి-బోరా రచించిన 'ది సెకండ్‌సెక్స్' మొదలగు రచనలు స్త్రీవాద సాహిత్యాన్ని ప్రభావితం చేసాయి.

స్త్రీవాద సాహిత్య చర్చకు దోహదం చేసిన ప్రధానాంశాలు.

1. స్త్రీ పతనానికి, అణచివేతలకు కారణమైన పురుషాధిక్య భావజాలం గుర్తించడం.
2. పునరుత్పత్తి, లైంగికత్వం, అనేభావనలు స్త్రీ జీవితాన్ని ఎలా నియంత్రిస్తున్నాయో చర్చించడం.
3. స్త్రీల శరీరాలకూ, మనస్సుకూ, వివాహవ్యవస్థకూ సంబంధించి తరతరాలుగా నిలిచిపోయిన సంఘటనలు.
4. ఇంటిచాకిరీ, పిల్లలు పెంపకం మొదలైనవి కూడా ఉత్పత్తిలో భాగంగా చేర్చాలని స్త్రీవాదం చెప్పడం.
5. పితృస్వామ్య వ్యవస్థ, కుటుంబ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపడమే కర్తవ్యంగా భావించడం.
6. స్త్రీని ఆమె పోషించే రకరకాల 'పాత్ర'ల ద్వారా కాక, ఒక వ్యక్తిగా గుర్తించవలసిన సమయం ఆసన్నమైనదని చెప్పడం.

తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం :

తెలుగు సాహిత్యంలో ఎంతోమంది కవయిత్రులున్నారు. తిమ్మక్క నుంచి కవితా ప్రస్థానం ప్రారంభమైనా, స్త్రీవాద సాహిత్యం తెలుగులో 1972లో ఓల్గా రాసిన ''ప్రతి స్త్రీ ఒక నిర్మలకావాలి'' అన్న కవితలో స్త్రీవాదం ప్రారంభమైందని చెప్పవచ్చు. అయితే అది ఉద్యమ రూపం దాల్చి, ఒక ప్రభంజనంగా మారి సమ కాలీన సాహిత్యాన్ని ఒక ఊపు ఊపడం 1977 తరువాత జరిగింది. ''నీలివేఘాలు'' తెలుగులో తొలి స్త్రీవాద కవితా సంకలనం.

స్త్రీవాద అస్తిత్వం :

స్త్రీల అస్తిత్వమంటే వాళ్ళ శరీరాలనే భావనను స్త్రీవాద కవిత్వ ఖండించింది. శిలాలోలిత 'రేవతిదేవి' తనకవిత ''పరాయి ముఖం'' లో

"ఆగీ ఆగకుండా, నన్ను, నేను వెతుక్కునేదారిలో
ప్రతిసారీ ముఖం కనిపించని
శరీరమే కనిపిస్తుంటుంది"

అని తన వేదన వ్యక్తం చేస్తుంది.

స్త్రీ స్త్రీగా మాట్లాడటాన్ని సహించలేక పోవడం కూడ ఆమె అస్తిత్వాన్ని నిరాకరించడమే. తాము ఏది మాట్లాడాలో ఏది మాట్లాడకూడదో నియంత్రించే పురుషస్వామ్య సంస్కృతిని రేవతిదేవి ఇలా వ్యాఖ్యానించింది.

"ఇన్నాళ్ళూ గంగలా మాట్లాడితే
నే చెప్పాల్సిందేమీ లేనందున
నేనేం చెప్పినా విన్నారు
ఇప్పుడేమో నాకూ చెప్పాల్సిందేదో ఉంది....
మాట్లాడబోతే
ఎవరు వినిపించుకోరు
అందుకో మరెందుకో
ఈ గొంతు మూగబోయింది"

(మూగవోయిన గొంతు, శిలాలోలిత సంకలనం)

స్త్రీల అస్తిత్వానికి సంబంధించిన ఇతర కవితలు వాణీరంగారావు రాసిన 'ఆడది' వసంత కన్నాభిరావ్ 'అస్మిత' మొదలగునవి.

మాతృత్వం :

మాతృత్వంలోని ఆనందాన్ని అంగీకరిస్తూనే, దాని వెనక ఇమిడివున్న శరీర హింసను, స్త్రీల నిర్ణయాలతో అభిప్రాయాలతో ప్రమేయంలేని మాతృత్వస్థితికి స్త్రీవాద కవయిత్రులు అద్భుతంగా చిత్రించారు. పునరుత్పత్తి హక్కుల గురించి స్త్రీని "సంతానాన్ని కనే యంత్రంగా" చూడటాన్ని వసంత కన్నాభిరావ్ "శారీరం" అనే కవితలో.

"దిరిద్రుడు బిడ్డలతో నా శరీరాన్ని పుచ్చింది
తన జాతిని కొనసాగిస్తే
ధనికుడు మరిన్ని మందులతో
సాగరాన్ని ఎడారిలా ఎండగడుతున్నాడు".

లైంగిక వివక్ష :

స్త్రీ పురుషుల మధ్య బాల్యం నుంచి చూపే వివక్ష, ఆడపిల్లను పుట్టుకముందే చంపడం వరకూ విస్తరించింది "వామనుడి మూడోపాదం"లో జయప్రభ

"విక్రమించే వామనుడి
మూడో పాదమై పెరిగి పెరిగి
ఆడ జాతిపై
ఆఖరు అడుగు పెట్టబోతోంది
అది
అక్కడ మాత్రమే జరుగుతున్నదికాదు
విశ్వవ్యాప్తంగా
గర్భంలో పెరిగే శిశుదశనుంచీ
ఆడతనంపై హత్యాచారం" అని పేర్కొంది.

పుట్టిన తరువాత, ఆడపిల్ల వృద్ధాప్యం వచ్చేవరకు ఎలాంటి నియంత్రణలో నిర్లక్ష్యంలో, చులకనలో బతుకుతుందో రజయాబేగం కింది కవితలో పేర్కొంది.

"బాల్యంలో
చిన్నపిల్లవి నీకెం తెల్సుకూర్చో" అన్నారు.
యవ్వనంలో
ఉడుకు రక్తం మంచీ చెడూ తెలీదుకూర్చో అన్నారు.
వృద్ధాప్యంలో
"ముసల్దానివి ఇంకేం చేస్తావ్‌కూర్చో అన్నారు.
అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు
కూర్చొని, కూర్చొని బద్ధకం వచ్చినందుకు బాధగా వుంది".

అని స్త్రీ జీవితం పురుషస్వామ్యం చూపే వివక్షవల్లా, నియంత్రణవల్ల ఎలా నిశ్శబ్దమై పోయిందనేది వర్ణించింది.

వివాహానంతర స్త్రీ జీవితం :

పితృస్వామ్య వ్యవస్థలోని అణచివేత విశ్వరూపం దాల్చేది, వివాహ వ్యవస్థలోనే 'పెళ్ళి' అనే రెండక్షరాల మాటఎలా 'శిక్ష'గా పరిణమిస్తుంటే మన సంస్కృతిలో అనునిత్యం వాడే మాటలే, పెళ్ళంటే ఆడపిల్లకు 'శిక్ష' అనే భావాన్ని ఎలా కలిగిస్తున్నాయో అత్యద్భుతంగా చిత్రించిన సావిత్రి "బందిపోట్లు" కవిత స్త్రీవాద కవితా స్వభావాన్ని పూర్తిగా అందిపుచ్చుకున్న తొలికవితగా విమర్శకులు భావిస్తారు.

"పాఠం ఒప్పుచెప్పకపోతే పెళ్ళి చేస్తానని
పంతులు గారన్నప్పుడే భయం వేసింది.

పెళ్ళంటే 'పెద్దశిక్ష' అని
మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని
మనం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని"

వర్ణించడం జరిగింది.

వివాహానంతరం స్త్రీ ఎన్ని రకాల అవతారాలు ఎత్త వలసి వస్తుందో చెప్పుంది మందరపు హైమవతి

"కుక్కర్ విజిల్స్‌లోనే
మనోజ్ఞ సంగీతం వింటాను
పతిదేవుని టేబిల్‌పై
కాఫీ కప్పుగా, మీల్స్ కారియర్‌గా
పిల్లల లంచ్ బాక్స్‌లుగా
బహుపాత్రాభినయపోటీలో
నాచేతుల కెప్పుడూ ఫస్ట్ ప్రైజే"

వివాహం తరువాత స్త్రీ తన ఉనికిని కోల్పోయి, కుటుంబ విధుల్లో తన అస్తిత్వాన్ని మరుగు పరచడాన్ని, ఈ కవితలు వ్యాఖ్యానించాయి. మొక్కపాటి సుమతి తన 'మిత్ర వైరుధ్యం'లో భర్తను దుష్ట శత్రువుగా సంబోధించి తన కలల్ని చెరిపేస్తాడని అంటుంది. వివాహ జీవితంలో చేదుతనంపై, రాజీలు, మొహమాటంలు, కృత్రిమత్వాలపై పాటిబండ్ల రజని, రాజీ చేసుకోవాలి, ఘంటసాల నిర్మల 'జుగల్‌బందీ', ఓల్గా 'దాంపత్యం', వంటి గొప్ప కవితలు వచ్చాయి.

కుటుంబ జీవితం :

కుటుంబంలో స్త్రీ నిర్వహించవలసిన అనేక పాత్రలు, ఆమెపై వాటి ప్రభావాలు, స్త్రీవాద కవితకు ప్రధాన వస్తువు లయ్యాయి. కుటుంబ వ్యవస్థలో కనిపించీ కనిపించని అణచివేత, దౌర్జన్యం, స్త్రీ అస్తిత్వాన్ని నిర్మూలించే వైనం అనే కవితల్లో చిత్రింపబడ్డాయి.

ఇంటి చాకిరీ స్త్రీ జీవితాన్ని ఎలా పరిమితం, సంకుచితం చేస్తుందో, ఆమె అస్తిత్వాన్ని ఎలా హరిస్తుందో విమల తన 'వంటిల్లు' కవితలో అద్భుతంగా వర్ణించింది. 'వంటింటి ఆట'తో స్త్రీ బాల్యం ప్రారంభమౌతుందని చెబుతూ

"మా అమ్మ మా అమ్మమ్మా
ఇంట్లో అమ్మలంతా ఇక్కడ 'స్త్రీ'లయ్యారట....
భయం, భయంగా, నిశ్శబ్దంగా, నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
అనలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా ఉంటుంది...
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మేరాణి
అయినా, చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా
మానాన్న పేరే"

స్త్రీవాద స్పృహతో ప్రారంభమై, వంట ఇళ్ళను, స్వంత ఆస్తిని కూల్చేద్దామన్న నినాదంతో, మార్క్సిస్టు దృక్పథంతో ఈ కవిత అంతమవుతుంది. కుటుంబ జీవితంలో నిర్బంధం గురించి జయప్రభ, జయ, రజని తదితరులు చక్కని కవితలు రాశారు. వరకట్నం, మూఢాచారాలు వంటి కుటుంబ సంబంధమైన విషయాలపై అణచివేత గురించి రాశారు.

ఇంటి నుంచి బయటకు వచ్చిన స్త్రీ ఎదుర్కొనే సమస్యలు, పురుషాధిక్య సమాజం, వాటిని కించపరచి, అవమానించి, అణచివేసే విధానాలు కవితా వస్తువు లయ్యాయి. మెహందీ స్త్రీల విజ్ఞప్తిలో ఓల్గా ఒక యువకుడి మరణం వల్ల మెహందీ స్త్రీలపై జరిగిన పోలీసుల దాడికి స్పందిస్తూ

"ఓ మగ మద మృగాల్లారా
మీరు మీ ఇళ్ళల్లో చావండి...
మాకు మిమ్మల్ని సుఖపెట్టడమే తెలుసు
చావటానికి మాదగ్గరకు రాకండి
బతకటానికి నానాచావు చస్తున్నవాళ్ళం"

అని వర్ణించింది.

స్త్రీవాద కవిత్వం పుట్టి పాతికేళ్ళు గడిచాయి. ఈ కవితా ప్రస్థానంలో ప్రపంచాన్ని, జీవితాన్ని స్త్రీల కోణం నుంచి విశ్లేషించడంలో సఫలమయ్యారు. విమర్శలకు నిందలకు ఆరోపణలకు లొంగిపోకుండా స్త్రీవాద కవయిత్రులు తమ సంఖ్యను తమ రచనా వస్తువులో నవ్యతను చేర్చు కుంటూ ముందుకు సాగుతున్నారు. స్త్రీవాదులు పోరాటం పురుషులపై కాదనీ, పురుషాధిక్య సమాజంలో పైనేననీ తమ పాఠకులకూ, విమర్శకులకూ విడమర్చి చెప్పడంలో కృతకృత్యులవుతున్నారు. స్త్రీ పురుషుల మధ్య ఆధిపత్య, అధికారం సంబంధాలు పోయి, పరస్పరం గౌరవించుకునే సమస్థాయి సంబంధాలు ఏర్పడాలన్నదే తమ లక్ష్యమని స్త్రీవాద కవయిత్రులు నిరూపించారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి
2. తెలుగు కవిత్వోద్యమాలు - యస్.వి.సత్యనారాయణ
3. తెలుగు సాహిత్యవిమర్శ - డాక్టర్ వెలమల సిమ్మన్న

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

బోయిభీమన్న – 'గడ్డిపిల్ల' – దళిత సామాజిక స్పృహ

– డా॥. జి. శైలమ్మ, ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

సామాన్యులు కూలిపనులు చేసుకొనో, వేటాడో, పాలేర్లుగా పని చేసి జీవిస్తుంటారు. పని చేస్తే గాని కడుపు నిండని స్థితి కొందరిది. ఈ క్రమంలో భారతదేశంలో నెలకొన్న కులవ్యవస్థ మనుషుల మధ్య బేధాన్ని సృష్టించింది. 'కులం' అనే పదం మనుషుల మధ్య బేధాన్ని సృష్టించడమే కాక న్యూనభావానికి గురైన వెనుకబడిన కులాల వారిని చూస్తుంటాం.

కులానికి - ఆర్థిక విధానానికి సంబంధం వుంది. సాధారణంగా దళిత సామాజిక వర్గానికి చెందిన జనులను, వారి ఆర్థికలేమిని గుర్తించలేనంతగా వుండదు. వారిని చాల సులభంగా గుర్తించవచ్చు. మాల మాదిగలు మనుషులే. ఇంకా అనేక ఉపకులాలున్నాయి. వారికి మనస్సుందని, వారిని మనుషులుగా గుర్తించాలని కవులు, సామాజిక ఉద్యమకారులు ప్రయత్నం చేయడం జరిగింది.

మానవ సమాజంలో మిగిలిన ప్రాణులకంటే శ్రేష్ఠమైన వారుగా మనుషులకు గుర్తింపు వుంది. మనుషుల మధ్య ఆధిపత్య ధోరణి వుంది. 1915లో మంగిపూడి వేంకటశర్మ దళితుల్ని ఉద్దేశించి రచించిన ''నిరుద్ధ భారతం'' పద్యకావ్యంలో. దళితులు ఈ దేశ ఆర్థిక సంపదలో పాలి భాగస్తులు కాకపోవడాన్ని గుర్తించి తెలియజేశారు. దళితులు ఏ విధంగా అణచివేతకు గురౌతున్నారో తెలియ జేశారు.

మాలమాదిగల పట్ల అనాదిగా కొనసాగుతున్న అంటరానితనమన్న దురాచారాన్ని గురజాడ ఖండించారు. దళితులను మనుషులుగా గుర్తించినప్పుడే ధర్మమవు తుందని తెలియజేస్తాడు.

"మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగ రెండెకులములు
మంచి యున్నది మాలయైతే
మాలనే నగుదున్"

అని గురజాడ ధైర్యంగా ప్రపంచానికి తెలియజేశాడు.

సమాజంలోని దురాచారాలను ప్రజలకు చేరువ చేయడంలో గేయ ప్రక్రియ చరిత్ర సృష్టించింది. గేయాన్ని ఆయుధంగా చేసుకొని అనేక రచనలు చేసిన బోయి భీమన్న నాగమ్మ, ఏల్లయ్య దంపతులకు రెండో సంతానంగా 1911 సెప్టెంబరు 19వ తేదీన జన్మించాడు. బీమన్న పుస్తకాలు మాత్రమే చదవలేదు. మనుషుల జీవితాన్ని పుస్తకాలుగా చేసి చదివాడు. అనేక ఉద్యోగ బాధ్యతలను చేపట్టాడు. ఆధునిక కవితా ప్రక్రియలు, నవలలు, నాటకాలు, కథలు రచించాడు. తెలుగు సాహిత్యంలో తనదైన గుర్తింపుని పొందాడు.

బోయి భీమన్న రాసిన 'పనిపిల్ల'. దీని ద్వారా నూతన సమాజాన్ని సృష్టించడానికి ప్రయత్నం చేశారు. దళితులు ఆర్థికంగా విద్యాపరంగా, సామాజికంగా వెనుకబడి వుండటం. తరాలు మారినా మారని వారి బ్రతుకులు కులాంతర వివాహంతో మారవచ్చని ఆశించాడు. కుల వ్యవస్థ అంతరించాలంటే కులాంతర వివాహాలు తప్పని సరి అని అంబేద్కర్ సూచించాడు. ఇదే ఆలోచనను చక్కని గేయ రూపంలో రచించారు బోయిభీమన్న.

ఇదొక ''జానపద గేయ కథ. ఇందులో ధనిక వర్గానికి చెందిన వ్యక్తి కింది కులానికి చెందిన మాలపిల్లను వివాహం చేసుకొని నూతన శకానికి నాందీ పలుకుతాడు. నాగేంద్ర శర్మ ఈ గేయంలో ప్రధాన పాత్ర. అగ్రవర్ణస్తుడు. పచ్చని పొలాల్లో షికారుకెళ్లడం అలవాటుపడిన వ్యక్తికి పొలంలో గడ్డికోస్తున్న పిల్ల కనిపిస్తుంది. ఆమెను చూసి ఆమెతో పరిచయం పెంచుకొంటాడు.

పరిచయంగా మొదలైన వారి మధ్యకవి అనేక ప్రశ్నలు

లేవనెత్తుతాడు. ఎందుకు ఆర్థికంగా వెనుకబడున్నారో పాఠకునికి తెలియజేస్తారు.

దళితులు శ్రమపడటం, విద్య, ఉద్యోగాలు లేక పోవడం, దుస్తులు, ఆహారం లేకపోవడాన్ని గమనించాడు. వివాహంతో దళితుల జీవితంలో కొంతవరకైనా నింపొచ్చని కవి ఆశిస్తాడు.

శ్రమపడటం :

దళిత సామాజిక వర్గంలో చేతనైన పని చేసుకొని జీవించడం, శ్రమకు తగిన ఫలితం పొందలేకపోవడం. అవసరాల కోసం అప్పు తీసుకొంటే అప్పు మీద అప్పు, వడ్డీ మీద వడ్డీ వేసి దళితులను పాలేర్లుగా జీవింప చేయడం శ్రమదోపిడీ చేయడం అలవాటైంది. బానిస బ్రతుకు జీవనంలో నుండి బయటకు రాలేకపోవడం దళితులు కష్టాలు అనుభవించడం జరుగుతుంది.

"పైరు చేలగట్టల్లో / పచ్చగడ్డికోసేవు / పచ్చపచ్చ పూలల్లో / పైరుగాలి కాడేవు / పైరు చేలు పచ్చగడ్డి / పైడి పూలు నీవేనా? పు. 668.

గడ్డికోస్తున్న స్త్రీ సొంత పొలంలో పని చేయడంలేదు. కూలి కోసం మరొకరి పొలంలో పని చేస్తుంది.

"పైరు చేలు మావికావు / పచ్చగడ్డి కామందుకి / పేదలమాపాటుచూచి / శీదరపడతావు నువ్వు" పు:668.

కష్టపడి పని చేయడం వల్ల ముఖానికి చెమట పడుతుంది. శ్రమపడటంవల్ల అందం నశించిపోతుంది. వాడిపోయిన పుష్పంలా ముఖం వాడిపోతుంది. పచ్చంగా వుండాల్సిన పొలం నల్లంగా అయిపోతే చూడలేం. అదే విధంగా ముఖం కూడా మారిపోయే అవకాశం వుంది. దళిత స్త్రీలు సౌందర్యం పట్ల శ్రద్ధ లేకపోవడానికి గల కారణం, పూట గడవటం కోసం అనుభవిస్తున్న కష్టాన్ని మన ముందుంచుతాడు.

"తామర పూవంటి నీ / మోము వాడిపోతున్నది / మాడగ నేలా యెండల? / మానివేయరాదా పని? / సస్యామల వనసీమల / శ్యామలవై పోతావో! పు:670.

స్త్రీ ముఖాన్ని పద్మంతో పోల్చడం, కన్నులను పద్మముతో పోల్చడం సాహిత్యంలో అనాదిగా వస్తున్న సంప్రదాయమే. తామర పువ్వు వంటి అప్సరస స్త్రీకి వర్ణించడం చూసింటాము. ఇక్కడ దళితస్త్రీని వర్ణించడం గమనార్హం. సస్యం అంటే పచ్చదనం. పచ్చదనంతో నిండిన వనంలాగా వున్నావు అంటాడు. వెంటనే ఇలాగే ఎండలో పని చేస్తే శ్యామలమై (నలుపై) పోతావు అని అనటం స్త్రీలు అందంగా ముద్దుగా వుండాలే తప్ప ఇలాగ కష్టపడ కూడదు అని చెప్పడం జరిగింది. దళిత వర్గంలో స్త్రీలు అందానికి ప్రాధాన్యత ఇవ్వక, పని చేయడానికి, పని చేయాల్సిన అవసరం, బాధ్యతలుంటాయని తెలియ జేస్తాడు.

గుర్రం జాషువా గబ్బిలంలో చెప్పులు కుట్టి జీవనం చేసి ప్రపంచానికి భోజనం పెడుతున్నాడంటే పని పిల్లతో బోయి భీమన్న దేశాభివృద్ధి చెందుతున్నదని అంటాడు.

"పని మానుదునా నేను? / పంటలెలా పండుతాయి? / పాడీ, పంటా లేక..... / ప్రజలెల్లా బ్రతుకుతారు? / చస్తేనే ఛస్తాను / చావుకన్న సుఖముందా? పు : 670.

పని చేయకపోతే తను మాత్రమే కాదు పస్తులుండేది. ఈ దేశమంతా పస్తులుంటుంది. ప్రజలందరికి కడుపు నిండా కూడు దొరుకదని అంటుంది. దేశంలో బ్రతికున్నన్ని రోజులు పని చేయాల్సిందేనని, పని చేయకుండా వుండడం మరణం ఒక్కటే మార్గమని తెలియజేస్తాడు.

ఉనికి :

ప్రతి జీవికి ఉనికి పరిధి వుంటుంది. కుక్కకు ఒక ముద్దను ఆహారంగా వేస్తే ఇంటి దగ్గరేవుంటుంది. కాపలా కాస్తుంది. దళితులు పని చేస్తుంటారు. చెత్త పని పెంటపని ఏదైనా ఇష్టంగా చేస్తారు. కాని వారికి గుర్తింపు లేదు అన్నది చరిత్ర చెప్పుతున్న సత్యం.

'కామందుల యింట్లోను / నామాటే యెవరెత్తరు, / ఎవరో యీ యబ్బాయీ! / ఎంతో కలిసెగమ్మాగా; పు : 677.

పని చేసుకొంటున్న దళిత స్త్రీని ఒక కామాందు పిల్లవాడు పలకరిస్తాడు. నీకు కష్టాలు ఎందుకొచ్చాయి అని అడిగి తెలుసుకొంటాడు. ఇక కష్టపడే అవసరం లేదు అని అంటాడు. ఇంత బాగ అగ్రవర్ణస్తులు పలకరించరే ఎన్నో ఏళ్ల నుండి తాతముత్తాతల నుండి పాలేర్లుగా పని చేస్తున్నాం. మమ్మల్ని ఈ విధంగా మా కామందులు పలకరించలేదని తెలియజేస్తుంది.

దుస్తులు: శరీరాన్ని దాచుకోవడానికి దుస్తులు ఎంతో అవసరం. అలాంటి దుస్తులు వంటి నిండా కప్పుకోడానికి లేవని అంటాడు. ఎంతో కష్టపడి పని చేస్తున్నప్పటికి బట్టలు కొనుక్కోమని డబ్బులు ఇవ్వరు. కూలీ డబ్బులు తిండి తినడానికి కూడా సరిపోవడం లేదని తెలియజేయడం. ఇంకా పని పాట చేయని వారు పట్టుదుస్తులు ధరిస్తున్నారని అంటాడు.

చిన్నప్పటి నుంచీ నీ
చేలల్లో పని చేస్తును,
కోకైనా, రైకైనా
కొనుకో గలిగానా? పు : 677.

నిష్మూరంగా ప్రారంభమై ఎంతోకాలంగా పని చేస్తున్నా నని అంటుంది. ఫలితంగా ఎంతో ధనవంతురాలిని కావాలి అంటుంది. ఆమె ధనవంతురాలు కావాలి కాదా. కాలేదు అని చెప్పు కోక రైక కూడా కొనే స్థోమత లేదని తెలియజేశారు. శ్రమదోపిడీ జరుగుతుండటం వల్ల వారు ఏమి అనుభవించలేక పోతున్నారనేది కవి మనముందుం చాడు.

వివాహం జీవితంలో ఒక్క సారే వస్తుంది. ఈ వివాహా నికి పట్టువస్త్రాలు ధరించడం సహజం. కాని ఈ పెళ్లికూతురు చిరుగులు పట్టిన చీరను ధరిస్తుందని చెప్పడం పాఠకుని ఆలోచింప చేస్తుంది.

"బొట్లు కాటుక లేదు / కట్టబట్టా లేదు / చేరనా యీ చిరుగు / చీరతోటే విభుని - పు : 697.

తన చుట్టు ఎవరూ లేరు. తనకు అలంకరణ వస్తువులు కూడా లేవు. ఎవ్వరు దయచేయ లేదు అన్న విషయాన్ని కవి చాకచక్యంగా చెప్పాడు.

ఒకటైనా మంచి చీర / ఉంటే బాగుండు నంటి / సోయగ ముంటే చాలని / సుస్మిత మయ్యింది తీగ పు : 697.

చెట్లకు దుస్తులు లేవు. పచ్చదనంతో పండ్లు కాయ లతో ఎంతో సోయగంగా చూసే వారిని పరవసింప చేస్తాయి. ప్రకృతి అందాన్ని దాచుకున్న నీకు మంచి చీరలు లేవని బాధపడొద్దు. మంచి హృదయం వుంది. నీతోటే పది మంది బాగుండాలనుకొంటావు. అదే చాలు దుస్తులు లేవని మల్లెతీగ సర్ధిచెప్పిందని అంటాడు.

హింస :

దళితులపై అనాది నుండి దొరల హింస, దొరసానుల హింస, కామందుల హింస కొనసాగుతుంది. దీనికి ప్రధాన కారణం ఆర్థికలేమి. ఆర్థిక స్థోమత లేని కారణంగా మట్టిపనులు వెట్టిపనులు చేసుకొంటూ జీవనం సాగిస్తుం టారు. దళితులను కూడా తమ పిల్లల లాంటి వారే అని ప్రేమించరు. వారి ముఖం చూస్తే వున్నోళ్లకి రోత పుడు తుంది.

"తమ బిడ్డల గారంగా / తనులాగే చూచుకొంటు / నన్నేమో కసిరి కొట్టి / తన్నడానికి కొస్తారు / కామందులు పు : 683.

ఈ రకమైన హింస దొరల పాలన సాగిన ప్రతిచోట ఎక్కువగా వున్నట్లు తెలుస్తుంది. దళితుల ముఖం చూస్తేనే కోపం చిరాకు పడటం జరుగుతుంది. వీరిని కొట్టినా, తిట్టినా, చంపినా కామందులకు ఎదురు తిరిగి మనలేరన్నది దళితులకు తెలుసు అందుకే తన్నడానికి వస్తున్నారని తెలియజేస్తాడు.

ఆహారం :

ప్రతి జీవి బ్రతకాలంటే ఆహారం కావాలి. గాలి నీరుతోపాటు ఎంతో కొంత అన్నం కూర తినాలి. అన్నం

వుడకగా వచ్చిన గంజిలో బలమేమి వుంటుంది. వుండదు కదా. ఈ గంజి పోసి, పని చేసుకురమ్మంటున్న కామందులున్నారని తెలియజేస్తాడు.

"బంగారం గిన్నెల్లో / పరమాన్నం పెట్టుకొని / మూకుడు చిప్పలో నాకు / మురికి గంజి పోస్తారు / కామందులు - పు : 682.

గంజి తాగితే దేహానికి సత్తువ కొంతవరకు వస్తుంది. మట్టిపాత్రలు ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయి. అవే వాటికి పాన వస్తువులు గంజి పాచి పోయినవి కుళ్లిపోయినవి ఇవ్వడం వారు తినడం తాగడం గమనార్హం.

విద్య :

భారత ప్రభుత్వం విద్యను ప్రాథమిక హక్కుల్లో భాగంగా చేర్చింది. ఆరు సంవత్సరాలు నిండిన భారత పౌరులందరికి ఉచిత విద్యను అందించాలని వుంది. దీనికి భిన్నంగా తాను పని చేస్తుండటం, కామందుల పిల్లలు తలదువ్వుకొని శుభ్రంగా బడికెళ్లి చదువుకొంటున్న విషయాన్ని తెలియజేస్తాడు.

"పాసి మొగం తోటే నేను / పనిచేలో మాడాలి / చదువు లేదు, సంధ్య లేదు / చచ్చుబ్రతుకు జీవనం / ఏమో నాకెంటో.... / ఎబ్బెరికం పడుతున్నది - పు:681.

దళితుల జీవన విధానం వారికే విరక్తి, రోత (ఎబ్బెరికం) కలుగుతుందనడంలో పాఠకుని ఆలోచింప చేసేలా వుంది. అంతే కాదు ఈ స్థితికి కారణం ఎవరో కాదు ఈ సంఘమేనంటాడు. దళితులు చదువుకొన్ననాడే మంచి దేశంగా అభివృద్ధి చెందుతుంది. విద్యకు వారిని దూరంగా చేస్తే దేశం ఇంకా వెనుకబడిపోయే ప్రమాదం వుంది.

మూఢనమ్మకం :

ఈ కష్టాలు కన్నీళ్లకు కారణం పూర్వజన్మలో చేసిన కర్మ పుణ్యమని నమ్మడం మనకు కనిపిస్తుంది. పని చేసి జీవించాలన్నది కర్మ అని నమ్మి దు:ఖపడుతూ దళితులు పని చేస్తుంటారు.

"ఏడవడం కన్నా నే / నేమి చేయగలనోయీ? / ఎందుకని రాశాడో / యీ కర్మల నాకు - పు : 676.

ఈ కర్మలు దైవం రాసిందని బాధపడుతున్న ప్రతి ఒక్కరికి కవి సమాధానంగా కర్మలు దైవం రాయరు. అన్నీ కల్పనలే కల్పిత కథలే అని విజ్ఞానం నింపే ప్రయత్నం చేస్తాడు.

"కర్మల రాసే దెవరే / కష్టం పెట్టేదెవరే? / కల్కీ / మన కామందుల / కల్పనలేనే అన్నీ" - పు : 676.

ఇక్కడ దైవమే రాసుంటే స్త్రీలకు కష్టాలను కల్పించడు దళితులకే ఎందుకు కష్టాలుంటాయి. కొంతమంది పని చేయకుండానే అనేక సుఖాలు అనుభవిస్తుంటారు. దీనికి కారణం సమాజమే. సమాజంలో కొందరు సృష్టించే ప్రణాళికలు అని కవి స్పష్టంగా తెలియజేస్తాడు.

వివాహం :

వివాహం చాలా గొప్పది. ఖర్చుతో కూడుకొన్నది. జీవితంలో ఒక్కసారే జరుగుతుంది. వివాహాలు సామాజిక వర్గాన్ని బట్టి వివాహ పద్ధతులుంటాయి. చేమకూరవెంకట కవి విజయ విలాసంలో సుభద్రార్జునుల వివాహ మహోత్సవం భూలోక స్వర్గలోక బంధుమిత్రులు రావడం బంగారు రత్నాలు మాణిక్యాలు, ముత్యాలు పట్టు వస్త్రాలు ఎంతో మహోత్సవ వేడుకగా జరుగుతుంది. దళితుల వివాహం ఖర్చు లేకుండా బంధుమిత్రులు కూడా లేని పరిస్థితిలో వివాహం జరిగే సందర్భం ఈ గేయంలో చూస్తాం.

"పేరంటాలెవ్వరు నా / పేదబ్రతుకులో? నీవే / పేరంటాలివి, చెప్పూ / పెండ్లి రూపు వచ్చిందా? - పు:696

పెళ్లి చేసుకోబోయే వధువరులకు ప్రత్యేక కళ వస్తుంది. అలాంటి కళ ఈమెలో లేదు. పెళ్ళికుమార్తె తోటే చెలికత్తెలుంటారు. వాళ్లూ లేరు.

పెండ్లి యవుతున్నదని / పెద్దయుత్సవంతో / చెప్పకుందామంటె / చెలులెవ్వరున్నారు? - పు : 697.

చెప్పుకోడానికి ఆహ్వానించడానికి ఎవ్వరు లేని ఒంటరి తనం చెప్పలేనంతగా అలముకొన్నది. హృదయంలో తనను ప్రేమించే కామందుల పిల్లవాడు నిండుకొని వున్నాడు. ఎవరికీ తెలియకుండా వాళ్లు పెళ్లి చేసుకోవాలి. కోడికూస్తే లోకం లేస్తుంది. ఈ వివాహం గురించి తెలుసుకున్న కులం కూడా లేస్తుంది. ఎప్పుడు లేస్తుందో తెలీదు. విప్లవం నవ సమాజానికి దోహదం చేస్తుంది.

కోడెప్పుడు కూస్తుందో / కులమెప్పుడు లేస్తుందో - పు:695.

కోడిలేస్తే లోకం మరో దినానికి పురుడుపోస్తుంది. అది కులాన్ని నమ్ముకొని జీవించే వారికి తెలిస్తే వినాశనమే కలుగుతుంది.

సమసమాజం :

దేశంలో కులాలు సమసిపోవాలని కాంక్షించే కవులు, ప్రముఖుల్లో గొప్ప వారు గాంధీజీ గారు ఒకరు. అంబేద్కర్ కులాంతర వివాహాలు చేసుకుంటే దేశంలో కులంపోయి సమసమాజం ఏర్పడుతుందని, ప్రకృతి వీరి వివాహాన్ని ఆహ్వానిస్తుంది.

సర్వోదయ సమాజమే / సాక్షాత్కారమయ్యింది / క్షత్రియ సౌధం హరిజన / సాధ్వీమణి మెట్టుటతో పు:699.

సమసమాజ రూపకల్పన ఈ వివాహంతో మొదల వడం ముదావహం. బోయి భీమన్న మానవ సమాజ రూపకల్పన చేయడానికి పనిపిల్ల జానపదగేయకావ్యం నాంది అయ్యింది.

భారత జననీ పదసే / వాభాగ్యం గైకొండని / బాపూజీ దీవించె / బంగారపు చిరునవ్వుతో / ప్రణయ ప్రణవాక్షత లను / భారతాంబ జల్లిందీ / సుఖజీవులు కండని, తే / జోవంతులుగా మనుడని / పైరు చేలు నవ్వాయి - పు : 700.

వివాహ మహోత్సవాన్ని గొప్పవారు, దేశాభ్యున్నతను కోరుకొనేవారు, ప్రకృతి ఆనందం వ్యక్తం చేసింది.

ముగింపు :

బోయి భీమన్న దళితకవి. దళితులు అనుభవిస్తున్న కష్టాలు కన్నీళ్లు కళ్లార చూసిన అనుభవం నుండి సాహిత్యం పుట్టింది. అందుకే ఆయన రాసిన నవల నాటకాలు కవితలతో నవసమాజానికి నాంది పలికాడు. ఇదొక విప్లవమే. విప్లవం జరిగేతేనే, మనుషులు మారితేనే సమాజం మారుతుంది. మనుషులందరు ఒక్కటే అన్న భావన ఏర్పడుతుంది. అనాది కాలంలో కొనసాగుతున్న వెట్టి చాకిరిని, దళితులు చదువుకి ఎందుకు దూరమవు తున్నారో తెలియజేసి బానిస సంకెళ్ల నుండి పనిపిల్లని విముక్తి కావించాడు.

ఆధార గ్రంథాలు :

1. బోయి భీమన్న నాటకాలు - తెలుగు విశ్వవిద్యాలయం.
2. దళితులు - రాజ్యం - బొజ్జా తారకం.
3. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

లలితానంద్ కవిత – రైతు ప్రతీకలు

– డా॥. జంపాల అనూరాధ, ప్రధానాచార్యురాలు (ఎఫ్.ఏ.సి), ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గార్ల, మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ.

ఆధునిక వచనకవితా రంగంలో 'లలితానంద్' పరిచయం అవసరం లేని పేరు. కవిగా, విమర్శకునిగా, బహుముఖ ప్రజ్ఞతో విభిన్నంగా రచన చేసే ఈ విశ్రాంత ఆచార్యుడు అనేక వ్యాసాలు, ఉపన్యాసాల ద్వారా ఆంధ్ర లోకానికి పరిచితులే. వృత్తి, ప్రవృత్తి వేర్వేరుగా ఉన్నా ఆ రెండింటిని సమన్వయ పరచుకుని ఉద్యోగదక్షునిగా, అధ్యాపకునిగా, కవిగా, సామాజిక విశ్లేషకునిగా, సాహితీ వక్తగా, విద్యార్థినైపుణ్య శిక్షకునిగా వీరి ప్రస్థానం విశేషమైంది. వీరి హైకూలు, వచన కవితలు, స్మృతి కవితలు అన్నింటిలో గ్రామీణ సౌందర్యం ఉంది. రైతు హృదయం ఉంది. విభిన్న ప్రతీకలతో అలరించే లలితానంద్ కవితల్లోని రైతు ప్రతీకలను పరిశీలించటం ఈ వ్యాస ఉద్దేశం. గ్రామీణ వ్యవసాయ నేపధ్యం నుంచి ఉన్నతోద్యోగిగా, అధ్యాపకునిగా ఎదిగినా కవిగా ఆయన హృదయ స్పందనలో రైతు నేపధ్యాన్ని గుర్తించటం ఇక్కడ లక్ష్యం. ఏ కవి అయినా తన మూలాల్ని వదిలి ప్రతీకల్ని ఎంచుకోవటం సాధ్యం కాని పని. ఈ విషయాన్ని ఉదాహరణాత్మకంగా తెలియచేయటం ఈ వ్యాస ప్రయోజనం.

ఉపోద్ఘాతం :

లలితానంద్ ఆధునిక తెలుగు కవిత్వంలో చిరపరచితులైన కవి. 90లలో తన హైకూ కవితతో ప్రఖ్యాతులనీ, సాధారణ కవి ప్రేమికుల్ని విశేషంగా ఆకర్షించారు. ఆయన హైకూల్లోని పల్లె జీవనసౌందర్యం, కర్షకనేపధ్యం పాఠకుల హృదయాల్ని రసభరితం చేసాయి. అప్పటికే ఆయన వచనకవిగా సుప్రసిద్ధులు. వందకు పైగా కవితలతో వెలువరించిన వారి కవితాసంకలనం "అలౌకికం" పండిత ప్రశంసలన విరివిగా పొందింది. స్మృతి కవితగా వెలువరించిన కవితా పొత్తం - "గుర్తుకొస్తున్నాయి" పాఠకుల హృదయాల్ని రసమయం చేస్తుంది.

వీటన్నిటిలో అసంఖ్యాక కవితలు, విభిన్న వస్తు చిత్రణలు ఉన్నాయి. అత్యధికంగా ఈ కవితల్లో కవి తన బాల్యం, యవ్వన దశల్లోని గ్రామీణ జీవన సౌరభాన్ని ప్రతీకలుగా రంగరించి కవిత్వాన్ని రసమయం చేయటం గమనిస్తాం. ప్రకృతి ప్రతీకల్ని స్వీకరించటం, ఆధునిక కవుల్లో అనేకమంది చేస్తున్నపనే. దానికి భిన్నంగా లలితానంద్ రైతు ప్రతీకల్ని అత్యంత సహజంగా, కవితాత్మకంగా ప్రయోగించటం ఇక్కడ ప్రత్యేకత.

లక్ష్యం - ప్రయోజనం :

విలక్షణ ప్రతీకలు, అలంకారిక ప్రయోగాలు ఒక కవితని ఉన్నతీకరిస్తాయి. రసపూర్వకమైన సంతృప్త స్థాయికి పాఠకుడిని చేర్చటంలో వస్తువు, భాష మొదలైన వివిధ విషయాల ప్రాధాన్యత ఉన్నప్పటికీ అతడి హృదయాన్ని తట్టే మొదటి అంశం మాత్రం అలంకారయుత ప్రతీకలే.

ప్రతీకల ప్రయోగంలో కవి తన జీవన మూలల్లోకి ప్రవేశిస్తాడు. తాను అనుభవించిన రసమయ జీవనపు అనేక వర్ణాలు, యధాశక్తి కవితలోకి ప్రవేశించి కవిత్వాన్ని పరిపుష్టం చేస్తాయి. ఈ సత్యాన్ని ఉదాహరణ పూర్వకంగా విశ్లేషించి యువకవులకు తెలియచేయటం ఈ వ్యాసం కోసం నిర్దేశించుకున్న లక్ష్యం. యువకవులు తమ జీవన మూలాల్లోకి లోతుల్ని పతీకలుగా మలిచి, అలంకార యుతంగా ప్రయోగించటం ఎలాగో ఈ కవితల నేపధ్యంగా గ్రహించటం ఈ వ్యాసం సాధించే ప్రయోజనం.

లలితానంద్ - రైతు ప్రతీకలు :

లలితానంద్ కవిగా సుదీర్ఘ ప్రయాణం చేసారు. ముప్పై యేళ్ళకు పైగా వందలాది కవితల్ని సృజించారు. ఎం.కాం, ఎం.బి.ఎ, ఎం.ఫిల్ పూర్తి చేసి ఉన్నతోద్యోగిగా

బాధ్యతలు నిర్వర్తించినా, విశ్రాంత ఉద్యోగిగా విద్యార్థులకి అధ్యాపకునిగా మారినా, రాజకీయ విశ్లేషణా వ్యాసకర్తగా మారినా ఇప్పటికీ లలితానంద్ కవితలో ఎప్పటిలాంటి పల్లెవాసన ఉంది. అది ఇంకా తాజాగా ఉండటం గొప్ప విషయం. ఈ ప్రత్యేకతకి వారి కవితలోని రైతు హృదయం ముఖ్యకారణం. వ్యవసాయం పై మక్కువ, శ్రామిక జీవనంపై మమకారం, పల్లె వ్యవసాయ అనుభవాలు కల గలిసి వీరి కవితను నిత్యనూతనం చేసాయి.

ప్రకృతిలో చెలిమి చేయగలగటమే కవిత్వ చేతనా మూలం. ఈ చేతన సాధిస్తే కవికి ప్రతీది ప్రకృతిమయంగా ఉంటుంది. అలా పకృతిలోకి మరలి వచ్చిన వాడే లలితా నంద్ అని, కవి - "ఇస్మాయిల్" ఈ కవికి కితాబు ఇచ్చారు. సామాన్య వస్తువుల ద్వారా అసామాన్య పరిణితి సాధిం చటం ఈ కవి సాధించిన విజయంగా "డా॥ సంజీవదేవ్" ప్రశంసించారు. ఇంకా చే.రా. సి.వేదవతి, వాడ్రేవు చినవీర భద్రుడు, ద్వానా శాస్త్రి, కె.శివారెడ్డి, సి.నా.రె, రావూరి భర ద్వాజ, ఆవంత్ససోమసుందర్, ఆచార్య జి.వి. సుబ్ర హ్మణ్యం, ఆర్వీఎస్ సుందరం, నందిని సిద్ధారెడ్డి, పాపినేని శివశంకర్, మొదలైన అసంఖ్యాక ప్రఖ్యాతులు లలితా నంద్ కవితకు అనుభూతి చెంది దీన్ని ప్రకృతి ప్రేమిక కవితగా కీర్తించారు.

హైకూల్లో రైతు హృదయం :

అనుభూతిని రేకెత్తించిన అనుభవాన్ని పదచిత్రంగా మలచి చెప్పినదే కవిత్వం అవుతుంది. ఆ కవిత పఠితలో కూడా సంవేదనారూపపు అనుభూతిని రగిల్చితే అది ఉత్తమ కవిత్వం అనబడుతుంది. ఇలాంటి ప్రయోగం హైకూ కవితలో చాలా క్లిష్టమైంది. ఎందుకంటే హైకూ చాలా కుప్తమైన కవిత. నియమిత మాత్రల్లో కవిత్వ ప్రయోజనం సాధించటం అషామాషీ వ్యవహారం కాదు. ఈ క్లిష్ట ప్రయోజనాన్ని లలితానంద్ అలవోకగా సాధిం చారు.

విపరీతంగా కాసిన గుమ్మడి పాదు కవి దృష్టిలో పడింది. ఆయనలోని కృషీవలుడికి ఇలా కనబడింది - " నేలంతా / గుండ్రటి గుడ్లు పెట్టింది / గుమ్మడి".

కొండ చుట్టూ వలయంలా తిరిగి వచ్చిన నది - సముద్ర సంగమం చేస్తే .... కవిలోని రైతు ఇలా అంటాడు - "పర్వతాల్ని / చుట్టుకు వచ్చిన మెలికల పాము / సముద్రం బుట్టలో దూరింది.

పచ్చటి చెట్టు మీది చిలుకలు కవి దృష్టిలో పడి ఇలా కవితారూపం పొందాయి - "చిలుకలు / చెట్టు చిరుగుల్ని / కుడుతూ....."

ఆఖరికి ఎండిన చెట్టు కొమ్మపై పిట్ట కూడా కవి ఆశావహదృష్టిలో కవిత్వమైతే - "ఎండిన కొమ్మ మీద / పిట్టవాలింది / అకాల వసంతం".

నిండుగా తొణికిసలాడే చెరువును చూసాడు కవి. ఇంకేమి ఇలా కవిత ప్రవహించింది - "గట్టు కొగిలి / చెరువు / ఉక్కిరి బిక్కిరి.

ఎండాకాలంలో పొలంలో రైతు దాహం తీర్చేది తాబేటికాయ. కవి కలంలో అమృతమైంది - "వేసవిలో అమృతం / పొలాల్లోని తాబేటికాయల్లో మకాం పెట్టింది".

ఎండాకాలపు తాపం కూడా ఇలా ప్రాణం పోసుకుంది - "దోస్తీ / ఎండిన కొలను / ఆకు లేని చెట్టు"

వరికోసి కుప్పలేసే వేళ రాత్రి కాపలాలో కవికి చంద్రుడు దొరికాడు. ఇక విలక్షణ వ్యక్తీకరణ మన ముందు వుంది.

"చంద్రుడు / వరికుప్ప ముందు / కళ్ళమై వాలాడు".

కృషిలో, ఆహారంలో దైవాన్ని దర్శించటం కేవలం రైతుకే సాధ్యం.

రైతు మూలాలను కవి ఇలా అన్నాడు - "వరి కుప్పలు / పూరి వెలుపల / దేవుడి గుళ్ళు".

పొలానికి ఒంటరిగా వెళుతున్న రైతు హృదయం నిద్ర లేచింది. ఆకుల సవ్వడి కూడా కవిత్వమైంది - "గల గల / ఆకులు / బాటసారిని పలుకరిస్తున్నాయి".

చెరువు ఒడ్డున చెట్టు కవి హృదయపుటద్దంలో ప్రతిబింబించి ఇలా కవిత అయ్యింది.- ''చెట్టు / చెరువులో / శీర్షాసనం".

కొండప్రక్క నుంచి ప్రవహించే నది, రైతు కవితా హృదయంలో ఇలా మారింది. "నది/కొండతపస్సును భగ్నం చేయ్యలేక / మలుపు తిరిగింది".

రైతు, కవి అయితే జీవితాన్ని ఇలా చూస్తాడు. - "జీవితం పంట / మిగిలేది / బాల్యపు పరిగెలు".

చీకటి పడ్డాక ఇంటికి వస్తుంటే వీధి దీపాలు వెలిగాయి. రైతు కవి మదిలో అవి కవితగా మెరిసాయి.- "వీధి దీపాలు / చీకటి చెట్టుకు / తేనె తుట్టెలు".

ఎండవేళ బాట ప్రక్క నిద్రగన్నేరు చెట్టు రైతు కవికి విశ్రాంతినిచ్చింది. కవితలో చిరంజీవిగా నిల్చింది.- "నిద్రగన్నేరు / నేలకు / గొడుడు పట్టింది". అక్కడితో ఆగక- "ఎండతాగి / నీడనిస్తుంది / చెట్టు తల్లి" అని కీర్తించాడు.

రాత్రివేళ చెట్టు క్రింద నుంచి వెన్నెల్ని చూసి - "వెన్నెల / చెట్టులో చిక్కింది / ఆకులు లాలిస్తున్నాయి" - అవి అలంకరించాడు. అదే చెట్టు మీది పిట్టల కువకువలు ఇలా కవితగా మారింది- "చెట్టు నిద్ర / పిట్టల ఊసుల / జోలపాట"

చెట్టుమీది కొంగలు - కవి దృష్టి - "ఎండిన చెట్టు / తెల్లపూలు పూసింది / విరిశాయి"

కవికి, దారిలో గురివింద అల్లిన పాదలు కనిపిస్తే - "దారి ప్రక్క / పాదలు / ఎర్ర తలంబ్రాలు పోసు కున్నాయి".

కవికి చిగిర్చిన చెట్టు కన్పిస్తే - "చెట్టు తనువంతా / ఆకులే / అమ్మ ప్రేమలా". తెల్లటి పూలు, ఎర్రటి పండ్లు ఉన్న దొండపాదు - " క్రింద చిలక ముక్కులు / పైన కొంగరెక్కలు / దొండపాదు".

వానలో కూడా రైతు కవికి సంగీతం విన్పిస్తుంది మరి - ''నంగీతం / నింగి అంతా నిండి/ మేఘమై ముంచెత్తింది".

"బండిలాగే ఎద్దు / నేల మాటల్ని / తలాడిస్తూ వింటుంది" - అని కవి చమత్కారం. మబ్బు కమ్మి చీకటి ముసిరిన వేళ కవి దృష్టి - "చీకటి పగలు / ఆకాశదీపానికి / మబ్బుల మసి".

ఎండాకాలం తాటి ఆకులు నరికారు. ఇక తొలకరి రావాలి. కవి అలంకార దృష్టిలో తాటిచెట్టు - "క్రాపు చేయించుకున్న / తాటిచెట్టు / స్నానానికై పైకి చూస్తుంది".

పొలం దున్నారు - కవి కవితా సేద్యం మొదలెట్టాడు. ఇలా కవిత వచ్చింది - "సాగేటి చాళ్ళు / నేల కాగితం మీద / సింగిల్ రూళ్ళు".

రైతు ఒంగి పొలంలో కలుపు దీస్తుంటే - కవి దృష్టి - "రైతు కొంగ / నాటిన చేనంతా / కలియ దిరుగుతోంది.

కందిచెట్టులో కూడా కవికి జ్ఞానమే కనిపిస్తే - "కంది చేను / విరగ్గాసి తలవచ్చింది / జ్ఞాన శిరస్సు.

"తొలకరి / నేలపగుళ్ళకు / నీటి లేపనం" - అని అనగలడు రైతు కవి. ఇలా అడుగడుగునా తన హైకూ కవితల్లో లలితానంద్ రైతు ప్రతీకలను వాడి అలంకార యుతంగా కవిత్వ లక్ష్యాన్ని సాధించారు.

స్మృతి కవిత - రైతు పరిమళం :

లలితానంద్ కవితా సంపుటాల్లో ఇది - ఇటీవలి కూర్పు. కీర్తి శేషులైన తల్లిదండ్రులు, మేనమామ మొదలైన వారి జ్ఞాపకాల్ని గుదిగుచ్చి హృద్యంగా కవిత్వీ కరించిన ఈ గ్రంధంలో కూడా అడుగడుగునా కవిలోని పల్లె ప్రేమికుడు గోచరిస్తాడు. పల్లెపదాలు మెరుస్తున్న గోళీల్లా దొర్లుతాయి.

అమ్మని తలుచుకుంటూ కవి -

"కంటకాల కీటకాల బాటలో / ఏములు గుచ్చుకున్నా ఏ పురుగులు కుట్టినా / నోట్లోంచి అమ్మే పుడుతుంది" - అని అద్వితీయ అభివ్యక్తీకరణ చేసాడు.

"పొద్దున్నే చల్లకవ్వం దగ్గర / నా కాళ్ళకు రాసిన వాత్సల్య వెన్నపూస / ఇంకా నా పిక్కలకు / నీ మమతల మెరుపు నిస్తూన్నే వుంది". అని అమ్మని గుర్తు చేసుకోవటం, పాడిని మర్చిపోని రైతుకవికే సాధ్యం.

"తెల్లారకముందే / గుట్టుగా ఆరగించిన / ఉట్టిమీది కుండలోని గట్టి మీగడ / నా మనసు పిడతలో / పేరుకునే వుంది / నీ జ్ఞాపకంగా...." అని అమ్మని గుర్తుచేసుకోవటం రైతుకవికి కాక ఎవరికి సాధ్యం ?

దూడలకు గడ్డి పిలకలందిస్తుంటే / నా పొట్టనిండే / బుజ్జి బుజ్జి బుజ్జాయిలతో బుల్లి బుల్లి ఆటలు / వాటి నునులేత స్పర్శ నా లోపల / ఎక్కడెక్కడో ప్రవహిస్తూనే వుంది. మేనమామని తల్చుకోవటంలో కూడా కవి రైతు హృదయం ఇలా కవిత్వ ప్రవాహమైంది. "ఆరుగాలం కష్టించినా / ఏటి ఈత లంక మేతలా ఉండటం".

"గేదె పక్క దూడలా అంటుకు వచ్చి / నీతో పాలంలో గడ్డి విరవటం / గట్లు పెట్టి వక్రఘనాల్ని సక్రపర్చటం..... ఊరి వెలుపల దేవాలయాల్లాంటి కుప్పలు వేయటం.....

నాన్నని తల్చుకుంటూ కవి హృదయమిలా వర్షించింది... "కుదురులా కుదురుగా వుండని / నీ పాద చలన స్పర్శకై తహతహలాడే / వీధులన్నీ వాన కాలువలై కన్నీరు విడిచాయి".

ఇలా స్మృతి కవితలో కూడా కవిలోని రైతు హృదయం - ప్రకృతి ప్రతీకల్ని విరివిగా ప్రయోగించి కవిత్వాన్ని సుసంపన్నం చేసారు.

వచన కవిత - అలౌకిక సృజన :

లలితానంద్ వచన కవితలు వందకు పైగా, కొన్ని కొత్త హైకూ కవితలూ చేర్చి కూర్చిన సమగ్ర సంకలనమిది. అక్షరం, ప్రకృతి, ప్రవాహం, శ్రమైకగీత, స్మృతిగీత, అనే విభాగాల క్రింద వివిధ వస్తు విలక్షణత గల కవితలు పేర్చబడ్డాయి. ఈ కవితల్లో అనేక చోట్ల కవిలోని కృషీవలుడు ప్రతీకాత్మకంగా తొంగి చూస్తాడు.

"ప్రకృతంతా స్వచ్ఛంగా / పొరలు పెగుల్చు కొచ్చిన బీజంలా / చీకటి తెరలు చీల్చుకొచ్చాను"

- అక్షరాంతరంగం.

"పారే నీటిలా / ప్రవహించే కవిత / పలుకరించే పచ్చదనం" - కవితాజలం.

"గరుకు పాదాల ములుగర్ర స్పర్శకు / మాయమైన గట్లు ఎగిరిపోయిన సంకోచపు దిబ్బలు"

- రాగమాలిక.

"పంటని గంపలకెత్తి / ఆకాశ మార్గాన పరుగులెత్తించి / మార్కెట్ రాబందుల తరిమి / ఆకలి హరించే స్వేద కారులు కవులు" - రాగమాలిక.

"కాలం ఎంత త్వరగా మా కళ్ళముందే / కాళ్ళ కింద ఒండ్రు మట్టిలా కరిగిపోయిందో" - భావన

"ముంజలు తిని బుర్రల బండి పై దొర్లిన బాల్యం" - దీవెన.

"పెరిగి పెరిగి నాగలి దుంపనై / మరోమంచి నాగరికతకు తొలకరినై / ఎడారి హరితమవుతానో...

- దీవెన

"చలువ బట్టలతో / కొలువు దీరిన పంటలు / ఊరి బయట ఒంటరిగా / ఒళ్ళంతా పరిచిన వంతెన / ఊరిని కలుపుతూ / సంబంధాలు నిలుపుతూ" - ఊరు బయట.

"మధ్యాహ్న ఎండలాంటి లోకంలో / కుతకుతలాడే ఎసట్లో నీళ్ళలా వుంది మా పని / అందరికీ అన్నమై గంజిలా మిగులుతున్నాం". - నెత్తుటి గులాబీలు.

"పంచభూత సమ్మిశ్ర ప్రకృతి / సదా స్వేద పరిపోషకం" - స్వేదాంబరుడు.

"ఎంత తొక్కినా / పచ్చటి గరిక / పాదాల్ని ముద్దిడుతూనే ఉంది" - హైకూలు.

"తల్లికోడి / పిల్లల్ని వెంటేసుకుని / దొడ్డంతా ముగ్గులు పెడుతుంది" - హైకూలు.

"కూలబడి కుములుతున్న కాడిమేడి / కారు చీకట్లో కదలని నాగలికర్రు.... సడలని అర్రుతో ఎలపటి దాపటి గిత్తల గుర్తు" - చిన్నబోయిన చేను.

వ్యవసాయిక ప్రతీకల్నీ అలంకారికంగా వాడి కవిత్వ లక్ష్యం సాధించటంలో లలితానంద్‌ది అందెవేసిన చెయ్యి. అనుభూతిని రమ్యంగా వ్యక్తీకరించటంతో బాటు పాఠకుడిని తన అనుభూతి వర్షంలో తడిపి వేయగల శక్తిగల ప్రతీకలు, పదజాలం ఈ కవి సొంతం.

ముగింపు :

లలితానంద్ కవిత ప్రధానంగా ప్రతీకాత్మమైనది. దీన్ని ఆస్వాదించాలంటే రసహృదయంతో బాటుగా కొంత మేధోపరమైన ప్రతిభ కూడా అవసరం. అప్పుడే రసాను భూతిని పొందగలం.

రైతు కుటుంబ నేపధ్యం, గ్రామీణ బాల్యం, వ్యవ సాయ అనురక్తి, అనుభవం కలగలిపి ఈ కవి కవిత్వాన్ని ప్రభావితం, ప్రభావంతం చేసాయి. కవిత్వపు ఆత్మను పరిపుష్టం చేయటంలో ఈ రైతు ప్రతీకలు ప్రధాన భూమికగా నిలిచాయి.

ఉపయుక్తం :

1. ఆకాశదీపాలు - హైకూలు - ప్రచురణ, 1997.
2. అలౌకికం - లలితానంద్‌కవిత - ప్రచురణ, 2015.
3. గుర్తుకొస్తున్నాయి - స్మృతి కవిత - ప్రచురణ, 2018.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్ వచన కవితలు – సామాజిక దృక్పథం

– డా॥. యం. మోదన్న, తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ & డిగ్రీ కళాశాల, తిరుపతి.

ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్ అనగానే చాలామందికి గుర్తుకువచ్చే విషయం ఏమిటంటే శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, తెలుగు విభాగంలోని ఆచార్యులుగా కీర్తించి గడించినవారని ప్రసిద్ధి అయితే వారి హృదయాంత రాళాల్లో తొంగిచూస్తే భావకవిగా అభ్యుదయ పదాలను, తమ కలం నుండి జాలువార్చిన సున్నితత్వ శిల్పి. వారిని గూర్చి రేఖామాత్రం పత్ర సమర్పణలో జీవిత విశేషాలు, రచనలు పొందుపరచడం సాధ్యంకాదు. వారి గురించి సిద్ధాంత వ్యాసామే సమర్పించవచు&.

బాల్యం - విద్యాభ్యాసం :

ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్ గారు 25-07-1952 సం॥ వెల్లాల వారి కండ్రిగ (గ్రామం), రైల్వే కోడూరు (మం), కడప జిల్లాలో శ్రీమతి ఎన్ వసంతమ్మ శ్రీ ఎస్. మోజెష్ పుణ్యదంపతులకు జన్మించారు. ప్రాథమిక, ఉన్నత, ఇంటర్మీడియట్, డిగ్రీ, విద్యాస్థాయి మొత్తం కడప జిల్లా పరిదిలోనే కొనసాగించారు. తరువాత ఎం.ఏ., (తెలుగు), ఎంఫిల్, పి.హెచ్.డిలు ఎస్వీ యూనివర్సిటిలోని తెలుగు శాఖలో పూర్తి చేసి 1979 నుంచి లెక్చరర్‌గా, రీజర్‌గా ప్రొఫెసర్‌గా, శాఖాధ్యక్షులుగా బోర్డ్ ఆఫ్ స్టడిస్ ఛైర్మన్‌గా ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ హ్యుమానిటిస్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ స్టడీస్‌కు వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రిన్సిపాల్‌గా, ఎస్.వి.యూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్ ప్రిన్సిపాల్‌గా. హోదాలలో విధుల్ని నిర్విర్థించిన అనన్య సామాన్యులు.

ఎస్వీడి చంద్రశేఖర్ గారు సుమారు 12 దాకా గ్రంథాలు చేశారు. వివిద అంతర్జాతీయ, జాతీయ సదస్సులో పత్ర సమర్పణలు చేశారు. రచనల్లో 'వచనకవిత్వం - కుందుర్తి పాత్ర' పుస్తకానికి 1982-83 సం॥నికి గాను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డు లభించింది. పత్రసమర్పణ దృష్ట్యా వారి రచనల్లో ఒకటైన 'సౌందర్యం ఎక్కాడ ఉంటుందో.... అక్కడ నేను. అనే వచక కవితా సంపుటిలో 38 ఉన్నాయి. కొన్ని వాటి వచన కవితల్ని, పరిశీలించినట్లయితే అందులో వారు కల్గించిన సామాజిక దృక్పథం గమనిద్దాం.

'త్రిపాదులు' అనే వచన కవితలో కొన్ని ప్రశ్నలు గమనిస్తే మనమెంత బాధ్యతా రహితంగా మెలుగు తున్నామో చూద్దాం.

తింటే చాలా గారెలు వింటే చాలా భారతం
జీర్ణించుకొనే శక్తుండొద్దూ? తింటే చాలా మామిళ్ళు
ఉంటే చాలా తోకలు లంకాదహనం చేసే సామర్థ్యం
ఉండొద్దూ?
ఉంటే చాలా ఆస్తులు వింటే చాలా నీతులు
దానధర్మం చేసే దయాగుణముండొద్దూ?
ఉంటే చాలా జుట్టూ వేస్తే చాలా కొప్పు
పువ్వులు ముడిచే నైపుణ్యం ఉండొద్దూ?
వేస్తే చాలా విత్తనం పోస్తే చాలా నీళ్ళు
సత్తువను కల్పించే సామర్థ్యముండొద్దూ?
గీస్తే చాలా గీతలు పూస్తే చాలా రంగులు
శాశ్వతత్వాన్ని పండించే జీవకళలుండొద్దూ?
చేస్తే చాలా వాగ్దానాలు చేస్తే చాలా సిద్ధాంతాలు
ఆచరణలో పెట్టే ఆర్థికస్తోమత ఉండొద్దూ?
చెప్పే చాలా కవితలు వ్రాస్తే చాలా కావ్యాల్
రసజ్ఞత వొలికించే శ్రోతలుండొద్దూ?

..... **(సా.ఎ.ఉ.అ.నే - పులులు:30.31.)**

శతాబ్దాల తరబడి ఇతిహాసాలైన రామాయణ భారతాలు వింటూనే ఉన్నాం. అందులోని పరమార్థం గ్రహించలేకుండా ఇంకా అలాగే జీవిస్తున్నాం. ఉన్న వనరుల్ని సక్రమంగా ఉపయోగించక సారహీనమైన ఆలోచనలు చేస్తున్నాం. తాత్కాలిక ఆనందాన్నే గుర్తి

స్తున్నాం. వాగ్దానాలు, సిద్ధాంతాలు ఆచరించే స్తోమత వున్నా కూడా ఆర్థిక వనరుల్ని ఉపయోగించడంలో వెనకడుగు వేస్తున్నాం ఎన్ని కవితలు రాసినా, కావ్యాలు వెలయించినా అంద్లులోని రసజ్ఞతను గ్రహించే శ్రోతలున్న ప్పుడే వాటికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం, లభిస్తుంది. అది లేనప్పుడు అన్నీ నిష్ప్రయోజనమే.

మనుషులు ఆహారం తినడం కాదు పౌష్టికాహారం తినాలి, సంపదలుంటే కాదు తగిన దానధర్మాలుండాలి. శాశ్వతత్వం గల కళలు, ఉన్న ఆర్థిక స్తోమతలో ఉదారత్వం, ఏదైన అర్థవంతమైన రసజ్ఞత కలిగివున్నప్పుడే సార్థకత, సామాజిక ప్రయోజనం అంటూనే ప్రశ్నలు రూపంలో సంధిస్తూ మనల్ని బాధ్యతగా ఉండాలని హెచ్చ రిస్తున్నారు.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, స్త్రీనిగురించి 'యత్రనార్యస్తు రమంతే పూజ్యితే తత్ర దేవతాः' అనే ఆర్యోక్తి. ఒక యుక్తిలా, కొనసాగుతూనే వుంది. స్త్రీ ఒక ప్రకృతి ఆ ప్రకృతి నేటికి ఎలాంటి ముళ్ళ జీవితం అవుతున్నదోచూద్దాం.

'ఆమె' వచన కవితలో

ఆమె -
కన్నవారింట పుట్టిన కలికి కామాక్షి తెలుగింట పుట్టిన అడపడుచు
కన్నవారి కలల పంట ఎన్నో ఏళ్ళుగా నోచిన నోముల పంట
ప్రేమాను రాగాల పొదరిల్లు, ఆమెనవ్వితే లెల్ల గులాబీలు వికసిస్తాయ్ ఆమె హర్షిస్తే
ఆనందాల హరివిల్లులు వెల్లివిరిస్తాయ్ ఆమె ఎదపై పయ్యెద రెపరెపలాడం గానే
పదీ పదహారాళ్ళు నిండీనిండగానే పసుపు పారాణితో - కట్నకానుకలతో-
అత్తవారింట తన జీవితం బండిని
నల్లేరులపై కాదుకానీ పల్లేరులపై ఉత్తరాళ్ళ నడకతో గాజు పెంకులపై నెత్తుటి మరకల నడకతో కొనసాగించింది.
మింటికి మంటికి ఏకదాటిగా విలపిస్తూ కుమిలి కుమిలి కృంగి, కృషిస్తూ
తొలిచూలు బిడ్డను ఇవ్వలేనందుకు తన్నులు తాపులూ తింటూ - అన్నాలు మానేసింది
ఆమెకోసం ఏడ్చి ఏడ్చీ - సముద్రాలే ఇంకిపోయాయ్
ఆమెకంట్లో కన్నీరొక లెఖ్ఖా కన్నుచూపు మేరలో
కనిపించనైనా కనిపించని దేవుడు యమధర్మరాజునైనా పంపడామె దగ్గరకు
తనువు చాలించడానికి అణువులో ఐక్యమవ్వడానికి.

పుట్టింటిలో గల మమతాను బంధాలు పెనవేసుకున్న రంగుల జీవితం. స్త్రీది. తన జీవితంలో కట్టుకున్న పురుషుడు కూడా సంపూర్ణంగా ప్రవేశించలేని ప్రేమా లయం పుట్టిల్లు. అత్తారింటికి దారిదే అని పుట్టింటివారు చెబితే వెళ్ళాక తెలిసొస్తుంది. తనునరకలోకంలో వున్నానని. ఆమెకు ఆర్తనాదాలు. అత్తింటి అరళ్ళు శాపాలు, వరాలయ్యాయి. ఆమె జీవితం కాకులు చింపిన విస్తరిలా అయ్యిందని. యముడైనా ఆమెకు విముక్తి కలిగించడానికి భగవంతుడు అనుమతి ఇవ్వడం లేదని స్త్రీవాదిగా భూత, వర్తమాన, భవిష్యత్తుల నుండి గ్రహిస్తూ స్త్రీ పక్షపాతిగానే ఊటంకిస్తూ సమాజం స్త్రీని గౌరవించాలని, భావి తరాలకు సూచించారు.

దేశభాషలందు లెస్స, తేట తెలుగు, సుందర తెలుంగునిలే (తమిళం), ఇలా ఇంకా ఎంతో అంత ర్జాతీయ ఖ్యాతిగడించిన తెలుగు భాషకు నేడు ఎలాంటి దు:స్థితి దాపురించిదో, ఎంతటి సందిగ్ధత నెలకొనిందో, మాతృభాష ఎందుకు మృత భాషలా అవుతున్నదో, పరాయి భాష వ్యామోహం స్వదేశీ దండయాత్ర జరుగు తున్న విధానం విశదీకరిస్తూ మాతృభాషపట్ల నిబద్ధులై ఉండాలంటూ తెలుగును బ్రతికించుకోండని ఎలా సందేశం యిచ్చారో క్రింది తేనెలాంటి కవితలో పరిశీలించ వచ్చు.

తేనెలాంటి కలికండ పలుకులాంటి చెరకు ముక్క ల్లాంటి తీయనైన తెలుగు పలుకులకు చేదెందుకబ్బినిదో తెలీక నేను తికమక పడుతున్నాను. నాకే మతి భ్రమిం చిందో లేక తెలుగు వాళ్లందరికీ మతులు భ్రమించాయో తెలీకుంది మనవాళ్ళకున్న తీపైన భాషను మన తెలుగు భాశను మన పసివాళ్ళకు చేదెందుకు చేశారో తెలీకుంది

మన తెలుగు తల్లులు తమ పిల్లలకు చనుబాలల్ని మాన్పించడానికి వేపచేదుల్ని పూసినందుకు తెలుగు భాష చేదైందో ఏమో తెలీకుంది. పొరిగింటి పుల్లకూర రుచి అన్న సామెత ప్రకారం పరభాషలు మన తెలుగు వాళ్ళకు

రుచికరమయ్యాయేమో తెలీకుంది ఒకప్పుడు తెలుగు భాషపై విదేశీ దండయాత్ర జరిగింది ఇప్పుడు స్వదేశీ దండయాత్ర జరుగుతూ ఉంది లెండి మేల్కనండి తెలుగు భాషను బ్రతికించుకోండి తెలుగు తన్నాన్ని ఒంటినిండా పులుముకోండి మీ జీవితాల నిండా తెలుగు రేఖల్ని నింపుకోండి.

తల్లిదండ్రుల దగ్గర నేర్చిన మాతృభాష స్వచ్ఛమైన, స్వేచ్ఛాయుతమైన, కలుషితం ఎప్పటికీలేని నాగరిక జీవన భాష మన తెలుగుభాష. పరభాషా వ్యామోహంలో కన్న తల్లుల నిర్లక్ష్యంతో విదేశీయుల దండయాత్ర కన్నా స్వదేశంలోనే, స్వరాష్ట్రలోనే దండయాత్రలు కారణం తెరమరగయ్యే ప్రమాదం ఉందని భాషావేత్తగా, ఆంధ్రుడిగా ఆందోళన వ్యక్తం చేస్తూ పై కవితలో ఆంధ్రులను, ప్రభుత్వాలను మేలుకొలిపే ప్రయత్నం చేస్తూనే జై తెలుగుతల్లి... అనిపిస్తూ సాహితీమూర్తుల ఉద్యమాలు, త్యాగాలు, వృదా కానీకండని, మాతృభాష వర్ధిల్లాలని దానికోసం ఆంధ్రులు, భాషావేత్తలు, ఏకమై మాతృభాషా పరిరక్షణకు కలిసినడవాలని మహోద్యమ రూపం దాల్చినప్పుడు తెలుగు భాష సజీవం కావడానికి అప్పుడే తెలుగువారి జీవిత భాషలకు వెలుగులస్తాయని ఆకాంక్షించారు.

ముగింపు :

ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్ గారి వచన కవితల్లో ఇలాంటి ఆణిముత్యాలు ఎన్నో సౌందర్యం అంటే భాహ్య సౌందర్యం కాదు హృదయ సౌందర్యం ప్రధానం. అది ఉన్నప్పుడు సామాజిక జీవిత దృక్పథాలు స్వర్ణమయాలవు తాయని వారి ప్రగాఢ విశ్వాసం 'సౌందర్యం ఎక్కడ ఉం టుందో .... అక్కడి నేను' అన్న వచన కవితా సంపుటిని చదివినట్లుయితే ప్రతి మనిషి మనిషీలా కాకుండా మానవత్వపు మట్టిలో మాణిక్యం లాంట భాషా జాతీయతకు నిదర్శనమవ్వాలంటే.

మనం వేరైనా మన ప్రాంతాలు వేరైనా
భాష ఒక్కటే భావమొక్కటే
గ్రహణాలు వేరైనా గ్రహించడం వైరైనా
తెలుసుకొంటే తెలుగొక్కటే
యాసలు ఎన్నైనా
ప్రాసలు తారుమారైనా
తెలుగు భాష మాధుర్యం చరితార్థం.

ఆధార గ్రంథాలు :

1. సౌందర్యం ఎక్కడ ఉంటుందో....అక్కడ నేను (వచనకవితాసంపుటి)
2. ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్ అరవైయ్యేవ జన్మదిన వేడుకల కమిటీ ప్రచురణ -2 ముద్రణ : స్టూడెంట్స్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ తిరుపతి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కాసుల ప్రతాపరెడ్డి కథలు – సామాజిక జీవన చిత్రణ

– మద్దిరాల సత్యనారాయణరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాయం, వరంగల్.

సమాజంలో నెలకొన్న అనేక సామాజిక సమస్యలను తీసుకొని రచయితలు కథా వస్తువులుగా సృష్టిస్తూ, మానవ సమాజాన్ని ఎంతగా చిద్రం చేశాయో కళ్లకు కట్టినట్టు చిత్రించారు. స్త్రీల సమస్యలు, నిరుద్యోగం, మూఢ నమ్మకాలు, బాలకార్మిక వ్యవస్థ, కుల అసమానతలు, స్త్రీ -పురుష సంబంధాలు, ఆత్మహత్యలు మొదలైన సామాజిక సమస్యలను వాటి వల్ల కరిగిన నష్టాన్ని కథా రచయితలు కూలంకషంగా తమ కథలలో వివరించారు. ఈ కోవకు చెందిన కథా రచయిత కాసుల ప్రతాపరెడ్డి.

"ప్రతాపరెడ్డి తన చుట్టూ ఉన్నవారి జీవితాలలోని వైరుధ్యాలను, అసంబద్ధతను చెప్పడానికి కథా రచనను ఎంచుకున్నాడు" అని చెప్పవచ్చు. కళ్ళముందు కూలుతున్న జీవితం తాలూకు జాడలు, వెలిసిపోతున్న ఆశయాలు, మారిపోతున్న విలువలు, స్తబ్ధమైపోయిన జీవితపు తాలూకు ఛాయలను ప్రతాపరెడ్డి కథలు చిత్రిక కట్టాయి. 'కాసుల ప్రతాపరెడ్డి సమ సమాజంలోని ఎన్నో జీవిత పార్శ్వాలను స్పృశించి చక్కని శిల్ప నిర్మాణ కౌశల్యంతో అనేక కథలని నిర్మించారు. ఆయన మౌళికంగా కవి కాబట్టి ఆయన కథలన్ని క్లుప్తంగా సంక్షిప్తంగానే ఉంటాయని ప్రముఖ కథా, నవల రచయిత్రి ముదిగంటి సుజాతరెడ్డి ప్రశంసించారు. రెడ్డి కులంలో ఉపకులాల మధ్య ఉన్న వివక్షను ఎత్తి చూపాడు. సాహిత్యంలో ఈ విషయాన్ని వ్యక్తీకరించిన మొదటి రచయిత కాసుల ప్రతాపరెడ్డి "ఉన్నత స్థాయికి ఎదిగిన దళితుల పట్ల కూడా కొనసాగే వివక్ష, అంటారనితనం ఎంత బాధాకరమైనవో, ఒకే కులంలోని వివిధ శాఖల మధ్య కనిపించే అసమానతలు కూడా అంతే భయంకరంగా ఉంటాయన్న సంగతిని కాసుల పత్రాపరెడ్డి తన కథలలో పేర్కొన్నాడు" అని కె.పి అశోక్ కుమార్ అన్నారు. వాస్తవ ప్రజా జీవితానికి దగ్గరగా ఉండేలా కథలు రాస్తూ నిత్యం ప్రజలను చైతన్య పరుస్తుంటారు.

మధ్యతరగతి ప్రజలు సమాజంలో అనేక సమస్యలను ఎదుర్కొంటూ జీవన పోరాటం చేస్తున్నారని, మధ్యతరగతి జీవితాలలో ఉన్న విభిన్నమైన కోణాలను, వాస్తవ పరిస్థితులను రచయిత ఎత్తి చూపారు. మధ్య తరగతి జీవితాలలో ఉన్న కష్టాలను కన్నీళ్ళను పట్టించిన కథ "శిధిలం". ఈ కథలో రాంరెడ్డి వ్యవసాయం చేస్తూ కరువు కారణంగా బావులు ఎండిపోవడంతో నీరు లేక పొలాలు కూడా ఎండిపోతుండడంతో తెచ్చిన అప్పులకు భయపడి ఆత్మహత్య చేసుకుంటాడు. రైతులు ఎక్కువగా మధ్య తరగతి వర్గానికి చెందిన వారే. కాబట్టి కరువు ప్రభావం రైతుల మీదనే ఎక్కువగా వుంటుందని ప్రతాపరెడ్డి మధ్యతరగతి ప్రజల దీనావస్థను వాస్తవ కోణంలోంచి చిత్రించాడు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి మధ్యతరగతి వర్గానిది. అలాంటి పరిస్థితులను వివరించిన కథ బతకుచిద్రం. ఈ కథలో రాజయ్య నాలుగురోజుల నుండి ముసురు ఉండడంతో ఆటో బయటకు తీయక తిండికి కష్టంగా మారింది. ముసురులోనే ఆటో తీసి బస్టాండ్ వద్ద ఎదురు చూస్తుండగా పోలీసొచ్చి మామూలు అడుగుతాడు. ఒక పక్క ఆకలి మరో ప్రక్క బేరాలు లేక అసహనంగా ఉండడంతో పోలీసుతో గొడవపడతాడు. చివరికి తన ఆటోను తానే తగలబెట్టుకొని ఉన్న ఉపాదిని కూడా కోల్పోతాడు. అధికార యంత్రాంగంలో పేరుకుపోయిన అవినీతిని, లంచగొండితనంతో మధ్య తరగతి ప్రజలు పడుతున్న బాధలను యదార్థంగా చిత్రించారు. మధ్య తరగతి కుటుంబాలను ఆర్థిక పరిస్థితులు ఎంత చిన్నాభిన్నం చేస్తాయో వ్యక్తీకరించిన కథ "శిలువకు తొడిగిన మొగ్గ". ఈ కథలో సూర్యం ఆర్థిక పరిస్థితుల కారణంగా

పుస్తకాలు కొనుక్కోలేక చదువు బంద్ చేసి పశువుల కాయడం హృదయ విదారకంగా కనిపిస్తుంది.

గ్రామాలలో మూఢనమ్మకాలు, మూఢ విశ్వాసాలు రాజ్యమేలుతున్నాయని చిత్రించిన కథ 'ఎల్లమ్మ'. బాలమ్మ చిన్న వయసులోనే భర్తను కోల్పోవడం వల్ల ఏర్పడిన అభద్రలొంచి లైంగిక వాంచలు తీరని ఒకానొక మానసిక అసమతుల్య స్థితిలొంచి పూనకంగా మార్పు చెందింది. బాలమ్మ కోడలు సత్య అత్తకు పూనకం రాకుండా చేసి కుటుంబాన్ని బాగు చేసుకుంటుంది. "సమాజంలో తర తరాలుగా పాతుకుపోయిన మూఢ నమ్మకాలను గురించి వివరించే ప్రయత్నం రచయిత చేశాడు. అయితే ఇక్కడ సత్య పాత్రను రచయిత మూఢ నమ్మకాలపై యుద్ధం చేసే పాత్రగా తీర్చిదిద్దలేదు. అందరి రచయితల్లాగా మూస ధోరణిలో ప్రతాపరెడ్డి ఈ పాత్ర చిత్రించలేదు. విలక్షణంగా ఈ సమాజానికి దగ్గరగా ఉన్న ఒక వాస్తవ సంఘటనలాగా ఈ కథను తర్చీదిద్దాడు". ఎల్లమ్మ కథలో ఉత్తమమైన విలువలతో కూడిన భావాలున్నాయి. సమాజంలో యదార్థంగా జరిగే సంఘటనలతో మరియు తన చుట్టూ ఉన్న వారి సామాజిక సమస్యలను చిత్రిస్తూ కథలు రాయడం ప్రతాపరెడ్డికే చెల్లిందని చెప్పవచ్చు.

అస్పృశ్యతను కుల అసమానతలను ఎత్తి చూపుతూ ప్రతాపరెడ్డి అనేక కథలను రాశారు. ఒకే కులంలో ఉన్న అంతర్గత వివక్షను ఎత్తి చూపిన కథ "పక్షులెగిరిపోయిన తోట". ఇందులో 'సౌందర్యవాళ్ళూ మోటాటిరెడ్లు, మేపాకనాటి, మా మేనత్తవాళ్లు గూడాటి రెడ్లు. రెడ్లలలో ఎనిమిది రకాల రెడ్లు ఉన్నారు. వీరిమధ్య కూడా అంట రానితనమేదో ఉన్నట్లు నాకనిపించింది"అని రచయిత పలకడం ద్వారా ఉన్నత కులాల్లో కూడా అస్పృశ్యత ఉంటుందని ఈ కథ ద్వారా తెలుస్తుంది. 'పారేసినకథ'లో సుజాత క్రిస్టియన్ల కుటుంబానికి చెంది, తనకు సాహిత్యం ఒంటబట్టదని తనతాను ఏ విధంగా తక్కువ చేసి ఊహించుకుంటుందో రచయిత సజీవ చిత్రణ ద్వారా చూపగలిగారు. సమాజంలో కొన్ని కులాలు ఇన్ఫిరియారిటి కాంప్లెక్స్‌తో బాధపడుతూ తమ కులాన్ని తక్కువగా బావిస్తారన్న ప్రతాపరెడ్డి చిత్రణ అద్భుతంగా ఉంది. కులాంతరాల ప్రేమను చిత్రించిన కథ 'హత్య'. ఇందులో మాలతి నిమ్న తరగతికి చెందిన కుర్రవాన్ని ప్రేమిస్తుంది. ఈ విషయం ఇంట్లో తెలిసి మేము ఊళ్లో తలెత్తుకు తిరగలేమని తల్లిదండ్రులు, అన్నలు మాలతిని బెదిరి స్తారు. పల్లెటూర్లలలో ఇప్పటికి ఈ దురాచారం కొనసాగు తుంది. సమాజంలో చాలా మంది కుల వివక్షతో తాము ఇష్టపడ్డ వారిని వివాహం చేసుకోలేకపోతున్నారు. ఈ కుల వివక్ష అంతరించపోవాలనే ఉద్ధేశ్యంతో రచయిత ఈ కథను చిత్రించాడని తెలుస్తుంది. వాస్తవిక దళిత జీవి తాన్ని వివక్షను చిత్రించిన కథ 'వెంటాడిన అవమానం'. ఈ కథలో ప్రశాంత్‌రెడ్డి, మాదిగ ఎల్లయ్య మంచి మిత్రులు. కులం కారణంగా ప్రశాంత్‌రెడ్డి ఇంటివారు ఎల్లయ్య అవమానపరుస్తారు. ఇలాంటి దుష్టాచారం సమాజంలో ఇంకా సజీవంగా ఉందని రచయిత చిత్రణ తెలియజేస్తుంది. అస్పృశ్యతగా పరిణమించి, భౌతికంగా, మానసికంగా వ్యక్తుల మధ్య అంతరాలకు కారణ మవుతున్న ఈ సమస్యను పరిష్కరించుకోవటం దళిత దళితేతరుల మధ్య ఉందని డా।. దార్ల వెంకటేశ్వరరావు అన్నారు.

ప్రస్తుత సమాజంలో స్త్రీ పురుష సంబంధాలలో ఉన్న వాస్తవికతను రచయిత పలుకోణాల్లో చిత్రించారు. సామాజిక వ్యవస్థలో స్త్రీ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడానికి చేసే పెనుగలాటను చిత్రించిన కథ 'పెనుగులాట'. ఈ కథలో పద్మజ, ప్రశాంత్‌లు ఒకరినొకరు ప్రేమించి పెళ్ళి చేసుకుంటారు.పెళ్ళి అనంతరం పద్మజను అవమానా లకు గురి చేయడం అది సహించని పద్మజ వేరుగా ఉ ండడం చివరికి ప్రశాంత్ తన తప్పు తెలుసుకోవడం ద్వారా కథ సుఖాంతం అవుతుంది. వాస్తవ సమాజంలో పురుషులు వివాహం కాగానే అహంకారంతో స్త్రీలను ఎలా చిన్న చూపు చూస్తారో స్పష్టంగా వివరించాడు. వ్యవస్థలో మానవ విలువలు స్త్రీ పురుష నబంధాలు ఎట్లా

పతనమవుతున్నాయో వివరించిన కథ 'దగ్ధం' ఇందులో రాములు యూనివర్సిటీలో ఒక విభాగానికి అధ్యక్షులు. తన సొంత కుటుంబాన్ని కాదని రమాదేవితో అక్రమ సంబంధం కొనసాగిస్తూ విలువలు పతనమై చివరికి నవ్వుల పాలై జీవితాన్ని కోల్పోతాడు. ఐహిక సుఖాల కొసం అర్రులు చాచి, అక్రమ సంబంధాలకు అలవాటు పడితే, హిందు వివాహ జీవితం అస్తవ్యస్తమవుతుందని చిత్రించిన కథ 'ద్వంద్వం'. ఈ కథలో భార్యభర్తలుగా రాధిక ప్రకాశ్ ఎప్పుడూ గొడవ పడేవారు. కొంత కాలానికి గొడవలు పెరిగి ప్రకాశ్ ఇంట్లోంచి వెళ్ళిపోయి మరో వివాహం చేసు కుంటాడు. తరువాత రాధికను బుజ్జగించే ప్రయత్నం చేస్తాడు. కాని రాధిక తన దారి తాను చూసుకుంటుంది. వివాహనంతర జీవితం సున్నితమైనది. అది ఏ మాత్రం ఒడిదుడుకులకు లోనైనా జీవితాంతం శిక్ష అనుభ వించాల్సి ఉంటుందని రచయిత నేటి స్త్రీ పురుషులకు హెచ్చరిక చేశారు.

ప్రతాపరెడ్డి సమాజంలో ఉన్న సామాజిక సమస్య అయిన అసబంద్ధతను కూడా తన కథలలో చిత్రించాడు. ఒక వ్యక్తి అర్థం లేని జీవితాన్ని గడుపుతూ, ఎదుటి వ్యక్తులనూ ఇబ్బందులకు గురి చేస్తున్న వైనాన్ని చిత్రించిన కథ 'చేదు మందు'. సమాజంలో పని పాట లేకుండా తిరుగుతూ అసంబద్ధమైన జీవితాన్ని గడుపుతున్న అమర్‌శంకర్ జీవితాన్ని చిత్రిస్తూ అలాంటి వ్యక్తులకు యువత దూరంగా ఉండాలన్న సందేశాన్ని రచయిత ఈ కథ ద్వారా అందించాడు. యూనివర్సిటీలలో కూడా ఇలా అసంబద్ధ జీవితాన్ని గడిపే విద్యార్థుల జీవితాలను చిత్రిస్తూ 'సిక్‌నెస్' అనే కథను రాశారు.

ఈ విధంగా కాసుల ప్రతాపరెడ్డి కథలు సమాజంలో జరుగుతున్న యదార్థ సన్నివేశాలను చిత్రించాయి. సామాజిక సమస్యల నేపథ్యంతో కూడిన కథనాలను చిత్రిస్తూ సాధ్యమైనంత వరకు ప్రజలను చైతన్యం చేసే దిశగా అయన కథలు పయనిస్తున్నాయని చెప్పవచ్చు. సామాజిక సమస్యలతో భూజు పట్టిపోతున్న ఈ సమాజాన్ని తన కథల ద్వారా రచయిత శుభ్రం చేసే ప్రయత్నం నిజాయితీగా చేస్తున్నాడని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. భావవీణ (మాసపత్రిక) - డిసెంబర్ 2019
2. వర్తా(ఆదివారం) 27 అక్టోబర్ 2002
3. పరీక్షణం-సంపా॥ మద్దిరాల సత్యనారాయణరెడ్డి -పుట సంఖ్య.07
4. ఎల్లమ్మ ఇతర కథలు
5. శిలువకు తొడిగి మొగ్గ

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రాసాని కథలు – గిరిజన, సంచార తెగల జీవిత చిత్రణ

– డా॥. పోచంరెడ్డి రాజేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

రాసాని కథలు వాస్తవ జీవన దృశ్యాలు. బడుగు, బలహీన వర్గాల, గిరిజన, సంచార జీవుల, జానపద కళాకారుల జీవితాల్లోని మారుమూల కోణాలు వీరి సాహిత్యానికి ముడిసరుకులు. చిత్తూరు జిల్లా మాండలిక భాషాప్రయోగం వీరి శైలి ప్రత్యేకత. ప్రజల జీవితాల సునిశిత పరిశీలన వీరి సొంతం. కథాసాహిత్యం ఆయా కాలాల నాటి సాంఘిక జీవితానికి ప్రతీక. ప్రపంచీకరణ ప్రభావం వారి జీవితాలలో కల్గించిన వేదనను రచయిత మనకు వివరించారు.

అడవికి దగ్గరలో రోడ్డు ప్రక్కన ఉన్న యానాదుల నివాసాలను రోడ్డు విస్తరణల పని నెపంతో ఎలా నేలమట్టం చేశారో తెలిపిన కథ 'వేట'. ఈ కథలో వెంకటస్వామి ఉడతలను పట్టే పద్ధతిని, ఇసుళ్ళు సేకరించే పనితనాన్ని రచయిత వివరించారు.

వెంకటస్వామి కళ్ళు చెట్టుచెట్టుని, కొమ్మకొమ్మను నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఒక చిన్న కోతిపిల్ల మాదిరి ఒక చెట్లో నుంచీ మరో చెట్లోకి దూకుతోంది ఉడుత. చేతిలో ఉన్న కొరముట్లను కొడుకు చేతికిచ్చి, "నువ్వు యీడనే నిలబడి దానికల్లా చూస్తావుండు. అది నీకల్లానే చూస్తావుంటుంది. నేను ఎనక్కి పోతా" అంటూ స్వరం తగ్గించి చెప్పి, కోలకట్టెను తీసుకుని, శబ్దం చేయకుండా మెల్లగా ఆ చెట్ల వెనక్కి వెళ్ళాడు. ఉడుత తోకను పైకెత్తి గొంతును టకటకలాడిస్తూ కిట్టప్ప వైపే చూస్తోంది. వెనక్కి వెళ్ళిన వెంకటస్వామి చెట్టును సమీపించి వడుపుగా కోలకట్టెతో ఒక దెబ్బ వేశాడు. అది కీచుమని అరుస్తూ నేలపైన పడి గింజుకోసాగింది. కిట్టప్ప గబగబా వెళ్ళి దాన్ని పట్టుకొని చేతిసంచిలో వేసేసుకున్నాడు. "మూడు, నాలుగు దినాలు పుట్టపైన నీళ్ళు పొయ్యాల, అట్ల పోస్తే పుట్టమన్ను నీళ్ళను పీల్చుకుంటుంది. నీళ్ళు చుక్కలు చుక్కలుగా పుట్టకూటిపైనబడతాయి. అప్పుడు పుట్టకుంట్లో నుంచి పురుగులు యిడిగి, వాటికి రెక్కలొస్తాయి, అవే యిసుళ్ళు".

"ఇసుళ్ళు పూర్తిగా యిడిగం తర్వాత కోమలన్నీ మూసేసి ఒకే ఒకదారి పెడతాం. పుట్టపైన ఆకుతో గూడు చేసి, ఆ గూట్లో దీపం పెడతాం. ఆ దీపం కింద ఒక దబిరో, తగారో యేదో వొగటి పెట్టి దీపం ముట్టిస్తాం. అంతే, ఆ ఎల్తురుకు పుట్టలో ఇసుళ్ళు బయటికొచ్చి దీపం చుట్టూ తిరిగి, రెక్కలు విరిగి అన్నీ ఆ దబిర్లో పడి పోతాయి"

"ముందు కాలంలో వాటికి మసాలాబెట్టి అటుకుల్లోనో, శనగపప్పుల్లోనో కలిపిస్తే లట్టిలేసుకుంటూ తింటా వుండ్రి. పల్లెల్లో నాగరీకం ముదిరిపోయిండాది. యిసుళ్ళంటే ముఖం చిట్లించుకుంటా వుండారు". ప్రభుత్వం చేసే పనుల వల్ల యానాదులు ఎలా నష్ట పోయారో ఈ కథ వివరిస్తుంది. తిరుపతి నుండి భాకరాపేట దాకా వచ్చిన దబుల్ రోడ్డుకు మీ ఇండ్లే అడ్డమని ప్రభుత్వాధికారులు జె.సి.బితో కూల్చివేస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియక మరో గూడు ఎలా ఏర్పాటు చేసుకోవాలో ఆలోచిస్తూ యానాదులు పడే ఆవేదనను తెలిపే దృశ్యకథ.

రాయలసీమ ప్రాంతంలో నివసించే సంచారతెగ నక్కలోళ్ళు. స్థిర నివాసం ఏర్పాటు చేసుకోలేని దీనమైన వారి జీవనరీతిని వివరించిన కథ 'పయనం'.

"అడవిలో ఎక్కడ నీళ్ళుంటే అక్కడ గుడారాలేసుకుని, అడవుల్లో జంతువుల్ని వేటాడి తింటూ, ఆ ప్రాంతంలో ఉన్న పల్లెల్లో పిన్నీసులు, తలపిన్నులు, పూసల దండలు అమ్మి, ఆ డబ్బుతో కాసిన్ని నూకలు తెచ్చుకుంటూ బతికే సంచారజీవనులు".

ప్రశాంతంగా బతుకుతున్న నక్కలోళ్ళ మధ్యలోకి కొందరు పెట్టుబడిదారులు అంగళ్ళు పెట్టి వారి జీవితాలను నాశనంచేసే తీరును రచయిత వివరించాడు. నక్కలోళ్ళు తుపాకీ కలిగి ఉండటం వారి కులధర్మం. ప్రభుత్వం మారణాయుధాలు ధరించి తిరగటం తప్పని తేల్చడం మూలాన, వారు వృత్తిని చేసుకోవటం కష్టమై పోయింది. అందువల్ల వాళ్ళు పడే ఆవేదన వర్ణణాతీతం.

సుగాలి కుటుంబ కథ 'నేరం'. కన్నబిడ్డల్ని సాకలేక ఒక చేయని నేరాన్ని పిల్లాడిపైన నెట్టించి తిండి కోసం వాళ్ళను బాల నేరస్థుల జైళ్ళకు పంపే దయనీయ స్థితిని 'నేరం' కథలో చూడవచ్చు. పిల్లవాడికి విడుదల సమయం వచ్చినా, పిల్లవాడి తండ్రి వచ్చి మరికొంత కాలం జోవెనైల్ హోమ్‌లో కొనసాగించమని అర్థించడం వెనుక సుగాలీ కుటుంబాలు ఎంత ఇబ్బందులలో ఉన్నాయో అర్థమవుతుంది.

ప్రభుత్వ చట్టాలను ఆలోచింపచేసే కథ 'ఎన్‌కౌంటర్'. అగ్రకులస్థుడైన చౌదరికి మంత్రులు, పోలీసుల పలుకుబడి ఎక్కువ. ఆ పలుకుబడిలో యానాదుల భూములను దోచుకోవాలని చూస్తాడు. ఆ సందర్భంలో ప్రతిఘటించిన యానాదుల ప్రతినిధి గంగజ్జును 'తుఫాకీ' కలిగి ఉన్నాడనే నెపంతో నక్సలైటుగా చిత్రించి ఎన్‌కౌంటర్ చేయిస్తాడు చౌదరి.

ఒకప్పుడు పాములన్ని బట్టి వాటిని ఆడించి బతికే ఇర్లోళ్ళకు జీవకారుణ్య చట్టం ఎలా అడ్డంకిగా మారిందో వివరించే కథ 'కుబుసాలు'. ఎన్నో యేండ్లుగా పాములు పట్టుకొని వాటిని కళాత్మకంగా ఆడిస్తూ జీవనం సాగించే ఇర్లవాళ్ళ వృత్తి కనుమరుగైపోయి తమ చిందు భాగవతాన్ని ప్రదర్శిస్తూ ఎలా భిక్షగాళ్ళుగా మారిపోయారో రాసాని వివరించారు.

జీవన పోరాటంలో భాగంగా ఒక యానాది కులస్తుడు తమిళ ప్రాంతపు ఎర్రచందనం స్మగ్లర్‌తో కలిసి తిరుమల కొండల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో తెలిపే కథ 'నిప్పు'.

నేడు 'సర్కస్'గా మనకు పరిచయమున్న దొమ్మరాటలతో ప్రజలను ఆనందింపజేసి, పొట్టపోసుకునే యాచక కులం గురించి వివరించే కథ 'అదృశ్య విధ్వంసం'. ఆ వృత్తిలో పొట్ట పోసుకునే వెంకటస్వామి కుటుంబం సర్కస్ ఫీట్లు చేసినా వారి ఆకలి మంటలు తీరలేదు. ఈ కథలో సన్నటి తీగపై నడచి, వెంకటస్వామి భుజాలపైన, ఎత్తయిన వెదురు కట్టె మీద పడుకొని కళ్ళు తిరిగీ పడిపోయే చిన్నబిడ్డ జయను చూస్తే ఒళ్ళు గగుర్పాటుకు గురవుతుంది. దొమ్మరి వాళ్ళ జీవితాలు ఎలా విధ్వంసానికి గురవుతున్నాయో రచయిత వివరించారు.

కరువు ప్రాంతమైన అనంతపురము జిల్లాలో వలసలు ఎక్కువ. వలస జీవితాలు ఎంత దుర్భరంగా ఉంటాయో రచయిత వివరించారు.

మద్దిలేటి కరువుకు భయపడి తన రెండవ భార్య సాలమ్మను, మొదటి భార్య కొడుకు తిరుమలను తీసుకొని చిత్తూరు జిల్లా ఓ గ్రామీణ ప్రాంతానికి వచ్చి సుబ్బరాయుడనే లారీ డ్రైవరు దగ్గర చేరి భిక్షాటన చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తుంటాడు. ఒక రోజు భిక్షాటనకు బయల్దేరిన మద్దిలేటి ప్రాణాలొదిలేస్తాడు. అదే కులానికి చెందిన శీనప్ప మద్దిలేటికి దహన సంస్కారాలు చేసి, సాలమ్మతో పరిచయం పెంచుకుని ఆమెను లేవదీసుకపోతే, తిరుమల అనాథగా మిగులుతాడు. అప్పటి నుండి లారీ డ్రైవరు సుబ్బరాయుడు ఆదరిస్తాడు. శెట్టిగారి చిల్లరంగడిలో చేయని తప్పుకు పోలీసుల చేత దెబ్బలు తింటాడు. అంతటితో ఆగక సుబ్బరాయుడు కూడా బెల్టుతో కొట్టడంతో, గాయపడిన పసి హృదయం ఆ ఇంటిని కూడా వదిలేసి వెళ్ళిపోతాడు.

నల్లపూసలు కథలో 'ఓలి' సంప్రదాయం ద్వారా గూలోళ్ళ బతుకులు ముఖ్యంగా స్త్రీ జీవితం ఎలా చిద్రమౌతుందో రచయిత హృద్యంగా వివరించాడు. విశ్వవిద్యాలయంలో ఆంత్రోపాలజీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి గువ్వలోళ్ళ గూడానికి వెళ్ళి వారి

జీవనాన్ని గురించి తెలుసుకోవాలని విషయ సేకరణలో భాగంగా సాగిన ఈ కథలో నాంచారి అనే యువతి చెప్పిన ఈ కథ స్త్రీ మనస్తత్వానికి అద్దం పట్టింది. ఒకప్పటి ఆచారమై, తరువాత దురాచారమై ఎలా ఆడవారి జీవితాలతో చెలగాటం ఆడిందో ఈ కథ తెలియజేసింది. నాంచారి పురుషస్వామ్య సమాజం మీద తన అనుభవాన్ని చెబుతుంది.

యాచక కులాలను గూర్చి వివరించే కథ 'నాలుగో నాటకం'. పరస్పరం అనుబంధం కలిగిన మూడు సంచార యాచక కులాల సంగమం ఇతి వృత్తం. గొర్రెలు కాసే కురవ కులానికి సాంస్కృతిక అనుబంధ కులం గొరవయ్యల కులం. ఆ గొరవయ్యలు చేసే గొరవ నృత్యానికి కావాల్సింది ఎలుగుబంటి చర్మం. యాచక కులమైన ఎలుగ్గొడోళ్ళ దగ్గర ఉంటుంది. శ్రీశైలంలో ఉండే శివయ్య పేరు మీద పెండ్లికాని మగవానికి దీక్షనిచ్చి గురవయ్యను చేస్తారు. జంగమదేవర్లు తొడుక్కునే నల్ల గౌను తగిలించి, నడుముకు గవ్వల పట్టీ కట్టి, నెత్తిన ఎలుగుబంటి చర్మంతో తయారుచేసిన టోపీతో గురవయ్య నృత్యం చేస్తాడు. ఎలుగ్గొడ్డు చర్మం కోసం ఎలుగ్గొడ్డోని దగ్గరకు వెదుక్కుంటూ గురవయ్య వస్తాడు. ఆర్నెలు యాచకత్వం కోసం బయట తిరుగుతున్న ఎలుగ్గోడ్డోన్ని గురవయ్య కలసి మాట్లాడుతాడు. అతడితో పాటు తోడుగా ఉంటున్న ముడ్డిగంటోనితో కలసి వారి గేరికి వెళుతూ ఈ కథ ముందుకు సాగుతుంది. ఆ గురవయ్య పేరడిగిన సందర్భంలో "అయ్యో పేరడగితివా, మాగేర్లో శానామందికి పేర్లుండవన్నా, ఎవరు ఏ పని చేస్తే వాడికదే పేరు. అద్దో ముందు బోతా వుండ్లా వాడు ముడ్డికి గంట కట్టుకొని ఆడతాడు. కాబట్టి వాడి పేరు ముడ్డి గంటోడు. గిరిజన సంచారీ తెగలవాళ్ళకు నాగరికమైన పేర్లు ఉండవని అర్థమవుతుంది. కళలకు ఆదరణ తగ్గిపోతుందని రచయిత ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ పాత్రల ద్వారానే చెప్పిస్తాడు. ప్రపంచీకరణ ఎలా గిరిజనుల జీవితాలను చిద్రం చేసిందో తెలిపే కథ ఇది.

గ్రామాల్లో ఆశ్రిత కులానికి చెందిన మొండోళ్ళ జీవనం గురించి వివరించే కథ 'కీడు'. ఈ మొండోళ్ళు మొండికేసి భిక్షను పెట్టించుకుంటారు. జరగకూడనిది జరిగితే కీడు అని నమ్ముతారు. ఆ నిండు గర్భిణి ఏదో కారణం చేత చనిపోతే, ఆమెను అలాగే ఖననం చేస్తే కీడు జరుగుతుందనే నమ్మకంతో తల్లీబిడ్డను వేరుచేసి పూడ్చాలని కొందరి ఆచారం. ఆ పని చేయగలిగిన వారు మొండోళ్ళు. ఈ కథలో నిండుచూలాలిగా ఉండి చనిపోయిన రత్నమ్మ గర్భాన్ని కోసి బిడ్డను వేరుచేసే సమయంలో మొండోడు శవాన్ని కళ్ళకద్దుకొని "ఇందులో నా తప్పేమి లేదు తల్లీ. నా వృత్తి నేను చేస్తావుండా, మన్నించు మహాతల్లీ..!" అనడం మొండోళ్ళ యాచకత్వం కనిపిస్తుంది.

పూడుబాములి, నక్షత్ర తాబేళ్ళను స్మగ్లర్లకు అమ్మే ప్రయత్నంలో పోలీసులకు చిక్కిన గిరిజనులను గురించి వివరించే కథ 'విషప్పురుగు'. చిత్తూరు జిల్లా ఎర్రచందనం స్మగ్లింగుకు ప్రసిద్ధి. తర్వాతి స్థానం పూడుబాములకు, నక్షత్ర తాబేళ్ళకు ఉండే గిరాకీ, వాటి ధర గురించి గిరిజనులకు అవగాహన లేదు. జీవన పోరాటంలో అది కొందరికి వ్యసనంగా ఉంటుంది. ప్రకృతిలో ఉన్న విషప్పురుగుల కాటుకు మందు ఉంటుంది కానీ, ప్రపంచీకరణ విషప్పురుగు కాటుకు మందులేదని సమాజంలోని మనుషులందరినీ కాటు వేసి మానవ విలువలు, ప్రేమాభిమానాలు, దయాదాక్షిణ్యాలను చంపివేసే అసలైన విషప్పురుగు అని రచయిత ఈ కథ ద్వారా సందేశం యిచ్చారు.

ఒకప్పుడు తంబురను, గుమ్మెతను కొడుతూ వీర గాథల్ని పాడి బతికే జంగమోళ్ళ గురించి మొదటిసారిగా రాసాని రాసిని కథ 'పొగిడింపు'. చనిపోయిన వారిని స్మరించుకోవడానికి, ఆ వ్యక్తి వివరాలు చెబితే అప్పటి కప్పుడు పాటను కట్టి 'పొగడటం' వీరి వృత్తి ఆచారం. ఈ వృత్తి నానాటికి నశించి, ఆదరణ కరువై, చివరకు

తిండిలేక తమ వాయిద్యాలనే పగలగొట్టుకొని వట్టి చేతులతో సంచారం వెళ్ళిన కథ ఇది. ప్రపంచీకరణ ప్రభావంతో జంగముల కులవృత్తి ఎలా నిరాదరణకు గురైందో వివరించిన కథ.

ఈ కథల ద్వారా రాసాని గిరిజన, సంచార తెగల జీవితాలను కండ్లకు కట్టినట్లు హృద్యంగా వివరించారు. ప్రపంచీకరణ ప్రభావం వారి జీవితాలలో తెచ్చిన మార్పును, ఆవేదనను మనల్ని ఆలోచింపజేసిన కథలు. అందుకే రాసాని ధన్యజీవి. ఇలాంటి కథలు మరెన్నో రావాలని ఆశిద్దాం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెన్నేటి వారి 'మనచేతుల్లోనే' నాటిక –సామాజిక స్పృహ

– డా॥. పులపర్తిశ్రీనివాసరావు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

'హితేన సహితం సాహిత్యం' అన్నారు ఆర్యులు. సమాజానికి హితం చేకూర్చేదే సాహిత్యం. సాహిత్యమేదైనా కూడా అంతిమ ఫలితం సమాజహితాన్ని కోరడం. సమస్యల వలయంలో చిక్కుకున్న సమాజాన్ని సాహిత్యం ద్వారా కొంతవరకైనా జాగృతం చేయాలని కవులు, రచయితల అభిప్రాయం. ఆ కోణంలో ఆధునిక కవులు, రచయితలు, రచయిత్రులు సంఘ సంస్కరణోద్యమ కవిత్వాన్ని రాసారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఈ విధమైన సాహిత్యం ఉన్నా గురజాడ తర్వాత ఇది బాగా విస్తృతమై సమాజాన్ని సంస్కరించింది. కందుకూరి, గుడిపాటి వెంకటాచలం, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ లాంటి అభ్యుదయ కవులు కవిత్వంతోనే కాకుండా, సాహిత్యంలోని వివిధ ప్రక్రియల ద్వారా తమ భావాలను నిక్షిప్తం చేసి సంఘాన్ని సంస్కరించారు. ప్రజలను చైతన్యం చేశారు. సమకాలీన సమాజాన్ని అంచనా వేస్తే రచనల ద్వారా ఏ విధమైన సంఘ సంస్కరణ జరిగిందో స్పష్టంగా అర్థమవుతుంది. ప్రాచీనకాలంలో ఉన్న మూఢవిశ్వాసాలను, అసాంఘిక పరిస్థితులను నిరసించి సమసమాజ నిర్మాణం కోసం ప్రయత్నం చేశారు. గురజాడ రాసిన కన్యాశుల్కం, బోయిభీమన్న పాలేరు నాటకం, గోపిచంద్ అసమర్థుని జీవయాత్ర, రావిశాస్త్రి అల్పజీవి లాంటి నవలలు, ఇంకా దిద్దుబాటు, యజ్ఞం లాంటి కథలు సమాజంలో సమూల మార్పులు తీసుకొచ్చాయి. ఇంకా ఎందరో ప్రముఖ కవులు. రచయితలు రాసిన నాటకాటు, నాటికలు కూడా ఉన్నాయి. దీన్ని బట్టి సాహిత్యం పరంగా ఎంతో విజయం సాధించినట్లే అని గ్రహించాలి. ఈ మధ్యకాలంలో పరిశీలిస్తే ఆధునిక రచయితలు చాలా మంది సామాజిక చైతన్యాన్ని కాంక్షించి దృశ్య కావ్యాలను వెలువరిస్తున్నారు. వారిలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన తెన్నేటి మాస్టారు కూడా ఒకరు. ఈయన నాటికలలో సామాజిక చైతన్యం కనిపిస్తుంది. సామాజిక పరివర్తన ఉంటుంది. సామాజిక చైతన్యంతో పాటు వ్యక్తి చైతన్యం కూడా ఉంటుంది. సమాజం తీరుతెన్నులు, మంచి చెడుల మధ్య విచక్షణ మొదలైనవాటిని తమ నాటికలలో వస్తువుగా స్వీకరించి సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించారు. ఈయన సామాజిక చైతన్య నాటికలను అధ్యయనం చేస్తే, సామాజిక చైతన్యం ఏ పాటిదో గ్రహించవచ్చు.

రచయిత పరిచయం :

తెన్నేటి మాస్టారుగా ప్రసిద్ధి చెందిన తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తిగారు పశ్చిమగోదావరి జిల్లా అర్థవరం ఉన్నత పాఠశాలలో తెలుగుపండితునిగా సేవలందిస్తున్నారు. 'అక్షర కిరీటి' బిరుదాంకితులైన ఈయన సమసమాజం కోసం తన కలాన్ని, గళాన్ని ఉపయోగిస్తూ సమాజాన్ని తనదైన శైలిలో చైతన్యం చేస్తున్నారు. ఈయన చేస్తున్న కృషి ఎంతటి ఘనాపాటితో తెలియాలంటే ఆయనను వరించిన పురస్కారాలు, బిరుదులే నిదర్శనం. ప్రస్తుతం ఈయన రాసిన 'మనచేతుల్లోనే' నాటికలోని సామాజిక స్పృహను అంచనా వేస్తూ ఈ పరిశోధన వ్యాసాన్ని అందిస్తున్నాను.

నాటిక నేపథ్యం :

పాఠశాలల్లో నేర్చుకున్న 'పరిసరాలు - పరిశుభ్రత' వంటి విషయాలు విద్యార్థులు సెలవుల్లో ఇంటికెళ్ళినప్పుడు వారి పెద్దలకు చెప్పడం, వారిచేత ఆచరించేలా చేయడం, పరిశుభ్రత పట్ల అందరిలోనూ అవగాహన కలిగించడం వంటి నేపథ్యంతో ఈ నాటికను వెలువరించారు రచయిత. ఇది 1999 మార్చి 20వ తేదీన ప్రచురించబడింది.

నాటిక కథా పరిచయం :

పద్మ, సునీతలు స్నేహితులు. ఒకరోజు ఓ గ్రామంలో నడుస్తూండగా అక్కడ అపరిశుభ్రతను గమనిస్తారు. దుర్వాసన వస్తుంది. తట్టుకోలేక ముక్కు మూసుకుంటారు. మనం పుట్టింది ఇక్కడేనే. ఏదో గొప్పగా మాట్లాడతావేమి అని సునీత అంటుంది. పుట్టినంత మాత్రాన ఈ కంపు భరించాలా? అయినా మనం హాస్టల్‌లో ఉంటున్నాం కదా! అయితే ఏం చేస్తాం చెప్పు. పోనీ హాస్టల్‌కు పోదామా అంటే సెలవులు. ఎక్కడికిపోతాం అని ఆలోచిస్తూ పోనీ ఓ పనిచేద్దామా అని తన చిన్న లక్ష్మీవాళ్ళ ఊరు వెళ దామా? అంటుంది పద్మ. అక్కడ కూడా ఇదే కంపు అన్నా విషయం మర్చిపోయి. అదీ మన గ్రామంలాంటి గ్రామమే కదా! అంటే, అయితే ఏం చేద్దామనుకుని, ఈ కంపులో మనం ఈ కాసేపూ ఉండలేకపోతుంటే పాపం మన వాళ్ళందరూ ఎలా ఉంటున్నారో కదా! అనారోగాల్తో, జబ్బుల్తో బాధపడ్తూ... వాళ్ళని కాస్త బాగుచేద్దామా అనే ఆలోచన తీసుకువస్తుంది. మనమేమైనా సంఘసంస్కర్త లమా? ఎందుకులే అని పట్టించుకోనట్లుగా అంటుంది సునీత.

మన ఊరిని బాగుచేయటానికి సంఘసంస్కర్తలమే కానక్కరలేదు... సంకల్పబలంతో, కాగలదని మన తెలుగు మాస్టారు చెప్పారు గుర్తుందా లేదా? అనే విషయాన్ని గుర్తుచేస్తుంది పద్మ. ఈమె ఆలోచనలు సంఘసంస్కర్త వలే ఉంటాయి. వెంటనే పద్మ ఊపిరి పీల్చుకుని ముందుగా మనం మన ఇళ్ళకుపోదాం. అక్కడ మన తల్లిదండ్రులకు కొన్ని మంచి విషయాలు చెప్దాం. ఆ తర్వాత మనం మన ఊళ్ళో ఉంటున్న ూ.చీ.వీ. వద్దకు వెళ్ళి ఆమె సహాయంతో కొన్ని విషయాలు మనవాళ్ళం దరూ తెలుసుకొనేలా చేద్దాం అని ప్రణాళిక చెబుతుంది.

రాజయ్య భార్య బంగారి ఏం పెట్టాలో చెప్పకూడదా తల్లీ అని A.N.M.ని అడిగితే, ఇంతలో పద్మ, సునీత కూడా వాస్తారు. శిశువుకు నాలుగు నెలలు వరకూ తల్లిపాలే ఇవ్వాలి. అయిదో నెలలో అన్నం పిండి గుజ్జు పెట్టాలి. ఆరో నెలలో పప్పుతేట, పళ్ళరసం పెట్టాలి, తొమ్మిదో నెలలో అన్నం, పప్పు, కూరలు పెట్టాలి. పిల్లాడికి ఒంట్లో బాగోలేకపోయినా సరే అన్నం పెట్టాలి. అదీ బిడ్డకీ ఆహారం ఇచ్చే పద్ధతి. అంతేకానీ ఇప్పుడిప్పుడే పంది మాంసం, కోడి మాంసం, నోట్లో కుక్కమాకు అని అర్థ మయ్యేలా చెబుతుంది. బాగా చెప్పావ్ అక్కా...ఏం రాజయ్య తాతా... అక్క చెప్పినవి గుర్తుంటుందా? అని పద్మ అంటే అలాగేలేవే. ఇదిగోూ.చీ.వీ. అక్కఉంది కదా.? అక్క చెప్పినట్టే చేస్తాను అంటుంది.

మేం పట్నంలో ఉంటూ హాస్టల్‌లో చదువు కొంటున్నాం. అక్కడనుంచి సెలవులకు ఇళ్ళకు వస్తున్నాం అక్కడ శుభ్రంగా ఉంటోంది. ఇక్కడ గలీజి గలీజిగా ఉంటోంది. అందుకని రాజయ్య, బంగారి వెళ్ళబోతుంటే వారిని కూడా ఆగమని మీలాంటి వాళ్ళే వినాలి ఈ విషయాలు అంటుంది. ఏం లేదక్కా మనం ఈ ఊరిని బాగుచేద్దాం. ప్రతీ రోజూ వీధులు, శుభ్రంగా తుడవటం, అనవసరపదార్థాలు, తుక్కు దూరంగా పారేయటం, పశు వులను జంతువులను, మనుషులకు దూరంగా ఉం చటం, ఇట్లాంటి విషయాలు మనం మీటింగ్లు పెట్టి అందరికీ చెప్పటం వంటి లక్ష్యాలను చెబుతుంది. దానికి A.N.M. బాగుంది పద్మా, సునీతా మీ ఆశయం. అలాగే చేద్దాం. మీలా చదువుకున్న వాళ్ళు ఎవరైనా సాయం వస్తారేమో ఈ పని చేద్దాం అని చాలాకాలం నుంచి అను కుంటున్నానని తన ఆలోచన కూడా తెలియజేస్తుంది ఏ.ఎన్.ఎమ్.. చాలా మంచి పని చేస్తున్నారమ్మా. మనూళ్ళో అపరిశుభ్రంగా ఉండటం వలన రోగాలొస్తున్నాయని A.N.M. చెప్తే వినిపించుకోవట్లేదు. రండి అందరం కలసి కట్టుగా చెబ్దాం అంటాడు రాజయ్య.

ఒకచోట మహిళలు, పిల్లలు, పెద్దలు అందరూ ఉంటారక్కడ. పద్మ మాట్లాడుతూ అమ్మలారా, అయ్య లారా అందరికీ నమస్కారం. ముఖ్యంగా మన గ్రామాలు ఆరోగ్యానికి, ప్రశాంతతకు పట్టుగొమ్మలు అని ఒకనాటి నగర ప్రజలు అనుకొంటూ సెలవుల్లో గ్రామాలకు వచ్చి

వెళ్ళేవారు. కానీ ఇప్పుడు మన వాళ్ళు మన ప్రాంతాలు విడచిపోతున్నారు. ఎందుకో తెలుసా.? అని మన పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవటం వలన మనకు ఎన్నో అనారోగ్యాలు వస్తున్నాయి. అందువలన మనం కూడా మన పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం అని చెబుతుంది.

రాజయ్య చదువుకోకపోవచ్చు కానీ తెలివైన వాడుగా వాళ్లతో కలిసి మాట్లాడడం, వాళ్ళకు సహాయం చేస్తాన నడం కనిపిస్తుంది. కాస్త బుర్రపెట్టుకొని ఆలోచించండర్రా. పద్మమ్మ చిన్న పిల్లే అయినా చదువుకుంటోంది కదా! బళ్ళో నేర్చుకొన్న మంచివిషయాలు మనకు చెప్తోంది విందాం..రా.. అని అక్కడి వాళ్ళందరకూ బోధపడేటట్లు చేస్తాడు.

తరువాత ఆరోగ్యం గురించి చెప్తూ, ముందుగా చిన్న పిల్లల ఆరోగ్యం గురించి, ప్రస్తావిస్తుంది. ఆహారం తినే ముందరా, తిన్న తర్వాత, చేతులు, కాళ్ళు కడుక్కోవటం, మలమూత్ర విసర్జన చేసిన తర్వాత శుభ్రంగా కాళ్ళు, చేతులు కడుక్కోవటం, చేతిగోళ్ళు కత్తిరించటం, జుట్టు కురచగా కత్తిరించుకోవటం, నూనెరాసి శభ్రంగా దువ్వుకోటం, రోజూ రెండు పూటలా స్నానం చేయటం, శుభ్రమైన బట్టలు ధరించటం, మురుగుపోయిన మాంసం తినకుండా చూడటం, ఉడికీ ఉడకనివి తినకుండా చూడటం, పాద్దస్తమానూ ఏదో ఒక చిరుతిళ్ళు తినకుండా చూడటం ఇవన్నీ తల్లులుచేయాల్సిన పనులు అని పద్మ వివరిస్తుంది.

అక్కడ కూర్చొన్న వారిలో ఒకరు ఇవన్నీ ఎక్కడ జరుగుతాయమ్మా? అవన్నీ చెప్పటానికి బాగుంటాయికానీ చేయటం కుదరదమ్మా అన్నా దానికి బదులుగా,,,చీ.వీ. కుదరదమ్మా అంటే ఎలాగా? మీ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలా...వద్దా? ఆరోగ్యంగా ఉంటేనే కదా ఏ జబ్బులు, రోగాలు రావు. తల్లులకు పిల్లల క్షేమం ముఖ్యం అనుకుంటే ఈ పనులు చేయక తప్పదు అని హెచ్చరికగా చెబుతుంది. D.T.T చల్లించుకొందాం. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయిద్దాం. కాచి చల్లార్చిన నీళ్ళు తాగుదాం. ఆరోగ్యంగా ఉందాం. ఆరుబయట ఎక్కడ పడితే అక్కడ మలమూత్ర విసర్జన, ఉమ్మటంలాంటివి మానేద్దాం. ఎంచిన ప్రదేశాలలోనే మలమూత్ర విసర్జన చేయండి అని హితవు పలికే ప్రయత్నం చేస్తుంది.

రాజయ్య లాంటి వాళ్ళు కల్పించుకుని చాల మంచి విషయాలు చెప్తున్నారమ్మా, ఇవన్నీ అందరకూ తెలిసినవే అయినా కానీ ఎవరూ చేయట్లేదమ్మా అంటే ఒక యువకుడు లేచి సిగ్గు లేదేంటిరా మనకు? మనకంటే చిన్న పిల్లలు చెప్తోంటే. మన ఊరిని మనం బాగుచేసుకోలేమా? మన ఆరోగ్యం మనం కాపాడుకోలేమా? మనకు పౌరుషం లేదా? మన వీధుల్లో అడ్డంగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగిద్దాం. పశువులను, మేకలను ఇళ్ళకు దూరంగా కట్టే ఏర్పాటు చేద్దాం. మలమూత్ర విసర్జన ఎక్కడపడితే అక్కడ విసర్జించేవారిపై చర్య తీసుకొందాం అని పౌరుషంగా మాట్లాడుతాడు. ఇతని మాటలకు ఎ.ఎన్.ఎమ్. చాలా సంతోషం, ఇలా ఎవరంతటవారు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యం అనేది మనదరికి రానే రాదు.అందరూ ఉత్సాహంగా ఉన్నారు కదలండి మన ఊరిని మనమే బాగుచేసుకొందాం అని అందరూ కదులుతారు. నాటిక ముగుస్తుంది.

సామాజిక స్పృహ :

సామాజిక బాధ్యతను తెలియజేసే క్రమంలో రచయిత ఊరి పరిశుభ్రతను, దాని ప్రాధాన్యతను పాత్రల ద్వారా వెల్లడించారు.ఈ పాత్రల చిత్రణ పరిశీలిస్తే రచయిత సామాజిక స్పృహ అర్థమవుతుంది. ఈ కోణంలో చైతన్యం కలిగిన పాత్రలను ఇతివృత్తం ఆధారంగా పరిశీలిస్తున్నాను.

ఈ కోవలో ముందుగా చెప్పుకోవలసిన పాత్ర పద్మ. గ్రామంలో పుట్టి చదువునిమిత్తం పట్టణంలో ఒక హాస్టల్లో ఉండే ఆదర్శవంతమైన విద్యార్థి. ఇతరుల్లో మంచిచెడుల మధ్య అవగాహన కల్పిస్తూ, సంఘ సంస్కర్తలా ప్రవర్తించే అమ్మాయి. పరిశుభ్రతగురించి ఊరి జనాలకు తెలియజేసి

అందరూ దీనికి బాధ్యతగా వ్యవహరించాలని, ఊళ్ళో రోగాలు వంటివి ప్రభలకుండా చూడాలని పరితపించే యువత. తన స్నేహితురాలితో కలిసి ఊరి బాగుకోసం తనవంతు కృషి చేస్తుంది. సంఘసంస్కర్తలమా? మనం అన్న స్నేహితురాలితో "చూడు సునీతా... మన ఊరిని బాగుచేయడానికి సంఘ సంస్కర్తలను కొనక్కరలేదు. సంకల్పబలంతో, కాగలదని మన తెలుగు మాష్టారు చెప్పారు గుర్తుందా లేదా?" అని ప్రశ్నించిన దాన్నిబట్టి పద్మ ఎంతో సామాజిక స్పృహ ఉన్న యువతిగా చిత్రించ బడిందని తెలుస్తుంది. యువతలో సామాజిక బాధ్యత పట్ల అవగాహన కలిగించుటకు రచయిత ఈ పాత్రను చిత్రించారనిపించింది.

తరవాత చెప్పుకోదగ్గ ప్రాత్ర సునీత. ఈమె పద్మ స్నేహితురాలు. ఈమె కూడా పద్మతోకలిసి హాస్టల్లో ఉంటూ చదువుకుంటుంది. సంఘ సంస్కరణమీద అంత అవగాహన లేకపోయినా పద్మ చెప్పే మాటలకు ఆలోచనలోపడి సునీత కూడా సామాజిక బాధ్యతపట్ల ముందడుగు వేస్తుంది. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన పాత్రగా మలిచారు రచయిత. ఎ.ఎన్.ఎం.తో కలిసి ఆ ఊరి జనాలను బాగుచేస్తుంది. తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటురోగాల బారినుండి కాపాడుకోవచ్చని, సమస్యలు ఉద్భతం అవకముందే నివారణలు చేపట్టవచ్చని ఈపాత్ర తెలుపుతుంది. ఇవన్నీ జరుగుతాయా? అనే ఊరి జనా లతో 'ఇప్పుడు మన ఇల్లు తీసుకుందాం. మన ఇంటి లోనికి గాలి, వెలుతురు ఏర్పాటు చేసుకొందాం. ఇంటి చుట్టు మురుగు, చెత్తా నిల్వ ఉండ కుండా చూద్దాం. ప్రతీ రోజు రెండు, మూడుసార్లు ఇంటిని తుడుచు కుందాం. ఇంటిలోని సామాన్లు, బట్టలు అందంగా అమర్చుకొందాం, కోళ్ళు, పశువులకు సంబంధించిన ఎరువులు, మందులు ఇంట్లో ప్రత్యేకమైన చోట ఉంచు దాం. ఇంట్లో ఊడ్చిన చెత్త అంతా ఒకచోట పోగేద్దాం.... నెలకోసారి ఆ చెత్త తగలెడదాం. మురికినీటి గుంటలు పూడుద్దాం" అని ఎంతో తెలిసిన సామాజిక కర్తగా మాట్లాడిన దాన్నిబట్టి, రచయిత ఈ పాత్ర ద్వారా ప్రతీ ఒక్కరిలో సామాజిక స్పృహను మేల్కొలిపే ప్రయత్నం చేస్తున్నారని తెలియవచ్చింది.

ప్రాథమిక ఆరోగ్య కార్యకర్త పాత్ర కూడా ఇదే తరహాలో చిత్రించారు రచయిత. ఆరోగ్య కార్యకర్తగా తన బాధ్యతను సంపూర్ణంగా నిర్వహించింది. అంటు రోగాలు ప్రభలకుండా ఉండటానికి తీసుకోవలసిన సూచనలను పద్మ, సునీతల ద్వారా ప్రచారం చేయగలిగిన పాత్ర ఎ.ఎన్.ఎం. పాత్ర. ఆరోగ్య విషయం ఎంత శ్రద్ధ తీసుకుంటే అంతమంచిదని చెప్పినప్పుడు ఆమెలో ఉ న్న నిబద్ధత గ్రహించవచ్చు. ఇవన్నీ కుదురుతాయా? అన్నప్పుడు "కుదరదమ్మా అంటే ఎలాగా... మీ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలా వద్దా ....?' ఆరోగ్యంగా ఉంటేనే కదా ఏ జబ్బులు , రోగాలు రావు కదా .... తల్లులకు పిల్లల క్షేమం ముఖ్యం. అనుకుంటే ఈ పనులు చేయక తప్పదు" అని కుండబద్దలు గొట్టినట్లు హెచ్చరించినదాన్ని బట్టి దాన్నిచూస్తే మీరు తప్పక శ్రద్ధ తీసుకోవాలని పరోక్షంగా హెచ్చరించిందనే చెప్పాలి.

ఈ పాత్ర విధులను తెలియజేయడం ఒక ఎత్తు అయితే, ఇదే పాత్ర చేత బాధ్యతాయుతమైన పనులు చేయించి దాన్ని ఊరి ప్రజలకు ఆదర్శంగాని లోపాలను కోవడం మరో ఎత్తు. రచయిత చేసిన ఈ ప్రయత్నం సామాజిక చైతన్యాన్ని కాంక్షించి ఉన్నట్లు గ్రహించాను.

మరో పాత్ర రాజయ్య ఇతనొక మధ్యతరగతి రైతు. వ్యవసాయంపరంగా ఆలోచనాపరుడు. సమయాన్ని సద్వి నియోగం చేసుకోవడంలో దిట్ట. సమస్యలు వచ్చినప్పుడు ఒత్తిడికి లోనవకుండా తనదైన శైలిలో ప్రతిస్పందించే వ్యక్తి. కానీ ఆరోగ్య సూత్రాలు తెలియక ఇంటివాళ్ళను, తనను కూడా ఇబ్బందుల్లో పడేసే మనిషి కూడాను. వారంరోజులు పసిపాపకు అన్నం తినిపించాలనే యోచన కలిగిన రాజయ్య ఒక రకంగా అమాయకుడనే చెప్పాలి. 'బిడ్డ లావుగా, బలంగా కావాలి కదమ్మా' అని చెప్పినపుడు

అతినిలో ఉన్న అమాయకత్వం అజ్ఞానం బయటపడింది. ఎంత అజ్ఞాని అంటే ఎ.ఎన్.ఎం. కూరలు, బువ్వలేంటి కానీ. అడివిమాంసం పెట్టకూడదా అని వెటకారం ఆడినప్పుడు 'అలాగేనమ్మా క్షణాల్లో తెచ్చి పెడ్తాను4 అంటాడు. వారం రోజుల బిడ్డకి అడవిమాంసం పెడతా నని చెప్పడంలో ఇతనికి జ్ఞానం లేదని తెలుస్తుంది. రాజయ్యలో జ్ఞానం లేకపోవచ్చు. కాని మంచి ఆలోచన చేస్తాడు. ఎవరైనా ఏదైనా ఒక మంచి విషయం చెప్తే ఆచరిస్తాడు. బాధ్యతగా తీసుకుని మంచి చేయడానికి ప్రయత్నిస్తాడు.

రాజయ్య పాత్రను ఇలా చిత్రించడానికి గల కారణా లను పరిశీలిస్తే పాత్ర ఆద్యంతం ఒక విషయం అర్థమవు తుంది. పల్లెల్లో ఇంకా జ్ఞానంలేని వాళ్ళు ఎందరో ఉన్నారు. పుట్టిన బిడ్డ విషయంలో నాటు పద్ధతులు పాటించి అనారోగ్యాల పాలు చేస్తుంటారు. అటువంటి వారి స్థితిని తెలపడంకోసమే ఈపాత్ర ముఖ్య ఉద్దేశ్యం అని గుర్తింవచ్చు.

మరో పాత్ర రాజయ్య కూతురు బంగారి. లోకజ్ఞానం కలిగిన అమ్మాయి. చిన్నవయసు లోనే పెళ్ళి చేసేయడం వల్ల అనేక రకాల శారీరక సమస్యలతో పోరాడింది. తను చిన్నవయసులో బిడ్డకు జన్మనిస్తుంది. ఆ బిడ్డ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు విషయంలో కూడా ఈమెకు ఏమితెలియదు, తల్లిదండ్రుల చెంతన ఉంటూ బిడ్డను కాపాడుకోవడమే తెలుసు..

లోకజ్ఞానం ఎరిగిన అమ్మాయి కావడంలో తండ్రి వారం రోజులకే భోజనం పెట్టేయాలి అన్నప్పుడు, అది తప్పని, ఆరు నెలల వరకూ బిడ్డకు ఏమీ తినిపించ కూడదని చెబుతుంది. ఈ మాటలు ఆమెలోఉన్న జ్ఞానా నికి నిదర్శనంగా చెప్పొచ్చు. తన తండ్రి అజ్ఞానంగా ఉ న్నాడని తెలిసినప్పుడు ఎ.ఎన్.ఎం.తో మాట్లాడి కొంచెం జాగ్రత్తలు తీసుకోమని చెప్పండని వేడుకొంటుంది.

తల్లిదండ్రులంటే ఎంతో గౌరవం. ఆ గౌరవంతోనే తండ్రి ఏంచెప్పినా చేసేసెది. అది మంచా? చెడా? అనేది చూసేదికాదు. కానీ ఒక బిడ్డ విషయంలో మాత్రం మంచి ఆలోచన చేయగలిగిందని ఈమె మాటలుబట్టి అర్థ మయ్యింది. అలాగే "ఇదిగో ఎ.ఎన్.ఎం. అక్కఉంది కదా... అక్క చెప్పినట్టే చేస్తాను. సరే .... నా సరే కానీ ఆరోగ్యం మాత్రం నిర్లక్ష్యం చేయను" అన్నప్పుడు కూడా ఎదుటివాళ్ళకు మర్యాద ఇస్తుందని గ్రహించవచ్చు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ, జీవితం మీద ఆశ, సక్రమమైన జీవనం గడపాలి అన్న వాళ్ళెవరైనా ఇలాగే ఉంటారనే కోణంలో ఈపాత్రచిత్రణ జరిగిందని తెలుస్తుంది.

ఈ నాటికలో ఒక యువకుడి పాత్రను పరిచయం చేశారు రచయిత. ఈ పాత్రకు పేరు పెట్టలేదు. చదువు అంతంత మాత్రమే అయినా, ఎవరైనా మంచికి చెబితే వినే వ్యక్తిత్వం కలవాడు. ఆలోచనతో కూడిన ఆవేశం కలిగినవాడు కావడం వల్ల ఊరి ప్రజలలో మార్పు తీసుకొచ్చే విధంగా కోప్పడి ప్రజలందరిలో ఆలోచన నింపగలిగాడు. ఎ.ఎన్.ఎం., పద్మ, సునీతలు ఊరి బాగుకోసం వచ్చి మాట్లాడు తున్నప్పుడు, ఊరి జనాలు ఎవరూ పట్టించుకోనప్పుడు "ఛత్ సిగ్గులేదేంటిరా మనకు మనకంటే చిన్నపిల్లలు చేస్తోంటే మన ఊరిని మనం బాగు చేసుకోలేమా... మన ఆరోగ్యం మనం కాపాడుకోలేమా? మనకు పౌరుషం లేదా? లెండిరా ... మన వీథుల్లో అడ్డంగా ఉన్నచెత్తా చెదారంను తొలగిద్దాం... పశువులను మేకలను ఇళ్ళకు దూరంగా కట్టే ఏర్పాటు చేద్దాం....6 అని అందరిలో పౌరుషం రగుల్కొల్పి సామాజిక బాధ్యతపట్ల అంకితభావంతో పనిచేసేటట్లు ప్రోత్సహించిన పాత్రగా మలిచారు రచయిత.

ముగింపు :

పాత్రల పరంగా ఈ నాటికను అంచనా వేసిన తరు వాత ఒక విషయం స్పష్టమవుతుంది.అందరూ పరిశు భ్రంగా ఉండాలి, చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉండాలని కోరుకునేవారేగాని, ఆ పరిశుభ్రతకోసం ఎవరూ ప్రయత్నించరు. అయితే ఈ నాటికలో పద్మ, సునీత అనే అమ్మాయిలు వారు చదువుకున్న 'పరిసరాలు

-పరిశుభ్రత' పాఠంవల్ల నేర్చుకున్న అంశాలను ఆ ఊరి జనాలతో ఊరిబాగుకోసం శుభ్రం చేయించడం చేస్తారు. అలాగే అంటురోగాలు వంటివి ప్రబలకుండా ఉండాలంటే పరిశుభ్రతే ప్రధానమని, ఇది మనందరి చేతుల్లోనే ఉందని చెప్పే క్రమంలో 'మన చేతుల్లోనే' అనే నాటిక ద్వారా రచయిత అనుకున్న సందేశం సామాజికంగా ఎంతో ప్రభావం చూపగలదనిపించింది.

అలాగే ఇతివృత్తాన్ని సమాజం నుండి గ్రహించినపుడు, పాత్రలను కూడా సమాజానికి దగ్గరాగా ఉండే పాత్రలనే ఎంచుకోవాలి. రచయిత తెన్నేటి వారు ఈ విధంగానే పాత్ర చిత్రణ చేశారు. ఇటువంటి పాత్రలను ఈ విధంగా చిత్రించడంవల్ల ఎంతోకొంత సామాజిక ప్రయోజనం ఖచ్చితంగా ఉంటుంది. ఆ ప్రయోజనం సమాజంలోని క్షేత్రస్థాయి వరకూ అందితే ఇంకా గొప్ప అభివృద్ధి ఉంటుందని పరోక్షంగా ఈ నాటికలో సూచన చేశారు రచయిత.

ఈవిధంగా ఈ నాటికలో వివిధ పాత్రల ద్వారా సామాజిక చైతన్యాన్ని ప్రజల్లో తీసుకురావడంకోసం తనవంతు బాధ్యతగా ఒక రచయితగా పాటుపడ్డారని ఈ నాటిక పరిశీలిస్తే అర్థమైంది.

ఉపయుక్త గ్రంథసూచిక :

1. ఆంధ్ర నాటక రంగ చరిత్ర - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, రేణుకా గ్రంథమాల, మద్రాడు, 1969.
2. ఆంధ్ర నాటక కళాపరిషత్తు - రజతోత్సవ సంచిక, గుడివాడ, కృష్ణాజిల్లా, వికారి సంఘం, 1960.
3. ఆచార్య ఆత్రేయ తెలుగు నాటక రంగం - సంపాదకుడు డా॥ మొదలి నాగభూషణశర్మ, తెలుగు విశ్వవిద్యాలయం, 1985.
4. ఆధునిక తెలుగు నాటకం - రెండు భాగాలు - గండవరపు సుబ్బరామిరెడ్డి, ప్రవీణ్.
5. ఏకాంకిక నాటికలు - దివాకర్ల వేంకటావధాని, సంస్కృతి, 1955.
6. చింతా దీక్షితులు నాటికలు - పరిశీలన, గేదెల వలసయ్య, వాల్తేరు,1985.
7. నేనూ సదూకుంటా(నాటికల సంపుటి) - తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి,తెన్నేటి రచనలు, గణపవరం, పశ్చిమగోదావరి జిల్లా,2014
8. సాంఘికోధ్యమ రూపకాలు- ఆచార్య సజ్జా మోహనరావు, తెలుగుశాఖ, విశాఖపట్నం-03, 2015.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రావిశాస్త్రి – అల్పజీవి : సామాజిక స్థితిగతులు

– డా॥. సి. ముత్యాలప్ప , అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీవాణి డిగ్రి. పి.జి. కళాశాల, అనంతపురము.

అస్తవ్యస్తంగా, వర్గ, వర్ణమయంగా ఉండి, ధనిక ఊదవర్గాల నడుమ దూరాన్ని రోజురోజుకు పెంచుకు పోతున్న నేటి సామాజిక వాతావరణాన్ని రావిశాస్త్రి వాస్తవికంగా తన రచనల్లో చిత్రీకరించటమే కాదు, వాటి మూలాలను, తత్పర్యవసానాన్ని కూడా వివరించి అసంఖ్యాక పేద ప్రజల పక్షాన అరుణోదయంలా నిలి చారు. సామాజిక, వాస్తవిక ధోరణి లేని రావిశాస్త్రి గారి రచన లేదు.

రావిశాస్త్రి సొంతపేరుతో మొదటి సారిగా 'అల్పజీవి' ప్రచురితమవటంతో ఆయన, సామాజిక బాధ్యతని, ముసుగుల్లేని తనాన్ని గుర్తించినట్లయింది. మనిషి అంత రంగ బాహిర విషయాలు పరస్పర సంబంధకాలు, సుబ్బయ్య జన్మత: అసమర్థుడు, భయస్తుడు కాడు, కాని అతని బావమరిది వెంకట్రావు సుబ్బయ్యని అసమర్థుడిగా పరిగణించటం, ఆఫీసులోని వాళ్ళు అతనిని అశక్తుడిగా ముద్రవెయ్యటం, తెలిసినవారెవరూ తనకు సరైన విలువ నివ్వటం లేదనే దృష్టి సుబ్బయ్యలో పెరగటం, ఆఖరికి ఇంట్లో భార్యకూడా అతన్ని పనికి రాని వాడిగా పరిగణించటం ఈ సామాజిక వాతావరణమంతా సుబ్బయ్య మనసుపై పనిచేసి, అతన్ని నిర్వీర్యం చేసింది.

అంతేగాక చిన్నప్పుడే తల్లి చనిపోవటం, సవతి తల్లి కాపురానికొచ్చిన మరునాటి నుండే సుబ్బయ్యని హింసిం చటం, చీకట్లో, తన కళ్ళ ముందే దొంగలు తండ్రిని కొట్టి పారిపోయిన సంఘటన, అతని జీవితంపై బాల్యం నుండే బలమైన ముద్రవేసి సుబ్బయ్యని పిరికివానిగా, అశక్తునిగా తయారు చేశాయి.

తనచుట్టూ ఉన్న సామాజిక పరిస్థితులు ఏ వ్యక్తినైనా తప్పక ప్రభావితం చేస్తాయి. ఇలాంటి వాతావరణం నుంచి ఎదిగిన సుబ్బయ్య ప్రతిదానికి భయపడటం, ఎదుటి వాళ్ళు ఏమన్నా అనుకుంటారేమోనని సందేహించటం. స్వయం నిర్ణయక శక్తి లేకపోవటం, చొరవ లేని వ్యక్తిగా పెరగటం వల్లే గవరయ్యని ఐదువందల రూపాయలు అడగాలంటే హడలిపోతాడు. ఆ ఐదు వందల సన్ని వేశంలో అంతగా అతలాకుతలం అవ్వనవసరం లేదు. కాని సామాజిక పరిస్థితులను సరియైన దృష్టితో అంచనా వేసుకోవడంలో సుబ్బయ్య మొదటినుంచి అచేతనంగా ఉన్నాడు. కాబట్టి ఆ పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. సామాజిక అవగాహన వ్యక్తి జీవితాన్ని మలుస్తుంది. అది లేక పోతే జీవన ఎదుగుదల కుంటుపడుతుంది. అయితే మనోరమ సాహచర్యం సుబ్బయ్య జీవన క్రమాన్ని మలుపు దిప్పింది. భయం తనకొక్కడికే కాదు. ప్రతి ఒక్కడికి ఉంటుంది. ఆ భయం వల్లే ఆఫీసులో గవరయ్య తనని డబ్బులడగడానికి జంకుతున్నాడు. అనే జీవన సత్యాన్ని సుబ్బయ్య తెలుసుకున్నాక అతని ఆలోచనల్లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. భౌతిక పరిస్థితులను అధ్యయనంలో అర్థం చేసుకోవటంలో మెలకువ ఉంటే జీవితం వెలుగుబాటలో లేక పోయినా, ముళ్ళపొదలో కూరుకుపోదు. చీకటి అరల్ని అడ్డగోడల్ని కట్టుకోకుండా, సామాజిక అవగాహనను పెంపొందించుకోవాలి సగం జీవితం గడిచిపోయినా తానేమిటో తన అస్తిత్వమెమిటో ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో, ఎవరికోరల్లో ఇరుక్కు పోయాడో, ఈ దగాకోరు సమాజంలో ఎలా జీవించాలో తెలియక తికమకపడి విలవిల్లాడిపోయాడు, సుబ్బయ్య లాంటి ఊగిసలాట వ్యక్తుల జీవితాల్ని వాస్తవికంగా విశదం చెయ్యటం వల్ల సమాజానికి మేలు జరుగుతుంది. తాడేదో పామేదో తెలుసుకోవడానికి దుర్మార్గుల కోరల్లో ఇరుక్కోకుండా జాగ్రత్త పడటానికి ఈ 'అల్పజీవి' వృత్తాంతం ఉపయోగపడుతుంది.

సుబ్బయ్యలో చిన్నప్పటి సంఘటనల తాలూకూ భయం పెద్దయ్యాక కూడా అతన్ని వెంబడించడాన్ని చూడవచ్చు, అర్ధరాత్రి అకస్మాత్తుగా నిద్రలేచి నాన్నను ఎవరో కొడుతున్నారు చంపేస్తున్నారని అరుస్తుంటాడు. రాత్రి వేళ ఒంటరిగా వెళ్ళటానికి భయపడతాడు. అందుకే అతని భార్య పిరికిపంద అని తిట్టుకుంటుంది. బావమరిది సంగిరి పింగిరి వానికింద జమకట్టి తన అవసరానికి వాడు కుంటాడు. అంతేకాక ఆఫీసర్లంటే భయపడటానికి, సెలవు అవసరం ఉన్నా అడగక పోవటానికి చివరికి బజారులో కూరగాయలమ్మే మనిషితో బేరం చేయడానికి కూడా సందేహ పడటానికి కారణం ఆత్మన్యూనతా భావమే అనే విషయాన్ని రావిశాస్త్రి చక్కగా విశ్లేషించి చూపాడు. ఇందులో సుబ్బయ్య వ్యక్తిత్వాన్ని కేవలం ఆత్మన్యూనతా భావం ఆధారంగానే అతని అభద్రతకు కారణమైన ఆర్థిక సమస్యలను కూడా రావిశాస్త్రి ఈ నవలలో అన్వయించారు.

సుబ్బయ్య జీవనస్థితి తెలియక సతమతమైపోతుంటే ఏరోటి దగ్గర ఏరాగంతో జీవన రాగాన్ని మీటాలో తెలుసుకొని గవరయ్యలు, వెంకట్రావులు హాయిగా సుఖంగా బ్రతుకుతున్నారు. ఈనాడు సమాజంలో సుబ్బయ్య కంటే గవరయ్యలు, వెంకట్రావులు ప్రబలిపోతున్నారు. దోచుకు తినటం, అవినీతి, లంచగొండితనం నిచ్చెనలతో పైకి ఎగబాకటం అధికార, రాజకీయ, అండదండలతో సమాజంపై పట్టు సంపాదించటం తద్వారా నిస్సిగ్గుగా ధన సంపాదన చేయటం వీళ్ళ జీవిత ప్రధాన ధ్యేయం సిగ్గు, లజ్జ, నీతి, న్యాయం, ధర్మం ఇలాంటి మాటలు వీళ్ళకి చెవిటివాడి ముందు శంఖం లాంటిది. తహశీల్దారు ఆఫీసులో అటెండరుగా చేరిన గవరయ్య, భార్య తప్పటడుగును ఫణంగా బెట్టి, అన్నీ విడిచిపెట్టి పెద్ద కాంట్రాక్టరుగా కాలుకింద పెట్టకుండా తిరుగుతున్నాడంటే ఈ వాతావరణాన్ని ఒంటబట్టించు కోవడం వల్లే.

అప్పులతో ఆస్తి ధ్వంసమైపోయి, ఐదువందల రూపాయలకు కూడా బావ సుబ్బయ్యను బెదిరించాల్సి వచ్చినా దర్జాగా 'అడుక్కొని' ఆ డబ్బుల్తో బావని చిక్కులోకి నెట్టి తనుమాత్రం ఇంట్లో ఉండి కూడా లేడనిపిస్తూ, గవరయ్య విడిచిపెట్టిన మొదటి భార్య రామాయ్యమ్మతో కులుకుతూ; ఏ మాత్రం మానవత్వపు విలువలు లేకుండా వెంకట్రావు జీవిస్తున్నాడంటే ఈ విషవాతావరణ ప్రభావమే. అందుకనే రావిశాస్త్రి ఈ కుహనా వాతావరణాన్ని నిలదీశాడు. ఈ మేడిపండు సంస్కృతిని బట్టబయలు చేశాడు. గవరయ్య, వెంకట్రావు లాంటి అసాంఘిక శక్తుల చేతుల్లో ఇరుక్కోవద్దని తన అనుభవంతో సాంఘిక అవగాహనతో హెచ్చరిస్తున్నారు. సమాజంలో, దాని చుట్టూ అలముకున్న వాతావరణాన్ని సహేతుకంగా విశదం చేసి ప్రజానీకాన్ని వెన్నుతట్టి మేలుకొలిపే రచయితే అభ్యుదయ కాముకుడు.

దేనికైనా కార్యకారణ సంబంధముంటుందనే సూత్ర బద్ధమైన ఆలోచనలతో సుబ్బయ్యలో కూడా సహేతుక ఆలోచన కలిగి తాను భయపడటం వల్లే లోకమంతా భయపడుతుందని, గవరయ్య అవినీతివనులు చెయ్యటం వలనే ఆఫీసులో డబ్బులు అడగలేక పోతున్నాడని, వెంకట్రావు మోసంతోటే జీవిస్తున్నాడని. కనుక ప్రతి దానికి ఒక కారణం తద్వారా కార్యం ఉంటుందనే జీవన సత్యాన్ని సుబ్బయ్య అలస్యంగానైనా గ్రహిస్తాడు. అంటే ఈ సామాజిక అస్తిత్వాన్ని సుబ్బయ్య లాంటి కూపస్థ మండూకాలు కాస్త ఆలస్యంగా గ్రహిస్తారనే వాస్తవాన్ని తెలియజేశారు. సుబ్బయ్య ఆలోచనల్లో మార్పుని, అతని అస్తిత్వాన్ని తెలియజేసి, సామాజిక పోకడని వివరించి అతనిలో చైతన్యాన్ని రగిలింపచెయ్యడం కోసమే మనోరమను సృష్టించింది.

ఈ నవలలో గవరయ్య తనను సుఖంగా బతకనివ్వని సమాజం కారణంగా క్రూరుడుగా మారి, కాంట్రాక్టర్ స్థాయికి ఎదిగాడని తెలుస్తుంది. అంతేకాక తన పనులను చేయించుకోవడం కోసం డబ్బును ఎరగా చూపడం అవసరమైతే బెదిరించడం దౌర్జన్యంగా హింసించడం వంటి పనులు చేయడానికి పూనుకుంటాడు. ఇందుకు

నిదర్శనం అతడు సుబ్బయ్య పట్ల ప్రదర్శించిన తీరును బట్టి తెలుస్తుంది.

అయితే దుర్మార్గుడుగా మారిన గవరయ్యలో మంచితనం ఇంకా మిగిలి ఉందనడానికి, తన ఊరే అయిన తన తల్లికి ఇష్టమైన మనోరమకు గవరయ్య, సుబ్బయ్యకు సంబంధించిన ప్రోనోటు వాపసు ఇచ్చివేసిన సంఘటన ద్వారా రావిశాస్త్రి తెలియజేశారు.

సామాజిక పరిస్థితుల కారణంగా దుర్మార్గులుగా మారిన గవరయ్య వంటి అట్టడుగు వర్గాలకు చెందిన వ్యక్తులు ఎప్పుడో ఒకప్పుడు వాస్తవాల్ని తెలుసుకొని మంచి మనుషులుగా మారే అవకాశం ఉందని అటువంటి వ్యక్తులను ద్వేషించడం కంటే సానుభూతిని తెలపడం మంచిదని రావిశాస్త్రి గవరయ్య పాత్ర ద్వారా సూచించారు.

ఇక స్వార్థపూరితమైన ఈ సమాజంలో నమ్మిన వాళ్ళే దగా చేయడంతో స్వలాభమనే జండా ఎత్తి స్వార్థపరుడిగా మారిన మరో వ్యక్తి సుబ్బయ్య బావమరిది వెంకట్రావు.

మనుషులను మోసం చేయడానికి ఎత్తులు వేసే ప్రయత్నంలోనే గవరయ్య తాలూకూ బిల్స్ తన బావ సుబ్బయ్య దగ్గర ఉన్నాయని తెలుసుకున్న వెంకట్రావు, తన అవసరానికి గవరయ్య దగ్గర డబ్బు తీసుకుని ఇవ్వాల్సిందిగా సుబ్బయ్యను అడిగి అతన్ని తన స్వార్థానికి వాడుకుంటాడు. గవరయ్యకు డబ్బులు తిరిగి ఇచ్చే విషయంలో తీవ్ర మానసిక వ్యధతో బాధపడుతున్న సుబ్బయ్యను ఏ మాత్రం, పట్టించుకొనక పోగా, సుబ్బయ్య తనకోసం ఇంటికి వచ్చినప్పుడు ఇంట్లోనే ఉంపుడు గత్తెతో కులుకుతూ ఆమెతో 'లేడని' సమాధానం చెప్పిస్తాడు. దీన్ని బట్టి సుబ్బయ్య పట్ల వెంకట్రావుకు ఎంత నిర్లక్ష్యం ఉందో తెలుసుకోవచ్చు. చివరకు మొండికేసి సుబ్బయ్యతో గవరయ్యకు సొమ్ము ఇవ్వవలసిన అవసరం లేదని సలహా ఇస్తాడు. గవరయ్య సుబ్బయ్యను బెదిరించిన విషయం తెలుసుకొని తాను ఉంచుకున్న గవరయ్య భార్య రామయ్యమ్మను అతనికి చూపించి మానసికంగా దెబ్బతీస్తాడు.

ఇటువంటి వెంకట్రావును ఉద్దేశించి రావిశాస్త్రి 'సిగ్గూ లజ్జా విడిచి పెట్టేశాడు. మెడింటి కవచం తొడిగేడు. స్వలాభం అనే జండా ఎత్తేడు. జీవితం అనే యుద్ధంలో దిగేడు' "వెంకట్రావు మసిపూసి మారేడు కాయ చేయడం నేర్చుకున్నాడు అతనంటే అనేక మందికి భయం, అనేక మందికి ద్వేషం వెంకట్రావు అలాగే పడిపోయి లేచాడు, లేస్తూ పడుతూ లేస్తూ వస్తున్నాడు." అని వాఖ్యానించడం వాస్తవమని తెలుస్తుంది.

ఇక్కడ సహజంగానే అధికార దర్పంగల వెంకట్రావు స్వార్థపూరితమైన సామాజిక పరిస్థితుల ప్రేరణతో దుర్మార్గుడిగా మారాడని ఇటువంటి వ్యక్తులు మంచికి మారరని అందుకే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని రావిశాస్త్రి సమాజాన్ని హెచ్చరించాడు.

ఈ విధంగా 'అల్పజీవి' నవలలో వ్యక్తుల ప్రవర్తనకు సామాజిక, కుటుంబిక పరిస్థితులే ప్రధాన కారణమని తెలియజేయడంలో రావిశాస్త్రి సఫలీకృతుడైనాడు.

ఆధార గ్రంథాలు :

1. రాచకొండ విశ్వనాథశాస్త్రి - 'అల్పజీవి'
2. పి.సంజీవమ్మ "తెలుగు నవలలో సామాజిక చైతన్యం"

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక తెలుగు కథలు – సామాజిక జీవన చిత్రణ

– శ్రీమంతుల దొమ్మోదర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

మానవ జీవితంలో ప్రతి మనిషి ఆనందాన్ని కోరు కుంటాడు. ఆనందం పొందటం కోసం జీవన ప్రయాణంలో వచ్చే అనేక రకాల సంఘటనలు దోహద పడతాయి. ఇలా మానవుడు తోటివారితో గతంలోని ఆనందకరమైన సంఘటనలను, ఆసక్తికరంగా, అనుభవ పూర్వకంగా చెప్పే ఒక ప్రక్రియ కథగా చెప్పవచ్చు. రచయిత ఊహల్లో పుట్టి రసవంతమై హృదయాన్ని ఆకట్టుకునే వస్తువే కథగా నిర్వహించారు. సంస్కృత రచయిత్రి ప్రొఫెసర్ సాదళే గారు.

మానవుడు సృష్టించుకున్న కథ కొన్ని శతాబ్దాల పాటు మౌఖిక సాహిత్యంగా, జానపద కథల రూపంగా, కులోత్పత్తి కథలుగా, పౌరాణిక కథలుగా, చారిత్రక కథలు గాప్రచారం చేస్తూ వచ్చారు. తర్వాత తర్వాత కాలంలో రచయితలు కథను లిఖిత సాహిత్యంగా తీసుకువచ్చారు.

తెలంగాణలో ఇలాంటి కథలు మొదటగా 1902 బండారు అచ్చమాంబ "ధన త్రయోదశి" కథ ద్వారా పునాది వేశారు. ఇలా మొదలైన కథా సాహిత్యం ప్రాంతీయ అసమానతలను రూపు మాపడం కోసం వందల సంఖ్యలో కథలు వచ్చాయి. వీటితోపాటు స్వాతంత్రోద్యమం, స్త్రీలసమస్యలు, పెత్తందార్లు, అధికారుల దోపిడీ వ్యవస్థను కళ్ళ ముందుంచారు.

ఈ వ్యాసంలో 2000 సంవత్సరం తర్వాత వచ్చిన కథలను పరిశీలిస్తే , పెద్దింటి అశోక్ కుమార్ గారి "తెగిన బంధాలు" కథలో అప్పటి గ్రామ వాతావరణాన్ని కుల వృత్తుల మధ్య ఉన్న అన్యోన్యమైన సంబంధాన్ని తెలియ జేశారు. పెండ్లి కార్యక్రమంలో ఏ వృత్తి వారు ఏ పనులు చేయాలి తెలుపుతూ వారి భాగస్వామ్యం ఏ విధంగా ఉంటుందో తెలియజేశారు. పట్టణంలో ఉన్న కొండల్ రావు దొర ఇంట్లో పెళ్ళికి వారి ఊరి మంగలి, చాకలి, కుమ్మరి వాళ్ళను పిలవడం వారు తమకు నెలరోజుల ఖర్చు దొరుకుతుంది, వారం రోజులపాటు విందుభోజనం దొరుకుతుందని ఎంతో ఆనందంగా తమ తమ వస్తువు లను తీసుకుని పట్నం బయలుదేరుతారు. ఎంతో ఆశతో దొర ఇంట్లో చివరి లగ్గం బాగాకట్నాలు వస్తే బాకీలుఅన్నీ తీరిపోతాయి అనుకుంటూ గతంలో జరిగిన పెళ్లిళ్లు యాజ్జేసు కుంటు బస్సులో వస్తుంటారు. దొరసాని పోలు పొందేందుకు బోజల కానీ తేలేదని కొప్పడుతుందేమొనని భయం భయంగా ఇంటికి చేరుకుంటారు. కుమ్మరి దేవయ్య తెచ్చిన కూరల్ల కుండలు, ఇరొండ్లు గరగ బుడ్లు, కంచాల్లుతో ఉన్న మూటను మంగళి లింగం తెచ్చిన గొరుగాల్లు, ఇత్తడి గిన్నెలు ఉన్న సంచిని ఎంతో జాగ్రత్తగా దొరసానికి ఇచ్చి ఇంట్లో పెట్టమంటారు. పెళ్లి పనులు ప్రారంభం అవుతాయి పిల్లగాడిని తీసుకొని పోతారు కానీ ఎవరినీ పిలవడం లేదు. పెళ్లి మొదలవుతుంది నన్ను పిలుస్తారు నన్ను పిలుస్తారు అనుకుంటూ ఎప్పుడు ఆశతో చూస్తుండగానే పెళ్లి అయిపోతుంది. చివరికి ప్లేట్లు కడుగుదామని చాకలి లింగం వెళ్తే అరేరే నువ్వు కడుగకు పని వాళ్ళు ఉన్నారు కదా అని అతనిని పిలుస్తాడు. గంటల్లో బంధువులు రావడం వెళ్ళిపోవడం పెళ్లి పూర్తి కావడం, వీళ్లంతా బిక్కుబిక్కుమంటూ నిరాశతో ఎందుకు నిరాశ తో ఎందుకు వచ్చాం అన్నంత బాధతో ముగ్గురు ఒకవైపు కూర్చుంటారు. పెండ్లి అంటే మనలాంటి వారికి ఎంతో ఆశ ఉంటుంది. వారం రోజులు పని దొరుకు తుందని ఆశలు నీరుగరాయి.

పెళ్లిలో నుండి నిరాశతో తిరిగి వస్తూ ఉల్లో పునాదులు తీసిన గోయ్యిలో బాలయ్య పెండ్లి ని తలుచుకుంటూ ఒళ్ళు జలదరించి తన భుజాల మీద ఉన్న కుండల మూటను అందులో వేసి పిచ్చి పట్టినట్లు మట్టితో

కప్పుతాడు. చాకలి లింగం చేతులు కూడా వణుకుతూ పునాదిలో గోరుగిన్నె వేసి ఐదు దోసిల్ల మట్టి పోసి పొట్ట చేత పట్టుకుని బాలయ్య వెంట అడుగులు వేస్తాడు. ఏడాది తిరగక ముందే ఆ పునాదుల మీద వాసవి మ్యారేజ్ హాల్ బోర్డు వెలిసింది. కుల వృత్తుల మీద ప్రేమ గౌరవంతో ఉన్న ముగ్గురు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ వారి దీనస్థితికి బాధపడతారు. అశోక్ కుమార్ గారు తెగిన బంధాలులో ప్రపంచీకరణ పేరుతో కుల వృత్తుల గురించి వాటి స్థానంలో వ్యాపారం పేరుతో కుల వృత్తులను చిన్నాభిన్నం చేసి వీరి జీవనం ప్రశ్నార్థకంగా చేసిన ఘటనలను, నాటి వృత్తి పనుల జీవన విధానాన్ని కుల వృత్తుల భాగస్వామ్యాన్ని తెలియజేశారు.

ఐతాచంద్రయ్య గారీ "కలికి గాంధారి" కథలో దొరలు స్త్రీలపైన చేసే అఘాత్యాలను, అధికార బలం, ఆర్థిక బలంతో ప్రజల్లో భయం కల్పించడం. ఈ కథలో ప్రధాన అంశాలు. జోగినీ వ్యవస్థను అడ్డం పెట్టుకుని జమిందార్ రంగారావు దొర రోజు గాంధారి తల్లి ఇంటికి రావడం బిడ్డపుట్టుటకు కారణం కావడం, ఆమె బడికిపోతుంటే నీకెందుకు చదువు పోరి అని హింసించడం అది వారించిన అమ్మమ్మను కోట్టి చనిపోవడానికి కారణం కావడం, కొన్ని రోజులకు పాము కాటుకు రంగారావు బలికావడం. యధావిధిగా గాంధారినీ కూడా జోగిని లెక్క దేవునితో పెళ్లి చేయడం, గాంధారి మీద రంగారావు కొడుకు ఏల్లారావు దొర మనసు పడటం తన దొర తనం ద్వారా ఆమె కు కూతురు పుట్టడం, ఆమె పేరు మేనక గా పెట్టిమంచిగా చదివిస్తుంది గాంధారి. రఘురాం టీచర్ మేనకను ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు ఏల్లారావు దొర కొడుకు కమలాకర్‌రావు కన్ను మేనక మీద పడుతుంది రేపే మేనకను దేవునితో పెండ్లి చేస్తా గడబెడ వద్దు అంటాడు. గాంధారి ఎంత చెప్పినా వినకపోతే కోపంతో కూరగాయలు కోసే కత్తితో కమలాకర్ రావు మెడను కొస్తుంది గాంధారి. భయపడకు బిడ్డా నీకు మంచి తోవ దొరకాలంటే ఇది తప్పదు. నువ్వు రఘురాం దగ్గరికి పోయి పోలీస్ స్టేషన్కు వెళ్లి జరిగిందంతా చెప్పిమంది. గాంధారికి జైలు శిక్ష పడుతుంది శిక్ష కాలం ముగియడంతో అప్పటికే జైలు సూపింటెండెంట్ గా ఎల్లారావు దొర రావడం అతను గాంధారిని చూసి భార్యగా చూసుకుంటాడని చెప్పడం గాంధారి అతని ఛీ కొట్టి గేటు దాటి బయటకు వస్తుంది.

అప్పటి జోగిని వ్యవస్థ ద్వారా స్త్రీలు సమాజంనకు దూరంగా ఉండటం దొరల చేతుల్లో కీలుబొమ్మలు కావడం ఒక వంతైతే, గాంధారి లాంటి ధైర్యవంతురాలు దొరల ఆటలకు అడ్డుకట్ట వేయడంతోపాటు జోగిని వ్యవస్థకు చరమగీతం పాడడం ఈ కథలో తెలుస్తుంది.

డా. ముదిగంటి సుజాత రెడ్డి గారి "గుడిసెలు గుడిసెలు" కథలో ఎంతో కష్టపడి వ్యవసాయం చేసుకుంటున్నరైతులు వచ్చిన ఆదాయంతో తృప్తిపొందుతున్న కుటుంబాల వారికి ఏరొడ్రాం పేరుతో రైతుల భూములను ఇండ్ల ను కబ్జా చేసి వారికి ఇల్లు, రేషన్ తినేందుకు తిండి లేకుండా చేసిన ప్రభుత్వ అధికారులు ఏదో అరకొర గుడిసెలువేసి బ్రతుకులను రోడ్ల పాలు చేసి, వరికి అడుక్కునే పరిస్థితి తీసుకు వచ్చారు. నష్ట పరిహారం ఇవ్వకుండా వీరి భూముల్లో ఏరోడ్రాం పూర్తి చేసి విమానాల ద్వారా వచ్చిన విదేశీయులతో డర్టీ ఫెలోస్, పూర్ పీపుల్స్ అనిపించుకుంటున్నారు. రైతుల భూములను ఆక్రమించి వారికి రావలసిన పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వాలు చేస్తున్న ఈ దోపిడీ సర్వసామాన్యం అనె విషయాన్ని రచయిత ఎంతో చక్కగా నాటి పరిస్థితులను తెలియజేశారు.

కె. వి. నరేందర్ గారి "దొర మల్లా వచ్చిండు" కథలో గడిలో దొరలు చేస్తున్న అన్యాయాలు, హత్యలు, అత్యాచారాలు, ఆకృత్యాలను దొర దగ్గర పనిచేస్తున్న రాజేందర్ మనసు చెలించి వీటన్నిటిని అంతం చేయాలనే సంకల్పంతో నక్సలైట్స్‌లో చేరుతాడు. తన దళంతో దొరను చంపాలని గడి మీదికి దండెత్తి కాల్పులు జరపడం

,భయపడి పట్నం పారిపోయిన పరమేశ్వర దొర తన ఆర్థికబలంతో అన్ని రకాల వ్యాపారాలు చేయడం మొదలు పెట్టి కోటీశ్వరుడు కావడం. కొన్ని రోజులకు రాజేందర్ ను పోలీస్‌ల కాల్పుల్లో చనిపోవడం. దొర మళ్లీ ఊర్లోకి వచ్చి అందరినీ ఆప్యాయంగా పలకరించి నట్టు నటించి కొంత డబ్బులు గ్రామానికి, రాజేందర్ తండ్రి కంటి ఆపరేషన్లు చేయించి, గ్రామ ప్రజల మీద అభిమానం చూపించడం చివరికి దొర ఎమ్మెల్యేగా పోటీ చేస్తాను మీ అందరి ఓటు నాకే వేయాలి అని ముందే మాట తీసుకోవడం దొర స్వభావానికి నిదర్శనంగా చెప్పవచ్చు. దొరల వ్యవస్థ ప్రజలను ఏదో రూపంలో దోచుకోవడం తప్ప, ప్రజలకు న్యాయం జరగదని, దొర చేష్టలకు మామూలు ప్రజలు బలికావడం తప్పదనే భావనను రచయిత తెలియజేశాడు. గడీల పాలన అంటేనే భయపడి పోయే జనం తన వైపు తిప్పుకోవడంలో దొర చేసే కుతంత్రాలను ఈ కథలో తెలియజేశారు.

గూడ అంజయ్య గారి "గొరడు" కథలో రాజమల్లు వ్యవసాయం చేసుకుంటూ కష్టంలో ఆనందాన్ని చూసు కుంటూ జీవిస్తున్నాడు. అంతలో అటెండర్ ఉద్యోగం ఉంది అది పర్మినెంట్ అవుతుందని ఎవరో చెప్తే వ్యవ సాయం వదిలి కష్టాలు తీరిపోతాయి అని ఆశతో ఉద్యోగంలో చేరుతాడు. సూపర్వైజర్ ఇంట్లో బట్టలు ఉతకడం, అంట్లు తోమడం వంటి పనులతో భయం భయంగా బతుకుతుంటాడు. పర్మినెంటు ఎప్పుడూ అయింది అని అడిగితే కాలం వెలిబుచ్చే అధికారులు అంతటా ఉన్నారు. ఇదే తరహాలో గొరడు తన వృత్తి పని వదిలి ఉద్యోగం పర్మినెంట్ అయితుంది అని నమ్మ బలిన అధికారులు పాకి పనుల ఉద్యోగం లో చేరుతాడు. ఎంతో దుఃఖంతో వృత్తి పని చేసుకోలేక ఇక్కడ ఉండలేక పర్మినెంటు కాకపోద్దా అని ఎన్నో సంవత్సరాలు ఎదురు చూపు నిరాశ కలిగిస్తుంది. అధికారులను నిలదీస్తే ఈ ఆఫీస్‌యే తరలిపోతుంది ఇంకా పర్మినెంటు ఎక్కడిది అని చిదరించుకోవడంతో కడుపు మసిలిన గొరడు అధికారులమీద కాండ్రించి ఉమ్మడం, చివరికి పిచ్చి పట్టి ప్రాణాలు కోల్పోయే స్థితికి కారకులైనారు అధికారులు. తమ అవసరాల కోసం ఉద్యోగం పర్మనెంట్ అవుతుందని ఆశ చూపి తమ వ్యక్తిగత పనులను చేయించుకొని, తమ పనులు పూర్తికాగానె మొఖం చాటేసే రోజులు అప్పుడు ఇప్పుడు ఉన్నాయననీ గూడ అంజయ్య గారు వివరించారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలంగాణ కథలు - కాలువ మల్లయ్య, సదానంద శారదచంద్ర.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

డా॥. ముదిగంటి సుజాతారెడ్డి కథలు – సామాజికత

– డా॥. తండు కృష్ణయ్య, అధ్యక్షులు, తెలుగుశాఖ, నాగార్జున ప్రభుత్వ (స్వ) కళాశాల, నల్లగొండ.

సంస్కృతాంధ్ర భాషాపండితులుగా, సుప్రసిద్ధ రచయిత్రిగా ప్రసిద్ధిగాంచిన డా. ముదిగంటి సుజాతారెడ్డి జన్మస్థలం నల్లగొండ జిల్లా, నకిరేకల్ మండలంలోని ఆకారం గ్రామం. వీరి తల్లిదండ్రులు మిట్టా వెంకటమ్మ - రామిరెడ్డి. నల్లగొండ, హైద్రాబాద్‌లో విద్యాభ్యాసం గావించారు. 'మను-వసు చరిత్రల తులనాత్మక పరిశీలన' అను అంశంపై పరిశోధనగావించి 1976లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టా పొందారు. ఎందరో పరిశోధకులు వీరి కథలు నవలలపై పరిశోధనలు గావిస్తున్నారు. కథ, నవల, యాత్రాకథ, సాహిత్య విమర్శ, సాహిత్య చరిత్ర గ్రంథాలు రాసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎన్నో గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. ఎన్నో కథలు, సాహిత్య వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురితమైనాయి. వీరి నవలలు, కథలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి తర్జుమా చేయబడ్డాయి. తెలంగాణ ప్రజల జీవితాలను సన్నగిల్లుతున్న మానవ సంబంధాలను, కుటుంబ వ్యవస్థలను ప్రపంచీకరణం, వ్యాపారీకరణ, మార్కెట్ వాదాన్ని కళ్ళకు కట్టినట్లు తన రచనల్లో చెప్పారు.

రచనలు :

1. శ్రీనాథుని కవితా సౌందర్యం, 2. మను-వసు చరిత్రల తులనాత్మక పరిశీలన, 3. తెలుగు నవలానుశీలనం, 4. చారిత్రక, సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర, 5. సంకెళ్లు తెగాయి (నవల), 6. మలుపు తిరిగిన రథ చక్రాలు, 7. ఆకాశంలోని విభజన రేఖల్లేవు, 8. విసుర్రాయి (కథా సంకలనం), 9. మింగుతున్న పట్నం (కథా సంకలనం), 10. తొలినాటి కథలు (సంపాదకత్వం సంగిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి), 11. నూరేండ్ల తెలుగు కథలు (సంపాదకత్వం సంగిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి), 12. అలంకార శాస్త్ర గ్రంథాలు, 13. సంస్కృత సాహిత్య చరిత్ర (ముదిగంటి గోపాల్‌రెడ్డితో కలిసి), 14. ఆంధ్రుల సంస్కృతి, సాహిత్య చరిత్ర, 15. రసచర్చ ఆధునికత, 16. వేమన నాథ సాంప్రదాయం, 17. ముద్దెర (వ్యాస సంకలనం), 18. ముసురు (ఆత్మకథ), 19. బాణుని కాదంబరి పరిశీలనం.

పొందిన పురస్కారాలు :

1. చాసో అవార్డు, 2. రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం-2007, 3. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట ప్రతిభా పురస్కారం-2016.

కథల రచనానేపథ్యం :

డా. ముదిగంటి సుజాతారెడ్డి క్రీ.శ. 1990 నుండి కథలు, నవలలు రాస్తున్నారు. వీరు కథారచన గావించే నాటికి ప్రపంచీకరణ ప్రభావంతో తెలంగాణ పల్లెపట్టుల్లో సంస్కృతి క్రమంగా విధ్వంసం అవుతూ వచ్చింది. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైపోయింది. ఉమ్మడి కుటుంబాలు క్రమంగా తగ్గిపోయి వ్యక్తి కుటుంబాలు వచ్చినవి. మానవ సంబంధాలు కాకుండా ఆర్థిక సంబంధాల ప్రాధాన్యత క్రమంగా పెరుగుతూ వచ్చింది. వ్యవసాయరంగంలో వచ్చిన మార్పుల వల్ల కల్తీ విత్తనాలు, మందుల వల్ల రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి దాపురించింది. విద్యావంతులైన స్త్రీలు పురుషాధిపత్య సమాజం చట్రంలో నుంచి బయటకు వచ్చి తమకు జరిగే అన్యాయాల్ని ఎదుర్కొనే స్థితికి రావడం జరిగింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన కుటుంబాల్లో తాగుడుకు బానిసై కుటుంబ యజమాని చనిపోతే ఆ కుటుంబాలు ఎంతగా ఛిద్రమైపోతున్నాయో గత 30 సం॥ల నుండి మనం గమనిస్తూనే ఉన్నాం.

ముఖ్యంగా వ్యవసాయ కుటుంబాల్లో మగవాళ్ళకన్నా ఆడవాళ్లే ఎక్కువ శ్రమించడం కనిపిస్తుంది. ఇంటిపని, బయటిపనిలో సతమతమయ్యే స్త్రీలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటున్న సందర్భం. కొందరు ప్రభుత్వ ఉద్యోగులైన మహిళలు కూడా ఇంటాబయట పనిచేస్తూ మగవారికన్నా ఎక్కువగా కష్టపడడం కూడా క్రమంగా పెరుగుతూ వస్తుంది. రిజర్వేషన్ల వల్ల స్త్రీలు ప్రజా ప్రతినిధులైనా భార్యల పేరుమీద భర్తలే అధికారాలు చలాయించడం కూడా ఈ కాలంలోనే ఎక్కువగా చూస్తున్నాం. అదేవిధంగా ఉద్యోగాల వేటలో పడిపోయి తల్లి దండ్రులకు దూరంగా విదేశాల్లో ఉద్యోగం చేస్తూ తల్లి దండ్రులను పట్టించుకోలేని పిల్లలు కూడా క్రమక్రమంగా పెరిగిపోతున్న సందర్భం. ఇలాంటి సందర్భంలో సుజాతా రెడ్డి సామాజిక సమస్యల్ని తన కథల ద్వారా చాలా చక్కగా తెలియజేశారు. రైతుల జీవనం, స్త్రీల సమస్యలు, మూఢ నమ్మకాలు, పురుషాధిక్యత వంటి అంశాల్ని తన కథల ద్వారా ప్రస్ఫుటంగా చెప్పడం జరిగింది.

రైతుల జీవనం :

సుజాతారెడ్డి కథల్లో రైతుల జీవన స్థితిగతుల్ని చిత్రీకరించడం జరిగింది. రైతేరాజు అన్న దేశాన రైతులు ఏ విధంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారో తన కథల ద్వారా చెప్పారు. 'అప్పుల బాధ భరించలేక సాయన్న అను రైతు పురుగుల మందు తాగి చనిపోతే ఆయన భార్య యాదమ్మ పెట్టిన శోకము యాదమ్మదేకాదు, అప్పులబాధ తాళ్లలేక ఆత్మహత్య చేసుకున్న ప్రతిరైతు భార్య శోకం కూడా అని 'జవాబుల్లేని ప్రశ్నలు' అను కథ ద్వారా చెప్పడం జరిగింది'. నకిలీ విత్తనాలు, నకిలీ మందులు, పెరిగిన కూలీరేట్లు, విపరీతమైన వడ్డీలు, రైతు జీవితాన్ని ఏ విధంగా ఛిద్రం చేస్తున్నాయో రచయిత్రి ఈ కథ ద్వారా చెప్పారు. ఇంటి యజమాని చనిపోతే ఆ కుటుంబం ఎంతటి బాధలో కూరుకుపోతుందో, భార్యాపిల్లలు ఎంతటి దైన్యాన్ని కలిగి ఉంటారో ఈ కథ ద్వారా తెలియజేశారు.

'కొందరు అగ్రవర్ణ రైతులు దురాశతో పక్కవాడి భూమిని కబ్జాచేయడానికి ఎలాంటి వ్యూహాలు పన్ను తారనేది తెలియజేసే కథ కబ్జా'. రాజిరెడ్డి, రామిరెడ్డి ఇద్దరూ పోటీపడి వ్యవసాయం చేస్తుంటారు. కాలక్రమేణ వారు రాజకీయాల్లో చేరేందుకు కూడా పోటీపడుతారు. కిరాయి నాగళ్ళను పెట్టి దున్నించడం తప్ప మిగతా పనులన్నీ పంట వచ్చి ఇంట్లో పడేవరకు వారి భార్యలే రెక్కలు ముక్కలయ్యేలాగా కష్టపడుతున్న స్థితిని ఈ కథలో చెప్పారు. రాజిరెడ్డి తనభార్య అంజమ్మను రామిరెడ్డి బలత్కారం చేశాడని కథ అల్లి అందుకు భార్యను ఒప్పించి కోర్టులో అదే విషయాన్ని భార్యచే చెప్పించి తద్వారా రామిరెడ్డిని జైలుకు పంపించి అతని భూమిని కబ్జా చేయాలన్న పన్నాగంలో రాజిరెడ్డి గెలుస్తాడు. ఇలా రైతుల జీవన స్థితిగతులను సుజాతారెడ్డి తన కథల ద్వారా తెలియజేశారు.

స్త్రీల సమస్యలు :

సుజాతారెడ్డి తన కథల్లో ఎక్కువగా స్త్రీల సమస్యలను చిత్రీకరించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారి భార్యలే కుటుంబాలను పోషించే స్థితి దాపురిస్తుంది. అలాంటి కుటుంబాలు ఎంతటి నరకాన్ని అనుభవిస్తాయో తెలిపే కథ 'జవాబుల్లేని ప్రశ్నలు'. అదే విధంగా భర్తల చేష్టలవల్ల భార్యలు ఎంతగా మానసికంగా వేదనకు గురౌతారన్న విషయాన్ని 'కబ్జా' కథలో చెప్పారు. రాజిరెడ్డి, రామిరెడ్డి భూమిని కబ్జాచేయాలనే కుతంత్రంతో తన భార్య అంజమ్మను రామిరెడ్డి బలాత్కారం చేశాడని కోర్టులో అబద్ధం చెప్పించడం వల్ల అంజమ్మ ఎంతో ఆవేదన పడుతుంది. తమ పన్నాగాలను నెరవేర్చుకోవడం కోసం భర్తలు భార్యల్ని ఏవిధంగా బలిపశువులుగా చేస్తారో ఈ కథ ద్వారా రచయిత్రి తెలియజేశారు. 'బేరం' కథలో చాలా రోజుల తరువాత సంగిగూడెంకు వచ్చిన మల్లయ్యకు అతని భార్య లచ్చికి పని యిప్పిస్తానని మాయ మాటలు చెప్పి పట్నం తీసుకొని పోతాడు. అక్కడ వ్యభిచార

గృహనిర్వాహకురాలికి లచ్చిని అమ్మి కొంత డబ్బును మల్లయ్య చేతిలో పెట్టి బలవంతంగా బస్సును ఎక్కించి పంపిస్తాడు. ఇలాంటి మోసగాళ్ళు సమాజంలో చాలా మంది ఉన్నారనే విషయాన్ని ఈ కథ ద్వారా తెలియ జేశారు. భార్యాభర్తలిద్దరు ఉద్యోగులైనప్పుడు భర్త ఆధి పత్యం వల్ల విసిగి వేసారిపోయి ఇంటినుండి పారిపోయిన భార్యవృత్తాంతాన్ని తెలిపే కథ 'మోక్షం'. అదేవిధంగా తన భర్తకు మరొకస్త్రీతో అక్రమ సంబంధాన్ని చూసి సహించలేక విడాకుల కోసం లాయర్‌ను ఆశ్రయించిన ఓ స్త్రీ వృత్తాం తాన్ని 'బొమ్మలో చైతన్యం' కథ ద్వారా తెలియజేశారు.

స్త్రీలపట్ల ఉన్న వివక్షను తెలియజేస్తూ స్త్రీకి ఎప్పుడూ కూడా స్వేచ్ఛలేదని చెప్పేకథ 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి'. సుగుణ తండ్రి రాఘవరావు తన బిడ్డకన్నా కొడుకులపై ఎక్కువ ప్రేమానురాగాలు కలిగిఉంటాడు. సుగుణ భర్త మోహన్‌రావు భార్య వంటింట్లో వండిపెట్టడానికి, పడక గదిలో సుఖాన్ని ఇవ్వడానికి మాత్రమే ఉందని అనుకునే వాడు. అంతకుమించి భార్యతో ఎలాంటి అనుబంధం ఉండేదికాదు. చివరికి కొడుకులు కూడా తల్లితో 'నీకేం తెలియదు నోరుమూసుకో' అని అరుస్తారు. భర్త చని పోయిన తరువాత తనను చెరో ఆరు నెలలు తమ తమ ఇంట్లో ఉండాలని కొడుకులు అన్నప్పుడు తాను అద్దె ఇంట్లో ఉంటానని, ఎవరి ఇంట్లో ఉండనని తల్లి చెబు తుంది. అప్పుడు కొడుకులు ఆమెపై కోపిస్తారు. అయి నప్పటికీ తల్లి అద్దె ఇంట్లో ఉండటానికే నిశ్చయించు కుంటుంది. స్త్రీల ఆలోచనా విధానంలో క్రమంగా మార్పు వస్తుందన్న విషయాన్ని ఈ కథ ద్వారా రచయిత్రి తెలియ జేశారు. 'పట్టణ ప్రాంత స్త్రీలకన్నా గ్రామీణ ప్రాంత స్త్రీలే ఎక్కువ శ్రమపడుతారన్న విషయాన్ని తెలిపే కథ పలా యనం'. ఈ కథలో ఎల్లమ్మ ఇస్త్రీపెట్టె చేతబట్టి సంసా రాన్ని ఈదుకొస్తుంది. తాగుబోతు భర్త ఇంటి నుంచి పారి పోతాడు. ఏమాత్రం బాధ్యతలేకుండా ప్రవర్తించే భర్తలు పోయిన తరువాత భార్యలు రెక్కలు ముక్కలు చేసుకొని తమ పిల్లల్ని కంటికి రెప్పలా చూసుకుంటారన్న విషయాన్ని ఈ కథ ద్వారా తెలియజేశారు.

నేటి వ్యవసాయ కుటుంబాల్లో మగవాళ్ళు పైపైన తిరుగుతారని ఆడవాళ్లే బాగా పనిచేస్తారని కూడా ఈ కథ ద్వారా చెప్పారు. 'తల్లిదండ్రులు తమ బిడ్డల్ని మగ పిల్లల్లా పెంచినప్పటికీ, మగ పెత్తనానికి బలైపోయిన వృత్తాంతాన్ని తెలిపే కథ రౌడీయిజం'. బీజింగ్‌లో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనడానికి బాగా ప్రాక్టీసు చేస్తున్న హరిత, సరిత జీవితాలను రౌడీలు ఏ విధంగా నాశనం చేశారో, అమ్మాయిల జీవితాలు ఏ విధంగా బుగ్గిపాలవు తున్నాయో ఈ కథ ద్వారా తెలియజేశారు. అమ్మాయిలపై ఎలాంటి దాడి జరిగినా బాయ్‌ఫ్రెండ్ వ్యవహారాల వల్లనే జరుగుతుందనే కోణంలో పోలీసులు అడిగే ప్రశ్నలు తల్లిదండ్రులకు మరింత ఇబ్బందికి గురిచేసే విధంగా ఉంటాయి. అమ్మాయి తప్పిపోయిందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఏదో ప్రేమ వ్యవహారమై ఉంటుందని భావించి ఏమాత్రం పట్టించుకోని పోలీసులను మనం చూస్తున్నాం. ఇలా సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తన కథల ద్వారా తెలియజేశారు.

మూఢ నమ్మకాలు :

శాస్త్రీయంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఇంకా ప్రజలు మూఢనమ్మకాలు కలిగి ఉండడం మనం గమనిస్తూనే ఉన్నాం. చేతబడుల పేరుమీద దాడులు, హత్యలు గావిస్తున్నతీరు శోచనీయం. 'గ్రామీణ ప్రాంతాల ప్రజలు మూఢనమ్మకాలు ఎక్కువగా కలిగిఉంటారనే విషయాన్ని తెలిపే కథ కామపిశాచం'. ఈ కథలో గౌరి, వెంకటయ్య ఇద్దరూ ప్రేమతో పరస్పరం రాజు, రాణి అని పిలుచుకోవడం జరుగుతుంది. గౌరి ప్రసవ సమయంలో తన భర్త వెంకటయ్య దగ్గర లేకపోగా రాజు, రాజు అని కలవరిస్తూ చనిపోతుంది. అప్పుడు ఆ విషయం అర్థంకాక తన బిడ్డను ఏదో పిశాచం పట్టిందని గౌరి తల్లి వీరమ్మ భావించడం అమె మూర్ఖత్వానికి తార్కాణం. జరగరాని సంఘటన ఏది జరిగినా ఏదో ఒక అను మానాన్ని వ్యక్తం చేస్తారన్న విషయాన్ని ఈ కథ ద్వారా తెలియజేశారు. ఇలాంటి మూఢనమ్మకాల వల్ల మను

షులు వింతగా ప్రవర్తించి అనేక అనర్థాలకు కారకమౌతారన్న విషయాన్ని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

పురుషాధిక్యత :

పితృస్వామ్య వ్యవస్థలో మగవాని ఆధిపత్యమే ఎక్కువగా ఉంటుంది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైనప్పటీ భార్యలపై భర్తల ఆధిపత్యం వల్ల ఎందరో భార్యలు విసిగి వేసారిపోయి విడాకులు తీసుకోవడం కూడా జరుగుతుంది. 'భర్త ఆధిపత్యం, ప్రేమలేని వాతావరణం నుంచి బయట పడడం కోసం ఇంటి నుంచి పారిపోయిన భార్య వృత్తాంతాన్ని తెలిపే కథ మోక్షం'. 'కొందరు భర్తలు భార్యల్ని ఏవిధంగా కాల్చుకుతింటారో, తమ ఆధిపత్యాన్ని ఏవిధంగా ప్రదర్శిస్తారో తెలిపే కథ విసుర్రాయి'. విసుర్రాయి ఎలా తిప్పితే అలా తిరుగుతుందో, అదేవిధంగా పురుషుడు ఎలా చెబితే అలా నడుచుకోవాలని ఈ కథ సారాంశం. కొందరు భర్తలు ఏవిధంగా భార్యలపై అధికారం చలాయిస్తారో సుబ్బారావు పాత్ర ద్వారా చక్కగా తెలియజేశారు. తాను లేవగానే టూత్‌బ్రష్ మీద పేస్ట్‌తో భార్య సిద్ధంగా ఉండాలి. బాత్రూంలో బకెట్ నిండా నీళ్ళుండాలి. భార్య జ్వరం వచ్చి లేవలేని స్థితిలో ఉన్నా సమయానికి టిఫిన్, భోజనం సిద్ధం చేయాలి. తాగి వచ్చినా ఊరుకోవాలి. చివరికి లేవలేని స్థితిలో ఉన్నా రాక్షస రతిలో పాల్గొనాల్సిందే. ఇలా ఎందరో స్త్రీలు తమ భర్తల చేతిలో నలిగిపోయి జీవితాలను వెల్లబుచ్చుతున్నారన్న విషయాన్ని తెలియజేశారు. విసుర్రాయిలాగా ఎలా తిప్పితే అలా తిరగాల్సిందే తప్ప తమకంటూ ఒకసాధికారత లేదా అనే విషయాన్ని ఈ కథ ద్వారా సమాజాన్ని ప్రశ్నించారు. స్త్రీల ఇష్టాయిష్టాలను పట్టించుకోకుండా పురుషులు తమ ఆధిపత్యాన్ని వారిపై కలిగి ఉంటారన్న విషయాల్ని సుజాతారెడ్డి తన కథల ద్వారా తెలియజేశారు.

కథాకథనం :

సుజాతారెడ్డి కథలు పాఠకుల్ని చదివించేటట్లు సరళంగా ఉంటాయి. చక్కని భావవ్యక్తీకరణ ఉంటుంది. సుప్రసిద్ధ రచయిత బి.ఎస్. రాములు అన్నట్లుగా 'ఒక నిశ్శబ్ద ఫోటోగ్రాఫర్‌లా జీవితాన్ని ఒక చక్కని ఫ్రేమ్‌లోకి తెచ్చి కథలు బిగిస్తారు'. సుజాతారెడ్డి కథల్ని చదువుతుంటే జీవితాల్ని కథలుగా చదువుతున్నట్లు ఉంటుంది. గ్రామీణ ప్రాంత సంబంధమైన కథల్లో తెలంగాణ భాషానుడికారం స్పష్టంగా కనబడుతుంది. జీవితం వేసే అనేక ప్రశ్నలకు జవాబులు చెప్పే చక్కని కథల్ని రాసి స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వం దారిచూపి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. చాలా కథలు పురుషాధిపత్య సమాజం మీద ఎక్కుపెట్టిన బాణాలుగానే కనబడుతాయి. తన అద్భుత కథాకథనం వల్ల ఆ బాణాలకు మరెంత వాడిని కలిగించారు. సందర్భోచితమైన పదప్రయోగం చేసి స్పష్టమైన భావవ్యక్తీకరణ చేయడంలో అందెవేసిన చేయి సుజాతారెడ్డి. 'విసుర్రాయి' కథలో సుబ్బారావు బాత్రూమ్‌లోకి వెళ్ళి అరచిన విధానాన్ని ఇలా చెప్పారు. 'ఏమే! ఎక్కడ సచ్చావే! బాత్రూంలో నీళ్లు లేవ్. చేతగాని ముండ, ఏ పని వేళకు చేసి చావదు. తినడం తిరగడం కబుర్లు చెప్పడం తప్ప ఏపని చేతకాదు. అందులో దీనికి ఫ్రెండ్ క్రాంతి జత అయింది. ఎందుకే ఈ బానిస బతుకు అని నూరిపోస్తుంది అది. దాన్ని ఇంటికి రాకుండా చేయాలి, అప్పుడుకాని దీన్ని రోగం కుదురదు'.

సమస్యనంతా మొత్తం కథలో చెప్పి పరిష్కార మార్గాన్ని ఒకటి రెండు వాక్యాల్లో చెప్పి ఆ తరువాత జరగబోయే పరిణామాలు పాఠకునికి చెప్పకుండానే అవగాహన కలిగించడం వీరి కథాకథనంలో మరొక ప్రత్యేకత. 'స్వేచ్ఛ' కథలో కొడుకుని ఎదిరించి వృద్ధాశ్రమంలో ఉండడానికి నిశ్చయించుకోవడానికి తల్లి ఈ క్రింది విధంగా చెప్పడం జరిగింది. 'ఓల్డేజి హోమ్‌లో ఉంటూ అప్పుడప్పుడు వచ్చి వాళ్ళను చూసి వెళ్తాను. ఎప్పుడైనా వాళ్ళు వస్తారు నన్ను చూడడానికి. వాళ్ళ స్వేచ్ఛ వాళ్ళకు ఉంటుంది. నా వ్యక్తిగౌరవం నాకు ఉంటుంది. దూరంగా ఉంటేనే మమతానురాగాలేమో'. ఇలా తల్లి మనో నిశ్చయాన్ని చివరి వాక్యాల ద్వారా తెలియజేశారు.

గ్రామీణ ప్రాంత సంబంధమైన ఇతివృత్తంతో కూడిన కథల్లో సందర్భానుసారంగా తెలంగాణ నుడికారాన్ని ప్రయోగించి ఆయాకథల్ని మరింత రసవత్తరం గావించారు. సహజమైన సంభాషణల వల్ల కథలోని వస్తువు దృశ్యమానం గావించబడింది. 'జవాబుల్లేని ప్రశ్నలు' కథలో పురుగుల మందు తాగి బాయికాడి నుండి ఇంటికి సోలుకుంటూ వస్తున్న తన భర్త సాయిలు దగ్గరికి ఉరికి యాదమ్మ ఏడుస్తున్న విధానం ఎంతో హృదయ విదారకంగా ఉంటుంది. 'గిట్ల పురుగుమందు ఎందుకు తాగితివయ్యా? పత్తిపంట పాడుగాను. నాశనగాలానికి పత్తి ఏసినమేమో... ఏందో? పత్తి చేతికొచ్చే యేలకు పురుగు పట్టి కాయలన్ని తెల్లగా కపిగిలిపోయే బదులు పొక్కులు పడ్డయి. గా పురుగులకు మందు కొడుదమంటే పైసల్లే వాయే. మందుతేకపోతివి. యిగనువ్వు తాగేటందుకు పురుగుమందు ఎక్కణ్ణుంచి దొరికిందయ్యో'. కథ ప్రారంభం నుండి చివరి వరకు ఆసక్తిగా ఉత్సుకతను కలిగించే విధంగా కథనం కొనసాగినప్పుడే పాఠకునికి ఏమాత్రం విసుగనేదే ఉండదు. కథ ప్రారంభించే ఎత్తుగడ ఆలోచింపజేసే విధంగా ఉండి కథను ముందుకు చదివించేటట్లుగా ఉండాలి. సుజాతారెడ్డి కథల్లో ఈ లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది. వీరి కథల్లో శిల్పపరమైన మరో అంశం ఏమిటంటే కథను ఎక్కడి నుండి మొదలు పెట్టినప్పటికీ చివరి వరకు నడిపించేతీరు అద్భుతంగా ఉంటుంది. ఇలాంటి విశిష్ట లక్షణం, నిరంతర అధ్యయనం అభ్యాసం వల్లనే సాధ్యపడుతుంది.

ముగింపు :

ముదిగంటి సుజాతారెడ్డి తన కథల ద్వారా రైతుల జీవన స్థితిగతులు, స్త్రీమీద జరిగే శారీరక, మానసిక దాడులు, శ్రమదోపిడి, అణచివేత, అన్యాయం, అసమానతలు, మూఢనమ్మకాలు మొదలగు వాటిని చాలా చక్కగా తెలియజేశారు. స్వేచ్ఛ, స్వాభిమానం కోసం స్త్రీలను ముందుకు నడపడానికి చిత్రించే కథలను రాశారు. శ్రమదోపిడికి గురై కుటుంబ బాధ్యతలకు అంకితమై పోయిన స్త్రీల మనోనిబ్బరాన్ని చాలా చక్కగా చిత్రీకరించారు. నిర్లక్ష్యం, వివక్షత దౌర్జన్యాలవంటి విషవలయాల నుంచి స్త్రీలను బయటకు రప్పించే తీరును గూర్చి ఈ కథల్లో చెప్పిన విధానం బాగుంది. ఇలాంటి కథలు రాసి డా. సుజాతారెడ్డి తెలుగు సాహిత్యంలో తన కంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జాఘవా రచనల్లో సామాజిక జీవనచిత్రణ

– డా॥ వై.ఐ.సి.హెచ్. లీలా పద్మజ, విభాగాధిపతి, తెలుగు విభాగం, రాజా ఆర్.ఎస్.ఆర్.కె. రంగారావు కాలేజ్, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

విశ్వశ్రేయ: కావ్యమ్ అన్న రీతిలో విశ్వం యొక్క శ్రేయస్సును కోరుతూ కవి చేసే కార్యము రచన అందులో సార్వకాలికంగా నిలిచే ధర్మాలను కొన్నిటిని అందిస్తూ కూడా ఆయాకవులు తామున్న సమాజాన్ని తమ రచనల్లో ప్రతిబింబింప చేస్తారు. ఇది కవులకు అనివార్యమనే చెప్పాలి. పైగా తాము తామరాకు మీద నీటిబొట్టులా వుండే కవిత్వం చెప్పరు. చెప్పలేరు ఎందుకంటే సత్కవి లోకం భాద తన దిగలోకం సంతోషం తనదిగా భావిస్తాడు. తన సమాజం వున్న దుస్థితి నుండి అధిగమింప చేసి సుస్థితికి చేరే దిశగా తన రచనలను సాగిస్తాడు. సమాజాన్ని మేలు కొలుపుతాడు. సమాజంలో నెలకొన్న అన్ని అసమానతలను కవి నిర్మొహమాటంగా చెప్పగలుగుతాడు. దళితుల పట్ల ఆనాటి సమాజం వ్యవహరించిన తీరు తెన్నులను ప్రముఖులైన ఆయా కవులు కుసుమ ధర్మన్నబోయి భీమన్న మొదలైన కవులెందరో తమ రచనల్లో చూపారు. తమ జాతి వారిని ప్రభోధించారు. ఎంతో మంది దళితులలో చెప్పుకో దగిన మేధావులు అంబేద్కర్ లాంటి వారు జాతి కోసం నినదించారు.

రాజనీతి శాస్త్ర పితామహుడు అరిస్టాటిల్ చెప్పినట్లు మానవుడు సంఘ జీవి. సంఘంలో తాను కలవాలని సంఘం తనతో కలవాలని అనుకొంటాడు. అలా జరగని నాడు అతడికి మానసిక సంఘర్షణ మొదలౌతుంది. సంఘ పశు అన్నాడు. మానవుడిని శ్రీ శ్రీ సమాజంలో నుండి వచ్చిన మనిషి సమాజానికి తాను కొంత నేర్పుతూ సమాజం నుండి కొంత నేర్చుకొంటూ ఎదుగుతాడు. అద్దంలో చూసుకొన్న మనిషికి తన ప్రతిబింబమే కనిపించినట్లు రచనల్లో కవిత్వమనే అద్దంలో సమాజమనే ప్రతిబింబమే కనిపిస్తుంది. మనం ఎక్కడి నుండో తెచ్చిన విత్తనాన్ని ఒక నేలలో నాటి మొలకెత్తిన కొద్ది కాలానికి దాన్ని వేళ్లను పరిశీలిస్తే ఆవేళ్ళకు అక్కడి భూసారమే వున్నట్లు మనం ఏకాలం నాటి రచన పరిశీలిస్తే ఆ రచనలో ఆకాలం నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయాది అనేక పరిస్థితులు ప్రతిబింబించక మానవు.

జాఘవా రచనలు - సామాజికి జీవనాన్ని ఎట్లా ప్రతిబింబింప చేసాయో చుద్దాం. అంతకంటే ముందు అతడి జీవన నేపధ్యం మనం చూస్తే సమాజంలో వర్ణ వివక్ష అధికంగా వున్న రోజుల్లో వర్ణాంతర వివాహం చేసుకొన్న దంపతులకు పుట్టిన బిడ్డ జాఘవా. పోనీ ధనం కొన్నిటిని అధిగమింప చేస్తుంది కదా ఆర్థికంగా పర్వాలేని స్థితిలో వున్నాడా అంటే అదీ లేదు. కడుపేద

'పేదరికము పెద్దవింత విద్యాశాల

దానిలోన లజ్జగానబడదు అని తనరచనలో ఒక చోట జీవితానికి సంబంధించి ఒక నగ్న సత్యం చెప్పారు జాఘవా. ఇది నాడు నేడు ఏనాడు ఒప్పుకోవలసిన విషయం ఏనాటి సమాజంలోనైనా పేదవాని స్థితి ఇదే.

అలాంటి జాఘవాను సిరి వరించక పోయినా సరస్వతి వరించింది. ఆ సరస్వతిదేవి వరించడానికి జాఘవా చేసిన కృషి

'కంటబడ్డ పద్యకావ్యంబు సాధించి
చదువకుండనెపుడు వదల లేదు.
కవిత చెప్పువాడు కనుపింపనెయ్యంబు
సేయకుండ వెడలనీయ లేదు'.

- అయితే ఇంత కష్టపడి సాధించుకున్న పాండిత్యంతో కవిత్వం చెబితే ఆనాటి సమాజంలో ఆదరించే వారే కరువయ్యారు.

'బాపన కులమున బుట్టక పాపపుసాతాని కులము పాలైతి గదా' అని జాలిగా మాట్లాడే వారలు అతని కవి

త్వాన్ని కవిత్వ స్వరూపముతోకాక కులముతో గణనము చేసిన ఆనాటి సమాజ ధోరణి వారి సామాజిక జీవనం ఎట్లా వుందో చూడండి. తరాలను అంతరాలను పాటిస్తూ గాలికీ, నీటికి, వీరులకు ప్రతిభకూ దాన్ని అంటగట్టిన నాటి సామాజిక ధోరణి 'నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూపరే ఖాకమనీయ వైఖరులు గాంచి 'భళీ భళియన్న' వాడెమీదేకులమన్న ప్రశ్నవెలయించి చివాలున లేచిపోవుచో బాకునగ్రుమ్మినట్లగును పార్థివ చంద్ర వచింప సిగ్గగున్' అంటూ జాషువా వాపోయారు. ఒక కవిని అలా ఆక్రోశింపచేసిన సామాజిక ధోరణి ఆనాటి కాలంలో అలా వుంది. ఇలా ఎన్నో అవమానాలు భరించి సంఘమనే విస్తరిలో అవమానమనే భోజనం తిన్న జాషువా ఉలిదెబ్బలకు ఓర్చిన శిల శిల్పంగా మారినట్లు తన ఓపికతో సమాజంలో అనేక ఘన సన్మానాల నందు కొన్న స్థాయికి ఎదిగాడు. అడుగేస్తే జారిపోయే పాకుడు మెట్లు లాంటి జీవితం తాను అనుభవించినా మధురమైన కవిత్వాన్ని లోకానికందించాడు. ఆయన రచనల్లో తలస్పర్శగా కొన్ని పరిశీలిస్తే వాటిల్లో - నాగర్జునసాగర్ ని పరిశీలిస్తే నాగార్జున సాగర్ నిర్మాణం సందర్భంలో లోకం సంతోషం తనదిగా భావించిన జాషువా అనేక విధాలుగా హర్షాన్ని వ్యక్తం చేశాడు. ఇదే శీర్షికతో సి॥నా॥రె॥ కూడా వ్రాశారు కానీ ఇతి వృత్తం వేరు. జాషువా నాగార్జున సాగర్‌లో ఆనాటి నాగార్జున సాగర్ నిర్మాణం వలన ఎంత ఉపయోగం కల్గిందో పద్యాలలో చెప్పారు. నాగార్జున విశ్వవిద్యాలయం గురించి, సాగర్‌లోని యంత్రాలను నడిపే కార్మికుల జీవనోపాధి గురించి ఇలా చెబుతూ అప్పటి వరకూ వున్న కర్షకుల దీన స్థితిని - 'తడుపు చున్నారు క్షేత్రములు కర్షక కోటి' అనే పద్యంలో చెప్పారు.

''అన్నమో రామచంద్రా యంచు నల్లాడి' అనే పద్యం లోనూ ప్రజల దీని స్థితిని చెప్పారు. జవహరు గాంధీల గొప్పతనం చెప్పారు. ఇలా ఆనాటి రైతులు, ప్రజల సామాజిక జీవనానికి అద్దం పట్టారు.

ఇక - గబ్బిలం - గబ్బిలంతో మాట్లాడు తున్నట్లే చెబుతూ కవి ఎన్ని సామాజిక అంశాలు చెప్పారో చూడండి.

సృష్టికర్త తాను సృష్టి వీవు
వెఱవనేల విశ్వనాథుని మ్రోల
సత్యవాక్యమ్మునకు చావులేదు.
ధర్మమునకు బిరికి తన మెన్నడును లేదు

- అంటూ చెప్పిన ఈ మాటలు జాషువా వ్యక్తిత్వానికే మకుటయమానం అని చెప్పవచ్చు. ఎందుకంటే ఇక్కడ ఈతత్వం జాషువాలో మెండుగా వుంది. తాను చెబు తున్నది ధర్మం అనుకొన్నప్పుడు పిణికి తనం అక్కర లేదు. అంటూ సమాజాన్ని ఆ దారిలో వుండాలనే హెచ్చరిక చేసాడు. ఈ ఖండ కావ్యంలో వ్యక్తమయ్యే భావాలు జాషువా మనసులోని మాటలే అనవచ్చు తననుభవిస్తున్న వెలిని దృష్టిలో పెట్టుకొని గబ్బిలం ద్వారా చెప్పారు.

'ముప్పు ఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్
పిప్పియొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండగా
చెప్పులు కుట్టి జీవనము సేయును గాని నిరాకరించలే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్'

చెప్పిన ఈ పద్యంలో అరుంధతీ సుతుడిని నాయ కుడిగా చేసి గబ్బిలంలో చెప్పిన తీరు అతడిపట్ల సమాజం వ్యవహరిస్తున్న తీరు ఎలా వుందో చెప్పారు.

జాషువా చెప్పిన ఈ మాటల్లోనే ఆయనను చూద్దాం-

'భయకంపితమై హింసా పీడితమైయున్న ప్రజానీకానికి కవి

కవి వాక్కు ఆశా కిరణాన్నందించాలి. మిట్ట పల్లాలను సమం చేసి చూపాలి హింసిత ప్రజల మూక భాష్పాలకు నోరిచ్చి రచ్చకెక్కించాలి అన్నారు. ఇలా ఆయన చేశారా అంటే ఖచ్చితంగా చేశారనే చెప్పాలి ఆయా రచనల్లో పై విధంగా చేశారు. శ్రీశ్రీ గారు చెప్పిన 'కదిలేది కదిలించేది' అంటూ నవ కవిత్వానికి చెప్పిన నిర్వచనం అంత ప్రసిద్ధికెక్క లేదేమో ఈ నిర్వచనం అనిపిస్తుంది. కానీ ఎంత వాస్తవముంది ఈ నిర్వచనంలో భయ కంపితమై హింసా

పీడతమైయున్న ప్రజానీకానికి చెప్పిన కవిత్వమా అని పించక మానవుకొన్ని పద్యాలు. ఉదా:- తెలుగు తేజంలో మన సంస్కృతి గొప్పతనాన్ని చెబతూ దానిని కాపాడు కోవలసిన బాధ్యత చెప్పారు. నేతాజీ బాపూజీ ఇలా ఎన్నో ఎన్నో బర్మాలోకాందిశీకుల యాత్ర' అనే వార్త పత్రికలో చదివి జాషువా ఆదేదనకు గురి అయ్యారు. ఆ ఆవేదనకు అక్షర రూపమిచ్చిన ఆయన పైన తాను చెప్పిన సిద్ధాం తాన్ని పాటించారు. అంటే ఊరడించారు.

జాషువా స్వప్న కథ రచనలో సామాన్య ప్రజలు దుర న్యాయాలకు ఏవిధంగా బలిఅయిపోతున్నారో సవివంగా చెబుతూ రచన చేశారు.

అలాగే జాషువా కవిత్వంలో స్పృశించని అంశం లేదు. కేవలం వర్ణ వ్యవస్థ నిరసననే కాకుండా మానవతావాదిగా, స్త్రీవాదిగా, దేశారాధన చేసిన దేశభక్తుడిగా, మన సంస్కృతిలో మూఢత్వం లేని అంశాలపట్ల గౌరవం కల్గిన వ్యక్తిగా అనేక కోణాలలో జాషువా కనిపిస్తారు.

కొత్తలోకం అనే రచనలో సమాజంలో వచ్చిన ప్రగతిని చెబుతూ రోజులు మారిపోయినవి రోజుకు రోజుకు దేవపూజ పై మోజులు సన్నగిల్లినవి.....

అనే పద్యంలో దుష్టులను తరిమికొట్టి అన్యాయాన్ని అరికట్టడానికి రమ్మని దేవుడినే నిలదీశాడు.

'ప్రతిమల పెండ్లి సేయుటకు వందల వేలు వ్యయించు కొని దు :
భీతమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్చదీ భరతమేదిని ముప్పది మూడుకోట్ల దే
వతలగవడ్డ దేశమున భాగ్య విహీనులక్షుత్తులారునే"

అన్న ఈ పద్యం నాటి సమాజం తీరు తెన్నులను మన కద్దం పడుతుంది కదా. అలాగే చీమలకు పంచదార పాములకు పాలూ పోసే మనిషికి సాటి మనిషిని మాత్రం మనిషిలా చూసే ఔన్నత్వం, సహృదయత ఎందుకు లేవని వాపోయాడు.

ఇక ఫిరదౌసి అనే ఖండ కావ్యంలోని కథ మనకు కొంత వరకూ జాషువా జీవితాన్ని తలపింపచేయక మానదు. ఎందుకంటే జాషువా కవిగా ఎంత నిరాదరించ బడ్డాడు. ఎంత నిరాశకులోనయ్యాడు. ఎన్నో అగచాట్లు పడ్డాక సన్మానాలందు కొన్నాడు. అయితే గజనీ మహ మ్మదు ఫిరదౌసి చేతిన షానామా (రాజచంద్రమా) అనే గ్రంథాన్ని అందుకున్నాడు. కానీ మాట తప్పాడు. ఒక్కొక్క పద్యానికి ఒక్కొక్క బంగారు నాణానికి బదులు వెండి నాణేన్ని ఇవ్వడం ముప్పై సం॥లు కష్టబడి వార్ధక్యంలోకి అడుగుపెట్టిన అతడు నిరాశకు లోనవడం జరిగింది. ఆ సందర్భంలో నిండు సభలో పెరుగు తోటకూర వంటి విఖ్యాత పురుషులు నవాబుకు ఫిరదౌసి మీద విరోధంగా చెప్పడం, కొందరు ధర్మతత్పరులు కవిని బాధపెట్టడం అమంగళకరం అన్నారు. అంటే మనం నేడువున్న సమాజంలో, ఏనాటి సమాజంలో కానీ ఇలా మంచి వారూ వుంటారు. అకారణ ద్వేషంతో వుండే చెడ్డవారూ వుంటారు.

ఇలా సమాజంలో వున్న మంచి చెడ్డలను వారి జీవన తీరును జాషువా కవితా మయంగానూ చెప్పారు. అలాగే ముసాఫర్లు లాంటి రచనలో తాత్త్వికంగా కూడా చెప్పారు. ఎలా చెప్పినా ఏది చెప్పినా అదిపూర్తిగా విశ్వశ్రేయస్సు నాకాంక్షించే అనేది మాత్రం విధితం. పిల్లలకు మనం పెద్దలను గౌరవంచండి అని చెబుతాం అంటే అది కేవలం మన ఒక్కరినీ గౌరవించాలనో గౌరవించలేదనో కాదు. అలా గౌరవించే లక్షణం వాళ్ళకు అలవాటు కావాలని. అలాగే జాషువా వర్ణ వ్యవస్థ పేరుతో ప్రతిభకు అన్యాయం చేయవద్దు అనేది అంతసూత్రంగా వున్న విషయం.

❖ ❖ ❖

కన్యాశుల్కం – నాటి సాంఘిక నేపథ్యం

– డా॥. గుల్లపల్లి జయపాలరెడ్డి, భౌతికశాస్త్రి ఉపన్యాసకులు, మహారాజ కళాశాల (స్వయం ప్రతి పత్తి), విజయనగరం.

మధ్యయుగపు చివిరి నాళ్లలో కళింగ ప్రాంతంలో అనాగరిక ఆచారం కన్యాశుల్కం. పురుషాధిక్య సమాజంలో బ్రహ్మ వివాహ పద్ధతిలో ప్రలోభాల ముసుగులో, అసుర విధానం ద్వారా జరిగే వివాహాలలో, డబ్బుకోసం (శుల్క) కన్యలను విక్రయించే పద్ధతి మీద సాంఘికంగానూ, సాహిత్యపరంగా చేసిన యుద్ధమే నికన్యాశుల్కం నాటకం.

కన్యాశుల్కాన్ని నిజంగా అప్పారావు గారు 1887లో రచించివుంటారా? అయితే 1892 దాకా అంటే ఐదేళ్ల పాటు దాన్ని ఎందుకు ఎవరూ ప్రదర్శించలేదు. ఇది చాలా పెద్ద ప్రశ్న. దీని పరిష్కారము కోసమే నికన్యాశుల్కం నాటి సాంఘికి నేపథ్యం అన్న ఈ చిన్న ప్రయత్నం.

కన్యాశుల్కంతొలికూర్పు పీఠికలో విశాఖపట్నం జిల్లాలో మూడేళ్ల కాలంలో జరిగిన బ్రహ్మణ శుల్క వివాహ వివరాల్ని తెలివే ఒక జాబితా, విజయనగరం మహారాజావారి ఆజ్ఞానుసారం పదేళ్ల క్రితం తయారు చేయబడినది. మూడేళ్లలో వీటి పరాసరి మూడు వందల నలభైనాలుగు చొప్పున మొత్తం ఒక వెయ్యిముప్పై నాలుగు పెళ్లిళ్లు జరిగినట్టు ఈ పత్రం దాఖలా చూపింది.

తదుపరి 1888వ సం. జనవరి 17వ తేదీన ఎగ్‌మూర్, మద్రాసు నందు రాష్ట్ర శాసన మండలి నందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గౌరవ H.E. స్ట్రోక్స్‌నకు లేఖాస్త్రాన్ని విజయనగరం మహారాజా పూసపాటి ఆనందగజపతిరాజు గారు సంధించినారు. మగాళ్లు భార్యను కొనుకొనే పద్ధతిలో పొందటంగాని, తండ్రి లేదా సంరక్షకుడు డబ్బుతీసుకొని అమ్మడంగాని హిందు వివాహ చట్టాలకు వ్యతిరేకము. కొద్దికాలంలోనే వారు బానిసలుగా జీవనం వెళ్ళబుచ్చు చున్నారు. కొద్ది మొత్తం చెల్లింపుతోనే బానిసలను కొనుక్కొన్నట్టు అవుతున్నది. బానిసత్వ నిర్మూలనా, చట్టాలకు వ్యతిరేకంగా, ఒక రూపంనకు బదులు వేరొక రూపంలో జరుగుతున్న తంతుగా భావించవలసి వస్తున్నది.

ఇది చట్టము యొక్క స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధముగా యున్నది. ఈ అనైతిక చర్యను అసాధరణంగాను అసమానముగాను,అన్యాయంగాను పరిగణించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా వుండేందుకు బిల్లును తేవలసిందిగా భావిస్తున్నాను. ఇది హిందూ వివాహ ధర్మాలకు, హక్కులకు, హిందు శిక్షాసతికి గాని వ్యతిరేకం కాదు అని తెలియపరుస్తూ కౌన్సిల్‌లో బిల్లు పెట్ట వలసిదిగా వినయంగా అర్థిస్తూన్నానని వ్రాతపూర్వకంగా కోరినారు.

1988 ఫిబ్రవరి సమావేశాల్లో కన్యాశుల్కం బిల్లును మద్రాసు విధాన మండలి నందు పూసపాటి ఆనంద గజపతిరాజు గారు ప్రవేశపెట్టినారు. బ్రహ్మణులలో కన్యలను వివాహం పేరుతో అమ్మకాన్ని నిరోధించుటకు ఉద్దేశించబడిన బిల్లు ఇది. కన్యలు, తండ్రులకుగాని, సంరక్షకులకు గాని వ్యక్తిగత ఆస్తులు కారు, హిందూ మతంలో ఇటువంటి వెసులుబాటు యుండలేదు. కన్యాశుల్కం చట్టవిరుద్ధమని పోర్ట్ సెయింట్ జార్జి గజెట్ నందు Go.Ms.No.13 తేది 01-03-1888 నందు పొందు పరచినారు. విధాన మండలిలో ఆనంద గజపతిరాజుగారు బిల్లును ప్రవేశపెడుతూ పరిశీలనాంశాలను, కారణాలను సవివరంగా వివరించినారు.

హిందువులలో పౌర ఒప్పందం మేరకు వివాహాలను జరిపించుటకు హెచ్చుప్రాముఖ్యాన్ని ఇస్తారు. అష్టవిధ వివాహ పద్ధతులలో నేను బ్రహ్మ మరియు అసుర వివాహ పద్ధతుల గురించి చర్చించదలిచాను. కన్న తండ్రి ఇష్టాను ప్రకారం, పిల్లల భవిష్యత్తు బాగుటుందని తలచి వరుని ఎంపిక చేసుకొని తన ఇంటికి సాదరంగా ఆహ్వానించి,

కుటుంబ బాధ్యతగా వివాహం జరిపించేదే బ్రహ్మ, తండ్రికీ డబ్బు ఇచ్చి పిల్లను పెళ్లి చేసుకోవటం నిఅసురు.

శృతి చంద్రిక నుండి పత్ని అనగా చట్టపరమైన భాద్యతలు పంచుకున్న, హిందు ఆచారాలు పాటిస్తున్న స్త్రీ అని అర్ధం కాని అసుర పద్ధతిలో కన్యలను కొనుకున్న, అమ్ముకున్న వారు పత్నిలు కాలేరు అని తెలియవస్తున్నది. గంజాం జిల్లా నుండి నెల్లూరు జిల్లా వరకు అన్ని కులాల వారిలోనూ బాల్య వివాహాలు కన్యాశుల్కం పద్ధతిలో జరుగుతున్నవి. మన ధర్మశాస్త్రంలో కూడా కానుకలు గాని, కట్నాలుగాని, వారి స్వంతంగా ఉపయోగించు కొనుటకు ఉద్దేశించబడినదిగాని, అమ్ముకొనుటకు ఉద్దేశించబడినదికాదు, ప్రేమాభిమానములతో ఇచ్చినది మాత్రమే అమాయకులైన పిల్లలు ఊహ తెలిసిన నాటికి వృద్ధుడైన భర్త మరణించడం, పెండ్లిచేసిన తండ్రి మరణిం చడం మూలంగా వారు విధవలుగా ఆ మొత్తం కుటుం బానికి బానిసగా మార్చటం జరుగుతున్నది.

ఏ రూపంలోనైన, ఏమతంలోనైనా శిక్షాశ్మృతికి అతీతంగా అయిన, కాంట్రాక్టు చట్టపరిధిలోనైన, కన్యాశు ల్కంను నిరోధించవలసిన అవశ్యకత వున్నదని బాల్య వివాహాలను సాంఘిక దురాచారంగా గుర్తించి బాల్య వివాహ నిరోదక చట్టంను తేవలసినదిగా ఆనంద గజపతి రాజు బిల్లును ప్రతిపాదించినారు.

కాని మైలాపూర్ జమిందార్ పి. చింతట్‌సాల్‌రావు ఫిబ్రవరి 1888, 23వ తేదిన మహారాజు ఆనందగజ పతిరాజు ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతు తెలుపలేమని చెప్పినారు. కన్యాశుల్కము అనేది ఒక ప్రాంతానికి సంబం ధించినదని, హిందు వివాహ చట్టము ప్రకరణము 566 నుండి 574 ప్రకారము ఉన్నదని, కన్న తండ్రి ప్రలోభా లకు లొంగిపొతే కన్నె పిల్ల నిరోధించలేదని, ఇష్టానికి వ్యతిరేకముగా ఉంటే దావా వేసుకోవచ్చునని వారి వారి వాదలను బట్టి ఉంటుందని చెపుతూ బిల్లు చేయవలసిన అవసరము లేదన్నారు. జూన్ 5, 1888 లో కొడైయికెనాల్ సభ్యులు యస్.సుబ్రమణ్యం అయ్యర్ గారు బిల్లును సవరించవలసిన అవసరం లేదని, హిందు సమాజంలో కొంత ప్రాంతానికి, కొన్ని వర్గాలకి ప్రాముఖ్యము ఉండవచ్చు నేమేగాని మద్రాస్ ప్రెసిడెన్సీ దక్షిణ భాగమున ఇటువంటి సమాచారం ఎచ్చటలేదు కనుక మొత్తం రాష్ట్రానికి సంబంధించి ఈ బిల్లు అవసరం లేదని తేల్చి చెప్పటంతో బిల్లు విగిపోయింది,

జూలై 15, 1886 న ఎల్లోర్ సబార్డినేట్ జడ్జి ప్రకారం అసుర కూడా హిందు పద్ధతి కావున అభ్యంతరం కాదాని సరైన భర్తకు వెదికే బాధ్యత తండ్రిదేనని కొన్నిచోట్ల కొన్ని సందర్భాలలో తప్పు జరిగినంత మాత్రాన ఒప్పంద వివాహం పద్ధతికే వ్యతిరేకమని భావించనక్కర్లేదని తీర్పు చెప్పినారు. ఒక కుటుంబంలో ఐదుగురు అన్నదమ్ములు ఉన్నప్పటికి అందులో ఒక వ్యక్తి భూములు అమ్మి తగిన రొక్కమును పిల్లతండ్రికి ఇవ్వడం వలన మా కుటుం బములో అసమానతలు వస్తున్నాయి అని కలవగంట లక్ష్మీనారాయణ మీద వారి అన్నదమ్ములు కలవగంట వెంకట కృష్ణయ్య మద్రాస్ హైకోర్టునందు రివిజన్ పిటిషన్ వేయడం జరిగింది. మరియు ఇతరులు 1887 లో సర్ ఆర్నాల్డ్ వైట్, చీఫ్ జస్టిస్, జస్టిస్ మిల్లర్ మరియు జస్టిస్ మన్రో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు హిందూ తండ్రికి, కూతురు రూపేణా డబ్బు ఇవ్వజూపడమనేది కోర్టు చట్టాలు ప్రకారం నిరూపించలేము. ఇది నిజమైనప్పటికీ తక్కువ కులాలలో భర్త, పిల్లతండ్రి నుండి భార్యను కొనుక్కోవడమనేది అసుర వివాహ పద్ధతిని అధిగమించి నది కాదు. పైచర్య చట్టాలకు అతిక్రమించినదిగాని, శిక్షించవలసినదిగాని కాదు. ఒప్పంద వివాహము అడ్డు చెప్పవలసినది కాదు అని తీర్పు ఇచ్చినారు. కావున గురజాడ వెంకట అప్పారావు గారు విధాన మండలిలో శాశనము కాకపోవటం వలన కోర్టు తీర్పులు కూడా ఈ పద్ధతిని నిలువరించలేక పోవటం వలన సాంఘిక ప్రయో జనం కోసం సాహిత్య ప్రయోజనాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని, అప్పటి వరకు తెలుగు నాటక రంగాన్ని సంస్కృత నాటకాలు పరిపాలిస్తున్న పరిస్థితులను కూడా

పరిగణలోనికి తీసుకొని, నాటకం ద్వారా ప్రజల్లోకి తీసుకొని వెళ్లి కన్యాశుల్కమనే సాంఘిక దురాచారాన్ని ప్రారద్రోల డానికి నడుం బింగించినారు.

1889 ఆగష్టు 16వ తేదిన డిబేటింగ్ క్లబ్, విజయ నగరం నకు ఉపాధ్యక్షులుగా గురజాడ ఎన్నిక కాబడి నారు. నిరంతరం జరిగే చర్చలు లాగేనే ఒక రోజు మహా పురుషుల పతినానికి స్త్రీలే కారణం అని అంశం మీద చర్చ జరిగి, చివరికి స్త్రీలు పతీతలు కావడానికి పురుషలే భాద్యులని తేల్చారట అలాగే కన్యాశుల్కం సమస్యమీద జరిగిన చర్చ ఫలితంగా, ఫలితం లేకపోవటంతో నాటక రచన చేయాలనే సంకల్పం అప్పారావు గారికి కలిగింది.

శంభు చంద్రముఖర్జీ గారితో 1884 నుండి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతుండేవి. చుట్టూరావున్న సమాజాన్ని పరిక్షించమని, సాంఘిక చైతన్యం కోసం రచనలు సాగా లని, సాంఘిక, రాజకీయ ఉద్యమాల గురించి క్షుణ్ణంగా పరిశీలించి పాలిటికల్ పద్యాలు రాయాలని, వితంతు వివాహాలు తదితర పరిస్థితులు తెలుసుకొని సమకాలీన పరిస్థితులు మీద కలం ఝులిపించాలని చెప్పినారట

రాజుల కబంధాలలో నలిగిపోతున్న ప్రభంద సాహి త్యాన్ని అతి కామోద్రిక రచనలను చేసిన వారిని, చేయిం చిన వారిని గురజాడ నిరసించారు. ఇంగ్లీష్, ప్రాకృతం, భాషల్లోని పోకడలను, సామాజిక అంశాలను సృశించడాన్ని సునిశితంగా పరిశీలించి, ఆంగ్లంలోనే మొదటి సాహిత్య ప్రకియను మొదలు పెట్టిన గురజాడ సమకాలీన సామాజాకాంశలపై కళం ఝులిపించాలని నిర్ణయిం చుకున్నారు.

కన్యాశుల్కం పేరు నిర్ణయించుకొన్న తరువాత గురజాడ ముందున్నవి రెండు ప్రశ్నలు 1. కధా రూపమా నాటక రూపమా? 2. గ్రాంధికమా, వ్యవహారికమా? కన్యాశుల్కం లోలి కూర్పు పీఠికలోనే గురజాడ వివరణ ప్రకారం ప్రజా బాహుళ్యానికి పుస్తక పఠనం అలవాటయ్యే దాకా. అలాంటి ఆరోగ్య కరప్రభావా వ్యాప్తికై నాటక రంగాన్ని ఆశ్రయంచవలసి వుంటుంది. కన్యాశుల్కం నాటక రచనకు నన్ను ప్రేరేపించినది ఇదే. కావున వ్యహారిక భాషలోనే నాటకం వ్రాయడానికి పూనుకున్నారు.

గురజాడ రచనలలో భావాలు, ప్రత్యేక శైలి, వ్యవ హారిక భాష తనకు తానుగా ఎంచుకున్నారు. శాసనాలు, కోర్టు తీర్పులు నిర్ధేశించలేని సామాజిక అంశాలను సాహిత్యం ద్వారా, దేశభక్తిని, మానవతా వాదాన్ని ప్రభా వితం చేయగలిగినారు. దేవుని కంటే మనిషి, మతంకంటే సమాజం ప్రధానమని, వర్తమానంలో స్వంత లాభం కొంత మానుకొని. పొరుగువాడికి తోడుపడవోయి, మనుష్యుల జీవన స్థితగతులు, జీవనశైలి, ప్రమాణాలు ఆయన కథా వస్తువులు - విశ్వజనీనత, సర్వకాలీనత ఆయన దార్శని కతకు నిదర్శనాలు- అందుకే తెలుగు సాహిత్య భాషను నాగరికత వ్యాప్తికి ఒక గొప్పసాధనంగా చేయాలంటే దాన్ని వ్యవహారిక భాషకు దగ్గరగా తీసుకురావాలి అన్నది అతను నమ్మిన సిద్ధాంతం. పాత్రలు ఎన్నుకోవాలి అవి సమకాలీన సాంఘిక చిత్రాలు కావాలి. సమాజం ఉన్నతం కావాలంటే సాంప్రదాయాల మునుగులో ఆచారాల పరదాల మాటున, బుద్ధి కుశలతకు, మనస్సు త్రికరణ శుద్ధికి పట్టిన చీడ పోవాలి. దురాచారాల మాలిన్యం కడిగి పారెయ్యాలి. చట్టాలు, శాసనాలు చేయలేని పని సాహిత్యం వలన, నిర్ధిష్ట లక్ష్యంతో శాశ్వత ప్రయోజనాన్ని ఆశించి, ప్రజాసామ్యయుతంగా ప్రజల్లో మనో వికాసాని, దగ్గరగా పరిశీలించి, వ్యవస్థల పతనాన్ని, ప్రజల అవస్థలు చూసి సాంఘిక పరివర్తన కోసం నడుంచిగించినారు. పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ, సంపన్నుల దాష్టికలు ఎలా సమకాలీన సమాజాన్ని అధోగతి పాలు చేస్తు న్నాయో, ఆనందగజపతి రాజు గారికి ఆంత రంగికులలో ఒకరు ఆగుట వలన ప్రత్యక్ష అనుభూతి కలిగియుండుట వలన భిన్న భిన్న పార్శ్యలనుండి పాత్రలను సృశించడం జరిగింది.

1884 నుండి మహారాజు "అభినవ ఆంధ్రభోజ" ఆనందగజపతిరాజు గారి అంతరింగకులలో గురజాడ కూడా ఒకరు. ఉత్తర ప్రత్యుత్తరాలు డ్రాఫ్ట్ చేయడంలో

గురజాడ వారి ప్రమేయమే ఎక్కువగా ఉండేది. వ్యక్తిగత విషయాలు కూడా గురజాడతో చర్చించేవారు.

సామాజిక పరిస్థితుల నేపద్యంలో వేశ్యా వృత్తిరీత్యా ప్రలోభాలకు బానిసలు అయినా ప్రవృత్తిలో వారి సంస్కారం, ఎదుట వారిని గౌరవించే విధానం, అబలలు, అభాగ్యుల పట్ల వారు చూపిన ఔదార్యం, ఇవన్నీ వారి జీవన నాణానికి రెండవ వైపు అని తెలుసుకోగలిగారు గురజాడ చేస్తున్నది వేశ్యవృత్తి అయినా సమయస్ఫూర్తి, నైతిక ప్రవర్తన, సమస్యలను పరిష్కరించే విధము, పాలనలోని లసుగులు, మగవారి ప్రలోభాలు, గుర్తించి పనులు చేయించుకొనే విధానాలు ఇవన్నీ " మధురవాణీ" పాత్రకు ప్రాణప్రధాలు.

సమకాలీన రాజకీయ వ్యవస్థలో అనేక మంది మధుర వాణిలు, గిరీశంలు తయారవుతారనే ముందే నిర్ధేశించు కున్నారు. ఆ పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసినారు. వారివారి స్వభావాలు, సమాజంలో వారి పాత్రలు గుర్తించి తదనుగుణంగా పాత్రలకు నామకరణం చేసి జీవం పోసారనటంలో సందేహం లేదు.

ఒక సమకాలీన సాంఘిక సమస్యను తీసుకొని వర్త మాన సమాజంలో ఎదురయ్యే పాత్రలను సామాన్య మనుసష్యుల నుండి తీసుకొని మంచి హృద్యంగా చర్చిస్తూ నాటకాన్ని ఆమూలాగ్రం వ్రాయడమన్నది ఆధునిక పద్ధతిలో నడిపించడమనేది ఒక్క గురజాడ వారికే చెల్లింది.

1987 నుంచి 1992 వరకూ లెజిస్లెటివ్ కౌన్సిల్ మరియు కోర్టులలో అనేక వినతులు, వాదనలు జరిగి నప్పటికి, "కన్యాశుల్కం" అనే దురాచారాన్ని రూపు మాపడానికి మార్గం దొరకక పోవడంతో సాహిత్య పరి ష్కారమే అంతిమమైంది. పై విషయాలే కొద్ది కాలం ముందున్న నేపద్యం.

అనందగజపతి మహారాజు గారి చుట్టూ వున్న సంబంధాలు, స్వాతంత్ర్యం కోసం ప్రజాస్వామ్య పరి రక్షణకు జరుగుతున్న పోరాటాలు ఇవన్నీ "కన్యాశుల్కం" నాటి సాంఘిక నేపద్యం

(గురజాడ కుటుంబీకురాలు ఇందిర గారి సౌజన్యంతో.....)

ఉపయుక్త గ్రంధాలు :

1. కన్యాశుల్కం తొలి, రెండవ కూర్పులు
2. మద్రాసు కౌన్సిల్ ప్రశ్నోత్తరాలు
3. మద్రాసు లా జర్నల్స్, జడ్జిమెంట్ కాపీలు
4. ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర
5. కొన్ని అముద్రిత పత్రాలు

❖ ❖ ❖

ముదిగంటి సుజాతరెడ్డి నవలలు – తెలంగాణ స్త్రీల జీవనం – సామాజిక జీవన చిత్రణ

– పల్లెమోని జయమ్మ, తెలుగు ఉపాధ్యాయులు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు), మహబూబ్‌నగర్, తెలంగాణ.

సమకాలీన వాస్తవ దృశ్యాలని చిత్రించేది నవల. "నవల కేవలం కాల్పనిక రచన కాదు. అది జీవిత రచన. యదార్ధ మానవుడ్ని - జీవితాన్ని వ్యక్తీకరించడానికి జరిగిన ప్రయత్నం". తెలుగులో నవలా ప్రక్రియ ప్రారంభపు కాలంలో మధ్య తరగతి సామాన్య జనజీవన చిత్రణ ఎక్కువగా చేయబడింది.

తెలంగాణ అనేక సంవత్సరాలు నిరంకుశ పాలనలో నలిగిన ప్రాంతం. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలోనూ రాజుల పాలనలోనే ఉండేది. అయితే తెలంగాణ భాష సంస్కృతీ సంప్రదాయాలపై ముస్లిం సంస్కృతీ ప్రభావం విశేషంగానే ఉంది, దేశమంతటా స్వాతంత్ర్య పోరాట పవనాలు వీస్తున్న సమయంలో గ్రామాల్లోకి వార్తా పత్రిక తేవడం కూడా నేరంగానే పరిగణింపబడేది. అణచివేత, వేదన, పీడన ఎక్కడుంటే అక్కడి నుంచి తిరుగుబాటు ఉద్యమాలు పుట్టుకొస్తాయనడానికి ఉదాహరణ తెలంగాణ. భారతదేశానికి భూ పోరాటాల వారసత్వాన్ని అందించింది తెలంగాణ. పోరాటాల ప్రభావం ప్రజా జీవనంపై బాగానే ఉంది. పోరాట స్వభామున్న తెలంగాణ నేలకు ప్రత్యేక సంస్కృతీ, సంప్రదాయాలు ఉన్నాయి. ఇక్కడి సంస్కృతీ, చరిత్ర, పోరాటాలను, సామాజిక జీవితాన్ని ప్రజల భాషను తెలంగాణ సాహితీకారులు అక్షరబద్ధం చేశారు, చేస్తున్నారు. ప్రాంతీయ ముద్రతో తెలంగాణ జీవిత భాష్యాలు చెప్పే రచనలు చేస్తున్నారు.

ఆధునిక యుగంలో సామాజిక సమస్యలను చర్చించడానికి సులభమైన మాధ్యమం నవలా ప్రక్రియ. 1960ల తరువాత తెలుగులో నవలకి అత్యధికంగా ప్రాచుర్యం లభించింది. ప్రాచీనకాలం నుండి మహిళలకు సాహిత్య రంగంలో ఎక్కువగా ప్రవేశం లేదు. కాని అంతకు ముందెన్నడు లేనంతగా స్త్రీలు సాహిత్యరంగంలో ప్రవేశించి వారి సృజనశక్తిని నిరూపించుకోవడానికి, వారి భావనాశక్తిని ఆవిష్కరించుకోవడానికి 'నవలా ప్రక్రియ'ను సాధనంగా ఎంచుకున్నారు.

సాహిత్యంలో స్త్రీల ప్రవేశం అనూహ్యమైన మార్పులకి దారి తీసింది. ఇంతేకాకుండా తొలినాళ్ళలో మహిళలే రాసుకొని, మహిళలే చదువుకునే టైంపాస్ ప్రక్రియగా తక్కువగా చేసే ప్రయత్నాలు కూడా జరిగాయి. కాని 1970వ సంవత్సరము నుండి నవలలో సాంస్కృతిక దృష్టి, విమర్శనాదృష్టి పెరిగింది. ఇటువంటి అనుకూల వాతావరణంలో స్త్రీలు నవలలు రాస్తూ తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడమే కాకుండా, సాహిత్యరంగంలో మిగిలిన ప్రక్రియలైన కవిత్వం, పద్యం, వచనం, శతకం, ప్రబంధం ఇలా అన్ని ప్రక్రియలలో పురుషులతో సమానంగా తమదైన ప్రత్యేక ముద్రను నిర్మించుకున్నారు. ఈ మధ్యకాలంలో అభివృద్ధి చెందిన దేశీయ, ప్రాంతీయ నూతన ప్రజాస్వామిక రాజకీయ ఉద్యమాల భావజాలం, భాగస్వామ్యం ఇవన్నీ పరీక్ష సాధనకు కారకాలై 1980 తర్వాత తెలుగు సాహితోత్థ్రంలో గుణాత్మకమైన మార్పులు తీసుకొని వచ్చాయి. ఈ నేపథ్యంలో స్త్రీవాద సాహిత్యం అభివృద్ధి చెందింది. జీవితం పట్ల స్త్రీల యొక్క తెలివేతేటలు అర్థం చేసుకోవడానికి ఎంచుకున్న ప్రక్రియే నవలా ప్రక్రియ.

డా॥. ముదిగంటి సుజాతరెడ్డి గారు ఈ నవలా ప్రక్రియను సాధనంగా ఎంచుకొని సమాజంలోని అనేక రకాల స్త్రీల సమస్యలను రాజకీయ, సామాజిక పరిణామాలను వారి నవలల్లో ప్రతిబింబిప చేస్తారు. వీరి

నవలల్లో తెలంగాణ జీవితాన్ని మనం స్పష్టంగా గమనించ వచ్చు. వీరు 1942 మే 25న నల్గొండ జిల్లా ఆకారంలో జన్మించారు. అప్పటికే నైజాం రాష్ట్ర పరిస్థితులు అల్ల కల్లోలంగా ఉన్నాయి.

డా॥. సుజాతరెడ్డి గారు కాలేజీ రోజుల్లోనే అడవి బాపిరాజు, శరత్‌శ్చంద్ర నవలలు చదివి సాహిత్యం మీద మక్కువతో కథలు, నవలలు రచించారు. మరియు ఆమె భర్త ఆచార్య ముదిగంటి గోపాలరెడ్డి గారితో కలిసి విమర్శనా గ్రంథాలు కూడా రచించారు.

వీరి రచనలు..

1. మలుపు తిరిగిన రథ చక్రాలు
2. సంకెళ్ళు తెగాయి
3. ఆకాశానికి విభజన రేఖల్లేవు

మలుపు తిరిగిన రథ చక్రాలు 1994లో వచ్చింది. ఇది మొదటి నవల. నిజాం నిరంకుశ పాలనకు, ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిపిన తెలంగాణా ప్రజల చారిత్రాత్మక సాయుధ పోరాట గాథ, రచయిత్రి తన ఎనిమిది సంవత్సరాల వయసులో నల్గొండ జిల్లాలో చూసిన సాయుధ పోరాట అనుభవాలను అతి చిన్న వయసులో ముద్రపడిన జ్ఞాపకాలు అన్నీ ఈ నవలలో ప్రతిబింబిస్తాయి.

ఒకప్పుడు దోపిడి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణాలో సాయుధ పోరాటం తప్పనిసరి అయింది. ఎందరో ఉద్యమ వీరులు సహనంతో నిస్వార్థంతో పోరాటంలోకి దిగి సాయుధ ప్రాణాలను సైతం తెగించి పోరాడారు. ప్రజల సహకారంతో ఈ పోరాటం విజయ వంతమైంది. గ్రామాలు, గ్రామ ప్రజలు వాళ్ళ జీవితాలు, దొరలు, దేశ్‌ముఖ్‌లు వాళ్ళ మేడల్లోని గజిల్లోని జీవిత విధానాలు వాళ్ళు ప్రజల మీద చేసే దోపిడి దౌర్జన్యాలు ఈ నవలల్లో ప్రతిఫలిస్తాయి.

పెట్టుబడిదారీ రాజ్యంలోనిగాని, సోషలిస్టు రాజ్యంలో గాని కమ్యూనిస్టు రాజ్యంలోని గాని ప్రజాస్వామిక విలువలు లేకపోతే ఆర్థిక విధానం వ్యవసాయోత్పత్తులు దెబ్బతిని చాలామంది బీదరికంలోకి వెళ్ళిపోతారు. ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇవ్వని ఏ సిద్ధాంత మైనా, ఏ రాజ్యమైనా ప్రజల తిరుగుబాటుతనాన్ని ఎదుర్కోవలసి వస్తుంది.

ఈ నవలలో కథానాయిక పాత్ర సరళ. ఈమె ప్రజా స్వామిక విలువలకు ప్రతీక, దోపిడీ, దౌర్జన్యపరుడైన విలాస పురుషుడు అయిన దేశ్‌ముఖ్ రంగారావు సరళను పెళ్ళి చేసుకోవాలని అనుకుంటాడు. కొన్ని పరిణామాల కారణంగా ఆమెకు దాసుతో పెళ్ళి జరుగుతుంది. కాని దాసు దేశ్‌ముఖ్‌తో కలిసి అవినీతి పనులు చేస్తూ ఉంటాడు. దీని వలన ప్రజాస్వామ్య విలువలు ప్రమాదానికి గురిఅయ్యే అవకాశం ఏర్పడింది. విప్లవ వీరుడు అయిన రమేష్, సరళ మనవరాలు బేబీని చేరదీసి ప్రజాస్వామ్యం వైపు నడిచి ప్రజల్లోకి రావటం జరుగుతుంది. అదే రథచక్రాలు మలుపు తిరగడం అంటే. ఈ నవలలో ఆనాడు జరిగిన రైతాంగ పోరాటం, సామాజిక పరిస్థితులను రచయిత్రి క్షుణ్ణంగా పరిశీలించి రచన చేయడం జరిగింది.

రెండో నవల సంకెళ్ళు తెగాయి. ఇది సుజాతరెడ్డి గారి మొదటగా ప్రింట్ అయిన నవల. ఈ నవలా సారాంశం కులవ్యవస్థ చుట్టూ నడిచింది. మంగళివృత్తి చేసుకునే కుటుంబం నుండి ఒక వ్యక్తి కష్టపడి చదువుకొని ఐ.పి.యస్. అధికారి స్థాయికి ఎదగటం, కుల సంకెళ్ళను తెంచడం కనిపిస్తుంది.

సంకెళ్ళు తెగాయి అన్న పదం కులవ్యవస్థకు ఒక ప్రతీకగా వాడబడింది. కులవ్యవస్థ నుండి బయటపడి, ఆ సంకెళ్ళు తెగడటం. ఈ నవల మొట్టమొదట ఒక పల్లెటూర్లో ఫ్యూడల్ వ్యవస్థను, భూస్వామ్య వ్యవస్థను, కుల వ్యవస్థను వర్ణిస్తూ ప్రారంభించారు. దొరలు వారి అహంకారం, దర్పం, రాచరికాన్ని ఇతరులమీద ఎలా చెలాయిస్తారో, అధికార తక్కువ కులాలవాళ్ళను బానిస

లుగా చూడటం, వారితో వెట్టిచాకిరి చేయించుకోవడం, ఇలాంటి దౌర్జన్యాలు ఈ నవలలో కనిపిస్తాయి.

ఈ నవలలో ఈరయ్య, రంగి దంపతుల కుమారుడు నారాయణ. నారాయణ ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌ల ద్వారా చదువుకుంటాడు. నగరంలో కాలేజీలో తనతో పాటు చదువుకునే దొర కొడుకు రామేశ్వరరావు నగరంలో కాలేజిలో తనతోపాటు చదువుకునే దొర కొడుకు రామేశ్వరరావు చేసే ఈసడింపులు, అవమానాలు చూస్తూ భరిస్తూ ఉంటాడు. అదే కాలేజిలో చదువుతున్న 'ఆనల' అనే అమ్మాయి ప్రోత్సాహాలతో తన చదువు సాగిస్తూ ఉంటాడు. కుల వ్యవస్థ గురించి స్వామి సత్యానంద తీర్థస్వామి చెప్పే బోధనల వల్ల ప్రభావితుడౌతాడు. అతడు కష్టజీవి ఐ.పి.యస్. చదివి, ఢిల్లీలో విజయవంతంగా ముగించుకొని రావటమే కులానికి ఉన్న సంకెళ్ళు తెంచుకోవటం అంటే.

మూడో నవల "ఆకాశానికి విభజన రేఖల్లేవు". స్త్రీల అభ్యుదయ స్వేచ్ఛా సమానతల కోసం పురుషుల సహకారం అంటే పురుషులకు, స్త్రీలతో సహకరించే, గౌరవించే గుణాలు రావాలి. స్త్రీ స్వేచ్ఛా పురుషునిలో న్యూనతా భావాన్ని పెంచకూడదు. అంటే పురుషునిలో కూడా మార్పు రావాలి. కుటుంబం ప్రజాస్వామిక విలువలతో కూడి ఉండాలి. బెబ్సియన్ సంబంధాన్ని ఒక ప్రతీకగా తీసుకొని స్త్రీ, పురుషుల మధ్య సహజమైన, ప్రజాస్వామిక సంబంధం వుండాలని అన్ని పాత్రల ద్వారా నిరూపించారు.

ఈ జెండర్ రాజకీయాలు ఇతర దేశాల్లో విపరీతమైన దిశగా ప్రయాణం చేస్తున్నాయి. అసలు మగజాతియే స్త్రీ జీవితంతో అవసరం లేనంతగా అక్కడ ఆలోచన నడుస్తుంది. అంతేగాక స్త్రీల కోసం నడుపుతున్న సంస్థల్లో పనిచేసే స్త్రీలలో ఒక్కొక్కసారి ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు చోటు చేసుకుంటాయో ఈ నవల్లో. 'మోషిత' అనే సంస్థ ద్వారా చిత్రిరారు.

ముఖ్యంగా స్త్రీలలో స్వార్థపూరిత ద్వంద్వ ప్రమాణాలుండాలని, స్త్రీ పురుషుల మధ్య ప్రజాస్వామ్య విలువలతో కూడిన సంబంధాలుండాలని చెపుతూ, అనేక పాత్రల సంఘర్షణల వల్ల ఈ నవలా రచన సాగింది. స్త్రీలు తలచుకుంటే ఎటువంటి సమస్య అయినా అసాధ్యం కాదని, స్త్రీలల్లో ఎంతో వ్యక్తిత్వ బలం ఉండాలని, స్త్రీకి స్త్రీ అండగా ఉండాలన్న భావజాలం పెరగాలన్న విషయం ఈ నవల చెపుతుంది. అంతవరకు సామాజిక దురాచారాలు సాగుతూనే ఉంటాయి. స్త్రీ స్వేచ్ఛతను పితృస్వామ్యం, కుటుంబం, మతం, సమాజం, రాజ్యం, సంస్కృతి అన్ని అరికడుతున్నాయి. అని మనం భావిస్తున్నాము. కాని స్త్రీల భాగస్వామ్యం గురించి మరిచిపోతున్నారు. దానితో తమ బాధ్యతల నుండి తప్పించుకుంటున్నారు. తప్పంతా మరొకరి మీదికి నెట్టి పలాయన వాదంలోకి అడుగుపెడుతున్నారు. అందుకే ఈ నవలలు జండర్ వివక్ష పేరుతో లింగభేదం ఉండకూడదనే ధోరణులు ఎలా విపరీతపు పరిణామాలకు దారితీస్తాయో చిత్రిస్తూ రచయిత్రి ఈ నవలను రచించారు. ఈ కోణంలో స్త్రీలు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. ప్రజల మనిషి - వట్టికోలు - ఆశ్వారుస్వామి.
2. మలుపు తిరిగిన రథచక్రాలు - ముదిగంటి సుజాతరెడ్డి
3. సంకెళ్ళు తెగాయి - ముదిగంటి సుజాతరెడ్డి
4. ఆకాశానికి విభజన రేఖల్లేవు - ముదిగంటి సుజాతరెడ్డి
5. రాజశేఖర చరిత్ర - కందుకూరి వీరేశలింగం

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

"జాషువా సాహిత్యంలో మానవీయత"

– డా॥. చౌదం ఆదినారాయణ, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి, అనంతపురం.

ఆధునిక తెలుగు కవులలో గొప్ప స్థానం పొందిన కవి గుఱ్ఱం జాషువా 1895 సెప్టెంబర్ 28న వీరయ్య - లింగమ్మ దంపతులకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారు. తల్లిదండ్రులు వేరువేరు కులాలకు చెందినవారు. తండ్రి యాదవ తల్లి మాదిగ చదువుకోవడానికి బడిలో చేరిన తరువాత జాషువాకు కష్టాలు మొదలయ్యాయి. ఉపాధ్యాయులు తోటి పిల్లల నుండి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. అయితే కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డాడు జాషువా. ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడు.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగా జూచి రూపురే
ఖ కమనీయ వైఖరుల గాంచి భళీ భలీ యన్నవాడే మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచి పోవుచో
బాకునగ్రమ్మినట్లగున్ పార్థివచంద్ర వచింప సగ్గగున్"

అని తన కవిత్వాన్ని ఆదరించి మెచ్చుకున్న వాళ్లే కులం పేరు విన్నాక చీదరించుకున్నారని ఆవేదన చెందారు. తాను కవిగా నిలబడడానికి మనిషిగా జీవించడానికి ఎన్నో ఆటంకాలను ఎదుర్కోవలసి వచ్చిందని అన్నారు. 'గబ్బిలం' గురించి చెబుతూ కాళిదాసుని మేఘదూతం లోని యక్షుని శాపం ఒక ఏడాది పాటే 'గబ్బిలం' నాయకునికి అతని జీవితంలోనే కాదు అతని పూర్వీకుల కాలం నుండి తీరని శాపం ఒకటి ఉంది అది తన బిడ్డలకు రాకూడదని బ్రహ్మచారిగానే ఉంటున్నాడు. ఆ కథా నాయకుని వెతలను శివునికి అందించడానికి ముక్కు మొగమున్న చీకటి ముద్ద వోలె బ్రతికే గబ్బిలం దూతగా నిలుస్తుంది.

"ఆలయంబున నీవు వ్రేలాడు వేళ
శివుని చెవి నీకు గొంతు చేరువుగ నుండు
మౌని ఖగరాజ్ని పూజారి లేని వేళ
విన్న వింపుము నాదు జీవిత చరిత్ర"

అంటూ గబ్బిలానికి విన్న విస్తాడు గబ్బిలం సందేశ హారిక నిర్వర్తించే పనులు రెండు కర్మ అంటే ఏమిటో దానికి ఈ కక్ష ఎందుకో ఈశ్వరుని చేత ఋజువు చేయించడమొకటి అస్పృశ్యుని అభాగ్యత్వాన్ని శివునికి నివేదించడం రెండవది.

తన మనోభావాలను కావ్య నాయకుడయిన అరుంధతి సుతుని ద్వారా గబ్బిలమునకు తద్వారా సమాజానికి తెలియజేశారు భరతోర్వరకు కడగొట్టు బిడ్డగా పుట్టిన గర్భదరిద్రుడ్ని వర్ణిస్తూ...

"ముప్పు ఘటించి వీని కులమున్ గబలించి దేహమున్
బిప్పి యొనర్చి నీ భరత వీరుని పాదము కందకుండగా
జెప్పులు కుట్టి జీవనము సేయుదు గాని నిరాకరింపలే
దెప్పుడు నప్పుపడ్డది సుమీ భరతావని వీని సేవకున్"

అంటూనే..

"వాని రెక్కల కష్టంబు లేని నాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమటోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తి లేదు"

అనే పద్యంలో దళితుల జీవన చిత్రాన్ని జాషువా అద్భుతంగా వర్ణించాడు.

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుప గజ్జెల తల్లి జీవనము సేయు
కసరి బుసకొట్టునాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

అని చెప్పడంలో చాతుర్వర్ణ వ్యవస్థను నాల్గు పడగల నాగరాజుతో పోల్చారు జాషువా.

"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించు గాని దుఃఖితమతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్ మెతుకు విదల్పదీభరత మేదిని ముప్పది మూడుకోట్ల దే వతలెగపడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులారునే"

అని ప్రశ్నించిన జాషువా.. హృదయములోని లోకము సుమీ ఇది అని హెచ్చరించాడు.

జాషువా తన కవిత్వాన్ని సామాజిక ప్రయోజనానికి సాధనంగా మలుచుకున్నాడు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలనుకున్నాడు. సుస్థిరమైన కవితా వ్యక్తిత్వాన్ని తన చుట్టూ నిర్మించుకున్నాడు.

ఆర్థిక అంశాల్ని సామాజిక పీడనల్ని కవిత్వం చేసే విషయంలో జాషువా శిల్పాన్ని కన్నా తన అభిప్రాయానికి ప్రాధాన్యం ఇస్తాడు.

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆర్థిక సాంఘిక రాజకీయ పరిణామాలను ఆయన చూశాడు అవగాహన చేసు కున్నాడు తన పరిధి మేరకు నూతన ఆర్థిక విధానాలను సమర్థించాడు. పెట్టుబడిదారీ విధానాన్ని, సొంత ఆస్తులు నిరసించాడు జాషువా లాంటి సంప్రదాయ పద్ధతిలో ఈ రకమైన పరిణామాలు రావడానికి ఆనాటి ప్రపం పరిస్థితులు కారణంగా చెప్పుకోవాలిన రెండు ప్రపంచ యుద్ధాలు పర్యవసానంగా ఆర్థిక మాద్యం, ఆకలి, నిరుద్యోగం, నిస్సహాయత, అభద్రత ఈ పరిస్థితుల్ని స్వయంగా అనుభవించిన జాషువా తన కవిత్వంలో ఆనాటి సామాజిక చిత్రాలతో పాటు సమాజాన్ని శాసించి పరిపాలించే ఆర్థిక శక్తుల వైపు కూడా దృష్టి సారించాడు. జాషువా పేదరికంలో నుంచి వచ్చినవారు ఆకలి వేదనలు ఆర్థిక పీడనను అనుభవించిన వాడు. అందుకే పేదరికం పెద్ద వింత విద్యాశాలగా ఉంటుందని భావిస్తాడు.

"ముప్పదిమూడు కోట్ల దేవతలెగబడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులారునే"

అని తీవ్ర మనస్తాపంతో ఈ దేశాన్ని ప్రశ్నిస్తాడు.

విశ్వనరుడను నేను అని ప్రకటించుకున్న మహాకవి గుఱ్ఱం జాషువా కులమతాలు గీసుకున్న గీతల్ని చెరిపి వేయటానికి జీవితమంతా కలం ఆయుధంతో పోరాటం చేశారు. జాషువా తన భావాలను ఎంత తీవ్రంగా వ్యక్తం చేసిన సమాజంలోని ఏ వర్గానికి ఆయన దూరం కాలేదు. పైగా అందరినీ స్పందింప చేశాడు. ఇది ఆయన చైతన్యస్థాయికి నిదర్శనం.

ఫిరదౌసి ఒక పారశిక కవి. గజనీ మహమ్మదు ఫిర దౌసిని పిలిపించి "షానామా" గ్రంథం రాయమని కోరాడు. ఒక్కో పద్యానికి ఒక్కో బంగారు నాణెం పారితోషికంగా ఇస్తానని చెబుతాడు. 30 సంవత్సరాలు కష్టపడి 60 వేల పద్యాలు రచించి రాజాస్థానానికి తీసుకుపోయి బాగా చదివి వినిపించిపోతాడు. పద్యానికొక్క బంగారు నాణెం ఇస్తానన్న రాజు మాటతప్పి పద్యానికొక్క వెండి నాణెం పంపిస్తాడు. ఫిరదౌసి దానిని తిరస్కరించి రాజును విమర్శిస్తూ కొన్ని పద్యాలు రాసి పంపుతాడు.

"ఓ సుత్తాను మహమ్మదూ! కృతక విద్యద్దీపముల్ నమ్మి యా శాసౌధంబును గట్టికొంటి నది నిస్సారంపుటాకాశమై! నా సర్వస్వము దొంగిలించి నరకానం గూలిపోయెన్; వృధా యాస ప్రాప్తిగ నిల్చినాడ నొక దుఃఖాక్రాంత లోకంబునన్"

అంటూ నీకు నా కవితామృతం ఇచ్చాను యిది పాపం ఆ పాపమే నన్ను పట్టి పీడించింది. ఇది నిజంగా తాను చేసుకొన్న దోషమని ఫిరదౌసి బాధపడ్డాడు. కవి యొక్క ఆత్మ నివేదనను మరొక్క కవే అర్థం చేసుకోగలరు.

"కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు
కృతిని జెందువాడు మృతుడు గాడు
పెరుగు దోటకూర విఖ్యాత పురుషులు
కవిని వ్యర్థజీవిగా దలంత్రు"

అపారమైన కావ్య ప్రపంచంలో కవే బ్రహ్మ అని చెప్పాడు ఆనంద వర్ధనుడు. అటువంటి భావన జాషువా రచించిన ఫిరదౌసి కావ్యంలో కనిపిస్తుంది.

ఫిరదౌసి ధీరుడై వెండి నాణేలను నిరాకరించి రాజాగ్రహానికి గురై ఎన్నో కష్టాలు పడి తన ప్రాణాలను దక్కించుకొంటాడు. గజనీ మహమ్మదు మనసు మార్చుకొని పంపిన బంగారు నాణేలు చేరే వేళకు ఫిరదౌసి మరణిస్తాడు. అంత అవమానం పడినప్పటికి ఫిరదౌసి.

"ముత్యములు కిక్కయైన సముద్రమునను
బెక్కుమారులు మున్కలు వేసినాడ
భాగ్యహీనుడ ముత్తెమ్ము పడయనయితి
వనధినము రింగ నోరు విచ్చినది తుదకు"

అని వాపోయినాడే కాని, రాజును శపించలేదు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గూడ అంజయ్య పాటలలో – సామాజిక జీవన చిత్రీకరణ

– పొల్కం రాములు, తెలుగు ఉపన్యాసకులు, ఆర్.జి.యు.కె.టి., బాసర.

సమాజ శ్రేయస్సు కోసం, చైతన్యం కోసం పిడికిలెత్తి సాహిత్య పోరాటం చేసి తన కలం, గళంతో గర్జించిన కవి గూడ అంజయ్య. సమాజంలో నెలకొన్న అనేక సామాజిక సమస్యలను కావ్య వస్తువుగా తీసుకొని రచనలు చేయడం పరిపాటి. సాహితీకారులు వివిధ కావ్య ప్రక్రియల ద్వారా సామాన్య ప్రజల జీవన విధానంను వర్ణిస్తే అంజయ్య సూటిగా హృదయాలలోకి చొచ్చుకొని పోయే గుణం పాట కుందని తన పాటల, ఆటల ద్వారా సామాన్య ప్రజల జీవన విధానంను కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించాడు.

జానపదుల జీవితాలను వారి సంస్కృతిని బాణీల రూపంలోకి మార్చి పాటలు రాసిన వారిలో ముఖ్యుడు అంజయ్య. జానపదుల జీవన విధానం, అట్టడుగు వర్గాల వారి దైనందిన జీవితం, గ్రామీణ ప్రజల అందమైన నవ్వులు. ఆ నవ్వుల వెనుకదాగిన బాధలు రాచరిక వ్యవస్థ మూలాన ప్రజలు అణచబడిన విధానం. స్తబ్ధమైన గ్రామీణ జీవితాలను తన పాటలలో వస్తువుగా స్వీకరించిన పదునైన పాటలను సమాజంపైకి విసిరాడు. అంజయ్య తాను కూడా మారుమూల గ్రామంలో జన్మించడం మూలాన పల్లె ప్రజల జీవనంను సజీవంగా చిత్రీకరించాడు. తాను అనుభవించిన జీవితం కాబట్టి.

వడ్డకిచ్చేటోని కద్దుపద్దులేదు
నాగులిచ్చె దొరకు న్యాయమసలేలేదు
తాళి తాకట్టు బెట్టింది నిజమే
అడిగి నప్పుడిస్తనన్నది నిజమే

(గూడ అంజయ్య సినిమా పాటలు, పుట : 61)

వేగు చుక్కలు సినిమాలు అంజయ్య రచించిన పాట ఇది. పెత్తందారుల జీవన విధానం. సామాన్య ప్రజల జీవన విధానంను అంజయ్య ఈ పాటలో ప్రతిధ్వనింప చేశాడు. వ్యవసాయమే జీవనాధారంగా భావించే ప్రజలు వ్యవసాయం చేసుకోవడానికి కొంత డబ్బును వడ్డీకి తెచ్చి, ముత్తైదువుకు చిహ్నమైన తాళిని తాకట్టుపెట్టి ఆరుకాలం కష్టపడి పంటలు పండించేది సామాన్య ప్రజలు, దొరలు భూస్వాములు వాళ్ళ కష్టార్జితంను దోచుకొని వారిని మానసిక క్షోభకు గురిచేసేవారు. ఈ విధంగా సామాన్య ప్రజల కన్నీటి ఘోషను అంజయ్య ఈ పాటలో వినిపించాడు.

పల్లెల్లో పెద్ద దొరల - పట్నంలో పెదబాబుల
వాల్ల వీల్ల సట్టమంత ఒకటే కొడుకో నా కొడుకో కొమురన్న
జర భద్రం కొడుకో - నా కొడుకో కొమురన్న

(గూడ అంజయ్య సినిమా పాటలు, పుట 1)

రంగుల కల చిత్రంలో అంజయ్య రచించిన పాట ఇది. గ్రామాలలో బతుకుబండి లాగాలేక ఓ తల్లి తన కొడుకుతో పట్నంకు వలస వచ్చింది. గ్రామాలలో పేద, ధనిక తారతమ్యాలు ఉన్నట్లుగానే పట్నంలో కూడా అలాంటి భావనలు ఉంటాయని అన్ని తెలుసుకొని మసులుకోవాల్సిన బాధ్యత మనది. పేద వారికి ఊరైన, పట్నమైన ఒక్కటే. బాధలు ఎక్కడైన ఉంటాయి. గ్రామీణ ప్రాంతం నుండి కూటికోసం వలస వచ్చిన వారు తిండిలేక డొక్కలు మాడి నిశ్చలంగా పడిఉంటే ధనవంతులు అన్నది అరగడం నిశ్చలంగా ఉంటారని. సామాన్య ప్రజలు ఆరుకాలం కష్టపడి పూరి గుడిసెలో ఉంటే ధనవంతులు వారిని దోచుకోని మిద్దెలలో నివసిస్తున్నారు అంటూ సామాన్య ప్రజల జీవన గొంతుకై అంజయ్య ఈ పాటలో ప్రశ్నించాడు.

ఊరు మనదిరా! ఈ వాడ మనదిరా
పల్లె మనదిరా ! ప్రతి పనికి మనందరా

సుత్తి మనది ! కత్తి మనది
పలుగు మనది ! పార మనది

(గూడ అంజయ్య సినిమా పాటలు, పుట 04)

ఎర్రసైన్యం సినిమాలో అంజయ్య రచించిన పాట ఇది. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు కుల, మత, వృత్తి భేదాలు లేకుండా ఒకరితో ఒకరు ఐకమత్యంతో, స్నేహ స్వభావంతో మెలిగేవారు. గ్రామీణ ప్రజలు ధైర్యవంతులే కాని అక్షరజ్ఞానం లేకపోవడం వలన అన్ని రకాల దోపిడికి గురై బానిసలాగా బ్రతకవల్సివచ్చింది. దోపిడి దారి వ్యవస్థ కలిగిన దొరలు ప్రజల శ్రమను దోచుకొని వారితో వెట్టి చారికి చేయిస్తూ పొరపాటున తప్పు జరిగితే వాని వరుస లేకుండా చిన్న పెద్ద లేకుండా, ఆడమగ లేకుండా తిట్టి పోసుకొనేవారు. దోపిడి దారి వ్యవస్థ పోవాలని అంజయ్య తన కలంలో ఈ పాట పలికించాడు.

లచ్చులో లచ్చన్న... ఈ భిచ్చగాల్ల రాజ్యంలో
బిచ్చగాల్ల బతుకులాయె... లచ్చులో లచ్చన్న

(గూడ అంజయ్య సినిమా పాటలు, పుట 14)

అంజయ్య రచించిన ఈ పాట ఒసేయ్ రాములమ్మ చిత్రంలోనిది. తినడానికి తిండిలేక బిచ్చం ఎత్తుకొనే వారు కొందరు. ఆ బిచ్చగాళ్ళ దగ్గర దోచుకెళ్ళేవారు కొందరు. రాజకీయ నాయకులు ఓట్ల పండుగకు ఓటర్ల కాళ్ళుమొక్కి పదవి వచ్చాక కోట్లు కొల్లాగొడుతు ఆ పథకాలు ఈ పథకాలు అంటూ ప్రజలను ఊరిస్తుంటారు. కల్లుతాగి సంసారాలు గడవ లేని సమయంలో అందరు ఏకమై సారా దుకాణం బందుపెట్టిస్తే ఖాజనాలు ఖాళీ అయ్యాయి పథకాలు లేవు అంటూ శ్వేతపత్రం చూపిస్తారు. ఆనాటి రాజకీయ వ్యవస్థను ప్రజల దైనందిన జీవితంను అంజయ్య ఈ పాటలో వివరించాడు.

విన్న పాటలు వ్రాశాము అన్నది ముఖ్యంకాదు ప్రజల హృదయాలను దోచుకొనే కొన్ని పాటలు రాసిన చాలు అని నమ్మిన వ్యక్తి అంజయ్య. సామాన్య ప్రజల జీవన విధానాలను, ఆర్థికస్థితిగతనులను, సామాజిక న్యాయంను వస్తువుగా తీసుకొని రచనలు చేసినవారు గూడ అంజయ్య. జానపదుల పాటల కెరటమై తన కలం, గళంతో సామాన్య ప్రజల కన్నీళ్ళను తుడిచాడు అనడంలో అతిశయోక్తి లేదు.

ఉపయుక్త గ్రంధాలు :

1. గూడ అంజయ్య సినిమా పాటలు - గూడ అంజయ్య.
2. ప్రవహించే పాట - బి.ఎస్. రాములు.
3. తెలుగెత్తి జైకొట్టు (వ్యాస సంకలనం)

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

భారత దళితోద్యమ వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జీవిత చరిత్ర పరిశీలన

– అచ్చ కుమార్, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

మానవాళి చరిత్రలో ఏ ఉద్యమానికైనా ప్రేరణగా నిలిచింది. ఏ ఒక్క వ్యక్తో కాదు అనేకమంది చైతన్య శీలురైన మనుషులు, అణచివేతే సామాజిక దుర్నీతిగా చలామణి అయ్యే సమాజం నుంచి వీళ్లు అవమానాన్ని, అమానవీయ తీరును ఎదుర్కొన్నవారే. తామనుకున్న లక్ష్య సాధనకు తమ విమోచనకు నిరంతరాయంగా పనిచేసిన వీరిలో సైతం దార్శనిక శక్తి కలిగినేదో ఒక్కరో తామూ ఎంచుకున్నా లక్ష్యాన్ని చేరుకుని కాగడావలె నిలువ గలిగారు.

జాతిపిత మహాత్మగాంధీ నాయకత్వంలో విదేశీ పరి పాలన నుండి భారతదేశం స్వాతంత్ర్య సాధించింది. కానీ ఆ ఫలాలు పూర్తిగా సిద్ధించే వరకు పోరాడే బాధ్యత మాత్రం ఆయన వారసులపైనే వుండింది. వారి సమ కాలీనులైన లోకమాన్య బాలగంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్, గోఖలే, చిత్తరంజన్‌దాస్, ఆంధ్రకేసరి, టంగుటూరి ప్రకాశం పంతులు ఇంకా అనేకమంది ఈ బాధ్యతలు పంచుకున్నారు. అంతిమ లక్ష్యాలు పరిపూర్ణంగా సిద్ధించేలా భూమికను తయారు చేయ వలసిన కర్తవ్యం స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన వీరిపైనే పడింది.

చర్చిలో చోటు చేసుకున్న తప్పుడు పద్ధతులపై పోపుల అధికారానికి వ్యతిరేకంగా జన్మన్ ఆయన ''మార్టిన్ లూథర్‌కింగ్'' సంస్కరణ ఉద్యమం నడపడం అది విజయవంతం కావడం తెలిసిందే. అయితే ఆ ఉద్యమ భానోదయం కలిగింది మాత్రం ఇంగ్లాండులోనే.

యూరప్ సంస్కరణోద్యమానికి వేగుచుక్కా అనే పిలుపు ''జాన్‌విక్‌లైఫ్''కు సరిగా సరిపోతుంది. పోపు అధికారానికి, ఇంగ్లాండ్ చర్చి దిగజారుడు తనానికి మొదట నిరసన తెలిపింది. అతనివల్లే అతనే ఈ పరిణామం చోటుచేసుకుంది. 14వ శతాబ్దపు నడిమి భాగంలో యూరప్‌ను చుట్టుముట్టిన మార్టిన్ లూథర్ కార్యాచరణకు రాజకీయ నేపథ్యం ఉంది. కానీ జానోవిక్ లైఫ్ ఉద్యమం ఆధ్యాత్మికమైనది. అది ఇంగ్లాండుకే పరిమితం.

సాంఘిక చరిత్రలోకి చూస్తే ఇలాంటి అనేకమంది వ్యక్తుల చరిత్రలు ఉంటాయి. హిందూ సమాజంలో కొనసాగే అమానవీయ దురంతాలను మట్టుపెట్టడానికి నిరంతరం ప్రయత్నిస్తూ తమ లక్ష్యసాధనకు అనేక త్యాగాలు చేసిన వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. ఎన్నో సంస్కరణలకు స్ఫూర్తినిచ్చింది వారే. దీనివల్ల అనేక మత, సాంఘిక సంస్థలు పుట్టాయి. దివ్యజ్ఞాన సమాజం. (బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం వంటి ఇటువంటివే)

దక్షిణాదిన కూడా హైదరాబాద్ దేశీయ సంస్థానంలో అట్టడుగు వర్గాల ఉన్నతికి విముక్తికోసం అంటరాని తరగతుల ఉద్యమం రమారమి 1906 నుండి మొదలైం దని చెప్పుకోవచ్చు. ఆ ఉద్యమమే దళితోద్యమము. ఆ ఉద్యమం కథానయకుడే భాగ్యరెడ్డి వర్మ.

పరిశోధనా పద్ధతి :

1. భాగ్యరెడ్డి వర్మ దళితోద్యమానికి చేసిన సేవలు దళిత జీవితాన్ని సంస్కరించిన విధానం. అతని జీవిత చరిత్రను అధ్యయనం చేయటం. ప్రాథమిక సమాచారమును భాగ్యరెడ్డి వర్మ మనవళ్ళు, మునిమనవళ్ళు, మనవరాళ్ళ ద్వారా సమాచారాన్ని ముఖాముఖి సంభాషణల ద్వారా సేకరించడం''
2. ప్రశ్నావళి పద్ధతిని ఉపయోగించడం జరిగింది.

3. పరిశీలన పద్ధతి.
4. శాస్త్రీయ పద్ధతిలో చారిత్రక సన్నివేశాలను సంఘటనలను వివరించడం.
5. అలాగయన, నిగమన పద్ధతుల ద్వారా వాస్తవాలను రాబట్టడం.
6. సర్వే పద్ధతిలో సమాచారాన్ని సేకరించడం.
7. గ్రంథాలయాల సందర్శన, చారిత్రక ప్రతులు, అప్పటి న్యూస్ ద్వారా దళిత జాతి చరిత్రను విశదీకరించాను.

పరిశోధన లక్ష్యం :

1. ప్రధానంగా నా యొక్క పరిశోధన లక్ష్యం. భాగ్య రెడ్డి వర్మ పాత్రను, అతని జీవిత చరిత్రను, అప్పటి దళితుల సంస్కృతి, అప్పటి దళిత ఉద్యమాలను వెలుగులోకి తేవడం.
2. దళితోద్యమంలో భాగ్యరెడ్డి వర్మ అనుభవించిన, చవిచూచిన రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను వెలుగులోకి తీసుక రావటమే. నా యొక్క పరిశోధన పరిశీలన లక్ష్యం!
3. దళితోద్యమంలో భాగ్యరెడ్డి వర్మ పాత్ర. అతని వ్యక్తిత్వ విశిష్టతను వెలికితీసి అతని పోరాట పటిమను అతను రగిలించిన స్ఫూర్తిని భవిష్యత్త రాలకు అందించటము. నా పరిశోధన యొక్క లక్ష్యం!

భాగయ్య చిన్నపటి నుండి చరిత్ర విజ్ఞానం పట్ల ఎంతో శ్రద్ధ కనబర్చేవాడు. వీరి ఇంటికి శైవమలె గురువు తరచువొచ్చి బోధనలు చేసేవారు. ఆర్యులు భారతదేశానికి వలస వచ్చినారు. వీరు రాకముందు నేడు అంటరాని వారుగా చూడబడుతున్నారు.

"దళితులు పాలకులుగా ఉండేవారు" రెడ్డి అన్న పదం రేడు నుండి వచ్చింది. దానికి అర్థం "పాలకులు" అని ఆయన చెప్పేవాడట. ఇది బాగయ్య మనసులో ఎంతగా నాటుకుపోయిందంటే మా పూర్వీకులు పాలకులే కదా. నేను పాలకుడిని ఎందుకు కాకూడదు అని ఆయన తన పేరు చివరన రెడ్డిని చేర్చుకున్నాడు. అట్టా బాగయ్య భాగ్యరెడ్డిగా మారాడు.

భాగ్యరెడ్డి వర్మ జననం :

నేటి హైదరాబాద్‌కు మరొక పేరు భాగ్యనగరం. బాగయ్య పేరు కలసివచ్చే విధంగా మాదిరి వెంకయ్య అనే పేరు పెట్టారు. రంగమాంబ దంపతులకు 1888వ సంవత్సరం మే 22వ తేదీన రెండవ సంతానంగా జన్మించిన చాగయ్య. ఆ తర్వాతకాలంలో తన పేరును భాగ్యరెడ్డిగా మార్చుకున్నాడు. 188వ సంవత్సరం నవంబర్‌లో వారి కుటుంబ గురువు వారని సందర్శించ డానికి వచ్చి "భాగ్యనగరం" పేరు వచ్చేటట్లు బాగయ్యకు బదులు, భాగ్యరెడ్డి అని నామకరణం చేశాడు. భాగ్యరెడ్డి తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో తల్లి ఐదుగురు సంతానాన్ని ఒక చిన్న కిరాణాకొట్టు నడుపుతూ పోషించింది.

భాగ్యరెడ్డికి ఆరు సంవత్సరముల వయస్సు రాగానే లక్ష్మీదేవితో వివాహం జరిగింది. ఈయనకు ఒక శిక్షకుడు ఉండేవాడు. కాని సాంప్రదాయక విద్యాభ్యాసం లేదు. తెలుగు చదవడం, రాయటం మాత్రం వచ్చేది. గోవాకు చెందిన బారిస్టర్ "దొసాశాంటోన్" ఈయనకు ఆశ్రయ మిచ్చి తిండిపెట్టి తన ఇంటి యొక్క మొత్తం యజ మాన్యాన్ని మరియు కొనాసాగడు. ఆ తరువాత విద్యుచ్ఛక్తి శాఖలో వైర్‌మ్యాన్‌గా పనిచేశాడు. ఆ తరువాత జీవన రక్షా మండలికి చెన్నిన లాల్జీ. మేఘాజీ, భాగ్యరెడ్డిని పచారకుని నియమించి నెలకు అరవై రూపాయల జీతం, తిరగటానికి మోటారు సైకిలు ఏర్పాటు చేశాడు.

దళిత సమాజోద్ధరణ :

పూర్వ నిజాం రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒక నాయకుడున్నాడని మనలో చాలామందికి తెలియదు. ఆయనే హైదరాబాద్ నగరానికి చెందిన మాదిరి భాగ్యరెడ్డి వర్మ. డాక్టర్ అంబేడ్కర్ రంగంలోకి దిగకముందే భాగ్యరెడ్డి వర్మ అఖిల భారతస్థాయిలో ప్రఖ్యాతిగాంచారు. సాంఘిక సంస్కర్తగా 1917లోనే సరోజనీనాయయుడు. మహాత్మగాంధీ మన్ననలను పొందిన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ.

1937వ సంవత్సరంలో జరిగిన ఆసక్తికరమైన సంఘటన. మరాఠిలో ప్రఖ్యాత దర్శకుడు శాంతారం వాహన్. క్షితి అనే బ్యానర్‌లో సినిమా నిర్మించాడు. ఆర్యులు జీవన

విధానంలోగల దుబార, క్రూరత్వం, మోసకారితనం, వ్యభిచారం, తాగుబోతుతనాన్ని ఆర్యులు, ఆర్యేతరులపై చేసే అరాచకాలను చాలా వివరంగా చూపించింది. ఈ సినిమా ఆర్యుల ఆర్యేతరుల సంస్కృతిని బాగా చూపించింది. ఈ సినిమా చూసిన వెంటనే వర్మ శాంతారావును ప్రశంసిస్తూ తన కొడుకుచేత టెలిగ్రాం పంపించాడు. ఆర్యులు సహజసిద్ధంగా సంతరించుకున్న లక్షనాలను బాగా చూపించాలని ఆయన నిర్మించిన సినిమాలో అదే అత్యుత్తమమైందని.

ఆయన జీవిత రేఖలకు సంబంధించిన ఆధారాలన్ని అక్కడక్కడ సేకరించినవే. ఉత్తర భారతదేశంలో జరిగిన సదస్సులు నివేదిక, ఆయన చేసిన ఉపన్యాసాలూ, పత్రికలు ప్రచురించినవి, ప్రచురితమైనవి.

భాగ్యరెడ్డి వర్మ చేసిన తీర్మానాలు :

1. ఆది ఆంధ్రుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపైన సదస్సు కృతజ్ఞతలు తెలియ జేస్తుంది. మహా ప్రభువు విక్టోరియా.
2. క్రైస్తవ మిషనరీలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ దేశ అంటరాని వర్గాల ప్రజల శ్రేయస్సుకు పనిచేస్తున్న స్త్రీ, పురుషులకు తమ మధ్య జీవించడానికి అన్ని వసతులు కలిగించి సాధారణ జీవితాన్ని గడిపేందుకు.
3. ఆది ఆంధ్రుల పేర్ల చివరగా చేర్చి ఆత్మగౌరవాన్ని కించపరచడాన్ని.
4. ఆది ఆంధ్రుల పురోగతికి అడ్డుగా నిలుస్తున్న దురలవాట్లు.
5. కల్లు దుకాణాలు, సారా దుకాణాలు ఏర్పాటుకు అయా ప్రాంతాల్లో అనుమతించడానికి.
6. దేవుని పేరిట స్త్రీలను దేవదాసీలుగా, జోగినీలుగా మార్చే సంప్రదాయాన్ని.
7. ఈ జిల్లాలో 25 శాతం జనాభా నిమ్న శ్రేణి ప్రజలైనందున ఇతర జిల్లాలో ఏర్పాటు చేసినట్లు.
8. నిమ్నశ్రేణి బాలబాలికలకు ఉచిత విద్య వసతి కలిగించాలని.

ఉపయుక్త గ్రంధాలు :

1. భాగ్యోదయం - పద్మశ్రీ యం.బి. గౌతమ్.
2. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర - దేవులపల్లి వేంకటేశ్వర్లు.
3. తెలంగాణ పోరాట స్మృతులు - ఆరుట్ల రామచంద్రారెడ్డి.
4. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు - ఆరుట్ల రాచంద్రారెడ్డి - విరుగంటి గోపాలకృష్ణ.
5. తెలంగాణ సాయుధ పోరాట సేనాని - ఆరుట్ల రామచంద్రారెడ్డి.
6. తెలంగాణ సాయుధ పోరాటం - నా అనుభవాలు - నల్ల నర్సింహులు.
7. సాయుధ పోరాటం - వాస్తవాలు - మాకినేని బసవపున్నయ్య.
8. వీర తెలంగాణ నా అనుభవాలు - జ్ఞాపకాలు - రావి నారాయణరెడ్డి.
9. ఎర్ర జెండాలు, తెలంగాణ గెరిల్లా యోధులు - జీవితగాథలు - గంగినేని వెంకటేశ్వరరావు.
10. అసెంబ్లీ భవనం - లైబ్రరీ నుండి వాల్యూమ్స్, శాసనసభలో ప్రముఖుల ప్రసంగాలు సి.డి.యస్.
11. తెలంగాణ చరిత్ర - సుంకిరెడ్డి నారాయణరెడ్డి.
12. దళితోద్యమ వేగుచుక్క - సంగిశెట్టి శ్రీనివాస్, నమస్తే తెలంగాణ.
13. Encyclopaidia of Dalits in India. Volumen 7, Edited by Sanjay Paswan.
14. A History of Telugu Dalit Literature by Thummapudi Bharathi.
15. తెలంగాణ సాహిత్యం వికాసం - కె. శ్రీనివాస్.
16. తెలంగాణ విమోచనోద్యమం సాహిత్యం - డా॥ ఎస్వీ సత్యనారాయణ
17. Dalit movement in India its Leaders 1857 - 1957 - Ramachandra Keerasagar.

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు దినపత్రికలు – ఆధునిక ధోరణులు – పరిశీలన

– యం. అనిత, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

గతం అనే పునాదిపై వర్తమానం అనే సౌధం నిర్మిత మవుతుంది. భవిష్యత్తు పరిణామాలను వర్తమానం భూమిక అవుతుంది. తెలుగు దిన పత్రికలకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఆధునిక పత్రికా ధోరణులను సమగ్రంగా అవలోకనం చేయాలంటే ఆనాటి, నేటి పత్రికల తీరుతెన్నులను తెలుసుకోవాలి. తెలుగు దినపత్రికల సుసంపన్న వారసత్వం. సమాజానికి దిశా నిర్దేశం చేసిన ఘన చరిత్ర తెలుస్తుంది. అధ్యయ విభజన.

1. తెలుగు దినపత్రికలు - ఆధునికత
2. తెలుగు దినపత్రికలు - ఆధునిక ధోరణులు - సంకేతికత
3. తెలుగు దినపత్రికలు - ఆధునిక ధోరణులు - సాంకేతిక భాష
4. తెలుగు దినపత్రికలు - ఆధునిక ధోరణులు - సాహిత్యం
5. తెలుగు దినపత్రికలు - ఆధునిక ధోరణులు - అవశ్యకత, సాకల్య విశ్లేషణ.

1. తెలుగు దినపత్రికలు - ఆధునికత :

వార్తలను ఆంగ్లంలో న్యూస్ అని పిలుస్తారు. న్యూస్ అంటే ఉత్తరం (ఎన్ - నార్త్), తూర్పు (ఇ - ఈస్ట్), పడమర (డబ్ల్యు - వెస్ట్), దక్షిణం (ఎస్. సౌత్) అనే నాలుగు దిక్కులు సమాచార సమాహారం అనే అర్థం ఉంది. అంటే ప్రపంచం నలుమూలలా జరిగే విషయాలు తెలిపే సాధనం న్యూస్ అన్నమాట. అంతే కాకుండా న్యూస్ అనే కొత్త కోణంలో సాధారణీకరుణార్థం కూడా పాత్రికేయ రంగంలో ఉంది.

1.1 కొత్తదనం - ఆధునికత :

కొత్తదనం, ఆధునికత అను పదాలు పరస్పర పూరకాలు. కొత్త విషయాలన్ని ఆధునికత అంశాలే. సమాజానికి అవసరమైన విశేసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు విడమర్చి చెప్పడంలో వార్తా పత్రికలు ఎంతో కృషి సల్పాయి. తెలుగు దినపత్రికలు కాలానుగుణంగా ఆధునిక సమాజ పోకడలను ప్రజల కళ్లకు కట్టాయి. డప్పు వాయించడం, చాటింపు చేయించడం వంటి పురాతన ప్రచార ప్రక్రియల నుంచి కేవలం ఒకటి రెండు శతాబ్దాల్లోనే భూమిపై ఎక్కడి నుండి ఎక్కడికైనా క్షణాల్లో వార్తలు అందించే ఆధునిక సాధనాలు వినయోగ స్థాయికి మానవాళి పురోగమించింది.

2. ప్రపంచ జర్నలిజంలో ఆధునిక భావనలు :

జర్నలిజం అంటేనే ఒక ఆధునిక, సాంకేతిక సమాచార విప్లవం. ఆధునిక పోకడలను జర్నలిజం ప్రతిబింబించి నంతగా మరే ఇతర సమాచార వ్యవస్థ కళ్లకు కట్టలేదు. ఆధునిక భావనలు ముందుగా ఆంగ్ల జర్నలిజంలో మొదలయ్యాయి. ఎందుకంటే ఆంగ్ల భాషలోనే తొలుత పత్రికలు వెలువడ్డాయి. ఏ దేశంలో అయినా పత్రికలు వెలువడినవి. ఆంగ్ల భాషలోనే అనేది ఒక సాధారణీ కరణాంశం.

1.3 భారతదేశం జర్నలిజంలో ఆధునిక భావనలు :

భారతదేశంలో కూడా తొలినాళ్లలో ఆంగ్ల పత్రికలే వెలువడ్డాయి. భారతదేశాన్ని బ్రిటీషు వారి పరిపాలించి నందున వారి కాలంలో దేశంలోని ముఖ్య పట్టణాలు నుంచి ఆంగ్ల పత్రికలు ప్రచురితమయ్యాయి. ఆంగ్లమే కాకుండా బెంగాలి, హిందీ భాషల్లో కూడా దేశంలో చాలాచోట్ల నుంచి దిన, వార, మాస పత్రికలు వెలు వడ్డాయి. అందులో కొన్ని బెంగాల్ గెజిట్, ది ఇండియన్ మిర్రర్, ది పేటియట్, బాంబే సామాచార్.

1.4 తెలుగు జర్నలిజంలో ఆధునిక భావనలు :

తెలుగు దినపత్రిక విషయానికి వస్తే ఆంధ్ర

దేశమంతటా వీటిపాత్ర ఎన్నదగినదనే చెప్పాలి. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి ఘట్టాల గురించి విశేష వార్తలను ప్రచురించాయి. దేశంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా స్థానిక భాషలలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రచురించాయి. దేశ నాయకుల పోరాటాలు, ఉద్యమ పిలుపులు మొదలైన వాటిని అత్యంత ప్రభావవంతమైన వార్తల రూపంలో అందించాయి. అలాగే ప్రపంచంలో జరుగుతున్న వివిధ ఉద్యమాల గురించి కూడా తెలుగు దినపత్రికలు ద్విగుణీకృతమైన వార్తలను ప్రచురించాయి. తద్వారా ఆధునిక సమాజంలో చోటుచేసుకున్న పోకడలను తెలుగు ప్రజానీకానికి అందించగలిగాయి.

2. తెలుగు దినపత్రికలు – ఆధునిక ధోరణులు – సాంకేతిక :

ఒకప్పుడు వార్తా పత్రికలు ప్రచురణ కేంద్రాలు నుంచి పాఠకులకు కొద్ది గంటల వ్యవధిలో అందేవి. గ్రామాలకు చేరాలంటే 21 నుంచి 24 గంటల సమయం పట్టేది. అయితే ఇప్పుడు ప్రచురణ కేంద్రాలు పెరిగాయి. పల్లె టూళ్లలో సైతం అర్ధరాత్రి వరకు జరిగిన వార్తలను సేకరించి పత్రాలు ముద్రించి తెల్లవారేసరికి పాళకుల గడపలకు చేర్చుతున్నారు.

2.1 పత్రిక – పరిమాణం :

పత్రికలు నిత్యం వాడే కాగితాన్ని 'న్యూస్ ప్రింట్' అంటారు. పొడవు, వెడల్పుల పరిమాణాన్ని బట్టి కాగితాలకు పేర్లు పెట్టారు. డెమి, రాయల్, క్రౌన్, ఫుల్‌స్కేప్ మొదలైనవి. అయితే ఇప్పుడు ఎ-1, ఎ-2, ఎ-3, ఎ-4 మొదలైన పేర్లు వినియోగిస్తున్నారు. మనం సాధారణంగా ఉత్తరాలు రాయడానికి ఉపయోగించేవి ఎ-4 సైజు. న్యూస్ ప్రింట్‌లోనూ చాలా రకాలున్నాయి. రంగు, కాగితం, నునుపు, బరువు రోటరీ యంత్రాలకి రోలును అమర్చి వేగంగా యంత్రాన్ని నడిపిస్తున్నప్పుడు మధ్య మధ్య కాగితం తెగిపోకుండా ఉండేంత గట్టితనం మొదలైనవి న్యూస్‌ప్రింట్ నాణ్యతను నిర్ణయిస్తాయి.

2.2 టాబ్లాయిడ్ రాక : :

దినపత్రికల్లో తల్లి పత్రికలుగా అవు-దూడలాగా బ్రాడ్‌షీట్ పత్రిక భాగం ఒకటి. టాబ్లాయిడ్ మరొకటి ఉంటున్నాయి. టాబ్లాయిడ్‌లు జిల్లా ప్రత్యేక సంచికలు లేదా జిల్లా ప్రత్యేక అనుబంధాలుగా వెలువడుతున్నాయి. స్థానిక వార్తలను విశేషంగా సవివరంగా ప్రచురిస్తున్నాయి. ముఖ్యంగా జోనల్ వ్యవస్థ తెలుగు దినపత్రికలను ప్రజలకు బాగా చేరువ చేసింది.

2.3 వార అనుబంధాలు – పుస్తకాలు :

పోటీ ప్రపంచానికి అనుగుణంగా వార్తా పత్రికలు, సరికొత్త పోకడలకు శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం సండే స్పెషల్ పేరిట ప్రత్యేకంగా చిన్నపాటి అనుబంధాల్ని లేదా పుస్తకాన్ని అందిస్తున్నాయి. ఈ అనుబంధాలను రెగ్యులర్ వార్తలతో కాకుండా కథలు, జోకులు, వింతలు, విశేషాలు, ఆటలు, పాటలు మేలు కలయికగా రూపొందించాయి.

2.4 కంప్యూటర్ వినియోగం :

టెక్నాలజి రంగంలో సాధించిన అభివృద్ధి పత్రికల స్వభావాన్నే మార్చేశాయి. వార్తలను క్షణాల మీద ఎక్కడి నుండి ఎక్కడికైనా పంపగలుగుతున్నాయి. ఫోటోలతో సహా సంఘటన జరిగిన కొద్దిసేపటికే వార్తలను పత్రికా కార్యాలయాలకు లేదా డెస్క్‌లకు అందించడం సాధ్యం అవుతుంది. కంప్యూటర్‌లో అక్షరాల కూర్పు ఆఫ్‌సెట్ ముద్రించు బాగా మెరుగుపరిచాయి. పోతపోసిన లోహపు అక్షరాలు అవసరం లేకపోయింది. అక్షరాల సైజు పెరిగిపోయింది.

2.5 అచ్చు కూర్పు :

ఒకప్పుడు విడివిడిగా అక్షరాలను కూర్పు చేసుకుంటున్న కాలంలో గుణింతాలను సహా విడివిడిగా అచ్చులలో కూడిన హల్లులు, సంయుక్తాక్షరాలు కలిసి మొత్తం 423 అక్షారలు అవసరమయ్యేవి. ఈ అక్షరాల పరిమాణాన్ని బిందువుల (పాయింట్స్) లెక్కలో రాయించేవారు. ఉదా : తెలుగు పత్రికలో వార్తలకు వాడే అక్షరాల

పరిమాణం 12 బిందువులు (పాయింట్స్). శీర్షికలకు వాడే అక్షరాలు 24, 36, 48, 60, 72 పాయింట్లలో ఉండేవి. పతాక శీర్షికలకు 72 పాయింట్ అక్షరాలను వాడేవారు. సీసంతో తయారు చేసిన ఈ అక్షరాలను (టైప్స్) వ్యవహార (టైప్స్) వ్యవహార నిమిత్తం ముద్రాక్షరాలు అంటారు.

2.6 ముద్రణ :

గూటన్‌బర్గ్ ముద్రణ విధానం, మోల్స్ టెలిగ్రాఫ్, గ్రాహంబెల్ టెలిఫోన్, మార్కోజి రేడియో వంటి సాంకేతిక విభాగాలు 18, 19, 20 శతాబ్దిలో పత్రికా రంగాల్లో విప్లవాత్మకంగా మార్చివేశాయి. లక్షల ప్రతులను రెండు మూడు ముద్రించగల యంత్రాలు, కృత్రిమ ఉపగ్రహాలు పత్రికలను సంబంధించి 19 శతాబ్దంలో సమాచార సేకరణ చేపట్టిన మొదటి వ్యక్తి సి.పి.బ్రౌన్. తెలుగు ముద్రణ తొలుత తెలుగునాట ప్రారంభం కాలేదు. తెలుగు లిపిలో రాసిన సంస్కృత రచనలు గానీ, తెలుగులోనే రాసిన పుస్తకాలు ముద్రణ గానీ ఇక్కడ జరుగలేదు. మొదట జర్మన్‌లో, తరువాత కలకత్తా సమీపంలో సీరాంపూర్ (శ్రీరాంపూర్) తెలుగు అచ్చు వేయడం మొదలైన తెలుగులో అక్షరాలను పోల్‌పోసి తయారు చేసే పద్ధతి కూడా సేరాంపూర్‌లోనే మొదలైంది.

3. తెలుగు దినపత్రికలు - ఆధునిక ధోరణులు - భాష :

దినపత్రికల ఆవిర్భావం నుంచే భాష విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనపబడింది. ఎందుకంటే ప్రతిరోజు ఉదయించే కొన్ని లక్షల మంది పాఠకులు చదివే కాబట్టి భాష విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముఖ్యంగా సాధారణ జనజీవనానికి అర్థమయ్య రీతిలో భాష ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పండితులు ఎంత సునాయాసంగా వార్తలను చదవగలరో చదివి అర్థం చేసుకోగలరో పామరులు కూడా అంతే సులభంగా పత్రికా భాషను అవగాహన శైలిని ఏర్పాటు చేసుకున్నారు.

3.1 యాసను బట్టి భాష :

అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, శైలి తీరును బట్టి మూడు ప్రాంతాలున్నాయి. అవి తెలంగాణ, కోస్తా ఆంధ్ర, రాయలసీమ ఆయా ప్రాంతాల వారు మాట్లాడేది తెలుగు భాష అయినా యాసలో తేడా ఉంటుంది. తెలంగాణ, కోస్తా ఆంధ్ర, రాయలసీమ ఈ మూడు ప్రాంతాల్లో తెలుగు భాష వాడుకలో ఉంది. కానీ కొన్ని పదాలు మాత్రం ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా వాడుకలో ఉన్నాయి. అవన్నీకూడా అర్థాన్నిచ్చినా వాడుకలో మాత్రం తేడా కనిపిస్తుంది. లేదా ఏమిటో కింది ఉదాహరణ ద్వారా స్పష్టమవుతుంది.

ఉదా : సబ్బం (తెలంగాణ) / గడ్డపార (కోస్తా ఆంధ్ర) / గునపం (రాయలసీమ)

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి పదాలను ఎన్నింటినో పత్రికలు ఆయా స్థానిక లేదా ప్రాంతీయ భాషలను బట్టి ద్విగుణీకృత మార్పులు చేసి పత్రికా భాషను రూపొందించుకుంటున్నాయి.

3.2 ఎప్పటికప్పుడు మార్పు :

భాష జీవనది లాంటిది. నిరంతరం దాని ప్రవాహం కొనసాగుతుంది. ఎంతలా అంటే అంతం లేనంతగా అనగా భాష నిత్యం, నిరంతరం లోనవుతుంది. కాని దాని ప్రవాహం మాత్రం ఆగడు. ఎప్పుడు కొనసాగుతూనే ఉంటుంది. అలాగే పత్రికా భాష కూడా ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన శైలిని మార్చుకుంటుంది. ప్రజల ఆచార వ్యవహారాలు, కట్టు బాట్లు, సంప్రదాయాలు, సంబంధ బంధవ్యాలు తదితర విషయాలన్నీ ఇందులోకి వస్తాయి. అలా ఎప్పటికప్పుడు ఇవన్నీ ఎలా అయితే మార్పు చెందుతాయో భాష కూడా అలాగే మారుతుంది. ముందుగా చెప్పినట్లు మారుతున్న కాలానికి అనుగుణంగా పత్రికలు భాష కూడా మారుతుందనేది అక్షరాలా నిజం.

3.3 వ్యాకరణ రీత్యా తదనుగుణం :

వ్యాకరణ రీత్యా కూడా దిన పత్రికలు భాషా ధోరణులు మార్పు చెందుతూ ఉంటాయి. ఏభాషలో నామవాచకం, క్రియలు చాలా శక్తిమంతంగా ఉంటాయి.

వాటికున్న శక్తి మిగతా వాటికి ఉండదు. వాక్యాన్ని నామవాచకం క్రియలతోనూ నింపాలి. విశేషణాలు, సహాయక క్రియలు వాడకూడనివి కాదు. అయితే వాటిని సాధారణంగా నామవాచకాలుకు క్రియలకు బలం చేకూర్చేవిగానే వాడాలి. ముఖ్యంగా ప్రచార సాధనాల కోసం విశేషణాలు, సహాయక క్రియలు జోలికి పోకూడదు.

4. తెలుగు దినపత్రికలు - ఆధునిక ధోరణులు - సాహిత్యం :

అక్షరాల్లో పదాల్లో వార్తల్లో లయ ఉంటుంది. రచనల్లో ఒక విధమైన 'తూగు'ను 'లయ'ను వార్తా రచనల్లో ప్రవేశపెట్టగలిగితే వార్తను పాఠకుడి చేత ఎంత వరకైనా చదవించవచ్చనే విషయాన్ని పత్రికలు గ్రహించాయి. గ్రహించడమే తడవుగా వెంటనే అమలులో పెట్టాయి కూడా. 1990 దశకంలో పోల్చిచూస్తే 2000 సంవత్సరం తర్వాత చాలా మార్పులే వచ్చాయి. ఈ విషయంలో ఎలా అంటే పాఠకుడి అభిరుచికి అనుగుణంగా వార్త రచన జరపడం. అనగా....

1. వార్తా రచన విషయంలో పాఠకుడి అభిరుచికి తగ్గట్టుగా వివిధ అంశాలు పాటించడం.
2. వార్తలో వచనం చాలా కీలకమయినది. కాబట్టి దీని విషయంలో ప్రత్యేక జాగ్రత్త తీసుకున్నారు.
3. గుడిపాటి వెంకటాచలం, మల్లాది రామకృష్ణశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, బుచ్చిబాబులు వచనం హాయిగా చాలా బాగుంటుంది. అందులో ఒక లయ ఉంటుండి. వాటిని హాయిగా చదువు కోవాలంటే వార్తా రచన శైలిలో విప్లవాత్మకమైన మార్పులు రావాలి. ఈ విషయం గ్రహించారు. కాబట్టి. కొన్నేళ్లుగా జర్నలిస్టులు వార్తా రచన తీరులో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూనే ఉన్నారు. మనం పత్రికల్లో సంస్కృతి పద భూయిష్టమైన, క్లిష్టమైన వాక్యాలు పాఠకులకు శీర్షికల్లో కవిత్వం పాళ్లు పెరిగి పాఠకులను చికాకు పెడుతున్నాయి. ఉత్తమ సాహిత్యానికి దిన పత్రికల్లో చోటులేకుండా పోయింది. ఉన్నంతలో కొంతగా దిన పత్రికల ఆదివారం అనుబంధాలే రచయితలకు, కవులకు కాస్త చోటిస్తున్నాయి.

5. తెలుగు దినపత్రికలు - ఆధునిక ధోరణులు - ఆవశ్యకత, సాకల్య విశ్లేషణ :

ఐదు దశాబ్దాల క్రితం పత్రికల నిర్వహణలో వృత్తిధర్మం కాకుండా, ఉద్యమ స్ఫూర్తి ఊతంగా ఉండేది. ఇప్పుడు వృత్తిధర్మం స్థానంలో వ్యాపార పోకడ పెరిగిపోయింది. సామాజిక సేవ స్థానంలో రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు స్థిరపడ్డాయన్నది నూటికి నూరు పాళ్లు నిజం. మేమిచ్చినవే వార్తలు, మాకు వీలు కుదిరి పంపినప్పుడే మీరు పత్రిక చదవాలి అనే ధోరణి పూర్తిగా మారిపోయింది. అభివ్యక్తికరణలో భావం కన్నా ఆకర్షణకే భాష ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం నేర్చుకుంది. ఈ క్రమంలో తెలుగులో తెలుగుతనం తగ్గిపోతుందనే విమర్శ కూడా ఉంది. విద్య కోసం, సామాజిక అవగాహన కోసం అనే పరిస్థితి దాటి వినియోగం వినోదం వాణిజ్యం అదే కోణంలో పత్రికలు రూపుదిద్దుకుంటున్నాయి. ఒకప్పుడు ఆదివారం అనుబంధం అంటే కళ, సాహిత్యం, విజ్ఞానం, సాంస్కృతిక వేదిక. ఇప్పుడు వినియోగదారుడి కరదీపిక. పాఠకులను ఆకర్షించడానికి తక్కువ నిడివి శీర్షికలు, ఆకర్షించే రంగులు, అంత్యప్రాసలు తయారయ్యాయి. కొంచెం అశ్లీలం కూడా తోడైంది. డైనమిక్‌గా గానో డైనమేట్ గానో ఉంటేనే తప్ప ఇప్పుడు పత్రిక బతికి బట్టకట్టలేదన్న మాటలో ఆశ్చర్యం లేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీమాంధ్ర భాషనే తెలంగాణ పత్రికలు లేదా ప్రసార మాధ్యమాలు వాడాలా అనే సంశయం పుట్టింది. దీనిపై చర్చలు జరుగుతూనే ఉన్నాయి. భావజాలంతోపాటు భాష వ్యక్తీకరణ తీరు మారాల్సి ఉంటుందనే గ్రహింపు అయితే ఉంది కాని అది ఆచరణలోకి పెద్దగా వచ్చినట్లు లేదు. మొదటి తెలంగాణ పత్రికలు చూస్తే స్థానిక పదజాలాన్ని వాడడం గమనిస్తాం. అదేవిధంగా క్రియా రూపాంతర పూర్వ

స్వరానికి బదులు నకారం చేర్చి రాయడం జరిగింది. ఉదాహరణకు వచ్చిండు అనే పదాన్ని వచ్చినాడు అని రాయడం జరిగింది. మౌఖిక భాషాలోని ధ్వనులను లిఖిత భాషలోకి తీసుకురావడం అనేది సాధ్యం కాదు. కానీ సాధ్యమైనంత సామీప్యంగా ఉండేవిధంగా లిఖిత భాషను వాడడమే ఇంతవరకు చేస్తున్న పని. ఇలా చూసినప్పుడు తెలంగాణ ప్రసార మాధ్యమాలు తనదైన భాషా శైలిని రూపొందించుకునే వీలుంది. కోస్తాంధ్ర పదాలకు సమానమైన తెలంగాణ పదాలు వాడుకలో ఉన్నాయి. క్రియా రూపాలను మార్చుకోవడానికి బదులు తొలుత తెలంగాణ పదజాలాన్ని వాడడం ప్రారంభిస్తే స్థానికత స్వభావాన్ని పత్రికకు తేవచ్చు గోంగూరను పుంటికూర అనే పదం ఉన్నట్లే. చాలా పదాల పర్యాయ పదాలు ఉన్నాయి. చక్రాన్ని పయ్య అని వాడవచ్చు. ఇలా వాడుతూ పోతే పత్రికలు స్థానిక స్వభావాన్ని సంతరించుకుని స్థానిక ప్రజల మనసు లను దోచుకునే అవకాశముంది.

ఆధార గ్రంథాలు :

1. నాటి పత్రికలు - మేటి విలువలు - పొత్తూరి వేంకటేశ్వరరావు.
2. ఆంధ్రజాతి అక్షర సంపద - తెలుగు పత్రికలు - పొత్తూరి వేంకటేశ్వరరావు.
3. దిద్దుబాటు - డాక్టర్ జి.ఎస్. వరదాచారి.
4. తెలుగు జర్నలిజం, అవతరణ వికాసం - డాక్టర్ వి. లక్ష్మణరెడ్డి.
5. తెలుగు జర్నలిజం చరిత్ర - నామాల విశ్వేశ్వరరావు.
6. తెలుగు పత్రికలు తీరుతెన్నులు - డాక్టర్ జి.ఎస్. వరదాచారి.
7. తెలుగు పత్రికలు - ఆధునిక ధోరణులు - రచన జర్నలిజం కళాశాల.
8. తెలుగు పత్రికా రంగం - నిన్న - నేడు - రేపు - రచన జర్నలిజం కళాశాల.
9. బ్రౌన్ జాబులు - తెలుగు జర్నలిజం తొలి చరిత్ర - బంగొరె బండి గోపాల్‌రెడ్డి.
10. ప్రసార భాషగా తెలుగు - డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు, నాగసూరి వేణుగోపాల్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు జానపద కళలు, కళా వైభవం, విశిష్టత, సమగ్ర పరిశీలన

- రవీందర్ అచ్చ, తెలుగు ఉపాధ్యాయులు, మహాత్మ జ్యోతిబా ఫూలే తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, వెంకటాపూర్, ములుగు, వరంగల్.

భారతీయ సమాజంలోని గ్రామీణ ప్రాంతాలలో దాగి వున్న ఇంక నాగరిక సమాజానికి తెలియని జానపదులు ఉత్సవాల్లో ప్రదర్శించే కళారూపాలను, పరిశోధనాత్మకంగా వాటి మూలాలను, జాతికి తెలియచెప్పాలనే ఉద్దేశ్యంతో ఈ అంశాన్ని ఎన్నుకున్నాను.

పరిశోధనలు లక్ష్యాలు :

1. జానపదుల - కళా వైభవాన్ని ముందు తరాల వారికి తెలియచేయడం.
2. జానపదుల, కళల పుట్టుపూర్వోత్తరాలను, వాటి విశిష్టత మరియు ప్రాధాన్యతలను భావి తరాలను సజీవంగా అందించడం.
3. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలలో ఉన్న కళలేగాక, వివిధ రాష్ట్రాల కళారూపాలచే సరిపోల్చడం కూలంకషంగా చర్చించడం.
4. జానపదుల కళావైభవంను, సువర్ణాక్షరాలచే లభించడం 'జానపదం' అనగా పల్లెవాసులకి, జనపద ములందు ఉండు వారు జానపదులు. వారు పాడే చక్కటి పాటలే 'జానపద గేయం' అని వ్యవహరించవచ్చు. దీనినే అను folk songs, volkslied జర్మన్ భాషపదంనకు అనువాదము. (folk lore) జానపదము విజ్ఞానం (folk literature) జానపద సాహిత్యం, (folk songs) జానపద గేయం అని వ్యవహారాలలో కలవు. జానపదమును జాతి, ప్రజలు విషయానికి చెందిన అంశాలకు వాడబడును.

జానపద సాహిత్యం మౌఖిక సారస్వతం అనగా కథాగేయం, పాట, ఆట, గద్యం, తిట్లు, మాండలికాలు, పిలుపులు, మొదలైనవిగా పేర్కొనవచ్చు. ఆ విధంగానే భౌతికపరంగా వారి సంస్కృతి, పరిశ్రమలు, పానీయాలు, వంట, వార్పు, వస్తువులు, వేషము, ఆభరణాలు, పచ్చబొట్లు, వాస్తు విజ్ఞానం, ఇళ్ల నిర్మాణం వంటి అంశాలుంటాయి. వీటినే Material Cultrure లో చేర్చవచ్చు.

మౌఖికవరంగానే (Social folk customer) జానపదులు సంస్కృతి, సారస్వతపరంగా సంప్రదాయక జీవితానికి సంబంధించిన సమాచారం ఉంటుంది, వారి ఆచారాలు, క్రీడలు, ప్రభలు, తిరునాళ్లు, నమ్మకాలు, బొనాలు, సమాధుల మ్రొక్కుబడులు, చిట్కాలు, కొలుపులు, దేవతలు వంటి ముఖ్యాంశాలుంటాయి.

అన్నింటిలోను మనకు అనందానిచ్చే వారి ప్రదర్శనలు కళలు (Performing folk Arts) ఆటవికులు విన్యాసాలు, సంగీతం, రాత్రి సంగీతం, బృంద, వ్యక్తిగత నృత్యాలు, కోలాటం, భజనలు, పగటి వేషాలు, కొరవంజి నృత్యాలు, గారడీ విద్యలు, చెక్కబుట్ట, తోలుబొమ్మలాటలు, గుర్రపు నృత్యం వంటి అసామాన్య కళలు వారిలో కలవు. కనుక విశాలమైన జానపద వాఙ్మయంలో జానపద విజ్ఞానం ఒక భాగం. 'కళ, కళ' కొరకే అనే నానుడి జానపద కళలకు చక్కటి ఉదాహరణ.

తెలుగు రాష్ట్రాలలో ఉన్న జానపద కళారూపాలు భారతదేశంలోని ఏ ఇతర రాష్ట్రాలలో కూడా లేవు.

కురవంజి :

ఇవి ఆంధ్రుల మొదటి కళారూపం, దృశ్యకావ్యం, కురవంజి. అరణ్యాలలో నివసించే చెంచులు, కోయలు, కురవలు ఈ కళారూపాన్ని ప్రదర్శించేవారు. కురవంజి అనగా ఒక నృత్య విశేషంతో కూడిన అడుగు. కురవలనే వారి అడుగు కాబట్టి కురవంజి లేక కొరవంజి అని కూడా పిలుస్తూ వచ్చారు. పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, భద్రాద్రి, సింహాచలం వంటి ప్రదేశాలలో యాత్రికులు

వేడుకార్థం పురాణాలు, పుణ్యక్షేత్రాలు మహత్యాలు ప్రదర్శించేవారు.

యక్షగానం :

మన కళారూపాల్లో అతి ప్రాచీనమైనది. యక్షగానం జక్కులనే వారు ఈ యక్షగానాలను ప్రదర్శించేవారు. జక్కు శబ్దం యక్షుగా మారి జక్కులవారి ప్రబంధానికి యక్షగాన మని పేరు వచ్చింది. దక్షిణదేశంలో యక్షగానాలు వర్ధిల్లా యని పాల్కురికి, సోమనాథుని పండితారాధ్య చరిత్ర వలన తెలుస్తుంది. యక్షగానాలు కాకతీయుల కాలంలో బాగా జనాదరణ పొందాయి. 14, 15వ శతాబ్దాల్లోను ఉన్న యక్షగానాల గూర్చి శ్రీనాథుడు పొగిడాడు. విజయ నగర రాజుల కాలంలో, తంజావూరును పాలించిన రాజులు కాలంలోనూ వర్ధిల్లాయి. ఈ నాటికీ తంజవూరు సరస్వతీమహల్‌లో 400 యక్షగానాలలో 18, 19, 20 శతాబ్దాలలో యక్షగాన ప్రదర్శనకు పేరెన్నికగన్న మేళాలైన కూచిపూడి సిద్ధేంద్రయోగి మేళం. వేములపల్లి, తాడిపత్రి మేళాలు, పడకండ్ల రామస్వామి, రాయకవి మేళాలు మొదలైనవి యక్షగాన ప్రచారానికి ఎంతగానో దోహదం చేస్తాయి.

వీధి నాటకాలు :

ఒకే ఒక పాత్ర ఆడుతూ, పాడుతూ కథ వినిపించే దశ నుంచి ఒక్కొక్క పాత్రనూ ఒక్కొక్క వ్యక్తి ధరించి నటించే దశకు పరిణితి చెందిన యక్షగాన ప్రబంధ రూపాంతరమే వీధి నాటకము. యక్షగానం యొక్క రూపాంతరమే వీధి నాటకం. దీనిని యక్షగాన నాటక మని, వీధి భాగవతమని, బయలాట అని కూడా అంటారు. కాకతీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరాయం వీధి నాటకమే. 16వ శతాబ్దం నుండి వీధి నాటకాలు ప్రారంభమయ్యాయి. కూచిపూడి వీధి భాగ వతులు ఈ కళారూపాన్ని ఉన్న అక్కన్న మాదన్న భాగవతదళం వీధి నాటకాలను విరివిగా ప్రచారం చేసింది.

తోలు బొమ్మలాట :

ఈ కళారూపం మహారాష్ట్ర నుంచి దిగుమతి అయింది. తోలుబొమ్మలాటలు తూర్పు చాళుక్యులు కాలంలోనూ, పల్నాటిలోనూ, రాయలకాలంలోను ఎక్కువగా అభివృద్ధి పొందాయి. బొమ్మలాటలను జంగంవారు. దేవాంగుల రకాల మొదలైనవారు ప్రదర్శిస్తున్నారు. ఈ ఆటలు రామాయణ మహాభారతాలు, ఉపరిణయం, హర్చింద్ర యోపాఖ్యానం, రంగనాథ రామాయణం వంటి కథలతో జనరంజకంగా ప్రదర్శించబడతాయి. లలిత కళలన్నీ కళలో ఇమిడి ఉన్నాయి. తెల్లని తెరవెనుక ఆయుధపు దీపాల వెలుతురులో రంగులతో చిత్రించిన తోలు బొమ్మలను ఆడిస్తూ, పాడుతూ, కథ చెపుతూ, మధ్య మధ్య హాస్యాన్ని చిలకరించే జట్టుపోలిగాడు, బంగారక్క, అల్లాటప్పగాడు, కేతిగాడు మొదలైన హాస్యపాత్రల ద్వారా అబాలగోపాలనికి ఆనందాన్ని కలిగిస్తాయి.

పగటి వేషములు :

బన్నాడు భారతదేశంలో సామంతరాజులు, స్వతంత్ర హిందూ ముస్లిం రాజుల పాలనలో గూఢాచారులగా మారువేశాలు ధరించి కోటలో జొరబడి రాజులను వంచించేవారు వివిధ వేశాలతో ప్రవేశించి రాజుల గుట్టు మట్టులు తెలుసుకొని యుద్ధం ప్రకటించేవారు. పగటి వేశాల ద్వారా సంఘంలో ఉండే మూఢనమ్మకాలనూ, దోపిడిగాండ్లనూ లంచగొండులగానూ, హాస్యధోరణిలో బట్టబయలు చేసేవారు. వీరు పగటి పూటనే వేశాలు ధరించి, బజారులు తిరుగుతూ కూడలిలో నిలబడి ప్రదర్శన లిచ్చేవారు.

జంగం కథలు :

ఈ నాటికి ప్రచారంలో ఉన్న బుర్రకథ కళారూపాన్ని, పూర్వరూపం, తందాన కథలన్నీ, జంగం కథలన్నీ, మరాఠీ కథలన్నీ తుంబర కథలనీ, బుర్ర కథలనే ప్రచారంలో ఉండేవి. ఒకనాడు దేశభక్తి ప్రచారానికి, ప్రబోధానికి మతవ్యాప్తికీ తోడ్పడిన కళారూపం. తర్వాతికాలంలో దేశదిమ్మరుల ఉదర పోషణకు ఉపయోగపడింది.

జముకుల కథలు :

ఈ కథలనే జక్కుల కథలుగా పిలుస్తారు. కాకతీయ సామ్రాజ్యంలో బవనివాండ్రు ఏకవీరాదేవి. ముహురమ్మ కాకతమ్మ, బతుకమ్మ, బొడ్డెమ్మ, రేణుకా కథలను భక్తి పురస్సరంగా చెపుతూ ఉండేవారు. ఆ కథలు తెలంగాణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోను, బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఈ కథల్లో శృంగార లాలిత్యాలతో హృదయాలను స్పందింపజేసే కరుణ రసానికి సంబంధించిన అనేక సన్నివేశాలున్నాయి. సంగీత, సాహిత్యం, వాయిద్య, నృత్య సమ్మేళనం ఈ కళారూపం. మధ్యలో కథకుడు తాళం వేస్తూ అభినయిస్తూ కథను చెపితే వంతలు జముకు వాయిద్యాన్ని వాయిస్తారు.

ఈ నాటికీ తెలంగాణ ప్రాంత పండుగలు, జాతరల సందర్భాలలో ఈ కళారూపాన్ని వివిధంగా ప్రదర్శిస్తూ ప్రజా రంజకము గావిస్తున్నారు.

కోలాట నృత్యం :

తెలుగుదేశపు జానపద కళారూపాలలో కోలాటం అతి ముఖ్యమైనది. పాల్కురికి సోమనాధుడు కోలాటాన్ని గురించి కోలాట గొడియ అని వర్ణించాడు. భక్తిరస ప్రధానమైన ఈ కళారూపంలో కూర్చుని, నిలబడి ఎగురుతూ, గిర్రుగిర్రున తిరుగుతూ కోలాటం వేస్తారు. తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండుగ సందర్భంలో స్త్రీలు వేసే కోలాటం కన్నుల పండువగా ఉంటుంది.

కనత కప్పెట్లు :

ఈ డప్పు వాయిద్యాన్నే తప్పెట్లు వాయిద్యమంటారు. రాయలసీమలో వీటినే కనక తప్పట్లంటారు. ఈ కళారూపాల్ని చాటింపులకు, జాతర్లకు, వివాహాలకు, వీరుల పూజలకు ఉపయోగిస్తారు. ఈ డప్పులతో వలయాకారంగా తిరుగుతూ వివిధ వరుసలను అత్యద్భుతంగా వాయిస్తూ ఉధృతంగా నృత్యంజేస్తూ పాట పాడుతారు.

చెక్క భజన :

పల్లె ప్రాంతాలలో తీరిక సమయాల్లో దేవుని స్తంభాలు పట్టుకొని భక్తితత్వంతో భజనలు చేస్తారు. బృందాలుగా ఏర్పడి పాటలతో, అభినయంతో, చెక్కలతో తాళం వేస్తూ, కాళ్ళకు గజ్జెలుకట్టి నృత్యం చేస్తారు. సాంఘీక ప్రచారానికి కూడా ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తారు.

బైండ్లవారు :

వీరశైవ మతస్థులకు వినోదాన్ని కలిగించే వారిని బైండ్లవాని అంటారు. కులాలు, మతాల వారీగా, ఆచార్యులూ, కళాకారులూ ఉన్నట్లు వీరు కేవలం శైవ మతస్థులకే వినోద ప్రదర్శనలిస్తారు. వీరు శైవ మతస్థుల ఇండ్లలో పెండ్లి మొదలైన శుభకార్యాలలోనూ చావు మొదలైన దుర్దినాలలోనూ కథలను చెపుతారు. వివిధ వాయిద్యాలను రమ్యంగా వాయిస్తారు.

గిరిజన నృత్యాలు :

1. థింసా నృత్యం :

ఆంధ్ర దేశంలోని అరకు లోయలో ఉన్న గిరిజనులు సర్వసాధారణంగా బరియా భాషనే మాట్లాడతారు. వాల్మీకి, భగత్, ఖోండ్, కొండదొర, కోటియా వంటి గిరిజన తెగల వారు ఈ నృత్యాన్ని చేస్తుంటారు. ఈ థింసా నృత్యాన్ని చైత్రపర్వంలోగానీ, వివాహ సమయంలోగానీ, పండుగ పర్వదినాలలోగానీ ప్రదర్శిస్తారు. థింసా నృత్యం అందరినీ అలరించడమేగాక, గిరిజన ప్రాంతాలలోని ప్రజలమధ్య సఖ్యతనూ, సుహృద్భావాన్ని పెంపొందిస్తుంది. ఈ నృత్యంలో తుండి, మోరీ, కిరిడి, తుడుము, డప్పు మొదలైన సాంప్రదాయ వాయిద్యాల సహకారంతో లయబద్ధంగా సాగుతుంది. కళాకారులను ఉత్తేజపరచడానికి జోడు కొమ్ముబూరలను ఊదుతారు. థింసా నృత్యం జోడె థింసా, గుండేవి థింసా, పోతార్‌తోలా థింసా, బాగ్‌థింసా, నాటికారి థింసా, కుందా థింసా, బాయి థింసా అని వివిధ రకాలుగా ఉంది. ఈ నృత్యాలను చేస్తూ గిరిజనులు తమ శ్రమను మర్చిపోతారు.

కొండరెడ్ల - మామిడి నృత్యం :

కొండ రెడ్లు తూర్పు కనుమల మధ్య ప్రవహించే గొదావరికి ఇరువైపులా వున్న కొండలమీద మరియు

గోదావరి ఒడ్డు వెంబడి, అడవి సరిహద్దు ప్రాంతాలలో నివసిస్తున్నారు. మామిడి పండ్లు కోతకు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని కొండరెడ్లు జరుపుకునే పండుగల్లో ఈ నృత్యం ప్రదర్శింపబడుతుంది. వీరి నృత్యంలో స్త్రీ పురుషుల నృత్యం, పురుషుల నృత్యం ఉంటాయి. ఈ నృత్యాన్ని రాత్రిపూట మాత్రమే ప్రదర్శిస్తారు.

Review of Relieroture :

1. Inductive method, deducative method. Research method, project method. Questioning method, Internet. Reference of library books, Expert instructions and Fielor Trip recently Bonala Jathara, etc.

Bibliography :

1. జానపద కళా సంపద - తూమటి దోణప్ప, 1972.
2. గిరిజనులు గేయాలు - సిద్ధాంత వ్యాసం - డా॥. శపరామకృష్ణ, 1981.
3. తెలంగాణ శ్రామిక గేయాలు - డా॥. పులి లింగారెడ్డి, 1982.
4. తెలుగు పొడుపు కథలు - కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, 1988.
5. జానపద గేయాలు - ఆర్.వి.యస్. సుందరం.
6. జానపద సాహిత్యం - స్నాతకోత్తర పుస్తకాలు.
7. తెలుగు జానపద సాహిత్యం - పురాణ గాథలు - డా॥. రావి. ప్రేమలత, 1980.
8. హిందువుల పండుగలు, సురవరం ప్రతాపరెడ్డి.
9. తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య బి. బిరుదురాజురామరాజు.
10. జానపద గేయాలు - శక్తిపూజ - డా॥. మాదిరెడ్డి అందమ్మ.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు పత్రికలలో బాల సాహిత్య ఆవిర్భావం – వికాసం

– ముత్తె స్వప్న, తెలుగు శాఖ, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

దేశాన్ని ప్రజల్ని మేల్కొలిపి ముందుకు నడిపించిన ఉద్యమాలకు తెలుగు పత్రికలు వెన్నుముకగా నిలిచాయి. భారతదేశంలో 19వ శతాబ్దంలో ప్రారంభమైన సాంస్కృతిక పునరజ్జీవనం దేశవ్యాప్తంగా తెలుగు ప్రాంతంలో అనేక రంగాలలో నవశకానికి బీజం వేసింది. వాటిలో బాల సాహిత్య రంగం కూడా పేర్కొనతగినది.

బాల సాహిత్య వికాసానికి, ప్రచారానికి సాధనలైన వాటిలో ప్రథమస్థానం పత్రికలకే, పఠనానురక్తి, భాషాభివృద్ధికి ఇవి ఎంతో దోహదకరాలుగా చెప్పవచ్చు. బాల బాలికలు సాహిత్య పరిచయం కలిగి ఉండేలా చేయాలి. పిల్లలకు సాహిత్యాభివృద్ధి కల్గించాలనే ఉద్దేశ్యంతో కందుకూరి, గురజాడ, రాయప్రోలు, గిడుగు వేంకట సీతాపతి, వేంకట పార్వతీశ్వర కవులు. చింతా దీక్షితులు. మొదలగు వారి రచనలు ముందుతరాల వారికి మార్గదర్శకాలయ్యాయి.

తెలుగు పత్రికరంగంలో బాల సాహిత్యాన్ని తొలిసారిగ ప్రచురించింది జనవినోదిని (1875 - 1885) అనే పత్రిక ఈ ప్రచురణను మద్రాస్ బుక్ సొసైటీ వారు దీనిలో పిల్లలు సరదాగా పడుకుని ఆనందించే చిట్టిపొట్టి కాయ రంగురంగు బిళ్ల అను గేయాలను పిల్లలు కథలను ప్రచురించి తన ధైర్య సాహసాన్ని చూపించిన మొదటి తెలుగు పత్రిక జన వినోదినిగా చెప్పవచ్చును. 1905లో ఇండియన్ మాంటిక్వరి 34వ సంపుటితో ఫోక్‌లోర్ ఆఫ్ తెలుగూస్ అని జి.ఆర్. నుబ్బిరామయ్య పంతులుగారు కొన్ని పిల్లల జానపద కథలను ఆంగ్లంలో ప్రచురించారు. అదే సంచికలో సమ్ తెలుగు ఫోక్ సాంగ్స్ పేరున యం.యస్. వెంకటస్వామి గారు కొన్ని బాల గేయాలను ఈ పత్రికలో ప్రచురించారు. వివేకవతి క్రైస్తవ మిషనరీలు గుంటూరు నుంచి వివేకవతి (1902-1918) అనే మాస పత్రిక ప్రచురించారు. ఈ పత్రికలో సరళమైన భాషలో కథలను పిల్లల కోసం ప్రచురించారు. గిడుగు వేంకట సీతపతి గారు రాసిన రైలుబండి "చిలుకమ్మ పెళ్ళి మొదలైన గేయాలు (1909) ప్రచురించారు. అనసూయ (1914 - 1919) కాకినాడ నుండి వింజమూరి వెంకట రత్నమ్మ గారు మహిళల పత్రికలోనూ తన సోదరుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన బాల సాహిత్యం గేయాలు 1919లో ప్రచురించారు.

బాలభారతి :

1924లో వెలువడిన బాలభారతి "నవ్వులతోట"లో సుబ్బారావు గారు తమ బాల సాహిత్యాన్ని అపారంగా ప్రచురించారు. కౌతా రామశాస్త్రి గారు "శారద" (1923 - 1924) మాస పత్రికలో బాల సాహిత్యం ప్రచురించారు.

గృహలక్ష్మి :

జాతియోద్యమ కార్యకర్త కె.ఎస్. కేసరి గారు 1928లో గృహలక్ష్మి మాస పత్రికను మహిళల కోసం స్థాపించగా దానిలో బాలలకు సంబంధించిన రచనలు ప్రచురించారు. గృహలక్ష్మిలో 1930 సెప్టెంబరు నుండి ప్రత్యేకంగా పిల్లల కోసం "బాలవిజ్ఞానశాఖ" అనే కొత్త శీర్షిక ప్రారంభించారు. ఇందులో తొక్కు పలుకులు చిక్కు ప్రశ్నలు, పొడుపు కథలు వినోద కథలు, చిట్టి కథలు, సీత కథలు మొదలగు రచనలను ఆబాల గోపాలం చదివి ఆనందించే వారట.

బాలనందం :

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు 1923లో ప్రారంభించిన "భారతి"లో మొదటి నుంచి బాల సాహిత్యంపై అనేక రచనలు అందిస్తూ గిడుగు వేంకట సీతాపతి గారు ఈ పత్రిక అనుబంధంతో 1949 ఏప్రిల్ నుండి "బాలనందం" అనే కొత్త శీర్షికను ప్రారంభించారు.

"బాల బాలికల కానందంగా
బాల హృదయములు విరియునట్లుగా

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

బాల చిత్తములు చిగురుచునట్లుగా
పాటలు పాడరండో"

అంటూ భారతి పత్రికలో గిడుగు సీతాపతి గారి పిలుపునందుకున్న అడవి బాపిరాజు, వేలూరి శివరామ శాస్త్రి, చింతా దీక్షితులు, శ్రీవాత్సవ, చిలుకూరి శేషగిరి రావు, పామర్తి వెంకట రమణరావు మొదలైన కవులు తమ రచనలతో పిల్లలను అలరించి బాల సాహిత్య నిభానికి సొదానికి చక్కని పునాదులు పడ్డాయని చెప్ప వచ్చు.

బాల :

పిల్లల కోసం రేడియో కార్యక్రమాలు నిర్వహిస్తున్న రేడియో అన్నయ్య వ్యాపతి రాఘవరావు "బాల" సచిత్ర మాస పత్రికను ప్రారంభించి ఎంతో సమర్ధవంతంగా నిర్వహించాలి. ఈ పత్రికను అసలు సిసలైన పత్రికగా తీర్చిదిద్దారు. బాల బాలికలు ఈ పత్రిక కోసం ఎంతగానో ఎదురు చూసి చదివి ఆనందించేవారుట. ముళ్ళపూడి వేంకటరమణ బాలంత్రపు రజని కాంతరావు ఆడపా రామకృష్ణారావు మొదలగు ప్రముఖ కవులు.

"బాల" పత్రిక ద్వారా బాపు, బుజ్జాయి, సత్యమూర్తి వంటి చిత్రకారులు సాహిత్యలోకానికి పరిచయం అయ్యా రని చెప్పవచ్చు.

చందమామ (1947) :

అందరినీ అల్లంతదూరం నుండే అలరించే చంద మామ చందమామ అయితే తెలుగు పిల్లలకు చేతికందిన మామ వంటిది. ఈ పత్రిక 1946లో రాశారు. చంద మామకు మించిన బాలల పత్రిక మరొకటి లేదని చెప్ప వచ్చు.

బాలమిత్ర :

ఈ పత్రికను బి.వి. రాధాకృష్ణ గారు స్థాపించారు. ప్రసుత్తం దీనిని బి.ఆర్. వరదరాజులు గారి సంపాద కత్వంలో నిర్విఘ్నంగా నడుస్తున్న బాల సచిత్ర మాస పత్రిక 67 సంవత్సరాలు పూర్తి చేసుకొంటూ నడుస్తున్న ఏకైక పత్రికగా చెప్పవచ్చును.

బుజ్జాయి (1975) :

ఈ పత్రికను గౌరవ సంపాదకులు ప్రచురణకర్త జి.ఎ. రావు గారు చెన్నైలో ప్రారంభించాడు. ప్రస్తుతం జగదీష్ గారి సంపాదకత్వంలో వెలువడుతుంది. బాల బాలికలను ఆకర్షిస్తున్న పత్రికగా చెప్పవచ్చును.

కృష్ణ పత్రిక :

కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు బందరులో 1902లో ప్రారంభించారు.

ఆంధ్రపత్రిక :

కాశీనాథుని నాగేశ్వరరావు గారు బొంబాయి నుండి వెలువడ్డ "ఆంధ్రపత్రిక" దిన వార్తపత్రికలలో బాల గేయాలు ఎన్నో రకాలుగా ప్రచురితమయ్యాయి.

"ఇంకా ఇలా ఎన్నో పత్రికలు మన భారత దేశంలో అవి.. విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతి, ఈనాడు, వార్త దినపత్రిక, సాక్షి ఇటువంటివే ఉంటాయి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు బాల గేయ సాహిత్యం - డా॥. యం. దేవకి
2. తెలుగు వార్త పత్రికలలో బాల సాహిత్యం - డా॥. కె. కుసుమ కుమారి.
3. తెలుగు వార్త, మాస పత్రికలు - డా॥. వేదగిరి రాంబాబు.
4. బాల సాహితీ వికాసం - డా॥. వెలగా వెంకటప్పయ్య.
5. బాల సాహితీ వైతాళికులు - చొక్కాపు వెంకటరమణ.
6. బాల సాహితీ వైభవము - కిన్నెర పబ్లికేషన్స్, ఆర్ట్ థియేటర్ (కిన్నెర బాలల సాంస్కృతికోత్సవాల ప్రసంగ వ్యాస సంకలనం)

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గంగిరెద్దులాట – సామాజిక జీవన చిత్రణ

– పెదపాటి శ్రీవీరవెంకట శ్రీదేవి, తెలుగు అధ్యాపకులు, శ్రీ ఎ.ఎస్.ఎన్.యం. ప్రభుత్వ కళాశాల, పాలకొల్లు.

భారతదేశం వృత్తి ఆధారిత దేశం ప్రజలు వివిధ వృత్తులను ఎంచుకుని వాటినాధారంగా జీవనాన్ని సాగిస్తారు. ఈ వృత్తులను తాము పోషించడమే కాకుండా తరువాతి తరాల వారికి అందించడం సాంప్రదాయంగా వస్తోంది.

తెలుగు సాహిత్యంలో జానపద విజ్ఞానం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. జానపద విజ్ఞానంలో జానపద ప్రదర్శన కళలు ఒక విభాగమైతే, అందులో గంగిరెద్దులాట సంగీత, సాహిత్య ప్రదర్శన సమాహారంగా చెప్పవచ్చును. వృత్తినిబట్టి వారికి 'గంగిరెద్దుల వారనే' పేరు వారి కులనామంగా ఏర్పడింది. నిజానికి వీరు యాదవులు. వీరు కోస్తా, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలో తమ ప్రదర్శనల ద్వారా జీవనం సాగిస్తున్న సంచార జాతి వారు. వీరి సొంత ఊరు ఉన్నా ప్రదర్శనల నిమిత్తం సంచార జీవితాన్ని సాగిస్తున్నారు.

భారతదేశం ప్రాచీనకాలం నుండి పశువులే సంపదగా విలసిల్లిన దేశం. మహాభారతంలో ఉత్తర గోగ్రహణం. కాటమరాజు యుద్ధం కూడా పశువుల గూర్చి జరిగినదే. ప్రాచీనకాలంలో చరాస్థులైన పశు సంపద వృద్ధి పొందడానికే ప్రాధాన్యత చూపించేవారు. కాలక్రమేణా స్థిరాస్థులైన కోటలు, భవనాలు, ఆభరణాలు చేకూర్చుకోవడం వలన చరాస్థులైన పశుసంపద కొంత వరకూ తగ్గింది. యాదవులు మాత్రం వారి ఆస్థిగా పశు సంపదను వృద్ధి చేసుకుంటూ ఉండేవారు.

గంగెద్దు కాలక్రమేణా గంగిరెద్దుగా మారింది. గంగిరెద్దును ప్రదర్శనకు సమాయత్తం చేయడానికి గంగిరెద్దుల వాళ్ళు ఎన్నో ప్రయాసం పడవలసి వస్తుంది. అందులో ముఖ్యంగా గంగెద్దును కొనాలంటే చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తన వృత్తికి పనికొచ్చే కోడెదూడను (సుమారు నెలరోజుల) కొనాలంటే ఎన్నో పరసలు తిరగవలసి వస్తుంది. 'పరస' అంటే పశువుల సంత. పశువుల సంతలో కొనాలంటే పశువుల జాతులు, మచ్చలు, సుడులు గూర్చి తెలిసి ఉండాలి. వీటన్నిటి గురించి ప్రతీ రైతుకు తెలియడం కష్టం. ఇవన్నీ తెలిసినా బేరమాడే విషయంలో జాగ్రత్త వహించాలి. అందుకే దళారీ వ్యవస్థ ఇటు పవువులను అమ్మే రైతుకు, పశువులను కొనే రైతుకు మధ్యవర్తిత్వం వహిస్తూ కొన్ని చిహ్నాలు, సైగల ద్వారా బేరాన్ని ఖరారు చేస్తారు.

'ఇంటికి బిడ్డొచ్చిన వేళ - గొడ్డొచ్చిన వేళ' అన్నట్లు తన వృత్తి మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొన సాగాలని రైతు తాను కొన్ని కోడెదూడను ఇంటికి తెచ్చి, పసిపిల్లలలాగా దాన్ని మచ్చిక చేసుకుంటాడు. దాని మంచి చెడ్డలు ఎప్పటికప్పుడు కనిపెట్టుకుని ఉంటూ, వాటికేమైనా, వ్యాధివస్తే సమయానికి తగిన వైద్యాన్ని అందించాలి. ఉదయాన్నే సన్నాయి మేళం ఊదుతూ, వాటికి రామన్న, లచ్చుమన్న, సీతమ్మ వంటి పేర్లతో మాటిమాటికీ పిలుస్తూ, పలు విన్యాసాలు చేయడం కోసం తర్ఫీదునిస్తారు. దూడలు కూడా వారు పిలిచే పిలుపుకు, మేళానికి తన్మయత్వం చెంది, వారు ఆడించేలా అవే ఆడతాయి. తరువాత ప్రదర్శనలకై తీసుకుని వెళ్ళగా, తమ ప్రదర్శనలతో ప్రజలను మత్రముగ్ధుల్ని చేస్తాయి.

గంగిరెద్దుల వారు కాలాన్ని బట్టి తమ పనులను ఏర్పాటు చేసుకుంటారు. సంక్రాంతి పండుగ సమయంలోను, పర్వదినాలలోను, ముఖ్యంగా రైతుల పంటలన్నీ చేతికి వచ్చి, పనిపాటలు లేని సమయాల్లో ఊరూరా తిరిగి ప్రదర్శనలిస్తూ ఉంటారు. మిగిలిన రోజుల్లో వ్యవసాయం చేసుకుంటూ, గొర్రెలను, మేకలను మేపుకుంటూ, గంగిరెద్దులకు తర్ఫీదునిస్తూ కాలం వెల్లబోస్తారు.

వీరు దేశాటన చేసేటప్పుడు ఒక్కొక్క కుటుంబం కాకుండా, నాలుగైదు కుటుంబాల వారు కలిసి తిరుగుతూ ఉంటారు. జానపద గేయాలు, కథా గేయాలు, సినిమా పాటలు మొదలైనవి పాడుతూ ప్రదర్శనలిస్తుంటారు. వీరి ఆట వినోద ప్రధానమైనది. ఇందులో పురుషులు మాత్రమే పాల్గొంటారు. స్త్రీలు పాల్గొనరు. ఈ ప్రదర్శనను కుల, మత విచక్షణ లేకుండా ప్రజలందరూ తిలకిస్తారు.

గంగెద్దు లాటలో ఒకటి లేదా రెండు గంగెద్దులు, ఒక ఆవు ఉంటాయి. వీటిని ప్రదర్శనలోకి తీసుకొచ్చే ముందు గంగెద్దులను, ఆవును శోభాయమానంగా అలంకరిస్తారు. వాటి మూపురానికి ఎర్రని టోపీ, కడుపుకు ఇరువైపులా బొంతలు, పట్టు చీరలతో అలంకరణ చేసి, కొమ్ములకు కుప్పెలను కట్టి, నడుముకు మువ్వల పట్టీని, గవ్వల పట్టీని తగిలించి అందంగా అలంకరణ చేస్తారు. ముందుకాళ్ళకు గజ్జెలను కట్టి ముఖంపై చక్కటి పలకను అమరుస్తారు. ప్రదర్శన ప్రారంభంలో చుట్టూ గుమిగూడిన ప్రజలందరికీ ''అయ్యగారికి దండం పెట్టు. అమ్మగారికి దండం పెట్టు'' అని ప్రదర్శనకారుడు చెప్పగానే ఎద్దు వారికి దండం పెడుతున్నట్లుగా తలను క్రిందికి పైకి ఊపుతుంది.

ఆ తరువాత ప్రదర్శనకారుడు వెళ్లకిలా కింద పడుకుంటే గంగిరెద్దు తన ముందుకాళ్ళు రెండింటిని అతని గుండెల మీద పెట్టి నాట్యం చేస్తున్నట్లుగా ఊగుతుంది. ఆ తరువత గంగిరెద్దు తన నాలుగు కాళ్ళను ఒకే దగ్గరికి తెచ్చి ఒక పీట మీద నిలబడడం మొదలైన విన్యాసాలను చేస్తుంది. అలాగే ఆవు, గంగిరెద్దులకు సీతారామ కల్యాణం మంచి హాస్యభరితంగా అత్యంత వైభవంగా మేళతాళాలతో వివాహం చేసినట్లుగా ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శనలో ఎద్దు రాముడు గానూ, ఆవు దూడ సీత గాను ఉంటారు. ఈ సీతారామ కల్యాణం మాత్రమే కాకుండా గంగిరెద్దుల వాళ్ళు సాంఘిక సంబంధమైన విషయాలను ప్రదర్శిస్తారు. సినిమా పాటలను డోలు, సన్నాయి మొదలైన వాద్యాలతో వాయిస్తుంటే, ఆ పాటలకు తగినట్లు నాలుగు కాళ్ళతో నాట్యం చేస్తుంది. ఇది ప్రజలను బాగా ఆకట్టుకుంటుంది.

గంగిరెద్దులను ఇంటింటికీ తీసుకుని వెళ్ళి పలు విన్యాసాలు చేయించి ప్రజలకు ఆనంద పరచడమే కాకుండా ఒక కళను తమకు జీవనాధారంగా చేసుకుని పొట్టపోసుకుంటారు గంగిరెద్దుల వారు. తాము ఎంత కష్టపడినా ఆ కష్టాన్ని తమలోనే దాచుకుని కళను అభివృద్ధి పరచాలనే తపన వారిలో ఉంటుంది. తమ వృత్తిని తమతోనే అంతం కాకుండా తరువాతి తరాల వారికి అందించాలనే వీరి అభిప్రాయము ఎంతో ముదావహమైనది. ప్రశంసనీయమైనది.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి.
2. 'పరస' - నవల - డా॥. వి.ఆర్. రాసాని వెంకట్రామయ్య.
3. గంగిరెద్దులాట - వ్యాసం - ఆరాల లింగమల్లయ్య.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గరికపాటి ఆశుకవిత్వం – సామాజిక జీవన చిత్రణ

– ఉల్లెంగ ముత్యం, తెలుగు ఉపన్యాసకులు, ఆర్.జి.యు.కె.టి., ఐ.ఐ.ఐ.టి., బాసర.

తమ ఉపన్యాసాల ద్వార పండిత, పామర జనులను ఉర్రూతలూగించి మైమరపింప జేస్తున్న గొప్పవ్యక్తి శ్రీ గరికపాటి నరసింహారావు గారు. వారు తెలుగు ఆచార్యులుగా అనేక కళాశాలలో పనిచేసి, పదవీవిరమణ చేసి సామాజిక మార్పు కోసం ఉపన్యాసకులుగా చెప్తూ ప్రజలలో మార్పుకోసం ప్రయత్నం చేస్తున్నారు. ఏ విషయాన్నైనా కుండబద్దలు కొట్టినట్టు చెప్పగల గొప్పవ్యక్తి గరికపాటి వారు. తెలుగు భాషకు ప్రాధాన్యత తగ్గుతున్న నేటి తరుణంలో తెలుగును కాపాడాలనే తీవ్ర కాంక్షతో కన్నీరు పెట్టుకున్న మహావ్యక్తి వారు. తెలుగు భాష పట్ల ఎనలేని ఇష్టము, భక్తి ఉన్న వారు వీరు. తెలుగు భాషలోని అనేక మహత్యాలను వివరించే వాగ్ధాటి కలిగినవారు. భారతీయ సంస్కృతి పట్ల, సాంప్రదాయాలపట్ల ఎనలేని గౌరవం కలిగిన వారు గరికపాటి వారు. వారు అనేక అవధానాలు చేశారు. వేలాది ఉపన్యాసాలు ఇచ్చారు. వారి ప్రతి ఉప న్యాసంలో భారతీయ సంస్కృతి - సాంప్రదాయాల వర్ణన, తెలుగు ప్రజల జీవన విధానము, మన తెలుగు సంస్కృతి వర్ణన ఉంటుంది. ఆధునిక జీవనంలో మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మారుతున్న ప్రజలు - ఆధునిక మార్పు పేరిట ఎన్ని పోకడలకు పోతుందో ఎలా వెర్రితలలు వేస్తుందో తెలిపిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. వారి ఉపన్యాసాలలో వారు అనేక కవితలు కూడా చెప్తారు. ఇవన్నీ ఆశు కవితలే. చాలా నవ్వించే విధంగా ఉన్నప్పటికి ఆలోచన కలిగించే విధంగా వారి ఉప న్యాసాలు ఉంటాయి. నేటి సామాజిక జీవనంలో ప్రజల పరిస్థితులను సమాజంలో రావాల్సిన మార్పులను గురించి చాలా చక్కగా వివరించడము జరిగింది.

కొన్ని ఉదాహరణలు చూద్దాము.

మనిషికి నిద్రపట్టని ప్రదేశాలు మూడు ఉంటాయని చెప్పారు గరికపాటి. నిద్రపట్టని వారు ముగ్గురు అని చెప్పాడు.

త్రినిస్థానాన్యని వ్రాయా చార్య కాంత పరాంగణాః ।
త్రినిస్థానాని నిద్రాయా స్వభార్యా పుస్తకం జపః ॥

పరస్త్రీని కామించిన వాడికి, ఇతరుల సంపదలు ఆశించినవానికి, నిద్రపట్టదు అంటారు. మూడు స్థానాలు నిద్రరానివారు. అంటే పడుకున్న నిద్రపట్టనివారు ముగ్గురు అని అంటారు చౌర్య, జ్యాత్, పరాంగణ ఇలాంటి వారికి నిద్రరాదని చెప్పారు. దొంగతనం చేసేవారికి, జూదము (పేకాట) చేసేవానికి ఇతర స్త్రీల గురించి ఆలోచించే వారికి నిద్రరాదు అని గరికపాటి వారు చెప్పారు. నిద్రవచ్చే ప్రదేశాలు మూడు అని చెప్పారు. తన భార్య, పుస్తకం చదివే వారికి, జపం చేసేవారికి నిద్ర వెంటనే వస్తుందని అన్నారు. బాగా నిద్ర వచ్చే స్థానాలు. పుస్తకం పట్టుకున్న వెంటనే నిద్ర వస్తుందని, జపం చేస్తున్న వారికి నిద్రవస్తుంది అని అన్నారు. స్వంత భార్య దగ్గర నిద్రవస్తుందని అంటారు. సంస్కృత చాటువులను చక్కగా వివరించారు. అదే విధంగా సుఖవత్ భాషణం కుర్యాత్ - చిలకలా మాట్లాడాలని అంటారు. అనుకరణతో, సత్యమును, ప్రయంగా చెప్పాలని అన్నారు. వీలైనంత తక్కువగా మాట్లాడాలని అన్నారు. రీజనల్ భోజనం కువ్యత్ వేకలాగా భోజనం చేయాలని అన్నారు. వేగంగా ఆకులను లాక్కొని, వేగంగా నమిలి తింటుంది. మనం భోజనానికి అరగంట కేటాయించాలి అని అన్నారు. కాకవన్ మైధునం కుర్వాత్ - కాకిలాగా శృంగారం చేయాలని అంటారు. కాకి నిర్జనారణ్యంలో శృగారం చేస్తాయి. నేడు విశ్వవిద్యాలయాలలో కిసింగ్ ఫంక్షన్స్ పేరుతో జరుగుతున్న విశృంఖలతను గురించి గరికపాటి వారు చక్కగా వివరించారు. అలా చేస్తున్న వారికి కాకుల ఉదాహరణను వివరించారు. వాటిని చూసి నేర్చుకోవాలని

అన్నారు. గజవత్ స్నానమాచరత్ - అనగా ఏనుగు లాగా స్నానం చేయాలి అని అంటారు. కొంచెం గోరువెచ్చని నీటితో, ఎక్కువ సమయం తీసుకొని చక్కగా స్నానం చేయాలని అన్నారు. ఆరోగ్యం, ఆనందము రెండూ వస్తాయని నేటి ఆధునిక జీవనంలో ఎలా జీవించాలని అన్నారు. యువతరం నేడు వేస్తున్న జీన్స్ వస్త్రధారణ గురించి గరికపాటి వారు ఇలా చెప్తారు. భారతదేశంలో వస్త్రధారణ గురించి చెప్పారు. ఇతర దేశాల వస్త్రధారణ గురించి వివరించారు. జీన్స్ మొత్తానికి కరుచుకునే విధంగా ఉంటుంది. గతకాలంలో ఉండే అనుకూలతను వివరించారు. విదేశాల వాతావరణ పరిస్థితులను ఆనందించే ధోరణిని గురించి వివరించారు.

మనిషి అయిదు వకాలను పాటించాలని అన్నారు.

వస్త్రేణ, వపుషా, వాచా, విద్యకూ, వినమేనచ ॥
వకురై పంచవిద్యుక్త : నరో భవతి పూజిత ॥

సరైన వస్త్రధారణ, మంచిమాట, విద్య, వినయము ఇలా ఐదు రకాల వకారాలు కలిగిన మానవుల పూజించబడతాడని అంటాడు. వేషంలో మార్పు రావాలని వివరించారు.

స్మార్ట్‌ఫోన్ వాడకం గురించి గరికపాటి వారు చక్కగా వివరించారు. ఫోన్ అరచేతిలో నరకము అని, పుస్తకం అరచేతిలో వైకుంఠము అని అంటారు. అప్‌లోడ్, డౌన్‌లోడ్‌లోని జీవితం సరిపోతుందని అంటారు. ఫోన్ బంధమును తగ్గించుకోవాలని అంటారు. మూడు ఫోన్‌ల ఆరు సిమ్ములుగా జీవితం నాశనం అవుతుందని అంటారు.

టివిలలో వచ్చే ప్రకటనల, పేపర్‌లో వచ్చే ప్రకటనల గురించి వివరిస్తారు. వినియోగదారుడా, శనియోగ దారుడా అని అంటారు. దేశం మీద ఉన్న అభిమానంగా మార్చాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేని గ్రామంలో కూడా నాలుగు బ్యూటీపార్లర్‌లు ఉన్నాయని అన్నారు. అందం పట్ల ప్రాధాన్యత పెరిగిపోయిందని అన్నారు. కర్పూరం లాగా పూర్తిగా కరిగిపోయి, మనం దేశ సేవలో లీనం కావాలని అంటారు. భారతీయ సంస్కృతి పదిమంది కోసం బ్రతకమని బోధిస్తుందని అంటారు. 1/4 క్రమభిన్నం, 4/1 ఆపక్రమ భిన్నం అని వివరిస్తూ, ఒకరి సంపాదన నలుగురు తింటే క్రమమని, నలుగురి సంపాదన ఒకరే తింటే అపక్రమమని అంటారు. నేడు వారసత్వ రాజకీయాల వచ్చి మొత్తం దేశాన్ని నాశనం చేస్తున్నాయని అంటారు. ఏ వర్గం వారు మరణిస్తే ఆ వర్గం వారే బాధపడతారని అన్నారు. యువతరం దేశం గురించి ఆలోచించాలని, దైవభక్తి కంటే దేశభక్తి ముఖ్యమని అంటారు. దేవుడంటే దేశమని ఆదిశంకరాచార్య అంటారని అంటారు గరికపాటి. కాఫీల, టివిల మొదలగు విదేశీ సంస్కృతుల వచ్చాయని అంటారు. భారతదేశమునకు విశ్వగురుత్వంకు తీసుకరావాలని అంటారు.

ప్రైవేట్ పాఠశాల గురించి బాగా వివరించేవారు. యూనిఫారం గురించి వివరించారు. పాఠశాలలో ప్రార్థనను తీసివేస్తున్నారని అంటారు. చమత్కార పద్యాల ద్వారా గతంలో విద్యార్థులకు ఎలా చదువులు నేర్పుతారో వివరించారు.

ప్రతి దానిలో భౌతికత, ప్రతిదాంట్లో వ్యాపార దృష్టితో చూడటము ఇది విదేశీ విధానమని, ప్రతి దానిని ఆధ్యాత్మిక దృష్టితో చూడడం భారతీయ జీవన విధానం అని సామాజిక చిత్రణ చేశారు. ఉదయించే దేశం భారతదేశమని అంటారు. మనం మన దేశపు ఆహారమే తినాలని అంటారు. మంచి ఉంటే మైకులో చెప్పాలని చెడు ఉంటే చెవిలో చెప్పాలని అంటారు. వచ్చినా మేలు రానిచో బాధలేదు అని భారతీయ సంస్కృతి చేస్తుందని అంటారు.

ఈ విధంగా వర్తమాన పరిస్థితులలో సామాజిక జీవన చిత్రణను శ్రీ గరికపాటి వారు చాలా చక్కగా వివరిస్తారు. సమయ సందర్భానికి తగినట్లుగా, హాస్యోక్తులను, శ్లోక్తులు, సామెతలు వినురుతూ శ్రోతలను, ప్రేక్షకులను మైమరపింపజేసే విధంగా చక్కగా వివరించడంలో వారికి వారే సాటి. ఆధునిక కాలంలో వారు అశు కవిత్వం ద్వారా సమాజంలో మంచి మార్పును తీసుకురావడానికి వీరి ఉపన్యాసాల ద్వారా చక్కని ప్రయత్నం చేస్తున్నారు. ❖

భాగవత పురుషార్థ ధర్మాలు

– డా॥. తోలు ఉమామహేశ్వరరావు, సహాయ ఆచార్యులు, సంస్కృత విభాగం, డా॥. వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ), విశాఖపట్టణం.

విదితము చేయునని (తెలియజేయునవి) వేదములు శాసించునవి (ఆజ్ఞాపించునవి) శాస్త్రములు పూరించునవి (పూర్తిచేయునవి) పురాణములు. అనగా వేదములు భగవద్విషయమును తెలియజేయుచున్నవి. శాస్త్రములు భగవంతుని పొందుటకు విధి నిషేధములతో జీవులను శాసించుచున్నవి. పురాణములు భగవంతుని తెలిసుకొను విషయములను, భగవంతుని ఆరాధన విషయములను తెలియజేయుచున్నవి. అందువలన పురాణములే మానవులకు అధికముగా ప్రయోజనవకరములై ఉన్నవి. అట్టి పురాణములలో కూడా శ్రీమద్భాగవత పురాణము సర్వశ్రేష్ట మైనది. అష్టాదశ పురాణ సమిష్టి చతుర్లక్ష శ్లోకాత్మక రూపమున కీర్తించబడినది. అందు శ్రీమద్భాగవతములో అష్టాదశ సహస్ర శ్లోకములు కలవు. సాక్షాత్తు భగవానుడగు నారాయణుడు బ్రహ్మకు ఈ భాగవతమునుపదేశించును. శ్రీమద్భాగవతమొక లౌకిక గ్రంథము. దీనిలో వర్ణాశ్రమ ధర్మాలు, కర్మయోగము, అష్టాంగయోగము, జ్ఞాన యోగము మొదలగు భాగవత్ప్రాప్తి సంబంధములైన సాధనములన్నియు విశదముగా వర్ణించబడినవి.

శ్రీమద్భాగవతంలో పండ్రెండు స్కంధములు పండ్రెండు అవయవములు వంటివి. ప్రథమ ద్వితీయ స్కంధములాయనకు పాదయుగళము, తృతీయ చతుర్థ స్కంధములు ఊరువులు, పంచమ స్కంధము నాభి ప్రదేశము, షష్ఠస్కందము భుజానర్తరము అనగా వక్ష స్థలము, సప్తమ అష్టమ స్కంధములు రెండును రెండు బాహువులు, నవమ స్కంధము కంఠము, దశమ స్కంధము వికశించిన ముఖ పద్మములు, ఏకాదశ స్కంధము లలాట ప్రదేశము, ద్వాదశ స్కంధము మస్తకములైయున్నవి. భాగవత ధర్మములను 12 స్కంధములలో ప్రతిపాదించిన విషయాలు ఒక్కక్క స్కంధమున ఒక్కక్క విషయము ప్రతిపాదించబడినది. ప్రథమ స్కంధమున అధికారలీల, ద్వితీయ స్కంధమున జ్ఞానలీల, తృతీయ, చతుర్థ స్కంధములయందు సర్గ, విసర్గ లీలలు, పంచమ, షష్ఠ స్కంధములలో స్థితి, అనుగ్ర లీలలు, సప్తమ స్కంధమున వాసనాలీల, అష్టము స్కంధమున వాసనా లీలలను నాశనము చేయునట్టి చతుర్విధోపాయములు, నవమ, దశమ స్కంధములలో శ్రీకృష్ణ పరమాత్మ లీలలు, ఏకాదశ స్కంధమున శ్రీకృష్ణోద్ధవ సంవాదము, ద్వాదశ స్కంధమున ఆశ్రయ లీల అను విషయములు వివరింపబడినవి.

సర్వవేదాంతసారం హి శ్రీ భాగవతమిష్యతే ।
తద్ర సామృత తృప్తస్య నాన్యత్ర స్యాద్రతి క్వచిత్ ॥

అనగా సర్వవేదాంతసారమే శ్రీ మద్భాగవతమని చెప్పవచ్చును. దీని రసామృతంచే సంతృప్తి చెందిన వారికి ఇతర శాస్త్రములయదు ఆసక్తి యుండదు. భాగవత కర్త వ్యాసుడే అయినను దీనిని పరిక్షీన్మహారాజుకు వ్యాస పుత్రుడైన శ్రీశుకుడు ఉపదేశించాడు. శ్రీశుకుని చరిత్ర మద్భుతము. ఒకప్పుడు ముక్తపురుషులను లెక్కవేయు ప్రయత్నము జరిగిందట. అప్పుడు మొట్టమొదట శ్రీశుకుని పేరు చెప్పెరట. ఆ తరువాత ఎంతయో ఆలోచన చేసి వామదేవుని పేరు చెప్పిరట. "శుకోముక్తః వామదేవోపి ముక్తః" అలాంటి ముక్తిని ప్రసాదించే గ్రంథములోని పురుషార్థ (ధర్మ అర్థ కామ మోక్ష) ధర్మాలు కొన్ని. ధర్మార్థకామోక్షాలకు పురుషార్థాలని పేరు. ఈ నాల్గింటిని సాధించినప్పుడే మానవ జన్మకు చరితార్థత చేకూరుతుంది. వీటిలో ధార్మర్థకామాల్ని ఒక వర్గంగాను, మోక్షాన్ని మరొక వర్గంగా విజ్ఞులు విభజించారు. వేద విహితాలైన యజ్ఞయాగాదుల్ని ధర్మమని, ధనధాన్యవస్తు వాహనాదుల్ని అర్థమని పేర్కొనవచ్చు. ధర్మార్థకామాలు సిద్ధించడం వలన కలిగే ఆనందం శాశ్వం కాదు. వీటికి దుఃఖ సంపర్కం లేదని చెప్పలేము. కాబట్టి నాల్గవదైన

మోక్షమే పరమపురుషార్థమని ఋషీన్ద్రులు వివరించారు. మానవ జీవితానికి ఒక పరమార్థం ఉందని ఎన్నో జన్మల తపఃఫలమే ఈ జీవితమని భారతీయుల విశ్వాసం. ఆ పరమార్థాన్ని సాధించడానికే మన ప్రాచీనులు పురుసార్థ భావన చేశారు. ధర్మం, అర్థం, కామం, మోక్షం అనేవి నాలుగు పురుషార్థాలు. పురుష పదానికి స్త్రీ పురుష సమాన మైన ప్రాణి అని అర్థం. ప్రతిజీవి కోరుకునేది కనుక ఇది పురుషార్థమనబడింది. ఈ నాల్గింటిని దశల వారీగా ప్రతి జీవి కోరుకుంటోంది. అందుకే వీటికి ఈ పేరు వచ్చింది.

ధర్మం :

ధర్మమనేది మొదటి పురుషార్థం. ఎవరి ధర్మాన్ని వారు సక్రమంగా నిర్వహిస్తే సమాజం చక్కగా ఉంటుంది. సమాజం బాగుంటే దేశం బాగుంటుంది. రాజు ప్రాచీను లాచరించిన ధర్మాన్ని తను ఆచరిస్తూ రాజ్యంలో అందరి చేత ఆచరింపజేస్తే భూమి సస్యశ్యామలమై, సిరిసంపద లతో తులతూగుతుంది.

రాజ్ఞోహి పరమో ధర్మః స్వధర్మస్థానుపాలనం ।
శానతో న్యాన్ యథా శాస్త్రం అనాపద్యుత్పథానిహ ॥

1-17-16

స్వస్వధర్మములును ఆచరించువారిని రక్షించు చుండుటయే రాజుల ఉత్తమ ధర్మము. అధర్మ మార్గగాములైన వారిని యథా శాస్త్రముగా శాసించుటయు రాజుల ధర్మమే. యుద్ధము, క్షామము, మొదలైన ఉ త్పాతములు లేనప్పుడు రాజులు శిష్ట రక్షణము దుష్ట శిక్షణము గావించుటలో తప్పుగాదు. పరిక్షిన్మహారాజు చెప్పిన రాజ ధర్మము లోనిదిది.

అర్థం :

ధర్మ విరుద్ధమైన మార్గంలో అర్థాన్ని సంపాదించు కోకూడదు. అర్థ పురుషార్థాన్ని ప్రధానంగా పెట్టుకోకూడదు. అందుకే ధర్మానికి మోక్షానికి మధ్య అర్థకామాలనే పురుషార్థాలను చేర్చారు. ధర్మాన్ని అతిక్రమించని అర్థ కామాలు ఎన్నటికి హాని చేయవు. ధర్మాతిక్రమణం జరిగితే అవే ప్రతిబంధకాలౌతాయి. అర్థసిద్ధి పొందినవారికే మిత్రులు, బంధువులు చేరువౌతారు. వాడే పురుషుడుగా చలామణి అవుతున్నాడు. వాడే పండితుడుగా గుర్తింపు పొందుతాడు. కనుక అర్థాన్ని సంపాదించాల్సిందే. కాని ధర్మవిరుద్ధంగా మాత్రం కాదు.

అర్థస్య సాధనే సిద్ధే ఉత్కర్షేరక్షణే వ్యయే ।
నాశోపభోగ ఆయాశః త్రాసశ్చింతా భ్రమోనృణామ్ ॥

11 - 23 -17

మానవులు ధన సంపాదనలో నిమగ్నులై దాని సాధన, అభివృద్ధి, రక్షణ, వ్యయము, నాశనము, అనుభవము కలుగునప్పుడు శ్రమ భయము, విచారము, దుఃఖము, సుఖభ్రాంతి వీటిని వరుసగా పొందుచున్నారు. అనగా ధనసంపాదనలోను వినియోగములోను మనుజలకు క్లేశ దుఃఖములే అధికము. అనుభవములోనైను కలుగునది సుఖలేశమేనని అందువల్ల దురాశకులోనై దుఃఖము నొందకూడదని నీతి.

తాంస్తాన్ కామాన్ హరిర్దద్యాత్ యాన్యాన్ కామయతే నరః ।
ఆరాధితో యథైవైషః తథా పుంసాం ఫలోదయః ॥

4 - 11 - 34.

కావున మానవులు యే కోర్కెలను మనస్సుయందు గాఢంగా వాంఛిస్తారో శ్రీహరి ఆయా కోర్కెలకనుగుణంగా ఫలములనొసంగును. పురుషుడు భగవంతుని ఏ రీతిగా ఆరాధించునో ఆ రతికనువైన ఫలముల నందించు చుండును.

కామం :

భారతీయులకు లౌకిక సుఖాలననుభవించడం తెలియదని కొందరు పాశ్చాత్యులు విమర్శిస్తుంటారు. అది పొరపాటు. లౌకిక జీవితాన్ని వ్యక్తిగతంగాను, సామాజికంగాను బాగా తీర్చిదిద్దుకున్నది భారతీయులు మాత్రమే అని మనము గుర్తించాలి. ధర్మ విర్ధమైన కామాన్ని అనుభవించడానికి మన సాహిత్యం మరియు మనము ఎప్పుడూ వ్యతిరేకమే. ధర్మవిరుద్ధమైతే పనికిరాదని చెప్పినమాట నిజం. ధార్మికమైన కోరికలను

తీర్చుకోవడానికి భారతీయ సంస్కృతి ఎప్పుడో అనుమతించింది.

నజాతు కామఃకామనాం ఉపభోగేన శామ్యతి
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే 9-19-14

భోగానుభవముచే కోరికలెన్నడు ఉపశమించవు, ఆజ్యాది హోమద్రవ్యములు వేసిక కొద్దీ అగ్ని ప్రజ్వరిల్లుచునే యుండునట్లు అనుభవించుకొలది ఈ కోరికలధికముగును. అదేవిధంగా యజమానికి ధర్మంతో పాటు భార్య కూడా ఎప్పుడూ వశవర్తినిగా ఉంటుందో అప్పుడు ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాల సంగమం ఏర్పడుతుందని మహాభారతం చెబుతుంది. కావున ధర్మబద్ధమైన కోరికలను మాత్రమే కలిగి ఉండాలని భాగవతం చెబుతుంది.

మోక్షం :

నాల్గవ పురుషార్థం మోక్షం. ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాల్లో సిద్ధిని సంపాదించవాడు మోక్షాన్ని సంపాదించడానికి అర్హుడౌతాడు. భారతీయ జీవన విధానానికి అంతిమ లక్ష్యమే మోక్షం. దుర్లభమైన నరజన్మ పొందిన వాడు సంపాదించదగింది మోక్షమేనని శాస్త్రం ప్రతిపాదిస్తున్నది. ఇది మనిషికి బతికి ఉండగానే లభిస్తుందని కొందరూ, మరణానంతరమే సంప్రాప్తిస్తుందని కొందరూ అంటారు. ఈ నిర్వచనాలు ఎలా ఉన్నా, అన్ని బంధాల నుంచీ విముక్తం కావడమే 'మోక్షం' అని చెప్పడం సముచితం. మనిషికి పుట్టిన నాటినుంచి ప్రతి విషయంలోనూ బాధ్యతలూ బంధాలతో బంధిమ్పబడుతూనే ఉంటాడు. అంటే ప్రతి మనిషీ కనబడని తాళ్లతో, గొలుసులతో ఎప్పుడూ బంధితుడై ఉంటాడే కాని, స్వేచ్ఛగా ఉండలేడు. కనుక సంసారంలోనే ఉంటూ మానసికంగా దేనికీ చిక్కకుండా ఉండే రాజయోగి జనకునిలా జీవించడం మనిషి నేర్చుకోవాలి. అప్పుడు ఏ బరువులూ ఏ బాధ్యతలూ మానవుణ్ని వశపరచుకోలేవు.

తస్మాద్భారత సర్వాత్మా భగవానీశ్వరో హరిః ।
శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్యశ్చేచ్ఛ తా భయం ॥
2-1-5

శుక మహర్ష పరిక్షన్మహారాజుతో ఈవిధంగా పలికెను. మోక్షమును కోరు పురుషుడు సర్వాంతర్యామియైన భగవంతుడైన ఈశ్వరుడైన ఆ శ్రీహరిని గూర్చియే వినవలెను. ఆయననే కీర్తిమ్పవలెనను మరియు స్మరింమ్పవలెను. సకల హితాన్ని కోరే ధర్మం, ఆ ధర్మం ద్వారా సంపాదించే అర్థం, ఆ అర్థాన్ని ధర్మంతో అనుసంధానించి అనుసరించే కామం - చివరికి ఏ బంధాలకూ లొంగని మోక్షానికి దారితీస్తాయి. ఇదే నాలుగు స్తంభాల మీద కట్టుకునే మానవ జీవన భవన దృశ్యం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ అంతర్నేత్రం – సామాజిక చిత్రణ

– పల్లెం జ్యోతి, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఆముఖం :

"హితేన సహితం సాహిత్యం"

సాహిత్యం ఏ కాలానికి చెందినది అయినా అది ఆ కాలం యొక్క సామాజిక జీవనానికి అద్దం పడుతుంది. సాహిత్యాన్ని సమాజాన్ని విడదీసి చూడలేము. సాహిత్యము సజీవంగా ఉంటూ సమాజంలో మార్పులకనుగుణంగా తాను మారుతూ సమాజాన్ని మార్చేదిగా ఉంటుంది. సాహిత్య వస్తువు, సాహిత్య భాష, సాహిత్య ప్రక్రియ ఈ మూడు అంశాలు మార్పుకు లోనవుతూనే ఉంటాయి. శ్రీశ్రీ గారు కవిత్వాన్ని 'కదిలేది కదిలించేది' అని అనటంలో పరమార్థం ఇదే.

పరిచయం :

సాహిత్య సృజన కళాకారులు తమ చుట్టూ ఉన్న సమాజంలో అనుభవానికి అవగాహనకు వచ్చిన అంశాలను భాష, విషయం రెండింటిని కలగలిపి తమ దృష్టిపదం నుండి ఏదో ఒక సాహిత్య రూపంలోకి కవిత్వంగానో, నాటకంగానో, నవలగానో మలుస్తారు. అటువంటి ఆధునిక సాహిత్య సృజన కళాకారులలో చెప్పుకోదగ్గ వ్యక్తి 'సాహితీ వాచస్పతి' మరియు 'విశిష్ట రత్న' బిరుదాంకితులైన కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ గారు ఒకరు. అర్ధ శతాబ్దం పైగా వందల సంఖ్యలో కథలు, కవితలు, నవలలు నాటకాలు, హరికథలు, ఆధ్యాత్మిక రచనలు, వ్యాసాలు మొదలగు అన్ని ప్రక్రియల్లో రచనలు చేశారు. వీరు సహృదయులు, బహుభాషా కోవిదులు.

కాటూరు వారి జననం - విద్యాభ్యాసం :

శ్రీమతి అనసూయాదేవి, శ్రీ వేంకట సుబ్బారావు అనే పుణ్య దంపతులకు డిసెంబర్ 18, 1945లో కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ గారు జన్మించారు. వీరు బందరు నోబుల్ కాలేజీలో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారికి జూనియర్‌గా వారివద్దనే ఉంటూ చదువుకున్నారు. విజయవాడ లయోలా కాలేజీ నుండి బి.ఎస్సీ సైన్స్‌ను, ఉస్మానియా యూనివర్శిటీ నుండి ఎం.ఎ. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, గుల్బర్గా యూనివర్శిటీ నుండి న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకున్నారు.

కాటూరి వారి వృత్తి - ప్రవృత్తి :

1963లో భారత వైమానిక దళం ఎలక్ట్రానిక్ సాంకేతిక విభాగంలో ఏరోనాటికల్ ఇంజనీర్‌గా, రాడార్ నిపుణునిగా దాదాపు అన్ని యుద్ధవిమానాలపై పనిచేస్తూ 1965, 71లో జరిగిన యుద్ధాలలో స్వయంగా పాల్గొని 6 సైనిక పతకాలు పొందిన ఘనత వీరిది. ఉద్యోగ విరమణ అనంతరం పంజాబ్ నేషనల్ బ్యాంకులో 20 సంవత్సరాలు పనిచేసి, ప్రస్తుతం హైకోర్టు లాయర్‌గా కొనసాగుతున్నారు.

కాటూరు వారు నిత్యం రచనలు చేస్తూనే ఎన్నో సాహిత్య సంస్థలకు నిర్వాహకుడిగా, అధ్యక్షునిగా, సలహాదారునిగా, లీగల్‌సెల్ కన్వీనర్‌గా, ఎడిటర్‌గా, లీగల్ అడ్వైజర్‌గా, జర్నలిస్టుగా, ఆకాశవాణిలో బీ-గ్రేడ్ ఆర్టిస్టుగా అనేక పురస్కారాలను, సన్మానాలను అందుకున్నారు. దూరదర్శన్‌లో ప్రసారం చేయబడుతున్న అనేక చర్చా కార్యక్రమాల్లో విశ్లేషకునిగా, న్యాయ సలహాదారునిగా పాల్గొంటున్నారు.

అంతర్నేత్రం - సామాజిక జీవన చిత్రణ :

కాటూరు వారు ఈనాడు అంతర్యామి శీర్షికన వందల సంఖ్యలో వ్యాసాలు రాశారు. రాస్తూనే ఉన్నారు. వీటిలో కొన్ని ఆధ్యాత్మిక పరమైనవి మరికొన్ని ప్రబోధాత్మకమైనవి. ఈ వ్యాసాలను 'అంతర్నేత్రం' పేర వ్యాససంపుటిగా వెలువరించారు. సామాజిక జీవన కోణంలో మచ్చుకు కొన్ని వ్యాసాలను పరికించి చూస్తే సమాజానికి పరివర్తన కలి

గించి, నైతిక విలువలను పెంచేవిగా, వారిలో ఆధ్యాత్మిక భావనలను మేలుకొలిపేవిగా ఉన్నాయి. వ్యాసము ఆధునిక సాహిత్యంలో ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వచ్చిన వచన రూప నూతన ప్రక్రియ. విశ్వసాహిత్యంలో వ్యాసానికి మూలపురుషుడు ఫ్రెంచ్ రచయిత మౌంటేన్ తెలుగులో మొట్టమొదటి వ్యాసాన్ని సామినేని ముద్దు నరసింహ నాయుని గారు వ్రాశారు. ఈ వ్యాసం "హితవాది" అనే పత్రికలో ప్రచురించబడింది.

ప్రబోధాత్మక వ్యాసాలు - వస్తు వైవిధ్యం :

ధృఢ సంకల్పం, విద్యా విజయాలు, యవ్వనఫలం, నిర్ణయాత్మకశక్తి వంటి వివిధ రకాల వస్తు వైవిధ్యంతో అనేక వ్యాసాలు రచించారు. వాటిలో మచ్చుకు కొన్నింటిని పరిశీలిద్దాం.

ధృఢ సంకల్పం :

కాటూరు వారు తన ధృఢ సంకల్పం అనే వ్యాసంలో 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని అంటూ కేవలం సంకల్పించగానే అనుకున్న పని జరిగిపోవటం అనేది దేవతలకు, సిద్ధ సాధ్యులకు, ప్రజాపతులకు, తప్ప సాధారణ మనుషులకు వీలు కాదు. "కాబట్టి మానవులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నా, విజయపథంలో నడవాలన్న ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, లక్ష్య సాధనకు, ధీఢసంకల్పంతో అవిరళకృషి సాగించాలి అని చెప్పారు. సంకల్పాన్ని దీక్షగా మార్చుకుంటే అనుకున్న లక్ష్యాన్ని మానవులు చేరుకోవచ్చని చెబుతూ, పురాణ ఇతిహాసాలలో గల భగీరథుడు, బ్రహ్మర్షి విశ్వామిత్రుడు, నహుష చక్రవర్తి మొదలగువారు సాధించిన విజయాలలో వారి ధృఢ సంకల్పము ఎంత గొప్పదో నొక్కివక్కాణించారు. కాబట్టి మానవులు పగటి కలలు కనకుండా దీక్ష బద్ధుడిగా, అవాంతరాలు వచ్చినాసరే, నిరాశ నిస్పృహలకు లోనై అర్ధాంతరంగా ప్రయత్నాన్ని విరమించకుండా ధృఢ సంకల్పంతో ప్రయత్నిస్తే విజయం మనలను వరిస్తుంది. అని ధృఢ సంకల్పం వ్యాసంలో చెప్పే విధానం పాఠకుల మనసును హత్తుకునే విధంగా ఉంది.

విద్యా విజయాలు :

కాటూరు వారు తమ విద్యా విజయాలు అనే వ్యాసంలో విద్య కామధేనువు లాంటిదని, దేశాంతరాలలో బంధువులాగా ఆదుకుంటుందని విద్య యొక్క విశిష్టతను చెబుతూ, విద్య వలన శ్రేష్టమైన వ్యక్తిత్వం, ధనం, కీర్తి, భోగం, సుఖం లభిస్తాయని, విద్యలేనివాడు పశువుతో సమానమని అంటూ విద్యకు వినయం తోడైతేనే అది రాణిస్తుందని, విద్యా వినయం కలిస్తేనే సంపద అవుతుందని, శరీరం అయితే వినయం ఆభరణం లాంటిదని చక్కగా చెబుతూ, "చదువని వాడజ్ఞుండగు చదివిన నదనద్వివేకచతురత గలుగున్చదువగలవ లయును జనులకు..." అంటూ హిరణ్యకశిపుడు అంతటి వాడు ప్రహ్లాదుడికి చదువు గొప్పతనం గురించి ఘనంగా చెప్పాడని అంటూ ఉదాహరణ సహితంగా వివరించడం సందర్భోచితంగా ఉంది. కాలానుగుణ్యంగా విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులకు వాపోతూ 'కోటి విద్యలు కూటి కొరకే' అన్న చందాన కాకుండా, మానవులు తాము నేర్చినవిద్యను పదుగురికి పంచాలని, వీలైతే సమాజానికి, దేశానికి, సమస్త మానవాళికి మేలుచేస్తూ లోకక్షేమానికి అంకితం కావాలని, అప్పుడే విద్యకు సార్ధకత లభిస్తుందని అంటూ విద్యయొక్క విశిష్టతను కళ్ళకు కట్టినట్లుగా వివరించారు.

యవ్వన ఫలం :

కాటూరు వారు తమ యవ్వనఫలం వ్యాసంలో మనిషికి గర్వం కలిగించే అంశాలలో యవ్వనం ఒకటని, ఉత్సాహ భరిత స్థితిలో మనసు గంతులు వేస్తూ, అనేక పోకడలు పోతుంటాడని జగమెరిగిన దానిని చెబుతూ, ఎవరైతే యవ్వనంలో జాగ్రత్తగా మసలుకుంటారో వారి యొక్క వార్ధక్యం ఆనందమయంగా గడుస్తుంది అని చెప్పటం జీవిత సత్యం. ఒక చెట్టు ఎలా అయితే మరిన్ని చెట్లు అవతరించడానికి బీజ సంపదనిస్తూ పక్షులకు, బాటసారులకు నీడ, ఫలాలను, స్వచ్ఛమైన గాలినిస్తూ ధన్యత చెందుతుందో మనిషి కూడా అలాగే సత్కర్మలు

ఆచరిస్తూ, యవ్వన గర్వాన్ని, దుష్కర్మలను విడిచిపెట్టి యువత తమ శక్తియుక్తులను సజ్జన సాంగత్యానికి, జ్ఞానసముపార్జనకు, సమాజ సంక్షేమానికి పాటుపడుతూ, కాలాన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేయాలని, కాబట్టి యవ్వనగర్వం పాలు లాంటిదని జాగ్రత్తగా లేకపోతే కాటువేస్తుందని చెప్పడం యువతకు జోలపాడుతూ మేలుకొలిపేలా ఉంది.

నిర్ణయాత్మక శక్తి :

కాటూరు వారు తమ నిర్ణయాత్మక శక్తి అనే వ్యాసంలో మానవులు తమ జీవితంలో కీలకమైన సందర్భాలలో నిర్ణయాత్మక శక్తిని కలిగి ఉండాలని, లేకపోతే దాని పర్యవసానం జీవితాంతం వేధిస్తూనే ఉంటుందని చెబుతూ మానవులు జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునేటప్పుడు, ఉన్నత చదువులను నిర్ణయించుకునేటప్పుడు, వృత్తిని ఎంచుకునేటప్పుడు, వైద్యుణ్ణి ఆశ్రయించినపుడు, నేతను ఎన్నుకునేటప్పుడు సునిశిత ఆలోచనా దృష్టితో, మనసుకునచ్చిన పనే చేయాలని హితబోధ చేస్తూ, కొంతమంది విద్యార్థులు తమ తల్లి దండ్రుల బలవంతంతో తమకు ఇష్టంలేని చదువుని ఎన్నుకుని అది అర్థంకాక, దానిపట్ల శ్రద్ధచూపలేక ఒత్తిడికి గురై అర్ధంతరంగా జీవితాన్ని ముగించి తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచి వేస్తున్నారని తమ బాధను వ్యక్తం చేస్తూ 'మనలోని నిర్ణయాత్మక శక్తి పటిష్టమైనప్పుడే జీవితం పూలబాటలో సాగుతుంది అని అంటూ ఉపమానంగా పాండవులు అన్నివిద్యల్లో మహాశూరులే కాని భీముడు గద, అర్జునుడు ధనస్సు, ధర్మజుడు హలం, సకుల సహదేవులు ఖడ్గవిద్యలో ఆరితేరారు. అలాగే నాయకుణ్ణి ఎన్నుకునేటప్పుడు సమర్థుడిని, దక్షత కలవాడినే ఎన్నుకోవాలి. దీనినే వివేచన అంటారు అని చెప్పడం కాటూరు వారి సామాజిక దృష్టి కోణానికి గీటురాయి.

ఆధ్యాత్మికపరమైన వ్యాసాలు - వస్తు వైవిధ్యం :

భగవంతుడి చిరునామా, సత్యమేవ జయతే, ఉప కారం వంటి వస్తు వైవిధ్యంతో అనేక రకాల వ్యాసాలను కాటూరు వారు రచించారు.

భగవంతుడి చిరునామా :

రవీంద్ర త్రివిక్రమ్ గారు తమ భగవంతుడి చిరు నామా అనే వ్యాసంలో ఆధ్యాత్మిక భావనతో, భక్తి నిండిన హృదయంతో ఆలోచిస్తే భగవంతుడు మనం భక్తితో కొలుచుకునే రాతి శిల్పాలలోనే కాక మన హృదయ మందిరంలో కూడా దర్శనమిస్తాడని, 'భగవంతుడి చిరునామా హృదయమే' అని ఘంటాపథంగా చెబుతూ, ఇందుకు తార్కాణమే హనుమంతుని రామభక్తి. రామ పట్టాభిషేకంలో సీతాదేవి హనుమంతుని పుత్ర వాత్సల్యంతో విలువైన ముత్యాల హారాన్ని బహుకరిస్తే, అందులో తన రాముడు కనబడలేదని హనుమంతుడు అమాయకంగా ముత్యాలను కొరికి చూశాడట. అలాగే భగవంతుడు ఉన్నాడా లేదా అన్న మీమాంస చాలా మందిలో ఉంటుందని వివరిస్తూ, మురికి తొలగిస్తే వస్త్రాలు, మకిలి తొలగిస్తే ముత్యాలు ఎలా ప్రకాశిస్తాయో, అజ్ఞానాన్ని వదిలించుకుంటే జ్ఞానం కూడా అలాగే ప్రకాశిస్తుంది అని చెప్పటం వ్యాసానికి పెట్టిన శీర్షికను ఫలవంతం చేసినట్లుగా ఉంది.

సత్యమేవ జయతే :

రవీంద్ర త్రివిక్రమ్ గారు తమ సత్యమేవ జయతే వ్యాసంలో సత్యం వలన జయం ప్రాప్తిస్తుందని, అది సత్వగుణాన్ని ఆశ్రయించి వారిలో అంతర్లీనంగా శాంతాన్ని, సహనాన్ని, వివేకాన్ని ప్రజ్ఞను ఉదయించేలా చేస్తుందని, వారికి పెట్టని కోటలా కల్పిస్తుందని చెబుతూ, ప్రస్తుత సమాజంలో చాలామందికి అబద్ధం చెప్పకుండా రోజు గడవదని, అవసరం ఉన్నా లేకపోయినా అనాయాసంగా, వినోదంగా కూడా అనేక అబద్దాలు చెబుతూ వారి హృదయ మందిరాన్ని చీకటిమయం చేసుకుంటూ భగవత్ సాక్షాత్కారానికి దూరమవుతున్నారు అన్ని ఆధ్యాత్మిక కోణంలో విశ్లేషిస్తూ 'అబద్ధం మలిలం లాంటిది' కాబట్టి నిజ జీవితంలో మానవుడు ఒక తప్పును కప్పిపుచ్చడానికి అబద్ధం ఆడితే, దాన్ని కప్పిపుచ్చడానికి మరిన్ని అబద్ధాలు చెప్పవలసి వస్తుంది. కానీ నిజానికి అబద్ధం ఆడేవాడికి చెప్పినది గుర్తు ఉండదు. ఎందుకంటే అది అబద్ధం

కనుక. కానీ విన్నవారికి మాత్రం అది బాగానే గుర్తు ఉంటుంది. ఏదో ఒక సందర్భంలో అబద్ధాలు చెప్పేవాళ్ళు ఇలానే పప్పులో కాలు వేయడం జరుగుతుంది. సత్యాన్ని జయించడంలో పురాణకాలంలో సత్యహరిశ్చంద్రుడు, నేటి కాలానికి గాంధీజీ ఆదర్శంగా నిలిచారని చెబుతూ కాటూరి వారు జీవితంలో సత్యం యొక్క గొప్పతనాన్ని పునరుద్ఘాటించారు.

ఉపకారం :

రవీంద్ర త్రివిక్రమ్ గారు తమ ఉపకారం అనే వ్యాసంలో ఉపకార బుద్ధి ఉత్తమ మానవుల లక్షణం అని చెబుతూ మానవుడు ఇచ్చే గుణాన్ని ప్రకృతి నుండే నేర్చుకోవచ్చుని గాలి, భూమి, నీరు, ఆకాశం చెట్టు ఇలా దేనిని తీసుకున్నా అవి ఉపకారం గుణాన్ని బోధిస్తున్నట్టుగా అనిపిస్తుందని చెబుతూ...

'యధాశక్తి ఉపకారం ఉత్తమం' కనుక మానవుడు ప్రకృతితో మమేకమై బ్రతకాలని సూచిస్తూ యాచిత సహాయం కన్నా ఆయాచిత సహాయం మిన్న అని చాలా చక్కగా ఉపకారం గురించి విశ్లేషించిన తీరు అద్భుతం.

ముగింపు :

'కత్తి కన్నా కలమే మిన్న' కాటూరు వారి భాష సరళంగా, సుందరంగా, సూటిగా సామాన్య పాఠకులను సైతం అర్థమయ్యే రీతిలో చక్కని పదాల పొందికను కలిగి ఉంది. సమాజం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. ఈయన తన వ్యాసాలను విశాలమైన ఆలోచనా దృక్పథంతో, సామాజిక స్పృహతో, పరిస్థితుల పట్ల అవగాహన శక్తితో వచన రచనగా ఉపమానసహితంగా మలచినతీరు అద్భుతం. అతని రచనల్లో సామాజిక జీవన చిత్రణ ప్రస్ఫుటమవుతుంది.

ఆధార గ్రంథాలు :

1. అంతర్నేత్రం - కాటూరు రవీంద్ర త్రివిక్రమ్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

మధుసూదన్ "బతుకుబండి" – సామాజిక దర్శనం

– డా॥. ఎ. విజయలక్ష్మి, తెలుగు పండిట్, చెన్నై, తమిళనాడు.

స్వామి వివేకానంద 'మనిషి పక్షిలాగా గాలిలో ఎగరడం, చేపలాగా నీటిలో ఈదడం నేర్చుకొన్నాడు. కానీ మనిషి లాగా భూమి మీద జీవించడం నేర్చుకోలేక పోతున్నాడు'. అని మనిషిపై తన దృక్పథాన్ని వెలి బుచ్చారు. ఇది మనిషిలో మానవత్వం దూరంగా జరిగిపోడాన్ని తెలియజేస్తుంది. మనిషి అభివృద్ధి చెందుతున్నానుకొటూ దిగజారిపోవడాన్ని తెలుపుతుంది. మనిషిలో స్వార్థచింతన పెరిగిపోయి ప్రకృతి వనరులను ఇష్టాభోజ్యంగాను, ప్రజాస్వామ్యాన్ని ఇష్టారాజ్యం గాను ఉపయోగించుకోవడం జరుగుతుంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ వంటి విధానాలతో సమాజం ఆర్థిక లాభాపేక్షతో అతలాకుతలమైపోతుంది. అసమానత, అమానుషతలతో కుతకుతలాడుతుంది. కాలుష్యపు కోరల్లో చిక్కికొట్టు మిట్లాడుతుంది. దోపిడీ, దౌర్జన్యాలతో అశాంతికి ఆలవాలమవుతుంది. ఇట్టి కల్లోలిత సమాజాన్ని జాగృతపరచగతిగేది, ఉపశాంతి కలిగించేది సాహిత్యమే నని నా అభిమతం. మనిషిలోని మానవత్వాన్ని, ప్రేమ తత్వాన్ని తట్టిలేపే కవిత్వం కావాలి, రావాలి.

ఇదుగో, అలాంటి ప్రయత్నంలోనే డా॥. కప్పగంతుల మధుసూదన్ గారు "బతుకుబండి" కవత్వం రాశారు. 'కప్పిచెప్పేవాడు కవి; విప్పి చెప్పేవాడు విమర్శకుడని' ఒకరంటే 'కవిత్వం ముందు విశ్లేషణ వీగిపోతుందని' మరొకరన్నారు. ఈ విప్పిచెప్పడం, వీగిపోవడం కంటె పరామర్శకు మాత్రమే పరిమితం కావడం మంచిది కదా!

ఆంధ్రమహాభారత కవిత్రయంలో ఒకరైన ఎఱ్ఱన జన్మించిన గ్రామం గుడ్లూరులో సాహితీవాసనల నొప్పుకప్పగంతులవారి వంశంలో జన్మించి మధుసూదన్ డా॥. మధుసూదన్‌శాస్త్రి కావడం సహజసిద్ధమైన గడించిన పాండిత్యం, పండించిన కవిత్వం స్వతఃసిద్ధమే.

కీ.శ. అబ్దుల్‌కలాం గారిని "మీరు రాష్ట్రపతి కావడానికి కారణం మీ అదృష్టంగా భావిస్తున్నారా?" అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు ఆయన "అవును, నాకు మంచి దారి చూపిన ఉపాధ్యాయులు దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నాన" అని సమాధానమిచ్చారట. మధుసూదన్ గారు కూడా తన కీమాత్రం విద్య అబ్బడానికి కీ.శే. డా॥.నాగభైరవకోటేశ్వరరావు, డా॥. సూరం శ్రీనివాసులు, ఆచార్య వి. రామచంద్ర వంటి గురువులే కారణమంటుం టారు. ఈయనలో నాకు నచ్చిన గుణాలు - పెద్దలను గౌరవించడం, అందరినీ ఆత్మీయంగా పలకరించడం, విద్యార్థులపై ప్రేమానుభిమానాలు చూపడం, ఆత్మ విశ్వాసంతో పనిచేయడం. ఏ గురువు నుండైనా ఇంత కంటే యింకేం ఆశిస్తాం? విద్య ఉంటే మరోధనం అవసరం లేదు, శీలం ఉంటే మరో ఆభరణం, పాండిత్య ఉంటే మరో రాజ్యం అవసరం లేదంటాడు సుభాషితకర్త భర్తృహరి. ఈ మూడూ ఉన్నవాడుమన మధుసూదనుడు. పాండిత్యం, కవిత్వం ఈయనలో సమానత్వంగా కన్పిస్తే వినయము, సౌశీల్యం సమున్నతంగా గోచరిస్తాయి.

20 సంవత్సరాలకు పైగా డా॥. మధుసూదన్ గారు మార్కాపురంలో శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రధానా చార్యులుగా పని చేస్తున్నా పూర్వాశ్రమంలో పత్రికా రంగంలోనూ, సాహితీ రంగంలోనూ మంచి అనుభవం గడించారు.

20 సంవత్సరాలకు పైగా డా॥. మధుసూదన్ గారు మార్కపురంలో శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రధానాచార్యు లుగా పనిచేస్తున్నా పూర్వాశ్రమంలో పత్రికారంగంలోనూ, సాహితీరంగంలోనూ మంచి అనుభవం గడించారు.

గత రెండు దశాబ్దాలుగా రచనలు చేస్తున్నారు. కవిత్వంతోపాటు కథలు, వ్యక్తిత్వ వికాస వ్యాసాలు

చాలానే పత్రికల్లో రాశారు. ఆకాశవాణిలో విన్పించారు. అయితే అవి పుస్తకాల రూపం దాల్చడానికి ఆలస్యమైంద నుకొంటాను. ఆ ప్రయత్నంలో ఇది మొదటిది. మిగిలినవి కూడా ఒక్కొక్కటిగా వెలువడాలని, వెలువడతాయని ఆశిస్తున్నాను.

'బతుకుబండి' రూపకసమాసం. బతుకు మనిషికి సంకేతమైతే బండి గతికి సంకేతం. మొత్తం మీద 'మనిషిగతి'కి సంబంధించింది. బతుకుబండి ప్రయాణం అనంతం. ఇది కొందరికి నల్లేరు మీద నడక అయితే ఎంతోమందికి గతుకుల మీద నడకే. కవి బతుకుబండి దేనిమీద నడకయినా రాసేది మాత్రం గతుకుల బ్రతుకు మీదనే. నిజానికి కవిదీ గతుకుల బతుకే అయితే కవిత్వం మొత్తం అద్భుతానుభవాలే. ఈ 'బతుకుబండి'లో ఉన్న అన్ని కవితల్లోనూ బతుకు భావన పూలదండలో దారంలా అంతర్లీనంగా వుంది. అందుకే ఈ కవితా సంపుటికి 'బతుకు బండి' అని పేరు పెట్టి ఉంటారనుకుంటా.

ఈ బతుకుబండిలో 'నాన్న'ను ముందునగల్లో కూర్చొబెట్టి జననిని, ఎఱ్ఱనను, ఆంధ్రభాషను ఎక్కించు కొని, అన్ని తావులా సంచరిస్తూ, సంక్రాంతి - జయ వసంతాలను పనకరిస్తూ, అప్పుడప్పుడూ వినువీధిన విహరిస్తూ, దుఃస్వప్నంకంటూ, కలికాలాన్ని ప్రశ్నిస్తూ, విముక్తి గీతి వినిపిస్తూ, కొత్తపోకడలో హృద్వేగంతో మారిపొమ్మంటూ, ఇంక సెలవంటూ ఓంశాంతిఃతో విశ్రమిస్తాడు కవిచోదకుడు.

మొదటి కవిత 'నాన్న'. అమ్మమీద అంతులేని ప్రేమవున్నా, నాన్న నామస్మరణం మధుసూదన్ గారికి వీడని ఆభరణం. అందుకేనేమో ఈ ఖండకావ్యం నాన్నతో మొదలైంది, అమ్మకు అంకితమైంది.

"నేను సత్వగుణ సంపన్నుడినీ
సగౌరవంగా బ్రతుక గల నని
.....
నాన్న బ్రతుకుసందేశం
నా జీవిత అనుభవం"

అంటూ ముగించడం అద్భుతంగా వుంది.

రెండవ కవిత జనని... ఇందులో కవి తన జన్మభూమి ప్రకాశం జిల్లాను "మమతలకు, మానవతకు నిలయమైన మా జిల్లా- ఆత్మీయతకు ఖిలా" అంటూ సగర్వంగా ప్రకటించాడు. తన జన్మస్థలాన్ని జననిగా సంభావించిన సద్భావకుడు మధుసూదన్.

మూడవ కవిత ఆంధ్రభాష. మాతృభూమి తర్వాత మాతృభాషను సీసపద్యాలతో తెలుగుదేశపు కీర్తిని దిశలజాట బావుటాలెత్తి నిల్చిన భాష మననది అని తేల్చి చెప్పాడు. నాల్గవ కవిత ఎఱ్ఱనలో "నన్నయదొక ఋషి మార్గము, తిక్కనదొక రసమార్గము కాగా ఎఱ్ఱఅనది ప్రబంధ మార్గమంటూ పూర్వకవులను ప్రస్తుతించాడు.

ఇక బతుకుబండి బయలుదేరింది. ఆరు పదుల స్వతంత్ర భారత ఘనత కన్నా నేడు కార్మికులు, కర్షకులు, అనాథలు, పసికందులు పడుతున్న అగచాట్లతో నాదేశంలో గతంలో బాగుండేదనే నిర్ణయానికొస్తాడు. "ఏమున్నది నేటి ప్రగతి?" అంటూ డెబ్బదేళ్ళ పాలనను ఎండగట్టాడు. వాడుతున్న బాల్యానికి, మాడుతున్న యవతకు చదువే చక్కని పరిష్కారమని 'విముక్తిగీతి' విన్పించాడు.

"ఇప్పుడు అమ్మలకు కూడా
మగాళ్ళంటే భయం, మృగాళ్ళంటే భయం
అడుగడుగునా భయం..... అణువణువునా భయం"

అంటూ 'ఆడ' అనే పదానికి భద్రత లేకుండా పోయిందని బాధపడతాడు. అయితే అందుకు పరిష్కారంగా..

"అమ్మలు ఆగ్రహించాలి
బుద్ధివక్రించినప్పుడు.. చిత్తం చలించినప్పుడు
పైత్యం ప్రజ్వరిల్లినప్పుడు
వ్యసనం.. విలాసం.. విధ్వంసపువైపు పయనం సాగినప్పుడు
వ్యవస్థ పతనం దిశగా పరుగులు తీసినప్పుడు..
అమ్మలు ఆగ్రహించాలని" సూచించాడు.

'సంకురాత్రి' గేయకవిత మాత్రా ఛందస్సులోసాగి అచ్చంగా గురజాడ వారి ముత్యాల సరాలను తల పిస్తుంది. సిరుల పండుగ సంక్రాంతి వేళ...

"పంటవేసి అలసి సొలసే రైతులకు మెతుకెక్కడ?
కండలను కరగించి పోసెడి కార్మికుల బ్రతుకెక్కడ?
రంగు రంగుల చీరనేసిన సాలె మనుగడ ఎక్కడ?
జాలిగొలిపే బతుకు గడిపే జాలరుల ఊసెక్కడ?"

అని రైతులు, కార్మికులు, సాలెలు, జాలరులు వంటి శ్రామికులకు నిజమైన సంకురాత్రి ఎక్కడుందని తన ఆవేదన వెళ్ళగక్కుతాడు కవి. శ్రామికజన పక్షపాతం కవికి సహజమే కదా!

"ద్రవ్యోల్బణం, పంచశీల - అంటువ్యాధులు, అనార్యోగం
దేశరక్షణ, తీవ్రవాదం - అక్రమాలు, నల్లధనం
అత్యాచారాలు, ఆకతాయి విజృంభణలు - జూదాలు, వ్యసనాలు
అశ్లీలత, అసంపూర్ణ విద్య - దొమ్మీలు, దొంగతనాలు
ఇంకా ఇలాంటివెన్నో?"

సామాజిక సమస్యలు కవితా వస్తువులుగా, ప్రగతిశీలక దృక్పథం పరిష్కార మార్గంగా 'జయవసంతం' కవిత్వ మైంది.

అధ్యాపక వృత్తిలో ఉండడం చేతనేమో కవి నవజీవన 'ఓనమాలు' దిద్దించి, 'నీటిపాఠం' బోధించాడు. వర్తమాన 'కొత్తపోకడ'లను వర్ధమాన భారతమని ఉపన్యసిస్తుం డాలిగ!' అంటూ పర్యావరణ పరిరక్షణకోసం ప్రతిఘటిం చాడు. గాలి, నీరు, ఆకాశం, ఆహారం; నివాసం, ఉనికి లను కుళ్ళబారకుండా స్వచ్ఛంగా ఉండాలని, స్వేచ్ఛా భారత జగతిని వదులుకోవద్దని 'జైహింద్' చెప్పాడు.

నేడు సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు, సంఘర్షణలు, జాతివైరుధ్యం వంటి సామా జిక రుగ్మతలకు కవి చలించిపోయి రేపటి ప్రపంచం ఎలా ఉంటుందో ఒక 'దుఃస్వప్నం' కంటాడు.

"..... సంస్కృతిని, సంప్రదాయాన్ని
చెరిపేసి మరీ మేం చరిత్రను తిరగరాసుకుంటున్నాం
.....
మా జాతి సమైక్యతకు
మా చేతులతోనే చెల్లురాస్తున్నాం"

సామాజిక అల్లకల్లోలాలు, సుఖదుఃఖాలు ఈ కవితలో అన్యాపదేశంగా దర్శమిస్తున్నాయి.

కపటీకృత ఆర్థిక విధానాలతో రైతును కుళ్ళబొడుస్తున్న దుర్మార్గపు వ్యవస్థను వ్యంగోక్తితో దండించాల్సిందే' అంటూ దండయాత్ర చేసిన ఈ కవి నిజంగా రైతు పక్షమే అని నిరూపితమౌతుంది.

"మేమేదో కొత్తదనం కోసం 'ఋణమాఫీ' అంటే
అది కుబేరులకు మాత్రమే వర్తించే కాన్సెప్టని గుర్తించరే వీళ్ళు
.....
ధర్మం తప్పిగూడా గొంతుపెగుల్తుందీళ్ళకి
ఈళ్ళని ఖచ్చితంగా దండించాల్సిందే!"

ఈ వ్యంగ్య కవితలో వాస్తవికత దర్శనమిస్తుంది.

ఉద్యోగ విరమణ చేస్తున్న ఓ పోస్ట్‌మ్యాన్ (కవి గాంచిన వ్యక్తి)

ఓ రెక్కల పంజరమా! మన చెలిమికి యింకసెలవ్
సజావుగానే సాగిన సహవాసానికి "గుడ్‌బై"

అని తన ఉద్యోగ మధురస్మృతులను తలపోసుకొన్న కవిత విశ్వకవి రవీంద్రుని "ది పోస్ట్‌మాస్టర్" రచనను గుర్తుకు తెస్తుంది. పోస్ట్‌బాక్స్‌ను రెక్కల పంజరం, ఎర్రని గుండెలతో ప్రతీకరించడం కవి భావుకతకు అద్దం పడు తుంది. పుణ్యానికిపోతే పాపం ఎదురైందన్న చందంగా గోదావరి పుష్కరాల దుర్ఘటనకు చలించిన కవి -

"పుష్కరం జనసంద్రం
మన ప్రవాహం.... మహాప్రవాహం
మూర్ఖత్వం నేర్పినపాఠం, అమాయకులకు అందిన ఫలితం
మన స్వార్థం రేపిన పుణ్యం చరిత్రలో చెరగని గాయం"

అంటూ 'ఓంశాంతిః' చెప్పినా, ఇందులో శాస్త్రీయ దృక్పథం ధ్వన్యాత్మకంగా విన్పిస్తుంది.

'కవిత్వం జీవితానికి వ్యాఖ్యానం' అన్న సత్యాన్ని నిరూపించేదిగా ఉంది ఈ బతుకు బండి - కవిత్వం.

దైనందిన జీవితంలో కలిగే అనుభవాల్లోంచి పల్ల వించిన అనుభూతులను కవిత్వీకరించడంలో మధు సూదన్ గారు కృతకృత్యులయ్యారని భావిస్తున్నాను.

కవిత్వమంటే ఏమిటో? అది ఎలా గుండాలో? చాలా మంది కవులు, విమర్శకులు చెప్తూనే ఉన్నా మనకాలంలో మన మధ్య తిరుగుతున్న కవితాయోధుడు కె. శివారెడ్డి గారు -

"కవిత్వమంటే మరేదోకాదు....
కవిత్వమంటే జీవితం,
కవిత్వమంటే తాను నివసించే ప్రాంతం....
కవిత్వమంటే అస్థిత్వం
కవిత్వమంటే అనుభవాలు
కవిత్వమంటే ప్రజల సమస్యలు, ఉద్యమాలు"

అంటూ సామాజిక కవిత్వాన్ని సరళీకరించారు. దీనిని బట్టి 'బతుకుబండి' నిండా అసలైన కవిత్వం కనిపిస్తుంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

సమాజ దర్పణం గురజాడ

– డా॥. వొసరెడ్డి భవాని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేబ్రోలు.

మన ఆంధ్రదేశంలో గురజాడ వారి జాడ తెలియని వారు లేరనడంలో అతిశయోక్తిలేదు. ఆధునిక యుగకర్తగా తెలుగువారికొక శాశ్వత చిరునామాగా తెలుగువారి హృదయంలో తనదైన ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. "నిద్రాణమైన జాతిని మేల్కొల్పడానికి అద్భుతమైన సాధనమే సాహిత్యం" ఏ మనిషి అయినా తన చుట్టూ వున్న సమాజాన్ని గమనిస్తూనే వుంటాడు. కానీ కవి మాత్రం సమాజంలోని మంచిచెడ్డలను తన కవిత్వం ద్వారా చక్కని పదజాలంతో ప్రజల హృదయాలకు హత్తుకునే విధంగా చెబుతాడు. ప్రాచీన సాహిత్యం నుండి ఈనాటి ఆధునిక సాహిత్యం వరకు సమాజానికి ఏదో ఒక ప్రయోజనం చేయాలనే కవి తాపత్రయపడతాడు. అందువలననే "గురజాడ తెలుగు సాహిత్యానికి సరిహద్దు" అని ఇంద్రగంటివారు అన్నారు. తన చుట్టూ వున్న సామాజిక సమస్యలతో చలించిన గురజాడ తన ప్రతి రచనలోనూ సమాజాన్ని ప్రతిబింబింపచేశారు. ఆ ప్రయత్నంలోనే అనేక సాహితీ ప్రక్రియలను సృష్టించి రచనా విధానంలోనూ తన తరువాత ఎన్నో తరాలవారికి ఆయన మార్గదర్శకుడైనాడు. భగవంతుని చేరడానికి అనేకమార్గాలు అనుకుంటూ గురజాడ వారు ఏ రచన చేసినా అది సమాజంలోని అవకతవకలను సరిదిద్దాలనే అన్నట్లుగా తన వంతు ప్రయత్నం చేశారు. గురజాడ వారు ముచ్చటగా అల్లిన ముత్యాల సరాలు తెలుగు భారతికి ముప్పేట హారములుగా శోభిల్లినవి.

ఆనాటి సమాజంలో స్త్రీలను చిన్నచూపు చూడడం మహిళలు సమాజంలో అసమానతకు గురికావడం సహించలేకపోయారు. సాంఘిక అవినీతి క్రిములతో నిండిన దుర్భరదాస్యం నుండి మహిళలకు విముక్తి కల్పించాలని పూనుకున్నారు. దేశంలో స్వాతంత్రోద్యమం ముమ్మరంగా వున్న రోజుల్లో సమాజంలో దేశభక్తిని ప్రేరేపించిన మహత్తరమైన గేయం "దేశమును ప్రేమించు మన్నా" అను గేయము. కన్యాశుల్కం నాటకంలో ఆనాటి సమాజంలోని కన్యాశుల్కం అనే దురాచారాన్ని నిర్భయంగా విమర్శించాడు. పూర్ణమ్మ కథ ద్వారా కన్యాశుల్కం లేతకొమ్మల బాల్యాన్ని ఏ విధంగా దుఃఖమయం చేస్తున్నదో చూపించరు. కన్యక గేయంలో కన్యక రాజును ఎదుర్కొన్న విధానాన్ని తెలియజేశారు. దిద్దుబాటు కథానిక ద్వారా వేశ్యా వ్యామోహం నుంచి సమాజాన్ని బయటకు లాగటానికి ప్రయత్నించాడు. పెద్ద మసీదు కథలో ఆనాటి ముస్లిం పాలకులు హిందూ దేవాలయాలను కూల్చివేసి నందుకు హిందువులు పడిన మనోవేదనను తెలియజేశారు. ముత్యాల సరాలు ఛందాస్సులో ప్రజల మనసుకు హత్తుకుపోయే విధంగా సామాజిక అభ్యుదయానికి నడుంబిగించన మహానుభావుడు. అస్పృశ్యతను తీవ్రంగా గర్హించారు, కుల వ్యవస్థను ఖండించారు. పండితులు, పామరులు తన రచనలతోమంచి అనుభూతిని పొందాలనే ఉద్దేశ్యంతో తన రచనా వ్యాసంగమంతా వ్యవహార భాషలోనే వ్రాశారు. వ్యవహార భాషను ప్రామాణిక భాషగా గుర్తింపు తీసుకురావడంకోసం గురజాడ వారు ఎంతో కృషి చేశారు. ఈ క్రమంలో గురజాడ వారి రచనలను కొన్నింటిని పరిశీలించుదాం.

కన్యాశుల్కం :

ఈ నాటకం సమాజాన్ని ఎంతగానో ఆకర్షించింది. భాషాభేదాలకు తావు లేకుండా అందరినీ అలరించినది. ఈ నాటక రచనలో అడుగడుగునా తన ప్రతిభా పాటవాలతో ఆనాటి మూఢాచారాలను ధైర్యంగా ఖండించారు. కన్యాశుల్క నాటకంలో గిరీశం వంటి అవకాశవాదిని, అగ్ని హోత్రావధాను వంటి ఛాందసుణి,

కరకటశాస్త్రులు వంటి లైక్యం గల వానిని లుబ్ధావధాన్లు వంటి లోభి పాత్రను; రామప్ప పంతులు వంటి స్వార్థ పరుణ్ణి సృష్టించి అందరినీ మెప్పించారు. పూటకూళ్ళమ్మ, బుచ్చమ్మ, మీనాక్షి వంటి విధవల పాత్రలను మల చడంలో వైవిధ్యాన్ని ప్రదర్శించారు. మధురవాణి వంటి చాకచక్యంగల వేశ్య పాత్రను ఎంతో శ్రద్ధగా తీర్చిదిద్దారు. సౌజన్యరావు పంతులు అనే న్యాయవాది పాత్రను అర్థ వంతంగా మలిచారు. ఇన్ని ప్రత్యేకతలు వుండడం వలననే నేటికీ ఈ నాటకానికి ప్రజాదరణ తగ్గలేదనేది నిస్సంశయము.

ముత్యాల సరసములు :

మృదు మధురమైన పదాల పొదికతో ఇంపుసొంపులు గులుకు గురజాడ వారి ముత్యాల సరాలు మన ఆంధ్రభాషా వధూటికి నిజంగా ముత్యాల సరాలే. అక్షర జ్ఞానం వున్న ప్రతీ ఒక్కరినీ పిలిచి పలకరించిన రచనయని చెప్పవచ్చును. "గుత్తునాముత్యాల సరములు" అనుచూ ఎంతో హృద్యంగా ప్రారంభించి తోక చుక్కను సంఘ సంస్కరణ ప్రయాన పతాకగా అభివర్ణించి

"యెల్లలోకము వొక్కయిల్లై
వర్ణభేదము లెల్ల కల్లై
వేలనెరుగని ప్రేమబంధము
వేడుకలుకురియ
మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును
అంతస్వర్గ సుఖంబులన్నవి
యవని విలసిల్లున్

అను కవిత ద్వారా విశ్వమానవ సౌభ్రాతృత్వమును ఆశించడమే కాక ప్రతి మనిషిని ప్రేమించే ప్రేమతత్వాన్ని బోధించాడు. మతములు, కులములు అన్నీపోయి ఒక్క జ్ఞానమే లోకానికి వెలుగును ప్రసాదిస్తుందని అప్పుడు భూమిమీద స్వర్గ సుఖాలు వెల్లివిరుస్తాయని తన సామా జిక స్వప్నాన్ని వివరించాడు.

కన్యక :

చరిత్రను పరిశీలించిన పెనుగొండను పరిపాలించిన కుసుమశ్రేష్ఠి కుమార్తె కన్యక. విమలాదిత్య విష్ణువర్ధన చక్రవర్తి పెనుగొండకు వచ్చినపుడు కన్యకను చూసి మోహిస్తాడు. ఆ కథను గురజాడ వారు మలుపు తిప్పి కన్యకను వర్తకుని కూతురుగా చిత్రీకరించారు. దేవతార్చన కొరకు వచ్చిన కన్యకను రాజు చెరపట్టబోతాడు. ఈ కథలో గురజాడ వారు కన్యక పాత్రను భావితరాలలో స్త్రీలకు ఆత్మస్థయిర్యం చేకూరే విధంగా ఎంతో ఉదాత్తంగా తీర్చి దిద్దారు. రాజు పాత్రను ఒక దుష్టశక్తిగా నీచంగా చిత్రీకరిం చారు. రాజు వీధిలో రాజు దుండగాన్ని సహించలేక చోరుడికన్నా జారుడికాన్న హీనంగా ప్రవర్తించిన రాజుతో కన్యక ఈ విధమైన పరుష వాక్యాలను పలికింది.

"కండ కావరమెక్కి నీవీ దుండగము తలపెట్టినందుకు
వుండడా ఒక దైవమంటూ వుండి వూర్కొనునా"
"పట్టమేతే రాజువైతే పట్టునన్ని పుడనుచు కన్యక
చుట్టుముట్టిన మంటలోనికి మట్టి తాజనియెన్"

ఈ గేయము ద్వారా కన్యక యొక్క తెగువ, ఆత్మాభి మానము మాత్రమేకాక తన అశక్తతను బేలవలె బయట పడనీయకుండా పురుషాహంకారాన్ని నిరిస్తూ దానికి బలైపోతున్న స్త్రీల మనఃప్రవృత్తులకు బాసటగా నిలబడే విధంగా కన్యక పాత్రను సృష్టించారు.

పూర్ణమ్మ :

ఈ గేయము గురజాడ వారికి మహిళల పట్ల వున్న మానవత్వమునకు ప్రతీక. ముక్కుపచ్చలారని ముద్దు గుమ్మ అయిన పూర్ణమ్మను తండ్రి కాసులకోసం ముసలి వానికిచ్చి పెళ్ళి చేస్తాడు. ఆ పుత్తడి బొమ్మను కాపురానికి తీసుకువెళ్ళడానికి ముసలి మొగుడు వచ్చినపుడు ఆమె తన బాధను పైకి చెప్పలేక నర్మగర్భంగా తన తోటివారితో ఈవిధంగా చెప్పినది.

"అన్నల్లారా తమ్ముల్లారా!
అమ్మను అయ్యను కానండీ!
బంగరు దుర్గను భక్తితో కొలవం

డమ్మల కమ్మా దుర్గమ్మా"
"నలుగురు కూచుని నవ్వేవేళల
నాపేరొకపరి తలవండి
మీ మీ కన్నబిడ్డలనొకతెమే
ప్రేమను నాపేరివ్వండి"
అని తానిక తిరిగిరాని లోకాలకు వెళుతున్నట్లుగా సూచన చేసినది అని తానికి తిరిగిరాని లోకాలకు వెళుతున్నట్లుగా సూచన చేసినది. సమాజంలోని కన్యాశుల్క దురాచారానికి ఈ గేయమొక గొడ్డలిపెట్టుగా చెప్పవచ్చును.

దేశభక్తి :

ఈ పేరులోనే మనకు స్పష్టత కన్పిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా వున్న రోజుల్లో సమాజాన్ని జాగృతం చేయడానికి గురజాడ ఈ దేశభక్తి గీతాన్ని వ్రాసి భరతమాత ముద్దుబిడ్డడనిపించుకున్నాడు. తెలుగునాట ఈ దేశభక్తి గీతము ఒక జాతీయ గీతమువలె అందరి హృదయాలలో నాటుకున్నది. ఈ గేయము నందలి ఒక్కొక్క అక్షరము ఒక మణిపూస వంటిది.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా"
"పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువుపాటు పడవోయి"
"చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడువ వలెనోయి"
"దేశమనియెడి దొడ్డవృక్షం
ప్రేమయను పూలెత్తలవలెనోయి"

అను గేయము ద్వారా సమాజానికొక మంచి సందేశము నందించినాడు. దేశమును ప్రేమించడమంటే సాటి మనుషులను ఆదరించడమేనని, పాడిపంటలను అభివృద్ధి చేయాలని అందరిలో ఐకమత్యం వుండాలని, ఈ దేశమనే వృక్షం ప్రేమ అనే పూలను వికసింపచేయాలని అన్ని జాతులు, మతములు అన్నదమ్ములవలె కలిసిమెలిసి వుండాలని ఉదాత్తంగా ప్రబోధించారు.

కథానికల విషయానికొస్తే తెలుగులో తొలి కథానిక "దిద్దుబాటు" సృష్టికర్త గురజాడవారే. వీరు రచించిన కథలు 5. అవి 1. దిద్దుబాటు, 2. మీపేరేమిటి, 3. మెటిల్డా, 4. పెద్దమసీదు, 5. సంస్కర్త హృదయం. ఈ కథలలో కూడా మనకు సమాజమే కన్పిస్తుంది.

ఆనాటి సమాజంలో వేశ్యాసంసర్గమునకు ప్రాధాన్యత ఎక్కువ అందువలననే వీరి కన్యాశుల్క నాటకంలోని మధురవాణి పాత్రను రూపుదిద్దడం జరిగినది. దిద్దుబాటు కథలో విద్యావంతులైన గోపాలరావు "ఎంతవారలైనా కాంతదాసులే" అన్నట్లు వేశ్యతో పరిచయం పెంచుకుంటాడు. అతని దృష్టి మరలచ్చడానికి భార్య అయిన కమలిని తన ఉత్తరం ద్వారా ఎంతో సున్నితంగా అతనిలో కనువిప్పు కలిగిస్తుంది.

మెటిల్డా అనే కథలో మెటిల్డా ఒక అందమైన యవ్వనంలో వున్న పడుచు. ఆమె భర్త ముసలివాడు. ఎంతో క్రూరంగా హింసించేవాడు. భార్యను మనిషిగాకాక ఒక వస్తువుగా చూచేవాడు. ముసలిపులి నోట్లో చిక్కుకున్న మేక వంటి నిస్సహాయత మెటిల్డాది. ఆమె ఎంతో సహనంతో అతని దురాగతాను భరించింది. చివరకు ఆ భర్త మెటిల్డా యోగ్యతను తెలుసుకుంటాడు. ఆ పరివర్తన గురజాడ వారు కల్పించినదే.

ఈ విధంగా గురజాడ వారు తన చుట్టూ వున్న సమాజాన్ని తన కవితా దృష్టితో పరిశీలించి సంస్కరణా దృక్పథంతో సమాజంలోని చెడును తన కలంతో శస్త్ర చికిత్స చేసి ఎన్నో అపురూపమైన రచనలను మనకందించారు. ఈ ప్రయత్నంలో ఆయన ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ వెనుకడుగు వేయక తన ప్రతి రచనలోనూ సమాజాన్ని ప్రతిబింబపచేసి ఆధునిక యుగంలోని కవులందిరకీ ఆదర్శంగా నిలిచారు. ఆధునిక యుగకర్తగా నిలిచిపోయారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జీవన భాష : కవితా విమర్శ

– అలువాల శ్రీలత, తెలుగు అధ్యాపకురాలు, టి.ఎస్.డబ్ల్యు.ఆర్.డి.సి (డబ్ల్యు), సూర్యాపేట.

సమాజంలో ప్రజలు పొట్టకూటి కోసం ఎన్నో పనులు చేస్తారు. కొందరు శారీరక కష్టాన్ని నమ్ముకుంటారు. కొందరు వ్యాపారం, ఉద్యోగాలు చేస్తారు, మోసాలు దొంగతనాలు వంటి అరాచకమైన పనులు చేసి కూడా జీవిస్తారు. ఎవరికీ అన్యాయం చేయకుండా ఎవరినీ కష్ట పెట్టకుండా చేసే పనులు ఎన్నో ఉన్నాయి. అలాంటి పనులతో కవిని ఆకర్షించి తన మనసును చలింపిచేసి కవిత రాసే దిశగా ప్రేరేపించిన పని "పాత బట్టలకు కొత్త బాసండ్లు, స్టీలు బాసండ్లు అమ్మే పని". ఆచార్య ఎన్.గోపి గారు "జీవన భాష" కవితలో పనిలో గొప్పతనమే కాదు పనిచేసే మహిళలలను కూడా ఎంతో గౌరవంగా కష్టజీవిగా, కుటుంబానికి ఆధారంగా ఎంతో ఆదర్శ ప్రాయంగా తీర్చిదిద్దారు.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని బహుముఖాలుగా సుసంపన్నం చేస్తున్న కొద్దిమంది కవుల్లో ఆచార్య ఎన్.గోపి గారు ఒకరు. తన ప్రతిభతో ఏ వస్తువునైనా కవితామయం చేయగల శక్తి కలవాడు ''నానీలకు నాన్నగా'' ప్రసిద్ధి పొందారు. ఈయన నల్లగొండ జిల్లా భువనగిరి పట్టణంలో 25 జూన్, 1948 సంవత్సరంలో జన్మించారు. లక్ష్మమ్మ, చెన్నయ్య వీరి తల్లిదండ్రులు.

ఆచార్య ఎన్.గోపి గారు ఎన్నో వ్యాసాలు, విమర్శ గ్రంథాలు, పరిశోధన గ్రంథాలు, యాత్రాచరిత్రలు వ్రాశారు. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన కవి 'జల గీతం' దీర్ఘకావ్యం, 9 భాషల్లోకి అనువాదం పొందింది. కాలాన్ని నిద్రపోనివ్వను, వచన కవితా సంపుటిని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఆచార్యులుగా, డీన్‌గా, తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీలో తెలుగు విభాగానికి సలహాదారులుగా ఉన్నారు. జాతీయ స్థాయిలో అకాడమీ పక్షాన సాహిత్య కార్యక్రమాల నిర్వ హణకు సలహాలను అందిస్తూనే నిరంతరంగా కవితా సృజన చేస్తున్న కవి డా॥. ఎన్.గోపి గారు.

ఆచార్య ఎన్.గోపి గారి కవితల్లో మానవత, ప్రగతి శీలత, సృజనశీలత, పల్లెవర్ణన ప్రధానంగా ఉంటాయి. ఏ సంఘటనను చిత్రించిన ఆర్ద్రత, ఆలోచన పురివిప్పిన సంయమన భావమే ప్రధానంగా ఉంటుంది. అటు వంటిదే గోపి గారి కలం నుండి జాలువారి నమస్తే తెలం గాణ పత్రికలో అచ్చయిన "జీవనభాష" కవిత. కుటుంబ జీవనం కోసం ఒక మహిళ పడే కష్టం అదీ ఎవరినీ బాధపెట్టకుండా, ఎవరికీ అన్యాయం చేయకుండా తన కష్టతో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తూ ముప్పైఏళ్ళుగా మహిళ బాసండ్లు అమ్మే పనిచేస్తూ తన సంసారాన్ని ఎలా వెళ్ళదీసిందో గమనించిన కవి హృదయం కరిగి హృదయం జాలువారిన కవిత జీవనభాష.

"పాత బట్టలకు కొత్త బాసాండ్లు" ఇస్తామంటూ లయ బద్ధంగా పాడుతూ వీధి వీధి తిరిగి ఇళ్ళలో పేరుకు పోయిన పాత బట్టలను అపురూపంగా తీసుకొని కొత్త సామాన్లతో ప్రజల కళ్ళల్లో కాంతి నింపుతుంది. ఈ కవితతో ఒక యువతి తను చేసే పనిలో నిబద్ధతను, నాణ్యతను, పట్టుదలను, సాహసాన్ని ధైర్యాన్ని ఎంతో చక్కగా వివరిం చారు.

ఆమె గొంతెత్తి అందరికీ వినబడే విధంగా పలికే మాటలు పాటలాగా ఉన్నాయని, ఆమె ఎన్నెన్ని వీధులు తిరుగుతూ తన వ్యాపారాన్ని పెంచుకుంటూ, మనుషు లతో మంచి సంబంధాలు నెరపుతూ ప్రపంచీకరణకు ఒక మంచి ఉదాహరణంగా ఉంటూ ఒక కొత్త అర్థాన్ని ఇచ్చిందంటూ వివరించారు. ఆమెను మట్టి మగువగా

తీర్చిదిద్దారు. సామాన్ల బుట్టను తన తలపై ఎంత చక్కగా బ్యాలెన్స్ చేస్తుందో తెలిపారు. తన శారీరక అందాన్ని కాదు తను బ్యాలెన్సు చేసుకుంటున్న గంపను, తన జీవితాన్ని చూడాలనీ వివరించారు. కవి 30 సంవత్సరాలుగా ఇలా కష్టపడి అమ్ముకునే మహిళను పరిశీలించి తన మనసులోని భావాలను చక్కని కవిత రూపంలో వివరించారు.

ఎందరో ఏవో సాకులు చెప్పి పనులు దొరకలేదని సోమరులుగా ఉంటూ కాలాన్ని వృధా చేస్తూ గడుపుతారు. ఇంకా ఎన్నో చెడ్డ పనులు చేస్తూ సమాజ ద్రోహులుగా జీవిస్తారు. ఇటువంటి వారికి ఇంకా కష్టపడి జీవించే వాళ్ళకు సైతం ఆమెను ఒక ఆదర్శమూర్తిగా తీర్చిదిద్దాడు. ఒక్కతే గంపనెత్తున ఎత్తుకుని నడుస్తూ వీదులలో వెళు ్ంది. అప్పుడు ఆమె సాహసం, ధైర్యం ఎంతో గొప్పగా అనిపిస్తుంది. ఆమె నడుస్తూ కాలాన్ని, దూరాన్ని వెనక్కి నెట్టివేస్తుంది. కుటుంబం కోసం తనుపడే కష్టం విరామం లేకుండా చేసే పనివల్ల తన కుటుంబం క్షేమంగాఉందో లేదో అనే విచారాన్ని కూడా వ్యక్తం చేశారు కవి తను కనబడకపోతే.

ఆమె పెట్టే కేకను అరుపుగా కాక ఒక సంగీత శకలం లాగా శ్రామిక లయగా వివరించారు. ఉన్న వాళ్ళను, లేని వాళ్ళను సమన్వం చేసే పని అనీ, హైదరాబాద్‌లోని ఏ ప్రాంతాలు తిరిగిందో కూడా పొందికగా వివరించారు. ఆమె ఎటువంటి తప్పు, మోసం చేయట్లేదు. గౌరవంగా తన కష్టాన్ని నమ్ముకుని బ్రతుకుతుంది. ఆమె చేసే క్రమంలో వచ్చే చెమటను ఆత్మగౌరవ జలంగా వివరించారు. తన కుటుంబం అనే సముద్రాన్ని దాటడానికి తమ శాయశక్తులా కృషి చేస్తుంది. ఆమె యువతిగా మొదలై వృద్ధురాలు అయ్యేవరకు ఆమె చేసే పనివల్ల ఎలా బక్కచిక్కిందో తన కాళ్ళు ఎంత అరిగిపోయాయి. ముంగురులు పలుచబడ్డాయి అని మెడలు వంకర్లు తిరిగాయి అని వర్ణించాడు. మానవ సంబంధాలు పెంచడంతో ఆమె చేసే పని ఎంతో ఆదర్శం.

తన వ్యాపారాన్ని కొనసాగిస్తూ నడుస్తూ నడుస్తూ ఒక సంచార కావ్యాన్ని లిఖించిందని అన్నారు. ఇటువంటి వాళ్ళు అసామాన్యులు. వీళ్ళు ఎవరికీ ఆదర్శాలు చెప్పరు. వాళ్ళ జీవితాన్ని కొనసాగిస్తారు. అంతే, హృదయంతో ఇటువంటి జీవితాలను చూసినపుడు ఒక చక్కని కవితలా, కావ్యంలా పుట్టుకొస్తుంది.

నేను ఎన్నో రకాల మాల్‌లు వచ్చి చిన్న వ్యాపారులకు జీవితం లేకుండా చేశాయి అయినప్పటికీ వెనకడుగు వేయకుండా ఎంతో ఆత్మవిశ్వాసంతో తన కుటుంబాన్ని బతికించుకోవడానికి మాల్‌లను వెక్కిరిస్తున్నట్టుగా చిన్న పడవ సైతం సముద్రాన్ని దాటుతూ ముందుకు సాగుతున్నట్టుగా ఎంతో ఆత్మగౌరవంతో తనపని కొనసాగిస్తూ ముందుకు సాగుతుంది.

ఆమె చేసే పనిలో భాగంగా "పాత బట్టలకు కొత్త బసాండ్లు" అంటూ పెట్టే కేక ఎంత గట్టిగా, ఎంత పద్ధతిగా, ఒక పాటలాగా లయబద్ధంగా ఉంటూ చెవులకు ఇంపుగా అనిపిస్తుంది అని అది ఒక కష్టజీవి పాడే పాటలాగా ఉంటుందని వివరించారు. తను చేసే పనిలో సహాయం అందించాలని చుట్టకుదురుగా మారిపోవాలని కవి హృదయం వెల్లడించారు. నెత్తిమీద పెట్టుకున్న గంపను పట్టుకోకుండా, కింద పడకుండా బాలెన్స్ చేస్తూ ఎంతో నేర్పుగా నడుస్తుందని ఇలా తన కుటుంబాన్ని చక్కగా బ్యాలెన్స్ చేసుకుటుందని తెలిపారు. ఆమె నడిచే క్రమంలో ఆమె శారీరక అందాన్ని కాదు చూడవలసింది శ్రమ అందాన్ని అని తెలిపారు. తన కుటుంబ పోషణకై ఎలాంటి తప్పటడుగులు వేయకుండా గౌరవంగా కష్టపడి బ్రతుకుతుంది. అందుకే ఆమె చిందించే ప్రతీ చెమట చుక్క ముత్యాల కన్నా విలువైన ఆత్మగౌరవ జలం అని అభిప్రాయం వెలిబుచ్చారు.

నేటి యువత పని చేయకుండా బద్ధకస్తులుగా మారిపోతున్నారు. ఎవరైనా సుఖంగా జీవించడానికి అలబాటు పడుతున్నారు. అటువంటి వాళ్ళకు తను ఆదర్శం. అన్ని ప్రాంతాలు ఒంటరిగా తిరుగుతుంది. అందరితో మంచి

సంబంధాలు పెట్టుకుంటుంది. వ్యాపారం సవ్యంగా కొన సాగిస్తూ ప్రజలకు ఇచ్చిపుచ్చుకోవడాలు నేర్పిస్తుంది. ఎందరో ఇళ్ళలో పేరుకుపోయిన చెత్తను తను ఎంతో అపురూపంగా పోగుచేసి కొత్తవాటికి అందిస్తుంది. ప్రపంచీకరణలో భాగంగా ఇదొక కొత్త పద్ధతి పాటిస్తుంది. తన కుటుంబ పోషణ కోసం తను ఎంత తపన పడుతుందో చేసే పనిలో మనకు అర్థమయ్యేలా ఎంతో చక్కగా కవితా రూపంలో వివరించారు. ఆమె పడే కష్టం, తన కుటుంబాన్ని ఒడ్డుకు వేసిందో లేదో కానీ తన వంతుగా చేసే ఆమె ఈ కష్టం మాత్రం ఎప్పటికీ తన జ్ఞాపకాల్లో నిలిచే ఉంటుంది అని కవి తన అభిప్రాయాన్ని తెలిపాడు.

నిజమే ఇటువంటి వాళ్ళను చూస్తే ఎంతో గౌరవంగా అనిపిస్తుంది. ఎవ్వరికీ తలొగ్గకుండా కష్టపడి తన కుటుంబాన్ని పోషించుకుంటుంది. అదీ ఎవ్వరికీ ఉప యోగపడని వాటిని సేకరించి ఉపయోగపడే వస్తువులు ఇచ్చి, నిజంగా ఇదే కదా ప్రపంచీకరణ. చిన్నప్పటి నుండి చూస్తున్న ఆమె కనిపించకపోతే ఏం చింత చేస్తుందో అని ఆలోచించడం వల్ల తనను కవి ఒక ఆత్మీయ విహంగంలా అభిప్రాయపడ్డాడు. ఈ కవితలో ఆమె సాహసం, ధైర్యం, పట్టుదల, సంకల్పం ఎంతో ఆదర్శప్రాయం అని నేటి యువతకు తెలియ చెప్పారు. ఈ కవిత ద్వారా పనిచేసి తన కష్టంతో బతికే యువత మరియు కవిత వ్రాసిన ఆచార్య ఎన్.గోపి గారు మన హృదయాలలో శాశ్వతంగా అత్యున్నత స్థాయిలో నిలిచారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు సాహిత్యంలో అత్యాచారాల పై కవిత్వం (శీర్షిక)

– జ్వలిత, హైదరాబాద్.

యుగయుగాలుగా పంజరం పై పక్షి చేసే యుద్ధమే కవిత్వం. యుగయుగాలుగా అణిచివేతకు హింసకు గురవుతున్న మానవి, తనపై జరిగే అత్యాచారాల గురించి రాసిన కవిత్వమే నేటి నా చర్చ అంశం. యుగయుగాలుగా అనుభవిస్తున్న హింసాత్మక సముద్రాన్ని , నెత్తురోడుతున్న ఆకాశాన్ని, గాయాలతో సలుపుతున్న భూమిని, ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు నిర్భయ మొదటిది కాదు దిశ చివరిదీ కాదు. కానీ జరుగుతున్న సంఘటనల పై కవిత్వం గురించి ప్రస్తావించడం కోసం ఒక నిర్దిష్టమైన కాలాన్ని సూచించడం కోసమే.మ నిర్భయ కంటే ముందే పూలన్దేవి రమీజాబి వంటి వారున్నారు. దిశ తరువాత మానస వంటి ఎందరో బాధితులున్నారు.

ఇప్పుడు అసలు అంశంలోకి వస్తే నిర్భయ సంఘటన తర్వాత వెజైన్ మోనో లాగ్ అనే కవితను ప్రస్తావిస్తాను.

"ఈ వ్యవస్థ ముఖం మీద/ నా సిగ్గుబిళ్ళను విసిరేసి వెళ్తున్నాను/ అత్యాచార చరిత్ర పేజీలేని నేల మీద/ మళ్లీ వెజైనా తో పుట్టాలని ఉంది / మళ్ళీమళ్లీ స్త్రీగానే అంటారు

నువ్వు నీ సెక్యూరిటీ కలిసి/ ఒక చిన్న వెజైనా రక్షించ లేక పోయాయి" అంటూ వ్యవస్థ మీద ఉమ్మారు కవయిత్రి.

"నా మీద లైంగిక దాడి జరుగుతున్న క్షణాన/ నేను తుమ్మ ముల్లు నై వాళ్లకు గుచ్చుకోవాలని అనుకున్నాను / విష కన్యను కానందుకు చింతించాను/ నా వెజైనా మీద హింస పరాకాష్ఠకు చేరుకున్న/ ఆ అవాంచిత విషాద సమయంలో/ నేను అస్థిత్వం కోసం ప్రతిఘటించాను / పోరాడి గాయపడి చివరికి ముగిసి పోయాను" అంటారు మెహ జబీన్.

"మీ కోరికలు రేపే మెదళ్ళ స్థానంలో/ దయగల హృదయాలను ఇవ్వమని/ క్యాస్ట్రేషన్ అవసరం లేకుండా/ కరిగి పోయే మైనపు లింగాలు కావాలని/ మాకు ఆసన స్థానంలో/ గిలిటెన్ యంత్రాలను మాత్రమే ఇవ్వమని/ కామాఖ్య యాగం చేస్తాన్నాం" అంటారు జ్వలిత "కామాఖ్య యాగ" అనే కవితలో.

"ఏదీ స్వాతంత్ర్యం" అనే కవితలో " చిన్నారి నక్షత్రాల రక్తంతో / త్రివర్ణ చీరెపుడో మాసిపోయింది/ గొంతు దాటని ఆర్తనాదాలతో/

పండుగలన్నీ ఆబ్ధికాలయ్యాయి/ సమిధలైన లేత కాయంతో /మృగ చరిత లిఖించబడుతుంది!"

అంటారు రవీణ చవాన్ అనే కవయిత్రి పూణె నుండి.

"సామూహిక బలత్కారాలకు ఎర అయి / లైంగిక హింస నడిపిన స్త్రీల మన శరీరాల క్షోభనూహించగలరా?/ అంగాన్ని ఆయుధంగా చేసుకున్న నర పశువుల అంగాన్ని తెగ నరకాలని మాకు ఉంటే/ హింసకు ప్రతి హింస ఎలా తప్పు అవుతుందిరా?" అని అని ప్రశ్నిస్తారు జయప్రభ.

"ద్వాపర నాటి వస్త్రాపహరణ సభ /ఈనాడూ పునరావృతం అగుట వ్యధ" అంటారు అనసూయ.

"అందమైన దోపిడీకి/ పవిత్రమైన హింసకు/ న్యాయమైన దాస్యానికి/ బలైన నేను భారత స్త్రీ ని" అంటున్నారు ఓల్గా.

" మొలకలు రుధిర జ్వాలలు" అనే కవితలో

"పిండ దశ నుండి మగాళ్ళ స్పర్శలోని మర్మాన్ని/ చూపుల్లో కామాన్ని / మాటల్లో క్రౌర్యాన్ని/ కనిపెట్టగలిగే టిప్స్ కూడా పేగు తాడుతో అప్లోడ్ చేయాలి / ఇప్పుడు ఇక్కడ పసి మొలకలన్నీ/ అభిమన్యుడికి మల్లె / గర్భం లోంచి యుద్ధ విద్యలను అభ్యసిస్తున్నాయి " అంటారు అయినంపూడి శ్రీలక్ష్మి.

"ఆడ జాతిని అణగ్గొట్టే/ మగ సెగలను ఎగదోసే/ మందు మాధకాల్నీ/ బూతు సినిమాల్ని /సీరియలళ్ళనీ/ సెల్లు సెక్సుల్నీ/ బంధు పెట్టి /బొంద పెట్టుండ్రీ" జూపాక సుభద్ర "విష వివక్షలు - పాయేదేర్ల పాపాలు" అనేక కవితలో.

"ఆమె కాల్చి వేయబడుతుంది /ఆమె ఆక్రందన పొలిమేర దాటదు/ ఆమె ఒక్కరోజులోనే పాత వార్తగా మారిపోతుంది" మెర్సీ మార్గరెట్, ఆమె వార్త, అనే కవితలో.

"ఈ భయము బ్రతుకులు మాకొద్దు/ జింకలకి మాత్రమే కాదు /ఆడవారి కోసమూ అభయారణ్యాలు కావాలి" అంటారు నస్రీన్ ఖాన్ "ఆడవారికి అభయా రణ్యాలు" అనే కవితలో.

"ఎవరి జన్మ రహస్యాన్ని దాచడానికి మనకీ నరకం/ ఈ మారణకాండకు కారణమయ్యే /పునరుత్పత్తి అవయవాలు మనకొద్దు" అంటారు 'మనకొద్దు 'అనే కవితలో లక్ష్మీభవానీపల్లి ,నెల్లూరు నుండి.

"ఎక్కడ? మానవ విలువలు" అనే కవితలో

"మద్యం మత్తులో మమకారం మరిచే
కన్నతండ్రన్న స్పృహ కూడా లేదాయే
మానవత్వం మట్టిలో కలిసిపోయే
ఎక్కడకు పోతున్నం ఏమవుతున్నం"

అంటారు యడవల్లి శైలజ, ఖమ్మం నుండి.

"పసివాని చేతిలో ఆండ్రాయిడ్ /ఉచిత వైఫైతో అదుపులో లేని అశ్లీలాలందిస్తుంటే/ విజృంభించి విహ రించే ఆ అంగాన్ని తొలగించితే/ మరో కామ తృష్ణ భయ పడుతుంది" అంటారు "విష బీజం" అనే కవితలో గాలి లలిత ప్రవల్లిక .

"వికసించని మొగ్గ" అనే కవితలో "ముక్కు పచ్చ లారని పసిపాప/ ఆడతనమే తెలియని ఆడపిల్లను / అచ్చోసిన ఆంబోతులు / నుసి చేశాయి పసి మొగ్గను" అంటారు కాళంగి వసంత.

"చిన్న పిల్లలను పసితనంలో బలిచేస్తున్నరు / చిన్న పిల్లలు పసి మొగ్గలతో సమానం/ ఊహ తెలియని వయసులో/ అత్యాచారంకు

గురవుతున్నారు / చదువుకునే వయసులో కాటేస్తూనె ఉన్నరు" అంటారు "చిన్న పిల్లలు" అనే కవితలో తిరునగరి సంధ్య, ఖమ్మం.

"నాలుగు చుక్కల అంగవిలాసానికి/ఎందుకంత పైశాచికం/ఇంకా పురుడుపోసుకోని- ఆడతనపు బలి పర్వం/ ఎన్నాళ్ళని సహించడం/నలిగినబాల్యంపై పొర నిర్మాణం/

కత్తిమీదసామనితెలిసినా/రాజ్యమా ఎందుకుఉ లికిపడవు/ నరాలు పిడికిలెత్తుతున్నాయి/ కన్నులు నిప్పు లవుతున్నాయి/ కోపం ఉప్పెనవుతుంది" అంటారు డా. శారదాహన్మాండ్లు, నిజామాబాద్.

"మమ్మల్ని ఆడించామన్న ఆనందపు అహం మీది/
బలహీనతల బానిసత్వపు పిరికితనమూ మీదే/
రక్తసిక్త దేహాలతోనూ చెదరని చిరునవ్వు మాది/
పీల్చి పిప్పిచేసినా తరగని ఆత్మవిశ్వాసం మాది/
ఆకాశంలో మేము సగమో పావో తెలియదు/
అవనిపై మహిళలను అవమానించిన కొద్ద/
మరింతగా ముందుకు దూసుకుపోతుంటాం/

సమగ్ర మహిళా వికాసంతో ప్రగతిపథంలో పయ నిస్తాం" అంటారు సమ్మెట విజయ "యుద్ధం" అనే కవితలో.

"పురుషావేశం పొంగినప్పుడల్లా/ సమాధానం లేని ప్రశ్నలా మిగులుతోంది స్త్రీ/ గాయం తగిలిన గుండెను ఒక చేత్తో/ చిధ్రమైన శరీరాన్ని దాచుకునే ప్రయత్నాన్ని మరో చేత్తో/ మోయ లేక మోయడం తప్ప మరే మార్గం కనుగొన లేక పోతోంది" అంటారు "సృష్టికేతనం" అనే దీర్ఘ కవితలో శైలజ మిత్ర.

"వావివరుసలులేక మృగమైన పురుషపుంగపులు మారేదెప్పుడు/ఎన్ని నిర్భయ దిశ చట్టాలు అమలైతున్నా/

తనంతటతాను నియమనిష్ఠలను ఏర్పర్చుకోలేకపోతే/ ఎప్పటికీ మార్పుజరగనే జరుగదు కద జగతిన /స్వయం క్రమశిక్షణ,స్వయంనియంత్రణ కావాలి/ మగవాడా మృగానివికాకు" అంటారు ముడుంబైఆచార్య పద్మశ్రీ "మొగాడు" అనే కవితలో.

"ఏడ దాచాలి /మా ఆడ కూతుళ్లను /కుళ్ళిపోతున్న దుర్గంధం నుండి /మదమెక్కిన పుండా కోరులనుండి/ చేవ చచ్చిన చట్టాల నుంచి" అంటారు" కలి" అనే కవితలో రమాదేవి కులకర్ణి, రంగారెడ్డి నుండి .

వికసించని మొగ్గలపై తుమ్మెద వాలదు/ క్రూర జంతువులు కూనల వైపు కన్నెత్తవు/ చేపలని చెరపట్టే కొంగలై/ పసితనం పై పాపం పడగ విప్పుతుంది" అంటారు 'బండి ఉష' ఖమ్మం నుండి, పందిరి అనే కవితలో.

"ముందడుగు వేయండి" అనే కవితలో

ఇది నవయుగమా..నవీన యుగమా..కాదు..కాదు. పాపం
పెల్లుబికె పాపపు యుగం.
వావి వరస చూడక అఘాయిత్యాలు చేస్తున్నారు
వీరికామాన్ని ఏ కాష్టంలో వేసి కాల్చాలి
ఏ భోగిమంటల్లో వేసి మసిచేయాలి
ఆడపిల్లకాదు.. పులికావాలి
గాండ్రించి..గర్జించాలి"

అంటారు గాజుల భారతి శ్రీనివాస్. ఖమ్మం నుండి

"ఆడతనమే శాపమా" అనే కవితలో "నిండు తనమే లేదంటూ/ అంగాంగ ప్రదర్శనమే మీకు చేటంటు/ మాటల తూటాలు/మరి పాలు గారే పసిదానికి ఏ అంగం వృద్ధిచెందినది/ కామవాంఛలు తీర్చుకొని కాటికి పంపే మృగ మాయారోగాలు/ ముదిమి వయసలో నైన/ పాలు తాగే పసి తనమైన/ ఆడ తనమే శాపమై వేదింపులు" అంటారు తులసి గుగులోతు, భద్రాద్రి కొత్తగూడెం.

"తనయను సైతం కామానికి బలిచ్చే కామాంధుల మైకం/పసికూనలకు కూడా రక్షణలేని దౌర్భాగ్యపు లోకం/ మానవత్వం మృగత్వం అవుతుందని తెలిసీ మద్యం నిషేదించని ప్రభుత్వాన్ని నిలదీయాలా/తప్పెలా చెయ్యొచ్చో పదేపదే చూపించే మాధ్యమాల ధోరణి మార్చాలా " అంటారు, "ఓదార్పు కాదు మార్పు"అనే కవితలో రాజశేఖరుని శ్రీ శివ లక్ష్మి.

చెప్పలేను...కాని చెప్పక తప్పట్లే అనే కవితలో

"ఏమని చెప్పను
ఎలా వర్ణించను
ఆడ దాన్ని ఆట బొమ్మగా చూసే సమాజంలో
ఏడ ఉన్నది మానవత్వం ఆనవాలు
వాయి, వరస లేని రాక్షసత్వంలో
ఎలా బ్రతకనూ"

అంటారు శ్రీలత సవిడిబోయిన అనే కవయిత్రి.

కవయిత్రి రాగా రాజేశ్వరి "నీ ఉనికికే చేటు" అనే కవితలో

"ఆడతనపు ఆకారమే అమ్మగా వచ్చి/
జన్మ యిచ్చి లాలించగా/ అమ్మా అమ్మ అని

పిలుస్తూ/ ఆమె చేతి అన్నం తింటూ/ రక్త మాంసాలుగా ఎదిగి/ ఆడతనమునే నుంచే/ నీచ రూపమే భూమికి భారము నీ ఉనికి/ జన్మ క్షేత్రాన్ని చిద్రం చేసే/ పేరులేని మృగాల పైశాచిక ఆనందాన్ని అనుభవిస్తూంటే/ గుండె పగిలి విస్తు పోయే వుడమి తల్లీ" అంటారు.

"మగువ జీవితం "అనే కవితలో" ఎలా? చెప్పను/ నా వ్యధ/ ఇరుగుపొరుగు, సహోద్యోగులు లైంగిక వేధింపులు ../ మానవత్వం లేని పోకడలు రాక్షసత్వం తో/ మద్యం మత్తులో అత్యాచారాలు/ ఏమరుపాటు లో కామాంధుల కాటుకు గురి అవుతానేమోనని/ క్షణ క్షణం భయం భయం ఎలా బతకను?" అంటారు మరింగంటి పద్మావతి, భద్రాచలం నుండి.

ఓ మగతనపు ఆకారమా నీ వునికి చేటు...

"ఖబడ్దార్" అనే కవితలో "దుర్యోధా విత్తనాలను పోగేసుకుంటూ/

కోరికల గుర్రాలపై స్వారీ చేసే దుర్మార్గం నీదైతే/
యమపురికి మార్గంచూపే/అగ్గితెగువే లలన" అంటారు
సోంపాక సీత, భద్రాచలం నుండి.
క్షమించండి. శీర్షిక లేదు!
"వాడుపరిచితుడో అపరిచితుడో ఎవరైతేనేం?/
ఇంటనో బైటనో ఎక్కడైతేనేం?/
పెద్దరికం మారణాంగాలతో వెంటపడుతున్నది/
పసిపిల్లల చుట్టూ/
కంచెలు వేసుకోవాల్సిన కాలం దాపురించింది"

అంటారు అరణ్య కృష్ణ.

"దొంగ సన్యాసి వచ్చి సీతనెత్తుకెళ్ళాడు/ ఇప్పుడైతే అత్యాచారం చేసి హత్యాచారం పాటించే వాడేమో" అంటారు "సూర్యరసం" కవితలో రావి రంగారావు.

ఫెమినిస్టు కవయిత్రులకు పురుషాధిక్య సమాజంపై కసి కోపం ఎక్కువైంది. కసి కోపంతో కాస్ట్రేషన్ కోరితే సరిపోదు. అందులో కవిత్వం లేకపోతే ఎట్లా అంటాడు ఒక కవి విమర్శకుడు. అయితే బాధను, నొప్పిని, అవమానాన్ని, సైద్ధాంతికరించడం, కవిత్వ పరిధిలోని సభ్య భాషలోనే మాట్లాడలనడం సమస్యను పక్కదోవ పట్టించే పలాయన వాదం (ఎస్కేపిజం)అంటాను నేను.

నిర్భయ సంఘటన తర్వాత ముంబైలో "విజువలైజ్ ముంబై" అనీ, ఢిల్లీ యూనివర్సిటీలో గోడల మీద ఒక కిలోమీటర్ పొడవున "డిజైన్ చేంజ్" అంటూ మార్పునకు రూపకల్పన చేద్దాం అనే పేరుతో 500 మంది చిత్ర కారులు తమ కుంచెలకు పని చెప్పి హత్యాచారాల చిత్రిం చారు. దీనిని టాటా హౌసింగ్ బ్రాండ్ ప్రమోషన్స్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించింది.

అత్యాచారాలను మానవ సమన్యగా సామాజిక సమస్యగా గుర్తించకుండా కేవలం స్త్రీల సమస్యగా భావించిన్నాళ్ళు. అవి ఆగవు కొనసాగుతూనే ఉంటాయి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రాయలసీమ కథ – ప్రాంతీయ ఆస్థిత్వం (1981 – 90)

– కె. సంగాలు, తెలుగు విభాగం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం.

ప్రాదేశిక సరిహద్దుల్ని అంచనా వేసి పరిణామాల్ని విశ్లేషించడానికి పరిశోధకులు చాలా విషయాలను పరిశీలిస్తారు. చరిత్ర, భౌగోళిక పరిస్థితులు, భాష, సామాజిక సాంస్కృతిక పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు అనేవి అత్యంత ముఖ్యమైన అంశాలు. రాయలసీమ చారిత్రకంగా ఒక ప్రత్యేక ప్రాంతమని విశ్లేషించడాననికి నిర్దిష్టమైన ఆధారాలున్నాయి. క్రీ.పూ. 3వ శతాబ్దినాటి మౌర్య సామ్రాజ్యంలో ఒక ప్రధాన ప్రదేశంగా ఉన్నప్పటి నుండి నిన్న మొన్నటివరకూ కూడా అనేక సామ్రాజ్యాల్లో అంతర్భాగంగా వుంటూనే వచ్చింది. మౌర్యుల కాలంలో సువర్ణ రాష్ట్రంగా తర్వాత హిరణ్యక రాష్ట్రంగా, మధ్యయుగంలో రేనాడు, ఆతర్వాతి కాలంలో మహారాజ వాడిగా ఈ ప్రాంతాన్ని పిలిచారు. విజయగనర చక్రవర్తుల కాంలో మొత్తం సామ్రాజ్యానికి హృదయ స్థానంగా రాయలసీమ వుండేది. హరిహర బుక్కరాయల నుండి తల్లికోట యుద్ధ పతనం వరకు (ఆ తర్వాత కొంతకాలం) ఒక ప్రత్యేక ప్రాదేశికత ఈ ప్రాంతానికి వుండేదనడం చారిత్రక వాస్తవం. దీనికి కొన్ని పరిమితులు కూడా వున్నాయి. 17వ శతాబ్దిలో నడిమింటి వెంకటవతి అనే కవి తన ''అభిషిక్త రాఘవము'' అనే కావ్యకృత్యాదిలో కృతిభర్త మట్ల అనంతరాజును గురించి వ్యాఖ్యానిస్తూ ''రాయలసీమ'' అనే మాటని మొట్టమొదటిసారిగా వాడినట్లు పరిశోధకులు భావిస్తున్నారు. అయితే, 1899 నాటి వెల్లస్లీ సైన్యసహకార పద్ధతి లోని దత్త మండలాలుకు 1928 నంద్యాల ఆంధ్రమహా సభలో ప్రస్తావనకు వచ్చిన రాయలసీమకు కూడా భౌగోళికంగా తేడాలున్నాయి. 1956 నాటి భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పాటులో అత్యంత ముఖ్యమైన తుంగభద్ర డ్యామ్, చారిత్రక ప్రాంతమైన హంపీ ప్రాంతాలు, అపార ఖనిజ సంపద కలిగిన ప్రాంతాలు బళ్ళారి జిల్లాగా కర్నాటక రాష్ట్రంలోకి కలిసి పోవడం రాయలసీమకు భౌగోళిక, చారిత్రక విషాదం.

ఒక ప్రదేశాన్ని నిర్దిష్ట సమయంలో చారిత్రక నేపథ్యంతో అవగాహన చేసుకోవడానికి సాహిత్యం అత్యంత ముఖ్యమైన వనరు. సామాజిక చలన సూత్రాల్ని అంచనా వేయడంలో సాహిత్యం నిర్వహించే పాత్ర చాలా విలువైనది. రాయలసీమ ప్రాంత భౌగోళికత, మాండలికత, చరిత్ర రాయలసీమ ఒక ప్రత్యేక ప్రాంతమని నిర్ధారిస్తాయి. విద్వాన్ విశ్వంగారి ప్రసిద్ధ ''పెన్నేటి పాట''కు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు పీఠిక వ్రాస్తూ ''రాయలసీమ నేడు అఖిలాంధ్రదేశములో ఒక విశిష్ఠ ఖండముగా ఏర్పడి యుండుటకు దాని ఇప్పటి దరిద్రావస్థ ఆ దశ నుండి ఇప్పటి దరిద్రావస్థకు కారణాల్ని 1956 నాటికే వారు గుర్తించారు. చెరువుల విధ్వంసం, తలపరికలు (నీటిబుగ్గలు) ఎండిపోవడం, మహారణ్యాలు కొట్టివేయడం పొరుగు ఉన్న కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమలోకి ప్రవహిస్తున్న నదులకు ఆనకట్టలు నిర్మించడం వంటివి రాయలసీమ అభివృద్ధి లేమికి కారణాలుగా 1956 నాటికే రాళ్లపల్లి వారు గుర్తించారు. రాయలసీమ అభివృద్ధి లేమికి కవిత్వ వేది కల్లూరు నారాయణరావు కూడా ఇటువంటి కొన్ని కారణాలను దాదాపు ఈ సమయంలోనే గుర్తించారు.

ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో రాయలసీమ ఒక పెద్ద క్షామంతో తగలబడుతోంది. ఇక్కడ కొన్ని అంశాలు చర్చించుకోవాలి. 1941-44 మధ్య భారత దేశాన్ని ఒక భయంకర కరువు పట్టిపీడించింది. బెంగాల్ ప్రాంతాన్ని మరీ నాశనం చేసింది. ఆ కరువు సృష్టించిన భయంకర పరిస్థితులను పత్రికలలో చదివి ప్రసిద్ధ తెలుగు కవి బాలగంగాధర తిలక్ ''భూలోకం'' అనే పేరుతో

బెంగాల్ కరువును కవిత్వం చేశారు. కరువుతోపాటు అంటు రోగాలతో దాదాపు 10 లక్షల మంది కాటికాపురికి శవాలై వెళ్ళిపోయారు. నిజానికి ఆ భయానక కరువు రాయలసీమను కూడా విధ్వంసం చేసింది. పంటలు లేకపోవడం వల్ల ఉద్యోగులు జీతాలు ధన రూపంలో తీసుకోక ధాన్య రూపంలో తీసుకున్నారు. ప్రజల మానాభిమానాల్ని ప్రశ్నార్థకం చేస్తూ ధరించడానికి దుస్తులు కూడా లేవు. అనేక ఆకలిచావులూ జరిగాయి. అందువల్ల ధాన్యంతోపాటు బట్టల్ని కూడా దానం చేయాల్సి వచ్చింది. రాయలసీమ దుర్భిక్షత విని మైసూరు మహారాజావారు విరాళం పంపారు. అయితే రాయలసీమలో బలమైన పత్రికలు లేకపోవడం, బెంగాల్ ప్రాంతం నుండి గొప్ప స్వాతంత్రోద్యమ పత్రికలు వస్తూవుండటం, స్వాతంత్రోద్యమానికి బెంగాల్ స్ఫూర్తిదాయక ప్రాంతం కావడంవల్ల తిలక్ ఆ ప్రాంత కరువు గురించి కవిత్వం వ్రాశారు. బహుశా అందువల్లనే కవిత్వవేది కల్లూరు నారాయణరావు గారు రాయలసీమ అభివృద్ధి లేమికి పత్రికలు లేకపోవడం కూడా ఒక కారణంగా పరిగణించారు. అన్నట్లు 1945లోనే వంగదేశాన్ని కరువు వదలి వేసింది. కాని రాయలసీమలో 1945-46 వరకూ ఆ కరువు కొనసాగింది సుమా! అందుకే భూమన్ గారు చెప్పినమాట సత్యం. 1947 సంవత్సరానికి ముందు తర్వాత రాయలసీమ సమాజంలో పెద్ద మార్పులేమీ జరగలేదు. 1948 కరువు, 1951-54 నాటి భయానక గంజి కరువులు ఈ వాస్తవాల్ని తేల్చి చెప్పాయి. గంజికరువు పరిస్థితుల్ని బెళ్ళూరి శ్రీనివాసమూర్తి గారు "గంజికేంద్రము" ఖండికతో వ్రాసిన పది పద్యాలు, భైరపురెడ్డి నారాయణరెడ్డి గారి "రాయలసీమ రైతు" కావ్యం వంటివి నాటి కరువుకి నేటికీ మిగిలిన సాక్ష్యాలు. 1955లోనే ప్రసిద్ధ రాయలసీమ కన్నీటి పాట విద్వాన్ విశ్వం "పెన్నేటిపాట"గా రావడం గమనార్హం.

అయితే 1980 నాటికి రాయలసీమలో కొన్ని సంఘటనలు జరిగి బలమైన సామాజిక పరిణామాలకు కారణభూతమయ్యాయి. వేల సంవత్సరాల నుండి రాయలసీమ ఆహార పంటలకు ప్రసిద్ధి. 16వ శతాబ్ది ప్రబంధ కవిత్వమే ఇందుకు గొప్ప సాక్ష్యం. 1980 సంవత్సరానికి కొంత అటూ ఇటూగా ఆహారపంటల స్థానంలో వ్యాపార పంటలు రంగ ప్రవేశం చేశాయి. ప్రభుత్వం విపరీతంగా సబ్సిడీలిచ్చి మరీ ప్రోత్సహించింది. సహజంగానే రైతాంగం ఆ వ్యాపార పంటల మోజులో విపరీతమైన అప్పుల్లోకి కూరుకు పోవడం మొదలైంది. ఈ వ్యాపార పంటల్లో కొన్నింటిని వర్షాధారంగాను, మరికొన్ని పంటలను సాగునీటితో పండించే ప్రయత్నం జరిగింది. సాంప్రదాయక నీటి వనరుల స్థానంలో బోరుబావులు ప్రవేశించాయి. భూగర్భ జలాలను విపరీతంగా తోడివేయడంతోపాటు సాంప్రదాయ నీటి వనరుల వల్ల నిర్లక్ష్యం కూడా ఎక్కువైంది. బోరుబావులకు అవసరమైన ఇందనకొరత (కరెంటు, ఆయిల్) కూడా తీవ్రమైంది. పంటలకు కొత్తకొత్త చీడపీడలు ప్రవేశించాయి. ఇదే సమయంలో రాష్ట్ర రాజకీయ రంగంలోకి కూడా రాయలసీమ ముఠా కక్షలు ప్రవేవించడం రాష్ట్ర రాజకీల్లో కొత్త మలుపు స్వాతంత్రోద్యమ కాలంనాటి నాయకులే 1980 దాకా దాదాపు రాజకీయ నాయకులుగా చలామణి అయ్యారు. ఈ నాయకులకు ఫ్యాక్షనిస్టులు వెనుదన్నుగా వుండి ఓటు బ్యాంకుగా ఉపయోగపడ్డారు. 80వ దశకానికి కొంత అటూఇటూగా ఫ్యాక్షనిస్టులే రాజకీయ నాయకులుగా రూపాంతరం చెందడం మొదలైంది. 80వ దశకం ప్రారంభంలో ఏర్పడ్డ ఒక ప్రాంతీయ రాజకీయ పార్టీకి మరొక జాతీయ పార్టీకి రాయలసీమలోని ఈ కొత్త తరమా ఫ్యూడల్ ఫాక్షన్ రాజకీయ నాయకులే ప్రధాన ఆధారం. రాయలసీమ స్థితిగతులన్నీ ఈ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

రాయలసీమ వ్యవయాం "జూదం" (1978) వంటిదని సింగమనేని గారు 70వ దశకం చివరల్లోనే వ్యాఖ్యానించడానికి రాయలసీమ వ్యవసాయంలోని ఈ పరిణామాలే ముఖ్యకారణం. ఆంధ్ర రాష్ట్రంలోని ఏ ఇతర ప్రాంత

రచయితా ఈ సమయానికి జూదంగా అభివర్ణించలేదు. ఈ స్థలకాల చైతన్యం సింగమనేని గారి "ఊబి" (1982), "విముక్తి" (1987) కథలలో చాలా స్పష్టంగా కన్పిస్తుంది. 1991లోని "అడుసు" కథ మార్కెట్ దోపిడీని ఎదుర్కోలేక తన చీనితోటను (బత్తాయితోట) రైతు నరికివేసుకొనే వైనాన్ని వ్యక్తీకరిస్తుంది. బోరింగ్ వేయాలనే ప్రదర్శనా ప్రభావానికి లోనైన స్థితి ఇది. కె.సభా గారు "పాతాళగంగ" వంటి కథల్లో దిగుడుబావుల తవ్వకాలలో చితికిన రైతు జీవితాల్ని చిత్రిస్తే తర్వాత పాతికేళ్ళకు బోర్లు ప్రవేశించి రైతు జీవితాన్ని మరింత దుఃఖమయం చేశాయి. ఈ స్థితే "ఊబి". "రాయలసీమ తొలితరం కథకుడైన జి.రామకృష్ణ కథా రచన మానివేసిన తర్వాత దాదాపు 20 సంవత్సరాల కాలం ఆ నూతన చైతన్యానికి వారసులు దాదాపు లేకుండా పోయారు. ఈ స్థానిక జీవిత చైతన్యం సింగమనేని కథలతో పునఃప్రారంభమైనదని చప్పవచ్చు" అని వల్లంపాటిగారి విశ్లేషణ.

కేతు విశ్వనాథరెడ్డి గారు 60వ దశకం ప్రారంభంలో కథారచన ప్రారంభించారు. స్థానిక చైతన్యంతో రాసిన "గడ్డి" (1981), "నమ్ముకున్న నేల" (1982), "పీర్లసావిడి" (1980), "కూలిన బురుజు" (1988) వంటి కథలు చాలా అపురూపమైనవి. కరువులలో పశువుల పోషణ, వాటి స్థితిగతుల్ని "గడ్డి" విశ్లేషిస్తుంది. వ్యవసాయాన్ని మార్కెట్ నిర్దేశిస్తుంటే ఏర్పడిన సరికొత్త దళారి వ్యవస్థను "అన్న దాతలు" కథ ఆవిష్కరించింది. కేతు విశ్వనాథరెడ్డి గారు అనగానే అందరికీ గుర్తొచే కథ "నమ్ముకున్న నేల". రైతుకూ వ్యవసాయానికి మధ్య వున్న సంబంధం విధ్వంసం అయిన విషయాన్ని తెలియజేస్తుందీకథ. కరువులు, వ్యవసాయ విధ్వంసాల వల్ల లబ్ధిపొందే ఒక వర్గం, భూమి బంధాన్ని తెంచుకొని చదువరులై పట్టణానికి వలసపోయే ఒక మధ్యతరగతి వర్గం, వ్యవసాయాన్ని వదిలివేయాలని నిశ్చయించుకొన్న రైతులు, అప్పటికే గ్రామాలలోకి ప్రవేశించిన రాజకీయ పార్టీల చైతన్యం వంటి అంశాలు మూర్తీభవించిన కథ "నమ్ముకున్న నేల". కరువులు వస్తే రైతుల అవకాశాల్ని, అవసరాల్ని తనకు అనుకూలంగా మార్చుకొనే ఒక వర్గాన్ని రాయలసీమలో శతాబ్దాల క్రిందటే గుర్తించిన ఒక అరుదైన విషయాన్ని ఇక్కడ కొంత విశ్లేషించుకోవాలి. క్రీ.శ.1402, క్రీ.శ.1442-54 లలో వచ్చిన కరువులలో రాయలసీమలో ఊర్లకు ఊర్లనే మంత్రయ్య అనే పన్ను గుత్తేదారు కొన్నాడని కంభంపాటి సత్య నారాయణ గారు సాక్ష్యమిస్తున్నారు. ఈ కరువుల్ని అవకాశంగా తీసుకొని రాయలసీమ నుండి మనుషులను కొని బానిసలుగా మార్చే విధానాన్ని కూడా విదేశీ యాత్రికుడు దార్తే బార్బోసా ధ్రువీకరిస్తున్నాడు. రాయలసీమ సరిహద్దు ప్రాంతాలకు చెందిన ఎర్రాప్రెగ్గడ కూడా కరువులలో మనుషులను కొనడాన్ని ధ్రువీకరిస్తాడు. ప్రాచీన సాహిత్యం, చరిత్రలలోనే కాదు ఆధునిక రాయల సీమ కావ్యమైన పెన్నేటిపాటలో కూడా ఈ వర్గాన్ని చాలా స్పష్టంగా విద్వాన్ విశ్వం గారు గుర్తించారు. రంగడు పనిచేసిన పెద్దిరెడ్డి కుటుంబం ఈ వర్గానికి చెందినదే. విశ్వం గారు పెద్దిరెడ్డి కుటుంబాన్ని చిత్రించిన తీరుకూడా చాలా ఆలోచనాత్మకంగా వుంది. నారపరెడ్డి ఫ్యూడల్ భావజాల స్వభావానికి తోడు దుబారా ఖర్చుకూడా అతని పతనానికి కారణాలైనప్పటికీ కరువు తీవ్రతే అత్యంత ముఖ్యమైన అంశం. నారపరెడ్డి అయిపోయాడు. కేతు విశ్వనాథరెడ్డి గారి "నమ్ముకున్ననేల" కథలో ఉత్తర భారతం నుండి వచ్చి చాలా తక్కువ ధరకు భూములు కొన్న వ్యాపారులు, స్థానికంగా వుండే అంగడి సుబ్బ రాయుడు వంటి వారు కరువులను ఆసరాగా చేసుకుని ఎదిగే పరాన్నజీవులు. ఈ వర్గాన్ని 500 సంవత్సరాల కిందట రాయలసీమ బుద్ధి జీవులు గుర్తించడం చాలా గొప్ప విషయం. కరువులకు శాశ్వత పరిష్కారంగా పారిశ్రామికీకరణ అనే అంశంలోని బలహీనతల్ని కూడా చాలా లోతుగా అంచనావేసిందీకథ.

కేతు విశ్వనాథరెడ్డిగారి "పీర్లచావిడి" కథకి కొనసాగింపు "కూలి బురుజు" కథ. రాజకీయ పార్టీల విధానం, అవిచేసే ప్రజా విభజన, "గడ్డి" కథలో ఫ్యూడల్ స్వభావాన్ని

ఎదిరించడం, ప్రభుత్వం పంపిణీచేసే గడ్డిని ఎక్కువ భాగం తీసుకున్న మునసబుకు వ్యతిరేకంగా ముఠాల ఏర్పాటు వంటివి ఫ్యాక్షన్ దశకు పూర్వదశను వివరిస్తాయి. వీటి కొనసాగింపులోని ఫ్యాక్షన్ వికృత దశను వివరించేదే "కూలిన బురుజు" అయితే ఈ కథ ఫ్యాక్షన్ సమస్యకు కారణాలనూ చెప్పదు. పరిష్కారాలను చెప్పదు. ఫ్యాక్షన్ వేళ్ళూనుకునే దశను, ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించే రాజకీయ పార్టీల విధానాన్ని లోతుగా విశ్లేషిస్తుంది.

1980-82 సంవత్సరాల మధ్య భిన్న పత్రికల్లో తన కథల్ని వై.సి.వి. రెడ్డిగారు "గట్టి గింజలు" సంపుటిగా 1982లో తీసుకువచ్చారు. అయితే వీటిని కథా స్కెచ్‌లని విమర్శకులు భావిస్తున్నారు. వీటిలో తాత్త్విక పునాది, నాటకీయత లేవుగాని, జీవితం మాత్రం నిండుగా తొణికిసలాడింది. ఈ కథల్లోని పాత్రలు మూడు మూర్తులా రాయలసీమ పేద బతుకులే. అందరికీ కాస్తో కూస్తో భూమి వుంటుంది. అయితే రైతు జీవితంలోని అనేక సమస్యలకు భూమి పరిష్కారం కాదు అనే విషయాన్ని స్పష్టంగా విశ్లేషిస్తాయి ఈ కథలు. రాయలసీమ జీవితం పట్ల అవగాహన, రచయిత దృక్పథం వంటివి ఈ కథల్లో గమనించదగిన ముఖ్యమైన విషయాలు, కరువులు, ఫ్యాక్షన్, ఫ్యాక్షన్‌ను పోషించే రాజకీయ పార్టీలు, కుల సమస్యలు వంటి అంశాలు గట్టి గింజల సంపుటి వస్తువులు.

అరవైయవ దశకం ప్రారంభం నుండి కథా రచన చేసిన మరో ప్రసిద్ధ కథకులు పులికంటి కృష్ణారెడ్డి గారు. రాయలసీమ ఫ్యాక్షన్‌కు మూల స్వభావమైన ఫ్యూడల్ ఆధిపత్య భావజాలం, కరువులు రాయలసీమ ఆర్థిక వెనుకబాటుతనం వంటి అంశాలు వీరి కథా వస్తువులు. 1982లో పులికంటి రాసిన రాయలసీమ గ్రామీణ కరువు కథ "గొడ్లు". స్వచ్ఛమైన రాయలసీమ మాండలికంల పశువులకు, రైతులకు వున్న ఆత్మీయ సంబంధాన్ని కన్నీళ్ళతో వివరించే కథ. ఈ కథ చక్రవేణు గారి "కసాయి కరువు" లాంటి కథ. కథలోనే చెప్పినట్లు "అబ్బోడా! ఆడబిడ్డను సాకి సంతరిస్తాము. సల్లంగా బతకాలని యెవుడో ఒకడి సేతిలో పెడ్తాం. తీరా ఆ బిడ్డ ఇల్లొదిలి పోయేటపుడు ఇల్లెగిరిపోయేటట్టు ఏడుస్తాం..." అంటూ ఆడబిడ్డకు, తల్లిదండ్రులకు ఉన్న సంబంధం లాంటిదే రైతుకూ, పశువులకూ వున్న బాంధవ్యమని అంచనా వేశారు. రాయలసీమ గ్రామీణ జీవితంలోని అంతర్గత అంశాల్ని ఆవిష్కరించిన రచయిత పులికంటి.

మధురాంతకం రాజారాం ప్రాంతీయ జీవన పరిమళంతో "కూనలమ్మ కోన", "సర్కస్ డేరా", జీవమ్మ క్కుడు", "జీవన ప్రహాసనం", "ఇక్కడ మేమంతా క్షేమం", "ఎడారి కోయిల", "నిషిద్ధాక్షరి" వంటి కథలు రాశారు. రష్యా సామాజిక వ్యవస్థను అర్థం చేసుకోవడానికి టాల్‌స్టాయ్, డోస్టోవస్కీ వంటి రచయితల సాహిత్యం ఉపకరించినట్లే, తెలుగుదేశ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి మధురాంతకం కథలు వుపకరిస్తాయని సింగమనేని గారి విశ్లేషణ. రాయలసీమ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయని చెప్పడం మరింత సమంజసం. "ఎడారి కోయిల" (1986) కథ రాయలసీమ జీవితంలోని ఒక సరికొత్త కోణాన్ని చూపిస్తోంది. ఈ జీవితం, ఈ సమాజం నుండి ఎదిగిన విద్యావంతుల్ని, మేధను మధ్యాంధ్ర ధనవంతులు ఏ విధంగా ఆకర్షిస్తారో, వీరి మేధ ఆ ధనవంతుల ఆర్థిక పరపతికి సోపానాలుగా ఎలా ఉపయోగపడుతుందో విశ్లేషించి, పరాయికరణను మొట్టమొదట విశ్లేషించిన రాయలసీమ కథ ఇది. మధురాంతకం రాయలసీమ ప్రత్యేక సమస్యలను ఎక్కువగా పట్టించుకోలేదన్న వల్లంపాటి గారి మాటలను ఈ ఒక్క కథే గొప్ప సమాధానం కాగలదు. ఈ ఆర్థిక మేధో దోపిడీని ఆ తర్వాతి రాయలసీమ రచయితలు పెద్దగా పట్టించుకోకపోవడం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఈ దశాబ్దంలో కథలు రాయడం ప్రారంభించిన యువకథా రచయితలు చాలా మంది వున్నారు. డాక్టర్ లంకిపల్లి, స్వామి, నామిని, రాసాని, సన్నపరెడ్డి వెంకట రామిరెడ్డి, చక్రవేణి, నరేంద్ర, మహేంద్ర, శాంతినారాయణ, వీరపల్లి వీణావాణి, దాదాహయ్యత్, జి.ఆర్.

మహర్షి వంటివారు ముఖ్యులు. ఇంతమంది కథకులుగా రూపొందడానికి ఈ దశాబ్దిలో జరిగిన సామాజిక చలన సూత్రాలతోపాటు, స్థానిక జీవన చైతన్య చిత్రణ కూడా ఒక ముఖ్యమైన కారణం. తర్వాత కాలంలో తెలుగు సాహిత్యంలో కూడా ముఖ్య కథకులుగా వీరు గుర్తింపు పొందారు. అయితే ఇక్కడ ఇంకొక విషయాన్ని కూడా చెప్పుకొని తీరాలి. 1980కి ముందుగానే కథా రచన ప్రారంభించినప్పటికీ 1990 వరకు కూడా స్థానిక జీవన చైతన్యాన్ని చిత్రించని ప్రసిద్ధ కథకులు కూడా వున్నారు. అందులో ఒకరు ప్రసిద్ధ విమర్శకులుగా గుర్తింపు పొందిన రాచమల్లు రామచంద్రారెడ్డి గారు, మరొకరు చిలుకూరి దేవపుత్ర. అయితే దేవపుత్ర గారు 1992లో రాసిన "మన్నుతిన్న మనిషి" కథ రాయలసీమ కథా చరిత్రలోనే కాక, మొత్తం తెలుగు కథాచరిత్రల్లోని గొప్ప కథల్లో ఒకటి. కాళీపట్నం రామారావు గారి "యజ్ఞం" కథ ఉత్తరాంధ్ర సాయిధ పోరాటాన్ని ముందే గుర్తించిన కథగా గుర్తింపు పొందినట్లే, ప్రపంచీకరణ దుష్ప్రభావంతో జరగబోయే అనేక విపరిణామాలు, రైతు ఆత్మహత్యల్ని చాలా స్పష్టంగా, నిర్దిష్టంగా అంచనావేసిన కథ. 1992 లోనే పి.వి.నరసింహారావు, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం సరళీకృత ఆర్థిక సంస్కరణల్ని ప్రవేశపెట్టడాన్ని మనం జ్ఞాపకం చేసుకుంటే "మన్నుతిన్న మనిషి" కథను మరింత స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాం.

నామిని సుబ్రమణ్యం గారి "పచ్చనాకు సాక్షిగా", "సినబ్బ కతలు" ప్రవేశించినది ఈ దశాబ్ది మధ్య భాగంలో. ఇవి కథలా? స్కెచ్‌లా? అని శిల్పసంబంధమైన సాంకేతిక చర్చను పక్కనబెడితే నామిని చర్చించిన రాయలసీమ జీవితం మాత్రం విస్మరించదగినది కాదు. నోస్టాల్‌జియా లక్షణంతో అనుభూతి ప్రధానంగా చిత్రించిన అనుభవ చిత్రాలు ఈ కథలు. "ఒకానొక కాలంతోనో, స్థలంతోనో, సామాజిక వర్గంతోనో మొత్తం మవేకమై పోయిన సాహిత్యకారులు ఏ భాషలోనైనా కొంతమందే వుంటారు. వీరు తమ రచనలకు మించిన వైశాల్యంతో తమ జాతి భాషని, సంస్కృతిని, సామాజిక జీవితాన్ని, దాని భవిష్యత్తుని ఆవిష్కరిస్తారు. అట్లాంటి అరుదైన రచయిత నామిని" అని స్వామి అంచనా వేశారు. తన రచనకు తన జీవితాన్నే వస్తువుగా స్వీకరించిన విలక్షణ కథకుడు నామిని "మా కుడితి తొట్టిని గమనించాక నాకు ఒక నమ్మకం కుదిరింది. పల్లెటూళ్ళలో జరుగుబాటైన ఇల్లు ఏదో నేను భలే సులువుగా కనిపెట్టేస్తాను. అందుకు నేను కుడితి తొట్టినే సాక్ష్యంగా తీసుకుంటాను" (మా అవు వంటిదే మా అమ్మ) అన్న నామిని నిశిత చూపు విస్మరించ రానిది.

లంకిపల్లి కన్నయ్యనాయుడు రాసిన కథలు చాలా తక్కువ. అయితే అన్నీ రాయలసీమ వ్యవసాయ సంస్కృతుల్ని, కరువుల్ని లోతుగా విశ్లేషించినవి. కరువుల్ని, వ్యవసాయాన్ని ఆర్థిక నేపథ్యంలో నుంచి చూసిన రచయిత. ప్రకృతి, పాలకపక్షం, రాజకీయ పార్టీలు గిట్టుబాటు ధరలలేమి, చీడపీడలు, మార్కెట్ పరిధిలో నడిచే బ్యాంకులు, అప్పులు వంటివి రాయలసీమ రైతు ప్రగతికి ప్రధాన ఆటంకాలని లంకిపల్లి విశ్లేషణ. స్పష్టమైన ప్రాంతీయ చైతన్యం, స్పృహ కలిగిన మేథోరచయిత లంకిపల్లి. ఈ మేదో లక్షణం ఆయన కథల్లో డామినేట్ చేయడం ఎక్కువ.

స్వామి రాసిన ప్రసిద్ధ "సావుకూడు" (1989) కథ కరువులలో మానవ సంబంధాల్లో కలిగే పరిణామాల్ని బలంగా చెప్పిన కథ. ఒక్క రాయలసీమ రచయిత మాత్రమే రాయగలిగిన కథ. కరువు రోజుల్లో మంచానపడి మరణానికి దగ్గరున్న వృద్ధుడు పెద్దప్పయ్య. అతనికి మాంసం తినాలని కోరిక. ముగ్గురు కొడుకుల్ని అడగలేక మధనపడి, చివరకు అడిగి మాంసం తినకుండానే మరణిస్తాడు. అతని అంత్యక్రియల్లో మాంసాహారాన్ని బంధువులకు, ఊర్లోవారికి వడ్డించి, ఆయన భార్య విస్తర్లోకి రెండు మాంసం ముక్కలు వేయనందుకు ఆమె పెట్టే శాపనార్థాలు. కరువు సమయంలో కూడా మాంసాహారంతో అంత్యక్రియలను ఆర్భాటంగా జరపాల్సిన స్థితి,

కరువు రోజుల్లో కుటుంబాలను వదలి వెళ్ళిపోయే మనుషులు వంటి వాటిని కళాత్మకంగా ఇక్కడి జీవితాన్ని యధాతంగా వివరించే అనంతపురం కథా చిత్రరాజం "సావుకూడు" 80వ దశకం తర్వాత స్వామి రాసిన స్థానిక చైతన్యం ఉట్టిపడే గొప్ప కథలు అనేక సమస్యల్ని, వాటి మూలాల్ని లోతుగా విశ్లేషించాయి.

మహేంద్ర "ప్రతిజ్ఞ" కథలో కరువుల్లో వలసలు వాటిని అవకాశంగా చేసుకుని ఎదిగే వర్గాన్ని స్పష్టంగా వివరిస్తారు. పాఠ్యపుస్తకాల్లో "ప్రతిజ్ఞ" ఆధారంగా రూపుదిద్దుకున్న కథ ఇది. "మాది అనంతపురం జిల్లా కదిరి దగ్గర. మా పక్క కరువుతో పోల్చుకుంటే మీ ఊళ్లకేమి మహారాజుగా వుండాయప్ప! కసువు గడ్డిలేక మా పక్క అందరూ గొడ్డూ గోద అమ్మేసుకుండ్రి... మేము కొంపగోడు అంతావదులు కొని వచ్చేస్తిమి.... రాజ్యమంతా యిట్లానే వుండాది" అన్న మనుషుల నుండే "భారతీదేశము నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు, నేను నా దేశమును ప్రేమించుచున్నాను..." అని ప్రతిజ్ఞ చేయాల్సిన స్థితిలోని భిన్న పార్శ్వాలని ఆవిష్కరించారు మహేంద్ర.

నరేంద్ర "కాకులు-గద్దలు" (1988) రాజ్యం దోపిడీ స్వభావాన్ని చెబుతాయి. అడవి సమీప గ్రామాల నుండి తిరుపతికి రైళ్ళలో కట్టెల మోపులను తీసుకుపోవాల్సిన దుస్థితిని, వారు ఎదుర్కొనే పరిస్థితుల్ని, అవమానాల్ని గాఢంగా చెబుతుందీ కథ.

"సీమ కథలు" సంకలనాన్ని 1992లో 18 మంది కథకుల కథలతో సింగమనేని నారాయణగారు ప్రచురించారు. ఇందులో 9 కథలు 80వ దశకంలో రాసినవే కావడం గమనార్హం. తెలుగు ప్రాంతీయ కథా చైతన్యంలో ఈ సంకలనం ఒక మైలు రాయి. ఒక ప్రయోజనాన్ని ఆశించి ప్రత్యేక స్వభావం కల ప్రాంతీయ ముద్రను ఒక వాణిలాగా" చేసిన గొప్ప ప్రయత్నం. తెలుగుకథలోని ప్రాంతీయ చారిత్రక, జీవిత అవగాహనను ఇచ్చిన గొప్ప సంకలనం. "రాయలసీమకు ఒక ప్రత్యేక ఆర్థిక, సాంగిఖ, సాంస్కృతిక జీవనం "వున్నదని తెలియజేసిన సంకలనం కూడా.

తెలుగుకథకు రాయలసీమ ప్రాంతీయ కథ చేసిన సేవ చాలా గొప్పది. 1980-90 దశకాలలో కవిత్వం తెలంగాణా నుండి కథ రాయలసీమ నుండి (ప్రత్యేకంగా అనంతపురం నుండి) వచ్చింది అనే భావన సాహితీవేత్తల్లో వుంది. ఆధునిక విమర్శ కూడా రాయలసీమలోనే పుట్టింది. తెలుగులోని ప్రసిద్ధ విమర్శకులు ఎక్కువ మంది రాయలసీమ వారే కావడం ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. కవిత్వం ఒక ఆవేశం. కథ ఒక ఆలోచన. కవిత్వానికి అవసరమైన భావోద్వేగం ఒక్కటే కథా రచనకు సరిపోదు. ఆ భావోద్వేగానికి తోడు వస్తువు పట్ల రచిఅయత విశ్లేషణ, వివేచన, భౌతిక స్పర్శ చాలా అవసరం. రాయలసీమ విమర్శలోని ఆ విశ్లేషణ, వివేచన జీవితంలోని భావోద్వేగం, భౌతిక స్పర్శ రాయలసీమ కథలో చాలా స్పష్టంగా కనిపిస్తాయి. ఇక్కడి భౌతిక జీవితానుభవం వల్లనే వ్యాపార రచయితలు ఈ రాయల సీమ ప్రాంతం నుండి చాలా తక్కువగా వచ్చారు.

రాయలసీమ కథా వస్తువును "సభా" సమస్యస్థాయికి చేరిస్తే, కేతు, సింగమనేని విశ్లేషణ స్థాయికి చేర్చారు. 80వ దశకంలోనే రాయలసీమ మాండలికం కథాసాహిత్యంలోకి బలంగా ప్రవేశించింది. పులికంటి అడపాదడపాగా రాస్తున్న మాండలికాన్ని 80వ దశకంలోని యువకథా రచయితలు ఒక దీక్షగా కొనసాగించారు. వస్తువు స్థల కాలాల నిర్దిష్టతతో స్థానిక భాషాభివ్యక్తితో రావడం వల్ల విశ్లేషణస్థాయిని దాటి 80వ దశకం చివరి నాటికి రాయల సీమ కథ ప్రశ్నించే స్థాయికి చేరుకుంది. "నీళ్ళు" (1990), "అడుసు" (1991), "మన్నుతిన్న మనిషి" (1992), "నడక" (1996) ఇందుకు గొప్ప ఉదాహరణలుగా నిలుస్తాయి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

డా॥ యమ్.వి.జె.భువనేశ్వరరావు జీవన ప్రస్థావన – కథా సాహిత్య రచనలు – పరిచయం

– కె. నారాయణ, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, గుంటూరు.

తెలుగు ఆధునిక సాహిత్యానికి అపూర్వమైన గౌరవాన్ని కలిపించి తమ రచనలతో అత్యుత్తమ ఘణతను సాధించిన నేడు ఆధునిక కథా రచయితలలో డా॥ యమ్.వి.జె. భువనేశ్వరరావు గారు ఒకరు. వీరి జీవితం, కథా సాహిత్యం రెండూ బింబ ప్రతిబింబాలే. సాధారణంగా అభిరుచితో కథా సాహిత్య సృజన చేసిన వీరి కథా సాహిత్యపు రంగు, రుచి, చిక్కదనం వేరు. కాని జీవితానుభవాలలో కలం పట్టి కథా సాహితీ వ్యవసాయం చేసిన వీరి కథా సాహిత్య పరిమళాల సువాసనలు వేరు. ఈ రెండవ కోవకు చెందిన సాహితీ వేత్తలు ఎప్పటికీ ఆధునిక సాహిత్య చరిత్రలో విలక్షణంగానే కనిపిస్తారు. నేటి భవిష్యత్ తరాలకి తన కథా సాహిత్యానికి మంచి గుర్తింపు లభించడమే కాక అది ఆదర్శంగా నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆ నేపద్యంలో డా॥ యమ్.వి.జె. భువనేశ్వరరావు గారి జీవితం, కథా సాహిత్యం రచలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

డా॥ యమ్.వి.జె. భువనేశ్వరరావు గారి జీవితం :

భువనేశ్వరరావు గారు 1966 నవంబరు 23వ తేదీన విశాఖజిల్లా అనకాపల్లిలో బుధవారం ఉత్తర భాద్రపద తెల్లవారుజామున మూడు గంటలకు శ్రీ మళ్ళ జగన్నాధం, నూకాలతల్లి దంపతులకు జన్మించారు. వీరి తల్లి ఆకాంక్ష మేరకు ఉన్నత చదువులు చదవడానికి అహోరాత్రులు కష్టపడి ఉన్నత చదువులు అభ్యసించారు.

విద్యాభ్యాసం :

వీరు అనకాపల్లిలో ప్రాధమిక విద్య శ్రీవాణి ట్యుటోరియల్‌లో పూర్తి చేసి ప్రాధమికోన్నత విద్య మున్సిపల్ హైస్కూల్ గురవపాలెం అనే గ్రామంలో పూర్తి చేశారు. అక్కడితో ఆగక ఉన్నత చదువులు చదవడానికి ముందుకు వెళ్తూ ఎల్.యమ్.ఇ.గవర్నమెంట్ పాలిటెక్నిక్ కలాశాల, విశాఖపట్టణంలో చదివి ఆ తరువాత ఏ.యమ్.ఇ మెకానికల్ ఇంజినీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్, ముంబాయి, ఆ తరువాత ఐచ్చికంతో బి.ఎ, బి.యల్ ఆంధ్రా యూనివర్సిటిలో దూర విద్యను అభ్యసించి తన ఉద్యోగ అవకాశాల కోసం యమ్.బి.ఎ ఇగ్నో యూనివర్సిటి, ఢిల్లీలో చేసి, తెలుగు సాహిత్యం మీద మక్కువతో యమ్.ఎ దూర విద్యను అభ్యసించి ఆతరువాత క్రమంలో పి.హెచ్.డి ఆంధ్రా యూనివర్సిటిలో చేసారు.

వృత్తి :

భువనేశ్వరరావు గారు బాల్యం నుంచి ప్రధమ శ్రేణి విద్యార్థి. అంతే కాకుండా తన బాల్యంలో చదివిన స్కూలు వదిలి వెళ్ళిన 15 యేళ్ళ వరకు యమ్.జి.హెచ్ స్కూలులో టీచర్లు భువనేశ్వరరావు గారిని రోల్ మోడల్‌గా చూపించి విద్యార్థులలో స్ఫూర్తి నింపడం ఆయన ప్రతిభకు తార్కాణం. ఈయన 19 యేళ్ళకే స్టీలు ప్లాంటులో చేరారు. అవిశ్రాంత విద్యార్థిగా ఎన్నో గొప్ప చదువులు చదివారు. అంతే కాకుండా మొదట జూనియర్ మేనేజర్‌గా తరువాత అసిస్టెంట్ మేనేజరుగా, ఆ తరువాత డిప్యూటి మేనేజరుగా ప్రస్తుతం అసిస్టెంట్ జనరల్ మేనేజరుగా క్రమంగా ఎదిగి ప్రస్తుతం డిప్యూటి జనరల్ మేనేజరు హోదాలో ఉన్నారు.

వివాహం – పిల్లల విద్యాభ్యాసం :

భువనేశ్వరరావు గారు 1989లో వివాహం చేసు

కున్నారు. వీరి భార్య ధనలక్ష్మి. వారికి ఇద్దరు పిల్లలు. పెద్దబ్బాయి నవ్యతేజ, చిన్నబ్బాయి నూక హర్షచైతన్య. భువనేశ్వరరావు గారి అభిరుచి మేరకు పిల్లలిద్దరిని ఉన్నత మైన చదువులు చదివించారు. పెద్దబ్బాయి నవ్యతేజ యమ్.బి.బి.యస్ చదివారు. ప్రస్తుతం భువనేశ్వర్‌లో యమ్.యస్ చదువుతున్నారు. తండ్రి వార సత్వాన్ని పునికి పుచ్చుకుని కథలు రాస్తున్నారు. పలు ఇంగ్లీషు, తెలుగు పత్రికలలో కార్టూన్‌లు వేస్తున్నారు. చిన్నబ్బాయి నూక హర్షచైతన్య ఇంజినీరింగ్ పూర్తిచేసి పై చదువుల కోసం యమ్.బి.ఏ చదివారు. ప్రస్తుతం ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకులో అకౌంట్స్ మేనేజరుగా పని చేస్తు న్నారు. ఈయన కూడా బ్లాగ్స్‌లో ఇంగ్లీషు రచనలు కూడా చేస్తున్నారు.

విదేశీయానం :

భువనేశ్వరరావు గారు వృత్తిరీత్యాను,వ్యక్తిగతంగాను "ఇటలీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, వాటికన్‌సిటి, థాయిలాండ్, సింగపూర్, మలేషియా" మొదలైన దేశాలన్నీ సందర్శిం చారు.

బిరుదులు, సత్కారాలు :

భువనేశ్వరరావు గారిని హైదరాబాద్, ఖరగ్‌పూర్, నెల్లూరు, మచిలీపట్నం,విజయవాడ, విశాఖపట్నం, రాయిగడ మొదలైన ప్రాంతాలలో సత్కరించబడిన శ్రీ డా॥ యమ్.వి.జె. భువనేశ్వరరావు గారికి "కథాగౌరి" బిరుద ప్రధానం ఖరగ్‌పూర్‌లో జరిగింది. వివిధ సందర్భా లలో రాష్ట్ర స్థాయిలో ప్రముఖ సంస్థలు వెలువరించిన ఎన్నో సంకలనాలలో వీరి రచనలు చోటు చేసుకున్నాయి.

ఇండియన్ సిరామిక్స్ సొసైటి, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా,ఇండియా సొసైటి ఆఫ్ అదర్స్, ఇండియా కాన్‌స్టంట్‌బుల్ కల్చరల్ అసోషియేషన్ నందు జీవితకాల సభ్యులు.

సన్మానాలు పురస్కారాలు :

భువనేశ్వరరావు గారికి టి.ఆర్.ఆర్ ఉగాది పురస్కారం, ఉక్కు గౌరి సంక్షేమ పరిషత్ పురస్కారం-2006, ఉక్కు సి.డబ్ల్యూ.సి ఉగాది పురస్కారం - 2007, విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి గ్రీన్ అవార్డు లభించాయి.

భావ తరంగిణి వారి రాష్ట్ర స్థాయి కార్టూన్ పోటీలలో 2007 సం॥గాను ప్రధమ బహుమతి గెలుచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పత్రిక తరుపున జరిగిన పోటీలలో నాలుగు సార్లు బహుమతులు అందుకున్నారు. ఆయన రాసిన "పుత్ర దేవోభవ" కథ ఐదు భాసలలో అనువాదమైంది. "రంజనీ- ఆంధ్రప్రదేశ్" పత్రిక సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో ఈ కథకు తొలి బహుమతి లభించింది. జాగృతీ, నది,చిత్రా పత్రికలు నిర్వహించిన కథా పోటీలలో ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

డా॥ యమ్.వి.జె. భువనేశ్వరరావు కథా సాహిత్య రచనలు :

సాహితీ ప్రక్రియల పరిణామ చరిత్రలో విశాఖ రచ యితలకు యారాడ కొండంత ఎత్తైన చరిత్ర. బంగాళా ఖాతమంత విశాలమైన ఖ్యాతి ఉంది. కథానికకు అడుగు జాడ చూపినగురజాడ (వేంకట) అప్పారావు కూడా ఇక్కడి వారే.వీరి జననం విశాఖజిల్లా యలమంచిలి తాలూకా రాయవరంలో జరిగింది. ఈయన రాసిన "దిద్దుబాటు" ఇప్పటికీ కథానిక రచయితలందరూ దిద్దుకోవలసిన ఓనమాల పాఠం.

ఆ కథానిక సారాంశం మగాడిలో ప్రత్యాత్తాపం, పురుషాహంకారం మీద స్త్రీ జాతి రబ్బరు సమ్మెటతో వేసిన సతిమెత్తని దెబ్బ. ఆయన నాటిన ఆ సాంఘీక కథానిక బీజం మొలకై, మొక్కై, మానై మహా వృక్షమై శాకోప శాఖలుగా విస్తరించింది. ఆ వృక్షం నీడలో ఎందరో కథ కులు ఉత్తమ కథానికలను సృజించారు.

ఈ శతాబ్ధం నాది అని సగర్వంగా చాటుకున్న మహా కవి శ్రీశ్రీ విశాఖ గడ్డ మీదే పుట్టారు. కాదేది కవితకు అనర్హమంటూనే చరమ రాత్రుల కథానికలతో ఇక్కడే ఆడుకున్నాడు. సినీకవిగా ప్రసిద్ధులైన శ్రీరంగం శ్రీనివాస

రావు (1910-1983) పలు పత్రికల సంపాదకులుగా పనిచేసారు. అభ్యుదయ కవి తరువాత విప్లవకవిగా ప్రఖ్యాతి చెందారు. వివిధ సాహితీ ప్రక్రియలో కృషి చేసారు. వీరు రాసిన 23 కథానికలలో "చరమరాత్రి" పేరుతో 1957లో సంపుటి వచ్చింది. నవరసాల శ్రీశ్రీ సంకలనంలో చేర్చిన కథానికలు 9. వాటిలో సీతయ్య, కోనేటి రాత్రి, అనామిక, బొజ్జమ్మ - బొచ్చు కుక్క, మధన - కధన, కన్నీటి కబుర్లు కొన్ని ఉన్నాయని చెప్పవచ్చు.

భాగవతుల సదాశివ శంకర శాస్త్రి అంటే తెలిసిన వారు తక్కువ. ఆరుద్ర (1925-1998) అంటే తెలియని వారు తక్కువ. జన్మ నక్షత్రమే కలం పేరుగా పెట్టుకున్న ఆరుద్ర సుప్రసిద్ధ కవి. వ్యాసకర్త సినీగేయ కవి, నవలా రచయిత, గొప్ప పరిశోధకుడు. శ్రీశ్రీ ప్రభావం చేత కవిగా రూపొంది అవసరం అభిరుచి ప్రేరణగా కథ, డిటెక్టివ్ నవల, సినిమా పాట, పరిశోధనా గ్రంధాలు ఇలా ఎన్నో రాసి ఆంధ్ర సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానం సాధించారు.

నాగరికపు సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై చిన్న కుటుంబాల నుంచి వేరే కాపురాలతో ఒంటరి కుటుంబాలు వచ్చాయి. ఇది ఒక సామాజిక పరిణామం. 1952 సం॥రంలో అనూహ్యంగా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి 1965 సం॥రం నాటికి తెలుగు కథానిక తన వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసింది.

నేడు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న ప్రక్రియల్లో కథానికే అగ్రగామియై నిలిచింద నడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

నేడు కథానిక సమాజంలోని వివిధ అంశాలను, స్వభావాలను, మానవ మనస్థత్వాలను, సమస్యలను చిత్రించి మనిషికి, సమాజానికి సజీవమైన సంబందాలను విశ్లేషణ చేస్తూ సమాజంలోని లొసుగులను ఎత్తి చూపుతూ పరిష్కార మార్గాలను వెల్లడిస్తూ ఒక బలమైన సాధన మాద్యమంగా ప్రయాణిస్తుంది. మానవ జీవన ప్రమాణాన్ని సుఖవంతం చేయడానికి ఎందరో కథా రచయితలు తమ వంతు ప్రయత్నిస్తున్నారు. వారిలో ఈనాటి తరానికి ప్రతినిధిగా కనిపించే కథా రచయిత శ్రీ. డా॥ యమ్.వి. జె. భువనేశ్వరరావుగారు ఒకరు.

కథా కవితా కార్టూనిస్టుగా పేరొందిన భువనేశ్వరరావు సమకాలీన సమాజంలో జరుగుతున్న ఘోర కృత్యాలను చూసి చలించి సమాజానికి తానేదైనా చేయాలనే సంకల్పంతో రచనా వ్యాసంగానికి పూనుకున్నారు. చిన్న చిన్న గీతలతో వ్యంగ్య అధిక్షేపణ ధ్వనించేలా కార్టూన్‌లు వేస్తూ ఎంతో ఆలోచన కలిగిస్తారు.అదేవిధంగా పొందికైన సొగసైన మాటలతూటాలతో చక్కని భావ సుగందాలు వెదజల్లేలా కథలను అల్లి హాస్యంతో పాటు ఆలోచన కలుగజేస్తారు. వీరి కథానికలలో మద్య తరగతి కుటుంబ జీవితాలలో జరిగిన చిన్న చిన్న సంఘటనలకే మనుషులు ఎలా మారిపోతారో అలా మారకుండా ఉండాలంటే ఎలా నడుచుకోవాలో తెలియజేస్తూ సామాజిక స్పృహను కలిగిస్తారు.

భువనేశ్వరరావు నేటి ప్రాశ్చాత్య నాగరికతా ప్రపంచంలోఉమ్మడి కుటుంబాలు, దాంపత్య జీవితాలు, రైతు జీవనం, ప్రపంచీకరణ, దుష్పలితాలు, అవమానీయ సంఘటనలు చిద్రమవుతున్న పల్లీయ బ్రతుకుల్ని కథ కెక్కించిన తీరు హృద్యంగా ఉంది.

భువనేశ్వరరావు విద్యార్థి దశలోనే తొమ్మిదవ తరగతిలో ఉండగా విద్యాబాల మాసపత్రికలో "ఆదాయం - వ్యయం" అనే కథను రాసారు. అదే ఆయన తొలి కథ అని చెప్పవచ్చు. అప్పటినుంచి ఆయన ఆలోచలనలకు పదునుపెట్టి పత్రికలలో కథలు రాయడం, కార్టూన్స్, కాలమ్స్ రాయడం, కవితలు, కథానికలు రచించడం ప్రారంబించారు.

సుమారు 300 కథలు వివిధ పత్రికలలో ప్రచురించ బడ్డాయి. కన్నడ, మరాఠ, ఒరియా భాషలలోకి ఈయన కథలు అనువదించబడ్డాయి. వేదగిరి రాంబాబు కేంద్ర సాహిత్య అకాడమీ కథా సంకలనంలో భువనేశ్వరరావు కథలు ప్రచురించబడ్డాయి. ఈయన సమకాలీన సమాజం

లోని సాంఘిక దురాచారాలపై అక్షర ఖడ్గాన్ని ఝుళిపించి రచనలు చేసారు.

భువనేశ్వరరావు గారి రచనలు 5000లకు పైగా వివిధ తెలుగు, వార, మాస పత్రికలతో పాటు దిహిందూ సైన్స్ రిపోర్టల్, కార్టూన్ వాచ్ మొదలగు ఇతర భాషా పత్రికలలోను ప్రచురించబడ్డాయి.

"భువన్ నవ్వులాట", "ఈ కథలు - ఆ కథలు" వీరి తెలుగు కార్టూన్ కథా సంకలనాలు. కాగా భువన్ కహానీలు (హిందీ), భువన్ కథలు (మరాఠా) ఇతర భాషా సంకల నాలుగా ప్రచురించబడ్డాయి.

"కథా గౌరీ"గా పేరు గడించిన డా॥ యమ్.వి.జె. భువ నేశ్వరరావు గారి రచనలను తెలుగు కథలు, ఆంగ్ల కథలు, హిందీ కథలు, ఒరియా,మరాఠీ, కన్నడ భాషలలో కొన్ని కథలున్నాయి. అవి పరిశీలిద్దాం.

తెలుగు కథలు :

1. ఈ కథలు - ఆ కథలు : ప్రచురణ - 2008

1) హయగ్రీవ మూర్తి హౌసంగ్‌లోన్, 2) థ్యాంక్స్, 3) మరణం అంచున స్వర్గం, 4) నాన్నగారు, 5) బట్టతల మొగుడు, 6) మగబుద్ధి, 7 సర్వెంట్ మైండ్, 8) గర్ల్ గెస్ట్, 9) అలక, 10) వీరప్పన్ ఎక్కడో- ఏకాంబరం అక్కడే, 11) సుబ్బారావుకి పెళ్ళాం కావాలి, 12) సంధ్యా సహగ మనం, 13) నా మొగుడే నా ప్రియుడు, 14) షష్టిపూర్తి శోభనం, 15) సందేశం.

2. భువన్ నవ్వులాట -హాస్య కథలు : ప్రచురణ 2009

1) పర్యటన, 2) హీరోయజం, 3) ప్రేమ, 4) పరి ష్కారం, 5) అవార్డు, 6) లెటరు, 7) ఉద్యోగం, 8)జడ్జిమెంట్, 9) జాతకం, 10) నటి, 11) హెల్‌ఫోన్, 12) మేకప్, 13) రచన, 14) ఫోన్, 15) గ్యారంటీ, 16) సమ్మె - ది స్ట్రయిక్, 17) ట్రీట్‌మెంట్, 18) అసలు రహస్యం, 19) పోటీ, 20) చిల్లు ఫోన్, 21) ఆక్రమణలు, 22) పరీక్ష, 23) కోత, 24) ఉచితం, 25) బాదానందం, 26) కంప్లయింట్, 27) మార్పిడి, 28) సేవ, 29) అరెస్ట్, 30) చదువు, 31) వ్యూహం, 32) రచయిత, 33) లాఠీచార్జ్, 34) అప్పు, 35) అల్లుడు.

3. భువనేశ్వరరావు - కథానిక కదంబం - ప్రచురణ - 2015

1) సయన్విత, 2) ఇదేనా ప్రేమంటే, 3) పైసా కోసం పోరాటం, 4) సాంబయ్య తాత, 5) సుబ్బారావుకి పెళ్ళాం కావాలి, 6) బలి పశువు, 7) హైహై నాయకా, 8) డా॥ సుబ్బారావు కేరాఫ్ డజను రోగాలు.

4. భువనేశ్వరరావు - తెలుగు కథనం : ప్రచురణ-2015

1) ప్రేమే కావాలి, 2) వైద్యో చైతన్యో నారాయణో హరి, 3)వాస్తుతో నాస్తి సుభిక్షం, 4) ఇసుక తోట కూర ఫ్రై, 5) నాన్నగారు, 6) సమన్విత, 7) పండుగ, 8) వేదన

5. భువనేశ్వరరావు - ఐదు కలాలు - ఐదేసి కథలు : ప్రచురణ - 2016

1) జ్ఞాపకాలు, 2) ఆనవాళ్ళు, 3) దాడి, 4) పుత్ర దేవోభవ, 5) నడిచెళ్ళే ఊర్లు.

6.భువనేశ్వరరావు - కథానందనం : ప్రచురణ - 2017

1) స్మృతి చిహ్నం, 2) దారి మారదు, 3) ప్రమాదం కావాలి, 4) సుబ్బారావు కొడుకు ఓ ఇంజినీరు

ఆంగ్ల కథలు :

1) సుప్రీం స్టార్టస్

హిందీ కథలు :

1) భువన్ కథలు (భువన్ కహానీలు)

కన్నడం :

1) భువన్ ఖథగళ్

ఒరియా, మరాఠీ కథలు :

1) భువన్ కథలు

ముగింపు :

పై కథల్లో భువనేశ్వరరావు నేటి ఆధునిక సమాజంలో జరుగుతున్న, జరగిపోయిన విషయాలన్నింటిని కుటుంబ

విలువలు సమాజంతో మానవుడు ఐక్యత వారి సాంఘిక ,రాజకీయ,ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నేటి ఆధునిక కథా సాహిత్యంలో గొప్ప కథా రచయితగా మకుటం లేని మహారాజుగా తెలుగు కథా సాహిత్యంలో తన వంతుగా కథలు రాస్తూ ప్రజలను మెప్పిస్తూ ప్రజల హృదయాలలో చోటు సంపాదించుకున్న రచయితగా గొప్పకీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు అనడంలో అతిశయోక్తి లేదు.

❖ ❖ ❖

ఆచార్య ఇనాక్ గారి 'విఘ్ను వినాయకుడు' కథా – పరిశీలన

– నోముల రాజు, పరిశోధక విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, హైద్రాబాద్.

ఆచార్య ఇనాక్ గారు తెలుగు సాహితి క్షేత్రమును ఇరువాలు పడ కలమనే హలముతో దున్ని అభవృద్ధి అనే పాలము మడిని కట్టి, అదులో కవితా, కథ, కథానిక, నాటకం, హైకూ, వ్యాసం, విమర్శ లాంటి మొదలగు సాహిత్య ప్రక్రియ విత్తనాలు నాటి, వాటి నుండి మాన వత, అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీ వాద మొదలగు ప్రక్రియ పంటలెన్నింటినో సమృద్ధిగ పండించినాడు. వీటి ద్వారా స్త్రీ, దళిత, బహుజనులకె కాక సమస్త ప్రజానికానికి వారి ఆలోచన మెదళ్ళకు అన్నం పెట్టినాడు. అంతేగాక వారు చేయాల్సిన పనిని, పోవాల్సిన మార్గాన్ని ఈ రచనల ద్వార సూచించారు. అందుకనే ఇతడిని సవ్యసాచి అని సాయితి ప్రియులు పిలుచుకుంటె, మరికొంత మంది సవ్యసాచి అనే పదం కూడా తక్కువవుతుందని సోడశ కళా ప్రపూర్ణుడుగ అభివర్ణిస్తుంటారు.

అంతటి ప్రతిభాశాలి కవి, రచయితైన ఇస్సాక్‌కు 42 ఏళ్ళుగ గొప్ప పఠన, పాఠన, పరిశోధన, పాలనాను భవజ్ఞులైనారు. వీరు ఉత్తమ ఉపాధ్యాయ, కళారత్న, కల్నర్, జాతీయ కవి, పద్మశ్రీ అనే బిరుదులు పొందినారు. వీరు వివిధ విశ్వవిద్యాలయల్లో ఉపన్యాసకులుగా, రీడర్‌గా, ఆచార్యులుగ, ప్రిన్సిపాల్‌గా, డీన్‌గా, కార్యదర్శి, సంచాలకులుగా పనిచేశారు. చివరగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యాక్షులుగ 2001న పదవి విరమణ చేశారు.

ఆచార్య ఇనాక్ గారు వేజండ్ల విశ్రాంతమ్మ - కొలుక లూరి రామయ్య దంపతులకు గుంటూరు దగ్గరి వేజండ్ల గ్రామంలో జన్మించారు. వీరు ఊరబావి, అస్పృశ్యగంగ, ఇదా జీవితం, భవాని మొదలగు కథలు రాశారు. వాటిలో విఘ్ను వినాయకుడు అను కథా ఒకటి అయితే కథ అనే పదము కథ్ ధాతువు నుంచి పుట్టింది. దీనికి సంభాషించు, చెప్పుట అనే అర్థాలున్నాయి. అలా చెప్పినటువంటి కథలలో సంఘటనలు కొంత నిజం, కొత అబద్దం అయి ఉంటాయి. అయితే మనం ఇప్పుడు తీసుకున్న కథ (విఘ్ను వినాయకుడు)లో మాత్రం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ళు మాత్రమే కనిపిస్తాయి. అంటె అది కథా అని, కొంత కల్పితం అనే విషయమే స్ఫురణ రాకుండ రాసిన గనత ఆచార్య ఇనాక్ గారిది.

విఘ్నవినాయకుడు అనే కథా పేరును శీర్షికగా తీసు కొని ఆ కథలో నరసప్ప, పూజారి, చిదంబరరెడ్డి, నాగిరెడ్డి, జయన్న నాయుడు అనేవి. ప్రధాన పాత్రల పేర్లుగ తీసుకుని మరికొన్ని పాత్రలు తీసుకొని సమాజంలోని దళితులపై ఉన్నతులు జరుపుతున్న భౌద్ధిక, భౌతిక పరమైన దాడులను చూపించారు. అదే విధంగ దళితులు ఆ దాడులను ఎలా ఎదుర్కొవాలో ఈ కథలో పాత్రల ద్వారా పల్కించారు. ప్రధానంగ దళితులు వినాయకుడిని వారి వాడలో నిల్పుకొని, కొల్చుకోవడం చూసి ఓర్వలేని పై వర్గాల వారు దళితులపై చేసిన దాడిని ఈ కథ ద్వార ఆచార్య ఇనాక్ గారు సమాధానం ఇచ్చారు. అందుకే వినాయకుడు దళితుల పాలిట విఘ్ను వినాయకుడు అయినాడు.

నరసప్ప అను ఒక దళితుడు నడిఈడు మనిషి. అతడు పనికి అలసి కల్లు, సారలను తాగినాక జవం సచ్చిన తన శరీరానికి బలమొచ్చినట్లయి అటు ఇటు ఊగుతున్నను, భూమే కంపిచేలా, శృతి తప్పకుడ డప్పు వాయించుతుంటాడు. అతడు ఆడటం, గనక చూసినట్ల యితే మహానటులు కూడా ఇతడి మీద బలదూరే అంటాడు. కథకుడు. ఇక మత్తులో ఉన్నంత సేపు వరసయిన అందరితో సరదాగ సరసాలు ఆడి, మత్తు దిగాక అతని ఒళ్ళు నొప్పలను దేవుడే మాన్పలేడు అని

చెబుతాడు. ఒక రోజు మందు తాగకుండ మెలకువగా పూజారి ఇంటి ముందుకు వెళ్ళి అతడిని పిలిచి స్వామి! ఈసారి కూడా మేము వినాయకుడిని నిలపెడుదామను కుంటున్నాం అని అనగానె, బ్రాహ్మడు సరే నేను పూజ చేస్తాను. కానీ ఈసారి ఎవరు చావకూడదంటాడు. ఎందుకంటె పోయినసారె నిమజ్జనం రోజున నల్గురు దళితులు చనిపోయారు కాబట్టి. అసలు అక్కడ ఎక్కువ కులం మేము అనుకొనేటోళ్ళు ఆ నల్గురిని చంపేసి పైగా వారికి వారే తాగి చచ్చారు అని పేరు చేసి, పత్రికలలో రాశారు. ఇలా నిందలను ఉన్నత సమాజం దళితులపై ఎలాంటి బురదలు చల్లుతుందో రచయిత చూపారు. అయితే ఏదేమైన ప్రాణాలు పోయిన నరే మన అస్తిత్వాలను చూపించాలి. మన భక్తిని మనం చాటు కోవాలి ఎవరిని ద్వేషించుకోరాదు అని రచయిత పాత్రల ద్వారా దళితులకు సందేశం చేశారు.

అయితే నల్గురు దళిత యువకులు చనిపోతే పోలీసులు మాత్రం హడావుడి ఎక్కువ చేస్తారన్నారు. పెళ్ళయితే కుక్కల హడావుడి అని సామెత వేసి ఆనాటి పోలీసుల పని తీరును వివరించాడు. మెత్తానికి నర్సప్ప మాత్రం మా యువకులంత కలిసి ఈసారి కూడా వినాయకుడిని నిలబెట్టుకుంటాం అనే విషయం బ్రాహ్మనునితో విషదీకరించాడు. అక్కడే ఉన్న సవర్ణ పిల్లలు (ఎక్కువ కులమనుకునె వారి పిల్లలు) నర్సప్ప మాట విని దళితులకు ఇంకా బుద్ధి రాలేదా అని దళితులను ఓర్వలేని వారు కుట్రలు పన్ని ఈ ఏడు 10 మంది చావాలి అని వారు అనుకోవడం ఆటుగ వచ్చిన నర్సప్ప విని మునుపటిలాగ ఏమి జరుగరాదని మనసులో అనుకున్నాడు.

ఇంతకు నరసప్ప ఊరు పేరు, ప్యాపిలి అది కాశ్మీర్ నుండి కన్యాకుమారి పోయే నేషనల్ హైవే రోడ్డుకు ప్రక్కన కొంత దిగువన ఉంది. రోడ్డుపైననే పోయిన సంవత్సరము వినాయకులను నిమజ్జనం చేసినప్పుడు దళిత యువకులు చనిపోయింది ఇక్కడే. కాదు ఉన్నతుల చేతిలో చంపబడింది ఇక్కడే అని కవి వివరించాడు. అయితే ఈ రోడ్డుపైన వినాయకులు తీసుకుపోయె సందర్భంలో రోడ్డు మాదంటె, మాదని దళితులపై దాడి జరిగిన తీరు తెలుపారు.

అసలు వినాయకుడిని మంచి పనులు చేయుటకు ముందు పూజిస్తే, అది దళితుల ప్రాణాలు తీసినట్ల యింది అన్నారు. అసలు స్వాతంత్ర్యం రాని భారతదేశానికి ముందు ఇక్కడి మాదిగలు వినాయకుడిని ఎరుగరని, గ్రామ దేవతలైన పోతురాజు, పోలేరమ్మ, అండాలమ్మ మొదలైన దేవుళ్లను పూజించారని చివరగా అప్పుడప్పుడు హనుమంతున్ని పూజించే వారని వివరించారు కథకుడు. సమాజంలోని అన్ని కులాల వారితో మేము హిందువులమే, మనుషులమే అనే విషయాన్ని తెల్పడానికి వినాయకుడిని నిల్పుకున్నారని తెలిపారు. అంతేగాక వారి అస్తిత్వానికి ప్రతీకగా, దళితుల శరీరానికి వినాయకుడి శరీరానికి పోల్చి చెప్పాడు. దీనిలో అర్థము ఏంటంటే దళితులను మిగత ఉన్నతులు వాడుకుని పారేసినట్లు, వినాయకుడి పారేస్తున్నారని పోల్చవచ్చు.

ఈ వినాయక నవరాత్రులు మన ఆంధ్ర దేశానిది కాదని మహారాష్ట్రం నుండి వచ్చాయని అవి అందరిని ఏకము చేయడమేమో కానీ కులాల కక్షలు లేపుతుందంటాడు. ఐతే ఆ ఊరులో తరిమెల నాగిరెడ్డి, అతడి అనిచరుడు చిదంబరరెడ్డి లాంటి రెడ్డి సామాజికులలో సమసమాజం కోరుకునే వారున్నారని కథకుడు తెలుపుతూ, మాదిగవారు ఇలాంటి వారిని మాత్రమే భాగప్రేమిస్తున్నారని వివరించాడు. నర్సప్ప చిదంబరరెడ్డి వద్దకి పోయి వినాయకుడిని దళితులు నిలబెట్టుకుంటె జరుగబోయె పరిణామాలను వివరించాడు. దానికి నేను చూసుకుటా పో అని బదులిచ్చి పంపాడు. ఆ తరువాత డ్రాయర్ కంటె కొంచెం పెద్దగా ఉన్న లాగును జరుపుకుంటు, అంగి కంటె తక్కువనైన చొక్క కాని చొక్కని అతడి లేమి స్థితిని కథకుడు వర్ణించారు. బట్టలు ఎలా ఉన్న సరేకానీ అతడి శరీరం మాత్రం శ్రమ చేసిన కండలు తేలి ఆరోగ్యంగా కనబడుతున్నాయంటాడు. అలా నర్సప్ప

తన భార్య చిన్న పిల్లగాన్ని అప్పగించి చచ్చిపోయాక అతడు కొడుకును కష్టపడి చదివించి ఒక కాంట్రాక్టు లెక్చరర్‌గా చేశాడు. ఇంతలో డప్పు కొట్టి కష్టపడి సంపాదించె ఓపిక లేనందున కొడుకుని చూసుకుని సంతోషించె వేలనె వినాయక ఊరెగింపులో చంపబడ్డాడు. నర్సప్ప కొడుకు లాగ చిదంబరరెడ్డి కొడుకు నాగిరెడ్డి చదువుని డి.యస్సీ కోసం చూస్తుండు అంటాడు.

జయన్న పాత్ర ద్వారా జయన్న అందరిని మర్యాదగ పల్కరిస్తడు. ఎవరికి ఏమీ ఇయ్యడు ఎవరి పొట్ట కొట్టడు. తన పని చేసుకుంటాడని, చాలా కాలం దాక రాజ కియ్యాల వైపే చూడలేదంటాడు కథకుడు. పిల్లికె బిచ్చం వెయ్యని జయన్న తన కొడుకు వెంకట నాయుడిని బాగా చదువుకునె వాడిని వ్యవసాయంలో పెడుతాడు. కానీ అతడిస్నేహితుడు సిద్దు అంత మాత్రంగా చదివే వాడు డిల్లిలో ఐ.ఏ.ఎస్. లాంటి పెద్దచదువులు చదివి తన సొంత ఊరు ప్యాపిలికి వస్తుండగా అతడి సూటు బూటు చూసి వెంకటనాయుడు అసూయపడ్డాడు. దీని ద్వారా కవి చదువు మనిషి విలువలు, జ్ఞానం పెర్గు తాయని నందేశం ఇస్తున్నాడు. అనలు ప్యాపిలిగ్రామంలో మాదిగలు రెండు శాతమే. ఇక సాయబులు ఒకటే శాతం ఉన్నారు. అయినవీరువురు బాషలు మతాలు వేరైన ఎక్కడో గొప్ప సోదర బదం ఉన్నట్లుగ చక్కగా కలిసి ఉంటారంటాడు. ఆ ఊరిలో పది శాతం బి.సిలు ఉన్నారు. వీరంత కలిసి ఐక్యత పాటిస్తూ శ్రామిక జీవులుగ జీవిస్తూ మాదిగలు వినాయకుడు పెట్టు కోవడానికి సంతోషించి సహకరిస్తున్నారు అని చెప్పారు.

నర్సప్ప డప్పుకొడుతు దండోర లేసేవాడు కావడం చేత అతడికి సర్పంచి నుండి కలెక్టర్, ఎమ్మెల్యేల దాక అందరు పరిచయం. అందరితో ఎలా మసలుకోవాలో ఎరిగినవాడు అని నర్సప్ప పాత్ర ద్వారా అందరితో మాట్లాడడం చేత లోకం తీరును తెలియచేశాడు. నర్సప్ప మాదిగలకు సుగ్రీవుడి లెక్క అంటే నాయకుడని అర్థం. అతడు వినాయకుడిని నిలబెట్టండనగానే నిలిపారు. పూజలు ప్రతాలు మైకులు బాగానే జర్గుతున్నాయి. ముందు చెప్పినట్లు వారిఊరు రహదారి ప్రక్కన ఉండడం చేత ఆ ఊరిలో ప్రతి గల్లికి పదిగళ్ళ వినాయకులు, మైకులు, వేడుకలు చూస్తుంటె ప్రయాణికులకు ఎంత గొప్ప సంపద కల్గిన ఊరో అనుకునే విధంగ ఉందని, కానీ ఊరిలో కులాల పేరుతో వినాయకుడిని నిలిపి పోటీలుగ మైకులు పెట్టారని వివరించాడు.

ఇలా పోటిపడి పోయిన సంవత్సరం నర్సప్ప కొడుకు కాంట్రాక్టు లెక్చరర్, ఒక ఐ.ఎ.ఎస్. ఎంపికైన యువకుడు పోలీస్ ఎంపికైన యువకుడు, యమ్.ఆర్.ఓ. ఎంపికైన యువకులు నల్గురు దళితులు గొప్పవారు కాపోతున్నారని ఓర్వని అగ్రకులాలు పగపట్టి వినాయకుడి నెపముతో చంపి జాతిని నాశనం చేశారు అని కథకుడు పాత్రలు సృష్టించి అగ్ర వర్ణాలు దళితుల మీద జరిపిన దాడులను వివరించాడు. ఇలా జరిగెసరికి ఇటుదళితులు అటు అగ్రకులాల వాళ్ళు ఈసారి వినాయ నిమజ్జనంలో ఏమి జరగబోతుందా అని భయపడి ఎత్తులు వేసుకుంటారు. ఏదేమైన మాదిగలు మనం బయపడి పొతె చచ్చిన క్రింద లెక్క! ఇక్కడే ఉండి పోరాడి మన ఊరిలో ఉండి అస్తిత్వం కాపాడుకుందాం ఎవరి సహాయం తీసుకున్న కొంత కాలమే కనుక మనమే తెగించాలని వినాయకుడిని నిలుపుకున్నారు. అది కని అగ్రకులాలు భయంతో రెడ్డి,నాయుడు వద్ద నర్సప్పను మాదిగ వారిని పిలిచి ఇదంత ఎవరు చేయమంటుండ్రు? ఎం చేస్తున్నారు? ఎవర్ని చంపడానికి చేస్తున్నారు? రెడ్డి, నాయుడులు అడుగగా నర్సప్ప తన జాతి తరుపున మమ్మల్ని దేవుడు ప్రోత్సహిస్తున్నాడు. అందుకే పూజ చేస్తున్నాము. తుప్పు పట్టిన ఆలోచనలను నూరుతున్నాం. మేము ఎవర్ని చంపము. మిమ్మల్ని ఎదిరించి బ్రతుకుతాము. మీకింద పని చేసే వాళ్ళము అని చక్కగ పాత్రలు పలికిస్తాడు కథకుడు. అంతలో రెడ్డి, నాయుడులు నర్సప్పకి మీకు ఈ మద్య పొగరు వచ్చిందనగా అవునండి పొగరు వచ్చింది నిజమే మేం కష్టం చేసుకుని తింటాం. ఎవరిపై

ఆదారపడి మీలా జీవించడం ఐనా పోరాడటానికి సిద్ధం. ఎందుకంటె ఈ నేల తల్లి మాకు స్వర్గం ఇక్కడే ఉంటాం. వెళ్ళాలంటె పోయేదేముంది మాకు గోసి, గొంగడి,గుడిసె తప్ప కానీ కాకపోతే మీ మేడలు మిద్దెలు ఉంటాయి మీరు రాలేరు అని గర్జిస్తాడు. అందుకు బయపడిన అగ్రవర్గం వారు ముందుగ అగ్రవర్ణాల వినాయక విగ్రహాలు వెళ్ళాక, మాదిగల విగ్రహం సాయంత్రం 6 గంటలకు ఊరేగింపుకు రావాలని చెప్పారు. దీనిలో కూడ తక్కువ చేసి చూపడం ఉద్దేశం అని కవి అభివర్ణించారు.

నర్సప్ప ధైర్యంగ మాట్లాడిన సత్యపు మాటలకు బహుజనులంత కలిసి వచ్చి లోకాన్ని కాపాడె దేవుడిని (వినాయకుడిని) మనుషులే కాపాడుకుంటున్నారని సమస్యలను ఎత్తి చూపారు. ఆ తరువాత కమ్యూనిస్టు నేత పుణ్యమా! అంటు కూలీ రేట్లు పెంచుకుని శ్రమకు తగిన ఫలితం పొందుతున్నారు. అదే విధంగ ప్రభుత్వం బంజారు భూములను దళితులకు పంచడం చేత బోర్లు, కరెంట్ బాయిల చేత వ్యవసాయం చేసుకుని ఇండ్లు, వాకిళ్ళు, విద్య - బుద్ధులు అన్ని అభివృద్ధి చెందాయి. అందువల్ల అగ్రవర్ణాల వేల ఎకరాలకు కూలీల కొరత ఏర్పడింది. ఇబ్బంది అయింది అని కథను మలుపు తిప్పారు కథకుడు. ఆ తరువాత ఆ హైవే రోడ్డు ప్రక్కన చిన్నగ దుకాణలు పెట్టిన దళితులు, సోషల్ వేల్ఫేర్ ద్వార లోన్‌లు పొంది అభివృద్ధిలోకి వచ్చారు. అగ్రకులాలను చూసి నిలబడె మాదిగలు ఇప్పుడు రోడ్డుకు ఇరు ప్రక్కల వారి వారి దుకాణాలలో కుర్చిలోనే దర్జాగ కూర్చుంటున్నారు రెడ్డి ముందు లేచేది లేదు. ఆ తర్వాత షాపులు ప్రక్క ఇండ్లతో నిర్మించుకున్నారు. వారికి వారే సంస్కరించుకున్నారని మాదిగ జాతిని సంస్కరించె విధంగా కథను రాశారు.

ఇక మాదిగలు వినాయకుడిని నిమజ్జనంచేయపూని మనం వినాయకుడిని పెట్టుకోవడం అనేది భక్తికి, భయాన్ని తోలడానికి, ఎవరికి లొంగకుండ, ఆత్మస్థైర్యం పెంచడానికి అగ్రవర్ణాలలో పోటి పడాలి అని నర్సప్ప చెప్పాడు. అటు అగ్రకులాలు మాదిగలు ఏమి చేస్తారో పోయిన సంవత్సరం కోపంతో ఉన్నారని అనుకుంటుండగా, ఇటు మాదిగ యువకులు ఏదైన సరే అని అంటుండగ అందులో ఒక్కరు ఇలా ఎంతకాలం ఊరేగింపులు, గొడవలు అనేసరికి, నర్సప్ప ఇలా సమాధానం ఇస్తున్నాడు. ఇప్పటికి, అసలు ఊరేగింపె లేని రోజు వరకు ఊరేగింపు అవసరం,వినాయకుడి విగ్రహం, నిమజ్జనం లేని రోజు వరకు ఊరెగింపు అవసరం అంటాడు. అంటె అగ్రవర్ణాల అదిపత్య ప్రతీక అయిన వినాయకుడు మనకు వద్దు అని మాదిగ జాతికి పిలుపునిచ్చాడు నర్సప్ప అని పాత్ర ద్వారా కథకుడు గొప్ప సందేశం మాదిగ జాతికి ఇచ్చాడు. ఆ తర్వాత ఎలాంటి గొడవలు లేకుండ నిమజ్జనం జరిగింది. నిమజ్జనంలో నర్సప్ప మందేసి చక్కగ చిందేసాడు. మాదిగలలో ఒకరు నర్సప్పను నీకు ఇప్పుడు ఆనందంగా ఉందా? అని అడగగా లేదు, ఎందుకంటె నేను చావనందుకు, ఎందుకు చావలేదంటె, జనాల భయం, వల్ల, ఇది జయం కాదు అపజయం. రానున్న అసలైన జయానికి సంకేతం అని ఊరిలోని దళిత - బహుజనులందరికి ఈ ఐకమత్యమే విజయమన్నాడు. ఇలాంటి మాటలు, పాత్రల ద్వారా పల్కించిన కథకుడు కొలకలూరి ఇనాక్ గారు గొప్ప కథకుడు.

ఉపయుక్త గ్రంథాలు :

1. దళిత కథలు - ఆచార్య కొలుకలూరి ఇనాక్
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి
3. హెచ్‌యం టివి., యూట్యూబ్‌లో - ఆచార్య ఇనాక్ ముఖాముకి తెలుగు లెస్సా
4. దళితుల చరిత్ర - 5 - డా॥ కత్తి పద్మారావు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పుట్టపర్తిగారి కలంలో – ఓరుగల్లు, రుద్రమదేవి కీర్తి, పరాక్రమాలు

- నోముల సుమలత

శతాధిక గ్రంథకర్త, వాగ్గేయ కృతికర్త, మృదు మనస్వి, కవితా యశస్వి, సరస్వతిపుత్ర బిరుదాంకితులయిన పద్మశ్రీ డా॥ పుట్టపర్తి నారాయణ చార్యులుగారు. పై బిరుదులే కాక ప్రజా బాష భూషణ, సర్వతంత్ర స్వతంత్ర, సరస్వతితిలక లాంటి వందలాది బిరుదులు వారి సాహిత్య కృషి - పత్రిభకు వరించినను. స్వామి శివానంద సరస్వతి తన పాండిత్యంను పరికించి ఇచ్చిన "సరస్వతి పుత్ర" బిరుదును పుట్టపర్తి వారు స్వీకరించారు. వీరు వైష్ణవ, శైవ, జైన, బౌద్దాలలోని సూక్ష్మాలను లోతుగా ఆకలింపు చేసుకున్నారు. "సంస్కృత, తమిళ, మళయాల, కన్నడ, హింది, పైశాచి, శౌరశాలి, మగాది, అర్ధమాగాది స్వదేశీ భాషలు మరియు ఆంగ్ల, జర్మన్, లాటిన్ లాంటి పరదేశి భాషలను నేర్చుకున్న బాహుభాష పండితుడు". వీరు మహాకావ్యాలు, ఖండకావ్యాలు, గేయకావ్యాలు, నవలలు, గేయాలు, అనువాదాలు, విమర్శలు, వాఖ్యాలలో వీరిది అందవేసిన చేయి. వీరి సాహితి ప్రతిభకుగాను డాక్టరేట్, ఆంధ్రరత్న, పద్మశ్రీ లాంటి అత్యున్నత బిరుదులు పొంది, కనకాభిషేకం చేయుంచుకున్నాను "నాహం పండిత" అనుకున్న గొప్ప ఉత్తమోత్తముడు నారాయణచార్యులు. వీరి రచనలో జాతీయ భావాలు, సమాజ అభ్యుదయ భావాలు, రక్తి, భక్తి కనిపిస్తాయి. ఈ మహనుభావులు 1914లో జన్మించి 1990 సెప్టెంబర్-1న పరమపదించారు.

కాకతీయులు గొప్పపాలనా దక్షత కల్గి తెలుగు మాట్లాడే వారినంత (తమపాలన) ఒక్క గొడుగు కిందికి తెచ్చారు. తెలుగు ప్రజల అభ్యున్నతికి అనేక గుళ్ళు-గోపురాలు, గొలుసుకట్టు చెరువులు, ముఖ్యంగా కోటలు, వేయి స్తంభాల గుడి, రామప్పగుడి, రామప్ప చెరువు, లక్నవరం చెరువు మొదలయినవి ఏర్పాటు చేశారు. "ఇక కాకతీయులు దుర్జయ వంశస్థులని బయ్యారం శాసనం తెలుపుతుంది. ఇంతకు దుర్జయ్ లంటే శత్రువులకు జయింపశక్యము కానివారని అర్థం". కాకతీయుల పాలనలో ఉన్న తెలుగు ప్రాంతం అంతయు "సిరులొలికించె సీమగా, వన్నె చిన్నెల వస్త్రాలకు కాణాచిగా, పాడిపంటలకు పట్టుకొమ్మగా, సుందర సౌదాల ధామంగా ఉండేది.

మేఘాన్ని దూతగ చేస్తూ పుట్టపర్తి నారయణచార్యుల వారు సృష్టించిన మేఘదూతం గేయకావ్యం ద్వారా ఓరుగల్లు కీర్తి, రుద్రమదేవి శక్తి పరాక్రమాలను కనులకు కట్టినట్లు గేయ కవిత రూపంలో వర్ణించారు.

చుట్టనుచు జడిసేపు / చేరంగ మరిచేపు / కాకతీయుల ఓరుగల్లూ / ఆంధ్ర చరిత్ర కన్యక పుట్టినల్లూ / రుద్రమ్మ చండీశ్వరీ దేవి జలజల పారించె / శాత్రవుల రక్తమ్ము చెడని సెలయేరుగా

పుట్టపర్తి వారు సృష్టించిన ఆకాశంలో ప్రయాణించి మెఘనితో జైలులోని ఖైది తన భార్యకు సందేశం పంపుతూ దారిలో ఓరుగల్లు వైభవంను, రుద్రమదేవి శక్తి పరక్రమాలు చూసివెళ్ళుము. ఒక వేళ నీవు చుట్టూ తిరగడం ఎందుకని మర్చిపోయోవు. ఓరుగల్లులో రుద్రమ్మ శత్రువుల రక్తాన్ని సెలయోరుగా పారించింది. ఆమె ఆంధ్ర చరిత్రలోనె పుట్టిన ఒక వీర కన్య కనుక నీవు చూసి వెళ్ళసిందే అంటారు పుట్టపర్తివారు.

యాదవాన్వయుడగు మహదేవరాజు - తామగువయని - చుల్కనగ జూచి
మనసులో - మగతనము పేరాసలాబీ -
కత్తిగొని వచ్చిపడెనట -నాడు - చిచ్చుమిసి రుద్రమ్మ
వెడలనది - విక్రమము వెడలినటు రూపెత్తి

యాదవవంశ మహాదేవరాజు రుద్రమ్మను అబలని చులకనతో చూసి, తానే మొగొన్ని, మొనగాన్ని అనుకుని ఆమెపైకి యుద్ధానికి రాగా, అప్పుడు రుద్రమదేవి పౌరుషమే తన ఆకారంగా మారి మహాదేవరాజు, అతని సైన్యంపై నిప్పులు కక్కింది.

కదన రంగమునందు - కాళిక రూపమై
మీ యెడల ద్రాను గన్పించీ- యాదవుని
అయువిక - నిల్వదని పించి తరిమినది
దేవగిరి వరకు నిద్రిత గుహా సముదయము
కడిమిగల తనదు హుంకారముల మేల్కొలిపి

రుద్రమ్మ యుద్ధరంగంలో అపర కాళికలగ ఎక్కడ చూసిన తానె కనపడగ, మహాదేవరాజు తన ప్రాణం పోతుందేమో అని భయపడుతుంటే తన దేవగిరిపట్నం వరకు పారిపోగొట్టింది.

దళితుడగు పగతుండు - తన శిరమ్మును వంచి
పాదమ్ములందు గీలించి - తెన్గుపారాణి సొమ్ముగను ధరించీ
వినయమున కోటి ధనరాసులను - కుప్పగ బోసెనట!
కాలమ్ములో వింత కనకాభిషేకమ్ము !

రద్రమ్మ దేవితో యుద్ధములో ఓడిపోయిన మహాదేవ రాజు రుద్రమదేవి పాదాలపై పడి పారాణిగ మారి పోయాడు. చివరగా కోట్లకొలది ధనరాసులను ఆమెకు సమర్పించడట. ఇది ఆ కాలంలో ఒక వింత కనకాభిషేకమే.

బ్రతుకుపోరా ! తెన్గు పడతి యడదపు వాడి
వ్రాయించుకో కావ్యమందూ ! నీతితో
పాడుకో ! జీవితంబందూ ! అన్నదట
యొకనాటి తెనుగులో నువిద దృష్టికి గాదు
గరసాన బట్టినది - ఖడ్గ లతికకుగ్రూడ

ఓడిన మహాదేవరాజుతో బ్రతుకుపోరా ! ఈ తెలుగు స్త్రీ (రుద్రమ్మ) కత్తిపదును గూర్చి కావ్యం రాయించుకోని, నీ జీవింతమంత పాడుకో... అన్నదట. ఒకప్పటి తెలుగు స్త్రీ లెక్కకు రాకుండేది. కానీ ఇప్పుడు రుద్రమ తన "ఖడ్గలతకు" సానపెట్టి యుద్ధం చేసింది.

ఎచటెచట, నిల్పిపోయెనో ! జయస్తంభములు
రుద్రాణి తెన్గురుద్రమ్మా - విక్రమం
ఆపాదనఖము నసిగ్రుమ్మా - కాలాన
మాసిపోయిన యాంధ్రమండలీ విభవంబు
లే "సోమశేఖరుడో" యేనాడొ జెప్పవలె

పార్వతీలాంటి రుద్రమ్మ నాటించిన జయస్తంభాలు ఎక్కడెక్కడో ! ఉన్నాయి. ఆ రుద్రమ్మ పరాక్రమం శిరస్సు నుండి కాలి గోటి వరకు చీలుస్తుంది. ఆనాడు మరుగున పడ్డ ఆంధ్రదేశ వైభవంను ఏ (మల్లంపల్లి) సోమశేఖరశర్మ వంటి వారు ఎప్పుడో! చెప్పాలి.

అచట "విద్యానాధు" - అమరకవి గనిపించు
చీకిపోయిన గుండియలతో - నేత్రముల
నాకట్టు బాష్ప సంతతితో - నడు రేల

నా మహాత్ముని మించుటడుగుదమ్ముల బాద్య మర్పించి కదలరా ! యాతడ్రు శంభుని మూర్తి ఆ రుద్రమ్మ ఉన్న ఓరుగల్లులో విద్యనాధుడనె సంస్కలత కవి, పగిలిపోయిన గుండెలతో, కళ్ళనిండా కన్నీరుతో దీనంగా కనిపిస్తాడు. ఆయన గొప్ప శంభుని రూపం. ఓ ! మొఘుడా! నీకు అర్ధ రాత్రి సమయం అప్పటికి అయిన నీవు ప్రయాణిస్తూ ఆ మహాత్ముని పాదాలను కడిగి వెళ్ళిపో...

తన కావ్య నాయకుడు - దైనమున కెరగాగ్ర
తానెంతగా నేడ్చినాడో ! - దు:ఖ భరముచే మేయి
వీడినాడో అయ్యయో !
యేచోట నాసుకవి యిల్లనెడిదుండెనో !
ఆ చోట వర్షింపు మమర జన్మము నీది

అమరకవి విధ్యానాధుడి యొక్క నాయకుడు (ఓరుగల్లు అప్పటి ప్రభు) దీనావస్థకు లోనుకాగా తానెంత బాధపడి దు:ఖంతో ప్రాణాలు విడిచాడో ! అక్కడ ఆ మహాకవి ఇల్లు వెతకి పూల వాన కురిపించు నీకు దీర్ఘాయుస్సు వస్తుంది. అని ఓరుగల్లు కీర్తిని, రుద్రమ్మ పరాక్రమాన్ని గొప్పగా వర్ణించారు.

ఉపయుక్త గ్రంథాలు :

1) పదవ తరగతి - తెలుగు వాచకం (1998)

2) పదవ తరగతి - తెలుగు క్వచ్చన్ బ్యాంక్ (2008)

3) కాకతీయ వైభవ తోరణాలు - డా॥ పోలవరపు హైమావతి

4) యూ ట్యూబ్ (మాధ్యమం -2014 జనవరి 31) ప్రతిభామూర్తులు - పుట్టపర్తి నారాయణాచార్యులు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు కథ – ముస్లిం మహిళల ఆక్రందన

– డా॥ పి .వరలక్ష్మి, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ, పి.జి.కళాశాల, పుత్తూరు.

"ఘోషలోబడి క్రుళ్ళిపోయినది దిక్కున్ మ్రొక్కులేకుండ నీ
యోషా మండలి యెండ కన్నెరుగక కీయుత్తుత్త ధర్మాలకున్
భోషాణంబయిబూజు పట్టినది హిందూ జాతి చిత్తంబునం
దీషత్ప్రేమ వహించి స్వేచ్ఛ యిడవోయీ! అక్క చెల్లెండ్రకున్"

– గుర్రంజాషువా

తెలుగు సాహిత్యంలో ఆధునిక ధోరణులతో వెలుగు లోకి వస్తున్న సాహిత్యం ముస్లింవాద సాహిత్యం. ఇది వారి వెనుకబాటుతనాన్ని, వేరుచేయబడేతనాన్ని సమాజంలో వారు పడే అవస్థల్ని చాలా స్పష్టంగా చిత్రిస్తుంది. అందులో భాగంగానే తెలుగు కథా సాహిత్యంలో ముస్లింమహిళలు ఎదుర్కొంటున్న అనేక రకాల ఇబ్బందులు, సమస్యలు మనకు కన్పిస్తుంది. ముస్లింమహిళలు అహర్నిశలు శ్రమిస్తున్నా తమ ఉనికి అడుగంటిపోతూ,దుర్భర దారిద్ర్య జీవితాలను నెట్టుకు రావాల్సిన నికృష్ట పరిస్థితి. పరదాల వెనుక వారు అనుభవించే చిత్రహింసలు, బహుభార్యత్వం,తలాక్, ముతా వంటి వివాహ సంప్రదాయాల పేరుతో వారుపడే మానసిక ఆవేదన అంతాఇంతా కాదు. ఆచారాలపేరుతో స్త్రీలపై సాగుతున్న వివక్ష, హింసలు అనేక రకాల అరాచకాలు మనకు తెలుగుకథల్లో కన్పిస్తాయి.

ప్రతి సమాజంలో మతానికీ, కులానికీ ఒక ప్రత్యేక సంస్కృతి ఉంటుంది. ఆహార విహారాల్లో ఆచార వ్యవహారాల్లో విలక్షణత ఉంటుంది. ఆ ప్రత్యేకత విలక్షణత మనుగడకు, మానవత్వానికి ఆటంకమైనప్పుడు గౌరవిస్తున్న సంప్రదాయాలే నిరసనకు గురౌతాయి. ముస్లిం మతంలోని వివాహ వ్యవస్థలోని లొసుగులను. పురుషాధిపత్యాన్ని, స్త్రీలపట్ల కొనసాగుతున్న వివక్షను తమ రచనల ద్వారా ఎండగట్టారు రచయితలు.

''సాహిత్యం ద్వారా మనకు దళితుల జీవితాలు తెలుసు! సాహిత్యం ద్వారా మనకు స్త్రీల జీవితాలు తెలుసు! రైతుల జీవితాలు తెలుసు, రైతు కూలీల జీవితాలు తెలుసు. అయితే ముస్లిం కుటుంబాలకు చెందిన జీవితాలు తెలియకపోవటం వెయ్యేళ్ళు తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విషాదం'' అన్నారు ప్రముఖ కథకులు, సాహిత్య విమర్శకులు సింగమనేని సత్య నారాయణ.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య నన్ను"తెలుగులో కథలు రాస్తున్న అందరికంటే నీకు ఓ ప్రత్యేకత వుంది. ఇప్పటి వరకు తెలుగులో రావాల్సిన ముస్లిం జీవితాలను గురించి నీవు రాయగలిగావు. నీవు ఆ సామాజిక వర్గానికి చెందిన వాడివి కావడమేకాక, రాయగలిగిన రచయితవి కదా. అందుకే చెప్తున్నా - ఈ కోణంలో ఆలోచించు'' అని చెప్పారు. ఆ ప్రేరణే ముస్లిం జీవితాల గురించి కథలు రాయడానికి కారణం అంటారు శశిశ్రీ.

ముస్లిం కుటుంబాల జీవితాలను, మరీ ముఖ్యంగా ముస్లిం మహిళల జీవితాన్ని, వారి కట్టుబాట్లను, హిందూ కుటుంబాలకు చెందినవారు అర్థంచేసుకోవటం అంత సులభం కాదు. మన పక్కపక్క ఇళ్ళలో నివసిస్తున్నప్పటికీ వాళ్ళు, మనమనుకున్నతంగా మనకు అర్థంగారు. ముస్లిం కుటుంబాలలోని మహిళల జీవితాలు హిందూ కుటుంబాలలోని మహిళల కంటే చాలా భిన్నంగా ఉంటాయి. ఇతర కులాల, మతాల స్త్రీలకంటే ముస్లిం స్త్రీలు ఎక్కువ అణచివేతకు గురౌతుంటారు.

పూర్వీకుల ఆచారాలను, మూఢంగా అనుసరించే ముస్లిం మత పెద్దలు విధించే కట్టుబాట్లు స్త్రీలపట్ల చాలా

కఠోరంగా ఉంటాయి. అజ్ఞానము, అమాయకత్వము, అభద్రతా, అనధికారము, అణచివేతా, ఇలాంటివన్నీ ముస్లిం మహిళలకు తీవ్రమైన శాపాల్లాంటివి. తరాలతర బడి అనుభవిస్తున్న కారణంగా, అవి వాళ్ళజీవితాల్లో, విడదీయరాని భాగమైపోవటం అత్యంత విషాదం. 'సత్యాగ్ని' లాంటి రచయితలు చెబితేతప్ప మనకు ఇవన్నీ అర్థంగావు.

ముస్లిమేతర సమాజానికి, ఎన్నో కొత్త జీవిత పార్శ్వాలను, కుటుంబ గతంగా ముస్లిం మహిళలు అనుభవించే మౌనహింసను, తెలుగుకథలు ఆవిష్కరిస్తాయి. అదే సందర్భంలో తలాక్, ముతా, హలాలా లాంటి మౌఢ్య సంప్రదాయాలను ఎదుర్కొనే మహిళలు కూడా ఈ కథల్లో కన్పించడం, ఈ కథల గొప్పతనం. పాత సంప్రదాయాల నుండి ముస్లిం మహిళలు బయట పడాలని కూడా ఈ కథలు ఆకాంక్షిస్తాయి. వ్యాస విస్తృతికి వెరచి రెండు కథలు మాత్రమే ఈ పరిశోధనా వ్యాసంలో విశ్లేషిస్తునాను

పేద మైనారిటీ కుటుంబాల్లో డబ్బులకు ఆశపడి అబంశుభం తెలియని చిన్నారులను 'నిఖా' పేరుతో దుబాయి షేక్‌లకిచ్చి వ్యభిచారకుహారంలోకి తోసేసే దుర్మార్గాన్ని వేంపల్లి సికిందర్ "ప్రవాహంలో నాచు" కథలో చిత్రించారు.

15సంవత్సరాల సల్మా ఈ కథలో ప్రధానపాత్ర, బాధితురాలు. ఈ అమ్మాయి తండ్రి ఏమాత్రం బాధ్యత లేకుండా తిని,తాగి తిరుగుతుంటాడు. ఈ అమ్మాయి తెల్లవారక మునుపే ఇంటి పనికెళ్ళి ముగించుకొని వారుపెట్టే అనేక రకాల చీవాట్లు హింసలు భరించి తరువాత స్కూలుకెళ్తుంది. ఇది ఆమె రోజువారీ పరిస్థితి. అయినా కడుపు నిండా తిండి తినే పరిస్థితి ఈమెకు లేదు. "రేపు నువ్వు పెందలాడే రా బూజు దులపాలి, ఇల్లు కడగాలి.....చదువు పేరు చెప్పి నిలిచిపోయావనుకో వీపు చీరేస్తాను" అని నిన్న పని ముంగించి వచ్చేటప్పుడు యజమానురాలు అన్న మాటలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. నిద్ర కూడా పట్టలేదు. పొద్దున్నే లేచి పనులు ముగించుకొని స్కూలుకు బయలుదేరింది. స్కూలుకు ఆలస్యమైపోయింది. రాత్రి ఇంట్లో జరిగిన మరో సంఘటన ఆమెకు వణుకు పుట్టిస్తోంది. భయపడుతూ ఆలస్యంగా వచ్చిన ఆ పాపను టీచరు తిట్టి పనిమ్మంటు ఇచ్చారు. అవన్నీ కూడా భరించింది. కానీ రాత్రి మళ్ళీ ఇంటికి చేరుకోలేదు. స్కూలు దగ్గరే తిరుగుతోంది. అది గమనించిన రాత్రి కాపలాదారుడు ఉదయం టీచర్లకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న టీచర్లు కలిసి మాట్లాడుకుంటున్న సందర్భంలో ఈ ప్రస్తావన వచ్చింది. కొంతమంది బాగా చదువుతుందని కనికరంచూపితే మరి కొందరు తిడ్తున్నారు. తనంటే అభిమానించే ఒక టీచర్ చొరవతీసుకొని ఆ అమ్మాయిని పిలిచి మంచిగా సమస్యను తెలుసుకుంటుంది. విషయం విని అవాక్కైన ఆమె తన తండ్రిని పిలిచి మాట్లాడి సర్ధిచెప్పి అలాంటివేవీ జరగవని భరోసాతో ఇంటికిపంపుతుంది టీచరు. ఆ మాటలు నమ్మి ఇంటికెళ్ళిన అమ్మాయి తిరిగి స్కూలుకు రానేలేదు. తండ్రి టీచర్లను కూడా నమ్మబలికి నటించి తాననుకున్న ప్రకారమే కొంత డబ్బు తీసుకొని దుబాయి షేక్‌లకు అమ్మేశాడు.

టీచరు పాఠశాలకు రాకపోవడానికి కారణం తెలుసుకొని వారు ఖాదర్ భాషా ఇంటికెళితే వారి గుడిసె కూడా బీగం వేసి ఉంది. ఖాళీ చేసి వెళ్ళిపోయిన విషయం తెలుసుకొని నీటి ప్రవాహంలో సుడులు తిరుగుతున్న నాచు మొక్క ఒకటి వేగంగా కొట్టుకు పోతున్నట్లు కనిపించింది. కానీ ఏం చేయగల్గింది? నిస్సహాయంగా నిలబడిపోయింది! ఇలాంటి తండ్రులబారినుండి ఈ ఆడపిల్లల పరిస్థితికి విముక్తి లేదా? డబ్బు కోసం దుబాయి షేకులకు కూతుర్ని అమ్ముకోవడానికి ఆ తండ్రికి మనసెలా వచ్చింది. ఇలాంటి రాక్షసుల అమానవీయ చర్యలను నియంత్రించేవారే లేదా? ఆ దుబాయిషేక్‌లు ఆ పసిబిడ్డను వ్యభిచార గృహాలకు తరలిస్తారని తెలియదా? సృష్టికొనసాగడానికి కారణభూతమైన ఆడబిడ్డలను ఈ గతినుంచి తప్పించే మార్గమేలేదా? అని ఆలో

చించి, ఇలాంటి సమస్యల నుండి బాధితులను పరి రక్షించే దిశగా చర్యలు తీసుకోవాలి. అలా స్త్రీలు సంపూర్ణంగా పరిరక్షించబడిప్పుడే సమాజం అభివృద్ధి చెందినట్టు. కాబట్టి ఇలాంటి వారికి బుద్ధిచెప్పేలా ప్రతి వ్యక్తి ఆలోచించాలి. అలాగే ఆడపిల్లలుకూడా ఇలాంటి తండ్రులనుంచి తమను తాము రక్షించుకోవడంలో అత్యంతజాగురూకత వహించాలి. ఇలాంటి అనుమానం పరిస్థితి కల్గినప్పుడు ప్రభుత్వ వసతి గృహాలతో కూడుకున్న పాఠశాలను ఆశ్రయించాలి. తద్వారా కనీసం తాత్కాలిక రక్షణపొంద వచ్చు.ఆ తర్వాతబాగా చదువుకొని తన కాళ్ళపైతాను నిలబడటానికి మంచి ఉద్యోగంలో స్థిరపడ టానికి ప్రయత్నించాలి. కన్నవారే యమదూతలుగా ప్రవర్తించినప్పుడు కన్న తండ్రే డబ్బుకు కక్కృతిపడి మద్యం, మత్తుపానీయాలుకోసం తన కన్నబిడ్డను వ్యభిచార గృహాలకు తరలించే దుర్మార్గపు స్థితికి అదే బిడ్డలే బుద్ధిచెప్పాలి. అలాంటి దౌర్భాగ్యం రాకూడదని ఆశిద్దాం.

తలాఖ్ సంప్రదాయం కారణంగా ముస్లిం మహిళల జీవితం ఎంత దుర్భరమైపోతుందో ఆఖరుకు ఆమె మృత్యువు ఒడిలోకి చేరుకోవడానికి ఈ సంప్రదాయమే కారణం కావడం సత్యాగ్ని రాసిన "బంగారుకత్తి" కథలో కన్పిస్తుంది.

ఈ కథలోని 'సాబిరా' దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. సాయంత్రం అయ్యేసరికి రెక్కలుంటే ఎంతో బాగుండు సాబిరా వద్ద వాలిపోయ్యేవాడ్ని అనుకునేవాడు. ఆమె అంటే అంత ఇష్టంగా చూసుకునేవాడు. ఒకరోజు బయటి నుండి వచ్చిన సాబిరా భర్త ఎంతో మైకంతో ప్రేమతో పిల్లలతో నిద్రిస్తున్న ఆమెను నెమ్మదిగా నిద్రలేపు తాడు. అప్పుడే తన భర్తతో శృంగారసుఖం అనుభవించి నట్లు కలగన్న సాబిరా "ఇప్పుడే గదండీ వచ్చారు. అప్పుడే మళ్ళీనా?"అంటుంది నిద్రపోతూనే. అంతలోనే నిశ్చేష్ట డైన భర్త ఏమాత్రం ఆలోచించకుండా నిర్దాక్షణ్యంగా 'తలాఖ్' చెప్తాడు. సాబిరా ఎంత చెప్పినా వినలేదు. తాను నిర్దోషినని తననూ, తన బిడ్డలనూ వేరు చేయద్దని తనను నమ్మమని కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడుతుంది. ఇక చేసేదేమీ లేక తన బిడ్డలను వదలి పుట్టింటికి చేరు కుంటుంది. కాని తన భార్యను మరచిపోలేక ఆ విష యాన్ని గురించే తీవ్రంగా ఆలోచించడం వల్ల గుండె పోటుకు గురై ఆస్పత్రిపాలౌతాడు.

తిరిగి తానామెను వివాహం చేసుకోవాలనుకున్నా వారి సంప్రదాయం ఒప్పుకోవని అలా చేసుకుంటే అధర్మమని బాధపడతాడు. ఏది ఏమైనా సాబిరా తన భర్తకు బిడ్డలకు దూరమై తన జీవితం దుఃఖమయమైపోయింది. ఆ దుఃఖంతోనే ఆమె నమాజ్ ముగించి శాశ్వతంగా నిద్రలోకెళ్ళిపోయింది. ఈ మాటలు విన్న ఆస్పత్రిలో ఉ న్న తన భర్తకూడా షాక్‌తో చలనంలేని స్థితికి వెళ్ళి పోయాడు. అంటే తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఎంతో అన్యోన్యంగా ఉన్న దాంపత్య జీవితం అగాథంలా మారిపోయింది. అనాలోచితమైన ఇలాంటి నిర్ణయాలు అనర్థాలకు దారితీస్తాయని తెలిపే ఈ కథ ప్రతి మనిషికి ఓ కనువిప్పులాంటిది.

సగటు భారతీయుడ్ని, సగటు కథారచయిత జ్ఞానాన్ని విస్తారంచేసే అనేక సామాజిక సాంస్కృతికాంశాలు ఈ కథల ద్వారా అందరికీ తెలిసి వస్తాయి. మరీ ముఖ్యంగా గ్రామీణ, పట్టణ, నగర ముస్లిం స్త్రీ, పురుషుల మనస్తత్వా లను ఆడించే ఇంటా - బయటా శక్తుల అవగాహన మనకు ఈ కథల ద్వారా కలుగుతుంది. తలాఖ్ సంప్ర దాయం కారణంగా ముస్లిం మహిళల జీవితం ఎంత దుర్భరమైపోతుందో ఆఖరుకు ఆమె మృత్యువు ఒడిలోకి చేరుకోవడానికి ఈ సంప్రదాయమే కారణం కావడం మనకు కన్పిసుంది. అలాగే సల్మాలాంటి ముక్కుపచ్చ లారని పసిబిడ్డలు ఎదుర్కొంటున్న హింసాపూరిత అమాన వీయ చర్యలు తెలుగుకథలద్వారా మనకు తెలియ వస్తాయి.

అయితే ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా

నిలబడి తమతమ శక్తిమేరకు పోరాడి బుద్ధిచెప్పిన మహిళలూ లేకపోలేదు. ఏ తప్పు చేయని 'నాదిరా' అనే అమ్మాయికి కోర్టుద్వారా 'తలాఖ్' నోటీసు పంపించి బోనులో నిలబెట్టిన తన భర్తకు అదే కోర్టులో ఖులా ఇచ్చి బుద్ధిచెప్పే సన్నివేశం, పురుషులు స్త్రీలపట్ల ఎంత బాధ్యతగా మెలగాలో బుద్ధి చెప్పే కథ 'ఖులా'. తెలుగు సాహిత్యంలో ఇప్పటి వరకూ ఇస్లాం సోదరులను ఉద్దేశించి ఏ రచయితా ఏ పాత్రతో కూడా పలికించని కథ ''ఖులా''. ప్రతి వ్యక్తిని ఆలోచింపజేసే కథ ఒక మాటలో చెప్పాలంటే మనసులో పాతుకున్ని ఉన్న మౌఢ్యాన్ని తరిమికొట్టి జ్ఞానోదయం కల్గించే ఆదర్శసాధికారిక మహిళపాత్ర మనకు దర్శనమిస్తుంది. ఇలా వైవిధ్యభరితమైన మహిళ పాత్రల్ని తెలుగు కథల్లో మనం చూడవచ్చు.

మనిషి స్వేచ్ఛగా ఉన్నప్పుడు ఆలోచనా విధానం విశాలదృక్పథం అలవడుతుంది. వారిని అలా బంధనాల్లో ఉంచకూడా తగిన స్వేచ్ఛనిచ్చినప్పుడే వారిలోని అంతర్గత శక్తులు బయటపడుతాయి లోకజ్ఞానం, లోకానుభవం తెలుసుకుంటారు. ఏది మాట్లాడాలో ఏది మాట్లాడ కూడదో అర్థం చేసుకుంటారు. అలాంటి సంకుచితమైన దృష్టినుంచి విశాలమైన దృష్టిని అలవరుచుకునే అవకాశం ఉంటుంది. అలా మహిళలు జ్ఞానపరిధుల్ని విస్తృతం చేసుకున్నప్పుడే కుటుంబానికీ, సమాజానికీ శ్రేయస్కరం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

స్త్రీవాద కథలు – సామాజిక చైతన్యం

– ఉషారాణి పిల్లి, యస్.జి.వి. ఓరియంటల్ కళాశాల, తెలుగు శాఖాధ్యక్షులు, తిమ్మసముద్రం - ప్రకాశం జిల్లా.

ఆంగ్లంలో 'Feminism' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'స్త్రీవాదం' అని, 'స్త్రీ విముక్తి ఉద్యమం' అని, 'స్త్రీ విమోచనోద్యమం', 'స్త్రీ స్వేచ్ఛా ఉద్యమం' అని వ్యవహరిస్తున్నారు. తెలుగులో ఫెమినిస్టు రచయితలు ఎక్కువగా 'స్త్రీవాదం' అన్న పదాన్నే వాడుతున్నారు. 'Feminism' అనే పదానికి 'స్త్రీవాదం' అన్న పదం నేడు వ్యవహారంలో ఉంది.

ఫెమినిజం ఎప్పుడు మొదలైందనే విషయం ఖచ్చితంగా చెప్పడం కష్టం. ఎవరి మీదైనా అణిచివేత ఎప్పుడు మొదలౌతుందో అప్పటి నుంచే ఆ అణిచివేత నుంచి విముక్తికోసం వాళ్ళు పోరాడటం జరుగుతుంది. సాహిత్యంలో మాత్రం 1792లో స్త్రీల హక్కుల గురించి ఇంగ్లండుకు చెందిన 'మేరీ వోల్‌స్టోన్ క్రాఫ్ట్' రచించిన 'విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ వుమన్' అనే గ్రంథంలో మొదటిసారిగా ఫెమినిస్టు ఆలోచనా ధోరణికి రూపకల్పన చేశారు.

ఫెమినిజం అనే పదం మొదట ఉపయోగించబడిన 17వ శతాబ్ది అర్థానికి, 1980 నుండి ప్రయోగిస్తున్న అర్థానికి చాలా భేదం ఉంది. పూర్వపు ఫెమినిస్టులు 'హక్కులు - సమానత' అనే పదాలు వాడితే, నేడు 'అణిచివేత - విముక్తి' అనే వాటి గురించి ఆలోచిస్తున్నారు. వాళ్ళ భాషలో వచ్చిన మార్పు వాళ్ళ రాజకీయ అవగాహనలో వచ్చిన మార్పును తెలియజేస్తుంది.

ఇంటా, బయటా స్త్రీలు సమానత్వాన్ని, గౌరవాన్ని పొందటం కోసం, తమ జీవితాలపైన, శరీరాలపైన తమకే హక్కు ఉండాలనేది స్త్రీవాదుల ప్రధాన వాదన."ఎక్కడైతే స్త్రీకి ఎన్నుకునే స్వేచ్ఛ ఉంటుందో, ఎక్కడైతే ఆమె గృహిణిగా ఉండాలని బలవంతం చేయబడదో, ఎక్కడైతే ఆమె ఆడవాళ్ళ పనుల్లోకి, తక్కువ వేతనాల పనుల్లోకి నెట్టబడదో, ఎక్కడ స్త్రీ అన్ని విధాలా గౌరవించబడుతుందో అటువంటి సమాజం కోసం పోరాడుతున్నారు." వీళ్ళ పోరాటంలో ప్రధానమైంది ఇంటి పని గుర్తింపు, విలువ పొందాలని, తద్వారా ఆ పనిచేసే గృహిణి గుర్తింపు, విలువ పొందాలనేది. ఆర్థిక స్వాతంత్ర్యం కోసం చేసే పోరాటం స్త్రీవాదుల పోరాటాల్లో ఒక కోణం మాత్రమే.

స్త్రీవాదుల లక్ష్యం కేవలం స్త్రీ సమానత్వం మాత్రమేనా? అనే ప్రశ్నలకు సమాధానం వాళ్ళ మాటల్లోనే - "బీద ప్రజల గురించి ఆలోచించడమే సోషలిజం సారాంశం అనుకోవడం ఎంత పొరపాటో స్త్రీల విషయాలను గురించి ఆలోచించడమే ఫెమినిజం అనుకోవడం అంతే పొరపాటు." అని సమాధానం చెప్పవచ్చు.

స్త్రీవాదులు కేవలం స్త్రీ సమానత్వాన్ని కోరడం, దాని కోసం పోరాడటం మాత్రమే కాక స్త్రీ, పురుషులిద్దరి కోసం, సమ సమాజం కోసం పోరాడుతున్నారు. స్త్రీవాదం కేవలం ఏదో ఒక తరగతికి (ఉన్నత, మధ్య, కింది తరగతుల) చెందిన మహిళలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించటం లేదు. అన్ని తరగతుల స్త్రీలకు, పురుషులకు కావాల్సింది. "ఫెమినిజం కేవలం మధ్య తరగతి స్త్రీలకే పరిమితమైందని వ్యాఖ్యానించడం ఫెమినిజం అంటే తెలుసుకోకపోవడమే. అన్ని వర్గాల స్త్రీలూ ఆ మాట కొస్తే పురుషులూ కేవలం ఫెమినిజం వల్ల మాత్రమే విముక్తి అవుతారు. మానవత్వాన్ని వ్యతిరేకించగలిగిన వాళ్ళే ఫెమినిజాన్ని వ్యతిరేకించ గలరు. ఫెమినిజమే సర్వ మానవతావాదానికి ప్రతీక." అంటారు జయప్రభ.

స్త్రీ సమస్యలుగా చూడబడే వరకట్నం, భార్యలను కొట్టడం, గర్భస్రావం, సమాన వేతనాలు, ఆర్థిక స్వేచ్ఛ మాత్రమే స్త్రీవాదులు చర్చించరు. ప్రపంచంలో ప్రతి

విషయం మన మీద ప్రభావం చూపుతుంది కనుక ప్రతి విషయం స్త్రీలకు సంబంధించిందేనని వీళ్ళు నమ్ముతారు. సామాజిక మార్పు కోసం చేసే పోరాటమే స్త్రీవాద లక్ష్యమని వీళ్ళ అభిప్రాయం.

స్త్రీవాదులు లేవనెత్తే అంశాలు :

1. పితృస్వామ్యం
2. జెండర్
3. మాతృత్వం
4. ఇంటిపని
5. లైంగిక స్వేచ్ఛ
6. సమాన వేతనం

స్త్రీవాద కథలు - సామాజిక చైతన్యం :

అస్తిత్వ స్పృహ :

"నేను ఎవరిని' అన్న ప్రశ్నతో ప్రారంభించి స్త్రీ తనను తాను తెలుసుకోవటం కోసం చేసిన బహుముఖ అన్వేషణే అస్తిత్వ స్పృహ. తనను తాను ఎక్కడో ఒక చోట నిలబెట్టి నిర్వచించుకోవడం స్త్రీవాద కథల్లో ఒక అంశం. స్త్రీగా తనను ఇన్నాళ్ళు ఈ సమాజం నిర్వచిస్తూ వచ్చింది. ఆ నిర్వచనాలన్ని తనను ఇరుకైన చట్రంలో బంధించాయని స్త్రీ గుర్తించినప్పుడు వాటిని నిరాకరించటం సహజ పరిణామం. పతివ్రత, పురుషానుభవానికి సిద్ధం చేయబడ్డ జీవి, అందాలబొమ్మ మొదలైన మాటలన్నీ స్త్రీ పర్యాయ పదాలైనాయి.

సమాజం ఇప్పటివరకు స్త్రీని భార్యగా, ఇల్లాలిగా, తల్లిగా నిర్వచించింది. ఈ నిర్వచనాలు స్త్రీ తనను తాను కోల్పోయేట్లు చేశాయి. బతుకు నుండి పరాయీకరించబడి బతకాల్సిన ఆ దుర్భరస్థితి గురించి స్పృహ కలిగినప్పుడు స్త్రీ ఎంత వేదనకు గురవుతుందో, తనను తాను తెలుసుకోవడానికి ఎంత తపనపడుతుందో సత్యవతి రాసిన 'ఇల్లకగానే...' కథ చూపిస్తుంది.

ఈ కథలో నిజానికి ఈగ పాత్ర కాదు. శారద అనే అమ్మాయి ఈ కథలో పాత్ర. పేరు మరచిపోయింది ఈమె. శారద పెళ్ళి చేసుకొని ఇంటిచాకిరే జీవితంగా బతుకుతూ తన వ్యక్తిత్వాన్ని కోల్పోయిందని చెప్పడానికి శారద తన పేరును మరచిపోయినట్లు, దానిని తెలుసుకోడానికి ఎవరెవరి దగ్గరికో తిరిగినట్లు కథానిర్మాణం చేస్తుంది రచయిత్రి. నిజానికి ఇలా తిరగడం నిజం కాదు అవాస్తవం. ఈ రెండింటి సమ్మేళనం వల్ల గొప్ప వ్యంగ్యం పుట్టి అదే ఈ కథా నిర్మాణానికి బలమైంది. కథ ప్రారంభంలోనే "అమె జీవితం మూడు అలుకు గుడ్డలూ - ఆరు ముగ్గు బుట్టలుగా సాగిపోతూ వచ్చింది" అన్న వాక్యం నుండి వ్యంగ్యం మొదలౌతుంది. శారద తన పేరేమిటో చెప్పమని మొదట పనిమనిషిని అడుగుతుంది. "మీరు మా అమ్మాగారే" అంటుందామె. పిల్లలు "నువ్వు మా అమ్మవి" అని, పక్కింటావిడ "మందుల కంపెనీ మేనేజర్ భార్య" అని, పిల్లల స్నేహితులు ""కమలా వాళ్ళమ్మా" అని, భర్త "నిన్నందరూ మిస్సెస్ మూర్తి అంటారు కదా" అని, స్వయానా అమ్మ "నువ్వు మా పెద్దమ్మాయివి" అని చెప్తారు. చివరికి ఆమె క్లాస్‌మేట్ ప్రమీల ఆమె పేరు శారద అని చెప్తుంది. అయితే కథ చివర్లో "ఇల్లకగానే పండగకాదండీ - అవునుగానీ ఇకనుంచీ నన్ను ఏమోయ్ గీమోయ్ అనకండి నా పేరు శారద - శారదా అని పిలవండి తెలిసిందా" అని చెప్తుంది భర్తతో. పేరు మరచిపోవడాన్ని స్త్రీ వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోవడంగా సంకేతించి అంచెలంచెలుగా సాగిన ఈ నిర్మాణం కథను మంచి శిల్పంగా మార్చింది.

శారీరక స్పృహ :

అస్తిత్వ చైతన్యంలో భాగంగానే స్త్రీకి తనకొక శరీరం ఉందన్న స్పృహ పెరిగింది. శరీరం ఇన్నాళ్ళు పురుష ప్రయోజనాలను నెరవేర్చగలిగిన సాధనం. అది పురుషుడికి లైంగికానందాన్నిస్తుంది. పురుషుడిదైన కుటుంబానికి శ్రమ చేసే యంత్రం అవుతుంది. తన శరీరం తనకేమీ కాదా? తనకే అనుభవం ఇవ్వదా, తన "అనుభవాలు' వ్యక్తిగతమైనవా? అవి లోలోన అణచి ఉంచుకోవాల్సిందేనా? అనుభవాలను వ్యక్తీకరించకుండా చేయడంలో అణచివేత

రాజకీయాలే ప్రధాన పాత్ర వహిస్తున్నాయి - అనే కొత్త ప్రశ్నలు, కొత్త అవగాహన కలుగుతున్న సందర్భం నుండి స్త్రీల సాహిత్య వస్తువు మారింది. శరీరానికి వ్యాయామం అవసరం అని గుర్తించి అందుకు సమయాన్ని కేటాయించడానికి స్త్రీ సిద్ధం కావటం 'గాంధారి రాగం' కథలో కనిపిస్తుంది.

ఈ కథలో సరస్వతి పెళ్ళికావటంతోనే తన తెలివి తేటలను, ఆసక్తులను భర్త అభిరుచులకు అనుకూలంగా కుదించుకొని ఇంటిని శుభ్రంగా ఉంచి, చక్కగా వంట చేసిపెట్టి భర్త అభివృద్ధికి, పిల్లల అభివృద్ధికి పనిచేయడమే జీవిత లక్ష్యంగా అనుకుంది. ఎదిగిన కూతురు స్నేహితురాలితో షటిల్ ఆడుతుంటే చూస్తున్న సరస్వతి అంతరంగపు ఆలోచనా స్రవంతి ఆమె గతాన్ని వర్తమానాన్ని కలిపి పి. సత్యవతి ఈ కథను రాసింది. సంసారపు మాయలో తానెంత కోల్పోయిందో గ్రహించటమే కాదు మరచిన తన జీవితంలో 'శరీరం' ఎంత బరువైందో అర్థం చేసుకుంది. కోల్పోయిన తన ఆటపాటల ఆలోచనల సంపూర్ణ జీవితాన్ని తిరిగి పొందటానికి కూతురుతోపాటు షటిల్ ఆడటానికి నన్నద్ధమవుతుంది సరస్వతి. శరీరముందని గుర్తించటం, దానికి వ్యాయామం అవసరమని గుర్తించటం ఈ కథలో ముఖ్యాంశం. ఈ సందర్భంలో చలం చెప్పిన ''స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడుంది. దానికి విజ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి'' అన్న మాటలు ఈ కథ చదువుతున్నంత సేపు గుర్తుకొస్తూనే ఉంటాయి.

మతం పేరు మీదనో, మగ దురహంకారం వల్లనో శరీరం అత్యాచారానికి గురవుతుంటే 'యోని' తనకు ఆనందానుభవానిచ్చే కేంద్రంగా కాక హింసకు వేదికగా మారుతుంటే తన శరీరం మీద తనకే ఏ అపేక్షలేని ఒక అమానవీయ పరిస్థితి వస్తుంది. ఇదే విషయాన్ని ఓల్గా ''అయోని' కథలో అద్భుతంగా చిత్రించింది. ఒకవైపు ఘంటసాల నిర్మల ''దేహమే కద / మన జీవన లాలసకు ఏకైక వాహిక'' అంటూ 'శరీరాన్ని ప్రేమించాలి' అంటుంటే, మరోవైపు స్త్రీకి శత్రువై లైంగిక పీడనకు ఎలా గురౌతుందో ఓల్గా రాజకీయ కథలు చిత్రించాయి. కళ్ళు నోరు, రొమ్ములు మొదలైన స్త్రీ అవయవాలు పితృస్వామిక అణచివేతకు గురౌతున్న వైనాన్ని విప్పిచెప్పాయి. కొండేపూడి నిర్మల రచించిన 'మొద్దురాచ్చిప్ప' కూడా స్త్రీ శరీరంపై ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో పురుషులు చేసే అధికారం వాళ్ళలో శరీర ద్వేషంగా వ్యక్తం కావటాన్నే చిత్రించింది.

సంతానంపై హక్కు లేకపోవడం :

పిల్లలను కనటం ఒకవైపు స్త్రీకి మరోజన్మ అవుతుంటే, మాతృత్వం గొప్పవరంగా మరొకవైపు కీర్తించ బడుతుంది. పిల్లల్ని కనటం దగ్గర నుండి పిల్లలకు సంబంధించిన ఏ విషయంలో స్త్రీకి హక్కు లేదు. పున రుత్పత్తికి సంబంధించిన హక్కుల గురించిన ఆందోళన స్త్రీవాదంలో ఒక ప్రధానాంశం. స్త్రీ గర్భం మీద స్త్రీకి హక్కు లేకుండా చేస్తున్న అమానుష కుటుంబాధికారం మీద ఆరోపణ పి. సత్యవతి రాసిన 'గోవు', కొండేపూడి నిర్మల రాసిన 'తడిసిమోపెడైన' కథల్లో వివరించబడింది.

పునరుత్పత్తి హక్కును వస్తువుగా చేసుకుని ఓల్గా భిన్న పార్శ్వాల నుండి విస్తృతంగా కథలు రాసింది. పిల్లల్ని కనలేని స్త్రీకి ఎదురయ్యే కుటుంబ, సామాజిక తిరస్కారాన్ని వివరించిన 'ఒక రాజకీయ కథ'. పిల్లలను కనను అని నిర్ణయించుకొన్న స్త్రీ మీదైనా నిర్బంధం, అణిచివేత, అధికారం ఏ స్థాయిలో ఉంటాయో చూపించిన 'భిన్న సందర్భాలు' కథ. భార్య పునరుత్పత్తి శక్తిని తన అవసరాలకు అనుగుణంగా నియంత్రించే భర్త స్వార్థాన్ని, స్వప్రయోజనాన్ని చూపించిన 'పురిటినొప్పులు' కథ. స్త్రీ తనకు పుట్టే పిల్లలపై హక్కులు లేవే అని అందోళన పడటమే కాక హక్కుల కోసం సంఘర్షించడం కూడా ఆధునిక మహిళ జీవన ప్రవృత్తి అవుతున్న స్థితిని చిత్రించాయి ఓల్గా కథలు.

తాను కపిపెంచిన పిల్ల మీద హక్కుకోసం చట్టపరమైన అవకాశాలుండాలని ఆశపడిన స్త్రీ వేదనను 'ఆర్తి' కథలో చిత్రించింది. పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యతను, ప్రభుత్వ బాధ్యతను గుర్తుచేస్తూ దానికనుగుణంగా రావలసిన కొత్త చట్టాల గురించిన ఆకాంక్షను ఓల్గా రాసిన 'కేసు' కథ చిత్రించింది.

మగ సంతానంపై మక్కువ :

తల్లి కడుపులో ఒకే రోజు పుట్టిన కవల పిల్లలు (ఒక మగ, ఒక ఆడ) పెంపకంలో ఉన్న అసమానత్వాన్ని, ఆడపిల్లలపై మగపిల్లలల పెత్తనాన్ని, కుటుంబంలో మగ పిల్లలకు ఇవ్వబడే ప్రాధాన్యాన్ని, ఆడపిల్లలపై చిన్న చూపుని, పురుష పక్షపాతాన్ని 'పెళ్ళి వయసు' అనే కథలో అబ్బూరి ఛాయాదేవి వివరించింది.

రవి, భువి ఇద్దరూ కవల పిల్లలు. చిన్నప్పటినుంచే వాళ్ళ పెంపకంలో తేడా ఉంటుంది. వాళ్ళ తల్లి రవికి లాగులు, చొక్కాలు భువికి గౌనులు, చెడ్డీలు వేసేది. రవికి క్రాఫ్, భువికి పోనీటైల్ చేయించేది. రవి వీధిలో క్రికెట్ ఆడటానికి వెళ్తే తల్లి ఏమీ అనదు. అదే భువి వెళ్తే 'ఆడపిల్లలు మగ పిల్లలతో కలిసి రోడ్డు మీద ఆడ కూడదు. వరండాలోనో, గదిలోనో కూర్చుని ఆడుకోవాలి' అని కోప్పడేది. ఈ రకమైన పెంపకం స్త్రీలను అబలలుగా, అజ్ఞానులుగా చేస్తుంది. రవి భువి ఒకే రోజు పుట్టినా రవి భువికి అన్నయ్యలాగా ఉండేవాడు. అంటే రవికి భువి కంటే బలమైన ఆహారం పెడుతుండేవారు. రవి 'ఒసే భువి మంచినీళ్ళియ్యవే' అని భువి మీద పెత్తనం చెలాయిస్తాడు. భువి ఎప్పుడైనా మంచినీళ్ళిమ్మని రవినడిగితే తల్లి 'తప్పుకదూ, మగ పిల్లవాణ్ణి అలా తెమ్మనొచ్చా?' అని అంటుంది. చదువు విషయంలో రవి ఎంతవరకు చదివితే నేనూ అంతవరకు చదువుకుంటా నంటే 'ఆడపిల్ల ఎంత చదివినా ఆఖరికి వంటిల్లు తప్పదుగా! అయినా రవితో నీకు వంతేమిటి? వాడు కుర్రకుంక" అంటుంది తల్లి. ఈ విధంగా రవి కంటే భువిని తక్కువగా చూస్తూ ఆమె వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తారు.

ఓల్గా రాసిన 'ఆర్తి' కథలో స్త్రీ, పురుషుల పెంపకంలో ఉండే అసమానత్వాన్ని చూపిస్తూ "మా అన్నయ్య మా ఊళ్ళోనే డాక్టర్ కోర్సు చదువుతున్నాడు. అన్ని విషయాల్లో అన్నయ్యకే విలువ. అన్నయ్య పనులకే ప్రాముఖ్యత. మా ఇద్దరి మధ్యా తేడా నిండా రెండేళ్ళుండదు. కానీ అందరూ అన్నయ్యను గౌరవించే తీరు చూస్తుంటే మా ఇద్దరికీ ఎంతో ఎడముందనిపించేది. "వాడు మగాడు, పెద్ద చదువు చదువుతున్నాడు అని అమ్మ, నాన్న, అత్తా అందరూ అన్నయ్యనే వెనుకేసుకు వచ్చేవారు. నేనెంత బాధ్యతగా ఇంటి పనులు చేస్తున్నా, అన్నయ్య ఇంటి సంగతులు పట్టించుకోకుండా తిరిగినా అన్నయ్య మాటకే విలువ" అన్న కథానాయిక మాట ల్లో ఆడ, మగ పిల్లల మధ్య తల్లిదండ్రులు పాటించే వ్యత్యాసాన్ని కళ్ళకు కట్టారు రచయిత్రి.

ఈ విధంగా మగపిల్లలపై ప్రేమతో వారికి స్వేచ్ఛను కల్పిస్తూ ఆడపిల్లలకి ఎక్కడికక్కడే హద్దులు విధిస్తూ, వాళ్ళ స్వేచ్ఛను అణిచివేస్తూ వారిలో ఆత్మనూన్యత భావానికి చిన్ననాటి నుండే పునాదులు వేస్తున్నారు.

శ్రమ దోపిడీ :

ఉత్పత్తి రంగంలో శ్రామికుల శ్రమ, శ్రామికుల్లో భాగంగానే స్త్రీలు చేసే శ్రమ వాళ్ళ ఆకలిని అవసరాలను అంతంత మాత్రంగానే తీర్చే ప్రతిఫ?లాన్నిస్తూ అత్యధికంగా భూస్వాములకు, పెట్టుబడీదారులకు లాభాలను సంపాదించేదవుతుంది. మరి కుటుంబంలో స్త్రీలు చేసే శ్రమ సంగతేంటి? ఉత్పాదక శ్రమగా గుర్తించబడని ఆ పని భారం కింద స్త్రీలు ఎంత నలిగిపోతున్నారో? అవమానించబడుతున్నారో? అన్న ప్రశ్నలకు స్త్రీవాదం మన ఆలోచనా ప్రపంచంలోకి తెచ్చింది. ఆ ప్రశ్నలకి జవాబుగా స్త్రీ శ్రమ గురించి పెరిగిన నూతన చైతన్యం స్త్రీవాద కథల్లో కనబడుతుంది. ఎడతెరిపిలేని ఇంటి పనిలో జీవిత మాధుర్యాన్నే కోల్పోయే స్త్రీని గృహలక్ష్మిగా కీర్తించడంలోని సామాజిక విషాదాన్ని ఎత్తి చూపుతూ ఎన్నో కథలు వచ్చాయి.

మన గ్రామాల్లో శ్రామికులైన ఆడామగ పొద్దస్తమానం కష్టపడతారు. కాని మగవాళ్ళు తమకు వచ్చిన కూలి డబ్బుల్తో పాటు పెళ్ళాం కూలి డబ్బులు కూడా తీసుకెళ్ళి తప్ప తాగి ఇంటికొచ్చి పెళ్ళాన్ని కొట్టడం, ఎవరైనా అడ్డుపడితే 'నా పెళ్ళాం నా ఇష్టం. కొట్టుకుంటాను, చంపు కుంటాను. నువ్వెవడివిరా?' అని అంటారు. ఈ విషయాన్నే మల్లాది సుబ్బమ్మ'కనువిప్పు' అనే కథలో ఇలాంటి వ్యక్తినే చైతన్య వంతులైన స్త్రీలంతా కలిసి "ఏ వ్యక్తికి మరో వ్యక్తిని హింసించే హక్కు లేదు. నీ పెళ్ళానికి మనసు ఉంది. వ్యక్తిత్వం ఉంది. నీకులాగే స్వేచ్ఛా సమానత్వాలున్నాయి. ఆడది అణిగిమణిగిన దానిలాగా పడి ఉండే రోజులు పోయినై" అని బెదిరించి అతనికి కనువిప్పు కలిగిస్తుంది.

పి. సత్యవతి రాసిన 'చీమ', 'గోధూళి వేళ' కథలు, సి. సుజాత రాసిన 'త్రీ ఇన్ వన్' కథ వరకు అనేక రచనలు ఉద్యోగాలు చేసే స్త్రీల మీద ఉండే రెండు రకాల పని ఒత్తిడిని, ఇంటి పనిలో యాంత్రికతను చిత్రించాయి.

కుటుంబ హింస :

స్త్రీల జీవితంలో వివక్ష, అణచివేతలను అమలు చేసే అత్యంత ప్రాథమిక వ్యవస్థ కుటుంబం. పెళ్ళి మగాడికి ఆడదాని మీద పూర్తి పెత్తనమిస్తే పెళ్ళి వల్ల ఏర్పడిన కుటుంబం ఆడదాని పాలిట నిత్యహింసల నిర్బంధ వాసం అవుతుంది. తల్లులను కొట్టే తండ్రులు, తండ్రుల మీద అసహ్యం పెరిగే పిల్లలు ఆ కుటుంబంలో సహ జీవనం చేస్తుంటారు.

ఆస్తికి వారసత్వం వహించేవాడు, వంశాన్ని నిలబెట్టే వాడు పుత్రుడే అన్న భావం వల్ల, పున్నామ నరకం నుండి తల్లిదండ్రులను రక్షించేవాడు పుత్రుడేనన్న వెర్రి నమ్మకం వల్ల, మగ సంతానానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ వెర్రి నమ్మకాలతో అబ్బాయి పుట్టే వరకు ఎంతమందినైనా కనాల్సిందేనని భార్యల్ని పిల్లల్ని కనే యంత్రాలుగా భావించే భర్తలు మన సమాజంలో ఉన్నారు. అలాంటి వాళ్ళలో ఒకడు 'వేగుచుక్క' కథలో పరంధామయ్య.

ఈ కథలో ఆరుగురు ఆడపిల్లలు పుట్టినా ఇంకా కొడుకు పుట్టేవరకు ఉండాల్సిందేనంటాడు భర్త. ఆమె పిల్లలతో వేగలేక, ఇంటెడు చాకిరీ చేయలేక దారిద్ర్యాన్ని తట్టుకోలేక తన స్నేహితురాలిని (ఆమెకొకతే కూతురు) ఆదర్శంగా తీసుకుని భర్తకు చెప్పకుండానే గర్భస్రావం చేసుకుంటుంది. ఈ విషయం తెలిసిన భర్త మండిపడ తాడు. అప్పుడామె భర్తతో "పిల్లల్ని కని పెంచే బాధ్యత నాదైనప్పుడు బిడ్డలొద్దనే హక్కు కూడా నాకున్నదని గ్రహించక పోవటం మీ పొరపాటండీ! ఆడదంటే కేవలం పిల్లల్నికనే యంత్రమనే భావం కల పురుషులకు స్త్రీలే గుణపాఠం చెప్పాలండీ" అని అంటుంది. పిల్లల్ని కనటం, కనకపోవటం స్త్రీ ఇష్టంపై జరగాలి. పిల్లలు ఎప్పుడు కావాలో, ఎప్పుడు వద్దో నిర్ణయించుకునే హక్కు స్త్రీలకే ఉండాలి. గర్భస్రావపు హక్కు పూర్తిగా స్త్రీలకే ఉండాలనే ఫెమినిస్టు భావాలు ఈ కథలో కనిపిస్తాయి.

సి. మృణాళిని రాసిన 'ఉద్యోగిని' బదిలీ కథలు స్త్రీల ఉద్యోగ జీవితాన్ని తమ అవసరాలకు, ప్రయోజనా లకు అనుగుణంగా నిర్వచించి నియంత్రించే భర్తల ప్రవృత్తి మీద విమర్శనాస్త్రాన్ని సంధించాయి. తన అభివృద్ధి ని నిరోధించే కుటుంబం మీద మమత వదులుకోక తప్పదని స్త్రీలు గ్రహించటాన్ని కుప్పిలి పద్మ 'మమత' కథలో చిత్రించింది.

కుటుంబధిక్కార చైతన్యం :

పెళ్ళి, దానివల్ల ఏర్పడే కుటుంబం అధికార వ్యవస్థగా స్త్రీల జీవితాలను నియంత్రిస్తాయని అర్థమైన తర్వాత కుటుంబాన్ని ధిక్కరించటం స్వీయ అభివృద్ధి దృష్ట్యా అవసరమౌతుంది. స్త్రీవాదం కుటుంబం మీద విమర్శను పెట్టడమేకాక కుటుంబ చట్టాన్ని బద్దలుకొట్టడానికి పిలుపు కూడా ఇచ్చింది.

మల్లాది సుబ్బమ్మ రాసిన 'చెలియలికట్ట' కథలో భూస్వామి అయిన భూషణం తన పాలేరు కూతురు 'చుక్కి'ని బలత్కారం చేయబోతే, చుక్కి ఎదురుతిరిగి అతన్ని చంపి పారిపోతుంది. ఆ తర్వాత ఒక మిల్లు

యజమాని ఆమెను చేరదీసి ఉంచుకుంటాడు. కానీ వాడు తన కూతురు 'నీలి'ని బలత్కారం చేశాడని తెలిసి గొంతు పిసికి చంపేస్తుంది. ఈ విధంగా చుక్కి కుటుంబధిక్కారాన్ని ప్రదర్శిస్తుంది.

మృణాళిని రాసిన 'కోమలి', 'గాంధారం' కథలు కుటుంబాధికారం మీద వేసిన చురకలుకాగా, ఓల్గా, కుప్పిలి పద్మ వంటి వాళ్ళ కథలు కుటుంబ చట్రాన్ని బద్దలుకొట్టిన కథలు. స్త్రీల జీవితాన్ని నియంత్రించాలని ప్రయత్నించే భర్త అధికార వ్యామోహాన్ని హాస్యంతో, చమత్కారంతో, ప్రతివ్యూహాలతో తిప్పికొట్టటం కోమలి జీవన పోరాటం. సున్నితమైన విమర్శకు చలించగలిగిన స్థాయిని కుటుంబ సంబంధాలు ఎప్పుడో దాటి పోయాయన్నది ఓల్గా అభిప్రాయం. అందుకనే ఆమె కుటుంబ చట్రాన్ని బద్దలుకొట్టి ఒంటరి జీవితాన్ని ఏర్పరచుకుంటున్న కొత్త తరహా స్త్రీల గురించి ఆలోచించగలిగింది. ఒక స్త్రీకి, ఒక పురుషుడికి ఏర్పడిన సంబంధాన్ని 'పెళ్ళి' రూపంలోకి మారిస్తే అది ఆడదాని మీద మగవాడి పెత్తనంగా బరువై కూర్చుంటుందన్న కొత్త చైతన్యంతో స్త్రీలు ఏ అధికార సంబంధాలకు తావివ్వని ఒంటరి జీవితాన్ని ఎంచుకుంటున్నట్లుగా 'ప్రయోగం' కథలో చూపించారు.

కుటుంబం అంటే భార్యాభర్తల సంబంధాలు మాత్రమే కాక బంధుత్వ సంబంధాలన్నీ కూడా స్త్రీల మీద అధికారాన్ని, పెత్తనాన్ని చేసేవేనని వీటి నుండి బయట పడటానికి స్త్రీలు ప్రయత్నం చేయాలని కుప్పిలి పద్మ 'ఆకాంక్ష', 'ముక్త' వంటి కథల్లో వివరించింది.

రాజ్యహింస :

ఎన్నికల నిర్వహణ కార్యక్రమంలో స్త్రీలు భాగం పంచుకోవడాన్ని, ఆ విధి నిర్వహణలో ఒక స్త్రీ ఎదుర్కొన్న కష్టనష్టాలను, అవమానాలను 'ఎన్నికలలో' కథలో వివరించింది ఓల్గా. ఎన్నికల సమయంలో పురుషులతో పాటు స్త్రీలకు కూడా ఎలక్షన్ డ్యూటీ వేస్తున్నారు. ఈ డ్యూటీలో పాల్గొనటం స్త్రీలకు ఎంతో ఇబ్బంది. పురుషులు తోటి స్త్రీలను గౌరవంగా చూసే స్థితి మన సమాజంలో ఇంకా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడో, ఏ మారుమూల గ్రామంలోనో అనేక మంది పురుషుల మధ్య స్త్రీలు డ్యూటీ చేయడం కష్టతరం.

ఈ కథలో విమలకు ఒక గ్రామంలో ఎలక్షన్ ప్రిసైడింగ్ ఆఫీసరు డ్యూటీ వేస్తారు. అక్కడికి లారీలో వెళ్ళాల్సి వస్తుంది. లారీ క్యాబిన్‌లో కూర్చున్న విమలను పక్కనే కూర్చున్న రూట్ ఆఫీసర్ ఆకలి చూపులతో అదే పనిగా చూస్తుంటాడు. వాడు తనను సెక్స్ సింబల్‌గా చూస్తున్నాడనే ఆలోచన రాగానే ఆమె ముఖం ఎర్ర బడింది. "వాడి చూపులకునేనవమాన పడకుండా ఎలా ఉండగలను? బయటకు వచ్చిన ఆడవాళ్ళకు ఇదొక సమస్య అని అరవకుండా ఎలా ఉండగలను?" అని అనుకుంటుంది.

ఓటింగ్ విధానంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనడానికి ప్రయత్నిస్తుంది. "తుపాకీ చూపించి జనాన్ని బెదిరించి ఓట్లు, అధికారం సంపాదించుకున్నారు ప్రజా ప్రతినిధులు. ఆడవాళ్ళను చూపులతోనే కాల్చి చంప గలిగే అధికారం పుట్టుకతోనే సంపాదించు కున్నారు మగవాళ్ళు" అని రాజ్యం తమపై జరుపుతున్న హింసను చిత్రించింది ఓల్గా.

కట్న సమస్య :

సాంఘీక దురాచారాల్లో ఒకటైన 'కట్నం' అనేది ఆడపిల్లల తల్లిదండ్రులకు పెట్టని ఉరి లాంటిది. పూర్వం బాల్యవివాహాల్లో కొంత ధనాన్ని పిల్ల తల్లిదండ్రులకు కన్యాశుల్కంగా ఇచ్చేవాళ్ళు, నేడది వ్యతిరేకమై ధనాశ పెరిగి కట్నమిస్తేనేగాని ఆడపిల్లలకి పెళ్ళి కావట్లేదు. అప్పట్లో ఆ సమస్య, ఇప్పట్లో ఈ సమస్య ఒక సాంఘీక దురా చారంగా మారింది.

మల్లాది సుబ్బమ్మ రాసిన 'బొమ్మపలికింది' కథలో రాణిని ఆమె తల్లిదండ్రులు కట్నం ఇవ్వలేక మూడో పెళ్ళివాడైన భాస్కర్‌కు ఇచ్చి పెళ్ళి చేస్తారు. ఇంట్లో ఓ ఆడది ఇంత ఉడకేసి పెట్టడానికి, ఇల్లు కనిపెట్టుకొని

ఉండటానికి మాత్రమే భార్య అవసరమని అతని భావం. మొదటి రాత్రే భార్యతో ''నీకిది మొదటి రాత్రేమో కానీ నాకు మాత్రం మూడో వంద పూర్తయిన రాత్రి... పై పై మాటలు, మోసం దగా లేని వాణ్ణి కనుక నిష్కపటంగా చెప్పాను'' అని అంటాడు. భాస్కర్ మాటల్లో నిష్కపటం కంటే పురుషుడు ఎంత మంది స్త్రీలతో లైంగిక సంబంధం కలిగివుంటే అంత గొప్ప అనే అహం కనిపిస్తుంది.

స్త్రీత్వాన్ని నిర్ణయించే వాటిలో ముక్కు పుడక ఒకటి. 'ముక్కు పుడక' కథలో ఓల్గా కట్నానికి, అందానికి, పెళ్ళికి ఉన్న అంతస్సంబంధాన్ని చర్చించింది. ఆడపిల్లల పెళ్ళిలో కట్నం, అందం ఏ విధమైన ప్రాముఖ్యం వహిస్తాయో చూపింది.

ఈ కథలో రమకు ఎన్ని పెళ్ళి సంబంధాలు వచ్చినా ఒక్కటీ కుదరదు. దానికి కారణం అమ్మాయి నచ్చక పోవడం కాదు. ఆ అమ్మాయి తండ్రి ఇచ్చే కట్నం నచ్చకపోవడం. కట్నం ఎక్కువ ఇస్తే ఆ అమ్మాయి నచ్చే దన్నమాట. వచ్చిన పెళ్ళి కొడుకులంతా కట్నం నచ్చలేదని చెప్పకుండా ముక్కు బాగాలేదని వంక పెడతారు. ఈ ముక్కు సమస్యను తొలగించడం కోసం ఆమె తండ్రి ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తాడు. ఆ తర్వాత వచ్చిన సంబంధం ఖాయమయ్యింది కానీ, పెళ్ళి కొడుకు ''అంతా బాగానే ఉందిగాని ఆ అమ్మాయికి ముక్కు పుడక లేదు'' అని వంక పెడతాడు. అతని కోసం ముక్కు కుట్టించుకోమంటే, రమ ''నేను కుట్టించుకోను, ఈ పెళ్ళి అగిపోయినా సరే'' అని ఖచ్చితంగా చెప్తుంది. పెళ్ళి కోసం ఆడపిల్లలు వీలైతే తమ అవయవాల్ని సైతం మార్చుకోవాల్సి వస్తున్న పరిస్థితిని విమర్శించిందీ కథలో రచయిత్రి.

స్త్రీలను ఇన్ని రకాల అణచివేతల నుంచి సంపూర్ణంగా విముక్తి చేయటానికి వ్యవస్థ మారనక్కరలేదు. స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులు, అవకాశాలు కల్పిస్తే చాలు. ప్రపంచంలో ప్రతిసమస్యను స్త్రీదృక్పథంతో కూడా పరిశీలించాలనడం స్త్రీవాద సాహిత్యం స్త్రీల జీవితాలలో తెచ్చిన గొప్పమార్పు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

"బతుకాట"నవల వస్తువు, సామాజికాంశాలు విశ్లేషణ

– పొంకం నాగరాజు, శ్రీశిరిడి సాయి డిగ్రీ కళాశాల, వరదయ్యపాళెం.

సాహిత్య లోకానికి ఇది వరకు పరిచయం లేని కొత్త కథావస్తువుల్ని పరిచయం చేసిన వారు రాసాని. విద్యావంతుడే కాక, నవలాకారుడుగా, కథకుడుగా, కవిగా, సాహిత్య విమర్శకుడిగా అంతకుమించిన నాటకకర్తగా, నటుడిగా బహుముఖమైన ప్రజ్ఞని కనబరచిన వారు రాసాని.

మనిషి సాంస్కృతిక జీవి. ఆయా వ్యక్తులు, ఆయా సమాజాలు కల్చలర్ ఎఫెక్ట్‌కి తప్పకుండా లోబడే జీవిస్తుంటారు. సంస్కృతి లేకుండా మనిషిని ఊహించడం కష్టం అందుకే సంస్కృతిని కొల్పోయిన జాతి ఉనికినే కోల్పోతుంది. సంస్కృతిని కోల్పోయిన జాతి బైరాగి గారు చెప్పినట్లు "పుల్లలు లేని అగ్గిపెట్టెలాంటిది" ఆత్మలేని బొందిలాంటిది. అందుకే రాసాని గారు సృష్టించిన ప్రతి పాత్ర సమాజ సంస్కృతిలో కదులుతున్నట్లు మనకు కనిపిస్తుంది.

ఆధునిక సాహిత్యానికి రంగభూమి సమాజమే. మన సమాజం సంక్లిష్టమైంది. అంతేకాకుండా బహుళ జాతులు, కులాలు, మతాల కలయికతో మనుగడ సాగిస్తోంది. అయితే ఈసభ్య సమాజం మరచిపోయిన లేదా దూరం చేసిన కొన్ని జాతులు ఉన్నాయి. అలాంటి తెగలను, మనుషుల జీవిన విధానాలను చిన్నప్పటి నుండి దగ్గరగా చూడడం వలననే నక్కల వాళ్ళగురించి (పయనం, తుఫాకి), పూసల వాళ్ళు(నల్లపూసలు), యానాదుల గురించి (ఆకలి, మిన్నేరు), కథలను, అలాగే ఆయా జాతుల సాంస్కృతిక నేపథ్యంలో నాటకాల వాళ్ళ గురించి (బతుకాట), గంగిరెద్దుల వాళ్ళగురించి(పరస), జోగినుల గురించి(ముద్ర) నవలు రాయగలిగానని రచయిత స్వయంగా చెబుతారు.

అలాగే 150 కథలు, వందలకొద్దీ వ్యాసాలు, కవితలు, 8నవలలు, 9నాటకాలు, 5విమర్శనా గ్రంథాలు రాసాని గారి కలం నుండి వచ్చినవి. వీటిలో అనేకం పలు భాషల్లోకి అనువాదం కూడా కాబడినవి ఉన్నాయి. వాటిలో ఒకటి ఈబతుకాట కూడా. ఈనవల "బణ్ణన" పేరుతో కన్నడంలోకి అనువాదం చేయబడింది. అంతేకాక ఈనవలకు 2001లో అమెరికాలోని తెలుగువారి 'తానా' అవార్డు కూడా వచ్చింది. నూతన నవ్యాంధ్రప్రదేశ్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ"బతుకాట"నవలను ఒక పాఠ్యాంశంగా 2015నుంచి కొనసాగుతోంది.

"కావ్యేషు నాటకం రమ్యం!" అన్నారు మన పూర్వీకులు.

నిజమే...చర,స్థిర కళల సమాహారంగానూ, సర్వకళల్లో మేల్బంతిగానూ గణుతికెక్కింది నాటకం. వేదకాలం నుంచే ఈనాటకం వుందంటారు పరిశోధకులు. ఇక్బాల్ కౌల్ "Indian Stage traces its heritage to the Vedas" అంటాడు.

వస్తు విశ్లేషణ :

"బతుకాట" పేరుకి నవలే కాని, నిజానికి అది నిజమైన వ్యక్తుల జీవితగాథ అనిపిస్తుంది. నిజజీవితాలను కథాత్మకంగా మలచి, నవలీకరణ చేసినట్లు స్పష్టమవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో ఇప్పటికీ యక్షగాన ప్రదర్శనలిచ్చే వారున్నారు. వంశానుగతంగా వచ్చిన కళ కూడు పెట్టకపోయినా - నమ్ముకున్న కళను వమ్ము చేసుకోలేక కొనసాగించే కొన్ని కుటుంబాలూ ఇప్పటికీ ఉన్నాయి. ఈకుటుంబాల వారు తిరుమల బ్రహ్మోత్సవాలకు వెళ్ళి వీటిని ప్రదర్శించడమే కాక, భజన బృందాల నేర్పరచి పాండురంగ భజనలూ, చెక్కభజనలు, కోలాంట

వంటి వాటిని ఆడడం ఇప్పటికీ జరుగుతున్నదే. అయితే నేటి సాంకేతిక పరిజ్ఞానంతో వస్తున్న సౌకర్యాలతోనూ, సినిమాల ప్రభావంతోనూ, టి.వి.చానల్స్‌తోనూ, వేగంగా దూసుకువస్తున్న అంతర్జాలంతోను, మానవజీవనంలో పెరిగిన వేగం ఫలితంగా నేడు కళలు కనుమరుగై పోతున్నాయి. వాటిని నమ్ముకున్న వారి జీవితాలు ఆకావికలమై పోతున్నాయి. ఇలాంటి కళలు కనుమరుగవ్వకూడదే ఉద్దేశ్యంతోనూ, భావి తరాలకు సంస్కృతి సాంప్రదాయాలను అందివ్వాలని తపనతోనే ఈ ''బతుకాట'' నవల రాసినట్లు మనకు తెలుస్తుంది. ఈ బతుకాట నవలలో అయిదు తరాల వీధినాటక కళాకారుల జీవితాలతో కూడిన విశిష్ట కథాంశంతో రాయబడింది. ఈనవల పూర్తిగా రాయలసీమ మాండలికంలోనూ, రాయలసీమ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, నమ్మకాలను ప్రతిబింబించేలా చిత్రీకరించారు.

నవలలో వీధినాటక కళాకారుల గురువుల గురించి, నాటకాలు ప్రారంభ చరిత్ర గురించి వివరించారు. జీవనం కొరకు వ్యక్తి నాటకాలను ఎలా వృత్తిగా మార్చుకున్నాడో తెలియజేయబడుతుంది. అవి వంశానుగతంగా ఒకరి నుండి మరొకరి చేతికి అందుతాయి. చివరి గురువు సిద్ధోజితో ఈబతుకాట నవల ప్రారంభమై క్రమక్రమంగా ఇతర గురువుల గురించి చెబుతూ చివరకు ఎవరితో ముగిసిపోయిందనే విషయంగా తెలియజేశారు.

చిత్తూరు జిల్లాలోని కుప్పం సమీపంలో యామిగాని పల్లె అన్న గ్రామం ఉంది. అక్కడ రంగస్థలం కళకే అంకితమైపోయిన కుటుంబం ఒకటుంది. వారి ఆది గురువు ''అణ్ణావు పటేరవు'' ఆయన ఎప్పుడు పుట్టాడో తెలియదు కానీ, 1867లో మరణించినట్లు ఆయన సమాధిమీద శిలాఫలకం చెప్తుంది. ఆయన కాలం నుంచి ఐదవ తరం వాడైన సిద్ధప్ప(సిద్ధోజి) వరకు గల ఆ వంశం వారే ఆనాటక బృందాలకు గురువులు. ప్రతి ఉగాదినాడు ఆనలుగురి సమాధులున్న మామిడితోపుకు వెళ్ళి పూజలు జరిపి, ఆ తర్వాత గజ్జెకట్టడం సాంప్రదాయం. తరువాత నాటకాలకు రంగస్థలం సిద్ధం చేయడం, కళాకారుల నిష్ట, రిహార్సిల్స్, ప్రాంప్టింగ్, ఆహారం, రాగం, తాళం ఇలా ఒకటేమిటి ప్రతి చిన్న విషయాన్ని ఈనవలలో వివరించారు. అలాగే ఆదిగురువైన అణ్ణావు పటేరావు ఒక ఉత్తమ సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. వారు తమ అనుభవాలను గ్రంథస్థం చేయాలనీ, పాత పుస్తకాలు పాడయిపోతే వాటిని తిరిగిరాయాలనీ ఆదేశించారు. ఈ సాంప్రదాయాన్ని సిద్ధోజీ వరకు అందరూ పాటించారు. అందువలన తరతరాల వారి చరిత్ర తరువాత తరాలకు తెలుస్తుంది.

ఈనవలలోని మొదటి గురువు అణ్ణావు పటేరావు పూర్వీకులు శివాజీ మహారాజు సంస్థానంలో సేనాపతులుగా, దండనాయకులుగా పనిచేసేవారు. తర్వాత రాజ్యాన్ని ఆక్రమించుకున్న తురుకుల బాధపడలేక కొన్ని కుటుంబాలు దక్షిణానికి వచ్చి స్థిరపడ్డాయి. అలా వచ్చిన కుటుంబాలలో పటేరావు కుటుంబం ఒకటి. కుటుంపోషణకోసం తనకు తెలిసిన విద్యతో తాటాకు మట్టలకు రంగులేసి వాటినే రాముడిగా, రావణుడిగా చెప్పి రామ కథలు చెప్పుకుంటూ, జనం మెచ్చి ఇచ్చిన డబ్బుతో జీవనం గడిపేవాడు.

పటేరావు తరువాత అతని బావమరిది, 'ఆటోకు కోటేశ్వరరావు'(కాటోజీ) రెండో గురువయ్యాడు. పటేరావు ఉపయోగించిన తాటాకు బుట్టబొమ్మల నాటకాలనే కొద్దిగా మార్పు చేసి వాటికి ముందు జంఖానాలు కట్టి, వాటి ముందు బొమ్మలు ఆడించేవాడు. వీటినే ప్రజలు జఖండీ నాటకాలుగ పిలిచేవారు. కాటోజీ ప్రతిభకు మెచ్చి విజలాపురం జమిందారులు గురువులతోపును అతనికి బహుమానంగా ఇవ్వడం జరిగింది. ఆతోపుకే 'గురువుల తోపు'గా నామకరణం జరిగింది. గురువుల తోపులో ఉన్న రెండో బండ మీద కోటోజీ1902లో మరణించాడని ఉంటుంది. అతని తరువాత అణ్ణావు తుక్కోజీరావు మూడో గురవయ్యాడు. ఇతను పనారస గోవిందరావు ఏర్పాటు చేసిన 'కీచకవధ' నాటకం వేస్తూ తన యాభైవ

యేట(1906)లో గుండె ఆగి మరణించాడు. ఇతను తరువాత వెంకోజీ(వెంకోబరావు) నాల్గో గురువయ్యారు. ఈయన ఊర్లో అందరికీ గురువుగా ఉంటూ భజనలు, నాటకాలు నేర్పించేవాడు. గురువులకు కష్ట కాలం మొద లైంది ఇతని కాలంలోనే. వెంకోజీ పాకాలలో ''భారతం'' ఆడుతూ చివర రోజు 'తపసమాను' ఎక్కి దిగుతూ ఉం డగా కాలుజారిపడి పోవడం జరుగుతుంది. తోపులోని నాల్లో బండమీద 1966 జనవరి 22 అని వెంకోజీ మరణించిన తేదీ వ్రాయబడి ఉంటుంది. ఇతని తరు వాత సిద్ధోజీ(సిద్ధప్ప) అయిదవ గురువయ్యాడు.

మొదటి నాలుగు తరాల కాలంలోనూ ఆకుటుంబం వారు ప్రదర్శనలిస్తూ వివిధ ప్రాంతాల ప్రజలను అలరిస్తుండేవారు. వారిచ్చే డబ్బు, ఇతర సామగ్రితో వారి జీవితాలు ఎలాంటి చీకూచింత లేకుండా సాగిపోతుండేది.

సిద్ధోజి తరం వచ్చే సరికి పరిస్థితులు నానాటికీ దారుణంగా దిగజారసాగాయి. నాటక సమాజంలో పోటీలు వచ్చాయి. ఎదుటివాడిని దెబ్బతీయాలన్న కుట్రలు, కుతంత్రాలు, రాజకీయాలు అన్నీ చోటు చేసుకున్నాయి. నాటకాల పట్ల ప్రజల ఆదరణా తగ్గి పోయింది. కరువులు, కాటకాలు, ఏపూట గింజలు ఆపూటకు వెతుక్కోవలసిన దుర్గతి, గత్యంతరం లేక దుక్కిటెద్దును కూడా కసాయివాడికి అమ్ముకోవడం ఇవన్నీ మనసున కలచి వేసే కఠిన వాస్తవాలు.

ఇతను కూడా తాత,ముత్తాతల పరంపరను కొన సాగిస్తూ తిరుమలకు యాత్ర సాగిస్తాడు. ఇతను కూడా తిరుమలలో భజన చేస్తూ అయాసంతో కిందపడి వైకుంఠ ద్వారంను చూస్తూ కన్నుమూస్తాడు. ఇలా కాటోజీతో ప్రారంబమైన తిరుమలయాత్ర సిద్ధోజీతో ముగుస్తుంది. ఆ తర్వాత యామిగాని పల్లె నుండి భజన యాత్ర తిరుమలకు జరగలేదు.

తర్వాత భాతరాంశాలతో వేసే నాటకాలలో ఈబృందం వారు పోతరాజు విగ్రహాన్ని ముందు పెట్టారు. ఈ పోతరాజు పదహారారణాల తెలుగు గ్రామదేవుడు. మరి పాండవులకీ, ఈ పోతరాజుకీ గల బాదరాయణ సంబంధ మేమిటి? ఆకథను కూడా వివరించారు రాసాని. అంతేకాక ''ద్రౌపది - పంచపాండవులు'',''ఇలావంతుడు లేక బలియ రాయుడు'', ''దుర్యోధనుడు - ఉక్కుశరీరం'', ''సహదేవుడు - జ్యోతిష్యం'',వంటి భారతానికి సంబంధిం చిన అన్నీ కథలను నాటకాలుగా భారతోత్సవాలలో ఆడుతారు. వాటిలో ఈ జానపథ కథలను కలిపి నాట కాలుగా ఆడడం రాయలసీమలో కనిపిస్తుంది. ఈ కథలను కూడా నవలలో నాటకారులు ప్రదర్శించేవారని మరోమారు గుర్తు చేశారు.

సాంఘిక పరిస్థితులు :

''బతుకాత'' నవల రచయిత రాసాని గారు రాయల సీమ ప్రాంతంలో సాధారణంగా కన్పించే సాంఘిక పరిస్థితు లను చిన్ని చిన్న విశేషాలతో వర్ణించడం మనకు ఈ నవలలో కనిపిస్తుంది.

ఊరిలో సంఘంలో కులమత బేధాలు చాలా నిక్కచ్చిగా పాటింపబడేవి. కులాంతర వివాహం చేసుకున్న వారిని సమాజం ఆదరించక వెలివేసే కట్టుబాట్లు ఉం డేది. అలా వెలివేయబడిన గ్రామస్థులతో పాటు వారి కన్న తల్లిదండ్రులు కూడా సాయం చేయకూడదనే నియయం. ఈ నవలలో కూడా కుర్వకుల కోటప్ప, బలిజ కుల బాలమ్మ వివాహం, వెంకోజీ(అణ్ణావు వెంకోబరావు) పెద్ద కుమార్తె రేణకమ్మ, బంగారప్పను కులాంత వివాహాలప్పుడు వీరిని వెలివేయడం జరుగుతుంది. బాలమ్మ వెలిని తట్టుకోలేక ఆమె తండ్రి గంగులయ్య తన భార్యతో సహా గురువలు తోపులోని మామిడిచెట్టుకు ఉరివేసుకుని చనిపోతారు. ఇక రేణుకమ్మ, బంగారప్పలు తమ పనులు తాము చేసుకుంటూ ఉండేవారు. కాలక్రమేణా వారిలోని మంచితనమే వారిని గ్రామంలోకి వారివద్దకు చేర్చింది.

సంఘంలో రెండే వృత్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఉండేవి. ఒకటి వ్యవసాయం, మరొకటి నాటకాలాడడం. వ్యవసాయ పనులు ఉన్నప్పుడు వ్యవసాయంను,

లేనప్పుడు నాటకాలను ప్రజలు తమ పనులుగా చేసుకునే వారు. సంఘంలో గురువుకు మంచి గౌరవం ఇచ్చేవారు. కేవలం నాటకం నేర్పే విషయంలో మాత్రమే కాకుండా గ్రామానికి చెందిన విషయాలలో కూడా గురువుకు పెద్దరికం ఇచ్చేవారు. నాటకాలు ఆడవారికి నియమాలు కూడా ఉండేవి. అటువంటి నియమాలు పాటించని గుర్రప్ప వంటి వారిని దూరంగా ఉంచడం కూడా నవలలో కనిపిస్తుంది. గుర్రప్ప సారాయి త్రాగిన కారణంగా అతనిని నాటకం వేయకుండా వెంకోజీ అపుతాడు.

సంఘంలో వడ్డీకి సొమ్ము ఇచ్చే వడ్డీ వ్యాపారులు ఉన్నారు. వారిలో ఇతరుల ఆస్తులను పీల్చేసే బుడ్డయ్య, గుర్రప్ప లాంటి వారు కూడా ఉన్నారు. భక్తి సంఘంలో ఎక్కువగా కనిపిస్తుంది. కరువు కాలమైనా, తినడానికి లేకపోయినా భజనలు, యాత్రలకు బియ్యం, డబ్బు ఇచ్చేవారు సంఘంలో కన్పిస్తారు. భారతోత్సవాలు ఘనంగ నిర్వహించబడుతూ ఉంటాయి. దానికోసం పెట్టే ఖర్చుకు ఎవరూ వెనుకాడరు. పాకాల, పుంగనూరులలో జరిగే భారతోత్సవాలు దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు.

సంఘంలో మూఢాచారాలు ఎక్కువగా కన్పిస్తాయి. నిప్పులపై నడవడం, బలిబండి భోజనం తీసుకోవడం, వర్షాలు పడనప్పుడు వర్షాల కొరకు 'విరాటపర్వం' చెప్పించడం, 'గోదురు కప్పలను ఊరేగించడం', 'కన్నెపిల్లలను అర్ధరాత్రిళ్ళు నగ్నంగా మడక దున్నించడం, 'వలసదేవర' వంటివి ఈ మూఢాచారాలకు పరాకాష్టగా చెప్పవచ్చును. ఇంకా గోదురు కప్పలను ఊరేగించి, చెరువులో విడిచి పెట్టి, లబలబమని నోరు కొట్టుకుంటూ వానదేవుడిని బూతుమాటలతో

"దిగిరారా దిగిరారా దివినుండి
దిక్కుమాలిన నాకొడకా
ఏ వనమైరారా - నీ పట్టూటి పోనాని
మెయిలై ముంచక రారా - ముండమోపి దేవుడా "

అని తిడితే వానలు కురుస్తాయని దేవుళ్ళను సైతం బూతు మాటలతో తిడితే వానలు కురుస్తాయని భావన ప్రజల్లో ఉండేది.

పుంగనూరు జమిందారు చిక్కరాయలు గొప్ప కళాభిమాని. మంచి మనస్సున్న మనిషి. కళను, కళాకారులను గౌరవించే సంస్కారం ఉన్నవాడు. వెంకోజీ, సిద్ధోజీ వంటి వారు ప్రదర్శించిన మంచి నాటకాలు ఆదరించబడ్డాయి. అలాగే గుర్రప్ప వంటి వారి ప్రోద్బలంతో అశ్లీల, అసభ్య కరమైన నాటకాలు కూడా ప్రజలు తిలకించేవారు.

సంతలు వారానికి ఒకసారి నిర్వహించబడేవి. సంత జరిగే సమయంలో వస్తుమార్పిడి, వస్తు విక్రయం, వస్తు కొనుగోలు సర్వసాధారణంగా జరుగుతుంది. జాతర్లు వంటివి కూడా ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తించేవి. బతుకాట నాటకం వీధినాటకాలాడే కళాకారులకు సంబంధించినది అయినా రచయిత సందర్భానుసారంగా నాటక సంబంధమైన అంశాలకు చెందిన సంఘంలోని విశేషాలను కూడా తెలియజేయడం జరుగుతుంది ఈనవలలో.

'బతుకాట' అంతా కష్టాలు, కన్నీళ్ళతో కూడిన జీవిత చిత్రణం అనుకోనక్కరలేదు. సందర్భోచితంగా హాస్యం, సామెతలు కూడా ఈనవలలో మనకు కనబడుతుంది.

"ఈ జగమంతా ఒక నాటక రంగం. స్త్రీ,పురుషులందరూ ఇందులో పాత్రధారులే!" 'As you like it' అన్న నాటకంలో విలియం షేక్స్పియర్ చెప్పిన మాటలను తరచూ చాలామంది ఉదహరిస్తూనే ఉంటారు. ఈ జగత్తంతా ఒక నాటకమే, దానిని నడిపించేవాడు ఆ పరమాత్మ అనీ భావించి ఆయనను 'జగన్నాటక సూత్రధారి' అన్నారు. ఆయన సూత్రధారి అయినప్పుడు సహజంగా మనందరమూ పాత్రధారులమే. ఎవరి పాత్రను వారు నిర్వహించి వెళ్ళిపోతుంటారని ఈనవలలో వెంకోజీ చనిపోతూ సిద్ధోజీకి చెప్పడం జరుగుతుంది.

ఆడే ఆటలో గెలుపు, ఓటములు సహజం. ఏదీ శాశ్వతం కాదు. గెలిచినప్పుడు ఆనందం, ఓడినప్పుడు విషాదం సాధారణమైన అంశాలు. బతుకు కూడా అటువంటిదే బతుకులో కూడా జయాపజయాలు ఉంటాయి. ఈ బతుకు ఆటలో చివరికి ఓటమి సిద్ధోజి

వంశీయు లను వీధినాటకాలకు దూరంగా బ్రతికే విధంగా చేసింది. కాబట్టి ''బతుకాట'' అనే పేరు ఉచితమైనదిగా భావించవచ్చు. ''ఇతిహాసపు చీకటి కోసం అట్టడుగున పడి కన్పించని పల్లెటూళ్లో పామర ప్రజల్ని గురించి రచనలు చేసిన వారి సంఖ్య తక్కువ ఈ కొద్ది మంది జాబితాలో తప్పక చేర్చ వలసిన పేరు డాక్టర్ వి. ఆర్. రాసాని - మధురాంతకం రాజారాం లాంటి ప్రసిద్ధ రచయిత పేర్కొనడం రాసాని గారి ప్రతిభకు నిదర్శనం.

❖ ❖ ❖

కన్నెగంటి అనసూయ 'ఆవిడెవరు...?' కథా సంపుటి – సామాజిక చిత్రణ

– ఆర్. లక్ష్మీ ప్రసన్న కుమార్, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఆధునిక సాహిత్యంలో అనేక సృజనాత్మక వచన సాహిత్య ప్రక్రియలు వచ్చాయి. అందులో కథా ప్రక్రియ అత్యంత ప్రాచీనమైనది. కథా అనే పదానికి 'కత' అనే వికృతి. ఎవరైనా లేనివి కల్పించి మాట్లాడితే కథలు చెప్పకు అని అంటుంటాము. అంటే కల్పిత వృత్తాంతం కలిగినది కథ అని అర్థం. విజ్ఞానాత్మకమైన పంచతంత్ర కథలు మొదలగు కథలు పిల్లలను అలరిస్తూ వినోదాన్ని విజ్ఞానాన్ని అందించి వారిని ఉత్తమ గుణసంపన్నులుగా ఎదగాడానికి దోహదం చేస్తున్నాయి.

కథ అనే ప్రక్రియ తెలుగులో తొలిసారిగా గురజాడ అప్పారావు రచించిన దిద్దుబాటు కథను పేర్కొంటారు. ప్రాచీన కాలం నుండి కథలలో అనేక రకాలు ఉన్నాయి. పరిమాణాన్ని, రంగాన్ని, ఇతివృత్తాన్ని దానికి గల ప్రాచుర్యాన్ని, చెప్పే విధానాన్ని బట్టి కథలను వర్గీకరించడం జరిగింది.

'జీవితంలోని ఒక్కానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యంతో కళ్ళకు కట్టినట్లు చూపించి, హృదయాన్ని ఒక మహత్తరమైన అనుభూతితో నింపి, పదేపదే చదవాలనిపింపజేసేది గొప్ప కథ' అని పోరంకి దక్షిణామూర్తి అంటారు.

ఆధునిక కథా సాహిత్యంలో పలువురు రచయితలు ప్రజాశ్రేయస్సు కోరుతూ అనేక కథలను రాశారు అలాంటి వారిలో కన్నెగంటి అనసూయ ఒకరు. వీరి కలం నుండి 5 కథా సంపుటాలు, 2 నవలలు, రెండు బాలలకు సంబంధించిన కథల సంపుటాలు వెలువడ్డాయి. రచయిత్రి జీవితంలోని సంఘటనలను, సమాజంలో ప్రతి నిత్యం ఉత్పన్నమయ్యే సంఘటనల ఆధారంగా కథలు రాశారు. వీరు రాసిన కథలు ఒక్కొక్క కథ ఒక ఆణిముత్యంగా చెప్పవచ్చు. వీరు రచించిన 'ఆవిడెవరు...? కథా సంపుటిలోని ఆవిడెవరు...?, చంద్రవన్నె, ఈ జీవుతానికి ఇది చాలు...? అనే కథలలోని సామాజిక చిత్రణను చిత్రీకరించడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం

ఆవిడెవరు..? :

ఈ కథలో కాత్యాయని, రాజారావు, రమణమ్మ, జాజి ప్రధాన పాత్రలు. కాత్యాయని, రాజారావు భార్యాభర్తలు. రమణమ్మ రాజారావుకు తల్లి. రాజారావుకి ఇద్దరు పిల్లలు జాజి కుమార్తె రాజారావు ఒక ప్రైవేట్‌కంపెనీలో పని చేస్తుంటారు. కంపెనీ మూతపడడంతో ఇంటిదగ్గరే ఉంటాడు. రాజారావు కూతురు జాజి డిగ్రీ చదువుతుంటుంది. రాజారావు కుమారుడిని బాగా చదివించడంతో ఉద్యోగం వస్తుంది. రాజారావు తల్లి షుగర్ వ్యాధితో బాధపడుతూ ప్రత్యేకగదిలో ఉంచబడిన వృద్ధురాలు. రాజారావు కుమారుడు ఉద్యోగంలో చేరి ఒకనెల పూర్తికావడంతో మొదటిజీతం తీసుకొని రాబోతున్న తన కొడుకు గురించి తల్లి కాత్యాయని తనకు ఏమి బహుమతి తెస్తాడోనని ఆలోచిస్తూ ఎదురుచూస్తుంటుంది. రాజారావు కూడా తన కుమారుడు మొదటి జీతం తనచేతిలో పెడతాడని పరిపరివిధాలుగా ఆలోచిస్తుంటాడు. తన అన్న తనకోసం కొత్త సెల్‌ఫోన్ బహుమతిగా తెస్తాడని జాజి ఎదురుచూస్తుంటుంది. రమణమ్మకు గంటకు ఒకసారి మూత్రం వస్తుండడంతో వస్తున్న మూత్రాన్ని అదుపుచేయలేక చీరతడుస్తుంటే అదుపు చేసుకుంటూ బాత్‌రూమ్‌కు వెళ్ళి త్వరత్వరగా తన రూములోకి పరిగెడుతుంది. చీర మూత్రంతో తడవడంతో ఆమెవుండే గది నుండి దుర్వాసన వస్తుంటుంది. అందువలన రాజారావుగాని, కాత్యాయని, జాజి, రమణమ్మ గదిలోకి వెళ్ళడానికి ఇష్టపడరు. రాజారావు కొడుకు మాత్రం తీరికసమయం దొరికినప్పుడల్లా నానమ్మ గదిలో

ఆమెచెప్పే ముచ్చట్లు వింటూవుంటాడు. గదిలో దుర్వాసనవస్తుంటే ఎలావుంటావు అని పలుమార్లు తల్లి, తండ్రి, చెల్లెలు అంటుంటారు.

మొదటి జీతం తీసుకొని రాజారావు కుమారుడు వస్తాడు. చేతిలోవున్న కవరుని చూసి కొత్తచీర అనుకొని కాత్యాయని, కొత్త సెల్‌ఫోన్ అని జాజి ఆనందంతో ఎప్పుడు చేతికిస్తాడా అని చూస్తుంటారు. చేతిలోవున్న కవరును చెల్లెలికి అందిస్తూ నాయనమ్మను రేపు డాక్టర్‌వద్దకు తీసుకువెళ్ళాలని కవర్‌లో న్యాప్‌కిన్స్ ఉన్నా యని వాటిని ఎలా వాడాలో నానమ్మకు చెబుతాడు. అందరూ అదోలా చూస్తుండగా నాయనమ్మ మన వంశా నికి మూలమని ఆవిడలేకపోతే వంశమే లేదని ఆవిడెవరు అని ఆనడంతో రాజారావు పశ్చాత్తాపపడి తల్లిని చూడడా నికి ఆమె గదిలోకి వెళతాడు.

ఆధునిక సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని రచయిత్రి కథను చిత్రించారని చెప్పవచ్చు. చిన్నతనం నుండి చిన్న పిల్లల్ని వారి హృదయాలలో ఉంచుకొని కాపాడుతూ వచ్చిన అమ్మమ్మలు, నాయనమ్మలను మన పూర్వీకులైన తాత ముత్తాతలు గొప్పతనాన్ని రాజారావుకి తన కొడుకు తెలియజేస్తాడు. పిల్లలు పెరిగి పెద్దయ్యాక పెద్దవారిని విస్మరించి వారిని హీనంగా చూడడమే గాకుండా వారి ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపుతూ హీనంగా చూస్తున్న నేటి సమాజానికి కొరడాతో కొట్టి లేపినట్లుగా రచయిత్రి కథను చిత్రీకరించారు.

చంద్రవన్నె :

ఈ కథలో జానకి, శేఖర్, చంద్రవన్నె, రమణ, సౌభాగ్యం ప్రధాన పాత్రలు. జానకి, శేఖర్ భార్యాభర్తలు. చంద్రవన్నె వాళ్ళ కూతురు. రమణ చంద్రవన్నె స్నేహితు రాలు. సౌభాగ్యం చంద్రవన్నె ఉపాధ్యాయురాలు. చంద్ర వన్నె ప్రాథమిక పాఠశాలలో చదువుతుంటుంది. చంద్ర వన్నెకు ప్రతిరోజు ఉదయాన్నే పెరుగన్నం తిని బడికి వెళ్ళడం అలవాటు. ఎప్పటిలాగే ఒకరోజు పెరుగన్నం కలిపి చంద్రవన్నెను తినమని చెబుతుంది. చంద్రవన్నె తినకుండా నసుకుతుంటుంది. శేఖర్ వరండాలో కూర్చొని సిగరెట్ తాగుతూ ఉంటాడు. జానకి బయటకువెళ్ళగానే చంద్రవన్నె స్నేహితురాలు రమణ వస్తుంది. రమణరాగానే చంద్రవన్నె తన పెరుగన్నం రమణని తినమంటుంది. రమణ తానుతిననని మీ అమ్మ జానకి చూస్తే తిడు తుందని అంటుంది. చంద్రవన్నె తాను తరగతి లీడర్‌నని, తినకపోతే రమణ పేరు బోర్డుపై వ్రాసి ఉపాధ్యాయులతో తిట్టిస్తానంటుంది. వీళ్ళ సంభాషణ శేఖర్ వింటూ వుంటాడు. బోర్డుమీద తమ పేరు వ్రాయవద్దు అని పెరుగన్నం తింటానని రమణ తింటూవుండగా చంద్రవన్నె తల్లి జానకి తిడుతుంది.

చంద్రవన్నెను తినమని జానకి బలవంతంచేయగా నోరుతెరవలేక తెరుస్తూ ఎర్రగా పూసిపోయిన నోరును చూసి ఏం జరిగిందో చెప్పమని జానకి దబాయిస్తుంది. చంద్రవన్నె పాఠశాలలో బీరతీగలు,సొరతీగలను కాల్చి పొగత్రాగిందని చెబుతుంది. ఆ సమయంలో అటువైపుగా వెళుతున్న చంద్రవన్నె ఉపాధ్యాయురాలు సౌభాగ్యం కూడా చంద్రవన్నెను దండించినట్లు చెబుతుంది. ఎందుకిలా చేశావని చంద్రవన్నెను అడగగా తన తండ్రి ప్రతిరోజూ సిగరెట్లు, చుట్టలు తాగుతాడని వాటివల్ల క్యాన్సరు వస్తుందని తాను త్రాగితే ఉపాధ్యాయులు దండించిన విషయం తన తండ్రికి తెలిస్తే పొగత్రాగడం మానేస్తాడని అందుకే ఇలా చేశానని చంద్రవన్నె ఇలా చెబుతుంది. శేఖర్ తన చేతిలోవున్న బీడీలు, సిగరెట్లను మంటల్లో వేసేస్తాడు. చంద్రవన్నెను ఆప్యాయంగా దగ్గరకుతీసుకొని ఇకనుండి పొగత్రాగనని ప్రతిజ్ఞ చేస్తాడు.

చంద్రవన్నె కథలో పెద్దలు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని నేటి సమాజానికి కవయిత్రి విభిన్న కథ ద్వారా తెలియజేస్తుంది. వ్యక్తి జీవన విధానం ముందు తరాల వారికి ఆదర్శ ప్రాయంగా, ఒక నిర్దేశంతో మెలగాలని ఈ కథ ద్వారా తెలియజేస్తుంది. నేటి సమాజంలో పెద్దలు చెడు అలవాట్లకు బానిసలుగా మారితే వారిని పిల్లల ప్రేరణతో ఎలా మార్చగలమో ఈ కథ ద్వారా రచయిత్రి తెలియజేశారు.

ఈ జీవితానికి ఇది చాలు....? :

ఈ కథలో గౌరమ్మ, సూర్యం, విమల ప్రధాన పాత్రలు. విమల, సూర్యం భార్యాభర్తలు. విమల తండ్రి కూతురికి మంచి సంబంధంచూసి పెళ్ళిచేస్తాడు. కొంతకాలానికి విమల తల్లి మరణిస్తుంది. విమల తండ్రి పక్షవాతానికి గురై మంచంలో ఉంటాడు. ఆమె తండ్రి పీడవదిలించుకొని ఆ ఇల్లు అమ్మేసి వచ్చిన డబ్బులు కట్నంకింద ఇమ్మని సూర్యం తల్లిదండ్రులు విమలను ఇంట్లోనుంచి గెంటివేస్తారు. విమల హాస్టల్‌లో ఉంటూ ప్రతిరోజూ తండ్రికి ఆహారం అందిస్తుంది. తండ్రికి తోడుగా గౌరి అనే అమ్మాయిని పనిలో కుదుర్చుకొని జీతం ఇస్తుంటుంది. తండ్రిని చూడటానికి విమల వచ్చినప్పుడల్లా అల్లుడిని తీసుకురాలేదేమని, ఒకసారి అల్లుడిని చూడాలని విమల తండ్రి ఆశపడతాడు.

సూర్యంకి పెద్ద ఉద్యోగంవచ్చిందని ఎప్పుడూ ఉద్యోగంలో ఉంటూ తీరికలేకుండా ఉన్నాడని చెబుతుంది. ఒక ఆదివారంనాడు సూర్యానికి కొంత ధనం ఇచ్చి తండ్రి దగ్గరికి పిలిపిస్తుంది. సూర్యం మామపట్ల, భార్యపట్ల ఎక్కడాలేని వినయాన్ని ప్రదర్శించి వెళ్ళిపోతాడు. తండ్రినేర్పిన నడవడికను గుర్తుచేసుకొని ఆయన ఆనందాన్ని ఆస్వాదిస్తూ ఈ జీవితానికి ఇది చాలు అని విమల అనుకుంటుంది.

ఆధునిక జీవన విధానంలో వరకట్నం ఒక పెద్ద సమస్యగా పరిణమించిందని చెప్పవచ్చు. ధనమే జీవితమని భావించి బతికే నేటి మనుష్యుల క్రూరత్వాన్ని రచయిత్రి ఇలా తెలియజేశారు. మారుతున్న కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మానవుడు ధనసమూపార్జన కోసమే బతికే మనుష్యుల గురించి తెలియజేశారు. కథలో విమల తన తండ్రిపై ప్రేమాభిమానాలను తెంచుకోలేక మధ్యలో వచ్చి, అధికారాన్ని చెలాయిస్తూ విమల కుటుంబ నాశనం కోరే సూర్యం లాంటి భర్తలు సమాజంలో నేటికీ ఎందరో ఉన్నారని అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని రచయిత్రి విశదీకరించారు.

ఈ విధంగా కన్నెగంటి అనసూయ కథల్లో అడుగడుగున సామాజికాంశాలు చోటు చేసుకొని పఠితను ఏకబిగిన పఠించగల వస్తు వైవిధ్యం కలదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కథా శిల్పం - వెంకటసుబ్బయ్య వల్లంపాటి
2. కథానిక స్వరూప స్వభావాలు - దక్షిణామూర్తి పోరంకి
3. తెలుగు కథా వికాసం - పద్మరాజు పాలగుమ్మి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

చింతా అప్పలనాయుడు కథలు – సామజిక జీవన చిత్రణ

– సాలిపల్లి నాగరాజు, పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఉత్తరాంధ్రా భాషనీ, సాహిత్యాన్నీ ప్రజలకందించిన ఘనత మహాకవి గురజాడ అప్పారావుది. ఆయన నుండి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని ఎంతో మంది రచయితలు తెలుగు కథా సాహిత్యానికి విశిష్ట స్థానాన్ని తెచ్చిపెట్టారు. అదే బాటలో ప్రయాణం కొనసాగించిన మేటి కథా రచయిత చింతా అప్పలనాయుడు. ఈయన విజయ నగరం జిల్లా పార్వతీపురం దగ్గర చిన్న గ్రామంలో 1960వ సంవత్సరం జన్మించారు.

చింతా అప్పలనాయుడు కథల్లో అన్యాయాలను ఎదురించేవాళ్ళు, మనిషిని ప్రేమించేవాళ్ళు, మార్పు కోసం ఆలోచించేవాళ్ళు, పోరాడేవాళ్ళు, శ్రమించేవాళ్ళు ప్రధానంగా కనిపిస్తారు. పల్లె రైతుల గోడు, చైతన్య మార్గంలో నడిచిన స్త్రీలు, అణచివేయబడ్డ జీవితాల ఆక్రందనలు మొదలైన విషయాలు ఈయన కథలలో వినిపిస్తాయి. చింతా కథల్లో ఆత్మీయ సంబంధాలు, భూమి లేని వాడికి భూమి ఉన్నవాడికి మధ్య ఉండే అంతరాలు, సొంత భూమి యజమాని కావాలనే రైతు కోర్కెలు తదితర దృశ్యాలు కళ్ళ ముందు మెదలడుతాయి.

పల్లె ప్రజల జన జీవితాన్ని, దళిత ప్రజల నేపథ్యాన్ని, రైతుల కష్టాలను నిబద్ధతతో చిత్రించిన కథా రచయిత చింతా అప్పలనాయుడు. పల్లె ప్రజల కష్టసుఖాలను వాళ్ళ మాటల్లోనే కథల్లో అక్షరీకరించిన కథా కృషీవలుడు. ఈయన కథల్లో ఉత్తరాంధ్ర నేల కబుర్లు, రాజకీ య, ఆర్థిక, సామజిక నేపథ్యాన్ని చిక్కనైన, స్వచ్ఛమైన ఉత్త రాంధ్ర యాసలో బలంగా వ్యక్తీకరించిన కథకుల్లో చింతా అప్పలనాయుడు ఒకరు.

నాగావళీ నదీ తీర ప్రాంత రైతుల బతుకును, వాళ్ళ క్షతగాత్ర హృదయాల బాధను కళ్ళారా చూసి అర్థం చేసుకున్నవారు చింతా అప్పలనాయుడు. రైతుల శ్రమకు తగిన ఫలితం దక్కక ఆశలన్నీ అణగారిపోయి నమ్ముకున్న నేలను అమ్ముకొని వారి పొలంలోనే కూలీలుగా మారిన రైతుల గోడు, అప్పుల ఊబిలో కూరుకుపోయి వలస బాట పట్టిన పల్లె ప్రజల విషాద ఛాయలు చింతా అప్పల నాయుడు కథల నిండా కనిపిస్తాయి. స్త్రీ జీవితంలో వచ్చిన చైతన్యాన్ని, ప్రాజెక్ట్ నిర్మాణంలో ముంపుకు గురైన రైతుల పోరాట చిత్రాలెన్నో అప్పలనాయుడు చిత్తశుద్ధితో కథల్లో, కవిత్వంలో వ్యక్తీకరించారు. ఈయన కలం నుండి వెలువడిన ఒకే ఒక్క కథా సంపుటి "నకజనకరి... నాం... నాం...".

"నకజనకరి... నాం... నాం..." అనే కథల సంపుటి 2011వ సంవత్సరం వెలువడింది. ఇందులో ఉన్న కథలు వివిధ పత్రికల్లో, కథా సంకలనాల్లో ముందుగానే ప్రచురించబడ్డాయి. "నకజనకరి... నాం... నాం...", "జజ్జన కరి... జనరే" అన్న పదాలు ఉత్తరంధ్ర ప్రాంతంలో డప్పు వాయిద్య కళాకారుడు డప్పు కొట్టినప్పుడు వెలువడిన ధ్వన్యానుకరణ శబ్దాలుగా కనిపిస్తాయి. ఈ శబ్దాలు చైతన్యానికి, మార్పుకి ప్రతీకలుగా కనిపిస్తాయి. చింతా అప్పలనాయుడు గారు కూడా గుండెను డప్పు చేసి నకజన కరి... నాం... నాం... అని డప్పు దరువులతో కథలను సమాజానికి వినిపించారు.

చింతా అప్పలనాయుడు కథలు - సామజిక జీవన చిత్రణ :

చింతా అప్పలనాయుడు కథల్లో స్త్రీల సమస్యలు, రైతుల సమస్యలు, దళితులకు జరుగుతున్న అన్యాయాలు మొదలైన అంశాలు కొట్టొచ్చినట్లుగా కని పిస్తాయి. పల్లెల్లో వ్యవసాయం చేసుకొని బతికే యజమానులు బతకలేక వలస వెళ్ళిపోవడం కనిపిస్తుంది. ఒక ప్రాంతంలో ఒక వృత్తిని జీవనాధారంగా చేసుకొని

బతుకు బండిని నడిపిస్తున్న వాళ్ళు ఆ ఒక్క ఆధారం కోల్పోయినప్పుడు అక్కడ బతకలేక మరో ప్రాంతానికి బతుకు తెరువు వెతుక్కొని పిల్లా పాపలతో కలసి వెళ్ళి పోవడాన్ని వలస జీవనం అంటారు. అలాంటి ఎన్నో విషయాలును ఆయన కథల నిండా కనిపిస్తాయి.

ఉత్తరాంధ్ర ప్రాంత పల్లెల్ని పాతిక సంవత్సరాలుగా గమనించి తన కళ్ళ ముందు జరిగిన వాస్తవ దృశ్యాలను కథలుగా మలచారు. ఉపాధ్యాయుల సమస్యలను, సన్నకారు రైతులు సాగు సమస్యలను, రైతులు ఏ విధంగా తమ పంటలు పండక ఇబ్బంది పడుతున్నారో అప్పల నాయుడుగారు తన "నకజనకరి... నాం... నాం..." కథా సంపుటిలో కథా వస్తువుగా తీసుకొని ఉత్తరాంధ్ర ప్రజల జీవన విధానాన్ని, వాళ్ళ కష్టాలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించారు.

"నకజనకరి... నాం... నాం..., భూతాల సొర్గం, కొత్త చిగురు, మాటు, దూరం" మొదలైన కథల్లో స్త్రీల సమస్యల పట్ల రచయితకి గల స్పష్టమైన అవగాహన తెలుస్తుంది. అందుకే ఆ సమస్యలకి పరిష్కారం వెదికే మార్గంలో పోరాట ధోరణి, ధైర్యం, తెగింపు కనిపిస్తాయి. మారుతున్న సమాజ స్థితిగతుల పట్ల, ప్రపంచీకరణ పట్ల అవగాహన ఉన్న రచయిత చింతా అప్పలనాయుడు.

"మేకలు" అనే కథలో రాజకీయ నేపథ్యం కనిపిస్తుంది. రెండు వర్గాల మధ్య జరిగిన పోరుకు ఏమీ తెలియని అమాయకుడు బలి అయిపోతాడు. ఈ కథలో వారాల పండగ విధానాన్ని రచయిత తెలిపారు. అలాగే విద్యార్థుల చదువుకున్నప్పటికీ మూఢ నమ్మకాల పట్ల వాళ్ళు పాటించే విధానాన్ని రచయిత తెలిపారు. ఈ రీతిగానే ప్రతి కథలో కూడా సమాజంలో ఆయన చుట్టూ జరిగిన సంఘటన లను వస్తువులుగా తీసుకొని రచించారు.

"నకజనకరి... నాం... నాం..." అనే కథల సంపుటిలో ఆరు కథల వరకు స్త్రీల గురించే రాయబడింది. దళిత స్త్రీ జీవన విధానాన్ని చిత్రీకరించారు. ఈయన కథలో స్త్రీలో వచ్చిన చైతన్య మార్పును, వికాసాన్ని తెలియజేసారు. ముఖ్యంగా ఈయన కథల్లో స్త్రీ పాత్రలు ధైర్యం కలిగిన ఆదర్శవంతమైనవిగా కనిపిస్తాయి. కుటుంబాన్ని నడప వలసిన భర్త వ్యసనానికి బానిస అయినప్పుడు ఆ కుటుంబ భారాన్ని స్త్రీనే నడిపిస్తుంది. ఈయన కథల్లో స్త్రీ పురుషుడితో సమానంగా పనిచేస్తుంది.

అప్పలనాయుడుగారి కథల్లో చాలా వరకు రైతుకు సంబంధించిన కథలు కనిపిస్తాయి. భూమినే సర్వస్వం అనుకొని బతికే రైతు కుటుంబాలు గురించి వివరించారు. నరైన పంటలు పండక, చేతిక అందిన పంటను పురుగులు తినేసి, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతుల దయనీయ పరిస్థితుల్ని కథల్లో చూపించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ముంపుకు గురైన భూమికి తగు ధరను ప్రభుత్వం నుండి తెచ్చుకోవడాని వెళ్ళిన రైతుల పోరాటాన్ని, అధికారుల, ధనవంతుల మాటలు నమ్మి వాళ్ళ చేతిలో మోసపోయిన అమాయకపు రైతుల గోడు, సొంత భూమి యజమాని అవ్వాలని కలలు కన్న రైతుల కష్టాలెన్నో ఈయన కథల్లో వివరించారు.

నేడు ప్రపంచీకరణ ప్రభావానికి ఎన్నో కుల వృత్తులు బలైపోతున్నాయి. అలాంటి వాటిల్లో జంగాల పాటలు, దాసరి పాటలు, బుర్ర కథలు, వీధి బాగోతాలు, జముకు పాటలు ఒక్కటేంటి అనేక రకాలైన కుల వృత్తులు వారు నేడు జీవిన భృత్యా కోల్పోతున్నారు. ఆ కళలు అన్నీ అంతరించిపోతున్నాయి అని రచయిత సమాజానికి "భూతాల సొర్గం" అనే కథ ద్వారా తెలియజేసారు. అలాగే మనిషికి డబ్బు, అధికారం కలిగినప్పుడు గత జీవితాన్ని మర్చిపోతాడు. ఆ డబ్బు, అధికారం వచ్చిన తర్వాత మనుషుల సంబంధాల కాస్త ఆర్థిక సంబంధాలయ్యి మనుషుల మధ్య దూరం పెరిగిపోయిన విధానాన్ని "దూరం" అనే కథ ద్వారా రచయిత తెలియజేసారు.

మనుషులకి మనుషులకి మధ్య ఉన్న బంధాలును రచయిత కొన్ని కథల్లో చాలా చక్కగా చిత్రీకరించారు. తనకు ఉన్న ఆధారాలు అన్నీ కోల్పోయి ఏ ఆధారము లేక సతమతమవుతున్న ముసలిదానికి బతుకు మీద

ఆశలు కల్పించి మేము నీకు తోడుగా ఉంటాము అని భరోసాను మరొక పాత్ర చేత రచయిత పలికించడం "కొత్త చిగురు" అనే కథలో కనిపిస్తుంది.

అంకిత భావంతో తన విధిని తాము సక్రంగా నిర్వ హిద్దాము అన్నా ప్రభుత్వం ఏదో ఒక పనిని చెప్పి తమ పనిని చేసుకోనియ్యకుండా చేస్తుందని "ఐకమ" అనే కథలో ఉపాధ్యాయుల ఇబ్బందులను చిత్రీకరించారు. పేదవాడి బతుకు ఎప్పుడు పోరాటమే. అప్పులు ఊబిలో కురికిపోయిన పేదవాళ్ళ జీవితం సముద్రంలో ఈతతో రచయిత పోల్చారు. సముద్రం ఎంత ఈదినా తరగదు అట్లే పేదవాళ్ళ బతుకులు కూడా నిరంతరం ఈతడమే. కాళ్ళు, చేతులు అందక ఆ అప్పుల సంద్రంలో పేద వాళ్ళు కూరుకుపోయి చివరికి మరణిస్తారు.

చింతా అప్పలనాయుడు కథల్లో పల్లెలు ప్రాణంతో లేచి వస్తాయి. ఒకనాటి విరామ సంగీత విశాలత్వం జీవితం నిండా అలుముకొని ఉంటుంది. నెమ్మది స్వభావం కలిగిన పాత్రలు తమ చుట్టూ ఉన్న వస్తువుతో తీసుకొని తాత్విక దృష్టితో కథలు రచించినట్లుగా ఈయన కథలు చదివితే తెలుస్తుంది. సమస్యలు కళ్ళ ముందు ఘనీభవించినప్పుడు ఎలా ధైర్యవంతులై నిలిచి ఎదురు తిరిగి పరిష్కారం చూపే మార్గం ఆయన కథల్లో కని పిస్తాయి.

ఈ విధంగా చింతా అప్పలనాయుడుగారి కథల్లో స్త్రీల జీవితాలు, రైతుల కష్టాలును కళ్ళకు కట్టినట్లుగా చిత్రీక రించారు. కథల్లో సామెతలు, జాతీయాలు ప్రయోగింప బడి చెవులకు ఇంపుగా ఉంటుంది. పాత్రోచిత సంభాషణల చిత్రణలోను కథకు తగిన వాతావరణం సృష్టించడంలోనూ ఆయనది అందెవేసిన చెయ్యి. ఇతివృత్త వైవిధ్యంలో కూడా తనదైన శైలిని, ప్రతిభను కనపరిచారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. అప్పలనాయుడు, చింతా. నకజనకరి... నాం... నాం..., పార్వతీపురం: స్నేహ కళా సాహితీ ప్రచురణ, 2011
2. ఉత్తరాంధ్ర కథా వెలుగు, విశాఖపట్నం: సాహితీ సాంస్కృతిక సంస్థ, 2006.
3. దక్షిణామూర్తి, పోరంకి. కథానికా స్వరూప స్వభావాలు, హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2009.
4. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2008.
5. శ్రీధర్, వెల్దండి. తెలుగు కథ - ప్రాంతీయ అస్తిత్వం కర్నూలు: తెలుగు అధ్యయన శాఖ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల, 2015.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

లోకరీతి శతకము – సామాజిక జీవన చిత్రణ

– షేక్ జరీనా, పరిశోధక విద్యార్థిని, మద్రాసు విశ్వవిద్యాలయం, మద్రాసు.

'సహితేన హితం సాహిత్యం' అన్నట్లుగా ఏ కాలంలో నైనా సాహిత్యం సమాజ హితాన్ని కోరుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు. సమాజంలో జరుగుతున్న అనేక సంఘటనలను, పరిణామాలను సాహిత్యం ప్రతిఫలింప జేస్తుంది. ఆధునిక మానవుని జీవితం అనుక్షణం సంఘర్షణగా మారింది. చిన్నచిన్న సరదాలు తీర్చుకోలేక సతమత మవుతూ, అనుకున్న లక్ష్యాల్ని చేరుకోవడానికి ఆరాటపడుతూ మనిషి తనలోని 'మనిషితనాన్ని' కోల్పో తున్నాడు. సంఘంపట్ల, తల్లి దండ్రుల పట్ల, కుటుంబం పట్ల తన బాధ్యతను విస్మరించి సంపదల వలయంలో చిక్కి సర్వస్వాన్ని కోల్పోతున్నాడు. నిజంగా ఇది విచారించ వలసిన విషయం.

మనిషి జీవితాన్ని కవిత్వం, కథ, నవల, నాటకం, శతకం మొదలైన అనేక ప్రక్రియలలో సాహిత్యం ప్రతిఫలింపజేసింది. ఎంచుకున్న ప్రక్రియ ఏదైనా దాన్ని సమాజానికి అన్వయించి సమాజంలో మార్పు సాధించ గలిగినపుడే దానికి సార్థకత ఏర్పడుతుంది. సాహిత్యం చదివినపుడు వెంటనే మార్పు కలగదు కానీ దానిని చదివిన పాఠకుడిలో ఆలోచన మొదలౌతుంది. ఆ ఆలోచన చైతన్యానికి నాంది పలుకుతుంది. ఆ చైతన్యం తనను తాను మార్చుకోవడానికి, కొద్దోగొప్పో సమాజాన్ని మార్చడానికి ఉపయోగపడుతుంది.

ఈ క్రమంలో చూసినపుడు శ్రీ రాఘవ మాస్టారు రాసిన 'లోకరీతి శతకం' కూడా ఆలోచనకూ తద్వారా చైతన్యానికీ నాందిగా నిలుస్తుందని చెప్పడం అతిశయోక్తి కాదు. జ్ఞానానికి ప్రాధాన్యతనిస్తూనే నైతికతకు పెద్దపీట వేయడం, కలంకంటే గుణం గొప్పదని నిరూపించడం, స్త్రీలు కూడా ప్రగతిలో భాగస్వాములు కనుక వారిని నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని చెప్పడం, గుళ్ళు గోపురాల్ని దర్శించడం కంటే తల్లిదండ్రు లను పూజించడం మంచిదని చెప్పడం మొదలైన అనేక అంశాల సమాహారంగా సాగిన వారి 'లోకరీతి శతకం' శతధా అభినందనీయం. లోకంలోని పోకడలను నిశితంగా పరిశీలించి ప్రతీ పద్యాన్ని ఒక అనర్ఘరత్నంగా తీర్చిదిద్దారు. అందరికీ అర్థమయ్యే భాషలో సరళంగా, సుందరంగా రాయడమే కాకుండా ఆట వెలదుల్లో అనంత సత్యాన్ని నిక్షిప్తం చేసి వివరించడం రచయిత ప్రతిభకు నిదర్శనం. అందులోని కొన్ని పద్యా లను పరిశీలించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

కులమతాల ప్రస్తావన :

పుడుతూ కులాన్ని తీసుకురాలేదు, పోయేటప్పుడూ కులాన్ని వెంటపెట్టుకుపోలేము అనే విషయాన్ని అత్యంత సుందరంగా ఈ శతకంలో చెప్పారు రచయిత. మనిషి ఏర్పాటు చేసుకున్న కులవ్యవస్థ అనేక మార్పుల్ని పొంది సమాజం లోని కొన్ని వర్గాలకు కొన్ని సౌకర్యాలను దూరం చేసింది. మనిషిని మనిషి సహించలేనంత విపరీత పరిణామాలకు కూడా ఈ కులవ్యవస్థ దారితీసింది. ప్రతీ మతానికి వారి వారి మతగ్రంథాలుంటాయి. వాటిని అనుసరిస్తుంటారు. ఏ మతమైనా ఇతరుల్ని ఆదరిం చమనే చెప్తుంది. అందుకే ఈ క్రింది పద్యాలలో సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, మాట సామరస్యాన్ని వివరిం చారు రచయిత.

భక్తితోడ గీత బైబిలును ఖురాను / యేమి జెప్పె మనకు యెరుగరేమి
పరుల నాదరించు పరుల బాధించకు / వినుడు లోకరీతి వీనులలర

ఏ మతగ్రంథమైనా ఇతర మతాలను సామరస్యంతో చూడమనే చెప్తుంది. ఇతరులను ప్రేమించమనే చెప్తుంది, ఇతరుల విషయంలో కనికరం, దయ, జాలిని కలిగి

ఉండమనే చెప్తుంది. కానీ నేడు కులమతాల విషయంలో సంఘంలో అనేక విపరీత పరిణామాలు చోటుచేసు కోవడం గర్హనీయం. అందుకే పై పద్యంలో చెప్తున్నాడు సర్వమత సమానత్వాన్ని చాటిచెప్తున్నాడు కవి. మనకు చేతనైనంత వరకు ఎదుటి వ్యక్తికి మేలుచేయాలి గానీ ఇతరుల్ని బాధించకూడదు అనే విషయాన్ని చెప్తున్నాడు. అంతేకాదు ఏ కాలంలోనైనా కులమతాల్ని మినహాయిస్తే జ్ఞానం అనేది వున్నవాడు మేధావిగానే పరిగణించబడ్డాడు. శోకంలోంచి శ్లోకాన్ని పుట్టించిన వాల్మీకి బోయవాడనే విషయం అందరికీ విదితమే. అందుకే జ్ఞానం విషయంలో కులమతాలను ఎంచడం అనేది మంచిది కాదనే విషయం ఈ క్రింది పద్యంలో చూడవచ్చు.

పాపి దళితుడెవరు బాపడెవ్వడు బోల్చ / వేద విద్యలంటు వాదులేల
విద్యలున్నవాడే విజ్ఞాని, ఘనుడు పో / వినుడు లోకరీతి వీనులలర

దళితుల్ని పాపులుగా భావించడం, ఉన్నతకులాల వాళ్ళను ఉన్నతులుగా ఎంచడం అనేది మనకు సమాజంలో అనాదిగా కనబడుతున్న అంశమే. కానీ జ్ఞానానికి కులమతాలుండవనే విషయాన్ని స్పష్టంచేస్తున్నాడు కవి. 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అన్నట్లు విద్యలున్నవాడే ఏ కాలంలోనైనా గొప్పవాడుగా పరిగణించబడతాడనే విషయాన్ని చెప్తున్నాడు. అంతేగాక పైపై వేషాన్ని చూసి మనిషిని అంచనా వేయడం తగదని చెప్తున్నాడు.

తల్లిదండ్రుల ప్రస్తావన :

తల్లిదండ్రులను గౌరవించడం, పూజించడం మన సంప్రదాయం. నవమాసాలూ మోసి కనీ పెంచిన తల్లిని, మన అవసరాలు తీర్చి ఒక ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని ప్రసాదించే తండ్రిని మనం నిర్లక్ష్యం చేస్తున్నామనే భావన కొన్ని పద్యాలలో కనిపిస్తుంది. అమ్మా అనే పిలుపులోనే ఏదో కమ్మదనం, విడదీయరాని బంధం కలిసి ఉంటాయి. అందుకే అమ్మా అని పిలవగానే అవని పులకరిస్తుంది అని చెప్తున్నాడు కవి. కానీ మారిన ప్రస్తుత పరిస్థితుల్లో సౌకర్యాలకు ఇచ్చినంత విలువ, గౌరవం మానవ సంబంధాలకు ఇవ్వడం లేదు నేటి మనుషులు. తల్లిదండ్రులని భారంగా, వారి పోషణ కష్టంగా భావించిన కొంతమంది పిల్లలు వారిని ఇంటినుంచి గెంటివేయడమో లేక అనాథ శరణాలయాల్లో చేర్పించడమో మనం నిత్యం ఏదో ఒక సందర్భంలో చూస్తూనే ఉన్నాం. ఆ విషయాన్ని ఈ క్రింది పద్యంలో మనం చూడవచ్చు.

జన్మనిచ్చినట్టి జననీ జనకులను/ ఆదరించలేని ఆస్తులేల

కన్నవారి జూడలేని పిల్లలు యేల / వినుడు లోకరీతి వీనులలార

మనిషికి వ్యక్తిత్వాన్ని, అస్తిత్వాన్ని ప్రసాదించిన తల్లిదండ్రుల పట్ల కనీస గౌరవ, ప్రేమ, దయ లేకుండా ప్రవర్తి స్తోంది నేటి సమాజం. కనీ పెంచిన తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా కనపర్చాలి. వృద్ధాప్యంలో వారికి కావలసిన అవసరాలు తీర్చాలి. వారి సేవ చేసుకోవడమే నిత్యపూజగా భావించాలి. ఆహార, ఆరోగ్య అవసరాలను భారం అనుకోకుండా తీర్చి వారి రుణం తీర్చుకోవాలి అనే విషయాన్ని చెప్తున్నాడు కవి పై పద్యంలో. కళ్ళముందు కనిపించే దైవాలైన తల్లిదండ్రులను విడిచిపెట్టి ఎక్కడో దూరాన ఉన్న దేవుళ్ళు, దేవతలను పూజించడం అజ్ఞానం అనే భావన కూడా వ్యక్త పరుస్తున్నాడు కవి ఈ క్రింది పద్యంలో.

కూడు గూడు చదువు గూర్చినట్టి ఘనులు / కన్నవారు! గుడులు కట్టకున్న
గుడుల ముందు వారి కూర్చొన బెట్టకు / వినుడు లోకరీతి వీనులలర

కనుకనే తల్లిదండ్రులకు గుడులు కట్టక్కర్లేదు కానీ వారిని గుడి ముందు కూర్చొని అడుక్కునే స్థాయికి దిగజార్చ వద్దనే ఆవేదన వ్యక్తపరుస్తున్నాడు కవి. మనకు చదువును, ఒక గౌరవాన్ని, ఖ్యాతినీ ఇచ్చిన తల్లిదండ్రులను మనం నిర్లక్ష్యం చేయకూడదు. వారికి బాసటగా

నిలవాలి. వృద్ధాప్యంలో వారికి ఆదరువుగా ఉండాలి తప్ప వారిని అనవసరం అని భావించకూడదు.

స్త్రీల ప్రస్తావన :

ఆకాశంలో సగం అంటూనే స్త్రీలపై అనేక అకృత్యాలు చేస్తూ ఉన్న రోజులివి. స్త్రీవాదం పేరుతో ప్రత్యేకంగా ఒక వాదం వచ్చినా నువ్వు ఆడపిల్లవంటూ మానసికంగా, శారీరకంగా వారిని ఇంకా అణగదొక్కాలనే ఆలోచనలు పురుషుల్లో వున్నాయి. అందుకే స్త్రీ పురుషులిద్దరూ నమానమేననీ, ఆడపిల్ల మగపిల్లవాడు అంటూ వ్యత్యాసం చూపవ ద్దంటూ హితవు పలుకుతున్నాడు కవి ఈ శతకంలో.

ఆడపిల్లలంటు అవమానమేలరా / అమ్మ ఆలీ చెల్లి అతివ గారె
పడతి లేక ప్రగతి పల్లవించదు సుమా / వినుడు లోకరీతి వీనులలర

వైజ్ఞానికంగా, సాంకేతికంగా ఎంతో ఎదిగిన ఈనాటి సమాజంలో ఇంకా ఆడ, మగ అనే వ్యత్యాసముంది. ఆడవాళ్ళు ఎంతో ధైర్యాన్ని, తెగువునూ ప్రదర్శిస్తూ అనేక రంగాల్లో దూసుకెళ్తూ తమ ప్రతిభను చాటుతున్నారు. అంతరిక్షంలోకి కూడా వెళ్ళి మేము ఎందులోనూ తీసిపోము అనే విషయాన్ని నిరూపిస్తున్నారు. అందుకే 'ముదితల్ నేర్వగ రాని విద్యగలదే చేరి ముద్దార నేర్పించి నన్' అంటాడు ఒక ప్రాచీన కవి. మన కుటుంబంలోని అమ్మ, అక్క, ఆలీ, చెల్లి అందరూ ఆడవారే. అయినా బయటి స్త్రీలను చూస్తే చులకన. కనుకనే కుటుంబ సౌభాగ్యానికైనా, దేశ సౌభాగ్యానికైనా స్త్రీలే కీలకం కాబట్టి వారిని నిర్లక్ష్యంగా చూడకూడదని చెప్తున్నాడు కవి. అంతేగాక స్త్రీలు ఉంటే పరిస్థితులెలా ఉంటాయో కూడా చెప్తున్నాడు.

స్త్రీలు నవ్వు చోట సిరులెల్ల వెలుగొందు / మగువ లేని చోట నగవు లేదు
యింతి లేని ఇంట సంతోషమేముండు?/ వినుడు లోకరీతి వీనులలర

ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఆనంద నాట్యం చేస్తారని ఆర్యోక్తి. స్త్రీ నవ్వని ఇంట్లో సంతోషం, సంపదలు ఉండవని చెప్తున్నాడు కవి. కనుకనే పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమాన ప్రాధాన్యత నివ్వాలి. వాళ్ళు ఆనందంగా ఉండేటట్లు మగవారు ప్రవర్తించాలి. వారు ఎదగడానికి అవకాశం ఉన్న అన్ని రంగాలలోనూ వారు ఎదిగేలా ప్రోత్సహించాలి. అప్పుడే దేశసౌభాగ్యం మరింతగా వెల్లివిరుస్తుందని చెప్తున్నాడు కవి.

తెలుగుభాష ప్రస్తావన :

దేశభాషలందు తెలుగు లెస్స అని చెప్పుకుంటాం గానీ భాషాభివృద్ధిలో మాత్రం నిర్లక్ష్యంగానే ఉంటాం. తెలుగు మాట్లాడితే చులకనగా చూస్తారనే భావం దాదాపు అందరిలోనూ ఉంది. అందుకే తెలుగు భాష దాదాపు అంతరించిపోయే భాషల్లో ఉందని భాషావేత్తలు ఆందోళన చెందడం కూడా మనకు తెలిసిందే. ఈ శతకంలో మనకు కవి యొక్క తెలుగు భాషాభిమానం కనిపిస్తుంది. అజంత భాషగా వున్న తెలుగు గొప్పదనాన్ని ఇలా వర్ణిస్తున్నాడు కవి.

తేట తేనెలూరు తెలుగుభాష మనది / మధురమైన భాష మాతృభాష
మరువదగునే అమ్మ మమతానురాగాలు / వినుడు లోకరీతి వీనులలర

తల్లిని ఎంతగా ప్రేమిస్తామో భాషను కూడా అంతే ప్రేమించాలనే భావం కనిపిస్తుంది పై పద్యంలో. ప్రాచీన, ఆధునిక సాహిత్యంలో ఎన్నో భావాలు మనకు కనిపిస్తాయి. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పేరుబడిన తేనెలూరే తెలుగు భాషకు నేడు ఎంతో నిరాదరణ ఉంది. తెలుగులో మాట్లాడుతున్న విద్యార్థినీ విద్యార్థులకు కఠినమైన శిక్షలు విధిస్తున్న పాఠశాలలు కూడా నేడు మనకు కనిస్తున్నాయి. అమ్మ పాలను తాగి అమ్మ రొమ్మును గుద్దే చందంగా ఈరోజు తెలుగు భాష పరిస్థితి తయారైంది. పుట్టగొడుగుల్లా విస్తరించిన ఇంగ్లీషు

కాన్వెంట్లు పిల్లలు ఇంగ్లీషు మాత్రమే మాట్లాడి తెలుగును నిర్లక్ష్యపర్చేలా తర్ఫీదునిస్తున్నాయి. ఆంగ్లభాష ధాటికి తట్టుకోలేక తెలుగుభాష తల్లడిల్లుతోందనే విషయాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు. అందుకే అమ్మానాన్నా అని ముద్దుముద్దుగా పిల్చే పిల్లలు కూడా మమ్మీ డాడీ అని పిలవడం నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా వారిని అలాగే ప్రోత్సహిస్తున్నారు. ఆ ఆవేదననే ఈ క్రింది పద్యంలో వ్యక్తపరుస్తున్నాడు కవి.

అమ్మ నాన్న మరచి మమ్మీ డాడి యనుచు / ఆంగ్ల మోజు పెరిగె అందరికిని
మాతృభాష మరువ మనగలదా జాతి / వినుడు లోకరీతి వీనులలర

అవసరం రీత్యా ఎన్ని భాషలను నేర్చుకున్నా పర్వాలేదు గానీ మనకు మూలమైన తెలుగుభాషను నిర్లక్ష్యం చేయడం తగదనే హితవు చెప్తుంది పై పద్యం. భాషను నిర్లక్ష్యంచేసిన చేసిన జాతికి మనుగడ ఉండదనే విషయాన్ని అందరూ గుర్తించాలని కోరుతున్నాడు కవి. మన భాష మనుగడకు మనమే నడుంకట్టుకోవాలని, అన్య భాషలను నేర్చుకున్నా అమ్మభాషను మరువ కూడదని చెప్తున్నాడు. తెలుగుమాట తీపిదనాన్ని, తెలుగు చరిత గొప్పదనాన్ని భవిష్యత్ తరాలకు అందించడంలో మనం ముందుండాలి. మాతృభాష అంటే మన జాతి సంపద అనే విషయాన్ని మనం ఎన్నటికీ మర్చిపోకూడదు.

చదువు ప్రస్తావన :

మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి వెలుగును పంచే చదువు నేడు వ్యాపారవస్తువుగా మారిపోయింది. కోట్ల రూపాయల పెట్టుబడితో స్థాపించిన విద్యాసంస్థలు విజ్ఞానం కంటే సంపదకే అధిక ప్రాధాన్యతనివ్వడం నేటి కాలంలో సర్వసాధారణమైంది. కొనగలిగినవారికే అందు బాటులో కొన్ని చదువులున్నాయి. అందుకే ఆ విషయా లకు కూడా ఈ శతకంలో ప్రాధాన్యతనిచ్చారు కవి.

చదువు వస్తువాయె జనులను దోచగ / బట్టి పట్టు చదువు వట్టిదగును
వాణి పేరు నేడు వాణిజ్య మాయెరా / వినుడు లోకరీతి వీనులలర

నేటి విద్యావ్యవస్థ తీరుతెన్నుల్ని కళ్ళకు కట్టినట్లు వివరించే పద్యమిది. జనులను దోచుకునే కొత్తపద్ధతి విద్యావ్యవస్థలో నేడు అలవాటుగా మారింది. వాణి పేరు నేడు వాణిజ్యమాయెరా అనడం నిజంగా అందరూ ఆలోచించవలసిన విషయం. విద్య అంటే కేవలం సంపద కోసమే కాదనే విషయాన్ని గ్రహించి దాన్ని సంఘ క్షేమం కోసం వినియోగించవలసిన అవసరాన్ని గుర్తించాలి. కేవలం మార్కుల కోసమే చదువు అన్నట్లుగా ఉంది తప్ప కలకాలం గుర్తుండే అంశాల ప్రాధాన్యాన్ని విస్మరిస్తోంది నేటి సమాజం.

ఇతర విషయాల ప్రస్తావన :

భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. కానీ నేటి యువత క్లబ్బులంటూ పబ్బులంటూ తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. తమ కర్తవ్యాన్ని మర్చిపోయి కలలలోకంలో విహరిస్తూ చదువును, ఆరోగ్యాన్ని కూడా నిర్లక్ష్యం చేసుకుని నాశనాన్ని కొనితెచ్చుకుంటున్నారు.

క్లబ్బు పబ్బులంటు గబ్బు గొట్టె యువత / విషము తేనె రీతి విపణి జేరె
టీవి నెట్టు తోడ టీనేజి చెడిపోయె / వినుడు లోకరీతి వీనులలర

కర్ణుడి చావుకి కారణాలనేకం అన్నట్లు ఈనాటి యువత చెడిపోవడానికి అనేక కారణాలున్నాయి. విదేశీ మోజులో విలాసవంతమైన జీవితానికీ, చెడు అలవాట్లకీ బానిసలుగా మారి తమ జీవితాన్ని తామే నాశనం చేసు కుంటున్నారు. మత్తుమందులకీ, డ్రగ్స్'కి అలవాటు పడి అంతుచిక్కని రోగాల బారిన పడుతున్నారు. దేశ భవిష్యత్తు యువత చేతిలోనే వుందనేది ఆర్యోక్తి. ముందు యుగానికి దూతల్లా ఉండాల్సిన యువత క్లబ్బు, పబ్బు, టీవి, నెట్ వలలో చిక్కి తమ భవిష్యత్తును తామే కాల రాసుకుంటు న్నారు. అందుకే యువతలో మార్పు వస్తేనే దేశం బాగు పడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాడు కవి.

చెట్టు ప్రగతికి మెట్టు అనే నినాదం అందరికీ తెలిసిందే. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించాక పచ్చని చెట్లు కూడా తమ రూపురేఖల్ని కోల్పోతున్నాయి. పండ్లనిచ్చే చెట్లను కూడా నిర్దాక్షిణ్యంగా నరికేసి అపార్ట్ మెంట్స్ కడుతున్నారు. కానీ చెట్లను పెంచడం మనిషి ఆరోగ్యానికి మంచిదనే విషయాన్ని కవి ఈ క్రింది పద్యంలో చెప్తున్నాడు.

వృక్ష సంపదలను విరుగగొట్టిన యంత / తల్లి ప్రకృతి తల్లడిల్లుచుండు
ఋతువులెల్ల మారె గతులు తప్పవు / చూడు వినుడు లోకరీతి వీనులలర

కాలంగాని కాలంగా మారి ప్రకృతి అనేక రకాలుగా ప్రకోపిస్తోంది నేడు. ప్రకృతి ఎప్పుడు ఎలా మారుతుందో, మానవాళి మీద ఎప్పుడు విరుచుకుపడుతుందో తెలియని సందిగ్ధస్థితిలో ఈనాటి లోకం వుంది. చెట్లను నరకడం వల్ల మంచిగాలి కూడా కరువై కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది లోకం. కనుక దేశం పచ్చగా, ఆరోగ్యంతో ఉండాలంటే చెట్లు పెంచాలేగానీ నరకకూడదు అనే బోధ కూడా చేస్తున్నాడు కవి.

ముగింపు :

చిన్నచిన్న ఆటవెలదుల్లో జీవితసారాన్ని రంగరించి సింగారించిన శతకం లోకరీతి శతకం. మనిషి జీవితంలోని అన్నీ దశల్లోనూ పాటించదగిన మంచి పద్యాల సమాహారంగా రచయిత ఈ శతకాన్ని తీర్చిదిద్దారు. తేలికగా అర్థమవ డమే కాకుండా మంచి విజ్ఞానాన్ని కూడా అందించగల అనేక పద్యాలతో దీనిని కూర్చారు రచయిత. సమాజంలో మంచి, చెడు అనే రెండింటినే చూడాలి తప్ప కులమతాల పేరుతో వైషమ్యాలను రెచ్చగొట్టడం మంచిది కాదనే హితవు చెప్తారు రచయిత. 'లోకరీతి శతకం' పేరుకు తగ్గట్టే లోకంలోని అన్ని రీతుల్ని విలక్షణంగా, విస్తృతంగా ఎంతో ప్రతిభతో చిత్రించారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కరీంనగర్ జిల్లా జానపద కథల వైశిష్ట్యం – విశ్లేషణ

– టి. భోజన్న, పరిశోధక విద్యార్థి, శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యలయం, హైదరాబాద్.

జానపద సాహిత్యం అనేక అంశాల కలయిక, దీనిలో జానపద కథలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయని చెప్పవచ్చు. ఈ కథలు మానవుడి జీవనాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. జానపద కథలు వినని, చెప్పని వారు మన ప్రపంచంలోనే లేరనడం అతిశయోక్తి కాదు. ప్రతి దేశంలోనూ వారికంటూ జానపద సాహిత్యం ఉంటుంది. అదే వారి జీవన మార్గాన్ని నిర్దేశిస్తుంది. నా పరిశోధన నిమిత్తం సేకరించిన కథలోని కొన్ని కథలను వస్తు ఆధారంగా వర్గీకరించి ఈ యొక్క అధ్యాయంలో చర్చించడం జరిగింది. జానపద కథలను జన జీవన సారంగా చెప్పవచ్చు. వీటిల్లో జనుల కష్టసుఖాలు, గాథలు, ఆనందాలు, పెండ్లీలు, పేరంటాలు, జనన మరణాలు, మొదలైనవన్ని జానపద విజ్ఞానంలో చేరుతాయి.

రామలింగని ఓటమి కథ :

తెనాలి రామలింగడు తెనాలి కాడ అందరిని ఓడిచ్చి మన దగ్గరికి అత్తే మనోళ్ళు ఓడిచ్చిండ్రు . రాంగనే ఎర్ర గొల్లామే పాలు, పెరుగు నెత్తిమీద పెట్టుకోని పాలు, పెరుగు అమ్మటానికి పోతుంది. ఈని కన్ను దానిమీద పడ్డది. పిల్ల అందగత్తె మంచిగ ఉన్నది. అమ్మా నాకు పాలు కావాలే దంచి పోసిన ఉనుకకు సరికి సరి పోత్తవా? పిల్లా అన్నడాట, అనంగనే ఆమే ఏమన్నదటా రామ లింగడు దేశమంతా ఓడిచ్చినోడు కవితల్లల్లా, ఏం చెప్పాలే అని ఆలోచించి. నేను తాగి పోసిన దానికి సరికి సరి పోత్తా అన్నదట. ఆడు అబ్బ నన్ను ఒడించింది. అంటే గిట్లేట్ల అన్నవ్ అమ్మా అని అడిగిండు. అవ్ నువు బియ్యం తీసుకున్నవ్ ఉనుకకు సరికి సరి పొయ్యిమన్నవ్. నేను పాలు తాగిన ఆ మూత్రానికి సరికి సరి పోత్తా అన్నా నాదేమి తప్పుంది తాతా అన్నదాట. అబ్బ నీకు దండం పెడుతా నేను ఓడిపోయినా అన్నడాట. తెనాలిలా గెలిచి అచ్చి మన దగ్గర ఓడి పేయిండు.

కథలోని విశేషాంశాలు విశ్లేషణ :

జానపద కథలలో తెనాలి రామలింగని కథలు కోకొల్లలుగా జానపదులు చెప్పుకుంటారు. రామలింగని కథలంటే పిల్లలు చేవి కోసుకుంటారని ఆర్యోక్తి కలదు. పిల్లలే కాదు నడి వయస్కులు, ముసలివారు సైతం అమితాసక్తిని కనబరుస్తారు. శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానంలో తెనాలి రామక ృష్ణ అను కవి ఉన్నట్లు జానపదులకు సైతం తెలుసు ఆ కవే రామలింగడిగా మారాడని చెప్పే జానపదులు కూడా మనకు కనిపిస్తారు. తెలుగు సాహిత్యంలోని పద్యాలపై, ఇతిహాసాలపై, నాటకాలపై పట్టు కలిగిన జానపదులు అడుగడుగున కనిపిస్తారు.

రామలింగని ప్రతిభ :

శ్రీ కృష్ణదేవరాయులు సభలో ఇతర ప్రాంత కవులను ఓడించడానికి చివరి అస్త్రంగా తెనాలి తెనాలి రామకృష్ణను వాడడం సాహిత్యం చరిత్రలో కనిపిస్తుంది. రామలింగ డంటే సమస్య పరిష్కారంలో దిట్ట అని జానపదులందరికి తెలుసు. జానపదులు రామలింగనిపై రకరకాల కథలను చెప్పుకునేవారు. రామలింగడిని ఓడించేవారు భూమిపైన లేరని చాలా మంది నమ్మెవారు. కాని మన తెలుగు నేలపై రామలింగడు ఓటమి చవిచూశాడని ఈ కథలో చెప్పడం వలన తెలుగు వారి మేదస్సును ముందు తరాలకు పరి చయం చేశారు జాపదులు. ప్రతి వ్యక్తికి ప్రతి ప్రాంతానికి స్వంతగా ఉనికి ఉంటుంది ఆ ఉనికిని నిరంతరం కాపాడుతూనే ఉంటారు. ఈ కథ చెప్పిన జానపదుడు రామలింగడు ఏ ప్రాంతంలో గెలిచిననూ తమ ప్రాంతంలో గెలువలేడని నిరూపించినట్లు కనిపిస్తుంది. ఈ చర్య వలన కథ వినే శ్రోతకి తనపై, తన ప్రాంతంపై అభిమానం నమ్మకం ఎక్కువౌతాయి.

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

కుల వృత్తులు :

గొల్లవారు పాలు పెరుగు అమ్ముకుని జీవిస్తారు. ఈ కథలోని ఎర్ర గొల్ల స్త్రీ పాలు, పెరుగు అమ్ముతుంది. ఆమెను గమనించిన రామలింగడు ఆమెపై సరదాగా ప్రశ్నలు సంధిస్తాడు. ఆ ప్రశ్నలకి ఆమె ఇచ్చే సమాధానం రామలింగని ఓటమి పాలు చేస్తుంది. విజేతలు ఎవరైనా ప్రతి ఘట్టంలో తామే విజయం సాధించాలని పోరాడు తారు. కొందరు స్థలకాలాదులను గమనించిక పోరాటం చేసి ఓడిపోయి అక్కడి నుండి నిష్క్రమిస్తారు. ఒక వ్యక్తని గెలుపు నిరంతరం వరించదని, ప్రతి వ్యక్తి ఓటమి రుచిని కూడా చవిచూడాలని ఈ కథ ద్వారా జానపదులు తెలియజేశారు.

తెలుగువారి దక్షత :

ఈ కథలో రామలింగడు ఓడిపోయింది పండి తులుతో వాగ్వాదం చేసి కాదు. పల్లెటూరులో జీవించే మామూలు స్త్రీ చేతిలో అని చెప్పడం వలన జానపదులు పండితులకు ఏ మాత్రం తక్కువకారనే అలోచనని ఈ కథ ద్వారా చెప్పబడింది. రాయల భువనవిజయ సభల అనేక మంది కవులను ఓడించి శ్రీ కృష్ణదేవరాయల చేత అనేక సత్కారాలు పొందిన రామకృష్ణుడు తెలుగు ప్రాంతంలో ఓడిపోవడం తెలుగు ప్రాంతంవారి దక్షత, దార్శనికతను తెలియజేసింది.

వస్తుమార్పిడి పద్ధతి చిత్రణ :

ఈ కథలో పాలు అమ్మే అమ్మాయి చాలా అందంగా ఉండడం వలన ఆమెపై అతని పండిత పకర్ష చూపుదా మని ఆమెను పిలిచి "అమ్మా నాకు పాలు కావాలి దంచి పోసిన ఉనుకకు సరికిసరిపోస్తవా? అనడంలో ప్రాచీన కాలంలో కరెన్సీ ఉండేది కాదు కాబట్టి ప్రజలం దరూ తమ దగ్గరున్న వస్తువులను మార్పిడి చేసుకునే వారు. ఒకరి దగ్గరి వస్తువులు మరొకరు తీసుకొని వారికి కావలిసిన వస్తువులు ఇచ్చేవారనే అంశాన్ని జానపదులు జానపద సాహిత్యంలో చేర్చి ముందు తరాలకు అందిం చారు.

జానపదుల చాకచక్యం :

రామలింగడు అడిగిన ప్రశ్నకు అంతే గాటుగా, సూటిగా పాలు అమ్మె గొల్లపిల్ల సమాధానమిస్తుంది. రామలింగని ప్రశ్నకు సమాధానంగా "నేను తాగిపోసిన దానికి సరికి సరి పోత్తా" అని సమాధానం ఇవ్వడం వలన ఎలాంటి ప్రశ్నలకు అలాంటి సమాధానాలు ఇవ్వాలనే జానపదుల భావనగా కనిపిస్తుంది. జానపదులు జీవితంలో ఘట్టంలో ప్రతి తెలివిగా ప్రతిచోట చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తారు. జానపదులు రోజువారి కార్య క్రమంలో చాలా చాకచక్యంగా మాట్లాడుతూ, సమస్యను పరిష్కార దిశగా తీసుకువెళ్తారు.

సామాజిక పరిస్థితుల చిత్రణ :

ఈ కథలో ఎర్రగొల్ల అమ్మాయి యొక్క సామాజిక పరిస్థితులు తెలుస్తున్నాయి. పల్లెటూరిలో ప్రజల జీవన విధానం పట్టణాల వారికి భిన్నంగా ఉంటుంది. వారి యొక్క కులవృత్తి చేయడంలో ఆడ, మగ తేడా లేకుండా ఎవరికీ సంబందించిన వృత్తి పనులు వారు చేసు కుంటారు. గొల్లవారికి పశుసంపద ఎక్కువగా ఉండి, వారి జీవితం పాడిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టే ఈ కథలో పాలు అమ్మే స్త్రీ వ్యక్తిత్వ చిత్రణ కనిపిస్తుంది.

గ్రామీణ ప్రాంతాలలో స్త్రీలు చాలా అమయకంగా ఉంటారు. ఏ విషయంలోనా కలుగజేసుకుంటే మాత్రం తమ చురుకుతనం, చతురత ప్రదర్శిస్తారు. ఈ కథలో ఉనుకకి ఏం ఇస్తావ్ అని రామలింగడు అడుగగా మూత్రం సరికిసరి ఇస్తానని ఘాటుగా సమాధానం చెప్పడం ఆమె తెలివితేటలు చితించబడ్డాయి. ప్రస్తుత సమాజంలోనూ అందంగా ఉండే స్త్రీలు తమతో వెటకారంగా మాట్లాడేవారికి చాలా ఘాటుగా జవాబివ్వడం కనిపిస్తుంది. కవులు, కళాకారులతో మాట్లాడడం చాలా దుర్గాభమే. జానపదులో సకల కళాపోషకులుగ ఉంటారు. వారి సత్సంబంధాలు, ఆటు - పోటుల జీవితం వారికి అనేక అంశాలను అనుభవాలతో నేర్పుతుంది.

అనాధ శవం కథ :

ఒకూరిలో ఎవలు లేనోడు చచ్చిపోయిండు. ఇగ అన్ని అన్ని చేయాలి కదా. ఎవలు ఏడవడానికి ఉండరు కదా. అయింతా ఒక ఆమెను కైకిలు పెడతారు. అయింతా ఆమె ఏడుత్తంది

తాలిత్తరో బోలిత్తరో ఉహు :

తవ్వ ఎంత చిన్నదో ఉహు :

అసలు ఇత్తరో ఇయ్యరో ఉహు :

కథలోని విశేషాంశాల విశ్లేషణ : మానవ జీవితంలో మనిషి సంపాదించిన ధనం, ఆస్తిపాస్తులు, అందం, అతనికి ఆనందాన్ని, కీర్తిని ఇవ్వలేవు. మనిషి ఎంత గొప్ప జీవితం గడిపినను చనిపోయిన తరువాత అతని యొక్క మంచితనం, దయాగుణం అతన్ని చరిత్ర పుటల్లో చేర్చుతుంది.

అనాధల స్థితిగతులు :

జానపదులలో ప్రేమ, ఆప్యాయతలకు కొదువలేదు. వీరు జీవించి ఉండగా, మరియు చనిపోయిన తదనంతరం కూడా వారి యొక్క బంధువులు కీర్తిస్తారు. కానీ ఎవరు లేని అనాధలకు మాత్రం చివరి కార్యాలు చేసే వారు లేక, కనీసం ఏడిచేవారు కూడా కొన్ని ప్రాంతాల్లో ఏడవడానికి కూలి పెట్టడం కనిపిస్తుంది. ఆ కూలికి వచ్చిన వారు అనాథ శవం కాబట్టి వీరికి కూలి ఎవరు ఇస్తారో? ఇచ్చిన అది నాణ్యత కల్గి ఉంటుందో? ఉండదోనని భయపడతారు. ఎందుకంటే భారతదేశంలో కుటుంబ సభ్యల తరువాతనే ఇతరులకు ప్రాధాన్యం ఇచ్చేవారు మనకు ఎక్కువగా కనిపిస్తారు. తమ వారికోసం అనేక రకాలుగా కష్టపడుతారు. కాని ఇతరులు తమవారు కాదనే భావన సర్వత్ర వ్యక్తమౌతుంది. కాబట్టే ఈ కథలో కూలిగా ఏడవడానికి వచ్చిన వారు మాకు కూలి ఇస్తారో, ఇవ్వరో, ఒకవేళ ఇచ్చినను తాలు ఇస్తారో? బోలు ఇస్తారో, తవ్వ చిన్నదో? పెద్దదో? అంటూ ఏడ్వడం వలన కూలీల జీవన చిత్రణ కనిపిస్తుంది.

కూలివారి స్థితిగతులు :

తెలంగాణలో కూలి ప్రత్యేకమైన పదం. ఎందుకనగా ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలంవరకు అనేక కుటుంబాలు ఈ కూలిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కరీంనగర్ దీనికి మినహాయింపేమి కాదు. ఈ జిల్లావారు దేశంలో అనేక రాష్ట్రాలకే కాకుండా దేశాంతరాలు పోయి పొట్టపోసుకునే ఆడ వారు, మగ వారు మనకు ఈ జిల్లాలో కనిపిస్తారు. ప్రస్తుత కాలంలో కూడా కూలి చేస్తేనే తప్ప రోజు గడవని వారు ఉన్నారంటే మన దేశ పరిస్థితులు అవగతమౌతాయి. నేటికి శవాల దగ్గర పొట్టపోసుకునేవారు ఉన్నారు. ఉదా : కాటిపాపల, చాకలి, మంగళి,

భారతదేశంలో రాజకీయాలు రోజు రోజుకి మారుతున్నా పేదల పరిస్థితులు మాత్రం మారడం లేదు. ఈ కథలో అనాధ శవానికి కూలికి వచ్చి శవానికి సంబంధం లేని వారు ఇచ్చే కూలి కోసం ఆరాటపడుతూ ఏడ్వడం చిత్రితమైంది. చనిపోయిన వ్యక్తికి ఏడ్చేవారు లేరు ఎందుకంటే అనాథ కాబట్టి, కాని ఏడవడానికి గ్రామస్థులు కూలికి పెట్టిన కూలీల జీవనస్థితిగతుల చిత్రణ హృదయ విదారకంగా ఉంటుంది.

ముగింపు :

ప్రాచీన కాలం మానవుడికి నేటి కాలం వారికి అనేక తారతమ్యాలు కనిపిస్తాయి. ఆ కాలంనాటి నైతిక విలువలు, మనుష్యల మధ్య ప్రేమ, ఆప్యాయతలు, కరుణ, దయ ప్రస్తుతం కనిపించడం లేదనేది ఆధునిక సమాజాన్ని గమనిస్తే తెలుస్తుంది. ప్రాచీన కాలంలో పేదవారికి, ధీనులకు, అనాధలకు అనేక మంది మద్ధతుగా ఉండేవారు. కాని ప్రస్తుతం వారిపైనే అనేక వ్యాపారాలు మొదలుపెట్టారు. సమాజహితంగా చెబుతూ కొందరు స్వహితాన్నే కోరుకుంటూ వీరి జీవితాలను పణంగాపెట్టి ఆస్తిపాస్తులను కూడబెట్టుకుంటున్నారు. సంగసేవ ముసుగులో అనేక ఆస్తులు సంపాదించుకున్నవారు ఈ నేలపై లేకపోలేదు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. అంకమ్మ కథలు - తంగరాల వెంకట సుబ్బారావు, లక్ష్మీ లేజర్ గ్రాఫిక్స్ బెంగళూరు, 1995 .
2. ఇనాక్ కొలుకలూరి, - జానపదల సాహిత్య విమర్శ, హైద్రాబాద్, జ్యోతి గ్రంథమాల.
3. దక్షిణమూర్తి, పోరంకి కథానిక స్వరూప స్వభావాలు
4. బాలస్వామి బుక్క మహబుబ్ నగర్ జిల్లా జానపద కథలు, హైదరాబాద్, తెలుగు పరిశోధన ప్రచురణలు 1987.
5. మోహన్, జి.యస్ - తెలుగు జానపద కథలు, సికింద్రాబాద్, యువభారతి సాహితి సాంస్కృతిక సంస్థ 1984.
6. వెంకట రెడ్డి, కసిరెడ్డి - జానపద సాహిత్యం అధ్యయనం - అనుశీలనం, హైదరాబాద్, జాతీయ సాహిత్య పరిషత్ 1994.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు సాహిత్యం – శ్రామికస్త్రీల జీవన చిత్రణ – చైతన్యం

– టి. వెంకట నారాయణ, పరిశోధక విద్యార్థి, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

చరిత్ర యేం జరిగిందో చెప్తుంది. సాహిత్యం యేం జరిగితే బాగుటుందో చెప్తుంది. అంతే కాకుండా యేం జరగబోతే బాగుణ్ణో కూడా చెప్తుంది.

– కొడవంటిగంటి కుటుంబరావు

హిందూ సంస్కృతి మాటల్లో స్త్రీకి ఎంతో గౌరవ స్థానాన్ని ఇచ్చినట్లు కనిపించిననూ వాస్తవానికి ఆచరణలో ఎంతో హీనంగా చూసింది. వివిధ సాంప్రదాయమనే సంకెళ్లలో బంధించి వేసింది. జీవించడానికి అవసరమైన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, ఆలోచనలకు కావలసిన విజ్ఞానాన్ని అందకుండా పురుషాధిక్య సమాజం అనాదిగా చేస్తూ వచ్చింది. అంతేకాకుండా స్త్రీకి సిగ్గే అలంకారమనీ, స్త్రీ తలదించుకొని జీవించాలన్నది. కానీ ఏదో ఒక రోజు మొత్తం స్త్రీ జాతికి జరిగిన అన్యాయాన్ని గుర్తించి స్త్రీజాతి ముందు సమాజమే తలదించుకోవాల్సి వస్తుందని మరచిపోయారు.

అయితే బ్రిటీష్ కాలంలో అనగా 19వ శతాబ్దంలో స్త్రీ జాతికి గతం కంటే మెరుగ్గా కొంత వరకు మేలు జరిగిందనే చెప్పవచ్చు. తెలుగు సాహిత్యం పరంగా కందుకూరి, గురజాడ, చలం మొదలైన వారెందరో తమ తమ రచనల ద్వారా స్త్రీకి జరుగుతున్న కష్టనష్టాలను, దురాచారాలను సమాజం ముందుంచి, స్త్రీ సమస్యలను స్త్రీలు కూడా ఆలోచింపచేసి విధంగా చైతన్యపరచారు. సంస్కరణలు, రచనలు ఆ సమయంలో ఎంతో దోహద పడ్డాయి స్త్రీ విముక్తి. ఆంధ్రమహాసభలు, గ్రంథాల యాలు, తెలంగాణ గిరిజన రైతాంగ పోరాటాలు, నక్సల్‌బరీ, కార్మికుల పోరాటాలు, తెలంగాణ దండ కారణ్యాలలో సాగుతున్న విప్లవ ఉద్యమాలు, సమస్త పీడిత వర్గాలలోనూ చైతన్యస్థాయిని పెంచాయి. ఇలా అన్ని పోరాటాల్లో స్త్రీలు గణనీయంగా పాల్గొన్నారనే చెప్పవచ్చు. అయిననూ ముఖ్యంగా శ్రామికస్త్రీల సామాజిక జీవనం ఎంతో దయనీయంగానే ఉందనే చెప్పవచ్చు. ఇక్కడ శ్రామికస్త్రీలు అనగా తన రెక్కల కష్టాన్ని అమ్ముకొని (నమ్ముకొని) జీవించే స్త్రీలు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబ స్త్రీలు. కాయ కష్టంతో జీవనాన్ని సాగించే స్త్రీలు. ఒక్క మాటలో చెప్పాలంటే చేతుల కష్టంతో బతికే స్త్రీలు. ప్రస్తుత కరోనా సమయంలో పొట్టకూటి కోసం, కుటుంబ పోషణ కోసం ప్రాణాన్ని లెక్క చేయ కుండా పనికి వెళ్ళే స్త్రీలు. వీరి జీవన చిత్రణ ఈ అత్యాధునిక యుగంలో ఎలా ఉందో పరిశీలిద్దాం.

అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న శ్రామికస్త్రీల బాధగాథలన్ని ఇన్ని కావు. జానెడు పొట్ట నింపుకోవడానికి తిప్పలు పడుతున్న స్త్రీల వ్యథలు, ఇంటిపనీ, బయటపనీ చేసుకుంటూనే కుటుంబాన్ని సైతం పోషించుకోవలసిన అధనపు బాధ్యతల భారాన్ని మోస్తున్న స్త్రీ మూర్తులు శ్రామికస్త్రీలే. వీరి ఆర్థిక స్వావలంబన కోసం ఎన్నో పథ కాలు సృష్టిస్తున్నామని ఈ ప్రభుత్వాలు ఊదరగొడు తున్నారు. కానీ దుర్భర జీవితాన్ని గడుపుతూ, మెతుకుల్లేని బతుకులీడుస్తున్నారు. అవి కరోనా కష్టకాలంలో స్పష్టంగా కనిపించింది. వీరిది బతుకుపోరాటం.

శ్రామిక స్త్రీల తమ రెక్కల కష్టాన్ని అమ్ముకొని జీవనం సాగించేవారు. కాబట్టి వీరికి రోజు పని లభిస్తుందన్న గ్యారంటీ లేదు. మేస్త్రీ, యజమానులు, కాంట్రాక్టర్ల దయా దాక్షిణ్యాల పైనే ఆధారపడాలి. కాబట్టి కూలీ రేట్లు పెంచమనీ గట్టిగా అడగలేని స్థితిలో ఉంటారు. అందుకే వీరు, శ్రమదోపిడీ, ఆర్థికదోపిడికీ, లైంగిక దోపిడికీ, లైంగిక పీడనకు గురికావడం వీరి జీవితాల్లో నిత్యకృత్యాలుగా జరుగుతున్నాయి. వీరి 2, 3 సం॥రాల పిల్లలకు సంరక్షణగా 5, 6 సంవత్సరాల పిల్లలే వారి బాగోగులు

చూసుకుంటున్నారు. సరైన పోషణ ఉండదు. విద్య, వైద్యం సరిగ్గా ఉండదు. ఒక మాటలో చెప్పాలంటే వాళ్ళకు జీవితం అంటే మనుగడ కోసం సాగే ఒక పరుగు పందెం. వీరు కాంట్రాక్టర్ల మేస్త్రీల దగ్గర ముందే తిండి కోసం అప్పులు చేస్తారు. అవి తీరడానికి వాళ్ళ దగ్గర వాళ్ళు చెప్పినట్లు చేయాలి. గర్భవతులైనా, బాలింతరా లైనా, చిన్న పిల్లల తల్లులైనా పనిచెయ్యకపోతే బతుకు లేదు.

శ్రామిక కుటుంబాలలో నిజానికి, మగవారికంటే స్త్రీలు ఎక్కువగా శ్రమపడుతుంటారు. కోడి కంటే ముందే లేచి గొడ్డు కంటే అన్యాయంగా కష్టం చేసి ఎంతో ఒద్దికగా, సంసారాన్ని సాకుతుంటారు. దారిలో నడిచేటపుడు కంపపుల్ల కాలికి గుచ్చుకుంటే ఆ పుల్లను పీకి పారవేయక ఇంటిలోకి తీసుకొస్తుంది. కాలి బాధ లెక్క చేయకుండా పొయ్యిలోకి ఒక పుల్ల వచ్చి చేరిందని తృప్తిపడతారు. ఆమెకు ఆరోగ్యం బాగలేకపోయిన ఆరోగ్యంగా ఉన్నట్టు నటిస్తూ ఉంటుంది. ఆమెకి ఏ జబ్బూ లేదని చెపుతుంది. డాక్టర్ దగ్గరికి వెళ్ళి పరీక్షలు చేయించుకోవాలంటే భయం, ఎంత డబ్బు ఖర్చు, అప్పు అవుతుందోనని. రోగం తెలుసు కొని నయం చేయించుకోలేక పోవడం కంటే తెలుసు కోకుండా ఉండటమే మేలు అనీ అనుకుంటుంది. డాక్టర్ కిచ్చే ఫీజుగా ఇచ్చే డబ్బుతో ఏదైనా మనస్సుకు నచ్చింది తినడం మేలు, పోతే రోగం పోతుంది. లేకపోతే ప్రాణం పోతుందనుకుంటారు. వీరి ఆయుష్షు ఇంకొంత కాలం పెంచమని దేవునిని అడుగుతారు. ఎందుకంటే చేసిన బాకీ అప్పుల భారం తన బిడ్డలపైన పడకుండా చేసిన అప్పులు తీరినంతకాలమైన బ్రతనియ్యమని కోరు కుంటారు.

గిరిజన కుటుంబాల్లో అయితే చాలామంది పురుషు లకు ఇద్దరు ముగ్గురు భార్యలుంటారు. తన భర్త రెండో పెళ్ళి చేసుకోవడానికి మొదటి భర్త సులభంగా అంగీ కరిస్తుంది. దానికి కారణం ఇంటిపనిలో, బయటపనిలో తనకు తోడుగా ఉండి ఆమె తన బరువు బాధ్యతలు పంచుకుంటుందనే అభిప్రాయంతోనే అధనంగా వచ్చే కూలిడబ్బులు కడుపుకు కూడైనా దొరుకుతుందనే. అలానే ఒక స్త్రీ తన భర్తని సునాయసంగా వదిలిపెట్టగలదు. ఇంకొకతనితో వివాహం, సహజీవనమో చేస్తుంది. దీనికి స్వంత ఆస్తి లేకపోవడం ఒక బలమైన కారణం. అంతేగాక ఈ స్త్రీలు కూడా భర్తలపై ఆధారపడి బతకనవసరం లేదు. తమకు తాము కష్టపడి బతకగల చేతి కష్టం చేసుకునే అవకాశం వారికుంది. వివాహబంధం పేరుతో ఇష్టమున్నా లేకపోయినా స్త్రీ పురుషులు కలిసి ఉండాలనీ పురు షాధిక్యతతో వాని బెదిరింపులకు అణచివుండాలని గానీ, భర్త చేసే పనులు నచ్చకపోయిన భర్త వేధింపులను భరించవల్సిన అవసరంముండదు.

కావాలంటే వానితో సహా కుటుంబ భారాన్ని తన రెక్కల కష్టంతో మోయడానికి సిద్ధపడుతుంది. గానీ, పురుషాధిపత్యంకు తలొగ్గక, చైతన్యంతో ఎదురించే శక్తి ఉంటుంది. చివరి వరకు పోరాడుతూనే ఉంటారు. కొనఊపిరి వరకు తన కుటుంబం కోసం దేనికైనా తెగిస్తారు. అదే కుటుంబం కోసం దేనికైనా తెగిస్తారు. అదే కుటుంబంలో భర్త తప్పులను, ఆగడాలను పలా యనం పట్టిస్తారు. ఇవన్నీ వింతగా కనిపించే వన్నీ, గిరిజన, దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో కనిపిస్తాయి. అపార్ ట్మెంటులోని పాచిపని చేసే మనిషి (స్త్రీ) నుండి భూస్వామి పాలంలో కలుపుతీసే మనిషి (స్త్రీ) వరకు శ్రమించే స్త్రీయే శ్రామిక స్త్రీలు. వీరు మధ్యతరగతి స్త్రీలు కారు. క్రింది తరగతికి చెందిన స్త్రీలు నిత్యం శ్రమించే స్త్రీలు. రెక్కల కష్టం మీద బ్రతుకు నీడ్చే స్త్రీలు. స్త్రీ వాదుల దుష్టికి కనబడని స్త్రీలు, వంటిల్లు లేని స్త్రీలు, కాదు, కాదు నివాసం కూడా సరిగ్గా లేని కుటుంబాలు. స్త్రీలు వారి శ్రమ గూర్చి చెప్పాలంటే పదిచేతులు, పదికాళ్ళు పది నోళ్లూ, వెయ్యికళ్ళు ఉన్నా ఒక ఆడమనిషే ఆ శ్రామికస్త్రీ. అన్ని రకాల పనులు, వేగంగా చేస్తూ యాంత్రిక జీవనం గడుపుతూ ఉంటుంది.

ఇంతటి కష్టాన్ని, దోపిడీనే, వేధింపులను, అణచి

వేతలను భరిస్తున్నది. పురుసాధిపత్యానికి గురవుతూ, మరోవైపు పురుషులతోపాటు సామ్రాజ్యవాద దోపిడికి బలవుతూ రెండు విధాల హింసకు లోనవుతూ ఎందరో శ్రామిక స్త్రీలు బతుకులు వెళ్ళదీస్తున్నారు. అయిననూ చైతన్యంతో శ్రామిక స్త్రీలు కొందరు తమపై జరుగు తున్నాయి. శ్రామిక కుటుంబాలలో నిజానికి మగవారికంటే స్త్రీలు రకరకాల హింసలు, అణచివేతల్ని ఎదుర్కొంటు న్నారు. శ్రామిక స్త్రీ లోకానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు. వారి శ్రమయే వారికి తెగువ ఇస్తుంది. ఇవి శ్రామిక స్త్రీలలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఆధునిక స్త్రీలు - ముఖ్యంగా శ్రామిక స్త్రీలు చైతన్యానికి ప్రతీకలు. వీరు అబలలు కాదు ఆత్మాభిమాన దీప్తులు. చరిత్రలో వీరు మరికొన్ని పేజీలు సంపాదిస్తారు. ఎందుకు ఐక్యరాజ్య సమితి ఆహారసంస్థ అధ్యయనం ప్రకారం ప్రపంచం మొత్తం మీద జరుగుతున్న ఉత్పత్తిలో 50% స్త్రీల వల్లనే జరుగుతుందనీ, అంతర్జాతీయ కార్మిక సంస్థ పురుషుల కంటే ఎక్కువ పని స్త్రీయే చేస్తున్నదని తెల్పింది. పురుషుడు చేసే ప్రతి పని స్త్రీ కూడా చెయ్యగలుగు తుందని ఒకానొక సందర్భంలో 'మావో' అంటాడు.

జనాభాలో సగం మంది స్త్రీలు, ఆ స్త్రీలలో ముప్పాతిక మంది శ్రామిక స్త్రీలుంటారు. కాబట్టి ఉన్నత చదువులు చదువుకున్న స్త్రీలు, ఉద్యోగాలు చేసే స్త్రీలు, తమ తమ హక్కుల కోసం పోరాడుతూ, తమను తాము కాపాడు కోవడానికి వారిలో చైతన్యం ఉంటుంది. అది గొప్ప విశేషం కాదు. ఎలాంటి అక్షరజ్ఞానం లేని శ్రామిక స్త్రీల్లో ఉండే చైతన్యాను వారిలో తెగింపును వారిపైన జరుగు తున్న దోపిడీలను, వారు తమ కుటుంబాల్లోనూ పురుషాధిపత్య సమాజంలోనూ వారు అనుభవించే హింసను, వారు చైతన్యంతో ఎదుర్కొనే వారి జీవిత స్థితిగతుల్ని, మనోభావాల్ని, వారి చైతన్యపూరిత ధిక్కార స్వరంను గురించి తెలుగు కవిత్వం, కథ, నవల సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి.

ఎగిరే పక్షులకు హద్దులు లేవు ఆత్మవిశ్వాసంతో సాగే స్త్రీకి సంకెళ్ళు లేవు.

ఆధార గ్రంథాలు :

1. కవిత్వం - ఒక సామాజిక చైతన్యం - డా॥ రాధేయ
2. అభివృద్ధిని ఇలా చూద్దాం! - మదునూరి భారతి
3. సామాజికం వ్యాససంపుటి - వి. చెంచయ్య
4. వివిధ వృత్తుల, శ్రమ గౌరవ పాఠాలు - ప్రొ॥ కంచె ఐలయ్య
5. సాహిత్య వీచక్షణం - కొలకలూరి మధుజ్యోతి
6. అమ్మకు ఆదివారం లేదా? - రంగనాయకమ్మ

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలంగాణ కథలు – సామాజిక సమస్యలు – కులవృత్తులు

– తోట రామకృష్ణ, పరిశోధన విద్యార్థి తెలుగు శాఖ, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

తెలంగాణా కథలలో సామాజిక సమస్యలు, కుల వృత్తులు ఆధారంగా తీసుకొని అనేక కథా సంపుటాలు వెలువడినాయి. వాటిలో దుబ్బచెలక కతలు, పేదోళ్ళ బతుకులు కథలు, వేపచెట్టు తెలంగాణా కథలు మొదలై నవి ముఖ్యమైనవి. సాధారణంగా కథల్లో రచయితలు తమలో తాము ఓ వర్గాన్నో, కులాన్నో, మతాన్నో, తప్పిస్తే రాజ్యం మీద అస్త్రాలను సంధించే ఏ వాదాలూ ఇప్పుడు లేవు. అందుకే కుంభకోణాలు, భూ ఆక్రమణలు యథేచ్ఛగా సాగి దోపిడీ వర్గాల ఆకృత్యాలు రాజకీయ నాయకులు బ్యాంకు నిల్వల్లా పెరిగి పోతున్నై ఇవేమి పట్టించుకోకుండా కొందరు రచయితలు, కవులు, తమ వాదాలను భూజానేసుకొని సాహిత్యంలో పిల్లి మొగ్గలేస్తూ బతుకు వెళ్ళదోస్తున్నారు. అట్లాంటి వాళ్ళకు చురకలం టిస్తూ ఆక్షేపించిన సందర్భాలు శంకర్ కథల్లో కోకొల్లలు.

తెలంగాణ భూముల్లో తొంబై శాతం దుబ్బచెల్కలే. ఆకాశం మీద ఆధారపడ్డ వ్యవసాయలే మొదటితరం విద్యావంతులు చిన్నా చితకా ఉద్యోగాల మీద వచ్చే ఆదాయాన్ని వ్యవసాయాల మీద పెట్టుబడి పెడుతూ బోర్లు వేయించి సెక్సెస్ కాక చితికి పోతున్నారు. తాకతు లేనివాళ్ళు కూడా అప్పో సప్పో చేసి బోర్లు వేయించడం, నీళ్ళు పడితే వ్యవసాయం, లేకపోతే ఉన్నది కూడా అమ్ముకోవడం చేస్తున్నరు. నీళ్ళు పడ్డా అర్ధంతరంగా ఆగిపోయేబోర్లు. ఒకదాని ప్రక్కన ఇంకొక్కటి వేసి ఒకరి కొరకు తగాదాలు. తన్ను కోవడాలు. ఇదే తెలంగాణాలో ఏ ప్రాంతంలో చూసిన కనిపించే పరిస్థితి. 'దుబ్బచెల్క' కథలో ఈ దృశ్యాలకు పూర్వరంగాన్ని జాతికరంగా రచ యిత చిత్రీకరించాడు. బోరు పడుతుందన్న ఆశ. ఏడేండ్ల ఎట్టి తోలగిపోతుందన్న నమ్మకం. కాని పడకపోతే? పడ్డా నడుంగల్నీ పాడిపోతే? దీన్ని రైతులు ఊహించలేరు.

'రుణం తీరింది' కథ తెలంగాణా వ్యవసాయ బీభత్స దృశ్యాలకు మరో మచ్చు తునక 'వ్యవసాయం తప్ప మరో బతుకులేదు. వ్యవసాయం విడిచేతే బతుకలేము. వ్యవ సాయం చేసినా బతికే ఉట్టులేదు. పంటలు ఎప్పుడు పండుతాయో, ఎప్పుడు ఎండుతయో తెలిస్థితి. బ్యాంకు ఋణాల వసూలు తీరులోనూ అలజడి. అసలు కట్టనోడికి మాఫీ. కొన్ని కట్టినోడికి లేదు. ఈ వర్గీకరణ అర్థంకాని రైతులకు అసంతృప్తి, ఆందోళన. సచ్చినోడిని బాకీ అడగరు అప్ప మాఫీ అవుతుంది. ఇదీ ఒక రైతు విశ్లేషణ. ఇజ్జత్‌దారు కసుక ఉప్పిడి ఉపాసం ఉండి కొంత వడ్డీ కట్టిండు. ఇప్పుడు చెట్టుకు ఉరేసుకొని మిగతారుణం తీర్చుకున్నాడు. మరి ఇంకేంచేస్తాడు? ఒక్కొక్కరే పత్తి రైతులు ఆత్మ హత్యలు చేసుకుంటూనే ఉండిరి. ఇప్పుడు అప్ప రైతు అదేదారి చూసుకున్నాడు.

ఆర్థిక స్థితిని బట్టి ఆయా సామాజిక వర్గాలను బట్టి మమతాను బంధాలు ప్రేమానురాగాలు విలువలు కూడా మారుతూ వుంటాయి. కరెక్ట్ కాక పోయినా స్త్రీ, పురుషుల మధ్య ప్రేమలు, లౌకిక సంబంధాల పట్ల మధ్య తరగతిలో ఉన్నంత తీవ్రస్థాయి పట్టింపులు కింది తరగతుల్లోనూ, అటూ ఉన్నతస్థాయి కార్పొరేట్ సంస్కృతుల్లోను ఉండవు. కలవడాలు, విడిపోవడాలు మధ్య తరగతిలో సృష్టించి నంత అలజడిని కింది, మీది తరగతుల్లో సృష్టించవు. 'తాతకథ' ఇందుకు ఉదాహరణ.

'వేపచెట్టు' కథలో పాలేరు మైసయ్య కొడుకును ఇంజనీరుగా చూడాలని ఆకాంక్షించిన డాక్టర్ రాజేశ్వర రావు కొన్నేళ్ళ తర్వాత బతుకు భారంతో కృంగిపోయి మేస్త్రీ పని కోసం అడుగుతున్న మహేష్‌ను చూసి నిర్ఘాంత పోతాడు. గ్రామీణ జీవితంలో సంపన్నుల పిల్లలు, మధ్య తరగతి పిల్లలు మాత్రమే డాక్టర్లు గాను, ఇంజినీర్లు గాను

ఎదుగుతుంటే దళితులు పిల్లలు తెలవి గలవాళ్ళయి నప్పటికీ కూలేరుగా, మేస్త్రీలుగా మిగిలేపోతున్న జీవిత విషాద వాస్తవికతను 'వేపచెట్టు' కథ చిత్రస్తుంది.

'పేదోళ్ళ బతుకులు' కథలో నర్సవ్వ పాత్ర స్త్రీ అబల కాదు సబల అని నిరూపిస్తుంది. నర్సవ్వ బతుకు జీవన కోసం బీడీలు చెయ్యడం నేర్చుకొని సొంతంగా బీడీలు చేస్తుంది. నాలుగేండ్లయినంత నర్సవ్వకు పి.యఫ్.కట్ చేసాడు టేకదారు. ఆమె బీడి కార్మికురాలని ఐడెంటిటి కార్డు అపాయింటుమెంటు లేటరు ఇస్తాడు. బుచ్చన్న నర్సవ్వలు పద్నాలుగేండ్లు రక్తం కలికలికాంగ కట్టపడితే రెండు గంటల భూమి కొన్నారు. మరో పద్నాలుగేండ్లు కట్టపడ్డ ఇల్లు కట్టుకోవడానికి ఖర్చు అయ్యే రూపాయాలు జమకావని ఒకగుడిసె వేసుకుంటే సరిపోతుందని అనుకుంటుండగా కేంద్ర ప్రభుత్వం ఒక సంవత్సరం నుండి పి.యఫ్. ఉన్న బీడి కార్మికులకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నలుపయి వేల రూపాయాలు పూర్తి సబ్సిడీతో ఆర్థిక సహయం చేస్తుందికి ప్రకటన వెలువడింది. అందుకు బీడికార్మికులు ముందుగా ఐదువేల రూపాయలు డి.డి. తీసి హౌసింగ్ బోర్డు ఆఫీస్‌లో ధరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అప్పటి నుండి బుచ్చన్న నర్సవ్వలు ఐదువేలు అప్పుకోసం పక్కపోంటి ఊర్లల్ల తెలిసినోల్లను అడిగిండ్రు. సూట్టాల మార్గాన అడిగిండ్రు ఎక్కడ అప్పు దొరకుత లేదు. ఇల్లు గట్టుకునే భాగ్యం లేదని సాలిచ్చు కుండ్రు ధరఖాస్తు పెట్టుకొన్నోల్లాందరికి ఇండ్లు మంజూరైనాయి ఎంత మోసం, ఎంత మోసం మనలాంటి పేదోళ్ళను ప్రభుత్వం మోసం జేత్తుంది'' అన్నది నర్సవ్య. నర్సవ్వ కిరాయికి ఉన్నఇంట్లో నర్సవ్వతో పాటు మరో ఐదారుగురు కూచొన బీడీలు జిత్తుండు. ''ఇండ్లు మంజూరు చేసేటప్పుడు సూడద్ద ఎవలకు ఇండ్లున్నాయో లేవోనని'' అన్నది బుచ్చమ్మ. గాసామ్మవ్వకు ఇల్లు లేదా... వాల్ల ఆడబిడ్డకు ఇల్లు లేదు.. గా లచ్చుంబాయికి ఇల్లులేదా... వాల్లకు ఇండ్లు లేనట్టుగా ఈ పట్వారి ఎట్ల రాసిచ్చిండు ''కుక్కకు బొక్కేత్తే కోరుక్కుంట ఉంటుంది. వాల్లడి వాల్లకు ముట్ట జెప్తుయిపోయే అన్నది బుచ్చమ్మ. ''మన చేతిలో చిల్లిగవ్వ లేకపాయె మనమే కాదు చాలామంది పైసలు లేక డి.డి. తీయలేదు'' అన్నది రామేశ్వరి. ''మనచేతిలో పైసల్లేవు నిజమే...కాని అంత మనచేతిలోనే ఉంది. మనం ఓటేసెనాం. గెలిపించినాం మనకనుకూలంగానే పథకాలే... మనకను కూలంగా రాకుంటే పోరాటం చెయ్యాలే..'' ''చేతులు ఆడించుకుంటు లగంచి అన్నది నర్సవ్వ. పోరాట మంటే...? అడిగింది రాజేశ్వరి.

పోరాటమంటే ఎమ్మేల్యే మీదికి, పాపీల మీదికి మంత్రుల మీదికి, అధికారుల మీదికి కోట్లాట జేయ్యాలే. లొల్లి లొల్లి జెయ్యాలె. మనకోసమే ప్రవేశపెట్టిన ఆ పథకం మనకు రాకుండా మన పేరు చెప్పి ఉన్నాల్లే ఎత్తుకపోతే దొంగలు దొంగలు ఊర్లు వందుకున్నట్లు కాదా...? మనం మనం సప్పుడు జేక ఊకుంటే మనం ఎప్పటి గిట్లునే ఉంటం. వాళ్ళు మంత్రం కోట్లకు పడగలెత్తుతారు. ఆవేశంగా అన్నది నర్సవ్వ. ఈ విధంగా పేదోళ్ళ బతుకులు అనే కథలో నర్సవ్వ వ్రాత స్త్రీ మొక్క ధైర్యాన్ని ప్రతిబించిస్తుంది.

క్షౌరశాల కథలో మంగళి వృత్తి వారి జీవన విధానం, సమాజంలో వారు ఎదుర్కొంటున్న నిందలు. శ్రమదోపిడి ఆగ్రకులాలవారు వీరిని చిన్న చూపు చూడుట మొదలైనవి ఇతివృత్తంగా ఈ కథ వుంటుంది. ఈ కథలో ముఖ్యమైన పాత్ర 'మంగళి దుబ్బయ్య' ఆ వూరిలో విగ్రహాల ఆవిష్కరణకు అయిన ఖర్చులు కుటుంబాల వారిగా ప్రజలు చెల్లిస్తున్నారు. దుబ్బయ్య చెల్లించక పోవడంతో పెద్ద మనుషులు ఊరందరి సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేసి దుబ్బయ్యను మందలించారు. అందులో ఒక పెద్ద మనిషి 'దుబ్బా...! నిన్నేప్పుడన్న చిన్న చూపు చేసినా మురా..? అంటాడు. ఆ మాటలకు దుబ్బయ్యే తన మనసులో ఇన్నాళ్ళ జీవితంలో తనను సాటి మనిషిగా ఏనాడు చూల్లేదు. మంగళోడిని అనుమానించారు. తనను నీచ మానవునిగా పరిగణించారు. ఎంతో సేవచేయించుకొని ప్రతిఫలం ఇవ్వకుండా దోచుకున్నారు. ప్రతిరోజు

ఉదయమే తనకల్పన జిబ్బకు వేసుకుని ఊల్లోని వ్యక్తులకు ఎవరెవరికి క్షౌరం పెరిగింది, గడ్డం పెరిగిందో తెలుసుకోని వారి ఇంటికి వెళ్ళి వారి గడ్డం తీసివాడ్ని, క్షౌరం తీసేవాడ్ని వారి పెరిగిన గోళ్ళ తీసేవాడ్ని, తల, శరీరం మాలీస్ చేసేవాడ్ని. ఇంకా చేస్తునే ఉన్నా తనను అశుభ్రడుగా భావంచేవారు. అయినా నిన్నెప్పడున్నా చిన్న చూపు చూసినామురా? అన్న పెద్ద మనిషి మాటలు దుబ్బయ్యను బాధించాయి.

దుబ్బయ్య భార్య రాజమ్మ ఈమె మంత్రిసాని తనం చేస్తే తనకేమెచ్చివారో పెద్ద మనుషులకు ఈ విధంగా తెలిపింది. "ఊల్లో కడుపుతోనున్న ఆడోళ్లకు కంటి రెప్పోలే కావలుండి కాన్పుజేత్తిమి. పుట్టంగనే బొడ్డుగోసి తల్లి, పిల్లలను బతికిత్తిమి. మాయినిముంతవేసి కుక్కలు తింటే ఎర్రిలెత్తదని కుక్కలకు దొరకకుంటదాసి పెడితిమి. పెయిపుండైన పచ్చి బాలింతకు పెయ్యంత పసుపునూనె రాసి నీళ్ళల్ల అయిలాకు, తక్కల్లాకేసి కాగవెట్టి తానంబోసి పెయిల నొప్పులు పోగ్గొడితిమి. పురుడునాడు తల్లి పిల్లను నడిమంచంలో కూసండబెట్టి ఎల్లిపాయల దండగుచ్చి ఇద్దరికి మెడలో వేసి నిండ దుప్పటి కప్పి అరుసోల (తవ్వ)లో ఆటాణ బిల్లచేసి ఆరుసోలను కిందికి మీదికి ఊపుకుంట' పాయోలె పాకులాడు. కప్పోలే దూకులాడు బుడు బుడు బుడుక్ అనుకుంట మంచం చుట్టు దుంకుకుంట తిరుగుదంటిమి. ఆడపిల్ల పెద్దమనిషి (రజస్వల) అయినాడు కాళ్ళగొల్లు తీసి తానం పొత్తిమి ఇంతజేత్తి మాకేమిచ్చిండ్రు ఓనూరో, యాబయో రూపాయలెత్తురు కొందరు తక్కోదరది సేర కొందురు. మీరెంతిచ్చినా తీసుకున్నాం ఏనాడు గిన్నియ్యుండ్రని అడగలేదు అన్నది రాజమ్మ.

"అంటే మేమిచ్చింది సాలలేదని మేము పెట్టిన ఖర్చులియ్యరా...? దుబ్బయ్య సప్పుడుజెయ్యవేందిరా...?" అన్నాడు పెద్దమనిషి రంగయ్య.

"అయ్యా నాకు ఇయ్యాలనే ఉంది కాని ఎక్కడున్నంచి తెచ్చియ్యాలనో తెలుత్తలేదు" అన్నాడు దుబ్బయ్య.

"అప్ప దెచ్చియ్యు" అన్నాడు రంగయ్య

"అప్పతెత్త మల్ల ఏన్నుంచి కట్టాలే...?"

"గింత పంజేత్తున్నావు... అవన్ని ఎటువోతున్నాయి...?" అన్నడు రంగయ్య.

"అయ్యా నేను బాగా సంపదిత్తున్నానుకుంట్రుండ్రా...? ఎనుకట ఇనుప కత్తితో గడ్డం తీత్తుం. గుండు గీకుదుం. కత్తి మొండై ఎంటుకలు తెగకపోతే నూరురాయి మీద తీడుతోలు మీద నూరుదుంటిమి. అయిన కూడ ఎంటుకలు తెగకపోతే కమ్మరోల్ల దగ్గరికి పోతే గడ్డం గీకే కత్తి ఎంటుకలు కత్తిరించే కత్తెరను మెత్తగా సాటేసిత్తురు. ఆ కత్తులు పోయి బ్లేడ్ కత్తులచ్చే. ఎనుకట గడ్డం తీయాలంటే నీల్లతో గడ్డాన్ని తడిపి గడ్డాన్ని రుద్ది గీకుదుంటిమి. ఆ తరువాత గడ్డానికే సుబ్బులచ్చే. ఇప్పుడు సబ్బులు వోయి క్రీములచ్చే. అవన్నిటికి లెక్కలు వెడితే మాకేమ్మి గులుతుంది...? ఇగ లగ్గాలప్పుడు పోలువోసె వడ్లు తప్పలు తర్రలే ఇయ్యవట్రి. అదట్లయిందంటే ఇగ ఇప్పుడు ఒకల్లకు వాడిన బ్లేడ్ మరొకల్లకు వాడితే ఏయిడ్స్ వత్తుందని కొత్తబ్లేడ్లు పెట్టువనవట్రి. నేను ఆడాది పొదువుగా పనిజేత్త నాకిచ్చే వడ్లు మక్కలు కొందరు తప్పలు తర్రలు ఇయ్యవట్రి" దుబ్బయ్య తన ఆవేదనంత తెలిపాడు.

ఇంతవరకు 'తెలంగాణ కథలు - సామాజిక సమస్యలు - కలవృత్తులు. అనే అంశంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వెనుక కులాలవారు తమవృత్తులలో ఎదుర్కొంటున్న అవమానాలు, నిందలును తెలుపుటకు ప్రయత్నించితిని.

ఆధార గ్రంధాలు :

1. దుబ్బ చెలక కతలు - ఎలికట్టి శంకర్‌రావు
2. వేపచెట్టు - తెలంగాణా కథలు - బి.ఎస్.రాములు
3. పేదోళ్ళ బతుకలు - నేరెళ్ళ శ్రీనివాస గౌడ్.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నవీన్ నవలలు – సామాజిక స్పృహ

– డా॥. అల్లు గణేష్, టి.జి.టి., ఏ.పి. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్స్

వర్థమాన సమాజంలో దమననీతిని, దుష్టచర్యలను తెలియపరిచిన తెలుగు నవలా యోధుడు నవీన్. అసమానమైన శిల్పనైపుణ్యం, వాస్తవికతాదృక్పథం నవీన్ గారి సహజ లక్షణాలు. అందుకే 'కేంద్ర సాహిత్య అకాడమీపురస్కారం' వరించింది. తెలుగు సాహిత్యంలో గొప్ప నవలాకారుడుగా, కథారచయితగా, మానవతా వాదిగా, ఎదిగిన గొప్ప రచయితగా నవీన్‌గారిని అంచనా వేయవచ్చు. పాల్కురికి సోమనాథుడు, బమ్మెరపోతన నడయాడిన నేలకు అతిదగ్గరి ప్రాంతం "వావిలాల" అనే గ్రామంలో జన్మించారు. అతని శ్వాసధారల్లో మహాకవులు స్ఫూర్తి ధాతలుగా నిలిచారు. తెలంగాణ ప్రాంతం కాకతీయులు, శాతవాహనులు వంటి మహారాజుల పాలనలో ఎంతో చారిత్రకతను పొందింది. ప్రతి బండకు తెలుసు ఆ గుండె చప్పుళ్ళు, ఈ రాగటి మట్టిలో మొలచిన మొలకలు ఎంతమందిలోనో ఊపిరులను నిల్పింది. ఈ నేలలోని నీరు పౌరుషానికి ప్రతీకయైంది. అతిసామాన్యమైన సర్వాయిపాపడు గోలకొండను స్వాధీనం చేసుకొని ఈ మట్టిని పౌరుషముందని నిరూపించాడు. రచయిత నవీన్ ఎన్ని పౌరుషాలను అవపోషణ పట్టాడో, రజాకర్ల దుష్ట చర్యలను విన్నాడో, కన్నాడో, తెలుగు పౌరుషాన్ని చూశాడో కాని తనకంటూ ఒక వ్యక్తిత్వంతో సామాజిక సమస్యలపై స్పందిస్తూ అనేక రచనలు చేశారు.

సామాజిక దృక్పథం :

వ్యక్తిత్వాన్ని మరిచి ఎవరు రచనలు చేసినా అవి నిలువలేవు. సమాజంలో రచయిత అంతర్భాగమే. సంఘంలోని ఇతర మనుషులతో కలిసి జీవిస్తాడు. ఎన్నో వైరుధ్యాలు కల వారుంటారు. భావద్వేషాలు ఉన్నవారుంటారు. అనేక సమస్యలుంటాయి. కుటుంబ జీవనం, స్నేహితులు, చుట్టాలు, ఇరుగుపొరుగువారు, ఊరివారు, సంపన్నులు పేదవారు, కష్టాలు, సుఖాలు, దౌర్జన్యాలు, డోపిడీలు, ఇదంతా మానవలోకంలో అంతర్భాగం జీవించటం కోసం కష్టాలు, సుఖాలు వెొయాలి. పండుగలు పబ్బాలు, పెండ్లి పేరంటాలు, బంధువులు, వారితో బాంధవ్యాలు అన్నింటినీ భరించాలి. కన్నింటిని కన్నులలో దాచుకొని కష్టాలను గుండెల్లో పదిలపర్చుకొని జీవించాలి. మనిషంటే కాలం అంచుమీద నడయాడే వాడు.

"రచయిత" అంటే రాయగల శక్తి ఉన్నవాడు. ఇది అందరికీ సాధ్యం కాదు. స్పందించేగుణం ఉండాలి, తపన ఉండాలి, జాలి, దయ, కరుణాత్మక హృదయం ఉండాలి, సృజనాత్మకత ఉండాలి. అటువంటి వాళ్ళే రచయితలు, సమాజాన్ని చదువగలుగుతారు. జరిగే విషయాలను రాయగలుగుతారు. మంచీ, చెడులను సమీక్షించి మానవత్వాన్ని రక్షిస్తారు. అందుకే రచయితలు అందరిలో ఒకరైనా, వారు ఉన్నతులు. వారి ఆలోచనలు మార్గనిర్దేశాలు. నవీన్ ఆలోచనలు ఉత్తమమైనవి. అతని రచనలు ఉన్నతమైనవి. భూపోరాటాలు, నిజాం పాలనలో "రజాకర్ల" చేష్టలపై ప్రజల తిరుగుబాటు, ఉద్యమాలు, విజయాలు అన్నింటినీ చిత్రించిన రచయితల్లో నవీన్ ఒకరు.

తెలంగాణ రాజుకున్న కుంపటి. ఈ మంట ఆరిపోదు. ఇది రగులుతూనే ఉంటుంది. ఇవి రజాకర్లను ఎదిరించిన ఉక్కు గుండెలు. అనభేరి ప్రభాకరుని రక్తం రాజుకుంటూనే ఉంటుంది. విసుమూరి దేశముఖ్‌ను ఎదిరించిన చాకలి ఐలమ్మ గుండె చప్పుళ్ళు ఇక్కడ వినిపిస్తూనే ఉంటాయి. రైతాంగ పోరాటాలు, సింగరేణి కార్మికుల హక్కుల పోరాటాలు, దొరలు, పటేండ్ల దౌర్జన్యాలను ఎదిరించిన నక్సలైట్ ఉద్యమాలు, ఇవన్నీ రచయిత

నవీన్‌లో బడబాణలమై అది ఒక "లావా"యై విజృంభించింది. అందుకే అతడు ప్రవహిస్తున్న జలపాతం. గర్జిస్తున్న మేఘం. అంతా తనలో దాచుకొని భూమిలా సహనం వహిస్తున్నవాడు. ప్రజలను కదిలించాలి, పరాధీనత నుంచి ఈ దారిద్ర్యాల నుంచి, కన్నీటి నుంచి ప్రజలను రక్షించాలనే ప్రయత్నం నవీన్‌ది. అతని రచనల్లో వాస్తవికత, సామాజికత, ఉట్టిపడుతుంది. శిల్పనైపుణ్యం, సంభాషణా చాతుర్యం, మానవత్వం నిండి ఉంటాయి.

ఈ సమాజమనే వృక్షంలో అన్యాయమే రాజ్యమేలుతుంది. మంచితనానికి చోటులేదు. ఈనాడు సామాన్యుడు బతుకలేకపోతున్నాడు. ఉద్యమాలకు రూపునిచ్చేవారు రచయితలు, కవులు, కళాకారులు. అందులో రచయితగా నవీన్ సమాజాన్ని చైతన్యపరుస్తున్నాడు.

నవీన్ రచనలో మట్టి వాసనలు వస్తాయి. ఈ మట్టిలో పుట్టినవాడు ఈ మట్టి కష్టాన్ని చూసినవాడు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చెక్కుచెదరని రాగడి మట్టి బలాన్ని తనలో నింపుకున్నవాడు.

కాలరేఖలు నవలలో నిజాంల రాజ్యపాలనలో ప్రజలు ఎదుర్కొన్న బాధలు, నిప్పులు వెదజల్లిన రజాకర్ల దౌర్జన్యాలు చెప్పతరం కానివి. దేశముఖులు, పటేండ్లు, పట్వారీలు, దొరల గడీలు, ఆ గడీలలో మానాన్ని కోల్పోయిన ఎందరో స్త్రీల కన్నీరు, రైతాంగ పోరాటాలు, రజాకర్ల వ్యతిరేక గెరిల్లా పోరాటాలు, ప్రపంచ చరిత్రలోనే ఒక గొప్ప ఉద్యమం.

నిజాంల, వారి తాబేదార్లు, దొరలు, పటేండ్లు, దేశ్‌ముఖ్‌లు, రజాకర్ల సేన, ఖాసీం రజ్వి వీళ్ళ దురాగతాలకు అంతులేదు. సంగపోల్లు వీళ్ళపని పట్టడానికి గెరిల్లా యుద్ధం చేశారు.

సాయిగాని భార్య మొదటి రాత్రి.... లతీఫ్ గాని వంతమయింది. ఇదెక్కడన్నా న్యాయం అవుతుందా?

సంగపోల్లు లతీఫ్‌ను ఊరి చివరికి తీసుకువచ్చారు.

బండెనుక బండి బట్టి
పదహారు బండ్లు కట్టి
యే బండ్లే వస్తువు కొడుకో
నైజాము సర్కరోడా
నైజాము సర్కరోడా... నాజీలు మించినోడా

అని పాడుకుంటూ ప్రజలమధ్యలో పాటలు పాడి, వారికి అన్ని ముచ్చట్లు చెప్పి, వారి అనుమతితో లతీఫ్ సాబ్‌ను చంపేశారు. మహాభారత, రామాయణ కాలం నుంచి, ద్రౌపది నుంచి సీత వరకూ అవమానాలు మోసిన వారే. రాజకుటుంబాలలో పుట్టినవారికి బాధలు తప్పలేదు. ఇది ఆడపుట్టుక, ఒక సామాజిక బాధ్యతతో రచయిత సాయిగాడు మొదటి రాత్రిని కోల్పోయిన తీరువాడి భార్య షేర్‌దార్ లతీఫ్ చేతిలో చెరబడటం అనే అంశాన్ని చూపెట్టి, ఇది దౌర్జన్య పూరితమని సామాజిక బాధ్యతగా ప్రజాపక్షం నిలిచాడు.

"అంపశయ్య" నవలలో రత్తి పాత్ర కన్నీరును తెప్పిస్తుంది. పిరికివాడైన రవిని ప్రేమించిన రత్తి చివరకు ఆమె బతుకును శిథిలం చేసుకోవడం నైతికంగా పతనమైన స్త్రీని మానవమృగాలు ఏవిధంగా, దారుణంగా, అవమానకరంగా వాడుకుంటారో రత్తి పాత్ర ద్వారా మనకు తెలుస్తుంది.

రత్తి నిరుపేద దళిత మహిళ. రవిని ఆమె అందం ఆకర్షిస్తుంది. ఆమెపట్ల వ్యామోహితుడవుతాడు. సహజంగా పిరికివాడైన రవి, రత్తికి దగ్గర కాలేకపోతాడు. పెండ్లి చేసుకుందామని చేసుకోలేకపోతాడు. అయినా, ఆమెపట్ల అతని ప్రేమ సహజమైంది. రత్తి దురదృష్టవంతురాలు. కొన్నాళ్ళకు ఆమెను ఒక దుష్ట భూస్వామి చెరబడతాడు. చివరికి రత్తి ఉన్మాదిగా మారుతుంది. దీనికంతటికీ రవియే కారణమనే భావం ప్రస్ఫుటమౌతుంది. పిరికివాడు ఫలాలను అందుకోలేడు, ఏది సాధించలేడు, అనే పెద్దల మాటలు అక్షర సత్యాలని తెలుస్తుంది.

ఒకానొక సమయంలో రత్తి రవిని రమ్మంటుంది. బావా! అందరికీ "ఆటాన" నీకు చారానేరా! నువ్వు కూడా

డబ్బులిస్తావా? అని ప్రశ్నిస్తుంది. ఈ మాటలు మనస్సును కదిలిస్తాయి. లోకంలో మానవత్వ లేదనీ, మంచితనం మటుమాయమైపోయిందనీ ఈ కథనం ద్వారా రచయిత చూపించాడు. హృదయం చలిస్తుంది. ఆత్మక్షోభకు గురౌతుంది. రత్తీ! నువ్వు మానవత్వం లేని లోకంలో అందమైన బమ్మగా ఎందుకు పుట్టావనిపిస్తుంది.

ఇది అంత:స్రవంతి నవల. మనిషి చేతన, అచేతనలో కలిగే భావాలను, చేష్టలను, రచయిత ఆలోచనలో చూపించి నిరూపించడం శాస్త్రీయ కోణంగా చెప్పవచ్చు. ఇందుకు రచయిత ఒక సంఘటనను చూపించాడు. "ఒక ఆందోళనలో దుండగలు ఒక బట్టల కొట్టును ధ్వంసం చేస్తే సమాజంలో మంచివారుగా మెలిగేవాళ్ళు కూడా లోపలికి వెళ్ళి బట్టలను దొంగలిస్తారని ఇది మనిషి లోని వివిధ రకాల మానసిక భావాలను చూపించాడు రచయిత. "రత్తి పాత్ర కరుణ రసాత్మకమైంది. ఆమె ప్రేమించిన వాడిని కోల్పోయింది. ఆమె అందమైన దేహాన్ని అందరూ వాడుకున్నారు. ఆమె చెడిపోయింది. జీవితంలో ప్రేమను సాంధిచలేదనే కోపం కావచ్చు. చివరికి తోడునీడ ఆత్మీయతను పంచుకుందామని హరి జన యువకుడికి దగ్గర కావడం తప్పు అయింది. మానవత్వం లేని లోకం ఇది. రత్తి వెళ్ళిపోయింది. ఆమె భౌతికంగా దూరమైంది. ఆమె ఆత్మ దు:ఖంతో సంచరిస్తూనే ఉంటుంది.

రత్తి పాత్రను రచయిత ఎంతో నేర్పుగా చిత్రించాడు. ఈ కుళ్ళిపోయిన సమాజంలో మంచితనానికి స్థానం లేదని తెలుస్తుంది. సమాజంలో చెడు స్వైరవిహారం చేస్తుంది. మంచిని నిలపాలనే ప్రయత్నంలో ఉన్నవారికి కష్టాలు తప్పువు, నిజాయితీని నమ్ముకున్నవారికి గోచిగుడ్డ మిగలడంలేదు. కపటత్వం, మూర్ఖత్వమే రాజ్య మేలుతుంది. ప్రేమకు అర్థం లేదు. అసలు మానవత్వమే మటుమాయమైపోతుంది. ఈ లోకాన్ని ఎలా రక్షించాలనే ప్రయత్నంలో నవీన్ సమాజంలోని అతి సూక్ష్మమైన అంశాలను పరిశీలించి కథనాన్ని అల్లి దగాపడ్డ వారి పక్షం నిలవడం, మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు పాత్రలా కనిపిస్తుంది.

"చీకటి రోజులు" నవల తెలంగాణ ప్రాంతంలో రాజ్య హింస కొనసాగుతుందో చూపిస్తుంది. అన్యాయాన్ని ప్రశ్నించవద్దు. ఇది అన్యాయమని చూపెట్టవద్దు. దగాపడ్డ వాడెవ్వడూ, మాట్లాడకూడదు. వాడి పక్షాన ఎవరూ మాట్లాడకూడదు. కలానికి బంధనాలు, ఇది అన్యామంటే సంకెళ్ళు, ఇది హింసాపూరిత పాలకుల చర్యలు.

తెలంగాణ తరతరాల నుంచీ దోపిడీ దౌర్జన్యాలకు గురౌతున్న నేల. దొరల అంతులేని దౌర్జన్యాలను, పటేండ్ల పక్షపాతాన్ని ఎదిరస్తే చిత్రహింసలు. ఈ నేపథ్యంలోనే "నక్సలైట్" ఉద్యమాల పుట్టుకొచ్చాయి. భూపోరాటాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు, దళాలు తిరుగుబాట్లు, ఎన్‌కౌంటర్లులతో రక్తం చిందించిన నేల ఇది.

"చీకటి రోజులు" నవల ఎమర్జెన్సీ కాలాన్ని గుర్తు చేస్తుంది. ఇది డైరీలా రాసిన నవల. ఇందులో శ్రీనివాస రావు అసలు పాత్ర యం.వి. తిరుపతయ్య. ఆదర్శభావాలు కలవాడు. సమాజం పట్ల, రాజ్యహింస పట్ల అవగాహన కలవాడు. అందరిలాగానే అనేక భాదలు భరించాడు ప్రైవేట్ కళాశాల యాజమాన్యం, ప్రభుత్వం గ్రాంటును తీసుకొని లెక్చరర్లకు జీతాలు ఇచ్చేవారు కాదు. తిరుపతయ్య ప్రశ్నించినందుకు కొందరు కక్షగట్టారు. అదును కొరకు వారు వేచి చూస్తున్నారు.

ఇదే సమయంలో తిరుపతయ్య రాసిన "న్యాయం కథ" విద్యుల్లత పత్రికలో ప్రచురితమైంది. దాన్ని నాటికగా మలిచి ప్రదర్శించారు.

గ్రామీణ ప్రాంతాలలో దొరలు పేదవారి భూములు ఆక్రమిస్తారు. పేదవారికి ఎంతో కొంత అప్పు ఇచ్చి దాన్ని చక్రవడ్డీగా మార్చి చివరకు వారనుకున్నది సాధిస్తారు. సాంబయ్య దొర మైసయ్యకున్న కాస్త భూమిపై కన్నేసి ఆక్రమించుకుంటాడు. మైసయ్య కొడుకులు తిరగబడి "నక్సలైట్లు"గా మారుతారు. ఈ కథలో తిరుపతయ్య

తెలంగాణలో సామాజిక పరిస్థితులను కన్నులకు కట్టినట్లుగా చిత్రించారు. ఇలాంటి హింసాయిత వాతావరణంలో సామాన్య ప్రజలు భరించలేక సంఘంలో చేరి "నక్సలైట్లు" గా మారడంతో దొరల దోపిడీ, దౌర్జన్యాలపై యుద్ధం మొదలైంది. ఈ కథ ద్వారా తిరుపతయ్య హింసను ప్రోత్సహిస్తున్నాడని అతన్ని అరెస్టు చేసి రామడుగు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. సహజంగా పిరికివాడైన తిరుపతయ్య ఎంతో భాదపడ్డాడు.

ఈ నవలలో నర్సింహులు పాత్ర క్రూరమైనది. అతడు ఎన్నో హింసాయుత చర్యలకు పాల్పడ్డాడు. జైల్లో తిరుపతయ్యతో ముచ్చటిస్తాడు. నర్సింహులు పశ్చాత్తాపడ్డాడు. తిరుపతయ్యను ఓదార్చుతాడు. ఈ సమాజం నిరంకుశమైనదనే భావన నర్సింహులులో కలుగుతుంది. చీకటి రోజులు నవల చారిత్రాత్మకమైంది. 1975లోని ఎమర్జెన్సీనీ గుర్తుకు తెస్తుంది. నక్సలైట్లు పేరుతో ఎందరినో పోలీసులు చంపేశారు. గ్రామీణ ప్రాంతంలో భయోత్పాతం సృష్టించి ప్రజల బ్రతుకులను అల్లకల్లోలం చేశారు. బాంధవ్యాలు తెలంగాణ ప్రాంతంలోని మధ్య తరగతి కుటుంబాలోని ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఈ నవల ప్రతిబింబిస్తుంది. మధ్యతరగతి వాడు, ఎదగలేడు, కానీ మౌనంగా బతుకుతాడు. ఉన్నదాంట్లోనే కుటుంబాన్ని ఈదాలనే ప్రయత్నంలో ఉంటాడు. నాగరిక సమాజంలో వస్తున్న పెనుమార్పుల గమనాన్ని అస్వాదించలేక, ఈ మార్పులు ఈ అవలక్షణాల పట్ల భాధతో మధ్యతరగతి వాడు మధన పడిపోతున్నాడు.

వెంకట్రామయ్యారుక్మిణమ్మల కుటుంబంలో వచ్చిన మార్పుల ప్రభావం ఆ పెద్దకొడుకైన నరేందర్ ఇంటిపై పడిన తీరు బంధుమిత్రులతో అనుభవాల తరువాత ఆయన నేర్చుకున్న జీవిత పాఠం. నరేందర్ తనవాళ్ళ ఓత్తిడి వల్ల అవసరాల వల్ల చెల్లిలి కూతురికి తన కొడుక్కి పెళ్ళి చేస్తానని వారి చిన్నతనంలోనే మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకోలేకపోవడం, జీవితంలో తను స్థిరపడటానికి కారణమైన రామనాథం ప్రమాదంలో మరణించిన తరువాత అతను పడే వ్యథ అంతులేనిది. జీవితం అనుకున్నట్లుగా జరగదు. మనం ఆశించినవి అన్నీ పొందలేం. మనిషి ఆశ, నిరాశల మధ్యనే జీవిస్తాడు. ఈ నవలలో రచయిత జీవితమంటే ఎన్నో ఇక్కట్లను దాచుకుంటూ వెళ్ళాలి అంటాడు.

మధ్య తరగతి వాడి బతుకు ఇంకా అయోమయం లాంటిది. వాడందుకోడు, అందుకోవలసినవి దరిచేరవు. అనేక జీవిత సత్యాలను రచయిత ఈ నవలలో చిత్రించాడు. సమాజంలో మార్పు అనివార్యం కావచ్చు. ఒక తరం నుంచి మరొక తరానికి వెళ్ళేవరకు ఎంతో మార్పు కన్పిస్తుంది. మూడు తరాలలో వచ్చిన మార్పుల్లో కొంత బాధ కూడా మిగులుతుంది. ఈ నాడు బంధుత్వాలు, అనుబంధాలు, మానవ సంబంధాలు బీటలు వారుతున్నాయి.

ఈ విధంగా ఈ నవలలో రచయిత తాను పుట్టిన నేల మట్టి వాసనలు సంస్కృతి సాంప్రదాయాలు, పండుగల విశిష్టతను చెప్పడం విశేషంగా కన్పిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. నవీన్ నవలలు
2. విశ్వం, అపిరాల-తెలుగు నవల నూరు సంవత్సరాలు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1973.
3. వెలమల సిమ్మన్న- తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు
4. వెంకట సుబ్బయ్య వల్లంపాటి -నవలా శిల్పం
5. వెంకట సుబ్బయ్య కడియాల- నవలా శిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1989.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

శ్రీలత నవలా సాహిత్యం – సామాజిక జీవన చిత్రణ

– డా॥. ఖి. సుభ్భరత్నం, తెలుగు అధ్యాపకురాలు, కె.వై. ప్రభుత్వ జూనియర్ కళాశాల, మద్దిపాడు, ప్రకాశం జిల్లా.

శ్రీమతి ఎం. శ్రీలత వ్యాపార రంగంలో రాణిస్తున్నప్పటికి సాహిత్యంపై ఆసక్తి గురించి ఆమె మాటల్లోనే 'అందరూ ఊపిరి ఆగిపోతే మరణిస్తారు. నేను రచనలు ఆగిపోతే మరణిస్తాను' అని తన సాహిత్యాభిరుచిని ప్రాణ పదంగా వ్యక్తీకరించారు. అటువంటి ఈమె గుంటూరు జిల్లా గూడవల్లి గ్రామస్థులయిన కోటపాటి మురహరిరావు, సరోజినిదేవి దంపతులకు 1962 సం॥ ఫిబ్రవరి 17న జన్మించారు. విద్యాభ్యాసం స్వగ్రామం గూడవల్లిలోను, మహబూబ్ నగర్‌లోను చదివారు.

శ్రీలత సామాజిక సమస్యలను రచనా వస్తువులుగా స్వీకరించడంతోపాటు వాటికి పరిష్కారమార్గాలు అన్వేషించి ఉత్తమ పరిష్కారాలను చూచించారు. ఈమె 'వెన్నెల స్పర్శ', 'సస్యశ్యామలం', 'దొరసాని', 'మనసా...ప్రేమించకే నువ్విలా!', 'మూడు తరాలు', 'స్పర్ధ' నవలల్లో సామాజిక జీవన విధానాన్ని ప్రతిబింబింపజేశారు. అయితే ఇక్కడ వ్యాసం నిడివి ఎక్కువవుతుందనే ఉద్దేశ్యంతో 'వెన్నెల స్పర్శ' నవలలోని అంశాలను విశ్లేషించడం జరిగింది.

యువత ఉజ్వల భవిష్యత్తే దేశభవిష్యత్తు. కాబట్టి యువతలో కలిగే అనేక సందిగ్ధాలు, సమస్యలకు స్నేహ భావంతో కుటుంబ సభ్యులు, పెద్దలు సరైన దిశానిర్దేశం చెయ్యాలి. వారి భావాలను, మానసిక స్థితిని అర్థం చేసుకుంటూ, వారి స్నేహాన్ని గౌరవిస్తూ ఎక్కడ, ఏ విధంగా ప్రవర్తించాలనే వివేకాన్ని మేల్కొల్పాలి. కుటుంబ సభ్యుల ప్రేమ, మంచి స్నేహితుల స్నేహం అండగా ఉంటే యువత ఎంతటి అసాధ్యాన్నయినా సుసాధ్యం చెయ్యగలదు. అంతటి స్నేహం లభించనివారు ఎవరయినా ఉంటే వారి జీవితంలో ఎన్ని ఉన్నా నిరుపేదలే. ఎందరున్నా ఒంటరి వారేనని స్నేహ మాధుర్యం చెప్పడంతో పాటు ఈ నవలంతా సామాజిక జీవనంలో యువత పాత్ర గురించి సుస్పష్టం చేశారు.

'సెంటర్ ఏజ్ అయిన ఇంటర్ ఏజ్'ను అర్థవంతంగా ఆవిష్కరించడంతోపాటు శ్రీలత మానవ సంబంధాల విలువ, శరీరం కంటే ఆత్మ గొప్పదని, ప్రేమకంటే స్నేహం విశాలమయిందని తెలిపారు. దీనిలో పింకీ, రవితేజల జీవితాల చుట్టు అల్లబడిన కథే అయినా దీనిలో యోగా, మెడిటేషన్ ద్వారా పరిపక్వత సాధించిన అమ్మాయి పింకీ, రవితేజ జీవితాన్ని, అదే విధంగా మిగిలిన తన స్నేహితుల జీవితాలలో ఆనందం నింపడం ఎలాంటిదంటే అచ్చంగా జాబిల్లి 'వెన్నెల స్పర్శ' ద్వారా అందరికి ఆనందానుభూతి నివ్వడంలాంటిదే'. చక్కని నామౌచిత్యంగల ఈ నవలలో సామాజిక చైతన్యాంశాలను చిత్రీకరించారు.

రవితేజ బాల్యంలో అమ్మ ప్రేమను పూర్తిగా అనుభవించిన అబ్బాయి. తర్వాత తెలియనితనంతో అమ్మ చావుకు కారణమై, అమ్మను కోల్పోయి, తండ్రి నిరాదరణకు గురై ఎప్పుడూ అమ్మ జ్ఞాపకాలతో ఏకాంతంగా గడుపుతుంటాడు. ఆ విషయం గమనించిన పింకీ తన స్నేహంతోపాటు యోగా, మెడిటేషన్ ద్వారా ఒకే ఇంట్లో బద్ధ శత్రువుల్లా జీవిస్తున్న తండ్రీకొడుకుల మధ్య ప్రేమబంధం బలపడేలా చేసింది. ఎలాగంటే డాడీకి నాతో మాట్లాడ్డం ఇష్టముండదు అన్న రవితేజతో పింకీ 'ఆయన మాట్లాడకపోతే నువ్వే మాట్లాడు' అని చెప్పి తండ్రి పెద్దరికాన్ని కొడుకు బాధ్యతను గుర్తు చేసింది. ఇంకా చెప్పాలంటే 'ఇష్టమున్నవారినే తిట్టాలనిపిస్తుంది' అని స్పష్టం చెయ్యడంతో వెంటనే రవితేజకు తండ్రి గుర్తుకొచ్చాడు. డాడీ తనపై ప్రేమ కారణంగానే తిడుతున్నాడు. తన పై ఇష్టంవల్లె తనని హాస్టల్లో చేర్పించకుండా తన దగ్గరే ఉంచుకున్నాడు. తనకోసమే అమ్మ 'చనిపోయినా మళ్ళి పెళ్ళి చేసుకోకుండా తనని చూసుకుంటున్నాడు. అనే ఆలోచన కలిగింది. దాంతో తర్వాత రవి,

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

డాడీ కొట్టినా, తిట్టినా సహనంగా ప్రేమగా ఉన్నాడు. దాంతో తండ్రిలోనూ మార్పు వచ్చి, ఆయన మనస్సులో ప్రేమ బయటపడింది. ఈ విధంగా కుటుంబ జీవితం చక్కదిద్దటంలో రచయిత్రి ముఖ్య ఉద్దేశ్యమేమంటే కుటుంబ బంధాల్లో ప్రేమానురాగాలు కొరవడితే యువత మొండిగానో లేక సామాజిక అసాంఘిక శక్తులుగానో తయారయ్యే అవకాశం ఉంది. అలా జరగకుండా ఉండాలంటే యువతకు సరైన దిశానిర్దేశం ఉండాలి. కుటుంబ జీవనం బాగుంటే సామాజిక, జీవనం బాగుండే అవకాశం ఉంటుంది. అందుకే ఇల్లు చక్కదిద్దడం ముఖ్యమని భావించారు రచయిత్రి.

పింకీ స్నేహితులందర్ని రవితేజకి పరిచయం చేసి రోజువారి కార్యక్రమాల్లో పాల్గొనేలాగా చేసింది. దాంతో నేను ఒంటరివాడ్ని కాదనే భావన కలిగింది. రాఫుడ్ గురించి తెలిపి దానికి సంబంధించిన పుస్తకం బహు మతిగా ఇచ్చింది. ఆనందం, దుఃఖం గురించి చెప్తూ ఇష్టమైనదాని వల్ల ఆనందం లభిస్తుందనుకుంటే, అది దూరమవుతుందనుకోవడం దుఃఖం కాబట్టి వాటికి అతీతంగా అందరితో ఆనందంగా కలిసుంటే ఒకరు లేకపోయినా మరొకరుంటారు. కాబట్టి ఆనందం ఎప్పుడు ఉన్నట్టే అని చెప్పడంతోపాటు, అమ్మ చనిపోయిందని అనుకోవడం కన్నా అమ్మ ఎప్పుడూ మనతోనే ఉంటుం దనే భావనలో బ్రతికించుకోవచ్చు అని చెప్తుంది. దాంతో రవితేజ అమ్మ తనతోపాటు తనని చూస్తూ ఉంటుందన్న భావన చాలా సంతోషాన్ని ఇచ్చింది.

ఒకరోజు పింకీ, రవితేజతో నువ్వు లీడర్‌వా? ఫాలోయర్‌వా? అంది. అంటే అన్న రవితో 'లీడర్ అంటే మనస్ఫూర్తిగా నిర్ణయాలు తీసుకుని, ప్రతిఫలం ఆశించ కుండా పనిచేసి, ఆ ప్రతిఫలం తనకే కాకుండా, అందరికీ చెందాలనుకునేవాడు. ఆ చెందడంలో బాధ్యత వహించే వాడు. 'గాంధీ'లా ఫాలోయర్ అంటే సొంత నిర్ణయాలు లేకుండా ఇతరులపై ఆధారపడుతూ ఏదో డ్యూటీగా పనిచేసి, ఆ పని నుంచి ప్రతిఫలం ఆశించి దొరికిన ప్రతిఫలాన్ని ఎవరికీ అందనీయకుండా తానొక్కడే అనుభవించేవాడు. అంటే లోభి అని చెప్పడంతో నేను 'లీడర్' అన్న రవితో ఎప్పటికి అలాగే ఉంటే సంతోషంగా ఉండవచ్చునంటుంది.

సామాజిక స్పృహ :

విద్యార్థులకు అత్యంత ఇష్టమైన రోజు ఆదివారం. పింకీ దగ్గరకు వెళ్ళిన రవితేజతో మాతో వచ్చెటట్టయితే చీపురు, బకెట్ పట్టుకురా అంటు స్నేహితులతో బయలు దేరింది. ఎందుకు? ఎక్కడికి? అని రవి అడిగినా సమా ధానం చెప్పకుండానే మార్కెట్‌కి వెళ్ళడం, వాళ్ళతో రవి వెళ్ళడం జరుగుతుంది. అక్కడ చెత్తంతా ఊడ్చి బకెట్‌తో కుప్పపోశారు. అలవాటులేక చేతులు బొబ్బలెక్కిన రవితేజ దార్లో 'మనమెందుకు ఊడ్వాలి మునిసిపాలిటీ వాళ్ళున్నారుగా? అనడంతో పింకీ చెత్త మునిసిపాలిటి వాళ్ళు వేస్తున్నారా? అని ప్రశ్నించింది. 'కాదు, పబ్లిక్ వేస్తున్నారు' అని చెప్పాడు. పబ్లిక్ అంటే మనమేగా! మనం వేయడం మానేస్తే చెత్తంటూ వుండదుగా, మనమేసిన చెత్త ఊడ్చేందుకు మునిసిపాల్టీ వాళ్ళు ఎంత కష్టపడు తున్నారో అనుభవంలోకి వస్తే మనం అలా చెత్త వేయ కుండా ఉంటామని చెప్పింది.

ఆ విధంగా రచయిత్రి పింకీ పాత్రద్వారా స్వచ్ఛ భారత్‌రాని రోజుల్లోనే విద్యార్థులంతా కలసి వారంవారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సమాజం పట్ల బాధ్యతగా జీవించడం గమనించవచ్చు. ప్రజా జీవనం ఆరోగ్యంగా, ఆనందంగా కొనసాగాలంటే ఇలా ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని స్పష్టం చేయడం జరిగింది. పరిసరాల పరిశుభ్రత పాటించకుంటే దోమలు, వైరస్‌లు, రోగాలు ఏ విధంగా దాడిచేస్తున్నాయో మనందరికి స్పష్టం. ఈ విషయంలో ముఖ్యంగా యువత బాధ్యత వహిస్తే విజయంవంతమవుతుంది. కారణమేమంటే తమ ఇంటి నుండి వారి పిల్లలే చెత్త ఊడ్చడానికి రోడ్లపైకి వెళ్తున్నారంటే, ఏ ఇంటి నుండి చెత్త రోడ్డు మీదకు రాదు అనేది నిస్సందేహం. ఈ విధంగా పెద్దల ఆలోచనల్లో,

చేతల్లో మార్పు వస్తుంది. ఇలాంటి మార్పు తీసుకురాగల నవతరం యువత మానవత్వం పునరుద్ధరించగల సమాజాన్ని ప్రభావితం చేయగల యువశక్తిగా స్పష్ట పరిచారు. అయితే వారితో ఏమాత్రం మొండిగా వ్యవహరించినా వారు జగమొండిగా దర్శనమిస్తారు. కాబట్టి విద్యార్థుల్లో మంచి నాయకత్వ లక్షణాలు పెంపొందేలా, స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండేలా, వ్యక్తి ప్రయోజనం కంటే సామాజిక ప్రయోజనానికి ప్రాధాన్యతనిచ్చే యువత సమాజానికి తరగని సంపదవుతుందని భావించవచ్చు.

శ్రీలత 'వెన్నెల స్పర్శ' నవలను పద్దెనిమిది రోజులుగా విభజించడంలో ముఖ్య ఉద్దేశ్యం సిద్ధసమాధి యోగా 18 రోజుల కోర్సు, ఈ సిద్ధసమాధి యోగా ద్వారా భారతీయ ఆధ్యాత్మిక విలువలు మనిషిని, తద్వారా సమాజాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళగలవని, యోగా, మెడిటేషన్ ద్వారా గొప్ప ఆనందానుభూతిని పొందటమే గాక శారీరకారోగ్యం, మానసికారోగ్యంతో పాటు మానసిక పరిపక్వత సిద్ధిస్తుందని పింకీ, రవితేజ పాత్రల ద్వారా 'వెన్నెల స్పర్శ' నవల్లో స్పష్టం చేశారు. అయితే ఈ నవల 2000 సం॥లో రాశారు. యోగా, మెడిటేషన్ అనే వాటి గురించి జనానికి అంతగా తెలియని సమయంలో తెలియ పరచడం కోసం రాశారు.

పింకీ యోగా కోచ్‌గా న్యూయార్క్ వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నమ్మాయి. కాబట్టే పింకీ రవితేజకు తెలియకుండానే ఈ కోర్సును రవితేజపై అప్లై చేసింది. మొదట రవితేజ ఒంటరిగా శాపగ్రస్తుడిగా సాధారణ మానసిక స్థాయికంటే తక్కువ స్థాయిగలవాడు. అలాంటి రవితేజను అసాధారణ మానసిక పరిణతికి తీసుకురాగలిగింది. ఇంతటి ఆత్మ స్థైర్యంగల, అసాధారణ వ్యక్తిత్వం గల ప్రభావశీలి పింకీ జీవితం నల్లేరుబాట కాదు. పల్లేరు వనం అనే చెప్పాలి. ఎందుకంటే 7 సం॥ వయసులో పింకీ చావు అంచులను చూసి వచ్చింది. ఎలాగంటే పింకీ డ్రైవింగ్ చేస్తానని మారాం చేసి తండ్రి చేతిలోని కారుస్టీరింగు తీసుకొంది. ఆ సమయంలో యాక్సిడెంటై తల్లిదండ్రులను, ఇద్దరు కవలలైన సోదరులను తన చేతులారా పోగొట్టుకుంది. అలా అంతులేని విషాదంలో మునిగి దాదాపు పిచ్చిదైంది. అటువంటి స్థితిలో పింకీని ఋషి యోగానంద్ మొదలగు వారు యోగా, ధ్యానం నేర్పించి ఆ మానసిక స్థితినుండి బయటపడేలా చేశారు. అయితే ఆ యాక్సిడెంట్ సమయంలో పింకీ పొత్తు కడుపులో బ్రేక్ రాడ్ దిగింది. వెజైనల్ కెనాల్‌ను డ్యామేజ్ చేసింది. దాంతో పింకీకి పెళ్ళి, పిల్లలు అనేవి జీవితంలో కుదరవని డాక్టర్లు చెప్పారు. ఇదంతా పింకీకి తెలిసినా తన జీవితంలోని విషాదాన్ని ఎవరికి పంచలేదు. కారణం పది మంది సంతోషం కోరుకునేవారు, సంతోషాన్ని అందరికి పంచుతారు. దుఃఖాన్ని తామొక్కరే అనుభవిస్తారు. ఈ విధంగా తన జీవితంలో ఎన్ని విషాదాలున్నప్పటికి సమాజానికి ఎంతో చేసిన పింకీ పాత్ర ద్వారా రచయిత్రి సమాజ జీవనంలో యువత పాత్రను సుస్పష్టం చేశారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. వెన్నెల స్పర్శ - శ్రీలత
2. తెలుగు నవల నూరు సంవత్సరాలు-తెలుగు నవల సమకాలీనత - ఆర్.ఎస్. సుదర్శనం
3. సాహిత్య ప్రయోజనం - కొడవటిగంటి కుటుంబరావు
4. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అభ్యుదయ కవిత్వం – సామాజిక జీవన చిత్రణ

– డా॥. కె. జ్యోతిలక్ష్మి, తెలుగు లెక్చరర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ.ప్ర.), శ్రీకాకుళం,

"హితేన సహితం సాహిత్యమ్"

"విశ్వ శ్రేయ: కావ్యమ్"

- ఈ వాక్యాలను బట్టి సార్వజనీనము, సార్వకాలికమై కవి యొక్క ఆత్మీయతను స్పురింప చేస్తూ విశ్వానికి మేలు చేసేది సాహిత్యం. అని తెలుస్తుంది. అది ప్రాచీన సాహిత్యమైనా లేదా ఆధునిక సాహిత్యమైనా విశ్వశ్రేయస్సు సామాజికసృహ దాని లక్షణం.

సామాజిక పరిసరాలలోని సాంస్కృతిక స్థాయిని అనుసరించే కవి వ్యక్తిగత ప్రతిభ వికసిస్తుంది. సార్వత్రిక సాంస్కృతిక స్థాయిని అనుసరించే వ్యక్తి ప్రతిభ పురివిప్పుకుంటుంది. తిరిగి సమాజానికి కూడా కవిత్వం నవజీవన లహరిని అందింస్తుంది.

"పున: పున: అనుసంధాన ఆత్మానుభవ భవసాక్షిక:..

.....

శరీరం వ్యాప్యతే తేనా శుష్కం కాష్ట వివాగ్నినా" -

అన్న కవి కులపతి 'కాళిదాను' నూక్తి ఎంతో అనుభవంతో చెప్పినది. కవిత్వం ఎప్పటి కప్పుడు కొత్త మలుపులు తిరుగుతూ ఉంటుంది. కొత్త బాటలు పయనిస్తుంది. కొత్తను వెతుక్కోకపోతే కవిత్వానికి జీవన శోభలేదు.

పాశ్చాత్యుల ప్రభావం వల్ల, భారత జాతీయతా భావం వల్ల సమాజంలో విస్తరించిన ఆంగ్ల విద్యావ్యాప్తి వల్ల సాహిత్యంలో ఆధునిక యుగం క్రీ॥శ॥ 1875 నుండి తెలుగు సాహిత్యములో అనేక ఆధునిక శాఖలు, రీతులు ప్రారంభమయ్యాయి.

తెలుగు సాహిత్యములో పరవస్తు చిన్నయసూరి క్రీ॥శ॥ (1809-1862), కొక్కొండ వెంకటరత్నము (క్రీ॥శ॥ 1842-1915), కందుకూరి వీరేశలింగం పంతులు (క్రీ॥శ॥ 1848-1919) ఈ ముగ్గురిని నవ్యయుగ ప్రవర్తక త్రయముగా వ్యవహరించారు. చిన్నయసూరి సంస్కృ తాంధ్ర, ప్రాకృత, ద్రావిడ భాషలలో, వ్యాకరణ, తర్క మీమాంసాలంకార శాస్త్రములలో మంచి పండితుడు. "ఈస్టిండియా కంపెనీ" వారి సుప్రీమ్ కోర్టులో న్యాయ శాస్త్రవేత్తగా పనిచేసారు. "నీతిచంద్రిక" (1853) అనే గద్యకావ్యాన్ని రచించి సలక్షణమైన భాషలో మంచి గ్రంథాలు వ్రాయవచ్చు అని నిరూపించారు. చిన్నయసూరి వ్రాసిన "బాలవ్యాకరణము" (1858) గ్రాంథిక భాషకు ప్రామాణికమైన వ్యాకరణ గ్రంథం, ఇది సూరి కీర్తిని స్థిరస్థాయి చేసిన రచన. ఆధునిక కవిత్వానికి పూర్వ కవిత్వానికి గల వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడానికి వీరి రచనలు తోడ్పడతాయి. కొక్కొండ వేంకటరత్నం పంతులు గారు గ్రాంథిక భాషాపీఠాన్ని అధిష్ఠించి ప్రాచీన సంప్రదాయాలు, నవయుగ వికాసానికి తొడ్పడేటట్లు భాషాసేవ చేసారు. "ఆంధ్రభాషాసంజీవని" అనే పత్రికను 20 సం॥లు నడిపి, వీరు తెలుగు పత్రికలలో వాఙ్మయ శాఖకు ఒక ప్రత్యేకస్థానాన్ని ఏర్పరచారు.

సంప్రదాయ రచనలకు భిన్నంగా కొత్త విలువలు కొత్త దృక్పథంలో వచ్చిన కవిత్వమే నవ్య లేదా "ఆధునిక సాహిత్యం". తెలుగు సాహిత్యంలో ఈ ఆధునికత వీరేశలింగం పంతులు తోనే ఆరంభమైందని చెప్పవచ్చును అంటే 1850 తర్వాత వచ్చిన కవిత్వం నవ్య కవిత్వం. పాశ్చాత్యదేశాలలో పారిశ్రామిక విప్లవం(1748), ఫ్రెంచి విప్లవం(1789), మొదటి ప్రపంచయుద్ధం (1914-18) ఇవన్నీ అక్కడ ఆలోచనా విధానాల్లో మార్పులను తెచ్చాయి. ముఖ్యంగా మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఆధునిక ప్రవేసించింది. భారతదేశంలో బ్రిటీషుపాలన ఆరంభమైంది. రైళ్ళు, టెలిఫోన్ల వంటి ఆధునిక

యంత్రాలు ప్రవేశించాయి. ఇంగ్లీషు విద్య ప్రారంభ మైంది. పాశ్చాత్య భాషాసాహిత్యం ప్రభావం పడింది. ఇవన్నీ భారతదేశంలో ఆధునికతకు పునాదులు వేశాయి. పాశ్చాత్యుల హేతువాదం, కాల్పానిక వాదం 19, 20 శతాబ్దాలలో భారతదేశంలో ప్రవేశించాయి. భారతీయుల జీవన విధానంలో, మత, సామాజిక, రాజకీయ విధాన, పరిపాలనా రంగాలలో ఆధునిక ధోరణులు వచ్చాయి. ఇవి సాహిత్యంలో నవ్యతను తెచ్చాయి. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమం ఆరంభమైంది అది కూడా సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. కందుకూరి, గురజాడ, గిడుగుల సంఘ భాషా సంస్కరణోద్యమాలు సాహిత్య ధోరణులలో నవ్యతను తెచ్చాయి. ఆత్మాశ్రయరీతి, వాస్తవికవాదం, కాల్పానిక వాదం, అభ్యుదయవాదం, హేతువాదం నవ్యకవితోద్యమం పేరుతో వ్యాప్తిలోకి వచ్చాయి.

1936 గుంటూరులో 'నవ్యసాహిత్య పరిషత్తు' స్థాపించ బడింది. 'ప్రతిభ' అనే ప్రతిక నవ్యసాహిత్యానికి వ్యావహారిక భాషోద్యమానికి వేదిక అయింది. తర్వాత నవ్యకవిత్వంలో కాల్పానికవాదం భావకవిత్వం పేరుతో తెలుగులో, అభ్యుదయవాదం తలెత్తేంతవరకు ప్రధానమై నిల బడింది. నిర్ధిష్టమైన సామాజిక దృక్పథం, నిబద్ధత, గల తాత్విక భూమిక లేని కాల్పానిక కవిత్వం దాని నిర్మాణ సంస్థాగతరూపమైన 'నవ్యసాహిత్యపరిషత్తు' క్రమంగా నిర్వీర్యమై, నిస్తేజంలో పడిపోయాయి.

అభ్యుదయ సాహిత్య నేపథ్యం :

1917 నాటి రష్యన్ "అక్టోబర్ సోషలిస్టు విప్లవం" నెల కొల్పిన "శ్రామికవర్గ సమసమాజ నిర్మాణం" ప్రపంచ వ్యాప్తంగా కవులను, కళాకారులనూ ప్రభావితం చేసింది. 1919లో ముగిసిన మొదటి ప్రపంచయుద్ధ ఫలితాలు, తీవ్ర ఆర్థిక సంక్షోభాలనూ, సాంస్కృతిక సంక్షోభాల ప్రమాదాలను మానవాళికి సూచించాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రకంపనలు స్పష్టించిన 1930 దశకం 'ఆకలి దశాబ్ధం' గా గుర్తింపు పొందింది. 1934 నాటికి జర్మనీలో హిట్లర్ నియంతృత్వం జాతీయ దురహంకారపు నీలినీడల్ని ప్రసరింపసాగింది. సంస్కృతి పరిరక్షణ కోసం 1935 ప్రథమార్ధంలో పారిస్‌లో 'అంతర్జాతీయ రచయితల సదస్సు' జరిగింది. 1935 డిసెంబర్‌లో అలహాబాద్‌లో "ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోషియేషన్" ఏర్పడింది. 1936 ఫిబ్రవరిలో లండన్ నుండి వెలువడే "ది డెయిలీ ట్రిబ్యూన్" లో భారతీయ అభ్యుదయ రచయితల ప్రణాళిక ప్రకటించబడింది. 1936 ఏప్రిల్ 9, 10 తేదీలలో లక్నోలో 'మున్షి ప్రేమ్‌చంద్' అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభలు జరిగాయి. 1936 నాటి స్పెయిన్ అంతర్యుద్ధంలో వివిధ దేశాల కవులు, కళాకారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. 1936 సెప్టెంబరులో ఫైజపూర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభల సందర్భంగా "రచయితల ఇష్టాగోష్టి" సమావేశం సరోజినీనాయుడు అధ్యక్షతన జరిగింది. జాతీయోద్యమంలో క్రమంగా అతివాదభావాలుగల యువకుల క్రియాశీల ప్రమేయం పెరగసాగింది. ఇన్ని పరిణామాల నేపథ్యంలో "అభ్యుదయ రచయితల సంఘం" 1936లో ఏర్పడింది. ఈ సంస్థ సభ్యులైన కవులు, స్పష్టించిన కవిత్వం 'అభ్యుదయ కవిత్వం' గా ప్రచారమైంది. (తెలుగులో కవిత్వోద్యమాలు : 108).

"అభ్యుదయం" అనే మాటకు "శుభం", "మంగళం" అని నైఘంటి కార్థాలు ఉన్నాయి. ఈ మాటకు పురోగమ నము, ప్రగతి అనే కొత్త అర్థాలు కూడా ఉన్నాయి. ప్రోగ్రెస్ అనే ఆంగ్ల పదానికి సమానార్థముగా అభ్యుదయం అనే పదం మనం వాడుతున్నాం.

భావకవిత్వము పై తిరుగుబాటుగా, సామాజిక చైతన్యమే ఉద్దేశముగా, మార్క్సువాదము ఆత్మస్థానీ యంగా, వస్తుప్రాధాన్యం, వాస్తవిక దృక్పథం, మానవతా వాదం, ప్రగతిశీలమైన మార్పు మొదలైన ప్రధాన లక్షణాలతో తెలుగులో "అభ్యుదయ సాహిత్యము" అవ తరించింది. భావకవిత్వానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ చైతన్యానికి, సరికొత్త కవితారీతికి, పునాది వేశారు. శ్రీశ్రీ

గారు 'ప్రగతి' అనే అర్థంలో అభ్యుదయం అదేపదాన్ని మొట్టమొదటి సారిగా ప్రయోగించి 'అభ్యుదయ' పదానికి కొత్త అర్థం చెప్పారు.

"నేడే
ఈనాడే
జనమంతా బలివితర్థి
నరజాతికి పరివర్తన
నవజీవన శుభ సమయం - అభ్యుదయం"

1935లో శ్రీశ్రీ రచించిన "మరో ప్రపంచం" గీతంతో అభ్యుదయ కవిత్వం ప్రారంభమైంది.

"కనబడలేదా మరో ప్రపంచపు
అగ్ని కిరీటపు ధగధగలు
ఎర్రబావుటా నిగనిగలు
హోమజ్వాలల భుగభుగలు"

ఈ కవితలో శ్రీశ్రీ సామ్యావాద సమాజం కోసం ప్రజలు విప్లవించాలని ఎలుగెత్తిచాటారు. తాను ఆవిష్కరించే నవ్యసమాజం ఏరకంగా ఉంటుందో శ్రీశ్రీకి ముందే తెలుసు, అందరి కంటే ముందుగానే శ్రీశ్రీ ఆ ధగ ధగలను, ఆనిగనిగలను, భుగభుగలను దర్శించ గలిగారు. కవికున్న పరికరాలు కేవలం మాటలే, వాటిని ప్రయోగించే హస్తవాసీ, వాటమూ, నేర్పూ పనితనము కవి అనేవాడికే తెలియాలి. అమెరికన్ కవియిత్రి 'ఎమిలీ డికెన్‌సన్' కవిత్వంలో పద ప్రాధాన్యం గురించి ఇలా అన్నారు -

"We must be careful as what we say
No bird resumes its eggs"

అంటూ పదాల పట్టు గురించి చెప్పారు. ఆమే మరో సందర్భంలో "A word dropped careless on a page may stimulate an eye when holded in perpetual seam the wrinkled author lie" - అంత ప్రభావమూ మాటలకుంది. కవిత్వంలో ఎంత గొప్ప భావన అయినా మాట మీద ఆధార పడవల్సిందే. అటువంటి మాటల మంత్రవేత్త శ్రీశ్రీ.

"అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామం
అనాఢుడికీ, ఆగర్భ శ్రీనాఢుడికే మధ్య" -

అన్నవర్గ చైతన్యాన్ని దాశరథి కవిత్వం వ్యక్తపరిచింది. వర్గ సంఘర్షణ తప్పదని మార్క్స్ చెప్పిన విషయమిది.

"అందరం కలిసి చేసిన
అందమైన వస్తు సముదాయమంతా
ఎవ్వడో ఒక్కడే వచ్చి ఎత్తుకు పోతూ ఉంటే
అన్యాయం! అన్యాయం! అని మేమంటే
అనుభవించాలి మీఖర్మం అంటాడు".

"వాడు" అన్న శీర్షికలో శ్రీశ్రీ రాసిన కవిత సమాజంలోని వర్గచైతన్యానికి ప్రతీక. సమాజంలోని ఆర్తిని ఆవేదనను తమ రచనల ద్వారా ఎత్తిచూపాలి. నిజమైన సాహిత్యం ఆకాలంలోని సగటు ప్రజల సాధకబాధల్ని వారి జీవనస్థితిగతుల్ని దృశ్యమానం చేయాలి. అభివృద్ధి క్రమంలో ఎవరు ఎక్కడ ఉన్నారో, అందుకు కారణాలు ఏమిటో కథలూ కవిత్వమూ చర్చించాలి. అటువంటి రచనలు కలకాలం నిలిచి ఉండటమే కాక తరువాత కాలంలోని ప్రజలకు పరిశోధకులకూ వారధిగా నిలుస్తాయి.

చరిత్ర నిర్మాతలు ప్రజలు. చరిత్ర అంటే చారిత్రక సంఘటనల ఉటంకింపు మాత్రమే కాదు. ఆఘటనల మధ్య ఉండే కార్యకారణాల సంబంధాల వివరణ, విశ్లేషణ అంటాడు ప్రసిద్ధ చరిత్రకారుడు ఈ.హెచ్.కార్. మానవజాతి చరిత్రలో వర్గ పోరాటాల చరిత్రేనంటూ విశ్లేషిస్తున్న దృక్పథాన్ని చారిత్రక భౌతికవాదం, అంటున్నాం. పీడించే వర్గమొకటి, పీడనకు గురయ్యే వర్గమొకటీ కొనసాగుతున్న శత్రువర్గ సమాజంలో సంఘర్షణ అనివార్యం. ఈ సంఘర్షణ పర్యవసానంగా సమాజం అనేక పరిణామాలకు లోనవుతూంటుంది.

"నరజాతి సమస్తం
పరపీడన పరాయణత్వం
రణరక్త ప్రవాహసిక్తం
దరిద్రులను కాల్చుకు తినడం"గా అభివర్ణించిన అభ్యుదయకవి శ్రీశ్రీ.

"రణరంగం కానిచోటు భూ
స్థలమంతా వెదికిన దొరకదు
గతమంతా తడిసెరక్తమున
కాకుండే - కన్నీళ్ళతో" - అని విశ్లేషించాడు.

"నైలునదీ నాగరికతలో - సామాన్యుని జీవనమెట్టిది,
తాజ్‌మహల్ నిర్మాణానికి - రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?

- అని ప్రశ్నించిన అభ్యుదయ కవిత్వం

ఒక వ్యక్తిని మరొక వ్యక్తి
ఒక జాతిని వేరొక జాతి
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా? ఇకపై సాగదు

- అంటూ ఖచ్చితంగా ప్రకటించింది. ఆధునిక కవిత్వం గతాన్ని భవిష్యత్తును దర్శింపజేసేది. వర్త మానంలో రాయబడేది, త్రికరణసుద్ధిగా చేసేది కాబట్టి త్రికాలాలలోనూ వర్తిస్తుంది.

పదార్థం నిరంతరం చలనంలో ఉంటుంది. కనుక నిత్యపరిణామశీలమై ఉంటుంది. ఈ మార్పుకు ఒక చారిత్రక క్రమం ఉంటుంది. మార్పుకు కారణమైనది భౌతిక శక్తులు కనుక దాన్ని 'గతితార్కిక భౌతికవాదం' అంటారు. నిరంతరం విరుద్ధ శక్తుల మధ్య ఘర్షణ కొనసాగుతూ, ఐక్యత ఉంటుందన్న ముర్క్యస్టు ఆలోచనా విధానాన్ని 'గతితార్కిక భౌతికవాదం' అంటున్నాం.

ఇతరేతర శక్తులులేస్తే
పడిపోయెను పేకమేడలై
పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను.

అని శ్రీశ్రీ దేశ చరిత్రలలో విశ్లేషించాడు. ఈ సంఘ ర్షణలే గుణాత్మక పరిణామాలకు దారి తీస్తాయని శ్రీశ్రీ విశ్వాసం. కమ్యునిష్టు మానిఫెస్టోలోని "The history of all hitherto existing society ishe history of class struggle" అన్న మౌళిక సూత్రాన్ని పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను - అన్న నిరంతర సత్య ప్రకటనగా శ్రీశ్రీ ఘోషించాడు. 'దేశభక్తి' గీతం రాసి జాతీయంగా గురజాడ అప్పారావుగారు ఎంతటి అభ్యున్నతిని ఆర్జిం చారో అంతటి ఔన్నత్యాన్ని 'దేశచరిత్రలు' గీతం రచించి శ్రీశ్రీ సముపార్జించుకున్నాడు. ఈ విధంగా అభ్యుదయ ధోరణిలో సాగిన శ్రీశ్రీ కవిత్వంలో మార్క్సిజం లోని పరస్పర సంఘర్షణ, విరోధవైరుధ్యాలు, గుణాత్మక పరి ణామాలు శ్రీశ్రీ రాసిన విడి విడి గేయాలలో ఒక్కొక్క సారి కనిపిస్తే, ఈ మూడు కలిసి ఒకేసారి, ఒకే గేయంగా కూడా కనిపించవచ్చు. కవికి ఒక ప్రత్యేకత ఉన్నది. అతడు సమాజంలో అందరిలాగే ఒకడైనా అందరికంటే ప్రత్యేక మైనవాడు కవి మాత్రమే. అందరూ అనుభూతి పొందు తారు, కానీ అనుభూతిని వర్ణించి ప్రదర్శించ గలగడమే అతని ప్రత్యేకత. "He is an absolute dealist, and his world is made up of realthings. Ideals existing objectivity apart from men" అంటూ కవిని "feeling tone"గా అభివర్ణించాడు కాడ్వెల్.

"సకలదేశ కార్మికులారా! ఏకం కండని ప్రభోదించిన మార్క్యాజం ప్రాపంచిక దృక్పథాన్ని ఆదర్శంగా స్వీకరించిన అభ్యుదయకవులు ప్రగాఢమైన దేశభక్తితో పాటు తమ కవిత్వంలో విశాలమైన అంతర్జాతీయ దృక్పథాన్ని ప్రదర్శిం చారు.

"చీనాలో రిక్షావాలా
చెక్ దేశపు గనిపనిషి
ఐర్లండున ఓడ కళాసి
అణగారిన ఆర్తులందరూ
హాటన్ టాట్, జూలూ, నీగ్రో
ఖండాంతర నానా జాతులు
చారిత్రక యదార్థ తత్వాన్ని ఒకే గొంతుక"

తో చాటిస్తారనీ, దీర్ఘశ్రుతిలో తీవ్రధ్వనిలో విప్లవశంఖం వినిపిస్తారని శ్రీశ్రీ సూచించాడు.

తూర్పు దక్షిణాల దేశమ్ముల
మా బంధువులు, మా తమ్ములు
అవీ, నేను ఒకటైనాము
పడమర చేస్తుంది రాజీనామా

- అని దాశరథి అభిలషించాడు.

అభ్యుదయ కవులు సార్వజనీనమైన విప్లవం రావాలని కాంక్షించారు. "Poetry is the highest type manifests it self as a together objective"అని ప్రసిద్ధ జర్మన్ కవి 'గేథె' కవిత్వానికి విశ్వజనీనత ఉత్తమత్వాన్ని ఇస్తుం దంటాడు. విశ్వజనీనత కావ్యానికి శాశ్వతంగా గౌరవాన్ని ఇస్తుంది. తన వేదనను, అనుభవాన్ని సమాజపరంగా అన్వయించి తద్వారా తన సందేశాన్ని ప్రవచించడమే, ఆసంవిధానాన్ని నిర్ణయించుకోగలగడమే కవి ఎదుర్కొనే ముఖ్య సమస్య.

"గుండె గుండెకు చిచ్చుముడించిలేవండి
గుడిసె గుడిసెకు కోట నిర్మించి లేవండి"

- అని వారు పీడితప్రజల్ని విప్లవానికై ప్రభోదించారు.

అభ్యుదయ కవులు విప్లవ వీరుల గురించి గానం చేశారు. అల్లూరి సీతారామరాజు, భగూర్ చంద్రసింగ్, భగత్‌సింగ్ మొదలగు వారిని గురించి వీరు ఆవేశంతో అనేక గేయాలు రాశారు. గంగినేని వారు గెరిల్లావీరుల్ని ఉద్దేశించి 'అరచేతిలో మృత్యువు' అనే శీర్షికలో -

"జాగ్రత్త భుజంపై తుపాకీ అదే మన పంచ ప్రాణం
మొలలో తూటాపెల్టు! అదే అదే మన సర్వస్వం
.....
.....
తెలీదా, నిన్న ఆరు పరగణాలు మనవాళ్ళు విముక్తి చేశారు".

ఇందులో ఉద్యమాలలో ఉన్న బాధలు, గెరిల్లాలు కష్టగాథలు హృదయ విదారకంగా చిత్రించబడ్డాయి. అభ్యుకవులు పచ్చని మానవజాతి సంస్కృతికి యుద్ధం కార్చిచ్చువంటిదని, దానిపట్ల తమ నిరసన ప్రకటించారు. యుద్ధము మాకొద్దని నినాదరూపంలో ఎలుగెత్తి చాటారు.

"అమ్మా! ఉమా! రమా! హీరోషిమా!
నీస్మశాన వేదికపై తొలకరి వానలు కురియునులే
నీ అనాధ సమాధిపై ఎర్రపూలు పూయునులే"

- అని హీరోషిమాను ఆశ్వాసించారు.

యుద్ధ తృష్ణాశ్రుల్ని ఉద్దేశించి

"గుండెలు పగిలిన నగరాల ఆర్తఘోష
ఇంకా వింటూనే ఉన్నాం.
పచ్చని భూమితల్లి వక్షస్థలి పుచ్చిపోతుండగా
ఇక మీదట చూడలేం"

- అని దైన్యాన్ని దారుణ వేదనను ప్రకటించారు. అభ్యుదయ కవులు యుద్ధవిముఖతను ప్రకటించటమే కాక శాంతినీ కోరుకున్నారు.

"తల్లీ చల్లని శాంతి
ధారుణి పండించవమ్మా"

- అని శిశు హృదయంతో శాంతిదేవతను వేడు కున్నారు.

సమాజంలో గూడు కట్టుకుని ఉన్న ఆకలి, దారిద్ర్యం, వ్యాధులు, అసమానత, మొదలైనవి తొలగి పోయి అది వర్గరహిత స్వర్గంగా కూడా వెలుగొందాలని అభ్యుదయ కవుల లక్ష్యం. కవిత్వం సమకాలీన సాంఘిక పరిస్థితిని వర్ణించక పోతే, ఉపదేశ ప్రయోజనం లేనట్లే అని ఆరుద్ర అభిప్రాయ పడ్డారు. దీన్ని బట్టి అభ్యుదయ కవిత్వం అంతా సామాజిక జీవనచిత్రణ ప్రాధాన్యంగా ఉందని చెప్పవచ్చు.

వృద్ధజగతి సమాధిపై సమధర్మం ప్రభవించును
నిద్దుర చీకటి వెలుపల వేకువ వెలకువ పుట్టును

- అని భాష్యం చెప్పారు.

ఇప్పటికి ఇండియా అసమానతల దేశమే. తెలంగాణా ఎప్పటికీ అందులోని ప్రదేశమే. అయితే ఒకనాడు అస మానతలతో పాటు తెలంగాణాలో అమానుషాలు కూడా నిత్యసామాన్యాలుగా, నెత్తిమీద పెట్టినా దింపుకోకూడని బరువు లాగా ఉంటూండేవి. కుందుర్తి అన్నట్టు ఆకాలంలో తెలంగాణా హెలంగాణా. తాముపడుతున్న యమ యాతనల నుండి బయట పడడానికి సామా న్యులు అసామాన్యంగా అనాడు పోరాడక తప్పదను కున్నారు. వాస్తవానికి మానవులు ఆదినుంచీ భూమికోసం,

భుక్తికోసం, లేమినుండి విముక్తి కోసం, ప్రకృతితో పోరాడు తూనే ఉన్నారు. ఆపోరాటాల పరంపరే నాగరికత, నాజూకు బతుకులు. దాశరథి ప్రజల కష్టాలకు స్పందించాడు. నైజాము ధౌష్ట్యాలకు ఎదురు తిరిగాడు. తన జన్మస్థానమైన తెలంగాణా 'కోటి రత్నాల వీణ' అని భావించాడు. ఆ వీణను నిజాంరాజు ఏం చేసాడో ఇలా చెప్పాడు.

"ఓ నిజాం పిశాచమా! కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేని
తీగెలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణా - కోటి రత్నాల వీణ"

- ఆ వీణనే తాను "రుద్రవీణ"ను చేసుకుని నిజాం నిజ స్వరూపాన్ని ఇలా బయటపెట్టాడు.

"అడుగుడున యెడద నెత్రు - గడ గడమని త్రాగినావు
పడతుల మానాలు ద్రోచి - గుడ గుడ మని హుక్క త్రాగి
జడియక కూర్చుండినావు - మడికట్టుక నిలిచినావు
దగాకోరు, బటాచోరు - రజాకారు పోషకుడవు"

ఈ విధంగా అగ్నిధార కురిపించిన దాశరథి తెలంగాణా పోరాటంలో స్వయంగా పాల్గొని, చిత్రహింసల పాలై, రజాకార్లను తప్పించుకొని కొన్నాళ్ళు అజ్ఞాతవాసం చేస్తూనే వీర కవితలు ఆలపించాడు.

అభ్యుదయ కవులు ఆంధ్రరాష్ట్రోద్యమంపై కవితల్ని రాశారు. వారిలో సామసుందర్, రెంటాల, దాశరథి ముఖ్యులు.

"ఆంధ్ర దేశపు మట్టి - అదిమాకు కనకమ్ము
ఆంధ్ర దేశపు జలము- అమృతంపురసము
ఆంధ్ర దేశపు గాలి - అది మాకు ప్రాణమ్ము
ఆంధ్ర దేశమే మాకు - అమర దైవతము"

అంటూ అజ్ఞాత కర్తృకంగా వెలువడిన ఈ గీతం ఆంధ్రోద్యమ చైతన్యానికి ప్రతిరూపం. అభ్యుదయకవులు ఆంధ్ర రాష్ట్రోద్యమంతో తృప్తిపడక విశాలాంధ్ర అవతరణ కొరకు పాటుపడ్డారు.

"పదవోయి తెలుగు వాడా
అదే నీ తెలుగు మేడా
సంకేళ్ళులేని నేల
సంతోష చంద్రశాల"

- అంటూ తెలుగువారి సముజ్వల భవిషత్తును గానం చేశారు.

రాయలసీమ చైతన్యంతో, కూడా అభ్యుదయ కవులు రచనలు చేసారు. రాయల సీమ కరువు జీవితాన్ని మొట్ట మొదటి సారిగా ప్రతిభావంతంగా గానం చేసిన ఆధునిక కవి విద్వాన్ విశ్వం.

"అచట నొకనాడు పండెముత్యాల చాలు
అచట నొకప్పుడు నిండె కావ్యాల జాలు
అచట నొకపుకురిసె భాష్యాల జల్లు
విరిసెనట నాడు వేయుంచు విచ్చుకత్తి
ఇచి గతించిన కథ, విరిపింతునింక
నేటి రాయలసీమ కన్నటిపాట"

అంటూ దుర్భరమైన రాయలసీమ జన జీవితాన్ని విద్వాన్‌విశ్వం తమ "పెన్నేటిపాట" కావ్యంలో చిత్రించారు.

ఈ విధంగా అభ్యుదయ కవిత్వంలో వర్గ సంఘర్షణ, విప్లవప్రభోదం, వీరగాథా కథనం, యుద్ధవిముఖత-శాంతిప్రియత్వం, సమసమాజ నిర్మాణం, తెలంగాణా విముక్తి, ఆంధ్ర రాష్ట్రోద్యమం మొ॥ సామాజిక స్పృహ, చిత్రణతో కూడిన ధోరణులు చోటు చేసుకున్నాయి. వర్తమాన సమస్యల్ని కవితావస్తువుగా తీసుకుని సమర్థవంతంగా చైతన్యవంతంగా వ్యక్తీకరించి ప్రగతి శీలమైన మార్పును కాంక్షించారు అభ్యుదయ కవులు. సబ్జెక్టివ్ భావాన్ని ఆబ్జెక్టివ్‌గా రాయడం అంటే కవి ఆత్మీయమైన దానిని విశ్వజనీనం చేసి రాయడం. ఉత్తమ కవిత్వ లక్షణాలలో ఇది ముఖ్యమైనది. అటువంటి ప్రత్యేకమైన లక్షణం భావఅభ్యుదయ కవులలో ఉంది. కవి ప్రత్యేకతను గురించి "Phillip Sydney" కూడా ఇదే అభిప్రాయ

పడుతున్నారు. సమాజంలోని వ్యక్తులందరి కంటే, కవి స్థానం ఉదాత్తమైనదని 'సిడ్ని' భావం. "That is the wisest the happiest and the best, in as mch as he is a poet, is equally incontrovertible" ఇంతటి ప్రత్యేకమైన వ్యక్తిత్వం కాబట్టే అతని అనుభూతి కూడా ప్రత్యేకమైంది అవుతుంది.

ప్రసిద్ధకవి గురజాడ అప్పారావును అభ్యుదయ సాహిత్యోద్యమ సిద్ధాంతవేత్తలు తిరిగి అంచనా కట్టారు. "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అన్న ఆయన మాటల్ని మార్క్సిస్ట్ దృక్పథంతో విశ్లేషించి చూపారు. విప్లవవాద సమయంలో ఒక ప్రత్యేక చర్చ నీయాంశంగా రూపుదిద్దుకొన్న 'సైద్ధాంతిక నిబద్ధత' అన్న అంశానికి అభ్యుదయ కవితోద్యమ కాలంలో గట్టి పునాదులే ఏర్పడ్డాయి. సాహిత్యంలో "సామాజిక జీవన చిత్రణ" ఎంతో అవసరమని అభ్యుదయ కవులు నొక్కి చెప్పారు. ఈ రకమైన సృహ కానరాని పూర్వతెలుగు సాహిత్యంపై ముఖ్యంగా ప్రబంధ సాహిత్యంపై విమర్శలు చెలరేగాయి. రూపానికన్న వస్తువుకే ప్రాధాన్యత ఇవ్వాలనే ధోరణి పెరిగింది. ఇదే సమయంలో వచన కవిత తదితర ప్రక్రియల విస్తృతికి అభ్యుదయ సాహిత్యోద్యమపు మౌళిక వస్తువులు చక్కగా ఉపకరించాయి.

కవిత్వానికి కూడా సైన్సుకి వలె
కావాలి రీసెర్చ్ ఎక్స్‌పెరి మెంటూ కాని దాని పరమార్థం
పలాయనం కాదు ప్రజాక్షేమం

- అంటాడు శ్రీశ్రీ ప్రజాక్షేమమే కవిత్వ ప్రయోజనం, సామాజిక ప్రయోజనం లేకుండా కవిత్వం రాయడం అర్థరహితం. ఈ విధంగా అనేక అంశాలలో అభ్యుదయ సాహిత్యోద్యమం చక్కని విజయాన్ని సాధించినట్టుగా చెప్పవచ్చు.

ఈవిధంగా వర్తమాన సమస్యల్ని కవితావస్తువుగా తీసుకొని సమర్థవంతంగా, చైతన్యవంతంగా వ్యక్తీకరించి ప్రగతిశీలకమైన మార్పునుకాంక్షించారు అభ్యుదయ కవులు. ఆధునిక సాహిత్య వికాసం ఒక పరిణామ క్రమంలో ఉంది. సంప్రదాయ ప్రయోగాల దశను దాటిన కవిత్వం కొన్ని ప్రత్యేక కారణాలవల్ల స్థిరరూపం పొంద గలిగింది. పాశ్చాత్య ప్రభావంతో వికసించిన సాహిత్యం కాల్పానిక దశ క్రమంగా భావకవిత్వంగా స్థిరపడింది. భావకవిత్వం వల్ల కలిగిన కొన్ని అసంతృప్తులు, కొన్ని ఆలోచనలు, కొన్ని విమర్శల నేపథ్యం నుండి అభ్యుదయ సాహిత్యం రూపుదిద్దుకున్నది. వ్యక్తి అభీష్టం నుంచి సమాజ శ్రేయస్సును కాంక్షించే స్థితికి సాహిత్యం పరిణామం చెందింది.

ఈవిధంగా వర్తమాన సమస్యల్ని కవితా వస్తువుగా తీసుకొని సమర్థవంతంగా, చైతన్యవంతంగా వ్యక్తీకరించి ప్రగతిశీలకమైన మార్పు కాంక్షించారు అభ్యుదయ కవులు.

ఉపయుక్త గ్రంథములు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ జి.నాగయ్య
2. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రా॥ వెలమల సిమ్మన్న
3. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి
4. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర (ఆధునిక యుగం)
5. మహాప్రస్థానం - శ్రీశ్రీ
6. చారిత్రాక, సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర - ముదిగంటి సుజాతరెడ్డి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జాషువా తెరచాటు నాటకం – సామాజిక దృక్పథం

– డా॥. కుందలపు నటరాజ్, సహాయక ఆచార్యులు, తెలుగు శాఖ, డి.జి.వైష్ణవ కళాశాల, అరుంబాకం, చెన్నై.

1935లో 'ప్రజామిత్ర' పత్రిక సంపాదకులు గూడవల్లి రామబ్రహ్మంగారు పత్రికాముఖంగా సాంఘిక నాటకాల పోటీని ఏర్పాటు చేస్తే అ పోటీకై జాషువా ఈ 'తెరచాటు' నాటకం రాశారు. కొన్ని కారణాల వలన పోటీలు జరగక పోవడంతో కవి తానే స్వయంగా 1946లో ఈ నాటకాన్ని వెలుగులోకి తీసుకొచ్చాడు. తెరచాటు నాటకాన్ని రచించడానికి గల ఉద్దేశం ఏమిటనేది ఈ నాటక భూమికలో జాషువ ఇలా చెప్పాడు.

"నా మనస్సు వేదిస్తూయున్న పెక్కు విషయాలను సమకూర్చుకొని నేనీ నాటకాన్ని వ్రాశాను. సంస్కరణాభిలాష నాకు మిక్కుటంగా కలదు. కథ కేవలం కల్పితం. బాల వితంతువుల హృదయావేదన, తత్ఫలితంగా కలుగు ననర్థాలు, ఇంగ్లీషు వైద్యుల నిష్కరుణ, సనాతనుల స్వార్థపరత్వం, ముసలిమగళ్ళు పడుచు పెండ్లాలతో అనుభవించు కష్టాలు మున్నగు విషయాలను లోకానికి వెల్లడించడమే నా ముఖ్యోద్దేశం" అంటారు.

ఈ తెరచాటు నాటకంలో ఎన్నో సామాజికాంశాలు చోటుచేసుకున్నాయి. బాలవితంతువుల హృదయావేదన వల్ల జరిగే అనర్థాలు, ఆంగ్ల వైద్యుల నిష్కరుణ, సనాతనుల స్వార్థపరత్వం, ముసలిమగళ్ళు పడుచు పెళ్ళాలతో పడే కష్టాలు మొదలైన అంశాలు ఈ నాటకంలో చోటుచేసుకున్నాయి.

బాల వితంతువుల హృదయావేదన :

ఈ నాటక రచనా కాలానికి, అంటే వీరేశలింగం పంతులు మరణించిన పదిహేను సంవత్సరాలకు కూడా ఈ దురాచారం మన సమాజంలో తిష్టవేసుకునే ఉంది. 'బ్రాహ్మ వివాహము' మొదలైన రచనల్లో వీరేశలింగం పంతులు అతి బాల్యవివాహం, వృద్ధ వివాహం, కన్యాశుల్కం మొదలైన దురన్యాయాలవల్ల కలిగే అనర్థాల్ని ప్రజలకు తెలియజెప్పి ఉన్నారు. కానీ ఆ రూపక ప్రయోజనాన్ని అవహేళన కప్పేయడంతో అది కేవలం 'పెద్దయ్యగారి పెండ్లి పుస్తకము'గానే మిగిలిపోయింది

పురుషాధిపత్యంతో కూడా హైందవ సమాజంలో స్త్రీ అసూర్యపశ్యంగా, వంటింటి కుందేలుగా మారిపోయింది. చిరుప్రాయంలోనే ముసుగువేసి మూలకూర్చునేటట్లు చేసే బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలకిందులో కల్యాణి వృత్తాంతమొక చక్కని లక్ష్యంగా మలచబడింది. ఆ దారుణ దౌష్ట్యానికి కారణభూతుడైన వ్యక్తి (కిశోర కుమారుడు) మాత్రం సంఘంలో మగ మహారాజుగా, చెలామణి అవుతుండగా అన్నెం పున్నెం ఎరుగని మహిళ మాత్రం రచ్చకెక్కుతుంది. ఈ తెరచాటు నాటకపాప ఫలమైన 'కలియుగ కర్ణులు' మాతృవాత్సల్య జలధలో ఈదులాడే భాగ్యాన్ని కోల్పోయి నగరవాసుల కాలుష్యాన్ని వెంటగొనిపోయే మురుగుకాల్వల పాలవౌతున్నారు. ఇది మనకు తెల్సిన విషయమే. లోకసామాన్యమైన ఇలాంటి సంఘటన ఏదైనా ఒకటి జాషువాపై ప్రగాఢమైన ప్రభావాన్ని కనబరచి ఉండవచ్చు. 'కొత్తలోకము'లో ఈ విషయాన్ని గూర్చే ఒక ఆఖ్యానంలో జాషువా వ్యాఖ్యానించి ఉన్నారు.

బాల్యవివాహాల వలన స్త్రీ విద్యాగంధానికి దూరమయి సమాజంలో అనేక కట్టుబాట్లకు గురయింది. శారీరకంగాను, మానసికంగాను ఎదగని వయసులో వివాహం చేసుకొని పిల్లల్ని కని, రోగాల రొంపిలో కూరుకు పోయింది. భర్త చనిపోయినపుడు సహగమనం చేయడమో లేక ఇతరులు చేసే అవమానాల్ని క్షమిస్తూ జీవితాంతం వైధవ్యాన్ని అనుభవిస్తూ జీవచ్ఛవంలా కాలం గడపడమో తప్పనిసరి. ముక్కుపచ్చలారని బాలికల దుస్థితిని చూసి జాలిపడిన జాషువా వేదన వర్ణనాతీతం.

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

తెరచాటు నాటకంలో బాల్యవివాహాలు, తత్ఫలితంగా వచ్చే అనర్థాలను గూర్చి కవి చక్కగా వర్ణించారు.

తెలుగునాటక రచనారంభంలో రెండు భిన్న ప్రక్రియలు పరస్పరం సాహచర్యం చేసుకుంటూ సాగి వచ్చాయి. ఒకటి సంప్రదాయ రచనారీతి. ఈ పద్ధతిలో పౌరాణిక నాటకాలు, సాంఘిక నాటకాలు రెండూ కొన సాగుతూనే వచ్చాయి. సాంఘిక నాటకాల్లో ఇతివృత్తం సమకాలీనమైనదే అయినా ఒకే సమస్యను ప్రధానంగా ఎంచుకున్నందువల్ల నాటకమంతా ఆ సమస్య మీదనే దృష్టి పెట్టడం అనివార్యమైంది. ఇతర సాంఘిక అవ రోధాలు, అక్రమాలు స్థాపించబడినా ప్రధాన సమస్యకు ఇవి ఉపాంగాలుగాను ఉపకరించాయి. కన్యాశుల్కం, వరవిక్రయం, మధుసేన ఇలాంటి నాటకాలు ఈ కోవ లోనివే. అయితే జాషువా 'తెరచాటు'లో అనేక సమస్యలు కేంద్రీకృతమయ్యాయి. బాల్య వివాహాల నేపథ్యంలోనే ఇతివృత్తం అల్లబడినా, ముసలివాళ్లకు పడుచువాళ్లకు వివాహ సమస్యలు, అప్పటి ఇంగ్లీషు వైద్యుల ఆకృత్యాలు, సనాతన చాందస భావాలు ఇందులో చర్చించ బడ్డాయి.

ముసలి మగళ్ళు పడుచు భార్యలతో పడే కష్టాలు:

దీనికీ నాటకంలో రాజ్యలక్ష్మి, కామశాస్త్రుల వృత్తాంతం లక్ష్యంగా చిత్రించబడింది. "హృదయముండని' నీ యెన్బ దెండ్లముదుక కొగిటంబడ్డ వసిపత్తి కడుపులోన సంతతమేపారు సంకుల సమరఘోష"ను జాషువా అనేక సందర్భాల్లో తన కృతుల్లో ఆవిష్కరించి ఉన్నారు. పారు గింటి బాలిక అయిన రమామణిని ముదివగ్గున కంట గట్టిన విషయం చిన్న నాటనే తన చిట్టి గుండెలపై ఎంత గట్టిగా ముద్రేసుకుందో జాషువా 'కొంటెపనుల'ను స్మృతికి తెచ్చుకున్నప్పుడు ఆవిష్కరించి ఉన్నాడు. ఆ అనుభవమీ కల్పనకు దోహదం చేసి ఉండడం ఇక్కడ గుర్తించదగ్గ అంశం.

వృద్ధ వివాహం భార్యాభర్తలిద్దరిని నరకయాతనకు గురిచేస్తుంది. దీనికి ప్రధాన కారణాలు తల్లిదండ్రుల దురాశ, ధర్మసూత్రాలు, మూఢవిశ్వాసాలు, దురాచా రాలు, ముసలిభర్త వయోభారంతో పాటు శారీరక బాధలననుభవిస్తున్నా పడుచు భార్యకు కాపలా కాయాల్సి వచ్చేది. సహధర్మ చారిణి వల్ల స్వర్గలోకం కలుగుతుందని నమ్మిన తనకు ఆమె ఈ లోకంలోనే నరకం చూపిస్తున్న దని బాధపడ్డాడు. కామశాస్త్రి, పెళ్ళి మీద పెళ్ళి చేసుకొని తన్ను తాను ఉద్ధరించుకొని సమాజాన్ని ఉద్ధరిస్తున్నానని అనుకున్నాడేగాని ఈ అసమ వివాహాల వలన స్త్రీలు ఎన్ని హింసలకు గురౌతున్నారో, పురుషులు ఎంత మానసిక క్షోభ అనుభవిస్తున్నారో ఆలోచించ లేకపోయింది ఆనాటి సమాజం. ఇలాంటి వృద్ధ వివాహాల వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గనుక ఇవి అవాంఛ నీయమని కవి అభిప్రాయం.

ఇంగ్లీషు డాక్టర్ల ఆకృత్యాలు :

"వ్యాధిగ్రస్తులైన వ్యక్తుల బంధువుల ఆతృతను పసికట్టి డబ్బు గుంజే ఇంగ్లీషు వైద్యుల కరుణారాహి త్యాన్ని, కర్కోటక హృదయాన్ని ఇందులోని డాక్టరు పిళ్ళై పాత్ర ద్వారా చిత్రించాడు జాషువా, డాక్టరింట్లో 'మంచి రసపట్టు'లో సాగిన పేకాట వృత్తాంతం జాషువా స్వీయానుభవానికి సరిపోలి ఉండడం గుర్తింపదగింది.

'వైద్యో నారాయణో హరి: అనే నమ్మకాన్ని వమ్ముచేస్తూ ఆ వృత్తికి కళంకంతెస్తూ ఆనాటి సమాజంలోని ప్రజల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న ఆంగ్ల వైద్యులను ఈ నాటకంలో విమర్శించారు కవి. రోగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నా పట్టించుకోకుండా పేకాటకు బానిసై కాలాన్ని గడుపుతున్న డా.పిళ్ళై ఆంగ్లవైద్యుడు.

ప్రమోదుని భార్య ప్రాణాపాయస్థితిలో ఉన్నదని అతను బ్రతిమాలాడుతున్నా ఈ రోజు ఆదివారం గనుక రావడానికి వీలుపడదని కఠినంగా ప్రవర్తిస్తాడు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఎక్కువ డబ్బు గుంజి సరైన వైద్యం సకాలంలో చేయని ఆంగ్లవైద్యులను కవి విమర్శించి బ్రహ్మశాస్త్రి చేత నోటికి వచ్చినట్లు తిట్టించాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను

రక్షించవలసిన డాక్టరు వాళ్ళకు అధైర్యం కల్గించడమే గాక 'South African sleeping disease' వచ్చిందని భయపెడ్తూ డబ్బు ఇవ్వని వాళ్ళ వద్ద నుండి డబ్బు గుంజడానికి కోర్టుకు వెళ్ళి దావా వేసుకొనైనా సరే సంపాదించగలననుకునే కుసంస్కారి డా.పిళ్ళై. ఆనాటి ఆంగ్ల వైద్యులు అజ్ఞానులైన ప్రజల మీద చూపిస్తున్న నిష్కరుణను కవి 'తెరచాటు'లో ఘాటుగా విమర్శించారు.

సనాతనుల స్వార్థపరత్వం :

పురుష ప్రధానమైన సమాజం కనుక శాపాలు, ధర్మాలు వారికి అనుకూలంగానే రచించబడ్డాయి. సనాతనులు ఈ ధర్మాలను తు.చ. తప్పకుండ పాటించాలను కోవడం వల్లనే స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హరించబడ్డాయి. సనాతనుల స్వార్థం మూలంగానే బాల్య వివాహాలు, బాల వితంతుల సంఖ్య పెరిగింది. దుర్భరమైన కట్టుబాట్ల మధ్య స్త్రీలు శారీరకంగాను, మానసికంగాను నలిగిపోయారు. సృష్టి ధర్మాలకు లోబడి బలహీనులై అక్రమ మార్గాలననుసరించి పతనమై పోయేవారు. 'తెరచాటు'లోని నాయిక కల్యాణి సనాతనుల స్వార్థ పరత్వానికి బలైంది.

బాల వితంతువయిన కల్యాణికి యుక్తవయసు. కోరికలణచుకోలేక కవియైన కిషోరునితో స్నేహం చేయడం ఆమెను హృదయ రాణిగా చేసుకొన్న కిషోరుడు కష్ట కాలంలో ఆమెకు అండగా ఉండకుండా ఆమెను సమాజపు కర్కశత్వానికి బలిచేయడం సనాతనుల స్వార్థ ఫలితమే. బాలవితంతువులపట్ల సమాజపు దృష్టిని, యువకుల ప్రవర్తనను కవి చక్కగా చిత్రించారు.

ఈ నాటకంలో సంప్రదాయం మీద అచంచల విశ్వాసాన్ని ప్రదర్శించిన వారు రామచయన్లు, బుచ్చిరామమ్మ, కామశాస్త్రి.

తరతరాల నుండి వస్తున్న ఆచార సంప్రదాయాలను అడ్డంపెట్టుకొని పసిదాన్ని వృద్ధునికిచ్చి వివాహం చేసి ఆమె జీవితాన్ని బలితీసుకొన్నదీ, భార్య మరణించిన తన అన్నకే కూతురు నివ్వాలనే స్వార్థంతో భర్తతో పోరు పెట్టినదీ కల్యాణి తల్లే. సంప్రదాయాన్ని, ఆచారాల్ని పాటించే విషయంలో రాజీపడకుండా కఠినత్వాన్ని ప్రదర్శించిన బుచ్చిరామమ్మ జీవితంలో సాధించినదేమి లేదు. పడుచు భార్యతో సుఖపడలేక పోయిన కామశాస్త్రి మళ్ళీ తన కూమార్తెకు అలాంటి వివాహం చేసి గిట్టనివాళ్ళు శారదా చట్టం కింద అర్జీ పెట్టినందువల్ల న్యాయస్థానం చుట్టూ తిరగవలసి వచ్చింది. తాను వయోవృద్ధుడైన భర్తతో సుఖపడింది గనుక ఈ వివాహాన్ని ఆపే ప్రయత్నం చేయాలని తల్లి ప్రయత్నించినా ఫలితం లేకపోతుంది. పూర్వం పతివ్రతలంతా ముసలి భర్తలతో కాపురం చేయలేదూ! నీ నొసటనే ప్రొద్దు పొడిచిందనుకున్నావా? మహర్షి వెయ్యేళ్ళు తపస్సు చేసి 12 సం॥ల సుకన్యను వివాహం చేసుకొన్నాడట. పరమ ఇల్లాలైన ఆమె తన భర్త అడుగులకు మడుగులొత్తి శుశ్రూష చేసి ఆయన అనుగ్రహం సంపాదించుకొన్నది. అలాంటి పాతివ్రత్యాన్ని బోధించే కథలు చదవమని పడుచు భార్యకు హితోపదేశం చేశాడు కామశాస్త్రి. ఆ కథలే ఆడవాళ్ళ కొంపదీశాయంటూ తన నిరసన వ్యక్తం చేస్తుంది రాజ్యలక్ష్మి. నన్ను పూజించుకోరాదూ! అంటే నిన్ను పూజించిన చేతులు పుచ్చిపోతాయంటూ కసిగా అంటుంది. సనాతనాచారాలు అడ్డం పెట్టుకొని స్త్రీలను బంధించి బాధిస్తున్న సమాజ స్వార్థ పరత్వాన్ని విమర్శించాడు.

జాషువా తన కాలం నాటి సమాజంలో ఉన్న స్త్రీల సమస్యలన్నిటిని 'తెరచాటు' నాటకంలో ప్రతిబింబింప చేస్తూ ఆ సమస్య వలన ఉత్పన్నమయ్యే కష్టాలు, వాటిని అధిగమించ లేక స్త్రీలు పడే ఆవేదన, బాల వితంతువు మాతృత్వాన్ని పొందిన వైనం, తత్ఫలితంగా తెరచాటున జరిగే దుస్సంఘటనలు తెరతీసి చూపించారు. ఈ నాటకంలో కథలోని పాత్రల రూపాన్ని నటులయందు ఆరోపించడం వలన నాటకాన్ని రూపకం అని కూడా అంటారు. జాషువా ఆనాటి సమాజంలోని వ్యక్తులకు దర్పణంపట్టే పాత్రలను సమాజానికి తెరచాటు నాటక రూపంలో చక్కగా ప్రదర్శించారు.

సమకాలీన పరిస్థితులు :

స్వార్థపరుడైన బ్రహ్మశాస్త్రికి, సంస్కార భావాలు గల అతని కొడుకైన ప్రమోదునికి మధ్య జరిగిన సంభాషణ ద్వారా జాషువా సమకాలీన రాజకీయ, సామాజిక పరిస్థితుల్ని తీవ్రంగా విమర్శించారు.

బ్రహ్మశాస్త్రి :

ఆ ఏదోవేశాం అయిపోయింది. స్వరాజ్యం స్వరాజ్య మని అంతా అంటుంటే ఆశపడ్డా. పుటిక్కిన వస్తుందేమో నేనొక ప్రక్క యేల వచ్చు గదా అని. స్వరాజ్యం స్వరాజ్య మని గోలపెట్టిన ముండాకొడుకు మధ్య హరిజనోద్ధ రణము, దేవాలయ ప్రవేశమని చొప్పించాదేమిటి? వర్ణ సంకరం చేయడానికి...

ప్రమోదుడు :

స్వరాజ్యమేమో కావాలికాని, దేవాలయాల్లో మాత్రం హరిజనులు రాకూడదా? అప్పుడు వర్ణసంకరమౌతుంది. ఎంతక్రూరమైంది నాన్నా మన సంఘం. ధర్మమో! ధర్మమో! అని అఘోరిస్తారు మళ్లా. మన ధర్మమిలా తగులబడి పోతుంది. పశుధర్మం గనుక.

అనే మాటలు ఆ రోజుల్లో సామాజిక పరిస్థితులకు పట్టిన వ్యాఖ్యానాలు. పీడిత తాడిత దళిత హరిజనులకు ఆలయ ప్రవేశం నిషేధం తద్వారా జరిగే వర్ణసంకరం నసేమిరా సమ్మతం కాదు బ్రహ్మశాస్త్రికి. వీటితో స్వరాజ్యాన్ని ముడిపెట్టిన జాతిపిత గాంధీజీని 'ముండా కొడుకు' అని బ్రహ్మశాస్త్రి అక్కసు వెళ్ళగక్కుకుంటాడు. ప్రమోదుని రూపంలో ఈ చీడపీడల వ్యవస్థను చూచి చీదరించుకుంటాడు జాషువా. మూడో అంకంలోని రెండో రంగమంతటా జాషువా పరోక్షంగా పాఠకులతో మాట్లాడు తాడు. నిర్భీతిగా నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని ప్రకటిస్తాడు. ఇలా వీలు కలుగజేసుకొని నాటి సాంఘిక పరిస్థితికి పట్టిన దుమ్ముధూళిని దులపటానికి ఉద్యుక్తు డౌతాడు. కులమతాలకు అతీతమైన వ్యవస్థ ఆయనకు కావాలి. అందరూ సమానంగా కలసీ మెలసీ జీవించే సమాజం ఆయన ఆదర్శం. అదే జాషువా ఆశించే సామాజిక ధర్మం.

ఈ నాటకంపై ప్రముఖుల అభిప్రాయలు :

" కావ్యశిల్పమునకన్న నభిప్రాయ ప్రకటనమే నా పరమావధి అన్న జాషువా దృక్పథానికీ నాటకమొక చక్కని లక్ష్యంగా ఉంది" అని బి.భాస్కరచౌదరి అభిప్రాయపడ్డారు.

"జాషువా తమ సంఘసంస్కరణాభిలాషకు తగ్గ కథనెన్నుకొని సునిశిత విమర్శలతో నాటకాన్ని విషా దాంతంగా రచించారు. ఈ విషాందాంత నాటకాన్ని రసో చితంగా రచించి తమనేర్పును ప్రదర్శించిన జాషువా 'కరుణరస చక్రవర్తిత్వము' కేవలం పద్యరచనయందేగాక, వచన రచన యందును వర్తించునని చెప్పవలసి ఉంది"అని డా॥గుదిమెళ్ళ భావనారాయణచార్యులు పేర్కొన్నారు.

"కందుకూరి వీరేశలింగం పంతులు గారు లేవనెత్తిన వితంతువుల సంస్కరణవాద ప్రభావం ఈ నాటకంలో కనబడుతుంది" అని డా॥ఎండ్లూరి సుధాకర్ తెలిపారు.

"ఇందు మానవతా వాదియైన జాషువ మూఢాచార నిరసన గావించిరి. బాల్య వివాహముల వలన కలుగు అనర్థములు వివరింపబడినవి. సమకాలీన సమాజంపై జాషువా విసిరిన విసుర్లు మానవతా ప్రబోధాత్మకము లైనవి. ఈ రచన ద్వారా జాషువ సంస్కరణ భావములు తెలియనగును" డా॥ ముప్పిడి సామ్యూల్ ప్రభాకరరావు చెప్పారు.

"జాషువ తన కాలంనాటి సమాజంలో ఉన్న స్త్రీల సమస్యలన్నిటిని 'తెరచాటు' నాటకంలో ప్రతిబింబింప చేస్తూ ఆ సమస్యల వలన ఉత్పన్నమయ్యే కష్టాలు, వాటిని అధిగమించ లేక స్త్రీలు పడే ఆవేదన, బాల వితంతువు మాతృత్వాన్ని పొందిన వైనం, తత్ఫలితంగా తెరచాటున జరిగే దుస్సంఘటనల నన్నిటిని తెరతీసి చూపించాడు"అని ఆచార్య తేళ్ల సత్యవతి తమ అభి ప్రాయాన్ని పేర్కొన్నారు.

'కవిత్వానికి కులమతాల పట్టింపులేదు' అనే సూక్తికి తార్కాణం "ఫిరదౌసి" కావ్యం.

"కళలు మోహించుటొక కులీ నులనె కాదు
కులము లేనివాని గూడవలచు" - అనేందుకు ఉదాహరణ "ముంటాజమహల్" కావ్యం.

అబలా లోకానికి జరుగుతున్న అన్యాయానికి దర్పణం "అనాథ" కావ్యం. అలాగే జాషువా నాటకాల్లో సామాజిక నాటకం "తెరచాటు" నాటకం. ఇలా ఒక్కొక్క కావ్యాన్ని ఒక్కొక్క రీతిగా సామాజిక న్యాయానికి వేసిన పునాది రాళ్ళుగా చెప్పవచ్చు. సమాజంలో జరిగే అన్యాయాలకు నిలువెత్తు ప్రతీకలుగా జాషువా రచనలను పేర్కొనవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెరచాటు - జాషువా
2. జాషువా కవితావైభవం - అమూల్యశ్రీ
3. జాషువా సాహిత్యము సామాజిక న్యాయం - డా॥టి.వరప్రసాదు
4. హేతువాది జాషువా - ఆచార్య తేళ్ల సత్యవతి
5. జాషువా సాహిత్య సమాలోచనం - తెలుగు అకాడమి
6. జాతీయ కవి జాషువా - డా॥ కాలువ మల్లయ్య
7. జాషువా నాటక సాహిత్యం (అముద్రిత పరిశోధన గ్రంథం) - డా॥ మందలపు నటరాజ్

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలంగాణ గిరిజన కవిత్వం – బంజారాల జీవన చిత్రణ

– డా॥. నూనెవత్ రంభాబు, సీనియర్ ఫెలో, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు, సిఐఐఎల్, నెల్లూరు.

బంజారాల వారి జీవనంపై, సంస్కృతిపై, జీవితంపై జరుగుతున్న దోపిడి, దౌర్జన్యాలకు, భూమిపై హక్కులను, అప్రజాస్వామిక హింసకు, ఈ అడవిబిడ్డల ఆర్తిని వెలికితీయడంలో ప్రత్యక్ష పరోక్ష అనుభవం నుండి వెలివడిన బంజారాల కవితలైన ఒక దగ్గరికిచేర్చితే అవి నెగడులా వెలిగితే కళ్ళు చేదిరే కాంతులతో మిరుమిట్లు గొలిపే గిరిజన కవితలైన "రామ్‌రామ్ నాయక్' - (వడ్త్య పంతులు నాయక్, 2013), 'నసాబ్' (పంచాయితీ) బంజారా కవిత్వం - (పంతులు వడ్త్య, 2008), 'ఉట్నూరు కవిత' - (ఉట్నూరు సాహితీ వేదిక, 2014), 'అక్షర ప్రతిఘటన'- (పోలవరం గిరిజన పరిరక్షణ వేదిక, 2014), కామ్రేడ్ రంగవల్లి జ్ఞాపకం - రంగవల్లి మమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్, 2014 'గోదావరిలోయ గోగుపూలు' - (అరుణ, విమోచన ప్రచురణలు, 2014), 'అడవిపక్షి ఆలాపన' - (జి.వెంకట్‌లాల్ (సంపా), 2016) వంటి కవితా సంకలనాలలోని కవితలలోని సామాజిక జీవన చిత్రణ.వస్తువును వివరించడం ప్రధానం.

"మన కాలంలో మన కళ్ళెదుటే డెబ్భై సంవత్సరాల 'సర్వసత్తాక గణతంత్ర రాజ్యం' పాచీన జీవన మూలాల్లోని విశిష్టతలను నిలిపి ఉంచుకున్న బంజారాల విప్లవోద్యమ నాయకత్వంలో నిజమైన ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం పోరాడుతున్నారు". ప్రజాస్వామ్యం నుంచి స్వాలం బన మీద నిర్మాణమయ్యే ఆర్థికవ్యవస్థ. ప్రజల భాగ స్వామ్యంలో సాగే రాజకీయ పాలనా వ్యవస్థ, పూర్వ సాంస్కృతి బంధనాల నుంచేగాక వర్తమాన సాంస్కృతిక అణచివేత నుంచి విముక్తి కలిగించే నూతన సాంస్కృతిక వ్యవస్థ వల్ల అవగాహన అవుతుంది. అపారమైన సహజ సంపదను కొల్లగొట్టడానికి అటవీ ప్రాంతాల్లో బడా పెట్టుబడిదారీ సంస్థలు ప్రవేశించటంతో ఈ సంఘర్షణ తీవ్రమైంది. పెట్టుబడిని వ్యతిరేకిస్తూ బంజారాల తమ కాళ్ల కింద వనరులను కాపాడుకోడానికి ఎదురు తిర గడంతో. ఈ ప్రతిఘటనలో తమదైన అభివృద్ధి నమూనాను ప్రత్యామ్నాయంగా నిలబెట్టడం జరిగింది. ఒక సమీప చరిత్రని, బహు పురాతనమైన పరిణామ శీలమైన పోరాట చరిత్రని కలగలిపి -బంజారాలకళ్ళలో దృశ్యమాన మవుతున్న భవిష్యత్ సమసమాజపు రూపురేఖ. అప్పటికే ఏర్పడిన పదబంధాలతో, పదజాలంతో పద్యం నిర్మించడం వేరు. ఒక సరికొత్త సందర్భానికి, పరిణామ శీలమైన, కొత్త పదజాలం, కొత్త అలంకారికత, దృశ్య పరంపర ఏర్పరచుకుని పలకటం అటువంటి వస్తు మిళితమె బంజారాల జీవన చిత్రణ. ఈ సంపుటిలో చాలాచోట్ల దర్శనమిస్తాయి.

"డప్పుల దరువుల్లో/కాలిగజ్జల సవ్వడి
చేతి గాజుల మోతల్లో/తలనిండా వేసుకునే సంప్రదాయ
అద్దాలవోనీల ముసుగుల్లో/తియ్యని రాగాల నడుమ
నీ డప్పు డ్యాన్సుతో తండంతా/మైమరిచేది
చెంగున ఎగిరే లేడిపిల్లలా/రివ్వున ఉరికే గోరువంకలా
చల్లగా వీచే పైరగాలిలా/అడవిలో ఆడే నెమలి నాట్యంలా
రామ చిలుక పలుకులుగా నీ మాట/విరబూసిన మోదుగు వనంలా
ఆరపోసిన పసిడి వెన్నెల్లాంటి నీ మనసు
కొండకోనలను కరిగించే నీ గొంతు"

(.....గోదావరిలోయ గోగుపూలు,పుట.44)

లంబాడీల జీవనంలో భాగంగా సంస్కృతి ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. వారు తండాలో ఉదయం లేచినది మొదలు పడుకునే వరకు వారి సంస్కృతి, ఆట, పాట, నృత్యం, నాట్యం మొదలైన అంశా

లలో ముడిపడిన జీవనం ఉందని పై కవిత్వంలో తెలుస్తుంది.

తీజ్ పండుగ :

'తీజ్ ఉత్సవం' కవితను 'జాదవ్ వెంకట్‌లాల్' రాశారు. ఈ కవిత 'ఉట్నూరు కవిత' సంకలనంలోనిది. తీజ్ పండుగ బంజారాలు (లంబాడీ స్త్రీలు) జరుపుకునే పవిత్రమైన పండుగ. లంబాడీ యువతులు అందరూ ఒకచోట చేరి, చైతన్య స్ఫూర్తితో జరుపుకునే జగదాంబ అమ్మవారి కొలిచి కీర్తించడం సంప్రదాయంలో ఒక భాగం. వివాహం కాని యువతులు తెల్లవారుజామునే లేసి తండా కులనాయకులతో ఆశీస్సులతో తీజ్ ఉత్సవం జరపడమే సంస్కృతికి ప్రతీక ఈ తీజ్‌పండుగ అని రచయిత ఇలా వివరించారు.

"నెత్తిన వెదురబుట్ట దరిచేరే చీమల పుట్ట/చంకి అద్దాలతో ధరించే కొత్త బట్ట
గోధుమ విత్తనాలతో మొలిచెను కలల తోట/జానపదుల బాణిలో ధూందాం పాట
రాగి చెంబులతో సుగంధ జలంను
అక్షువులు అనంతం/తీజ్ మా సంస్కృతికి
ఒక జాగృతి ఉత్సవం.."

.....(ఉట్నూరు కవిత, పుట.35,36)

ఈ విధంగా లంబాడీ యువతులు సమాజంలోని వారి సంస్కృతిలో భాగంగా జరిగే తీజ్ పండుగ ద్వారా ప్రపంచానికి సమైక్య జీవనాన్ని, స్త్రీ చైతన్యాన్ని, కుటుంబ జీవనాన్ని, వారి సంస్కృతి, సంప్రదాయాలను తెలియ జేస్తున్నారు. ఇది తెలంగాణాలో అత్యంత ప్రత్యేకతను సంతరించుకుని జరుపుకునే లంబాడీల సంస్కృతి, సంప్రదాయాల ఉత్సవం.

తండా జీవనం :

'లింగాల మంగమ్మ' రాసిన 'తండాజీవనం' కవిత 'శతమహిళా ఉగాది పురస్కారం' పొందిన కవిత. ఈ కవిత 'మహిళ' అను కవితా సంకలనం లోనిది. తండా సంస్కృతికి నిలువెత్తు అర్థాన్ని రచయిత్రి కొండను అద్దంలో చూయించినట్లు తండా సంస్కృతిని, వారి జీవనాన్ని కళ్లకు కట్టినట్లు చూపిచడం జరిగింది. వారి సంస్కృతిలో సుఖసంతోషాలతోపాటు విషాదాలు కూడా ఉన్నాయని ఈ తండా జీవనంలో కనిపిస్తుంది.

"అడవికి ఆనుకుని కొండ కోన వాగు వంకా మా జీవనం
మా తండా బహు సుందరం / అనేక సంస్కృతుల సమైక్య జీవనం
అమాయక జీవులం/ ప్రపంచానికి భిన్నంగా
మా వస్త్రాలంకరణ, మా యాస భాష

ఈ విధంగా బంజారా జాతి జీవనం అత్యంత దుర్భరంగా జీవనం కొనసాగిస్తున్నది. సరైన పనిలేక పట్టణం బాట పట్టి వెట్టిచాకిరి చేస్తున్నారు. జాతి హక్కుల కోసం పోరాడక తప్పదు. లేనిపక్షంలో జాతి రోజురోజుకు అంతరించే ప్రమాదంలో పడుతుందని కవి బంజారాభేరి కవితలో వివరించారు.

'ఆనందం' కవితను 'పంతులు నాయక్' రాశారు. ఈ కవిత 'రామ్ రామ్ నాయక్' కవితా సంకలనంలోనిది. మేము గిరిజనులం, గరీబ్, అమీన్ అనే తేడాలేని తండా జీవనం కొనసాగిస్తున్నాం. మా జీవనం జాతి సమైఖ్యతకు నిలువుటద్దం. కష్టాన్ని, సుఖాన్ని సమపాళ్ళల్లో అనుభవిస్తాం. మాదొక వసుదైవత కుటుంబం, వేట నుండి చావుదాకా అన్నింట్లో కలిసే ఉంటాం. మా తండా జీవనం రోజురోజుకూ క్షీణిస్తున్న దశకు చేరింది. అందుకు వలస వాదుల్లా పట్టణబాట పట్టేవాళ్ళం అయినారు బంజారాలు. ఎన్ని కష్టాలు వచ్చినా కలిసేవుంటూ, కలిసే జీవిస్తారని కవి తండా జీవనాన్ని వ్యక్తీకరిస్తున్నారు.

మేము గిరిజనులం/ గరీబ్ అమీర్ అనే అంతరాలు/ తేడాలు లేకుండా
జీవనాన్ని కొనసాగిస్తుంటాం/కష్టాన్ని సుఖాన్ని పాలు నీళ్ళలా
సమపాళ్ళలో అనుభవిస్తాం/ఏడ్పు నవ్వు ఆకలి అన్నీ
మాకు మామూలే

దొరికినపుడు కడుపునిండా తింటాం/వేట నుంచి చావుదాకా అన్నింట్లో
అందరం కలిసే ఉంటాం/మేము ఆఫీసర్లమయినా/ రోడ్లు వేసే కూలీలయినా
మా జాతి నిజాయితిగానే ఉంటుంది/మేము ఎప్పుడూ గొప్పవాళ్ళమే
మమ్మల్ని వేలెత్తి చూపేటోడేలేడు/ తరాలుగా మీరు చేసే తప్పులను
సరిదిద్దలేక మేము /తరతరాలుగా అడవుల్లోనే/ బతుకుతూ...."
"మా బతుకుల్ని బరిసెలగా/ఎక్కు పెడుతున్నాం /ఇక జీవితాంతం
ఆనందమే మహానందం /అంతులేని మా ఆనందాన్ని/ ఎన్ని జన్మలకైనా
నువ్వు అర్థం చేసుకోలేవు"

..... (రామ్ రామ్ నాయక్, పుట. 28, 29)

బంజారాజాతి కష్టాలలోనూ, సుఖాలలోనూ ఎప్పుడూ నిరంతర కృ'సుఖాలలో మనోధైర్యంగా బతికేస్తున్నారని అర్థం.

బంజారా వలస :

'బంజారా వలస' కవితను 'పంతులు నాయక్' రాశారు. ఈ కవిత 'రామ్ రామ్ నాయక్' లోనిది.

"లంబాడోళ్ళు /గుంపులుగా /ఆతారగా తట్టబుట్ట / సర్దుకొని పోతారెందుకే నాయనమ్మ
పట్నం పోతాండ్రు /బతుకు తెరువుకి /ఆ తండలల్ల యెంపాడ్ బడ్డది
గుక్కెడు మంచి నీళ్ళు గూడా /దొరకవాయె /పాపం లంబడోళ్ళు....."

(రామ్ రామ్ నాయక్, పుట. 53)

తండా అంతా పాడు పడిపోయింది. పనిలేక పట్నం వలసపోతున్నారు. తండాలో ముసలి అవ్వ, చిన్న పిల్లలు తప్ప ఎవరూలేని దుస్థితి. దానికి కారణం తండా జీవనంలో అత్యంత దుర్భరంగా జీవనం కొనసాగుతుంది. పంటలు పండించడానికి నీరులేక భూములు నోరు తెరుచుకున్నాయి. తండాలో తాగడానికి మంచినీళ్లు కూడా లేవు. అందుకనే పట్నంబాట పట్టిన లంబాడోళ్ళ జీవనంను కవి కవిత్వీకరించారు.

'రాం రాం' కవితను 'పంతులు నాయక్' రాశారు. ప్రపంచం మీద అతివేగంగా అభివృద్ధి పేరుతో ముందుకు వెళుతున్నా తండాలలో జీవనం మాత్రం అత్యంత దుర్భరంగా ఉంది. అత్యంత దుర్భంగా జీవిస్తున్నారు లంబాడోళ్ళు.

"ఎండి పోయిన కట్టెల మోపు దగ్గరనే ఉండిపోయినా /బతుకు భారమయితదని
పిల్లల్ని కని అమ్ముతనే ఉన్న /నల్లబెల్లం నీళ్ళ సాక్షిగా /నాకు తెలిసిన పనులే
నేను చేస్తపోతున్న /గవర్నమెంటు రూలు / తెలియనోళ్ళం..."...

(రామ్ రామ్ నాయక్,పుట.55)

భూమిమీద హక్కులేనివాళ్ళం అదేదో రియల్ ఎస్టేట్స్ అంటా, అది వచ్చాక లంబాడోళ్ళ భూములు లాక్కున్నారు. ఈరకమైన జీవనం అత్యంత దుర్భరంగా ఉందంటున్నాడు కవి.

లంబాడీ (బంజారా) జీవనం :

'దుగ్గు' కవితను 'పంతులు వడ్త్య' రాశారు. ఈ కవిత 'నసాబ్' (పంచాయితీ) లోనిది. మేము గిరిజన లంబాడీ తండాలో జీవనం కొనసాగిస్తున్నవాళ్ళం. పూర్వం రాజరికం కింద నలిగిపోయాం. దేశ స్వాతంత్ర్యం వచ్చాక మా జీవనం అత్యంత కష్టాలలో పడింది.

"గిరిజన జీవులం /లంబాడా తండావోల్లం /దేశ స్వాతంత్రానికి
రాజరికాన్ని బలిచ్చినోల్లం...../"ఎండిన అడివి కట్టెల్ని పాయిలోకి మోస్తున్నోల్లం/అడవి వస్తువులతో /మీ ఇండ్లకు ముస్తాబు చేస్తున్నోల్లం
కణికి (నూకలు) తింటూ బియ్యాన్ని పంచినోల్లం / కట్టె మోపుకి మిసన్ కాడ దుగ్గు తీసుకున్నోల్లం

రంగుల దుగ్గుగుడ్డతో ఒల్లు కప్పుకున్నోల్లం...."
.... (నసాబ్,పుట.29)

గిరిజన జీవితాలలో మైదాన ప్రాంతం దగ్గరగా కొండ కోనలకు ఆనుకొని జీవిసున్న బంజారాల జీవనంలో ఎటువంటి మార్పు రాలేదు. ఇక వారి జీవనం అత్యంత దుర్భరంగా కొనసాగుతుంది అని కవి వివరించిన సందర్భం లోనిది.

'బంజారా భేరి' కవితను 'పంతులు వడ్త్య' రాశారు. ఈ కవిత 'నసాబ్'(పంచాయితీ)లోనిది. బంజారా జీవితంలో మార్పు ఏనాటికి వస్తుంది అని ఎదురు చూసి చూసి అలసిపోయినా, మా తండాలలో బండారా నగారా భేరి మోగిస్తున్న తరుణంలో మా తండానిండా తోరణాలుగా ఎర్రని జెండాలు అలుముకున్నాయి. ఇక కొత్త చరిత్ర రాసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

"మాతండా నిండా /తోరణమయి అల్లుకుంటుంది /
ఆ పాటల ఆకలి రాగాలు /నా గుండెల్ని కదిపాయి
సంకలో బిడ్డని నిదుర లేపాయి /మా కన్నీరు తాగిన ఈ నేల /కసిని పెంచుతుంది
కొత్త చరిత్ర రాసేందుకు /నెత్తుటి సిరాని ఒలకబోస్తుంది /నాగలి కర్రూ గడ్డపారా
అరచేత ఆయుధ మవుతునై్న /బతుకును బలితీసుకున్న /ఆయాల్టి ఆ మాట
ఇంకా గుర్తుగానే ఉంది /నీల్లలోని చేపను /నేపలై జంతువును
వాటంగా పట్టినోల్లం /వాలు చూసి కొట్టినోల్లం....."
(నసాబ్, పుట. 30)

సేవాలాల్ మహారాజ్ గురువు ఆశీస్సులతో, కొమురం భీం స్ఫూర్తితో రేపటి తొలిరోజుకోసం తండాలలో ఉద్యమస్ఫూర్తి రగిలించి బంజారాభేరి మోగిస్తుంది.

'ఆకలి...' కవితను 'పంతులు వడ్త్య' రాశారు. ఈ కవిత 'నసాబ్'(పంచాయితీ)లోనిది. లంబాడీ ప్రజలు ఆకలికేకలు తట్టుకోలేక తమ పాలాలలోనే పాలేర్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. తమ కన్నబిడ్డలకు పట్టెడు అన్నం పెట్టలేని కన్నతల్లి దుస్థితి. పిల్లలు పుట్టగానే అమెరికా గ్రీన్‌కార్డు హైల్టర్‌కు అమ్ముకొనే దుస్థితి.

"ఆకలి మంటలు, /భగ భగమని మండే మంటలు /
మాడిన లంబాడి ప్రేగు
అమ్మ ఆకలి అని అరిచే పసికూనకు /పట్టెడన్నం పెట్టలేకుంది
బువ్వలేక పాలురాక ఏమి తినాలో తెలీక /బజారుల్లో మన పాలాన్ని దొరోనికి
తాకట్టు పెట్టి పరిగేరుకున్న /పావుసేరు ఒడ్లు /కోమిటి వెంకన్నకు అమ్మినట్లు
నవ మోసాలు మోసి /రెండు ప్రాణాలు పోగొట్టు కుంటూ....."
(నసాబ్, పుట. 57)

ఆకలి కేకలతో తండాలోని పసిపిల్లలను బ్రోకర్లు ద్వారా తండా ఆడపిల్లలను అమ్ముకొనే దుస్థితి. ఆకలి, పేదరికం, అధిక సంతానం పోషణభారంతో అమ్ముకొనే దుస్థితి. ఇక ఎన్నడు మారుతుందో ఈ దేశం అని కవి ఎదురు చూస్తున్నాడు.

'అడ్డకూలి' కవితను 'నూనావత్ రాంబాబు' రాశారు. ఈ కవితను తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంవారు నిర్వహించిన 'ప్రపంచ రికార్డు కవితా సమ్మేళనం'లో (డిసెంబరు-17,19, 2011) సమర్పించడం జరిగింది. తండా ప్రజల జీవనం దుర్భర స్థితిని, వారి వెట్టిచాకిరీని కళ్ళకు కట్టినట్టు కవిత్వీకరించారు.

"నా పేరు చంద్రు నా తాండ సుదూరం /మేమో అడ్డ కూలీలం
మాతండా కరువు కోరలలో చిక్కినోళ్ళం /తినడానికి తిండి దొరకనోళ్ళం
పాలాలు దున్ని హలాలుగా మలిచినోళ్ళం /తండా జీవనం దుర్భరంగా మారినోళ్ళం
మా జీవనం దినదినగండం!/ పనికోసం పట్నంబాట పట్టినోళ్ళం /నా అడ్డ చందానగర్ గడ్డ!
నా జీవనం సిటిస్లమ్ ఏరియా /పని దొరికినరోజు

పండుగా.../పనిలేని రోజు జీవనం దండగా!
అడ్డలో కూలికోసం పడిగాపులు గాసేటోళ్ళం.../ఏ పని దొరికిన చేసేటోళ్ళం
నా ఇంటిది! పది ఇళ్ళల్లో పని చేసేట్టిది.../మా పిల్లాల జీవనం అతిదుర్భరం
చదువు సంధ్య తెలియనివాళ్ళం /పనికోసం పడిగాపులు గాసేటోళ్ళం
మేము అడ్డకూలిలం! పనికోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూసేటోళ్ళం!
ఇదే మా జీవనయానం /అందుకే అయ్యాం అడ్డాకూలీలం!"

పనివున్న రోజు తినడం లేనిరోడు పస్తుపడుకోవడం తండా ప్రజల జీవనం, వారి ఆకలికేకలు జీవనంతో భాగంగా వారు పడుతున్న కష్టాలను తెలియజేశారు.

ఈ విధంగా బంజారాలు సమాజంలోని వారి సంస్కృతిలో భాగంగా జరిగే తీజ్ పండుగ ద్వారా ప్రపంచానికి సమైక్య జీవనాన్ని, స్త్రీ చైతన్యాన్ని, కుటుంబ జీవనాన్ని, వారి సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తున్నారు. ఇది తెలంగాణాలో అత్యంత ప్రత్యేకతను సంతరించుకుని జరుపుకునే లంబాడీల సంస్కృతి, సంప్రదాయాల ఉత్సవం. తండా సంస్కృతికి నిలువెత్తు అర్థాన్ని కొండను అద్దంలో చూయించినట్లు తండా సంస్కృతిని, వారి జీవనాన్ని కళ్లకు కట్టినట్లు చూపిచడం జరిగింది. వారి సంస్కృతిలో సుఖనంతోషాలతోపాటు విషాదాలు, పెదరికం, అధిక సంతానం, పోషణభారంతో అమ్ముకొనే దుస్థితి. కూడా ఉన్నాయని ఈ తండా జీవనంలో కని పిస్తుంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కథల్లో సామాజిక జీవన చిత్రణ

– డా॥. నల్లపనేని విజయలక్ష్మి, తెలుగు ఉపన్యాసకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

మనిషితో పాటే పుట్టినవి కథలు. ఒకప్పటి కథలు నీతిబోధకో, ధర్మబోధకో, మాయలు, మంత్రాల వర్ణనలతో ఆశ్చర్యాన్ని కలిగించటానికో పరిమితమై ఉండేవి. పాశ్చాత్య ప్రభావంతో వెలువడిన ఆధునిక కథానికా ప్రక్రియ ఈ కథలకు భిన్నమైనది. పాశ్చాత్యులు కథని ఒక అవస్థాత్మకం (The short story deals with a single situation) అని నిర్వచించారు. ఆధునిక కథలో ఒక సందేశమో, చమత్కారమో ఉంటే ఉండవచ్చు. కాని అది ప్రధానంగా వాస్తవిక చిత్రణ కలిగినది.

'కథలు జీవితాన్ని ప్రతిబింబించటమే కాదు, వ్యాఖ్యానించాలి; పాఠకుణ్ణి రంజించటంతో పాటు, మేధస్సును కూడా కదిలించాలి' అన్నారు కొడవటిగంటి కుటుంబరావు. ఆ విధంగా భిన్న వర్గాలకు చెందినవారి జీవితాలను ప్రతిబింబించటమే కాక వ్యాఖ్యానించిన కథలు తెలుగులో ఎన్నో ఉన్నాయి. ఈ కథల ఆధారంగా మనం సమాజంలోని వివిధ వర్గాలకు చెందినవారి జీవితాలు ఎలా ఉన్నాయి? వారు అనుభవిస్తున్న కష్టనష్టాలు ఏమిటి? సమాజంలో భాగమై సమాజాన్ని నడిపించే ప్రభుత్వ వ్యవస్థల పని తీరు ఎలా ఉంది? వంటి అంశాలను అధ్యయనం చేయవచ్చు.

మోతుబరి రైతు కుటుంబంలోని పిల్లకూ, కూలి పని చేసుకునే కుటుంబంలోని పిల్లకూ జీవితం ఎంత భిన్నంగా ఉంటుందో, సామాజిక హోదాల్లోని తేడా, ధనిక, పేద తేడాలు వారి జీవితాలను ఎలా శాసిస్తాయో చక్కగా వివరించిన కథ 'కుంకుడాకు'. ఈ కథను చాగంటి సోమయాజులు రచించారు.

అప్పలనాయుడు మోతుబరి రైతు. చినదేముడు కూలీ. అప్పలనాయుడు కూతురు పారమ్మ, చినదేముడు కూతురు గవిరి ఒకే ఈడు వారు. పారమ్మ పరికిణీ కట్టుకొని, గావంచా పైటేసుకుంటే గవిరికి గోచీయే గతి. పారమ్మ చెవులకి, ముక్కుకి బంగారపు కాడలు, మెడలో పగడాలు, చేతులకీ, కాళ్లకీ సిల్వరు కడియాలు ఉంటే గవిరికి ముక్కుకి రాగి కాడలు మాత్రమే ఉన్నాయి. బుర్ర మీద వెంట్రుకలే లేకపోయినా చక్కగా నూనె పెట్టుకుంటుంది పారమ్మ. ముంతంత కొప్పున్నా దానికి పెట్టుకోవటానికి నూనె లేని పరిస్థితి గవిరిది. వరి అన్నం చేపల పులుసుతో పారమ్మ భోజనం చేస్తే, గవిరి ఇంట్లో పొయ్యి రగలటమే గగనం.

అప్పలనాయుడు కూతుర్ని చదివించటానికి సిద్ధమైతే, ఇంటిల్లిపాది కష్టపడినా నోట్లోకి నాలుగు వేళ్లు వెళ్లే పరిస్థితి లేక కూలివాళ్లకు చదువెందుకని కూతురిని బడికి పంపనంటాడు చినదేముడు.

ఆడుతూ పాడుతూ పొలాల్లోని పెసరకాయలు కోసుకుంటూ, చింతకాయలు రాల్చుకుంటూ పారమ్మ ఖుషీగా తిరుగుతుంటే, ఎనిమిదేళ్లకే సంసారభారం నెత్తి మీద పడుతుంది గవిరికి. ఇంటిలోకి నీళ్లు మొయ్యటం, ఒక పూటకు సరిపడా వంట చెరకు తేవటం దాని రోజువారీ బాధ్యతలు.

కడుపు కరకరలాడుతున్నా పొలాల్లో పడి పెసరకాయలు తెంపుకుంటే పెద్ద నేరమౌతుందని గవిరి భయపడుతుంది. పారమ్మ మాత్రం 'సూసి నోడెవడు? సూసినా నా నప్పల నాయుడి బొట్టిని. ఆళ్ళ మొకం ఏటంటారు?' అని కొట్టిపడేస్తుంది. సామాజిక హోదా నేరాలను ఎలా కప్పేస్తుందో ఆ మాటలను బట్టి అర్థమౌతుంది. రాలిన కుంకుడాకులు, చింతకంప ఏరుకున్నందుకే గవిరిని కామందు తన్నాడు. మరెవరో తుప్పల చాటున తట్టడు పేడను దాచుకుంటే ఆ దొంగతనాన్ని కూడా గవిరి మీదే వేసి కొట్టాడు.

సామాజిక హోదాలు, ఆర్థిక స్థితిగతులు సమానంగా జీవించవలసిన మానవుల మధ్య ఎటువంటి అంతరాలను సృష్టిస్తున్నాయో ఈ కథ ద్వారా చా.సో చక్కగా వివరించారు.

కోర్టులు, సాక్ష్యాలు, తీర్పుల వెనుక ఉండే మాయల్ని, ఆ మాయల మధ్య సామాన్యులు అనుభవించే బాధని, లోకం తీరుని వివరించిన కథ 'మాయ'. ఈ కథను రాచకొండ విశ్వనాథశాస్త్రి రచించారు. సివిల్ కేసైనా, క్రిమినల్ కేసైనా సాక్ష్యంతోనే సంబంధం కాని సత్యంతో సంబంధం లేదన్న విషయాన్ని ఈ కథలో నిరూపించారాయన.

సారా వ్యాపారం చేసుకునే ముత్తేలమ్మ తనకు నెల మామూలు ఇవ్వకపోగా తిట్టిపోసిందన్న కోపంతో హెడ్ కానిస్టేబుల్ దొంగ సారా కేసు బనాయించాడు. అతడే మళ్లీ ఆమె వద్ద డబ్బు తీసుకొని కేసును తేలగొట్టాడు.

కమీషన్ కోసం కేసుల్ని లాయరుకు అప్పజెప్పేవాళ్లు, లంచం తీసుకొని దొంగ సాక్ష్యాలు చెప్పేవాళ్లు, వ్యాపారాలు చేసుకొనే వాళ్ల మీద నెల మామూళ్ల కోసం దాష్టికాలు చేసే పోలీసులు, హృదయాలను పక్కన పెట్టి ఫీజుల కోసం మాత్రమే వాదించే ప్లీడర్లతో కూడిన వ్యవస్థ డొల్లతనాన్ని ఈ కథలో రచయిత చిత్రించాడు. రచయిత ముత్తేలమ్మతో పలికించిన మాటలు లోకం తీరును తెలియజేస్తాయి.

'పీడరు బాబూ! సెప్తున్నా యిను! నువ్వే కాదు ఈ బాబే కాదు. ఏ మనిషి మంచోడని ఒవురు జెప్పినా నాను నమ్మను. ఈ నోకంలో డబ్బు యాపారం తప్ప మరేట్నేదు. పసువులు నోర్లేని సొమ్ములు- ఆటికి నీతుంది కాని మనకి నేదు. సదువు లేన్దాన్ని నాకూ నేదు; సదువుకున్నోడివి నీకూ నేదు. డబ్బుకోసం నోకం నోకఁవంతా పడుసుకుంటోంది. డబ్బుకి నాను సారా అమ్ముతున్నాను. డబ్బుకి సదివిన సదువంతా నువ్వమ్ముతున్నావు. డబ్బుకి పోలీసోళ్ళు నాయాన్నమ్ముతున్నారు. మందుకోసరం పెద్దాసుపత్రికెల్తే అక్కడ మందులమ్ముతున్నారు. మంచాలమ్ముతున్నారు. లంజెలు రోడ్లంట, రిచ్చాలంట, కార్లంట తిరిగి ఒళ్ళమ్ముకుంటున్నారు. గుళ్లో కెళ్ళి కొబ్బరికాయ సెక్కా కాన్డబ్బు ఇస్తే ఆ దేవుడి దయే అమ్ముతున్నారు. నోట్లిస్తే పీడరు బాబూ, వోట్లొస్తే నువ్వూ, నానూ, ఈ బాబూ అందరం అమ్ముడయిపోతున్నాం. అమ్మకం! అమ్మకం తప్ప మరేట్నే దీనోకంలో. నాను సదువుకో నేదుగాని సూసిన సత్తెం మాత్తరం అది. తప్పయితే తప్పని సూపించి సెప్పు! ఇంటాను.'

ఇన్ని అమ్మకాల మధ్య ముత్తేలమ్మ వంటి సామాన్యులు అనుభవిస్తున్న బాధను, తిమ్మిని బమ్మిని చేసి మాయ చేసే మహానుభావుల తీరును తెలిసీ పట్టించుకోకుండా తప్పుకునే మహాత్ములకు ఈ కథ రూపంలో చురక వేశారు రచయిత.

రాష్ట్ర స్థాయిలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేయటం ఎంత కఠినశిక్షో వివరించిన కథ 'కఠినశిక్ష'. ఒక ఉద్యోగి తన జీవితంలో ఎదుర్కొన్న కఠిన పరీక్షను చిత్రించిన కథ ఇది. దీనిని భమిడిపాటి రామగోపాలం రచించారు.

ఒక నిజాయితీ పరుడైన ఉద్యోగి వాసుదేవరావు. అతడు ఆరేళ్లు బోర్డాఫ్ రెవెన్యూ ఆఫీసులో పని చేశాడు. మూడు రెవెన్యూ టెస్టులు, రెండు ఎకవుంట్ టెస్టులు, క్రిమినల్ జుడీషియల్ టెస్టులు, సర్వే ట్రెయినింగ్ ఫైనల్ పరీక్ష అలవోకగా పాసయ్యాడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రెండేళ్లు పని చేస్తేనే ప్రమోషన్ వచ్చే అవకాశముండడంతో R.I గా పని చేయడానికి వచ్చాడు. పై అధికారులు వచ్చినప్పుడు వారికి జరిపించే మర్యాదల కోసం, పై అధికారులు పురమాయించే ఇంటి పనులు నిర్వహించటం కోసం తన చేతిలో ఉన్న డబ్బులన్నీ ఖర్చు పెట్టవలసి రావటంతో ఇంటినుండి డబ్బులు తెప్పించుకొని మరీ ఖర్చు పెడతాడు. భార్య తన మెడలోని గొలుసు అమ్మి మరీ డబ్బు పంపుతుంది. చివరకు ఆ విధంగా తాను ఎంతోకాలం నెట్టుకురాలేనని గ్రహిస్తాడు. ఆ పరిస్థితుల నుండి గట్టెక్కటం కోసం లంచాలు తీసుకోవటం

మొదలు పెడతాడు. చివరకు ఉద్యోగం కోల్పోయి రెండేళ్లు జైలు శిక్ష అనుభవించవలసి వస్తుంది.

ఒక నిజాయితీపరుడైన ఉద్యోగి ఆ విధంగా తన నిజాయితీని, ఉద్యోగాన్ని కోల్పోయేలా చేసిన రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లోని పరిస్థితులను రచయిత వివరంగా వర్ణించారు. కలెక్టరుగారి భార్య శివార్చనకు అవసరమైన నాగలింగ పుష్పాలను సమకూర్చటం కోసం శెలవు రోజంతా తిరగటం, అప్లికేషన్ అవసరం లేకుండా పాతిక కేజీల పంచదార పర్మిట్టు తెచ్చి ఇస్తానని బ్రతిమాలి నాగ లింగ వృక్షం యజమాని నుండి ఆ పూలను సేకరించటం మొదలైన సన్నివేశాల సాయంతో అధికారులు తమ క్రింద పనిచేసే చిరుద్యోగులను స్వంత పనులకు ఎలా వాడుకుంటారో తెలియజేశారు.

పై అధికారులు ఇన్‌స్పెక్షన్ కోసం వస్తే వారి కోసం గెస్ట్‌హౌస్ బుక్ చేయటం, అక్కడ హాట్ వాటర్ సిస్టమ్ సరిగ్గా ఉందో లేదో చెక్ చేయటం, దగ్గరుండి బాత్రూమ్ డెట్టాల్‌తో క్లీన్ చేయించటం, దగ్గరుండి పక్క దుప్పట్లు, తలగడలు, గలీబులు మార్పించటం చెయ్యాలి. ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండాలి. కాఫీ, బోర్న విటా, సిగరెట్లు, బిస్కెట్లు - ఏవి కావాలంటే అవి క్షణాల మీద అందించాలి. స్నానానికి ఖరీదైన సబ్బు, తినటానికి రకరకాల పండ్లు సిద్ధంగా ఉంచాలి. అధికారితో పాటు ఆయనను కలవటానికి వచ్చేవారికి వెజ్ట్రన్ స్టయిల్ బ్రేక్ ఫాస్ట్, లగ్జూరియస్ డిన్నర్ ఏర్పాటు చేయాలి. ఇన్నింటి కోసం జేబులోని డబ్బులన్నీ ఖర్చు పెట్టినా అధికారి మెప్పు కోసం చాలా తక్కువే ఖర్చు అయిందని చెప్పి ఆయనను సంతోషపెట్టాలి.

రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే చిరుద్యోగుల జీవితాలను వాస్తవికంగా చిత్రించి వారి పట్ల సానుభూతిని కలిగించే కథ ఇది.

గ్రామీణ జీవనచిత్రణతో పాటు రైతుల సమస్యలను చిత్రించిన కథ 'చింతల తోపు'. రచయిత పాపినేని శివశంకర్. ఉండ్రాళ్ల తద్దె, దీపావళి వంటి పండుగలు, కోతి కొమ్మచ్చి, గోలీలాట, వాలింకి మొదలైన కను మరుగవుతున్న పిల్లల ఆటల వర్ణనలతో పాటు రైతుల జీవన స్థితిగతుల్ని వివరిస్తుందీ కథ.

చింతల తోపుకు యజమాని వరదయ్య. సన్నకారు రైతు. అప్పు తెచ్చి పొలం సాగు చేశాడు. పెద్ద వానకు నువ్వుచేను ఊరకే పోయింది. పెసర కొంత చేతికి వచ్చినా గింజలు సరిగ్గా ఊరలేదు. పండిన పంట రెండు క్వింటాళ్లు మాత్రమే. వాటిని అమ్మినా బాకీలు తీరని పరిస్థితి. పొగాకు పంట వేస్తే బాకీ తీరుతుందన్న ఆశతో పొగ నారు తెస్తే, నాటిన మొక్కల్లో కొన్ని బతకలేదు. మళ్లీ నారు తెప్పించవలసి వచ్చింది. కూలీల సాయంతో కలుపు పెరగకుండా పంటను కాపాడుకున్నా పంట చేతి కొచ్చే సమయంలో గాలివాన రావటంతో పొగ తోటలు దెబ్బతిన్నాయి. ఆకులకు మచ్చ తెగులు రావటంతో రంగు, నాణ్యత తగ్గిపోయాయి. ఎగుమతి ఆర్డర్లు ఆగిపోవటంతో పొగాకు రేటు పడిపోయింది. ప్రభుత్వం ఎన్.టి.సి ద్వారా పొగాకు కొనాలని కోరుతూ రైతులంతా ఉద్యమిస్తే గాని పొగాకు అమ్ముడుపోలేదు. వరదయ్య పొగాకంతా అమ్ముడు పోయినా పట్టుమని ఎనిమిది వేలు కూడా రాలేదు. కొట్లో బాకీ, బ్యాంకి బాకీ, సీజన్ ఖర్చుల కోసం పట్నంలో మందుల కొట్లో తెచ్చిన బాకీ - ఏవీ తీర్చే పరిస్థితి లేదు. అప్పులు తీర్చటం కోసం కుంట చేను అరెకరం బేరం పెట్టవలసి వచ్చింది.

తాకట్టులు, జప్తులు, ఉరేసుకోవటాలు రైతుల జీవితాల్లో సాధారణమౌతున్న పరిస్థితి, ఏళ్ల తరబడి చాకిరీ చేసినా ఏ మాత్రం ఎదుగుదల లేక తరువాతి తరమైనా బాగుపడాలన్న కోరికతో వారిని వ్యవసాయానికి దూరంగా చదివించుకుంటున్న పరిస్థితి ఈ కథలో హృద్యంగా చిత్రితమైంది. అవిద్య, ఎలక్షన్‌ల సమయంలో తప్పితే ఊరి వైపైనా తొంగి చూడని రాజకీయ నాయకులు, వర్షాధారమైన మెట్ట భూములకు నీటి సౌకర్యం కల్పించే అవకాశమున్నా స్పందించని ప్రభుత్వాలు, సహకరించని ప్రకృతి నడుమ జీవనపోరాటం సాగించలేక నలిగిపోతున్న

రైతుల జీవిత చిత్రాన్ని కళ్లెదుట పెడుతుందీ కథ. కథల్లో చిత్రించబడిన సామాజిక పరిస్థితుల్ని అధ్యయనం చెయ్యడం ద్వారా మనం సమాజంలో చోటు చేసుకుంటున్న మార్పులను గుర్తించవచ్చు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'ఇలాంటి తవ్వాయి వస్తే' కథను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఊరి పెద్దలను ఎదిరించి బ్రాహ్మణ అగ్రహారంలోని చెరువును ఉపయోగించుకోవటానికి మాదిగలు చేసిన పోరాటాన్ని ఈ కథ వివరిస్తుంది. ఈ కథ ఆధారంగా ఆనాటి సమాజంలో పాతుకుపోయిన జాతి, మత, వర్గ సంబంధమైన అంతరాలను గ్రహించవచ్చు. బస్సు రాక జట్కా బండి నడుపుకునే వాళ్ల ఉపాధిని దెబ్బ తీసిన విధానం 'అద్దద్దో బస్సు' (అమరావతి కథలు) కథ వివరిస్తుంది. చిన్న కార్లు వచ్చాక పెళ్లిళ్లలో పల్లకీ ఊరేగింపులు ఆగిపోవటంతో పల్లకీని సరఫరా చేసి బతికే వ్యక్తులు జీవనాధారాన్ని కోల్పోయి అల్లాడిన విధాన్ని 'విరిగిన పల్లకీ' కథ (అమరావతి కథలు) వివరిస్తుంది.

సామాజిక హెూదాలు, బీదా,గొప్పా తేడాలు మనుషుల జీవితాలను శాసించే విధాన్ని తెలుసుకోవాలన్నా, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు, చిరుద్యోగులు, రైతులు - ఇలా వివిధ వర్గాల వారు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్ని తెలుసుకోవాలన్నా, సమాజంలో చోటు చేసుకుంటున్న మార్పులను గుర్తించాలన్నా ఆధునిక కథే ఆధారం.

ఆధార గ్రంథాలు :

1. కథానికా లక్ష్యము-లక్షణాలు - సంకలన కర్త - డా. వేదగిరి రాంబాబు
2. కళింగ కథానికలు - సంకలనం - చాసో
3. సగం తెరిచిన తలుపు - పాపినేని శివశంకర్
4. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్న కథలు (పన్నెండో సంపుటం)
5. అమరావతి కథలు - సత్యం శంకరమంచి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వచన కవిత్వంలో రైతు జీవిత చిత్రణ

– డా॥. సుభ్బర రాకుంట్లనేయులు, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎం.ఎన్.హళ్ళి, అనంతపురం జిల్లా.

సాహిత్యం జీవనది వంటిది. కాలానుగుణంగా మార్పులు చేర్పులూ చెందుతూ ముందుకు సాగిపోతూనే ఉంటుంది. దానికి ముగింపు లేదు. సాహితీ సృజన కారులైన కవులు వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేస్తూనే ఉంటారు. ప్రజలను చైతన్యపరుస్తూనే ఉంటారు. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. 'కాదేది కవిత కనర్హం' అన్న మహాకవి శ్రీశ్రీ మాటను ఒంటబట్టించుకున్న ఆధునిక కవులు సమకాలీన సమాజంలోని అన్ని అంశాలను వస్తువుగా ఎన్నుకొని సాహిత్య సృజన చేసారు. ఈ దృక్కోణంలో చూసినపుడు దాదాపు మూడు నాలుగు దశాబ్దాలనుంచి భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్య 'రైతు సమస్య'. రైతు అహర్నిశలు కృషిచేస్తున్నా అప్పుల్లో మునిగిపోతూనే ఉన్నాడు. స్వాతంత్ర్యానంతరం నుంచి నేటివరకు వేలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ గడ్డు సమస్యను ఎందరో వచనకవులు కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

భారతదేశం వ్యవసాయ ప్రధానమైనదేశం. రైతుకీ, భూమికీ, అవినాభావమైన ఒక అనుబంధాన్ని సుస్థిరం చేసుకున్నదేశం. గ్లోబలైజేషన్ వేగం పుంజుకుంటున్న ఈ నేపథ్యంలో రైతుకీ నేలకీ ఉన్న ఆత్మీయతని తెంపెయ్యడం కళ్ళఎదుట జరుగుతున్న అత్యంత విషాదకరం. ఈ దేశంలో సామ్రాజ్యవాదుల శాసనాల్ని అమలు చెయ్యడంలో ప్రభుత్వం అనుసరించే విధానం ముందుగా ఉన్నత వర్గాల్ని మరింత ఉన్నతంగా తయారు చెయ్యడానికి ప్రయత్నించడమే. మట్టి విషయాన్ని మరచిపోయి సర్వాంగాల్నీ యాంత్రికంగా మార్చడమే. యంత్రాన్నే నమ్ముకొని జీవితాన్ని సర్వవిధాల కృత్రిమం చేసుకున్న ఆధిపత్య దేశాల బాటలో నడవాలంటే ముందు ఈ దేశంలో నేలమీద అభిమానం పోవాలి. శ్రమ మీద గౌరవం నశించాలి. అందువల్లనే శ్రమచేసే వర్గం మీదుగా కాకుండా యాంత్రికంగా సంపాదించే వర్గం మీదుగా అభివృద్ధి జరుగుతుంది. దాని ద్వారా పెట్టుబడిదారి వ్యవస్థ బలపడుతుంది.

ఆధునిక తెలుగు కవిత్వానికి ఉద్యమాల మీదుగా ప్రయాణించిన నేపథ్యం బలంగా ఉంది. అందువల్ల తెలుగు కవులు ఉన్నత వర్గాలకు ఉపయోగపడే సంస్కరణలకు తాళం వెయ్యడం కంటే పీడిత వర్గాల ప్రగతికోసం కవిత్వాన్ని వినియోగించారు. మట్టిని నమ్ముకుని మోసపోతున్న రైతు జీవితాన్ని గురించి వందలాది కవితలు వెలువడ్డాయి. దర్భశయనం శ్రీనివాసాచార్య 'ధాన్యంముందు కూర్చుని' అనే కవితలో ఇలా అంటాడు.

ఉత్తుత్తి తీర్మానాల
ఎండు తోరణాలు మాకేంటి
అంగడి మాకు పరాయిదైనపుడు
మార్కెట్ భాషలో నేను అమ్మినట్లు మీరు కొన్నట్లు
ఒక లావాదేవీ
కానీ రహస్య మేంటి?
మీరు ధాన్యం మీదుగా పదిరెట్లు పైకి
నేను ధాన్యం మీదుగా పది మెట్లు కిందికి
పొలాలేమో పల్లెటూళ్ళో
అంగళ్ళేమో నగరాల్లో
ఈ రాజకీయం నాకంతుబట్టదు
అంగట్లో ధాన్యం పోతోంది, దైన్యం మిగుల్తోంది

పై కవితలో మనదేశంలో రైతు మార్కెట్‌కి ఎలా బానిసగా చెయ్యబడ్డాడో కవి చెప్పాడు. తాను పండించిన పంటకీ తాను అమ్ముకోవడానికి మధ్య ఎంతో దళారితనం ఉంది. అత్యంత బాధాకరమైన విషయమేమిటంటే అంగిట్లో ధరని నిర్ణయించే వాళ్ళకు నాగటి చాలంటే

కూడా తెలియదు. ఇది రైతుల దౌర్భాగ్యం. ప్రతి ఉత్పత్తి దారుడు వాని ఉత్పత్తికి వాడే ధర నిర్ణయిస్తాడు. అయితే రైతుకిమాత్రం ఆ హక్కుగాని స్వేచ్ఛగానీ లేదు. రైతుకు ఆ హక్కు వచ్చేంతవరకు రైతు దుస్థితిలో ఎలాంటి మార్పు రాదని స్పష్టంగా చెప్పవచ్చు.

కరువు కారణంగా వ్యవసాయపు పనులులేక, శ్రమకు విలువలేక, గ్రామాల నుండి నగరాలకు లక్షలాది రైతులు వలసలు పోతున్నారు. ఇది ఈ దేశపు మౌలిక శ్రమ సంస్కృతిని నాశనం చెయ్యడం వల్ల వచ్చిన ఫలితమే. యాంత్రికతను ఆరాధిస్తూ, వ్యాపార సంస్కృతిని పెంచడంవల్ల వచ్చిన అనర్థమే ఇది. ఈ విషయాన్ని గూర్చి నాళేశ్వరం శంకరం 'వలస' కవితలో ఇలా అంటాడు.

భూమిని వదలతున్నందుకు దిగులు
పరిసరాలను వదలుతున్నందుకు
పాపం అన్నింటినీ శరీరంలోని
నరాల్లా నమ్ముకున్న వాడు
భూమిని నమ్ముకున్నవాడు
మేఘాన్ని నమ్ముకున్నవాడు
మోహాల్ని పంట పొలాల్ని ప్రాజెక్టుల్ని
దేశసౌభాగ్యాన్ని నమ్ముకున్నవాడు
భూదేవి పగుళ్ళమధ్య దాహం తీరక
సుళ్ళు తిరిగిన పంట పొలాల్లోంచి
గొంతెండిన భూమిలోంచి
వలస పోతున్నాడు దిగులుగా
దీనంగా ఎత్తిన తల దించకుండా - అంటాడు.

భూమిని, సొంత ఊరిని వదలలేక ఎలా రైతు మధన పడతాడో చక్కగా చిత్రించాడు కవి. ఉద్యోగం రాగానే ఎగిరి గంతేసి ఎక్కడెక్కడికో వెళుతున్నారు. కానీ రైతు మాత్రం అలా వెళ్ళలేకపోతున్నాడు. దీనికి ప్రధాన కారణం అతనికున్న మానవతా గుణమని చెప్పక తప్పదు.

పత్తిరైతులు వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని జూకంటి జగన్నాథం 'ఖనన హననం' అనే కవితలో ఇలా తెలిపాడు.

శవాల్ని పీక్కు తింటున్న దుర్మార్గం
విచ్ఛిన్నత జీవితాలతో వ్యాపారం చేసే అడ్డదారి
రాజ్యం ఇప్పుడు బహుళ జాతి సౌజన్యంతో
శవయాత్రకు సన్నాహ సారథ్యం వహిస్తోంది
జ్వాజ్వల్య మానంగా వెలుగుతున్న దీపాలు అలిసిపోగా
కళ్ళల్లో నీళ్ళను కళ్ళల్లో కుక్కుకుంటూ
నిశ్శబ్దంగా ఒదిగిపోతున్న రక్తసిక్తబలి దానాలు
ఇక నడయాడుతున్న ప్రదేశమంతా
పచ్చి పచ్చి రొచ్చు మృత్యు వాసన
ఇక నాగలి రైతు మోస్తున్న శిలువ - అంటాడు.

ఈ కవితలో ఎంతో ఆర్ద్రత ఉంది. ఆవేదన ఉంది. రైతు శ్రమ ఉంది. అయినా దానిని గుర్తించేవారు లేరు.

'గోబలైజేషన్' అన్నది భారతదేశంలోని అత్యంత్య విశిష్టమైన రైతు ప్రతీకనీ, స్వభావాన్నీ, జీవన విధానాన్ని విధ్వంసం చేస్తున్నది. ఈ విషయాన్ని 'రిహార్సల్' కవితలో గౌతమ్ ఇలా అంటాడు.

సమాధిలో బతికుండడం నేరం
శరీరం నిండా పచ్చిగడ్డి మొల కెత్తాకా
నేను మనిషినే అనడం నేరం
దేశాల్ని గురించి ఏదిమాట్లాడుకోవాలి భాయ్
మూతి మీద బహుళ జాతి విషసూదుల్ని మెలేసి
వాడు ముద్దులతో మన్ని రక్తసిక్తం చేస్తున్నాడు
మన మీద దివ్యమైన తాజ్‌మహల్ కడుతున్నాడు - అంటాడు.

రైతు దుస్థితిని పై కవితలో అద్భుతంగా చిత్రించాడు కవి.

బ్యాంకు అధికారులు కారు. ఇల్లు కొనడానికి కంపెనీ పెట్టడానికి ఉదారంగా లోన్లు ఇస్తారు. కానీ రైతుకు మాత్రం లోను ఇవ్వరు. కాళ్ళ చెప్పులు అరిగిపోయేలా తిప్పిస్తారు. ఈ విషయాన్ని గూర్చి కవి ఛాయారాజ్ ఇలా తెలిపాడు.

గ్రామాణ బ్యాంకు తలుపు తెరుచుకుంది
లోను ప్రేమ లేఖ క్యూలో నిలబడింది
ఆసుపత్రి మెట్ల మీద జ్వరం మాతర కోసం కూచుంది
రిజిస్టారు ఆఫీసులో రైతులు నిషానీలు దిద్దుతున్నారు
క్రీచాటు కాగితాలపై కథలు రాస్తున్నారు మాజీ కరణాలు
దుక్కులు సాగుతున్న ఇరుమారు ముమ్మార్లు
అంతరాత్మలోని ఆవేశాలను అనుభూతుల్ని
.....

.....
రెండు మూడు కన్నీటి చుక్కలను భరించలేని
పాలం పాతాళంలోనికి దిగిపోతున్నట్లుంది - అంటాడు.

కరువు, కరెంటు కొరత, గిట్టుబాటు ధరలేకపోవడం, వర్షాభావం, బోర్లు విఫలం కావడం, కూలీల కొరత, దళారీల కుట్ర, ప్రభుత్వం భరోసా లేకపోవటం వంటి కారణాలతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రైతుకోణంలో వచన కవులు వచన కవితలు రాసి తమ సామాజిక బాధ్యతను నెరవేర్చుకున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగుసాహిత్యసమీక్ష - రెండో సంపుటం- ఆచార్య జి.నాగయ్య
2. దశాబ్ది కవిత - సం॥ ఆచార్య యస్వీ సత్యనారాయణ
3. 2017-18 సం॥లో ఆంధ్రజ్యోతి వివిధ కవితలు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అత్యాధునిక కవితా రూపం 'నానీలు'

– డా॥. వెల్దండి శ్రీధర్, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్ - జి. రంగారెడ్డి, తెలంగాణ.

'వాక్యం రసాత్మకం కావ్యం' అంటాడు విశ్వనాథుడు తన సాహిత్య దర్పణంలో. నిన్నటి మహా కావ్యం 18 పర్వాలైతే నేటి మహాకావ్యం 18 వాక్యాలే అంటాడు శ్రీశ్రీ. ఇప్పటి కావ్యం నాలుగు పాదాలే అంటాను నేను.

కవితాభివ్యక్తికి తెలుగులో అనేక రూపాలు కన్పిస్తాయి. అలనాటి కందం, ఆటవెలది, తేటగీతి, ఆ తార్వాతి కాలంలో గురజాడ వారి ముత్యాల సరాలు, దాశరథి రుబాయీలు, డా. సి. నారాయణరెడ్డి గజళ్లు,

ప్రపంచపదులు, ఆరుద్ర కూనలమ్మ పదాలు, గాలి నాసరరెడ్డి హైకూ, డా. ఎన్. గోపి నానీలు, నానీలను పోలిన రెక్కలు, కైకూలు, టుమ్రీలు, చినుకులు, గవ్వలు, అణువులు, ముక్కానీలు... ఇలా అనేక అభివ్యక్తి రూపాలు కనిపిస్తాయి.

డా. ఎన్. గోపి అద్భుత సృష్టితో 1997లో తెలుగు కవితా యవనిక పైకి బుడిబుడి అడుగులతో ప్రవేశించిన 'నానీ' ఇప్పుడు 17 సంవత్సరాల నూత్న యౌవనంలోకి అడుగుపెట్టాడు. 'నానీ' అంటే నావి, నీవి వెరసి మనవి అని డా. ఎన్.గోపి నిర్వచనం. చిన్న పిల్లల్ని కూడా నానీ లంటాం. కవిత్వంలో ఇవి కూడా అట్లాంటివే. హైకూకు 17 అక్షరాలున్నట్లు నానీకి 20-25 అక్షరాలుండవచ్చు. మాట ఎక్కడ విరిగితే అక్కడికి ఒక పాదంగా నాలుగు పాదాలుంటాయి. ఛందస్సు నర్వ పరిష్వంగాన్ని వదిలించుకొని, పద్యాల నడుములు విరగదన్ని, నిఘంటువుల్ని సమాధి చేసి, సామాన్య మానవున్ని మకుటధారిగా చేసి అత్యంత సహజంగా, సరళంగా, భావ వ్యక్తీకరణకు తోడ్పడే కవితా రూపం వచన కవిత్వం. ఇందులో మినీ కవిత్వానికి మరో వెసులుబాటు ఉంటుంది. దీర్ఘ కవితలో ఉండాల్సిన ఆలోచనా ధార, కొనసాగింపు, కథనాత్మక శైలి దీనికి అక్కరలేదు. Spontaneous over flow ఉంటే చాలు. కవి మెదడులో అనేక శకలాలుంటాయి. వాటికి కవిత్వపు రూపాన్ని ఆపాదించడమే నానీ. నానీ చూడడానికి చిన్నదిగానే ఉన్నా రాయడం చాలా కష్టం. నానీలో ఒక విరుపు, ఒక చరుపు, ఒక మెరుపు ఉండాలి. అప్పుడే పాఠకుడి హృదయంలోకి నేరుగా వెళ్తుంది. నానీలో గాఢత, సాంద్రత, చిక్కదనం, కవిత్వాంశ బలంగా ఉన్నప్పుడే కాల పరీక్షకు నిలబడుతుంది. నానీల ముఖద్వారం నుండి తెలుగు కవిత్వ రంగంలో అడుగుపెట్టి కవులుగా గుర్తింపు పొందిన వారు ఎంతో మంది ఉన్నారు. ఇప్పటి దాకా 209 నానీల సంపుటాలు వెలువడ్డాయి. సుమారు వేయి మంది కవులు నానీలు రాశారు. రసరాజు లాంటి పద్య కవులు కూడా నానీలు రాయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీనికి కారణం నానీలలో ఏదో మార్మికత, ఇంకేదో ఆకర్షణీయ గుణం ఉండటమే. నానీలలో ఏవో బీజాక్షరాలు పడ్డాయి అందుకే అంతగా పాఠక లోకంలోకి దూసుకుపోతున్నాయని అనే వారూ లేక పోలేదు. వర్ధమాన వేగవంతమైన కాలానికి సరిగ్గా సరిపోయే రూపం నానీ. ఇప్పుడు ఏ పనైనా క్షణాల్లో జరిగిపోవాల్సిందే. నానీ చదవడానికి 10 క్షణాలు చాలు. అంటే అత్యాధునిక కాలానికి అత్యంతాధునిక కవితా రూపం నానీ. మరో విశిష్ట గుణం సరళమైన అర్థగ్రాహ్యత. విన్న వెంటనే లేదా చదివిన వెంటనే మెదడులో పేలిపోతుంది. విద్యుల్లతలా వెలుగులు విరజిమ్ముతుంది. అయితే అట్లాంటి నానీ బయటికి రావాలంటే హృదయపు గదుల్లో నానీ నానీ వెలువడితే తప్ప అలవడదు. ఏ కవిత్వమైనా ప్రజల నాలుకల మీదికి ఎక్కితే దాని జీవితం ధన్యం, చిరకాలం. అట్లాంటి గుణం నూటికి నూరు శాతం ఉన్న నానీలకే అంతటి ఖ్యాతి దక్కింది. ఎంతోమంది సాహిత్య, సాహిత్యేతర రంగాలకు చెందిన వారు తమ ప్రసంగాల్లో

అక్కడక్కడా నానీలను 'కోట్' చేస్తున్నారు. నానీలలో సకల ప్రపంచం తొంగి చూస్తుంది. అంటే వస్తు వైవిధ్యత అంత విశాలం అన్న మాట.

'చెరువులో
బంగళాలు మొలిచాయి
నీటి తల్లికి
ఇన్ని సమాధులా?'

అంటారు డా. ఎన్. గోపి. చెరువులను సమాధి చేసి బంగ్లాలకు పునాదులు తీయడం ఈ నానీలో కన్పిస్తుంది. భూ ఆక్రమణ ఎంతగా పెరిగి పోయిందో దీనిలో కవితాత్మకంగా చెప్పారు కవి. నగరీకరణ విస్తరించి నా కొద్దీ చెరువులు కూడా నగరంలో కల్సిపోయాయి. అవి చెరువులైనా, శ్మశానాలైనా మనిషి స్వార్థం ముందు నిలబడలేవు. నీటికి సమాధి కట్టి కాంక్రీటు అరణ్యాన్ని నిర్మిస్తున్న మనిషి కుటిలత్వానికి, ఆక్రమణ బుద్ధికి నిలువెత్తు నిదర్శనం ఈ నానీ.

'దీపంతో
పోల్చక్కరలేదు
కిరోసిన్‌కి
అర్పించకుంటే చాలు'

అంటారు ఎస్సార్ భల్లం. ఇంటికి దీపం ఇల్లాలని ఇల్లాలిని దీపంతో పోల్చుతాం. కానీ తనకి అంత అత్యాశ ఏమీ లేదు కానీ కిరోసిన్ పోసి, అంటించి హత్యచేయ కుండా ఉంటే చాలనే కోడలి ధీనత్వం కనిపిస్తుందీ నానీలో. వరకట్న హత్యలు, అనుమానపు హత్యలు నిత్యం మన సమాజంలో చూస్తూనే ఉన్నాం. ఏడడుగుల బంధంతో మెట్టినింట అడుగు పెట్టిన అమ్మాయిని మాటల ఈటెలతో పొడిచి చివరికి తన్ని మంటల్లో తగిలేసే కుటుంబాలెన్నో..

'ఏడు పదులలోనూ
'యజ్ఞం' చేశాడు
కథానిలయం
తెలుగోడి డాక్యుమెంట్!'

అంటారు డా. ద్వా. నా. శాస్త్రి. 'యజ్ఞంతో తొమ్మిది' కథా సంపుటి ద్వారా తెలుగు పాఠక హృదయాలలో స్థిర స్థానం ఏర్పర్చుకున్న కాళీపట్నం రామారావు మాస్టారిని, కథానిలయాన్ని పట్టి చూపించిన నానీ ఇది. నిజంగానే కథానిలయం తెలుగు కథకుడి చిరునామా. తెలుగు కథను పుట్టినప్పటి నుంచి 'ప్రిజర్వు' చేయ డం యజ్ఞంతో సమానమే.

'అదేం
చిత్రమో
పట్నమొచ్చి చూస్తేగానీ
పల్లె సౌందర్యం తెలియలే!'

అంటారు సోమేపల్లి వెంకట సుబ్బయ్య. పల్లె కౌగిట్లో జీవించినన్నాళ్లూ పల్లె సాదా సీదా చిత్రపటం. కానీ పల్లెను విడిచి ఉద్యోగం కోసమో, జీవిక కోసమో నగరాన్ని చేరిన తర్వాత పల్లె ఒక అద్భుత కళాఖండంలా కన్పిస్తుంది. సహజ సౌందర్యానికి, అమాయకత్వానికి, ఆప్యాయతకూ, అనురాగానికీ పచ్చని సంతకంలా కన్పిస్తుంది పల్లె. పల్లె అంటే ఆత్మీయత ముల్లె. అందుకే కవికి అంత సౌందర్యంగా కనిపిస్తుంది. పల్లెను తల్చుకొని మైమరచి పోనిదెవరు?, పల్లె అందంపై కవిత్వం రాయని కవి ఎవరు?

'కాశ్మీర్ ఆపిల్
కొరికి చూడ్డను కదా
గడ్డ కట్టిన
నెత్తురు'

అంటారు సుబ్బయ్య గారే. భారతదేశ చరిత్రలో జమ్మూ కాశ్మీర్ ఎప్పటికీ రగిలిపోయే రావణ కాష్టం. పచ్చని లోయలతో, ప్రకృతి సౌందర్యంతో అలరారే కాశ్మీర్ ఒక నెత్తుటి గడ్డ. తీవ్రవాదం, మతఛాందస వాదం, సరిహద్దు సమస్య ఇవన్నీ కలిసి కాశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నాయి.

'వేర్లనోట్లో
గుక్కెడు నీళ్లు పోద్దాం

గ్లోబును
ఆకుపచ్చ ముత్యం చేద్దాం'

అంటారు యశశ్రీ రంగనాయకి. చెట్టును నరకడం మానవ కుసంస్కారానికి పరాకాష్ట. అందుకే కవయిత్రి గుక్కెడు నీళ్లు పోసి Blue Planet "Green Planet గా మార్చుదాం అంటుంది. చెట్టు మానవ జీవనాడికి తొలి మెట్టు. చెట్టూ, నీళ్లూ లేకపోతే జీవి మనుగడ ప్రశ్నార్థకం. అందుకే 'చెట్టును పెంచు చిరకాలం జీవించు' అనే సూక్తిని కడుపులో దాచు కున్న నానీ ఇది.

'అమ్మకు
అక్షరాలు రెండే
చాకిరీకి
డిక్షనరీ చాలదు'

తప్పటపల్లి సాయి వెంకన్న బాబు నానీ ఇది. తెలుగు సాహిత్యంలో అమ్మపై బోలెడు కవిత్వం వచ్చింది. అమ్మంటే అమలిని ప్రేమకు నిలువెత్తు సాక్ష్యం.

అయితే అమ్మను మరో కోణంలో చూపించడంలోనే కవి గడుసుదనం దాగి ఉంది. అమ్మంటే జీవితాంతం జీతం లేని పనిమనిషి స్థాయికి దిగజార్చింది ఈ పురుష ప్రపంచం. ప్రేమను కలగలిపి ఆమె చేసే చాకిరీని వర్ణించ డానికి డిక్షనరీ చాలదనడం గొప్ప అభివ్యక్తి.

'శకుంతలా
దుష్యంతుడొస్తున్నాడు
ఈ సారి నువ్వే
ఉంగరం తొడగాలి'

ఎస్. రఘు నానీ ఇది. కాళిదాసు 'అభిజ్ఞాన శాకుం తలం'లో దుష్యంతుడు శకుంతలను గాంధర్వ వివాహం చేసుకొని పోతూ పోతూ గుర్తుగా వేలికి ఉంగరం తొడుగు తాడు. తర్వాత మర్చిపోయి కనీసం గుర్తు కూడా పట్టకుండా భార్య గా అంగీకరించడు. కానీ ఇప్పుడు కాలం మారింది. శకుంతలనే ఉంగరం తొడగమంటున్నాడు కవి. మారిన చైతన్యానికి నిదర్శనం ఇది.

'హైటెక్ యుగం
అంతటా కంప్యూటర్లు
మనోవ్యధ తుడిచే
సాఫ్ట్‌వేర్ లేదు'

అంటారు డా. పత్తిపాక మోహన్. ప్రపంచమంతా కంప్యూటర్ మయం. అంతా ఒత్తిడి జీవితం. ఈ మనో వ్యధను తుడిచే సాఫ్ట్‌వేర్ ఏంటీ అని కవి ప్రశ్న. ఎంత ఆధునికత పెరిగినా, ఎంత టెక్నాలజీ పెరిగినా మానసిక ప్రశాంతత లేక పోతే మన ముందడుగులకు అర్థం లేదు. డబ్బు, వస్తు సంస్కృతి చుట్టే జీవితమనే భ్రమలో ఉన్నంత కాలం ఈ రోగానికి మందులేదు.

'సీరియళ్ల వరదలో
కాలం కొట్టుకు పోతోంది
ఇల్లాలు
టీవీలో కప్ప'

మానేరు నానీల్లో జిందం అశోక్. సగటు ఇల్లు ఇవాళ టీవీ చెప్పు చేతల్లోకి వెళ్లింది. మాటైనా, భోజనమైనా అడ్వర్టైజ్‌ల మధ్యనే చేసే దౌర్భాగ్యం. మనిషి టీవీలో కప్పగా మారాడు. మానవ పరిణామ క్రమంలో ఇదొక మరుగుజ్జు దశ.

'డాక్టర్
ఎప్పుడూ రక్త పరీక్ష
మూత్ర పరీక్షేనా
చెమట పరీక్ష చెయ్యవేం'

అని ప్రశ్నిస్తారు డా. నలిమెల భాస్కర్ 'మట్టి ముత్యాలు' నానీల సంపుటిలో. శ్రమజీవన సౌందర్యాన్ని మరో కోణంలో తరచి చూడటం కనిపిస్తుందీ నానీలో. రక్త పరీక్ష, మూత్ర పరీక్ష చేస్తే ఏం తెలుస్తుంది. దేహంలోని షుగర్ లెవల్, బి.పి. లెవల్ తెలుస్తాయి. కానీ అదే దేహం నుండి పుట్టిన చెమట చుక్కను హృదయమనే పరీక్ష నాళికలో వేసి పరీక్షిస్తే ఉత్పత్తి వర్గాల ప్రాధాన్యం, వారి సామాజిక స్థాయి ఏ లెవల్లో ఉన్నాయో తెలుస్తాయి.

చెమట బిందువు పరీక్ష ద్వారా సమాజ ఆరోగ్య స్థితి, మనిషి ధైన్య స్థితిని అధ్యయనం చేయవచ్చని తెలిపే నానీ ఇది.

'ఖానే వాలేకా
నామ్ ఛోడో
ప్రతి గింజ మీదా
రైతు సంతకముంది'

అంటారు అదే నలిమెల భాస్కర్. తొడిగిన చెప్పు మీద దాన్ని తయారు చేసిన కార్మికుడి పేరు, తొడుక్కున్న అంగి మీద నేసిన నేత కార్మికుడి పేరు, ధాన్యపు గింజ మీద రైతు పేరు రాసి ఉంటాయా? ఉంటాయి. మనం మనసు పెట్టి, హృదయమనే భూతద్దం పెట్టి చూస్తే. కవి శ్రమ చేసిన వాడి వైపు నిలబడతాడు. పీడితుని వైపు నిలబడ తాడు. అది ఈ నానీలో అసలు నిజం. శ్రమ చేసే వాడొకడు, కూర్చొని తినే వాడు మరొకడు. ప్రతి గింజా రైతు శ్రమ నుండి పుట్టిందే. మట్టిని ధాన్యంగా మార్చే 'ఆల్కెమీ' తెలిసిన మార్మికుడు రైతు. గింజదీ, రైతుదీ జన్మ జన్మల బంధం. అందుకే ప్రతి గింజ మీదా రైతు తనదైన ముద్ర వేసే మార్కెట్‌లోకి పంపిస్తాడు. అయితే ఆ సంత కాన్ని 'ట్రేస్' చేసే పరిపక్వత మనిషికుండాలి.

'ఇప్పుడు
రెండే ఫ్యాషన్లు
అమ్మాయిలకు డైటింగ్
అంబోతులకు డేటింగ్'

అంటారు వెల్దండి శ్రీధర్. ఇప్పుడు ప్రపంచమంతా వ్యక్తిత్వ వికాసం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జీరో సైజ్ చుట్టూ తిరుగుతోంది. అలాగే డేటింగ్. విదేశీ సంస్కృతి చుట్టూ తిరగడం, దాన్ని మూఢంగా అనుకరించడం అలవాటయింది. ఇంతటి వస్తు వైవిధ్యంతో పాటు నానీల్లో గొప్ప తాత్విక నానీలు కూడా ఉన్నాయి. తాత్వి కత్వాన్ని పులుముకొని దివ్యంగా వెలిగిపోయే నానీలు అనేకం ఉన్నాయి.

'కుండ ముక్కలైందా
కుమిలి పోకు
మట్టి మరో రూపం కోసం
సిద్ధమౌతుంది' - డా. ఎన్. గోపి.

మనిషి పాత వస్త్రాన్ని త్యజించి, కొత్త వస్త్రాన్ని ధరించి నట్లు ఆత్మ ఒక దేహాన్ని వదిలి మరో దేహాన్ని తొడుక్కుం టుందనే గీతా సారాన్ని తెలియజెప్పే నానీ ఇది.

'జీవితం
నాకెంతో ఇచ్చింది
లాగేసుకున్నది కూడా
ఎక్కువ'

అంటారు ఎన్. అరుణ

'నిజానికి ఈ లోకం
పరాయి దేశం
నీవైనా నేనైనా
వలస జీవులం'

వాసాల నర్సయ్య నానీ ఇది. ఇలాంటి చిన్న అద్దంలో కొండను ఇమిడ్చుకుని ఎంతో తాత్వికతను బోధించే నానీలు అనేకం.

భాష, భావం, వస్తువు, చమత్కారం, ధ్వని ఇవన్నీ కల్పితే నానీ. అయితే అక్షరాల్ని కుప్ప పోయడం సులభమే కానీ వాటిలో అసలైన కవిత్వాన్ని పోయడం చాలా కష్టం. అందుకే కొన్ని నానీలు పసలేని కూర లా తేలిపోతాయి. రూపం ఏదైనా కవిత్వం లేకపోతే వట్టి గులక రాళ్ల ధ్వనిగానే మిగుల్తాయి. అందుకే నానీ కవి కవిత్వపు పనిలో నిపుణుడై ఉండాలి. అప్పుడే మేలిమి పనితనంతో సరికొత్త భావజాలంతో, నూత్న పరిమళంతో నానీలు పాఠకుడి మదిలోకి అడుగులు వేస్తాయి.

ఎంతో మంది అనామకులచేత కలం పట్టించిన నానీలు గత దశాబ్దంన్నర నుండి తెలుగు సాహిత్యలోకాన్ని అలరిస్తున్నాయి. అంతే కాదు లబ్ద ప్రతిష్ఠులైన విమర్శకుల మన్ననలను పొందుతున్నాయి. "తెలుగు సాహిత్యం

అభివ్యక్తి సంక్షోభంలో పడిన సందర్భంలో కవిత్వాన్ని బతికించడానికి హెూమయో గుళికల్లా గా నానీ ప్రక్రియ ముందుకు వచ్చింది'' అన్నారు కవి, విమర్శకులు సతీష్ చందర్. అలాగే ''నానీలు ఆధునికాంధ్ర కవిత్వంలో సరికొత్త ప్రయోగం. నానీలు ప్రయాణంలో దారి బత్తెం బఠాణీలు కావు. అవధానుల అప్రస్తుత ప్రసంగాలు కావు. అవి వడిసెల రాళ్లు. అనుభూతి పారావతాలు. మహా వృక్షాన్ని గర్భీకరించుకున్న మర్రి విత్తనాలు'' అంటారు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి. ఇలా తెలుగు కవిత్వ రంగంలోకి నిశ్శబ్దంగా ప్రవేశించి అనతి కాలంలోనే బలపడి శక్తి వంతమైన అభివ్యక్తి రూపంగా మారింది నానీ. అల్పాక్షరాల్లో అనల్పార్థం అనే మర్యాదకు అక్షరాక్షర సాక్ష్యం నానీ. అన్ని ఉద్యమాలకు, అన్ని వాదాలకు, అన్ని అస్తిత్వ పోరాటాలకు సరిపోయిన అత్యాధునిక కవితా రూపం నానీ. పాఠకుడి సమయాభావాన్ని దృష్టిలో పెట్టుకొని పురుడు పోసుకున్న నానీ అంతే వేగంగా సహృదయుడి హృదయ రాజ్యాన్ని గెల్చుకున్న రూపకారి. అందుకే పిల్లలు సైతం నానీలు రాస్తున్నారు. అది మంచిదే కదా. కవుల సంఖ్య పెరిగితే దుర్మార్గుల సంఖ్య తగ్గుతుం ది అంటారు డా. ఎన్. గోపి.

ఇంగ్లీష్ మేడ్ ఈజీ లాగా పొయెట్రీ మేడ్ ఈజీయై కొంత మంది ఉబలాటపు కవుల చేతిలో పడి నానీ కొంత పల్చనైంది వాస్తవం. అందుకే నానీ రూపం అనేక విమర్శలకు కూడా గురైంది. అయితే ఎలక్ట్రాన్ పరికరాలలో వస్తోన్న రూప విప్లవం లాగే కవిత్వంలో వచ్చిన ఈ నవీన రూప విప్లవాన్ని ఆహ్వానించాల్సి ందే. ఆరుద్ర అన్నట్టు 'ఎన్ని గజాలు రాసాడన్నది కాదు, ఎన్ని నిజాలు చెప్పాడన్నది ముఖ్యం'.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

మాలపల్లి నవల కథా సంగ్రహం – సామాజిక జీవన చిత్రణ

– జి. బాలకృష్ణ పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

'ఉన్నవ లక్ష్మినారాయణ' సృజించిన 'మాలపల్లి' నవల తెలుగు సాహిత్యంలో ఉన్నతమైన భావాలత వెలుబడిన తొలి నవల. సాంఘిక, అర్థిక అసమానతలను తొలగించి సమాజంలో సమతా ధర్మాన్ని స్థాపించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ నవల రాయబడింది. 1922లో రచించబడిన ఈ నవల జాతి యొద్యమంలో భాగంగా పల్నాడు పుల్లరి సత్యగ్రహంలో పాల్గొని జైలుపాలైన ఉన్నవ లక్ష్మినారాయణ రాయవెల్లురు జైలులో ఉండగా ఈ నవల దేశభక్తి పూరితంగా సంఘసంస్కరణ అభిలాషతో రచించారు. ఉన్నవ విధవలకు, అనాథలకు, అణగారిన వర్గాల ఉన్నతికై పాటుబడ్డారు. తన సామాజిక వర్గం నుండి ఎదురైన నిరసనలు లెక్కచేయకుండా గుంటూరులో 32 వితంతు వివాహాలు జరిపి "గుంటూరు వీరేశలింగం" గా పేరు పొందాడు. ఈ నవలకు పీఠిక రాసిన దేశోద్ధారక 'కాశీనాథుని నాగేశ్వరరావు' పంతులు ఈ నవల గురించి ఆయన పీఠికలో "ఆంధ్ర సాహిత్య హృధయ పరిణామాన్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యమని, తెలుగు విప్లవ సాహిత్యంలో వచ్చిన ప్రథమ కావ్యమని కొనియాడారు. ఆధునిక ఇతిహాసంగా పేరుపొందిన ఈ నవలను 1958 లో 'ఆచార్యరంగా' టాల్‌స్టామ్ రాసిన "వార్ అండ్ పీస్" నవలతో పోల్చాడు.

కథా సంగ్రాహం - సామాజిక జీవన చిత్రణ :

దళితులలో అట్టడుగు వర్గాలకు చెందిన 'మాలదాసరి'[2] కులస్తుడైన రామదాసు సాత్వికుడు. కథంతా అతని కుటుంబం సమాజాన్ని అల్లుకొని సాగుతుంది. రామదాసు భార్య మహాలక్ష్మి. వీరికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్దకొడుకు వెంకటదాసు చిన్న కొడుకు సంగదాసు, కూతురు జ్యోతి. పెద్ద కొడుకు వెంకటదాసు తండ్రికి సాయంగా సేద్యం చేస్తుంటాడు. చిన్న కొడుకు సంగదాసు ఒక భూస్వామి వద్ద పాలేరుగా పనిచేస్తుంటాడు. పొలం పనులలో కూతురు జ్యోతి సాయం చేస్తుంటుంది. రామదాసు చెల్లెలు సుబ్బలక్ష్మీ ఆమెకొడుకు అప్పాదాసు కూడా తండ్రి లేకపోవడం చేత రామదాసు ఇంటిపట్టునే పనులు చేస్తూ పెరుగుతుంటాడు. ఈ విధంగా తమకున్న కొద్దిపాటి భూమితో మాలపల్లిలో రామదాసు కుటుంబం అంతా శ్రమిస్తూ జీవనం సాగించేది.

ఆ ఊరి ఆ స్వామి అయిన చౌదరయ్య కొడుకులైన రామనాయుడు, వెంకయ్య నాయుడు అనే అన్నదమ్ములు కూడా ఈ నవలల ముఖ్య పాత్రలుగా ఉంటారు. సంగదాసు ఈ చౌదరయ్య వద్దనే పాలేరుగా పనిచేస్తుంటాడు. పనివాడైన సంగదాసు, యజమాని కొడుకైన రామనాయుడు ఇద్దరి ఆశయాలు ఒక్కటే కావటంతో స్నేహంగా సఖ్యతగా ఉంటారు.

రామదాసు కుటుంబంలోని వాళ్ళాంతా కులమతాల పట్టింపులో దుయ్య బట్టినవాళ్ళే కొడుకులు వెంకటదాసు, సంగదాసు, సంస్కరణ భావాలు కలిగిన వారు. కరుడు గట్టిన భూస్వామి చౌదరయ్య చేసే అత్యాచారాలు ప్రతిఘటించేందుకు, సంగదాసు తోటి కూలీలను సంఘటితపరచి, వారిలో చైతన్యం కలిగించి, సమ్మెలకు నాయకత్వం వహిస్తాడు. దళితులకు విద్య నేర్పడం కోసం బడులను ప్రారంబిస్తాడు. ఈ కృషిలో రామానాయుడు అతనికి సాయంగా ఉంటూ ఆర్థికంగా చేయుతను ఇస్తాడు. ఇది భూస్వామి చౌదరయ్యకు నచ్చక సంగదాసు తలపై పనిముట్టుతో గట్టిగా కొట్టడం వల్ల సంగదాసు మరణించడం జరుగుతుంది. భూస్వామి పోలిసులకు లంచం ఇచ్చి విచారణ పరిధి నుండి తప్పించుకుంటాడు. నష్ట పరిహారంగా భూస్వామి ఇవ్వబోయిన ధనాన్ని నిరాకరించి

తమ కొడుకు చంపబడ్డ విషాదాన్ని రామదాసు పంతులు మౌనంగా భరిస్తాడు. దీనితో రామానాయుడు పేద రైతులకే మరింత దగ్గరై, దళితుల అభ్యున్నతికి పూర్తిగా అంకితమౌతాడు. సంగదాసు ఆదర్శ భావాల వ్యాప్తి కోసం అతని స్మృతి చిహ్నంగా "సంగపీఠం" గ్రామంలో నెల కొల్పబడుతుంది. క్రమేణా ఈ సంగపీఠం కృషిలో దళితే తర అగ్రకులాలు కూడా చేరుతాయి.

రామదాసు రెండవ కొడుకు వెంకటదాసు అడవులలో నివశిస్తు తక్కెళ్ళ జగ్గడు అనే మారుపేరుతో 'సంతాను' లనబడే రహస్య కార్యచరణ దళాలను ఏర్పాటు చేస్తాడు. ఈ నవలలోని సంతానుల ప్రవక్తి బంకించంద్రుని "అనందమఠం" నవలలోని "సంతానులను" గుర్తుకి తెస్తుంది. 'ధర్మకన్నాలు' వేయడం ద్వారా ధనికుల ఆస్తిని కొల్లగొట్టి పేదలకు పంచిపెట్టే ఉద్యమానికి వెంకటదాసు నాయకత్వం వహిస్తాడు. అయితే పోలిసులతో జరిగిన సాయుధ ఘర్షణలో వెంకటదాసు గాయపడి పట్టుబడి చివరికి జైలుపాలవుతాడు. ఒక వాజ్యంలో ఓడిన రామదాసు తన యావదాస్థిని భూస్వామి చౌదరయ్యకు స్వాధీనం చేయవలసి వస్తుంది. తన పోలం నుండి, ఇంటి నుండి వెల్లగొట్టబడిన రామదాసు చివరికి ఒక సంపన్నుల ఇంటిలో పనికి కుదురుతాడు. తకెళ్ళ జగ్గని సహచరులు అ సంపన్నుని ఇంటిని కొల్లగొట్టటంతో రామదాసు అతని భార్య మహాలక్ష్మిని పోలిసులు అరెస్టుచేసి జైలులో నిర్భంద కూలీలుగా పనిచేయిస్తారు. సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న పెద్దకొడుకు వెంకటదాసు సహాయ చర్యలకోసం తల్లి, తండ్రి కొంత కాలం అక్కడే ఉం డటంతో ఆ బెంగతో భార్య మహాలక్ష్మి కూడా చని పోవడం జరుగుతుంది. ఈ భాదలిన్నింటిని రామదాసు సహనంతో తన సహజ వేదాంత దోరణిలో శాంతంగానే స్వీకరిస్తాడు.

క్రమేణా సంగపీఠం కృషి దిన దిన అభివృద్ధి చెందు తుంది. సహాయ నిరాకరణ ఉద్యమాల, కార్మికొద్య మాలు, ధర్మకన్నాల వంటి ప్రజా ఉద్యమాల ఫలితంగా స్వాతంత్ర్యంగా లభిస్తుంది. ఖైదిలు విడుదలవుతారు. వయోజన ఓటింగుద్వారా ప్రజా ప్రథినిథులు ఏన్నికవు తారు. రామదాసు కూడా జైలునుండి విడుదలై తన గ్రామానికి వీస్తాడు. రామానాయుడు తన యావదాస్థిని దళితుల అభ్యుదయానికి సమర్పించి రామదాసుని గ్రామంలో ఉండి సంగదాసు చేసిన కృషిని కొనసాగించ మని కోరుతాడు. కాని రామదాసు నిరాకరించి అడవులకు వెళ్తాడు.

ముగింపు :

ఒక దళిత కుటుంబం సమాజంలో కలియడానికి చేసే ప్రయత్నలు, అ ప్రయత్నంలో వారికి ఏదురైన చేదు అనుభవాలు, ఆ అనుభావాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సమాజంలో నిర్లక్షం చేయబడ్డ తమ ఉనికి కోసం మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాల వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలన్ని ఉదాత్తాంగా చిత్రికరించబడ్డాయి. చివరికి భూస్వాముల మదం అణిగి పోయి వారు తమ సర్వస్వాన్ని దళితుల అభ్యుదయానికి, గ్రామాభ్యుదయానికి సమర్పించుకొని గ్రామానికే అంకిత మయ్యారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఓల్గా కథలు – సమాజంలో "స్త్రీ" పాత్ర

– గొల్లపల్లి కనకు, పరిశోధక విద్యార్థి, రాజధాని కళాశాల

అనాది కాలం నుండి నేటి వరకు స్త్రీ వైయక్తికంగా, సామాజికంగానూ, కుటుంబ పరంగానూ, లైంగికంగానూ అనేక సమస్యలతో సతమతమవుతూ ఉంది. తెలుగు సాంప్రదాయంలోనూ, సాహిత్యంలోనూ ఒకవైపు స్త్రీని గౌరవించాలి అంటూనే అణచివేయబడిన సంఘటనలు సమాజంలో మనకు చాలానే కనిపిస్తున్నాయి. అనేక సందర్భాలలో స్త్రీలకు సంబంధించిన సంఘటనలు, సమాజం వారికి ఇస్తున్న స్థానం వంటివి స్త్రీని అణచివేస్తూ ఊపిరాడనివ్వకుండానే చేస్తున్నాయి. తెలుగు సాహిత్య విషయానికి వస్తే తెలుగులో వచ్చిన కావ్యాలు, ప్రబంధాలు, నాటకాలు మొదలైన వాటిలో స్త్రీని అణచి వేసిన వైనాన్ని మనం గమనించవచ్చు. ఆధునిక కాలంలో కూడా స్త్రీ కేవలం సౌందర్య సాధనంగానూ, సంతాన సాధనంగానూ, పరిగణింపబడుతుంది. అయితే స్త్రీల సమస్యలను రూపుమాపడానికి ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ఎందరో సంఘసంస్కర్తలు తమ వంతు కృషి చేశారు. క్రమానుసారంగా తెలుగు సాహిత్యంలో రచయితలు, కవులు స్త్రీల సమస్యలను తమ సాహితీ వస్తువుగా తీసుకుని రచనలను రచించి పాఠకలోకానికి అందించారు. తరువాతి క్రమంలో స్త్రీలు కూడా తెలుగు సాహిత్యంలో తమ అస్తిత్వాన్ని నిలుపుకొని స్త్రీల సమస్యలకు కవిత్వం, నవల, కథల రూపంలో స్త్రీల జీవనశైలిని రూపుమాపే పని చేస్తున్నారు. ఈ కోణంలో వచ్చిన "ఓల్గా కథలు" పరిశీలింపదగినవి.

నేటి కథా ప్రపంచంలో "స్త్రీవాదం" కూడా తన పాత్రను చాటుకుంది. స్త్రీవాద దృక్పథంతో రచనలు చేస్తూ స్త్రీలలో చైతన్యం తీసుకురావడానికి తమ కథలను ఆయుధం చేసుకుని పోరాడుతున్న రచయిత్రులలో "ఓల్గా" మొదటి వరుసలో ఉన్నారు. ఓల్గా రచించిన "స్పర్శ, తోడు, ఓ పెళ్ళి కథ, నోర్ముయ్, కళ్ళు, మొదటి చావు, ఒక రాజకీయ కథ, గోడలు, భద్రత మొదలైన కథలను ఎంపిక చేసి అరసం గుంటూరు జిల్లా శాఖ వారు "కథా స్రవంతి" శీర్షికతో ప్రచురించారు. ఈ కథలలో స్త్రీ పాత్రలు సమాజం నాటిన హద్దులను దాటి తమ భావాలకు అనుగుణంగా ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాయి.

ఓల్గా కథలు – వస్తువు :

ఓల్గా కథలలో కుటుంబ వ్యవస్థ, నైతికత, వివాహేతర సంబంధం, లైంగిక వేధింపులు, సంతానోత్పత్తి వంటి అంశాలను వస్తువుగా చేసుకుని స్త్రీల మను గృహాల్లో కెళ్ళి వారి అభిప్రాయాలను, వారి భావాలను ఈ కథలో ఆవిష్కరించారు.

"స్పర్శ" అనే కథలో వంశీ మాలతికి మంచి స్నేహితుడు. మాలతి భర్త మోహన్‌కి కూడా వంశీ క్లాస్‌మెంట్ కావడంతో, మాలతి ఉంటున్నా అపార్ట్‌మెంట్ కింద షాపింగ్ కాంప్లెక్స్‌లో వంశీ స్టూడియో కావడంతో వంశీ మాలతిల స్నేహం గాఢంగా నాటుకుపోతుంది. వంశీ మాలతీలు ప్రతి చిన్న విషయాన్ని, ఒకరి భావాలను ఒకరు, ఒకరి సమస్యలను ఒకరు పంచుకుంటూ ఉండటంతో స్నేహం మరింత దగ్గరవుతుంది. ఉన్నఫలంగా వంశీ తన స్పర్శ కావాలనే కోరికను ప్రకటిస్తాడు. అది విన్నప్పటి నుండి మాలతి స్నేహం అంటున్న వంశీ స్పర్శ మోహావేశంతో నిండితే ఏం జరుగుతుంది? అన్న ఆలోచన నుండి బయటపడలేక తన ఆలోచనలను వంశీతో చెప్తుంది దానికి వంశీ "మా అమ్మాయి తన స్నేహితులతో చేతులు పట్టుకుని మాట్లాడుతుంది". మన వయస్సు వేరు, మన తరం వేరు, వాటిని దాటి లేమా? అని ప్రశ్నిస్తాడు. దానితో మాలతి తన చిన్నతనం నుండి మామయ్య, నాన్న, తమ్ముల్లతో తను పెరుగుతున్న కొద్దీ వాళ్ల స్పర్శను కోల్పోయిన వైనాన్ని గుర్తు చేసుకుని "ఎందుకు స్త్రీ పురుషుల మధ్య స్పర్శ అంత నిషేధం కావాలి?" అని ప్రశ్నించుకుని

వంశీ స్పర్శను హాయిగా అనుభవిస్తుంది. నువ్వు నా ప్రాణం స్నేహితుడివి వంశీ స్నేహాన్ని వదులుకోవాల్సినంత ప్రాముఖ్యం గలదా ఆ మొహం అని వంశీకి స్నేహం విలువ తెలియజేసి, వంశీకి కూడా మోహపు ఆలోచనలు లేవని తెలుసుకుని సంతోషిస్తుంది. వంశీ మాలతీలు ఇద్దరూ స్త్రీ పురుషత్వాలను జయించి మానవులగా మారిన స్నేహ క్షణాలను సంపూర్ణంగా ఆస్వాదిస్తారు.

"తోడు" అను కథలో గంగాధరం తన భార్యను కోల్పో తాడు. అదే ప్లాట్లో ఉంటున్న విజయలక్ష్మి గంగాధరం తన భార్యను కోల్పోయిన కొన్ని రోజులకు తన భర్తను కోల్పోతుంది. గంగాధరం భార్య లేని లోటుతో ఎప్పుడు బాధ పడుతూనే ఉంటాడు. విజయలక్ష్మి తన భర్తను కోల్పోయిన కూడా ధైర్యంగా ఉండగలుగుతుంది. గంగా ధరానికి అందుకు కారణం ఏమై ఉంటుందో అన్న ఆలో చన వస్తుంది. అదే విషయాన్ని విజయలక్ష్మితో చర్చిస్తాడు. దానితో విజయలక్ష్మి పెళ్లయినప్పటి నుండి భర్త ఇష్టాలకు అనుగుణంగాను, పిల్లల ఇష్టాలకు అనుగుణంగానే ఇన్నాళ్లు బ్రతికినాను. నా ఇష్టాలు ఏమి ఆయన ఏ నాడూ తెలుసుకోలేదు. ఆఖరికి తిండి విషయంలో కూడా ఆయన ఇష్టాలే నడిచేవి ఇప్పుడు నాకోసం నేను బ్రతుకుతున్నాను. ఇందులోనే నాకు సంతృప్తి కలుగుతుంది అని చెప్పుంది. కొన్ని రోజులకు గంగాధరం విజయలక్ష్మల మధ్య మంచి స్నేహం ఏర్పడుతుంది. ఆ స్నేహంతోనే గంగాధరం విజయలక్ష్మిని పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. అందుకు విజయలక్ష్మి అంగీకరించదు. మగవాళ్లకు సేవలు చేస్తూ బ్రతకడం తనకు ఇష్టం లేదనే అభిప్రాయాన్ని చెప్తుంది. దానితో విజయలక్ష్మి గంగాధరం ఒకరికి ఒకరు తోడుగా, జీవితాన్ని సంతోషంగా గడుపుతారు.

"ఓ పెళ్లి కథ" నిర్మల, ప్రసాద్ తన కూతురు దీప్తికి అమెరికా సంబంధం వచ్చిందని అబ్బాయి ఎలాంటి వాడో తెలుసుకోకుండా కూతురి చదువు అర్ధాంతరంగా ఆపేసి పెళ్లి చేసి చేతులు దులుపుకోవాలనుకుంటారు. వారి దృష్టిలో అమ్మాయికి చదువు అంత ముఖ్యమైనది కాదు. పెళ్లి చేసి నెత్తిన బరువు దించుకోవాలి అనుకుంటారు. దీప్తి అన్న ప్రశాంత్‌కి దీప్తికి పెళ్లి చేయడం నచ్చదు. దీప్తి మాత్రం తల్లిదండ్రుల మాటలకు అడ్డు చెప్పదు. అందు వలన ప్రశాంత్ దీప్తిని కాపాడాలనే ఉద్దేశంతో తల్లిదండ్రు లకు వారి మార్గంలోనే అడ్డు తిరుగుతాడు. తాను కూడా ఇక చదువుకోనని, తనకి కూడా చదువుకుని ఉద్యోగం చేసే మంచి అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేయమంటాడు. దానితో నిర్మల, ప్రసాద్ చేసేది ఏమీ లేక దీప్తి పెళ్లి విషయం కొడుకు నిర్ణయానికే వదిలేస్తారు. దీప్తి బ్రతుకు బాగు చేయాలని ఆలోచిస్తూ తన పెళ్లి నిర్ణయం తననే ఆలోచించుకోమని దీప్తికి చెప్తాడు. దీప్తి కూడా చదువు కోవడమే ఇష్టం కావడంతో దీప్తి, ప్రశాంత్‌లు ఎప్పటిలాగే కాలేజీ చదువులు కొనసాగిస్తారు.

"నోర్మయ్" అను కథలో జానకి చిన్నతనంలో సహజం గానే తన మనస్సులో ఈ ఉద్యోగం కలిగినా దానిని సహజంగానే వ్యక్తపరిచేది. కానీ అలా చేయడం తల్లిదండ్రులకు నచ్చేది కాదు. ప్రతిదానికి "నోర్మయ్ ఆడపిల్లకు అంత నోరు పనికిరాదు" అని అణచి పెట్టేవారు. దానితో జానకి తనకు బాధ, సంతోషం, ఏడుపు ఏది వచ్చినా వ్యక్త పరచకుండా ఉండటం అలవాటు చేసుకుంటుంది. పెళ్ళయ్యాక భర్త తన మాటలను కోరుకుంటున్నాడు అని తెలిసి మాట్లాడటం మొదలు పెడుతుంది. ఆ మాటలలో కూడా కొన్ని మాటలు మాట్లాడడం, అడగడం మొదలు పెట్టేసరికి భర్త కూడా "నోర్మయ్ ఆడదానికి అంత నోరు పనికి రాదు" అని అనడంతో చిన్నప్పటినుండి ఆ మాటలతో విసిగిపోయిన జానకి గుండె చెరువు చేసుకుని ఏడుస్తుంది.

"కళ్ళు" అను కథ ఉత్తమ పురుషలో నడుస్తుంది. ఇందులో కథానాయిక ప్రతిదీ చూడాలని అనుకుంటుంది. కానీ సమాజం స్త్రీకి విధించిన షరతులలో కళ్ళు ఉన్నాయి కదా అని ఎలా పడితే అలా చూడకూడదు అనే విషయాన్ని తల్లితో పాటు ఇంట్లో నాన్న, అన్న, వదిన అందరూ తన కళ్లని ఎలా వాడుకోవాలో తన కళ్లు ఎలా ప్రవర్తించాలో నేర్పుతారు. తన ఇంట్లో అమ్మ, వదిన దించిన తలను పైకి ఎత్తరు తమ చుట్టూ ఏమి జరుగుతుందో వాటి

గురించి పట్టించుకోరు. అమ్మ అంతా అయ్యాక తన కళ్లు కూడా అలాగే మారిపోతాయా అని ప్రశ్నించుకుని సందిగ్ధంలో పడుతుంది.

"మొదటి చావు" కథను ఓల్గా తెలంగాణ మాండలికంలో రచించారు. ఈ కథలో ఇందిరా పల్లెటూరులో ఒక పేద కుటుంబానికి చెందిన అమ్మాయి. తల్లి ఇండ్లల్లో పనిచేసి, పండ్లు అమ్మడానికి వెళితే ఇందిరా ఇంట్లో పని చూసుకుని, మంచాన పడ్డ నాన్నకు సేవలు చేసేది. ఇందిర అందాన్ని చూసి తల్లి మురిసిపోతూ లోలోపలే భయపడేది. తల్లిదండ్రులు ఇంట్లో లేరు అని తెలుసుకున్న చంద్రయ్య ఏమీ తెలియని ఇందిరపై కన్నేసి ఇందిర గర్భానికి కారకుడవుతాడు. అది తెలుసుకున్న తల్లి ఇందిరను తిట్టి కడుపు తియ్యించడానికి పట్నంలో ఆసుపత్రికి తీసుకు వెళుతుంది. గర్భం తియ్యించుకునే ముందు ఆసుపత్రిలో నర్సులు, పనిచేసే ముసలాయన ఎందుకు తిడుతున్నారో ఇందిరకు అర్థం కాదు. అసలు తన కడుపులోకి బిడ్డ ఎలా వచ్చిందో కూడా తెలియని ఇందిర బాధపడుతూనే ఆపరేషన్‌కు సిద్ధమయ్యి ఆ నొప్పిని భరించలేక తను చచ్చిందా? బ్రతికిందా? అన్నంత బాధను భరిస్తుంది. "ఆడది శానా సావులు సస్తది" అని అమ్మ ద్వారా తెలుసుకుని అన్ని సావులు ఎట్లా సావాలిరా? భగవంతుడా అని బాధపడతూ తన బిడ్డకు ఒక్క సావే అయినందుకు సంతోషిస్తుంది. తన బిడ్డ అదృష్టం తనకు లేనందుకు బాధపడుతుంది.

"ఒక రాజకీయ కథ" అను కథ కూడా ఉత్తమ పురుష లోనే సాగుతుంది. ఇందులో కథానాయక పెళ్లయినప్పటి నుండి భర్తే దైవంగా సేవలు చేస్తూ, ప్రేమగా చూసుకునేది. కొన్నాళ్లకు తనకు గర్భం వస్తుంది. ఆ గర్భం కొన్ని కారణాల వల్ల గర్భసంచితో పాటు తీసేయాల్సి వస్తుంది. అప్పటి నుండి అత్త, భర్త తనపై విరుచుకుపడుతారు. చేయని తప్పుకు లోకం తనని గొడ్రాలిగా ముద్రవేసి నిందిస్తుంది. అత్త తనని పుట్టింటికి పంపేసి కొడుకుకు వేరే పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెడుతుంది. ఇవన్నీ తలచుకుని బాధపడుతూ కట్నం ఇవ్వలేదాని, పిల్లల్ని కనని గొడ్రాలు అని ముద్ర పడిన స్త్రీలు తనలాగే అక్రోషించేవారు, ఆత్మహత్యలకు తరమబడుతున్నవారు ఎందరో ఉన్నారు. వారందరితో కలవడమే తన జీవిత గమ్యంగా మార్చుకుంటుంది. తన జీవిత సాఫల్యం మాంగల్యంలో, పతి సేవలో లేదు, కనలేని సంతానంలో లేదు. తన తోటి స్త్రీలందరితో చేయి కలపడంలోనే ఉంది అని నిశ్చయించుకుంటుంది.

ఓల్గా కథలు - సమాజంలో "స్త్రీ" పాత్ర :

ఈ కథలలో స్త్రీ పాత్రలు భారతీయ స్త్రీకి సమాజం గీసిన సరిహద్దులు దాటి స్వేచ్ఛను కోరుకుంటున్నాయి. పుట్టినప్పటినుండి ఒక ఆడపిల్ల తన మనోభావాలను, స్వేచ్ఛను హర్షిస్తుంది ఎవరో కాదు తమ సొంత తల్లి దండ్రుల నుండి ప్రారంభమవుతుందని గ్రహించే విధంగా ఇందులో పాత్రలు తెలియజేస్తున్నాయి. ఒక స్త్రీ తనకు విధించిన కట్టుబాట్ల నుండి ఎలా తనని తాను విముక్తి చేసుకోవాలో ఓల్గా ద్వారా తెలియజేశారు.

ఆడపిల్ల పుట్టినప్పటి నుండి వయసుకు వచ్చేసరికి నాన్న, అన్నదమ్ముల స్పర్శను కోల్పోతుంది. పెళ్లయ్యాక భర్త స్పర్శను మాత్రమే పొందుతుంది. ఇది భారతీయ సంప్రదాయం. కానీ రచయిత్రి స్త్రీల మనోభావాలకు, స్వేచ్ఛకు ప్రాధాన్యతనిస్తూ "స్పర్శ" కథలో మాలతీ పాత్రను సృష్టించారు. మాలతి అందరి స్త్రీల లాగే తండ్రి, అన్నదమ్ముల స్పర్శను క్రమంగా కోల్పోతుంది. పెళ్లయ్యాక భర్త దుర్గా పట్టించుకోకపోవడంతో కొన్ని అసంతృప్తులకు గురవుతుంది. అందువలన తన ప్రాణ స్నేహితుడు మాలతి స్పర్శను కోరగానే మొదట అతనిది మోహం ఏమో అని ఆలోచించినా మాలతి కూడా వంశీ స్పర్శను హాయిగా అనుభవిస్తుంది. ఈ కథలో రచయిత్రి "ఎందుకు ఇద్దరు పురుషుల్లా, ఇద్దరూ స్త్రీలలా స్త్రీ పురుషులు సన్నిహితంగా, దగ్గరగా స్నేహం చేయకూడదు? మనుషులు దగ్గర అయినంతగా శరీరాలు దగ్గర అయితే అంతా తల్లకిందులు ఎందుకు అవ్వాలి? అని ఈ కథలో ప్రశ్నింపజేస్తుంది.

స్త్రీ అంటే సమాజంలో ఓర్పు, సహనం మంచి మాటలతో అణచివేస్తూ ఉండడం సమాజంలో చూస్తూనే

ఉన్నాము. ఒక స్త్రీ తనకు ఇష్టం వచ్చినట్లు ఉండడానికి వీల్లేదు. పెళ్లికి ముందు తల్లిదండ్రులకు ఇష్టం వచ్చినట్లుగా, పెళ్లయ్యాక భర్త, పిల్లల ఇష్టాలనే తన ఇష్టాలుగా మార్చుకోవాలి. మార్చుకుంటుంది కూడా అయితే తన ఇష్టాలను తీర్చేవారు, తనకు సేవలు చేసేవారు ఎవరు? అని రచయిత్రి ''తోడు'' కథలో విజయలక్ష్మి పాత్ర ద్వారా ప్రశ్నిస్తుంది. స్త్రీ పురుషులకు ఇద్దరికీ చదువు అవసరమే అన్న సందేశాన్ని ''ఓ పెళ్లి కథ'' కథలో రచయిత్రి పాఠకులకు అందించారు.

''నోర్ముయ్'' అను కథలో ఒక స్త్రీ సహనం వెనుక దాగి ఉన్న అణచివేతను, స్త్రీ మనోభావ ప్రకటనాభిలాషను కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ కథలో జానకి ప్రధాన పాత్ర పోషిస్తుంది. చిన్నతనంలో జానకి ఎక్కడ ఏమి చూసినా, ఏం జరిగినా పట్టలేని సంతోషమో, కోపమో, బాధో కలిగేవి. వాటిని అమ్మకో, నాన్నకో చెప్పాలని పరిగెత్తేది. తన ఆవేశాన్ని అంతా ప్రదర్శిస్తూ వాళ్లు వెంటనే ''నోరు మూసుకుని అవతలకు నడువు, ఎక్కడ లేని సంగతులు నీకే కావాలి''. అని కసిరేవాళ్ళు అప్పటి నుండి తన భావావేశాన్ని తనలో సమాధి చేస్తుంది. జానకి మనోవేదన లోపల రగిలిపోతున్నా అలా ఉండడానికి కారణం తన కుటుంబమే అన్న విషయాన్ని రచయిత్రి ఈ కథలో స్పష్టంగా చర్చించారు. సమాజంలో ప్రతి మనిషికి కళ్ళు ఉంటాయి. కానీ స్త్రీలకు మాత్రం కళ్ళు ఉన్న లేనట్లుగానే ఉండాలి. ఆ కళ్ళకు సమాజం కొన్ని ఆంక్షలను విధించింది. పైకి చూసి నడవకూడదు, కొన్నింటిని చూడరాదు, కొన్నింటిని చూసినా స్పందించ రాదు. వంటి నియమాలను స్త్రీలకు విధించింది ఈ సమాజం. ఈ ఆచరణలను ఆచరిస్తేనే స్త్రీని సమాజం ఆహ్వానిస్తుంది. వీటికి వ్యతిరేకిస్తే ఆ స్త్రీని సమాజం బహిష్కరిస్తుంది. స్త్రీ తన భావోద్వేగాలను, స్పందనలను అన్నకి మేసిన కుటుంబాన్ని, సమాజాన్ని ''చూసిన తర్వాత ఏదన్నా చేయాలి కదా లేకపోతే చూడడం ఎందుకు? చూడక ముందు చూసిన తర్వాత ఒకే రకంగా ఉంటే చూడటం ఎందుకు? అంటూ రచయిత్రి ఈ కథలో పాత్ర ద్వారా ప్రశ్నిస్తుంది.

''స్త్రీ'' తాను చేయని తప్పును కూడా భరిస్తూ ఎవరో చేసిన తప్పుకు తాను బలి కావడం వంటి సంఘటనలు సమాజంలో జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయాన్ని ''మొదటి చావు'' కథలో ఓల్గా తెలియజేశారు. అమాయకురాలైన ఇందిరను చంద్రయ్య గర్భవతిని చేస్తాడు. చంద్రయ్య చేసిన తప్పుకు ఇందిర సమాజంలో తప్పుడు మనిషి అవుతుంది. అందరి చేత మాటలు పడి చావుకు దగ్గరగా వెళ్లి గర్భాన్ని తియ్యించుకుంటుంది. ఇలాంటి చావులు ఎన్నో చావాలి అని తల్లి ద్వారా తెలుసుకుని ఇందిర కుమిలిపోతుంది. ''ఒక రాజకీయ కథ''లో పెళ్లి అనే పేరుతో స్త్రీలను ఏ విధంగా బానిసలను చేస్తున్నారో రచయిత్రి తెలియజేశారు. భార్య భర్తల సంబంధం అతనితో పిల్లల్ని కంటేనే నిలబడుతుంది. అప్పుడే సమాజం కూడా ఆ స్త్రీని గౌరవిస్తుంది. లేదంటే భార్య అనే ఉద్యోగం పోతుంది. ఆ స్థానంలో వేరొకరిని భర్తీ చేస్తారు. భర్తే ప్రాణం, దైవం అనుకున్న ఈ కథలో కథానాయక ఇటువంటి సంఘటనలను జీర్ణించుకోలేక పోతోంది. తన పిల్లలు పుట్టరని, కట్నం తీసుకురాలేదని బాధపడుతున్న స్త్రీలకు తోడుగా ఉండడమే తన జీవితాశయంగా మార్చుకుంటుంది.

ముగింపు :

సమాజంలో కుటుంబం, స్త్రీ పురుష సంబంధాలలో స్త్రీలే సంక్షోభానికి గురవుతున్నారు. అలా మనస్తాపానికి గురయిన స్త్రీలు తమ భావాలకు అనుగుణంగా, స్వేచ్ఛగా ఎవరి అధికారానికి బలికాకుండా తమ జీవితాలను తమకు నచ్చిన విధంగా మలచుకుంటున్న వాస్తవాన్ని ఓల్గా ఈ కథల ద్వారా తెలియజేశారు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. అనురాధ, జె. రచయిత్రుల కథానికలు - స్త్రీల సమస్యల చిత్రణ, హైదరాబాద్: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, 2001.
2. స్రవంతి (ఓల్గా కథలు), అరసం గుంటూరు శాఖ, 2015.

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జాషువా కవితలో దేవతా మూర్తులు

– కొఱతం చైతన్య కుమార్, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు.

కులానికి కలానికి సంబంధమే లేదని తన కవిత్వంతో చాటి చెప్పిన మహాకవి జాషువా. ఆ మహాకవి రాసిన కవిత్వం సమాజంలోని అసమానతలను దురాచారాలను ఎత్తిచూపింది.మతం, కులం పేర్లతో జరుగుతున్న దాడులను తెలియజెప్పింది కులాన్ని బట్టి తమ గళాన్ని విప్పి కవిత్వాన్ని గౌరవించినట్లైతే ఏ కవి మహాకవి కాలేడని అని చెప్పి, కలాన్ని బట్టి తమ గళాన్ని విప్పి ప్రజల క్షేమాన్ని ఆకాంక్షించిన కవులెందరో ఘనతను పొందారని చెప్పాడు కవి.

మహాకవి జాషువా గుంటూరు జిల్లా వినుకొండలోని చాట్రగడ్డలో వీరయ్య, లింగమాంబలకు గారాల సుతునిగా జన్మించాడు. జాషువా జీవితం గ్రామ జీవనంతో ముడిపడి ఉంది. తన చుట్టూ జరుగుతున్న అసాంఘికాచారలను వ్యతిరేకిస్తూనే ప్రజల భక్తి తత్పరతలను తెలియజేసాడు. అలా తాను నివసించిన వినుకొండలోని నాలుగు దిక్కులలో ఉన్న గ్రామ దేవతలను కొలుస్తున్న భక్తులను చక్కగా తన కవిత్వం ద్వారా వివరించాడు. ఆ మహాకవి రచించిన రచనలు : 1. ధ్రువ విజయం 2. సమదమార్క పరిణయం 3. రుక్మిణీ కళ్యాణం 4. మీరాభాయి 5. చిదానంద ప్రభాతం వంటి నాటకాలతో తెలుగు సాహిత్యానికి పరిచయమయ్యాడు.

''భారతి పత్రిక''లో ప్రచురితమైన ''గిజిగాడు'', ''సాలీడు'', ''భారత?వీరుడు'', ''శిశువు'' ''స్మశాన వాటిక'' వంటి కవితలెన్నో జాషువాను కవిగా గుర్తింపు తెచ్చాయి. ''గబ్బిలం'', ''స్వప్నకథ'' ''అనాథ'', కొత్త లోకం'', ''కాంది శీకుడు'' ముసాఫరులు నేతాజీ బాపూజీ స్వయంవరం వంటి మహా కావ్యాలతో కవి కాస్త తెలుగు సాహిత్యంలో మహాకవిగా పేరొందినాడు. కీర్తితో పాటు పేరును గుర్తుండేలా చేసిన ''ఫిరదౌసి'', ''ముంతాజ్ మహల్'', ''క్రీస్తు చరిత్ర'' వంటి లఘు కృతులతో నిలిచిపోయాడు. ''రాష్ట్ర పూజ'',''నాగార్జునసా గరం'' వంటి కావ్యాలు రాసి ఆంధ్రాభిమానాన్ని పొందాడు. ఆరు వందల (600) పద్యాలతో రచించిన ''నా కథ'' అనే కావ్యంతోతెలుగు సాహిత్యంలో ఘనుడయ్యాడు.

యినుప గజ్జెల తల్లి :

జాషువా? కవిత్వాన్ని నిశితంగా పరిశీలిస్తే మూడు అంశాలు బోధపడతాయి. పేదరికం కులంపై పోరాటం. కవిత్వాన్ని ఆయుధంగా చేసు కోవటం. ''గబ్బిలం'' మహాకావ్యంలో అరుంధతి సుతుని గురించి కైలాస నాధునికి తన దయనీయమైన స్థితిని గూర్చి వివరించవలసినదిగా కవి కోరతాడు. తానే కథానాయకుడై అరుంధతి సుతునిలో పరకాయ ప్రవేశం చేసి ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి

యినుప గజ్జెల తల్లి జీవనంబు సేయి
గసరిబుసకొట్టు నాతని గాలిసోక

నాల్గు పడగల హైందవ నాగరాజు అంటూ దరిద్ర దేవతైన ఆ ''యినుప గజ్జెల తల్లి'' సైతం అసహ్యించుకుంటుంది.

"ముసలివాడైన బ్రహ్మకు బుట్టినారు
నలువురు కమారులనుట విన్నాము గాని
పసరమున కన్న హీనుడభాగ్యుడైన
యెదవ కులస్థడెవ్వరమ్మా సవిత్రి"

బ్రహ్మ సైతం బ్రహ్మ సైతం బొమ్మగా మారి వింటున్నాడు. కవి ''భారతమ్మోరిని'' స్మరించుకుంటూ ఎన్నెన్నో ప్రశ్నలు వేసి తాను ఎందులోనూ ఘనుడు కాలేడు అని తెలుసుకుంటాడు.

ధర్మదేవత గ్రామ దేవత :

మనిషిని జంతువులా చూడటం, జంతువులను

దేవునిగా, దేవతగా కొలవటంతో ఆశ్చర్యపోయిన మహాకవి జాషువా గారు, ఇది జంతు సమాజమా లేక మానవుడు నివసించే మానవ సమాజమా అరుంధతీ సుతుడు నిల్చున్న చోట పులికి పడుతూనే అంటూ కవి ఇలా

"పామునకుంబాలు చీమకుంబంచదార
మేపుకొనుచున్న కర్మభూమింజనించు
ప్రాక్తనంబైన ధర్మదేవతకు గూడ
నులికిపడు జబ్బుగలదు వీడున్న చోట"

ఈ ధర్మ దేవతకు మాయ రోగం వస్తుంది కాబోలు, చెట్టుని లక్ష్మీ తల్లిగా పూజిస్తారు కాని మనిషిని గౌరవించరు.

గగన గంగ :

సృష్టికిమూలంఆది శక్తి. ఈ ఆదిశక్తి మూడుమూ ర్తుల అవతారంగా అవతరించి మైలపడిన వాడిని కడుగు తుంది. కానీ అరుంధతీ సుతుని చూడగానేవాడి నెత్తిన పులుముకున్న బురదను కడగాలంటే బెదిరిపోతున్న త్రిమూర్తులను చూసి మహాకవి జాషువా బిత్తరపోయాడు.

"వాని తలమీద బులిమిన పంకిలమును
గడిగి కరుణింపలేదయ్యె గగన గంగ
వాని నైవేద్యముననంటుపడినవాడు
మూడు మూర్తులకును గూడగూడులేదు"

గంగ, యమున, కృష్ణ, గోదావరి వంటి పుణ్య నదీమ తల్లుల సైతం పవిత్ర భారతదేశంలో పవహిస్తూ? అనేక? పాపాలను కడుతున్న తాము అస్పృశ్యతా కలంకాన్ని మాత్రం కడిగే శక్తి ఏ నదీమ తల్లికి లేదని వాపోతాడు.

ముప్పది మూడు కోట్ల దేవతలు :

ముప్పది మూడు కోట్ల దేవతలు పెళ్ళిళ్ళతో, భోగభాగ్యాలతో తులతూగుతూ ఉంటూ రోజుకో రంగు చీర బహుమతులతో సింగారించుకుని ప్రతిమలను చూసి మహాకవి జాషువా గారు ఆశ్చర్యచకితుడై ఇలా అంటు న్నాడు.

"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు
వ్యయించుగాని
దుఃఖితమతులైన పేదలపకీరుల శూన్యములైన
పాత్రలన్
మెతుకు విదల్పదీ భరతమేదిని ముప్పది కోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్య విహీనులక్షుత్తులారునే"

ఆకలి కడుపుతో అల్లాడుతున్నవాని గురించి కవి కరుణ చూపుతూ, రాతి విగ్రహములందు ఇలవేల్పుగా భావించి కళ్యాణాలు చేయటానికి వేలుఖర్చు చేస్తారు పేదవానికి సహాయం చేయరు. బిచ్చగానికి సహాయం చేయరు. ఇదేమి కర్మరా బాబోయ్! అంటూ కవి కసురుకుంటాడు.

సత్కళా దేవత :

శ్వపచుడు వియోగంతో స్మశానంలో తిరుగుతూ బూడిదతో ముద్దలు బొమ్మగా చేసి, పేదవానిలోని శిల్పకళలకు సత్కళా దేవత సైతం ఆనందపడుతుంది. మట్టిసైతం అతని చేతుల్లో అందమైన బొమ్మగా నిర్మించ బడుతుంది. ఆ శిల్పి సృష్టిని మెచ్చుకుంటూ మహాకవి జాషువా యిలా అంటాడు.

"కళలు మోహించు లోక కలీనుల చెగాదు
కులము లేదన్న వానిని గూడ వలచు
సత్కళా దేవతా కటాక్షంబు కతన
సమయుగావుత ముచ్చనీచతల బెడద"

''ముంతాజ్ మహల్''లో షాజహానును సైతం ఆకట్టుకున్న బూడిద బొమ్మ నిజంగా పేదవానిలోని కళను వెలికితీసి రాజు సన్మానించిన తీరు అందరూ మెచ్చు కోకపోయినా రాజు హృదయానికి ఆనందపరచ గలిగింది. పేదవాడైన శ్వపచుడు సత్కళాదేవత కటాక్షంబుతో ఘనుడు కాగలడని నిరూపించాడు.

దహన దేవత :

ముక్కు పచ్చలారని పసిబిడ్డలను మొక్కుబడుల నెపంతో గంగపాలు చేస్తున్న మూఢ ఆచారాలను, నాటి పేదల జీవన తీరును, భక్తిని వివరిస్తూ, విపరీత భక్తితో దహన కాండను ప్రోత్సహించటం సహించలేని వ్యర్థ ఆచా రాలు అన్ని ఎత్తిచూపుతూ మహాకవి జాషువా దుఃఖిస్తు యిలా అంటాడు.

"మొక్కుబళ్ళ నెపాన చక్కని పసిపాపలెందరు గంగలోగలిసిరొక్కొ
సహగమనాచార దహన దేవతలెన్ని చిగురు గొమ్మల బూది సేసెనొక్కొ"

ముదిరిన పిచ్చి భక్తిని, పసి పిల్లల దహనబలిని వ్యతిరేకించి లోకంలో జరుగుతున్న బ్రూణహత్యాలను ఎద్దేవా చేస్తాడు. కాపాడే దేవతలే దహించి వేస్తుంటే బాధపడతాడు.

పెద్దక్కగారైన అంకాళిదేవత :

వినుకొండలో నాలుగు దిక్కులలో, రక్షణగా ఉండిన గ్రామ దేవతలలో, పెద్దక్క గారైన అంకాళి దేవత జాతర పతి ఏటా నిర్వహించడం లేదని చీటికీమాటికీ ఆ గ్రహించవద్దమ్మా అంటూ సర్వదేవతలను కొని యాడుతూ, జాషువా తన పద్యంలో యిలా అంటాడు.

"టిప్పుసుల్తాను గట్టించిన నట్టింటి
మజ్జీదు మణికి క్షేమము కదమ్మ
.....
ఆగ్రహింపదుగదా అంకాళి దేవత
అలతి సత్తులకు పెద్దక్క గారు"

వినుకొండలోని నాలుగు దిక్కుల తల్లులందరికీ పెద్దక్క గారైన "అంకాళి దేవత"ను ఎక్కువగా స్త్రీలు భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. గస్తీ జవానుగా హనుమంతుడు, కొండపై శ్రీరామచంద్రుడు, టిప్పుసుల్తాన్ కట్టించిన మసీదుకలదని స్మరిస్తూ జాషువా సర్వమత సోదర భావాలను "నా కథ" అనే కావ్యంలో వివరించాడు.

కనకదుర్గ యింటి గడప :

వినుకొండలోని తీరుబావి దగ్గర వెలసిన దేవతామూర్తి కనకదుర్గమ్మ అమ్మవారు. ఆ తల్లి గడపను తొక్కి పూజించే పురజనుల గురించి జాషువా మాటలో..

"తీగ బావి పొంత తిష్ఠవేసిన యట్టి
కనకదుర్గ యింటి గడప ద్రొక్కి
తొంగి చూచువారు తొల్లి లేరిపుడైన
పలకరింతురమ్మ పౌరజనులు"

కనకదుర్గమ్మ తల్లి దగ్గర గ్రామవాసులు నిర్వహించే జాతర్లు గొప్పగా ఉంటాయి. ఆ తల్లి తమ పిల్లాపాపలను రక్షిస్తుందని ప్రజల నమ్మకం

శ్రీమహాకాళీ అమ్మవారు :

వినుకొండలోని విహంగాలైన పక్షులను? చంపి నప్పుడు, పశ్చాత్తాప పడిన కవి, పక్షులను ఆ ప్రాంతంలో వెలసిన అమ్మవారు శ్రీ మహాకాళి తల్లిని స్మరిస్తూ, అందరూ క్షేమాన్ని కోరుతు

క్షేమంబే కథ నీకు నీ సుతులకున్ శ్రీ కన్యకాండాళికిన్
రామక్ష్మాపతి పాదముద్రల పవిత్రంబైన నీకొండకున్"

అంటూ శ్రీ మహాకాళిని వినుకొండలోని దేవతా మూర్తిని తలుచుకుంటాడు. శ్రీరాముని పాదముద్రలు వెలిసిన కొండను ఎంత చక్కగా పలకరిస్తూ రాసినపద్యం, కొండంత ఆశ్చర్యాన్నిగొలుపుతుంది

గుబ్బులమ్మ గుట్టలో గజ్జెల ధనలక్ష్మీ :

వినుకొండలోని అనేక విషయాలను, తాను తిరు గాడిన ప్రాంతాలను "నా కథ" అనే కావ్యం ద్వారా గుట్టలమ్మ వద్ద గజ్జల ధనలక్ష్మి అమ్మవారి కథలను మరొకసారి దేవతామూర్తులను, సీతాదేవిని, మంజినీ దేవిని ఇంకా అనేక దేవతాలను కవి స్మరించెను.

"వాదించినా మంజనీ దేవి తనయుండు
తనయుల బుట్టించు దాతయనుచు
ఆశించితిమి గుబ్బలమ్మ గుట్టల వద్ద
గజ్జెల ధనలక్ష్మీ గాథలు ననచు"

"జననీ జన్మభూమిచ్చ! స్వర్గాదపీ గరీయసి!" అనే సూక్తి జాషువా కవి విషయంలో నిజమైంది. గుబ్బలమ్మ గుడి దగ్గర గజ్జల ధనలక్ష్మి అమ్మవారిని నల్లని బూబమ్మ తల్లిని పతి గామదేవతను "నాకథ" అనే కావ్యం ద్వారా మనకు తెలియపరిచాడు.

సత్తులకు జాతరలు :

జాతర అంటేనే గ్రామాల్లో పెద్ద ఎత్తున జరిగే పండుగ జాషువా మహాకవి దేవతామూర్తులు దగ్గర నిర్వహించే

జాతరలోని జంతు బలులను కన్నులకు కట్టినట్లుగా చూపినాడు చిల్లరదేవుళ్లు సేవ గూర్చి మహాకవి జాషువా కలం నుండి జాలువారిందే ఈ పద్యం.

"గొరెపోతుల నల్లజుర్రగుర్రున ద్రేచు
కరకు సత్తులకు జాతరలుసల్పి"

.....

అంబుధీశుని కళ్యాణులని తలంచి

ముంచు గంగమ్మలకు డబ్బు పోసిపోసి" "గబ్బిలం" కావ్యంలో చిల్లర దేవుళ్ళు సేవ, గ్రామదేవతల దగ్గర జరుగు జాతరలు గ్రామీణుల భక్తి ఏడుకొండల వాని కళ్యాణం గంగమ్మ తల్లికి సమర్పించు తలనీలాలు, యిదంతా పూసగుచ్చినట్టుగా పద్యంలో రాస్తు చివర పేదవానికి భక్తి పెరిగి గోచిలో నిలవాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పాడు జాషువాగారి పద్యాలలో గంగమ్మను చాలా చోట్ల ప్రస్తావిస్తాడు పేదలుపడే కష్టాలను గూర్చిన విషయాలు వారి ఆచార వ్యవహారాలు, వినుకొండలోని దేవతా మూర్తులను, గుడులను ప్రతిదీ జాషువా కవితలో, కావ్యాలలో చెప్పుకుంటూ వస్తాడు. తెలుగు సాహిత్యంలో గ్రామదేవతలు, వాటి ప్రాధాన్యతను చక్కగా వివరించాడు.

ఆధార గ్రంధాలు :

1. జాషువా సాహితీ ప్రస్థానం, సంపాదకులు డా. ఎస్వీ. సత్యనారాయణ, మొదటి ముద్రణ 1995.
2. జాషువా ముంటాజ్ మహల్, రచయిత - అమూల్య శ్రీ, ప్రచురణ 2000.
3. అన్వేషణ, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, ప్రథమ ముద్రణ 1995.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

"సంజీవదేవ్ – సామాజిక చైతన్యం – రేఖామాత్ర పరిశీలన

- లంక ఎల్. ఆర్ .వెంకటరమణ, అధ్యాపకులు,
ప్రాథమిక పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నాగులగుడ్డం తాండ, శింగనమల,అనంతపురం జిల్లా.

"సామాజిక చైతన్యం" అంటే సమాజంలో ఉండే చైతన్యం అని, సమాజంలో ఉండవలసిన చైతన్యం అని రెండు విధాలుగా అర్థాలున్నాయి. అనేకమంది వ్యక్తుల చైతన్యం కలసి సామాజిక చైతన్యం అవుతుంది. "నిర్ధిష్ట కాలంలో, నిర్ధిష్ట మనుగడ సాగిస్తున్న ప్రజల సామూహిక చైతన్యమే సామాజిక చైతన్యం". ఈ సామాజిక చైతన్యాన్ని - సామాజిక జీవితం నిర్ణయిస్తుంది. మరింతలోతుగా చూసినపుడు - విభిన్న కాలాల్లో, విభిన్న స్థలాల్లో ఉండే ప్రజల మధ్య గల సంబంధాలను సామాజిక జీవితం మధ్య గల మానవ సంబంధాలు సామాజిక చైతన్యాన్ని నిర్ణయిస్తాయి.

"మానవత్వంలేని మేధస్సు కంటే, మేధస్సులేని మానవత్వం ఎంతో మంచిదని చాటిన గొప్ప మానవతా వాది శ్రీ సూర్యదేవర సంజీవదేవ్. వీరు 1914వ సం॥ జులై 3వ తేదిన గుంటూరు జిల్లాలోని తుమ్మపూడి గ్రామంలో రామదేవరాయలు,వెంకాయమ్మ దంపతులకు జన్మించారు. బాల్యంలోనే తల్లిని పొగొట్టుకున్న ఆయన జీవితంలో ఒక రకమైన మానసిక అస్థిరతకు లోనయ్యారు. 16వ ఏట హిమాలయాలకు వెళ్ళారు. అక్కడి ప్రదేశాలు, వ్యక్తులు, విభిన్న భాషలలో విభిన్న విషయాలను చర్చించిన గ్రంథాలు, ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి.

'హేతువు' - బాల్యం నుండే సంజీవదేవ్‌ను వెన్నంటి ఉండి వీరు చిన్నతనంలోనే అనాచారాలు, మూఢనమ్మకాలపై ధ్వజమెత్తారు. వీరి 12వ ఏటనే కొన్ని సందేహాలు కలిగాయి. వీరు రాసుకున్న స్వీయ చరిత్రలో ఈ వివరాలు తెలుస్తాయి. "భార్యలు చనిపోయిన భర్తలు మరలా పెండ్లి చేసుకోవడం చూశారట, కానీ భర్తలు చనిపోయిన భార్యలు తిరిగీ పెండ్లి చేసుకోవడం లేదట. అపుడు దేవ్‌గారి బంధువు ఒకాయన సహగమనం గురించి, దీనిని రూపు మాపిన రాజారామ మోహనరాయ్ గారిని గురించి విధవ వివాహాలను ప్రవేశపెట్టిన ఈశ్వరచంద్ర విద్యా సాగర్, కందూకూరి వీరేశలింగం గారి గురించిన వివరాలు తెలిపాడు. ఈ సంస్కరణలకు ఆకర్షితుడైన సంజీవదేవ్ తన స్నేహితులతో కలిసి భర్తలేని ఒక ఆమెకు పెండ్లి చేయపూనుకున్నారట. ఇలా సంస్కరణ వాదాలపట్ల, హేతు వాదం పట్ల ఆసక్తిని చిన్ననాటి నుండే కలిగి ఉన్నారు.

''తెలుగులో ఉద్యమగీతాలు'' గ్రంధరచయిత శ్రీ ఎస్.వి.సత్యనారాయణగారు - "సామాజిక చైతన్యంలో మనిషి భావాలు, అభిప్రాయాలు, నైతిక, రాజకీయ, సైద్ధాంతిక దృక్పథాలు, సౌందర్యసృష్టి, తాత్విక, మత భావాలు, సాహిత్యాది కళలు అంతర్భాగాలుగా ఉంటాయి" అని పేర్కొన్నారు. వీటిలో వేటి ద్వారా నైనా మనిషి మనోగత భావాలను వ్యక్తం చేయవచ్చునంటారు.

అశాస్త్రీయ విషయాలకు, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండే సంజీవదేవ్ ప్రకృతి విశ్లేషణ పట్ల ఆసక్తి ప్రదర్శిస్తారు. చిన్ననాటి నుండే శాస్త్రీయ దృక్పథంలో విషయాల గమనింపును మనం చూడవచ్చు. శాస్త్రీయ దృక్పథం అంటే ఏ విషయానికైనా అసలు కారణం (హేతువు)తెలుసుకోవడం. శాస్త్రీయ ఆలోచనలు ప్రకృతికి సంబంధించిన విషయాలకే కాక, సమాజానికి సంబంధించిన అసలు కారణాలుగా కూడా ఉంటాయి. ఈ శాస్త్రీయ ఆలోచనలు సృష్టిలో నిర్మాణానికి మూలలను అన్వేషిస్తాయి. సమాచారాన్ని విశ్లేషిస్తాయి. వాస్తవాలను విశదీకరిస్తాయి. ఇంకా లోతుగా చెబితే - "ఇంద్రియాల

ద్వారా సేకరించిన హేతుబద్ధమైన సమాచారాన్ని విశ్లేషించి, దానికి 'శాస్త్రీయ నిబద్ధత' సమకూర్చడమే శాస్త్రీయ ఆలోచనల ముఖ్య లక్ష్యం.

''చైతన్యం'' అన్నది ఎప్పుడైనా ప్రశ్నలో నుండే పుడుతుంది. నేనెవరిని? నీవెవరవు? ఈ ప్రశ్నలు చైతన్యానికి తొలి రూపాలు. ప్రశ్న అన్నది ప్రశ్నగానే మిగిలిపోయిన సమాజంలో చైతన్యం గడ్డకట్టినట్లుంటుంది. ప్రశ్నకు సమాధానం దొరికిన సమాజంలో చైతన్యం ద్రవరూపంలో ఉంటుంది. ఇలాంటి ద్రవరూప చైతన్యమే సజీవ చైతన్యం.

సంజీవదేవ్ గారి సాహిత్యం :

సంజీవదేవ్ గారి సాహిత్యం మనకు - అనేక వ్యాసాల రూపంలోనూ, వ్యాస సంపుటాలుగా, కవితా సంపుటాలుగా, లేఖాసాహిత్యంగా, స్వీయచరిత్ర రూపంలో తెలుగు, ఆంగ్ల భాషలలో కనబడుతుంది.

వీరి స్వీయచరిత్ర ఆత్మకథా ప్రపంచంలో ప్రత్యేక స్థానముంది. తెగిన జ్ఞాపకాలు, స్మృతి బింబాలు, గతంలోకి మూడు గ్రంధాలు కలిగిపినదే వీరి స్వీయ చరిత్ర.

దేవ్‌గారు ఇంగ్లీషులో రాసిన గ్రంధం "బయోసింథసీ" - వీరి రచనలలోకెల్లా ఇది ఉత్తమమైనదిగా చెప్పబడుతోంది. ఇందులో విశ్వసృష్టి జీవోత్పత్తి, మానవ పరిణామం, సంస్కృతి, భాషలు, కళలు, జీవితం, మృత్యువు, మతాలు, దర్శనాలు ఇలా ఎన్నో విషయాలను తాత్విక వైజ్ఞానిక ధోరణుల గురించి అనేక శాస్త్రాలలో చెప్పిన విషయాలను సమదృష్టితో అర్ధం చేసుకుంటూ తనదైన ప్రత్యేకశైలిలో ఆ భావాలను తిరిగి మనకు అర్థమయ్యేలా చెప్పారు. వీరే ఈ గ్రంధంలో నూతన జీవి తాత్విక సిద్ధాంతం. ''సైకోహ్యూమనిజం''ను ప్రతిపాదించారు. దీనినే మానసవాదం అని కూడా అంటారు.

సంజీవ్‌దేవ్ గారు ఎందరో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినవారు. అల్డస్ హాక్సలీ అనే ఆంగ్లమేధావికి ఒక ఉత్తం రాస్తూ అందులో - ''మానవుడు స్వేచ్ఛాజీవి, మానవుడు అన్నిటి కన్నా స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కోరుకుంటాడు. దుఃఖాన్నించి, దారిద్రాన్నించి, మనోవేదనల నించి, నిత్యావసరాల నించి, రాజకీయ, సామాజిక, ఆర్థిక పీడిత శక్తుల నుంచి విముక్తి చెంది ఉండటమే స్వేచ్ఛ, అదే స్వాతంత్ర్యమని దేవ్‌గారు లేఖలో రాస్తారు.

శాస్త్రీయ ఆలోచన :

శాస్త్రీయ విషయాల పట్ల సంజీవదేవ్‌కు ఆసక్తి ఉండటమే కాదు, ఆయన ప్రతి వ్యక్తి జీవితంలోనూ శాస్త్రీయ పరిజ్ఞానం ఉండాలని అంటారు.

దైవం :

దైవం అన్నది 'ఒక నమ్మకం' మాత్రమే హేతువుకు అందనిది. శాస్త్రీయంగా సమాధానం చెప్పలేనిది అంటారు. వీరు రాసిన ఒక లేఖలో 'ప్రతి మతంలో జ్ఞానకాండ, కర్మకాండ అనే రెండు దశల సాధనలుంటవి. నాకు కర్మకాండ నచ్చదు, జ్ఞానకాండ ఇష్టం'' అంటారు. మతం పేరిట జరిగే పూజాక్రతువుల పట్ల సంజీవదేవ్ వివిధ సందర్భాలలో తమ విముఖత వ్యక్తపరచారు.

మూఢ నమ్మకాలు :

అశాస్త్రీయ విషయాలు, మూఢనమ్మకాలకు దూరంగా ఉంటారు సంజీవదేవ్. ప్రకృతి వైవిద్యాన్ని, శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి ఆయన ఆసక్తి చూపుతారు.

శరీరనిర్మాణ శాస్త్రం :

ప్రపంచంలో మెదడును మించిన సంక్లిష్టమైన, సునిశితమైన, శక్తివంతమైన నిర్మాణంలేదని, అది అనుభూతులు, ఆలోచనలు, కోరికలకు మూల స్థావరంగా ఉందంటారు. అంతేకాక శరీరంలో జరిగే అనేక జీవ రసాయనిక చర్యలను మెదడు అదుపు చేస్తుందని చెబుతారు.

మనోవిజ్ఞానం :

దేవ్‌గారికి అత్యంత ఇష్టమైన రంగం మనో విజ్ఞానం.

"సామూహిక అచేతన నుండి వైయుక్తిక అచేతన వస్తుంది. వైయక్తిక అచేతన నుండి వైయక్తిక చేతన రూపొందు తుంది". ఈ వైయక్తిక చేతననే 'వ్యక్తిత్వం' అన్న యూంగ్ సిద్ధాంతమంటే అభిమానం.

ఇవే కాక సంజీవదేవ్ గారు చిత్రకళ, శిల్పకళ, ఫోటో గ్రఫీ, ఇంకా అనేక కళా, సాహితీ, శాస్త్ర అంశాలను శాస్త్రీయంగా వివరిస్తారు.

సామాజిక జీవితం - ప్రభావిత అంశాలు :

సామాజిక జీవితాన్ని - సాంఘికం, ఆర్థికం, రాజకీయం, నైతికం వంటి అంశాలు ప్రభావితం చేస్తాయి. వీటితో పాటుగా తాత్విక పార్శ్వం అన్నది కూడా ప్రముఖమైన ప్రభావిత అంశం. సంజీవదేవ్ గారి రచనలన్నీ కూడా తాత్విక పార్శ్వం నుండి ఇతర అంశాలను దర్శిస్తూ చైతన్య పరుస్తాయి.

మానవ స్వభావం, మానవ వ్యక్తిత్వం అన్నవి తమంతట తాముగా నిర్ణయిమైనవి కావు. ఒక్కొక్కమారు - ఇతర మానవుల ఒత్తిడి ద్వారా, నిర్ణయమైనవిగా ఉం టాయి. అలాగే మానవుడు తన చర్యల ద్వారా, ఆలో చనల ద్వారా ఎప్పటికప్పుడు, తన వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని నిర్ణయించుకుంటుంటాడు. నిర్మించుకుంటుంటాడు.

చైతన్య శీలి అయిన మానవుడు సాటివారితో కలసి తన జీవితం నిన్నటి కన్నా నేడు, నేటి కన్నా రేపు సుఖంగా, సంతోషంగా, అందంగా ఉండాలని కృషి చేస్తాడు.

ముగింపు :

మానవుడు ఆదిమ మానవ రూపం నుండి, సంచార జీవితపు గుహలు, చెట్టు తొర్రల నుండి - పచ్చి మాంసం తినే దశ నుండి వండిన మాంసం తినే దశకు చేరినది పరిణామదశ, ఆహార సేకరణ నుండి ఆహారాన్ని ఉత్పత్తి చేసే దశకు చేరుకున్నాడు. ఇవన్నీ కూడా మనిషి తన అన్వేషణతో తన కోసం తాను సృష్టించుకున్న, సాధించు కున్న విషయాలు. ఈ పరిణామ దశలో మానవుడి సామాజిక చైతన్యం రూపుదిద్దుకుంది.

మనిషి శ్రమతో సంబంధం లేకుండా జీవితంలో ఏదీ సంబంధం కాదు. ప్రతి వస్తువును మనిషి, తన కోసం, తన శ్రమతో ఉత్పత్తి చేసుకుంటూ పురోగమిస్తున్నాడు.

మారిన పరిసరాలు, పరిస్థితులలో మనిషి తాను మారిన ఆలోచనలతో, అభిరుచులతో ఉత్పత్తి శీలతను మార్చుకుంటూ వస్తున్నాడు. నాటి ఆదిమ మానవునికి అనువుగాని పరిసరాలకు అనువుగా మార్చుకోవడంలోను, అదేవిధంగా నేటి ఆధునిక మానవుడు తనకు సవాలు విసురుతున్న క్రొంగొత్త రోగాలను, కొత్త సవాళ్ళను ఎదుర్కో వడంలో ఏనాడు నెరవడం లేదు. ఇదంతా అతను సాధించుకున్న సాంఘిక చైతన్యమే.

సామాజిక చైతన్యం ఒక జాతి, జీవిత విధానాన్ని నిర్వచిస్తుంది. ప్రజల సృజన స్వభావం, వారి సామాజిక చైతన్యంలో తొంగి చూస్తుంది. అలాంటి లోతైన, లోచూపున్న సాహిత్యాన్ని సృజన చేసి మనకందించిన సూర్యదేవర సంజీవదేవ్‌గారు. చిరస్మరణీయులు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

'సంకెళ్ళు తెగాయి' – సామాజిక మార్పు

– డా॥. మేడికుర్తి ఓబులేసు, అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి), తెలుగుశాఖ, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు.

1960వ దశకంలో ఆఖరి సంవత్సరాలు మరియు 1970వ దశకం మొత్తాన్ని హరిత విప్లవం మొదటి దశ కాలంగాను, 1980వ దశకాన్ని హరిత విప్లవం రెండోదశ గాను పరిగణించవచ్చు. 1990వ దశకం ఆర్థిక సంస్కరణల దశ.

1970-90 మధ్యగల కాలంలో దళిత బహుజనులు గ్రామీణ వ్యవస్థలో కొంత వరకు మనుగడను కొనసాగించారు. ఈ కాలంలో అగ్రవర్ణాల సమాజం కొనసాగినా బహుజనులు వృత్తిని నమ్ముకొని, వృత్తి లేని రోజుల్లో వ్యవసాయ కూలీలుగా పరిణామం చెందారు. 1990వ దశకం నాటికి గ్రామీణ, పట్టణ సమాజంలో పెట్టుబడిదారీ అభివృద్ధి, పారిశ్రామీకరణలతో బహుజనులు కులవృత్తి పతనం అవడం మొదలైంది. వస్తుసేవల్లో చాలా వరకు ఫ్యాక్టరీలలో గానీ, ఆధునిక యంత్రాలతో ఉత్పత్తి జరగడం వల్ల వాటితో పోటీకి తట్టుకోలేక కులవృత్తులు మూతపడి, జీవనాధారాన్ని కోల్పోవడం జరుగుతున్న కాలం. ఇదే సమయంలో 1994లో భారతదేశంలోకి చొచ్చుకొచ్చిన ప్రపంచీకరణ ఈ క్రమాన్ని వేగవంతం చేయడమే కాక, అనేక దేశాల బహుళజాతి సంస్థల ఉత్పత్తులు సులువుగా మనదేశంలోకి దిగుమతి చేయడంవల్ల వృత్తులు కోల్పోతున్న దళిత బహుజనుల ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మళ్ళారు. అక్కడ కూడా ఎక్కువ కాలం దళిత బహుజనులు నిలువలేకపోయారు. గ్రామీణ వ్యవసాయ రంగం కుదేలైపోవడం వల్ల వ్యవసాయ కార్మికులుగా జీవిస్తున్న దళిత బహుజనుల పిల్లలకు, యువతరానికి విద్య, ఉపాధిరంగంగా, ప్రయోజనకారిగా కనిపించిన కాలం. ఈ దశకంలోనే గ్రామీణ వ్యవసాయ కార్మికులుగా బ్రతుకుతున్న బహుజనులు విద్యా ఉద్యోగం వంటి వాటిల్లో ప్రవేశించటం జరిగింది. ఇది ఒకవైపు మరోవైపు పట్టణ వ్యవస్థలో అసంఘటిత కార్మికులుగా వున్న దళిత బహుజనులు కూడా విద్య వైపు పయనించటం మూలాన ఉపాధి వనరులు అధికంగా అవసరం అయ్యాయి.

ఇలాంటి సమయంలో డా॥. ముదిగంటి సుజారెడ్డి 'సంకెళ్ళు తెగాయి' అనే నవలను రాశారు. ఇది 1994లో ముద్రితమైంది. రచయిత ఈ నవల రాసేనాటికి భారత దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మార్పులు మనం గమనించవచ్చు. ఈ నవలను చదివితే మనకు రెండున్నర దశాబ్దాల క్రితం దళిత బహుజనుల జీవితాలు సుస్పష్టంగా అర్థమవుతాయి.

డా॥. ముదిగంటి సుజాతారెడ్డి రాసిన 'సంకెళ్ళు తెగాయి' ఒక మారుమూల పల్లెలో క్షురుకుని జీవితాన్ని ఆవిష్కరించిన నవల. ఇది పదిహేను భాగాల నవల. ఆ పల్లెలో 'ఈరిగా' అని పిలవబడే ఈరయ్యది కులవృత్తిపై జీవించే కుటుంబం, భార్య రంగి, ముగ్గురు కూతుళ్ళు - పూలమ్మ, చెంద్రమ్మ, పద్మమ్మ, ఒకే కొడుకు నారాయణ. నాలుగెకరాల మడి చెలక, ఒక మంగలి పెట్టె అతని స్థిరచరాస్తులు. ఆ గ్రామానికి మోతుబరి, రాజేశ్వరరావు భూస్వామి. బడుగు వర్గాలను అణచి వుండే స్వభావంతో వెలిగిపోతాడు. కూతురు సుశీల అమెరికాలో స్థిరపడిన డాక్టరు భార్య. రాజేశ్వరరావు కొడుకు రామేశ్వరరావు.

ఈరయ్య కొడుకు నారాయణ. మంచి చదువరి. పల్లెల్లో బలహీన వర్గాల అణచివేత పట్ల కలత చెందుతాడు. స్వగ్రామంలో తండ్రి పడుతున్న యాతన, బానిసల్లా రాజేశ్వరరావు వద్ద శ్రామిక కులాలు చేస్తున్న ఊడిగానికి బాధపడతాడు. తను చదువుతున్న కళాశాలలోనే రాజేశ్వరరావు కొడుకు రామేశ్వరరావు చదువుతాడు. కాని నారాయణంటే రామేశ్వరరావుకు చిన్నచూపు.

తన బానిస కొడుకు తనతో సమానంగా చదువుకోవటం ద్వేషానికి కారణమవుతుంది.

కళాశాలలో వేద ప్రకాష్ చరిత్ర అధ్యాపకుడు. నారాయణ విద్యార్థి. నారాయణ ఏకాగ్రతపట్ల, కష్టించి అధ్యయనం చేయటంపట్ల, సహనశీలతపట్ల వేదప్రకాష్ ముగ్ధుడవుతాడు. డిగ్రీ చివరి సంవత్సరం చరిత్ర పరీక్షలో నారాయణకి అందరికంటే ఎక్కువ మార్కులు వస్తాయి. ఉక్రోషం పెంచుకున్న రామేశ్వరరావు, వేదప్రకాష్‌పై నిందలు మోపుతాడు. నారాయణతో ఇంట్లో పనులు చేయించుకొని ఎక్కువ మార్కులు వేసినట్టు ప్రచారం చేస్తాడు. వేదప్రకాష్‌పై దౌర్జన్యం చేయటానికి ప్రయత్నిస్తాడు. కాని వేదప్రకాష్ లాలనగా రామేశ్వరరావుని దగ్గరకు తీసుకొని ప్రేరణ కలిగిస్తూ మాట్లాడతాడు. అనల డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థిని. అనలకు నారాయణ అంటే ఎంతో ఇష్టం. ఒకరోజు అనల నారాయణతో పల్లెను చూడటానికి తల్లితండ్రులను ఒప్పిస్తుంది. రామారావు దంపతులు నారాయణతో వాళ్ళ ఊరికి వెళ్ళి పల్లెను చూసి రాత్రికి ఇంటికి చేరుకొనే ఒప్పందంతో పంపిస్తారు. నారాయణ తన ఇంటికి అనలను తీసుకెళ్ళతాడు.

అనల పల్లెల్లో ఉన్న అనేకమైన కులాల వృత్తుల వారి జీవన విధానాన్ని ఆర్థిక రాజకీయ, సామాజిక, సాంస్కృతి కాది కోణాల్లో అధ్యయనం చేస్తుంది. నారాయణ చెల్లెలు పూలమ్మ, చంద్రమ్మలు అనలను వదిలివుండలేనంతగా కలిసిపోతారు. అనలకు తెలియని విషయాలు పల్లెలో తెలుసుకుంటుంది. ఇంతకాలం వరి మొక్కలకు బియ్యం కాస్తాయనుకుంటుంది. కానీ ధాన్యాన్ని దంచితే బియ్యం వస్తాయని తెలుసుకొని ఆశ్చర్యపోతుంది. వేరుశనగ కాయలు మొక్కకు కాస్తాయో భూమిలో వుంటాయో ఇప్పుడు తెలుసుకొంటుంది. పల్లెలో వివిధ వృత్తుల వారి జీవితాల్ని అధ్యయనం చేస్తున్నప్పుడు దోపిడి వ్యవస్థలో భూస్వాములు ఎలా పేద ప్రజల్ని దోచుకుంటున్నారో తెలుసుకొంటుంది.

చేనేత, కుమ్మరి, వడ్రంగం, కమ్మరం, కంసాలి మొదలైన పనులు చేయటంలో ఉన్న వృత్తి పనితనాన్ని కళాత్మకతను అందులో ఇమిడి ఉన్న విజ్ఞానాన్ని పరిశీలిస్తుంది. బంగారం పనులు చేసే వృత్తి పరికరాలను ఆసక్తిగా గమనిస్తుంది. వ్యవసాయానికి ఆధారమైన వడ్రంగి పనితనాన్ని గమనిస్తుంది. బండి చక్రాలు, నాగలి వంటి సాధనాలు చరిత్రలో ఎలాంటి మలుపులు తీసుకున్నది. నాగరికతా వృద్ధిలో వాటి స్థానాన్ని మననం చేసుకుంటుంది. కమ్మరి కొలిమిలో ఇనుము సైతం ఎలా వంపులు తిరుగుతుందో కొడవలి, పార వంటి వస్తువులు తయారి వెనుక ఎంత శ్రమ దాగివుందో విశ్లేషించుకుంటుంది. చివరిగా రాజేశ్వరరావు గడీ చేరుకుంటుంది. అక్కడ రాజేశ్వరరావు ప్రజల్ని కొల్లగొట్టి తన అధికత్వతను ప్రదర్శించిన ఇంటి వైభవాన్ని తన అహంకారాన్ని గమనిస్తుంది. నారాయణ, ఈరయ్య వంటి చిన్న కులాల వాళ్ళు ఎలా అణచి వేయబడింది గ్రహిస్తుంది. రాజ్య లక్ష్మమ్మ కట్టుకున్న చీర వెనక ఎంతటి దోపిడీ దాగి వుందో విశ్లేషించుకుంటుంది.

నారాయణ సివిల్స్ రాయటానికి ప్రయత్నిస్తాడు. అతనికి స్ఫూర్తినివ్వటానికి అనల కూడా కోచింగు తీసుకుంటుంది. నారాయణ బావ రాజయ్య పోలీసులు ఎదురుకాల్పుల్లో మరణిస్తాడు. పూలమ్మ పుట్టింటికి చేరుకుంటుంది. పోలీసులు విచారణ పేరుతో ఈరయ్య కుటుంబాన్ని వేధిస్తారు. ఈ సంఘటనకు నారాయణ కదిలిపోతాడు. తన మొత్తం శక్తిని వినియోగించి పరీక్ష రాస్తాడు. రాత పరీక్షలో ఉత్తీర్ణుడవుతాడు. నారాయణ విద్య వల్ల తన జీవితాన్ని ఎలా పరిపూర్ణం చేసుకున్నాడో ఈ నవల చదివితే మనకు అర్థం అవుతుంది.

ఈ నవలలో వివిధ బహుజన వృత్తులవారు పడుతున్న కష్టాల గురించి, దోపిడీ గురించి రచయిత మనకు అక్కడక్కడ స్పష్టంగా తెలియజేస్తారు. సుశీల భర్తతో పసిబిడ్డతో పుట్టింటికి రావటంతో కథ మొదలవుతుంది. 'పుట్టెంట్రుకలు' తీసే సంప్రదాయం ఇక్కడ దృశ్యం చేశారు రచయిత్రి. ఒక భూస్వామి ఇంటిలో ఈ

కార్యక్రమం ఎంత ఆర్భాటంగా జరుగుతుందో చిత్రించ బడింది. రోజుల తరబడి ఆ పల్లెకు చెందిన మంగలి, చాకలి వంటి కులాల చాకిరీ కనిపిస్తుంది. భార్యకు జ్వరం. నీళ్ళు లేక ఎండిన పాలంలో ఆగిపోయిన పని ఒత్తిళ్ళ మధ్య రాజేశ్వరరావు ఇంటిలో పెట్టెంట్రుకులు తీయటానికి వస్తాడు వీరయ్య. ''ఏందిరా! ఈరిగా! నీ కోనం ఎప్పట్నించి చూస్తున్నం! చిన్నదొర తయారై ఎంత సేపాయే! మునేపటి కాలం కాదురా! నీకు మస్తీలు ఎక్కువైనయి. మనుపటి భయాలు లేదు. ఇప్పుడెందుకు మాట వింటరు'' (పుట.7) ఇది రాజేశ్వరమ్మ గద్దింపు. వేడుక అనంతరం అక్కడికి వచ్చిన పెద్దలు, బంధువులు భోజనం చేసి వెళ్ళిపోతారు. డప్పులు వాయించిన వాళ్ళకు, చాకలి, మంగలి పనివాళ్ళకు అందరికీ కలిపి సాయంత్రానికి పెరట్లో మిగిలిపోయిన అన్నం కూరలు పెడతారు. ''మాంసం బొక్కయినా మనదాకా రాలేదే'' అని ఆశ్చర్య పోయాడు మేకలను కోసి కోసి అలసిపోయి చాకలి అంజయ్య'' (పుట.12) అనే వాక్యం ఈ మొత్తం సంఘటనని వ్యక్తం చేస్తుంది.

ఆ పల్లెలో పది సాలె కుటుంబాలున్నాయి. వాళ్ళ పొద్దస్తమానం కుటుంబం అంతా కలసి పని చేస్తారు. చీరలు నేస్తారు. కాని వేల రూపాయల విలువ చేసే చీరల్ని చాలా తక్కువ ధరకు రాజేశ్వరరావు భార్య రాజ్య లక్ష్మమ్మకు అమ్ముతారు. ఆమె ఆ చీరల్ని పట్నంలో వేలల్లో అమ్మి సొమ్ము చేసుకొంటుంది. ''నాకు చీర నేడయమే తెలుసు. దాన్ని బజార్లో ఎంత కమ్ముకోవాల్లో, ఎట్ల అమ్ముకోవాలో, ఎవరికి అమ్ముకోవాలో నాకు తెల్వదమ్మా! నేను నేసిన చీరలు అందరూ కట్టుకొనేయి కావు. అంటే అందరు గన్ని పైసలు కట్టి కొనుక్కోలేరు. అందుకే దొరసాని చీరలు తీస్కపోయి పట్నంలో తమ దోస్తులకు అమ్ముతది. ఆమె దయవల్ల అంతమాత్రం అమ్మకం జర్గుతున్నది. అని రెండు చేతులెత్తి దానయ్య గాలిఓ ఆ దొర్సా నినుద్దేశించి నమస్కరించాడు'' (పుట.113) అనే మాటలు దొరసాని వల్ల అమాయకులైన బడుగువర్గాలు ఎలా మోసపోతున్నది కనపడుతున్నది. దళారీ వ్యవస్థతలో శ్రమ జీవుల జీవితాలు ఎలా దోపిడీకి గురి అవుతున్నది, వివరంగా చెప్పి నేత కార్మికులు సహకార సంఘంగా ఏర్పడాలని చైతన్యపరుస్తుంది.

కుమ్మరి కుటుంబాల వైపు వెళ్ళి అక్కడ కుండలు తయారు చేసే విధానానికి చకితురాలవుతుంది. కుండలకు గిరాకీ లేకపోవటం, ప్లాస్టిక్, (స్టెయిన్‌లెస్) స్టీలు వస్తువుల వాడకం పెరగటం, కుమ్మర్ల జీవితాలు దయనీయంగా మారటం, వృత్తి పనివాళ్ళు వేరే పనులు చేయటానికి చైతన్యం లోపించటం పట్ల బాధపడుతుంది. ''ఇదే మా బతుకుదెర్వు మరీ! ఏరే పని రాదు మాకు తల్లీ! ఏదోగట్ల దొర్కిన పైసలతోనే గడుపుకుంటన్నం గందుకే ఇప్పటి పోరలెవ్వరూ గీపని నేర్చుకుంటలేరు. ఎవసాయం కూలిపని సేసుకుంటన్నరు. వరికోతలు, చెరువు కొట్టే కాలంలో నాగార్జున సాగరం అని బెజవాడ అనీ దూర దేశాలకు పోతుండ్రు. కుండలు ఎవురికి కావాలమ్మ గిప్పుడు! నేనేదో ముసలోన్ని గీ పని ఒదులుకోలేక చేస్తున్న'' (పుట.109) అని కుమ్మరి మల్లయ్య అన్న మాటలు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి.

పై సంఘటనలు ఆధారంగా ఈ నవల ఆనాటి తెలంగాణ జనజీవితాన్ని ముఖ్యంగా దళిత బహుజనుల జీవితాల్ని మన కళ్ళ ముందు ఉంచుతుంది. ఈ నవలలో ఆనాటికి తెలుగు రాష్ట్రంలో ఉన్నటువంటి నక్సల్స్ ఉద్యమం కొంతవరకు కనిపిస్తుంది. 1994 నాటికి సామాజికంగా జరుగుతున్న మార్పులలో భాగంగా నారాయణ లాంటి దళిత బహుజన విద్యార్థులు ఎంతోమంది విద్య వల్ల జీవితాల్ని బాగు చేసుకున్నారు. ఈ నవల నారాయణ విజయం మాత్రమే కాదు. ఆనాటి కాలంలో ఎంతో విద్యార్థుల హృదయాలలో విద్య పట్ల ఉత్సాహాన్ని రగిలింప జేసిన ముద్దిగంటి సుజాత రెడ్డి గారి విజయం కూడా. అందుకే ఈ నవలలో నారాయణ విజయంతో దళిత బహుజనుల సంకెళ్ళు తెగాయి. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక తెలుగు సాహిత్యం – తెలంగాణ కవుల రచనలలో సామాజిక జీవన చిత్రణ

– యస్. రజిత, తెలుగు అధ్యాపకురాలు, పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హనుమకొండ.

సాహిత్యమనగా సహృదయమునకు హితవు గోల్పు నది. సమాజానికి మేలు చేకూర్చేది సాహిత్యం అవుతుంది. సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం వుంది. సమాజంలోంచి సాహిత్యం ఉద్భవిస్తుంది. సాహిత్యం సమాజం కోసమే సాహిత్య రచనని అంచనా వెయ్యడానికి ఆనాటి సామాజిక స్థితిగతులు ఉపయోగపడుతాయి. ఈవిధంగా చూసినట్లయితే సామాజిక స్థితిగతులు తెలుసుకోవడానికి సాహిత్యం ఎంతో ఉపయోగపడు తుంది.

లిఖిత సాహిత్య చరిత్రను యుగాలుగా విభజించారు. 1875 నుంచి ఆధునిక యుగం ప్రారంభమైంది. ఆనాటి నుండి వెలువడిన సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యం అంటున్నాం. ఆధునిక సాహిత్యాన్ని నవ్య సాహిత్యం, అభినవ సాహిత్యం అని కూడా అంటారు.

కవి మనసులో ఎప్పుడో ఒకప్పుడు సంఘర్షణలకు గురి అవుతాడు. అట్టి సందర్భాలలో తిరుగుబాటు మనస్తత్వంతో ఉండటం జరుగుతుంది. కొందరు తమకు తాము కొత్త పోకడలు పోతూ వాటికి మెరుగులు దిద్దు కుంటూ రొమాంటిక్ కవులుగా స్థిరపడతారు. అయితే ప్రతిభావంతుడైన కవి ఆ భాణీ నుండి నెమ్మది నెమ్మదిగా బయటపడి క్లాసికల్ కవిగా రూపొందవచ్చు. మరికొందరు సంప్రదాయ కవిగా ప్రారంభమై అంతటితోనే ఆగిపోతారు. ఒకసారి పరిశీలించి చూసినట్లయితే ప్రతి కవిలోను రెండు అంశాలు గోచరించవచ్చు. అయితే దేని ప్రభావం ఎక్కువగా ఉంటే ఆ కవిగా పిలువబడుతాడు.

ఈ యుగంలో తెలుగు సాహిత్యం ప్రక్రియ, వస్తువు శైలి తదితర అంశాల పరంగా విప్లవాత్మకమైన మార్పులకు లోనైంది. ఈ మార్పులు ఎందుకైనవి అంటే సాహిత్యం పై రాజకీయ, సామాజిక ఉద్యమాల ప్రభావాలు వున్నాయి. అదేవిధంగా బ్రిటీష్ పాలనలో రెండు బలమైన సంస్కృతులు సమాంతరంగా నడిచాయి. ఒకటి పాశ్చాత్య సంస్కృతి, రెండవది హిందూ సంస్కృతి. ఈ పాశ్చాత్య సంస్కృతి వలన నవల వంటి కొత్త ప్రక్రియలను అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడింది. ఈ పాశ్చాత్య సంస్కృతి వలన కందుకూరి, రాజారామమోహనరాయ్ ఇలాంటి వారు మన సంస్కృతిలో మార్పులు అవసరమని భావిం చారు. హోమ్ రూల్ ఉద్యమం వలన అయితేనేమి, హిందూ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు స్థాపితమవడం వలన హిందు పునరుజ్జీవన ఉద్యమం బయలు దేరింది. దీని వల్ల పాత భావాలు, మూఢ నమ్మకాలు నూతన ఆచారాలు బలహీనపడినవి. ఈ దృక్పథము వలనే ఆధు నిక సాహిత్యం మొదలైంది. ఆధునిక సాహిత్య వ్యాప్తికి వ్యవహారిక భాషోద్యమం కూడా ఒక కారణం. భాషా తత్వం, చరిత్ర నిర్మాణం, దృష్ట్యాదీ కాల నిర్ణయం, సంఘ దర్మాలు, విశ్వాసాలు వీటిని యే గ్రంథం అయితే చూపించగలుగుతుందో అది ఆధునిక సాహిత్యం. ఆధు నిక సాహిత్య నిర్మాతగా పేరు గాంచిన వారు కందుకూరి వీరేశలింగం గారు నవ్య సాహిత్య ప్రక్రియలన్నింటికి స్థితిని, ప్రాచర్యమును కల్పించిన వారు కందుకూరి వీరేశలింగం పంతులు గారు.

ఆధునిక సాహిత్యంలో వివిధ రచయితల, కవుల సామాజిక జీవన చిత్రణ చూసినట్లయితే వీరేశలింగం గారి కాలంలో గల మూఢాచారాలు, వృద్ధ వివాహాల వల్ల నష్టాలు వినోద తరంగిణిలో ''కలి పురుష శనైశ్చర

విలాసము" లో ప్రజలు ఏవిధంగా భ్రష్టులవడం మొదలు పెట్టారో వివరించే ప్రహసనం. వీరేశలింగం గారి వ్యాసాలలో ఆనాటి సాంఘిక సమస్యలన్ని కనిపిస్తాయి.

గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం నాటకంలో నాటి సాంఘిక వ్యవస్థ వినాశకర స్థితిని, హేయమైన మానవ నైజాలను, బ్రతుకులు వెళ్లమార్చే బాల వితంతువులు, సారా మత్తులో యోగ రహస్యాలు చెప్పే బైరాగులు, దొంగ సాక్షులు ఇలా ఆనాటి సంక్షుబిత సమాజ సమగ్ర స్వరూపాన్ని ఫోటోగ్రఫీ తీసి మన ముందు పెట్టారు గురజాడగారు.

తెలంగాణ కవుల రచనలలో సామాజిక జీవన చిత్రణ :

సురవరం ప్రతాపరెడ్డి గారి రచనలలో సురవరం కథలలో సాంఘీక వ్యవస్థకి, గ్రామీణ జనజీవితాలకు దర్పణం పడుతూ సమకాలీనతను ప్రతిబింబిస్తూ ఉంటాయి. ప్రతాపరెడ్డిగారు వ్రాసిన హిందువుల పండుగలు గ్రంథంలో తెలుగువారి పండుగలే కాక భారతీయ లందరూ జరుపుకునే వ్రతాలు, జయంతులు, పండుగలు ఉత్సవాలకు సంబందించిన గాథలు ఎన్నో అందులో వున్నాయి.

ప్రజాకవి కాళోజీ నారాయణరావు గారు 1969-72 మధ్య కాలంలోని తెలంగాణలో జరిగిన ప్రతి సంఘటన కాళోజీ కవిత్వంలో రికార్డు చేశారు.

"అన్నపు రాసులు ఒకచోట, ఆకలిమంటలు ఒకచోట
హంస తూలిక లొక చోట, అలసిన దేహాలొకచోట
సంపదలన్ని యొక చోట, గంపెడు బలగంబొకచోట"

అంటూ నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజల కష్టాలను తన రచనల ద్వారా చెప్పినవారు కాళోజి. కాళోజీ గారు మన వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో పోటీపడి కాటులాడ - అనే ఖండికలో

విపణీ విధి - తపోవనం
చాకిరేవు - శాసనసభ
సానికొంప - సాధుమఠం
మూత్రశాల - యాత్రాస్థలి
ఎచటైతేం - ఎచటైతేం?

పోటిపడి కాటులాడ ఎచటైతేం ? అని ముగుస్తుంది. ఇందులో సమాజంలోని అన్ని కోణాల్ని చూపించాడు.

నిజాం నిరంకుశ పాలనలో ప్రజల బాధలను హృదయ విధారంగా సామాన్యుల జీవితాలు దుర్భరమయినవి అని, మానభంగాలు లెక్కేలేదు, తెలుగు మాట్లాడటానికి వీలే లేదు. ఆస్తుల దోపిడీలు, గృహ దహనాలు యివ్వన్ని రచనల ద్వారా తెలియచేసాడు.

పల్లా దుర్గయ్య గారు వ్రాసిన కావ్యం 'గంగిరెద్దు' కావ్యం ఇది గ్రామీణ సంస్కృతి, సౌందర్య శోభకు పట్టం కట్టినది. తెలుగువారి ఆచార సంప్రదాయాలకు మన కళ్లకు కట్టినట్లు చూపినవి ఈ కావ్యం.

దాశరథి రంగాచార్య తెలంగాణ సాయుధ పోరాటం నాటి పరిస్థితుల గురించి, నిజాం అకృత్యాల గురించి, నాటి బానిస పద్ధతులను గురించి తన రచనలలో వివరించారు.

"పల్లెటూరి పిల్లగాడా! పశువుల గాసే మొనగాడా
పాలు మరిచి ఎన్నాళ్ళయిందో ....."

ఈ పాట వినగానే మనకు గుర్తుకు వచ్చే పేరు సుద్దాల హనుమంతు - పల్లెటూళ్ళలో చిన్నపిల్లలు పశువులు గాయటానికి వెళ్లడం చూసి చలించిపోయి రాసినవీ పాట. 'ఒక జాతి సంస్కృతికి భాష ఆయువు పట్టు వంటిది' అని చెప్పిన డా॥ పి.యశోదారెడ్డి తన రచనలలో యుగయుగాలుగా ఉన్న స్త్రీ సమస్యలను స్త్రీ వాద దృక్కోణం నుంచే కాక పూర్వాపర సంబంధ పూర్వకంగా స్త్రీ పురుషుల మధ్య వచ్చే సమస్యలను వివరించింది. అంతే కాక తెలంగాణలో జరుపుకునే పండుగలు, ఆచార, వ్యవహారాలు, సంబంధ బాంధవ్యాలు యివ్వన్ని తన రచనలలో వివరించింది.

గద్దర్ విప్లవ కళాకారుడిగా పాటలు కట్టి పాడి ప్రజల్ని ఉత్తేజపరుస్తున్నారు.

"సిరిమెల్ల చెట్టు కింద లచ్చుమమ్మా లచ్చుమమ్మా
సినబోయి కూర్చున వెందుకమ్మా ఎందుకమ్మా"

శ్రమలో బ్రతుకంతా చీకటి చేసుకొన్న లచ్చుమమ్మ గురించి వివరిస్తూ శ్రమ జీవుల శ్రమ అంతా వ్యర్థమే అని వారు ఎంత శ్రమించిన వారి జీవితాలలో వెలుగు లేదని, తన రచనలలో దళితుల కష్టాలను వివరిస్తూ తన పాటల ద్వారా చైతన్య పరుస్తారు.

ఈ విధంగా ఈ ఆధునిక సాహిత్యం సమకాలీనమైన జీవిత పరిస్థితులను, రాజకీయ వాతావరణాన్ని, ఆర్థిక సమస్యలు సమాజ సంఘర్షణలు, నైతిక సందర్భాలు, వీటన్నటిని చూపించేది. సాహిత్యం - సమాజం బింబ ప్రతిబింబంలా ఉండేదే ఆధునిక సాహిత్యం.

ఉపయుక్త గ్రంథావళి :

1) తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా.శాస్త్రి
2) తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర - ఉన్నం వెంకటేశ్వర్లు, డా॥ పడాల జగన్నాథరావు, నియోగి
3) 20వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య ఎస్వీ రామారావు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఎన్. పూజిత నవలలు – సామాజిక జీవన చిత్రణ

– పి. **జ్యోతి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

'హితేన సహితం సాహిత్యమ్' అంటే హితంతో కూడుకున్నది సాహిత్యం అని అర్థం. ఆధునిక సాహిత్య ప్రక్రియలలో ఎన్నో సృజనాత్మకమైన వచన సాహితీ ప్రక్రియలువచ్చాయి. ఆ సాహితీ ప్రక్రియలో ఎక్కువగా ప్రాచుర్యం పొందిన ప్రక్రియ నవల. నవలను పాకెట్ థియేటర్ అని పిలుస్తారు. నవల అనేది మనిషికి తనేమిటో సమాజం దృష్టిలో తన స్థానం ఏమిటో తెలుసు కునేలా చేసే ప్రక్రియ, అందుకే నవల ఒక ప్రయోజనంతో సాగాలి. నవల రచనకు ముఖ్యంగా కావలసినది కథా గమనం, అది ఉత్సుకతో పాఠకుడిని చదివించాలి. అప్పుడే రచయిత/రచయిత్రి చెప్పదలచుకున్న విషయంపై పాఠకుడు అవగాహన కలిగి ఉంటాడు. నేడు తెలుగు సాహిత్యంలో ప్రముఖ రచయితలు, రచయిత్రులు నవలా సాహిత్యంలో విరివిగా రచనలు చేస్తున్నారు. అలాంటి వారిలో ఒకరు ఎన్. పూజిత.

మంచితనం, మానవత్వం,ప్రేమానురాగాలు నిండుగా ఉంచుకొని ధర్మ మార్గంలో పయనించాలి... అప్పుడే మనం, మన కుటుంబం తద్వారా మన సమాజ పురోభి వృద్ధి చెందుతుంది అని భావించి, వాటి విలువలను సమాజానికి చెప్పి చైతన్య పరచాలన్న తపనే ఆమెను నవల రచయిత్రిగా చేసింది. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగుతూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారు ఎన్. పూజిత. అంతేకాకుండా నవల చదవ టానికి మాత్రమే కాదు, మార్పు కోసం ... పరిష్కారం కోసం నడిపించేందుకు మాత్రమేనని ఆ మార్గంలో రచనలు చేశారు ప్రముఖ నవల రచయిత్రి ఎన్.పూజిత. వీరు ఇప్పటి వరకు 16 నవలలు, 25 నాటికలు, 80 కథలు రాశారు. వీటిలో 9 నవలలు, 40 కథలు ప్రచురితం అయ్యాయి, 19 నాటికలు ఆల్ ఇండియా రేడియోలో ప్రసారమయ్యాయి. ఈమె రాసిన రెండు కథలు కన్నడ భాషలోకి కూడా అనువదించారు. పట్టుదల, ఆశయం ఉంటే అనుకున్నది సాధించవచ్చునని పూజిత నిరూపిం చారు, ఆ విషయాలనే నవలలో కూడా తెలియజేశారు.

సుజిత నవల :

జీవితంలో అనుకోని సంఘటనలు సంభవించినపుడు కృంగిపోకూడదు, జీవిత విలువలు మీద నమ్మకాన్ని కలిగించి జీవితాన్ని ఎలా మలుచుకోవాలో, ఎలా గెలుచు కోవాలో, ఆశయాన్ని ఆలోచనల్లోనే కాక ఆచరణలో ఎలా చూపించాలో తెలియజేసేది ఈ నవల.

ఈ నవలలోని ప్రధాన పాత్ర సుజిత, ఈమె గొప్పింటి పల్లెటూరి పడుచుపిల్ల. నలుగురు అన్నదమ్ములకుగారాల చెల్లెలు, తల్లిదండ్రులకు ప్రియమైన కూతురు. సుజిత పదోవ తరగతి మంచి మార్కులతో పాసవుతుంది పై చదువులు చదువుకోవాలని అనుకున్నా తన తండ్రి అందుకు ఒప్పుకోడు. పెళ్ళి కొడుకుకి ఎక్కువ కట్నం ఇచ్చి వివాహం చేస్తాడు. అనుకోకుండా ఆ పెళ్ళి రోజున వాళ్ల నాన్నమ్మ చనిపోవడంతో ఆమె భర్త ఆమెను పుట్టింటి లోనే విడిచిపెట్టి వెళ్లిపోతాడు. కొద్దిరోజుల తర్వాత అతను మరణించాడనే వార్త టెలిగ్రాం ద్వారా అందుతుంది. ఆ వార్తను విన్న వాళ్ల నాన్నకు పక్షివాతం వస్తుంది. ఇంట్లో వదినలు అమెను తిడుతూ,వాళ్ల అమ్మను పనిమనిషి లాగా చూస్తూ ఉంటారు. తన తల్లిదండ్రుల పరిస్థితి, తన జీవితం ఇలా అయినందుకు బాధపడినా ఆ తర్వాత తను అనుకున్నది సాధించాలనే పట్టుదలతో ఇంటి నుంచి వెళ్ళిపోతుంది.

కలం ద్వారా పరిచయమైన స్నేహితురాలి దగ్గరకు వెళ్ళుతుంది, మోసపోతుంది. ఆ క్షణం అమెకు ప్రాణం పోయిన ఇల్లు దాటకూడదు అని అనుకున్న నేను...

మనను మార్చుకున్నాను. కష్టాల్ని ఎదిరించాలి అన్యాయాన్ని అరికట్టాలి, మనిషిగా పుట్టిన నేను ఇలాంటి ఒడిదుడుకులకు భయపడి భారమైన జీవితాన్ని గడపకూడదన్ని ఈ నిర్ణయం తీసుకున్నాను. కాని ఇక్కడ కూడా ఎదురుదెబ్బే తగిలింది అనుకొని బాధపడుతుంది.

కాని ఆ మోసగాళ్ల నుంచి తనను మానవతా దృక్పథంతో కాపాడిన బామ్మను, కళ్ళు కనిపించని లలితను చూసి మానవత్వం మనుషులలో ఉంది అనుకుంటుంది. ఆ తర్వాత తనను కాపాడిన వాళ్లకు సహాయం చేస్తూ, తన చదువును ఇన్‌స్పెక్టర్ విజయ్ సహాయంతో పూర్తి చేసుకుంటుంది. సమాజంలో ధైర్య సాహసాలతో కూడినటువంటి స్త్రీ గా ఎదుగుతుంది.

జరిగిన అన్యాయాన్ని, విధివైపరిత్యానికి, మనుషులు చేసిన మోసాలకు తట్టుకోలేక జీవచ్ఛవంలా బ్రతుకు కోన సాగిస్తూ, పిల్లలు, పిల్లలు అని ప్రతి నిమిషం వారి శ్రేయస్సు కోరే నా తల్లి గతి ఏమయింది? నోరెత్తి బిడ్డలకు తీర్పుచెప్పలేక భర్తను కాపాడుకోలేక, ఒక అడకత్తెరలో పోచగా నలిగిపోతుంది మా అమ్మ. దీనికంతటికి కారణం ఏమిటి? ఆమెలో ఆత్మస్థైర్యం లేదు, ఒక పునాది లేదు, స్వయం ఉపాధి లేదు అన్నింటికన్నా ధైర్యం లేదు. అందుకే ప్రతి స్త్రీలో స్పందన కలగాలి తనంతటతాను ఆత్మ స్థైర్యంతో నిలబడగల గుండె ధైర్యం ఉండాలి. ఒకవేళ జీవితం తలక్రిందులైనా తన జీవితాన్ని తనే తీర్చి దిద్దుకొనే ఆత్మవిశ్వాసం కావాలి. చదువుతో పాటు ఉపాధి కావాలి. ప్రతి తల్లిదండ్రులు ఆడపిల్లే కదా చదు వెందుకు అని అనుకోకూడదు, ఆమెను విద్యావంతు రాలిగా మార్చి, జీవితంలో తనకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించుకునే విధంగా పెంచాలి. జీవితంలో స్త్రీ ఎప్పుడు ఓడిపోకూడదని, తనను గుర్తించని మనుషులకు తనేమిటో తెలిసేలా జీవితాన్ని సరిదిద్దు కోవాలి, గొప్ప వ్యక్తిత్వం గల స్త్రీగా గుర్తింపు పొందాలన్నదే నా ధ్యేయం అని సుజిత బామ్మకు చెబుతుంది.

సుజిత పెద్దన్నయ్య శివ బంధువుల పెళ్లికి వెళ్ళతాడు, ఆ పెళ్ళి కూతురు మూగ అమ్మాయి కావడంతో పెళ్ళి కొడుకు తరపున వాళ్లు ఎక్కువ కట్నం ఆశిస్తారు. అంత స్తోమత లేని ఆమెతండ్రి కట్నం తగ్గించి ఇవ్వడంతో పెళ్ళి ఆగిపోతుంది. వాళ్ల కుటుంబ పరిస్థితిని, బాధను చూసిన శివ సామాజిక దృక్పథంతో ఆమెను వివాహం చేసు కుంటాడు.

ఈ నవలలో రచయిత్రి స్త్రీల విలువను, వెలుగును తెచ్చే అక్షరాస్యతను గురించి తెలియజేశారు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ఎలాంటి సమస్యలు అయిన ఎదుర్కొ గలరని, వరకట్నం వంటి విషయాలను తెలియజేశారు.

ప్రేమ తీర్పులో తేనెజల్లు నవల :

వివాహ వ్యవస్థ, వరకట్నం, బాల్యవివాహాలు స్త్రీల జీవితాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తాయనే విషయాన్ని మరియు మానవత్వపు విలువలు గురించి వివరించేదే ఈ నవల. ఈ నవలను మే 2019 న సాహితీ ప్రచురణ వాళ్లు ప్రచురించారు.

ఈ నవలలో ప్రధాన పాత్ర విరిజ, ఈమె మధ్య తరగతి అమ్మాయి. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోతే ఆమె అన్నయ్య ఆమెను కష్టపడి డాక్టరు కోర్సు చదివిస్తాడు. విరిజ తన స్నేహితురాలు అయిన విమల పెళ్ళికి వెళ్ళుతుంది. వాళ్ళ కుటుంబం, వాళ్ళ మధ్య గల అప్యాయతలు, అనురాగాలు చూసి చాలా సంతోష పడు తుంది. తన స్నేహితురాలు విమల చాలా అదృష్టవంతు రాలు అని అనుకుంటుంది. కాని విమల ముఖంలో సంతోషం ఉండదు, అందుకు విరిజ, విమలను నీకు ఈ పెళ్ళి అంటే ఇష్టంలేదా అని అడుగుతుంది, అప్పుడు విమల అలాంటిది ఏమిలేదు కాకపోతే బోలెడన్ని కట్నలాంఛనాలు వసూలు చేస్తున్నారు. నిజంగా ఇష్టం అయితే అంత లాంఛనాలు వసూలు చేయరు కదా ఇదీ కావాలి, అది కావాలి అని మరీ మరీ వసూలు చేస్తున్నారు. నన్ను వాళ్ళు ఇంతని వెలకట్టి తీసుకుంటున్నారు, ఇప్పుడు వెల కట్టారు ఎంతో ఆశతో, ఆశకు హద్దు అనేది లేకపోతే నా గతి ఏమిటి వాళ్ళ గొంతెమ్మ కోర్కెలు చూసి నిజంగానే

ఆవేశం వస్తుంది. మీ అమ్మాయికి ఏమి ఇచ్చుకుంటారో ఇచ్చుకోండి అని ఉంటే వాళ్ళ మంచితనం తెలిసేది. కాని వాళ్ళ ఆశలకు అంతులేనట్లు అడుగుతుంటే, మనకు తెలిసినవాళ్ళే కదా అని వీళ్ళు దోచిపెడుతున్నారు అదే నాకు ఇష్టంలేదు అని అంటుంది. ఇదీ నిజమే కట్న లాంఛనాలు వద్దు అనేవారు అరుదు ఈ రోజుల్లో మీరు మీ అమ్మాయికి ఏమి పెడతారో పెట్టండి మన స్టేటస్‌కి తగినట్లు అని వసూలు చేసే వాళ్లు కొందరు, కానీ ఇలా అది కావాలి ఇది కావాలి అని వేధించి మరీ వసూలు చేసేవాళ్ళతో జాగ్రతగానే ఉండాలి అని అంటుంది విరిజ.

పెద్ద కుటుంబాల్లో సంప్రదాయాలని ఆచారాలని, ఆడపిల్ల నెత్తిమీద పెట్టి వైభవంగా ఎంతో ఘనంగా పెళ్ళిళ్ళు చేసి అత్తవారింటికి పంపుతారు. అలా వెళ్ళిన ఆడపిల్లలో కొంతమంది మాత్రమే సంతోషంగా, అన్యోన్యంగా భార్యాభర్తలు కలిసిమెలసి ఉంటున్నారు. కాని దురదృష్టవశాతం కొందరి జీవితాలు తారుమారై పోతున్నాయి అందుకే కాబోయే భార్యభర్తల మధ్య అవ గాహన ఉండాలి. అలుమగల అనుబంధం అంటే అపు రూపంగా సాగాలి. ఇద్దరిలో మంచి అభిప్రాయం ఏర్ప డాలి ఒకరు చెప్పింది ఇంకొకరు కాదనో, వద్దనో విభేదాలు ఏర్పడగూడదు అని విమల వివాహ వ్యవస్థ గురించి చెబుతుంది.

విరిజ మా అన్నయ్య, వదినల వివాహ బంధం చాలా గొప్పది. వదిన ఆరోగ్యం బాగాలేదు అయినా అన్నయ్య అమెను పిల్లలతో సమానంగా చూసుకుంటున్నాడు. అన్నీ ఉన్న వాళ్లు కూడా భార్యను రాచి రంపాన పెడుతుం టారు, కొందరు చెడ్డవ్యసనాల బారినపడుతుంటారు. కాని మా అన్నయ్యకు వదిన అంటే ప్రేమ, అభిమానం. వీళ్లు అన్యోన్య దంపతులు అని విమలకు చెబుతుంది.

ఆ తరువాత విమలకు వివాహం జరుగుతుంది, వాళ్ళ అత్తగారి ప్రవర్తనతో ఇంట్లో అందరికి అనుమానం వస్తుంది. విమలను గురించి వాళ్ళ అమ్మ ఆలోచిస్తూ ఉంటుంది. అప్పుడు విరిజ పెళ్ళి సంబంధం ఖాయం చేసినప్పుడు విమలను అడిగారా అంటీ అంటుంది. అంటే ఈ పెళ్ళి అంటే విరిజకు ఇష్టంలేదా అని అడుగుతుంది

అలా అని కాదు ఒక్కసారి మీరు తనని అడిగి ఉండాల్సింది. తల్లిగా మీ బాధ్యత కన్నబిడ్డ ఇష్టా యిష్టాలు తెలుసుకోగలవారు కన్నతల్లే. మీ రోజుల్లో అయితే పెద్దలు నిర్ణయించిన వివాహాలను ఆమోదించి తలవంచి తాళి కట్టించుకునేవారు ఇష్టం ఉన్నాలేకున్నా అలా జరిగిపోతుండేవి. ఇప్పుడు అలా కాదు రోజులు మారాయి అనాటి స్త్రీ గడపదాటేది కాదు. కాని ఇప్పుడు అలా కాదు, దేశవిదేశాలు దాటి వీరనారిగా వెలిగి పోతుంది. పురుషునితో సమానంగా పదవులు చేపట్టి అన్ని రంగాల్లో అధిగమించి ధైర్యసాహసాలతో విజయాలు సాధిస్తుంది.

కాని ఇంకా పాత సంప్రదాయ కుటుంబంల్లో ఉన్న స్త్రీలు వారి మనోభావాల్ని విప్పి చెప్పుకోలేకపోతున్నారు.

ఆ విషయాల్ని తల్లిదండ్రులు గ్రహించలేకపోతున్నారు వాళ్ళల్లో మార్పు రావాలి అని చెబుతుంది. పిల్లలు పెద్దవాళ్ళని గౌరవించి వాళ్ళు చెప్పిందే చేస్తున్నారని ఆనందించినా, వాళ్ళ మనోభావాలను తెలుసుకోవటం మరిచిపోకూడదని అనుకుంటుంది విమల వాళ్ళ అమ్మ.

కొద్దిరోజుల తరువాత విమలపై అత్తింటివారు కట్నం ఇంకా ఎక్కువ తీసుకొనిరమ్మని వేధిస్తారు. అందుకు అంగీకరించని ఆమెపై హత్యాప్రయత్నం చేస్తారు. వాళ్ళ నుంచి తప్పించుకొని ఇంటికి వచ్చిన విమలకు అందరూ అండగా నిలబడుతారు, చదువుకోమని ప్రోత్సహిస్తారు. మధ్యలో ఆపేసిన ఐ.ఎ.యస్ చదువును విమల కొన సాగిస్తుంది.

విరిజ మరొక స్నేహితురాలు మల్లిక ఆమె కూడా డాక్టరు, కాని ఆమెకు పదేళ్ళ వయస్సులోనే వివాహం చేస్తారు. కాని అతను మోసగాడు, ఆస్తులు అమ్మి చెడువ్యసనాలకు బానిసై ఆమెను, ఆమె అమ్మానాన్నను, సరిగా చూసుకునేవాడు కాదు, ఆమె కష్టాలు భరించలేక ధైర్యంగా అతనికి ఎదురుతిరుగుతుంది. తల్లిదండ్రులను

ఊరిలో జాగ్రత్తగా ఉంచి ఆమె కష్టపడి చదివి డాక్టరు అవుతుంది, తల్లిదండ్రులకు అండగా నిలబడుతుంది. ఆమె విషయం తెలుసుకున్న విరిజ, నీవు సామాన్యురాలివి కాదు మల్లిక, నిజంగా శక్తి స్వరూపిణివి, నీ జీవితం ఇంతగా రూపుదిద్దుకుందంటే నీలో శక్తి సామర్థ్యాలు ఉంటే ఇలా చేయగలిగావు. కొందరు స్త్రీలు చిన్న చిన్న విషయాలకే భయపడిపోయి, ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నీవు పదేళ్ళ వయస్సు నుండే తీరని వ్యధలతో పై చదువులు చదువుకుని ఇంత పదవిలో నిలబడి జీవిస్తున్నావు. మహిళాలోకానికే నీవొక ఆదర్శ మహిళవు అంటుంది.

ఈ విధంగా రచయిత్రి ఈ నవలలో వివాహ వ్యవస్థను, వరకట్నం, బాల్యవివాహాల వలన స్త్రీలు ఏవిధంగా మానసిక సంక్షోభానికి గురవుతున్నారనే విషయాలను చెప్పారు. అటువంటి స్త్రీ మరల సమాజంలోని ఆచారాలు, వ్యవస్థపై ఎదురుతిరిగి, తనకంటూ ఒక స్థానాన్ని గుర్తింపును ఏవిధంగా ఏర్పరుచుకుంటున్నారనే విషయాలను నేటి తరం యువతకు తెలియజేశారు.

వసుధ నవల :

కుటుంబ వ్యవస్థ గురించి, మానవత విలువలు గురించి తెలియజేసేది ఈ నవల. ఈ నవలను నవంబరు 1991 న స్పందన సాహితీ సమాఖ్య వాళ్లు ప్రచురించారు.

ఈ నవలలో ప్రధాన పాత్రలు విష్ణు, వసుధ, ప్రియ. విష్ణు, వసుధ బావా మరదళ్ళు, వీరి ఇద్దరికి పెళ్ళి చేసి, తన బాధ్యతను నేరవేర్చుకోవాలి అని అనుకుంటుంది వీళ్ళ బామ్మ. విష్ణు, వసుధ లకు కూడా ఒకరంటే మరొకరికి ప్రాణం. వసుధ వాళ్ల నాన్న ఉపాధ్యాయుడు. విష్ణు గుణవంతుడు, విద్యావంతుడు తాను చదువుకొని మంచి ఉద్యోగం సంపాదించుకొని బామ్మన్ని, వసుధను బాగా చూసుకోవాలని అనుకుంటాడు. కాని అనుకోని పరిస్థితుల కారణంగా విష్ణు, ప్రియను వివాహం చేసుకోవలసి వస్తుంది. అందుకుగాను విష్ణు, వసుధకు తాను అన్యాయం చేశాను అని బాధపడుతుంటాడు. తన వలన మరొక అమ్మాయి బాధపడకూడదనే మానవతా దృక్పథంతో ప్రియను బాగా చూసు కుంటాడు.

వసుధ, విష్ణు తనని పెళ్ళి చేసుకోనందుకు కొద్ది రోజులు బాధపడుతుంది, కాని ఇదంతా విధి సంకల్పంగా భావిస్తుంది. కొద్దిరోజులకు అమె తండ్రి చనిపోవడంతో విష్ణు అమెను తన ఇంటికి తీసుకొనివెళ్ళతాడు. వసుధకు అక్కడకి వెళ్ళిన తరువాత ప్రియ పిల్లలను కూడా సరిగా చూసుకోకుండా క్లబ్‌లకు, పార్టీలకు వెళ్ళడం చూసి తనే ఇంటి పనులు అన్ని చూసుకుంటుంది. ప్రియకు కిడ్నీ చెడిపోతే, వసుధ తన కిడ్నీని దానం చేసి, మానవత్వాన్ని చాటుకుంటుంది. తను విష్ణు, ప్రియ ఇంటిలో ఉండ కూడదని, తనువీధి చేతిలో కీలుబొమ్మ కాకుడదని,తన జీవితాన్ని తనే సరిదిద్దుకోవాలని. ఇంటిలో నుంచి వెళ్ళి పోతుంది, వసుధకు యాక్సిడెంటు కావడంతో అమె చిన్న నాటి స్నేహితురాలు అయిన రేవతి అమెను కాపాడుతుంది. రేవతి మరియు అమె భర్త హరినాధరావు ప్రోత్సాహంతో లండన్ వెళ్ళి పై చదువులు చదువుకొని పేరు ప్రఖ్యాతులు గాంచిన కిడ్నీ డాక్టరుగా ఎదుగుతుంది. కొంతకాలం తరువాత ప్రియకు తను దానం చేసిన అదే కిడ్నీకి వసుధ ఆపరేషన్ చేయాల్సిస్తుంది. తన అవయవంకు తనే ఆపరేషన్ చేసి ప్రియను కావాడుతుంది వసుధ. ప్రియ కూతూరు శిల్ప డ్రగ్స్ బారినపడి జీవితం నాశనం చేసుకుంటుంటే ఆమెకి ట్రీట్‌మెంట్ ఇప్పించి ఆమెను కాపాడుతుంది. తన స్నేహితురాలి అయిన రేవతి పిల్లలకు, విష్ణు పిల్లలను ఇచ్చి వివాహం చేసి వాళ్ళ జీవితాలను బాగుచేస్తుంది.

ప్రియ ఇటు భార్యగా, అటు తల్లిగా ఆమె బాధ్యతలు నిర్వర్తించడంలో సఫలీకృతం కాలేకపోతుంది. చివరకు తనకు కిడ్నీ దానం చేసి, తన కుటుంబాన్ని సరిదిద్దిన వసుధను అనుమానిస్తుంది, అవమానిస్తుంది.

ఈ నవలలో వసుధ స్నేహితురాలు అయిన రేవతి చిన్నప్పటినుంచి డాక్టర్ కావాలనుకుంటుంది, కాని ఆమెను డాక్టర్ హరినాధరావుకిచ్చి వివాహం చేస్తారు. వీరు

కష్టాలలో ఉన్న వసుధను సమాజంలో ఉన్నతమైన స్త్రీగా ఎదగడానికి సహాయం చేస్తారు. రేవతి తను డాక్టరు కావాలి అనుకున్న కలను తన స్నేహితురాలు అయిన వసుధ ద్వారా నెరవేర్చుకుంటుంది.

ఈ నవలలో రచయిత్రి కుటుంబంలోని స్త్రీ భార్యగా, తల్లిగా ఎలా ఉండాలి అనేది వసుధ, రేవతి పాత్రల ద్వారా తెలియజేస్తే, ఎలావుండకూడదు అనేది ప్రియ పాత్ర ద్వారా తెలియజేశారు.

త్రిష నవల :

నవల పేరు వినడానికి సినిమా హీరోయిన్ పేరులాగా ఉన్న ఇందులో రచయిత్రి చెప్పిన విషయాలు వేరుగా ఉంటాయి. ఇందులో ఈనాటి కళాశాలలు ఎలా ఉన్నాయనే విషయాన్ని అక్షర చిత్రణ చేయడమే కాకుండా, మూఢాచారాలతో, పురాతన ఆచారవ్యవహారాలను ఇప్పటికి పాటిస్తున్న తల్లిదండ్రుల గురించి తెలియజేసేదిగా ఉంటుంది ఈ నవల. ఈ నవలను జనవరి 2007 న సిరి పబ్లికేషన్స్ వాళ్లు ప్రచురించారు.

ఈ నవలలో ప్రధాన పాత్రలు త్రిలోక్, త్రిపురసుందరి, సౌమ్య . త్రిలోక్ ఆస్తిమంతుడు, వివేకవంతుడు, పెద్దల పట్ల గౌరవ మర్యాదలు, స్నేహితులకు విలువ ఇచ్చే వ్యక్తి. తన కలలో వచ్చిన ఊహాసుందరి కోసం వెతుకుతుంటాడు, చివరకు అతను ఆమెకు తన ప్రేమను తెలియజేస్తాడు కాని ఆమె అతని ప్రేమను తిరస్కరిస్తుంది అందుకు త్రిలోక్ ఆమెను ఇబ్బంది పెట్టకుండా ఆమె సంతోషంగా ఉంటేచాలు అని అనుకుంటాడు.

త్రిపుర సుందరి పాత్రను రచయిత్రి చాలా చక్కగా తీర్చిదిద్దారు. ఈతరం అమ్మాయిలందరికి మార్గదర్శకంగా ఉంటుంది. ఈమె తమిళ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అమ్మాయి, ఏవిషయం అయినా సూటిగా మాట్లాడుతుంది. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను, ఆమెపై గల నమ్మకానికి తగిన విధంగా నడుచుకుంటుంది. హీరోయిన్ త్రిష టివిలో అడ్వటేజ్‌మెంట్ ఎలా చేస్తుందో అదే విధంగా ఈమె కూడా చేస్తుంది, అందువలన కాలేజీలో అందరూ ఆమెను త్రిష అని పిలిచేవారు. ప్రేమ వంటి విషయాలకు తన మనస్సులోతావు ఇవ్వకూడదని తను ఒక హిందూ సంప్రదాయం కలిగిన బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అమ్మాయినని తన మనస్సులో పదే పదే హెచ్చరిక చేసుకుంటూ ఉంటుంది.

త్రిపుర సుందరికి ఇంట్లో పెళ్ళి సంబంధం చూస్తారు, అందరికి ఆ సంబంధం నచ్చుతుంది, ఆమెకు ఇష్టం లేకపోయినా తల్లిదండ్రుల కోసం అంగీకరిస్తుంది. త్రిలోక్ ఆమెను నీకు ఈపెళ్ళి ఇష్టలేకపోయినా ఎందుకు ఒప్పుకున్నావు అని అడుగుతాడు. మొదట జన్మనిచ్చిన, జన్మించిన పరిసరాలు పరిపూర్ణంగాఉండాలని వాళ్ళ తర్వాతేనే నాదంటూ జీవితం అనే ఆలోచించే మన సత్తత్వం నాది. అలా అని మీ మీద అభిమానం లేదని చెప్పను అదొక గౌరవాభిమానం మాత్రమే అని. పుట్టినిల్లు పండువెన్నెలగా ఉండాలి, మెట్టినిల్లు నిండూ పున్నమిగా ఉండాలనికోరుకునే ఒక భారత స్త్రీని నేను. నాకంటూ ఒక స్వార్థం ఏర్పరుచుకొని, తొలిప్రేమ, తొలిచూపు అని మనసుకు సన్నాయి పాట నేర్పి చిందులు వేయాలని లేదు. ఈ సగటు స్త్రీని అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించండి అని చెబుతుంది. ఆమె చెప్పిందంతా నిజమే అని అనుకున్న త్రిలోక్ ఏమి మాట్లాడకుండా వెళ్లిపోతాడు.

సహజంగా మనిషిలో బొమ్మ బొరుసులాగా మంచి చెడూ రెండూ ఉంటాయి. అలా రచయిత్రి సృష్టించిన పాత్ర సౌమ్య పాత్ర. ఈమెకు త్రిలోక్ అంటే చాలా ఇష్టం, వీరి రెండు కుటుంబాలు వీళ్లకు వివాహం చేయాలని అనుకుంటారు. అందుకు కాలేజ్‌లో ఎవరైనా త్రిలోక్ తో మాట్లాడితే ఆమెకు నచ్చేదికాదు. కాని చివరకు త్రిలోక్, త్రిపుర సుందరిల ప్రేమను అర్థంచేసుకోని వాళ్ల పెళ్ళికి ఒప్పుకుంటుంది.

త్రిపుర సుందరి వాళ్ల అమ్మనాన్నలు బ్రాహ్మణాచారాలను, సంప్రదాయాలను ఖచ్చితంగా పాటిస్తారు త్రిపురకు ఇష్టంలేని సంబంధం కుదిర్చినప్పుడు,ఈ ఇంటికి కళంకం తెచ్చేపని త్రిపుర ఎన్నడూ చేయదు వాళ్ల

నాన్నగారూ పరువు ప్రతిష్టకోసం ప్రాణాలు పెట్టే మనిషి, మన బ్రహ్మణ పిల్లవాడంటేనే ఆయన ఒప్పుకుంటారనే విషయం గుర్తుపెట్టుకున్నా నా కూతురిని చూసి గర్విస్తున్నాను అంటుంది త్రిపుర వాళ్ల అమ్మ, ఆమాటలకు త్రిపుర వదిన మీ కూతురి మనసును మాత్రం చూడలేకున్నారా అత్తయ్య అని అడగాలనుకుంటుంది, కాని అడగలేక పోతుంది కారణం చిన్నవాళ్లు పెద్దవాళ్లను ప్రశ్నించకూడదు అని తెలిసి మౌనంగా ఉండిపోతుంది. బ్రహ్మణ కుటుంబంలోని ఆచారావ్యవహారాలను గురించి రచయిత్రి చాలా చక్కగా వివరించారు.

త్రిలోక్ తాతయ్య, నాన్నమ్మల పాత్రలు హాస్యంగా వున్నప్పటికి, అభ్యుదయ భావాలను కలిగి ఉంటారు. త్రిలోక్, త్రిపుర సుందరిల ప్రేమను వాళ్ళ తాతయ్యే విజయవంతం చేస్తాడు.

ఈ నవలలో రచయిత్రి త్రిపుర సుందరి పాత్రను నేటి తరం అమ్మాయిలకు మార్గదర్శకంగా ఉండే విధంగా సృష్టించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల ప్రేమకు విలువ ఇవ్వాలని, సృష్టిలో విలువైన ప్రేమ తల్లిదండ్రులదేనని తెలియజేశారు.

ఎన్ పూజిత నవలలో ఎక్కువగా స్త్రీల సమస్యలు, వివాహ వ్యవస్థ, వరకట్నం. కుటుంబ విలువలు, సంప్రదాయాలు, మానవత్వపు విలువలు ఇలాంటి వాటికి సంబంధించిన విషయాలు ఎక్కువగా కనిపిస్తాయి. కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకుండా సమాజంలో ఏవిధంగా పోరాడాలనే విషయాలను పాత్రల ద్వారా చాలా చక్కగా తెలియజేశారు. రచయిత్రి రాసిన నవలలు అన్ని మార్పు కోసం, సమస్య పరిష్కారం కోసం అనే విధంగానే ఉన్నాయి. ఇలాంటి రచనలు మరెన్నో రచయిత్రి కలం నుండి వెలువడి సమసమాజాభివృద్ధికి దోహదపడతాయని ఆశిద్దాం.

ఉపయుక్త గ్రంథాలు :

1. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
2. సుజిత నవల - ఎన్. పూజిత
3. వసుధ నవల - ఎన్. పూజిత
4. ప్రేమ తీర్పులో తేనెజల్లు - ఎన్. పూజిత
5. త్రిష నవల - ఎన్. పూజిత

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

దిద్దుబాటులో సామాజిక జీవన చిత్రణ

-పెదనోరప్ప గారి సురేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

కందూకూరి వారి భావ విప్లవాన్ని, గిడుగు వారి భాషా విప్లవాన్ని సమన్వయించుకొని సరికొత్త విప్లవాన్ని సృష్టించిన నవయుగ వైతాళికుడు. మన గురజాడ అప్పారావుగారు. సమాజాన్ని మార్చాలి. అనుకునే గొప్ప ప్రయోక్త. ఆధునిక తెలుగు కవిత్వానికి దిక్సూచి. దేశీ కవితా మార్గ ప్రయోక్త కవిత్వంలో వ్యవహారిక భాషను ప్రవేశ పెట్టిన వ్యక్తి.

గురజాడ పూర్వం నుంచి వస్తున్న భారతీయ సాంప్ర దాయాలను అనేక విషయాలను ప్రశ్నించడం ప్రారంభిం చాడు. స్త్రీల అభ్యున్నతి కోసం పాటు పడ్డాడు. ఎన్నో సంఘ సంస్కరణ ఉద్యమాలలో పాల్గొన్నాడు. గురజాడ రాసిన దిద్దుబాటు కథ వలన ఒక కీలక మలుపు అంటే స్త్రీ విద్య గురించి సమాజంలో రావడం జరిగింది.

నేపథ్యం :

దిద్దుబాటు కథ 1910 లో రాయడం జరిగింది. ఇందులో గురజాడ వేసుకున్న ప్రశ్నలకు సమాధానాలు దొరకలేదు. ఈ రచన గురించి తెలుసుకోవాలి అనుకుంటే ఆ కాలం నాటి సమాజాన్ని తెలుసుకోవాలి. ఈ కథ 1910 ఫిబ్రవరిలో ఆంధ్ర భారతి పత్రికలో వచ్చింది. ఇందులోని వస్తువు పూర్తిగా సంఘ సంస్కరణలతో కూడుకొని ఉన్నది సమాజంలో ఉన్నత వర్గంలో కనిపిస్తున్న సమస్య వేశ్యా లోలత్వం ఇదే గురజాడ కథకు ఇతి వృత్తం అయింది.

తలుపు! తలుపు! తెరవబడలేదు గదిలోని గడియారం కీర్రుమని ఒంటి గంట కొట్టింది. అని ప్రారంభమవుతుంది. ఈ కథ ఇంటికి ఆలస్యంగా వచ్చిన గొపాలరావు భార్యను వెతకడంలో అనేక ఆలోచనలతో సతమతమవుతూ ఉంటాడు.

ఇంక ఇంటికి ఎప్పుడూ ఆలస్యంగా రాకూడదు అనుకుంటాడు. ఇక్కడ గొపాలరావు పాత్ర ద్వారా కమలినిని వెతకడంలో ఉత్కంఠతను పాటకులలో రేకెత్తిస్తాడు. గోపాలరావు తన భార్య కనిపించక పోయేసరికి తను చేసిన తప్పును అతని ద్వారానే గురజాడ తెలియజేసి పశ్చాత్తాపాన్ని కలగజేస్తాడు. గోపాలరావు తను చేసిన తప్పును తెలుసుకొని సరిదిద్దుకుంటాడు. అని చెప్పాడు.

గురజాడ కథలో అంతర్లీనంగా భార్య భర్తల అను బంధాన్ని, స్త్రీ విద్యను గురించి చెప్పాడు. గోపాలరావు సాని దాని పాట సరదాలో మనసు లగ్నమై పోయినది కేవలం పాటతో మాత్రమే కాకుండా సానిదాని వైపు కూడా మనస్సు పడ్డది. ఇలా ఎంతో మంది భార్యలను కాదని పర స్త్రీలపై నేటి సమాజంలో వ్యామోహం పెంచు కుంటున్నారు. అలాంటిది తప్పు అని చెప్పే నేటి కాలపు కమలినీలు ఎంతో మంది నేటి సమాజానికి అవసరం.

కమలని కనిపించక పోయే సరికి గోపాల రావు ఆవేశంతో రాముడిని కొట్టాడు. తరువాత తన తప్పును తెలుసుకొని పశ్చాత్తాపడ్డాడు. నేటి సమాజంలో కూడా ఆవేశంలో విచక్షణా జ్ఞానం లేకుండా తొందర పడి చేయి చేసుకోవడం జరుగుతోంది. అలా కాకుండా ఆలోచనతో మంచిగా ప్రవర్తించాలి, అని గురజాడ ఉద్దేశం.

కథలో కమలిని గోపాలరావుకి ఒక ఉత్తరం రాసి ఇంటిలో పెట్టింది. అందులో "ప్రియా" పోయి "అయ్యా" కాడికి వచ్చెనా? అని ప్రారంభించింది. గాడి తప్పిన తన భర్తను దారికి తీసుకురావడానికి వాడిన మాటల చాతుర్యం.

భార్య చూపించడం జరిగింది. గోపాలరావు రాముడితో "ఓరి మూర్ఖుడా! భగవంతుడు సృష్టించిన సృష్టిలో కెల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్య నేర్చిన స్త్రీ రత్నం" అన్నాడు. అంటే ఇక్కడ గురజాడ తన రచనా కాలం నాటికి స్త్రీకి విద్య అందేది కాదు. అందుకే స్త్రీ విద్యను గురించి కమలినీ పాత్ర ద్వారా చూపించాడు.

ఈ కథలో స్త్రీ విద్య గురించి కూడా అంతర్లీనంగా ఉంది. నేటి సమాజంలో కూడా స్త్రీకి విద్య చాలా అవసరం. చదువుకున్న స్త్రీ తన కుటుంబాన్ని సరైన మార్గంలో పెట్టగలదు. అని కవి ఉద్దేశం. "విద్య నేర్పని తల్లి పిల్లలకు శాపం" అని అంటారు. స్త్రీ సమాజాన్ని కూడా మార్చగలదు.

గురజాడ ఈ కథలో భార్య భర్తల అనుబంధాన్ని చూపించారు. ఇలా సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నించారని గోపాలరావు, కమలినీ, రాముడు పాత్రల ద్వారా మంచి సందేశం అందించాడు.

ముగింపు :

తన భర్తను చెడు మార్గంలో నుంచి మంచి మార్గంలోకి తెచ్చుకున్న స్త్రీ పాత్ర కమలిని ఇందులో భార్య భర్తల అనుబంధాన్ని గురజాడ చక్కగా చూపించాడు. ఒక ఆంగ్లకవి భార్యను "better half" అన్నాడు. భర్త కన్నా భార్య గొప్పది. అని చూపించడం జరిగింది. ఇంటికి దీపం ఇల్లాలు అంటే ఇదే. విద్య నేర్చిన తన కుటుంబాన్ని చక్కగా మార్చుకోగలదు. ఇందులోని పాత్రల ద్వారా సమాజంలో మార్పు తెచ్చే విధంగా చూపించడం జరిగింది.

❖ ❖ ❖

నిద్రాజగత్తులో హాస్య రసపోషణ

–వై. బుజ్జి, సంస్కృతోపన్యాసకురాలు, జి.బి.ఆర్. డిగ్రీ కాలేజి, అనపర్తి.

పెళ్ళికి, శోభనానికి 'మూడు రోజులు - మూడు నిద్రలు' అనునది కంపల్సరీ. ఈ మధ్య కాలంలో టూకీ పెళ్ళిళ్లు వచ్చినా ఈ సదాచారం ఖచ్చితంగా పాటిస్తున్నారు. నిద్రయొక్క పవిత్రత ప్రాముఖ్యం గురించి మన పూర్వికులు ఎప్పుడో గుర్తించియున్నారు. 'మూడు మేతలు' సెకండరీ నిష్మూరాలు, కయ్యాలు, సిగరెట్లు, రోతలు తాత్కాలికం.

నిద్రపోతున్న ప్రతి ఒక్కరు బ్రహ్మనిష్ణులు కనుక వారిని సడెన్‌గా లేపకూడదు. ఎందుకనగా కట్టె ఇక్కడపడి ఉన్నా, జీవుడు షికారకు వెళ్తాడు సంచారం చేసి, స్వసానం చేయడానికి కొంత వ్యవధి అవసరం. శాండిరి అను పతివ్రత స్వర్గానికి వచ్చిన తన అర్హతలు విపులీకరిస్తూ.

प्रसाधनंच निष्क्रान्ता नाभिवंदामी भर्तरि ।
नोत्तपयामि भर्तारं, सुखंसुप्त महंसदा ॥

అంటే నా భర్త సుఖంగా నిద్రించునపుడు యెంతటి అర్జంటు కార్యమున్నా, నేను నా శ్రీవారిని నిద్రలేపను అని భార్య సెలవిచ్చినది. చాలామంది లక్షణం కలి యుగంలో కూడా కొందరు పతివ్రతా శిరోమణులు, ఇంటి ఓనర్లు అద్దెవసూలు నిమిత్తం వచ్చినా వెచ్చాలిచ్చిన వాళ్ళు, బొగ్గరాళ్ళు వాకిట్లో గొంతు చించుకున్న అఖండ స్వచ్ఛంద నిద్రాపరాయణులైన తమపతి దేవుళ్ళను డిస్టర్బు చేయరు. ఘరానా ఆఫీసర్లు నిద్రలో ఉండగా ఉద్యోగం కొరకో, సెలవు నిమిత్తమో వచ్చిన వారి దర్శనార్థం వచ్చిన శాపగ్రస్తులు తలుపుతట్టకుండా వరండాలోనో, చెట్టు నీడలోనో గంటల తరబడి వారికోసం వేచి ఉందురు తెలివితక్కువ తనంతో తొందరపడినచో వారి కార్యం సర్వనాశనం పైపెచ్చు ఓ పడవ చివాట్లు ఇంగ్లీషులో పాడు తిట్లు. సామాన్యంగా దేవతలకు నిద్రపోయే గీతలేదు. వారి అని మేషులు వారికి కళ్ళు మూత పడవు. తేడా గమనించే లోగడ దమయంతమ్మ స్వయంవరానికి విచ్చేసిన నకిలీ నలుళ్ళను డిటెక్టుచేసి అసలైన నలమహా రాజు మెల్లో హారం వేసింది. కనుక ప్రతి మానవునికి వరప్రసాదం లాంటిది నిద్ర.

శరీరం అనే ఇంటికి ఆహారం, విహారం, నిద్ర ఈ మూడు మూడనిట్టాళ్ళు. సమస్త ప్రాణకోటికి ఆరోగ్య దాయిని, అటువంటి నిద్రాదేవత జగదేకదూత జ్యేష్ఠ భాగినిని కించపరుస్తూ 'నిద్రాదేవత నిను బూనే గదరా నిర్భాగ్య దామోదరా' అని అంటారు? ఇది సబబేనా? సౌభాగ్య లక్ష్మీలతో అని సవరణ చేయటం న్యాయం. నిద్రా జగత్తు వాస్తవ జగత్తుకంటే ఎంత శోభాయమానమో, యెంత శ్రేయోదాయకమో మనం తప్పక తెల్సుకోవాలి. ఏది మిథ్యో ఇంకా తేలలేదు. నిద్రా విరోధులకు నిద్రా ప్రవీణులను చూస్తే కన్నెర్ర చుప్పనాతితనం.

చర్చిల్ రెండవ ప్రపంచ యుద్ధం రోజుల్లో బ్రిటీషు సామ్రాజ్యపు విజయసారధి అన్నేళ్ళూ ఆయనగారి నిద్ర రోజుకు నలభైనిమిషాలు మాత్రమే. ఆ కొద్ది సమయంలో మాత్రం ఎవ్వరూ నిద్రాభంగం చేయకూడదు. మధ్యాహ్నం భోజనం ముగియగానే ఓన్లీ 40 మినిట్స్ నిద్ర సమాధి లోనికి వెళ్ళేవాడు. తర్వాత లేచి మర్నాడు మధ్యాహ్నం దాకా ఏకబిగిన పడుగల్లే పనిచేసేవాడు. ఒక వేళ శత్రుసేనలు బ్రిటీష్ దేవుల్లోదిగటం సంభవిస్తే మాత్రం అయన్ని లేపవచ్చునని తోటి అమాత్యులకు చెప్పాడట. కానీ అలాంటి పరిస్థితి లేదు. నెపోలియన్, గాంధీ లాంటి వారు నిద్రను అదుపులో ఉంచగలిగారు. వారు రాత్రిం బవళ్ళు సైన్యాన్ని నడిపిస్తూ అశ్వంమిదే ఆ ఐదారు క్షణాలు కునుకు తీసి ఆ నిద్రతోనే వారు తృప్తిపడేవారు. ఎన్ని కథలు చెప్పినా మానవునికి రోజూ ఎనిమిది గంటలు నిద్రవుంటే విమ్, విగర్, వైనాల్టీ వుంటవి. నిద్రాదేవికి

కొన్ని సీజన్లు పర్వదినాలు కొందరిమీద నిద్రకు వెర్రిప్రేమ. పరిక్ష సమయాలలో విద్యార్థులపై ప్రేమ కురిపించు చుండును. ఎలక్షన్ సీజన్స్‌లో ఓటర్సును కొగలించు కుంటుంది, పెళ్ళి చూపులలో కాబోయే దంపతుల్ని ఆవహించును.

वर्षार्ध मृष्टौ प्रयते तमासान ।
निशार्थमर्थं दिवसेय तीताः ॥

సహజంగా పగలు కష్టపడితే ప్రతీ ఒక్కరికి నిద్రబాగా పడుతుంది కానీ కవికి పిచ్చివానికి, విపీలకానికి నిద్రవట్టిచావదు. బ్రహ్మ విద్యకు, మోక్షానికి నిద్ర ఎసన్షియల్.

"నిద్రలోని నిద్ర నిజముగా దెలసిన
భద్రమౌను విద్య బ్రహ్మవిద్య
నిద్ర తెలియనివాడు నిర్మలయోగిరా"

అని నిద్ర మర్మము తెలిసిన ఒక జ్ఞాని సెలవిచ్చినాడు. మనకు నిద్ర బంగారంలాంటిది కనుక దానికి చిన్న బుచ్చకూడదు. డ్యూటీలో ఉండగా నిద్రముంచుకొచ్చును. మన్నించి కొగలించు. పిమ్మట వెయ్యి ఏనుగుల బలం అసలు పడి వాండ్రు యెడిగీది నిద్రలోనే. 'అతి నిద్రా లోలుడు తెల్విలేని మేర్ఖుడు'అని నిద్రా ద్వేషి అన్న మాట నమ్మవర్దు. నిద్రా దరిద్రుడు అనుకవి ప్రేయసి కోసం పరితపించి నిద్రకు నోచుకోలేదు. అతనిదో శాపగ్రస్త జీవితం.

నిద్రాజాతులు ఎన్నో అవి బండనిద్ర, మొద్దునిద్ర, దొంగనిద్ర, కలతనిద్ర, రోతనిద్ర, సుఖనిద్ర, యోగనిద్ర, మొదలైనవి. అరకన్ను నిద్ర, వారిని కోడినిద్ర అనిపిలు స్తారు. కొంతమంది కన్ను తెరిచే నిద్రపోతారు. అది చేప నిద్రట. కల్పాంతంలో విష్ణుమూర్తి మిల్కు ఓషన్‌లో మర్రాకుపూ వవ్వళించి యోగనిద్ర లంకించుకుంటాడు. భూమిపైనున్న ప్రతియొక్కటి నిద్రపోతాయి.

"యా నిశాసర్వే భూతానాం
తస్యా జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని
సానిశా పశ్యతో మునిః"

అందరూ నిద్రించు రాత్రియందు తత్వ ధర్మయగు యోగి మేల్కొని యుండి ధ్యానాధికము నొనర్చును. అందరూ మేల్కొను పగటి వేళ ముని నిద్రించును. రైల్వే గార్డు ఇంజను డ్రైవరు, ఆయాచోట్ల పనిచేయు కీపర్ల్, వాచ్‌మేన్ గూర్ఖా మొదలగు వారు ముని అంశకల వారేమో! జనాలకు నిద్ర మీద మక్కువ కుతి, ఘనత మోజు, యావ, తపన, ఆసక్తి వృద్ధి చెందితే జాతి వన్నె పెరుగుతుంది. మానవునికి నిద్ర పై మరీ, జాబు సెకండరీగా పాటిస్తూ నిద్దుర పెద్దమ్మకు ముద్దు బిడ్డగా జీవయాత్ర సాగించుచున్నాడు. నిద్ర ట్రాన్సఫర్ చేయ వచ్చు. త్రేతాయుగంలోనే యీ వ్యవహారం అమలులో ఉన్నట్లు దాఖలావుంది. లక్ష్మణుడు తన నిద్రను ఊర్మిళాదేవికి సంక్రమింప చేసి తన సోదరునికి, తన వదినెకు రాత్రింబవళ్ళు సేవచేసినాడు. ఇంద్రజిత్తును చిత్తు చేయుటకు క్వాలిఫికేషన్‌ను సంపాధించెను.

Oxford, Tokyo, Horwordలోను నిద్రమార్పిడి గురించి అనేక ప్రయోగాలు చేస్తున్నారు. గుండె, ఊపిరి తిత్తుల మార్పిడులు సులభంగా జరుగుతున్న ఈ రోజుల్లో నిద్ర ట్రాన్స్‌ఫర్ సుసాధ్యమే. నిద్రాహీనులకు నిద్రా సంపన్నులు, నిద్రను దానం చేస్తే దాతల, గ్రహీతల పేర్లు Black Lettersతో పత్రికల్లో పడతాయి. "నిద్ర బ్యాంకులు వెలగాలి నిద్ర రుణం, నిద్ర అరువు, సౌకర్యం, బడుగు ప్రజలకు కల్పిస్తే మానవాభ్యుదయం సాధించినట్లే -కుంభకర్ణుని నిద్ర లేపడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఎన్నో భయంకర సాధనాలు చేసినా నిద్రాదేవత గారాల బిడ్డ గనుక యుగాలు గడిచినా అతని రికార్డు చీట్ చేసే మగాలు పుట్టలేదు. ఫిన్లాండ్ దేశం హెల్సింకీలో సాక్స్ టారీ ఇన్‌న్ అను ప్రబుద్ధుడు హొటల్ లోనికి రానివ్వ లేదని సమీపంలో ఒక మున్సిఫల్ చెత్తకుండీలో మూడు రోజులు హాయిగా నిద్రించాడు. మధ్యప్రదేశ్‌లో చోర శిశామణి ఓ ఇంట్లో చొరబడి పట్టుపానుపుచూసి ముచ్చట

పడి తొంగున్నాడు. సమాజంలో వడ్డీ వ్యాపారికి నిద్రపట్టదు, రాజకీయాలు వ్యత్తిగా గలవారికి జన్మంతా నిద్రపట్టదు.

నిద్ర మత్తుగల తల్లిదండ్రులు తమ పిల్లలను అర్ధరాత్రి ప్లాట్‌ఫాం మీద వదిలేసి రైలెక్కిన ఉదాంతాలెన్నో! సుకుమార ప్రాణులకు మెత్తని శయ్య ఉండాలి. లేకపోతే వారికి నిద్రపట్టక ఎన్నో అవస్థలు పడుతుంటారు. అప్పుడు గాని నిద్రలేమి కరుణించదు. కొన్ని పెంకె ఘంటాలకు భార్యతో పోట్లాడి వారి పుట్టింటి వాళ్ళను తిడితేగాని నిద్రపట్టదు. కోటీశ్వరులకు నిద్రకు చుట్టరికం. Sleep is Poor Mans Wealth పేదలపెన్నిది నిద్రడని విజ్ఞుల మాట. సంసార లంపటంలో కొట్టుమిట్లాడుతున్న గృహస్థులకు నిద్ర డైలీ పెరోల్. "నిద్రాతురాణాం న మంచం నచాప, నమిట్టర్న" పల్ల (పల్లేరుకాయలు) తలగడగా పీట చెక్క ఇటుకరాయి. డిక్షనరీలు, ఇలా ఏదో ఒకటి ఆసయమానికి. విద్యార్థి దశలో నిద్రకు అనువైన చోటు క్లాసురూమ్సు. అదృష్టం కలసొస్తే, పురపాలక సంఘాలు జిల్లా పరిషత్తులు, శాసనసభలు, అయిదేళ్ళపాటు నిరభ్యంతరంగా నిద్రపత్రం కోనసాగించవచ్చు. కొందరు న్యాయవాదులు ఆర్గ్యుమెంట్స్ వింటూనే, కొందరు న్యాయవాదులు నిద్ర తన్మయిత్వంలో న్యాయస్థానంలో నిద్రపోయిన సంఘటనలు అనేకం కలవు. పుస్తకం వాసన పడనివారు కూడా తొందరగా నిద్రపోవడానికి పుస్తకంను సహాయంగా తీసుకుంటారు. పుస్తక ప్రాణిపై నిద్రాదేవికి యెంత పక్షపాతంతో కూడిన ప్రేమో! భిషబ్మణాలకు ఆటోమేటిక్‌గా నిద్రబోయే పేషెంట్స్ దొరుకుతారు. రోగులకు నిద్ర పట్టడం శుభలక్షణం కనుక నగం వ్యాధి తగ్గినట్లే. లేకుంటే డాక్టర్ల తిప్పలు పెరుమాళ్ళకెరుక. అర్ధరాత్రి ఫోన్ కాల్స్, టాబ్లెట్లు, ఇంజక్షన్లు ఒక సుమంగళి తన భర్తకు ఎంత తంటాలు పడ్డ నిద్రపట్టడం లేదని సెరైన్ గాత్రంతో డాక్టర్‌కు చాంతాడంత ఓరల్ రిమార్కు ఇస్తూ తన మాటలను జలపాతం ఫోర్సులో విన్నవించుకుంది. కుశాగ్ర బుద్ధిగల వైద్యుడు కొన్ని నిద్ర మాత్రలు ఆమె చేతికి ఇచ్చాడు. ఆమె ఆ మాత్రలును ఎలా వాడాలి అని డాక్టరును అడగగా అతడు అవి మీ భర్తకు కాదు మీరు వేసుకోండి చాలు అని లౌక్యంగా చెప్పివెళ్ళాడు. దొంగనిద్రగాళ్ళతో మహాప్రమాదం. మనం ఇష్టం వచ్చినట్లు వారు పడుకునానరులే అని ఎలా పడితే అలా మాట్లాడితే గోడలకు చెవులు ఉన్నాయో లేవో కాని ఈ కుహనా నిద్రితుల కర్ణేంద్రియంలు చురుగ్గా పనిచేస్తాయి. ఈ దొంగ నిద్ర గాళ్ళు కబుర్లు చేరేసి కలహాలు నిలుపుతారు.

నిద్రలో ఎన్నో గ్రేడ్లు. జాగృత, స్వప్నావస్థ, సుషుప్త, మరియు అఖండ బిందు వగైరా నిద్రలో కొందరు పితాంబరులు, కొందరు బైరవులు, దిగంబరులుగా ఉంటారు. నిద్రలోనే కలలు సాధ్యం, పొట్టివో, పొడుగువో కలలు కంటూ 'కలోపాసన' చేయుట ఆరోగ్య దాయకం కల భార్యలాంటిది. నిద్ర భర్తలాంటిది. కలవల్ల కలతనిద్ర "Derame is a wife who must talk, sleep is a husband who silently suffers it." నీ స్వప్న నిద్ర గ్రేడ్ వన్ అయితే డ్రీమ్ లాండ్‌తో ఉయ్యాలలూగవచ్చు. "ధామన్ హార్టీ అను సుప్రసిద్ధ రచయిత" Sleep Walkers అనుకథలో క్లేర్ పాత్ర ద్వారా స్వప్న జగత్తులో ఉండికూడా చేసిన అద్భుతకార్యం రసవత్తరంగా వ్రాశాడు. "నిద్రా శాస్త్రం గురించి Research చేసిన వారిలో ప్రఖ్యాత డాక్టర్ మేరీస్టోప్స్ ఒకరు. నిద్ర, కలలు, కలవరింతలు, ఆవులింతలు వగైరాలన్నీ వీటిలో రకాలు, కారణాలు, లాభనష్టాలు అవసరాలు, వీటి పుట్టు పూర్వోత్తరాలు, వీటి అర్థాలు, అనర్థాలు గురించి ఇప్పటికే కొన్ని లారీల (లిటరేచర్) Literature ఉంది.

నీ స్వప్న నిద్రే Grand one లక్కీ పీపుల్ కు సుఖనిద్ర శుభస్వప్నాలు. కొందరు పడుకునే ముందు దేవుని స్మరించు కొనుచు పాటలు పాడుచూ ఉందురు. ఆ దెబ్బతో దెయ్యాలు భూతాలు వదలి ఉడాయిస్తాయి. కొందరికి దుస్వప్నాలు వస్తే కీడు కరెక్టుగా జరిగినట్టే కాలిరెడ్డి అను సుప్రసిద్ధ ఆంగ్లకవి "కుబ్లాఖాన్" అనే

ఖండకావ్యం స్వప్న వృత్తాంతంతోనే ప్రాసినట్లు చెప్తారు. రసజ్ఞులైన Romantic Poets స్వప్న సుందరిన్ని ఆపాద వస్తకం వర్నిస్తూ ప్రణయగీతాలు అల్లుతారు. నిద్ర, అవు లింత అంటుడు వస్తువులు, కంటే జియన్ అవులింతలు నిద్రాదేవికి ముందు నడిచే పందిమా గధులో, ఆ తల్లిని స్మరిస్తూ అలలు, అలలుగా వస్తారు. భార్యా భర్తలలో ఇద్దరు గురకిష్టులైతే శభాపైన జోడి వృత్తులను బట్టి కూడా కలవరింతలు జబ్బున పడ్డ రోగి డాక్టరు దగ్గరకెళ్ళినపుడు అది తలనొప్పయిన, కాలినొప్పయినా ముందు ఎక్స్‌రే, తర్వాత నెత్తురు, మలమూత్రాలు మొ॥ టెస్టులన్నీ చేసిన తరువాత మాత్రమే రోగ నిర్ణయం చేస్తారు". చస్తే వాయిదా ఇవ్వను, ప్రొసీడ్" అని జడ్జి మనం బస్సు ఎక్కునపుడు కండక్టర్ చిల్లర వుంటేనే ఎక్కండి అని, డిపో డిక్టేటర్ కిరోసిన్ లేదు. పంచదార లేదు, బోర్డు చూస్కోండి ప్రతిమనిషికి చెప్పను అని బోర్డు రాసి గోడకు కడతారు. దేవుళ్ళు నిద్రపోరు, వారికైవారు నిద్రపోరు. మానవులు 4 గం॥లు లేచి తమ దినచర్య ప్రారంభిస్తారు. దేవుళ్ళను నిద్రపుచ్చాలంటే ''రామాలాలీ మేఘ శ్యామ లాలీ జో అచ్యుతానంద ఇలాంటి పాటలు పాడాలి. వారిని నిద్ర పుచ్చుటకు కౌసల్యా సుప్రజారామా, అని రికార్డు పెట్టిస్తే నిద్ర లేచి వొళ్ళు విరుచుకుంటారు.

నిద్ర వాల్యూ తెల్సిన ఒక జాణ తన భర్తతో 'తెల్లారకట్ట అలారం మోగిన తరువాత చదివే పాఠం ఇపుడే చదువుకుని పెండ్రాడే పడుకోండి" అని వ్యంగ్య మర్యాద చెడకుండా నిద్ర చేటు ఎందుకని హింట్ ఇచ్చిందట. పూర్వం ఒకాయిన కాలంతీరి, నిద్రలోనే బకెట్ తన్నేశాడు, ''**अनयासेन मरणं, विनादैन्येन जीवनं**'' ఎంత పుణ్యాత్ముడో'! రాజా చావు! అని చచ్చిన వానికి ఊజనం మంచి కాంప్లిమెంట్స్ ఇచ్చారు. దీర్ఘ నిద్రకు రోజువారీ పొట్టి, పొడుగూ నిద్రలు దివ్యమైన ప్రిపరేషన్, చక్కని ట్రైనింగ్ నిద్ర అనగా టెంపరరీ డెత్.

"Sleep will solve all problems" అని అంగ్ల సూక్తి. నిద్రకు శృంగారానికి లంకె ఉంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నిద్రలో జుట్టు చెరిగిపోతూ ఉంటుంది. రసికుడైన భర్త శిఖామణి క్షేత్రయ్య అందులోనూ అందా లను చూచి పొందు పరిచాడు. ''విడజారు గొజ్జంగి విరి దండ జడతోను, కడు చిక్కు బడి పెనుగు కంఠసరితోను మగువ కేశికా మందరము వెడలెన్ తెల్లవారెననుచు'' అంటూ క్షేత్రయ్య వర్ణించెను. బ్రహ్మచారిని పెండ్లి చేసుకోమని స్నేహితులు అడుగుతుంటే అతను జీవితం ప్రశాంతంగా ఉంది చక్కగా నిద్రపోతున్నాను. ప్రాణం హాయిగా ఉంది. పక్క విశాలంగా ఉంది అని చెప్తుంటారు. నిద్రకు దూరం కాకూడదు. నిద్రపోతే కదా కలలు వచ్చేవి. పగలు పై అధికారి చేతిలో తిట్లుతిని స్వప్నంలో ఆమిడిసి పాటు అందికారికి ఇంకా స్ట్రాంగ్ భాషలో తిట్టి గుంజీలు తీయించి, గోడకుర్చి వేయించవచ్చు. నిద్ర మత్తు అలాంటిది. మానవునికి దైవదత్త మైన ప్రసాదం కనుక దైవం మీద భారం వేసి అందరూ "Sound Sleep" పోండి పూర్వము టెలిఫోన్ సంపన్నుల ఇళ్ళలో ఉండేది. ఇరుగు పొరుగు వారు వారి బంధు మిత్రులకు వారి నెంబరు ఇచ్చేవారు. ఆ సంపన్నుడు టెలిఫోన్ మోగు టుంటే న్యూసెన్సు, టెలిఫోన్ నిద్రానాశిని' అని సమా ధానం చెప్పాడు. బంగారం లాంటి నిద్ర టెలిఫోన్ ముందు బలాదూర్ నిద్రను ఆధారం చేసుకొని ఎన్నో పాటలు ఉన్నాయి. మేలుకో చినవదన మేలుకో.... నే నిద్రకేళి వాలాసంబు, ముక్కు కిందకు రెండు ముంగి పిల్లలు వచ్చే, చెవ్వు కిందకు రెండు చుంచు పిల్లలు వచ్చె మేలుకో.... నిద్ర పోతే శక్తి వస్తుంది. దీర్ఘ నిద్రతో బలం పుంజుకుంటుంది. ''రాత్రంత గర్ధం గతం'' **रात्रौ तदर्थं गतं** ఇచ్చిన నూరేళ్ళలో మూడోవంతు కాలం నిద్రలు పడి వేస్ట్ చేశాం. మనవి దేహాలు కాని, లోహాలు కావు. వెధవ మెషిన్లకే **खटथद** కావాలి. ఇక మానవుడికి వద్దా.

ప్రజలు అతి నిద్రాలోలు రైతే. పాలకుల గుండెలు పదిలంగా ఉంటాయి. ప్రతి ఒక్కరూ నిద్ర చేసే మేలు, కీడు రెండు చర్చించకుండా నిద్రాదేవత మీ మీదికి దూకితే భేషరుతుగా లొంగిపోయి పడుకోవడం ఇంటికి, ఒంటికి మంచిది. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కృష్ణమోహన్ గారి 'నారీ హంలతకుడు' నవలలో సామాజిక జీవన చిత్రణ

– ఖి. ఆంజనేయులు, తెలుగు విభాగం, టి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఎస్ (బి), వీపయాగండ్ల, వనపర్తి జిల్లా.

నమస్కారం! 'నారీహంతకుడు' అనే కృష్ణమోహన్ గారి నవల అర్ధరాత్రి రెండు గంటల సదుపాయంతో ప్రారంభం అవుతుంది. శేఖరం అనే పోలీస్ ఇన్స్పెక్టర్ ఆనంద్ ఫైనాన్స్ కంపెనీ యజమాని అయిన ఆనందరావు గారి ఇంటికి ఫోన్ చేసి ఇంటికి వచ్చి ఆనందరావు గారి భార్య అయిన శారదాంబ గారితో మాట్లాడి ఆనందరావు గారిపై నేరారోపణ చేయడం జరుగుతుంది. తన భర్తపై నేరారోపణ భరించలేని శారదాంబ ఎంతో కలత చెందుతుంది. శేఖరం అనే పోలీస్ ఇన్స్పెక్టర్ స్నేహబంధాన్ని అధిగమించి తన బాధ్యతా విధులను నిర్వర్తించడానికే ఇష్టపడి విచారణ నిమిత్తం శారదాంబను కొన్ని ప్రశ్నలు ఆనందరావు గురించి అడుగుతాడు. అంతకుముందు పనిమనిషి వారి ముందు ఉండకుండా శేఖరం జాగ్రత్త పడతాడు. అక్కడ కనుసైగతో పోయే పని మనిషి ఉంది. ఆనందరావు వివరాల్లో భాగంగా న్యాయమూర్తి కాంతారావు గారి కుమార్తె పెళ్ళికి వెళ్ళాడని శారదాంబ చెబుతుంది. అంటే ఆనాటి సమయాల్లో (1957) ఈనాడు కన్పిస్తున్న అనేక విందుల వలే రాత్రి వేళలో పెళ్ళి విందులున్నాయన్న మాట. ఆనందరావు గారి ఒక ఫైనాన్స్ కంపెనీ యజమాని అంటే పెద్దల విందులకు ఆ స్థాయి లోని వారే నేటి వలే హాజరయ్యేవారు.

పోలీస్ ఇన్స్పెక్టరు శేఖరం చేసిన నేరారోపణ ఏమిటంటే ఆనందరావు గారు మీనాక్షి అనే రెండవ తరగతి సినిమా నటిని అత్యాచారం చేయబోయి విఫల ప్రయత్నంతో ఆమెను కత్తితో పొడిచి చంపాడు. ఈ విషయాన్ని బట్టి కాలం పొడవునా ఏ రంగంలోని వారైనా పురుషుల కామాంధకారానికి స్త్రీల ప్రాణాలు అవిరైతున్నాయి. పూర్వ వంటింటిలో ఉండే స్త్రీ సమాజంలోకి వచ్చింది కాని తాను కోరుకున్న రక్షణ మాత్రం కరువై పోయింది. హత్యకు ముందు మీనాక్షి సెండు షో సినిమా చూసి తన ఇంటికి దగ్గర్లోని ఇలియట్స్ బీచ్‌కు చేరి సేదతీరాలనుకుంది. అంటే స్త్రీ అర్ధరాత్రి కూడా గాంధీ కలలు గన్న స్థాయి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటుంది. స్త్రీ స్వేచ్ఛను కాపాడే సమాజం నేటికి కొరతగానే ఉంది.

మీనాక్షీ నేరారోపణకు కారణం అయిన ఆనందరావు గారి కారు నెంబర్ యం.ఎఫ్.ఎక్స్. 40067 ను, నిందితుడి నుండి లభించిన పెన్నును సాక్ష్యంగా నిలిపింది. మీనాక్షికి తెలుగు, అరవం కూడా వచ్చు అంటే స్త్రీలు కూడా బహుభాషా సంపన్నులు కాగలరు అన్నమాట. మీనాక్షి నిందితుని తాలుకు వస్త్రాలంకారాలు, వయస్సు మొదలగు తెలిపి తెలివిగా తన చివరిశ్వాస వరకు సామాజిక రుగ్మతతో పోరాడుతూ ప్రాణాలు విడిచింది. ఆనాడు ఈనాడు ఇలాంటి స్త్రీ ధీరత్వం మనకు కన్పిస్తుంది.

శారదాంబ గారితో మాట్లాడుతుండగానే ఆనందరావు గారు రాత్రి 2 : 45 ని॥లకు ఇల్లు చేరుకున్నారు. ఆనందరావు నేరారోపణ విని శేఖరంతో స్నేహం పాముతో స్నేహంగా అభివర్ణించాడు. ఈనాటికి సామాన్యులు పోలీస్ స్నేహాన్ని ఇలాగే భావిస్తారు.

ఆనందరావు తనపై వచ్చిన నేరారోపణను ఏమాత్రం ఒప్పుకోలేదు. పెన్ను సాక్ష్యంగా చూపితే తన విశ్వాసం ప్రకారం కొద్దిరోజుల కింద ఆఫీసులో పోయిందని చెప్పాడు. ఆనందరావుతో అపరాధి నిర్భీతి కన్పిస్తుంది. శారదాంబ ఆ సమయంలో ఆనందరావుకు ప్రమాదం కల్గుతుందేమో అని భయపడి ఏడుస్తుంది. తన వంతు

ఆందనావును తప్పించే ప్రయత్నంగా తనకు పరిచయం ఉన్న ఎమ్మెల్యే గారి భార్య కామాక్షమ్మను సహాయం అడుగుతుంది. రాజకీయ కళంకంగా మారుతుందేమో అని ఆమె సహాయం చేయుటకు తిరస్కరిస్తుంది. అప్పుడు శారదాంబ సహాయం పొందినవారే వారి ఆపదలో ఉన్నప్పుడు సహాయం చేయలేకపోతున్నారని కన్నీటి పర్యంతమవుతుంది.

శేఖరంతో కలిసి ఆనందరావు ప్రఖ్యాత డిటెక్టివ్ వామనరావు గారిని కలుస్తారు. వామనరావు గారు కేసు తాలుకు వివరాలు తెలుసుకొని కేసు విచారణ ప్రారంభి స్తాడు. మరుసటిరోజు పేపర్లో నాఇ వలె 'బీచ్‌లో హత్య', 'సినిమా నటి చిత్రవద' 'మానం హరింపబోయి, ప్రాణం గొన్న హంతకుడు' అని హెడ్డింగ్స్ వచ్చాయి. దీని బట్టి సమాజం క్షేమాన్ని కోరే సమాచారం స్రవంతి నిరంతరం వెనువెంటనే స్పందిస్తుందన్న మాట.

కేసును చేధించడానికి వామనరావు 'ఆనంద్ ఫైనాన్స్ కంపెనీ' దగ్గరకు వెళ్ళాడు. అక్కడ ఎయిర్ కండీషన్ గది ఉన్నది. వాటికి విలాస ఎసి గది ఉంది అన్నమాట. అయితే నేటికి చాలామంది సామాన్యులకు గుడిసెలు న్నాయి. వామనరావుకు తోడు పిల్ల డిటెక్టరుగా పాణిని ఉన్నాడు. ఇక్కడ అసిస్టెంట్ పాత్ర మనకు కనిపిస్తుంది. ఆనందరావు నుండి అనేక విషయాలను తెలును కున్నాడు. రాజన్ అనే మేనేజరు కూడా మనకు కన్పిస్తాడు. యాజమాన్యాలు తన సంస్థలను మేనేజరులకు అప్పగించడం నేటికి జరుగుతుంది. అదేవిధంగా హామీ పత్రాల ఇబ్బందులు ప్రాస్తవించబడుతాయి. పాణి ద్వారా సహాయకుల మెరుపులాంటి సహాయాలు గుర్తుకు వస్తాయి. డిటెక్టరు కారును కల్గి ఉండడం విలాస ప్రయాణాన్ని అవసరాన్ని తెలుపుతున్నాయి. వామనరావు తన కారుకు 'కంచురదం' అనే ముద్దుపేరు కూడా పెట్టుకున్నాడు.

వామనరావు పాణితో కలిసి కేస్‌లో భాగంగా 'ది న్యూ బాంబే పెన్ మాన్‌ప్యాక్చరింగ్ కంపెనీ' యజమాని అయిన అబ్దుల్ మజీద్‌బాయ్‌ని కలిసి మాట్లాడుతాడు. అప్పుడు మజీద్‌బాయ్ పాత్రలో మాటకారిలో ఎదురీతి తనం కనిపిస్తుంది. వరదరాజులు విషయం తెలుసుకున్న వామనరావు వరదరాజులకు తగు భయం చెప్పి తన నుండి తదుపరి వేళం విషయం తెలుసుకుంటాడు. ఈ పాత్ర ద్వారా దొంగవెలంగాళ్ళు ప్రస్తావించబడ్డారు. అదేవిధంగా బతకాలనే ఆశలో అత్యుత్సాహం గోచరి స్తుంది. వరదరాజులు వాళ్ళ అమ్మాయి పుట్టినరోజు జరిపాడు అంటే నాడు పుట్టినరోజులు జరుపుకోవడం సామాన్యులు కూడా వచ్చింది అన్నమాట.

సరాసరి ఆనందరావు కంపెనీకి వెళ్ళిన వామనరావుకు లేడీ స్టెనోగ్రాఫర్‌తో అతురతగా పనిచేస్తున్న రాజన్ కనిపిస్తాడు. అతనిలోని ముభావాన్ని పరిశీలించిన వామన రావు అతనితో మాట కలిపి తనతో మాట్లాడుతాడు. అప్పుడు రాజన్ తాను నాటకాలాడే వాడినని కూడా తెలుపుతాడు. అంటే ఒక మనిషిలో తన జీవిన పోరాటంలో ఒకటి కన్నా ఎక్కువ రంగాలలో నైపుణ్యం సంపాదించు కోవడం ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది.

తరువాతి భాగంలో మెరినాబీచ్ ప్రస్థావన వచ్చింది. అంటే ఆనాటికి బీచ్‌ల వినియోగం చెన్నై లాంటి చోట్ల బాగానే పెరినట్లుంది. ఈ మెరినాబీచ్ సమీపంలో డిటెక్టరు వామనరావు 'డీలక్స్' సిగరెట్ తాగాడు. ఇతనికి సిగరెట్‌తాగే అలవాటు బాగానే కనిపిస్తుంది. కారులో పాణి హింది చిత్ర గీతాల్ని సీలోను నుండి వింటున్నాడు అంటే రేడియో ప్రసారాలు అందుబాటు కనిపిస్తుంది. ఇది వృత్తిధర్మం కూడా. ఐ.జి ఆఫీసు, ఇటియట్స్ రోడ్స్ అనేవి నగర అభివృద్ధిని తెలుపును. రాజన్ ఇంటిని చేరడానికి ముందు వామనరావు వాళ్ళు అజంతా గ్రీన్ కాఫీ తాగారు. అనడానికి బట్టి కాఫి కాలక్రమేణా తన విస్తారం, విలాసం పెంచుకుంది. డిటెక్టివ్‌లో భాగంగా వామనరావు గారు రాజన్ నుండి అనేక విషయాలు రాబట్టారు. చివరగా వస్తున్నప్పుడు రాజన్ ఇంటి దగ్గర ఒక కొత్తవ్యక్తిని అనుమానంగా చూశాడు వామనరావు. అతని గురించి

అడిగాడు. ఆ సమయంలో పాణి రాజన్ చెల్లెలు గౌరీని చూస్తూ ఉన్నాడు. ఇక్కడ మనకు పెళ్ళికాని అమ్మాయి అబ్బాయిలు దోరచూపులు చూసుకోవడం కనిపిస్తుంది. రాజన్ కృతజ్ఞత స్వభావం యజమాని పట్ల ఎలా ఉందో కూడా కన్నీటి సాక్షిగా చూశారు డిటెక్టర్లు ఇద్దరూ. ఆనంద రావు టూర్ రహస్యం వివరాలు తెలుసుకున్నారు. డిటెక్టర్లు సైకాలజీ ప్రస్థానం తెచ్చుకున్నారు. సమాజంలో వాటికి సైకాలజి ప్రాముఖ్యం పెరిగిందన్నమాట.

వామనరావు గారు ఆనందరావు గారి ఇంటికి చేరి శారదాంతో మరోసారి చర్చించి రాజన్‌పట్ల ఉన్న అభి ప్రాయాన్ని కనుకొన్నారు.

హామీపత్రం కేసు మొదలగునవి కోర్టు హియరింగ్‌కు వచ్చాయి. నాటికి కోర్టుల జోక్యం పెరగటం గమనించ వచ్చు. కోర్టులో వాదనలు జరుగుతున్నప్పుడు రాయపురం నుండి వామనావు గారికి ఫోన్ ఒక స్త్రీ నుండి వచ్చింది. తనను కలిస్తే కేసుకు సంబంధించిన కోర్టులో మాట్లాడే సౌకర్యం కనిపిస్తుంది.

ఇందూ నిలయం దగ్గర అందమైన నడి వయస్సు స్త్రీ వామనరావు గారికి స్వాగతం పలికింది. మీరు ఇందిరానా అన్నాడు వామనరావు. ఇక్కడ మనకు అందమైన స్త్రీకి అందమైన స్త్రీ పేరుకు ముడిపెట్టడం కనిపిస్తుంది. ఇందిరా తనకు ఆనందరావుతో గల సంబంధాన్ని సవివరంగా తెలియబరచి ఆరోపణ ప్రధాన సమయానికి తాను ఆరోపించే స్థలంలో ఆనందరావు లేడని తెలిపింది. స్త్రీలు పురుషులతో విలాసాలకు పోవడం కానవస్తుంది. ఇందిరా తన భర్త మరణం వివాహ షరత్ గురించి చెబుతుంది. ఇక్కడ పునర్వివాహానికి నిబంధన కానవస్తుంది. ఈ నిబంధనతో మరణం ముందు మాత్రమే కాదు మరణం తరువాత కూడా తన భాగస్వామి తనకు మాత్రమే చెందినదై ఉండాలనే భర్త కోరిక గోచరిస్తుంది.

ఇన్‌స్పెక్టరు శేఖరం కేసు విషయంలో ఇందిరాను కలవడానికి వెళ్తాడు. అక్కడ వెళ్ళిన శేఖరం ఆమె మరణపు చివరి పలుకుల నుండి ఆనందరావుపై మరో హత్యారోపణ కల్గుతుంది. ఈ విషయాన్ని వెంటనే వామనరావు తెలి పాడు. ఇక్కడ మరో ఆనంద్‌ను ప్రియురాలు గుర్తించలేక పోయింది. అందుకే నేటికి కళ్ళతో చూసేవన్ని నిజాలు కావు అనే నానుడి వాడుకలో ఉంది.

రెండవ హత్యానేరం కూడా తోడవడంతో శేఖరం తన బాధ్యతలను పదును పెంచి ఆనందరావును జైలుకు పంపాడు. అయిన వామనరావు దృష్టిలో తన కేసు స్టడీ పూర్తి కాలేదు. కావునా తిరిగి జామీను తీసుకువచ్చి స్టడీ కొనసాగించాడు. కాని ఆరోపిత నేరస్తుని పట్ల శేఖరంకు కఠినత్వం దృఢపడింది. స్టడీ నిమిత్తం రిజర్వు దళంతో వామనరావుతో పాటు శేఖరం ఆనందరావు ఫైనాన్స్ ఆఫీసు చేరాడు. వామనావు కనిపిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేయమన్నాడు. తనతోపాటు రాజన్‌ను కూడా చెప్పాడు. అక్కడే నకిలి ఆనంద్ సృష్టి రాజన్ మోసం గురించి శేఖరంకు తెలిపాడు. వారిని అరెస్ట్ చేశాడు శేఖరం.

ఆనందరావు గారి ఇంట్లో ఆనందరావు - శారదాంబ, వామనరావు, పాణి, గౌరీ, శేఖరం మాట్లాడుకుంటున్నారు. అంటే ఇది విజయానంతర చర్చ అన్నమాట. ఇలాంటిది నేటి సమాజంలోనైనా కానవస్తుంది. ఆనందాన్ని అందరూ కలిసి పంచుకోవడం కనిపిస్తుంది. ఈ సందర్భంలోనే ఇద్దరూ ఆనంద్‌ల పుట్టుక వృత్తాంతాన్ని, ఆనంద్‌రావు గారి అస్సలు తండ్రి కథను, రాజన్‌కు ఇచ్చిన అధికారం ఎలా వమ్ము కాబడ్డదో తిరిగి ప్రమాదాన్ని ఎలా తయారు చేసిందో తెలిపాడు. ఆనందరావు అస్సలు తండ్రి పేదరికం వల్ల కుటుంబాన్ని సగంగా చీల్చడం అపసృతి గానే కానవస్తుంది. ఇటువంటి అపసృతులు ఇంకా మితి మీరి నేటి సమాజంలో కుటుంబం అంతా కలిసి చని పోవడం కనిపిస్తుంది. ఇది పేదరికం నుండి పారిపోవడం కాని ఎదిరించిన్నట్లు కాదు.

తన తల్లి సంరక్షణార్థం మగతోడును ఆధించడం చూస్తే తల్లి బిడ్డలకు మగవారి సంరక్షణ ప్రాధాన్యత ఎంత గొప్పదో తెలుపుతుంది. అదేవిధంగా పెంచిన తండ్రి మాస్టరు గారు ఎంతో గొప్ప నంస్కరణ

హృదయంతో తల్లిబిడ్డల సంరక్షణార్థం వివాహం చేసుకోవడం. సామాజిక బాధ్యతను గుర్తుచేస్తుంది. వృద్ధాప్య సమయంలో కూడా ఆనందరావు తల్లి కొడుకు చేసిన సహాయాన్ని తిరస్కరించడం బంధాన్ని విఘాతం కల్గించింది. ఆ డబ్బులను తీసుకొని దానం చేసేవారు కూడా నేడు లేకపోలేదు. ఆ బాధ విఘాతం రాజన్ వంటి వారికి పరోక్షంగా అవకాశం కల్పిస్తుంది. వామనరావు జరిగిన కేసు విషయం ముగిస్తుండగానే పాణి వచ్చి వామనావు చెవిలో 'గౌరీ పెళ్ళికి ఒప్పుకుంది అనే విషయం తెలిపాడు. యువకులు తన స్వభావానికి తగ్గ వ్యక్తిని ఓపికతో ఎలా భాగస్వామిగా చేసుకోవచ్చో పాణి పాత్ర గోచరిస్తుంది.

మొత్తం మీద ఈ నవల తరతరాలుగా వారసత్వంగా సమాజం పొందుతున్న ఆదర్శాలతోపాటు అవాంఛ నీయతలు కూడా ఎలా సంభవిస్తున్నాయో తెలుపుతూ దానికి తగిన సామాజిక గతిశీలత పరిస్థితులను ధనాశ, స్త్రీపై దురాశ వంటి వికృత చేష్టలు ఎలాంటి గతులకు గోతులను సమకూరుస్తాయో తెలుపుతూ వ్యక్తులపై ఏర్పరుచుకోవాల్సిన నమ్మకాలకి నిరంతర జాగురుకతను నేర్పుతుంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఈతరం అమ్మాయిలు – సామాజిక స్పృహ

– వింధ్యారాణి

"నానృషిః కురితే కావ్యమ్" అనగా ఋషి అంశలేని వాడు కవి కాజాలడు. అటువంటి కవి బ్రహ్మచే సాహిత్య సృష్టి జరుగుతుంది. ఆ సాహిత్యం నాటి సమాజానికి అద్దం వంటిది. అంతేకాక విశ్వశ్రేయః కావ్యమ్ అన్న విధంగా సామాజిక శ్రేయస్సును కూడా కోరుతుంది.

సాహిత్యం కూడా కాలగమనంలో వివిధ మార్పులకు లోనైంది. ఈ సాహిత్యాన్ని రెండుగా విభజించి ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం అని తీసుకున్నట్లయితే ఆధునిక సాహిత్యంలో కూడా "విశ్వశ్రేయః కావ్యమ్" అనే లక్షణమే దాగి ఉంది. ఈ ఆధునిక సాహిత్యాన్ని ఆధారంగా చేసుకొని "ఈతరం అమ్మాయిలు" సామాజిక స్పృహను ఏవిధంగా కలుగజేస్తున్నారో పరిశీలిద్దాం.

"కార్యేషు దాసి, కరణేషు మంత్రీ" అను ఆర్యోక్తిని వినని ఆంధ్రులు ఉండరు. అదేమి విచిత్రమో కొన్ని మాటలు నిత్యనూతనములుగా ఉంటాయి. కాలం ఎంతమారిన ఎన్ని చరిత్రలు కాలగర్భంలో కలిసి పోయిన మారనది మగువ వ్యక్తిత్వం మాత్రమే.

నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి అనే కాలం నుండి "నస్త్రీ స్థానం భవతి" అనగా స్త్రీలేని చోటులేదు అని నా ఉవాచ.

పారశుద్ధ్య రంగం నుండి పారిశ్రామిక రంగం వరకు, పాకశాల నుండి ప్రయోగశాల వరకు, అవని నుండి అంతరిక్షం వరకు అన్నింటా అడుగులు మోపింది. అంతరిక్షం వరకు అన్నింటా అడుగులు మోపింది. ఇక్కడ ఆలోచించవలసిన విషయం ఏమంటే మహిళ ముందుకు సాగుతూ ఉంది. ఆసకి ఒక స్త్రీగా, గృహిణిగా, మాతగా, ఇల్లాలిగా తన ధర్మాన్ని మాత్రం ఎప్పుడూ విడవలేదు.

మరి కొంతమంది సమాజానికి చీడపురుగులు లేరా అంటే త్రేతాయుగంలోనే సీతమ్మవారితో పాటు శూర్పణఖ, మంథరలాంటి దుష్టులు ఉన్నారు కదా! మరి ఇది కవియుగం కాబట్టి వీరి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండవచ్చు. కాని దుష్టసంహారం చేయనక్కర్లేదు. దుష్టులకు దూరంగా ఉంటే చాలు వారిలో పరివర్తన వస్తుంది. మంచి చెడులు సమాజంలో ఎప్పుడూ ఉంటాయి మనం గ్రహించిన దానిని బట్టే మన భవిష్యత్తు ఉంటుంది.

ఇక ఆధునిక సాహిత్యంలో అమ్మాయిలను పరిశీలిస్తే మనకు (సమాజానికి) ఎన్నో విలవలు నేర్పుతున్నారు. ముందుగా చాగంటి సోమయాజులు గారు రచించిన "కుంకుదాకు" నుండి గవిరి (గౌరి)ని తీసుకుందాం.

గవిరి చినదేవుడు కూతురు 8 ఏళ్ళు అయినా "అష్ట వర్షాత్ భవేత్‌కన్యా" అనే పూర్వ సంప్రదాయం ప్రకారం ఈమెను గ్రహిస్తే ఆమె నెత్తిమీద కొండంత సంసార భారం ఉంది. ఆకులు అలలమూ ఏరి ఇంటికి పూటకు సరిపడే వంటచెరుకు తేవాలి.

రాత్రంతా తిండి లేకపోయిన, ఆకలితో పాలాల్లో తిరుగుతూ తోటి అమ్మాయి పారమ్మ (అప్పలనాయుడు కూతురు) పేదరికానికి ఎగతాళి చేసిన కుంకుడాకులు ఏరుకొని తట్టనింపుకొని ఆకలి బాధతో ఇంటి బరువును తట్టపై మోస్తూ వచ్చింది. కాంభుక్త అనవసరంగా ఆమెపై చేయిచేసుకొన్న ఆ దెబ్బలకు నొచ్చుకున్నదేకాని తన కార్యం వదిలిపెట్టలేదు. చెల్లాచెదరు అయిన ఆ కుంకుడాకులను మళ్ళీ తట్టలోకి చేర్చి చివరకు తన విధిని నిర్వహించింది. ఇది చాలా చిన్న దృశ్యం కాని దీని లోతును పరిశీలిస్తే గవిరి పాత్రలో ఎంతో సామాజిక స్పృహ దాగి ఉంది.

సామాజిక స్పృహ :

ఒక పనిని మొదలుపెట్టినప్పుడు ఆ కార్యాన్ని

నలుగురు వేలెత్తి చూపవచ్చు, ఎగతాళి చేయవచ్చు, శరీరం సహకరించకపోవచ్చు కాని ''నవిరమన్తి ధీరాः'' అనగా ధీరులు ఎప్పుడు విఘ్నాలయ భయపడి తమ పనిని మధ్యలో విడవరు విడువరాదు అనే సందేశాన్ని మనకు గవిరి ద్వారా చెపాపరు. చా...సో గారు. ఇది సామాజిక స్పృహ కాదా. ఇదే కదా మన ఆర్యులు చెప్పిన ''కార్యేషు దాసే తత్వం''.

గోరా శాస్త్రి గారి ''ఆశ ఖరీదు అణా''లోని కృష్ణవేణి పాత్ర కూడా ఇదే కోవకు చెందినది.

అదేవిధంగా వనిత మంత్రాంగాన్ని నడపడం కూడా ఎంతో దిట్ట. ఒక మాటలో చెప్పాలంటే చాణక్యుడు తిమ్మరసు లాంటి హేమాహేమీలకు ఏమాత్రం తీసిపోదు.

అందువలనే నేటి మహిళ ఆర్థికమంత్రిగా, సభాపతిగా, రాష్ట్రపతిగా అనేక విధలు నిర్వహిస్తున్నది. ఇక ఆధునిక సాహిత్యంలోకి వెళితే ''కరణేషు మంత్రికి'' ఉదాహరణగా గురజాడ వారి మధురవాణిని చెప్పవచ్చు.

బాల వితంతువు అయిన బుచ్చమ్మను గిరీశం లాంటి మాయగాళ్ళనుండి కాపాడి డామిట్ కథ అడ్డం తిరిగింది అనిపించింది. నిజానికి ఒక వేశ్యావృత్తిలో ఉండి కూడా పదిమంది ఛీత్కారాలకు బదులుగా అందరి మన్ననలను పొందింది. కాబట్టి వృత్తికంటే ప్రవృత్తి (వ్యక్తిత్వం) చాలా ముఖ్యమైనది. ఉన్నతమైన వ్యక్తిత్వం ఉంటే ఎంతటి అసాధ్యమైన సుసాధ్యం చేయవచ్చని మధురవాణి పాత్ర ద్వారా సామాజిక స్పృహ కలిగించారు మన వెలుగుజాడ గురజాడ.

ఈ గురజాడ వారే ''కన్యక'' అనే ఖండికలో కన్యకు ప్రాణం కంటే మానం గొప్పదని సూచించారు.

కన్యక కలువలవంటి కన్నులు కలిగి, మెరుపుకాంతిలో హంస నడకతో అందాల భరణిలా ఉండే ఒక వైశ్యుని కూతురు దేవాలయానికి పూజకు వెళ్తుంటే రాజు ఆమెను కామించి తన దర్పాన్ని చూపబోతే కన్యక అమం దెబ్బతిన్నది.

''నీవొక పట్టమేలే రాజువట!
రాజునేలే దైవముండదా?'' అని

మన పాపములకు మన ఆత్మసాక్షి మనపై దైవము ఒకడు ఉన్నాడు అని హెచ్చరిస్తూ ఆత్మార్పణ చేసుకున్నది. ఇక్కడ మనం గ్రహించవలసినది ప్రాణం కంటే మానం గొప్పదని.

అంతేకాని గురజాడవారు ఆత్మహత్యను ఎంరేజ్ చేశారని కాదు అర్థం. మంచిని గ్రహించడమే నిజమైన సామాజిక స్పృహ.

క్షమయ ధరిత్రీ అనగా ఓర్పు విషయంలో భూదేవిలా వ్యవహరించాలి. ఇప్పటికి కొంతమంది ఇల్లాల్లు తమ త్రాగుబోతు భర్తల బారినుండి ఎంతో క్షమ కలిగే ఉంటున్నారు. దీనికి ఉదాహరణగా కందుకూరి వారి ''రాజశేఖర చరిత్ర'' నవలలోని రుక్మిణి పాత్రను పరిశీలిద్దాం.

రాజశేఖరుని కుమార్తె రుక్మిణి. అందాల భరిణి. వివాహమయిన కాని పుట్టింట ఉంటూ తన భర్తకోసం ఎదురు చూస్తూ చివరికి కుటుంబం చెల్లాచెదర అయిపోయిన బెదరక ఓర్పుతో కష్టాలను భరించింది. చివరకు తన ఓర్పుకు తగిన ఫలితం లభించింది. ఈ పాత్ర ద్వారా నేటి యువత చాలా నేర్చుకోవాలి చాలా చిన్న చిన్న విషయాలకే విసిగిపోయి విరక్తి చెంది తనువును చాలించే దానికంటే ఓరిమితో ఉంటే ఎప్పటికైనా సుఖాలను అనుభవించవచ్చు. కందుకూరి వారు రుక్మిణి ద్వారా భూదేవిలా ఓర్పు ఉండాలని స్పృహని కలిగించారు.

గురజాడ వారి ''దిద్దుబాటు''లో కూడా కమిలినీ పాత్ర ఇదే విషయాన్ని గుర్తుకుచేస్తుంది. కమిలినీ తన భర్తను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ఎంతో ఓరిమిని వహించింది. చివరకు తన భర్తను బాగుచేసుకుంది. కాబట్టి యుగమేదయున ధర్మం వదలక నడుచుంటే అది మనలను రక్షిస్తుంది. విశ్వనాథవారి కిన్నెరసాని కూడా వాగులు, వంకలు దాటి కష్టాలకోర్చి కడిలిలో కలిసింది.

"రూపేచ లక్ష్మి" అని సూరులు (సూరి - పండితుడు) అంటున్నారు. ఆ సౌందర్యం అంతఃసౌదర్యం అయి ఉండాలి. బాహ్య సౌందర్యం యొక్క ఉనికి హృదయ సౌందర్యంపై ఆధారపడి ఉంటుంది. హృదయ సౌందర్యం లోపించినపుడు బాహ్య సౌందర్యం వికృతంగా కనిపిస్తుంది. ఈ భావనకు ప్రతీకయే వాసిరెడ్డి సీతాదేవి గారి "సౌందర్యం" లోని రేఖపాత్ర.

రేఖ సన్నగా, తెల్లగా, నాజూకుగా ఉంటుంది. ఆమె భర్త సుందర్రావు అంత అందగాడు కాదు. నల్లగా, లావుగా, బట్టతలతో ఉంటాడు. హైదరాబాద్‌కి ప్రయాణించినప్పుడు బస్సులో గురక పెడతాడు. తన ప్రక్కనున్న అందమైన అబ్బాయిని చూసి తన భర్తను చూస్తే కంటికి ఎలుగుబంటిలా కనిపించాడు. కాని ముందుసీటులోని జంటను చూసి తన భర్త అందంగా ఉన్న భార్యను ఏవగించుకోవడం చూసి అప్పుడు రేఖలో పరివర్తన కలుగుతుంది. బాహ్య సౌందర్యం కంటే హృదయ సౌందర్యం ముఖ్యమని అప్పుడు గ్రహించింది.

అంత వికృతంగా ఉన్న సుందర్రావు భార్యను ఎంతో అపురూపంగా చూసుకోవడంతో ఎంతో సుందరంగా కనిపించాడు. కాబట్టి రూపం కాక హృదయం చూడాలని సీతాదేవి గారు నేటి మహిళకు సూచనలిస్తున్నారు. మనిషి బాహ్య సౌందర్యం కాక హృదయ సౌందర్యం చూడాలని హృదయం అందంగా ఉంటే జీవితం అందంగా ఉంటుందనే సామాజిక స్పృహను కలిగిస్తున్నారు.

సంస్కృతి సంప్రదాయలకు వస్తే పూర్వం పిల్లలకు తల్లిదండ్రులు సర్దుకుపోయే తత్వాన్ని నేర్పేవారు. కాని నేటి తరంలో స్వతంత్రత, స్వేచ్ఛ ఎక్కువయిపోయింది. కాని దానివల్ల ఎన్నో కష్టాలు పడవలసి వస్తుంది. పూర్వం ఉమ్మడి కుటుంబం ఉంటే అందరూ తలోపని చేస్తూ ఇంటిని అందంగా తీర్చిదిద్దుకొనేవారు. రామాయణంలో కూడా సుమిత్ర లక్ష్మణినికి అదే హితబోధ చేసింది.

"రామందశరథం విద్ధి మాంవిద్ధి జనకాత్మజామ్
అయోధ్యామటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్"

అని అన్నవదినలు తల్లిదండ్రులతో సమానమని చెప్పింది. ఇదే విషయం ఆధునిక సాహిత్యంలో కూడా కనిపిస్తుంది.

జానపద సాహిత్యంలో ఉన్న "కలవారి కోడలు కవికి కామాక్షి" అనే పాట ఈతరం అమ్మాయిలకు ఎంతో ఉపయోగకరం. యస్వీ భుజంగరాయ శర్మ గారు రాసిన "కలికి కామాక్షి"ని పరిశీలిద్దాం.

కామాక్షి కలవారి కోడలు బిడ్డను కని ఆ బిడ్డతో అత్తవారింటికి వెళ్ళి సంవత్సరంలోపు పురిటి మంచాన్ని చూడాలి. అది ఒక ఆచారం. దానికోసం కామాక్షి అన్న వచ్చాడు. తనతోపాటు మేనాను బోయిలను తీసుకొచ్చాడు. కామాక్షి అత్తగారి అనుమతిని కోరింది, తరువాత మామగారిని, తరువాత బావగారిని తదుపరి తోడికోడలిని అడిగి చివరగా భర్త అనుమతి కోరింది. ఈ విధంగా ఉమ్మడి కుటుంబంలోని ఆప్యాయతలు అనురాగాలు వాళ్ళమధ్య ఉండే సఖ్యతలు కంటికి కట్టినట్లు చూపించారు. ఈతరం అమ్మాయిలు కూడా ఈ విధానాన్ని అలవరుచుకోవాలి. ఇంటిలో పెద్ద ఉంటే వారి అనుభవం మనకు తోడవుతుంది. కాబట్టి పెద్దవారిని గౌరవించాలి తోడికోడళ్ళు సఖ్యంగా ఉండాలి అనే సామాజిక అంశాన్ని భుజంగరాయ శర్మ గారు కామాక్షి ద్వారా మనకు తెలియజేశారు.

వీరే కాక ఆధునిక సాహిత్యంలో ఎందరో స్త్రీలు తమ తమ ధోరణిలో సమాజానికి హితవును చెబుతున్నారు. కట్టమంచి వారి "ముసలమ్మ" లాంటి వారు ఏస్వార్థం లేకుండా సమాజం కోసం తమ జీవితాలను కూడా సునాయాసంగా అర్పణ చేస్తున్నారు.

ఈతరం అమ్మాయిలు అన్ని రంగాలలోను ముందుకు వెళ్తూ గృహిణి ధర్మాన్ని కూడా ఎంతో చక్కగా నిర్వహిస్తూ అవధానులుగా, అష్టభుజులుగా అగుపిస్తున్నారు. ప్రతి సాహిత్యం నాటి సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. కావున నేటి ఆధునిక సాహిత్యంలో కూడా "ఈతరం అమ్మాయిలు" దర్శనమిస్తూ విశ్వశ్రేయస్సును కోరుచున్నారు. కావున ఆధునిక సాహిత్యంలో స్త్రీ సమాజంపై ఎంతో ప్రేరణను కలిగిస్తుంది. కావున ఓ వనితా నీకు వందనం. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గంగుల శాయిరెడ్డి "కాపుబిడ్డ" – రైతు జీవిత చిత్రణ – విశ్లేషణ

– రొజస్వామి గోగు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, తెలంగాణ.

ఆధునిక ఛాయలున్న తొలి తెలుగుకావ్యం ముస లమ్మ మరణం. వ్యవసాయంతో వస్తుపరమైన సంబంధ మున్న కావ్యం. ఆ తరువాత వ్యవసాయంతో సంబంధం లేని కవులు రైతుల్ని గురించి కాల్పనిక దృష్టితో ఎన్నో కవితలు రాసినా, కృషీవలుడు (దువ్వూరి రామిరెడ్డి), పఱిగిపంట (తుమ్మల సీతారామమూర్తి చౌదరి) లాంటి కావ్యాలు కర్షక జీవితానికి ప్రతిబింబాలుగా నిల్చాయి. ఇదేవరుసలో గంగుల సాయిరెడ్డి రాసిన కాపుబిడ్డ కావ్యం ఏమాత్రం తీసిపోదనే చెప్పాలి.

కవి గంగుల శాయిరెడ్డి తెలంగాణాలోని నల్గొండ జిల్లా జనగాం తాలుకా (ప్రస్తుతం వరంగల్ జిల్లా) వాస్తవ్యుడు. ఈయన కాలం 8-6-1890, 4-9-1975. ప్రకృతి వైద్య చికిత్సకు, ప్రకృతి వైద్యాచార్య, పశువైద్య ప్రవీణ అనే బిరుదులున్నాయి. ప్రధానంగా వ్యవసాయ వృత్తిలో జీవిస్తూ కవిత్వం రాసిన కొద్దిమందిలో ఒకరు. ఈయన వృత్తివరంగా రైతు కానీ, ప్రవృత్తిపరంగా కార్యకర్త. బాలసాహిత్యంలో, వయోజన విద్యా ప్రచారంలో ఇతోధికంగా కృషి చేశారు. ఆంధ్ర మహాసభ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఈయన జాతీయవాది. ఒక సంవత్సరం జైలుశిక్షను కూడా అనుభవించాడు.

ఏ ప్రాణికైన బతకడానికి ఆహారం అవసరం. ఆ అవసరాన్ని తీర్చేది వ్యవసాయం. వ్యవసాయం చేసేది రైతులు. వీరిని ప్రత్యక్షంగా, పరోక్షంగా అనునిత్యం వెంబడించేవి కష్టాలు. ఏడాదిలోని మూడు కాలాల్లో ఎప్పటి పనులు అప్పుడే కాచుకుని ఉండి రైతులు తీరికగా ఉండరు. ఎల్లకాలం కష్టించి పనిచేసిన హాయిగా బతకలేరు. దినదినగండం, అమాయకత్వం, అహింసా తత్వం రూపుకట్టిన రైతుల కడగండ్లను వివరించడం, శ్రామికజీవనం పట్ల గౌరవాన్ని పెంపొందించడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశ్యం. ప్రాంతీయ భాషకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి, దైనందిన జీవితాన్ని పద్యాల రూపంలో కూర్చి, రైతుల జీవన విధానం, వారి కడగండ్లు, భూస్వాముల వల్ల పొందే ఇబ్బందులు.... మొదలైన విషయాలను నాగరికులకు తెలిపే ఉద్దేశ్యంతో రాసిన కావ్యమిది.

"కాపుబిడ్డ" కావ్యం 1937లో వచ్చిన మూడవ ముద్రణ లభ్యమౌతుంది. దీనికన్నా ముందు వెలువడిన రెండు ముద్రణలు అలభ్యాలు. మొదటిసారిగా ఒక ప్రాంతీయ మాండలికంలో రాయబడ్డ వ్యవసాయ సంబంధ పద్య కావ్యం. మాండలికానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తున్న రచన లుగా కథానిక, నవలలు నేడు బహుళ ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ, "కాపుబిడ్డ" లాంటి కావ్యాలు అటువంటి మాండలికాలను పద్యాల్లో కూడా చెప్పవచ్చునని నిరూపిస్తున్నాయి. "కాపుబిడ్డ" కావ్యం రైతు యదార్థ జీవితంలో నుండి పురుడు పోసుకున్న కావ్యం. రైతు కష్టాలు, కడగండ్లకు నిలువెత్తు నిదర్శనం.

కవి ఈ కావ్యంలో రైతు ఉదయం మేల్కొన్నది మొదలూ, రాత్రి ఇంటికి చేరుకునే వరకు గల కార్య కలాపాలను, స్థితిగతులను, స్వరూప స్వభావాలను, సుఖ దుఃఖాలను, కష్టాలను, నష్టాలను వంటి అనేక అంశాలన్నింటినీ ఎంతో హృద్యంగా, వాస్తవిక జీవితానికి సరిపోయే విధంగా చిత్రీకరించాడు.

రైతు స్వరూప స్వభావాలు :

కవి స్వయంగా రైతు కాబట్టి రైతు స్వభావాలను మనకు కళ్ళముందు కన్పించేట్టుగా చిత్రీకరిస్తూ పంట చేతికి వచ్చిన కాలంలో ఆ ధాన్యాన్ని కర్షకుడు ఎవరెవరికి ఏ విధంగా దానం చేస్తున్నాడో ఈ పద్యంలో వివరిస్తు న్నాడు.

సీ॥. వరికుప్పను గొట్ట వచ్చెడివారికి
దోసిళ్ళతో ముంచి త్రోయనాడు
కొలత తూనీక లేక విలువ లెక్కింపక
నొరులకు వెరచుచు నొసగునాడు.....
(కాపుబిడ్డ; పుట. 47, 94వ పద్యం)

వరికుప్పలను కొట్టడానికి వచ్చేవారికి దోసిళ్ళతో ముంచి ధాన్యం పోశాడు. కంకులను, ప్రత్తిని, గడ్డల గొలలను చేతిలో పట్టినంత చేపట్టిన వారికి ఇచ్చాడు. ఈ సందర్భాలే కాకుండా అనేక సందర్భాలలో మొదట ముంతపోత పిదప గరిటవేత అనే విధంగా ధాన్యాన్ని ఇచ్చేవాడు. ఇలా చేయకూడదనీ, పిండికొద్ది రొట్టె అనేది గ్రహించి చేయాలని, కట్టతెగినటువంటి చెరువుకు ఎంత వదర ఉన్నా ఫలం లేదని, ఆ ఇంటిలో ఏ పదార్థాలు నిల్వ ఉండవని కవి కర్షకున్ని హెచ్చరిస్తున్నాడు. మానవుడు సహజంగా కొన్ని ప్రత్యేకమైన వర్ణాలను ఇష్టపడ తాడు. రైతుకు మాత్రం ప్రత్యేక వర్ణాలు తాను నిత్యం చూసే వ్యవసాయిక జీవితం నుండి ఉద్భవించినవే. రైతుకు తను పండించిన పంట బంగారం, వెండి, రాగి, ఇనుము.... మొదలైన రంగులతోనే కాకుండా ఆ పంటే అతనికి బంగారంతో, వెండితో సమానమని కవి చెప్పకనే ఈ పద్యం ద్వారా చెప్తున్నాడు.

సీ॥. సెనగలు పసుపును ధనియాలు మట్నాలు
మెంతులు బంగారు మేనివన్నె
సీత తలంబ్రాలు శ్వేతతిలలు ప్రత్తి
వెల్లుల్లి కుసుమలు వండివన్నె...
(కాపుబిడ్డ; పుట. 46, 93వ పద్యం)

కర్షకుడు పొలంలో విత్తనాలు వేయడానికి బయలు దేరుతున్న స్థితిని కవి వర్ణించిన తీరు వివరించ శక్యం కానిది. రైతు కార్యక్రమాన్ని గూర్చి చేసిన వర్ణన ఎంతో గొప్పగా ఉంది.

సీ॥. మోకాళ్ళమీదికి ముతకదోవతి జెక్కి
నెత్తిగుడ్డను విప్పి యెత్తిచుట్టి
వలపల చేతిలో ములుగర్ర సవరించి
పాదరక్షలబూని పాలెబట్టి....
(కాపుబిడ్డ; పుట. 21, 46వ పద్యం)

రైతన్నా మోకాళ్ళమీదికి దోవతి చెక్కుకొని, తలపై రుమాలును విప్పి ఒత్తిపట్టి సుట్టగా కట్టుకున్నావు. కుడిచేతిలో ములుగట్టె పట్టుకొని, ఎడమచేతిని మేడితోక మీద నిలిపి, భూమిని రెండుగా చీల్చడానికి ఎద్దులను అదిలిస్తూ కదిలావు. ఏమయిందో కాడో, నాగలి కోలో, మేడితోకో విరిగిపోయింది. ఒక ఎప్పుడు కొత్త నాగలి చేయించుకొని తెస్తావు. నీ కష్టాలు చూసేదెవరు అంటూ కవి తన ఆవేదనను వ్యక్తం చేశాడు.

రైతు సమస్యలు :

"కాపుబిడ్డ" కావ్యం జాతీయోద్యమ కాలం నాటిది. అనాటి రైతుయొక్క కష్టాలు, సమస్యలు అన్నీ ఇన్నీ కావు. గిర్దావరు (రెవెన్యూ అధికారి), చౌచక్బారులు (పోలీసులు), అబుకారి దొరలు, పటేళ్ళు, కరణాళ్ళు... వంటి అనేకులు రైతుకు ఎన్ని కష్టాలు కలిగించారనేది శాయిరెడ్డి ఉదహరించాడు.

సీ॥. గిరుదావరుదెంచి బురదనేలరుగని
చెఱువు నీరని వ్రాసి చెఱచు నిన్ను
చేచక్బరారులు కీచర బాచర
లాగంబుచే డబ్బు లాగుకొనుచు
అబుకారీదొర హాలహాలంబిచ్చి
వూరి మోసవనిచ్చి బ్రోచునిన్ను
(కాపుబిడ్డ; పుట. 19, 42వ పద్యం)

సర్కారు రైతులను ఎలా దోచుకున్నదీ ఈ క్రింది పద్యంలో వర్ణించాడు.

సీ॥. గ్రామాధికారులు భీమస్వరూపులై
పెక్కుటక్కుల వెతల్ బెట్టుచుండ...
దొరలును కరణాలు దోపిడి చేయగా
పుస్తెమట్టెల మాడ్చి బొగులువారు
(కాపుబిడ్డ; పుట. 55, 108వ పద్యం)

భూమిని సాగు చేయకపోతే బీడుగా ఎందుకుంచా వని పైసలు వసూలు చేసే స్థితిని; బావి కింద పొలం

పారితే చెఱువు నీళ్ళతో పారించావని, అజ్ఞలేకుండా సాగు ఎట్లా చేశావని, చెట్లు కొడితే, చేపలు పడితే ఇలా ఎన్నెన్నో సాకులు చెప్పి సైసలు వసూలు చేసి, రైతును పిప్పి చేసే వైనాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. వ్యవసాయం చేసే రైతు కష్టాలే కాకుండా అతని వెన్నంటి ఉండే, అతని ధర్మపత్ని అయిన రైతు భార్యను గురించి, ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునేంత వరకు పనులన్నింటితో ఎలా సతమతమౌతుందో, అత్తమామల దగ్గర, పిల్లల దగ్గర, పాలం దగ్గర, మొగుని దగ్గర, ఎలా మసులుకునే తీరుని వర్ణించిన విధం అనిర్వచనీయం.

సీ॥. పిడుకల గంపను పెనిమిటి యెత్తగా
నది మోసుకుని వచ్చి యతివయిల్లు
చేరి పాపము నెత్తి చేపువచ్చిన పాలు
డొలికలో వేసి జోలపాటల బాడి...

(కాపుబిడ్డ; పుట. 34, 71వ పద్యం)

భర్త ఎత్తిన పిడుకల గంపను మోపుకొని ఇంటికి వచ్చి, బడ్డను ఎత్తుకుని చేపిన పాలను కడుపార తాగించి గారాబం చేసి, ఉయ్యాలలో పడుకోబెట్టి జోలపాడి ఇంటిని ఊడుస్తూనే చేయాల్సిన పనులంన్నిటినీ వేగంగా చేస్తూ ఉండగా, అంతలోనే మబ్బులు కమ్ముకుని కుండ పోతగా వర్షం కురిసింది. అదే సమయంలో ఇంట్లోకి చుట్టాలు రాగా, ఇంట్లోనేమో బియ్యపు గింజ లేని కాపు స్త్రీల కష్టాలను చూసేది ఎవరు అని కవి వాపోయాడు.

కవి "కాపుబిడ్డ" కావ్యాన్ని రైతు సుఖదుఃఖాలకే పరిమితం చేయకుండా, అనేక అంశాలతోపాటు రైతు కలల్ని, అతను ఆశించిన మార్పును పేర్కొన్నాడు. రైతులందరూ విద్యావంతులు కావాలనీ, వారు ఆ జ్ఞానంతో వృక్షశాస్త్రం, పశువైద్యశాస్త్రం చదవాలనీ, వీటి ద్వారా వచ్చే జ్ఞానం మూలగా వ్యవసాయం నష్టపోకుండా, సంపద దెబ్బతినకుండా కాపాడుకునే అవకాశం వాళ్ళ చేతుల్లోనే ఉంటుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని సాధించే అవకాశం కల్గుతుందనీ, అలా జరగాలంటే ఆంగ్ల భాషలో ఉన్న ఆ శాస్త్రాలను మాతృభాషలోకి (తెలుగు) మార్చాలని ఆకాంక్షించాడని, రైతు పాత్ర ద్వారా కవి తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

ఆనాటి తెలంగాణ పరిస్థితినంతటినీ దృశ్యీకరించిన గొప్ప సాంఘీక కావ్యం "కాపుబిడ్డ". ఆ కాలం నాటి సామాజిక చలనాన్ని, ఘర్షణనూ గొప్పగా పట్టుకున్న కావ్యమిది. సామాజిక చలనాన్ని పట్టుకోవడం కవి ప్రతిభకు ఒక పార్శ్వం అయితే రెండో పార్శ్వం వర్ణనాశక్తి, అభివ్యక్తీ తీరు, భావనా బలం. వివిధ ఋతువుల వర్ణనల సందర్భంలో గంగుల శాయిరెడ్డి ప్రతిభ వేయి అంచులుగా దర్శనమిస్తుంది. రైతు దృష్టిలో వ్యవసాయం జీవితం వేరుకావు. ఈ రెండింటిని ఒకటిగా భావించి బతకగలిగే వాడు రైతు మాత్రమే.

ఉపయుక్త గ్రంథసూచి :

1. చంద్రశేఖర్‌రెడ్డి రాచపాళెం, 2008, కొన్ని వాక్యాలు కొందరు కవులు, అనంతపురం, లక్ష్మీగ్రాఫిక్స్.
2. నారాయణరెడ్డి సుంకిరెడ్డి, 2014, తెలంగాణ తొలి రైతు కావ్యం కాపుబిడ్డ, నమస్తే తెలంగాణ.
3. వెంకటేశులు బి.యం., 2006, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, "దుక్కిచూపు - ఒక పరిశీలన", మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం.

❖ ❖ ❖

కవి జీవిత పరిశోధనల్లో డా॥. సి.ఆర్. రెడ్డి జీవితం, రచనలు – పరిశీలన

– వనతల్ల శ్వేత, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగు సాహిత్యంలో ఇప్పటి వరకు కవి జీవిత పరిశోధనలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. ఇలా జరిగిన కవి జీవిత పరిశోధనల వల్ల సమగ్రమైన సాహిత్య చరిత్రను తెలుసుకోవడమే కాకుండా కవి (రచయిత) నివసించిన కాలం నాటి సామాజిక సాంఘిక ఆర్థిక పరిస్థితులను తెలుసుకుంటాం. ఇటువంటి పరిశోధనలు తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణానికి కొంత వరకు దోహదపడతాయి. అందువల్లనే ఈ కవి జీవిత పరిశోధన గురించి ఈ పత్రంలో చెప్పాలనుకుంటున్నాను. హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ, తెలుగుశాఖలో డా॥. దార్ల వెంకటేశ్వరరావు గారి పర్యవేక్షణలో విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి అనే అంశం మీద పరిశోధన చేస్తున్నారు. సి.ఆర్.రెడ్డిగా ప్రసిద్ధుడైన డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి ప్రతిభావంతుడైన సాహితీవేత్త, విద్యావేత్త, పండితుడు, వక్త, రచయిత, హేతువాది, ఆదర్శవాది, రాజనీతిజ్ఞుడు. ఇంతటి ప్రతిభా పాటవాలు ఒక వ్యక్తిలో కనిపించడం చాలా అరుదు. ఆంధ్రభాషారంజని సంఘంలో చురుకైన పాత్ర పోషించాడు. గైక్వాడ్ స్కాలర్షిప్తో అమెరికాలో విద్యాభ్యాసం చేశాడు. అక్కడినుంచి తిరిగి వచ్చిన తర్వాత బరోడా కళాశాల వైస్ ప్రిన్సిపాల్గా చేరాడు. 1909లో మైసూరులో విద్యాశాఖలో చేరి 1918 నుండి 1921 వరకు విద్యాశాఖ ఇన్స్పెక్టర్ జనరల్గా వ్యవహరించాడు. 1951లో అనారోగ్యంతో ఆయన మరణించాడు. ఈ పత్రంలో కట్టమంచి వారిపై జరిగిన పరిశోధనలు, వారి జీవితం, రచనలను, వారి విమర్శ దృక్పథాన్ని సంక్షిప్తంగా పరిచయం చేస్తాను.

తెలుగు సాహిత్యంలో కవి జీవిత పరిశోధనలు :

కవి జీవిత పరిశోధనలు వివిధ విశ్వవిద్యాలయాలలో డాక్టరేట్ కోసం చేసినవారున్నారు. విశ్వవిద్యాలయాలతో పని లేకుండా స్వీయభిరుచితో కవి జీవితాలపై పరిశోధన చేసినవారున్నారు. కావలి సోదరులు రాసిన దక్షిణ కవుల చరిత్ర, కందుకూరి వీరేశలింగం రాసిన ఆంధ్రకవుల చరిత్ర, గురజాడ శ్రీరామమూర్తి రాసని కవి జీవితములు, చాగంటి శేషయ్య రాసిన ఆంధ్ర కవుల తరంగిణి, బేకుమళ్ళ అచ్యుతరావు మొదలుపెట్టిన పూర్వాంధ్ర కవుల చరిత్ర మొదలైనవి కవుల చరిత్ర నిర్మాణానికి చేసిన విలువైన పరిశోదనలుగా చెప్పవచ్చు. వీటితోపాటు 19వ శతాబ్దానికి చెందిన రచయితల సాహితీ వ్యక్తిత్వాలను వాఙ్మయ చిత్రాలుగా రూపొందించిన మధునాపంతుల సత్యనారాయణ ఆంధ్ర రచయితలు, ప్రత్యేకంగా పేర్కొనదగింది. ఈ విధంగా తెలుగు సాహిత్య నిర్మాణానికి కృషి చేసిన వారు ఎంతోమంది ఉన్నారు. విశ్వవిద్యాలయాల్లో కూడా కవి జీవితాలపై పరిశోధనలు విరివిగానే జరిగాయి. కందుకూరి మీద అక్కిరాజు రామాపతిరావు, వేమన మీద ఎన్.గోపి, తాపీ ధర్మారావు మీద ఏటుకూరి ప్రసాద్, ఆరుద్ర మీద దార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులెందరో కవి జీవిత పరిశోధనకై కృషి చేసిన వారున్నారు.

విశ్వవిద్యాలయాల్లో కట్టమంచి రామలింగారెడ్డిపై జరిగిన పరిశోధలు :

విద్యావేత్తగా, సాహితీవేత్తగా, రాజకీయవేత్తగా ప్రసిద్ధి చెందిన సి.ఆర్.రెడ్డి, మీద వివిధ విశ్వవిద్యాలయాల్లో కొన్ని పరిశోధనలు జరిగాయి. బెనారస్ విశ్వవిద్యాలయంలో సి.ఆర్.రెడ్డి రచనలు - సవిమర్శిక పరిశీలన అనే అంశం మీద మురళీకృష్ణ పరిశోధన చేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సి.ఆర్.రెడ్డి జీవితం - రచనలు అనే అంశం మీద, డి.మహాలక్ష్మమ్మ పరిశోధన చేశారు. ఇదే అంశం మీద మద్రాస్ విశ్వవిద్యాలయంలో

గంధం అప్పారావు గారి పర్యవేక్షణలో ఎం.వెంకటరెడ్డి పరిశోధన చేశారు. కట్టమంచి రామలింగారెడ్డి ముసలమ్మ మరణం - ఒక పరిశీలన అనే అంశం మీద దామోదర్‌రెడ్డి, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. కట్టమంచి రామలింగారెడ్డి రచనల్లో సంస్కృతి సాంప్రదాయం అనే అంశం మీద పద్మావతి విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిగింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు - పరిశీలన అనే అంశంపై ఎం. చంద్రమౌళి, డా॥. దార్ల వెంకటేశ్వరరావు గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్ చేశారు. సి.ఆర్.రెడ్డిపై అభిమానం ఉన్న మరికొందరు రెడ్డి గారి సాహిత్య కృషిని, వారి జీవిత చరిత్రలను సంకలనాలుగా తీసుకువచ్చి తెలుగు సాహిత్యానికి మహోపకారం చేశారు. డా॥. సి.ఆర్. రెడ్డి జీవిత చరిత్ర, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, ఆద్యుడు కట్టమంచి అనుమాండ్ల భూమయ్య, సాహితీమూర్తి కట్టమంచి బి.భాస్కరచౌదరి, వంటివారు కట్టమంచి వారి సాహిత్యాన్ని, సాహిత్యలోకానికి తెలిపే ప్రయత్నం చేశారు. రెడ్డి గారు తెలుగులోనే కాకుండా ఆంగ్లంలో కూడా మంచి పాండిత్యం ఉన్నవారు. ఈ విధంగా పరిశోధకులు, సాహితీకారులు రెడ్డి గారి సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేశారు.

పరిశోధనాంశ వివరాలు :

నేను విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి అనే అంశం మీద పరిశోధన చేస్తున్నాను, ఇప్పటివరకు వివిధ విశ్వవిద్యాలయాల్లో సి.ఆర్.రెడ్డి రచనలపై వివిధ కోణాల్లో పరిశోధనలు జరిగాయి. వీటన్నింటి ఆధారంగా నేను ఆయన విమర్శ దృక్పథాన్ని నా పరిశోధనలో సాహిత్య లోకానికి తెలియజేయాలకుంటున్నాను. సి.ఆర్.రెడ్డి అనగానే ముందుగా కవిత్వ తత్వ విచారం, ముసలమ్మ మరణం గుర్తుకు వస్తాయి. అయితే వీటితోపాటుగా కొన్ని అంశాలపై వ్యాసాలు, పీఠికలు కూడా రాశారు. ఇవన్నీ రెడ్డి గారి విమర్శ దృక్పథాన్ని తెలియజేసే విధంగా ఉన్నాయి.

కవిత్వతత్వ విచారము అన్న గ్రంథం మీద అనేక ఖండన మండనలు జరిగాయి. ఈ గ్రంథం సాహిత్య లోకంలో ఒక సంచలనం కలిగించింది. పాత ప్రతిపాదనలను కొట్టివేసి నూతన సిద్ధాంతాలను చూసి సనాతులు మండిపడ్డారు. కవిత్వతత్వ విచారము వచ్చిన వెంటనే సాంప్రదాయిక పండితుల నుండి వ్యతిరేకత వచ్చింద. కుంగంటి సీతారామయ్య గారు ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో అలంకారతత్వం అన్న వ్యాసం ప్రకటించారు. కాళ్ళకూరి వ్యాసమూర్తి కవిత్తతత్వ విచార ఖండనం అనే విమర్శన గ్రంథం రాశారు. విమర్శలో కొత్తదారులు తొక్కుతూ బుర్రా శేషగిరిరావు విమర్శాదర్శనం అనే పుస్తకం రాశారు. దీన్ని ఖండిస్తూ పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు విమర్శాదర్శవిమర్శనం అన్న పుస్తకం వెలువించారు. ఈ ఖండన మండనలుగా వచ్చిన పుస్తకాలను చూస్తే తెలుగు సాహిత్యంలో కవిత్వ తత్వ విచారము ఎంతటి సంచలనాన్ని రేపిందో అర్థమౌతుంది.

ముసలమ్మ మరణం కావ్యాన్ని పరిశీలిస్తే అందులో వస్తువు నవ్యం, భాష సంప్రదాయం, దీన్ని గమనిస్తూ ఆధునిక సంద్రాయ భావజాలాల మధ్య జరిగిన సంవాదంలా కూడా మనకు కనిపిస్తుంది. అన్ని ప్రక్రియలకు తానే ఆద్యుడు అని చెప్పుకుంటున్న వీరేశలింగం గారి విమర్శ రచనలను, సి.ఆర్.రెడ్డి గారి విమర్శను పరిశీలించి ఆధునిక సాహిత్య విమర్శకు ఆద్యుడు ఎవరు అన్న విషయాలన్నీ నా పరిశోధనలో చర్చించాలనుకుంటున్నాను. పింగళి సూరన కళాపూర్ణోదయం, ప్రభావతి ప్రద్యుమ్నము కావ్యాలను పరిశీలించి విమర్శను చేసినప్పుడు తులనాత్మక విమర్శకుడిగా కూడా మనకు కనిపిస్తాడు. వీటన్నింటిని నా పరిశోధనలో పరిశీలించి సాహిత్య లోకానికి చెప్పాలనుకుంటున్నాను. కట్టమంచి రామలింగారెడ్డి గారి రచనలన్నింటినీ పరిశీలించడం వల్ల విమర్శకుడిగా ఈయన్ని అంచనా వేయడం జరుగుతుంది. దీనివల్ల పూర్వ విమర్శకుల అభిప్రాయాలను సవిమర్శకంగా పరిశీలించవచ్చు. తెలుగు సాహిత్య విమర్శలో కందుకూరి వీరేశలింగం గారు, కట్టమంచి రామలింగారెడ్డి గారు, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి మొదలైన

తొలితరం వారి విమర్శకుల్లో కట్టమంచి వారి ఆధుని కత్వం తెలుస్తుంది. నేటికీ తెలుగు సాహిత్య విమర్శలో గల తొలి తెలుగు విమర్శకుడు కట్టమంచి రామలింగా రెడ్డా? కందుకూరి వీరేశలింగం పంతులు గారా? అనే అంశాల్ని శాస్త్రీయంగా గుర్తించగలిగే అవకాశం ఉందను కుంటున్నాను. ఈ విధంగా తెలుగు సాహిత్య చరిత్ర మరింత పరిపూర్ణమవుతుందని నమ్ముతున్నాను.

సాహిత్య చరిత్రలలో డా॥ సి.ఆర్.రెడ్డి స్థానం :

ఆరుద్ర తన సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో కట్టమంచి రామలింగారెడ్డి గురించి చెప్తూ 'తెలుగు నాటకానికి గురజాడ, నవలకు ఉన్నవ లక్ష్మీనారాయణ చేసిన సేవ లాంటిది, తెలుగు విమర్శకు సి.ఆర్.రెడ్డి చేసిన సేవ' అని కొనియాడారు. ఈ ఇద్దరి వాడుక భాషావాదుల మధ్యకాలంలో రెడ్డి గారు తన కవిత్వతత్వ విచారం అనే గ్రంథంతో తెలుగు సాహిత్య విమర్శను ఆధునిక రీతులకు మళ్ళించారు. కావ్యాలలో గల పద్య గద్యాల తారతమ్య, భావనాశక్తి, రచనా కౌశలం, వస్తు స్వరూపం భావ ప్రకటనల పరస్పర సంబంధాల, విషయం శైలి యీ రెండింటిలో ఏది ముఖ్యమనే చర్చ మొదలైన విషయా లను కూలంకుశంగా చర్చిస్తూ రెండు ప్రబంధాలను విశ్లేషణ చేసి తమ నూతన దృక్పథాన్ని లోకానికి చాటారు. సి.ఆర్.రెడ్డి తెలుగు సాహిత్య విమర్శకు కొత్త ద్వారాలను తెరిచారని కొనియాడారు. 'కవిత్వతత్వం వెలువడిన తరువాత దాన్ని కొంతమంది విమర్శించినా అందులో సరుకు ఉంది కాబట్టి నిలబడగిలిగింది' అని ఆరుద్ర పేర్కొన్నాడు.

కల్లూరు అహోబిలరావు రాయలసీమ కవుల చరిత్ర (2 సంపుటం)లో కట్టమంచి రామలింగారెడ్డి బాల్య విశేషాలతో పాటు ముసలమ్మ మరణం కావ్యంలోని వర్ణనలు, తిక్కన, పోతన కావ్యాలలోని పద్యాలకు అను సరణీయంగా ఉన్నాయని పేర్కొన్నాడు. అంతేకాకుండా రామలింగారెడ్డి. ముసలమ్మ మరణం, నవ యామిని, ఆర్థిక శాస్త్రం, కవిత్వతత్వ విచారము, భారత విమర్శనము, వ్యాస మంజరి (5 ఖండములు) ముత్యాల సరములు, దేవీభాగవతము, ప్రహసనములు, ప్రతాప రుద్రీయము, కట్టమంచి సుబ్రహ్మణ్యం రెడ్డి సంక్షేమ చరిత్ర వంటి రచనలు చేశాడని, వీటితోపాటుగా ఆంగ్లంలో కూడా ఉపన్యాసాలు, వ్యాసాలు రాశారని పేర్కొ న్నారు. సీమ రత్నాలు మణిదీపాలు అన్న పుస్తకంలో అనంతపద్మం గారు రామలింగారెడ్డి గారి గురించి సంక్షిప్తంగా పరిచయం చేశారు. వీటితోపాటుగా మరికొన్ని సాహిత్య చరిత్రలను చూస్తే రామలింగారెడ్డి గురించి మనకు కొంత పరిచయం అవుతుంది.

నేను నా పరిశోధన మొదలుపెట్టి 6 నెలలే అయింది. నా పరిశోధన పూర్తి అయ్యేనాటికి సి.ఆర్.రెడ్డి విమర్శను సమగ్రంగా తెలియజేస్తాను.

ఆధార గ్రంథాలు :

1. రామలింగారెడ్డి కట్టమంచి, కవిత్వతత్త్వ విచారము అను పింగళి సూరనార్య కృత కళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్నముల విమర్శనము, వాల్తేరు : ఆంధ్రకళాపరిషత్, ఐదవ ముద్రణ : 1973.
2. ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, నాల్గవ సంపుటి హైదరాబాద్ : తెలుగు అకాడమి, హైదరాబాద్ 2012.
3. అహోబిలరావు కల్లూరి, రాయలసీమ రచయిత్రుల చరిత్ర, హిందుపురం : శ్రీకృష్ణదేవరా గ్రంథమాల, హిందుపూర్, 1977.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక తెలుగు సాహిత్యం – చాకలి వారి జీవిత ప్రస్తావన

– రమేష్ గంగుల, కాకతీయ విశ్వవిద్యాలయం.

చాకలికులం దాన్ని అంటిపెట్టుకుని ఉన్న వృత్తిజీవితాలను జి.యస్.చలం, పి.నాసరయ్య లాంటివారు నవలలో ఆవిష్కరించగా, ఆవుల పిచ్చయ్య, కొలకలూరి ఇనాక్, పెద్దింటి అశోక కుమార్, ముదిగంటి సుజాతారెడ్డి, ఎమ్.ఎమ్. వినోదిని వంటివారు కథల్లో చాకలి జీవితాన్ని చిత్రించారు. ఇక కవిత్వానికి సంబంధించిన కత్తి పద్మా రావు, శిఖామణి, మద్దూరి నగేష్‌బాబు, కె.గీత, లకుమ లాంటివారు చాకలి జీవితం గురించి కవితాగానం చేశారు. ఈ మూడు రకాల ప్రక్రియల్లో చాకలివారి జీవితం ఎలా కనిపిస్తుందో పరిశీలిద్దాం.

కవిత్వ :

ఆధునిక కవులు చాకలి వృత్తి జీవితాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఇందులో చాకలి జీవితం వచన, గేయ, పద్య కవిత్వాలలో చిత్రింపబడింది.

వచనం :

'నా నరాల్లో నెత్తురుండదు - గంజితప్ప / నా ఒంట్లో మాంసముండదు - సొడు తప్ప' అని 'మైలపెట్టె'లో మద్దూరి చాకలివారి వెట్టి జీవితాలను ఆర్ద్రంగా వెలిబుచ్చాడు. 'ఇప్పుడు అక్షరాన్ని / కాల్చిన జీడిగింజను చేసి / జాతి వస్త్రం మీద/నా చాకలి సంతకాన్ని చేస్తున్నాను' అని 'కిర్రు చెప్పులభాష'లో శిఖామణి చాకళ్ళ పురోగమన దిశను తెలుపుతున్నాడు. 'అతడలా నలిగిన బతుకు మడతల్ని / ఆకలి నిప్పు పెట్టుతో సాఫీ చేస్తూన ఉంటాడు' అంటూ కె. గీత 'ఇస్త్రీవాడు'లో ఎంత కష్టపడినా ఆకలి తీరని చాకలివారి దీనస్థితిని మన కళ్ళముందు ఉంచుతుంది. ఇంకా కత్తి పద్మారావు, గద్దర్, ఇస్మాయిల్, జి.వి. రత్నాకర్, ననుమాసస్వామి, జూలూరి గౌరీశంకర్ వంటి వారు తమ వచన కవితలద్వారా చాకలివృత్తి జీవితంపై స్పందించారు.

గేయం :

'ఏకులమబ్బీ మాదే మతమబ్బీ/మురికి బట్టలుతికి మల్లె - పూలు జేసి ఇచ్చినపుడు' అని చెరబండరాజు తన 'ఏకులమబ్బి' గేయంలో ప్రతిభకు కులంలేదని చెప్తున్నాడు. 'పదిలం బిడ్డో! బిడ్డ సుబ్బన్న నీవు / బట్టలు తికెకాడ, తెచ్చెకాడ, ఇచ్చెకాడ, అని 'పదిలంబిడ్డో' గేయం ద్వారా నాగరాజ్ దుర్గయ్య వృత్తిని నిర్వహించే క్రమంలో జాగ్రత్తగా ఉండమని చాకలివారిని హెచ్చరిస్తున్నాడు. 'పలనాటి యోధుడు పలనాటి చంద్రుని సఖుడు / కదన సింహము "చాకిచందు" నీవాడురా/ గీర్వాణ కవిరాజు "భాసుండు/ నీ జాతి సోదరుడె కనవోయి' అంటూ "రజక ప్రభ" గేయం ద్వారా చరిత్రలో చాకలివారి ఘనతను చాటుతున్నాడు మానేపల్లి మల్లిబాబు. ఇంకా పూసల అంజయ్య, యు. వీరయ్య, దమరశింగు మల్లీరాజు, సి.హెచ్. కృష్ణ, శక్తి, గద్దర్ లాంటివారు సమాజంలో చాకలివారు పడుతున్న సాదకబాధకాలను తమ గళమెత్తి చాటారు.

పద్యం :

'మైల బట్టలుతుకు మడివేలునని నిన్ను
పరిహసించువారి కెఱుకలేదు
చదువరులను మించు చాకలియన్న వా
క్యమ్ములోని వాస్తవమ్ము సఖుడ!'

అన్న పద్యంతో ఉండేల మాలకొండారెడ్డి చాకలివారు అగ్రవర్ణాల పరిహాసానికి కుంగిపోకుండా 'చదువుకున్న వాడి కంటె చాకలోడు మేలు' అన్న విషయంలో ఆత్మాభిమానాన్ని వారిలో నింపుతున్నాడు.

'పగలు చాకిరి జేసి బువ్వకమయి వెళ్ళి
బుట్ట చేతబట్టి యడుగ "బువ్వలేదు

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

రేపు పెట్టెదములె రమ్ము రేప"ని పలుకు
దురు నిన్ను ప్రతివారును భిక్షకుండవోలె'

అని కానుగండి నాగయ్య చాకలివారి వెట్టి బతుకును తన పద్యంలో చిత్రించాడు. ఇలా చాలా పద్యాలు చాకలివృత్తి ఆధారంగా వచ్చాయి.

కథ :

కథా రచయితలు కూడా మిగతా వృత్తి జీవితాల గురించి మాట్లాడినంతగా చాకలి వృత్తి జీవితాన్ని గురించి మాట్లాడలేదు. తన శతాబ్దకాల ప్రస్థానంలో కథ చాకలి వృత్తిని స్పృశించింది మాత్రం ఇసుక రేణువంత. కథలలో చాకలి బతుకులను తాకినవారు అవున పిచ్చయ్య, కొలకలూరి ఇనాక్, పెద్దింటటి అశోక్ కుమార్, ఎం.ఎం. వినోదిని, కె. సుభాషిణిలు మొదలైనవారు.

ఇందులో కథల్ని ఆరు రకాలుగా వర్గీకరించుకోవచ్చు. అవి.

1. చాకలివారు పాత్రలుగా గల సాధారణ కథలు
2. వృత్తి ధర్మాన్ని ఆరాధించే కథలు
3. వృత్తిసంబంధ బాధల్ని వ్యక్తం చేసే కథలు
4. శ్రామిక దోపిడీ, మానసిక సంఘర్షణ నుండి బయటపడ్డానికి ప్రయత్నించిన కథలు
5. దోపిడీ వ్యవస్థకు ఎదురొడ్డి తిరగబడిన కథలు
6. మహిళా ప్రధాన పాత్రలుగల కథలు

వృత్తితో సంబందించిన సమస్యలుగాకుండా, సాధారణంగా సమాజంలోని మనుషులందరి జీవితాల్లో ఉండే బంధాలు, బాధలను ఇతివృత్తాలుగా మలచబడిన కథలు - ఐతా చంద్రయ్య రాసిన ''వరాలమూట' డా॥. నక్కా విజయరామరాజు రాసిన 'అమెరికా రాజయ్య', సత్యం శంకరమంచి రాసిన 'ముద్దేలనయ్య మనసు నీదైయుండ', బెజ్జారపు రవీందర్ రాసిన 'రాజవ్య' జె. భాగ్యలక్ష్మి రాసిన 'కాదేది కవితకనర్హం' మొదలైనవి ఉన్నాయి. వృత్తిధర్మాన్ని పాటిస్తూ ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలకు కట్టుబడి వివిధ శుభకార్యాలలో చాకలి వృత్తివారే చేయాల్సిన పనులే వస్తువుగా సాగిన కథలు - కాలువ మల్లయ్య రాసిన 'మడేలయ్య మనస్సు' మొదలైనవి. వృత్తిని నిర్వర్తించే క్రమంలో భాగంగా బాధలను వ్యక్తం చేసే కథలు - ఆవుల పిచ్చయ్య రాసిన 'వెట్టిచాకిరి దినచర్య', సరికొండ చలపతి రాసిన 'అందమైన నగరం', కాంచనపల్లి రాసిన 'గౌరి', మోహ్నా రాసిన 'రాములవారి గుడిమందు', జి.ఆర్. మహర్షి రాసిన 'నేను బతుకలేను సిన్నమ్మా' మొదలైన కథలు ఉన్నాయి. దోపిడీ వ్యవస్థకు ఎదురొడ్డి, భూర్జువా వర్గంపై తిరగబడ్డ కథలు - కాలువ మల్లయ్య రాసిన 'ధిక్కారం', అట్టాడ అప్పల్నాయుడు రాసిన 'పువ్వుల కొరడా' గంటేడ గౌరనాయుడు రాసిన 'విముక్తి' పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'వెలి', 'సాకిరేవు', తుమ్మేటి రఘోత్తమ రెడ్డి రాసిన 'సవారి - 1', 'సవారీ - 11' మొదలైనవి ఉన్నాయి.

నవల :

సమాజంలోని ఎన్నో కథాలను ఆవిష్కరించిన నవలా రచయితలు చాకలి జీవితం గురించి చాలా చాలా తక్కువగా మాట్లాడారు. నవల పుట్టి ఒకటిన్నర శతాబ్దం కావస్తోంది. అయినా, ఇంతవరకూ చాకలి వృత్తిపైన కేవలం రెండే రెండు నవలలు వెలువడ్డాయి. అవి - 1. రేవు, 2. ఉతికేసిన బతుకులు.

ఆగష్టు 2000 సంవత్సరంలో ప్రచురితమైన ''రేవు'' నవల జి.యస్. చలం చేత రాయబడింది. ఈ నవల ప్రజాశక్తి బుక్ హౌస్‌వారు నిర్వహించిన నవలా పోటీలలో ద్వితీయ బహుమతిని సాధించింది. ఇది కళింగాంధ్ర ప్రాంతంలోని చాకలివారి యదార్థ జీవిత వ్యదార్థ గాథను చిత్రించింది. వృత్తి ఆధారంగా బ్రతుకుతున్నవారు పొందే అవమానాలు, వారిపై జరిగే దాడులు, దౌర్జన్యాలకు ప్రతి రూపం ఈ నవల. శ్రమను నమ్ముకుని బ్రతికే ఏ వృత్తి అయినా, తక్కిన వృత్తులు వేటికీ తక్కువ కాదని తెలియ జేస్తూ ఆత్మాభిమానాన్ని చాటడం ఈ నవలలో మనం చూస్తాం. ఈ నవల కళింగాంధ్ర ప్రాంతానికి చెందిన చాకలి వృత్తిపై వచ్చిందే అయినా, కోస్తా, రాయలసీమ, తెలంగాణా ఏ ప్రాంతమైనా సరే పీడిత కులాలపై జరిగే అణచి

వేత, శ్రమదోపిడీ, దౌర్జన్యాలు అనేవి ఒక్కటేనని స్పష్టపరిచింది. సాహిత్యం సమాజ పురుగోమనానికి, ప్రజాచైతన్యానికి వినియోగపడాలనే లక్ష్యాన్ని సాధించింది ఈ 'రేవు' నవల.

చలి... చలి..., దాహం.. దాహం.., వానా.. వానా... అని మూడు భాగాలుగా సాగిన ఈ నవలలో అంకమ్మ, రామిశెట్టి అనే రెండు ప్రధాన పాత్రలను మనం చూస్తాం. అంకమ్మ, రామిశెట్టి ఇద్దరూ అక్కాతమ్ముళ్ళు. భర్త ఆదిశెట్టి పిరికివాడైనప్పటికీ, చేసిన శ్రమకు ఫలితాన్ని అడుక్కోవడం కాదు, దాన్ని హక్కుగా రాబట్టుకోవాలనే అభ్యుదయ భావజాలం గల స్త్రీల అంకమ్మ. ఒకసారి ఆనవాయితీ ప్రకారం నాయుడింటి నుండి తనకు రావాల్సిన పందిరి మంచం కాకుండా ఇంకేదో పనికిరాని వస్తువు తీసుకు పొమ్మన్నప్పుడు, ఆచారం ప్రకారం తనకు రావాల్సిందేదో అదే కావాలని నాయుడితో పోరాడి నెగ్గుతుంది. అంతేకాదు, భర్త ఆదిశెట్టి, నాయుడికి భయపడి ఎందుకులేవే అని నిరుత్సాహంగా మాట్లాడినపుడు "ఆలేటిత్తే అది తీసుకోడానికి నేను ఆదిశెట్టిని పంచాయితీలో ముద్దాయిగా నిలబెట్టినప్పుడు అంకమ్మ తన మాటల ధాటితో పంచాయితీ పెద్దలైన నాయుళ్ళందరికీ ముచ్చెమటలు పట్టిస్తుంది. ఇందులో చేసిన శ్రమకుతగ్గ ఫలితాన్ని పొందడంలో, భూర్జువా వర్గాన్ని ఎదిరించి నిలవడంలో అంకమ్మను ఐలమ్మ వారసురాలిగా రచయిత తీర్చిదిద్దాడు. అగ్రవర్ణాల వారి కులవివక్షను ఏమాత్రం తట్టుకోలేని యువకుని పాత్ర రామిశెట్టిది. తనవైపు తప్పులేకుంటే అది నాయుడైనా, వాడి నాయనైనా లెక్క చేయనితత్వం రామిశెట్టిది. కులపెద్దలు కామందులతో అణిగిమణిగి ఉండాలని హెచ్చరించినపుడు దాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా ఆత్మాభిమానాన్ని చాటుకుంటాడు. తన ఆలోచనలకు తగ్గట్టు బ్రతకాలని ఆలోచించే స్వేచ్ఛాభావి రామిశెట్టి. తన చొక్కా తొడుక్కున్నాడన్న కోపంతో దాలినాయుడును రామిశెట్టి అనరాని నానామాటలు అనడమేగాక, కర్రతో కొట్టినపుడు అదే కర్రను లాక్కొని దాలినాయుడ్ని చావుకేకలు పెట్టినా వదలకుండా కొడతాడు రామిశెట్టి. పల్లెలో తమపట్ల వున్న కులవివక్షకు, శ్రామికదోపిడీకి, దౌర్జన్యాలకు గిట్టని రామిశెట్టి పట్నం వెళ్ళిపోయినా, చివరికి తమ తమవాళ్ళందరితో కలిసే కులవివక్షను, ఆర్థిక అసమానతను రూపుమాపి సమసమాజ నిర్మాణాన్ని సాధించాలనే మార్క్సిస్టు దృక్పథంతో ఎదుగుతాడు. తిరిగి మళ్ళీ తన పల్లెలోని తనవారి దగ్గరికి రావాలన్న ఆలోచనతో నవల ముగుస్తుంది. ఇంకా ఆచార వ్యవహారాలల్లో భాగంగా కళింగాంధ్ర చాకళ్ళు జరుపుకునే ఏకైక పండుగ 'బల్ల పండుగ'ను రచయిత చక్కగా తెలిపాడు. నీళ్ళ ఎద్దడి వచ్చినప్పుడు చెరువుకోసం చాకళ్ళంతా కలిసి ఐకమత్యంగా పోరాడిన సంఘటన మిగతా ప్రాంతాల చాకళ్ళందరికీ స్ఫూర్తినిస్తుంది.

2001లో ప్రచురితమైన "ఉతికేసిన బతుకులు" నవలను పి.నాసరయ్య రచించాడు. ఇందులో కోస్తా ప్రాంత చాకలివారి వృత్తిజీవితం చిత్రింపబడింది. చాకలి వృత్తిపై జీవిస్తున్నవారి సమస్యలకు, సంఘర్షణలకు ప్రతిరూపం ఈ నవల. ఇది కూడా కోస్తాప్రాంత చాకలివారికి చెందినదే అయినా, చాకలివృత్తి చేస్తున్నవారు ఎక్కడి వారైనా, వారందరికీ సంబంధించిందిగా మనం గమనించవచ్చు. ఈ నవలలో ప్రధానపాత్ర పేరయ్య. ఇతను అభ్యుదయ భావాలు గల వ్యక్తి. పేరయ్య చాకలి వారినంతా ఏకంచేసి పెత్తందార్ల పోకడలను, దౌర్జన్యాలను అధిగమించడం కన్పిస్తుంది. శ్రమను నమ్ముకుని జీవించేవ్యక్తి. ఆత్మగౌరవంగా బ్రతకాలేగాని, అవమానాలతో కాదనేది పేరయ్య అభిమతం. ఊరి చాకిరీచేసి ఇంటింటికీ తిరిగి తిండిముద్దకోసం అడుక్కోవడం హీనచర్య అని, తమ కష్టానికి సరైన ప్రతిఫలంగా ఏడాది చివరన ఇచ్చే ధాన్యం నెలనెలా ఇవ్వాలని డిమాండ్ చేయడం వంటివి పేరయ్యలోని ఆత్మగౌరవానికి నిదర్శనంగా కన్పిస్తాయి. ఈ నవల నిండా ప్రగతిశీల భావాలు కనిపిస్తాయి. పేరయ్య ఆదర్శ వివాహం చేసుకోవడం,

తన బిడ్డలకు కూడా ఆదర్శ వివాహం చేయడం, స్త్రీ సమానత్వం వంటివి రచయిత అభ్యుదయ దృక్పథాన్ని తెలియజేస్తాయి. భూమి చోయినా తమ రెక్కల కష్టంతో "ఇస్త్రీపెట్టె"ను నమ్ముకుని జీవించడమేకాదు, కబ్జాకు గురైన తమ చెరువును పోరాడి సాధించుకున్న తీరు ద్వారా పీడిత కులాలవారు తిరగబడితే ఎలా ఉంటుందో రచయిత తెలియజేశారు. పేరయ్య చదువుకోవడానికి పడిన పాట్లు, అవమానాలు, మధ్యలో చదువు ఆపేయాల్సిన పరిస్థితులు ప్రతి పల్లెలోని చాకలివారి స్థితిగతులకు అద్దం పడతాయి. ఉదయం లేవగానే తల్లీపిల్లతోసహా కుటుంబ మంతా ఊరిలోనుండి తీసుకువచ్చిన బట్టలను మూటగా కట్టుకొని చెరువుకు వెళ్ళడండ, ఆడ, మగ తేడా లేకుండా పని భారాన్ని అంతా పంచుకుంటూ తమ శ్రమను మర్చిపోవడానికి పదాలు పాడుకుంటూ బట్టలు ఉతకడం, మురికితో, మలమూత్రాలతో ఉన్న దస్తులను శుభ్రం చేస్తూ వాంతులు చేసుకోవడం, రేవులో అందరూ ఒకతావులో చేరి కబుర్లు, చమత్కారాలతో గడపటం వంటి సంఘటనల్ని చక్కగా వర్ణించాడు రచయిత. అంతేగాకుండా ఉదయాన్నే అన్నం వండుకుని వెంట తీసుకెళ్ళడం, తమ చంటిపిల్లలకు డేరాలు ఏర్పాటుచేసి పాలివ్వడం, ఆడివ్వడం, మురికిని పిండిన చేతులతోనే అన్నం తినడం వంటివి కూడా కరుణరసాత్మకంగా కన్పిస్తాయి. మొత్తానికి చాకలివృత్తి జీవితానికి అద్దం పడుతుంది ఈ నవల.

ఏది ఏమయినా ఆధునిక తెలుగు సాహిత్యంలో చాకలివారి జీవితచిత్రణ రావలసినంతగా రాలేదు. కారనం ఇంతవరకూ ఆ వృత్తిపై సాహిత్య సృజన చేసినవారంతా దాదాపుగా చాకలేతరులే కావడం. చాకలివారు ఇంకా చదువులో వెనుకబడి, అవగాహనా రాహిత్యంతో ఉండటం, వారిలో రాజకీయ చైతన్యం లేకపోవడం మొదలైన వాటిని కారణాలుగా చెప్పుకోవచ్చు. చాకలి జీవితంపై ఆశించినంతమేర సాహిత్య సృజన జరగాలంటే వారిలో ముందుగా అక్షరాస్యత పెరగాలి. ఆడ, మగ తేడా లేకుండా ఆ సామాజిక వర్గానికి చెందిన బాలబాలికలందరూ చదువుకోవాలి. అప్పుడే వారు ప్రశ్నించడం అనేది నేర్చుకుంటారు. ఆత్మాభిమానాన్ని పెంపొందించుకుంటారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక అసమానతలను సాధిస్తారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

సినిమాలుగా రూపొందిన తెలుగు నవలలు – పరిశీలన

– వేణు ఉక్కరాజు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగు సినిమాల మీద, నవలల మీద ఇప్పటి వరకు చాలా పరిశోధనలు జరిగాయి. సినిమాలు మీద జరిగిన పరిశోధన వలన అనాటి సామాజిక స్థితిగతులు, సినిమా రంగంలోని సాంకేతికత, చరిత్ర, సాహిత్యపరంగా వాటిలోని విలువలు అధ్యయనం చేయవచ్చు. నవల సాహిత్యానికి సంబంధించిన ప్రక్రియ, సినిమా దృశ్యానికి సంబంధించిన సృజనాత్మక విలువలతో కూడిన కళ. ఇందులో నవలలోని సాహిత్యం, నాటకంలో దృశ్యం రెండింటిని మేళవించి ఏర్పడిన నూతన దృశ్య మాధ్యమం సినిమా. ఈ పరిశోధన వల్ల నాటకరంగంలో వచ్చిన మార్పు లను, పోకడలను ఒక విధంగా నాటక కళ అంతరించ డానికి గల కారణాలను తెలుసుకునే వీలుంది. ఈ క్రమంలోనే డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు గారి పర్యవేక్షణలో ''సినిమాలుగా రూపొందిన తెలుగు నవలలు - నాటకీయత'' ఏకవీర, బలిపీఠం నవలలపై ప్రత్యేక అధ్యయనం అనే అంశంపై 2010 నుండి పిహెచ్.డి పరిశోధన చేస్తున్నారు. ఈ సిద్ధాంత గ్రంథాన్ని 2016, మార్చి నెల చివరలో విశ్వవిద్యాలయానికి సమర్పిం చాలనుకుంటున్నాను. ఈ పరిశోధన పత్రంలో సినిమా లుగా మారిన తెలుగు నవలల గురించి వివరించే ప్రయత్నం చేస్తాను.

సినిమాలుగా రూపొందిన తెలుగు నవలలు - పరిశీలన :

కందుకూరి వీరేశలింగం రాసిన రాజశేఖర చరిత్ర (1878)ను తెలుగు సాహిత్యంలో వెలువడిన మొదటి నవలగా పరిశోధకులు భావిస్తున్నారు. తొలి తెలుగు టాకీ చిత్రంగా భక్తప్రహ్లాద (1931)ను ఇంపీరియల్ ఫిలిం కంపెనీ పతాకంపై అర్దేషిర్ ఎం. ఇరానీ నిర్మాణంలో హెచ్.ఎం.రెడ్డి నిర్మించాడు. తెలుగు నవలను చలన చిత్రంగా మలచడం మొక్కపాటి నరసింహశాస్త్రి బారిష్టర్ పార్వతీశం (1924)తో ప్రారంభమైంది. ఈ నవల బారిష్టర్ పార్వతీశం (1940) పేరుతో తొలి నవల ఆధారిత సినిమాగా హెచ్.ఎం. రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కింది. అనంతరం తెలుగులో నవల ఆధారిత చిత్రాలకు ఈ చిత్రం మార్గదర్శమైందని చెప్పవచ్చు. తెలుగులో నవల ఆధారంగా వచ్చిన కొన్ని సినిమాల గురించి ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

పినిశెట్టి శ్రీరామమూర్తి రాసిన అక్కచెల్లెళ్ళు నవలను పరివర్తన (1954) సినిమాగా తెరకెక్కించారు. శ్రీదేవి కాలాతీత వ్యక్తులు నవలను చదువుకున్న అమ్మాయిలు (1963) సినిమాగా వచ్చింది. కోడూరి కౌసల్య దేవి చక్రభ్రమరం నవలను డాక్టర్ చక్రవర్తి (1964) సినిమాగా, ప్రేమనగర్ నవలను ప్రేమనగర్ (1971) సినిమాగా తెరకెక్కించారు. విశ్వనాథ సత్యనారాయణ ఏకవీర నవలను ఏకవీర (1969) సినిమాగా రూపొందింది. యద్దనపూడి సులోచనరాణి రాసిన జైజవాన్ నవలను జైజవాన్ (1970) సినిమాగా, జీవన తరంగాలు నవలను జీవన తరంగాలు (1973) సినిమాగా, సెక్రటరీ నవలను సెక్రటరీ (1976) సినిమాగా తెరకెక్కించారు. తమిరిశ జానకి రచించిన విశాలి నవలను విశాలి (1973) సినిమాగా రూపొందింది. రంగనాయకమ్మ కృష్ణవేణి నవలను కృష్ణవేణి (1974) సినిమాగా, బలిపీఠం నవలను బలిపీఠం (1975) సినిమాగా, ఇదెక్కడిన్యాయం నవలను గోరింటాకు (1979) సినిమాగా మలిచారు. దాశరథి రంగాచార్యులు చిల్లరదేవుళ్ళు నవలను చిల్లరదేవుళ్ళు (1975) సినిమాగా వచ్చింది. పోలాప్రగడ సత్యనారాయణ రాసిన కౌసత్య నవల తల్లిదండ్రులు (1970) సినిమాగా, దీపశ్రీ నవలను రామరాజ్యం (1973) సినిమాగా చిత్రీకరిం

చారు. ఆనందరామం మమతల కోవెల నవలను జ్యోతి (1976) సినిమాగా, జాగృతి నవల త్రిశూలం (1982) సినిమాగా మలిచారు. కవిలిపాటి విజయలక్ష్మి విధి విన్యాసాలు నవలను తాసిల్దార్ గారి అమ్మాయి (1971) సినిమాగా తెరకెక్కించారు. డి.కామేశ్వరి రాసిన కొత్త మలుపు నవలను న్యాయంకావాలి (1981) సినిమాగా రూపొందించారు. యండమూరి వీరేంద్రనాథ్ అభిలాష నవల అభిలాష (1983) సినిమాగా, ఛాలెంజ్ నవల ఛాలెంజ్ (1984) సినిమాగా, కాష్మోర నవలను కాష్మోర (1986) సినిమాగా తెరకెక్కించారు. మల్లాది వెంకటకృష్ణ మూర్తి రాసిన మిసెస్ పరాంకుశం (1986) నవలను జ్యోతిలక్ష్మి (2015) సినిమిగా మలిచారు. ఇలా నాటి నుండి నేటి వరకు చాలా నవలలు తెలుగులో సినిమా లుగా మలచబడ్డాయి. ఇందులో కొన్ని సినిమాలు నవల పేరుతోనే వస్తే మరికొన్ని సినిమాలు శీర్షిక మార్చుకొని ప్రేక్షకుల ముందుకు వచ్చాయి.

తెలుగు సినిమాలపై పూర్వపరిశోధనలు :

విశ్వవిద్యాలయాల్లో తెలుగు సినిమాలపై ఆశించిన స్థాయిలో పరిశోధనలు జరగలేవనే చెప్పాలి. ఇందులో డిగ్రీ పట్టం కోసం కొన్ని గ్రంథాలు వెలువడితే, సాహిత్య అభివృద్ధికి మరికొన్ని గ్రంథాలు సినిమాలపై వచ్చాయి. తెలుగులో సినిమాలపై సిద్ధాంత గ్రంథాలు 1980 దశకం నుండి మొదలయ్యాయని చెప్పవచ్చు. ఇందులో కొన్ని సినిమా రచయితల మీద వెలువడితే మరికొన్ని సినిమా లోని సాహిత్యంపై అందులోని పాటలపై వెలువడ్డాయి. టి. గౌరీశంకర్ "తెలుగు సినిమా పాటలు - సాహితీ మూల్యాలు" (1985) అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓ.యూ)లో పరిశోధన చేశారు. "సాంఘిక సినిమా పాటలు - సాహిత్యపు విలువలు" (1989) అంశంపై సి. కోటేశ్వరరావు ఆంధ్ర యూని వర్శిటీలో పరిశోధన చేశారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ (ఎస్వీయూ)లో పి. మౌలానా "తెలుగు సినిమా పాటల్లో శృంగార దృష్టి" (1991) అనే అంశంపై పరిశోధన చేశారు. పి.ఎన్.రెడ్డి "తెలుగు సినిమా పాట ప్రభావం - పరిణామం" (1992) అనే అంశంపై పరిశోధన చేశారు. పి.ఎన్.రెడ్డి "తెలుగు సినిమా పాటల ప్రభావం - పరి ణామం" (1992) అనే అంశంపై మద్రాసు విశ్వ విద్యాలయంలో పరిశోధన చేశారు. ఈ సిద్ధాంత గ్రంథా లన్ని సినిమాలోని సాహిత్యపు విలువలపై అధ్యయనం చేశారు. జయంత్రి చక్రవర్తి "శ్రీవేటూరి సుందరరామ మూర్తి పాటలు - సాహిత్యపు విలువలు" (1995) అనే అంశంపై పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. ఇక తెలుగు సినిమా సాహిత్యంలో కథాశిల్పం ఎలా ఉన్నదో విశ్లేషిస్తూ "తెలుగు సినిమా సాహిత్యం కథా కథనం శిల్పం" (2003) అనే అంశంపై పరుచూరి గోపాలకృష్ణ. ఓ.యూ.లో పరిశోధన చేశారు. ఈ పరిశోధనలన్నీ ఆయా విశ్వవిద్యాలయాల్లో డిగ్రీల కోసం సమర్పించబడ్డాయి. ఇవి గాకుండా ఇంకా తుల నాత్మక సాహిత్యంలో మరికొన్ని పరిశోధనలు వెలు వడ్డాయి.

విశ్వవిద్యాలయం వెలుపల వెలువడిన గ్రంథాలు:

తెలుగు సినిమా సాహిత్యంపై రచయితలు భిన్న కోణాల్లో గ్రంథాలు వెలువరించారు. అందులో బులెమాని వెంకటేశ్వర్లు తెలుగు సినిమా చరిత్ర (1997) అనే గ్రంథం రాశారు. ఇందులో భారతీయ సినిమా చరిత్రతోపాటు, తెలుగ సినిమా చరిత్రను కూడా పొందుపరిచారు. సినిమా రంగానికి సేవచేసిన వారిని గుర్తు చేశారు. తెలుగు సినిమా పుట్టుపూర్వోత్తరావు ఆధారాలంతో సహా చూపించారు. తెలుగు సినిమా చరిత్ర గురించి తెలుసుకునే వారికి రిఫరెన్సు పుస్తకం. దీనిని విశ్వవిద్యాలయాల్లో డిగ్రీకి సమానమైన పరిశోధన గ్రంథంగా చెప్పవచ్చు. మధు వాకిటి. వందేళ్ళ సినిమాకు వందనం, (2013) గ్రంథం రాశారు. ఇందులో వందేళ్ళ సినిమా రంగాన్ని పాఠకులకు పరిచయం చేశారు. యస్వీ రంగారావు 'తెలుగువీర' (2004) గ్రంథంలో తెలుగు సినిమా రంగాన్ని పరిచయం చేశారు. ఇందులో సినిమా స్టూడియోలు, సినిమా సంస్థలు

దర్శకుల గురించి, నటీనటులు గురించిన వివరాలు అందించారు. ఇవేకాకుండా తెలుగు సినిమా నటుల మీద, సినిమా సాహిత్యం మీద వ్యాసాలు, సంకలనాలు, గ్రంథాలు వెలువడ్డాయి. ఇవన్నీ విశ్వవిద్యాలయం బయట జరిగిన పరిశోధనలుగా భావించవచ్చు.

ఏకవీర, బలిపీఠం నవలలపై పూర్వ పరిశోధనలు:

విశ్వవిద్యాలయాల్లో డిగ్రీల కోసం ఏకవీర బలిపీఠం నవలలపై పరిశోధనలు జరిగాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 'బలిపీఠం నవల - ఒక పరిశీలన 1989) అనే అంశంపై ఎం. అశోక్ పరిశోదన చేశారు. "విశ్వనాథ సత్యనారాయణ ఏకవీర - ఒక పరిశీలన" (2007) అనే అంశంపై పి. జయప్రకాశ్‌రెడ్డి మద్రాసు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. విశ్వవిద్యాలయం డిగ్రీ కోసం కాకుండా సాహిత్య అధ్యయనం కోసం ఏకవీర సినిమా మీద వై కామేశ్వరి ఏకవీర విశ్వనాథ కథన కౌశలం (2010) అనే గ్రంథం వెలువరించారు. ఇందులో ఏకవీర సినిమా వైఫల్యం చెందడానికి గల కారణాలను విశ్లేషించారు. ఇంకా వీటిపై వివిధ సాహిత్య వ్యాసాలు వెలువడ్డాయి. ఇవన్నీ నా పరిశోధనకు భిన్నమైనవి. కావున నాకు తెలిసినంత వరకు సినిమాలుగా రూపొందిన తెలుగు నవలలు - నాటకీయత అనే అంశంపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధన జరుగలేదు.

పరిశోధన సారాంశ వివరాలు :

నేను తీసుకున్న ఈ పరిశోదన అంశాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించారు. వాటి వివరాలు కింద పేర్కొంటున్నాను.

మొదటి అధ్యాయం :

"నవల, సినిమా స్వరూప స్వభావాలు"తో తెలుగు నవల పుట్టుక, పరిణామంతోపాటు నవల చరిత్ర ప్రారంభ పరిణామం, నవలను సాహిత్యకారులు ఏవిధంగా నిర్వచించారు. ఏది తొలి తెలుగు నవల, నవలకు నైఘంటిక అర్థాలు ఏమి సూచిస్తున్నాయి. నవలకు ఉండవలసిన లక్షణాలు మొదలగు అంశాలను పరిశోధనాత్మకంగా విశ్లేషించాను. వీటితోపాటు యుగ విభజన జరిగిన తీరును కూడా ఇందులో పొందుపరిచాను. ప్రపంచంలో మొదటి సినిమా రావడానికి గల కారణాలు, సినిమా తీయడానికి నాడు నిర్మాతలు పడిన కష్టాలను, ఆనాటి సాంకేతిక, చారిత్రక పరిస్థితులను తొలి మూఖీ, టాకీ చిత్రం ఏది ఆ సినిమా ఎప్పుడు ఎక్కడ విడుదలైంది అనే అంశాలను ఇందులో పొందుపరిచాను. ఇంకా భారతీయ సినిమాకు ఆధ్యులైనవారు నాడు భారతదేశంలో సినిమా వారి స్థితిగతులు పేర్కొన్నాను. తెలుగు సినిమాల పుట్టుక పరిచయం మూఖీల నుండి టాకీల వరకు సాగిన సినిమా ప్రస్థానం విశ్లేషించడంతో పాటు, సినిమాలుగా మారిన తెలుగు నవలలను ఈ అధ్యాయంలో పొందుపరిచాను. దీని ద్వారా సినిమా రంగంలో వచ్చిన మార్పులు, సినిమా నాడు నేడు ఎలా ఉంది. ఎలాంటి సాహిత్యాన్ని ప్రజలకు అందిస్తుంది మొదలగు అంశాలతోపాటు, సినిమా, నవల గురించిన సమాచారం అవి మానవాళికి, సాహిత్యానికి ఏ విధంగా సేవచేశాయో ఈ అధ్యాయంలో తెలుసుకోవచ్చు.

రెండవ అధ్యాయం :

"నవల, నాటకం, సినిమా మధ్య భేద సాదృశ్యాలు" ఇందులో నవలకు, నాటకానికి, సినిమాకు గల భేదాలతోపాటు, సాదృశ్యాలు కూడా విశ్లేషించాను. నాటకం, నాటకీయతపై పలువురి అభిప్రాయాలూ పొందుపరిచాను. దీనితోపాటు సామాజిక అంశాలను కూడా సమన్వయం చేశాను. ఏకవీర, బలిపీఠం నవలల చారిత్రక నేపథ్యాన్ని అధ్యయనం చేశాను. దీని ద్వారా సాహిత్యంలో ఈ ప్రక్రియల మధ్య ఉన్న వైవిధ్యాన్ని గురించిన సమాచారంతోపాటు, ఆధునిక నాటకం సినిమాగా ఎలా రూపాంతరం చెందినదో ఈ అధ్యాయం ద్వారా తెలిసే ఆస్కారం ఉన్నది.

మూడవ అధ్యాయం :

"ఏకవీర, బలిపీఠం నవలల్లో చేసిన మార్పుల -

చేర్పులు'' ఇందులో సినిమాలుగా మారిన ఏకవీర, బలిపీఠం నవలల ఇతివృత్తం, పాత్రచిత్రణ, సంభాషణలు మొదలగునవి పరిశోధనాత్మకంగా విశ్లేషించాను. నవల నుండి సినిమాగా మారిన క్రమంలో చోటుచేసుకున్న మార్పుచేర్పులను అధ్యయనం చేశాను. సినిమాగా ఒక గ్రంథాన్ని చిత్రించేటప్పుడు అది దృశ్యరూపంలోనికి ఎలా మార్చరు. ఈ మార్పు సినిమా చిత్రీకరణు అనుకూలంగా ఉందా? లేదా? అనే అంశాలను పరిశోధనాత్మకంగా విశ్లేషించాను. దీని ద్వారా ఒక నవల సినిమాగా మారుతున్నప్పుడు సహజంగా కొన్ని మార్పులు అనివార్యమైన మరికొన్ని సన్నివేశాలు వ్యాపారాన్ని పెంచుకోవడానికి చేయవలసి ఉంటుంది. ఏకవీర, బలిపీఠం సినిమా విషయంలో ఇతివృత్తంతోపాటు, పాత్ర చిత్రణలో, సంభాషణలోనూ రచయితకు భిన్నంగా దర్శకుడు మలచిన తీరును వివరించాను. పాఠకుడు, ప్రేక్షకుడు ఒక్కడే ఐనప్పుడు, అతడి అనుభూతి రసానందంగా మారినప్పుడు ఎలా స్పందిస్తాడు. అనేది ఈ అధ్యాయం ద్వారా గ్రహించవచ్చు. నవల సినిమాగా మారినప్పుడు అనివార్యం అనే అంశాన్ని చెప్పడంతోపాటు, వాటి ద్వారా ప్రేక్షకులు పొందిన రసానందాన్ని ఈ అధ్యాయంలో చూడవచ్చు.

నాలుగవ అధ్యాయం :

''సినిమాలుగా మారిన ఏకవీర బలిపీఠం నవలలు - శిల్పానుశీలన'' ఇందులో ఏకవీర బలిపీఠం నవలలో శిల్పం ఏవిధంగా ఉన్నది. రచయిత నవలను ఏవిధంగా తీర్చిదిద్దారు. కథా-కథన పద్ధతులు, పాత్ర నిర్మాణ శిల్పం, నవలలో ఎలా పోషించారు. సినిమా శిల్పంలో ఉన్న అంశాలు, అవి సినిమాను ఎలా తెరకెక్కించడానికి ఉపయోగపడ్డాయి. సంభాషణలోని రకాలు, సినిమాలో అభినయాన్ని చూపించే విధానం సిద్ధాంతపరంగా అధ్యయనం చేశాను. దర్శకులు సినిమాను ఏ విధంగా చూపించారు. నవల శిల్పానికి, సినిమా శిల్పానికి ఉన్న సంబంధాన్ని, వైవిధ్యాన్ని దర్శకుడి ఆలోచన విధానానికి సినిమా ఏవిధంగా కార్యరూపం దాల్చిందో చూడవచ్చు. సమాజంపై సినిమా ప్రభావం ఎలా ఉంది? దీనిని ప్రేక్షకులు ఆదరించారా? నిరాదరించారా అనే కోణంలో కూడా విశ్లేషణ చేశాను. తద్వారా ప్రేక్షకుల నాడిని పట్టుకునే అవకాశం ఉందనుకుంటున్నాను.

చివరగా ''సింహావలోకనం'' దీనిలో పరిశోధనకు సంబంధించిన ఫలితాంశాలను పొందుపరుస్తున్నాను. పాఠకుడు ప్రేక్షకుడైనప్పుడు కలిగే అనుభూతిని, అతడి హృదయ స్పందనలను సాహిత్యంలో గల సంబంధాన్ని అన్వయించి చూడవచ్చు. మొత్తం మీద నా పరిశోధన ద్వారా నవలలుగా మారిన తెలుగు సినిమాల గురించిన అంశాలతోపాటు, నవల సినిమాగా మారిన క్రమంలో చోటుచేసుకున్న మార్పులు, చేర్పులు, నాటకీయత, సంభాషణల యొక్క ప్రాధాన్యం, వాటి అవసరం సమాజానికి సినిమాలు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయి. సాహిత్యంపై, సమాజంపై సినిమా ప్రభావం ఎలా ఉంది. సాహిత్యానికి సినిమాలు చేసిన సేవ మొదలైన అంశాలు ఇందులో ఉంటాయి. ఈ అంశంపై ఇంకా భిన్న కోణాల్లో పరిశోధన సాగించే అవకాశం ఉంది. నవల సినిమాల్లో కథా కథనం, నవల సినిమాల్లో శిల్పం, సామాజిక అంశాలు, పాత్ర చిత్రణ, సాహిత్య ఉద్యమాల ప్రభావం, తెలుగు సినిమాలపై నవలల ప్రభావం, తెలుగు నవల చిత్రాలు పరిశీలన లాంటి అనేక అంశాలపై పరిశోధనలు చేసే ఆస్కారం ఉంది.

ముగింపు :

సినిమాలుగా మారిన తెలుగు నవలలపై పరిశోధన చేయడమంటే నవల, సినిమా రెండు కాలాల నాటి సాహిత్య చరిత్రను, చారిత్రక, సాంకేతిక అంశాలను, సమాజంలోని స్థితిగతులను అధ్యయనం చేయడమని చెప్పవచ్చు. నవల ఆవశ్యకతను అందులోని నాటకీయతను, సాహిత్య విలువలను తెలుసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల తెలుగు నాటక రంగంలో వచ్చిన మార్పులను దాని ఆవశ్యకతను, సినిమా పరిణామ క్రమాన్ని, ఆధునిక కాలంలో సినిమా ఆవశ్యకతను అది సాహిత్య

విస్తృతికి ఎలా దోహదం చేసిందో తెలుసుకోవచ్చు. కోణాల్లో పరిశోధన చేయాల్సిన అవసరం ఎంతైనా రానున్న కాలంలో నవలలుగా మారిన సినిమాలపై విభిన్న ఉంది.

ఆధార గ్రంథాలు :

1. అప్పారావు, పి.యస్. తెలుగు నాటక వికాసము, నాట్యమాల ప్రచురణము.
2. కుటుంబరావు, బి.వి. తెలుగు నవలా పనిణామము, (ప్రథమ సంపుటం) గాయత్రి ప్రచురణము, హైదరాబాద్, 1971.
3. గంగప్ప, ఎస్. తెలుగు నాటకం, శశి ప్రచురణలు, గుంటూరు, 1985.
4. గోపాలకృష్ణ, పరుచూరి. తెలుగు సినిమా సాహిత్యం కథా-కథన-శిల్పం, వీటెక్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2004.
5. నాగభూషణ శర్మ, మొదలి, తెలుగు నవలా వికాసం, నాట్యకళా ప్రెస్, హైదరాబాద్, 1971.
6. నాగభూషణ శర్మ, మొదలి, నాటకశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2008.
7. నిత్యానందరావు, వెలుదండ. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన, హైదరాబాద్, 2013.
8. రామారావు, యస్వీ, తెలుగు సినిమా చరిత్ర, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2012.
9. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి, నవలాశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1989.
10. వెంకటేశ్వరరావు, దార్ల. వీచిక, ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్, 2009.
11. వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. తెలుగు నవలా సాహిత్య వికాసం, వైయన్ ప్రెస్, ఖమ్మం, 1974.
12. వెంకటేశ్వర్లు, బులెమాని, తెలుగు సినిమా చరిత్ర, నెక్ట్ స్టెప్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 1997.

ఆంగ్ల గ్రంథాలు :

1. Ashish Rajadhyaksha. Paul Willemen. “Encyclopedia of India Cineme”.
2. Sastri, K, N, T, “Telugu Cineme”, Cinema Group, Hyderabad, 1986.
3. Yves Thoraval. “The Cinemas of India”, Macmillan India Limited, New Delhi, 2000.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆంధ్ర మహాభారతం – మానవీయ విలువలు పరిశీలన

– శ్యామల కడారి, తెలంగాణ విశ్వవిద్యాలయం.

అంతరించిపోతున్న నేటి మానవ విలువలను ఆనాటి వేద వ్యాసుడు సంస్కృతంలో అందించిన బృహత్తర కావ్యం "మహాభారతం". ఇది జయ 'జయ సంహిత'గా పేరుగాంచింది. పంచమ వేదంగా భారతాన్ని తెలుగులో ఆంధ్రీకరించినవారు కవిత్రయం వారు (నన్నయ, తిక్కన, ఎఱ్ఱన).

ఆధునికత ఎంత పెరిగినా, నాగరికత ఎంత ముదిరినా రకరకాల సాహిత్యాలు ఎన్ని వచ్చినా, ఎన్నో సహిత్య ప్రక్రియలు వృద్ధి పొందినా మహాభారతం ఈనాటికి నిత్య జీవన యానపు విలువ అందిస్తూ, మానవుని జీవిత ప్రస్థానం కొనసాగించడానికి వెలుగు దివ్వెలా కాంతి పుంజములా విలువల వెలుగులు పంచుతున్నది.

మహాభారతం మంచి చెడులతో కూడిన మనిషి కథ. పేరుకు కురువంశ రాకుమారుల కథే అయినా... రకరకాల మనస్తత్వాలతో మన చుట్టూ ఉన్న మనుషుల కథ. మానవు జీవితానికి అద్దంపట్టే కథ. "లోకాస్సమస్తా సుఖినోభవంతు'..... అన్న ఉత్కృష్టమైన భావాల్ని ప్రతి మనసులో జ్వలింపజేసేది మన చిరపురాతన నిత్య నూతన హైందవ వాఙ్మయం.

మనిషి "మనిషిగా" మానవుడు మాధవుడిగా ఎదగడానికి అవసరమైన "మానవీయ విలువలు" ప్రతి హృదిలో మొనులెత్తి వికసించడానికి అవసరమైన "నంస్కారాల్ని ప్రోది చేసేవే మన వేదాలు, ఉప నిషత్తులూ, మన ధర్మశాస్త్రాలూ, నీతి చంద్రికలూ, రామాయణం, మహాభారత ఇతిహాసాలూ, సుభాషితాలూ, భాగవతం, భగవద్గీతలాంటి వివిధ గ్రంథాలు.

అహంకార మమకారాలతో - అంటే 'నేను - నాది' అన్న భావనతో మానవ స్వార్థం ధర్మ విరుద్ధంగా ప్రవర్తిల్లితే, వ్యక్తి ఎంత దారుణంగా జీవితంలో పతనమైతాడో, అలా కాకుండా ధర్మబద్ధలమైన స్వార్థంతో జీవితం సాగిస్తే చివరకు ఎంత ఉన్నత స్థితిని అందుకొంటాడో మానవాళికి తెలియజెప్పే కథ. వ్యక్తి ఉన్నతికి, సుఖశాంతులకు, సమాజ ప్రగతికి, సుఖశాంతులకు అవసరమైన ధర్మాన్ని, ధర్మ సూక్ష్మాలను మానవ జీవితానికి సమన్వయించి రసమయంగా చెప్పే కథ. మానవ జీవిత మహాప్రస్థాన కథ. మన వేద విజ్ఞానానికి, సంస్కృతికి పెద్ద భాంగాగారంగా నిలిచిన కథ.

మహాభారతం ఒక మహాకవి కల్పించి వ్రాసిన కథ కాదు. అది వాస్తవికతా మనోహరమైన కథ. ఒకనాటి సామాజిక కథ. వ్యాస మహర్షి కూడా ఒక పాత్ర నిర్వహించిన కథ. మానవ జీవితంలో ముఖ్య భాగమైన పంపకం - మితిమీరిన మానవ స్వార్థంతో, పరిష్కార సాధ్యంకాని ఒక విషయ సమస్యగా మారి, ప్రళయ భయంకరమైన మరణ హోమానికి - మహాభారత యుద్ధానికి దారి తీసిన కథ. లోకంలో నేల పంపకం, నీటి పంపకం, ఆస్థి పంపకం, అధికార పంపకం ఎక్కడ, ఎప్పుడు సమస్యగా మారినా, పోరునష్టం పొందులాభం అని మానవజాతికి హెచ్చరించే కథ. సర్వసంగ పరిత్యాగాలతో ఆత్మతత్వాలతో, ఆధ్మాత్మిక ప్రబోధాలతో నివృత్తి ధర్మాన్ని మనిషి నెత్తికెత్తి ఒకేసారి భువి నుండి దివికెగురమని చెప్పకుండ, ప్రవృత్థి ధర్మ ప్రాధాన్యాన్ని ఐహిక జీవిత ప్రాముఖ్యాన్ని, అర్థకామాల అవసరాన్ని గుర్తించి - మానవుడు ధర్మబద్ధంగా అర్థ కామాలు అనుభవిస్తే, అతడు ఉన్నతోన్నతమైన ఆముష్మిక స్థితిని ఎలా అందుకొంటాడో, ధర్మబద్ధంగా అర్థకామాలు అనుభవిస్తే ఎంత దారుణమైన పతనాన్ని పొందుతాడో ప్రపంచానికి తెలియజెప్పే కథ.

మానవుడు తనలోని పశుత్వాన్ని క్షాళన చేసుకోవడానికి, దివ్యత్వాన్ని వెలగించుకోవడానికి ఉత్తమ సాధనా

లుగా ఉపకరించే ఆచరణ సాధ్యాలైన అనేక ధర్మాలను, ధర్మ సూక్ష్మాలను, వాటి అద్వైతస్థితిని, కథాత్మకంగా మానవ జీవితానికి సమన్వయించి, సాత్మకంగా మన మనస్సును ఆకర్షించేటట్లు చెప్పిన సందేశం - మహాభారత సందేశం.

మానవుడు భుని నుండి దివికి చేరుకోటానికి ఊతగా ఉపకరించే ఉత్తమోత్తమ ధర్మసందేశం. మహాభారతం ధర్మతత్వానికి, మానవ జీవితానికి, జీవిత పరమార్థానికి నిలువెత్తు అద్దం. మానవ జీవిత మహాప్రస్థానం. మహా భారతంలో మనల్ని మనం చూచుకోవచ్చు. మన చుట్టూ ఉన్న వాళ్ళందరిని చూడవచ్చు. మానవ జీవతాన్ని అన్ని కోణాల్లో చూచి అవగాహన చేసుకోవచ్చు ఆనందించవచ్చు. అట్టి మహాభారత గ్రంథాన్ని అధ్యయనం చేసి మనం మంచి వ్యక్తులుగా మారవచ్చు. మానవ జీవిత పర మార్థాన్ని ధర్మతత్వాన్ని అర్థం చేసుకొని మనల్ని మనం ఉద్ధరించుకోవచ్చు. మనిషి విలువలను పదిలపరుచు కోవచ్చు.

మానవీయ విలువలు :

అ) వినయం :

వినీతుడు, వినయం కలవాడు. వినమ్రుడు, వినయ శీలుడు ఇవి సమానార్థక పదాలు. వినయం అనే గుణం వ్యక్తికి వన్నె తెస్తుంది. వివశీలుడైన వ్యక్తి అందరి మన్ననలు పొందుతాడు.

"విద్యాదతాతి వినయం, వినయా ద్యాతి పాత్రతా
పాత్రత్వాధ్న మాప్నోతి, ధనాధర్మఞ తతస్సుఖం"

విద్య వలన వినయం, వినయం వలన పాత్రత అనగా యోగ్యత, పాత్రత వలన ధనం, ధనం వలన ధర్మాచరణకు వీలు ఏర్పడుతుంది. అందువల్ల సుఖం కలుగుతుంది. వినయం వల్ల మానవ జీవితానికి సాఫల్యం చేకూరుతుంది. ఇహపర సౌఖ్యాలకు వినయం మానవునికి ఆధారమై ఉంటుంది.

భర్తృహరి మహాకవి తన సుభాషితంలో ఈ విధంగా వినయమును గూర్చి చెప్పెను.

"తెలివియొకింత లేని యెడ దృప్తుడనై కరిభంగి సర్వమున్
దెలిసెనటంచు గర్వతమతిన్ విహరించితి దొల్లి యిప్పుడు
జ్వలమతులైన పండితుల సన్నిధినించుక బోధశాలినై
తెలియని వాడనై మెలిగితిం గతమయ్యె నితాంత గర్వమున్"

నేను కొంచెం తెలుసుకున్న సమయంలో మదగజం వలె గర్వంతో కర్తవ్య వివేక శూన్యుడనై "అంతా నాకే తెలుసు" నేనే సర్వజ్ఞానిని అని గర్వించి తిరిగాను. "అల్ప విద్యా మహాగర్వీ" అయినట్లున్నాను. తర్వాత గురు శు శ్రూషాదికాల ద్వారా శ్రవణ మననాల ద్వారా వినయ వివేకం కలిగి కొంచెం కొంచెము జ్ఞానం లభించింది. అప్పుడు నాకేమీ తెలియదని నేను మూర్ఖుడినని తెలిసి గర్వ రహితుడనైనాను. అల్పజ్ఞుడై ఉండి నేను సర్వజ్ఞుడై ఉండి నేను సర్వజ్ఞుడను అనుకొనేవాడు "అహంకారి". అన్నీ తెలిసినా ఏమీ తెలియనివాడనని భావించేవాడు "వినయశీలి" అని భావం.

ఆ) సత్యం :

సత్యం అనే గుణం మానవ జీవితమనే నౌకకు దిక్సూచీ లాంటిది. దిక్సూచి లేకుండా నౌక గమ్యం ఎలా చేరలేదో అలాగే మానవ జీవిత గమ్యం చేరాలంటే సత్యమనే దిక్సూచీని ఆశ్రయించక తప్పదు. మంచి నడవడి అనేది ఒక మహాసాగరం. ఆ సాగరాన్ని తరింప జేసేందుకు ఓడలాగా ఉపయోగపడేది సత్యవాక్కు అని విదురనీతిలో కూడా చెప్పబడింది.

"సత్యాను సారిణీ లక్ష్మీ: కీర్తి స్త్యాగాను సారిణీ
అభ్యాస కారిణీ విద్యా బుద్ధిః కర్మానుసారిణీ॥"

అన్న ఆర్యోక్తిని బట్టి "సత్యం మానవుని తరింప జేస్తుంది. గౌరవం, సంపద మొదలైనవన్నీ సత్యాన్ని అనుసరించి వస్తాయి. సత్యం సర్వ సద్గుణాలకు ద్వారం

వంటిది. సత్యభాషణం అంటే మనస్వేకం, వచస్వేకం, కర్మణ్యేకం, మహాత్మానాం అనగా మనస్సులోని ఆలోచన, నోటితో చెప్పేమాట, చేసే పని ఒకేరీతిగా ఉండటం సత్య వ్రతుని లక్షణం.

ఇ) క్షమాగుణం :

క్షమించుట అంటే మన్నించుట, తప్పుసైచుట, సహించుట 'క్షమ' అంటే క్షమించువాడు, ఓర్చువాడు. "క్షమ, క్షముడు" అనే పదాలకు సమర్థుడు శక్తుడు, చాలినవాడు, హితుడు, తగినవాడు, యోగ్యుడు అని కూడా అర్థాలున్నాయి.

క్షమ అనే సద్గుణం మానవున్ని మహనీయున్ని, మానవీయుడిని చేస్తుంది. భౌతికంగా గాని, ఆధ్మాత్మికంగా గాని తమకు ఎవరైనా దుఃఖం కలిగించినప్పుడు కోపగించకుండుట క్షమాగుణం. శంకరాచార్యులవారు "అకృష్టస్య తాడితస్వవా అవికృత చిత్త తాక్షమా" అంటే నన్ను తిట్టినా కొట్టినా మనస్సునందు వికారం కలుగకుండుట "క్షమ" అనిపించుకుంటుంది అని తెలిపారు. క్షమాగుణం కవచం లాంటిది. అది పరాక్రమవంతులకు అలంకారం. తల్లిదండ్రులు పుత్రుల యెడల, భర్త యెడల, అత్త కోడలి యెడల, గురువు శిష్యుల యెడల, యజమానుల కార్మికుల యెడల క్షమాగుణంతో వ్యవహరిస్తే అశాంతికి తావే లేకుండా పోతుంది.

మహాభారతంలో ప్రహ్లాద బలీంద్ర సంవాదంలో.....

"క్షమయ తాల్చియుండ జలదెల్ల ప్రొద్దు తే
జంబు తాల్చియుండ జనదు పతికి
సంతత క్షముండు సంతత తేజుండు
నగుట దోషమందు రనఘమతులు"

క్షమ, పరాక్రమం ఎల్లప్పుడూ ప్రదర్శించరాదు. ఏది ఎప్పుడు అవసరమో అప్పుడు ప్రదర్శించాలి. క్షమించబడే వ్యక్తి కంటే క్షమించే వ్యక్తి అధికబల సంపన్నుడైయున్నప్పుడే అది క్షమ అనిపించుకుంటుంది. క్షమాగుణం అత్యుత్తమ సద్గుణం. క్షమ అనేది అమృతవల్లి. భార్యా, పుత్రలతో, సోదరీ సోదరులతో, పనివాళ్ళతో, మిత్రులతో, బంధువులతో తోటి వ్యక్తులతో సౌజన్యంగా స్నేహయుగంగా, మధురంగా వ్యవహరిస్తే జీవితం సఫలమగును.

ఈ) దయ :

దయ అనేది దైవీయమైన గుణం. ప్రతి వ్యక్తి హృదయాంతరాళంలోనూ, దయ, జాలి, కృప దాగి ఉంటుంది. భారతంలో దయా గుణాన్ని తెల్పుతూ..

సర్వభూత దయకు సత్యవాక్యమునకు
నుత్తయంబు ధర్మమొండెఱుంగ
నొరుల నొప్పి కోడకు పతాప మొనరించు
నదియు కడు నధర్మమనిరి బుధులు.

సర్వప్రాణులయందు దయ గలిగి ఉండటం. సత్యం పలకటం ఈ రెండింటికి మించిన ధర్మం లేదు. ఇతరుల బాధకు వెనుకాడకుండా హింసించుటయే మిక్కిలి అధర్మం.

ఉ) ధర్మం :

నిష్పక్షభావ ధోరణిలో అంతరాత్మ పరిస్థితులనుసరించి దేశకాల పరిస్థితుల ఆధారంగా వివక్షణను ఉపయోగించి మానవుడు జీవితంలో సందర్భానుసారంగా మసులు కోవడమే ధర్మం.

ఈ ధర్మం అనేది అనాదిగా ఎందరో మహర్షులు, రాజర్షులు, బ్రహ్మర్షులు, పతివ్రతల చేత ఆచరించ బడుతూ తరతరాలకూ మార్గదర్శకమౌతూ వస్తుంది. ధర్మం అనే మాటకు తను చేయాల్సిన పని తెలిపేదిగా తన కర్తవ్యం అనే అర్థంలో వాడుతుంటాము. పుత్రుడుగా తాను చేయవలసినది పుత్రధర్మంగా పిలవబడుతూ ధర్మం అనగా "ధర్మోధారయతి ప్రజా" ప్రజల చేత ఏదైతే ధరింపబడుతుందో అదే ధర్మం అనే భావన ఉంది.

సర్వకాల సర్వావస్థల యందు ధర్మం అనేది ప్రతి ఒక్కరూ ఆచరించాలి. "ధర్మోరక్షతి రక్షితః" ధర్మాన్ని రక్షిస్తే అది మనను రక్షిస్తుంది. ధర్మం ఎవరైతే ఆచరిస్తాడో అటువంటివాడు అందరిచేత గౌరవింపబడుతాడు. అదే భారతంలో ధర్మరాజు చరిత్ర తెలుపుతుంది.

సోదర ధర్మాన్ని పాటించిన ధర్మరాజు యక్షుడితో ధర్మ సంవాదం చేసి తన సోదరులను బ్రతికించుకోగలిగాడు.

విద్యా ధర్మాన్ని పాటించిన అబ్దుల్ కలాం గారు భారత రాజకీయానుభవం లేకున్నా రాష్ట్రపతి అయ్యారు. అహింసా ధర్మాన్ని పాటించి గాంధీజీ మహాత్ముడు కాగలిగాడు. ధర్మం అంత గొప్పది.

ఊ) ప్రయత్నం :

మనుష్యులకు ప్రయత్నాన్ని మించిన చుట్టం లేదు. సోమరితనం, ఏమరుపాటు, మనుష్యులకు మహా శత్రువులు. ప్రయత్నం చేసిన వాడెవ్వడు వైఫల్యం పొందడు. ప్రయత్నించే వ్యక్తినే సంపద వరిస్తుంది. అసమర్థులు, హీనులు, భీరువులు దైవమివ్వాలి గానీ మనదేముంది అంటారు. కాని దైవం అనేదాన్ని లెక్క చేయకుండా మానవ ప్రయత్నం చేయాలి. ప్రయత్నం చేసినా పని అనుకూలించకపోతే మన తప్పేమిలేదు. ప్రయత్నం మన పని.

"ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి న మనో రథైః
నహి సుప్తస్య సింహస్య ప్రవిశంతి ముఖే మృగాః"

ప్రయత్నం వల్లనే ఏ పనులైనా సిద్ధిస్తాయి. కేవలం మనస్సులో కోరిక ఉన్నంత మాత్రాన పనులు నెరవేరవు. సింహము హాయిగా నిద్రిస్తుంటే మృగాలు ఆహారంగా వచ్చి దాని నోట్లోకి వచ్చి పడవు.

కావున నా కర్మ ఇంతే, అంటూ నిరాశా నిస్పృహలతో నిష్క్రియలు కాకూడదు. సోమరులు కాకూడదు. అంతా భగవంతుడు చూసుకుంటాడని గాలిలో దీపం పెట్టి దేవుడా అంతా నీదే భారం అంటే భగవంతుడేమీ చేయడు. ప్రయత్నం చేయాల్సింది మనమే.

ఋ) సేవాతత్పరత :

సేవ అంటే పరిచర్య పూజ. సేవ అంటే కొలుపు, శుశ్రూష, పూజ, మన్నన, ఆదరం అని, సేవకుడు అంటే కొలుచువాడు, పూజించువాడు అని వివిద నిఘంటువులలో చెప్పబడింది. తిరుపతిలో వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగే పూజలన్నీ సేవలే. స్వామి వివేకానందుడు తనకు వ్యక్తిగత మోక్షం వద్దు. దేశంలో ఒక్క కుక్క పస్తున్నా కూడా నేను మాటి మాటికి జన్మిస్తూనే ఉంటాను అని సేవా ధర్మానికి నూతన నిర్వచనం చెప్పాడు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు, గురువుకు, పెద్దలకు సాధుసంతులకు, దుఃఖితులకు, పీడితులకు, సమాజ, దేశసేవ చేసే వాళ్ళు "సేవ" అంటే పూజించే అనే భావనను స్వీకరించి వేయాలి. వ్యక్తులు సేవాతత్పరులైన కుటుంబ జీవనం స్వర్గతుల్యము అవుతుంది. సమాజం సర్వాంగీణ ఉన్నతి సాధిస్తుంది.

ౠ) త్యాగం :

త్యాగం అంటే విడుచుట, వదిలిపెట్టుట. సర్వసుఖాల సారమైన బ్రహ్మానంద స్థితి యొక్క స్వరూపమే త్యాగం. మానవ జీవితోన్నతికి అన్ని స్థాయిలలో అత్యంత అవశ్యకమైన గుణం త్యాగం. వ్యక్తి, కుటుంబం, సంస్థ, సమాజం, దేశం సమస్త మానవాళి అభివృద్ధికి త్యాగం తప్పనిసరి. ప్రపంచ చరిత్రను ఎందరో మహాత్ముల జీవితాలను తరచి చూచినా త్యాగం విలువ తెలుస్తుంది.

త్యాగం సాత్వికం, రాజసం, తామసం అని మూడు విధాలు. ప్రతిఫలాపేక్ష లేకుండా నిరహంకార భావనతో చేసే త్యాగం సాత్విక త్యాగం. దాని ద్వారా పరమేశ్వర ప్రాప్తి సుగమమౌతుంది. తనను తాను వంచించుకొని లోకాన్ని మోసపుచ్చేందుకు చేసేది, ఇతరులకు నష్టం కలిగించేది అయిన త్యాగ ప్రదర్శన తామస త్యాగం. సాత్విక త్యాగం ఉత్తమం. రాజసత్యాగం మధ్యమం. తామస త్యాగం అధమం.

భారతీయ సంస్కృతి త్యాగమయి సంస్కృతి. భోగమయంకాదు. త్యాగమయి జీవనాన్నే మనదేశంలో సర్వశ్రేష్ఠమైనదిగా భావిస్తాము. చాతుర్వర్ణాలు, చతురాశ్రమాలు, భారతీయ సామాజిక వ్యవస్థలో త్యాగం ఆధారంగానే నిర్మించబడ్డాయి.

ఇలా అనేక మానవీయ విలువలు మనిషి నిత్య జీవితంలో నిరంతరం భాగంగా ఉంటూ జీవితాన్ని నడిపిస్తూ ఉంటాయి. వాటి విలువలు తెలుసుకుని 'మనిషి'గా ఎదిగి తర్వాతి తరాలవారికి ఆదర్శంగా నిలవాలని ఎన్నో ఘట్టాలలో భారతంలో పొందుపరిచారు కవిత్రయంవారు. అటువంటి అమూల్యమైన విలువలను ఆచరిస్తూ, జీవితంలో ముందుకు వెళ్ళాలి. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కొలకలూరి ఇనాక్ కథానికలలో మానవత విలువలు

– శోభరాణి. టి, కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ.

తెలుగు కథ ఎప్పుడు పుట్టిందీ అన్న ప్రశ్నకు "అనగ నగా ఒకరాజు.. ఆ రాజుకు ఏడుగుకు కొడుకులు" అన్న కథ పుట్టినప్పుడే అని సమాధానం రావచ్చు. నిజమే కథలు మనకు క్రొత్తకాదు. కథానికలు అర్వాచీనాలు కావచ్చు కానీ కథలు అతి ప్రాచీనాలు. ప్రతి సమాజంలోనూ కథలు లిఖిత సారస్వతానికి ముందే మౌఖిక ప్రచారం ఉన్నాయి. వేదాలలో ఉపనిషత్తులలో రకరకాల కథలున్నాయి. పంచతంత్రం కథలు, విక్రమార్కుని కథలు, సింహాసన ద్వాత్రింశిక, కథాసరిత్సాగరం, శుకసప్తతి మొదలైనవి బహుళ ప్రచారం పొందిన కథలు, తెనాలి రామలింగని కథలు, కాశీమజిలీ కథలు, తాతాచార్ల కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు, ప్రజల ఆదరాన్ని అందుకున్న కథలు కానీ ఈ కథలన్నింటికీ కథ ప్రధానమైతే నేటి కథానికకు కథనం ప్రధానం.

ఈ కథానిక ప్రక్రియ ఆధునిక కాలంలో గురజాడవారి 'దిద్దుబాటు'తో ప్రారంభమై రాజకీయ, ఆర్థిక, సామాజిక, మానసిక రంగాలలో, అనేకానేక వాదాల దొంతరల్లో అలరారుతున్న ప్రక్రియ, ఈ కథానిక ప్రక్రియ. కథానిక ప్రక్రియను దళితవాద నేపథ్యంలో దళిత జాతులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా, ఎలా దోపిడీకి గురవుతున్నారో తెలిపే క్రమంలో ఈ కథానిక ప్రక్రియను సాధనంగా చేసుకున్న సాహితీ త్రివిక్రములు ఆచార్యులు కొలకలూరి ఇనాక్ గారు.

అక్షరాలు నేర్వని ఇంట పుట్టి లక్షలాది అక్షర రేణువు లను సృష్టించి గొప్ప రచయితగా, తెలుగు సరస్వతీ కంఠ హారంలో మణిపూసగా కీర్తి ప్రతిష్ట లార్జించిన వీరి నేపథ్యం గొప్పది. ఆకలితో పూరిగుడిసెలో పైకప్పు సందుల్లోంచి కారే వాన చినుకునకు చెంబు, తెపాళాలు అడ్డుపెట్టి కూర్చున్న స్థితి నుండి, ఐదు నక్షత్రాల దశ వరకూ అన్నీ అనుభవించి, పలవరించి, మదిలో నిక్షిప్తం చేసుకున్న నిజమైన డా॥. బి.ఆర్. అంబేడ్కర్ వారసుడీ ఆచార్యులు, వారి జననం దళిత జాతికి మరో శుభోదయం.

ఇనాక్ గారి సాహిత్యం సామాజిక దురాచారాన్ని ఖండించి, మనిషిని మనిషిగా పునర్నిర్మిస్తుంది. మానవ సమాజ ప్రగతికి ప్రేరణ శక్తి అవుతుంది. ఆ ప్రేరణ శక్తిలో మానవతాంశం ఉంది. అది ఎదుటివారి గుండెను తాకుతుంది. అది కథ, కథానిక, నాటిక, నాటకం, విమర్శ, వచనం, పద్యం ఏదైనా అది విశ్వ జనరంజకమౌతుంది.

వీరి విశిష్ట రచనలు ఆంగ్ల, కన్నడ, తమిళ, హిందీ భాషలలోనికి అనువాదమయ్యాయి. సామాన్య మనుష్యు లలో చాలా గొప్ప ప్రజ్ఞావంతులు ఉంటారు. అటువంటి ప్రజ్ఞావంతుల వరుసలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన వ్యక్తి కొలకలూరి ఇనాక్ గారు. వీరి పండిన ప్రజ్ఞకు మరో దళిత స్వరమే ఈ 'కాకి' కథానికల సంపుటి. ఏ ఉద్య మానికైనా దానికి చెందిన చరిత్ర ముఖ్యం. ఆ చరిత్రను భవిష్యత్ తరాలకోసం బద్రపరచడం అత్యవసరం, తరతరాలుగా వున్న దళితుల చరిత్ర సమగ్రంగా లేక పోవడమనేది తీవ్రమయిన లోటు అనే విషయం నిర్వివాదమయిన అంశం. ఆ లోటును కొన్ని కోణాల్లోనైనా పూర్తిచేసే ప్రక్రియకు తన కథానికలలో ప్రాణం పోసే ప్రయత్నం చేసి, అడుగంటుతున్న దళిత జాతుల చరిత్రను భద్రం చేస్తూ, 'అక్షరయజ్ఞం' చేస్తున్న గొప్ప కవి ఇనాక్ గారు. ఇతిహాసపు చీకటి కోణంలో అట్టడుగున పడి కన్పించని చరిత్రే దళిత చరిత్ర. ఈ చరిత్ర రాయ డానికి రక్తమూ, కన్నీరూ కలిపిన కొత్త సిరా కావాలి, ఆ సరికొత్త సిరాను తన కలంలో నింపి దళిత చరిత్రను 'కాకి, ఊరబావి, అస్పృశ్యగంగ, తలలేనోడు, సూర్యుడు తలెత్తాడు. ఇదా జీవితం, గులాబీ నవ్వింది, భవానీ

మొదలైన కథానికల్లో నిక్షిప్తం చేసిన వాస్తవ చరిత్రవాది ఆచార్య కొలకలూరి ఇనాక్.

ఈ కథలన్నీ దళిత నేపథ్యం చుట్టూ తిరుగుతూనే ఉంటాయి. తరతరాలుగా, అత్యంత హీనమయిన బతుకు బరువులను మోపిన బానిసేండ్లే దళితులు. ఆ దళితులు పందుల గూడుల్లాంటి గుడిసెల్లో మానాన్ని సైతం దాచుకోవడానికి పేలికైనా గతిలేక, ఆకలి, ఆవేదన, అవమానం, అంటరానితనం, నిరంతరం దోపిడీలచే బాధింపబడి, పీడింపబడి, ఇన్ని మెతుకులు గతకడానికైనా వీలులేక బ్రతుకుతున్న కోట్లాది భారతీయ బానిసల బాధల గాధయే, కన్నీటి గాధయే ఇనాక్ గారు తన కథానికల రూపంలో ప్రపంచానికి (చాటారు) అందించారు.

ఆచార్య కొలకలూరి ఇనాక్ కథానికలలో ఒక్కొక్క కథకు ఒక్కొక్క చారిత్రక నేపథ్యం ఉంది. ఇందులో సామాజికాంశాలకు సంబంధించిన కథలు, దళిత నేపథ్యానికి చెందిన కథలు, మానవత్వానికి సంబంధించినవి, రాజకీయ, ఆర్థికాంశాలకు సంబంధించిన అనేక కథల ద్వారా సమాజానికి సమున్నత సందేశాన్నిచ్చారు. అలా తన సందేశాత్మక కథానికల ద్వారా దళిత సమాజాల జీవన స్థితిగతుల్ని, దళిత, దళితేతర సమాజాలకు చేరువ చేస్తూ, వారి చరిత్రను శిలా సాదృశ్యంగా అక్షరబద్ధం చేసి, సామాజిక చైతన్యాన్ని సాధించడంలో వీరి ఊరబావి, అస్పృశ్యగంగ, కాకి, మొదలైన కథానికల నేకం. వాటిలో 'కాకి' కథానిక ఇతివృత్తాన్ని, మానవీయ కోణంలో దర్శిస్తే, 'కాకి' - ఈ కథలో ఇతివృత్తం భారతీయ వర్ణవ్యవస్థలో కులాల విభజనవల్ల అస్పృశ్య కులాలుగా చూడబడుతున్న జాతులు మాల, మాదిగ మొదలగు జాతులు. వీరు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా అన్ని రంగాల్లో అధోగతిని అనుభవిస్తున్న దౌర్భాగ్యజీవులు. అటువంటి వీరి బ్రతుకుబండి బహుభారంతో కూడుకున్నది. అటువంటి ఈ కులాలు ఆశ్రయ కులాలలని వీరిపై ఆధారపడిన 11 ఉపకులాలైన ఆశ్రితుల్ని పోషించాలని, మనవేద, పురాణాల వాక్కు, ఆశ్రిత కులాలను పోషించలేని పక్షంలో వారినుండి వచ్చే శాపం బహు భయంకరం. అటువంటి ఆశ్రయ, ఆశ్రిత కులాల సామాజిక జీవన నేపథ్యాన్ని సమాజానికి అందించడం.

భారత ఆదిమ జాతుల చరిత్రను పాశ్చాత్యులు ఒక పద్ధతిలో, నిర్లక్ష్యంచేస్తే, ఆర్య జాతులు ఇంకో పద్ధతిలో నిర్లక్ష్యం చేశారు. ఒక జాతిని, అణచివేయడం, అంటే వారి చరిత్ర మొత్తంగా తుడిచివేయడమనే భావన, ఆర్య జాతులకుంది. అందుకే అనార్య ఆదిమ జాతులను, వారి చారిత్రక గుర్తులను శిధిలం చేయడానికి వారు ప్రయత్నించారు. ఆ శిథిలమైపోయిన గుర్తులను వెలుగులోనికి తెచ్చే ప్రయత్నం కవి ఈ కథలో చేశారు.

ఈ కథలో ఒక ఇంట్లో ముసలమ్మ, ఆమె కూతురు, మనుమడు ఉన్నారు. ఆ ఇంటి పైకప్పు పైన, చుట్టూ వున్న చెట్లమీద కాకుల గుంపు చేరి వారిని తిడుతున్నట్లుగా, కోపంగా అరుస్తూ, ఆ ఇంట్లో నుండి ఎవరు బయటకొచ్చినా మాడు పగిలేటట్లు పొడుస్తూ, తమ ప్రతీకారాన్ని ప్రకటిస్తూ గోల చేస్తున్నారు. అప్పుడు అవ్వ బయటకు వెళ్ళబోయిన మనుమడి చెయ్యిపట్టి లాగి "కాకులు మాలావు కోపంగా వున్నాయి యెల్లకు, యెలితే రక్తం కళ్ళ జూడందే వదలవు" అంటూ 'ఇదంతా అడిపనే' నంటుంది అవ్వ.

ఎవడాడు? ఏం జేశాడు? అని ప్రశ్నించిన మనుమడికి ఇంకెవరు "బండోడు" అని "వాడు మన గుడిసె ముందు తల, కాళ్ళు, గోళ్ళు పీకిన కాకి ఈకలు కట్టిన పురికొస పడేశాడు, ఈ పని ఆడుతప్ప మరెవ్వరూ చెయ్యరం"ది. అవ్వ, ఎవరీ బండోడు? ఎందుకు చేశాడీపని అనే ప్రశ్న మనుమడి ద్వారా కవి అడిగింది అవ్వ ద్వారా పాఠకుడికి జవాబిస్తారు.

అన్ని కులాల, వర్గాల వారిలో ఆశ్రయ కులాల వాళ్ళు వున్నారు. అవర్ణ కులంలో ఆశ్రితులున్నారు. వారిని ఆశ్రయ కులాలు పోషించాలి. ఆశ్రితులు పోషింపబడాలి. అందుకు ప్రత్యుపకారంగా, ఆశ్రితులు వాళ్ళ కుల

పురాణం మౌఖికంగా కాపాడతారు. పిండితార్ధం, కుల పురాణం చెప్పకుంటూ యాచిస్తుంటారు. అలా ఆశ్రితులుగా యాచిస్తూ, ఆశ్రయ కులమైన మాదిగల దగ్గర మాత్రమే యాచన చేస్తూ బతికే పదకొండు ఉప కులాల్లో పదో ఉపకులం వాళ్ళు ఈ బండోళ్ళు. ఈ బండోళ్ళు రోజులో ఒక్క ఇంటివారినే అడుగుతారు. అదీ మా పటేలే అడుక్కుంటారు. యాచనకు వచ్చేటప్పుడు ఏమీ తెచ్చుకోరు, వట్టి చేతులూపుకుంటూ వస్తారు "అమ్మా! బువ్వపెట్టు తల్లీ!" అంటారంతే.

ఆ ఇంటి వాళ్ళు అలా వచ్చిన బండోళ్ళకు లేదు అని అనకూడదు. ఎందుకంటే వీళ్ళు ఆశ్రయ కులాలవారు, వాళ్ళకు ఆశ్రయం కల్పించాలి. పోషించాలి, ఎవ్వరికైనా లేదనొచ్చు గానీ వీళ్ళు అడిగితే లేదని మాత్రం అన కూడదు. అన్నాన్ని చేతుల్లో పెట్టాలి. అది కింద పడకుండా తింటాడు. వాడి కడుపు నిండినా, లేక ఇంటివాళ్ళు తెచ్చిన అన్నం అయిపోయినా "అమ్మా! నీళ్ళు తల్లీ!" అంటాడు. నీళ్ళు పోయాలి. పోస్తే తాగి వెళ్ళిపోతాడు.

ఆశ్రిత కులాలైన బండోళ్ళు, మొండోళ్ళకు వున్న నియమాలవి. మాపటేల ఒక ఇంటివాళ్ళనే బువ్వ అడగటం, ఎప్పుడు తెచ్చి పెడతారోనని ఇంటిముందే కూర్చుంటాడు, పెడితే తింటాడు. లేకపోతే బండోడితో గొడవే! ఏమీ అనడు కాకుల్ని ఉసిగొల్పుతాడు.

గోలీ చూపుడువేలి క్రింద అదిమిపట్టి, వేలు విసురు కుంటున్నట్లుగా విసురుతాడు. కాకి క్రింద పడుతుంది. అలా తెలివైన కాకి, ఎవరి చేతికీ చిక్కని కాకి, వాడి గోలీ దెబ్బకు చిక్కి చస్తుంది. అలా చిక్కిన కాకి తల, కాళ్ళు, గోళ్ళు, ఈకలు పీకి ఇలా ఇంటిముందు పడేస్తాడు. అప్పుడైనా ఆ ఇంటివారు అన్నం పెడితే వాటిని దూరంగా తీసి పారేస్తాడు. లేకపోతే ఆ కాకుల గుంపు ఆ ఇంటి వారిపై దాడిచేస్తాయి. తోటి కాకిని చంపిన హంతకుడు ఈ ఇంటిలోనే వున్నాడని భావిస్తూ. వాటిని ఎవ్వరూ తీయడానికి వీలులేదు, అది నియమం. వాడు తప్ప ఎవరైనా తొలగిస్తే అది దోషం, అది పురాణాల ఘోష. ఈ భూ ప్రపంచంలో కాకిని కాల్చుకుని తినేవాడు వాడొక్కడే, వాడి రూపం కూడా వాటిలాగే ఉంటుంది. ముళ్ళకంపలాంటి రేగిన జుట్టుతో భయంకరంగా వుండేవాణ్ణి చూస్తేనే కాకులు పరారౌతాయి. ఒకవేళ వాడిమీద దాడి చేయాలని దగ్గరకొస్తే రేగిన ముళ్ళకంప లాంటి వాడి జుట్టులో చిక్కి వాడికి ఆహారమౌతాయి. అందుకే అవి వాడిని చూస్తేనే పరారౌతాయి.

కాకుల గుంపు ఇంటిముందు ఇలా దాడికి దిగాయి అంటే ఆ ముందురాత్రి ఆ ఇంటివాళ్ళు బండోడికి అన్నం పెట్టలేదని అర్థం. ఆ అవ్వ వాళ్ళు అన్నం పెట్టకపోవడానికి కారణం ఆర్థికంగా స్థితిలేకపోవడం. అవ్వ అల్లుడు రోడ్డు పనికి చేబ్రోలు పోయి వారమయింది. ఆయన వస్తూ వెచ్చాలు తెస్తేనే పండేది, వాడికి పెట్టగలిగేది, కానీ అల్లుడు రాలేదు. నిన్నటికే మూడు రోజుల నుండి అవ్వ ఇంట్లోని పొయ్యిలో పిల్చి లేవలేదు. వారికి లేక వాడికి అన్నం పెట్టలేదు. కానీ బండోడికి ఇవన్నీ పట్టవు.

ఆ ఉదయం కూడా ఆ ఇంటివాళ్ళు అన్నం పెట్ట నందున, వాడు ఆ కాకిని కాల్చుకుని తిని, సాయంత్రం ఆ ఇంటి ముందుకు వచ్చి వేళ్ళు విరుచుకుంటూ "అమ్మా బువ్వబెట్టు తల్లీ!" అని అడగనే అడిగాడు. ఇంటిలో ఉదయం నుండి తలుపులు బిగించుకొని కూర్చున్న అవ్వ భయపడుతున్నంతా అయ్యింది. వాడు అడగనే అడిగాడు, లేదు, అన్నం పెట్టలేదు, లేక పెట్టలేదు, కానీ దానికి వాడిచ్చే శాపం తలుచుకుంటే భయంకరం. అవ్వ ఏడుస్తుంది. తను బుబ్బ పెట్టలేదు, వాడు శాపం పెడతాడు.

బండోడు కాకీకల కట్ట పంచబొంగుకు కట్టాడు. అర గని కాని మాంసం ముక్కలు ముక్కలుగా కక్కాడు. కాకి మాంసం కంపు, రోత, అరగని, జీర్ణంకాని ముక్కలు మరింత నీసు! ముక్కు పగిలే దుర్గంధం, కక్కిన బండోడు వెళ్ళిపోయాడు.

రేపు ఉదయం మళ్ళీ కాకుల గుంపు వస్తే బండోడు కక్కిన మాంసం మీద కంపు పోవడానికి మట్టిపోసి

కొప్పెట్టకూడదు. ఒక ఆ ఇంట్లో కాపురం వుండకూడదు. పంచకు కట్టిన కాకీకల కట్ట తీయకూడదు. ఆ ఇల్లు పాడుబెట్టి తీరాలి. ఎవరూ ఆ ఇల్లు వాడరాదు, ఉండకూడదు. దానికి వ్యతిరేకంగా కక్కుడు మీద మట్టి పోసినా, కాకీకల కట్ట తీసినా, ఇల్లు పాడుబెట్టక పోయినా అనర్థం, పీనుగ లేస్తుంది. అన్నం పెట్టకపోతే ఇంత శాపమా? ఇంత పగా?. ఒకవేళ కాకులు రాకపోతే మాత్రం అలికి ముగ్గులు పెట్టి, పొయ్యి ముట్టించి వండొచ్చు. తినొచ్చు, ఉండవచ్చు. అయితే ఆ ఇంటిమీద కాకి వాలదు, బండోడూ ఇక ఎన్నడూ రాడు. "అమ్మా! బువ్వ బెట్టు తల్లీ!" అని అనడు. అంతవరకైతే విముక్తి కానీ, ఆ విముక్తి పల్లెలో వారి కుటుంబానికి శాపం. ఇక ఆ ఇల్లు కాకి వాలని ఇల్లు, బండోడు బిచ్చం అడగని కొంప. అది అవమానం, అది వెలి.

ఈ కథలో కవి ఇనాక్ గారు సమాజంలో ఆర్థికంగా, అన్ని రంగాల అణగారిన ఈ మాదిగలు ఒకప్పుడు ఆశ్రయం కల్పించిన వారై, పాలకులై ఉండొచ్చు. ఆశ్రితుల్ని పోషించి ఉండొచ్చు. కానీ నేడు, చాలామంది పేదలు, నిరుపేదలు, రైతు కూలీలు, నోటికీ, చేతికీ వెతుక్కునేవాళ్ళు, ఏమీ లేనివాళ్ళు ఆశ్రితులైన 11 ఉపకులాల వాళ్ళను పోషించి తీరాలని కుల పురాణాలు, శాసనాలు చేస్తే, ఆ శాసనాల్ని అమలుపరచలేక శాపాల పాలౌతున్న జాతి మాదిగ జాతి. దానం చేయడం వీళ్ళకు గర్వ కారణమే, కానీ లేమి?. దానం చేయపోతే, ఆ నియమాలు చాలా కఠినాలు.

ఈ మాదిగలు సమాజంలో అనర్హులుగా ఒక అవస్థ, పేదలుగా మరో అవస్థ, శాపగ్రస్తులుగా వేర్కొ అవస్థ, కోలుకోలేని ఈ అవస్థల కూపంలో కూరుకుపోవడం వీళ్ళ దౌర్భాగ్య జీవితానికి నిదర్శనం. ఈ దయార్ద్ర జీవితాలను సామాజిక దృక్పథంతో, మానవతా కోణంలో ఈ ఉదంతాన్ని తన కథానికలో వివరించాడు. సామాజిక కోణంలో కవి 'కాకి' కథానికలలో వివరించారు.

దళిత సాహిత్యంలో నిబిడీకృతమైన అంశం సాంఘిక సమస్య. ఇది మానసికమైనది. మానవత్వానికి గాయమయ్యే విషయం. చట్టాలకు శాసనాలకు అతీతమైనది. ఒక సమాజం మరో సమాజాన్ని హీనంగా చూచినప్పుడు ఆ హైన్యాన్ని అనుభవించే ప్రజలు ఎంత సంక్షోభితులు అవుతారో, ఆ భావజాలమంతా అభివ్యక్తీకరించబడితే అది సాహితీ సముద్రం అవుతుంది. ఆ సంక్షోభితుల జీవితాల్ని సాహితీ సముద్రపరం చేసిన సాహితీ త్రివిక్రములు ఇనాక్ గారు.

ప్రజా జీవితాల్ని ఆకళింపు చేసుకుని సాహిత్యం ద్వారా బలమైన గొంతుకల్ని వినిపించిన బోయి భీమన్న, కుసుమ ధర్మన్న, డా॥. బి.ఆర్. అంబేడ్కర్‌ల ఆశయ సాధనలో ప్రపంచాన్ని అడుగడుగునా ఆకళింపు చేసుకుంటూ, దేశకాల స్థితిగతుల్ని అవగాహన చేసుకుంటూ తమ జాతి జనుల కడగండ్లను తొలగించడం కోసం నిత్యం విజ్ఞాన గనిని, ఉద్యమాల స్ఫూర్తిని ఇస్తున్న మరో స్వరం ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు.

బానిసలైన ఇశ్రాయేలీలను ఫరో నుండి విముక్తం చేయడానికి నాయకుడై నడిపించిన మోషే వలే, మరియు ఈ దేశపు ఆదిమవాసులైన, బడుగు, బలహీన, హరిజన, గిరిజన, మైనారిటీ వర్గాల ప్రజా జీవితాల్లో స్వేచ్ఛా, సమత, మమతల స్థాపనపై నిర్విరామ కృషి సల్పిన డా॥. బి.ఆర్. అంబేడ్కర్ వలే, అన్ని దశల్లో అధోగతిని అనుభవిస్తున్న అణగారిన కులాల ప్రజల పక్షాన నిలబడి బలమైన 'పాళీ'ని దూసిన సమసమాజాభివృద్ధి కాంక్షకుడు కొలకలూరి ఇనాక్.

మానవ జాతి ప్రయోజనం కోసం, సామాన్యులు మహాత్మల అవతారాలెత్తుతారనేది ఎంత సత్యమో, దళిత జాతి చైతన్యానికి సాహిత్యాయుధం సమాజంలో బలమైన గొంతుకతో కేకవేసిన కవిగా (ఇనాక్) వీరు ప్రసిద్ధులు. ఆ కేక తల్లి పురిటి నొప్పుల నుండి బయటపడ్డ నాటినుండే మొదలైంది. ఆ కేక నేడు 'కాకి'గా మారి ఎందరో దళితుల ఏడుపును జోకొట్టే పాటైంది. మాటైంది. అడుగడుగునా దళిత జాతులకు పూల బాటైంది.

ఆధార గ్రంథాలు :

1. కట్టెల మోపు - డా॥. కత్తి పద్మారావు
2. కాకి - ఆచార్య కొలకలూరి ఇనాక్
3. దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు - సి.వి. (చిత్తజల్లు వరహాల రావు)
4. దళితుల చరిత్ర 1, 2, 3, 4 భాగాలు - డా॥ కత్తి పద్మారావు
5. దళితుల చరిత్ర - సంస్కృతి - డా॥. పిల్లి శాంసన్
6. భూమిభాష - డా॥. కత్తి పద్మారావు
7. వీరమాత విశ్రాంతమ్మ - శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ గారి తృతీయ వర్ధంతి సంచిక
8. సాహిత్య దర్శని - వ్యాస సంపుటి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

సాహిత్యంలో చారిత్రక నాటకాల విశిష్టత – విశ్లేషణ

– మంతెన జ్యోతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగు సాహిత్యంలో నాటక ప్రక్రియకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. నాటక ప్రక్రియ ప్రధానంగా మూడు రకాలయిన ఇతివృత్తాలతో నలుదిశలా ప్రసరించింది. ఆ విధంగా పౌరాణిక, చారిత్రక, సాంఘిక కథనాలతో కూడిన ఈ దృశ్య కావ్య ప్రక్రియ బహుళ ప్రదర్శనల ద్వారా ప్రేక్షక లోకాన్ని చైతన్యవంతం చేసింది. చారిత్రక నాటక విభాగం జాతిసేవలో విశిష్టమైన పాత్రను నిర్వహించింది.

చారిత్రక నాటక నిర్వచనం :

చరిత్ర ఎప్పుడు యథాతథంగా నాటకంలో కనబడదు ఒక ఘట్టానికి సంబంధించిన చరిత్ర సంపూర్ణంగా లభించడం కూడా కష్టం. ఒక వాక్యంలో నున్న చరిత్రకాంశం ఆ రచయిత కాలంలో రెండు వందల పుటల నాటకంగా విస్తరించవచ్చు. కాని ఆ రచన మూలాంశానికి విఘాతం కల్గించేదిగా ఉండకూడదు.

ఒక వాక్యంలోని చారిత్రకాంశానికి భిన్నం కాకూడదు. ముఖ్యంగా ఆ చారిత్రక ఘట్టానికి ఆయువు పట్టు అయిన నాయకునికి సంబంధించిన విషయం ఆ నాటకంలో వ్యతిరేకముఖంగా విస్తరించకూడదు. ఈ తరహా రచనలకు 'రాణి సంయుక్త' చారిత్రక నాటకాలు ఉదాహరణగా చెప్పవచ్చు.

అయితే శాసన ప్రమాణాలు ద్వారా రాజులు చేసిన కొన్ని మహత్తర కావ్యాలు మనకు తెలియ వస్తుంటాయి. ఆయా అంశాలకు చెందిన పూర్వాపర సందర్భాలు మాత్రం విశదం కాకపోవచ్చు. ఆ సమయంలో రచయితకి ఆ కార్యాలకు గల కారణాలను కల్పించుకునే అవసరం ఉంటుంది.

అంతేకాకుండా కార్యకారణ సంబంధాలను సమన్వయం చేసిన కొన్ని మహతర్తర కావ్యాలు మనకు తెలియ వస్తుంటాయి. ఆయా అంశాలకు చెందిన పూర్వాపర సందర్భాలు మాత్రం విశదం కాకపోవచ్చు. ఆ సమయంలో రచయితకి ఆ కార్యాలకు గల కారణాలను కల్పించుకునే అవసరం ఉంటుంది.

అంతేకాకుండా కార్యకారణ సంబంధాలను సమన్వయం చేయుడానికై రచయిత కొంత కల్పన చేయవలసి ఉంటుంది. అటువంటప్పుడు మౌలికమైన చారిత్రకాంశాలు మాత్రం దెబ్బతినకుండా చూసుకోవాలి. రామరాజు చరిత్రలో పఠాణి పాత్ర అటువంటిదే. కోలా చలం వారు రామరాజుకు పిఠాణీకి గల సంబంధాన్ని కల్పించడమైకాకుండా రామరాజు పంపిన సంగీత విద్వాంసుణ్ణి తురుష్కులు అనుమానించాడంటే యుద్ధానికి రంగం సిద్ధం అయినట్లు కథను సృజించారు.

చారిత్రక నాటక స్వభావాలు :

చారిత్రక నాటకంలో మూడు అంశాలు ప్రధానంగా ఉండాలి. 1. నిర్దిష్టమైన చారిత్రకాంశం, 2. రచనా శిల్పం, 3. ప్రదర్శనానుకూలం.

ఈ ప్రక్రియలో ఈ మూడు అంశాలు సమప్రాధాన్యాన్ని సంతరించుకుంటాయి. ఈ మూడు అంశాలలో మొదటి అంశం రచయిత ఎన్నుకునే చారిత్రక ఘట్టం మీద ఆధారపడి యుంటుంది. గజిబిజిగా వున్న సందేహాలతో కూడిన చారిత్రక ఘట్టాన్ని తీసుకొని రచయిత నాటకీకరించనట్టయితే ఆ రచయిత ఎంతటి ప్రతిభామూర్తి అయినా ఆ నాటకంలో కథ సంవిధానశిల్పం సంతరించదు.

నిర్దుష్టమైన చారిత్రక ఘట్టం రచయితకి లభించినప్పుడు అతడు తన ప్రతిభను రచనా చాతుర్యంతో నాటకీయతా శిల్పంలో ఆ దృశ్య కావ్యాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగల్గుతాడు. తాను ఆ ఘట్టం ద్వారా

రచన ద్వారా సమాజానికి అందించదలచుకున్న సందేశాన్ని సంపూర్ణంగా ప్రజాహృదయాల్లో గూడు కట్టుకునేట్టు అందించగల్గుతాఉడ. శాశ్వతమైన కీర్తిని చిరంజీవి అయిన తన చారిత్రక దృశ్యకావ్యం ద్వారా లోకంలో పొందగల్గుతాడు.

కాబట్టి ఒక చారిత్రక నాటకంలో పైన పేర్కొన్న మూడు లక్షనాలు త్రివేణి సంగమంగా, త్రిగుణబద్ధంగా ముప్పేటజడగా సమ ప్రాధాన్యంతో ఒప్పినప్పుడు ఆ రచన సర్వాంగ సుందరంగా భాసించగల్గుతుంది. లోకంలో రామబాణం లాగా ప్రదర్శనాదుల ద్వారా వ్యాపింప గల్గుతుంది.

చారిత్రక నాటకావతరణం :

కోలాచలం శ్రీనివాసరావు గారు చారిత్రకాంశాన్ని గ్రహించి 'సుఖమంజరీ పరిణయ' మనే నాటకాన్ని 1895వ సంవత్సరం నాటికి రచించారు. ఈ రచనను 1896వ సంవత్సరంలో కోకనాడ (నేటి కాకినాడ) నుండి ప్రకటించారు. కాని ఇందులోని చారిత్రక వ్యక్తుల పేర్లు మారిపోయినాయి. పృథ్వీరాజు ప్రద్యుమ్నుడయాడు. ఈమె తావలచిన వరుని ప్రతిమ మెడలో పూలమాల వేసి స్వయంవరంలో వరించడం చారిత్రకాంశం. ఈ అంశం మినహా మిగిలిన విషయాలన్ని ఈ నాటకంలో చరిత్రకు భిన్నంగా, కథకు అనుగుణంగా సాగాయి. అనేక కల్పిత సన్నివేశాలే రచనలో చోటు చేసుకున్నాయి. చరిత్రలో ఘట్టం దుఃఖాంతంగా ఉండగా వీరు సుఖాంతంగా మార్చారు. ఈ విధంగా ఈ నాటకం చారిత్రక నాటక లక్షణాలను సంతరించుకోకపోయినా చారిత్రకాంశం తీసుకొని రచించిన తొలి తెలుగు నాటకంగా పేర్కొనవచ్చు.

తర్వాత 1897వ సంవత్సరములో ప్రతాపరుద్రీయం నాటకం వెలువడింది. ఈ నాటకాన్ని తమ తండ్రి గారు చెబుతుండిన ఒక ఐతిహ్యం ఆధారంగా తీసుకొని రచించామని వేదం వారే తమ నాటక పీఠికలో చెప్పుకున్నారు. తర్వాత చారిత్రకారులు పరిశోధన వల్ల ప్రతాపరుద్రుడు ఢిల్లీ సుల్తాన్‌కు పట్టుబడిన విషయం మాత్రం చారిత్రకమని తేలింది. చరిత్రలో ప్రతాపరుద్రుడు ఢిల్లీలో సుల్తాను కొలువు చేరకముందే మార్గమధ్యలో నర్మదా నదీ తీరములో ఆత్మహత్య చేసుకున్నట్టు చరిత్రలో వ్రాయబడింది.

నాటకంలో యుగంధర మంత్రి ప్రతాపరుద్రుణ్ని ఢిల్లీ సుల్తాన్ చెఱనుండి బంధవిముక్తుణ్ణి చేసినట్లుంది. అంతేకాక ఢిల్లీ సుల్తాన్‌ను కూడా బందీగా ఓరుగల్లు నగరానికి యుగంధర మంత్రి తన ప్రజ్ఞాబలంతో తీసుకు వచ్చినట్లు, అతడితో సంధి కుదుర్చుకుని వదలి పెట్టినట్లు రాసివుంది. ఈ విషయాలన్నీ చరిత్ర నుండి భేదిస్తున్నాయి. ప్రతాపరుద్రుడు బంధవిముక్తుడు అయినట్లు ఐతిహ్యం జీవించడానికి పరిశోధకులు వారికి లభించిన ప్రమాణ వాక్యాలను అపార్థం చేసుకోవడమే కారణమని ఆ ప్రముఖ పండితులు తర్వాతి కాలంలో తేల్చి చారిత్రక సత్యాలను తెలిపారు.

ఈ విధంగా ప్రతాప రుద్రీయమనే తొలి చారిత్రక నాటకంగా పలువురు పేర్కొన్నారు. ఈ నాటకావతరణంలో చారిత్రక నాటకం మరికొంత స్పష్టతను సంతరించుకుంది. ప్రతాపరుద్రుడు ఢిల్లీ సుల్తాన్‌కు పట్టుబడిన చారిత్ర కాంశాన్ని వివరించింది.

1897వ సంవత్సరములో పి. శ్రీనివాసాచారి గారు ''శివాజి'' అనే చారిత్రక నాటకాన్ని రచించారు. ఈ నాటకమే తొలి చారిత్రక నాటకంగా నిలుస్తుందని పి.ఎస్.ఆర్. అప్పారావు గారు తమ సిద్ధాంత వ్యాసం అయిన తెలుగు నాటక వికాసంలో పేర్కొన్నారు. కాని ఈ నాటక ప్రతి లభించే వరకు ఈ రచనలోని చారిత్రక గూర్చి వివరించడం కష్టం.

కాళ్ళకూరి సాంబశివరావు గారు రంగవాక కదన సమవాకారమనే బొబ్బిలి రూపకాన్ని 1899వ సంవత్స రములో రచించారు. చారిత్రక రూపక లక్షణాలన్నీ ఈ రచనలో సంపూర్ణంగా ఉండడంచే చారిత్రక ఘట్టాన్ని చారిత్రక రూపకంగా దీన్ని భావించవచ్చు. సమవాకరమే

అయిన నాటకానికి కావలసిన కథా విస్తృతి ఈ రచనలో నుండి మూడంకెలతో అనేక రంగాలతో ఈ రచన ఒప్పింది. తర్వాత వెలువడిన బొబ్బిలి యుద్ధ నాటకాలకు ప్రథ రూపకంగా నిల్చింది.

1899-1900 సంవత్సరముల మధ్య కాలంలో కోలాచలం శ్రీనివాసరావు గారు సుల్తానా చాంద్‌బీ అనే మరొక నాటకాన్ని రచించారు. మొదట బీజాపురాన్ని తర్వాత అహమద్ నగరాన్ని బాలుర తరపున రాజ్యం చేసి కీర్తి ప్రతిష్టల నార్జించిన సుల్తానాచాంద్‌బి రాజకీయ జీవితాన్ని నాటకం ప్రదర్శిస్తోంది. ఇందలి ముఖ్య సన్ని వేశాలన్ని చరిత్ర నుండి తీసుకున్నారు. ఈ విధంగా సుల్తానాచాంద్‌బి నాటకావతరణంతో చారిత్రక నాటకం పరిపూర్ణ లక్షణాలను కలిగివుంది.

ధర్మవరం వారి రోషనార శివాజి నాటకం కూడా ప్రతాప రుద్రీయ రచనా కాలంలోనే వెలువడినట్లు తెలుస్తుంది. ఈ నాటకంలో రోషనారా కథ, ఐతిహ్యం ఆధారంగా రచింపబడినది.

కొప్పరపు సుబ్బారావు గారి రోషనార నాటక పంచమ ముద్రణ బట్టి (1923) ఈ నాటకం ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలోనే రచింపబడిందని భావించవచ్చు. శివాజీని గూర్చి అనేక చారిత్రకాంశాలతో అతడి ప్రవృత్తికి, శీలానికి భిన్నం కాని రీతిలో ఈ నాటక రచన సముచింగా సాగిందని చెప్పవచ్చు.

ఈ నాటకాలన్నింటికన్నా పూర్వమే కోరాడ రామచంద్ర శాస్త్రి గారు 'ముద్రా రాక్షస' నాటకానువాదం చేసినట్లు తెలుస్తుంది. అది కేవలం అనువాద నాటకం అనువాద చారిత్రక నాటకాల్లో తొలి నాటకంగా ఆ రచనను పేర్కొన వచ్చు.

1930-1939 మధ్య కాలంలో సుమారు 30 చారిత్రక నాటకాలు వెలువడ్డాయి. వీటిలో సుమారు పది పన్నెండు నాటకాలు ఇతర భాషల నుంచి అనువాదం చేయబడిన నాటకాలు ఉన్నాయి.

వేలూరి చంద్రశేఖరం గారి 'కాంచనమాల' (1539)కు అశోకుని కాలం నాటి కథ ఆధారం. అశోక చక్రవర్తి భార్య తిష్యరక్షత తన సవతి కొడుకుపై ప్రేమించి తిరస్కరించ బడుతుంది. ఆ పరాభానికి అతని మీద నిందమోపి కుణులుని కనులు తీయించి కక్ష తీర్చుకొంది. కాంచన మాల నాటకం 1938వ పింగళి నాగేంద్రరావు గారి నిర్వా హణలో బందరులో ప్రదర్శింపబడింది. దేశకాల పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని తయారుచేసిన నాటకం నాటక రంగంలో కొత్త ఒరవడి సృష్టించిందని శ్రీ చాట్ల శ్రీరాములు గారు రచించిన వ్యాసం ద్వారా తెలుస్తుంది. అనువాద నాటకాలు మాచిరాజు దర్గాశంక రామాత్య గారి శంభాజీ నిర్మాణం (1931) కోటమర్తి చినరఘుపతి రచించిన చితోడు పతనం (1935) ఈ కాలంలోనే వచ్చాయి.

విశ్వనాథ సత్యనారాయణ గారి 'త్రశూలం'' (1937) సాహిత్య దృష్ట్యా మంచి నాటకమే గాని ప్రదర్శనను కూలతలేని నాటకాల జాబితాలో చేరుతుంది. వీరి శైవమతానికి ఆదిపురుషుడు అయిన బసవేశ్వరుడు కల్యాణి నగరాన్ని పరిపాలించే కాలచూరి వంశస్థుడైన బిజ్జలుని జైనమతాభిమాని ద్ధ మంత్రిగా ఉంటూ వీరశైవ ప్రచారానికి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తాడు. అతని చేష్టలకు ఆగ్రహించి బసవేశ్వరుని శిక్షించపూను కుంటాడు బిజ్జలుడు. కాని వీరశైవులు మతావేశంలో బిజ్జలుని సంహరించి, కల్యాణ నగరాన్ని పీనుగుల పెంట చేస్తారు. అన్యమతాద్వేషం, మూఢభక్తి జాతి పతనానికి, సంఘ వినాశనానికి ఎలా దారి తీస్తాయో అనాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను చక్కగా విశదీకరించారు విశ్వనాథ వారు త్రిశూలం నాటకంలో.

ఖిల్జీ రాజ్య పతం :

ఈ దశకంలో వెలువడిన చారిత్రక నాటకాలలో ప్రదర్శనయోగ్యమైన రంగస్థల నాటకాలను రచించిన వారిలో శ్రీ గుండిమెడ వెంకట సుబ్బారావు అగ్రగామి. ''రాణా ప్రతాప్'' నాటకకర్తగా యిదివరకే ప్రసిద్ధికెక్కారు. వీరు రచించిన 'మే వాడు పతనం' (1935) ఖిల్జీ రాజ్య

పతనం (1931) ఆంధ్రరంగస్థలిపై విరివిగా ప్రదర్శించబడి బహుళ జనాదరణ పొందిన నాటకాలు. అల్లాఉద్దీన్ గుజరాత్ రాజును యుద్ధంలో ఓడించి, గుజరాత్ మహా రాణి కమలాదేవిని చెరపడతాడు. ప్రతీకారాగ్నితో ప్రజ్వరిల్లి మహారాణి అల్లావుద్దీన్‌ను ప్రేమిస్తున్నట్టు నటించి అతన్ని సర్వనాశనం చేసి కసి తీర్చుకోవడం ఖిల్జీ రాజ్యపతనంలోని ఇతివృత్తం దృశ్యరూపంలో కథను నడిపించడంలో రసజ్ఞులను ఆకర్షించే విధంగా శిల్పనైపుణ్యం కనబరిచారు నాటక రచయిత.

శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు రచించిన 'ఉచ్చుల విషాదం (1933) మత్తిరాజు సుబ్బారావు గారి 'రణ తిక్కన' (1938) సోమరాజు రామానుజరావు గారి 'ధరణికోట' (1931) కూడా పేర్కొనదగిన చారిత్రక నాటకాలు. 1940-49వ సంవత్సరంలో 16 చారిత్రక నాటకాలు వెలు వడ్డాయి. కీ.శ. వేదం వెంకటరాయశాస్త్రి గారు ప్రతాప రుద్రీయంలో పేరిగాడికి, చాకలిలచ్చి,త ఉరకలు తదితర పాత్రలు పాత్రోచిత భాషను వారి సాహిత్యంలో తొలి ప్రయోగం చేశారు. పాటలు కూడా పాత్రోచిత భాషలోనే వ్రాశారు. కాని పద్యాలు దగ్గరకు వచ్చేసరికి తారక ప్రభువులుకు కూడా (వలీఖాన్ వగైరా పాత్రలకు) సలక్షణ మైన పద్యాలే వాడారు. అయితే ఈ నాటకంలో శ్రీ ఊటుకూరు వారు ఒక్క అడుగు ముందుకుపోయి శకారుని పద్యాలు కూడా పాత్రోచితంగా వ్రాయడం గమనార్హం.

ఉత్తమత చారిత్రక నాటకాలు :

కణ్యశ్రీ గారి "ఆనాడు" (1948), "అజాత శత్రు" (1948) శ్రీపాద సుబ్రహ్యణ్య శాస్త్రి గారి "రాజరాజు" (1944), శ్రీ దర్భా వెంకటకృష్ణమూర్తి గారి "విషాద తిమ్మరసు" (1946), శ్రీవావిలాల సోమయాజులు గారి "నాయకురాలు" (1946), శ్రీ కోటగిరి వెంకట కృష్ణారావు గారి "పారుషా పరాభవం", "బెబ్బులి" (1943) నాటకాలు ఈ దశాబ్దంలో ప్రేక్షకులను రంజింపచేసి ఆదరించబడిన ఉత్తమ చారిత్రక నాటకాలు శ్రీ పి.యస్.ఆర్. అప్పారావు గారి "తాజ్‌మహల్" (1942) ఈ కాలంలోనే వెలువడింది.

చారిత్రక నాటక రచన ఈ దశాబ్దంలో దాదాపు అంతమైనట్లు ఆ తర్వాత కూడా కొందరు రచనలు చేసినప్పటికి రంగస్థలాన్ని స్పృశించినవి లేవనే చెప్పాలి. పాఠ్యగ్రంథాల కోసం ఈనాడు కూడా కొందరు వ్రాస్తూనే వుంటారు. అవి కేవలం విద్యాబోధనకు, గ్రంథాలయంలో భద్రంగా దాచుకోవడానికే పరిమితమవుతున్నవి.

చారిత్రక నాటక రచన మీద 1948 తర్వాత రచ యితలు మొగ్గు చూపకపోవడానికి బలమైన కారణం ఒకటుంది. జాతీయోద్యమంలో ప్రజలలో చైతన్యం తీసుకురావడానికే చారిత్రక నాటకం అవసరం వచ్చింది. స్వాతంత్ర్యం సిద్ధించాక చారిత్రక నాటకాలకు 1947 తర్వాత ప్రాముఖ్యత పడిపోయినది. అది గుర్తించిన రచయితలు చారిత్రక రచనలను ఉద్యమించలేదు. సాహిత్య దృష్ట్యా ప్రదర్శన దృష్ట్యా ఉన్నత ప్రమాణాలు గల పాత నాటకాలను ప్రజలు ఇప్పటికీ ఆదరిస్తూనే ఉన్నాయి.

1950-59లో 25 చారిత్రక నాటకాలు వెలువడ్డాయి. వీటిలో రాయప్రోలు సుబ్రహ్మణ్యం గారు రచించిన "కొండవీడు" (195)0, నండూరి బంగారయ్య గారి "ఆంధ్రతేజం" (1955), చిల్లర భావ నారాయణ గారి "ఉమరఖయ్యాం" (1957). కార్యశ్రీ గారి "విక్రమాధిత్య" మొదలైనవి రంగస్థలం మీద రాణించిన ప్రసిద్ధ నాటకాలు.

ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన చారిత్రక నాటకాలు ప్రస్తుతం ఖర్చుతో కూడుకున్నవి కావటం చేత పథ్య నాటకాలు మీద మోజు తగ్గటం వల్ల తదితర కారణాల రీత్యా చారిత్రక నాటకాలు అంతగా రావటం లేదు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

దళితవాద కవిత్వం – శీర్షికాశిల్పం పరిశీలన

– ఆర్. భార్గవి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ.

తెలుగులో దళిత సాహిత్యానికి ప్రత్యేకస్థానం ఉంది. 20వ శతాబ్దం ప్రారంభం నుండి దళిత స్పృహతో సాహిత్యం వెలువడినప్పటికీ, 1985 కారంచేడు సంఘటన తర్వాత దళిత వాద సాహిత్యం ఉద్యమం రూపాన్ని సంతరించుకుంది. ఇందులో కవిత్వానిది ప్రధాన పాత్ర. పరిశోధనా రంగంలో కూడా దళిత సాహిత్యంపైనా, ముఖ్యంగా కవిత్వంపైనా అనేక కోణాలలో పరిశోధన జరిగింది. అయితే వీటిల్లో ఎక్కువ భాగం వస్తువులు కేంద్రంగా చేసుకున్నవే. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారి పర్యవేక్షణలో పిహెచ్.డి. పరిశోధక విద్యార్థిగా చేరిన నేను దళిత కవిత్వంలో నిర్మాణ శిల్పాన్ని పరిశీలించాలనే ఉద్దేశంతో "దళిత వాద కవిత్వం వస్తు శిల్ప సమాలోచన" అనే అంశాన్ని పరిశోధనకు ఎంచుకున్నాను. నిర్మాణ శిల్పంగాలలో 'శీర్షిక' ప్రధాన అంగం. కాబట్టి 'దళితవాద కవిత్వం - శీర్షికాశిల్పం' అనే అంశంపై పరిశోధన వ్యాసాన్ని సమర్పిస్తున్నాను.

సాహిత్యంలో ఏ ప్రక్రియకైనా, వస్తువు, శిల్పం అనేవి సమ ప్రాధాన్యం గల అంశాలు. ముఖ్యంగా కవిత్వానికి సంబంధించి ప్రత్యేకంగా చర్చించుకోవాల్సిన అవశ్యకత ఉంది. కవి ప్రధానంగా ఏ విషయాన్ని చెప్పదలచుకున్నాడో దాన్ని 'వస్తువు' అని, ఎలాంటి అభివ్యక్తిని, రచనా విధానాన్ని అవలంభిస్తున్నాడో దాన్ని 'శిల్పం' అని అంటున్నాం. శిల్పంలో ఒకానొక ప్రధానాంగం శీర్షిక. మనిషి శరీరంలో శిరస్సుకు ఎంత ప్రాధాన్యం ఉందో సాహిత్యంలో శీర్షికకు కూడా అంత ప్రాధాన్యముంది. శీర్షిక పాఠకున్ని ఆకర్షించేదిగా ఉండాలి. చక్కటి అభివ్యక్తితో వస్తువును పాఠకుడి ముందు పరచి దానికి తగ్గట్టుగా శీర్షికను పెడితే అది గొప్ప కవితగా రూపుదిద్దుకుంటుంది.

వార్తా పత్రికను గమనించినట్లయితే చాలామంది కేవలం శీర్షికలను మాత్రమే చూసుకుంటూ వెళ్ళిపోతారు. ఏదైనా శీర్షికలో వినూతనత్వం, వైవిధ్యం కనిపిస్తే పాఠకుడి కళ్లు అక్కడ ఆగుతాయి. తర్వాత ఆ విషయం ఏమిటో తెలుసుకోవడానికి ఆసక్తి కనబరుస్తారు. ముఖ్యంగా కవిత్వానికి సంబంధించి కవితా వస్తువు. దాన్ని నడిపే తీరు, సంవిధానం ఒక ఎత్తయితే గొప్పగా మలచిన ఆ కవితను సమన్వయం చేస్తూ శీర్షిక పెట్టడం మరొక ఎత్తు. కవిత్వ శిల్పంలో శీర్షికను నిర్ణయించడం అత్యంత ప్రాధాన్యత గల విషయం.

సమాజంలో సంభవించే మార్పులు కారణంగా సాహిత్యంలో వస్తుపరంగానూ, రూపపరంగానూ అనేక మార్పులు వచ్చాయి. అనేక నూతన వస్తువులను నేటి కవి అక్షరబద్ధం చేస్తున్నాడు. అభ్యుదయ, విప్లవ, స్త్రీ, దళజుత, బి.సి., మైనార్టీ, ప్రాంతీయ, ప్రపంచీకరణ మొదలైన అనేక రకాల కవిత్వోద్యమాల వల్ల వస్తు స్వీకరణలో వైవిధ్యం పెరిగింది. కవిత్వం కూడా కుప్పలు తెప్పలుగా రావడం ప్రారంభమైంది. ప్రపంచీకరణ ప్రభావంలో పడ్డ పాఠకుడు అనేక రకాల వ్యాపకాలతో తీరికలేని జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. ఇలాంటి సమయంలో కవితా సంపుటినో, సంకలనాన్నో తీసుకొని పేజీలు తిప్పుకుంటూ పోతే శీర్షిక పాఠకున్ని ఎక్కడో ఒకచోట ఆపుతుంది. ఆ విధంగా పాఠకున్ని అక్కడ ఆపడం కవి శీర్షిక ద్వారా చేసిన శిల్ప నైపుణ్యంలో ఒక భాగం. అలా ఆపిన శీర్షిక ఆ కవితా ప్రయోజనాన్ని నెరవేర్చినట్లుగా చెప్పవచ్చును.

దళిత కవిత్వంలో వస్తు శిల్పపరంగా అనేక నూతన పరిణామాలు చోటు చేసుకున్నాయి. అనేక రకాల దళితుల

సమస్యలు, పరిష్కారాలు, కర్తవ్యాలు కవితా వస్తువులుగా మారాయి. దళితవాద కవిత్వంలో కవిత్వం లేదని, శిల్పం అసలే లేదని కొన్ని అవాస్తవమైన విమర్శలు వెలువడ్డాయి. తరచి చూస్తే అలాంటి విమర్శలో నిజం లేదని తెలిసి పోతుంది. దళిత కవులు మిగతా కవుల కంటే భిన్నంగా వస్తువును, శిల్పాన్ని సృష్టించినట్లు స్పష్టంగా మనం గమనించవచ్చు. ఇప్పుడు శీర్షికా నిర్ణయంలో దళిత కవుల శిల్ప చాతుర్యాన్ని పరిశీలిద్దాం.

పంచమ సంఖ్య ప్రతీక శీర్షికలు :

దళితవాద కవులు సంఖ్యను శీర్షికగా పెట్టడమనేది ప్రధానంగా గమనించదగ్గ విషయం. ఆ సంఖ్యలో కూడా 'ఐదు' (5) సంఖ్యను దళిత కవితా ప్రతీకగా తీసుకున్నారు. ఎందుకంటే మనుధర్మం చాతుర్వర్ణ వ్యవస్థను ఏర్ప రచింది. ఈ నాలుగ వర్ణాల్లో కూడా దళితులను అనర్హులుగా ప్రకటించింది. ఈ వర్ణవ్యవస్థ, దళితులు కనీసం మనుషులుగా కూడా గుర్తించబడలేదు. అందుకే వారు పంచములుగా, ఈ నాలుగు వర్ణాలకు సంబంధం లేని ఐదో వర్ణంగా బతుకుతున్నారు. ఈ దుస్థితిని దృష్టిలో ఉంచుకొని దళిత కవులు పంచమ సంఖ్యను తమ అస్తిత్వ ప్రతీకగా మార్చుకొన్నారు. అంతేకాకుండా ఆ సంఖ్యా శీర్షికతో అనేక గొప్ప కవితలు కూడా రాశారు.

నాలుగు వేదాల్లో దళితుడికి స్థానం లేకపోగా చివరకు వివక్ష, అవమానం మిగిలింది. ఆ వివక్షల్ని నేటికీ ఎదుర్కొంటున్న పంచముడి పక్షాన నిలబడి సతీష్ చందర్ రాసిన మరో వేదం 'పంచమ వేదం' విద్యాలయాల్లో గురువుల కులపిచ్చిని నేపథ్యంగా ఈ శీర్షికతో కవితను రాయడం సముచితంగా ఉంది.

మనకు జ్ఞానేంద్రియాలు ఐదు ఉన్నాయి. ఒక్కో జ్ఞానేంద్రియానికి ఒక్కోరకంగా దళితుల అవమానాల్ని చెపుతూ కర్తవ్యాన్ని నిర్దేశించిన మద్దూరి నగేష్‌బాబు 'పంచమగీతం' నిజంగా ఓ ఉద్యమ గీతం, కవిత మొత్తం చదివాక ఈ శీర్షికా ఔచిత్యం మనకు తెలుస్తుంది. ఈయనే రాసిన మరో కవిత 'ఐదో గది' కూడా చక్కటి ఔచిత్యంతో కూడినదే. తన బాధను తానే దిగమింగుకొని తన అవమానాల్ని ఎవ్వరికీ చెప్పుకోలేక కవి తన గుండె ఐదో గదికి నివేదించుకున్నాడు. సాధారణంగా గుండెకు నాలుగు గదులు మాత్రమే ఉంటాయి. కానీ దళితులు పంచములుగా వివక్ష పొందుతున్నందుకు గుర్తుగా కవి ఐదోగడికి నివేదించుకున్నట్లు తెలిపాడు.

ఇవేకాకుండా పైడి తెరేష్‌బాబు - పంచనామా, ఐదో తనం. ఎండ్లూరి సుధాకరం - ఐదోవాచకం కవితలు కూడా ఈ రకమైన ప్రాధాన్యాన్ని సంతరించుకున్నవే.

తారీఖు సంబంధ శీర్షికలు :

ఒక తారీఖును చూడగానే గతంలోని దానికి సంబంధించిన చారిత్రక నేపథ్యాలు జ్ఞప్తికి వస్తాయి. ఇలాంటివి శీర్షికలుగా దళిత కవిత్వంలో కూడా కన్పిస్తున్నాయి. కారంచేడు మొదలు లక్ష్మింపేట వరకు దళితులపై అగ్రవర్ణాల మారణహోమం జరిగింది. జరుగుతున్నది. ఈ దాడి సంఘటనలపై దళిత కవులు స్పందించి శక్తివంతమైన కవితల్ని రాశారు. కొందరు కవులు సంఘటన జరిగిన తారీఖును, నెలను, సంవత్సరాలను శీర్షికలకు పెట్టి, శీర్షికలోని సంఘటన నేపథ్యాన్ని ప్రతిధ్వనించేలా వైవిధ్యాన్ని కనబరిచారు.

మద్దూరి నగేష్‌బాబు 'జూలే పదిహేడు' ఈ కోవలేనిదే. దళితవాదం, దళిత సాహిత్యం ఉవ్వెత్తున ఎగసి పడ్డానికి కారణమైన కారంచేడు సంఘటన (1985) జరిగిన రోజు అది. దారుణ మారణ కాండ జరిగిన ఈ రోజును దళిత జాతి గుర్తుంచుకోవాల్సిన రోజుగా కవి ఈ కవితలో చెబుతున్నాడు. దళిత చైతన్యానికి నాంది పలికిన రోజుగా 'జూలై పదిహేడు'ను కవి గుర్తించాడు. ఈ తారీఖును కేంద్రంగా చేసుకొని రాసిన ఈ కవితలో కవి ఆవేదన స్పష్టంగా కనిపిస్తున్నది.

కారంచేడు తర్వాత జరిగిన అంతటి ఘోరమైన మరో సంఘటన చుండూరు సంఘటన. 'ఆగష్టు - 6' అనే శీర్షికతో నల్లూరి రుక్మిణి రాసిన కవిత చుండూరు సంఘటనకు సంబంధించినదే. కథాత్మక శైలిలో సాగే ఈ

కవితలో కవయిత్రి తాను చూసిన చుండూరు ప్రాంతాన్ని గురించి మన కళ్ళకు కట్టినట్టుగా చెబుతుంది. చివరకు తుంగభద్రలో కలిసి పారుతున్న దళితులు రక్తాన్ని చూసి విస్మయం చెందిన కవయిత్రి పాఠకుల్ని కూడా విస్మయానికి గురిచేసి కవితను ముగిస్తుంది.

రాపాక సన్నివిజయకృష్ణ '15 ఆగష్టు 2012', కలేకూరి ప్రసాద్. '18 డిసెంబర్ 1996' పోతుల బాలకోటయ్య 'డిశంబర్ 18' వంటి శీర్షికలు కూడా దళిత కవిత్వంలో సంఘటనల నేపథ్యాన్ని వివరించే తారఖు సంబంధ శీర్షికలుగా చెప్పవచ్చును.

నలుపు రంగు సంబంధ శీర్షికలు :

హిందూ శాస్త్రాల ప్రకారం నలుపు రంగు అరిష్టానికి చిహ్నం. అమెరికాలో 'బ్లాక్స్' (నల్ల జాతివారు)ను తెల్ల వాళ్ళు అంటరానివారుగా చూస్తారు. అలాగే ఇక్కడ దళితులు కూడా అగ్రవర్ణాల చేత వివక్షకు గురవుతున్నారు. ఈ సందర్భంలో దళిత కవులు 'నలుపు' రంగును కేవలం శరీరపు రంగుకు సంబంధించి కాకబీ దళిత శ్రమ జీవితానికి చిహ్నంగా గ్రహించి, ప్రాధాన్యం కల్పించి తమ కవితా శీర్షికల్లో సముచితంగా ప్రయోగించారు.

ప్రసాదమూర్తి 'నల్లకోను - తెల్ల తీర్పు' అనే కవితలో దళితుల్లోని అంతర కలహాలను ఆసరాగా తీసుకొని, సందుచూసి కారంచేడు సంఘటనపై దళితులకు ప్రతికూలంగా తీర్పు చెప్పిన హైకోర్టునుద్దేశించి చెప్పన ఈ కవితకు, ఈ శీర్షిక ఎంతో సమంజసంగా కన్పిస్తుంది. మద్దూరి నగేష్‌బాబు 'నల్లపూస' అనే కవితలో దళితులు శ్రమకోర్చి, వివక్షల కోర్చి, పేదరికాన్ని నెత్తిన పెట్టుకొని నల్లని శరీరాలతో ఉంటూ అవమానాలకు గురికావడాన్ని చెపిపన కవిత ఇది. ఇందులో నలుపు రంగు ప్రతీకగా దళితుల అస్తిత్వాన్ని కవి చెప్పే ప్రయత్నం చేశాడు.

చల్లపల్లి స్వరూపరాణి 'నల్ల సూర్యుడు', మద్దూరి నగేష్‌బాబు 'నల్లసముద్రం', జి.కె. 'నల్లోడి పాట' కవితలు కూడా. నలుపు రంగుకు సంబంధించిన శీర్షికలే.

వర్ణ సంబంధ శీర్షికలు :

భారతీయ సామాజిక వ్యవస్థ చాతుర్వర్ణ వ్యవస్థ. వేల యేండ్ల క్రితమే పురుడు పోసుకున్న ఈ వర్ణవ్యవస్థకు నేటి ఆధునిక సమాజంలో కూడా దాని ఛాయలు పూర్తిగా పోలేదు. చాతుర్వర్ణం వ్యవస్థకు సంబంధం లేని వారూ, ఏ వర్ణానికి చెందని అవర్ణులూ దళితులు. వారి పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఆ వర్ణ సంబంధ శీర్షికలను కూడా దళిత కవులు చక్కగా వాడారు.

పైడి తెరేష్‌బాబు 'అవర్ణదీర్ఘ సంధి' అనే కవితలో సవర్ణాచ్చులు పరమైనపుడు సవర్ణదీర్ఘసంధి జరుగుతుంది. సవర్ణాచ్చులు అంటే ఒకే వర్ణానికి చెందిన అచ్చులు. కానీ కవి వైవిధ్యాన్ని చూపిస్తూ 'అవర్ణదీర్ఘసంధి' అనే శీర్షికను పెట్టాడు. అంటే వేరువేరు వర్ణాలకు చెందిన వారి మధ్య సంధి ఎలా ఎదురుతున్నదీ? దాని పర్యవసానం ఏమిటో ఈ కవితలో చెప్తూ దానికి సరిపోయే విధంగా కవి చక్కని శీర్షికా నిర్ణయం చేశాడు.

శిఖామణి రాసి 'అవర్ణం' కవితలో కూడా ఇన్నాళ్ళుగా సవర్ణుల ఆదేశం ప్రకారం సమాజం, సాహిత్యం నడిచింది. ఇవాళ దళిత కవిగా శిఖామణి అవర్ణం గురించి మాట్లాడుతూ వర్ణవ్యవస్థను ప్రశ్నించాడు. ఈ శీర్షిక క్లుపక్తగా ఉన్నా కవితను బాగా నప్పింది.

తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ 'సవర్ణదీర్ఘ సంధి' జి.వి. రత్నాకర్, 'వర్ణమాల', కత్తి పద్మారాలు 'అవర్ణం', గౌతమ్ 'వర్ణ పంజరం' మొదలైన కవితలు కూడా వర్ణ సంబంధ శీర్షికలే.

మిథోపోయి శీర్షికలు :

పౌరాణిక నేపథ్యంలో ఆధునిక జీవితాన్ని కవిత్వంలో ఆవిష్కరించడమే మిథోపోయి. ఈ మిథోపోయి అభివ్యక్తి విధానం దళితవాద కవిత్వంలో విరివిగా కన్పిస్తుంది. ఈ మిథోపోయిని ఉపయోగిస్తూ దళిత కవులు శీర్షికలను కూడా పెట్టారు. ఈ ప్రయోగం కూడా దళిత కవిత్వ శిల్పంలో, ముఖ్యంగా శీర్షికా శిల్పంలో ఒక ప్రత్యేకతగా

చెప్పవచ్చు. ఈ శీర్షికల్లో కూడా హిందూ మిథోపోయి. క్రైసత్వ మిథోపోయి అనే రెండు కోణాల్లో శీర్షికల్ని పరిశీలించవచ్చు.

ఏకలవ్యుని బ్రొటనవ్రేలును గురుదక్షిణగా కోరి, అతని ప్రతిభను నిర్వీర్యం చేస్తాడు ద్రోణుడు. ఆ నేపథ్యాన్ని స్ఫురింపచేస్తూ పెట్టిన శీర్షిక చిత్రం ప్రసాద్ - 'గురుదక్షిణ', అలాగే పురాణాలలోని దళిత జాతికి చెందిన అరుంధతిని గుర్తు చేస్తూ వచ్చిన శీర్షిక జి. విజయలక్ష్మి 'ఆధునిక అరుంధతి', ఇవేకాక సతీష్ చందర్ 'అంపశయ్య', తల్లిమల్లి విల్సన్ సుధాకర్ 'మాయలేళ్ళూ - బంగారు సీతలూ' వంటి శీర్షికలు హిందూ మిథోపోయిక సంబంధించినవి.

బైబిల్‌లో ఉపకథ అయిన తప్పిపోయిన కుమారుని కథను శీర్షికగా 'తప్పిపోయిన కుమారుడు'ను మద్దెల కాంతయ్య ఒక కవితకు పెట్టాడు. దళిత భావజాలాన్ని కాదని పన్నెండు సంవత్సరాలు విరసంలో ఉండి తర్వాత బహిష్కరింపబడి సొంత గూటికి చేరిన సొదాను ఉద్దేశించి రాసిన ఈ కవిత బైబిల్ మిథోపోయి శీర్షికకు చక్కని ఉదాహరణ. తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ 'యూదులు రాజే బీదల రాజు', కత్తి పద్మారావు 'ముళ్ళ కిరీటం' మద్దెల శాంతమ్మ - 'మద్దెల శాంతయ్య - పిలాతు న్యాయం' వంటి శీర్షికలు కూడా గమనించదగ్గవే. మద్దూరి నగేష్‌బాబు 'నరలోక ప్రార్థన' అనే శీర్షికతో ఒక కవితను రచించచాడు. బైబిల్‌లోని పరలోక ప్రార్థనను ఇది స్ఫురింప చేస్తుంది.

ముగింపు :

దళిత కవిత్వం మొత్తంలో శీర్షికల్ని వైవిధ్యంగా పెట్టడంలో నిపుణిడిగా, సిద్ధహస్తుడిగా పైడి తెరేష్‌బాబు పేరు చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆయన కవిత్వాన్ని చదివిన ఎవరైనా దీన్ని గుర్తించగలరు. బండి చక్రమ్మీద ఈగ, ఛాగ్గుడిస్తే ఛీ, 'మిగితావేళ్ళల చిటికన వేళ్ళు రాయనది' 'కుక్క చరచిన వార్త' 'అల్పపీడనం' వంటి శీర్షికల్లో అయిన వైవిధ్యాన్ని మనం గుర్తించవచ్చు. జి.ఆర్. కూర్మే 'నేను హత్య చేయబడ్డాను', కత్తి పద్మారావు 'శవం మేల్కొంది'. నేతల ప్రతాప్ కుమార్ - 'పందీ నీకు వందనం' 'ప్రార్థన' వంటి కవితా శీర్షికలు దళిత తాత్విక చింతనలో నుండి వెలువడిన శీర్షికలే.

పైన విభజించుకున్న శీర్షికలే కాకుండా విస్తృతమైన శీర్షికా వైవిధ్యం దళిత కవిత్వ సొంతం. నెత్తుటి ప్రశ్న (ఎండ్లూరి), మీరేవుట్లు (మద్దూరి) వంటి ప్రశ్నార్థక శీర్షికలు పిడికెడు ఆత్మగౌరవం కోసం (కలేకూరి ప్రసాద్), పదెనెక్కిన పాట (ప్రసాదమూర్తి) వంటి చైతన్య శీర్షికలు దళిత మేనిఫోస్టో (సలంద్ర), దళిత వ్యాకరణం (తుల్లి మల్లి), దళిత ప్రేమలేఖ (సతీష్ చందర్) వంటి దళిత శబ్దంతో కూడిన శీర్షికలు నిషిద్ధ చరిత్ర (చల్లపల్లి స్వరూప రాణి), అంటరాని పద్యం (జూలూరి గౌరీశంకర్), నేను అస్పృశ్యున్ని (బొజ్జా తారకం) వంటి అస్పృశ్య సంబంధం శీర్షికలు ఇలా అనేక రకాలు. దళిత కవిత్వంలో ఉన్నాయి.

ఈ అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే దళిత కవులు శిల్పానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చారో అర్థమవుతోంది. మిగతా కవితోద్యమాల కంటే దళిత కవిత్వం ఏ విధంగా భిన్నమైందో, కవిత్వమే కాకుండా శీర్షికలు కూడా ఆ విషయాన్ని తేటతెల్లం చేశాయి. కవితలకే కాకుండా 'ఓ.సీ. క్రీస్తు', 'దళిత వ్యాకరణం', వంటి శీర్షికలను కవితా సంపుటాలకు 'చిక్కనవుతున్న పాట', 'పదునెక్కిన పాట', 'దళిత మేనిఫోస్టో', 'విడి ఆకాశం' 'తెగిపడిన చోట తెగబడటమే' వంటి శక్తివంతమైన శీర్షికలను కవితా సంకలనాలను కలిగిన దళిత వాద కవిత్వం మరింత ముందుకు కదలడానికి ఈ శీర్షికల భాగస్వామ్యం మరువరానిది. ఈ విధంగా ఔచిత్యవంతాలైన శీర్షికలు, దళిత కవిత్వాన్ని మరింత ఔచిత్యంగా మార్చి ఒక గొప్ప సామాజిక కవిత్వోద్యమంగా తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని నింపాయి.

ఆధార గ్రంథాలు :

1. అల్పపీడనం (1996) : పైడి తెరేష్‌బాబు
2. ఓ.సి. క్రీస్తు (2002) : మద్దెల శాంతయ్య
3. చిక్కనవుతున్న పాట (1995) : జి. లక్ష్మీనరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్ (సంపా)
4. చిత్తరువు (1997) : తాటిపర్తి బాలస్వామి, జి. విజయలక్ష్మి (సంపా)
5. తెగిపడిన చోట తెగబడటమే (2013) : తుల్లిమల్లి విల్సన్ సుధాకర్, నూకతోటి రవికుమార్ (సంపా)
6. నరలోక ప్రార్థన (2002) : మద్దూరి నగేష్‌బాబు
7. దళిత కవిత్వం - 1 : డా॥. కె. లక్ష్మీనారాయణ (సంపాద)
8. దళిత కవిత్వం - 2 (2003) : డా॥. కె. లక్ష్మీనారాయణ (సంపాద)
9. దళిత వ్యాకరణం (2007) : తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
10. పదునెక్కిన పాట (1996) : జి. లక్ష్మీనరసయ్య (సంపా)

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

సంప్రదాయ కవిత్వంలో స్త్రీ చిత్రణ – స్త్రీవాద దృక్కోణం పరిశీలన

– బొల్లి సునీత, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ప్రాచీనకాలంలో స్త్రీ స్వేచ్ఛగా పురుషులతో సమానంగా జీవించేది. చరిత్ర ప్రకారం స్త్రీలు మాతృదేవతలుగా ఆరాధింపపడ్డారు. ఆదిమకాలంలో స్త్రీ పురుషుల మధ్య శారీరక నిర్మాణంలో ఉన్న బేధం తప్ప మరేవిధమైన భేదమూలేదు. కానీ మధ్యయుగంలో స్త్రీ పరిస్థితి పూర్తిగా తారుమారైంది. స్త్రీ ఒక భోగవస్తువుగా మాత్రమే చలామణి అయింది. స్త్రీ పతివ్రత ధర్మాలు, బానిసత్వాన్ని ఇష్ట పూర్వకంగా వరించే పద్ధతిని మన ఇతిహాసాలు పురా ణాలు బోధించాయి. అయితే సంప్రదాయం అంటున్నాం. కనుక సంప్రదాయాన్ని గూర్చి కూడా తెలుసుకోవలసిన ఆవశ్యకత కూడా ఉంది.

సంప్రదాయ కవిత్వం :

సంప్రదాయవాదం లేక సంప్రదాయం అంటున్నాం అంటే పాతకాలపు విషయాలని, సామాజిక స్పర్శలేని తర్కవాదమని, సంప్రదాయ నిరాకరణం అని అర్థం కాదు. అన్ని భావజాలాల్లోనూ సంప్రదాయం ఒక యథాతథశక్తిగా పని చేస్తుంది. కాబట్టి సంప్రదాయ వ్యతిరేక పోరాటం చేసేటప్పుడు సంప్రదాయ సారాంశాల మీద పోరాటం చేయాలి. అది మొత్తం మతం మీద పోరాటంగాకాక మతానికి ప్రధాన గుణంగా ఉన్న సంప్రదాయం మీద పోరాటంగా ఉండాలి. సంప్రదాయాన్ని నిందించడం వలనగానీ, న్యూనపరచడం వలన గానీ అది పోదు. శాస్త్రం సాధించిన ప్రకృతి ధర్మాలను, సామాజిక సూత్రా లను ప్రమాణంగా చేసుకొని సంప్రదాయంలోని వివిధ అంశాలను ఎదుర్కోవాలి. ఒక తప్పుడు భావాన్ని శాస్త్రీయ భావంతోనే నాశనం చేయగలం. రాజరికం నుండి నేటి ప్రభుత్వాల వరకు సంప్రదాయాన్ని తమకు రక్షాకవచంగా వాడుకుంటున్నారు. కాబట్టి సంప్రదాయ వ్యతిరేక పోరాటా లను, ప్రభుత్వ వర్గాల వ్యతిరేక ప్రజాపోరాటాల్లో అవి భాజ్యంగానే కొనసాగించాలి.

"సత్యాన్వేషణ ఆగిపోయిన దశనూ, అధికారవర్గ కీర్తనకు మేధావులు పరిమితమైన దశనూ గతానుగతికత్వ రోగ పీడిత భావజాలాలను 'సంప్రదాయం' అంటారు. అయితే ఈ యుగంలోకూడా ఏదీ సర్వ స్వతంత్రంగా లేదు. అన్ని ఉపరితల రంగాలమీద వేదాంత ప్రభావం, ధర్మశాస్త్రాల ప్రభావం అధికారవర్గ ముద్ర ఉన్నాయి. ఇవి అన్నీ కూడా ప్రజలకు తెలియని అధికారవర్గ బృందాలకు తెలిసే సంస్కృతభాషలోనే జరిగింది. ధర్మశాస్త్రాలకు మానవత్వం ముసుగును కప్పటానికి ప్రయత్నించిన సంప్రదాయక సాహిత్యం మానవత్వాన్ని కోల్పోయింది. మధ్యయుగాల సామ్రాజ్య అస్తమయంతో మధ్యయుగాల భావజాలం కూడా అస్తమించింది. సామ్రాజ్య పతనం తర్వాత అనేక ప్రాంతీయ రాజ్యాలు ప్రాంతీయ భాషలు ఏర్పడ్డాయి. ప్రాంతీయ రాజులు సామ్రాజ్యయుగంలోని చక్రవర్తులు అనుకరించిన సాహిత్యాన్ని సంస్కృతం నుండి అనువదించుకున్నారు. ప్రాంతీయ విలక్షణాలున్నప్పటికీ ప్రధానంగా సంప్రదాయక భావజాలాన్నే నిర్జీవంగా అను వదించుకున్నారు. సంప్రదాయిక భావజాలాన్ని ప్రాంతీయ రాజ్యాలు అనుకరించటాన్నే భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వంలో జాతీయవాద చరిత్రకారులు వర్ణించారు. అనేక సాహిత్య ప్రక్రియలు సంప్రదాయక భావజాలాన్ని అనేక రూపాల్లో రూఢి చేశాయి. అధికారవర్గ జీవితంలోని విభిన్న అంశాలను విభిన్న ఉపరితల శాఖ లను ఉపయోగించుకుంటూ సాహిత్యం అధికారవర్గ ఆయుధంగా పనిచేసింది. ఇలాంటి కోణంలో నుంచి వచ్చినవే మన హిందూమత ప్రమాణికంగా భావించే ఇతిహాస గ్రంథాలైన రామాయణం, భారతం, భాగవతం పురాణాలు, ప్రబంధాలు, కథాకావ్యాలు, శతకాలు, యక్షగానాలు అన్నీ కూడా స్త్రీలోని ఉత్తమ గుణాలను

కీర్తిస్తూ స్త్రీని గౌరవించాలని పేర్కొంటూ కట్టుబానిసలుగా తయారు చేశాయి.

మహాభారతంలో స్త్రీ చిత్రణ :

ద్రౌపది :

స్త్రీలు ఒక పురుషుడితో సంతృప్తి చెందరనే విషయం మహాభారతంలో ద్రౌపది పాత్ర ద్వారా చెప్పబడింది. జూదంలో రాజ్యాన్ని, ద్రౌపదిని కూడా ఒడ్డి ధర్మరాజు ఓడిపోయాడు. భార్యను తన ఆస్థిగా భావించి ఒడ్డటం అనేది ఆ కాలం నుంచే వస్తుంది. నిండు సభలో దుశ్శాసనుడు వివస్త్రను చేస్తుంటే చేతగాని వారిలా చూస్తూండిపోయారు. భర్తగా భార్య మానప్రాణాలు రక్షించాల్సినవారే భార్యను ఇతరులకు అప్పగించారు.

కుంతి :

కుంతి వివాహం కాకముందే దుర్వాసుడు తనకు ఇచ్చిన వరంవల్ల కర్ణుడిని కన్నది. కానీ వివాహం కాక ముందే తల్లి కావడం అనేది సమాజం భరించలేనిది. తను తెలిసీ తెలియక చేసినా, తన ప్రేమయం లేక పోయినా లోకం నిందిస్తుంది అన్న కారణంలో బిడ్డను పెట్టలో పెట్టి నదిలో వదిలివేస్తుంది. అదే కుంతి భర్త అనుమతితో దేవుళ్ళు అంశతో పుత్రులను కన్నది అప్పుడు ఎలాంటి పాపం అక్కడ ఆమెకు అంటలేదు. భర్తకు శాపం కారణంగా భర్తయే మంత్రోచ్చారణతో పిల్లలు కనడానికి అనుమతి ఇచ్చాడు. కనుక ఇక్కడ ఇది అపఖ్యాతి కాదు.

భాగవతంలో స్త్రీ చిత్రణ :

భాగవతం భక్తిప్రధానమైన గ్రంథం. కానీ ఇందులో కూడా స్త్రీల స్థాయిని గూర్చి దిగజార్చే విధంగానే ఉంది. యయాతి, దేవయాని, శర్మిష్ఠ కథ తరువాత పురుషులను ఉద్దేశించి స్త్రీ విలువలను దిగజార్చే కథ ఉంది. కానీ అందులో స్త్రీ తప్పిందం ఏమాత్రం లేకపోయిన పురుషుడిలో నిగ్రహశక్తి లోపించినందుకు కూడా స్త్రీనే నిందించడం చూడవచ్చు. బ్రహ్మ ఒక ఆశ్రమంలో ఉండగా ఒక స్త్రీ వర్షంలో తడిచి వచ్చి ఆశ్రయం అడిగి అక్కడ తల దాచుకోగా బ్రహ్మ ఆమెకోసం వెళ్ళి ఇంటికి ఉన్న సూరిలో ఇరుక్కుని పోతాడు. వేదాలు తెలిసి బ్రహ్మకు సైతం స్త్రీ బాధ తప్పలేదు. యయాతి కూడా ఇంద్రుని భార్య అయిన శచీదేవిని కోరుకోవడంతో భూలోకంలో యయాతిగా జన్మిస్తారు. ఇలా ఎంతటివారైనా కామాగ్ని ముందు బలహీనులై అని చెప్పడానికి స్త్రీ విలువలను దిగజార్చారు.

ఒంటరిగా తల్లితోగాని, కుమార్తెతోగాని, కోడలుతోగాని ఇతర స్త్రీలతోగాని ఎలాంటి పరిస్థితులలోను ఉండకూడదు. కామాగ్ని ముందు వాయువరునలు, బంధుత్వాలు, చిన్న పెద్ద తారతమ్యాలు మరచి ప్రవర్తిస్తారు. ఇలా భాగవతంలోనే ఉండటంలో లేని ఆలోచనలు రేకెత్తవచ్చు. ఉన్న సంబంధాల పట్ల అనుమానం మొదలుకావచ్చు.

స్త్రీ మోహానికి కారణమని, స్త్రీకి దూరంగా, జాగ్రత్తగా వుండాలని హిందూమత గ్రంథాలన్నీ పురుషుణ్ణి హెచ్చరించాయి. స్త్రీ ఈ పాపాలన్నింటికి కారణమని స్త్రీని పాతాళానికి తొక్కేశాయి. మహాభారతంలోని నారద పంచబొడ సంవాదంలో కూడా స్త్రీని గూర్చి ఇలాంటి అంశాలే చోటు చేసుకొన్నాయి.

రామాయణంలో స్త్రీ పాత్రల చిత్రణ :

మహాభారతంలో కంటే రామాయణంలో స్త్రీల పరిస్థితి మరీ దయనీయంగా కనిపిస్తుంది. రామాయణంలో స్త్రీల పాత్రలన్నీ అవమానానికి గురైనవే. అందులో ముఖ్యంగా సీత, ఊర్మిళ, శూర్పణక, కైక, తార, మండోదరి, అహల్య మొదలైన స్త్రీ పాత్రలన్నీ అవమానానికి గురైనవే.

సీత :

సీతను రావణుడు అపహరించి లంకలోని అశోక వనంలో నిర్భంధించాడు. తరువాత రాముడు సీత జాడ తెలుసుకొని వానరసేన సాయంతో యుద్ధం చేసి రావణున్ని సంహరించి సీతను నిందిస్తాడు. రాముడు సీతతో నేను వీరికోసం యుద్ధం చేయలేదు, నా వంశగౌరవం

కోసం, రాజ్యప్రతిష్టకోసం నా సౌర్య పరాక్రమాల నిరూపణ కోసం యుద్ధం చేశాను. నీవు చాలా సౌందర్యవతివి. రావణుడు మిక్కిలి కాముకుడు. కనుక వారి ఆధీనంలో ఉన్న నీ చరిత్ర సందేహమే. నీవు నీకు నచ్చిన చోటుకు వెళ్ళు లేకపోతే లక్ష్మణుడు, భరతుడు, సుగ్రీవుడు వీరిలో ఎవరి దగ్గరున్న నీకు తిండి బట్టలు ఇస్తారు అని సీత అనుకోని విధంగా అవమానిస్తాడు రాముడు. దానితో సీత అగ్నిప్రవేశం చేసి పునీతగా పైకి రాగా రాముడు సీతగూర్చి నాకు తెలుసు లోకం కోసం నేను ఆమెను నిందించాను అని చెప్పి సీతను స్వీకరిస్తాడు.

తిరిగి రెండవసారి కూడా రాముడు ఇలాంటి తప్పిదమే చేశాడు. రెండవసారి కూడా ప్రమాణం చేస్తే స్వీకరిస్తాను లేకపోతే లేదు అనే మాటలు వినగానే సీత భూదేవిని ప్రార్థించి తను పరపురుషున్ని కోరుకోకపోవడం నిజమే అయితే తన హృదయంలో చోటు ఇవ్వమని కోరుకోగా భూమి చీలిపోయి ఒక ఆసనం పైకి రాగా సీత అందులో తల్లి ప్రక్కన కూర్చొని భూమిలోకి వెళ్ళిపోతుంది.

ఇక్కడ స్త్రీ హృదయం మనకు తెలుస్తుంది. అభిమానవతి అయిన సీత భర్తమీద ప్రేమతో ఒకసారి అగ్నిప్రేశం చేసింది. రెండవసారి ఎవరికోసమో అడవిలో వదిలివేసి తిరిగి రమ్మని ప్రజలందరిముందు ప్రమాణం చేస్తే స్వీకరిస్తాను అనటంతో తన హృదయం ముక్కలై తను తన తల్లి ఒడిలో కలిసిపోతుంది.

ఊర్మిళ :

లక్షణుని భార్య. ఈమె జీవితం నిద్రకే సరిపోయింది. ఎలాంటి సంసార సుఖాలు, భోగభాగ్యాలు అనుభవించని స్త్రీ, అన్నకోసం, అన్నకు సేవ చేయడంకోసం భార్యను తిరస్కరించాడు లక్ష్మణుడు.

శూర్పణక :

ఈమె రావణుని సోదరి. రామలక్ష్మణులను చూసి మోహించి వారి దగ్గరకు వెళ్ళి రాముని వివాహం చేసుకోమనడం రాముడు లక్ష్మణుని చూపించడం తను నిరాకరించి తిరిగి రాముని దగ్గరకు వెళ్ళడం రాముడు నిరాకరించడంతో సీత చంపేస్తాను. దీని అడ్డు తొలగిస్తాను అని సీతపైకి వెళ్ళటంతో రాముని ఆజ్ఞపై లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు, చెవులు కోసి పంపిస్తాడు. కోరివచ్చిన స్త్రీని తిరస్కరించి అంతటితో ఆగకుండా ఆమె ముక్కు, చెవులు కోసి తీవ్రంగా అవమానించారు.

కైక :

కైక మంధర మాటలు విని భర్తను రెండు వరాల కోరినవే కానీ తనకు తానుగా కోరినవి కావు. కానీ భర్త మరణానికి, రాముడు అడవుల పాలు కావడానికి కైక కారణం అని అందరి దగ్గర అవమానింపబడుతుంది. ఎవరి కోసం చేసిందో చివరకు ఆ కొడుకైన భరతుడు తనను తిరస్కరించి అవమానించాడు.

తార :

వాలి భార్య. కానీ వానర సంప్రదాయం ప్రకారం సుగ్రీవుని ప్రేయసి అయింది. భర్తను దగ్గరుండి చప్పించిన వ్యక్తితో తనకు ఇష్టం ఉన్నా లేకున్నా కాపురం చేయాల్సిన పరిస్థితిని రామాయణంలో తార పాత్ర ద్వారా చూడవచ్చు. తారను మించిన రసమయ శృంగారమూర్తి మరి లేదని సుగ్రీవుడు మురిసిపోయేంతగా నిర్వహించింది.

మండోదరి :

ఈమె రావణునికి ధర్మపత్ని. ఆమె లోకోత్తర సుందరి. కానీ రావణుడు దేవగంధర్వ ఋషి కన్యలను అపహరించాడు. రంభను మానభంగం చేశాడు. ఎందరెందరో పతివ్రతలను బలాత్కరించాడు. శాపగ్రస్తుడయ్యాడు. సీతాపరహరణం చేశాడు. భర్తకు హితబోధ చేసింది కానీ రావణుడు వినలేదు. భార్య ముందే ఎన్ని వేషాలు వేసినా ఎదురు మాట్లాడకపోవడం పతివ్రతా ధర్మం.

అహల్య :

గౌతముని భార్య. ఇంద్రుడు ఆమెను మోహించి గౌతముడివలె వచ్చి అహల్యను రమించాడు. దీని వలన అహల్యను శిలగా మారమని గౌతముడు శాపమిచ్చాడు. ఆమె ప్రమేయం లేకపోయినా శాపం అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పురాణాలలో స్త్రీ చిత్రణ :

పురాణాలు కూడా స్త్రీని పతివ్రతగా, భర్తయే దైవంగా పూజించే స్త్రీమూర్తిగా చూపించాయి. సుమతి, సావిత్రి, అనసూయ, రేణుక మొదలైన స్త్రీలను పతివ్రతలుగా కీర్తించారు.

సుమతి :

భర్త కౌశికుడు. అతడు కుష్ఠురోగి. వాడు చెడు తిరుగుళ్ళు తిరిగి అనారోగ్యాన్ని తెచ్చుకొన్నాడు. కానీ సుమతి వాడిని దైవంవలే సేవించింది. కాని వారు ఒకరోజు వేశ్యాకాంతను చూచి ఆమె దగ్గరకు తీసుకొని పొమ్మని భార్యను వేధించెను. ఆమె వేశ్యను ఒప్పించి ఆమె దగ్గరకు తీసుకొని వెళ్ళెను. తీసుకువెళ్ళే క్రమంలో మాండవ్య మునికి తగిలి అతను శాపం ఇవ్వడంతో అతని శాపం విన్న సుమతి సూర్యోదయం కాకుండా ఆపివేస్తుంది. అప్పుడు దేవతలు అందరూ ప్రార్థించగా, తిరిగి అనసూయ ద్వారా భర్తను బ్రతికించుకొంటుంది. ఇది పాతివ్రత్య ధర్మంగా పురాణాలు పేర్కొన్నాయి.

సావిత్రి :

సావిత్రి కూడా భర్తకోసం యమునితో పోరాడి తిరిగి భర్తను బ్రతికించుకొన్నది. ఇది పవిత్రతాధర్మంగా పాతివ్రత్యానికి అంత గొప్ప శక్తి ఉందని ఇలాంటి కథల ద్వారా నిరూపించి స్త్రీలను మభ్యపెట్టారు.

కథాకావ్యాలలో స్త్రీ చిత్రణ :

కథా కావ్యాలలో మూలఘటిక కేతన రచించిన దశకుమార చరిత్రలో వేశ్యల, వేశ్యమాతల వ్యభిచారాలను గురించి వివరించాడు. అనంతామాత్యుని భోజరాజీయంలో స్త్రీలను గురించి కొంత గొప్పగా చెప్పిన స్త్రీని డబ్బు మార్పిడి వస్తువుగానే చూశారు. అంటే ఆ రోజుల్లో కన్యాశుల్కం అమలులో ఉన్నట్లు తెలుస్తుంది. జక్కన రాసిన విక్రమార్క చరిత్రలో శయ్యాసౌఖ్యాన్ని గురించి 30 పద్యాలలో వర్ణించారు. అంటే శృంగారానికి ఎంత ప్రాధాన్యం ఉందో అర్థమౌతుంది.

సింహాసన ద్వాత్రింశకను కొరివి గోపరాజు గారు వ్రాశారు. ఇందులో స్త్రీ స్వరూప స్వభావములను గురించి, నాలుగు రకాలైన స్త్రీ జాతులను గురించి, నాలుగు జాతుల లక్షణములను గురించి వివరించారు. వేశ్యల గురించి, వేశ్యామాతల గురించి వారి స్వభావాలను గురించి కూడా వివరించబడింది.

ప్రబంధాల్లో స్త్రీ చిత్రణ :

ప్రబంధాల యుగానికి వచ్చేటప్పటికి ఈ కవులంతా స్త్రీని వర్ణించవలసి వచ్చినప్పుడు ఆమె దేవతాస్వరూపిణి అయినా, రాజకాంత అయినా, కాపుపడతి అయినా, వేశ్య అయినా ఆమె అంగాంగ వర్ణ చేయటంలో ఏమాత్రం భేదమూ పాటించలేదు. పారిజాతాపహరణంలో తిమ్మన రుక్మిణిని అంగాంగ వర్ణన చేశాడు. పాండురంగ మహాత్మ్యం తెనాలి రామకృష్ణ కవి రచించాడు. ఇందులో నిగమశర్మను గురించి అక్క కొన్ని మాటలు చెబుతుంది. నీకంతగా కోరిక ఎక్కువైతే 'రూపగుణశీల కులోన్నతి గల్గు విప్రకన్యామణులన్ సహస్రమయిన పరియించి రమించరాదే? యేమీ మునులే గృహస్థులు! రమించుట యెగ్గే కులాంగనాతతిన్'' అని సలహా ఇచ్చింది. ఒక పురుషుడు తనకు కావలసిన స్త్రీలనెంతమందినైనా వివాహం చేసుకోగల వీలుంది కదా! అలాంటప్పుడు ఇలా సానికొంపలకు వెళ్లవలసిన పనేమి? అని చెప్పింది. అంటే ఇక్కడ పురుషుడు బహుభార్యతత్వం అవలంభించడం తప్పు కాదని తెలుస్తుంది. అదేవిధంగా కళాపూర్ణోదయంలో కూడా పింగళి సూరన సుముఖాసత్తి ఒక పతివ్రతలాగే చిత్రించాడు.

మనుచరిత్రలో కూడా వరూధిని ఆమె అవయవాలకు వాటి కదలికలకే అత్యంత ప్రాధాన్యతనిస్తూ వ్రాసిన పద్యాన్ని చూస్తే అర్థమౌతుంది.

చూచి ఝళం ఝళత్కటక సూచితవేగపదారవిందమై లేని, కుచంబులున్ దుఱుము లేనడుమల్లల వాడునయ్యెడన్.....

శతకాలు :

తెలుగులో మొట్టమొదటి శృంగార శతకం తాళ్ళపాక అన్నమాచార్యుల శ్రీ వేంకటేశ్వర శతకం, పెదతిరుమలా చార్యుడు శృంగార వృత్తుల పద్యశతకాన్ని రాశాడు. సుమతీ శతకము, భాస్కర శతకములో కూడా స్త్రీని గురించి స్త్రీ స్వభావం గురించి అనేకరకాలుగా వ్రాశారు.

పనిచేయు నెడల దాసియు,
ననుభవమున రంభ, మంత్రియాలోచనలన్,
దనభుక్తి యొడలందల్లియు,
యనదగు కులకాంతయుండనగురా సుమతీ.

సద్గుణవతియైన ఉత్తమ ఇల్లాలు ఇలాంటి లక్షణా లతో ఉండాలని సుమతి శతకంలో రాయబడింది. అలాగే వేశ్యా స్త్రీ స్వభావము గురించి వర్ణించిన పద్యాలు కూడా ఉన్నాయి.

పులిపాలుదెచ్చి ఇచ్చిన
నలవడంగా గుండెగోసి యరచేనిడినన్
దల పొడుగు ధనముంబోసిన
వెలయాలికింగూర్మి లేదువినరా సుమతీ!

కవి చౌడప్ప శతకంలో స్త్రీ గురించి చాలా మార్మికమైన శృంగారపరమైన పద్యాలున్నాయి.

వగలాడికి ముసలాతడు
మగడయితే దానిచింత మరియింతింతే
జగదీశుడు తానెరుగు
ఖగపతిబల కుందవరపు కవి చౌడప్పా.

వయస్సులో ఉన్న స్త్రీకి ముసలివాడు భర్త అయితే ఆమె బాధలు పరమేశ్వరుడికే తెలుస్తాయి. ఇలా శతకాలు కూడా స్త్రీని శృంగార వస్తువుగా, పతివ్రత ధర్మాలను చెప్పింది. ఇలాంటి ధర్మాలు చెప్పిన శతకాలలో కుమారీ శతకం ఒకటి. ఇది కేవలం బాలికలకోసం రాయబడిన నీతిశతకం. స్త్రీలు చేయవలసిన పనులేమిటో, చేయకూడ దని పనులేమిటో వివరించబడ్డాయి.

తిట్టిన తిట్టిక కొట్టిన
గొట్టక, కోపించెనేని కోపించక నీ
పుట్టిన యింటికి పాదము
పెట్టిన యింటికిని వన్నె పెట్టు కుమారీ!

స్త్రీని కించపరచిన భర్త పాదాల వద్ద బ్రతకమని చూచించాయి.

ఇలా సంప్రదాయ కవిత్వమైన మహాభారతం, రామా యణం, ప్రబంధాలు, కథాకావ్యాలు, ద్విద కావ్యాలు, క్షేత్రయ్య పదాలలో కవులు స్త్రీని శృంగారపరంగానే చూశారు. పతివ్రతా ధర్మాలతో కట్టి పడేశారు అని మనకు స్పష్టమౌతున్నది. స్త్రీ చుట్టూనే అన్నీ కూడా తిరిగినట్టు మనకు స్పష్టంగా అర్థమౌతుంది. అవన్నీ కూడా స్త్రీకి పాతివ్రత్యాన్ని ఆపాదించడం కోసమే.

ఆధార గ్రంథాలు :

1. కవిత్వం - చైతన్యం - త్రిపురనేని మధుసూదనరావు
2. కథావాక్యాలు
3. ప్రాచీనాంధ్ర కవయిత్రుల స్త్రీ స్వభావ చిత్రణం - సాంబశివరావు
4. పురాణాలు
5. భావకవిత్వంలో స్త్రీ - జయప్రభ
6. భారతం
7. భాగవతం
8. యుగయుగాలలో భారతీయ మహిళ - కె. వరలక్ష్మి
9. శతకాలు
10. స్త్రీవాద వివాదాలు - ఎస్.వి. సత్యనారాయణ
11. సంప్రదాయ సాహిత్యం - స్త్రీవాద దృక్పథం కాత్యాయనీ విద్మహె
12. స్త్రీవాద కవిత్వం వస్తుశిల్ప సమాలోచన - యం.యం. వినోది.

❖

గురజాడ వారి ముత్యాలసరాలు – సామాజిక చిత్రణ

– డా॥. డి. సుశీల, తెలుగు అధ్యాపకురాలు, డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఐఐఐటి, ఒంగోలు.

ఆధునిక కవులలో తనదైన ముద్రవేసుకొని సమాజాన్ని చైతన్యమార్గంలో ముందుకు నడిపిన గొప్ప వ్యక్తి గురజాడ అప్పారావు గారు. సమాజంపై తనకున్న ఇష్టాన్ని, బాధ్యతను తన రచనల ద్వారా చెప్పకనే చెప్పారు. ఆయన కలం నుండి జాలువారిన ప్రతీ అక్షరం ఒక ప్రభంజనమనే చెప్పాలి. నవయుగ వైతాళికుడుగా చెరగని ముద్రవేసుకొని అహర్నిశలు తన రచనల ద్వారా సమాజ అభివృద్ధికి శ్రీకారం చుట్టిన అద్వితీయుడు గురజాడ.

గురజాడ వారి రచనల్లో వాస్తవిక జీవితం కళ్ళకు కట్టి నట్లుగా కనిపిస్తుంది. సామాజిక దృక్పథం కలిగిన ఆధునిక రచయితల్లో ప్రముఖులు సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి తన రచనల ద్వారా నడుంకట్టి సఫలీ కృతులయినారు. గురజాడ వారు సమకాలీన చైతన్యంతో కూడిన కవితా వస్తువును సమాజం నుంచే గ్రహించి సగటు మనిషికి అర్థమయ్యే విధంగా రాశారు. ఇలా రాయడానికి ఒకకొత్త ఛందస్సుని రూపొందించుకున్నారు. ముత్యాలు పొదిగిన సరం అందంగా, ఆకర్షణీయంగా ఉన్నట్లుగా గురజాడవారు తన కొత్త ఛందస్సుకు 'ముత్యాల సరాలు' అని పేరు పెట్టుకున్నారు. ఈ ముత్యాల సరాలు గేయరూపంలో ఉంటాయి. ఇవి పాడుకోవడానికి అనువుగా ఉండడమే గాకుండా వీటిని పాడిన వెంటనే భావం స్ఫురించడంతోపాటుగా గేయం మొత్తం మనస్సులోతుల్లో నిలిచిపోతుంది.

ముత్యాలసరములు, కాసులు, కన్యక, లవణరాజు కల, పూర్ణమ్మ, దేశభక్తి, మనిషి అనేవి "ముత్యాల సరాలు" లోని ముఖ్య ఖండికలు. ఈ ఖండికల ద్వారా గురజాడ వారు సమాజానికి అందించిన సందేశం తెలియజేయడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

ముత్యాల సరములు - ఛందస్సు :

గురజాడ రచనల కవితాసంపుటికి శెట్టి ఈశ్వరరావు గారు సంపాదకత్వం వహించగా, దీనిని విశాలాంధ్రవారు ప్రచురించారు. ఈ ముత్యాల సరములు తెలుగు సాహిత్యంలో వినూత్న మార్పులు తీసుకురావడానికి నాంది పలికింది అని చెప్పవచ్చు. దీనిలో గురజాడవారు వస్తువు, కవిత్వం యొక్క విశిష్టతను గురించి ఇలా తెలిపారు.

'గుత్తునా ముత్యాల సరములు
కూర్చుకొని తేటైన మాటలు
క్రొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు చిమ్మగా

అంటూ గేయకవితను ప్రారంభించారు.

ప్రాచీన కాలంనాటి పద, భాషాడంబరం ప్రదర్శించ కుండా నూతన ఛందస్సును నిర్మించుకొని, కొత్త, పాత విధానాన్ని కలుపుకొని తేనెలొలుకు తేటైన తెలుగు మాటలతో కవిత్వం చెప్పారు. ప్రాచీనకాలంలో పాల్కురికి సోమనాథుడు ప్రజలకు ప్రాధాన్యతనిచ్చి కావ్య వస్తువు ఛందస్సులోను గేయ రూపంలో ఉండే ద్విపద, రగడ వంటి వాటితో రచనలుచేశారు. దీనిని తెలియజెప్పేవే కొత్త పాతల మేలుకలయిక. గురజాడ వారు జానపదగేయ బాణిలో ముత్యాల్లాంటి పదాలను ఏర్చి, కూర్చి, ముత్యాల సరాలు రచించారు.

'మెచ్చనంటా వీవు నీవిక
మెచ్చకుంటే మించి పాయెను
కొయ్యబొమ్మలె మెచ్చు కళ్ళకు
కోమలుల సొరెక్కునా?

గురజాడ వారు పై కవితా పంక్తులలో నూతన కవితా విధానం గురించి ప్రస్తావిస్తూ నాటి సంప్రదాయ వాదులకు బెదరకుండా వారి కవిత్వంతో సమాధానం చెప్పారు. వారి నూతన కవిత్వాన్ని సమర్థించక పోయిన నష్టం ఏమి లేదు అని భావించారు. నూతన కవితాదృక్పథం ప్రతిష్టించారు. వీరి ముత్యాలసరాలు కథాత్మక గేయ కవితలో వస్తువు ముఖ్యంగా నాటి కులం మూఢనమ్మకాలపై వ్యతిరేకతతోపాటు నూతన హేతువాద దృక్పథంతో సాగింది.

ముత్యాల సరాలు ద్వారా గురజాడ వారు ఆనాటి సమాజంలోని దురాచారాలు, అంటరానితనం ఎంత తీవ్ర స్థాయిలో ఉండేవో తెలిపారు. అంతే గాకుండా సమాజంలోని మూఢనమ్మకాలు, అంటరానితనం తొలగిపోయి నవసమాజ నిర్మాణం జరగాలని ఈ ఖండిక ద్వారా తెలిపారు.

కాసులు :

గురజాడవారి 'కాసులు' గేయకవితలో నూతన ప్రేమ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ముఖ్యంగా దీనిలో స్త్రీ, పురుషుల మధ్య ఉండవలసిన ఐక్యతను గురించి తెలిపారు. భర్త దైవంతో సమానం అనే పాత మాటలు వద్దని, భార్యాభర్తలు ఇద్దరు సమానమే అని, గొప్ప భావజాలాన్ని ప్రదర్శించారు. ఇద్దరు కలిసి మెలసి ఉండడం వలన ఒకరిపై ఒకరికి ఆప్యాయతానురాగాలు పెరుగుతాయని కాసులు ఖండిక ద్వారా సమాజానికి సందేశం అందించారు.

'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమనిలుచును'

భార్యాభర్తలు ఒకరిపై ఒకరు అన్యోన్యంగా ప్రేమాభిమానాలను చూపించుకున్నట్లయితే ఆ ప్రేమ జీవితాంతం వరకు నిలిచి ఉంటుందని గురజాడ వారు రెండు పంక్తుల్లో నూరేళ్ళ జీవిత సారాన్ని ప్రబోధించారు.

కన్యక :

గురజాడవారి 'కన్యక' కవితలో అధికారం ఉందనే గర్వంతో ఏమి చేసినా తనను ఎవరూ ఏమీ చేయలేరనే రాజుగర్వం, కాలక్రమంలో కోటలు మట్టి కలిసిన విధానం కళ్ళ ముందు కదిలాడుతున్నట్లు అక్కడ జరిగిన సంఘటనలను కరుణ రసాత్మకంగా తెలిపారు. శెట్టిగారి ఇంట పుట్టిన కన్యకను రాజు ఆశించడం. రాజు తన అభిప్రాయాన్ని కన్యకకు తెలియజేస్తాడు. రాజు అభిమతానికి కన్యక అంగీకరించదు. కన్యకను రాజు బలత్కరించడానికి ప్రయత్నిస్తాడు. తన వారు ఎవరూ కూడా రాజును ఎదిరించే సాహసం చేయరు. చివరికి కన్యక గుడి ముందు మండుతున్న అగ్ని గుండంలో దూకి ఆత్మార్పణ చేసుకుంటుంది.

రాజును ఎదిరించే ధైర్యం ఎవరికీ లేదని తెలిసిన కన్యక వారి బంధువులను ఉద్దేశించి ఇలా అంటుంది.

"పట్టమేలే రాజు అయితే
రాజునేలే దైన ముండదే
పరువు నిలుపను పౌరుషము
మీకేల కలగదొకో!"

రాజ్యాన్ని పరిపాలించే రాజు అని రాజుని చూసి భయపడుతున్నారు. రాజుని పరిపాలించే దైవం ఉంది కదా! ఆ దైవం చూస్తూ, ఊరుకోదు. సాటి కులానికి చెందిన స్త్రీకి పరాయి పురుషుడు బలవంతంగా చెరబట్టాలని అనుకుంటుంటే మీరు ఎలా చూస్తూ ఉంటారు. పరువు నిలుపుకోవడానికి కొంచెం అయినా పౌరుషం కలిగి ఉండాలి కదా అంటూ కన్యక తమ వారిని ఉద్దేశించి మాట్లాడుతుంది. ఆ రాజుని, ఆనాటి రాజుల దుశ్చర్యలను గురించి తెలిపారు. స్త్రీలకు స్వేచ్ఛ లేకుంటే సమాజంలో వారి పరిస్థితి ఎలా ఉంటుందో విశదీకరించారు. ఎదుటి వాళ్ళకు భయపడుతున్నంత కాలం వాళ్ళు భయపెడుతూనే ఉంటారని, ఎదురు తిరిగి పోరాడితే ఎంతటి శత్రువువైనా జయించవచ్చనే దృఢసం

కల్పాన్ని కల్గిస్తుంది. బలవంతంగా ఇతరులకు సంబంధించిన దానిని ఆశించి పొందాలని అనుకుంటే దాని ఫలితము ఎంత దారుణంగా ఉంటుందో కన్యక పాఠం ద్వారా రచయిత తెలిపారు. అత్యాశ పరుడైన రాజు కన్యకను కోరుకొని, ఆమె ఆత్మార్పణకు కారణమవుతాడు. చివరికి రాజు మరణించడం, రాజ్యం సర్వనాశనం కావడం ఈ గేయం ద్వారా తెలుస్తుంది.

లవణరాజుకల :

1911వ సంవత్సరంలో గురజాడవారు లవణరాజుకల అనే గేయ రచన చేసి ఆంధ్రభారతిలో ప్రచురించారు. డామన్ పితియస్ కథలో గ్రీకు దార్శనిక సిద్ధాంతాలకు నూతన వ్యాఖ్యానం చేసి అంటరానితనాన్ని నిరశించారు. మానవతా వాదము ఇందులో మనకు కనిపిస్తుంది. వర్ణకట్టుబాట్లకు కట్టుబడకుండా గుణానికి ప్రాధాన్యం ఇవ్వాలని వారు ఆశించి సమాజానికి హితవు పలికారు. ఆనాటి సమాజంలో అంటారనితనం అధికంగా ఉండేది. పంచముల గాలి కూడా ఇతర కులాల వారికి సోకేది కాదు. గుడిలోకి, బడిలోకి ప్రవేశం నిషిద్ధము. అలాంటి పరిస్థితుల్లో గురజాడవారు వర్ణవ్యవస్థను రూపుమాపేందుకు నడుంకట్టారు.

సమాజంలో అంటరానితనం అమానుషంగా తయారయింది. దీనిని గమనించిన గురజాడవారు ఈ దురాచారాన్ని రూపుమాపడానికి తన రచనల ద్వారా ప్రయత్నం చేసి, సఫలీకృతుడైనాడు. మనిషిలో గుణాలను చూడాలే కానీ కులం ప్రధానం కాదని సమాజానికి హితవు పలికారు. అగ్రకులాల వారు వారి అవసరాలకు పంచముల శ్రమను దోచుకుంటారు. రాజకీయ అవసరాలు వచ్చినప్పుడు సహపంక్తి భోజనాలు చేయడం లాంటివి చేస్తారు. అలా చేస్తే కులం అనేది సమసి పోదని, పంచములకు చెందిన అమ్మాయిని వివాహం చేసుకుంటే నిజమైన ఐకమత్యం కలుగుతుందంటారు. ఆ విషయాన్ని గురజాడ ఇలా తెలియజేసారు.

"కలసి మెసగిన యంత మాత్రనె
కలుగుబోదీ యైక్యమత్యము
మాల మాదిగ కన్నె నెవతినో
మరులు కొనరాదా."

అంతేగాకుండా మంచితనం అనేది ఎక్కడ ఉంటుందో, అక్కడ కులాల ప్రస్తావన తీసుకురా కూడదని విశ్వసించారు. ఈ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ, మంచి అనేది మాల అయితే ఆ మాల కులానికి చెందిన వ్యక్తిని నేనే అవుతానని గురజాడ కులరహిత సమాజం కోసం ఆరాటపడినట్లు తెలుస్తుంది. ఆ విషయాన్ని గురించి ఇలా అంటారు.

'మంచి అన్నది మాల అయితే
మాలనే అగుదున్"

పూర్ణమ్మ :

అనాటి సమాజంలో బాల్య వివాహాలు అధికంగా జరిగేవి. ముక్కుపచ్చలారని ఆడపిల్లలకు కూడా వివాహాలు చేసేవారు. ఈ దురాచారం ఎంతోమంది పసిమొగ్గలను సతీసహగమనం, ఆత్మార్పణకు బలి చేసాయి. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి, సమాజంలో మార్పుకోసం, సమాజానికి కనువింపు కలిగించడానికి గురజాడవారు కరుణ రసాత్మకంగా 'పూర్ణమ్మ' గేయ రచన చేశారు. ఇది పాడుకోవడానికి అనువుగా ఉండి. చక్కటి భావాలను కలిగి ప్రతి శ్రోత హృదయాన్ని ద్రవింప చేస్తుంది.

ఆడపిల్ల పుడితే అదృష్టం అని కాకుండా, అరిష్టంగా భావించే రోజులవి. ఆ సమయంలో గురజాడ వారు వారి రచనల ద్వారా సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి ఉద్యమించారు. ఆడపిల్ల తల్లిదండ్రులు ధనానికి ఆశపడి పదహారేళ్ళ ప్రాయంగల పూర్ణమ్మను ముదుసలి వాడికి ఇచ్చి పెళ్ళి చేసిన సంఘటన గురించి గేయంలో ఇలా అంటారు.

'కాసుకు లోనై తల్లిదండ్రీ
నెనరూ న్యాయం వెడునాడి
పుత్తడి బొమ్మ పూర్ణమ్మను వొక
ముదుసలి మొగుడుకు ముడివేసి'

పూర్ణమ్మకు ముదుసలి వానితో వివాహం చేసిన తరువాత ఆమె ఆడుకోవడానికి వెళ్ళేదికాదు. తన తోటి పిల్లలు మొగుడు తాతయని అంటూ ఉంటే పూర్ణమ్మ తన ఇష్టదైవం అయినటువంటి దుర్గను చేరి ఏడుస్తుంది. చిన్న పిల్లల మనస్సు గాయపడినప్పుడు వారు ఎలాంటి మానసిక క్షోభకు గురవుతారో గురజాడ వారు తెలియజేసారు. పూర్ణమ్మ తన అన్నదమ్ముల పిల్లలతో మాట్లాడుతూ, తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోండి దుర్గాదేవిని పూజించండి అని చెబుతుంది. సాధారణంగా ఆడవాళ్ళు తమకు వచ్చిన కష్టాలను ఎదుటి వాళ్ళకు చెప్పేటప్పుడు అసలు విషయాన్ని దాచిపెట్టి, ఇతర విషయాలు చెబుతుంటారు. పూర్ణమ్మ కూడా అలాగే ప్రవర్తించింది. తాను ఆత్మార్పణ చేసుకుంటున్నాను అనే విషయాన్ని దాచిపెట్టి, ఇతర విషయాలు తన అన్నదమ్ములతో పంచుకుంటుంది. ఇక్కడ గురజాడవారు నేర్పుగా పూర్ణమ్మచే మాట్లాడించిన పద్ధతి ఆయన సంస్కర్త హృదయాన్ని తెలియజేస్తుంది.

'కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి చేరెను మేని పసల్
హంసల జేరెను నడకల బెడగుల్
దుర్గను జేరెను పూర్ణమ్మ'

పూర్ణమ్మ దుర్గలో లీనమై పోయిన క్రమాన్ని వర్ణించే ఘట్టము పాఠకుల మనస్సును ద్రవింపజేస్తుంది. 'దిక్కు లేని వారికి దేవుడే దిక్కు' అనే సామెతలాగా పూర్ణమ్మ తన ఇష్టదైవ సన్నిధిలో ఆత్మార్పణ చేసుకుంటుంది. ఈ గేయం బాల్య వివాహాలకు తెరదించడానికి కొంతవరకు దోహదపడిందనుటలో అతిశయోక్తి లేదు.

దేశభక్తి :

గురజాడవారి 'దేశభక్తి' గేయం ద్వారా ప్రపంచ మానవాళికి గొప్ప విశ్వమానవ ప్రేమను పంచారు. దీని ద్వారా మానవతావాదం, దేశభక్తి, మరియు జాతీయత అన్ని రంగాల అభివృద్ధిని కాంక్షించారు. ఈ గేయంలో ఎక్కడా కూడా దేశాల పేరుకానీ, మతము పేరుకానీ లేకుండా ప్రపంచంలోని అన్ని దేశాల వాళ్ళు ఈ గేయాన్ని పాడుకొనే విధంగా రచించారు. ఈ గేయంలో అన్ని వర్గాల వారి గురించి, వాళ్ళ యొక్క విశిష్టతను గురించి తెలియజేశారు. దేశభక్తి గేయాన్ని అర్థం చేసుకోవడానికి పాండిత్యం అవసరం లేదు. నగటు మానవుడు చదివి అర్థం చేసుకోగలడు. అంతటి సులువైన పదజాలంతో గురజాడ వారు రచించారు. ఈ గేయంలోని ఒక్కొక్క పద్యం ఒక అణిముత్యమై 'ముత్యాలసరాల'ను ముచ్చట గొలుపుతాయి.

ప్రతి భారతీయ పౌరుడు తనకు దేశభక్తి ఉందని గొప్పలు చెప్పుకుంటుంటారు. అలాంటి వారిని ఉద్దేశించి గురజాడ వారు ఇలా అంటారు.

'దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్ట వోయి
గట్టి మేల్ తలపెట్టవోయ్'

కొంతమంది గొప్పలు చెప్పుకుంటూ, కాలం గడుపుతుంటారు. అలాంటి వాళ్ళను గురించి గురజాడ వారు పై విధంగా అంటారు. వట్టిమాటలు చెప్పకుండా ఏదైనా ఒక పని చేసి చూపించమంటాడు. ప్రతి మనిసిలో మంచి అనేది పెంచాలని, ఎదుటి వాళ్ళలో మంచిని పెంచాలంటే మనం మంచివారుగా ఉండాలనే విషయాన్ని నిగూఢంగా ధ్వనింపజేశారు.

మనిషి :

గురజాడ వారి 'మనిషి' గేయం హేతువాద దృష్టితో రాసిన గేయం. మనిషి చేసిన రాయిరప్పకు మహిమ కలదని సాగి మొక్కడం అనేది మనిసిని, రాయికన్నా తక్కువగా చూడడమే అని విమర్శించారు. మనిషి యొక్క మనసు అన్ని పనులకు ఆధారం. మానవసేవయే

మాధవసేవ అని మనిషి యొక్క విశిష్టతను ఎలుగెత్తి చాటారు.

గురజాడ వారు మనిషి గొప్పతనాన్ని గురించి 'మనిషి' గేయంలో ఇలా అంటారు.

'యెల్ల లోకమము లొక్క యిల్లై
మతములన్నియు సమసిపోవును
జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును'

గురజాడ అప్పారావుగారు మనిషి విశ్వప్రేమికుడు కావాలని ఆకాక్షించాడు. అలాంటి రోజులు రావాలని ప్రగాఢంగా వాంఛించారు. ఆ దిశగా రచనలు చేస్తూ, సమాజాన్ని సంస్కరించడానికి పూనుకున్నాడు.

'బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు
ప్రీతి గూర్చునో వాడే ధన్యుడు'

అనే మాటలు గురజాడ వారికి చక్కగా సరిపోతాయి. ప్రస్తుత సామాజిక, ఆర్థిక, రాజకీయ, పరిస్థితులలో గురజాడవారి దేశభక్తి గీతం నేటి యువతకు వారి భవితకు స్ఫూర్తిగా నిలుస్తాయి. వారి హేతువాద దృక్పథం నవ్య కవితా విధానాలు తెలుగు సాహిత్య వినీల ఆకాశంలోని ముచ్చట గొలిపే తారకల్లాగా సుస్థిరంగా ప్రకాశిస్తుంటాయి.

గురజాడవారు రాసిన 'ముత్యాల సరాలు' గేయ ఖండికల్లో దేశభక్తి, బాల్యవివాహాలు, రాజుల దురహంకారాలు, మతసామరస్యం లాంటి సమాజంలో ఉన్న దురాచారాలను గురించి పేర్కొన్నారు. భావి పరిశోధకులు ఈ అంశాలను ప్రధానంగా చేసుకొని పరిశోధన చేయడానికి అవకాశం ఉంది.

ఆధార గ్రంథాలు :

1. అధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - సి.నా.రె.
2. తెలుగు సాహిత్య సమీక్ష - జి.నాగయ్య 2వ సంపుటం
3. గురజాడ రచనలు - ఈశ్వరరావు సెట్టి
4. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - వేల్చేరు నారాయణరావు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నూతన సాహిత్య ప్రక్రియ సిరిమంజరిలో సామాజిక జీవన చిత్రణ

– ధనికి ఉషారాణి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, భాకరాపేట, చిత్తూరు జిల్లా.

తెలుగు సాహిత్యం అనేక రకాల ప్రక్రియలకు నెలవై కొలువై సాగుతూ ఉన్నది. అనేక ప్రక్రియలతో పున్నమి చంద్రుడులా వెలుగు వేదజల్లుతూ వసంత ఆమనివలే శోభితమై తెలుగు భాష ప్రకాశిస్తూ ఉన్నది. నన్నయ్య గారితో అనువాద ప్రక్రియ మొదలై రచన చేసే మార్గానికి రాజబాట వేశారు. మన ప్రాచీన యక్షగానము సంకీర్తనలు వచన కవిత్వం వెలుగు వెదజల్లినవి.

నేటి ఆధునిక యుగంలో ఛందస్సు పరంపర శైలిలో కవిత్వం ఎన్నో ప్రక్రియలు వర్తిస్తుంది. ప్రస్తుతము అనేక వచన కవిత్వపు ప్రక్రియలలో యతి ప్రాసను దృష్టిలో ఉంచుకోని ఎన్నో ప్రక్రియలు సాగుతూ ఉన్నాయి. ఛందస్సును సంక్షిప్తపు భావము నుండి చాలా సులభంగా ఆధునీకరణ చేయబడినది పండితులే కాదు అందరూ కవిత్వం రాయగలరు అనెడి దృక్పథంలోకి నూతనముగా ప్రక్రియల సృష్టి జరుగుతూ ఉన్నది. ఇప్పటి నూతనముగా వినూత్నముగా చాలా సులభతరం రూపొందించబడిన ప్రక్రియ సిరిమంజరి. ఇప్పటికి 100 శతకాలు కవులు లిఖించడము జరిగింది. సామాజిక విషయాలను పురణాలను ఇతిహాసాలను సాంస్కృతిక ప్రతిబింబించే విధముగా మనసుకు హత్తుకునే విధముగా సూటిగా సంక్షిప్తముగా సామాన్య జనాలకు అర్థం అయ్యేలా తెలియజేయడం సిరిమంజరి ప్రక్రియ లక్షణం.

కవితలో భావము సూటిగా పాఠకులను చేరి సంపూర్ణ మానసిక ఆనందం కలుగజేస్తుంది 10 పాదాలను కలిగి, 5 పాదములో కవి కలము పేరును 10 పాదములో గురువును స్తుతి చేస్తూ ఉన్నట్టుగా ఉంటూ కవితలో మొదటి పదముకు చివరి పదమును ప్రాస పదము వచ్చేలా రాయడము ప్రతి పాదములో 2 సూర్య 1 ఇంద్ర గణము వచ్చేలా రాయడము సిరిమంజరి ప్రత్యేకత. తెలుగు సాహిత్యము తెలియజేసే ఏ సందర్భమును అయినా చక్కగా వర్ణించవచ్చును.

మధ్యపానము సిరిమంజరిలో...

మందు తోడ మనిషి
మరొక జగముకుపోవు
ఆలి బిడ్డ లందరిని
కొట్టి తిట్టి చంపెరు
సిరుల నిచ్చు మాటలు
మత్తు అన్న భూతము
వల్ల యెన్ని ఇండ్లుర
నాశనమవుతున్నాయి
తాగి నోళ్ళ గతింతె
గురువు నేర్పు మర్యాద

మధ్యపానము సేవించి సామాజికముగా బతుకులు ఏ విధముగా బలి అవుతున్నదో తెలుపుతున్నది.

సిరిమంజరిలో పాట సామాజిక చిత్రణ గురించి

కమ్మనైన పాటలు
యెదను తాకు పాటలు
తెలుపు కవుల భావాలు
నవరసాల మిళితము
రమ్యమైన పాటలు దృశ్య మాళికల్లుగా
మధుర కథలు చెప్పును
జోల పాడు పాటలు
మధురగాన పాటలు
గురువు కథలు కమ్మన !!

బాలకార్మికులు సిరిమంజరి ప్రక్రియలో

ముద్దు చిట్టి చేతులు
చేయరాదు పనులను

పాఠశాల యందున
నేర్వ వలయు చదువును
సిరులు పెంచు శ్రద్ధను
కూలిపనులు వారిని
చేయమనుట నేరము
బాలకార్మికులు లేని
జాతి మనకు రావాలి
గురువు నింద వద్దురా!

ధ్యానము సిరిమంజరి ప్రక్రియలో

ధ్యాన యోగ చేయుము
అదే నీకు మంచిది
నడకనుకొన సాగించు
ప్రతి రోజు చేయుము
సిరులు కూర్చు మాటరా
జీవ హింసవద్దురా
ప్రేమ తోడ మెలుగుమ
తోడుగాను ఉండుము
నీడ వలెను ఉండుము
గురువు నేర్పు ధ్యానము

సిరిమంజరిలో కరోనా సామాజిక చిత్రణ

తరిమి కొట్ట వేలను
ఈకరోనా జబ్బును
ప్రాణ భయముతోడను
ప్రజలు అల్లలాడుచు
తిరుగ ఉషకు బాధాయె
కృష్ణ నీవు దయచూపు
చక్రమునుపయోగించి
సంహరించరాదయ్య
ఏలమమ్ము చూడవు
గురువు నిత్య ఆద్యము

సిరిమంజరిలో రైతు బతుకు చిత్రణ

పుడమి పైన జల్లులు
కురిసె పల్లెలందును
చినుకు చినుకు పడగాను
ఒర్రెలెన్నో నిండెను
వాస్తవంబు సిరిరాగ
బీళ్ళుపడిన భూములు
మొలచె గడ్డి నెంతయో
చెట్లుచిగురు వేసేను
గుబురు లెక్కువయ్యేను
రైతు గురువు పుడమిలో

శ్రమ విజయ బాట సిరిమంజరి ప్రక్రియలో

ఫలము కొరకు శ్రమములు
ధనము కొరకు యతనము
కీర్తి కొరకు యతనము
సలిపి చూడ విజయము
తెలుగుతేజ పలుకులు
దారి చూపు రేఖలు
ఫలము ధనము పొందుట
కీర్తి వలన సులభము
తెలిసి యరుగు నరవరాగురువు చెంత ఫలమురా

సిరిమంజరి ప్రక్రియ ద్వారా సామాజిక అంశాలను మరియు మానవ జీవన చిత్రణను బాగా వ్యక్తపరచ గలము.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నీలిమేఘాలు – స్త్రీ మానసిక సంఘర్షణ పరిశీలన

– జె. కృష్ణవేణి, కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ.

ఉపోద్ఘాతం :

తెలుగు సాహిత్యోద్యమాలలో 20వ శతాబ్దం ఒక ప్రతోష్ట్యకతను సంతరించుకుంది. భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ సాహిత్యోద్యమాల కంటే భిన్నమైనవే గాదు సంచలనం కలిగించిన ఉద్యమాలెన్నో వచ్చాయి. తెలుగు సాహిత్యం పొండవునా అపుడపుడు నిరసన స్వరాలు వినిపించుకుంటూ వచ్చి, 20వ శతాబ్దాంతంలో ఉద్యమ చైతన్యాన్ని నింపుకుంది స్త్రీవాది. వ్యక్తి చైతన్యం కరడుగట్టిన సమాజాన్ని సైతం మార్చగలదనే దాన్ని నిజం చేసిందీ ఉద్యమం. లింగపరమైన సమసమాజ లక్ష్యం కోసం స్త్రీవాదం అన్ని అడ్డంకుల్ని ఎదుర్కొని నిలిచింది. అటువంటి స్త్రీవాద దృక్పథాన్ని సాహితీలోకంలో ప్రచారం చేయాలన్న ఉద్దేశ్యంతో వెలువడిన కవితా సంకలనమే నీలిమేఘాలు. దీనిలోని కవితల్ని స్త్రీవాద దృక్పథాన్ని ప్రకటించేవే.

నీలి మేఘాలు - నేపథ్యం :

'నీలి మేఘాలు' అనే కవితల సంకలనం. ఇందులో 34 మంది స్త్రీవాద రచయిత్రులు వ్రాసిన 93 కవితలు ఉన్నాయి. ఇది 1993లో మొదట ముద్రణను, 1996లో రెండవ ముద్రణను పొందింది. దీనికి సంపాదకులుగా ప్రత్యేకంగా ఉంది. కొన్ని సంవత్సరాలుగా స్త్రీవాదం సంస్థ ఈ సంకలనాన్ని ప్రచురించింది. ఈ సంకలనం వెలువడ టానికి కొంత నేపథ్యం ఉంది. కొన్ని సంవత్సరాలుగా స్త్రీవాదం కొన్ని విషయాలను ముందుకు తెచ్చి చర్చకు పెట్టింది. పితృస్వామ్యం, జండర్, అణచివేత, ఇంటిచాకిరీ స్వభావం మొదలైన ఎన్నో విషయాల గురించి కొత్త ఆలోచనలు రేపింది సమాజంలో స్త్రీ, పురుషులు ఎలా నిర్వచింపబడతారనే దానిమీద ఆధారపడి సమాజంలో రకరకాల విషయాలు రూపొందుతాయనీ, మిగిలిన విషయాలన్నింటికీ నిర్ధిష్టమైన స్వరూప స్వభావాలనిచ్చేంత ప్రధానమైన విధానం జండర్ విధానమని స్త్రీవాదం చెబు తుంది. "స్త్రీల అణచివేతనూ, దాని స్వభావాన్నీ విశ్లేషించే పద్ధతీ, ఆ అచనివేతను వ్యతిరేకించే ఉద్యమం, ఆ ఉ ద్యమపు వ్యూహం గురించిన వివేచన ఇవీ యివాల్టి చారి త్రక అవసరాలు". ఈ చారిత్రక అవసరాలు నేపథ్యం లోంచి బయలుదేరిన కవితలే ఈ 'నీలిమేఘాలు' (నీలి మేఘాలు, పుట - 19) అని ఓల్గా పేర్కొన్నారు.

స్త్రీవాద కవిత్వం - నీలి మేఘాలు :

సమాజాన్నీ, సాహిత్యాన్నీ తమ దృక్కోణం నుంచి పునరధ్యయనం చేసి సాధికారింకగా స్త్రీవాదులు 1993లో ప్రకటించుకొన్న కవితా సంకలనం 'నీలి మేఘాలు'.

'నీలి మేఘాలు'కు ముందు మాటలు అందిస్తూ ఓల్గా 'సంకెళ్ళు తెగుతున్న సంగీతం' అంటూ స్త్రీవాదాన్ని స్పష్టంగా చర్చించారు. పితృస్వామ్యం, జండర్, అణచివేత, ఇంటిచాకిరీ గురించి 'నీలి మేఘాలు' కొత్త ఆలోచనల్ని రేపిందన్నారు. స్త్రీల గురించి ఈ సమాజం ఇచ్చే నిర్వచ నాల్ని తిరస్కరించాలన్నారు. సొంతగొంతు దృష్ట్యా, వ్యక్తిత్వం దృష్ట్యా నూతనంగా నిర్వచించుకోవాలన్నారు. సంచలనంగా ఉబికిన నిరసన జ్వాలల పితృస్వామ్య వ్యవస్థని చుట్టుముట్టి కదనరూపంగా మార్చిన సన్నివేశ దృశ్యమే ఈ నీలి మేఘాలు. మన రాష్ట్రంలోని 34 మంది స్త్రీ వాద రచయిత్రులు తమ దృక్కోణం నుంచి సమాజాన్ని వీక్షించిన తీరును ప్రస్ఫుటీకరించారు. స్త్రీవాద సిద్ధాంతా లకు నిలువెత్తు దర్పణమేగాదు పురుషాధిక్య సమాజం మీద యుద్ధం కోసం ప్రకటించిన మేనిఫెస్టో 'నీలి మేఘాలు'. 1972లో స్త్రీవాద కవిత్వానికి బీజం నాటిన ఓల్గాతో సహా కన్నాభిరాన్, విమల, కొండెపూడి నిర్మల, జయప్రభ, రేవతి, వసంత, సావిత్రి, హేమలత మొదలైన

ప్రసిద్ధి పొందిన కవయిత్రలు కవితలు కలకలం సృష్టించాయి. అందాలకోసం పుట్టిన భోగ వస్తువులుగా, పిల్లల్ని కనే యంత్రాలుగా, మైనన్‌లుగా, నడిచే గాయాలుగా, గయ్యాళులుగా ఎన్నో పాత్రలు పోషించాల్సిన దుర్గతిని ఎండగట్టడానికే స్త్రీవాదులు నీలి మేఘాలయినారు. స్త్రీల అణచివేతను వ్యతిఏకించే ఉద్యమం. ఆ ఉద్యమపు వ్యూహం గురించి వివేచన ఈనాటి చారిత్రక అవసరాలుగా పరిణమించిన తీరు 'నీలి మేఘాలు'లో కనబడుతుంది.

నీలి మేఘాలు - స్త్రీ మానసిక సంఘర్షణ :

నీలి మేఘాలు సంకలనంలో కనిపిస్తున్న స్త్రీ మానసిక సంఘర్షణను ఏడు భాగాలుగా విభజించవచ్చు.

1. అస్తిత్వం, 2. వివాహ వ్యవస్థ, 3. శారీరక స్పృహ, 4. లైంగిక వివక్ష, 5. మాతృత్వం, 6. కుటుంబ హింస, 7. సామాజిక జీవితం.

అస్తిత్వం :

స్త్రీ అస్తిత్వానికి సంబంధించి శ్రీమతి, రేవతీదేవి, వసంత కన్నాభిరాన్, వాణీ రంగారావు కవితలు రాశారు.

ఈ సమాజంలో పితృస్వామ్య వ్యవస్థ స్త్రీగా పుట్టడమే పెద్ద పాపంలా, శాపంలా భావించింది. అంచేత తమ ఉనికే నిషిద్ధం అని చెబుతుంది శ్రీమతి గారు.

"నేనొక స్త్రీని
నేఒక నిషిద్ధ జీవిని
మొన్నటిదాకా నా నవ్వు నిషిద్ధం
నిన్న నా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే"

ఆడపిల్లయితే పుట్టిన వెంటనే గుడివెనుక విషం ఇచ్చి చంపే రాజస్థాన్ గ్రామాల్లోని దుష్టాచారం విని ఈ కవిత రాశానని చెప్పుకున్నారు. 'శ్రీమతి' గారు. కానీ ఇలాంటి సంఘటనలు ఆచారంగా కాకపోయినా ఆడపిల్ల పుట్టుకను జీర్ణించుకోలేని మనుషులు, పరిస్థితులు వారి చావుకు కారణమవుతున్న సంగతి జగద్విదితమే.

శారీక స్పృహ :

సుధ, మందరపు హైమావతి, కె.వరలక్ష్మి గారు వివాహ వ్యవస్థ గూర్చి కవితలు రాశారు.

సావిత్రి గారి "బందిపోట్టు" అనే కవిత భారతదేశంలోని వివాహ వ్యవస్థను చీల్చి చెండాడింది. 'పెళ్ళి' అనే రెండక్షరాల మాట ఎలా 'శిక్ష'గా పరిగణిస్తుందో అద్భుతంగా చిత్రించిన కవిత ఇది.

"పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తానని
పంగులుగారన్నప్పుడే భయం వేసింది
ఆఫీసులో నా మొగుడున్నాడు
అవసరమొచ్చినా సెలవివ్వడని
అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది
వాడికేం మగమహారాజని
ఆడమగా వాగినప్పుడే అర్థమైపోయింది
పెళ్ళంటే పెద్దశిక్ష అని
మొగుడంటే స్వేచ్ఛాభక్షకుడని
మనం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని"

వివాహం, దాపంత్యం అనే పదాలకున్న ఆదర్శ ప్రాయమైన నమ్మకాలకు వాస్తవిక జీవితానికి పొలిక లేదని స్పష్టం చేసింది ఈ కవిత.

పెళ్ళి తర్వాత స్త్రీ ఎన్ని రకాల అవతారాలు ఎత్తవలసి వస్తుందో హైమావతి గారు చాలా చక్కగా చిత్రీకరించారు.

"ఎదురుచూచిన బస్సెంతకీ రాక
ఎప్పటికో వచ్చిన బస్సెక్కి ఆఫీసు గమ్యం చేరుకుంటాను
ఆఫీసరు అసురుడు అనేస్తాడు ఆఖరికి
"ఆడవాళ్ళకెందుకమ్మా ఉద్యోగాలని"
ఆనాటి సీత అభిమానం కాపాడిన భూమాత

మళ్ళీ ప్రత్యక్షమవగూడదూ అనిపిస్తుంది ఆ క్షణం" అంటూ ఆ క్షణంలో ఉద్యోగిని అయిన స్త్రీ యొక్క మానసిక క్షోభను చక్కగా కవిత్వీకరించారు.

శారీరక స్పృహ :

కొండేపూడి నిర్మల, కె. గీత, జయప్రభ, పాటిబండ్ల రజని, విమల, రేవతీదేవి మొదలైన వారు ఈ రకమైన వస్తువును తీసుకొని కవితలు రాశారు.

"సౌందర్యాత్మక హింస" అనే కవితలో విమల స్త్రీల శరీరాన్ని భోగవస్తువుగా తీర్చిదిద్దడం వెనుక పితృ స్వామ్యంలోని వ్యాపార దృక్పథాన్ని ఆ కొలతల మేర తయారవ్వాలనే ఆలోచనలతో సతమతమవుతున్న స్త్రీల మానసిక అలజడిని విడమరిచి చెప్పారు.

"మనమంటే 34, 24, 35 కొలతలమైనచోట
మొటిమలు మొలవడం, జుట్టు రాలడం
నడుం సన్నగా లేకపోవడమే
మన నిరంతరాందోళనలైనచోట
అందం పోటీయైనచోట
అందం సరుకైనచోట
అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం"

అని హెచ్చరిస్తూ శ్రమ సౌందర్యాన్ని, మానవ విలువల్ని ప్రేమించాలని అదే కవితలో హితవు పలికారు.

మందవరపు హైమావతి గారు చలనచిత్రాలకు, వ్యాపార ప్రకటనలకు స్త్రీల శరీరాన్నే పెట్టుబడిగా ఉపయోగించుకుంటున్న పురుషస్వామ్య సంస్కృతిని విమర్శిస్తూ

స్త్రీకి పర్యాయపదం
శరీరమే అని భావించిన మీకు
నా మనోభావాలు
నా అంతర్గత వేదనలు
అర్థం కావు"

అని స్త్రీల మనోభావాలను గౌరవించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

లైంగిక వివక్ష :

జయప్రభ, శ్రీమతి, పాటిబండ్ల, రజియాబేగం గార్ల కవితలు దీనికి మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు. "ఎవరూ ఆడవాళ్ళుగా పుట్టరు, తయారవుతారు" అన్న ఫ్రెంచి స్త్రీవాది సిమోన్ దబూవుఆర్ మాటలు లైంగిక వివక్ష అసలు స్వరూపాన్ని తెలియజేస్తాయి. దాన్ని సమాజం చిన్నతనం నుండే ఎలా అమలుచేస్తుందో మగపిల్లవాడికి, ఆడపిల్లకూ మధ్యవున్న తేడాని చాలా స్పష్టంగా శ్రీమతి గారు కవిత్వీకరించారు.

"చీర ఒక అంచును గుండెలపై పదిలంగా అమర్చు
కున్నట్లు
అమ్మ తమ్ముణ్ణి హృదయానికి హత్తుకుంటుంది
కాళ్ళకు అడ్డుపడే అంచులా
నన్ను మాటల్తో తన్నుతుంది"

పురుషస్వామ్య భావజాలాన్ని జీర్ణించుకున్న స్త్రీలు తమ కుమార్తెల (వారూ స్త్రీలే అయినప్పటికీ)ను ఎంత వివక్షతతో తూలనాడతారో తెలియజెప్పిన కవిత.

స్త్రీ పుట్టుక నుండి వృద్ధాప్యం వరకు పడే బాధలు వున్నవి వున్నట్లు వర్ణించారు రజియాబేగం గారు.

"బాల్యంలో
చిన్నపిల్లవి నీకేం తెల్సు కూర్చో' అన్నారు.
యవ్వనంలో
'ఉడుకు రక్తం మంచీచెడూ తెలీదు కూర్చో' అన్నారు.
వృద్ధాప్యంలో
'ముసల్దానివి ఇంకే చేస్తావ్ కూర్చో' అన్నారు
అవకాశం రానందుకు కోపంగాలేదు నాకు
కూర్చొని, కూర్చొని బద్ధకం వచ్చినందుకు బాధగా
ఉంది"

ఇటువంటి వివక్ష వలన స్త్రీలలో ఒకరకమైన నిస్తేజం, మౌనం ఆవరిస్తాయి. వారు ఎప్పటికీ బయటి ప్రపంచంలో భాగస్వాములు కాలేరు. వారికి అభివృద్ధి వుండదు అన్న విషయాన్ని స్పష్టం చేసిందీ కవిత.

మాతృత్వం :

స్త్రీవాద కవయిత్రులు మాతృత్వ భావనపై పితృ స్వామ్య వ్యవస్థ కల్పించిన ఆదర్శీకరణను ఖండించారు.

"లేబర్‌రూమ్" కవితలో కొండేపూడి నిర్మల గారు స్త్రీని సంతానాన్నికనే యంత్రంగా చూడడాన్ని నిరసించారు.

"లేబర్ రూంలో అడుగుపెడితే చాలు
మీరంతా చెబుతున్న తెల్లచీర మల్లెపూలు, పాలగ్లాసు వరుసల్లో
పరాధీనతా, బానిస కన్నీరు, ద్వీపాంతర వాసం
కాళ్ళనలా ఎడం చేసి దీనంగా, హీనంగా, నీచాతినీచంగా
ఒక హింసాతల పరాకాష్ట కోసం ఎదురు చూడ్డమంటే
రైలుపట్టా మీద నాణెం విస్తరించిన బాధ"

ఈ కవితలో ప్రసవ సమయంలో స్త్రీ పడే వేదన ఎంత తీవ్రంగా, భరించరానిదిగా ఉంటుందో నిర్మల తెలిపారు. మాతృత్వంలోని ఆనందాన్ని అంగీకరిస్తూనే, దానిలో వున్న శరీర హింసనూ, స్త్రీల ఇష్టాయిష్టాలతో సంబంధంలేని మాతృత్వస్థితిని స్త్రీవాద కవయిత్రులు చక్కగా చిత్రించారు.

కుటుంబ హింస :

భారతీయ కుటుంబ వ్యవస్థలో స్త్రీ పడిన బాధల మీద అణచివేత మీద, అనేక కుటుంబ సమస్యలపై కవితలు వచ్చాయి. విమల గారు రాసిన "వంటిల్లు" దీనికి మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇంటి చాకిరీ స్త్రీ జీవితాన్ని ఎలా సంకుచితం చేస్తుందో, ఆమె అస్తిత్వాన్ని ఎలా హరిస్తుందో 'విమల' ఈ కవితలో అద్భుతంగా వర్ణించింది.

"మా అమ్మ మా అమ్మమ్మ
ఇంట్లో అమ్మలంతా ఇక్కడ స్త్రీలయ్యారట
భయం, భయంగా నిశ్శబ్దంగా, నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా వుంటుంది
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా
మా నాన్న పేరే"

కుటుంబ వ్యవస్థలో కనిపించీ కనిపించని అణచివేత, దౌర్జన్యం ఎలా ఉంటాయో పై కవిత వివరించింది. కుటుంబ వ్యవస్థలోని కుళ్ళును బయటపెట్టిన స్త్రీవాద కవయిత్రుల్లో జయప్రభ, ఓల్గా, రజని, భవానీదేవి, వాణీ రంగారావు, రావులపల్లి సునీత మొదలైనవారు చెప్పుకోదగ్గవారు.

సామాజిక జీవితం :

సామాజిక జీవితాన్ని వస్తువుగా స్వీకరించిన స్త్రీవాద కవయిత్రుల్లో చెప్పుకోదగ్గవారు జయప్రభ, మందరపు హైమావతి, రావులపల్లి సునీత, ఓల్గా, ఘంటసాల నిర్మల, కె. గీత మొదలైనవారు.

ఇంట్లో భర్త నుంచి బయట 'గుంటనక్కల' వరకూ కుటుంబం, సమాజం బతకనివ్వడం లేదని బాధపడుతుంది సునీత గారు.

"నాకూపిరిర సలప నివ్వని
సామాజిక న్యాయం మీద
కాండ్రించి వూసిన ఉమ్మిలా
నా ప్రాణాన్ని ఉరితాడులో
బిగించాను
ఇప్పటికిదే నేనెరిగిన నిరసన"

పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీల ఆత్మహత్య కూడా ఒక నిరసన అని 'సునీత' గారు ఈ కవితలో వివరించారు.

ముగింపు :

ఈ విధంగా నీలి మేఘాలు కవితా సంకలనం స్త్రీల అస్తిత్వానికి దర్పణంలా నిలుస్తుంది. కొన్ని పదుల స్త్రీల గొంతులు ఏకమై తమ ఉనికి కోసం, ఊపిరి కోసం ఉద్యమిస్తున్న తీరును స్పష్టంగా ప్రకటించింది. మేమూ మనుషులమే, మాకూ మనసున్నది, దానికి ఒక ఆలోచన కావాలి, అనుభూతి ఉండాలి అంటూ తమ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్న సమాజాన్ని ప్రశ్నిస్తున్న కొన్ని లక్షల స్త్రీల గొంతులు ఏకమై తమ ఉనికి కోసం, ఊపిరి కోసం ఉద్యమిస్తున్న తీరును స్పష్టంగా ప్రకటించింది. మేమూ మనుషులమే, మాకూ మనసున్నది, దానికి ఒక ఆలోచన కావాలి, అనుభూతి ఉండాలి అంటూ తమ ఉనికిని

ప్రశ్నార్థకం చేస్తున్న సమాజాన్ని ప్రశ్నిస్తున్న కొన్ని లక్షల స్త్రీల గొంతులకు ప్రతీక ఈ సంకలనం. దీని ద్వారా పురుష స్వామ్య సమాజం తమ ఆలోచనా విధానాన్ని మార్చుకొని కొంతవరకైనా స్త్రీలను స్త్రీలుగా చూడాలని, వారి ఆకాంక్షలు నెరవేర్చాలని, స్త్రీ పురుషుల మధ్య ఆధిపత్య, అధికార సంబంధాలు పోయి, పరస్పరం గౌరవించుకొనే సమస్థాయి సంబంధాలు ఏర్పడాలన్నదే తమ లక్ష్యమని స్త్రీవాద కవయిత్రులు కాంక్షిస్తున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగులో కవిత్వోద్యమాలు : తెలుగు అకాడమి
2. నీలిమేఘాలు : అస్మిత ప్రచురణలు
3. రెండో సంగం : డా॥. మనేపల్లి
4. స్త్రీవాద వివాదాలు : డా॥. ఎస్.వి. సత్యనారాయణ (సం॥)

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలంగాణ మాండలిక నవలలు : నూతన ఆవిష్కరణలు పరిశీలన

– గణేష్ వేములూరి, కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ.

తెలుగు సాహిత్యంలోకి ప్రాంతీయ మాండలికాలు ప్రవేశించడానికి కారణాలను పేర్కొన్నారు. తెలంగాణ మాండలిక నవలా సాహిత్యానికి చిరునామాగా నిలిచిన కుక్క నవలలో ప్రయోగితమైన తెలంగాణ మాండలికాన్ని చర్చించడమైంది. తెలంగాణలోని మాండలిక నిర్మాణం, నామ పదాల వైవిధ్యత, సామెతల స్వరూపాన్ని పేర్కొనడమైనది. తెలుగు మాండలిక నవలల పరిచయాన్ని పేర్కొంటూ, మాండలిక రచనలను ప్రోత్సహించడం వల్ల తెలుగు సమగ్రీకరణవైపు మనం ప్రయాణించాల్సిన అవసరాన్ని ఈ వ్యాసంలో పేర్కొనడమైనది. "తెలంగాణ మాండలిక నవలలు : భాషా పరిశీలన" అనే అంశంపై నా పరిశోధన కొనసాగుతోంది. ప్రధానంగా తెలంగాణ మాండలిక నవలల్లోని భాషావైవిధ్యతను ఈ పత్రంలో విశ్లేషిస్తారు.

నేపథ్యం :

బహురూపతా లక్షనం భాషకు సహజమైనది. ఈ బహురూపత వైయక్తిక స్థాయి మొదలుకొని కుల, వృత్తి, ప్రాంతీయాలుగా వివిధ స్థాయిల్లో ప్రవర్తిల్లుతుంటుంది. ఈ రకమైన భాషా భేదాలనే స్థూలంగా మాండలికాలు అంటారు.

"ఒకే భాషకు ప్రజల వ్యవహారంలో పదాలలోనూ, వాటి ఉచ్చారణలోనూ, ప్రత్యయాలలోనూ, పదాల అర్థాలలోనూ భేదాలు ఉండి ఆ భాషలో రకాలు ఉంటాయి. ఒకే భాషకు ఉన్న ఇటువంటి రకాలని మాండలికాలు అంటారు". (సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1997 : 174).

1980వ దశకం తర్వాత ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో 'స్థానీయతా చిత్రణ' ప్రధానాంశముగా ముందుకొచ్చింది. ఇది సాహిత్యంలోనూ ప్రతిఫలించి, ప్రాంతీయ భాష / మాండలికాల ప్రయోగాలకు ప్రాధాన్యత పెచ్చింది. ప్రాంతీయ వాదంలో భాగంగానే తెలంగాణ కవులు / రచయితలు తమ ప్రాంత భాషలో సాహిత్య సృజన చేయాలనే తపనతో అందుకు ఉపక్రమిస్తున్నారు. ఈ సృజన వివిధ సాహిత్య వచన రచన ప్రక్రియల్లో వరుసగా కవిత్వం, కథ, నవలల్లో వెలువడుతోంది.

తెలుగు మాండలిక నవలలు :

నిరంతరం మార్పువల్ల భాషలో బహురూపతతోపాటు వైవిధ్యాలు ఏర్పడుతాయి. భద్రిరాజు కృష్ణమూర్తి గారు తెలుగు భాషా వ్యవహార ప్రాంతాన్ని నాలుగు మండలాలుగా (మాండలిక భేదాల ఆధారంగా) గుర్తించారు'. (కృష్ణమూర్తి, భద్రిరాజు, 2000 : 397). ఆయా మండలాలలో వచ్చిన కొన్ని మాండలిక నవలలను కింద పేర్కొన్నారు. వీటిలో కొన్ని నవలలు సంభాషణలు మాత్రమే మాండలికంలో ఉండగా, మరికొన్ని పూర్తి మాండలికంలో ఉన్నాయి.

తెలంగాణ :

1. ప్రజల మనిషి (వట్టికోట ఆశ్వారుస్వామి, 1955)
2. ముత్యాల పందిరి (పొరంకి దక్షిణామూర్తి, 1969)
3. మోదుగుపూలు (దాశరథి రంగాచార్యులు, 1971)
4. కొలిమంటుకున్నది (అల్లం రాజయ్య, 1978)
5. ఊరు (అల్లం రాజయ్య, 1979)
6. అగ్నికణం (అల్లం రాజయ్య, 1981)
7. బతుకుపోరు (బి.ఎస్. రాములు, 1982)
8. తెలంగాణ పల్లె (కౌముది, 1996)
9. కక్క (వేముల ఎల్లయ్య, 2000)
10. సూర (భూతం ముత్యాలు, 2004)
11. సిద్ధి (వేముల ఎల్లయ్య, 2005)

12. పురుడు (భూతం ముత్యాలు, 2007)
13. పొద (కదిరె కృష్ణ, 2010)
14. ఇగురం (భూతం ముత్యాలు, 2012)

తెలుగు ప్రాంతంలోని మిగతా మాండలాలలోని రాయలసీమలో రంగవల్లి, ఎదురగ్గి, గుమ్మెట మోతబీ ఆంధ్రలో వెలుగు వెన్నెల గోదారి, వెన్నెల నవ్వు, సొరాజ్జెం మాండలిక నవలలు మొదలైనవి.

తెలంగాణ మాండలిక నవలలు : నూతన ఆవిష్కరణలు :

భాష సామాజిక, ఆర్థిక, సాంస్కృతికాది కారణాల వల్ల వైవిధ్యతను సంతరించుకుంటుంది. ఈ వైవిధ్యం ఉచ్చారణ భేదమేగాక శబ్ద స్వరూపం, ప్రత్యయ విభజన, సామెతలు, జాతీయాలు మొదలైన తావుల్లో ప్రవర్తిల్లుతుంది. ఈ వ్యాసంలో ప్రధానంగా తెలంగాణ (ఉత్తర మండల) నవల 'కక్క' ఆధారంగా మాండలికం ఆవిష్కృతమైన తీరును విశ్లేషించాను.

వ్యాకరణ విభాగం :

ఎ) '-ండ్రు' అనే సంయోజక ప్రత్యయం తెలంగాణ మాండలికంలో బహ్వర్థ బోధను తెలిపే '-రు' కుమారుగా క్రియాంతాల్లో ప్రయోగింపబడుతుంది.

ఉదా : ఎలేసిండ్రు ("కులంల కెల్లి ఎలేసిండ్రని సుట్టూర్లకు డప్పు సాటింపు చెయ్యిండ్రి". కక్క : 22)

ఉదా : గలుసుకుండ్రు ("గయ్యాల్టి పండ్గనాడే గల్సిన గల్సుడు గియ్యాల మల్ల గల్సుకుండ్రు పానాదిల". కక్క : 43)

బి) బహువచన ప్రత్యయాలు పరమైనపుడు ప్రాతిపదికాంత ట, డల మీది ఉత్వం వికల్పంగా వస్తుంది.

ఉదా : వొడ్డు+లు = వొడ్లు ("ఏదో సర్ది బుడ్డెడన్ని వొడ్లు, పద్సేర్ల బియ్యంతోటి ఎల్లదియ్యి". కక్క : 60)

సి) బహువచన అద్విరుక్త -ల, -డ, లకు అలఘు 'ల'కారం నిత్యంగా రాని రూపాలు కూడా కన్పిస్తున్నాయి.

ఉదా : గుంటూరోడు + లు, గుంటూరోలు + లు = గుంటూరోళ్ళు ("గుంటూరోళ్ళు భూములల్ల నిర్పతోటలు పత్తి పంటలు పండిత్తుండ్రు8". కక్క : 95)

బాగోతగాడు + లు, బాగోతగాలు + లు = బాగోతగాళ్ళు ("బాగోతగాళ్ళు పనులకు బోకుండ సావాట్ల భాగోతం స్టేజీ కట్టింది అడివిల వొనం ఆకులు అలములు పూలతోని తీరు తీరుగా మూడు లోకాలోలే స్టేజీ పుదిచ్చిండ్రు". కక్క : 106)

విభక్తులు :

తెలంగాణ మాండలికంలో సంప్రదాయ వ్యాకరణాలు గుర్తించిన విభక్తులతో పాటు ఆయా విభక్తుల్లో నూతన ప్రాతిపదికలకు, నూతన ప్రత్యయాలు కన్పిస్తాయి.

ఎ) ప్రథమా విభక్తి రూపాల నిర్మాణం :

ఉదా : కక్కడు ("ఇల్లెందులోల్లు వొక్కింటొళ్ళు, తానాల్జేసి తానాల్జేసి ఆగమయ్య కక్కడు తడి బట్టల్తోటి ముందట నడుస్తుంటే సుట్టపక్కాలంతా ఎన్కొస్తుండ్రు". కక్క : 8)

పోరడు ("అయ్యా! ఆగుండ్రి పోరడు మీ అద్రుకే కాలిగావ్ల దాస్కున్నాలె పిల్సుకొత్తాగు గడ్ప దాట్తుండగనే అమ్మ అడ్గులసప్పడిని". కక్క : 10)

బి) తృతీయ విభక్తి ప్రత్యయాలు :

తెలంగాణ మాండలికంలో / -తోటి-తోసి-/అనే ప్రత్యయాలు కనిపిస్తాయి.

ఉదా : ముర్పెం'తోటి' ("ముర్పెంతోటి తాతకు జెప్పిండు కక్కడు". కక్క : 41)

రోకలిబండ'తోటి' (''మంచిగ పండి పాతమైన తోలును రోకలిబండతోటి సద్దుజెయ్యాలె". కక్క : 47)

పెద్దమడ్పుల'తోని' (''అట్టనయం లేదు పద కొండొద్దుల కుండల్ల గల్పుకోర్రని పెద్దమడ్పులతోని జెప్పిండు ముత్తయ్య". కక్క : 39)

సేత్తోని (''సే'త్తోని' అందుకొని పిళ్ళి సంపుదనొ ఏం లాభం రొండు పిట్టపిల్లలను దిని కదలకుంటైంది". కక్క : 112)

సి) పంచమి విభక్తి ప్రత్యయాలు

నుండి అనే అర్థంలో /-కెల్లి/ అనే ప్రత్యయం పంచమి విభక్త్యర్థంలో ప్రయోగించబడింది.

ఉదా : పానాదిలకెల్లి (''పనుల పానాదిల కెల్లి గొట్కొస్తున్న కక్కని జూసి." కక్క : 15)

కంచెలకెల్లి (నెత్తిపొద్దు యాలకైందట! గా దొరజీత గాల్లకు దూపకు నీల్లిచ్చిగా కంచెలకెల్లి బోయి పొల్లను జూసిపోదాం....." కక్క : 36)

డి) షష్ఠీ విభక్తి ప్రత్యయాలు :

లోపల అనే అర్థంలో '-లె' అనే ప్రత్యయం ప్రయోగించబడింది.

ఉదా : నాకెర్కేలే (''నాకెర్కేలే నీకెవ్వలు దిక్కులేరని గందుకని నాకు గల్గిన దాంట్లనె గింత దెచ్చిన".)

ఇ) సిద్ధ విశేషణాలు :

వీటిలో విశేషణాలు నమాన పూర్వపదంగానే కన్పిస్తాయి.

ఉదా : కలినీళ్ళు (-లో) (''పోకొడ్కా జొన్నల్ని ఇసురు కొని కలినీలల్ల పజ్జొన్నగట్క కల్పుకొని ఎల్లమొత్తపో అని అయ్యా పట్లమ్మా!...." కక్క 10)

ఎఫ్) నామిక విశేషణాలు :

వీటిలో నామం విభక్తి రూపంలో ఉండి విశేషణంగా పనిచేస్తుంది. ఇలా పనిచేయడాన్ని సంప్రదాయ వ్యాకరణాలు 'సంబంధం' అన్నాయి.

ఉదా : నా పెద్దకొడ్కు (''నా పెద్దకొడ్కు ఆగమయ్య నెత్తి నిత్తుల్బడంగనే పెండ్లాన్డిస్కొని పట్నంబోయి గిటాం కలొత్తలేడు". కక్క : 3)

దొరబత్కులు (''నా తల్లి జచ్చిన్నాడు గూడ నాకు మరాదిత్తలేరు పట్నంల దొరబత్కులు బత్తున్నమా?". కక్క : 9)

హెచ్) నిర్దేశక సర్వనామాలు :

మహద్వాచకాలు : ప్రథమా విభక్తి

ఏకవచనం :

సమీపం	దూరం
గీడు (కక్క : 50)	గాడు (కక్క : 41)
ఈడు (కక్క : 18)	ఆడు (కక్క : 18)

ద్వితీయా విభక్తి :

అన్ని (కక్క : 55)	దాన్ని (కక్క : 20)

ఐ) సార్వనామిక క్రియా విశేషణాలు :

కాలార్థకాలు

సమీపం	దూరం
గిప్పుడు (కక్క : 55)	గప్పుడు (కక్క : 55)

జె) విధానార్థకాలు

గిట్ల (కక్క : 62)	గట్ల (కక్క : 55)
ఎట్ల (కక్క : 83)	

నైఘంటిక విభాగం :

తెలుగు వ్యవహార ప్రాంతాన్ని నాలుగు మండలాలుగా భద్రిరాజు గారు విభజించడానికి ప్రధాన కారణం ఆయా మండలాల నామపదాల వైవిధ్యత, కనుక వీటిని నైఘంటిక విభాగంలో ప్రత్యేకంగా పేర్కొంటున్నాను.

తెలంగాణ ప్రాంత మాండలికంలో అన్యదేశ్యాలు మిళితమై ఈ భాషకు వైవిధ్యాన్ని, ప్రత్యేకతను సంతరించి పెట్టాయి. వీటిని ఏ భాషా పదాలో స్పష్టంగా మూలంలోకి వెళ్తే తప్ప వింగడించలేని పరిస్థితి నెలకొన్నది. వాటి మూలాలను ముఖ్యంగా ఉర్దూ, అరబ్బీ, పారశీ భాషల్లో గుర్తించవచ్చు.

ఉదా : అంగూటి : వేలు, మూలపదం. అంగుష్ఠ (పారసీ) (ఉర్దూ - తెలుగు నిఘంటువు, 2010 : 15) ("పటేలు పకీరయ్య తోటి అంగూటొత్తిండా ఏంది? : కక్క : 71)

గులాంగిరి :

నా.పు.బానిస, కొనబడిన సేవకుడు అర. గులామ్ (ఉ.తె.ని : 76) ("గాల్ల కాల్లొత్తి గులాంగిరి జేసి బత్కి గాల్లిక్కడ్నుంచి ఎల్లిపోయినంక గాల్ల ఆరసులు ఇద్దరు ముగ్గురుంటె తుర్కోల్లను జంపి" (కక్క : 61)

ఇతర మండలాల ప్రజలకు అర్థంకాని మాండలిక పదజాలం తెలంగాణ మాండలిక నవలల్లోని కొన్ని మాండలిక పదాలను కింద ఇచ్చాను.

మోదుగుపూలు (దాశరథి రంగాచార్యులు) :

పున్నానికి = ఉచితంగా / పుక్కిటికి "జవాబ్బీ చెప్పుతవ్ బే. కోమటీని సొమ్ము పున్నానికొచ్చిందనుకున్నవ్? భూమి రాసియ్యి బాకీ కింద అని బాదసాగినాడు" (పు : 30).

చింతబరికలు = చింతాకులు తొలగించిన చింతకొమ్మ.

"గుర్రాలకు చింతబరికెలు బాగా తగిలాయి". (పు : 55)

కొలిమంటుకున్నది (అల్లం రాజయ్య) :

నెత్తురు = రక్తం "ఇంకొకడింకొడైతే ఇవ్వారకే పెయ్యంత నెత్తురు నివ్వేదే... పట్నం మొలల సెప్పేపెయ్యంత తడిమి నూసేదే... ఆపని నూత సెయలేదు దొర". (పు : 77)

మాడ సమరు = తల వెంట్రుకల నూనె (ఆముదం, కొబ్బరి నూనె)

("ఎండకు పెయ్యి మాగిన, గడుకెసలయిపోయినా, మొడనరాలుబ్బంగ వోతలు వోసినా, మన సిన్నపోరగాండ్లకు మాడసమరు లేకుంటపోయింది". పు : 150)

కక్క **(వేముల ఎల్లయ్య) :**

మెల్లెగ = నెమ్మదిగా ("మెల్లగా లేసి కంచెల దొంగల గుండ్లు దాటి తొల్లబండకాడికొచ్చి గుండ్రాయెక్కి ఓరారి పోర్గాల్లరేయ్! ఎట్బోతిర్రో? అడ్వంతా అల్లల్లాడింది". పు : 4)

సంవర్త = రజస్వల ("అసేయ్! గిట్రా నీకేమెర్కనే? సిన్న పిల్లవైతివి సంవర్త సంగతి?" పు : 36)

సూర (భూతం ముత్యాలు) :

బండారు = గ్రామ దేవతలను పూజించే సందర్భంలో నుదిటిన పెట్టే పసుపు బొట్టు, స్వస్థత చేకూరడానికి మంత్రించి ఇచ్చే పసుపు. ("ఈ బండారు రోజుమాపు పండ్కొబోయే ముందు బొట్టుబెట్కో". పు : 58)

అలటోల = ప్రాణం పోయేంతపని" ("దవకానకు పొయ్యెసర్కి పోరడు అలటోల చేయవట్టిండు". పు : 93)

తెలంగాణ పల్లె (కౌముది) :

పలంగి = పెద్దబల్ల "వీళ్ళ గురించే ఎదురు చూస్తున్న లచ్చయ్య, పలంగి మీద పడుకున్నోడు, తలుపు తెరుచుకున్న చప్పుడుకు చట్టున లేసి 'రాండ్లి రాండ్లి' అన్నాడు". (పు : 141)

గోదె = పశుగణం

("గోదెలకు గడ్డేస్తె కదనే పాలిచ్చేది... పాలు తక్కువాయె తాగేటోళ్ళు ఎక్కువాయే..." పు : 145)

సామెతలు :

తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన సామెతలను కింద రెండింటిని పేర్కొన్నాను.

1. "ఇంటాడిదాన్ని గొట్టింది ఇది మీసంగాదన్నదు". (కొలిమంటుకున్నది : 62)

   పురుషుడు సంప్రదాయంగా స్త్రీలపై ఆధిపత్యం ప్రదర్శించి హింసిస్తూ ఉన్నాడు. కనుక స్త్రీని కొట్టలేని నేను మగాడినే కాదు అని అర్థం.

2. "మొద్దోల్లే తింటడు ఎద్దోల్గే జేస్తడు" (పురుడు : 29) చాలా ఎక్కువగా తిని, తిన్నదానికి తగ్గిట్టుగా శ్రమ చేస్తాడు అని అర్థం. ఎద్దు అలసిపోకుండా శ్రమ చేస్తుంది. కనుక దాన్ని పోలికగా వాడుతారు.

4. మాండలిక రచనలు - ఆవశ్యకత :

తెలుగు వ్యవహార ప్రాంతంలో వివిధ మండలాల్లో వస్తున్న రచనలను ఆయా ప్రాంతం వాసులు మాత్రమే పూర్తిగా అవగతం చేసుకోగల్గుతున్నారు. వీటిలోని మాండలిక పదజాలాన్ని, వ్యాకరణ నియమాలను కోశాలుగా, వ్యాకరణ గ్రంథాలుగా (మూడవ విభాగంలో పేర్కొన్న విధంగా) నిర్మించినప్పుడు ఆయా మండలాల వారికి మాండలిక పదజాలం సులభంగా అర్థం అవుతుంది. ప్రసార మాధ్యమాలైన ఎలక్ట్రానిక్, ముద్రణా వ్యవస్థల ద్వారా మాండలిక పదజాలాన్ని వ్యాప్తిలోకి తీసుకరావచ్చు. "కావ్యాలు లేదా రచనలు, అటు సమాచార నిధి రూపంలోనూ, వాటిని వినగలిగే సౌకర్యం ఉన్న పద్ధతుల లోనూ సంగణకాలపై నమోదు చేయాలి. చదివిన పాఠాన్ని లేదా సమాచారాన్ని నమోదు చేసి అటు రాతలో చూపుతూ, ఇటు వినగలిగే వెసులుబాటును ఇచ్చే పద్ధతిలో తెలుగు సమాచార నిధులు రూపొందించాలి. సంప్రదాయ ముద్రణ పద్ధతిలో కాకుండా ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులకు అనుగుణంగా ఉండేట్టుగా చలనశీల సమాచార నిధులుగా, నిఘంటువులుగా వీటిని రూపొందించుకోవాలి". (పవన్ కుమార్, పమ్మి (రచయిత) ఉమామహేశ్వరరావు, గారపాటి. (సంపా). 2012 : 195) అంతర్జాలం సహాయంతో వీటిని జనబాహుళ్యంలోకి తీసుకెళ్ళవచ్చు. తద్వారా మాండలిక రచనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కవి రచయిత తన స్థానిక మాండలికంలో రాయడం వల్ల అనివార్యంగా వాటిని పాఠకులుగా మనం చదువుతాము. వాటిలోని మాండలిక పదాలు అర్థం కాని సందర్భంలో పదకోశాలను చూస్తాము. అందులో కూడా కన్పించకపోతే వాటికి అర్థాలను తెలుసుకొని పదకోశాలు, నిఘంటువుల్లోకి చేర్చుతాము. తద్వారా ఆ రచనలకు అలవాటుపడి వాటిలోని సహజత్వాన్ని తెల్సుకొంటాము. మాండలికాల మధ్య అంతరం కూడా తగ్గి అన్ని ప్రాంతాల వారికి మాండలికాలన్ని అర్థం అవుతాయి.

ఉపయుక్త గ్రంథసూచి :

1. ఉమామహేశ్వరరావు, గారపాటి (సంపా), 2012. అంతర్జాలంలో తెలుగు, హైదరాబాద్ : సమాచార సాంకేతిక శాఖ (ఆం.ప్ర), సిలికానాంధ్ర విశ్వ తెలుగు అంతర్జాల వేదిక.
2. ఎల్లయ్య వేముల, 2000, కక్క : నల్గొండ : గోసంగి నీలి సాహితి.
3. కృష్ణమూర్తి భద్రిరాజు (సంపా), 2000. తెలుగు భాషా చరిత్ర, హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయం, చ.ము.
4. చంద్రయ్య శివన్న, 2012, తెలంగాణ ఉద్యమ కవిత్వం : భాషా వైవిధ్యం, హైదరాబాద్, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోదన వ్యాసం.
5. దక్షిణామూర్తి పోరంకి, 1992, భాష ఆధునిక దృక్పథం, హైదరాబాద్ : వరలక్ష్మి పబ్లిషర్స్.
6. పవన్ కుమార్ పమ్మి, 2003, కట్టా వరదరాజు ద్విపద రామాయణం : భాషా పరిశీలనం, హైదరాబాద్ : తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం.
7. ప్రతాపరెడ్డి జె. (సంపా), 2007, తెలుగు మాండలికాలు నల్గొండ జిల్లా, హైదరాబాదు : తెలుగు అకాడమీ.

8. ప్రభాకర్ ఎ.కె., 2002, తెలుగులో మాండలిక కథా సాహిత్యం, హైదరాబాదు : సాహితీ సర్కిల్.
9. మల్లేశ్ మంత్రి, 2012, వేముల ఎల్లయ్య 'కక్క' నవల : భాషా వైవిధ్యం, హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం.
10. ముత్యాలు భూతం, 2004, సూర, నల్గొండ : గుంపు సాహితీ సంస్థ.
11. రంగాచార్యులు దాశరథి, 2010, మోదుగుపూలు, హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పం.ము.
12. వరవరరావు (సంపా), 2008, అల్లం రాజయ్య సాహిత్యం - 1, హైదరాబాదు : పర్‌స్పెక్టివ్స్.
13. సుబ్రహ్మణ్యం పి.ఎస్., 2007, ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, హైదరాబాదు : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
14. భాస్కర్, నలిమెల, 2010, తెలంగాణ పదకోశం, హైదరాబాదు : తెలంగాణ రచయితల వేదిక.
15. ముత్యాలు భూతం, 2013, మాండలీకం, నల్గొండ : గుంపు సాహితీ సంస్థ.
16. లక్ష్మణరావు పతంగే, 2010, ఉర్దూ - తెలుగు నిఘంటువు, హైదరాబాదు : ఎమెస్కో బుక్స్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వరంగల్ జిల్లా పత్రికలు – సాహిత్య సేవ పరిశీలన

– నాగళ్ళపల్లి స్వప్న, కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ.

కళలకు కాణాచియైన వరంగల్ జిల్లాలోని పత్రికా రంగాన్ని పరిశీలించే ముందు ఆ ప్రాంతపు చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య, ఉద్యమనే పద్యాలను స్మరించు కోవడం అత్యంతావశ్యకము, భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు అనుసంధానకర్తగా పత్రిక వెలువడుతుంది. కావున గతకాలపు స్మృతులను మొదటగా ప్రస్తావించటం జరిగింది.

తెలంగాణలో సాహిత్య, సంస్కృతులకు ప్రధాన కేంద్రం ఓరుగల్లు. తెలంగాణ ప్రజల అభిరుచులకు, అనుభూతులకు, ఉద్వేగాలకు, ఆవేశాలకు, నిత్యం కొత్తదనానికై చేసిన అన్వేషణకు ఓరుగల్లు పెట్టింది పేరు. సంప్రదాయాన్ని రక్షించుకొనే ప్రయత్నానికి, సంస్కృతీ మూలాలను జాతి భూమికలోకి చొచ్చి వెతుక్కోవడంలో ఓరుగల్లు ప్రధాన భూమిక వహించింది. భూతకాలపు నిరంకుశత్వాన్ని సంపూర్ణంగా తిరస్కరించి, తిరుగబాటు జెండా ఎగురవేయడానికి ఆర్భాటంతో, అట్టహాసంతో, ఉద్విగ్నతతో, కంఠమెత్తిపలకడానికి, నిశ్శబ్దంగా తన లోతుల్లోకి తాను వెళ్ళి ఆత్మావలోకనం చేసుకోవడానికి ఓరుగల్లు ప్రాంతం ఆనాదికాలం నుండి చైతన్య స్ఫూర్తితో అలరారుతున్నది. కాకతీయుల పౌరుష ప్రాభవాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన రాజధానీ నగరం ఓరుగల్లు. విద్యా వైదుస్యాలకు కేంద్రంగా పత్రికారంగంలో వినూత్న ప్రయోగాలకు నెలవుగా, కళలకు కాణాచిగా ప్రసిద్ధి గాంచినది. పోరాటాలకు పురిటిగడ్డగా, ఉద్యమాలకు ఊపిరిగా, భాషా సాహిత్యాలకు భాగ్యరేఖగా, రాజధానిగా వర్ధిల్లినదీ ఓరుగల్లు.

ఘన చరిత్రకు, సాహిత్య, సంస్కృతులకు తార్కాణంగా నిలిచిన జిల్లా వరంగల్ జిల్లా పత్రికారంగాన్ని పరిశోధనకు స్వీకరించి దారిలో 'వరంగల్ జిల్లా పత్రికలు - సాహిత్య సేవ' అనే అంశాన్ని పరిశోధనాంశంగా ఎంచుకోవడం జరిగింది. ఈ పరిశోధనాంశాన్ని ఐదు భాగాలుగా విభజించుకోవడం జరిగింది. వానిలో మొదటిది - ప్రస్తావన, రెండవది - స్వరూపక్రరణం, మూడవది - పాత్రికేయ ప్రకరణం, నాలుగవది - సాహిత్య ప్రకరణం, ఐదవది - సంపాదకీయ ప్రకరణం.

ప్రస్తావన :

దీనిలో మొదట ఓరుగల్లు నామ ప్రాశస్త్యాన్ని తెలియజేయటం జరిగింది. అలాగే శాతవాహనులు, చాళుక్యులు, వరంగల్ ప్రాంతంలో అడుగిడిన సందర్భాలను వివరించారు. అలాగే కాకతీయుల హృదయసీమగా ఓరుగల్లు వెలుగొందిన విధానాన్ని మరియు కాకతీయుల కాలంలో వికసించిన సాహితీ సుమాలను తెలుపనైనది. కుతుబ్‌షాహీల వశమైన ఓరుగల్లు చరిత్రను పేర్కొనడమైనది. నిజాం పాలనలో ప్రారంభమైన గ్రంథాలయోద్యమాన్ని, ఉద్యమ ఫలితంగా వరంగల్‌లో వెలిసిన గ్రంథాలయాల వివరాలు తెలియజేశాను.

ఒకవైపు స్వాతంత్ర్యోద్యమం, మరోవైపు నిజాం వ్యతిరేకోద్యమం పుంజుకుంటున్న కాలంలో వరంగల్ జిల్లాలో తొలుదొల్తగా తెలుగులో పత్రికలు ఆవిర్భవించాయి. ప్రస్తావనలో వివిధ ఉద్యమాల ప్రభావంతో పోరుగడ్డ ఓరుగల్లులో ఆరంభమైన ఉద్యమ పంథాను వివరించటమైనది. ఈ విభాగంలో చివరగా ఓరుగల్లు సాహితీరంగం రూపురేఖల్ని పరిచయం చేస్తూ వరంగల్ పత్రికారంగాన్ని రేఖామాత్రంగా స్పృసిస్తూ స్వరూప ప్రకరణంలోనికి అడుగిడడమైనది. అలాగే ప్రతీప్రకరణాన్ని ఉపోద్ఘాతంతో ప్రారంభించడమైనది.

స్వరూప ప్రకరణం :

ఈ ప్రకరాణాన్ని మూడు ఉప విభాగులుగా విభజించడమైనది అవి :

1. పత్రికలు ప్రారంభము - వికాసము
2. పత్రికలు కాలికత - స్వరూప స్వభావములు
3. పత్రికలు ఉద్దేశ్యము - లక్ష్యము

పత్రికలు ప్రారంభము - వికాసము అనే భాగంలో ప్రయత్నపూర్వకంగా సేకరించిన సమాచారంతో పత్రికలు వెలువడిన సంవత్సరాలను ఆధారంగా చేసుకొని పత్రికలను క్రమపరచి ఆయా పత్రికలు ప్రారంభమైన కాలము, సంపాదకునిపేరు కాలికత, పత్రిక వెలువడిన నేపథ్యం, పత్రిక కొనసాగుతున్నదా (లేదా) ఆగిపోయిందా అనే అంశాలను తెలపటం జరిగింది. పత్రికను ముద్రించు ముద్రణాలయం పేరును కూడా తెలియజేసే ప్రయత్నం చేశాను. ఈ విధమైన పరిశీలనద్వారా వరంగల్ జిల్లా పత్రికారంగారినిక ప్రప్రథములు ఒద్దిరాజు సోదరులేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. వరంగల్ జిల్లాలో దాదాపు 200 పత్రికలు వెలవడటమనేది యావత్ తెలంగాణాకే గర్వకారణంగా భావించవచ్చు. ఈ పత్రికలను విషయ పరంగా పరిశీలించినపుడు వార్తా, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, వ్యవసాయం, వాణిజ్య, కుల, మత, ఆరోగ్య, పిల్లల, వైద్య, ఆధ్యాత్మిక, ధార్మిక మొదలైన విభిన్నాంశాల నేపథ్యంలో వెలువడిన, వెలువడుతున్న పత్రికలకు సంబంధించిన విషయాలను విశ్లేషించడం జరిగింది.

ఈ జిల్లాలోని పత్రికారంగంలో గల మరో విశేషం ఏమిటంటే వార్తా ప్రచారంలో ముద్రణాసౌకర్యాలు అంతగాలేనికాలంలో పత్రికా నిర్వహణలో భాగంగా గోడపత్రికలు, లిఖిత పత్రికలు సైక్లోస్టయిల్ పత్రికలు వెలుడినాయి.

ఈ విధంగా పత్రికల్లో కొన్ని ఎక్కువకాలం పత్రికా రంగంలో నిలిచి పాఠకాదరణకు పరిమితమైనవి ఉన్నాయి. పరిమిత లక్ష్యంతో వచ్చిన కొన్ని పత్రికలు, లక్ష్యసాధనలో ఎదురుదెబ్బలు తగిలి ఆగిపోయిన పత్రికలు ఉన్నాయి. నిలిచిపోయిన, కొనసాగుతున్న పతిక్రలన్నింటిని గూర్చి ఈ ఉపవిభాగంలో రేఖామాత్రంగా పరిచయం చేయనైనది.

స్వరూప ప్రకరణంలోని 'పత్రికలు కాలికత - స్వరూప స్వభావము' అనే అంశంలో వరంగల్ జిల్లాలో పత్రికలు, భాషా సాహిత్యాలు, సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషి చేస్తున్న తరుణంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో వెలువడిన పత్రికల్లో దిన, వార, పక్ష, ఊనవింశతి, మాస, ద్వైమాసిక, త్రైమాసిక, చాతుర్మాసిక, షాణ్మాసిక, వార్షిక పత్రికల స్వరూప స్వభావాన్ని వివరించడం జరిగింది.

పత్రిక స్వరూపాన్ని గూర్చి కొక్కొండ వెంకటరత్నం పంతులు గారు ఆంధ్ర భాషా సంజీవని పత్రికలో ఇచ్చిన నిర్వచనాన్ని పేర్కొంటూ వరంగల్ జిల్లాలో వెలువడిన, వెలువుడుతన్న వివిధ పత్రికల స్వరూప స్వభావాలను వివరించే ప్రయత్నం చేశాను.

వరంగల్ జిల్లాలో వెలువడిన పత్రికల్లో చాలా పత్రికలకు సంబంధించిన కనీసం ఒక్క సంచిక కూడా లభించక పోవడం, మరెక్కడా వాటి ప్రస్తావన కనిపించనందున ప్రయత్నించినంత మేరకు ఎవరి ద్వారా కూడా కనీస సమాచారం కూడా లభించిన పత్రికలను ఈ ప్రకరణంలోని మొదటి విభాగంలో మాత్రమే పేర్కొనటం జరిగింది. ఇది చాలా విచారకరమైన విషయంగా భావిస్తున్నాను.

పత్రికలు ఉద్దేశ్యము - లక్ష్యము అనే విభాగంలో స్వాతంత్ర్యానికి పూర్వం పత్రికల పాత్ర వేరు, పత్రికా రచయితల ఉద్దేశ్యాలు వేరు. తదనంతర కాలంలో పత్రికల పాత్ర, పాత్రికేయుల ఉద్దేశ్యాలను విశ్లేషించడం జరిగింది.

వరంగల్ జిల్లా పత్రికారంగం చరిత్ర సింగిడి వంటిది. అన్ని తత్వాలను, యిజాలను, ఎన్నో నిజాలను తనదైన శైలిలో ప్రజలకందించిన ఘనత ఇక్కడి పత్రికారంగానికుంది. ప్రజల్లో నూతన సత్యాన్ని, చైతన్యాన్ని ఉద్దీప్తం చేసి ప్రజల్ని కార్యోన్ముఖులుగా చేసేందుకు పత్రికారంగాన్ని సాధనంగా ఎంచుకొని అనేక అద్భుతాలు సృష్టించిన విషయాన్ని వివరించడం జరిగింది.

వరంగల్ జిల్లాలో వెలువడిన వివిధ పత్రికలను విశ్లేషించగా స్పష్టమైనటువంటి వివిధ పత్రికల ఉద్దేశ్యాలు,

లక్ష్యాలను ఈ విభాగంలో వివరించటం జరిగింది. అనంతరం పత్రికా ధ్యేయాన్ని ప్రకటించిన పాత్రికేయులకు సంబంధించిన ప్రకరణంలోకి అడుగిడడమైనది.

పాత్రికేయ ప్రకరణం :

ఈ ప్రకరణాన్ని పాత్రికీయుల జీవన రేఖలు, పత్రికల నిర్వహణ-సమస్యలు, వివిధ ఉద్యమాలు - పత్రికల స్థానం అనే విభాగాలుగా విభజించడమైనది.

'పాత్రికీయుల జీవన రేఖలు' అనే విభాగంలో పత్రికారంగంలో పాత్రికేయుడి కీలకమైన వ్యక్తి అంటూ పాత్రికేయుని ప్రాధాన్యత తెలియజేయడమైనది. అలాగే వివిధ పతిక్రల సంపాదకుల జీవిత వివరాలను వారి ముఖచిత్ర సహితంగా వెలువరించే ప్రయత్నం చేయగా దాదాపు 54 మంది సంపాదకుల పరిచయంలో 40కి పైగా సంపాదకులకు సంబంధించిన ముఖచిత్రాలు లభించాయి.

పత్రిక అంటేనే ఎన్నో కూర్పులతో కూడినది. ఒక పత్రిక రూపుదిద్దుకోవడానికి కావాల్సిన హంగామా, ఆర్భాటం, సరంజామాలను గూర్చి వివరించడమైనది. ఒక దేవుడి ఊరేగింపు జరగడానికి ఎందరిదో ప్రయత్నం ఎలా అవసరమౌతుందో ఒక పత్రిక వీధిలోకి రావాలంటే కూడా అంతమంది ప్రయత్నం అవనరమవుతుంటుంది. అలాంటి వారిలో విలేకరులు, ఉపసంపాదకులు, ప్రూఫ్ రీడర్లు, ముద్రాపకులు, యజమానులు, ప్రకటనల సేకరణ కర్తలు, వ్యాసకర్తలు, సంపాదకులు, ఇలా ఎందరో యెందరెందరో భాగస్వాములైతే తప్ప ఆ పత్రిక పూర్తి రూపాన్ని సంతరించుకోదు. అలాంటి పత్రికారూపంలో సంపాదకునిది ప్రధాన స్థానము అని చెప్పవచ్చు.

తెలంగాణ పత్రికా సంపాదకులు వృత్తిధర్మంలో చూపిన అసమాన పత్రిభ చరిత్రలో నిలిచిపోతుంది. వరంగల్ జిల్లాలో 'తెనుగు' పత్రికకు సంపాదకత్వం వహించిన ఒద్దిరాజు సీతారామచంద్రరావు గారిని వరంగల్ జిల్లా పాత్రికేయ పితామహునిగా చెప్పవచ్చు. ఈ విధంగా విశేషమైన సేవలందించిన పాత్రికీయుల జీవన రేఖల్ని పరియం చేయడం. ఈ ప్రకరణం ముఖ్య ఉద్దేశ్యం. అసమాన ప్రతిభా విశేషాలున్నప్పటికీ సంపాదకులు పత్రికా నిర్వహణలో సమస్యల్ని ఎదుర్కొనక తప్పలేదు. వారు ఎదుర్కొన్న నిర్వహణాపరమైన సమస్యల్ని తర్వాతి విభాగంలో తెలియజేయటం జరిగింది.

ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే శాసన సభలూ, పార్లమెంట్ వంటివి ఎంత ముఖ్యమో పత్రికల పాత్ర కూడా అంతే ముఖ్యమైనది. దుష్టశక్తులు కొన్ని కలాలకు సంకెళ్ళు వేసే ప్రయత్నం చేసినప్పటికీ పత్రికలు తాము నిర్వహించాల్సిన గురుతరమైన బాధ్యతను ప్రజాస్వామ్యబద్ధంగా, దేశాభివృద్ధికై నిర్మాణాత్మక పాత్ర నిర్వహించాలి.

వరంగల్ జిల్లాలో పత్రికా రంగానికి ప్రథమ సంతానమైన 'తెనుగు' పత్రిక నిర్వహణలో మొదలుపెట్టి నేటికీ నడుస్తున్న పత్రికల నిర్వహణ వరకు ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను, చాలా వరకు పత్రికలు పురిటిలోనే కనుమరుగవడానికి గల కారణాలను పరిశీలించగలిగినంత మేరకు ఈ విభాగంలో తెలుపడమైనది.

ఉద్యమాలకు ఊపరిగడ్డగా నిలిచిన వరంగల్ జిల్లాలోని పత్రికలను ఉద్యమ పుత్రికలుగా పేర్కొనడంలో అతిశయోక్తిలేదు. నిజాం విముక్తి ఉద్యమం, స్వాతంత్ర్యోద్యమం, గ్రంథాలయోద్యమం, తెలంగాణ ఉద్యమం, విప్లవోద్యమం, ఆంధ్రోద్యమం వంటి పలు ఉద్యమాల్లో పాల్గొన్న తెనుగు, ఆంధ్రాభ్యుదయం, శోభ, కాకతీయ, వెలుగు, అదృష్టం, జనధర్మ, ఏకశిల మొదలగు పత్రికలు వివిధ ఉద్యమాల్లో నిర్వహించిన పాత్రను ఈ విభాగంలో వివరించడం జరిగింది.

సాహిత్య ప్రకరణం :

ఈ ప్రకరణం నా పరిశోధనా వ్యాసానికి పట్టు గొమ్మయని చెప్పవచ్చు. దీనిలో వరంగల్ జిల్లాలోని వివిధ

పత్రికలు భాషాసేవ, సాహిత్యసేవ, సాంస్కృతికసేవ, వార్తానుశీలనం, సామాజిక సేవ మొదలగు అంశాలలో నిర్వహించిన, నిర్వహిస్తున్న పాత్రను ఈ విభాగంలో వివరించే ప్రయత్నం చేసాను.

తెలుగు సాహిత్య వికాసానికి పత్రికలు చేసిన సేవ అనితరసాధ్యం. పత్రికలు ప్రాచీన, ఆధునిక సాహిత్య ప్రచురణకు వారధిగా పనిచేస్తాయి. వరంగల్ జిల్లాలోని సాహితీరంగాన్ని పరిశీలించినప్పుడు పాల్కురికి సోమ నాథుని కాలం నుండే తెలుగు సాహిత్యంలో కొత్తకొత్త ప్రక్రియలు, క్రొత్త ధోరణులు మొలకెత్తి సాహిత్యానికి నూతనాలంకారం చేశాయి. ఎందరో మహాకవులు విశిష్టమైన రచనలు చేసి సాహిత్యానికి కొత్తమార్గాలనన్వే షించి నూతన పంథా కొనసాగించారు. వీరు వినూత్నమైన దార్శనికతతో సమజానికి సాహితీ దృక్పథాన్ని గోచరింప చేశారు.

వరంగల్ జిల్లాలోని పత్రికల్లో సాహిత్య నేపథ్యంలో వెలువడిన మొదటి పత్రిక ఆంధ్రాభ్యుదయం. అలాగే శోభ, కాకతీయ సాహిత్య సంచిక, కవితాజ్యోతి, జనధర్మ ద్వైమాసికపత్రిక, నవోదయం, సృజన వంటి ఆగిపోయిన పత్రికలే కాకుండా నేటికీ వెలువడుతున్న ప్రసారిక వంటి సాహిత్య పత్రికతో పాటుగా వివిధ నేపథ్యాలతో వెలువడు తున్న పత్రికలు వివిధ రంగాలలో చేసిన సేవను తెలియ జేయటం జరిగింది.

సంపాదకీయ ప్రకరణం :

ఈ ప్రకరణంలో వివిధ పత్రికలు వెలువరించిన సంపాదకీయాల విశ్లేషణ మరియు పత్రికల స్థితిగతులు నాడు-నేడు అనే ఉప విభాగాల గూర్చి వివరించే ప్రయత్నం జరిగింది.

సంపాదకీయం అంటే పత్రికా సంపాదకుడి లేదా పత్రికను నిర్వహించేవారి దృక్పథాన్ని వెల్లడి చేసే వ్యాసం. సంపాదకీయమనేది ఏ విషయంపై రాసినా అది ప్రజా సంబంధమైనదై, ప్రజలకోసం రాసే విశ్లేషణాత్మక వ్యాఖ్యానంగా ఉండాలి. సమస్యలకు పరిష్కార మార్గా లను సూచించేదిగా ఉంటూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలవాలి. సంపాదకీయ రచన మొక్కువడిగా కాకుండా ధర్మాభినివేశం, నిర్భీతి, నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీలకు ఆలవాలమై పాఠకుల మనసులో చెరగని ముద్ర వేయాలి. తెలంగాణ గోల్కొండ పత్రిక సంపాద కీయాలు అజరామరమైనవి.

వరంగల్ జిల్లా పత్రికల్లో అధికశాతం పత్రికలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నడిచినంతకాలం పాఠకుల హృదయపీఠంపై పత్రికల అడుగుజాడలు సుస్థిర స్థానాన్ని పదిలపరచుకొంటాయని చెప్పవచ్చు. ఇలాంటి పత్రికల్లో తెనుగు, ఆంధ్రాభ్యుదయం, శోభ, కాకతీయ, సృజన, సాధన, జనధర్మ వంటి మొదటితరానికి చెందిన పత్రికలే కాకుండా ఓరుగల్లు, ప్రసారిక, విమర్శిని, వరంగల్ వాణి వంటి పత్రికలు వెలువరించిన సంపాదకీయాలను ఈ విభాగంలో విశ్లేషించటం జరిగింది. ఈ పరిశీలన వలన విభిన్న సందర్భాలను, సమస్యలను గూర్చి సంపాదకులు వెలువరించిన వ్యాఖ్యానాలు తెలంగాణ మేధోసంపత్తికి ప్రతిబింబాలుగా నిలుస్తాయని చెప్పవచ్చు.

తెలంగాణలో నిజాం నవాబు పత్రికల విషయంలో బ్రిటీష్ ప్రభుత్వం కంటే ఎక్కువగా స్వేచ్ఛను నిరోధించడం వలన తెలంగాణలో పత్రికలను నడపడానికి ప్రభుత్వం అనుమతి తప్పనిసరి అయింది. అంతేకాకుండా పత్రిక ప్రారంభించాలంటే నిజాం ప్రభుత్వ అనుమతితోపాటు నిజాం ప్రభువు విధించిన నిబంధనల్ని ఒప్పుకోక తప్పని పరిస్థితి ఉండేది.

వరంగల్ జిల్లాలో పత్రికలు నాడు - నేడు అనేది పరిశీలించాల్సిన ముఖ్య విషయం. 'నాడు' అంటే వరంగల్ జిల్లాలో పత్రిక ప్రారంభ దశ అంటే 1920 నుండి 1970 వరకు అని నిర్ణయించుకోవచ్చు. 'నేడు' అంటే 1971 నుండి 2020 వరకు (దృష్టి సారించగలిగిన కాలాన్ని) నేడు అనుకుందాం. ఈ విధమైన పరిశీలనకు మరింత తోడ్పడుతుందని చెప్పవచ్చు.

నాటితరానికి, నేటి తరంలో వెలువడుతున్న, ప్రచురణ నిలిచిపోయిన పత్రికలను చూసినపుడు నేటి పత్రికల్లో చాలా వరకు నామమాత్రంగానే వెలువడు తున్నాయి. ప్రకటనలతోనే ప్రాచుర్యం చెందుతున్న పత్రికలు కనబడుతున్నాయి. అయితే వీటిలో కొన్ని పత్రికలను మినహాయించవచ్చు. పత్రిక పదికాలాలపాటు నిలవాలంటే ఈ విధానానికి స్వస్తి పలకాలి.

ఆయా పత్రికా సంపాదకుల్లో కొందరు తమ పత్రికను భద్రపరచటంలో శ్రద్ధ వహించకపోవడం, కూడా ఒక కారణంగా తెలుస్తుంది. సంపాదకుల అనంతరం వారి కుటుంబ సభ్యులకు సాహితీ స్పృహ లేకపోవడంవల్ల కావచ్చు. మరే ఇతర కారణాలవల్లనైనా కావచ్చు వారు కూడా పత్రికలను పదిలపరచలేకపోయారు.

వరంగల్ జిల్లాలో వెలువడిన దాదాపు 200 వరకు పత్రికల్లో 70 శాతం పత్రికల కాపీలు లభించకపోవడం విచారకరమైనది. పత్రికల కాపీల కొరకు పలుమార్లు క్షేత్రపర్యటన చేసినప్పటికీ పత్రికా ప్రతినిధుల ఇళ్ళకువెళ్ళి అడిగినప్పటికీ, గ్రంథాలయాల్లోగాని, మరెక్కడా కూడా చాలా వరకు ప్రతుల అలభ్యం. వరంగల్ జిల్లాలోని పెద్దల సహకారంతో మరియు గ్రంథాలయాలలో, కొందరు సంపాదకులతో ముఖాముఖి ద్వారా లభించిన సమాచారం మేరకు శక్తివంచనలేకుండా ప్రయత్నించి అందినంత మేరకు పరిశీలించి విషయాన్ని అందించడం జరిగింది. ఇది ఆరంభ ప్రయత్నంగానే భావించవచ్చు. వరంగల్ జిల్లా పత్రికారంగంపై పరిశోదన మరింత విస్తృతంగా జరాగాలంటే కనీసం భద్రపరచబడిన పత్రికల సంచికలను పరిశోధకులకు అందుబాటులోకి తేవాలి. ఈ విషయంలో పత్రికా నిర్వాహకుల కుటుంబ సభ్యులు చొరవ చూపితే మరిన్ని ఉత్తమ ఫలితాలు వెలువడు తాయని చెప్పవచ్చు.

పైన పేర్కొన్న ప్రకరణముల చివర ఉపసంహారము చేర్చబడినది. దీనిలో పత్రికా రంగంలో వరంగల్ జిల్లాకు గల విశిష్టతను, వాటి యొక్క సాహితీసేవను స్మరిస్తూ, పత్రికల ద్వారా తెలుగు సాహిత్య ప్రపంచానికి లభిస్తున్న అమృత ఫలాలను ఆవిష్కరించుట జరుగును. సాహితీ, సాంస్కృతిక ఫలాలను, మానవీయ విలువలను పెంపొం దించటంలో పత్రికల పాత్ర తెలియజేయాలనే తపనతో మరియు పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికీ వారధిగా ఉంటూ నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించగలవనే ఆశా భావంతో ఈ పరిశోధనా వ్యాసాన్ని రచించడం జరిగింది.

నాగరిక, యాంత్రిక జీవనశైలితో నడుస్తున్న ఈ కాలంలో పత్రికా పఠనమునకు ఆదరణ తగ్గకుండా, సాహితీ పీపాసగల పాఠకులకు పత్రికారంగ ప్రాధాన్యతను స్మరింపజేయుట ద్వారా గౌరవనీయమైన పరిశోధనా ప్రమాణములను నా ఈ పరిశోధన వ్యాసము ద్వారా, నిలుపగలనని ఆశిస్తున్నాను.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నాగప్ప గారి సుందర్రాజు కథలు – మాదిగల జీవన చిత్రణ

– డా॥. ఆంజనేయుడు, తెలుగుశాఖ, రాయలసీమ విశ్వ విద్యాలయం, కర్నూలు.

"ఇది మాదిగోడు
ఇది మాదిగల గోడు
ఇది మట్టిమనుషుల గోడు
అసలు సిసలు ఆదివాసుల గోడు
మొత్తంగా మానవుల గోడు
నిజమైన మనిషి గోడు
ఇది మనసు గోడు అందుకే
ఇది నిజాల నిప్పుల తప్పెట"

నాగప్పగారి సుందర్రాజు రాసిన మాదిగోడు కథల సంపుటిలో నిజంగా మాదిగ జీవితాల గోడు కనిపిస్తుంది. ఇందులో జీవం ఉంది, జీతం ఉంది. జీవితం ఉంది. జాతి సమస్యలు ఉన్నాయి. జనం ఆలోచన ఉంది. జన చైతన్యం ఉంది. అందుకే మాదిగ జాతీ అటు మానవజాతి జాగృతం అవుతుంది. ఆధునిక తెలుగు కథా సాహిత్యం 1910 సం॥ నుండి ప్రారంభమైంది. అది సమాజంలోని వివిధ అంశాలను సమస్యలను, స్వభావాలను, మనస్తత్వాలను చిత్రించి మనిషికి సమాజానికి సజీవమైన రూపురేఖలనిచ్చింది. కులం, ప్రాంతం, అస్థిత్వం, జెండర్‌లు ఇటీవల కాలంలో మరి ఎక్కువగా చోటు చేసుకొని వాటి ప్రాముఖ్యతను లోకానికి చాటుతున్నాయి. వర్తమాన రచయితగా తెలుగు సాహితీ లోకానికి పరిచయమైన నాగప్పగారి సుందర్రాజు మాదిగల సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి పూనుకొని "ఆంధ్రప్రదేశ్ మాదిగ సాహిత్య వేదిక'ను స్థాపించి "చండాల చాటింపు, మాదిగ చైతన్యం, కవితా సంపుటాలను, మాదిగోడు, మావూరి మైసమ్మ కథా సంకలనాలను ఆవిష్కరించి తన దైన వాణిని నిజాల నిప్పుల తప్పెట మీద బలంగా పలికించాడు. 'మాదిగోడు' (మాదిగల దైనందిన జీవిత కథలు) కతల సంపుటిని రాయలసీమ భాషలో రాయటం జరిగింది. రాయలసీమలో నాలుగు జిల్లాలకు నాలుగు విధాల వ్యవహారశైలి ఉంది. అందులో ప్రాంతాల వారిగా భేదాలున్నాయి. చిత్తూరుకు మద్రాసు అనంతపురం, కర్నూలుకు కర్ణాటక ప్రాంత భాషల ప్రభావం సరిహద్దు ప్రాంతాలలో మాండలిక భాషలో కనిపిస్తుంది.

ఈ 'మాదిగోడు' కథలు రాయలసీమలోని కర్నూలు జిల్లా ఆలూరు ప్రాంతం జన వ్యవహారశైలిలో రాయటం జరిగింది. ఆదోని, పత్తికొండ, ఆస్పరి, చిప్పగిరి, మద్దికెర, గుంతకల్, మండలాల చుట్టూ ఆలూరు మండలం కేంద్రంగా ఉన్న మొలగవల్లి కొట్టాల, నేమకల్ గ్రామాల నేపథ్యంగా కథలు నడిచాయి. ఈ ప్రాంతవాసులు కర్నూలు జిల్లాకు చెందినప్పటికీ అతి సమీపంలో ఉన్న అనంతపురం, కర్ణాటక రాష్ట్రంతో సంబంధ బాంధవ్యాలు ఉండటం వలన ఆయా ప్రాంతాల జన వ్యవహారశైలి, సాంస్కృతిక జీవన విధానం వీరిలో కూడా కనిపిస్తుంది. 'మాదిగోడు' కథా సంకలనంలో 10 కథలున్నాయి. అవి బోడెద్దు కత, గుండేలక్క కత, సొట్టకాళ్లు సద్దుగుణము కత, సెలివోడి కత, జోరేసావు కత, పోడేపోడు, నడిమింటి బోడెక్క బసివిరాలయ్యెద, ఈరారెడ్డి మనుమురాలు మింద వొనునుండాది, వీర్ల వండగ నాడు ఏమయ్యేద్నుంటే, మద్దికేరి మార్తమ్మ కత యంత మందికి తెలుసప్పా ! అనే కథలు కలవు.

బోడెద్దుకతలో మాదిగల ఆహారపు అలవాట్లను చిత్రీకరించడం జరిగింది. పండుగ మరుసటిరోజు అనగా కరి పండుగనాడు గ్రామంలో అన్ని కులాల వాళ్లు మాంసాన్ని భుజిస్తారు. పండుగ రోజు దేవతలకు నైవేద్యం కోసం తీపి పదార్థాలు చేసుకొని ఉంటారు కాబట్టి మరుసటి రోజు కరిపండుగ చేసుకుంటారు. కొన్ని కులాల వాళ్లు పొట్టేలు, కోడి, పంది, ఎనుములు, వధించి వాటి

మాంసాన్ని ఆహారంగా తీసుకుంటారు. మాలలు, మాదిగలు అయితే ఎద్దు మాంసాన్ని స్వీకరిస్తారు. ఈ ఎద్దును వధించేటప్పుడు చేసే కార్యక్రమాలు ఎలా ఉంటాయో ఈ కథలో చిత్రించాడు.'' తాడు తీసుకోలే ... కత్తి తీసుకోలే... డేగీసా తీసుకురాలే.... తడికెత్తుకోని రాలే... ఫరకలే...! ఫరక మరిసిపోయేవ్ !... రాండ్లే బిరీన ... సంకలమ్మ గుడికాడేనప్ప ! మా కాలంలో అయిత ఇయాలికే పాయ్యి మీదుండేది. పదండ్లే పదండి, ఈ మాటల సందర్భాన్ని బట్టి చూస్తే మాదిగల వ్యవహారశైలి ఏమిటో తెలుస్తుంది. అలాగే వెళ్ళిన వారందరూ ఎద్దును కట్టేసి ముందు భాగాన కొందరు, వెనుక వైపు కొందరు నిలబడి దాన్ని కింద పడవేసి పదునైన కత్తితో దాని గొంతును కోస్తారు. గొంతు కోసిన తర్వాత దాని చర్మాన్ని గీత గీసినట్లుగా ఒలుస్తారు. దాన్ని బాగాలుగా విడగొట్టి ఆయా పరిమాణంలో కుప్పలుగా వేసుకొని తీసుకెళతారు. మనిషి శరీరంలో ఉండే అవయవాలను ఒక డాక్టరు చెప్పగలడు పశువు శరీరంలోని అవయవాలు, గుండెలు, ఈరిగి, నెరిడి, వలువుకాయిలు, గోరోజనం ఎక్కడుంటాయో మాదిగ కులస్తులకు తెలుసంటాడు రచయిత. గుండేలక్క కతలో ''మాదిగ కులానికి చెందిన గుండేలక్క అసలుపేరు మల్లక్క తాతపేరు సిద్రామప్ప. ఈయనంటే సుట్టుముట్టు ఊరొల్లందరికి తెలిసినోడు. ఆలూరు తాలుకలో సిద్రామప్పకి వున్నన్ని పనిండ్లు యెవురికి వుండవు. సిద్రామప్ప బసివిరాల్కి పుట్నాడంట. తండ్రెవడో తెలియనోనికి పిల్లనెవుడు ఇస్తాడని యెవురు ఈ లేదంట అట్ల అగసాట్లుపడి ఇట్లు అగసాట్లుపడి ఒక సంబంధం కుదిరింది. అయితే ఆ వూరోళ్ళు పనిండ్లు లేని మాదిగ వానికి పిల్లనివ్వమన్నారు. చివరికి పాక సంబంధం కుదిరింది. వాళ్లు ఓ నియమం పెట్టారు. ఒక యేడాది పిల్లను నిలబెడతాము కాపులిండ్లు చూసుకోమన్నారు'' - ఈ సన్నివేశంలో మాదిలకు సొంత ఆస్తులు ఉండవని, పైగా బసివి రాలి వ్యవస్థ ఈ కులంలోనే పాటించబడుతుందని వీరికి పుట్టిన బిడ్డలకు తండ్రి ఎవరో తెలియదని అటువంటి వారికి వివాహం జరగడం చాలా కష్టమని తెలుస్తుంది. పైగా మాదిగలకు ఎక్కువ పనిండ్లు ఉంటే ఎంత ఎక్కువ పాచీ పనులు చేసే గృహాలు ఉంటే అంత శరీర కష్టం చేసేవోడని అటువంటి వానికి పిల్లను ఇవ్వటానికి సిద్ధపడతారని తెలస్తుంది. ''సిద్రామప్పకి పెట్టిన శివ పరీక్షలో పగలు రాత్రనక కష్టిం సేసి పెద్ద రెడ్లను మెప్పించి జీతానికి కుదరాడు ఇతడు చెప్పులు చేస్తే అద్దంలాగా ఉంటాయంట, మోకులు చేసిన బండి సెరుగులు చేసినా, వారిని చేసినా యేమి జేసినా సిద్రామప్పే చేయాలనే పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నాడు. అనగా మాదిగల చేతి పనులు ఎంత నాణ్యమైనవో ఎంత నైపుణ్యమైనవో ఈ సందర్భాన్ని బట్టి తెలుసుకోవచ్చు. ఈయన కొడుకు బడెద్దుల నారాయిని కూతురే మల్లక్క.. పనిమంతురాలు. ఈ పాప పనిముందర మగవాళ్లు పనికిరారని ఈ కథలో తెలుస్తుంది.

సొట్టకాళ్ళు సద్దుగుణుము కతలో మొలిగేలి కొట్టాలలో మాదిగోళ్ళ కొట్టాలికి మంచినీళ్ళు కరెంటు లేవు. బస్సు సావుకర్యం లేదు. ఉప్పు దగ్గిరినుంచి ఊరిమిండి దాకా గుంతకల్లు, ఆదోని, ఆలూరు, పత్తికొండకో పోయి తెచ్చుకోవాలి. అలాగే ఆలూరు తాలుకాలో రెడ్లకు వేలవేల ఎకరాల భూమి ఉంది. వీరికి పాచీపని, తోలుపని వ్యవసాయం చేసేదంతా మాదిగలే. వీరికి వెట్టిచాకిరి చేయలేని మాదిగలు ఊరువిడిచి బొంబాయికో ఇతర ప్రాంతాలకో వలస వెళ్ళాలి. తెల్ల దొరల పాలనలో వీరికి విముక్తి కలిగింది. ఫలితంగా అందరికి సొంత భూమి వచ్చింది. దాన్ని సాగు చేసుకొని పంటలు పండిస్తూ కాస్త ఆర్థికంగా స్థిరపడ్డారు మాదిగలు, దాని మూలంగా ఈ వూరి వాళ్ళేకాక ఇతర ప్రాంతాల నుండి కూడా కొంత మంది వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని ఈ కథలో తెలుస్తుంది.

సెలివోడి కతలో మాదిగ పిల్లలు చదువుకు దూరమై పంట పొలాలకు కాపలా ఉండటం గమనించవచ్చు. బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి అయితే ఆర్థిక కారణాలు, వల్ల వీళ్ళు వెళ్లరు. వెళ్ళితే స్కూల్లో వీళ్లని

అంటరాని వారిగా విద్యార్థులు అటు అయ్యవార్లు చూస్తారు. ఎందుకంటే ఊరు కట్టిడి అని చెప్పటం ఇందులో కనిపిస్తుంది. పాలాల దగ్గర కాపలా ఉన్న వీళ్ళు వేరుశనగలు, అలుసందలు, కందులు, పెసలు, నేరేడు పండ్లు, సింతకాయలు, సీతరాం పండ్లు, టమోటాలు, సద్దకంకులు తినటం సాయంత్రం వేళలో డ్రామా పద్యాలు పాడటం, రాత్రి పూట కోలన్న ఆటలు ఆడుకోవడం ఈ కథలో చిత్రించాడు. ఇంగ రాతిరి బువ్వ తిన్నంక కోలన్న ఆడేవాళ్లాము. వానాలి వానెక్క అదేమి రసి కత్తెమొ. మొదులు బెట్టేమంటే సగురు బొద్దయినా ఇడిసిపెట్టేదిలేదు. యా పొద్దున్నా అత్తొయ్యేవోళ్ళు మాయాతిని వొగ్గు సూస్తాండాడే అంటే ఇంగా ఎగురుడే. మరునాడు లేసేకి సాతగాకండట్లా. యెగిరిందే యెగిరిందేనప్ప. కునుసుకోలన్న, జడికోలన్న, సిత్తారి, లోన బయిటాట ఇగడ దయ్యా తదిమిత అని యేకుదమ్మున కోలన్న ఆడేవాళ్లము" పిల్లలు ఆడుకునే ఆటల్లో భార్యా భర్తల ఆట ఒకటి. "మొగుడు పెండ్లామాటంటే అట్లాగే గదమ్మా? మీయప్ప మీయమ్మని అట్లా తిట్టుడా? యేమొనమ్మ! మా నాయినయితే ఇంగా రోతురోత మాట్లన్నీ తిడతంటాడు. మన మాదిగ్గేర్లో మొగోల్లంత అట్లామట్లేగదమ్మ తిట్టేది" అని అంటే "ఒప్పోయ్! అట్లయితే కుండ్రంగన్న పెండ్లములక్క.... నీ నోట్లోకునా వుచ్చులు.... నీ నోట్లోకునాసాడు .... బాడుకోవ్... బాడోడ.... అట్లనాబట్టా ఇట్ల నాబట్టా అని నేను తిడతానమరి. అని అమ్మాయి అంటుంది. కుటుంబంలో భార్యాభర్తలు తగువులాడుకుంటే వచ్చే మాటలు విన్న పిల్లలు వాటిని అనుకరించడం, ఆ పదాలనే వాళ్లు నేర్చుకోవటం ఇక్కడ గమనించవచ్చు. మాదిగల భాష తీరును ఇందులో గమనించవచ్చు.

జోరే సావు కతలో

సిక్కదీసి
కొప్పుకట్టి తుమ్మదియలో
సిరి గందము బొట్టుపెట్టి తుమ్మదియలో'

- అని పాడుకొనే పాటలో బాల బాలికలు తల దువ్వ కోవడంలో వున్న ఆనందాన్ని తెలుపుతుంది.పుట్టెంటుకలు కొన్ని కులాల్లో బిడ్డ పుట్టిన 3,7,9,11 నెలలలోపే తీస్తారు. కాని మాదిగ కాలంలో 3 సం॥ లేదా 5 సం॥లలో తీసే అలవాటు ఉంది. ఇవి ఎంత ఎక్కువ లేటుగా తీస్తే అంత పొగరు ఉంటాదని వీరి భావన, నమ్మకం, విశ్వాసం. మాదిగలు కాయాకష్టం చేయడం వలన వారికి స్నానం చేసే అవకాశం దొరకదు. అందువల్ల చాలా రోజులకు ఒకసారి తలస్నానం చేస్తారు. వెంట్రుకలు అన్ని చిక్కుముడిగా ఉంటాయి. వీటిని విడదీయాలంటే ఒక సాహసమే అవుతుంది. తలకు నూనె రాసుకోవడం అరుదు. స్కూలుకు వెళ్లే విద్యార్థులు అయితే రోజు మరచి రోజు స్నానం చేసి శుభ్రంగా ఉంటారు. వీరు అలా కాదు కదా! ఉదయం లేచినప్పటినుంచి పనులు చేస్తూనే ఉంటారు. రాత్రిది ఏమైనా మిగిలివుంటే త్వరత్వరగా తిని పొలం పనులకు, వెట్టి పనులకు పోతారు. తిరిగి సాయంత్రం చీకటికి ఇంటికి చేరుకుంటారు. అలసిపోయి ఉంటారు. కాబట్టి ఆవేళప్పుడు వండుకొని లేదా ఉన్నది తిని నిద్రిస్తారు. వీలున్నప్పుడే మాత్రమే స్నానం చేసి శుభ్రంగా తయారవుతారు. పండుగరోజుల్లో మాత్రమే కొత్త వస్త్రాలు ధరిస్తారు.

పోడేపోడు కతలో మదిగల కులవృత్తి అయిన చెప్పులు కుట్టడం కనిపిస్తుంది. చెప్పులు కుట్టిన మాదిగల కాళ్ళకు చెప్పులు లేకపోవడం మంచి ఎండకాలమైనా వీళ్ళు చెప్పు లేకుండా పనులు చెయ్యడం చూడవచ్చు. అలాగే సాధారణంగా తీరికవేళల్లో గామంలో స్త్రీ పురుషులు ఆడుకొనే ఆటలు వీధిలో వేపచెట్టు లేదా కానుగ చెట్టుకింద దాని చుట్టూ కూర్చోటానికి బండరాతి కట్టడిమీద కూర్చుని బారకట్ట పులికట్టఆటలు ఆడుకోవడం గమనించవచ్చు. ఊరునే నమ్ముకొని జీవించే మాదిగలు ఎంత కష్టమైనా ఊరువదలి వెళ్ళరు. వెళ్ళినా కొంతకాలానికి తిరిగి ఇల్లు చేరుకుంటారు. కొన్ని కులాల వాళ్ళు ఆర్థికంగా ఉన్న ప్రాంతంలో స్థిరపడలేక పోతే మరోచోటికి వెళతారు.

ఆస్తులు సంపాదిస్తారు. దళితులుఅట్లాకాదు. ఈ కథలో ఒక సన్నివేశం ఉంది. వాళ్ళు దేసుము తుక్కేమొ యద మింద కొంగు ఉండదా లేదా అంటానని ద్యాసానే వుండనే వుండుదంట. మొగానిలక్క ఆడోల్ళు కొంగుని దీసి నడుముకి సుట్టుకొని పనిచేస్తారంట. మననా బట్లుయాపొద్దన్న నాలుగు వూర్లు తిరిగి నాలుగు ఇనయాలు తెలునుకునుంటే కదా. యంత సేపు ఈనాబట్లులక్క ఆడోళ్ళు గుద్దుసుట్టు తిరుక్కుంటుండే నా బట్లకి లోకుములో యేమి జరుగుతాదో యేమి లేదో మేమి తెలుస్తాయి. ఈ మాటల వల్ల వీళ్లు ఉన్న వూరికి ఎంత ప్రాముఖ్యతనిస్తారో ఈ కథ వలన తెలుస్తుంది. అలాగే వీరికి వైద్య సదుపాయాలు ఉండవు కనుక ఏదైనా గాయమైతే వీరు చేసే జానపద వైద్యం ఎలా ఉంటుందో గమనిస్తే. బుర్రు పగిలని కాడ నసిపోడి వొత్తమని వొగురు పెంచుమింద మసి కొబ్బరినూనీ సున్నము కలిపి పెట్ట మని వొగురు, వూరికే పాతబట్ట నీళ్ళలో అద్ది తడిబట్ట కట్టమని వొగరు అంతా కలిసి అలుగుబులుగు సేస్తుం డారు. వీరి వైద్యం ప్రత్యేకమనే విషయం ఇక్కడ అవగత మవుతుంది.

నడిమింటిబోడెక్క బసివిరాలయ్యెద కతలో మాదిగల ఆచారాలు కనిపిస్తాయి. నడిమింటి బెలిగింటి పెద్దమ్మ తన కూతుర్ని బసివిరాలని చేసే శుభకార్యాన్ని పరిశీలిస్తే బోడెక్కొళ్ళు ఇంటిముందు నాలుగు బసిరికట్లు నాలుగు దిక్కుల తుక్కునాటి ఆటికి జమ్మాకు కట్టేర. నాలుగు గుంజలు మధ్యలో కమ్మిడి పోరిసి సాసుకుము యేసేర. యరమన్ను సున్నము పట్లు పెట్టేర. మద్దిలో కుంకుమ బుక్కుపిండితో బోట్లు పెట్టేర. ముందురుపక్క రెండు దిక్కులు రెండు రాసులు జోండ్లు పోసి మూడు ఆకులు రెండు వక్కులు పెట్టేర. వొగుపక్క కలుసుము పెట్టేర. కలుసుము మద్దిలో ఆకులు పెట్టిన గిన్నిలో ఈ బీతిపొండు తీసుకొని కల్లెన్న కోడుకు మల్లన మామ అందరికి అడ్డుబొట్లు పెడుతాండడు. బోడెక్కోళ్ళు, వులిగెన్న మల్లన్న మామ పణమింద పెట్టిన ఈ చీతిపొండు అడ్డుబొట్లుమింద మద్దిలో కులకుముబోట్లు ఈబీతి పెడుతుండాడు. ఇంతులోకి తలారి నాగన్న మల్లన్న మామని అరిసిడిసి. వొసోస్.....మల్లిగా... పిల్లొల్లకి ఆడోళ్ళకి రెండు రెండు బొట్లు పెట్టు. మొగొళ్లకి మూడు మూడు బొట్లు పెట్టు. శ్యాస్త్రము తప్పకూడదు. తెలిసేదా. అదేమరి. మరిసిపోకుండసెయ్యి" వీళ్లు ఆచారానికి ఎంత విలువ నిస్తారో ఈ సన్నివేశం చాలు. బెలిగింటి కందారప్ప ఎంత ఆచారం కలవాడో ఈ కథలో తెలుస్తుంది. వూరు కట్టిడి పకారము. మాకులాచారము పకారము, మాయింటి దేవత వులిగెమ్మ మొక్కుబడి పకారము సాతనయిన పనిసేస్తిని" - అంటూ ఊరు అందరిముందు తన మాట నెలబెట్టుకొని తన కూతుర్ని బసివరాల్ని చేస్తాడు.

ఈరారెడ్డి మనుమురాలు మింద మొనుసుండాది కతలో మాదిగ పిల్లలు ఇద్దరు స్కూలుకి వెళతారు. వారిని మిగతా విద్యార్థులు కంటెకొంచెం దూరంగా చివర్లో కూర్చో బెడతారు. పంతులు అందరి పిల్లలకు మల్లె వీరికి చదువు చెబుతాడు. వీరు చదువుకున్నంత బాగా మిగతా కులాల పిల్లలు చదవురు. వీరు పాట పాడినా, ఆటలాడినా వీళ్ళంత చక్కగా ఎవరూ పాడలేరు. ఆడలేరు. ఈరారెడ్డి మనుమరాలు తల్లిదండ్రులు బెంగుళూరులో ఉద్యోగం చేస్తుంటారు. ఈరారెడ్డి తనకు ఆస్తులు ఎక్కువగా ఉం టాయి. కొమారులు, కూతుర్లు ఎవ్వరు ఈయన దగ్గర ఉండురు. కొందరు విదేశాల్లో మరికొందరు స్వదేశంలో ఉన్నా పెద్ద పెద్ద నగరాల్లో ఉద్యోగాలు వ్యాపారాలు చేస్తుంటారు. బెంగళూరులో ఉండే కొడుకు కూతుర్ని ఈయన తన దగ్గర ఉంచుకొని సర్కారు బడికి పంపి స్తాడు. ఆ అమ్మాయికి ఇంగ్లీషు తప్ప తెలుగురాదు. రెడ్డి ఆజ్ఞమేరకు ఉమకు తెలుగు నేర్పిస్తారు. ఈ అమ్మాయి మాదిగ కులానికి చెందిన సుందర్రాజుతోనే ఎక్కువ ఆడుకోవడం చూసి అయ్యవార్లు మందలిస్తారు. ఆగస్టు పదిహేను రోజున జెండా ఎగురవేయటానికి వచ్చిన ఈరారెడ్డి ఆయన బందువులు ఉమ తల్లిదండ్రులు అందులో పాల్గొంటారు. జెండా అనంతరం సుందర్రాజు పాడిన పాట, సుందర్రాజు అక్క రాణక్క పాడిన పాట ఈరారెడ్డిని మైమరపిస్తుంది. అందుకు బహుమానంగా

ఒక రూపాయి తీసిఇస్తాడు. వీళ్లద్దరూ మాదిగ రంగన్న బిడ్డలని మిగతా కులం పిల్లల కంటే వీళ్ళు చదవులో ముందుంటారని హెడ్‌మాస్టర్‌రెడ్డికి చెబుతాడు. ఈ సన్నివేశాన్ని రెడ్డీ.... రెడ్డీ... వాడు మాదిగరంగన్న కొడుకు రెడ్డీ. వాన్ని ముట్టుకునిడిస్తివే అనిడిన. అర్రెర్రెర్రె..... ఈడూ మాదిగ రంగన్న కొడుకేనా! బాగానే పాడతాండాడే ఇంతతీసిన వూర్లోన ఇంతమంది పిల్లోలుండారు. వొగుడు గూడ జాతిగీతము పాల్లేర. అంటారని పిల్లోలు పాడుతుంటే మనుమందరు తలోంచుకొని నిలబడాల్సి వొచ్చిందే. మీరంతా యేమిసేస్తుండారు అయ్యివార్లంత. ఆ మాదిగ పిల్లోల్లు పాడే మంచి మంచి పాట్లన్నీ ఈర్లో పిల్లోల్లకి యంటికి నేర్పలేదు..... అంటాని ఈరారెడ్డి అయ్యివార్లు మీద కొప్పు తెచ్చుకొనె. అంటే మాదిగ కులానికి చెందిన పిల్లలు విద్యలోను ఆట పాటలోను మిగతా వారికంటే ఏ మాత్రం తీసిపోరని, ముందే ఉంటారని అర్థం చేసుకోవచ్చు.

పీర్లపండగనాడు యేమయ్యేద్దుంటే.. కతలో మాదిగలు మిగతా కులాల వాళ్ళు చేసే ఊరేగింపుల్లో పాల్గోన కూడదని వాళ్ళ సంతోషాలకు అనుగుణంగా వీళ్ళు తొట్టెటకోట్టాలని వీళ్ళు వాళ్ళతో సమానంగా దేవాలయాల దగ్గ పీర్ల సావిడి దగ్గరకు సామిసోను తొక్కరాదని అలా చేస్తే తన్నులు తప్పవని చెప్పే కథ ఇది. సుందర్రాజు ఈ కథలో పీర్లసావిడి దగ్గరను వెళిత బోయ, రెడ్డి, ఇతర కులస్తులు ఇతన్ని పట్టుకుని కొడతారు. చివరకు తలపై గాయం అవుతుంది. సుందర్రాజు గట్టిగా ఏడ్చి స్పృహ కోల్పోతుంటే వదిలిపెట్టి దూరంగా పారిపోతారు. అపుడు వారిపై ప్రతీకారం తీర్చుకొనెందుకు సుందర్రాజు బోయ కులానికి చెందిన పిల్లోన్ని వెంటాడి చీకట్లో ఒక చోట నక్కి అతను రాగానే రాయితో బలంగా కొట్టి మాదిగ్గేరికి పారిపోతాడు. మాదిగలపై అన్ని కులాలవాళ్లు దాడి చేయడానికి వస్తారు. వీళ్ళంతా తలోదిక్కు పారిపోతారు. సుందర్రాజు పారిపోడు. సుందర్రాజు తల్లి మాదిగలలో ఉండే ఆధైర్యానికి బాధ పడుతుంది. తిడుతుంది. తెగించి పోరాడమంటుంది. అప్పుడు అందరూ దీపాలు ఆర్పి ఇంట్లో దాక్కొని ఉంటే ఈమె మాత్రం బయట నిలబడి ప్రతాపాలు పలుకుతుంది. ఇక్కడ ఇంట్లో దాక్కున్న ఆడవాళ్ళు ఎలాంటి వారంటే, ఇసుపురక్క రెండు సేతులునిండ కారముపొడి పట్టుకోని కుసునేద. వాళ్లమ్మ యెరుకిలికొడివిలి పట్టుకోని పక్కులో రాకిలిబండ పెట్టుకొని వాకిలికి అవుతులు దిక్క కుసునేద వాకిలేసుకుని మొగోళ్ళని యెతుకుంట వూర్లోళ్ళు వస్తేవాళ్ళు గీన ఇంట్లోకి జోరబడిడిస్తే, కండ్లులో కారుముసల్లిడిసి సంపేకి దేరుము సీసి కుసునేర. వారి ప్రాణాల మీదకి వచ్చినప్పుడు ధైర్యంతో పోరాడుటానికి మాదిగస్త్రీలు సిద్ధంగా ఉన్నారంటూ చెబుతాడు రచయిత ఈ కథ ద్వారా నాగప్పగారి సుందర్రాజు రాసిన ఈ కథల్లో మాదిగల దైనందిన జీవితంతో పాటు వాళ్ల అస్తిత్వం కూడా ఉంది. తరతరాలుగా ఉన్న ఆచారాలను పాటించటం వాళ్లకు మాత్రమే ఉన్న బసివిని ఆచారాన్ని అలాగే కొనసాగించటం విద్యలో అందరి విద్యార్థులు కంటే ఎక్కువగా రాణించటం కలదు. ఐనా వారిని ఊరుకట్టడి పేరుతో కులం పేరుతో అంటరాని వాళ్లుగానే చూస్తూ ఉంది సమాజం. మాదిగలు మాట్లాడే భాష ప్రత్యేకమైనది. చెప్పులు కుట్టినా, రైతులకు కావలసిన తాళ్లు తాయారు చేసినా గోరోజనం తీసి పెద్ద కులస్థులకు పంచినా, పంట పోలాలు కూర్చినా నమ్మకంతో కూలి పని చేసినా మాదిగలు మాదిగలే అంటూ నీచంగా చూస్తున్న సమాజాన్ని తూర్పారబట్టడమే కథల్లోని సారాంశం.

మాదిగల అస్థిత్వాన్ని అనైక్యతను తెలుపుతూ వారికి మనోధైర్యాన్ని నింపాడు అలూరు ప్రాంతం పరిసరాల్లో నివశిస్తున్న మాదిగల భాష, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లను, వీరత్వాన్ని, సంస్కృతిని చిత్రించిన సుందర్రాజు కథలు సమాజానికి ఎంతో ఉప యోగకరమైనవి. ప్రత్యేకించి ఒక కుల ఆచార వ్యవహారాలను, జీవన విధానాన్ని తీర్చిదిద్దిన క్రమం ఎంతో అనిర్వచనీయమైనది. ఇది మానవాళికి ఎంతో ఉపకారి అని తెలుప వచ్చు.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కటుకోజ్వల మనోహరాచారి – "ఆత్మీయులు" తెలుగు కథ – సామాజిక జీవన చిత్రణ

– డా॥. నాగరాజు అసిలేటి, పోస్ట్ డాక్టరల్ రీసెర్చర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

వేల యేళ్ళ చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యం ఎంతో శక్తివంతమైంది. వ్యక్తపరచదలుచుకున్న విషయాన్ని వ్యక్తీకరించేందుకు కవిత్వం తర్వాత ప్రక్రియ కథ ప్రక్రియ అనడంలో సందేహం లేదు. గురజాడకు ముందే ప్రారంభమైన తెలుగు కథ నాటి నుండి సమాజంలోని మంచి చెడులను అన్నింటిని తనలో ఇముడ్చుకొని కొనసాగుతూ వస్తుంది. సమాజంలో జరిగే ప్రతి సంఘటనను అక్షరబద్ధం చేసి కథలు రాస్తూన్నవారి సంఖ్య తక్కువేమి కాదు. ఆ మాటకొస్తే చదువుతున్న వాళ్ళు కూడా కొరతేమీ కాదు. ఎవరు ఏమి రాసినా సమాజ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని రాయబడిన కథలే చిరకాలం నిలుస్తాయి. రాశామనిపించుకోవడానికి మాత్రమే రాసిన కథలు అనుకున్నంత ప్రాచుర్యాన్ని సంతరించుకోవు.

ప్రాశ్చాత్య సాహిత్యం ద్వారా భారతీయ సాహిత్యానికి పరిచయమైన ఆధునిక సాహిత్య ప్రక్రియ కథానిక. దీని పుట్టుకకు ఆధునిక సామాజిక నేపథ్యముంది!. ఆధునిక తెలుగు కథానిక ఒక్కసారిగా హఠాత్తుగా ఊడిపడలేదు. 1819 నాటి రావిపాటి గురుమూర్తి శాస్త్రి (The Tales of Vikaramarka) నుంచి 1909 నాటి పనపాటికము శ్రీనివాసాచార్యులు, 'భోజనుతా పరిణయము' దాకా తొంభై ఏళ్ళ తెలుగు వచనం కథానికా పుట్టుకకు పురిటి నొప్పులు పడింది గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' (1910, ఫిబ్రవరి, ఆంధ్రభారతి) తొలి తెలుగు కథానిక అని ఎక్కువ మంది భావించారు. కానీ ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ 'లలిత' కాకపోతే, 'విశాఖ' తొలి తెలుగు కథలు అనే వాదాలున్నాయి. ఇటీవల భార్గవీరావు 'నూరేళ్ళ పంట'లో బండారు అచ్చమాంబ 'స్త్రీ విద్య' (1902 హిందూ సుందరి) తొలి తెలుగు కథానిక అని ప్రతిపాదించారు" (ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, ప్రధాన సంపాదకులు: డా॥ ఆవుల మంజులత, సంపాదకులు : ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ, సామాజిక ఉద్యమాలు: తెలుగు కథానిక, డా॥ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, పుట:99) తెలుగులో పుట్టిన మొట్టమొదటి కథగా గురజార అప్పారావు గారి 'దిద్దు బాటు'ను పేర్కొంటారు. దీన్ని అందరూ అంగీకరించాల్సిన విషయమే. ఎందుకంటే కథకు ఉండవలసిన అన్ని లక్షణాలు ఈ దిద్దుబాటులో సంపూర్తిగా ఉన్నాయి కాబట్టి.

రెండు మూడు దశాబ్దాల క్రిందట సాహిత్యం అంటే కేవలం కవిత్వమే అనే ప్రచారం జరిగింది. కవులకు ఉన్నంత ప్రాధాన్యం కథా రచయితలకు దక్కలేదు. కథలు వ్రాసిన వారి చరిత్రగానీ, కథా సాహిత్య విమర్శ గ్రంథాలు గానీ వెలువడటం చాలా తక్కువ.1910లో తెలుగు కథ ప్రారంభమైతే 1960 దాకా సరైన కథా విమర్శ వెలువడ లేదు. అంటే కథకి, కథా విమర్శకి మధ్య 50 సంవత్సరాల అంతరం ఏర్పడింది. తొలి తరానికి చెందిన కథా సమీక్షకులు ఆచంట జానకీరామ్, నోరి నరసింహశాస్త్రి మొదలైన వాళ్ళని పేర్కొనాలి. తరువాత తరానికి చెందిన వారిగా ఆర్.ఎస్. సుదర్శనం, టి.ఎల్. కాంతారావు, రామమోహన్ రాయ్, శార్వరి, పోరంకి దక్షిణామూర్తి, వావిలాల సుబ్బా రావులను చెప్పుకోవచ్చు. నేటి తరానికి చెందిన కథా విమర్శకులలో కోడూరి శ్రీరామమూర్తి, పాపినేని శివ శంకర్, కాత్యాయనీ, విద్యాహే, ఓల్గా, మృణాళిని, వల్లభాచారి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, బి.ఎన్. రాములు మొదలైన వారున్నారు.

కథలు రాయడం అంత తేలికైన విషయం కాదు. ఊహాజనితంగా కథ రాయడానికి ఎంతో ప్రతిభ కావాలి. వాటి విలువ తెలుసుకోవడానికెంతో పరిజ్ఞానం ఉండాలి. వాటిని అర్థం చేసుకోవడానికి విచక్షణాజ్ఞానం కావాలి, కథలు కళ్లకి వెలుగునిస్తాయి, బుద్ధికి పదునుపెడతాయి, మనస్సుకు ఉత్సాహం, ఉల్లాసం కలిగిస్తాయి. కథలు చదవడం, వినడం, ఎప్పుడూ దండగ అనుకోరాదు.

ఈ సందర్భంలో నా పరిశోధన పత్రంలో కటుకోజ్వల మనోహరచారి - "ఆత్మీయులు" కథలో సామాజికాంశాలను విశ్లేషిస్తాను. ఈ కథ ప్రస్తుత సమాజానికి అద్దం పడుతుంది. సమాజంలోని వ్యక్తులు, వారి మనస్తత్వాలు విభిన్న పోకడలు ఈ కథలో చూడొచ్చు. కథలో నాలుగు ప్రధాన పాత్రలున్నాయి. అవి 1) చిత్ర, 2) చిత్ర తల్లి సుభద్ర, 3) చిత్ర స్నేహితురాలు కావేరి, 4) చిత్ర ఆటో డ్రైవర్ శామ్యూల్.

చిత్ర తల్లిదండ్రులు వాళ్ల పిల్లలకు ఏది, ఎప్పుడూ, ఎలా ఇవ్వాలో వారికంటూ ఒక ప్రణాళిక వుంది. దాన్ని పిల్లలు అతిక్రమిస్తే కొంత కటువుగా వ్యవహరించటం తప్పకపోయింది. దీనినే చిత్ర ప్రేమ రాహిత్యం అని భావించింది. తల్లిదండ్రులపై ప్రేమకు బదులు తిరస్కారాన్ని క్రమేపి పెంచుకుంటూ వచ్చింది. తల్లిదండ్రులు కాదు అన్న వాటినన్నింటిని ఆటో డ్రైవర్ శామ్యూల్ పసిగట్టి చిత్రతో రాబట్టి చిత్రకు సమకూర్చడం నేర్పాడు. అది ఎంత దాకా పోయిందంటే చాక్లెట్‌లు కొనిపెట్టడంతో మొదలై ఐస్‌క్రీమ్‌ల స్థాయి దాటి కాలేజీలు ఎగ్గొట్టి, పుట్టిన రోజు వేడుకలు జరపడం దాటి మాయ మాటలు చెప్పి మభ్యపెట్టి శారీరకవాంఛ తీర్చుకొనే దాకా వచ్చింది. తరువాత పెళ్ళి ప్రస్తావన రాగానే అతగాడి మాటలకు విరక్తి చెంది తిరిగి ఇంటికి చేరుతుంది. పరువు కోసం తపించే చిత్ర తల్లిదండ్రులు జరిగినది తెలుసుకొని గట్టిగా మందలించి నిర్భంధిస్తారు. దానితో మనస్థాపం చెంది జీవితంపై విరక్తి పెంచుకుని తనువు చాలించేందుకు బాత్‌రూమ్ క్లీనర్ త్రాగి హాస్పిటల్ పాలు అవుతుంది. ఆ సందర్భంలో తల్లి సుభద్ర చిత్రకు కావాల్సిన ఇంజక్షన్ కొనేందుకు మెడికల్ షాప్‌కి వచ్చి తిరిగి కంగారుగా వెళ్ళుతూ కావేరి క్యాబ్‌కు అడ్డం పడుతుంది. సుభద్రను గుర్తుపట్టిన కావేరీ ఆరా తీసి విషయం తెలుసుకుని మదనతో ఇద్దరు హాస్పిటల్‌లో ఉన్న చిత్ర దగ్గరకు చేరుకుంటారు.

చిత్రను చూసి కావేరి మనసు బాధతో నిండిపోయింది. కావేరి, చిత్ర చిన్ననాటి నుండి స్నేహితులు, ఇద్దరూ ఇంటర్మీడియట్ దాకా కలిసి చదువుకున్నారు. మరో ప్రక్క కావేరి తాను ఏ పని మీద రైల్వే స్టేషన్‌కి వెళ్ళుతుందో అందుకు టైమ్ అయిపోతుందనే తొందర ఒక ప్రక్క, మరో ప్రక్క అసలు చిత్రకు ఏం జరిగింది అని తెలుసుకోవాలనే ఆదుర్దా ఎక్కువైపోయింది. "తర్వాత.. తర్వాత ఏం జరిగింది అంటే...?" అంది ఉద్విగ్నంగా "వాస్తవం తనే గ్రహించింది".

"ఏంటా వాస్తవం...??"

"తమ ఆరోగ్యం కోసం భద్రత కోసం తల్లిదండ్రులు చేసే నియంత్రణను పిల్లలు ప్రేమరాహిత్యంగా భావించి, బయటి వ్యక్తులు దురుద్దేశంతో అందించే తాయిలాలను ప్రేమ కానుకగా భావిస్తే.. నిండు జీవితం బండలవుతుందని తానే స్వయంగా గ్రహించింది"

"ఎట్లా...?"

"పెళ్లి పేరుతో తీసుకెళ్లి వారం రోజులపాటు కాపురం పెట్టాడు ఆటో అబ్బాయి. చిత్ర పెళ్లి ప్రపోజల్ తీసుకొస్తే.. మీ అమ్మానాన్నలు ఇష్టపడి మనిద్దరికీ పెళ్లి చేస్తేనే చేసుకునేది" అని లంకె తగిలించాడు.

'ప్రాణం పోయినా అమ్మానాన్నలు ఒప్పుకోరన్నది చిత్ర.

'అయితే పెండ్లి విషయం ఆలోచించుడు మానుకో' అన్నాడు.

'పెండ్లి కాకుంటే నన్ను లేపుకొచ్చినట్లవుతుంది కదా' అంది చిత్ర.

'ఎట్లైతేంది? మీవోళ్లు పెండ్లి చేత్తమని వొచ్చెదాంక గిట్లనే కలిసుందాం. నీ దగ్గర పైసలు, నగలు ఉన్నాయ్

గదా! గవ్వి అయిపోయేదాకా బేఫికర్. నాకా ఉద్యోగం, సదువు లేదు. మీ వోళ్లను కాదని లగ్గం జేసుకొని మనం బతికేదెట్ట?'

' నీకు కావాల్సింది నేనా... మా వాళ్లా..?'

ఉత్త నువ్వు కాదు, మీ అమ్మానాన్నతో కలిసున్న నువ్వు...' అతను నవ్వాడు.

చిత్రకు వాస్తవం అర్థమైంది. అతనిది ప్రేమ కాదనీ, కేవలం స్వార్థమనీ గ్రహించిన వెంటనే అతన్ని కాదని వచ్చేసింది" వివరంగా చెప్పింది సుభద్ర.

గాఢంగా నిట్టూర్చింది కావేరి. "మరి అతనిమీద పోలీసులకి కంప్లయింట్ చెయ్యలేదా ఆంటీ..?"

"ఏంటీ చేసేది? తప్పు చిత్రవైపు కూడా ఉంది కదా?"

"అది సరే.. తప్పు తెలుసుకుని ఇంటికొచ్చింది కదా! మరి ఈ ఆత్మహత్యా ప్రయత్నం ఎందుకు?" కావేరిలో సందిగ్ధం అట్లాగే ఉంది.

సుభద్ర చాలాసేపు మౌనంగా ఉండిపోయి నెమ్మదిగా అంది. "చిత్ర.. గర్భవతని తెలిసింది". కావేరి ఉలిక్కి పడింది. కాసేపు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. తర్వాత సంశయిస్తూనే అంది. "ఈ పరిస్థితుల్లో... అతనితో పెళ్లికి ప్రయత్నిస్తే ఎట్లా ఉండేదాంటీ...? అతనికి ఉద్యోగం లేకున్నా... మీరే ఏదన్నా దారి చూపించి..." తర్వాత ఏం మాట్లాడాలో తెలియలేదు.

"కావచ్చు! కానీ.. అతనికి అప్పటికే పెళ్ళైంది".

బాంబ్ పేలినట్లు అదిరిపోయింది కావేరి."ఏంటీ...??" పెళ్ళైన వ్యక్తి... ఓ చదువుకునే అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడిపాడా? పెళ్లి చేసుకుందామని పిలిచి వారం రోజులు కాపురం చేసి వదిలివేశాడా? అయినా వదిలేసింది అతడు కాదు. చిత్రే అతన్ని వదిలించుకుని వచ్చింది.

'మరి వదిలించుకోక..?!'

'అమ్మానాన్నల ఆస్తితో కూడిన చిత్ర' కావాలన్నాడంటే... అతడెంత అవకాశవాది...? ఒక ఆటోవాలాను నమ్మి బయటకుపోతే సరైన గుణపాఠమే నేర్పాడు మరి! దీని ద్వారా ఏమర్థవుతుంది?? నియంత్రించినా... పిల్లలకు ఒకదశ వరకూ తల్లిదండ్రులే అసలైన భద్రత అని కదా!!

అయినా, చిత్ర ఎంత తెలివితక్కువ పనిచేసింది... అనుకుంటూ ఉలిక్కిపడింది కావేరి... మరి... తను?! తను చేస్తున్నదేమిటీ..??

ఒక కారు డ్రైవర్‌తో లేచిపోవడానికి సిద్ధపడింది. పెంపకంలో అమ్మానాన్నలు అనుసరిస్తున్న నియంత్రణను బంధనంలా తనింటి కారు డ్రైవర్ ప్రదర్శిస్తున్న ఆసక్తిని ప్రేమగా భావించింది. అతడందించే తాయిలాలకు మురిసిపోయి తల్లిదండ్రులకంటే అతడే ఆత్మీయుడనుకుంది. అతడు స్మార్ట్‌ఫోన్ కొనిస్తే తీసుకుంది. సినిమాకు తీసుకెళ్తే వెళ్లింది. చివరకు అతనితోనే ప్రేమలో పడింది. అమ్మానాన్నలు పెట్టే ఆంక్షలు కాస్త ఎక్కువే అయ్యుండొచ్చు. కానీ తమ పిల్లలకు ఎప్పుడు ఏది అవసరమో, ఏది అవసరం కాదో తల్లిదండ్రులకు తెలిసే ఉంటుంది. ఏది చేసినా అదంతా తన భద్రతకోసమనీ, తనమీద వాళ్లకున్న బాధ్యతా, ప్రేమా అనీ గుర్తించకుండా.. తామిచ్చే జీతం మీద ఆధారపడి బ్రతికే వ్యక్తితో తను... వెళ్లిపోవడానికి సిద్ధపడింది.

అతను ఎట్లాంటివాడో... అతని కుటుంబ పరిస్థితులేంటో తెలియదు. అతడు తనను ఎట్లా పోషిస్తాడో తెలియదు. అయినా కొద్ది నిముషాల్లో అతనితో కలిసి బతకడానికి రైలు ఎక్కబోతోంది.

గదిలో గడియారం ఆరుగంటలైనట్లు చూపిస్తోంది.

వెళ్లాలి...!

కావేరి లేచివెళ్లి సుభద్ర కన్నీళ్లు తుడిచింది. "ఏడవకండి ఆంటీ! అంతా మన మంచికే జరుగుతుంది. చిత్ర కోలుకున్నాక వస్తాను.. ధైర్యం చెప్పడానికి" అని నెమ్మదిగా బయటకు నడిచింది. లిఫ్టలో కిందకు దిగుతుంటే సుభద్ర అన్న మాట ఆమె మనసులో పదే పదే ప్రతిధ్వనిస్తోంది.

'తమ ఆరోగ్యం కోసం భద్రత కోసం తల్లిదండ్రులు చేసే నియంత్రణను పిల్లలు ప్రేమరాహిత్యంగా భావించి, బయటి వ్యక్తులు దురుద్దేశంతో అందించే తాయిలాలను ప్రేమకానుకగా భావిస్తే... నిండు జీవితం బండలవు తుంది.."

కఠినంగా అనిపించినా ఎంతో వాస్తవం ఉంది అందులో. ఆలోచిస్తుంటే మనసు పొరలపై పరుచుకున్న చీకటి తెరలు క్రమక్రమంగా విడివడుతున్నట్లు అనిపించిం దామెకు. భవిష్యత్ ప్రపంచం కనుల ముందు లీలగా దర్శనమిస్తుంటే... ఎదురుగా వస్తున్న ఆటోను ఆపింది. ఆమె ఎక్కి కూర్చోగానే ఆటో పరుగుతీసింది.

అయితే... రైల్వేస్టేషన్ వైపు కాదు! కావేరి ఇంటివైపు!

ఈ కథ చదివితే ఒక చేటు మరో మేలు కోసమే అన్న ఆలోచన కలుగుతుంది. సమాజంలో తల్లిదండ్రులు బాధ్యతని, పిల్లల బాధ్యతని కూడా రచయిత గుర్తు చేశారు. నమాజంలో మంచి-చెడులు న్యాయ అన్యాయాలు, మోసాలు, దగలు అన్ని ఉంటాయని వాటి పట్ల ప్రజలు వేమర్పాటు కలిగి విచక్షణతో వివేచన చేసి తగురీతిగా మనులుకోవాలనే కర్తవ్యాన్ని రచయిత "ఆత్మీయులు' కథ ద్వారా తెలియజేయడం గమనార్హం.

ఆధార గ్రంథాలు :

1. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, ప్రధాన సంపాదకులు: డా॥ ఆవుల మంజులత, సంపాదకులు: ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ.
2. ఈనాడు ఆదివారం అనుబంధం, జూన్, 28, 2020.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నవలల్లో నటీమణుల జీవిత చిత్రణ

– డా॥. ఎఐఐ. చైతన్య, గెస్ట్ ఫ్యాకల్టీ, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

సమాజం అన్న పదానికి ఎన్ని అర్థాలు చెప్పుకున్నా మౌలికంగా సమాజం అంటే మనుషులు, వాళ్ళ చుట్టూ ఉన్న పరిస్థితులు. ఇక్కడ మనుషులే ప్రధానం అయినప్పటికీ వారికి ఒక గుర్తింపును ఇచ్చేది మాత్రం పరిస్థితులే. రాజకీయ పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు, చారిత్రక పరిస్థితులు, భౌగోళిక పరిస్థితులు వంటివి మనిషికి గుర్తింపును ఇస్తూనే మనుషులను కొన్ని వర్గాలుగా విభజించడం కూడా ఉంది. దేశం, జాతి, మతం, కులం, పేద, ధనిక మొదలైన వర్గాలు ఒక దానిపై మరొకటి ఆధారపడడమో, ఒకదానిని మరొకటి దోచుకోవడమో చరిత్ర పరిణామంలో కనిపిస్తూనే ఉంది. అయితే అన్ని కాలాలలో, అన్ని జాతులలో, అన్ని ప్రాంతాలలో పీడనకు గురైన వర్గం స్త్రీలు. మనిషి దారుణంగా Exploit (అవసరానికి వాడుకోవడం) చేసిన అంశాలలో మొదటిది ప్రకఅతి, రెండవది స్త్రీ. సమాజం అభివఅద్ధి చెందుతున్న కొద్దీ ఆడవారికి కూడా సమాజంలో తమను తాము నిరూపించుకొనే అవకాశాలు లభిస్తున్నాయి. కానీ సమాజంలో పురుషులతో సమానమైన స్థానం వారికి నేటికీ పూర్తిగా లేదు. అభివఅద్ధి చెందినవి అని చెప్పుకుంటున్న దేశాలలో కూడా. నూతన రంగాల్లోకి వారు ప్రవేశించే కొద్దీ వారిపై జరిగే పీడన కూడా కొత్త రూపాలను సంతరించుకొంటోంది. ఇంట్లో ఒకరకమైన సమస్యలైతే, పని చేసే చోట మరొక రకమైన సమస్యలు. అంటే పరిస్థితిని బట్టి సమస్య స్వరూపం మారుతోందే కానీ పరిష్కారం మాత్రం ఎండమావిగా కనిపిస్తోంది. కుటుంబ జీవితాన్ని, వృత్తి జీవితంతో సమన్వయించుకుంటూ జీవించాల్సిన పరిస్థితి ఈనాటి మహిళది. దీనికి రెండు ఉదాహరణలు/పరిస్థితులు చెబుతాను. మొదటి పరిస్థితి - భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నపుడు, ఏదైనా కారణంగా ఇద్దరిలో ఒకరు ఉద్యోగం మానివేయాల్సిన పరిస్థితి వస్తే అది తప్పకుండా భార్యే అవుతుంది. ఇది చాలా సమాజాలలో అలిఖిత చట్టం. ఒకవేళ భార్య భర్త కన్నా ఎక్కువ సంపాదిస్తున్నా కూడా ఈ చట్టంలో పెద్దగా మార్పు ఉండదు. రెండవ పరిస్థితి - ఇది ఓల్గాగారు ఒక ఇంటర్వ్యూలో అన్న మాట "అర్ధరాత్రి పిల్లవాడు లేచి ఏడిస్తే ఎంతమంది తండ్రులు లేచి వాళ్ళని సముదాయిస్తున్నారు?" అన్నది ఓల్గాగారి ప్రశ్న. ఇప్పుడు సమాజంలో మార్పు కనిపిస్తోంది (అనుకుందాం). అలా అనుకున్నా పిల్లల పెంపకంలో భాస్వాములయ్యే భర్తలు మొత్తం సమాజంలో పదిహేను శాతం కన్నా మించరు. వఅత్తి జీవితంలో స్త్రీలను Exploit చెయ్యడం అన్నది ఆధునిక సమాజ అభివఅద్ధి సూచీని దిగజార్చే అంశాలలో ఒకటి. వేతనాలు తక్కువగా ఇవ్వడం, కొన్ని రంగాలకు స్త్రీలు పనికిరారు అని ముందే నిర్ణయించి వారిని దూరం పెట్టడం వంటివి పీడనకు ఉదాహరణలు.

ఇలా స్త్రీలతో పనిచేయించుకుంటూ కూడా వారికి తగిన గుర్తింపును ఇవ్వని సమకాలీన రంగాలలో మొదటిది సినిమా రంగం అనే చెప్పుకోవాలి. సినిమా రంగంలో స్త్రీలను వృత్తి జీవితంలోని వారే కాక, కుటుంబ సభ్యులు కూడా Exploitation లేదా పీడనకు గురి చేయడం అనలు సమస్య. ఇటువంటి నటీమణుల జీవితాలను చిత్రిస్తూ తెలుగులో అనేక నవలలు వచ్చాయి. ఆయా నవలల్లోని నటీమణుల జీవిత చిత్రణను రచయితలు చిత్రించిన తీరును విశ్లేషించడమే ప్రస్తుత పత్ర ప్రధానోద్దేశం.

సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం మాదిరి సినిమాను కూడా కళగా భావించవచ్చు. నాట్యశాస్త్రంలో భరతుడు ఆశించిన సామాజిక ప్రయోజనాన్ని సాధించగల

సామర్థ్యం, పైన చెప్పుకున్న అన్ని కళల కంటే సినిమాకే ఎక్కువ అనడం అతిశయోక్తికాదు. విషాదం ఏమిటంటే సినిమా కళగా మొదలై, పరిశ్రమగా ఎదిగి చివరకు నేడు ఒక వ్యాపార రంగం స్థాయికి దిగజారిపోవడం. అడపా దడపా మంచి సినిమాలు వస్తున్నా అవి నిర్మాతలకు లాభాలు ఆర్జించిపెట్టిన సందర్భాలు అరుదు. అయితే తెలుగు సాహిత్యానికి, సినిమాకు మంచి అనుబంధమే ఉంది. తెలుగు రచయితలు, రచయిత్రులు ఎందరో సినిమాలకు కథలు, పాటలు, మాటలు రాశారు. సినిమా సాహిత్యం అన్న కొత్త సాహిత్య రీతి ఏర్పడడానికికి సాహితీవేత్తల రచనలు దోహదం చేసాయి. సినిమాలకోసం రాయకపోయినా ప్రసిద్ధి చెందిన సాహిత్య రచనలను సినిమాలకు కథావస్తువుగా వాడుకొన్న సందర్భాలు అనేకం. ఈ పద్ధతి హాలీవుడ్‌లో ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. హ్యారీపోటర్ వంటి సినిమాలే ఇందుకు ఉదాహరణ. సినిమా రంగం సాహిత్యాన్ని వాడుకున్నట్టే, సినిమారంగాన్ని కొందరు రచయితలు ముఖ్యంగా నవలా రచయితలు తమ రచనలకు నేపథ్యంగా వాడుకున్నారు.

నేను ఎంచుకున్న పాత్రలు పాకుడు రాళ్ళు నవలలోని మంజరి, కళ్యాణి, రేణుకాదేవి ఆత్మకథలోని రేణుకాదేవి, అభినేత్రి నవలలోని రాణి, కళ్యాణి నవలలోని కళ్యాణి. పై నటీమణుల పాత్ర చిత్రణలో కనిపించే సాధారణ అంశం ఒక్క కళ్యాణి పాత్ర తప్ప మిగితా వారంతా ఆత్మహత్యకో లేదా హత్యకో గురికావడం. ఇటువంటి పరిణామాలకి దారితీసింది ఆయా నటీమణుల చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితులే.

మంజరి - పాకుడురాళ్ళు :

ముందుగా మంజరి పాత్ర జీవిత చిత్రణను పరిశీలిద్దాం. రావూరి భరధ్వాజ జ్ఞానపీఠ పురస్కార సందర్భంలో ప్రత్యేకంగా పేర్కొన్న నవల పాకుడురాళ్ళు. సాధారణంగా సినిమాలలోని సాహిత్యంతోపాటు, సినిమారంగంపై వచ్చిన సాహిత్యం ఉత్తమ సాహిత్య శ్రేణికి చెందదన్న భావన అధికంగా ఉంటుంది. ఈ భావనను తోసిరాజన్న నవల పాకుడురాళ్ళు. సినీ జర్నలిస్టుగా పనిచేసిన భరధ్వాజ గారి అనుభవం ఈ నవలలోని వస్తువుకు నేపథ్యాన్ని అందించింది. మంజరి ఎక్కడ, ఎవరికి పుట్టిందో తెలియక పోయినా ఆమె పెరిగింది మాత్రం వేశ్యావాటికలో. నాటకాలలో వేషాలు వేయడంతో మొదలు పెట్టి అగ్రశ్రేణి నటీమణిగా ఎదిగింది. సినిమా రంగంలో ఎదుగుదల కోసం తన అందాన్ని పణంగా పెట్టాడానికి మంజరి వెనుకాడలేదు. అయితే తనను వాడుకున్న ఎవరినీ ఆమె ఊరికే విడిచిపెట్టలేదు. వారిని విసిగించి, ఏడిపించి, అదను దొరికితే, చివరకు బికారులను చేసిగాని వదలిపెట్ట లేదు. అయితే అవసరంలో ఉన్న వారికి సాయం చేయడం, దానధర్మాలు వంటివి కూడా చేసింది. కన్యా శుల్కంలో మధురవాణి, సౌజన్యారావుతో "చెడని వారిని చెడగొట్టవద్దని మా అమ్మ చెప్పింది" అంటుంది. ఈ మాటలను మంజరి అక్షరాల పాటించింది అని చెప్పవచు.

తానుగా ఎవరికీ అపకారం చేయాలని అనుకోలేదు కానీ, తనను Exploit చేయాలనుకున్న మగవారిని మాత్రం తనే Exploit చేసింది. మంజరిని సినిమాల నుంచి బ్యాన్ చేయాలని రావు, మూర్తి ప్రయత్నించడం ఈ రంగంలోని పురుషాధిక్యతకు ప్రత్యక్ష ఉదాహరణ. అలాగే డైరెక్టర్ల, ఇతర సాంకేతిక నిపుణుల విషయంలోనూ హీరోల మాటే చెల్లుబడి కావడం ఈనాటి వాస్తవ పరిస్థితులకు దూరమైన విషయమేమీ కాదు. అయితే మంజరి తన ఆలోచనతో రావు, మూర్తిలను కాళ్ళబేరానికి వచ్చేలా చేసింది. అంతగా విజయాలు లేని చంద్రం వంటి వారిని పెద్ద ఆర్టిస్టులుగా మార్చింది. నవలలోని కళ్యాణి, విజయ, వసంత వంటి పాత్రలు కూడా తమ అందం పెట్టుబడిగానే అవకాశాలు సంపాదించుకోవడం చూస్తే, ఈ రంగంలోని ఆడవారందరినీ రచయిత చిన్న బరుస్తున్నట్టు అనిపిస్తుంది. నిజానికి సినిమా రంగంలోని "కాస్ట్ అండ్ కౌచ్" అన్న నీచ విధానాన్ని చిత్రించడమే రచయిత ముఖ్యోద్దేశం. మంజరి నవల చివరకు ఆత్మ హత్య చేసుకుంటే, కళ్యాణి మాజీ భర్త చేతిలో హత్యకు

గురౌతుంది. డబ్బు, పేరుప్రఖ్యాతలు, పలుకుబడి ఉండి కూడా ఈ పాత్రలు ఇలా ముగుసిపోవడానికి కారణాలు సమాజపు లోపలి పొరల్లోకి వెళ్ళి అన్వేషిస్తేనే కానీ అర్థం కావు. ఒకే తప్పును స్త్రీ, పురుషుడు ఇద్దరూ చేసినప్పటికీ పురుషుడిపై కొంత ఉదారత చూపించడం, స్త్రీని దోషిగా చిత్రించడం సమాజంలో పాతుకుపోయిన పురుషాహంకార భావజాలానికి ప్రతీకలు. ఈ పురుషాహంకారం పట్ల తనకున్న కసిని, కోపాన్ని మంజరి చేతల్లో వ్యక్తం చేసింది. స్త్రీ ఏయే పనులు చేస్తే పురుషాధిక్య (సభ్య) సమాజం అంగీకరించదో ఆమెకు తెలుసు. పంతం పట్టిమరీ అటువంటి పనులనే చేసింది. సమాజంపై తనకసినీ, కోపాన్నీ ఆరకంగా కొంత తీర్చుకోగలిగింది. రోగాన్ని కనుక్కోగలిగింది కానీ, తగిన ఔషధాన్ని పసికట్టలేకపోయింది. మంజరి ఆక్రోశానికి తగిన కారణాలలో ఇది కూడా ఒకటి. ఈ ఆక్రోశమే తనను అంతం చేసుకోవడానికి కారణం అయింది. నవల మధ్యలో మంజరి హాలీవుడ్ నటి మార్లిన్ మన్రోను కలిసినట్టు చిత్రించారు. నిజజీవితంలో మన్రో ప్రేమ వైఫల్యం కారణంగా ఆత్మహత్య చేసుకుంది. మంజరి ఆత్మహత్యకు ఇటువంటి ప్రేమ రాహిత్య జీవితం కూడా ఒక కారణం. చలపతి, స్టువర్ట్, రాజన్‌లు మంజరిని Exploit చేసిన వాళ్ళే కానీ ప్రేమించిన వాళ్ళు కాదు. విజయం అంచులకు చేరుకోవడానికి ఒక విధమైన వైకుంఠపాళీ ఆటను ఆడింది. చివరకు తానే పాము నోట చిక్కుకుంది.

రేణుకాదేవి - రేణుకాదేవి ఆత్మకథ :

మాలతీ చందూర్ ఈ నవలను ఒక వింతైన ప్రశ్నతో మొదలుపెట్టారు. ధనవంతులు తమ ఆస్తిని సంస్థలకు, గుడులకు, బడులకు ఎందుకు రాస్తారు? అన్నదే ఆ ప్రశ్న. దీనికి సమాధానం కూడా నవల మొదట్లోనే ఇచ్చారు. ''పెద్ద పెద్ద ఆస్తులని సంఘాల కోసం ఇచ్చేవారు వారి జీవితానుభవాలను బట్టి ఇస్తారు గానీ, సంఘంలో మనుషులు సుఖపడ్తారని ఇవ్వరు. చుట్టూ పెరిగిన పరిసరాల మీద కసి కొద్దీ అలా చేస్తారు'' (మాలతీ చందూర్. 1955: 07). ఈ వాక్యాలకు ఉదాహరణే సినిమా తార రేణుకాదేవి జీవితం. మంజరి పాత్ర మాదిరి రేణుకాదేవి ఎవరూ లేని అనాథ కాదు. ఆమెకు తల్లి, అన్నయ్య, అక్కయ్య, తమ్ముడు ఉన్నారు. తండ్రి చిన్న తనంలోనే గుండె జబ్బుతో చనిపోయాడు. ఆర్థిక అవసరాలు తీర్చడం కోసం రేణుక సినిమాల్లో వేషాలు వేయాల్సి వచ్చింది. క్రమంగా ఆస్తి పెరిగింది, దానితో పాటే సమస్యలు పెరిగాయి. తల్లి, అక్కయ్య, అన్నయ్య ఆమెను డబ్బు సంపాదించి పెట్టే సాధనంగానే చూసారు. ప్రేమ కరువైన రేణుక సినిమా రచయిత అనిల్‌బాబు చూపించిన ఆదరణకు ఆకర్షితురాలై అతణ్ణి పెళ్ళిచేసుకుంది.

అతను కూడా మిగిలిన కుటుంబ సభ్యుల బాపతేనని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అక్క కూతురితో భర్తకు గల సంబంధం, తన పేరుమీద ఇంట్లో వారు చేసిన అప్పులు, తనని మనిషిగా కూడా చూడని కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆమెను అనారోగ్యానికి గురిచేసాయి.

దీనితో ఆమెకు బతుకుపై ఆశ నిశించి పోయింది. ''నాకోసం నేను బతకటం పన్నెండేళ్ళ క్రితమే మానేశాను. ఎవరికోసం వారు బతుకుతారు - అనే ఆలోచన మర్చిపోయాను. కొన్నాళ్ళు మాకుటుంబం కోసం, కొన్నాళ్ళు భర్త కోసం, కొన్నాళ్ళు ప్రేక్షకుల కోసం, కొన్నాళ్ళు అందరికోసం - చనిపోయే అవకాశం లేక బతికున్నాను'' అన్న రేణుక మాటల్లో ఆమె ఆవేదన వ్యక్తం అవుతుంది. తన కథనంతా ఆస్పత్రిలో డాక్టర్ రామారావుకు చెప్పుకొని కొంత శాంతిని పొందింది. రామారావు తన ప్రేమ ద్వారా రేణుకాదేవిని బతికించుకోవాలను చూశాడు. కానీ సమయం మించిపోయింది. సినిమా నటిగా చెప్పడమే తప్ప రేణుక నట జీవితంలో పెద్దగా కష్టాలను ఎదుర్కొన్నట్టు నవలలో కనిపించదు. ఆమెకు వచ్చిన సమస్యలన్నీ కుటుంబ సభ్యుల వల్లనే. అయితే ఆ సమస్యలకు కారణం అయిన డబ్బుకు ఆమె నట జీవితం ప్రాతిపదిక. ఆర్థిక సంబం

ధాలు మానవతా విలువలను ధ్వంసం చేయడమే నవలలోని ప్రధాన చిత్రణ. ఆధునిక కాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తోంది. అభివఅద్ధి చెందే కొద్దీ కష్టాలలో ఉన్న వ్యక్తుల పట్ల చూపించాల్సిన జాలి, సహానుభూతి మనుషుల్లో తగ్గిపోతున్నాయి. వీటితోపాటు అన్యాయాలను ఎదిరించడం, ప్రశ్నించడం అన్న లక్ష ణాలు కూడా తగ్గిపోతున్నాయి. పాకుడురాళ్ళలో మంజరిలా, రేణుకాదేవి సమాజపు కట్టుబాట్లను అతి క్రమించలేదు. కూతురిగా, చెల్లెలుగా, భార్య తన బాధ్యత లను నిజాయితీతో నిర్వహించింది. అయినా కూడా మంజరి మాదిరి మరణాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. కారణం మంజరి జీవితం మాదిరి రేణుకాదేవి జీవితం కూడా ప్రేమ రాహిత్యంగా మారడమే. రేణుకాదేవి మరణం కుటుంబ సభ్యులు పరోక్షంగా చేసిన హత్య.

రాణి - అభినేత్రి :

మాదిరెడ్డి సులోచనగారు రాసిన అభినేత్రి నవలలోని ప్రధాన పాత్ర రాణి. అతి బీదదరికంలో రోడ్డు మీద ఆటపాటలతో బతుకు మొదలు పెట్టింది. క్రమంగా సినిమా తారగా ఎదిగింది. సభాపతి, రాయ్‌లు సినిమాల్లో అవకాశం రావడానికి, కొంత వరకూ ఎదగడానికీ తోడ్పడ్డారు. చిట్టి చివరకు సినిమా తార రాణి అయింది. అయితే రెండింతలుగా ఆమె నుంచి రాబట్టుకున్నారు. అప్పులపాలైన రాయ్ తన ముగ్గురు కూతుళ్ళకు రాణి డబ్బుతో ఘనంగా కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసాడు. ఆమె డబ్బుతో సినిమాలు తీసి లాభాలు తాను తీసుకున్నాడు. ఆమె ఇంటిని తన భార్య అన్నమ్మ పేర రాయించు కున్నాడు. కూతుళ్లకు తాను పూట గడవని స్థితిలో ఉన్న పుడు పట్టించుకోని అన్నలు, అక్క, తల్లిదండ్రులకు, సినిమాలలో అవకాశం కోసం సహాయం చేసిన శివరావు, సభాపతులకు ఎంతో సహాయం చేసింది. అయితే ఆమె సంపాదించిన డబ్బు ఆమెకు ఉపయోగపడలేదు. "ఎందుకీ డబ్బు, పేరు? తన కోరికలు అతి చిన్నవి కూడా తీరవు" (సులోచన మాదిరెడ్డి. 2018: 127). జర్నలిస్టు క్రాంతికుమార్‌ను రాణి ప్రేమించింది. ఆ ప్రేమకు రాయ్ అడ్డుపడ్డాడు. క్రాంతి కుమార్ రాసిన లేఖలు రాణికి అందకుండా చేసాడు. ఆమెను భయపెట్టి పెళ్ళి చేసుకున్నాడు.ఆమె ధనసహాయంతో అప్పులు తీర్చుకొని షూటింగ్ సమయంలో అందరి ముందూ ఆమెను కొట్టాడు. తన సినిమా చేయనన్న రాణిపై దుష్ప్రచారం చేసి, ఆమెకు అవకాశాలు రాకుండా చేసాడు. క్రాంతి కుమార్ వేరే దేశంలో ఉండడంవల్ల రాణికి సహాయం చేయలేకపోయాడు. దీనితో రాణి చంద్రన్‌కు లంగిపోయి తిరిగి పేరున్న నటిగా మారింది. "సినీ ఫీల్డులో తనలాంటి బీదవారు, తనలోని నటనా చాతుర్యంతో పైకి రావటం కల్ల అని తెలిసిపోయింది. ఒక ఆలంబన కావాలి. అది ఆమెకు చంద్రన్ రూపంలో దొరికింది" (సులోచన మాది రెడ్డి. 2018: 171). అయితే రాణిలో మాత్రం మార్పు వచ్చింది. ఇంతకు ముందులా అన్నలకు, అక్కబావలకు సహాయం చేయడం మానేసింది. డబ్బు విషయంలో జాగ్రత్త పడగలిగింది కానీ మనుషుల మనస్తత్వాలను అంచనా వేయలేకపోయింది.

చంద్రన్ బిడ్డకు తల్లి కావాలనుకున్న ఆ ఆశలు ఫలించలేదు. చివరకు అతడికి ఆస్తి అంతా రాసి ఇచ్చేసి, క్రాంతి కుమార్ దగ్గరకు వెళ్ళిపోదామనుకుంది. మాదిరెడ్డి సులోచనగారు రాసిన అభినేత్రి నవలలోని ప్రధాన పాత్ర రాణి. అతి బీదదరికంలో రోడ్డు మీద ఆటపాటలతో బతుకు మొదలు పెట్టింది. క్రమంగా సినిమా తారగా ఎదిగింది. సభాపతి, రాయ్‌లు సినిమాల్లో అవకాశం రావడానికి, కొంత వరకూ ఎదగడానికీ తోడ్పడ్డారు. చిట్టి చివరకు సినిమా తార రాణి అయింది. అయితే రెండిం తలుగా ఆమె నుంచి రాబట్టుకున్నారు. అప్పులపాలైన రాయ్ తన ముగ్గురు కూతుళ్ళకు రాణి డబ్బుతో ఘనంగా కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసాడు. ఆమె డబ్బుతో సినిమాలు తీసి లాభాలు తాను తీసుకున్నాడు. ఆమె ఇంటిని తన భార్య అన్నమ్మ పేర రాయించుకున్నాడు. కూతుళ్లకు తాను పూట గడవని స్థితిలో ఉన్నపుడు పట్టించుకోని అన్నలు,

అక్క, తల్లిదండ్రులకు, సినిమాలలో అవకాశం కోసం సహాయం చేసిన శివరావు, సభాపతులకు ఎంతో సహాయం చేసింది. అయితే ఆమె సంపాదించిన డబ్బు ఆమెకు ఉపయోగపడలేదు. "ఎందుకీ డబ్బు, పేరు? తన కోరికలు అతి చిన్నవి కూడా తీరవు"(సులోచన మాదిరెడ్డి. 2018: 127).

జర్నలిస్టు క్రాంతికుమార్‌ను రాణి ప్రేమించింది. ఆ ప్రేమకు రాయ్ అడ్డుపడ్డాడు. క్రాంతి కుమార్ రాసిన లేఖలు రాణికి అందకుండా చేసాడు. ఆమెను భయపెట్టి పెళ్ళిచేసుకున్నాడు. ఆమె ధనసహాయంతో అప్పులు తీర్చుకొని షూటింగ్ సమయంలో అందరి ముందూ ఆమెను కొట్టాడు. తన సినిమా చేయనన్న రాణిపై దుష్ప్రచారం చేసి, ఆమెకు అవకాశాలు రాకుండా చేసాడు. క్రాంతికుమార్ వేరే దేశంలో ఉండడంవల్ల రాణికి సహాయం చేయలేకపోయాడు. దీనితో రాణి చంద్రన్‌కు లంగిపోయి తిరిగి పేరున్న నటిగా మారింది. "సినీ ఫీల్డులో తనలాంటి బీదవారు, తనలోని నటనా చాతుర్యంతో పైకి రావటం కల్ల అని తెలిసిపోయింది. ఒక ఆలంబన కావాలి. అది ఆమెకు చంద్రన్ రూపంలో దొరికింది" (సులోచన మాదిరెడ్డి. 2018: 171). అయితే రాణిలో మాత్రం మార్పు వచ్చింది. ఇంతకు ముందులా అన్నలకు, అక్కబావలకు సహాయం చేయడం మానేసింది. డబ్బు విషయంలో జాగ్రత్త పడగలిగింది కానీ మనుషుల మనస్తత్వాలను అంచనా వేయలేకపోయింది. చంద్రన్ బిడ్డకు తల్లి కావాలనుకున్న ఆ ఆశలు ఫలించలేదు. చివరకు అతడికి ఆస్తి అంతా రాసి ఇచ్చేసి, క్రాంతి కుమార్ దగ్గరకు వెళ్ళిపోదామనుకుంది. తెల్లారేసరికి రాణి ఆత్మహత్య చేసుకుందని లోకానికి తెలిసింది. నిజానికి రాణిని హత్యకు గురైంది. ఆ పని చేసినవాడు చంద్రన్. తన డబ్బు, పలుకుబడితో హత్యను ఆత్మహత్యగా చిత్రించాడు. ఆమె ఆస్తిని తనపేర ముందే రాయించుకున్నాడు. రాణి ఇతివృత్తంలో పాకుడు రాళ్ళు నవలలోని మంజరి పోలికలు చాలా ఉన్నాయి. మంజరిలానే సినిమా అవకాశాలకోసం తన అందాన్ని సాధనం చేసుకొంది. అయితే మంజరిది అతి తెలివి, రాణిది అమాయకత్వం. మంజరికి దొరకని ప్రేమ జీవితం రాణికి దొరికింది. కానీ అత్యాశాపరుల అసూయకు బలైంది. తల్లిదండ్రులు, క్రాంతికుమార్ తప్ప అందరూ రాణిని, ఆమె చుట్టూ ఉన్నవారంతా డబ్బుకోసం వేధించినవాళ్ళే. నవల నేపథ్యంలో సినిమా రంగంలోని లోతుపాతులను చిత్రించారు రచయిత్రి. తమను తాము ఎల్లప్పుడూ బిజీ ఆర్టిస్టులుగా చూపించుకోవడానికి ప్రయత్నించేవాళ్ళు కొందరైతేబీ ఇతరుల టాలెంటీను కాపీ కొట్టో, దొంగిలించో తమదిగా చెప్పుకునేవాళ్ళు మరి కొందరు. ఇలాటి వ్యక్తులను నవలలో చిత్రించారు రచయిత్రి. తెలిసినవారికి అవకాశం ఇప్పించాలనుకుంటే సినిమా కాంట్రాక్టు సంతకం చేయడానికి ముందే అడిగితే చచ్చినట్టు చేస్తారు. డిమాండు ఉన్న తారలు ఏది చెప్పినా చెల్లుబాటు అవుతుందని అని అసిస్టెంటు డైరెక్టరు రాణితో చెప్పడం ఈ రంగంలోని మరొకోణానికి చిత్రణ.

కళ్యాణి – కళ్యాణి :

"కళ్యాణి" నవల తమిళంలో "ఒరు నడిగై నాడగం పార్కిరాళ్" పేరుతో డి. జయకాంతన్ రాసిన నవలకు తెలుగు అనువాదం. జిల్లెళ్ళ బాలాజీ తెలుగు చేసారు. నవలలో కళ్యాణి సినిమా నటి కాదు, రంగస్థల నటి. అయినా కూడా ఆమెకి రంగస్థల కళాకారిణిగా మంచి పేరు, ప్రఖ్యాతి ఉన్నాయి. కళ్యాణి తల్లిదండ్రులది కులాంతర వివాహం. ఆమె తల్లి దేవదాసీ వర్గానికి చెందింది. నవలా కాలానికి కళ్యాణికి తల్లిదండ్రులు లేరు. అయినా ఆర్థికంగా మంచి స్థితిలోనే ఉంది. నటిగా ఎదగడానికి ఆమెకు ఆనందరావు ఎంతో సహాయం చెసాడు. అందుకు కళ్యాణిపై అన్ని హక్కులూ తనవే అనే అధికారాన్ని ప్రదర్శిస్తుండేవాడు. అలాగని చెడ్డవాడు కాదు. ఒక దశలో కళ్యాణిని పెళ్లి చేసుకోవాలను కూడా అనుకున్నాడు. కళ్యాణి దివాకర్‌ను ఇష్టపడుతున్నదని తెలిసి తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. పత్రికా విలేఖరి అయిన దివాకర్‌ను కళ్యాణి ప్రేమించి పెళ్లిచేసు

కుంటుంది. అప్పటికే అతనికి పెళ్లై, భార్యపోయి పదేళ్ళ కూతురు కూడా ఉంది. ఈ సంగతులన్నీ తెలిసి కూడా కళ్యాణి దివాకర్‌తో పెళ్ళికి సిద్ధపడుతుంది. దివాకర్ బంధువర్గం ఈ పెళ్ళికి అంగీకరించలేదు. ఆర్థికంగా దివాకర్ కళ్యాణికన్నా తక్కువ స్థితిలో ఉన్నాడు. కానీ దివాకర్ ఉన్నత కులానికి చెందినవాడని, కళ్యాణి వంటి కులంలేని నాటకాల పిల్లని పెళ్ళి చేసుకోవద్దని బంధువులు దివాకర్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తారు. అటువంటి పట్టింపులు తనకు లేవంటూ దివాకర్ కళ్యాణిని పెళ్ళిచేసుకుంటాడు. పెళ్ళైన తరువాత నాటకాలు మానేస్తానన్నది కళ్యాణి. అలా కాదని ఆమెను నాటకాలు కొనసాగించేలా ఒప్పిస్తాడు దివాకర్. అతని ఉన్నత వ్యక్తిత్వానికి కళ్యాణి ఆనందపడుతుంది. పెళ్ళైన కొద్దికాలానికే దివాకర్ కళ్యాణి నుండి దూరం కావాలని ఆలోచన చేస్తుంటాడు. ఇక్కడ రచయిత పురుషాధిక్య భావజాలం మనుషుల్లో ఎంత లోతుగా పేరుకు పోయిందో, బయటకు అది ఎంత సహజంగా కని పిస్తుందో చిత్రించారు.

ఇతర నవలల్లోని నటీమణుల మాదిరి కళ్యాణి చదువులేనిది కాదు. దివాకర్ కూడా చదువుకున్నవాడు, ఆధునిక భావాలుగలవాడు. కళ్యాణితో పెళ్ళైన తరువాతే అతని ఆధునిక అభిప్రాయాలలోని డొల్లతనం బయట పడుతుంది. తన భార్యకు తనకన్నా ఎక్కువ పేరు, ప్రతిష్ఠలు రావడం దివాకర్ సహించలేకపోతాడు. పెళ్ళికి ముందు కళ్యాణి కులం, వఅత్తి, స్వతంత్రంగా ఆలోచించగల కళ్యాణి స్వభావం సమస్యలుగా కనిపించ లేదు ఇప్పుడు అవే కళ్యాణిలోని లోపాలుగా కనిపిం చాయి. తన బిడ్డను పెంచుతూ, తన కోసం ఎదురు చూస్తున్న భార్య చెల్లెల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. కళ్యాణి నుండి విడిపోతాడు. ఆ బాధతో కళ్యాణి అనారోగ్యం పాలై, నడవలేని స్థితిలో చక్రాల కుర్చీకి అంకితమైపోతుంది. దివాకర్ తిరిగి కళ్యాణి దగ్గరకు చేరి ఆమెకు సేవలు చేస్తాడు. అంతరంగ వ్యక్తిత్వాలను పరిశీలించకుండా బయటనుండి చూసే సమాజానికి దివాకర్‌లో ఆధునిక, అభ్యుదయ భావాలకు ప్రతీక అయిన మంచి మనిషి కనిపిస్తాడు. పెళ్ళైయ్యాక అతను కళ్యాణి డబ్బుపై ఆధారపడలేదు. కళ్యాణి సొంత ఇంటిలో కాక వేరే ఇంటిలో ఉండేలా ఏర్పాటు చేసాడు. ఈ చర్యలో అతని దఅష్టికోణాన్ని కళ్యాణే వివరించింది.'' నటిని పెళ్ళి చేసుకునే మగాళ్ళు ఆస్తికి ఆశపడే ఆమెకు అతుక్కుపోతారు. ఆ విధంగా మా విషయం కాకూడదుబీ ఆయన గురించి ఏ ఒక్కరూ చెడుగా మాట్లాడకూడదని భావించి ముందుజాగ్రత్తగా ఆయనిలా ఆలోచించటం వక్రబుద్ధి ఎలా అవుతుంది'' (జయకాంతన్, డి. బాలాజీ, జిల్లేళ్ళ. 2006 : 56). ఇలా కళ్యాణి ప్రతి విషయంలోనూ దివాకర్ ఆలోచనా ధోరణిని అతనివైపు నుండి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించింది. (నిజానికి ఆడదాని సంపాదన మీద, అందులోనూ భార్య సంపాదన మీద ఆధారపడడానికి దివాకర్‌లోని పురుషాహంకారం ఒప్పు కోలేదు.)

ఈ దృష్టికోణం దివాకర్‌లో కనిపించదు. కళ్యాణి డబ్బుకు తాను ఆశపడలేదని, ఆమెను పెళ్ళి చేసు కోవడంలో తాను చాలా గొప్ప త్యాగం చేసాననేది దివాకర్ భావన. తాను చేసిన త్యాగానికి కళ్యాణి తగిన కఅతజ్ఞత చూపించలేదనేది దివాకర్ అభిప్రాయం. ఆమెకు ప్రేమించడం చేతకాదని, సెల్ఫ్ సెంటర్డ్ ఉమెన్ అనీ, తనకోసం ఏ త్యాగమూ చేయలేదనీ ఆమెను విమర్శిం చాడు. తనకన్నా ఆమె అర్థికంగా ఎక్కువ స్థాయిలో ఉం డవచ్చు కానీ, మానసికంగానూ, తెలివితేటల్లోనూ తన కంటే తక్కువదనే అభిప్రాయం అతని మనసులో ఉంది. అందుకే ఆమె తనకంటే ఎక్కువ వివేచనతో మాట్లాడినప్పుడు అది న్యాయమని అనిపించినా సరే, అతడు ఆమె అభిప్రాయాలను తక్కువ చేసి చూపించ డానికి ప్రయత్నించాడు. ''కళ్యాణి చెప్పింది బుద్ధికి స్ఫురించినప్పటికీ, అలాంటి ఓ వాదాన్ని అతనే చెయ్య దగిన వాడైనప్పటికీ, అతడి నుంచే అలాంటి మాటలను

ఆమె నేర్చుకున్నప్పటికీ, అప్పుడు ఆమె అతణ్ణి ఖండించి మాట్లాడ్డంతో అతను మనస్తాపానికి గురయ్యాడు'' (జయకాంతన్, డి. బాలాజీ, జిల్లేళ్ళ. 2006 : 67). కళ్యాణి ఆరోగ్యం సరిగా లేదని తెలిసి ఆమెకు తిరిగి దగ్గర య్యాడు. కళ్యాణికి దూరంగా ఉన్న కాలంలో తన ప్రవర్తన గురించి ఆలోచించే సమయం దివాకర్‌కు లభించింది. తన బాధలకు కారణం కళ్యాణి కాదు తనే అన్న విషయం దివాకర్‌కు బోధపడింది. కళ్యాణి వ్యక్తిత్వాన్ని అర్థం చేసు కోలేక పోయినందుకు పశ్చాత్తాప పడ్డాడు. ''నీ సెల్ఫ్ నన్ను మీరిందో, నాకు లోబడిందో ఇప్పుడు అర్థం చేసుకున్నాను. అది మాత్రమే కాదు నీ సెల్ఫ్ లోపల నేనూ దాగి ఉన్నా నని కూడా అర్థం చేసుకున్నాను. మన అనుబంధానికి, ప్రేమకూ మధ్య నీ సెల్ఫ్ అడ్డు రానేలేదు. రాదు కూడా. నేనే దాన్ని మధ్యకు లాగాను'' (జయకాంతన్, డి. బాలాజీ, జిల్లేళ్ళ. 2006: 145). దివాకర్ మాటల్లో అతనిలోని మానసిక పరివర్తన తెలుస్తుంది. కానీ అనారోగ్యం కారణంగా కళ్యాణి నట జీవితానికి అంతరాయం ఏర్పడింది.

ముగింపు :

ఒక్క కళ్యాణి తప్ప మిగిలిన నటీమణుల జీవితాలన్నీ విషాదంగానే ముగిసాయి. ఈ పరిణామాలకు కారణాలు అనేకం. మొదటి కారణం పైన వివరించినట్టు వారిచుట్టూ ఉన్న వ్యక్తులు మరో మాటలో చెప్పాలంటే సమాజం, ముఖ్యంగా సినిమా సమాజం. రెండవ కారణం వీరిలో ఎవ్వరికీ మొదటి నుండీ చదువుకునే అవకాశం లభించలేదు. సినిమాలలో చేరి చదువు నేర్చుకొనే నమయానికి వారు జీవితంలో చాలా దూరం ప్రయాణించేశారు. మంజరికి, కళ్యాణికి లోకజ్ఞానం ఉంది. మంజరి తన తెలివిని ఇతరులను నాశనం చేయ డానికి వాడింది. కళ్యాణి తన జీవితాన్ని బాగు చేసు కోవడానికి వాడుకుంది. రాణి, రేణుకాదేవిలకు ఆపాటి లోకజ్ఞానం కూడా లేదు. జీవితంలో తగిలిన ఎదురు దెబ్బలే రాణి, రేణుకాదేవిలకు లోకం అంటే ఏమిటో చెప్పాయి. అప్పటికే వారు చాలా పోగొట్టుకున్నారు. ఒక్క కళ్యాణి తప్ప మిగిలినవారు పెద్ద తారల వారసులుగానో, నటన అంటే ఇష్టపడో సినిమాల్లోకి రాలేదు. డబ్బు సంపాదన ధ్యేయంగానే సినిమాల్లోకి వచ్చారు. ఇందు లోనూ మంజరికి, మిగిలిన ఇద్దరికీ చిన్న తేడా ఉంది. మంజరి తానుగా డబ్బు సంపాదించడానికి వచ్చింది. రాణి, రేణుకాదేవిలు ఇతరులు డబ్బు సంపాదించడానికి ఒక పెట్టుబడిగా సినిమా రంగంలోకి తీసుకురాబడ్డారు. కళ్యాణికి చదువు ఉంది. కొంత ఆర్థిక స్థిరత్వం ఉంది. నటన ఆమెకు అభిరుచి, జీవనోపాధి కాదు. అందుకే సినిమా అవకాశాలు వచ్చినా వదులుకుంది. ''సినిమాల్లోకి వెళ్ళి తాను నమ్మిన విలువలు వదిలిపెట్టి, ప్రతిచోటా రాజీపడడం తనవల్ల కాదన్నది'' కళ్యాణి. ఇంత జాగ్రత్త పడినా ఆమె నట జీవితానికి అంతరాయం కలిగింది. కారణం భర్తలోని పురుషాధిక్య భావజాలం. సినిమా రంగంలో ఈ భావజాలం ఇంకా అధికం.

నేటికి కూడా అటువంటి పరిస్థితే కనిపించడం దురదృష్టకర పరిణామం. నాలుగు పాత్రలను గురించి ఒక్క మాటలో చెప్పవలసి వస్తే మంజరి (అన్ని విధాలా) ఆత్మహత్య చేసుకుంది. రేణుకాదేవి పరోక్ష హత్యకు బలైంది, రాణి ప్రత్యక్ష హత్యకు గురైంది. కళ్యాణిలోని నటి కోమాలోకి వెళ్లిపోయింది. అందరిలోని నటీమణులు అచేతనం అయిపోయారు. సినిమా రంగంలోని పురుషా ధిక్య భావజాలం, నెపోటిజం, కాస్ట్ అండ్ కౌచ్ వంటి లక్షణాలన్నీ వీరి జీవితాల నాశనానికి అసలు కారణాలు. ఈ రంగంలోని స్త్రీల కోసం ప్రత్యేక చట్టాలు, సహకారం అందించే సంస్థలు ఏర్పడాల్సిన అవసరాన్ని పై నవలలన్నీ పరోక్షంగా తెలియజేస్తున్నాయి. ఆడవారిని పురుషులతో సమానంగా చూసే స్థాయికి సమాజం చేరుకోవడమే ఈ సమస్యకు అసలైన పరిష్కారం. ఆ దిశగా చదువులు, విలువలు, మనుషులు మారాలని సూచించే సాహిత్యం తెలుగులో ఉంది. అటువంటి సాహిత్యం ద్వారా సామాజిక

సమస్యలకు సాహితీవేత్తలిచ్చిన పరిష్కారాలు పరిశీలించాలి. ఎంతమేరకు ఆయా పరిష్కారాలు ఆచరణ సాధ్యమో విశ్లేషించాలి. రాబోయే తరాలు అందుకోవలసిన సామాజిక విలువలను నూత్రీకరించి సాహిత్యంలో ప్రతిఫలింపజేయాలి. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి రచయితల సాహిత్య సఅష్టి ఎంత అవసరమో, సాహిత్య విమర్శకుల, సాహిత్య పరిశోధకుల మార్గనిర్దేశనం కూడా అంతే అవసరం. ప్రస్తుత వెబినార్ అటువంటి మార్గనిర్దేశానికి ఒక వేదిక అవుతుందని ఆశిస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. జయకాంతన్, డి. బాలాజి, జిళ్ళేల్ల(అనువాదకుడు).2006. కళ్యాణి. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
2. భరధ్వాజ, రావూరి. పాకుడురాళ్ళు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. మాలతీ చందూర్. 1955. రేణుకాదేవి ఆత్మకథ. విజయవాడ: దేశీ ప్రచురణ.
4. సులోచన, మాదిరెడ్డి. 2018. అభినేత్రి. చెన్నై: క్వాలిటీ పబ్లిషర్స్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆముక్త మాల్యదలో జనజీవనం

– డా॥. బశెట్టి ఉపేంద్ర, అతిథి అధ్యాపకుడు, ఎ.పి. ట్రిపుల్ ఐటి, ఆర్.కె.వ్యాలీ, కడప.

తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీకృష్ణదేవరాయల యుగం సువర్ణాక్షరాలతో లిఖించదగినది. రాయలు రాజుగానే గాక కవిగా కూడా విఖ్యాతిగాంచాడు. తాను 'ఆముక్తమాల్యద' అనే ప్రబంధాన్ని రాశాడు. అది ప్రౌఢ ప్రబంధంగా పండితులచేత ప్రశంసలందుకొన్నది. రాయలు తన ఆస్థానంలో అల్లసానిపెద్దన, భట్టుమూర్తి, పింగళిసూరన వంటి అష్టదిగ్గజ కవులను నియమించుకొని వారిచేత అపూర్వసృష్టి అనదగ్గ ప్రబంధాలు రాయించాడు. ఆ ప్రబంధాల్లో ఆనాటి ప్రజల జీవన విధానము ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అందులో ఆముక్త మాల్యద అగ్రస్థానమని చెప్పవచ్చు.

పాండ్యదేశమున శ్రీ విల్లుపుత్తూరనే నగరం ఉండెడిది. అందలి మేడలు ఆకాశాన్ని తాకేవి. వీథుల కిరువైపుల కొబ్బరిచెట్లు ఉండేవి. ఆ దేశ స్త్రీలు ఉదయాన్నే స్నానం చేసి దివ్యప్రబంధాలను పఠించేవారు. పూలతో ఇంటిలోని దైవాన్ని అర్చించేవారు. ఆ వీధి అరుగుల మీద ఆటవెలదులు పాచికలతో జూదమాడుచుందురు. వారు ఎంతో నాగరికులు, విలాసవంతులు కూడా. రైతులు తమ పొలాల్లో అన్ని పంటలు పండించేవారు. అందులో సుగంధి అరటి తోటలు విరివిగా ఉండెడివి. ఇంకా చెరకు తోటలు, తమలపాకు తోటలు, మామిడితోటలు కూడా ఉండెడివి. ఇక ఉద్యానవనాలకు కొరత లేదు. ఆ ఊరి యువతలు ఉద్యానవనాల్లో ఎలా విహరించేవారో శ్రీకృష్ణ దేవరాయలు ఇలా తెలిపాడు.

మ॥ శయపూజాంబుజముల్ ఘటిందడబడన్,
జన్దోయిల గౌనుపై
దయ దప్పన్ బసుపాడి, పొగడపు బాదంబొప్ప,
జెంగల్వడి
గ్గియ నీరమ్యత మజ్జనార్థము గటిం గీలించి,
దివ్య ప్రబం
ధ యుగాస్యల్ ద్రవిడాంగనల్ నడుతురుద్యా
నంపు లోత్రోవలన్

(ఆముక్త మాల్యద - ప్రథమాశ్వాసం - పద్యం 44)

అని వర్ణించాడు.

పై పద్యాన్ని బట్టి పాండ్యదేశంలో యువతులు బహిరంగ ప్రదేశాల్లో స్వేచ్ఛగా విహరించేవారని స్పష్టమగుచున్నది. స్త్రీలపై దాడులు కానీ అత్యాచారాలు కానీ ఉన్నట్లు పై పద్యంలో చెప్పబడలేదు.

రాయల కాలమునాడు రాజులు భోగిని కడకు వెళ్ళేవారని తెలుస్తున్నది. దీనికి నిదర్శనమే ఈ పద్యం.

సీ॥ పన్నీటితోఁ గదంబము సేసి పూసిన
మృగనాభివస రాచనగరు దెలుపఁ
బాటలానిలము లార్పగఁ దపారపు జుంగు
లలరుఁ దానికి మూగునళులఁ జోఁప
గర్ణడోలా మౌక్తిక చ్ఛాయ లెగ బ్రాకు
నురుహార రుచులఁ ద్రస్తరికిఁ దన్న
శశికాంతి చెంగావి దశములంచిన కేల
స్వర్ణత్సురువు వాడివాలు మెఱయ

తే॥ మెలత యడపముఁ దేఁ జరన్మేరు వనగ
దల వరులు గొంద ఱొలసి ముంగల జనంగ
నర్థి రథ్యాంత రాంతఃపురాంతరమున
భోగినీ సంగతికి రాజు వోవుచుండి

అంటాడు రాయలు.

తన కాలంలో రాజులు విలాసాలు ఎలాంటివో పై పద్యం ద్వారా తెలుస్తున్నది. దీనినిబట్టి చూస్తే ఆనాడు భోగపుస్త్రీలు ఉండేవారని తెలుస్తున్నది. రాజులు

ప్రత్యేకంగా కొందరు భోగపు స్త్రీలను ఉంచుకొనేవారని బోధపడుతున్నది. ఈ విషయాన్ని చరిత్ర కూడా ధృవీకరిస్తున్నది. భోగపు సానివద్దకు వెళ్ళేటపుడు రాజు ఎలా సుగంధాది ద్రవ్యాలు అలముకొని వెళ్ళేవాడో చెప్పబడింది. దీనినాధారంగా చేసుకొని చూస్తే ఆనాడు ప్రజలు వాడే సుగంధాలు కూడా తెలుస్తున్నాయి. నేడు మనం వాడే వివిధ సెంటులకు ఆనాడే వాడు అంకు రార్పణ చేశారని చెప్పవచ్చు.

అందరు కలలుగంటారు. అలా కనే కలలు చాలా విధాలుగా ఉంటాయి. కొన్ని కలలు సాకారమవుతాయి. కొన్ని సాకారం కావు. అయితే రాయలకు ఒక రోజు ఒక కల వచ్చింది. శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువే కలలో కనిపించి కావ్యం రాయమన్నారట. రాజు మేల్కాంచిన వెంటనే దానికి రూపకల్పన చేశాడు. అలా రూపుదాల్చినదే ఆముక్త మాల్యద.

భగవంతుడు రాజుతో ఇలా చెప్పాడట.

సీ॥ పలికి తుత్రేక్షోపముల జాతి పెంపెక్క
రసికుతా ననయదాలస చరిత్ర
భావధ్వని వ్యంగ్య సేవధి గాఁగ జె
ప్పితిని సత్యావధూ ప్రీణనంబు
శ్రుతి పురాణోసంహిత తేర్చి కూర్చితి
సకలకథా సారసంగ్రహంబు
శ్రోత్ర ఘచ్చటలు విచ్చుగ రచించితి సూక్తి
నైపుణి జ్ఞాన చింతామణికృతి

తే॥ మరియు రసమంజరీ ముఖ్యమధుర కావ్య
రచన మెప్పించుకొంటి గీర్వాణ భాష
నంధ్ర భాష యసాధ్యంబె యందు నొక్క
కృతి వినిర్మింపు మికమాకు బ్రియము గాగ

మదాలస చరిత్ర, సత్యవధూప్రీణం, సకల కథా సారసంగ్రహము, జ్ఞాన చింతామణి, రసమంజరీ వంటి మధుర కావ్యాలను సంస్కృత భాషలో రచించావని, అదేవిధంగా తెలుగులో ఒక మంచి కావ్యం రాయాలని ఆ దేవదేవుడు కలలో ప్రత్యక్షమై ఆదేశించాడట రాయలను. అపుడు రాయలు ఆముక్తమాల్యద రాసి తనకున్న విష్ణుభక్తి తత్పరతను చాటుకున్నాడు. రాజులు కేవలం పాలన, యుద్ధం వంటి వాటిల్లో కాకుండా రచనా రంగంలో కూడా ప్రతిభావంతులని ఈ ఘటన నిరూపిస్తున్నది. దీనినిబట్టి ఆ రోజుల్లో రాజులు, ప్రజలు కూడా సాహితీ ప్రియులని చెప్పవచ్చు. 'యథా రాజా తథా ప్రజ' అన్న నానుడికి రాయలును ప్రబల నిదర్శనకారుడిగా పేర్కొనవచ్చు.

ఈ ప్రబంధంలో విల్లుపుత్తూరు వర్ణన ఉంది. దీనిని బట్టి ఆనాటి నగరాలు ఎలా ఉండేవో తెలుసుకోవచ్చు. ఆ రోజుల్లో ఊరూర భాగవతులుండేవారు. వారిలో అగ్రగణ్యుడు విష్ణుచిత్తుడు. ఖాండిక్య కేశిధ్వజ సంవాదం ఆధారంగా ఆరోజుల్లో పండితుల మధ్య చర్చలు వాదోపవాదాలు జరిగెడివని చెప్పవచ్చు. గోదాదేవి, మాలదాసరి వృత్తాంతాలు ఆనాటి స్త్రీ, దళిత జనజీవనానికి దర్పణం పడతాయని చెప్పక తప్పదు. మాల దాసరిని గురించి రాయలు ఇలా అంటాడు.

చ॥ కలఁ డొకరుండు పేరు కొనగాని కులంబు
మదీయ భక్తుడి
యినుమును వాడు వామనత నే వసియింపనే
పుణ్యభూమినం
దుల కొక యోజన త్రయపు దూరపుటూర
వసించి, బ్రహ్మవే
ళల జనుదెంచి పాడుయము లాలన మంగళ
నామ కైశికిన్

ఆ భక్తుడు ఊరికి దూరంగా నివసిస్తున్నాడని, అతడు ప్రాతఃకాలముననే మంగళకైశికి రాగములో విష్ణువును కీర్తించేవాడని తెలుస్తున్నది. భగవద్భక్తికి కులముతో పనిలేదని ఈ ఘటన తెలుపుతున్నది.

ఈ ఆముక్త మాల్యద ప్రబంధంలో చెప్పదగినది మాలదాసరి చూసిన మర్రివృక్షం. ఈ రోజు మనం చెట్లను

మన స్వార్థానికి విచ్చలవిడిగా నరికివేసి ఖండాంతరాలకు పంపి సొమ్ము చేసుకుంటున్నాము. అయితే ఆనాడు వాళ్ళు చెట్లను సంరక్షించారు. ఒక రోజు ఆ దాసరి చీకటిలో చూసిన మర్రి వృక్షాన్ని రాయలు ఇలా వర్ణించాడు.

శా॥ కాంచెన్వై ష్ణవుడర్ధ యోజన జటా ఝూటోత్థ శాఖోపశా
ఖాంచజ్ఝూట చరన్మరుద్రయ దవీయః ప్రేషితోద్యచ్ఛందో
దంచ త్కాటకృత ప్రణచ్చలన లిప్యాపాది తాధ్వన్య ని
స్సంచారత్త మహాఫలోపమ ఫల స్థాయద్వట క్ష్మాజమున్

అర్ధ యోజన పర్యంతం వ్యాపించిన మర్రిచెట్టును అదాసరి చూశాడు. ఆనాటి ప్రజలు ఆ చెట్లను ఆనాడు ఆదరించారు. ఈ సామాజిక నీతిని కూడా మనం అముక్త మాల్యద ద్వారా తెలుసుకోవాల్సి ఉంది. ఈ ప్రబంధాన్ని సమగ్రంగా అధ్యయనం చేస్తే రాయల కాలంనాటి ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మికాది వివిధాంశాలు బోధపడతాయని రూఢిగా చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య
2. ప్రబంధ విద్య - తుమ్మపూడి కోటేశ్వరరావు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పుంజీతం కథలు సామాజిక జీవన చిత్రణ

– డా॥. బొసని సురేష్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్.

సమాజంలో మనిషి మనుగడ సాగించడానికి పడే వివిధ సంఘర్షణలను సజీవంగా చిత్రించ గలిగిన సామర్థ్యం సాహిత్యంలోని వివిధ ప్రక్రియల కంటే కథకే ఎక్కువగా ఉంటుంది. సామాజికంగా మనిషి సమాజంలో అనుభవించే ఆవేశం, బాధ, కోపం, ఆకలి, అమాయ కత్వం, కర్కశం, పిసినారితనం, అవమానం, దర్పం, మోస పూరిత కుట్రలు కుతంత్రాలు, కష్టం, నష్టం, ఇష్టం, దయ, అధికారపు ఆగడాలు, పీడితుల ఆర్తనాదాలు, విభిన్న సంఘర్షణల మనస్తత్వాలు ఈ రకంగా ఏ భావోద్వేగన్నైనా సమగ్రంగా కథల్లో ఇమడ్చడానికి అవకాశం ఉంటుంది. ఈ కోవకు చెందిన కథకుడు డాక్టర్ వెల్దండి శ్రీధర్ గారు. తన కథల్లోని పాత్రల ద్వారా సమాజంలో వ్యక్తి పడే వివిధ సంఘర్షణలను పలు కోణాల్లో సజీవంగా చిత్రిస్తున్నారు. తాను మంచి కథకుడు, కవి, విమర్శకుడు, పరిశోధకుడు కూడా. వృత్తిరీత్యా అధ్యాపకునిగా స్థిరపడి దశాబ్దకాలంగా సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో తనదైన ముద్ర వేస్తూ పేరుతెచ్చుకున్నారు. పన్నెండు కథలతో రచించి ప్రచురిం చిన పుంజీతం కథల సంపుటిలోని విభిన్న కథల్లోని పాత్రల మనస్తత్వం,సామాజిక జీవన చిత్రణ ఏరకంగా ఉందో నా పరిశోధనా పత్రంలో వివరించదలిచాను.

నేటి ఆధునిక ధోరణులకు అద్దం పడుతూ రచించిన కథల్లో అమృత వర్షిణి ఒకటి. కాలేజీలో నితిన్, నిమిష చాలా చనువుగా కాలం గడుపుతున్న రోజుల్లో ఒకనాడు నితిన్ పెళ్లి చేసుకుందామని నిమిషాకు ప్రపోజ్ చేయడంతో అందుకు తిరస్కరించి నిమిష, చనువుగా ఉన్నంత మాత్రాన ప్రేమ అనుకుంటే ఎలా అంటూ, నీ అవసరం నాకు ఉంది, నా అవసరం నీకు ఉంది అందుకే దగ్గరగా గడిపానని, ప్రపంచంలో ఏ ప్రేమికులైన మొదట పెళ్లి చేసుకునే ఉద్దేశం ఉందో లేదో కనుక్కొని ప్రేమించు కోవడం మొదలు పెడతారా, అలా మొదలైనిది ఏదీ, అసలు ప్రేమే కాదంటూ, నిన్ను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని చెప్పి నితిన్ తో తెగతెంపులు చేసుకొని వెళుతుంది. ఈ సంఘటన నుండి కోలుకోవడానికి చాలా రోజులు పడుతుందినితిన్‌కు. మూడు సంవత్సరాల తర్వాత ఆమె తిరిగి తిరిగి ఒక రోజు నితిన్ జీవితంలోకి ప్రవేశించి పెళ్లి చేసుకుందామని అర్థిస్తుంది. అందుకు తన మీద ఉన్న ప్రేమతో పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకొని, కాపురం చేయగా తద్వారా అతనికి ఎయిడ్స్ సంక్రమిస్తుంది. అందుకు నితిన్ నిమిషను నిలదీయగా, నాకు ముందే ఈ విషయం తెలిసి నిన్ను పెళ్లి చేసుకున్నాని, నన్ను క్షమించమని చెప్పి తన జీవితం నుండి వెళ్ళిపోతుంది. నితిన్ ఫ్రెండ్స్ అంతా కలిసి తిరిగి పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేయగా అతని జీవితంలోకి ఎయిడ్స్ సంక్రమించిన స్థిమిత అనే స్త్రీ ప్రవేశిస్తుంది. ఈమె సినిమా ఛాన్స్ ల కోసం పరిగెత్తి మోస పోయిన స్త్రీ. తన జీవితం మీద విరక్తి పుట్టి ఆత్మహత్య చేసుకునే దశకు చేరుకోగా, వెంకటరమణ మంచి మాటలు చెప్పి రక్షిస్తాడు. ప్రత్యామ్నాయంగా ఆమె ఆదర్శ భావాలతో ఎయిడ్స్ హోమ్ కేర్ నడుపుతూ ఉంటుంది. చివరిరోజుల్లో నితిన్‌ను పెళ్లి చేసుకుని తన హోమ్ కేర్‌లో తనతో గడిపమంటుంది. ఈ కథలో నితిన్ ఒక స్త్రీ చేత వంచించబడితే, మరొక స్త్రీ తన గురించి నిజం తెలిసి జీవితం పంచుకోవడానికి ముందుకు వస్తుంది. ఈ రకమైన భావజాల సంఘర్షణలు మనస్తత్వాలు సమాజంలో అక్కడక్కడా కనిపిస్తాయి. వీటిని రచయిత అమృతవర్షిణి కథలో సజీవంగా చిత్రించారు. ప్రేమ పేరుతో మోసపోయిన యువకుడు, చివరికి దీర్ఘకాలిక రోగం అంటించుకుని జీవితమే లేకుండా చేసుకున్న నితిన్ పాత్ర, విచక్షణ వివేకం లేకుండా ఎదుటి వారి మనస్తత్వం

అర్థం చేసుకోలేకుండా ప్రేమ పేరుతో మోసపోయే యువకులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుంది. స్థిమిత విషయంలో అనాలోచితంగా అందని ద్రాక్ష పండ్ల కోసం పరిగెత్తే స్త్రీని అవకాశవాదులు వాడుకొని బలిపశువును చేసే వైనం కనిపిస్తుంది. అటువంటి భావజాలం కలిగిన స్త్రీలను ఆలోచింప చేయడమే గాక వారు ఉన్న స్థితిని మెరుగుపరుచుకుని బయటపడడానికి ఇటువంటి కథాంశం ఉపకరిస్తుంది.

గ్రామీణ జీవితం, రైతు కోణంలో చిత్రించిన కథాంశం పొక్కిలి.ఈ కథలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి కలిగిన రైతు దేవయ్య, అతని భార్య కనకవ్వ. పొలం ఉంది కానీ బాయి లో నీళ్లు సరిగా లేక పంట పండని స్థితి వీరిది. దీనికి తోడు తిరుపతిరెడ్డి దగ్గర చేసిన అప్పు, ఇంట్లో పసిద్ధైన బిడ్డ, మనవరాలు, కొడుకు చదువు ఇవన్నీ ఈయనకు ఉండే సమస్యలే. పంట కాపాడు కోవడానికి పక్క పొలం మైన రాజేశ్వరరావు దొరబావి నుండి కుండతో నీళ్ళు తెచ్చి పోసినప్పటికి పండని పంట పొలం పాపం దేవయ్యది. దేవయ్య పొలం కోసం నాను పెట్టి ఆశగా కూర్చున్న తిరుపతి రెడ్డి. ఒకరోజు తాను దేవయ్య ఇంటికెళ్లి అరచేతిలో స్వర్గం చూపి తన అప్పు గుర్తు చేసి పొలాన్ని దక్కించుకుంటాడు. భూమి తల్లిని అమ్ముకున్న దేవయ్య పని కోసం సిరిసిల్లలో లేబర్ అడ్డా కు వెళ్లి నిలుచున్న దయనీయమైన స్థితి. దేవయ్య అమ్మిన పొలాన్ని తిరుపతి రెడ్డి సంవత్సరంలో నే రియల్ ఎస్టేట్ రూపంలో పది రెట్లకు అమ్ముకున్న తిరుపతిరెడ్డి చివరికి తన పొలంలోనే ఒక ఫ్లాట్ కొనమనడం దేవయ్య పానం నీళ్లవుతుంది. ట్రాక్టర్ పనికి చేరి, క్రషర్ మిషన్ కంకర తోలే పనిచేస్తాడు. ఆ క్రషర్ డస్ట్ కారణంగా దేవయ్య ఊపిరి తిత్తుల్లో దుమ్ము పేరుకుపోయి,పట్నం వెళ్లి ఆపరేషన్ చేయించుకోలేక చావుతో కొట్టుమిట్టాడుతాడు. కనకవ్వ ఏమీ చేయలేక తల్లి లాంటి భూమి అమ్ముకొని ఇట్లా కష్టాలు తెచ్చుకున్నా మని విలపిస్తుంది. ఈ రకంగా పల్లె జీవితంలో ఒక రైతు కుటుంబం అనుభవించే సంఘర్షణలు కథలో కనిపిస్తాయి. ఎరువుల కోసం పొద్దాక ఎండలో రైతు నిలబడడం, ఇంట్లో రైతు పొలానికి వెళ్లి పని చేస్తే, భార్య కైకిలికి పోవడం, పెరట్లో పండిన కూర గాయలు పక్క ఊళ్లోకి వెళ్లి అమ్మడం, పంట పండే సమయానికి పొలానికి నీళ్లు లేకపోతే రైతు పడే ఆరాటం, ఆవేదన. ఇక పొలాన్ని అమ్ముకున్న రైతు పడే కష్టాలు తన కళ్ళముందే అదే పొలాన్ని అధిక ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకున్న అవకాశవాదుల దుర్మార్గాలు మొదలైన సంఘటనలు ఈనాటి వర్తమాన కాలంలో జరిగే సంఘటనలకు రుజువుగా నిలుస్తాయి. రచయిత గ్రామీణ వాతావరణాన్ని, వస్తు సంస్కృతిని చిత్రిస్తూ ఆ గ్రామంలో రైతులు ఎదుర్కొనే సమస్యలను వాస్తవిక దృష్టితో దోసిలిలో పట్టి పొక్కిలి కథలో చూపించినారు.

ఆరుద్ర పురుగు కథలో తాను నమ్ముకున్న భూమిలో పంట పండాలని బోర్ల మీద బోర్లు వేసి ఊరంతా అప్పుచేసి చివరికి అదే పొలంలో ఆత్మహత్య చేసుకున్న రైతు భార్య చింతకింది చంద్రవ్వ కథ ఇది. ఈమెకు ఒకతే బిడ్డ, ఆ బిడ్డకు పెళ్లి చేసి అత్తారింటికి పంపించింది. చివరకు గుడ్డి కుక్కోలే ఒక్కతే మిగిలుతుంది. ఆమె రేషన్ కార్డు ఈ మధ్యనే తొలగించి తిండి గింజలు లేకుండా చేసిన వ్యవస్థ. ఒక టీచర్ సర్వే కోసం ఆవిడ దగ్గరికి వెళితే ఉన్నోనికి అన్నీ ఉంటయ్, లేనోడికి కడుపులో పేగులు తేలిన డొక్కలు తప్ప ఏమీ ఉండదు అని వాపోతుంది. అది ఆమె దయనీయమైన స్థితి. చివరకు బుక్కెడు బువ్వ దొరకక తాను చనిపోతుంది. దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేక గ్రామస్తులు చందాలు వేసుకొని చేస్తారు. ఇది గ్రామీణ వాతావరణంలో ఆత్మహత్య చేసుకున్న రైతు భార్య దీనస్థితిని తెలియజేస్తుంది. వర్తమాన సామాజిక వ్యవస్థలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు ఇంకా అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఈ కథ ద్వారా బోధపడుతుంది. వ్యవస్థలో ఉన్న లోపాలను కథకుడు ఎత్తి చూపినట్లు కనిపిస్తుంది. ఈ కథను చదువుతున్నప్పుడు రచయిత పాఠకుని కంటిలోకన్నీళ్లు

తిరిగేలా చేస్తుంది. ఇదే కోవకు చెందిన రైతు వృత్తాంతం తో మలిచిన మరొక కథ సజీవదహనం. ఇందులో ఐలయ్య, బూదవ్వ దంపతులకు మూడెకరాల భూమి ఉంటుంది. వరి గొలుసు పెట్టి అక్కడక్కడ బంగారం రంగులో మారుతుంటుంది. ఆ పొలం అంతలోనే వర్షాలు లేక కరెంటు లేక పంట ఎండిపోతుంది. అది తట్టుకోలేక గడ్డివాము మంటల్లో దూకి ఆత్మహత్య చేసుకుంటాడు ఐలయ్య.బూదవ్వకు పుట్టెడు కష్టాలు మిగిల్చి బూడిద అవుతాడు. ఇట్లా సమాజంలో జరుగుతున్న సంఘటన లను సజీవంగా కథలుగా మార్చిన వైనం రచయితలో కనిపిస్తుంది.

చేనేత జీవితాల కష్టాలకు అద్దంపట్టే కథాంశం మరణ మృదంగం. ఇందులో చేనేత వృత్తి నుండి మరమగ్గాల వృత్తిని చేపట్టిన కార్మికులు పొట్టకూటి కోసం రాత్రి పగలు కష్టపడితే తమ కుటుంబానికి పొట్ట నింపని బతుకుల దీనగాథలు కనిపిస్తాయి. సిరిసిల్లలో జరిగిన ముగ్గురి ఆత్మహత్యల ప్రేరణతో రాయబడిన వాస్తవిక సంఘటన కథారూపం దాల్చింది. శాంతినగర్‌లో శ్రీనివాస్ సాంచాలు నడుపుతూ తన భార్య పిల్లల కనీస కోరికలు తీర్చలేక, నా బ్రతుకు ఇంతేనా అని, నా బతుక్కి మంచి రోజులు లేవని, ఇంట్లో కెళ్ళి దూలానికి ఉరి వేసుకుని చని పోతాడు. మరొకరు ముప్పైఏళ్లకే ముడతలు పడిన శరీరంతో రాజీవ్ నగర్‌లోని శ్రీనివాస్ మంచి బతుకు లేక గర్భంతో ఉన్న భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి డబ్బుకోసం ఊరంతా తిరిగి తిరిగి ఊరికే ఇంటికి వస్తాడు. భార్య ఏడ్చి ఏడ్చి, మూలిగి మూలిగి రూప మంచంమీద పడి ఉంటుంది. ఇంటికి ఖాళీ చేతులతో వచ్చిన శ్రీనివాస్ కోరి కోరి పెళ్ళి చేసుకున్న భార్యకు కడుపు నిండా తిండి పెట్టలేక, కాన్పుకు కనీసం ఆసుపత్రికి తీసుకెళ్లలేని, తన ఆర్థిక స్థితికి రోదించి కార్గిల్ లేక్ లో శవమై తేలుతాడు. ఇక గాంధీ సెంటర్లో సాంచాలు నడిపే చంద్రం కూడా ఇదే వృత్తిని చేస్తూ తన కుటుంబాన్ని పోషించలేక, కాలుతున్న కడుపుతో బిక్కుబిక్కుమంటూ ఆకలితో పోరా డుతూ కుటుంబాన్ని పోషించలేక కల్లులో విషం కలుపు కొని ఆత్మహత్య చేసుకుంటాడు. ఈ రకంగా బతుకు లేక బతుకు ఈడుస్తూ, ఈ పని తప్పితే వేరే పని చేయరాదని అమాయకపు జీవితాల వాస్తవిక సంఘటనల రూపమే మరణ మృదంగం కథాంశం. ఒకప్పుడు చేనేత మగ్గాల మీద గౌరవంగా బతికిన పద్మశాలీలు మర మగ్గాలు వచ్చిన తర్వాత వాటినే నమ్ముకొని పని మొదలుపెట్టారు. ఈ వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించు కోలేక ఉరి వేసుకొని ఆత్మహత్యలు చేసుకున్న సంఘ టనలు కోకొల్లలు. ఈరకమైన మనుషుల మానసిక సంఘర్షణలను, ఆవేదనలను కథలోరచయిత చిత్రించి నాడు. ఈ వృత్తి చేసే కార్మికులకు సంక్షేమ పథకాలు అందుతున్నది తెలియదు, వీరి మరణాలకు గల కారణా లను అధికారంలో ఉన్న ప్రభుత్వం వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపితలేవనే విషయం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కథాంతం ముగిసినా, పాఠకుల గుండెలు దుఃఖంతో అలిసిపోతాయి. రచయిత తాను స్వయంగా అనుభవించిన, చూసిన వాస్తవిక సంఘటనలను పాత్ర లకు ఆపాదించి సజీవంగా కథలుగా మలిచిన తీరు కథల్లో కనిపిస్తుంది.

ఈ రకంగా డాక్టర్ వెల్దండి శ్రీధర్ గారు రచించిన పుంజీతం కథల్లో ఇతర కథలైన నాలుగు కోట్ల పిడికిళ్ళు, పుంజీతం, పేగుబంధం, పుండు, దడ్వత్,లోలోపలి విధ్వంసం, గుండె కింద తడి, వేటికవి సామాజిక కోణంలో వర్తమాన సంఘటనలను, అనుభవాలను, వాస్తవిక కోణంతో సంగ్రహించి ఆయా మనుషుల సంఘ ర్షణల వైవిధ్యాన్ని, వెతలను, సజీవంగా ఆవిష్కరించిన తీరు కథల్లో కనిపిస్తుంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

'ప్ర'పంచపదులు – సామాజిక జీవనాంశాలు

– డా॥. సిహెచ్. లవన్‌కుమార్, సంస్కృత అతిథి అధ్యాపకుడు, తెలుగు & ప్రాచ్య భాషావిభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ప్రస్తావన :

'సహితస్య భావః సాహిత్యమ్', 'హితేన సహితం సాహిత్యమ్' అని సాహిత్యం అనే పదానికి నిర్వచనాలున్నాయి. అంటే హితంతో కూడినది, హితాన్ని చేకూర్చునది అని ఆ నిర్వచనాలకర్థం. కనుక మానవతకు పట్టంకట్టి, సమభావనను కలుగజేసి, సమాజానికంతటికీ మేలు చేకూర్చేదే సాహిత్యం అవుతుంది. సాహిత్యానికీ - సమాజానికీ విడదీయరాని బంధం ఎప్పుడూ ఉంది. ఎందుకంటే సాహిత్యం అనేది సమాజంలోంచే పుడుతుంది. కనుక సాహిత్యం మనుగడ ఆయా సామాజికాంశాలపైనే ఆధారపడి ఉంటుంది. అలాంటి సామాజిక స్పృహ కలిగిన రచనలే సమాజంలో కలకాలం నిలిచుంటాయి, అవి తమ ప్రభావాన్ని సమాజంపై తప్పక చూపిస్తాయి. ఐతే సమాజాన్నంతటినీ మార్చగలిగే శక్తి సాహిత్యానికుందా ? అంటే ఏ సాహిత్యమైనా సమాజాన్ని ఒకేసారి మార్చలేకపోయినా కాలక్రమంగా సామాజిక జీవన పరిణామానికి తోడ్పడుతుంది. మానవుని ఆలోచనలకు పదునుపెట్టి సంస్కారాన్ని పెంచుతుంది. అతనిలోని మానసిక పరివర్తనకి కారణభూతమై సామాజికాభ్యుదయానికి, మానవతకు, మంచి మార్పునకు ప్రధాన కారణమౌతుంది. ఇలాచూస్తే ప్రాచీనాంధ్రసాహిత్యయుగం నుండి నేటి ఆధునికాంధ్ర సాహిత్యంలో వెలువడుతున్న ఉన్నత విలువలున్న సాహిత్య రచనలన్నీ సామాజికాభ్యున్నతికి, విశ్వమానవ కళ్యాణానికి ప్రధాన హేతువులే అని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు. కనుక మంచి సాహిత్యం కోసం సమాజం, మంచి సమాజంకోసం సాహిత్యం ఎప్పుడూ అవసరమే అనటం ఎంతో సముచితం. ఇలా ప్రాచీనాంధ్ర సాహిత్యంలో నన్నయను మొదలుకొని నేటి ఆధునిక ఆంధ్ర సాహిత్యయుగం వరకు ఎందరో కవులు, రచయితలు, విమర్శకులు తమ అపూర్వ పాండిత్య ప్రతిభతో ఎన్నో ఉత్తమ రచనలను రచించి, సామాజికాభ్యున్నతికి తమవంతు పాత్రను పోషించారు, పోషిస్తూ ఉన్నారు. అటువంటి కవి పుంగవులలో సినారెగా తెలుగు సాహిత్యలోకానికి చిరపరిచితులైన 'జ్ఞానపీఠ' పురస్కార గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి గారు ముందువరుసలో నిలుస్తారు. వీరి 'ప్ర'పంచపదులలోని సామాజిక జీవనాంశాలను పరిశీలించటమే నా ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.

డా॥ సి. నారాయణరెడ్డి గారి వైశిష్ట్యమ్ :

"నాపేరు కవి
ఇంటిపేరు చైతన్యం
ఊరు సహజీవనం
తీరు సమభావనం"
నా వచనం బహువచనం
నా వాదం సామ్యవాదం
కవిత్వం నా మాతృభాష
ఇతివృత్తం మానవత్వం"

అనటంటో డా॥ సి.నారాయణరెడ్డి గారి కవిత్వం ఏమిటో స్పష్టమవుతుంది. అభ్యుదయం, శాంతి, విప్లవం, మానవత, సమత - ఇలా అన్ని భావాలను ఆహ్వానించే 'సమన్వయ కవి'గా మనకు సినారె కనిపిస్తారు. శ్రీశ్రీ వారసత్వాన్ని కొంత, గురజాడ వారి తత్వాన్ని కొంత పుణికి పుచ్చుకొని నాగార్జునసాగరం, కర్పూరవసంతరాయలు, మంటలు-మానవుడు, విశ్వంభర, మధ్యతరగతి మందహాసం, మట్టి మనిషీ ఆకాశం వంటి ఎన్నో రచనలను విభిన్న ప్రక్రియలలో రచించి ఆంధ్రసాహితీ జగత్తులో

తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు సినారె. వీరి కలం నుండి జాలువారిన విశిష్టకావ్యమే ఈ 'ప్ర'పంచ పదులు.

'ప్ర'పంచపదులు - సామాజిక జీవనాంశాలు :

'ప్ర'పంచపదులు తెలుగు సాహిత్యంలో ఓ అపూర్వ ప్రయోగం ! నలభైయేళ్ల కవితాప్రస్థానంలో నారాయణరెడ్డి గారు సాధించిన భావపరిణతకుపరాకాష్ఠ ఈ 'ప్ర'పంచ పదులు. 'ప్ర'పంచపదులు అన్న కూర్పులో అనేకార్థాలున్నాయి. 'ప్రపంచ్యత ఇతి ప్రపంచః'. అంటే నిరంతరం విస్తరించేది అని అర్థం. ఇక్కడ ప్రపంచించి చెప్పడం అంటే విస్తరించి చెప్పడం అని అర్థం. పార్శీలోని రుబాయీలో నాలుగు పాదాలుంటాయి. సినారె వాటిని ఐదు పాదాలకు విస్తరించారు. అట్లాగే 'ప్ర' అన్న ఉపసర్గకు విశేషం అని అర్థం. అంటే ఇవి మామూలు పంచపదులు కావు విశేషమైన పంచపదులు అని తాత్పర్యం. 'ప్రపంచ' అని కలుపుకొంటే పంచభూతాత్మకమైన ఈ సమస్త లోకతత్వాన్ననుసరించి చెప్పిన పదాలని అర్థం. ఇలా సమస్తలోక భావాల్ని తమలో ఇముడ్చుకున్న ఈ ప్రపంచపదులు మానవసామాజిక జీవనోన్నతికి తరగని సిరులు.

'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని గురజాడవారన్నట్లుగా సమాజం వేరు, మనిషి వేరు కాదు. మానవ సమూహ సమాహారమే సమాజం. అలాంటి మానవ సామాజిక జీవనాభ్యున్నతికి సినారె ఈ ప్రపంచ పదులలో అనేక సామాజికాంశాలను స్పృశించారు. మానవుడు నిరంతర కర్తవ్య పరాయణునిగా ఉండాలనీ, కర్తవ్య నిర్వహణ సమయంలో అవరోధాలు ఎదురౌతాయని, అంతమాత్రానికే నిరాశకు, నిస్పృహకు లోను కాకూడదనీ, ప్రపంచం యొక్క వాస్తవికరూపాన్ని తెలుసుకొమ్మనీ, మనం అనుకున్నట్లుగా సమాజం లేదని సమాజం పట్ల వైముఖ్యాన్ని ప్రదర్శింపక పునరుత్తేజాన్ని పొంది, మనల్ని మనం సంస్కరించుకొని తర్వాత మెరుగైన సమాజం కోసం ఆరాటపడాలనీ, చివరకు సమున్నత సమాజ లక్ష్యాన్ని సాధించాలనీ కవి బోధిస్తాడు.

నిరంతర కర్తవ్యోన్ముఖత :

మానవ జీవన గమనంలో ముఖ్యంగా ఉండవలసిన లక్షణమిది. ఊహాలోకంలో విహరిస్తూ కాలాన్ని వృథా పుచ్చక, నిరంతర కృషీవలుడైన మానవుడే సమాజంలో ముందుంటాడని కవి చాలా అద్భుతంగా ఇలా చెబుతాడు -

"తవ్వగలిగితె గుండె పొరలను రవ్వలెన్నో ఎదుట పడవా?
ఇవ్వగలిగితె నాదలయలను మువ్వలెన్నో వెంట పడవా?
చెక్కుచెదరని లక్ష్యముంటే చేతకానిది మనిషికేదీ-
చూడగలిగితె పట్టపగలే చుక్కలెన్నో కంటపడవా
కదపగలిగితె పెనుయెడారిని గంగలెన్నో బయట పడవా?"

అలాగే ఎవరి జీవితాన్ని వారే సరిదిద్దుకోవాలని, ఎవ్వరో వచ్చి బాగుచేస్తారని ఎదురుచూడటం వృథా అంటూ ప్రతి మానవునికి జీవన హితాన్ని ఇలా సినారె బోధపరుస్తాడు.

"చేదు సత్యం మింగగలిగితె జీవితం వైద్యాలయం
మననువుటలను చదవగలిగితె అనుభవం విద్యాలయం
ఎవ్వరో నేర్పాలనే భ్రమ యెందుకంట వృథా వృథా -
అడుగు తప్పక అడగలిగితె అవనియే నృత్యాలయం
కనులు తిప్పక చూడగలిగితె అణువణువు తత్వాలయం"

అవరోధాలు :

ఐతే మానవునికి తను ప్రయత్నం చేస్తున్న సమయంలో అనేక అవరోధాలు ఎదురుకావచ్చు. కానీ ఆ చిన్నచిన్న ప్రతిబంధకాలకే జడిసి చెదిరిపోరాదని, కష్టాలకు లొంగక, కృంగక ధైర్యంగా కడదాకా నిలిచి

జీవనపోరాటం చేయాలని, ఆత్మస్థైర్యంతో పురోగ మించటమే సామాజిక జీవనోన్నతికి ఏకైక మార్గమంటాడు.

"కలవరపడి వెనుదిరిగితే కాలం ఎగబడుతుంది
కదను తొక్కి చెలరేగితే కాలం భయపడుతుంది.
కర్మయోగి ఏనాడూ కాలాధీనుడు కాడు -
కనురెప్పలు మూతపడితె కాలం జోకొడుతుంది
కంఠమెత్తి తిరగబడితె కాలం జేకొడుతుంది"

ఇంకా, జీవనగమనంలో లక్ష్యసాధనలో, ఛేదనలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శింపక, అడ్డంకులను ఛేదించుకుంటూ ముందుకుసాగాలనీ, సాధించిన దాని తోనే సంతృప్తిని చెందితే జీవితంలో ఎదుగుదల ఉండ దంటాడు.

"గాలిని దూసుకుపోకుంటే అదికాదు విమానం
కల్లను తుడుచుకుపోకుంటే అదికాదు ప్రమాణం
సర్దుబాటుతో ఉన్నతలక్ష్యం సాధ్యపడదులే -
కదలిక లేనే లేకుంటే అదికాదు ప్రయాణం
కాలాన్ని దాటిపోకుంటే అదికాదు విధానం"

వ్యక్తిత్వాన్ని కాపాడుకోవటం :

జీవితంలో ఉన్నతస్థితికి చేరాలన్న తపనతో, మనుగడ కోసం తాను జరిపే పోరాటంలో మానవుడు తన ఉన్నత వ్యక్తిత్వాన్ని మాత్రం ఎన్నడూ దిగజార్చుకోక కడలివలె కడదాకా నిలవాలని గొప్ప సూచనను కూడా కవి చేస్తు న్నాడు.

"అడుగడుగునరేగే అలజడులకు అదరని శిరసే సముద్రం
ఎన్ని రుతువులూ పీల్చివేసినా ఇంకని సొగసే సముద్రం.
సముద్రమంటే ఉప్పునీరనే భ్రమలో పడివుంటే యెలా-
కునుకే కరువై కలత కూల్చినా కుంగని మనసే సముద్రం
నింగివిరిగి తనమీద కూలినా లొంగని మనిషే సముద్రం"

సామాజిక చిత్రణ :

సమాజం అంతా బాగుందని కవి చెప్పటం లేదు. ఈ సమాజం యొక్క హీనస్థితికి, మనిషిని మృగంగా మార్చి, అతణ్ణి సమాజానికి చీడగా మార్చే ప్రధానకారణాలుగా స్వార్థం, లోభం, ద్వేషం, కృతఘ్నత వంటి దుర్గుణాలను కవి ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు.

"తోడుగ సాగే నీడను కూడా వాడుకుంటుంది స్వార్థం
ఆపైవాణ్ణే పాచిక చేసీ ఆడుకుంటుంది స్వార్థం.
మనిషిలోని ఆ చీకటికోణం మార్చే వేషాలెన్నో -
చిటికెడు పేరుకు నీతిని నిలువున చీల్చివేస్తుంది స్వార్థం
మూరెడు గద్దెకు జాతి పరువునే ఆరవేస్తుంది స్వార్థం"

ఈ స్వార్థం మనిషిలో మితిమీరితే ఏమౌతుందో కూడా హెచ్చరిస్తున్నాడు.

"ఏమిటో ఈ మూర్ఖలోకం ఇంతగా దిగజారుతున్నది
అడుసులో పొరలాడుతూ అది పడకగది అని కేరుతున్నది.
స్వార్థమన్నది నెత్తికెక్కితె సర్వనాశనమే కదా మరి -
తిన్న యింటికి కన్నమేసే తెలివి హద్దులు మీరుతున్నది
నీతి అల్లిన గూటిలో అవినీతి సర్పం దూరుతున్నది"

స్వార్థం తర్వాత మానవసమాజ పతనానికి మరో పెద్ద హేతువు లోభం. ఈ లోభగుణం వల్లనే నేడు మనం ఈ అసమసమాజపు విషపు కోరల్లో చిక్కుకొని విలవిల్లాడు తున్నామంటాడు కవి.

"పంటలెన్నో యింటవున్నా పరిగలేరిస్తుంది లోభం
పెట్టెలోపలి గవ్వయేదని పెంటవెతికిస్తుంది లోభం.
లోభతత్త్వం అంతుపట్టదు లోని పొరలను చీల్చుకుంటే-
ఉన్న కాస్తా కలతనిదురను ఊడ్చిపారేస్తుంది లోభం
మనిషిమనసును కాటిదిబ్బగ మాడ్చి మసిచేస్తుంది లోభం"

ఇక మరొక సామాజిక దుర్గుణం కృతఘ్నత. అంటే మనిషి తన మూలాలను, తన ఎదుగుదలకు కారకులైన

వారిని జీవితంలో ఎప్పుడూ మరిచిపోకూడదనీ, ఎంత తాను ఎదిగినా సదా వారిని స్మరించుకోవాలనే గొప్ప నీతిని కూడా కవి బోధిస్తున్నాడు.

"ఈ చెట్టును చూసిన మరునిమిషం ఆ మట్టిని కాస్తా తలచుకో
ఈ గట్టును చేరిన మరునిమిషం ఆ పుట్టిని కాస్తా తలచుకో
నువ్వెంతటి యెత్తులో వున్నా జన్మించిన సంచిని మరవకో-
ఈ మేడను ఎక్కిన మరునిమిషం ఆ మెట్లను కాస్తా తలచుకో
ఈ గద్దెను ఏలిన మరునిమిషం ఆ సుద్దులు కాస్తా తలచుకో"

నేటి సమాజం మేడిపండులా పైకి మిలమిలా మెరుస్తూ కనబడుతున్నా లోపల మాత్రం ఎన్నో లోపాలతో నిండియున్నదనీ, అనాదిగా స్త్రీపై పురుషుని అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయనీ, పైకి నీతులు చెబుతూ వంచనకు పాల్పడే ధూర్తులెందరో ఈ లోకంలో మనకు కనిపిస్తుంటారనీ, పాలకులు ఈ పాపాత్ములను కాపాడుతున్నారని కవి మన సమాజంలోని లోపాలను నిర్మొహమాటంగా కళ్ళకు కట్టినట్లుగా చూపారు.

"నిండుసభలో నీతినొలిచే దండిమగలున్నారు నేడూ
మర్మమెరిగీ బొంకులాడే ధర్మసుతులున్నారు నేడూ
నాటి భారతగాథ లేదా నేటికీ మనకళ్లముందే -
పాప సంతతి కొమ్ముకాచే ప్రభువులూ ఉన్నారు నేడూ
పరమశిష్యుల ప్రతిభనరికే గురువులూ ఉన్నారు నేడూ."

మనిషికీ-మనిషికీ, ప్రాంతానికీ-ప్రాంతానికీ, దేశానికీ - దేశానికీ, కులాలకీ-మతాలకీ మధ్య తారతమ్యాలను సృష్టించి సమస్త మానవ ప్రపంచాన్ని నాశనం చేసే మరొక దుర్గుణం ద్వేషం. ఈ ద్వేషం వల్ల మానవ సమాజం సర్వనాశనమైపోతుందని కవి హెచ్చరిస్తున్నాడు.

"వెలిగే చూపులలో మసి పులుముతుంది ద్వేషం
కమ్మని తలపులలో కసి కలుపుతుంది ద్వేషం
ద్వేషం తలకెక్కితే వినాశం తప్పదులే -
మాటల పొదలో విషమై మసలుతుంది ద్వేషం
మనిషి గుండెలో మృగమై మరుగుతుంది ద్వేషం"

సామాజికజీవనాభ్యున్నతికి ప్రధానావరోధాలైనటువంటి ఇటువంటి సంకుచిత భావాలను విడిచిపెట్టి కుల-మత-ప్రాంత వర్గాలకు అతీతమైన విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంచుకోవాలని చెబుతూ, గాలికీ, కాంతికీ, నీటికీ లేని ఈ అంతరాల తెరలు మనిషికి మాత్రం ఎందుకని ప్రశ్నిస్తున్నాడు.

"పూలపైన విహరించే పిల్లగాలికీ - తుమ్మముళ్లంటే జడుపుంటుందా ?
గోపురాలపై మెరిసే సూర్యకాంతికీ - పెంటకుప్పలంటె వెగటుంటుందా ?
మైదానంలో పారే యేటినీటికీ - పసిమిమాగాణీ బీడూ ఒకటే -
గుండెలోన పొరలు లేని మనిషికంటికి - ఒకే కులం పైన గురివుంటుందా ?
మానవతను పూజించే మంచిమనసుకూ - ఒకే మతంపైన బరివుంటుందా?"

అలాగే సమాజంలో మనిషిని అతడు పుట్టిన కులాన్ని బట్టో, మతాన్నిబట్టో, ప్రాంతాన్నిబట్టో గౌరవించక, అతడు సాధించిన జ్ఞానాన్నిబట్టి సత్కరించాలని, జ్ఞానమే మహోన్నతమైనదని కూడా కవి ఎంతో హృద్యంగా చెబుతున్నాడు.

"బురదలోన వుంటున్నా తరగదు పద్మం విలువ
తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ
అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు -
అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ
మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ"

ఇలా సమున్నతమైన జ్ఞానాన్ని సముపార్జించుకొన్న మానవుడు రాగ-ద్వేషాలకతీతంగా ఎదిగి, హింసకు

తావులేని క్షమ-దయ-సహనగుణాలతో నిండిన ఆదర్శ సామాజిక జీవన యానాన్ని కడదాకా సాగించాలనీ, సాధించాలనీ కవి కాంక్షిస్తున్నాడు.

"గిరులెదురై పొమ్మంటే తిరిగిపోదు ఝరీగుణం
కడుపును కలచే వ్యథలకు ఉడిగిపోదు ధరాగుణం.
స్థితి తప్పని గుణముంటే క్షతి యేదీ మృతియేదీ-
తన శ్వాసను కోస్తున్నా అణిగిపోదు క్షమాగుణం
తనను పీల్చివేస్తున్నా తరిగిపోదు దయాగుణం"

ముగింపు :

మానవ జీవనయానంలో ఎదురయ్యే సామాజిక సంక్లిష్టతలను సమర్థంగా ఎదుర్కొని పురోగమించి, కుల-మత-హింసారహితమైన సమున్నత సమాజాన్ని సాధించుకోవాలని, జ్ఞానకాంతులతో జీవిత పరమార్థాన్ని తెలుసుకోవాలనీ మానవునికి దిశానిర్దేశంచేస్తూ సినారె తన ప్రపంచ పదుల రచనా ప్రధానోద్దేశ్యాన్ని చివరి పద్యంలో చక్కగా వివరించాడు. ఇది అక్షర సత్యం.

"ఒరిగిపడిన జాతికి వెనుచరుపులీ ప్రపంచపదులు
మరుగుపడిన నీతికి కనుమెరుపులీ ప్రపంచపదులు
చేదో తీపో మథించి చెప్పాడు సుమా సినారె -
కునికే అడుగులకు మేలుకొలుపులీ ప్రపంచపదులు
మారే విలువులకు దారిమలుపులీ ప్రపంచపదులు"

ఇలా 'ప్రపంచపదుల'ను విశిష్టకావ్యంలో సినారె గారిచే సామాజికజీవనాభ్యుదయాంశాలు చక్కగా నిర్దేశింప బడ్డాయి.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. డా॥ ద్వా.నా.శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర
2. అమరసింహుడు - అమరకోశం
3. డా॥ సి. నారాయణరెడ్డి - 'ప్ర'పంచపదులు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు కథానికలు – స్త్రీ జీవిత చిత్రణ

– డా॥. డి. ముస్తానమ్మ, తెలుగు అధ్యాపకులు, ఐఐటి, ఒంగోలు.

ఆధునిక సాహిత్యంలో అత్యంత పాఠకాదరణ పొందిన ప్రక్రియగా కథానికను పేర్కొనవచ్చు. కథ, కథానిక అన్న పదాలను నేడు సమానార్థకాలుగా ఉంటున్నవి. నేడు పురుషులు, స్త్రీలు, పిల్లలు వివిధ వృత్తి వ్యాపకాల్లో జీవిస్తున్నారు. వారిలో కొందరు సుఖంగా ఉంటున్నారు, మరికొందరు కష్టాలను భవిస్తున్నారు. ఈ వ్యత్యాసాలు మాతృస్వామ్య వ్యవస్థ నుంచే ఉన్నా ఇటీవల పెచ్చు మీరాయని చెప్పవచ్చు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మానవుడు ఎంతో పురోగతి సాధిస్తున్నా సమస్యలు చుట్టుముడుతూనే ఉన్నాయి. ప్రతి ఒక్కరిలో ఆవేశం, ఆరాటం, పోరాటం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఏదో సాధించాలని, అనుభవించాలని, తరతరాలకు దాచి ఉంచాలని ప్రజలు తపన పడుతూనే ఉన్నారు. విరామం విశ్రాంతి అన్నది లేకుండా కష్టపడుతున్నారు కొందరు. మరికొందరు మాత్రం అక్రమమార్గంలో అనైతికంగా సంపాదించాలని ఆరాట పడుతున్నారు.

భారతదేశంలో దాదాపు పదనాలుగు వందల దాకా వృత్తులు ఉన్నాయి. వాటిలో ఏదోకటి ఎంచుకొని కష్టపడి సంపాదిస్తూ ప్రశాంతంగా మనిషి బ్రతకవచ్చు. అయితే ఎలాంటి శ్రమకు నోచుకోకుండా కోట్లు కూడబెట్టాలని తపన పడుతూ ఉన్నారు. దాంతో సామాజిక స్పృహ అన్నది ఏకోశానా లేకుండా పోతున్నది. ఈ నేపథ్యంలో నేటి సమాజాన్ని పరిశీలిస్తే స్త్రీలు లెక్కలేనన్ని సమస్యలను ఎదుర్కొంటున్నారని తేలుతుంది. వాటిని సామాజిక బాధ్యతగల రచయితలు కథలుగా మలిచారు. వాటి ద్వారా సమాజానికి చక్కని దిశానిర్దేశం చూపటానికి యత్నించారు. ఈ పరంపర నేటికీ కొనసాగుతున్నది. రేపటికీ తన వారసత్వాన్ని అందిస్తుంది. సామాజిక సమస్యలున్నాళ్లు వీటి చిత్రణ జరుగుతూనే ఉంటుంది. స్త్రీల సమస్యలతోబాటు వారి మనస్తత్వాలను కథ చిత్రిస్తున్నది. నాణేనికి బొమ్మబొరుసు ఉన్నట్లే స్త్రీల వ్యక్తిత్వంలో విభిన్న దృక్పథాలు కలిగిన వారూ ఉంటారు. వారి స్వరూప స్వభావాలను గూర్చి కథకులు కథలు రాసారు.

స్త్రీలు ఎదుటి వారికి తమ గొప్పదనాన్ని చూపాలని చాటి చెప్పాలని చూస్తారని. అదే సందర్భంలో ఎదుటి వారి ఉన్నతిని సహించలేరని సర్వసాధారణంగా అందరూ అంటుంటారు. ఇందులో కొంత వాస్తవ ముందన్నది జగమెరిగిన సత్యం. అయితే అందరు స్త్రీలు అలాంటి వారు కారు. ఏకొందరో అలాంటి కోవకు చెందుతారు. అట్లాంటి వారి మనస్తత్వాలను చిత్రిస్తూ బడబాగ్ని శంకరరాజు 'ఆఖరి మెట్టు' అనే కథ రాశాడు. అందులో ఒక వీధిలోని ముగ్గురు స్త్రీలు బాగా సంపన్నులు. వారు ఎదుటి వారి కుటుంబ విషయాలు చర్చించుకుంటుంటారు. వారికి తెలియకుండా ఏ ఇంటివారైనా కొత్త వస్తువు తెచ్చుకుంటే దానికి రకరకాల పేర్లు పెడతారు. అది అక్రమంగా సంపాదించిన డబ్బుతో కొన్నారనో లేకుంటే అది మంచి వస్తువు కాదనో ఏ లేవో వంకర్లు పెడుతుంటారు. ఎదుటి వారిని తక్కువగా చూడటమే వారు పనిగా పెట్టుకుంటుంటారు.

అన్నపూర్ణ ఎస్ ఐ భార్య. ఇంద్రాణి సేల్స్ టాక్స్ ఆఫీసరు భార్య. ఊర్మిళ బిజినెస్ మాగ్నెట్ భార్య. వీరు ముగ్గురూ తెగబలిసిన సంపదతో తులతూగుతుంటారు. వీరి భర్తలకు జీతంతో బాటు గీతం కూడా వస్తుంటుంది. వీరికి ఇంటి పనికి వంట పనికి పనిమనుషులుంటారు. అందువల్ల వీరికి మరో వ్యాపకం ఏదీ ఉండదు. ఆ కారణంగా వీరు ఎదుటి వారిని గూర్చి చర్చించుకుంటూ ఉంటారు. తమకంటే అధికులైతే వారిని చూసి ఈర్ష్య పడతారు. తమకంటే తక్కువ స్థాయి వారైతే వారిని

చిన్నచూపు చూస్తుంటారు. ఒక రకంగా చెప్పాలంటే వీరు ఆధిపత్యాన్ని చెలాయిస్తుంటారు. ఒక రోజు వీరు ముగ్గురూ ఆశాలత ఇంటికి వస్తారు. కొత్త టీవి తమకు చెప్పకుండానే కొన్నారని ఈసడిస్తారు. అప్పుడు ఆశాలత వారికి తగిన బుద్ధి చెప్పాలనుకుంటుంది. వాళ్లు తదేకంగా చూస్తున్న వస్తువు పైనున్న నీలంరంగు క్లాత్ తొలగిస్తుంది. అంతవరకు తమను కలవరపెట్టిన ఆ వస్తువును చూసి షాక్ తింటారు. వారి దృష్టిలో అది టెలివిజన్. కానీ వాస్తవానికి అది ఒక బుక్ షెల్ఫ్ ఎవరో వారికి ఆశాలత వాళ్లు టీవి తెచ్చారని చెబుతారు. అది నమ్మిన ఆ ముగ్గురు స్త్రీలు ఆశాలత ఇంటికి వచ్చి భంగపడతారు. దానిమీద 'నిజాయితీ పరుడైన ఉద్యోగికి నిత్య ఆదరణ' అని రాసి ఉన్న అక్షరాలను చదువుకొని ఆశ్చర్యపడతారు. తాము అనవసరంగా ఎంతో తప్పు చేశామని భావించి సిగ్గుతో తలదించుకుంటారు. వారి మానసిక స్థితిని గుర్తించిన ఆశాలత వారిని దెబ్బతీయాలనే దృష్టితో ఇలా అంటుంది.

"దీన్ని కూడా ఫారెస్టర్ అయిన మావారు దొంగ కలపతో చేయించారను కొనేరు సుమీ! గిరిజనులకు మావారు స్వచ్ఛందంగా చేసిన విద్యాపరమైన సేవకు, అతని నీతి నిజాయితీకి మెచ్చి ఒక స్వచ్ఛంద సంస్థవారు ఇచ్చిన బహుమతి అది అని స్పష్టం చేస్తుంది. అప్పుడు వారు ఆ ఇంటి వరండామెట్లు ఒక్కొక్కటే దిగుతూ నీతి, నిజాయితీ రీత్యా తాము ఆఖరు మెట్టు మీద వున్నట్లు భావిస్తారు. స్త్రీలను, ఇతరులను తక్కువగా అంచనా వేసి తప్పుడు ఆలోచనలతో నడుచుకుంటే అవమానాలు ఎదుర్కొక తప్పదని ఈ కథ చెబుతున్నది.

మన సమాజంలో తల్లికి మొదటిస్థానం ఇవ్వబడింది. తల్లిని వర్ణించటానికి ఉపమానాలు కాదు కదా మాటలు కూడా చాలవు. అలాంటి తల్లి ఔన్నత్యాన్ని గూర్చి ఎందరో కథకులు తమ కథల్లో చక్కగా చిత్రించారు. ఆ కోవకు చెందిన కథ 'మాతృవందనం' దీని రచయిత యామినీ సరస్వతి.

రామచంద్ర విద్య, ఉద్యోగ నిమిత్తం ఎన్నో ప్రాంతాలు తిరుగుతాడు. తన వెంట భార్య పిల్లలను మాత్రమే తీసికెళతాడు. తండ్రిని కోల్పోయాక తల్లి ఒక్కటే పల్లెలో ఒంటరిగా ఉంటుంది. ఆమెను తనతో వచ్చి ఉండమని రామచంద్ర కోరతాడు. అందుకామె ఆ పల్లె వాతావరణాన్ని, పాలాలను వదలి రానంటుంది. అయినా అతడు గట్టిగా పట్టుబట్టి పిలిచిన సందర్భాలు లేవు. చివరిలో తన తల్లి విలువను గుర్తిస్తాడు ఎంతగానో పశ్చాత్తాప పడతాడు.

"లేదమ్మా లేదు, నేనే పాపం చేశాను. కన్నతల్లిని జన్మభూమిని ఇంతదాకా గుర్తించలేక పోయాను. ఈ వూరికి వచ్చే దాకా నాకు నా ఉద్యోగం నా బ్యాంకు బాలెన్స్ నేను మద్రాసులో హైద్రాబాద్‌లో కట్టించుకున్న యిల్లు, నాహోదా, నా స్టేటస్ నాసర్కిల్‌లోని మనుషులు ఇవే గుర్తున్నాయి. అదే లోకం అనుకున్నాను. అదే నిజం అనుకున్నాను. ఎవరి బతుకు వాళ్ళు పొరుగింటిని కూడా పట్టించుకోకుండా జీవించడమే మంచిదనుకున్నాను. కానీ యీ ప్రేమానురాగాలు, పొరుగు మనిషి మేలుకోసం పడే తపనలోని నిస్వార్థం చూశాక నాలో ఎంత స్వార్థం వుందో తెలుస్తుంది. నేను నా జీవితాన్ని నా గమ్యాన్ని చూశాక నా తల్లిని ఎంత నిర్లక్ష్యంగా చూశానో తెలుసుకున్నాను. నీ మనసు నా కోస, నాకుటుంబం కోసం, మాతో ఆత్మీయంగా మెలగడం కోసం ఎంత తపించిందో తెలుసుకున్నాను", అని పశ్చాత్తాపపడతాడు. కొడుకు తన తప్పిదం తెలుసుకున్నందుకు కాంతమ్మ మనసు కుదుటపడుతుంది. ఆమె రామచంద్రా అంటుంది. ఆ నాలుగక్షరాలు మాతృప్రేమకు దర్పణం పట్టాయి. ఎనలేని తృప్తి ఆ గొంతుల్లో ధ్వనిస్తుంది. యుగ యుగాలుగా అనుస్యూతంగా వస్తోన్న తల్లీ కొడుకుల రాగ భావనకు మరో మొగ్గతొడిగింది. తల్లి స్థానంలో ఉన్న స్త్రీ ఒంటరిగా ఉన్నా బిడ్డల యోగక్షేమాలను కోరుకుంటుందే తప్ప తన స్వార్థాన్ని చూసుకోదని కథకుడు చెప్పాడు.

కొందరు స్త్రీలు బాధ్యతాయుతంగా తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వరిస్తారు. మరికొందరు ఇక తప్పదన్నట్లుగా చేస్తారు. 'ఇంటికిదీపం ఇల్లాలు' సామెతను కొందరు రుజువు చేస్తుండగా మరికొందరు పాడు చేస్తుంటారు. ఆ కోవకి చెందిన స్త్రీ శారదమ్మ. డి.రామచంద్రరాజు గారి 'తృప్తి' కథలోని పాత్ర శారదమ్మ. ఈమె మామ పట్ల (భర్త తండ్రి) నిర్లక్ష్య ధోరణితో మసలుకుంటుంది. క్షయ వ్యాధితో బాధపడుతున్న ముసలివాన్ని ఇంట్లోంచి బయటకు నెడుతుంది. భర్తకు చెప్పి అతనికి ప్రత్యేకంగా ఒక గుడిసె ఏర్పాటు చేయిస్తుంది. వేళకు ఒక ముద్ద సంగటి అతని కంచంలో వేస్తుంది. ఒకరోజు అన్నం ఎత్తునుండి ముసలోడి కంచంలో వేయడం వల్ల చేయి జారి కంచం కిందపడుతుంది. దాంతో అన్నం కింద పడటంతో శారదమ్మకు ఒళ్లు మండుతుంది.

"ఏం ముసలోడా? కంచం పట్టుకోనురాదా నీకు? చూడు అన్నం నేల పాలైంది? కంచం యెంత నొక్కు పోయిందో?" అని గట్టిగా కేకలేస్తుంది" ఆమె మాటకు ముసలాయన భయంతో వణికిపోతాడు. వయస్సులో ఎంతో ఉన్నతంగా బతికి, చివరికి అవసాన దశలో ఇలా దీనంగా బతకడం జీర్ణించుకోలేకపోతాడు. అయినా ఏమీ చేయలేక ఊరకుండిపోతాడు.

స్త్రీలు పౌరుషంలో కూడా తక్కువేమీకాదని నిరూపిస్తూ కొందరు కథలు రాశారు. అలాంటి వాటిలో చెప్పదగిన కథ "కూలిన బురుజు" ఈ కథలో శంకరరెడ్డి ఫ్యాక్షన్ కక్ష్యల్లో చంపబడతాడు. అపుడు అతని భార్య లక్ష్మమ్మ కథకునితో ఇలా అంటుంది.

"మీ బావను చంపినోడు కుక్క చావు చచ్చేదాకా ఆ గాజులు పగలగొట్టుకోను. ఈ బొట్టు చెరుపుకోను అన్నాను నువ్వు చదువుకున్నోడివి చెప్పు. ఇది తప్పంటావా!" అని తన ఆవేదనను ఆక్రోశాన్ని వెళ్లగక్కుతుంది. లక్ష్మక్క ప్రశ్న విన్నాక కథకుని నోటివెంట మాట రాలేదు. ఆమెలోని పట్టుదలా దాని పర్యవసానాలు ఊహించాడు. కానీ ఆమెను హెచ్చరించాలో, సమర్థించాలో అభినందించాలో తెలియక తికమకపడ్డాడు. చివరికి తన దారిన తాను వెళ్లిపోయాడు.

ముస్లిం స్త్రీల దుర్భర జీవితాన్ని గూర్చి షేక్ హుస్సేన్ సత్యాగ్ని గారు 'యంత్రం' కథలో కళ్లకు కట్టినట్లు చిత్రించాడు. రజియా సుల్తానాకు రాజాఖాన్‌తో పెళ్లి జరుగుతుంది. వారికి ముగ్గురు పిల్లలు కలుగుతారు. ముగ్గురు ఆడపిల్లలు కావటంతో రాజాఖాన్ భార్యకు "తలాక్" చెప్పి విడాకులిస్తాడు. విధిలేని పరిస్థితిలో ఆమె పుట్టినింటికి చేరుతుంది. తల్లిదండ్రులు ఆమెకు తిరిగి పెళ్లి చేయాలని ప్రయత్నిస్తారు. వారి ప్రయత్నాన్ని ఆమె వ్యతిరేకిస్తుంది. తాను స్వతంత్రంగా స్వేచ్ఛగా బ్రతకగలనని తల్లిదండ్రులకు హామీ ఇస్తుంది. దాన్ని సాకారం చేయటానికి 'లా' కోర్సులో చేరుతుంది. బిడ్డ ధైర్యాన్ని, ఆత్మాభిమానాన్ని వారు మెచ్చుకుంటారు. అయితే తన ముగ్గురు బిడ్డలు తనకు కాకుండా పోయినందుకు ఆమె ఎంతగానో ఆవేదన చెందుతుంది. తల్లి ప్రేమ ఎలాంటిదో కథకుడు ఈ కథలో అద్భుతంగా చిత్రించాడు.

"నా బిడ్డలు ప్రతిరోజు కాన్వెంట్‌కు మా యింటి ముందునుండేపోతారు. మా యింటి ఆవలి సందులో వుంది కాన్వెంటు. రాత్రి పగలు దిగులు నన్ను చిత్రవధ చేస్తుంది. నా పిల్లల్ని చూచిన పది నిముషాలే నాకు వూరట, ఆనందం. వాళ్లను గుండెకు హత్తుకున్నపుడు నా బాధంతా ఆవిరైపోతుంది. నా ప్రేగులు త్రెంచుక పుట్టిన అనురాగపు ముద్దులు వాళ్లు. తియ్యని అనుభూతులతో నవమాసాలు మోసికన్నాను. కానీ ఈ రోజు నా బిడ్డలని చెప్పుకునే తాహతు లేదు. ఇప్పుడు రాజాఖాన్ బిడ్డలు. నాకు ఏమీ కాదు" అంటూ బాధపడుతుంది. ఒక స్త్రీకి కన్నబిడ్డలపై ఉన్న మమకారం ఎలాంటిదో ఈ కథలో చక్కగా చిత్రించబడింది.

ఈ విధంగా చూస్తే ఎందరో స్త్రీలు మానసికంగా శారీరకంగా క్రుంగిపోతున్నారు. వారి వేదననూ రోదనను కథకులు కథలుగా మలిచి అద్భుతంగా చిత్రించారు.

ఆధునిక సమాజంలో స్త్రీలు విద్యావంతులై అన్ని సమస్యలను అధిగమించటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఒక స్త్రీ, తల్లిగా చెల్లిగా భార్యగా, వదినగా, అవ్వగా వివిధ బాధ్యతలను నిర్వరిస్తున్నది. ఆ పరంపరలో ఎన్నో వృత్తులను ఆచరిస్తున్నారు. ఆ సందర్భంగా ఎదురయ్యే ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. అలాంటి అన్ని అంశాలను వస్తువుగా స్వీకరించి కథకులు కథలు రాస్తున్నారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

డా॥ పి. కేశవరెడ్డి నవలల్లో సామాజిక జీవన చిత్రణ

– డా॥. జి. పార్వతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆధునిక తెలుగు సాహిత్యం సామాజిక జీవన ప్రతి బింబం. ఆధునిక తెలుగుసాహిత్యం కందుకూరి వీరేశలింగం పంతులతో ఆరంభమయింది. అనాటి నుండి తెలుగు సాహిత్యం రాజవీధుల్లో నుండి పురవీధుల్లోకి, అవతార పురుషుల ఆరాధన నుండి ఆర్తనాదాలు వినిపిస్తున్న అన్నార్తుల జీవితాల్లోకి వచ్చింది. సంస్కృత వాసనను వదిలి సామాన్యప్రజల భాషను సాహిత్య భాషగా చేసింది. పామరుల మాండలికానికీ, వారి యాసకు సాహిత్యంలో స్థానం కల్పించింది. అదే పాత్రోచిత భాష అని ప్రతి రచయిత ముందుకు తీసుకెళ్ళాడు. కథ, నవల వంటి ఆధునిక సాహిత్య ప్రక్రియలు నిర్మాణంలోను, కథన శక్తిలోను విస్తృతినీ, వైవిధ్యాన్ని సాధించాయి. మార్పును కోరుకునే రచయిత చేతుల్లో సాహిత్యం పరఢవిల్లింది. తెలుగు సమాజాన్ని సమగ్రంగా చిత్రించా లనే దృక్పథంతో తమ రచనలను చేస్తూ, సమాజంలో చలనాన్ని తీసుకొచ్చారు. 'చలనం'లో ఉన్న మన సమాజ అభివృద్ధి, క్షీణతల వెలుగు నీడల చైతన్య రూపమే సాహిత్యం' అంటాడు ప్రఖ్యాత విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు. ఆయన మాటలు ముమ్మాటికి వాస్తవాలు. ఈ దృక్పథంతో తెలుగు సాహిత్యం ప్రయాణించిన దూరం తెలుగు సమాజం ప్రయాణించిన దూరంగా మనం భావించాలి. ఆ సమాజ ప్రగతికి దోహదం చసే విధంగా రచనలు చేసిన ప్రతి రచయిత కూడా ధన్యుడే. అలాంటి రచయితల్లో ఒకరు డా॥. పెనుమూరు కేశవరెడ్డి.

డా॥. కేశవరెడ్డి గురించి సాహిత్యాభిమానులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని ఆధునిక రచయిత. చిత్తూరు జిల్లా, తలపుల పల్లె గ్రామా నికి చెందిన ఈయన వృత్తిరీత్యా వైద్యునిగా నిజామా బాద్‌లో స్థిరపడ్డారు. ఆయన వృత్తిరీత్యా వైద్యుడు అయినా ప్రవృత్తిరీత్యా రచయిత అని అనడానికి వీలులేదు. ఎందుకంటే ఆయన సరదా కోసమో, కాలక్షేపం కోసమో రచనలు చేసే వ్యక్తి కాదు. మానవాభ్యుదయం కోసం ఆయన రచనలు అన్నది సుస్పష్టం. అగ్రవర్ణంలో పుట్టినా అన్నార్తుల గురించే ఆయన ఆలోచన. దళిత, పీడిత జన పక్షపాతిగా, రాయలసీమ గ్రామీణ జీవిత సంఘర్షణే ఇతివృత్తంగా రచనలు చేస్తున్న గొప్ప మానవతా మూర్తి ఈయన.

డా॥ కేశవరెడ్డి వ్యక్తిగతంగా కూడా చాలా సూటిగా మాట్లాడుతాడు. దానికంటే పదునుగా రచనల్లో తన ఆలోచనలను వ్యక్తీకరిస్తాడు. ఆధునిక మానవ సమాజం నిరంతర పోరాటాల కూపం అంటాడు ఆయన. ఈ పోరాటం ఎందుకో ఆయన మాటల్లోనే ''నేనేకాదు, సమాజంలో ప్రతిఒక్కరూ ఏదో ఒక విధమైన పోరాటంలో మెడడాకా కూరుకుపోయి ఉండటం గమనించాను. కొందరు జానెడు పొట్ట కోసం, కొందరు బ్యాంకులు నింపడం కోసం, కొందరు పదవి కోసం, కొందరు కీర్తికోసం, మరికొందరు ఆడవాళ్ళ కోసం వివిధ స్థాయిల్లో పోరాటం సాగిస్తున్నారు'' (అతడు అడవిని జయించాడు) అంటాడు. ప్రతి మానవుడు దుఃఖం ఉంది కాబట్టే దాన్ని కాదనుకొని సంతోషం కోసం వెదుకుతున్నాడు. మరణం ఉంది కాబట్టే జీవితాన్ని ప్రేమిస్తున్నాడు. స్పర్ధ లేకుంటే జీవితం స్తబ్దతతో నిండిపోతుందనేది కేశవరెడ్డి వాదన. దీన్నిబట్టి మానవ జీవితంలో పోరాటం అనేది ఒక అవసరం అంటాడు ఆయన. 'అతడు అడవిని జయించాడు'లోని ముసలివాడు జీవన పోరాటంలో గడచిన అనుభవాల నుంచి సామాజికులకు అందించిన పాఠాలు మరువరానివి. ఈ నవలలో ముసలివాడు సామాజిక జీవనంలో అన్యాయ

పరంపర ఆటవిక న్యాయాన్ని ఎదుర్కొంటూ ఎలా బతుకుతాడో ఆధునికులకు ఆదర్శప్రాయం. పరిశ రాలు, పరిస్థితులకు అలవాటు పడాలన్న తాత్వికతను ఈ నవల ద్వారా రచయిత మన కందించాడు. ఆధునిక సమాజంలో జయాపజయాల సమన్వయమే జీవితం అనే గొప్ప సామాజిక సూత్రాన్ని డా॥ కేశవరెడ్డి తాత్వికరీస్తాడు.

రాయలసీమ ప్రాంత సాంఘిక చరిత్ర, సమాజ నిర్మాణం, గ్రామీణ జీవితంలో ప్రతిఫలించే హింసాత్మక ధోరణి గురించి డా॥ కేశవరెడ్డి చిత్తూరు జిల్లా యాసతో రాసిన నవలలన్నీ పాఠకులకు చదివేకొద్దీ ఎంతో ఉత్కంఠను రేకెత్తిస్తాయి. ముఖ్యంగా హరిజన సమస్య గురించి స్పందించిన ఇన్‌క్రెడిబుల్ గాడెస్, స్మశానం దున్నేరు నవలలు. అనాది కాలంగా మర్యాదకు, మన్ననకు, గౌరవానికి దూరమై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఆత్మాభిమానాన్ని అగ్రవర్ణాల దగ్గర తాకట్టు పెట్టి బలైపోతున్న బడుగు జీవితాల గురించి ఈ రెండు నవలలు కూడా బాగా వివరించాయి. ఇన్‌క్రెడిబుల్ గాడెస్, స్మశానం దున్నేరు నవలలు ఇంచు మించు ఒకే కాలంలో 1979లో అచ్చయ్యాయి. ఒకే వస్తువు రెండు నవలల్లోను కథయింది.

ఇన్‌క్రెడిబుల్ గాడెస్ కథ అగ్రహారం అనే గ్రామంలో జరుగుతుంది. గ్రామ పెద్ద భూస్వామి పెద్దరెడ్డికి 450 ఎకరాలు. అతని మీద ఆధారపడిన హరిజనుల్లో సంఘ ర్షణ కథావస్తువు. పెద్దరెడ్డి తరుపున దొరగా సాక్ష్యం చెప్పడానికి నిరాకరించిన రామచంద్రుడు ఆ భూస్వామి ఆగ్రహానికే గాక తన కులం వాళ్ళ ఆగ్రహానికి కూడా గురవ్వడం ఇందులో ఆలోచించదగ్గ అంశం. భూస్వామి కోపానికి గురైతే అది సహజం. కానీ తనతోటి కులపోల్ల దగ్గర కూడా నిరాదరణకు గురికావడానికి కారణం అంత ర్గత సమస్య. అన్ని కులాల్లో, ఉపకులాలు ఉన్నట్లే, రంపాల, రెడ్డిభూములు, మాలదాసరి, అరవ లాంటివి కొన్ని. ఒక తెగను చూస్తే మరొక తెగకు కాదు. రామ చంద్రుడు రంపాల తెగకు చెందినవాడు. తక్కినవాళ్ళు పాకనాటి మాలలు. అదీ కారణం. ఈ అంతర్గత సమస్య వల్లనే హరిజనులు ఐకమత్యాన్ని కోల్పోయి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారనేది వాస్తవం. వారి సామాజిక జీవన చైతన్యానికి ప్రోత్సాహకంగా ఎన్ని రచనలు వచ్చినా వారిలో ఐక్యత భావం లేనప్పుడు అవన్నీ వ్యర్థాలే.

అగ్రహారం గ్రామంలో రామచంద్రుడిని వెలివేస్తారు. సామాజిక బహిష్కరణ ఎంత దురన్యాయమో ఎంతటి రాజ్యాంగ విరుద్ధమో అప్పట్లో బడుగు బలహీనవర్గాల్లో అవగాహన లేకపోవడంతో ఊరిపెద్దలు ఎంత సాఫీగా ఇలాంటి తీర్మానాలు చేసేవారో ఈ కథ ద్వారా అర్థమవు తుంది. 'వెలి'కి గురైన రామచంద్రుడు తనకున్న 20 పందుల్ని, ఎనిమిదేళ్ళ కొడుకు, భార్యను తీసుకొని వేరే ఊరు వెళ్ళి అక్కడైనా బాగా బతుకు దామనుకుంటే ఆ ఒక్క రోజులోనే అతని ఆశలన్నీ భగ్నమైపోతాయి. ఆ ఊరి మనసబు పొలంలో ఎరువులు తినేసాయన్న కారణంతో మనసబు గారి హరిజన పాలేరు పందుల్ని కొట్టి చంపే స్తాడు. కొబ్బరి తోటల్లో రక్షణ కోసం పెట్టిన బ్లేడ్లుకు కొడుకు బలైపోతాడు. ఆ గ్రామం కూడా మరో గ్రామానికి తరళి వెళ్తాడు రామచంద్రుడు. ఆ గ్రామంలో అగ్రవర్ణ బ్రహ్మచారి రైతు రామచంద్రునికి ఆశ్రయమిస్తాడు ఫలితంగా ఆ రైతు ఇంటికి పై కులస్తులు నిప్పు పెట్టి చంపుతారు. రామచంద్రుడు, అతని భార్య ఆశ్చర్య పోతారు.

కుల సమస్య ఏ ఊరు వెళ్ళినా ఉంది. ఎక్కడికి వెళ్ళినా రూపాయికి పదహారు అణాలైనట్లు కుల సమస్య సామాజికంగా నిమ్నవర్గాలను అణగదొక్కుతోంది.

స్మశానం దున్నేరు నవల కూడా ఇదే అగ్రహారంలో జరుగుతుంది. అదే పెద్దరెడ్డి గ్రామపెద్ద. మాలపల్లిలో 30 మాలకుటుంబాలు నివసిస్తుంటాయి. వాళ్ళంతా పెద్దరెడ్డి మీదే ఆధారపడి జీవిస్తుంటారు. దళితుల స్మశాన వాటికలో 5 ఎకరాలు సాగులోకి తెద్దామని పెద్దరెడ్డి ఆదేశిస్తే బాధపడాల్సిన దళితులు మరింత పనిదొరికిం దని సంతోషించడం వారి అమాయకత్వానికి, అజ్ఞానానికి

కారణం. ఆ స్మశానంలో దున్నుతుంటే వాళ్ళకు బంగారు కాసులకుండ దొరుకుతుంది. ఆసాగు చేస్తున్న వారిలో ..... తెగకు చెందిన వీరభద్రునికి మిగిలిన మాలవారికి తగువైనప్పుడు వీరభద్రుడు సాంఘికబహిష్కరణకు గురికావడం జరుగుతుంది. వీరభద్రుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడన్న నెపంతో అతని భార్య కూతురుని బలాత్కరించడమే గాకుండా అతని ఇంటిపై దాడి చేసి అతణ్ణి చితక్కొట్టుతారు. పోలీసులు కేసు కట్టి కోర్టులో కేసు నడుస్తుంటే పెద్దరెడ్డి తనకు కాసుల వ్యవహారం ఏమి తెలియదని తప్పించుకొంటాడు. హరిజనులు పదేళ్ళు జైలుశిక్ష అనుభవిస్తారు.

ఇంతక ముందు ఏ రాయలసీమ గ్రామంలోనైనా మొత్తం గ్రామం ముఖ్యంగా హరిజనులు ఒక పెద్ద భూస్వామిపై ఆధారపడటం సాధారణంగా కనిపించే విషయం. ఈ రెండు నవలల్లోను చిత్తూరు జిల్లా సాంఘిక జీవితం, అణచివేత ధోరణి, అణచివేతకు గురి కాబడుతున్న మాలవాళ్ళలో విభజన కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఈరకం గ్రామీణ నిర్మాణంలో ప్రభుత్వ యంత్రాంగం, ఉద్యోగుల ప్రవర్తన ఎలా ఉంటాయో కూడా ఈ రెండు నవలల్లో మనకు బాగా కనిపిస్తుంది. ''మా గోడు మీ యట్టా... పట్టకపోతే ఇంగెవరు వింటారు సామి.

కలిగినోళ్ళు మమ్మల్ని నమ్మించి నమ్మించి మా గొంతులు కోస్తా వుంటే మేమెవర్తో చెప్పుకోవాల సామీ'' అనే రామచంద్రుడి ఆర్తనాదానికి వచ్చిన ఆఫీసర్ల సమాధానం ''ఆ సోదలన్నీ చెప్పి మాకు తలనొప్పి పెట్టద్దు... ఏ గ్రామానికి పోయినా యీ కథలే ఎవరిని కదిలించినా ఈ ఏడుపులే. ఆ ఏడుపులన్నీ వినడానికి మేమిప్పుడు రాలేదు'' (ఇన్‌క్రెడిబుల్ గాడెన్). ఏ గ్రామంలో అయినా ఆఫీసర్లు మరోలా ఉండరనికూడా ఇక్కడి సూచన. అలాగే ఈ రెండు నవలల్లోనూ ప్రజల చూసే సత్యానికి కోర్టు తీర్పుకి మధ్య ఉన్న అంతరానికి అద్దం పట్టిన సన్నివేశాలు చాలా కనిపిస్తాయి.

తెలుగు సాహిత్యంలో జానపద ఇతివృత్తంతో సంచలనం సృష్టించిన నవల మునెమ్మ. పాటి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి చేత ఉత్తమ నవల బహుమతి పొందిన ఈ నవలికలో ఒక స్త్రీ పాత్రను కేంద్రంగా చేసి భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న మహిళల జీవితాలను సృష్టించారు. స్త్రీలను అర్థం చేసుకోవడంలో పురుషులు ఏ విధంగా వైఫల్యం చెందుతున్నారో ఈ నవల ఆవిష్కరిస్తుంది. ఈ నవల అంతా మాతృస్వామ్యంపై పితృస్వామ్యం పెత్తనం చెలాయించే వికృత స్వరూపాన్ని వివరించారు.

మునెమ్మ జయరామిరెడ్డి భార్యా భర్తలు వారిద్దరు ఆరుయేండ్లు కాపురం చేసారు. వాళ్ళు ఒక రోజు పొలంలో పనిచేస్తున్నప్పుడు బొల్లిగిత్త తన రెండు కాళ్ళు పైకెత్తి మునెమ్మ పైకి వస్తుంది. అది గమనించిన భర్త బొల్లిగిత్తను కక్షతీరా కొట్టి దాన్ని అమ్మెయాలనుకుంటాడు. అమ్మడానికి పశువుల సంతకి వెల్లిన జయరామిరెడ్డి హత్యకు గురికాబడుతాడు. ఆయన హత్యకు కారణమైన వాళ్ళను మునెమ్మ వెతికి బొల్లిగిత్త సహాయంతో చంపడం కథలోని ఇతివృత్తం. మహిళా చైతన్యానికి ప్రతిరూపం ఈ మునెమ్మ నవల అని చెప్పవచ్చు.

ఆయన రాసిన 'మూగవాని పిళ్ళిన గ్రోవి' రైతుకు భూమికి మధ్య ఉండే అవిచ్ఛిన్న అనుబంధ నాదాన్ని వినిపించిన రచన. ఆయన రాసిన 'చివరి గుడిసె' నవలలో యానాదులంతా పేదలు, భలహీనులు భూముల్ని అన్యాయంగా పోగొట్టుకున్నవారు. ఇంతగా దగా పడిన వారి జీవితంలో ఎవరూ ఉండరు. కాని వారిని దొంగల జాతిగా ముద్రవేసి రికార్డుల్లోకి ఎక్కించిన సర్కారు దాష్టికాన్ని ప్రశ్నిస్తాడు కేశవరెడ్డి.

కులవృత్తులు ధ్వంసం అయిపోతున్న... 'రాముడుండాడు... రాజ్యం వుండాది' నవలలో కేశవరెడ్డి పతనమవుతున్న కులాలు మాత్రం నాశనం అవుతున్న దాకలాలు లేవని ఈ నవల వివరిస్తుంది.

ముగింపు :

కేశవరెడ్డి ప్రతి నవలలోనూ సామాన్యుల జీవితాన్ని సామాజిక స్పృహతో రచనలు చేసిన రచయిత. అందుకే ప్రఖ్యాత కథా రచయిత గోపిని కరుణాకర్ "కేశవరెడ్డి గారు మాములు రచయిత కాదు పాఠకుల్ని వెలిగించే రచయిత" అని చమత్కరిస్తాడు. అయిన రచనలు చదివితే మన చుట్టూ ఉండే సమాజం కనిపిస్తుంది. మన జీవితాన్ని మనం తవ్వుకోవడాన్ని ప్రారంభిస్తాం. అయిన నవలలు చదివన, మాట్లాడిన, ఆలోచించిన తెలుగు సాహిత్యంలో రాయలసీమ ముఖ్యంగా చిత్తూరు జిల్లా గ్రామీణ నేపథ్యం సంస్కృతి కనిపిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. అతడు అడవిని జయించాడు - డా॥. పి. కేశవరెడ్డి
2. ఇన్‌క్రెడిబుల్ గాడెస్ - డా॥. పి. కేశవరెడ్డి
3. స్మశానం దున్నేరు - డా॥. పి. కేశవరెడ్డి
4. మునెమ్మ - డా॥. పి. కేశవరెడ్డి
5. రాముడుండాడు - రాజ్జివుండాది - డా॥. పి. కేశవరెడ్డి
6. చివరిగుడిసె - డా॥. పి. కేశవరెడ్డి
7. ప్రతిభావైజయంతి - ప్రత్యేక సంచిక
8. విభాత సంధ్యలు - డా॥. సి.వి. సుబ్బారావు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అగ్గిపుల్లల నవలిక – విద్యార్థుల జీవనశైలి

– డా॥. డి. సత్యలత, తెలుగు శాఖాధ్యక్షులు హిందూ కళాశాల, మచిలీపట్నం.

అగ్గిపుల్లల నవలిక 1956లో స్వాతి మాసపత్రికలో అనుబందంగా వచ్చింది. రచయిత డా॥ చందు సుబ్బా రావు. వీరి జన్మస్థలం గుంటూరుజిల్లా. తెనాలిలో వున్న చదలవాడ గ్రామం వీరు 1946 మే 18వ తేదీన శ్రీమతి రాజ్యలక్ష్మీ వెంకట సుబ్బయ్య అనే దంపతులకు జన్మిం చారు. ప్రాథమిక విద్య, కళాశాల విద్య పూర్తి చేసుకొని ఆంధ్రా యూనివర్శిటీలో ఎమ్.ఎస్.సి. చదివిన జియో ఫిజిక్స్ డాపార్ట్‌మెంట్‌లోనే స్కాలర్‌గా చేసి, "గ్రౌండ్ వాటర్ జియో - ఫిజిక్స్" అనే అంశం పరిశోధన ప్రారంబించారు. అందులో భాగంగా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, సి.యస్.ఐ.ఆర్. నుండి పొందారు. "భూగర్భ జలాలు" అనే అంశం పై పరిశోధన చేసి 1974లో డాక్టరేట్ పట్టా పొందారు. అదే సంవత్సరం లెక్చరర్‌గా జీవితం మొదలై రీడర్‌గా పదోన్నతి పొంది 1993లో ప్రొఫెసర్ అయ్యారు.

వీరు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్‌కు డిప్యూటీ డైరెక్టర్‌గా సైన్స్ & టెక్నాలజీకి అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా అసిస్టెంట్ కో ఆర్డినేటర్‌గా జియోఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఛైర్మన్‌గా బోర్డ్ ఆఫ్ స్టడీస్ గాను, జియో ఫిజిక్స్ శాఖాధిపతిగా అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షల డీన్‌గా పనిచేశారు. దేశ విదేశాలలో ఎన్నో సెమినార్లు వర్క్ షాపుల్లో పాల్గొన్నారు. వివిధ రకా లైన సంస్థలలో సభ్యత్వం వున్నది. పరిశోధనా సంబంధ మైన వ్యాసాలు చాలా పుస్తకాలు, నవలికలు రాశారు. యు.జి.సి. సహకారంతో 6 ప్రాజెక్టులు చేశారు. అంశము మీదనైనా వీనులవిందుగా ఉపన్యసించగల దిట్ట ఆచార్య చందు సుబ్బారావు.

ప్రజల జనజీవితంలో పెనవేసుకుపోయి అంతో ఇంతో అక్షర జ్ఞానం గల వారికి మిక్కిలి చేరువై సామాజిక చైతన్యంతోబాటు విజ్ఞాన వికాసానికి ఎంతో తోడ్పడగల ప్రక్రియ నవల దీనిని ఇంకా అభివృద్ధి చెందించాలన్న ఉద్దేశ్యంతో ఆంధ్రా యూనివర్శిటీ నేపథ్యంగా ఇతి వృత్తాన్ని గ్రహించి రాసిన నవలలు చాలా ఉన్నాయి. వీటిలో అగ్గిపులల నవలిక ఒకటి.

అగ్గిపుల్లలు అనే ఈ నవలిక 1976లో వ్రాశారు. ఇతి వృత్తం ఆంధ్ర విశ్వ విద్యాలయంలో విద్యార్థులు నేపథ్యంగా జరిగినది. ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన విశ్వ విద్యాలయములో మంచి పేరు ప్రతిష్టలున్న విద్యా లయం ఆంధ్ర విశ్వ విద్యాలయం డిగ్రీ అయిన తరువాత ఉన్నత చదువుల కోసం విద్యార్థులు యూనివర్సిటీకి వచ్చి చక్కగా చదివి తమ జీవితాన్ని శోభాయమానంగా తీర్చి దిద్దుకుంటూరు. అలాగే ఆకడమిక్ ఇయరంతా సరదాగా కాలక్షేపం చేసి ఇంటికెళ్ళిన వారు ఉంటారు. అయితే యూనివర్సిటీలో చేరే విద్యార్థుల మనస్తత్వం, ప్రవర్తన గురించి బుద్ధిమంతులు, అకతాయిలు, తాత్కలిక తర్కరహిత ఆవేశాలు, ఈష్యాసుయాలు ప్రణయాలు, హాస్టల్ కోలాహలం, యూనియన్ ఎన్నికలు రాజకీయాలు ఇలా ఎన్నో విశేషాల్ని ఈ నవలిక ద్వారా వివరించిన చందు సుబ్బారావు గారిని గొప్ప మానసిక శాస్త్రవేత్తగా చెప్పవచ్చు.

ఇతివృత్తం:

ఈ నవలికలో యం.ఏ. తెలుగు విద్యార్థి శేఖర్, యం.యస్.సి., బోటనీ విద్యార్థి సుధారాణి ప్రేమించు కుంటారు. విద్యార్థులు సెమిస్టర్ పరీక్షా పద్ధతి ఎత్తి వేయాలని సమ్మె చేస్తారు. యూనియన్ ఎన్నికలు జరుగు తాయి. కబుర్లు కాలక్షేపాలతో విద్యా సంవత్సరం గడిచి విద్యార్థులంతా ఏకాగ్రతతో సిద్ధమవుచుండగా సుధారాణి ఆత్మహత్య ప్రయత్నం చేస్తుంది. డాక్టర్లు ఆమెను బ్రతికి స్తారు. తరువాత శేఖర్ సుధారాణిల పెళ్లితో కథ సుఖాంత మవుతుంది.

ఈ నవలికలో విద్యార్థుల జీవన శైలి – విశ్లేషణ :

అకడమిక్ ఇయర్ ప్రారంభంలో విద్యార్థుల కాలక్షేపం గూర్చి రచయిత చాలా నిశితంగా పరిశీలించారనడానికి ఉదాహరణగా 11గంటలు దాటుతున్న కొందరు నిద్ర పోతూ, కొందరు ఓపికున్నంత వరకు గ్రూపులుగా రూములోన్ను, బెంచీల పైన కూర్చుని కబుర్లు చెప్పు కుంటుండగా, ఎక్కడో ఒక గదిలో రేడియో వినిపిస్తుంది. భారతీయ స్టేషలన్ని అయిపోయాక జపానులో జాంబియాదో సంగీతం వినిపిస్తుంది.

విద్యార్థులు చదువుకొనే తీరు :

చూస్తే రచయిత విద్యార్థి దశలో తన తోటి విద్యార్థ లను క్షుణ్ణంగా పరిశీలించారనేది గమనించవచ్చు. పాపం రాత్రంతా నిద్రపోయి చాలా అలసిపోయినట్లు మెల్లగా మేల్కొంటుంది హస్టల్, కొందరు విద్యార్థులు బుద్ధి మంతుల్లా తెల్లవారు జామున లేచి పుస్తకాలు ముందేసు కొని కూర్చుంటారు. వీళ్ళకే యూనివర్సిటీ ఫస్టులోస్తాయని గ్యారంటీ ఏమి లేదు. ఈ వర్గానే మిగత విద్యార్థులు రుబ్బువీరుడు, పిడి బ్రహ్మ, పిడి శాస్త్రి అని పిలుస్తుంటారు.

వీళ్ళగదులు కూడా పేర్లుంటాయి:

అదిగో ఆ గది నెం.164 దాని పేరు తాజ్‌మహాల్ అందులో క్రికెట్ ఆడే కిరణ్ ఉంటాడు. రంజీట్రోపి టెస్టు మ్యేచ్ అంటుంటారు. ఆ పక్కరూమ్ స్వీట్‌హోమ్, ఇందులో కాపురముండే బుచ్చిబాబుకు సంగీతం పిచ్చి ఎక్కడెక్కడ రికార్డులు, ఎల్ పిలు, పాపి మ్యూజిక్కు లుంటాయి. అతని రూమ్ పక్కగా వెళేళవారుత. నడుముపుతూ వెళ్లుతుంటారు. నయాగారాలో రాజకీయ శాస్త్రి అతని హృదయము, మనస్సు రాజకీయాలే. ఆ ప్రక్కనే క్రాంతినికేతన్‌లో "లా" లా వెంకట్రావు ఉంటాడు. ఇతడు మంచి మంచి పుస్తకాలు చదివి చర్చిస్తుంటాడు. సోషలిజమ్, సెక్యులరిజం అభ్యుదయం, శాంతి అంటుం టారు. డేవిడ్ రూమ్ 'పేరడైజ్' (లాస్టు) అని బ్రాకెట్లో రాసారెవరో "వీనస్"లో రామం బాడీ బిల్డింగ్ వస్తాదు. అతని గది నిండ కండరాలు తిరిగిన వాళ్ళు బొమ్మలుం టాయి ఇంకా రేఖా, హేమమాలిని, జయమాలిని లాంటి శరీరపుష్టిగల అమ్మాయిల బొమ్మలుంటాయి. కొందరు గదుల్లో 3/4వ వంతు నగ్న సుందరీల చిత్రాలుంటాయి. ఈ రీతిగా విద్యార్థుల రూమ్‌లు, వాళ్ళ హాబీలు, ఆలోచనా విధానాలు వుంటాయి. రచయిత వీళ్ళందరినీ సజీవ పత్రాలుగా మనముందుంచారు.

అలాగే విద్యార్థుల మధ్య జరిగే రసవత్తర సన్నివేశాలకి కూడా ఈ నవలికలో అక్షరం రూపం కనిపిస్తుంది. రాజ కీయ, సాంఘీక, సాంస్కృతిక ఆర్థిక సాహిత్య చలన చిత్ర రంగాలన్నిటిలో తమ శక్తిమేర సమీక్షించి, హస్టల్ గోడలు వేడెక్కిపోయేలా మాట్లాడు కుంటారు. అలాగే విద్యార్థుల హాస్టల్‌కి కొంత మంది అమ్మాయిలు అడుగుపెట్టినప్పుడు కొంతమంది ఆకతాయిలు ప్రవర్తించే తీరు కూడా రచయిత చిత్రించారు. వాళ్ళను చూచి ఈలలు, కూతలు పరిపాటి. కానీ వాళ్ళెవరు ఇన్‌వైట్ చేయందే రారు. ఇన్‌వైట్ చేసినవారు వాలీబాల్‌ప్లేయర్, బాడీబిల్డిర్ అయ్యుంటే ముక్కుబద్ధలు కొడతాడు. అంతేకాక

(Hai Black Beauty, Hai Red Saree)అని పలకరించినా సామాన్యంగా ఆడపిల్లలు పట్టించుకోరు. పైగా నవ్వుకుంటారు. అల్లరిలేందే ఆనందమేముంటుంది. కాకుంటే అప్పుడప్పుడు శృతి మించి ఒక్కో అమ్మాయి మనస్సుకు గులకరాళ్ళ దెబ్బ తగలుతుంది. ఈ విధంగా ఈ నవలికలో అల్లర్లు ఆనందాలు విద్యార్థి దశలో ఇవన్ని సహజం అని తెలియజేసారు రచయిత. చదువు విషయంలో విద్యార్థులకు నచ్చని వాటికి ఏ రీతిగా ప్రతిఘటిస్తారో గమనించవచ్చు. "సెమిస్టర్ సిస్టమ్"లో లోపాలున్నాయని నాన్ సెమిస్టర్ పద్ధతి ప్రవేశ పెట్టమని విద్యార్థులంతా (Down with Semister system)అని నినాధాలిస్తూ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళతారు. రిజిస్ట్రారు విద్యార్థి నాయకుల కోర్కెలు విని ప్రిన్సిపాల్‌తో సమా లోచన చేసి, ఈ విషయం చాలా కష్టమయినదని దీనిని వెంటనే మార్చలేమని చెప్పారు. ఈ విషయంలో పద్ధతి ఏమంటే ముందుగా ప్రతి డిపార్టుమెంట్‌తో చర్చించాలి.

హెచ్చు తీర్మానించాలి. ఆ తీర్మానాన్ని ఎకాడమిక్ కౌన్సిలింగ్ అంగీకరించాలి. ఆ తీర్మానం సిండికేట్ అప్రూవ్ చేయాలి. వైస్ ఛాన్సులర్ కూడా సుముఖంగా ఉండాలి. అప్పుడు సెమిస్టర్ పద్ధతి రద్దు చేయవచ్చు. అంతే కాని వెంటనే జరుగదు.

ఇక యూనివర్సీటీలు ఎన్నికల ఘట్టం :

'మిగిలిన యూనివర్సీటీల మాటేమోగానీ ఆంధ్ర యూనివర్సిటీలో జరిగే విద్యార్థుల ఎన్నికలు ఒక ప్రత్యేక పద్ధతిలో జరుగుతాయి. కాలేజీ స్థాయిలో పేనల్ విధానం ఒకటుంది. డిపార్టుమెంట్ స్థాయిలో పేనల్ విధానం ఉండవచ్చు ఉండకపోవచ్చు కాలేజీ స్థాయిలో పోటీ చేస్తున్న విద్యార్థులు పేనల్సుగా ఏర్పడి, ప్రతి డిపార్టు మెంటుకు ప్రతి క్లాసుకు వచ్చి వారి అధ్యక్ష అభ్యర్థుల చేత ఉపన్యాసాలిప్పిస్తారు. మగవాళ్ళు ఆడవాళ్ళ హస్టల్‌కి వెళ్ళి ముమ్మరంగా ప్రచారం చేస్తారు. ఎలక్షన్ ముందు రోజు బహిరంగ స్థలంలో అభ్యర్థులందరికి డిబేటింగ్ పోటీ జరుగుతుంది. ప్రిన్సిపాల్ ఆ సభకు అధ్యక్షత వహిస్తారు. ఒక ట్రాఫిక్ ఇవ్వబడుతుంది. దాని మీద పది నిమిష ములు మాట్లాడాలి. ప్రతి అభ్యర్థి ఆ టాపిక్ మీద మాట్లాడ తారు. యాభైశాతం విద్యార్థులు ప్రచారానికి గ్రూపిజానికి, కుల మత, వర్గ, వర్ణ ప్రాబల్యానికి లోనై ఎవరికి ఓటు వెయ్యాలో నిర్ణయించుకుంటే మిగతా యాభైశాతం చివరిరోజు డిబెట్ ఉపన్యాసంతో మారిపోతారు. ఆ తరువాత ఎన్నికల జయపజయాలు మరో వారం రోజు లకు హస్టల్ యూనియన్ ఎన్నికలు వాటితో పాటు మెస్సు సెక్రటరీ ఎన్నికలు డిపార్టుమెంటు వారు అధ్యక్ష కార్యదర్శి ఎన్నికలు ఈ రీతిగా యూనివర్సిటీ విద్యార్థుల యొక్క సంవత్సరములు జరుగుతాయి. సామాన్యులకు తెలియని ఎన్నో విషయాలు ఈ నవలికలో ఉన్నాయి. ఈ నవలికను చదివినట్లుయితే యూనివర్సిటీలలో చదువుతో పాటు అన్ని రకాల ఔత్సాహిక కార్యక్రమాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. నాయకత్వ లక్షణాలు సామాజిక స్పృహను కలిగియుండి భవిష్యత్తులో మంచి నడవడిక కలిగిన పౌరుడిగా కూడా తయారవవచ్చు.

ఈ నవలికలో విద్యార్థుల జీవన శైలి :

శేఖర్ - సుధారాణి, కండలు తిరిగిన విగ్రహంతో అందంగా కనిపించే శేఖర్ ఎప్పుడు అమ్మాయిలతో షికార్లు, పిక్‌నిక్‌లతో కాలక్షేపం చేస్తుంటారు. బాగా డబ్బున్న వాడవటం వల్ల అమ్మాయిలు వెంటపడుతుంటారు. సుధారాణిని స్కూటర్‌పై ఎక్కించుకుని తిరుగుతుంటాడు. అతని రూమ్మేటు ప్రసాద్ మాటలను బట్టి "శేఖర్‌గాడు ... వెధవ చూడు ఎన్ని దిండ్లు పై పడుకొని నిద్రపోతు న్నాడో ఇక్కడున్న అమ్మాయిలు చాలక వెధవకు వారానికో ప్రేమలేఖ వస్తుంది. ఒకళ్ళు కజిన్ ఒకళ్ళు సిస్టర్ అంటూ బర్తడే ప్రజంటేషన్స్ పంపుతుంటాడు. పండక్కి పబ్బానికి రంగల గ్రీటింగ్స్ వాటిలో ఏమిటేమిటో డిజైన్లు వచ్చినాని కవితలు ... వలపులు. అంటు శేఖర్ అదృష్టవంతుడంటూ ఒక్కోసారి ఈర్ష్య పడుతుంటాడు. శేఖర్‌లో అమలిన ప్రేమ కంటే తొందర పాటే ఎక్కువ. సెలవుల్లో సుధా రాణితో సింహాచలం వెళ్ళి రెండు మూడు రోజులు గడిపి వస్తాడు. తన రూమ్‌కి తీసుకువెళ్ళతాడు. ఈ విషయాలు అందరికీ తెలుస్తాయి. లేడీస్ హాస్టల్ వార్డెన్ నీ ప్రవర్తన మార్చుకోకపోతే ఇంటికి పంపేస్తానని సుధారాణికి వార్నింగ్ ఇస్తుంది. లలిత లాంటి మిత్రులు సూటీపోటి మాట లనడం, పరీక్షలు దగ్గరకు రావడంతో మానసిక ఆందోళనకు గురియై ఆత్మహత్యకు ప్రయత్నిస్తుంది సుధారాణి. విద్యార్థులందరూ ఏకాగ్రతతో పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో సుధారాణి ఆత్మహత్య చేసుకొందన్న వార్త యూనివర్శీటి మొత్తాన్ని కుదిపి వేసింది. బోటనీ డిపార్టుమెంటు ప్రొఫెసర్లు, స్టాఫ్‌తో బాటు విద్యార్థులంతా హాస్టల్ దగ్గరకు చేరుకుంటారు. చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న సుధారాణిని బ్రతికిస్తారు డాక్టర్లు. ఈ సంఘటనతో భయపడిపోయిన శేఖర్ పరీక్షలు రాయడం మానేస్తాడు. సుధారాణి బ్రతకడంతో తన స్నేహితులయిన ప్రసాదు, వెంకట్రావు, శాస్త్రి, డేవిడ్ సహకారంతో ఈ గండం నుండి బయటపడి,

సుధారాణి తల్లిదండ్రుల అంగీకారంతో ఆమెను పెండ్లి చేసుకోవటానికి నిశ్చయించుకుంటాడు.

ఈ నవలలో శేఖర్ యూనివర్శిటీ జీవితాన్ని ఆనందంగా గడుపుతూ భవిష్యత్ విషయంలో బాధ్యతా రహితంగా వ్యవహరించినప్పటికీ చేసిన తప్పులన్నీ సరిదిద్దుకుని ఉన్నతమయిన విలువలకు కట్టుబడిన వ్యక్తిగా కనిపిస్తాడు. అంతేకాక ప్రసాదు పేదవాడని అతనికి ఏదైనా ఉపాధి చూపాలనుకున్న స్నేహశీలి. సుధారాణిని మోసం చేయాలనుకోలేదు గానీ జీవితంలో సెటిలయ్యాక పెండ్లాడాలనుకున్నాడు.

ఈ నవలికలో ఆదర్శపాత్ర ''లా'' వెంకట్రావు మంచి పుస్తకాలు చదివి చర్చిస్తాడు, ఉపన్యాసాలిస్తాడు. సెమిష్టర్ సిస్టమ్ ఎత్తివేయాలని సమ్మె చేస్తున్న సమయంలో యూనివర్శిటీలో అధికారుల మాట మీద కొంతకాలం సమ్మె వాయిదా వేయడానికి అధికారులకు విద్యార్థులకు సమరస్యం కుదురుస్తాడు. అంతేగాకా హాస్టల్ మెస్‌లో ఒకసారి గొడవ జరిగినప్పుడు శేఖర్ దురుసుగా ప్రవర్తించి అవమానపర్చినప్పటికి అవేమీ దృష్టిలో పెట్టుకోక సుధారాణి ఆత్మహత్య విషయంలో శేఖర్ డీలా పడినప్పుడు అతనికెంతో ధైర్యాన్నిచ్చి తన విజ్ఞతను ప్రదర్శించిన ఉత్తమ విద్యార్థి వెంకట్రావు.

రచనా విశేషాలు :

రచయిత భావాలకు రూపకల్పన రచన అయినప్పుడు తానొక సంపూర్ణమయిన కళాఖండంగా తీర్చిదిద్దడానికి తన శక్తియుక్తుల్ని ఉపయోగిస్తాడు. ఈ ప్రయత్నంలో తనలోని ప్రతిభ, నేర్పరితనం, అనే గుణాలు బయటి కొస్తాయి. వీటిని రచన విశేషాలనవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే శిల్పి శిల నుండి అద్భుతమయిన శిల్పాన్ని చెక్కినట్లు రచయిత తాను తీసుకున్న ముడి వస్తువు లేదా కథా తన కథాకథన సామర్థ్యంతో వర్ణన కౌశలంతో పాత్ర చిత్రణ, తన ప్రతిభాను భావాలతో రచనను పాఠకులకింపయిన రీతిగా తయారు చేయడంలో తన ప్రత్యేకతను చూపిస్తాడు. పాఠక సమాజంలో తనకొక స్థానం సంపాదించుకుంటాడు.

నవలికలో శీర్షిక :

నవల శీర్షికను బట్టి నవలలోనికి ఇతివృత్తాన్ని అంచనా వేయవచ్చు. నవలలోని విషయానికి శీర్షిక ప్రతిబింబం. ఆ శీర్షిక నిర్ణయమే పాఠకుళ్ళో పఠనాశక్తిని పెంచుతుంది. రచయిత వస్తువును ఆధారం చేసుకుని ఈ నవలికకు ''అగ్గిపుల్లలు'' అను శీర్షికను స్థిరపరిచారు. అగ్గిపుల్లలు మంచి పనులకు ఉపయోగించవచ్చు. విధ్వంస కార్య క్రమాలకు ఉపయోగించవచ్చు. విద్యార్థి దశను రచయిత అగ్గిపుల్లలతో పోల్చారు. విద్యార్థులు సక్రమ ప్రవర్తన కలిగి ఉంటే అది విద్యాలయాలకి సమాజానికి మంచిది. లేకపోతే రెండిటికి నాశనమే అని తెలియజేసారు.

ఇతివృత్తం :

నవల రచనలో కీలకమైన అంశం ఇతి వృత్తం. అదే రచనకు కేంద్రం. ఈ నవలికలో చదువకోవడానికి వచ్చిన విద్యార్థులు భిన్నమనస్తత్వాలతో కూడిన విభిన్న ప్రవర్తనల్ని ఇతి వృత్తంగా తీసుకున్నారు రచయిత.

కథాకథనం :

కథ చెప్పే తీరును కథనం అనవచ్చు. రచయితకున్న ప్రజ్ఞ, అనుభవం, ప్రత్యేకతన్ని అనుసరించి ఆ కథనం తీరు ఉంటుంది. సుబ్బారావుగారి కథనమంతా పరాశ్రయ పద్ధతిలోనే నడిచింది. ఈ పద్ధతిలో రచయిత ప్రథమ పురుషుల్లో కథ నడిపించారు. ఈ నవలికలో యూనివర్శీటీ హాస్టల్ మగపిల్లలు నిద్రపోవడంతో కథనం ప్రారంభమవు తుంది.

పాత్రపోషణ :

పాత్ర చిత్రణ నవలకు జీవం వంటిది. పాత్రను ఎన్ను కోవడం వాటి ప్రవర్తనల్ని అక్షర బద్ధం చేయడంలో చందూ గారిది ఒక ప్రత్యేక పద్ధతి. సాధారణంగా పాత్రలతోపాటు ఉదాత్త మరియు ఆదర్శ పాత్రల్ని సృష్టించారు. ఈ నవలికలో ఆదర్శపాత్ర ''లా'' చదివే వెంకట్రావు.

సంభాషణలు :

ఈ నవలికలో సంభాషణలు పాత్రలగుణ, శీల విశేషాల ద్వారానే వ్యక్తి చేస్తారు.

వర్ణనలు :

దీనిలో కథతో పాటు వర్ణనలకు ప్రాధాన్యతుంది. వర్ణనలన్నీ వాచార్థ్యం కోసం పుట్టినవి. వర్ణనల వలన నవలకు సహజత్వం సిద్ధిస్తుంది. పాఠకుడికి విసుగు పుట్టించే దీర్ఘమయిన వర్ణనలు ఈ నవలికలో లేవు. దీనిలో యూనివర్శిటీ ప్రదేశాలు ఆహ్లాదకర వాతావరణ వర్ణనలు పాత్ర స్వాభావాలు వర్ణించబడ్డాయి.

భాష - శైలి :

రచయిత శిల్పి ప్రావీణ్యం భాష మీద ఆధారపడి ఉంటుంది. ఈ నవలికలో ప్రయోగించిన భాషా విశేషల్ని పరిశీలిస్తే ఇతి వృత్తాన్ని బట్టి వచ్చే సన్నివేశాలు, ప్రాంతాన్ని బట్టి (మాడలికం) వాటికి అనుగుణమయిన రీతిలో పద ప్రయోగం జరిగింది. వ్యవహారిక భాషనే సందర్భోచితంగా వాడారు రచయిత. యూనివర్సీటీకి సంబంధించిన పద జాలాన్ని ప్రయోగించారు. ఈయన శైలి మృదు మధుర మైన శైలి.

ప్రారంభ ముగింపులు :

ఏ రచనకైనా ప్రారంభ ముగింపులు ఎంతో ముఖ్యం. ఆరంభం ఎంత ఆసక్తిగా ఉంటే పాఠకుడు రచన పట్ల అంతగా ఆకర్షితుడవుతాడు. ముగింపు ఎంత సొంపుగా ఉంటే అంతగా పాఠకుడి హృదయంలో ముద్రవేసు కుంటాడు. ఈ నవలలో కథ ప్రారంభించడంలోనూ ముగించడంలోనూ రచయిత తనదంటూ ఒక ప్రత్యే కతను కనబరిచాడు. ఈ నవలిక యూనివర్సీటీ విధ్యార్థు లకు సంబంధించినదవటం వల్ల హస్టల్ వాతావరణంలో కథ ప్రారంభమవుతుంది. విద్యార్థులు తమ చదువు పూర్తి చేసుకొని యూనివర్సీటీ విడచి ఎవరిళ్ళకు వారు వెళ్ళాల్సోస్తున్నందుకు బాధపడుతూ భారమైన హృదయా లతో ఇంటి ముఖం పట్టారనడంతో కథ ముగించారు. ఈ రీతిలో ఒక విద్యాలయానికి, సమాజానికి, సాహిత్యానికి సన్నిహిత సంబంధాన్ని కలిగించే నవలికలను పాఠక సమాజానికి అందించిన రచయిత డా॥ చందు సుబ్బారావు గారు తెలుగు నవలా సాహిత్యములో తనదైన విశిష్టతను విలక్షణతను వ్యక్తపరచి, ప్రముఖ నవలాకారుల సమున్నత స్థాన్నాని సంపాదించియున్నారు.

పరిశీలన గ్రంథాలు :

1. హిమపుత్రి నవలికలు - డా॥ చందు సుబ్బారావు
2. బలివాడ కాంతారావు నవలలు - ఒక పరిశీలన డా॥ గజ్జా యోహాను బాబు
3. హిమపుత్రి నవలికి సంకలనం - ధృక్పధ పరిశీలన - డా॥ డి. సత్యలత

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలంగాణ కథలు – సామాజిక జీవన చిత్రణ

– డా॥. డి. విజయకుమారి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సమాజం, సాహిత్యం రెండు విడదీయరానివి. సాహిత్యం సమాజానికి ప్రతిబింబంవంటిది. సాహిత్యంలో వెలువడిన వివిధ ప్రక్రియలను పరిశీలించినట్లైతే, సమాజంలో మానవ జీవనపరిణామం, సంస్కృతి, సంప్రదాయాలు, భాష మొదలైన విషయాలు వెల్లడి అవుతాయి.

ఎఫ్.హెచ్.గిడ్డింగ్స్ (F.H.Giddings) సమాజం గురించి ఈ కింది విధంగా నిర్వచించారు. "సాముదాయిక మైన ప్రయోజనాల కోసం, అభిప్రాయ సామరస్యమున్న వ్యక్తులు ఒకరినొకరు గుర్తించి కలసిమెలసి పనిచేయడానికి ఏర్పడిన గుంపును సమాజమంటారు.

(కృష్ణకుమారి, నాయని, 2000. పుట : 2)

ఈ విధంగా ఏర్పడిన సమాజంలోని ప్రజలు ఇచ్చి పుచ్చుకునే లక్షణం కలిగి ఉంటారు. వీరు ఒకరకమైన వ్యవస్థను స్థాపించడానికి కట్టుబాటు కలిగి ఉంటారు. వ్యక్తిగత ధర్మాన్ని కలిగి ఉంటారు. అనగా విభిన్నమైన విధులను నిర్వహించే వ్యక్తులుంటారు. వారందరు వ్యక్తిగత ధర్మాలను పాటిస్తు, పరస్పరం సహకరించుకుంటూ వ్యవస్థలో జీవిస్తారు. ఒక్కొక్క సమాజానికి ఒక్కొక్క సంస్కృతి ఉంటుంది. ప్రజల ఆచారవ్యవహారాలు, భాష, విద్య, కళలు, మొదలైనవి సంస్కృతిలో భాగమే. వీరి మధ్య భౌగోళిక, ఆర్థిక, రాజకీయ, మత విషయాలలో వైవిధ్యముంటుంది. ఈ వైవిధ్యం సమాజంలోని ప్రజల మధ్య పరస్పర అవగాహనకు ప్రతిబంధకంగా నిలుస్తుంది. పై విషయాలన్ని సాహిత్యంలో ప్రస్ఫుటమవుతాయి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ కథలను పరిశీలించడం జరిగింది.

చెప్పులు కథ :

చెప్పులు కథను కవుటూరు వెంకట నారాయణరావు రాశారు. ఇది 1967వ సంవత్సరంలో ఆంధ్రప్రభ వార పత్రికలో వెలువడింది. రంగయ్య అనే వ్యక్తి చెప్పులు కుడుతుంటాడు. అతని కొడుకుపేరు రమణ. ఐదుగురు పిల్లలు పుట్టి చనిపోయిన తరువాత రమణ పుడతాడు. ఆ పిల్లవాడు పుట్టినపుడే తల్లి చనిపోతుంది. అందుచేత రంగయ్య కొడుకుని అతి గారాభంగా పెంచుకుంటాడు. ఆ ఊరిలో ఒక పంతులుగారు వీధిబడిలో పిల్లలకు చదువు చెబుతుంటాడు. ఆయన రమణకు భోజనం పెట్టి, చదువును నేర్పిస్తారు. ఒకరోజు రమణ బాగా పాడయిపోయిన చెప్పులను తెచ్చి, తండ్రికిచ్చి, అవి పంతులుగారి చెప్పులని వెంటనే వాటిని కుట్టివ్వమని అంటాడు. ఆ చెప్పులను చూడగానే రంగయ్య ముఖం విప్పారుతుంది. వాటిని చేతిలోకి తీసుకుని 'మీ అయ్యోరికి ఇట్లాటి చెప్పులేడయిరా తాతముత్తాత ల్నాటియి లాగున్నాయే' అంటాడు. ఈ చెప్పుల్ని బాగుచేసే కంటే కొత్తవి కుట్టడం సులభమని రంగయ్య అంటాడు. 'అయ్యోరొద్దన్నారు ఈట్నే బాగాసేసి తెమ్మన్నాడు ఇప్పుడే గావాలంట' అంటాడు. అప్పుడు రంగయ్య నేనేదో ఒకటి చేస్తాలే, బడెగ్గొట్టి వచ్చావా అని రమణని అడుగుతాడు. కాదు ఒంటేలు గంటకొడితే వచ్చా అంటాడు రమణ. ఆ తరువాత రమణ తండ్రి దగ్గర ఐదు పైసలు తీసుకుని బడికి వెళతాడు.

రంగయ్యకు ఆరోజు చేతినిండా పనిదొరుకుతుంది. పక్కనే ఉన్న టీ బంకులో నుండి సిలోన్ పాటలు వస్తుంటాయి. రంగయ్య ఆ బంకులో పులిచారల బనీను వేసుకున్న యువకుడుకి ఒక సింగిల్ టీ చెప్పి, దానిని తాగుతాడు. ఆ తరువాత బూట్లు పాలిష్ చెయ్యడం, సైకిల్ టైర్ కుట్టడం, చెప్పులు బాగుచెయ్యడం, లాడాలు కొట్టడం వంటి పనులు పూర్తిచేసి, ఆ రోజు వచ్చిన చిల్లర లెక్క పెట్టుకుంటాడు. మొత్తం ఆరు రూపాయల ఇరవై

పైసలు వస్తుంది. వాటిని జేబులో వేసుకుంటాడు. ఆ రోజు రంగయ్యకు కొడుకు ఎలా చదువుతున్నాడో చూడాలనిపిస్తుంది. పంతులు గారి చెప్పులు తీసుకుంటాడు. అవి సాధారణ చెప్పులే అయినా రంగయ్యకు మహిమాన్వితంగా అనిపిస్తాయి. ఎందుకంటే అవి పంతులు గారివి కావడం వల్ల, వాటిని కళ్ళకద్దుకుని యీట్ని బాగుచేత్తాను కొత్త చెప్పులు కుట్టిత్తాను అనుకుంటాడు. పక్కవీధిలో ఉన్న బడి దగ్గరకు వెళతాడు. అక్కడ ఒక పెంకుటింటికి రెండు వైపుల ఉన్న అరుగుల మీద ఇద్దరు ఉపాధ్యాయులు పిల్లలకు చదువు చెబుతుంటారు. అది విన్న రంగయ్య తన్మయత్వం చెందుతాడు. రంగయ్యకు తన కొడుకు ఎలా చదువుతున్నాడో చూడాలని ఆశగా ఉంది. అతను ఆ పెంకుటింటి మెట్లక్కబోతు, తను తప్పుచేస్తున్నానేమో అని ఆగిపోతాడు. అక్కడ ఉన్న ఒక ఉపాధ్యాయుడు రమణ ఎక్కడున్నాడో చూపిస్తాడు. అక్కడ రమణ అందరి పిల్లలతో కలసి గుణింతం చెబుతుంటాడు. చదువుకుంటున్న తన కొడుకుని చూసిన రంగయ్య ఆనందానికి అవధుల్లేవు. చదువుకుంటున్న రమణ తండ్రిని చూసి, వెంటనే నాన్నో అంటాడు. పంతులుగారు కూడ అటువైపు చూచి వచ్చి రంగయ్యను పలకరిస్తాడు. రమణను చూసి వెళదామని వచ్చానంటాడు. 'ఓణ్ణి బాగా సదవెండయ్యగారో' అని పంతులుగారి పాదాలు పట్టుకుంటాడు.

రంగయ్య ఆ విధంగా చేసినందుకు పంతులుగారు నొచ్చుకుంటాడు. రమణ నీ కొడుకు కాదు నా కొడుకు అని పంతులుగారు రంగయ్యతో అంటాడు. ఆ మాటలు రంగయ్యకు అమృత తుల్యంగా అనిపిస్తాయి. రమణ గొప్పవాడై నిన్ను కార్లో తిప్పుతాడు అని పంతులు గారంటారు. అందుకు రంగయ్య అంత అదుట్టం కూడానా అని, చెప్పులు సాయంత్రం ఇస్తానంటాడు. పంతులుగారు తాను సాయంత్రం ఉండనని, మరుసటిరోజు ఇవ్వమంటాడు. ఆ తరువాత రంగయ్య తన జేబులో నుంచి నాలుగు రూపాయలు తీసి పంతులుగారికి ఇస్తాడు. ఆయన అవి తీసుకుని రెండువందల నాలుగు రూపాయలు అయినట్టు చెప్పి, వాటిని ఏం చేయమంటావ్ అని అడుగుతాడు. అపుడు రంగయ్య మీ ఇట్టం వచ్చినట్టు చేయండి అంటాడు. రంగయ్య బయటకు వచ్చి, మరొకసారి బడివైపు చూస్తాడు. అది అతనికి స్వర్గధామంలా అనిపిస్తుంది. రంగయ్య నేను కూడ చదువుకోవచ్చా అని అక్కడున్న ఉపాధ్యాయుని అడుగుతాడు. రంగయ్యకు ఆ ఆలోచన వచ్చినందుకు ఆ ఉపాధ్యాయుడు చాలా ఆశ్చర్యపోతాడు. అతడు రంగయ్యకు వయోజన విద్య గురించి చెబుతాడు. రంగయ్యను పలకా బలపం తీసుకురమ్మని, తాను అక్కడ చేర్పిస్తానని అంటాడు. రంగయ్య తన కొడుకు గొప్పవాడవుతాడన్న ఆనందంతో ప్లాట్ ఫామ్ మీద నడుస్తూ, మురికి కాలువ వంతెన దాటి, సినిమా హాలు ముందున్న గుడిసెలకు చేరుకుంటారు. అక్కడ ఎటు చూసిన టైర్లు, తోళ్ళు, చెప్పులు, వాటి వలెనే అక్కడ మనుషులు కూడా, అక్కడ ఉన్న ప్రతివ్యక్తికీ తాగడంపై ఉన్న నేర్పు దేనిలోను ఉండదు. వాళ్ళలో రంగయ్య ఉంటాడు గాని, వాళ్ళలాంటివాడు కాదు. రంగయ్య తన ఇంటిలోకి వెళ్ళి, కుండలో ఉన్న నీళ్ళను ముంతలోకి వంపుకుని తాగుతాడు. బయటికి వస్తూ ఎదురుగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఫోటోకి తన కొడుకుని చల్లగా చూడమని మొక్కుకుంటాడు.

రంగయ్య ఇంటి దగ్గర ఉన్న దుర్గంధమైన కాలువలో కొంతమంది పిల్లలు స్నానం చేస్తుంటారు. స్త్రీలు బట్టలు ఉతుక్కుంటారు. రంగయ్య పంతులుగారి చెప్పులు సంచిలో నుంచి బయటకు తీస్తాడు. వాటిని కొత్త చెప్పుల్లా తయారుచేసి, వాటిని తనే స్వయంగా ఆయన కాళ్ళకు తొడగాలని అనుకుంటాడు. అంతలో ఒక చిన్నపిల్ల కుళ్ళిపోయిన మామిడిపండు తింటూ వచ్చి, మాయమ్మకు ఒళ్ళు బాగాలేదంట నిన్నే కూడు వండుకోమంది అని చెబుతుంది. రంగయ్య మీ అమ్మను జాగర్తగా ఉండమని చెప్పు అని, పంతులుగారి చెప్పులు

కుట్టి, కొత్తవాటిలా తయారుచేసి, వాటిని ఇంటి లోపల అటక మీద పెట్టి, తలుపు దగ్గరకు వేసి, రోడ్డు మీదికి వెళతాడు. అక్కడ ఒక స్త్రీ బుట్ట నిండా అన్నం, కుండలో పులుసు, టిఫిన్ బాక్స్‌లో మజ్జిగ పెట్టుకుని ఉంటుంది. నలుగురు రిక్షావాళ్ళు కూర్చుని తింటుంటారు. రంగయ్య కూడా అక్కడకు వెళ్ళి ఆ పక్కనే ఉన్న కుళాయి దగ్గర కాళ్ళుచేతులు శుభ్రంగా కడుక్కుని, బనీను కొసలతో తుడుచుకుని, 'ఏయే గంగా ఇయ్యాల కుట్లోకేం చేశావ్' ఆమె పక్కనే కూర్చుంటాడు. అపుడా గంగ మునక్కాయ పులుసు, గోగాకు పచ్చడి అని సమాధానమిస్తుంది. 'సాల్లేయే ఓ విస్తరాకిట్టా పడేయ్' అని రంగయ్య అంటాడు. అపుడామె అతనికి వడ్డిస్తుంది. రంగయ్య కడుపు నిండా తిని కుళాయి దగ్గర చేతులు కడుక్కుని, పక్కనే ఉన్న గంగ రావి చెట్టు కింద నిద్రపోతాడు. ఒక వ్యక్తి వచ్చి రంగయ్యను తట్టిలేపి గుడిసెలంటు కున్నాయని చెబుతాడు.

రంగయ్య పరుగు లాంటి నడకతో రొప్పుతూ వస్తాడు. అప్పటికే రంగయ్య ఇంటికప్పు పూర్తిగా కాలిపోతుంది. రంగయ్య మనసు అటక మీద ఉన్న పంతులుగారి చెప్పుల మీదే ఉంటుంది. అవి కాలిపోవడం కంటే తను కాలిపోవడం మంచిదనుకుంటాడు. రంగయ్యలో ఏదో ఆవేశం వస్తుంది. అతడు తన శరీరంలోని శక్తినంతా కూడ గట్టుకొని, తలుపు తన్ని ఇంటిలోకి ప్రవేశిస్తాడు. ఆ తరువాత ఎంతకీ రంగయ్య బయటకు రాలేదు. ఫైరింజను వచ్చి, నీళ్ళు కొట్టడం ప్రారంభిస్తుంది. నలుగురు వ్యక్తులు లోపలికి వెళ్ళి, అక్కడ కనిపించిన దృశ్యం చూసి భయకంపితులవుతారు. రంగయ్య బోర్లా పడి ఉంటాడు. అతని శరీర పైభాగం పూర్తిగా కాలిపోయి, చర్మం కుతకుతలాడుతుంటుంది. అందరూ అక్కడకు వస్తారు. నలుగురు వ్యక్తులు మెల్లగా రంగయ్యను లేవ దీస్తారు. పంతులుగారి చెప్పులు మాత్రం రంగయ్య పొట్టలో దాగి ఉంటాయి. రంగయ్య ప్రాణాలు పోవడం, ఆ చెప్పులు తప్ప ఎవరు చూడలేదు.

(తెలంగాణ కథలు. 2005.పుట: 161)

చెప్పులు కథ – సామాజిక జీవన చిత్రణ :

ఈ కథలో 1967 నాటి సామాజిక జీవన చిత్రణ కనబడుతుంది. కాబట్టి ఆనాటి సామాజిక జీవన విధానం, మానవసంబంధాలు, వస్తువిజ్ఞానం, ఆహారపు అలవాట్లు, విద్యావిధానం, ముఖ్యంగా పేదవారి జీవన విధానం మొదలైన విషయాలు వెల్లడి అవుతున్నాయి.

ఈ కథలో కథానాయకుడు రంగయ్య. అతని ఒక్కొగానొక్కకొడుకు రమణను పంతులుగారు చేరదీసి, భోజనంపెట్టి, చదువు చెబుతుంటాడు. అందుకు రంగయ్య ఎంతో సంతోషిస్తాడు. ఆ ఊరిలోని అందరి పిల్లలవలె కాకుండ, రమణ చదుకుంటున్నందుకు, రంగయ్య ఆనందానికి అవధులుండవు. రమణకు ఆ అదృష్టాన్ని పట్టించిన పంతులుగారంటే రంగయ్యకు తన ప్రాణమిచ్చేంత అభిమానం. పంతులుగారు కూడా రమణను తన సొంత కొడుకులా చూసుకుంటాడు. ఆ విషయాన్ని రంగయ్య రమణను చూడడానికి బడికి వెళ్ళినపుడు 'రమణ నీకొడుకు కాదు నాకొడుకు' అంటాడు. ఆ రోజులలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పట్ల అంత ఆదరణ, అభిమానం చూపేవారని వ్యక్తమవుతుంది. అంతేగాక ఆనాటి సమాజంలో దళితులను ఆదరించే పంతులుగారివంటి వ్యక్తులున్నారని తెలుస్తుంది. వారి కోసం తమ ప్రాణాలను సైతం అర్పించే రంగయ్యలాంటి వారు కూడా ఉంటారని వెల్లడి అవుతుంది.

ఈ కథలో రంగయ్యకు తన ఇల్లు కాలిపోతున్న సమయంలో కొడుకు గుర్తు రాలేదు. పంతులుగారి చెప్పులే గుర్తుకొస్తాయి. బహుశా పంతులుగారు తన కొడుకుని ఏ లోటు లేకుండా చూసుకుంటారన్న నమ్మకం కావచ్చు. సమాజంలో వ్యక్తులు తాము నమ్మినవారి కోసం ప్రాణాలను కూడా అర్పిస్తారని తెలుస్తుంది. రంగయ్య రెండు వందల నాలుగు రూపాయలు పంతులుగారి దగ్గర దాచిపెడతాడు. ఆ పంతులుగారు ఆ ధనాన్ని తన కొడుకుకి ఉపయోగిస్తాడన్న నమ్మకంతోనే రంగయ్య ఆ విధంగా చేస్తాడు. రంగయ్యకు ఒకామె వంట చేసి

పెడుతుంటుంది. ఆనాటి సమాజంలో ఒకరికొకరు సహాయం చేసుకుంటూ జీవించేవారని తెలుస్తుంది. ఈ కథలో బాలిక కుళ్ళిపోయిన మామిడిపండు తింటుంది. బాలురు మురికి కాలువలో స్నానం చేస్తుంటారు. స్త్రీలు దుర్గంధమైన కాలువలో బట్టలుతుకుతుంటారు. ఈ విషయాల వల్ల పేదవారు ఎటువంటి దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారో వెల్లడి అవుతుంది.

అంతేగాక పేదవారు మురికి కాలువ పక్కన గుడిసెలు వేసుకుని నివాసముంటారు. అక్కడ ఎటుచూసినా తోళ్ళు, టైర్లు, చెప్పులు ఉంటాయి. ఇక్కడ శ్రమజీవుల జీవనశైలిని కళ్ళకు కట్టినట్టుగా కనబడుతుంది. ఆనాటి సమాజంలో వయోజనవిద్య కూడా ఉన్నట్టు ఈ కథ ద్వారా వెల్లడి అవుతుంది. టీ అమ్మే వ్యక్తి పులిచారల బనీను వేసుకున్నట్టు ప్రస్తావించబడింది. దీనివల్ల ఆనాటి వస్త్రధారణ తెలుస్తుంది. రంగయ్య మట్టికుండలో నీళ్ళను ముంతలోకి వంపుకుని తాగుతాడు. ఇవి నేడు ధనవంతుల వంట పాత్రలుగా మారాయి. ఈ కథలో రమణ తండ్రి దగ్గర ఐదు పైసలు తీసుకుంటాడు. ఆ రోజులలో ఐదు పైసలకు తినుబండారాలు లభించేవి. ఇప్పుడు ఒకరూపాయి తీసికెళితే గాని ఏమిరావు. రంగయ్య రోడ్డు పక్కన ఒక స్త్రీ దగ్గర భోజనం చేస్తాడు. ఆధునిక సమాజంలో కూడ ఈ విధంగా భోజనం లభిస్తుంది. ఈ కథ ద్వారా ఆనాటి ప్రజల సామాజిక జీవన చిత్రణ వెల్లడి అవుతుంది.

మనమే నయం కథ :

మనమే నయం కథను కాళోజీ నారాయణరావుగారు 1943వ సంవత్సరంలో రాశారు. రచయిత జంతువుల, మానవుల జీవన విధానం గురించి, నల్ల ఎద్దు, తెల్ల ఎద్దుల సంభాషణ ద్వారా తెలియజేశారు.

ఒకరోజు ఈ ఎద్దుల యజమాని ఎల్లయ్య ఎద్దులను అందంగా అలంకరిస్తాడు. అపుడు ఆ ఎద్దులు ఈ విధంగా మాట్లాడుకుంటాయి. ఈరోజు ఎల్లయ్య మన మెడలపై కాణికి బదులు, బుక్కాగులాలు, బ్యారేడు జోడులకు బదులు నుదుట కుంకుమ బొట్టుపెట్టి, వీపు మీద కొరడాతో కొట్టకుండ దయతో వీవు మీద తడుతున్నాడేమిటని నల్ల ఎద్దుని, తెల్ల ఎద్దుని అడుగుతుంది. ఓపిక పట్టి చూడమని తెల్ల ఎద్దు అంటుంది.

ఆనాటి సమాజంలో ఎస్.పి.సి.ఎ. (జంతువుల పట్ల జరిగే అన్యాయ నిరోధక సంఘము) వారు ఆ రోజు ఆ సంస్థ వార్షికోత్సవ సందర్భంగా ఆరోగ్యంగా ఉన్న కొన్ని జంతువులను, కొంతమంది మనుషులతో కలసి ఊరేగింపు జరుపాలనుకుంటారు. అందువల్ల ఎల్లయ్య ఎద్దులను అలంకరిస్తాడు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు బాజాభజంత్రీలతో, వాలంటీర్ల, గార్డ్ ఆఫ్ ఆనర్లతో చెప్రాసి మొదలు సుబేదారు వరకు గల ప్రభుత్వోద్యోగులు, లక్షాధికారులు, బిచ్చగాళ్ళు, విద్యావంతులు, అవిద్యావంతులు, డాక్టర్లు, వకీళ్ళు, అన్ని మతాల, కులాల, సంఘాలకు చెందిన సభ్యులందరు ఆ ఊరేగింపులో పాల్గొంటారు. కానీ వారిలో కొంత మందికి ఆ ఊరేగింపు ఎందుకు జరుగుతుందో, జంతువులకు ఎంత తెలుసో వారికి అంతే తెలుసు. నల్ల, తెల్ల ఎద్దులు ఎల్లయ్య బలవంతం మీద ఏవిధంగా ఆ ఊరేగింపులో పాల్గొంటున్నాయో, ఆ ప్రభుత్వ ఉద్యోగులు కూడా అదే విధంగా పాల్గొంటున్నారు. ఆ సభకు ఒక గొప్ప ప్రభుత్వ ఉద్యోగి అధ్యక్షత వహిస్తాడు. ఆ సంఘ కార్యదర్శి వార్షిక చదివి వినిపిస్తాడు. అందులో ఎన్ని వందల ముల్లుకర్రలు విరిగాయి, ఎంతమంది బండి వాళ్ళను, జట్కావాళ్ళను, గాయపడిన వాటిని, ఎడ్లను, గుర్రాలను, బళ్ళను, కట్టినందుకు కోర్టు కెక్కించి జరిమానాలు విధించింది చెబుతాడు. ఆ తర్వాత నలుగురైదుగురు పెద్దలు, జంతువులకు కష్టాలు, ఇబ్బందులు, వానిని మాన్పించడానికి ఉపాయాలను గూర్చి, జ్ఞానంగా ఉపన్యసిస్తారు. వీరికి ఏ జంతువుకి ఏ కష్టమో తెలియదు. వారు బండి వాళ్ళను కోర్టు కెక్కించడం వల్ల, ఆ బండి వ్యక్తి, తన బక్క చిక్కిన జంతువుకి గడ్డి కొనడానికి ధనం లేక జంతువులను విషయం వారికి తెలియదని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

ఆ సభానంతరం ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతారు. జంతువులు కూడా దొడ్లకు చేరుకుంటాయి. అప్పుడు తెల్ల ఎద్దు, నల్ల ఎద్దుతో ఈవిధంగా అంటుంది. ఈ మనుషులలో కొందరు, అందులో ముఖ్యంగా పని పాటలు లేకుండా ధనాన్ని గడించేవారు, మన క్షేమం కోసం, ఒక సంస్థను స్థాపించారు. ప్రత్యక్షంగా నిత్య జీవితంలో వారికి, మనకు ఏమి సంబంధం లేదు. మనతో నేరుగా సంబంధం ఉన్నవారు, మన వలన జీవనోపాధి పొందడమే గాక, వేలపుట్ల ధాన్యాన్ని పండించుకునేవారు మనపై, మనము ఈడ్చే బండ్లపై స్వారీ చేసేవారు మనకు సరిగా తిండి పెట్టకుండా కష్టపెడుతున్నారని, మనకు రోగాలు వచ్చిన, గాయాలు తగిలిన, చికిత్స చేయించ కుండ పనిచేయిస్తున్నారని అందువలన మనందరం ఇబ్బందులు పడుతున్నారని వీరి అభిప్రాయం. అందుకనే ఈ సంఘం వారు ఎంతో ప్రయాసపడి, మన కాపరులైన నరుల నుండి వేలకువేలు ముల్లుకట్టను లాక్కుంటున్నా రట. బక్కచిక్కిన, అనారోగ్యంతో ఉన్న, గాయపడిన జంతువులతో పని చేయించేవారిని కోర్టు కెక్కించి శిక్ష లిప్పిస్తున్నారట. కాని వీరి ఆహారం కోసం కరకర నరకబడే జంతువుల మీద ఏమాత్రం దయలేదు. 'ఒకేసారి చంపడం వల్ల జీవితం నుండి విముక్తి పొందడం అనివీరి భావన కాబోలు!'. ప్రతిరోజు తెల్లవారేసరికి లక్షలకోళ్ళు, గొఱ్ఱెలు, ఆవులు, ఎడ్లు క్రమక్రమంగా నరకబడుతున్నా వీరికేమాత్రం పట్టదు.

ఈ విధంగా చంపే జంతువులన్ని ఆరోగ్యంగా ఉన్నవి, బాగా బలిసినవి, ముసలివి కానివి, అయి ఉండాలి. ఇదేమి భూతదయో! ఇదేమి దౌర్జన్య విరోధమో వారికే తెలియాలి. ఈ సంఘం వారు మనకు చేసిన ఉపకారమేమి అని ఎద్దు అంటుంది. అంతేగాక తల్లిపాలు మాని నాలుగు గడ్డిపరకలు తినడం మొదలైన నాటి నుండి నిర్భంధ జీవితం ప్రారంభమైనట్లు ఎద్దు భావిస్తుంది. స్వేచ్ఛ పేరుతో మానవుడు వాటి జీవితాన్ని చేస్తున్నాడని, అతడు చేయించిన పనినెల్ల చేయాలని, అలా చేయకపోతే ఎముకలు విరిగేలా బాదుతాడు. వాటికున్న అన్ని కష్టాలకు మూలకారణం నిర్భంధ జీవితమే అని తెల్ల ఎద్దు అంటుంది.

ఆ తరువాత నల్ల ఎద్దు ఈ విధంగా అంటుంది. ఆ జంతువులను అంత కష్టపెట్టే ఆ నరుల జీవితం కూడ ఏమంత బాగోలేదని, చాలామంది జీవితం జంతువుల జీవితం కన్నా అన్యాయంగా ఉందని అంటుంది. కొంత మంది ధనవంతులు తప్ప, మిగినవారి జీవితం ఎన్నోరెట్లు అసహ్యకరంగా ఉందని, కొన్ని జంతువులు స్వేచ్ఛగానే ఉన్నాయని, ఎద్దుల వంటి జంతువులకు దేహకష్టం చేసిన తరువాత, తినడానికి గడ్డి, చొప్ప, తెలకపిండి, తాగుటకు నీరు, ఉండడానికి దొడ్లు ఉన్నాయి. కాని మనుషులలో కోట్ల మందికి ఎముకలు విరిగేంత కష్టపడినప్పటికీ, ఉండడానికి గుడిసె, వారి ఆచారాను సారంగా దేహాన్ని దాచుకోడానికి సరైన వస్త్రాలు, చివరికి తాగాడానికి నీరు కూడా లేక మలమల మాడుతూ అసహ్యకరమైన రోతపుట్టే జీవితాన్ని గడుపుతున్నారు. వారికి మనకున్నట్లు దౌర్జన్య నిరోధక సంఘమొకటి కూడ లేదు. కనీసం తలనరికి ఒకేసారి ముక్తి కలిగించే కసాయి ఖానాలు కూడ లేవు. మనమే నయం అని నల్ల ఎద్దు చెప్పింది విన్న తెల్ల ఎద్దు తెలతెల బోయింది.

(తెలంగాణ కథలు. 2005. పుట: 33, 34)

మనమేనయం కథ - సామాజిక విశ్లేషణ :

సుప్రసిద్ధ తెలంగాణ రచయిత "కాళోజీ" గారు పరకాయ ప్రవేశం చేసి సమాజంలో బలహీన వర్గాల జీవనం ఏ విధంగా ఉందో 'మనమేనయం' అనే కథలోని ఎద్దుల సంభాషణ ద్వారా తెలియజేశారు. జంతువుల జీవితం కంటే బలహీన వర్గానికి చెందిన ప్రజల జీవితమే దుర్భరంగా ఉందన్న విషయం ఎద్దులతోనే పలికించారు. ఈ కథలోని ఎద్దులు రోజంతా యజమాని ఏ పని చేయిస్తే ఆ పని ఆ పని చేసిన తరువాత వాటికి తినడానికి గడ్డి, తెలకపిండి, తాగడానికి నీరు, నివాసముండడానికి దొడ్లు ఉన్నాయి. కాని పగలంతా శ్రమ చేసే మానవులకు

ఉండడానికి గుడిసెలు, కట్టుకోడానికి బట్టలు, చివరకు తాగడానికి నీరు కూడా లేక హీనమైన జీవితాన్ని గడుపు తున్నారని, అనగా కేవలం ధనవంతుల కోసం పనిచేస్తు, హీనమైన జీవితాన్ని గడుపుతున్న వ్యక్తుల జీవన విధానాన్ని రచయిత సమాజానికి తెలియజేసేశారు. ఈ దౌర్జన్య నిరోధక సంఘం వల్ల, వారు గుళ్ళపు బండి మొదలైనవి నడుపుకుని జీవనం సాగించే వ్యక్తుల పైన వేసే పిటిషన్‌ల వల్ల, వారు కోర్టుకి జరిమానాలు కట్టి, వాటికి గడ్డి కొనలేని పరిస్థితి ఏర్పడి, ఆ జంతువులు మరణిస్తుంటాయి. అందుకు కారణం ధనవంతులేనన్న విషయం రచయిత ఆ ఎద్దులతోనే పలికించారు. ధనవంతులు చేసే పనుల వల్ల జంతువులు చనిపోతున్నాయి, గాని బండి నడిపే తమ యజమాని వల్ల కాదు అన్న విషయాన్ని రచయిత ఎద్దుల మనోగతం ద్వారా వారికి కనువిప్పు కలిగించే ప్రయత్నం చేశారని చెప్పవచ్చు.

సమాజంలో కొంతమంది వ్యక్తులు తమ గుర్తింపు కోసమే, ఇటువంటి సభలు ఏర్పాటుచేస్తున్నారు. వారిలో ఉన్న కొంతమంది ఎద్దుకి, గుఱ్ఱానికి తేడా తెలియ కుండానే ఆ సభలకు హాజరవుతుంటారు. కాని బండి నడిపే వ్యక్తుల పైన మాత్రం కేసులు పెడుతుంటారు. వాటి వల్ల నష్టమే తప్ప, ఎవరికి మేలు జరగకపోగా నష్టమే జరుగుతుంది. రచయిత ఆయా సంఘాలను నడిపే వ్యక్తులకు కనువిప్పు కలిగించే ప్రయత్నం చేశారని చెప్పవచ్చు. ఈ కథలో రచయిత మానవుల, జంతువుల జీవన విధానాన్ని సమన్వయం చేసి, సమాజంలో గల లోపాలను ఎత్తిచూపి కృతకృత్యులయ్యారు. అంతేగాక ఈ కథలో ఎద్దులు 'మనలను ఇంత కష్టపెట్టే ఆ నరుల జీవితం మాత్రం ఏమంత బాగా ఏడ్చింది'. అని అను కుంటాయి. కాళోజీ నారాయణరావుగారు జంతువుల పట్ల భూత దయ కలిగి ఉండాలన్న నీతిని వాటి మనోగతం ద్వారానే సమాజానికి సూచించారు.

జంగుభాయి కథ :

గోపి భాగ్యలక్ష్మిగారు 1992లో 'జంగుభాయి' అనే కథను రాశారు. ఈ కథలో ఆదిలాబాద్ జిల్లాలోని గిరి జనుల జీవన విధానాన్ని రచయిత్రి చిత్రించారు. లక్ష్మి భర్త ఉపాధ్యాయుడు. వారు ఉద్యోగ రీత్యా ఆ ప్రాంతానికి వెళతారు. అక్కడ వారికిచ్చిన ఒక పర్ణశాలను తలపింప జేస్తుంది. వారు తాగడానికి నీరు వాగుకి వెళ్ళి గుంటలు చేసి,అవి తేరుకున్న తరువాత గ్లాసులతో తోడి బిందె నింపుకొని తెచ్చుకుంటారు. అక్కడున్న స్త్రీలు కేవలం చీరను మాత్రమే కట్టుకుంటారు, జాకెట్ వేసుకోరు. వీరు చలికాలం నట్టింట్లో సంద్ర కర్రలు పేర్చుకుని, వాటిని వెలిగించి కుటుంబ సభ్యులంతా చుట్టూ కూర్చుని చలి కాచుకుంటూ ఉంటారు. వర్షా కాలంలో వీరి ఇంటికి, వీధికి పెద్ద తేడా ఉండదు. వేసవి కాలంలో కూడా వీరి పరిస్థితి అతి భయంకరంగా ఉంటుంది. వీరు కాళ్ళకు చెప్పులు వేసుకోరు. అందువల్ల వీరి పరిస్థితి నిప్పులపై నడుస్తున్నట్టే ఉంటుంది. ఒకరోజు బంగాళాఖాతంలో వాయుగుండం పడుతుంది. ఆ రోజు గాలివాన చాలా ఎక్కువగా ఉంటుంది. ఉపాధ్యాయుని ఇంటి ఎదురుగా ఒక గోండు కుటుంబం ఉంటుంది. ఆ కుటుంబంలో జంగుభాయి అనే యుక్త వయసు వచ్చిన అమ్మాయి. ఆమె బహిష్టు అయ్యిందని, ఆమె తల్లి వానలో గుడిసె బయట కూర్చో బట్టి, ఒక సత్తు గిన్నెలో మొక్కజొన్న గడుక (సంకటి)ని పై నుంచి ఎత్తి వేస్తుంది. ఆ తరువాత జంగుభాయి, ఆ గిన్నెను తీసుకుని తింటుంది.

ఆ తరువాత ఆమె తల్లి ఒక సత్తు చెంబుతో నీరు తెచ్చి దూరంగా పెడుతుంది. జంగుభాయి ఆ నీరు తాగి, ఆ గిన్నె చెంబులను చూరు నీళ్ళతో కడిగి ఓరగా బోర్లిస్తుంది. ఆ దృశ్యాన్ని లక్ష్మి చూసి, ఏమైందని అడుగు తుంది. అపుడు జంగుభాయి 'బయటున్నాను ఇంట్లకు పోవద్దు' అంటుంది. ఆ మాటలు విన్న జంగుభాయి తల్లి బయటకు వస్తుంది. అపుడామె లక్ష్మిని చూసి 'అమ్మా తడుస్తండ్లు ఇంట్లకు రాండ్లి' అంటుంది. మరి జంగు కూడా తడుస్తుంది కదా! అంటుంది. 'అది ముట్టుకోదు అయిదు దినాల దాకా ఇంట్లకు రాదు'. అపుడు లక్ష్మి

జంగుభాయి తల్లికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుంది. నాగరిక సమాజంలో ఆచారం పేరుతో స్త్రీని దూరంగా ఉంచుతుంటే, ఇక్కడ అంతకంటే ఘోరంగా ఉంది అనుకుంటుంది లక్ష్మి. ఆమె జంగుభాయిని తన ఇంటికి తీసికెళుతుంది. తుడుచుకోడానికి ఒక పాతచీర ఇచ్చి, తాగడానికి డికాషన్ కూడ ఇస్తుంది. జంగుభాయి మేనత్త అటువంటి పరిస్థితిలోనే జ్వరం వచ్చి చనిపోయిందని లక్ష్మితో చెబుతుంది. ఆ రాత్రి జంగుభాయి అక్కడే పడుకుంటుంది. తెల్లవారేసరికి బయట హడావిడిగా ఉంటుంది. ఆ రాత్రి చిరుతపులి వచ్చి మేకను చంపుతుంది. దానికి కారణం జంగుభాయిని లక్ష్మి ఇంటిలోకి తీసికెళ్ళడం వల్ల దేవుర పులిని తోలిందని ఒక ముసలామె అరుస్తుంది. ఆ తరువాత కొన్నిరోజులకు జంగుభాయి అక్కకు మగశిశువు జన్మిస్తాడు. వారు ఆ శిశువుకి మూడవరోజే పుట్టుజుట్టులు తీస్తారు. ఆ మరుసటి రోజే అనారోగ్యంతో ఆ పిల్లవాడు మరణిస్తాడు. ఆ పిల్లవాడు అనారోగ్యంతో ఉన్నా హాస్పిటల్‌కి తీసికెళ్ళరు. ఇది వారి అనాగరికతకు తార్కాణం. ఆ ప్రాంతపు పటేల్ ఉపాధ్యాయుణ్ణి దగ్గరకు వెళ్ళి మాలమాదిగల పిల్లలు, గోండు పిల్లలతో కలసి కూర్చోవడం వల్ల వారు మైలపడుతున్నారని, వేరుగా కూర్చో బెట్టమని చెబుతాడు. అపుడు మాష్టారు ఒకసారి పాఠశాలకు వచ్చిన తరువాత విద్యార్థులందరూ సమానమే అని సర్దిచెప్పే ప్రయత్నం చేస్తాడు. అపుడు పటేల్ సరేలెండి గోండు పిల్లలు బడి నుండి వాగుకి వెళ్ళి స్నానం చేసి వస్తారు అంటాడు. జంగుభాయికి బాల్య వివాహం జరుగుతుంది. ఆమెకు యుక్త వయసు వచ్చిన తరువాత వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుంటుంది. అందుకు ఆ కుటుంబానికి మూడు వందల రూపాయలు జరిమానా విధిస్తారు. ఆమె తల్లిదండ్రులు దాన్ని అవమానంగా భావించి ఎంతగానో దుఃఖిస్తారు. ఈ కథలో కమల అనే లంబాడి యువతి ఆ ఊరికి బట్టలు అమ్మడానికి వచ్చే యువకుని చేతిలో మోసపోతుంది.

సామాజిక జీవన చిత్రణ :

ఈ కథలో గిరిజనులు తమ ప్రాణాల కంటే మూఢ నమ్మకాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. స్త్రీలు బహిష్టు సమయంలో ఇంటి లోపలికి వస్తే దేవరకు కోపం వస్తుందని వారు నమ్ముతారు. ఈ కథలో జంగుభాయిని లక్ష్మి వాళ్ళ ఇంటికి తీసుకెళుతుంది. ఆ రోజు ఊరిలోకి పులి వచ్చి ఒక మేకను తింటుంది. జంగుభాయి ఇంటిలోకి వెళ్ళడం వల్ల, దేవరకు కోపం వచ్చిందని, అందుకే పులి వచ్చి మేకను తిందని, ఆ ఊరి వారు జంగుభాయి తల్లితో గొడవపడతారు. పుట్టిన మూడు రోజులకే శిశువుకి పుట్టు వెంట్రుకలు తీస్తారు. ఆ విధంగా చేయడం వారి ఆచారమని, దానిని తప్పనిసరిగా పాటించాలని వారు భావిస్తారు. వీరు కాళ్ళకు చెప్పులు వేసుకోరు. మండుటెండల్లో కూడా కొండల్లో అలాగే తిరుగుతారు. ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేస్తారు. యుక్త వయస్సు వచ్చిన తరువాత వారిరువురిలో ఎవరికైనా, వేరొక వ్యక్తి నచ్చితే వారు జరిమానా కట్టాలి.

ఈ కథలో జంగుభాయికి వేరే వ్యక్తి నచ్చి, అతనితో ఉండడం వల్ల ఆ ఊరి వాళ్ళు జంగుభాయి తల్లిదండ్రులకు 300 రూపాయలు జరిమానా వేస్తారు. అది వారు చాలా అవమానంగా భావిస్తారు. జంగుభాయి తల్లి దండ్రులు వాళ్ళ పెద్దకూతురుకి వివాహం చేయడానికి వారికున్న కొంత భూమిని, ఆ ఊరి పటేల్ దగ్గర ధనం తీసుకుంటారు. వారు ఆ ధనాన్ని చెల్లించలేకపోతారు. అందువల్ల ఆ ఊరి పటేల్ వారి భూమిని కట్టుకుంటాడు. ఈ కథలో మరొక స్త్రీ కాంతాభాయి. ఆమె లక్ష్మితో 'ఈడ గోండులు మంత్రాలు చేస్తరు జేగర్త గుండాల' అంటుంది. ఆమె గోండులకు మంత్రతంత్రాల పట్ల ఉన్న మూఢ నమ్మకాలను సొమ్ము చేసుకుంటూ జీవిస్తుంది. ఇటువంటి దౌర్జన్యం గిరిజన సమాజంలో ఉన్నట్టు ఈ కథ వల్ల వ్యక్తమవుతుంది. అంతేగాక ఈ గోండుజాతి వారు తమ పిల్లలను, మాలమాదిగల పిల్లలను ఒకేచోట కూర్చోబెట్టొద్దని ఉపాధ్యాయుడితో చెబుతారు. అందుకు

ఉపాధ్యాయుడు ఒప్పుకోడు. అపుడు వారు తమ పిల్లలు బడి నుంచే వాగుకి వెళ్ళి స్నానం చేసి వస్తారని సమాధానం చెబుతారు. గోండుజాతిలో గూడుకట్టుకున్న మూఢ నమ్మకాలు, బాల్యవివాహాలు, కులవివక్ష మొదలైనవన్ని ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

చెర కథ :

'చెర' అనే కథను 'నవీన్' అనే రచయిత 1987వ సంవత్సరంలో రాశాడు. ధర్మారం అనే గ్రామంలో రాజమ్మ, సమ్మయ్య అనే భార్యాభర్తలుంటారు. వారికి సాంబయ్య అనే కుమారుడుంటాడు. రాజమ్మ, సమ్మయ్య రోజంతా వరి పొలంలో కోతకోసి ప్రతిఫలంగా యజమాని ఇచ్చిన కూలిగింజల్ని నెత్తిన పెట్టుకుని ఇంటికి వస్తారు. అప్పుడే సాంబయ్య భోజనం చేస్తుంటాడు. తండ్రికి కొడుకుని చూడగానే విపరీతమైన కోపం వస్తుంది. నెత్తి మీద వడ్ల బస్తా కింద పడేసి 'పైస సంపాయించే తెలివి లేదు గాని గిన్నె నిండ బువ్వ మాత్రం గావాలె' అంటాడు. అపుడు తల్లి 'కొలువుకని పట్నంల తిరిగి తిరిగి గిప్పుడే వచ్చి గింత తింటాండేమో వాన్ని ఇప్పుడే మనకు' అంటుంది. 'పట్నంల గివీనికి కొలువెవ్వడిత్తడే పెద్ద, పెద్ద చదువులు చదివినోళ్ళకే కొలువుల్లేక తిరిగి తిరిగి చస్తుంటే గీడు పని కోసం పట్నం బోవాలా! ఊళ్ళో ఆసాములంతా కూలికొస్తావా... కూలికొస్తావా అని ఇల్లిల్లు తిరుగుతలేరు' అంటాడు సమ్మయ్య. ఆ మాటలు విన్న సాంబయ్యకు దుఃఖం వచ్చి కంచం దగ్గర నుండి లేచి చెయ్యి కడుక్కుని వీధిలో కెళతాడు. తల్లిదండ్రుల కష్టంపై బతుకుతున్నందుకు అతనికి బాధగా ఉంది. సాంబయ్యకు బాగా బతకాలని కోరిక, అందుకే అందరిలా కూలిచేయలేక పాతాడు.

ఆ ఊరిలో ప్రకాశరావు అనే అతను యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుంటాడు. అతడు ఆ ఊరిలో ఇద్దరు ముగ్గురికి ఉద్యోగాలిప్పిస్తాడు. అతడు గ్రామానికి వచ్చినప్పుడల్లా సాంబయ్య అతణ్ణి కలసి తనకు ఉద్యోగమిప్పించమని అడుగుతుంటాడు. కొంతకాలం తరువాత ప్రకాశరావు తండ్రి కుటుంబరావుకి పక్షవాతం వస్తుంది. అపుడతడు తన తండ్రిని పట్నం తీసికెళ్ళడానికి వస్తాడు. సాంబయ్యను పిలిచి, ఉద్యోగమిప్పిస్తాను రమ్మని తీసికెళ్తాడు. కుటుంబరావుని హాస్పిటల్లో చేర్పించి, సాంబయ్యను అతని దగ్గర ఉంచి, తండ్రి మల మూత్రాలను ఎత్తిస్తాడు. మూడునెలల తరువాత కుటుంబరావు చనిపోతాడు. ప్రకాశరావు తండ్రి కర్మ కాండలు ధర్మారంలోనే చేస్తాడు. ఆ పదకొండు రోజులు సాంబయ్య క్షణం తీరిక లేకుండా పనిచేస్తాడు. ఆ పనులన్ని పూర్తి అయిన తరువాత పట్నానికి బయలు దేరుతాడు. సాంబయ్య కూడా పట్నానికి వెళ్ళడానికి సిద్ధపడతాడు. అపుడు ప్రకాశరావు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌తో మాట్లాడానని, రెండు అటెండర్ పోస్టులు వచ్చాయని, అవి షెడ్యూల్డ్ కులాలకు చెందినవని, సాంబయ్యను కూడా షెడ్యూల్డ్ కాస్ట్ సర్టిఫికెట్ సంపాదించమంటాడు. అపుడు సాంబయ్య 'దొంగ సర్టిఫికెట్ నాకెందుకు సార్' అంటాడు.

కన్నీటితో! అపుడు ప్రకాశరావు ఎందుకలా బాధపడతావు, 'ఒక్క నాలుగు రోజులు ఓపిక పట్టు, ఊర్లో పని చేసుకో, నీలాంటి ఏబుల్ బడీడ్ యంగ్ మ్యాన్‌కి పని దొరకకపోవడమేమిటి' అని వ్యానెక్కి వెళ్ళిపోతాడు. సాంబయ్యకు ఆ మాటలు చెవుల్లో మారుమోగుతుంటాయి. ఆ సమయంలో కూలీలు పొలాలకు వెళుతుంటారు. అపుడు సాంబయ్యకు వాళ్ళతో కలసి పనికి వెళ్ళాలో, లేక పట్నం వెళ్ళి ఏ లారీ కిందనైనా పడి శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచిపోవడమో సాంబయ్యకు బోధపడలేదు.

సామాజిక జీవన చిత్రణ :

''చెర'' కథను రచయిత వాస్తవిక సంఘటనను ఆధారంగా చేసుకుని రాసి ఉండవచ్చు. సమకాలీన సమాజంలో గల స్థానికత ఈ కథలో వ్యక్తమవుతుంది. గ్రామాలలో పై పదవులలో ఉన్న వ్యక్తులు, చిన్న చదువులు చదువుకున్న వ్యక్తులను, వారి సొంత

ప్రయోజనాల కోసం ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది. పై కథలో ప్రకాశరావు ఉన్నత పదవిలో ఉండి కూడా సాంబయ్యను దొంగ సర్టిఫికెట్ సంపాదించమనడం, ఇక్కడ గమనించ దగ్గ విషయం. సమాజంలో కొంతమంది ఈ విధంగా ఉద్యోగాలను సంపాదిస్తున్నారన్న విషయం ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

షెడ్యూల్డ్ కులాల వారికి ఉద్యోగ అవకాశాలున్నాయన్న విషయాన్ని, రచయిత ఈ కథ ద్వారా వ్యక్తం చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పవచ్చు.

సమాజంలో కూలి పనిచేసి, యజమాని ఇచ్చిన ధాన్యంతో జీవితాన్ని వెళ్ళబుచ్చే సమ్మయ్య, రాజమ్మ వంటి వ్యక్తుల జీవితం, ఎంత దుర్భరంగా ఉంటుందో ఈ కథ వల్ల వ్యక్తమవుతుంది. అంతేగాక సాంబయ్య వంటి వ్యక్తులు సరిగ్గా చదువుకోక పోవడం వల్ల, జీవితం మీద సరైన అవగాహన లేక, ఉన్నతంగా జీవించాలన్న ఆశతో, వాస్తవికత లోపించి జీవితాన్ని దుర్భరంగా మార్చుకుంటున్నారని తెలుస్తుంది. సమాజంలో సాంబయ్య వంటి వ్యక్తులు కొంతమంది స్వార్థానికి బలవుతున్నారన్న విషయం కూడ పై కథ వల్ల వ్యక్తమవుతుంది.

సమాజంలో ప్రకాశరావువంటి వ్యక్తులు ఉన్నారన్న విషయాన్ని రచయిత పాఠకులకు తెలియజెప్పే ప్రయత్నం చేశారని చెప్పవచ్చు. రచయిత సామాజిక ప్రయోజనాన్ని ఆశించి ఈ కథను రాశారని చెప్పవచ్చు.

అంతర్ముఖం కథ :

జాతశ్రీ రాసిన ఈ 'అంతర్ముఖం' కథ 2003వ సంవత్సరం, మార్చి నెల, ఆదివారం ఆంధ్రజ్యోతిలో వెలువడింది. ఈ కథలో రచయిత గీత కార్మికుల జీవన విధానాన్ని చిత్రించాడు. ఈ కథలో మల్లేశం అనే గీత కార్మికుడు చదువుకున్న తన కొడుకుని విదేశాలకు పంపించడానికి 50 వేల రూపాయలు అవసరమవుతుంది. అతని కుమారుడు భూమిని అమ్మి తనను విదేశాలకు పంపించమంటాడు, కాని మల్లేశానికి భూమిని అమ్మడం ఇష్టం లేదు. ఆ ధనాన్ని ఏ విధంగా సమకూర్చాలన్న ఆలోచనలతో కల్లు గీయడానికి వెళతాడు. అప్పుడతనికి ఆ సమయంలో తాటిచెట్టు మీద నుండి కిందపడి చనిపోయిన బండి వెంకన్న గుర్తుకొస్తాడు. వెంకన్నకు తాటిచెట్టు పైన మండ్రగబ్బం కరిచి చనిపోతాడు. ఆ తరువాత ప్రభుత్వం అతని కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ఇచ్చింది. ఖర్చులు పోను వాళ్ళకు 80వేలు మిగులుతాయి. ప్రస్తుతం మల్లేశం మనసులో అదే మెదులుతుంటుంది. 'బతికి సాధించేదేముంది. ఇయ్యాల గాకుంటే రేపన్న బూడిద గాక తప్పుద్దా' అని మనసులోనే అనుకుంటాడు. అదే ఆలోచనలతో తాడి చెట్టెక్కుతాడు. అతని గుండెను పిండుతున్నట్టు ఏదో బాధగా ఉంటుంది. తాడు జారి కిందపడిపోతుంది. మల్లేశం కూడ చెట్టు పైనుండి కింద పడి చనిపోతాడు. మల్లేశం తన కొడుకుని కువైట్‌కి పంపించడానికి మరణాన్నే మార్గంగా ఎంచుకుంటాడు.

(తెలంగాణ కథలు: 2005. పుట: 724)

సామాజిక జీవన చిత్రణ :

సమకాలీన సామాజిక నేపథ్యాన్ని రచయిత ఈ కథలో ప్రస్ఫుటింపజేసే ప్రయత్నం చేశాడు. కేవలం కులవృత్తి మీద ఆధారపడి జీవించేవారి జీవితం దుర్భరమని, కులవృత్తితో పాటు, సొంత భూమి ఉండి, వ్యవసాయం కూడ చేసుకునే వారి జీవితం కొంత మెరుగ్గా ఉంటుందని ఈ కథ వల్ల వెల్లడి అవుతుంది. మల్లేశం ప్రతి ఉగాదికి ఎరువుల కొట్లో, బట్టల కొట్లో అప్పులు తీర్చేసి, కొత్త ఖాతా రాయించుకునేవాడు. కాని రెండేళ్ళ నుంచి పాత అప్పుకే వడ్డీ కలిపి, కొత్త ఖాతా తెరుస్తుంటాడు. అటువంటి పరిస్థితి ఏర్పడినందుకు అతడు మనస్తాపానికి గురవుతాడు. ఇక్కడ గీతకార్మికుల జీవన స్థితిగతులు వెల్లడి అవుతున్నాయి. ఈ కథలో తులసెమ్మ అనే స్త్రీ కల్లు అమ్ముడుపోక పడేస్తుంది. గ్రామంలో అందరు 'కోకా కోలా'కి అలవాటు పడ్డారని, అంతేగాక తాండాల్లో

గుడుంబా కూడ దొరుకుతుందని మల్లేశంతో అంటుంది. ప్రజలందరు వాటికి అలవాటుపడుతున్నారని ఈ కథ వల్ల తెలుస్తుంది.

ప్రపంచీకరణ ప్రభావం కులవృత్తుల మీద పడిందని వ్యక్తమవుతుంది. ప్రభత్యం కార్మికులకు ఇచ్చే 'శ్రీశ్రీఅ' కూడ పాత అప్పులు కడితేనే ఇస్తుందన్న విషయం కూడా ఈ కథలో ప్రస్థావించబడింది. ఆ ఊరిలో డాక్టర్ కూడ ఇంజక్షన్ చేసినందుకు మల్లేశం దగ్గర 20 రూపాయలు, వేరే వ్యక్తి దగ్గర పది రూపాయలు తీసుకుంటాడు. గ్రామాలలో ఇచ్చిన వారి దగ్గర ఇచ్చినంత దోచుకుంటు న్నారన్న విషయం వ్యక్తమవుతుంది. ఈ విధంగా గ్రామాలలో ప్రజలు అనేక సమస్యలతో సతమత మవుతున్నారన్న విషయం రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

ముగింపు :

ఈ వ్యాసంలో ఐదు విభిన్నమైన కథలు చర్చించ బడ్డాయి. ఐదు కథలలోను ఆయా కాలాలలో గల సమ కాలీన సామాజికాంశాలను, రచయితలు కథా ఇతి వృత్తాలుగా స్వీకరించారు. వాటిలో 1967లో వెలువడిన 'చెప్పులు' కథ ఒకటి. ఈ కథయందు ఒక దళితుడైన రంగయ్యకు, పంతులు గారికి ఉన్న అనుబంధం వ్యక్త మవుతుంది. పంతులుగారు రంగయ్య కొడుకుకి భోజనం పెట్టి, చదువు చెబుతూ తన సొంత కొడుకు వలె చూసుకుంటాడు. అందుకు కృతజ్ఞతగా రంగయ్య పంతులుగారి చెప్పులు బాగుచేసి ఇవ్వాలనుకుంటాడు. కాని చివరికి ఆ చెప్పుల కోసం తన ప్రాణాలనే కోల్పో తాడు. దళితులు కాలువ పక్కన గుడిసెలలో నివాస ముండడం, ఒకరికొకరు సహాయం చేసుకోవడం మొదలైన ఆనాటి సామాజిక జీవన విధానం ఈ కథలో చిత్రించ బడ్డాయి. అంతేగాక వయోజన విద్య గురించి కూడా ఈ కథలో ప్రస్తావించబడింది. వేరొక కథ 'మనమే నయం'. దీనిలో రచయిత మానవుడి జీవితాన్ని జంతువుల జీవితంతో పోల్చి, మనిషి కంటే జంతువులే ఉన్నతమైన జీవితాన్ని గడుపుతున్నాయని, రెండు ఎద్దుల సంభాషణ ద్వారా తెలియజేస్తాడు. సమాజంలో ఉన్న జంతువుల అన్యాయ నిరోధక సంఘాల వల్ల కలిగే నష్టాలు ఈ కథలో వివరించబడ్డాయి. ధనవంతుల వల్ల సమాజానికి కలిగే నష్టాలు మొదలైన అన్ని విషయాలు చర్చించబడ్డాయి.

మూడవ కథ 'జంగుభాయి' దీనిలో గోండుల మూఢ నమ్మకాలు, వారికి గల కులవివక్ష మొదలైన అంశాలతో కూడిన సామాజిక జీవన చిత్రణ జరిగింది. మరొకటి 'చెర' ఈ కథలో సమాజంలో కూలి చేసుకుని జీవించే ప్రజల జీవన విధానం చిత్రించబడింది. అంతేగాక పై పదవులలో ఉన్న వ్యక్తులు, యువకులకు ఉద్యోగమిప్పిస్తామని ఆశ చూపి, వారిచేత మలమూత్రాలు కూడా ఎత్తించడం గమనించదగ్గ అంశం. స్థానికపరమైన సంఘటనల ఆధారంగా ఈ కథ వెలువడిందని చెప్పవచ్చు. చివరిది 'అంతర్ముఖం' ఈ కథయందు గీతకార్మికుల జీవన చిత్రణ చేయబడింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. కృష్ణకుమారి, నాయని. 2000. తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి - సాహిత్యం. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014. భాష సమాజం సంస్కృతి. నీల్ కమల్ పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. మల్లయ్య, కాలువ. శారద సదానంద్, చంద్ర. 2006. తెలంగాణ కథలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబదు.
4. మల్లయ్య, కాలువ. 2012. తెలుగు కథ విభిన్న ధోరణులు. తెలుగు అకాడమి, హైదరాబాదు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

సమాజ ప్రతిబింబం – నాడు నేడు

– డా॥. దీవి శ్యామలారాణి

అభ్యుదయ భారతి, మధురభారతి, కవిరాజమౌళి, కవి శిరోమణి, కవి సార్వభౌమ వంటి బిరుదులతో నేటికీ దేదీప్యమానమైన సాహిత్యాన్నందిస్తున్న శ్రీ చింతలపాటి నరసింహదీక్షిత శర్మగారు కవిత్వమే జీవితంగా జీవన గమనాన్ని సాగిస్తున్నారు. వీరి మనోజ్ఞమైన కవితా సరళిని చూసిన సాహితీ రసజ్ఞులైన, విశ్వనాథ, జంధ్యాల, మధునాపంతుల, సి.నా.రె. వంటి మహానీయులు, తెలుగు పలుకుల రాణి వీరిని వరించిందని, నేటి సుకవి కోటిలో మేటి అని, కవి శిరోమణి బిరుదుకేకాదు కవిరాజమౌళి బిరుదానికి సహితం అర్హులని ప్రశంసించారు అటువంటి వీరిచే రచించబడిన నాడు-నేడు ఆధునిక సమాజానికి అద్దం పడుతుంది.

ఈ సమస్తసృష్టిలో కాలచక్రం నిరంతరం పరిభ్రమిస్తూ ఉంది. ఆ కాలంతోపాటు సమాజ పరిస్థితులు కూడా రోజురోజుకీ దీనంగా మారిపోతున్నాయి. నాటికాలంలో సజ్జనుల్లో దుర్జనులు కొందరుండేవారు. కాని నేటి కాలంలో దుర్జనుల్లో కొందరు సజ్జనులను గుర్తించవలసి వస్తోంది. దుర్జనత్వానికి స్వార్థం, ఈర్ష్య, అసూయ, ద్వేషం, అహంకారం ప్రతీకలైతే సజ్జనత్వానికి నిస్వార్థం, ప్రేమతత్వం ప్రతీకలుగా ఉంటాయి.

నాగరికుల పరిస్థితి :

'నాగరికము అంటే నాజెమైనది' అని అర్థం. నాగరిక జీవితమంటే నాణ్యమైన నికాల్చైన జీవితం అని అర్థంకాని నేటి నాగరిక వ్యవస్థ దానికి వ్యతిరేకంగా మానవతా విలువల్ని కోల్పోయి గడుపుతున్నారు. మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు వ్యతిరేకంగా నేటి జీవనసరళి ఉంది. సూర్యోదయానికి ముందే స్నానమాచరించవలసిన మనవారు దంతధావనం లేకుండానే టీ, కాఫీలు సేవిస్తున్నారు.

ఎల్లవారలకును హెచ్చె 'టీకాఫీల', రుచులు పాచినోట, క్రోలుచుండ్రు
ఇంత నాగరికత, యెట్లు పెంపొందెనో, నలువగూడ సుంత తెలుపలేడు

స్నాన సంధ్యలు లేకుండా టీ కాఫీలు స్వీకరించే పాశ్చాత్య సంప్రదాయం ఆ ఆంగ్లేయుల వల్లే మన భారత దేశానికొచ్చింది. ఇంత నాగరికత ఎలా పెరిగిందో సృష్టించిన బ్రహ్మకు కూడా తెలియజేయడం సాధ్యం కాదు. మంత్రోపాసన చేయాలనే విషయాన్ని మర్చిపోతూ తీరిక లేదు అని నెపం చెబుతున్నాడు నేటి నాగరికుడు.

వస్త్రధారణతో వేషభాషల్లో సహితం నాగరికత ప్రళయ తాండవం చేస్తుంది. స్త్రీలు నేత చీరలు కట్టుకొనే సంప్రదాయాన్ని మర్చిపోయారు.

తరుణులు వీపుకన్పడు విధంబున, రైకలు దాల్తురెంత నా
గరికతహెచ్చెరా? తెలుగుగడ్డపయిన్ వివరింపసిగ్గుగున్ పురుషులు పుట్టుమచ్చలను పూర్తిగలెక్కిడి వెన్కసీట్లపై మురియుచునుందురే సుకృతమో గడియించినరీతి నెంచుచున్

స్త్రీ పురుషుల బేధభావం తెలియని రీతిగా నేటి సమాజ నాగరికపు వస్త్రధారణ ఉంటుంది. గోప్యంగా ఉండవలసిన స్త్రీ వస్త్రధారణ విపరీతస్థితిని పొందుతుంది. ఇహ భాషా విషయానికొస్తే పరభాషా వ్యామోహంతో 'అమ్మ' అనే పదం కూడా బూతుగా అన్పిస్తుంది నేటి ప్రజలకు. మాతృభాష అయిన మన తెలుగు భాషను మాట్లాడటానికే నామోషీగా భావిస్తున్నారు.

"దేశభాషలందు తెలుగులెస్స యటంచు, తీర్పు చెప్పె కృష్ణదేవరాయ

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

లతని సూక్తినిపుడు బ్రతికించనోచని, దుష్టపాలనమ్ము పుష్టిచెందె"

శర్మగారీ రచన చేసే నాటికి తెలుగు దుర్భర పరిస్థితి లోనే ఉంది కాని నేడు కృష్ణదేవరాయలి సూక్తిని బ్రతికించ టానికి, పాలకవర్గం కొంతవరకు ప్రయత్నిస్తుంది. కాబట్టే డిసెంబరు 26, 2012 నుండి 28 వరకు ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించబడ్డాయి. ఇకనైనా తెలుగు వెలుగుచూస్తుందని ఆశిద్దాం. మాతృభాషను మంటగలుపు తున్నారంటూ

మాతృభాషాభిమానంబు మంటగలిసె, డాడిమమ్మీల ధోరణుల్మాడుగట్టె
ముద్దుపల్కులుగా మెచ్చి మురియుచుండ్రు, తల్లిదండ్రులిసీ? యెంత దారుణంబు?

అమ్మలోని కమ్మదనాన్ని వీడి ఈజిప్టు వారి మృత కళేబరాల పేరుతో మమ్మీలుగా పిలువబడుతున్న తల్లులు దారుణస్థితిలో ఉన్నారు. నాన్నలోని ఆత్మీయత డాడీలో కన్పించకపోయినా తృప్తి చెందుతున్నారు తండ్రులు.

నేటి సమాజాన్ని పెడదారి పట్టిస్తున్న ప్రధాన సాధ నాలు రెండు.

1. టి.వి., 2. సెల్‌ఫోన్స్ శర్మగారు వీటిని కూడా విడిచి పెట్టలేదు.

ప్రచార సాధనాల వల్ల చాలా ప్రయోజనాలున్నాయి అంతకుమించి అనర్థాలు కూడా ఉన్నాయి. సెల్ లేకపోతే ఎంత డబ్బున్నా లేనివాడే అంటూ

"నాల్గురూకలు కూడి యీ నాడు 'సెల్లు' లేనివాడుండి యునుగూడ లేనివాడె
ఉన్నవాడేమిలేకయు, నున్నవాడె, చెడెపురాతనయోగ సంసిద్ధిబలము."

సెల్లు చేతిలో ఉంటే ఏమీ లేని వాడు కూడా ఉన్నవాడే, అదిలేకపోతే ఎంత ఉన్నా లేనివాడిగానే చూస్తున్న నాగరిక ప్రపంచం తీరును నేడు మనం చూస్తున్నాం. ఈ సెల్‌ఫోన్స్ ద్వారా ఫోన్ ఫ్రెండ్స్‌గా స్త్రీపురుషులు దగ్గరై లేత జీవితాల్ని రోత చేసు కుంటున్నారు.

టి.వి., ఇంటర్నెట్‌లు అనేక విధాలుగా జీవన ప్రయా ణాన్ని సులభతరం చేస్తున్నాయి. అంతకన్నా వేగంగా యువతని తప్పుదారి పట్టిస్తున్నాయి.

వెకలి హాస్యములును, వెఱ్ఱిముద్దులు, పిచ్చి, కొగి లింతలిపుడు సాగుచుండె

భావపుష్టిలేని 'టీవీ'ల దృశ్యాల, సభ్యతావిహీన చర్యలివ్వి.
అన్ని కథలు స్త్రీల నవమానపఱచెడు, ఘట్టములకె ఆటపట్టులయ్యె
వీనిజూచి నేర్చు జ్ఞానమేమున్నది? కాలయాపనలకె వీలుకలుగు

టీవీల ప్రభావంతో చిన్న పిల్లల్లో సహితం భావావేశాలు ఎక్కువవుతున్నాయి. సభ్యత, సంస్కారాలకు చోటు లేకుండా పోతుంది. స్త్రీలే ప్రతినాయికలుగా పాత్రలను పోషిస్తూ స్త్రీ తన జాతిని అవమానపరిచే విధంగా నాటికలున్నప్పటికీ వాటిని ఆదరించి ఈ నాగరికులు కాలక్షేపం చేస్తున్నారు.

"పొగాకు, మత్తుపానీయాలు, నాగరికతగా భావిస్తున్నారు.
మందు త్రాగనట్టి మనుజుడు, మందుడు, త్రాగునట్టిజెట్టి నాగరికుడు"
గుండెజబ్బు నిండికూలు టెఱుంగడు, క్రొత్త సంప్రదాయ మెత్తెతలను

మందుతాగని వాడు మందబుద్ధిగలవాడని త్రాగే వాడు నాగరికుడు అని భావిస్తారు. అలానే పొగత్రాగేవారిని గూర్చిచెప్తూ

పెదవినల్లబారు, హృదియెల్లమసిపారు, పూనిపొగను త్రాగుమానవులకు
ఇట్టి వెఱ్ఱి వ్యామోహమెట్లబ్బెనో యిది, ఇంగిలీసు ప్రభువులిడిన కాన్క

'పొగ త్రాగనివాడు దున్నపోతై పుట్టున్' అని గిరీశం చమత్కారంగా అన్నప్పటికీ పొగత్రాగటం వల్ల జీవితాన్ని కోల్పోయే దుస్థితి ఏర్పడుతుంది. కాబట్టి నాగరికుడు నాగరికము అనే పదానికి నిజమైన అర్థాన్నిచ్చే విలువైన జీవితాన్ని గడపాలి కానీ నైతిక విలువల్ని కోల్పోయే జీవితాన్ని గడపకూడదు.

ఈ విధంగా శర్మగారు నాడు-నేడు అనే స్వతంత్ర పద్యకావ్యమందు నాటి వైభవోపేతమైన అనుభూతిని పొందుతూనే నేటి జీవనసరళిని మార్చే ప్రయత్నంలో భాగంగా ఈ కావ్యరచన చేశారు. అందుకే కావ్యాంత మందు

"అందఱు ప్రశాంతజీవితయాత్రసలిపి, సౌఖ్యసౌభాగ్య సౌజన్యసంపదలను
అందుదురుగాత దీర్ఘాయురభ్యుదయము, దైవకరుణా సుధైకపాత్రత వహించి"

అని విశ్వశ్రేయస్సుని కోరుకున్నారు శ్రీ శర్మగారు.

సమాజదుస్థితి – వివిధ రంగాలు :

సమాజంలోని అన్ని రంగాలు అధర్మంతో నిండి పోయాయి. ప్రతిచోట లంచగొండితనం పెరిగిపోయింది, వైద్యశాలల్లోను, న్యాయస్థానాల్లోను, వ్యాపారరంగంలోను, విద్యారంగాల్లోను, దేవాలయాల్లో సహితం అన్యాయాలు, అక్రమాలు చోటుచేసుకున్నాయి. విద్య, వైద్యం, అన్నీ వ్యాపార సంస్థలే అయ్యాయి అంటూ నిరసిస్తున్నారు.

వైద్యరంగం :

నేటి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఉన్న వ్యవస్థను వర్ణిస్తూ...

వైద్యశాలలెల్ల, వైశ్యాంగణములయ్యె, దోచుకొనుటె, మేటిత్రోవయయ్యె
పేదజనుల నెత్రుపీల్చురు, జలగలై విత్తదాహమెచ్చె వెజ్జులకును

"వైద్యోనారాయణోహరిః" అనేది ప్రాచీనమైన మాట వైద్యుడు సాక్షాత్తూ దైవమే అనే భావన పూర్వముండేది. కానీ నేటి వైద్యశాలలు వ్యాపారసంస్థలయ్యి పేద ప్రజల నెత్తురును జలగల్లా పీల్చుకుంటున్నాయి.

న్యాయస్థానాలు :

శిక్షించవలసిన వారిని శిక్షించకుండా శిక్షించకూడని వారిని శిక్షిస్తే రాజు నరకానికి వెళ్తాడు అనేది రాజధర్మం. ఆ రోజుల్లో రాజాస్థానాలే న్యాయస్థానాలై ధర్మబద్ధమైన పాలన అందించేవారు. నేటి న్యాయస్థానాలు అన్యాయానికి నిలయాలు. న్యాయం కోసం న్యాయస్థానానికి వెళ్ళినవాడి దుస్థితిని వర్ణిస్తూ

"వీనులేగాని, కన్నులు లేని యిట్టి, కోర్టులకునెక్కి ధన మెల్ల కోలుపోకు
వాయిదాలను వేయుచు, గాయపఱచి, మనను త్రిప్పుచు నుందు రమాయికులను"

కోర్టునాశ్రయిస్తే వాయిదాల పేరుతో కోర్టుచుట్టూ తిరగటమే తప్ప న్యాయం జరగదు. ఉన్న డబ్బుని పోగొట్టుకోవటమే తప్ప లాభముండదు. అధర్మాలకు నెలవైన న్యాయస్థానాలని గూర్చిచెప్తూ

నిజముతెలుపు సాక్షినే, తుంటరిగనెంచి, కుంటి ప్రశ్నలేసి, క్రుంగదీసి
కొట్టి వేయుచుండ్రు కుటిలాభియోగమం, చింకధర్మ మార్గమెచటగలదు?

సాక్ష్యాలను తారుమారుచేసి న్యాయాన్ని అన్యాయంగా నిరూపిస్తున్న దుస్థితి నేటి న్యాయస్థానాల్లో ఉంది. న్యాయానికి అధికారులమని పేరే గాని న్యాయాధిపతిగా కీర్తిని పొందలేరు.

వ్యాపారరంగం :

ఇంటిలో వాడుకునే సరుకులు సహితం కల్తీ అంటూ.

"ఉప్పులోన కలితి, పప్పులందును కల్తి, బియ్యమందు కలితి, వియ్యమందు
కలితి, మంచిసరుకుకానరాదాయెను, చట్టుబండ లగుచు సాగు బ్రతుకు"

ఎవరికి వారు స్వార్థంతో కష్టపడకుండా డబ్బు

సంపాదించటానికి అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. తూకం విషయంలో కూడా మోసమే చేస్తున్నారు.

"కారమందునుప్పుకలిసి, తూకంబున, మోసగింతు రిపుడు దోసమునక
వారి తప్పులేదు వారినే కడునమ్మి, మూఢ్యమూని యుంటమనది తప్పు"

తూకం పెరగటం కోసం కారంలో ఉప్పు కలిపి అమ్ముతున్నారు. అయినా తప్పు వారిది కాదు మనదే అని తెలియజేస్తున్నారు.

విద్యారంగం :

విద్యారంగం మరో వ్యాపారరంగంగా చలామణి అవుతుంది. చదువుకి విలువ లేకపోయింది అంటూ

"చదువు 'కొనుటె' గాని చదువభ్యసించుట, కాదు నేటి పాడుకాలమందు
పుట్టగొడుగులట్లు పుట్టి కళాశాల, లంతరించె గురుకులాభ్యుదయము"

చదువుకోవాలి అనే ఆలోచన అంతరించి చదువును కొంటున్న దుర్వ్యవస్థ వచ్చేసింది. విద్యార్థులపై వ్యాపారం చేస్తున్న వ్యవస్థ వచ్చింది. ఈ విద్యార్థులు రాజకీయాల్లో కూడా బలైపోతున్నారు.

"పట్టి విద్యార్థులను రెచ్చగొట్టి వారి, జీవితములను నాశమ్ము చేసినట్టి
స్వార్థపరులు స్వేజీలపై చచ్చుపుచ్చు, పలుకులను వల్లె వేసిన ఫలము గలదె?"

రాజకీయవేత్తలు తమ స్వార్థం కోసం విద్యార్థులను రెచ్చగొట్టి వారి జీవితాలతో ఆడుకుంటున్నారు. జ్ఞాన సముపార్జనకు వచ్చిన విద్యార్థులు అజ్ఞానంతో జీవితాలను కోల్పోతున్నారు.

దేవాలయవ్యవస్థ :

దేవాలయ ధర్మకర్తలు కూడా స్వార్థంతోనే ఉంటున్నారు అంటూ

"గుళ్ళు హుండీలనే కొల్లగొట్టునట్టి, ధర్మకర్తలె, ధర్మచింతనయు పాప
భీతి విడనాడి కడు విజృంభించుకతన, అడుగుపెట్టెను దేవాలయాభివృద్ధి"

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేదు, అన్నట్టు ధర్మకర్తలె ధర్మచింతన లేక దేవుని హుండీలనే కొల్లగొడుతున్నారు. దేవుని పోషణకై ప్రభువులిచ్చిన అగ్రహారాలను దోచుకుంటున్నారు.

రక్షణశాఖా వ్యవస్థ :

రక్షకులే భక్షకులై నేటి వ్యవస్థ అణగారిపోతుంది.

"రక్షణాధికారి శిక్షించుదక్షుడై, కానరాడు నేరగాని యెడల"
దొంగచిక్కె, సొత్తు దొరికినదంచును, పత్రికలు వెలార్చు ప్రకటనలనె

దొంగదొరికినా శిక్షించని వ్యవస్థ నేడు కన్పిస్తుంది. రక్షించవలసిన అధికారులు కూడా నిరుపేదను నిర్లక్ష్యం చేస్తున్నారు.

ప్రబలి రక్షణ శాఖాధిపతులు కూడ, విత్తమత్తులనే, గౌరవించుచుండ్రుకేలు జంటనుమోడ్చి, మ్రొక్కినను వారు, ఇపుడు నిరుపేదవైపు కన్నెత్తికనరు

రక్షణాధికారులు డబ్బున్న వార్నేఆదరిస్తారు పేదవాడు చేతులెత్తి మ్రొక్కినా పట్టించుకోరు. లంచం తీసుకున్న వాడ్ని పట్టుకున్నాము అని ప్రకటిస్తారు గాని అతన్ని శిక్షించినట్టుగా ఎక్కడా కనబడదు. ఇదీ నేటి రక్షణ వ్యవస్థ.

రాజకీయరంగం :

నేటి రాజకీయ వ్యవస్థ మరీ దుర్భరంగా ఉంది. ఎవరికి వారికి పదవీకాంక్ష, స్వార్థం పెరిగి ప్రజల హితాన్ని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. ప్రజలచే ఎన్ను కోబడిన మంత్రి ప్రజల సౌకర్యాలను గూర్చి ఆలోచించడు.

"మంత్రిపదవి యొక్కమాఱు దక్కినచాలు, పదితరాలదాక, కొదువలేక

బ్రతుకవచ్చు, తినుచు, త్రాగుచు, వాగుచు, కట్టు బాటులన్ని కట్టిపెట్టి"

సమాజంలోని కొందరు మంత్రులు ఈ విధంగా స్వార్థభూయిష్టమైన జీవితాన్ని గడుపుతున్నారు. రాజకీయ పార్టీలను గూర్చి చెప్తూ

"పరువుమాలి స్వపక్ష, విపక్షనేత, లాడుకొనెడి 'యెద్దేవాలు' వాడిలేని
శస్త్రములె గాని, సాధకాస్త్రములు కావు, ప్రజలనాడిని గుర్తించి పలుకవలయు"

శాసనసభలో ప్రజలకుపకరించవలసిన విలువైన సమయాన్ని నిరుపయోగంగా పరస్పరవాగ్వివాదాలతో వృధా చేస్తున్నారు.

లంచగొండితనం :

దేశంలో అడుగడుగునా కన్పించే అకృత్యం లంచగొండితనం. లంచం తీసుకుని గుడిని కూల్చటానికి కూడా వెరవట్లేదు. లంచం తీసుకోకుండా కంచంలో ముద్ద కూడా స్వీకరించని దుస్థితి నేటి అధికార వ్యవస్థ. ఈ లంచానికి బరువు అనే పరిభాష ఉంది. దాన్ని గూర్చి చెప్తూ

బరువు పెట్టినపుడు, పత్రంబు కదలదు, కాని, నేటి వింతకాలమందు
బరువు పెట్టగానె పరుగెత్తుకాగితం, బింతకన్న చిత్రమేమికలదు?

సాధారణంగా కాగితం కదలకుండా ఉండటానికి బరువుపెడతాం కానీ నేటి సమాజంలో బరువుపెడితేనే కాగితం కదులుతుంది. లంచం తీనుకోనివాడు అసమర్థుడిగా భావించబడుతున్నాడు.

లంచములు గుంజి విత్తమార్జించలేని, వాడు వ్యర్థుడెయగు నేటి పాలనమున
ధనములాగెడు తుంటరిదంటవాడు, మింటబెట్టిన దీపమై, మిడిసిపడును

లంచం తీసుకోనివాడు వ్యర్థుడని భావించి లంచం తీసుకునేవాడు ఆకాశంలో దీపంలాగా వెలుగుతున్నాడు. లంచాలు స్వీకరించే జీవితం నరకప్రాయమంటూ

"లంచముల మెక్కి బ్రతుకు సాగించుకంటె బండను ధరించి నూతిలోపడుట మేలు
జీతముల వల్ల సంతృప్తి చెందలేని వాడు నరకాల గూలు, జీవచ్ఛవంబు"

లంచాలతో జీవితాన్ని సాగించటం కన్నా నూతిలో దూకటం మేలు, తనకొచ్చే జీతంతో సంతృప్తి పడలేనివాడు నరకాలపాలవుతాడు.

ఈ లంచగొండితనాన్ని పారద్రోలటానికి శర్మగారు సలహానిస్తూ

"చాలవేమో? జీతాలు లంచాల కొఱకె, చేతులను చాపుచున్నారు సిగ్గు వీడి
వారి యుద్యోగమింకొక్కవాని కొసగ, వాడు బాధ్యత గుర్తించి పనులు చేయు"

ప్రభుత్వం నిష్కర్షగా లంచం తీసుకునే వాడ్ని తొలగించి ఆ ఉద్యోగము మరో పేదవాడికిస్తే అతను బాధ్యత గుర్తెరిగి పనులు చేస్తాడు. ఆ విధంగా చేయగలిగితేనే ఈ అవినీతి ప్రక్షాళనమౌతుంది.

సామాజిక ప్రబోధము :

సమాజ పరిస్థితులను గుర్తించి జనాన్ని జాగృతి పరచటానికి కొంత ప్రబోధాన్ని అందించారు. ఎదుటి వారి గురించి మాట్లాడే వారిని గూర్చి చెప్తూ

"ఎత్తి చూపించు నొక వ్రేల నితరుదొసగు, కూడి తనవంకజూపించు, మూడు వ్రేళ్ళు
ఈ రహస్యముగుర్తించనేరనట్టి తులువ, జాతింబురోగ తిన్నిలుపగలడె?"

ఎదుటివారి తప్పును ఒక వేలుతో చూపిస్తే మనవైపు నీ సంగతేమిటో చెప్పు అని మూడు వేళ్ళు చూపిస్తాయి. కాబట్టి ఎదుటి వారిలోని తప్పులను వెతకటం కన్నా తనను తాను సరిచేసుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుంది.అహంకారంతో ఉన్న వారి వల్ల అనర్థాలొస్తాయని చెప్తూ

"పెద్దపిన్న యన్న హద్దులు నశియించె, గర్వరేఖ
యొకటి కాలుమోపె
ఇంకముందు జాతియేదారిపట్టునో, దైవమేయెఱుంగు
దానిగుట్టు"

చిన్న పెద్ద భేదం లేకుండా గర్వాంధకారంతో కన్ను మిన్నుకానక ప్రవర్తిన్తున్న వారివల్ల మానవజాతి ఏమైపోతుందో భగవంతుడికే తెలియాలి అని ఆవేదన చెంది అహంకార రాహిత్యంతో గౌరవ భావాన్ని కలిగి ఉండాలి అన్నారు. నేటి వృద్ధాశ్రమాల ఆవశ్యకతను గూర్చి చెప్తూ

"కన్నతల్లిదండ్రులకె పట్టెడన్నమిడక, ఏడిపించగ, బాధసహింపలేక
అరుగుచున్నారు వారు వృద్ధాశ్రమముల, కెంతమమకారములఁ పెంచనేమి ఫలము?"

కనిపెంచిన తల్లిదండ్రులకు అన్నం పెట్టని నేటి దుస్థితిని చూసి ఆవేదన చెందుతూ చెప్పిన పద్యమిది. బిడ్డలను చిన్నప్పట్నుంచీ ఎంతో ప్రేమతో పెంచినా నేటి సమాజంలో పుత్రులు కొందరు వాటిని మర్చిపోయి కన్న వాళ్ళకు అన్నం పెడితే ఆస్తులు తరిగి పోతాయన్నంత బాధపడ్తున్నారు. ఇది చాలా దుశ్చర్య. పెద్దలకు పెట్టిన ముద్దే నీకు పుణ్యాన్నిస్తుందని ప్రబోధించారు. ధర్మార్థ కామములను గూర్చిచెప్తూ

"ధర్మమును మంటగలిపి, అర్థమునుకామ, మునెస దాకొల్చుతులువకు మోక్షలక్ష్మి
వశపడుటకల్ల వాని జీవనవిధాన, మడవిగాచిన వెన్నెలయగుటనిజము"

ధర్మార్థకామమోక్షములు చతుర్విధపురుషార్థములు. ధర్మబద్ధంగా జీవితాన్ని గడుపుతూ న్యాయంగా డబ్బు సంపాదించి ఆ డబ్బుతో తన కోరికలను తీర్చుకునేవాడు మోక్షాన్ని పొందగలరు. కానీ ధర్మాన్ని పట్టించుకోకుండా అర్థకామల్నే జీవితలక్ష్యంగా ఉంటే ఆ జీవితం అడవిలో కాచిన వెన్నెలలాగా ఏ విధమైన ప్రయోజనాన్ని పొందదు. త్యాగగుణాన్ని కలిగిఉండాలని చెప్తూ

"ధనముకూడబెట్టు పని తప్ప, నెప్పుడున్, త్యాగ లక్షణంబునందు కొనడు
తరలిపోవునాడు, దమ్మిడీపైతము, వెంటరాదు ధర్మ విధమెవచ్చు."

తాను సంపాదించి త్యాగం చేస్తే ఉత్తమమైనది తాననుభవిస్తే మధ్యమైనది. దానం చేయక, అనుభ వించక ఉన్న డబ్బు అధమమైనది. తనువు చాలించి నపుడు మరోజన్మకు నీకు తోడుగా వచ్చేది ధర్మమే. కాబట్టి ప్రజలు ధర్మవర్తనులుగా ఉండాలని ప్రబోధించారు.

ఈవిధంగా నేటి ఆధునిక సమాజంలో నాగరికల వెర్రిపోకడలని ఈసడిస్తూ లంచగొండితనం వంటి అసాంఘిక వ్యవస్థలను దుయ్యపడుతూ సమాజ శ్రేయస్సుతో ప్రబోధాన్నాందించిన మహోన్నత కావ్యం శ్రీ శర్మగారి నాడు - నేడు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రాంతీయ చైతన్య నవలలు – సామాజిక జీవన చిత్రణ

– డా॥. ప్రకాశరెడ్డి జి, తెలుగు సహాయాచార్యులు, ఆర్.జి.యు.కే.టి, శ్రీకాకుళం.

ఇరవయ్యో శతాబ్దపు ఆఖరి రెండు దశాబ్దాల నుండి తెలుగు సాహిత్యం అనేక మలుపులు తిరిగింది. విభిన్న అస్తిత్వాలకు చెందినవారు తమ అనుభవాలను తమదైన గొంతుతో చెప్పడం ఆరంభించారు. ప్రతి ప్రాంతం, దేశం తమ భాషయాసల్లో, సంస్కృతి నేపథ్యంలో తమ మూలాలను, ఉనికిని, బాధలను, వేదనలను చాటుకుంటున్నారు. తమ నేటివిటీని నిలుపుకోవాలని దానిలోనుంచే కొత్త సాహిత్యం వస్తుందని భావిస్తున్నారు. తమ సమస్యలను, తమ వేదనలను తామే వ్యక్తీకరించుకోవాలనే భావంలో నుంచే స్త్రీవాదం, దళిత వాదం, మైనారిటీ వాదం వచ్చాయి. కొత్తగా ప్రాంతీయ బాధను, నమన్యలను, వేదనలను చిత్రించే సాహిత్యం బాలీయంగా ముందుకు వచ్చింది. కనుకనే ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణి సాహిత్యంలో ప్రాముఖ్యతను సంతరించుకుంది.

1980ల కాలంలో ప్రాంతీయ మాండలికంలో రచనలు చేయడం చర్చకు వచ్చిన దగ్గర నుండి అసమానతలకు గురైన సాహిత్యకారులు తమ స్వరాన్ని వినిపించడానికి, తమ అస్తిత్వాన్ని, ఉనికిని బలంగా చాటడానికి సమీకృతులవుతున్నారు. భాషకు సంబంధించిన చర్చ ప్రాంతీయ స్పృహకు పాదువేయగా, 1990ల తర్వాత ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రాంతీయ వివక్షకు లోనుకావడానికి సంబంధించిన ప్రశ్నలను వివిధ వర్గాలవారు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో ప్రాంతీయ ఆకాంక్షలు బలపడి ప్రాంతీయస్పృహ కాస్తా ప్రాంతీయ చైతన్యంగా రూపుదిద్దుకుంది. ఈ క్రమంలోనే ప్రాంతీయ సాహిత్యం మరింత నిర్దిష్టతను సంతరించుకుంది. ఆచార్య కాత్యాయనీ విద్మహే ప్రాంతీయ సాహిత్యాధ్యయన ఆవశ్యకతను వివరిస్తూ, 'ప్రాంతీయత సాహిత్యానికి గుణమే కానీ విరోధం కాదు. సాహిత్యం నేల నుంచి మొలకెత్తినప్పుడు, నేల మీద నిలబడ్డప్పుడు, ఆ నేల లక్షణం ఆ ప్రాంత వాతావరణ ప్రభావం దాన్ని సజీవం చేస్తాయి. సాహిత్యాన్ని సజీవ మానవ సంబంధాల్లో అర్థం చేసుకోవాలంటే ప్రాంతీయత ప్రాతిపదికగా అధ్యయనం తప్పనిసరి' అని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే నేడు ప్రాంతీయాత్మతో, ప్రాంతీయవాదంతో వచ్చే సాహిత్యానికి అవాంతరాలు ఎక్కువైనా వాటిని అధిగమించి ప్రాంతీయవాద సాహిత్యాన్ని ఓ తపస్సులా సృజిస్తున్నారు.

ఇటువంటి సాహిత్యం ప్రాంతీయ చైతన్యాన్ని రగిలిస్తే, అది బలపడటానికి ఈ క్రింది అంశాలు దోహదం చేశాయి.

1. సాహిత్య ప్రమాణాలను బేరీజు వేసేటప్పుడు కొన్ని ప్రాంతాల సాహిత్యానికి ప్రాధాన్యం లభించడం లేదని గుర్తించడం.
2. కొన్ని జిల్లాల వాడుక భాష వ్యవహారికంగా చలామణి అవుతుంటే తక్కిన ప్రాంతాల వారి భాషను హేళన చేసే ధోరణి పెరిగిందని భావించడం.
3. సాంస్కృతికంగా కొన్ని ప్రాంతాలే గొప్పవన్న భావాన్ని సాహిత్యంలో, ఇతర కళారూపాలలో ప్రదర్శించడం.
4. కొన్ని ప్రాంతాలు మాత్రం భౌగోళిక వనరుల వల్ల ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా వైజ్ఞానిక రంగాల్లో సాధించిన అభివృద్ధిని అంచనా వేసినప్పుడు మిగిలిన ప్రాంతాలు వివక్షకు గురయ్యాయని భావించడం.
5. కొన్ని ప్రాంతాల తక్షణ అభివృద్ధి వల్ల వలసలు

అనివార్యం కాగా, వలస వచ్చిన వారు ఆధిపత్యం చలాయిస్తున్నారని గుర్తించడం.

6. ప్రాంతీయ అసమానతలకు ప్రాధాన్యం ఇవ్వ కుండా కేవలం ప్రజలు మాట్లాడే భాష, జీవించే భౌగోళిక పరిస్థితుల ఆధారంగా జరిగిన విభజన వల్ల అభివృద్ధిలో సమతూకం కొరవడిందని గుర్తించడం.

ఈ కారణాల వల్ల స్థానిక ప్రజలలో అణచి వేయబడుతున్నామనే చైతన్యం కలిగింది. మరోవైపు రచయితలు తమ భాష, సాహిత్యం, అస్తిత్వాన్ని ప్రకటించుకోవడానికి ముందుకొచ్చారు. ''కొత్త ఆలోచన లతో ఎవరి అనుభవాలను వాళ్ళు రాయడమే కాకుండా తమ అనుభవాలను తమదైన భాషలు రాయాలన్న సంకల్పం ఏర్పడడానికి కొత్త చైతన్యం తోడ్పడింది. ప్రాంతీయ స్పృహవల్ల అప్పటివరకు మామూలు పద్ధతిలో రచనలు చేసిన వారు సైతం మాండలికాన్ని ఉపయోగిం చటం అలవరచుకున్నారు.'' (వెంకటేశ్వర్లు గుడిపాటి - తెలుగు సాహిత్యం-తెలంగాణ చైతన్యం ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు-ధోరణులు,(సం.) ఆచార్య సత్యనారాయణ ఎస్వీ, తెలుగు అకాడమీ, 2005, పు. 149,150) అనుభవంలోని జీవితాన్ని రాయాలి అనేసరికి రచయితల్లో ప్రాంతీయత ముద్ర తప్పనిసరి అయ్యింది. ప్రాంతీయతలో ప్రత్యేక రాజకీయ ఆస్తిత్వకాంక్ష కూడా చేరుతుంది. రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి స్థానిక, ప్రాంతీయ అస్తిత్వాలకు ప్రాతినిధ్యం వహించే సాహిత్యం వస్తున్నది.

ఉత్తరాంధ్ర నుండి కథలు, నవలలు ఎక్కువగా వస్తు న్నాయి. భూసమస్యలు జల వనరుల సమస్యలు, కొన సాగుతున్న భూస్వామ్య సంస్కృతి, పేదరికం, దోపిడీ వాటి వెనుక ఉన్న కారణాలను చిత్రిస్తూ ఆ మాండలికంలో రచనలు వస్తున్నాయి. రాయలసీమలో ఆధునిక కవిత్వం కంటే కథకు, నవలకు ప్రాచుర్యం ఎక్కువ. భూ సంబం ధాలు, కరువులు, వ్యవసాయ సమస్యలు, కూలీల వలసలు, ప్రాథమిక అవసరమైన నీటి సమస్యలు, ముఠా కక్షలు, స్థానిక స్వార్థ రాజకీయాలు, పీడన, దోపిడీ, కుల మత వివక్షలు, ఆత్మహత్యలు, వలసలు, సామాజిక సంబంధాలు, వ్యాపార సంస్కృతి, ప్రపంచీకరణను చిత్రిస్తూ ప్రాంతీయ భాషాభీవ్యక్తులలో రచనలు చేస్తు న్నారు. కోస్తా ప్రాంతం నుండి సామాజిక సమస్యలు, ప్రాంతీయ సమస్యలు, హత్యా రాజకీయాలు, మార్కెట్ సంస్కృతి, ప్రపంచీకరణ, వ్యాపారీకరణలను చిత్రిస్తూ రచనలు వెలువడుతున్నాయి.

ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు తెలంగాణ చారిత్రి కానుభవాలు భిన్నమైనవి. హైదరాబాదు విముక్తి జరిగేంత వరకు తెలంగాణ భిన్నమైన పరిపాలనలో తెలుగు భాష అస్తిత్వం కోల్పోయింది. ఉర్దూ ప్రభావం ఉండటం వల్ల రచనలలో కూడా అన్యభాషా పదాలు చోటుచేసు కున్నాయి. 1969 తరువాత తెలంగాణ ప్రజల జీవితాన్ని ఆవిష్కరించే రచనలకు పునాది ఏర్పడి మాండలికంలో రచనలు రావటం ఆరంభమైంది. 1990ల తరువాత తెలంగాణా స్పృహ బలపడి విస్తృతంగా రచనలు వచ్చాయి. తెలుగు సాహిత్యంలో తెలంగాణ ప్రాంతీయ చైతన్యం వ్యక్తమయింది. ''స్థానికతను, ప్రాంతీయ చైతన్యానికి ప్రాతినిధ్యం వహించే సాహిత్యంలో స్వత్వానికి ఆధార భూమిక అయినవి గ్రామీణ జీవితం, సంస్కృతి, జ్ఞాప కాలు, పలుకుబళ్ళు, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వ చైతన్యా నికి మూలాధారాలు. తెలంగాణ ప్రాంతీయ చైతన్య సాహిత్యంలో మరో ప్రధానమైన అంశం ప్రాంతీయభాషా స్పృహ, తెలంగాణ మాండలికం అన్నమాటను తెలంగాణ చైతన్య రచయితలు ఒప్పుకోరు. తెలంగాణ భాషగానే గుర్తిస్తారు. తెలంగాణ భాషలో రచనలు వస్తున్నాయి. మరుగున పడుతున్న పద సంపదను నిలబెట్టే ప్రయత్నంలో ప్రయోగాలు చేస్తున్నారు.'' (రంగనాథా చార్యులు కె. కె. - ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు తదనంతరంబీ ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - (సం.) కె. కె. ఆర్., ఆంధ్ర సారస్వత

పరిషత్తు, హైదరాబాదు ద్వి. ము. 2005, పు.263.) ఈ రకమైన ప్రాంతీయాభిమానం సాహిత్యంలో గాఢంగా ప్రతిబింబిస్తుంది. ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యం అనగానే తెలంగాణ సాహిత్యం అనే స్థితికి వచ్చింది.

ఆధునికీకరణ, ప్రపంచీకరణ దుష్ఫలితాల వల్ల పతనమవుతున్న వృత్తులు, మానవ సంబంధాల్లో మార్పులు, కుటుంబ సంబంధాలు, బొగ్గుగనుల, బీడీ కార్మికుల జీవితాలు, అంతర్వలసలు, కల్తీ విత్తనాలు, పురుగు మందుల నాణ్యతా లోపం, భూములు ఆక్రమించబడటాన్ని, వ్యవసాయ భూములు, పారిశ్రామిక వాడలు, ప్రకృతి వనరులు, నీటి దోపిడీలను చిత్రిస్తూ ప్రాంతీయ చైతన్యంతో రచనలు వస్తున్నాయి. తెలుగు సాహిత్యంలో ఈ ప్రాంతీయ చైతన్యం ఆయా ప్రాంతాల సాహిత్య ప్రత్యేకతను నిరూపించుకోవడానికి ఉపకరించింది. ఈ క్రమంలో మూడు ప్రాంతాల నుండి వచ్చిన మూడు నవలలను పరిచయం చేస్తాను.

పునరావాసం - ఎ అప్పల్నాయుడు :

శ్రీకాకుళ గిరిజన రైతాంగ జీవితాలను సంఘర్షణకు గురి చేసే వ్యక్తులను, వ్యవస్థను ధిక్కరిస్తూ చేసే పోరాటాలను, వాటి ద్వారా సాధించుకునే హక్కులను దృశ్యమానం చేసింది అప్పల్నాయుడు పునరావాసం నవల. అడవిలో జీవనం సాగించే ఆదివాసీలకు ఆపాయం మృగాల వల్లే కాదు వాటి కంటే ప్రమాదకరంగా జనం మధ్యలో ఉండే షావుకార్లు, పోలీసులు, నాయకులు, ప్రభుత్వ అధికారులు నుండి నిత్యం ఉంటుందని వారిని, వారు చేసే మోసాలను ఎదిరించాలంటే చదువు ముఖ్య ఆయుధమని ప్రతిపాదించిన నవల. ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం కొండల్లోని జమ్మొలస ఆదివాసీలను ఉద్ధరించటానికి ప్రభుత్వం పునరావాసం పేరుతో అందించే పథకాలను, వాటిని పొందడం కోసం చేసే పోరాటాలు నేపథ్యంగా తీసుకుని ఈ నవల రచించారు. మూడు తరాలకు ప్రతినిధి అయిన కంఠుడు భూమి కోసం, భుక్తి కోసం చేసిన యుద్ధంలో తన కొడుకుని, కోడలిని, మనవరాలి భర్తను, చివరకు భూమిని పోగొట్టుకుని పిచ్చివాడిగా మారి ప్రాణాలను వదిలిన విధానం గడువు దయనీయంగా చిత్రించారు. ఈ నవలలో కథా నాయిక కంఠుడి మనవరాలు బంతెమ్మ. చదువుకున్న బంతి తమ జాతి ఆచారాలు, సంప్రదాయాలను కాదని నగర సంస్కృతికి లోనై అదే ప్రపంచం అని నమ్మి ఆ వ్యామోహంతో రాజూ బాబు చేతిలో మోసపోయి గర్భవతి అవుతుంది. బంతిని ప్రాణంగా ప్రేమించే భీముడు ఆ నిందను తనమీద వేసుకుని భార్యగా స్వీకరిస్తాడు. గౌరునాయుడు మాస్టారు ప్రోత్సాహంతో బంతిని సంగీతం టీచరుగా ఐటిడిఏ వారు నియమిస్తారు. భీముడితో సాఫీగా సాగిపోయే సంసారంలో నకిలీ వార్డెన్, మరో టీచర్ పన్నిన పన్నాగంలో ఉద్యోగం పోగొట్టుకుంటుంది. భీముడు ఉద్యమాలకు ఆకర్షితుడై ఆ సిద్ధాంతాల ద్వారానే తమ హక్కులు పొందాలని దానిలో చేరతాడు. కంఠుడు పెద్దల కాలం నాడు సాలూరు జమీందారు యీనామ్ కిచ్చిన భూమిని సత్తయ్య ఆక్రమించి అన్నల చేతిలో ప్రాణాలు పోగొట్టుకుంటే, ఇప్పుడు కాంట్రాక్టర్ జగ్గారావు గడ్డ పొలం ఆక్రమించుకుని దాని హక్కుదారుణ్ణి గుండాల సహాయంతో పంటను కోయిస్తాడు. దానికి ఎదురు తిరిగిన భీముడు, మరో నలుగురు ప్రాణాలు అర్పిస్తారు. దాంతో రాజకీయ నాయకుల వాగ్దానాలు, పునరావాస కార్యక్రమాలు మొదలవుతాయి. అన్నలు జగ్గారావును చంపడంతో పోలీసులు కాలనీని ముట్టడిస్తారని తెలిసి అక్కడి ప్రజలు తలదాచుకోవడానికి పారిపోతారు. బంతి ఒరిస్సా సరిహద్దుల్లో ఉన్న తన ముత్తాతను చేరుకుని అక్కడ కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. కానీ అక్కడ కూడా జమ్మొలసలో పొందిన అనుభవాలకు భిన్నంగా ఉండక పోవడంతో చైతన్యం పొందిన బంతి ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించగలం అనే ఆలోచనతో నవల ముగుస్తుంది.

గిరిజనులు హక్కుగా పొందవలసిన పథకాలను ఉచితంగా ఉద్ధరించటానికి ఇస్తున్నామన్న అగ్రికల్చర్ డెమోని స్ట్రేటర్ తో కంఠుడు ''యెవుల్ని నమ్మి యెలాగ సెడిపోనామో... మీకు తెల్డా బావ్? మా కొండల మీద మా పంటల్తోటి, సంపదల్తోట... మా బతుకు మేము సుకంగా బతికినోళ్లం. మా బతుకుల్లోకి సంతలూ, సావుకార్లూ వచ్చినారు. ఉప్పుకీ, వొగ్రగుండకీ, కిర్సనూనికీ మీము పల్లానికి దిగినం. నేస్తరికాలు గట్నారు మాతోటి. అప్పా, అన్నా, బావా వరసలు గట్టి నమ్మించినారు పల్లం సావుకార్లు, నమ్మినాం. కంబార్ల (పాలేర్లు) మయిపోనాం. ఎలాగయి పోనామో, ఎవులి పాపమెంతుందో ఆ భగవంతుడికి తెలియాల''(పు. 22) అని తాము మోసపోతున్న విధానాన్ని తెలియజేస్తారు. మరోవైపు రాజకీయ నాయకులు, షావుకార్లు అడవి సంపదను ఆదివాసీలకు దక్కకుండా కారుచౌకగా అనుభవించటం, భూములు ఆక్రమించుకున్నందుకు సంఘం మరణదండన విధించడం, చేతివృత్తుల ధ్వంసం అక్రమ సంబంధాలు అరికట్టడానికి ఆచారాల కొనసాగింపు, స్త్రీ పురుషులు తప్పు చేసినప్పుడు పురుషుణ్ణి శిక్షించడం, స్త్రీకి ఏ శిక్షా లేకపోవడం, ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం, గిరిజనుల్లో చైతన్యానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు, బయట ప్రపంచం తెలియని ఏజెన్సీ గ్రామాల ప్రజలకు సంతల ద్వారా వస్తుమార్పిడి చేసుకునే పద్ధతి, ఆహారపు అలవాట్లు, వన మూలికలతో వైద్యం, పునరావాసం పేరుతో దోచుకునే వర్గాన్ని, పథకాలు అందక అడవి బతుకు బతికే వీలులేని, ఆకలితో అసహాయంతో జీవితాలను నెట్టుకొచ్చే వలసల్లోని బతుకులను చాలా యథార్థంగా పునరావాసం నవలలో చిత్రీకరించారు.

అంతేకాకుండా ఈ నవలలో పోలీసుల, ప్రభుత్వ అధికారుల ద్వంద్వనీతిని, మరి కొంత మంది అధికారులు గిరిజనుల కోసం సంక్షేమ, పునరావాస పథకాలు దళారులకు అందకుండా నేరుగా అందేటట్టు తీసుకున్న చర్యలు రాజకీయ నాయకులు నిర్ధారించటం నీరు గార్చటం, నగర సంస్కృతి ప్రవేశించడం వల్ల మనస్సుల్లో కల్తీ, నచ్చిన అమ్మాయిని లాక్కుపోయి పెళ్లి చేసుకునే వివాహ పద్ధతి, నచ్చిన వ్యక్తికీ తన జీవితాన్ని నైవేద్యంగా సమర్పించే సవర స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించారు.

ఆదివాసీలు యినాంగా పొందిన భూమిని పెత్తందారీ కలాలు, పెట్టుబడిదారీ వర్గాలు ఆక్రమించుకోవడానికి ఐదుగురి నిండు ప్రాణాలను బలి గొనడం, గిరిజనుల అమాయకత్వాన్ని అడ్డుపెట్టుకు ప్రతీది దోచుకోవడం, మరోవైపు పోలీసులు వలసపై పడి భీభత్సం సృష్టించి, స్త్రీలను చెరచి, దొరికిన వారిని లాకప్పుల్లో వేసి దారుణంగా కొట్టడం, సంఘం ద్వారా కొంత జ్ఞానం సంపాదించిన యువత అన్యాయాలను ఎదిరించడం ఈ నవలలో ఆయా పాత్రల ద్వారా స్థానిక మాండలికంలో సహజంగా చిత్రించారు రచయిత.

పన్నేటి మలుపులు - శాంతి నారాయణ :

భూస్వామ్య దౌర్జన్యాన్ని ప్రధానంగా చిత్రించిన నవలల్లో పెన్నేటి మలుపులు ముఖ్యమైనది. రాజ్యం భూస్వాములకు ఇచ్చే అపరిమితమైన హక్కులు, భూస్వాములు ఆ హక్కుల్ని కింది తరగతుల వారిని అణచి వేసేందుకు ఉపయోగించే తీరు ఈ నవలలో స్పష్టం చేయబడ్డాయి. భూస్వామి రాజేశ్వరెడ్డి అతని తమ్ముడు రామిరెడ్డి చేసిన హత్యలు, మానభంగాలు, భూ ఆక్రమణలు దాదాపుగా నవలంతా పరుచుకున్నాయి. అంతేగాక విస్తృతమైన బహుజన జీవన చిత్రణ కూడా మనకు ఈ నవలలో కనిపిస్తుంది. మాదిగల భూముల సమస్య, ఈడిగల ఈతతోపు వేలం సమస్య, బోయల సారా వ్యాపారం సమస్య, కురవల గొర్రెల మేత సమస్య మొదలగువాటిని కుల నేపథ్యంలో నుంచి కాకుండా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అంచనా వేసే ప్రయత్నం చేశాడు రచయిత. రాజేశ్వర రెడ్డి చేసిన దురాగతాలకు ప్రతిఫలంగా, ప్రతిక్రియ గా నక్సలైట్ల దండన సహజమనే తీరు ఈ నవలలో కనిపిస్తుంది. అప్పటివరకు ప్రజలను హింసించి, దండించి దోచుకున్న సంపద, భూములు ప్రభుత్వ

అధికారుల, ప్రజాప్రతినిధుల సమక్షంలో తిరిగి ప్రజలకే అప్పజెప్పాడు రాజేశ్వరరెడ్డి. దానికి కారణం నక్సలైట్లు అంటే ఉన్న భయం అతన్ని ఈ చర్యకు పురిగొల్పుతుంది. అయినప్పటికీ నక్సలైట్లు రాజేశ్వర రెడ్డి కుటుంబం మొత్తాన్ని ఎత్తుకుపోయి కొడుకైన కొండారెడ్డి మర్మాంగాలు కోసి పడేసి పోయినప్పుడు ''తప్పుడు నాకొడకల్ని, మంచి పని చేసారులేన్నా, ఈ నా కొడుకు ఎన్నో తప్పుడు పనులు చేసింటేనే వీణ్ణి 'దడ్లు' కోసింటారు! కాకపోతే ఏం అప్ప, ఈ ముదనష్టమోల్లతో బంగారట్లా ఊరు నాశనమయి పాయ'' (పు. 349) అని సరైన శిక్షే విధించారని, వారి పీడ విరగడయిందనే సంతోషంలో ప్రజలు పండగ చేసుకోవడం ఈ నవలలో చిత్రితమైంది.

భూస్వాములు తమను దిక్కరించే వారిని సహించలేక పోవటం, తమ అవసరాలకు ఉపయోగపడని వాటిని ధ్వంసం చేయటం, మనుషుల మధ్య, కులాల మధ్య తరగవులు పెట్టి తమ పని నెరవేర్చుకోవడం, ఆధిపత్యాన్ని, అధికారాన్ని చెలాయించడానికి చేసే ఆగడాలు, దౌర్జన్యాలు ఎంత వికృతంగా ఉంటాయో ఈ నవలలో చిత్రించారు.

అగ్నికణం - అల్లం రాజయ్య :

ప్రాంతీయ వాద స్ఫూర్తిని, చైతన్యాన్ని మాండలిక భాషలో అద్భుతంగా చిత్రించిన నవల అగ్నికణం. ఆర్థిక పీడనతో పాటు పితృస్వామ్య సమాజం వల్ల లైంగిక పీడనకు గురవుతూ బ్రతుకు నిత్య సంఘర్షణగా జీవిస్తూ ఉన్న స్త్రీలకు ప్రతినిధిగా భయ్యక్కను ఈ నవలలో చూపిస్తాడు రచయిత. అంతేగాక పీడన నుండి, దోపిడీ నుండి విముక్తం కావాలంటే శ్రామిక రైతాంగ విముక్తి పోరాటాల్లో స్త్రీలు మమేకమైనప్పుడే వారి స్థితిగతులు మారతాయనే అంతర్లీన సందేశం ఈ నవలలో కనిపిస్తుంది.

భూములు ఉన్న వాటి మీద అధికారం లేని స్థితి, పంట పండినా దానిని అనుభవించే అవకాశం లేకపోవడం అత్యంత దయనీయంగా ఆయా పాత్రల ద్వారా ఈ నవల నిరూపిస్తుంది. పండిన పంట నంత గౌరయ్య బండ్లలో తరలించుకు పోతుంటే దానిని సహించలేని నరసయ్య నెత్తి కొట్టుకుంటూ 'నా బొందిల పానముండగా నేను గీ బండ్ల కదులనియ్య, గౌరయ్య నన్ను సంపు, నా మీనికెల్లి బండ్ల గొట్టుకుని నా నెత్తురు, సెమట, నా పంట గొంటబో' అని బండికి అడ్డం పడటం వారి దయనీయ స్థితికి అద్దం పడుతుంది. అంతేకాక పేదవాళ్ళు, రైతుల శ్రమను దారుణంగా దోచుకునే పెత్తందార్ల ఆలోచనా విధానాలు ఈ నవల ద్వారా గ్రహించవచ్చు.

బలవంతులు బలహీనుల్ని దోచుకోవడం, దానిని ఎదిరించిన వారిని సాంఘిక బహిష్కరణ చేయడం మొదలైన అంశాలు ఈ నవలలో ప్రాముఖ్యత వహించే ఇతరాంశాలు. పల్లెల్లో జరుగుతున్న దౌర్జన్యాలు వాటి ఫలితంగా రైతాంగం పడుతున్న కష్టాలతో పాటు భూమి కోసం వారు పడే పాట్లు మొదలైన అంశాలు కూడా రచయిత ఈ నవలలో చిత్రించారు. అడుగడుగున తన జీవితంలో ఎదురైన అవమానాలను భరిస్తూనే పుట్టు బానిసగా బ్రతికిన బయ్యక్క చివరకు చైతన్యాన్ని పొంది దళంలో చేరడం, పరిస్థితుల్ని మార్చాలని చూడటం వారిలో వస్తున్న మార్పుకు నిదర్శనం. దళంలో చేరిన తరువాత ఊర్లోకి వచ్చిన బయ్యక్క ఊర్లోని పరిస్థితులు మారక పోవడంతో ఆశ్చర్యపోతుంది. దొరలు, పెత్తందార్లు రైతాంగ పోరాటాలకు భయపడి పారిపోయినా ఏదో ఒక రూపంలో దోపిడీ జరుగుతూనే ఉండడాన్ని గ్రహిస్తుంది బయ్యక్క.

అందుకే వీళ్ళు ఉన్నంతకాలం ఏదో ఒక రూపంలో ప్రజల్ని లొంగదీసుకోవాలనే ఆలోచనతోనే ఉంటారు. ''గిది మన ఊరికొక్క దాని సంగతి కాదు. మన దేశంల మన ఊరు ఏరే లేదు... పెద్దోర జేసే టక్కుటమారాలు ఇంకా సేత్తానే ఉన్నడు. పోలీసోల్ల బెట్టుకొని ఎప్పటికైనా మునుపటి తీర్గ సాగిచ్చుకుంటానని కలలు కంటుండు... ఏ పల్లె జూసిన గిట్లనే ఉన్నది. దొరను ఎలేసి అన్ని పనులు బందు బెట్టంగనే అయిపోలేదు. ఆడున్నంతకాలం

ఏదో ఉపాయంతోని మన మీదికి ఎక్కి నవారీ జెయ్యాన్నని సూతంటడు. వానెనుక సర్కారు పోలీసుల బలగం ఉన్నది. మనం మన రెక్కలతోని ఆని బలగాల కెదురు నిలిసినం.... మన కట్టాలన్ని బోవాల్నంటే దొరోని బూములన్నీ మనకు రావాలే... దున్నెటోనికి బూమి గావాలె... గందు కోసం కట్టమైన నిట్టూరమైన గీ లఢాయి జెయ్యాలె'' (పు. 416). కాబట్టి రైతాంగ పోరాటాలు, సంఘాలు ఏర్పాటు చేసుకోవడం అనివార్యంగా అని పిస్తుంది.

చైతన్యం పొంది ఉప్పెనలాగా పోరాటాన్ని నిర్వహించి భూముల్ని దున్నుకుని ప్రజా కోర్టులను నిర్వహించి చివరికి దొరల్ని సాంఘికంగా బహిష్కరించే స్థాయికి ఎదిగాకే వారికి ఊరంటే ఏంటో నిజంగా తెలుస్తుంది. అందుకే కష్టము మనదే, ఫలితమూ మనకే, భూమీ మనదే, దాని మీద పెత్తనమూ మనకే అంటూ దొరల పెత్తనాన్ని ఎదిరించటం ఈ నవలలో ప్రముఖంగా కనిపించే విషయం. చివరగా పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి అనే సామెతలాగే తాము ఆర్థికంగా, సామాజికంగా అణచివేయబడ్డ చోటే తిరిగి పోరాటం చేస్తూ తమను తాము నిలబెట్టుకోవాలనే తపనను ప్రతిభావంతంగా చిత్రించారు రచయిత.

ఉత్తరకోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతీయ నవలల్లో రచయితలు వస్తువుగా స్వీకరించిన పలురకాలైన సమస్యలకు దాదాపు ఒకే విధమైన పరిష్కారాన్ని అందించడం గమనించవచ్చు. విద్య, చైతన్యం, సమష్టి పోరాటం ద్వారా మార్పు సాధ్యమనే సూచన రచయితల నవలల్లో గుర్తించవచ్చు.

ఎ. అప్పల్నాయుడు - పునరావాసం భూమి కోసం ఆది వాసీల పోరాటం సాగించడాన్ని చిత్రీకరించింది. మోసాలను జయించడానికి విద్య ఆయుధమని ప్రతి పాదించిందీ నవల. శాంతి నారాయణ - పెన్నేటి మలుపులు భూస్వాముల హక్కులు కింది వారిని అణచి వేసేందుకే అనే అంశాన్ని వస్తువుగా స్వీకరించి, నక్సలైట్ల దండన పరిష్కారంగా సూచిస్తుంది. అల్లం రాజయ్య - అగ్నికణం దొరల పెత్తనాన్ని వస్తువుగా స్వీకరించారు. రైతాంగ విముక్తి పోరాట చైతన్యాన్ని, నక్సలైట్ల ఉద్యమం అవసరాన్ని సూచించాయి. భాష, మతం, ఆచార వ్యవహారాలు, ఆహార అలవాట్లు, సంస్కృతి సంప్ర దాయాలు పరంగా అణచివేతకు, వివక్షకు, అన్యాయానికి, ఆధిపత్యానికి గురవుతున్న ప్రాంతాలు అస్తిత్వం కొరకు ప్రత్యేక ప్రతిపత్తిని, స్వయం నిర్ణయాధికారాన్ని కోరు కోవడాన్ని ప్రాంతీయవాదంగా చెప్పవచ్చు. ఒక ప్రాంతంలో సామాజిక సమస్యలైన కరువు, వలసలు, అసమానతలు, పేదరికం, విద్య, నిరుద్యోగం, సంస్కృతి సంప్రదాయాలు, నమ్మకాలు, ఆహార అలవాట్లు, జీవనవిధానం, వనరుల దోపిడీ, నిష్పత్తి పంపకాలలో వివక్ష, సాహిత్య వస్తువులో, అభి వ్యక్తిలో, భాషలో, ఉపమానాల్లో ప్రత్యేకతను ప్రతి బింబించేలా వ్యక్తం చేయటం ఈ ప్రాంతీయవాద నవలల్లో కనిపిస్తుంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక సాహిత్యంలో కరువు ప్రభావ చిత్రణ

– డా॥. జి. వెంకట రమణ, తెలుగు ఉపన్యాసకులు, అక్కినేని నాగేశ్వర రావు కళాశాల, గుడివాడ, కృష్ణా జిల్లా.

ఆధునిక సాహిత్యంలో సామాజికాంశాల పట్ల స్పృహ, చలన ఉన్న రచనలు ఎక్కువగా కనిపిస్తాయి.అలా చూసినప్పుడు ప్రాంతీయతా చైతన్యంతో రాసిన రచనలు కూడా ఎక్కువనే చెప్పాలి. ఆధునిక రాయలసీమ సాహిత్యంలో ప్రాంతీయతా చైతన్యం బహుశా రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ 'పెనుగొండ' అన్నపాటతో ప్రారంభ మైందని వల్లం పాటి వెంకట సుబ్బయ్య గారి "ఆధునిక కవిత్వంలో రాయలసీమ చైతన్యం" అనే పుస్తకం చదివితే మనకు అర్థమవుతుంది.

'పెనుగొండలక్ష్మి'- పుట్టపర్తి నారాయణాచార్యులు:

గత వైభవం వద్దనే ఆగిపోకుండా, వర్తమాన దైన్యం వద్దకు వచ్చిన కావ్యం పుట్టపర్తి నారాయణాచార్యుల 'పెను గొండలక్ష్మి'. ఈ కావ్యాన్ని 1930 ల ప్రాంతంలో రాశారు.

పుట్టపర్తి నారాయణాచార్యుల 'పెనుగొండలక్ష్మి', రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ 'పెనుగొండ' అనే ఈ రెండు కావ్యాలు 20 శతాబ్దపు పూర్వభాగంలో రాయబడ్డాయి. వీటిలో ప్రస్తుత 'పెన్నేటి పాట'లో ఉన్న దైన్యస్థితి కనిపిం చదు. ఆనాడు ఈ పెనుగొండ ప్రాంతం ఈ నాటిలా కరువు సీమకాదని విద్వాన్ విశ్వం 'పెన్నేటిపాట' పీఠికలో రాళ్ళపల్లి వారు పై విషయాన్ని స్పష్టం చేయడం గమనించదగింది.

పెనుగొండ పక్కనే ఉన్న 'భోగసముద్రం' అన్న చెరువు (దీన్ని బాబయ్య చెరువని కూడా అంటారు)ఎప్పుడూ నిండుగా ఉండేదట. కొండమీద నెమళ్ళు, జింకలు, ఇతర జంతువులు పుష్కలంగా ఉండేవట. తన చిన్నప్పటి పెనుగొండను తలుచుకొని పుట్టపర్తి వారు "వర్షాకాలంలో ఆ సౌందర్యం వర్ణనాతీతం" అంటూ "ఈనాడు ఆ కొండ కట్టేల కోసం బీడుగా మారిపోయిందని" వాపోయారు. 'పెనుగొండలక్ష్మి' లో పెనుగొండ కరువు కాటకాల ప్రాంతంగా కనిపించకపోవటానికి కారణం ఇదే.

పుట్టపర్తి "మేఘదూతం"లో మొదటిసారిగా సమ కాలీన రాయలసీమ జీవితానికి సంబంధించిన నెగిటివ్ అంశాల ప్రస్తావన బలంగా వినిపిస్తుంది. అక్కడి జీవితాన్ని ఇలా వర్ణించాడు.

"క్షామపీడిత గాత్రములు వణుకాడ
నీ మొగము వీక్షింత్రు నీరదను
తెలుగుప్రజ"

అన్నాడు ఇక్కడ తెలుగు ప్రజ అన్నమాట రాయలసీమ ప్రజలు అన్న అర్థంలో వాడబడింది. అంతేగాక ఆధునిక కాలంలో ఫ్యాక్షన్ హింసనూ కరువును కలిపి రేనాడును గురించి పుట్టపర్తి ఇలా అన్నారు.

"పొడిచికొన నేలపై పడుడు రక్తమేకాని
అరుదుగా మేఘజాలమా నేలపై పడును
రాయలసీమలో"...

- ఆధునిక సాహిత్యంలో సామాజిక సాంస్కృతిక విశ్లేషణ పుట -58

అమృతం కురిసిన రాత్రి - దేవరకొండ బాలగంగా ధర తిలక్ :

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవిత్వోద్యమానికి ఒక విశిష్ట స్థానం ఉంది. అభ్యుదయ కవిత్వంలో ఓ మైలురాయి అమృతం కురిసిన రాత్రి. దీన్ని తిలక్ రాశారు. బెంగాల్లో 1941లో అనావృష్టి. తుఫానులు, యుద్ధాలవల్ల క్రమంగా కరువు పరిస్థితి ఏర్పడింది. ఇది మూడు సంవత్సరాల పాటు కొనసాగడంవల్ల భయంకర మైన అంటువ్యాధులు వ్యాపించాయి.సూమారు 10 లక్షల మందికి పైగా మరణించారు. దాదాపు 1945 వరకు అదే పరిస్థితి.

తిలక్ 'భూలోకం' అనే కవితలో ఈ బెంగాల్ కరువు దృశ్యాలను చిత్రీకరించాడు.

"వంగదేశ క్షామం యిది
వ్యంగ్యభాష క్షేమంయిది
పరప్రభుత్వ దానం యిది
ధనికలోక ధర్మంయిది".

- అ.కు.రా. భూలోకం -33

బెంగాల్ రాష్ట్రం కరువులో చిక్కుకుంది వ్యంగ్యభాష అంటే ఆంగ్లేయుల భాష. వారికి ఏ దయా దాక్షిణ్యాలు లేవు. పరప్రభుత్వ పాలనలో ధనికులు మాత్రమే బతికే రాజ్యమేలే రాజ్యమని బ్రిటిషు ప్రభుత్వ దారుణాలను ఎత్తిచూపాడు.

బెంగాల్ ప్రాంతమంతా ఏ దారిలో చూసినా శవాలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. అస్థి పంజరాలు ఎక్కడ చూసినా పడిపోయాయి.తిలక్ 'భూలోకం' కవితలో

"కూడులేని లోకం యిది
గుండెలోతు తాపం యిది
సోమయాజి శాపం యిది
పెద్దలున్న మిద్దెలున్న పాపంయిది
ఇది భూలోకం అబ్బీ - యిట
అస్థిమూల పంజరాలు
ఆర్తరావ మందిరాలు
పలుకలేని గులకరాళ్ళు"

- అమృతం కురిసిన రాత్రి- భూలోకం - తిలక్. 34

మైదానాలన్నీ మృత్యుమయమయ్యాయి. తినడానికి తిండిలేక, తాగడానికి నీళ్ళులేక ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చనిపోయారు. బెంగాల్ కరువు ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేసింది.

త్రిపురనేని గోపిచంద్ ఓ సందర్భంలో కరువు గురించి ఇలా వర్ణించాడు.

''మలమల మాడు పొట్ట, తెగమానిన బట్ట, కలంతపెట్టగా విలవిల యేడ్చుచున్న నిఱుపేదకు జాలిని జూపకుండ, నుత్తల పడిపోయి, జీవరహితంబగు బొమ్మకు నిండ్లువాకిళుల్ పాలమును బుట్టనిచ్చెడు ప్రబుద్ధ వదాన్యాల నిచ్చమెచ్చెదన్".అనియూబెళ్ళూరి శ్రీనివాసమూర్తి 1954లో ''తపోవనము'' అన్న ఖండ కావ్యంలో ''గంజికేంద్రము'' అన్న ఖండిక ఆనాడు సంచలనం రేపింది.

1948-53 మధ్య రాయలసీమలో వచ్చిన కరువు కాలంలో తిండిలేని వారికోసం ప్రభుత్వం, రామకృష్ణమిషన్ వంటి స్వచ్ఛంద సంస్థలూ, కమ్యూనిష్టు పార్టీవంటి వామపక్ష పార్టీలు ఎన్నో గంజి కేంద్రాలను నడిపాయి. అవి లేకపోతే ఎన్నో వేలమంది ఆకలితో చనిపోయి ఉండేవారు. గంజి కరువు మొదటిగా సాహిత్యంలో పరిచయం చేసిన గౌరవం బెళ్ళూరి శ్రీనివాసమూర్తికే దక్కుతుంది.

శ్రీనివాసమూర్తి తన 'తపోవనము' కావ్యంలో ఇలా అన్నాడు.

కనుడోయి యిటు గంజి కేంద్ర మిటులాకర్ణింపు డాక్రందన
ధ్వని హస్తంబుల మట్టి పాత్రలు వహింయింపన్ దీన భావంబులా
నన సీమన్ వహియింపగా ముసురు చున్నారెంత దారిద్ర్యమీ
జనతన్ మ్రింగగవేచి యున్నయది దుష్కలంబు ప్రాప్తింపగన్

పై విధంగా గంజి కేంద్రాలను హృదయ విధారకంగా వర్ణించాడు.

'రాయలసీమ రైతు' బైరపురెడ్డి నారాయణరెడ్డి :

గంజి కరువును గూర్చి బెళ్ళూరి శ్రీనివాసరావు రాసింది ఒక ఖండిక మాత్రమే. సంపూర్ణ కావ్యాన్ని రాసిన గౌరవం బైరపురెడ్డి నారాయణరెడ్డికి దక్కింది. ఇతని 'రాయలసీమ రైతు' అన్న కావ్యం 1976లో ప్రచురించపబడింది. రాయలసీమ రతనాలసీమ కాదు. ఈ ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. నా ''యాభై ఏళ్ళ అనుభవంలో సమృద్ధిగా పంటలు పండిన కాలమును నేను చూడలేదు".

అనగలిగినంతగా సీమ జీవితాన్ని గురించి తెలిసిన వాడు. "అనాటి విషాదానుభవాలే ఈ కావ్యానికి ప్రేరణనిచ్చినవి".

రచయిత కావ్యవస్తువైన కరువుకు తాత్విక పునాదిని కల్పించి నాయకుడిగా మేఘుడు, నాయికగా భూమి అంటే రాయలసీమను ప్రతీకలుగా సృష్టించాడు. కడపజిల్లా రాయచోటి తాటాకాలో బహుదా నది తీరాన పంచ రాత్నాలు అనే ఐదుపల్లెల్లో ఒక పల్లె కథా స్థలం. రాయల సీమ కరువుకు ఈ కావ్యంలో ఒక చమత్కారాన్ని సృష్టించాడు నారాయణరెడ్డి.

రాయలసీమ ప్రజలు శ్రీశైలమల్లన్నను, శేషాచలపతి వెంకన్నను శ్రీకాళహస్తులకు మోక్షమిచ్చిన శివుణ్ణీ, కంచి వరద స్వామిని పూజించి భోగాధిపతి అయిన ఇంద్రుణ్ణి మరచిపోయాడట. అందుకు కోపగించిన ఇంద్రుడు దత్త మండల వాసులు మత్తులగుచు నన్ను నమరేశు నెన్నర ఎన్నడైన అని సస్యవృద్ధికి వర్షంబు చాలతోడు వానలేకున్న నుడుగును వారి మదము అని నిర్ణయించాడు. మేఘా లను పిలిచి రాయలసీమ ప్రజలకు చిన్న చినుకైన పడ కుండ చేయవలయు అని ఆజ్ఞాపించాడు.కరువు కాలంలో మానవ ప్రవర్తననూ, మానవ సంబంధాలను తల కిందులు కావటాన్ని నారాయణరెడ్డి చిత్రించాడు.

భోజన సమయానికి అభాగతులు వస్తే (అతిదులు) తనతోపాటు భోజనం పెట్టే గృహస్తు తప్పించుకున్నాడు. తనతో పని ఉండి వచ్చేవారికి ఆకలి తీర్చే అలవాటున్న మర్యాదస్తుడు తొలగిపోయాడు స్త్రీలు తరతరాలుగా సేకరించుకున్న ఆభరణాలు దినవెచ్చము కోసం దారి ఖర్చుల కోసంమూ తెగనమ్ముకోవలసివచ్చింది. త్యాగ గుణం మీద కరువు దెబ్బతీసింది. భార్యాభర్తల మధ్య ఉండాల్సిన మాధుర్యాన్ని కూడా కరువు కలుషితం చేసింది.

కొప్పున ముడువంగ కుసుమముల్ కొనలేక
కులకాంత కుందినఁ గుందెనొకడు
కేశవ సంస్కర తైలాశక శక్తమై
ఇల్లాలు నేడ్చిన నేడ్చునొకడు
పసుపు కుంకుమ కొన పైకమ్ములేమికై
వల్లభవగచిన వగచెనొకడు
గాజులు తొడుగగా కాసులు లేనిదై
తెఱవచింతింప చింతించెనొకడు

ఇలా మంగళ ప్రదమైన సుమంగళీ చిహ్నాలను భార్యలు కొనలేక కరువు కాలంలో ఏడ్చితే నిస్సహాయులైన భర్తలు కూడా ఏడ్చారట. కలలో కూడా భర్తను నొప్పించని భార్యలు కరువు ప్రభావంచి భర్తల పట్ల కటువుగా ప్రవర్తించటం ప్రారంభించారట. చెరువులు తిండిలేక ఎండిపోయిన స్త్రీ ముఖంలాగా, బావులు క్షయరోగంతో పీక్కుపోయిన యువతుల కళ్ళలాగా ఉన్నాయట పంట పొలాలు సర్వస్వమూ దోపిడీ అయిపోయిన ఇళ్ళలాగా, ఇలా హృదయ విదారకంగా సాగిన ఈకావ్యంలో చివర వాన రావడం వలన పంటపొలాలూ,రైతుల జీవితాలూ చిగురిస్తాయి.

కరువు గురించి, కరువు కారణాల గురించి, ఫలితా లను గురించి ఇద్దరు మిత్రుల మధ్య జరిగిన చర్చ రూపంలో కథనం ఉంటుంది. శ్రమ జీవన సౌందర్యం ఇచ్చే ఆత్మసంతృప్తి, ఇతరులకు తల వంచకుండా జీవించే బతుకు ఇచ్చే ఆత్మగౌరవం మహోన్నతమైనవని కవి ప్రబోధించటంలో రాయలసీమ రైతు కావ్యం ముగుస్తుంది.

"రామిరెడ్డి" మద్ది శేషశర్మ: కరువు ప్రసక్తి లేకపోయినా రాయలసీమ గ్రామాలలోని ప్యూడలిజం గురించి వచ్చిన సంప్రదాయ ఛందోబద్ధ కావ్యం కుంటి మద్ది శేషశర్మ "రామిరెడ్డి"

పెన్నేటిపాట విద్వాన్ విశ్వం :

రాయలసీమకు ప్రాతినిధ్యం కావ్యం పెన్నేటిపాట రాయలసీమ గతవైభవంతో ప్రారంభమవుతుంది. గతించిన కథను పక్కకు పెట్టి వినిపింతునింకరాయుట మా కన్నీటి/కోచిగొంతుల కిన్నెరమీటుకొనుచు /

కోటిగుండెల కంజి కట్టుకొనుచు అని వర్తమాన పరిస్థితిని తెలియచేస్తాడు.

శుకవిక శారికారవరుచుల్ వినిపింపవు గూబమూల్గులొ
క్కొక తరి గుండె వీల్చును. దిగుల్ వడజేయును
తీతువుల్ సమ
త్సుక వృకజంబుకమ్ములు మతుల్ పెడగుయ్యిడు
వల్లకాడుపె
న్నకిరుగట్టులందు పులినస్థలి పుర్రెలు పండు
మెందుగన్
పెన్నేటి గట్ల ప్రజలను పెట్టిన బాధల్ని
ఇందులోతెలిపాడు.

నారపరెడ్డి సంపద హారతి కర్పూరం లాగా కరిగి పోతుంది. నారపరెడ్డి నీ పేరే బంగారుకడ్డిర అన్నవారే బాకీలు తీర్చడం వలన సంపదమొత్తం పోతుంది. ఊరి పిల్లలు కూడా నారపరెడ్డిని దివాలరెడ్డి అని గెలిచేయటం ప్రారంభించారు.

నారపరెడ్డి నాపప్పయ్యను
ఊరిమోతుబరీ ఉప్పరి అయ్యను

అవమానంలో భార్య ఉరిపోసుకొని చనిపోతే, గుండె చెదిరి నారపరెడ్డి చనిపోతాడు. వారి కొడుకే రంగారెడ్డి రండయ్యాడు. రంగడు ఎన్నో బడ బాగ్నులను తన గుండెలో దాచు కుంటూ జీవనం సాగించాడు. ఒకప్పుడు పెదవాళ్ళు కట్టెలు కొట్టి తెచ్చి అమ్మి పొట్టపోసుకునేవారు. బలసకాయలు, రేణుగాయలు, చింతకాయలు అమ్ము కొని నాలుగ కాసులు సంపాదించేవారు. నేడు అడవిలు స్వార్థానికి బలై అది పలచబడిపోయింది.దీనికి తోడు వేయేండ్లకొక్క వానకదా? అక్కడ మాత్రమెట్లు గరకైనా పుట్టు? ఏ పాత చెట్టుకు గానీ చివురేదీ? పచ్చనలు తాటల్ తీసినా చూడమే దొరికిన గడ్డీగాదం కోసుకొని గోగుపగ్గం మోపుకట్టుకొని వచ్చాడు రంగన్న. ఈ విధంగా పెన్నేటిపాట విద్వాన్ విశ్వం రాయలసీమ ప్రాంతప్రజల దుర్భర పరిస్థతులను తెలిపారు.

"అనిల సందేశము" పాలా వెంకట సుబ్బయ్య :

రాసిన రాయలసీమ కరువు ఆధారం చేసుకొని ''మిత్స్'' సృష్టించటంఅన్న పద్య కావ్యంలో కూడా కనిపిస్తుంది. అందులోని కావ్య శిల్పం కూడా మేఘ దూతములోని ఉన్నదే. "అనిల సందేశము" రాయలసీమ కరువుకు అద్దం పట్టిన సాంప్రదాయిక ఛందోబద్ధకావ్యం ఆ సందేశంలోని ఒక పద్యం

కోరూనుకోట్లు నాకొమరులు నిలుపున
గూలిపోయి రనుమ, కూడులేక
లక్షపలక్షలు భిక్షాధికారులై
దుఖానఉగుములుచు దూలిరనుమ,
వేలకువేలు వస్త్రాలకు హీనులై
చింపిపాతల నైఉగై నేసి రనుమ
పచ్చని వల్వ నిప్పచ్చరంబునాదు
దయితము మాలిన్యధామయనుమ
నిలిచి కనువిచ్చి ఒకనాడు నిండుకూర్మి
జూడతలవెట్టి ప్రేమంపుఉజుట్టమవయి
సత్వరంబు రాకున్న సర్వ సృష్టి
కాలసర్వ విషజ్వాలగ్రాగుననుమ

ఇలా చాలామంది సాంప్రదాయ కవులు అలంకార శాస్త్ర నిబంధనలను అతిక్రమించి రాయలసీమ జీవితం లోని విషాదాన్ని కావ్యవస్తువుగా స్వీకరించారు.

పుట్టపర్తి, బెళ్ళూరి ప్రారంభించిన స్థానిక చైతన్య కవిత్వ భైరవురెడ్డి, రెడ్డి నారాయణరెడ్డి, కుంటిమద్ది శేషశర్మ, పాలా వెంకటసుబ్బయ్య , కల్లూరి అహోబల రావు మొదలైన కవులలో ఒక నిశ్చిత రూపాన్ని సంతరించుకుంది.

"మళ్లీ నన్ను మాతృగర్భంలోకి వెళ్లనివ్వండి"- ప్రేంచంద్ :

రాయలసీమ జీవితంలోని విషాదాన్ని పట్టుకుని దాని తీవ్రతను సమాజానికి అందించిన కవుల్లో ప్రేమంచద్ ఒకడు. "మళ్లీ నన్ను మాతృగర్భంలోకి వెళ్లనివ్వండి" అన్న కవితలో ''జీవితం రుణగ్రస్తమైన చోట మధురస్వప్నలకు ఆస్కారం లేదని'' స్పష్టంగా చెప్పాడు.

పాలక వర్గాలు సృష్టిస్తున్న
రంగు రంగుల ప్రపంచం నాకు అక్కర లేదు
అంగరక కుజ గ్రహాంతర చిరునామాలు అక్కరలేదు
అస్తిత్వ రాహిత్యంతో భయ విహ్వాలాల మధ్య
నక్షత్రయుద్ధ ఆధిపత్యాలు అక్కరలేదు

అని చెబుతూ "గుక్కెడు మంచినీళ్ళు కావాలి" అన్నారు

గౌతమీకృష్ణవేణులు సాగరంలోపడి ఆత్మహత్యంచు కుంటున్నా రాయలసీమకు గుక్కెడు నీరులేక పోవటాన్ని జిజ్ఞాసువుల దృష్టికి తెచ్చాడు. అందుచేతనే రాయలసీమ అంతటా అనంతక్షామ సంగ్రామము నేలతల్లి తను వంతటా చిల్లులు పోవడమా బాంబులతో బంతు లాటలూ, కుత్తుకలు ఉత్తరించుకోవటాలూ నిత్యకృత్యాలై పోయాయి.

సంఘటిత స్పర్శ రఘుబాబు :

సంఘటిత స్పర్శ అన్న పేరుతో రాయలసీమ ఆర్తిని దీర్ఘకావ్యంగా మలచిన రఘుబాబు

క్షామక్షేత్రాల్లో ప్రతిఫలిస్తున్న నిరీక్షణ
సమాధానాలు రానిప్రశ్నల ఎడారి నిరీక్షణ

పైన చెప్పిన దీర్ఘ కావ్యాలే కాకుండా రాయలసీమ జీవితా హృదయ ద్రావకంగా వర్ణించిన కవులు ఎందరో ఉన్నారు. వీళ్ళకు నీళ్ళకూ నాగరికతకూ మధ్య ఉన్న అవినాభావ సంబంధం తెలుసు

ఎస్.మునిసుందరం కవిత :

"నాగరితలు నీళ్ళలోనే ప్రవహిస్తాయి/చరిత్రను ఏటి అలలే రాస్తాయి"

అంటాడు సీనియర్ కవి ఎస్.మునిసుందరం.

గోపిని కరుణాకర్ :

రాయలసీమలో బతుకు శిధిలం కావటాన్ని గోపిని కరుణాకర్ ఇలా కవిత్వీకరించాడు.

సేద్యం జూదమైపోయింది
మీ అమ్మమెడలోని తాళి బొట్టు
పసుపుకొమ్మయింది
నీ చెల్లిలి చెవుల్లోనికమ్మలు
జొన్నబెండులయ్యాయి
నీ తమ్ముడు బడిమాని

బట్టిలో కాలే ఇటికైపాయ నువ్వేమో హోటల్లో ఎంగిలి కంచమై పోతివి

దేశానికి పట్టెడన్నంపెట్టిన మీతాత
తుంట బీడీలు అడుక్కుంటు
బస్టాండులో బిచ్చగాడైపాయ

ఈ సీమలో మానవ సంబంధాలను కరువు ఇలా ధ్వంసం చేసింది.

సన్నపురెడ్డి వెంకటరెడ్డి :

రాయలసీమ రైతులు వానచుక్కకోలం నిరీక్షించటాన్ని సన్నపురెడ్డి ఇలా చెప్పారు.

"ఎన్ని సార్లు/జలరేఖల్ని లెక్కకట్టే ముసలాళ్ళముందు
బీడిముక్కలమై/మినుకు మినుకు మన్నామని!
ముద్ద ముద్ద గా తడిపి/మంచాన్ని ఇంట్లోకి
మార్పించేవానకోసం
వడిగాపులు కాశాయని"

అంటూనే ప్రజల నిరాశ ఎంతహృదయ విదారకంగా ఉందో కూడా సూచించాడు.

ఈ సీమ ఎడారిగా మారినా బావుండు/రాని వసంత కోసం ఎదురు చూస్తూ
క్షణక్షణం చావకుండా ఉండేందుకు/రాదని తెలిసిన దానికోలం నిరీక్షించటం
రాయలసీమ జీవితం విషాదం/గుక్కెడు నీళ్ళకు కరువే కానీ
పడికిళ్ళకు కరువులేదే

నీటి కరువును గురించి కరువును గురించిన, మాత్రమే కాకుండా సీమ రాజకీయ జీవితంలోని ప్రత్యేకతను గురించి కూడా చాలా మంది కవితలు రాశారు.

రాచపాళెం చంద్ర శేఖర్ రెడ్డి :

ఎంతోపరిశోధన చేసి "కరువు కాటకాల కన్నీటి సీమ

- నేటి రాయలసీమ'' కరువు జిల్లాలో కొత్తపాలెగాళ్ళు వంటి గ్రంథాలను ప్రచురించిన విప్లవోద్యమాసంస్థలూ, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కు సంఘమూ ఈలోగా రాయలసీమ సమస్యలమీద చూపవలసిన శ్రద్ధ చూపలేదు. రాయల సీమ కవులు ప్రజాజీవన శైథిల్యానికి మూడు కారణాలు గుర్తిస్తార అని దస్తగిరి చెప్పినట్టు ''అనావృష్టి అకాలవృష్టి, రాజకీయ సంకుచిత దృష్టి'' రాయలసీమ జీవితానికి సంబంధించిన అన్ని అంశాలనూ కవిత్వీకరించిన పద్యం రాచపాళెం రాసిన పరాధీన సీమ.

విత్తనాలు చల్లినా /మొలిచేది కొడవళ్ళు, గొడ్డళ్ళు
కొడవళ్ళు కర చాలనానికి /తాళిబొట్లు తెగటంక నిపించదు.

రాయలసీమలో ప్రజల జీవితాలు నీటిబుడగలు, పేలుతున్న బాంబులు, తెగుతున్న పేగులు. అందుచేత ఇక్కడ ఎవరి జీవితమూ వాడి సొంతకాదని చెప్పాడు.

"అనంతపురం" సింగమనేని నారాయణ :

రాయలసీమలో ఆధునిక కవిత్వం గురించి కప్పుతూ ''అనంతపురం'' అన్న పద్యంలో సింగమనేని నారాయణ ఈ విధంగా చెప్పారు. విత్తనాన్ని మొలకెత్తించే రైతు, ఒక్కచిక్కిన ఎద్దు, వాన చినుకుకోసం ఎదురు చూసే వేరుశనగ మొక్క,వలస బాపలోపయనించి బాలింతా, ఆత్మహత్యల ఆర్తనాదమూ మాత్రమే కవితా వస్తువు కాగలవు. ఇక్కడ కవిత్వం

లలితంగా, సుకుమారంగా ఉండదు. ఇక్కడ కవిత్వ మొక విస్ఫోటనం. అది తన్ను ధ్వంసించే వాల్లనెవరినైనా అతణ్ణి క్షమించదు.ఇక్కడి కవిత్వంమందుపాతరల విస్ఫోటనానికి సానుభూతి ప్రకటించదు.

సింహావలోకన ప్రాయంగా ఆలోచిస్తే కవిత్వంలో రాయలసీమ చైతన్యం రాళ్ళపల్లి పెనుగొండ పాటలో ప్రారంభమైంది. పెనుగొండలక్ష్మీ పెనుగొండ పాటతోని గతవైభవకీర్తి గాన సంప్రదాయం నుంచి కొద్దిగా జరిగిన సమాకాలీన దైన్యాన్ని చూపింది. మేఘదూతంలో రాయల సీమ జీవితంలోని వైవిద్యానికీ పలుకుబడికీ అద్దం పట్టింది. 1949 -52 సంవత్సరాల మధ్య వచ్చిన గంజికరువే ఇతివృత్తంగా వచ్చిన కావ్యం రాయలసీమరైతు. మన్నవ భాస్కర నాయందు రాసిన శ్వేద సూర్యోదయం, కరణ బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె రాసిన ఒక రాఘవరెడ్డి కథ అన్న పద్యకావ్యాలలో రాయలసీమ జీవిత వర్ణనలు కనిపిస్తాయి.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. వొరుపు - సం. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరెడ్డి - ఆనంతపురం ప్రచురణలు.
2. అధునిక తెలుగు సాహిత్యంలో రాయలసీమ చైత్యన్యం - మదనపల్లె.
3. రాయలసీమ రచయితల చరిత్ర.
4. అవగాహన - ఆచార్య తుమ్మల రామకృష్ణ - చంద్రకలా పబ్లికేషన్స్ హైదరబాద్.
5. ప్రాచీనతెలుగుసాహిత్యం కరువుప్రభావచిత్రణ - డా.జి.వి.రమణ - హైదరబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కరోనా కథ – ముస్లిం సామాజిక జీవన చిత్రణ

– డా॥. జడా సుబ్బారెడ్డు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆర్జీయూకేటీ, ఏపీఐఐఐటి, నూజివీడు, కృష్ణా జిల్లా.

కరోనా పరిచయం :

ఈనాడు ప్రపంచదేశాలకు పరిచయం చేయనక్కర్లేని పేరు కరోనా. దీనినే కోవిడ్-19 అనే పేరుతో కూడా పిలుస్తున్నారు. ఎన్నో మహమ్మారిలను తరిమికొట్టిన భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ కోవిడ్ ఒక పెనుసవాలుగా మారింది. ఆగకుండా గంటల తరబడి దగ్గురావడం, 100 ఫారన్ హీట్‌లను దాటి జ్వరం రావడం, నాలుక రుచిని కోల్పోవడం, చలితో తరచుగా వణకడం, ఒళ్లునొప్పులు రావడం మొదలైన లక్షణాలు కలిగి పద్నాలుగు రోజుల వరకూ వ్యక్తి శరీరంలో ఉండడం అనే వాటిని కరోనా వైరస్ లోని ప్రధాన లక్షణాలుగా ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొంది. మిగిలిన వైరన్'లతో పోల్చితే ఈ కరోనా గాలిలో వేగంగా ప్రయాణించలేదు. ఈ వైరస్ బారినపడిన వ్యక్తి తుమ్మినపుడు తుంపర్లద్వారా ఎదుటివ్యక్తి శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ వైరస్ దేనినైనా అంటిపెట్టుకుని చాలాకాలం జీవిస్తుంది. చల్లని ప్రదేశాలలో ఎక్కువ రోజులు బతికే అవకాశం ఉంది.

తుమ్ములు, దగ్గులద్వారా, ఒకరినొకరు తాకడం ద్వారా ఈ వైరస్ వ్యక్తి శరీరంలోకి ప్రవేశించి తీవ్రమైన అనారోగ్యాన్ని కలుగజేస్తుంది. అందుకే వ్యక్తికి వ్యక్తి సామాజికదూరాన్ని పాటించడం, నబ్బుతోకానీ, శానిటైజరుతో కానీ చేతుల్ని తరచుగా శుభ్రం చేసుకోవడం, కళ్లను, ముక్కును అదేపనిగా తాకకపోవడం, మాస్కు ధరించడం, సాధ్యమైనంత వరకూ ఎక్కువమంది గుమికూడిన ప్రాంతాలకు వెళ్లకుండా ఉండడం ద్వారా ఈ వైరస్'ను అరికట్టవచ్చని ప్రపంచ ఆరోగ్యసంస్థ వెల్లడించింది. దీని ప్రభావం షుగర్, బీపీ, క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారి మీద అధికంగా ఉంటుంది. చిన్నపిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కనుక వారిని కూడా వేగంగా ఈ వైరస్ బారిన పడతారు.

కరోనా సాహిత్యం :

సమాజంలో వస్తున్న అనేక పరిణామాల్ని తెలుగు సాహిత్యం ప్రతిబింబించింది. సమాజమే సాహిత్యానికి వారధి కనుక చుట్టూ జరుగుతున్న అనేక పరిస్థితుల్ని తనలో ఇముడ్చుకుంది. దాదాపు 2019 నవంబరులో చైనానుంచి ఇతర దేశాలకు వ్యాపించిందని చెప్పుకుంటున్న ఈ వైరస్ ప్రభావాన్ని కవులు, రచయితలు, గేయ, నవలా రచయితలు తమ తమ పరిధిలో వ్యాప్తిచేసే ప్రయత్నం చేయడం అభినందనీయం. వైరస్ తీవ్రతను, తీసుకోవలసిన జాగ్రత్తలను, ప్రజల్లో రావలసిన అవగాహనను కవులు తమ కవితల, కథల, గేయాల ద్వారా వ్యక్తంచేశారు. ఈనాడులాంటి పత్రిక కరోనా కవిత పేరుతో ప్రతీరోజూ పోటీలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కలిగించే పనిచేసింది. కాకినాడకు చెందిన పుప్పాల సూర్యకుమారి అనే రచయిత్రి 'కరోనా వరమా శాపమా' పేరుతో నవల రాయడం విశేషం. కరోనా చేస్తున్న విధ్వంసాన్నీ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూనే కుటుంబ సంబంధాలనూ, సామాజిక సంబంధాలనూ కూడా ఈ నవలలో వివరించారు. కరోనా నేపథ్యంలో వచ్చిన తొలి నవల బహుశా ఇదే కావచ్చు. మిగిలిన అనేక దిన, వార, మాస పత్రికలు కూడా తమవంతు ప్రయత్నంగా కవితను, కథను, పాటను తమ పత్రికల్లో ప్రచురించి విస్తృత అవగాహనను కలిగించడానికి ఎనలేని సేవచేశాయి.

కరోనా నేపథ్యంగా వచ్చిన కథ, కవిత, నవలా ప్రక్రియల్లో ప్రధానంగా కనిపించే లక్షణాలు ఇలా చెప్పుకోవచ్చు. కరోనా ఎలా వ్యాపిస్తుందో తెలియజెప్పడం,

మాస్కులు ధరించడం మీద అవగాహన కల్పించడం, శానిటైజర్ రాసుకోవడం, భౌతికంగా దూరాన్ని పాటిస్తూ గుంపులుగా ఒకేచోట చేరకుండా ఉండడం, నలుగురు కలవాల్సిన సందర్భాలు వచ్చినప్పుడు దూరం పాటిస్తూ చేతులు కలపకుండా ఉండడం, కళ్లను-నోటిని-ముక్కును చేతులతో తాకకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ఇంట్లోనే ఉండడం మొదలైన అనేక విషయాలను ఆయా రచయితలు తమ రచనల్లో పొందుపర్చారు.

కరోనా పేదబతుకుల్లో నింపిన విషాదాన్ని, రోజువారీ పనుల్ని కోల్పోయి ఆకలితో అల్లాడి చనిపోయిన దారుణ సంఘటనల్ని, మనుషుల్ని తాకితే వస్తుందన్న భయంతో సాటి మనిషినే దూరం పెట్టడం, ఉపాధి కోసం వలస వెళ్లిన కార్మికుల దారుణ పరిస్థితుల్ని వివరించడం, విదేశాల నుంచి వచ్చిన వారిద్వారా కరోనా ఎక్కువగా వ్యాపిస్తుందన్న కారణాల్ని చర్చించడం, కుటుంబాల్ని వదిలేసి కరోనా రోగులకోసం వైద్యం చేసిన వైద్యుల సేవల్ని కొనియాడడం, పారిశుధ్య కార్మికులను గౌరవిస్తూ వారిని మనుషులుగా గుర్తించడం, పోలీసు సేవలను మననం చేసుకోవడంలాంటి ఎన్నో విషయాల్ని రచయితలు తమ కథల్లోనూ కవితల్లోనూ చిత్రించారు.

సాక్షి, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి, నవతెలంగాణ ఆదివారం సంచికలలో వచ్చిన కథలను అంశాల వారీగా విభజించుకుని అందులో ముస్లిం సామాజిక నేపథ్యంగా వచ్చిన కథలోని అంశాలను సమర్పించడమే ఈ వ్యాసపరిధిగా, ఉద్దేశ్యంగా భావిస్తున్నాను. మాసపత్రికల్లో వచ్చిన కథలు నేను ఈ వ్యాసపరిధిలోకి తీసుకోలేదని గమనించగలరు. పైన పేర్కొన్న సంచికలలో ఏప్రియల్ 2020 నుంచి జూన్ ముప్పై తారీఖు వరకూ వచ్చిన దాదాపు 30 కథలలో ముస్లిం సామాజిక జీవనానికి నేపథ్యంగా వచ్చిన కథలను మాత్రమే ఈ వ్యాసానికి స్వీకరించాను.

బూచి :

సాక్షి ఆదివారం సంచికలో 10.5.20 తారీఖున వచ్చిన ఈ కథ షేక్ షబ్బీర్ హుస్సేన్ రాశారు. మనదేశంలో కరోనా వ్యాప్తిచెందడానికి ఢిల్లీలోని మర్కజ్‌కు వెళ్ళొచ్చిన సాయిబులే కారణమనే అభిప్రాయం చాలామందిలో ఉంది. అప్పటివరకు అందరితోనూ కలిసిమెలిసి ఉండి అందరి ఇళ్లలోనూ అన్నం తిన్న బుడెన్ సాహెబ్ జీవితంలో కరోనా తీసుకొచ్చిన పెనుప్రమాదం ఈ కథలో చర్చించ బడింది.

తమలపాకులు అమ్ముకుంటూ జీవనం సాగించే బుడెన్ సాహెబ్ అప్పుడప్పుడు అనారోగ్యంతో ఉన్న పిల్లలకు పెద్దలకు తయెత్తులు కూడా కడుతుంటాడు. ఊరివారందరికీ ఎంతో దగ్గరైన బుడెన్ సాహెబ్‌ను కరోనా కారణంగా అనుమానంగా చూస్తూ "ఏయ్ సాయిబూ ఊర్లోకి ఎందుకొచ్చినావ్? ఇప్పుడే సస్తా బతుకుతున్నాం. మీ వాళ్లు ఢిల్లీకి పోయినారంటనే? నువ్వు కూడా పోయావా?" అంటుంటే ఏం చెప్పాలో తెలియక అయోమయానికి గురవుతాడు. ఊరంటే మనుష్యులందరి జీవనానికి వేదిక. అన్ని కులాలు, మతాలు కలిసి సహజీవనం చేస్తుంటాయి. కానీ కరోనా బూచిని కారణంగా చూపించి మనిషిని దూరం పెట్టడాన్ని తట్టుకోలేకపోతాడు బుడెన్ సాహెబ్. చివరికి అతని స్నేహితుడు నరసింహారెడ్డి ఊరి వారందరికీ బుడెన్ సాహెబ్తో చాలా సంవత్సరాల నుంచి ఉన్న అనుబంధాన్ని వివరిస్తాడు. అందర్నీ పిలిచి "మనం భౌతికదూరాన్ని పాటిస్తే వైరస్ పోతుంది. అదే మనిషిని దూరం చేసుకుంటే మంచితనం చచ్చిపోతుంది. మానవత్వం నాశనమవుతుంది" అంటూ చెప్తాడు. కరోనా వల్ల మనుషుల్లో మానవత్వం చచ్చిపోకూడదు అనే మంచి సందేశాన్ని ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు.

2. ఖయామత్ :

అఖిలాశ రాసిన ఖయామత్ (ప్రళయం) కథ 5.4.20 ప్రజాశక్తి ఆదివారం సంచికలో వచ్చింది. కరోనా రెండో దశలో ఉన్నప్పుడు తన ఇంట్లో ఇజితిమా (సామూహిక ధార్మిక ప్రార్థన) చేయాలని ఆశపడే నూర్జహాన్ అనే వృద్ధురాలి కథ ఇది. రోగాలు వ్యాపించడానికి దేవుడికి కోపం రావడమే కారణమనే అమాయకత్వం కూడా నూర్జహాన్

పాత్రలో మనకు కనిపిస్తుంది. అందుకే "భయం, భక్తి లేకుండా ప్రవర్తిస్తే ఇలాంటి వ్యాధులే వస్తాయి. ఒకనికన్నా భయం ఉందా? అందుకే ఇలాంటి ముదనష్టపు వ్యాధు లొచ్చి ఈ ప్రపంచం ఇట్టైపోతాంది" అని కరోనా గురించి అవగాహన లేకుండా నలుగురిని పిల్చి ఇంట్లో నమాజ్ చేసుకోవాలనే నూర్జహాన్, "కరోనా చాలా భయంకరమైన వ్యాధి అంట. అరవై సంవత్సరాలకు పైబడిన వారికి, పిల్లలకు వస్తే కోలుకోవడం కష్టమట' అనే అవగాహన ఉన్న నూర్జహాన్ కూతురు ఖాజాబీకి మధ్య జరిగే మానసిక సంఘర్షణను ఈ కథలో రచయిత చక్కగా చిత్రించారు.

ఎవ్వరిమాటా వినకుండా వీధిలోని ఆడవాళ్లను ఇంటికి పిల్చి ఇజితిమా నిర్వహిస్తుంది. దానికి ఫలితంగా వీధిలోని ఆడవాళ్ళు ఇంటికి రావడం, ఆ సాయంత్రానికి నూర్జహానుకి జ్వరం దగ్గు ఎక్కువై పరీక్షలు చేస్తే కరోనా పాజిటివ్ రావడం, ఇతిజిమాకి వచ్చిన ఆడవాళ్లందరికీ పరీక్షలు చేయడం ఈ కథలో కనిపించే మరికొన్ని అంశాలు. మతవిశ్వాసాలు కలిగి వుండడం మంచిదే అయినా గుంపులుగా చేరి నిర్వహించే ఇజితిమా వల్ల తనతో పాటు వీథలోని అందరికీ కూడా ఇబ్బందులు రావడాన్ని ఈ కథలో చర్చిస్తారు రచయిత.

3. చూపుడువేలు :

అఫ్సర్ రాసిన ఈ కథ 17.5.20 ఆంధ్రజ్యోతి ఆది వారం సంచికలో వచ్చింది. హిందూ ముస్లింలు మన దేశంలో ఎప్పటినుంచో కలిసిమెలిసి సోదరుల్లా జీవనం సాగిస్తున్నారు. అరమరికలు లేకుండా ఒకరి పండుగలకు ఒకరు వెళ్తూ మతసామరస్యాన్ని చూపిస్తున్నారు. అయినా ప్రభుత్వాలు తీసుకునే కొన్నికొన్ని నిర్ణయాల వల్ల హిందువులు ముస్లింలను శత్రువులుగా భావిస్తున్నారు. గోమాంసం విక్రయం కారణంగా ఎంతోమంది ముస్లిం లను హింసపెట్టడం, చంపడం ఈ మధ్యకాలంలో పరి పాటిగా మారింది. అటువంటి దారుణాలు మర్చి పోకుండానే అన్నదమ్ముల్లా కలిసున్న హిందూ-ముస్లిం మధ్య కరోనా ఎంతటి అగాధాన్ని సృష్టించిందో ఈ కథ చెప్తుంది.

చురుగ్గా ఉండే కుర్రాళ్లలో ముస్లిం మతం పట్ల తీవ్ర మైన అనురక్తి కలిగించి వారిద్వారా అందరిలోకి ముస్లిం మతాన్ని వ్యాప్తిచేయడానికి జమాత్‌లు నిర్వహిస్తారు. ఈ కథలో ఉమర్ ఒక ముస్లిం ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తూ సాయంత్రాల్లో వీధిలోని పిల్లల్ని చేరదీసి ట్యూషన్స్ చెప్తుంటాడు. ఇతరులకు ఏదో ఒక రూపంలో సహాయం చేయాలనే మంచి ఆలోచన కలిగి వున్న ఉమర్ "కమ్యూ నిటీ కోసం నేనింకా ఏమీ చేయలేను కదా! చదువు ఒక్కటే దారిద్ర్యాన్ని ఎదుర్కొనే మంత్రం. మనకి తెలిసినంతలో చదువు విలువ గురించి చెప్పుకుంటూ వెళ్లాలి" అంటాడు. అనుకోకుండా వేరే వాళ్ల బలవంతం మీద ఉమర్ మర్కజ్కు వెళ్తాడు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఢిల్లీ వెళ్లొచ్చాడన్న కారణంగా "ఏరా... మర్కజ్‌కి వెళ్లకపోతే ఏమైందిరా? ప్రాణాలతో ఆడుకుంటున్నారా మీరంతా" అంటూ సూటిపోటి మాటలతో హింసిస్తారు.

కారణాలు ఏవైనా దేశంలో జరిగే అన్ని దారుణాలకు ముస్లింలవైపు చూపుడువేలు చూపిస్తూ నిందించే పరిస్థితి మారాలనే అభిప్రాయం ఈ కథలో కనిపిస్తుంది. అందుకే "మర్కజ్ లేకపోతే ఇంకో కారణమేదో ముస్లింలని తిట్టి పోయడానికి వెతికి పట్టుకుంటారు. దేశమంతా ముస్లిం వ్యతిరేకతలో కొట్టుకుపోతుంది" అనే మాటలు చూపుడు వేలు కథలోని అంతరార్థాన్ని మనకు సూచిస్తుంది.

అస్తిత్వవాదం ఉద్యమాలలో భాగంగా ఉనికిలోకొచ్చిన మైనారిటీవాద సాహిత్యం తెలుగుసాహిత్యంలో చాలా ప్రభావాన్ని చూపించింది. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజాన్ని ముక్కలుచేసి మతపరంగా అధికసంఖ్యాక మతాలవారి అవమానాలకు, దాడులకు, అణచివేతకు నిదర్శనంగా ముస్లింవాద సాహిత్యం తన ఉనికిని చాటుకుంది. మన దేశంలో నివశిస్తూ భారతదేశాన్ని మాతృదేశంగా భావిన్తున్న వీరిపైన, వీరి మత విశ్వాసాలపైన దాడులు చేయడం ముస్లింవాద సాహిత్యంలో కనిపించే ప్రధానాంశం. హిందూవాదులు ముస్లింలను వేరే మతంగా కాకుండా వేరే జాతిగా 'విదేశీ

బూచి'గా చూపిస్తూ వివక్షకు గురిచేయడం మనకు పైన చెప్పుకున్న కథల్లో కనిపిస్తుంది.

ఏప్రియల్ నుంచి జూన్ వరకు ఆదివారం సంచికలలో వచ్చిన కరోనా కథలు...

సాక్షి :

ఖబరస్తాన్ - జాని తక్కెడశిల - 26.4.20, లాక్ డౌన్ - గంగాడి సుధీర్ - 3.5.20, బూచి - షేక్ షబ్బీర్ హుస్సేన్ - 10.5.20, వలసపక్షి - శ్రీనివాస రౌళో - 17.5.20, స్పర్శవేది - ఎమ్వీ రామిరెడ్డి - 24.5.20, కొత్తస్వరం - దొండపాటి కృష్ణ - 31.5.20, మిస్టర్ అన్ ఫ్రెండ్- రామదుర్గం మధుసూదనరావు -- 7.6.20, బతుకువేట - డా. జడా సుబ్బారావు - 21.6.20.

ప్రజాశక్తి :

మా ఊరి పెళ్ళి - ఆవుల వెంకటరమణ - 5.4.20, జాతర - పెమ్మరాజు విజయ్ - 5.4.20, కరోనా తంట - ఆవుల వెంకటరమణ - 12.4.20, తడవని చేతులు - అప్పిరెడ్డి హరనాథరెడ్డి - 12.4.20, తపన - ఆవుల వెంకటరమణ - 19.4.20, నిన్నటిచీకటి - పివిఆర్ శివకుమార్ - 19.4.20, ఏటికి రెస్ట్ - ఆవుల వెంకట రమణ - 26.4.20, వెలుగు - శాంతిశ్రీ - 26.4.20, దీపం పురుగులు - డా. జడా సుబ్బారావు - 26.4.20, జిందగీ కా మేళా - నంగెనేని రవీంద్ర -17.5.20, వలసకూలీని బాబూ - బాణోతు బాలాజీ -24.5.20, గమ్యం - చాగంటి ప్రసాద్ - 31.5.20, సేపలోళ్ళ బతుకు - 31.5.20, మాయమైపోలేదు మనిషన్నవాడు - ఆర్.సి. కృష్ణస్వామిరాజు - 7.6.20, చలపలమ్మ - ఓట్ర ప్రకాశరావు - 14.6.20, చేపలపెట్టె - రాజేశ్ యాళ్ల - 21.6.20.

ఆంధ్రజ్యోతి :

కరోనా కలవరం - పి.ఎల్.ఎన్.మంగారత్నం - 26.4.20, చూపుడువేలు - అఫ్సర్ - 17.5.20, లక్ష్మి నవ్వింది - గొర్లి శ్రీనివాసరావు - 14.6.20.

నవతెలంగాణ :

పెద్దమనుషులు - పేదమనసులు - ప్రసాద్ చెన్నూరి - 26.4.20, కరోనా నీకు శతకోటి వందనాలు - గులాబీల మల్లారెడ్డి -26.4.20, కరోనాతో కొంత మంచి కొంత చెడు - గులాబీల మల్లారెడ్డి - 17.5.20.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక తెలుగు సాహిత్యం సామాజిక జీవన చిత్రణ

– కె. నవీనరాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు, విజడిసి విద్యానగర్, హైదరాబాద్.

ఆధునిక కాలంలో తెలుగు సాహిత్యంలోని అనేక ప్రక్రియలు మానవుని సామాజిక జీవిత చిత్రణలు ప్రముఖ పాత్ర వహించి ప్రతిబింబాలుగా నిలిచాయి. వీటిలో ముఖ్యంగా ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలైన కథా, నవల, కవిత్వం మొదలగు ఆంగ్ల సాహిత్యం ప్రభావంతో భారతదేశంలో ప్రవేశించి తెలుగు సాహిత్యంలో పరిమళించాయి. జీవితం లోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యంతో కళ్ళకు కట్టించి హృదయాన్ని మధురమైన అనుభూతులతో నింపి పదేపదే చదవాలనిపించే జీవిత చిత్రణ మార్గాన్నే సూచించే ప్రక్రియ నవల.

"రవి కాంచని చోట కవి కాంచును" అన్నట్లుగా సామాజిక జీవిత చిత్రణలో నవల ప్రముఖ పాత్ర వహించింది నవలలో విస్తృతి ప్రధానం నవల జీవితానికి ప్రతిబింబం, వైవిధ్యానికి, వైశిష్ట్యానికి, చిహ్నంగా నిలిచే సాహిత్య ప్రక్రియ చారిత్రక రాజకీయ, ఆర్థిక సామాజిక నైతిక తాత్విక విషయాలన్నీ, మనస్తత్వ శాస్త్రాన్ని, వివరిస్తూ సమగ్ర జీవిత కోణాల్ని చిత్రించ గల అనువైన ప్రక్రియ నవల. నవల పాఠకుని ఆలోచింప చేస్తుంది. అక్షర జ్ఞానం ప్రతి ఒక్కరూ చదివి ఆనందించగలరు ఇది వృత్తాంతాన్ని బట్టి నవలల్ని సీరియస్ నవలలు, కాలక్షేపం నవలలు, విమర్శ కోణం నుంచి చూస్తే సాంఘిక నవలలు, హాస్య వ్యంగ్య నవలలు, రాజకీయ నవలలు, డిటెక్టివ్ నవలలు, విజ్ఞానశాస్త్ర నవలలు, పౌరాణిక నవలలు మొదలగునవి. తెలుగు నవల సాహిత్యానికి నూట పాతిక సంవత్సరాల చరిత్ర ఉంది. వేల నవలలు వెలువడ్డాయి. వాటిలో అన్ని ఆధునిక సాహిత్య ప్రక్రియ సామాజిక జీవన చిత్రణ చేసినవే. సాంఘిక నవలలు సంస్కరణ మూఢ విశ్వాసాలను పోగొట్టడానికి నడుము బిగించిన కందుకూరి వీరేశలింగం గారి తొలి నవల "రాజశేఖర చరిత్ర".

మొత్తం మీద చాలామంది కందుకూరి వారి "రాజ శేఖర చరిత్ర'నే తొలి నవలగా పేర్కొన్నారు. వీరేశలింగం "మనలో గల మూఢ విశ్వాసములను పోగొట్టవలెనన్న ముఖ్యోద్దేశముతో దీనిని వ్రాసితిని" అని స్వీయ చరిత్రలో తెలిపారు. సమకాలీన "సమాజంలో ప్రచారం పొందడమే కాకుండా అనాడే ఆంగ్ల, తమిళ భాషల్లోకి ఈ నవల అనువదించ బడటం విశేషం. "కథలో సందర్భానుసారంగ ఎన్నో మూఢ విశ్వాసాల్ని విమర్శిస్తాడు రచయిత. దురాచారాల్ని ఖండిస్తాడు. మతం కులం పేరుతో పాటిస్తున్న అర్థంలేని ఆచారాల్ని - వెలివేయటాన్ని, ప్రాయశ్చిత్తాల్ని, మూఢభక్తిని, భక్తిలో డాంబికత్వాన్ని విగ్రహారాధనను విమర్శిస్తాడు. సమాజం యొక్క మనస్తత్వాన్ని పల్లె ప్రజల పట్టణ వాసుల స్వభావంలో - ప్రవర్తనలో తేడాను, ధనం యొక్క ప్రాధాన్యాన్ని వ్యాఖ్యానిస్తాడు. స్త్రీల అవిద్య, అజ్ఞానం వల్ల సంభవించిన వారి నికృష్టస్థితిని స్త్రీ విద్య వల్ల ప్రయోజనాన్ని సోదాహరణంగా వివరిస్తాడు. 'రామచంద్ర విజయము', 'అహల్యాబాయి', 'సౌందర్య తిలక', 'కర్పూరమంజలి', 'హేమలత', గణవతి అనే నవలల ద్వారా ప్రసిద్ధుడైన చిలకమర్తి లక్ష్మీనరసింహం. రామచంద్రవిజయం పరిశీలిస్తే. "పెట్టుబడి దారీ వ్యవస్థ లక్షణాలు-డబ్బు మహాత్తు కారణంగా షేక్స్‌పియర్ కారణంగ "లంపెన్ ఎలిమెంట్స్" దండిగ తయారయిన వ్యవస్తను చూస్తాను. రచనలో ఆనాడూ సామాన్య ప్రజలకు లంచ గొండి వుద్యోగుల బెడద బాగా వుండటం కూడా ప్రతిబింబించింది ఈ నవల" ఇందులో రామచంద్రుని కథ ఉత్కంఠతో పటిష్టంగా. సాగుతుంది. మహమ్మదీయ పరిపాలనలోని దుర్మార్గాలూ, రసపుత్ర విజయం వివరించే "హేమలత" నవల సాంఘికరాజకీయ నవలగా తోస్తుంది. చిలకమర్తివారి కల్పనా శక్తికి "సౌందర్యతిలక" నఃసాక్ష్యం.

సునిశిత హాస్యంతో చక్కని కథా కథనంతో సానే "కర్పూరమంజరి" అనే పెద్ద నవల కూడా చిలకమ్మర్తి రచించారు. కాని, చిలకమర్తివారి నవలలు అనగానే గుర్తుకు రావలసినవి రెండే - రామచంద్రవిజయము, గణపతి. (హాస్య ప్రధానమైన నవల. దీనిని తొలి హాస్య నవల (1010) అనవచ్చు.

తల్లా ప్రగడ సూర్యనారాయణ 1913 లోనే పంచముల సమస్యతో ' హేలావతి' నవల రాయడం గమనార్హం. వెంకట పార్వతీశ్వర కవులు 1918లోనే వర్ణాంతర వివాహం, సహవాస, సమత లక్షణాలుగా "మాతృమందిరం" అనే స్వతంత్ర సాంఘిక నవల రాయడం అందరు గుర్తుంచుకోవలసిన విషయం. జాతీయోద్యమాన్ని ప్రతిబింబించే మొదటి వేలూరి శివరామ శాస్త్రిగారి 'ఓబయ్య' (1920) ను పేర్కొనాలి. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు రాసిన గొప్ప నవల "మాలపల్లి" "సమకాలీన సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలు 'మలపల్లి' ఇతివృత్తానికి మూల కందాలు. అట్టడుగు ప్రజల సమస్యలు సామాజిక పీడన, ఆర్థిక దోపిడీయైన చిత్రింతమైయ్యాయి. ఇందులో వీటికి పరిష్కారంగా స్వాతంత్రోద్యమన్ని చూపించింది ఈ నవల. సామాజిక ఆర్థిక పారాటాలు రాజకీయమైన స్వాతం త్రోద్యమంలో కలిసి చక్కగా చూపించాడు ఉన్నవ". ఈ శతాబ్ది రాజకీయాల్లో గాంధీజి ఎలా విశిష్టవ్యక్తో, అలాగే తెలుగు నవ్య సాహిత్యంలో 'మాలపల్లి' కూడా ఒక విశిష్ట రచన" అని ఆర్.ఎస్.సుదర్శనం అంటే శ్రీనివాస శిరోమణి "పంతులుగారి మాలపల్లి ఒక చిన్నయెత్తున ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యక్ష జగత్తు. మాలపల్లితో తుల్యమైన రచన ఇంత వరకు తెలుగులో రాలేదు" అని వాస్తవం పలికారు. 1920-21 నాటి దేశ సామాజిక రాజకీయ చైతన్యానికి 'మాలపల్లి' ప్రతీక.

సమకాలీన చరిత్రను కధా వస్తువుగా స్వీకరించడమే గొప్ప విశేషం. 'మాలపల్లి' నవలపై వీరేశలింగం సంఘ సంస్కరణ ప్రభావం గాంధీజి హరిజనోద్యమ ప్రభావం జాతీయోద్యమ ప్రభావం తీవ్ర ప్రభావం రష్యా విప్లవ ప్రభావం భారతీయ ఆధ్యాత్మికత ప్రభావం ఆనాటి "రంప - పితురీ" ప్రభావం అన్ని కనిపిస్తాయి. హిందు సంఘలో లోపాన్ని సవరించి బాగు చేయాలన్న సంగదాసు కోరిక ఆనాటి సంస్కరణోద్యమ ప్రభావమే.

ధర్మ విజయం అప్పుడు బలి కోరుకుంటుంది. ధర్మ నిర్వహణకై సోక్రటీసు విషం గ్రహించాడు. క్రీస్తు శిలువ నెక్కాడు. ప్రహ్లాదుడు సమస్త కష్టాలు పడ్డాడు. హరిశ్చం ద్రుడు సర్వత్యాగం చేశారు. అమరుడు శిరచ్ఛేదం పొందాడు.

రామానుజ శిష్యుడు అంధుడైనాడు. కన్యక అగ్ని ప్రవేశమయింది. హేమలత ఆత్మహత్య గావించుకున్నది. తిలక్ మహాశయుడు నిరంతర కార్యబద్ధుడైన నాడు. ధర్మానికి బలికావడం శత్రువులకి అపజయమే.

మాలపల్లిలో కార్మిక ఉద్యమాన్ని చిత్రీకరించారు. రైతుకూలీ ఉద్యమాన్ని స్పృశించారు. జమిందారీ, పెత్తందారూ వ్యవస్థను చెదరయ్య పాత్రద్వారా చిత్రిక రించారు. అప్పడప్పడే వ్యాపిస్తున్న మార్క్సిస్టు కమ్యూనిస్టు భావాల ప్రభావం కొంత కనబడుతుంది.

అడవి బాపిరాజు నారాయణరావు తుఫాను, కోనంగీ నవలలో సమకాలీన స్వాతంత్రోద్యమం నాటి పరిస్థితులు చిత్రీకరించారు. "హిమబిందు", "గోన గన్నారెడ్డి", "అడవి శాంతిశ్రీ", "తుఫాను" ఎంత ప్రసిద్ధి చెందాయి. ఆయన లలిత కళా హృదయం నారాయణరావు పాత్రచిత్రణలో ప్రతిఫలించాయి. పాత్రచిత్రణలో వాస్తవికత దృక్పథం కంటే రచయిత యొక్క భావుక ధోరణి, ఆదర్శలదే పై చేయి అయింది. జీవిత చిత్రణలో ఏ అంశాన్ని విశ్లేషించ వలసి వచ్చిన, పరిశీలించవలసి వచ్చిన భౌతికవాద దృక్పథం కంటే భావవది తత్వమే ఎక్కువ గోచరిస్తుంది.

"హిమబిందు నవల ఒక అపూర్వ కళాఖండం. ఇందులో నిర్మల ప్రణయం, నిష్కలంక దేశభక్తి ఉత్తమ ఆదర్శజీవితం, పరాక్రమ ప్రదర్శన, కవితా తత్వం అన్నీ ఉన్నాయి. బాపిరాజుగారి బహుముఖ ప్రజ్ఞకి, రచన

నైపుణ్యానికి 'హిమబిందు' చిన్న పతాక. వారికి రచన ఒక తపస్సు. హిమబిందులో శిల్ప కుమారుడైన సువర్ణ శ్రీ పాత్రను సృష్టించారు. హిమబిందు, సువర్ణశ్రీలకీ, శిల్ప, చిత్రలేఖనాలంటే మక్కువ, బాపిరాజు మానస పుత్రి 'హిమబిందు' "అనిపిస్తుంది". అంతే కాదు - అడవి బాపిరాజు శైలీగతంగా కూడా కొత్త ప్రయోగాలు చేసి రచింప చేశారు. ఇందువల్ల కావ్య గౌరవం కల్పించారు. కుంచెతో అపురూప చిత్రాలను లిఖించినట్లు హృద్యమైన కలంతో అక్షర శిల్పాలు చెక్కారు బాపిరాజు. మహీధర రామ్మోహనరావు నవలలన్నీ రాజకీయాలకు సంబంధించిన దేశ స్వాతంత్ర ఉద్యమాలు నేపథ్యంగా వెలువడినవి వారు జాతీయోద్యమంలో పాల్గొన్న వారు. తర్వాత కమ్యూనిస్టు అయ్యారు. "రథచక్రాలు" ఓనమాలు, "మృత్యు నీడల్లో", "శుభలేఖ", వంటి నవలలు రాసిన మహీధర రామ్మోహనరావు పేరు చెప్పగానే చాలా మందికి "కొల్లాయిగట్టితేనేమి" గుర్తుకువస్తుంది. ఈ నవల సాహిత్య అకాడమీ బహుమతి కూడా గెలుచుకుంది.

విశ్వనాథ వారు పుంఖానుపుంఖంగా నవలలు రాశారు. చారిత్రక నవలలు, సాంఘిక నవలతో పాటు "పురాణవైర గ్రంథమాల" పేరుతో భారతీయ చరిత్రకి కల్పించడానికి కొన్ని చారిత్రక సత్యాలను వెలికి తీసే ప్రయత్నంగా నవలలు రాసి సంచలనం కలిగించారు. 'వేయిపడగలు' విశ్వనాథకి మహోన్నతమైన కీర్తిప్రతిష్టలు సంపాదించింది. విశ్వనాధ వారి 'ఏకవీర' నవల రొమాంటిక్ సంప్రదాయాన్ని పూర్తిగా నింపుకుంది. 'ప్రేమికుల మనస్తత్వంలో ప్రేమ ధర్మానికే సంఘర్షణ ప్రవేశపెట్టారు. మనసులో అవ్యక్తమైన భాగంగా ఒకటి ఉంటుందని, దానికి వ్యక్తి మైన భాగానికి సంఘర్షణ ఉంటుదని గుర్తించి, పాత్ర పాత్ర పోషణ చేసిన మొదటి తెలుగు నవలా రచయిత విశ్వనాథ. విశ్వ నాథ ఇతర నవలలో పేర్కొనదగినవి 'చెలియలి కట్ట', 'స్వర్గానికి నిచ్చెనలు', 'తెరచి రాజు' హిందూ ధర్మంమనే మేలిముసుగులతో వేయి పడగలులో రొమాంటిక్ గా కనిపించిన జమిందారి వ్యవస్థ నగ్న స్వరూపం ఏమిటో 'తెరచి రాజు' నవలలో చూడవచ్చు. మతం వ్యవస్థను అపహాస్యం పాలు చేసే నవల స్వర్గానికి నిచ్చెనలు ఈ నవలలో రచన కేవలం మేధ స్పష్టం కావడమే కాదు విశ్వనాథ మనసులోనున్న 'కలవరము' వ్యక్తం చేస్తుంది. ఇది విశ్వనాథ వ్యక్తిగతమైన అన్వేషణను ప్రతిబింబించే నవలలు'.

పుష్పాల వారుభారత స్వాతంత్రోద్యమ కాలంనాటి సాంఘిక, రాజకీయ పరిస్థితుల, గురించి, జాతీయోద్యమ కాలానికి సంబంధించిన అన్ని రంగాలను స్పృశించి వివరించిన మంచి నవల 'అతడు అమె. స్త్రీ- స్వేచ్ఛ - ఆర్థిక స్వాతంత్ర్యం - నీతి నిజాయితీలు పెట్టుబడిదారి మనస్తత్వం - ఆ వ్యవస్థ నికృష్ట స్వరూపం-బూర్జుతత్వం- రాజకీ యాల స్వభావాలు - జాతీయ వాదం- రైతు కార్మిక పోరాటాలు- రష్యా పరిస్థితి - కళలు - సంస్కరణలు మొదలై న అంశాలను క్షుణ్ణంగా వివరించే ఈ నవలను మేథకి సంబంధించిన కూడా రచనగా పేర్కొనవచ్చు. విశ్లేషణ తోనే ఆగకుండా మార్పు ఎలా రావాలో కూడా వివరించబడిన నవల 'అతడు ఆమె'.చలం సాహిత్యం మొత్తానికి స్త్రీ కేంద్రం అనిపిస్తుంది స్త్రీకి ఉన్న సమస్యలు, స్త్రీ వల్ల కలిగే సమస్యలు, సామాజికమైన, వ్యక్తిగతమైనవి, మొహానికి, స్వేచ్ఛకు సంబంధించినవి. చలం 1921లో రాసిన 'శశిరేఖ మొదటి నవలగా 1948లో రాసిన జీవిత 'దర్శనం' చివరి సాంఘిక నవల. తెలుగు నవలన్ని ఆధునికం చేసి జ్వాజ్వల్యమానం చేసినవాడు ఈ గుడి పాటి వెంకటచలమే.

'దైవమిచ్చిన భార్య' 'చట్టాన్ని' వ్యతిరేకించి ప్రేమను వివరించిన స్త్రీ జీవితం.స్త్రీ ప్రేమలో ఆర్పణ ప్రధానమైతే పురుష ప్రేమలో ఆక్రమణ ప్రధానమని తెలిపే నవల ఇది. అసూయ ప్రేమనువేన్నాడే వీడే ఆ నీడ కలిగించే మనో వికారాలను ఈ నవలలో చిత్రించబడ్డాయి. కథ ప్రాధాన్యం విడిచి చలం గారి కలం మైదానంలో సౌందర్య లోకం ప్రవేశం చేస్తుంది. అరుణ అనే నవల సాఫీగా చదివించే నవల. క్రూర నిరంకుశ దోపిడి పరిపాలనకు

మారుపేరుగా నిలిచిన నిజాం ప్రస్థానానికి వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యమం మొదలైంది. నిజాం నవాబులకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు జరిపిన పోరాటం చరిత్రలో ఒక సువర్ణ ఘట్టం. ఉద్యమ కాలం లోనే వెలువడిన బొల్లిముంత శివరామకృష్ణ 'మృత్యుంజయులు' పేర్కొంటారు. విశిష్టమైన నవలలుగా వట్టి కోట అళ్వార్ స్వామి రచించిన ప్రజల మనిషి, గంగు నవలని, దాశరధి రంగాచార్య రచించిన 'చిల్లర దేవుళ్ళు' పేర్కొనదగినవి రంగాచార్య తర్వాత 'మోదుగుపూలు', 'మయాజలతారు', 'జానపద' నవలలు రచించారు.

తెలంగాణ వాతావరణం మా ప్రజాజీవితం నవలలో ప్రతిబింబించింది. అంటే నిజాం నిరంకుశ పాలన అందులో గ్రామాల్లో సామాన్య ప్రజానీకం సామాజికంగా ఆర్థికంగా ఎంత ఘోరంగా పీడింపబడుతూ నిస్స హాయులైన బ్రతుకులను వెళ్లదీస్తూ ఉండినది అలాంటి వాళ్లలో మెల్లగా చైతన్యం ఏలాగా మేల్కొన్నది. ఆ చారిత్రక పరిస్థితులు చిత్రించబడ్డాయి. భూమి సమస్య కారణంగా వాళ్ళలో మేల్కొన్న ఆర్థిక చైతన్యం- తిరుగుబాటు ఈ నవలలో స్పష్టంగా ప్రతిపంపించబడినది'. ఈ నవలలో కులమతలు ఏ విధంగా మానవ ప్రగతికి అడ్డుగోడలు వర్ణింపబడ్డాయి. రెండవ నవల 'గంగు' అసంపూర్ణంగానే మిగిలిపోయింది.

గోపీచంద్ నవలలో చాలా విశిష్టమైన నవల అస మర్థుని జీవితయాత్ర సీతారామారావు జీవితం విచిత్ర మైనది. సీతారామారావు కథ ఏమైనా దాని వెనక గల సందేశం ఏదైనా ఇందులో రచయిత చిత్రించిన సీతా రామారావు మనస్తత్వం అపూర్వమైనది. ఒక అసమర్థుని అంతరగాన్ని అతడిలోని అత్మన్యున్యతా బావాన్ని యింత అద్భుతంగా చిత్రించిన రచయిత మరొకరు లేరు. మనో వైకల్యానికి ప్రతిబింబంమి నవల. నవల రాయడం ద్వారా, తనలోని సీతారామారావు మృతి చెందడం ద్వారా గోపి చంద్ వ్యక్తి పునర్జన్మ వంటి అనుభూతి పొంది దృక్పథంతో కొత్త జీవితాన్ని ప్రారంభించారు. గోపి చంద్ రాసిన 'గడి యారపు తలుపులు', 'మెరుపుల మరకలు', ప్రేమోప హతులు, శిధిలాలయం, కూడా గోపీచంద్ అంతర్మధనం వివరిస్తాయి. ఆధునిక నవలల్లో బుచ్చిబాబు రచించిన 'చివరకు మిగిలేది' నవల ముఖ్యమైన నవల. మానవ జీవితానికి సహనం, క్షమ, దయ ప్రదనమని ఏవరి జీవితాన్ని వారు చక్క పెట్టుకుంటే ప్రపంచం బాగు పడుతుందినీ ఈ నవల చెప్తుంది. "చివరకు మిగిలేది తెలుగు సాహితి పురోగతిలో ఒక మైలు రాయి. ఈ నవలలో అస్తిత్వ వాద దొరణులు అధిక ఆధునిక మనన్తత్వ విశ్లేషణ రీతిలూ, జలిమిగా చోటుచేసు కున్నాయి చివరకు మిగిలేది ఏమిటి అనే ప్రశ్నతో నవల ప్రారంభమై చివరకు మిగిలంది దాని సమాధానం కాదు సమాధానం తెలుసుకునేందుకు జ్ఞాపకాలు. తనతో తాను సామాధాన పడటం - అది మిగిలింది అనే సమాధానం పూర్తి అయి పాటకుల ఆలోచనను ప్రేరేపిస్తుంది మిగలిన మనో వైజ్ఞానిక నవలకు 'చివరకు మిగిలేది' కి ఉన్న తెడా ఏమిటి ఈ నవలలో కొన్ని ప్రధాన పాత్రల విషయంలో కూడా అంతరంగ సంక్షోబలు కనబడతాయి.

జీవీ కృష్ణారావు కీలుబొమ్మలు నవలపై వ్యాఖ్యా నించారు "అనాటి గ్రామాలు కేవలం మురికి కూపాలు అసత్యం, అధర్మం వాటికి అలంబనాలు డబ్బు అధి కారం, అజ్ఞనం వాటి కుల దేవాతలు.. ఆ సంగతి వాటికి తెలుసు. అదే మరి ఘోరం తెలియకపోతే ఏనాటికైనా తెలపటానికి అవకాశం ఉన్నదని కానీ తెలిసి తెలిసి చేస్తున్నప్పుడు ఎన్నో జీవితాలు ధ్వశమై ఏమిటి ప్రయో జనం. అనే సమస్య అని వివరిస్తూ వ్యక్తి తన ధర్మాన్ని విస్మరిస్తే సమాజంలో ధర్మచ్యుత్తి దీక్ష సంక్షోభం తప్పదని ఈ నవల హెచ్చరిస్తుంది. రాజు మనిషి గోవులు వస్తు న్నాయి జాగ్రత్త సొమ్ములు పోనాయండి వంటి నవలలు గొప్పవేయినా జీవితమంటే మార్పు జీవితమంత సంచ లనం. అందువల్ల ఎవరి బెదిది పోకూడదు. ఈ సత్యం మేరికీ బ్రతకాలి' అనే నీతిని బోధించే అల్పజీవి నవల రావిశాస్త్రి గొప్ప సృష్టి అనాలి.

"కొ.కు. (కొడవగంటి కుటుంబరావు)కి కల్పనలో గూడా వాస్తవ గుణం కనిపిస్తుంది. కొ.కు. బుద్ధివాది. (ఈ) గొప్ప రచయితలో వాస్తవవాదమూ, కాల్పనిక వాదమూ సహజీవనం చేస్తాయి. టకొడవటిగంటి దాదాపు 18 నవలలు రాశారు. చదువు, అనుభవం, మారుపేర్లు, తార, తిమింగలం వేట, మారిన జీవితం, ఎండమావులు, వారసత్వం మొదలైన నవలలు కొ.కు. ను మేధవి రచయితగా నిలబెడతాయి. ఆవేశం లేకుండా ఆలోచనలు గల పాత్రలు ఈ తని కనిపిస్తాయి. 'పాత్రలను తన సృష్టిగా కాక వాటి చర్యలకు ప్రేక్షుడై సునిశితంగా విమర్శించే విధానం కొడవటిగంటి కుటుంబరావు రచనల్లో కనిపిస్తుంది'. సామాజిక, ఆర్థిక ,సాంస్కృతిక, మూలాలలోకి వెళ్ళిన సాంప్రదాయానికి గతి తార్కిక దృష్టి నిచ్చిన నవలా రచయితగా కొడవటిగంటిని పేర్కొంటారు. ఇతని నవలలో ఏభైఏంళ్ల సంఘచరిత్ర కనిపిస్తుంది.

చరిత్ర శేషులు ఆ మోహన వంశీ వంటి గొప్ప కాలానికి నవల రాసిన తెన్నేటి లత, " పుంసోకిల" వంటి జీవిత సంఘర్షణన్ని చిత్రించే మంచి సాంఘిక నవలలు రాశారు. యద్దన పూడి, అరికెపూడి వంటి రచయితలు నాయకుడు, నాయిక, ప్రేమ, పెళ్లి, త్యాగం అత్మహత్య, ధనిక వర్గ ప్రబల్యం- అంశాలుగా నవలలను రాసి నవలలకి మార్కెట్'ని పెంచడమే కాకుండా పాఠకుల్ని కూడా పెంచారు. ఈ కొవకి చెందిన "కమర్షియల్ రైటర్స్' రచయితలు ఉన్నారు. కానీ సామాజిక సమస్యల్ని కథా వస్తువులుగా స్వీకరించి, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడాన్ని రంగనాయకమ్మ వ్రాసి రెడ్డి సీతాదేవి,బీనదేవి నవల రాశారు. కె.రామలక్ష్మి, మాలతీచందూర్, ద్వివేదుల, విశాలాక్షి, డి.కామేశ్వరి, పవని నిర్మల, ప్రభావతి, మాదిరెడ్డి సులోచన వంటి రచయితలు సాఫీంక సమస్యల్ని సంసారిక పరిస్థితులు విభిన్న కోణాలలో పరిశీలించి ఆలోచనాత్మకమైన నవలలు రాస్తున్నారు. స్త్రీల సమస్యలను ఇతివృత్తంగా స్వీకరించి ఉప్పొంగి పోయే ఆవేశంతో నవలలు రాసిన వారిలో వెనుకటి తరంలో రంగనాయకమ్మ, ఈ తరంలో ఓల్గా ప్రాముఖ్యులు.

వాసిరెడ్డి సీతాదేవి రాసిన "సమత" నవలలో రాజకీయాల్లో ముసుగులో జరిగే అన్యాయాలను బహిరంగ పరిచారు. శ్రీదేవి ఈమె రాసిన "కాలాతీత వ్యక్తులు" తెలుగులో విశిష్టమైన నవల. "కొమ్మూరి వేణుగోపాలరావు హౌస్ సర్జన్","పెంకుటిల్లు""ఈ దేశంలో ఒక భాగం ఇది". ఒకే రక్తం- ఒకే మనుషులు - కె.ఎన్.వై పతాంజలి 'ఖాకివనం, మల్లాది వెంకట కృష్ణ మూర్తి 'రేపటి కొడుకు' యండమూరి' 'డబ్బు-డబ్బు-డబ్బు', 'యద్దనపూడి జీవన తరంగాలు', బలివాడ కాంతారావు గారి 'దగాపడిన తమ్ముడు' 'పుణ్యభూమి', శిలావీర్రాజు'మైన', పిలక గణపతిశాస్త్రి 'విశాలనేత్రాలు' తెన్నేటి సూరి 'చేంఘిజ్ ఖాన్' మల్లాది వసుంధర 'యుగసంధి' 'తంజావూరు పతనం' పోరంకి దక్షిణామూర్తి 'ముత్యాల పందిరి' ఎన్.ఆర్. నంది "నైమిశారణ్యం",రావురి భరద్వాజ "పాకుడురాళ్ళు" తెలుగులో వెలువడిన మరికొన్ని వైవిధ్యమైన నవలలు పేర్కొనదగినది.

నవీన అనగానే అంపశయ్య నవల గుర్తుకు వస్తుంది. మొదటి నుంచి చివరి దాకా "చైతన్య స్రవంతి" తో సాగిన బాగా నడిచినా నవల 'అంపశయ్య'. విశ్వవిద్యాలయల విద్యార్థుల మనస్తత్వాన్ని కట్టిస్తుంది. సంచలనం సృష్టించిన నవలల్లో వడ్డెర చండీదాస్ "హిమజ్వాల", "అనుక్షణికం" పేర్కొనదగినవి. "హిమజ్వాల నవల నాయిక గీతా దేవిని అధిక లైంగి కేచ్చా ప్రవృత్తి గల పాత్రగా చిత్రీకరించారు.

"అతడు అడవిని జయించాడు" 'మూగవాని పిల్లన గ్రోవి' వంటి నవలల ద్వారా ఆధునిక నవలా సాహిత్యాన్ని సృష్టి అంతం చేసిన విశిష్ట రచయిత కేశవరెడ్డి. 'అతడు అడవిని జయించాడు' నవలలో ఒక వృద్ధుడు సూర పందిని అన్వేషించటాన్ని చిత్రీకరిస్తూ - ఆ సమయంలో అతడు ఎదుర్కొన్న కష్టనష్టాదుల్నీ, ప్రకృతి పురుషుల పోరాటంలోని బీభత్సాన్ని సహజంగా వర్ణించారు.

నమకాలీనమైన నవలల్లో కె.ఎన్.వై.పతంజలి, గోపాత్రుడు, అరె పద్మజా, చౌదరి, నాలుగుగోడల,

కవతల ఓల్గా, స్వేచ్ఛ, ఆకాశంలో సగం. అడవి సూర్య కుమారి త్రేతాగ్ని, రావులపాటి సీతారాం హృదయవేదం స్వామి గద్దలాడతండాయి జలంధర తమసోమా జ్యోతిర్గ మయ మహీధర రామమోహనరావు జ్వాల తోరణం రావులపల్లి సునీత, వృత్తి మల్లాది సుబ్బమ్మ, వంశాంకురం కేతు విశ్వనాథరెడ్డి, వేలు, చిలుకూరి దేవపుత్ర, అద్దంలో చందమామ, కె.రామలక్ష్మి, నన్ను వెళ్లిపో నీరా, మొదలైన ఎన్నో నవలలు పేర్కొన్న వలసిన ఉన్నాయి. ఇటీవల నవలలో దేశ్‌పాండే అడవి కేశవ రెడ్డి - చివరి గుడిసె, కుప్పిలి పద్మ అహల్య.

రచయిత (త)లు సమాజ జీవితంతో, దానిలోని సమస్యలతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకొని, దానిలోని సమస్య నవలల్లో సజీవంగా రూపొందే వీలుంది. రచయిత స్వీయ దర్శనం నుండి వాస్తవ వాస్తవికతను, కళా మయంగా మార్చగలిగే అంతర చైతన్యశక్తిని సాధించ గలుగుతాడు. సమాజ సమస్యకు ఆత్మీయ స్పందన కల్పానికాత ఇక ఆధునిక నవలా రచయిత కల్పనాలూ ఊహలు అద్భుతాలు అడుగడుగునా స్పృజించటం అవ లీలగా చేస్తున్నారు. అపార శాస్త్ర విజ్ఞానాన్ని ఎంతో నేర్చు కుని కథల్లో కల్పనకు అద్భుతాలకు వాస్తవికతకు వాడు కుంటున్నారు. నవల బ్రతుకుల్లా ప్రవహించేది మన బ్రతుకుల్లో ఒక అలాగా మారేది.

ఈ విధంగా ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన నవల సమాజంలో యుగయుగాలుగా పేరుకుపోయిన దురాచారాలను, మూఢనమ్మకాలను ఎలుగెత్తి చాటి సంఘసంస్కరణలో తనదైనా పాత్రను నిర్వర్తించింది. ఆధునిక కాలం సమసమాజ నిర్మాణానికి, సామాజిక జీవన చిత్రణకి రాచ బాటలు వేసిన ఘనత నవలదే!

ఆధార గ్రంధాలు :

1. వల్లంపాటి వెంకటసుబ్బయ్య - 'నవలా శిల్పం'
2. ముదిగంటి సుజాత రెడ్డి - 'తెలుగు నవలానుశీలనం'
3. డాక్టర్ ద్వా.నా.శాస్త్రి - 'తెలుగు సాహిత్య చరిత్ర'

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

భువనచంద్ర సినీగేయాలు – సామాజిక జీవన చిత్రణ

– డా॥. కె. రాములక్ష్మి, చెన్నై.

ఆధునిక సాహిత్యానికి చెందిన నాటకం, నవల, కథ, కథానిక, ఖండకావ్యాలు, గేయాలు వంటి ప్రక్రియల ద్వారా ఎందరో రచయితలు నాటి సామాజిక అంశాలను స్పృశించారు. ఆ కోవలోనే సినీగేయ రచయితలు కూడా సమాజాన్ని పట్టి పీడిస్తున్న అంటరానితనం, కులమత భేదాలు, మద్యపానం, వరకట్నం, బాల్యవివాహాలు, నిరుద్యోగ సమస్యల్ని వ్యతిరేకిస్తూ సామాజిక అభ్యున్నతి కోసం పలు గీతాలను రాశారు. సినీకవులు సందేశాలకోసం, సంఘ సంస్కరణకోసం అని రాయకపోయినా సందర్భాను సారంగా సన్నివేశాలకనుగుణంగా రాసిన పాటల్లో నాటి సమకాలీన సామాజిక పరిస్థితుల్ని చిత్రించారు.

సముద్రాల రాసిన ''లెండు భారతవీరులారా లేవం డోయ్ (గృహలక్ష్మి) కట్నమిచ్చి కొంటేగాని కన్నియకు వరుడురాడు (వరవిక్రయం), శ్రీశ్రీ - ప్రతి మనిషి మరియొకని దోచుకునే వాడే (వెలుగునీడలు), సినారె - గాలికి కులమేదీ - ఏదీ నేలకు కులమేదీ (కర్ణ), కొసరాజు అబ్బాయికే ఆస్తి అమ్మాయికే నాస్తి (ప్రేమలేఖ), ఆరుద్ర - ఉద్యోగం వేటలోన ఊరంతా తిరగాలి'' (అందాల రాముడు) వంటి ఎన్నో పాటలు సామాజిక సమస్యల్ని చిత్రించాయి.

సుప్రసిద్ధ సినీగేయ రచయితల్లో శ్రీ భువనచంద్ర ఒకరు. 1987లో ''నాకూపెళ్ళాంకావాలి'' చిత్రంలో ''వినోదాల విందురా'' పాటతో సినీరంగంలోకి ప్రవేశించారు. 30 సంవత్సరాలుగా నిర్విరామంగా వీరు రాసిన పాటలు 2000లకు పైగా ఉన్నాయి. వాటిలో శృంగార గీతాలు, ఎక్కువగా ఉన్నప్పటికి సన్నివేశం పరంగా రాసిన గీతాలు కూడా ఉన్నాయి. అలా అడపాదడపా సందర్భాలకు రాసిన పాటల్లో సమాజ స్థితిగతుల్ని తెలియజేశారు. మనిషి యాంత్రిక జీవితం, ఆకలి, అద్దె సమస్య నిరుద్యోగ సమస్య తదితర అంశాల్ని చిత్రించారు.

మానవుని జీవనచిత్రణ :

సమాజంలోని ఒక సాధారణ మనిషి జీవితం గురించి, కష్టాల గురించి కవి ఈ గీతాన్ని రాశారు. చిరుద్యోగి, సమాజంలోని అవినీతిని ఎదిరిస్తూ నాయకుడు పాడే సన్నివేశ గీతమిది.

"ఆదాబర్సే.... అందరి కాదాబర్సే పాపం పుణ్యం రెండూ బొమ్మబొరుసే
పాపానికి ఓ జైలూ, పుణ్యానికి ఓ జైలూ, నువు భూమిన పడగానే
తెరిచారోయ్ నీ ఫైలూ - లోకంలో జైళ్ళెన్నున్నా - మంచిది మనదే రన్నో
గర్భాన పెరిగే పాపాయికీ ఆ గర్భమే ఓ జైలురా
ఉయ్యాల వదిలిన బుజ్జాయికీ... అడుగడుగు ఓ జైలురా
చిన్నబడి ఓ జైలు.... పెద్దబడి ఓ జైలూ... ఉద్యోగం ఓ జైలూ
ఉల్లాస ముప్పొంగీ - ఓటేసి వచ్చినాక... దేశమే ఔతుందోయ్ జైలూ
జోహారు చేస్తే బీహారు కన్నా మరింత గొప్పది యీజైలూ
ప్రేమలోపడ్డ పసివాళ్ళకీ... కౌగిళ్ళే ఓ జైలురా
ఇంకాస్త పిచ్చిముదిరిందంటే మేరేజే ఓ జైలురా
సంతు పెరిగిందంటే సంసారమో జైలు ఆపినాఆగదు ఆరైలూ
బాధ్యత బరువెక్కి కింద పడిపోయాక వల్లకాడేరా తుదిజైలు
డౌటొద్దురన్నా.... అన్నింటికన్నా మరింత గొప్పది యీ జైలూ"

(చిత్రం : గణేష్)

పాప పుణ్యాలు బొమ్మ బొరుసుల్లాంటివి. పాపానికి జైలు నరకం. పుణ్యానికి జైలు స్వర్గం. మనిషి భూమి

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

మీద పుట్టగానే జీవితమనే ఖైలు ప్రారంభమవుతుంది. సమాజంలోని మనిషి జీవితం ఒక జైలు. మనిషి ఒక జీవిత ఖైదీ. తల్లిగర్భం, వేసే అడుగు, బడి, ఉద్యోగం, యవ్వనం, ఓటు హక్కు, కొగిలి, పెళ్ళి, సంసార బాధ్యతలు, వృద్ధ్యాప్యం అన్నీ జైలే. ఈ జైలుకన్నా తాను ఉన్న బీహార్ జైలు చాలా గొప్పదట. "ఓటేసి వచ్చాక దేశమే ఔతుందోయ్ జైలూ" ఓటు హక్కుతో ఉత్సాహంగా ఎవరో నాయకుని గెలిపిస్తే ఆ నాయకుని పాలనలో దేశమే జైలు అవుంతుందని చెప్పారు. నేటి ఆధునిక సమాజంలోని మనిషి యాంత్రిక జీవితం జైలు వంటిదని తన గీతంలో చిత్రించారు.

సమాజంలోని మరొక పెద్ద సమస్య వార్ధక్య జీవితం. పిల్లలు, వయసైన అమ్మానాన్నల్ని వయోవృద్ధ ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. కనిపెంచిన అమ్మానాన్నల్ని నిర్ధాక్షిణ్యంగా వదిలేసి తాము జీవితంలో బాగా స్థిరపడుతున్నారు. ఆ కథా నేపథ్యంతో రాసిన గీతమిది. కొడుకు నిరాదరణకు లోనైన వృద్ధ తల్లిదండ్రుల మనోవేదన, దయనీయ పరిస్థితిని వారి జీవితాన్ని ఇలా భువనచంద్ర ఆవిష్కరించారు.

"ఊపేది ఎవ్వరైనా... ఊగేదీ ఎవ్వరైనా
నవ్వుతూ... ఊగావే ఊయలా... నీ బ్రతుకంతానవ్వులే ఊయలా
కెవ్వుమనీ ఏడ్చేటి బిడ్డనీ... నీ ఒడిలో మురిపిస్తావే ఊయలా
ఎదిగాక చోటు చాలదంటూ నిను మూలకి విసిరేస్తారే ఊయలా
అయినా నువు నవ్వులే పంచిస్తావే.... నవ్వుల పాలైనా నువు మన్నిస్తావే
నిన్నటి పాఠాలు మరచి ఊబిలోకి దిగమాకే
రాయి విసిరినా దయతో ఊయలా.... చెట్టు కాయనివ్వదా చెప్పవే ఊయలా
చెట్టుదిగిన మరుక్షణమే ఊయలా... దాన్ని మొదలంటా నరుకుతారె ఊయలా
అంతా మననుదుటి రాత అనుకుందామే
తలరాత అనుకుంటే తలపగిలేనే మనకోసమే మనబ్రతుకు సాగించాలే"

(చిత్రం : సూరిగాడు)

పిల్లలు తమను కనిపెంచి పెద్ద చేసిన అమ్మానాన్నలను ఇక అవసరం లేదని వదిలిపోతే ఆ తల్లిదండ్రుల దీన పరిస్థితి ఊయల, చెట్టు వంటిదే. ఎదిగాక చోటు చాలదని ఉయ్యాలను మూలకి విసిరేసినట్లుగా, చెట్టు డిగిన మరుక్షణం దాని మొదళ్ళను నరికి పారవేసినట్లుగా అవసరం తీరాక పిల్లలు తమ తల్లిదండ్రులని విసిరేస్తారని భువనచంద్ర వివరించారు. "నవ్వులె పంచిస్తావు, నవ్వుల పాలైనా నువుమన్నిస్తావే, రాయి విసిరినా చెట్టు దయతో కాయనివ్వదా..." అనే పంక్తులు పిల్లలు తమను బాధించినా, వారిని క్షమించే అమ్మానాన్నల వ్యక్తిత్వం, ఔన్నత్యం, ప్రేమానురాగాలకు అద్దం పట్టాయి. "నిన్నటి పాఠాలు మరచి ఊబిలోకి దిగమాకె..." అని హెచ్చరిస్తూ మన కోసమే మన బతుకు సాగించాలే" అనే పంక్తుల్లో వృద్ధులైన తల్లిదండ్రులు పిల్లల్ని నమ్మకుండా వారి కోసం వారు బ్రతకాలని కవి సూచించారు. నేటి సమాజంలోని వయోవృద్ధుల దీన పరిస్థితి, తోడునీడలేని జీవితాన్ని, పిల్లల నిర్లక్ష్య వైఖరిని ఈ గీతంలో చిత్రించారు.

ఆకలి సమస్య :

సమాజంలో మనిషి జీవించేది ఆహారం వల్లనే. మనిషికి ఆ ఆహారం దొరక్కపోతే ఆకలితో తల్లడిల్లే జీవితం దుర్భరం. ఈ క్రింది గీతంలో అనాధ శరణాలయంలో పిల్లలు ఆహారంలేక ఆకలితో వస్తువున్నప్పుడు నాయిక నిస్సహాయతలో కన్నీరుకారుస్తుంది. పిల్లలు నాయికను ఊరడిస్తూ పాడే సందర్భంలో "ఆకలి" గురించి చిత్రించారు.

"వెండి మబ్బు నీడలో వెన్నెలమ్మ మేడలో
చల్లగా దాగిందా జాబిలీ... మా యింటిలో
మనసు చెదిరి మౌనంగా నిలిచెను ఈ జాబిలీ

నిదురమ్మ తెరిచింది వాకిలీ... నిదుర పోయిందమ్మా ఆకలీ
ఆకలికి నిదురేలేదు నిదురపోతే ఆకలికాదు
పురుటి శిశువు కాకలి... మూగ శిశువు కాకలి
అణువణువున మెలి తిరిగే సుడిగాలి ఆకలీ... అందుకే
ఆకలికే ఆకలేసి బాధమరచిపోవగా
నిదురమ్మ తెరిచింది వాకిలీ... మన కన్నీటి కరిగిందీ ఆకలీ"
"బాధకు భేదమే లేదు... భయపడితే బాధలు పోవూ
కలత లెదురు వచ్చినా... కుమిలి పోకనిలబడూ
తలవంచకు తలదించకు... యీలోక రీతి నేస్తమా
ఉదయించిన సూర్యునిలా... ఉత్సాహమె నింపుకో"

(చిత్రం : నేటి దౌర్జన్యం)

ఈ గీతంలో అనాథ పిల్లలు తమకు ఆకలి లేదని ఆకలి నిద్రపోయిందని చెప్పటం కంటతడి పెట్టిస్తాయి. "ఆకలికి నిదురేలేదు. నిదుర పోలే ఆకలి కాదూ" ఈ లోకంలోని పురుటి శిశువుకి, మూగ పశువుకి ప్రతీ జీవికి ఆకలి ఉంటుంది. ఆకలి కడుపున అణువణువున మెలి తిరిగే సుడిగాలి వంటిదని వ్యక్తీకరించారు. ఆకలిని మరిచి, ఆదమరిచి నిద్రపోయే పేదల దౌర్భాగ్యం, కంటికి కనిపించని ఆకలి స్వరూప స్వభావాలను కవి తెలియ చేశారు.

అద్దె సమస్యలు :

సమాజంలో మనిషికి తిండి, బట్ట, ఎంత అవసరమో ఉండటానికి ఇల్లు కూడా అంతే అవసరం. అద్దె ఇంటి సమస్యతో సతమతమవుతున్న మధ్య తరగతి కుటుంబం లోని ఆవేదనను దీన పరిస్థితిని ప్రతిభింబిస్తూ కంట తడిపెట్టిస్తున్న గీతమిది. సన్నివేశ పరంగా ఇంటి యజ మాని (నాయకుడు) ఇల్లు ఖాళీ చేయమని బాధిం చటంతో నిస్సహాయురాలైన కథానాయిక ఇలా బాధపడు తుంది.

"ఏమని వివరించనూ నా బాధ ఎవరికి వినిపించనూ
పక్షికి గూడుంది పాముకి పుట్టుంది ఏ చోటు లేనిది మాకే కదా"
కురుక్షేత్ర సమరాన అభిమన్యుడు పద్మవ్యూహాన్ని
ఛేదించి పోరాడితే
నీతికి యుద్ధాన తావే లేదని పదిమంది కూల్చారు అది ధర్మమా
జయమెవరిదీ అపజయ మెవరిదీ
"నిజమెవరికీ మా కథ ఎవరికీ... మా కథ ఎవరికీ
విధి ఎంత వంచించి కవ్వించినా ఎన్ని కష్టాల సుడిరేపి
శోధించినా
ధైర్యాన్ని కోల్పోని ఏ మనిషినీ.... విధి ఓడించ లేదమ్మ ఏ నాటికీ
మాకళ్ళ వెలిగేటి దీపాని వే.... నీవు మా ఇంటికెన్నడు
మహరాణివే
మా ఇంటికి మహరాణివే"
"తలదించుకోననీ శపథాలు చేసీ... తల బాదుకుంటున్న
మహరాణి నేనే
పసిపిల్ల లిద్దరిని నడివీధిలోన నిలబెట్టి కూర్చున్న
మహరాణినేనే
నగుబాటులో గుండెముక్కలౌతున్న దిక్కెటూ కనబడక
అల్లాడుతున్నా
ఏనీడ లేనీ మహరాణినే... మహరాణినే"

(చిత్రం : దొంగకోళ్ళు)

పక్షులు స్వయంగా గూడుకట్టుకుంటాయి. పాములు దౌర్జన్యంగా చీమలు పెట్టిన పుట్టల్ని ఆక్రమించు కుంటాయి. పశుపక్ష్యాదులన్నిటికీ నివాసం ఉంది. వాటికి అద్దె ఇంటి సమస్యలు ఉండవు. మనుషులకి తలదాచు కోవటానికి సొంత ఇల్లు ఉండాలి. అద్దె ఇంట్లో ఉంటే అద్దె ఇవ్వలేక పోవటమో, ఉన్న ఫళానా ఇంటి యజమాని ఖాళీ చేయమనడమో జరుగుతుంది. మధ్య తరగతి మర్యాదస్తుల ఆత్మగౌరవాన్ని, ఆవేదనను యదార్థంగా కళ్ళకు కట్టినట్లు చిత్రించటం జరిగింది.

విధవావస్థ :

సమాజంలోని స్త్రీని అందరూ చిన్నచూపు చూస్తుం టారు. అందునా విధవస్త్రీ అంటే సమాజంలోని పురుషులందరికీ మరీ లోకువ. 'ఆమె' చిత్రంలోని ఈ పాటను కవి మూడు సన్నివేశాలకు రాశారు. వివాహం అయిన రోజునే కాళ్ళపారాణి అయినా ఆరక ముందే నవవధువు (నాయిక) విధవ అవుతుంది. పుట్టింటికి

వచ్చిన నాయికను అక్క మొగుడు (బావ) బలాత్కరించబోతాడు. అతని నుండి నాయిక తప్పించుకుంటుంది. అది చూసి కూడా తల్లిదండ్రులు తోబుట్టువులు ఎవరూ ఆదుకోలేరు. నాయిక శోక సంద్రాన్ని భువనచంద్ర తన పాటలో ఇలా వివరించారు.

ఓ చల్లగాలీ... ఓ దార్చిపోవా
ఓ నేల తల్లీ... ఒడి చేర్చుకోవా
ఏ పూజ చేసిందో... ఈ బొమ్మ ఆ బొమ్మకీ
ఏనాడు చేరెనో... ఈ గువ్వ ఓ గూటికీ

నిస్సహాయురాలైన నాయిక కన్నీరుని తుడవటానికి చల్లగాలి, ఒడిచేర్చుకోవటానికి నేల తల్లి యే దిక్కు. విధవస్త్రీకి తోడు పునర్వివాహం వలన లభిస్తుందని విధవా పునర్వివాహాన్ని కవి ప్రోత్సహిస్తూ "ఏ పూజ చేసిందో యీ బొమ్మ... ఆ బొమ్మకీ. ఏ నాడు చేరెనో ఈ గువ్వ ఓ గూటికీ" అని ప్రతీకాత్మకంగా చిత్రించారు. సమాజంలో విధవ బ్రతుకును, దుర్భరమైన ఆవేదనను యదార్థంగా చిత్రించి ప్రేక్షకుల చేత కంటతడి పెట్టించారు.

దోపిడీలు :

పల్లెటూళ్ళలో అధికారప్రాబల్యంలో, ధనస్వామ్య బలంతో ఊరి పెద్దలు నిరక్షరాస్యులైన జనాన్ని మోసం చేసి దోపిడీ చేసేవాడు. వారు చేసే దోపిడీలలో దేవుడి మానాలను అపహరించటం ఒకటి. సామాన్యంగా జనాలు ఎవరికైనా కొద్దోగొప్పో దైవ నమ్మకం ఉంటుంది. పాపభీతి దైవభీతితో కొందరు దోపిడీ దగాలకు పూనుకోరు. ఈ క్రింది గీతంలో ఊరిలో దేవుని మాన్యాలను అపహరించి అమాయకపు జనాలను మోసం చేస్తున్న ఊరి పెద్దను నాయిక బెదిరిస్తూ పాడుతుంది.

ఉంగరాల బొంగరయ్యా బొంకమాకూ
అప్పనంగ దేవుడి మాన్యం మింగమాకూ
రెచ్చరేగి పోయావా - నిన్ను రచ్చకీడుస్తా
దొంగలెక్కలిచ్చావా - డోలు కట్టి వాయిస్తా నీ జుట్టు పట్టేసి,
నీ గుట్టువైటేసి తైతక్కలాడిస్తాం తరితోం పాపం
చెయ్యకు పాపయ్యశాస్త్రి
గాడిద పాదాలు పట్టుకోకు గురుడా... అమ్మకి శరగోపం పెట్టమాకూ
కన్నులు తెరిచిందా... కబళించేస్తుందీ... శూలం ఎత్తిందా... రక్తం చూస్తుందీ...
మహిషాసుర మర్దిని మరిచిపోకూ...
పాపాలు పండించి ప్రాణాలు తీస్తుంది. ఆది పరాశక్తి బరువులు పెంచుకోకు భద్రకాళీ. అమ్మని శిల అనుకుంటేనీ సొత్తుఖాళీ
శరణని అన్నవారి కల్పవల్లి, ఆమె దుష్టుల సంహరించు దుర్గతల్లి
మహిమలు చూపించే మాతను గుర్తించు భక్తుల పాలించే శక్తికి తలవొంచు
త్రిభువన మోహినీ... చైతన్యరూపిణీ... పాపాలు మానండి పాదాలు పెట్టండి
హారతులివ్వండీ... ఓం ఆది పరాశక్తి ఓం... ఓం... ఓం... ఆదిపరాశక్తి ఓం.

(చిత్రం : శుక్రవారం మహాలక్ష్మి)

సినిమా సామాజిక మాధ్యమం. సంగీత నృత్య సాహిత్య సర్వకళల సమాహారం. సినిమాలో నాయకులుగా నటించి రాష్ట్రాలకు ముఖ్యమంత్రులైన వారి పేరు ప్రతిష్ఠలకు, వారి వెనుక ఉన్న సినీ నేపథ్యాన్ని వివరిస్తూ సినిమా ప్రాముఖ్యతని కవి చెప్పారు. కులమత పేద ధనిక భేదాలు లేకుండా జనాలు ప్రక్కప్రక్క కూర్చని సినిమాలు చూడగలిగే సమసమాజాన్ని సాధిస్తుందని తెలియజేశారు.

సమాజంలో పెరిగిన బియ్యం ధర, కరెంటుకోత, విద్యా సంస్థల ఆర్థిక వ్యామోహం, పెరిగిన గ్యాస్ ధర, మ్యాచ్‌ఫిక్సింగ్‌లు, పట్టాలు తప్పిపడిపోయే రైళ్ళు, కాలువల్లో పడి పడవలుగా తేలిపోయే బస్సుల యాక్సిడెంట్లు, రవాణాసంస్థల నిర్లక్ష్యం, జీతం కొరత, అప్పులు వంటి సమస్యలను పాటలో చిత్రించారు. నాటి సామాజిక రాజకీయ, విద్యక్రీడ, రవాణా రంగాల్లోని లోటుపాట్లు సమస్యలను నిష్పక్షపాతంగా నిర్మొహమాటంగా చిత్రించారు భువనచంద్ర. సినీగీతాల ద్వారా గీత రచయితలు సామాజిక పరిస్థితుల పట్ల ప్రజలకు అవగాహన కలిగించారు. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రావూరి భరద్వాజ 'జీవన సమరం' – సామాజిక జీవన చిత్రణ

– డా॥. కె.వి.యన్.డి. కరప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమండ్రి.

జీవితాంతం సామాన్యుడిగానే జీవించినా అనన్య సామాన్యమైన సాహిత్యాన్ని సృష్టించిన ద్రష్ట శ్రీ రావూరి భరద్వాజ. రచనా వ్యాసంగం సామాన్యంగానే ప్రారంభించినా విశిష్ట రచనలతో సాహిత్యానికి వన్నె తెచ్చిన రచనా శిల్పి ఆయన. సాహిత్యం, జీవితం రెండూ చెరో కన్నుగా జీవించిన మహాఋషి. అవిశ్రాంతంగా సాహిత్యాన్ని సృష్టించినా అలుపెరగని అక్షర యోధుడు. అందుకే ఆయనను భారతదేశ అత్యున్నత సాహిత్య పురస్కారం "జ్ఞానపీఠం" వరించింది. తన సాహిత్యంతో తెలుగు సమాజానికి మూడో జ్ఞానపీఠాన్ని అందించిన సాహితీవేత్త శ్రీ రావూరి భరద్వాజ.

భరద్వాజ ఎనిమిదవ తరగతిలో ఉండగా 1942లోనే చదువుమానేసినా, చదువుకోకపోవడంవల్ల కలిగే అవమానాలు ఆయన హృదయాన్ని గాయపర్చాయి. అవి పెంచిన పట్టుదలతో ఆయన స్వయంగానే తన విజ్ఞానాన్ని పెంచుకునే పనిలోపడ్డారు. తరువాత కొవ్వలి, చలం, కొడవటిగంటి కుంటుంబరావు, గోపీచంద్‌ల సాహిత్యాన్ని అధ్యయనం చేసిన ఆయన 1943లో 'వీరగాథ' అనే నవలను సరళగ్రాంథికంలో రాసి, తన రచనావ్యాసంగాన్ని ప్రారంభించారు. ఆయన రచనలన్నింటిల్లోనూ సమాజంలోని వివిధ పరిస్థితులు వివిధ రకాల వ్యక్తులు వారి జీవన విధానం స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే భరద్వాజ సాహిత్యంలో సామాజిక అంశాలు లేకుండా సాహిత్యాన్ని విభజించడం అసాధ్యమని చెప్పుకోవచ్చు.

సాహిత్యంలో జీవితం ప్రతిబింబిస్తుందంటారు విమర్శకులు. కాని రావూరి భరద్వాజ సాహిత్యాన్ని పరికిస్తే సాహిత్యానికి ఆధారమే సామాన్యుల జీవితాలని ఇట్టే అవగతమౌతుంది. ఆయన సాహిత్యమంతా సామాన్యుల జీవితాల చుట్టూ పరిభ్రమించడమే దీనికి కారణం. ఆయన సాహిత్యవస్తువులే సామాన్యుల జీవితాల్లోని సమస్యలు. అందుకే రావూరి సాహిత్యంలో సామాజికత విడదీయలేని భాగం. రావూరి భరద్వాజ "జీవన సమరం" దీని ప్రతిరూపాల్లో ఒకటి.

అందుకే తాను రాసిన 'పాకుడురాళ్ళు'కు జ్ఞానపీఠ్ పురస్కారం వచ్చిందని తెలియగానే, ఆయన "జీవన సమరం"కు వచ్చి ఉంటే ఇంకా ఆనందించేవాడినని అన్నారని వివిధ పత్రికల్లో వచ్చింది. ఆయనకు ఇష్టమైన అంత గొప్ప రచన ఇది.

సమాజంలో అట్టడుగునపడి ఎవరికీ కాకుండా, అతిక్రూరమైన జీవితాలను గడుపుతున్న వ్యధార్త జీవుల యధార్థగాథలను అక్షరీకరించిన ఆధునిక మహాకావ్యం "జీవన సమరం". ప్రపంచ సాహిత్యంలోనే ఈ రచన సరికొత్త ప్రక్రియకు నాందిపలికిందని విమర్శకుల అభిప్రాయం. అలాగే "ఒక్క భారతీయ భాషల్లోనే కాదు, నాకు తెలిసినంత వరకూ ఏ విదేశీ భాషల్లోనూ ఇలాంటి సాహిత్యం ఇంతవరకూ రాలేదు" అన్న పురిపండా అప్పలస్వామి మాటలు ఇక్కడ ప్రస్తావనార్హాలు. ఈ మాటలను పరిశీలిస్తే ప్రపంచ సాహిత్యానికి ఓ ప్రక్రియలో మార్గ నిర్దేశం చేయగలిగిన మహా రచయితకు దేశసాహిత్యంలోనే ఉన్నతమైన సాహిత్య అవార్డుకు ఎంపిక చేయడం తెలుగు సాహిత్యానికీ గర్వకారణమేనని చెప్పుకోవచ్చు.

మన దైనందిన సామాజిక జీవితంలో రోజూ కనిపిస్తూ ఉన్నా కూడా మనం ఎవరం పట్టించుకోని, ఎవ్వరికీ పట్టని అభాగ్యుల జీవితాల యధార్థగాథలను వస్తువులుగా తీసుకొని వారి ద్వారానే సమాచారాన్ని సేకరిస్తూ, వారి జీవితాల్లోని అనేక విశేషాలను విభిన్నకోణాల్లో విశ్లేషిస్తూ, విమర్శిస్తూ రావూరి చేసిన అద్భుత పరిశోధన ఈ "జీవన సమరం". ఇందులో 52 యధార్థగాథలున్నాయి.

"మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ఈ శిల్పసంపదే ప్రతీక" అన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటలు చెప్పుకోవడానికే గానీ, ఇప్పుడు శిలలపై శిల్పాలు చెక్కించే వారెవరు? ఆ శిల్పకారులను పోషించేదెవరు? ఈ విషయమే 'ఖరీదు కట్టే షరాబులేడు' గాథలోని ఇతివృత్తం. బండరాళ్ళను శిల్పాలుగా మార్చగలిగే ఆగమయ్యలాంటి వాళ్ళు ప్రస్తుతం రాళ్ళకూ, పాత్రాలకు 'కక్కు' కొడుతూ, 'సన్నెకళ్లు' తయారుచేస్తూ బతుకు బండి లాగుతున్నారు. అలవోకగా శిల్పాలు చెక్కడంలో ఎంతో నైపుణ్యం కలిగిన ఆగమయ్య ప్రస్తుతం అవే రాళ్ళను కంకరకింద కొడుతూ జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. మరి తరతరాలుగా వంశ పారపర్యంగా వారికి వస్తున్న శిల్పశాస్త్ర రహస్యాలన్నీ ఆగమయ్యతో అంతం కావలసిందేనా? మన సమాజంలో అంతరించిపోతున్న సంప్రదాయ వృత్తులను ఆదరించాల్సిన అవసరాన్ని ఈగాథలో నొక్కి చెప్పారు రావూరి.

గొడుగు రిపేరుచేసే మనిషి శంకరయ్య గురించి వివరించే గాథ 'చిత్రపాణి'. 'చిత్రమేమంటే గట్టిగా ఎండ కాసినా, వానకురిసినా అతను మాత్రం ఏచూరుకో వెళ్ళి తలదాచుకోవాల్సిరావడం మన సమసమాజస్థాపనకొక మచ్చుతునక' అన్న భరద్వాజగారి మాటల్లో ఆవేదన కనిపిస్తుంది.

'భ్రమణం-పరిభ్రమణం'లో డిగ్రీ రెండవ సంవత్సరం పూర్తిచేసి రంగులరాట్నాలు తిప్పి పొట్టపోసుకుంటున్న జాఫర్ "లేదండీ! ఇక నేను చదవను, ఇంత వరకూ చదివిందే నాకు పనికిరానప్పుడు ఇంకో ఏడాది ఈ ముష్టి చదువుకోసం నేను వృధా చేయనండీ" అన్నమాటలతో మన విద్యావ్యవస్థలోని లోపాలను చర్చకుపెట్టి ముగించారు భరద్వాజ.

తన పిల్లలందరితో కలసి గాజుల తయారీలో నిమగ్నమైన భిక్షపతి వివరించిన దళారీ సమస్య నేటి సమాజంలో విశృంఖలరూపం దాల్చిన విషయాన్ని, అలాగే భిక్షపతి భార్య చేతికి కాశీ తోరం తప్ప కనీసం మామూలు గాజులు కూడా లేకపోవడం వంటి విషయాలకు అతని పేదరికాన్ని, సమాజంలో సమకాలీన పరిస్థితుల సూచనతో వివరించారు రావూరి.

సర్కస్‌పై మోజుతో ఇల్లువిడిచి వెళ్లిపోయిన యశ్వంతరావు జీవితాన్ని చిత్రించిన గాథ 'ముందుగతి కానవే చిలకా'. లా చదవాల్సిన యశ్వంతరావు జీవితం స్కూల్ ఫైనల్‌ల్లోనే మారిపోయింది. సర్కస్‌పై కలిగిన మోజు అతని జీవన గమనాన్ని మార్చివేసింది. నర్కన్ చేయడంలో అతడు సాధించిన నైపుణ్యం అతని పేరు వింటేనే జనప్రవాహం సర్కస్‌కు తరలివచ్చేలా చేసింది. దానిని అసరాగా తీసుకొని అతనిని పెట్టుబడిగా పెట్టి అతని పేరుమీద ప్రచారం చేసి డబ్బు సంపాదించడంలో సర్కస్ కంపెనీలు పోటీపడ్డాయి. 35 సంవత్సరాలు సర్కస్ ఫీట్లు చేస్తూ కష్టపడిన అతను ఓ ప్రమాదంలో సర్కస్‌కు పనికిరాకుండా పోయినప్పుడు అతని ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కనీసం ఒంటరివాడైన అతని పోషణే ఎవ్వరికీ పట్టకుండా పోయింది. కాస్తోకూస్తో సంపాదించుకున్నప్పుడు దాచుకోవడం చేతగాని ఫలితమే ప్రస్తుతం చిలక జోస్యం చెప్పుకోవడం.

ఈ గాథలో రావూరి సమాజంలో జరుగుతున్న దోపిడీని వివరించారు. ప్రాణాలకు తెగించి రోజూ ఫీట్లు చేసినా, శరీర ధారుఢ్యం పెంచుకోవడం తప్ప అతను సాధించింది ఏమీ లేదు. ప్రస్తుతమైతే అదీ లేదు. పెళ్ళీలేదూ, పిల్లలూ లేరు. ఒంటరిగా ఉన్నా జీవనమే కష్టంగా మారిందని నెహ్రూతో కలసి ఫోటో దిగిన యశ్వంతరావు చెబుతుంటే కళ్ళుచెమర్చకుండా ఉండడం కష్టం. దేశమంతా తిరిగి తన ప్రదర్శనలతో ప్రజల్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేసిన యశ్వంతరావు ఇప్పుడు చిలక జోస్యంతో పొట్టపోసుకోవడం యాదృచ్ఛికమా? స్వయంకృతాపరాధమా? ఈ రీతిగా ఈ గాథను వివరించిన రావూరి సమాజంలోని లోపాలను ఎత్తిచూపారు.

స్వాతంత్ర్యం వచ్చాక కూడా సమాజానికి చీడపురుగులా చాలా కాలం వేధించిన బానిసత్వ సమస్యను కళ్ళకు కట్టించిన గాథ 'చచ్చులూ - పుచ్చులూ'. చేసిన అప్పుకు

ప్రతిగా ఉన్న భూమిని సమర్పించుకోవడంతోబాటు మిగిలిన అప్పును తీర్చడంకోసం తరతరాలుగా బానిసలుగా పనిచేయాల్సిన దుర్భరస్థితులు స్వాతంత్ర్యానంతర సమాజంలో కూడా ఉండడం శోచనీయమని ఈ గాథలో చెబుతారు రావూరి.

బ్రిటీషువారు దేశం విడిచిపెట్టినా ప్రజలందరికీ 1947 ఆగష్టు 15నే స్వాతంత్ర్యం రాలేదని దీనితో మనకు అర్థమౌతుంది. బానిసబ్రతుకులతో జీవనాన్ని సాగిస్తూ దొర దోపిడీని ప్రశ్నించడానికి వీల్లేని పరిస్థితుల్లో 'ఇక మా జనమలు ఇంతే ననుకున్నమండీ! మేం ఇందుకోసమే పుట్టినోళ్ళమనుకున్నాం. యెంగలరావు దొర సీటుమీన కొచ్చిండు. మా బాధ ఇరగడయింది!' అన్న యాదగిరి ఆనందం ఎంతో కాలం నిలవలేదు. అప్పటి కలెక్టర్ పి.వి.ఆర్.కె. ప్రసాద్ ప్రోత్సాహంతో వీరి పునరావాసానికి రుణసదుపాయం వచ్చింది. దీంతో యాదగిరి కూర గాయల బండి పెట్టాడు. అయినా కొనడం, అమ్మడం తెలియదు. రాళ్లు, తూకాలు తెలీదు. దాంతో మోసాలకు గురయ్యారు. ఫలితంగా వచ్చిన నష్టాలతో చద్దామనుకున్నాడు. కానీ భార్య ప్రోత్సాహంతో బండి నెట్టుకొస్తున్నాడు. 'ఈ దరిద్దరం మాతోనే ఆఖరు కానియ్యండి దొరా! ఇంకా పిల్ల పిల్లతరాలు ఎందుకులేండి' అన్న యాదగిరి మాటల్లో ప్రతిధ్వనించే అంతరార్థం ఏంటి? సమాజంలోని దోపిడీ, అరాచకాలు, అన్యాయాలపై ద్వేషమేనా? అని మనల్ని ఆలోచనల్లో పడేస్తారు రావూరి.

గారడీ విద్యపై మోజుతో ఇంట్లోనించి వెళ్లిపోయి పాత్రలకు మాట్లువేసే పనినేర్చుకున్న రజాక్ జీవితగాథ 'కాయకల్ప చికిత్స'. పాత్రలను యవ్వనవంతులుగా చేయడం రజాక్‌కు బాగా తెలుసన్నది భరద్వాజగారి స్టేట్‌మెంట్. 15, 16 సంవత్సరాల వయస్సులో ఇంట్లో నించి వెళ్ళిపోయిన రజాక్ గారడీ విద్యనేర్చుకోవడానికి గురువుకు 3, 4 సంవత్సరాలు విపరీతమైన శుశ్రూష చేశాడు. అయినా గురువు ఏమీ నేర్పకపోగా చిన్న పొరపాటు చావబాదాడు. దాంతో చావడానికి వచ్చి భయపడి ఏదో హోటల్ ప్రక్కన మాట్లువేస్తున్న పెద్దాయన దగ్గర సెటిల్యాడు. అందులో నైపుణ్యం సాధించాడు. పెద్దాయన తమ్ముడి కూతుర్నే పెళ్ళి చేసుకున్నాడు. పుట్టిన పిల్లాడికి ఆ పెద్దాయన పేరే జహంగీరు అని పెట్టుకున్నాడు.

ఈ గాథలో గారడీ విద్యపై పిల్లలకు గల మోజు శుశ్రూష చేస్తున్నా గారడీ రహస్యాలు చెబితే వారు తమను ఎక్కడ మించిపోతారోననే భయంతో ఏమీ నేర్పని మానవత్వంలేని గురువులు, అదే సమయంలో ఎలాంటి పరిచయం లేకపోయినా మానవత్వంతో ఆదరించి అన్నీ నేర్పి జీవితాన్ని ప్రసాదించిన మనుషులు గురించి వారిపట్ల కృతజ్ఞత చూపించే తీరును తన అక్షరాల కూర్పుతో మనముందుంచారు భరద్వాజ. 'అన్నంపెట్టిన వాడిని మరిచిపోతానా సార్' అంటూ 'పస్తులుండడంలేదుగాని సార్, డొక్క లెగిసేటట్లు తినడానికి కూడా ఉండదండి' అన్న రజాక్ మాటలు స్వతంత్ర భారతదేశంలో కోట్లాది మందికి ప్రానిథ్యం వహించే అక్షరతూణీరాలే.

దేవుడిమీద ప్రజలకున్న నమ్మకంపై ఆధారపడి బండిలాగిస్తున్న నటరాజన్ జీవితాన్ని చిత్రించిన గాథ 'బతుకు కోసం బహుకృత వేషాలు'. కారణం లేకుండానే ఇంటినుంచి వచ్చేసి ఒక హోటల్‌లో పనికి కుదిరి అపరిచయాలతో ఓ హీరో దగ్గర పనికి కుదిరాడు నటరాజన్. తరువాత ఓ ఆర్ట్ డైరెక్టర్ దగ్గర 3 ఏళ్ళు పని చేశాడు. ఆ సమయంలో బొమ్మలుగీయడం నేర్చుకొని సహాయకుడిగా మారాడు. నటరాజన్ అక్కడే ఉంటే అతని జీవితం మరోలా ఉండేదేమో. కాని ఇంట్లో యజమానురాలు తనను దొంగగా చిత్రించడంతో అక్కడినించి వచ్చేసి ఇంక ఎవ్వరిదగ్గర పనికి కుదరకూడదని నిర్ణయించుకున్నాడు.

తను నేర్చుకున్న బొమ్మగీసే కళనే తన జీవనాధారం చేసుకున్నాడు. దేవాలయాల ముందు, రోడ్డు ప్రక్కల దేవుడు బొమ్మలను, బొగ్గుముక్కలు, రంగుసుద్దలతో గీయడం ప్రారంభించాడు. పొట్టగడవడానికి ఎలాంటి

ఇబ్బంది లేకుండా పోయింది. ఒక్కచోటే ఉంటే ఆదాయం రాకపోవడం గమనించి దేశమంతా తిరగడం ప్రారంభించాడు. అలా పాట్నాలో తనకన్నా పేదరికాన్ని అనుభవిస్తూ, అనాధైన ఓ అమ్మాయిని తిరుపతిలో పెళ్ళిచేసుకున్నాడు. ప్రస్తుతం నటరాజన్‌కు ఇద్దరు పిల్లలు కూడా. 'దేవాలయాల ముందు ఆయా దేవుళ్ళ బొమ్మలు గీస్తా, భక్తితో కాకపోయినా భయంతోనైనా నాలుగు డబ్బులు పడతాయ్, భగవంతునిమీద జనంలో నమ్మకం ఉన్నంతవరకు నాఆదాయానికి ఢోకా ఉండదు' అని విశ్వాసం వ్యక్తంచేసే నజరాజన్ అభిప్రాయం నిజమేనని పిస్తుంది. ఈ సమాజంలో పాపాలు పెరిగే కొద్దీ భక్తిభావం కూడా పెరుగుతుంది. కాబట్టి నటరాజన్ దైనందిన జరుగుబాటుకు ఢోకాలేదు. కాని నాలుగు రూపాయలు వెనకేయడం అతని ఇష్టముండదు. కాబట్టి అతని తరువాత అతన్ని నమ్ముకున్న కుటుంబం పరిస్థితి ఏంటి? వారికి ఎవరు ఆధారం అనే ప్రశ్నలను రావూరి మనకు కలగజేస్తారు.

ఈ విధంగా సమాజంలో భిన్న వృత్తులవారి విభిన్న జీవన విధానాలను అత్యంత విపులంగా వివరించారు కాబట్టే ఈ "జీవన సమరం" ప్రపంచ సాహిత్యంలో ఒక అద్భుత ప్రయత్నమంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి గాథలు, వ్యధలు ఇందులో మరెన్నో ఉన్నాయి.

ఈ సమాజంలో బతుకుతెరువుకోసం ఎన్నో కష్టాలుపడ్డ రావూరి, ఆ కష్టాలనుంచే, ఆ సమాజంనుంచే తన సాహిత్యానికి ముడి పదార్ధాన్ని వెతుక్కున్న సాహితీ పిపాసి. చూడగల దృష్టి ఉంటే సమాజంలో ఎవరూ పట్టించుకోని ఎన్నో వస్తువులు మనకు దొరుకుతాయని ప్రగాఢంగా నమ్మే ఆయన విశ్వాసానికి ప్రతిరూపమే "జీవన సమరం". సమాజం పట్టించుకోని అభాగ్యులను తన సాహిత్యంతో అద్భుతంగా ప్రతిష్టించి వారి పాత్రలకు, వృత్తులకు, వ్యక్తిత్వాలకు, విలువలకు, ఉన్నత స్థానాన్ని కల్పించిన అత్యున్నస్థాయి సాహితీవేత్త రావూరి.

''జీవన సమరం''లోని గాథలను పరిశీలిస్తే ప్రతీ పాత్రలోను రావూరి కష్టాలు ప్రతిఫలిస్తాయి. మానవతా దృక్పధం కనిపిస్తుంది. జీవన సమరం చదివాక ఇక ఆ వృత్తిలో బతుకుతున్న వ్యక్తి మనకెక్కడ కన్పించినా వెంటనే అతని జీవన చిత్రం, మన మదిలో మెదులుతుంది. అంతలా వారితో మనల్ని ఈ రచన ద్వారా మమేకం చేసిన వ్యక్తి రావూరి.

మనకు సమాజంలో నిత్యం కనిపించే పలు వృత్తుల వారి జీవన విధానాన్ని తన రచనా పఠిమతో సజీవులుగా మనముందు నిలబెట్టింది రావూరి కలం. ఆ కలం చేసిన సృజనాత్మక సాహిత్యరచన "జీవన సమరం". ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ఇది అజరామరం.

ఉపయుక్త గ్రంథాలు :

1. జీవన సమరం - రావూరి భరద్వాజ.
2. రావూరి భరద్వాజ రచనలు ఒక పరిశీలన - (సం.) ఎన్. మధుకర్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలంగాణ కథా పరిణామం

– డా॥. కడివెండి సుమత, అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగుశాఖ, బద్రుకా కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.

తెలుగు కథకు - తెలంగాణ కథకు కూడా ఆధ్యురాలు భండారు అచ్చమాంబ. ఆమె తెలంగాణ వైతాళికుడైన కొమర్రాజు లక్ష్మణరావు సోదరి. ఆమె తెలంగాణలో దేవరకొండలో పెరిగింది. మేనమామను వివాహం చేసుకొని నాగపూరులో స్థిరపడింది. నాగపూరులో వుంటున్నా తెలుగును మరచిపోలేదు. చక్కని శైలిలో 1898 నుంచే కథలు వ్రాయటం ఆరంభించింది. ఆమె వ్రాసిన మొదటి రెండు కథలు దొరకకున్నా 1901, 1902ల నుంచి రచించిన కథలు దొరుకుతున్నాయి. లలితాశారదలు (1901) జానకమ్మ (1902) దంపతుల ప్రథమ కలహం (1902) ఆమె వ్రాసిన కథల్లో లభించే మూడు కథలు. ఆమె కథలో సంఘ సంస్కరణ భావాలు, స్త్రీ జనోద్ధరణ భావాలు కన్పిస్తాయి. అదే విధంగా తెలంగాణ తర్వాత కథకుడు మాడపాటి హనుమంతరావు "హృదయశల్యము"ననే కథలు కూడా సంఘసంస్కరణ భావాలను ప్రబోధిస్తున్నాయి. అన్ని భాషల్లోని కథల్లో వలెనే ఆరంభదశలో వచ్చిన తెలంగాణ కథలు సంఘసంస్కరణ భావాలను చిత్రిస్తున్నాయి. ఒద్దిరాజు సోదరులు, సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, కాళోజి, ఎ.ఆరా అవధాని, రచించిన కథల్లో సంఘసంస్కరణ భావాలు ప్రాధాన్యతను వహించాయి. తర్వాత కాల్పనిక వాద (రొమాంటిసిజం) ప్రభావంతోను తెలంగాణ నుంచి చక్కని శైలిలో రచింపబడిన కథలు వచ్చాయి. బూర్గుల రంగనాథరావు, హీరాలాల్, నందగిరి ఇందిరాదేవి, వెల్దుర్తి మాణిక్యరావు, బోయనపల్లి రంగారావు, ధరణివోలు శ్రీనివాస్, నెల్లూరి కేశవరావు మొదలైన రచయితలు ప్రణయం, ప్రేమ సంబంధమైన కథలు వ్రాసారు. నందగిరి వెంకట్రావు, జి. రాములు మొదలైన కథకులు చారిత్రక కథలను రచించారు. 20వ శతాబ్ద ఆరంభంలో తెలంగాణా నుంచి డిటెక్టివ్ కథలు, సూన్స్ ఫిక్షన్ కథలు కూడా వచ్చాయి.

1940ల నుంచి నైజాం విమోచనోద్యమం ఆరంభమైనది. మొదలు ఆ పోరాటానికి సంబంధించిన కథలు తెలంగాణ కథకులు రచించారు. 1940కి పూర్వం నుంచే దొరలు, జమీందార్లు పేదలను పేద రైతులను దోపిడీ చేసే కథలు వచ్చాయి. కాంచనపల్లి చిన వెంకట రామారావు, "చెరువు ఒడ్డున", "మావూళ్ళో కూడానా?", మంద రామారెడ్డి "సర్కారు సిస్తు", భాస్కరభట్ల కృష్ణారావు "ఇజ్జత్", ఐతా రామారావు "గరీబోణ్ణి", సురవరం ప్రతాప రెడ్డి "సంఘాల పంతులు", ఆవుల పిచ్చయ్య "దొరా", కాంచనపల్లి "చాకలి దినచర్య", కథలు రైతుల కష్టాలను, వెట్టిచాకిరి బాధలను ప్రజలను పీడించే కథలు చాలా వచ్చాయి. ఈ కథలన్నీ తెలంగాణలో నిజాం కాలం నాటి గ్రామీణ ప్రజల బాధలను, పేదరికాన్ని దోపిడికి గురి కావటం వంటి సమస్యలను వాస్తవికంగా చిత్రిస్తున్నాయి.

నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, కాంగ్రెసు వాళ్ళు, ఆర్యసమాజం వాళ్ళు చేసే పోరాటాలను తెలంగాణలో ఈ కథా రచయితలు చిత్రిస్తూ కథలు రచించారు. ఈ కథలో అనాటి రాజకీయ సామాజిక జీవితాన్ని ప్రతిబింబింప జేస్తున్నాయి. పి.వి. నరసింహారావు "గొల్ల రామవ్వ", అయోధ్యా రామకవి "కాలాన్ని తేవాలి", నెల్లూరి కేశవరావు "యుగాంతం", ఆవుల పిచ్చయ్య "ఊరేగింపులు" కె.ఎల్.ఎన్ "అమరజీవి" మొదలైన ఎన్నో కథలు రచింపబడ్డినాయి. 1950 దశకంలో గూడూరి సీతారాం, యశోదారెడ్డి, సురమౌళి మొదలైన రచయితలు తెలంగాణ మాండలిక భాషలోనే కథలు రచించారు. తెలంగాణ భాష మీద వున్న అభిమానాన్ని చాటారు. 1960 దశకంలో మాదిరెడ్డి సులోచన సమకాలిన సామాజిక రాజకీయ సంబంధమైన ఇతివృత్తాలను తీసుకొని చక్కని కథలు వ్రాసారు. నక్సలైటు ఉద్యమం తాత్వికతను

పోషించిన "విరసం" విరసం కాలంలో అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు, రఘోత్తంరెడ్డి, చెరబడ రాజు, పి. చంద్ వంటి రచయితలు ఫ్యూడలిజంపై తిరుగుబాటును ప్రబోధిస్తూ కథలు రచించారు. ఆ తర్వాత గీతాంజలి, ముదిగంటి సుజాతారెడ్డి, గూడురు శ్యామల, జాజుల గౌరి, జూపాక సుభద్ర, ప్రాజ్వలనా వంటి రచయితులు స్త్రీ మీద కథలనే కాక సమకాలిక సమాజాన్ని దళిత ముస్కం వాదాలను ప్రతిబింబించే ఇతివృత్తాలను తీసుకొని కథలు రచించారు. బహుజనోద్యమాన్ని చిత్రిస్తూ కాలువ మల్లయ్య, ఉప్పల నరసింహం కథలు వ్రాసారు. దళిత వాదాన్ని ప్రబోధిస్తూ బోయ జంగయ్య, భూతం ముత్యాలు, పసునూరి రవీందర్ వంటి రచయితలు కథలు రచించారు. ముస్లిం వాదం భావజాలంతో అఫ్సర్, స్కైబాబా, అన్వర్, అలీ, గౌసుద్దీన్ మొదలైన రచయితలు కథలు రచించారు. తెలంగాణోద్యమం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కాలంలో పెద్దింటి అశోక్ కుమార్, జూకంటి జగన్నాథం, కాసుల ప్రతాపరెడ్డి, బెజ్జరపు రవీందర్, బెజ్జారపు వినోద్‌కుమార్ ఇంకా ఎందరో తెలంగాణ ప్రజా జీవితాన్ని చిత్రిస్తూ తెలంగాణ భాషలో కథలు రచించారు.

21 శతాబ్దంలో తెలంగాణ కథకులు ఒక ప్రత్యేకమైన కథనశైలిలో ఆధునిక జీవితాన్ని చిత్రిస్తూ కథలు వ్రాస్తున్నారు. ఇన్ని దశాబ్దాలుగా వ్రాస్తున్న తెలంగాణ కథా రచయితలు ఆయా కాలానికి, వాదానికి తగిన శైలిలో భాషలో వ్యక్తీకరణలో కొత్తదనాన్ని చూపిస్తూ కథలు వ్రాస్తున్నారు. అదే విధంగా ఇప్పటి రచయితలు పసునూరి రవీందర్, చందు, తులసి, మన్నెఏలియా, వంశీధర్, కొట్టం రామకృష్ణారెడ్డి, పూడూరి రాజిరెడ్డి, సరస్వతీ రమా మొదలైన రచయితలెందరో తెలంగాణ కథను ముందుకు సాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త భాష వ్యక్తీకరణ శిల్పంతో కొత్తదిలైన సమకాలిక ఇతివృత్తాలతో కథలను వ్రాస్తున్నారు.

మొదటి నుంచి ఇప్పటి వరకున్న తెలంగాణ కథా సాహిత్యాన్ని పరిశీలిస్తే తెలంగాణ రచయితలు ఎప్పుడూ సమాజానికి, ప్రజాజీవితానికి దూరంగా వుంటూ కృత్రిమమైన కల్పనలు గల ఇతివృత్తాలతో కథలను వ్రాయలేదని తెలుస్తున్నది. తెలంగాణ కథలను చదివితే ఆయా కాలాలా సామాజిక చరిత్రనే కండ్లముందు నిలుస్తుంది. ఆ విధంగా తెలంగాణ రచయితలను సామాజిక చరిత్రకు తమ కథలిచ్చి రికార్డు చేసారు. తెలంగాణ కథ మొదటి నుంచి కూడా వస్తువు స్వరూప స్వభావాల్లో ప్రత్యేకత కలిగిస్తుంది. ఇతర ప్రాంతపు తెలుగు కథకులపై బెంగాల్ కథల ప్రభావం వుంది. అదే తెలంగాణ కథకులపై ప్రేమ్ చంద్ ఉర్దూ హిందీ కథల ప్రభావం కన్పిస్తున్నది.

ఆ విధంగా తెలంగాణ కథ భిన్నమైన వస్తు స్వరూపత స్వభావాలతో తెలుగు సాహిత్యంలో నిలిచింది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గొరుసు జగదీశ్వర రెడ్డి కథల్లో మానవ జీవిత చిత్రణ

– డా॥. కుంద వెంకటరత్నం, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

మానవ జీవన పోరాటంలో ఎదురయ్యే సమస్యలు, కష్టాలు, నష్టాలు, పోరాటాలు మొదలైన వాటిపట్ల అవగాహన కల్గిస్తూ తమ కథలద్వారా సమాజానికి ప్రేరణ కల్గించడానికి, లక్ష్యసాధనకి, సత్ఫలితాలను సాధించ డానికి ఉత్తమస్థాయి రచయితలు సమాజానికి ఎంతైనా అవసరం. అటువంటి రచయితల్లో నిగర్వత్వం, నిరాడం బరత, తమ గూర్చి ఎక్కువగా చెప్పుకోకపోవడం అనేవి ముఖ్య లక్షణాలు. అటువంటి లక్షణాల్ని పుణికిపుచ్చుకున్న రచయితల్లో గొరుసు జగదీశ్వర రెడ్డిని ఒకరుగా చెప్పు కోవచ్చు.

వీరు రాసిన కథల్లో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సామా జిక అంశాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి. వీరి కథల్లోని ఇతి వృత్తాలు బడుగు, బలహీన, కార్మికులకు, కూలీలకూ సంబధించిన అంశాలతో కథలను రచించాడు. గొరుసు తన కథలలో సమాజంలోని అన్నివర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యల్ని, అంశాల్ని ఇతివృత్తా లుగా తీసుకొని కథలు రాశారు. వీరి కథల్లో మానవతా వాదం, సమాజంపట్ల ప్రతి ఒక్కరి బాధ్యత అడుగడుగునా కనబడుతుంది. గొరుసు రచనా దృక్పథం, సామాజిక సమస్యలపట్ల అతనికి గల అవగాహన వీరి ఇతివృత్తాలలో ప్రస్ఫుటమౌతుంది.

గొరుసు కథల్లో మానవ జీవిత చిత్రణ ఏవిధంగా చేశాడో గమనిద్దాం :

గొరుసు జగదీశ్వర రెడ్డి రచించిన వైవిధ్యభరితమైన ఇతివృత్తం గల కథ 'ప్రేమశిక్ష'. ఈ కథల్లో పెళ్లైన స్త్రీ, పురుషుల మధ్య కలిగే వ్యామోహ ప్రేమను గూర్తి తెలియ జేశాడు. అటువంటి ప్రేమవల్ల జరిగే అనర్థాలను గూర్చి తెల్పుతూ స్నేహితుని పాత్రద్వారా మార్పును తెస్తూ ఆ యువకునికి జ్ఞానోదయం కల్గించిన తీరు పాఠకుల్ని ఆలోచింపజేసేవిధంగా కథను రచించాడు.

వీరి రాసిన 'ఈ జీవితం నాది' అనే కథలో కోటి ఆశలతో పెళ్లి చేసుకున్న అమ్మాయి తన భర్త చెడు తిరుగుళ్ళు తిరగడం చూసి నిలదీయడం, అందుకు అతడు ఆమెను పుట్టింటికి వెళ్ళమనడం, అందుకు ఆమె చనిపోవాలనుకోవడం, తర్వాత ఒక సంఘటనతో ఆమెలో మార్పువచ్చి తన కాళ్ళపై తాను జీవించడమనే వైవిధ్యభరిత ఇతివృత్తంతో ఈ కథ సాగుతుంది. 'మన్ జడా పాపి' అనే కథలో యువకులు స్త్రీలను చూసి ఎలా ప్రవర్తిస్తారో తెల్పుతూ ఈ కథ సాగుతుంది. ఒక యువ కుడు పక్క ఊరిలో జరిగే జాతరకు వెళ్ళడం, అక్కడ ఒక అందమైన స్త్రీవెంటపడడం, ఆమెను బలాత్కరిం చడం, ఆమె తప్పించుకోవడం, ఆ యువకుణ్ణి కొందరు వచ్చి కొట్టడం, రక్తపు మడుగులో ఉన్న అతణ్ణి ఆమె కాపాడడం ద్వారా అతనిలో మార్పు రావడమనే వైవిధ్య భరితమైన ఇతివృత్తంతో ఈ కథ సాగుతుంది.

గొరుసు రచించిన మరో వైవిధ్యభరితమైన కథ 'వలస పక్షులు. ఈ కథ పాలమూరు జిల్లాలోని కూలీల దయ నీయమైన జీవన విధానాన్ని తెలియజేస్తూ మేస్త్రీలు, కాంట్రాక్టర్లు కూలీలను పెట్టే కష్టాలను గూర్చి ఈ కథలో తెలియజేశాడు. వీరు రచించిన 'బాధితులు' కథలో కుటుంబంలోని పెద్దలు పిల్లలముందు ఎటువంటి పనుల్ని చేయాలి, ఎటువంటి పనుల్ని చేయకూడదన్న విషయాన్ని రచయిత ఈ కథలో చాలా సున్నితంగా తెలియజేశాడు. 'మోదుగాకులు' కథలో అరవై సంవత్స రాలు నిండిన పేద వృద్ధురాలు ఇతరులపై ఆధారపడ కుండా బతికినంతకాలం కష్టపడి జీవించాలని అనుకున్న వృద్ధురాలు ఒంటరవడంవల్ల మోసగింపుకు గురై చివరకు మరణించేటటువంటి విషయాన్ని రచయిత ఎంతో దయ నీయంగా తెలియజేశాడు.

కుటుంబంలోని ఆడపిల్లల్ని గుండెలపై కుంపటిలా భావించి పెళ్లి చేసేటటువంటి ఇతివృత్తంతో నడిచే కథ 'ఒప్పందం'. ఈ కథ ఒప్పందం ద్వారా పెళ్లి చేసుకున్న స్త్రీ ఏవిధమైన కష్టాలకు గురవుతుందో తెలియజేస్తుంది. సమాజంలో ఇతరుల కష్టాలను చూసి స్పందించి సాయం చేసే మానవత్వంగల మనుషులను గూర్చి చెప్పేకథ గొరుసు రాసిన 'రక్తసంబంధం' కథ. ఈ కథ సాటి మనిషికి సాయం చేయాలనే నీతిని తెల్పుతుంది. సంఘంలో ఉద్యోగం చేస్తున్న స్త్రీలు పడుతున్న కష్టాలను, అవమానాలను గూర్చి తెలిపే కథ 'మార్పు అవసరం'. ఈ కథ తోటి ఉద్యోగులను గౌరవించాలని, ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోకూడదని తెలియజేస్తుంది.

కుటుంబాన్ని పోషించడంకోసం వయస్సు మీద పడుతున్నా లెక్కచేయక స్వశక్తిపై ఆధారపడి జీవించే శ్రమ జీవులను గూర్చి తెలిపేకథ 'జగదాంబ జంక్షన్'. ఈ కథలో రచయిత సమాజంలోని వ్యక్తులు కష్టపడి జీవించాలని తెలియజేశాడు. పరిశ్రమలలో పనిచేసే కార్మికుల జీవిత స్థితిగతుల్ని తెలియజేస్తూ గొరుసు రాసినకథ 'ఖాయిలా బతుకులు' ఈ కథ ఉద్యోగాలను పోగొట్టుకున్న కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేక ఏవిధంగా కష్టాలకు గురై మరణిస్తారో తెలియజేస్తుంది. గొరుసు తల్లి ప్రేమ గొప్పదనాన్ని తెలియజేస్తూ రచించిన కథ 'కొడుకో కొమరన్నా'. ఈ కథలో గాయపడిన తన కొడుకును చూడాలని తల్లి హృదయం ఏ విధంగా తల్లడిల్లుతుందో చక్కగా ఆవిష్కరించాడు. సమాజంలో వ్యక్తులు ఎంతటి స్వార్థంతో జీవిస్తుంటారో తెలియజేసే కథ 'వాచ్‌మెన్'. ఈ కథద్వారా మనుషులలో మరుగున పడిపోయిన మానవత్వాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేశాడు.

నేటి సమాజంలో విద్యావ్యవస్థ తీరుతెన్నులను గూర్చి గొరుసు రచించిన కథ 'క్షోభ'. ఈ కథ తల్లిదండ్రులు తమ కోర్కెలను పిల్లలపై రుద్దకూడదని, పిల్లల్ని స్వేచ్ఛగా చదవనీయాలని తెల్పుతుంది. సమాజంలో తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు లేనటువంటి అభాగ్యుల జీవితాలను గూర్చి తెలిపే కథ 'ఉసుళ్ళు'. ఈ కథ ఒక ఆకలి తీర్చుకోవడంకోసం వెళ్లిన అమ్మాయి మరో ఆకలికి బలైన పరిస్థితిని, తమ ముందు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించడానికి వయస్సుతో నిమిత్తంలేదన్న నీతిని తెల్పుతుంది. కుటుంబంలోని వ్యక్తులు మనస్తత్వాలనుగూర్చి తెలియజేసే కథ 'మంగళ సూత్రం'. ఈ కథలో రచయిత డబ్బుముందు మానవ సంబంధాలు చిన్నబోతాయి అని తెలియజేశాడు. గొరుసు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లలో జరిగే లంచగొండితనాన్ని గూర్చి తెలియజేస్తూ రచించిన కథ 'జలగల వార్డు'. ఈ కథ లంచగొండితనాన్ని తీవ్రంగా నిరసిస్తుంది.

గొరుసు జగదీశ్వరరెడ్డి కుటుంబంలోని వృద్ధులు అనుభవించే కష్టాలను తెల్పుతూ రాసిన కథ 'అవసానం'. ఈ కథ కుటుంబాన్ని పోషించిన వ్యక్తి వృద్ధాప్యదశలో ఆ కుటుంబ నిరాదరణకు గురై చనిపోయిన విధానాన్ని తెలియజేస్తుంది. మధ్యతరగతి కుటుంబాల జీవన విధానాన్నే ప్రతిబింబిస్తూ వీరు రాసిన కథ 'హంస తూలికా తల్పం'. ఈ కథ మధ్యతరగతి కుటుంబాలలో ఎదురయ్యే సమస్యల్ని భార్యాభర్తలు ఒద్దికతో అధిక మించి జీవించాలని తెల్పుతుంది. గొరుసు సమాజంలోని అనాథలు, అభాగ్యులను చూసి స్పందించి రచించిన కథ 'నిర్ణయం'. ఈ కథ సమాజానికి నీతులను, అభ్యుదయ భావాలను చెప్పేవారు వాటిని ఆచరించాలని, తద్వారా సంఘసేవ చేయాలని తెల్పుతుంది.

సమాజంలో కష్టజీవుల జీవితాలను గూర్చి వారి కుటుంబ పోషణకోసం పడే కష్టాలను తెలిపే కథ వీరు రాసిన 'గజ ఈతరాలు'. ఈ కథ కొడుకు ఉన్నతికి తల్లి ఎంతటి కష్టమైనా భరిస్తుందని తెల్పుతుంది. సమాజంలో చిన్న వడ్డీవ్యాపారులు, చీటీవ్యాపారులు పడే కష్టాలను గూర్చి తెలియజేసే కథ 'వాల్తేరత్త'. ఈ కథ వ్యాపారంలో మోసపోయినవారి బతుకులు ఎలా చితికిపోతాయో ఈ కథ తెల్పుతుంది.

సమాజంలో మోసగించబడిన కళాకారులు అనుభవించే దుర్భర జీవితాన్నిగూర్చి తెల్పుతూ గొరుసు రాసిన కథ 'దగాపడిన కోయిల'. ఈ కథ తమ ప్రతిభతో చిత్ర పరిశ్రమకి ఎంతో సేవ చేసిన కళాకారులను ప్రభుత్వం వారు ఆదుకోవాలని తెల్పుతుంది. కుటుంబంలోని చిన్న చిన్న కలహాలు ఏవిధంగా సంసారాన్ని నాశనం చేస్తాయో తెలిపేకథ 'చీడ'. ఈ కథ ఆర్థిక పరిస్థితులవల్ల కుటుంబాలు ఎలా చిన్నాభిన్నమైపోతాయో తెలియజేస్తుంది.

సమాజంలో ఉద్యోగాలను పోగొట్టుకున్న కార్మికులు కుటుంబాలను పోషించుకోలేక ప్రాణాలను కోల్పోయిన వారి ఆత్మఘోషను తెలియజేసే కథ 'బతుకుగోస'. ఈ కథ అవినీతిపరులైన అధికారుల చర్యలకు బలైపోయిన కార్మికుల ఆర్తనాదాలకు ప్రతీకగా నిలుస్తుంది. గొరుసు జగదీశ్వరరెడ్డి రచించిన కళాకారుల జీవితాలకు అద్దంపట్టే కథ 'యవనిక'. ఈ కథ కుటుంబ నిరాదరణకు గురైన వృద్ధ కళాకారుల జీవితాలను గూర్చి తెలియజేస్తుంది.

ఈ విధంగా గొరుసు జగదీశ్వరరెడ్డి సమాజంలోని అన్ని అంశాలను స్పృశిస్తూ కథలను రాశాడు. వీరు రాసిన కథలు నేటి సమకాలీన సమాజంలో సమస్యలను, సంఘటనలను, సంఘంలోని వ్యక్తులను వారి మనస్సులను తెలియజేసేవిగా ఉన్నాయి. వీరి కథల్లోని పాత్రలు నేటి సమకాలీన సమాజంలోని ప్రజల జీవన విధానానికి అద్దం పట్టేవిధంగా ఉన్నాయనడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. గజఈతరాలు (కథాసంపుటి), గొరుసు జగదీశ్వరరెడ్డి, ఎస్‌కె. పబ్లికేషన్స్, విజయనగరం, 2007.
2. గొరుసు జగదీశ్వరరెడ్డి కథలు, గొరుసు జగదీశ్వరరెడ్డి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అంటారాని గాంతు ఆక్రందనం – అక్రమ సంతానం

– డా॥. మెండా దేవేనంద్ కుమార్, తెలుగు అధ్యాపకుడు, ఎస్ఆర్ఆర్ మరియు సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళశాల (స్వ) విజయవాడ.

తెలుగు సాహిత్యానికి బలమైన పునాదులు వేసిన ప్రక్రియ అనువాదం. వివిధ భాషల్లోని భావ వైచిత్రిని కవులు అందిపుచ్చుకొని మన పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయడం ఆది కవి నన్నయ తో ప్రారంభమై నేడు సంపూర్ణత సాధించింది. ఇట్టి ఆదాన లక్షణాలు పుష్కలంగా ఉండటంచేత రెండు వేల సంవత్సరాలుగా తెలుగు జీవద్భాషగా దేదీప్యమానంగా ప్రకాశిస్తూంది. మరాఠీ భాష పదాలైన లోటా, డేరా, రావు. గాడి, పైస, దర్వాజ, చెమ్చా, రుమాల్ లాంటి పదాలు అనేకం తెలుగు భాషలో పాతుకుపోయాయి.

మరాఠీ సాహిత్యంలో ప్రకంపనలు సృష్టించిన ఆత్మ కథల్లో డా॥శరణకుమార లింబాళె రచించిన "అక్కరమాశి" ఒకటి. ఇది మరాఠీలో ఒక తిట్టు. సూటిగా చెప్పలంటే 'లంజకొడుకు' 'అక్రమ సంతానం', జారపుత్రుడు అని అర్థం. 'ప్రజాసాహితీ' మాసపత్రికలో 17 నెలలపాటు ధారవాహికంగా ప్రచురించారు. దీన్ని 'అక్రమ సంతానం' పేరుతో శ్రీ రంగనాథ రామచంద్రరావు అనువదించి తెలుగు పాఠకుల ముందుంచారు.

ప్రతి వ్యక్తికి సమాజం దర్శించలేని జీవితం ఒకటి ఉంటుంది. గొప్ప స్థితిలోకి వెళ్ళిన తర్వాత గతం మరచి జీవించే ప్రభుద్ధులు కొందరుంటే, ఏ స్థితిలో ఉన్న గతాన్ని నెమరువేసుకొనే గుణవంతులు కొందరుంటారు. ఆ కొద్ధి గుణవంతుల్లో శరణకుమార లింబాళె ఒకరు. అతి దుర్భరమైన పరిస్థితులకు ఎదురీది అత్యున్నత స్థానమైన వై.సి.యం. యూనివర్శిటీ, నాసిక్‌లో ప్రొఫెసర్, డైరెక్టర్ స్థాయిలో ఉండి ధైర్యంగా తన అంతరంగాన్ని ప్రపంచ పాఠకుల ముందుంచారు. ఈ కఠోర సత్య ఆత్మ కథ ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడం, పంజాబీ, మళయాళ భాషల్లోకి అనువాదమై పెను సంచలనం సృష్టించింది.

డా॥. శరణ్‌కుమార్ లింబాళె తల్లి మాసామాయి దళిత మహర్ కులానికి చెందిన అందగత్తె. అయితే అందమైన అమ్మాయి పుట్టుక దళిత జాతికొక శాపం. ప్రతి ఒక్కరు అందమైన ఆడదాన్ని వేటాడుతారు.

ఆమె మొదటి భర్త విఠల్ కాంబ్లే. కుదురుగా సాగు తున్న సంసారంలో నిప్పులు కుమ్మరించి ,కుక్కలు చింపిన విస్తార చేసాడు ఆ ఊరి పెత్తందారి హనుమంత లింబాళె. మాయమాటలతో మాసామాయిని లొంగ దీసుకొని శరణ్‌కుమార్ పుట్టుకకు కారణమైనాడు. శరణ్ పెరిగి పెద్దవాడై పాఠశాల్లో చేర్పించేటప్పుడు

తండ్రి పేరు వద్ద అసలు సమస్య వచ్చింది. హను మంత లింబాళె తన పేరు రాసినందుకు పెద్ద అవ మానంగా భావించి రచ్చ చేసాడు. మసామాయి కావాలి, ఆమె శరీరం కావాలి అంతేకానీ ఆమెకు పుట్టిన సంతానం తనకెందుకు? మసామాయి బిడ్డ పేరు వేనుక లింబిళె పేరు తగిలిస్తే తన కులానికి అవమానం. పిల్లవాడు పెరిగి పెద్దయి పాలాల్లో, ఆస్తిలో వాటా అడిగితే ? హనుమంత లింబాళెకి ఇదంతా అక్కర లేదు. ఇదే వంక అదే వంక అంటూ మసామాయి వైపు చూడటం మానివేసాడు.

శరణ్‌కుమార్‌ని పెంచి పెద్ద చేసింది అమ్మమ్మ సంతామాయి. భర్త చనిపోడంతో దాదా అనే ముస్లీంతో సహజీవనం చేసింది. తమ కడుపులో భగ భగ మండే ఆకలి మంటలను నీళ్లతో చల్లారిచ్చి మనమడికి మాత్రం రొట్టె, టీ అందించేవారు. శరణ్ ఎదుగుదకు తమ జీవితాలను పణ్ణంగా పెట్టి టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వస్తే తమకు వచ్చినట్టే మురిసిపోయారు. పని చేసే చోట గొడ్డుమాసం దొరకదనీ భావించి పట్టు కెళ్ళిన అమాయకులు. శక్తి సన్నగిల్లీ తినడానికి తిండి లేకపోయినా, మనుమడి ఉన్నతిని చూసి సంతృప్తి చెందారే కానీ ఏ రోజు శరణ్‌ని ఇబ్బంది పెట్టలేదు.

ఉన్నత కులాల్లో పుట్టడం వల్ల , మతం వల్ల మంజూరైన అధికారం కలిగినవారు, వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తులు కలిగినవారు దళిత స్త్రీ లను నయనో భయనో భయపెట్టి లోగదీసుకోవడం సర్వసాధారణం. మాసామాయి ఒంటరిగా ఉండటాన్ని గమనించిన హన్నూర్ గ్రామ పటేల్ కాకా కన్ను పడింది. శాశ్వతంగా పటేల్ ఉంపుడుకత్తెగా మిగిలిపోయింది. మాసామాయి ముగ్గురు భర్తల ద్వారా 14 మంది పిల్లలను కని వాళ్ల బాగోగులు కోసం పడిన వేదన అంతా ఇంతా కాదు.

తాను అక్రమ సంతానం అని చెప్పుకోవడంలోనే శరణ్ నిబద్ధత, నిజాయితీ తేటతెల్లమవుతుంది. ఈ ఆత్మ కథలోని ప్రతి పేజీలో శరణ్ పడిన బాధ, కోపం, సంకటం, ఆక్రోశం, నిరాశ, నిస్పృహ, పీడన, అవమానం, పగ పరుచుకుని ఉంది. శరణ్ తన కులమేమిటని సమాజం ముందు అతి పెద్ద ప్రశ్న ఉంచాడు. తాను ఏ మాతానికి చెందుతానో చెప్పండని సవాలు చేస్తున్నారు. తమ అథమ స్థితికి కారకులు ఎవ్వరనీ సమాజన్ని ప్రశ్నించారు.

కులవ్యవస్థ దౌష్టాన్ని తన అనుభవంతో వివరించిన తీరు మనలో కసిని పెంచుతాయి. చదువుకోవడంలో, ఆడుకోవడంలో, నడవడంలో, పుట్టనప్పటి నుండి చచ్చెంత వరకు కులం ఎలా వెంట పడిందో శరణ్ ఆర్తీతో అక్షరబద్ధంచేసారు. అగ్రకుల పిల్లలు బడి బయట చెన్పులు విడిచేచోట దళిత పిల్లలను కూర్చు బెట్టడం, పొరపాటున అగ్రకుల పిల్లలను అంటుకొంటే అందరు కలసి మూకుమ్మడిగా దాడి చేయడం శరణ్‌ను ఎంతో బాధించింది. తన ఈడు ఆడపిల్లలు తనను కులం పేరుతో పిలిస్తే వాళ్లను ఎదో ఒకటి చేసి ప్రతీకారం తీర్చుకోవాలనీ ఆరాటపడ్డాడు.

ఆకలి మంటను చలార్చుకోవడానికి శరణ్ బస్సు పైన అతుక్కున్న బెల్లం గీరుకుని తెచ్చి, టీ కొట్టుతను పారబోసిన టీపొడి తెచ్చుకుని మళ్ళీ మరగబెట్టి టీ కాచుకుని తాగడం కనీళ్ళు పెట్టిస్తుంది. తాను గొప్ప అధికారైనా, తన ఊరు వచ్చి తన వాళ్ళతో తినడం, గుడినెలోనే కాళ్ళు ముడుచుకొని పడుకోవడం

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదుల జీవన విధానం – సామాజిక జీవన చిత్రణ

– డా॥. ఒభన్ని శ్రీహరి, తెలుగు అధ్యాపకులు, రాజీవ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు.

జానపదులు అంటే సామాన్యంగా గ్రామీణులు లేదా నిరక్షరాస్యులు అని అనుకుంటారు. జనపదం అంటే గ్రామం కాబట్టి గ్రామంలో నివసించే వారు జానపదులు.

జానపద సాహిత్యాన్ని చాలా కాలంగా పట్టించుకోలేదు. ఆధునిక కాలంలో జానపద సాహిత్యంపై కృషి చేసిన వారు బిరుదురాజు రామరాజు, నాయని కృష్ణకుమారి, నేదునూరి గంగాధరం తూమటి దోణప్ప, జి.ఎస్.మోహన్, తంగిరాల సుబ్బారావు, భక్తవత్సలరెడ్డి, జయధీర్ తిరుమల రావు మొదలగు వారు ఉన్నారు.

జానపదుల జీవన విధానాలు రెండు రకాలు. అవి

1) సాంఘిక జీవన విధానం,	2) సాంస్కృతిక జీవన విధానం
1) ఆచారాలు	1) పెళ్ళికి సంబంధించిన ఆచారాలు
2) ఆహారపు అలవాట్లు	2) మరణానికి సంబంధించిన ఆచారాలు
3) వస్త్రధారణ	3) వస్త్ర సంస్కృతికి సంబంధించినది.
4) కుల మతాలు	4) వూజలు, ఆట వస్తువులు.

కులమతాలు :

పూర్వం కులాలు, మనుషులు తక్కువగా ఉండేవారు. కావున అప్పుడు కుల వ్యవస్థలో భేదాభిప్రాయాలు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుత కాలంలో కులాలకు, మనుషులకు మధ్య బేధాభిప్రాయాలు తక్కువగా ఉన్నాయి.

వృత్తులు :

ప్రధానంగా మన దేశం వ్యవసాయ దేశం. కాబట్టి జానపదుల వృత్తి వ్యవసాయం. వేటను వృత్తిగా జీవించే వాళ్ళు, వ్యసాయ కూలీలు బట్టలు ఉతకడం, గాజులు అమ్మడం, బట్టలు నేయడం, చేపలు పట్టడం, ఊరూరా తిరిగి బిక్షమెత్తడం, బుట్టలల్లటం మొదలగునవి వారి వృత్తులు.

పూర్వం వ్యవసాయం చేసేవారు. కాని ఇపుడు పారిశ్రామిక విప్లవం వల్ల వ్యవసాయం కొద్దిగా తగ్గుముఖం పట్టుతుంది. అంతే కాక రైతులుగా ఉన్న వాళ్ళు ప్రస్తుతం పట్టణాలకు వలస వెళ్తున్నారు. పూర్వం వేటాడి మాంసం సేకరించేవారు. ప్రస్తుతం పొట్టేల్లను పెంచి వాటి అమ్మటం ద్వారా మాంసం సేకరిస్తున్నారు. అంతేగాక ఇంట్లో కోళ్ళను, పొట్టేల్లను పెంచుకోవటం వాటి మాంసం తింటున్నారు.

పూర్వ కాలంలో నదులు సముద్రాలు, చెరువులలో సేకరించే వారు. అయితే ప్రస్తుత కాలంలో జానపదులు కృత్రిమంగా చెరువులు నిర్మించి వాటి ద్వారా చేపలు, రొయ్యలు సేకరిస్తున్నారు జానపదులు.

ఆహారపు అలవాట్లు :

పూర్వకాలంలో జొన్న అన్నం, కొర్ర అన్నం, ఆరిగ అన్నం, రాగి సంగటి, జొన్న సంగటి, జొన్న అంబలి, రాగి ముద్ద తినేవారు జానపదులు. ప్రస్తుత కాలంలో జానపదులు వరి అన్నం, జొన్నరొట్టే మరియు చపాతి ఇవియే కాక మాంసపుకృత్తులు ఎక్కువగా ఉండేవి తింటున్నారు.

మత్తు పానీయాలు :

నల్లమందు, తాటికల్లు, ఈతకల్లు, సారాయి మొదలగు లాంటివి పూర్వకాలంలో జానపదులు తాగేవారు. కానీ ప్రస్తుత కాలంలో ఇంగ్లీషు మందులు ఎక్కువగా త్రాగుతున్నారు ప్రస్తుత కాలం జానపదులు.

సుగంధ ద్రవ్యాలు :

అత్తరు, పన్నీరు, శోంఠి, ఇంగువ, పునుగు, జవ్వాది, సోంపులాంటి సుగంధ వస్తువులు పూర్వకాలం జానపదులు వాడేవారు. ప్రస్తుత కాలంలోని జానపదులు తక్కువగా ఉపయోగిస్తున్నారు.

జాతరలు, తిరునాళ్ళు, ఉర్సులు :

పూర్వకాలంలో జానపదులు చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొనేవారు జాతరులు, తిరునాళ్ళు, ఉర్సులలో గాని, ఆధునిక కాలంలో జానపదులు చాలా తక్కువగా పాల్గొంటున్నారు. అంతేకాక ఉత్సాహం, ఉల్లాసం తగ్గిపోయింది అని చెప్పవచ్చు.

పండుగలు :

ఉగాది, శివరాత్రి, సంక్రాంతి, నాగులచవితి, వినాయక చవితి, శ్రీరామనవమి, దసరా, దీపావళి పండుగలు చాలా ఎక్కువగా సంతోషంగా ఊరంతా ఒక కుటుంబంలా పండుగలు జరిపేవారు. కాని ప్రస్తుత కాలంలో జానపదుల జీవన విధానంలో మార్పు రావడం వల్ల పిండివంటలు చేసుకోవటం వరకు మాత్రమే చేసు కుంటున్నారు.

ఆచారపు వ్యవహారాలు :

ఒక సంఘంలో ప్రజలు తరతరాలుగా పాటించే పద్ధతుల్ని ఆచారాలని స్థూలంగా నిర్వచించవచ్చు. జననం మొదలు మరణం వరకు అనుష్ఠించే కార్యకలాపాలలో వివిధ ఆచారలు పాటింపబడుతుంది.

జానపదులు ఆచారాలను ఉల్లంఘిస్తే చెడు జరుగు తుందని నమ్ముతారు. కాబట్టి చాలామంది జానపదులు ఆచారాలు ఉల్లంఘించే ధైర్యం చేయలేక వాటిని తప్పక పాటిస్తారు. ఉదాహరణకు కొన్ని ముత్తయిదువ తాళి, మెట్టలు ధరించడం, విధవ వాటిని తీసివేయడం. ముత్తయిదువ తలకట్టు ఉంచుకోవడం, ఇంటి ముందర పేడనీళ్ళు వేయడం, ముగ్గువేయడం, ఆవును పూజించడం, ముత్తయిదవలు చేతికి గాజులు వేసుకోవడం, విధవలు తీసివేయడం, కొన్ని కులాలలో విధవ తెల్లచీర కట్టాలనే, కొన్ని కులాలలో ఎర్రచీర కట్టాలనే ఆచారాలు ఉన్నాయి. బ్రాహ్మణ కులంలో విధవలు తల వెంట్రుకలు తీసివేయవలెననే ఆచారం ఇప్పటికి వుంది. జానపదులు నాగలికి పూజలు చేయడం ఆచారాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. ఎద్దును బసవేశ్వరుడుగా తలంచి పూజిస్తారు.

ప్రస్తుత కాలం జానపదులు ఆచార వ్యవహారాలు చాలా వరకు విస్మరిస్తున్నారు. ప్రస్తుత కాలం ముత్తయి దువ అయినా కూడా తాళి, మెట్టలు లేకుండా ఉండ గలుగుతున్నారు. విధవలు అయిన వారు కూడా కొందరు తీసేస్తున్నారు. కొందరు అలాగే ఉంచుకుంటున్నారు. ఇంటి ముందు పేడనీళ్ళకు బదులుగా రంగునీళ్ళు చల్లు తున్నారు. కొపస్తుత కాలంలో విధవ అయిన వారు ఏ బట్టలు అయినా కడుతున్నారు. ఆధునీకరణలో కారణం చేత జానపదుల్లో మార్పు వచ్చింది. జానపదులు ప్రస్తుత కాలంలో చాలా కొద్దిమంది మాత్రమే నాగలికి, మరియు బసవేశ్వరుడికే పూజలు చేస్తున్నారు.

పెండ్లి :

మనిషి పుట్టినది మొదలు మరణించే వరకు జరిగే షోడష సంస్కారాలలో వివాహమొకటి. స్త్రీ పురుషుల నిద్దరిని చతుర్వర్గ సాధన కోసం కలిపే పవిత్ర సంస్కారం.

ఇల్లరికం :

ఆడ పిల్లలు సాధారణంగా వారి తల్లిదండ్రులు నిర్ణ యించిన వరుని వివాహం చేసుకొని అత్తవారింటికి వెళ్ళి కాపురం చేస్తారు. కానీ ఇల్లరికంలో వరుడు అత్తవారింటికి వెళ్ళి వధువుతో కలిసి కాపురం చేయాలి. దీన్ని ఇల్లరికం అంటారు.

ప్రస్తుతకాలం జానపదుల్లో ఇల్లరికం పూర్తిగా అంత రించిపోతుంది అని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రస్తుత కాలంలో ఒక కూతురు, ఒక కుమారుడు సంతానం ఉంటుంది. అలాంటప్పుడు ఏ తల్లిదండ్రి కూడా పంపరు. కాబట్టి ఇల్లరికం తగ్గుముఖం పట్టింది అని చెప్పవచ్చు.

పెళ్ళిచూపులు :

వివాహం తలపెట్టినపుడు మొదట వధూవరులను నిశ్చయించుకుంటారు. ఇరు పక్షాల వారు తమ తమ సంబంధాలను గూర్చి ముచ్చటించుకొంటారు. వరుని తరుపున పెద్దలు వధువును చూడటానికి వస్తారు. వధువును చక్కగా అలంకరించి, అమ్మాయి తల్లి దండ్రులు వారికి చూపిస్తారు. వధువు కులగోత్రాలు, సౌందర్య స్వభావాది సమస్త గుణాల్ని కాక హస్తాన్ని పరికించి, ఆయుర్దాయం, ఐదవతనం, సంతాన రేఖను చూసిన తర్వాతే మగపెళ్ళి వారు ముహూర్తం నిశ్చ యించుకుంటారు పెండ్లికి సంబంధించిన ఆచారాలు.

ప్రస్తుత కాలంలో జానపదులు పెండ్లి కూతురు ఇల్లు పెళ్ళి కుమారుని బంధువులు చూసిన తరువాత పెళ్ళి కూతురు బంధువులు పెళ్ళి కుమారుని ఇల్లు చూసిన తరువ్వా కుల గోత్రాలు అడిగి వివాహం నిశ్చయించు కుంటారు.

పెండ్లికి సంబంధించిన ఆచారాలు ప్రత్యేకంగా ఉంటాయి.

1) ఇల్లరికం 2) మేనరికం 3) పెళ్ళిచూపులు 4) నిశ్చితార్థం 5) ఓలి 6) లగ్న నిర్ణయం 7) కొట్నాలు దంచడం 8) శకునాలు 9) పెండ్లి ఏర్పాట్లు 10) ఎదురుకోళ్ళు 11) పెండ్లి కూతురు - పెండ్లి కొడుకు 12) పెండ్లి తంతు 13) సప్తపది 14) అరుంధతీ నక్షత్ర దర్శనం 15) మహదాశీర్లచనం 16) చదివింపులు 17) పెండ్లి భోజనం 18) వసంతోత్సవం 19) అప్పగింతలు 20) గృహప్రవేశం మొదలగునవి ఉన్నాయి.

ప్రస్తుతకాలంలో పెండ్లికి సంబంధించిన ఆచారాలను జానపదులు కొన్నింటిని మాత్రమే ఆచరిస్తున్నారు. పెళ్ళి చూపులు, నిశ్చితార్థం, పెండ్లి ఏర్పాట్లు, సప్తపది, అరుం ధతీ నక్షత్ర దర్శనం, చదివింపులు, పెండ్లి భోజనం మొదలగునవి పాటిస్తారు జానపదులు.

భారతదేశానికి ఉన్న ప్రత్యేకత ఇతర దేశాల కన్నా విభిన్నమైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు నిలయం. ఈ సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు అన్నీ కూడా ఇప్పటి నాగరికుడిగా పిలువబడే ఒకనాటి ఆదిమమానవుడి నుండి సంక్రమించినవి అనుటలో అతిశయోక్తిలేదు. అయితే నేటి ప్రపంచంలో మారుతున్న పరిస్థితుల్లో గిరిజన ప్రాంతాలలో కూడా మార్పులు వస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం. గిరిజనుల అక్షరాస్యత, ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు రావాలి, అప్పుడే గిరిజనుల నిజమైన అభివృద్ధి చెందినట్లు భావించాలి.

అయితే ప్రస్తుత ప్రపంచీకరణ ప్రభావం వలన గిరిజన ప్రాంతాలలో సంస్కృతీ సంప్రదాయాలపై పడుతున్నాయి. అందువల్ల ఈ ప్రపంచీకరణ ప్రభావం వలన గిరిజనుల భావితరాలు ఈ సంస్కృతీ సాంప్రదాయాలను ఎంత వరకూ ఆచరిస్తాయో చెప్పడం సందేహమే అనవచ్చు. ఇలా జరగడం నిజంగా బాధాకరం. అందువల్ల ఇటువంటి ఆచార, వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలను భవి షత్ తరాలవారికి అదించాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది.

సంప్రదింపు గ్రంథాలు :

1. భారతీయ గిరిజనుల నదీం హస్ నైస్ 2. గిరిజన విజ్ఞానం (పిహెచ్.డి పరిశోధనా గ్రంథం) జర్రా అప్పారావు.
3. గిరిజన సాహిత్యం . ఆచార్య ఎం. గోనా నాయక్
4. తెలుగు జానపద విజ్ఞానం ,ఆచార్య భక్తవత్సల రెడ్డి.
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం , డా. ఆర్.వి.ఎస్. సుందరం,
6. జానపద సాహిత్య ప్రభ , ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అస్పృశ్యమవుతున్న దేశీ శబ్దజాలం నిర్మూలీకరణంలో

– డా॥. పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

ఒక నిర్దిష్ట ప్రాదేశిక విభాగంలోని సమాజం ఆచార వ్యవహారాల్లో వేష భాషల్లో గుంపులుగా విడువడి మనుగడ సాగిస్తుంది. ఒక్క ప్రాదేశికత మాత్రమే దాన్ని ఒక మొత్తం కట్టిపడేయగలుగుతుందికానీ గుంపుల మధ్య అనైక్యత అనివార్యంగా కొనసాగుతుంది. అంటే అది ఊరికో పేరుకో మాత్రమే సమాజంకాని అది వైవిధ్యాల సమాహారం. సమాజంతాలూకు ఈ వైవిధ్యాలు చాలా వరకు పరస్పర వైరుధ్యాలుగా చలామణిలో ఉంటాయి. ప్రతి కదలికలోను కనపడని లక్ష్మణరేఖలు అడ్డుతగులుతూ ఉంటాయి. ఏకత్వంవైపు నడచే ప్రతికదలిక అతిక్రమణగానో, ఆక్రమణగానో నిషిద్ధ ముద్రలు వేయించుకుంటుంది. వేగంగా మారే వస్తువాహన సంస్కృతి ప్రభావంతో దాని లక్ష్మణ రేఖలు చెరిగిపోతున్నట్టే అనిపించినా కనపడని అంతరాల్లో, అగాధాల్లో దాని ప్రగతి చక్రం కూరుకుపోతూ ఉండటం చాలా సహజంగా జరుగుతుంది.

ఈ ఏకత్వంలోని భిన్నత్వాన్ని అధ్యయనం చేసే క్రమంలో ఆ సమాజంలో ఉపశ్రేణిగా ముద్రవేయబడ్డ సమూహాల భాషా సాహిత్యాలు మరుగున పడిపోవటమో వెనకపడిపోవటమో చాలాసహజం. భాషాసాహిత్యం శోధకులకు వీటిపట్ల ఉదాసీనత, వివక్ష గొప్ప వనరుగా ఉపయోగపడతాయి. నిర్మూలీకరించబడుతూ, క్రమంగా అస్పృశ్యమవుతూ చివరికి అదృశ్యమయ్యే ఉపశ్రేణి వర్గాల భాషను దాని సభ్యతాసభ్యతలముద్రల్ని వివేచించడం ఆవశ్యం.

ఒక సమాజంలోని ప్రతివ్యక్తి, ప్రతి సమూహం ఇతర వ్యక్తులకంటే ఇతర సమూహాలకంటే భిన్నమైనవిగా, ప్రత్యేకమైనవిగా గుర్తించబడాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకు అడుగేస్తాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేకమైనవిగా గుర్తించబడ్డ వ్యక్తులు, సమూహాలు ఇతరులకు, ఇతర సమూహాలకు ఆదర్శం అవుతాయి. ఈ ఆదర్శవంతమైన వ్యక్తులు, సమూహాలు మొత్తం సమాజాన్ని నడిపిస్తారన్న మాట. వాళ్ళు గోతిలోకి దిగమంటే మొత్తం సమాజం కళ్ళుమూసుకుని గుడ్డిగా దిగిపోతుంది. లేదా పైకిరమ్మంటే గొర్రెదాటుగా అనుసరిస్తాయి. గొర్రె స్వభావం సమాజ సహజ స్వభావం సమాజాన్ని ముంచాలన్నా పైకెత్తాలన్నా ఆధిపత్యం నాయకత్వం వహించే వ్యక్తుల, సమూహాల చేతుల్లోనే ఉందన్నమాట.

ఆధిపత్యంవహించే వ్యక్తులు, సమూహాలు సాంఘిక, ఆర్థిక రాజకీయాలపరంగానే కాకుండా మానసికంగా, మేధోపరంగా కూడా పైచేయిగా ఉంటారు. అంటే వీళ్ళు సమాజంలోని మిగతా సమూహాలను చేతగాని వాళ్ళుగా, చవటలుగా నమ్ముతూ నమ్మిస్తూ వాళ్ళ అనుచర గణంగా తయారుచేసుకుంటారు.

భారతీయుల ప్రాచ్య విజ్ఞానం మీద లార్డుమెకాలె వ్యూహరచన ఇలాంటిదే. ఇలాంటి వ్యూహరచన ఉపశ్రేణి వర్గాలమీద నిరంతరం ప్రయోగించబడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో భిన్న సంస్కృతుల సమాహార సమాజాన్ని ఒకానొక ప్రాదేశిక ఆధిపత్య సంస్కృతి మొత్తం సమాజానికి ప్రాతినిధ్యం వహించగలుగుతుంది. ఈ క్రమంలో స్థానిక వేషభాషలు, ఆచారవ్యవహారాలు, విజ్ఞానం, కళలు, మొత్తం వాళ్ళ వారసత్వ సంపద పనికిమాలినవిగా తీర్మానించబడతాయి. జానపద విజ్ఞానం విషయంలో కూడా జరిగిందదే.

ఈ స్థానిక వేష, భాషల వెనకబాటు తనాన్ని సోదాహరణంగా పరిశోధకులు చర్చించడంవల్ల వీటిపట్ల నెలకొన్న ప్రెజుడైస్‌ను, వివేచనా రాహిత్యాన్ని తగ్గించే అవకాశం కలుగుతుంది. స్థానిక భాషాలోని పదాలు, పద

బంధాల చుట్టూ అల్లుకున్న న్యూనతీకరణను అర్థం చేసుకునే వీలుకలుగుతుంది. ఇవి వర్గ మాండలికాలుగా కూడా మినహాయించబడి ఉదాసీనతకు గురికావడం జరుగుతుంది.

'నాకు తెలియదు', 'నాకు తెలవదు' అన్న వాక్యాలలో మొదటిదే ప్రమాణభాషలోకి చేరుతుంది. విద్య, సాంస్కృతిక, రాజకీయ ఆర్థికాది రంగాల్లో పైచేయిగల వ్యవహర్తలను అనుసరించి ప్రామాణీకరణ నిర్ణయించ బడుతుందన్న సంగతి తెలిసిందే.

'పనిమినిషి' అనే పదబంధం ఇంటిపనులకు నిర్దేశించ బడ్డ వ్యక్తిగత ఉద్యోగిని సూచిస్తుంది. ఉద్యోగం అంటే రూఢిలో ఏదో ఒక పనికి నియుక్తం కావటమే. కాని ఇది సేవా, పారిశ్రామిక రంగాలకు పరిమితం అయ్యింది. ప్రాథమికరంగం, లేదా గృహ సంబంధ అంశాలలో ఉద్యోగం అన్న పదాన్ని వాడుకలో కనిపించదు. మన సమాజంలో పనిమనిషి కంటే 'ఉద్యోగి' కి ఎక్కువ సామాజిక హోదా ఆపాదించబడుతుంది.

పనిని సమాజం వైట్ కాలర్ అని వైట్ కాలరేతరంగా విడగొట్టి తద్వారా భౌతికశ్రమ, బౌద్ధిక శ్రమకంటే తక్కువ స్థాయి కలదిగా గణించబడి భౌతికశ్రమ తిరిగి నైపుణ్యం కలపని, నైపుణ్యం అవసరం లేని పనిగా విడగొట్టబడింది. మొత్తం చేతిపనులన్నీ ముఖ్యంగా ప్రాథమికరంగానికి చెందిన పనితనం అంతా నైపుణ్యం లేనిపనిగా తీర్మానించ బడింది. ఇది బుద్ధిజీవులు శ్రమజీవులపై పన్నిన కుట్రగా చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం, సేవారంగవికాసాలను మన సమాజంలో పాశ్చాత్య విజ్ఞానం ప్రభావితం చేసింది. ప్రాచ్య విజ్ఞానం పాశ్చాత్య విజ్ఞానం కంటే తక్కువస్థాయి కలదిగా ఎంచబడింది కాబట్టి. సామాజికంగా ఆర్థికంగా ప్రాథమికరంగం సహజంగా తక్కువస్థాయిలోనే ఉంటుంది. కాబట్టి ప్రాథమికరంగానికి చెందిన పద జాలమూ తక్కువస్థాయిలోనే ఉంటుంది. కుశమును నేర్పుగా కోయకపోతే వేళ్ళుతెగుతాయి. కుశమును కోసేవాడు కుశలుడుఅంటాం. కాని 'కుశలత' 'తెలివి', 'నైపుణ్యం'గా అందులోను ప్రాథమిక రంగానికి సంబంధం లేనంతగా దూరంగా జరిగిపోయింది.

సంస్కృతీకరణ, అంగ్లీకరణ నేపథ్యంలో స్థానిక భాష నిమ్నతీకరించబడటంచూస్తాం. చేతివృత్తులేకాక వాటిపేర్లు కూడా నీచస్థితి లోకినెట్టబడ్డాయి. ఉదా॥కు చాకలి, మంగలి పేర్లు రజక, నాయీబ్రాహ్మణులుగా సంస్కృతీ కరించ బడ్డాయి. నిందవాచకాలు మిగిలాయి. తొక్క, తోలు, బొక్క, లాంటి పదాలు ఆగ్రహవ్యక్తీకరణలుగా, బూతులు జాబితాలోకి జారిపోయాయి. తెలుగులో లైంగికావయవ వాచకాలు ఇతర అవయవ వాచకాల్లా కాకుండా రాయశక్యంకాని స్థాయిలో బూతుల జాబితాలో చేరిపోయాయి. వీటి సంస్కృతీకరణలే సభ్యోక్తులుగా ప్రమాణభాషశబ్దాలుగా చలామణి అవుతున్నాయి.

లేబరు, విధువ (వెధవ) లాంటిపదాలు తిట్లుగా వాడబడుతున్నాయి. అంటే భౌతికశ్రమ, బౌద్ధికశ్రమ; స్త్రీత్వం, పురుషత్వం; తెలుగు, సంస్కృతంలాంటి ద్వంద్వాలలో మొదటివి తక్కువ శ్రేణివిగా జమకట్టబడు తున్నాయి. లింగ, కుల, భాషలాంటి అంశాలలో తిష్టవేసిన వివక్ష తెలిసో తెలియకో మన వివేచనను అధిగమించి ఒక నిబంధన అభ్యసనంలా ఉనికిలో ఉంది.

ఈ వివక్షను ప్రశ్నించటం ప్రస్తుతం విడ్డూరంగా ధిక్కారంగా ముద్రించబడి సామాజిక తిరస్కారానికి గురవుతుంది. వృత్తులు, వర్గాలు నిమ్నోన్నతాలుగా గణించబడటం, ఉచ్చనీచాలుగా చలామణిలో ఉండటం సర్వసాధారణ అంశం అయ్యింది. ఆయా ద్వంద్వాలలో ఒక దానిపట్ల మోజు, మరోదానిమీద చిన్నచూపుకు ప్రధానభూమిక బలమైన ఆర్థిక ప్రాతిపదికలే అన్నది స్పష్టమైన విషయం. వివక్షను తప్పించుకోవటానికి ఉప శ్రేణి వర్గాలు గొంతెత్తడం, పిడికిళ్ళు బిగించడం, అహింస పోరాటాలు చెయ్యడం మేధోపరమైన వ్యాసంగాలతోపాటు ఉచ్చశ్రేణి వర్గాల భూమికల్ని గమనించి అదే భూమికల్ని నిర్మించుకోవటం ద్వారా పరిస్థితిని మెరుగుపరచుకోవచ్చు.

ఆగ్రహావ్యక్తీకరణకు, ప్రతీకారవాంఛకు, ప్రతిచర్యకు వినియోగించబడే 'బూతులు' 'స్త్రీ' ని లక్ష్యం చేసుకున్నవే. ఇద్దరు పురుషులమధ్య లేదా ఇద్దరు స్త్రీల మధ్యకానీ హింస, ప్రతిహింస, ప్రతీకారేచ్ఛల్ని సంతుష్టిపరచుకోవడానికి స్త్రీ యే బలవుతుంది. అమ్మో, ఆలో ఘర్షణలో ఎలాంటి సంబంధ లేకపోయినా ప్రతీకారేచ్ఛ సంతుష్టికి ప్రధాన వనరు అవుతుంది. దీనికి కారణం ఆడదాన్ని ఆస్తిగా పరిగణించడమే. ఆస్తుల్ని దోపిడీ చేయడం, దోపిడీ చేయబడడం ధీర, భీర చర్యలుగా జమకట్టబడుతున్నాయి. పిరికిపందలు చేతకాని వాళ్ళుగాను, ధీరులు, వీరులు గాను ఆస్తుల్ని కొల్లగొట్టడం ప్రాతిపదికగా సమాజం విభజిస్తుంది. గెలుపోటముల్ని 'కొల్లగొట్టడం, కొల్లగొట్టబడటం భూమికగానే నిర్ణయించడానికి నిలువెత్తు సాక్షీభూతంగా చరిత్ర నిలుస్తుంది.

పితృహంతకుల పట్ల ఉదాసీనతను కాలం కలగ జేస్తుంది కాని తన ఆస్తులు ఆడవాళ్ళను అపహరించే వారిపట్ల పగచల్లారే అవకాశం ఉండకపోవటానికి కారణం పితృస్వామ్యవ్యవస్థలో స్త్రీని భోగవస్తువుగా, ఆస్తిగా చూడటమే ఆస్తుల దురాక్రమణ అవమానంగా, ఆత్మ గౌరవ హానిగా, ఆత్మ గౌరవ భావన ప్రాణంకంటే గొప్పదని సమాజం నమ్మడం లాంటి భావజాలంవల్ల సమాజంలోని హింసకు ప్రధానకారణం.

ఈ ద్వంద్వాల మధ్య సమతుల్యత వైపుగా హింసాత్మకంగానో, అహింసాత్మకంగానో ఘర్షణలు అనివార్యం అవుతాయి. అయితే ఈ ఘర్షణలు, పోరాటాలు అహింసాత్మకంగా కొనసాగటమే వాంఛనీయం. సంబంధిత సమాజ పరిణామ పరిణితి చిహ్నం. ఉపశ్రేణి వర్గాలపట్ల వివక్ష అసమానతలు నశించడం ఆరోగ్య దాయకం. సృజనలో వీటిని స్పృశించడం సమాజప్రగతికి ఆవశ్యం.

ఆధార గ్రంథాలు :

1) తెలుగుభాషాచరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
2) పోష్టమోడర్నిజం - బి. తిరుపతిరావు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అద్దేపల్లి సాహిత్యం – సామాజిక జీవన చిత్రణ

– డా॥ పి. కాళియప్ప, తెలుగుశాఖ, డి.జి.వైష్ణవ కళాశాల, చెన్నై.

సాహిత్యం అనేది సమాజంలోని అన్ని పార్శ్వాల్నీ స్పృశించగలగాలి. సమాజంలోని అసమానతల్నీ, వైకల్యాల్నీ పాఠకుల మనోఫలకంపై ఆవిష్కరించే విధంగా ఉండాలి. సమాజాన్ని ప్రక్షాళన చేసేదిగా ఉండాలి. సమాజాన్ని దశాదిశా మార్చేదిగా ఉండాలి. అటువంటి సాహిత్యం ద్వారానే సామాజిక ప్రయోజనం చేకూరుతుంది. సాహిత్యం, సమాజం కంటికి కనిపించే వస్తువులు. అయితే ప్రయోజనం అనేది సాహిత్యం నుంచి సమాజానికి అంత ర్వాహినిగా ప్రవహించి చైతన్యవంతం చేయాలి. తద్వారా సమాజంలోని వ్యక్తులు ఉత్తమ పౌరులుగా జీవించే అవకాశముంటుంది. ఇటువంటి చైతన్యం కలగాలంటే అందుకు ఉద్యమాలు వారదిగా ఉంటుందని చెప్ప వచ్చు. ఈ కోణంలో నుంచి చూస్తే సామాజికోద్యమాలే గొప్ప మేధావుల్ని పుట్టిస్తాయనేది చారిత్రక సత్యం. గత అర్ధశతాబ్దంలో ఆంధ్రదేశంలో వచ్చిన సామాజిక ఉద్య మాలు పుట్టించిన మేధావులలో అద్దేపల్లి రామమోహనరావు ఒకరు. వీరి సాహిత్యంలో సామాజిక జీవన చిత్రణకు సంబంధించిన విషయాలను గురించి చర్చించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

అద్దేపల్లి జీవితవిశేషాలు :

అద్దేపల్లి రామమోహనరావు సెప్టెంబరు 6, 1936న కృష్ణా జిల్లా, బందరు తాలూకా, చింతగుంట పాలెం గ్రామంలో జన్మించారు. వీరి తండ్రి అద్దేపల్లి సుందర్రావు. తల్లి రాజరాజేశ్వరి. అద్దేపల్లి ప్రాథమిక విద్యాభ్యాసం బందరు చింతగుంటపాలెంలో పూర్తయింది. ఉన్నత విద్యాభ్యాసం ఎన్.ఎస్.యల్.సి. హిందూ హైస్కూలు, బందరు, ఇంటర్మీడియట్ హిందూ కాలేజీ, బందరు, బి.ఏ. ఆంధ్ర జాతీయ కళాశాల రాజుపేట, బందరు, ఎం.ఏ., శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో పూర్తి చేశారు. ''అభ్యుదయ విప్లవ కవిత్వాలు - సిద్ధాంతాలు, శిల్పరీతులు'' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేటు పట్టా పొందారు.

1955లో శ్రీమతి అన్నపూర్ణగారితో వివాహం జరిగింది. ఆ తర్వాత కొద్ది రోజులకు కాకినాడలో స్థిరపడటం జరి గింది. 1957-60 మధ్య కాలంలో బందరు హిందూ కళా శాలలో ట్యూటరుగా పనిచేశారు. 1971లో కాకినాడ ఎం.యస్.యన్. ఛారిటీస్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా నియమితులై, సెప్టెంబరు 1994లో ఉద్యోగ విరమణ చేశారు.

అద్దేపల్లి అందుకున్న సత్కారాలు అనేకం. వాటిలో విజయనగరం - 'విజయ భావన', పాలకొల్లు - 'రసధుని', తణుకు - శ్రీ నన్నయ భట్టారక పీఠం, భిలాయ్ - 'ప్రవాసాంధ్ర సంఘం', మచిలీపట్నం - 'సాహితీ మిత్రులు', కొత్తపేట - 'కళాసాహితి', విజయవాడ - 'సాహిత్య సమాఖ్య', నరసాపురం - 'జాషువా సాహితీ సమితి' మొదలైన ఎన్నో సాహిత్య సంస్థలు ఆయనను ఘనంగా సత్కరించాయి.

''విమర్శకునిగా ఎంత ప్రాచుర్యం పొందారో కవిగా అంతే ప్రఖ్యాతిని పొందారు. ఉపన్యాసకునిగా ఎంత పేరు సంపాదించారో, కార్యకర్తగా అంతే శ్రమిస్తారు. బహు ముఖీనమైన ఆయన వ్యక్తిత్వంలో పార్శ్వాలెన్నో'' అంటారు మాకినీడి సూర్యభాస్కర్‌గారు.

వీరు అందుకున్న అవార్డులను గమనిస్తే 'సాహిత్య విమర్శ' గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం 'ప్రతిభా పురస్కారం', వరంగల్ 'నిధి', తంగిరాల అవార్డు, శ్రీశ్రీ అవార్డు, బోయి భీమన్న అవార్డు, ఇతర భాషా అవార్డులు లభించాయి. 'గోదావరి నా ప్రతిబింబం' కవితా సంపుటికి అమలాపురం నమతా రచయితల సంఘం వారి

పురస్కారం లభించింది. ఆయన కవిత్వానికీ, విమర్శకీ సంయుక్తంగా 'ఉమర్ అలీషా' అవార్డు వచ్చింది. విజయవాడ 'దళితవేదిక' ఆయనను 'జనపథకవి'గా పురస్కరించింది. తెలుగు సాహితీ లోకంలో చెరగని ముద్ర వేసి సాహితీ ప్రయుల హృదయాలలో నిలిచిపోయిన అద్దేపల్లి జనవరి 14, 2016న భౌతికంగా దూరమయ్యారు.

అద్దేపల్లి సాహిత్యం - పరిచయం, నేపథ్యం :

అద్దేపల్లి గురువులైన మునిమాణిక్యం నరసింహారావు, అద్దేపల్లి లక్ష్మణస్వామి, శ్రీ పువ్వాడ శేషగిరిరావు, శ్రీ భాగవతల కుటుంబ శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ వంటి ఉద్దండుల ప్రభావం వలన చిన్న వయస్సులోనే పద్యరచన పట్ల ఆసక్తిని పెంచుకొని రాయడం మొదలు పెట్టారు. అద్దేపల్లి1960వ సం॥లో మొట్టమొదటి సారిగా కొన్ని కవితలు కృష్ణా పత్రికలో ప్రచురింపబడినప్పటికీ అసలైన సాహిత్య వ్యాసంగం 1963 నుండే ప్రారంభమైంది. ఆ రోజుల్లోనే వచన కవిత్వాన్ని ఎక్కువ మక్కువతో అభ్యుదయ కవుల రచనల్లే చదివడం, దానిలో ఎక్కువగా కుందుర్తి, తిలక్‌లను చదవడం వల్ల 1965 నుండి సంప్రదాయిక భావాలు తగ్గి, హేతువాద దృక్పథం, ప్రగతిశీలత కలిగేటప్పటికి, ఆ భావాలు చెప్పడానికి వచన కవిత్వం సరియైన మార్గంగా ఎంచుకుని వచన కవితను ఎంచుకుని ఎన్నో రచనలు చేశారు.

కవిగా అద్దేపల్లి వందలాది కవితల్ని వెలువరించారు. ఉదాహరణకు కొన్నింటిని గమనిస్తే... మధుజ్వాల, రక్త సంధ్య, గోదావరి నా ప్రతిబింబం, మెరుపు పువ్వు, సంఘం శరణం గచ్ఛామీ, తెరలు, నిశ్శబ్దస్వరం, కాలం మీద సంతకం, తెలుగు గజళ్ళు, కాలం మీద సంతకం ఇలా ఎన్నో గ్రంథాలు వెలువరించారు. అద్దేపల్లి కేవలం వచన కవిత్వాన్ని మాత్రమే కాకుండా కథల్ని, నవలల్ని కూడా చదవడం, సమీక్షించడం, విమర్శ చేయడం మనకు కనబడుతుంది.

"డా॥ అద్దేపల్లి కవితా చిక్కణత్వానికి 'గోదావరి నా ప్రతిబింబం', 'పొగచూరిన ఆకాశం' లాంటి కవితా సంపుటాలు నిలువెత్తు నిదర్శనాలు. ప్రాథమిక దశలో అతడు రచించిన పద్యకవితా సంపుటి "మధుజ్వాల" ప్రౌఢ రచనా ప్రతిభకు ఉదాహరణీయం" అంటారు డా. సి. నారాయణరెడ్డి.

విమర్శకుడిగా శ్రీశ్రీ మహాప్రస్థానం మీద వ్రాసిన వ్యాసాలతోనే విమర్శ రచన ప్రారంభమైంది. అద్దేపల్లి కేవలం వచన కవిత్వాన్ని మాత్రమే కాకుండా కథల్ని, నవలల్ని కూడా చదవడం, సమీక్షించడం, విమర్శ చేయడం జరిగింది. వీరు వెలువరించిన విమర్శ గ్రంథాలను గమనిస్తే... శ్రీశ్రీ కవితా ప్రస్థానం, విమర్శ వేదిక, మినీ కవిత, శ్రీశ్రీ మహాప్రస్థానం - ఒక పరిశీలన, కుందుర్తి వచన కవితా వైభవం, కుందుర్తి వచన కవిత, సాహిత్య సమీక్ష, స్త్రీవాద కవిత్వం - ఒక పరిశీలన, మహాకవి జాషువా కవితా సమీక్ష, దృష్టిపథం, విలోకనం, ఆధునిక కవిత్వంలో సామాజికత ఇలా అనేక గ్రంథాలను వెలువరించారు. తెలుగు సాహిత్యంలో అతి కొద్దిమంది ప్రామాణిక విమర్శకులలో అద్దేపల్లి ఒకరు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

దాదాపు వందల పుస్తకాలను సమీక్షలు చేశారు. వాటిలో కొన్ని శ్రీశ్రీ వ్యాసాలు, సాగరు - దిష్టిబొమ్మ, సోమసుందర్ - చేతావని, అప్పర్ - ఇవాళ, బీరం సుందరరావు - చైతన్యం నా చిరునామా ఇలా చెప్పుకుంటూపోవచ్చు.

ఉపన్యాసకుడిగా అద్దేపల్లిది ఒక ప్రత్యేక స్థానం అనే చెప్పవచ్చు. నలుదిశలా ఈయన ఉపన్యాసాలు పన్నీరు జల్లులాగా తడిసిపోయాయి. వీరి తొలి ఉపన్యాసం 1964లో శ్రీశ్రీని గూర్చి బందరులోని జాతీయ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఇవ్వడం జరిగింది. బహుశా ఏ సాహితీవేత్త ఇన్ని ఉపన్యాసాలిచ్చి ఉండకపోవచ్చు. ఉపన్యాసాలు వేల సంఖ్యలోనే ఉన్నాయి. అదే విధంగా ఈయన వందల కొలది సాహిత్య సభలు నిర్వహించిన ఘనుడు. అలాంటి వాటిలో 1986లో "సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర మహాసభలు", 1994లో "గురజాడ

శతజయంతి సభ" 1995లో "ప్రజారచయితల సంఘం రాష్ట్రసభ" ఎంతో విశిష్టమైనవిగా చెప్పవచ్చు.

అద్దేపల్లి సాహిత్యం – సామాజిక జీవన చిత్రణ :

ఏ కవి రచనలోనైనా ఆ కవి సమకాలీన సమాజం ప్రతిబింబించడం అనివార్యం. సమాజం అంటే సంస్కృతితో, జీవనరీతితో తొణికిసలాడే నిండైన ప్రవాహం. 'హితేన సహితం సాహిత్యం' కాబట్టి సాహిత్యం సరళంగా ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండాలి. అలా అర్థవంతమైన భావాన్ని ఆవిష్కరింప చేసేది ఉత్తతమైన కవిత్వం, రచనలు సమాజ వికాసానికి మరియు మనుషుల్లో మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేయాలి. బతుకు చూచిన కవి అక్షరానికి ఒక స్పష్టమైన గమ్యం ఉంటుంది. ఆ అక్షరం అసమానతలపై ఉక్కు పాదం మోపి సమాజంలో ఒక వెలుగు రేఖల్ని ప్రసరింప చేయాలి.

కాలంతో పాటు నడుస్తూ, నిరంతర చైతన్యాన్ని నడకలో నింపుకుని ముందుకు కదులుతూ పోవడమే తన జీవన విధానంగా చేసుకొన్నారు. తరసపడ్డ వాళ్లందరినీ తారతమ్యాల్ని చూపక ఆత్మీయంగా భుజం చరిచే పెద్దమనస్సు ఆయనది. తనతోపాటు కవితావరణంలోకి కొనిపోయి వర్తమానంలో కదిలే అభ్యుదయ, ప్రగతిశీల విప్లవకవి కూడా. సమాజ చైతన్యం మరియు సామాజిక సమస్యలపై పోరాటం, సామాజిక సమస్యలను కవితల అంశాలుగా తీసుకుని అద్దేపల్లి అద్భుతమైన రచనలను కొనసాగించారు. ప్రపంచ కవితా జగత్తులో గొప్ప కవిత్వం రాసేవాళ్లూ ఉన్నారు, గొప్ప విమర్శ చేసేవాళ్లు ఉన్నారు. ఇవి రెండూ అదే స్థాయిలో రాయగల ఇలియట్‌లాంటి వారు తెలుగునాట అద్దేపల్లి రామమోహనరావు. సాహిత్య మూర్తులతో సాన్నిహిత్యంగా మెలిగినా, సామాన్యులనూ అలాగే దగ్గరగా మాట్లాడే వినయశీలి. అంతేకాదు ప్రజల గురించి ఆలోచించి, వారి పక్షాన నిలిచే గొప్ప మానవతావాది అద్దేపల్లి.

అద్దేపల్లి వారి కవితా రచనలు మధుజ్వాల, అంతర్జ్వాల, రక్తసంధ్య, గోదావరి నా ప్రతిబింబం, అయినా ధైర్యంగానే, మెరుపు పువ్వు, సంఘం శరణం గచ్ఛామి, దృష్టి, పొగచూరిన ఆకాశం, గీటురాయి, ఆధునిక కవిత్వంలో సామాజికత, తెరలు, ఆకుపచ్చని సజీవ సముద్రం నా నేట, కాలం మీద సంతకం మొదలైన గ్రంథాలు వెలువరించారు. దీనిలో విలువైన, పదునైన కవిత్వమూ ఉంది. వారి సాహిత్యంలో సామాజికత అడుగడుగునా మనకు స్పష్టంగా కనపబడుతుంది.

అద్దేపల్లి సాహిత్యంలో సామాన్య మానవుని జీవన చిత్రణ మనకు అడుగడుగునా తారసపడుతూనే ఉంటుంది. అద్దేపల్లి వారి మధుజ్వాల అనే కవితా సంపుటిలో జీవితం యొక్క వైపల్యాన్ని గురించి, జీవితాన్ని విభిన్న కోణాలల్లో చెప్పే ప్రయత్నం చేశారు. జీవితం క్షణభంగుర మంటారు అద్దేపలి. జీవితం అనేటువంటి ఒకసారి వచ్చినట్లైతే మళ్ళీ లభించేది కాదు. ముందు ఏముందో వెనకేముందో తెలియదు. అందుకని ఉన్నంతకాలం జీవితాన్ని అనుభవించాలని చెప్పారు.

జీవితమనేది మన చేతిలో ఉండేదా కాదు. ఇది ఒక్క క్షణం తర్వాత మరో క్షణంలో ఏమౌతుందో మనకు తెలియదు ఈ విషయాన్ని ఇలా అంటారు.

"రమ్ము! పాత్ర నింపగ వేగరమ్ము చెలియ!
మరుదినమ్మేమి యగునను మాట యేల?
ఈ క్షణమ్మంతమైన మరుక్షణమ్ము
గడచినట్టి శతాబ్దాలు విడుచునట్టి
మూగ నిట్టూర్పులందునే మునుగ వచ్చు!"

(మధుజ్వాల)

క్షణం తర్వాత మరో క్షణం ఉంటుందో లేదో తెలియదు. ఇటువంటి సందర్భాల్లో అద్దేపల్లి వారి భావుకత వ్యక్తమవుతుంది. ఇంకా మరుక్షణం ఏమౌతుందో అని ఇలా అంటారు.

"గడచినట్టి కాలపు పీడకలలనెల్ల
గడువనున్నట్టి కాలపు కలతలెల్ల

అంతమొందిచి దేశ కాలాతిరిక్త
చరమ సౌఖ్యాను సంధానవర మొసంగు
మధువు పాత్రలో నింపవే మధురమూర్తి!"

(మధుజ్వాల)

గడచిన కాలం పీడకలగా మిగిలిపోతే, రాబోయే కాలం కలతతో కూడుకొంటుందని చెబుతూనే, జీవితం క్షణభంగురం అవటం చేత భోగాలను అనుభవించు అని చెబుతాడు.

నాణ్యానికి బొమ్మ బొరుసు ఉన్నట్లు మనిషి జీవితంలో కూడా కష్టం, సుఖం ఉంటుంది. సగటు మనిషి జీవన వేదన గురించి చక్కగా చెప్పారు. ఈ ఆవేదన ఏ విధంగా ఉంటుందో కింది పద్యం చక్కటి నిదర్శనం అవుతుంది అని చెప్పవచ్చు.

"నీవు నిరంతరమ్ము పయనించెడు మార్గము ప్రక్కనుండి భీ
తావహమౌ నగాధము మహావికృతమ్ముగ నాపులించెడున్
నీవొకయింత జాణిసను నిన్నది మ్రింగి, అనంతదూర కా
లావరణాంధకారముల యందున త్రోసి హసించు నిత్యమున్!"

(మధుజ్వాల)

మనిషి జీవన వేదన ఎలాంటిదంటే ఒక వైపు నిరంతరం ప్రయాణం చేస్తుంటే ప్రక్కనే పెద్ద అగాథం ఎదరై కొంచెం పొరపాటు చేస్తే అది మింగి వేస్తుందని, అది నిన్ను తోసేసి నవ్వుకుంటుందని, అజ్ఞానంలోకి నెట్టివేసి నిత్యం నవ్వుకుంటుంది అంటారు. అంటే జీవితం వేదన అనే అగాథంలోకి వెళ్ళకుండా జాగ్రత్తతో మెలగాలంటారు కవి.

సామాజిక పరిస్థితులు అద్దేపల్లిని పద్యకవిత్వం నుంచి వచన కవిత్వం వైపు మళ్ళించాయి అని చెప్పవచ్చు. "అంతర్జ్వాల" లోని కవితలన్నీ రాయడం మొదలు పెట్టారు. ఇది వచన కవిత. కుందుర్తి, తిలక్ వీరిద్దరు కూడా అద్దేపల్లి వారి ఆరాధ్యులు. కుందుర్తి సామాజిక సమస్యలను తీసుకున్నారు. వచన కవిత కోసం పోరాడడంతోపాటు, వచన కవితలో సామాజికత, ప్రజలభాష, సమకాలీనత ఉండాలంటారు. వచనకవితయే అన్నింటికి అనుకూలమని కుందుర్తి చెప్పారు. సమాజం గురించి, అభ్యుదయాన్ని గురించి చెప్పడానికి వచన కవితయే కావాలి అని కుందుర్తి అంటారు. అదే కాలంలో తిలక్ అద్భుతమైన కవిత్వాన్ని నింపినటువంటి కవి. అతనిలో ఆధునికమైనటువంటి వచన కవితా శైలి ఉంది. భావ చిత్రాలు, ప్రతీకలు, అలంకారాలు, ఆవేదన, అభ్యుదయం, ప్రేరణలు ఉంటాయి. ఈ కోణాలన్నీ అద్దేపల్లిపై ప్రభావాన్ని చూపాయి.

'అంతర్జ్వాల' నిండా సామాజిక చిత్రణ కనపడుతుంది. అంతర్జ్వాలలో చక్కని రచనా శిల్పం, ధ్వని ఉంది. "అభ్యుదయ కవిత్వంలోని తీవ్రత, నిబద్ధత తగ్గిపోయిన తర్వాత స్తబ్ధతని చీల్చుకుంటూ, సామాజిక ప్రగతిశీల ఆవేశాన్ని వచనకవితల్లో పలికించిన అతికొద్దిమంది కవుల్లో నేనొకణ్ణి" అని ఆయన స్వయంగా చెప్పుకున్నారు. సమాజం అంటే కవికి సమకాలీనంగా ఉన్న సమాజమే, వర్తమాన కాలమే ఆధునిక కవికి అత్యవసరం. అతని చూపు దానిమేదనే ఉండాలి. ఈఈ యుగంలో అభివృద్ధి చెందుతున్న విజ్ఞాన శాస్త్రం మనిషి ప్రవర్తన మీద ఎంతో ప్రభావాన్ని చూపుతోంది. అయితే దానిని వాడుకోవడంలో మనిషి జాగ్రత్తగా మెలగకపోతే అది అతన్ని, సమాజాన్ని కూడా కబళిస్తుంది.

సమాజంలో మనిషి ఎక్కడున్నాడు? ఉంటే ఏ స్థితిలో ఉన్నాడు? అనే ప్రశ్నలకి సమాధానంగా అద్దేపల్లివారు ఇలాంటారు.

"ఇది అంతర్జ్వాల
మనిషనే అగ్గిపుల్లని
ఏ రోడ్డు మీద గీసినా భగ్గునమండే
సమాజ బాధామయ వాతావరణం
గుండెలో రాజుకుంటున్న మహాజ్వాల..."

(అంతర్జ్వాల)

అని చెప్పడంలో సమాజంలో జరుగుతున్న అవినీతి - అక్రమాలకు ప్రతి మనిషిలో కోపావేశాలు రగులుతూనే ఉన్నాయి. కాని ఎదుటివాని బలానికి భయపడి గుండె ల్లోనే మంటలు రగులుతున్నా బయటికి మాత్రం చెప్పటం లేదు. ఇది వ్యక్తిగతమైనది. ధైర్యం చేసి మీకు జరుగుతున్న అన్యాయానికి ఎదురు తిరిగినట్లైతే, మీ ఆవేశపు మంటల్లో అవినీతిపరులు కాలిబూడిదవుతారు. అంటే ఎవరి ఇంట్లో వారు ఉండక బయటికి వచ్చి సంఘటితమై ఎదుర్కో వాలి అంటారు.

'భయంకర వర్తమానం' అనే కవితలో వడ్డీ వ్యాపారస్థు లను ఎండగడతాడు ఇలా అంటాడు. భయంకరమైన వడ్డీలతో ఉరితాడుపేని గొంతుచుట్టూ గట్టిగా బిగించి రక్తి కట్టిస్తూ, చావనివ్వక బతకనివ్వక సాటి మనిషి నెత్తురు బొట్టని రూపాయిలుగా మార్చుకొని దుర్మార్గులైన వడ్డీ వ్యాపారులు కక్కించిన నెత్తురు వీధి వీధిలో నా అడుగుల్లో వెచ్చగా ఇంకిపోతుంటే ఆకలి పెనుమంటలుగా రగిలి ఎముకల్ని నమిలేసి మాంసాన్ని కొరుక్కుతిని రక్తాన్ని తాగివేయగా, ఊపిరిమీద చుట్టబడిన చర్మపు బొమ్మలాగా మిగిలిపోయి తమ జాలి చూపులతో భారతదేశపు భవిష్యత్తుని శపిస్తున్న పసిపిల్లల మరిగే కన్నీరు నూటిగా నా గుండెమీద పడి వేడి వేడి పొగలై వెలికి వస్తుందంటారు. వడ్డీల పేరుతో అప్పులిచ్చి, వడ్డీకి వడ్డీవేస్తూ సామాన్యు లను పీడించుకు తినే ధనిక స్వాములు రోజంతా కష్టపడి తాము సంపాదించినదంతా వడ్డీలకే కట్టిసి, అసులు తీరకా, వడ్డీ కట్టలేక, తన రక్తమాంసాలను సర్వం దారపోస్తుంటే ఒక శవంలా మిగిలిపోతున్నాడు పేదవాడు అని సామాన్య మానవుని జీవితాన్ని చక్కగా మన కళ్ళ ముందు ఆవిష్కరించారు.

మన జీవితాలను 'ముల్లు'తో పోలుస్తూ 'ముల్లు విరిచెయ్యండి' కవితలో ఈ విధంగా అంటాడు.

"జీవితం గులాబి పువ్వు వంటిదనీ
అడుగున ముల్లు దాచుకొని కనబడకుండా కాటు వేస్తుందనీ
పూర్వకాలపు లోకోక్తి
ఈ కాలంలో మార్చాలి దాన్ని
జీవిత శిఖరాగ్రాన నిలబడ్డదే ముల్లు
మీ చెయ్యి ఆ ముల్ల మీద పడ్డప్పుడు
అది కసిగా గుర్చుకొని వికృత నాట్యం చేసినా
చెయ్యంతా రక్తసిక్తమైనా
భయపడి వెనుదియ్యవలసిన పని లేదు
నెత్తురు వేళ్ళతో అందుకొన్న గులాబిరేకుల్ని
నలుగురికి పంచడమే మనకు జీవితమంత తృప్తి!"

(అంతర్జ్వాల)

ఇక్కడ గులాబి పువ్వును మంచి పనికి ప్రతీకగాను, ఆ మంచిని చేసేటప్పుడు అడ్డుతగిలే అవినీతి పరులను గులాబి క్రింద ఉండే 'ముల్లు'కు ప్రతీకగాను చూపించాడు కవి. అనగా నలుగురికి మంచి చేసే విషయంలో ఎవరైనా అడ్డు తగిలితే వారిని 'ముల్లు' విరిచినట్లుగా తగిన గుణపాఠం చెప్పాలి అని మన జీవన ప్రయాణానికి చక్కని బాట ఇది అని నిర్దేశించాడు కవి.

సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర అనన్య సామన్యం. భారతదేశంలో స్త్రీకి చాలా గౌరవం ఉంటుంది. ఇది నాణానికి ఒక వైపు, మరో వైపు నిరాదరణకు గురిచేసిన సంఘటనలే ఎక్కువగా కనిపిస్తాయి. తన జీవత ఆశయా లను పక్కకు నెట్టి సమాజంలో నేటికి ఉత్తమ సమాజ నిర్మాతలుగా ఉన్నారు. కాని అలాంటి స్త్రీ నేడు సమాజంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమాజంలో ఎన్నో రకాల ఇబ్బందులను ఎదుర్కొంటూ తమ జీవితాన్ని కొనసాగిస్తున్నారు మరీ ముఖ్యంగా నిరుపేద స్త్రీ జీవితం మరింత దుర్భరంగానే ఉంటుంది. అలాంటి స్త్రీ జీవిత కోణాన్ని చూస్తే...

"అసహాయులైన నిరుపేద కన్యకల
చర్మాన్ని రక్కి, శీలాన్ని పీల్చి
పిప్పిని బజార్లో ఉమ్మేసి
చెడిపోయిందని పేరుపెట్టి
నలుగురికి చూపించి నవ్విస్తుంటే

.....
నానాటికి పాలిపోతున్న కనుపాపల్లో
కాంతిరేఖలు రగిలించడానికి
ఇక్కడ ఈ కవితాజ్వాల వెలిగిస్తున్నాను"

(అంతర్జ్వాల)

సమాజంలో ఎటువంటి సహాయంలేని నిరుపేద స్త్రీల జీవితగమన నేపథ్య అగాథాలూ, మరెన్నో అరాచక శక్తులు ఎలా వారి పట్ల ప్రవర్తిస్తారు అనే విషయాన్ని చెప్తూ సమాజం నిరుపేద కన్యల శరీరాన్ని, తన శీలాన్ని ప్రశార్థకం చేసి, చెడిపోయిందని పేరుపెట్టి నలుగురిలో చూపించి నవ్విస్తున్న సమాజంలో పాలిపోతున్న స్త్రీ కనుపాపల్లో కాంతిరేఖలు రగించడమే ఈ కవితలో జ్వాల వెలిగిస్తున్నాను అంటారు అద్దేపల్లి.

నిరుపేదల కష్టాల్ని, దోపిడికి గురవుతున్న ప్రజల జీవితాన్ని దగ్గరగా చూసిన దృశ్యాల్ని పాఠకులకు తన కవితల ద్వారా తెలియజేసిన గొప్ప కవి అద్దేపల్లి. పేద ప్రజల జీవితాలను దోచుకొనే దోపిడీ వ్యవస్థపై కవి ఏ విధంగా తిరుగుబాటు చేస్తున్నాడో మనం గమనించవచ్చు. 'ఆయుధపూజ' అనే కవితలో ఇలా అంటారు.

"కోటాను కోట్ల నిరుపేదల బ్రతుకులోని వెలుతుర్ని
చీకటి గదుల్లో బంధించి
నోరులేని విగ్రహాల్ని కాపలాపెట్టి
దేశభక్తి తాళాన్ని బిగించిన
ప్రజాద్రోహుల బురఖాల్ని ఒలిచి
నాలుగు రోడ్ల కూడలిలో నిలబెట్టి
నా అక్షరాల విద్యుత్కాంతిలో
వారి నిజస్వరూపాల్ని
బట్టబయలు చేస్తాను"

(రక్త సంధ్య)

సమాజంలోని కోటాను కోట్ల నిరుపేదల బ్రతుకులోని వెలుతుర్ని చీకటి గదుల్లో బంధించి, వారిని ఎలా దోచుకుంటున్నారో చిత్రిస్తూ వారిపై తీవ్రస్థాయిలో హెచ్చరించడమే కాకుండా నిరుపేదలు తిరుగుబాటు చేయవలసిన ఆవశ్యకతను చూపించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

సమాజంలో దళితుల జీవితం ఎలా ఇబ్బందులకు గురవుతుందో వీరి కవితలను చూస్తే హృదయం చలించిపోయే సంఘటనలు ఎన్నో కనపడుతాయి. ''సజీవ దహనం'' అనే కవిత చాలా విశిష్టమైనది. ఈ కవిత 1969లో రాయడానికి ప్రేరణ కలిగిన సంఘటన నందిగామ దగ్గర కంచినచర్లలో ఒక దళితుడిని సజీవ దహనం చేయడమే. కవికి ఉన్న సహజ లక్షణం సమాజంలో నెలకొన్న సంఘటనలను కవితా వస్తువుగా తీసుకొని అక్షర బద్ధం చేయడం జరుగుతుంది. నందిగామలో ఉద్యోగం చేస్తున్న క్రమంలో జరిగిన ఈ సంఘటనను కవిత్వీకరించారు అద్దేపలి.

"చెప్పులు కుట్టేవాడు
చెప్పులు తొడుక్కుంటే చెప్పరాని కోపం
చెరువులు తవ్వేవాడు
చెరువులో నీళ్ళు ముట్టుకుంటే సహించరాని పాపం
పొలాలు దున్నేవాడు
కాస్త భూమి కావాలంటే నేరం
కాళ్ళమీద పడుకున్నవాడు
కాసంతలేచి నిలబడితే ఈ వ్యవస్థకే ద్రోహం"

(గోదావరి నా ప్రతిబింబం)

ఈ కవితలో చెప్పులు కుట్టేవాడు చెప్పులు తొడుక్కుంటే తక్కిన వర్గానికి చెప్పరాని కోపం రావడం, తన శ్రమను, చమటను దారపోసి చెరువును తవ్విన వారికి ఆ చెరువులో నీటిని ముట్టుకుంటే సహించరాని నేరం, పాపంగాను, కాయకష్టం చేసి పొలాలను దున్నే రైతు రాజుకు కాస్త భూమి కావాలంటే నేరంగా చూసే సమాజపు అహంకార ధోరణిని చక్కగా చిత్రించారు. ఈ కవిత ద్వారా నాడు సమాజంలో దళితుల జీవన చిత్రణ ఎలాంటిదో స్పష్టంగా కనపడుతుంది.

నమకాలీనమైన ఆవేదన మనకు ''అయినా ధైర్యంగానే'' కవితా సంపుటిలో కనిపిస్తుంది. అలాగే బలం

ఉన్నవాడు బలహీనులను ఎలా దోచుకుంటాడో ఈ క్రింది "కన్నీళ్ళలో కొట్టుకుపోయే కాగితాలు" అనే కవితను గమనిస్తే...

"దోచుకునే వాడిదే దేశం
లాక్కునే వాడిదే పేపరు
కొట్టేవాడిదే రాజ్యం
కొట్టేసేవాడిదే వస్తువు!
అని పెద్దగా భయంకరంగా అరిచానట!
అలా అరుస్తూనే ఉన్నానట!
ఈ విషయం
నాలుగు రోజుల తర్వాత
నాకు తెలిసింది
పిచ్చాసుపత్రిలో"

(అయినా ధైర్యంగానే)

ప్రపంచంలో బలం ఉన్న దేశం బలహీనమైన దేశంపై పోరాటం చేసి దాన్ని తన హస్తగతం చేసుకోవడం, సాధారణంగా ఎక్కడైన ప్రయాణం చేసే సమయంలో పేపరు చదవుతామంటే పక్కవారు లాక్కోవడం, కొట్టేవాడిదే రాజ్యం, కొట్టేసేవాడిదే వస్తువు అని బలంగా చెప్పే సమాజాన్ని చూస్తున్నాం. ఇలాంటి దురాచాల వలన సామాన్యుడు నలిగిపోయి వాటిని నిత్యం తలుచుకుంటూ పిచ్చివాడైన వైనాన్ని ఈ కవిత ద్వారా తెలియజేస్తున్నాడు కవి.

సమకాలీనమైన ఆవేదన మనకు "అయినా ధైర్యంగానే" అనే కవితలో కనిపిస్తుంది. దానిలో పోరాటం ప్రధానంగా కనపడుతుంది. కవిత్వం కంటే జీవితం గొప్పది అని భావించినవారు అద్దేపల్లి. అందుకే "పొగచూరిన ఆకాశం"లోని ఏ అక్షరాన్ని తాకిన ప్రపంచీకరణ ప్రభావానికి చిద్రమవుతున్న కోటాను కోట్ల జీవిత శకలాలు ఏదో ఒక పార్శ్వంలో గుచ్చుకుంటూ ఉంటాయి. సంస్కృతుల వెనుక దాగి ఉన్న మోసాన్ని సామాన్యుడు అర్థం చేసుకోగలుగుతాడు. భవిష్యత్తు గురించి ఆలోచనకు శంఖం పూరిస్తాడు. దీని ద్వారా అద్దేపల్లివారు సాధించ దలచుకున్న ప్రయోజనం కూడా ఇదే. జీవితాన్ని గురించిన, సాంఘీకమైన, తాత్వికమైన, కవితాత్మకమైన ఆలోచనలతో "జీవన సంగీతం" అనే దీర్ఘకవితలో రాయబడింది.

ముగింపు :

కవిత్వం రాసినంత మాత్రాన అతడు గొప్ప కవి కాలేడు. సామాజిక అంశాలపట్ల అవగాహన, సమాజం పట్ల కర్తవ్యంతో, నిబద్ధత కలిగి ఉండటం అనేది ఆధునిక కవికి ఉండే లక్షణం. కవిత్వం కంటే జీవితం గొప్పది అని భావించినవారు అద్దేపల్లి. "సుదీర్ఘకాలంగా కవితా నిర్మాణం చేస్తున్న కలం అద్దేపల్లిది. స్వీకరించిన వస్తువును బట్టి, ఎంచుకున్న శ్రోతను బట్టి కవిత్వ నిర్మాణ పద్ధతిలో మార్పులు చేసుకోవడం ఆ కవి ప్రతిభను నిరూపిస్తుంది. అద్దేపల్లి అటువంటి ప్రతిభ, సృజన శక్తి పుష్కలంగా కలిగిన కవి. అందుకే "పొగచూరిన ఆకాశం" సంకలనంలో వైవిధ్యభరితమైన కవితాశిల్పం కనిపిస్తుంది" అని డా. మేడిపల్లి రవికుమార్ అంటారు. దీనిని బట్టి చూస్తే కొత్త ఉద్యమాలు వచ్చినప్పుడల్లా వారిని తీవ్రంగా ఆలోచించే వ్యక్తి అద్దేపల్లి. అందుకనే అభ్యుదయ కవిత్వమైనా, దళితకవిత్వమైనా, స్త్రీవాద కవిత్వమైనా, మినీ కవిత్వమైనా తర్వాత వచ్చిన మైనారిటి వాదమైనా అన్నింటిని వారు బాగా క్షుణంగా పరిశీలించారు. కాబట్టి సమాజిక అంశాలు వస్తు సంబంధమైనవిగా మనకు వారి రచనలలో కనిపిస్తూ ఉంటుంది.

ఆధారగ్రంథాలు :

1. నిరంతరం - సప్తతి పూర్తి ప్రత్యేక సంచిక -అద్దేపల్లి సన్మాన సంఘం : అద్దేపలి రామమోహనరావు
2. అద్దేపల్లి సంకలిత గ్రంథావళి -1 : అద్దేపలి రామమోహనరావు
3. ప్రపంచీకరణ నేపథ్యంలో పొగచూరిన ఆకాశం - అద్దేపల్లి విజన్ : మేడిపల్లి రవికుమార్
4. అద్దేపల్లి కవిత్వం - వ్యక్తిత్వం - తత్వం : మాకినీడు సూర్యభాస్కర్

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అమెరికా తెలుగు కథలు – సామాజిక పరిణామం

– డా॥. పలివెల చిరంజీవిరావు, సహాయాచార్య(తెలుగు శాఖ), ఐఐటి శ్రీకాకుళం, ఆర్.జి.యు.కె.టి,

అనునిత్యం వ్యవహారంలో "సమాజం" అనే పదానికి కొందరు వ్యక్తులు సమూహం అనే అర్థాన్నిచ్చారు. కాని సామాజిక మానవశాస్త్రం దృష్టిలో కేవలం వ్యక్తుల సమూహాన్ని సమాజంగా చెప్పలేం. వ్యక్తుల మధ్య సామాజిక సంబంధాలున్న పరస్పర చర్యల సమూహాన్ని సమాజమని చెప్పవచ్చు. మైకెవర్ (Maciver) అనే శాస్త్రవేత్త సమాజాన్ని "సామాజిక సంబంధాల సాలెగూడు" (web of social relationships)గా వివరించారు. అరిస్టాటిల్ "మానవుడు సంఘజీవి" అని పేర్కొన్నారు.

మానవుడు ముందుగా బతికి బట్టకట్టాలంటే సమాజం అవసరం. సహజీవనం, సమాజ సహకారం లేనిదే ఏ మనిషీ మనుగడ సాగించలేడు. సమాజం వ్యక్తి పరస్పరాశ్రయాలు. వ్యక్తులు లేనిదే సమాజం ఉండదు. సమాజం లేకపోతే వ్యక్తికి సామాజిక మనుగడ మాయమవుతుంది. మనిషి జీవించడానికి, రక్షింపబడటానికి, పురోభివృద్ధి సాధించడానికి ఇతరులపై ఆధారపడి బతుకుతాడు. ప్రకృతిలో సహజ సిద్ధమైన ఆకలి, దప్పిక, శారీరక కోర్కెలు తీర్చుకోవడానికి మానవుడు తన చుట్టూ ఉన్న సహజ వనరులను వినియోగించుకుంటాడు. అలా చెయ్యడంలో మానవుడు తనకు తానే ఒంటరిగా ఏ పని చెయ్యలేడు.

అందుకే సమాజం అనే పదానికి సమాజశాస్త్ర వేత్తలు రకరకాలుగా నిర్వచించారు. సామాజిక మానవశాస్త్రం - ప్రాథమిక భావనలు అనే పుస్తకంలో ఇలా చెప్పారు "సముదాయకమైన ప్రయోజనం కోసం, అభిప్రాయం సామరస్యం వున్న వ్యక్తులు ఒకరి నొకరు గురించి కలిసి మెలిసి పనిచేయడాన్ని సమాజమని ఎఫ్. హెచ్. గిడ్డింగ్స్ నిర్వచించారు.

సమాజశాస్త్రం పరిచయం - సూత్రాలు అనే పుస్తకంలో "సమాజం అంటే కేవలం వ్యక్తుల మధ్య నెలకొని ఉండే రాజకీయ సంబంధాలు కాదు. ఆ సమాజంలోని వ్యక్తుల మధ్య ఏర్పడ్డ సంబంధాలన్నింటినీ కలిపి సమాజంగా చెప్పవచ్చు(society includes not only the political relations by which men are bound to gather But the whole range of human relations)" అన్నారు.

సమాజమనేది వ్యక్తుల సముదాయం. ఆ వ్యక్తుల మధ్య సామాజిక సంబంధాలుంటాయి. కాబట్టి సామాజిక సంబంధాల కలయికే సమాజం అనవచ్చు. సామాజిక సంబంధాలు నిత్యం మార్పుచెందుతూ ఉంటాయి. అందువల్లనే సమాజాన్ని ఒక నిత్యనూతన చైతన్య స్రవంతి వంటిదని పేర్కొనవచ్చు. అంతేకాక మానవులు ఒకరి కొకరు మానసిక పరిజ్ఞానంతో కలిసిమెలిసి ఎక్కడైతే ప్రవర్తిస్తారో అక్కడ సమాజమనేది ఉంటుంది. సమాజం సంక్లిష్టమైంది కూడా. దానిలో ఉండే సాంఘిక సంబంధాలు వివిధ రకాలుగా క్లిష్టమైనవిగా ఉంటాయి. కొన్ని సంబంధాలు స్నేహపూరితంగానూ, మరికొన్ని సంఘర్షణతో కూడుకున్నవిగానూ ఉంటాయి. కాబట్టి సంబంధాలు ఎలా ఉన్నప్పటికి వాటన్నింటినీ కలిపి సామాజిక సంబంధాలుగా చెప్పుకోవడం జరుగుతుంది. సమాజ నిర్మాణానికి ఈ సామాజిక సంబంధాలే ఆయువుపట్టు.

సమాజ నిర్మాణం ప్రాతిపదికలను బట్టి కొందరు శాస్త్ర వేత్తలు, సమాజం పనితీరు, ప్రాకర్యాలను బట్టి మరి కొందరు సమాజ శాస్త్రవేత్తలు నిర్వచించినట్లు స్పష్టమవు తుంది. సమాజం అంటే సమూహాల కలయిక అని, సామాజిక సంబంధాల ఫలితమని, వ్యక్తి తన జీవన కార్య కలాపాలను సాగించుకొనేందుకు వీలైన వేదికని అనేక రకరకాల ప్రాకర్యాలను దృష్టిలో ఉంచుకొని నిర్వచించారు.

ఎంతమంది ఎన్ని నిర్వచనాలిచ్చినా దాన్ని సమాజమనే అంటున్నాం. ఒక్కమాటలో చెప్పాలంటే సమాజం అంటే ఒక విస్తృతమైన భౌగోళిక సమూహాల మానవ నిర్మాణ మని తేలికగా చెప్పుకోవచ్చు. అయితే వ్యక్తుల కోసం సమాజం తప్ప, సమాజం కోసం వ్యక్తులు కాదని గుర్తిస్తే ఏ సమాజం మనిషి వ్యక్తిత్వాన్ని శాసించలేదు. ఈ సృష్టిలో ప్రతి మనిషికీ తనదంటూ ఓ ప్రత్యేకత ఉంది.

అమెరికా తెలుగు కథ - పరిణామం :

1960 లో వచ్చి స్థిరపడినవారు 1970ల నాటికి కొంచెం తమ భాషా సంస్కృతుల పరిరక్షణకై ఆలోచనలు ప్రారం భించారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వెలువడిన మొట్టమొదటి తెలుగు పత్రిక "తెలుగు భాషా పత్రిక". పెమ్మరాజు వేణుగోపాలరావు ప్రధాన సంపాదకులుగా, గవరసాని సత్యనారాయణ మేనేజింగ్ ఎడిటర్‌గా మొదటి సంచిక ఏప్రిల్ 1970 లో వెలువడింది. ఈ పత్రికలో ప్రచురించిన మొట్టమొదటి తెలుగు కథలు శ్రీమతి చెరుకూరి రమాదేవి "పుట్టిల్లు", కోమలా దేవి "పిరికి వాడు", కస్తూరి రామకృష్ణారావు "యవ్వన కుసుమాలు వాడిపోతే" మొదలైనవి. ఉత్తర అమెరికా రాత ప్రతిగా ప్రచురించబడిన మొట్టమొదటి తెలుగు పుస్తకం శ్రీశ్రీ గారి "సిప్రాలి" 1981 హ్యూస్టన్ లో వెలువడింది. తెలుగు కళాసమితిచే నడపబడుతున్న తెలుగుజ్యోతి పత్రికలో అమెరికా తెలుగు కథలు ఎక్కువగా ప్రచురించబడ్డాయి. కె. వి. యస్ రామారావు తొలి సంపాదకులుగా అమె రికాలో ప్రారంభించిన మొట్టమొదటి అంతర్జాల సాహిత్య పత్రిక "ఈ మాట".

ఎందరో తెలుగువారు మనదేశాన్ని వదలి వేరే దేశా లకు వెళ్ళిపోతున్నారు, ఇకముందు కూడా వెళ్తారు. బర్మా, మలేషియా, ఫిజీ, ఇండోనేషియా, దక్షిణ అమెరికా, మారిషస్, సింగపూర్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా ఒకటేమిటి - ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ఉన్న మన తెలుగువారు తరతరాలుగా ఇతర దేశాలలో నివసిస్తూనే ఉన్నారు. అలాగే ఉత్తర అమెరికాకి తెలుగువారు 1960లో వచ్చారు. వలస వెళ్ళి అక్కడే స్థిరపడిపోవడం 1970లో నుంచి ప్రారంభమైంది. వారంతా ప్రవాసాంధ్ర కథా రచ యితలుగా పేరు పొందారు.

అమెరికా తెలుగు కథాపరిణామాన్నే అమెరికా తెలుగు సాహిత్య పరిణామంగా చెప్పవచ్చు. అమెరికా తెలుగు కథ పుట్టు పూర్వోత్తర వికాసాలను పరిశీలిస్తే 1965 ప్రాంతపు తొలిదశలో అమెరికా గడ్డపై కాలుమోపిన తెలుగువారు, ఆ సరికొత్త వ్యవస్థలో సర్దుకుపోలేక విపరీతమైన ఒత్తిళ్ళకులోనై సాహిత్యం జోలికిపోలేదు. కాని 1970 ప్రాంతంలో ఈ పరిస్థితులు మారి సాహిత్య సృజనకు అనుకూలమైన వాతావరణం ఏర్పచుకున్నారు. 1970 నుండి అమెరికాలో ప్రతీ ప్రాంతం నుంచి స్థానికంగా కొందరు రచయితలు, సాహితీవేత్తలూ తమకు తోచిన విధంగా రచనలు చేస్తువచ్చారు. 1990 ప్రాంతంలో అమెరికాలోని తెలుగువారిలో వర్గబేధాలు అంతకు ముందుకంటే ఎక్కువగా చోటు చేసుకున్నాయి. అప్పటికే అంతంత మాత్రంగా ఉన్న తెలుగు రచయితల పరిస్థితి అటూ ఇటూగా ఉంది. ఆ పరిస్థితులలో "వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా" అనే సంస్థను వంగూరి చిట్టెన్ రాజు హ్యూస్టన్, టెక్సాస్‌లో స్థాపించారు. దీనికి ప్రధాన సంపాదకులుగా పెమ్మరాజు వేణుగోపాలరావు, గౌరవ సంపాదకులుగా ఇంద్రగంటి శ్రీకాంత శర్మ ఉన్నారు. ఈ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంస్థ పేరుతో అనేక కథా సంకలనాలు వెలువడ్డాయి. అందులో 1995 లో "అమెరికా తెలుగు కథానిక" అనే పేరుతో మొదటి సంకలనం వెలువడింది. ఇప్పటివరకు ఈ సంస్థ నుండి 12 సంకలనాలు వచ్చాయి. ఈ సంకలనాలలోని కథా నేపథ్యాలు విభిన్న కోణాలతో రాయబడ్డాయి. దీంతో అంతకుముందు రచనా వ్యాపకం కలిగిన వారేకాక కొత్తవారు కూడా కలంపట్టి తమ సంఘర్షణలను కథలుగా మలచడం ప్రారంభించారు.

తొలిదశలో అక్కడికి వచ్చినవారు వేరు వేరు సంవత్స రాలలో రావడం చేతనో, వేరు వేరు ప్రాంతాలలో

స్థిరపడటం చేతనో, మొదటిలో వారి మధ్య పరిచయాలు అంతగా లేకపోవడం చేతనో అమెరికాలో వెలువడిన తొలికథ ఏది? తొలి కథకులు ఎవరు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం చెప్పడం వీలు కాదు. కాని అమెరికాలో తొలి తెలుగుకథ ఉత్తర అమెరికా తెలుగు కథారచయిత "స్వర్గీయ పులిగండ్ల మల్లికార్జునరావు" కెనడాలో "వాహిని" ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఏప్రిల్ 24, 1964 సంచికలో ముద్రించబడింది. ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చినవారు "రచన" శాయిగారు.

అమెరికా తెలుగు కథలు – సామాజికాంశాలు :

ప్రతి సమాజానికి మార్పు అన్నది సహజం. అటువంటి సమాజంలో మనిషి ఒక అణువుకాబట్టి, మనిషి కాలాను గుణంగా మారడం కూడా అంతే సహజం! సంఘంలోని ప్రజలకూ - ప్రజల మీద బతికే కొన్ని శ్రేణులకూ మధ్య అంతరమెలా దినదినాభివృద్ధి చెందుతుందో సమాజం లోని మానవ సంబంధాలు అనేక విధాలుగా ఉంటాయి. స్త్రీ పురుష సంబంధాలు, భార్యాభర్తల సంబంధాలు, వివాహ సంబంధాలు, జాతుల మధ్య సంబంధాలు, ఉన్నవారికి లేనివారికి మధ్యగల సంబంధాలు, విభిన్న సంస్కృతుల మధ్య అంతరాలు, తరాల అంతరాలు, అమెరికన్ సంస్కృతులు, స్వదేశంలో బంధుప్రేమలు, పిల్లలపెంపకంలో ఎదురయ్యె సమస్యలు ఇక్కడ మెచ్చిన కథలు. ఈ సామాజిక సంబంధాలన్నీ ఒకే వరలో నిరంతరం కొనసాగుతూనే వచ్చాయి. కొన్ని సమాజాల్లో మార్పులు త్వరితంగానూ మరికొన్ని సమాజాల్లో మార్పులు నిదానంగా వస్తాయి. ఈ సామాజిక అంతరకల్లోలం ఒక దుర్భరస్థితికి చేరుతుందని, దానికి కారణాలు అమెరికా తెలుగింట్లో ఉన్నవని భవిష్యత్తులో సాగబోయే మానవ జీవనం గురించి అక్కడ, ఇక్కడ సామాజిక నేపథ్యాలతో చూపించి హెచ్చరించిన కథలే అమెరికా తెలుగు కథలు.

అమెరికా తెలుగువారి జన జీవనాన్ని తెలిపే రచ యితలు పుట్టుకొచ్చారు. ఈ కథల్లో సామాజిక వాతావరణం చోటు చేసుకున్నకాలమిది. ఇంకోవైపు పెరుగుతున్న వలసలు అధికార యంత్రాంగం అవినీతి మార్కెట్ మాయ జాలంలో పడి మారిన స్థితిగతులు ప్రభావాన్ని ఈ కథకులు చిత్రించసాగారు. సమాజంలో మనుషుల మధ్య సంబంధాలు ఎంత మార్పుకు లోనౌతున్నాయో తెలు పుతూ, ఆ సామాజిక చలనాలను అమెరికా తెలుగువారు అమెరికా తెలుగు కథల్లో చూపించారు. మానవ సామాజిక జీవనంలో కనిపించే సంబంధాలు. సంఘర్షణలు, సమన్వ యాలు, ప్రభావాలు, జీవితంలో ఎదురయ్యే సాధారణ అసాధారణ సంఘటనలు, సమస్యలు మానవుని జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ ప్రభావం వల్ల మానవ సంబంధాలు కూడా మార్పులు పొందుతాయి. ఆ మార్పుల వల్ల ప్రభావితం చేయబడిన సంబంధాలు అమెరికా తెలుగు కథల్లో గమనించవచ్చు.

శార్వరి "తప్పెవరిది" కథ 1995 సంవత్సరంలో రాసారు. తల్లిదండ్రులు అమెరికా సంబంధం మంచి సంబంధమని ఆశించి, వాళ్ళ అమ్మాయికి ఎటువంటి కష్టాలుండవని అనుకొని ముక్కు మొహం తెలియని ఎవరో ఒకరికి కట్టబెడతారు. అమెరికా వెళ్ళి భర్త చేతిలో ఒక కీలుబొమ్మగా, ఆట వస్తువుగా మారిన స్త్రీ గాథను భర్త పెట్టే చిత్రహింసలను తెలుపుతూ రాయబడింది ఈ కథ. నీ.యస్సీ.మురళి "జాలికథ" కథ 1995 సంవత్సరంలో రాశారు. పేదరికంతో క్రుగ్గిపోయేకంటే చని పోవడం మంచిది. ఎంతోమంది మనదేశంలో పేదరికంతో బాధపడుతున్నారు. కనీసం ఎక్కడ చూసిన దుర్మార్గాలు, ఎక్కడ చూసిన కడుపునింపుకోవడం కోసం ఆరాటాలు. ఇలా రోజుకాలం గడపడం కంటే చచ్చిపోతేనే పై లోకంలో సుఖంగా ఉండవచ్చనే తెలుపుతుంది ఈ కథ. గవరసాని సత్యనారాయణ "ఎమిలి" కథ 1996 సంవత్సరంలో రాశారు. పద్నాలుగు సంవత్సరాలు నిండకుండానే ఇంటిలో చెప్పకుండా కారు నడుపుతూ ప్రమాదానికి గురైనప్పుడు ఆమె తల్లిపోలీసులకు చెప్పి కేసుపెట్టమని తెలుపుతూ రాయబడింది ఈ కథ. పూడిపెద్ది శేషుశర్మ "అగాధం" 1996 సంవత్సరంలో రాశారు. ఒంటరి తనంతో

బాధపడుతున్న తల్లిదండ్రులు గుర్తుకువచ్చినప్పుడు వారికి ఏమీ చేయలేకపోతున్నామనే ఆలోచన మనస్సుని నమిలివేస్తుంది. తల్లిదండ్రులు ఇండియాలో వుంటే అమెరికాలో సెటిలయ్యే వారి పిల్లలు ఎదుర్కొనే మానసిక సంఘర్షణని తీసుకొని రాయబడిన కథ ఇది. కనక ప్రసాద్ ''ఉయ్యాల'' కథ 1996 సంవత్సరంలో రాసారు. బస్తీలో ఉన్న మగరాయుళ్ళ పేకాటకు లొంగిపోయి భార్యలను పట్టించుకోరు సరికదా పేకాటకు బానిసయితే మానడం కష్టమని తెలుపుతూ రాశారు ఈ కథ. సోమ సుదేష్ణ ''సంబరంలో చినుకు'' కథ 1996 సంవత్సరంలో రాశారు. భార్యా భర్తలు చిన్న చిన్న గొడవలు పెట్టుకుంటే దానిని ఆసరాగ తీసుకొనివాళ్ళకు లేనిపోనివి చెప్పి వాళ్ళను విడదీయడానికి కొంతమంది అమ్మలక్కలుంటారు. అలాగే మంచిని బోధించి మంచిగా మాట్లాడేవారుంటారని తెలుపుతూ రాశారు ఈ కథ. కొవ్వలి కాటూరి జ్యోతి ''తరతరాల'' కథ 1996 సంవత్సరంలో రాశారు. వివాహం చేసుకొని అమెరికా వెళ్ళిన ఆడవారు, తన భర్తల చేతిలో దెబ్బలు తిని సతమతమవుతూ, గృహహింసకు బలియైన స్త్రీలకు కొన్ని సంస్థల ద్వారా వారికి ధైర్యం చెప్పి, వారి కాపురాన్ని సరిచేసిన స్త్రీలు కూడా ఉన్నారని రాయబడింది ఈ కథ. విశ్వనాథ్ వడ్లమాని ''వెలంటైన్స్ డే'' కథ 1996 సంవత్సరంలో రాశారు. ప్రేమించిన ఆమెకు ఎయిడ్స్‌తో పాటు మరికొన్ని జబ్బులువుంటే, అయినా ఆమెను అర్థం చేసుకొని ఆమెతో అతను స్పందించి మృదువుగా చుంబించి వెలంటైన్స్ డే అని చెప్పాడనే రాయబడింది. కొమరవోలు సరోజ ''జిగీషి'' కథ 1996 సంవత్సరంలో రాశారు. ఎంతోమంది దేవుళ్ళను నమ్ముతాం కాని ఒక మనిషిగా ఉండి మనదేశంకోసం పోరాడిన గాంధీకోసం, గాంధీ విగ్రహాన్నిగాని, అతన్ని దేవుడిగా ఎందుకు భావించరాదు. గాంధీని గాడ్సె చంపినట్టుగానే అమెరికాలో కూడా మంచివారికి అపనిందలు తప్పవు అంతేకాక మంచివారిని ఆదర్శాలతో జీవించే స్త్రీలను కూడా ఏ నల్లవాడో బ్రతకనివ్వడని తెలుపుతూ రాశారు ఈ కథ. సత్యం మందపాటి ''తెమినచా - నమీతెచా'' కథ 1997 సంవత్సరంలో రాశారు. దేశంకాని దేశంవెళ్ళినా, ఇండియా నుంచి వెళ్ళినా పెద్దవాళ్ళు అక్కడకు వెళ్ళి కులపిచ్చి వాళ్ళలో రేపి తగాదాలు పెడతారు. ఎవరి జాతివారిని వారే గౌరవించుకుంటారు. దేశంకాని దేశంలో కూడా కులాలవారిగా సంఘాలు ఏర్పాడుతున్నాయనే రాశారు. పూడిపెద్ది శేషుశర్మ ''సర్ ప్రైజ్'' కథ 1997 సంవత్సరంలో రాశారు. వివాహ వ్యవస్థలో ఉన్న ఒడుదుడుకులతో విస్తుపోయిన స్త్రీ మానసిక విడుదలకోసం తీసుకున్న నిర్ణయాన్ని తీసుకొని రాశారు. సోమ సుదేష్ణ ''మొగుడు కావాలా?'' కథ 1997 సంవత్సరంలో రాశారు. పిల్లల పెళ్ళిళ్ళు చేయడానికి తల్లిదండ్రులు చాలా ఆలోచిస్తారు. పిల్లల వయసు పెరిగిపోతుందని వారికి సరియైన భర్త దొరకడేమోనని బెంగపడతారు. పిల్లలు కూడా మానసిక ఒత్తిడికి లొంగిపోతుంటారు. ఈ క్రమంలో పిల్లల ప్రేమ ఫలించి మంచిగా పెళ్లి జరిగితే వారి సంతోషానికి అవధులే ఉండవనే నేపథ్యంతో కె.వి.ఎస్ రామారావు ''అదృష్టవంతుడు'' కథ 1998 సంవత్సరంలో రాశారు. కట్నంకోసం, ఉద్యోగంకోసం ఆశపడి చేసుకున్న సంబంధాలు ఎక్కువకాలం నిలబడవని తెలియజేస్తూ, ఒక స్త్రీ మగవాడి పురుషాహంకారానికి, మగవాడు పన్నె ఉచ్చులకు చిక్కకుండా తిరగబడి అతనికి బుద్ధి చెప్పిందని తెలుపుతూ రాశారు ఈ కథ. విజయ శ్రీ అసలు పేరు పెమ్మరాజు వేణుగోపాలరావు. విజయ శ్రీ ''పిల్లలకోసం'' కథ 2000 సంవత్సరంలో రాశారు. పిల్లలులేని దంపతులు పిల్లలకోసం చేసిన ప్రయత్నాన్ని నేపథ్యంగా తీసుకొని రాశారు. చెరుకూరి రమాదేవి ''భయం'' కథ 2004 సంవత్సరంలో రాశారు. యుద్ధ సమయంలో సైనికుల విధి ఆక్రమంలోవారి కుటుంబ సభ్యులలో కలిగే ఆందోళన ఎంత తీవ్రంగా ఉంటాయో తెలిపే నేపథ్యంతో రాయబడిన కథే ఇది. రంగ పంచాంగం ''టోపి'' కథ 2004 సంవత్సరంలో రాశారు. గత అనుభవాలు కొన్ని కొత్తపాఠాలు నేర్పు

తాయనడానికి, ఎదుటివారి మనసులో (స్త్రీ) ఏముందో తెలుసుకోకుండా అతిగా రియాక్టవడం, దానివల్ల సానుకూలమైన స్పందన రాకపోవడం వల్ల కృంగిపోవడ మనేది మంచిదికాదు. ప్రేమించడం తప్పుకాదుగాని తిరస్కారాన్ని ఒప్పుకోవడమనేది గొప్ప సహృదయమని రాయబడిన కథే టోపి. కల్పన రెంటాల "టింకూ ఇన్ టెక్సాస్" కథ 2006 సంవత్సరంలో రాశారు. ఇటీవల "వన్ ఆర్ నన్" (one or nun) అనే స్లోగన్ బాగా వినబడు తుంది. ఇది అమెరికా వంటి అగ్రరాజ్యంలో బాగా అమలులో ఉంది. కుటుంబంలో పిల్లో, పిల్లడో మాత్రమే ఉండడం వలన వాళ్ళు ఊహా ప్రపంచంలో విహరిస్తూ బొమ్మలనే తమ మిత్రులగాను, అన్నలుగాను, చెల్లెలు గాను, తమ్ముళ్ళుగాను భావిస్తున్న నేపథ్యాన్ని ఆధారంగా చేసుకొని రాయబడిన కథే ఇది. శ్రీనాథ్ జొన్నవిత్తుల "కలయిదనీ నిజమిదనీ తెలియదులే" కథ 2008 సంవత్సరంలో రాశారు. ఈ కథ కొన్ని ఇబ్బందులు, మరికొన్ని మానసిక సంఘర్షణలతో సాగి చివరకి వాటిని వదిలించుకొని కృష్ణ, జానకి ఎలా ఒకటయ్యారో తెలిపుతూ రాయబడింది. లత కందికొండ "మార్పు-ది-ఛేంజ్" కథ 2010 సంవత్సరంలో రాశారు. వివాహమైన సంవత్సరం గడవకముందే భార్యాభర్తలలో కలతలురావడం మామూలే. కాని సర్దుబాటు సాగిస్తూ కాపురం చేసుకొని జీవితాన్ని చక్కగా మలచుకుంటూ ఉంటే ఆ జీవితానికి హద్దులు లేవని రాయబడిన కథే ఇది.

ముగింపు :

అమెరికా దేశం వలసవెళ్ళిన ప్రవాసాంధ్రులు వారి సమస్యలను ఎలా ఎదుర్కొని పరిష్కరించుకుంటున్నారో అమెరికా తెలుగు కథల్లో చిత్రించారు. పుట్టి పెరిగిన మట్టిమీద మమకారం, సంస్కృతుల మధ్య పొరసత్వం, సప్త సముద్రాలను దాటి దేశంకాని దేశంలో పరాయీ కరణలో మనవాళ్ళ జీవితాలను చిత్రిస్తూ అమెరికా తెలుగు కథలు మన సొంతగడ్డ మీద వస్తున్న కథల కంటే విభిన్నంగా అమెరికా తెలుగు కథకులు రాస్తున్నారు. అమెరికా దేశానికి వెళ్ళి అన్ని ప్రాంతాలకీ విస్తరించి అక్కడ వారి సమస్యలను, సుఖాలను, దుఃఖాలను అందు బాటులో ఉంచడానికి, ఆయా ప్రాంతాలలో స్థిరపడిన తెలుగువారి అనుభవాలను,అనుభూతూలను, చరిత్రను సాహిత్యరూపంలో పదిలపరచడమే కాక, భవిష్యత్ తరాల వారికి అందిస్తున్నారు ఇక్కడి రచయితలు. ఈ కథలపైన మరికొన్ని కొత్తవిషయాలతో పరిశోధనలు ఇంకా వస్తే మంచిదని నా సూచన.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పేదహారణాల రైతు – జీవన చిత్రణ

– డా॥. రొట్ట గణపతిరెడ్డి, సహాయాచార్యతెలుగు శాఖ, ఆర్.జి.యు.కె.టి, శ్రీకాకుళం.

భారతదేశం ఒక వ్యావసాయకదేశం. అఖండ భారతా వనిలో జీవించుటకు అనేకమైన వృత్తులున్నవి. ఆ వృత్తులున్నింటిలో ముఖ్యమైనది వ్యవసాయం. వ్యవ సాయానికి మూలకారకుడు రైతు. రైతు తన చెమటను అన్నముగా మలచి ప్రపంచానికి ఆకలిదప్పునుండి ఆదు కుంటున్నాడు. ప్రపంచమునకే ఒక అమ్మగా, ఒక నాన్నగా సాకుతున్నాడు. అందుకే అమ్మలోని మొదటి అక్షరమైన "అ" ను, నాన్నలోని చివరి అక్షరమైన "న్న" ను కలిపి ప్రపంచమంతా అన్న, రైతన్న అని గొప్పగా, ధైర్యంగా, సగర్వంగా పిలుచుకుంటుంది. రైతన్నే అమ్మా నాన్నలు కావడం వలన ప్రజల తల్లిదండ్రులు కేవలం వారి జన్మకు మాత్రమే కారకులయ్యారు. రైతు కేవలం ప్రజలకు మాత్రమే భోజనం పెడుతున్నాడనుకుంటే పొరపాటే చరాచర జీవకోటికి అన్నం పెట్టేవాడు రైతని చెప్పడంలో లేశమంతయును సందేహము లేదు. రైతే రాజు అనికూడా అంటారు.

తెలుగు సాహిత్యక్షేత్రంలో రాయలసీమ కవితరువు లకు గొప్ప స్థానమున్నది. అందులోను వారు చిత్రించిన రైతు పాత్రచిత్రణ ఫలాలు అతి మధురమైనవి. అటు వంటి కవులలో అసలు సిసలైన గ్రామీణ రచయిత సన్నపు రెడ్డి వెంకటరామిరెడ్డి గారు. పల్లెలో పుట్టి, పెరిగి, ఉ పాధ్యాయుడుగా ఉద్యోగం చేస్తూ, పల్లెలోనే జీవిస్తున్న గ్రామీణ రచయిత. అందుకే అతడు రాసిన కథలన్నీ, నవలలన్నీ కూడా గ్రామీణ జీవన ఇతివృత్తాలే. అతడు గడిపిన గ్రామీణ జీవితం, అతడి రచనల్లో కళాత్మకంగా ప్రాణం పోసుకుంది. వారి కలం నుండి జాలువారిన ఒక్క "వాన చాలు" అనే నవల ద్వారా రాయలసీమ రైతు యొక్క జీవన విధానము తేటతెల్లమౌతుంది.

రాయలసీమలో కరువు పిలిస్తే పలుకుతుంది. పిలవకపోయినా పలుకుతుంది. అనంతపురం జిల్లాల్లో అది చాలా కాలంగా ప్రాచుర్యంలో ఉన్న ఒక పలుకుబడి. కడప జిల్లాలోని ఒక కరువు ప్రాంతం నుంచి కూటికోసం కూలికోసం పట్టణంలో బ్రతుకుదామని బయలుదేరిన రైతన్నల బాధల పాటల పల్లవి ఒక్కవాన చాలు అనే నవల. వానల్లేక, పంటల్లేక, పాలంపనుల్లేక పొట్టపోసు కోవడానికి రాయలసీమ రైతులు పట్టణానికి గృహనిర్మాణ కూలీలు (వలస కూలీలు)గా మారిపోయారు. రైతు పని తప్ప వేరే పని చెయ్యడం రాయలసీమ రైతులకు ఇష్టం ఉండదు. కాని బ్రతకాలంటే తినాలి. తిండితినాలంటే ఏదో ఒక పనిచెయ్యాలి. అందువలన ఇష్టం లేకపోయినా చెయ్యక తప్పదు. అందువలన మళ్లి వాన పడేంతవరకు న్యాసముగా పల్లెల నుంచి గుహనిర్మాణ పనులకోసం పట్టణాలకు వలస వెళ్లవలసివస్తుంది. అలాగ వలస వెళ్లినవారంతా వానకోసం పరితపించిపోతున్నారు. ఒక్క వాన రావాల, మళ్ళి మా సేద్దె పనుల్లో మేముండాలని వాళ్లంతా వానకోసం పరితపించిపోతున్నారు పట్టణాల్లో బ్రతుకుతుంటారు.

రాయలసీమ రైతు జీవన చిత్రణ గూర్చి తెలియా లంటే ఒక్క వాన చాలు అనే నవల చదివిన తరువాత చదువ పద్యం చదువ పద్యమరయ చాలదా ఒక్కటి అన్నట్లుగా, రైతు జీవన చిత్రణ గురుంచి తెలియాలంటే ఈ ఒక్క నవల చదివితే చాలు అనే భావన పాఠకులలో కలుగుతుంది. అటువంటి స్థాయిలో సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి గారు రచనా పాఠవాన్ని చూపించారు. ఒక్క వాన చాలు, ఒకే ఒక్క వాన చాలు అని ఈ నవల వేదంలా ఘోషించింది.

రాయలసీమలో ఆ ఏడాది కూడా ఎప్పటిలాగే కరువు తాండవిస్తుంది. అదునులో పదును వాన పడక ఎన్ని బుతువులైందో! మృగశిర కార్తె రానే వచ్చింది. మృగశిర కార్తె వచ్చిందంటే రైతుల గుండెల్లో ఏదో ఆశల ఊట. వాన పడుతుందని, తొలకరి చినుకులకు నేలమ్మ గుండె చల్లబడుతుందని. వానలు పడలేదు. ఆరుద్ర కార్తె దాటి పునర్వసు కార్తె కూడా వచ్చేసింది. తొలి ఏకాదశి పండగ కూడా పేదరికపు త్రోవగుండా చెప్పా పెట్టకుండా వెళ్ళి పోయింది. ప్రతిరోజు మబ్బులు రావడం, వాన రాక పోవడం వారికి అలవాటయిపోయింది.

ఈరోజు వచ్చిన మబ్బులను చూసి గృహనిర్మాణం కూలి పనిలో ఉన్న రాయలసీమ రైతు శివన్న దేవుని ప్రార్థిస్తూ అన్న మాటలివి. "కాశి నాయన ఇప్పుడన్నా ఒక్క పదును వాన కురిపి తండ్రి అని, ఒక్క పదును వాన సాల్నాయనా..... నీ ఆశ్రమానికి వచ్చి అన్నదానం సేయిస్తా" అని ఆర్ద్రంగా అన్నాడు. ఈ మాటల్లో వాన కోసం వారు పడుతున్న ఆవేదన, వారికున్న ఆశలు తేటతెల్ల అవు తున్నది. వాటి సాకారం కోసం కాశీవిశ్వేశ్వరుడిని ప్రార్థిస్తు న్నాడు. రాయలసీమ రైతు ఆత్మాభిమానం గల వాడు. కాయకష్టాన్నినమ్మిన మహా సేద్యగాడు. రైతును గాని, పల్లెలను గాని కించపరిస్తే సహించని వాడు రాయలసీమ రైతు అని ఈ మాటల ద్వారా తెలుస్తుంది. వలస కూలీ లను నమ్ముకొని బిల్డింగ్ నిర్మాణాన్ని కాంట్రాక్టరుగా పనిచేస్తున్నాడు కేశవులు. వాన పడితే ఆరోజు కట్టినదంత కూలిపోయి కాంట్రాక్టరుకి నష్టం వస్తుంది. ఆరోజు కూడా ప్రతిరోజులాగే మేఘాలు కమ్ముకున్నాయి. కూలీలందరూ వాన కోసం ఆశగా ఆకాశం వంక చూస్తున్నారు. వాన వంగితే యిగేం నాయనా వంద టెంకాయలు కొట్టమా... ఆంజనేయసామికి ఆకు పూజ సేయించమా! అని అన్నాడు గుడ్డి రామిరెడ్డి. ఆ మాటలు చెవిన పడ్డ కాంట్రాక్టరు కేశవులు వానపడితే సమాజానికంతటికి ఉ పయోగముంటుందని తెలిసినా, తను ఆ రోజు కట్టినది వర్షమొస్తే పడిపోతుందని, అలాగైతే నష్టమొస్తుందని, తనకు నష్టం కలిగేలాగ పనివాళ్లు కోరుకుంటున్నారని వారిపైన కోపంతో రగిలిపోయాడు. నా దగ్గర కూలి పనికొచ్చిన మీరు నా మేలు కోరకుండా నాకీడు కోరుతారా అని వారి పైన మండిపడ్డాడు.

"వానదేవుడు కనికెరం జూపక ఇట్లా ఇటుకలు, సిమెంటు పాలయినం గానీ.. వానొస్తే మేమెందు కుంటామన్న ఈడ... అని శివన్న సమాధానమిచ్చాడు. దానికి మరింత కోపంతో ఊగిపోయి మర్యాదగా నా పంజెయ్యి, లేదంటే సగం కూలిస్తా ఇప్పుడే పొమ్మంటూ పల్లెనీ, రైతునీ కించపరిచాడు."

పై మాటలను బట్టీ చూస్తే ఆ వలస కూలీల జీవనం ఎంత దుర్భరంగా ఉందో మనకి అర్థమౌతుంది. కుక్కిన పేనిలాగ పడుండి పనిచేయవలసిందే. ఒక్కమాటైనా మాట్లాడితే దాని ప్రభావం వారి కూలిడబ్బులపైన పడుతుంది. చూసాము కదా! ఆ మేస్త్రికి ఎప్పుడు నచ్చక పోతే అప్పుడే పనిలోనుంచి తీసేస్తాడు. అది ఆ వలస కూలీల దయనీయ పరిస్థితి.

దానికి సహనం కోల్పోయిన శివన్న కోపంతో నీ పనెవురుగ్గావాల నా బొచ్చుగానిగ్గావాల్నా నా కూల్లెక్క నాకీ.... అని పక్కకు సర్దుకున్నాడు. సమాజానికి మంచి కోరని కేశవులు లాంటి వాని దగ్గర పని చేసే కంటే, మానేయడం మంచిదని తలచి పనిని వదులుకున్న ఆత్మాభిమాని రాయలసీమ రైతన్న. ఒక్కసారి శివన్న బజారుకి వెళ్ళాడు. అక్కడకు వచ్చిన ఒక పెద్దాయన సామాన్లను, వాటి నాణ్యతను చూస్తూ కొంటున్నాడు. ధనియాల్లో పుల్లలను, పూడికలు కనిపిస్తున్నాయని, బియ్యంలో రాళ్లు ఉన్నాయని ఆ పెద్దాయన షావుకారుని అడిగాడు. అప్పుడు ఆ షావుకారు రైతులే వాటి కల్తీకి కారణమని, తప్పును రైతులపై నెట్టివేశాడు. అది విన్న శివన్న సహించలేకపోయాడు. షావుకారీ! ఇన్నన్ని అబద్ధా లాడిన ఆ నోటితో బువ్వెట్టా తింటావు. ఎందుకు షావుకారీ! రైతుల ఉసురు పోసుకుంటారు వానదేవుడు పెడసూపు జూస్తుండు. సర్కారోళ్లు దిష్టి కండ్లతో సూస్తాం

డరు. పల్లెల్లో బతకలేక రైతులంతా కూలిమాసులై కడుపు చేతపట్టుకుని టౌన్లకొస్తాంటే.... వాళ్లను తప్పుడోల్లంజేసి ఎందుకయ్యా అడ్డ మాటలు మాట్లాడతారు. అని ముక్కు సూటిగా షావుకారును నిలదీస్తాడు.

షావుకారు ఇంకా బుకాయించేబోతే శివన్న ఇలా వివరించాడు. వడ్ల మిషన్నాడించి బియ్యంలో రాళ్లు కలిపేవాళ్ళు తప్పుడోల్లు. దనేల్లో పుల్ల, పూడిక కలిపి మల్లా సంచులకెత్తే వాళ్లు మోసగాల్లు. వాళ్ళు షావుకారీ తప్పున్నాకొడుకులు. వాళ్లు షావుకారీ దొంగ నా కొడుకులు.... రైతులు కాదు. రైతుల్నంటే పురుగులు పడి సస్తారు... అంటూ షావుకారిని నిలదీసాడు. కళ్ళ ముందు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకోడు రాయలసీమ రైతన్న.

అదేవిధంగా మరో చోట రాజారావు అనే రిటైర్ అయిన ఇంజినీర్ని కూడా నిలదీస్తాడు శివన్న. రాజారావు ఒక రిటైరయిన ఇంజినీరు. అతడు మృదుస్వభావి. తన ఇంటి చుట్టూ వేసిన మొక్కలను బాగుచేసే నిమిత్తము శివన్న వచ్చి బాగుచేసిన వైనం రాజారావుకు నచ్చింది. వారిద్దరికి మధ్య స్నేహం పెరిగింది. శివన్న పై ఆశలు పెంచు కున్నాడు రాజారావు. ఆ చనువుతో తనకున్న రెండు వందల ఎకరాలను సాగు చేయమని శివన్నను కోరాడు రాజారావు అప్పుడు శివన్న తన మాటలలో ఇలా చెప్పాడు.....

"మట్టిలో పొర్లాడేవానికి భూములుండాలా పెద్దయ్య! అది ఎంత ఉండాల ఒక కాడి సేద్దెమంత. అంటే.... బరక భూములయితే పదెకరాలన్నె పర్లే. అప్పుడే భూమి తల్లిని సాగదీడొచ్చు. వందల ఎకరాలను ఒక మనిసి ఏంజేయాల నువ్వయితే మాత్రం ఏంజేస్తావు దున్నుతావా నీతో అయిద్దే? ఐదు ఎకరాలు అయితే రైతువే. వందల ఎకరాలున్నోనివి నువ్వెట్లా రైతువౌతావు? రైతు కాదయ్యా నువ్వు..... భూమికి మొగునివి ఇన్నెకరాల భూమితో సంసారం జేసే సత్తా నీకు ఉందే? ట్రాక్టర్లు బెట్టి, మను షుల్ని పెట్టి ఇక్కడే ఉండి భూమమ్మను లొంగదీసుకునే సత్తా ఉంటేనే భూమికి మొగుడివి కావాలా... ఆ తల్లి జోలికి పోవాలా... పొలం నొకం సూడకుండా నువ్వేడనో మేడ మిద్దెల్లో నల్లంగా పండుకొని ఈ భూమమ్మతో సంసారం చేయ్యాలంటే యాడయితాది. ఆమె నీ అంకెకు వస్తాదా! నువ్వు ఈ మట్టిలోనే పడుకోవాల.... మట్టిని పూసుకోవాల.... ఈ నీళ్లు తాగాల.... కలిసి సంసారం జేయ్యాల..... అప్పుడే ఆమె నీకు లొంగేది...." అని రాజా రావును నిలదీశాడు.

పై మాటలను బట్టి ఒక కుటుంబానికి ఎంత భూముండాలి అనే విషయాన్ని, సాగు చేయడం చేతగాని నీలాంటి వారికి ఇంత భూమి ఎందుకు అని రాజారావును నిలదీశాడు శివన్న అనే రైతు. అనగా ఉన్న భూమంతా ప్రజలందరికీ సమానంగా ఉండాలని భూమి కొద్ది మంది చేతుల్లో ఉండిపోకూడదని ఆశిస్తున్నాడు రాయలసీమ రైతు.

రాయలసీమ రైతుకు నిరంతరం పని కావాలి. ఆ పనిలో ప్రాణం ఉండాలి. రైతు పనిలోనే ప్రాణం ఉం టుందని అందులో ఉన్న ఆనందం ఇంకెందులోని లేదని, రైతుపనినే ప్రాణమని నమ్మిన వాడు రాయలసీమ కృషికుడని శివన్న తన ఆవేదనని రాజారావు తో క్రింది మాటల ద్వారా తెలియపరుస్తున్నాడు.

"పని కావాలి పెద్దయ్య! రైతు పని కావాల. భూమిని పగల దున్నాల.... విత్తనాలు విత్తాల.... కలుల్దియ్యాల.... మడలగట్టాల..... కోతలుకోయ్యాల..... కల్లాలు జెయ్యాల.... గింజలు ఇంటికి మొయ్యాల.... పొలం పని గావాల..... రైతు పనిమాద మొగమాస్తాంది..... ఈ ఇటికెలు ఎగరెయ్యడాలు, సెమెంటు మొయ్యడాలు ఈ పనుల్తో సచ్చేంత యాసిరికే వస్తాంది. పంజేస్తాంటే యింగా యింగా చెయ్యాలనిపించాల. కులాశ పుట్టాల... పనిలో పానముం డాల.... పానముండే పని గావల పెద్దయ్యా! పానముం డేపని యాడుంది? వాన కురిస్తేగాని ఆ పని దొరకదు.... వాన రావాల. పానముండే పని దొరకాలంటే వాన రావాల.... ఒక్క వాన..... ఈ మాటలను పరిశీలించి

చూసినట్లైతే రాయలసీమ రైతు నిరంతర అవిచ్ఛిన్న కృషివ్యసని అని తెలియుచున్నది. రైతంటే కేవలము పంటలు పండించేవాడు కాదని, తనచుట్టూ ఉన్న సమాజము అనగా ప్రజలు, జంతువులు, పక్షులు, ప్రాకుడు జీవరాసులు మొదలగునవన్ని బాగుండాలని కోరుకొనేవాడు రాయలసీమరైతని ఈ క్రింది మాటలను శివన్న తన భూమిని గురించి రాజారావుతో చెప్పిన సందర్భమును చూసినచో మనకు తెలియుచున్నది.

"పెద్దయ్యా ! మాకు పదెకరాల పొలముందయ్యా! అది పండిస్తే సాల్దా.... మా నాయన ఆశపోతు చేస్తాలు కాకుంటే .... బీల్లు కూడా దున్నితే కొజుపిట్టలూ, పూరేల్లూ ఎట్ల బతకాల..... కుందేల్లెట్ల కులకాల చూడ్డానికది బీడే. దాన్ని నమ్ముకొని ఎన్ని జీవాలు బతుకుతాంటయనీ..." అని రైతంటే ఏమిటో, రైతుకున్న పరమార్థమేమిటో, జీవవైవిద్యమును గూర్చి శివన్న రాజారావుకు వివరించాడు.

ఇదేవిధంగా మరోచోట రైతుకు ఇతర జీవులపట్ల ఉన్న భూతప్రీతిని ప్రకటించాడు. శ్రీను అనే యువరైతు గడ్డలితో పనిచేస్తుండగా, తనకాళ్లసందులోంచి ఏవో వెలితే, శ్రీను ఉలిక్కిపడి గంతేసాడు. అలా వెళ్లంది వాటిని గమనించిన రామిరెడ్డి - అవి కుందేళ్లే అని, ఒక్కటే ఉండదు. జతుంటాది... ఎతుకులాడు.... అని, కుందేల్లుండే ఆ పొద జోలికి పోవద్దని, బొక్కని పెద్దది జేస్తే నక్కలో, జంగుపిల్లులో జొరబడి కుందేలు పిల్లల్ని తినేస్తాయి. మనం పిల్లల్ని తగిలినా వాటి తల్లి వాటి దగ్గెరికి రాదు..." అని ఒక అనుభవమున్న రైతు శిక్షకునిగా కొత్త రైతుకు తర్ఫీదు ఇస్తూ, భూతప్రీతిని చూపేవానిగా రైతు తనను తాను ఆవిష్కరించుకున్నాడు.

రాయలసీమ రైతు శారీరకసౌష్టవం కలవాడు. పొలం పనులతో రాటుదేరినవాడు, పిక్కబలమున్నోడు, దమ్మున్నోడు అని ఈ మాటలలో చూడవచ్చు. పట్టుకుంటారంట పోలీసోల్లు... యాడ పట్టుకొనేది... నా కాల్ల సందున్నా.... ఏ పోలీసోన్నో రమ్మను... సేతిలో సెయ్యేసి పరిగెత్తుతా.... మొగోడయితే నన్ను పట్టుకోమను... అని తనకున్న దమ్మును, తన బలాన్ని తెలియజేస్తూ నరసింహం అనే రైతు తమతోటివారితో తెలియపరుస్తున్నాడు. రాయలసీమ రైతుకు అంతటి దమ్ము ఎలా వచ్చిందో గమనిస్తే, అదే నవలలో రచయిత చూపించారు. అందరూ ఉదయాన్నే అన్నం తిన్నతరువాత కూడా రాజారావు తెచ్చిన అల్పాహారాన్ని అందరూ చాలా ఆనందంగా తినడం మనం గమనించవచ్చు. అంటే రాయలసీమరైతుకు కడుపునిండా తిండి ఉండాలి. అది అరిగేంత వరకు చేతినిండా పనుండాలి. ఆ పనిలో ప్రాణముండాలి. అనగా అది రైతుపనే కావాలి అని మనకు తెలియుచున్నది.

రాయలసీమ రైతుకు వ్యవసాయము మాత్రమే జీవనమని, వ్యవసాయంలోనే జీవతముందని, వ్యవసాయము తప్ప ఇంకేపనైనా తనకు మనస్కరించదని, అతడొక నిరంతర అవిచ్ఛిన్న కృషి వ్యసని అని, మరొకరికి అన్నము పెట్టడంలోనే తను ఆనందిస్తాడని, తనతోపాటు తన చుట్టూ ఉన్నవారు కూడా బాగుండాలని కోరుకొనే వాడని పాఠకులు అర్థం చేసుకోవాలని ఈ వ్యాసం ద్వారా నా ప్రార్థన.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఒక్కవాన చాలు, నవల, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అల్పజీవి – సామాజిక జీవన చిత్రణ

– డా॥. రొళ్లు శ్రీనివాస్, తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ.

'హితేన సహితం సాహిత్యం' - అంటే హితంతో కూడినది, హితాన్ని కూర్చేది సాహిత్యం అని అర్థం. పురాణం, కవిత్వం, కథ, నవల, నాటకం, లేఖాసాహిత్యం, జానపద సాహిత్యం ఇలా ప్రక్రియ ఏదైనా ఈ సాహిత్య మంతా సమాజానికి మేలుచేకూర్చేదే. 'విశ్వశ్రేయం కావ్యం' అన్నారు పెద్దలు. సమాజానికి మేలు చేకూర్చేది మాత్రమే ఉత్తమ సాహిత్యం అవుతుంది. కాబట్టి ఉత్తమ సాహిత్యం సమాజానికి అవశ్యకం, అభిలషణీయం. ఒక జాతి యొక్క సంస్కృతి ఆ జాతియొక్క సాహిత్యంలోనూ ప్రతిఫలిస్తుంది. కాబట్టి రచయిత సామాజికి స్పృహతో, బాధ్యతతో రచనలు చేస్తాడు.

సాహిత్యాన్ని సృష్టించే కవి సమాజంలోని ఒక వ్యక్తే. సమాజంలోని విషయాలనే తన కవిత్వంలో ప్రతిబిం బిస్తాడు కవి. కవిత్వంలోని విషయాలను స్వీకరిస్తుంది సమాజం. అనగా సమాజానికి, సాహిత్యానికి అవినాభావ సంబంధం కనిపిస్తుంది. కాబట్టి సామాజిక జీవనాన్ని ప్రతి రచనలోనూ దర్శించవచ్చు.

వైదికమత పునరుద్ధరణ కోసం, వేదధర్మ ప్రచారం కోసం రాజరాజ నరేంద్రుడి ప్రేరణతో నన్నయ భారతాన్ని తెలుగులోకి అనువదించాడు. తిక్కన భారతం హరి హరాద్వైత బోధనకీ, శైవ-వైష్ణవ మత సామరస్యానికీ దోహదపడింది. శివకవుల రచనలలో శైవమత ప్రాబల్యం దర్శనమిస్తుంది. శతక రచన బహుముఖాలుగా సమాజంలో ఉండే లోటుపాట్లని విప్పి చూపించింది. సంస్కరణలకి దారితీసింది. ప్రబంధ యుగంలో భాషా సౌందర్యం వెల్లివిరియడమేకాక, అప్పటి భోగలాలసతనీ, విలాస జీవన విధానాన్నీ వ్యక్తపరిచింది. ఆధునిక సాహిత్యంలో సామాజిక తపన, మానవత్వ కాంక్ష, సమతా భావన చోటు చేసుకున్నాయి. ఏ సాహిత్య రచన అయినా ఆనాటి సమాజాన్ని ప్రతిబింబిస్తూనే ఉంది. కాబట్టి సామాజిక ప్రగతికి, మంచిని పెంపొందించడానికీ, మాన వతా విలువలు వెల్లివిరయడానికీ ఉత్తమ సాహిత్యం ఎప్పుడూ అవసరమే. మంచి సమాజం కోసం సాహిత్యం, మంచి సాహిత్యం కోసం సమాజం పరస్పరం దోహద పడతాయి.

అల్పజీవి - రాచకొండ విశ్వనాథశాస్త్రి :

అల్పజీవి నవలని రాచకొండ విశ్వనాథశాస్త్రి గారు 1952లో రచించారు. రావిశాస్త్రి గారు కథలని ఎక్కువగా రాసారు. నవలలు కొన్నే రాసారు, ఆయన రాసిన నవలల్లో అల్పజీవి ఉత్తమమైన నవల. "చిన్నవాళ్ళకి చిన్నతగువులే మహా విషమసయన్య లవుతాయి" అనే వస్తువును తీసుకుని ఈ నవల రాశాడు రచయిత. రావిశాస్త్రి గారు వృత్తి రీత్యా న్యాయవాది. తన అనుభవంలో ఎంతో మంచి వారు పిరికితనం వలన ధైర్యం లేకపోవడం వల్ల జీవితంలో ఓడి పోవడం చూసి, సమాజంలో దోపిడీకి గురి అవుతున్న సామాన్య ప్రజల కోసం అల్పజీవి నవలను రాయలనిపించింది అని రచయిత ఈ నవల ముందు మాటలో చెప్పుకున్నాడు.

1950లకు ముందే ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్‌ల సిద్ధాంతాలు ప్రపంచమంతటా విపులంగా ప్రచలితం కావడంతో అవి తెలుగు గడ్డను కూడా సోకాయి. తెలుగు నవలకారులనూ ఆకర్షించాయి. 1953లో వచ్చిన అల్పజీవి ఆ సిద్ధాంతాలను ప్రతిబింబించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. "ఈ నవల న్యూనతా భావ గ్రంథి ఆధారంగా రాయబడింది" అని అధికుల అభిప్రాయం. ఇది చాలా వరకు సబబే. రావిశాస్త్రి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తత్వ శాస్త్రం చేశారు గనుక. తత్వశాస్త్రంలో తర్కం ఒక ఆవశ్య కత పాఠం కనుక, ఆ తర్కంలో మిసెస్ నికోలస్ నికలబీ

రాండమ్ థింకింగ్‌ను గురించి రావిశాస్త్రి చదివాడు. అల్పజీవి నాయకుడైన సుబ్బయ్య ఆలోచనలో అనేక సందర్భాలలో ఇది కనబడుతుంది.

రావి శాస్త్రి గారు ఈ నవలని "చైతన్య స్రవంతి" అన్న ప్రక్రియలో రాసారు. తెలుగులో ఇలాంటి ప్రయోగం ఈ నవలతోనే మొదలయింది. రావి శాస్త్రి గారు సుబ్బయ్య అలోచనలను మన కళ్ళకి కట్టినట్టు చూపిస్తూ ఉంటారు నవలలో. ఇదొక అద్భుత దృశ్య కావ్యం అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే పాఠకులకి సుబ్బయ్య అలోచనలే కాకుండా తన చుట్టూ జరుగుతున్న సంఘటనలను కూడా శాస్త్రి గారు చాలా చక్కగా వర్ణించారు.

ఇక నవలలోకి వెళ్తే సుబ్బయ్య కథానాయకుడు. ఈ సుబ్బయ్య మన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్నటువంటి సగటు మనిషి. ఈ సుబ్బయ్య గురించి అందరూ పలు రకాలుగా అనుకుంటూ ఉంటారు. "సుబ్బయ్య ఒట్టి నంగిరి పింగిరి గాడు" అని చుట్టుపక్కల వాళ్ళు అనుకుంటారు. "మా ఆయన ఏమీ చేతకాని మనిషి" అని సుబ్బయ్య భార్య అనుకుంటుంది. "మా నాన్న వెర్రి బాగులవాడు" అని పిల్లలు అనుకుంటూ ఉంటారు. ఇలాంటి సుబ్బయ్య మంచి ప్రభుత్వ ఉద్యోగమే వెలగబెడుతున్నాడు. "సుబ్బయ్య కాక మరొకరు ఆ కుర్చీలో ఉంటే బల్ల కింద, పైనా బాగా సంపాయించే వాళ్ళే!" అని కూడా ఆఫీసులో ఉండే తోటి ఉద్యోగులు అనుకుంటూ ఉంటారు.

అందరూ అనుకున్నట్టే సుబ్బయ్య పిరికివాడు, మంచివాడు కూడా. ఏ నిర్ణయం గట్టిగా తీసుకోలేక సతమతమవుతూ ఉంటాడు. అలాంటి సుబ్బయ్య బావమరిది వెంకట్రావు బాగా గడుసుపిండం. జమీందారు వంశంలో పుట్టి ఆస్తిని హారతి కర్పూరంలా కోల్పోయి, నోటి దురుసు తనం, లౌక్యంతో ఎలాగో నెట్టుకు వస్తూ ఉంటాడు. సుబ్బయ్య బావమరిది కోసం కంట్రాక్టరు గవరయ్య దగ్గర అయిదు వందలు అప్పు చేస్తాడు. వెంకట్రావుకు ఇస్తాడు. కానీ అతను అప్పు తీర్చడు, గవరయ్యేమో అప్పు తీర్చమని సుబ్బయ్యను బెదిరిస్తుంటాడు. అప్పటి వరకు ఆఫీసులో తన పని తను చేసుకునే సుబ్బయ్య జీవితం అల్లకల్లోలం అవుతుంది. నవలంతా అల్పజీవి అయిన సుబ్బయ్య మానసిక సంఘర్షణతో సాగుతుంది.

సుబ్బయ్య పిరికి వాడుగా ఉండడానికి కారణాన్ని రచయిత బాగా సృష్టించారు. ఈ నవల గొప్పతనమంతా సుబ్బయ్య అంతర్మథనమే! ఒక్కొక్కసారి ఈ సుబ్బయ్య మీద మనకి జాలి కలుగుతుంది. అలాగే ఇంకొకసారి ఇతని చేత కాని తనం చూసి కోపం కూడా వస్తుంది. మంచితనం, పిరికితనం ఒకచోట ఉండలేవు అని రావి శాస్త్రి గారు ఈ నవలలో మనకి చెప్తారు.

అల్పజీవి నవలను న్యూనతాభావ కోణం నుంచి పరిశీలిస్తే బాగుంటుందనిపిస్తుంది. ఆ నవలకు 'అల్పజీవి' అనే పేరు అతికినట్లు అనిపిస్తుంది. పుట్టినపుడు ప్రతి ఒక్కడూ అల్పుడే. శారీరకంగా, మానసికంగా, శక్తిపరంగా, అన్నిట్లోను పెద్దవాళ్లతో పోల్చినపుడు పిల్లలు అల్పులే. అందుకని ప్రతి పిల్లవాని జీవితం న్యూనతా భావనతోనే ఆరంభమవుతుంది. అయితే పిల్లవాడు ఎదగడంలో, సామాజిక కారకాల దోహదంతో అంటే తల్లి తండ్రి, ఇరుగు పొరుగు, సమవయస్కులు, గురువులు కల్పించే దోహదంతో ఆ న్యూనతా భావాన్ని అధిగమిస్తాడు. ఈ ఎదుగులలో చాలామందికి విజయమే చేకూరుతుంది. కొంతమంది సుబ్బయ్యలాంటివారు కొన్ని చిన్ననాటి అనుభవాలతో కుంఠితులై అక్కడే స్థిరపడిపోయి బాధ పడుతుంటారు.

గుమస్తా జీవుల అనర్థ బతుకులు :

రావిశాస్త్రి అల్పజీవి నవల రాయకముందు వెయ్యి మంది గుమస్తాలతో కలిసి పనిచేశాడు. గుమస్తాలు ఎలా ఉంటాలో అతనికి బాగా తెలుసు. మన దేశంలోని బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెకాలే విద్యావిధానం వల్ల డిగ్రీ చదువులు అన్నీ గుమస్తాలను తయారుచేయడానికే అన్నట్లు ఉన్నాయి. ఉద్యోగం కోసం చదువు. చదివేదంతా

ఉద్యోగం కోసమే. పొద్దున తొమ్మిదింటికి ఆఫీసుకు వెళ్లడం. గొడ్డులా చాకిరీ చేయడం. సాయంత్రం ఇంటికి తిరిగి రావడం. నిద్ర పోవడం. మళ్లీ తిరిగి ఆఫీసుకు వెళ్లడం. నెల తిరిగే సరికల్లా వచ్చిన నాలుగు డబ్బుల్తో వెచ్చాలు తెచ్చుకోవడం. గుట్టుగా సంసారం నెట్టుకు రావడం. చిన్న చిన్న అవస్థలు వస్తే ఇబ్బంది పడటం. పెద్ద పెద్ద అవస్థలే తట్టుకోలేకపోవడం. ఇలా ఒక సురక్షితమైన జీవితానికి అలవాటు పడతారు గుమస్తాలు. దీనికి భిన్నంగా ఏది జరిగినా భయపడతాడు. హడలెత్తి పోతాడు. జీవితాంతం పరాన్నభుక్కుగా గడిపేయడం. ఉద్యోగం పోతే ఇక బతకలేని పరిస్థితికి చేరుకోవడం.

సుబ్బయ్య ఐదువందలు కాంట్రాక్టర్‌ని అడిగేశాడు. చేబదులు అన్నట్టుగా అడిగాడు. కాని అది లంచం. అతడు చేబదులే అన్నట్టుగా ఇచ్చాడు. ఇచ్చిన ఐదు వందలు బావమరిదికి ఇచ్చాడు. కాని, ఆ వెంటనే సెక్షన్ కూడా మారిపోయింది. తనకు ఇవ్వకుండా ఒక్కడే డబ్బులు తీసుకుంటున్నాడని హెడ్ క్లర్క్ సుబ్బయ్య సెక్షన్ మార్చాడు. తన పని చేయకపోవడం వల్ల దక్షిణ అని ముట్టజెప్పిన కాంట్రాక్టర్ గవురయ్య తన డబ్బులు ఇవ్వ మని బెదిరిస్తాడు. ఐదువందలంటే చాలా పెద్ద మొత్తం. ఏం చేయాలో బోధపడదు. సుబ్బయ్య భయపడి పోయాడు. గవురయ్య దుర్మార్గుడు. పుచ్చుకున్న బావ మరిది అవకాశవాది. తానేమో పిరికివాడు. ఎలా? సుబ్బయ్య హడలిపోతాడు. పారిపోవడానికి ప్రయత్నిం చాడు. కాని ఎక్కడికని పారిపోలేడు. ఇలా పిరికితనంతో సుబ్బయ్య బాధపడతాడు.

ఈ భయం నరాల్లోకి ఎక్కి దేహం అంతా వ్యాపించి భయస్తుడిగా, పిరికివాడు మారిపోతాడు సుబ్బయ్య. ఆ పిరికితనంతో తనలోతాను కుంచించుకుపోతాడు. ఎవరినీ ఏమి అనలేని స్థితికి చేరుకుంటాడు. ఇంట్లో భార్యతో ధైర్యంగా మాట్లాడడానికి జంకుతాడు. ఆఫీసులో తనని ఏడిపించిన హెడ్ క్లర్క్‌ని ఎదిరించడానికి భయపడతాడు. చివరికి కూరగాయలవాడితో బేరమాడ్డానికి కూడా భయపడి వాడు ఏది ఇచ్చినా తీసుకుంటాడు. పిల్లలకు ఏమైనా చెప్పడానికి కూడా భయపడతాడు. ఇతరులు ఏ తప్పు పనిచేసినా ఏమీ అనలేని పరిస్థితికి చేరుకుంటాడు. అధికారం అంటే భయం. పోలీసులంటే భయం. కోర్టులంటే భయం. హాస్పిటల్స్ అన్నా భయమే. ఆఫీసులో బిల్స్ క్లియర్ చేసే పని అతనిది. బావమరిది ఇది గమనించాడు. ఎవరి బిల్లు క్లియర్ చేయాలో వాడి దగ్గర ఐదు వందలు అడిగి తనకు ఇమ్మన్నాడు. ఇలా చేయకూడదు. కాని సుబ్బయ్యకు వేరే దారి లేదు. అడుగుతున్నది బావమరిది. బావమరిదిని ఎదిరించే ధైర్యం కూడా లేదు. చెప్పిన పని చేయకపోతే చేతగాని వాడంటారు.

కాంట్రాక్టర్‌ను ఎదిరించడం చేతగాని గుమాస్తా. అయితే అప్పుడప్పుడు కొంత వెలుతురు వస్తుంది. కొంత మార్చ ప్రయత్నిస్తుంది. సుబ్బయ్య జీవితంలో కూడా అలాంటి వెలుతురు వచ్చింది. ఒక స్నేహితురాలు పరిచయమైంది. ఆమె అతణ్ణి ఆదరించింది. ఊరడిం చింది. పవిటతో నుదుటి చెమట తుడిచి కొంచెం ధైర్యంగా ఉండమని ధైర్యం చెప్పింది. కాని ధైర్యంగా ఉండటానికి సుబ్బయ్యకు ధైర్యం కావాల్సి వచ్చింది. అతడు ఆలోచిస్తూ ఉన్నాడు. అతడే కాదు దేశంలోని గుమస్తాలందరూ ఆ ధైర్యాన్ని ఇంకా అందుకోవలసి ఉంది.

ధైర్యం ఉంటేనే మిగతా సద్గుణాలుంటాయి. ధైర్యం లేకపోతే ఎన్ని సద్గుణాలున్నా అవి రాణించవు, పిరికి వారెవరూ కూడా మంచివారు కాజాలరు, మంచికి నిలబడ లేరు. మంచిగా ఉండాలంటే గుండె నిబ్బరం చాలా ఉండాలని రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి అభి ప్రాయం.

న్యూనతాభావం :

బాల్యంలోని భిన్న పరిస్థితుల వల్ల వ్యక్తిలో ఆత్మ న్యూనత ఏర్పడుతుందని ఆడ్లర్ సిద్ధాంతీకరించాడు. అతని సిద్ధాంతం ప్రకారం బాల్యంలో విపరీతమైన

గారాబం అనుభవించిన వారు, అతి నిర్లక్ష్యానికి గురయిన వారు, అంగవైకల్యం ఉన్నవాడు న్యూనతాభావంతో బాధపడుతుంటారు. బాల్యంలో ఇటువంటి పరిస్థితులు ఎదురైన వ్యక్తి అనంతర జీవితంలో తనకు తటస్థపడిన అవకాశాలను, సర్వ ప్రపంచాన్ని అపనమ్మకంతో తిలకిస్తాడు. తనను ఏకాకిగా భావిస్తాడు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సన్నివేశంలోనూ అతి జాగ్రత్త ప్రదర్శించి కష్టాలను ద్విగుణీకృతం చేసుకుంటాడు.

అల్పజీవి నవలలో సుబ్బయ్య ఇటువంటి పరిస్థితికే గురవుతాడు. సుబ్బయ్యలో ఆత్మన్యూనత పెరగడానికి కారణాలను ఈ విధంగా చెప్పుకోవచ్చు. తల్లి ప్రేమ ఎరగక పోవడం. ఇతరులకు తల్లి ఉండి, తమకు లేకపోవడం ఒక కొరతను, న్యూనతను కలిగిస్తుంది. సవతి తల్లి నిర్లక్ష్యం వల్ల కూడా సుబ్బయ్యలో న్యూనతా భావం ఏర్పడడానికి కారణమైంది. అమె కొంతకాలమే అతని జీవితంలో ఉన్నప్పటికీ అతనిలో ఆమె కలిగించిన న్యూనతా, భయం అతన్ని ఎప్పటికీ వీడిపోకుండా చేశాయి. భార్య సావిత్రికి సుబ్బయ్య పట్లగల చులకన భావం కూడా దీనికి దోహద పడింది. జమీందారి వంశానికి చెందిన సావిత్రికి సుబ్బయ్యపట్ల వివాహానికి ముందు నుంచీ చిన్నచూపే. బాల్యంలో సుబ్బయ్య కళ్ళెదుటే తన తండ్రి చావుదెబ్బలు తినడం, తండ్రి ఆత్మరక్షణ చేసుకోలేకపోవడం అన్న సన్నివేశం కూడా అతనిలో న్యూనతా భావం పెరగడానికి కారణమైంది. ఇక ఆఫీసులో తోటి వ్యక్తులు తన పట్ల వ్యక్తం చేసిన అభిప్రాయాలు 'సుబ్బయ్య ఈజ్ ఇనెఫిషియెంట్, సుబ్బయ్య నంగిరిపింగిరిగాడు' వంటి అభిప్రాయాలు అతనిలో న్యూనతను పెంచాయి.

ఒక ఐదు వందల మొత్తం! సుబ్బయ్య జీవితంలోని ప్రశాంతతను అంతా సర్వనాశనం చేసేసింది. అతడిలోని పిరికితనమే అతణ్ణి సర్వనాశనం చేసేసింది. ఎప్పుడూ ధైర్యంగా వ్యవహరించలేదు.

రావిశాస్త్రి 1953లో రాసిన నవల 'అల్పజీవి'. పిరికి తనంతో బతుకులీడ్చే మధ్యతరగతి వర్గం మీద, గుమస్తా మనస్తత్వాలతో కునారిల్లుతున్న మధ్యతరగతిలోని ప్రధాన వర్గం మీద ఆయన కొట్టిన కొరడా దెబ్బ ఇది. ఆయన బాధ ఏమిటంటే చదువుకోని వారు ఎలాగూ చస్తున్నారు. బాగా చదువుకున్నవారు లొసుగులు లోపాలను ఉపయోగించి ఎక్కడికో చేరుతున్నారు. కాని ఈ గుమస్తాలే- ఈ అపసవ్యతను తొలగించాల్సిన బాధ్యత ఉన్న ఈ గుమస్తాలే ఆ బాధ్యత నుంచి దూరంగా తొలగిపోతున్నారు. మనిషి పిరికితనం దాటాలని రావిశాస్త్రి కోరిక. ధైర్యలక్ష్మి ఉంటేనే తక్కిన లక్ష్ములన్నీ ఉంటాయని ఆయన ఈ నవలలో చెప్పదల్చుకున్నారు. లక్ష్ములు కావలసింది వ్యక్తిగతానికి కాదు. సమాజానికి. దేశానికి. ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్ అని గురజాడ అన్నది అందుకే.

అమాయకత్వం, అజ్ఞానం, సోమరితనం, బలహీనతలను అధిగమించలేకపోవడం వల్ల, పరిస్థితుల ప్రభావం వల్ల పిరికివాళ్ళుగా తయారవుతారు. పిరికివాన్ని కన్న తల్లికూడా అసహ్యించుకుంటుంది. పిరికిగుణం ఉన్న సమాజం పైకి రాదు. పిరికి గుణం వల్లే మధ్యతరగతి పైకి రావడం లేదు. ఈ మాటను పదే పదే చెప్పడానికి ఇష్టపడ్డారు రావిశాస్త్రి. సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న భయస్తులు, పిరికివాళ్ళ స్వభావాన్ని మార్చడానికి, ధైర్యంగా వ్యవహరించాలనీ రావిశాస్త్రి ఈ నవలలో ఆకాంక్షించాడు రావిశాస్త్రి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రపంచీకరణ సాహిత్యం – సామాజిక జీవన విధ్వంసం

– డా॥. సింగర కొషి, సహాయ ఆచార్యురాలు, తెలుగు శాఖ, డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ ట్రిపులైటి, ఆర్.జె.యు.కె.టి., ఒంగోలు.

కారల్ మార్క్స్ రచనలు 20వ శతాబ్ది పూర్వభాగంలో నవతరానికి కొత్త ఆలోచనల్ని రేకెత్తించాయి. సమాజాన్ని సంస్కరించి దానికి తగు రీతిలో నడిపించే విధంగా సాహిత్యం ఉండాలని, దానికి సాహిత్యం సముచిత బాధ్యత స్వీకరించాలని ఆధునిక యుగం భావించింది. తెలుగులో లిఖిత వాఙ్మయం ప్రారంభమైన తొలిరోజుల నాటి పరిస్థితులు వేరు. ఆధునిక యుగం సంతరించి పెట్టిన వాతావరణం అందుకు పూర్తి భిన్నం. కవిత్రయ కాలంలోనూ, ప్రబంధ, క్షీణప్రబంధ యుగాల్లో కూడా సాహిత్యానికి, సమాజానికి మధ్య అంత గొప్ప సంబంధాలు లేవు. కాని ఆంగ్లేయుల రాకతో సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల వల్ల ఆదాన ప్రదానాలు అధికమయ్యాయి.

యూరప్ ఖండంలో సంభవించిన పారిశ్రామిక విప్లవం, దానికి బలాన్ని చేకూరుస్తూ సాహిత్యం పోషించిన పాత్ర యొక్క గొప్పతనాన్ని ఆధునిక యుగం గ్రహించింది. సాహిత్యం ఒంటరిగా ఉండాల్సిన అవసరం లేదని, సామాన్య జనజీవన స్రవంతిలో మమేకం చేయవచ్చునని భారతీయ ఆధునిక సాహిత్య మేధావులు గుర్తించారు.

"కళ కళ కోసమే" అనే అస్కార్డ్ వైల్డ్ భావంలో నిజం లేదనీ, కళ సమాజం కోసం రూపొందాలనీ అత్యధికులు భావించారు. "సాహిత్యం ఎవరి కోసం" అనే చర్చ మొదలైంది. ఇందుకు అవసరమైన రీతిలో మార్క్స్ తాత్విక సిద్ధాంతాలను స్వీకరించింది. ఏ విధంగా చెప్పాం అంటే పద్యం, గేయం, వచనం అనేది ప్రధానం కాదు. ఏమి చెబుతున్నామనే విషయమే కీలకమని నవ్యతరం భావించింది. రాజకీయ, సామాజిక, సాహితీ సాంస్కృతిక లోకాల్లోనూ, తగు మార్పులు రావాలని ఆశించింది. సహజంగా తెలుగు రచయితలు కూడా ఇందుకు సానుకూలంగా స్పందించారు. అందుకే మన తెలుగు సాహిత్యంలో అనేక ధోరణులు, ప్రక్రియలు, వాదాలు ప్రవేశించాయి. ఏదిఏమైనా కవులు, కళాకారులు సమాజంలోని అనేక కోణాలను పరిశీలించారు. తమదైన శైలిలో వ్యక్తీకరించారు. భావకవిత్వం, అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీ, దళితవాద కవిత్వాలతో పాటు బహుజన, ప్రాంతీయ, ముస్లింవాద, ప్రపంచీకరణ సాహిత్యం వెలువడింది. వీటిలో ప్రపంచీకరణ సాహిత్యం ఒక ప్రత్యేకమైంది.

బిసి వాద, మైనార్టీ, దళిత, ప్రాంతీయ కవిత్వంలో వారివారి సమస్యలను వ్యక్తం చేశారు. అయితే ప్రపంచీకరణపై అందరూ స్పందించారు. ఎందుకంటే ఈ ప్రపంచీకరణ ప్రభావం అన్ని రంగాలపై, అన్ని వర్గాలపై పడింది. ఈ ప్రపంచీకరణను ఎల్.పి.జి. అని ఆంగ్లంలో వ్యవహరిస్తారు. ఈ ఎల్.పి.జి. ప్రభావంపై అన్ని వర్గాల ప్రజలు, కవులు, రచయితలు తమ గళాన్ని విప్పారు. ప్రపంచీకరణ మన భారతదేశంలోకి ఎలా ప్రవేశించిందో పరిశీలిద్దాం.

20వ శతాబ్దం ప్రారంభంలో సోవియట్ రష్యాలో 70 ఏళ్ల చరిత్రగల వామపక్ష ప్రభుత్వం కూలి పోయి రష్యా ముక్కలైంది. తూర్పు, పశ్చిమ జర్మనీలను వేరుచేసిన బెర్లిన్ గోడ నిర్మూలింపబడింది. అగ్రరాజ్యాలలో ఒకటైన రష్యా పతనమై అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా అవతరించింది. అప్పుడు డంకెల్ ప్రతిపాదన ముందుకు వచ్చింది. గాట్ ఒప్పందం జరిగాయి. భారత దేశం కూడా దానిమీద సంతకం చేసింది. ఫలితంగా ఎల్.పి.జి. వ్యవస్థ (లిబర్ లైజేషన్, ప్రైవటైజేషన్, గ్లోబలైజేషన్) అమలులోకి వచ్చింది. ప్రపంచీకరణ అనేది పెట్టుబడిదారి దేశాల అనుకూలమైంది. ఇది భారతదేశంలోకి బలంగా చొచ్చుకు వచ్చింది.

దీనివల్ల కొన్ని మేళ్ళు అనేక కీళ్ళు సంభవించాయి. వ్యవసాయ సంక్షోభం సృష్టించింది. విద్యారంగాన్ని మార్కెట్టుగా మార్చింది. ఉపాదిరంగాల్ని కుదేలు చేసింది. జీవితం ఒక అంగడి సరుకుగా మారింది. మానవత్వం మంట గలిసింది. అవినీతి పెచ్చుమీరిపోయింది. స్థానిక, భాషా సంస్కృతులు ధ్వంసమయ్యారు. పాలకులే ప్రపంచీకరణ సంస్కరణలను ముందుండి నడిపించారు.

ప్రపంచీకరణవల్ల అనేక దుష్పరిణామాలు కలిగాయి. ప్రపంచీకరణను తెలుగు కవులందరూ వ్యతిరేకించినవారే. దాని విధ్వంసాన్ని గత రెండు దశాబ్దాలుగా తెలుగు కవులు ఎలుగెత్తి చాటారు. దీనిపై అనేక కావ్యాలు, కవితలు వెలువడ్డాయి. కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి "దుక్కి చూపు" కావ్యంలో వ్యవసాయ విధ్వంసాన్ని అధిక్షేపించారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలు గుట్టును రట్టు చేశారు.

మట్టిని మచ్చిక చేసే మావటీణ్ణి
ప్రపంచీకరణ మదపు టేనుగుతో తొక్కించాక
సైబర్ సైతానుతో రక్కించాక
సంస్కరణలన్నీ శాడిజం సింబల్ కాబోతున్నాయి
(దుక్కిచూపు పుట 8)

ప్రపంచీకరణ పుణ్యమా అని నీళ్ళు కూడా వ్యాపార సరుకై పోయాయి. ఎన్.గోపి జలగీతం అనే కావ్యంలో నీటి వ్యాపారాన్ని తీవ్రంగా విమర్శించారు.

బహుళ జాతి పరిశ్రమలారా
సమస్త జలాన్ని సీసాల్లో నింపండి
పేదవాడి నోటిలో దాహాన్ని కొట్టండి
(జలగీతం పుట 63)

"నారాయణస్వామి" చెరువు కేమయింది" (అరుణ తార, ఏప్రిల్ 2006) కవితలో ప్రపంచీకరణ చేసిన ప్రకృతి పర్యావరణ విధ్వంసాన్ని చిత్రించారు.

కుక్క గొడుగు లెక్క
మొలచిన గ్రానైట్ కంపెనీలు
చెరువు కేమైందో
యెప్పుడూ చెప్పవు
(అరుణ తార, ఏప్రిల్ 2006)

కొల్లేరు విధ్వంసాన్ని సజ్జావెంకటేశ్వర్లుచిత్రించారు. కొల్లేరు సరస్సు ఆక్రమణదారులు చేసిన దుర్మార్గాలను తన కవిత ద్వారా ఎండగట్టారు. "కొల్లేటి గాయాలు" కవితలో

కొల్లేరు పొదుగులోని
అమృతనాన్ని హతమారుస్తూ
అమృతనానికి రాళ్ళు వేస్తూ
కట్టలు కట్టలుగా సంతకాలు చేసి
కొప కొల్లేరుగా మార్చిందెవరు"
(నేటి నిజం 22.06.2006)

అద్దేపల్లి రామమోహన్‌రావు "పొగచూరిన ఆకాశం" వంటి అనేకం కావ్యాలు వచ్చాయి.

ఇకపై కృషీవలుని చుట్టూ
కందకాల్లా కొత్త వలయాలు
కాడికి కంప్యూటర్, పాడి కీబోర్డు
వెబ్‌సైట్‌లో విత్తడం
ఇంటర్‌నెట్‌లో అమ్మకం
అంతా గ్లోబలైజేషన్
సాగుభూముల్లో తొండ గుడ్లు
(అంకురస్పర్శ - పుట 20)

ఎస్వీ సత్యనారాయణ...

పాలకులారా
నినాదాల్లోంచి బయటపడి
నిజాల్లోకి దిగండి
రాజకీయాలు పక్కనబెట్టి
రైతు రాజును బతికించండి
(జీవితం ఒక ఉద్యమం - పుట 50)

అని ప్రబోధించాడు.

ఎన్ని ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు కట్టామన్న
కానేకాదు క్లైటీరియా
ఎన్ని ఫ్లైఓవర్లూ, స్టేడియంలూ నిర్మించామన్నదే
నేటి జాతీయ సమస్య

(జీవితం ఒక ఉద్యమం - పుట 62)

అంటూ ప్రపంచీకరణ, ప్రభుత్వాలను ప్రజాప్రాతినిత్య కార్యక్రమాల నుండి దూరం చేయడాన్ని కూడా ఆయన అధిక్షేపించారు.

ఇటీవల అద్దెతల్లుల హడావిడి ఎక్కువగా ఉంటున్నది. అలాగే అన్పత్రులలో పుట్టిన ఆడబిడ్డల్ని మాయచేయడం ఎక్కువైంది. దాని మీద ఎన్.అరుణ ఇలా అధిక్షేపించారు.

రక్తాన్ని అమృతంగా మార్చి
పాలిచ్చే అమ్మతనాన్ని కూడా
అమ్మకానికి పెడుతుంది
ఈ గ్లోబలైజేషన్ మార్కెట్

(అమ్మబన్ మనిషి - పుట 40)

రాజారం అతడే ఒక కావ్యంలో ప్రపంచీకరణ వల్ల కుమ్మరి, రైతు, చేనేత కార్మికుడు, చర్మకారుడు ఎలా బతుకును పోగొట్టుకున్నారో అందంగా ఆవిష్కరించారు. ప్రపంచీకరణ వల్ల చర్మకారుడు 'గోనెపట్టా జింక్ చర్మం మీద ఆకలి జపం చేస్తున్నా' అన్నారు (రాజారాం అతడే కావ్యం - పుట 16).

మట్టిపాత్రలు చేసే కుమ్మరిని
సిల్వర్, స్టీల్ ఫ్రిజ్ కూలర్ వంటివి
వచ్చి అతని బ్రతుకును
భళ్ళున పగిలిన బాన"ను చేశాయి అన్నారు.

జూలూరి గౌరిశంకర్ "నాలుగోకన్ను" లో ప్రపంచీకరణ గూర్చి చెబుతూ

"ఈ సరికొత్త ప్రపంచీకరణ
నామట్టి నుంచి నన్ను వేరు చేస్తున్నది" అన్నారు.
"ఆధిపత్యం మరో పేరే ప్రపంచీకరణ
అగ్రవర్ణపు భావజాలపు మారురూపే ప్రపంచీకరణ"
అన్నారు

(నాలుగోకన్ను - పుట 10)

ఈ విధంగా వ్యవసాయం దాని అనుంబంధ వృత్తులను, అమ్మతనాన్ని అన్నింటి మీద ఈ ప్రపంచీకరణ ప్రభావాన్ని కవులు ఎత్తి చూపారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ
2. జలగీతం - ఎన్. గోపి
3. దుక్కిచూపు - కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
4. విమర్శ 2009 - రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
5. వార్తా పత్రికలు
6. అంతర్జాలం

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వచన కవిత్వంలో స్మృతి – సామాజికత

– సుంకర గోపాలయ్య, తెలుగు శాఖాధ్యక్షులు, పీఠికాపురాధిశ ప్రభుత్వ కళాశాల, కాకినాడ.

సమాజం అనేక వ్యక్తుల సమాహార. వ్యవసాయం, వృత్తిపనులు, సేవారంగం, జర్నలిజం ఇలా అనేక రంగాలలో తమ వంతు కృషి చేసిన వ్యక్తులు ఉన్నారు. అలాగే శాస్త్ర పరిశోధనలద్వారా సాంకేతికతను, ఆధునికతను అందుబాటులోకి తెచ్చే శాస్త్రవేత్తలు, ఆటల ద్వారా దేశ ప్రతిష్ట పెంటే ఆట గాల్లు ఇలా అనేక విషయాలలో వ్యక్తులు ఆదర్శంగానిలిచే వాళ్ళు ఉంటారు. అటువంటి వ్యక్తుల్ని కోల్పోయినపుడు, కవులు స్మృతులు రాశారు. అలాంటి స్మృతి కవితల్ని ఈ అధ్యాయంలో పరిశీలిద్దాం.

ఆధునిక యుగంలో వేగం సంతరించుకోవడానికి పారిశ్రామిక విప్లవానికి ఎంతో మంది శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ఆలంబనలు. శాస్త్రవేత్తలు కనిపెట్టిన విషయాలు వలన విప్లవాత్మకమార్పులు సంభవించాయి. శాస్త్ర వేత్తలు ప్రపంచ సంపద. మన దేశానికి చెందిన కల్పనాచావ్లా గొప్ప అంతరిక్ష శాస్త్రవేత్త. అంతరిక్ష పరిశోధనలో భాగంగా నింగిలోకి వెళ్లిన ఆమె, తిరిగి నేలకు రాలేదు. ఆ పరిశోధనలో భాగంగా ఆమె ప్రాణాలు కోల్పోయింది. ప్రపంచం నివ్వెరపోయింది. మన దేశం కూడా దిగ్ర&భంతికి గురైంది. ఆమె స్మృతిలో తెలుగు కవులు కవితలు రాశారు.

ఎమ్మెస్ సూర్యనారాయణ అనే కవి "కల్పనా రోహిణి" అనే కవితలో రాశారు. 'ఆకాశంలో సగం' స్త్రీలు అంటారు. కానీ 'కల్పన' మహోన్నతంగా విస్తరించేందుకు గొప్ప ప్రయత్నం చేసిందని కొనియాడారు.

శూన్యంలో
సగం వాటా కోసం కాదు
మహాకాశంలో
మహోన్నతంగా
విస్తరించేందుకే
పరితపించి వుంటావు!
జీవితాన్ని అర్థవంతం చేసేందుకే
నిన్ను నువ్వు నిరూపించుకుని వుంటావు

(శబ్దభేది, పుట.33)

ఇంకా కవి 'కల్పన' చిన్నప్పటి నుండి చూసిన చుక్కల లోకాన్ని అందుకునే క్రమంలో ప్రాణాలు వదిలింది. చుక్కల గౌను తీసుకుని కన్న కల 'తేలిక' పడిందని బాధ పడ్డారు.

కల్పనా!
చిన్నప్పుడు నువ్వు
చుక్కల గౌను వేసుకున్నప్పటి నుంచీ
చుక్కల లోకం
చూద్దామనుకుని వుంటావు!
అద్భుత అంతరిక్ష కల్పనా...
ఎంత" తేలిక పడ్డావు!

(శబ్దభేది, పుట.33)

శిఖామణి కల్పన స్మృతిలో రాసిన కవిత 'గగన కుసుమం' ఇది కూడా చాలా ఉదాత్తమైన కవిత. దాదాపు 50 పాదాల కవిత. శిఖామణి కవిత 'ఎత్తుగడ'లో మామూలుగా ప్రారంభించినా... ముగింపులో గొప్ప చాతుర్యం ప్రదర్శిస్తాడు. ఈ కవిత ప్రారంభంలో కవి, కల్పనని... దిరిసిన పువ్వుగా, లేలేత చెంగల గరికపోచగా, మాఘమాసపు మధ్యాహ్నవేళ నేలరాలే పసుపు పచ్చ గన్నేరు పువ్వుగా చెప్పుకొస్తాడు. అంటే 'స్త్రీ' అంత సున్నితమైనదని కవి బావం. కానీ కల్పన రోదసిమెట్లు ఎక్కింది. అప్పుడు కవికి కల్పన 'వజ్రవనిత'గా కనిపించింది.

నువ్వు
ఉత్త దిరిసెన పువ్వులే

అను కున్నాను
శీతాకాలపు
పొద్దు పొడుపువేళ మంచు ఆవిరికే
శిరసు శిఖరాగ్రం వొంచే
వేవేలు చెంగల గరిక పోచవే అనుకున్నాను
... ...
కానీ విశ్వరహస్యాలను ఛేదించడానికి
ఆత్మ విశ్వాసమే చోదక శక్తిగా
నీవు రోదసి మెట్లు ఎక్కుతున్నప్పుడు
నీలో అజేయమూ అమేయమూ అయిన
వజ్రవనితను చూశాను
(నల్లగేటూ నంది వర&ధనం చెట్టు, పుట.14-15)

ఎల్లలు లేని ఆకాశంలోకి కల్పన వెళ్లాలనుకుంది. పెంజీకట్ల కావలకు ప్రయాణం కట్టింది. రోదసిలో విహరించి, నేలపై సగర్వంగా అడుగుపెట్టాలని ఆశించింది. భార రహిత వాతావరణంలోకి వెళి&ళన 'కల్పన' దుఃఖభారాన్ని మిగిల్చిందని కవి ఆక్రోశించాడు.

కళ్ళనిండా ఆశ్చర్యంతో
దోసిళ్ళ నిండా పూల గుత్తులతో
మేం నీ రాక కోసం ఎదురు చూస్తుంటే
నువ్వు వినువీధిని అనంతశయ్యను చేసుకుని విశ్రమించావు
మాకు ఎప్పటికీ అందని గగన కుసుమం అమ్మావు
ఏ అపరాత్రి వేళో
రహస్యంగా
నేలకు జాలువారే వెన్నెల సానలో
నీ కన్నుల కాంతిని పోల్చుకుంటాం
వర్షాకాలపు
సోమరి సాయంకాలపు నీ రెండ వేళ
ఇలకు వొంగే ఇంద్ర ధనస్సులో
నీ మృదు దరహాసాలను చూస్తాం
(నల్లగేటూ నందివర&ధనం చెట్టు, పుట.15-16)

దేశమంతా ఆమెకోసం ఎదురు చూసింది. కానీ ఆమె ఆకాశ విధిని 'మరణశయ్య'గా చేసుకుంది. గగన కుసుమంగా మారింది. వెన్నెలసానలో సాయంకాలపు నీ రెండ వేళలో కిందకు వంగే హరివిల్లులో నీ జ్ఞాపకాలన్ని వెతుక్కుంటాయని కవి ఆశిస్తున్నాడు. ఇక ముగింపులో కవి

ఇప్పుడు
ఆకాశంలో సమూల
ఏ తార తళుక్కుమన్నా
మా కల్పనా చావ్లాయే అనుకుంటాం
(నల్లగేటూ నందివర్ధనం చెట్టు, పుట.16)

మరణించిన వారంతా... ఆకాశంలో నక్షత్రాలుగా మారుతారని బాల్యంలో... పెద్దలు చెప్పిన విషయాన్ని కవి ఇక్కడ ఆవిష్కరించాడు. అందుకే అంతరిక్షంలోని కొన్ని కోట్ల తారకలలో కల్పన చేరింది. ఇప్పుడు ఏ తార మెరిసినా అది కల్పన చావ్లాయే' అని కవి భావిస్తున్నాడు.

కవయిత్రి చిల్లర భవాని దేవి కల్పన స్మృతిలో రాసిన కవిత 'ఓతారకా'. కల్పన చావ్లా అంతరిక్ష ప్రయాణం పదహారు రోజులపాటు సాగి, ఆ రోజు భూమికి చేరుకోబోతుంది. అనే ఆనందం అందరిలోను వెల్లివిరిసింది కానీ దురదృష్టం వెక్కిరించి, ఆమె దుర్మరణం చెందింది.

ఆకాశంలో... పేగు బంధానికి దూరంగానా...
విజయోత్సవం...
పదహారు రోజుల పాటు
ఆనందాల వెల్లువగా
భూమాత కౌగిట్లో వాలేందుకు తపించిన క్షణం
నీటి బుడగలా మాయం
(భవాని కవిత్వం-2, పుట.33)

అంటూ కవయిత్రి 'కల్పన' ను స్మరించికుంది. 'కల్పన'లానే 'కల్పనా చావ్వా' జీవితం ముగిసిందని ఆవేదన చెందింది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆధునిక కవిత్వంలో దగాపడిన దళిత జీవన చిత్రణ

– డా॥. తరపట్ల సత్యనారాయణ, తెలుగు శాఖాధ్యక్షులు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమండ్రి.

ఏ ముహుర్తాన ఆ ముసలివాడైన బ్రహ్మపాదం నుండి చీల్చుకుని శూద్రవర్ణంలో నాల్గవ కులస్తుడిగా ఈ అశుద్ధభారత ధాత్రిపై పడ్డాడో, అప్పటి నుండి మనుకణ నిర్మితమైన అధర్మ మనుధర్మ శాస్త్ర పాలనలో దాస్యానికి ప్రతీకగా సవర్ణుల సేవలకు సదాస్మరామి అంటూ నాల్గు పడగల హైందవ నాగరాజు విషపు కోరల కింద భయం భయంగా జీవనాన్ని కొనసాగిస్తుంటే అక్కడితో ఆగకుండా మనిషికాని మనిషిగా పశువుకన్నా హీనంగా నిషిద్ధ జీవిగా నిశీధి బ్రతకులను నుదిటిరాతగా ముద్రవేసి సృష్టించిన మరొక వర్ణం పంచమవర్ణం. ఇదే వంచనలతో నిండిన పంచమకులం. అసమానతలు, అవహేళనలకు నిలయమైన ఈ సవర్ణ హిందూ భారతంలో పంచమ స్వరంతో నినదించే ధిక్కార స్వరమే ఆధునిక కవిత్వం. అడుగడుగునా క్షతగాత్ర చరిత్రను అక్షరాలనే అగ్ని కణాలతో దహించి కొత్త చరిత నిర్మిస్తున్న ఆధునిక కవుల కలాలు గళాలు పదునెక్కిన ఆయుధాలే అవుతున్నాయ్. అందుకే ఆధునిక కవిత్వంలో దగాపడిన దళిత జీవుల ఆర్తనాదాలు అడుగడుగునా దర్శనమిస్తాయి.

ఉద్దేశ్యం :

ప్రాచీన కవిత్వంలో ప్రజాకవిత్వం లేదు సవర్ణ కవిత్వమే తప్పా సరైన కవిత్వం కనబడదు. రాజ, రాణి దేవుడు, భార్యలు, భామలు, ఉంపుడు కత్తెలు, చెలి కత్తెలు, వావీ వరసలు లేని సక్రమం కాని సరసాలు, శృంగారాలు, అశాస్త్రీయమైన కనీవినీ ఎరుగని మహాను భావుల విచిత్రమైన జన్మలు, కామలీలు, రాసలీలు, అధర్మయుద్ధాలు, అభూత కల్పనలు, విచిత్రమైన దేవుళ్ళు - విచిత్రమైన కోరికలు, అర్ధంకాని, అర్ధంలేని మంత్రాలు, మంగళ హారతులు, మేలుకొలుపులు, ఇవన్నీ ఇతిహాస పురాణాల్లో ప్రాచీన కావ్యాల్లో కనిపించే అచ్చమైన అశాస్త్రీయాంశాలు. అక్షరాలతో అందంగా వర్ణించిన ఊహా కల్పనలు. వీటికి భిన్నంగా ఆధునిక దృక్పథంతో హేతు బద్ధంగా వాస్తవికాంశాల్ని వాస్తవంగా చిత్రీకరిస్తూ కొత్త చరిత్రకు శ్రీకారం చుడుతున్న ఎందరో ఆధునిక కవుల రచనల్లో దగాపడిన దళిత జీవుల ఆవేదనల్ని ఏ విధంగా చిత్రించారో వివరించే ప్రనయత్నమే ఈ వ్యాసపత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

భారతీయ సమాజం మిగిలిన సమాజాలకంటే భిన్నమైంది. వివిధ వైరుధ్యాలతో విలసిల్లిన సమాజంలో ఎక్కడాలేని విచిత్రమైన కులవ్యవస్థ భారతదేశంలో కనిపిస్తుంది. ఎప్పటికి మారని పుట్టుమచ్చలా పుట్టుక నుండే కులం పునాదుల మీద భారతఖండం ఆధారపడి ఉంది. ఋగ్వేదం 10వ మండలంలోని పురుషసూక్తంలో కుల విభజన ఉంది. రామాయణంలో నాలుగు కులాల ప్రస్తావన ఉంది. భారతం కాలంనాటికి నాలుగైన కులాలు ఐదుగా మారి తర్వాత అనేక ఉపకులాలకు కూడిలిగా మారింది. ఈ అసమానతలు తరిమికొట్టడానికి ఆధునిక కవులు ఎన్నోరచనలు చేసారు. వివిధ ప్రక్రియల్లో అసమానతను ఎండగొట్టారు. అన్యాయాన్ని ఎదిరించే ప్రయత్నం చేసారు. ఉద్యమ బాటపట్టారు. ఇలా 19వ శతాబ్దం నుంచే నూతన విప్లవం వచ్చింది. అందుకు ఆధునిక కవిత్వం ఆయుధంగా నిలిచింది. ప్రజాభాషలో భావవిప్లవాన్ని తీసుకొచ్చారు. దళిత సాహిత్యానికి ఒక కొత్త వేదికను నిర్మించి కొత్త కోణంలో ధిక్కార స్వరాన్ని వినిపించి దళితులు బ్రతుకులకు ఒక బరోసా కల్పించారు. అందులో కొన్ని సంఘటనలు, సంఘర్షణ ఫలితంగా దళిత జీవుల యదార్ధ దృశ్యాలను పరిశీలిద్దాం.

1909లో భాద్రపద మాసపు ఆంధ్రభారతి పత్రికలో మాలవాండ్ర పాట అన్న గేయంలో అస్పృశ్యతా నిరసన

కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో కనిపిస్తున్న మొట్టమొదటి అస్పృశ్యతా నిరసనకు శ్రీకారం చుట్టిన గేయం అదే. అప్పటినుండి అనేకమంది కవులు కవితా శంఖారావం పూరిస్తూ దళిత జాతుల ధర్మయుద్ధాన్ని ప్రకటిస్తూ వచ్చారు. వారిలో కుసుమ ధర్మన్న, జాలా రంగస్వామి, జాషువ, బోయి భీమన్న చెప్పుకోదగ్గవారు. ఆ తర్వాత వచ్చిన తరం కవుల్లో కవిత్వం చిక్కినైన పాటగా పదునెక్కిన పాటగా మారి అసలైన పంచమ వేదాన్ని అగ్ని కణాలలో ఆవిష్కరించారు. అంబేద్కర్, పూలే ఆలోచనలతో ఆధునిక కవులు. దళితులు వివిధ వృత్తులను జీవనాధారం చేసుకుని అతుకతుకుల బ్రతుకులతో అసంతృప్తి మెతుకులతో జీవన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. వృత్తులు మలినమైనా, నీచమైనా, జీవనాధారం కోసం వృత్తినే దైవంగా భావించి పనిని త్రికరణశుద్ధితో చేస్తుంటే హీనంగా, హీనాతి హీనంగా చూస్తూ అవమాన పరుస్తుంటే ఆ ఆవేదనను తట్టుకోలేక ''యోధుడు కొగిలించుకో'' అనే సంకలనంలో నలుపు అనే కవితతో.

నేను నల్లగా ఉంటాను
నల్లని నేలతల్లి పేగు తెంచుకుని పుట్టేనుగనుక
నల్లగా చెమట వాసతో చల్లగా ఉంటాను.

అంటూ నా రంగు నీకు హేయంగా కనబడవచ్చు. కష్టపడేటప్పుడు ప్రవహించే నా చెమట నీకు కంపుకావచ్చు, వళ్ళంతా తడిసి ముద్దైనపుడు వచ్చే వాసన నీకు అసహ్యం కావచ్చు. నేను నమ్ముకున్నది నేలతల్లిని. నా జీవన గమనానికి నా కుటుంబానికి అన్నం పెట్టేది నేలతల్లి. ఆ తల్లి చలవే నా కుటుంబానికి చల్లని వెలుగు అంటూ శరీరకష్టాన్ని, చేసే వృత్తిని పవిత్రంగా భావిస్తూ

వర్షంలో నా రక్త యంత్రంతో ఉష్ణం సృష్టిస్తాను
నా చేతిలో విత్తనాలు అన్నమౌతాయి
ప్రతి వస్త్రమై వంటికి విలువనిస్తుంది
చెరకు చెక్కరై నాలుక తీపిలొలికుతుంది
గేదెలు పాదుగు చేసి పాలుగుమ్మరిస్తాయి.
నా చేతిలో సమస్త ప్రకృతి ఫలదీకరణ చెంది
చివరకు సరుకై మార్కెట్లో మేడలెక్కుతుంది.

ఎండనక వాననక శరీరకష్టంతో యంత్రంలా పనిచేస్తూ ప్రపంచానికి అన్నంపెడుతున్నాము. కట్టుకున్న బట్ట, తినే తిండి, తాగే పాలు, సమస్తం మా శరీరకష్టమే, అయినా నీకు మాసేవ కంటే హీనమైన కులమే గుర్తొస్తుంది. మా చేతులు స్పర్శలేకుండా నేలతల్లి పులకరించదు. కాని నీవు నన్ను పిలిచే పిలుపు ఒరే, ఒసే కూలి, సాలీ అనేకదా. అయినా నేను గౌరవించేది నా వృత్తిని. కాని నీవు గౌరవించేది నా కులమే. అంటూ దళిత జీవుల ఆవేదనను చిత్రీకరిస్తు ఆలోచనలను రేకెత్తిస్తాడు. మానేపల్లి

ఈ దేశంలో దళితులుగా పుట్టడమే పాపంగా ఉంది ఎంత వెట్టి చాకిరి చేసినా ఎంత మాలినాలన్ని ఊడ్చి శుభ్రం చేసినా, కళ్లల్లో ఇసుకరేణువులు పడినా, ధూళి దూసర ఒళ్లంతా చిమ్మినా మీ కళ్ళు కందిపోకుండా ఉండటానికి చర్మాన్ని నానబెట్టి చెప్పులుగా తయారు చేసినా మలిన వృత్తులనే నిందిస్తారంటూ బొజ్జాతరకం నేను అశృశ్యుణి అనే కవితలో

నేను అసృశ్యుణి
నా ఒళ్ళంతా మట్టివాసనే
నా బ్రతుకు నిండా వెట్టి వేదనే
నా కళ్ళనిండా ఎండ వేడిమి

అంటూ నన్ను ఊరికి దూరంగా ఉంచారే అనే ఆవేదనను వ్యక్తం చేస్తు నేను చేసేది ఏమాత్రం చెడ్డ పనికాదు. నేనెవరినీ తృణీకరించలేదు. నేను ఏ విధంగాను సమాజాన్ని మోసం చేయడంలేదు. నమ్మకద్రోహిని అసలే కదా. ఈ దేశంలో అందరిలాగే పుట్టినోణ్ణి, అమ్మానాన్నకు పుట్టినవాణ్ణి, విచిత్రంగా లోకానికి భిన్నంగా పుట్టినవాణ్ణి కాదు, అమ్మ అయ్యకు అసలైన వారసుణ్ణి, ప్రకృతికి విరుద్ధంగా మా బ్రతుకులు లేవు. మరి ఎందుకు మా మీద ఇంత వివక్ష అంటూ గత అవమానాలను నెమరు వేసుకుంటూ ప్రశ్నిస్తూ బొజ్జాతారకం గారు

మట్టిపిసిగి ఇటుకలు చేసి
ఇళ్లు కట్టి ఇవ్వమన్నారు

ఇంట్లోకి రావద్దన్నారు
భూమి దున్ని గింజలు పండించి
రాసులు ఏర్చి కూర్చమన్నారు
మీరు విసిరే గింజలు
ఏరుకు తినమన్నారు.....

అంటూ అన్నీ మా చేత చేయించి, హాయిగా సుఖాన్ని పొందే మీరు కష్టపడి ఎండలో మండి మసిబొగ్గుగా మారి ఆకలి బాధతో చచ్చేది మేము, పంటలు పండించేది మేము, కోతలు కోసేది మేము, రాసులు పోసేది మేము, గాదిలో పోసేది మేము, కాని ఇంటిలోకి రావొద్దంటారు. ముట్టుకుంటే అంటు అంటారు. పేడ తీసేటప్పుడు, అంట రానివాళ్లం మరి పాలుతాగేటప్పుడు అంటూ ఏమై పోయింది. పాయకానాలు కడిగేటప్పుడు అశుద్ధజీవులం హాయిగా కూర్చున్నప్పుడు, ఇల్లు కట్టినప్పుడు నీచకులం, ఇంటిలో నివసించేటప్పుడు మీదే కులం, చచ్చిన గొడ్లను మోసుకుపోయినప్పుడు, నీకులం చెప్పులు కుట్టి ఇచ్చి నప్పుడు, అవి తొడుక్కుని షఠీవిగా నడిచినప్పుడు కులం గుర్తుకురాదా అంటూ ఘాటుగా ప్రశ్నిస్తూ దళిత జీవితంల్లో నేలకొన్న విషాదాన్ని వాస్తవంగా చిత్రీకరించారు తారకం గారు అందుకే పురాణహితెహాసి ప్రాచీన కావ్యాల్లో మీ కధలే తప్పా మా బాధలు లేవుంటూ.

నాగురించి కథలు లేవు
గాధలు లేవు
నాకై కవిత లేదు
నాకు చరితలేదు
నాలుగు వేదాల్లోంచి
నాలుగు పాదాల్లోంచి
నన్నుతొలగించారు .....

అంటారు. ఈ కవితలో చాతుర్వర్ణ వ్యవస్థ సృష్టించిన కులధర్మం మనుషుల మధ్య ఎంత అంతరాలను సృష్టిందోకదా. అందుకే డాॖబాబా సాహెబ్ మనుధర్మ శాస్త్రాన్ని ధ్వంసం చేసారు అని ఒక విప్లవాత్మక, చారి త్రాత్మక సంఘటనను గుర్తు చేసారు తారకం. ప్రాచీన సాహిత్య ప్రజాసాహిత్యం ఏమాత్రం కాదు అది సవర్ణ సాహిత్యం. నాలుగు పాదాల్లోంచి నన్ను తొలగించారనే కదా దళిత జీవుల ఆర్తనాదాలకు కులవివక్షతకు అది అర్ధం పడుతుంది. పుక్కటి పురాణాలతో లక్షల లక్షల శ్లోకాలతో, కట్టుకతలు, పిట్టకతలతో కల్పనాసాహిత్యాన్ని సృష్టించి మానవుల మధ్య విభజన రేఖలు గీసి కులాల కురుక్షేత్రాన్ని ఆవిష్కరించిన శిష్ట సాహిత్యం పై అక్షరాలను అస్త్రాలుగా సంధించారు తారకంగారు. సకల శాస్త్రాలు చదివినానని ప్రతిభనాదాని, పలుకుతున్నావే, వేదవేదాం గాలు చదివిన పండితుడినని పలుకుతున్నావ్ ఓ పంతులయ్యా నేను చేసే పని నీవు చేస్తావా. నీ పంట నీవు పండించుకుంటావా, నీ జోళ్ళు నీవు కుట్టు కుంటావా. నీయిల్లు నీవు కట్టుకుంటావా, నీకత్తి నీవు చేసుకుంటావా, నీ దొండ్లో పెంట నీవు తీసుకుంటావా అంటూ, నీవొక పరాన్న జీవిని, అందరి మీద ఆధారపడేవాడివి. అంతే కాదు కేవలం నోటితో బ్రతికే వాడివి. అర్ధంకాని మంత్రా లతో దోషాలని, జాతకాలని చెప్పి బ్రతికేటోడివి. అవన్నీ ఒట్టి కథలని, నీవు సృష్టించినదేనని, బ్రతుకుదెరువు కోసం సృష్టించిన నీ అసలు కథలు తెలిసినాయ్ అంటూ గూడ అంజయ్య

ఓ పంతులయ్య
నేతకాని నేత నేత్తవా
కొమ్మరన్న కొలిమి పెడతావా
కంసాలన్న సేత సేత్తావా
జాల పొలమాల జంబుగొడతావా
మిట్టతోటకు మోటి కొడతావా
దాటెద్దుకు దానపెడతావా
దొడ్లవున్న పెండ దీత్తావా
సకల సంపదల సృష్టి కర్తలు
దళితులంటే ఒప్పుకుంటావా.....

అంటారు. ఈ కవితలో అంజయ్యగారు సకల సంపదలకు సృష్టికర్తలు దళితులే. వారి వృత్తి నిపుణులు, కమ్మరకొలిమి, కుమ్మరి చక్రం సాలెలమగ్గం జాలరి పగ్గం

శరీర కష్టం స్ఫురింపచే సహస్ర వృత్తుల్లోశ్రమదో పిడీ జరుగుతోంది అని అనాడే శ్రీశ్రీ చెప్పాడు. వృత్తినే దైవంగా భావించి జీవితాన్ని గడుపుతున్న అవమానాలు తప్పడం లేదు. నిందర్ధాలతో కూడిన నీచ పదజాలంలో పలకరింపులు పోవడంలేదు. అగ్రవర్ణ అహంకారం, ఆధిపత్య ధోరణి ఇంకా కొనసాగడం విచారించదగ్గ విషయమంటూ దళిత జీవితాల్లో వెలుగు రేఖలు ఎప్పుడు ఉదయిస్తాయో. దళితకవుల్లో ఎరుపెక్కిన నినాదం వినిపిస్తోంది. అప్పటి వరకు సామాజిక మార్పు కోసం ఎదురుచూసారు. కాని మార్పురాలేదు. అందుకే దళిత జీవన శైలిలో, భావ వ్యక్తీకరణలో, రచనా నిర్మాణంలో ఉద్యమ బాటలో మార్పులు వచ్చాయ్. గర్జించే స్థితికి రావడమే కాదు ఎరుపెక్కిన బాటలో నీలిజెండా సాక్షిగా కదనరంగానికి కలాలను, గళాలను సిద్ధం చేసి సరికొత్త దళిత సాహిత్యాన్ని సృష్టించారు. ఈ సాహిత్యంలో అరుదైన పదజాలం అసలైన పదజాలం, వస్తు సంస్కృతితో పాటు నూతన ఆవిష్కరణలు జరిగాయ్. పురాణ ఇతిహాసాల అధ్యయనం మొదలైంది. అసలైన మూలాల కోసం అన్వేషించడం మొదలు పెట్టారు. అసలు చరిత్రలను తవ్వడం మొదలు పెట్టారు. అందుకే ఆధారాలతో, శాస్త్రీయాలతో తర్కబద్ధంగా, హేతు బద్ధంగా పదునైన పాదాలతో ఆధునిక కవిత్వాన్ని సృష్టించారు. అందులో కొన్ని పదునైన కవిత్వాలను పరిశీలిద్దాం. బోయి జంగయ్య ఆదిత్యులు అనే కవితలో

పంటలు పండించేది వాళ్ళే
పాడికట్టేది వాళ్ళే
వాళ్లు తిరగబడితే
ఊళ్ళుకు ఊళ్ళే ఉప్పెనలై లేస్తాయ్
దేశచరిత్ర మారిపోతుంది సుమా.....

అంటూ సరికొత్త నినాదాన్ని ఇస్తారు. నిజంగా ప్రపంచానికి అన్నం పెడుతున్నది వాళ్లే. కూలీనాలీ చేసుకుని మట్టినే దైవంగా భావించినవారికి అవమానాలు ఎదురైతే, కష్టానికి ప్రతిఫలం లేకపోతే పంటలు పండించే చేతులు తిరగబడతాయ్ అంటారు. ఉద్యమం రాకముందే కులదురహంకారం పోవాలంటారు. అంటరాని తనం మంటగలపాలి అంటారు. దళిత జీవుల ఆర్తనాదాలు దేశ చరిత్రనే మార్చి వేస్తాయని పాడికట్టిన చేతులతో పాడి కట్టించుకోకూడదని హెచ్చరిస్తారు బోయి జంగయ్య.

కల్పన కథలనే కావ్యాల్ని కట్టుకథల వికటాట్టహాన్ని కట్టెలపై కాలుస్తు దళిత దార్శినిక కవిత్వం కొత్త పుంతలు తొక్కింది. అందులో భాగంగా చాలావుంది కవులు కలాలతో విప్లవాగ్నిని రగిల్చి దళిత జనజీవనశైలిలో మార్పును తీసుకొచ్చారు. విప్లవ కవిత్వాన్ని విల్లుల్లా సంధించి ఖండించి శాసించిన కవిత్వం మనువాదుల పాలిట ధిక్కార ఖడ్గమైంది. అటువంటి వారిలో శిఖామణి కిర్రాచెప్పుల భాషలో

ఇప్పుడు అక్షరాల్ని
రాకాసిబొగ్గును చేసి
నా చీకటి కొలిమిని ముట్టించుకున్నాను
ఇప్పుడు అక్షరాలు పుట్టేవి
శివునిచేత డమరుకం నుంచికాదు
వీర భాహుని కిర్రు చెప్పుల చప్పుళ్లనుంచి.....

అంటారు. ఈ కవిత్వాలు శిఖామణి మంగలి పాది నుండి చాకలి, జాలరి, సాలీలు, గౌడ, గొల్ల, మాల, మాదిగ కులవృత్తులను పేర్కొంటూ దళిత చైతన్యాన్ని రగిలించారు. దళితుల జీవనయానంలో ఎదురయ్యే కష్టాలను గుర్తుచేస్తూ శ్రమ నిష్పలతను నిష్పక్షపాతంగా చిత్రించారు.

ఇతిహాసపు చీకటి కోణాలు లెక్కకు మించి కనిపిస్తున్నాయి. అడుగడుగున ఇదే భారతం. అందులో అశుద్ధ, అభారతం పైగా మలినంతో కమిలిన కులాల కల్లోల భారతం. అందుకే డా॥ తరపట్ల సత్యనారాయణ.

నాదేశం సువిశాలమైన
పెద్ద మతమేడ్య స్మశానం
ఎక్కడ తవ్వినా కులరక్కసి
కొరికి పారేసిన ఎముకలే తప్పా
ఇంకేమి కన్పించవు.....

అంటారు. అటువంటి దేశాన్ని అప్సర్ ఊరమతం దు:ఖం అనే కవితలో

ఇక ఈ చరిత్రను నేను
ఏకలవ్యుడి తెగిపోయిన బొటనవేలితో రాస్తున్నాను
ఇక్కడ నువ్వు చెప్పే నవలాక్ష కారణాలు
నీకు నిజమైతే కావచ్చు.
నాకు మాత్రం అది
హిమాలయాలకన్నా ఎత్తైనా అబ్దం.....

అంటూ దాచిన దళితుల హత్యాకాండను అందంగా వర్ణించిన సవర్ణ కవిత్వాన్ని హేతుబద్ధంగా విమర్శించారు. అందుకే ఇప్పుడు వేదశ్లోకాల మధ్య అణచి పెట్టిన శోకమే కావాలి అంటారు. ఇప్పుడు నల్లనినాదంతో ఇక్కడ తెల్ల రాలి అంటూ శపధం చేసారు.

మరొక కవి వైతాళికుడవైరా పద్యంలోకి అంటూ
ఇప్పుడు ద్విజుడి వేషాన్ని ధిక్కరిస్తా
ఛండాలుడా పద్యంలోకి వైతాళకిడవైరా
నిన్నుబహిష్కరించిన చరిత్ర చెవుల్లో
సలసలకాగే సీసాన్ని పోద్దావురా.....

అంటూ పిలుపునిస్తారు. దళితులపై జరిగిన అమానుషమైన దాడిని ఖండిస్తూ పగడాల నాగేందర్. ధిక్కార స్వరాన్ని వినిపిస్తాడు. గతకాలపు ఆనవాళ్ళు ఇక ఉండకూడదంటూ బాకీ చెల్లింపుల తంతు ప్రారంభం కావాలి అంటారు.

ఆధునిక కవిత్వంలో దళితకవిత్వం పదునెక్కి పద జాలంతో ఎరుపెక్కి భావోద్రేకంతో సమతామమతా సౌభాతృత్వం కోసం సమసమాజ నిర్మాణంలో కలాలు గళాలు కలసి కులరహిత మతరహిత సమాజం కోసం శ్రమించి రచనలు చేసారు. అందులో మూలాలను అన్వేషించి గత చరిత్రలు తిరగేసి అసలు చరిత్రల ఆధారాలతో ప్రపంచానికి అందించారు. శాస్త్రీయ అవగాహనతో. తార్కికంగా హేతు బద్ధంగా రచనలు చేసి దళిత జీవన వేదాన్ని వాస్తవిక కోణంలో ఆవిష్కరించి, దళితులు బ్రతుకల్లో స్వేచ్ఛ వాయువులను నింపి ఆ చూపుడు వేలుసాక్షిగా మనుధర్మ శాస్త్రం కాదు రాజ్యాంగమే మనధర్మశాస్త్రమని వివరించి ప్రయత్నం చేసి కృతకృత్యులయ్యారు.

ఆధారగ్రంథాలు :

1) తెలుగు కవితోధ్యమాలు - తెలుగు అకాడమి ప్రచురణలు
2) దళిత కవిత్వం - 2 - సం॥ డా॥ కె.లక్ష్మీనారాయణ

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

'రంధి' నవల – సామాజిక జజీవన చిత్రణ

– ఎలగొండ రాములు, తెలుగు పండిట్, జిల్లా ప్రజా పరిషత్తు సెకండరీ స్కూలు - ఇటికాలపల్లి
మం॥ నర్సంపేట, జి॥ వరంగల్ రూరల్, తెలంగాణ.

'తెలుగు' కు పర్యాయపదం 'ఆంధ్ర'

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రముఖ జిల్లా గుంటూరు. ఈ జిల్లాలో ఒక గ్రామం 'వేజండ్ల'. ఇది ఊరు, పల్లె అని రెండు భాగాలు. ఊరులో దళితేతరులుంటారు. పల్లె దళితులకు ననిలయం. పల్లెలో మాల, మాదిగ రెండు ప్రధాన వాడలు.

'వేజండ్ల' గ్రామం 'మాదిగ పల్లె' 'రంధి' నవలకు ముఖ్య కథా క్షేత్రం. ఊరు ఆధిపత్యం పల్లెపై ఏ విధంగా ఉంటదో కళ్ళకు కట్టినట్లుగా చిత్రితమైంది. కులం కారణంగా - అణిచివేతకు, అన్యాయానికి గురవుతున్న మాదిగల పరిస్థితిని తెలిపే నవల ఇది. వేజండ్లలో కుల వివక్షత వెర్రి చేష్టల్ని తరతరాలుగా అనుభవిస్తున్న మాదిగల్లో వినూత్న రీతిలో చైతన్యం తీసుకవచ్చే ప్రయత్నంలో భాగంగా రచించబడిందే 'రంధి' నవల. రచయిత పేరు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు. వీరు తెలుగు నవలా సాహిత్యంలో మాదిగ చైతన్యానికి చక్కని నిదర్శనంగా ఈ నవలను తీర్చిదిద్దారు.

వెయిలాది ఏండ్ల నుంచి ఇండియాలో కొనసాగుతూ వస్తున్న కులవ్యవస్థ అవస్థల్ని ప్రధాన వస్తువుగా 'రంధి' నవల రచించబడినది. మాదిగలను కుల వ్యవస్థ ఎంతగా అణగదొక్కుతుందో, మానసికంగా ఎంత వేదిస్తుందో ఈ నవలాపరంగా రూపుకట్టించారు రచయిత ఆచార్య ఇనాక్ గారు.

ఆరు దశాబ్దాల నుంచి నేటికీ గ్రామీణ వ్యవస్థలో బ్రాహ్మణీయ భావజాలం కలిగిన భూస్వాములు మాదిగ పల్లెలపై జరుగుతున్న అమానవీయ, దుష్టత్వానికి అక్షర సాక్ష్యంగా తెలుగు కాల్పనిక సాహిత్యంలో, ముఖ్యంగా నవలా రచనలు చాలా తక్కువ. 'రంధి' నవల ఈ కోవకు చెందినదిగా చెప్పవచ్చు. గ్రామాల్లో మాదిగలు, భూస్వాములుగా ఎదిగిన సుద్దరోళ్ళ మధ్య ఉన్నటువంటి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర అంశాల్లో వైరుధ్యాన్ని, వికృతాన్ని మాదిగ సంఘటిత శక్తిని, స్త్రీ అస్తిత్వ చైతన్యాన్ని, కూలంకషంగా చర్చకు పెట్టిన ఒక చక్కని నవల ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి 'రంధి'.

తెలుగు సాహిత్యంలో శతాధిక గ్రంథాల్ని అన్ని సాహిత్య ప్రక్రియల్లో తనదైన ముద్రతో వెలువరించిన ఇనాక్ గారు సమత, అనాధ, సౌభాగ్యవతి, సౌందర్యవతి, ఎక్కడుంది ప్రశాంతి? ఇరులలో విరులు, రెండు కళ్ళు మూడు కాళ్ళు, సర్కారు గడ్డి, అనంత జీవనం నవల్ని రచించారు. వీటికి తోడుగా ఇటీవల చేసిన మరో రచన 'రంధి' నవల ఈ నవలలో ఉన్న సామాజిక జీవన చిత్రణే ఈ వ్యాసం ప్రత్యేకత.

'రంధి' నవల ఇరువై ఏడు భాగాలుగా రచించబడినది. చదువరిని ఎంతో ఆసక్తిగా, ఉత్కంఠతో చివరిదాకా లాక్కెళ్లి, ఇదీ ఈనాటి ఇండియా గ్రామీణ సమాజం అంటూ చెప్తున్నట్లుంటుంది. ఈ నవలలో ఒక్కో భాగంలో ఏ విధంగా కథ నడిచిందో విశ్లేషించే ప్రయత్నం చేస్తున్నా నిక్కడ.

మొదటి భాగంలో - పందుల గురించిన అనేక విషయాల్ని వివరించారు. రైలు వస్తున్న సమయాన్ని చూసి, కుక్కలు పందుల్ని తరుమడం, రైలు ఢీకొనడం ద్వారా చనిపోయిన పందుల్ని కుక్కలు పీక్క తినడం... కథ ప్రారంభంలో చిత్రించిన తీరు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నది. కుక్కలు బ్రాహ్మణీయ ఆధిపత్య భూస్వామ్య వర్గానికి, పందులు మాదిగలు అణిచివెయ్యబడుతున్న సామాజిక వర్గానికి ప్రతీకలుగా నవలను

రక్తికట్టించారు ఇనాక్ గారు. నవల చివర కుక్కలపై పందులు తిరగబడటం రచయిత సాహిత్యపరంగా తీసు కొచ్చిన చైతన్యంగా చెప్పుకోవాలి.

రెండో భాగంలో 'సువ్వి' తాటి తోపులో బహిర్భూమికి వెళ్ళిన సమయంలో మానభంగానికి గురైనట్లు చెప్ప బడినది. కొద్ది గంటల్లో పెళ్ళి కావలసిన 'సువ్వి'కి ఇలా జరుగడం... పాఠకుల్ని బాధకు గురిజేసి... ఉత్కంఠను కలిగిస్తుంది. ప్రదేశాల్ని, పరిసరాల్ని ఎంతో చక్కగా వర్ణిం చారు రచయిత.

మూడో భాగంలో - చదువుకోవడానికి రైళ్లో ప్రయాణం చేస్తున్న మాదిగ 'సువ్వి'ని, ఆధిపత్య అహంకారి రాముడు లైంగికంగా లొంగదీసుకోవాలని చేస్తున్న పిచ్చి చేష్టలకు చెంప దెబ్బతో సమాధానమిస్తుంది.

నాలుగో భాగంలో - రైలులో సువ్వి - రాముడి ముక్కు మీద గుద్దిన కారణంగా, ముక్కు నుండి రక్తం కారుతుంది. రాముడి చిల్లర వేషాలు పరాకాష్టకు చేరడాన్ని ఈ భాగం ద్వారా తెలుస్తున్నది.

అయిదో భాగంలో - రాముడి తండ్రి నాంచారయ్య తన కొడుక్కే సపోర్టుగా ఉంటాడు. నాంచారయ్య గురించిన అనేక విషయాలు ఈ భాగంలో వివరించ బడినాయి.

ఆరో భాగంలో - సువ్వికి పెళ్లి సంబంధాలు వెతుకు తుంటాడు, ఆమె తండ్రి కోటి (కోటయ్య) సువ్వికి, రాముడికి - రైళ్ళో జరిగిన గొడవలు, సువ్వి తండ్రితో చర్చించినట్లు ఈ నవలలో ఏలేదు. కానీ ... ఆ నేపథ్యంతోనే సువ్వికి పెళ్లి చెయ్యాలని కోటి నిర్ణయించి నట్లు... చదువరికి అర్థమయితది.

ఏడో భాగంలో ... 'చందిరి' అనే పాత్ర గురించిన వర్ణన ఎంతో చక్కగా ఉన్నది. తెలంగాణ నుంచి రజాకార్ల దాడులకు భయపడి వలస కూలీలుగా వేజండ్ల మాదిగ పల్లెకు చేరిన అంజవ్వ - వెంకటయ్యల ఒకగానొక కొడుకు ఈ 'చందిరి'. డాబా సత్తయ్య పోలాల్లో పనిచేసే ఈ కుటుంబం, సత్తయ్య సావిట్లో ఒక ఇల్లు కట్టుకుంటారు. సత్తయ్య ఇంటి పక్క ఇల్లు కోటయ్యది. చందిరి - సువ్విలు బాల్యం నుంచి స్నేహంగా ఉంటారు. ఇలాంటి అనేక విషయాలు ఈ భాగంలో ఉన్నాయి.

ఎనిమిదో భాగంలో - బాల్య స్నేహితుడైన చందిరిన సువ్వి పెళ్లి చేసుకుంటాననటం, మూగవాడైన చందిరికి సువ్వినెట్లా ఇయ్యాలని సందేహించడం... ఈ భాగంలో రచించబడింది.

తొమ్మిదో భాగంలో - బైరాగి పాత్ర చిత్రించబడినది. వేజండ్ల - మాదిగ పల్లె బయట ఒక మర్రిచెట్టు కింద ఉండే బైరాగితో చందిరికి స్నేహం ఏర్పడుతుంది. చందిరికి మాటలు రాకపోయినా, మనసులో ఏమను కుంటున్నాడో ... అతడి హావభావాల ద్వారా ... బైరాగికి తెలుస్తుంది. అందుకే బైరాగి కోటికి ఇంటికి వచ్చి, 'చందిరి-సువ్వి'ల పెళ్లి గురించి మాట్లాడటం ... ఇంకా ... ఎన్నో విషయాలు ఈ భాగంలో ఉన్నాయి.

- పదో భాగంలో - 'సువ్వి-చందిరి'ల పెళ్లి గురించి మాదిగ కులం పెద్దలు చర్చించడం ఇందులో ప్రధా నాంశం.
- పదకొండో భాగంలో - 'చందిరి' ... నాంచారయ్య, రాముడుల కాళ్ళు పట్టుకొని బతిలాడటం ఉంది. ఈ బతిలాటకు కారణం - రాముడు ... సువ్విని చంపుతానని శపథం చెయ్యడం.
- పన్నెండో భాగంలో - సువ్వికి మానభంగం జరిగిందని ఊరంతా చర్చ చేస్తూ ఉంటుంది.
- పదమూడో భాగంలో - 'సువ్వి - చందిరి'ల పెళ్లి వారి ఇష్ట ప్రకారంగానే జరుగుతుంది.
- పద్నాలుగో భాగంలో - స్నేహితులు శాంతయ్య, సూరిలతో రాముడి సంభాషణ ... వేర్వేరుగా జరుగుతది.
- పదిహేనో భాగంలో - 'సువ్వి - చందిరి'ల కార్యం గురించిన చర్చ జరుగుతుంది.
- పదహారో భాగంలో - వేజండ్లలో గ్రామ సభ జరుపుటకు, ఆ ఊరి ముఖ్య పెద్దలు నిర్ణయి స్తారు.

- పదిహేడో భాగంలో - 'సువ్వి'కి జరిగిన అన్యాయానికి రాముడు జరిమానా ఇవ్వడం మేలని గ్రామ సభ తీర్మాణం చేస్తుంది.
- పద్దెనిమిదో భాగంలో - 'సువ్వి'కి ఇవ్వవలసిన మాన నష్టపరిహారాన్ని ఎవరితో పంపాల్నో, గ్రామ పెద్దలు పడే తర్జన భర్జన చిత్రించబడినది.
- పందొమ్మిదో భాగంలో - రాముడు తెచ్చిన నష్ట పరిహారాన్ని తిరస్కరించిన 'సువ్వి' గురించిన కథ వివరించబడింది.
- ఇరువయ్యో భాగంలో - రాముడు - రైతులతో, మిత్రుడితో సంభాషించడం ఉంది.
- ఇరువై ఒక్కటో భాగంలో - మాదిగ పంచమ దొరలు నాంచారయ్యతో జరిపిన సంభాషణ చిత్రితమైంది.
- ఇరువై రెండో భాగంలో - మునసబు గారి భవనంలో జరిగిన సంభాషణను చిత్రించారు.
- ఇరువై మూడో భాగంలో - దొంగగా వెళ్లి, సువ్వి ఇంట్లో మహిళలతో తన్నులు తిన్న రాముడి పరిస్థితిని గురించిన వివరాలు చిత్రించబడ్డాయి.
- ఇరువై నాలుగో భాగంగా - 'సువ్వి'కి మత్తు ఇంజక్షన్ ఇవ్వబోయిన ప్రయత్నంలో రాముడు విఫలం చెంది, తప్పించుకోవటం చిత్రితమైంది.
- ఇరువై అయిదో భాగంలో - 'సువ్వి'కి వెయ్యాలనుకున్న మత్తు ఇంజక్షన్‌ను తనకే వేసుకునే తందుకు సిద్ధమైన రాముడి పరిస్థితి చిత్రించారు.
- ఇరువై ఆరో భాగంలో - తనకు మగతనం లేదనే అవమానాన్ని తట్టుకోలేక రైలు కింద తలపెట్టి రాముడు ఆత్మహత్య చేసుకోవడం ఉంది.
- ఇరువై ఏడోదైన చిట్ట చివరి భాగంలో - 'సువ్వి' ఆగి పోయిన తన చదువును కొనసాగించే తందుకు వెళ్ళటం, నాంచారయ్యలో మార్పు రావటం, 'చందిరి సువ్వి' లను ... కొడుకు - కోడలుగా నాంచారయ్య భావించడం, 'సువ్వి - చందిరి'లకు పుట్టబోయే కొడుకును నాంచారయ్య దత్తత తీసుకుంటాననటం, తాను చచ్చినాడు, తనకు 'చందిరి' తలకొరివి పెట్టాలని నాంచారయ్య అనటం... మొదలగు విషయాలు ఉన్నాయి.

మొత్తం మీద ఈ 'రంధి' నవలలో అట్టడుగు సామాజిక వర్గమైన మాదిగ కులం పరిస్థితిని 'సువ్వి' పాత్రపరంగా రచయిత ఇనాక్ గారు ఎంతో చక్కగా వివరించారు. ఈ నవల చదవడం ద్వారా మాదిగలు ముఖ్యంగా మాదిగ మహిళలు ఎంతో చైతన్యాన్ని పొందుతారు. ఒక్క మాదిగలే కాక బహుజన కులాలన్నీ కూడా ఈ నవలా స్ఫూర్తిని అందుకుంటాయనటంలో ఎటువంటి సందేహం లేదు.

'సువ్వి' ఒక గొప్ప పాత్ర. 'సెల్ఫ్ రెస్పెక్ట్' కలది. తనపై జరిగిన అన్ని రకాల అఘాయిత్యాలకు చాలా తెలివిగా ఆలోచనాత్మకంగా స్పందించి, సరైన జవాబుగా నిలుస్తుంది. 'సువ్వి' మాటల మనిషి కాదు. చేతల మనిషని ఈ నవల నిరూపించింది. ఒక స్త్రీ పాత్రకు ఇంత గొప్ప ధైర్యం ఎలా వచ్చింది ? ఈ ప్రశ్నకు సమాధానం రచయిత ఇనాక్ గారి అపారమైన సామాజిక, సాంస్కృతిక అనుభవమే అని చెప్పక తప్పదు.

మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రీ బాయి ఫూలేలు కలిగించిన విద్యా చైతన్యానికి నిలువెత్తి సాహిత్య సాక్ష్యం 'సువ్వి' పాత్ర. భారతం కథలో 'పాండు రాజు' కన్న, ఈ నవలలోని 'చందిరి' గొప్పోడని, ద్రావిడ సంస్కృతి ప్రకారం హిరణ్యకశిపుడి లాంటి నాయకుడని, మంచి కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడని చెప్పడం ద్వారా మూలనివాసి బహుజన ద్రావిడ చైతన్యాన్ని నేటి సామాజికులకు అందించినట్లయింది. తెలుగు భాష ద్రావిడ భాషకు చెందినదనుటకు సార్ధకత ఏర్పడింది. తెలుగు ద్రావిడ సాహిత్య భాషగా చెప్పటకు బలాన్ని చేకుర్చేదిగా ఉన్నది. కన్నీటి గొంతు - దీర్ఘకావ్యం, ఆది ఆంధ్రుడు - పద్యకావ్యం, సర్పయాగం - కవితా సంపుటి ... లాంటి రచనతో ద్రావిడ చైతన్యాన్ని అందించిన రచయిత ఇనాక్ గారు. ఈ 'రంధి' నవలతో ద్రావిడులకు మరింత చేరవకాగలిగారని చెప్పడం సత్యదూరం కాదు. ❖

చల్లా రాధాకృష్ణ శర్మ రచనల్లో సామాజిక జీవన చిత్రణ

– ఎంబేటి అమృతేష్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

మానవులు అందరూ పరస్పరం సహాయం అందించుకుంటూ జీవించే విధానాన్ని సమాజం అంటారు. సమాజం ఒకటికంటే ఎక్కువమంది వ్యక్తులు సంఘాలతో కూడిన నిర్దిష్ట సమూహాన్ని, అలాగే వారు సభ్యులుగా ఉన్న విస్తృత సమాజాన్ని కూడా సూచిస్తుంది. ఒక సమాజం నుండి వచ్చే ప్రజలు ఒకరికి ఒకరు పర్సపర అనురాగం, ఆప్యాయతలు కలిగి ఉంటారు. సమాజ అధ్యయన శాస్త్రాన్ని సామాజికశాస్త్రం అంటారు.

చల్లారాధాకృష్ణ శర్మ :

కృష్ణా జిల్లా సోమ వరప్పాడు గ్రామ వాస్తవ్యులైన చల్లా లక్ష్మీ నారాయణ శర్మ గారు తెలుగు, సంస్కృతం, హిందీ భాషలలో పండితులు. ఈయనగారి సతీమణి యశోదమ్మ ఆదర్శ దంపతులు. వీరికి చల్లా రాధాకృష్ణ శర్మ గారు తేది:06.01.1929 న జన్మించారు. చల్లా రాధాకృష్ణ శర్మ గారు మొదటి తరగతి నుండి 4వ తరగతి వరకు మచిలీపట్నంలో చదివారు. ఐదవ తరగతి నుండి ఎస్.ఎస్.ఎల్.సి. వరకు తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాలోని పొన్నేరి గ్రామంలో చదివారు. నెల్లూరు వి.ఆర్.కళాశాలలో ఎం.పి.సి.గ్రూపులో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించారు. తెలుగు సాహిత్యాన్ని ప్రధానాంశంగా తీసుకుని బి.ఏ. చదివి 1950 వ సంవత్సరంలో డిగ్రీ పట్టా పొందారు. నిడదవోలు వెంకటరావు గారి పర్యవేక్షణలో ఎం.లిట్ పొందారు. ఆ తర్వాత పింగళి లక్ష్మీకాంతం గారి పర్యవేక్షణలో పి.హెచ్.డి. పట్టా పొందారు.

సామాజిక జీవన చిత్రణ :

చల్లా రాధాకృష్ణ శర్మ గారిచే రచించబడిన 'శ్రమలో స్వర్గము' అను కవితా సంకలనంలో మానవుల సామాజిక జీవితం గురించి చాలా అద్భుతంగా చిత్రీకరించారు. శర్మగారి 'శ్రమలో స్వర్గము' అను కవితా సంకలనంలో సామాన్య మానవుల జీవితాన్ని చిత్రీకరించిన విధానం పాఠకుల హృదయాల్ని హత్తుకునేలా ఉంటుంది.

వస్తువుల నాణ్యత
తెల్లని కాకి కాగా
వస్తువుల ధరలు
తారా జువ్వలు కాగా
వస్తువులే అప్పుడప్పుడు
చిఠారు కొమ్మను మిఠాయి పొట్లాలు కాగా
సామాన్యుణ్ణి నేను
సతమతమై పోతున్నాను
విధిలేక రూపాయలతో నింపుకుంటున్నాను కడుపు
ఎలుకలేమో కడుపులో తొలుస్తూనే ఉన్నాయి.

చల్లా రాధాకృష్ణ శర్మగారి 'శ్రమలో స్వర్గము' అను కవితా సంకలనంలోని సామాన్యుడి స్వగతం నుండి సేకరించబడిన పై కవితా ఖండికలో నిత్యావసర వస్తువుల ధరలు ఎక్కువగా ఉండటం వలన సామాన్య మానవుల బాధని ఈ కవితా ఖండికలో అద్భుతంగా చిత్రీకరించారు.

పెద్దల దృష్టిలో నేను దరిద్రుణ్ణి
పేదల చూపులో నేను ధనికుణ్ణి !
ఎవరి యెదుటా
మనసు విప్పి మాట్లాడలేని సామాన్యుణ్ణి !

సగటు మధ్యతరగతి వారు తమ యొక్క అభిప్రాయాలని, కోరికలని, ఉద్దేశ్యాలను ప్రజలందరి ముందు వ్యక్తీకరించలేరు.

'తాళాలు అలంకారాలయ్యేను విద్యానిలయాలకు
బాకులు తగిలెను విద్యార్థుల తల్లిదండ్రుల గుండెలకు
మూగతనం వచ్చెను ముచ్చట గొలిపే బజారు వీధులకు
బాధా సర్పాలు చుట్టుకునెను సామాన్యుల మెడలకు

బండ నిద్ర ఆవహించెను పరిగెత్తే బస్సులకు
ప్రేతకళ వచ్చెను చూడ చక్కని ఆఫీసులకు
రేయింబవలు రెక్కలు ముక్కలు చేసుకునే మిల్లు
నే బంధ హస్తాలతో గట్టిగా మూసుకుంది కళ్ళు'
'చేతిలో డబ్బులుండీ సరుకులు కొనలేని గృహస్థు
ఆకలిని నెమరు వేసుకుంటూ ఉండిపోయాడు పస్తు
కడుపులో తిరిగే పిల్లల్ని కట్టడిలో ఉండలేని
బ్రహ్మచారి
తిండి కోసం ఎక్కడెక్కడి సందులూ గాలించాడు
ఒక్కసారి'

చల్లా రాధాకృష్ణ శర్మ గారి 'శ్రమలో స్వర్గము' అను కవితా సంకలనంలోని 'సమ్మెరోజున సామాన్యుడు' నుండి సేకరించబడిన పై కవితా ఖండికలో దినసరి కూలీల జీవన విధానాన్ని ఈ విధంగా వివరించారు. సమ్మెలు జరిగే రోజున సగటు మానవుల జీవితం అతలా కుతలము అవుతుంది. నిత్యం రద్దీగా ఉండే బజారు వీధులకు ఏకాంతం లభిస్తుంది. నగరాల్లోనూ, గ్రామాల్లోనూ పరిగెత్తే బస్సులు సమ్మెరోజున మాత్రం విశ్రాంతి తీసుకుంటాయి. రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకునే కార్మికుల హస్తాలను కట్టివేసినట్లుగా సమ్మెరోజు ఉంటుంది. ఈ విధంగా చల్లా రాధాకృష్ణ శర్మ సమ్మె రోజున సామాన్య మానవుని యొక్క జీవనాన్ని అద్భుతంగా చిత్రీకరించారు.

'పంచాంగం పుటలు రెపరెపలాడుతుంటే
తెలుసుకున్నాడు పండుగ రోజని
ఎదురింట్లో కొత్త బట్టలు మెరుస్తుంటే
మెదడు గుర్తు చేసింది పండుగ రోజని
పక్కింట్లో పిండివంటలు గుమ గుమ లాడుతుంటే
ప్రస్ఫుటమయింది పండుగ రోజని
చదువుకి సెలవిచ్చిన కుర్రవాళ్ళను చూస్తుంటే
విధితమయింది పండుగ రోజని'

నగటు సామాన్య మానవులు ముందుగానే పండుగలు గురించి తెలుసుకుని ఆనందంగా వారు పండుగను జరుపుకుంటారు. ఇరుగు పొరుగు వారి వలన సామాన్య మానవులకు పండుగ వాతావరణం తెలుస్తుంది. ఆతర్వాత తన జీవితంలో ఘనంగా చేసుకున్న పండుగలను గుర్తుచేసుకుంటూ సామాన్య మానవుడు ఆ పండుగ పర్వదినాన్ని ఆస్వాదిస్తాడు.

'నా కష్ట ఫలాన్ని
కాసులు చేసుకునే
మీసాల ఆసాములు
మిద్దెమీద మిద్దె వెయ్యగా
నా మీద పేరుకుంటున్నాయి
నాలాంటి చెమట చుక్కలు'
'శ్రమ జీవుల చేతులు
తీర్చి దిద్దుతున్నాయి
ఈ ప్రపంచాన్ని
పట్టు పరుపుగా
శ్రమజీవి మాత్రం
గూడులేని విహంగం'
వట్టి కేకలవల్ల బాగుపడదు సమాజం
గట్టి చేతలవల్ల బాగుపడుతుంది సమాజం
మానవుడు జ్ఞానసంపన్నుడు
మంచిని మనసారా ప్రేమిస్తాడు
కాంతిని తనివితీరా దర్శిస్తాడు
కడుపున పుట్టిన సంతానాన్ని
కంటికి గుండె సైతం కురుగుతుంది
విలవిలలాడే జీవిని చూసి
అది స్వార్థ ప్రేరితమే కావచ్చు
అయినా
కనిపిస్తుంది మానవత్వం
ప్రతి మానవునిలోనూ
కొద్దిగానో గొప్పగానో
మానవుడు మహితాత్ముడవుతాడు
మానవతను పరిరక్షించిన నాడు

ఈ కవితలో శర్మగారు సామాన్యమానవుల యొక్క ఆర్థిక పరిస్థితులు వారి మానసిక పరిస్థితులు, సమాజంలో

వారి పట్ల ఉండే వైఖరిని చాలా అద్భుతంగా వర్ణించారు మహాభారతంలోని 'అసాధుశ్చైవ పురుషో లభతే శీలమేకదా' అను వాక్యం ఈ కవిత వ్రాయుటకు చల్లా రాధాకృష్ణ శర్మ గారికి ప్రేరణని కల్గించింది.

ముగింపు :

పరస్పర ప్రయోజనాల కోసం మానవులు తీసుకునే కృత్రిమ చర్యలే సమాజం. ఈ సమాజం అనేది మానవుని యొక్క జీవన విధానం శాంతియుతంగా ఉండాలి, సభ్యసమాజంకి ఆదర్శవంతంగా ఉండాలి ఆచార్య చల్లా రాధాకృష్ణ శర్మ గారు తన రచనల్లో సగటు సామాన్య మానవుల జీవన విధానాన్ని చిత్రీకరించబడిన 'శ్రమలో స్వర్గము' కవితా సంకలనం ఒక మహాద్భుతం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

'పాకుడురాళ్ళు'– సామాజిక సమస్యలు, అంశాలు

– గంధం వేణు, తెలుగు అధ్యాపకులు, వి.ఆర్. డిగ్రీ కళాశాల, నెల్లూరు.

సమాజం, సాహిత్యం ఒకదానిని మరొకటి ప్రభావితం చేసుకుంటూ ఉంటాయి. సమాజంలో భాగమైన కవి సమాజంలోని వివిధ సమస్యలను తన రచనల ద్వారా వ్యక్తపరుస్తాడు. తన మేధోశక్తి కాలది రచనలోనే అందుకు తగిన పరిష్కారాలూ సూచిస్తాడు. ఒకవేళ అలా సూచించక పోయినా రచనలోని సమస్యపై పాఠకులు, తాత్వికులు, మేధావులు స్పందించి తమ తమ కోణాల్లో ఆ సమస్యలకు పరిస్కారాలు వెతుకుతారు. అందుకే కవికైనా, రచయిత కైనా సమాజంలో గౌరవం ఉంటుంది. అందుకు తోడు అతనిలోని కళాత్మకతతో కూడుకున్న సృజనాత్మకత రచనా శక్తిని పెంచుతుంది.

రచన సమాజానికి మేలు చేసేదిగా ఉండాలి అన్నది ఆధునికతతో వచ్చిన గొప్ప మార్పు. "సమాజ హితం" అన్నది ప్రధాన సాహిత్య దృక్పథంలో ఉన్నా ఆధునికత తోనే ఈ ఆలోచన బలంగా స్థిరపడింది. ఆధునిక సాహిత్య ప్రక్రియలుగా కథ, కవిత్వం (వచనం), నవల వంటివి ప్రజలను ఎక్కువ చైతన్య పరుస్తున్నాయి. వివిధ వాదాలు, ఉద్యమాల్లో పాటతో సహా ఇవి ప్రధానపాత్ర పోషిస్తు న్నాయి. ఆధునికంగా వచ్చిన, వస్తున్న రచనలన్నింటినీ సామాజికస్పృహతో చూడడం విమర్శలో, పరిశోధనలో ప్రధానంగా కనిపిస్తున్న అంశం. ఈ కోణంనుంచి చూసినప్పుడు 'పాకుడురాళ్ళు' నవలలో అనేక సామాజిక అంశాలున్నాయి.

'పాకుడురాళ్ళు' నవలలో కనిపించే సామాజిక అంశా లన్నీ, అప్పటి సమాజంలోనే కాదు ఇప్పటి సమాజంలోనూ కనిపిస్తున్న సామాజిక అంశాలే. అయితే వీటిలో ఎక్కువ భాగం సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలే. భరద్వాజ నవలలో ప్రత్యేకంగా కాకుండా ఆయా పాత్రల స్వభావం, రచనా నేపథ్యం, వస్తువు, పాత్రల అలవాట్లు, నవలకు అవసరమైన సంఘటనలు, సన్నివేశాలలో వీటిని చొప్పించారు. వాటివల్ల సమాజానికి జరుగుతున్న నష్టా లను కూడా చెప్పారు. ఇవి నవలలో అంతర్భాగంగా కనిపిస్తున్నా వాటిని వివరించడమే ఈ వ్యాసం ప్రధా నోద్దేశం.

జాతకాలు :

సమాజంలో వివిధ నమ్మకాలు ఒకతరం నుంచి మరోతరానికి సంప్రదాయాల పేరుతో వ్యాప్తిచెందుతూ ఉంటాయి. వాటిలో కొన్ని మంచి నమ్మకాలు మేలు చేసేవా ఉండవచ్చు. కొన్ని మూఢనమ్మకాలు ఎలాంటి శాస్త్రీయత లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేవిగా ఉండొచ్చు. ఇలాంటి నమ్మకాలవల్ల మంచి కంటే జరిగే చెడే ఎక్కువగా ఉంటుంది. కొన్నిటివల్ల ఎలాంటి చెడు, మంచి ఉండకపోవచ్చు. పిల్లలు పుట్టిన సమయాన్ని పరిగణనలోకి తీసుకొని పేర్లు పెట్టడం, వాళ్ళ భవిష్యత్తు గురించి ముందే చెప్పే జ్యోతిష్యశాస్త్రం మనకు చలా మణిలో ఉంది. అలాగే దేవుడికి సంబంధించిన అనేక అంశాలు నమ్మకాలుగా ఉన్నాయి. ఇంకా పేర్లు మార్చు కోవడంవల్ల భవిష్యత్తు బాగుంటుందనే నమ్మకాలూ ఉన్నాయి. ఇంకా ఉంగరాలు, దానిలో రాళ్ళు, రత్నాలు లాంటివి ధరిస్తే ధనం, కీర్తివంటివి.

కలిసొస్తాయనే అభిప్రాయాలు, ఆలోచనలు కొన్ని ప్రజల్లో ఉన్నాయి. అదృష్టం కలిసి రావాలని, సమస్యలు తొలగిపోవాలని పూజలు లాంటివి, ప్రార్థనలు వంటివి చేయడం కూడా కనిపిస్తుంటాయి. పాకుడురాళ్ళు' నవలలో జాతకాలకు సంబంధించిన పలు అంశాలు కనిపిస్తున్నాయి. 'నవల' ప్రధానంగా సినిమా ఇతివృత్తంగా సాగుతుంది కాబట్టి సినిమాలో జాతకాలకు సంబంధిం చిన పలు విషయాలు ఉన్నాయి. సినిమాలలో నాయికలు,

నాయకులు సినిమాల్లోకి వచ్చిన తర్వాత తమపేర్లు మార్చుకోవడం కనిపిస్తుంది. అలా మార్చుకోవడం వల్ల తమకు అవకాశాలు కలిసొస్తాయని నమ్మేవాళ్ళు కొందరు, అప్పటికే అదే పేరుతో ఉండడంవల్ల తప్పక పేరు మార్చుకునేవాళ్ళు కొందరు ఉన్నారు. 'పాకుడురాళ్ళు' నవలలో మంగమ్మ చలపతితో కలిసి మద్రాసు సినిమా అవకాశాలకోసం వెళుతుంది. 'మంగమ్మ' పేరు సరిగా లేదనే భావంతో ఆమెపేరు మార్చాలని నిర్ణయించుకుంటారు. ఒక శాస్త్రిగారి సలహా ప్రకారం మంగమ్మ పేరు మంజరిగా మారడం వెనుక జాతకాలు, నమ్మకాలు వంటివే ఉన్నాయి.

చలనచిత్రాలకు సంబంధించి కేవలం నాయికల పేర్లు మార్చడమే కాదు. మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవడానికి కూడా జాతకాలు చూసుకోవడం వంటివి ఉన్నవి. ఇంకా చెప్పాలంటే సినిమా ప్రారంభించడానికి కూడా ముహూర్తం చూపించడం, ఆ తిథి, నక్షత్రాలను బట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తారని తెలుస్తుంది. నేటికి కూడా ఇదే ఆనవాయితీ కొనసాగుతుంది. 'పాకుడు రాళ్ళు' నవలలో సినిమా ప్రారంభం గురించి, ముందు ముహూర్తం నిర్ణయించడం గురించి చర్చించడం ఉంది. వెంకటేశ్వర్లు, రామబ్రహ్మం ఇద్దరూ తీయబోయే సినిమా గురించి, ముహూర్తం గురించి పరబ్రహ్మశాస్త్రితో మాట్లాడడం కనిపిస్తుంది. అన్నీచూసి, అన్నివిధాలా మంచి ముహూర్తం నిర్ణయిస్తే సినిమా తప్పక విజయం సాధిస్తుందని నమ్మడంకూడా కనిపిస్తుంది.

మద్యం :

సామాజిక సమస్యల్లో ప్రధానమైంది మద్యపానం. మద్యం బారినపడి చాలామంది ఆరోగ్యాలు నాశనం చేసుకుంటున్నారు. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. కానీ మద్యం తయారు చేయడం, అమ్మటం అనేది ప్రభుత్వ చట్టప్రకారమే జరుగుతుంది. కొన్ని రాష్ట్రాలలో కొన్ని సమయాలలో మద్యనిషేధం అమలయింది. కానీ ప్రభుత్వాలు మారినప్పుడు ఓట్లకోసం, అధికారంకోసం రాజకీయపార్టీలు కొన్ని రాష్ట్రాలలో మద్యనిషేధాన్ని అమలుచేయడం లేదా నిషేధం ఉంటే ఎత్తివేయడం జరుగుతుంది. అదీగాక మద్యంవల్ల వచ్చే ఆదాయం పాలనకు అవసరం. ఎందుకంటే ప్రభుత్వాలకు మద్యం ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తుంది. ఆర్థికంగా ఎక్కువ స్థాయిలో ఉన్న వారినుంచి క్రిందిస్థాయిలో ఉన్నవారి వరకు మద్యం సేవించడం ఎక్కువైంది.

మద్యం గురించి, దానివల్ల ప్రజలకు జరుగుతున్న తీవ్రనష్టం గురించి మద్యం వ్యాపారం గురించి, లోటుపాటుల గురించి తెలుగు సాహిత్యంలో కవిత్వం, కథలు, నవలలు చాలానే వచ్చాయి. రావిశాస్త్రిగారు 'అరుసారా కథలు రాశారు. 'పాకుడురాళ్ళు' నవలలో కూడా అనేక చోట్ల పాత్రలు మద్యం సేవించడం కనిపిస్తుంది. ప్రధాన పాత్ర మంజరి మద్యాన్ని తొలిసారి తీసుకునే పరిస్థితి నుంచి మద్యాన్ని బాధలు మర్చిపోవడానికి తీసుకునే స్థాయివరకు చేరుతుంది. అంతేకాదు మద్యం స్వీకరించడం హోదాకు, గౌరవానికి చిహ్నమన్న పరిస్థితి కూడా నవలలో కొన్నిచోట్ల ఉంది. మద్యం సేవించి శరీర సుఖాన్ని అనుభవించే సన్నివేశాలూ నవలలో కనిపిస్తాయి.

సమాజంలో పైస్థాయిలో ఉన్నవాళ్ళ సంబంధాలను, ముఖ్యంగా సినీపరిశ్రమలో స్త్రీ, పురుష సంబంధాలతో ముడిపడివున్న మద్యాన్ని ఇక్కడ వివరించాడు రచయిత. నిర్మాతైన ప్రసాద్‌తో తనకు అవసరమైన పనిచేయించుకోవడానికి మంజరి తన మనసును చంపుకుంది. మద్యంతో విందు ఇచ్చింది. తనూ తాగి, శరీర సుఖాన్ని అందించి అతనితో తనకు కావాల్సిన పని చేయించుకుంది. హోదా, గౌరవం ఉన్నవాళ్ళ జీవితాల్లోని రహస్యాలను ఈ సన్నివేశం తెలియచేస్తుంది. మద్యానికి వాళ్ళు ఎలా లొంగుతారో, ఆనందాన్ని ఎలా పొందుతారో కూడా తెలియచేస్తుంది. మద్యం మహమ్మారి మత్తులో జరుగుతున్న మానవుల బలహీనతలకు ఈ సన్నివేశం ఓ మంచి ఉదాహరణ.

ఇలాంటి సన్నివేశమే నవలలో మరోచోట కూడా కనిపిస్తుంది. రాజన్ అనే పరపతి, డబ్బు, హోదాగల వ్యక్తితో మంజరి, కళ్యాణి సంబంధం పెట్టుకుంటారు. అతనితో కలిసి మద్యం సేవిస్తారు. ఆ ఆనందంలో అతని నుండి కావాల్సిన కారు, చిత్రపరిశ్రమలో తమకు అవసరమైన పనులు చేయించుకుంటారు.

"ట్రేలో రెండు నల్లటి సీసాలు, మరో నాలుగు సోడాలు ఉన్నాయి. ఘుమ ఘుమలాడుతున్న కూర, ఇంకోసాసర్‌లో ఇన్ని జీడిపప్పులు ఉన్నాయి. కళ్యాణి మూడు గ్లాసుల్లోకి వంపి, మిగతా ఖాళీలను సోడాలతో నింపేసింది. ముగ్గురూ గ్లాసులందుకొని, ఒకదానికి ఇంకొకటి తాకించారు. కళ్యాణి తన గ్లాసును పైకెత్తి "ఫర్ దిహెల్త్ ఆఫ్ మిస్టర్ రాజన్!" అన్నది.

"డిట్టో" అన్నది మంజరి.

రాజన్ "మీ యిద్దరి ఆరోగ్యం కోసం" అంటూ గ్లాసును ఖాళీ చేశాడు. దాదాపు పదకొండున్నరయింది. రేడియో గ్రామ్‌లోంచి సన్నగా, మధురంగా ఏదో సంగీతం వినిపిస్తోంది. రాజన్ గట్టిగా సిగరెట్‌లాగి, మంజరి ముఖం మీదికి పొగ వదిలాడు. మంజరి అతని సిగరెట్‌ను లాక్కుని కాల్చ సాగింది. కళ్యాణి అతని వెనకవైపున చేరి, మంజరికి సైగ చేసింది. గ్రహించానన్నట్లుగా మంజరి కూడా కన్ను కలిపింది." (పాకుడురాళ్ళు: 284). అలా మద్యం మత్తులో ఉన్న రాజన్ ఆనందాన్ని గమనించి కళ్యాణి, మంజరి అతని కొత్తకారును సొంతం చేసుకుంటారు. మంజరి కొత్తగా కొన్న ఇంటికి కట్టాల్సిన ధనం మొత్తాన్ని అతనిచేతే కట్టిస్తారు. ఆ తర్వాత ఇద్దరూ అతనికి శరీరసుఖాన్ని అందిస్తారు. ఈ విధంగా, నవలలో మంజరి అనేకమందితో మద్యం తాగడం, వాళ్ళకు సుఖాన్ని అందించడం, దాన్ని తన ఎదుగుదలకు ఉపయోగించుకోవడం కనిపిస్తుంది.

వ్యాపార ప్రకటనలు :

ప్రస్తుత సమాజంలో వ్యాపార సంస్కృతి పెరిగిపోతుంది. మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకు కావల్సిన వస్తువులనేకం. వాటిలో అవసరాన్ని బట్టి, మనుషులు ఇచ్చే ప్రాధాన్యాన్ని బట్టి ఆయా సంస్థలు వస్తువులు తయారు చేస్తాయి. వీటిలో అన్ని వస్తువులు ముఖ్యమైన అవసరాలకే సంబంధించినవి కాకపోవచ్చు. మనిషి మరింత సుఖవంతంగా, ఆరోగ్యవంతంగా, సంతోషకరంగా జీవించేవి కూడా చాలా ఉంటాయి. క్రమక్రమంగా వస్తువులు తయారుచేసే వివిధ సంస్థల మధ్య పోటీ ఎక్కువై, తమ వస్తువులను వినియోగదారులకు (ప్రజలకు) మరింత చేరువచేయడానికి పత్రికలు, ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో ప్రకటనలు ఇస్తాయి. తాము తయారుచేసిన వస్తువు గొప్పతనం గురించి, అది వాడటంవల్ల కలిగే లాభాల గురించి వివరిస్తాయి. ఈ క్రమంలో ప్రజలలో పేరున్న, గుర్తింపున్న వ్యక్తులను ఈ ప్రకటనలలో వాడుకుంటాయి. వాళ్ళద్వారా ప్రజలకు తాము తయారుచేసిన వస్తువు గురించి చెప్పిస్తే, చూపిస్తే ఎక్కువ మంది కొంటారు కనుక. ఇదో వ్యాపార సూత్రం. నేటికీ ఎక్కువమంది పారిశ్రామికవేత్తలు పాటిస్తున్న ఆర్థికమంత్రం.

'పాకుడురాళ్ళు' నవల రచనాకాలం నాటికే ఈ ధోరణి కనిపిస్తుంది. స్త్రీల అందానికి సంబంధించి పెంచే వివిధరకాల వస్తువులకు చలనచిత్ర నాయికలను ప్రకటనలకు అంగీకరింపచేసేవారు. అందుకు వారికి ధనం ఇచ్చేవారు. ముఖ్యంగా ఆ కాలంలో సబ్బులు, తలకు వాడే నూనెలకు సంబంధించిన వ్యాపార ప్రకటనలలో సినిమా నాయికలు కనిపించేవారు. అందుకు వారికి డబ్బులు ముట్టేవి. ఇలాంటి ప్రకటనలకు మంజరి మొదట అంగీకరించేది కాదు. కానీ రాజన్ అనే వ్యక్తి సిఫారస్ చేయడం వల్ల ఒప్పుకుంటుంది. ఇలాంటి ప్రకటనలు ఇవ్వడంవల్ల నాయికలకు కూడా ప్రజల్లో గుర్తింపు పెరుగుతుంది. అటు వ్యాపారసంస్థలు తమ వస్తువులు అమ్ముకోవడానికి, ఇటు ప్రకటనల ద్వారా అందులో కనిపించే వాళ్ళు ఎక్కువమందికి తెలియడం ద్వారా....

రెండు విధాలా లాభపడతారు. ఇదే విషయాన్ని కనక సుందరం, మంజరికి మధ్య జరిగిన సంభాషణలో వెల్లడవుతుంది.

కులం :

భారతదేశం వివిధ కులాలతో నిర్మించబడిన దేశం. ఈ కులాల మధ్య ఎక్కువ తక్కువలే కాదు అర్థిక, సామాజిక, సాంస్కృతిక అసమానతలూ ఉన్నాయి. అలాగే కులాలమధ్య కట్టుబాట్లు, ప్రత్యేక ఆచార సంప్ర దాయాలూ ఉన్నాయి. ఏ కులానికి ఆ కులం ప్రత్యేక మైనదిగా భావించబడుతుంది. మొదట వర్ణసమాజంగా ఉన్నదేశం వృత్తివిభజన జరిగాక, ఆ వృత్తులే కులాలుగా ఏర్పడ్డాయని చరిత్రకారులు చెప్తారు. కులవృత్తులలో మిగులు విలువను ప్రాధాన్యంగా చేసుకొని విశ్రాంతి వర్గం, ఆ తర్వాత కొన్నివృత్తులకు గొప్పదనం, కొన్ని వృత్తులకు అలసత్వం ఏర్పడిందని అంటారు.

"ఐరోపాకు చెందిన గ్రీసులోను, రోమ్‌లోను ప్రాచీన సామ్యవాద వ్యవస్థ పతనానంతరం బానిసవ్యవస్థ రూపొందినది. అయితే, భారతదేశంలో అటువంటి బానిస వ్యవస్థకు మారుగా మరో రకమైన వర్గబేధము, దోపిడి వ్యవస్థ రూపొందాయి. సింధూ మైదాన శిథిలాలను పరిశీలించినపుడు గ్రీసులోను, రోమ్‌లోను ఉన్నటువంటి బానిసపద్ధతి ఇక్కడా ఉన్నట్టు అనుమానం కలుగుతోంది. కానీ సింధూ మైదాన నాగరికతనే ధ్వంసంచేసి ఒక కొత్త నాగరికతను రూపొందించిన ఆర్యులు బానిసలు - యజమానులు అనే వర్గబేధానికి బదులుగా తొలిదశలో నాలుగు వర్ణాలు, తర్వాతి కాలంలో అసంఖ్యాకమైన కులాలు, ఉపకులాలతో కూడిన ఒక వ్యవస్థను రూపొం దించారు."

కులవ్యవస్థ రానురాను సమాజంలో పాతుకు పోయింది. ఒక్కో కులానికి ఒక్కోరకమైన స్వభావం, ప్రత్యేకత ఏర్పడింది. కులాలమధ్య కట్టుబాట్లు ఎక్కువ అవడంతో భిన్నకులాలమధ్య బేధాలు ఎక్కువయ్యాయి. దాంతో ప్రతికులానికి సంబంధించిన వాళ్ళమధ్య ఐక్యత, సహకారం, ప్రేమ లాంటివి పెరుగుతూ వచ్చాయి. ఒకవైపు సమాజం వైజ్ఞానికంగా ముందుకు సాగుతూంటే ఈ కులం మాత్రం తన మూలాలలను మరింత విస్తరించుకుంటూ పోతుంది.

ఈ నవలలో ప్రధానంగా సినిమాల్లోని వివిధ విభాగాల్లో పనిచేసే వారిమధ్య కుల సంబంధాలు ఎలావున్నాయో చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది. ముఖ్యంగా నటుల మధ్య తమ కులానికి సంబంధించిన వాళ్ళను ఎలా ముందుకు తీసుకెళ్తారో, సహాయ సహకారాలు అందిస్తారో వివరించారు రచయిత.

జయరాం తనకు అవకాశాలు తగ్గడానికి కులంకూడా ఒక కారణమని శర్మతో చెబుతాడు.

"ఏం చెప్పను శర్మగారూ! ఈ లోగుట్టు వ్యవహారాలు అందరికీ తెలిసినవే! కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది. అంతకుముందు దాకా, ఫైలంతా నాదే. అంతా ఓ పదేళ్ళనుండి చక్రం అడ్డంగా తిరగసాగింది. మరీ - అయిదారేళ్ళ నుండి కేకేసినవారు లేరు....కారణాలు ఏమని చెప్పనండి? కులప్రభావం. నా కులం వాడు ఒక్క డైరెక్టరు కూడా లేడు. ఒక్క ప్రొడ్యూసరు లేడు. కనీసం డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీలోనైనా బాగస్థుడు కూడా కాదు. ఇక నన్ను పిలిచేదెవరు చెప్పండి" అన్నాడు జయరాం."

జయరాం మాటలను బట్టి సినిమా ప్రపంచంలో అవ కాశాలు దక్కడానికి కులం చాలా ప్రధానమని తెలుస్తుంది. దర్శకులు, నిర్మాతలు, నటులు, పంపిణీదారులు తమ తమ కులాలవాళ్ళకే అవకాశాలు ఇస్తారు. వేరే కులంవాళ్ళ గురించి పట్టించుకోరని జయరాం శాస్త్రితో చెప్పిన మాటల వెనుక అర్థం ఇది. చలనచిత్ర పరిశ్రమలోనే కాదు విద్య, వైద్యం, రాజకీయం, న్యాయం....వంటి అన్నిరంగాల్లోనూ ఈ కులం రోగం కనిపిస్తుంది. తమ కులం వాళ్ళకే సహాయం చేయడం, తమ కులం గురించి గొప్పగా చెప్పు

కోవడం, వేరేకులంలో ప్రతిభావంతులున్నా, వాళ్ళకు అవకాశాలు దక్కనీయకుండా అడ్డుపడడం ప్రధానంగా నేటికీ సమాజంలో కనిపిస్తుంది. అలాంటిదే సినీ పరిశ్రమలోనూ ఉందని ఈ నవలలో జయరాం పాత్ర ద్వారా చెప్పించాడు రచయిత.

పాకుడురాళ్ళు నవల ద్వారా రచయిత రావూరి భరద్వాజ ఆనాటి సమాజంలోని సామాజికాంశాలను విశదీకరించడంతో పాటు అవి సమాజాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తాయో నవలలోని పాత్రల ద్వారా కూలంకషంగా తెలియజేశారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. నవలా శిల్పం - వెంకట సుబ్బయ్య వల్లంపాటి
2. సాంఘిక నవల - కథన శిల్పం - మృనాళిణి. సి
3. పాకుడురాళ్ళు నవల - భరద్వాజ రావూరి

❖ ❖ ❖

గురజాడ అప్పారావు కవిత్వము – సామాజిక వాస్తవికత

– డా॥. పట్టపు శకుంతల, తెలుగు ఉపన్యాసకులు, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల, తి.తి.దే., తిరుపతి.

గురజాడ అప్పారావు గారు ఆధునిక తెలుగు కవిత రచనా మార్గంలో చేసిన నూతన ప్రయోగములు ఆనాటికి ఎంతో సాహసోపేతమైనవి, ఈనాటికి ఎంతో ఆదర్శప్రాయమైనవి. తెలుగు కవితారచనలో ఆధునికతకు మొదటి మలుపుగా పేర్కనదగిన ఖండకావ్య ప్రక్రియలో(ముత్యాల సరములు)రచన చేయడం గురజాడ వారి నవీన కవితాదృక్పథానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఆధునిక కవిత్వాన్ని నవ్య కవిత్వమని కూడా పిలుస్తారు. 'నవీన గుణములు గల్గిన సమస్తాధునిక కవిత్వమునకు ఈ మాట సరిపడును' అని సి. నారాయణరెడ్డి గారు పేర్కొన్నారు. గురజాడ అప్పారావు గారు తమ 'ముత్యాల సరములు' ఖండకావ్య ప్రక్రియలో రచించుట, ఆత్మాశ్రయరీతిని అందిపుచ్చుకొనుట, కావ్య వస్తు సంగ్రహణంలో నూతనత్వాన్ని అభిలషించుట, భావప్రకటనంలో నవ్యతను పొందుపరచుట, కావ్య రచనాశైలిలోను, పదప్రయోగ విషయంలోను కొత్తదనాన్ని ఆపేక్షించుట వంటి మొదలైన అంశాలన్నీ గురజాడ అప్పారావు గారిలోని ఆధునికతకు నిరుపమ నిదర్శనాలుగా కనిపిస్తాయి.

గురజాడ అప్పారావు గారి కవిత్వంలో తమ సమీప కాలంలో సామాన్య జనుల వ్యవహారంలోని పదములకు, పలుకుబడులకు కూడా కావ్యత్వం కల్పించడం కనిపిస్తుంది. వర్ణభేదములు లేని సంఘవ్యవస్థను ఆకాంక్షించడం వీరి రచనల్లోని మరో విశేషం. గురజాడ అప్పారావు గారి రచనల్లో కనిపించే నవ్యతాస్ఫోరకమైన గుణాలలో సామాజిక స్పృహ విశేషమైనది అని చెప్పుకోవాలి.

దేశికవితా సమాదరణము :

మార్గ దేశ కవిత్వములలో గురజాడ వారికి దేశి కవిత్వమంటేనే మక్కువ ఎక్కువ అని తెలుస్తుంది. మార్గ దేశి రీతులను వారు క్లాసికల్ కృతులు, పాపులర్ కృతులు అనే పేర్లతో వ్యవహరించారు. గురజాడ వారి ఉద్దేశ్యంలో క్లాసికల్ కృతులు పద్య(వృత్త)మయములు, శబ్ద డంబరము కలిగినవి. పాపులర్ కృతులు పాశ్చాత్యుల గేయముల వలె లలితరీతిలో ద్విపదలలో రచింపబడిన వని గురజాడ వారి అభిప్రాయం. ద్విపదలలో రాయబడిన ప్రజాసాహిత్యం సహజముగానే లలితముగా ఉంటుందని అప్పారావు గారు భావించారు. 'ఈ జానపద గేయాలలో శబ్ద సౌష్ఠవం లేకపోయినా, కవితా శిల్పం లేకపోలేదు.' అనే మాట దేశి కవిత్వం పట్ల గురజాడకు గల అభిమానాన్ని ప్రకటిస్తుంది. అప్పారావు గారు మార్గ దేశి విభాగంలో దేశి కవిత్వం వైపే మొగ్గు చూపినారు. జానపద గేయాలలోని కవితా శిల్పానికి అప్పారావు గారు ముగ్ధులైనట్లుగా సి. నారాయణరెడ్డి గారు పేర్కొన్నారు. జానపద గేయాలలోని భావప్రాధాన్యాన్ని అప్పారావు గారు ఎలుగెత్తి చాటినారు. అంతేకాకుండా సంస్కృత పద జటిలత్వముతో నిండిన మార్గ కవితారీతి సామాన్య జనులకు సన్నిహితం కాదని తమ లేఖలు, డైరీల ద్వారా స్పష్టపరిచారు.

సామాజికత :

మన చుట్టూ ఉన్న సమస్తమైన అతిసామాన్యమైన ప్రజాజీవితమే సమాజం అవుతుంది. కవులు తమ కావ్యాలలో కాల్పనిక జగత్తునే కాకుండా తమ సమీప కాలంలో జీవిస్తున్న అతిసామాన్యమైన అన్ని వర్గాల ప్రజాజీవితాన్ని కూడా రచించ గలిగినప్పుడే వారి రచనలు సార్థకతను పొందగలుగుతాయి. తెలుగులో ఆధునిక కాలంలో అటువంటి రచనలు చేసిన కవులలో గురజాడ అప్పారావు గారు అగ్రగణ్యులు. గురజాడ వారు తమ

'కన్యాశుల్కం' నాటకంలో సమకాలీన సాంఘిక జీవితమును వస్తువుగా గ్రహించిన విషయాన్ని గురించి విజయరామ గజపతి మహారాజు గారికి రాసిన లేఖలో కిందివిధంగా ప్రస్తావించారు. "పుష్కలమైన అనంతమైన సంఘటనలతో నిండి వున్న ఎంతో గాంభీర్యమూ వైవిధ్యమూ గల నేటి జీవితాన్ని వీక్షించక, ప్రపంచ ప్రసిద్ధికెక్కిన ప్రాచీన కాల్పనిక కథల నుంచి రచయితలు యితివృత్తాలను ఎందుకు స్వీకరిస్తారో అర్థంగాక నాకు ఆశ్చర్యం వేసింది. ఈ కారణాల వల్ల నేను వాస్తవిక జీవితం నుంచి సమకాలిక యితివృత్తాన్ని స్వీకరించి దానిని తెలుగున వాడుకభాషలో నాటకంగా రూపొందించాను."

(నారాయణరెడ్డి, సి. 2001, 205)

ఈ మాటలు నాటకంలోని ఇతివృత్తాన్ని గురించి రాసినప్పటికీ, కావ్య వస్తువు పట్ల కూడా ఇవి అన్వయిస్తున్నాయి. కావ్య వస్తువును గ్రహించే విషయంలో అప్పారావు గారిపై ఆంగ్లకవి విలియం వర్డ్స్‌వర్త్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. 'మైకేల్' మొదలైన కావ్యాలలో వర్డ్స్‌వర్త్ కవి వస్తువుగా గ్రహించిన సామాన్య మానవుల జీవితము అప్పారావు గారిని ఆకర్షించినట్లుగా తెలుస్తుంది. వర్డ్స్‌వర్త్ కవిని గురించి గురజాడ వారు రాసిన వ్యాసంలో మన ప్రాచీన కవులకు, వర్డ్స్‌వర్త్ కవికి మధ్య గల తారతమ్యము స్పష్టమవుతున్నది.

"మనదేశపు కవులు కావ్యములలో వర్ణించు పాత్రలు దేవతలు, రాజవంశీయులేయని, లోకములో కానరాని గుణసంపత్తి రూపసంపత్తి ఆ నాయికానాయకులలో రాశీభూతమైనట్లు మనవారు వర్ణింతురని, అట్టి సంపత్తి క్రింది కులములకు చెందిన వారిలో ఉండవని మన దేశపు కవులభిప్రాయ పడినారని, గురజాడ వారు తమ విచారమును ప్రకటించిరి."

(నారాయణరెడ్డి, సి. 2001, 205)

అప్పారావు గారు కులము కన్న గుణము మిన్న అని భావించినారు. రసవత్తరమగు కావ్య రచనకు రాజుల, రెడ్ల, బ్రాహ్మణుల చర్యల వర్ణన ఏవిధంగా తగినదో, తక్కువ జాతివారి చర్యలు కూడ అదేవిధంగా తగినవని గురజాడ వారు నొక్కి చెప్పారు. అందుకు నిరూపణగానే, 'లవణరాజు కల'లో కావ్య నాయికగా మాలితను స్వీకరించి ఎంతో సాహసం చేశారు అప్పారావు గారు. ఆ మాలిత ప్రవేశాన్ని గురజాడ వారు అత్యంత సహజంగాను, ముగ్ధమనోహరంగాను వర్ణించారు.

"కూటి కడవను బుజముపై నిడు/ వాట మది యొక మరువు గులకగ
పాట పాడెను, పాటలాధరి/ చెట్లు చామలకై"

(ముత్యాల సరములు.2005. 22)

ఆనాటి సమాజంలో కిందివర్గాల ప్రజలు తమ కులం కారణంగా అనుభవిస్తున్న మానసికవ్యధను, న్యూనతా భావాన్ని విడిచిపెట్టి, ఆత్మస్థైర్యంతో తమ కులం కూడా ఎవరికీ తక్కువ కాదు అనే ఆత్మవిశ్వాసాన్ని మాలెత మాటలలో పలికించారు.

"వన్నెమీరిన మేని పసతో/ కన్నుమణగెడి రత్నరుచితో,
"నన్ను" తెలియక నాస చేసెద/ వయ్యో! మాలిత నేన్"

(ముత్యాల సరములు.2005. 24)

అంటూ కావ్యనాయికను ఉద్దేశించి, ఆమె నోటివెంటే తాను మాలితను అనే మాటను పలికించారు గురజాడ అప్పారావుగారు. అంతేకాకుండా ఆకలితో అలమటిస్తున్న సాటిమనిషికి పిడికెడు అన్నాన్ని కూడా తన చేతులతో పెట్టడానికి నోచుకోలేక పోయిన తన దైన్యానికి కారణమైన కులాన్ని, అందుకు కారణమైన వర్ణవ్యవస్థను కూడా నింద చేయడానికి తనకు అవకాశం ఉన్నప్పటికీ, 'నాదు భాగ్యము కెవరి నేమందున్' అని మాలిత లవణరాజుతో పలికిన మాటలు ఆమె హృదయ నైర్మల్యాన్ని, అకారణంగా ఎదుటి వారి మీద నిందలు మోపని గొప్ప గుణాన్ని కూడా ఆవిష్కరింపజేశారు. ఆవిధంగా గురజాడ వారు తమ మనోభావానికి శాశ్వతత్వాన్ని కల్పించారు.

'పూర్ణమ్మ'కథ గేయకవితలో

"పూజారింటను పుట్టిన చిన్నది
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా . . ."

(ముత్యాల సరములు,2005. 46)

అంటూ కావ్యనాయికగా పూజారి కూతురును ఎన్నుకొన్నారు.

'కన్యక' గేయకవితలో,

" . . . . నీవు పట్నం
యేలు రాజువు, సెట్టికూతుర
నెటకు పోనేర్తున్"

(ముత్యాల సరములు,2005. 12)

అని కావ్యనాయిక చేతనే ఆమె సెట్టికూతురు అనే ప్రస్తావన చేయించారు గురజాడ వారు. ఈ విధంగా కావ్యవస్తు గ్రహణంలో ఒక నూతన మార్గాన్ని అనుసరించి తర్వాతి కవులకు ఆదర్శ ప్రాయులైనారు.

వాస్తవికత :

కవిత్వములో వాస్తవికతను ప్రవేశపెట్టిన వారిలో అప్పారావు గారు అగ్రగణ్యులు. కృత్రిమమైన పదచిత్రాల రచనలు, నిరాధారమైన ఊహా కల్పనలు గురజాడ వారికి అక్కరలేని భావనలు అని వారి కవిత్వాన్ని పరిశీలిస్తే స్పష్ట మవుతుంది. కవిత్వంలో వాస్తవికత అనగానే నీరసమైన భావ ప్రకటనమని భావించనక్కరలేదు. శ్రీశ్రీ అభ్రాయంలో గురజాడ వారిది వట్టి ఫోటోగ్రఫీ కాదు, 'ఎక్సురే ఫోటోగ్రఫీ'. గురజాడ కవిత్వం ప్రధానంగా హృదయ సంబంది. అలతి అయిల సుకుమార భావాలతోనే హృదయ స్పందనను కలిగించగల ప్రయత్నం అందులో కనిపిస్తుంది. గురజాడ వాస్తవికతకు, సుకుమార భావ పరంపరా ప్రకటనమునకు ఈ కింది సూర్యోదయ వర్ణన చక్కని నిరూపణము.

"వెలుగు నీటను గ్రుంకె చుక్కలు/ చదల చీకటి కదల బారెను;
యెక్కడనొ వొక చెట్టు చాటున/ నొక్క కోకిల పలుక సాగెను.
మేలుకొలుపుల కోడి కూసెను/ విరులు కన్నులు విచ్చి చూసెను;
ఉండి, ఉడిగియు, ఆకులాడగ/ కొసరెనోయన గాలి వీచెను."

(ముత్యాల సరములు,2005. 3)

పై చరణములలో చుక్కలు మాయమవటం, చీకటి కదిలిపోవటం, కోకిల పాడటం తోపాటుగా కోడి కూయటం, పూవులు విచ్చుకోవటం, మెల్లగా గాలులు వీయటం అనే ఉదయకాలపు ప్రకృతి సహజమైన ధర్మములు అత్యంత సహజ రమణీయంగా చిత్రించటం కనిపిస్తుంది. వెలుగునీటిలో చుక్కలు కుంకి పోవటం అనేది ఎంత చక్కని భావుకత ! కోడి కూతలో కూడా మేలుకొలుపులు వినగలగటం మహాకవికి మాత్రమే అనుభవంలోకి వచ్చే భావన. విరులు కన్నులు విచ్చి చూశాయని చిత్రణ చేయటంలో జడప్రకృతిలో కూడా ఆ ఉషోదయం చైతన్యాన్ని నింపిందని ధ్వనింపచేయటం గమనించవచ్చు.

ఇదేవిధంగా 'లవణరాజు కల'లో మాలిత పాడిన పాటను చెట్లు చేమలు కోటి చెవులతో గ్రోలినవి అనటం, తాటివనంలో ఆగి చంద్రుడు చెవి ఒగ్గి వినటం వంటివి, చెవులు లేని చెట్లకు కూడా శ్రోతృత్వాన్ని ఆపాదించటం అనే రమణీయ భావనలు గురజాడ వారి భావనాశక్తికి ప్రకృతిలోని సహజమైన వాస్తవిక చిత్రణలకు పతాకలు.

సామాజిక వాస్తవికత :

గురజాడ వారిది పదాడంబరము, వ్యర్థపద ప్రయోగములూ లేని రచనా శైలి. కవితా రచనలో చరణములు వేనికవి విడిపోవునట్లుగా, పదములు దేనికది తునిగి పోవునట్లుగా రచన చేయటం గురజాడ వారి కవిత్వంలో కనిపిస్తుంది. వ్యావహారిక భాషలోని పదజాలానికి కూడా సమస్త భావప్రకటనా సామర్థ్యము ఉన్నదని అప్పారావు గారి ప్రగాఢ విశ్వాసం.

కావ్యంలో ప్రయోగించేందుకు వాడుక మాటలు కూడా యోగ్యమైనవేనని అప్పారావు గారు నిరూపించారు. ''దేశభక్తి' లోని ప్రతి పంక్తిలో ఈ శక్తియే కనిపించును. వాడుక మాటలే వాడినను ఆయన ఎక్కడ జారిపోలేదు.' అని విశ్వనాథ సత్యనారాయణగారు విశ్వసించారు.

"మెచ్చనంటావీవు; నీవిక/ మెచ్చకుంటే మించిపాయెను;
కొయ్యబొమ్మలె మెచ్చుకళ్ళకు/ కోములుల సొరెక్కునా."
(ముత్యాల సరములు,2005. 3)

పై చరణంలోని మాటలన్నీ సామాన్య జనుల వ్యవహారం లోనివే. ఇవన్నీ విడివిడి మాటలే అయినప్పటికీ వాటిలోని కవితాశక్తి అసాధారణమైనదని తెలుస్తుంది. వాడుక మాటల కూర్పు అంత సులువేమీ కాదు. లోకవ్యవహారమును ఉన్నదున్నట్లుగా ప్రకటించుటకు ఎంతో నేర్పు, ఓర్పు కావలసి ఉంటుంది. చెప్పదలచుకొన్నది సూటిగాను, స్పష్టంగాను చెప్పవలసి ఉంటుంది. మామూలు వాడుక మాటలలోనే అప్పారావు గారు కరుణ రసాత్మకమైన 'పూర్ణమ్మ' వంటి గాథను వినిపించారు. 'డామన్ పితియస్' వంటి గ్రీకుగాథను, 'లవణరాజుకల' వంటి వివిధ రసభరితములైన కథాగేయములను రచించినారు. 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' వంటి మహాసూక్తులను కూడా వాడుక మాటలలోనే పలికించగలిగినారు.

గురజాడ వారి రచనలో దీర్ఘసమాస బాహుళ్యం మృగ్యం. అల్పసమాస రచన, వీలైతే అసమాస రచనే అప్పారావు గారికి ప్రీతికరమని వారి కవిత్వం స్ఫురింపజేస్తుంది.

"విరిగిపెరిగితి పెరిగివిరిగితి/ కష్టసుఖముల పార మెరిగితి
పండునన్నవి ఆశలెన్నో/ యెండిరాలగ బొగిలితిన్"
(ముత్యాల సరములు,2005. 69)

ముగింపు :

సర్వ మానవాభ్యుదయం పట్ల ఆసక్తి, దేశ సాహిత్య పునరుద్ధరణ కోసం తపించడం అనేవి గురజాడ మహోన్నతకు సూచికలుగా కనిపిస్తాయి. డబ్బుకు ఆశపడి కాటికి కాళ్లు చాచుకొన్న ముసలిపెళ్లి కొడుకులకు పసిపిల్లల్ని అమ్ముకోవడం గురజాడ దృష్టిలో మానవ సమాజాన్ని అప్రతిష్టపాలు చేయడమే (పూర్ణమ్మ), గురజాడ రచనల్లో కనిపించే, స్త్రీల ఆత్మరక్షణ కోసం ప్రతిఘటన (కన్యక), స్త్రీ విద్యకు ప్రోత్సాహం (దిద్దుబాటులో కమలిని), వితంతు పునర్వివాహాల ప్రోత్సాహం (కన్యాశుల్కంలో బుచ్చమ్మ, కొండుభట్టీయంలో పార్వతి), వేశ్యా వివాహాల ప్రతిపాదన (కన్యాశుల్కంలో మధురవాణి, సంస్కర్త హృదయంలో సరళ), మలిన చిత్తులకు అగ్రకులాలు, మలిన దేహులకు నీచ కులాలు విధించిన 'వర్ణధర్మం అధర్మధర్మం' (లవణరాజుకల) అని ధిక్కరించడం,

ఆనాటి మన సమాజంలో పాతుకుపోయిన మతమౌఢ్యాల ఖండనం (దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులు చేసిన దేవుళ్లారా మీపేరేమిటి?) వేశ్యా వ్యామోహాన్ని హేళన చేయటం (దిద్దుబాటు, సంస్కర్త హృదయం), సకల కులాల సహపంక్తి భోజనాల సమర్థన (ముత్యాలసరములు) వంటి నవీన భావాల ప్రతిపాదనము, సమర్థనము, నిరూపణము అనేవి అప్పారావు గారి రచనల్లో ప్రతిఫలిస్తూ, సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తూ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా అజరామరంగా నేటికీ నిలిచి ఉన్నాయి అని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. గురజాడ రచనలు - కవితల సంపుటి
2. ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు, ప్రయోగములు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కాళోజీ కథల్లో సామాజిక జీవన చిత్రణ

– జె. శంకర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

"లోయలోకి దూకి దూకి
లోతులెన్ని చూసినాను .....
నే పాకని ఎత్తు లేదు
నే జారని లోతు లేదు
అతిథివోలే వుండి వుండి
అవని విడిచి వెళ్ళుతాను"

అనే వాస్తవ రూపమైన తన స్వగతాన్ని తెలుపుకున్న కాళోజీ నారాయణరావుగారు నైజాం కాలంలో పుట్టి ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ ఉద్యమాల్లో పెరిగి తెలంగాణ గొడవను తన గొడవగా 70 ఏళ్ల అలసట లేకుండా ఎలుగెత్తి చాటుతున్న కాళోజీ,సార్వజనీన సత్యాలను, సామాజిక వాస్తవాలను అక్షరీకరించి ప్రజా చైతన్యం కలిగించి, తన సాహిత్యం ప్రజల నాలుకలపై ముద్రణాకృతి రూపంలో కదులుతూ ఉంటుంది.కాళోజీ గారి జీవితాన్ని, సాహిత్యాన్ని వేరు పాయలలో ఉంచకపోవడం చేత ఆయన జీవితంలోని ప్రతి సంఘటనను ఆయన రచనల్లో చూడవచ్చు. కాళోజి గారి అక్షర యుద్ధం ఎక్కుపెట్టిన బాణం వలే నిక్కచ్చిగా, సూటిగా గుండెల్లో గుచ్చుకునేలా ఉంటుంది.ఎక్కడా ఆగకుండా ప్రజా చైతన్య ప్రేరకంగా మారిపోతుంది,మార్పును సూచిస్తూ వుంది. కాళోజీ గారు మౌలికంగా రాజకీయ కార్యకర్త అయినప్పటికీ,రాజకీయ సమస్యలు, నిజాం పాలనకు వ్యతిరేకమైన సమస్యలు, ప్రజా సమస్యలు లేక పౌర హక్కులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఆయన వ్యక్తిత్వంతో విడదీయలేని అంశాలు.నిజాం నిరంకుశ పరిపాలనలో ప్రజాస్వామ్య సంస్కృతిని వంటబట్టించుకున్న తీరు తెలుసుకోవడానికి మేధావులు, రచయితలు, సిద్ధాంత కర్తలను చూస్తే కాదు తెలంగాణలో జీవితానుభవం, వివేకం ఉన్న సగటు మనిషిని చూడాలి. సంక్లిష్టమైన, సంఘర్షణాత్మక మైన సామాజిక జీవితంలో భాగంగా ఉంటూ, ప్రజల జీవితాలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ప్రతిఘటించ సాగాడు. బాధితులను చూస్తూ, మానవీయ హృదయంతో కన్నీరు కారుస్తూ, చెలించి పోయాడు. ఆ చింతనే కవిత్వంగా మిగిలిపోయాయి. ప్రజల నాలుకల మీద వాలిపోయాయి. కానీ ఆయన రాసిన కథల గురించి శోధిస్తే గాని తెలువదు మనకు సామాజిక కథకుడిని. నిజాం పాలన నుండి మొదలుకుని స్వతంత్ర భారతదేశంలో నేటి వరకు పౌర హక్కులకు నష్టం వాటిల్లే సమకాలీన సామాజిక, రాజకీయ విషయాలన్నింటిని ప్రజాస్వామ్య బద్ధంగా నిరసిస్తూ ధిక్కరిస్తూ, ప్రతిఘటిస్తూ వచ్చాడు కాబట్టి కాళోజీ రచనలకు ప్రజామోదం లభించింది. మాట ఆయన దృష్టిలో ఒక భావ ప్రకటన. ప్రక్రియ రూపమేదైనా, మనసులోని మాట చెప్పడమే, ఆ మాటలను ప్రజల హృదయాలకు హత్తుకునేట్టు చేసి, ప్రజా చైతన్యం తీసుకురావడమే కాళోజీ గారి అభిమతం.

''గద్యం కవీనాం నికషమ్ వదంతి'' అని దండి దశ రూపకంలో చెప్పినట్టు గద్యం రాయడం ఎంత కష్టమో, గద్య ప్రక్రియ కోవకు చెందిన కథలు రాయడం కాళోజీ గారి బహుముఖీన ప్రతిభకు అద్దం పడుతుంది.కవిత్వం అయినా కథ అయినా కాళోజీ గారికి ముడిసరుకు సమాజం నుండి తీసుకున్న సంఘటనలే కానీ ప్రాచీన కవులకు మాదిరి ఊహాజనితాలు కల్పిత వస్తువులు కాదు మనుషుల జీవితం నుండి సేకరించిన ప్రతిబింబాలు కాళోజి గారి కథలు.ఇలాంటి కొన్ని కథలలోని మానవీయ కోణాలను నేను ఈ వ్యాసం నందు వివరిస్తాను.

54 పేజీల చిన్న సంపుటి ''కాళోజీ కథలు'' ఇందులో ఎనిమిది కాళోజీ స్వంత కథలు, ఒక మరాఠీ కథకు అనుసరణ, రెండు మరాఠి కథల అనువాదాలు, ఒక ఇంగ్లీష్ కథకు అనువాదం ఉన్నాయి.

అమానవీయ సాంస్కృతిక మాలిన్యం ఇంకా పేరుకు పోతుంది, అనడానికి నిదర్శనం ''భూతదయ'' కథ అద్దం పడుతుంది.ఈ కథలో ఓ రోజు అప్పుడే పుట్టిన పసికందును కానీ వదిలేసి పోతారు.ఆ పసికందును చూడడానికి తండోప తండాలుగా వచ్చిన జనం పాప ఏడుస్తుంటే 'గొర్రె దాటు మంద వోలే ' చుట్టూ మూగి చూస్తూ ఉంటారు. కానీ ఎవ్వరూ దగ్గరికి వెళ్లరు.అక్కడికి వచ్చిన రక్షక శాఖ అధికారి ముందుకు వచ్చి పాపను చూసి, ఎవరైనా ఆదుకోండి అని అభ్యర్థించినా ఎవరూ ముందుకు రారు. చివరకు ఒక క్రైస్తవ ప్రచారకురాలు తోసుకొచ్చి తాను అనాథ శిశువు పోషకత్వ భారాన్ని వహిస్తానని చెప్పింది.

మరొక రోజున అదే గుడి ప్రాంగణంలో ఒక విగ్రహం దొరుకుతుంది.జనం తండోప తండాలుగా గుమిగూడతారు. భక్తితో నమస్కరిస్తారు.ఇంతలో ఒక బాపనయ్య వచ్చి,దేవుడికి చలిస్తుందని శాస్త్రి గారు శాలువా కప్పారు. తాను కలగన్నది నిజమైంది అని చెబుతూ దేవుడికి గుడి కట్టాలి అని నిర్ణయిస్తారు. ఈ ఇద్దరు స్త్రీలు వింజామరలు వేయసాగారు క్రైస్తవ బ్యాండు తురకల తాషాలు, నౌబత్తులు, డప్పులు మొదలైన వాయిద్యాలతో ఆ శిలా విగ్రహాన్ని ఊరేగించారు.ఊరందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఒకే ఊరిలో, ఒకే గుళ్లో జరిగిన విభిన్న సంఘటనలు వేరువేరుగా చిత్రీకరించబడ్డాయి.హైందవ సమాజంలో జన్మించిన నిరపరాధులైన ఆ శిశువుకు ఎక్కడా సమాజాశ్రయం ఇవ్వలేదు.చివరకు క్రైస్తవ శరణాలయంలో తల దాచుకో గలిగాడు.కానీ రాతి విగ్రహానికి సాటి లేని గౌరవం దక్కింది ఇదే మనకు ధర్మంపై ఉన్న ఆదరం - ప్రేమ ! ఇదే భూత దయా.

''ఆకలికి అన్నమూ దొరికినదే చాలు అడుక్కుని తింటేమీ''అనే మాటలతో మొదలైన కథ ''కాళోజీ నా గొడవ''అన్నింటికీ మూలం అన్నం 'కొందరికి తిన మస్తు, మస్తు మందికి తిన వస్తూ'ఈ మస్తు మంది నోటికి అందకుండా అన్నమంతా ఎటు పోతున్నది ఈ సందర్భాన్ని తన చిన్నప్పుడు విన్న కథ యాదికొచ్చింది.

మూడు దుడ్డెలు మేతకు వెళ్లినవి. 1. బాపని దుడ్డె 2. కాపు వాని దుడ్డె 3. వ్యాపారస్తునిది. మేత మేసి, వాగులోకి వెళ్లి నీళ్లు తాగుతాయి. బాపని దుడ్డె అంది కదా ! నీళ్లు అమృతం వలే ఉన్నాయని కాపు వాని దుడ్డె అది విని అమృతము దేమున్నది ? మా అమ్మ చనుపాలు ఇంకా తీయగా ఉంటాయంది. వ్యాపారి దుడ్డె అది విని అట్లనా అమ్మ చనుపాలలో పాలు ఉంటాయా? ఇది విన్న బాపని దుడ్డె అమ్మకు చన్ను కూడా ఉంటుందా ? అన్నది.ఈ కథల్లో ఒకడేమో బిడ్డకు పాలు దక్కని ఇస్తాడు. ఇంకొకడేమో ఆ చెన్ను కూడా నోటికి అందనిస్తడు. కానీ ముందే పాలన్నీ విసుక్కుంటాడు. ఇంకొకడు ఆ చన్ను కూడా నోటికి అందనీయడు. ఆ చన్నుల జ్ఞానమే దానికి కలగనీయడు. తెలిస్తే ప్రమాదం, అడుగుతుంది కదా ! అట్లా గద్దెనెక్కి కూర్చున్న పాలకులే,మస్తు మందిని పస్తు పెట్టి గద్దెనెక్కి కూర్చున్నారు. ప్రతీదీ రాజకీయమే అంటాడు.నేటి రాజకీయాల కన్నా, నాటి రాజకీయాలు కొంత ప్రశ్నించడాన్ని స్వాగతించెవి.నేటి రాజకీయాలు ప్రశ్నించే వారిని నయానో, భయానో లేకుండా చేస్తున్నవి. ఎవరైనా తప్పు చేస్తే చట్టబద్దంగా శిక్షించాలి కానీ చట్ట వ్యతిరేకమైన శిక్షలు వేసి,ప్రభుత్వాలు తమ బాధ్యతను మరచి, ప్రశ్నించే వారి గొంతు నొక్కితే చట్ట వ్యతిరేక కార్య కలాపాలు జరుగుతాయని హెచ్చరిస్తాడు. అంగబలం - అర్థబలం ఉన్న ప్రభుత్వం చేసే హింస బండెడు అయితే ప్రైవేటు వారు చేసేది వెంట్రుకంతా అని హితవు పలుకు తున్నాడు. రాజకీయ నాయకులు 'తెలివి ప్రమాద ప్రళయం' తెలివి తెచ్చుకుని అడగాలి అని అనిపించ కుండా చూసాడే ప్రభుత్వాలు చేస్తున్నది.ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యం ఉండాలి అని కోరుకుంటాడు. అన్యాయాన్ని అందరూ కలిసి ఎదుర్కోవాలి. సిద్ధాంతపరమైన తేడాలు అన్నీ పక్కన పెట్టి అన్యాయాన్ని ఎదిరించాలి అంటాడు. సమాజంలో ఎక్కువ తక్కువ తేడాలు లేకుండా సుహృద్భావాన్ని పెం పెంపొందించాలి అని కోరుకుంటాడు. అన్ని విషయాలు దేవుడికి వదిలి ప్రశ్నించడం మానుకున్నారు.

ప్రజలు చైతన్యవంతులు కావాలి. ప్రశ్నించడం మొదలు పెట్టాలి అని అంటాడు. సమాజం పట్ల బాధ్యత ఉన్నది అన్యాయం జరిగితే అడగకుండా ఉండలేని పరిస్థితి అని ఈ కథలో చెప్పుకున్నారు కాళోజీగారు.

కాళోజీ గారు రచించిన కథల్లో సశేషం అయినా కథ, సంఘర్షణాత్మక మైన కథ 'ఎన్నిక' ఒక యుక్త వయస్కు రాలు వివాహ విషయంలో తన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను హరించి వేస్తున్న అన్నను చూసి నిలువునా స్తంభించి పోయింది. ఇక్కడ నిర్ణయాన్ని, స్త్రీ యొక్క స్వేచ్ఛను నిరంకుశ నిర్ణయంతో తనకు నచ్చినవాడిని పెళ్లి చేసు కోవాలి అనే నిర్ణయాన్ని చూసి ముందడుగు వేయలేక ఒకవైపు తన స్వయం నిర్ణయాధికారం, మరోవైపు తన అన్న బెదిరింపు ఆమె తన స్వయం నిర్ణయాధికారాన్ని ఉపయోగించినది లేక తన అన్న నిర్ణయాన్ని శిరసా వహిం చిందో ? మీరే చెప్పాలి అని కాళోజీగారు మనకే వదిలి పెట్టారు.

ఈ కథలో తన తండ్రి ఏర్పాటు చేసిన స్వయం వరంలో తనకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే స్వేచ్ఛ లేని వ్యక్తి జీవితం. తన అన్నకు నచ్చిన వాన్ని పెళ్లి చేసుకోవాలనే నిరంకుశ ధోరణి ప్రతిబింబిస్తుంది. ఆమె తన నిర్ణయాన్ని పాటించాలో తన అన్న నిర్ణయాన్ని పాటిం చాలో తెలియని మానసిక సంఘర్షణ ఈ కథలో కని పిస్తుంది.

కాళోజీ గారి అనువాద కథల్లో ఆంగ్ల అనువాద చిన్న ఇతివృత్తం కలిగిన కథ ''అపోహ''నాణాలు సేకరించే అమెరికా ఆ వ్యక్తి ఓడలో ప్రయాణం చేస్తున్న సందర్భాన తన దగ్గర వున్న నాణాలను తోటి ప్రయాణికులకు చూపిస్తూ చూపిస్తున్న క్రమంలో విలువైన ఒక నాణాన్ని పోగొట్టుకోవడం జరుగుతుంది.అట్టి విలువైన నాణెం కొరకు అందరి జేబుల్లో వెతకడం జరుగు జరుగుతుంది. కానీ బ్రిటీష్ బ్యాంకర్ మాత్రం తన జేబులోని వెతకని ఇవ్వడు. పరువు ప్రతిష్టలు ఉన్న బ్యాంకర్ తమ దేశ పరువు పోగొట్టు కూడదు అని తన జేబులు వెతక నీయడు. కానీ మరుసటి రోజు క్యాబిన్లో దొరికిన నాణాన్ని సర్వెంట్ తెచ్చి అమెరికన్ కు ఇవ్వడం నీ వల్ల సంతోషాన్ని వ్యక్త పరుచుకుంటూ బ్రిటిష్ బ్యాంకర్ దగ్గరికి వెళ్ళి క్షమాపణలు కోరడం, తనను వెతకని యక పోవడానికి గల కారణాలు అడగడం జరుగుతుంది. దీనికి సమా ధానంగా బ్రిటిష్ బ్యాంకర్ తన దగ్గర అదే విధమైన నాణెము ఉండడం వల్ల నేను వెతకని యలేదని చెబు తాడు. ఒకవేళ నేను నిన్ననే నా జేబులు వేతనాన్ని ఇచ్చి ఉంటే నేను ఎన్ని చెప్పినా వినే వాడివి కాదు అని ముందు జరిగిన తన మానసిక ప్రవర్తనను పరివర్తనను ఈ కథ ద్వారా తెలియజేశారు.

మరాఠి అనువాద కథ ''జాజి తీగ'' తల్లిదండ్రులు తమ పిల్లలపై పెంచుకున్న ఆశలు, పిల్లలు తమ అభి రుచులను తెలిపే కథ ఇది.ఒక తండ్రి తన కూతురికి విదేశాలలో ఉండే తమ అంతస్తుపై స్థాయి అబ్బాయిని కోరుకుంటాడు కానీ తన కూతురు వారాల చేసుకుని తనతో చదువుకునే అబ్బాయిని ఇష్టపడుతుంది. అతని తోనే జీవితాన్ని పంచుకోవాలని ఆశపడుతుంది. ఇది గమ నించిన తండ్రి కల చెదిరిపోయింది.ఈ సన్నివేశాన తండ్రికి జాజి తీగా గుర్తుకు వస్తుంది. తను ఎంతో ప్రేమగా పెంచుకున్న జాజి తీగను పొగడ చెట్టుకు ఎక్కించాలని, ఎత్తయిన పొగడ చెట్టును అల్లుకోవాలని తాపత్రయ పడతాడు. సువర్ణ ఛాయల్ని, పసుపు పచ్చ పొగడపూలు వాతతటి మధ్యన కలికి నవ్వులు వొలకబోసినట్లుగా జాజిపూలు ఒక దాన్ని ఘమ - గఘమ మరొకదానికి సుకుమార మగు సువాసన, పొగడ చెట్టు యొక్క ఎత్త యిన బలమైన బాహుల బహుళ బావుల్లో సుకుమార మైన జాజి తీగ ముగ్ధ కోమలి వలె అటూ, ఇటూ నడయాడు తుంటే నిజంగా ఆ దృశ్యం చూచి తీరవల సిందే కాని, ఊహా వర్ణన ఏమి చాలు తుంది వర్ణించ డానికి అని కోరుకుంటాడు. కానీ జాజి తీగా పక్కనే పొగడ పొగడ చెట్టు పక్కనే వంకర టింకరగా వున్న రేగు చెట్టుని పారుతుంది. ప్రకృతి కున్న ప్రేమ మహిమాన్వితమైనది

కదా! అనిర్వచనమైనది కూడా కదా! సున్నితంగా, నీలంకారంగా తిరస్కరిస్తోంది!

ఒకటి తప్ప కాళోజీగారు అనువాదానికి ఎంచుకున్న కథలన్నీ మరాఠీ కథలే, అది ఆయన మాతృభాష కూడా ''రెండు గింజల'' కథలో నిరాశా వాదానికి,ఆశావాదం లో 'ఏది మంచి చేస్తుంది', 'ఏది చెడు చేస్తుంది.'అనే విష యాన్ని ఈ రెండు గింజల సంభాషణ ద్వారా తెలియ జేయడం జరిగింది.ఈ కథలో ఒకే చేనులో, ఒకే వాతా వరణంలో, ఒకే జొన్న కర్రకు,ఒకే జొన్న కంకికి పెరిగిన రెండు గింజలు జీవితంలో ప్రయాణం మాత్రం వేరు వేరుగా ఉండెను.ఒకరిది ఆశావాదమైతే, మరొకరి జీవితం నిరాశావాద దృక్పథంతో తిరిగి పునర్జన్మను సాధించడం ఈ కథలో కాళోజీ గారి తత్వం అర్థం చేసుకోవచ్చు. ఆనాడే కాదు, ఈనాటికి ప్రాణికి జీవధాతువు పై ఒక జీవ ఆకర్షణకు, ఆశావాదానికి, కాళోజీ తత్వానికి ప్రతీక లైనవి.

ముగింపు :

కాళోజి గారి నిరాడంబరత, ముక్కుసూటితనం, తాత్విక చింతన మరే ఇతర కవులలో కనిపించదు. కాళోజీ గారి కథా వస్తువు కానీ, అనువాద సేకరణ సేకరణలోని కథావస్తువు సమకాలీన ప్రజా జీవితం లోనిదే తప్ప, ప్రాచీన కవులు, భావ కవులు, అభ్యుదయ కవుల వలె ఊహాజనితం కాదు. అందుకే తను సమాజం గురించి.....

"మనకేమీ అనరాదు,
మనది కానిది ఏమున్నది?
దేశము దేశీయులదే
దేశీయుల మన్నా మనమే"

అని అంటాడు. కాళోజీ గారు తెలుగు జాతి 87 ఏళ్ల సంచలన జీవితానికి నిలువుటద్దం.కుల, లింగ, మత వర్గ, ప్రాంత వివక్షకు,అణచివేతకు, దోపిడీకి వ్యతి రేకంగా,దొర వ్యవస్థకు వ్యతిరేకంగా, నైజాం పాలకుల కట్టు బానిసల వలె ఉన్న పీడితవర్గాల పక్షాన పోరాడుతూ ప్రశ్నించడమే కళ్ల ముందు కనిపిస్తున్న చరిత్ర.

"నా మనసులోని ఆసక్తిని
నా అవయవాలు గల శక్తికి
కట్టడి అమలుకు కుదరక కొట్టుకు చస్తున్నా
మెట్టుకు నెట్టుకు వస్తున్నా"

అని అంటాడు. ఆయనలోని చైతన్య స్ఫూర్తి, పట్టుదల యుక్త వయస్సులో ఎంత ఉత్సాహ మైనదో, అవసాన దశలో కూడా అంతే చైతన్యమైనది అని ఆయన రచనల ద్వారా తెలుసుకోవచ్చు.

ఆధార గ్రంధాలు :

1. కాళోజీ కథలు, సం.కాళోజీ, సం. 2000, ప్రచురనలు : కాళోజీ ఫౌండేషన్, వరంగల్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రూపనగుడి నారాయణరావు నాటకాల్లో సామాజిక జీవన చిత్రణ

– కె. ఎం. సునీల్ కుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఎందరో కవిరత్నాలకు పుట్టినిల్లు అయిన రాయల సీమలో పుట్టిన ఒకానొక కవిరత్నం 'రూపనగుడి నారాయణరావు' అధ్యాపక వృత్తిని అవలంబించినా బహుముఖ గ్రంథ పఠనం, ఆంగ్లాంధ్ర, సంస్కృత గ్రంథాల అధ్యయనం వల్ల స్వతసిద్ధమైన వారి ప్రతిభ పాండిత్యప్రకర్షతో పరిమళించింది.

రాయలసీమలోని బళ్లారిప్రాంతం మొదటి నుండి సాంస్కృతిక కేంద్రమే. బళ్లారి నాటక సాహిత్య రచనా ప్రదర్శనలకు పుట్టినిల్లు. ఎందరో నాటక కర్తలు, నటులు వెలసిన బళ్లారిలో వారసత్వంగా వచ్చిన నాటక రచనా ప్రదర్శనలతో రూపనగుడి నారాయణరావు సైతం ఉత్తమ నాటక రచన చేశారు. విద్యార్థి లోకానికే కాకుండా ప్రజా ప్రయోజనార్థం అనేక రచనలు చేశారు. వచన రచనలు, అనువాదాలు, కవితలు, నాటకాలు, విమర్శక గ్రంథాలు, ఇలా అనేకం రచించారు. వీటిలో ముద్రిత నాటకాలైన "విప్రనారాయణ నాటకము", "గౌతమ బుద్ధ నాటకము", "సౌందర నందము" అనే మూడు నాటకాల్లోని సామాజిక జీవన చిత్రణను గూర్చి విశ్లేషించడమే ఈ పత్ర సమర్పణ యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

"సహిత్యస భావమ్ సాహిత్యం" - సమాజ హితాన్ని కోరేది సాహిత్యం. సమాజం సాహిత్యంలో ప్రతిబింబించాలి. సర్వసాధారణంగా రచయితలు తాము తీసుకునే ఇతివృత్తం ఎప్పుడూ సంఘ సంబంధమైనవే ఉంటాయి. అంటే తన చుట్టూ ఉన్న సమాజ సంబంధమైన, వాస్తవమైన గాధలకు కొంత కల్పన జోడించి రచించే ఇతివృత్తమే వస్తువు కావడం జరుగుతుంది. కాబట్టి సామాజిక స్పృహ అనేది రచయిత వాస్తవమైన పరిధిలో నుంచే ఇతివృత్తాన్ని స్వీకరించినట్టు ధృవీకరించవచ్చు. అటువంటి సాహిత్యం సమాజానికి మార్గదర్శకంగా వుండాలని, సంఘాన్ని ప్రభావితం చేయాలని కోరుకునే దృష్టితో సమాజ-సాహిత్య సంబంధ బాంధవ్యాలు, ఇచ్చి పుచ్చుకోవడాలు నేపథ్యంలో రూపనగుడి నారాయణరావు నాటక సాహిత్యాన్ని సృష్టించారు.

వారి నాటకాలన్నింటిలో పీడిత వర్గాల వేదనామయ బాధాదగ్ధ జీవితం కళ్ళకు కడుతుంది. తమ నాటకాల్లో వారు స్పృశించని సామాజికాంశం లేదు. ఆయా వాస్తవికాంశాలను పాఠకుల హృదయాలు చెమ్మగిల్లేలా అక్షర బద్ధం చేశారు. వీరి రచనల నిండా స్త్రీల వేదన, బడుగుల గోడు, అణగారిన వర్గాల ఆత్మఘోష వినిపిస్తుంది. సామాజిక జీవన విధానంలో పెనుమార్పుల కోసం పరితపించారు.

విప్రనారాయణ నాటకము :

ఇది ఒక సాంఘిక నాటకము. ఈ నాటకానికి మూలం చవలవాడ మల్లయకవి రచించిన 'విప్రనారాయణ చరిత్రము', సారంగతమ్మయ్య కవి రచించిన 'వైజయంతీ విలాసము' అనే ప్రబంధాలు. ఈ విషయాన్ని రూపనగుడి నారాయణ రావు గారే స్వయంగా నాటక పీఠికలో తెలిపారు.

విష్ణుభక్తుడైనటువంటి విప్రనారాయణుడు దేవదేవి అనే వేశ్యకుల వనితను ఎలా వివాహమాడాడు అనేది ఈ నాటక ఇతివృత్తం. సమాజంలోని దురాచారాలలో ఒక ప్రధానమైన దురాచారం వేశ్యావృత్తి. ఈ వేశ్యావృత్తి కారణంగా అనేకమంది యువతులు అకారణంగా బలి కాబడ్డారు. ఈ నాటక ప్రస్థావనలో నారాయణరావు గారు ఒక వితంతువు తన ఇద్దరు స్త్రీ శిశువులను ఒక వేశ్యకు అమ్మినట్లు తెలిపి, ఇది దుష్కార్యమని, నీచవృత్తి అని తెలిపి, ఆ వేశ్యావృత్తి నిర్మూలనకుగాను నాటకంలో మార్పుచేసి చూపించడానికి ప్రయత్నిస్తున్నట్లు రచించ

బడింది. దీన్ని బట్టి సమాజంలో కొందరు పిల్లల్ని కని పెంచలేక లేదా డబ్బుకోసమో ముక్కుపచ్చలారని ఆడపిల్లల్ని వేశ్యావృత్తిలో దించుతున్నారని రచయిత తెలియజేసి, ఆ దురాచార, అమానుష వృత్తిని నిర్మూలించ డానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొనబడింది. 1919లో రచింపబడిన ఈ నాటకంలో పేర్కొన్న ఈ దురాచారం వందేళ్ళు గడిచినప్పటికీ ఇప్పటికీ అక్కడక్కడా కనబడు తూనే ఉన్నది.

దేవదేవి ఎలాగైనా విప్రనారాయణుడిని వివాహ మాడాలని తలచి విటకంటకి గృహం నుండి వెళ్ళి పోతుంది. తన అక్క అయినటువంటి మధురవాణి కూడా తన దురవస్థకు చింతించుచూ, వేశ్యావృత్తిని అసహ్యిం చుకొని, ఎలాగైనా బయటపడి దేవదేవిని చేరాలని భావిస్తుంది. దేవదేవితో వేసుకున్న పందెం ప్రకారం ఇక పరాయి పురుషుడిని పరిగ్రహింపక, ప్రేమసారుడ్ని అన్నగా భావించి అతడితో కలిసి వేశ్యావృత్తి నిర్మూలనకు పూను కొన్నది. నాటకాంతంలో విటకంటకి కూడా తాను చేసిన వాటికి ప్రాయశ్చిత్తంగా తన ఆస్తిలో ఒక్క పాలుంచుకొని, మిగతా రెండు పాళ్లను దేవదేవి, మధురవాణులకు ఇచ్చివేసింది. దేవదేవి తన ఆభరణాలను మాత్రం శ్రీరంగేశునకు అర్పించి, మిగిలినదంతా వేశ్యావృత్తి నిర్మూ లనకు పూనుకొన్న ప్రేమసారుడికిచ్చి వేయమని చెప్పగా మధురవాణి కూడా అందుకు అంగీకరించి దానం చేసింది. ఈవిధంగా దేవదేవి, మధురావణులు తమకు తెలియకుండా ఆ వృత్తిలో దింపబడ్డా కూడా తెలిసాక ఆ వృత్తిపట్ల అసహ్యభావంతో తమలా ఇంకెవరూ కాకూడదని తమ ఆస్తి మొత్తాన్ని వేశ్యావృత్తి నిర్మూలనకు ఉపయోగించి అందరికీ ఆదర్శవంతులయ్యారు.

గౌతమబుద్ధ నాటకం :

వ్యక్తి ఆరాధన కంటే సిద్ధాంత బలానికి ప్రాధాన్యత నిచ్చే బౌద్ధంలో వ్యక్తుల ప్రస్తావన అంతగా కనిపించదు. కాని తెలుగులో తొలుత వచ్చిన సాహిత్యమంతా బుద్ధుడి బోధనల కన్నా ఆయన జీవితం చుట్టూ తిరిగింది. నారాయణ రావు కూడా బుద్ధుని కథను ఎన్నుకొని నాటక ప్రక్రియలో రచించి బుద్ధుని ఔనత్యాన్ని చాటి, నాటి సమాజంలోని అసమానతల్ని ఎంతో చక్కగా నాట కీయతతో చిత్రీకరించారు.

మహాభారత కాలం నుండి నేటి కరోనా మహమ్మారి కాలం వరకు కూడా సమాజంలో దాయాదుల మధ్య ఆడదానికోసం, లేదా ఆస్తికోసం ఎన్నో యుద్ధాలు జరి గాయి, జరుగుతున్నాయి. ఈ గౌతమబుద్ధ నాటకంలో కూడా సిద్ధార్థుడి దాయాది అయిన దేవదత్తుడు సిద్ధా ర్థుడిపై కక్షగట్టి ఎలాగైనా సిద్ధార్థుడి స్థానాన్ని పొందాలను కుంటాడు. సిద్ధార్థుడు వివాహమాడదలచిన యశోధరను కూడా పొందగోరి చివరి వరకు పగతో రగలిపోతుంటాడు. నేటి సమాజంలో కూడా అనేకమంది దాయాదులు పైవిధంగా శత్రుత్వంతో రగిలిపోతున్నారు. ఈ అంశాన్ని రచయిత ఎంతో సున్నితంగా స్పృశించారు.

అదేవిధంగా పంచమాంకంలో సిద్ధార్థుడు అడవిలో అలిసిపోయి, ఆకలితో అలమటిస్తుండగా సుజాత, రాధ అనే ఇద్దరు యాదవ వనితలు సిద్ధార్థుడిని చూచివారు భక్తితో క్షీరాణాన్ని సమర్పించారు. దానిని భుజించినందుకు సిద్ధార్థుడు కులభ్రష్టుడు, ధర్మభ్రష్టుడు అయ్యాడని తలచి శిష్యులు సిద్ధార్థుడ్ని విడిచి వెళ్ళిపోయారు. ఇది ఆనాటి సమాజంలోని కులవ్యవస్థకు, అస్పృశ్యతకు గల నిదర్శనం. నేటికి ఈ దురాచారం సంఘంలో కొన్నిచోట్ల చూస్తున్నాము. దానిని రూపనగుడి నారాయణరావు తన నాటకంలో ఒక దురాచారంగా బుద్ధుడి ప్రవచనం ద్వారా రూపుమాపేలా రచించారు.

సౌందరనంద నాటకము :

మానవ జీవితంలో సుఖదు:ఖాలు వెలుగునీడలు లాంటివి. అవి వస్తూ పోతూ ఉంటాయి. క్షణికమైన కోరికలను పట్టుకువేలాడటం వేదనకి హేతువని చెప్పే బుద్ధుడి బోధనలకు ఈ నాటకం జీవధాతువు లాంటిది.

సిద్ధార్థుడి సవతి సోదరుడైన నందుడు అతని ప్రాణ సఖి సుందరులు శారీరక సౌఖ్యాలకు బానిసలైనప్పుడు

వారిని బుద్ధుడు తన బోధనలతో బిక్షువులుగా మారేలా చూడటమే ఈ నాటక కథాంశం. తెలుగులో చాలా కొద్ది మంది మాత్రమే బుద్ధుడిపై మాత్రమే కాకుండా బుద్ధుడితో సంబంధమున్న పాత్రలతోడి రచనలు చేయడం జరిగింది. నారాయణరావు ఈ కోవలోనే తన రెండవ నాటకమైన గౌతమబుద్ధలో బుద్ధుడి జీవితాన్ని ఆవిష్కరించగా, ప్రస్తుత నాటకమైన 'సౌందరనందము' బుద్ధుడి సోదరుడైన నందుడు కథానాయకుడిగా సాగుతుంది. కామవాంఛలతో క్షణికమైన సుఖాలకోసం వెంపర్లాడుతూ ఉండిపోయిన కొందరు నాటి నేటి సమాజంలో కూడా ఉన్నారు. ఇటువంటి వాటి కోసం ఉన్నతమైన, గొప్పదైన మానవజీవితాన్ని, జీవిత పరమార్థాన్ని వదిలి జీవిస్తున్న వారి ప్రవర్తనను ఎత్తిచూపుతూ నారాయణరావు ఈ నాటక రచనను కొనసాగించారు.

ఐదు అంకాల ఈ నాటకానికి మూలం పింగళి కాటూరి కవులు రచించిన 'సౌందరనందము' అనే ప్రబంధము. ఈ ప్రబంధాన్ని ఆధారంగా చేసుకొని సామాజిక పరిస్థితులకు తగిన విధంగా మార్పులు చేర్పులు చేసుకొని, కొన్ని భావాల్ని యథాతథంగా గ్రహించి, సామాజిక జీవన - చిత్రణ చేయడం జరిగింది.

కథానాయకుడైన నందుడు, నాయకయైన సుందరులు జీవిత పరమార్థాన్ని మరిచి, కర్తవ్యాలను పరిత్యజించి కేవలం విషయలోలులై, ఐహిక సుఖాలతో మునిగి ఉండగా బుద్ధుడు వారికి జీవిత యదార్థాన్ని, కర్తవ్యాన్ని ఉపదేశించి, వారిని ఆధ్యాత్మిక మార్గంలోకి మరల్చిన వైనాన్ని ఈ నాటకంలో ఎంతో విశేషంగా చూపడం జరిగింది. సమాజంలో రాజు అనేవాడు ప్రజల్ని ఎల్లవేళలా తండ్రివలె కాపాడుతూ ప్రజాక్షేమం, దేశ రక్షణలో ముందుండాలి. కాని విషయాలోలత్వంతో ప్రజా సేవ, రాజకార్యాల్ని విడిచిపెడితే రాజ్యం ఏ విధంగా తయారవుతుందో, రాజ్యంలోని ప్రజలు ఎలా చెడు దారిలో నడుస్తారో రచయిత ఈ నాటకం ద్వారా ఎంతో సున్నితంగా తెలియపరిచారు.

ముగింపు :

"సమాజాన్ని కూలంకషంగా దర్శించి సాహిత్య సృష్టి చేసినవాడు, మానవ జీవిత కదలికలను సాహిత్యంతో ముడివేసినవాడు శక్తివంతుడైన రచయిత. సాహిత్యానికి, సమాజానికి ఉన్న సంబంధాన్ని నిలువుటద్దంలో చూపిన రచన ఉత్తమ రచన. సమాజానికి దూరంగా ఉండే సాహిత్యం మనజాలదు, అది ఉత్తమ రచన కాదు" అన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి మాటలు అక్షరసత్యం.

నాటి సమాజంలో పాతుకుపోయిన జాతి, వర్గ, కుల రాజకీయాలు, దురాచారాలు, వేశ్యావృత్తి తదితర అంశాలన్నింటినీ రూపనగుడి నారాయణరావు తన నాటకాల ద్వారా లేవనెత్తారని చెప్పొచ్చు. ఆయన రచనల్ని లోతుగా పరిశీలిస్తే ఆయన సామాజిక జీవియని, సమాజశ్రేయస్సు కోసం తాను ఒక సమిధను సమర్పించాలనే ఉద్దేశంతో ఎంతో చైతన్యవంతమైన రచనలు చేశాడని తెలుస్తున్నది.

మానవజాతి మనుగడకే ప్రాణం పోసిన, ప్రేమానురాగాలను పంచడంలో పెన్నిధి అయిన మహిళ బానిసత్వపు శృంఖలాలతో బంధింపబడి భారంగా బ్రతుకీడుస్తోంది. కూటికోసం వేశ్యావృత్తిని స్వీకరించిన స్త్రీల దుర్భరస్థితిని "విప్రనారాయణ" నాటకం ద్వారా తెలియజేశారు. ఈ విధంగా సాంఘిక దురంతాన్ని దానికి కారకులైన దుర్మార్గుల్ని రూపుమాపి సమసమాజ నిర్మాణానికి తగిన మార్గాన్ని చూపే లక్ష్యంతో చేసిన సామాజిక స్పృహగల రచనలుగా రూపనగుడి నారాయణ రచనల్ని పరిగణించవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. విప్రనారాయణ నాటకము - డి.1932. రూపనగుడి నారాయణరావు.
2. గౌతమబుద్ధుడు - 1936. రూపనగుడి నారాయణరావు

3. సౌందరనంద నాటకము - 1964. రూపనగుడి నారాయణరావు
4. వ్యాసం - ఆంధ్రభూమి (దినపత్రిక) హైదరాబాద్ - తేది:11.04.2000, మంగళవారం - డా॥ అవధానం నాగరాజరావు
5. శ్రీ నారాయణ రాయకవి ప్రశస్తి - పుట.17 - సిరిపి ఆంజనేయులు.
6. ఆచార్య కొలకలూరి ఇనాక్ - షష్టిపూర్తి సన్మాన సంచిక
7. నేటి సాహిత్యం - సామాజిక స్పృహ, సమాలోచనం - సుదర్శనం.ఆర్.ఎస్.
8. సాహితీ శిల్పి నారాయణరావు, ఆంధ్రప్రభ, తేది:30.09.2007 - ఆచార్య గంగప్ప.ఎస్.
9. తిరుమల రామచంద్ర, రూపనగుడి నారాయణరావు, హంపీ నుంచి హరప్పాదాక. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, హైదరాబాద్- 04.09.1996.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పానుగంటి వారి సాక్షి వ్యాసములలో సామాజికాంశములు

– కె. మూర్తి, తెలుగు అధ్యాపకురాలు, అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి), కాకినాడ.

ఆధునిక తెలుగు సాహిత్యం ఆంగ్ల భాషా సాహిత్యాల ప్రభావంతో కొత్త ఒరవడులను దిద్దుకొని కొత్త విద్యలను నేర్చుకొని తనను తాను మరింత పరిపుష్టం చేసుకొని కాలానికి తగిన భావం, భావానికి తగిన రూపం, రూపానికి తగిన భావ వ్యక్తీకరణలతో సమాజ హితమును కాంక్షించే సాహిత్యమై కొనసాగుతోంది. ఆదికవియైన నన్నయతో ప్రారంభమైన లిఖిత రూపమైన ప్రాచీన సాహిత్యం ఎన్నో శాఖోపశాఖలతో, ప్రక్రియా వైవిధ్యంతో దాదాపు వెయ్యి సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా కొనసాగింది. నన్నయను అనుసరించిన కవిరాజులు, రాజకవులు తమ కావ్యాలలో కథారూపంలో, పాత్రల ప్రవర్తన, సంఘటనల రూపంలో, సంభాషణల రూపంలో, రుచిరములైన సూక్తుల రూపంలో ప్రకరణ వక్రతతో ధ్వని గర్భితంగా ప్రతిపాదించారు. ఉదాహరణకు అందరికీ తెలిసిన శ్రీమద్రామాయణమునే తీసుకుందాం. రామాయణం చదివిన వారికి 'రామాదివద్వర్తితవ్యం, న రావణాది వత్' (రాముడు మొదలైన వారి వలె ప్రవర్తించాలి, రావణుడు మొదలైన వారి వలె కాదు) అన్న విషయం తెలుస్తుంది. ప్రాచీన సాహిత్యాన్ని చదివేటప్పుడు ఎప్పుడూ ఆ కాలము నాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను వాస్తవ దృష్టితో అవగాహన చేసుకొని చదవవలసి ఉంటుంది.

అయితే, పరిణామశీలమైన ప్రకృతి, సమాజము ఎప్పటి కప్పుడు తనను తాను పున:పరిశీలన చేసుకొంటూ, పునర్నిర్మించుకుంటూ ఉంటుంది. కాలానికి తగినట్లుగా సాహిత్య రీతులు, భావ ప్రకటనా రీతులు కూడా మారుతాయి. ఎంత మారినా, ఎన్నటికీ మారని కొన్ని శాశ్వత సత్యాలను, మర్యాదలను ఔచిత్యాలను పాటిస్తూ రసగంగా ప్రవాహం వలె ముందుకు సాగిపోతూనే ఉంటుంది. కవిత్వం ప్రాచీనమైనా, ఆధునికమైనా అది సమాజ సంబంధిగా ఉంటేనే కలకాలం నిలుస్తుంది. సంఘ హితమును విస్మరించిన ఏ కావ్యమైనా నేల విడిచి సాము చేసినట్లే.

ఆధునిక యుగంలో గురజాడ, రాయప్రోలు మొదలగు వారితో ప్రారంభమైన నవ్యకవిత్వం ప్రధానంగా సామాజికాంశాలనే ఇతివృత్తాలుగా, సామాన్య ప్రజలే నాయకులుగా, సామాజికాభ్యుదయ సందేశమును చాలా సందర్భాలలో సూటిగానే అందించింది. ఈ క్రమంలో ఎన్నో కొత్త కొత్త సాహిత్య రూపాలు ప్రక్రియా భేదాలు అవతరించాయి.

ఆ కోవలోనే కవిశేఖర శ్రీ పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు (నవంబరు 2, 1865 - జనవరి 1, 1940) 'సాక్షి' పేరుతో ఉపన్యాసములను వ్యాసరూపములో వెలువరించారు. ఆంగ్లంలో ఎడిసన్ స్పెక్టేటర్ అనే పత్రికలలో సంఘమును విమర్శిస్తూ వ్యాసాలు ప్రచురించే వాడు. పానుగంటి వారి వ్యాసాలకు ఇదే స్ఫూర్తి. అందుకే ఆయనకు 'ఆంధ్రా ఎడిసన్' అని పేరు. పానుగంటి వారి రచనా శైలి విచిత్రమైనది. అచ్చమైన గ్రాంథిక శైలిలో రచించారు. తెలుగు గ్రాంథిక భాషాశైలి ఎంత మధురముగా ఉంటుందో తెలియాలంటే తప్పక పానుగంటి సాక్షి వ్యాసములు చదవ వలసిందే. తెలుగులో పుంఖానుపుంఖాలుగా ఉపమలను గుప్పించే ప్రయోగ రీతిలో పానుగంటిని మించిన వారు లేరు అనేది అక్షరాలా నిజం. అందుకే ఆయనకు 'అభినవ కాళిదాసు' అని గౌరవించారు. పానుగంటి వారు ఈ వ్యాసాల ద్వారా సమాజంలో ఉన్న లోటు పాట్లను వ్యంగ్యాధిక్షేప పరిహాస ధోరణిలో వెల్లడించారు.

సాక్షి సంఘ నిర్మాణం :

సాక్షి సంఘములో సభ్యులు ఐదుగురు. 1. కాలా చార్యులు 2. జంఘాల శాస్త్రి 3. వాణీదానుడు 4.బొఖ్ఖయ్య 5. సాక్షి. ఈయన పేరునే సంఘమునకు, వీరి పత్రికకు పేరుగా నిర్ణయించారు. వీరు ప్రతి రాత్రి సమావేశమై మత విషయములు, ఆరోగ్య విషయములు, కవిత్వము మొదలగు కళలు, చరిత్ర, రాజభక్తి మొదలగు అంశముల రించి, సమాజంలోని లోటుపాట్లను గురించి చర్చించుకుంటూ ఉంటారు. తప్పులను, లోపాలనే గాని వ్యక్తులను నిందించకూడదనేది వీరు ఏర్పరచుకున్న నిబంధనలలో ముఖ్యమైనది. సభలో జంఘాల శాస్త్రి ఉపన్యాసములే సాక్షి వ్యాసములు. జంఘాల శాస్త్రి యొక్క వాగ్ధోరణి, వాదనా పటిమ, వాజ్నైపుణ్యములు అనన్య సామాన్యములు. అనితర సాధ్యములు. ప్రపంచంలోని ఏ విషయం పైనైనా అనర్గళంగా ఏకధాటిగా ఘంటా పథంగా, సూటిగా ఉపన్యసించగల దిట్ట. ఈయన యొక్క ధారాళమైన వాగ్ధోరణి నాన్యతోదృశ్యమైనది.

సాక్షి వ్యాసముల వైశిష్ట్యం :

సమాజం అంటేనే ఎన్నో రకాల స్వభావాలున్న మనుష్యుల కలయిక. అందరూ ఒకేలా ఉండరు. ఏవో లోటుపాట్లు, అవలక్షణాలు ఉంటూనే ఉంటాయి. ఒక వ్యక్తి అన్ని విధాలుగానూ పరిపూర్ణుడుగా ఉండటం అనేది సాధ్యం కాదు. "ఎంచుటకు మొదలు పెట్టినచో లోపము లేనివాడు లోకమున నుండునా?" అని కాళ్ళకూరి వారి 'వర విక్రయము'లో పురుషోత్తమ రావు పాత్రచే పలికిస్తారు. ఈ లోపములను సహించి ఊరుకోవడమా? లేక వాటిని పనిగట్టుకొని ఎత్తి చూపించి విమర్శించడమా? అనేది ప్రశ్న. మళ్ళీ ఆ విమర్శించడంలో కూడా సుతి మెత్తగా, నొప్పింపక, తానొవ్వక అన్నట్లు చెప్పాలా? లేక కాస్త దురుసుగానైనా ఖండన రూపంగా చెప్పడమా? అనేది ఎంచువారి ఆలోచనా దృక్పథం, స్వభావం మీద ఆధారపడి ఉంటుంది. ఇందులో పానుగంటి వారు రెండవ మార్గమునే ఎంచుకున్నారని చెప్పవచ్చు.

సాక్షి వ్యాసములు మొత్తం ఆరు సంపుటాలుగా వెలువడ్డాయి. వీటన్నింటిలోనూ కలిపి దాదాపు గా 140కి పైగా వివిధ అంశాలపై వ్యాసాలున్నాయి. గ్రామ్య భాషా గ్రంథ వఠనము, విమర్శక స్వభావము, స్త్రీ స్వాతంత్ర్యము, గ్రహ చక్ర జ్యోతిషము, పాశ్చాత్య నాగరకతా మాహాత్మ్యము, భూతవైద్యము, మఠాధిపతులు, మత వైషమ్యము, ఆధ్యాత్మిక విద్యావశ్యకత, స్వదేశీయ వస్త్రధారణము మొదలగు వ్యాసాలలో అనేక రకాల అంశాలు ప్రస్తావించబడ్డాయి. వాటిలో కొన్ని:

ఈ గ్రంథ రచన మన దేశంలో ఆంగ్లేయులు పరిపాలిస్తున్న కాలంలో జరిగింది. బ్రిటిష్ దొరలు పాఠశాలల్లో దేశభాషలను ప్రాముఖ్యం తగ్గించి, ఆంగ్ల మాధ్యమమును ప్రవేశపెట్టి ఆంగ్ల విద్యావ్యాప్తికి పూనుకొంటున్నారు. ఈ విషయాన్ని ఆంగ్లేయులు ఇంటర్మీడియట్ డిగ్రీలలో దేశభాషను తప్పని సరి పాఠ్యాశంగా చేయుటకు ఆంగ్లేయ విద్యా సంఘం వాళ్ళు నిరాకరించారు. దీన్ని ప్రస్తావిస్తూ పానుగంటివారు 'గ్రామ్యభాషాగ్రంథపఠనము'లో '4వ క్లాసు పిల్లవాడు దేశభాషను వదలుకొనవలసినదేనా? ఏ దేశముననయిన నిట్లే జరుగుచున్నాదా? మీ కింగ్లీషు దేశభాష కాదా? మీ యభివృద్ధికి దేశభాష యావశ్యకమై మా యభివృద్ధికి యాటంకమయినదా? అని జంఘాల శాస్త్రి ద్వారా ఆవేదనతో ప్రశ్నిస్తారు. 'పుట్టినది మొదలు హరీమని కాటికి వెళ్ళే వరకు ఉపయోగించవలసిన దేశభాషకు ఇటువంటి దుర్గతి పట్టినందుకు జంఘాల శాస్త్రి దు:ఖిస్తాడు.

మరో వ్యాసం 'స్వభాష'లో న్యాయవాద వృత్తిలో ఉన్న ఒక తెలుగు వాడు తాను అధ్యక్షునిగా ఉన్న ఒక సభలో తనకు ఆంధ్రభాష రాదు, ఆంధ్రములో మాట్లాడలేను అనగా జంఘాల శాస్త్రి 'తెలుగులో మాట్లాడలేక పోవటమేమిటి? మ్యావు మనలేని పిల్లి, కిచకిచలాడలేని కోతి, ఈత రాని కప్ప ఎక్కడైనా ఉంటాయా? ఆరు సంవత్సరముల వయస్సు వచ్చే వరకు తెలుగులో మాట్లాడినవాడు ఇంగ్లీషు నేర్చుకొన్నంత మాత్రమున

ఇప్పుడు తెలుగులో మాట్లాడలేకపోవటమేమిటి? అతడు తెలుగువాడు కాదా? అతడు తెలుగులో మాట్లాడలేక పోవటం కాదు, తెలుగులో మాట్లాడడానికి అనిష్టత. అసహ్యత' అని ఆంధ్రుల ఆంగ్ల భాషా వ్యామోహమును తీవ్రముగా నిరసించాడు. ఇది దాదాపు 1900 సంవత్సరము నాటి పరిస్థితి. ఇప్పుడు ఆంగ్లభాషావ్యామోహం మరింత పెరిగింది గానీ ఇసుమంతైనా తగ్గలేదు. తెలుగుకు ఆదరణ మరింత క్షీణిస్తోంది గానీ పెరగట్లేదు. ఎంత ఇంగ్లీషులో అనర్గళముగా మాట్లాడినా, అవి వట్టి చిలుక పలుకులే గానీ వాటికి 'ఒరిజినాలిటి' అనునది ఉండదు. 'తల్లి స్తన్యముతో గూడ నే భాష మనము త్రావుదమో ఆ భాష తేనే మనమెన్నటికైన గఠిన ప్రయత్న మొనర్చిన యొడల నుపజ్ఞా సహితమగు నుత్తమ గ్రంథమును వ్రాయగలము. పరభాషలో నెన్నడును దద్భాషా వేత్తలు మచ్చునట్లు మాటలాడలేము' అనే సత్యాన్ని చెప్పారు పానుగంటి. 'పరభాషా పదముల కర్థము తెలిసినంత మాత్రమున బరభాషా నాండిత్యము లభించినదని భ్రమపడకుడు' అని అంటారు పానుగంటి వారు. అటువంటి వారి పరిస్థితి ఉభయభ్రష్టత్వమే అంటారు పానుగంటి.

'దేశభక్తి - స్వార్థ పరిత్యాగము' అనే వ్యాసములో దేశభక్తులమని పేరు పెట్టుకొని దేశభక్తి ముసుగులో డాంబికాలు ప్రదర్శించే పెద్దమనుషుల నిజ స్వరూపమును బయటపెట్టారు. అటువంటివారిని ఉద్దేశించి 'ఈ గుణమనునది పుట్టుకతో బుట్ట వలసినది, కిట్టుటతో గిట్టవలసినది' అంటారు. అందరూ దేశభక్తిని నటించేవారే. అందుకే సందులలో, గొందులలో ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా దేశభక్తులు దర్శనమిచ్చు చున్నారని వ్యంగ్యం గా తెలిపారు. భూమిలోంచి ఒక మహాపురుషుడు వచ్చి దేశసేవకుల మనుకునే వారి నందరినీ వరునగా ఒకరి వెనుక వచ్చి భరతమాత పీఠమును స్పృశించి కన్నుల కద్దుకొమ్మని చెప్పగా, ఎవరూ ఆ పీఠమును తాకలేకపోతారు. అప్పుడు ఆ మహా పురుషుడు నిజమైన దేశభక్తు యొక్క స్వభావము ఎలా ఉంటుందో వివరిస్తాడు. భిక్షమెత్తి చదువు చెప్పించిన తల్లిదండ్రుల కన్నము పెట్టనివాడు దేశభక్తుడు కాడని, మాతృభక్తి, పితృభక్తి లేని వారికి దేశభక్తి కలుగదని చెప్పారు. కీర్తికోసం, ధనం కోసం నటించేవారు దేశభక్తులు కారని, దేశభక్తి అంటే ప్రజాభక్తి అని వివరిస్తాడు.

'మండలమానీనీ జనమణీ మహానభ' అనే వ్యాసములో మహిళలకు సంబంధించిన ప్రత్యేక అంశము ప్రస్తావించబడింది. మహిళామణులందరూ ఒక సమావేశమును ఏర్పాటు చేసున్న సమావేశములో ఒక మహిళ మాట్లాడుతూ, ఒక స్త్రీ మరొక స్త్రీని కలిసినప్పుడు నీకెంత మంది పిల్లలని అడుగుతుంది గానీ, నువు ఎంత చదువు కున్నావని అడగదు. ఏ గ్రంథమును రాశావని అడగదు. నీ దేశభక్తినెట్లు చూపావని అడగదు. నీ సోదరులకెలా సాయపడ్డావని అడగదు. కేవలము పిల్లల గురించి మాత్రమే అడుగుందని స్త్రీ సహజ స్వభావమును చెప్పారు. ఇందులో మహిళలను కేవలము పిల్లల సంఖ్య ద్వారా వారిని గుర్తించకూడదని చెప్పారు. అంతే కాక స్త్రీ దేహారోగ్యము గురించి, గర్భధారణ, స్త్రీలకు వచ్చే వ్యాధులను గురించి, వాటి నివారణము గురించి స్త్రీలు చక్కగా తెలుసుకోవాలని, అనేక ఆరోగ్యసూత్రములను చెప్పారు.

'అస్పృశ్యత' అనే వ్యాసములో అమానవీయమైన దురాచారమును ఖండించారు. 'అస్పృశ్యత, చెప్పరాని తనము నను నీ రెండు మాటలు నొక్క భారతదేశ సారస్వతమునందే యున్నవి. ఇంత పాపము, యింత ఘోరత, యింత మూర్ఖత, యింత క్రౌర్యము మనదేశ మందే తక్క మఱి యెచ్చటను లేవు' అంటారు. పూర్వులైన మన మహర్షులు ఎంతటి జ్ఞాన తేజస్సును మన కిచ్చినారో, వారి తపోనిష్ఠ , వారు చెప్పిన పరమార్థములు స్మరించు కోమని చెప్పారు. భగవద్గీతలో 'విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని' అని బ్రహ్మజ్ఞాన సంపన్నుడైన బ్రాహ్మణునికి, నీచ జంతువైన కుక్కకు, దానిని తినేవారికి

భేదములేదని శ్రీకృష్ణ భగవానుడు ఆనతిచ్చిన విషయం గుర్తుచేశారు. బ్రాహ్మణత్వము వేదాధ్యయనములోను, పురాణ పఠనములోను, సదాచారములలోను ఉన్నది కాని జ్ఞానశూన్యులై పేరులో మాత్రము బ్రాహ్మణులైనవారిలో బ్రాహ్మణత్వము లేదని చెప్పారు. "పంచములని కొందరిని అధమ స్థితిలో ఉంచినప్పుడు వారు చేసిన వ్యవసాయము, ధాన్యము మనకు పనికి వస్తుందా? వారు మేపిన పశువుల పాలు మనము త్రాగవచ్చునా? వారు వడికిన నూలు మనకు మడి బట్టకు పనికి వచ్చుటేమి? మనము వారి యెడల మనుష్యుల వలె ప్రవర్తించుట లేదు, ఆ మనుష్యులను నీచ జంతువల కంటె హీనముగా జూచినప్పుడు మనలను మనుష్యులమే కామని వారనుకొనిన తప్పేమున్నది?" అని తీవ్రముగా ప్రశ్నించారు. విధవా పునర్వివాహములు చేసినంతనే మతాచారములు మాసిపోయినట్లు కాదని సెలవిచ్చారు. స్త్రీ విద్య కూడదని అజ్ఞానముతో వాదించటం అస్వాభావిక, అసహజ, అనౌచిత్యమైన ఆలోచన అని చెప్పారు. సంఘ పురోగతికి, దేశపురోగతికి పెను అవరోధాలై దేశప్రతిష్ఠను మంటగలిపే ఇటువంటి దురాచారాలలన్నిటినీ తీవ్రవముగా దుయ్యబట్టారు.

సమాజంలోని అన్ని రకాల వ్యక్తిత్వాలు, స్వభావాలు ఈ వ్యాసములలో పానుగంటివారు మనకు చూపించారు. ముక్కు పొడుము పీల్చే అలవాటున్న శ్రీవైష్ణవుడు. శ్రీవైష్ణవుడైయుండి పొడుము పీల్చుకూడదను జ్ఞానము లేనివాడు. అతనికి ఆ పొడుము ఎలా తయారైందో తెలుసుకోడు గానీ, ఆ పొడుము కట్టే పొట్లమును తాటాకు ఈనెతో కట్టకుండా దారముతో కట్టినందుకు తగువు పెట్టుకుంటాడు. ఎందుకంటే దారము తగిలితే మైలపడిపోతాడు! కాయగూరలు కాశిలో వదలటం అనేది మరొక ప్రహసనం. ఇందులో పంక్తి భోజనములలో కూర్చున్న వ్యక్తికి 'అమృతరసనీకాశామ్లరసమృణ్మయపాత్రగ్రాహి' ఒకడు బెండకాయ వేసిన పులుసు వడ్డించి పోగా, వ్రత భంగమైనదని ఉత్తరాపోశన పట్టి భోజనము మధ్యలో వదిలి లేచిపోతానని ఆ శుద్ధ బ్రహ్మచారి గావు కేకలు పెడతాడు. బెండకాయను గయలో వదలడం దేశోపకారమా? '

స్వదేశ పరిశ్రమలు' అనే వ్యాసంలో విదేశీ సాధన సామగ్రులు, యంత్రములు వచ్చిన తరువాత చేతి పనులు నశించాయని, చెప్పాడు. పొందూరులో నేత పని వాళ్ళు నేసే వస్త్రములకు, కాశ్మీరు శాలువలకు, కుంభకోణపు చెంబులకు, విశాఖ పట్టణపు దంత పనికి, బ్రహ్మవరపు పీతాంబరములకు, మేధుర రంగులకు, ఉప్పాడ పట్టుకు, సాటియైనవి ఎక్కడా లేవని, పరిశ్రమలు వచ్చిన తర్వాత వాటికి తగినంత ఆదరణ లేదనే విషయం ప్రస్తావింపబడింది.

ఈవిధంగా పానుగంటి సాక్షి వ్యాసములు చదివితే భాషా సంబంధమైన జ్ఞానం పెంపొందుతుంది. తెలుగులో ఎన్ని రకాల ప్రక్రియలలో ఎన్ని రకాల అంశాలతో గ్రంథములు వచ్చినా, వాటన్నింటిలోనూ సాక్షి వ్యాసాలది ప్రత్యేక స్థానం. విజ్ఞాన, వినోదప్రదములైన ప్రసంగాలతో కూడిన పానుగంటివారి సాక్షి వ్యాస సంపుటి తెలుగు వారే కాక, తెలుగు తెలిసిన ప్రతీ వారు కూడ తప్పక చదువవలసిన గొప్ప గ్రంథం.

❖ ❖ ❖

అగరం వసంత్ హొసూరు కథలు – సామాజికాంశాలు

– కె. సతీష్ కుమార్, తెలుగుశాఖ, పరిశోధక విద్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

కవి జీవన రేఖలు :

అగరం వసంత్ తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో హొసూరు తాలుకాలోని బస్తి అనే గ్రామంలో 5.4.1975వ సంవత్సరం వెంకటలక్ష్మమ్మ, నారాయణప్ప దంపతులకు జన్మించారు. వీరు సాధారణమై వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. వీరి ప్రాథమిక విద్య అక్కడ ప్రభుత్వ తెలుగు పాఠశాలలో చదవడం జరిగింది. తన చిన్నప్పటి నుండి నేటివరకు తెలుగు భాష అన్నా, సంస్కృతి పట్ల ఎనలేని మక్కువ. ముఖ్యంగా వీరు "ఆంధ్ర సాంస్కృతిక సమితి బోనుబజాల బృందం, తెలుగు సంఘాలు, తెలుగు సాహిత్య పరిషత్ నిర్వహించిన కార్యక్రమాలలోనూ, ఉద్యమాలలోను పాల్గొనడం జరిగింది. వృత్తి రీత్యా వైద్యునిగా ఉంటూ తెలుగు భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అగరం వసంత్‌గారు బస్తీ యువక బృందం అధ్యక్షుడిగా ఉంటూ 2007నుండి ఉగాది కవితా సంకలనాలు వెలువరిస్తున్నారు. కవిగా, రచయితగా వీరి రచనలు వివిధ పత్రికలలో ప్రచురితమైనాయి.

అగరం వసంత్ రచనా ప్రతిభకు ఎన్నో అవార్డులు, సత్కారాలు లభించాయి. కేంద్రసాహిత్య అకాడమీ వారి కథా పురస్కారం, తేజ పురస్కారం, గుత్తినారాయణరెడ్డి సాహిత్య పురస్కారం, డా॥బి.ఆర్.అంబేద్కర్ 125వ జయంతి సాహిత్య పురస్కారం, తెలుగు తేజం ఆత్మీయ పురస్కారాలు అందుకున్నారు.

వీరి కథా రచనలు 1.తెల్లకొక్కర్ల తెప్పం, 2.వెండి మొయిల్లు బండ బతుకులు, 3.ఆటాడుకుందాం...రా 4.దణ్ణై 5.సామెతల సప్పరము 6.కైవారం తాతగారి రచనలు - చిరుపరిశీలన వంటి రచనలు మొదలయినవి కలదు.

సామాజికాంశాలు పరిచయం :

సమాజం అంటే మన చుట్టూ ఉన్న మనుషులని అర్థం. సమాజంలో ప్రజలు ఎన్నో సమస్యలతో బాధపడుతున్నారు. అంటే రకా వ్యక్తుల మధ్య సామాజిక జీవితానికి సంబంధించినది. సాహిత్యం సమాజాన్ని ప్రతిభింబిస్తుంది. కథకులు సమాజంలోని సమస్యలను కథల్లో పాత్రలకు ఆపాధించిన దానివల్ల కలిగే లాభాలు తెలిపి పరిష్కారాలను తెలిపి ఆలోచింపజేస్తున్నారు. సంఘసంస్కర్తలు కూడా సమాజంలో సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని మార్పులు తీసుకు వచ్చారు. అగరం వసంత్ గారి రచనలు సమకాలన సమాజంలోని అంశాలను (ప్రతిఫలిస్తుంది) ప్రతిపలింపజేస్తున్నాయి.

"ఒక సమాజ జీవన సంబంధాలలో బతుకుతున్న మనుషులంతా సామాజికులు జీవన సంబంధిత సమాజ మూలాలు సమాజ సంబంధాలకు మూలమై ఆసంబంధాల వల్ల మార్పులకు చేర్పులకు లోనవుతూ అభివృద్ధి అయ్యే మానవ ఆలోచన విధానాన్ని సామాజి చైతన్యం అంటున్నాం. సామాజిక చైతన్యం సామాజిక జీవులయిన మనుషుల జీవన వాస్తవిక స్థాయికి నిదర్శనంగా ఉంటుంది".

"సమాజహితం ఉత్తమ సాహిత్యలక్షణం. సాహిత్యం ఒక సామాజిక అవసరం. సామాజిక హితం ప్రధాన లక్ష్యంగా అసలైన సాహిత్యం ప్రాచీన కాలం నుండి ప్రస్తుత కాలం వరకు వచ్చిన వస్తున్న అనేక సాహిత్య రూపాలు, ప్రక్రియలు ఏదో ఒక లక్ష్యంతో ఆవిర్భవించినవే. కాలధర్మాన్ని బట్టి, సామాజిక అవసరాన్ని చైతన్యాన్ని బట్టి వాటి దృక్కోణాలను ప్రదర్శిస్తున్నాయి. తమ ధర్మాన్ని అవి నిర్వర్తిస్తున్నాయి.

పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, నాటకాలు, నవలలు, కథలు, విమర్శలు, జీవిత చరిత్రలు మొదలైన అనేక ప్రక్రియలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. వర్తమాన జీవితాన్ని ఫలవంతంగా మార్చగలిగే సాహిత్య అవసరం ఎప్పటికి ఉంటుంది.

అగరం వసంత్ హొసూర్ కథలలో నాటి నేటి సమాజాన్ని పాఠకుడి ముందుంచి పాఠకలోకాన్ని ముందడుగు వేయగలిగేలా ప్రోత్సహించేదిగా ఉంటాయి.

1. ఆర్థిక పరమైన అంశాలు
2. రాజకీయాంశాలు
3. సంస్కృతి పరమైన అంశాలు

ఆర్థికపరమైన అంశాలు :

అగరం వసంత్‌గారు హొసూరు ప్రాంతంలోని రైతు కుటుంబ జీవన పరిస్థితులు గూర్చి కథల ద్వారా తెలియ జేశారు.

ఆపత్తు :

కథలో రైతుల నుండి వ్యవసాయ భూముల్ని కంపెనీల కోసమని ప్రభుత్వం తీసుకుంటుంటే ఒకప్పటి బాధిత రైతు రైతులందరినీ ఆపద నుండి ఆదుకోవడం ఆపత్తు కథలోని ఇతివృత్తం.

నాగమ్మ ఆమె కొడుకు ఇద్దరూ గౌడు ఇంట్లో సేద్యం చేసేవారు. వ్యవసాయ పంటపొలాల్లో ఊరందరిదీ ఒక కల్లమయితే గౌనోళ్లది ఒక కల్లము. గౌడు పొలంలో పనికి వెళ్లాలంటే రైతుకూలీలకు చానా సంతోషం. గౌని భార్య కడుపు చూసి అన్నం పెడుతుంది. పొలంలో కలాల్లములో ధాన్యరాసి పట్టేడంత పేడ ముద్దచేసి జల్లిడి పువ్వుపెట్టి పూజ చేస్తుంది గౌడు సానమ్మ. ఆ వూరిలో పొలంలోని ముసలి ముతకకు ఒక్కొక్క మూముడు రాగులు ఇచ్చే వాడు. గౌడు మంచి మనిషి కాని అతని కొడుకు చెడు సాహసగాళ్లతో చేరినాడు. గౌడు భూమిని ప్రభుత్వం కంపెనీలకని ఇస్తాడు. గౌని కొడుకు ఆడబ్బులను విలాసాలకు చేసి తల్లిదండ్రులను బాధపెట్టేవాడు. అప్పుడు గౌడు అతని భార్య ఊరువదిలి వచ్చి పిండికొట్టే మిషను పెట్టుకుంటారు. అక్కడకు వచ్చే రైతుల నుండి విషయాలు తెలుసుకుంటుంటారు. అయితే ప్రభుత్వం రైతుల భూముల కోసం సంప్రదింపులు జరుగుతూ ఉంది. అప్పుడు రైతు సభ ఏర్పాటు చేస్తారు. గౌడు మన నేలలు పోతే మన నాలికలు పోయినట్లే మన కడుపులు పోయినట్లే కంపెనీల వాళ్లు కంపెనీ వస్తే మంచిదని నమ్మ బలుకుతారు. ఉద్యోగాలిస్తామంటారు. చేను దున్నుకుని తలెత్తుకుని బతకండి సలాములు కొట్టుకుని బతకడం కంటే శాద్యములా నస్తేనే మేలు అని అంటాడు. ఆ మాటలు విన్న రైతులు తమ భూములు అమ్మకూడదని అందరూ నిశ్చయించుకుంటారు.

పెట్టుబడి కంపెనీదారులు భూమి వ్యవహారం వల్ల రైతులు ఆర్థికంగా సమస్యలు ఎలా ఎదుర్కొంటున్నారో రచయిత ఈకథలో తెలిపారు.

నేలమ్మకు మొక్కుకుంట్నీ :

కథలో ప్రజలు కరువు కాలంలో ఏవిధంగా జీవనం సాగించారని చెప్పేది ఈకథలోని ఇతివృత్తం.

రంగన్న అనే వ్యక్తి కరువు నేపథ్యంలో బాధల్ని పాటగా పాడుతుంటే కథకుడు వచ్చి మన హొసూరు ప్రాంతంలో కరువు వచ్చినట్లుంది. అప్పుడు మీరెలా బతికినారు అని రంగన్నను అడిగినాడు. అప్పుడు "మూగ జీవాలకు మేపు లేక కసాయివాళ్లకి అమ్మి జొన్నపిండి తెచ్చి గంజి కాచుకుని బతికినాము. కలబంద గడ్డలు ఉడకేసి తింటా ఉంటిమి. అడవుల్లో దొరికే గోటిగుడ్లు దంచి రాగి రొట్టెల్లాగా, అవిసాకు అలా తిని బతికిమి అని అంటాడు. అతని మాటలు విని కథకుడు కరువు రాకూడదని నేలమ్మను మొక్కుకుంటాడు.

ఒకప్పుడు ప్రజలు కరువు సంభవించినప్పుడు వరి వెతలు గుండెల్ని కొలిచి వేస్తుంది. ఇకపై భూమి మీద కరువు రాకుండా ఉండాలని నేలమ్మకు మొక్కుకోవాలని రచయిత అభిప్రాయపడ్డారు.

రాజకీయాంశాలు :

మనిషిని ఎంతకైనా దిగజార్చే రాజకీయాన్ని కథా వస్తువుగా గ్రహించి రచించిన కథలు కూడా ఉన్నాయి. రాజకీయాల పేరుతో జరుగుతున్న అన్యాయాలను మోసాలను వ్యంగ్యంగా విమర్శించాడు. సిద్ధాంతం కలవాడు.

తెలుగు తలవర :

ప్రస్తుతం తమిళనాడు ప్రాంతంలో మాతృభాష తెలుగును పరిరక్షించుకునే బాధ్యత ప్రజలది ప్రభుత్వ రాజకీయ నాయకులదేనని తెలియజేసే కథ ఇందులోని ఇతివృత్తం.

ఆ ఊరికి పంచాయితీ ప్రెసిడెంటు శినప్ప. అతని సలహాదారుడు గోపాలప్ప. రాత్రి వార్తలు పొద్దున్న టీ కొట్టు దగ్గర శినప్ప మన ఎమ్.ఎల్.ఎ చట్ట సభల్లో తెలుగు కావాలి స్కూళ్లు మూయకూడదని మాట్లాడాడు. ఇక్కడ ఊర్లో సూళ్లు పోతుండాయి మనోళ్లు ఈడ ఊరికే తెలుగు అని బోడునుకునేది. ఒకమీదట మన ప్రాంతంలో తెలుగు నిలుస్తుందా ఏమన్నానా? అని గోపాలప్ప అంటుండగా గొడు పాపన్న అక్కడకు వచ్చి నీయట్ల వారుంటే ఎందుకు నిలుస్తుందిరా అని అంటాడు. గొడుకి తెలుగంటే ప్రాణం. నువ్వు పంచాయితీ తలవరు కదా ఇక్కడ తెలుగుకి ఏమి చేశావు. పంచాయితీలు తీర్మాణాలు తెలుగులో జరిపితివా అని ప్రశ్నిస్తాడు. అంతేకాదు ఊరిలో వెళ్లి చూశావా అని ఎడాపెడా అడిగె గొడు. గొడు మాటకు ఎదురు కాలేదు. పొద్దు మునిగిందే శినప్ప, గోపాలప్ప మందు కొట్టు దగ్గర ఎన్నికలొస్తావుంది. ఓట్లు అడగాలి ఎలా అని గోపాలప్పతో అంటాడు. అందుకు తెలుగుకావాలి మాస్కూల్లో తెలుగు మాష్టార్లకి వెయ్యాలి. నాబిడ్డని తెలుగులో నదివిస్తానని నాటకమాడన్నా అని.గొడు దగ్గరి కెళ్లి తప్పయపోయింది క్షమించమని కాళ్లకు మొక్కు అని అనె శినప్ప అట్లే చేస్తాడు. ఎన్నికల్లో గొడు కూతురు పేరు లేదు. అధికారి దగ్గర వినతిపత్రం తెలుగులో రాసిస్తే ఇదే మన్నా ఆంధ్రా అధికారి దగ్గర వినతిపత్రం తెలుగులో రాసిస్తే. ఇదే మన్నా ఆంధ్రా అనుకుంటివా అని గేలిసేసి మాట్లాడి అధికారి. అధికారి వినతిపత్రం అనుకుంటివా అని గేలిసేసి మాట్లాడి అధికారి. అధికారి వినతిపత్రం ఎత్తి పారేస్తాడు. శినప్ప జనాలు అధికారిపై తిరగబడతారు. అధికారి క్షమాపణ తెలుగులో చెయ్యాలి. కాని అధికారి తమిళంలో ఇచ్చె. అక్కడ అందరూ తెలుగు అక్షరాలు రాయించినాడు. ఆ ప్రాంతంలో తెలుగుకి అన్యాయం జరిగితే పోరాడ్డంలో ముందుంటాడు.

తమిళనాడు రాష్ట్రేతర ప్రాంతం అయినప్పటికీ నేటికి తెలుగు ప్రజలు భాషా పరంగా పాఠశాల స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు గొడ్డు సమస్యను ఎదుర్కొవాల్సి ఉంటుంది. కాబట్టి పరిపాలకులు నాయకులు మాతృ భాషకు బలంగా గట్టిగా పునాదులు నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని రచయిత తెలియజేశాడు.

పెసిడెంటు పదవి :

కథలో రాజకీయ నాయకులు పదవీ వ్యామోహం వారసత్వంగా నిలుపుకుంటున్నారు గాని ఇతరులను ఎదగనివ్వరని తెలియజేసే కథ ఇందులో ఇతివృత్తం

ఇరవై సంవత్సరములుగా ప్రెసిడెంటు కుడి భుజము మాద్రిగా ఆది పని చేస్తుంటాడు. పెసిడెంటుకి వయసు మీద పడింది. ఆదిగాన్ని చూసి గాదిగాడు ఈసారి ఎలక్షన్లలో నిలువు హాసపోటు నీకు లభిస్తుందని చెప్పారు. ఒకవేళ పెసిడెంటు కొడుకు నిలవాలంటే అతడు పరం బోకు ఎదో గొడవలు పెట్టుకుంటాడు అని చెప్పడం జరుగుతుంది. అంతలో పెసిడెంటు కొడుకు వచ్చి ఆదన్నా, గాదన్నా, మానాన్న తోట దగ్గరికి రమ్మనె అని వెళతాడు. అప్పుడు తెల్లచొక్కా పంచె ధరించి తోటకు వెళతారు. పెసిడెంటు మందు మాంసంపెట్టి కొడుకుని నిలబెట్టి సూడండప్పా ఇరవై యేండ్లు సపోటు చేస్తిరి. అదే విధంగా నాకొడుక్కి చేయాలి అనె. వీళ్లకు మత్తు వదిలింది. వీళ్లను కుస్తీపట్టి కొట్టిస్తాడు పెసిడెంటు. నువ్వు

ఎట్ల చెబితే అట్ల అనిరి. ఉంగరాలు తొడిగి పంపి గమనించుకోండి కుస్తీ బాబులు అని అప్పగిస్తాడు పెసి డెంటు.

రాజకీయ నాయకులు వారసత్వపు పొరులో ప్రజలను ప్రచారకులుగా కార్యకర్తలుగా మచ్చిక చేసుకోవడానికి మందు మాంసాలతో ఎలా విందు చేస్తారన్నది. అలానే ఇతరుల్ని రాజకీయంగా ఎదగనివ్వరన్నది ఈకథలో సందేశం.

సంస్కృతి పరమైన అంశాలు :

మన భారతదేశము పెక్కుసంస్కృతుల కూడలి. మన జాతి జీవనంపై ఇతిహాస పురాణాల ప్రభావం ఎంతైనా ఉంది. పూర్వకాలము నుండి అనేక ఆచారాలు, పండు గలు, వేడుకలు, మూఢనమ్మకాలు వంటివి. నేటి వరకు తరతరాలుగా కొనసాగిస్తున్నారు.

అగరం వసంత్ గారు సంస్కృతి గురించి ఆచార సంప్రదాయాల గురించి తమ కథలలో తెలిపారు.

పిన్నయ్య పెండ్లి :

వివాహ సంప్రదాయమును గురించి తెలియజేసే కథ ఇందులోని ఇతివృత్తం.

కథకుని తాతగౌడు. పిన్నయ్య పెండ్లి నెల రోజులు ఉందనగానే ఇల్లు చక్కబరచి సున్నము కొట్టిస్తాడు. తోటల్లో తమల పాకుల అరటిగెలలు, కట్టెలె చీల్చి ముందస్తుగా ఏర్పాటు చేస్తాడు. ఊర్లా వుండే ఆడ వాళ్లు నాలుగైదు రోజులు బ్యాళ్లు, పప్పు మలిశిస్తారు. పెండ్లికి తొమ్మిది రోజులుందనగా పసుపు దంచే సాంగెము జరుగుతుంది. ముత్తైదువులు వచ్చి పసుపు దంచుతారు. వాళ్లకు పసుపు కుంకుమ యిచ్చి భోజనాలు పెట్టిస్తారు. సప్పరము నాటికి పెండ్లి కూతురింటికి సుగమంచి పుట్టిక ఎత్తుకొని పోవాలి. అందులో ఐదుసేర్లు బియ్యము, ఐదు అచ్చుల బెల్లము, ఐదు ఎండు కొమ్మిరిగిన్నెలు, అరటి పండు చిప్పలు, ఐదుకట్ల ఆకులు, రెండు రవిక బట్టలు, ఒక అద్దము దువ్వెన, పౌడరు పెట్టి ముత్తయిదువుల ద్వారా పెండ్లి కూతురింటికి సాగనంపుతారు. పెండ్లి కూతురు పుటక్కి పూజ చేస్తుంది. పూజ గదికి మామిడా కులు, లేపాకులు తోరణాలు అలంకరించి నల్లకడవ గడిగె మీద పెండ్లి కూతురు, కుమారుని కొత్త బట్టలు మాంగళ్యం పెట్టి తొమ్మిది రకాల వంటజేసి ఒక్క పొద్దుతో పూజ చేస్తారు. పెండ్లి కొడుక్కొ పసుపు పూయడం జరుగు తుంది. అప్పుడు దానప్ప నట్టింట్లో దేవున్ని నిలబెట్టి గరుడస్తంభానికి దీపం వెలిగిస్తారు. పూజలు జరిపిస్తారు.

విడిదిలో వున్న పెండ్లి కూతుర్ని ముతైయిదువులు తీసుకుని పెండ్లి కూతుర్ని ముత్తైదువులు తీసుకుని పెండ్లి మండపానికి రావడం జరుగుతుంది. వూరి నిండా జనాలు, చిన్నాపెద్దా అందరూ చేరి వుంటారు. గట్టిమేళము అని ఐవారు అనగానే మాంగళ్యధారణ జరుగుతుంది. ఆ తరువాత పెండ్లి కొడుకు ఇంట్లో శివాసనము పూల దండలు మార్చుకుంటారు. కులపెద్దలు దీవిస్తారు. పెండ్లి కొడుకు కూతరు. మెరగణి జరిపించడం జరుగుతుంది.

పూర్వాచారాలు కాలంతో పాటు మార్పు జరుగుతోంది. వివాహం ఊరందరి మధ్యన నలుగు, శివాసనము మెరగణి జరిగేది. నేడు కాలానుగుణంగా వివాహ పద్ధతులు మారుతున్నాయి. కాబట్టి మన జీవితంలో ఆచారం వివాహ సంప్రదాయం ప్రధానమైనదని రచయిత ఈకథలో తెలియజేశాడు.

ఒడిబాలు :

ఈ కథ దైవారాధన గురించి తెలియజేస్తుంది. ఏడు ఊర్లు దేవుళ్లను కొలువు చేసి "ఒడిబాలు"కట్టడం ఈ కథ లోని ఇతివృత్తం.

కథకుని ఊరిలో ఉండె మునెమ్మతల్లి, సవారమ్మతల్లి ఓసూరులోని కోటమారెమ్మ, సిద్ధనపల్లిలో వుండే గూపల్లి మునేశ్వరుడు ఆవులవల్లి సప్పలమ్మని, పక్కార్లాచండే గంగమ్మతల్లిని మెరగణి ఏడు ఊర్ల నుండి చేయడం జరుగుతుంది. మరుసటి దినము ఆడవాళ్లు పొద్దున్ననే ఒడిబాలు కట్టడానికి వెళతారు. కథకుడు వారితో వెళతాడు. ఆడవాళ్లు అమ్మవారికి పసుపు కుంకుమపెట్టి

దేవుళ్లకు చీర, రవిక, పూలు, కొబ్బరి, కొత్తబట్టలు కట్టి విగ్రహాన్ని పూజిస్తారు. మగదేవుడైన మునీశ్వరునికి పంచె, తువాలు పెట్టి అలంకారము చేస్తారు. పూజారి ఒడిబాలు కట్టింది పూర్తయిన వెంటనే మంగళహారతి ఇవ్వగా అందరూ మంగళాహారతి తీసుకుని వెళతారు. కథకుడు ఒడిబాలు గూర్చి తల్లిని అడుగుతాడు. "ఒడిబాలు అంటే దేవుళ్ళకు మెరగణి చేసేటప్పుడు పసుపు కుంకుమ పెట్టి పూజచేసి కొత్త బట్టలు పెట్టేదని దానిని ఒడిబాలు కట్టేదని అంటుంది.

దేవతారాధన ఉత్సవం మెరగణి పూర్వీకుల కాలం నుండి మనకు అనాదిగా వస్తుంది. అసంప్రదాయాలే మన సంస్కృతిలో భాగమని రచయిత ఉద్దేశం.

ఆధార గ్రంథాలు :

1. సాహిత్య సామాజికతావాదం కొన్ని ప్రతిపాదనలు - కేతవరపు రామకోటిశాస్త్రి
2. సాహిత్యం - సామాజిక అవసరం - డాక్టర్. ఎన్.ఈశ్వర్‌రెడ్డి
3. తెల్లకొక్కర్ల తెప్పం కథాసంపుటి - డాక్టర్ ఎన్.అగరంవసంత్
4. దణి - డాక్టర్ ఎన్. అగరంవసంత్

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

శ్రీశ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు– సామాజిక చిత్రణ

– కె. శంకర సాయిబాబు, శాఖాధిపది, ఓరియంటల్ లాంగ్వేజస్, జె.కె.సి. కళాశాల, గుంటూరు.

"ఉత్తమ కథలు చదివితేనే సభ్యత అలవడుతుంది. సభ్యతే నాగరికత, నాగరికతే సంస్కారం, సంస్కారమే జాతికి జీవనాడి. ఆంధ్రజాతి సంప్రదాయ బద్ధమైన ఉన్నతి పొందాలంటే - ఇరుగు పొరుగు జాతుల కంటే మిన్న కావాలంటే భారతీయత మీద స్ఫుటంగా తన ఆంధ్రతాముద్ర వేసుకోవాలంటే ఈ కథలు చదవాలి. చదివి అవగాహన చేసుకోవాలి."

ఈ ధ్యేయంతో తెలుగు భాషలో, అచ్చంగా తెలుగు వారి కథలే వ్రాసిన జాతి కథకులు స్వర్గీయ శ్రీ పాద.

సంస్కృతాంధ్రాలు వినా అన్యభాషా సాహిత్యాల పరిచయం లేకుండా తెలుగులో అచ్చమైన తెలుగు కథలు వ్రాసి, తెలుగు కథకు పుష్టినీ, తెలుగు పఠితకు తుష్టినీ కలిగించిన కథకుడు శ్రీశ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

కథా రచయితగానే కాక, తెలుగులో వ్యవహారిక భాషకు చైతన్య స్ఫూర్తినిచ్చిన శిష్టులలో విశిష్టులుగా కీర్తించబడ్డారు. శాస్త్రిగారు ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలన్నింటిలో కృషి సాగించినా, తెలుగులో కథానికకూ వారి పేరుకూ అవినాభావసంబంధం ఉంది. చిన్న కథల రచయితగా, ఆధునిక కథా రచయితలలో వారికి విశిష్టస్థానముంది.

శాస్త్రిగారి కథలు మొత్తం 75 లభ్యమవుతున్నాయి. శాస్త్రిగారు తమ కథలను చిన్న కథలనే పేరుతో వ్యవహరించారు. శాస్త్రిగారి కథలను 1. సాంఘిక కథలు 2. చారిత్రక కథలు అన్ని విధాలుగా విభజించవచ్చు. వస్తుతత్వాన్ని బట్టి సంఘసంస్కార కథలను విభజించితే అవి సుమారు 25 వరకు ఉంటాయి. వానిలో 1) రామలక్ష్మి 2) ముందుహాలాహలము పిదప అమృతము 3) వెలిపెడితే అల్లుడైనాడు 4) మేనరికం తప్పులేదు వగైరా కథలు వితంతు పునర్వివాహానికి ఉద్యమించిన కథలు. ఇక రజస్వలానంతర వివాహం ఆరోజుల్లో తగని నేరం! కానీ దాన్ని తెగేసి ప్రోత్సహిస్తూ శ్రీపాదవారు జూనియర్ కాదు, అల్లుడు అన్న కథరాశారు. తహస్సీలు దారు గాదు-వర్తకుడు, వెలుగు-చీకటి, నలుగుర్ని పోషిస్తున్నానిప్పుడు' అన్నకథలు పాఠకులలో స్వతంత్ర వృత్తి మీద ఆసక్తిని, గౌరవాన్ని కూడా పెంపొందించాయని నేటికీ విజ్ఞులు వక్కాణిస్తున్నారు.

వీరేశలింగం పంతులుగారు అన్నా, బంకించంద్ర చోటోపాధ్యాయగారు అన్నా-శాస్త్రిగారికి చెప్పనలవిగానీ ఇష్టం. వీరేశలింగం పంతులుగారినే తన కథలలో ఒక పాత్రగా ప్రవేశ బెట్టిరంజుగా; సంఘ శ్రేయోభి ముఖంగా కొన్ని కథలను ఆయన నడిపించాడు. స్త్రీ జనోద్ధరణ మాత్రమే గాదు- స్త్రీల మీద అపారమైన ప్రేమాభి మానాలతో శ్రీపాదవారు ఎక్కువ భాగం కథలు రాశారు. "అరికాళ్ళ కింద మంటలు" అన్న కథలో ఒక బాల వితంతువు. తన సవతి తల్లి అక్కలూ పెట్టే బాధలు తట్టుకోలేక అట్టి అరికాళ్ల కింద మంటలు భరించలేక అర్ధరాత్రి వేళ రాజమండ్రి పారిపోతుంది. ఒక బండివాడు ఎక్కడి కమ్మా వెళ్తారూ అని అడుగుతాడు. "దానవాయి పేటకు వెళ్లాలబ్బీ" అంటుంది. దానికా బండివాడు సంగతి గ్రహించి "అమ్మా పంతులుగారి తోటకే అయితే, డబ్బులివ్వక్కరలేదులే తొందరగా బండెక్కండి. రేపే పాటికి పెళ్ళిచేయిస్తారు" అని చెబుతాడు. ఈ కథలో బండివాని పాత్ర కూడా మరపురానిదే. వితంతు పునర్వివాహ ఆవశ్యకతపై ఆయన రాసిన కథలన్నీ అతి సహజ సిద్ధంగా, అపూర్వ శీర్షికలతో సంస్కరణ స్ఫూర్తినిస్తాయి. శైలీ, శిల్పాలతో సజీవ చిత్రణలుగా భాసించాయి ఆ కథలు.

శ్రీ పాదవారి కథలకు బీజం, క్షేత్రం కూడా నాటి సంఘమే. అగ్రహారీకులలో రావలసిన మార్పులనూ,

భ్రష్టుపట్టి పోయిందనుకున్న బ్రాహ్మణ సమాజాన్ని ఉద్ధరించే లక్ష్యంతోనూ, ఆయన పుంఖాను పుంఖాలుగా రాశారు. అయితే కేవలం బ్రాహ్మణుల బాగోగులను గుర్తించి వారందుకే అంకితం అయిపోయారు అనుకోవడానికి వీలులేదు. సంఘంలో నవీన యుగపు పోకడలు ఇల్లాలితోను, ఇంటితోను మొదలవ్వాలని దానికి అన్ని కులాలలోను, వివాహ వ్యవస్థలో సరళమైన మార్పులు రావాలని కోరుతూ ఆయన తన దృష్టిని అన్ని కులాలు, మతాలూ, వర్గాల మీద కేంద్రీకరించారు.

వివాహ వ్యవస్థ మీద శాస్త్రిగారేనాడో దృష్టికేంద్రీకరించారు. కులాంతర, మతాంతర, వర్ణాంతర, శాఖాంతర వివాహాల ఆవశ్యకతా, "జాతీయత"కు అవసరమని అనేక నాటకీయమైన కథల ద్వారా చాటారు.

వానిలో కోటిసాగర సంగం, ఇలాంటి తవ్వాయి వస్తే' కథలు అద్భుతమైన కథలు. బ్రాహ్మణులలో నియోగి, వైదిక శాఖలు ఉన్నట్లే, నాడు హరిజనులుగా వ్యవహరింపబడే దళితులలో (మాల, మాదిగ) శాఖా భేదాలున్నాయి. ఈ రెండూ కలిసి పోవాలన్నది ఆయన ప్రగాఢ కాంక్ష. అందుకే 1921లోనే సాగరసంగం అన్న కథరాశాడు. అదోక ప్రేమ కథ. అబ్బాయికాటంరాజు శాల మాల, అమ్మాయి సోమాలు మరొక శాఖ మాదిగ. కాని కుల పెద్దలు అంగీకరిస్తారా అట్టి వివాహం? అందువల్ల ఆయన ఆ యిద్దర్ని క్రిష్టియన్లుగా మార్చేశారు. కల్యాణం జరిపించాడు. సవర్ణుల నోరు మూత పడుతుంది. ప్రేమకుల జంట అట్లా ఏకమైంది. మతం మారితే సాధ్యమైన ఈ సంస్కరణ మతం మారకుండానే జరగాలి అన్న సూచనను ఆనాడే ఆయన గట్టిగా చేశాడు... చేస్తూనే ఉండేవాడు.

'ఇలాంటి తవ్వాయి వస్తే' - కథని ఆయన 40 పేజీల కథగా చెప్పాడే కానీ, వెయ్యి పేజీల అర్థాన్నిస్తుంది. కథలోని పాత్ర, సన్నివేశాలు యింకా అక్కడక్కడా వుండటం మన దురదృష్టమే... ఇది అందరూ అధ్యయనం చేయాల్సిన కథ.

ఊళ్లో పెద్ద చెరువులో బ్రాహ్మణులు, సాయిబులూ నీళ్ళు తాగొచ్చు. జలకాలడవచ్చును, గానీ దళితులకు వీలులేదు. మతం మార్చుకుని, క్రైస్తవులయినా, కూడా వారు వూరవతల వుండాల్సిందే. ఒకసారి వాళ్ళ చిన్న చెరువులో కుష్టురోగి ఒకడు మరణిస్తాడు. అటు తరువాత సంఘటనలూ, సన్నివేశాలు కథలో ఎక్కడా అనౌచిత్యం కానీ, ఎబ్బెట్టు తనం గాని, పక్షపాత ధోరణిగానీ లేకుండా సాగుతాయి. సాయిబులైతే చెర్లో దూకొచ్చును. కనుక మనమూ "మహమ్మదీయ మతం పుచ్చేసుకుందాం" అని విస్సన్న అందుకు మొట్టమొదట లంఘిస్తాడు అనక మొత్తం గూడెం పొలోమని ధైర్యం తెచ్చుకుని చెరువులో ఎట్లా దూకుతారో చెప్పుతుందీకథ. అది క్లుప్తంగా చెప్పలేని అద్భుతమయిన క్రమ వికాసగతిశీలక సన్నివేశం. దీని మొత్తం "చూడాల్సిందే".- "ఆ వూరు ఎనభైయేళ్ళనాటి వెలనాటి అగ్రహారం. మున్సబు, కరణాలుననన్నూ ఆది నుంచి ఆ వూళ్ళోని ఆశాఖవారే... వైదిక విద్యలకు అదొ పీఠం. వెనుకటికి ఆ ఊళ్లో తపోధనులెందరో వుండేవారని, వారిలో నలుగురైదుగురు ఆ పెద్ద చెరువులో స్నానం చేసి గుండెల్లోతున నిలిచి గాయత్రీ జపం చేసుకుంటూ, చుంగలు తీర్చి పై బట్ట పైకెగరేస్తే. వారు మళ్ళీ పరమేశ్వరార్పణ మస్తు" అనే దాకా గొడుగులాగ అది అలాగే వుండిపోయేదనీ చెప్పుకుంటూ వుంటారక్కడ కాని అక్కడ మార్పు తెచ్చాడాయన.

ఆ వూరు రైతాంగం అంతా కమ్మవారు. రెండు వందలుపైగా వుంటుంది గడప. ఊరి పెత్తనం వారిదే తతిమ్మా కులాల వాళ్లు శెట్టి బలిజలు, కలారీలు కొప్పు వెలవలు, చాకళ్లూ, మంగళ్లూ... బాగా తక్కువే గాని, మాదిగ పల్లెలో యాభైదాకా వున్నాయి కొంపలు.

అది ఎప్పుడు ఎందుకు అలా తటస్థించిందో కాని ముప్పయితొమ్మిది మంది 'మహమ్మదీయులు' కూడా వున్నారా వూళ్లో, కానీ క్రైస్తవులుగా మతం మార్చుకున్నా, దళితులైన వారికి వేర్పాటు తప్పలేదు. అయితే హిందువులు, ముస్లిం మతం తీసుకుంటే వాళ్ళు సవర్ణులతో అలాగే బ్రాహ్మణుల మధ్య భుజం భుజం రాసుకుంటూ

తిరుగుతున్నారు. వూళ్లో- హిందువులుగా వున్నప్పుడూ బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు, చాకలి, మంగలి, మాల, మాదిగ యిలా వేరే వేరయిపోయి వుండిన వారందరూ ఇస్లాం మతం పుచ్చుకోగానే ఒక్కటే అయిపోయారు. నవాబు-గరీబూ, పాచ్చా-ఫకీరూ- భేదాలటుంచి బతుకంతా వాళ్ళది ఒక్కటే. జాతి ఒకటే- ఎందుకనీ? ఇలా అడుగుతూ అందుచేత హిందువులలో వర్ణబేధం, దళిత భేదం వుండరాదు అంటాడు శాస్త్రిగారు. ఆ కథలో యిదంతా అరటి పండు వొలిచి చేత బెట్టినట్లు చెప్పుకొస్తాడు. ప్రతిపాత్ర సానబెట్టిన రత్నం, సవర్ణులు, దళితులు అంతా ఏకం అయిన నాడే మనకి జాతీయత" - జాతి ప్రతిపత్తి అన్న ప్రతిపాదనను తన కథల్లో పాలల్లో చక్కెర కలిపినంత తీయ్యగా, మందు మాత్రచుట్టూ చక్కెర పూత వేసినంత చక్కగా చెప్పుతాడు.

శాస్త్రిగారు కథల్లో అభ్యుదయ దృక్పథం కలిగిన మరో కథ "కొత్తచూపు". అది నేటికీ, రేపటికీ కూడా మనకు కొత్తచూపు, కొత్తబాట ప్రసాదించే అద్భుతమైన కథ. అందులో కట్నంతో చేసుకునే పెళ్ళిని నిరాకరించిన ఒక విద్యావతి 'అన్నపూర్ణ'కి తండ్రి యిచ్చే ప్రోత్సాహం రచయిత ఆవిష్కరించిన తీరు మన నరనరాల్లో కొత్తనెత్తురై ప్రవహిస్తుంది. బతికున్నంత కాలమూ, జీవితంలో స్త్రీలు తమతో సహకరించుకోవాలంటే యువకులిప్పుడు గడించుకోవలసిన యోగ్యతలు శౌర్య, బలపరాక్రమాలు, తెగబడి యుద్ధం చేసే ధైర్యం, ఆడపిల్ల తండ్రి అయిన రామశాస్త్రి గారి మాటలే యివి కూడా. ఏదయినా విద్యలో ప్రజ్ఞ కలవాళ్ళు ఏ మాన్నా, అదో అందం కానీ, పప్పుబొట్టు పండితులు ధర్మశాస్త్రాలు విడగొడితే ఎలాగ భరించడం? ఇంతకీ అగ్రహారం అంతటిలోనూ ఆడపిల్లని ఇంగ్లీషు చదువులో పెట్టింది నేను. రజస్వల అయితేగాని, పెళ్లి చెయ్యక అట్టే పెట్టేసిన మొదటి వాణ్ణీ నేనే అంటాడు రామశాస్త్రి.

శాస్త్రిగారి అమ్మాయి అటు సంప్రదాయ, వేదాల సారాన్ని, ఇటు ఆధునిక పోకడల రెండింటిని సమన్వయిస్తు నవీన దృక్పథానికి పరమావధిని ఈ కొత్త చూపు పెద్ద కథలో చూపెట్టారు శ్రీపాదవారు.

చివరగా గుర్రప్పందాలు అన్న కథ నేటికీ సరిపడే లాగ ఉద్యోగాలను ఇంటర్వ్యూలను ఒక ఫార్సు రూపంలో ఎండగడుతుంది.

శాస్త్రిగారి కథలలో కొత్తచూపు, కథనరంగలో ఒక కొత్త ఊపూ తెలుగు జాతి గర్వించ దగ్గ తెనుగు కథామూర్తి ఆయన.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అధునిక సమగ్ర సామాజిక కావ్యం – "ఆసుపత్రి గీతం"

– ఖలీమ్ పాషా, అధ్యాపకులు, తెలంగాణ.

20వ శతాబ్దం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విశిష్టమైన మైలురాయి. అనేక సాహిత్యప్రక్రియలు, ధోరణులు, ఉద్యమాలతో సుసంపన్నమయిన శతాబ్ద మిది. తెలుగునాట తలెత్తిన సకల సామాజిక, రాజకీయ ఉద్యమాలకు చాలా మంది రచయితలు స్పందించారు. అద్భుతమైన సాహిత్య పక్రియలను, కళారూపాలను తీసుకున్నారు. ప్రతి దశాబ్దం ఒక వినూత్న ప్రక్రియతో, ధోరణితో పులకించిపోయింది. ప్రతి సాహిత్యధోరణి ఒక కొత్తరకం కవులనూ, రచయితలనూ, విమర్శకులనూ రూపొందిచుకున్నది.ఆయా సాహిత్య ధోరణులన్నీ ఆయా నిర్దిష్టమైన చారిత్రక, సామాజిక, రాజకీయనేపథ్యాల నుండి ఆవిర్భవించాయి. 'ఆధునిక జీవితం సాహిత్యానికి ప్రాతిపదిక. సాహిత్యంలోవస్తువుమారినప్పుడల్లా, రూపంలోనూ మార్పులొస్తాయి.వస్తువూ - రూపం రెండింటి సముచిత సమన్వయమే గొప్ప సాహిత్యం' అంటూ కె.శివారెడ్డి గారు విశ్లేషించారు.

ఆధునిక కావ్యేతిహాస యుగంలో ప్రతీకాత్మకాభివ్యక్తి ప్రధానంగా వెలువడిన ఆధునిక సామాజిక కావ్యాలలో బలమైన ప్రయోగం కె.శివారెడ్డిగారి ఆసుపత్రి గీతం' (1976). వస్తుపరంగా, అభివ్యక్తి పరంగా, ఒక సమన్వయాన్ని సమర్పించటంలోనూ శివారెడ్డి గారి 'ఆసుపత్రి గీతం' అగ్రతాంబూలం అందుకుంది. ఆధునిక సామాజిక కావ్యానికి ఉండదగిన ప్రమాణాలను పుష్కలంగా సంపాదించుకొని ఉండటం చేత, అటువంటి ప్రయోగాలకు ఒక ప్రమాణంగా నిలిచే ప్రక్రియ గౌరవాన్ని సంతరించుకొన్నది. ఆధునిక కావ్య స్వరూప స్వభావాలతో పాటు ప్రక్రియా పరంగా సప విధ ప్రయోగాలుండే అవకాశం ఉన్నదని వివరించటమైనది. ఆధునిక ఇతిహాస కావ్యం, కావ్యేతి హాసం అనే భేదాలతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక కావ్య ప్రక్రియా భేదాలను ప్రతిపాదించడమైనది. ఈ విశ్లేషణ విధానాన్ని అనుసరించి ఈ యుగంలో వెలువడిన ఉత్తమ ఆధునిక సామాజిక కావ్యం ' ఆసుపత్రి గీతం'.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

చలం సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛ

- సత్య శిరీష కొళ్ళకూరి, ఆంధ్రోపన్యాసకురాలు, ఆంధ్ర మహిళా సంస్కృత కళాశాల, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.

చలం ప్రసిద్ధుడైన గుడిపాటి వెంకట చలం సుప్రసిద్ధ తెలుగు రచయిత, వేదాంతి, సంఘ సంస్కర్త, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన అతి ముఖ్య వ్యక్తులలో చలం ఒకడు. చలం రచనలు చాలా వరకు స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా చేసుకొని ఉంటాయి. ముఖ్యంగా సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసలు, వాటిని వారు ఎదుర్కొనే విధానాలను చర్చించాడు. చలం రచనలలో ఇతివృత్తమూ తాత్వికత, రచనాశైలీ ఆయనకు ఆధునిక తెలుగు రచనా రంగంలో అనన్యమైన స్థానాన్ని సంపాదించిపెట్టాయి.

చలం రచనల్లో అతను వ్యక్తపరచిన భావాలు, ప్రతిపాదించిన విషయాలు, అప్పటి సమాజం మీద ఎంతగానో ప్రభావం చూపాయి. కానీ సమాజం అతణ్ణి అపార్థం చేసుకున్నది. అతను స్త్రీ స్వేచ్ఛ పేరుతో విశృంఖల జీవన విధానాన్ని ప్రచారం చేస్తున్నాడని అతని కథల్లో బూతులు ఉన్నాయని ప్రచారం జరిగింది. చలం పుస్తకాలను బహిరంగంగా చదవడానికి భయపడిన రోజులవి. ఆసక్తిగల పాఠకులు చలం పుస్తకాలను దాచుకొని చదివేవారట.

చలం సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛని తీసుకుంటే దానికి అనుకూలించే పాజిటివ్ అంశాన్ని దానికి హాని కలిగించే నెగిటివ్ అంశాన్ని వేరుపరచి, దేన్ని స్వీకరించాలో, దేన్ని తిరస్కరించాలో గుర్తించడం చాలా అవసరం.

ఈ సాహిత్యం మీద ప్రారంభం నుంచి చర్చలు సాగుతూనే ఉన్నాయి. మూడు రకాల ధోరణులు ఈనాటికీ ఉన్నాయి. చలంలో ఉన్న ఏ సానుకూలాంశాన్నీ పట్టించుకోకుండా వ్యతిరేకాంశాల్ని మాత్రమే పట్టించుకొనే ధోరణి కొందరిది. చలంలో ఉన్న ఏ వ్యతిరేకాంశాన్ని స్వీకరించకుండా ప్రతీదాన్ని నిర్విమర్శగా స్వీకరించే ధోరణి మరికొందరిది. గాస్త్రంగా ఇష్టాలు, తీవ్రమైన సందేహాలు రెండింటితోనూ సతమతమయ్యే మూడో ధోరణి మిగతా వాళ్ళది. ఈ స్పందలన్నీ ఈనాటికీ ఉన్నాయి.

సమాజంలో నీతిపేర జరుగుతున్న అన్యాయమును నిర్భయంగా ఎదిరించి స్త్రీ స్వేచ్ఛను గురించి పోరాడిన కవి. ఆధునిక తెలుగు వచన రచనకు ఒరవడి పెట్టిన వారిలో ప్రముఖులు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్త్రీల సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని అనేక నవలలు రాసిన ప్రసిద్ధ నవలాకారుడు.

కాల్పనికోద్యమ లక్షణాల్ని నవలా రచనలో ప్రవేశపెట్టిన వారిలో ప్రముఖులు గుడిపాటి వెంకట చలం. సమాజంలో నీతి పేరిట జరుగుతున్న అన్యాయాన్ని నిర్భయంగా ఎదిరించి, స్వేచ్ఛను గూర్చి తీవ్రంగా పోరాడిన వ్యక్తి. ఈయన సాంఘిక విప్లవవాదిగా పేరు పొందాడు. మైదానం, శశిరేఖ, మా కర్మమిట్లా కాలింది, కన్నీటి కాలువ, దైవమిచ్చిన భార్య, బ్రాహ్మణీకం, జీవితాదర్శము, అమీనా, అరుణ వంటి నవలలోని స్వేచ్ఛా ప్రణయం విప్లవాత్మకమైనది. చలం రచనలు ఆనాటి యువతరానికి వేదాలు. సంప్రదాయబద్ధమైన వివాహ వ్యవస్థలో కామానికే కానీ ప్రేమకు చోటులేదనీ తరతరాల నుండి స్త్రీ వంచింపబడుతున్నదని, మగవారు కీలుబొమ్మగా ఆడిస్తున్న స్త్రీలకు స్వేచ్ఛ కలిగించడం తన ధ్యేయమని చలం తన నవలల్లో చాలి చెప్పాడు. అనుకూల వాతావరణంలోకి స్త్రీ దూరంగా వెళ్ళిపోవచ్చు అని చలం చెప్పినా ముగింపులో సరైన పరిష్కారం చెప్పలేదు. ఈ నవలల్లోని నాయికల జీవితాలు విషాదాంతాలుగా పై కారణాల వల్లనే ముగించబడ్డాయి.

శశిరేఖ :

సృష్టిలోని మాధుర్యం ప్రేమ అయితే
ఆ ప్రేమకి అసలుసిసలు అయిన రూపం శశిరేఖ.

చలంగారి ముద్దుబిడ్డ శశిరేఖ, చంచలంలాగ కనిపించే సంచలనం ఆమె. చివరికి చలనంలేనిది అయిపోయింది. పదహారు వేల మందితో ఉన్న కృష్ణుడు దేవుడూ, ప్రేమ మూర్తి అయితే ప్రేమతోనే కడవరకు ప్రయాణం సాగించి ఆ ప్రణయ ప్రళయంలోనే జీవితాన్ని ముగించిన దేవత కదా శశిరేఖ?

ప్రాణానికి ప్రాణం అంటూ ప్రేమించిన ప్రేమను చివరిదాకా నిలుపుకోరెందుకు? ప్రేమ నశించిన బంధానికి విలువ ఏమిటి? అంటూ నిలదీసింది. తనని ప్రేమించిన వారికే ఆ ప్రేమ దక్కుతుందని ఖరాఖండిగా తేల్చి చెప్పేసింది శశిరేఖ.

"ప్రేమలేని పెళ్ళిళ్ళు ఎందుకు
ప్రేమ ఉన్నాక అసలు పెళ్ళి ఎందుకు
కొన్నాళ్ళకి ప్రేమపోతోంది ఎందుకు"

అంటూ ఇప్పటికీ సమాధానాలు రాని ప్రశ్నలని నిర్భయంగా బయటపెట్టింది.

సంస్కారవంతుల ముసుగులలో ఉండే ఈ నాగ రికులకి అర్థంకాని పెద్ద చిక్కుముడి ఈమె. ప్రేమకీ, బంధాలకీ సంఘం పెట్టిన ఆంక్షలని నెట్టివేసింది.

మనసుకి మలినం అంటనిది, మనసులో ఒకటి, బయట ఒకటి అనే ముసుగు ఎప్పుడూ ధరించినది.

ఏ కష్టాలకి జడవనిది ఈ శశిరేఖ.

సోమరితనంతో జీవితాన్ని గడిపే చవట అయిన కృష్ణుడికి, క్రూరత్వాన్ని మనసు నిండా నింపుకున్న రాక్షసుడైన సుందరరావుకి, ప్రశ్నించే దమ్ములేని దలదించుకు బ్రతికే దద్దమ్మ అయిన రామారావుకి ఎవరికీ దక్కనిది శశిరేఖ.

ఈ నవల సామాన్యులను చాలా ఆందోళన కలిగి స్తుంది. ఎప్పుడైతే పుస్తకము ఆందోళన కలిగిస్తుందో అప్పుడే దానిలో జీవము ఉన్నదని చెప్పవచ్చు. పాత ఊహలను పారదోలి నూతన భావాలను రగులుకొల్పు లాయి. "శశిరేఖ" ఈ జాతిలో నవల అని చెప్పడానికి ఎంతమాత్రమూ సంశయంలేదు అంటూ వ్యాఖ్యా నించారు ఈ పుస్తకానికి ప్రవేశిక రాసిన శివశంకరశాస్త్రిగారు. అయన పేర్కొనట్లు ఈ నవలలో కథానాయిక సామాన్య స్త్రీకాదు. ఆమె ప్రేమైక జీవి. అందువల్లే యోగ్యుడైన ప్రియుడికోసం ఎట్లాంటి త్యాగమైనా చేస్తుంది. శశిరేఖకు సౌందర్యమే నీతి, వేరు నీతిలేదు. ప్రేమ లేకపోతే భర్తతో నైనా కలిసి ఉండటం ఆమెకు రోత. మాయ చూపటం ఆమె చూపుల్లో పాపం. భర్త నిర్భంధ: ఇష్టంలేక శశిరేఖ కృష్ణుడి దగ్గరికి వచ్చేస్తుంది. ఆ తర్వాత కొన్నాళ్ళకు మళ్ళీ సుందరరావుతో వెళ్ళిపోతుంది. మరికొన్నాళ్ళకు రామా రావును ఇష్టపడుతుంది. ఇట్లా జీవితంలో నిరపేక్షమైన సౌందర్యభరితమైన ప్రేమను కోరుకున్న శశిరేఖ కథే ఈ నవల.

మైదానం :

అత్యంత వివాదస్పదమైన నవలలో ముందుండే నవల మైదానం. ఆ కాలంలో చలం పేల్చిన డైనమేట్ అని ఈ నవలని అంటారు. ఈ నవల చదివి ఎంతోమంది మహిళలు తమ వైవాహిక బంధాన్ని చిన్నాభిన్నం చేసు కున్నారు అని అంటారు.

శశిరేఖ నవల ఇతివృత్తం కూడా మైదానం నవల లాంటిదే. శశిరేఖ నవల గ్రాంథిక భాషలో ఉండుటచే తరువాత వచ్చిన మైదానం నవల వాడుక భాషలో వచ్చింది.

ఈ నవలలో ప్రధాన పాత్ర రాజేశ్వరి. ఆమె ఒక ప్లీడరు భార్య, సంప్రదాయమైన కుటుంబం. వివాహం అయిన తరువాత వారి దాంపత్య జీవితం సాఫీగానే గడిచింది. కొన్నిరోజుల తరువాత ప్లీడరుగారు అన్ని పనులలో తలమునకలై ఉండడం వలన భార్యను పట్టించుకోలేదు. రాజేశ్వరి జీవితం రసహీనమైనది అని భావించింది. వారికి ఇంకా సంతానంలేదు. ఆ సమయంలో తన భర్త (ప్లీడరు) వద్దకు వచ్చిన ఒక క్లయింట్ అయిన అమీర్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. భర్తలేని సమయంలో అమీర్ ఇంటికి రావడం అది శారీరక

సంబంధంగా ఏర్పడింది. రాజేశ్వరికి అమీర్ మీద ఉన్నది ప్రేమ సంబంధం అని చివరి వరకు పాఠకులకు తెలియజేస్తుంది. అమీర్ రాజేశ్వరిని తన వద్దకు వచ్చే యమని చెబుతాడు. రాజేశ్వరి దానికి అంగీకరిస్తుంది. వారిద్దరు ఆ ప్రాంతానికి దూరంగా నిజాం దేశంలో ఊరికి దూరంగా కొండల్లో ఒక మైదానం చేరుకుంటారు. ఒక పూరిగుడిసెలో ఉంటారు. కొండలు, నది, ఒక పాడు బడిన దేవాలయం, ఎటుచూసినా మైదానం. ఆకాశం భూమిని తాకే విధంగా ఉంది ఆ ప్రాంతం. అలా వారిద్దరు రాత్రిపగలు ప్రేమలో మునిగితేలుతారు. అలా మూడు నెలలు గడుస్తుంది. రాజేశ్వరికి భర్త నుండి పొందలేని అనురాగం రాజేశ్వరికి దక్కుతుంది. అమీర్‌ను చూస్తే చాలు, అమీర్‌తో ఉంటే చాలు అని రాజేశ్వరి తీవ్ర ప్రణయంలో ఉంటుంది. రాజేశ్వరిని వెతుకుతూ మేనమామ అక్కడకు వస్తాడు. చేసిన తప్పు ఒప్పుకుని రమ్మని బ్రతిమిలాడుతాడు. కానీ తనకు వైవాహిక బంధంలోలేని సుఖం ఇక్కడ పొందుతున్నానని రాజేశ్వరి చెబుతుంది. ఏముంది ఇక్కడ పూరిగుడిసె, మట్టికుండ, మట్టిపాయ్యి తినడానికి తిండి కూడాలేదు. పశువుల్లా జీవిస్తున్నారు అని చెబుతాడు మేనమామ. ఇదే నాకు ఆనందం. అమీర్ నన్ను చూసుకొన్న విధంగా నా భర్త ఏనాడు నన్ను చూసుకోలేదు అంటుంది రాజేశ్వరి మేనమామతో వెళ్ళడానికి రాజేశ్వరి ఏ రకంగా ఒప్పుకోదు. అమీర్, రాజేశ్వరి మేనమామని అవమానిస్తాడు. ఇలా వారు జీవితాన్ని కొనసాగిస్తారు.

ఒకనాడు అమీర్ దగ్గరకు 16 సంవత్సరాల వయసున్న మీర్ అనే వ్యక్తి వస్తూ ఉంటాడు. ఆ వయక్తి మీర్‌ను చూడగానే రాజేశ్వరి తమ్ముడు అనే భావన కలుగుతుంది. ఆ కుర్రవాడు ఎవరు? అతడు రాగానే అమీర్ ఎందుకు ముభావంగా ఉంటున్నాడని అనుకుంటుంది. ఒకనాడు అమీర్‌లేని సమయంలో మీర్ అక్కడికి రావడాన్ని గమనించిన రాజేశ్వరి అమీర్ దగ్గరకు ఎందుకు వస్తున్నావు ఏమిటి అని అడుగుతుంది. ఆ ప్రాంతానికి దగ్గరలో తోళ్ళసాయిబు ఇల్లు ఉంది. ఆ సాయిబు కూతురుని అమీర్ ప్రేమిస్తున్నాడు. కానీ ఆమె అమీర్‌ను ఇష్టపడటం లేదని చెబుతాడు మీర్. ఈ విషయంలో రాజేశ్వరి చాలా బాధపడుతుంది. నేను నా కుటుంబాన్నే విడిచిపెట్టి అమీర్ ప్రేమలో మునిగిపోయాను అనుకుంటుంది. భర్తను విడిచిపెట్టిన భార్యల పరిస్థితి ఇలాగే ఉంటుందా మగవారు అందరూ ఇంతేనా అని బాధపడుతుంది. వెంటనే అమీర్ ప్రేమపాశం ఈ విషయాలనన్నిటిని వెనకకు నెట్టేస్తుంది. రాజేశ్వరి తానే మీర్‌సాహెబ్ దగ్గరకు వెళ్ళి అమీర్‌కు సాయిబ్ కూతురుని ఇచ్చి వివాహం చేయమని అడుగుతుంది. వారిద్దరికీ వివాహం జరుగుతుంది. కానీ అమీర్ ఆ సాయిబు కూతురుని విడిచిపెడతాడు. రాజేశ్వరి, అమీర్‌లు ఆ కొండల్లో ఒక పూరిగుడిసె, మైదానంలో కాలం గడుపుతారు. కొన్నాళ్ళకు రాజేశ్వరి గర్భం దాల్చుతుంది. అమీర్‌కు ఈ సంగతి ఇష్టంలేదు. గర్భత్యాగం చేయమని అడుగుతాడు. కానీ రాజేశ్వరి ఒప్పుకోదు. తనకి దూరంగా వెళ్ళిపోతాడు అమీర్. అమీర్ ప్రేమతో గర్భత్యాగం చేస్తుంది రాజేశ్వరి. ఆ సమయంలో అమీర్ కోసం వచ్చిన మీర్‌తో శారీరక సంబంధం ఏర్పరచుకుంటుంది. వారిద్దరు ఇలా కొన సాగుతున్న సమయంలో అమీర్ రాకతో, మీర్ రాజేశ్వరి సంబంధం బయటపడుతుంది.

ఈ ముక్కోణపు ప్రేమకథలో మీర్‌ని చంపడానికి ప్రయత్నిస్తాడు అమీర్. రాజేశ్వరి మీర్‌కి అడ్డుపడుతుంది. రాజేశ్వరి కళ్ళు తెఱచి చూసేసరికి అమీర్ తనని తాను పొడుచుకొని చనిపోతాడు. డాక్టర్ కోసం వెళ్ళిన మీర్ డాక్టర్‌ను, పోలీసులను తీసుకొని వస్తాడు. మీర్ తానే పొడిచానని చెబుతాడు కానీ రాజేశ్వరి నింద తన మీద వేసుకుంటుంది.

నేను లేచి వచ్చేశాను అని ఎవరైనా అంటే గనక నాకు ఆ మాట ఏమాత్రం సహించదు అని నేనే పొడిచేశాను అనే వాక్యంతో ముగిసింది. చెప్పాలంటే ఈ 92 ఏళ్ళ మైదానం నవలకు వెయ్యిపైగా విశ్లేషణలు, విమర్శలు, వ్యాఖ్యానాలు వచ్చాయి.

ఈ నవలలో ప్రధాన పాత్రలు - రాజేశ్వరి, అమీర్, మీర్ రసహీనమైన దాంపత్య జీవనాన్ని భర్తను వదిలేసి అమీర్‌తో వెళ్ళిపోయింది. విశాలమైన మైదానం మీదుగా భయంకరమైన రక్తపాతం నుండి జైలుగోడల మధ్యలోకి సాగిన ఆమె ప్రయాణంలో ఆమెకు స్వేచ్ఛ లభించిందా? అంటే అవును అని ఆమె అనుకుంది. అమీర్ పెట్టిన చిత్రహింసల్ని అన్నిటిని భరించింది. అమీర్ వేరే అమ్మాయిని ప్రేమించినా కూడా తాను మధ్యవర్తిగా ఉండి వారికి పెళ్ళి చేసింది. అదికూడా అమీర్ మీద ప్రేమే అని భావించింది.

రాజేశ్వరికి భర్త దగ్గర దక్కని ప్రేమ, ఆప్యాయత అమీర్ దగ్గర దక్కినా చివరకు 16 సంవత్సరాల మీర్‌తో కూడా శారీరక సంబంధం పెట్టుకుంది.

ఇంత జరిగినా రాజేశ్వరికి పశ్చాత్తాపంలేదు. అదంత అమీర్ మీద ఆకర్షణ.

ఏ వివాహ బంధంలో అయితే స్వార్థం ఉంది అని భావించిందో అటువంటి స్వార్థం అమీర్ దగ్గర కూడా చవి చూసింది. కానీ అమీర్ మీద ప్రేమతో ఆమె కళ్ళకు మబ్బులు కమ్ముకున్నాయి.

ఆమెది అమర ప్రేమ అని భావించింది. అమీర్ రాజేశ్వరికి ప్రేమానురాగాలు అందించినా మగవారిలోని రాగ ద్వేషాలకు, ఏ మాత్రము అతీతుడు కాదు. తన మొండి పట్టుదలతో తనని తాను పొడిచేసుకున్నాడు.

16 సంవత్సరాల మీర్ తనకు తెలియకుండానే రాజేశ్వరి అమీర్‌ల చక్రవ్యూహంలో చిక్కుకున్నాడు.

ఆకర్షణ మోజులోపడిన రాజేశ్వరి జీవితం చివరకు జైలుకు బలి అయింది.

బ్రాహ్మణీకం :

కుల వ్యవస్థ పేరుతో స్త్రీకి జరుగుతున్న అన్యాయాలను, వారెదుర్కొనే దయనీయస్థితిని కళ్ళకు కట్టినట్లు చూపిన నవల.

కథా సంగ్రహము :

సుందరమ్మ పల్లెటూరి బ్రాహ్మణ పిల్ల, సంప్రదాయ కుటుంబంలో జన్మించింది. ఆచారాలతో పుట్టిన కారణంగా మడి, దేవుళ్ళు, దెయ్యాలు, జ్యోతిషాలు, సోదెలు మొదలయిన మూఢ నమ్మకాలుగల అమాయక ప్రవృత్తి ఆమెది. వయస్సు చిన్నదే అయినా, పెద్ద ఆచారాలు, పెద్దమడులు, పెద్ద ఊహలు ఎనిమిది సంవత్సరాలు రాగానే సుందరమ్మను తన మేనత్త కొడుకుకి ఇచ్చి పెళ్ళి చేశారు. పెళ్ళికాగానే సుందరమ్మ భర్త సంస్కృత విద్యాభ్యాసం కోసం ఇతర దేశాలకు వెళ్ళి ఆరు సంవత్సరాల తరువాత తిరిగి వచ్చాడు. సుందరమ్మ పేరు తగ్గట్టు సౌందర్యరాశి కావడంచేత వారి సాంసారిక జీవితం సుఖంగానే గడిచింది. దేవుడికే కన్నుకుట్టింది కాబోలు సుందరమ్మ భర్తను తీసుకొని వెళ్ళిపోయాడు. చివరి సమయంలో తన భర్త సుందరమ్మను మామగారిని పిలిచి నేను పోయిన దానిలోనే నివసిస్తాను దాని జీవితం నాశనం చెయ్యొద్దు అని చెప్పి ప్రాణాలు విడుస్తాడు. ఇంతలో సుందరమ్మ తండ్రి కూడా మరణిస్తాడు. దిక్కులేక మేనమామ ఇంటికి చేరుతుంది. మేనమామ వెంకట్రామయ్య ఇంట్లో చంద్రశేఖరమనే బీదకుర్రాడు వెంకట్రామయ్య కూతురుకు పాఠాలు, సంగీతం చెబుతాడు. చంద్రశేఖరం మనసు సుందరమ్మ వైపుకు లాగుతుంది. ఆమెను వశపరచుకుంటాడు.

గర్భం దాల్చిన సుందరమ్మను తన మేనమామ చేసేది లేక చంద్రశేఖరానికే ఇచ్చి పెళ్ళి చేస్తాడు. ఈ వివాహ విషయంలో చంద్రశేఖరం, సుందరమ్మల ఇష్టాయిష్టాలను తెలుసుకోవడానికి ఎవ్వరూ ప్రయత్నించలేదు. సుందరమ్మ చంద్రశేఖరాన్ని ప్రేమించలేదు. పైగా తన జీవితాన్ని ధ్వంసం చేసాడని తన భర్తకు ఇచ్చిన వాగ్ధానం భంగం చేసినదని. ఈ వితంతు వివాహం మహాపాప కార్యమని చంద్రశేఖరాన్ని ద్వేషంగా చూడటం మొదలు పెడుతుంది. సుందరమ్మ తనను ద్వేషిస్తున్నదని అమెకు

పరపురుష సంబంధం ఉన్నదని అనుకుంటాడు చంద్ర శేఖరం. సంసారం చేస్తున్నారన్న మాటేగానీ ఏనాడు సుఖంగా గడిపిందిలేదు. సుందరమ్మ ప్రసవించింది కానీ ఆ బిడ్డకు ఏ అచ్చటా ముచ్చటాలేదు. ఈ వివాహం వితంతు వివాహం కావడంచేత చుట్టుప్రక్కల వారు ఎవరూ వారిని పలకరించరు. సుందరమ్మ బిడ్డకు జబ్బు చేస్తుంది. ఆ జబ్బుకు కారణం ఆమె పాపకర్మ ఫలం అని ఆమె విశ్వాసం. ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని తన బిడ్డను కాపాడుకుంటుంది సుందరమ్మ.

సమాజంలో పురుషుడితో పాటు స్త్రీకి కూడా సమాన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉండాలని తన రచనల ద్వారా పేర్కొన మొదటి తరం స్త్రీవాద కవి చలం.

ఆధునిక మహిళ దేశ చరిత్రను తిరగ రాస్తున్నది అని చలం ప్రకటించారు. చలం తన రచనలన్నీ స్త్రీజాతికే అంకితం చేశాడు.

తెలుగు సంఘంలో స్త్రీ నికృష్టస్థితి, ఆధ్యాత్మిక మానసికాందోళన మొదలైన శక్తులు చలంచేత ఇలాంటి నవలలన్ని రచింపజేశాయి.

❖ ❖ ❖

"తెలంగాణ దళిత కవిత్వం – సామాజిక జీవన చిత్రణ"

- కందాళ కనకమూర్తి రోహిణి, ఆంధ్ర ప్రదేశ్ సోషల్ వెల్‌ఫేర్ ఐ.ఐ.టి.- నీట్ మెడికల్ అకాడమీ, ఇడుపుగల్లు, విజయవాడ, కృష్ణా జిల్లా.

భారతదేశ సంస్కృతి చాలా గొప్పది. విభిన్నత ఉంది. ఐక్యత ఉంది. ఒక రకంగా ఇది భారతీయ ఆత్మ, కులం అనేది ఒక సామాజిక వివక్షత తెలంగాణా భారతదేశంలో అంతర్భాగం. తెలంగాణా యాసరీత్యా, సంస్కృతి రీత్యా ప్రత్యేకత కలిగి ఉంది. బతుకమ్మ, బోనాలు వంటి ప్రత్యేక పండుగలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడి దళిత జీవనం కూడా ప్రత్యేకమైనది. ఎందుకంటే వివక్షతలు గలది. ఇది కవిత్వాన్ని ప్రభావితపర్చింది. తర్వాత అనేక ప్రక్రియలను ప్రభావితపర్చింది. అంటే దళిత సమాజం సాహిత్యాన్ని ప్రభావితపర్చింది. సాహిత్యంలో వచ్చిన మార్పులు, ముఖ్యంగా భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, ముఖ్యంగా విప్లవ కవిత్వం, స్త్రీవాద, అస్తిత్వ ఉద్యమాల ప్రభావం దళిత కవిత్వం మీద పడింది.

ఈ కోణంలో దళిత కవిత్వంలో సామాజిక జీవణ చిత్రణ చాలా వైశిష్ట్యమైంది.

నైరూప్యము :

రాజ్యాంగం ప్రకారం "దళిత" అనే పదం ఒక షెడ్యూల్డు కులం. తెలంగాణాలో రాజవంశాల పాలన ఉంది. సామ్రాజ్యవాద కాంక్ష ఉంది. భూస్వామ్యం ఉంది. తెలంగాణాలో కులం సామాన్యులను అణచి వేస్తుంది. మరొపక్క భూస్వామ్యం బతకనీయడం లేదు. నిజాం నిరంకుశత్వంతో సామాన్యులు కలత చెందు తున్నప్పుడడు దీన ప్రజల ఆశాజ్యోతిగా కొమరం భీం ఉదయించాడు.

సంస్థానాల పరిపాలనలో విప్లవాత్మక మార్పులు చేపట్టిన వీరుడు ఛత్రపతి సాహు.

"అజ్ఞానము తోటి అంతరించె
ఆదిజనులెల్లరిని చేరదీసి
విజ్ఞానులుగా నువు తీర్చిదిద్ద
విద్యాలయాలనె నెలకొల్పి"

నారాయణగురు దళిత ప్రజలను కాపాడాడు.

"విద్య వల్ల వికాసం
వికాసం వల్ల వివేచన
వివేచనతో విముక్తి"

కలుగుతుందని మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలేలు సమాజాన్ని మేల్కొల్పారు.

తెలంగాణ సామాజిక పరిస్థితులు-దళిత జీవనం:

మనుధర్మశాస్త్రం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలను విభజించింది. అగ్రకులాల పెత్తనం కింద నిమ్నకులాలు నలిగిపోయాయి. ఆధునిక సమాజంలో బతికే హక్కు చాలా ముఖ్యమైనది. భూమి కోసం ఉద్యమాలు జరిగాయి. ఈ వరసలో తెలంగాణలో జనసభ, ఆంధ్ర మహాసభలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో సాహిత్యం అభివృద్ధి పొందింది. గ్రంథాలయోద్యమం, విద్యావ్యాప్తి, కుల వ్యతిరేకత - ఆర్య సమాజ్ కృషి, సామాజిక సమానత్వం, స్వధర్మ ప్రచారం, సాహిత్య సమావేశాలు, అణా గ్రంథ మాల ప్రజలలో ..... కలిగించాయి. దీనితో సామాజిక మార్పు

"ప్రాణములొడ్డి ఘోర గహ
నాటవులన్ బడగొట్టి మంచి మా
గాణములన్ సృజించి, ఎము
కల్ నుసిజేసి వాలాలు దున్ని, బో
షాణములన్ నవాబునకు
స్వర్గము నింపిన రైతుదే,
తెలంగాణము రైతుదే
ముసలి నక్కకు రాచరికంబు దక్కునే"

నిజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా కవులు రుద్రవేణను మీటినారు. అగ్నిధార కురిపించారు. నియంతృత్వ పాలకులను దిగిపొమ్మన్నారు.

కవిత్వంలో తెలంగాణలో దళితుల సామాజిక జీవన చిత్రణను వ్యక్తీకరణ చేసినవారిలో దాశరథి, కాళోజీలాంటి వారి పాత్ర గొప్పది.

"అంటరానివారెవరు?
మా వెంటరానివారు"

లాంటి చైతన్య పూర్వకమైన నినాదాలు తెలంగాణకు ఆదర్శమైనాయి. తెలంగాణలో దళిత సమాజాన్ని కవులు పట్టించుకున్నారు. ఇక్కడి దళిత కవులు కులంద్వారా నష్టపోయిన విలువలను గుర్తించారు.

తెలంగాణ దళిత కవిత్వం - సామాజిక జీవన చిత్రణ :

దళిత సమాజం సంక్లిష్టమైన సమస్యలతో కూడుకొని ఉంది. కనుక దళిత కవులు వేర్వేరు వస్తువును తీసుకొని రచనలు చేశారు.

తెలంగాణ దళిత వెలి జీవితం, తెలంగాణ దళితులలో స్త్రీల దుర్భర జీవితం, తెలంగాణ దళితుల మూఢ నమ్మకాలు, దళిత ప్రజల శ్రమ సంబంధం, దళిత ప్రజలకు దూరమైన విద్య, వైద్యం, జీవనోపాధి, వెట్టి చారికి, చైతన్యరాహిత్యమైన రాజకీయాలు, సామాజిక వెనుకబాటుతనం, దళితులపై భూస్వాముల పెత్తనందారీతనం, దళిత ప్రజలలో రాజకీయ అస్థిరత, తెలంగాణ దళిత ప్రజట జీవితం, సాంఘికవ్యవస్థ, తెలంగాణ దళిత కుల సమాజం, తెలంగాణ దళిత వ్యవసాయ శ్రమ సంబంధాలు, సామాజిక జీవితం, అంటరానితనం నిర్మూలన, తెలంగాణ దళిత అవిద్యపై పోరాటం మొదలైన పలు అంశాల పట్ల తెలంగాణ కవులు అద్భుతంగా రచనలు చేశారు.

"ఆదికాలమందు అవనిలో జనులెల్ల
అన్నదమ్ములగుచు నాశవీడి"

జీవించారని కుసుమ ధర్మన్నగారు చెప్పారు. మలివేద కాలంనాటి నుండి వివక్షతలు ఏర్పడ్డాయి. తెలుగు సాహిత్యంలో చాలా మార్పులు వచ్చాయి. ప్రధానంగా ఆధునిక కాలం తెలుగు కవిత్వంలో ఉద్యమాలు, ధోరణులు గొప్పగా వచ్చాయి. జాతీయోద్యమ కాలంలో ఆదిహిందు, ఆది ఆంధ్ర దళిత ఉద్యమాలకు భాగ్యరెడ్డి వర్మ, అరిగె రామస్వామి, ఆదియ్య, శ్యాంసుందర్, వెంకట్రావ్ లాంటివారు కృషి చేశారు. తెలుగు కవిత్వాన్ని జాలా రంగస్వామి, వేంకటశర్మ - మంగిపూడి, కుసుమ ధర్మన్న వంటివారు ప్రభావితపర్చారు.

స్త్రీవాద సాహిత్యం 1980 దశకంలో వచ్చింది. వెంటనే దళితవాద కవిత్వం 1990 వ దశకంలో వచ్చింది. ఈ క్రమంలో అస్తిత్వవాదాన్ని పరిశీలించాను. వేరు "డప్పు - దరువు" చర్మవాద్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

"ఆదవ్వ" ను పలకరించే ఒక ఉదాహరణ

"సింగులెగ్గెట్టికాసె బిగించి
గొంగడి భుజానేసి
గొల్లకొంకితో ముంజేతిసాలని కడియాలు
ఘల్లుఘల్లుమంది"

దళిత అస్తిత్వాన్ని ఆవిష్కరించింది.

దళిత కవిత్వంలో కొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. అంతకుముందు తెలుగు కవిత్వంలో స్వీకరించిన వస్తువు కంటే దళిత కవిత్వం స్వీకరించిన వస్తువు విభిన్నమైనది. చెప్పే పద్ధతి, భావం, విభిన్నతను స్వీకరించింది.

దళిత కవిత్వంలో -

"ఎరుకలి వేషం, బల్లని వేషం, బాలింత వేషంలో పునరుత్పత్తి సందేశం, గ్యారడీ వేషం, పోతురాజు వేషం, జాంబవంతుని ప్రాధాన్యతలు, ఒడిబాలు బియ్యం, పసుపు కుంకుమ, ఎల్లమ్మను లంద నుండి ఎదుర్కొనుడు. జాంబవంతుని - బ్రాహ్మణుని సంవాదం మొదలైన వినూత్నమైన మార్పులతో దళిత కవులు దళిత సాహిత్యాన్ని శాశ్వతం చేశారు.

"అబ్బుఆరెలలో అటురాని పిల్పుతో
నడ్సొచ్చె పాదాలకు నగిషీలు దిద్దుతున్నం
ఎండిన పొద్దుచర్మం పాతంచేసి
మామీదనుంచే నడుస్తున్న"

కొత్తదనం తెలుగు కవిత్వంలో పాతుకుపోయింది. దళిత కవిత్వంలో ఆత్మవేదన, నునిశితత్వం, సౌందర్యాత్మకం, సుకుమార్యం ఉన్నాయి.

"వర్ణవ్యవస్థ అప్రజాస్వామికమని
మానవులంతా ఒక్కటేనని
మనుధర్మశాస్త్రం రోజులు చెల్లిపోయానని
విద్యవిజ్ఞానం ఏ ఒక్కరిసొత్తుకాదు"

రాజ్యాంగం ఇచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, స్వేచ్ఛా హక్కుల ప్రకారంగా జీవించడమే ఆధునికం.

తెలంగాణ దళిత అస్తిత్వధోరణి తనదైన పదజాలాన్ని ఆత్మగౌరవంగా కవిత్వంలో నిల్యుకున్నట్టే సామెతలను, వైచిత్రిని, సౌందర్యాన్ని, వస్తునవ్యతను, కొత్తదైన ప్రతీకలను, అభివ్యక్తులను సాధించింది. శిష్ట సాహిత్యంలో కవులు అద్భుత వర్ణము చేస్తూ అద్వితీయమైన అంకితాలు, వాటి ప్రమేయం గల గొప్పతనాన్ని ఎలా పేర్కొన్నారో దళిత కవులు సమాంతరంగా తమ జీవితాలను సమున్నతంగా చేశారు.

జీవితమార్గం చూపిన తాతలు, తండ్రులు, నానమ్మలు, అమ్మమ్మలు, స్నేహితులు, అన్న తమ్ముళ్ళు, అక్కచెల్లెళ్ళకు, వాడలకు అంకితమిచ్చారు.

"అన్నిచేసినగాని అంటరానోల్లని-
ఆటకాడ గూడ ఉయ్యాలో
దూరమే గొట్టిలో ఉయ్యాలో
ఎన్ని సేవలు చేసి విలువియ్యనోల్లకే
భయపడడమే ఓ తల్లి ఉయ్యాలో
మేం బతుకమ్మ పేర్తము ఉయ్యాలో
దొడ్లల్లకు ఇగపువ్వుమోయమే తల్లి"

అని తరతరాలకు సేవచేసిన బానిసగానే బతుకు వెల్లబోస్తున్న దైన్యం నుండి చైతన్యాన్ని ఆవిష్కరించారు.

ముగింపు :

ఈ విధంగా తెలంగాణ దళిత కవులు తెలంగాణ ఉద్యమానికి ఇచ్చిన ప్రోత్సాహం, ఇలాంటి ప్రోత్సాహంలో తెలంగాణ కవుల ఆట, పాట, మాట, కవితాత్మక హృదయాన్ని "తెలంగాణ దళిత కవిత్వం - సామాజిక జీవిత చిత్రణ" లో పొందుపరిచితిని.

ఉపయుక్త గ్రంథము :

1. దళితుల చరిత్ర - కత్తి పద్మారావు, దళిత సాహిత్యం - చరిత్ర - పిల్లి శ్యాంసన్, కలేకూరి ప్రసాద్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రేగులపాటి కిషన్‌రావు 'అన్వేషణ' కథలు – సామాజిక చిత్రణ

– కటుకం శారద, సహాయ ఆచార్యులు, యస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

'సమాజంలో అనహాయులుగా ఉన్న వారిలో చైతన్యం, బెదిరి వున్న వాళ్లకు ధైర్యం, వ్యక్తిత్వం కోల్పోయిన వాళ్లకు వ్యక్తిత్వం ఇవ్వటం రచయిత తన రచనల ద్వారా చేసే ఉత్తమమైన పని 'అన్నారు కొడవటి గంటి కుటుంబరావుగారు. ఈ విధమైన వ్యక్తిత్వాన్ని అందిస్తాయి రేగులపాటి కిషన్‌రావుగారి కథలు. వీరు సమాజంలోని అనేక సమస్యలను, సామాజిక వైరుధ్యాలను తన రచనల ద్వారా ఆవిష్కరించినారు. సాహిత్యం ద్వారా వ్యక్తిలో, సంఘంలో మార్పు జరగాలన్నది రచయిత అభిమతంగా కనిపిస్తున్నది. అందుకే తెలుగు సాహిత్యంలో ఉన్న విభిన్నమైన ప్రక్రియలలో రచనలు చేపట్టి కథలు, నవలలు, కవితలు విమర్శలు, వ్యాసాలు వంటివి రాసినారు. రేగులపాటి కిషన్‌రావుగారు సిరిసిల్ల జిల్లా చింతల్‌ఠాణ గ్రామంలో 1946లో చంద్రమ్మ, భూంరావు పుణ్యదంపతులకు జన్మించారు. తల్లి దండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించి, ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడినారు. ఉపాధ్యాయుడుగా పనిచేస్తూనే రచనా వ్యాసంగాన్ని కొనసాగించినారు. వీరు 1976 నుండి అవిశ్రాంతంగా రచనలు చేస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు ఆరు నవలలు, ఆరు కథా సంపుటాలు, పదమూడు కవితా సంపుటాలు, భాగవత విషసర్పం అను విమర్శ గ్రంథం, ఒక వ్యాస సంపుటి, సమీక్షావ్యాసాలు, ముందుమాటలు వీరి కలం నుండి వెలువడి పుస్తకాలుగా ప్రచురించబడినవి. అన్వేషణ కథల సంపుటిని 2014 వ సంవత్సరంలో పుస్తక రూపంలో అచ్చువేసినారు. ఇందులో 15 కథలున్నవి. ఈ కథల్లో మన చుట్టూ ఉన్న సమాజాన్ని చిత్రించడం, పాత్రలన్నీ మన మధ్య కనిపిస్తున్నవే కావడం వల్ల సమస్యల పట్ల అవగాహన పెంచడానికి దోహదం చేస్తాయి. ఈ కథల సంపుటిలోని కథలన్నీ పేద, మధ్యతరగతి గ్రామీణ ప్రజల కష్టసుఖాలు, సాంఘిక, ఆర్థిక, సామాజిక, మానసిక పరిస్థితులను తెలియచేస్తాయి.

ఏ రచయిత ఐనా తన రచనల్లో ప్రతిఫలించే వస్తువు, ఇతివృత్తం కోసం తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి వాస్తవిక విషయాలకు కొంత కల్పన జోడించి మంచి రచనను చేసి అందిస్తాడు. అందుకు రచయితకు లోక పరిశీలనా శక్తి, ప్రతిభ,సృజనాత్మక నైపుణ్యం ఎంతో అవసరం.''నాకు నేనే కథా వస్తువును అని అంటూ నా చుట్టూ ఉన్న, నేను ఆకలింపు చేసుకున్న నా అనుభవంలోకి వచ్చినవే నా కథా వస్తువులు ''అని అంటాడు రచయిత రాజిరెడ్డి. లెక్చరర్‌గా పనిచేస్తున్న హరికృష్ణ 'దీపావళి కథల పోటీ' కోసం మంచి ఇతివృత్తంతో, వాస్తవిక పరిస్థితులతో కూడిన రచన చేయాలని సంకల్పించి, ఒక అనాధ గురించిన వృత్తాంతం కోసం అనాధాశ్రమానికి వెళ్లి, అరుంధతి కుటుంబ నేపధ్యం, తల్లిదండ్రుల పేదరికం, వారిని పోగొట్టుకొని అనాధాశ్రమంలో చేరిన క్రమం, చదువు పట్ల ఆమెలో ఉన్న ఉత్సాహం తెలుసుకొని 'అన్వేషణ' కథను రాయడం కనిపిస్తుంది. అదేవిధంగా పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న గోపికృష్ణ కూడా మంచి కథకు కావలసిన వస్తువు కోసం ప్రయత్నిస్తున్న సమయంలో భార్య గోమతి తన జీవితంలో ఒకరోజు జరిగిన యధార్థ సంఘటనను తెలిపింది. ఆమె గుడికి వెళ్లి దైవదర్శనం చేసుకొని తిరిగివస్తు, బిచ్చగాళ్లకు దానం చేస్తుండగా వేలికున్న ఉంగరం అతడి పళ్లెంలో పడిపోయింది. తర్వాత రోజు అతడు నిజాయితీగా ఆమెకు ఆ ఉంగరం తిరిగి ఇవ్వడం జరిగింది. పేదరికంలో ఉండి కూడా నీతి నిజాయితీతోజీవిస్తున్న బిచ్చగాడి కథను రాయుమని ప్రోత్సహించడం జరిగింది. ఆమెసంతోషంతో

ఇచ్చిన వంద రూపాయలను కూడా అతడు తన తోటి బిచ్చగాళ్లందరికి పంచి ఇవ్వడం అతడి గొప్పతనం. ధనికులలోను కనిపించని అంత గొప్ప దాన గుణం ఒక బిచ్చగానిలో ఉండడం అరుదైన విషయం.

జీవితంలో బాల్యం చెదరని జ్ఞాపకం.ఆ రోజులు తిరిగిరానివి. 'ప్రయాణం' కథలో రచయిత తన చిన్ననాటి అనుభవాలను జ్ఞాపకాలను నెమరు వేసుకున్నాడు. అతడు చిన్నతనంలో అమ్మ, చెల్లితో కలిసి బతుకుమ్మ పండుగకు అమ్మమ్మ వాళ్ల ఊరు గూడెంకు సవారి కచ్చరంలో వెళ్లడం, పండుగ జరుపుకున్నతీరు, పిండి వంటలు ఆరగించడం, పెద్దమ్మవాళ్ల ఊరు కన్నాపురం వెళ్ళడం, ఎగువ మానేరు తీరంలో తెచ్చుకున్న సద్దులు తినడం, ఆ ఊరివాగులో స్నేహితులతో స్నానాలు చేయడం, వాగులో పిచ్చుక గూళ్లు కట్టుకోవడం, మోతుకు కర్రలు, ఆకులతో పందిళ్లు వేయడం చెరగని జ్ఞాపకాలు. లింగన్నపేటలోని రకరకాల గుళ్లు గోపురాల నిర్మాణం, వాటి నైపుణ్యం అద్భుతంగా ఉన్నదని కొనియాడారు. పెద్దమ్మ కొడుకు ఊరిలో పరపతి కలిగి ప్రజల సమస్యలను పరిష్కరించడం, అతనిపై వారికి గల అభిమానం మొదలగు విషయాలు తెలుస్తున్నవి.

ఆనాటి కాలంలో ఆర్థికంగా ఉన్నవారు సవారి కచ్చరంలో ప్రయాణం చేసేవారు. రచయిత ఈ కథలో ప్రయాణానికి ఎడ్ల బండిని సిద్ధం చేసిన తీరును వర్ణించారు. చాకలి వెంకటి 'సవారి కచ్చరంలో అడుక్కు గడ్డిపెట్టి దాని పైన జంపుకాన, చద్దర్లు కప్పి అటు ఇటు రెండు మెత్తలు పెట్టాడు. కానికి కనాలు అమర్చి దొత్తెలు కట్టాడు. బొల్లెద్దు, మైలెద్దు మెడల్లో గుంగుర్లు అమర్చి వాటి కొమ్ములకు పగ్గాలు పెట్టిండు. వాటిని వలపల దాపల కట్టి చేతిలో వారుకట్టె పట్టుకొని, తాను తెచ్చుకున్న గొంగడి భుజం మీద వేసుకొని కచ్చరం ముందు సిద్ధంగా నిలబడి ఉన్నాడు అని ప్రయాణానికి ఎద్దుల బండిని సిద్ధం చేసిన తీరును' వివరించాడు. ఇక్కడ ఆనాటి దొరతనానికి నిదర్శనంగా, ఆనాటి వ్యవస్థలోని లోపంగా ఒక విషయం కనిపిస్తుంది. చాకలివాడు బండి వెళ్లుతుంటే ప్రయాణం మొదలైనప్పటి నుండి ముగిసే వరకు కూడా దాని వెంబడి ఆగకుండా పరుగెత్తవలసిందే. చాకలి వెంకటి ఈ కథలో బండి వెంబడి అలా పరుగెత్తినవాడు కావడం విచారకరం. అది దొరల అహంకారానికి చిహ్నం అని చెప్పవచ్చును. ప్రయాణం కథ రచయిత స్వీయ అనుభవం అని చెప్పవచ్చును.

ప్రాచీనకాలం నుండి సమాజంలో పురుషులకు బహు భార్యత్వం అమలులో ఉండడం వల్ల విలాసవంతమైన జీవితం గడిపేవారు. స్త్రీ పురుషులకు ఒకేవిధమైన ఆచారాలు, కట్టుబాట్లు లేవు. పూర్వకాలంలో పురుషులే రచనలు చేసేవారు. ధర్మశాస్త్రాలు, ఇతర ధార్మిక రచనల్లో తమకు అనుకూలమైన ఆచారాలను, కట్టుబాట్లలను విధించుకొని, స్త్రీలకు మాత్రం అనేకమైన ఆంక్షలు విధించారు. నేటి కాలంలో ఎంతో మంది స్త్రీలు రచనలు చేస్తూ అటువంటి వాటిని ప్రశ్నించడం జరుగుతున్నది.

'ఇద్దరు భర్తల భార్య' కథలో ఒక స్త్రీ ఇద్దరు భర్తలతో కాపురం చేయడంతో కథ ముగుస్తుంది. అది సమంజసం కాదని, సంప్రదాయానికి విరుద్ధమని వాదించిన సులోచనతో పురుషుడు ఇద్దరు భార్యలతో కాపురం చేయటం సమంజసం అయినప్పుడు ఒక స్త్రీ ఇద్దరు భర్తలతో కాపురం చేయడం కూడా సమంజసమే అని అంటుంది. సమాజంలో స్త్రీ పురుషులకు ఒకే విధమైన పద్ధతులుండాలనే ఉద్దేశంగా కనబడుతుంది. నేటి కాలపు పురుషులు

పెళ్లి చేసుకునే అమ్మాయి అందంగా, తెలివితేటలు, ఉన్నత చదువు, ఉద్యోగం, వంటపని, ఇంటిపని చేస్తూ, ఎక్కువ కట్నం తెచ్చి, భర్త అడుగుజాడల్లో నడిచే వారై ఉండేటట్లు చూసుకొని పెళ్లి చేసుకోవడం కనిపిస్తుందనే వాస్తవాన్ని ఈ కథలో తెలిపినారు. ప్రాచీన కాలం నుండి స్త్రీ ఒక సాహిత్య వస్తువు ఐనట్లుగానే, నేటి ఆధునిక కాలంలో కూడా స్త్రీ పురుషుడి ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా నడుచుకునే విధానం కనిపిస్తుంది.

సాధారణంగా గుళ్లల్లో పూజారులుగా బ్రాహ్మణులు (పురుషులు) పూజాదికాలు నిర్వహించడం జరుగుతుంది. కాని 'పరిశుద్ధబంధం కథ' లో ఒక యువతి తన తండ్రి చనిపోవడం, ఆ ఊరులో మరో బ్రాహ్మణ కుటుంబం లేనందు వల్ల ఊరి ప్రజల కోరిక మేరకు దేదీప్య ఆలయంలో పూజాదికాలు నిర్వహించే బాధ్యతను తీసుకుంది. అంతేకాదు భాగవత సప్తాహంలో రుక్మిణీ కళ్యాణంలోని పద్యాలను అధ్భుతంగా, రాగయుక్తంగా పాడి ప్రశంసలు పొందడం జరిగింది. స్త్రీలు ఏ రంగం లోనైనా అవకాశాలను అందిపుచ్చుకొని రాణించగలరని బుజువు చేసింది. ఇది ప్రజల ఆలోచనా దృక్పధంలో వచ్చిన మార్పుగా చెప్పవచ్చును.

దేదీప్య ఉన్నత వర్గమైన బ్రాహ్మణ కులంలో పుట్టినా, ఇతర కులంవాడైన లలితానంద్‌ను ప్రేమించి, ఇంట్లో ఒప్పించి కులాంతర వివాహం చేసుకున్నతీరు ప్రేమకు కులాలు అడ్డుకావన్న భావన వ్యక్తమైనది. బ్రాహ్మణ కులంలో పుట్టిన గౌరీశంకర్ వ్యసనాలకు బానిస అయి జీవితం నరకం చేసుకున్నాడు. వ్యసనాలు కులమతాలకు అతీతంగా వ్యాపించే ఒక అంటురోగం వంటిది. అంటు కుంటే అంత తొందరగా వదలదు. ప్రయత్నంతో వది లించుకోవాలి.

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు పరిచి ప్రజలకు చేరునట్లు బాధ్యతలను నిర్వహిస్తారు. వారు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తారు. అటువంటివారు నియమ బద్ధమైన, నీతివంతమైన జీవనాన్ని అలవరుచుకోవాలి. 'మల్లెచెండు కథ' లో ఆర్.డి.ఓ భగత్ ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ఎంతో మంది దగ్గర లంచాలు తీసుకొని పనులు చేసేవాడు. ప్రతి పనికి ఒక రేటు ఉంటుంది. జవాబుదారిగా ఉండవలసిన అతడు లంచం తీసుకొని పనులు చేయడం అవినీతి అవుతుంది. చట్టాన్ని అమలు చేసే వ్యక్తులు నీతిమంతులుగా ఉండాలి. అధికారి లంచం తీసుకోవడం స్త్రీలు వ్యభిచారం చేయడం వంటిదని అతని భార్య నిర్మల మందలించి మంచి మార్గంలో పెడుతుంది. ఆమె ఒక రచయిత్రి. తన రచనల ద్వారా చక్కని సందేశం అందించింది. వాటిని చదివిని భగత్‌లో మార్పు రావడం గమనించినప్పుడు సాహిత్య ప్రయోజనం నెరవేరిందని అర్ధం అవుతుంది. ఎందుకంటే సాహిత్య ప్రయోజనం ఉపదేశమే కదా.

తల్లిదండ్రులు పేదరికంలో మగ్గుతున్నా పిల్లల భవి ష్యత్తు గురించిన ఆరాటం 'కనిపించిన దేవతలు' కథలో చూడవచ్చును.. హరీంద్ర దంపతులు తన ముగ్గురు పిల్లలను ఉన్నత చదువులు చదివించడానికి కావలసిన సంపాదన కోసం యంత్రాల్లా కష్టపడేవారు. పిల్లలు బి.టెక్, ఇంటర్మీడియట్, పదవతరగతి చదివేవారు. హరీంద్ర కూతురు లావణ్య చదువుకోసం స్నేహితున్ని ఆర్థిక సహాయం చేయుమని అడుగుతాడు. అతనికి పిల్లల చదువు పట్ల ఉన్న ఆరాటాన్ని, పిల్లల కష్టపడే తత్వాన్ని గమనించిన స్నేహితుడు అమ్మాయిని తన ఇంటి కోడలుగా చేసుకొని, ఉన్నత చదువులు తామే చదివించు కుంటామని భరోసా ఇవ్వడం కనిపిస్తుంది. నేటికాలంలో విద్యాధనానికి ఉన్న విలువ, గౌరవం, స్నేహ మాధుర్యం, వరకట్న పట్టింపులు లేనితనం తెలుస్తున్నది.

తిరస్కార ఫలితం కథలో మధ్యతరగతి కుటుంబానికి చెందిన నీలవేణి ధనవంతుడైన ఎమ్.ఎల్.ఎ కొడుకు ప్రేమించుకుంటారు. అతడు ప్రేమకు పేద,ధనిక బేధాలు లేవని చెప్పుతాడు. ఆమెను అమెరికాలో ఉన్నత చదువు చదివిస్తానని చెప్పి నమ్మకం కలిగిస్తాడు. అతన్ని నమ్మిన నీలవేణి తండ్రి చూసిన మంచి సంబంధాన్ని కూడా కాదనుకుంటుంది. కాని అతడు నీలవేణిని మోసం చేసి, వాడుకొని వదిలేస్తాడు. ఆమె తనకు చేసిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, న్యాయం కోసం మహిళా మండలి వారి సహాయంతో అతని ఇంటి ముందు ధీక్షకు దిగింది. నేటికాలపు ఆడపిల్లలు అన్యాయాన్ని ధైర్యంగా ఎది రించడం శుభపరిణామంగా చెప్పవచ్చు.

'అపుత్రస్య గతుర్నాస్తి' అని పెద్దల మాట. సమాజంలో తల్లిదండ్రులు పుత్ర సంతానం పట్ల ఎక్కువ మక్కువ చూపిస్తారు. పుత్రులు పున్నామ నరకం నుండి తప్పించి, ఉత్తమ గతులు పొందడానికి మార్గం చూపిస్తారనే భావనతో మగ పిల్లవాడు కావాలనే అభిప్రాయం వారిలో కనిపిస్తుంది. ఆడపిల్లలతో అటువంటి అవకాశం లేదనే భావనతో వారిపట్ల నిర్లక్ష్య ధోరణి చూపిస్తారు. ఆమెను ఒకరికి ఇచ్చి పెళ్లి చేస్తే ఆమె ఆడపిల్లనే కాని ఈడ పిల్ల కాదనే భావనతో వారి పట్ల చిన్నచూపు కనిపిస్తుంది. కాని నేటి ఆధునిక కాలంలో ఆడపిల్లలు చదువుకొని, ఉద్యోగాలు చేస్తూ కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులను పట్ల ఆప్యాయతాను రాగాలు కురిపిస్తూ, మగవారి కంటే ఎంతో ముందు చూపుతో కుటుంబ బాధ్యతలను సమర్ధవంతంగా మోస్తున్నారు.

'ఔదార్యం కథ'లో పేద కుటుంబంలో పుట్టి పెరిగిన సునంద తండ్రి చనిపోవడం, తల్లి అనారోగ్యానికి గురి ఐన పరిస్థితుల్లో ఆమె ఒక ధనికుని ఇంట్లో ఇంటి పని, వంటపని చేసి తన చదువును కొనసాగించింది. ఇంటి బాధ్యతలను సమర్ధపంతంగ మోని, తల్లికి కొడుకు లేని లోటును తీర్చింది.అంతేకాదు పెళ్లైన తర్వాత కూడా తల్లి బాధ్యతను స్వీకరించింది. 'విజేత కథ'లో పేద కుటుంబానికి చెందిన మాధురి తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోతారు. ఆమె తన తెలివి తేటలతో తాను చదువుకుంటూ, తమ్ముడు, చెల్లెలిని చదివించింది. అక్క పెళ్లి చేసి ఒక ఇంటిదాన్ని చేసింది. మాధవికి నచ్చిన (వంట) పనిలో ప్రవేశం కల్పించింది. తమ్ముడిని ఉన్నత చదువులు చదివించి, తాను జర్నలిస్టుగా, గాయనిగా నిలదొక్కుకున్నది. కుటుంబ బాధ్యతలను మోయడానికి ఆడ, మగ అన్న తేడా లేదు. ప్రతికూల పరిస్థితులను సైతం తట్టుకొని, గుండెనిబ్బరంతో, పట్టుదలతో ముందుకుసాగటమే ప్రతి ఒక్కరి కర్తవ్యం అని మాధురి నిరూపించింది.

సంగీతం, సాహిత్యం, నాట్యం, శిల్పం, చిత్రలేఖనం మొదలగునవి లలిత కళలు. ఇవి నేర్చుకోవడం వల్ల మానసికానందంతో పాటు జీవనోపాధిని పొందవచ్చును. మనం ఏ కళనైనా చిత్తశుద్ధితో నేర్చుకోవాలి. ఆ కళ ఇప్పుడు మన అవసరాల కోసం పనికి రాకపోయినా భవిష్యత్తులో ఏదో ఒక విధంగా పనికి వస్తుంది. సుహాసిని కథలో శకుంతల పెళ్లైన తర్వాత తనకు అభిరుచి ఉన్న నాట్యకళలో శిక్షణ తీసుకున్నది. ఐతే ఆ కళ తన భర్త చనిపోయిన తర్వాత కుటుంబాన్ని పోషించుకోవడానికి ఒక ఆధారంగా నిలిచింది. అదేవిధంగా ప్రతి వ్యక్తి తనకు నచ్చిన కళను అభ్యసించి మానసికానందాన్ని పొంద వచ్చునని తెలుస్తున్నది. ఈసకథ లలిత కళల ప్రాధాన్యతను తెల్పుతున్నది.

పేదరికం అనుభవిస్తున్న కుటుంబాల్లో పుట్టిన అమ్మాయిలు అణకువ, ఓర్పు, ఆప్యాయత, అనురాగాలు కలిగి భవిష్యత్తుపై కొండంత ఆశావహ దృక్పథాన్ని కలిగి, పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకొని జీవించడం చూడవచ్చును.'ఔదార్యంకథ' లో పేదదైన సునంద బాధ్యతాయుతమైన జీవనం, నడవడికను చూసిన ధనికుడైన రేవంత్ ఆమెను ప్రేమించడం, అతని తండ్రి రంగారావు ఆమెను తన ఇంటి కోడలుగా స్వీకరించడం చూడవచ్చును. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నీలవేణి తల్లిదండ్రులు చూసిన సంబంధాన్ని కాదని, తనకు నచ్చిన ఎమ్.ఎల్.ఎ కొడుకు ఉషాకాంత్ ప్రేమలో పడి (ఉన్నత చదువుల మీద ఆశతో) మోసపోతుంది. చదువుకున్న జ్ఞానంతో ఎదుటివారి ప్రవర్తన, నడవడికను అర్థంచేసు కోవాలన్న తీరును 'తిరస్కార ఫలితం' కథ తెలుపుతుంది. వ్యక్తి ప్రవర్తన, నడవడిక, ఆలోచనా విధానం జీవితాన్ని తీర్చి దిద్దుతుంది అని అర్థం అవుతున్నది.

పరాంకుశం తండ్రి పాపయ్య.వయస్సు పైబడినవాడు. అతడు ఇంటిపట్టునే ఉంటూ కుటుంబ సభ్యులతో

ఆత్మీయంగా మసులుకునేవాడు. అతనికి ఉన్నట్టుండి ఒక్కసారిగా పక్షవాతం వచ్చి కుప్పకూలిపోయాడు. అతని కోడలు, మనుమడు గమనించి ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్యం చేయించారు. అతని కోడలు ప్రభావతి, మనుమడు ప్రకాశం పాపయ్యను కంటికిరెప్పలా చూసుకున్నారు. కువైట్‌లో ఉన్న పరాంకుశం తండ్రి అనారోగ్యంగా ఉన్న విషయం తెలుసుకొని ఇండియాకు తిరిగి వచ్చాడు. అతనికి సమయానికి మందులు, ఆహారం, పండ్లు అందిస్తూ సేవలు చేయడం వల్ల ఆరునెలల్లోనే కోలుకున్నాడు. అనుభవజ్ఞుడైన పాపయ్య ఇంటికి సంబంధించిన, వ్యవసాయానికి సంబంధించిన అనేక విషయాలలో తగిన సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. అతని సూచన ప్రకారమే పరాంకుశం ఇంటిని కట్టుకున్నాడు. అతని జీవితానుభవాలను కుటుంబ సభ్యులు ఎంతో విలువైనవిగా భావించేవారు. వృద్ధులను గౌరవించి, వారి ఆలోచనలు, అభిప్రాయాలకు విలువ ఇచ్చిన తీరు 'తిరస్కార ఫలితం' కథలో చిత్రించారు.ఈ కథ నేటి తరం వారికి ఒక మార్గదర్శనం చేస్తుందని చెప్పవచ్చును.

ఈ విధంగా కథల సంపుటిలో రచయితలు రచనా వస్తువును ఎన్నుకునే విధానం, పూర్వకాలపు ప్రయాణ సౌకర్యాలు, కలిగిన వారి స్థితిగతులు, పెళ్లిళ్లు, ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు, తల్లిదండ్రుల్లో పిల్లల చదువు పట్ల గల ఆలోచనా విధానం, ప్రేమ వివాహాలు, కుటుంబం పట్ల ఆడపిల్లల బాధ్యత, లలితకళలు, అనుభవంతో కూడిన వృద్ధుల జీవితాలు వంటి అనేకమైన సామాజికాంశాలు విస్తృతంగా వివరించబడినవి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

సావుకూడు – సామాజిక జీవన చిత్రణ

– కొటంగొలి బాబు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

ఆధునిక కాలంలో వెలువడిన కథానికలో ప్రాంతీయ చిత్రణతో వచ్చిన కథానికలు కూడా ఉన్నాయి. అందులో రాయలసీమ ప్రాంతంలో ఉన్న సామాజిక జీవన చిత్రణ కలిగిన కథానికాన్ని బండి నారాయణ స్వామి గారు రాసిన 'సావుకూడు' ప్రధానమైనది.

ఈ కథానిక ద్వారా రచయిత 'రాయలసీమ'లోని ప్రత్యేకంగా 'అనంతపురం' జిల్లాలో ప్రజలు కరువు కాటకాలతో ఎంత దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారో, వారి జీవన విధానం ఎలా ఉంటుందో పాఠకుల మనోనేత్రాల ముందు నిలిపారు. 'ఈ సృష్టిలో ప్రాణమున్న ప్రతి జీవిని కదిలించే అంశము ఆకలి'. ఆకలి అనేది మనుషులను ఎలా శాసిస్తుందో, ఎలా మారుస్తుందో అనే విషయాన్ని రచయిత ఈ కథానిక ద్వారా తెలిపినారు.

కథానిక సారాంశం :

సావుకూడు కథానికలో ప్రత్యేకంగా అనంతపురం జిల్లాలో కరువు కాటకాలతో ప్రజలు సతమతమవుతున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్ద వాళ్ళవరకు వేసుకోవడానికి బట్టలు కూడా సరిగా లేవు. చాలా ఏళ్ళ నుంచి వానలు లేకుండా భూములంతా బీడుమారాయి. ఎక్కడ చూసినా తినడానికి తిండి లేక 'అన్నమో రామచంద్రా' అంటూ ఉన్నకాడికి కలోగంజో తాగి పడుకుంటున్నారు. ఏదైనా పనిచేద్దామన్నా ఎక్కడా పనిలేదు. ముసలాయన పెద్దప్పయ్య బతుకంతా కష్టపడి ముగ్గురు కొడుకులకు పెండ్లిచేసి ఉన్న పొలాన్ని కొడుకులకు పంచిపెట్టాడు. చివరకు పెద్దప్పయ్య ఆరోగ్యం క్షీణించి మంచానపడ్డాడు. ఇక ఎక్కువరోజులు బ్రతికే పరిస్థితి లేదు.

చిన్నతమ్ముడు ఇంట్లో ఉన్న తండ్రిని పలకరిద్దామని పెద్ద కొడుకు మారప్ప వచ్చాడు. 'ఎట్లుందినాయనా పానానికి' అని అడగగా తండ్రి ఎక్కువనాళ్ళు బ్రతకలేను. నా పరిస్థితి క్షీణంగా ఉంది అని బదులిచ్చాడు. తండ్రిని తీసుకొని ఆరోగ్యాన్ని బాగుపరిచే ఆర్థిక స్థోమత వాళ్ళకు లేదు. కొడుకు తిరిగి వెళ్ళే సమయంలో పెద్దోడా నాకు కల్లుతాగాలనిపిస్తుంది. 4 రూపాయలు ఉంటే ఇచ్చిపో అని అడిగాడు. కొడుకు సతమతమవుతూ 4 రూపాయలు తండ్రికి ఇచ్చాడు. ఆవిషయం తెలిసిన పెద్దప్పయ్య భార్య ఇంటిలో రచ్చచేసింది. ఇంట్లో తినడానికి తిండిలేదుగానీ మీ నాయనకు కల్లుకు డబ్బులిస్తివా అంటూ దుమ్మెత్తి పోసింది.

కొన్నాళ్ళకు రెండో కొడుకు నాగన్న తండ్రి దగ్గరకు వచ్చి, యోగక్షేమాలు తెలుసుకున్నాడు. వెనుతిరిగే సమయంలో ముసలాయనకు 'సియ్యాబువ్వ' తినాలనే కోరికను అడుగుదామని మనసులో ఉంది. రెండో కొడుకు నాగన్న ఆర్థిక పరిస్థితి చాలా విషమంగా ఉంది. భార్యకు ఆరోగ్యం బాగలేక ఆసుపత్రిలో చూపించే స్థోమత కూడా లేదు. అయినా తండ్రి కోరికను తీరుస్తాడనే నమ్మకంతో 'నడిపోడా నాకు సియ్యాబువ్వ తినాలని ఉంది' అని అడగ్గా నోటినుంచి సమాధానం లేకుండా నాగన్న వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళకు ముసలాయన చివరి కోరిక తీరకుండానే చనిపోయాడు.

తండ్రిని స్మశానానికి సాగనంపడం కోసం ముగ్గురు కొడుకులు సావు ఏర్పాట్లు చేసినారు. పసుపు, కుంకుమ, సామ్రాణి కడ్డీలు తీసుకురమ్మని ఒకరికి ఒకరు చెప్పుకున్నారు. ఇవన్నీ జరిగే పనికాదని దినం అయ్యేదాకా శెట్టి దగ్గర కావాల్సిన వస్తువులన్నీ తీసుకొని పద్దురాసి తర్వాత అప్పుచెల్లిస్తామని ఒప్పందం పెట్టుకున్నారు. సావులో తప్పెట్లుకి, గుంత తొవ్వడానికి బేరాలు ఆడి చివరికి అన్ని కార్యక్రమాలు చేసుకున్నారు.

ఆంజనేయస్వామి పూజారి దగ్గరకు వెళ్ళి 11వ రోజు దినం పెట్టుకున్నారు. పెద్ద కొడుకు మారెప్ప సంతలోకి వెళ్ళి ఒక ముసలిగొర్రెను తీసుకొచ్చి 10వ రోజు అర్ధరాత్రి కోశారు. దానితోలు తీసి ముక్కలు చేసి పొయిమీద పెట్టి మసాలాను అంటించారు. మసాలా వాసనతో పొయిమీద ఉన్న కూర చుట్టూ బంధువులు చేరారు. తర్వాత రోజు ముసలాయనకు పిండాలు పెట్టి, భార్యను విధవరాలిగా మార్చి అన్ని కార్యక్రమాలు ముగించుకొని ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం వరి అన్నం మసాలా వాసనతో ఉన్న కూరని వచ్చిన బంధువులు, ఇంటి ప్రక్కవాళ్ళందరూ వచ్చి కడుపునిండా తిని వెళ్ళారు. మూడోరోజు ముసలి ఏడ్పు కొడుకులకు వినపడగా 'సచ్చినోళ్ళ పానాలు తిరిగి వస్తాయా' అన్నారు కొడుకులు. దానికి ముసలిది నేను ఏడ్చేది ముసలోడి పానాలు పోయాయని కాదు. దినంకి ఎవడెవడో వచ్చి పీకలదాకా తినివెళ్ళారు. నాకు మాత్రం మూడుతునకలు, నీళ్ళ పులుసు మాత్రమే వేశారని తిట్టుకుంటూ శాపనార్ధాలు పెట్టింది.

సామాజిక జీవన చిత్రణ :

కరువు ప్రాంతంలో ఉండే ప్రజలు వారి కడుపు నింపు కోడానికి కష్టపడి పనిచేస్తారని కుటుంబ బాధ్యతను గుర్తెరిగి సామాజికంగా జీవిస్తారని రచయిత తెల్పారు. అంతేకాకుండా ఒక కుటుంబంలో పిల్లల పెళ్ళి తర్వాత వారి ఆస్తిపాస్తులను పంచడం, సంసార సాగరాన్ని ఎలా నడపాలన్నది రచయిత ఈ కథానికలో చెప్పారు.

నేడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్నది డబ్బు. డబ్బే మనిషికి ప్రధానంగా మారింది. మనిషి మనిషికి మధ్య సంబంధాన్ని తొలగించి కేవలం డబ్బు ఉంటే చాలను కుంటున్నారు. 'సాధారణంగా మనిషి కోరికలు అనం తాలు'. ఈ అనంతమైన కోరికలను తీర్చుకోవడానికి డబ్బు ప్రధాన అంశం. పరిమితమైన డబ్బుతో అపరిమితమైన కోరికలను తీర్చుకోవడం సాధ్యం కాదు. కథానికలో రచయిత ప్రతి నన్నివేశం డబ్బుతోనే ముడివడి ఉంటుందని తెల్పారు. మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయిన తర్వాత చేసే అన్ని కార్యక్రమాలకు డబ్బు అవసరమని రచయిత తెల్పారు.

సమాజంలో జరుగుతున్నటువంటి విషయాన్ని వివరిస్తూ మనిషి మరణించిన తర్వాత వారి ఆచార సంప్రదాయాల ప్రకారం జరిగే కర్మకాండలు, దినం, పిండాలు పెట్టడం, భార్యను విధవురాలిగా చేయడం లాంటి అనేక రకాల కార్యక్రమాన్ని రచయిత కథానికలో చెప్పకనే చెప్పారు.

అంతేకాకుండా కథానికలో ప్రధానంగా రచయిత మాండలికానికి ప్రత్యేక స్థానాన్ని కల్పించారు. రాయల సీమలో ప్రజలు ఎక్కువగా ఉపయోగించే సియ్యాబువ్వ, నూరుపాయలు, పానము, బేళ్ళు, దొమ్మ, దుడ్లు వంటి మాండలిక పదాలను కథానికలో కూడా చెప్పినాడు.

రచయిత రాయలసీమ ప్రాంతాల్లో ఉన్న ఆర్థిక అసమానతలను ఏ విధంగా పట్టి పీడిస్తుందో కథానికంలో తెలియజేస్తూ క్రింది కులాల్లో పిల్లలకు అంగీ ఉంటే నిక్కరు ఉండదని, నిక్కరు ఉంటే అంగీ ఉండదని అదే విధంగా ఆడవాళ్ళు అయితే రవికలు చినిగినా మానం లేకుండా అలానే తిరుగుతుంటారని కనీసం బట్టలు కూడా సరిగ్గా ఉండదని కథానికంలో పాఠకుల గుండెలను హద్దుకునేలా చెప్పారు.

సమాజంలో మనిషికి ఆరోగ్యం క్షీణించినప్పుడు అప్పుచేసి ఆసుపత్రిలో చూపించేదానికన్నా చనిపోయిన తర్వాత ఎవరో ఏదో అంటారని అప్పుచేసి మరీ పెద్ద ఎత్తున కార్యక్రమాలను జరుపుతున్నటువంటి నేటి సమాజ పరిస్థితిని రచయిత కథానికలో చెప్పారు.

ముసలాయన భార్య భర్త చనిపోయినాడన్న బాధకంటే తనలో ఆకలిబాధతో ఎక్కువ వ్యధి చెందినట్లు తెలుస్తుంది. ఎలా అంటే "లేసన్న నా కొడకా! మూడు నూర్లు పెట్టి గొర్రెని కోస్తిరి, ఊరోల్లు అంతా వచ్చి తినిపోయిరి. ఎవరెవరికి పుట్టిన నా కొడుకులో వచ్చి గొంతువరకూ సించుకొని పోయిరి. నా ఇస్తరాకులోకి

మాత్రము నాలుగు తునకలు కూడా ఎయ్యకపోతిరి కదరా మీ కడుపులు దొక్కా! ముండలు మోయా! మీరు తునకలు తిని నా మొగానికి నీళ్ళు కలిపిన పులుసు పోస్తిరి. మీ యమ్మా కడుపుకాలా" ఈ తిట్ల వెనక ఆమెలోని ఆకలితీవ్రత కడుపునిండా తిండి తినలేకపోయిన ఆవేదన వ్యక్తమవుతున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. వల్లంపాటి వెంకట సుబ్బయ్య - కథాశిల్పం
2. బండి నారాయణ స్వామి - సావుకూడు
3. నేరువ వేంకటేశ్వరరావు - స్వాతంత్రానంతర సాహిత్యంలో తెలుగుకథ
4. మధురాంతకం రాజారాం - తెలుగు కథకులు - కథనరీతులు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పాలేరు నాటకంలో నవరసాల సామాజిక జీవనం

– కొడపు లలిత, తెలుగు ఉపన్యాసకురాలు, సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల, సుంకేసుల రోడ్ , కర్నూలు జిల్లా.

మానవుడు సంఘజీవి. మనిషి అభివృద్ధి తాను నివ సించే పరిసరాలు,పరిస్థితులమీద ఆధారపడి ఉంటుంది. సామాజిక జీవనంలోని అనుభవాలు, అలవాట్లు, కట్టు బాట్లను ఒకతరం నుంచి మరొకతరానికి చేరుతుంటాయి. మానవ సమాజం ఎప్పుడూ మార్పులతో కూడుకొన్నది. సమాజంలో కొత్తగా సభ్యులు రావచ్చు, పోవచ్చు.కానీ సమాజమనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ. మానవ సంబంధాలు కొన్ని తాత్కాలికమైనవి, కొన్ని శాశ్వతమైనవి. ఈ సంబంధాలకు వాటి స్వభావాన్ని అర్థం చేసుకోవడంవల్ల సమాజగతిని ఆర్థం చేసుకోవడానికి వీలవుతుంది.వ్యక్తులు సమాజంతో ప్రభావితం అయి ఉండటం వల్ల వారిమీద సమాజం ప్రభావం ఉంటుంది. ఒకసారి సమాజం కట్టుబాట్లతో ప్రభావితమైన మనిషి సమాజం బయట ఎంతోకాలం ఉండలేదు. సమాజానికి దూరమై జీవించడ మనేది కష్టమైనపని. మానవ సముదాయం నుంచి వ్యక్తులు విడిపోవడం అనేది జరగని విషయం.మనిషి వ్యక్తిత్వం అభివృద్ధి చెందడానికి సమాజంలో పాల్గొనడం చాలా ముఖ్యం. సమాజం అనుభవాల ద్వారా మనం ఎన్నో విషయాలు నేర్చుకొంటాం.మన విలువలు,వైఖరులు మన చుట్టూ ఉన్న సామాజిక వ్యవస్థనుంచి ఏర్పడినవే కాబట్టి సమాజమనేది ప్రజలందరూ కలిసి జీవించే ఒక అవసరమైన పరిస్థితి.

"నాసుఖాలూ, సంతోషాలూ
సమస్తమూ సరస్వతీ ప్రత్యర్థం
నాకష్టాలూ, నష్టాలూ, దురదృష్టాలూ
అన్ని శివార్పణం"

అన్న రసాద్వైతాచార్యుడు భీమన్న, జీవించడంకోసం ఏవృత్తిలో ఉన్నా సాహిత్యం ఊపిరిగా కవిత్వం ఆత్మగా కారణజన్ముడుగా జీవించాడు.

ఆంధ్రరాష్ట్ర మంతటా ఉర్రూతలూపిన నాటకాల్లో పాలేరు, కూలిరాజు ముఖ్యమైనవి ఈ నాటకాలు నేర్చు కొవడానికి పల్లెల్లోని దళిత వర్గాల వారు చదువుకున్నారంటే ఈ నాటకాలు ఎంత ప్రభావితం చేశాయో ఊహించ వచ్చు. పాలేరు నాటకం ఆడని పల్లెలు లేవంటే అతిశయోక్తి కాదు.పాలేరు నాటకం చూసి పాలేరు పనిమాని చదవుకొని కలెక్టరుగా ఉన్నతద్యోగులుగా పదివి పొందిన యువ కులు అనేకం.

"ప్రపంచ శాంతికి మార్గం - ఒక
పారుష జీవితమే నోయ్!
కర్ర చేతిలో లేకుంటే
గొర్రె కూడ కరిచే నోయ్!

భారతీయ గ్రామలలో రైతులకు, కూలీలకు కూడ ఆయుధాలు చేతి కర్రలే.నిలువెత్తు పొడవున వుండే వెదురు కర్రలవి. వాటినే బాణాకర్రలంటారు. "పాలేరుతనం పూర్వమున్నంత ఇప్పుడు లేదు. మరికొంత కాలానికి పుర్తిగా పోవచ్చు. అప్పుడు పాలేరు నాటకానికి ప్రయోజన మేమిటి?" అంటారు కొందరు. పాలేరు అంటే ఎవరు? యజమాని క్రింద బానిసలే పనిచేసే ప్రతి అస్వతంత్రుడూ పాలేరే. అట్టి ప్రతివాడూ తన బానిస తనాన్ని తొలగించు కోవడానికి నిరంతరం కృషి చెయ్య వలసివుంది.ఇదొక ఎడతెగని సమస్య.దీనికి ముగింపు లేదు. అయినా, పోరాటం కొనసాగక తప్పదు.ఈ నాటకం ప్రారంభ గేయం లోని ఉద్బోధ ఇదే, "బానిస తనమును బాపుమురా" అనేది.

గోదావారి తీరంలో రైతువాడా అనే గ్రామంలో కుబే రయ్య ఒక భూస్వామి పాలేళ్ల సహాయంతో వ్యవసాయం చేసుకుంటాడు.అతడి పాలేళ్లలో పులయ్య ముఖ్యుడు. అతడి కొడుకు వెంకన్న. పిన్ని సీతమ్మా , వీరేశ్ మరొక

పాలేరు. ఆ ఊరికి ఉపాధ్యాయుడు ఉపకారి. విద్యార్థి వనబాల ఈమె ధనవంతుల బిడ్డ ఈమె సోదరుడు సుందరం ఇతని స్నేహితుడు రామం. వెంకన్నకు పాలేరు పని ఇష్టముండదు బాగా చదువుకోవాలని కోరిక. పచ్చని పైర్లు పొలాల మధ్య పశువుల్ని అదిలిస్తూ వెంకన్న పాడుకుంటూ ఉంటాడు.ఈ పాటలో వీరరసం కాన వస్తుంది

బానిసతనమును.....బాపుమురా
భారతభూమికి.....భాగ్యము తేరా!

ఈ నాటకంలో అనేక రంగాలలో వీరరసము కాన వస్తుంది వనబాల సోదరుడు సుందరం పాట

పదరా, పదరా, పల్లెలకు
పల్లెటూరెరా భారత భాగ్యము.....!

ఆ ఊరి ఉపాధ్యాయుడు ఉపకారి పల్లెవారు అందరు చదుకొని జ్ఞానులు కావాలని ప్రోత్సాహిస్తూ వీర రసంగా పాడిన పాటలు, పద్యాలు ఎన్నో ఉన్నాయి.

సీ. గోచిపెట్టుట నెర్చుకొనగానె బిడ్డకు
చేతికి కర్రిచ్చు రైతులార!

గీ. ....బడికి పంపుడు ,విద్యనేర్పుడు, రవంత
ముందునకు బోవనిండు మీ ముద్దుసతుల

వెంకన్న చదువుకోవడానికి ప్రయత్నం చేసినప్పుడల్లా తండ్రి పుల్లయ్య, కామందు కుబేరుయ్య అడ్డుపడు తంటారు. పస్తులు పెడతాడు.కొడతాడు అనేక బాధలకు గురిచేస్తాడు దాంతో వెంకన్న తన జీవితాన్ని తలుచుకొని ఈ పాలేరుగా బ్రతకడం కంటే నూతిలో పడి మరణిం చాలనుకుంటాడు. తన జీవితాన్ని అస్యహించుకుంటాడు. ఇక్కడ మనకు బీభత్సరసం కానవస్తుంది.

సీ. దీనుల గావించి పాలేరుగా జేసి
కామందు కాలికి- గట్టినావు
.....
మనిషిగా నన్ను మననీవు, మహినికేల?
చంపుకొని పొమ్ము చాలింతు జన్మమింక

వెంకన్న ఇంటిని నుండి ఉపాధ్యాయుడి సహకారంలో కాకినాడకు బయలుదేరుతాడు.పుల్లయ్యను ఈడ్చి కుబేరయ్య గెంటేస్తాడు పుల్లయ్య భిక్షగాడిగా మారుతాడు తన జీవితాన్ని అస్యహించుకుంటూ పాటలు పాడుతూ అడుక్కుంటాడు.

గీ. పొట్టచింపినా అచ్చరంలేదు
పట్టెడు మెతుకు పొట్టకులేదు
కటికోణ్ణి నమ్మిన గొర్రెను నేను
కడుపుకాలి చస్తున్నాను

వెంకన్న పిన్ని సీతమ్మ ,వీరేశ్ ఒకరికొకరు ఇష్టపడతారు. పొలాలో పనిచేస్తూ పాటపాడుతారు. ఇక్కడ ఈ పాటలో శృంగార, హస్యరసాలు కానవస్తాయి.

వీరే!! వస్తావంటోలి పిల్లా!నాతో
కొత్త కొరంగి దాకా!

సీత!! వస్తానుగానోరి కుర్రా! నన్ను
కొట్టకుండ వుంటావా!

ఇలా పల్లెలో వారి సామాజిక జీవనం కళ్ళకుకట్టినట్టుగా కవి చక్కగా వివరించారు. సరదాగా మాట్లాడుకుంటూ ఒకరికొకరు నవ్వుకుంటున్న సమయంలో కుబేరయ్య వస్తాడు. వీరేశును తిట్టి సీతమ్మతో వెకిలి మాటాలు మాట్లాడుతాడు. ఆమెతో చెడుగా ప్రవర్తిస్తాడు. సీతమ్మ పనిమానేసి వెళ్ళిపోతుంది. ఒకనాడు సీతమ్మ గుడెసె దగ్గరకి వెళ్ళి కుబేరయ్య చెడుగా ప్రవర్తిస్తుంటా కుబే రయ్యను వీరేశు కోపంతో తిట్టి, కొట్టి పారిపోయేలా చేస్తాడు వీరేశ్‌లో రౌద్రరసం కానవస్తుంది. తరువాత సీతమ్మ, వీరేశు ఆ ఊరు వదిలి వెళ్ళిపోతారు ఇక్కడ కవి శృంగార, హస్యరస గేయాన్ని అల్లినాడు.

పా. పట్టమెల్లిపోదామో నాబుల్లి సీతి! మనం
మెళ్ళి చేసుకుందామో నా చిట్టి సీతి!

వెంకన్న కాలినడకన వెళ్ళే సమయంలో కొంతడబ్బు, చేరవలసిన చిరునామా దొంగలించబడి దు:ఖిస్తాడు ఇక్కడ కరుణ రసం కనబడుతుంది.

గీ. పైని ఆకాశమున కంతు కానబడదు
నిల్చుటకు నీడయును లేదు నేలమీద
రెక్కలాధారముగ ప్రచురించుచుంటి
ఆశ్రయములేని బ్రతుకయ్యెనయ్యదేవ!

వెంకన్న బాగా ఆకలితో ఉండి కారుకింద పడి ప్రాణాలు వదిలేయాలని అనుకుంటాడు. అంతలోనే వనబాల అన్న సుందరం కాకినాడ అనాథశరణాలయానికి తీసుకువస్తాడు కాలం గడిచిపోతుంది ఉపాధ్యాయుడి చేతిలో ఒక ఉత్తరం చూసి ఆశ్చర్యం అద్భుతం కలిగాయి.

ద్వి. అంతలో చీకటి, అంతలో వెలుగు
అంతలో జడివాన అంతలో యెండ
అంతలో కష్టము అంతలో సు:ఖము
కాలచక్రపుదారి గలదెల్లవింత

కష్టలు సు:ఖాలు ఒకదానివెంట ఒకటి పోతూ వుంటాయి అప్పటి పాలేరు వెంకన్న నేడు వెంకటేశ్వరరావు అనే పేరుతో బి.ఏ చదువుతున్నాడు ఇక్కడ అద్భుతరసం కానవస్తుంది. కాలచక్రం తిరుగుతుంది పాలేరు వెంకన్న డిప్యూటీ కలెక్టరుగా నియామకం ఇంత చరిత్ర రెండు గంటల్లో జరిగిపోయినట్లుగా ఒక అద్భుతం జరిగింది.

రోజులు గడస్తున్నాయి సుందరం చెల్లెలి వనబాలకు రామంతో వివాహం నిశ్చయించారు. కాని వెంకన్న, వన బాల వారు ఒకరికొకరి తెలియకుండా చిన్ననాటి స్నేహం ప్రేమగా మారింది వెంకన్న శుభలేఖ చూసి ఇలా భాధపడ తారు.

గీ. కులపుగొడ్డళ్ళతో మొత్తుకొనెడు జాతి
నిన్ను నన్నును ఒకటి కానిచ్చుటెట్లు?
పిచ్చికోర్కెల భ్రాంతిని పెంచుకొంటి
ఎరిగియుండియు ఎదకుందు

ఇక్కడ కరుణరసం కానవస్తుంది మరోపక్క రైతు వాడలో వనబాల ఇలాగే బాధపడుతూ నూతిలో దూకి ఆత్మహత్య ప్రయత్నం చేస్తే అదే ఊరికి న్యాయవిచారణ చేయడానికి వచ్చిన వెంకన్న కాపాడుతాడు.వాలిద్దరి ప్రేమ విషయంతెలిసి రామం వారిద్దరిని కలుపుతాడు.వెంకన్న తండ్రి పుల్లయ్యను స్వయంగా కుబేరయ్య వెతికించి క్షమాపణ చెబుతాడు. సీతమ్మ, వీరేశు అందరు క్రొత్త బట్టలు ధరిస్తారు. ఊరంతా మంగళతోరణాలతో అలంక రించబడింది. ఉపాధ్యాయుడు వారి కులాంతర వివాహా నికి సంతోషిస్తాడు.

గీ. కుటిల కులభేద కుడ్యాలు కూలద్రోసి
పూర్వవైభవ శిఖరాల బూజు దులుపి
తెలిసి, జాతి నిద్దుర లేచి, నిలిచి నడువ,
బాల బెండ్లాడె వెంకటేశ్వరుడు నేడు!

ఇక్కడ శాంత,హాస్యరసాలు పెండ్లిమండపంలో వెల్లువిరిసాయి. వీరేశు , సీతమ్మ మరోకసారి అదే పెండ్లి మండపంలో కూర్చుంటారు. చివరికి కథ సు:ఖాంతమవు తుంది. ఇలా గ్రామంలో ఉండే వారి సామాజిక జీవన చిత్రణ కవి కళ్ళకుకటినట్టుగా చిత్రికరించాడు. పాలేరు నాటకంలో నవరసాలతో నిండి ఉంది.

ఉపయుక్త గ్రంథం :

1. పాలేరు - బోయిభీమన్న

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

సినారె పాటలో సామాజిక జీవన చిత్రణ

– ఎమ్.ఎన్.వి.సూర్యకుమారి, తెలుగు అధ్యాపకురాలు, డి.ఆర్.గోయంకా మహిళా డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.

కవి సంఘజీవి. కావున కవికృతమైన కావ్యమునందు సంఘము ప్రతిఫలించుట సహజము. ఈ కారణము వలనె సాహిత్యము జీవితమున ఒక భాష్యము వంటిదని మేథ్యూ ఆర్నాల్ట్ పేర్కొనెను. ఇతర సాహిత్యములందు సాంఘిక జీవన పరిస్థితులు ప్రతిఫలించునట్లే ఆంధ్రసాహిత్యము నందు కూడా వివిధ కాలములలో ఆంధ్రులు ఏవిధంగా తమ జీవనాన్ని కొనసాగించారో కవుల రచనలలో తెలుస్తుంది. కదిలించే పల్లవి జీవితాన్నే కదిలిస్తుంది. తేజం ఉన్న పల్లవి నిస్తేజంగా ఉన్న జీవితాన్ని పరుగులెత్తిస్తుంది. ఉల్లాసం ఉన్న పల్లవి చరణాలలో ఉత్తేజం నింపుతుంది. పల్లవి లేకపోతే చరణాలు నడవలేవు. కొత్త కొత్త లోకాలను చూడలేవు. సినారె అనే పల్లవి వెళ్ళిపోయింది కానీ ఆయన వ్రాసిన పాట మాగాణి మానవ జీవన సంఘటనలను, సంఘర్షణలను తెలియజేస్తూ ఎప్పటికీ స్థిరస్థాయిగా మన మనస్సులోతుల్లో నిండిపోయిందనుటలో అతిశయోక్తి లేదు.

సినారె గురించి మనం మాట్లాడుకోవాలంటే ఖచ్చితంగా తెలుగు చలనచిత్ర యవనిక మీద ఎన్నో ప్రయోగాలు సృష్టించిన దాసరి నారాయణరావుగారి గురించి కూడా మనం మాట్లాడుకోవలసి ఉంటుంది. వీరి కలయికలో ఉదయించిన ఎన్నో సినీగీతాలు జనరంజకాలై నిలిచాయి. తొలి చిత్రం "తాతామనవడు"తోనే తిరుగులేని దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు దాసరి. ఈ సినిమాకి మూడు పాటలు రాసిన డా.సినారెతో ఆయనకు అనుబంధం పెరిగింది. తదనంతరకాలంలో దాసరి సారథ్యం వహించిన అధికశాతం సినిమాలకు సినారె పాటలు రాశారు.

తాతా మనవడు సినిమాలో "అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం ఆత్మతృప్తికి మనుషులు ఆడుకొనే నాటకం...వింత నాటకం" అనే రామకృష్ణ ఆలపించిన పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. "వార్ధక్యంలో ఉన్న తండ్రి కళ్ళు లేని పరిస్థితుల్లో ఉండగా ఇల్లాలు మరణిస్తుంది." విడిగా ఉంటున్న కొడుకుకు కబురు చేస్తే అతడు రాడు. ఈ నేపథ్యంలో కరుణ రస భరితంగా పాట రాయాల్సిందిగా దాసరి నారాయణ రెడ్డిని కోరారు. "అమ్మా వెళ్ళిపోయావా" అంటూ పల్లవి వినిపించారు సినారె. ఆ చిత్రానికి సంగీతం అందించిన రమేష్ నాయుడు ఇది ఎవరైనా రాస్తారు. ఇందులో మీ ప్రత్యేకత ఏముంది అని సినారెకి సవాల్ విసిరారు. దానితో సినారె "ఎవరు తల్లి..ఎవరు కొడుకు ఎందుకు ఆ తెగని ముడి.. కొన ఊపిరిలో ఎందుకు అణగారని అలజడి...అంటూ ఎవరమ్మా వినేది నీ ఆత్మ ఘోషను...ఏ తల్లీ కనకూడదు ఇలాంటి కొడుకును...కొడుకును అంటూ ముక్తాయించారు. కళావతి రాగంలో భావరమ్యంగా ఆ గీతానికి మట్లు కట్టారు రమేష్‌నాయుడు.

తొలి చరణంలో తాత్విక భావన, మలి చరణంలో వైరాగ్యం చోటు చేసుకుంది ఈ పాటలో...ఇందులోనే సుశీల పాడిన "ఈనాడే బాబూ నీ పుట్టిన రోజు...ఈ ఇంటికే కొత్త వెలుగు వచ్చిన రోజు పాటను అంజలీదేవి మీద చిత్రీకరించారు. ఈ పాటలో "చుక్కలు వేయెందుకు ఒక్క చంద్రుడే చాలు తన వంశం తెలిగించే తనయుడొకడే పదివేలు" అంటూ సారూప్యాన్ని చూపడం సినారె గొప్పతనం! అటుచూస్తే చార్మినారు ఇటు చూస్తే జామా మసీదు...ఆ వంక అసెంబ్లీ హాలు ఈ వంక జూబిలీ హాలు రిమ్‌జిమ్ రిమ్‌జిమ్ హైదరాబాద్ రిక్షావాలా జిందాబాద్ అంటూ సిటీలో షికారు చేయించి, పాయా షేర్వాల ఘుమఘుమలనీ, బన్ బిస్కట్ల బరువు రుచినీ అలవాటు చేసి, మణికట్టు మీద ఇంత అత్తరు చార వేసి

వదిలిన సినారె పాట ఆనాటి సమాజంలో కార్మిక జీవనాన్ని ఆహారపు అలవాట్లనుచ దుస్తుల గురించి, అత్తరు ప్రాముఖ్యతను గురించి అద్భుతంగా చెప్పింది.

'బలిపీఠం' చిత్రంలో పాఠశాల విద్యార్థుల ముందు నాయకా నాయికలు పాడే ఒక సంవాద యుగాళగీతానికి చక్రవర్తి సింధుభైరవి రాగంలో స్వరాలు కూర్చారు. సినారె రాసిన ఈ పాటతో "మారాలి మారాలి మనుషుల నడవడి మారాలి తరతరాలుగా మారని వాళ్ళను మీ తరమైనా మార్చాలి"...అని వర్ణాధిక్యతను ఎత్తి చూపుతూ నాయకుడు పాడుతుంటే...నాయిక "మారాలి మారాలి మనుషుల గారడి మారాలి మెప్పుల కోసం చెప్పే వాళ్ళను మీతరమైనా మార్చాలి" అంటూ అతడు చెప్పేది ఎదుటి వాళ్ళ మెప్పుకోసమేనని మాటలు విసురుతుంది. "మేలుకోక తప్పుదులే మారిపోక తప్పదులే" అనే ప్రబోధంతో ఈ పాట ముగుస్తుంది. ఈ పాట ద్వారా సినారె సమాజంలో వర్ణాధిక్యత తగ్గాలని మానవులంతా సమానమని ఆనాటి ప్రేక్షకులకు చాలా సామ్యంగా తన పాట ద్వారా చెప్పారు. సినారె పాత తరానికి కొత్తతరానికి మిగిలిన ఆఖరువారధి. ఆయన పాట, పరువు, మర్యాద బెసకకుండా జాగ్రత్తగా భుజాలపై మోసి దాని బరువు పెంచిన కవి ఆయన. పండితులకు, పామరులకు మధ్య సమన్వయ స్థాయిలో పాటను నిలబెట్టి శృంగారం, కరుణ, ఎడబాటు, నీతి బోధన, వియోగం, విషాదం ఏదైనా సరే హత్తుకొనేలా చెప్పి, వచ్చింది రెండు, మూడు నెలలు బాటసారి కాదు సుదీర్ఘయానం చేయగల పాటసారి అని నిరూపించిన పధికుడాయన. ఆయన చాలా గొప్పపాటలు రాసి ఉండవచ్చు. కొన్ని ఉత్త పాటలు రాసి ఉండవచ్చు. కొని చెత్త పాటలు మాత్రం రాయలేదన్న పేరు తెచ్చుకున్న సమర్థ కలంధారి ఆయన.

తెలుగు ప్రాంతాలన్నా తెలుగు బాష అన్నా, తెలుగు జాతి అన్నా సినారెకు ఎంతో ప్రాణం. తెలంగాణా ఉద్యమం ఉధృతంగా ఉన్నప్పుడు ఆయన ఇరువర్గాల సహ జీవనాన్ని కాంక్షిస్తూ కవిత్వం రాసారు. ఈ సంగతి విన్న ఎన్టీ రామారావు ఆ సమయంలో తాను తీస్తున్న 'తల్లాపెళ్ళామా' సినిమాలో ఒక పాటను సందర్భం లేక పోయినా పెట్టించారు. అదే "తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది." ఈ పాటను ఎన్టీఆర్ తన ఎన్నికల ప్రచార సమయంలో చైతన్యరథం మీద ఎక్కువగా వినిపించేవారు.

రెండు రాష్ట్రాలుగా తెలుగు రాష్ట్రాలు ఏర్పడినా ఇద్దరూ గ్రహించవలసిన ఉపదేశం ఈ పాటలో కనిపిస్తుంది. "వచ్చిండన్నా, వచ్చాడన్నా వరాల తెలుగు ఒకటేనన్నా... మహాభారతం పుట్టింది రాజమహేంద్ర వరంలో... భాగవతం వెలసింది ఏకశిలా నగరంలో... ఈ రెంటిలో ఏది కాదన్నా ఇన్నాళ్ళు సంస్కృతి నిండు సున్నా" అంటూ... నేటి సమాజానికి ఆ ఆనాడే హితవు పలికారు సినారె. యువతీ యువకుల ప్రేమకు కులం, మతం అడ్డుగోడలుగా నిలిస్తే కర్తవ్యం ఏమిటి అనే నేపథ్యంలో దాసరి దర్శకత్వం వహించిన "పాడవోయి భారతీయుడా" సినిమాలో సినారె ఓ గొప్ప గీతాన్ని రాసారు. అల్లరి మూకలు మారణ కాండకు పూనుకున్నప్పుడు ఒక రాయి పెళ్ళికూతురు నుదిటి మీద బలంగా తాకినప్పుడు రక్తం బొటబొటా కారుతుంది. అప్పుడు హీరో పాడే పాట "బాల భారతి నుదుట చిమ్మిన రక్తం భావిభారతి ఎదను మాయని గాయంలో మానవ రక్తానికి సంబంధించిన ప్రస్తావన చరణంలో తీసుకువస్తారు సినారె. "శిలువపైన ఏసుక్రీస్తు, చిందించిన రక్తమిది. శిలల దెబ్బలకి మహ్మదు ఒలికించిన రక్తమిది, గుండు దెబ్బతో గాంధి గుండె నుంచి చిమ్మిన రక్తమిది...చెప్పండీ ఈ రక్తం కులమేదో, చెప్పండీ ఈ రక్త మతమేదో" అంటూ ఆనాటి కులవ్యవస్థను గూర్చి ఎంతో ఆర్థంగా రాసారు సినారె.

అన్యాయానికి గురైన ఒక దళిత మహిళ ఉగ్రరూపం దాల్చి తన బతుకును తెల్లార్చిన నల్లదొరలను వేటాడి మతమార్చిన కథాంశంతో దాసరి నిర్మించిన చిత్రం

'ఒసేయ్...రాములమ్మా!' ఈ సినిమా తెలంగాణా ప్రాంత నేపథ్యంలో ఉంటుంది. తెలంగాణా అంటే సినారె జన్మస్థలి. "ఓ ముత్యాల రెమ్మ, ఓ మురిపాల కొమ్మ, ఓ పున్నమి బొమ్మ, ఓ పుత్తడి బొమ్మ" అంటూ ఒక దళితస్త్రీని వర్ణిస్తారు సినారె. ఈ సినిమాలోనే "ఏ అసురుడు సృష్టించిన పంచమతంత్రం, నరజాతిని వంచించిన దారుణకుల మంత్రం, నరకబడిన శంభూకుని శిరం సాక్షిగా...ముంతల చీపురుల మన దీనగతం సాక్షిగా...ప్రశ్నించిన ప్రతీచోటా మహా రక్తక్షేత్రం....ఆడగండోయ్...అరవండోయ్...మీ గుండెల డప్పుగొట్టి నినదిస్తూ నిలదీస్తూ అడగండోయ్ పంచముణ్ణి సృష్టించిన ఆ వంచకుడెవడని అడగండోయ్" అనే పాట సమస్త ప్రజానికాన్ని ఆలోచింప చేస్తుంది.

ముగింపు :

సినారె బంధాలకు మాటలద్దిన కవి. మరణించే నాటికి ఆయన రాయగా రికార్డు అయిన పాటలు కేవలం ఒకటీ రెండు మాత్రమే ఉన్నాయి. అయినా...ఆ కలం ఎందుకు పుట్టిందో ఆ పనిని సంపూర్తిగా నెరవేర్చగలిగింది.ఆ పల్లవి ఎక్కడ మొదలయిందో అంతకు వంద యోజనాల దూరం దాటగలిగింది. వినే చెవి ఉన్నా ప్రతి చోటుకు చేరగలిగింది. సమాజంలో వేళ్ళూనుకుని ఉన్న సాంఘిక దురాచారాలను వేలెత్తి చూపింది. కొట్టుకునే గుండె ఉన్న ప్రతీ ఒక్కరికీ ఆయన పదాల ప్రతిస్పందన అందింది. సినీ స్వర్ణయుగపు సినారె పాట ప్రజల మనస్సులో స్థిరపడి పోయింది.

ఆధారగ్రంథాలు :

1. ఆంధ్రసాహిత్యము - సాంఘిక జీవన చిత్రణము, డా॥నండూరి వేంకట సత్యనారాయణ
2. సాక్షిఫ్యామిలీ, మంగళవారం, 13-02-2017
3. తెలుగు వెలుగు జూలై 2017.

❖ ❖ ❖

పండుగలు – సామాజిక చిత్రణ

– యం. నాగమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

తరతరాలుగా ప్రజలలో నిలిచి ఉన్న ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, సంస్కృతి సంప్రదాయాలు పండుగలతోనూ ముడిపడి ఎన్నో ఉన్నాయి. ప్రకృత్యారాధనగా మొదలైన భక్తి భావం వ్యవసాయ సంస్కృతిలో స్పష్టమైన రూపాన్ని సంపాదించి, చివర ప్రాచీన ఆచారాల విధానాలతో కూడిన ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేవిగా పండుగలు ఏర్పాడ్డాయి. భారతదేశంలో ఎన్నో మతాలు, కులాలు ఉన్నాయి. వాటికి సంబంధించి పండుగలు తప్పకుండా ఉన్నాయి. కర్నూలు జిల్లాలో జానపదులు ఎక్కువగా వ్యవసాయం పైనే ఆధారపడతారు. అనేక రకాలైన పంటలను పండిస్తూ జీవిస్తూంటారు. ఆసమయంలో వివిధ ప్రాంతాల్లో వివిధ రీతులుగా వారివారి సంప్రదాయాలతో జానపదుల ఆట, పాటలతో, పూజలతో ఆనందోత్సవాలను పండుగగా చేసుకొంటారు. "ప్రతి దినం రోజువారిగా కార్యక్రమం, కష్టం ఫలించిన తర్వాత తినేతిండి కాకుండా కొద్ది మార్పుతో సంతోషంగా ఏదో ఒక కూర, పాయసంతో భార్యాపిల్లలతో సంతోషంగా తింటాము. వారానికొకసారి ఆరు దినాల కష్టాన్ని ఏడవ దినం సెలవుగా ఆ సెలవును తాగుడు, తిండియే కాకా వనభోజనాలు, దేవుని గుళ్లకు వెళ్లి ఆనందించడం జరుగుతుంది. ఏదో మంచి జరిగినా పెండ్లి అయినా సంతానం కలిగినా సంతోషాలతో పండుగగా సంబరాలను జరుపుకొంటాం." అలా జానపదులు చేసుకొనే పండుగలే ఇవి. పల్లెలో జీవిస్తున్న ప్రజలకు కేవలం వారి గ్రామానికి సంబంధించిన పండుగలు జానపదుల పండుగలు ఆంధ్రప్రదేశ్ - కార్తి సంధు, హొళగుంద - వరుణయాగం పండుగ, కోడూమూరు - కొండరాయుడు తేళ్ళపండుగ, ఏరువాక పండుగ, పెద్దల పండుగలు మొదలగు పండుగలు ఉన్నాయి. చైత్రమాసంతో పండుగలు మొదలవుతాయి. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలు పండుగ సమయాల్లోనే ఎక్కువగా కన్పిస్తుంటాయి. పండుగలను ప్రజలందరూ కలిసి చేసుకొంటారు. ఇలా కలిసి పండుగ చేసుకోవటంలో వారిలో బంధాలు బలపడుతాయి. పండుగ కూతుర్లు, కొడుకులు, కోడళ్ళు, మనుమళ్ళు, మనుమరాలు, బంధవులు ఒకచోట చేర్చుతుంది. అలాగే కొత్త బట్టలు ధరించడం, పిండివంటలు చేసుకోవడం సరదాగా సినిమాలకు వెళ్ళడం, బంధువులను పలకరించడం వారితో కబుర్లు చెప్పుకోవడంలో సంతోషాన్ని వ్యక్తపరచుకొంటారు.

వరుణయాగం :

కర్నూలు జిల్లా హొళగుంద గ్రామంలో వరుణ యాగం పండుగను చేస్తారు. గ్రామంలో కరువు కాటకాలు, వర్షాలు రాకుండ వుండే సమయంలో గ్రామ పెద్దలు అందరూ గ్రామంలో పీఠాధిపతి (దైవభక్తుడు)ని కలిసి ఒక ఒక ముహుర్తాన్ని నిర్ణయిస్తారు. ఆ ముహుర్తాను గుణంగా పీఠాధిపతి భక్తుల కంటే ముందుగా శ్రీసిద్ధ లింగేశ్వర స్వామికి కలశం నీళ్ళు పోస్తారు. నా తర్వున భక్తులు వస్తున్నారు వారి కోర్కెలు తీర్చుమని వేడుకొని పీఠాధిపతులు వెళ్ళుతారు. అప్పుడు గ్రామంలో వున్న ప్రతి ఇంటి నుంచి ఒక్కొకస్త్రీ ఒక కుండను (కడవ) తీసుకొని దానికి సున్నం పూసి, పూలు చుట్టూ, వేప మండలు కట్టి గ్రామంలో ఇరబావి (పెద్దబావి) దగ్గరికి తెల్లవారుఝామున 4:00 గంటలకు చేరుతుంది. అలా అందరు కలిసి వెళ్ళి బ్యాండ్‌మేళాలతో, భక్తి శ్రద్ధలతో శ్రీ సిద్దలింగేశ్వర స్వామి గుడిలోకి ఒకరి తరువాత ఒకరు వెళ్ళి అర్చకులకు నీళ్ళ కడవను ఇచ్చి శివునికి అభిషేకం చేస్తారు. అలా 108 మంది ఈ వరుణయాగంలో తప్పని సరిగా పాల్గొంటారు. ఈ సంఖ్యకంటే భక్తులు తగ్గకూడదు. తగ్గరు అని స్థానికుల కథనం.

శివునికి 108 అనే సంఖ్య వరుణాభిషేకాన్ని గుర్తు చేస్తుంది, 5 అనే సంఖ్య పంచాభిషేకాన్ని, 11 అనే సంఖ్య రుద్రాభిషేకాన్ని, 121 అనే సంఖ్య కుంభాభిషేకాన్ని, 108 అనే సంఖ్య కుంభోత్సవాని గుర్తు చేస్తాయి.

గ్రామంలోని ఇరబావి నీటిని ఇంటిలో శుభకార్యాలకు, గృహ ప్రవేశాలకు, పెండ్లిలకు వాడుతారు. ఈ బావి నుంచి నీటిని తెచ్చుకొని ఇంటిలో పెట్టుకొని పూజలు చేస్తారు.

ముగింపు :

వరుణయాగం చేయడం వలన గ్రామంలో వర్షాలు సమృద్ధిగా పండుతాయని జానపదుల నమ్మకం.

కొండరాయుడు తేళ్ళపండుగ :

ప్రతి సంవత్సరం శ్రావణమాసం మూడవ సోమవారం కోడుమూరులో తేళ్ళ పండుగ చేయడం ఆనావాయితీ. . 1969 సంవత్సరం వరకు దేవుడి విగ్రహం మాత్రమే కొండపైన వుండేది. కోడుమూరులోని 1970లో ఇక్కడ ఆలయం నిర్మాణం జరిగింది. అక్కడి గ్రామస్థుడైన దీని వెనుక ఒక కథ ఉంది. నల్లచోల్‌రెడ్డి ముగ్గురు ఆడపిల్లలు. నాల్గోవ సంతానంగా కుమారుడు కలిగితే దేవాలయం కట్టిస్తాను అని మ్రొక్కుకొన్నాడు. అలా మ్రొక్కిన సంవత్సరానికి అతడికి మగ సంతానం కలగడంతో 1970 లో కొండలరాయుడు స్వామికి దేవాలయం నిర్మించాడు. ఆ ఆలయానికి తానే పూజారిగా కొనసాగుతున్నాడు. శ్రావణ మాసపు మూడో సోమవారం జరిగే తేళ్ళ పండుగనాడు ఉదయాన్నే భక్తులు వేలకు పైగా కొండపైకి చేరుకొని దేవునికి అభిషేకాలతో పూజలు నిర్వహిస్తారు. తరువాత మధ్యహ్నం భక్తులు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేయిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే చివరి పూజ తరువాత భక్తులు దేవాలయ ఆవరణంలో వున్న చిన్న బండలను, పెద్దబండలను పైకితీస్తారు. వెంటనే ఆ బండల కింద ఉన్న తేళ్ళు బయటకు వస్తాయి. బండల కిందనేగాక దేవాలయ ఆవరణంలో అక్కడ అక్కడ తేళ్ళు తిరుగుతుంటాయి. వాటిని భక్తులు చేతులతో పట్టుకొని నాలుక మీద, భూజాల మీద, తలమీద, వీపులమీద, పొట్టలపైన వాటిని ఆడిస్తారు. తేళ్ళ కుట్టితే గుడి చుట్టూ మూడుసార్లు ప్రదక్షణలు చేస్తే నొప్పి పోతుంది అని స్థానిక భక్తుల కథనం. వాటిని ప్రత్యక్షంగా చూడటానికి చానుగోండ్ల, గూడూరు, వల్కూరు, గోనేగండ్ల, గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా వస్తారు. ప్రసార మాధ్యమలూ ఈ పండుగను ప్రసారాలు చేస్తాయి.

కార్తీక అమవాస్య పండుగ :

కార్తీక మాసంలో అమావాస్య తరువాత వచ్చే సోమవారం ఈ పండుగ చేసుకొంటారు. కల్యాణానికి ముందు కాళికాంబ, వీరభద్ర స్వాములవారికి నిశ్చితార్థ వేడుకను ఒక పండుగలా కైరుప్పల గ్రామస్థులు చేస్తారు. స్వామివారి వర్గీయులు వారు అమ్మవారి వర్గీయులు అనే తేడా లేకుండా అందరు కలిసి మెలసి అందరి సమక్షంలో నిశ్చితార్థపు పండుగ చేసుకొంటారు. ప్రతి సంవత్సరం వేడుకలు చేసుకొంటారు. ఈ పండుగకు ఇంటి ఆడపడుచులు వచ్చి భక్ష్యాలు చేయడం, ఒడి బియ్యంపోసుకొని గాజులు తొడిగించుకోవడం వంటవి సంప్రదాయంగా జరుగుతాయి. ఈ కార్యక్రమమాలు అన్ని దేవాలయాలలోనూ జరుగుతాయి. సాయంత్రం ఆటల పోటీలు వుంటాయి. ఈ వేడుకలు కార్తీక మాసంలో చేసుకుంటారు.

హులి లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పండుగ:

కర్ణాటక సరిహద్దులోని పెద్దహులి గ్రామంలో శ్రీ గురు సిద్ధలింగేశ్వర స్వామి వారి ఆశీర్వాదంతో శ్రీ హులి లింగేశ్వర, శ్రీ కారుమంచేశ్వర స్వాముల వారు వెలిశారు. ఈ దేవాలయం శ్రీకృష్ణదేవారాయల కాలం నాటిదిగా చెప్పుకొంటారు. లింగేశ్వర స్వామి వెలిసిన తరువాతనే ఈ గ్రామానికి ఆ పేరు ఏర్పడిందని స్థానికుల కథనం. పూర్వం నుంచి కురవలు గొర్రెలను కాస్తుండేవారు. అక్కడ ఒక జమ్మిచెట్టు దగ్గర ప్రతి రోజు గొర్రెల కాపరులు కాపు కాస్తుండగా ఆ చెట్టు పాదలో నుంచి ఒక పులి కాపరులకు కన్పించి మాయం అయ్యేది అలా కొన్ని సార్లుకన్పించి

మాయమవ్వడంతో ఆ స్థలాన్ని దైవంగా భావించుకొని దేవాలయాన్ని నిర్మించారు. కన్నడలో 'హులి' అనే పదం పులి అని అర్థం. అందువలన ఈ స్వామి పేరు మీదనే చిన్న హులి, పెద్దహులి గ్రామాలు ఏర్పడ్డాయి.

ఉత్సవ కార్యక్రమాలు :

హులి లింగేశ్వర స్వామి ఉత్సవాలు మూడు రోజులు జరుగుతాయి.

మొదటి రోజు :

ప్రతి సంవత్సరం కార్తీక మాసం పాడ్యమి రోజున స్వాముల వారికి ఉదయం అలంకరణ, సాయంకాలం మంచా పూజ చేస్తారు. అంటే స్వాముల వారిని ఆహ్వానించడం. చింతలకుంట నుంచి ఈ స్వాముల వారి గురువైన సిద్ధలింగేశ్వర స్వామి వచ్చిన తరువాత ఈ గ్రామంలోని గ్రామపెద్ద కారుమంచప్ప అనే భక్తుని ఇంటి దగ్గర బీరప్పడోలు, గొరవయ్యల నృత్యాలు చేస్తారు.

రెండవ రోజు :

ఉదయం తెల్లవారుఝామున మూడు గంటలకు శ్రీ త్రీమూర్తుల వారిని గంగ పూజకు బయలు దేరుతారు. అక్కడ శ్రీ గురు సిద్ధలింగేశ్వడికికి కారు మంచేశ్వరునికి, శ్రీ ఎల్లమ్మ దేవికి చెరువు దగ్గర గంగ పూజాలు చేస్తారు. సాయంత్రం గొరవయ్యల ఆటలు జరుగును.

మూడవ రోజు :

ఉదయం కోలాటం, డోలు నృత్యాలు వేస్తారు. మధ్యహ్నం మూడు గంటలకు ఆ సమయంలో పూజారుల ఇంటిలో గ్రామ పెద్దలందరికి అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి వంటలో కొద్దిగా బండారు (పసుపు, కుంకుమలు) కొద్దిగా కలిపి, కొబ్బరి కాయలు కొట్టిన తరువాత భోజనాలు చేస్తారు. తరువాత గొరవయ్య నృత్యాలు చేస్తారు. సాయంత్రం భక్తులకు, ప్రసాదం ఇస్తారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గంటేడ గౌరునాయుడు కథలు – సామాజిక జీవన చిత్రణ

– ఎం. రమాగీతాదేవి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చీపురుపల్లి, విజయనగరం జిల్లా.

సమాజ చిత్రణ అన్నది మానవ జీవన చిత్రణకు మరోపేరు. వ్యక్తిపరంగా కావచ్చు, మొత్తం వ్యవస్థపరంగా కావచ్చు. రచయిత ఎన్నుకొన్న వస్తువు ఒక కాలానికిగానీ, సమస్యకుకానీ... మొదలగు వాటికి పరిమితమైనప్పటికీ పూర్తి సామాజిక స్పృహ ఉంటేనే ఆ రచన చక్కగా రాణిస్తుంది. సామాజిక స్థితిగతుల అవగాహన, ఆస్థితికి మూలకారణాల పట్ల మొత్తం పరిజ్ఞానం ఉన్న రచన పాఠకుడి అనుభూతిని పెంచుతుంది. ఆలోచింపచేస్తుంది. ఆచరింప చేస్తుంది.

సామాజిక చిత్రణ ఆ సమాజంలో సంస్కృతి సంప్ర దాయాలు, కుటుంబం, వృత్తి ఉద్యోగాదులు, రాజకీయ ప్రభావాలు, ఆర్థిక సంబంధాలు, ఆచారాలు, నమ్మకాలు, కట్టుబాట్లు... వీటన్నింటిని వ్యక్తి, కుటుంబ పరంగా సమాజపరంగా అభ్యున్నతి సాధించి పురోగమన దిశగా పయనింపచేయడం వంటి మొదలగు అంశాలన్నీ చిత్రిం చడం. సామాజిక స్పృహతోపాటూ సమాజంపట్ల బాధ్యత ఉన్న రచయిత (కవి) వాస్తవాన్ని విస్మరించి వక్రభాష్యం చేయడు. తనచుట్టూ ఉన్న సమాజంలోనున్న వారిని గమనించి వారి సమస్యలను అర్థం చేసుకుని చిత్తశుద్ధి, నిబద్ధతతో కథా రచన చేసిన మంచి కవి, గాయకుడు, చిత్రకారుడు గంటేడ గౌరునాయుడు.

గంటేడ గౌరునాయుడు వర్తమాన ఉత్తరాంధ్ర ప్రసిద్ధ కథకుల్లో ఒకరు. మనుషులందరూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో మెలిగే సమాజమనే సమిష్టి వాదంలోంచి, సామాజిక గతితార్కిక చరిత్రలోంచి... ఆశగా ఆసక్తి అధ్యయనం చేస్తాడు.... (అట్టాడ అప్పల్నాయుడు, నాగలి జాడ)

గౌరునాయుడు కథలు గురించి చెప్పాలంటే... 'చలికాలపు నెగడులాగా, చైత్రమాసపు తెంపెరలాగ, కందమూలఫలంలాగ, ఇప్పకల్లు దొన్నెలాగుంటది. మన మధ్యనున్న కొండదేశపు బొట్టెడు చింత చెట్టెక్కి దులుపు తుంటే జలజలా రాలిన పండువానలో సాగిన ఫల సేకరణలా ఉంటుంది. (వాడ్రేవు చినవీరభద్రుడు)

గౌరునాయుడు తన పుట్టిపెరిగిన ప్రాంతాన్ని, అక్కడ జీవితాలను కవితా హృదయంతో, చిత్రకారుడులా చిత్రించాడు. పల్లె, పంటపొలాలు,వాగులు, వంకలు, ప్రకృతిలో దగ్గరగా ఉండే రైతు జీవితం, శ్రమైక జీవన సౌందర్యాన్ని దర్శించి, అనుభవించి, గౌరవించినవాడు గౌరునాయుడు.

గౌరునాయుడు దృష్టిలో సమాజం అంటే ఆత్మీయ మానవహారం. అందులో కుటుంబం ఆనందాల పొద రిల్లు. ఆ పొదరిల్లు చెదిరితే... అన్ని సంబంధాలు ఆర్థిక సంబంధాలు అవుతున్న నేటి యాంత్రిక ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమగుట 'సెగ' కథలో చూడవచ్చు. బంగారునాయుడు, రమణమ్మ తన మనవడి ముద్దు ముచ్చట్లతో ఆనందంగా ఉంటారు. ఉమ్మడి కుటుం బంలో ఇమడలేని కోడలు రాజులు వేరే కాపురానికి సిద్ధమవ్వడం, తల్లిదండ్రులను వదిలి వెళ్ళడం ఏ మాత్రం ఇష్టం లేకపోయినా, భార్యకు ఎదురు చెప్పలేని బల హీనత, అశక్తత ఈ కథలో రచయిత చక్కగా చిత్రీకరిం చారు. పండిద్దామంటే నూతిలో నీరులేకపోవడం, దానికి కారణం మోతుబర్లు మోటార్లతో నీరుతోడడం, బావి ఎండిపోయి, వ్యవసాయం చితికిపోవడం, కుటుంబం చితికి విచ్ఛిన్నమైన పరిస్థితివస్తుంది. ఈ పరిస్థితులకు తట్టుకోలేక బంగారునాయుడుకి పక్షవాతంతో కాలు, చెయ్యితోపాటు నోరు పడిపోతాయి. కొడుకూ, కోడలూ వచ్చి ఒక్కరోజుండి వెళ్ళిపోతారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రిని ఆదరించాల్సిన కొడుకు భార్య మాటలు

విని వెళ్ళిపోవడాన్ని ''ఇంటికి ఎల్తురిచ్చిన దివ్వైనా ఆడదాయె, ఇల్లు తగలేసిన మంటైనా ఆడదాయే....'' అని, రాజులు, రమణమ్మలనుద్దేశించి రచయిత అంటాడు. ఊరిలో నుంటే తన పరిస్థితులు మెరుగవని ఉన్న ఎకరా అమ్మించేసి తన భర్త ఉద్యోగానికి కట్టి వేరుకాపురానికి వెళ్ళిపోయి, అత్తమామలను, పెళ్ళికెదిగిన ఆడబిడ్డను వదిలించుకుని తమ స్వార్థం చూసుకున్న అరుణ ఇంటిని విడగొట్టుతుంది.

బంగార్నాయుడు తన కూతురు అరుణ తలమీద రెండక్షింతలు పడిపోతే నేను కన్నుమూసిద్దును కదా అని కన్నీరు కార్చగా అప్పుడు రమణమ్మ... ఏమీ బాధ పడతున్నట్లు కన్పించదు. సరికదా నిబ్బరంగా, నిజాయితీగా ఉండాలి అని కూతురికి చెబుతుంది. మొగోడు మూడుసార్లు పుట్టాడా? కష్టపడటానికి, ఆడేటి, మొగేటి నానే పెంచుతాను, నా కూతుర్ని నా మొగుడ్నీనూ అంటుంది. బాగా బతికి చితికిపోయినా ఆత్మాభిమానాన్ని, కుటుంబ విలువలు కాపాడీ, ఇంటికి వెలుతురునిచ్చే పురోగమించే విధంగా రమణమ్మ పాత్రను చిత్రీకరించారు రచయిత.

ఉన్నోడు, లేనోడు అనే వర్గ వ్యత్యాసం గల ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థ. ఈ వ్యవస్థలో ఉత్పత్తి చేసిన వ్యక్తులకు ఆ ఉత్పత్తి ఫలాలు దక్కపోవడం. ఇది అన్ని రంగాలకూ... వ్యవసాయం రంగం కావచ్చు, పారిశ్రామిక రంగం కావచ్చు, కరోనా నేపథ్యంలో మనం ఈ మధ్య చూసిన వలస కూలీల వెతలు దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పవచ్చు. 'వలస పక్షి' కథలో పెళ్ళాం పిల్లల్ని పోషించుకోవడానికి ఊరిలోనున్న మడిసెక్కల్ని, మిగుల్చుకోవడానికి వలసవెళ్ళి చివరకు తన గూడుతోపాటు పెళ్ళాం పిల్లల్ని పోగట్టుకోవడం జరుగుతుంది.

రెక్కాడితేకాని డొక్కాడని బడుగుల బతుకులు, షావుకారు దౌర్జన్యాలు, జాలిలేని గుండెలు, శ్రమ దోపిడి ''అవతలి ఒడ్డు కథ''లో కనిపిస్తాయి. ఇందులో సోములు ఓడ నడిపేటప్పుడు... నాయుడు బావమరిది దిగుతూ పైసలివ్వకుండా చిల్లర లేదురా తరువాత ఇస్తాన్లే అని వెళ్ళిపోతాడు. ''కల్లికోట కూరాకులోలునయం ఎందుకంటే ఓడెక్కితే సొత్తుదుంపలో, జొన్నపొట్టులో, తోటకూరో, జనపనారో, ఏదో ఒకటి ఇస్తారు. పరకో పావలో చేతిలో పెడతారు.... అనే అక్కను వెళ్ళగక్కుతాడు. ఉన్న వాళ్ళుకంటే, పనిపాటా చేసుకునే శ్రామికులే నయం. కష్టాన్ని గుర్తిస్తారు. ''సావుకారమ్మ సోములు మనవడిని, బడ్డానోడి సీనుగాడిని పిలిచి వర్రబూర్లు ఇస్తానని పని చేయించుకుని చివరకు ఇంత బెల్లం రాసి పంపిస్తుంది.'' ఎంత శ్రమ దోపిడి గురి అయినా షావుకారు తన ఓడ వెదురు బొద్దులు తీసి ముక్కలు ముక్కలుగా చేసినా, అతడి కూతుర్ని ఏరుదాటించి రక్షించాలనే తపన సోముల్లో కన్పిస్తుంది.

తవిటినాయుడు వంటి సంపన్నులవల్ల అచ్చియ్య వంటి దళితులు వెట్టిచాకిరికి గురవడం, వర్గవర్ణ వ్యత్యాసం, చదువుకొనలేనితనంతో, పాలేరుతనంతో మనవడి కోరిక తీర్చడానికి, నాణెం కోసం పాము పుట్టలో చేయిపెట్టడం, చివరకు పాలేరుతనం కొడుకుకి అప్పజెప్పాల్సిన స్థితిలో ''కష్టపడి బతుకుదామంటే దరిద్రం, పరిస్థితులు తనచేత వెట్టిచాకిరి చేయిస్తున్నాయి అని అచ్చయ్య బాధపడడం ''నాణెం క్రింద చీమ'' కథలో హృద్యంగా చిత్రీకరించారు.

గౌరునాయుడు సమాజంలో అన్ని వర్గాలవారిని అందునా గ్రామీణ సమాజాన్ని దగ్గరగా చూడడం వల్ల ఆయన కథల్లో గ్రామీణులు సజీవంగా కన్పిస్తారు. అయితే పైరు దగ్గరగా పెరిగిన రైతులు, వివిధ వృత్తులవారు వారివారి పనులను కోల్పోడం, పట్టణాలకు వలస వెళ్ళిపోవడం, వ్యవసాయ పనులు తగ్గి, పల్లె వినోద కార్యక్రమాలు వెనుకబడి,టి.వీలు, సినిమాల మోజులోపడి, సౌకార్యాలకు అలవాటు పడి, గ్రామీణ జీవనసంస్కృతికి దూరం కావడం... రంగు రంగుల చీకట్లోకి కథలో కన్పిస్తుంది. ఇందులో బూతు సాహిత్య ప్రభావం యువతను పెడదోవపట్టిస్తున్న సంగటి చక్కగా చెప్పారు. ''ఏం

మిగిలింది'' కథలో జముకు వాయిస్తూ పాటలు పాడే గాయకుడు ఊరి విడిచి వెళ్ళాల్సి రావడం, తిరిగి వచ్చాక,తనపాటలే రేడియోలో, టివీల్లో వినిపించడం. తన పాటల్నే వేరొకరు వాడుకున్న విషయం ''పాటల్ని కన్నతండ్రులు యిదుల్లంట అడుక్కుతిరుగుతుంటే పాటల్ని ఎత్తుకెల్లినోళ్ళు కారులోన వూరేగుతుండ్రు'' ఊరేగితే ఊరేగనే కాని... పల్లెపదాల్తోటి పేరు డబ్బు గడించినోలు ఆ పేద పల్లెటూరి కళాకారులకి ఎంతోకొంత ఉపాధి పెట్టొచ్చుగా అన్న మాటల్లో గౌరునాయుడు ఆవేదన కన్పిస్తుంది.

మూఢనమ్మకాలు, పండుగలు మొదలగు అంశాలను కూడా తమ కథల్లో చక్కగా చిత్రీకరించారు గౌరు నాయుడు. సెగ కథలో నూతిలో నీళ్ళు ఎండిపోవడానికి కారణం వాస్తు బాగోలేక అనుకోవడం, ఇల్లు మార్పులు, చేర్పుల కోసం ధనం ఖర్చుచేసి బంగారునాయుడు ఆర్థికంగా చితికిపోవడం జరుగుతుంది. కొడుకు, కోడలు వేరే కాపురంపెట్టి పదిరోజులయినా చూడ్డానిక రాకపోయే సరికి 'సీతమ్మ పేరంటానికి' కోపం వచ్చింది దీపం పెట్టలా అన్న రమణమ్మ గ్రామదేవతల పట్ల నమ్మకం కన్పిస్తుంది.

నాణెం క్రింద చీమ' కథలో తన మనవడు పాము కాటుకి గురవ్వడంతో మంత్రం వేయించడానికి అచ్చయ్య మంత్రగాణ్ణి ఆశ్రయిస్తాడు. నాగేంద్రునికి పాలు, గుడ్డు, నాగుల గావంచ చూపించడం అనే ఆచారం కన్పిస్తుంది.

ఆసరసాల కథలో కొత్త అమావాస్య, నందన్న పండ లగు చేయడం, మహలక్ష్మమ్మ పాటపాడే సోములమ్మోరు, ఆరుచెక్కా పసుపు కుంకుమలు, దక్షిణాలతో సాగ నంపటం చూస్తే గ్రామాలలో పాటగాళ్ళు, ఆటగాళ్ళను గౌరవించే రోజులు వున్నాయని భావించవచ్చు.

నర్సరీ రైమ్స్‌కి అలవాటుపడిన తన మనవలకు తెలుగుపాటలు నేర్పించాలని లక్ష్మమ్మ ప్రయత్నించగా నాగలీ నీకిదే జోహారు... మా భాగ్యదేవతా జోహారు... అంటూ పాడగా మనవడు తెలుగుపాటకు నోరుతిరగక పోయినా మెల్లమెల్లగా నాన్నమ్మతో గొంతు కలుపుతాడు.

ఆర్తి కథలో అడవిలో ఉద్యమాల పేరిట ఆగుతున్న ఊపిరిలు, జనారణ్యంలోనున్న జంతువుల గురించి, కొండ ప్రాంతాల్లో అభివృద్ధి పేరిట జరుగుతున్న నయ వంచనలు, బిడ్డల్ని ఉద్యమాల్లో కోల్పోయిన ముసలి తండ్రి గురించి, అధికార వ్యామోహంతో పేదవాళ్ళు బడు గుల మీద అత్యాచారాలను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరిం చారు గౌరునాయుడు.

నీడనివ్వని పందిరి కథలో తండ్రి వ్యసనం బిడ్డని (రాజులు) పచ్చని పెళ్ళి పందిరిలోకి వెళ్ళకుండా పోగాకు పనికి వెళ్ళి పాడి కెక్కడం, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని ఆడపిల్లని అనుభవించాలనుకునే షావుకార్లు, పనిచేసే కార్మికులకు రక్షణ లేకపోవడం.... వంటి అంశాలు సమాజంలో పేదవారి స్థితిగతులు ఎలా ఉన్నాయో అవ గతం అయ్యే రీతిలో పాఠకులకు అందించడంతో రచ యిత ఆశయం నెరవేరిందనే చెప్పవచ్చు.

తమ ప్రాంతంలో భూములు కోల్పోవడం, వృత్తులు కోల్పోవడం, పల్లెలకు పల్లెలు కబళించడం వెనకున్న కుట్రలు, గ్రామీణ పేదరికం, రైతు కూలీగ మారడం, పల్లె పట్టణాల్లో మనిషి బతుకును చిదిమేసే పెను విధ్వంసానికి పాల్పడున్న మార్కెట్ శక్తుల గురించి, మన కళ్ళకు కట్టినట్లు వర్ణించి తన కళ్ళముందు కనిపించిన జీవన విధ్వంసాన్ని తాను చూసిన సమాజాన్ని కళాత్మకంగా కథలుగా చిత్రీకరించారు గంటేడ గౌరునాయుడు.

''సమాజంలో జరుగుతున్న దోపిడీని వివరించడం ద్వారా మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ సమసమాజ స్థాపనకై పాఠకుల్ని చైతన్యవంతులను చేస్తాయి గౌరునాయుడు కథలు'' అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. గంటేడ గౌరునాయుడు కథలు
2. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి
3. నాగలి జాడ... గంటేడ గౌరునాయుడు సాహిత్య పరామర్శ

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వందేళ్ల కథకు వందనాలు కథల్లో సామాజిక జీవిత చిత్రణం

– మళ్ళి పెంచల ప్రసాద్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సమాజానికి సాహిత్యానికి బింబప్రతిబింబ భావాలుం డుట సహజం. తన చుట్టూ ఉన్న సమాజంలోని ప్రజలు, వాళ్ళ జీవన విధివిధానాలు, ఆచారవ్యవహారాలు, అల వాట్లు, కట్టుబాట్లు, పండగలు, పబ్బాలు, ఆలోచనలు వంటి అంశాలన్నింటిని కథకులు తమ రచనల్లో వివిధ కోణాల్లో ప్రతిఫలింపజేస్తుంటారు. రచయిత ఏ కాలానికి చెందిన వాడైనా, ఏ ప్రాంతానికి చెందిన వాడైనా అతని రచనల్ని పరిశీలించి చూస్తే సమకాలీన సమాజ ముద్ర అనేది సుస్పష్టంగానో, స్పష్టాస్పష్టంగానో కనిపించి తీరు తుంది. సమాజ ముద్ర కథకుడి మీద అతని రచనల మీద ఉన్నట్లే, రచయిత ప్రభావంకూడా ఎంతో కొంత సమాజంపై ప్రసరిస్తుంది. సమర్థుడైన రచయిత అయితే పాఠకుని ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చి సమాజాన్ని సరిదిద్దుతుంటాడు కూడాను. ఉదాహరణకు చూసినట్లైతే 19వ శతాబ్ది ప్రారంభం వరకు నాటి సమాజంలో సతీ సహగమనం, బాల్యవివాహాలు, కన్యాశుల్కం, వేశ్యావృత్తి వంటి అనేక సాంఘిక దురాచారాలు వల్ల సమాజంలో శాంతి కొరవడింది. వితంతు పునర్వివాహాలు, కులాంతర, మతాంతర వివాహాలు, స్త్రీ విద్య వంటి అంశాలను నాటి సమాజం మహాపాపంగా భావించేది. కానీ ఇవాళ్టి పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉంది.ఇందుకు కారణం ప్రజల ఆలోచనల్లో మార్పురావడమే. ఈ మార్పుకు కారణం ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలే కాదు కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ, శ్రీపాద, కాళీపట్నం రామారావు వంటి సమర్థులైన రచయితలు వెలువరిచిన సాహిత్యం కూడాను.

ఇక కథానిక విషయానికొస్తే ఈ భాద్యత కథకునిపై మరింత ఎక్కువగా కనిపిస్తుంది. అందుకు కారణం కథానికకు ముడి సరుకు చుట్టూ ఉన్న సమాజంలోని సభ్యులు, వారి జీవన విధానాలు. మిగిలిన సాహితీ ప్రక్రియలైన కవిత్వం, నాటకాలలో కొంత ఊహాజనితా లకు అవకాశం ఉండొచ్చు. కానీ కథానికలో ఇందుకు అస్కారం లేదు. ఏ కథైనా పాఠకునికి హృదయానికి ఎంత వాస్తవంగా అనిపించగలిగితే అంత గొప్ప విజయాన్ని సాధిస్తుంది. ఇందుకు కథకుని నేర్పరితనం, సామాజిక పరిశీలనా దృష్ట ఇతోధికంగా తోర్పడుతాయి.

తెలుగు సాహిత్యంలో కథ పుట్టి వందేళ్లు దాటింది. నిన్న మొన్నటి వరకు తొలి తెలుగు కథానికగా గురజాడ దిద్దుబాటును పేర్కొంటూ వచ్చారు. అయితే 2015లో తానా ప్రచురణల వారు ప్రచురించిన 'దిద్దుబాటులు' (దిద్దుబాటుకు ముందు కథానికలు 92) కథాసంకలనం రాకతో బండారు అచ్చిమాంబ రాసిన స్త్రీవిద్యయే తొలి తెలుగు కథానికి అని తేటతెల్లమైనది. ఏది ఏమైనప్పటికీ తెలుగు కథ పుట్టి వందేళ్లు దాటింది అన్నది అక్షర సత్యం. ఈ వందేళ్ల కథా సాహిత్యంలో గురజాడ,శ్రీపాద, కొడవటిగంటి కుటుంబరావు, పాలగుమ్మి పద్మరాజు, కాళీపట్నం రామారావు వంటి కథకులెందరో పుంఖాను పుంఖాలుగా కథలురాసి తెలుగు సాహితీ సౌరభాలను విశ్వవ్యాప్తం చేశారు. ఇలా వందేళ్ల కథా సాహిత్యంలో వచ్చిన 116 ఉత్తమ కథల సంకలనంగా గొల్లపూడి మారుతీరావుగారి సంపాదకత్వంలో 'వందేళ్ల కథకు వంద నాలు' కథాసంకలనం వెలువడింది. నిజానికి ఇది 116 ఉత్తమ కథల సంకలనం కాదు. 116 మంది తెలుగు కథకుల కథావైభవం అని చెప్పడం సమంజసం. ప్రస్తుతం ఇదే నా పరిశోధనాంశం.కావున నేను 'వందేళ్ల కథకు వంద నాలు సామాజిక జీవిత చిత్రణం' అనే అంశాన్ని వివరిస్తు న్నాను.

వందేళ్ల కథకు వందనాలు కథల్లో సామాజిక జీవిత చిత్రణం :

వందేళ్ల కథకు వందనాలు కథా సంకలనంలో తొలికథ గురజాడ అప్పారావు రాసిన దిద్దుబాటు. ఈ కథలో కథావస్తువు ఎన్నికలోనూ, శిల్పంలోను ఎంతో నేర్పును ప్రదర్శించిన గురజాడ ప్రథమాంధ్ర కథానిక రచయితగా పేరొందాడు. నాటి సమకాలీన సమాజంలో జఠిల సమస్యగా పరిణమిస్తున్న వేశ్యావృత్తిని కథా వస్తువుగా తీసుకొని ఈ కథను చిత్రించాడు. దిద్దుబాటు కథానికలో ప్రధాన పాత్రలు గోపాల్రావు, కమలినిలు. గ్రోపాల్రావు యాంటీనాచ్(సానివృత్తి నిర్మూలనా సంఘం)లో సభ్యుడు. సంఘ సంస్కర్త. సానివృత్తి నిర్మూలనకై పోరాడుతూ ఒక సానిదాని పాటకు, మాటకు ఆకర్షితుడైనాడు. ఈ విషయం కొందరు స్నేహితురాండ్ల ద్వారా తెలుసుకున్న విద్యావంతురాలైన భార్య కమలిని భర్త గోపాల్రావును, కుటుంబాన్ని ఎలా చక్కదిద్దుకుంది అని తెలియ జేయడమే ఇందులోని ఇతివృత్తం. ఈ కథ ప్రారంభంలోనే కథకుడు ఆనాటి సమాజంలో ప్రభలంగా ఉన్న వేశ్యా వృత్తిని ప్రస్తావించాడు. డబ్బున్న, చదువుకున్న పురుషులు వేశ్యాలోలులై జీవించేవారని, వేశ్యావృత్తి నిర్మూలనకు యాంటీనాచ్ అనే సంఘ సంస్కరణ సంస్థ ఉండేదని ఈ కథ ద్వారా తెలుస్తుంది. భర్త గోపాల్రావును మార్చు కోవడానికి విద్యావంతురాలైన భార్య కమలిని చూపిన చొరవను బట్టి స్త్రీ విద్యా ఆవశ్యకతను కూడా గురజాడ ఈ కథలో ప్రస్తావించాడు.

ఇక నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రజల జీవన విధానాన్ని వారు ఎదుర్కొంటున్న సంఘర్షణలను, సామాన్యుల త్యాగాలను వాస్తవికంగా కళ్ళకు కట్టినట్లు ప్రజల ముందు ఆవిష్కరించిన కథ పి.వి. నరసింహారావు గారు రాసిన గొల్ల రామవ్వ కథ. ఈ కథ ఆధారంగా నాటి తెలంగాణా ప్రజల సామాజిక జీవితం, రజాకర్లు, పోలీసులు, తురకలు సామాన్యులపై చేసిన అకృత్యాలు తెలిసివస్తాయి. ఈ కథలో ప్రధాన పాత్ర గొల్లరామవ్వ. 70యేళ్ళ వృద్ధురాలు. నిష్కారణంగా అమాయకులను కాల్చి చంపిన నలుగురు పోలీసులను కాల్చి చంపాలని ప్రయత్నిస్తాడు ఒక యువ కుడు. అందులో ఇద్దరిని కాల్చి చంపి తప్పించుకువచ్చిన యువకుడిని చేరదీస్తుంది గొల్లరామవ్వ. అతని గాయాలకు మందు రాసి కోలుకునేందుకు సాయపడు తుంది. అతని చేతిలోని తుపాకిని చూసి భయపడుతుంది. ఇద్దరు పోలీసులను కాల్చి చంపాడని తెలిసి ఆనంద పడుతుంది. ఇంకో ఇద్దరు మిగిలిపోయారు కదా నాయనా అని సందేహాన్ని వెల్లబుచ్చుతుంది. ఆ యువకుడి కోసం తన ఇంటిని చుట్టుముట్టిన పోలీసులను ముందుగానే పసిగట్టి అతనికి గొల్లవేషం వేయించి తన మనమరాలి భర్త అని చెప్పి కాపాడుతుంది. అతడు నువ్వు సాక్షాత్తు భారతమాతవే అవ్వ అని పొగిడితే ఆనందపడుతుంది. చివరికి అతడిని అక్కడినుండి పంపివేస్తుంది. ఇది గొల్లరామవ్వ కథలో ఇతివృత్తం.

ఈ కథలో ఆధ్యంతం ఆనాటి తెలంగాణా ప్రజల సామాజిక జీవితం ప్రతిబింబిస్తుంది. ఒక యువకుడు తన గుడిసెలో ప్రవేశించినప్పుడు అతడు పోలీసో, రజాకరో, తురకనో అని రామవ్వ ఆందోలన చెందుతుంది. తనకు చావు, మనువరాలికి మానభంగం తప్పవని బాధ పడుతుంది. మా ఊరి పెద్దకరణం కూతురిని మనభంగం చేసి చంపిన చూట్టూ ఉన్నవారెవ్వరూ పట్టించుకోలేదని మనసులో గుర్తుచేసుకుంటుంది. తన ప్రాణం పోయిన మనమరాలిన మానభంగం నుండి కాపాడాలని నిశ్చ యించుకుంటుంది. ఈ మాటలను బట్టీ నాటి సమాజంలో రజాకర్లు, పోలీసులు, తురకలు చేసే అకృత్యాలు తేటతెల్లమౌతాయి. ఇక పోలీసులను కాల్చి చంపిన యువకుడి తెగువను చూస్తే తన ప్రాణాలు పోయినా సమాజం చైతన్యవంతం కావాలని నాలాంటి వారు మరెందరో పోరాటం చేసి ఈ దుష్ట పాలన నుండి ప్రజలను విముక్తులను చేయాలనే తెగువ కనిపిస్తుంది. అంతేకాదు నాటి సమాజంలో ఉద్యమాలలో పాల్గొనే వారు పోలీసులనుండి తప్పించుకునేందుకు గొల్లవేషా లను ధరించేవారని తెలుస్తుంది.

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

కుప్పిలి పద్మ 'యిన్ స్టెంట్ లైఫ్' కథలో సామాజిక జీవితాన్ని ఎంతో సహజసిద్ధంగా చిత్రించింది. నేడు సమాజంలో మానవుడు ప్రపంచీకరణ ప్రభావానికి లోనై సామాజిక బాధ్యతల్ని, సంక్షేమాన్ని విస్మరించి కేవలం లాభార్జనే ధ్యేయంగా జీవిస్తున్నారని, కుటుంబ, మానవ, ప్రేమ సంబంధాలు సైతం ప్రపంచీకరణ ప్రభావానికి గురై విచ్ఛిన్నమైపోతున్నా పట్టించుకోకుండా యాంత్రిక జీవితం సాగిస్తున్నారని రచయిత్రి ఈ కథ ద్వారా వివ రిస్తుంది.

యిన్‌స్టెంట్ లైఫ్ కథ రోజ్ వుడ్ పెయింట్ వేసిన 2×2 నలుచదరపు టేబుల్‌కి అటో కుర్చీ ఇటో కుర్చీ. టమోటో, చిల్లీ సాస్, వెనిగర్ సాల్ట్ పెప్పర్‌లు, పింగాసీ ట్రేలో ఉంచిన పిజ్జాలు, ప్లాస్టిక్ గ్లాస్‌లలోని థమ్స్‌ప్, కోక్, స్ప్రయిట్ చల్లదనాలు అంటూ ప్రారంభమౌతుంది. మనిషి ఒకప్పటి తన ఆహారపు అలవాట్లను పూర్తిగా విడనాడి పిజ్జాలు, బర్గర్‌లు, ఐస్‌క్రీమ్‌లు వంటి పాశ్చాత్య సంస్కృతులకు ఎలా అలవాటు పడుతున్నాడో తెలియ జేస్తుంది దీనిని బట్టీ నేటి సమాజంలో మనిషి ఆహారపు అలవాట్లు, సంస్కృతి సంప్రదాయాలు అర్థమౌతాయి. ఇక కథలోకి తొంగిచూస్తే మనీరా సందీప్‌లు ఐదేళ్ళుగా ప్రేమించుకుంటుంటారు. ఇద్దరూ జీవితంలో స్థిరపడిన తరువాత వివాహం చేసుకోవాలి నిశ్చయించుకుంటారు. మునీర తల్లి ఆదర్శభావాలు కలిగిన ఇల్లాలు,జీవితం అనేది కొన్ని విలువలకు కట్టుబడి జీవించాలి అని నమ్మిన స్త్రీ. తండ్రి డబ్బు ఉంటేనే సమాజం గుర్తిస్తుంది, గౌరవిస్తుంది అని భావించే వ్యక్తి. వీరిరువురి ఆలోచనలు వేరు వేరు కావడంతో ఎప్పుడు గొడవలు పడుతుండే వారు. మునీరా తల్లి ఆదర్శ భావాలను పునికిపుచ్చు కుందది. ఒకరోజు సందీప్ మునీరకు కలిసి తాను అమెరికా వెళ్తునానని, అక్కడే సెటిలై తన ఫీల్డ్‌లోనే పనిచేసే అమ్మాయిని చూసి వివాహం చేసుకుంటానని చెబుతాడు. ఈ మాటలు విన్న మునీర మొదట బాధపడు తుంది. ఈ నిర్ణయానికి గల కారణం ఏమిటని ప్రశ్నిస్తుంది. సందీప్ చెప్పిన సమాధానం విని ఆశ్చర్య పోతుంది. మన ఐదేళ్ల ప్రేమను 14 గంటల నర్సనాల్టి డెవలప్‌మెంట్ క్లాసులు ఫలితంగా మర్చిపోయాడు అని తెలుసుకొని బాధపడుతుంది. తన తండ్రి డబ్బు, అధి కారానికి అలవాటుపడటానికి 25 సంవత్సరాలు పట్టగా సందీప్‌కు మా ప్రేమను మర్చిపోవడానికి కేవలం 14 గంటలు మాత్రమే పట్టాయని తెలిసి కృంగిపోతుంది. కలిసి పంచుకున్న కాలాన్నో, చెవిలో ముద్దునో, తడ బడుతూ అల్లుకున్న శరీరాల మోహస్పర్శను గుర్తుచేసి నిర్ణయం మార్చుకోమనడం అనవసరమని అక్కడినుండి వెళ్ళిపోతుంది. కథ చివరిలో సందీప్ పెళ్లికి వెళ్ళినప్పుడు ఇప్పటికైనా అసలు కారణం ఏమిటో చెప్పగలవా అని ప్రశ్నిస్తుంది. మీ తల్లిదండ్రుల జీవితంలా మన జీవితం కాకుడదని ఇలా చేశానని సందీప్ చెప్పిన సమాధానం విని అతనికి మానవ సంబంధాలపై ఉన్న అభిప్రాయానికి సిగ్గుపడి అక్కడి నుండి వచ్చేస్తుంది.

ఈ విధంగా నేడు సమాజంలో మానవుడు ప్రపంచీ కరణ ప్రభావానికి లోనై ధన, అధికార దాహంతో మానవ సంబంధాలను, కుటుంబసంబంధాలను, సంస్కృతి సంప్రదాయాలను విస్మరించి యాంత్రిక జీవనాన్ని సాగి స్తున్నారని కుప్పిలి పద్మ ఈ కథద్వారా తెలియజేసింది.

ఇలా వందేళ్ల కథకు వందనాలు కథాసంకలనంలోని ప్రతి కథలోను ఆయాకాలలకు సంబంధించి ప్రజల సాంఘిక, సాంస్కృతిక, సామాజిక జీవనాలు ప్రతిబిం బించేలా ఉన్నాయి అని తెలియవస్తుంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కాలం వెంట నడిచిన కథ

– నందిగాము నిర్మలకుమారి, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ & పీజి కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

మనిషి తన తోటి సమాజంతో కొనసాగించిన తొట్ట తొలి ఉద్విగ్న మానస సంభాషణమే ఆదిమ సాహిత్య రూపం అయి ఉండొచ్చు. ఆకలి కోసం వేసిన కేకలు కావచ్చు, ఆలంబన కోసం చేసుకున్న భావనలు కావొచ్చు, శత్రు భయంనుండి పెట్టిన కేకలు కావొచ్చు ఇవన్నీ తొలి కావ్య వస్తు ప్రేరణలు. చీకటి గుహల్లో తాను బ్రతికిన ఆనవాళ్ళను ఏరాయితోనో, చెట్టు బెరడుతోనో గీసిన గీతలు ఆదిమ కావ్య మొదటి రూపం అయి ఉండొచ్చు. అలా తన జీవికలో బ్రతుకు పోరాటంలో శ్రమలో భాగం అయినప్పుడు చిందిన చెమట చుక్కలు ఆ కావ్యానికి తాళాలు అయి ఉండొచ్చు. అవిధంగా మొదట సైగలు తర్వాత రాతలు గీతలతో మొదలైన ఆదిమ కళ మనిషి తో బాటే పెనవేసుకొని దానిని ఒక రూపంగా స్థిరపరుచుకుంది. ఈప్రక్రియ ఏ ఒక్క యుగంలోనో జరిగి ఉండదు. కొన్ని వందల తరాలు వ్యాప్తి చెంది ఉంటాయి. ఇవన్నీ మనిషి వ్యక్తీకరణ మౌఖికం నుండి లేఖనం దిశగా కొనసాగిన ప్రాధమిక కొండగుర్తులు.

అసలు తొలి సాహిత్య రూపం ఏమిటి? అది మౌఖికమా లిఖితమా? సైగలు భాషగా గుహల్లో గీసుకున్న గీతలు రచనకు ఆదిమ రూపాలుగా స్థిరపడ్డాయి. స్థిర నివాసం లేని ఆ కాలాన ప్రకృతి ప్రకోపానికి బయపడినప్పుడు స్థిరపడిన దైవం అతని జీవితాంతం వెంటాడింది. ఆదైవం అనేక రూపాలుగా విస్తరించింది. అలా విస్తరించిన ప్రక్రియనే వివిధ క్రతువులలో మంత్రాలు, శ్లోకాలుగా స్థిరపడినాయి. ఆ విధంగా తొలి సాహిత్య రూపం వేద వాజ్మయమే. అవి పురాణాలు, ఇతిహాసాలు, చిందు యక్ష గానాలు, కావ్యాలు, గల్పిక, నవల, కథ, కవిత్వం, నాటకం, నాటి నుండి నేటి దాకా మనిషి జీవితం తో పెనవేసుకొని కాలంతో నడుస్తూనే ఉంది.

తెలుగునాట "నీతి చంద్రిక", "కాశీ మజిలీ కథలు" లాంటి రచనా ప్రక్రియలు ఉన్నప్పటికీ "బృహత్కథ", "కథా సరిత్సాగరం" "గాధాసప్తశతి" వంటివి ప్రాచీన పాళీ, ప్రాకృత భాషలలో కథనాలు ఉన్నాయి. అయితే ఈ కథ అనే ప్రక్రియకు గోథె, హాప్మన్ లాంటి వారు తమవయిన నిర్వచనాలు ఇచ్చినప్పటికీ అసలు కథ లక్ష్య, లక్షణ చర్చలు ప్రతి భాషలోనూ జరిగాయి. క్రీ.శ. ఏడవ శతాబ్దానికి పూర్వం తెలుగు భాష శాసన, తాళపత్ర గ్రంధాలలో ఆనవాళ్ళు మినహా మరే లిఖిత సాంప్రదాయమూ లేదు. అంత దాకా తెలుగు మూలాలు కన్నడ లిపిలో ప్రక్షిప్తాలుగా ఉండేవి. నన్నెచోడ, పాల్కురికి వేసిన తొలి తెలుగు కావ్య ఆనవాళ్ళు పది పన్నెండు శతాబ్దాల మధ్యనే కావ్యాలుగా మనకు మిగిలాయి. అలా తెలుగు కావ్యాలు ప్రబంధాలు, భక్తి కవిత్వం దాని కొనసాగింపుగా ఆధునిక కవిత్వం, కథానికలు బయలుదేరాయి. అలా పందొమ్మిదో శతాబ్ద ప్రారంభంలో అటు ఇటు పదేళ్ళలో తెలుగు కథానిక ఆనవాళ్ళు ఉన్నట్లు చరిత్రకారులు నిర్ధారించారు.

ఆక్రమంలో తెలుగు కథ మీద విస్తృతంగా చర్చ జరిగింది. మొదటి చర్చ తొలి కథ, కాలం లాంటి అంశాల చుట్టూ అనేక వాద వివాదాలు చోటు చేసుకున్నవి. ఆధునిక యంత్ర సామాగ్రి అందుకున్న సమాజాలు సాహిత్య ముద్రణలో ముందు ఉన్నాయి. అవి లేని సమాజాలు మౌఖిక కథలనే పరిగణలోకి తీసుకున్నారు.ప్రచురణ సమయం, అనాటి కథా కథన రీతి, ఎంచుకున్న అంశాల ప్రాదిపదికగా గురజాడ అప్పారావు రాసిన "దిద్దుబాటు" కథను తొలి ఆధునిక కథానికగా పరిశోధకులు నిర్ధారించారు. నాటి సామాజిక సాంస్కృతిక చైతన్యం 'దిద్దుబాటు' కథలో ఉన్నప్పటికి ఆచర్చ ఎంతోకాలం నిలబడలేక పోయింది. ఒక రకంగా తొలి కథానిక 'దిద్దుబాటు' అని

స్థిరపరచిన చర్చను కదిలించే, ప్రశ్నించే సాహసం ఎవరూ చేయలేకపోయారు.

ప్రపంచ వ్యాప్తంగా జాతి, వర్ణ, లింగ, ప్రాంత అస్తిత్వ స్పృహతో సాహిత్యాన్ని పున:సమీక్ష చేసే ఆలోచనలు మొదలయినాయి. అమెరికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా మొదలైన నల్లజాతి పోరాటాలు. ఐరోపా కేంద్రంగా మొద లైన హక్కుల ఉద్యమాలు వాటితోపాటు జమిలిగా కొన సాగిన స్త్రీవాద ఉద్యమ చైతన్యం అనేక ప్రశ్నలు లేవ నెత్తింది. సాహిత్యంలో రాజకీయాలలో, సాంస్కృతిక ఉ ద్యమాలలో ప్రాతినిధ్య సమస్య బలంగా ముందుకు వచ్చింది. ఆవిధంగా కులం, మతం, లింగ, ప్రాంతీయ స్పృహ సాహిత్య చర్చల్లో ఒక అనివార్యతను సృష్టించింది. ఆ అని వార్యత లోంచే పోతన స్థానికత మీద మరో దుమారం లేచింది. పోతన ఒంటిమిట్ట దగ్గర ఉన్న బమ్మెర అని అది కాదు వరంగల్ జిల్లా బమ్మెర గ్రామం పోతన నివాస స్థలంగా ముందుకు వచ్చిన క్రమంలోనే మలిదశ తెలంగాణ ఉద్యమం ఉదృతంగా ముందుకు వచ్చింది. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర నిలయ స్థాపనతో మొదలయిన తెలంగాణ సాహిత్య వికాసం సాహిత్య చరిత్రకు మొదటి మెట్టు నిర్మిస్తే, ప్రాంతీయ అభిజాత్యంతో ముడుంబై రాఘవాచార్యులు "తెలంగాణ లో కవులు పూజ్యము" అని చేసిన వివక్షా పూరితమైన ప్రకటనతో మొదలయిన తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణం, సాహిత్య చర్చల్లో తెలంగాణ సాహిత్యానికి జరిగిన వివక్ష లోంచే బయలు దేరిన "గోల్కొండ కవుల సంచిక", "పాక్కిలి", "ముంగిలి" లాంటి కవితా సంచికలు సాహిత్య ఆధిపత్య భావనలకు వ్యతిరేకంగా ప్రాంతీయ స్పృహతో ముందుకు వచ్చాయి.

ఒక వైపు ప్రాంతీయ అస్తిత్వంతో తమవయిన కథల వెలికితీత జరుగుతుండగా బండారు అచ్చమాంబ పేరు సాహిత్య చర్చల్లో ముందుకు వచ్చింది. 1874 కృష్ణా జిల్లా పెనుగంచి ప్రోలులో జన్మించిన ఆమె తమ్ముడు ప్రసిద్ధ చరిత్రకారుడు కొమ్మరాజు వెంకట లక్ష్మణరావు. ఆనాటికే బండారు అచ్చమాంబ సంస్కృత, మరాఠీ, గుజరాతీ భాషలు నేర్చుకున్న ఆమె 1902లో బందరులో 'బృందా వన స్త్రీల సమాజం' స్థాపించారు. ఆనాటికి కోస్తా ప్రాంతంలో అది మొట్టమొదటి స్త్రీల సంస్థ. ఆమె తెలంగాణ కోడలుగా తన సాహిత్య ప్రస్థానాన్ని హైదరా బాద్, నాగపూర్ కేంద్రంగా కొనసాగించింది. మొదటి సారిగా 1901 మే నెలలో 'తెలుగు జనానా' అనే పత్రికలో 'గుణవతియగు స్త్రీ' అనే కథను, అదే పత్రికలో 1901 సెప్టెంబర్ లో 'లలితాశారదలు', 1902 ఆగష్టులో 'సత్పాత్ర దానము'తో బాటు 1902నవంబర్ 'హిందూ సుందరి' పత్రికలో "ధన త్రయోదశి" అనే కథను ప్రచురించారు. ఇవి కాక ఇంకా కొన్ని కథలతో బాటు స్త్రీల జీవిత చరిత్రలను కూడా రాసిన ఆమెను తెలుగు సాహిత్య కారులు మరుగున పరిచారు. అచ్చమాంబ కథలు గురజాడ దిద్దుబాటు కన్నా ముందే ప్రచురణ పొందినవి అనే చర్చ సాహితీ ప్రపంచంలో ఒక దుమారమే లేపింది. మరుగున పడిన ఒక కథా రచయిత్రి గతం ఇది. ఆధిపత్య పురుష స్వభావంతో రాసిన వర్తమాన సాహిత్య చర్చలో కనుమరుగు అయిన ఒక స్త్రీ కథ వెనక కథ. ప్రాంతీయ అస్తిత్వ స్పృహ చేసిన స్వాభిమాన ప్రకటన మూలంగా వెలుగులోకి వచ్చిన తెలంగాణ కథ వెనక దాచేస్తే దాగని సత్యాలు ఎన్నో కొత్త సవాళ్ళను ముందుకు తెచ్చింది.

'దిద్దుబాటు' కథ తెలుగు నాట వందేళ్ళ కింద మొద లయినా దానికి ఇంకా వందేళ్ళ కిందనే మౌఖిక కథలు ఉండే అవకాశం ఉంది అని కథానిలయం పూనికతో మొదలయిన మేధో శ్రమ మరో వంద కథల వెలికితీతకు ఆవిష్కరణకు దోహదం చేసింది. తానా ప్రచురణల సౌజన్యంతో రెండేళ్ళ కింద వచ్చిన ఈ పుస్తకంలో దిద్దు బాటు కథకన్నా పూర్వం ప్రచురణ పొందిన పెద్దగా ప్రాచుర్యంలో లేని వ్యక్తుల కథలు వెలుగులోకి వచ్చాయి. సమగ్రమైన పరిశోధన లేకుండా భావోద్వేగాలతో చరిత్రను రాసినప్పుడు జరిగిన తప్పిదాలు ఇవి. అప్పటిదాకా దిద్దుబాటు కథ తెలుగు సమాజాన ప్రచురితం అయిన

తొలి ఆధునిక కథానిక అనే చర్చను పూర్వపక్షం చేసింది బండారు అచ్చమాంబ కథా సంకలనం. దాని కొన సాగింపుగా వచ్చిన తానా ప్రచురించిన వంద కథలు. అతిమంగా ఈ తొంభై రెండు కథల కన్నా ముందు కథలు లేవని కాదు కానీ స్థల కాలాలకు అనుగుణంగా చరిత్ర రచన జరిగినప్పుడు జరిగే తప్పిదాలు ఇవి.

వర్తమాన సామాజిక ఉద్యమాల వెలుగులో కథకు ఉన్న భిన్న అస్తిత్వాల నేపధ్యంలో కథల ప్రచురణ మొదలైనది. అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం, జనసాహితి లాంటి ప్రజా సంఘాల సంస్థల మొదలు అనేక రాజకీయ పార్టీలు కూడా కవితా సంకలనాలను ప్రచురించారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో 'మహా సంకల్పం' పేరుతో వచ్చిన సంకలనం, ప్రజాశక్తి కథల సంకలనం, ప్రత్యేకతెలంగాణ స్ఫూర్తితో వచ్చిన 'తెలంగాణ కథ', విప్లవ రచయితల సంఘం 'విప్లవ కథ' తోబాటు అనేక జిల్లాల రచయితల సంఘాలు తమ జిల్లా కథా రచయితల కథా సంకలనాలను విస్తృతంగా ప్రచురించాయి. వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటి అడ్లూరి అయోధ్య రామకవి 'తెలంగాణ మంటల్లో' అనే కథా సంకలనాన్ని ప్రచురించినది.

'కథ' పేరుతో ప్రతి ఏటా వాసిరెడ్డి నవీన్ ప్రచురిస్తున్న 'కథ' గడిచిన రెండు దశాబ్దాలుగా నిరంతరంగా కొన సాగుతున్నప్పటికీ దానిలో ప్రాంతీయ వివక్ష మూలంగా తెలంగాణకు అన్యాయం జరిగింది అనే చర్చ ముందుకు వచ్చింది. ఆ వివక్షల వ్యతిరేకంగా తెలంగాణ సాహిత్య కారులు ముందుకు తెచ్చిన తొలి కథానిక చర్చ ప్రాధా న్యతను సంతరించుకున్నది. ఆక్రమంలో వచ్చిందే బండారు అచ్చమాంబ 'ధన త్రయోదశి' మరి కొన్ని కథలు.

పందొమ్మిది వందల ఎనభైల తర్వాత రాష్ట్రంలో జరి గిన ఒక ఘోరవిపత్తు దళిత, బహుజన, విప్లవ శ్రేణుల్లో కుల చర్చ ఒక అని వార్యతను ముందుకు తెచ్చింది. వర్గ సంబంధాల ప్రాతిపదికగా జరుగుతున్న చర్చల్లో కుల ఆవశ్యకత, వివక్ష, తదితర అంశాలు ముందుకు వచ్చాయి. ఈనందర్భం అటు వర్తమాన రాజకీయ పార్టీలలో ముఖ్యంగా విప్లవ సంఘాలలో కూడా కులం చర్చ ప్రధాన భూమిక అయ్యింది. భూమి ఇరుసుగా జరిగిన పోరాటాలు భూమి, వర్గ కేంద్రీకృత చర్చలు ఒక బలమైన ప్రాతినిధ్య చర్చను జీర్ణం చేసుకోలేక పోయింది. తద్వారా దేశవ్యాప్తంగా దళితుల మీద జరిగిన అనేక అత్యాచారాల గురించి చర్చ సాహిత్య రంగంలో ఒక చీలిక తీసుకొని వచ్చింది. 'చిక్కనవుతున్న పాట', 'పదునెక్కిన పాట' లాంటి అనేక దళిత సంఘీభావ కవిత్వ సంకలనాలు వెలుగులోకి వచ్చాయి. విశాలాంధ్ర ప్రచురణల ద్వారా 'దళిత కథ' పేరుతో వచ్చిన సంకలనాలు, మరియు 'కథా వార్షిక', 'ప్రాతినిధ్య' పేరతో మరికొన్ని కథా సంకలనాలు తమవయిన ముద్రను వేసాయి.

కథ ఒక బలమైన సాహిత్య మాధ్యమం. వర్తమాన స్వాభిమాన అస్తిత్వ ఉద్యమాల నేపధ్యం సాహిత్యంలో అన్ని విభాగాల మీద పడినట్టే కథ మీద కూడా పని చేసింది. శిల్పం, ఇతివృత్తం తదితర అంశాల మేలవింపుతో కథ మరింతగా పదునెక్కింది. కేవలం ఒక ప్రాంతానికి, భాషకి మాత్రమే నరిమితం కాకుండా వివిధ భాషలో వచ్చిన మేలిమి కథలను అనువాదం ద్వారా కథ సాహిత్య లోకంలో ముకుటాయ మానంగా ఎదిగింది. దిద్దుబాటు కథను మొదటి ఆధునిక కథానికగా భావించినప్పటికి దాని కొనసాగింపుగా జాతీయ ఉద్యమ నేపధ్యం మొదలు అభ్యుదయ, ఆధునిక, అత్యాధునిక, విప్లవ, దళిత, బహు జన, మైనారిటీ, స్త్రీవాద, 'ప్రాంతీయ అస్తిత్వం' లాంటి అనేక అస్థిత్వాలతో మమేకం అయిన కథ ఒక రకంగా గడిచిన వందేళ్ళ తెలుగు సమాజ వైయుక్తికమైన భావ వ్యక్తీకరణకు అద్దంపట్టింది. గడిచిన నూటా ఇరవై ఏళ్ళలో సమాజం అనుభవించిన అన్ని కల్లోలాలను 'కథ' చిత్రిక పట్టింది. దాని మొదలు ప్రేమకథలు, విరహకథలు, మైనారిటీ కథలు, ప్రాంతీయ అస్తిత్వ కథల కొనసాగింపుగా ఇటీవల మహ్మద్ ఖదీర్‌బాబు 'ఉత్తమ తెలుగు వాన కథలు' పేరుతో వచ్చిన కథలు ఒక వినూత్నమైన

ప్రయత్నం. ఈ సంకలనం పాలగుమ్మి పద్మరాజుతో మొదలై మహమ్మద్ ఖదీర్‌బాబు దాకా కొనసాగింది. కథ చుట్టూ మరుగున పడిన చరిత్రను సామాజిక ఉద్యమాలు మరింత పదునెక్కేలా చేసాయి. ఈ విధంగా వివిధ రాజకీయ అస్తిత్వాల మేళవింపుతో సామాజిక ఉద్యమాల నాడిని ఒక సిస్మోగ్రాఫ్ లా నమోదు చేసింది కథ. ఇది ఒక రకంగా తెలుగు నాట స్వాభిమాన ఉద్యమాల ఘర్షణ విజయం.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. వివినమూర్తి: దిద్దుబాటులు: దిద్దుబాటుకు ముందు కథలు. తానా ప్రచురణలు, హైదరాబాద్,2015.
2. ఆచార్య కేతువిశ్వనాథరెడ్డి, సింగమనేని నారాయణ, పెనుగొండలక్ష్మి నారాయణ, సదానంద్ శారద. విశాలంధ్ర తెలుగు కథ 1910-2000. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్,2002.
3. మహ్మద్ ఖదీర్‌బాబు. ఉత్తమ తెలుగు వాన కథలు. చాయా రిసోర్స్ సెంటర్, హైదరాబాద్, 2017.
4. వాకాటి పాండురంగారావు, పురాణం సుబ్రమణ్య శర్మ. కథా భారతి తెలుగు కథానికలు నేషనల్ బుక్ ట్రస్ట్ ఢిల్లీ.1973.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కె. వరలక్ష్మి గారి కథలో సామాజిక చిత్రణ

– పోతురాజు దుర్గాదేవి, నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, నంబూరు, గుంటూరు.

బిందెను నీళ్లలో ముంచనీకుండా కళ్లను కట్టి పడేసే మంచి నీళ్ల చెరువులో వికసించిన పద్మాల అందాలు బడి ప్రాంగణంలోని పారిజాత సుమాల పరిమళ పవనాలు - ఊరి మార్గాలన్నింటా విరిసి మురిపించిన తురాయి పూల చెట్ల అటవీ సౌందర్యాలు పాలంలో ఉన్న నాన్నకి అన్నం పట్టుకెళ్లి దారితప్పి గట్లన్నీ తిరిగి తిరిగి ఎక్కెక్కి ఏడ్చి, నాన్న గొంతెత్తి పాడిన పద్యం మార్గం చూపించి గమ్యాన్ని చేర్చగా నాన్న భుజం మీద వాలిపోయిన ఆనందాలు. అమ్మ ఎప్పుడూ సన్నని గొంతుతో పాడే 'సీతమ్మ వాకిట సిరిమల్లె చెట్టు' పాటలు కన్పించిన ప్రతి చెట్టునీ పుట్టనీ ప్రేమింపచేసి పరవశించి రాసుకున్న కవిత్వాలు-

అన్నీ.... అన్నీ.... కాలంతోపాటు కరిగిపోయి మిగిల్చిన జ్ఞాపకాలు - నేనెరిగిన సమాజంలోని అతి సామాన్యమైన వ్యక్తులు, వాళ్ల జీవన పోరాటాలు, నిస్సహాయతలు, రాగద్వేషాలు, ప్రేమలు, అసూయలు, అహంభావాలు నా కథల్లో కొన్ని స్వానుభవాలు., డబ్బే ప్రధానమైన రాజ్య మేలుతున్న ఈ లోకంలో ఎన్నెన్ని మోసాలు-మాయలు! తుఫానుకి ముందు ప్రమాద సూచికల్లా వ్యక్తుల గుండెల్లో సంక్షోభ వీచికలు, నిరంతరం- రక్త సంబంధీకుల్లోనే కొరవడిన ప్రేమలు, ఆ ప్రేమకు దూరమై విలపించే స్త్రీలు, విలాపంలోనూ మానవత్వాన్ని క్షమని వదలలేని బలహీనతలు- ఎందరి కలతల్నో స్వీయ దుఃఖాల్తో కల బోసుకోని నిద్రకు దూరమై గడిపిన రాత్రులు- నా కథలు అంటారు వరలక్ష్మిగారు.

కె. వరలక్ష్మిగారు 24 అక్టోబర్ 1948 తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటలో శ్రీపల్లా వెంకట రమణ, బంగారమ్మ దంపతులకు జన్మించారు. ఎం.ఎ. తెలుగు చదివారు. వివిధ పత్రికలలో 140కి పైగా కథలు, 4 నవలికలు, కవితలు, వ్యాసాలు, నాటికలు, ప్రచురణ, ప్రసారం అయ్యాయి. చాలా కథలు, కవితలు, వివిధ సంకలనాల్లో చోటు చేసుకున్నాయి. జీవరాగం, మట్టి-బంగారం, అతడు-నేను, క్షతగాత్ర, పిట్టగూళ్లు కథాసంపుటాలు, ఆమె కవితా సంపుటి వెలువడ్డాయి. "విహంగ" వెబ్ మేగజైన్‌లో వీరి ఆత్మకథ నెలనెలా వస్తోంది. వీరి సాహిత్య ప్రతిభకు గాను వీరికి ఎన్నో అవార్డులు లభించాయి.

బలం కథ :

వలస బ్రతుకుల వ్యతలను తెలియచేసే కథ "బలం." ఈ కథలో పార్వతి, తిరుపతి భార్యభర్తలు. వారికి ఇరువురు పిల్లలు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. పల్లెలలో పనులు లేక పట్నం వచ్చి వాళ్ళు పడిన బాధలు చివరకు "దూరపు కొండలు నునుపు" అని తెలుసుకొని తిరిగి పల్లెకి వెళ్ళి పోతారు. ఈ పట్నంలో వాళ్ళు పడిన ఇబ్బందులు కళ్ళకు కట్టినట్లు వివరించారు రచయిత్రి. సమాజంలో పాతుకొని ఉన్న సమస్యలకు అద్భుతమైన విశ్లేషణ అందించారు. బాలకార్మికుల గురించి, బాలికలపై జరిగే లైంగిక వేధింపుల గురించి, అంగవైకల్యం ఉన్న పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియచేశారు.

కథ ఇతివృత్తం :

చక్కని గోదావరి మాండలికంలో పాత్రలు మన ముందే కదులాడుతున్నాయా అన్నట్లు రచయిత్రి కథను సాగించారు.

"ఇదంతా కర్మ కాకపోతే పెంకుల మిల్లులో కూలీగా ఎల్లినోడు ఎల్లినట్టుండక, ప్రెస్సింగు మిషను దగ్గరకు వెళ్ళి ప్రమాదవశత్తు తిరపతి అరచేతులు సగానికి కట్ అయిపోతాయి. లాబోదిబోపని పిల్లలని తీసుకొని వెళ్ళుతుంది పార్వతి. అప్పటికే కాకినాడలోని పెద్దఆసుపత్రికి తీసుకువెళ్ళుతారు. తిరపతికి మెలుకువొచ్చేక-"ప్రెస్సింగు

మిషను కాడ పని నేర్చుకుంటే కూల్డబ్బులు పెరుగుతాయి కదా అని ఆ పన్జేసేనే" అని బావురుమన్నాడు.

గుండెరాయి చేసుకుని తనే ధైర్యం చెప్పవలసి వచ్చింది. అరిచేతుల్లేనోడు ఏం పని చేయగల్డు? ఇంకే అవసరాలకైనా కట్టుకున్న దానిగా తనకి తప్పడం లేదు. పిల్లల చదువులు గట్టెక్కిపోయేయి. వాళ్ల గురించి కన్న కలలన్నీ ఏలేట్లో కలిసిపోయేయి. అతని కాని పనిలో చేతులు పెట్టినందుకు మాదేం బాధ్యత కాదు అని ఫ్యాక్టరీ వారు అన్నారు. కాళ్ళు, వేళ్ళు పట్టుకొని బ్రతిమాలితే పిల్లలను పనులలో పెట్టుకుంటాము అన్నారు ఫ్యాక్టరీ యాజమానులు. ఏదో గుడ్డిలో మెల్లలా పిల్లకి రూ.15/-, పిల్లవాడికి రూ.12/-లు యిస్తామన్నారు.

పనికి వెళ్ళి కాళ్లీడ్చుకుంటూ పిల్లాడు గంగరాజు వస్తూ కర్రకి కట్టుకొచ్చిన రావి మండల్ని వాకిట్లో కట్టేసి ఉన్న మేకపిల్ల ముందేసి అక్కడే చతికిల పడ్డాడు. అక్కేదిరా అని అంది పార్వతి కంగారుగా. వస్తుంది ఎనకాల, ఇవాళ్ల బట్వాడా రోజు కదా, డబ్బులు తెస్తుంది" అన్నాడు. ఎని మిదేళ్ల వాడి లేత మొహం రోజంతా ఎండలో పని చెయ్యడం వల్ల కమిలిపోయింది. అలసిపోయి తల్లి దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. ఒళ్లంతా కిరసనాయి కలిపిన మట్టి వాసన. పచ్చి పెంకులు మోసి మోసి వాడి తల నిండా మట్టి పెళ్లలు కట్టింది.

చెయ్యి వెనక్కి చాపి వాడి పొట్ట నిమరబోయింది పార్వతి. అది లోపలికి పోయి డొక్కకంటుకుపోయింది. "ఆగమంటుంటే ముందొచ్చేసేడు చూడమ్మా తమ్ముడు" అంటూ వచ్చింది పిల్ల జలాకన్నికి.

ఇంట్లో బియ్యం నిండుకున్నాయని ముందే తెలియడం వలన వచ్చేటప్పుడే రెండు కేజీల బియ్యం పరికిణీలో పోయించుకొచ్చింది. మిగిలిన డబ్బులు తల్లి చేతుల్లో పెట్టి చేట పట్టుకొచ్చి గింజ క్రిందపడకుండా బియ్యాన్ని ఒంపింది. "అమ్మా పోయ్యిలో కంప ఎగదొయ్యి, ఛణంలో బియ్యం ఏరేసి, కడిగేసిత్తాను" అంది. ఆ చిరు చీకట్లు ముసురుతున్న వేళ బియ్యం చేటలోకి మొహం వంచేసి చకచకమని నల్లరాళ్లు ఏరిపడేస్తోంది. పన్నేండేళ్లైనా నిండని ఆ పిల్ల చురుకుతనాన్ని పక్కింటి పాపమ్మ ముచ్చటగా చూస్తోంది. "ఏ ఇంటికెల్తాదో గాని పార్వతీ నీ కూతురు బంగారమే" అంది పాపమ్మ. ఈనె పుల్లలు తియ్యడం పూర్తిచేసి, పురికొసదారంతో మొదళ్ళు కట్టి, నేలకేసి కొట్టి చీపుర్ని సరిచేసింది. కత్తిపీట మించి లేవబోయి నడుం రాక వంగి నిలబడింది.

"ఒరే బాబా గంగరాజా, ఈసీపురుకట్ట సావుకారింట్లో ఇచ్చేసి రెండ్రూపాయలిత్తాడు తెచ్చి పెట్టు నాయినా" అంది.

"నాక్కాళ్లు లాగేస్తన్నె నేనెల్లను" అన్నాడు గంగరాజు వాళ్లమ్మ వీపు మీద మరింత వాలిపోతూ.

"ఉండ్రా, నన్నుగానీ పోయ్‌లో తోసేత్తావేటి" అని కసురుకుంది పార్వతి. బియ్యం కడిగి పొయ్యి మీది కెక్కిస్తున్న జలాకన్నికి "పోన్లేమామ్మా, నేనెల్తాన్లే" అంది. "నాయమ్మే నా తల్లే, నెన్జేప్పలేదా నువ్వు బంగారానివని" అంది పాపమ్మ వెన్నుని నిటారుగా లేపి నిల్చుంటూ.

పార్వతి డబ్బులు ఇంట్లో పెట్టిరాడానికెళ్లింది.

"అక్కా, అమ్మతో చెప్పలేదేం?" అన్నాడు గంగరాజు గుసగుసగా.

"అమ్మ ఏడుత్తాదేమోనని బయవేత్తందిరా" అంది జలాకన్నికి. పోన్లే అది కాపోతే ఉంకోటి, ఊళ్లో మిల్లులకేం కరువు? రేపెల్లేక ఎక్కడోకాడ పని సంపాదిద్దార్లే, అమ్మతో చెప్పొద్దు" అంది.

ఆ రాత్రికే కాలనీ అంతా గుప్పుమంది- బాలకార్మిక చట్టం ప్రకారం పిల్లల్ని పనుల్లోంచి తీసేసేరని.

"అమ్మా, అక్కా నేనూ ఈపాలి బళ్లోకెళ్ళిపోవచ్చా" అన్నాడు గంగరాజు సంబరంగా.

తమ్ముడి అవగాహనా లేమికి జాలిగా నవ్వింది జలాకన్నికి. అప్పుడూ అంతే, బడి మానేసి పన్లోకెళ్లడం అంటే గొప్ప సంబరం అనుకున్నాడు. నాలుగు రోజుల్లోనే పనిలోని కష్టాన్ని భరించలేక ఏడ్చిగోల పెట్టేవాడు. తనకే

జాలేసింది చెంగు చెంగున ఎగిరే లేడిపిల్ల లాంటి వాడు కాస్తా తల్లిపాలు అందని మేకపిల్లలాగైపోవడం చూసి.

మర్నాడు వాళ్లమ్మకి తనే ఉపాయం చెప్పింది జలాకన్నికి.

పార్వతి తన చీరొకటి రెండు ముక్కలు చేసి జలాకన్నిక్కి పైటేసి పంపింది. వెళ్లిన గంటలోనే ఏడ్చుకుంటూ ఇంటికొచ్చింది. "ఏటే పిల్లా పెద్దోళ, కూలీ అందేసుకుందారనే? ఏదీ ఎంత పెద్దదానివయ్యేవో సూత్తానుండు" అంటూ పైట లోపల చేతులేసి గట్టిగా పిండి వదిలేడట మేస్త్రీ. బాధతో, నొప్పితో, అవమానంతో కుళ్లి కుళ్లి ఏడుస్తున్న కూతుర్ని హత్తుకుని తనూ ఏడ్చింది పార్వతి.

రెండేళ్ల నాడు తనకి జరిగిన అవమానం గుర్తుకొచ్చింది.

ఈ వూరొచ్చిన కొత్తలో పాపమ్మతో కలిసి సినిమా కెళ్లింది పార్వతి.

ఇంటర్వెల్లో బాత్‌రూంకెళ్లొస్తూ చెట్ల నిండా విరగ బూసిన గులాబీ పువ్వుల్ని చూసి ఓ పువ్వుకోసుకో బోయింది.

చటుక్కున ఓ బలమైన చెయ్యొచ్చి పార్వతి చేతిని ఒడిసి పట్టుకుంది. ప్రొజెక్టరు రూం మేడమీద నుంచుని డేగ చూపుల్తో ఆడవాళ్లని పరికిస్తున్న అతన్ని చూపించి సాయంకాలం వచ్చేటప్పుడే చెప్పింది పాపమ్మ అతనే ఈ హాలు ఓనరని. మిల్లులూ, తోటలూ, దొడ్లూ ఎన్నున్నాయో అతనికే లెక్కతెలీదని రోజుకో ఆడదాన్ని పక్కలోకి రప్పించుకునే లెక్క మాత్రం బాగా తెలుసని. కోసిన పువ్వునలాగే వదిలేసి చెయ్యి విదిలించుకుంది పార్వతి.

గబగబా నాలుగు పువ్వులు తుంచి గుత్తిగా పట్టుకుని

"తీసుకో" అన్నాడతను.

"వద్దు" అని పార్వతి గబగబా వచ్చేస్తూంటే-

"అబ్బో చాలా ఉందే, ఎవరు మీరు?" అన్నాడు.

ఆ ప్రశ్నకి అర్థం బాగా తెలిసిన పార్వతి నిలబడి "గొల్లలం" అంది అడుగు కదుపుతూ.

"ఓస్, ఇంకేదో పెద్ద కులంలో పుట్టినట్టు పోజు కొట్టేస్తన్నావే" అన్నాడతను. ఆ మాటకి పార్వతి గుండె భగ్గున మండినా వాణ్ణేమీ చెయ్యలేక, అనలేక నిస్సహాయంగా తిరిగొచ్చింది.

అవును తనకి కులం బలం లేదు. డబ్బు బలం లేదు. శారీరక బలం లేదు. చివరికి తమ ఊళ్లోలా మంది బలం కూడా లేదు.

ఒకో మనిషిలాగే ఒకో ఊరూ తన నైజాన్ని చూపించుకుంటుంది.

అసలు తమ ఊళ్లో ఏం తక్కువైందని ఈ దూరపు కొండలకి పరుగెత్తుకొచ్చినట్టు?

కళ్లు తుడుచుకుంది పార్వతి. పొద్దున్న కూతురికి కుచ్చిళ్లు పెట్టి బొడ్లో దోపి వేసిన పైటను లాగి, ఉండచుట్టి దాన్తో కన్నీళ్లతో మలినమైన కూతురి మొహాన్ని శుభ్రంగా తుడిచింది.

ఇప్పుడేమైందని తామిలా కుమిలిపోవడం?

మొగోడికి అరచేతులు లేకపోవడం నలుగురితో కలిసి మేకలు కాయడానికి అడ్డేం కాదు.

ఎప్పట్లాగే తన పిల్లలు నాలుగు మైళ్లు నడిచి ఆశ్రమం బడికెళ్తారు. కొండల మధ్య, పచ్చని అడవి మధ్య నిశ్శబ్దంగా నిలిచి ఉండే తన ఊరు, పూరిల్లు, తమ వాళ్లు కళ్ళకి కట్టి కొండంత బలం వచ్చింది పార్వతికి.

గిన్నెలూ తపేళాలూ గోతంలో వేసి కట్టమని పిల్లలకి పురమాయించి, వాకిట్లోకొచ్చి నిలబడి-

"పాపమ్మత్తా, ఇల్లు ఖాళీ చేసి మావూరెల్లిపోతున్నాం" అనరిచింది హుషారుగా. మంచంలో ముణగదీసుకుని పడుకున్న తిరపతి చట్టుక్కున ఇటు తిరిగి పార్వతికేసి ఆనందంగా చూసేడు.

పక్కనే ఉన్న మేకపిల్లను ఎత్తుకుని ముద్దాడింది పార్వతి. రేపు ఊరెళ్లేక పిల్లల్ని పెట్టి మందను పెంచ వలసింది అదే కదా మరి!

ముగింపు : కష్టాలల్లో ఉన్నా పరిస్థితులకు అనుగుణంగా స్త్రీ ఎంతో ఆలోచనాత్మక నిర్ణయాలు తీసుకోగలదో, కన్నీళ్ళతో ఒడిదుడుకులకు అడ్డు కట్ట వేయగలదో, మానసిక ధైర్యాన్ని నింపుకోగలదో, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆశావాద దృక్పథంతో ముందుకు సాగి పోగలదని రచ యిత్రి తెలియచేసారు.

ఆధార గ్రంథసూచిక :

1. మట్టిబంగారం కథల సంపుటి - కె. వరలక్ష్మిగారు.
2. సాహితి వైజయంతి - అజో-విభొ-కందాళం 2020 "సమ్మానోత్సవ విశేష సంచిక

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

బైబిల్‌లోని ప్రజల జీవన విధానం – సాంఘిక పరిస్థితులు

– సుజిత రెడ్డి, పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆదిమ మానవుడు తన పరిసర ప్రకృతిని, శాస్త్రీయ దృక్పథంతో అవగాహన చేసుకోలేని అసహాయ స్థితిలో ఉన్నప్పుడు అతని అజ్ఞానానికి ప్రతిబింబంగా దేవుడు, మతం అనే భావాలు ఉద్భవించాయి. అందుచేత మతానికి, దైవ భావానికీ మానవ అజ్ఞానమే ప్రధాన ప్రాతిపదిక అనేది సుస్పష్టం. మానవ అజ్ఞానం నుండి మూఢ మత విశ్వాసం బయల్దేరింది. తత్ఫలితంగా ప్రకృతి శక్తులను వివిధ దేవతలుగా భావించి పూజించే సాంప్రదాయం ఉనికిలోకి వచ్చింది.

భారతదేశంలో అనేక మతాలు ఉన్నాయి. అలాగే వారి మతాలకు సంబంధించిన గ్రంథాలు కూడా ఉన్నాయి. హిందువులకు - భగవద్గీత, ముస్లింలకు -ఖురాన్ ఇలా వారివారి మతాలకు సంబంధించిన గ్రంథాలున్నాయి. దానితోపాటు వారి జీవన విధానంలో కూడా కొంత మార్పు చేర్పులు రావడం సహజం. హిందువుల జీవన విధానం కొంతవరకు వేరుగా ఉంటే, ముస్లిం జీవన విధానంలో కూడా కొంత బేధం అనేది ఉంటుందని చెప్పవచ్చు. హిందు, ముస్లిం మతాలలాగా క్రైస్తవ మతం కూడా ఒకటి.

క్రైస్తవులకు బైబిల్ పవిత్ర గ్రంథం. క్రైస్తవ మత విశ్వాసాలకు బైబిలు గ్రంథం మూలాధారం. ప్రపంచ మత సాహిత్య గ్రంథాల్లో బైబిల్ ఒక ప్రామాణిక గ్రంథం. ఇది ఒక మానవత విలువలతో కూడిన గ్రంథం అని అనడంలో అతిశయోక్తి లేదు. కారణం అందులో కనిపించేది మానవ జీవిత వికాసం. ఈ గ్రంథంలో శాంతి, సమాధానం, పరస్పర ప్రేమతత్వం, త్యాగం, దయ, కరుణ, వంటి విషయాలను ఉపమానాలతో, కథలతో, సంఘటనలతో పెనవేసుకున్నాయి. ఒక్క మాటల్లో చెప్పాలంటే మానవుని సంపూర్ణ అభుదయం కోసమే "బైబిలు" గ్రంథం లభించబడిందని క్రైస్తవుల నమ్మకం.

బైబిలు అన్న మాట బైబిల్‌లో ఎక్కడా కనిపించదు. గ్రీకు భాషలో 'బిబ్లియన్" అనే మాటకు 'పుస్తకం' అని అర్థం. పైపరస్ తయారైన పుస్తకానికి బిబ్లియ అనే పదం బిబ్లియాస్‌కు బహుచవనరూపం. బైబిలు అన్న పదం అధికారికంగా క్రీ.శ 5వ శతాబ్దంలో గ్రీకు దేవాలయాల్లో ఫాధరీలు నామకరణం చేశారు. ఈ మూల శబ్దం నుండి వచ్చిందే బైబిలు అనే పదం. పుస్తకం అనడం కన్నా గ్రంథం అని అనడమే సమంజసం.

బైబిల్ని ధర్మశాస్త్రామని, లేఖనాలని, నిబంధనలని కూడా పిలుస్తారు. నిబంధన అంటే ఒడంబడిక, నియమం, ఒప్పదం అనే అర్థాలు కూడా వస్తాయి. ఆంగ్లంలో హొలీబైబిల్ అనీ, తమిళంలో పరిసుత్త వేదాంగం అని, కన్నడంలోసత్యవేద అని, మలయాళంలో వేదపుస్తకం అని కూడా ఆయా భాషల్లో బైబిలును పిలుస్తారు. బైబిల్ కొన్ని పుస్తకాల సంపుటి. విడివిడి పుస్తకాలన్నింటిని ఒకే పుస్తకంగా ముడివేయబడ్డాయి. అందుకే గ్రంథం అన్నమాట సమంజసమైంది. వేదం అంటే జిజ్ఞాస, విజ్ఞాన భాండాగారం అని అర్థం. బైబిల్‌లో ప్రధాన పాత్ర యేసుక్రీస్తు. యేసుక్రీస్తుకు సంబంధించిన అనేక విషయాలను బైబిల్‌లో పొందుపరిచారు. అందులో ఉన్న ప్రజల జీవన విధానం ఎలా ఉంటుందో చెప్పడమే నా పత్రం ముఖ్యోద్దేశం.

నివాస విశేషాలు :

ఆదిమ దశలో మానవ చరిత్రను చూస్తే ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రజల్లో దినదినం మార్పులు కాలాను గుణంగా అభివృద్ధిలోకి వచ్చే ప్రకారం నివాసాలలోనూ మార్పులు చేర్పులు జరగడం సహజం. బైబిల్‌ల్లోని పాతనిబంధన కాలంలో ప్రజలు నిర్మించుకొన్న నివాసాలు, వారు ఉపయోగించుకొన్న ఉపకరణాలు,

కట్టడనిర్మాణాలకు కావాల్సిన సామాగ్రి, వినియోగించిన విధానం తెలుసుకోవడంలో తప్పలేదు. ప్రాచీన కాలంలో మానవులకు కట్టడాలు గల నివాసాలు లేవు. ఆదిమ మానవులు జీవించినది గుహలలోనే. తర్వాత మానవ జాతి చేతితో నిర్మించుకొన్న గుడారాలను ఎక్కువగా నివసించడానికి ఉపయోగించుకొన్నారు. తర్వాత కాలంలో అనేక రకాల ఇల్లు నిర్మించుకోవడం జరిగింది.

ఇశ్రాయేలు పాలస్తీనాలోనికి రాక పూర్వం ఆ దేశంలో వున్న కనానీయులు ఇండ్లను కోటలను కట్టుకొని వాటిలో నివసించారు. ఇల్లు నిర్మించుకోవడం జరిగింది. పాలస్తీనా దేశంలో సున్నపురాళ్ళు ఎక్కువగా ఉండి భూమిలో నుండి వచ్చే ఊట వల్ల అవి కరిగిపోవడం చేత గుహలు అనేకం ఏర్పడిన్నాయి. గుహ అనే పదానికి మూల భాషలో "హొరు" అనే మాటను వాడారు. లోతు, దావీదు పారి పోయిన సమయంలో వారు గుహలోనే నివసించారు. అంతేకాక ఇశ్రాయేలీయుల గోత్ర కర్తల ఇండ్లలో నివ సించిన వారే కాకా డేరాలలో కూడా నివసించారు. స్థిరమైన నివాసాలు ఉన్న సూచనలు లేవు. కనాను చేరినప్పటి నుండి వారు ఇండ్లలో నివసించారు. అంతే కాకుండా ఇళ్ళను రాళ్ళు ఉపయోగించి కట్టేవారు.

వంట సామాగ్రి :

పరిశుద్ధ గ్రంథం కాలంలో పాలస్తీనా ప్రదేశంలో వంట పనులు చేసుకొన్నారు. ఇంటి పనులకు సంబంధించిన కుండలలో ఆహారం తయారు చేసుకొనేవారు. కడవలు, తొట్లు, బానలను ఉపయోగించారు. పాత్రలు కూడా రాతిలో తయారు చేసినవి ఉపయోగించారు. బానలు ఒక మనిషి పట్టేంత పెద్దవిగా ఉండేవి. ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు నీళ్ళ బుడ్లను వెంటతీసుకొని వెళ్ళేవారు.

ఆచార వ్యవహారాలు :

బైబిల్ కాలంలో ప్రజల మధ్య సంచరించిన ఆచా రాలకు అంతులేదు. ప్రాచీన పశ్చిమ ఆసియాలోని ఇతర ప్రాంతాలలాగా ఇశ్రాయేలీయులలో కూడా ఋతువు లను ఆధారం చేసుకొని తయారు చేసిన పంచాంగం వాడుకలో ఉండేది. యూదుల పంచాంగంలో సంవత్స రానికి పన్నెండు నెలలు. సాధారణంగా మాసాల పేర్లు కంటే ఋతువుల పేర్లే ఎక్కువగా వాడుకలో ఉండేవి. ఆయా ఋతువులలోని సేద్యపు పనులను బట్టి కాలమానాన్ని వాడుక చేసుకొన్నారు.

బైబిల్ గ్రంథంలోని మాసాల పేర్లు :

- హబీబు(సీసాను) - మార్చి, ఏప్రిల్
- జీపు - ఏప్రిల్, మే
- సీసాను - మే, జూన్,
- తమ్ముజు - జూన్, జూలై
- హబ్ - జూలై, ఆగష్టు
- ఏలూలు - ఆగష్టు, సెప్టెంబరు
- ఏతనీము - సెప్టెంబరు, అక్టోబరు
- బూలు - అక్టోబరు, నవంబరు
- కిస్లేపు - నవంబరు, డిసెంబరు
- టేబేతు - డిసెంబరు, జనవరి
- సెబాతు - జనవరి, ఫిబ్రవరి
- ఆదారు - ఫిబ్రవరి, మార్చి

పాలస్తీనాలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య కాలంలో పొడి వాతావరణం, అక్టోబరు నుండి మార్చి వరకు వర్షాకాలం, నవంబరు -డిసెంబరు నెలల్లో నాట్లు ఆరంభమౌతాయి. ఏప్రిల్ నుండి జూన్ వరకు కోతకాలం ఇశ్రాయేలు ప్రజలకు సంవత్సరంలోని నెలలు మత పరంగా కూడా ప్రాముఖ్యమైనవి. ప్రతి నెల మొదటి దినం ఇశ్రాయేలీయులు పండుగను ఆచారించేవారు. వార్షిక పండుగలు, వ్యవసాయ పనులకు సంబంధించిన పండుగలు జరుపుకొనేవారు.

శిశిర ఋతువులో పండుగలను ఆచరించేవారు. విశ్రాంతి దినం తిప్రి నెల 10దినం ప్రజలు ఉపవాసం ఉండి ప్రాయశ్చిత్తార్థ సంతాపం పాటించే దినం. ఇలా అనేక ఆచారాలను పాటించేవారు.

పండుగలు :

దేవుడు తమకు చూసిన కృపలను పండుగలలో

జ్ఞాపకం చేసుకొనేవారు. దేవుణ్ణి దర్శించి దీవెనలు పొందడానికి పండుగలలో ప్రజలు సమాజంగా కూడుకొనే వారు. చాలా పండుగలలో రాజులు తాము చేసిన పాపాలను ఒప్పుకొనేవారు. ధర్మశాస్త్రం పట్ల భక్తితో ఉండేవారు. ప్రవక్తలు తరచుగా

ఈ పండుగలను ఆచరించుటకు నిరసించారు. ఇశ్రాయేలీయులు జరుపుకొనే పండుగలు చూస్తే- దినదినము జరుపుకొనే పండుగ, వారంలో జరిగే పండుగ, పస్కా పండుగ, పర్ణశాల పండుగ లేక గుడారాల పండుగ, పూరీము పండుగ, దేవాలయ ప్రతిష్టిత పండుగ, వసంత కాలపు పండుగ (పస్కా, పొలియని రొట్టెల పండుగ) ఇలా అనేక రకాల పండుగలను జరుపుకొనేవారు.

ఇందులో పస్కా పండుగ అంటే పొలియని రొట్టెల పండుగ. ఐగుప్తు నుండి విడుదల పొందిన దానికి జ్ఞాపకార్థంగా ఒక వారం పాటు జరుపుకొంటారు. మాంసం, చేదురొట్టెలు, పులియని రొట్టెలు మాత్రమే ఆహారంగా తీసుకొనేవారు. పులియని రొట్టెలు తినడం అంటే ఒక వ్యవసాయక సంబంధమైన పండుగ. లేక కోత కాలపు పండుగ అని తర్వాత కాలంలో పెంతుకోస్తు పండుగ అని పిలవడం జరిగింది.

సంచార జీవితం :

బైబిల్‌లో మొదటి దేశ దిమ్మరిగా లేక సంచార జీవిగా కయినును చెప్పవచ్చు. ఒక పెద్ద రాష్ట్రంలో ఆయా కాలాలలో తమ నివాసాలను మార్చుకొంటూ స్థిర నివాసం లేకుండా సంచరించే వారు. అబ్రహాము తన సంచార జీవితం ప్రారంభించక పూర్వం "ఊర్" అనే గ్రామంలో ఉండేవారు.

ఈజిప్టు నుండి బయలుదేరిన తర్వాత ఇశ్రాయేలియులు అరణ్యంలో తాత్కాలికంగా సంచార జీవితం గడిపారు.

వివాహం :

స్త్రీ పురుషులు తమ సమాజం ఆమోదంతో లైంగిక సంబంధం కలిగి సమజీవనం చేసే స్థితి. వివాహం జరగడం సర్వసాధారణంగా ఎంచారు. ప్రాచీన బబులోను వారి"హమ్మురాపి" చట్టంలో రాసిన ప్రకారం ప్రధానం అయిన తర్వాత పెళ్ళి కొడుకు పెళ్ళిని భంగ పరచినపుడు పెళ్లి కూతురి తండ్రి పెళ్లికూతురి ఓలిని ఉంచుకొనవచ్చును. అలాకాక తండ్రి మనసు మార్చుకొని పిల్లని ఇవ్వను అంటే పుచ్చుకొన్న ఓలికి రెండింతలు వరునికి చెల్లించాలి. పెండ్లి కూతురు తండ్రి తన కుమార్తెకు కట్నంగా దాసీలనుగాని, భూమినిగాని ఇస్తారు. ఆమె భర్త పెండ్లి కానుకగా ఆమెకు నగలు లేక బట్టలు ఇచ్చేవారు. వివాహం అయిన తర్వాత వధువును తన ఆధీనంలోకి తీసుకొనిన గుర్తుగా వరుడు ఆమెపై ఒక దుప్పటికప్పును. అలా వారి వివాహం పూర్తి అవుతొంది. ఇంకొక ఆచారం కుడా ఉంది. వధువును వధువు ఇంటి దగ్గర నుండి వరుని ఇంటి తీసుకురావడానికి వరుడు తన మామను మెప్పించాలి. మాయ అనుమతితో వధువుని స్వగృహానికి తెచ్చుకొంటారు.

ఆహారపు అలవాట్లు :

ప్రాచీన కాలంలో మొదటి నుండి ధాన్యం, కూరగాయాలు, పండ్లు మానవునికి ఆహారంగా ఉండేవి. నోవాహు జల ప్రళయం పూర్వం మానవకోటి అంతా శాఖాహారులుగా ఉండేవారు. తర్వాత జంతువులను ఆహారంగా తీసుకొన్నారు. తర్వాత కాలంలో ఐగుప్తు, పాలస్తీనా, మెసపొటోమియా దేశాలలో ధాన్యం, రొట్టెలతో పాటు వెన్న, జున్ను, ద్రాక్షరసం, నీరు మొ॥వి ఆహారంగా తీసుకొనేవారు. ఎర్రగా ఉండే చిక్కుడు కూర సర్వ సాధారణం. అతిథులకు కొవ్విన దూడను వధించి వండి పెట్టేవారు. దానితో పాటు పెరుగు, పాలను కూడా ఆహారంగా తీసుకొనేవారు.

ఒలీవ నూనెను వంట నూనెగా ఉపయోగించారు. అంజూరపు పండ్లు కూడా ఉపయోగించారు. బైబిల్‌లో పాలస్తీన పాలు తేనే ప్రవహించే దేశం అని ప్రసిద్ధి ఉంది. ధనవంతులు తప్ప మిగిలిన వారు అప్పుడప్పుడూ మాత్రమే మాంసం తినేవారు. ఎద్దు, గొర్రె, మేక, జింక

మరి ఏడు రకాలైన వాటినే ఆహారానికి యోగ్యమైన పవిత్ర జంతువులుగా పరిగనించారు. హెబ్రీయులు ఆహారంలో పాలు ఒక భాగం. ఒంటె పాలను ఎక్కువగా ఉప యోగించేవారు. అడవి జంతువులలో తినదగిన వాటి జాబిత ఎర్రజింకు, చిన్న దుప్పి అనే వాటిని ఎక్కువగా వేటాడేవారు. నిషిద్ధ జంతువులలో పంది, కుందేలు, ఒంటె, గాడిద ముఖ్యమైనవి.

చేప జాతిలో పొలుసులు గల వాటినన్నింటిని తిన వచ్చు. రెక్కలు, పొలుసులు లేని వాటిని నిషేదించారు. ఐగుప్తులో ఉన్నప్పుడే చేపలను నిరాటంకంగా తిన్నారు. నెహెమ్యా కాలంలో తూరూ దేశస్థుల చేపల వర్తకం యెరుషలేము నందు బాగా జరిగింది. గలిలయ సముద్రంలో చేపల వర్తకం ఎక్కువగా జరిగేది.యేసుక్రీస్తు శిష్యులలో కూడా చేపల వ్యాపారం చేసేవాళ్ళు ఉన్నారు.

ప్రాచీన పాలస్తీనాలో ప్రధాన ఆహార పదార్థం రొట్టె. పేదలు బార్లీ రొట్టెను విస్తారంగా వాడారు. పవిత్ర భోజనంగా రొట్టెను తీసుకొనేవారు. ఇలా ఆహార విషయంలో కూడా ఏవి పవిత్రమో వాటినే ఆహారంగా సేవించారు.

వస్త్రాలు, ఆభరణాలు :

స్త్రీ, పురుషులు తమ శరీరాలకు రక్షణగా దుస్తులను ఉపయోగించారు. స్త్రీ పురుషులిద్దరికి ముఖ్యమైన దుస్తులు నడుముకు ధరించే అంగవస్త్రం, పొడవుగా లేక పొట్టిగా ఉండే చొక్కా లేక అంగి, పై బట్ట కప్పుకొనే వంటివి, తలపాగా, చెప్పులు మొ॥. ఆకాలం నుండి ఈ కాలం వరకు ఎన్నో రకాలైన దుస్తులను ఉపయోగిస్తు న్నారు.

పాతనిబంధన కాలంలో వస్త్రాల గురించిన ప్రస్థావన ఆదిలో ఆదాము, అవ్వలు దేవుడు తినవద్దు అని చెప్పిన పండును తినిన కారణంగా వారు మంచి చెడు తెలుసు కొని తాము దిగంబరులని ఎరిగి అంజూరపు ఆకులను కప్పుకొన్నారు. బైబిల్‌లోని ఆదికాండం మాత్రమే ఈ విషయానికి సాక్ష్యంగా ఉంది. మిగిలిన వాటిల్లో వస్త్రం గురించిన ప్రస్తావన అనేక విధాలుగా ఉంది. దేవుడే ఆదాము, అవ్వలకు చర్మపు చొక్కాలను చేయించి తొడి గించాడని, వ్యవసాయంలో కష్టపడిన నోవహు తర్వాత ద్రాక్షారసం తాగి వస్త్రహీనుడిగా ఉండడం కనిపిస్తుంది. ఈనాటి కాలంలో కూడా వస్త్రహీనత అవమానానికి గుర్తు.

విశేషమైన దినాలలో, ఉత్సవాలలో ప్రత్యేకమైన వస్త్రాలను ధరించేవారు. ఇలాంటి అలవాటే నేటి ప్రజలు కూడా ఆచరిస్తున్నారు. ప్రాచీనకాలంలో వివిధ వస్త్రాలను గురించి పేర్కొన్నారు. నారబట్టలు, చెంగు, లాగు, పై వస్త్రం లాంటివి ఉండేవి. సహజంగా నారలేక ఉన్నితో చేసిన బట్టలు, చేతులు ఉన్నవి, లేనివి కూడా ధరించే వారు. లోపల దుస్తులు వేసుకోలేదు. మోకాళ్ళ వరకు పురుషులు వస్త్రలను వేసుకొనేవారు. స్త్రీ పురుషులిద్దరూ ఒకని దుస్తులు మరోకరు ధరించడం నిషిద్ధం. కాబట్టి వారి దుస్తులలో గుర్తించదగిన భేదాలు ఉన్నా స్త్రీ పురుషుల దుస్తులు దాదాపు ఒకే విధంగా ఉండేది. స్త్రీల దుస్తులు ఎక్కువ రంగులతో ఉండేవి. స్త్రీలకు ముసుగు ఉండటమే వారి దుస్తుల భేదాలును తెలియజేస్తాయి. ఎక్కువగా సింధూర, ఎరుపు, నీలం కలిసిన రక్త వర్ణాలను ఎంచుకొనేవారు అలాంటి దుస్తులను బహుమతులుగా లేక రుసుముగా చెల్లించేవారు

పురాతన కాలంలో ప్రజలు నగలు ధరించేవారు. వాటికి ఎక్కువ విలువ ఇచ్చేవారు. నాణ్యెమ్ చలామణిలోకి రాకముందు వీటినే మానక ద్రవ్యాలుగా వాడేవారు. పాత నిబంధనలో చెప్పిన ఆభరణాలు చాలా వరకు నేటి ప్రజలు వాడుతున్న ఆభరణాలు వంటివి, కడియాలు, కర్ణభూషణం, పోగులు, ముక్కెరలు, నాణ్యమైన ముసుకు, రక్షారేకులు (తాయెత్తులాగా), వడ్డాణం, కీరి టాలు, మొదలైన అనేక ఆభరణాలను ఉపయోగించారు. నాణేలు స్త్రీకి ముఖ్యమైన ఆభరణనంగా ఎంచేవారు.

భాషలు :

ఇశ్రాయేలీయులు హెబ్రీ భాషను మాట్లాడం మాని సిరియా దేశంలో వాడుకగా ఉండే అరమేయాక్ భాషను

మాట్లాడేవారు. బైబిల్లోని దానియేలు గ్రంథం, ప్రసంగిలో కొన్నిభాగాలు అరమేయాక్ భాషలోనే రాశారు.

అరామూ భాష :

అరామూ దేశస్థుల భాష అరామూ. హెబ్రీ అరామూ అక్షరాలు ఒకే రీతిగా ఉండేవి. నీనెవే పట్టణం. క్రీ.శ నకు ముందు 8వ శతాబ్దంలో ఈ భాషను ఉపయోగించారని రాతి శాసనాల వలన తెలుస్తుంది. రాజైన హిజ్కియా కాలంలో జనులు తమ వ్యాపారాలలోను ఇతర పనులను చేయడానికి ఈ భాషను వాడారు. క్రీ.పూ 9వ శాతాబ్దంలో నుండి వర్తకానికి సంబంధించినది. ఇది అంతర్జాతీయ భాషగా ఉన్నది.

హెబ్రీ భాష :

యూదుల భాష బైబిల్‌లోని పాత నిబంధనను ఈ భాషలోనే రాశారు. ఉర్దూభాష లాగా దీనిని కుడితట్టు నుండి ఎడమ వైపుకు రాస్తారు. హల్లులను మాత్రం ప్రత్యేకంగా రాశారు. అచ్చులను రాయకుండా శబ్దాలను నోటి పాట ద్వారా నేర్పించారు.

గ్రీకు భాష :

క్రొత్త నిబంధన రాత ప్రతులను సామాన్యమైన వాడుక భాషలో రాశారు. రోమా సామ్రాజ్యకాలంలో పశ్చిమాసియ మధ్యధారా ప్రాంతంలోని ప్రజలు గ్రీకు భాషను సాధారణంగా ఉపయోగించారు.

వ్యవసాయం :

యెరికో జరిగిన త్రవ్వకాలలో మానవ చరిత్రలో అతి ప్రాచీన కాలంలో వ్యవసాయం జరిగిన ప్రాంతం పాలస్తీనా. క్రీ.పూ7500 నాటికే నీటిపారుదల వ్యవసాయం జరిగింది. భూములను ఎకరానికి ప్రకారం కాక ఒకకాడి ఎడ్లు రోజుకు దున్నతగినంతగా రూకలను ఇచ్చేవారు. మూల రాళ్ళు వేసి ఆయా వారి పొలాలను లెక్కించేవారు. వాటిని మార్చడం గొప్ప పాపంతో ఒకటిగా భావించేవారు. వారి పొలాలు మగాణి లేక మెట్ట భూములుగా ఉండేవి. భూమికి సాగుబడి చేయడానికి ఎరువులను వాడలేదు. కాని ప్రతి ఏడు సంవత్సరాలకు ఒకసారి భూమిని సేద్యం చేయకుండా ఊరికే విడిచిపెట్టేవారు. నాగలిని సర్వ సాధారణంగా వాడే పనిముట్టుగా ఉపయోగించారు. పార లతో భూమిని తవ్వినట్లు కలదు. రంపము, పళ్ళున్న కొడవలి, కొయ్యనాగలి మొదలైన పనిముట్ల ఉపయోగించారు. దున్నడానికి ఎడ్లను, గాడిదలను ఉపయోగించారు. పంట పండించిన తర్వాత మూలలలో ఉండే వాటిని కోయకుండా బీదల కోసం విడిచి పెట్టాలనే నిమయం ఉంది. "వారికోసం పరిగెను ఏరక విడువ వలెను" అనే ఆజ్ఞ ఉంది. తుమ్మచెట్లు, బాదం చెట్లు, దేవదారు వృక్షాలు, తమారువృక్షాలు, సింధూర, ఖర్జూరం, దానిమ్మ, మారేడు, చితిసారపుమాను, గుగ్గిలం లేక మస్తకి వంటి చెట్లు వుండేవి. గోధుమ, బార్లీ, చిక్కుళ్ళు, బఠాణీలు, ఒలీవనూనె, ద్రాక్ష, దోసకాయ, పుచ్చకాయ, అంజూపరు చెట్లు, కెనాయ మొక్క, వెర్రిద్రాక్షచెట్టు, కర్పూర వృక్షం, హిసోపు వృక్షం, కొలకర్ర చెట్టు, తదాపయొక్క, కూరాకుల మొక్క, రెల్లుగడ్డిమొక్క, రక్త వర్ణపు నూలుమొక్క, ఇలా అనేక వృక్షాలు ఆనాటి కాలంలో ఉండేవని చెప్పవచ్చు.

పరిమళ ద్రవ్యాలు :

ప్రాచీన కాలంలో చూర్ణంతో చేసి తగు పాలలో మిశ్రమం చేసిన ఖనిజ పదార్థాలు, జంతువుల కొవ్వు, వనస్పతి నూనెలు మొదలగు వాటిని కలిపి సౌందర్య పోషక పదార్థాలు తయారు చేసేవారు. జటామాంసి, గోపరసం, బోళం, సాంబ్రాణి, గంధపు చెక్క, చందనం, పునుగు, జవ్వాది, కస్తూరి, అగరు, నిమ్మగడ్డి, గచ్చపాద, మాచిపత్రి మొక్క వంటి వాటిని పరిమళం రావడానికి వాడేవారు.

ఔషధాలు :

ఐగుప్తీయులకు మంచి మందులు తెలుసు. హెబ్రీయులు ఔషధ విషయములో మిగుల ఆరితేరి ఉండిన అష్షురు బాబెలు వారికి లోబడి ఉన్న కాలంలో వారు వైద్యం బాగా నేర్చుకొన్నారు. అంజూరపు పండ్ల ముద్దను గడ్డలు పగులుటకు వాడేవారు. గుగ్గిలం (గాయాలు

మాన్పడం) తైలం (గాయాలు, పుండ్లు), ద్రాక్షరసం (గాయాలు ఆకలి పుట్టించడానికి), నూనె (దేహానికి పూయడానికి) మొదలైన ఔషధాలను వాడటం జరిగింది.

సంగీత వాద్యాయి :

ఆది నుండి సంగీతానికి మత ప్రాధాన్యాలతో పాటు సాంఘిక ఉపయోగం ఉంది. హెబ్రీ సంస్కృతిలో సంగీతానికి ప్రధానస్థానం ఉంది. సాగనంపు సమయంలో, విందు సమయంలో సంగీత వాయిద్యాలను వాడారు. యుద్ధానికి వెళ్ళేవారికి రోషం పుట్టించడానికి ఉత్సాహ వంతులుగా చేయడానికి సంగీతం ఆలపించేవారు. ప్రవక్తలకు ఆవేశం పుట్టించడానికి, వారికి కలిగిన ఆవేశాన్ని తగ్గించడానికి, పిశాచ ప్రేరితులగు వారిని శాతింప చేయడానికి, ఇంకా అనేక విధాలుగా సంగీతాన్ని ఉపయోగించారు. ముఖ్యంగా చెప్పాంటే దైవారాధనలో సంగీతం బహు ప్రాధాన్యతను సంతరించుకొంది. దావీదు దేవుని మందసమును యేరుషలేముకు తెచ్చినప్పుడు సంగీతముతో గానాలు చేశారు. ఆలయాలను ప్రతిష్ఠించినప్పుడు సంగీతం ఆరాధనలో ఎక్కువ ప్రాముఖ్యత వహించింది.

తంబుర డోలు, తాళాలు, పెద్ద తాళాలు, పిల్లన గ్రోవి, సన్నాయి, సానిక, కొమ్ము, బాకా, బూరగలు తంతుల స్వర మండలం తమ విపంచిక, వీణ సుంఫోనీయ వంటి వాయిద్యాలను ఉపయోగించారు.

ముగింపు :

ఈ విధంగా బైబిల్‌లోని ప్రజల అలవాట్లు, వారి పనులు, ఆహారం, నివాసాలు మొ॥ ఉన్నాయి. కాని ఇవే కాక అనేక విషయాలను కూడా బైబిల్‌లో చూడవచ్చు. ఈనాటి కాలం ప్రజల జీవన విధానానికి ఆనాటి వారి జీవన విధానానికి కొంత వ్యత్యాసం ఉందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఆధారగ్రంథాలు :

1. పరిశుద్ధ గ్రంథం
2. బైబిలు గ్రంథ చరిత్ర- టి.జాన్‌రత్నం
3. క్రైస్తవ వేదాంత శాస్త్రం - డా. జోసఫ్ పాతూరి
4. సంపూర్ణ బైబిలు జాబితాలు - హెచ్. ఎల్. విల్మింగ్ టన్

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రాచపూటి రమేష్ కథలు – జీవన చిత్రాలు

– యస్. చంద్రయ్య, పరిశోధక విద్యార్థి, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతి.

తెలుగు కథా సాహిత్యం ఈరోజు కొత్త కొత్త కథా వస్తువులతో సమకాలీన సమాజాన్ని ప్రతిబింబచేస్తూ ముందుకు సాగుతుంది. ఈ క్రమంలో అనేక మంది కథా రచయితలు సమాజంపై ఉన్న నిబద్ధతో, బాధ్యతతో రచనావ్యాసాంగాన్ని కొనసాగిస్తూ అద్భుతమైనటువంటి కథలను సృష్టిస్తున్నారు. తెలుగు ఉపాధ్యాయుడుగాను, అధ్యాపకుడుగాను, ఆచార్యుడుగాను ఉంటూ కథలు రాయడం కాకుండా, ప్రభుత్వ సంబంధమైనటువంటి అధికారులుగా భాద్యతలను నిర్వర్తిస్తూ అద్భుతంగా తెలుగు సాహిత్యానికి సేవ చేస్తున్న వారిలో వాడ్రేవు చిన వీరభద్రుడు మొదలైనటువంటి వారిని చెప్పుకోవచ్చు. ఆ కోవకు చెందినవాడే చేనేత జౌళిశాఖలో అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్నటువంటి రాచపూటి రమేష్. ఆయన చదువుకుంది. ఎం.ఏ. ఇంగ్లీషు అయినప్పటికీ, ప్రవృత్తి రిత్యా చక్కనైనటువంటి కథలు రాస్తూ, తెలుగు శ్రోతలకు సందేశాన్నిస్తున్నాడు. కడప జిల్లా, రైల్వే కోడూరు సమీపంలోని బుడుగుంట పల్లెకి చెందిన ఈ రచయిత దాదాపుగా ఇప్పటి వరకు 5 కథాసంపూటాల్ని ప్రచురించాడు. అలాగే తనకు ఉన్నటువంటి ఆంగ్ల భాషా పరిజ్ఞానంతో ఆంగ్లం నుంచి ఎన్నో కథలను తెలుగులోకి అనువదించి, వివిధ పత్రికలలో ప్రచురింపజేస్తున్నాడు. ఆయన రాసిన గాలి గోపురం, అందమైన అబద్ధం, మైత్రీవనం, వలయం, నెమలి కన్ను చీర వంటి కథా సంపూటాల్లో ఎన్నో జీవన చిత్రాలు మనకు కనిపిస్తాయి. ఎన్నో జీవనశిల్పాలు పాఠకుడికి దర్శనం ఇస్తాయి. ఈయన రాసిన రచనలు అన్ని మధ్య తరగతి జీవితానికి సంబంధించినటువంటి ఇతి వృత్తాలు కావడం గమనించదగ్గిన విషయం. ముఖ్యంగా చేనేతవృత్తి కారులు నేటి సమాజంలో ఎదు ర్కొంటున్న సవాళ్లతోపాటు, ఉద్యోగవ్యవస్థలో అనేక మంది రకరకాల ప్రవర్తనలతో సాగిస్తున్న జీవనాన్ని కూడా రచయిత గ్రంథస్థం చేశాడు.

రాచపూటి రమేష్ రాసిన కథల్లో అట్టడుగుపొరల్లో నివసించే ప్రజల జీవనసరళి కనిపించకపోయినప్పటికీ, మధ్యతరగతి, ముఖ్యంగా ఉద్యోగజీవనంలో సగటు మనిషి ఎదుర్కొంటున్న సవాళ్లను, ప్రపంచీకరణ నేపథ్యంలో చిద్రమైపోతున్న మానవవిలువలను, గ్రామీణ వ్యవస్థ చిన్నాభిన్నమైపోతున్న తీరును గురించి లోతైనటు వంటి చర్చ చేశాడు రచయిత. ఈయన రచనలోని కథా వస్తువు నెల్లూరు, చిత్తూరు, కడప పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుంది. ముఖ్యంగా తిరుపతి, నెల్లూరు, కడప వంటి ప్రాంతాలో జీవిస్తున్న ప్రజల జీవనచిత్రాలు, ముఖ్యంగా ఉద్యోగస్తుల మనస్తత్వాలు స్పష్టంగా కనిపిస్తాయి. రమేష్ కథల్లోని వస్తువు ఉద్యోగవ్యవస్థపైన కేంద్రీకరించడానికి కారణంగా ఆయన ఉద్యోగస్తుడుగా అనేక రకాలైనటువంటి జీవితాల్ని ప్రత్యక్షంగా పరిశీలించడం కావచ్చు. ఈయన రాసినటువంటి కథాసంపూటాల్లో మానవత్వ పరిమళాలు గుభాళిస్తుంటాయి. స్వయాన వాటిని కళ్లతో చూసి రాశాడా అనిపిస్తున్నట్లు కొన్ని ఇతి వృత్తాలు మనకు కనిపిపిస్తావుంటాయి. ఆయన కథాసంపూటాల్లో నుండి మచ్చుకి కొన్ని కథల్ని ఎంపిక చేసుకొని అందులో ఏవిధంగా మానవ జీవనచిత్రాలు ప్రతిఫలిస్తున్నాయో చెప్పడం ఈ వ్యాసం ఉద్దేశం.

ఈయన రాసిన కథలకి ఎక్కువగా సాంప్రదాయ బద్ధమైన శీర్షికలను ఎంపిక చేసినప్పటకీ, కథల్లో ఉన్నటువంటి వస్తువు మాత్రం సామాజికమైనటువంటి సందేశంతో, మానవత్వం వైపు నడక సాగిస్తుంది. కథా సంపూటాలకి పెట్టిన పేర్లు గానీ, కథలకు ఎంచుకున్నటు వంటి శీర్షికలు గానీ, రచయితలోని సాంప్రదాయ భావాల

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

వాసనలకు గుర్తులుగా కనిపిస్తాయి. 'అద్వైతం' అనేకథ శీర్షిక చూడడానికి ఆధ్యాత్మిక సంబంధమైనదిగా కని పించినప్పటికీ, మనిషి మానవత్వం విషయంలో ద్వంద్వవైఖరిని అవలంభించకూడదు అని తెలియ జేస్తుంది. ఒక వ్యక్తి శ్రీకాకుళం ప్రాంతానికి వెళ్లి, తిరిగి రావడానికి చివరిదైన రైలును అందుకోవడం కోసం రిజర్వేషన్ కౌంటర్ దగ్గర నానా అగచాట్లు పడుతాడు. రిజర్వేషన్ చేసే ఉద్యోగి ఐదు నిమిషాలు వుండగానే కౌంటర్‌ను క్లోజ్ చేసి 'నేను ఇప్పుడు చేయలేను' అంటూ వెళ్లిపోయే సందర్భంలో తనను ఎదో ఒక విధంగా బస్టాండు దగ్గర అయినా దించమని బ్రతిమలాడు కుంటాడు. తన దగ్గర ఉన్నటువంటి పండ్ల బుట్టను మోయడానికి పనికి వస్తాడనే ఉద్దేశంతో బస్టాండు దగ్గర దించి అతనికి సహాయం చేసినట్లు నటిస్తాడు ఆ రైల్వే ఉద్యోగి. కాలం ఎప్పుడు ఒకేలా ఉండదు. అదే ఉద్యోగి మొక్కు తీర్చుకోవడం కోసం తిరుమల కొండపైకి వెళ్లి తన సూటేకేసు పొగొట్టుకుని, దిగాలు మోహంతో తిరుపతి చేరుకుంటాడు. అతనికి తెలిసిన వాళ్లు ఎవ్వరూ అక్కడ లేకపోవడంతో నానా యాతన పడుతాడు. చివరకు తనకు తెలిసి బ్యాంకు ఉద్యోగి ఉన్నాడు అని తెలుసుకొని అతని కోసం వాకబు చేస్తాడు. అతడు మైసూరు వెళ్లాడు అని తెలుసుకొని నిరుత్సాహపడుతాడు. ఆ సమయంలో ఒక వ్యక్తి ఆ ఉద్యోగిని ఆప్తుడుగా తీసుకువెళ్లి, తన ఇంట్లో ఉంచుకొని భోజనం పెట్టి, పరిశుభ్రమైనటువంటి గది ఇచ్చి, తెల్లవారి రైలు దగ్గర వదిలిపెడుతాడు. అప్పటికీ ఆ రైల్వేఉద్యోగికి ఆదరించిన వ్యక్తితో ఉన్నటువంటి సంబంధం ఏమిటో గుర్తించలేకపోతాడు. రైల్లో ఎక్కి బయలుదేరిన తరువాత చాలాసేపటికి గానీ ఆవిధంగా తనను ఆదుకొన్న వ్యక్తి ఒకప్పుడు రిజర్వేషన్ టికెట్టు ఇవ్వకుండా పంపించి వేసిన వ్యక్తిగా జ్ఞాపకం చేసు కుంటాడు. తమకంటే తక్కువ స్థాయి దుస్తులు ధరించి వారిని తక్కువగా చూడడం, భాద్యతలు మరిచిపోవడం ముఖ్యంగా మానవత్వం విస్మరించడం ఎప్పటికీ మంచిది కాదు అనే విషయాన్ని తెలియజేస్తూ అద్వైతం అనే కథ ముగిస్తాడు రచయిత.

అలాగే నీతిగా బ్రతకడాని పలుభాషలతో పరిచయం అవసరంలేదు అనే విషయాన్ని చెప్తూ 'బహు భాషా కోవిదుడు' అనే కథరాశాడు. ఒక ప్రవేటు కంపెనీలో ఉద్యోగం చేసేటటువంటి ఉద్యోగస్తుల సగటు మస్తత్వం ఎలా వుంటుంది, పై అధికారిని మెప్పించి ఉన్నత స్థితిలోకి ఎదగాలని సగటు ఉద్యోగి ఎలా తాపత్రయ పడుతాడు, వంటి విషయాలు తెలియజెప్పే కథ ఇది. ఆఫీసులో పనిచేసే ఒక ఉద్యోగి మేనేజర్‌ను రకరకాల భాషా పాండిత్యాలతో బుట్టలో వేసుకుని, ప్రమోషన్ కోసం ప్రతిభావంతుల్ని తొక్కేటువంటి పరిస్థితి ఈ కథలో కన బడుతుంది. తోటిమనిషికి సహాయం చేసే విషయంలో పక్క వారిని ఆదుకొనే విషయంలో అతనికి మనస్సు లేదని తెలుసుకున్న మేనేజర్ అతనిని ప్రమేషన్‌కి అనర్హుడుగా ప్రకటిస్తాడు.

నగరజీవనంలో భాగంగా మనషులు మధ్య సంబం ధాలు యాంత్రికంగా మారుతున్నతీరును 'అంతరాలు' అనే కథలో వివరిస్తాడు రమేష్. తాను 5సం॥ నుంచి తమ ఊరికి దూరంగా ఢిల్లీలో నివసిస్తూ ఉండడం వల్ల బాంధవ్యాలకు, అనుబంధాలకు దూరమై ఉంటాడు ఓ ఉద్యోగి. ఆ సమయంలో తన పెదనాన్న కొడుకు ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ మీద వస్తున్నాడని తెలుసుకొని ఎంతో ఆనంద పడుతాడు. వరుసకు అన్న అయిన అతనికి కుటుంబం కోసం వారంరోజులు తిరిగి మంచి ఇల్లు చూసి పెట్టి వారిని సకల లాంఛనాలతో ఆ ఇంట్లో ప్రవేశపెడుతాడు. ఎంతో అప్యాయంగా అనుబంధంగా వారితో మసలు కుంటాడు కానీ, వారికోసం అంతశ్రమపడ్డా సోదరుడు మాత్రం తమ్ముడు గురించి ఒక్క క్షణం కూడా ఆలోచిం చడు. తన ఊరి నుంచి వచ్చిన అన్నా వదిన పిల్లలతో ఉండాలి అనే ఉద్దేశంతో ఒక ఆదివారం తీరిక చూసుకొని వారి ఇంటికి వచ్చిన ఆ ఉద్యోగికి చేదు అనుభవం ఎదురౌతుంది. మద్యాహ్నం 2గం॥లకు తప్పని పరిస్థితుల్లో

పనికి మాలిన పదార్థాలతో ఆహారం పెట్టి, మొక్కుబడి చెల్లిస్తారు. దాంతో ఎంతో భాదపడ్డ ఆ సగటు ఉద్యోగి అనుబంధాలు నాగరికత ముసుగులో మూసుకు పోయాయని భాదపడుతాడు. అలా వెళ్తుతున్న క్రమంలో తనకు తెలియని వ్యక్తి పలకరించడంతో ఆశ్చర్యపోతాడు. అతడు తన తండ్రి దగ్గర చదువుకున్న ఒక విద్యార్థిగా తెలుసుకుంటాడు. అతని బలవంతపై వారి ఇంటికి వెళ్లి వారితో కలిసి భోంచేస్తాడు. ఆ వ్యక్తి చూపించిన అప్యాయతలు, అనురాగాలు వంటి వాటి ముందు తన సోదరుడు చేసినటువంటి అవమానాన్ని గుర్తు చేసుకుంటాడు. ఎప్పుడో తన తండ్రి చేసినటువంటి ఉపకారాన్ని గుర్తుపెట్టుకొని ఈవిధంగా తనను గౌరవించడం ఆ ఉద్యోగికి ఆశ్చర్యం కలిగిస్తుంది. యాంత్రిక యుగంలో పక్క వారిని పలకరిస్తే తమకు ఏమి లాభం, చిరునవ్వు నవ్వితే తమకేమి ఉపయోగం అని ఆలోచించే వ్యవస్థలో కూడా ఆలాంటి తులసి మొక్క లాంటి వ్యక్తులు ఉండడం మానవత్వానికి నిదర్శనం అని చెప్పడానికి రచయిత ఈ కథను రాశాడు.

అలాగే రాచపూటి రమేష్ రాసినటువంటి మరొక కథ 'అంచనాలు'. ఎదుటి వ్యక్తులు గుర్తుంచుకోవడం కోసం సహాయం చేసినట్లు నటించే తత్వంగల వ్యక్తులు కొంతమంది సమాజంలో ఉంటారు. అలా కాకుండా తమ జీవనంలోను తోటి మనిషికి సహాయం చేయాలి అనే తత్వాని జీర్ణించుకున్న వ్యక్తులు మరికొంతమంది ఉంటారు. ఈ విషయాన్ని కథలో తెలియజేశాడు రచయిత. ఇప్పటికీ చాలా గ్రామాల్లో పేద విద్యర్థులను, ఆర్థికంగా చదువు కోవడానికి వెసులుబాటు లేనటువంటి విద్యార్థులని ఆదరణతో చదివించే ఉపాధ్యాయులు కొంత మంది ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో మానవ సంబంధాలు ఆర్థిక అంశాలు చుట్టూ తిరుగుతూ వుండడం వల్ల ఇలాంటి ధోరణి కరువౌతుంది అని చెప్పడానికి ఈ కథను రాశాడు రచయిత. ఒక టీచర్‌గా బరువు బాధ్యతలు లేని రోజుల్లో పేద విద్యార్థులకు సహాయం చేసిన ఒక ఉపాధ్యాయురాలు, తరువాత కాలంలో కుటుంబ బరువుబాధ్యతల నేపథ్యం, ఆర్థిక పరిస్థితులు సహకరించక పోవడంతో పేద విద్యార్థినికి సహాయం చేయలేకపోతునని బాధపడుతుంటుంది. గతంలో రాజేశ్వరి అనే విద్యార్థికి తాను చేసిన సహాయంవల్ల అమె గవర్నమెంటు కాలేజిలో అధ్యాపకురాలు కావడం, పేద పిల్లలకు సహాయం చేస్తాను అని హామి ఇవ్వడంతో ఈ ఉపాధ్యాయురాలు సంతోషిస్తుంది. ఆమె భరోసాతో గౌరి అనే విద్యార్థిని చదివించడానికి పూనుకుంటుంది. అయితే ఉపాధ్యాయురాలు ఆ విషయమై నేరుగా మాట్లాడటానికి రాజేశ్వరి ఉంటున్న ఊరుకు వెళ్లి ప్రయత్నిస్తుంది. అయితే ఆ సమయంలో ఆమె ఇంట్లో లేక పోవడంతో, ఇంట్లో పని చేసే వ్యక్తుల ద్వారా తాను వచ్చిన సమాచారాన్ని చేరవేస్తుంది. ఆ తరువాత కొంత కాలానికి రాజేశ్వరి టీచర్‌కు 40 వేల రూపాయలు డి.డి పంపించి, గౌరి అనే విద్యార్థిని చదివించమని కోరుతుంది. తరువాత ఎప్పుడూ ఆమె తన టీచర్‌కి ఫోన్ చేయడం గానీ, ఎలాంటి ప్రస్తావన చేయకపోవడంతో గర్వం పెరిగింది అని అభిప్రాయ పడుతుంది టీచర్. అయితే తరువాత కొంతకాలానికి తనకు తెలిసినటువంటి స్నేహితురాలు ద్వారా రాజేశ్వరి కిడ్నీ సంబంధిత వ్యాధితో భాదపడుతూ చనిపోయిందని, తాను చనిపోవడానికి కొద్ది రోజుల ముందే తన చేతి గాజులు అమ్మి, ఆ డబ్బు ఎవ్వరో పేద పిల్లను చదివించడానికి డి.డి తీసి పంపిందని అని తెలుసుకొని టీచర్ విచారిస్తుంది. చేసిన సహాయాన్ని తప్ప తనకున్న నమన్యలను చెప్పుకోని ఆదర్శవంత మైనటువంటి మానవతా విలువలు కలిగిన వ్యక్తులు ఈ నాటి సమాజంలో కూడా ఉన్నారని చెప్పడానికి రచయిత ఈ కథను రాశాడు.

సాధారణంగా అధికారులు కఠినస్వభావం కలిగి ఉంటారని, మానవతావిలువలు లోపించి వుంటాయని ఒక విమర్శ వుంది. అయితే మన సమాజంలోను యస్.ఆర్. శంకరన్ లాంటి కలెక్టర్లు, ఎంతో మంది

ప్రభుత్వం అధికారులు ప్రజలతో మమేకమై సేవలు చేసిన విషయాన్ని మన గుర్తుంచుకోవాలి. ఆక్రమంలోనే రాచ పూటి రమేష్ రాసిన 'నిలువుటద్దం' అనే కథ అధికారుల్లో మానవ విలువలు ఎలా ఉంటాయి అనే విషయాన్ని వివరిస్తుంది. తాను చదువుకునే రోజుల్లో జ్వరంతో బాదపడుతూ ఆసుపత్రి ముంగిట్లో విలవిలలాడుచున్న సమయంలో ఆనాటి డిప్యూటి కలెక్టరు ఆకస్మికంగా ఆసుపత్రిని సందర్శించి తనకు ఆరోగ్యంతో పాటు జీవి తాన్ని ప్రసాదించిన విషయాన్ని గుర్తుంచుకున్న చంద్రశేఖర్ ఇంట్లో ఆడంబరాలకు పోకుండా పిల్లల్ని పెంచి పెద్ద చేస్తాడు. ప్రతి నిత్యం ప్రజాసేవలోనే నిమగ్నం అవుతాడు. చివరకు తన పిల్లల పుట్టిన రోజున కూడా ఇంట్లో వుండ నటువంటి పరిస్థితి. ఈ విషయాన్ని ఇంట్లో కుటుంబ సభ్యులందరూ ఒకసారి నిలదీసి ప్రశ్నించినప్పుడు వారిని నేరుగా ఒక ఆసుపత్రికి తీసుకువెళ్లి, అక్కడ ఉన్నటువంటి రోగులను వాళ్ల సమస్యలను వినిపించి, ఇలాంటి పరిస్థితుల్లో నుండే తాను వచ్చినాన్ని, అందుకే ఖచ్చితంగా తాను ఇలాంటి విలువలకు కట్టుబడి వుంటానని, అందరూ అర్థం చేసుకోండని తన భార్య బిడ్డలకు వివరిస్తాడు. ఇలాంటి నిబద్ధత కలిగినటువంటి, మాన వతా విలువలు కలిగినటువంటి అధికారుల తత్వాన్ని వివరిస్తూ రచయిత చక్కటి సందేశాన్ని ఇచ్చారు.

రచయిత 2006సం॥లో రాసినటువంటి 'చేదు నిజం' అనే ఈ కథ అనేక రూపాలతో ఇటీవల కాలంలో వాట్సప్ గ్రూపుల్లో బాగా ప్రసిద్ధి పొందింది. మానవ సంబంధాలు అనేవి ప్రపంచీకరణ నేపథ్యంలో ఎలా విచ్ఛిత్తిని పొందుతున్నాయో దాదాపుగా 14సం॥లు క్రితమే రాచపూటి రమేష్ గుర్తించాడు. తనకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుడ్ని చేసిన తండ్రిని ఎంతో ఇష్టంగా చూసు కోవలసిన ఓ కొడుకు, భార్య సూటి పోటి మాటలతో, నిరాసక్తతో తండ్రిని ఎలా వదించుకోవాలో ఆలోచించడం 'చేదు నిజం' కథలో వస్తువు. తనకు జీవితాన్ని ఇచ్చిన తండ్రి మనస్సు ఎలా ఉందో అర్థం చేసుకోలేక పోతాడు ఆ కొడుకు. మొదట చాటుగా, ఆ తరువాత బహి రంగంగా తన మామ ఇంట్లో వుండడం ఇష్టం లేదని చెప్పిన భార్యను సముదాయించలేకపోతాడు. ఆమెకు సమస్యను విప్పిచెప్పలేకపోతాడు. బిడ్డగా తండ్రిని జాగ్రతగా చూసుకోవలసిన బాధ్యత వుందని విడమరచి చెప్పలేకపోతాడు. చివరకు అతని తండ్రే ఒక రోజు తాను ఆశ్రమంలో జీవించాలపిస్తుందని చెప్పినప్పుడు మౌనంగా తండ్రిని స్కూటర్‌పై ఎక్కించుకొని వెళ్లుతాడు. ఆశ్రమానికి తీసుకెళ్తాడు. ముందు తండ్రి దిగి కొడుకును వెళ్లిరమ్మని వీడ్కోలు చెప్పుతాడు. చివరకు ఆ తండ్రి లోపలకి వెళ్లిన కొద్దిసేపటి తరువాత ఈ కొడుకు మేనేజర్ రూంలోకి అడుగుపెట్టబోతుంటే అక్కడనుంచి కొన్ని మాటలు వినిపిస్తాయి. 'పాతికేళ్ల క్రితం మీరు ఒక మూడేళ్ల బాబును తీసుకెళ్లారు పెంచుకోవడానికి ఆ బాబు ఎలా ఉన్నాడు' అని తన తండ్రి మేనేజర్‌ను ప్రశ్నిస్తూంటాడు. అప్పుడు అనాథగావున్న తనను తీసుకు వెళ్లింది, ఇంతవాడ్ని చేసింది సొంత తండ్రి కాదని తెలుసుకొని ఆ కొడుకు తనను క్షమించమని తండ్రి కాళ్లపై వాలి పోతాడు. మానవతా విలువలు మంటగలుపుతున్న బిడ్డలు, తండ్రులను వృద్దా శ్రమాల్లో చేర్చి గొప్పలు చెప్పుకునే బిడ్డలు ఈనాడు వీధి కొక్కరు పుట్టుకొస్తున్న సమాజంలో అలాంటి బిడ్డలకు చెంపదెబ్బ లాంటి కథను రాశాడు రచయిత.

ఇలా చెప్పుకుంటూ పోతే చేనేత కార్మికుల జీవిత చిత్రాలను సంపూర్ణంగా ఆవిష్కరించిన కథాసంపూటి 'నెమలికన్ను చీర'. ఇందులో చేనేత కార్మికుడు రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో ఇబ్బందిపడుతున్న తీరును ఆ వృత్తిలో ఎదురౌతున్న అనారోగ్య సమస్యలను, ఆ వృత్తి చేసేటువంటి వారిని మోసగిస్తున్న దళారీల వ్యవస్థని, ప్రభుత్వం వారి కోసం అందచేసిన సామ్మును ఏలా కాజేయాలి అని ఆలోచిస్తున్న కొందరు అధికారుల్ని ఇలా రకరకాల కోణాల్లో మావతా విలువలని ఆవిష్కరింప చేసాడు రాచపూటి రమేష్. ఈ విధంగా మధ్యతరగతి జీవితాలను, వారి జీవితంలో ఉన్నటువంటి ఓడిదుడుకు లను, వారి సంబంధబాంధవ్యాలను ఆవిష్కరిస్తూ రచనలు చేస్తూన్న వర్ధమాన రచయిత రాచపూటి రమేష్ మరిన్ని కథలు రాయగలడి ఆశిద్దాం. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

చలం సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛ

– సత్య శిరీష కొళ్ళకూరి, ఆంధ్రోపన్యాసకురాలు, ఆంధ్ర మహిళా సంస్కృత కళాశాల, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.

చలం ప్రసిద్ధుడైన గుడిపాటి వెంకట చలం సుప్రసిద్ధ తెలుగు రచయిత, వేదాంతి, సంఘ సంస్కర్త, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన అతి ముఖ్య వ్యక్తులలో చలం ఒకడు. చలం రచనలు చాలా వరకు స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా చేసుకొని ఉంటాయి. ముఖ్యంగా సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసలు, వాటిని వారు ఎదుర్కొనే విధానాలను చర్చించాడు. చలం రచనలలో ఇతివృత్తమూ తాత్వికత, రచనాశైలీ ఆయనకు ఆధునిక తెలుగు రచనా రంగంలో అనన్యమైన స్థానాన్ని సంపాదించిపెట్టాయి.

చలం రచనల్లో అతను వ్యక్తపరచిన భావాలు, ప్రతిపాదించిన విషయాలు, అప్పటి సమాజం మీద ఎంతగానో ప్రభావం చూపాయి. కానీ సమాజం అతణ్ణి అపార్థం చేసుకున్నది. అతను స్త్రీ స్వేచ్ఛ పేరుతో విశృంఖల జీవన విధానాన్ని ప్రచారం చేస్తున్నాడని అతని కథల్లో బూతులు ఉన్నాయని ప్రచారం జరిగింది. చలం పుస్తకాలను బహిరంగంగా చదవడానికి భయపడిన రోజులవి. ఆసక్తి గల పాఠకులు చలం పుస్తకాలను దాచుకొని చదివేవారట.

చలం సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛని తీసుకుంటే దానికి అనుకూలించే పాజిటివ్ అంశాన్ని దానికి హాని కలిగించే నెగిటివ్ అంశాన్ని వేరుపరచి, దేన్ని స్వీకరించాలో, దేన్ని తిరస్కరించాలో గుర్తించడం చాలా అవసరం.

ఈ సాహిత్యం మీద ప్రారంభం నుంచి చర్చలు సాగుతూనే ఉన్నాయి. మూడు రకాల ధోరణులు ఈనాటికీ ఉన్నాయి. చలంలో ఉన్న ఏ సానుకూలాంశాన్నీ పట్టించుకోకుండా వ్యతిరేకాంశాల్ని మాత్రమే పట్టించుకొనే ధోరణి కొందరిది. చలంలో ఉన్న ఏ వ్యతిరేకాంశాన్ని స్వీకరించకుండా ప్రతీదాన్ని నిర్విమర్శగా స్వీకరించే ధోరణి మరికొందరిది. గాస్త్రంగా ఇష్టాలు, తీవ్రమైన సందేహాలు రెండింటితోనూ సతమతమయ్యే మూడో ధోరణి మిగతా వాళ్ళది. ఈ స్పందలన్నీ ఈనాటికీ ఉన్నాయి.

సమాజంలో నీతిపేర జరుగుతున్న అన్యాయమును నిర్భయంగా ఎదిరించి స్త్రీ స్వేచ్ఛను గురించి పోరాడిన కవి. ఆధునిక తెలుగు వచన రచనకు ఒరవడి పెట్టిన వారిలో ప్రముఖులు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్త్రీల సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని అనేక నవలలు రాసిన ప్రసిద్ధ నవలాకారుడు.

కాల్పనికోద్యమ లక్షణాల్ని నవలా రచనలో ప్రవేశపెట్టిన వారిలో ప్రముఖులు గుడిపాటి వెంకట చలం. సమాజంలో నీతి పేరిట జరుగుతున్న అన్యాయాన్ని నిర్భయంగా ఎదిరించి, స్వేచ్ఛను గూర్చి తీవ్రంగా పోరాడిన వ్యక్తి. ఈయన సాంఘిక విప్లవవాదిగా పేరు పొందాడు. మైదానం, శశిరేఖ, మా కర్మమిట్లా కాలింది, కన్నీటి కాలువ, దైవమిచ్చిన భార్య, బ్రాహ్మణీకం, జీవితాదర్శము, అమీనా, అరుణ వంటి నవలలోని స్వేచ్ఛా ప్రణయం విప్లవాత్మకమైనది. చలం రచనలు ఆనాటి యువతరానికి వేదాలు. సంప్రదాయబద్ధమైన వివాహ వ్యవస్థలో కామానికే కానీ ప్రేమకు చోటులేదనీ తరతరాల నుండి స్త్రీ వంచింపబడుతున్నదని, మగవారు కీలుబొమ్మగా ఆడిస్తున్న స్త్రీలకు స్వేచ్ఛ కలిగించడం తన ధ్యేయమని చలం తన నవలల్లో చాలి చెప్పాడు. అనుకూల వాతావరణంలోకి స్త్రీ దూరంగా వెళ్ళిపోవచ్చు అని చలం చెప్పినా ముగింపులో సరైన పరిష్కారం చెప్పలేదు. ఈ నవలల్లోని నాయికల జీవితాలు విషాదాంతాలుగా పై కారణాల వల్లనే ముగించబడ్డాయి.

శశిరేఖ :

సృష్టిలోని మాధుర్యం ప్రేమ అయితే
ఆ ప్రేమకి అసలుసిసలు అయిన రూపం శశిరేఖ.

చలంగారి ముద్దుబిడ్డ శశిరేఖ, చంచలంలాగ కనిపించే సంచలనం ఆమె. చివరికి చలనంలేనిది అయిపోయింది. పదహారు వేల మందితో ఉన్న కృష్ణుడు దేవుడూ, ప్రేమమూర్తి అయితే ప్రేమతోనే కడవరకు ప్రయాణం సాగించి ఆ ప్రణయ ప్రళయంలోనే జీవితాన్ని ముగించిన దేవత కదా శశిరేఖ?

ప్రాణానికి ప్రాణం అంటూ ప్రేమించిన ప్రేమను చివరిదాకా నిలుపుకోరెందుకు? ప్రేమ నశించిన బంధానికి విలువ ఏమిటి? అంటూ నిలదీసింది. తనని ప్రేమించిన వారికే ఆ ప్రేమ దక్కుతుందని ఖరాఖండిగా తేల్చి చెప్పేసింది శశిరేఖ.

"ప్రేమలేని పెళ్ళిళ్ళు ఎందుకు
ప్రేమ ఉన్నాక అసలు పెళ్ళి ఎందుకు
కొన్నాళ్ళకి ప్రేమపోతోంది ఎందుకు"

అంటూ ఇప్పటికీ సమాధానాలు రాని ప్రశ్నలని నిర్భయంగా బయటపెట్టింది.

సంస్కారవంతుల మునుగులలో ఉండే ఈ నాగరికులకి అర్థంకాని పెద్ద చిక్కుముడి ఈమె. ప్రేమకీ, బంధాలకీ సంఘం పెట్టిన ఆంక్షలని నెట్టివేసింది.

మనసుకి మలినం అంటనిది, మనసులో ఒకటి, బయట ఒకటి అనే ముసుగు ఎప్పుడూ ధరించినది.

ఏ కష్టాలకి జడవనిది ఈ శశిరేఖ.

సోమరితనంతో జీవితాన్ని గడిపే చవట అయిన కృష్ణుడికి, క్రూరత్వాన్ని మనసు నిండా నింపుకున్న రాక్షసుడైన సుందరరావుకి, ప్రశ్నించే దమ్ములేని దల దించుకు బ్రతికే దద్దమ్మ అయిన రామారావుకి ఎవరికీ దక్కనిది శశిరేఖ.

ఈ నవల సామాన్యులను చాలా ఆందోళన కలిగి స్తుంది. ఎప్పుడైతే పుస్తకము ఆందోళన కలిగిస్తుందో అప్పుడే దానిలో జీవము ఉన్నదని చెప్పవచ్చు. పాత ఊహలను పారదోలి నూతన భావాలను రగులుకొల్పు లాయి. "శశిరేఖ" ఈ జాతిలో నవల అని చెప్పడానికి ఎంతమాత్రమూ సంశయంలేదు అంటూ వ్యాఖ్యానిం చారు ఈ పుస్తకానికి ప్రవేశిక రాసిన శివశంకరశాస్త్రిగారు. అయన పేర్కొనట్లు ఈ నవలలో కథానాయిక సామాన్య స్త్రీకాదు. ఆమె ప్రేమైక జీవి. అందువల్లే యోగ్యుడైన ప్రియుడికోసం ఎట్లాంటి త్యాగమైనా చేస్తుంది. శశిరేఖకు సౌందర్యమే నీతి, వేరు నీతిలేదు. ప్రేమ లేకపోతే భర్తతోనైనా కలిసి ఉండటం ఆమెకు రోత. మాయ చూపటం ఆమె చూపుల్లో పాపం. భర్త నిర్భంధ: ఇష్టంలేక శశిరేఖ కృష్ణుడి దగ్గరికి వచ్చేస్తుంది. ఆ తర్వాత కొన్నాళ్ళకు మళ్ళీ సుందరరావుతో వెళ్ళిపోతుంది. మరికొన్నాళ్ళకు రామారావును ఇష్టపడుతుంది. ఇట్లా జీవితంలో నిరపేక్షమైన సౌందర్యభరితమైన ప్రేమను కోరుకున్న శశిరేఖ కథే ఈ నవల.

మైదానం :

అత్యంత వివాదస్పదమైన నవలలో ముందుండే నవల మైదానం. ఆ కాలంలో చలం పేల్చిన డైనమేట్ అని ఈ నవలని అంటారు. ఈ నవల చదివి ఎంతోమంది మహిళలు తమ వైవాహిక బంధాన్ని చిన్నాభిన్నం చేసు కున్నారు అని అంటారు.

శశిరేఖ నవల ఇతివృత్తం కూడా మైదానం నవల లాంటిదే. శశిరేఖ నవల గ్రాంథిక భాషలో ఉండుటచే తరువాత వచ్చిన మైదానం నవల వాడుక భాషలో వచ్చింది.

ఈ నవలలో ప్రధాన పాత్ర రాజేశ్వరి. ఆమె ఒక ప్లీడరు భార్య, సంప్రదాయమైన కుటుంబం. వివాహం అయిన తరువాత వారి దాంపత్య జీవితం సాఫీగానే గడిచింది. కొన్నిరోజుల తరువాత ప్లీడరుగారు అన్ని పనులలో తలమునకలై ఉండడం వలన భార్యను పట్టించుకోలేదు. రాజేశ్వరి జీవితం రసహీనమైనది అని భావించింది. వారికి ఇంకా సంతానంలేదు. ఆ సమయంలో తన భర్త (ప్లీడరు) వద్దకు వచ్చిన ఒక క్లయింట్ అయిన అమీర్ అనే యువ కుడితో పరిచయం ఏర్పడింది. భర్తలేని సమయంలో అమీర్ ఇంటికి రావడం అది శారీరక సంబంధంగా

ఏర్పడింది. రాజేశ్వరికి అమీర్ మీద ఉన్నది ప్రేమ సంబంధం అని చివరి వరకు పాఠకులకు తెలియ జేస్తుంది. అమీర్ రాజేశ్వరిని తన వద్దకు వచ్చేయమని చెబుతాడు. రాజేశ్వరి దానికి అంగీకరిస్తుంది. వారిద్దరు ఆ ప్రాంతానికి దూరంగా నిజాం దేశంలో ఊరికి దూరంగా కొండల్లో ఒక మైదానం చేరుకుంటారు. ఒక పూరి గుడిసెలో ఉంటారు. కొండలు, నది, ఒక పాడుబడిన దేవాలయం, ఎటుచూసినా మైదానం. ఆకాశం భూమిని తాకే విధంగా ఉంది ఆ ప్రాంతం. అలా వారిద్దరు రాత్రిపగలు ప్రేమలో మునిగితేలుతారు. అలా మూడు నెలలు గడుస్తుంది. రాజేశ్వరికి భర్త నుండి పొందలేని అనురాగం రాజేశ్వరికి దక్కుతుంది. అమీర్‌ను చూస్తే చాలు, అమీర్‌తో ఉంటే చాలు అని రాజేశ్వరి తీవ్ర ప్రణయంలో ఉంటుంది. రాజేశ్వరిని వెతుకుతూ మేన మామ అక్కడకు వస్తాడు. చేసిన తప్పు ఒప్పుకుని రమ్మని బ్రతిమిలాడుతాడు. కానీ తనకు వైవాహిక బంధంలోలేని సుఖం ఇక్కడ పొందుతున్నానని రాజేశ్వరి చెబుతుంది. ఏముంది ఇక్కడ పూరిగుడిసె, మట్టికుండ, మట్టిపాయ్యి తినడానికి తిండి కూడా లేదు. పశువుల్లా జీవిస్తున్నారు అని చెబుతాడు మేనమామ. ఇదే నాకు ఆనందం. అమీర్ నన్ను చూసుకొన్న విధంగా నా భర్త ఏనాడు నన్ను చూసు కోలేదు అంటుంది రాజేశ్వరి మేనమామతో వెళ్ళడానికి రాజేశ్వరి ఏ రకంగా ఒప్పుకోదు. అమీర్, రాజేశ్వరి మేన మామని అవమానిస్తాడు. ఇలా వారు జీవితాన్ని కొన సాగిస్తారు.

ఒకనాడు అమీర్ దగ్గరకు 16 సంవత్సరాల వయసున్న మీర్ అనే వ్యక్తి వస్తూ ఉంటాడు. ఆ వయక్తి మీర్‌ను చూడగానే రాజేశ్వరి తమ్ముడు అనే భావన కలుగుతుంది. ఆ కుర్రవాడు ఎవరు? అతడు రాగానే అమీర్ ఎందుకు ముభావంగా ఉంటున్నాడని అనుకుంటుంది. ఒకనాడు అమీర్‌లేని సమయంలో మీర్ అక్కడికి రావడాన్ని గమ నించిన రాజేశ్వరి అమీర్ దగ్గరకు ఎందుకు వస్తున్నావు ఏమిటి అని అడుగుతుంది. ఆ ప్రాంతానికి దగ్గరలో తోళ్ళసాయిబు ఇల్లు ఉంది. ఆ సాయిబు కూతురుని అమీర్ ప్రేమిస్తున్నాడు. కానీ ఆమె అమీర్‌ను ఇష్టపడటం లేదని చెబుతాడు మీర్. ఈ విషయంలో రాజేశ్వరి చాలా బాధపడుతుంది. నేను నా కుటుంబాన్నే విడిచిపెట్టి అమీర్ ప్రేమలో మునిగిపోయాను అనుకుంటుంది. భర్తను విడిచిపెట్టిన భార్యల పరిస్థితి ఇలాగే ఉంటుందా మగవారు అందరూ ఇంతేనా అని బాధపడుతుంది. వెంటనే అమీర్ ప్రేమపాశం ఈ విషయాలనన్నిటిని వెనకకు నెట్టేస్తుంది. రాజేశ్వరి తానే మీర్‌సాహెబ్ దగ్గరకు వెళ్ళి అమీర్‌కు సాయిబ్ కూతురుని ఇచ్చి వివాహం చేయమని అడుగుతుంది. వారిద్దరికీ వివాహం జరుగు తుంది. కానీ అమీర్ ఆ సాయిబు కూతురుని విడిచి పెడతాడు. రాజేశ్వరి, అమీర్‌లు ఆ కొండల్లో ఒక పూరి గుడిసె, మైదానంలో కాలం గడుపుతారు. కొన్నాళ్ళకు రాజే శ్వరి గర్భం దాల్చుతుంది. అమీర్‌కు ఈ సంగతి ఇష్టం లేదు. గర్భత్యాగం చేయమని అడుగుతాడు. కానీ రాజేశ్వరి ఒప్పుకోదు. తనకి దూరంగా వెళ్ళిపోతాడు అమీర్. అమీర్ ప్రేమతో గర్భత్యాగం చేస్తుంది రాజేశ్వరి. ఆ సమయంలో అమీర్ కోసం వచ్చిన మీర్‌తో శారీరక సంబంధం ఏర్పరచు కుంటుంది. వారిద్దరు ఇలా కొనసాగుతున్న సమయంలో అమీర్ రాకతో, మీర్ రాజేశ్వరి సంబంధ: బయట పడుతుంది.

ఈ ముక్కోణపు ప్రేమకథలో మీర్‌ని చంపడానికి ప్రయత్నిస్తాడు అమీర్. రాజేశ్వరి మీర్‌కి అడ్డుపడుతుంది. రాజేశ్వరి కళ్ళు తెఱచి చూసేసరికి అమీర్ తనని తాను పొడుచుకొని చనిపోతాడు. డాక్టర్ కోసం వెళ్ళిన మీర్ డాక్టర్‌ను, పోలీసులను తీసుకొని వస్తాడు. మీర్ తానే పొడిచానని చెబుతాడు కానీ రాజేశ్వరి నింద తన మీద వేసుకుంటుంది.

నేను లేచి వచ్చేశాను అని ఎవరైనా అంటే గనక నాకు ఆ మాట ఏమాత్రం సహించదు అని

నేనే పొడిచేశాను అనే వాక్యంతో ముగిసింది. చెప్పాలంటే ఈ 92 ఏళ్ళ మైదానం నవలకు వెయ్యిపైగా

విశ్లేషణలు, విమర్శలు, వ్యాఖ్యానాలు వచ్చాయి. ఈ నవలలో ప్రధాన పాత్రలు - రాజేశ్వరి, అమీర్, మీర్ రసహీనమైన దాంపత్య జీవనాన్ని భర్తను వదిలేసి అమీర్‌తో వెళ్ళిపోయింది. విశాలమైన మైదానం మీదుగా భయంకరమైన రక్తపాతం నుండి జైలుగోడల మధ్యలోకి సాగిన ఆమె ప్రయాణంలో ఆమెకు స్వేచ్ఛ లభించిందా? అంటే అవును అని ఆమె అనుకుంది. అమీర్ పెట్టిన చిత్రహింసల్ని అన్నిటిని భరించింది. అమీర్ వేరే అమ్మాయిని ప్రేమించినా కూడా తాను మధ్యవర్తిగా ఉండి వారికి పెళ్ళి చేసింది. అదికూడా అమీర్ మీద ప్రేమే అని భావించింది.

రాజేశ్వరికి భర్త దగ్గర దక్కని ప్రేమ, ఆప్యాయత అమీర్ దగ్గర దక్కినా చివరకు 16 సంవత్సరాల మీర్‌తో కూడా శారీరక సంబంధం పెట్టుకుంది.

ఇంత జరిగినా రాజేశ్వరికి పశ్చాత్తాపంలేదు. అదంత అమీర్ మీద ఆకర్షణ.

ఏ వివాహ బంధంలో అయితే స్వార్థం ఉంది అని భావించిందో అటువంటి స్వార్థం అమీర్ దగ్గర కూడా చవి చూసింది. కానీ అమీర్ మీద ప్రేమతో ఆమె కళ్ళకు మబ్బులు కమ్ముకున్నాయి.

ఆమెది అమర ప్రేమ అని భావించింది. అమీర్ రాజేశ్వరికి ప్రేమానురాగాలు అందించినా మగవారిలోని రాగ ద్వేషాలకు, ఏ మాత్రము అతీతుడు కాదు. తన మొండి పట్టుదలతో తనని తాను పొడిచేసుకున్నాడు.

16 సంవత్సరాల మీర్ తనకు తెలియకుండానే రాజేశ్వరి అమీర్‌ల చక్రవ్యూహంలో చిక్కుకున్నాడు.

ఆకర్షణ మోజులోపడిన రాజేశ్వరి జీవితం చివరకు జైలుకు బలి అయింది.

బ్రాహ్మణీకం :

కుల వ్యవస్థ పేరుతో స్త్రీకి జరుగుతున్న అన్యాయాలను, వారెదుర్కొనే దయనీయస్థితిని కళ్ళకు కట్టినట్లు చూపిన నవల.

కథా సంగ్రహము :

సుందరమ్మ పల్లెటూరి బ్రాహ్మణ పిల్ల, సంప్రదాయ కుటుంబంలో జన్మించింది. ఆచారాలతో పుట్టిన కారణంగా మడి, దేవుళ్ళు, దెయ్యాలు, జ్యోతిషాలు, సోదెలు మొదలయిన మూఢ నమ్మకాలుగల అమాయక ప్రవృత్తి ఆమెది. వయస్సు చిన్నదే అయినా, పెద్ద ఆచారాలు, పెద్దమడులు, పెద్ద ఊహలు ఎనిమిది సంవత్సరాలు రాగానే సుందరమ్మను తన మేనత్త కొడుకుకి ఇచ్చి పెళ్ళి చేశారు. పెళ్ళికాగానే సుందరమ్మ భర్త సంస్కృత విద్యాభ్యాసం కోసం ఇతర దేశాలకు వెళ్ళి ఆరు సంవత్సరాల తరువాత తిరిగి వచ్చాడు. సుందరమ్మ పేరు తగ్గట్టు సౌందర్యరాశి కావడంచేత వారి సాంసారిక జీవితం సుఖంగానే గడిచింది. దేవుడికే కన్నుకుట్టింది కాబోలు సుందరమ్మ భర్తను తీసుకొని వెళ్ళిపోయాడు. చివరి సమయంలో తన భర్త సుందరమ్మను మామగారిని పిలిచి నేను పోయిన దానిలోనే నివసిస్తాను దాని జీవితం నాశనం చెయ్యొద్దు అని చెప్పి ప్రాణాలు విడుస్తాడు. ఇంతలో సుందరమ్మ తండ్రి కూడా మరణిస్తాడు. దిక్కులేక మేనమామ ఇంటికి చేరుతుంది. మేనమామ వెంకట్రామయ్య ఇంట్లో చంద్రశేఖరమనే బీదకుర్రాడు వెంకట్రామయ్య కూతురుకు పాఠాలు, సంగీతం చెబుతాడు. చంద్రశేఖరం మనసు సుందరమ్మ వైపుకు లాగుతుంది. ఆమెను వశపరచుకుంటాడు.

గర్భం దాల్చిన సుందరమ్మను తన మేనమామ చేసేది లేక చంద్రశేఖరానికే ఇచ్చి పెళ్ళి చేస్తాడు. ఈ వివాహ విషయంలో చంద్రశేఖరం, సుందరమ్మల ఇష్టాయిష్టాలను తెలుసుకోవడానికి ఎవ్వరూ ప్రయత్నించలేదు. సుందరమ్మ చంద్రశేఖరాన్ని ప్రేమించలేదు. పైగా తన జీవితాన్ని ధ్వంసం చేసాడని తన భర్తకు ఇచ్చిన వాగ్దానం భంగం చేసినదని. ఈ వితంతు వివాహం మహాపాప కార్యమని చంద్రశేఖరాన్ని ద్వేషంగా చూడటం మొదలు పెడుతుంది. సుందరమ్మ తనను ద్వేషిస్తున్నదని ఆమెకు పరపురుష సంబంధం ఉన్నదని అనుకుంటాడు చంద్ర

శేఖరం. సంసారం చేస్తున్నారన్న మాటేగానీ ఏనాడు సుఖంగా గడిపిందిలేదు. సుందరమ్మ ప్రసవించింది కానీ ఆ బిడ్డకు ఏ అచ్చటా ముచ్చటాలేదు. ఈ వివాహం వితంతు వివాహం కావడంచేత చుట్టుప్రక్కల వారు ఎవరూ వారిని పలకరించరు. సుందరమ్మ బిడ్డకు జబ్బు చేస్తుంది. ఆ జబ్బుకు కారణం ఆమె పాపకర్మ ఫలం అని ఆమె విశ్వాసం. ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని తన బిడ్డను కాపాడుకుంటుంది సుందరమ్మ.

సమాజంలో పురుషుడితో పాటు స్త్రీకి కూడా సమాన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉండాలని తన రచనల ద్వారా పేర్కొన మొదటి తరం స్త్రీవాద కవి చలం. ఆధునిక మహిళ దేశ చరిత్రను తిరగ రాస్తున్నది అని చలం ప్రకటించారు. చలం తన రచనలన్నీ స్త్రీజాతికే అంకితం చేశాడు. తెలుగు సంఘంలో స్త్రీ నికృష్టస్థితి, ఆధ్యాత్మిక మానసికాందోళన మొదలైన శక్తులు చలంచేత ఇలాంటి నవలలన్ని రచింపజేశాయి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అట్టాడ అప్పలనాయుడుగారి కథలు – సామాజిక దృక్పథం

– తలారి సుజాతక్క, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సాహిత్యాన్ని సమాజాన్ని వేరుచేసి చూడలేనంతగా ఒకదానిలో ఒకటి మిళితమై పోయాయి. ఇవి రెండూ బొమ్మా బొరుసు లాంటివి. సాహిత్యం ఏరూపంలో ఉన్నా, ఏ ప్రక్రియలో ఉన్నా సమాజంపై అత్యధికంగా ప్రభావం చూపుతుంది. ఆంగ్ల ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి నవల, నాటిక వంటి ప్రక్రియలు వచ్చి ఈ సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. వీటిలాగే నేడు సమాజాన్ని అత్యధికంగా ప్రభావితం చేస్తున్న ప్రక్రియలలో 'కథా సాహిత్యం' ఒకటి. ఇందులో వస్తువు (ఇతివృత్తం), పాత్రలు సమాజం నుంచి ఉద్భవించినవే. సాంఘీకాంశాలను ఇతివృత్తంగా చేసుకొని నేడు ఆధునిక సాహిత్యం మూడు పువ్వులు ఆరుకాయలుగా పరిఢవిల్లుతుంది.

'ఇతివృత్తంతు కావ్యస్యశరీరమ్' అన్నట్లు కావ్యానికీ గానీ, కథకుగానీ "ఇతివృత్తం" ప్రధానం అనే విషయం అవగతమవుతుంది. ఇతివృత్తాన్ని వస్తువు అని పిలవడం పరిపాటి. కథకు సమాజంలోని అంశాన్ని ఇతివృత్తంగా ఎంచుకొని, కథా రచనను పరిసమాప్తి గావిస్తూ, అట్టడగు వర్గాల బాధలను కథావస్తువులుగా స్వీకరించి చాలామంది రచయితలు వస్తువైవిధ్యంలో వారికి నచ్చిన దృష్టికోణంలో రచనలు చేస్తూ, పాఠకుల ఆదరాభిమానాలు పొందుతున్న కథా రచయితల్లో "అట్టాడ అప్పల్నాయుడు" ఒకరు.

అప్పల్నాయుడు రచించిన 'పువ్వుల కొరడా', 'కో....బలి' కథల్లోని వస్తువు బడుగు బలహీన వర్గాల చితుకులా చితికిన వారి చిధ్రమైన జీవితాలలోని సంఘటనలను నిత్యజీవితంలో వారు ఎదుర్కొంటున్న వర్ణాతీత విషాద గాధలను ఇతివృతాలుగా తీసుకొని కథలు రాశారు. వాటిని సామాజిక దృక్పథాన్ని గురించి విశ్లేషించడమే ఈ వ్యాసం ఉద్ధేశం. ఈ కథల్లోని ఇతివృత్తం ఇలా ఉంది.

పువ్వుల కొరడ - కథేతివృత్తం :

ఈ కథలో ప్రధాన పాత్ర 'అసిరి శెట్టి' చాకలి కులానికి చెందినవాడు. తుమ్మపాళెం నాయుడు గారింట్లో పని మనిషి ఇతని భార్య నాయుడు గారి దుర్మార్గానికి, అరాచకత్వానికి ప్రతీకగా నిలిచిన నాయుడు గారి ఎద్దు అహంకారానికి బలిపశువు అవుతుంది. భార్యను కోల్పోయిన అసిరిశెట్టి ఒంటరి వాడై జీవనం సాగిస్తుంటాడు. ఇద్దరు కూతుళ్లు వారిలో పెద్ద పాపకు పక్క ఊరిలో పెళ్ళి చేస్తాడు. రెండవ కూతురుకి, నాయుడుగారి కూతురికి ఒకే ముహుర్తానికి పెళ్లి జరుగుతుంది.పెళ్లి కొడుకు ఇంటికి నాయుడు గారు అరిసెల సారె అసిరి శెట్టి చేత పంపుతాడు. అతను కావడి మోసుకుపోతూ మార్గమధ్యలో తన పెద్దకూతురు ఇంటికి వెళ్ళతాడు. అసిరి శెట్టి జేబులో చిల్లిగవ్వకూడా లేకపోవడంతో కూతురు పిల్లలకు ఏమి తీసుకొని వెళ్ళడు. ఆమె పిల్లలు కావడి కట్టిన సారెలోని అరిసెలను తీసుకొని ఎలాంటి భయంలేకుండా వాటిని తింటూ మధురానుభూతిని పొందుతారు. అసిరి శెట్టికి ఆ దృశ్యాన్ని చూసి భయంతో ఒళ్ళంతా భయంతో కంపించి పోతుంది. లెక్క తగ్గకుండా వియ్యకుంల వాళ్లకు ఇచ్చి రమ్మని పంపిన నాయుడు గారి ఆజ్ఞను ధిక్కరించినందుకు ప్రాణాలు పోయేంత పనవుతుంది. కావడి మోసుకొని అవతల ఊరు బంగారం పేట వెళ్తాడు.

నాయుడుగారి వియ్యంకులు సారె విప్పి చూసి అందులో అరిసెలు లెక్క తగ్గడం గమనించి నాయుడు గారికి తెలియజేస్తారు. నాయుడు గారు దానికి కారకుడైన అసిరి శెట్టిని పూలకొరడా తీసుకొని శరీరమంతా ఎర్రగా కమిలిపోయే విధంగా వాతలు పడేటట్లు విచక్షణా రహితంగా కొడతాడు. అసిరి శెట్టికి తన మనవళ్ళు

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

అరిసెలు తింటున్నప్పట్టి దృశ్యం కళ్ళెదుట మెదిలింది. వారిలో ఎలాంటి అధైర్యం కనిపించలేదు అసిరి శెట్టి హృదయాంతరాళంలో దాగిన కోపావేశం కట్టలు తెంచుకొని రావడంతో నాయుడు గారి చేతిలోని కొరడాను బలవంతంగా లాక్కొన్ని తిరగబడి కొడతాడు. కొరడా తునాతునకలైపోయింది.

కో.... బలి కథేతివృత్తం :

కో...బలి కథలో కూడా భూస్వాముల దురాగాతాలకు అట్టడుగు వర్గాల వారు బలైన సన్నివేశాలున్నాయి.

ఈ కథలో ప్రధాన పాత్ర 'చిట్టెమ్మ'. చిట్టెమ్మ భర్త వంశధార వరదకు బలైపోతాడు. చంద్రం పేట భూస్వాములు తప్ప అందరూ వరద బాధితులే. చిట్టెమ్మకు ఇద్దరు సంతానం భర్త అకాల మరణానికి గురి కావడంతో సంసారాన్ని ఒంటి చెత్తో నెట్టుకొస్తుంటుంది. వీరికి ఉన్న అరవై సెంట్ల భూమిలో వరద వలన ఇసుక మేట వేస్తుంది. దానిని తొలగిస్తే తప్ప పంట పండదు. బ్యాంకు వారు సబ్సీడి లోను ఇస్తామనడంతో కరణం గారి ద్వారా చిట్టెమ్మ లోను పొందడానికి ప్రయత్నిస్తుంది. ఇదే తరుణంగా భావించిన కరణం నూటికి ముపైరూపాయలు ఖర్చువుతుందంటాడు. సావుకారి శంకరయ్య దగ్గర వందరూపాయలు ఒక్కసారి మరో యాభై రూపాయలు తీసుకుంటుంది. సబ్సీడీ లోను తొంబై రూపాయలు వస్తుంది. తన కొడుక్కీ ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆ డబ్బులు కూడా ఖర్చు అయిపోతాయి.

ఎప్పటినుంచో చిట్టెమ్మ పొలాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలనుకున్న సావుకారి శంకరయ్యకు కాలం కలిసి వచ్చింది. చిట్టెమ్మ అప్పతీర్చడం లేదని పంచాయితీ పెట్టిస్తాడు. చిట్టెమ్మ తాను అప్పు చెల్లించే స్థితిలో లేనని చెబుతుంది. ఆ సమయంలో సావుకారి దురాగతం ఇలా ఉంటుంది.

"పోనీ ఒకటి సేత్తాను ఇసుకెత్తించకుండా ఆ మడి ఎవులకీ పనికిరాదు, నేను ఇసుకెత్తిస్తాను. రెండొందల రూపాయల సిల్లరే అవుతుంది యిసకెళ్తాడానికి! పోనీ చిల్లర కేటి రొండొందలనుకోండి. ఆ రొండొందలూ, అప్పు నూట యాభయ్యా వడ్డీతోటి కలిసి నాలుగొందలకు నోటు రాసుకొని దాని కయివేజుగా ఆ మడి తీసుకుంటాను. ఆ పిల్ల యేసంవత్సరం తేలికయి అప్పు నాలుగొందలూ వొడ్డీతోటి తీర్చేత్తాదో, ఆ సంవత్సరమే ఆ మడి ఆ పిల్లకిచ్చేతాను. అలాగైతే ఒప్పుకుంటాను".

ఈ సన్నివేశాన్ని పరిశీలించినట్లుయితే ఆనాటి సమాజంలో భూస్వామ్యులు అట్టడుగు వర్గాల వారిని ఎలాంటి దురాగాతాలకు గురి చేసేవారో తెలుస్తుంది.

భూస్వాముల దురాగాతాలు :

పువ్వుల కొరడా కథలో ఉన్నత వర్గాల వారు నిమ్న జాతుల వారిని ఎలా అణగద్రొకుతున్నారో తెలుస్తుంది. ఆనాటి సమాజంలో వర్ణ వివక్షత అధికంగా ఉండేది తక్కువ కులాల వారిని ఉన్నత కులాల వారు తమ స్వార్థం కోసం ఉపయోగించుకొనేవారు. ఏ మాత్రం పొరపాటు జరిగినట్లుయితే విచక్షణా రహితంగా కొట్టే వారని తెలుస్తుంది. యజయాని పట్ల వినయ విధేయతలు ప్రదర్శించేవారు కానీ నిజమైన గౌరవ మర్యాదలు చూపే వారు కాదని విశదమవుతుంది.

తమ ఇంట్లో పనిచేసే వారి పట్ల ఏ మాత్రం దయా దాక్షిణ్యాలు చూపేవారు కాదు. ఎండైనా వానైనా వారికి కావలసిన పనులుచేసిపెట్టాలి. అలా కాదని బదులు సమాధానం చెబితే శిక్షలు తప్పవని తెలుస్తుంది.

పూల కొరడా కథలో నాయుడు తన వియ్యంకుడికి ఇచ్చి రమ్మని అరిసెల సారె తన దగ్గర పని చేసే చాకలి అనిశెట్టి ద్వారా పంపుతాడు. మార్గ మధ్యలో తన కూతురు ఇంటికి వెళ్తాడు. కూతురు పిల్లలు అరిసెలు తింటారు. లెక్క తగ్గిందని వియ్యంకుల వారు నాయుడికి తెలియజేస్తారు. ఆవేశంలో నాయుడు అసిరి శెట్టిని శిక్షిస్తాడు. ఆ సన్నివేశం ఇలా ఉంటుంది.

"రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా? నాయుడు తల్చుకున్నాడు, పువ్వుల కొరడా పట్టుకున్నాడు. అంతే.... నరాలు జెవ్వుమని తెగిపోతున్నాయి. అనిశెట్టి వీపు మీద పడుతున్న కొరడా దెబ్బలకు చర్మం చిట్లిపోతుంది. శరీరం మంటపెడుతుంది, కంటె నుండి నీరు ధారాపాతంగా లాగా ఏడుస్తున్నాడు, అసిరి శెట్టి ఒంటి నుండి రక్తం, చర్మం తెగి కారుతుంది".

పేదరికం :

అప్పల్నాయుడు కథల్లో పేదల కష్టాలు బడుగు బలహీన వర్గాల వర్ణణాతీత బాధలు వాస్తవ జీవితానికి సమీపంగా ఉంటాయి. కథలు చదువుచున్నప్పుడు పాఠకుడు తన్మయత్వాన్నికి లోనై బాధాతప్తహృదయుడవుతాడు. వీరు రచించిన. పువ్వుల కొరడా, కో...బలి, కథలలో పేదరికం గురించి ఇలా ఉంది.

పువ్వుల కొరడా కథలో ప్రధాన పాత్ర అసిరి శెట్టి చాకలి కులానికి చెందినవాడు. నాయుడుగారి దగ్గర పని చేస్తుంటాడు. కూతురు పిల్లలకు తినడానికి ఏమైనా తీసుకోపోలేని తన పేదరికాన్ని ఇలా తెలియజేస్తాడు.

"దార్లో పెద్ద కూతురింటికి వెళ్లాలనుకున్నాడేగానీ, వెళ్ళిన తరువాత అక్క మనమలిద్దరూ చూస్తారు గావాలి.. తాత యేటి తెచ్చాడో అనీ! కొనుక్కొని తీసికెళ్లాలి! కొనాలంటే జేబుల పైసాలేదు!

తోవల కర్సులుంటాయని జేబుకీ తేలీదు. పంపించన బాబుకీ తెలీదు! పై సందర్భాన్ని పరిశీలించినట్లయితే అసిరిశెట్టి ఎంత దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాడో తెలుస్తుంది.

'కో...బలి' కథలో ప్రధాన పాత్ర చిట్టెమ్మ భర్త అకాల మరణంతో బ్రతుకు భారమవుతుంది. ఇద్దరు పిల్లలతో సంసార సాగరాన్ని ఈదుకొస్తుంటుంది.పేదరికంతో సరిగా తినడానికి దొరకని పరిస్థితిని రచయిత ఈ కథలో ఇలా తెలియజేస్తాడు.

గవర్మెంటిచ్చిన బియ్యం పొద్దుటితోటయి పోయినాయి. రాతికేటి చెయ్యడం? చేట పట్టుకొని ఎవులి గడపెక్కడం? రెండ్రోజులనుంచి వారిటిల బాగునేదు. ఎంకప్పడాట్రు మందివ్వక ముందే డబ్బులడుగుతన్నం. ఇంటిల గింజనేదు.సేతల కానీ లేదు"(అట్టాడ... సాహిత్యం పుట.26)

పై సన్నివేశాన్ని గమనించినట్లుయితే చిట్టెమ్మ ఎంతటి పేదరికాన్ని అనుభవిస్తుందో తెలుస్తుంది.

పెత్తందార్లపై తిరుగుబాటు :

అప్పల్నాయుడు సాహిత్యంలోని మొదటి రెండు కథలైన పువ్వుల కొరడా, కో...బలి కథలలో ప్రధాన పాత్రలుగా బడుగు బలహీన వర్గాలు కనిపిస్తాయి. అణగారిన అగ్ని పర్వతంలావా ఒక్కసారిగా పెల్లుబికినట్లు ఈ రెండు కథల్లోని పాత్రలు కూడా పెత్తందార్ల దురాగాతాలని అనుభవించి తాల్మిని కోల్పోయిన వీరు పెత్తందార్లపై తిరుగుబాటు చేయగా ప్రతి కథకు ఉపసంహాతంగా ఉంది.

పువ్వుల కొరడా కథలో అరిసిశెట్టి తప్పుచేశాడని గ్రహించిన నాయుడు కొరడా తీసుకొని విచక్షణారహితంగా శిక్షిస్తాడు. ఆ సన్నివేశం క్రింది విధంగా ఉంటుంది.

అసిరి శెట్టికి వీపు మండుతోంది. శరీరమంతా అగ్నిలా కాలిపోతుంది. కావడి వద్ద పిల్లలు నిర్భయంగా తింటున్న దృశ్యం కళ్ళ ముందు కదులాడింది! భయం బెదురులేని వారి రూపాలు, వారి అమాయక మొహాలుఅసిరి శెట్టిలో కదలిక తెచ్చాయి! అరిసి శెట్టి కదిలాడు. నిటారుగా, నిప్పులా లేచాడు, కొరడా కంటే వేగంగా కత్తెకంటె పదునుగా నాయుడు కంటే బలంగా లేచాడు!

పువ్వుల కొరడా అరిసిశెట్టి చేతిలో విరిగిపోయింది (అట్టాడ.... సాహిత్యం పుట26) ఈవిధంగా అరిసి శెట్టిలో కోపాద్రేకాలు కట్టలు తెంచుకొని రావడంతో నాయుడిని ఎదురిస్తాడు.

కో...బలి కథలో చిట్టెమ్మ తీసుకున్న అప్పుతీర్చలేదని

సావుకారి శంకరయ్య పంచాయితీ పెడతాడు. ఆ పంచాయితీకి చిట్టెమ్మ అన్న కూడా ఉంటాడు. పంచాయితీలోని పెత్తందార్లు ఎలాగైనా చిట్టెమ్మకు చెందిన పొలాన్ని సావుకారి వశం చేయాలని పన్నాగం పన్నుతారు. ఎత్తుకు పై ఎత్తులు వేస్తారు. ఆ సందర్భంలో చిట్టెమ్మ వాళ్ళ అన్న ఇలా అంటాడు.

"నా సెల్లిలికి తోడు అన్నగా నేనున్నాను. నాకంటే అండగా జనమున్నారు.మానుండి తప్పించుకోలేని రోజాస్తాది. దాన్ని కాసుకోండి"! అని హెచ్చరించి మరక్కడ నిల్చోకుండా చెల్లెలు చేయి పట్టుకొని తీసుకొని పోసాగాడు.

అప్పల్నాయుడు కథలల్లో బడుగు బలహీన వర్గాల వారి వ్యధార్థ గాథలను చిత్రీకరించడమే గాకుండా ఆధునిక సమాజంలో జరుగుతున్న విషయాలను ఇతివృత్తాలుగా గ్రహించి కథలు రాయడం రచయిత సహృదయతకు నిదర్శనం. సమాజంపట్ల బాధ్యతాయుత పాత్రను పోషిస్తూ పెత్తందార్ల అరాచకాలను కథల ద్వారా తెలియజేస్తూ సమాజాన్ని జాగృత పరుస్తున్నాడనుట అతిశయోక్తికాదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కథాశిల్పం - వెంకటసుబ్బయ్య వల్లంపాటి
2. తెలుగు కథా వికాసం - పద్మరాజు పాలగుమ్మి
3. తెలుగు కథలు కథనరీతులు - నారాయణ సింగమనేని
4. అట్టాడ అప్పలనాయుడు కథలు

❖ ❖ ❖

జయంపు కృష్ణ కథలు – సామాజిక జీవన చిత్రణ

– తుళ్ళూరు రవి, పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

జయంపు కృష్ణగారు ఆధునిక కథా రచయితల్లో ఒకరుగా చెప్పవచ్చు. బహుముఖ ప్రజ్ఞాశాలి. వివిధ రకాల సాహిత్య ప్రక్రియల్లో ప్రవేశం ఉంది. కవిగా, కథా రచయితగా, నవలాకారునిగా, సీరియల్, సినిమా రచయితగా, వ్యాసరచయితగా పేరు పొందారు. నిత్య జీవితంలో జరిగే కుటుంబ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యలను తీసుకుని మన చుట్టూ ఉండే మనుషులను పాత్రలుగా మలిచారు. నెల్లూరు జిల్లాలో పుట్టి పెరిగి నందున ఆ ప్రాంత ప్రజల జీవనం, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మాండలికాలు ప్రతిఫలించేటట్లు కథలు తీర్చిదిద్దారు. సమాజంలోని సామాజిక విషయాలను జోడించి అనేక రచనలు చేశారు. శతకం, నాటకం, నవల, కథ, కవిత్వం, పాట, వ్యాసం, ఆర్టికల్స్, మిమిక్రీ, సినిమా, రేడియో, దూరదర్శన్ లాంటి రచనలు, రెండువందల కథలు, నాలుగువందలుపైగా కవితలు వివిధపత్రికల్లో ప్రచురణలు పొందాయి. స్క్రిప్టురచయితగా, అసిస్టెంట్ డైరెక్టరుగా మల్లెమాలప్రొడక్షన్లో పనిచేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో సమాజ స్థితిగతులను తెలుపుతూ రచనలు చేసిన రచయితల్లో చెప్పదగిన రచయిత జయంపు కృష్ణగారు "జయంపు కృష్ణ కథలు" సంపుటిలో ముప్పైరెండు కథలున్నాయి.

జయంపు కృష్ణగారు సామాజిక దృక్పథంతో మాట్లాడుతూ సాహిత్యప్రక్రియలు అన్నింటిలోనూ సామాజిక సమస్యనే ప్రధాన వస్తువుగా ఉండాలనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు. సాహిత్యం ప్రజలకోసం అని గుర్తిస్తే ప్రజాజీవితం సాహిత్యంలో ప్రతిఫలించాలి. సామాజిక సమస్యలు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో నేడు ప్రతిఫలిస్తున్నాయి. అయితే నవల, కథ, కథానికలతో ప్రజాజీవితం ప్రస్ఫుటంగా కనిపించే అవకాశం ఎక్కువ. అందుకే రచయిత అయిన జయంపుకృష్ణ కవిత కన్నా కథకు అధిక ప్రాధాన్యతనిచ్చి సమాజ స్థితిగతులను కథల్లో చర్చించాడు. ప్రతి రచయిత ఏదో ఒక సంఘటనలో ప్రేరేపితుడవుతాడు. ఆ సంఘటనల ద్వారా తన లక్ష్యాన్ని నిర్ణయించుకుంటారు. అనుభూతిని జోడిస్తాడు. కథ అల్లుకుంటూ పోతాడు. జయంపుకృష్ణగారు జీవిత అనుభవాలను జోడించి సామాజిక దృక్పథంతో అందంగా తీర్చిదిద్దారు.

జయంపుకృష్ణగారు కథలను సామాజికంగా చిత్రిస్తూ వస్తువులను రాజకీయ, కుటుంబం, ఆర్థిక, శ్రామికజనుల బాధలు, గాథలు, కలలు, కన్నీళ్ళు, సభ్యత, సంస్కారం, నాగరికత మొదలైన విషయాలను చక్కగా ఈ కథల్లో చూయించాడు. కథల్లో రెక్కలు విరుచుకొని, నాలుగు డబ్బులు సంపాదించుకొని పొట్టపోషించు కోవడంలోనే తమ సర్వస్వం కోల్పోతున్న ఈ అభాగ్య జనావళికి సమాజంలో సరియైన రక్షణ లేదు. పోలీసులు, అధికారులు, అదృష్టవంతులు మొదలైన వాళ్ళంతా వీళ్ళ రక్తాన్ని పీల్చుతున్నారు. ఆర్థికంగా వెనుకబడడంవల్ల పతీతులుగా, భ్రష్టులుగా మారిన ఈ దీనుల పక్షాన నిల్చుని వాళ్ళ బాధల్ని, గాథల్ని, కలల్ని, కన్నీళ్ళను తన శక్తివంతమైన అక్షరాల రూపంలో

నేటి సమాజంలోని స్త్రీని తక్కువగా చూడవద్దని "నంది వర్ధనం" కథలో తులసి తన భర్త చెడు అలవాట్లను గమనించి అతనితో అంటి ముట్టనట్టు ఉంటుంది. గోవర్ధన్ ఆ విషయం మనస్సులో పెట్టుకుని తులసిని పుట్టింటికి తరిమేస్తాడు. మగవానికి కంటే నేను తక్కువ కాదనే ఉద్దేశ్యంతో హస్తకళా(చీరలు నేసే) నైపుణ్యంతో తనకు తానుగా సమాజంలో నిలబడుతుంది. "ఆడ వాళ్ళూ! మీరు గులాబీలు" కథలో ప్రేమ అనే ఆకర్షణకు గురై తొందరపడి తప్పు చేస్తే ఏమవుతుందో ఈ కథ ద్వారా తెలియజేశారు.

''ఓవూచిన పువ్వు'' కథలో ఆకుల్లోపలి నుంచి అందంగా నవ్వుతూ వున్నా పూవుకు ప్రసవ వేదనతో జన్మనిచ్చింది, జోలపాడింది, అలా ఆమని ఆహ్లాదంలో పెరుగుతూ సిగ్గుతో తన అందాన్ని లోకానికి చూపిస్తుంది. మరో నిమిషంలో పక్కన రొద చేస్తూ అంటే? తేనెటీగ నవ్వుతూ తన దగ్గరకు రావడం గమనించి, ఆకుల్లో దాక్కొవాలని చూసింది. తేనెటీగ మంత్రంజపిస్తూ పువ్వుచుట్టూ గిరగిర తిరుగుతూ పైట లాగబోయింది. దాన్నిచూసి పూవు గిజగిజలాడుతోంది. తన హృదయంలో ఏడుస్తుంది. అయిన వదలకుండా ఉయ్యాల ఊపినట్టు ఊపి పక్క పూవు మీదకు వెళుతుంది. పూవు కన్నీళ్ళ ద్వారా చెక్కిళ్ళను తడుపుకుంది, బాధతో తనలోని భావం ఆ ఈశ్వరుని పాదాల పూజకు అర్పణ కావాలన్నదే తన ఆశ, శ్వాస. నా జీవితం వ్యర్థం కాదు, జన్మ చరితార్థం కావాలి అందు కోసమే పుట్టాను అనుకుంది. పెనుగాలికి పట్టు తప్పి కిందపడి భగవాన్‌ను పలకరిస్తూ ప్రాణం విడుస్తుంది. స్త్రీహృదయం ఎలా బాధపడుతుందో స్త్రీని పూవుగా, మగవాడ్ని తేనేటీగతో పోల్చి ప్రతీకవాదంతో చూయించాడు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, చలం వంటి కవులు స్త్రీలకిచ్చిన స్త్రీస్వేచ్ఛ ఈ కథల్లో కన్పిస్తుంది.

మానవుడు జీవితం తాగుడుకుబానిసైతే ఏవిధంగా ఉంటుందో తాగుడుకు బానిసగా బతుకుతూ, కుటుంబ పోషణలేక రోడ్డునపడడం కనీసం తన ఆకలి తీర్చుకోవడం కూడా కష్టం అవుతుంది. ఈ పరిస్థితి రావడానికి ప్రధాన కారణం తాగుడేనని తల్లి మరణం తరువాత శివుడు తెలుసుకుంటాడు. ''చావూ నీకెప్పుడు చావు'' కథలో తాగుడుకు బానిసైన కుటుంబాల జీవితాలు ఉన్నా తీరును, మనిషి జీవితంలో అనుమానం పెనుభూతం లాంటిది దీనిని మానవుని మనస్సుల నుండి తరిమేయాలని ఉద్దేశ్యంతో ''ప్రేమో నీకు జోహారు!'' కథల్లో చూయించాడు.

ప్రతి మనిషికి సమాజంలో జీవించడానికి డబ్బు అవసరం. కానీ ఆ డబ్బు సమాజంలో కొంత మంది దగ్గర మాత్రమే కేంద్రీకృతమై ఉండడం వలన ఉన్నత వర్గాలు తమ అవసరాల కోసం పేదవారిని నిత్యం మానసికంగా శారీరకంగా వేధించడం జరుగుతుంది. ''కారల్ మార్క్స్ అన్నట్లు ''మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే''. అయితే సమాజంలో నేడు మనుషులు తమ కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఎంతటి నీచమైన క్రూరమైన పనులకైనా ఒడిగడుతున్నారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో వుంచుకొని కవి. ఒక రూపాయకోసం ఆశపడి ప్రాణాలు పొగొట్టుకున్నా సందర్భం ''ప్రాణం ఖరీదు'' కథలో కన్పిస్తుంది. ''చివరకు మిగిలేది'' కథలో రాజి పొట్టకూటి కోసం రాత్రిపూట పడుపు వృత్తిచేస్తూ గడుపుతూ వుంటుంది. ఒకరోజు తన దగ్గరకు ఎవరూ రారు, ఆకలితో కనీసం టీకైనా వస్తే చాలని అనుకుంటూ ముష్టివాని దగ్గరకు వెళ్ళి వాడి ఆకలి తీర్చి, తన ఆకలి తీర్చుకోవడం కోసం వెళుతుంటే పోలీసు గద్దలాగా వచ్చి పావలాను తన్నుకుపోతాడు. ప్రభుత్వ ఆఫీసుల్లో, హాస్పిటల్లో చిన్నా పెద్ద తేడాలేకుండా లంచాలతో ఏవిధంగా దోచుకుంటున్నారో ''ఆపరేషన్'' కథలో కోటిగాడు పదిమంది సంతానంతో పేదరికం అనుభవిస్తుంటాడు. పక్కింటివారు చెప్పారని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకుంటే గవర్నమెంట్ హాస్పిటల్లో వంద రూపాయలు యిస్తారనే ఆశతో భార్యను ఒప్పిస్తాడు. పక్కింటి అయ్యనడిగి గింజలు అప్పు తీసుకుని హాస్పిటల్‌కు వెళ్తే అక్కడ రాసిచ్చిన, మంచంపట్టిన, చిమ్మిన, వాచ్‌మెన్, నర్సులకు వారిస్థాయిల్లో పంచగా కోటిగాడికి యిచ్చిన వంద రూపాయల్లో చిల్లిగవ్వకూడా మిగలదు, చివరకు దొంగబండెక్కి యిల్లుచేరి, పోకపోయినాబావుణ్ణు అప్పుల్లో కూరుకుపోయేవాడిని కాదని అనుకుంటాడు కోటిగాడు. అలానే రేషన్ డీలర్లు ప్రజలకు రేషన్ ఇవ్వకుండా మింగేస్తున్న విధానాలను ''గబ్బు సవురు'' లాంటి కథల ద్వారా ఎండగట్టారు. అలానే అధికారం చేతుల్లో ఉన్న వ్యక్తులు సామాన్యమానవుని ఎలా బెదిరించి బతుకుతారో ''దుంప రాష్ట్రం'' కథ ద్వారా చెప్పారు. .

మానవునికి ఆరోగ్యం సరిలేకపోతే డాక్టర్ దగ్గరకు వెళ్తాం. వారు ఈరోజు డబ్బుకు ఆశపడి చిన్న రోగానికి

కూడా పెద్దమొత్తంలో పీడిస్తున్నటువంటి విధానాన్ని "నేను బతకొద్దా?" కథతో, పెట్టుబడి వర్గం వెట్టిచాకిరి చేయించుకుంటున్న విధానం "కన్నీటి ముత్యాలు" అధికారాలను చెలాయించే గ్రామాధికారులను, చిన్నవర్గంవారి మానాన్ని దోచుకుంటున్నా వారిని ఎదిరించి ఎలా నిలబడాలనేది "ఈ సమాజం చిగిర్చేదెప్పుడు" కథల్లో వివరించాడు. "ఈస్ట్‌మన్ కలర్ ప్రేమ"లో మధుసూదనరావుది మధ్య తరగతి కుటుంబం సినిమా రంగం మోజులోపడిన కొడిక్కి పొలంఅమ్మి ఇవ్వడం, తీసినా సినిమా ప్లాప్ అవ్వడంతో ఆస్తిమొత్తం పొగొట్టుకుంటాడు. కొడుకు చేసిన పనికి కనీసం ఇల్లైన మిగిలిందని ఆనందపడుతాడు.

బాల్యంలో మనసుపై వేసిన ముద్రలు కొన్ని అనుభవ పూర్వకంగా ఏర్పడిన సంఘటనల రూపంలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగాగానీ స్థిరంగా వుండి వ్యక్తి మనసులో ముద్రవేస్తాయి. ఈస్మృతులు గతానుభవస్మృతి, వర్తమాన స్మృతి రూపంలో ఉండవచ్చు. ఇది పునరావృత్తం అవుతూ అనుకూల సంఘటనలు ఆనందాన్ని, ప్రతికూల సంఘటనలు విషాదాన్ని కలుగజేస్తాయి. మనసు లోపలి పొరల్లో అవి నిబిడీకృతమై ఉంటాయి. "బాబు! సంతోషాన్ని పంచుకోవడం కాదు, బాధను పంచుకోవడంలోనే నిజమైన జీవితం వుంది. మనిషిని ప్రేమించలేని ఈ సమాజం దేవుణ్ణి ప్రేమించడం విచిత్రం. పులిని ఎవరూ ఖచ్చితంగా చూడలేదు కానీ ఆది వస్తుందన్న భ్రమతో, భీతితో ఎలా తప్పెటు వాయిస్తున్నారో చూస్తున్నావుగా? పులి సంగతి ఎలా వున్న రోజూ సాగే ఈ తప్పెట్టు మోత జనంలో పులి భయాన్ని రోజు రోజుకు ఎక్కువగా చేస్తూ వుంది. మనిషి తనను చూసి తనే భయపడే రోజు ఆసన్నమయింది బాబు!" (జయంపు కృష్ణ కథలు:పుట:52). "భయం" కథలో వంశీ త్రాచుపామును చూసి తన స్నేహితులకు చెప్పడం వారులేని పురాణాలు చెప్పి మరింత ఎక్కువగా భయపెడతారు. ఈ కథ ద్వారా భయం అనే ఆలోచనతో వుంటే మానవున్ని పీడిస్తుందని నిరూపించాడు రచయిత". ఈ కథలో పాఠకునికి మనోవిశ్లేషణా ధోరణి కనబడుతుంది.

నేటి కాలం యువకులకు ఉద్యోగావకాశాలు లేక పడుతున్నా పాట్లులను కవి అనుభవంతో చేప్తూ శక్తి సామర్థ్యాలు, అర్హత వుండి కూడా స్వతంత్రవృత్తిని సంపాదించే క్రమంలో బుచ్చిబాబు సర్కాస్‌కంపెనీలో ఖాళీలు వున్నాయని తెలిసి దరఖాస్తు చేసుకుని, రాత్రంతా చదివి, ఇంటర్వ్యూకి వెళ్తే, మేనేజర్ అనుకోకుండా పులి చనిపోయింది, దాని వేషం మీరేయాలి అంటాడు. పులి వేషంతో బోన్లో ఉన్నా బుచ్చిబాబుకి, ఎదురుగా వున్నా బోన్లో సింహం కన్పిస్తుంది. బుచ్చిబాబు భయంతో గజగజ వణకడం ప్రారంభించాడు. అది గమనించి సింహం వేషంలో వున్న వ్యక్తి దగ్గరగా వచ్చి మిత్రమా భయపడకు యిద్దరం ఉద్యోగస్తులమే నువ్వు బి.ఏ., నేను ఎం.ఏ. అంటాడు. జయంపు కృష్ణ కథలకు నెల్లూరు జిల్లాలో పుట్టి పెరిగినందున ఆ ప్రాంత సామాజిక ప్రజల జీవనం, సంస్కృతి, ఆచార వ్యవహారాల మాండలికాలు ప్రతిఫలించేటట్లు కథలను తీర్చిదిద్దారు. వీరి రచనల్లో కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, చలం వంటి కవులు స్త్రీలకు ఇచ్చిన స్త్రీ స్వేచ్ఛ కథల్లో కన్పిస్తుంది. అలానే గుడిపాటి వెంకటచలం, కొడవటిగంటి కుటుంబ రావు, శరత్ చంద్ర, ఠాగూర్, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీరంగం శ్రీనివాసరావు వంటి కవుల ప్రభావం కనబడుతుంది. పాశ్చాత్య రచయితలైన మపాసా, ఓహెన్రీ కథల ప్రభావం వీరు రచించిన కథల్లో "కొసమెరుపు", "చమత్కృతి" కన్పిస్తుంది.

ఆధారగ్రంథాలు :

1. కృష్ణ, జయంపు.1994. జయంపు కృష్ణ కథలు. నెల్లూరు: వంశీకీర్తి పబ్లిషింగ్.
2. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం. 2015. మన నవలలు మన కథానికలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. దక్షిణామూర్తి, పోరంకి 1989. కథానిక స్వరూప స్వభావాలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి.2016. కథాశిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ నవలలు – సామాజిక జీవన చిత్రణ

– యు. సత్యప్రభ, పరిశోధక విద్యార్థిని.

సాహిత్యం అంటే హితం తో కూడినది. సాహిత్యం యొక్క లక్ష్యం సమాజ హితం. సాహిత్యం సమాజం యొక్క ప్రతిబింబం. దేశకాల పరిస్థితులకు అనుగుణం గానే సమాజంలో నడవడిక ఉంటుంది. ఆ సమాజం యొక్క పోకడలే సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. సామాజికతను ప్రతిబింబించే దే సజీవ సాహిత్యం అనిపించుకుంటుంది. రచయిత, కవి, వ్యాఖ్యాత ఎవరైనా సరే వారి వారి రచనలు సమాజానికి దర్పణంగా సాగుతాయి. అయితే రచయిత ఏ ప్రక్రియలో రచనలు చేసినా దానికి ఒక సామాజిక ప్రయోజనం ఉండాలి. రచనలో అంతర్భాగంగా సమాజానికి అనుసరణీయం అయిన ఒక సందేశం ఇమిడి ఉండాలి ఆ సందేశం సర్వజన ఆమోదదాయకంగా, ఆచరణ యోగ్యంగా ఉండాలి.

సమాజంలో పరివర్తన తీసుకురావడమే సాహిత్యం యొక్క ప్రధాన లక్ష్యం. పరివర్తన అంటే మార్పు. సమాజంలోని ప్రజల ఆలోచన లోను, ప్రవర్తనలోను, జీవన ప్రమాణం స్థాయిలోనూ అభిలషనీయమైన, ఆచరణీయమైన మార్పు రావడమే సామాజిక పరివర్తన.

ఆధునిక కాలంలో అనేకమంది రచయితలు సమాజంలోని సమస్యల మీద స్పందిస్తూ, ఆ సనస్యల మీద కలమనే ఆయుధాన్ని ఎక్కు పెడుతూ సామాజిక పరివర్తన తీసుకు రావడానికి రచనలు చేస్తున్నారు.

అటువంటి రచయితలలో శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ గారు ఒకరు. ఆయన తన రచనలలో సమాజంలోగల అనేక సమస్యలను చిత్రించడమే కాక ఆ సమస్యల పరిష్కారానికి తగిన మార్గం కూడా సూచించి సామాజిక పరివర్తనను తీసుకురావడానికి ప్రయత్నం చేశారు. ప్రతి రచనకు స్పష్టమైన సామాజిక ప్రయోజనాన్ని చూపడం కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ ప్రత్యేకత.

జగన్నాటకం నవల - సామాజిక జీవన చిత్రణ :

శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ గారు రచించిన మొదటి నవల జగన్నాటకం . ఈ నవలలో సామాజిక జీవన చిత్రణ ను తెలుసుకోవాలంటే నవలలో ఏఏ అంశాలను ఏ ఏ పాత్రల ద్వారా వ్యక్తం చేశారు , నవల యొక్క సామాజిక ప్రయోజనం ఏమిటి అన్నది తెలుసుకోవాలి.

జగన్నాటకం నవలలో ముఖ్యమైన పాత్రలు అభ్యుదయ భావాలు గల విద్యావంతుడు భానుమూర్తి, విద్యావంతురాలు, సౌందర్యవతి అయినప్పటికీ యవ్వన ఆరంభ దశలో ఒక మగవాని అకృత్యానికి బలై ఒక విధమైన ఆత్మన్యూనతా భావానికి లోనై, సహజసిద్ధమైన మృదు స్వభావాన్ని, ముగ్ధత్వాన్ని దాచుకుని తన చుట్టూ ఒంటరితనం అనే చీకటి కుహరాన్ని నిర్మించుకుని ఎందరిలో ఉన్నా తనకు తానై బతుకుతున్న యువతి విశాలాక్షి. నవలా గమనాన్ని ముందుకు తీసుకువెళ్లే దశలో కథాంశం చుట్టూ అనేక పాత్రలు తిరుగుతూ నవలా సమాప్తికి దోహదం చేస్తాయి. అవి విశాలాక్షి మేనమామ కాలేజీ కమిటీ మెంబర్ అయిన ఆనందరావు, కాలేజీ ప్రిన్సిపాల్, విన్సెంట్, బహు సంతాన వంతుడైన పేద గృహస్థు మాధవ రావు, ప్రిన్సిపాల్ కుమార్తె ప్రతిమ, ఇంకా భానుమూర్తి తల్లిదండ్రులు. ఆయా పాత్రల స్వబావాలు, విశిష్ట వ్యక్తిత్వాల ద్వారా వారి ప్రభావం సమాజంపై ఎలా ప్రతిఫలిస్తుందో తెలుసుకోవచ్చు.

భానుమూర్తి, మానసికంగా దెబ్బతిని కఠిన శిల వలె కుంచించుకు పోయిన విద్యావంతురాలైన విశాలాక్షి ని హిమశిల వలె ద్రవింప చేస్తాడు. జీవితం అంటే ఎడారి కాదని, అందులో మల్లెల పూయించి వచ్చని, జీవితం అంటే చీకటి కాదని, అందమైన వెన్నెల అని నిరూపిస్తాడు.

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

శిల వంటి యువతిని శిల్పంగా మార్చి జీవం పోస్తాడు. ఆమెలోని ద్వేషాన్ని తొలగించి అనురాగాన్ని నింపుతాడు. ఆమెకే కాదు , తన చుట్టూ ఉన్నవారందరి కష్టసుఖాల్లో పాలుపంచుకొని మానవత్వానికి నిలువెల్ల ప్రతీకగా నిలుస్తాడు. అధ్యాపకునిగా తన వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో నిర్వర్తించడమే కాకుండా తన చుట్టూ ఉన్నవారి కష్టాలను, సమస్యలను తనవిగా భావించి వారి వారి బ్రతుకులలో వెలుగును నింపడానికి తన వంతు కృషి చేసి విజయుడు అవుతాడు. భానుమూర్తి మూర్తిమత్వం, వ్యక్తిత్వం ఎంతో ఆదర్శనీయమైనది. సమాజంలోని వ్యక్తులకు అనుసరణ ీయమయినది.

ఒక లెక్చరర్‌గా తన విధిని నిర్వర్తించడమే కాకుండా కాలేజీ మొత్తం విద్యార్థుల శ్రేయోభిలాషిగా, కాలేజీ నిర్వహణలో ప్రిన్సిపాల్ కు చేదోడు వాదోడుగా ఉంటాడు. బహు సంతాన వంతుడైన పేదవాడు మాధవరావు కుమార్తెల బ్రతుకు బాటలు సరిదిద్దుతాడు. ప్రిన్సిపాల్ కుమార్తె ప్రతిమ వితంతువు అని తెలిసి బాధ పడతాడు. ఆమె రూప లావణ్యానికి, నెమ్మది తనానికి ముగ్ధుడై ఆమె పట్ల అనురాగం పెంచుకుని, ఆమెను వివాహం చేసుకొని, కొత్త జీవితం ఇవ్వాలని ఆశ పడతాడు. కానీ అనూహ్య పరిణామాల మధ్య ఆమె అపహరణకు గురై హత్య చేయ బడినప్పుడు భానుమూర్తి బాధతో విల విల లాడతాడు. ఆ సంఘటన తర్వాత బాధను తట్టుకోలేని ప్రిన్సిపాల్ కు పక్షవాతం రావడంతో ఆయనకు సేవ చేసి తన మానవత్వాన్ని చాటుకుంటాడు. ఇక్కడ చెప్పవలసిన సామాజిక అంశం ఏమిటంటే సమాజంలోని వ్యక్తులు తమకు తాము బతకడం కంటే తన చుట్టూ ఉన్న వారి గురించి కూడా ఆలోచించి వారి మంచి కై పాటుపడాలి. అప్పుడే మొత్తం సమాజం ఆనందమయం అవుతుంది.

వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడంలో ఖచ్చితంగా ఉండాలని నిరూపించే వ్యక్తి ప్రిన్సిపాల్. ఈ పాత్ర ఒక ఆదర్శవంతమైన అధ్యాపక వృత్తికి ఉదాహరణ. సమాజం అంటేనే రకరకాల పూల మొక్కలు, పండ్ల చెట్లు, ముళ్ల పొదలు ఉండే ఒక వనం లాంటిది. అందరిని అలరించే పూల చెట్లు, ఫలవృక్షాల లాంటి మంచి వ్యక్తు లే కాక, చురుక్కున గుచ్చుకునే ములు లాంటి వ్యక్తిత్వం గల వ్యక్తులు కూడా ఉంటారని తెలియజేస్తుందీ నవల. అలాంటి దుష్ట పాత్రలకు ఉదాహరణ విన్సెంట్. కథా నాయిక విశాలాక్షి పాత్ర చిత్రణ ద్వారా మనకు అవగత మయ్యే విషయం ఏమిటంటే స్త్రీలకైనా, పురుషులకైనా వారివారి సహజసిద్ధ లక్షణాలు ఉంటాయని, పరిస్థితుల ప్రభావం చేత తాత్కాలికంగా మరుగునపడినా వాటిని మార్చగల వ్యక్తిత్వం ఉన్న మనుషులు తారసపడి పరిస్థితులు అనుకూలిస్తే వారివారి సహజ లక్షణాలు బయటపడక తప్పదని తెలుస్తుంది. తనకు జరిగిన చేదు అనుభవంతో ఆత్మన్యూనతా భావానికి, అభద్రతా భావానికి గురై, పురుష ద్వేషిగా మారి తన చుట్టూ శూన్యాన్ని ఆవరింప చేసుకొని, ఎంతమంది ఉన్నా ఒంటరి తనంతోనే మగ్గుతుంటుంది అందమైనదీ, తెలివైనదీ, విద్యాధికురాలు, కాలేజీ లెక్చరర్ అయినప్పటికీ అందరి పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ సమాజం పట్ల వ్యతిరేక భావంతో ఉంటుంది. విశాలాక్షి ఉన్నత విద్యా వంతురాలు అయినప్పటికీ వినయంగా ప్రవర్తించలేదు. దీనికి కారణం ఆమె 'మోసగించబడ్డాను' అనే ఆత్మ న్యూనతా భావాన్ని నిర్లక్ష్య భావం గా మలుచుకుంటుంది. ఎవరు ఏ విషయం గురించి అడిగినా పెడసరం గా సమాధానం చెబుతుంటుంది.

ఈ నవలలో విశాలాక్షి పాత్ర సమాజంలోని ఎందరో అబలలకు ప్రతీక. నవలా కాలానికి, ఇప్పటికీ, ఇక ముందు కూడా ఈ దుస్థితి లో మార్పు వస్తుందనే ఆశ లేదు. ఆడపిల్లని కేవలం ఒక ఆటబొమ్మగా,తమ కామ వాంఛను తీర్చుకోవడానికి ఉపకరించే ఒక ఉపకరణంగా మాత్రమే సమాజంలోని కొందరు వ్యక్తులు భావిస్తూ అత్యా చారాలకి, హత్యాచారాలుకి పాల్పడుతున్నారు. పసి పిల్లల నుంచి పెద్ద వయసు గల మహిళలకు వేధింపులు,

అత్యాచారాలు తప్పడం లేదు ఇటీవల మనదేశంలో విభిన్న ప్రాంతాలలో రుగుతున్న అత్యాచార సంఘటనలు పరిశీలిస్తే మనుషులలో మానవత్వం మరణించిందా! అనిపిస్తోంది. జస్ట్రిని సాటి మనిషిగా, వ్యక్తిత్వం కలదిగా గుర్తించడం లేదు ప్రపంచవ్యాప్తంగా స్త్రీల పట్ల వివక్ష, చిన్న చూపు, అత్యాచారాలు నిత్యము జరుగుతూనే ఉన్నాయి. ఒకవైపు స్త్రీలు విద్యలలో రాణిస్తూ, సాంకేతిక ప్రజ్ఞ ను పెంచుకుంటూ, మగవారితో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నా రెండో వైపు చీకటి కోణాలు ఉంటున్నాయి. ప్రతి రంగంలోనూ స్త్రీలకు లైంగిక వేధింపులు తప్పడం లేదు. సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఆడవారి మీద జరుగుతున్న అనేక అత్యాచారాలను తీవ్రంగా ఖండిస్తూ తీర్పులు వెలువరించింది.' విశాఖ మార్గదర్శకాలు ' ద్వారా ఉద్యోగినులకు తమ కార్యాలయాల్లో జరిగే లైంగిక ధింపుల నుండి రక్షణ, తగు న్యాయం చేసే విధానానికి కేంద్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. ఎఅయినప్పటికీ బయటకు తెలియకుండా జరిగే లైంగిక వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి.

సమాజంలో అబలల మీద అఘాయిత్యాలు జరిగినప్పుడు వారు అనేక అవమానాలకు, మానసిక సంక్షోభాలకు గురవుతారు. మానసిక శాంతిని, స్థిరత్వాన్ని పూర్తిగా కోల్పోతారు. ప్రధానంగా వారి మానసిక పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. ఇది వారి శేష జీవితాన్ని ప్రభావితం చేస్తుంది.వారిని తిరిగి మామూలు మనుషులుగా మార్చడం చాలా కష్టం.మానసిక వైద్య నిపుణుల ప్రయత్నాలతో కొంతవరకు ప్రయోజనం కనిపించవచ్చు. కానీ తాము ఎంతో విలువైన శీలాన్ని కోల్పోయామనే బాధ తొలగిపోదు. అది వారి మనసులో కదులుతూనే ఉంటుంది. వారు జీవితంలో నవ్వులు మర్చిపోతారు. సంతోషం అనేది ఎరగరు. అందరితో కలిసిమెలిసి ఉండలేరు. వారి మనసు మృదుత్వం నుండి అతి కఠినంగా మారిపోతుంది. జడత్వం ఏర్పడుతుంది. విశాలాక్షి పాత్రలో ఇటువంటి ధోరణి కనబడుతుంది. తల్లిదండ్రులను పోగొట్టుకున్న విశాలాక్షి కి సంరక్షకుడు అయిన ఆనందరావు పాత్ర తండ్రి తర్వాత తండ్రి అంతటివాడు మేనమామ అని నిరూపిస్తుంది. కన్న కొడుకు అకాల మరణం పొందినప్పటికీ అనాధ అయిన మేనకోడలు విశాలాక్షికి అన్నీ తానై పెంచి పెద్ద చేసి విద్యావంతురాలుని చేస్తాడు. ప్రిన్సిపాల్ కూతురు ప్రతిమ ఎంతో ఔన్నత్యం గల యువతి. భానుమూర్తి తనను ప్రేమిస్తున్నాడని తెలుసుకున్న ప్రతిమ ఎడారి లాంటి బ్రతుకులో వెన్నెల పూలు పూస్తాయని, తన జీవితం కొత్త మలుపు తో సంతోషమయం అవుతుందని మురిసిపోయి కలలు కనలేదు. మంచితనం, వివేకం, వివేచన గల వ్యక్తిగా ఆలోచించింది. విశాలాక్షికి భానుమూర్తి పై గల అనురాగాన్ని, ఆరాధనని అర్థం చేసుకున్న యువతిగా, తన పై గల ఆరాధనను పరోక్షంగా తెలియజేసిన భానుమూర్తితో ఎంతో నేర్పుగా వ్యవహరించింది. విశాలాక్షి కి అతని పై గల ఆరాధనను, ప్రేమను వివరించి చెప్పి " మాస్టారూ! మీరు నా చీకటి బ్రతుకులో వెలుగు నింపాలని తహతహలాడుతున్నారు. కానీ నా జీవితం ఆనందం కోసం ఇంకొకరి ఆశలు కోర్కెల పై నీళ్ళు జల్ల లేను" అంటూ ఎంతో పరిణతి కలిగిన యువతిలా ప్రవర్తిస్తుంది సహజంగా సమాజంలో స్త్రీలను గూర్చి అసూయాపరులని, స్వార్థపరులని, ప్రేమ విషయంలో మరీ సంకుచితంగా ఉంటారనే అపప్రదను తొలగించేలా ప్రతిమ పాత్రను చిత్రీకరించారు. దీని ద్వారా సమాజంలో అందరూ అనుకున్నట్లు సంకుచిత బుద్ధిగల స్త్రీలే కాకుండా విశాల హృదయము ఉండే స్త్రీలు కూడా ఉంటారనే విషయాన్ని రచయిత తెలియజేశారు.

జగన్నాటకం నవలలో విద్య, వివేకం, సంస్కారం, సంయమనం గల యువతిగా మనకు ప్రతిమ కనిపిస్తే వయసు కోరికలను అణుచుకు నేటంత ఆలోచనలేని యువతిగా రుక్మిణీ కనిపిస్తుంది. మాధవరావు పిల్లలలో పెద్దది రుక్మిణి. యవ్వనవతి. పేదవాడు అయిన తన తండ్రి తనకు వివాహం చేయలేడని భావించి మొదట

భానుమూర్తిని ఆకర్షించే ప్రయత్నం చేసి విఫలమవు తుంది. తర్వాత రంగారావు అనే వ్యక్తిని ఆకర్షించి అతని వలలో పడుతుంది. రంగారావు ఫుడ్ కార్పొరేషన్ లో పనిచేసే ఒంటరి యువకుడు పరస్పరం ఆకర్షితులైన ఇద్దరూ హద్దులు దాటితే ఫలితంగా రుక్మిణి గర్భవతి అవుతుంది. కాకపోతే రంగారావు మోసగాడు, దుష్టుడు కాదు కాబట్టి భానుమూర్తి చొరవతో రుక్మిణిని వివాహం చేసుకుంటాడు. మాధవరావు రెండవ కూతురు మంగ కూడా అక్క మార్గాన్ని అనుసరించాలని తలచి చలపతి అనే వివాహితుడు వలలో పడ బోతుంది. చలపతి అప్పటికే వివాహమై భార్యకు దూరంగా ఉన్న షోకిల్లా రాయుడు. ఈ విషయంలో కూడా భానుమూర్తి కలగ జేసుకుని మంగ బ్రతుకు పతనం కాకుండా రక్షిస్తాడు.

సమాజములో దిగువ మధ్య తరగతి కుటుంబాలలో తల్లిదండ్రులు ఆడపిల్లలకు సకాలంలో వివాహం చేయ లేని అశక్తతతను, ఫలితంగా ఎదురయ్యే సమస్యలను రుక్మిణి, మంగ పాత్రల ద్వారా తెలియజేశారు. భాను మూర్తి పనిచేస్తున్న కాలేజీ లోనే లెక్చరర్‌గా పనిచేస్తున్న అవి వాహితురాలు వయొలెట్. ఈమె కొంచెం విచ్చల విడిగా తిరిగే యువతి. కోర్కెలను ప్రేరేపించే అశ్లీల సాహిత్యాన్ని చదవడం అలవాటు చేసుకుని స్వేచ్ఛగా మగవాళ్లతో తిరిగే స్వభావం కలది. సంస్కరణాభిలాష కలిగిన భానుమూర్తి ఆమె దగ్గర అలాంటి పుస్తకాలు చూసి "దయచేసి అలాంటి పుస్తకాలు తీసుకురాకండి. పిల్లల కంటపడితే ప్రమాదం" అని హెచ్చరిస్తాడు.

సమాజంలో ఒకేలాంటి స్వభావం ఉన్న మనుషులే ఉండరని, రకరకాల మనస్తత్వం ఉన్నవాళ్లు ఉంటారని తెలియజేయడం కోసమే వయొలెట్ లాంటి యువతిని రచయిత ప్రస్తావించారు.

సమాజం అంటేనే మంచి చెడుల మిశ్రమం. మనం మంచి వారిని అనుసరిస్తూ, చెడ్డవారికి దూరంగా ఉండాలి. 'సాహిత్యంలో సమాజం ప్రతిఫలిస్తుంది." అని చెప్పడానికి సరైన ఉదాహరణ 'జగన్నాటకం' నవల. ఈ నవలలో కథాగమనం, పాత్రల స్వభావాల చిత్రీకరణ, పాత్రల మధ్య సంభాషణల ద్వారా అనేక సామాజి కాంశాలు చాలా స్పష్టంగా ప్రతిబింబించాయి. వ్యక్తుల భిన్న మనస్తత్వాలు, వారి ప్రవర్తనలుసమాజం మీద ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయో తెలియజేసే అంశమే సామాజికత. ఆ సామాజికతను ప్రతిఫలింప చేసి, సమాజాన్ని ప్రభావితం చేసి, ఆయా పాత్రల గుణగణా లతో పాఠకుల ను ఆలోచింప చేసేది మంచి సాహిత్యం.

'జగన్నాటకం' నవల ను అనేక సామాజికాంశాలను మనముందు ఉంచి సఫలత పొందిన నవలగా పేర్కొన వచ్చు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు సాహిత్యంలో గజల్లు

– డా॥. ఉడాలి విష్ణుప్రియ, తెలుగు శాఖాధ్యక్షులు, సెంట్ ఆన్స్ మహిళ కళాశాల, హైదరాబాదు.

ఆధునిక సాహిత్యంలో ప్రణయ భావాలతో పాటు సామాజిక చైతన్యాన్ని ప్రతిభావంతంగా ఆవిష్కరించిన కథ, నవల, నాటకం, వచన కవిత వంటి ప్రక్రియల్లో గజల్ ప్రక్రియ వినూత్నమైంది. అరబ్బీలోను, పారసీ లోనూ ఉన్న కవితా ప్రక్రియ "కసీదా". చక్రవర్తులను రాజులను కీర్తించడమే కసీదా ప్రధాన వస్తువు. కసీదాలో ఒక భాగమైన తాషిబ్ విడిపోయి, క్రమంగా గజల్ అనే ప్రక్రియ ఏర్పడింది. అరబ్బీ సాహిత్యం నుంచి పారసీ సాహిత్యంలోకి గజల్ వచ్చిందని కొందరు, పారసీ నుంచి అరబ్బీకి వ్యాపించిందని మరికొందరు అంటున్నారు. పన్నెండవ శతాబ్దిలో మొఘల్ రాజుల కాలంలో ఇరాన్ సంస్కృతిలో భాగంగా ఈ గజల్ భారత్‌లోకి ప్రవేశించింది. అమీర్ ఖుస్రూ (1253-1325) ఇండియాలో గజల్ రచన ఆరంభించాడు. ఢిల్లీ, లక్నో నగరాలు కేంద్రాలుగా గజల్ ప్రక్రియ వర్ధిల్లింది. గజల్ అనే పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది ప్రేమ మాత్రమే. ప్రేమ, ఎడబాటు, వేదన, సూఫీ తాత్వికతలు వస్తువులుగా ఉన్న గజళ్లనే గాయకులు ఎక్కువగా పాడుతున్నారు.

ఈ గజల్ పేరు వెనక ఓ కథ ఉంది. ఒక అరబ్బు దేశంలో గజ్జాల్ అనే పేరుగల ఒక కవి ఉండేవాడు. అతడు జీవితాంతం ప్రణయాన్ని గూర్చి, సౌందర్యాన్ని గూర్చి కవితలు రాస్తూ గడిపాడు. కేవలం ప్రణయ రచనలు చేయడమే కాక, ప్రణయ కలాపాల్లో అతడు జీవితం వెళ్లబుచ్చాడు. ఆ రచయిత పేరు గజ్జాల్ కనుక ప్రణయ కవితకు గజల్ అనే పేరొచ్చిందంటారు ప్రముఖ కవి డా. దాశరథిగారు! గజల్ పనే పదానికి 'ప్రేయసితో సంభాషణ' అనే అర్థమే ప్రచలితమై ఉన్నది. కానీ 20వ శతాబ్దిలో మహమ్మద్ ఇఖ్బాల్ (1873-1938), హస్రత్ మొహానీ (1875-1951) లాంటి కవులు దేశభక్తిని, సంస్కరణ భావాలను ఈ ప్రక్రియ ద్వారా ప్రబోధించారు. ఆ తర్వాత కాలంలో ఫైజ్ అహమ్మద్ ఫైజ్, అలీ సర్దార్ జాఫ్రీలాంటి కవులు సోషలిస్టు భావాలను గజళ్లలో చెప్పారు.

రెండు రెండు పాదాల ద్విపదల (ముక్తకాలు) సముదాయమే గజల్! రెండు పాదాలను కలిపి 'షేర్' అనీ, ఒక్కొక్క పాదాన్ని 'మిస్రా' అనీ అంటారు. మొదటి షేర్‌ను 'మత్లా' అంటారు. మత్లా పాటలోని పల్లవిలాంటిది. ఇది పాఠకుడిలో ఒక నిర్దిష్టమైన మానసిక స్థితిని ఏర్పరచి గజల్‌ని ఆనందించడానికి తగిన మానసిక సంసిద్ధతని చేకూరుస్తుంది. ఒక షేర్‌లోని భావం ఆ షేర్‌తోనే పూర్తి కావాలి

ఆంగ్ల సాహిత్యానికి షేక్స్పియర్ ఎంతటి వాడో ఉర్దూ కవిత్వానికి గాలిబ్ అంతటివాడు. ఈ గాలిబ్ గీతాల్ని దాశరథి తెలుగులోకి అనువదించి ఆంధ్ర సాహిత్యానికి గజల్ ప్రక్రియను పరిచయం చేశారు. దాశరథిగారు గాలిబ్ గీతాలను తెలుగులో అనువదించే టప్పుడు ప్రతి పద్యాన్నీ ఆకళింపు చేసుకొని, ఆ పద్యానికి ఇతర భాషల్లో వివిధ వ్యాఖ్యాతలు, విమర్శకులు చెప్పిన అర్థాన్ని చదివి తనకు స్ఫురించిన అర్థాన్ని జీర్ణించుకొని రాశారు.

"ప్రతిదీ సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము
నరుడు నరుడౌట ఎంతో దుష్కరము సుమ్ము"

మూలంలోని ఆద్మీ, ఇన్‌సాన్ పదాలకున్న భావ భేదాన్ని నరుడు నరుడౌట అనే తెలుగుదనంతో వ్యక్తీకరించడం విశేషం. మానవుడిని సమాజ దీపంగా ముందుకు నడిపించే దిశలో పై పాదాలున్నాయి.

"బతుకుపై నింత విశ్వాస పడెదరేల
యేడీ మాంధాత? పురుకుత్సుడేడీ నేడు?

గుడిని శివుడు దొరకకున్న కాశికి గానీ
పరుగులెత్తి నేను బడయగలను?.."

వంటి ఇలాంటి షేర్‌లను చూస్తే హైందవేతర వాతావరణాన్ని హైందవ వాతావరణంగా పరివర్తించడానికి దాశరథిగారు ప్రయత్నించారని అర్థమవుతుంది. ఇత్యాది అనువాదాలలోని భావ మార్దవం, తాత్వికత, ప్రేమికుల సహజ ఉద్వేగ ప్రవృత్తి, జీవన సత్యాలు తెలుగు పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

"ఇన్నినాళ్లకు తెలుపమంటివి ఎందుకొరకే నా పతా.."

అని మొదలయ్యే గజల్‌లో కవి దాశరథిగారు..

"పగబూని కఱకువారు బంధించి ఉంచినారు
యేనాటికైన గాని ఈ గూడు పొడిచి రానా.."

అని స్వాతంత్ర్యం కోల్పోయిన వ్యక్తి జాతీయతను స్ఫురించేలా ప్రతిభావంతంగా కవిత్వీకరించారని విమర్శకులు పేర్కొన్నారు. ఇందులో ఆయన దేశభక్తి, జాతీయ దృక్పథంకనిపిస్తుంది.

తెలుగు గజల్‌ను తొలుత ప్రవేశ పెట్టినవారు దాశరథి గారైతే, విశేష ప్రాచుర్యాన్ని తీసుకొచ్చినవారు డా. సి. నారాయణరెడ్డిగారు. తెలుగు గజళ్లు అనే గ్రంథాన్ని 1986లో తొలి తెలుగు గజళ్ల సంపుటిగా తీసుకొచ్చారు. సినారె తన గజళ్లలో ఎక్కువగా సామాజిక అంశాలు, ప్రగతిశీల భావాలను వస్తువులుగా స్వీకరించినట్లు కనిపిస్తుంది.

"పరుల కోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని?
మూగ నేలకు నీరందివ్వని వాగు పరుగు దేనికని..?"

అన్న పాదాల్లో నేలకు మానవ ధర్మారోపణ, వాగుకు ప్రాణి ధర్మారోపణలు గమనించదగినవి. అనావృష్టి పీడనను మూగతనంతో కవి నిక్షేపించారు. వాగును నదికి ప్రతీకగా గ్రహిస్తే, బీళ్లను సస్యశ్యామలం చేయకుండా సాగరసంగమానికి ఉరకలెత్తే నదులది నిరర్థక జీవనమనేది వ్యంగ్యం!

"ఎన్నో ఎన్నో శాఖలుగా వ్యక్తిత్వమెంతగ ఎదిగినా
తల్లి వేరును పొద్దు పొద్దున తలచుకుంటే మంచిది"

అని వ్యక్తిత్వాన్ని శాఖలతో పోల్చడం ద్వారా ఇక్కడ వృక్షం మౌలిక ఉపమానమని వ్యంగ్యం చేశారు. మూలాలను మరచిపోకుండా ఉంటేనే ఆధిక్యతా భావం, అహం తలకెక్కకుండా ఉంటాయి. ధారణకు మూలం మననం. పొద్దు పొద్దున అనేది శిష్ట వ్యావహారికంలోనూ, మాండలికంగానూ అతికినట్లు ఒదిగిన ప్రయోగం.

ఒక వ్యక్తికి మాట విలువ ఎంత అవసరమో కవి సినారె ఇలా అభివ్యక్తీకరించారు.

"నీ మాటకు విలువే లేకుంటే అది మాట ఎలా అవుతుంది?
తన మాటున పరువును దాచనిదే అది పైట ఎలా అవుతుంది?"

వ్యక్తికి ఏ రకమైన వ్యక్తిత్వపు ముద్రనైనా ఇచ్చేది అతని భావ వ్యక్తీకరణ పద్ధతే! మనో వాక్కాయ కర్మల మధ్య నుండే సమన్వయమే మాటకూ, వ్యక్తిత్వానికీ ఉన్న సంబంధం గాఢమైనదీ, లోతైనదీ! చదువు ఎలా మాట్లాడాలో నేర్పుతుంది. జ్ఞానం ఎప్పుడు, ఎందుకు మౌనంగా ఉండాలో తెలుపుతుంది. అంతర్యాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎవరి వద్ద ఎంతవరకు బైటపెట్టాలి అనే వివేచన మీద ఆ మాట ఆధారపడి ఉంటుంది. ఎప్పుడు, ఎక్కడ, ఎవరి వద్ద ఎంతవరకు తన సౌందర్యాన్ని ప్రదర్శించాలో లేదా దాచుకోవాలో అనే నిర్ణయానికి పైట సంకేతం!

అహంభావాన్ని విడనాడి మానవుడు నడవాలన్న స్ఫూర్తితో సినారె గారు..

"తలపులూరే తలకు కొమ్ములు మొలిస్తే అది ప్రమాదం
అహంభావం పడగలెత్తితే అణచుకుంటే మంచిది.."

పశువు నుంచి మనిషిని వేరుగా చేసేది బుద్ధి. తలకు కొమ్ములు మొలిస్తే పశు లక్షణాలు సంక్రమించే ప్రమాదం ఉందని, అహంభావం హద్దు మీరడమే పడగలెత్తడం అన్నది అహంభావ తీవ్రతకు సూచన.

"కుదురుకుంటుందా సమాజం అదుపు లేకుంటే?
"కొత్త వేగం పెరుగుతుందా కుదుపు లేకుంటే.."

- సమాజం కూడా తన అదుపులో తానుంటే అన్నీ సవ్యంగా ఉంటాయని అన్నారు.

"తీపి మాటున ఉన్న చేదును తెలుసుకుంటే మంచిది
"కలహమేనా జీవితాంతం.. కలుసుకుంటే మంచిది.."

అంటూ సామాజిక బాధ్యతను తెలియజేశారు. వ్యవస్థ లోని అవ్యవస్థకు కారణాలను అధిక్షేపించడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి అనుసరించ వలసిన పద్ధతులు, వ్యక్తి నిర్వర్తించవలసిన నియమాలూ సినారె గజళ్లలోని కవితా వస్తువులు! ఆ గజళ్ల మీది ప్రేమే..

"నన్ను నేనే పాటగా పలికించుకుంటాను
"మిన్నులను నా ముంగిటికి పిలిపించుకుంటాను.."

అంటూ ఆయన చేత పాడించింది! దాశరథి, సినారె.. వీరి బాటలో చల్లా రాంబాబుగారు 'చల్లా గజళ్లు' సంపుటిని రచించారు. వీరి రచనలోనూ ఎన్నో సామాజిక ప్రబోధాత్మకాలు, ఆనాటి వాస్తవ సదృశ్యాలు కనిపిస్తాయి.

"పైపైకి ఎదిగావు నేల పైకి చూసుకో
"భూమి పైన కాళ్లుంచి ముందడుగు వేసుకో.."

వంటి ప్రబోధాత్మకమైన పంక్తులే గాక..

"బండెడు సంతానపు యాత్రలింక చాలు
"కొండంత అండైన ఇద్దరుంటే చాలు.."

వంటి షేర్‌లు ప్రభుత్వం వారి కుటుంబ సంక్షేమ పథకాల ప్రచారానికి బాగా ఉపకరిస్తాయి.

"ఎవరు నాటిరి బాట ప్రక్క పూలనిచ్చెను గడ్డిమొక్క
"పరుల కోసం పంట నలిగి పెదవి పండెను ఆకు వక్క"

...

"జనం లోపల జాగృతున్నది తట్టి లేపితే మేలుకొన్నది
"మధనపడే హృదయాన మనసుకి వేదన.."

మొదలైన విచిత్ర, విలక్షణ ప్రయోగాలు వీరి సంపుటిలో ఉన్నాయి.

మరో గజల్ కవి సూరారం శంకర్ గారు 2007లో సౌగంధిక అనే గజల్ సంపుటిని వెలువరించారు. వారు చెప్పిన గజళ్లలో..

"కొన్ని గుండెలు ఎంతకాలం చెప్పినా అవి మారవు
కొన్ని దారులు ఎంత దూరం నడిచినా దరి చేరవు.."

- బింబ, ప్రతిబింబ భావం స్ఫురించే విధంగా ఒక లోకరీతిని పై మత్లాలో అందంగా చెప్పారు.

"ఓటమే నీ నేస్తమైనా పట్టు వదలవదేమి శంకర్
జగతిలో ఏ అండ లేదు నాకు నేనే సేతువు.."

మనిషి తనకు తానే ప్రేరణకు గురి చేసే విధంగా ఈ పంక్తులున్నాయి.

"నీవు నన్ను విడిచినాక తోడు విలువ తెలిసింది
చెట్టు దాటి వచ్చినాక నీడ విలువ తెలిసింది.."

అంటూ ఇలాంటివెన్నో శంకర్ గారి కలం నుంచి గజళ్లుగా జాలువారాయి.

డా. సాగర్ జయాదీ 'ఆకలి రంగు' అనే గజళ్ల సంపుటిని ఆవిష్కరించారు. వీరు కడప జిల్లా రాయచోటి వాసి. ఉర్దూలో గజళ్లు, రుబాయిలు రాసి సంకలనాలుగా వెలువరించారు. పట్టుదలతో, స్వయంకృషితో తెలుగు భాష మీద పట్టు సాధించారు. వీరి 'ఆకలి రంగు' సంకలనంలో 52 గజళ్లున్నాయి.

"నెత్తురు తాగిన కత్తుల పిడులకు
ఎర్రని పచ్చని రాళ్లుంటాయి.."

...

"స్నేహానికి నేత్రాలుండవు
నీ ద్రోహానికి గోత్రాలుండవు.."

...

"నన్ను నిన్ను కూడినాను
తీసివేతలో ఓడినాను.."

ఇంకా చూడండి..

"శత నిరాశల ఉగ్గు గిన్నెలు పోసినా
ఆశ జోలెలో పెరుగుతుందీ జీవితం.."

అని ఆశల జోలెలలో పెరిగే మనిషి నిత్య శిశువనే భావాన్ని కవి ధ్వనించారు.

"నన్ను వ్యక్తం చేయగలవా?
అగ్నిచిత్రం గీయగలవా.."
...
"గాజు చేపలు తిరుగుచున్నవి
రాతి గాలెం వేయగలవా..?"
...
"అలసిపోయిన చెమటచుక్కను
పాలబుగ్గలు మోయగలవా..?"

అంటూ అద్భుత పదచిత్రాల్ని సృష్టించిన జయీద్

ఉర్దూ మాతృభాషయినా తెలుగులో చక్కటి కవిత్వం రాయడం విశేషం. నిజానికి ఉర్దూ మాతృభాషగా కలిగిన వారు రాసిన మొదటి తెలుగు గజల్ సంపుటి ఇదే! తన గజల్‌లో ముస్లిం సమాజం మీద, బయటి విద్వేష దాడుల్ని, అంతర్గత సమస్యల్ని, రాయలసీమలోని అనావృష్టినీ, కరువునూ, ఫ్యాక్షనిజంను సున్నితంగా ధ్వనింపజేసిన కవి ఈయన!

ఇక గజల్ రచయిత్రుల విషయానికి వస్తే డా. ఎమ్.బి.డి. శ్యామలగారు తొలి గజల్ కవయిత్రిగా పేరొందారు. ఆమె సుహృల్లేఖ అనే గజల్ సంకలనాన్ని తెచ్చారు. వారు రాసిన కొన్ని పంక్తులు..

"ఏమి చెప్పగలను నేను అమ్మ గురించి?
ఇంటింటా జన్మ నిచ్చు బ్రహ్మ గురించి.."
...
"నీవు నేల నేను నింగి కలుద్దాం రమ్మంది
నిన్ను వదలి పోలేనని మాటిమ్మని కోరింది"

పై పంక్తులలో ఎంతో ఆర్ద్రత ఉంది. ఇలాంటి గజళ్లు వీరి రచనల్లో తిలకించవచ్చు.

డా. అద్దేపల్లి రామమోహనరావుగారు తెలుగు గజళ్లలో రాసిన ఈ పంక్తులను చూద్దాం.

"లోకం కంటే నేనే ఎక్కువ లోకం నాలో ఉన్నప్పుడే
దేవుడి కంటే నేనే ఎక్కువ మనిషిగ నేనే ఉన్నప్పుడే"

- ఈ పాదాల్లో మనిషి అస్తిత్వానికున్న విలువను తెలియజేస్తున్నారు. ఇలా గజళ్ల రచనకు పూనుకున్న పలు రచయితల వరుసలలో డా. రెంటాల శ్రీవేంకటేశ్వర రావుగారు రాసిన గజళ్లు కూడా సాహిత్య లోకంలో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. సినారె గారి గజళ్లే ఈయన ఈ ప్రక్రియలో కృషి చేయడానికి కారణమని చెప్పుకున్నారు.

"చేదకుంటే బావి నీరు చెడిపోతుంది
వాడకుంటే ప్రతిభకున్న పదిను పోతుంది.."

అనే గజల్‌లో ప్రతి మనిషి ప్రతిభావంతుడు కావాలంటే నిత్యమూ తన మెదడుకు పదును పెడుతుండాలంటారు.

"ఓటమి పాలవుతామని ఓ రెంటాల
బరి వీడకు అనుభవాల బడి పోతుంది.."

వంటి వాక్యాల్లో పోరులో గెలిచినా, ఓడినా అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని చెప్పడం మనం గమనించదగినది.

అలాగే నేటి సమాజంలో మొబైల్ ఫోన్ల ఆధిపత్యం ఎంతగా విజృంభిస్తుందో ఈయన గజళ్లలోనే చూద్దాం.

"నోరు గలది ఫోను దాని తీరు చూస్తే కలవరం
ఇంక ఉత్తరాన్ని చెయ్యనిస్తుందా కాపురం"

- ఇందులో నోరు గలది అనే మాట ఫోనుకు సంబంధించి సార్థకమవుతూనే ఉంది. కాపురం చెయ్యనివ్వడం అనే అంశం ద్వారా ఫోనుకూ, ఉత్తరానికీ సపత్నీకత వ్యంగ్యమవుతుంది.

కేవలం సాహిత్య పరమైన గుర్తింపు కోసం రాసే ప్రక్రియ కాదు గజల్. మనసు ఉపరితలంలో తేలిన భావాల్ని ఎవరి మెప్పు కోసమో గుదిగుచ్చితే ఆ గజల్ ఏ అనుభూతినీ కలిగించలేదు. ఎందుకంటే గాయపడని గుండెలో గజల్ మొలవదు. గజల్ రాయడం కోసం ఏ కత్తికో ఎదురెళ్లి గాయపడక్కరలేదు. వ్యక్తిగత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ స్థితిగతుల వల్ల ఎంతో కొంత మానసిక సంఘర్షణను అనుభవించని వ్యక్తులు సాధా

రణంగా ఉండరు. వ్యక్తి జీవితాలకి, లోకానికీ మధ్య సామరస్య వైమనస్యాల మిత్ర శత్రు వైరుధ్యాల ఎరుక కలుగుతుంది. ఆ గాయం కలిగించే దు:ఖం నుంచి తనకు తాను సాంత్వన చేకూర్చుకుని గజల్ రాయడానికి ప్రయత్నించినప్పుడు జీవన సంఘర్షణ స్వరూపం ఫలితాలు అనుభవంలోకి వస్తాయి. ఆ మానసిక స్థితి నుంచి అచ్చమైన గజల్ ఉద్భవిస్తుంది. అలా ఉద్భవించింది కాబట్టే..

"ఏ మనసు పొరల్లో ఏముందో ఏనాడో సినారెకు తెలుసులే
పడగెత్తే వంచన పైబడితే తొడగొట్టే బాధాగళమెంతో.."

అంటూ గజల్ కవి గళమెత్తుతాడు!

ఉపయుక్త గ్రంథాలు :

1. డా. సూరారం శంకర్ - 'సౌగంధిక' (గజళ్లు)
2. చల్లా రాంబాబూ 'చల్లా గజళ్లు'
3. డా. ఎమ్.బి.డి.శ్యామల - 'సుహృల్లేఖ'
4. డా. సాగర్ జయీద్ - 'ఆకలి రంగు'
5. డా. సినారె - 'తొలి తెలుగు గజళ్లు'
6. డా. దాశరథి - 'గాలిబ్ గీతాలు'
7. డా.పెన్నా శివరామకృష్ణ - 'తెలుగు గజళ్లు రుబాయిలు'
8. డా. అద్దేపల్లి రామమోహనరావు 'తెలుగు గజళ్లు'
9. డా. రెంటాల శ్రీవేంకటేశ్వరరావు గజళ్లు
10. తెలుగు గజళ్లు - వికీపీడియా

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

డా॥ కొండెపోగు సాహిత్యం – సామాజిక జీవన చిత్రణ

– ఉడుముల అంజిరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఉపోద్ఘాతం :

హితేన సహితం సాహిత్యం. సాహిత్యం సమాజ హితాన్ని కాంక్షిస్తుంది. సమాజ హితమంటే సమాజం లోని సర్వజనుల హితమని అర్థం. సమాజం లోని ప్రజల అజ్ఞానాన్ని, దారిద్ర్యాన్ని పారద్రోలి నిజమైన వికాసాన్ని, ప్రబోధాన్ని ఇచ్చే శక్తి కవిత్వానికి ఉంది. దానిలో భాగంగానే నిన్న జరిగిన విషయాలతో నేటి అనుభూతు లను రంగరించి రేపటి స్వప్నాలతో అనుసంధానిస్తూ రచ యితలు తమ కలం బలంచే సామాజిక చైతన్యం దిశగా రచనలు సాగిస్తారు. ఆ క్రమంలోనే కవులు రచయితలు సమాజ స్థితిగతులను, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపే ప్రయత్నంచేస్తారు. అందులో భాగంగానే వర్తమాన కాలపు వివిధ అంశాలను ప్రస్తావించడంతో పాటు సజాజాన్ని ప్రతిబింబించేలా సమకాలీన ప్రజల జీవన విధానాన్ని కూడా చిత్రీకరిస్తారు. ఆ భావాలను అభివ్యక్తీకరించడంలో పద్యం కంటే వచనం మరింత దృఢంగా ప్రభావం చూపు తుందని నవీన కాల రచయితల నమ్మకం. సగటు మనిషి హృదయపు భాషలో అనుభవాలను అభివ్యక్తీకరించ గలిగితే నేరుగా పాఠకుల మనసు ఆలోచనల అద్దంపై ఒక ముద్ర వేస్తాయి. అముద్రలే ఆత్మావలోకనం చేసుకోగల వివేకాన్ని ప్రేరేపిస్తాయి. ఈ ఒరవడిలో డా॥ కొండెపోగు బాబు డేవిడ్ లివింగ్‌స్టన్ చేసిన కవితా సేద్యాన్ని విశదీకరించే ప్రయత్నమే ప్రస్తుత వ్యాసంలోని ప్రధానాంశం.

కొండెపోగు వారు సమాజాన్ని అన్ని దృక్కోణాల నుంచి పరిశీలించి ఈ వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను, అన్యాయాలను, ప్రజల అవస్థలను తన రచనలలో చొప్పిం చారు. సమాజంలో నెలకొన్న ప్రతి అంశాన్ని కూలంకషంగా విశదపరుస్తూ కవిత్వీకరించారు. వీరు తమ కవిత్వం ద్వారా సమాజంలోని అకృత్యాలను అమానవీయ సంఘ టనలను తూర్పారపడుతూ సామాజిక చైతన్యాన్ని అభి లషించారు. ప్రస్తుత సమాజంలోని విద్యావ్యవస్థలో, సినిమా రంగంలో జరుగుతున్న లోపాలను ఎండగట్టిన విధానాన్ని పరిశీలిద్దాం.

సామాజిక ప్రగతికి విద్య మూలస్తంభం. అన్ని రంగాల కన్నా విద్యారంగం ప్రధానమైంది. విద్యారంగం పరిపుష్టి కాకుంటే అన్ని రంగాలు కుదేలవుతాయన్న విషయం డా॥ కొండెపోగు వారి కవిత్వంలో ద్యోతకమవుతుంది. రచ యిత స్వయంగా అధ్యాపకుడు కావడం చేత విద్యా వ్యవస్థలో విద్యపేరుతో జరుగుతున్న దోపిడీని, విద్యా వ్యాపారంలో భాగంగా చిదిమివేయబడుతున్న బాల్యాన్ని, విద్యార్థుల అవస్థల్ని గురించి అక్షరీక రించారు. శ్రీశ్రీ గారి మహాప్రస్థానంలోని 'బాటసారి' కవితను స్ఫురణకు తెస్తూ 'ఎంత కష్టమో చిన్న తల్లికి' అనే కవితను రాశారు.

ఆడే పాడే బాల్యాన్ని
అలమరాలో దాచేసి
నవ్వుల్ని అర్థాంతరంగా చిదిమేసి
మాటలైనా రాకముందే
రెక్క పుచ్చుకొని అమ్మ
కాన్వెంటు లోకి విసిరేస్తుంటే
ఎంత కష్టమో చిన్నతల్లికి

నేటి సమాజంలో కొందరు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్ళే సాకుతో, మరికొందరు తమ పిల్లలు చదువుల్లో పునాది గట్టిగా ఉండాలనే ఉద్దేశ్యంతో L.K.G. & U.K.G. ల పేరుతో పసి ప్రాయంలోనే కాన్వెంటు లోకి పంపిస్తున్నారు. సరిగా మాటలైనా రాని పిల్లలు తమ ఆడే పాడే బాల్యాన్ని చదువుల బందిఖానాల్లో ఎర్రబడ్డ కళ్ళతో, తడిసిన బుగ్గలతో దీనంగా ఉండడాన్ని వివ

రించారు. 'కాన్వెంటు' అనే మరో కవితలో కూడా ప్రైవేటు పాఠశాల్లో చదువుకొనే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వివరించే ప్రయత్నం చేశారు.

ఇక్కడే మేము మా బాల్యాన్ని జారవిడుచుకున్నాం
బానిసత్వాన్ని ఏ,బి,సి,డి లుగా దిద్దుకున్నాం
బ్రతుకు భారాన్ని స్కూలు బ్యాగుగా
మోయడాన్ని నేర్చుకున్నాం
మేథో పరుగు పందెంలో
మా పసి పాదాల్ని పచ్చిపుళ్లు చేసుకున్నాం.

ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న బాధాకరమైన విషయాలను వివరిస్తూ మాట్లాడడాన్ని, ప్రశ్నించడాన్ని నేరంగా భావించే ఈ పాఠశాలల్లో క్రమశిక్షణ పేరుతో, మితిమీరిన హోంవర్క్‌లతో, యూనిఫారాలు, స్కూలుఫీజుల పేరుతో బాలలు బాల్యాన్ని జారవిడుచుకుంటున్న విధానాన్ని విశదపరిచారు.

నానా తిప్పలుపడుతూ ప్రాథమిక విద్యను పూర్తి చేసిన అనంతరం ఉన్నత తరగతుల నిమిత్తం తల్లిదండ్రులకు దూరంగా కార్పొరేట్ విద్య కోసం వెళ్ళి హాస్టల్స్‌లో, చెర సాలల్లాంటి తరగతి గదుల్లో విద్యార్థులు పడే కష్టాలను గురించి "విద్యార్థులెక్కడ" అన్న శీర్షికన కవిత్వీకరించారు.

విద్యార్థులెక్కడున్నారిపుడు?
అంతా కోళ్ళ ఫారాల్లో చేరిపోయారు
అక్షరాల్ని ఆబగా తింటూ
కాలం కళ్ళలో ఎర్రెర్రని వొత్తులు వేసుకొని
నిద్రెరుగని రాత్రిళ్ళు వెళ్ళదీస్తూ
చదువును గరళంగా మార్చి అందించే
కార్పొరేట్ కాన్సంట్రేటెడ్ డెన్స్‌ల్లో

ఈ కవితలో రచయిత కార్పొరేట్ పాఠశాలలను కోళ్ళ ఫారాలతో పోల్చారు. అక్కడ విద్యార్థులు ఆటపాటలు లేకుండా ఉక్కపోతల మధ్య ఉక్కిరిబిక్కిరై పోతున్నారని ఆవేదన చెందారు. గతంలో సెలవుల్లో అయినా పిల్లలు బయట ఆడుకొనేవారు. కానీ ఇపుడు సెల్‌ఫోన్‌లలో గేమ్స్, ఇండోర్‌గేమ్స్‌కు అలవాటుపడి ఇళ్ళకే పరిమితమై పోతున్నారు. ఈ తరహా అలవాట్లతో వారిలో రోగనిరోధక శక్తి తగ్గి ఇన్‌ఫెక్షన్ ప్రభావంతో అనేక జబ్బుల పాలవుతున్నారు. రోజుకు కనీసం 15-20 నిమిషాలైనా పిల్లలు పగలు బయట తిరగడం లేదా ఆడడం ద్వారా రోగ నిరోధక వ్యవస్థ ఇన్‌ఫెక్షన్లతో పోరాడేతత్వం వస్తుంది.

ఈ ఉరుకుల పరుగుల పితలాటకంలో విద్యార్థులపై తల్లిదండ్రుల నుండి, ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుండి ఒత్తిడి ఎక్కువై తమ లక్ష్యాన్ని సాధించలేక పోతున్నామనే అపనమ్మకంతో ఆత్మవిశ్వాసాన్ని విడిచి ఆత్మహత్యలు చేసుకొంటున్న విద్యార్థుల్ని ఉద్దేశించి "రంగుల ఋతువు రాదనుకోకు " కవితను రాశారు.

బ్రతుకునంత తేలిగ్గా తీసుకోకు బిడ్డా
చదువు జీవితంలో ఓ భాగం
పరుగు పందెం పెట్టిన వాడో బుద్ధి హీనుడు
నీ కాలానికి రంగుల ఋతువు రాదనుకోకు
ఏదో లక్ష్యాన్ని ఛేదించలేక పోయానని
ఎవరో ఏదో అనుకుంటారని
నిన్ను నీవే చిదిమేసుకుంటావా?
వెలకట్టలేని విలువైన ప్రాణాన్ని
బలిపీఠంపై కడతేరుస్తావా?

అంటూ ఈ లోకంలో ఎవరికి వారు యునీక్‌లని, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం తప్పక సాధ్యమవుతుందని బ్రతుకును తేలిగ్గా తీసుకొని మరణశాసనం రాసుకోవద్దని దిశానిర్దేశం చేశారు.

విద్యార్థుల ఒత్తిడికి, ఆత్మహత్యలకు కారణమవుతున్న సమాజాన్ని, తల్లిదండ్రులను విద్యావ్యవస్థను గురించి చెబుతూ పిల్లల మనసు తెలుసుకోకుండా తల్లిదండ్రులు చదువు పోటీ అనే బరిలోకి తోసి బలవంతంగా చదివిస్తుంటే ఆశక్తి, ఆసక్తి లేని విద్యార్థులు నలిగిపోతున్నారు. ప్రతిభ ఒక్కొక్కరిలో ఒక్కోరకంగా ఉంటుంది. అందరిని ఒకేగాటన కట్టడం వల్ల సున్నిత మనస్కులు ఆత్మ

హత్యలు చేసుకొంటున్నారు. అలా కాకుండా వారికి ఆసక్తి ఉన్న రంగంలో చదువు కొనసాగిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగే అవకాశం ఉంటుందని సూచిస్తూ 'కలలుకననివ్వండి' కవితలో

సృజనను చిదిమేసే ప్రతిభా పోటీలూ
కరెన్సీ పరుగు పందేలూ పెట్టి
వాళ్ళను కార్పొరేట్ కర్మాగారాల్లో
నిద్రెరుగని రోబోలుగా మార్చకండి
ఆ లేత కనురెప్పల క్రింది
కలల్ని దొంగిలించకండి
ఇకనైనా దయచేసి
వాళ్ళకలల్ని . . . . . వాళ్ళే కననివ్వండి.

కలలు కనలేని వాడు వర్తమానపు సౌధాన్ని నిర్మించు కోలేడు. ఆశల శిఖరాన్ని అధిరోహించలేడు. భవిష్యత్ వెలుగుల్ని ఆహ్వానించలేడు. కాబట్టి డా॥ అబ్దుల్ కలాం గారు చెప్పినట్లు వాళ్ళను కలలు కననివ్వండి. వాటిని సాకారం చేసుకొనే క్రమంలో తోడ్పాడును అందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసే దిశగా పయనించమని ప్రబోధించారు.

సమాజంలోని విద్యార్థులను మరీ ముఖ్యంగా యువతను పట్టిపీడిస్తూ పెడదారి పట్టిస్తున్న రంగం సినిమా రంగం ఒక రంగుల ప్రపంచం. ఇది నేటి యువత పాలిటి వెండితెర అయితే బుల్లితెర ఆడవాళ్ళ పాలిటి అమృత భాండం. దీని మోజులో పడి ఎందరో యువతీయువకులు, ఉవిధలు సినిమాల్ని తింటూ, సినిమాల్ని త్రాగుతూ సీరియళ్ళను శ్వాసిస్తూ సినీనటులే సర్వస్వంగా భావించడాన్ని, సినిమాలు చూడడంతో ఆగకుండా అభిమాన సంఘాల పేరుతో సంఘాలుగా ఏర్పడడాన్ని నిరసిస్తూ 'అవమానసంఘాలు' కవితను రాశారు.

అమ్మకంటె ప్రేమాస్పదుడా? నాన్న కంటే అధికుడా?
గురువు కంటే గౌరవనీయుడా? దైవం కంటే
ఆరాధ్యుడా?
జాతి సిగ్గుతో తలదించుకోవాల్సిన
అవమాన సంఘాలు
యువతను నిర్వీర్యం చేస్తున్న
అమానుష రంగాలు

సినిమాలు మన కాలాన్ని, మన పనుల్ని ఆటంక పరుస్తాయని హీరోలు నల్లధనాన్ని చుట్టుకున్న రంగుల సర్పాలని అలాంటి వారి కోసం మనం గుళ్ళుకట్టి చివరికి ప్రాణాలు తీసుకొనేంత పిచ్చి పెంచుకోవడం ఏంటని సమాజాన్ని ప్రశ్నించారు.

నేటికాలంలో వస్తున్న సినిమాలన్ని కొత్తదనం లేని చిత్రాలని చెబుతూ మా సినిమాలో అంతా ఉందంటారు. కానీ అక్కడ ఓ నవ్వు - ఓ విషాదం - ఓ సమాగమం. నేటి చిత్రాలన్నీ మూస ధోరణిలోనే సాగిపోతున్నాయి. సినిమాల్లో బ్రతుకును తేలిగ్గా తీసుకొనే డైలాగులు, బికినీ తైతక్కలు, విచిత్ర మారణాయుధాలతో విన్యాసాలు అబ్బురపరిచే అసంభవాలు తప్ప మరేమీ ఉండవని చెప్పారు.

ఇపుడు ఏవీ చలన చిత్రాలు కావు
సంచలన చిత్రాలు రావు
అన్నీ జనం ముఖాల్ని కరాబు చేసే
దుర్గంధపు స్కలన చిత్రాలు

చలన చిత్రాల్లోని దృశ్యాల్ని చూసిన యువత చెడు మార్గం పడుతున్న విధానాన్ని గురించి చెపుతూ ఈ సంస్కృతి వల్ల కొన్ని కుటుంబాల్లో వల్లమాలిన స్వేచ్ఛ వచ్చి మూతికి లిప్‌స్టిక్ రాసుకొని మీటింగులకు స్లీవ్‌లెస్ జాకెట్లతో వెళ్ళే మమ్మీలు, జుట్టుకు, మీసాలకు రంగులు వేసుకొని లేని యవ్వనాన్ని నటించే డాడీలు తయారవు తున్నారని ఎవడి లోకం వాడిదే అయినపుడు వారి సంతానం చేసే విన్యాసాల్ని గురించి 'కామోన్మాదం' కవితలో వెలిబుచ్చారు.

దగుల్బాజీ సర్వ సంతానాలన్నీ
ఏ రోడ్డు మీదకో

ఏ ఉమెన్స్ కాలేజీ గేటు ప్రక్కకో చేరిపోతాయి
ప్రేమించమంటూ కత్తులు, కొడవళ్ళతో వెంటబడ తాయి.
యాసిడ్‌తో డిమాండ్ చేస్తాయి
ఆడపిల్ల అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తాయి.

దీనంతటికి కారణం ప్రేమతో గారాబంగా మనం చేస్తున్న తప్పుల వల్లే కొందరు పిల్లలు, యువత చిన్న వయస్సులో సిగరెట్స్, మందు, బెట్టింగ్, దొంగతనాలు, డ్రగ్స్, రేప్‌లు, హత్యలు చేస్తున్న సంఘటనలు నిత్యం మనం టీ.వీల్లో వార్తాపత్రికల్లో చూస్తూనే ఉన్నాం. పిల్లల్లో అభిమానాలు కనబడడంలేదు. అణకువగా ఉండడం రాదు. సంస్కృతి సంప్రదాయాలు పట్టించుకోవడం లేదు. వీటన్నింటికి కారణం కొందరు తల్లిదండ్రులు పిల్లలను సరైన పద్ధతిలో పెంచకపోవడమే. అందుకే ముందు తల్లిదండ్రులు మారాలి.

సినిమా రంగం ఇపుడు ఈ జాతిని అమాంతంగా మింగేస్తున్న కొండచిలువ. ఇది మెదళ్ళనూ, హృదయాన్ని మాయం చేస్తున్నది. ప్రేమంటే సెక్సేనని, గురువంటే బడుద్ధాయని, తరగతి గది అంటే చేపల మార్కెట్టని, దేవాలయాల్లాంటి తరగతి గదిని, గురువుని తక్కువ చేసి చూపిస్తూ వ్యవస్థను తిరోగమన దిశగా నడిపిస్తుందని రచయిత దుయ్యబట్టారు. తలలు తరగడమే హీరోయిజమని, అమానవీయ సంఘటనలను దృశ్యమానం చేస్తూ తెర నిండా అశ్లీల దృశ్యాలను కనువిందు చేయిస్తూ, బూతు సాహిత్యాలను వీనుల విందు చేస్తూ చివరిలో ఒక వాక్యంలో మంచిని గ్రహించమని శుభంకార్డు వేయడాన్ని లివింగ్‌స్టన్ గారు తీవ్రంగా ఖండించారు.

నేర ప్రవృత్తికి విలువల పతనాలకు
కుర్ర కారు జులాయిత్వాలకు
సినిమా ఒక 'ఖర్మాగారం'
ఇది సైతాన్ ఎత్తిన కొత్త అవతారం
చాప కింద కదులుతోన్న సర్పం
జాగ్రత్త! పొంచి ఉంది ప్రమాదం!!

ఉపసంహారం :

ప్రజల జ్ఞానాభివృద్ధికి మనోవికాసానికి విద్యారంగము సమాజచిత్రణకు, వినోదానికి సినిమారంగములు అత్యంతావశ్యకములైన సాధనాలు. విద్యారంగం అక్షరాస్యుల పాలిటి జ్ఞానప్రదం కాగా సినిమారంగం అక్షర, నిరక్షరాస్యులకు చెందినదైనప్పటికీ నిరక్షరాస్యుల పాలిటి విజ్ఞానప్రదం. ఈ రెండు రంగాలు సమాజ చైతన్యరథ చక్రాలు. నేటి సమాజం వక్రబుద్ధితో ఆలోచిస్తూ వాటిని అంగడి సరుకులుగా భావిస్తూ సమాజ గమనానికి తిలోదకాలిస్తూ స్వార్థమే పరమావధిగా విద్యారంగాన్ని, సినిమారంగాన్ని తిరోగమింపజేస్తున్న విధానాన్ని లివింగ్‌స్టన్ గారు కవిత్వీకరించిన తీరు నేటి సామాజిక జీవనానికి నిలువుటద్దంగా నిలుస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. సాహిత్యంలో చర్చనీయాంశాలు - ఆచార్య జి.వి. సుబ్రమణ్యం
2. ఆధునికాంధ్ర కవితా సమీక్ష - కాకర్ల వేంకట నరసింహం
3. ఆధునిక సాహిత్యంలో ప్రక్రియలు - ధోరణులు - అవుల మంజులత
4. ఆధునిక సాహిత్యం దళితస్పృహ - కె.కె.రంగనాథాచార్యులు
5. వర్తమానం - ఎండ్లూరి సుధాకర్
6. మహాప్రస్థానం - శ్రీశ్రీ
7. ఖండిత స్వప్నాలు - డా॥ కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్
8. అరణ్యంలో కేక - డా॥ కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్
9. దగ్ధదృశ్యం - డా॥ కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్

❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నానీలు – సామాజిక జీవన చిత్రణ

– ఐ. వింధ్యలోసిని దేవి, తెలుగు అధ్యాపకురాలు, కె.వి.ఆర్.ప్రభుత్వ మహిళా కళాశాల(స్వ.ప్ర), కర్నూలు.

సమాజం సాహిత్యం పరస్పర ఆశ్రితాలు. సమాజ జీవన గమనాన్ని సాహిత్యం తనలో ఆవిష్కరింప చేసుకుంటే, సమాజీయులు సాహిత్యాన్ని దారిదీపంగా గ్రహిస్తారని చెప్పొచ్చు.ప్రధానంగా ఆధునిక సాహిత్యం సమాజానికి దర్పనంపడుతూ సమాజ గమన లోతు పాతుల్ని అభివ్యక్తీకరిస్తూ ముందుకు సాగుతుంది. వ్యక్తి సామాజిక జీవితంలోని ప్రతి కోణాన్ని సాహిత్య క్యాన్వాసుపై వాస్తవికంగా,యథార్థ దృక్పథంతో చిత్రించడంలో ఆధునిక కవులు, రచయితలు సఫలీకృతులయ్యారని చెప్పడం సత్యదూరం కాదు.ఎప్పటికప్పుడు సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాల్ని సాహితీవేత్తలు ఎంతో ఒడుపుగా ఒడిసిపట్టుకొని సాహిత్య మాధ్యమంగా వ్యక్తీకరించడంలో కృతకృత్యులయ్యారు. కాలానుగుణంగా సమాజంలో వస్తున్న మార్పులు, తలెత్తుతున్న సమస్యలు, మానవ అనుభవాలను, అనుభూతులను, కాలప్రవాహంలో మార్పుచెందుతున్న మానవ మనస్తత్వం, జీవన తాత్వికత మొదలైనవన్నీ ఆధునిక తెలుగు సాహిత్యవేదికపై కళ్ళకు కట్టినట్లుగా ప్రదర్శితమవుతున్నాయి.

ఆధునిక తెలుగు సాహిత్యం విభిన్నమైన ప్రక్రియలతో విలసిల్లుతూ సునంపన్నమైనది.అయితే సాహిత్య రూపమేదైనా, ఆధునిక సాహిత్య సృజన ప్రధాన లక్ష్యం మాత్రం సామాజిక జీవన చిత్రణగానే కొనసాగుతుందని చెప్పొచ్చు. వచనసాహిత్య ప్రక్రియలైన నవల వంటి వాటిలో సమగ్ర సామాజిక జీవితం ప్రవర్తిల్లితే,కవిత్యంలో సామాజిక సమస్యలను వస్తువుగా ఎన్నుకోవడం గమనించవచ్చు. వచనకవిత్వంలో భాగంగా రూపుదిద్దుకున్న మినీ కవిత్వం సంక్షిప్త వాక్యాలలో సమాజాన్ని వ్యాఖ్యానించడంలో పరిణతను సాధించింది. మినికవిత్వ కోవకు చెందిన రుబాయిలు, హైకూలు నానీలు,మొగ్గలు మొదలైన లఘు కవితారూపాలలో సమాజ చిత్రణ స్పష్టంగా దర్శనమిస్తుంది. నానీలలో సామాజిక జీవన చిత్రణను పరిశీలించడం ప్రస్తుత వ్యాసోద్దేశం.

సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం ఆచార్య ఎన్.గోపీ గారు శిల్పీకరించిన నానీలు కవితారూపం దిన దిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వత స్థానాన్ని అలంకరించాయి. ఇప్పటి వరకు సుమారు 250 నానీల కవితా సంపుటులు వెలువడ్డాయి. పుస్తకరూపంలో రాకపోయినా నానీలు రాసే కవుల సంఖ్య వెయ్యికిపైనే ఉంది.

సూక్ష్మమైన విత్తనం మహా వృక్షాన్ని తనలో దాచుకున్నట్టు, శ్రీమహావిష్ణువు వామనరూపధారియైనట్టు అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని గర్భీకరించుకున్న నానీలు బహుళ ప్రజాదరణ పొందిన విషయం సుస్పష్టమే.అక్షర నియమాన్ని కలిగున్న నానీల ముక్తక లక్షణం వల్ల అపరిమితమైన వస్తువైవిధ్యానికి ఆస్కారమేర్పడింది. సామాజిక జీవితంలోని భిన్నమైన పార్శ్వాలను నానీ స్పృశించింది. సామాజిక జీవితంలోని అనేకాంశాలను నానీ కవులు, సౌందర్యాత్మకంగా, రసవంతంగా, చమత్కారభరితంగా, వ్యంగ్యరూపంగా, ప్రభోదాత్మకంగా, సున్నితంగా, గంభీరంగా, భావగర్భితంగా పలుకోణాల్లో అక్షరీకరించారు. లబ్ధ ప్రతిష్టలైన కవులు మొదలుకొని తొలకరిలో కలంపట్టిన కవుల వరకు నానీలను రాసి నానీ వికాసానికి దోహద మయ్యారు.

నానీల్లో ప్రతిఫలించిన సామాజిక జీవితాన్ని పరిశీలించడం ప్రస్తుత వ్యాసోద్దేశం. అపరిమితమైన వస్తువైవిధ్యాన్ని కలిగిఉన్న నానీల్లో సామాజిక జీవన చిత్రణ అనేది విస్తృతాంశం.మానవజీవన వైవిధ్యమంతా నానీల్లో

ద్యోతకమవుతుంది.లఘు సిద్ధాంత వ్యాసరచనకు కావల్సినంత విస్తృత పరిధి ఉన్న అంశాన్ని సింధువులో బిందువును స్పృశించిన విధంగా ఈ వ్యాస ప్రయత్నం.నా పరిశీలన మేరకు నానీల్లో సామాజిక జీవిత చిత్రణను ఈ కింది విధంగా అంశాల ఆధారంగా వివరించాను. సామాజిక జీవన చిత్రణను గ్రామీణ జీవితం, పట్టణ జీవితం, స్త్రీ సామాజిక జీవితం, బంజారాల జీవితం, ప్రపంచీకరణ నేపథ్యంలో రూపాంతరం చెందుతున్న సమాజం, దిగజారుతున్న మానవ సంబంధాలు మొదలైనవి.

గ్రామీణ జీవితం :

గ్రామ ప్రాంతాల ప్రజల ప్రధాన జీవనోపాధి వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు మరియు చేతి వృత్తులు, కుటిర పరిశ్రమలు మొదలైనవి. గ్రామ జీవితానికి కేంద్రబిందువు రైతు. గ్రామీణ ప్రాంతాల్లో డెబ్భైశాతం భూమితల్లిని నమ్ముకున్న రైతులే దర్శనమిస్తారు. దేశానికంతా అన్నంపెడ్తూ , అన్నదాతగా కీర్తించబడే రైతు పళ్ళెంలో అన్నంమెతుకులకు చోటులేని వింత పరిస్థితి నాటి నుంచి నేటి దాకా వరకు కనిపిస్తున్న దుర్భర దృశ్యమే. సమస్త మానవాళికి జీవశక్తినందించే రైతు కళ్ళు నిర్జీవ గోళాలు కావడం శోచనీయం. రైతుకండగా నిలిచి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం, కల్తీవిత్తనాలు, నీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితులు, కనీస మద్ధతు ధర లేకపోవడం, దళారుల మోసాలు, మొదలైన వన్నీ భవిష్యత్తు రైతును మింగేస్తున్న అంశాలు. కర్ణుడి చావుకు కారణాలనేకం అన్నట్టు రైతు దుర్భర దారిద్ర్యానికి కారణాలు ఎన్నో. దేశానికి వెన్నెముకగా భావించే రైతు జీవితాన్ని ప్రతిబింబిస్తూ ఎంతోమంది కవులు నానీలు రాశారు. కొన్ని నానీలు రైతు కన్నీటి కావ్యాన్ని దృశ్యమానం చేస్తే,మరికొన్ని రైతుకు మార్గనిర్దేశనం చేస్తూ రైతుల జీవితాల్లో రావలసిన ఫలవంతమైన మార్పును వ్యక్తం చేస్తున్నాయి.

రైతుల ఆత్మహత్యలకు కల్తీవిత్తనాలు కారణమవుతున్నాయన్న విషయాన్ని గురించి డా.ఎస్.రఘుగారు 'జీవనలిపి' నానీల సంపుటిలో ఈ విధంగా కవిత్వీకరించారు

"పొలంలో విత్తిన
కల్తీవిత్తనం
రైతు ఆత్మహత్యగా
మొలకెత్తింది "

అంటారు నిజమే మరి. పొలంలో నాటిన కల్తీ విత్తనాలు మొలవక, రైతులాత్మహత్యలను మొలిపిస్తున్నాయన్న నగ్నసత్యాన్ని ఆవేదనాపూరితంగా వ్యక్తీకరించారు. అలాగే ఎన్.సి.హెచ్.చక్రవర్తి గారు " నానీ పంచశతి" లో

విత్తనాలు
మొలకెత్తడమే తెలుసు
ప్రాణం తీస్తాయని
తెలిసిందిప్పుడే

అంటూ వ్యంగ్యాస్త్రాన్ని ప్రయోగించడం గమనించవచ్చు. అలాగే మరొక నానీలో చక్రవర్తిగారు

కళ్ళంలో
రాలిపడుతున్నవి
ధాన్యపుగింజలా?
చెమటముత్యాలా?

అంటూ ధాన్యపు గింజల్నిరైతు చెమట బిందువులుగా సంభావించారు. ఎన్ని చెమటబట్లు ధారవోస్తే ఒక ధాన్యపు గింజ పుడుతుందో ఆలోచించమంటారు కవి. పొద్దస్తమానం రైతు శ్రమకోర్చి ఎండనకా,వాననకా, రేయనకా, పగలనకా కృషి చేస్తేనే మానవాళి కడుపునిండుతుందన్న విషయం స్పష్ట పరుస్తున్నారు.

నిజానికి
వ్యవసాయం జూదం కాదు
అయినా
గెలుపోటములున్నాయి.

అంటారు. 'గూడు వదిలిన గువ్వలు' సంపుటిలో

ఎన్.ఆర్.భల్లంగారు. నానీల సింగిడి లో వింధ్యవాసిని రైతును ఉద్దేశించి

"ఉద్యమాలు కాదు
సహాయనిరాకరణే
నీ ఆయుధం కానీ
రైతన్నా "

అంటారు. ఇక్కడ రైతు సహాయనిరాకరణ చేయడం అనేది వాచ్యార్థం. కానీ అసలు అర్థం రైతు సహాయ నిరాకరణ చేసిన రోజున మానవాళి మనుగడ ప్రశ్నార్థ కమవుతుందని ఉద్బోధించడమే కవయిత్రి భావన.

గ్రామాల్లో నేడు కులవృత్తుల విధ్వంసం అనేది పరాకాష్ట స్థాయికి చేరిన విషయం విధితమే.వ్యవసాయం తర్వాత అధిక సంఖ్యాక ప్రజల జీవన భృతికి ఆధార మైనది చేనేత పరిశ్రమ. భారతీయ వస్త్రపరిశ్రమ ప్రాచీన కాలం నుంచి ఎంతో ఘనచరిత్రనుకలిగి ఉంది. అగ్గి పెట్టెలో ఇమడగల వస్త్రాలనుతయారుచేసిన నేతన్నల కళానైపుణ్యం మరమగ్గాల వేగం ముందు చిన్నబోతున్న వైనం నేడు మనకు దర్శనమిస్తుంది.వెలవెలబోతున్న చేనేత కార్మికుల వెతలను గురించి నానీ కవులు ఆవేదనా పూరితంగా వ్యక్తీకరించారు.

మగ్గం గోతిలో
పాతుకుపోయాయి
చేనేత బతుకులంటే
ఇంతే మరి

యంత్రాలపై తయారుచేయబడే అధిక వస్తూత్పత్తితో పోటీపడలేక మగ్గం మూలనపడింది. మగ్గాన్ని నమ్ముకొని జీవించే నేతన్నల కుటుంబాలు మగ్గం గోతిలో పాతుకు పోయి, వారి జీవితాలు దుర్భర దారిద్ర్యంలోకి నెట్టబడి చివరకు వారి ఆత్మహత్యలకు దారితీస్తున్న విషయాన్ని ఈ నానీ ద్వారా స్పష్టపరిచారుఎన్.ఆర్.భల్లంగారు.మరొక నానీ పరిశీలిస్తే

పోచంపల్లి చీర
ఎంత బాగుందో
మరి
దానిని నేసినవాడు ?

అని ప్రశ్నిస్తారు బండారు సుజాతా శేఖర్ గారు 'జన్న కంకులు' నానీ సంపుటిలో.ఒక అందమైన కళాఖండాన్ని సృష్టించిన నేతన్నల జీవితాలు మాత్రం కళావిహీనమైన స్థితిని ఎత్తిచూపుతున్నారు.పోచంపల్లి

వస్త్రాల ఖ్యాతి దేశవిదేశాలు దాటింది.కానీ దానిని తయారుచేసిన నేతన్నల బతుకులు మాత్రం చీకటిలో తారాడుతున్నాయన్న విషయాన్ని గుర్తించమంటుంది కవయిత్రి.

పట్టణ జీవన చిత్రణ :

నగర జీవన విధానాన్ని నానీ కవులు చక్కగా కవిత్వీక రించారు. వేగమయమైన జీవనశైలి, ఆడంబర జీవన విధానం, ప్రదర్శనమయమైన జీవితాలు, కార్పోరేట్ సంస్కృతి, కలుషితంగావించబడుతున్న ప్రకృతి వనరులు, వైయుక్తిక అవసరాల నిమిత్తం మానవుల్లో పెరుగుతున్న స్వార్థం, దెబ్బతింటున్న సున్నిత మానవ సంబంధాలు, పతనమవుతున్న నైతిక విలువలు మొదలైనవన్నీ నానీలలో దర్శనమిస్తాయి.

ఎక్కడ చూసినా
ఎం ఎన్ సీ లు,కాల్ సెంటర్లూ
అమ్మో
నిశాచర నగరం

అంటారు బి.బాలకృష్ణ గారు 'భావచిత్రాలు' నానీ సంపుటిలో. నేడు నగరానికి రాత్రింబగళ్ళు తెలియదు. నగరం ఎప్పుడూ మేల్కునే ఉంటుంది.

ఓల్డేజి హోమ్స్
ఎవరీ వృద్ధులు?
పిల్లలు వదిలేసిన
అనాథ పద్దులు.

నగర జీవన శైలిలో కనిపించే నూత్న పోకడలకు అద్దం పడుతూ డా.వి.త్రివేణిగారు 'తూనిగలు' నానీ సంపుటిలో

వృద్ధుల దీనస్థితిని,నిస్సహాయతను రూపుకట్టించారు. అభివృద్ధి పేరుతో నిర్మితమవుతున్న అనేక ఆధునిక పరిశ్రమలు,కర్మాగారాల వల్ల నగరాలలో పెరుగుతున్న కాలుష్యం ప్రకృతి వినాశనానికి దారితీస్తూ, మానవ మనుగడకు ప్రమాదకరంగా పరిణమించింది. ప్లాస్టిక్ పదార్థాల అపరిమిత వినియోగం ద్వారా నేలతల్లికి మానవుడు చేస్తున్న ద్రోహాన్ని ఘాటుగా విమర్శిస్తూ ' నందివర్ధనాలు' నానీ సంపుటిలో కందేపి రాణీప్రసాద్ గారు ఈ విధంగా కవిత్వీకరించారు.

కుప్పలు తెప్పలుగా
క్యారీబ్యాగులు
నేలతల్లికి
విషప్రయోగం

తెలిసీ తెలియని మానవ తప్పిదాలు ప్రకృతికి శాపంగా పరిణమించాయంటారు కవయిత్రి. ప్లాస్టిక్ నిషేధ చట్టాలు కాగితాలకే పరిమితమై, మానవాళి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న విషయం లోక విదితమే. నదీనదాలు,వాగులు వంకలు,సెలయేళ్ళు స్వచ్ఛంగా ప్రవహించాల్సింది పోయి, నగరాల్లో కాలుష్యం విశృంఖలంగా, అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్న సంగతిని ఎత్తిచూపారు 'గూడు వదిలిన గువ్వలు' సంపుటిలో ఎన్.ఆర్.భల్లంగారు.

కాలుష్యం
ఎలా ప్రవహిస్తుందో చూడు.
పచ్చదనాన్ని
చప్పరించుకుంటూ...

ప్రకృతిలోని పచ్చదనమంతా కాలుష్య భూతానికి ఆహారంగా మారిందన్న వేదన ఈనానీలో స్ఫురిస్తుంది.

స్త్రీల జీవిత చిత్రణ :

ఆకాశంలో సగం,అంతరిక్ష పయనాలు, ఆర్థిక స్వేచ్ఛ, సాధికారిత వంటి పదాలు స్త్రీ జీవితంలో ఒక కోణాన్ని మాత్రమే పరిచయం చేస్తాయి. కొంతమంది స్త్రీల కు మాత్రమే అనువర్తించే అంశాలు ఇవి. తరతరాలుగా అణచివేతకు గురౌతున్న స్త్రీలు నేటికీ ఎందరో ఉన్నారు. సామాజిక కట్టుబాట్లనే వృత్తంలోంచి బయట పడలేక తల్లడిల్లుతున్న స్త్రీలెందరో నేటి సమాజంలో మనకు కనిపిస్తారు. తన చుట్టూ అలుముకున్న సమస్యల పద్మవ్యూహంలో అభిమన్యుడిలా పోరు చేస్తున్న స్త్రీల జీవితాల్లోని విభిన్న పార్శ్వాలను నానీలు స్పష్టంగా ప్రతిబింబించాయి. స్త్రీ పుట్టుక మొదలుకొని మరణం వరకు అన్నిదశల్లోని ' ఆమె' జీవిత గమనాన్ని నానీలు యథార్థంగా చిత్రించాయి.స్త్రీల ఆశలను, ఆశయాలను, ఆలోచనలను, ఆవేదనలనూ నానీ కవులు హృద్యంగా కవిత్వీకరించారు.

దేశంలో
ఆడపిల్లలే తప్పిపోతున్నారు
డాక్టర్లూ
మీ బాధ్యతకు జోహార్లు

అంటూ వ్యంగ్యాస్త్రాన్ని ప్రయోగించారు 'భవానీ నానీలు'లో డా.చిల్లర భవానీ దేవి గారు. ఆడపిల్ల లోకం చూడకుండానే తిరిగి వెళ్ళిపోవడంలో గల అనేక కారణాలలో డాక్టర్ల పాత్ర కూడా ఒకటి. వారి సహకారంతోనే భ్రూణహత్యలు జరుగుతున్నాయనేది జగమెరిగిన సత్యమే.

అంతేకాకుండా
ఆడపిల్ల
అమ్మకు బరువైంది
పేదరికం
ఎంత పని చేయించింది

అని ఆవేదన వ్యక్తం చేశారు 'బంజారా నానీ'ల్లో ఆచార్య సూర్యా ధనంజయ్ గారు. నేటి సమాజంలో పేదరికం స్త్రీల పాలిట శాపంగా మారిన విషయాన్ని నానీ సూచిస్తుంది.

దీపం తో
పోల్చక్కరలేదు
కిరోసిన్‌కు
అర్పించకుంటే చాలు

అంటారు గూడు వదిలిన గువ్వలులో భల్లంగారు. ఒకవైపు స్త్రీలను పూజనీయురాలని, సృష్టికి మూలమని, ఇంటికి దీపం ఇల్లాలని, ఆమె లేని చోటు చీకటితో సమానమనీ కీర్తించే సమాజం మరోవైపు వరకట్నం తేలేదని, వారసుడిని అందించలేదని పలుకారణాలతో ఆమెను అగ్నికి ఆహుతిచేయడం సమాజంలో గమనించవచ్చు.

ప్రపంచీకరణ :

ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజంలో చోటుచేసుకుంటున్న అనేక పరిణామాలను నానీలు బలంగా చిత్రించాయి. నేడు ప్రపంచీకరణ ప్రభావానికి లోనుకాని రంగమంటూ లేదు. సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలతో పాటూ మానవసంబంధాల్లో సైతం పెను మార్పులకు ప్రపంచీకరణ కారణమైంది. దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారమే మూల సూత్రంగా ప్రపంచీకరణ అంతటా, అన్నింటా వేగంగా విస్తరించింది. పచ్చని పంట పొలాలతో కళకళలాడే గ్రామాల్లోని భూములన్నీ నేడు బహుళజాతి కంపెనీలుగా, సెజ్జులుగా మారుతున్న వైనాన్ని నానీ కవులు తీవ్రంగా ఖండించారు.

గద్ద కళ్ళు
పల్లెమీద పడ్డాయి
ఏ కోడి రెక్కల కింద దాచాలో
దాన్ని

ఈ నానీలో ప్రపంచీకరణను గద్దతో పోలుస్తూ గద్ద కోడిపిల్లలను అమాంతం తన్నుకుపోయినట్లు, ప్రపంచీకరణ ముసుగులో పల్లెలు మాయమవుతున్నాయన్న విషయం గుర్తించి పల్లెను గద్దకు ఆహారం కానీయకుండా కాపాడుకోవాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు బి.బాలకృష్ణగారు 'భావచిత్రాలు' నానీల సంపుటిలో.

వేప చెట్టు
అమెరికా గాలి వీస్తుందా?
వెళ్ళి
కొత్త లేబుల్‌తో వస్తుందేమో !

అంటూ ఆచార్య ఎన్.గోపీగారు ప్రపంచీకరణ స్వభావాన్ని వెల్లడించారు. భూమి మనది, చెట్టు మనది, పండు మాత్రం పక్కవాడిది అన్న చందంగా ప్రపంచీకరణ ఉందన్న వాస్తవాన్ని తెలియజేశారు.

ప్రపంచీకరణ
మహత్మ్యం
కోకాకోలా
కొబ్బరిబండొంని తాగేసింది.

అని 'చెలిమి చెలిమెలు' నానీల సంపుటిలో మాడిశెట్టి గోపాల్ గారు ప్రపంచీకరణ స్థానిక వస్తువులకు డిమాండు లేకుండా చేసి, అంతర్జాతీయ విపణిలో లభించే వస్తు సముదాయం పట్ల వ్యామోహం కల్పించి, ఆ వస్తువుల వినియోగమే నాగరికతకు చిహ్నం అనే భ్రమలను కల్పించిన విషయాన్ని చమత్కార భరితంగా కవిత్వీకరించారు.

బంజారాల జీవనం :

అడవుల్లో నివసించే గిరిజనుల జీవితాల ప్రతిబింబాన్ని ఆచార్య సూర్యాధనంజయ్ గారి 'బంజారా నానీల్లో' దర్శించవచ్చు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, శ్రమైకజీవనవిధానం, ప్రజల అమాయకత్వం, వారి బతుకు వెతలు మొదలైనవన్నీ దృశ్యమానం చేశారు. వీరి నానీలు గ్రామానికి, నగరానికి సమాంతరంగా కొనసాగే తండా ప్రజల జీవితాన్ని సమగ్రంగా ప్రతిబింబించాయి.

ఆ తండా నిండా
వితంతువులే
మద్యం చెట్లకు వేళ్ళాడే
జీవచ్ఛవాలే

మద్యానికి బానిసై అర్ధాంతరంగా జీవితాలను చాలించే వ్యక్తుల కుటుంబ స్థితిగతులకు దర్పనం పడుతుందీ నానీ. గిరిజన స్త్రీల నిస్సహాయమైన స్థితికి అద్దం పడుతుందీ నానీ.

నోట్లో సారా చుక్కేసి
ఆడశిశువును చంపేస్తారా
తండాలకు
గుండె లేదా?

అని ప్రశ్నిస్తారు మరొక నానీలో. తండాలలో నివసించే ప్రజల అమాయకత్వం, అజ్ఞానం వల్ల జరుగుతున్న భ్రూణహత్యలు, పేదరికం కారణంగా అమ్మాయిలను కనికరం లేకుండా వదిలించుకోడం, ఆడపిల్లల అమ్మకాలు, బాల్యవివాహాలు, స్త్రీల నిరక్షరాస్యత వంటి అనేక సమస్యలు నేటికీ పరిష్కారం లేకుండా ఉన్నాయన్న విషయాన్ని ఎత్తిచూపుతున్న నానీ ఇది.మరొక నానీలో

గిరిజనుడికి
రెక్కలే పెట్టుబడి
అందుకే
వలసల అలజడి

కాయకష్టంపై ఆధారపడే గిరిజనుల నిత్యశ్రామిక మనస్తత్వాన్ని నిరూపించే నానీ ఇది. స్థిరమైన, సరైన జీవనోపాధి లేక, అనేక గిరిజన కుటుంబాలు వలసబాట పడుతున్న విషయాన్ని రుజువుచేస్తున్న నానీ ఇది.వారికి బతుకుతెరవును చూపించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని ఈ నానీ తెలియజేస్తుంది.

మానవ సంబంధాలు :

ఆధునిక సమాజంలో మట్టి పరిమళాలు వెదజల్లే మనుషులు కరువవుతన్నారు.మానవుల మధ్య ఉండాల్సిన సహజ సంబంధాల స్థానంలో ఆర్థిక సంబంధాలు చోటుచేసుకోవడం గమనార్హం. ప్రతి విషయం స్వలాభ దృక్కోణంలో ఆలోచించడం నేటి మానవుడి బలహీనతగా మారింది. ఈ పరిస్థితిని నానీ కవులు

అందర్నీ
ప్రేమిస్తున్నానంటావు
పక్కవాడిని
పట్టించుకోవు

అంటూ ఆచార్య ఎన్.గోపీ గారు మానవ స్వభావంలోని సంకుచితత్వాన్ని బట్టబయలు చేశారు.

దేశం నిండా
ఎంత ప్రగతో
మరి మానవసంబంధాలదే
దుర్గతి

అని బి.బాలకృష్ణ గారు ' భావచిత్రాలు ' సంపుటిలో దిగజారిపోతున్న మానవసంబంధాలను దేశప్రగతితో పోలుస్తూ ప్రగతి కంటే ఉన్నతమైన

ఈ విధంగా నానీల్లో సమగ్ర సామాజిక జీవనచిత్రాన్ని యథార్థంగా దర్శించవచ్చు. పేదరికం, వలసలు, విద్యా విధానం, నిరుద్యోగం, దీనుల ఆకలి కేకలు, రాజకీయాలు, రాజకీయ నాయకులు మొదలైన సామాజికాంశాలు నానీల్లో ప్రతిబింబిస్తూ ఆధునిక సమాజానికి దర్పనం పడుతున్నాయని నిస్సందేహంగా పేర్కొనవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. నానీలు - ఆచార్య ఎన్ .గోపి
2. బంజారా నానీలు - ఆచార్య .సూర్యా ధనంజయ్
3. గూడు వదిలిన గువ్వలు - ఎన్.ఆర్.భల్లం
4. నానీపంచశతి.ఎన్.సి.హెచ్.చక్రవర్తి
5. భావచిత్రాలు - బి.బాలకృష్ణ
6. భవానీ నానీలు - డా.చిల్లర భవానీ దేవి
7. తూనీగలు - డా.వి.త్రివేణి
8. జొన్నకంకులు - బండారు సుజాతా శేఖర్
9. నందివర్ధనాలు - కందేపి రాణీప్రసాద్
10. నానీల సింగిడి - వి.వింధ్యవాసినీ దేవి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కోమలాదేవి దాంపత్యాలు నవల – సామాజిక చిత్రణ

– కడ్డివెటి ముల్లయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

దాంపత్యం అంటే వివాహం చేసుకున్న భార్య భర్తలు అన్యోన్యంగా కలిసి జీవించడం అని అర్థం. ఈ దాంపత్యాలు నవలలో మహీధర్, వెంకటేశ్వర్లు మంచి మిత్రులు. వెంకటేష్ భార్య నాగరత్నమ్మ, మహీధర్ భార్య ప్రతిమ వీళ్ళ దాంపత్య జీవితం ఎలా సాగిందో, భార్య భర్తలు ఎలా కలిసి జీవించాలో ఈ నవలలోని ఇతివృత్తం.

వెంకటేశ్వర్లుది నరసరావుపేట దగ్గర చిన్న పల్లెటూరు. వెంకటేష్ తల్లిదండ్రులకి ఒక్కగానొక్క మగబిడ్డ కావడం చేత అందరికీ అతనిమీదా అమితమైన ప్రేమ. వెంకటేశ్వర్లును తల్లిదండ్రులు ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. వెంకటేష్ అక్కడ ఆ పల్లెటూర్లో చదువు పూర్తి చేసుకొని, అప్పుడు గుంటూరు ఏసీ కాలేజీలో చేరాడు. వెంకటేష్‌కి పట్టణానికి మొట్టమొదట రావడం వలన అక్కడ అన్ని ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

గుంటూరు ఏసీ కాలేజీలో వెంకటేష్ హాస్టల్ రూమ్మెంట్ మహీధర్ కావడం వలన వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు అయ్యారు. వెంకటేష్ కు మహీధర్ ఎంతో ధైర్యం చెప్పేవాడు. అందువల్ల కాలేజీలో సీనియర్స్ ర్యాగింగ్ చేసిన ఎక్కువగా భయపడేవాడు కాదు. నాకు ఒక మంచి మిత్రుడు దొరికాడు అని వెంకటేష్ ఆనందంగా ఉండేవాడు. అలా వాళ్ళిద్దరి స్నేహం తో పాటు కాలం కూడా గడిచిపోయింది. ఇద్దరూ బి.ఎన్.సి మూడో సంవత్సరంలో ప్రవేశించారు. అప్పుడు ఒక సంఘటన జరిగింది. మహీధర్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి తిరస్కరించింది. తర్వాత మహీధర్ బాధపడ కుండా బుద్ధిగా చదువుకొని, పరీక్షలు రాసి వాళ్ళు ఇద్దరు ఎవరి ఇళ్లకు వాళ్ళు వెళ్ళిపోయారు. రిజల్ట్ కోసం ఎదురు చూస్తున్నారు. స్నేహితులిద్దరు ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకుంటున్నారు. "ఒకనాడు వెంకటేష్ నుంచి మహీధర్‌కు ఉత్తరం అందింది. అందులో విశేషం ఇది. వెంకటేష్‌కు పెళ్లి నిశ్చయమైంది..... వధువు సొంత మరదలు పిల్ల పేరు నాగరత్నమ్మ. ఐదో క్లాస్ వరకు చదువుకుంది. అందరికీ ఇష్టమైన సంబంధం. చిన్నప్పటి నించి అనుకుంటున్నదే నాకు కూడా అభ్యంతరం లేదు" అని రాసివుంది.

అది చదివిన మహీధర్ నాకు తెలుసు రా నీవు వట్టి దద్దమ్మవి అని ఐదో తరగతి చదివిన అమ్మాయిని వివాహం చేసుకొని రేపు నువ్వు సుఖంగా ఉండగలను అనుకుంటున్నావా, ఉద్యోగరీత్యా నీవు పట్టణాలకు వెళ్తావు. అప్పుడు అక్కడ అందరూ చదువుకున్న వాళ్లు ఉంటారు. మీ భార్య మాత్రం చదివి ఉండదు. వాళ్ళ మధ్య మీ భార్యను నువ్వు తీసుకుని వెళ్లగలుగుతావా, అక్కడ నువ్వు ఎంజాయ్ చేయగలుగుతావా, నీకు నచ్చిన అమ్మాయిని చేసుకుంటే నీ దాంపత్య జీవితం సుఖ సంతోషంగా అన్యోన్యంగా సాగుతుంది. ఇప్పుడు నీవు తొందర పడి చేసుకుని తరువాత ఇంట్లో వాళ్లందరినీ తిట్టుకోవడం మంచిది కాదు కాబట్టి ఆలోచించుకుని నిర్ణయం తీసుకో అని పదే పదే మహీధర్ మిత్రుడిని హెచ్చరిస్తూ ఉత్తరం రాసాడు.

అలా హెచ్చరిస్తూ రాసిన ఉత్తరాన్ని వెంకటేష్ పదే పదే చదువుకున్నాడు. మిత్రుడు చెబుతున్నది నిజమేనని ఆలోచించి నాకు ఈ పెళ్లి వద్దు అని వెంకటేష్ చెప్పాలి అనుకున్న, ధైర్యం చేసి చెప్పలేకపోయాడు. పోనీలే అనుకొని ఇంక నాగరత్నమ్మను వివాహం చేసుకోవాలి అనుకున్నాడు.

ఈ పెళ్లికి మహీధర్ కూడా వచ్చాడు. మహీధర్, నాగరత్నమ్మను చూసిన తరువాత మహీధర్ మొహంలో సంతోషం కనబడుతుంది. అదిచూసి వెంకటేష్ నచ్చి

నట్టుగా ఉంది అనుకొని సంబరపడిపోతాడు. అలా వెంకటేష్ పెళ్లి జరిగిపోయింది.

ఆ తరువాత కొద్ది రోజులకే మహీధర్, వెంకటేష్‌లు ఇద్దరికి వాల్తేరులో ఎం.ఎస్.సి.లో సీట్ రావటంతో అక్కడికి వెళ్లి యూనివర్సిటీలో చేరారు. అక్కడి వాతావరణం అందమైన భవనాలతో చలాకీగా తిరుగుతున్నటు వంటి అబ్బాయిలు, అమ్మాయిలతో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా యూనివర్సిటీ ప్రాంగణం కలకలలాడుతూ ఉంది. అలా మొదటి సంవత్సరం సర్వసాధారణంగా గడిచిపోతుంది పరీక్షలు రాసి ఎవరింటికి వాళ్ళు వెళ్లి పోతారు.

వెంకటేష్ సెలవుల్లో అత్త వాళ్ళ ఇంటికి బయలు దేరాడు.

చాలా రోజులు అవడంతో భార్యను చూడాలని ఆత్రుత పడుతున్నాడు. అక్కడికి వెళ్లిన వెంకటేష్‌ను, అత్త మామలు చదువు గురించి యోగక్షేమాల గురించి అంత అడిగి తెలుసుకున్నారు. నాగరత్నం పల్లెటూరి పిల్ల కావడంచేత సిగ్గుపడుతూ వెంకటేష్ కి నీళ్లు అందించింది. తల్లి ఉండి బావేగా ఎందుకు సిగ్గు పడుతావు అని మందలించింది. అలాగే చీర కూడా కట్టుకోమని చెప్పి చీరను కట్టించింది. తల్లిదండ్రులు ఎలా చెబితే అలా వినేది తనకంటూ సొంత ఆలోచనలుగాని, తన అభి ప్రాయాలుగాని చెప్పేదికాదు. ఎలా ఉన్నా కూడా నాగ రత్నమ్మ సర్దుకుపోయేది.

వెంకటేష్, రత్నమ్మ కట్టుకున్న చీరను చూసి ఇలా అన్నాడు "బాగాలేదు, ఎన్ని గజాలు ఏమిటి ఇందులో మునిగిపోయావు." అన్నాడు. అలాగే ఏం చేసేదో కనుక్కు న్నాడు. అంతా తెలుసుకున్న తర్వాత రత్న అలా ఉండటం చూసి వెంకటేష్ కి ఎలాగో అనిపించింది. తనను పట్టణంలో పిల్లలాగా మార్చాలని అనుకున్నాడు. అందు కని చదవడానికి పుస్తకాలు పంపిస్తానని చెప్పి రెండు రోజులు ఉండి వెళ్ళిపోయాడు.

ఇంటికి వచ్చిన తర్వాత ఇంట్లో అక్క వాళ్ళు బావ వాళ్ళు రత్న గురించి అలాగే తన గురించి అడిగారు. అలా అడిగినప్పుడు వెంకటేశ్ ఈ విధంగా చెప్పాడు. రత్న ఎప్పుడు చూసిన వాళ్ళ అమ్మానాన్న చెప్పిన విధంగా నడుచుకుంటూ ఉంటుంది. చిన్న పిల్లలాగా సిగ్గు పడుతూ ఉంటుంది. ఇంకా ఈ పల్లెటూర్లో ఆమె ఇంత కన్నా ఇంకేం నేర్చుకోగలదులే అని వెంకటేష్ చులకన చేసి మాట్లాడేసరికి పెద్దక్క పెద్ద బావ ఇలా అంటారు. ఏంటోయ్ పల్లెటూరి పిల్ల అంటే అంత చులకనా మరి నీ దృష్టిలో ఎలా ఉండాలి. నీకు ప్రేమ లేఖలు ఉత్తరాలు రాస్తూ , నీతో చెట్టపట్టాలేసుకుని తిరుగుతూ, ఈ కాలపు నవలలు చదువుకుంటూ ఉండాలి అంటావు. అంతేగా, అని పెద్ద బావ అలా అనేసరికి వెంకటేష్ ఈ విధంగా అన్నాడు. అవును బావ నా దృష్టిలో అవి అన్ని మంచి అలవాట్లే, అయినా నాకు అనుకూలమైన రీతిలో మలుచుకోవడంలో తప్పేముంది. ఈ కాలంలో అలా ఉంటేనే బాగుంటుంది అని వెంకటేష్ అంటాడు.

అలా కొన్ని రోజుల తర్వాత వెంకటేష్ విశాఖపట్నం వెళ్లిపోయాడు. మహీధర్ కూడా వచ్చాడు. ఎం.ఎస్.సి రెండో సంవత్సరంలో ప్రవేశిస్తారు. మహిధర్ అక్కడ ప్రతిమ అనే అమ్మాయిని చూసి ఇష్టపడతాడు. అది తెలుసుకున్న వెంకటేశ్, ప్రతిమ వివరాలు అన్నీ తెలుసుకొని ప్రతిమను మహిధర్ ప్రేమించవచ్చు అని అనుకుంటాడు. ఈ విషయాలన్నీ మహిధర్ తో చెబుతాడు. అలా చెప్పిన తర్వాత మహీధర్, ప్రతిమలు ఇద్దరు ప్రేమించు కుంటారు. ప్రతిమ తల్లిదండ్రులది కూడా లవ్ మ్యారేజ్ కావడంచేత ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఈ పెళ్లికి ఒప్పుకుంటారు. కానీ మహిధర్ తల్లిదండ్రులు ఒప్పుకోరు. అయినా కూడా మహిధర్ తల్లిదండ్రులను ఎదిరించి ప్రతిమ ను వివాహం చేసుకుంటాడు. అలా పెళ్లి చేసుకొని గుంటూరులో కాపురం పెడతాడు. వెంకటేష్, మహిధర్ లది కూడా ఎమ్ ఎస్ సి పూర్తవుతుంది.

ప్రతిమ వాళ్ళ అమ్మ వెంకటేష్ కి అలాగే మహిధర్ కి ఇద్దరికీ గుంటూరు లోనే ఉద్యోగం ఇప్పిస్తుంది. అప్పుడు

వెంకటేష్ ముఖంలో ఆనందం కలుగుతుంది. "జీవితం ఆనందంగా ఆశాజనకంగా చైతన్య పూరితంగా ఉంటుందని" ఆశించాడు.

కానీ ఎన్నో అనుమానాలు - రత్నం అతి సామాన్యమైన స్త్రీ. ఆమె సహచర్యంలో తన కోర్కెలను ఫలిస్తాయా అని" అలాగే ఇక్కడ వాళ్ళందర్నీ చూసి రత్న వీళ్ళతో కలివిడిగా కలిసి పోతుందో లేదో అని భయపడేవాడు.

వెంకటేష్ కి గుంటూరులో ఉద్యోగం దొరకడం వలన నాగరత్నమ్మను కూడా గుంటూరు కు తీసుకువచ్చి కాపురం పెడతాడు. వచ్చిన కొత్తలో కొన్ని కొత్త స్థలాలు కొత్త ప్రాంతాలు చూపిస్తాను చూడు. అలాగే అక్కడ అబ్బాయిలు అమ్మాయిలు చాలా చనువుగా కలిసిమెలిసి తిరుగుతూ ఉంటారు. వారిని తెల్లబోయి చూడకు అని రత్నతో అంటాడు.

ఒకరోజు వెంకటేష్ రత్నని తీసుకుని ఇంగ్లీష్ సినిమా కు వెళ్ళాడు. అక్కడ రత్నాకి సినిమా నచ్చలేదు. ఈ సినిమా కి ఎందుకు తీసుకు వచ్చావ్ అని వెంకటేష్ ను అడిగింది. వెంకటేష్ ఇంటర్వెల్ సమయంలో పద వెళ్లిపోదాం అని అంటాడు. రిక్షాలో వెళ్తూ వెళ్తూ వెంకటేష్ ఇలా అంటాడు. "అయితే నీ అభిప్రాయం ఏమిటి? నీతో నేను తెలుగు పౌరాణిక సినిమాలు చూడాలని మాట..... నీ భక్తితో నా వయసు పెంచాలి అనుకుంటున్నావ్ ఏమో ఇది కలి యుగం ఎవరికి వారికే ఉంటుంది." కాబట్టి నీవు అన్ని రకాల సినిమాలను చూడడం నేర్చుకో అని రత్న తో వెంకటేష్ అంటాడు. అలా ఉండటం రత్న కు ఇష్టం ఉ ండదు. అందువలన రత్న ఇలా అంటుంది "మీకు నచ్చినవి నాకు నచ్చవు, నాకు నచ్చినవి మీకు నచ్చవు, నేను రాకుండా మీరు వెళ్ళాచ్చుగా, మీరు లేకుండా నేను వెళ్ళ లేనుగాని." అని రత్న అంటుంది. అప్పుడు వెంకటేష్ ఆశ్చర్యంగా చూస్తాడు. తనను తాను నిందించుకుంటాడు.

వెంకటేష్ ఒకరోజు బజారుకు వెళ్లి ఇంట్లో సరుకులు తీసుకొని వస్తాడు అలా తీసుకు వచ్చిన సరుకులును రత్న చూసి బాగాలేవు అని అంటుంది. అప్పుడు వెంకటేష్, రత్నను కోపగించుకొని ఇలా అంటాడు. ఈసారి నుండి నిన్ను కూడా బజారుకు తీసుకు వెళతాను, అప్పుడు మీకు నచ్చినవి తీసుకోవచ్చు అని అంటాడు. అప్పుడు రత్న సిగ్గుపడుతూ బాబోయ్ నేను బజారుకు రావడమా! నేను రాలేను అండి, మీరెలాంటి సరుకు తెచ్చిన నేను నోరు తెరువను. సరేనా? అని అంటోంది. అప్పుడు వెంకటేష్ ఇలా అంటాడు. "అంతేగాని నాతో రానంటావు." అని వెంకటేష్ దీనంగా జాలిగా చూశాడు.

వెంకటేష్, ఒకరోజు రత్నను తీసుకొని మహీధర్, ప్రతిమ వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. అక్కడ ప్రతిమ అన్ని వస్తువులు చూపిస్తూ రత్నతో మాట్లాడుతూ ఉంటే, రత్న మాత్రం మాట్లాడకుండా మౌనంగా చెప్పినవాటికి ఊ కొడుతూ ఉంది. అలా ఉండటం వెంకటేష్ కి నచ్చక బయటికి వచ్చిన తరువాత ఇలా అంటాడు. ఇంటి దగ్గర అయితే అందరితో బాగానే మాట్లాడుతావు ఇక్కడ మాట్లాడడానికి ఏమీ అని అన్నాడు.

దానికి రత్న ఇలా అంటుంది. అక్కడ అయితే నేను అందరికీ తెలుసు కాబట్టి మాట్లాడతాను. ఇక్కడ ఎవరు తెలుసు నాకు అని నెమ్మదిగా చెప్పింది.

ప్రతిమ, రత్నలా కాదు. మహీధర్ బజార్ కి వెళితే, తను బజార్ కి వస్తాను అంటుంది. అలాగే మహీధర్ తెచ్చిన సరుకులు బాగలేకపోయిన బాగలేవు అని చెప్తుంది. అలాగే వాటి ధరలు కూడ ఆడిగి తెలుసుకుంటా వుంటుంది. ఏది కొనాలన్నా తను చూడాలి, తనకు నచ్చాలి, అన్నట్టుగా ఉంటుంది. ఒకరోజు మహీధర్, వెంకటేష్ ఇద్దరూ కలిసి బజారుకు వెళ్లి ప్రతిమకు, రత్న కు ఇద్దరికీ చీరలు తీసుకొని వచ్చారు. ప్రతిమకు నచ్చకపోయేసరికి నచ్చలేదు అని అక్కడే వెంటనే చెప్పింది. రత్న అలా కాకుండా, నచ్చకపోయినా వెంకటేష్ ఎక్కడ బాధ పడతాడో అని నచ్చింది, అని చెప్పి ఏమి అన కుండా ఉంటుంది.

ప్రతిమ, అలా ఉండటం మహీధర్ కి నచ్చేది కాదు. ఎక్కడికి రాకపోతేనే బాగుంటుందని, తను ఉంటే ప్రతి

దానికి నేనున్నానంటూ బయలుదేరుతూ ఉంటే ఏ పనులు కావు, అని బాధపడుతూ ఉంటాడు. "గడప దాటితే చాలు ఎక్కడికి, ఎందుకు, ఏమీ పని ఉంది, ఎప్పుడొస్తారు, వెళ్ళకండి నాకు తోచదు, త్వరగా రండి, అని కండిషన్స్ పెడుతూ ఉంటుంది." రత్న ఇటువంటి కండిషన్ పెట్టేది కాదు వెంకటేష్ ఎలా ఉన్నా ఏమి అనేది కాదు. అందువలన వెంకటేష్ ను, మహీంధర్ ఇలా అనేవాడు నీవు అదృష్టవంతుడివి నీ భార్య నీకు ఎలాంటి కండిషన్స్ పెట్టదు అని అనేవాడు.

రత్న పిండి వంటలు బాగా వండుతుంది అని చెప్పి వెంకటేష్ ఒక ఆదివారం నాడు మహీధర్, ప్రతిమలను ఇంటికి ఆహ్వానించాడు.ఆరోజు రత్నం ఉదయాన్నే లేచి పిండివంటలు మొత్తం చేసి ఉంటుంది. అయినా కూడా వెంకటేష్ తో చేయలేదు అని చెబుతుంది. అప్పుడు వెంకటేష్ కోపడతాడు. కొద్దిసేపటికి వంటగదిలోకి వెళ్లి చూస్తే వంటలన్నీ చేసి ఉంటుంది. అది చూసి సంబర పడిపోతాడు. ప్రతిమ చదువు హ్యాపీ గానే సాగుతుంది. అలా సాగుతూ ఉండగా వెంకటేష్ ఒకరోజు మాటవరసకి ప్రతిమను ఇలా అడుగుతాడు. ఇప్పుడు మీరు పాఽ య్యాక ఏం చేద్దాం అనుకుంటున్నారు. అలా అడగగానే ప్రతిమ ఉద్యోగం చేస్తాను అని చెప్పింది. డబ్బు సంపాదించడం వల్ల ఆర్థిక స్వతంత్రం ఉంటుంది. అలాగే తమకి కావాల్సినవి తెచ్చుకోవచ్చు అని, తమ కాళ్ళమీద తాము నిలబడ గాలుగుతామని చెప్పింది. ప్రతి దానికీ భర్త దగ్గర డబ్బులు తీసుకోవడం బాగుండదు అని అంటుంది. అలా చెప్పడం మహీధర్ కి నచ్చలేదు. తర్వాత ప్రతిమ మనసులో మాట చెప్పడం వలన మహీధర్‌కి కూడా అదే కావాలి అని వాళ్ళిద్దరూ సర్దుకు పోయారు.

రత్న ఒకరోజు ప్రతిమ వాళ్ళ ఇంటికి వెళ్ళింది. ప్రతిమ, రత్న ఇద్దరూ పుస్తకాలు గురించి మాట్లాడుకుంటున్న సందర్భంలో ప్రతిమ ఇలా అంది. ''నేను కూడా ఇంటింటా గ్రంథాలయం ప్రణాళికలో చేరాను నిన్నానే డబ్బు కట్టాను". అని చెప్పే సరికి రత్న కూడా చేరాలి అనుకుంది. రత్న ఇంటికి వెళ్ళిన తర్వాత వెంకటేష్ తో ఇలా అంటుంది. ఇంటింటా గ్రంథాలయంలో చేరడానికి, వారికి ఐదు రూపాయలు పంపించండి అని చెబుతోంది. రత్న ఆలా చెప్పే సరికి వెంకటేష్ కి చాలా సంతోషం అనిపించింది. అదే రోజున డబ్బులు పంపించాడు.

ఇది అంతా చూసిన వెంకటేష్ కి ప్రతిమ చేష్టలకు తన భార్య సహచర్యలకు ఎంత తేడా ఉంది, అని అనుకున్నాడు. "వెంకటేష్ రత్న చేతిని గట్టిగా పట్టుకుని తను ఇక ఎన్నటికీ రత్నం విషయంలో బాధపడనవసరం లేదు. ప్రతిమ జవాబు మహీధర్‌కు నచ్చింది. తను కోరిన జవాబు రత్న ఇచ్చింది" అని వెంకటేష్ అనుకున్నాడు.

దంపతులు మానసికంగా ఒకరికి ఒకరు అర్థం చేసుకోవాలి. భార్యాభర్తల మధ్య సాన్నిహిత్యం పెరగాలి. ఒకరికొకరు సహకరించుకోవాలి, ఎదుటి వ్యక్తి ఆనందానికి ప్రాధాన్యమివ్వాలి. ఇద్దరిలో ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా, ఒకరి ఇష్టాలు మరొకరు తెలుసుకోని వాళ్ళ అభిప్రాయలకు అనుగుణంగా మసలుకోవాలి. ఈ దాంపత్య జీవితంలో ఒకర్నొకరు పూర్తిగా అర్థం చేసుకోని జీవించాలి. దంపతుల మధ్య ఒకరిమీదఒకరికి నమ్మకం, ప్రేమ, ఆప్యాయత, అనురాగలు, ఎంతో అవసరం. ఇలాంటి దాంపత్య జీవితం కచ్చితంగా ఆనంద మయమవుతుంది. అని రచయిత్రి ఉద్దేశంగా భావించవచ్చు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

విహారి 'కొత్తనీరు' కథా సంపుటి – సామాజిక జీవన చిత్రణ

– డా॥. కాళిశెట్టి సంధ్య, తెలుగు మెంటర్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు, కృష్ణా జిల్లా.

'హితేన సహితం సాహిత్యం' అంటారు. సమాజానికి హితాన్ని కూర్చేది సాహిత్యం. సమాజం, సాహిత్యం రెండూ పరస్పర సంబంధం కలిగి ఉంటాయి. సమాజంలోంచి సాహిత్యం పుడితే, సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. సమాజాభివృద్ధికి, మానవతకు, సమభావనకు సాహిత్యం చాలా అవసరమౌతుంది.

ఆధునిక సాహిత్యంలో ఏ కొన్ని రచనలనో మినహాయిస్తే మిగిలినవన్నీ సమాజాన్నీ, ప్రజల జీవితాన్నీ, జీవన విధానాన్నీ చిత్రించేవే. తమ రచనల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసిన ఎందరో ప్రముఖులలో 'విహారి' అనే కలం పేరుతో ప్రసిద్ధి చెందిన జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కవి, కథకుడు, కథా విమర్శకుడు, పద్యకవి అయిన విహారి గారి కథలు తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి.

మధ్యతరగతి జీవితాన్ని కథావస్తువుగా గ్రహించి, వీరు రాసిన అనేక కథలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి, కథాసంపుటాలుగా వెలువడ్డాయి. ఆ సంపుటాలలో 15 కథలున్న "కొత్తనీరు" అనే కథాసంకలనాన్ని మాత్రమే నా పత్ర సమర్పణకు పరిధిగా ఎంచుకున్నాను.

వస్తువైవిధ్యంతో 2007లో రాసిన "అవ్యక్తం, రెండో సముద్రం, కొత్తనీరు, గూడు-నీడ, కొత్తపాఠం, భ్రష్టయోగి, 'భూ'మధ్యరేఖ, సిద్ధము సుమతీ, రెండర్థాల పాట, మిస్టర్ ఆక్రోశం, రుచుల జాడ, శేష ప్రశ్నలు, ఉభయ కుశలోపరి, వంకర గీతలు, ఎదురద్దాలు" అనే 15 కథలున్న కథాసంపుటి పేరు "కొత్తనీరు"

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు కుటుంబవ్యవస్థ మూలం. అటువంటి కుటుంబ వ్యవస్థకు భార్యాభర్తలే పునాది. వారి మధ్య బంధం ఎలా ఉండాలో చెప్పే కథ అవ్యక్తం. 48 సంవత్సరాల వయసులో ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన భార్య పట్ల భర్త చూపే ఆదరణ, వారిద్దరి మధ్య ఉండే ప్రేమాభిమానాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయి. తనను మరో వివాహం చేసుకోమని పరోక్షంగా చెప్పిన భార్యతో "జీవితం 'మనం' అనే నువ్వూ నేనూ మధ్య నడుస్తుంది. మూడో చేతి ప్రమేయం లేదు" అంటాడు భర్త. వారి అవ్యక్తమైన ప్రేమకు ప్రతిరూపమే ఈ కథ.

వైవాహిక బంధం ఎలా ఉండాలో అవ్యక్తం కథ చెప్తే, ఎలా ఉండకూడదో చెప్పే కథ రెండో సముద్రం. స్త్రీవాద భావజాలాన్ని వ్యక్తీకరించిన కథ ఇది. ఇందులో కథానాయిక స్వరూప. ఆమె భర్త తన ఆనందాలకూ, వ్యసనాలకూ కుటుంబం అడ్డమని బెంగుళూరులో ఉద్యోగం చేస్తూ వారాంతంలో భార్య దగ్గరకు వస్తుంటాడు. ఉద్యోగస్తురాలైన భార్యపై అనుమానంతో ఆమెను మానసికంగా, శారీరకంగా హింసిస్తాడు. అతని ఆనందానికి మూడేళ్ళ కూతురు కూడా అడ్డమే. తన సహోద్యోగుల మాటలు ఆమెలో ఆలోచనలను రేకెత్తిస్తాయి. "గతం పుస్తకం, బతుకు ప్రస్తుతం, రేపు? వెలుగే కావాలి! ఆశ రెండో సముద్రం!" అనుకుంటూ భర్తకు చెప్పి, అతని అంగీకారం కోసం చూడకుండా తన తల్లిని, కూతురిని తీసుకుని పుణ్యక్షేత్రాలకు వెళుతుంది. ఈ కథలో స్వరూప, ఆమె తల్లి, స్వరూప వదిన రాజశ్రీ (అన్న భార్య) కూడా పురుషాధిపత్యాన్ని ఎదుర్కొన్నవారే. స్వరూప తల్లి, తన భర్త చేసిన నిర్వాకాన్ని మౌనంగా భరిస్తే, స్వరూప వదిన రాజశ్రీ అవలక్షణాలు కలిగిన భర్తకు దూరమై చిన్న ఉద్యోగం చేస్తూ తన జీవితాన్ని గడుపు తుంటుంది. ఇక స్వరూప ఆత్మవిశ్వాసంతో అడుగేయడం కథకు ముగింపు.

తరాల మధ్య ఉన్న అంతరాన్ని వ్యక్తం చేసే కథ కొత్తనీరు. ముసలివాడైన తండ్రికి, యువతరానికి ప్రతీకలైన తన సంతానానికి మధ్య రోజూ జరిగే గొడవలకు పరిష్కారం చూపలేని వ్యక్తి కథ ఇది. రెండు తరాల మధ్య వారధిగా ఉన్న అతనికి అటు తండ్రి మనస్తత్వమూ, ఇటు తన పిల్లల ఆలోచనా రెండూ తెలుసు కనుకే ఆ సమస్యకు పరిష్కారం లేదని భావిస్తాడు. ఆ సమయంలో వృద్ధుడైన అతని తండ్రి వృద్ధాశ్రమంలో చేరి ఆ సమస్యకు పరిష్కారం సూచిస్తాడు. "కొత్తనీరు వచ్చి పాత నీరుని కొట్టేస్తూ ఉంటుంది. అందువల్ల కుటుంబంలోని ఒకరి ప్రవర్తన మరొకరి అనారోగ్యానికి కారణం కాకూడదు" అనే సందేశం ఇస్తుందీ కథ. ఒకప్పుడు విలువలకు, సంస్కృతీ సంప్రదాయాలకు పెన్నిధియైన ఉమ్మడి కుటుంబం నేటికాలంలో తన అస్తిత్వాన్ని ఎందుకు కోల్పోతుందో, ఎందుకు కోల్పోయిందో వ్యక్తం చేసే కథ ఇది.

అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ సంతానం వివాహం వల్లనో, లేక ఉపాధి కారణంగానో తమకు దూరమైతే మానసిక వ్యధతో వృద్ధాశ్రమంలో చేరిన తల్లిదండ్రుల కథ గూడు-నీడ. ఈ కథలో కొడుకూ, ముగ్గురు ఆడపిల్లలు ఉండీ ఆదుకునేవారు లేక ఆశ్రమంలో చేరిన తల్లిదండ్రుల్ని పిల్లలు తమ స్వలాభానికి వాడుకోవడం కనిపిస్తుంది. వారు చేరతామన్నప్పుడు "మేమీ బరువులూ, బాధ్యతలూ భరించలేం. మీ చరిత్రని మళ్ళీ మా తరానికి కూడా పునరావృతం చేయకండి. ఉన్న సొమ్ముతో మీరేమైనా చేసుకోండి మీ యిష్టం" అన్న కొడుకూ, కోడలే ఇప్పుడు ఉద్యోగ బాధ్యతల వల్ల తమ పిల్లని చూసుకోవడానికి కష్టంగా ఉందనీ, అందుకు మీ అవసరం ఉందనీ, మీకు ఉండటానికి వేరే ఏర్పాట్లు చేస్తామనీ, పిల్లని చూడడానికి డబ్బులు కూడా ఇస్తామనడం 'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అన్న మాటను గుర్తుకు తెస్తుంది.

చేసేపని గుమాస్తా అయినా తన గురించీ, తన సంతానాన్ని గురించీ గొప్పలు చెప్పుకుంటూ భేషజాలకు పోయిన ఒక తండ్రి కథ అతని సంతానానికే కాదు మనకి కూడా ఒక 'కొత్తపాఠ'మే. వ్యసనాలకు బానిసై వచ్చే జీతం చాలక ఉద్యోగం ఇప్పిస్తానని తన స్వంత మేనల్లుడినే మోసం చేయడం, ఆ విషయం బట్టబయలవడంతో ఆ కుటుంబసభ్యులు పడిన ఆవేదన, చివరికి భేషజాలకు పోవద్దని హెచ్చరిద్దామనుకున్న కొడుకుకు తండ్రి మరణం ఒక పాఠమైంది.

కొత్తనీరు కథాసంపుటిలో రైతుల యధార్థ జీవితాన్ని చిత్రించిన కథలున్నాయి. అందులో ఒకటి భ్రష్టయోగి కథ. పల్లెలో మర్యాదా, మన్ననా కలిగిన ఒక రైతు సరళీకృత పెట్టుబడిదారీ విధానం వల్ల ఉన్న పొలాన్ని అమ్ముకొని రైతుకూలీగా, తర్వాత వలసదారుడిగా, చివరకు బిచ్చగాడిగా మారిన వైనాన్ని చిత్రించిన కథ ఇది. మనది వ్యవసాయంపై ఆధారపడిన దేశం. అందుకే 'దేశానికి వెన్నెముక రైతు' అంటారు. రైతుకు కావాల్సినవి సకాలంలో ప్రభుత్వం ఇవ్వగలిగినప్పుడు, ఏ పంట పండించాలో పూర్తి నిర్ణయాధికారం అతనికే ఇవ్వగలిగినప్పుడు, దళారీ వ్యవస్థ నశించినప్పుడు రైతు జీవితం బాగుపడుతుంది.

గూడు-నీడ కథలో కూడా శ్రీరాములు అనే రైతు ఆర్థిక అవసరాల వల్ల పట్టణానికి వలస వచ్చి ఒక ఫ్యాక్టరీలో కార్మికుడిగా చేరతాడు. సంతానం స్థిరపడడం, యాజమాన్యం ఫ్యాక్టరీ మూసేయడం, తమని ఆదరించేవారు కరువవడంతో భార్యతో వృద్ధాశ్రమంలో చేరతాడు.

రైతు జీవితాన్ని వర్ణించిన మరో కథ 'భూ'మధ్యరేఖ. ఇందులో టీచర్ గా రిటైర్ అయి వ్యవసాయం చేస్తుంటాడు గురునాథం. అతనికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల ఒక కొడుకు, చీటీల వ్యాపారం వల్ల మరో కొడుకు, వ్యసనాలకు, ఆకర్షణలకు బానిసై అప్పుల్లో కూరుకుపోయిన భర్త కోసం కూతురు-ముగ్గురూ తమ తమ అవసరాల కోసం ఉన్న భూమిని అమ్మమని తండ్రి దగ్గరకు వస్తారు. అందుకు అంగీకరించడు గురునాథం. "మనిషికి భూమి అంటే దేశానికి జెండా వంటిది" "అడుసులో కాలేసినవాడే

తీసుకోవడమూ, కాలు కడుక్కోవడమూ కూడా తానే నేర్చుకుంటాడు. మనిషి చరిత్ర చెపుతున్న పాఠం ఇదేనమ్మా" అంటూ గురునాథం పాత్ర చేత పలికిస్తాడు రచయిత.

ప్రపంచీకరణ నేపథ్యంలో నిరుద్యోగం బాగా పెరిగింది. విద్యార్హతలకు తగిన ఉద్యోగాలు లభించడం లేదు. ఒకవేళ చిన్నా చితకా ఉద్యోగాలు లభించినా వచ్చే నాలుగైదు వేల జీతంతో బతకలేని పరిస్థితి. అటువంటి ఒక నిరుద్యోగి కథ సిద్ధము సుమతీ. సరైన ఉపాధి లభించక బతుకుని యథార్థం చేసుకోవడానికి నాయకుడు చివరికి ట్యుటోరియల్ పెట్టుకోవడంతో కథ ముగుస్తుంది.

ఉపాధి కోసం పట్టణానికి వలస వెళ్లిన ఒక గ్రామీణ యువకుడు అతికష్టం మీద చిరుద్యోగాన్ని సంపాదించడం, ఆ ఉద్యోగం చేయడానికి అతను ఎదుర్కొన్న కష్టనష్టాల్ని వర్ణించిన కథ రెండర్థాల పాట. పెద్ద పెద్ద కంపెనీలు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పేరుతో నిరుద్యోగ యువతను ఆకర్షించడం, ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని వారిని అప్పుల పాలు చేసేలా ప్రోత్సహించడం వంటివి ఈ కథలో చర్చకు వచ్చాయి.

సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన ప్రజలు ఎదుర్కొనే సమస్యలను అతి సుతారంగా చిత్రించిన కథ మిస్టర్ ఆక్రోశం. మనిషి అవసరాన్ని ఆసరా చేసుకుని ఆర్థిక దోపిడీ జరుగుతుందని నిరూపించిన కథ ఇది.

భిన్నమైన వస్తువుతో విహారి గారు రాసిన కథ రుచుల జాడ. ఒక హోటల్ సర్వర్ గా పనిచేసిన వ్యక్తి తన తెలివి తేటలతో ఉన్నత స్థానానికి ఎదుగుతాడు. సంతానం లేకపోవడంతో తమ్ముడి కొడుకును దత్తత తీసుకోవడానికి ఏర్పాట్లు చేస్తాడు, అందర్నీ ఆహ్వానిస్తాడు. కానీ దత్తత స్వీకారానికి ముందురోజు తమ్ముడు, మరదలి ధన దాహాన్ని, దత్తత తీసుకోవాలనుకున్న పిల్లవాడి మనస్తత్వాన్ని గ్రహించి దత్తత స్వీకారాన్ని కాస్తా సత్య నారాయణ స్వామివ్రతంగా మారుస్తాడు. తర్వాత భార్యాభర్తలిద్దరూ కలిసి అనాధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలనుకోవడంతో కథ ముగుస్తుంది.

నేడు మానవ సంబంధాలకు విలువ లేదనీ, డబ్బే అన్ని బంధాల్నీ శాసిస్తోందనీ పతీ వ్యక్తీ భావిస్తాడు. ఇతరులను ఆ దృష్టితో చూసే మనం కూడా అడపా దడపా ఇలాంటి పరిస్థితులకు తలవంచక తప్పదని చెప్పిన కథ శేష ప్రశ్నలు. "సమాజంలో సంక్లిష్టత, సంఘర్షణ, అస్తవ్యస్తత.... వీటి తీవ్రతలో తరతమ భేదాలూ.... మనిషిని నాడూ, నేడూ శాసిస్తున్నవి! మానవచైతన్య ప్రస్థానంలో ఒకటి రెండు పాత్రల్ని తీసుకుని సిద్ధాంతాలు చెయ్యగలమా? జీవితం ఎప్పుడూ శేష ప్రశ్న కదా?" అంటారు విహారి.

రెండో కొడుకు కోరికపై వినాయకచవితి పండక్కి హైదరాబాదు వస్తాడు శివయ్య. నగరంలోని జీవితం, ఆర్థిక దోపిడీ వంటి ఘటనలు చూసి అక్కడ ఇమడలేక తిరిగి తెనాలి చేరుకున్న ఆ తండ్రి కథ ఉభయ కుశలోపరి.

మనిషికి సహజమైన సమస్యలు కొన్నయితే, తెచ్చి పెట్టుకునేవే మరిన్ని అయి చింతలతో, చికాకులతో మనుగడ సాగించడం కష్టమవుతుంది. "ఆధునికత తెచ్చిన సాంకేతిక పరిణామాలు జీవితాలను అపారంగా వృద్ధి చేస్తున్నాయి అంటున్నారు, కానీ పూసల్లో దారం లాంటి విశ్వాసం ఏది?" అంటూ రచయిత సమాజాన్ని ప్రశ్నించిన కథ వంకర గీతలు. సాంకేతికతకు దగ్గరై మానవత్వాన్ని మరచిన మనిషిని స్పష్టంగా చూపించిన కథ ఇది.

నగరాల్లో మొదలై పట్టణాలకు వ్యాపించి చివరకు పల్లెటూళ్ళకు పట్టిన జాఢ్యం అలజడులు, ఆందోళనలు, ఉరుకులు, పరుగులు...కేకలు, పాలికేకలు, గావుకేకలు. సమాజంలో సుఖ శాంతులు మాయమవుతున్నాయనీ, త్వరలోనే స్వరాజ్యం కూడా మనిషి కోల్పోయే అవకాశ ముందని, అందుకు కారణం మనమే అనీ చెప్పిన కథ ఎదురద్దాలు.

ఈ కథాసంపుటిలోని కథలలో ఎన్నో అంశాలను కవి స్పృశించారు. హైదారాబాద్ లో ఉగ్రమూకల బాంబుదాడి వల్ల ఎన్నో జీవితాలు, ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్న మయ్యాయి. ఆ సంఘటనలో జనం కాళ్ళ కింద నలిగి పోయి మంచానికే పరిమితమైన గౌరి పాత్ర అవ్యక్తం కథలో కనిపిస్తుంది.

స్వచ్ఛమైన ప్రకృతి గాలి పీల్చిన మనిషి మారుతున్న కాలానికనుగుణంగా ఆర్థిక ఇబ్బందుల్లోకి బలవంతంగా నెట్టి వేయబడి నగరాలకు వలస వస్తున్నాడు. నగరం ప్రియురాలులా నయగారాలు ఒలకపోస్తుంది. విపరీత మైన జనం, వాహనాల రద్దీ, మిరుమిట్లు గొలిపే షాపింగ్ మాల్స్... అక్కడ కృత్రిమ అప్యాయతలు, కుహనా సంస్కారాలు, మిథ్యా గౌరవాలు కలిగిన మనుషుల మధ్య జీవిస్తూ మనసును కలుషితం చేసుకుంటున్నాడు. రాత్రికి రాత్రే ధనవంతులై పోవాలనుకునేవారు, ఇతరుల చేత మోసగింప బడే అమాయకులు, వ్యసనాలకు బానిసలై బాధ్యతా రాహిత్యంతో అప్పుల్లో కూరుకు పోయేవారు, భేషజాలకు పోయి కుటుంబాన్ని బజారున పడేసేవారు, చేసిన చిన్న పనికి అధిక మొత్తంలో డబ్బు ఆశించే చిన్నా చితకా ఉద్యోగస్తులు, 'అప్పు కొంప ముంచుతుంది', 'అప్పు లేనివాడె అధిక సంపన్నుడు' అని నీతులు నేర్చు కున్న ప్రజల్ని పనిగట్టుకుని అప్పుల పాలు చేయాలని కంకణం కట్టుకున్న పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు, ఎవరో చేసిన ప్రాజెక్టులకు అట్టలు మార్చి తమవిగా చెప్పి, విజ్ఞానాన్ని విడిచి, నీతిని మరచి డిగ్రీలు సంపాదించే విద్యార్థులను తయారు చేస్తున్న విద్యాలయాలు... ఇలా ఒకటేమిటి అన్ని సామాజిక పార్శ్వాలను తన కథలలో చొప్పించారు విహారి.

గత 6 దశాబ్దాలుగా కొనసాగుతున్న రచనా ప్రక్రియ ద్వారా 14 కథాసంపుటాలను వెలువరించిన ఘనత వీరిది. సమకాలీన సమాజంలోని కోణాలనన్నింటినీ చూపగల వీరి రచనలపై అనేక కోణాల్లో పరిశోధనలు జరపాల్సి ఉంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నేటి సమాజానికి అవసరం మానవతావాద సాహిత్యం

– డా॥. నందనవనం శివ కుమార్

ఈనాటి సమాజంలో మానవతా విలువలు మంట గలిసిపోతున్న విషయం అందరికీ విదితమే. ప్రధానంగా మనం నిత్యం సమాజంలో చూస్తున్న పలు ఘోరాలు, నేరాలు ఎంత దయనీయంగా ఉన్నాయో మనకు అవగత మౌతున్నది. తల్లిదండ్రులను అనాథాశ్రమాలకు సాగనంపు తున్న వైనం, చిత్రహింసలకు గురిచేస్తున్న సోజ్యం, తన మన లేకుండా అక్క తమ్ముడు, అన్న చెల్లి అన్న తార తమ్యం లేకుండా అపూర్వమైన, అపురూపమైన మానవ సంబంధ బాంధవ్యాలను సైతం కాలరాస్తున్న వైనం గమ నిస్తున్నాం. నేడు సమాజానికి కావలసిన సాహిత్యం మానవతావాద సాహిత్యం. ఈ కోవలోకి వచ్చేవి అత్యా చారాలు, అమానవీయ సంఘటనలు, స్వార్థం, కుట్ర, కుతంత్రం, మోసం, దగా, రౌడీయిజం, రాజకీయం, అంటరానితనం, పైశాచికత్వం ఇలా చెబుతూ బోతే చాలానే ఉన్నాయి. నేడు సమాజంలో విశ్వమానవ శ్రేయస్సును సైతం నాశనం చేసే దిశగా ప్రవర్తిస్తూ, "నా చిన్న బొజ్జకు శ్రీరామరక్ష" అని స్వార్థపూరిత మనస్తత్వ ధోరణలకు అద్దం పడుతుంది.

ప్రతి నిత్యం సమాజంలో జరుగుతున్న అమానవీయ సంఘటలపైన, ఇటు రాజకీయ, ప్రభుత్వ అధికారుల పైశాచికత్వాలపూ తెలుగు కవితా గళం వినిపిస్తూనే ఉన్నమాట వాస్తవమే. మరియు ఇటు కుటుంబ నేపథ్యంలో జరుగుతున్న అమానవీయ సంఘటలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పలు సాహిత్య సంఘాలు, సాహితీవేత్తలు, అధ్యాపకులు, విశ్వవిద్యాలయ స్థాయి లోని ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమే. ఇందులో భాగంగా వారు చేసే రచనలుగాని, కవిసమ్మేళనాలు, చర్చలు, సదస్సులు లాంటివి తెలుగు సాహిత్యంలో లెక్కకు మిక్కుటంగానే ఉన్నాయి. ఆధునిక సాహిత్యం వచ్చినది మొదలుకొని అనేకములైన సాహిత్యవాదులు వారి వాదాలు వినిపిం చడం మనం చూసాము. దాదాపుగా అన్ని సాహిత్య వాదాలలో సైతం కొంత మానవతా వాదం స్ఫురిస్తూనే ఉంటుంది. వీటిని ఏకత్రాటిపై తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ఈ సందర్భంగా నేను ప్రస్తుతిస్తున్నాను.

ప్రధానంగా కవి అనేవాడు మార్గ నిర్దేశకుడు. ఎప్పటి కప్పుడు సమాజంలో జరుగుతున్న అనేకమైన విషయా లను, యదార్థ సంఘటనలను క్రోడీకరించి తన కవిత్వంలో చొప్పిస్తాడు. అలా ప్రాచీన సాహిత్యం నుండి నేటి ఆధునిక సాహిత్యంలో సైతం ఎన్నో రచనలు వచ్చాయి. ప్రధానంగా నలుగురు ఆధునిక కవుల రచన లను మాత్రమే గ్రహించి మానవతా విలువలను ఉడతాభక్తిగా చాటే ప్రయత్నం చేయదలచాను. అవి (1) మనిషి - దీర్ఘకవిత - సబ్బని లక్ష్మీనారాయణ (2) మనిషి - డాక్టర్ అందెశ్రీ "పాటల పూదోట" (1995) లలిత గీతాల సంపుటి (3) శత్రువుతో ప్రయాణం - డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్ కవితా ఖండిక (3) "కర్మ కాదు క్రియ" - డాక్టర్ ఎన్‌వి కృష్ణారావు సంపాదకత్వంలో వెలువడిన "మానవతా కవులు కవితా సంకలనం" లను స్వీకరించి నా పరిశోధనాత్మక రచన సాగించాను.

మొదటగా మనిషిలోని మనిషిని తట్టి లేపే దీర్ఘకవిత "మనిషి" గురించి పరిశీలిస్తే ఇందులో మానవతా విలువ లున్నాయి. మానవతా నిర్వచనం ఉంది. అనేక కోణాల్లో చేసిన మానవతా పరిశీలనం ఉంది. అందుకే కాబోలు తన భావాల్ని చెప్పడానికి దీర్ఘకవితా ప్రక్రియను ఆయన ఎంచుకున్నారు. ఆయన తన దీర్ఘకవితలో ఇలా అంటారు.

తెలుగు శాఖ, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు.

"నటన, నటన నటన
భార్యా భర్తలుగ నటన,
ప్రేయసీ ప్రియులుగ నటన,
మిత్రులు హితులుగ నటన,
సమస్త జీవిత సన్నివేశాల్లో నటన
నటనే జీవితంలో భాగమైపోయింది,
మనిషి నిజంగా జీవించేదెప్పుడు?"

అంటూ ప్రశ్నిస్తారాయన. దీనిని బట్టి చూస్తే అటు కుటుంబ నేపథ్యంలో, సమాజంలో నా అనుకున్న వాళ్ళు సైతం మానవతా విలువలకు మంగళం పాడి స్వార్థపూరితంగా మాత్రమే మనుషుల జీవితాలు ఓ నటనగా సాగుతున్న వైనం ఆయన ఎండగట్టారు. (ఆధారం: డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు, కాకినాడ తేది 12-10-2015 గూగుల్ సెర్చి నుండి గ్రహించబడింది)

అదే విధంగా డాక్టర్ అందెశ్రీ రచించిన "మనిషి" కవితలో

మాయమైపోతున్నడమ్మా
మనిషన్నవాడు ఓ. . . . ఓ. . . .ఓ. . .
మచ్చుకైన లేడు చూడూ
మానవత్వం ఉన్నవాడూ
నూటికో కోటికో ఒక్కడూ
యాడ వున్నడో కాని కంటికి కనరాడు ॥ మాయమై ॥
నిలువెత్తు స్వార్థము నీడలాగొస్తుంటే
చెడిపోక ఏమైతడమ్మా
ఆత్మీయ బంధాల ప్రేమ సంబంధాల
దిగజారుతున్నడోయమ్మా ॥ మాయమై ॥

అంటూ సాగుతుంది.

(ఆధారం: "పాటల పూదోట" లలిత గీతాల సంపుటి, ముద్రణ: 1995) ఇందులో డాక్టర్ అందెశ్రీ నేటి సమాజంలో మానవతా విలువలు అడుగంటుతున్న వైనాన్ని గేయరూపంలో రచించి సమాజంలోని మూఢా చారాలను ఎండగడుతూ, స్వార్థపూరిత మానవ నైజాన్ని ఎత్తి చూపి మానవత్వానికి కావాల్సిన ప్రాధాన్యతలను చాటి చెప్పారు.

డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్ రచించిన "శత్రువుతో ప్రయాణం" కవితా ఖండికలో "మనిషి" కవితలో ఇలా అంటారు

"యుద్ధాన్ని గురించి భయంలేదు
మరణాన్ని గురించి భయంలేదు
క్రూరమృగాల గురించి
విషనాగుల గురించి
సునామీ గురించి
ఉప్పొంగే నదుల గురించి భయంలేదు
నా భయమంతా మనుషుల గురించే

మనిషి రూపంలో ఉన్న మనిషి గురించే - అంటూ సాగుతుంది ఆయన కవిత. చివరగా. . . . .

"మానవ ప్రయోగశాలను
పణంగా పెట్టాడు!
మనిషిగా మారేంతవరకూ
మనిషంటే నాకు వణుకు
మనిషంటే నాకు బెణుకు!"

అంటూ నేటి సమాజంలో మనిషంటే భయపడాల్సిన దుస్థితిని ఎండగట్టారు. ప్రస్తుత పరిస్థితికి ఈ కవితా పాదాలను అన్వయించుకుంటే నేడు సమాజంలో రగులుతున్న "మహమ్మారి కరోన - కోవిడ్ -19" సృష్టించ బడింది ప్రయోగ శాలలోనే, ప్రపంచాన్ని వణికిస్తున్న మనిషిని చూచి మనిషి భయపడుతున్న తీరుకు అద్దం పడుతుంది ఈ రచన. 2020వ సంవత్సరంలో మహ మ్మారి కరోన రాబోతున్న విషయాన్ని సైతం ఆయన ముందుగానే గ్రహించారా! అన్న సందేహం వస్తుంది. కవి స్ఫురద్రూపి అన్నదానికి ఈ కవిత ఒకింత ఆల వాలంగా నిలుస్తుంది. అలాగే వారి పలు రచనలలో నేడు సమాజంలో అంతరించిపోతున్న మానవత్వపు విలువ లను, మానవ మనుగడను గురించి విశ్రాంత ఆచార్యులు

మాడభూషి సంపత్ కుమార్ చెందిన ఆవేదన స్పష్టంగా గోచరింస్తుంది.

చివరగా డాక్టర్ ఎన్.వి.కృష్ణారావు సంపాదకత్వంలో తెలుగు వచన కవిత్వంలో దూసుకొస్తున్న నవతరం గొంతుక "మానవతా కవులు" కవితా సంకలనం "కర్మ కాదు క్రియ" (ముద్రణ: వెన్నెల ప్రచురణ జూలై 2018)

ఈ కవితా సంకలనంలో మొదటి కవిత "శాంతి ! అహింస !! మానవత్వం !!!"లో ఇలా అంటారు. "శాంతి ఉత్తమమైనది

అహింస ఉదాత్తమైనది
మానవత్వం మహోన్నతమైనది"

(పుట సంఖ్య 13, 14)

ఇందులో ఆచార్య ఎన్ వి కృష్ణారావు మానవత్వాని కిచ్చిన స్థానం మహోన్నతమైనది అనడంలో ఆయాన ఆలోచనలలో మానవత్వం అంతరించిపోతున్న తరుణంలో మానవతా విలువలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఇక్కడ ప్రస్తుతించారని చెప్పవచ్చు. ఇదే కవితలో చివరగా. . . . . .

"మనిషుండాలి
మనుషులుండాలి
సమాజముండాలి
మనుషుల్లేని నేల
మరుభూమికన్నా హీనం కాదా?
మనిషే దేవుడు
మానవత్వమే దైవత్వం"

అనడంలో ఆచార్య ఎన్ వి కృష్ణారావు గారు "దేశ మంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అన్న "మన అడుగుజాడ గురజాడ" పలుకుల్ని మరోమారు ప్రస్తుతించారు. ఆయన మాటలు అక్షర సత్యాలని మరోమారు నొక్కి వక్కాణించిన వైనం సుస్పష్టం. అలాగే "దైవం మానుష రూపేణా" అనేది పెద్దల ఉవాచ. "మానవత్వమే దైవత్వం" అని కవి అనడంలో వారిలో దాగి ఉన్న ఆధ్యాత్మిక వేదాంత ధోరణులతో బాటు ఆయన మన ముందు వేదాంతాల సారమును ఒకింత ఒడిసిపట్టి చెప్పినట్లున్నది.

కర్మ కాదు క్రియ" అనే కవితా ఖండికలో

"కర్మ - పూర్వజన్మలో చేసిన పాపపుణ్యాల చిట్టా।
క్రియ - ప్రస్తుత సమాజానికి నువు చేయాల్సిన చిట్టా॥"

అనడంలో సమాజ శ్రేయస్సుకు ప్రతి మనిషి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు.

అదే విధంగా "రాసిందంతా.....! బ్రతికిందంతా.....! అనే కవితా ఖండికలో (పుట సంఖ్య 66, 67)

"మనిషి పుట్టుకే ప్రభంజనం
మనిషి కలయిక మహా ప్రభంజనం
కలవాలంటే బతకాలి
బతకాలంటే ఎన్ని కావాలో ! "

అంటూ మనిషికి కావాల్సిన అవయవాలు అవస రాలను చెబుతూనే మధ్యలో

"రాసినదాన్లో హృదయాన్ని స్పర్సించిందే కవిత్వం !
బ్రతికిన దాన్లో గుండె తడిని ఆవిష్కరించిందే జీవితం!"

అని నిజంగా మనుషులను కదిలించే వారి హృదయ కుహూరాలను తాకేదే నేటి సమాజంలోని మనుషులలో మార్పును తెచ్చేదే నిజమైన విత్వం అనిపించు కుంటుందని నవ కవితా ధోరణులను సైతం ప్రస్ఫుటం చేసారు.

చివరగా "కావాలి మనిషి తత్వం అదే ప్రపంచానికి బ్రతుకు ధనం!" అని ముగింపు చెబుతూ చిట్ట చివరన "మానవత్వానికి లేదు ఏ కొలమానం ! " అనడంలో మానవత్వపు విలువలకున్న ప్రాధాన్యతను నేటి సమాజంలో మానవతా వాద కవిత్వానికున్న అవసరాన్ని సైతం ఆయన వ్యక్తీకరించారు.

దీనిని బట్టి నేడు సమాజంలో నశిస్తున్న మానవతా విలువలను చాటిచెప్పే ప్రయత్నమే మానవతా వాద సాహిత్యం అని, నేటి సమాజానికి అవసరం మానవతా వాద సాహిత్యం లనేదే నా మానవతావాదం. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గబ్బిలం సామాజిక చైతన్యం

– ఎన్. నరేంద్ర, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

ఆధునిక ప్రక్రియల్లో ఒక్కటైన కథా ప్రక్రియ నుండి 'గబ్బిలం' అనే కథను మధురాంతకం రాజారామ్ గారు చిత్తూరు మాండలికంలో రచించారు.

ఈ కథలో పైడి మల్లన్న అనే వ్యక్తి తన కళ్ళ ఎదురుగా జరుగుతున్న అన్యాయాలను, అరాచకాలను ఎదిరించే ధైర్యం లేక 'గబ్బిలం' అనే ఒక పక్షికి పరిచయం ఏర్పరచుకొని ఇక్కడ జరుగుతున్న అన్యాయాలను కాశీలో విశ్వనాథునికి తెలియజేయాలని గబ్బిలం ద్వారా సందేశం పంపడం జరుగుతుంది.

ఆనాటి కాలంలోనే కాదు నేటి కాలంలో కూడా ఈ సమాజంలో పరిస్థితులు మారలేదు అని చెప్పవచ్చు. ఎందుకంటే గ్రామాల్లో అగ్రకులాల వారిది ఆధిపత్యం నేటివరకు కూడా. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో సైతం అన్నింటా వారే ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు. ప్రభుత్వం పేదలకోసం ప్రవేశపెడుతున్న పథకాలు అని చెప్పడమే కానీ అవి ప్రజలకు అందలేక పోతున్నాయి. కారణం ఈ గ్రామాల్లో రెడ్డి, నాయుడు అనే వారిదే అధికారం. పంచాయితీ పనులలో రేషన్‌షాపులు అన్నింటా వారిదే ఆధిపత్యం జరిగేది. ఈ అన్యాయాలను ఎదరించే ధైర్యం లేక పైడి మల్లన్న అనే వ్యక్తి గబ్బిలం ద్వారా సందేశాన్ని కాశీలోని విశ్వనాథునికి అందజేయడం జరుగుతుంది.

రాయలసీమ ప్రాంతంలో పూర్వం రోజుల్లో జరుగుతున్న అన్యాయాలు నేటికి జరుగుతూ వున్నాయి. సమాన న్యాయం కోసం ఎదిరించే వారు లేక వారు పెట్టే హింసలను సైతం భరిస్తూ సతమతమవుతూ జీవిస్తున్నారు ప్రజలు.

సమన్యాయం కోసం పూర్వ రోజుల్లో అనేకమంది అనేక మంది నాయకులు ముఖ్యంగా గాంధీ, వినోభాబావే, అంబేద్కర్ వంటి వారు సమన్యాయం కోసం అనేక ఉద్యమాలు చేస్తూ వచ్చినారు. అయినా వాటిని తుంగలో తొక్కివేస్తున్నారు నేటి పాలకులు.

దేవాలయంలో వుండే దేవునికి లేదు వ్యత్యాసం. కానీ గ్రామాల్లో వుండే పెద్దలకు మాత్రం చాలానే వుంది. పూర్వం రోజుల్లో ఉన్న వ్యత్యాసం నేటి ఆధునిక ప్రపంచంలో కూడా అనుసరిస్తునే వున్నారు.

కాశీలో విశ్వనాథుని దగ్గర లేదు వ్యత్యాసం
తిరుపతిలో వెంకన్న దగ్గర లేదు వ్యత్యాసం
శ్రీశైలంలో మల్లన్న దగ్గర లేదు వ్యత్యాసం

కానీ గ్రామాలలో మాత్రం వ్యత్యాసం అనేది అడుగడుగునా కనిపిస్తూంది. హొటళ్లలో, రచ్చబండ కాడ ఇలా ఎక్కడపడితే అక్కడ వ్యత్యాసాన్ని చూపెడుతూ వచ్చారు. ఇలా అయితే సమాజం ఇంకెప్పుడు అభివృద్ధి పథంలో నడిచేది.

మధురాంతకం రాజారామ్ గారు ఆనాటి రోజుల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళక కట్టినట్టుగా మనకు అందిస్తూ వచ్చారు. ఈ కథలో పైడిమల్లన్న అనే వ్యక్తి ఆయొక్క బాధలను పొందుతూ మానసికంగా కృంగిన వ్యక్తిగా వుంటున్నాడు. ఆ యొక్క అవమానాలను అరాచకాలను భరించలేక తానుపొందే ఇబ్బందులను ఇంకెవరూ పొందకూడదన్న ఉద్దేశ్యంతో ఈ యొక్క సందేశాన్ని కాశీలో విశ్వనాథుడికి అందజేస్తూ వచ్చాడు. ఆ యొక్క గబ్బిలం కాశీకి వెళ్లి విశ్వనాథునికి పైడి మల్లన్న యొక్క బాధలను వివరిస్తూ తిరిగి ఆ యొక్క గ్రామాన్ని చేరిన తరువాత అక్కడ వున్న హడావిడిని బట్టి ఊర్లో ఏమో జరిగిందన్నట్లు ఊహించుకుంటుంది.

పైడి మల్లన్న కుమారుడైన నారాయణ బాగా చదువుకుని కలెక్టరు ఉద్యోగం సంపాదిస్తాడు. మొదటిసారిగా ఆ గ్రామంలో ప్రవేశించినపుడు ఆ గ్రామ దేవాలయంలో వున్న ఎరామేశ్వరుడు దర్శించుటకై వస్తే అప్పటి వరకు దేవాలయంలో ప్రవేశించద్దన్న పెద్దలు రెడ్డి చౌదరి ఉన్నత వర్గాల వారు ఏవిధమైన వ్యత్యాసం చూపకుండా గౌరవంగా చూడడం జరుగుతుంది. అంటే స్థాయి వున్నప్పుడు ఒక విధంగా, స్థాయి లేనపుడు ఒక విధంగా చూస్తూ వచ్చారు. ఈ విధమైన వ్యత్యాసాన్ని నేటి సమాజంలో కూడా మనం చూడగల్గుతున్నాం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

విద్యార్థి నవల – సామాజిక జీవన చిత్రణ

– నూకల విజయలక్ష్మి, పరిశోధక విద్యార్థిని, రాజధాని కళాశాల, చెన్నై.

కథ చెప్పడం అన్నది భారతదేశంలో ఎన్నో వందల సంవత్సరాల క్రిందట వికసించిన కళ. ఈ ప్రక్రియ మౌఖికంగా ఖండాంతరాలకు వ్యాపించి ఇటాలియన్, స్పానిష్ భాషల్లో ''నావెల్లా'' ప్రక్రియగా పుట్టింది. అనంతర కాలంలో ''నవల''గా పరిణామము చెందింది. మధ్య తరగతి ప్రజల వాస్తవ జీవితంలోని సంఘటనలనే వచనంలో నవలలుగా రచియించారు. డా.ముదిగంటి సుజాతరెడ్డి ''వచనం అంటే చింతకు మేధస్సుకు చిహ్నంగా వికసించిన రచన ప్రక్రియ'' అని అంటారు. అలాంటి వచన ప్రక్రియతో కూడిన నవలలో, సమకాలీన సమాజ, మానవ జీవన చిత్రణతో, యదార్థ జీవితంలోని సంఘటనలతో, సమానమైన వచనంతో కూడిన లక్షణాలు కలిగి ఉండి సామాజిక అంశాలను నవలల్లో ప్రస్తావించడం ద్వారా నవలా రచయిత సామాన్య పాఠకుడికి ఎంతో దగ్గరగా వారితో మమేకం కావచ్చు. రచయితలు తమ నవల ద్వారా పాఠకులకి చేరువయ్యారు.

అలా సామాజిక అంశాలను తన నవలల్లో ప్రస్తావించిన వారు ఆర్వీయస్. సుందరంగారు. వారు రచియించిన రెండు స్వతంత్ర నవలల్లో ఒకదానిలో N.R.I. పెళ్ళి కొడుకులు చేసే మోసాలు గురించి భావన నవల ద్వారా, నిరుద్యోగ సమస్యతో నేటి యువత నిరాశ, నిస్పృహలతో, అసహనంగా ఎలా ఉన్నారో అనే అంశాన్ని తన విద్యార్థి నవలలో రచన అనే సామాజిక బాధ్యతను ప్రస్తావించి చక్కని సామాజిక స్పృహతో ఆ అంశాన్ని ప్రస్తావించారు. నేను ఈనాడు తీసుకున్న అంశం ''విద్యార్థి నవల''. అది తాను విద్యార్థిగా ఉన్నప్పుడు రాసినా, 1995లో స్వాతి పత్రికలో అనుబంధ నవలగా అచ్చయింది. నిరుద్యోగం అనే సమస్య అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికి కూడా ఇలాంటి సమస్యతోనే యువత కొట్టుమిట్టాడుతోంది. దీనిని పరిష్కరించడానికి ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆ సమస్యలో ఏమీ మార్పు అనేది లేకుండా ఉంది.

భారతదేశానికి గొప్ప సంపద 63% యువత ఉండడం. ప్రతి సంవత్సరం ఎన్నో లక్షల మంది డిగ్రీలు పుచ్చుకుంటున్నారు. అందులో ఉద్యోగాలు వచ్చేవి ఏ కొద్దిమందికో. దీనితో యువతలో నిరాశ, నిస్పృహ, అభద్రతా భావం పెరిగిపోతోంది. దీనితో ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతోంది. అలాంటి నేపథ్యమే విద్యార్థి నవలలోని చంద్రహాస పాత్ర. తనకి ఉద్యోగం ఎంత ప్రయత్నించినా దొరకపోవడం, నిరాశ నిస్పృహ చెంది ఆత్మహత్యకు పాల్పడడంతో నవల మొదలవుతుంది. నేడు చంద్రహాస లాంటి వాళ్ళని మనం ఎంతోమందిని చూస్తున్నాం. ప్రతి చిన్న విషయానికి ఆత్మహత్య చేసుకోవడం గమనించదగ్గ విషయం. జీవితం ఎంతో గొప్పది క్షణికావేశాలతో ప్రాణాలు తీసుకోవడం సర్వ సాధారణమై పోయింది. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది. ఆ సమస్యకు పరిష్కారం కనుగొనగలిగేలా ఉంటే వారి జీవితం సరైన మార్గంలోకి వెళ్ళుతుంది. తప్పుడు నిర్ణయాల తీసుకాని తప్పుద్రోవ పడితే జీవితం అంతా బాధపడవలసి వస్తుంది.

చంద్రహాస తన పదేళ్ళప్పుడు తనకంటే పెద్దవారయిన రాము, శ్రీనులతో స్నేహం చేస్తాడు. వారి మాటల ప్రభావంతో ఎవ్వరికి చెప్పకుండా ఇంట్లోనుంచి బొంబాయి వెళ్ళాలని పారిపోతారు. శీను పెట్టె తెరచి అడుగున ఉన్న నోట్లకట్టలు చూపిస్తాడు. అది తండ్రికి తెలియకుండా దొంగిలించిన డబ్బు. నేడు చెడు సావాసాలతో ఎందరో పిల్లలు పాడైపోతున్నారు. పిల్లలు ఇలాంటి పనులు చెయ్యకుండా ఉండాలంటే, తల్లి దండ్రులు పిల్లలకి మొదటి నుంచి మంచి చెడులు,

నీతి బోధలు చెయ్యాలి. దీనివలన నైతిక విలువలు తెలుస్తాయి. అందువలన సంఘంలో మంచి పౌరుడిగా ఉంటారు.

యువతకి ఆవేశం, ఉద్రేకం ఎక్కువ. చిన్న గొడవతో మొదలైన సంఘటనలు, చిలికి, చిలికి గాలివానయి నట్లుగా కాలేజీలో చిన్న సమ్మెతో మొదలైంది. అందులో చంద్రహాస, అతడి స్నేహితులు పాల్గొనలేదు కాని సాయం కాలానికి సమ్మె తీవ్రరూపం దాల్చి బస్సు కాల్చడంతో ఒక అమాయిక విద్యార్థి మరణిస్తాడు. ఇలాంటి సంఘ టనలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. సమ్మెపేరుతో ఎన్నో ప్రభుత్వం ఆస్తులనూ తగలబెట్టడం, ఒకరు చేసిన పనికి ఫలితం వేరోకరు అనుభవించడం మనం చూస్తూనే ఉన్నాం.

కాలేజీ సెలవులికి చందు తల్లిదండ్రుల దగ్గరకు వెళ్తాడు. అక్కడ ప్రశాంతమైన గ్రామీణ వాతావరణం ఆకర్షిస్తుంది చందుని. ఇది అప్పటి పరిస్థితి అయితే నేటి పరిస్థితి గ్రామాలలోని ప్రజలకు ఉపాధి కరువైపోతోంది. ఒకప్పుడు భారతదేశం వ్యవసాయ దేశంగా పేరు ఉన్నది. అయితే ప్రస్తుతకాలంలో గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కరువైపోయి అందరు పట్టణాలకి వలసరావడం, కుల వృత్తులను వదిలేసి పట్టణాలలో ఉద్యోగాలకోసం వెళ్ళడం వలన నిరుద్యోగ సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. పట్టణాలలోని యువతతో పాటు గ్రామీణ యువత కూడా పోటీ పడడంతో నిరుద్యోగ సమస్య మరింత జటిలమయింది. ప్రభుత్వం వారు గ్రామీణ ప్రజలలో కుల వృత్తులను ప్రోత్సహిస్తూ వారి ఉత్ప త్తులను మంచి ధరలకు అమ్మడానికి ప్రభుత్వపరంగా సహాయం చేయాలి అలా చేస్తే నిరుద్యోగ సమస్యను కొంతలో కొంత అరికట్టవచ్చు.

విద్యార్థులంటే సమ్మెలు చెయ్యడం, గొడవలు పడడం కాదు. అవసరమైనప్పుడు వాళ్ళందరూ ఐక మత్యంగా ఉంటారనే సంఘటన విద్యార్థి నవలలో రచయిత వివరించారు. ఎన్.సి.సి. క్యాంపుకు చందు, రఘు, శేఖర్‌లతో పాటు వాళ్ళ కాలేజీ విద్యార్థులే కాకుండా రెండు, మూడు కాలేజీ విద్యార్థులందరూ కలిసి క్యాంపులకు వెళ్తారు. అందరూ కలిసి మెలసి క్రమశిక్షణతో ఉండడం, ఒకరితో మరొకరికి పరిచయాలు ఏర్పడి సంతోషంగా ఉంటారు. ఇలాంటి సంఘటనలు సంభవం అని విద్యార్థిలోకం నిరూపించింది. దీనివల్ల పరిచయాలు పెరిగి బిడియ స్వభావులైతే, బిడియం వదిలి బయట వారితో ఎలా మాట్లాడాలి, ఎలా ఉండాలో తెలుస్తుంది. దానితో వారిలో ఒక ఆత్మవిశ్వాసం వచ్చి, ఇంటర్యూలలో, సమూహ చర్చల్లోనూ చర్చించడం, లేక మాట్లాడటానికి ఉపయోగపడుతుంది.

ర్యాగింగ్ వల్ల జరిగే నష్టాన్ని రచయిత ఇందులో ప్రస్తావించారు. డిగ్రీ ముగించిన చందు ఎం.ఎ.లో చేర డానికి విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ దొరుకుతుంది. ఫీజు కట్టి కాలేజీలో చేరతాడు. మొదటిరోజు ర్యాగింగ్ పేరుతో అతన్ని చితకబాది ఊరి బటయకు తీసుకువెళ్ళి బాగా బాదుతారు దానితో అతడు తీవ్రంగా గాయపడ తాడు. తిరిగి కోలుకోవడానికి పదిరోజులు పైనే అవుతుంది. చందూ తల్లి భయపడిపోయి చందూని చదువు మానేసి ఉద్యోగం చేయమని బలవంతం చేస్తుంది. చందు చదివిన డిగ్రీకి ఉద్యోగం దొరకదు.

ర్యాగింగ్ అనేది చాలా పెద్ద సమస్య, ర్యాగింగ్ పేరుతో ఎంతో క్రూరంగా హింసిస్తున్నారు. దీని బారిన పడినవారు ఎందరో ఆత్మహత్యలు కూడా చేసుకుంటు న్నారు. నేడు చిన్న చిన్న కాలేజీలనుంచి పెద్ద పెద్ద విశ్వవిద్యాలయాలు లేక ఐఐటి లలో ర్యాగింగ్ పేరుతో అదుపులేకుండా విచ్చలవిడిగా హద్దులుమీరి ప్రవర్తిస్తు న్నారు. ఎందరో విద్యార్థినీ విద్యార్థులు ర్యాగింగ్ బారిన పడి తమ ప్రాణాలు తాము తీసుకుంటున్నారు. ప్రభుత్వ పరంగా ఎన్నో రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ ర్యాగింగ్ బారిన పడినవారు తమ బాధలను బయటకు చెప్పుకోలేక విలువైన ప్రాణాలను తీసుకుంటున్నారు. ర్యాగింగ్ చేసేవాళ్ళు తాము ఒకప్పటి నూతన విద్యార్థి

లమే అనే విషయం గుర్తుంచుకోవాలి. వారివల్ల ఇబ్బంది పడ్డవారు జీవితంలో ఎంతో నష్టపోయిన సంఘటనలు అనేకం ఉంటాయి. కాబట్టి విద్యార్థులందరూ ఒకరిపై ఒకరు ప్రేమ, గౌరవం కలిగివుంటే ఇలాంటి సంఘటనలు జరగవు. ర్యాగింగ్ వల్ల చందు విశ్వవిద్యాలయంలో చదువుకునే అవకాశాన్ని కోల్పోయాడు. ఫలితంగా డిగ్రీ చదువుతోనే ఉద్యోగం వెతుక్కోవలసి వచ్చింది. కానీ అతనికి ఎటువంటి ఉద్యగం లభించకపోవటం, నిరాశ, నిస్పృహ చెంది ఆత్మహత్యకు పాల్పడడం అనే సంఘటన ర్యాగింగ్ చేయడం వలన జరిగింది.

చివరిగా నా అభిప్రాయం విద్యార్థి జీవితంలో ఆత్మ హత్యలు చేసుకోకుండా మానసికంగా ఎదగాలంటే వారికి మద్దతుగా తల్లిదండ్రులు, స్నేహితులతో సత్స బంధాలు కలిగి ఉండాలి. అప్పుడు వారు విద్యార్థి జీవితంలో ఆనందంగా ఉంటారు. అలాంటి ఆలోచనలు రాకుండా, ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్ళకుండా వారి విద్యార్థి జీవితాన్ని సంపూర్ణంగా ఆనందంగా జీవించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. తల్లిదండ్రులు పిల్లలకు మంచి మార్గదర్శకులుగా, నిర్దేశకులుగా ఉంటే ఈనాడు యువత ఎంతో ముందుంటుంది. కానీ ఈనాడు అది కొరవడు తోంది. నేటికాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలకి మెడి సిన్‌లో సీటురాలేదనీ, మార్కులు తక్కువ వచ్చాయనే ధోరణులు కొనసాగుతోంది. దానితో వారిని వారు తక్కువ చేసుకుని తాము ఎందుకూ పనికిరామనే ధోరణి అలవడు తోంది. వారి మానసిక ఎదుగుదలకి తల్లిదండ్రులు సహాయ సహకారాలు ఎంతో అవసరం. తల్లిదండ్రులు స్నేహితులుగా చదువుకునే రోజులలో వారికి సహకారం అందిస్తే సంతోషంగా ఉండి మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఒక మంచి పౌరుడుగా ఉండి ఆత్మవిశ్వాసాలతో దేన్నైనా సాధించ గలం అనే విశ్వాసం వస్తుంది.

నిరుద్యోగ యువత ''గురించి'' నా అభిప్రాయ మేమంటే, గ్లోబల్‌గా ఎంతో ఎదుగుతున్న నేటి యువత అనవసరమైన విషయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎన్నో వ్యసనాలకి లోను అవుతున్నారు. టెక్నాలజీతో అనవసర మైన విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, పనికివచ్చే విషయాలపై శ్రద్ధ చూపకపోవడం ఒక కారణం. వారికి ఉపయోగపడే విషయాల్లో ఎక్కువ సమయం గడపగలిగితే వారిలో నైపుణ్యం పెరిగి ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు నవలానుశీలనం - డా. ముదిగంటి సుజాతారెడ్డి
2. సుందరం రచనలు - డా. రాళ్ళపల్లి సుందరం

❖ ❖ ❖

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి కథల్లో స్త్రీ

– సిలిగిరెడ్డి గంగాదేవి, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

సమకాలీన జీవన విధానానికి ప్రతిబింబాలు కథలు ప్రాచీన కథలు పిల్లలను నిద్రపుచ్చడానికి చెప్పబడితే ఆధునిక కథలు నవసమాజ నిర్మాణానికి బాటలుగా నిలిచి నిద్ర నుండీ మేల్కొల్పేవిగా ఉన్నాయి. కథకులు సమాజం లోని ముఖ్యమైన సమస్యలను, మార్పులను ఎప్పటి కప్పుడు కథా వస్తువులుగా స్వీకరిస్తూ సమాజాన్ని ఆధునికత వైపు పయనింపజేస్తున్నారు. "మారిన ఆర్థిక, సామజిక రాజకీయ పరిస్థితులు పునాదిగా ఏర్పడిన కొత్త దృక్పథా లను ప్రతిఫలిస్తూ కొత్త స్వరూపాన్ని సంతరించుకోవడమే సాహిత్యంలో ఆధునికత" 1. ఆధునిక సాహిత్యంలో అనేక రచనలు చేసిన, చేస్తున్న నిరంతర అక్షర కృషీవరురాలు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఆచార్యులు శ్రీమతి కొలకలూరి మధుజ్యోతి గారు రచించిన "అమ్మమ్మకో అప్పగింత" కథా సంపుటిలోని స్త్రీ సామాజిక స్థితిగతుల గురించి పరిశీలిస్తే ....

తెలివి, అందం, చురుకుదనం, చలాకీతనం, చైతన్యం అన్నీ కలగలిసిన అమ్మాయి లత, కళాశాల రోజుల్లో ఉరుకులు, పరుగులతో విద్యకు సంబంధించిన అనేక పోటీలలో పాల్గొంటూ బహుమతులనెన్నో గెలుచు కొన్న లత వివాహమయిన తర్వాత నిరుత్సాహంగా స్తబ్ధుగా మారిపోయింది భిన్నముఖం కథలో వివాహ వ్యవస్థలో భర్త ఆధిపత్యం కానీ, భార్య అవమానం కానీ ఉండ కూడదనే అభ్యుదయ భావాలు గల లత వివాహ జీవితంలో అడుగు పెట్టిన తర్వాత సాంప్రదాయ భావా లకు పెద్దపీట వేసి సాధారణ స్త్రీగానే ఆలోచించి తన జీవితాన్ని సొంత వ్యక్తిత్వాన్ని పూర్తిగా మార్చుకొంది, వివాహం లత పురోగాభివృద్ధికి, స్వేచ్ఛకు, స్వతంత్ర్య ఆలోచనలకు ఆటంకం కలిగించింది. వివాహం మహిళల అభివృద్ధికి, మానసిక వికాసానికి దోహదకారిగా మారి నప్పుడే స్త్రీలు మరింత చైతన్యవంతులుగా మారడానికి అవకాశం ఏర్పడి సమ సమాజ, నవ సమాజ నిర్మాణం పురోగమనం చెందుతుంది.

రిటైర్డు బడిపంతులు ఇద్దరు కొడుకులు, కోడళ్ళు ఉద్యోగ బాధ్యతల్లో కుటుంబానికి దూరంగా ఉండి తల్లిదండ్రుల బాధ్యతలను విస్మరించారు. వైధవ్యం పొందిన పెద్దకూతురు జయ, టీచరు ఉద్యోగం చేస్తున్న వివాహం కాని చిన్న కూతురు సుధలు తల్లిదండ్రుల సాన్నిధ్యంలో ఉన్నారు. కొడుకులు పూర్తిగా తల్లిదండ్రు లను, అక్కచెల్లెల్లను విస్మరించడంతో తల్లి తీవ్ర ఆవేదన చెందింది " తప్పని వ్యధలు " కథలో.

కొడుకులకు తమ జీవిత భాగస్వాములను ఏ లోటూ రాకుండా చూసుకోవాలనే ఆలోచన ఉండటం మంచిదే కానీ కని,పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రుల పట్ల, భర్తదూర మైన అక్కపట్ల, వివాహం కాని చెల్లి పట్ల బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించడం వారి క్షేమ సమాచారాలు పట్టించుకోకపోవడం తల్లి ఆవేదనకు కారణమయింది. కారణం సమాజంలో భర్తకు దూరమైన భార్యపట్ల, వివాహం కాని స్త్రీ పట్ల ఉన్న చులకన భావం, అభద్రతా భావం అధికంగా ఉండటమే.

బ్రతుకుతెరువుకోసం విదేశాలకు వెళ్ళిన సుధ తండ్రి అక్కడ మరో వివాహం చేసుకొని అక్కడే స్థిరపడ్డాడు. సుధ, సుధ తల్లి మేనమామ పంచన చేరారు. సుధ ఎంతో కష్టపడి చదువుతూ ఎం.ఏ లో చేరింది. తండ్రి ఆధార్ లేని కారణంగా కాలర్‌షిప్ సమస్య ఎదురైనప్పుడు ప్రొఫె సర్ లత సూచనల మేరకు స్వయంగా ఆఫీసుల చుట్టూ తిరిగి పట్టుదలతో సమస్యను పరిష్కరించుకొంది. పట్టు దలే సుధను ఏనాటికైనా ఉన్నత స్థాయికి చేరుస్తుందని నమ్మిన ప్రొఫెసర్ లతకు సుధ డిగ్రీ కాలేజి లెక్చరర్‌గా ఉన్నత స్థాయిలో కనిపించింది పట్టుదల కథలో.

కృషి, పట్టుదల ఉంటే మనుషులు దేనినైనా సాధించ గలరని సుధ నిరూపించింది. సుధ తండ్రి స్వలాభం కోసం తనని తల్లిని పూర్తిగా విస్మరించాడు. తండ్రి లేక తన తల్లి పడిన కష్టాలను గ్రహించిన సుధ పట్టుదలతో ఉద్యోగం పొంది గురువుల మన్ననలను పొందింది.

ఉద్యోగ విరమణ పొందిన శేఖర్ ఇంట్లో ఒంటరి జీవనం గడిపాడు. భార్య భారతి ఉద్యోగపు చివరి దశలో ఉంది. శేఖర్ దూరంగా విదేశాలలో ఉద్యోగం చేసు కొంటున్న కొడుకును తలచుకుంటూ దిగులుతో ఆకస్మి కంగా మరణించాడు. భర్త ఉన్నఫలంగా దూరమవడంతో భారతి పుట్టెడు దు:ఖంలో మునిగిపోయింది. ఈ బాధ చాలదనట్లు సాంప్రదాయపు కట్టుబాట్ల పేరుతో తన వైధవ్యాన్ని ఎత్తిచూపే కార్యక్రమ నిర్వహణలో ఉన్న బంధువులను ఎలా ఎదుర్కోవాలో తెలియని అయో మయ స్థితిలో పడిపోయింది భారతి "గుండెలో అలజడి" కథలో పురుషాధిపత్య భావజాలాలు వేళ్ళూనుకొన్న సమాజంలో భార్య చనిపోయిన పురుషునికి ఎటువంటి ఆచారాలు, కట్టుబాట్లు నియమ నిబంధనలు, చీద రింపులు ఉండవు కానీ భర్త చనిపోయిన స్త్రీని సమాజం వెలివేయడం, ఆచారాలు సాంప్రదాయాల పేరుతో బొట్టు, గాజులను తొలగించే కార్యక్రమాలు నేటి ఆధునిక సమాజంలోనూ జరుగుతూనే ఉండడం అమానుషం. ఉన్నత చదువు, సమాజంలో గౌరవప్రదమైన ఉద్యోగం చేస్తున్న భారతి కూడా ఈ ఆచారాన్ని దిక్కరించాలా వద్దా అనే సందేహంలో పడిపోయింది. ఇటువంటి దురాచారాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరిం చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సతీసహగమనం వంటి అతి దారుణ దురాచారాన్నే రూపుమాపేలా చేయగలిగిన సంఘసంస్కర్తలు వైధవ్యం పొందిన స్త్రీల అగచాట్లను నేటికీ నివారించలేకపోవడం నేటి సమాజ ప్రగతికి ప్రతిబంధకం.

వివాహ జీవితం, భర్త కారణంగా పూర్తిగా స్వేచ్ఛా స్వాతంత్రాలను కోల్పోయి, తన జీవన విధానాన్నే మార్చు కొన్న లత "భిన్నముఖం" కథలో కనిపిస్తే, వివాహ జీవితంలో భార్యలకు పూర్తిగా అనుకూలంగా ఉంటూ తల్లిదండ్రులను, అక్కచెల్లెళ్ళను వారి బాధ్యతలను పూర్తిగా విస్మరించినకొడుకుల వల్ల కుమిలిపోయిన తల్లి "తప్పని వ్యధలు" కథలో కనిపించింది స్వలాభం కోసం వివాహం చేసుకొన్న భార్యకు, కుమార్తె సుదకు ద్రోహం చేసిన తండ్రి పాత్ర "పట్టుదల" కథలో ఉంది. భర్త చనిపోయిన బాధలో ఉన్న భారతిని సాంప్రదాయపు కట్టుబాట్ల పేరుతో మరింతగా హింసించిన బంధువుల గాధ "గుండెలో అలజడి" కథలో కనిపించింది.

మొత్తం మీద వివాహ వ్యవస్థ, భర్త, కుమారులు, సమాజిక కట్టుబాట్ల కారణంగా ఎందరో స్త్రీలు ప్రగతి పథంలో అడుగుపెట్టలేక వెనకబడి పోతున్నారు. "యుద్ధ కాలంలోనే కాదు, శాంతియుత పరిస్థితులుండే కాలంలో కూడా స్త్రీ హింసను అనుభవిస్తూనే ఉంటుంది. ఇప్పటి సామాజిక, సంస్కృతి- సంప్రదాయలు మారనంత కాలము స్త్రీ హింసకు అదుపుండదు"

ముగింపు :

"సమాజం స్త్రీని భార్యగా, తల్లిగా, కూతురిగా, సోదరి గానే చూసింది కానీ ఆమె అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని గుర్తించలేదు." అనాదిగా సాగుతున్న కొన్ని దురాచారాలు మహిళల మానసిక వికాసానికి అవరోధాలుగా ఉన్నాయి. ఆధునిక స్త్రీ చదువు, ఉద్యోగంతో పాటు సొంత వ్యక్తి త్వాన్ని సొంత ఆలోచనలను పెంపొందించుకొనే కృషి చేయాలి. ఆధునిక యుగంలో స్త్రీ స్వాతంత్ర్యాన్ని గురించి ఆలోచించిన చలం "స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకి హృదయం ఉంది దానికి అను భూతినివ్వాలి " అన్నాడు. సంస్కృతి పరిణామంలో సంభ వించిన పరిస్థితులను అర్థం చేసుకొంటూ వివేచనతో దురాచారాలను నిర్మూలించుకొంటూ కాలానుగుణమైన మార్పులను స్వాగతిస్తూ స్త్రీల వ్యక్తిత్వాన్ని పెంపొందింప

జేసే విధివిధానాలను ఆచరిస్తే జాతి అభివృద్ధి పథంలోకి సాగిపోతుంది, నవమానవ నిర్మాణం: పురోగమిస్తుంది. "అధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది". అన్న గురజాడ వాక్కు అక్షర సత్యమవుతుంది.

ఆధార గ్రంథాలు :

1. అమ్మమ్మకో అప్పగింత (కథానిక) - ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
2. "మహిళ " - బి.హనుమా రెడ్డి
3. సాహిత్యం జండర్ స్పృహ - డా.పి. కుసుమకుమారి.
4. స్త్రీ వాద సాహిత్యం - సామాజిక అవసరం - ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
5. వ్యాస లతిక - రావి ప్రేమలత

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – జులై 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వయన కవిత్వం – స్త్రీ అస్తిత్వం – సామాజిక జీవన చిత్రణ

– డా॥ బూసి వెంకటస్వామి,
శాఖాధిపతి, తెలుగు విభాగం, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

– పెండ్యాల లావణ్య, శాఖాధిపతి,
తెలుగు విభాగం, డా॥. కొత్తా రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, దుగ్గిరాల.

ప్రాచీనకాలం పద్యమైతే వర్తమానం వచన కవిత్వం. ఆంగ్లంలోని ఫ్రీవర్స్ అన్న పదానికి సమానార్థకంగా వచన కవితా అన్నపదం ప్రయోగింపబడింది. తెలుగు సాహిత్యంలో వచ్చిన అనేక ప్రక్రియల్లో ఎక్కువమందిని ఆకట్టుకున్నది వచన కవిత్వమే. తెలుగు కవిత్వానికి పద్యమే దిక్కు అన్నవారు కొత్త ధోరణుల్లో తెలుగు కవితా ప్రక్రియలకు శ్రీకారం చుట్టాలన్న తపనతో యువకులు చేసిన ప్రయోగమే వచన కవిత.

వచన కవితా పితామహుడు కుందుర్తి అంజనేయులు. పద్యమే కవిత్వమని అపోహ పడేవారికి ఆధునిక కాలానికి వచనమే తగినదని నిరూపించే దశలో కుందుర్తి వారు 1958 సంవత్సరంలో ఫ్రీవర్స్ ఫ్రంట్‌ను స్థాపించాడు. వనచ కవిత్వం తెలుగు సాహిత్యలోకంలో దుమారం లేపింది. పద్య కవుల విమర్శలకు ధీటుగా వచన కవులు "కవి భావుకతకు, భావ ప్రకటనా స్వేచ్ఛకు ఛందస్సు ఆటంకం కనుక ఛందోరహితమైన వచనం సామాన్యుడికి అందు బాటులో ఉంటుందని వచన కవులు సమాధాన మిచ్చారు. వచన కవితకు శిష్ట్లా, పఠాభి, శ్రీశ్రీ వంటి వారు అనుసరించి ప్రోత్సహాన్ని అందించారు.

ప్రస్తుతం పద్యం రాసే వారికంటే వచన కవిత్వం రాయడంపై మొగ్గు చూపిస్తున్నారు. ఫ్రీవర్స్ ఫ్రంట్ ప్రతి సంవత్సరం ఒక ఉత్తమ వచన కావ్యానికి పురస్కారాన్ని ప్రకటించి వచన కవితా ప్రక్రియను పరిపుష్టం చేస్తుంది. వచనానికి విషయం ప్రధానమైతే, వచన కవితకు నిగూఢ భావం ప్రధాన లక్షణం.

20వ శతాబ్దంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో మౌలికమైన మార్పులు వచ్చాయి. అందుకే, ఈ యుగాన్ని ఉద్యమాల యుగమంటారు. భారతదేశంలో ఇంగ్లీషు విద్య, పాశ్చాత్య నాగరికత, ప్రబలడం వలన సాంఘిక, మత, సంస్కరణోద్యమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్త్రీలకు సంబంధించిన అనేక అంశాలపై ఉద్యమాలు వెలిశాయి. సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతు వివాహాలు, స్త్రీ విద్య మొదలగు విషయాలనేకాకుండా స్త్రీ అణచివేతపై, పురుషాధిపత్యంపై ఉద్యమాలు చెలరేగాయి. అటువంటి ఉద్యమాల తరుణంలోనే వచన కవిత్వం ఊపందుకుంది. వచన కవులు తమ వచన కవితలతో స్త్రీవాద ఉద్యమానికి ఊపిరిపోశారు.

వచన కవిత్వ ప్రభావం వలన మహిళాభ్యుదయ ఛాయలు నలుదిక్కుల వ్యాపించాయి. వచన కవితలతో అనేకమంది కవులు, కవయిత్రులు వచన కవిత్వాన్ని తారాస్థాయికి తీసుకెళ్ళారు. ముఖ్యంగా వచన కవిత్వం స్త్రీ, తన మనసులోని భావాల్ని అలవోకగా చెప్పుకునే అవకాశాన్ని తెచ్చిపెట్టింది. అనాదిగా వస్తున్న స్త్రీల అణచివేత, సంప్రదాయాలను స్త్రీవాద రచయిత్రులు, కవులు తొక్కిపట్టి తమ రచనల ద్వారా నార తీశారు. పురుషాధిక్య సమాజాన్ని ఎదిరించారు.

మనుధర్మశాస్త్రం ప్రకారం బాల్యంలో స్త్రీ తండ్రి సంరక్షణలో, యవ్వనంలో భర్త సంరక్షణలో, వృద్ధాప్యంలో బిడ్డల సంరక్షణలో, నాస్త్రీ స్వాతంత్ర్య మర్హసీ! అని పేర్కొన్నాడు. హైందవ సాంప్రదాయం ప్రకారం సమాజం నడిచింది. సమాజం మనుషుల మధ్య అన్ని వివక్షలతో పాటు ముఖ్యంగా లింగవివక్షను ప్రోత్సహించింది. స్త్రీ పురుషుడితో సమానంగా ఉండరాదని పేర్కొంది.

గురుకులాల్లో స్త్రీల ప్రవేశం నిషిద్ధం. వేదాలు, వేదాంగాలు, పురాణాలు స్త్రీ చదవడం మహాపాపంగా భావించారు. నాటి సమాజం స్త్రీని వంటికి, అలాగే కేవలం పిల్లల్ని కనడానికి మాత్రమే పరిమితం చేసింది. అయితే అప్పటి సమాజంలో స్త్రీ చైతన్యం లేదా అంటే ఉందనే చెప్పాలి. ఝాన్సీ లక్ష్మీభాయ్, రాణి రుద్రమదేవి, రజియా సుల్తానా, భండారు అచ్చమాంబ మొదలగునవారు చైతన్యానికి మారుపేరుగా చెప్పవచ్చు.

ఆంగ్లేయుల పలన మూలంగా దేశంలో జాతీయ భావం పెంపొంది స్వతంత్ర్య కాంక్ష వెల్లివిరిసింది. బ్రిటీష్ సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించడం ప్రతిఘటించడం, జాతీయోద్యమంలో ప్రధాన అంశం. ఉద్యమాల్లో చైతన్యం పొంది చురుగ్గా పాల్గొన్న స్త్రీలు తమ హక్కుల సాధన కోసం కూడా ఉద్యమించడం మొదలుపెట్టారు. స్త్రీల సమస్యల కోసం కందుకూరి, గురజాడ, చలం మొదలైన వారు ఎక్కువశాతం స్త్రీలనే కవితా వస్తువులుగా చేసుకుని అనేక రచనలు సాగించారు. ఆ తరువాత కొడవటిగంటి, రంగనాయకమ్మ, లత, మల్లాది సుబ్బమ్మ, ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, విమల, గంటశాల నిర్మల మొదలగు వారెందరో స్త్రీవాద దృక్పథాన్ని ఆయా సాహజతీ ప్రక్రియల్లో ప్రస్ఫుటం చేశారు. సాహితీ ప్రియులు దీనిని స్త్రీవాద యుగంగా పేర్కొన్నారు.

పురుషాధిక్య సమాజాన్ని పునాదులతో సహా పడగొట్టాలనే ప్రయత్నం స్త్రీవాదులు చేస్తున్నారు. సనాతన ధర్మాలను, ఆచారాలను కూకటి వ్రేళ్ళతో పెకళించడం అంత సులువైన పని కాదు. అందుకే స్త్రీ చైతన్యానికి, భావ విప్లవానికి ఉపకరించే సాహిత్యాన్ని ప్రధాన ఆయుధంగా తీసుకున్నారు. సాహిత్యంలోని ఒకే ప్రక్రియకు పరిమితం కాకుండా సాహితీరంగంలో ఉన్న ప్రక్రియల్లోనూ తమ కలాన్ని వాడి దాడిగా వాడుతున్నారు. సాహిత్యరంగంలో కవిత్వ, నవల, వచన, కథ ప్రక్రియల్లో స్త్రీవాద సాహిత్యం వెల్లివిరిసింది.

ఉద్యమాలన్ని మొదట కవిత్వ ప్రక్రియలో వెలువడ్డాయి. తరువాత ఇతర ప్రక్రియలు వ్యాప్తి చెందాయి. స్త్రీవాద సాహిత్యం తొలుత కవిత్వరూపంలోనే ఎక్కువగా వచ్చింది. 1975-1985 కాలాన్ని ఐక్యరాజ్య సమితి "అంతర్జాతీయ మహిళా దశాబ్దం"గా ప్రకటించింది. సాహిత్యపరంగా వచ్చిన అన్ని ప్రక్రియల్లోను వచన కవితా ప్రక్రియ మిక్కిలి ప్రజాదరణ పొందింది. అంతకుముందు చలం, లత, రంగనాయకమ్మ, మల్లాది సుబ్బమ్మ మొదలగు వారి రచనలు స్త్రీ స్వేచ్ఛా, స్వాతంత్ర్యం విముక్తికోసం ఎంతగానో ఉపకరించాయి. అలాగే "సెకండ్‌సెక్స్" "ఎ రూమ్ ఆఫ్ బన్స్ బన్" "సెక్సువల్ పాలిటిక్స్" వంటి ఆంగ్ల రచనలు స్త్రీ సాహిత్యం ఉద్యమానికి హేతువులైయ్యాయి.

1990 వ సంవత్సరంలో 'అస్మిత' వారు 'నీలి మేఘాలు' అనే భారీ స్త్రీవాద కవితా సంకలనం రూపొందించారు. 'నీలి మేఘాలు' కవితా సంకలనంలోని కవితా రచనా కాలాన్ని పరిశీలిస్తే "ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి" అని ఓల్గా, 1972 సంవత్సరంలో రాసిన కవిత మొదటి స్త్రీవాద కవితగా విమర్శకులు భావిస్తున్నారు. పంచాది నిర్మల పురుష అహంకారానికి ఘోరంగా బలికావడాన్ని తీవ్రంగా ప్రతిస్పందించిన ఓల్గా -

"నేను ప్రతివ్రతామ తల్లిని కాను
ప్రబంద కన్యనను గాను
పంచదార చిలకను గాను
ఫ్యాషన్ పరేడ్ బొమ్మను కాను
పసిపాపల్ని చంపే పాపిని కాను
పంచాది నిర్మల వారసురాలిని"

అని అంటూ స్త్రీ జాతిలో భావవిప్లవం తీసుకు రావడానికి ప్రయత్నించారు.

1984 సంవత్సరంలో "బందిపోటు" అనే కవిత రాసి గొప్ప సంచలనాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చిన కవయిత్రి సావిత్రి. ఈమె పెళ్ళిని, భర్తని గురించి నూతన రీతిలో కవితా భావన చేశారు.

పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తానని
పంతులు గారన్నప్పుడే భయమేసింది
ఆఫీసులో నా మొగుడున్నాడు అవసరమొచ్చినా సెలవివ్వడని
అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది
వాడికేం? మగమహారాజు' అని
ఆడామగా వాగినప్పుడే అర్థమైపోయింది
పెళ్ళంటే పెద్ద శిక్షని"
మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తోందని
సావిత్రి పురుష అహంకారాన్ని, లింగవివక్షను నిరసించింది.

పితృస్వామ్య వ్యవస్థ మీద నూతన తరహాలో వచ్చి ప్రాచుర్యం పొందిన కవిత "జయప్రభ" రాసిన "పైటను తగలెయ్యాలి".

పై కొంగును చూస్తే
నాకెందుకో
పాతివ్రత్యం గుర్తుకొస్తుంది
భుజాల నుండి కిందికి వేలాడే
గుడిబండలా
అదెప్పుడు నా స్వేచ్ఛను హరిస్తూనే ఉంటుంది
నన్ను నిటారుగా నిలువనివ్వక
పైట నాగుండెలపై తన అంచుల చేతులాన్చి
నన్ను వంగదీయాలని చూస్తుంది
నాకు అలవాటు లేని సిగ్గుని కప్పుతుంది
నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి
దానిపైన కప్పిన తెల్లని దుప్పటి పైట
నేను నడిచే శవాన్ని కాకుండా వుండాలంటే
ముందుగా పైటని తగలెయ్యాలి"

అని పేర్కొన్నారు. జయప్రభ కవిత అనంతర స్త్రీవాద కవలయిత్రులపై అమితమైన ప్రభావాన్ని చూపింది.

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి మొక్కపాటి సుమతి "వర్గ శత్రువు కంటే లింగ శత్రువే ఎక్కువ ప్రమాదకరం" అని పేర్కొన్నారు. వీరి రచనైన "మిత్ర వైరుధ్యమా?" అనే కవితలో

"వర్గ శత్రువు నాశమనే దోచుకుంటాడు
ఈ దుష్ట శత్రువు నా బ్రతుకే దోచుకుంటాడు
వాడు నాకు కలనైనా కనిపిస్తాడు
వీడు నా కలలన్నీ చెరిపేస్తాడు
వాడికి నేను మరను తిప్పే మనిషిని
ఎవడూ అన్నది? ఇది మిత్ర వైరుధ్యమని?
పెళ్ళినాడు పురోహితుడు చూపే అరుంధతి నక్షత్రంలా
ఆకాశంలో సగాన్ని చూపి
మోసం చేస్తున్నాడు వాడు..."

అని జండర్ (లింగ) వివక్షే అన్ని వివక్షల కన్నా అత్యంత ప్రమాదకరమైందని పేర్కొన్నారు.

మాతృత్వం ప్రకృతి సహజం. కాని దాన్ని పురుషాధిక్యానికి అవకాశంగా తీసుకుంటున్నారని కొండేపూడి నిర్మల "లేబర్ రూమ్" అనే కవితలో పేర్కొన్నారు.

"కాళ్ళనలా ఎడంచేసి ధీనంగా హీనంగా నీచాతి నీచంగా
ఒక హింసాతల పరాకాష్టకోసం ఎందురు చూడ్డమంటే
రైలు పట్టాలమీద నాణెం విస్తరించిన బాధ
కలపను చెక్కుతున్న రంపం కింద పొట్టులా ఉండ చుట్టుకున్న బాధ
అప్పుడే ఏమైంది ఉధృతికొద్ది విముక్తి
ముల్లుకు గుచ్చి నిప్పుతో కాలుస్తున్న చేప యిలాగే ఏడుస్తుందా"

అని స్త్రీ పడుతున్న అనుభవిస్తున్న బాధల్ని కవితలో తెలియజేశారు.

స్త్రీవాద కవిత్వంలో విమల రాసిన "వంటిల్లు", "సౌందర్యాత్మక హింస" అన్న కవితలు రెండు కూడా చలా ప్రసిద్ధమైనవి. ఆడవాళ్ళ కలల్లో సైతం "వంటిట్లు"

అవిభాస్యమైన బంధంగా ఎలా భాగమైపోయిందో స్పష్టంగా వ్యక్తీకరించిన కవిత వంటిల్లు. స్త్రీ తన కవితా వస్తువు పట్ల చూపే చూపు నిస్సందేహంగా తనదైన స్పష్టతను కలిగి ఉంటుంది.

"భయం భయంగా నిశ్శబ్దంగా నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ ఉంటుందిక్కడ
అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా ఉంటుంది
అని అంటూ
మా అమ్మే మండుతున్న పొయ్యిలాగా ఉంటుందన్నారు.
మన రక్తం పీల్చేసి, మన ఆశల్ని, కలల్ని కాజేసి
కొద్దికొద్దిగా జీవితాంతం పీక్కుతింటున్న
రాకాశి గద్ద ఈ వంటిల్లు..

అని మనం ఏమైనా మన అంతిమ కర్తవ్యంగా గరిట తిప్పటంగా చేసిన ఈ వంటిళ్ళను ధ్వసం చేద్దాం రండి" అని విమల పిలుపునిచ్చారు.

జీవిత సత్యాన్ని తెలుసుకోవడానికి ఎవరి అనుభవం వారికి ఆధారం కావల్సిందేనన్న విషయాన్ని స్త్రీవాదులు వెలుగులోకి తెచ్చారు.

1975 సంవత్సరం నుండి నేటి వరకు వెలువడిన, వెలువడుతున్న స్త్రీవాద రచనల్లో స్త్రీల ఉద్యోగం, వివాహం, సంతానం, కుటుంబ హింస లాంటి ఇతి వృత్తాలు కనిపిస్తాయి. ఆయా రచయిత్రలు తమ పాత్రల ద్వారా ఓ చైతన్యాన్ని, సమస్యా పరిష్కారతత్వాన్ని ప్రదర్శించారు. రానురాను 1980 సంవత్సరానికల్లా తెలుగు సాహిత్యం స్పష్టమైన మలుపు తిరిగింది. పాతివ్రత్యం, సిగ్గు, బిడియం, అపనిందలు, అవమానాలు లాంటివి స్త్రీని ఒక వ్యక్తిత్వం గల మనిషిగా పెరగనివ్వకుండా అడ్డుకున్న నిరోధాలు. 80వ దశకం నుండే స్త్రీలు స్వేచ్ఛగా, నిర్భయంగా రాయడం ప్రారంభించి ఇప్పటి వరకు నిరంతరం రచనలు సాగుతూనే ఉన్నాయి.

స్త్రీ అంటే కేవలం శరీర సుఖాల కోసమే చూసే పితృస్వామ్య సంస్కృతిని ధిక్కరిస్తూ, తిరుగుబాటు వాబుటా ఎగరవేస్తూ 80వ దశకంలో స్త్రీవాద కయిత్రులు స్త్రీలను అణచివుంచే అధికారం చలాయించే పురషాధిక్య భావజాలాన్ని తిరస్కరిస్తూ గొప్ప కవిత్వాలు రాశారు. ఒక దశలో వరద గోదారిలా తెలుగు సాహిత్యాన్ని ముంచెత్తిన స్త్రీవాద కవిత్వ ఉధృతి తగ్గి కుదురుకుని నిదానంగా నలుదిక్కులా పారుతూ కథల్లోకి, నవలల్లోకి, వ్యాసాల్లోకి ప్రవహించింది.

స్త్రీవాదం అన్ని సాహిత్య ప్రక్రియల్లోకి విస్తరించింది. ఏ ఉద్యమమైనా మొదట్లో ఉధృతంగానే మొదలౌతుంది. ఆ ఒరవడిలో చెత్తనంతా కడిగేస్తుంది. ఉధృతి తగ్గిన తరువాత కూడా తన ఉనికిని కోల్పోకుండా నిదానంగా ప్రవహిస్తూనే ఉంటుంది.

అనుబంధం :

1. అంతర్జాలంలోని వ్యాసాల ఆధారంగా

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

Gurajada's Modernistideals and his Enigmatic Social Concerns

- ***Dr. B. Venu gopala Rao***, Assistant Professor of English, Maharajah's college, Plot no. 16, Bobbadipeta, Behind Pipes company, Near state bank of India, Cantonment, Vizianagaram.

Gurajada Venkata Apparao's Kanyasulkam, even after a tread across a century and a half years, in the least a pass over, notwithstanding that Kanyasulkam as such is a practice of yesterday. That Gurajada remains unscathed by time and defies ageing should not be a cause for rise of any eye-brows, given that his works have their origin in the lives of the people.

People often look at a thing of past with eyes filled with suspicion and they dislike its intervention into the affairs of the day. Gurajada took upon himself the twin tasks, ridding Telugu of the tyranny of a highly artificial literary dialect and emancipating women of the evil of being sold to old men for Kanyasulkam as it is so called or bride-price. Gurajada was up against a deeply entrenched social practice among the Brahmin community and yet unlike his famous mentor Sri Kandukuri Veeresalingam who suffered a community ban, he could manage an escape. A list prepared under the orders of the Maharaja of Vizianagaram put the sulka marriages at an alarming one thousand and thirty four during three years. Kanyasulkam and the many other articles, stories and poems by Gurajada, however, had done more than what a legislation could do to eradicate the evil and took Telugu vernacular to an enviable position. A reading of Kanyasulkam assumes significance in any context where a veritable other dangerous social evils fail to find a redeemer. The situation now is complex in that it is stage for all the evils that the world is known to, with vast globalization in place and the putrid smell of the old ills continues to emanate as ever refusing to be cowed down into submission.

The larger common good, more often than not, becomes a victim of diametrically opposite human interests. Advice being a commodity having more sellers than buyers, it is a field day for people like Girisam, one of the main characters in the play Kanyasulkam, who proffer holy advice as sacrament, themselves remaining awefully profane. There is no book that Girisam does not stake claim to knowledge. He does not hesitate to bring into his defense instances from popular books, even if those references call many issues into question. When he is accused by his disciple Venkatesam that he did not learn anything worthwhile than smoking cigarettes, he wantonly claims sanction for the habit in the fourth aswasa of Brihannaradiyam and even brags that it is behind the white man's invention of steam engine. His wit is nowhere else better present than in his speeches to Buchamma where he performs all somersaults to convince her for widow remarriage. He is surely in the category of those who are 'anti-nauch' in the day light and 'pro-nauch' in the nights. His pretext to teach Venkatesam during summer time at his home to escape 'pootakoollamma' and others he owed money is a context for him to realize suddenly the wastefulness of circling around such women with low morals. He is like every man in the sense that now he is wise and then he is wound by stupidity. While it is innocent stupidity in oth-

ers, it is a deeply laid natural trait in Gririsam. Even Soujanya Rao, the goody lawyer, could not help but fall a victim to the apparent charms of Girisam. His calm and phlegmatic demeanour can bring to normalcy the grinding teenth of Agnihotra Avadhanulu.

The world now is a safe haven to people like Girisam'. Girisam is the new icon who seems to drive certain new strands of thought that prevail among those vested with the task of governance, which believe that evils are necessary tools for winning elections if his observation that child marriages, though an evil, are to exist for social reforms like widow-remarriage to take place is any indication. He is one foot in India and another in the west, equally far from the both and belongs to none, again a modern predicament. Now the Girisamania is institutionalized and people in the globalised market scenario are trained in ideas and philosophies, not in the interest of the society but in the market interests as visualized by the corporates. Vice is saleable as long as it is profitable. The philosophy of the organization or institution goes useless as one is out of it and like Girisam one sheds his veneer to take on another. And when the philosophy of the moment becomes the brand, that brand is ruled by Girisam.

Girisam's philosophy can fit into the confines of certain reason. Modern man, exposed to innumerable unforeseen contexts like never before, is caught among multiple dilemmas for which no single idea is a safe bet.For the modern man, Girisam is no match. Girisam's tantrums are everybody's knowledge and he makes a helpless exit as a denouement when his role is loudly announced in Buchamma's elope with him. Unlike Agnihotra Avadhanulu and Lubda Avadhanulu who are vices of less serious nature and self inflicting, Girisam is many colours as the moment declares and highly infectious.

Kanyasulkam has flirts of all hues whether or not in the pull of the new wind blowing in the form of new learning with the introduction of English education. The opportunist and sceptic Girisam does not have faith in the sacred thread he was wearing across his chest and was too happy that it had come to use at last, when he was able to drive away the servant who was pestering him for money, by swearing in the name of Gayatri holding it by hand. Agnihotra Avadhanulu and Lubda avadhanulu are only casual practitioners hanging on the hooks of certain religious practices and the village heads like Ramappantulu were rollicking in the new-found luxury in the form of grants and inams by kings. Lubda avadhanulu, characteristic of his name, is ready to marry any girl for the dear money. For Agnihotra Avadhanulu, it is a necessity, with his having Venkatesam by his side, to marry off his daughter for bride-price. He refuges to relent even when Soujanya Rao tries to preempt the disaster he is heading for in trying to give her to an eighty years old man and claims his aunts had married and lived a happy life. Not to speak of Girisam, Karataka Sastri is a replica of most men of today for abnegation of the prime duty in pursuit of trivial things when his student reveals that he did not teach him even a single verse a day. The play's unstinted appurtenance to the modern times is therefore strongly reinforced. It is the story of man wherever he is or whatever his clime.

His creative ouvre is an effort to see the world in the pink of its health. Gurajada's poem which oozes with patriotic fervor that a coun-

try is not a lump of clod but its people is a surprise outpouring as it comes at a time when 'country' was extant only as a notion and moreover he had quite handful of outpourings In praise of his royal patrons by then. The lines of the poem contend with one another in their urge to enrich the lot of humanity. A stanza translates like this:

Hand in hand
The countrymen must walk
Like bossom brothers all races
Religions should band

Gurajada was not left behind by the Indian independence movement either :

With people with lethargy
How will the nation turn better?
Learn all arts early
And fill with native commodity.

Gurajada is many layers unfolding as his contexts dictated. Kings court, home, history, legend or a social situation, his concerns are idealistic. He declares to his wife in the poem by name Kasulu that love does not grow unless one grows it and their equal nature when he calls her his bosom friend. His Mutyalasaramulu dreams of a state where the people of all races come under one roof forgetting all their differences in a rare pact of love and camaraderie. His Matala Mabbulu does not hesitate to lambast that deceit is the route to scale heights inside the court of the king. His poem Lavanaraju Kala embellishes the story of Yogavasishta with the ideals of truth and nonviolence and the uplift of the Harijans. He composed Subhadra to demonstrate his skills of composing poems in orthodox manner. The short story Matilda brings out the nobility and the power of endurance of women. He was a bilingual poet who published both in English and Telugu with equal ease and he was a hand at all genres, poetry, short- story, drama, essay or whatever. He evinced exquisite interest in epigraphy. His Neelagiri Patalu partake the beauty of Wordsworth whom he admired without end.

Gurajada is an enigma for many reasons. While all others were content with standing their ground, he refused to be cowed down by the peripheries of human understanding. There are instances of looking into the past but not a single example that stands evidence to opening up into mazes of thought whose realization is beyond conception except the case of Gurajada. Geoffrey Chaucer was guided by his times and chose to write in English vernacular as against French or Latin which were holding sway then. Turning to the past, in the case of Shakespeare, is cathartic and a detour for staying calm. Ones fine- self is revealed only in the context of contemporaneity. Gurajada could look ahead of his time.

Past, present or future Gurajada is propelled by intentions to rejig, by thought which did not exist before. His only concern is to reach out to the commoner. He was father to thought which did not exist before. He is rival only to Shakespeare in his capacity for statements of universal appeal. He is born every minute in every household for the reason. He is unusually modern and versatile. He is a mystery and an enigma.

Jayanta Mahapatra, a noted poet of our time strikes the right perspective when he says:

Even though this poetry appears as a river,

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

A river without water
We have to swim across,
And even if its words
Do not welcome us to its secret country
Where we live without knowing
(Door of Paper)

Even if it falls to a deaf ear, writers have the onerous duty towards the well-being of the society. As long as there prevail flirts, loose etiquette, and the social flip-side, Gurajada the enigma will stay on to enrich the world for many more years to come, like the Ganges whose mystic affect continues to render this world pure and sacred. Gurajada and his writings will be relevant as long as there lies someone who denies another his dignity.

References :

1. Kanyasulkam, 2 edition by Gurajada
2. Door of Pper. Delhi:Authors Press, 2007.

❖ ❖ ❖

జులై 2020

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

ఆధునిక తెలుగు సాహిత్యం - సామాజిక జీవన చిత్రణ

అంతర్జాల జాతీయ సదస్సు



పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కాలేజి

పెదనందిపాడు, గుంటూరు - 522 235, ఆంధ్రప్రదేశ్.